హోలీ వేడుక చూసొద్దాం రండి

తాజంగిలో 80 అడుగుల శిఖరం ఏర్పాటు

మన్యంలో భిన్న ప్రాంతాల సమాహారంగా తాజంగికి పేరుంది. మన్యం, మైదాన ప్రాంత వాతావరణం కలగలిసినట్లు ఇక్కడ ఉంటుంది. జోలాపుట్ జలాశయం నిర్మాణ సమయంలో సుమారు 200 నిర్వాసిత కుటుంబాలు ఇక్కడకు వలస వచ్చాయి. ఇక్కడే ఉంటూ ఇళ్లు నిర్మించుకున్నారు. ఏటా హోలీ పండగను వైభవంగా, మిగతా ప్రాంతాలకు భిన్నంగా నిర్వహిస్తుంటారు. ఈ నెల 3న హోలీ పండగ నిర్వహణకు గ్రామస్థులంతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సంబరాల్లో భాగంగా ఎంపిక చేసిన మైదానంలో 70 నుంచి 80 అడుగుల ఎత్తులో కర్రలతో ఎత్తయిన శిఖరాన్ని నిర్మిస్తున్నారు. మామిడి తోరణాలతో అలంకరిస్తారు. శిఖరం పైభాగంలో జెండా ఏర్పాటు చేస్తారు. రాధాకృష్ణుని ఆలయంలో పూజల అనంతరం ఊరేగింపుగా వచ్చి హోలీ రోజు వేకువజామున ఈ శిఖరాన్ని వెలిగిస్తారు. అగ్నికీలల్లో హోలీ శిఖరం దహనమవుతుండగా గిరిజనులంతా ఆనందోత్సాహాలు, ఆటపాటలు, బాణసంచాతో సందడి చేస్తారు. శిఖరంపై నున్న జెండా ఏ దిక్కున పడుతుందో అటు వైపు పంటలు బాగు పండుతాయని గిరిజనుల నమ్మకం. జెండాను కింద పడకుండా పట్టుకున్న వారిని ఊరేగించి బహుమతి అందజేయడంతోపాటు సత్కరిస్తారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగంగా పరిష్కరించే లక్ష్యంతో గురుద్వారాలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 11 జిల్లాలకు చెందిన వినియోగదారులు ఉదయం 10.30 నుంచి 11.30 వరకు సమస్యలను 86884 00499 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని సీఎండీ ప్రకటించారు. ఈ అవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రంజాన్ వేళలు ఇఫ్తార్: సోమవారం 6:13 గం॥లకు సహరి: మంగళవారం 4.56 గం॥లకు

అడవిలో అగ్గి రాజుకుంటే బుగ్గే!

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: వేసవి సమీపిస్తుందంటే చాలు.. మన్యంలో కాఫీ రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. అడవిలో నిప్పు రాజుకుంటే కాఫీ తోటలు అగ్నికి ఆహుతి అవుతాయన్న భయం గిరిజన రైతులను వెంటాడుతుంటుంది. గతంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో అనేక సార్లు కాఫీ తోటలు బుగ్గిపాలవడంతో అపార నష్టం వాటిల్లిన ఘటనలు ఉన్నాయి. మన్యం వ్యాప్తంగా 2.5 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. లక్షన్నర కుటుంబాలు తోటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అటవీ శాఖాధికారులు సూచిస్తున్నారు. వేసవి ఆరంభం నుంచే విస్తృతంగా ప్రచారం చేస్తూ గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహనతో అగ్నిప్రమాదాల నివారణ

ప్రమాదాల నివారణకు చేపడుతున్న ఫైర్‌లైన్ పనులు

▲ ఈ ఏడాది వాతావరణ పరిస్థితుల ప్రభావంతో జిల్లాలో కాఫీ దిగుబడులతోపాటు నాణ్యత బాగా తగ్గింది. సాధారణంగా దిగుబడులు తగ్గితే ధర పెరగాలి. నాణ్యత లేకపోవడం, తేలికపాటి పంట రావడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో కాఫీ ధరలు బాగా తగ్గాయి. ఒకవైపు ధరలు రాక రైతులు గగ్గోలు పెడుతుంటే మరోవైపు తోటల్లో అగ్నిప్రమాదాలు వారిని మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

▲ కాఫీ సాగు దీర్ఘకాలిక ప్రక్రియ. క్లిష్టమైనది. తోటలను నిత్యం కంటికి రెప్పలా కాపాడుకుంటేనే ఆశించిన ఫలితాలు సాధించలేం. మొక్కలు పెరిగి పెద్దవై దిగుబడినిచ్చేందుకు కనీసం మూడేళ్లు పడుతుంది. కాఫీ మొక్క జీవితకాలం 50 ఏళ్లు. మన్యంలో కాఫీ తోటలన్నీ గ్రామాలకు దూరంగా అటవీ ప్రాంతంలోనే ఉన్నాయి. తోటలను సంరక్షించడంపై గిరిజన రైతులు శ్రద్ధ చూపడం లేదు.

▲ 'అటవీ ప్రాంతంలో ఏటా వేసవిలో చెట్లన్నీ ఆకులను రాలుస్తాయి. గిరిజనులు అటవీ ఉత్పత్తుల సేకరణ, వేటకు వెళ్లిన సమయంలో నిప్పు పెట్టడం, చుట్ట, బీడీ కాల్చి ఆర్పకుండా పడేయడం వల్ల అగ్గిరాజుకుని మంటలు చెలరేగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై గిరిజనులకు అటవీ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. శాటిలైట్ ఉపగ్రహ చిత్రాల సాయంతో ముందుగానే అగ్నిప్రమాదాలు సంభవించే ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నా'మని చింతపల్లి డీఎఫ్‌వో నరసింహారావు పేర్కొన్నారు.

పదోన్నతులకు పచ్చజెండా

ఉద్యోగ విరమణకు చేరువలో ఉత్తర్వులు

ఉత్తర్వులు అందుకున్న భాషా పండితులు, వ్యాయామోపాధ్యాయులు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: కల సాకారమైతే ఆ ఆనందమే వేరు. ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపితే ఉద్యోగుల సంతోషం మాటల్లో చెప్పలేం. ఉన్నతీకరణ, పదోన్నతి కోసం ఇన్నాళ్లూ ఎదురు చూసిన ఉపాధ్యాయులకు కూటమి సర్కారు తీపి కబురు చెప్పింది. గిరిజన సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఉన్నతీకరణ, పదోన్నతి ప్రక్రియను పూర్తి చేసింది. ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న వారంతా పదోన్నతులు రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

◗ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎనిమిది ఐటీడీఏల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో భాషా పండితులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు వేలాది మంది పనిచేస్తున్నారు. వీరంతా ఎస్జీటీ హోదాలోనే కొనసాగుతున్నారు. అర్హతలున్నా వీరంతా దశాబ్దాలుగా పదోన్నతులకు నోచుకోలేదు. స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని డిమాండు చేస్తూ వస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దస్త్రం కదిలింది. మంత్రులు నారా లోకేశ్, సంధ్యారాణి చొరవతో పరిష్కారం లభించింది. ప్రస్తుతం ఎక్కడ పని చేస్తున్నారో అక్కడే కొనసాగుతూ పదోన్నతి కల్పించడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 11 మండలాల్లో 118 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 88 మందికి డిప్యూటీ డైరెక్టర్ పదోన్నతులకు సంబంధించి ఉత్తర్వుల పత్రాలు అందజేశారు.

ఉన్నతీకరణ ఉత్తర్వులపై హర్షం..: పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమాల్లో పనిచేస్తున్న భాషాపండితులు, పీఈటీల ఉన్నతీకరణ పత్రాల పంపిణీ దాదాపు పూర్తయిందని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు పరిమళ చెప్పారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితులు, పీఈటీలకు ఉత్తర్వులు అందాయని సంఘ జిల్లా అధ్యక్షుడు రాంబాబు పేర్కొన్నారు.

◗ ఏజెన్సీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు పది మంది వరకు ఉన్నారు. అనుభవం రీత్యా వీరికి అన్ని అర్హతలున్నా.. మూడేళ్లుగా పదోన్నతులకు నోచుకోలేక పోయారు. ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సులు దూర విద్య విధానంలో చేయడంతో పదోన్నతులకు అర్హులు కారని, తమతో సమానంగా పదోన్నతుల ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోవద్దంటూ అప్పట్లో రెగ్యులర్ డిగ్రీ చేసి ఉద్యోగాలు పొందిన వారు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం పదోన్నతుల దస్త్రాన్ని పక్కన పెట్టింది. దీన్ని సవాల్ చేస్తూ పలువురు కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో పదోన్నతి లభించింది. వీరిలో ముగ్గురు ఎంఈవో-1 పోస్టులు పొందగా, ఏడుగురు ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎంలుగా నియమితులయ్యారు.

అంగన్‌వాడీలకు బీమా

జీవన జ్యోతి, సురక్షతో పథకాలతో ధీమా

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మాతాశిశు సంరక్షణలో కీలకంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు బీమాతో ధీమా కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు కాలేదు. అధిక ఆదాయం పొందుతున్నారనే సాకుతో నవరత్న పథకాలకు దూరం చేశారు. అనుకోని ప్రమాదం, అనారోగ్య సమస్యలతో కార్యకర్తలు మృతి చెందితే.. ఎలాంటి సాయం అందేది కాదు. విధుల్లో ఉండి మరణిస్తే కుటుంబసభ్యులకు సాయం అందించడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను వర్తింపజేసేలా కూటమి సర్కారు చర్యలు చేపట్టింది. తద్వారా అంగన్‌వాడీల కుటుంబాలకు బీమా రక్షణ కలుగుతుంది. జిల్లాలో 2,329 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కార్యకర్తలు అందరితో బీమా ప్రీమియం చెల్లించి వారితోపాటు కుటుంబాలకు రక్షణ కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాం పడాల్ చెప్పారు.

▮ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై)కు 18 నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులు. ఏడాదికి రూ.436 బ్యాంకు ఖాతా / తపాలా శాఖ ద్వారా చెల్లిస్తే రూ.2 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగి మృతి చెందినా, సహజ మరణం పొందినా బీమా పరిహారం అందుతుంది.

▮ 18 నుంచి 70 ఏళ్లలోపు వారికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) వర్తింపజేయనున్నారు. ఏడాదికి ప్రీమియంగా రూ.20 చెల్లిస్తే సరిపోతుంది. ప్రమాదవశాత్తు మరణానికే బీమా వర్తిస్తుంది. మృతి చెందినా, పూర్తి వైకల్యం బారిన పడినా రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష అందిస్తారు. ఆటో డెబిట్ ద్వారా బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం చెల్లించవచ్చు.

మినీ జలవిద్యుత్కేంద్రం నిర్మాణంలో కదలిక

జలవిద్యుత్కేంద్రం నిర్మాణ ప్రతిపాదిత ప్రదేశం

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలకు విద్యుత్తు వెలుగులు ప్రసరింపజేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న జోలాపుట్ జలాశయం దిగువన మినీ జలవిద్యుత్కేంద్రం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. జలాశయం దిగువన మూడు జనరేటర్లు, 18 మెగావాట్ల సామర్థ్యంతో మినీ జలవిద్యుత్కేంద్రం ఏర్పాటుకు 1994లో ఒప్పందం కుదిరినా.. కోర్టు కేసులతో ప్రాజెక్టు పట్టాలెక్కలేదు. తాజాగా ఏపీ జెన్‌కో, ఓపీటీసీఎల్ ఒడిశా పవర్ కన్సార్టియమ్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరింది. చిత్రకొండలో నిర్మించే 60 మెగావాట్ల విద్యుత్కేంద్రంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 50 శాతం ఏపీజెన్‌కోకు సరఫరా చేయాలని మరో ఒప్పందం చేసుకున్నారు.

'పది' పరీక్షలకు అంతా పైనుంచే!

ప్రైవేటు ఉపాధ్యాయులకూ ఇన్విజిలేషన్ బాధ్యతలు

పాడేరు, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గతేడాది వరకు ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లను డిజిటల్ విధానంలో నియమించారు. ఈ ఏడాది టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీఐఎస్)లో నమోదు చేసిన ఉపాధ్యాయుల వివరాల ప్రకారం ఇన్విజిలేషన్ విధులు కేటాయించనున్నారు.

▮ పరీక్షల ఇన్విజిలేషన్‌కు తొలిసారిగా గుర్తింపు పొందిన పాఠశాలల నుంచి ప్రైవేటు ఉపాధ్యాయులకూ అవకాశం కల్పించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 80 శాతం, ప్రైవేటు పాఠశాలల నుంచి 20 శాతం మందిని వినియోగించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. లీప్ యాప్ ద్వారా నేరుగా నియామక ఉత్తర్వులు అందించనున్నారు. గిరిజన సంక్షేమ విద్యాశాఖకు చెందిన ఉపాధ్యాయులను విధులకు దూరంగా ఉంచడం గమనార్హం.

▮ ఈ నెల 16 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు జిల్లాలోని 264 పాఠశాలలకు చెందిన విద్యార్థులు 11,457 మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 531 మంది హాజరుకానున్నారు. 72 కేంద్రాలు ఏర్పాటు కాగా, 8 చోట్ల సీసీ కెమెరాలతో నిఘా పెట్టనున్నారు.

▮ మాస్ కాపీయింగ్ జరగకుండా పరీక్షలు సజావుగా జరిగేలా జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇన్విజిలేటర్ల నియామకంలో ప్రభుత్వం సమూల మార్పులు చేసింది. 72 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 72 మంది డిపార్ట్‌మెంట్ అధికారుల నియామకం జరిగింది. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ప్రతి కేంద్రం పర్యవేక్షణకు ఒక సహాయ అధికారిని నియమించినట్లు డీఈవో డాక్టర్ రామకృష్ణారావు చెప్పారు.

దివ్యాంగ విద్యార్థులకు వెసులుబాటు..: జిల్లాలో దివ్యాంగ విద్యార్థులు పరీక్ష రాసేందుకు సహాయకులను నియమించుకునేందుకు బోర్డు అనుమతి ఇస్తోంది. వైకల్యం ఉన్న విద్యార్థులకు ఉత్తీర్ణత మార్కుల్లో మినహాయింపు ఉంది. వినికిడి లోపం ఉన్నవారు తెలుగు, హిందీ, ఆంగ్లంలో ఏదైనా ఒక సబ్జెక్టుకు పరిమితమయ్యేలా వెసులుబాటు కల్పించారు. ఈ పరీక్షల్లో ఏదో ఒకటి రాస్తే చాలు. – శశికుమార్, సహాయ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం

నేటి నుంచి సార్వత్రిక ఇంటర్ పరీక్షలు

పాడేరు న్యూస్‌టుడే: సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో అరకులోయ, చింతపల్లి, పాడేరులలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. దూర విద్యలో ఇంటరు చదువుతున్న 595 మంది పరీక్షకు హాజరు కానున్నారని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రామకృష్ణారావు చెప్పారు. అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 182 మంది, చింతపల్లి జడ్పీ పాఠశాల కేంద్రంలో 273 మంది, పాడేరులోని లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల కేంద్రంలో 140 మంది పరీక్ష రాయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించొద్దు

1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయండి

వైద్య సిబ్బంది సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఉన్నతాధికారులకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకోసం ప్రభుత్వం టోల్‌ఫ్రీ నంబరు 1100ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పీహెచ్‌సీల నిర్వహణ, సిబ్బంది అనుచిత ప్రవర్తన, జనన, మరణాల నమోదు, కుటుంబ ఆరోగ్య సర్వీసులు, వ్యాధి నిరోధక టీకాలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడంలో నిర్లక్ష్యంపై 24 గంటల్లో ఎప్పుడైనా ఫోన్ చేయవచ్చు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారమూ ఈ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. – న్యూస్‌టుడే, డుంబ్రిగుడ

చక్కని కోర్సులు.. మెచ్చిన ఉపాధి..!

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాధారణ డిగ్రీలు, పీజీలు చేస్తే ఉద్యోగాలు దొరకని పరిస్థితి. వాటికి అనుబంధంగా వృత్తివిద్యా కోర్సులను నేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ చదవలేని విద్యార్థులకు విశాలాక్షినగర్‌లోని దయాల్బాగ్ విద్యాకేంద్రం ఆధ్వర్యంలో తక్కువ ఫీజుతో శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా యువత, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని కోర్సుల సమన్వయకర్త దక్షిణామూర్తి తెలిపారు.

స్క్రీన్ ప్రింటింగ్

ఎనిమిదో తరగతి విద్యార్హత. కోర్సుల కాల వ్యవధి మూడు నెలలు. టీషర్టులు, బ్యాగులు, గ్లాస్, మెటల్‌పై స్టిక్కర్లు వేయడం నేర్పిస్తారు. కలర్ ప్రిపరేషన్‌లో మెలకువలు, కెమికల్స్ వాడకంలో శిక్షణ అందిస్తారు. తయారు చేసిన ఉత్పత్తులను ఏవిధంగా మార్కెట్ చేయాలి, యూనిట్ స్థాపనకు ఎలా సిద్ధం కావాలో సూచనలు ఇస్తారు.

వాహనాల మరమ్మతులు

యమహా, మారుతీ సంస్థల సహకారం, పర్యవేక్షణలో పదోతరగతి విద్యార్హతతో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహన మరమ్మతుల కోర్సులో శిక్షణ ఇస్తున్నారు. ఏడాది శిక్షణ అనంతరం యమహా, మారుతీ కార్ల షోరూంలలో ఉద్యోగాలు కల్పిస్తున్నారు.

డిప్లమో ఇన్ ఎలక్ట్రానిక్స్

పదో తరగతి విద్యార్హత. కోర్సు కాల వ్యవధి మూడేళ్లు. ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్‌లలో 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 90శాతం మందికి పూర్వ విద్యార్థుల సంఘం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి.

దయాల్బాగ్ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ

యువత, మహిళల సాధికారతకు పెద్దపీట

శిక్షణకు హాజరైన మహిళలు

చరవాణి రిపేర్

పదో తరగతి విద్యార్హత. ఏడాది వ్యవధి గల ఈ కోర్సులో స్మార్ట్ ఫోన్ మరమ్మతులు, నిర్వహణలో శిక్షణ ఇస్తారు. అలాగే సాఫ్ట్‌వేర్ ట్రబుల్ షూటింగ్‌లో మెలకువలు నేర్పిస్తారు. ఇప్పటి వరకు మూడు బ్యాచ్‌లలో 60 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా 40 మంది సెల్‌ఫోన్ మరమ్మతు దుకాణాలు ఏర్పాటు చేసుకోగా, మిగిలిన వారికి షోరూంలలో ఉద్యోగాలు లభించాయి.

ఆఫీస్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్

ఇంటర్మీడియట్ విద్యార్హత. కోర్సు వ్యవధి ఏడాది. కంప్యూటర్ బేసిక్స్, టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, టాలీ, షార్ట్ హ్యాండ్, జావాలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

ఆటపాటల ఉదయం.. ఆరోగ్య దేహం!

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో ఫిట్ ఇండియా పేరుతో సైకిల్ థాన్ నిర్వహించారు. వేలాది మంది యువత పాల్గొని సందడి చేశారు. ప్రారంభంలో జరిగిన జుంబా నృత్యాల్లో యువత హుషారు మిన్నంటింది. కరాటే, స్కిప్పింగ్ తదితర క్రీడాంశాల్లో బాలలు విన్యాసాలు అలరించాయి. – ఈనాడు, విశాఖపట్నం

మెడ్‌టెక్ జోన్‌లో 'జీనోమ్ సీక్వెన్సింగ్'

పరవాడ, న్యూస్‌టుడే: దేశంలో ప్రాణాంతక వ్యాధులను నయం చేసేందుకు వీలుగా మెడ్‌టెక్ జోన్‌లో జీనోమ్ సీక్వెన్సింగ్ సెంటర్ ఏర్పాటుకు తొలి అడుగు పడింది. ఈ కేంద్రం ఏర్పాటుకు వీలుగా బయోవ్యాలీ, 4బేస్‌కేర్, డిఫైన్ బయో లిమిటెడ్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఆయా సంస్థలు సంయుక్తంగా జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం బయోస్పియర్ పేరిట సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయనున్నాయి. తద్వారా వైద్యులు, విద్యాసంస్థలు, పరిశ్రమ భాగస్వాములు, వివిధ అంకుర సంస్థలు పరిశోధన చేయడానికి అవకాశం లభిస్తుంది. ఔత్సాహిక శాస్త్రవేత్తలు, వ్యవస్థాపకులకు శిక్షణ ఇవ్వడానికి ఒక వేదికగా పని చేస్తుంది. ఈ సందర్భంగా 4బేస్ కేర్ సహ వ్యవస్థాపకులు హితేష్ గోస్వామి మాట్లాడుతూ దేశంలో బయోటిక్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి కీలక అడుగు పడినట్లు పేర్కొన్నారు. అధునాతన జన్యుశాస్త్ర నైపుణ్యం, ఇంక్యుబేషన్ మద్దతు, పరిశోధన సామర్థ్యాలు ఒకేచోట అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రాణాంతక వ్యాధులకు కచ్చితమైన వైద్య పరిష్కారాలు చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బయోవ్యాలీ సీఈవో డాక్టర్ సుశీల బ్రన్హామ్ మాట్లాడుతూ ఈ కేంద్రం ఏర్పాటుతో దేశంలో తదుపరి తరం జన్యు సంబంధ పర్యావరణ వ్యవస్థ నిర్మాణం, జన్యు సంబంధ ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

మార్చి 8.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం. ఈ సందర్భంగా మహిళల భద్రత, సాధికారతపై పోలీసులు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముంచంగిపుట్టులో పోలీసుల ఆధ్వర్యంలో బాలికలు ర్యాలీ చేశారు.

వివరాలు.. 7లో..

మామిడి అల్లానికి గిరాకీ

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: మామిడి అల్లానికి ఈ వారం ధర పెరిగింది. మామూలు అల్లానికి భిన్నంగా ఉండే ఈ అల్లం మైదాన ప్రాంతాల్లోని రెస్టారెంట్లు, జ్యూస్ స్టాళ్లలో విరివిగా వాడుతుంటారు. ఈ అల్లం కోసం ఇతర ప్రాంతాల నుంచి గిరాకీ పెరిగింది. దీంతో ఈవారం ధర రెట్టింపయింది. అరకులోయ- ఒడిశా సరిహద్దు గ్రామాలకు చెందిన రైతులు ఆదివారం సుంకరమెట్ట వారపు సంతకు పెద్దఎత్తున తీసుకువచ్చి విక్రయాలు చేపట్టారు. కిలో రూ.50కు మైదాన ప్రాంత వ్యాపారులు కొనుగోలు చేశారు. కొద్దిరోజుల క్రితం కిలో రూ.30 లోపు ధర ఉండగా.. ప్రస్తుతం ధర పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

సింహాద్రి అప్పన్నకు రేపు పెళ్లిచూపులు

సింహాచలం, న్యూస్‌టుడే

శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి దేవాలయంలో ఏటా జరిగే ప్రధాన ఉత్సవాలకు తొలి అడుగు పడనుంది. ఫాల్గుణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 3న సింహాద్రి అప్పన్న స్వామి డోలోత్సవం సంప్రదాయబద్ధంగా జరగనుంది. ఆ రోజు స్వామివారి సోదరీమణి, అడివివరం గ్రామ దేవత శ్రీపైడితల్లి అమ్మవారి కుమార్తెతో పెళ్లిచూపులు జరుగుతాయని విశ్వసిస్తారు. స్వామివారి కల్యాణోత్సవాలకు ముందు జరిగే ఈ ఉత్సవం కోసం గ్రామీణ భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తారు.

సింహగిరిపై నుంచి తరలిరానున్న స్వామి..: డోలోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై నుంచి స్వామివారు దేవేరుల సమేతంగా కొండ దిగువన పుష్కరిణి ఉద్యాన మండపానికి తరలివస్తారు. వేకువజామున 1 గంటకే అర్చకులు ఆలయంలో సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు నిర్వహించి చూర్ణోత్సవం నిర్వహిస్తారు. అనంతరం 4 గంటలకు సపరివార సమేతంగా పల్లకీలో కొండ దిగువకు స్వామిని తీసుకువస్తారు. ఉద్యాన మండపంలో స్వామిని ఉయ్యాలలో అధిష్ఠింపజేసి డోలోత్సవం జరిపిస్తారు. చూర్ణోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తారు. సింహాద్రినాథుడికి పెళ్లి కుదిరిన సందర్భంగా ఆలయ ఉద్యోగులు, గ్రామస్థులు సంతోషంతో రంగులు చల్లుకుని సంబరాలు చేస్తారు. ఉదయం 6 గంటలకు స్వామి, అమ్మవార్ల గ్రామ తిరువీధి వేడుకగా జరుగుతుంది.

ఉత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు..: డోలోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై నుంచి స్వామి, అమ్మవార్లు కొండ దిగువకు తరలిరానున్న నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో జె.వెంకటరావు తెలిపారు. ఆదివారం సింహగిరిపై విభాగాధిపతులతో సమావేశమయ్యారు. ఉత్సవం పూర్తయ్యే వరకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఇంజినీరింగ్ పనులపై సమీక్షించారు. మార్చి నెలాఖరు నాటికి అన్ని నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని సూచించారు.

విభాగాధిపతులకు సూచనలిస్తున్న ఈవో వెంకటరావు

చంద్రగ్రహణం సందర్భంగా దర్శనాలు నిలిపివేత..: ఈ నెల 3న చంద్రగ్రహణం సందర్భంగా అప్పన్న స్వామి దర్శనాలు లభించవని ఈవో జె.వెంకటరావు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3.21 గంటలకు గ్రహణం సంభవించి సాయంత్రం 6.49 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఆ రోజంతా స్వామివారి దర్శనాలు భక్తులకు లభించవని, ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

(c) eenadu

రోగి భద్రతలో స్టెరైల్ ప్రాసెసింగ్ కీలకం

ఇషాకన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ జితేంద్రశర్మ తదితరులు

పరవాడ, న్యూస్‌టుడే: విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో ఇండియన్ స్టెరైల్ హెల్త్ కేర్ అసోసియేషన్(ఇషా) ఆధ్వర్యంలో 8వ జాతీయ శాస్త్రీయ సదస్సు ఇషాకన్-2026ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్టెరైల్ ప్రాసెసింగ్ భవిష్యత్తు, ఆవిష్కరణ, ధోరణులు అనే థీమ్‌తో నిర్వహించిన ఈ సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. స్టెరైల్ ప్రాసెసింగ్ సహాయక చర్య మాత్రమే కాదని రోగి భద్రత, ఇన్ఫెక్షన్ నివారణ, మెరుగైన క్లినికల్ ఫలితాలు కీలకమని పేర్కొన్నారు. డానిష్ సొసైటీ ఫర్ పేషెంట్స్ సేఫ్టీ సీఈవో ఇంగే క్రిస్టెన్సెన్ మాట్లాడుతూ అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, సురక్షితమైన, అధిక నాణ్యత గల ఆరోగ్య సంరక్షణ అందించడానికి స్టెరైల్ ప్రాసెసింగ్ సాంకేతికత, శిక్షణ వృత్తిపరమైన ప్రమాణాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విశాఖ జోన్‌కి చెందిన సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో పన్ను చెల్లింపుదారుల పాత్ర కీలమన్నారు. జీఎస్టీ.. పన్ను విధానం మాత్రమే కాదని దేశాభివృద్ధికి సమష్టి సహకారమన్నారు. పారిశ్రామికవేత్తలు జీఎస్టీ చెల్లించి పరోక్షంగా మౌలిక సదుపాయాల వృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఎంతో సహకరిస్తున్నట్లు చెప్పారు. 2017లో 65లక్షలుగా ఉన్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య 2025నాటికి 1.51 కోట్లకు పెరిగిందన్నారు. ఇండియన్ స్టెరైల్ హెల్త్‌కేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కెప్టెన్ బాబన్‌రాయ్ మాట్లాడుతూ స్టెరైల్ ప్రాసెసింగ్ భవిష్యత్తు.. ఆటోమేషన్, కృత్రిమ మేధ, డిజిటల్ ట్రాకింగ్, అధునాతన సాంకేతికతపై ఆధారపడి ఉంటుందన్నారు. మెడ్‌టెక్ జోన్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ సంక్లిష్టమైన ప్రక్రియ గనుక సరైన భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. దేశంలోనే తొలిసారిగా మెడ్‌టెక్ జోన్‌లో స్టెరిలైజేషన్ టెక్నాలజీ అకాడమీని స్థాపించినట్లు చెప్పారు.

ఉపమాక వెంకన్నపై తొలిపాట రచన

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్నను కీర్తిస్తూ తొలిపాటను రచించగా, దీన్ని ఆదివారం రాత్రి ఆలయం వద్ద ఆవిష్కరించారు. అష్టావధాని, కవి డాక్టర్ గొట్టిముక్కల గాయత్రీదేవి ఈ పాట రచించారు. దీన్ని తితిదేకు చెందిన డోలు విద్వాంసుడు స్వరపరిచారు. ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆలయం వద్ద పీఏసీఎస్ అధ్యక్షుడు కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పాటద్వారా ఆలయ విశిష్టత భక్తులకు మరింత చేరువ అవుతుందన్నారు. భక్తితత్వం పెరుగుతుందన్నారు. అనంతరం రచయిత్రి, స్వరకర్తను అభినంది సత్కరించారు. స్వరకర్తకు ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో తితిదే అధికారులు, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు క్రాంతికుమార్, సత్యనారాయణ, డీవీ రామారావు పాల్గొన్నారు.

బాధితులకు అండగా.. సాయపడిన వారికి తోడుగా

★ క్షతగాత్రులకు రూ.1.25లక్షల వరకు అత్యవసర ఉచిత కార్పొరేట్ వైద్యం
★ సాయపడిన వారికి రాహ్ వీర్ పురస్కారం రూ. 25వేలకు పెంపు

నక్కపల్లి, న్యూస్‌టుడే: తెల్లారిలేస్తే ప్రమాదం జరగని రోజంటూ ఉండడం లేదు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల్లో తీవ్రగాయాలతో సకాలంలో వైద్యం అందక మరణిస్తున్నవారి సంఖ్య అధికంగానే ఉంటోంది. క్షతగాత్రులను తొలి గంటలోగా (గోల్డెన్ అవర్) ఆసుపత్రికి తీసుకెళ్లగలిగితే ప్రాణాలు నిలిపిన వారవుతారు. ఇలా సాయమందించిన వారికి కేంద్రం రాహ్ వీర్ కింద నగదు పురస్కారం ఇవ్వడమే కాదు, క్షతగాత్రులకూ అత్యవసర ఉచిత వైద్యం అందనుంది.

జిల్లాలో 65 కిలోమీటర్ల పరిధిలో జాతీయ రహదారి ఉండగా, రాష్ట్ర, గ్రామీణ ప్రాంత రహదారులు దీనికి అదనం. వీటి పరిధిలో జరిగే ప్రమాదాల్లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడానికి ముందుకు వచ్చేది అంతంతమాత్రమే. సాయమందిస్తే పోలీసులు స్టేషన్‌కు పిలిపిస్తారని, కోర్టుల వెంట తిప్పుతారనే భయం చాలామందిలో ఉండటమే దీనికి కారణం. ఫలితంగా ఆసుపత్రికి తరలించే ప్రక్రియలో జాప్యం జరిగి అనేక మంది మృత్యువాత పడతున్నారు. ఈ జాప్యాన్ని అరికట్టేందుకు కేంద్రం రాహ్ వీర్ పథకం తెచ్చింది. గతేడాది జిల్లాలో 649 ప్రమాదాలు జరిగితే, 308 మంది మరణించారు. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నవారి సంఖ్య ఆందోళనకరంగా ఉండటంతో ప్రజల్లో చైతన్యం తెచ్చి గాయపడిన వారిని రక్షించేందుకు కేంద్రం మూడేళ్ల క్రితం గుడ్ సమారిటన్ తెచ్చి,

క్షతగాత్రుల తరలింపు (పాత చిత్రం)

తాజాగా దీన్ని రాహ్ వీర్‌గా మార్పు చేసింది.
★ రోడ్డు ప్రమాద క్షతగాత్రుడిని గోల్డెన్ అవర్ లోగా ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడితే ఎవరైనా కృషి చేసినట్టు వైద్యులుగాని, పోలీసులుగాని ధ్రువీకరిస్తే సదరు వ్యక్తికి రూ. 25వేల బహుమతి, ప్రశంసా పత్రం ఇవ్వాలని కేంద్రం ప్రకటించింది. ఇటీవల వరకు ఇది రూ. 5వేలు మాత్రమే ఉండేది. ★ ప్రమాదాల్లో ద్విచక్ర వాహన ప్రమాదాల్లో గాయపడిన వారిలోనే ఎక్కువ మంది మరణిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి ప్రమాదాల్లోనే జిల్లాలో గతేడాది 220మంది వరకు మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.
★ తీవ్రంగా గాయపడిన వారిని ఏ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినా ఎలాంటి షరతులు లేకుండా రూ. 1.5లక్షల విలువైన వైద్యాన్ని అందించాలని కేంద్రం ఆదేశించింది. ఈ మొత్తం ఆసుపత్రికి కేంద్రం చెల్లిస్తుంది. దీని ద్వారా క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లడమే కాదు, ప్రాణ రక్షణకు దోహదం చేస్తుంది. ప్రస్తుతం ముమ్మర ప్రచారానికి సిద్ధమవుతున్నారు.

విస్తృత ప్రచారం: రాహ్ వీర్ పురస్కారాన్ని కేంద్రం భారీగా పెంచింది. దీనిపై వైద్యులు, పోలీసు అధికారులతో సమావేశమై క్షతగాత్రులను తరలించి ప్రాణాలు కాపాడే వారికి అందించే పురస్కారం కోసం వివరించాం. దీనిపై ప్రజలకు కరపత్రాలు ముద్రించి విస్తృత ప్రచారం చేయిస్తున్నాం. అంతే కాకుండా తీవ్రంగా గాయపడిన వారికి ఎలాంటి షరతు లేకుండా ఏ ఆసుపత్రిలోనైనా రూ. 1.50 లక్షల వరకు ఉచిత చికిత్స చేయాలి. దీనికి సంబంధించి ఆసుపత్రులకు సర్క్యులర్ సిద్ధం చేస్తున్నాం. అతి త్వరలోనే ఇది అమలుకానుంది. క్షతగాత్రులకు తక్షణ సాయమనేది ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలి.
- మనోహర్, జిల్లా రవాణాశాఖ అధికారి

నేటి నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి పాత జైలు రోడ్డులోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐఓ పి.మురళీధర్ తెలిపారు. మొదటి రోజు సంస్కృతం జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ ఎగ్జామినర్లు మధ్యాహ్నం ఒంటి గంటకు మూల్యాంకనం నిర్వహించే కేంద్రానికి హాజరు కావాలని సూచించారు.

లింగంపేటలో ఆక్రమణల తొలగింపు

నాతవరం, న్యూస్‌టుడే: పలు వివాదాల మధ్య లింగంపేట గ్రామ కంఠంలో ఆక్రమణలను పోలీస్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా తొలగించారు. ఇక్కడ సర్వే నంబరు 46లో 12 సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకుని పక్కా భవనం నిర్మించుకున్నారని ప్రజావేదికలో ఫిర్యాదు చేయడంతో రీసర్వే చేయించి వైనంపై ఉమ్మడి సర్వే చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆక్రమణలు తొలగించి పంచాయతీకి స్థలాన్ని అప్పగించారు. ఇందులో త్వరలోనే పంచాయతీ భవనం నిర్మాణం చేయనున్నారు.

సైబర్ 'వేషాలు'.. నిలువెత్తు మోసాలు

ఈనాడు-విశాఖపట్నం, మధురవాడ-న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రధానంగా డిజిటల్ అరెస్టు, మనీ లాండరింగ్, హవాలా కేసుల పేరుతో భయభ్రాంతులకు గురి చేసి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. జిల్లాలో విశాఖ నగరంలో సైబర్ మోసాల బారిన పడిన బాధితుల్లో ఎక్కువ మంది వృద్ధులే ఉన్నారు.

హవాలా, మనీలాండరింగ్ పేరుతో బెదిరింపులు

విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులే బాధితులు

నగరంలో సైబర్ కేసులు ఇలా..	ఏడాది	కేసులు	రికవరీ (రూ.కోట్లలో)
	2023	409	1.10
	2024	374	3.89
	2025	286	14.64

అరెస్టయిన సైబర్ నేరగాళ్లు

2024	2025
160	205

ఇటీవల జరిగిన ఘటనలు..

1 ★ సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన 67ఏళ్ల విశ్రాంత ప్రొఫెసర్ పేరిట నకిలీ ఏటీఎం కార్డు సృష్టించారు. ఆ కార్డుకు, డ్రగ్స్ కేసుకు సంబంధం ఉందని బెదిరించి రూ.1.05కోట్లు కాజేశారు.

2 ★ నగరానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగికి గుర్తు తెలియని వ్యక్తి మహారాష్ట్ర డీజీ పేరుతో ఫోన్ చేశారు. మనీలాండరింగ్ కేసులో మీ బ్యాంకు ఖాతాను గుర్తించామని, సుప్రీంకోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిందని భయపెట్టి రూ.66లక్షలు దోచేశారు.

3 ★ రుషికొండ ప్రాంతానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగికి సైబర్ మోసగాళ్లు ఫోన్ చేసి హవాలా లావాదేవీల్లో మీ బ్యాంకు ఖాతా గుర్తించామని, రూ.1.60కోట్లు ఇస్తే పేరు తొలగిస్తామని నమ్మించి నగదును ఖాతాకు జమ చేయించుకున్నారు.

4 ★ ఎంవీపీ కాలనీలోని ఓ వృద్ధురాలిని సైతం హవాలా కేసు పేరుతో బెదిరించి రూ.8.50లక్షలు కొట్టేశారు.

చాకచక్యంగా స్పందించాలి: స్కామర్లు వీడియోకాల్‌లో పోలీస్ యూనిఫాం వేసుకుని మాట్లాడతారు. వాస్తవంగా పోలీసులు అలా మాట్లాడరు. అరెస్టు అనేది చట్టపరమైన ప్రక్రియ. అర్జెంటుగా డబ్బు జమ చేయాలని అడిగారంటే వెంటనే అనుమానించాలి. ఇటీవల నగరంలో డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ హెడ్ నర్సును బెదిరించి రూ.50లక్షలు డిమాండ్ చేశారు. ఆమె బ్యాంకుకు వెళ్లి ఆ డబ్బులు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. బ్యాంకు మేనేజర్ బాధితురాలి ఆందోళన గమనించి, వివరాలు తెలుసుకుని సీపీకి ఫిర్యాదు చేయడంతో సైబర్ డొంకకు అడ్డుకట్ట పడింది.

బాధితులు ఈ నెంబరుకు ఫోన్ చేయాలి..

మోసపోయామని గుర్తించిన గంటలోపు బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి చెప్పాలి. స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. వెంటనే పోలీసులు ఖాతాలోని నగదును ఫ్రీజ్ చేస్తారు. తర్వాత ఆ నగదు బాధితులకు తిరిగి అందేలా చూస్తారు.

సైనిక్ పాఠశాల ప్రవేశ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

కుషాల్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

హేమచంద్ర

ఇలేష్

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: సైనిక్ పాఠశాలల్లో ఆరు, తొమ్మిది తరగతుల ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆరోతరగతి ప్రవేశానికి పరీక్ష రాసిన అనకాపల్లికి చెందిన యల్లపు కుషాల్ 285/300 మార్కులు సాధించి ఆల్ ఇండియాలో 116 ర్యాంక్ సాధించాడు. తమ కుమారుడు మెరుగైన ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు యల్లపు శ్రీనివాసరావు, రేవతి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. రాసిన పట్టణానికి చెందిన వెలంగాయల హేమచందర్ 364/400 మార్కులు సాధించి ఆలిండియా 142 ర్యాంక్ సాధించాడు. విద్యార్థి ప్రతిభ పట్ల తల్లిదండ్రులు దుర్గలక్ష్మి, గోవిందలతో పాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు ఎ.సాయిబాబా సంతోషం వ్యక్తం చేశారు.

అచ్యుతాపురం: అచ్యుతాపురంలోని భవాని విద్యానికేతన్‌లో అయిదో తరగతి చదువుతున్న చెంచెంగి ఇలేష్ సైనిక పాఠశాలలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సంతోష్, డైరెక్టర్ శ్రీలత చెప్పారు. ప్రవేశ పరీక్షలో 300 మార్కులకు 234 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు కుంద్రపు మూర్తిప్రసాద్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు, చెంతలో మాజీ ఎంపీ చలపతిరావు తదితరులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయాలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఎలమంచిలి తెదేపా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిరుద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా రెండు సార్లు వీరికి వేతనాలు పెంచారన్నారు. అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పెంచామన్నారు. ప్రతి కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారన్నారు. వీరి డిమాండ్లలో తొమ్మిది ఇప్పటికే కూటమి ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, పట్టణపార్టీ అధ్యక్షులు గొర్లె నానాజీ ఆడారి ఆదిమూర్తి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధర లేక తోటల తొలగింపు

డొంకాడ వద్ద తొలగించిన టమాటా మొక్కలతో రైతులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: టమాటా ధర పతనమై పోవడంతో రైతులు నష్టాలబాట పడుతున్నారు. ఈ క్రమంలో నక్కపల్లి మండలం డొంకాడలో కొందరు రైతులు తమ తోటలు తీసేస్తున్నారు. ప్రస్తుతం క్రేటు (సగటు బరువు 28 కేజీలు) విక్రయిస్తే కేవలం రూ.100 మాత్రమే లభిస్తుంది. కూలీలను పెట్టి టమాటాలు ఏరేందుకు రూ.600 చెల్లిస్తున్నారు. వీరు ఒకరోజులు సేకరించిన పంటను విక్రయిస్తుంటే రూ. 500 మాత్రమే వస్తోందని రైతులు చెబుతున్నారు. నష్టం వస్తుండటంతో కొందరు రైతులు పొలాల్లో టమాటా తోటలు తొలగించారు. గ్రామంలో సుమారు 100 ఎకరాల వరకు తోటలున్నాయని, ఇప్పటికే పలువురు తొలగించారని, గ్రామానికి చెందిన రైతు శ్రీను తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భగీరథీ ఆలయం వద్ద..

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మండలంలోని హరిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో భగీరథి ఆలయం వద్ద ఆదివారం సమావేశమయ్యారు. కుటుంబ సభ్యులతో హాజరై ఆటపాటలతో సాయంత్రం వరకు సందడి చేశారు. పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
☛ కొండకర్ల ఆవ వద్ద అచ్యుతాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. పాఠశాల అభివృద్ధికి కృషిచేద్దామని నిర్ణయం తీసుకున్నారు. ప్రతిఏటా కలుస్తూ ఉండాలని నిర్ణయించుకున్నారు. మద్దెల నానాజీ, ద్వారపురెడ్డి బాబ్జీ, సత్తిబాబు, గోవాడ నాయుడు, హరికృష్ణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

కొండకర్ల ఆవ వద్ద 1994-95 బ్యాచ్ విద్యార్థులు

పరీక్షలకు మిగిలింది రెండు వారాలే

పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈఓ

నక్కపల్లి, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షలు ప్రారంభానికి ఇంకా రెండు వారాల గడువే ఉంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ పెట్టాలని డీఈఓ గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. వేంపాడు, ఉద్దండపురం ఉన్నత పాఠశాలలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు.

సమన్వయంతో పనిచేయండి

నెహ్రూచౌక్ (అనకాపల్లి): సోమవారం నుంచి నిర్వహించనున్న సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్ పరీక్షల నిర్వహణకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని డీఈఓ గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందు చేరుకోవాలన్నారు. ఇన్విజిలేటర్లు పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకురాకుడదన్నారు

విద్యావంతులతోనే అభివృద్ధి సాధ్యం

మాట్లాడుతున్న సీఆర్ఎం అధినేత మాపూరి వెంకట రమణ

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఏ ప్రాంతమైనా, కుటుంబమైనా విద్యావంతులతోనే అభివృద్ధి చెందుతుందని సీఆర్ఎం సంస్థల అధినేత మాపూరి వెంకట రమణ పేర్కొన్నారు. సత్యనారాయణపురం పంచాయతీ సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో ఆదివారం చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి దేవాంగ కుటుంబాల ఆత్మీయ సమారాధన, సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఆర్ఎం సంస్థలు వ్యాపార అభివృద్ధితోపాటు సేవా కార్యక్రమాలు పెంచుకుంటూ వస్తున్నాయన్నారు. ఉప్పు సత్యనారాయణ, శీలా వెంకట రమణారావు, కొమ్మన లక్ష్మణరావులు మాట్లాడారు. సంఘ గౌరవాధ్యక్షులు ముప్పన వ్యాపార సంస్థల అధినేత ముప్పన సుబ్రహ్మణ్యం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి వరప్రసాద్, బూడిద నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని.. అలరిస్తుంది'

కార్యక్రమంలో పాల్గొన్న లయ, శివాజీ

విశాఖపట్నం, న్యూస్‌టుడే : 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' చిత్రం అన్ని వర్గాలను అలరిస్తుందని కథానాయకుడు శివాజీ అన్నారు. ఆదివారం చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా హోటల్ దసపల్లా ఎగ్జిక్యూటివ్ కోర్టులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివాజీ మాట్లాడారు. ఈనెల 6న విడుదలయ్యే చిత్రాన్ని ప్రతి ఒక్కరూ థియేటర్‌లో చూసి, ఆదరించాలని కోరారు. సినిమాలో ఆఖరి 45 నిమిషాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటుందన్నారు. ఓవైపు సినిమాలు చేస్తూనే, మరోవైపు ప్రజా సమస్యలపై స్పందిస్తుండడంతో ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, గతంలో రాజధాని అమరావతి కోసం మాట్లాడానని శివాజీ అన్నారు. హీరోయిన్ లయ మాట్లాడుతూ... సినిమాలో ఊహించని ట్విస్ట్‌లు ప్రేక్షకులను అలరిస్తాయన్నారు. విశాఖతో ఎంతో అనుబంధం ఉందని ఆమె గుర్తు చేసుకున్నారు.

'పాత పింఛను పునరుద్ధరించాలి'

ఆందోళనలో ప్రభుత్వ ఉద్యోగులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛను పథకాన్ని రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పింఛనుపథకం ఉద్యోగుల సంఘం ఐక్యవేదిక ఛైర్మన్ కేఆర్.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ ఉద్యోగులు 'సాగరఘోష' పేరిట జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ...సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం ఓపీఎస్ మాత్రమే అన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. సంఘం అధ్యక్షుడు బాజీపఠాన్ మాట్లాడుతూ... ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు. ఇదే డిమాండ్‌తో కార్మిక దినోత్సవం సందర్భంగా కడపలో ప్రభుత్వ ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహిస్తారని స్పష్టం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్, నాయకులు కేదారేశ్వరరావు, అప్పలనాయుడు, జి.మురళీ, ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఒకరి మృతి

ఆరుగురికి గాయాలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు మండలంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా.. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కినపర్తి పంచాయతీ వల్సంపేటకు చెందిన చెదల గణేష్ (27) అదే పంచాయతీ గాదిగుమ్మిలో బంధువు పొత్తూరు దేముడు ఇంట్లో ఉంటున్నాడు. గాదిగుమ్మి నుంచి రామరాజుపాలెం బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా టోల్‌గేట్ వద్ద బైక్ అదుపు తప్పి ఇనుప స్తంభాన్ని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడ్ని ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడని స్థానికులు చెప్పారు. గణేష్ తల్లిదండ్రులు పదేళ్ల కిందట మృతి చెందడంతో దేముడు ఇంటి వద్ద ఉంటున్నాడన్నారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు.

చింతాలమ్మ ఘాట్‌రోడ్డులో..

రాజేంద్రపాలెం వీఆర్వో సత్యనారాయణ కుమారుడు రవికిరణ్‌తో కలిసి బైక్‌పై కృష్ణదేవిపేట వెళ్తుండగా చింతాలమ్మ ఘాట్‌రోడ్డులో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. కృష్ణదేవిపేట నుంచి వేగంగా వస్తున్న కారు మలుపులో ఇనుప బడ్డీని ఢీకొని ఆ వెంటనే బైక్‌ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన ఇద్దర్నీ 108 వాహనంలో కృష్ణదేవిపేట పీహెచ్‌సీకి, ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని..

సీలేరు, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలం డి.కొత్తూరు వద్ద ఆదివారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. చింతపల్లి మండలం అసరాడ నుంచి ముగ్గురు యువకులు పెళ్లికార్డులు ఇవ్వడానికి గూడెంకొత్తవీధి మండలంలోని డి.కొత్తూరుకు ఆదివారం వచ్చారు.

సంఘటనా స్థలంలో గణేష్ మృతదేహం

తిరుగు ప్రయాణంలో డి.కొత్తూరు సమీపంలో.. కొంగపాకలు నుంచి డి.కొత్తూరు వస్తున్న బైక్‌ను ఢీకొన్నారు. రెండు ద్విచక్రవాహనాలు బలంగా ఢీకొట్టడంతో అసరాడకు చెందిన నర్సింగ్, కార్తిక్, బాలరాజు, కొంగపాకలకు చెందిన ప్రకాశం తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ధారకొండ పీహెచ్‌సీకి తరలించగా.. అక్కడ వైద్యసేవలు అందించి మెరుగైన వైద్యసేవల కోసం చింతపల్లి సామాజిక ఆసుపత్రికి తరలించారు.

ముంచుకొచ్చిన మృత్యువు

★ పశువుల షెడ్డు నిర్మిస్తుండగా విద్యుదాఘాతం ★ ఇద్దరు మృతి

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెం గ్రామంలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి గురై ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ ఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. షెడ్డు నిర్మాణానికి జేసీబీతో స్తంభాన్ని నిలబెట్టే క్రమంలో పైనున్న 11 కేవీ విద్యుత్ తీగలకు తాకడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇసకలపాలెం గ్రామానికి చెందిన కాళ్ల సూరీడు (70), కుమారుడు సూరిబాబు (46) కళ్లం వద్ద పాత స్తంభాలు సేకరించి పశువుల షెడ్డు నిర్మిస్తున్నారు. తాపీ మేస్త్రి కంటుబోతు శ్రీను (36) స్తంభాలు నిలబెట్టడానికి వెళ్లారు. మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో చివరి స్తంభం జేసీబీతో నిలబెట్టే క్రమంలో పైనున్న 11 కేవీ విద్యుత్ తీగలకు తాకడంతో దాన్ని పట్టుకొని నిల్చొని ఉన్న ముగ్గురూ తుళ్లిపడ్డారు. సూరీడు, శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా సూరిబాబు గాయాలతో బయటపడ్డాడు. అక్కడున్న ఇద్దరు యువకులు స్పందించి సీపీఆర్ చేసి బతికించే ప్రయత్నం చేయగా అప్పటికే ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన సూరిబాబును చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

సూరీడు (పాతచిత్రం) శ్రీను (పాతచిత్రం)

★ బతుకుదెరువు కోసం వచ్చి..: విద్యుదాఘాతంతో మృతి చెందిన తాపీ మేస్త్రి కంటుబోతు శ్రీను స్వస్థలం విజయనగరం జిల్లా డెంకాడ మండలం గుండాలపేట గ్రామం. బతుకుదెరువు కోసం 13 ఏళ్ల క్రితం పద్మనాభం వచ్చి స్థిరపడ్డారు. కృష్ణాపురం జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. భార్య రాజు (35), కుమార్తె మాధురి (14), కుమారుడు పవన్ సాయి (12) ఉన్నారు. అందరితో చనువుగా ఉండేవాడు. శ్రీను కుమార్తె పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఆయన మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ★ కాళ్ల సూరీడుకు భార్య కనకం, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఒక పక్క భర్త విగతజీవిగా పడి ఉండగా.. మరో పక్క కొడుకు సూరిబాబు గాయాలపాలై ఆసుపత్రిలో ఉండటంతో కనకం రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది.

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రమాదానికి కారణమైన స్తంభం

చెరువుల సుందరీకరణకు చర్యలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: చెరువుల సుందరీకరణ, పునరుజ్జీవానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. చెరువుల్లో ఎల్లప్పుడూ నీరు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి అల్లూరి జిల్లాలో కొయ్యూరు మండలంలోని బాలారం, రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేట, గంగవరం మండలంలోని ముల్లేరు చెరువుల సుందరీకరణకు వాటర్ షెడ్ పథకంలో నిధులు మంజూరయ్యాయి. ఒక్కో చెరువు అభివృద్ధికి రూ.50 లక్షల చొప్పున కేటాయించారు. గట్టుపై వాకింగ్ ట్రాక్, ప్రధాన ద్వారం, చిల్డ్రన్ పార్క్, ఓపెన్ జిమ్, సోలార్ దీపాలు, సిమెంట్ బెంచీలు వంటివి ఏర్పాటు చేస్తారు. పూల, ఉద్యాన మొక్కల పెంపకం చేపడతారు. భవిష్యత్‌లో బోట్ షికార్ అందుబాటులోకి తీసుకొస్తారు. బాలారంలోని చెరువును ఉపాధి పథక ఏపీడీ లాలం సీతయ్య పరిశీలించారు. అక్కడి ప్రజలతో సమావేశమై.. చేపట్టబోయే పనులను వివరించారు.

బాలారంలో ప్రజలతో మాట్లాడుతున్న ఏపీడీ సీతయ్య, సిబ్బంది

ఆటో బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ ఆటోడ్రైవర్ మృతి చెందినట్లు మూడో పట్టణ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు తెలిపారు. ఆ వివరాలిలా.. చినజాలరిపేటకు చెందిన చింతల గురుమూర్తి (50) ఆదివారం సాయంత్రం అతివేగంగా ఆటో నడుపుతూ సిరిపురం సమీపంలో ఓ ప్రైవేటు హోటల్ వద్ద డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో వాహనం బోల్తా పడి డ్రైవర్ కింద పడ్డాడు. తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులు లేరు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. డ్రైవర్ మద్యం తాగి ఆటో నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ విషయం శవపరీక్ష నివేదికలో తెలుస్తుందని పోలీసులు అంటున్నారు.

వివాహిత ఆత్మహత్య

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి సమీపంలోని ఉమ్మలాడ వంతెన వద్ద శారదానదిలో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లిలోని ముత్రాసుకాలనీలో ఉంటున్న బి. నూకేశ్వరి (36) శనివారం సాయంత్రం శారదానదిలో దూకింది. మృతదేహాన్ని గుర్తించారు. కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. మృతురాలి సోదరుడు మోహన్ గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

హోలీ రద్దీకి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం: హోలీ రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

యశ్వంత్‌పూర్ - సంత్రాగచ్చి (06233/34): ఈనెల 1న ఉదయం 7.30 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి, అదే రోజు రాత్రి 8.45 గంటలకు సంత్రాగచ్చికి చేరుతుంది. 3వ తేదీ తెల్లవారుజామున 2.45 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి, గురువారం తెల్లవారుజామున 4 గంటలకు యశ్వంత్‌పూర్‌కు చేరుతుంది.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	150	145
లైవ్	177	165
డ్రెస్డ్	257	300
స్కిన్‌లెస్	292	310

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు 89853 66570 | అరకులోయ: 63034 86346 | చింతపల్లి: 94404 07658

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి అధ్వానంగా మారింది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. – **రెహ్మాన్, చింతపల్లి**, ✔: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాంప్లెక్స్ పరిసరాల్లో వ్యర్థాలన్నింటినీ తొలగిస్తాం. వీధుల్లో చెత్త వేయకుండా కుండీలను వాడేలా చర్యలు తీసుకుంటాం. – **వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి, చింతపల్లి**

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కితలంగి పంచాయతీ దూదుగుడలోని కింద వీధిలో కుళాయిలు లేక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. గత్యంతరం లేక ఊటగెడ్డను ఆశ్రయిస్తున్నాం. – **మోహన్‌రావు, స్థానికుడు**, ✔: ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే పనులు ప్రారంభించి నీటి కష్టాలు తీర్చుతాం. – **వి.జయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి**

ముగిసిన స్కౌట్స్, గైడ్స్ శిక్షణ

అరకులోయ పట్టణం: భారత స్కౌట్స్, గైడ్స్ శిక్షణ కార్యక్రమం రవ్వలగుడ బాలుర పాఠశాలలో ముగిసింది. ఆదివారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. దేశం పట్ల గౌరవం, సేవాభావాన్ని పెంపొందించుకోవాలని జిల్లా స్కౌట్స్, గౌడ్స్ కార్యదర్శి బాకా లవకుశ, హెచ్ఎం నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎల్ఓసీ మారుతీ హరీష్‌కుమార్, పద్మావతి, ధనుంజయ్ పాల్గొన్నారు.

ప్రార్థనలో విద్యార్థులు

ఆశ్రమాల్లో దాహం కేకలు

జి.మాడుగుల, న్యూస్‌టుడే

మన్యంలోని ఆశ్రమ పాఠశాలల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. విద్యార్థులకు శుద్ధజలాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు కొన్నేళ్లుగా పాడై మూలకు చేరాయి. మరమ్మతుల కోసం సాంకేతిక సిబ్బంది రాకపోవడంతో ఇవి అలంకారప్రాయంగా మారాయి. ఫలితంగా వందలాది గిరిజన విద్యార్థులు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. వేసవి ప్రారంభమవడంతో సమస్య మరింత పెరిగే అవకాశం ఉంది.

★ జి.మాడుగుల మండలంలో మొత్తం 10 ఆశ్రమ పాఠశాలలు, రెండు పోస్టుమెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయి. గతంలో నాడు- నేడు కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా సంస్థల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ప్రారంభంలో కొంత కాలం పనిచేసిన ఇవి.. నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ఒక్కొక్కటిగా దెబ్బతిన్నాయి. పలు మార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా సిబ్బందిని సమయానికి తీసుకొచ్చి మరమ్మతులు చేయించడంలో విఫలమయ్యారు.

బోరు నీరే గతి

ఆశ్రమాల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయకపోవడంతో విద్యార్థులకు బోరు నీరే దిక్కవుతోంది. విద్యార్థుల సంఖ్యకు తగినన్ని బోర్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని పాఠశాలల్లో గ్రావిటీ పథకాల ద్వారా వచ్చే నీటినే తాగాల్సిన పరిస్థితి నెలకొంది. శుద్ధ జలం లేమి కారణంగా.. బాలలు జలుబు, జ్వరం, కడుపు నొప్పి చర్మ సంబంధిత వ్యాధులబారిన పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ప్లాంట్లు పూర్తిగా శిథిలమవడంతో ప్రభుత్వ నిధులు వృథా అయ్యాయి.

★ బొయితిలి, కులుపాడు, పెదలోచలి పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదు.

బొయితిలి ఆశ్రమ పాఠశాలలో పాడైన ఆర్వో ప్లాంటు

గత ప్రభుత్వంలో పోస్టుమెట్రిక్ వసతిగృహాలకు అందజేసిన రెండు పెద్ద ఆర్వో ప్లాంట్‌ను కనీసం ప్రారంభించలేదు. పరికరాలను తీసుకొచ్చి మూలన పడేశారు. వీటిని అనుసంధానం చేయాల్సిన సాంకేతిక సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యంతో అలంకారప్రాయంగా మారాయి.

ప్రతిపాదనలు పంపించాం

జి.మాడుగుల మండలంలోని ఆశ్రమ పాఠశాలల్లో కొన్ని ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయి. ఎక్కువ కాలం కావడంతో వీటిని బాగు చేసే అవకాశం లేదు. వాటి స్థానంలో కొత్త ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. 10 ఆశ్రమ పాఠశాలలు, రెండు పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో కొత్తవి ఏర్పాటు చేస్తాం. ఇటీవలే సాంకేతిక సిబ్బంది వచ్చి పరిశీలించారు. మరో 15 రోజుల్లో కొత్త ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – **నాగశిరీష, ఏటీడబ్ల్యూవో, జి.మాడుగుల**

టెలిస్కోప్‌లో వీక్షిస్తున్న విద్యార్థులు

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోండి

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీకృష్ణాపురం గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో సైన్సు ఫర్ బెటర్ సొసైటీ, ఆశా జ్యోతి సంయుక్తంగా అంతరిక్ష వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వారోత్సవాల ముగింపు వేడుకలు ఆదివారం జరిగాయి. జిల్లా సైన్సు అధికారి కేజీ రామారావు, సైన్సు ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు జగదీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లోచలిపుట్టు, శ్రీకృష్ణపురం ఆశ్రమాలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులు టెలీస్కోప్‌లో వీక్షించారు. వక్తలు మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పాఠశాలల్లో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొరాయించిన పంపు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధిలో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ బంకులో ఒక పంపు సాంకేతిక సమస్యతో మొరాయించింది. దీంతో ఒక్క పంపుపైనే ఆధారపడాల్సి వస్తోంది. పెట్రోల్, డీజిల్ వంటి వాటికోసం వినియోగదారులు చాలాసేపు వేచి చూస్తున్నారు. అధికారులు స్పందించి.. రెండో పంపును వినియోగంలోకి తీసుకురావాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

అడవికి నిప్పు.. ఎవరిది తప్పు

చోడవరం నుంచి పాడేరు వెళ్లే ఘాటీలో అడవిలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ప్రస్తుతం మంటలు చెలరేగాయి. ఎండిన ఆకులకు నిప్పు పెట్టడంతో చెట్లు సైతం ఆగ్నికి ఆహుతవుతున్నాయి. అధికారులు స్పందించి మంటలను ఆపాలని పలువురు కోరుతున్నారు. – **పెదబయలు, న్యూస్‌టుడే**

మంచు ముసుగు!

మన్యాన్ని మంచుతెరలు వీడటం లేదు. వేసవి ప్రారంభమై.. మైదాన ప్రాంతాల్లో ఎండలు మండుతుంటే మన్యంలో ఇంకా మంచు దట్టంగా కురుస్తోంది. అన్ని మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. తెల్లవారేసరికి మంచు, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం చలి ఇలా విభిన్న వాతావరణాన్ని ఈప్రాంతవాసులు ఆస్వాదిస్తున్నారు. – **పెదబయలు, న్యూస్‌టుడే**

కేంద్రం ఇలా.. సంపద సృష్టి ఎలా?

చెత్త నుంచి సంపద సృష్టించేందుకు గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో కొయ్యూరులో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పిల్లర్లు వేసి దానిపై తాటాకులు కట్టారు. మొదట్లో దానిని వినియోగించినా తర్వాత పట్టించుకోవడం మానేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాల ద్వారా సంపద సృష్టించడానికి చర్యలు తీసుకుంటోంది. చాలా కేంద్రాల్లో చెత్తను సేకరించి నిల్వ చేస్తున్నారు. కొయ్యూరు మాత్రం ఈ కేంద్రం తాటాకులు పాడైపోవడంతో పిల్లర్లు మాత్రమే కనిపిస్తున్నాయి. ఇటీవలే దాని చుట్టూ పిచ్చిమొక్కలను తొలగించారు. దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో ప్రసాదరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పిల్లర్లపై రేకులు ఏర్పాటు చేసి, అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. – **కొయ్యూరు, న్యూస్‌టుడే**

కూలిన మూత.. పడితే వాత!

డుంబ్రిగుడలో పెట్రోల్ బంకు సమీపంలో కాలువపై ఏర్పాటు చేసిన కాంక్రీట్ మూత ధ్వంసం అయ్యింది. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఎటువంటి రక్షణ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీన్ని సరిచేయాలని పలువురు కోరుతున్నారు. – **డుంబ్రిగుడ, న్యూస్‌టుడే**

అ వీ ఇ వీ

బాధిత కుటుంబానికి సాయం

సీలేరు, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న జెన్‌కో ఉద్యోగులను ఆదుకోవడానికి ముందుంటామని విద్యుత్తు ఉద్యోగుల సహకార సొసైటీ(గాజువాక) సంచాలకుడు, ఏపీఈఈ ప్రాంతీయ కార్యదర్శి వై.సత్తిబాబు అన్నారు. శుక్రవారం మృతిచెందిన ఏపీ జెన్‌కో జూనియర్ సహాయకుడు, ఏపీఈఈ కార్మిక సంఘ ప్రాంతీయ నాయకుడు కె.భవానీశంకర్ భార్య ఉమామహేశ్వరికి తక్షణ సహాయం కింద రూ.పది వేల నగదును అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి రావాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరితగతిన అందజేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్మిక సంఘ నాయకులు ఎస్.నాగేశ్వరరావు, జి.శివప్రసాద్, ఎం.జోగారావు, ఎన్.పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

భవానీ శంకర్ భార్య ఉమామహేశ్వరికి సాయం అందజేస్తున్న సంచాలకుడు

పరీక్షా సామగ్రి అందజేత

కొయ్యూరు, న్యూస్‌టుడే: చిట్టింపాడు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వైఎస్ఆర్ టీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని ఆదివారం పంపిణీ చేశారు. వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి.సురేష్‌కుమార్, వైకాపా మండల అధ్యక్షుడు బి.అప్పారావు, సర్పంచి నూకాలమ్మ, పాఠశాల కమిటీ ఛైర్మన్ చిన్నారావు పాల్గొన్నారు.

నూతన ఎంఈవోకు సన్మానం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉగ్రంగి నరసింగరావు పదోన్నతిపై గూడెంకొత్తవీధి ఎంఈవో-1గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఈవోను ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బౌడ గంగరాజు, కార్యదర్శి శశికుమార్ ఆధ్వర్యంలో సత్కరించారు. అనేక పాఠశాలల్లో పనిచేసి ఉత్తమ విద్యార్థులను తయారు చేశారని, పలుమార్లు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రశంసలు పొందారని కొనియాడారు. చంద్రరావు, సత్యనారాయణ, చిట్టినాయుడు, పుష్పరాజ్, కోటేశ్వరరావు, తిలక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిలో 'మరుగు' చింత

చింతపల్లి, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీతోపాటు సబ్ డివిజన్ కేంద్రంగా ఉన్న చింతపల్లిలో అనేక ప్రభుత్వ కార్యాలయాలున్నాయి. నిత్యం వివిధ పనులపై చింతపల్లి వచ్చి వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. బుధవారం సంత రోజైతే జనాల తాకిడి మరింత అధికంగా ఉంటుంది. నర్సీపట్నం, సీలేరు, పాడేరు వెళ్లే వారంతా చింతపల్లి మీదుగానే రాకపోకలు సాగించాలి. ప్రధాన కూడలి కావడంతో వేలాది మంది ప్రయాణికులు రోజూ ఇక్కడకు వచ్చి వెళుతుంటారు. ఇక్కడ ప్రధాన సమస్య మరుగుదొడ్లు లేకపోవడం. గతంలో పంచాయతీ నిధులతో ప్రయాణికుల విశ్రాంతి మందిరం వద్ద ప్రజా మరుగుదొడ్లు నిర్మించారు. అవి కొద్దిరోజుల్లోనే వినియోగంలోకి లేకుండా పోయాయి. మోటారు పనిచేయకపోవడం, నీరు అందుబాటులో లేక వినియోగించడం మానేశారు. దీంతో సమస్య మొదటికొచ్చింది. మూత్ర విసర్జన చేయాలంటే ఏ చెట్టుచాటుకో వెళ్లాల్సి వస్తోంది. మహిళలు మరింత ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. అత్యవసరమైతే ఎక్కడికి వెళ్లాలో తెలియక కడుపు ఉగ్గబెట్టుకుని ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్దా ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు లేవు. కేవలం సంబంధిత అధికారులు వినియోగించేందుకు మరుగుదొడ్లు నిర్మించారు. దీంతో వాటిని ప్రజలెవరూ వినియోగించుకునే పరిస్థితి లేదు. పాత బస్టాండ్ వద్దకే ఆర్టీసీ, పల్లెవెలుగు, ప్రైవేటు వాహనాలన్నీ వస్తుంటాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ కిలోమీటరు దూరంలో ఉంది. అక్కడ మరుగుదొడ్లు ఉన్నప్పటికీ దూరం కావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వెంకటరావును వివరణ కోరగా.. త్వరలో పాతబస్టాండ్ వద్ద మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

వినియోగానికి నోచుకోని ప్రజామరుగుదొడ్లు

రూ.8.7 కోట్లతో అంతర్రాష్ట్ర రహదారి మరమ్మతులు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలంలోని ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకూ జరుగుతున్న అంతర్రాష్ట్ర అనుసంధాన రహదారి నిర్మాణ పనులను ఆర్ అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. ఈ రహదారి మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.8.7 కోట్ల నిధులను కేటాయించింది. టెండర్లు పూర్తికావడంతో కొద్దినెలల క్రితమే పనులు మొదలయ్యాయి. మొదటి రీచ్‌గా ఆర్వీనగర్ నుంచి గూడెంకొత్తవీధి మీదుగా లంకపాకలు, రెండో రీచ్‌గా సప్పర్ల రెయిన్ గేజ్ నుంచి దారాలమ్మ గుడి, మూడో రీచ్‌గా సీలేరు నుంచి పాలగెడ్డ వరకూ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే తొలిదశ పనులు పూర్తయ్యాయి. ఆదివారం ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ శ్రీనివాస్, డీఈ వేణుగోపాల్ పనులను పరిశీలించారు. ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాస్, డీఈ శ్రీనివాస్, జేఈలు భరతుడు, జయరాజ్ పాల్గొన్నారు.

పనులను తనిఖీచేస్తున్న ఇంజినీరింగ్ అధికారులు

హోలీ జాతరకు ఏర్పాట్లు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు, దారెల, కొండపడ, జోలాపుట్టు గ్రామాల్లో హోలీ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపడ గ్రామంలో జగన్నాథస్వామి ఆలయం, వీధులను విద్యుత్తు కాంతులతో అలంకరించారు. లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం రాత్రి నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముంచంగిపుట్టులో రాధాకృష్ణుల ఉత్సవాన్ని నిర్వహించనున్నారు.

కొండపడలో విద్యుత్తు అలంకరణ

చెరువులవేనం వెలవెల

చింతపల్లి, న్యూస్‌టుడే: నిన్నమొన్నటి వరకూ వారాంతాల్లో పర్యాటకులతో ఎంతో సందడిగా కనిపించే చెరువులవేనం.. ఈ ఆదివారం పూర్తిగా వెలవెలబోయింది. మార్చి సమీపించడంతోపాటు ఎండలు పెరుగుతుండటంతో దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య దాదాపు తగ్గిపోయింది. చెరువులవేనం, తాజంగి, లంబసింగి పర్యాటక ప్రాంతాలు బోసిపోయాయి.

మహిళా చట్టాల పరిరక్షణకు కృషి

అరకులోయలో మానవహారం

అరకులోయ, న్యూస్‌టుడే: మహిళలకు రాజ్యాంగం కల్పించిన చట్టాలను పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎస్పీ అభిషేక్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లావ్యాప్తంగా విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. అరకులోయ ర్యాలీలో డీఎస్పీ పాల్గొన్నారు. మహిళలను గౌరవించాలని పేర్కొన్నారు. అతివల రక్షణ కోసం అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి మూడురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐ హిమగిరి, ఎస్సై గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతపల్లిలో ఆదివారం ఎస్సైలు వీరబాబు, ఎంవీ రమణ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. బాల్య వివాహాలు నిరోధించడం, అతివల భద్రత, గౌరవం, సాధికారతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా ఈ ర్యాలీ చేపట్టారు. హనుమాన్ కూడలి నుంచి చింతపల్లి పాతబస్టాండు వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఆశ్రమ పాఠశాల వార్డెన్ నూకరత్నం, పోలీసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరులో సీఐ దీనబంధు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బాలికలు లక్ష్యాలు నిర్దేశించుకుని.. వాటి సాధనకు శ్రమించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. రెండో తేదీన మహిళల స్వీయ రక్షణ, 3న వ్యాసరచన, 4న వక్తృత్వం, 5న చిత్రలేఖనం, 6న విద్యార్థినులు వివిధ పోలీసు స్టేషన్ల సందర్శన, 7న ప్యానల్ డిస్కషన్స్, 8న జిల్లా కేంద్రంలో ర్యాలీ, పోటీల్లో విజేతలకు బహుమతులు

రాజేంద్రపాలెం సంతలో ర్యాలీ

పెదబయలులో..

పంపిణీ చేయనున్నామని పేర్కొన్నారు. ఎస్సై పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టులో జి.మాడుగుల సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలికలు మానవహారంగా ఏర్పడి.. మహిళల హక్కులు, భద్రతపై నినాదాలు చేశారు. పోలీసులు, గిరిజన సంక్షేమ పాఠశాలల బాలికలు పాల్గొన్నారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: రాజేంద్రపాలెం వారపుసంతలో ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధం, గంజాయి వ్యతిరేక సందేశాలు తెలిపే ప్లకార్డులను మహిళలు, విద్యార్థినులు ప్రదర్శించారు. దొడ్డవరం కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మహిళా చట్టాలను వివరించారు. మహిళలు, కేజీబీవీ విద్యార్థినులు, పోలీసులు పాల్గొన్నారు.

పెదబయలు, న్యూస్‌టుడే: పెదబయలులో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం ఏర్పాటుచేశారు. అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. మహిళా సాధికారతపై ఎస్సై వెంకటేష్ వివరించారు. విద్యార్థినులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

11 నెలలైనా పనులు ప్రారంభించరా?

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: చిలకలగెడ్డ పంచాయతీ దాసరితోట నుంచి మెట్టపాలెం వరకు బీటీ రహదారి పనులు చేపట్టాలని కోరుతూ మెట్టపాలెం గ్రామస్థులు ఆదివారం ఆందోళన చేపట్టారు. అడవి తల్లి 2.0లో భాగంగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ రహదారి పనులకు శంకుస్థాపన చేసి.. 11 నెలలు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సుమారు 180 మంది వరకు గిరిజనులు జీవనం సాగిస్తున్నారని, సుమారు 4 కిలోమీటర్ల రహదారికి రూ.3.77 కోట్లు కేటాయించినట్లు స్థానికులు శోభ మధు తదితరులు పేర్కొన్నారు. గ్రామస్థులు శోభ అప్పలస్వామి, సన్యాసమ్మ, కిల్లో అప్పలనరసమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

మెట్టపాలెం గ్రామస్థుల ఆందోళన

ఘనంగా తిరువీధి ఉత్సవం

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో ఆదివారం సాయంత్రం శివపార్వతుల తిరువీధి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కళ్యాణమహోత్సవం జరిగింది. ఉత్సవమూర్తులను ఆదివారం ఊరేగించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పాల్గొన్నారు.

సీలేరులో శివపార్వతులను ఊరేగిస్తున్న భక్తులు

గూడెంకొత్తవీధిలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ

భక్తిభావంతో ఒత్తిడికి దూరం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: భక్తిభావాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఒత్తిడిలేని జీవనాన్ని పొందవచ్చునని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కమిటీ ప్రతినిధి లావణ్య అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గూడెంకొత్తవీధిలో భక్తులు ర్యాలీ నిర్వహించారు.

తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

సత్యసాయి ట్రస్టు సేవలు అభినందనీయం

సీలేరు, న్యూస్‌టుడే: ధారకొండ పంచాయతీ చినగంగవరంలో భగవాన్ సత్యసాయి ప్రేమామృతధార తాగునీటి పథకాన్ని ఆదివారం ప్రారంభించారు. సీనియర్ వైద్యులు కేవీ రంగారావు, కె.పద్మలతదేవీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయిరాం భక్తులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. గ్రామస్థులు బిందెలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక, భజనా కార్యక్రమాలు, ధింసా, కోలాట నృత్యం ఆకట్టుకున్నాయి. సీపీఐ మండల కార్యదర్శి భగవాన్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల ప్రజలకు రక్షిత నీటిని అందించే ఉద్దేశంతో సత్యసాయి ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ట్రస్ట్ జిల్లా సమన్వయకర్త కె.వి.నర్సింహమూర్తి, గూడెంకొత్తవీధి సమితి కన్వీనర్ రామకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్యం

సీలేరు, న్యూస్‌టుడే: ధారకొండలోని ఏనుగుబయలు వద్ద ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 15 మంది వైద్య నిపుణులు, 29 మంది శిక్షణ వైద్యులు సేవలందించారు. ఈ శిబిరంలో 658 మంది రోగులకు వైద్యసేవలు అందించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ జిల్లా శారీరక ప్రముఖ్ నాగబాబు మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతంలో గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. సీలేరు ఎస్సై యాసిన్ మాట్లాడుతూ.. మరిన్ని వైద్య శిబిరాలు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు రామకృష్ణ, తిరుమలేష్, గిరిబాబు, ఉమామహేష్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మందులు అందజేస్తున్న నిర్వాహకులు

క్రికెట్ టోర్నీ విజేత చొంపి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఆదివాసీ గిరిజన ఆచార సాంప్రదాయ పండగ ఓల్‌పొడ (హోలీ) వేడుకల్లో భాగంగా మాడగడ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా చొంపి గ్రామం జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో చొంపి, దొరగుడ జట్టు తలపడగా.. చొంపి విజయం సాధించింది. బాలరాజు, లక్ష్మణ్, మత్స్యరాజు, అర్జున్, సోమరాజు, కృష్ణ పాల్గొన్నారు.

★ సోమవారం నుంచి వాలీబాల్ టోర్నీ నిర్వహించనున్నట్లు పంచాయతీ పెద్దలు, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు బాలరాజు తెలిపారు.

ఆరు ద్విచక్రవాహనాలు సీజ్

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గావీధిలో సీఆర్పీఎఫ్ జవాన్లు, ఎస్సై యాసిన్ ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనుమానితులను ప్రశ్నించారు. ఆరు ద్విచక్రవాహనాలకు ఎటువంటి రికార్డులు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. గంజాయి, నాటుసారా వంటి వ్యాపారాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై యాసిన్ పేర్కొన్నారు.

నమూనా పరీక్షలతో మేలు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పది పరీక్షలపై విద్యార్థులు భయాన్ని వీడి.. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలనే ఉద్దేశంతో మోడల్ టాలెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అనిల్ తెలిపారు. స్థానిక బాలికలు, బాలుర ఆశ్రమ పాఠశాలల్లో ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు మోడల్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు. డుంబ్రిగుడ మండలవ్యాప్తంగా 80 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఆ సంఘ మండల కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదబయలులో పరీక్షకు 230 మంది హాజరయ్యారు. ఏటీడబ్ల్యూఓ జగత్‌రాయ్ మాట్లాడుతూ.. నమూనా పరీక్షలతో విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ శ్రీను, కమిటీ సభ్యులు గౌతం, నిశాంత్ పాల్గొన్నారు.

పెదబయలులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ సీఏహెచ్‌లో నిర్వహించిన పరీక్షను ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్‌సాగర్, చందు, రమాదేవి, రిషి, ఐసుబాబు పర్యవేక్షించారు.

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాగిన చిరంజీవి, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వంతల పురుషోత్తం ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. 169 మంది విద్యార్థులు హాజరయ్యారు. వార్డెన్ రామకృష్ణ, ఉపాధ్యాయులు పూర్ణ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో..

(c) eenadu

ఆన్‌లైన్‌లోనూ అర్జీలు సమర్పించొచ్చు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మాత్రమే కాకుండా 'మీకోసం' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ప్రజలు అర్జీలు సమర్పించవచ్చని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌తో పాటు రెవెన్యూ క్లినిక్‌లను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. రెవెన్యూ క్లినిక్ ద్వారా మండలాల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేశామని, ప్రజల నుంచి అర్జీలు నేరుగా స్వీకరించి నమోదు చేయడంతో పాటు, సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామని తెలిపారు. అప్పటికప్పుడే పరిష్కరించలేని వాటిని వారం రోజుల్లో పరిష్కరించడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను డివిజనల్, మండల రెవెన్యూ అధికారులు సమర్పిస్తామని వివరించారు.

రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన నేడు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో మంత్రి నారాయణ సోమవారం పర్యటించనున్నారు. నేలపాడు సమీపంలో నిర్మిస్తున్న గెజిటెడ్ ఆఫీసర్ల క్వార్టర్స్, గ్రూపు- డి ఉద్యోగుల భవన సముదాయాలను ఆయన పరిశీలించి. .పనుల పురోగతిపై ఆరా తీస్తారని మంత్రి కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి.

అమరావతిలో కీలక అడుగు

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- హాజరైన సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాకతో ఆదివారం అమరావతిలో సందడి వాతావరణం నెలకొంది. ఏపీ జ్యుడిషియల్ అకాడమీ, ఏపీ హైకోర్టు అతిథి గృహ నిర్మాణాలకు శంకుస్థాపన..నూతనంగా నిర్మించిన

హైకోర్టు న్యాయమూర్తుల బంగళా నమూనా పరిశీలిస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నరసింహ, జస్టిస్ భట్టి, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, ముఖ్యమంత్రి చంద్రబాబు

హైకోర్టు న్యాయమూర్తుల రెసిడెన్షియల్ ఎన్‌క్లేవ్ ప్రారంభోత్సవాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వేద పండితులు సీజేఐకు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, సీఎం చంద్రబాబునాయుడు, పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సుమారు 2.05 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణం చేపడుతుండగా..120 మంది ట్రైనీ జడ్జిలకు శిక్షణ ఇచ్చేలా రూపకల్పన చేశారు.

రైతుల సంతోషం.. రాజధానిలో కీలక నిర్మాణాలకు అడుగులు పడడంతో స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికే అమరావతిలో నిర్మాణాలు ఊపందుకోగా..తాజాగా న్యాయవ్యవస్థకు సంబంధించిన ముఖ్యమైన వసతుల కల్పన పట్టాలెక్కడంపై ఆనందించారు. శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసే ప్రాంతంలో నిర్మాణాలకు సంబంధించి మ్యాపులను ప్రదర్శనలో ఉంచగా.. పలువురు ఆసక్తిగా వీక్షించారు.

ప్రహ్లాద వరద.. పరమాత్మ రూపా

తాడేపల్లి, మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా నృసింహుని కల్పవృక్ష వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల ముఖమండపం వద్ద స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి హారతులిచ్చిన అనంతరం స్వామి వారిని ఆలయ ప్రదక్షిణం చేయించారు. అనంతరం మాడ వీధుల గుండా తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

పొన్నచెట్టుపై శ్రీకృష్ణుని అవతారంలో నృసింహుడు, చెట్టు కింద గోపికలు

నృసింహుని గ్రామోత్సవం

పొన్న వాహన సేవ.. రాత్రి కీలకమైన పొన్నవాహన సేవ నిర్వహించారు. గోపికలు నదిలో స్నానమాచరిస్తుండగా శ్రీకృష్ణుని అవతారంలో ఉన్న స్వామివారు.. వారి వస్త్రాలను అపహరించే ఘట్టాన్ని కళ్లకు కట్టే విధంగా వాహనాన్ని అలంకరించారు. ఈ విధంగా దేహంపై గోపికలకు ఉన్న అభిమానాన్ని స్వామి వారు తొలగించి వారికి మోక్షం ప్రసాదించారని, ఆ సన్నివేశాన్ని వివరిస్తూ పొన్న వాహన సేవ నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

క్యాన్సర్ చికిత్సలో ఏఐ సేవలు..!

గుంటూరు జీజీహెచ్ నాట్కో సెంటర్‌లో ప్రయోగాత్మకంగా అమలు

ఈనాడు, అమరావతి

ఆధునిక యంత్రాలపై రోగులకు సేవలందిస్తున్న వైద్యులు

క్యాన్సర్ చికిత్సలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని నాట్కో సెంటర్‌లో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక ఒప్పందం చేసుకోగా..ఇక్కడకు వస్తోన్న భిన్నమైన కేసులను దృష్టిలో పెట్టుకుని సొంతంగా డేటా రూపొందించుకోవడంపైనా వైద్య నిపుణులు దృష్టి పెట్టారు.

ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో క్యాన్సర్ రోగులకు మెరుగైన, కచ్చితత్వంలో కూడిన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఏపీ చాప్టర్‌ను ఏర్పాటు చేసింది. టాటా మెమోరియల్ సెంటర్, హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్(విశాఖపట్టణం), నవ్య కేర్ నెట్‌వర్క్‌లతో కలిసి నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌తో పనిచేసే ఎన్‌సీజీ పైలట్ ప్రాజెక్టు సేవలు గుంటూరు జీజీహెచ్‌లోని క్యాన్సర్ సెంటర్‌లోనూ ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించి అందులో రోగుల వివరాలు, నివేదికలు పొందుపరుస్తున్నారు. ఇప్పటివరకు విశాఖపట్టణం, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే క్యాన్సర్ చికిత్సలో అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు వినియోగిస్తుండగా..తాజాగా గుంటూరు, కర్నూలు ఆసుపత్రుల్లోనూ అందుబాటులోకి వచ్చినట్లయింది. గుంటూరు జీజీహెచ్ అంకాలజీ విభాగం నోడల్ సెంటర్‌గా.. విశాఖపట్టణం, కాకినాడ, కర్నూలు ప్రభుత్వాసుపత్రులను అనుసంధానం చేశారు.

సొంత డేటాపై దృష్టి.. అయితే, ఎన్‌సీజీ పైలట్ ప్రాజెక్టులోని కేస్‌స్టడీలకు భిన్నమైన కేసులు గుంటూరు నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు వస్తున్న నేపథ్యంలో రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ దుర్గాప్రసాద్ నేతృత్వంలో వైద్యుల బృందం స్వయంగా ఏఐ సేవల ఆధారిత ప్రాజెక్టులపైనా దృష్టి పెట్టింది. ఇప్పటికే ఏపీలో తొలి సమగ్ర క్యాన్సర్ ఆసుపత్రిగా గుర్తింపు తెచ్చుకున్న గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ రోగులకు తమదైన సేవలు అందిస్తోంది. ఇక్కడికి ఎక్కువగా గర్భకోశ, రొమ్ము, చర్మ క్యాన్సర్ బాధితులు వస్తుండగా..ఇవి ఎన్‌సీజీ పైలట్ కేసులతో విభిన్నంగా ఉండడంతో వైద్యవర్గాలు ఆ కోణంలోనూ సునిశిత పరిశీలన చేస్తున్నారు. సొంత డేటా ఆధారిత ఏఐ సేవల్ని అందుబాటులోకి తీసుకురావడం వల్ల రోగాన్ని ప్రారంభంలోనే గుర్తించేందుకు, అత్యుత్తమ వైద్య విధానాలు అనుసరించేందుకు వీలుంటుందని ఇక్కడి క్యాన్సర్ వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

నూతన పింఛన్లకు వెల్లువలా దరఖాస్తులు

స్వర్ణ గ్రామ, వార్డులకు అర్జీదారులు

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛను పథకంలో నూతనంగా సాంఘిక భద్రత పింఛన్ల కోసం దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలు, దివ్యాంగుల పింఛన్లు రూ.6 వేలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి రూ.15 వేల చొప్పున పెంచింది. దాంతో పింఛన్ల కోసం డిమాండ్ ఎక్కువగా ఉంది. అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయడంతో జిల్లాలో ప్రజలు అర్జీలు అందజేస్తున్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయం, డివిజన్, మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో వందల సంఖ్యలో అర్జీలు వస్తున్నాయి. గ్రామ స్వర్ణ, వార్డు కార్యాలయాల్లోనూ దరఖాస్తు చేసుకోవడానికి వెళుతుండడంతో వారు అర్జీలు తీసుకోవడానికి సంశయిస్తున్నారు. ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన రాకపోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది. ఎవరైనా పట్టుబడితే వారి నుంచి అర్జీలు తీసుకుని యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో నమోదు చేస్తున్నారు. పీజీఆర్ఎస్‌లో, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అర్జీల్లో అర్హుల వివరాలను పంపాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి ఎంపీడీవోలు, మున్సిపాలిటీల కమిషనర్లకు సర్క్యులర్ జారీ చేశారు. దాంతో వారు జాబితాలను రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టరు కార్యాలయం పీజీఆర్ఎస్ అధికారులు జాబితాలను తెప్పించుకునే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో ప్రస్తుతం 2,51,350 మంది వివిధ కేటగిరీల్లో పింఛన్లు పొందుతున్నారు. నెలకు రూ.109.79 కోట్లు ప్రభుత్వం వ్యయం చేస్తోంది.

రంజాన్ వేళలు – న్యూస్‌టుడే, తెనాలి టౌన్
ఇఫ్తార్ : సాయంత్రం: 6:20 (సోమవారం)
సహారి : ఉదయం 5:08 (మంగళవారం)

16.02 లక్షల సిలిండర్లు.. రూ.130.94 కోట్ల రాయితీ

విజయవంతంగా అమలవుతున్న దీపం-2 పథకం

న్యూస్‌టుడే – కలెక్టరేట్

దీపం-2 పథకం అమల్లోకి వచ్చాక ఇప్పటి వరకు జిల్లాలో లబ్ధిదారులు వినియోగించుకున్న సిలిండర్లు 16.02 లక్షలు. వారి ఖాతాలకు కూటమి ప్రభుత్వం జమ చేసిన సొమ్ము రూ. 130.94 కోట్లు.

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఈ పథకాన్ని మహిళలకు అందుబాటులోకి తెచ్చింది. 2024 నవంబరులో ప్రారంభమవగా.. నాలుగు నెలలకోసారి ఉచిత గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. ప్రస్తుతం నాలుగో విడత ప్రక్రియ కొనసాగుతోంది. లబ్ధిదారులకు మరింత సౌకర్యంగా ఉండేలా ప్రభుత్వం ఈ పథకంలో కొన్ని మార్పులను తీసుకురాబోతోంది.

ప్రస్తుత బిల్లింగ్: సిలిండర్ ధరను లబ్ధిదారులు ముందుగానే చెల్లిస్తుండగా. ప్రభుత్వం 48 గంటల్లో వారి బ్యాంకు ఖాతాల్లో ఆ సొమ్మును జమ చేస్తోంది.

ప్రయోగాత్మకంగా: లబ్ధిదారు సిలిండర్ తీసుకునే సమయంలోనే నేరుగా సంబంధిత ఏజెన్సీకి సొమ్ము చెల్లించేలా ప్రభుత్వం మంగళగిరి నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా పరిశీలన చేస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో వినియోగదారుల ఖాతా తెరిచి.. అందులో విడతలవారీగా ప్రభుత్వం రాయితీ సొమ్ము జమ చేస్తోంది. లబ్ధిదారు రాయితీ సిలిండరు తీసుకునే సమయంలో డెలివరీ బాయ్‌కు క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా ఆ ఖాతాలోని సొమ్ము బదిలీ చేయొచ్చు. ఈ విధానంలో లబ్ధిదారులు ముందుగా సొమ్ము చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఈ విధానంలో లోటుపాట్లను పరిశీలించి సరిచేశాక రాష్ట్ర మంతటా అమలు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన.

గత నాలుగు విడతల్లో సరఫరా అయిన సిలిండర్లు, వినియోగదారులకు జమైన రాయితీ సొమ్ము వివరాలిలా...

విడతలు	సిలిండర్లు	రూ.కోట్లలో
మొదటి	4,16,494	33.15
రెండు	3,98,512	33.50
మూడు	4,10,154	34.73
నాలుగోది (ఇప్పటివరకు)	3,77,599	29.56
మొత్తం	16,02,759	130.94

రాయితీ జమ కాకుంటే...

దీపం-2 పథకంలో వినియోగదారులకు రాయితీ సొమ్ము జమ కాకపోతే సంబంధిత గ్యాస్ ఏజెన్సీని సంప్రదించాలి. ఈకేవైసీ పెండింగ్‌లో ఉంటే పూర్తి చేయించాలి.

ఎన్నాళ్లీ జాగు.. అందితే బాగు..!

ఉమ్మడి జిల్లాలో 400 ఈ-ఆటోలకు ఎదురుచూపులు

ఈనాడు, అమరావతి

కాలుష్యానికి చెక్ పెట్టాలనే ఉద్దేశం..సంప్రదాయ ఇంధన వనరులను పరిరక్షించుకుంటూ, విద్యుత్తు వాహనాలను అందిపుచ్చుకోవాలన్న లక్ష్యం..వెరసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో 400 ఈ-ఆటోల కొనుగోలుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ గతేడాది కసరత్తు మొదలుపెట్టింది. వీటి కొనుగోలుకు సిద్ధం కాగా..జాప్యం జరుగుతుండడం చర్చనీయాంశంగా మారింది.

దేశంలో వాయుకాలుష్యం ఎక్కువైంది. ఎన్జీటీ కింద గుంటూరును కాలుష్య నగరంగా గుర్తించారు. ఎన్జీటీ ఆదేశాల మేరకు నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం(ఎన్‌క్యాప్) ద్వారా బాధిత నగరాల్లో 2029 కల్లా 70 నుంచి 80 శాతం మేర కాలుష్య స్థాయిలను తగ్గించాలనే లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళికలు రచించారు. అలా గుంటూరులోనూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నాలుగుచోట్ల ఎన్ఏఏంపీ స్టేషన్లను ఏర్పాటు చేసి గాలి నాణ్యత పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలోనే సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సూచనల మేరకు విభిన్న మార్గాల్లో సమస్యకు చెక్ పెట్టేందుకు సంకల్పించింది..ఇప్పటికే 220 ఈ-ఆటోలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సమకూర్చారు. అయితే, అవి సరిగా నిర్వహించకపోవడం, నిధులు ఇవ్వలేదనే సాకుతో సంబంధిత ఏజెన్సీ మరమ్మతులకు గురైన వాటిపై దృష్టి పెట్టకపోవడంతో 100 వరకు మూలన చేరి కనిపిస్తున్నాయి.

జీఎంసీలో ఈ-ఆటోలు

ఉమ్మడి జిల్లాలో మరో 400..

కాలుష్య కోరల్లో చిక్కిన నగరాలే కాదు..రాష్ట్రంలో 83 పుర, నగరపాలికలకు సంబంధించి 19.14 లక్షల మంది జనాభాకి గాను 1910 ఈ-ఆటోలు అవసరమని గతేడాది చివర్లో ప్రతిపాదించారు. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 400 కావాలని ప్రతిపాదించారు. చెత్త కుటుంబాలకు ఒక ఈ-ఆటో చొప్పున ఈ ప్రతిపాదన చేయగా..ఒక్కో ఈ-ఆటో వెయ్యి కిలోల వ్యర్థాలను తరలించేలా ఉన్నది నిబంధన. అయిదేళ్లపాటు ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ నిర్వహించేలా ఒక్కో ఈ-ఆటోను రూ. 68,949 చొప్పున సరఫరా చేసేందుకు నాలుగు ఏజెన్సీలు ముందుకొచ్చాయి. అయితే, వాటిని ఖరారు చేసి, సరఫరా చేయించడంలో జాప్యం జరుగుతోంది. ఆ ప్రభావం చెత్త తరలింపుపై పడుతోంది. జీపీఎస్, కెమెరా, ఆడియో తదితర సౌకర్యాలు వీటిలో ఉండేలా ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నా..గతేడాది ఆగస్టు నుంచి కసరత్తు జరుగుతోంది. డిసెంబర్ 12న ఏజెన్సీల వివరాలు పేర్కొనగా ఉత్తర్వులు కూడా వెలువడటంతో.

ఇదీ లెక్క

★ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రతిపాదించిన 400 ఈ-ఆటోల్లో.. గుంటూరు జిల్లా పరంగానే 284 ఉన్నాయి. ఇందులో మంగళగిరి-తాడేపల్లిలో 35, గుంటూరు నగరంలో 200, తెనాలిలో 49 అవసరమని పేర్కొన్నారు.

★ పల్నాడు జిల్లాలో 51 అవసరమని పేర్కొనగా..ఇందులో నరసరావుపేటలో 20, మాచర్లలో 19, వినుకొండలో 12 కావాలని ప్రతిపాదించారు.

★ ఇక, బాపట్ల జిల్లాలో 65 అవసరమని చూపగా..ఇందులో బాపట్లలో 24, రేపల్లెలో 14, చీరాలలో 27 ఈ-ఆటోలు కావాలని ఆయా పురపాలికలు ప్రతిపాదించాయి.

అయిదుగురికి ప్రాణదానం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: చిలకలూరిపేటకు చెందిన యువకుడు నల్లపనేని చైతన్య(25) తను చనిపోతూ ఐదుగురికి ప్రాణదానం చేశాడు. చిలకలూరిపేటకు చెందిన చైతన్య గత నెల 27న ద్విచక్రవాహనంపై వెళుతుండగా తాడేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం అతడిని గుంటూరులోని ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో చేర్పించారు. అతని ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. శనివారం బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో జీవన్‌దాన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేషన్ బృందం అవయవాల సేకరణ గురించి చైతన్య తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి, సోదరుడు మానసకుమార్‌లు చైతన్య అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఆదివారం చైతన్య నుంచి కిడ్నీలు, లివర్, నేత్రాలను సేకరించారు. ఒక కిడ్నీ, లివర్‌ను గుంటూరు ఆస్టర్ రమేష్ ఆసుపత్రికి, మరో కిడ్నీని విజయవాడలోని అమెరికన్ కిడ్నీ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించారు. రెండు కార్నియాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆసుపత్రికి వచ్చి చైతన్య తల్లిదండ్రులు, సోదరుడిని పరామర్శించి వారు తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు చైతన్య కుటుంబసభ్యులను అభినందించారు.

'భవిష్యత్తులోనూ వైకాపా నాయకుల మాటలు నమ్మొద్దు'

తుళ్లూరు, న్యూస్‌టుడే: 'గత వైకాపా ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలకు తీరని నష్టం జరిగింది. అమరావతినే రాజధానిగా నిర్ణయించి, రైతులకు ప్యాకేజీ పెంచి ప్రస్తుతం మాట జగన్ చెబుతున్నా ఆయనను రాజధాని రైతులు నమ్మి మోసపోయారు. మళ్లీ ఎన్నికల సమయం వస్తే వైకాపా నాయకులు ఆదరణ చేకూరుతారు. వారి మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దు' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రజాప్రతినిధులు సుదర్శనం డా. రామచంద్ర ప్రసాద్, కళ్యాణి దంపతులు రూ. 50 లక్షల ఆర్థిక సహకారంతో తుళ్లూరు మండలం పెదపరిమిలో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాలును స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలను నేతలు, గ్రామస్థులు, కూటమి నాయకులు సత్కరించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ..ప్రపంచ స్థాయి రాజధాని అమరావతి నిర్మాణం వేగంగా కొనసాగుతోందన్నారు. సుపరిపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. కష్టార్జితం రూ.4 కోట్లను పేద ప్రజల కోసం విరాళంగా అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కమ్యూనిటీ హాల్‌ను కేవలం వివాహాలకే పరిమితం చేయకుండా.. విద్యార్థుల చదువులు, నైపుణ్యాభివృద్ధి వంటి శిక్షణ కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా దాత రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామస్థుల కోరిక మేరకు ప్రహరీ నిర్మాణానికి సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీగా పెమ్మసాని చేస్తున్న సేవలను కొనియాడారు. రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు ప్రహరీ నిర్మాణానికి రూ. 2 లక్షలు విరాళం ప్రకటించగా.. భాష్యం సాంబశివరావు రూ. 25 వేలు అందించారు. తుళ్లూరు మండలం తెదేపా అధ్యక్షుడు ధనేకుల వెంకట సుబ్బారావు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు, కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దాతలు రామచంద్రప్రసాద్, కళ్యాణి దంపతులను సత్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, నాయకులు

చరవాణిలోనే ఆధార్ మార్పులు, చేర్పులు

రేపల్లె అర్బన్: సాంకేతికతపై పట్టు ఉంటే ఆధార్ కార్డు డౌన్‌లోడ్, వివరాల మార్పులు చేర్పుల కోసం ఆధార్ కేంద్రాలు, నెట్ సెంటర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు. ఆ పనులన్నీ మీరే స్వయంగా చేసుకోవచ్చు. గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి ఆధార్ అని టైప్ చేయగానే యాప్ కనిపిస్తుంది. డౌన్‌లోడ్ పూర్తికాగానే ఆధార్ వివరాల నమోదు చేసి ఓటీపీ, ముఖ నిర్ధారణ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం ఫోటో కూడిన ఆధార్ కార్డు కనిపిస్తుంది. కింద డౌన్‌లోడ్, షేర్, బయోమెట్రిక్ లాక్ వంటి ఐచ్ఛికాలు కనిపిస్తాయి. వీటి ద్వారా కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సర్వీసు పేజీ తెరవగానే చరవాణి నంబరు, అడ్రస్ అప్‌డేట్ ఐచ్ఛికాలు కనిపిస్తాయి. వీటిని ఎంపిక చేసుకుని మార్పులు, చేర్పులను పూర్తి చేసుకోవచ్చు.

ఇలా రాసేసి.. అలా ఇచ్చేసి..!

- జీఎంసీలో ఇంజినీరింగ్ విభాగం ఇష్టారాజ్యం
- గుత్తేదారుల చేతికే ఎం-బుక్‌లు

ఈనాడు–అమరావతి

గుంటూరు నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగంలో ఇంటి దొంగల ఆగడాలకు అడ్డూ అదుపూ ఉండడం లేదు. గుత్తేదారులతో కుమ్మక్కై తిన్నింట్లోనే గోతులు తీస్తున్న పరిస్థితి. నిబంధనల ఉల్లంఘనలు ఎంబుక్‌ల్లో రాసి.. వాటిని సంబంధిత వ్యక్తులకే ఇచ్చేస్తున్నారు. వాటి నిర్వహణలో ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు.

అలా ఎలా ఇచ్చేస్తారు?

చంద్రమౌళీనగర్‌లో మురుగునీటిలోనే నాసిరకంగా డ్రెయిన్ నిర్మాణం

అభివృద్ధి పనుల సమగ్ర సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఈ-ఎంబుక్‌లో నమోదు చేయాలి. వాటి నిర్వహణ బాధ్యత ఇంజినీరింగ్ విభాగంలోని ఈ-4 సెక్షన్‌దే. డీవియేషన్లు ఉంటే వాటిని గుత్తేదారులతో సరిచేయించడం, పని పూర్తయితే అందులోని వివరాల మేరకు బిల్లుల కోసం పంపించడం.. ఇవన్నీ నిర్వహణలో భాగమే. ఇక్కడ మాత్రం ఎంబుక్‌లను గుత్తేదారుల చేతికే ఇస్తున్నారు. తమ బిల్లులు మంజూరుకాగానే వారు వాటిని మాయం చేస్తుండడం గమనార్హం. ☛ వాస్తవానికి ఒప్పందం గడువు పూర్తయ్యే వరకు వీటి అవసరం ఉంటుంది. ప్రీ ఆడిట్ ఎగ్జామినర్ పరిశీలన, పోస్ట్ ఆడిట్ పరిశీలనకు వీటిని సమర్పించాలి. రెండేళ్ల వరకు అందుబాటులో ఉండాలి. తర్వాత పదేళ్లపాటు స్టోర్ రూమ్‌లో భద్రపరచాలన్నది నిబంధన. జీఎంసీలో ఇవేమీ అమలు కావడం లేదు. ☛ గుత్తదారుల చేతుల్లోకి ఎంబుక్‌లు వెళ్లిపోతుండడంతో వాటిలో వారు ఏం మార్పులు చేస్తున్నారో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే అక్రమాలు జరిగినా.. వారిపై చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఖజానాశాఖలో మాదిరిగా ఇక్కడా దస్త్రాలను పక్కాగా నిర్వహించేలా ఉన్నతాధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.

అడ్డదిడ్డంగా పనులు...

కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్ల పనులు నత్తనడకన చేస్తుండడంతో జనం యాతన అనుభవిస్తున్నారు. అడ్డదిడ్డంగా రోడ్లు తవ్వేయడం.. మట్టి, కంకర అక్కడే వదిలేయడంతో వాహనాల రాకపోకలకు అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఇంజినీరింగ్ విభాగం వద్ద రికార్డులే లేకపోవడంతో ఎక్కడెక్కడ పనుల పరిస్థితి ఎలా ఉందో స్పష్టత కొరవడుతోంది. ☛ ప్రస్తుతం నగరంలో రూ.600 కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టగా.. గుత్తేదారులు నిబంధనలకు విరుద్ధంగా కడుతున్నారు. వీటిని ఎప్పటికప్పుడు పరిశీలించి, ఎంబుక్‌ల్లో నమోదు చేయాల్సిన ఇంజినీర్లు ఆ దిశగా చొరవ చూపడం లేదు. ☛ అధికారుల కొరత, ఇన్‌ఛార్జి బాధ్యతలు చూస్తున్నవారు సరైన రీతిలో స్పందించకపోవడం గమనార్హం.

సజావుగా బ్రాగ్ సెట్

జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, జూనియర్ ఇంటర్, ఐఐటీ-నీట్ శిక్షణ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన బ్రాగ్‌సెట్ సజావుగా జరిగింది. ఆదివారం ఉదయం 9.30 గంటలకు 5వ తరగతి, మధ్యాహ్నం 12 గంటలకు ఇంటర్.. 3 గంటలకు ఐఐటీ, నీట్ కోసం పరీక్షలు జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్. శ్రీదేవి.. కాకుమాను, నరసాయపాలెం, నాగులపాలెం గురుకులాలు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ డిప్యూటీ ఏఎంవో శాంతివిశాల.. రామకృష్ణాపురం, సత్తెనపల్లి గురుకులాల్లోని కేంద్రాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఎంఈవోలను పర్యవేక్షణ అధికారులుగా నియమించడంతో వారు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

విద్యార్థిని వద్ద పరీక్ష పత్రం పరిశీలిస్తున్న డీసీవో శ్రీదేవి

5వ తరగతికి 1,615 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 1,351 మంది హాజరయ్యారు. ఇంటర్‌కు 2,270 మంది దరఖాస్తు చేసుకుంటే.. 2,090 మంది హాజరయ్యారు. ఇంటర్ ఐఐటీ, నీట్ ప్రవేశపరీక్షకు 1,728 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 1,551 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. గురుకులాల్లో 6, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 8న ప్రవేశపరీక్షలు నిర్వహించనున్నారు.

కాల్వలకు 2,823 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్ : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు ఆదివారం 2,823 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ(కేఈ)కు 1,005, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వ(కేడబ్ల్యూ)కు 1,818 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. బ్యారేజీ వద్ద పూర్తి స్థాయిలో 12 అడుగుల నీటి మట్టం ఉంది.

అసిస్టెంట్ సేల్స్‌మెన్ కావలెను

బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, పిడుగురాళ్ళ, మాచర్లలో ఈనాడు దినపత్రిక కొరకు ప్రకటనలు సేకరించుటకు చురుకైన, చొరవ కలిగిన యువకులు కావలెను.

జీతము రూ. 20,000/- (అన్ని అలవెన్సులు కలిపి) మరియు ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్ ఇవ్వబడును.

అనుభవం ఉన్నవారికి అర్హతను బట్టి వేతనం ఉంటుంది.

అర్హతలు: వయస్సు: 19 సం॥ - 30 సం॥ మధ్య
* 10th or ఇంటర్ పాస్
* తెలుగు, ఇంగ్లీషు చదవడం, రాయడం వచ్చియుండాలి.

ఆసక్తిగల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికేట్స్, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో తేది. 02-03-2026 సోమవారం ఉదయం 10 గం॥ల నుండి 4 గం॥ల లోపు స్వయంగా సంప్రదించండి.

CIEL HR inspired by science

C/o. ఈనాడు ఆఫీస్, 9వ లైను, అరండల్‌పేట, గుంటూరు

Ph: 800085 10541

Email: gnt_hr@eenadu.net

నిత్యం కసరత్తు.. విజయం దక్కేట్టు..

బాడీ బిల్డింగ్ పోటీల్లో ఆర్వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

ఎస్వీఎన్‌కాలనీ(గుంటూరు), న్యూస్‌టుడే

ఉత్తరాంధ్రకు చెందిన సాధారణ మధ్యతరగతి రైతువారీ కుటుంబాలకు చెందిన ఆ యువకులు చదువుకుంటూనే ఇష్టమైన రంగంలో రాణిస్తున్నారు. సీనియర్ల సూచనలతో క్లిష్టమైన బాడీ బిల్డింగ్‌లో కసరత్తు మొదలుపెట్టారు. ఏఎన్‌యూలో ఇటీవల జరిగిన అంతర్ కళాశాలల బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తా చాటారు. వారే ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ రెండు, నాలుగో సంవత్సరం విద్యార్థులు. పతకాలు సాధించిన విద్యార్థుల ప్రతిభ తెలుసుకుందాం..

దుర్గాప్రసాద్, నివాస్, గణేష్, శ్రీనులతో ఫిజికల్ డైరెక్టర్ గౌరీశంకర్

సమతుల ఆహారం కీలకం

అండర్-60 కిలోల కేటగిరిలో తృతీయ బహుమతి సాధించా. కొవ్వు కరిగించడం కోసం రోజుకు వెయ్యి సార్లు స్కిప్పింగ్ చేస్తాను. ప్రొటీన్ కోసం మీల్‌మేకర్, మాంసం, గుడ్లు, ఉదయం ఓట్స్‌లో పాలు, డ్రైఫ్రూట్స్ కలిపి తీసుకుంటా. దీనివల్ల కండరాలు బలంగా తయారవుతాయి. కళాశాల జిమ్‌లోనే ప్రాక్టీస్ చేశా. సీనియర్ నివాస్ మార్గదర్శనం చేశారు. **- గురాన దుర్గాప్రసాద్, పాలకొండ**

జూనియర్లకు నేర్పాను

నాన్న ప్రభాకరరావు బాడీ బిల్డర్, కుంగ్‌ఫూలో నైపుణ్యముంది. ఆయన్ను చూసి స్ఫూర్తి పొందా. అండర్-70 కిలోల విభాగంలో మొదటి బహుమతి గెలుచుకున్నా. ప్రస్తుత శరీర ఆకృతికి మూడేళ్లు పట్టింది. ప్రకాష్ పోకూరి శిక్షణ ఉపయోగపడింది. అదే జూనియర్లకు నేర్పాను. రోజుకు ఐదు లీటర్ల నీరు, ప్రొటీన్ కోసం గుడ్లు, పన్నీరు, మాంసం తీసుకుంటా. పోటీలకు వెళ్లే ముందు కండరాలు స్పష్టంగా కనిపించేందుకు ఆహారంలో శ్రద్ధ తీసుకుంటా. **- బిన్నాడ నివాస్, అరసవెల్లి, శ్రీకాకుళం**

ఒక్కో భాగానికి ఒకరోజు

ఏఎన్‌యూలో జరిగిన అంతర్ కళాశాలల బాడీ బిల్డింగ్ అండర్-65 కిలోల విభాగంలో బంగారు పతకం గెలుచుకున్నా. రోజూ రెండు గంటలు కార్డియో కోసం నడుస్తా. ఛాతీ, వీపు, కాళ్లు, భుజాలు, చేతులు, పొట్ట.. ఇలా ఒక్కో భాగానికి ఒక్కో రోజు వ్యాయామం చేస్తాను. ఆదివారం విశ్రాంతినిస్తాను. నిత్యం ఆరు గుడ్లు, రోజు మార్చి రోజు మాంసం, పాలతో ఓట్స్ తీసుకుంటాను. **- మామిడి గణేష్, బొబ్బిలి, విజయనగరం**

మిస్టర్ ఏఎన్‌యూ లక్ష్యం

రోజూ రెండు గంటలు పరుగు, బెంచ్‌ప్రెస్, డంబుల్స్, స్క్వాట్స్, పుల్‌ప్స్ చేస్తా. వ్యాయామంతో పాటు విశ్రాంతి కూడా అవసరం. అందుకు ఆదివారం కేటాయిస్తాం. కండరాల విశ్రాంతి కోసం రోజుకు ఎనిమిది గంటల నిద్ర అవసరం. అండర్-75 కిలోల విభాగంలో ద్వితీయ బహుమతి సాధించా. ఈ ఏడాది మరింత సాధన చేసి మిస్టర్ ఏఎన్‌యూ సాధించాలనేది లక్ష్యం. **- పొందూరు శ్రీను, బొబ్బిలి, విజయనగరం**

ఎన్టీఆర్ స్టేడియం కార్యదర్శిగా వజ్జా రామకృష్ణ

ప్రశాంతంగా పాలకవర్గం ఎన్నిక

అధికారుల నుంచి ఎన్నిక ధ్రువపత్రాలు తీసుకుంటున్న మహేశ్వరరావు, రామకృష్ణ

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: జీఎంసీ ఎన్టీఆర్ స్టేడియం స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గం కార్యదర్శిగా వజ్జా రామకృష్ణ ఎన్నికయ్యారు. ప్రత్యర్థి దొడ్డపనేని రాజేంద్రకుమార్‌పై రామకృష్ణ 455 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఆదివారం ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా మధ్యాహ్నం 2 గంటల వరకు సాగింది. తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొత్తం 2160 మందికి ఓటర్లకు 1267 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వజ్జా రామకృష్ణకు 851 ఓట్లు రాగా, ప్రత్యర్థి దొడ్డపనేని రాజేంద్రకుమార్‌కు 396 ఓట్లు వచ్చాయి. 20 ఓట్లు చెల్లుబాటు కాలేదు. కార్యనిర్వాహక సభ్యులుగా పురుషుల్లో ఇంకొల్లు వెంకటరత్తయ్య, జి.హనుమంతరావు, మహిళల్లో గుంటుపల్లి యామిని శివజ్యోతి, లగడపాటి అంజలిలు విజయం సాధించారు. పాలకవర్గం ఉపాధ్యక్షుడిగా దామా మహేశ్వరరావు, సహ కార్యదర్శిగా పాకనాటి ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా కండె కాంతారావు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. విజేతలకు అధికారులు ధ్రువపత్రాలు అందజేశారు. పోలింగ్ సరళిని ఎన్నికల నిర్వహణాధికారి, డీసీ సీహెచ్.శ్రీనివాస్, డీసీలు బి.శ్రీనివాసరావు, జి.సాంబశివరావు, ఉపాసెల్ పీవో సింహాచలం పర్యవేక్షించారు.

ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు

ఈఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వినియోగించుకున్న వారిలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ సజీల, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, భాష్యం రామకృష్ణ, చుక్కపల్లి రమేష్, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, మన్నెం శివనాగమల్లేశ్వరరావు, కార్పొరేటర్లు ఉన్నారు.

15 వరకు పోషణ అభియాన్- స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: అంగన్వాడీ కేంద్రాల్లో మార్చి 1 నుంచి మార్చి 15 వరకు పోషణ అభియాన్- స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్పష్టత ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు ఆధ్వర్యంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు అమలుపై ఏర్పాట్లు చేశారు. 1నుంచి 7వ తేదీ వరకు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, పోషకాహార పరిశుభ్రతలో భాగంగా గోడలు, కిటికీలు, నేల పరిశుభ్రత, పనికిరాని, పాత వస్తువుల తొలగింపు, గోడలకు సున్నం, రంగులు వేయించడం, తడి-పొడి చెత్త వేరు చేయడం, ప్లాస్టిక్ రహిత కేంద్రంగా మార్చడం, నీటి పాత్రలు, వంట పాత్రలు శుభ్రత, సురక్షిత ఆహార తయారీ పద్ధతులపై ప్రదర్శన ఉంటాయి. 8 నుంచి 15 వరకు ప్రవర్తనా మార్పు, తల్లులతో ఇంటి పరిశుభ్రతపై సమావేశం, మరుగుదొడ్లు, చేతుల శుభ్రతపై అవగాహన, చిన్నారులకు కథలు వినిపించడం తదితర కార్యక్రమాలు ఉంటాయని సీడీపీవో జి.విజయలక్ష్మి చెప్పారు.

ఫ్లైయాష్ ఇటుకల పరిశ్రమను కాపాడండి

మంగళగిరి, న్యూస్‌టుడే: ఫ్లైయాష్ (బూడిద) కొరత కారణంగా ఇటుకలు తయారు చేసే సూక్ష్మ, లఘు పరిశ్రమలు మూతపడుతున్నాయని, వాటిని కాపాడి యజమానులతో పాటు కార్మికులకు ఉపాధి కల్పించాలని అమరావతి ఫ్లైయాష్ బ్రిక్స్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళగిరిలోని హ్యాయ్‌ల్యాండ్ వద్ద ఆదివారం ఆ సంఘం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ. రాష్ట్రవ్యాప్తంగా 500పైగా ఉన్న పరిశ్రమల్లో సుమారు లక్ష మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నారు. 1990లలో ఫ్లైయాష్ ఇటుకల పరిశ్రమలను స్థాపించి వాతావరణ కాలుష్య నియంత్రణలో భాగస్వాములు అయ్యామని గుర్తు చేశారు. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు తగిన ప్రోత్సాహం అందించారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తమ సేవలను విస్మరించిందని, ఉచితంగా లభించే ఫ్లైయాష్‌కు ధర నిర్ణయించడం దారుణమన్నారు. నిర్వహణ లోపాలతోనే బూడిత కొరత ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని లేకుంటే ఆందోళన బాటపడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం వార్షిక కార్యాచరణను ప్రకటించారు. ఆ సంఘం ముఖ్య సలహాదారు కాళిదాస్, అధ్యక్షుడు వెలగ సాంబశివరావు, ఉపాధ్యక్షుడు ఐబీ చౌదరి, కార్యదర్శి బత్తుల శ్రీనివాసరావు, కోశాధికారి కె.శ్రీనివాసరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం సెక్రటరీ జనరల్ వాసిరెడ్డి శివాజీ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: పోస్టల్ ఉద్యోగుల సమస్యలను మానవతా దృక్పథంతో ప్రభుత్వం పరిష్కరించాలని అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం సెక్రటరీ జనరల్ వాసిరెడ్డి శివాజీ కోరారు. గుంటూరులోని జిల్లాపరిషత్తు సమావేశ మందిరంలో గుంటూరు డివిజన్ పోస్టల్ ఉద్యోగుల జాతీయ సంఘం ద్వైవార్షిక సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శివాజీ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 8వ వేతన సవరణ సంఘంలో జీడీఎస్ ఉద్యోగులను చేర్చాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలను మార్పు చేయాలన్నారు. పోస్టల్ శాఖ ప్రైవేటీకరణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తున్నామన్నారు. పోస్టల్ శాఖను ప్రజలకు సేవలు అందజేసే గొప్ప సంస్థగా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో పోస్టల్ ఉద్యోగుల సంఘం ఏపీ సర్కిల్ అధ్యక్షుడు కృష్ణప్రసాద్, కార్యదర్శి డేవిడ్‌రాజు, పోస్ట్‌మ్యాన్-ఎంటీఎస్ సంఘం సర్కిల్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, డిప్యూటీ సర్కిల్ కార్యదర్శి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాలివాహనుల అభ్యున్నతికి ప్రభుత్వం సహకరించాలి

మాట్లాడుతున్న కుమ్మర శాలివాహన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నాగేంద్ర

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని శాలివాహన సంఘీయులు అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్తామని కుమ్మర శాలివాహన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని సీఏఎన్ కోటేశ్వరరావు కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పారెళ్ల బసవేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి బెజవాడ ఆదిశేషయ్య మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుమ్మర శాలివాహనుల అభ్యున్నతికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ మాట్లాడుతూ జిల్లాలో సంఘీయులకు ఏ సమస్య వచ్చినా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ముందుండి పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు పద్మనాగేశ్వరరావు, సంఘ నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు, నాగన్న, పైడికొండలు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగం.. కమనీయ సంబరం..

క్రతువు తిలకిస్తున్న భక్తులు



శ్రీనివాస కల్యాణోత్సవం చేస్తున్న అర్చకులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరు బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. పాలకమండలి ఉపాధ్యక్షుడు లంక విజయబాబు ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. డాక్టర్ కోగంటి వెంకట రంగనాయకి బృందం లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో త్రిదండి అహోబిల రామానుజజీయర్ స్వామి, హెచ్‌పీసీ కమిటీ ఛైర్మన్ జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, ప్రవచనకర్త మల్లాది కైలాసనాథ్, సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, లింగంశెట్టి ఈశ్వరరావు, మర్రెడ్డి రామకృష్ణారెడ్డి, దేవినేని కరుణచంద్రబాబు ప్రసంగించారు. ఆలయ అర్చకులు పి.మాధవస్వామి బృందం ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షుడు సూర్యదేవర వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, బండారు సాంబశివరావు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించి అతిథులను సత్కరించారు.

జనసేన కార్యాలయం వద్ద కట్టుదిట్ట భద్రత

అదనపు సిబ్బంది నియామకం

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ క్యాంపు కార్యాలయంతోపాటు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. గత నెల 27వ తేదీ ఉదయం ఓ వ్యక్తి లోనికి ప్రవేశించి కార్లు ధ్వంసం చేసిన ఘటనతో ప్రభుత్వం అప్రమత్తమైంది. భద్రతా లోపం బయటపడడంతో అదనంగా దాదాపు పది మంది సిబ్బందిని కొన్ని ముఖ్యమైన ప్రదేశాల్లో నియమించారు. లోపలికి రావాలంటే ముందస్తు అనుమతిని తప్పనిసరి చేశారు. కార్యాలయంలో వారానికి రెండు సార్లు ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన 'జనవాణి' కార్యక్రమం వద్ద బందోబస్తు ఏర్పాట్లను మంగళగిరి పోలీసులకు అప్పగించారు.

ఆధ్యాత్మిక బోధనలే సమాజానికి దిక్సూచి

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక బోధనలే సమాజానికి దిక్సూచి అని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. అమరావతిలోని యూనివర్సిటీ వీస్ రిట్రీట్ సెంటర్‌లో బ్రహ్మకుమారీల ఆధ్వర్యాన 90వ త్రిమూర్తి శివ జయంతి మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఛైర్‌పర్సన్ శైలజ మాట్లాడుతూ బ్రహ్మకుమారీలు మహిళల్లోని సహనం, ప్రేమ, త్యాగం, నాయకత్వ లక్షణాలను వెలికితీస్తున్నారని చెప్పారు. మహిళలు స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవించేందుకు మార్గదర్శనం అందిస్తూ నైతిక విలువలతో కూడిన జీవితానికి ప్రేరణగా నిలుస్తున్నారన్నారు. శివనామస్మరణతో 110 దేశాలకుపైగా విస్తరించి ప్రపంచశాంతి కోసం కృషి చేస్తున్న బ్రహ్మకుమారీల జీవన విధానం ఆదర్శప్రాయమని కొనియాడారు.

అలరించిన జాతీయ స్థాయి నాటిక పోటీలు

నరసరావుపేట: నరసరావుపేట రంగస్థలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భువన చంద్ర టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్న 25వ జాతీయ స్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు హైదరాబాద్ వారు ప్రదర్శించిన అమ్మ చెక్కిన బొమ్మ, గేమ్ నాటికలు ప్రేక్షకులను అలరించాయి.

స్కిల్ పలావర్‌కు కేఎల్‌యూలో విశేష స్పందన

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు నిర్వహించిన స్కిల్ పలావర్‌కు విశేష స్పందన లభించింది. విద్యార్థులను పరిశ్రమల ఏర్పాటుకు సన్నద్ధం చేసే లక్ష్యాన్ని కేఎల్‌యూ పెట్టుకుందని స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ శ్రీనాథ్ అన్నారు. వివిధ విభాగాలకు చెందిన 5546 మంది విద్యార్థులు పాల్గొనగా.. ఏఐ ఎంఎల్ సవాల్-1లో 852 మంది, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్‌లో 659 మంది పాల్గొన్నారని ఆయన చెప్పారు. ఫోర్డ్ మోటార్స్ కంపెనీ, ఐబీఎం, సిస్కో, హెచ్అండ్ ఎంగ్రూప్, మోంగోడీబీ, సినోప్సెస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ వంటి సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. 70 శాతం మంది విద్యార్థులు సాంకేతిక రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు సన్నిద్ధత ప్రకటించారు. 60 శాతం మంది ఏఐపై మక్కువ చూపారు. ప్రేమ్ వర్క్‌ను కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజేష్ రూపొందించగా ఆయా విభాగాధిపతులు పర్యవేక్షించారు. వీసీ డాక్టర్ పార్థసారథివర్మ, ప్రొవీసీ డాక్టర్ వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో నైపుణ్య ఆధారిత విద్య

బీఐఎస్ అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న భాష్యం వేదమ్మ, పక్కన భాష్యం రామకృష్ణ కుటుంబ సభ్యులు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: భాష్యం ఇంటర్నేషనల్ స్కూల్(బీఐఎస్) ద్వారా అత్యున్నత అంతర్జాతీయ ప్రమాణాలతో నైపుణ్య ఆధారిత విద్యను అందించేందుకు కృషి చేస్తామని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు తెలిపారు. ఆదివారం భాష్యం రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఆయన మాతృమూర్తి వేదమ్మ చేతుల మీదుగా గోరంట్ల భాష్యం ఆదిత్య క్యాంపస్ సమీపంలోని భాష్యం ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్ అకడమిక్ బ్లాక్‌ను లాంఛనంగా ప్రారంభించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణ, హనుమంతరావు మాట్లాడుతూ నేటి యువత ఎంచుకున్న రంగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడేలా భాష్యం విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యాప్రణాళిక రూపొందించామని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని భాష్యం ఎప్పుడూ నిలబెట్టుకుంటుందన్నారు.

హెడ్గేవార్ దార్శనికత అనుసరణీయం

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూపూడి హైమావతి తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: జాతీయ సమైక్యతకు స్ఫూర్తినిచ్చిన హెడ్గేవార్ దార్శనికతను నేటి తరం అందిపుచ్చుకోవాలని ప్రముఖ రంగ ప్రముఖుడు కస్తూరి రాఘవసుధాకరరావు అన్నారు. గోపరాజు వెంకట సుబ్బారావు ఆలిఖిత దుర్గాదాస్ రచించిన 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నిర్మాత నవద్రష్టి - మన డాక్టర్ జీ' గద్య నాటక పుస్తకాన్ని స్థానిక హిందూ ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం జూపూడి హైమావతి ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకరరావు మాట్లాడుతూ నిద్రాణమైన హిందూ సమాజాన్ని మేల్కొలిపి దిశానిర్దేశం చేసేందుకు ఆర్ఎస్ఎస్‌ను స్థాపించడంలో డాక్టర్ జీ కీలక పాత్ర పోషించారన్నారు. దుర్గాదాస్ రచనా శైలి పాఠకులను ఆకట్టుకునేలా ఉందన్నారు. పుస్తక రచయిత దుర్గాదాస్ మాట్లాడుతూ దేశభక్తి ప్రేరణ నేపథ్యంలో డాక్టర్‌జీ జీవితంపై పుస్తకం రచించినట్లు తెలిపారు. టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం సభకు అధ్యక్షత వహించారు. ఆర్ఎస్ఎస్ ప్రతినిధి మాట్లాడుతూ డాక్టర్‌జీ స్థాపించిన ఆర్ఎస్ఎస్ ప్రపంచ వ్యాప్తంగా వేలాది శాఖలతో విస్తరించిందన్నారు. కార్యక్రమంలో గడియారం రామకృష్ణ, అంగలకుదురు వాసుదాస ఆశ్రమం సీతారామస్వామి, భోగరాజు విజయభాస్కర్, జూపూడి రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

మేడికొండూరు మండలం మందపాడు రెవెన్యూ పరిధిలో మందపాడు నుండి రావెల వెళ్ళు రోడ్డు ఫేసింగ్‌లో 5.1/2 ఎకరముల పొలం అమ్మకం. 80742 96586.

LEASE/ RENT

GENERAL

గుంటూరు ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ దగ్గరలో 1576 చ||గ||లు గల ఖాళీ స్థలం అద్దెకు & గోడౌన్ కన్స్ట్రక్షన్ చేసి ఇవ్వబడును. ఫోన్: 98482 31040.

TO LET

COMMERCIAL

గుంటూరు లక్ష్మీపురం 3వలైనులో కమర్షియల్ బిల్డింగ్ 2ఫ్లోర్స్ ఈచ్ ఫ్లోర్ 1740sft. బ్యాంక్స్ / సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ ఆఫీసు / షోరూంలకు అద్దెకు. ✆ 9849900303.

JOBS

Wanted Male Transport Incharges Qualification any Degree, Age limit:30 to 45 years, Salary upto:20,000/-. Eligibility having experience in any Educational organisation will be preferable, Note: Must have valid LMV License & Good Knowledge about auto Gear & Manual gear. Working location: Master Minds College, Guntur. Contact: 89784 80430.

ప్రముఖ లోన్స్ ఏజెన్సీ నందు లోన్స్ చేయుటకు టెలికాలర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 97014 79569, 80081 00872.

రాజధాని రాయల్ భూమి డెవలపర్స్ నందు మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ ఎంప్లాయీస్ కావలెను. 10th పాస్ / ఫెయిల్, జీతం: 13000 to 60000 & ఇన్సెంటివ్. ✆ 70137 05436.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు క్లాస్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 12000 నుండి 14000 వరకు ఇవ్వబడును. (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22సం||రాల నుండి 40 సం||రాలు ఉండవలెను. వివరాలకు సంప్ర. ఫోన్: 9248733320.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీలో ఉద్యోగ ఖాళీలు: సీనియర్ బ్యాచ్ ఇన్‌ఛార్జీలు, లింగం: పురుషులు మాత్రమే, విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 25 సం||ల నుండి 45 సం||రాల మధ్య ఉండవలెను. నెలకు జీతం:16000 వరకు ఇవ్వబడును. వివరాలకు సంప్రదించగలరు. ఫోన్: 9248722246.

బిజినెస్ మేనేజర్స్/ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, ఫ్రెషర్స్, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న 30 సం||లలోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

మనసును తాకేదే అసలైన కవిత్వం

విద్యాధరరావును సత్కరిస్తున్న రావి రంగారావు తదితరులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మనసును తాకేలా కవిత్వాన్ని రచించిన జల్ది విద్యాధరరావు అభినందనీయుడని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. బ్రాడీపేట 2/1లోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో అమరావతి సాహితీ మిత్రులు సంస్థ ఆధ్వర్యంలో జల్ది విద్యాధరరావు కవిత్వ సమాలోచన సభ ఆదివారం జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మానవీయత, నవ్యత విద్యాధరరావు కవితల్లో కనిపిస్తాయన్నారు. విద్యాధరరావు రచించిన 'అంతరంగ భాష' కవిత్వ సంపుటి గురించి సాహితీవేత్త శైలజా మిత్ర ప్రసంగిస్తూ ప్రేమ విశ్వరూపం ఆయన కవిత్వంలో కనిపిస్తుందని, రాజకీయ విమర్శ కూడా ధైర్యంగా రాయడం ప్రత్యేకత అన్నారు. కోహినూర్ కవిత్వ సంపుటి గురించి యర్రగుంట్ల పాణిరావు, ముసాఫిర్‌పై సరికొండ నరసింహరాజు (నాగార్జునసాగర్), తోటమాలి మాలినిపై తాటికోల పద్మావతి వివరించి చెప్పారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, పింగళి భాగ్యలక్ష్మి, పలకలూరి శివరావు తదితరులు ప్రసంగించారు. విద్యాధరరావును డాక్టర్ రావి రంగారావు, పెనుగొండ లక్ష్మీనారాయణ, బండికల్లు జమదగ్ని, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు, సాహితీప్రియులు సత్కరించారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు

బాలనాగమ్మ నాటకంలో ఓ సన్నివేశం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సౌజన్యంతో పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజైన ఆదివారం రాత్రి ప్రదర్శించిన హరిశ్చంద్ర, బాలనాగమ్మ పౌరాణిక పద్య నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. బాలనాగమ్మ నాటకంలో మాయలఫకీర్‌గా డాక్టర్ టి.వి.నారాయణ నటన ప్రశంసలందుకుంది. సత్యహరిశ్చంద్ర నాటకంలో నిమ్మగడ్డ వీరయ్య, వి.వి.శివారెడ్డి, మునగల్లు సుధాకర్, అప్పలస్వామి నాయుడు, గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎ.ఎల్.ప్రసాదరాయ చౌదరి, ఆలపాటి జనార్దన్‌రావు, అడపా ప్రభావతి, శాంతి, దర్శి శ్రీనివాసరావు, షేక్ ఖాసింమీర, గురునాథంలు నటనతో మెప్పించారు. కార్యక్రమాలను సంఘం అధ్యక్షుడు నల్లక శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, కిలారి రోశయ్య తదితరులు ప్రసంగించారు.

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

శుక్లాల శస్త్రచికిత్సకు 250 మంది ఎంపిక



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గుంటూరు మిర్చియార్డు ఛైర్మన్ కుర్రా అప్పారావు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: సామినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యడ్లపాడు మండలం బోయపాలెం అనంతలక్ష్మి నూలుమిల్లులో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కంటి సమస్యలతో బాధ పడుతున్న 500 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో శుక్లాల శస్త్రచికిత్సలకు 250 మందిని ఎంపిక చేశారు. వారికి ఉచితంగా వైద్యం, మందులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. గుంటూరు మిర్చియార్డు ఛైర్మన్ కుర్రా అప్పారావు మాట్లాడుతూ 11 ఏళ్లుగా సామినేని కోటేశ్వరరావు, ఆయన తల్లిదండ్రులు సామినేని పానయ్య, నాగరత్నమ్మల జ్ఞాపకార్థం ఏటా ఈ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు విశ్రాంత మేనేజర్ కేవీఎల్ రాజు, ట్రస్టు నిర్వాహకులు సామినేని కోటేశ్వరరావు, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

9, 10 విద్యార్థులకు నేటి నుంచి ప్రత్యేక పరీక్షలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 9, 10 తరగతుల విద్యార్థులకు సోమవారం నుంచి పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు ఎంఈవోల పర్యవేక్షణలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు. సోమవారం తెలుగు పరీక్షతో ప్రారంభమైన పరీక్షలు 10వ తేదీ సోషల్ పరీక్షతో ముగియనున్నాయి. మిగిలిన రెండు రోజుల్లో సంస్కృతం, అరబిక్, ఒకేషనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.45 వరకు పరీక్షలు జరపనున్నారు. 9వ తరగతి విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్షలు నిర్వహిస్తుండగా, 10వ తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రాండ్ టెస్టు పేరుతో పరీక్షలు నిర్వహించాలని ఆదేశాల్లో అధికారులు పేర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఎంఈవో కార్యాలయాలకు ప్రశ్నపత్రాలు కొన్నిరోజుల క్రితమే చేరాయి.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, రిటైల్ ధర - 177, చికెన్ విత్‌స్కిన్ - 257, చికెన్ స్కిన్‌లెస్ - 292.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -150 రిటైల్ ధర 177 చికెన్ విత్ స్కిన్ - 257 చికెన్ స్కిన్‌లెస్ - 292.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 167, 176, 187 చికెన్ విత్ స్కిన్ - 324 చికెన్ స్కిన్‌లెస్ - 334.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

తెనాలి

•తెనాలి •పొన్నూరు

సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ ఏర్పాటు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ పరిధి చినరావూరు టిడ్కో గృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నివాసితులు అందరూ అసోసియేషన్‌గా ఏర్పడినట్లు అధ్యక్ష, కార్యదర్శులు కోట శ్రీనుబాబు, వాకా శ్రీనివాసరావు తెలిపారు. వీరు ఆదివారం టిడ్కో గృహాల సముదాయంలో మాట్లాడారు. అసంపూర్తి రోడ్లు, వాటర్ ట్యాంకు, అసాంఘిక కార్యకలాపాలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం బుర్రిపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేసినట్లు శ్రీపరంజ్యోతి కల్కి సేవా సమితి ప్రతినిధులు ఆదివారం తెలిపారు.

ముమ్మరంగా సభ్యత్వ నమోదు

అత్తోటలో సభ్యత్వ వివరాల నమోదు కార్యక్రమంలో నాయకులు

కొల్లిపర, న్యూస్‌టుడే: జనసేన సభ్యత్వ నమోదులో కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తున్నారని మండల పార్టీ అధ్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు అన్నారు. అత్తోటలో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉందన్నారు. కార్యకర్తలు పోలిశెట్టి శ్రీరామాంజనేయులు, తుంగల గోపి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి పట్టణ బోస్‌రోడ్డులో విస్తరణ పనులు చేపట్టిన ప్రాంతంలో పైపులైన్ పగిలి తాగు నీరు వృథాగా పోతుంది. - **ఆంజనేయులు, బోస్‌రోడ్డు** ? తెనాలి పట్టణ నందులపేట మందావారి వీధిలో పది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. - **సాంబశివరావు, నందులపేట** ✔ పైపులైను పనులు, వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం.
- రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్

స్పందన: తెనాలి-గుంటూరు వంతెనపై కంకర వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు స్పందించారు. కంకరను తొలగించి ప్రమాదాలను నివారించారు. ★ తెనాలి కొత్తపేటలో మురుగు పారుదల సరిగా లేదని అందిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ అధికారులు స్పందించారు. పూడికలు, అడ్డంకులు తొలగింపజేశారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

ప్రాణవాయువు తయారీ యూనిట్‌కు సుస్తి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

తెనాలి జిల్లా ఆసుపత్రిలో బిగించిన ఆక్సిజన్ యూనిట్

తెనాలి జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో బిగించిన ప్రాణవాయువు తయారీ యూనిట్‌కు సుస్తి చేసింది. కరోనా వైరస్ మహమ్మారితో ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్న రోగులకు ఆక్సిజన్ లభ్యతలో ఏర్పడిన కొరతను అధిగమించేందుకు జిల్లా స్థాయి ఆసుపత్రుల్లో వాతావరణం నుంచి ఆక్సిజన్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేశారు. సదరు వైరస్ శాంతించడంతో ఈ యూనిట్ల నిర్వహణపై నిర్లక్ష్యం అలముకుంది. వీటిని వినియోగంలోకి తేవాల్సిన వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులు కమీషన్ల కోసం ఏజెన్సీల నుంచి లిక్విడ్ ఆక్సిజన్ కొంటున్నట్లు విమర్శలు విన్పిస్తున్నాయి.

ఖర్చు ఎక్కువని పక్కన పడేసి..

జిల్లాలోని గుంటూరు సర్వజనా ఆసుపత్రి తరవాత పెద్దది మూడొందల పడకల తెనాలి జిల్లా ఆసుపత్రి. కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో లిక్విడ్ ఆక్సిజన్ సమృద్ధిగా సరఫరా కాకపోవడంతో.. ప్రత్యామ్నాయమైన గాలిలోని తేమ నుంచి ఆక్సిజన్ తయారీ యూనిట్‌ను తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేశారు. ఇందులో నిమిషానికి వెయ్యి ఎల్‌పీఎం (లిక్విడ్ పర్ మినిట్) ప్రాణవాయువు తయారవుతుంది. దీనిని ఆసుపత్రిలోని పడకలకు బిగించిన గొట్టాల ద్వారా రోగులకు అందిస్తుంటారు. కొవిడ్ వ్యాప్తి తగ్గాక గాలి నుంచి ఆక్సిజన్ తయారీకి విద్యుత్తు ఖర్చు ఎక్కువని పక్కన పెట్టారు ఆసుపత్రి అధికారులు. కొన్ని నెలల తరవాత అది కాస్త మూలనపడింది.

పనితీరు నివేదిక సమర్పించండి..

దీనికి తోడు రసాయనాల కొరత వేధిస్తోంది. ఈ ఇబ్బందులు తీర్చాలని కోరుతూ ఆసుపత్రి అధికారులు.. ప్రభుత్వ ఆసుపత్రుల మౌలిక వసతుల కల్పన అభివృద్ధి సంస్థ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. యూనిట్ సామగ్రి సరఫరా చేసిన వారిని సంప్రదించాలని సదరు అధికారులు సూచించినట్లు సమాచారం. ఇటీవల ప్రభుత్వం గాలి నుంచి ఆక్సిజన్ తయారీ యూనిట్ల పనితీరును పరిశీలించి నివేదిక సమర్పించాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించింది. వారు ఆ పనిలో నిమగ్నమయ్యారు.

తొలి దశలో గుర్తిస్తే వ్యాధులు దూరం

అతిథులను సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఆధునిక అంశాలపై అవగాహన అవసరమని వాకర్స్ క్లబ్ తెనాలి-2 అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశానికి దంత వైద్య నిపుణులు డాక్టర్ చాలి పాళ్ల రవీంద్రనాథ్ అతిథిగా హాజరై మాట్లాడారు. పెద్దల్లో మధుమేహం, రక్తపోటు వల్ల దంత ఇబ్బందులు అధికంగా కనిపిస్తున్నాయని, తొలి దశలో గుర్తించడం ద్వారా సమస్య పెద్దది కాకుండా చూసుకోవచ్చని, రోజూ నడక కొంత వరకు మేలు చేస్తుందని తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు రాయపాటి శివనాగేశ్వరరావు మాట్లాడుతూ.. శాస్త్రీయ వాస్తవాలను తెలుసుకొని వదం ద్వారా మూఢనమ్మకాలు దూరమై జీవన పయనం సులువు అవుతుందని వివరించారు. తమ, తమ విభాగాల్లో ప్రజలకు అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్న అతిథుల సేవలను కొనియాడి క్లబ్ ప్రతినిధులు వారిని జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఆనందరావు, మురహరి రావు, భుజంగరావు, పూర్ణచంద్రరావు, సుబ్బారావు, సత్యనారాయణ, రవి, సాంబశివరావు, అనురాధ, ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థ సేవలు స్ఫూర్తిదాయకం

దాతలను సత్కరిస్తున్న ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సమాజంలో మానవత విలువలు పెంపొందిస్తూ, అవసరంలో ఉన్న వారిని ఆదుకుంటూ ముందుకు సాగుతున్న తెనాలి మానవత సంస్థ పయనం స్ఫూర్తిదాయకమని, ఇందులో దాత పాత్ర కీలకమని రీజనల్ డైరెక్టర్ కొత్త సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పట్టణంలో అధ్యక్షుడు డాక్టర్ కొలసాని రాంచంద్ పర్యవేక్షణలో ఆదివారం జరిగిన దాతల సత్కార వేడుకలో ఆయన మాట్లాడారు. రామ్మోహనరావు, శోభారాణి దంపతులు, అప్పారావు, సామ్రాజ్యలక్ష్మి దంపతులు, రామకృష్ణ, కేశవరావు, లక్ష్మణరావు, హనుమంతరావు తదితరులను సత్కరించారు. 97 సంవత్సరాల లక్ష్మణరావు, మానవత సంస్థ మీద చేసిన రచన, సత్యనారాయణ రాసిన గేయం ఆకట్టుకున్నాయి. వాసు, వెంకట్, ప్రసాద్, కల్యాణి, మొవ్వా సత్యనారాయణ, వెంపటి సత్యనారాయణ, మల్లేశ్వరరావు, నరసింహారావు, వెంకట్రామయ్య, మల్లికార్జునరావు, నాగేశ్వరరావు, అర్జున, భుజంగరావు, సాంబశివరావు, విద్యాసాగర్, ఇందిర తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనంద వేడుక

పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరులోని పీబీఎన్ కళాశాలలో 1979-82 విద్యా సంవత్సరంలో డిగ్రీ బీకాం విద్యను అభ్యసించిన విద్యార్థులు ఆదివారం మండల పరిధిలోని దొప్పలపూడిలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా 44 సంవత్సరాల కిందటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఉత్సాహంగా గడిపారు. వారు సాధించిన పురోగతిని ఒకరితో మరొకరు పంచుకున్నారు. సమాజ సేవకు తమ వంతు కృషి చేయాలని తీర్మానించుకున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రామ్మోహనరావు, సభ్యులు కొల్లూరి కిశోర్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 26న సత్రం కమిటీ ఎన్నికలు

సమావేశానికి హాజరైన సభ్యులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన సత్రం కమిటీ పాలకవర్గం పదవీకాలం ముగిసిన సందర్భంగా.. నూతన పాలకవర్గానికి సంబంధించిన ఎన్నికలు ఏప్రిల్ 26వ తేదీన నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షులు నూకల వెంకట వేణుగోపాలరావు పేర్కొన్నారు. ఆదివారం ఆలయంలోని కల్యాణ మండపంలో సత్రం కమిటీ సభ్యుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తనను ఎన్నికల నిర్వహణ అధికారిగా ప్రకటించినందుకు సభ్యులు సాదుప్రతాప్ కృతజ్ఞతలు తెలిపారు. దీనిని వ్యతిరేకిస్తున్నట్లు సభ్యులు పి.వెంకట్రావు ప్రకటించారు. అందరి అంగీకారం పొందిన వ్యక్తులను ఎన్నికల నిర్వహణ కమిటీలో నియమించుకుందామని సభ్యులు కొణిజేటి గోపి పేర్కొనడంతో సభ్యులు వెళ్లిపోయారు. కమిటీ వారి కోరిక మేరకు ఈ సమావేశానికి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సమావేశంపై సామాజిక మాధ్యమాల్లో పలు పుకార్లు చక్కర్లు కొడుతున్నాయి.

నిత్యం తనిఖీలు కొనసాగించాల్సిందే..!

బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేస్తున్న పోలీసు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపే వారికి నిర్వహించే పరీక్షలు రోజూ సాగడం లేదని, సంబంధిత పరీక్షలు నిర్వహించే బ్రీత్ ఎనలైజర్లు పలు పోలీస్ స్టేషన్ పరిధిలో పని చేయడం లేదని, అందుబాటులో లేవని 'ఈనాడు' గత నెల 17న 'మత్తు వదిలేది ఎలా?' శీర్షికన పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన డీఎస్పీ బి.జనార్దనరావు సబ్ డివిజన్‌లోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు కొనసాగించాలని ఆదేశాలు ఇవ్వడంతో పాటు... బ్రీత్ ఎనలైజర్లను వినియోగంలోకి తీసుకొచ్చారు.

స్పందనకు వందనం

పైపులు మార్చి.. నీటి వృథా అరికట్టి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి పట్టణ గాంధీనగర్‌లో పైపులైను రెండు చోట్ల పగిలి తాగునీరు వృథా అవుతుంది, జలాలు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని 'ఈనాడు' గత నెల 22న 'తాగునీరు వృథా.. అరికట్టకుంటే ఎలా?' శీర్షికన మున్సిపల్ అధికారులకు సమస్యను తెలియజేసింది. స్పందించిన మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది పగిలిన పైపులను మార్చి నీటి వృథాను అరికట్టారు.

అమర వీరులకు నివాళి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ పోరులో అమరులైన వీరులకు ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. తెనాలి రైల్వే స్టేషన్ రోడ్డులోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సమితి నాయకులు పాల్గొన్నారు.

త్యాగాలతోనే పోరాటాలు విజయం

నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మంగళగిరి, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో పోరాడి తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన అమరవీరులకు నాయకులు నివాళులర్పించారు. మంగళగిరి బస్టాండ్ కూడలిలో ఉన్న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి చందోలు విక్టర్‌పాల్ మాదిగ మాట్లాడుతూ త్యాగాలు లేకుండా ఏ పోరాటమూ గమ్యాన్ని చేరదన్నారు. నాయకులు అద్దేపల్లి నాగేశ్వరరావు మాదిగ, ఎంఎస్పీ మంగళగిరి అధ్యక్షుడు పాతకోటి బాస్కర్, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి పోగు శ్యామల, గౌరవాధ్యక్షురాలు నాగేంద్ర, ఏడుకొండలు, యాకోబు, ఏసుబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం రూ.కోట్ల విరాళం గొప్ప విషయం

తాడికొండ, న్యూస్‌టుడే: నియోజకవర్గానికి సంబంధం లేకపోయినా అక్కడి ప్రజల సౌకర్యార్థం సామాజిక భవనాలు నిర్మించిన దాతలు సూద్దగుండు రాఘవేంద్ర ప్రసాద్ దంపతుల కృషి అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. రావెల గ్రామంలో బీసీ సామాజిక భవనాన్ని ఆదివారం ఆయన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాఘవేంద్రప్రసాద్ వైద్యుడిగా పనిచేసి తన సంపాదన నుంచి రూ.4 కోట్లను సామాజిక భవనాల నిర్మాణానికి ఇవ్వడం గొప్పవిషయమన్నారు.

రహదారిపై నీరు.. వాహనదారులకు ఇబ్బందులు

పెదకాకాని గౌడపాలెంకి వెళ్లే రోడ్డుపైకి డ్రెయిన్‌లోని నీరు చేరడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెదకాకాని సెంటర్ నుంచి ఎస్ కన్వెన్షన్ వరకు వెళ్లే ప్రధాన డ్రెయిన్‌లోని నీరు గౌడపాలెం మలుపు వద్ద దిగువ ప్రాంతంలో ఉన్న పంచాయతీ మురుగు కాలువలోకి చేరుతోంది. స్థానికులు సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వారు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. **- న్యూస్‌టుడే, పెదకాకాని**

అపరిశుభ్రంగా మసీదు పరిసరాలు

పెదకాకాని పొలిమేర సెంటర్లోని మసీదు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. దీంతో పాటు ఆ ప్రదేశంలో డ్రెయిన్ లేకపోవటంతో వాడకపు నీరు రోడ్డుపైకి చేరుతుందని చెబుతున్నారు. రంజాన్ నెలలో ప్రార్థనా మందిరాల పరిసరాలు శుభ్రంగా ఉంచాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ముస్లిం సోదరులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెదకాకాని**

ప్రమాదం అంచున ప్రయాణం

చివలూరు గ్రామంలోకి ప్రవేశించే మార్గంలో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టుకు రెండువైపులా రక్షణ గోడలు కూలి కాలువలోకి జారిపోయాయి. రక్షణ లేని కల్వర్టుపై నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదం తప్పదని.. సంబంధిత అధికారులు సైడ్ గోడలు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, కొల్లిపర

రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..?

తెనాలి పట్టణ నెహ్రూ మార్గం నుంచి గాంధీనగర్‌కు వెళ్లే ప్రధాన అనుసంధాన రోడ్డు ఇలా అధ్వానంగా ఉంది. వాణిజ్య ప్రాంతంగా పలు దుకాణాలతో పాటు బ్యాంకులకు కేంద్రంగా ఉన్న ఈ మార్గంలో రద్దీ అధికంగా ఉంటుంది. రోడ్డు తీరు వల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని.. బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

వేగ నిరోధకాలు ఏర్పాటు చేయరూ..

పట్టణ చెంచుపేట ఉమేష్ చంద్ర విగ్రహ కూడలికి ఇరువైపులా ప్రధాన కాలనీలు, పాఠశాలలు అధికంగా ఉన్నాయి. కూడలిలో నలువైపుల నుంచి వాహనాలు దూసుకొస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగ నిరోధకాలు ఏర్పాటు చేయించాలని ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. అధికారులు వెంటనే తీవ్రతను గురించి పరిష్కరించాల్సి ఉంది.
- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

సామగ్రి ఉన్నా.. సేవలు సున్నా

కాంపోనెంట్ అభివృద్ధి చేసే పరికరాలున్నా ప్రయోజనం శూన్యం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే:

తెనాలి జిల్లా ఆసుపత్రికి వచ్చే వారిలో గర్భిణులు, శస్త్రచికిత్స రోగుల్లో అవసరమైన వారికి వైద్యులు వివిధ గ్రూపుల రక్తం ఎక్కిస్తున్నారు. కానీ ఘనీభవించిన ప్లాస్మా, ప్లేట్ లెట్స్, ఎర్ర, తెల్ల రక్తకణాలు, అవసరమైన వారికి లేవని, బయట తెచ్చుకోవాలని చెబుతున్నారు. కాంపోనెంట్ అభివృద్ధి చేసే ఆధునిక సామగ్రి ఆసుపత్రికి వచ్చినా.. వినియోగంలోకి తీసుకొచ్చే వారు లేరని అడిగిన వారికి చెబుతున్నారు. ఎందుకింత జాగు జరుగుతుందో అంతుబట్టడం లేదని జనం వాపోతున్నారు.

ఆసుపత్రికి వచ్చిన రక్త విభజనకు వినియోగించే యంత్ర పరికరాలు

★ ఆసుపత్రిలో రక్త నిల్వల కోసం తరచూ రక్తదాన కార్యక్రమాలు నిర్వహించే స్వచ్ఛంద సంస్థలు, కళాశాలల వారిని సంప్రదిస్తున్నారు. ఆసుపత్రికి కేటాయించిన రక్తదాన, సేకరణ వాహన సిబ్బంది నేరుగా దాతల వద్దకు వెళ్లి సేకరిస్తున్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఏ, బీ, ఏబీ, ఓ నెగిటివ్ గ్రూపుల రక్తంగా వర్గీకరించి నిల్వ ఉంచుతున్నారు. రక్తం నుంచి కణాలు, ప్లాస్మా వంటివి వేరు చేసి మైనస్ 40-80 ఉష్ణోగ్రతలో భద్రపరిచేందుకు శీతలీకరణ పెట్టెలు వంటివి ఇప్పటికే ఆసుపత్రికి చేరుకున్నాయి.

అందుబాటులోకి వచ్చేనా..

ఆసుపత్రికి వచ్చిన రోగుల్లో రక్తం ఎక్కించాల్సిన వారి బంధువుల్లో ఎవరైనా రక్తం ఇస్తే మీకు ఆసుపత్రిలో ఉంది ఇస్తామని రక్తనిధి కేంద్రంలోని సిబ్బంది చెబుతున్నట్లు రోగుల సహాయకులు పేర్కొన్నారు. రక్తదాతలు తగ్గడంతో రక్తనిధి కేంద్రంలో రక్త నిల్వలు సమృద్ధిగా ఉండటం లేదు. ఎవరైనా వచ్చి రక్తం ఇస్తే రోగికి కావలసిన బ్లడ్ ఇస్తున్నట్లు ఆసుపత్రి అధికారులు పేర్కొన్నారు. చివరకు ఎవరినీ తెచ్చుకోని వారికీ ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కాంపోనెంట్ అభివృద్ధికి సంబంధించిన సామగ్రి వచ్చి ఉంది. దీనిని బిగిస్తున్నారు. త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొన్నారు.

చౌక బియ్యం పట్టివేత

స్వాధీనం చేసుకున్న వాహనం

చేబ్రోలు, న్యూస్‌టుడే: పేదలకు అందాల్సిన బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తుండగా పోలీసులకు పట్టుకున్న ఘటన. ఎస్సై వీర నారాయణ కథనం మేరకు.. పొన్నూరు నుంచి గుంటూరు వైపునకు ఓ వాహనంలో సుమారు 90 బస్తాలు (50 కేజీలు) తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం తెల్లవారుజామున చేబ్రోలు మసీదు సెంటర్ వద్ద వాహనాన్ని తనిఖీ చేసి అదుపులోకి తీసుకున్నాం. రేషన్ బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించి వాహనాన్ని.. అందులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నాం. రేషన్ డీలర్లకు వచ్చే బస్తాలు ఉండడంతో ఏ డీలర్ నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు అనే కోణంలో విచారిస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కారుకు నిప్పు

దుగ్గిరాల: దుగ్గిరాల పంచాయతీ కార్యాలయం వద్ద ఓ అపార్టమెంట్ ఎదుట నిలిపిన కారుకు ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. వాహనం అత్తోట అనురాధ అనే పేరు మీద ఉంది. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఒక్కసారిగా మోత రావడంతో అనురాధ బంధువులు బయటకు వచ్చి చూడగా.. అప్పటికే వాహనం 90 శాతం కాలిపోయింది. స్థానికులు మంటల్ని అదుపులోకి తెచ్చారు. ఘటనపై ఎస్సై వెంకటరవి కేసు నమోదు చేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం, న్యూస్‌టుడే: పొనుగుపాడు గ్రామంలో శ్రీగంగా, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం లలితా సహస్రనామ పారాయణం, అభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం అనంతవరం కొండపై శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలసిన వేంకటేశ్వరస్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు తితిదే ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం ధ్వజారోహణం, ఊంజల్ సేవలు నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంపై ఊరేగింపు జరిగింది.

మేదర్లకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలి

తాడికొండ: రాష్ట్రంలో మేదర్ల ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం చేయూత అందించాలని రాష్ట్ర బీసీ విభాగం మేదర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ దూళిపాళ్ల ఏసుబాబు కోరారు. జిల్లా మేదర సంఘం అధ్యక్షుడు మైలపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తాడికొండ గ్రామంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సెక్రటరీగా సి.రాఘవులు, కోశాధికారిగా చలపతిరావు, యువజన సంఘం అధ్యక్షుడిగా దూళిపాళ్ల శ్రీశైలం, సెక్రటరీగా ప్రసాద్, కోశాధికారిగా గోపి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అల్పాహారం తెస్తానని వెళ్లి.. విగతజీవిగా మారి

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సురేష్ (పాత చిత్రం)

ప్రమాద స్థలి వద్ద స్థానికులు, రైల్వే పోలీసులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అల్పాహారం, చికెన్ తీసుకు వస్తానని ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మృతి చెందారు. ఈ విషాద ఘటన తెనాలి పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. తెనాలి రైల్వే పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. పట్టణ పినపాడుకు చెందిన కె.సురేష్ (53) అల్పాహారం, చికెన్ తీసుకు వస్తానని ఇంటి నుంచి బయల్దేరారు. మార్గమధ్యలో మద్రాస్ గేటు వద్ద రైళ్ల రాకపోకల నేపథ్యంలో గేటు మూసేసి ఉంది. ఈ క్రమంలో గేటు కింద నుంచి ముందుకు వెళ్లి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలిలోనే ఆయన మృతి చెందారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరి కన్నీరుమున్నీరుగా విలపించారు. రైల్వే పోలీసుల వివరాలు నమోదు చేసుకుని.. తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు.

వంతెన నిర్మాణ ప్రతిపాదనలు పట్టించుకోరా..?: చెన్నై - విజయవాడ మార్గంలో తెనాలి జంక్షన్ వద్ద మద్రాస్ గేటు ఉంది. ఈ మార్గంలో రోజూ సుమారు 160కు పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ప్రతి పది నిమిషాలకు ఒకసారి గేటు పడుతుంది. ఒక్కోసారి ఒకే సమయంలో రెండు, మూడు రైళ్ల రాకపోకలు ఉంటే మరింత అధిక సమయం పడుతుంది. పినపాడు, పాండురంగపేట తదితర అధిక నివాసాలు ఉండే ప్రాంతాల రాకపోకలకు ఈ మార్గమే ప్రధానమైనది. అంతే కాకుండా గతంలో సమీప మారీసుపేటలోని మొండి గోడల వద్ద పట్టాల మీదుగా రాకపోకలు సాగించే వారు. తాజాగా జరుగుతున్న రైల్వే పనుల్లో ఈ గోడలను మూసివేయడంతో ఈ గేటు మీదుగా రాకపోకలు మరింత పెరిగాయి. ఇక్కడ వంతెన నిర్మించాలని 15 సంవత్సరాల కిందటే ప్రతిపాదనలు పంపారు. కాని ఆ ప్రతిపాదనలు నేటికీ పట్టాలెక్కలేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న క్రమంలో వంతెన విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు గాడిన పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చికిత్సా విధానాలపై అవగాహన

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి పట్టణంలోని ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం సర్వసభ్య సమావేశాన్ని కొల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోలా విజయ్ శేఖర్ ప్రథమ చికిత్స, గుంటూరు జీజీహెచ్ వైద్యులు నీరజ నరాలకు సంబంధిత వ్యాధులపై, డాక్టర్ మర్రెడ్డి శ్రీనివాస్ కిడ్నీ వ్యాధులపై, డాక్టర్ నీలా బ్రైన్ స్ట్రోక్స్‌పై అవగాహన కల్పించారు.

దాడిచేశారని ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ పాలాద్రి కాలువ వద్ద చరవాణి విషయంలో చెలరేగిన వివాదం నేపథ్యంలో తనను నాని, అతని మిత్రులు కొట్టారని డాంగే వారి వీధికి చెందిన మదన్‌సాయి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు ఆదివారం తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక జగనన్న కాలనీలో పులి రమాదేవి ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని ఆదివారం గుర్తించారు. రమాదేవి వాళ్ల అమ్మ మాత్రమే ఇంట్లో ఉంటారు. ఆరోగ్యం సరిగా లేక వారిరువురు 20 రోజుల క్రితం ఆస్పత్రికి వెళ్లారు. ఆదివారం వచ్చి చూస్తే ఇంట్లో వైరింగ్ అంతా కట్ చేసి ఉంది. సుమారు రూ. 50 వేలు నుంచి రూ. 60 వేలు విలువైన వస్తువుల్ని అపహరించినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై వెంకట రవి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. వేలిముద్రల నిపుణులు నమూనాలు సేకరించారు.

కర్రలు తొలగించి.. మరమ్మతులు చేపట్టి



స్పందన.. తెనాలి (కొత్తపేట): తెనాలి జిల్లా ఆసుపత్రిలో ఓపీకి వెళ్లే కూడలిలో కుంగిపోయిన పేవర్స్‌తో రోగులు ఎదుర్కొంటున్న అవస్థలపై గత నెల 10న 'ఈనాడు'లో ప్రచురితమైన 'కర్రలే ప్రమాద హెచ్చరికలు' చిత్ర వార్తకు ఆసుపత్రి అధికారులు స్పందించారు. కుంగిన వాటిని తొలగించి నిర్మాణ పనులు చేపట్టారు.



(c) eenadu

గుంటూరు పశ్చిమ

3న ఉచిత వైద్య శిబిరం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా ఈనెల 3న రాధికా రాయుడు స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెవికి సంబంధించిన పరీక్షలు, ఆటో ఎండోస్కోపీ, చెవిటిని కనుగొనే ఆడియోమెట్రీ వంటి రూ.5 వేల విలువైన పరీక్షలు ఉచితంగా చేస్తారని ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు 12 లక్షల విలువైన కాక్లియార్ ఇంప్లాంట్ ఆపరేషన్లు ఉచితంగా చేసే అవకాశం ఉందన్నారు. పెద్దలకు చెవికి సంబంధించిన వ్యాధులను పరీక్షించి అవసరమైన వారికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

స్పందన: ఆటుకువారితోట పీకలవాగు దగ్గర ఉన్న డ్రెయిన్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని.. 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా స్థానికులు జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో కాలువలోని వ్యర్థాలను తీసేలా చర్యలు తీసుకున్నారు. ● కోదండరామయ్యనగర్‌లో రహదారి పక్కన ఉన్న డ్రెయిన్‌లో మురుగు ముందుకు కదలడం లేదు. దీంతో దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుల్లయ్య స్పందించి డ్రెయిన్‌లో పూడిక తీయించి మురుగు ముందుకు కదిలేలా చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం

ప్రజాఫిర్యాదుల స్వీకరణ నేడు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ పరిధిలోని కలపల వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీనివాస కనపర్తి నాగేశ్వరరావు, పద్మావతి దంపతులు రూ.1,01,116 చెక్కును ఆలయ ఈవో, సహాయ కమిషనర్ బి.సుభద్రకు ఆదివారం అందించారు.

సహాయ కమిషనర్ సుభద్రకు చెక్కు అందిస్తున్న దాతలు

3, 4 తేదీల్లో ప్రకృతి ఛాయాచిత్ర ప్రదర్శన

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఈనెల 3, 4 తేదీల్లో ప్రకృతి ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సేవకుమార్ ఆదివారం తెలిపారు. మూడో తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ప్రదర్శన నాలుగు సాయంత్రం వరకు ఉంటుందన్నారు. ప్రఖ్యాత వైద్యులు, ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొంటారన్నారు. ప్రకృతి ఫొటోగ్రఫీలో ఆసక్తి ఉన్న వారికి నేచర్ ఫొటోగ్రాఫర్ వరప్రసాదు మెలకువలు చెబుతారని, ప్రజలు ప్రదర్శన సందర్శించాలని ఆయన తెలిపారు.

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 12, ఉల్లి 16, బెండ 19, పచ్చిమిర్చి 39, కాకర 35, బీర 35, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 17, క్యారెట్ 25, దొండ 25, బంగాళాదుంప 20, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుడు 20, దోస 22, సొర 12, పొట్లకాయ 22, అరటికాయ 10, పెద్ద చిక్కుళ్లు 32, రామములగ 24, బీట్‌రూట్ 25, ముల్లంగి 15, కీర దోస 35, బీన్స్ 50, క్యాప్సికమ్ 50, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 55, అల్లం 70, వెల్లుల్లి 145. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

ట్రాఫిక్ వెతలు తీరేదెన్నడు?

రహదారులపై వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే

కొందరు రహదారులపైనే వాహనాలను నిలిపేస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడతారన్న ఆలోచన లేకుండా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు. ఫలితంగా ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారవుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణదారులు యథేచ్ఛగా రెచ్చిపోతున్నా పట్టించుకోవాల్సిన జీవీఎంసీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి రోడ్లు విస్తరించి అభివృద్ధి చేస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. కార్ల సర్వీసింగ్ సెంటర్లు, హోటళ్ల నిర్వాహకులు ఇష్టారాజ్యమైపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. పరిస్థితి దారుణంగా ఉంది. గుజ్జనగుండ్ల సెంటర్ మొదలుకొని స్తంభాలగరువు, పట్టాభిపురం, కంకరగుంట ఓవర్‌బ్రిడ్జి వరకు ఇదే పరిస్థితి. కొందరు నిబంధనలకు విరుద్ధంగా రహదారులపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఆదేమని ప్రశ్నిస్తే గొడవకు దిగుతున్నారు. కొంత మంది అడ్డదిడ్డంగా రాంగ్‌రూట్లో రాకపోకలు సాగిస్తున్నారు. ◆ స్తంభాలగరువు పెరుగు చెట్టు సెంటర్‌లో కార్ల సర్వీసింగ్ సెంటర్ నిర్వాహకులు రోడ్లపైనే వాహనాల పార్కింగ్ చేయిస్తున్నారు. జీవీఎం ఈ ప్రాంతంలో ట్రాఫిక్ విభాగం పరిధిలో వాహనాలను నిలిపేయడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లే వారు పడుతున్న వెతలు అన్నీ ఇన్నీ కావు. ◆ స్తంభాలగరువు సెంటర్‌లోని ఓ హోటల్ వద్ద వాహనాలను రోడ్డుపై నిలిపేస్తున్నారు.

అన్నిచోట్లా అదే తీరు.. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో రహదారులపై రావాలంటేనే భయపడాల్సిన

స్తంభాలగరువు పెరుగు చెట్టు సెంటర్‌లో రోడ్డుపైనే వాహనాలు నిలిపారిలా..

హోటల్‌కు ఇరువైపులా ఉన్న రాజేంద్రనగర్ రహదారులకు వెళ్లాలంటే స్థానికులతో పాటు ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఈ విషయాన్ని ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ఈ ప్రాంతీయులు విమర్శిస్తున్నారు. ◆ గార్డెన్స్ పెట్రోల్ బంకు రహదారిలోనూ ఇదే పరిస్థితి. ◆ కండువ రోడ్డు జంక్షన్ పట్టాభిపురం రహదారిలో స్వామి వివేకానంద విగ్రహం వెనుక వైపు, పట్టాభిపురంలోని నారాయణ పాఠశాల వద్ద ట్రావెల్స్ బస్సుల్ని రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారేవ్వరూ లేరు.

4 నుంచి ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజినీరింగ్ తరగతులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: జేకేసీ కళాశాల రోడ్డులోని ఆర్వీఆర్ఆర్ బీఈడీ కళాశాలలో ఈనెల 4వ తేదీ నుంచి ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజినీరింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఈశా వాలంటీర్ సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు షీఎం ఇన్నర్ ఇంజినీరింగ్ అనే ఏడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఇన్నర్ ఇంజినీరింగ్ అనేది సద్గురు రూపొందించిన ఏకైక సమగ్ర కార్యక్రమమని, ఇందులో సులభమైన యోగా సాధనలు, సెషన్లు, ప్రక్రియలు ఉంటాయన్నారు. శాంభవి మహాముద్ర క్రియ అనే శక్తివంతమైన 21 నిమిషాల యోగా సాధన ఉంటుందన్నారు. దీనివల్ల ఒత్తిడి, భయం, అలర్జీ, బీపీ, ఆందోళన నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. వివరాలకు 9885198095 నంబరులో సంప్రదించాలని కోరారు.

కవిత్వంతో కాసేపు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని కేంద్ర గ్రంథాలయంలో కవిత్వంతో కాసేపు కార్యక్రమం ఆదివారం జరిగింది. రచయిత డాక్టర్ విజయ్ కోగంటి కవిత చదివి కార్యక్రమం ప్రారంభించారు. విజయ్ కోగంటి మాట్లాడుతూ కవులందరూ ఒక చోట చేరి కవిత్వంతో కాసేపు గడపడం బాగుందన్నారు. సంస్థ కోశాధికారి నానా, భూసురపల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, కె.పుల్లారావు, వశిష్ట సోమేపల్లి, తాటికోల పద్మావతి, ఎం.సుభద్రకృష్ణ, జమదగ్ని, కొణతం నాగేశ్వరరావు, విజయలక్ష్మి సోమేపల్లి, రమణి సబ్బరాజు, రవికుమార్, బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, పింగళి భాగ్యలక్ష్మి, గిరిభూషణరావు, గురవయ్య తదితరులు కవితలు చదివి అలరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న కవులు, కవయిత్రులు

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక కంకరగుంట గేటు సమీపంలోని శ్రీసాయి మందిరంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. కురుచేటి పిచ్చయ్యశాస్త్రి ఆధ్వర్యంలో అర్చక బృందం సీతారాములు, ఆంజనేయ స్వామి, సాయిబాబా విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. చలనచిత్ర దర్శకుడు జాగర్లమూడి క్రిష్ పాల్గొన్నారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమాలను పాలకమండలి అధ్యక్షుడు జాగర్లమూడి సాయిబాబు, కార్యదర్శి దాసరి శివకుమార్, కోశాధికారి చెవుల శ్రీనివాస్, సభ్యులు గోవిందరాజులు, సత్యసింగ్ యోగానంద్, శివరాంసింగ్, దాసరి కిశోర్, పాపారావు పర్యవేక్షించారు.

మూలమంత్ర హోమాలు చేస్తూ..

మట్టి కుప్పలు.. రాకపోకలకు తిప్పలు

అరండల్‌పేట 5వ లేను 1వ అడ్డరోడ్డు నుంచి 2వ అడ్డ రోడ్డుకు వెళ్లే మార్గంలో ఒకవైపున మట్టికుప్పలు పోశారు. దీంతో రాకపోకల సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనచోదకులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఎదురెదురుగా వాహనాలు వస్తే మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుందని, వాటి తొలగింపునకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గోరంట్ల

సంపు ఇలా.. చూడకుంటే పడిపోరా..

స్థానిక రామన్నపేట ప్రధాన రహదారి మధ్యలో కేబుల్ సంపు రోడ్డుకు మించి ఎత్తుగా ఉంది. దీంతో వాహనచోదకులు గమనించక సంపును ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. మరీ ముఖ్యంగా మలుపు తిరిగే సమయంలో చోదకులు వాహనాలను అదుపు చేసేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, నగరపాలక సంస్థ అధికారులు స్పందించి.. నిర్వాహకులతో చర్చించి రోడ్డుకు సమాంతరంగా సంపు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గోరంట్ల

మురుగునీరు తొలగింపునకు చర్యలు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ఉద్యోగనగర్ పార్కు ఎదురు వీధిలో కాలువల కోసం తవ్విన గుంతల్లో నిలిచిన మురుగునీటిని ట్యాంకర్ల ద్వారా తొలగించారు. 'నెల రోజులైనా కాలవలు నిర్మించరే' శీర్షికన గురువారం 'ఈనాడు'లో వచ్చిన కథనానికి కార్పొరేషన్ అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపి గుంతల్లో నిలిచిన మురుగును పైపుల ద్వారా ట్యాంకర్లకు నింపుకుని తరలించారు. కాలువ పనులు త్వరగా మెదలుపెట్టి పూర్తిచేయాలని గుత్తేదారుని ఆదేశించామని అధికారులు తెలిపారు.

గుంతల దారి.. ప్రమాదకరంగా మారి..

మల్లారెడ్డినగర్‌లోని ప్రధాన రహదారిలో గుంతలు ప్రమాదకరంగా మారాయి. రద్దీగా ఉండే ఈదారిలో గుంతలు పడి నాలుగు నెలలు గడిచినా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఇటుగా వెళ్లే వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈమార్గంలో కల్యాణమండపం ఎదుట రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. ఇక్కడ రోజూ ఒక ప్రమాదం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెనుప్రమాదాలు జరగకముందే స్పందించి గుంతలు పూడ్చించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గుంటూరు నగరం

విజయలక్ష్మీ నారాయణుల కల్యాణం

పవిత్ర మాంగల్య దర్శనం

అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో 31వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం విజయలక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం జరిగింది. ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ బృందం కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో కల్యాణమూర్తులకు అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీచక్ర మేరుకు అభిషేకాలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, గుంటూరు సాంస్కృతికం

వాసవీక్లబ్ సేవలు అభినందనీయం

పట్నంబజారు, న్యూస్‌టుడే: వాసవీక్లబ్ మణికంఠ గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం ఏటుకూరు రోడ్డులోని గీతా మందిరంలో 108 మంది పేదలకు 20 రకాల నిత్యావసర సరకులు, 10 మంది వృద్ధులకు రూ.500 చొప్పున పింఛన్లు అందజేశారు. గీతా మందిరం ఛైర్మన్ జుజ్జూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మిర్చియార్డు డైరెక్టర్ కొనకళ్ల సత్యం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వాసవీక్లబ్ మణికంఠ గుంటూరు సభ్యులు పదేళ్లుగా ఈ తరహా సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పొట్టి శివరామకృష్ణ అయ్యప్ప, నిమ్మగడ్డ కామేశ్వరరావు, పోలిశెట్టి సురేంద్ర, జుజ్జూరు శివకుమార్, మాజేటి మణికంఠ, చింతా శ్రీనివాస్‌మూర్తి, కోట శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు అందజేస్తున్న కొనకళ్ల సత్యం, జుజ్జూరు శ్రీనివాసరావు

జనసేన విజయంలో మహిళల పాత్ర కీలకం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: జనసేన విజయంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆపార్టీ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ పార్వతి నాయుడు పేర్కొన్నారు. జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుతోటలో ఆదివారం జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్వతి నాయుడు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు జరుగుతున్న సభ్యత్వ నమోదుకు మహిళలు ప్రభంజనంలా ముందుకు వస్తున్నారన్నారు. మిర్చియార్డు వైస్ ఛైర్మన్ బిట్రగుంట మల్లిక మాట్లాడుతూ జనసేనలో మహిళలకు సముచితస్థానం ఉంటుందన్నారు. నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు, బాషా, అంజి, సుబ్బారావు, మహిళలు లీల, శిరీష, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం తీసుకున్న మహిళలతో పార్వతినాయుడు తదితరులు

అర కిలోమీటరు రోడ్డు ఆరు నెలలైనా అవ్వదా..?

అధికారుల నిర్లక్ష్యంతో స్థానికులు, వాహనదారుల అవస్థలు

నగరపాలకసంస్థ(గుంటూరు), పట్టాభిపురం, న్యూస్‌టుడే

అర కిలోమీటరు రహదారి వేసేందుకు నెలల తరబడి కాలయాపన చేస్తుండడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కాకుమానువారితోట శ్మశానం రోడ్డును ఆరు నెలల క్రితం ప్రారంభించారు. రహదారిలో కొంత వరకు పనులు పూర్తిచేసి డస్ట్ పోసి సీసీ రహదారి నిర్మాణం ప్రారంభించకుండా వదిలేశారు. దీంతో అనేక ప్రాంతాలకు అనుసంధానంగా ఉండే ఈ దారిలో రాకపోకలు చేసేవారు అవస్థలు పడుతున్నారు. దీనికితోడు డస్ట్ పోసి వదిలేయడంతో దుమ్ముతో పరిసరాలు కలుషితంగా మారుతున్నాయి. స్థానికులు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా రహదారి నిర్మాణం పూర్తికి అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈరహదారి పనులు మధ్యలో ఆగిపోవడంపై కౌన్సిల్‌లో కూడా చర్చకు వచ్చింది. గుత్తేదారుడిని మార్చుతున్నామని, పనులు ప్రారంభిస్తామని చెప్పినా ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా వదిలేసిన కాకుమానువారితోట శ్మశానం రోడ్డు

పనుల పరిస్థితి ఇది.. కాకుకమారివారి తోట నుంచి శ్రీనగర్ 7వ లైన్ వరకు సుమారు 625 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.56 లక్షలు వ్యయం చేస్తున్నారు. ఇన్ని నెలల పాటు పనుల జాప్యంపై ఉన్నతాధికారులు, కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. కొన్నిచోట్ల మట్టి కుప్పలు అలాగే వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఈ ప్రాంతాలకు ఉపయోగం..

ఈ రహదారి నిర్మాణం పూర్తయితే అరండల్‌పేట, బ్రాడీపేట, శ్రీనగర్, సంజీవయ్యనగర్, శారదాకాలనీ, రెడ్డిపాలెం వైపు వెళ్లే వారికి ఉపయోగంగా ఉంటుంది. శంకర్‌విలాస్ బ్రిడ్జి పనులు జరుగుతున్నందున డొంకరోడ్డుకు పెద్ద ఎత్తున ట్రాఫిక్ పెరిగి సమస్యలు వస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని అనుసంధానంగా ఉండే ఈ రహదారిపై అధికారులు వెంటనే దృష్టి పెట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. రహదారి నిర్మాణంలో భాగంగా ముందుగా ఈ మార్గంలో సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. కొన్ని చోట్ల పనులు అసంపూర్తిగా ఉండడంతో స్థానికంగా నివాసాల నుంచి వచ్చే మురుగునీరు పారుదలకు ఆటంకం కలుగుతోంది. వెంటనే ఇంజినీరింగ్ అధికారులు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అంబటికి వైకాపా నేతల పరామర్శ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: గుంటూరు సిద్ధార్థనగర్‌లోని కార్యాలయంలో మాజీ మంత్రి అంబటి రాంబాబును పలువురు వైకాపా నేతలు ఆదివారం పరామర్శించారు. ఈసందర్భంగా వైకాపా నేతలు మాట్లాడుతూ రెడ్‌బుక్‌కు భయపడేది లేదని తెలిపారు. అంబటిని పరామర్శించిన వారిలో మాజీ మంత్రులు మేకతోటి సుచరిత, కొడాలి నాని, కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యేలు నంబూరు శంకర్‌రావు, జక్కంపూడి రాజా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కాపు నేతలు చిన్నమిల్లి వెంకటరాయుడు, రామకృష్ణ, పరమేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ప్రభుత్వాలు మారుతున్నా అగ్రిగోల్డ్ బాధితుల కష్టాలు తీరడం లేదని అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరావు కోరారు. ఆదివారం కొత్తపేటలోని కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. చంద్రశేఖరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది బాధితులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫాస్టుట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమర్థత కలిగిన అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీని నియమించాలన్నారు. అగ్రిగోల్డు బాధితుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 2 నుంచి విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా గౌరవ అధ్యక్షులు కోట మాల్యాద్రి మాట్లాడారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీల, చెంబేటి మణికుమారి, పార్లమెంట్ అంగన్‌వాడీ ప్రధాన కార్యదర్శి లామ్ నవమి పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. రెండు సార్లు అంగన్‌వాడీల వేతనాలు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసి, ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. 58,204 మంది అంగన్‌వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, బ్లాక్ సమన్వయకర్తలకు రూ.75 కోట్ల వ్యయంతో 5జీ స్మార్ట్‌ఫోన్లు అందించడంతో వేగవంతమైన సేవలు అందుతున్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల హాజరు 96 శాతానికి పెరగడం ప్రభుత్వ పాలన ఫలితమని, ఏళ్లుగా ఎదురుచూసిన గ్రాట్యుటీ అమలు చేసినట్లు పేర్కొన్నారు. కేంద్రాలకు టీవీలు, ఆర్వోలు, మరుగుదొడ్ల సౌకర్యం, వేసవిలో 15 రోజుల సెలవులు, ఆటవస్తువులు, ఛార్టులు, ఇండక్షన్ స్టౌలు, నాణ్యమైన వంట పాత్రలు అందించామని చెప్పారు. అంగన్‌వాడీలు ప్రతిపాదించిన 9 డిమాండ్లను ఇప్పటికే పరిష్కరించామని, వేతనాల పెంపు అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

ఒలింపియాడ్‌తో విద్యార్థుల్లో పోటీతత్వం పెంపు

గోరంట్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పోటీతత్వం, విశ్లేషణాత్మక ధోరణి పెంపొందించేందుకు ఒలింపియాడ్ పరీక్షలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి అన్నారు. పలకలూరు రోడ్డులోని చైతన్య స్కూల్‌లో ఈ-అభ్యాస్ అకాడమీ, కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లెవల్-2 ఒలింపియాడ్ ప్రతిభా పరీక్షలు ఆదివారం జరిగాయి. ప్రశ్నపత్రాన్ని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి విడుదల చేసి పరీక్షకు హాజరైన విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఇటువంటి ప్రతిభా వేదికలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఈ-అభ్యాస్ ఛైర్మన్ భువనగిరి ఫణిపవన్‌శాస్త్రి, అపుస్మా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రమణారెడ్డి, చైతన్య స్కూల్స్ డైరెక్టర్ సాంబిరెడ్డి, అపుస్మా రాష్ట్ర సభ్యులు కొండవీడు మస్తానరావు, స్కూల్ డైరెక్టర్లు బద్దిగం శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఏరువ శ్రీవేణి, పి.అభినందన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాన్ని విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

అలరించిన నృత్య ప్రదర్శనలు

స్థానిక ఏడీ హాలులో ఆదివారం రాత్రి జరిగిన నృత్యప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. రాధామాధవ రసరంజని ఆధ్వర్యంలో పలు నృత్య శిక్షణాలయాల విద్యార్థుల ప్రదర్శనలు ఆద్యంతం కనులవిందుగా సాగాయి. కార్యక్రమాలను నాట్యాచార్య షేక్ ఖలీల్ పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, గుంటూరు సాంస్కృతికం

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక కృష్ణనగర్ లోటస్ ఆద్య ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఆంగ్లం, హిందీ, ఫిజికల్ సైన్స్, కెమిస్ట్రీ, గణితం, మ్యాజిక్ క్యాలెండర్, ఫ్లిప్ బోర్డ్, విండ్ మిల్, ట్రాఫిక్ సిగ్నల్స్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, గర్భస్థ పిండం ఎదుగుదల దశలు తదితర అంశాలను విద్యార్థులు ప్రదర్శించి.. నమూనాల గురించి సందర్శకులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వరరావు, అకడమిక్ డైరెక్టర్ యడ్లపల్లి ఉమాదేవి, ప్రిన్సిపల్ బి.రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నమూనా గురించి వివరిస్తున్న బాలలు

కుటుంబ కథా చిత్రం విష్ణువిన్యాసం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా విష్ణు విన్యాసం అని చిత్ర కథానాయకుడు శ్రీవిష్ణు అన్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని ఓ హోటల్లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రేక్షకుల స్పందన, తొలివారంలో భారీ కలెక్షన్లు రావడం సంతోషంగా ఉందన్నారు. గుంటూరుతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని వివరించారు. గుంటూరు చలన చిత్ర రంగానికి ఎందరో హీరోలు, హీరోయిన్లు, దర్శకులను అందించిందని వివరించారు. కథానాయిక నయన్‌సారిక మాట్లాడుతూ విష్ణు విన్యాసం చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో చిత్ర దర్శకుడు యదునాథ్ మారుతిరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీవిష్ణు

ఉత్సాహంగా కరాటే పోటీలు

ఏటీ అగ్రహారం: స్థానిక తితిదే కల్యాణ మండపంలో ఆర్‌బీ డ్రాగన్స్ షొటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఉగ్గిరాల సీతారామయ్యలు మాట్లాడుతూ జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. టోర్నమెంట్ నిర్వాహకుడు పి.రాంబాబు మాట్లాడుతూ బాలుర విభాగంలో నరసరావుపేట, వైజాగ్, కడప, బాలికల విభాగంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి వరుస స్థానాల్లో నిలిచాయని తెలిపారు.

టెన్యూర్ పీపీల అధ్యక్షుడిగా చుక్కపల్లి రమేష్

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: టెన్యూర్ పీపీల అధ్యక్షుడిగా గుంటూరు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చుక్కపల్లి రమేష్ ఎన్నికయ్యారు. ఆదివారం ఏలూరు బార్ అసోసియేషన్‌లో జరిగిన టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశంలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా నరసరావుపేట జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ ప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా తాడేపల్లిగూడెం అదనపు పీపీ కె.శివరామకృష్ణ ఎన్నికయ్యారు. పర్యవేక్షకులుగా ఏలూరు జిల్లా కోర్టు పీపీ ఏవీ నారాయణ, గుంటూరు పోక్సో కోర్టు స్పెషల్ పీపీ టి.దుర్గాప్రసాద్ వ్యవహరించారు.

అత్యాధునిక టెక్నాలజీతో డ్యాన్స్ స్టూడియో

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: గుంటూరులో అత్యాధునిక టెక్నాలజీ, సదుపాయాలతో డ్యాన్స్ స్టూడియో ఏర్పాటు చేయడం అభినందనీయమని కొరియోగ్రాఫర్ రేవంత్ అన్నారు. కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్ ఎదుట పద్మావతి ఫోనిక్స్ మాల్ నాలుగో అంతస్తులో నూతనంగా ఏర్పాటుచేసిన ఫ్యూజన్ డ్యాన్స్ స్టూడియోను కొరియోగ్రాఫర్స్ రేవంత్, మణికంఠ మాస్టర్స్ ఆదివారం ప్రారంభించారు. స్టూడియో ఫౌండర్ డాక్టర్ ఐశ్వర్య మాట్లాడుతూ స్టూడియోలో రెగ్యులర్‌గా యోగా, కూచిపూడి నృత్యం, వెస్ట్రన్ జుంబా డ్యాన్స్ ఏర్పాటు చేశామన్నారు.

యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ స్టేడియం నూతన పాలకవర్గ సభ్యులు యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల్లో కార్యదర్శిగా ఎన్నికైన రామకృష్ణ, ఆయన ప్యానెల్ సభ్యులు ఎమ్మెల్యే గళ్లా మాధవిని ఆదివారం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

(c) eenadu

గుంటూరు తూర్పు

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రిపై డీఎస్పీ ఫిర్యాదు

తుళ్లూరు: తిరుమల లడ్డూలో పందికొవ్వు, జంతుకొవ్వు కలిసిన నెయ్యిని వినియోగించారంటూ పదే పదే ఆరోపణలు చేయడం తనను మనస్తాపానికి గురిచేసిందంటూ ఓ డీఎస్పీ ఆదివారం తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు టీటీడీ ఛైర్మన్, ఈవో శ్యామలరావు తదితరుల పేర్లను ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. భక్తుల మనో భావాలు, విశ్వాసాలు దెబ్బతినేలా మాట్లాడటం సరికాదని, శ్రీవారి లడ్డూ మీద, శ్రీవారి మీద అనేక రకాల దుష్ప్రచారం జరుగుతుండడం తనకు బాధ కలిగించి ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ధర వరలు

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్న ఇలా.. (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 12, వంగ 17, బెండ 19, పచ్చిమిర్చి 39, కాకర 35, క్యారెట్ 25, క్యాబేజీ 17, బీర 40, దొండ 45, బంగాళాదుంప 20, ఉల్లిపాయలు 24, గోరుచిక్కుడు 35, దోస 34, పొట్ల 25, చామ 23, గోంగూర 10, తోటకూర 15, ములక్కాడ 15, మెంతికూర 5, కొత్తిమీర 20, బీట్‌రూట్ 25, కీర 42, క్యాప్సికం 65, అల్లం 75, ఫ్రెంచ్ బీన్స్ 60, సొర 10, అరటి 8.
- న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

స్పందన: వివేక్ కాలనీ ప్రధాన రోడ్డులో చెత్తకుప్పలు తీయకుండా అలాగే వదిలేయడంతో వీధి అపరిశుభ్రంగా మారిందని స్థానికుడు సురేంద్ర 'మేమున్నాం.. మీకు తోడుగా' తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ ఆయూబ్‌ఖాన్‌కు తెలియజేయడంతో చెత్తకుప్పలు తీయించి తరలించారు. శివనాగరాజు కాలనీ నాల్గోలైన్ సైడు కాలువల్లో పూడికలు చేరి మురుగునీటి పారుదలకు ఆటంకం ఉందని స్థానికుడు అమీర్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్య ప్రజారోగ్య అధికారులకు తెలియజేయడంతో కాలువల్లో పూడికలు తీయించారు. విజయపురి కాలనీ ప్రధాన రోడ్డులో చెత్త కుప్పలు రెండు రోజులుగా వదిలేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికుడు శ్రీనివాస 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ ఆయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో చెత్తకుప్పలు తరలించారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

? పాతగుంటూరు బాలాజీనగర్ పరిసర ప్రాంతాల్లో లోవోల్టేజ్ సమస్య సమస్య అధికంగా ఉంది. విద్యుత్తు సరఫరాలో అంతరాయం కారణంగా ఇళ్లల్లోని టీవీలు, ఫ్రిజ్‌లు పాడైపోతున్నాయి. - బన్నీ, మణి హోటల్ సెంటర్ ✔ ఆ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. - మస్తాన్, విద్యుత్తుశాఖ ఏఈ

? రైల్వేస్టేషన్‌లో కొందరు స్టాల్స్ నిర్వాహకులు శీతలపానీయలను గరిష్ఠ చిల్లర ధరలకు మించి విక్రయిస్తున్నారు. - బాలయ్య, రైలుపేట ✔ అలాంటివారిపై కేసులు నమోదు చేస్తాం. - సునీల్‌రాజు, తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్

? నందివెలుగురోడ్డులోని మణిహోటల్ సెంటర్‌లో మందుబాబులు రోడ్డుపైకి చేరుతున్నారు. - హారిబాబు, పార్కుసెంటర్ ✔ పోలీసు గస్తీ ముమ్మరం చేసి సమస్యను పరిష్కరిస్తాం. -వెంకట ప్రసాద్, పాతగుంటూరు సీఐ

? కొండయ్యకాలనీలో రోడ్డుపై చెదిన వృక్షాన్ని తొలగించాలి. -ఆన్సర్ ✔ వృక్షం తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. -రత్నం, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, పట్నంబజారు

పట్టించుకోకుంటే ప్రజల ప్రాణాలకే ముప్పు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే

వాహనాల మధ్యలో బస్సు కోసం పరుగులు పెడుతూ..

వాసవీమార్ట్ ఎదురుగా శిథిలావస్థలో ప్రయాణికుల షెల్టర్

కాకానిరోడ్డులో బస్సులకోసం ప్రయాణికులు నిత్యం వేచి ఉంటున్నారు. బస్సులు వచ్చిన సమయంలో రోడ్డుకు అడ్డంగా పరుగులు తీసే క్రమంలో ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. గుంటూరు నుంచి కాకాని రోడ్డు మీదుగా నిత్యం వందలాది ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. జేఎన్టీయూ కాకాని, మంగళగిరి, విజయవాడ తదితర ప్రాంతాలకు నిత్యం వేలాది మంది ప్రయాణిస్తుంటారు. కొత్తపేట, గుంటూరువారితోట, నెహ్రూనగర్, సీతానగర్, పరమయ్యకుంట, మంగళదాస్‌నగర్, ఆదిత్యనగర్, అంబేడ్కర్‌నగర్, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాలకు చెందిన వారు కాకాని రోడ్డు మీద బస్సుల కోసం వేచి ఉంటారు.

తగిన ప్రాంతాల్లో బస్సులు ఆపక..

గుంటూరు నుంచి తాడేపల్లి వరకు అనేక ప్రముఖ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. బస్సుల కోసం కాకానిరోడ్డులో నిత్యం వేలాది మంది విద్యార్థులు రోడ్డుపై వేచి ఉంటున్నారు. దీంతోపాటు మంగళగిరిలోని ఎయిమ్స్‌కు వందలాది మంది ఇటు వైపు బస్సుల ద్వారా ప్రయాణిస్తుంటారు. అంతటి ప్రధాన మార్గంలో సరిపడినన్ని బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయలేదు. ఉన్న బస్‌షెల్టర్లు పర్యవేక్షణ లేక శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్‌షెల్టర్ వద్ద బస్సులు నిలపకుండా రోడ్డు మధ్యలో ఆపడం, కొన్ని బస్సులు ఆపకుండా వెళ్లిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. సమయానికి కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు చేరుకోవాలని బస్సుల కోసం రోడ్డుకు అడ్డంగా పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. నిత్యం రద్దీ రహదారిలో రోడ్డుకు అడ్డంగా పరుగులు తీసే క్రమంలో వెనుక వచ్చే వాహనాలు ఢీకొంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి బస్‌షెల్టర్లను బాగుచేయించడంతోపాటు వాటి వద్దనే బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యం

ర్యాలీలో డీఎస్పీ అజీజ్, ఎస్సైలు, విద్యార్థినులు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: మహిళల రక్షణ, భద్రతకు పోలీసుశాఖ ప్రాధాన్యమిస్తుందని తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం నగరంలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వడం అందరి బాధ్యత అన్నారు. కుటుంబ స్థాయి నుంచే బాలికలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలన్నారు. మహిళలకు ఏదైనా ఇబ్బంది కలిగితే డయల్ 112, శక్తి టీమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ర్యాలీలో ఎస్సైలు రమేష్, సుబ్బారావు, వెంకట్రావు, రెహమాన్, మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ చెందిన లాలాపేట వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు కనుమర్లపూడి నాగేశ్వరరావు, పద్మావతి దంపతులు రూ. 1,01,116 చెక్కును ఆలయ ఈవో, సహాయ కమిషనర్ బి.సుబ్రహ్మణ్యానికి ఆదివారం అందించారు.

సహాయ కమిషనర్ సుబ్రహ్మకు చెక్కు అందిస్తున్న దాతలు

అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమానికి కృషి

నగరపాలకసంస్థ: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరుద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశచరిత్రలో తొలిసారిగా రెండు సార్లు అంగన్‌వాడీల వేతనాలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అంగన్‌వాడీల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 86.68 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. గ్రాట్యుటీ కలను నిజం చేసి 2025 బడ్జెట్‌లో రూ. 20 కోట్లు కేటాయించామన్నారు. ఇప్పటికే 9 డిమాండ్లను నెరవేర్చినట్లు, వేతనాల పెంపు అంశాన్ని వీలైనంత త్వరగా అమలు చేసేలా కృషి చేస్తామని చెప్పారు.

టెన్యూర్ పీపీల అధ్యక్షుడిగా చుక్కపల్లి రమేష్

రమేష్‌ను సత్కరిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: టెన్యూర్ పీపీల అధ్యక్షుడిగా గుంటూరు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చుక్కపల్లి రమేష్ ఎన్నికయ్యారు. ఆదివారం ఏలూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా నరసరావుపేట జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ ప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా తాడేపల్లిగూడెం అదనపు పీపీ కె.శివరామకృష్ణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఏలూరు జిల్లా కోర్టు పీపీ ఎవీ నారాయణ, గుంటూరు పోక్సో కోర్టు స్పెషల్ పీపీ టి.దుర్గాప్రసాద్ వ్యవహరించారు.

భాష్యం రామకృష్ణకు ప్రముఖుల శుభాకాంక్షలు

రామకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు విద్య: భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, గల్లా మాధవి, ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, ఉద్ధర నరసింహారెడ్డి, నగరంలోని భాష్యం విద్యాసంస్థల ఏపీ, తెలంగాణాల జీఎంలు, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. మంలో భాష్యం విద్యాసంస్థలకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ప్రజాఫిర్యాదుల స్వీకరణ

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ హాల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తామన్నారు.

ప్రేమ, కరుణ కలిగి ఉండాలి

ఇఫ్తార్ విందులో పాల్గొన్న డిప్యూటీ మేయర్ షేక్ సజీల

పట్నంబజారు, న్యూస్‌టుడే: అల్లా చెప్పినట్లు ప్రతి ఒక్కరూ తోటివారిపై ప్రేమ, కరుణ కలిగి ఉండాలని డిప్యూటీ మేయర్ షేక్ సజీల తెలిపారు. యానాది కాలనీలో ఆదివారం ఆషిక్, ఖలీల్ ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ అశోక్, కృష్ణ బాజీ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదం

నమూనాల వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ జయకిషన్, ప్రసాద్‌రావు, మహతి

పట్నంబజారు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడతాయని కిమ్స్ శిఖర హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జయకిషన్ తెలిపారు. అరండల్‌పేట కాలనీలోని కన్నా ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో ఆదివారం విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆల్ రౌండ్ టాలెంట్ షో తిలకించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇగ్నో డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్‌రావు, డాక్టర్ మహతి, వాణిజ్యపన్నుల విశ్రాంత డిప్యూటీ కమిషనర్ కె. చంద్రశేఖరరావు, కన్నా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ కన్నా మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

3,4 తేదీల్లో ప్రకృతి ఛాయాచిత్ర ప్రదర్శన

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: సర్వీస్ హెల్ప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఈనెల 3, 4 తేదీల్లో ప్రకృతి ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సేవకుమార్ ఆదివారం తెలిపారు. మూడో తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ప్రదర్శన నాలుగు సాయంత్రం వరకు ఉంటుందన్నారు. ప్రఖ్యాత వైద్యులు, ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొంటారన్నారు. ప్రకృతి ఫొటోగ్రఫీలో ఆసక్తి ఉన్న వారికి నేచర్ ఫొటోగ్రాఫర్ వర్క్‌షాప్ మెలకువలు చెబుతారని, ప్రజలు ప్రదర్శన సందర్శించాలని ఆయన తెలిపారు.

వృద్ధుడి మృతిపై విచారణ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : కోదండరామయ్యనగర్‌లో ఆదివారం ఓ వృద్ధుడు మృతి చెంది పడిఉండడం స్థానికంగా కలకలం రేపింది. సమాచారం తెలుసుకున్న సీఐ సత్యనారాయణ, ఎస్సై రాంబాబు ఘటనాస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి వృద్ధుడు మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించిన ఐజీ, ఎస్పీ

భద్రతా చర్యలు పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రాజధాని ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లను ఆదివారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, ఎస్పీ వకుల్‌జిందాల్ క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. అతిథులకు భద్రతాపరంగా అన్నిరకాల ముందస్తు చర్యలు తీసుకున్నారు. బందోబస్తులో ఉన్న అధికారులు, సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేస్తూ సమర్థంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. బందోబస్తులో ఏఎస్పీలు రవికుమార్, సుప్రజ, హనుమంతు, డీఎస్పీలు మురళీకృష్ణ, శ్రీనివాసరావు, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఇసుక

నెహ్రూనగర్ 1వ వీధి మహాలక్ష్మమ్మ ఆలయం వెనక రహదారిలో అడ్డంగా ఇసుక, కంకర కుప్పలుగా వేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాహనాలు ఇసుకలో కూరుకుపోతున్నాయి. స్థానికులు వెనకనుండి ఆటోలను తోయాల్సిన పరిస్థితి. ద్విచక్రవాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి.
- న్యూస్‌టుడే, నెహ్రూనగర్

అసంపూర్తి పనులతో అవస్థలు

లాలాపేట చిన్నబజారులో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఈ ప్రాంతంలో సైడు కాలువలు పూర్తికాక వ్యర్థపునీరు ఖాళీ స్థలాల్లోకి చేరుతోంది. ఇళ్ల మధ్య నెలకొన్న అపరిశుభ్ర వాతావరణం కారణంగా రోగాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు తెలిపారు.
- న్యూస్‌టుడే, పట్నంబజారు

మురుగు నిల్వతో ఇబ్బందులు

సంజీవనగర్ ప్రధాన రహదారిపై డ్రెయినేజీ లీకై మురుగునీరు రోడ్డుపై చేరడంతో ఇబ్బందిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. దుర్గంధం భరించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

జనసేన విజయంలో మహిళల పాత్ర కీలకం

సభ్యత్వం తీసుకున్న మహిళలతో పార్వతినాయుడు తదితరులు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: జనసేన విజయంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని ఆపార్టీ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ పార్వతి నాయుడు పేర్కొన్నారు. జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుతోటలో ఆదివారం జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్వతినాయుడు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు జరుగుతున్న సభ్యత్వ నమోదుకు మహిళలు ప్రభంజనంలా ముందుకు వస్తున్నారన్నారు. మిర్చియార్డు వైస్ ఛైర్మన్ బిట్ర గుంట మల్లిక మాట్లాడుతూ జనసేనలో మహిళలకు సముచితస్థానం ఉంటుందన్నారు. నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు, బాషా, అంజి, సుబ్బారావు, మహిళలు లీల, శిరీష, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

3న ఉచిత వైద్య శిబిరం

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా ఈనెల 3న రాధికా రాయుడు స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెవికి సంబంధించిన పరీక్షలు, ఆటో ఎండోస్కోపీ, చెవిటిని కనుగొనే ఆడియోమెట్రీ వంటి రూ. 5 వేల విలువైన పరీక్షలు ఉచితంగా చేస్తారని ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు 12 లక్షల విలువైన కాక్లియార్ ఇంప్లాట్ ఆపరేషన్లు ఉచితంగా చేసే అవకాశం ఉందన్నారు. పెద్దలకు చెవికి సంబంధించిన వ్యాధులను పరీక్షించి అవసరమైన వారికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని తెలిపారు.

మిర్చియార్డు అభివృద్ధికి కృషి చేయాలి

పట్నంబజారు, న్యూస్‌టుడే: మిర్చియార్డు అభివృద్ధికి కొనకళ్ల సత్యం పాటుపడాలని ఆర్.పి.మిత్ర బృందం ఫౌండర్స్ ఉప్పుటూరి రవికుమార్ కోరారు. రవిప్రకాష్ ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో మిర్చియార్డు డైరెక్టర్‌గా నియమితులైన కొనకళ్ల సత్యంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సత్యం భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలన్నారు. సత్యం మాట్లాడుతూ తన పదవికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానన్నారు. కార్పొరేటర్ బాబు మాట్లాడుతూ రాజధాని అమరావతిలో నిర్మించే పొట్టి శ్రీరాములు స్మృతి వనం నిర్మాణంలో అందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో మాజేటి వరప్రకాష్, శ్రీనివాస్‌గుప్తా, బొలిశెట్టి సురేష్, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, శ్రీధర్‌బాబు, శేషగిరి, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజినీరింగ్ తరగతులు

పట్టాభిపురం: జేకేసీ కళాశాల రోడ్డులోని ఆర్‌వీఆర్‌ఆర్ బీఈడీ కళాశాలలో ఈనెల 4నుంచి ఈశా ఫౌండేషన్ ఇన్నర్ ఇంజినీరింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు వాలంటీర్ సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం 6 నుంచి 9 వరకు పీఎం ఇన్నర్ ఇంజినీరింగ్ అనే ఏడు రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

వాసవీక్లబ్ సేవలు అభినందనీయం



పింఛన్లు అందజేస్తున్న కొనకళ్ల సత్యం, జుజ్జూరు శ్రీనివాసరావు

పట్నంబజారు, న్యూస్‌టుడే: వాసవీక్లబ్ మణికంఠ గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం ఏటుకూరు రోడ్డులోని గీతా మందిరంలో 108 మంది పేదలకు 20 రకాల నిత్యావసర సరకులు, 10 మంది వృద్ధులకు రూ. 500 చొప్పున పింఛన్లు అందజేశారు. గీతా మందిరం ఛైర్మన్ జుజ్జూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మిర్చియార్డు డైరెక్టర్ కొనకళ్ల సత్యం ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వాసవీక్లబ్ మణికంఠ గుంటూరు సభ్యులు పదేళ్లుగా ఈ తరహా సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పొట్టి శివరామకృష్ణ అయ్యప్ప, నిమ్మగడ్డ కామేశ్వరరావు, పోలిశెట్టి సురేంద్ర, జుజ్జూరు శివకుమార్, మాజేటి మణికంఠ, చింతా శ్రీనివాస్ మూర్తి, కోట శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

అర కిలోమీటరు రోడ్డు ఆరు నెలలైనా అవ్వదా..?

అధికారుల నిర్లక్ష్యంతో స్థానికులు, వాహనదారుల అవస్థలు

నగరపాలకసంస్థ(గుంటూరు), పట్టాభిపురం, న్యూస్‌టుడే

అర కిలోమీటరు రహదారి వేసేందుకు నెలల తరబడి కాలయాపన చేస్తుండడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కాకుమానువారితోట శ్మశానం రోడ్డును ఆరు నెలల క్రితం ప్రారంభించారు. రహదారిలో కొంత వరకు పనులు పూర్తిచేసి డస్ట్ పోసి సీసీ రహదారి నిర్మాణం ప్రారంభించకుండా వదిలేశారు. దీంతో అనేక ప్రాంతాలకు అనుసంధానంగా ఉండే ఈ దారిలో రాకపోకలు చేసేవారు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు డస్ట్ పోసి వదిలేయడంతో దుమ్ముతో పరిసరాలు కలుషితంగా మారుతున్నాయి. స్థానికులు శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా రహదారి నిర్మాణం పూర్తికి అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈరహదారి పనులు మధ్యలో ఆగిపోవడంపై కౌన్సిల్‌లో కూడా చర్చకు వచ్చింది. గుత్తేదారుడిని మార్చుతున్నామని, పనులు ప్రారంభిస్తామని చెప్పినా ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా వదిలేసిన కాకుమానువారితోట శ్మశానం రోడ్డు

పనుల పరిస్థితి ఇది.. కాకుకమారివారితోట నుంచి శ్రీనగర్ 7వ లైన్ వరకు సుమారు 625 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 56 లక్షలు వ్యయం చేస్తున్నారు. ఇన్ని నెలలపాటు పనుల జాప్యంపై ఉన్నతాధికారులు, కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.. కొన్నిచోట్ల మట్టి కుప్పలు అలాగే వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఈ ప్రాంతాలకు ఉపయోగం..

ఈ రహదారి నిర్మాణం పూర్తయితే అరండల్‌పేట, బ్రాడీపేట, శ్రీనగర్, సంజీవయ్యనగర్, శారదాకాలనీ, రెడ్డిపాలెం వైపు వెళ్లే వారికి ఉపయోగంగా ఉంటుంది. శంకర్‌విలాస్ బ్రిడ్జి పనులు జరుగుతున్నందున డొంకరోడ్డుకు పెద్ద ఎత్తున ట్రాఫిక్ పెరిగి సమస్యలు వస్తున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని అనుసంధానంగా ఉండే ఈ రహదారిపై అధికారులు వెంటనే దృష్టి పెట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. రహదారి నిర్మాణంలో భాగంగా ముందుగా ఈ మార్గంలో సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు కూడా పూర్తి చేశారు. కొన్ని చోట్ల పనులు అసంపూర్తిగా ఉండడంతో స్థానికంగా నివాసాల నుంచి వచ్చే మురుగునీరు పారుదలకు ఆటంకం కలుగుతోంది. వెంటనే ఇంజినీరింగ్ అధికారులు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కనుల పండువగా ఏకాదశ వార్షికోత్సవాలు

స్వామివార్ల విగ్రహాల్ని ఊరేగిస్తున్న అర్చకులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: నందివెలుగు రోడ్డు వస్త్రనగర్‌లోని పద్మావతి, గోదాదేవి సమేత వెంకటాచల స్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు స్వామివార్లకు అభిషేకాలు, విష్వక్సేన పూజలు నిర్వహించారు. సోమవారం సుప్రభాత సేవ, నిత్యహోమం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మండవ వెంకట శేషగిరిరావు, మద్దినేని నాగేశ్వరరావు, కూరపాటి వెంకట నరసింహారావు, చేబ్రోలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

మాట్లాడుతున్న చంద్రశేఖరరావు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ప్రభుత్వాలు మారుతున్నా అగ్రిగోల్డ్ బాధితుల కష్టాలు తీరడం లేదని అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరావు కోరారు. ఆదివారం కొత్తపేటలోని కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. చంద్రశేఖరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది బాధితులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫాస్టుట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమర్థత కలిగిన అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీని నియమించాలన్నారు. అగ్రిగోల్డు బాధితుల సమస్యల పరిష్కరించాలని ఈనెల 2వ తేదీ నుంచి విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోట మాల్యాద్రి మాట్లాడారు. సమావేశంలో నాయకులు సాంబశివరావు, నాగరాజు, సుబ్బారెడ్డి, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యమని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఆదిత్యనగర్‌లో గడప గడపకు సీపీఐ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. నాయకులు కోట మాల్యాద్రి, ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం అందజేస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, మాల్యాద్రి, అరుణ్‌కుమార్, హనుమంతరావు

చుక్కపొడుపు నవల ఆవిష్కరణ



కార్యక్రమంలో పాపినేని శివశంకర్, మల్లికార్జునరావు, రుక్మిణి, లక్ష్మీనరసయ్య

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : నల్లూరి రుక్మిణి రచించిన చుక్కపొడుపు నవల ఆవిష్కరణ ఆదివారం బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో జరిగింది. ప్రోగ్రెసివ్ ఫోరం అధ్యక్షులు మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. అతిథిగా హాజరైన ప్రముఖ రచయిత పాపినేని శివశంకర్ మాట్లాడుతూ 1970 దశకంలో గుంటూరు జిల్లాలో ఉన్న సామాజిక జీవితాన్ని ఈ నవల బలంగా తెలియజేసిందని చెప్పారు. సాహిత్య విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ కేవలం ఒక చారిత్రక డాక్యుమెంట్ మాత్రమే కాదని చరిత్రతోపాటు జీవితాన్ని అర్థవంతంగా చెప్పిన నవల అని చెప్పారు. రచయిత నల్లూరి రుక్మిణి మాట్లాడుతూ జిల్లాలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన మార్పులను సంఘటనల పరంగానేకాక మానవ సంబంధాల పరంగా ఈ నవలలో రూపొందించామని చెప్పారు.

'సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిన వైకాపా'

మాట్లాడుతున్న క్రాంతికుమార్

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసి కార్మికులను ఇబ్బందులకు గురిచేసిందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి విస్సా క్రాంతికుమార్ అన్నారు. ఆదివారం సీతానగర్‌లో భవన నిర్మాణ కార్మిక నాయకులతో సమావేశం నిర్వహించారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభించడంతోపాటు నిలిచిపోయిన సంక్షేమ పథకాలు తిరిగి అమలు చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. కూటమి పాలనలో రాష్ట్రంలో నిర్మాణ రంగం పుంజుకోవడం, సంక్షేమ బోర్డు పథకాలు అమలు వలన భవన నిర్మాణ కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎంపికైన సందర్భంగా క్రాంతికుమార్‌ను కార్మికులు సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి యడ్లపల్లి నాగేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షులు తోటకూర బుచ్చిబాబు, కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ శ్రీనివాస్ నాయకులు రోశయ్య పాల్గొన్నారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

సేవా కార్యక్రమాలు అభినందనీయం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి రిలోని గంగా, భ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం శివభక్త బృందం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పెదవడ్లపూడి మాజీ సర్పంచ్ అన్నే చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడుతూ.. 33 ఏళ్లుగా ప్రతి నెలా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. మార్కెట్‌యార్డు మాజీ వైస్ ఛైర్మన్ మస్నెం రమేష్, భక్త బృందం ప్రతినిధులు గుండా రామాంజనేయులు, నందకిషోర్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం, న్యూస్‌టుడే: పొనుగుపాడు గ్రామంలో శ్రీగంగా, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం లలితా సహస్రనామ పారాయణం, అభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు.

అలంకరణలో కాశీ విశ్వేశ్వరస్వామి

శాస్త్రోక్తంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం అనంతవరం కొండపై శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలసిన వేంకటేశ్వర స్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు తితిదే ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం ధ్వజారోహణం, ఊంజల్ సేవలు నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంపై ఊరేగింపు జరిగింది. సోమవారం స్వామివారి శాంతి కల్యాణం, 3న చక్రస్నానం, 4న పుష్పయాగం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్లు

గౌరవనీయులైన ది 6వ డిస్ట్రిక్ట్ & సెషన్స్ జడ్జి, ఫాస్ట్ ట్రాక్ కోర్టు, బాపట్ల
ఏ.యస్.నెం. 79/2025
మద్దసాని రమాదేవి మరియు ఇతరులు – అప్పీలెంట్స్
వర్సెస్
గుంటూరు సామ్రాజ్యం – రెస్పాండెంటు
టు డి–1: గుంటూరు సామ్రాజ్యం, భర్త సుబ్బారావు, వయస్సు 75 సం.లు, హిందువు, గృహిణి, నివాసం పెద్దకాకాని గ్రామం & మండలం, గుంటూరు జిల్లా.
పై నెంబరు అప్పీలులోనూ, మధ్యంతర ఉత్తర్వుల పిటీషన్‌లో మీకు నోటీసు నిమిత్తం ది. 11.03.2026న వాయిదా అయివుంది. కావున మీరు ఆ రోజు ఉదయం గం. 10.30 ని॥లకు పై కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, ప్లీడర్ ద్వారాగానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలియపరచు కొనవలయును. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మరియు అనుమతితో
సం/- యస్.రవీంద్రబాబు, ఎన్‌రోల్‌మెంట్ నెం. ఏ.పి. 391/97
శ్రీమతి టి.వి. శైలజ, ఎన్‌రోల్‌మెంట్ నెం. ఏ.పి. 655/2013
అడ్వకేట్స్, బాపట్ల

ప్రకటన
మా క్లయింటు, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం, నూతక్కి గ్రామ కాపురస్తురాలు శ్రీమతి మారెళ్ళ ప్రశాంతి, W/o మారెళ్ళ వెంకట శివన్నారాయణ గారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియచేయునది ఏమనగా, మా క్లయింటు, U.S.A, Corona, 1338 VERSANTECIR, CA92881 కాపురస్తురాలు KURRE LEENA, D/o RAJA BABU గారి తరపున వారి G.P.A, Holder అయినటువంటి KURRE SUHASINI, W/o RAJA BABU గారి నుండి ఈ దిగువ దాఖలా షెడ్యూలాస్తిని కొనుగోలు చేయుటకు నిర్ణయించుకొని కొంత సొమ్మును బయానాగా చెల్లించి విక్రయ భారారు అగ్రిమెంటును పొందియున్నారు. కావున ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తినకు సంబంధించి ఎవరికైనా ఎటువంటి క్లయిములు, అభ్యంతరములు, ఆక్షేపణలు, కోర్టు జప్తులు, ఇంజక్షన్ ఉత్తర్వులు, మనోవర్తి ఛార్జీలు, భాగలబ్ధి తగాదాలు, సరిహద్దు తగాదాలు గాని మరి యే ఇతర అభ్యంతరములు ఉన్న యెడల యీ దిగువ తెల్పిన మా అడ్రసుకు లిఖిత పూర్వకముగా రిజిష్టర్ పోస్టు తిరుగు రశీదుతో ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 14 రోజులలోగా తెలియచేయగలరు. గడువు లోపల ఏవిధమైన అభ్యంతరములు, క్లయిములు వగైరాలు రాని యెడల ఈ దిగువ షెడ్యూలాస్తిని నిర్వివాదమైన ఆస్తి అని భావించి క్రయ దస్తావేజును మా క్లయింటు వారి పేరుతోగాని, వారి సంబంధీకుల పేరుతోగాని రిజిష్టర్ పొందగలరు. గడువు దాటిన దరిమిలా వచ్చు అభ్యంతరములు, క్లయిములు మా క్లయింటును బైండు చేయజాలవని యిందుమూలముగా యావన్మందికీ తెలియపరచడమైనది.
షెడ్యూలు: గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్.డి. యిలాకా మంగళగిరి మండలం, రామచంద్రపురం గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, రామచంద్రపురం గ్రామం తాలుకా డి.నెం.226/బి రు యి. 0.99 సెంట్ల పూరా శేరి మెరక భూమికి హద్దులు. తూర్పు: శ్రీ రాములు స్వామి వారి దేవస్థానం భూమి హద్దు, దక్షిణం: కుర్రె శివనాగిరెడ్డి, తమ్మా మల్లేశ్వరి గార్ల భూమి హద్దు, పడమర: కుర్రె పిచ్చిరెడ్డి, అల్లంశెట్టి విజయ గార్ల భూమి హద్దు, ఉత్తరం: మోదుగుల సుధ, మోదుగుల పిచ్చిరెడ్డి వగైరాల భూమి హద్దు. ఈ హద్దుల మధ్య యి. 0.99 సెంట్లు లేక హె .399లు భూమిన్ని, ఈ భూమికి లోగడ నుండి ఉన్న యావత్తు నీటి పారుదల పాత రివాజు యీజ్‌మెంట్ హక్కులతో సహా.
కాకర్లపూడి శ్రీనివాస సుధాకరరాజు, ఉద్దరాజు నారాయణరాజు
న్యాయవాదులు, D.No. 23-11-73, శివాజి కేఫ్ బిల్డింగ్, శివాలయం వీధి, సత్యనారాయణపురం, విజయవాడ - 520 011 సెల్: 93999 88858
విజయవాడ
ది. 01-03-2026

వీరు.. హాకీలో అదుర్స్

క్రీడల్లో రాణిస్తున్న బాలబాలికలు

హాకీలో రాణిస్తూ తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో అదుర్స్ అని ప్రశంసలు పొందుతున్నారు.. ప్రత్తిపాడు మండలం యనమదల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తూ సత్తా చాటుతున్నారు. 'పాఠశాలలో విద్యతో పాటు సామర్థ్యం వేళ విద్యార్థుల ఆసక్తి మేర క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నాం. హాకీలో ఒక విద్యార్థిని జాతీయ స్థాయి పోటీల వరకు వెళ్లింది. మరో 9 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడారు' అని హెచ్‌ఎం నీ హెచ్.చత్తయ్య, పీడీ గంగాధరరావులు తెలిపారు. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

సాధన చేస్తున్న క్రీడాకారులు

ఐపీఎస్ అవుతా..

నేను 9వ తరగతి చదువుతున్నా. అండర్-17 విభాగంలో గతేడాది అక్టోబరు, 13న బాపట్ల జిల్లా చెరుకుపల్లి ముప్పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపాను. తర్వాత నెల్లూరు నగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. ఐపీఎస్ యూనిఫాం జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తలపడ్డాను. ఐపీఎస్ కావాలనేది నా కల. -ఎ.అంజికాలక్ష్మి

సీనియర్ల స్ఫూర్తితో..

మేము 9వ తరగతి చదువుతున్నాం. అండర్-17 విభాగంలో బాపట్ల జిల్లా చెరుకుపల్లిముప్పాలెంలో గతేడాది జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపాం. రెండు సార్లు జిల్లా పోటీల్లో ప్రతిభ చూపాం. నెల్లూరు నగరంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గట్టిపోటీ ఇచ్చాం. మా సీనియర్లు ఆడుతుంటే చూసి ఆసక్తి పెంచుకుని సాధన చేస్తున్నాం. రాష్ట్ర పోటీలకు సిద్ధం అవుతున్నాం. -పి.నాగలక్ష్మి, ఎస్.యశస్విని

ఒలింపిక్స్‌లో ఆడాలని..

మేము 8వ తరగతి చదువుతున్నాం. అండర్-14 విభాగంలో గతేడాది బాపట్ల జిల్లా చెరుకుపల్లిముప్పాలెంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తాచాటాం. తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పోటీపడ్డాం. ప్రతి రోజు సాయంత్రం అరగంట సాధన చేస్తున్నాం. ఒలింపిక్స్‌లో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. -బి.సురేష్, ఎన్.వినయ్ కుమార్, యనమదల

మహిళలకు ఆత్మవిశ్వాసం అవసరం

పుల్లడిగుంట(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: మహిళలు ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ప్రారంభంలో ఆయన మాట్లాడారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల ఛైర్మన్ మలినేని పెరుమాళ్లు, ఆచార్యులు జయని కిశోర్‌బాబులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి, వేదికపై అతిథులు

ఉత్తమ సేవలతోనే మన్ననలు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: నిబద్ధతతో పాఠశాల అభివృద్ధికి పీడీ ముద్దన సత్యనారాయణ విశేష కృషి చేసి మన్ననలు పొందారని సీనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి తెలిపారు. పాలపర్రు ఏపీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీడీగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ముద్దన సత్యనారాయణ, త్రివేణి దంపతులను జడ్జి సుధారాణి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ లక్ష్మణరావు, పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ తర్వాత సమాజ సేవలో పాల్గొనాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సీఐ ఆర్.రాంబాబు, ఎంఈవో రమేష్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కరిముల్లారావు చౌదరి, ప్రధానోపాధ్యాయుడు ఎం. శ్రీనివాసరావు, పూర్వవిద్యార్థుల సంఘ కోశాధికారి డి. రమేష్, విశ్రాంత ఎస్సై పుల్లయ్యలు తదితరులు పాల్గొన్నారు. ముద్దన సత్యనారాయణను ఆదివారం పాలపర్రు వీధుల్లో కప్పులు ఆయనను ఊరేగించారు.

సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ లక్ష్మణరావు, జడ్జి సుధారాణి తదితరులు

నడకతో సంపూర్ణ ఆరోగ్యం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ నిత్యం నడిస్తే అనారోగ్యం దరిచేరదని ఏపీ స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, కృష్ణగంగ స్పిన్నింగ్ మిల్స్ ఎండీ జి. పున్నయ్యచౌదరి అన్నారు. పెదనందిపాడు వాకర్స్ అసోసియేషన్, శ్రీనివాస కాటన్ అండ్ ఆయిల్ మిల్స్ (వరగాని) వారి సహకారంతో పెదనందిపాడు శ్రీనివాస పాఠశాల నుంచి కాకుమాను శ్రీనివాస స్పిన్నింగ్ మిల్ వరకు ఆదివారం మహిళలు, పురుషుల 5కె ఫ్రెండ్లీవాక్ ను ఆయన పచ్చజెండా ఊపి ప్రారంభించారు. పెదనందిపాడు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. శేషగిరిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ చూపించాలని చెప్పారు. పాల్గొన్న వారందరికీ పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మాజీ ఎంపీపీలు నర్రా బాలకృష్ణ, ఎం.నగరాజకుమారి, బంగారు పతకాల అవార్డు గ్రహీత రమణేశ్వరి, పారిశ్రామికవేత్తలు ఎం. రామయ్య, ఎ. రామసుబ్బారావు, వాకర్స్ అసోసియేషన్ సమన్వయకర్త ఎస్. రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఫ్రెండ్లీ వాక్‌లో ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు

పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు కృషి

తాడేపల్లి, న్యూస్‌టుడే: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు అనుగుణంగా పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు జొన్నా రాజేష్ తెలిపారు. ఆదివారం తాడేపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో నాయకులు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేశారు. ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు సూచనలు మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. నాయకులు గుర్రాల శేషగిరి, దాసరి దుర్గామల్లేశ్వరరావు, గాజుల సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో జొన్నా రాజేష్, జనసేన నాయకులు

స్కిల్ పలావర్‌కు కేఎల్‌యూలో విశేష స్పందన

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు నిర్వహించిన స్కిల్ పలావర్‌కు విశేష స్పందన లభించింది. విద్యార్థులను పరిశ్రమ ఏర్పాటుకు సంసిద్ధులను చేసే లక్ష్యాన్ని కేఎల్‌యూ పెట్టుకుందని స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ శ్రీనాథ్ అన్నారు. వివిధ విభాగాలకు చెందిన 5546 మంది విద్యార్థులు పాల్గొనగా.. ఏఐ ఎంఎల్ సవాల్-1లో 852 మంది, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్‌లో 659 మంది పాల్గొన్నారని ఆయన చెప్పారు. పోర్డ్ మోటార్స్ కంపెనీ, ఐబీఎం, సిస్కో, హెచ్‌ఎండ్ ఎంగ్రూప్, మోంగోడీబీ, సినాప్సిస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ వంటి సంస్థల ఇందులో పాల్గొన్నాయి. 70 శాతం మంది విద్యార్థులు సాంకేతిక రంగంలో పరిశ్రమ ఏర్పాటుకు ఆసక్తి చూపించారు. 60 శాతం మంది ఏఐపై మక్కువ చూపారు. ప్రేమ్ వర్క్‌ను కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజేష్ రూపొందించగా ఆయా విభాగాధిపతులు పర్యవేక్షించారు. వీసీ డాక్టర్ పార్థసారథివర్మ, ప్రొవీసీ డాక్టర్ వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

ఫిరంగిపురం: అమీనాబాద్, వేములూరిపాడు గ్రామాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

పింఛన్ అందజేత

పెదనందిపాడు, న్యూస్‌టుడే: నాగులపాడుకు చెందిన ఎం. వెంకటప్పయ్య హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు నెలలుగా ఆయనకు ఇవ్వాల్సిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ. 12,000లను ఆదివారం స్వర్ణగ్రామ ఉద్యోగి ఎస్. జగ్జీవన్‌రావు అక్కడికి వెళ్లి అందించి మానవత్వం చాటారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో నైపుణ్య ఆధారిత విద్య

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: భాష్యం ఇంటర్నేషనల్ స్కూల్(బీఐఎస్) ద్వారా అత్యున్నత అంతర్జాతీయ ప్రమాణాలతో నైపుణ్య ఆధారిత విద్యను అందించేందుకు కృషి చేస్తామని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు తెలిపారు. ఆదివారం భాష్యం రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఆయన మాతృమూర్తి పేరమ్మ చేతులమీదుగా గోరంట్ల భాష్యం ఆదిత్య క్యాంపస్ సమీపంలోని భాష్యం ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్ అకడమిక్ బ్లాక్‌ను లాంఛనంగా ప్రారంభించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణ, హనుమంతరావు మాట్లాడుతూ నేటి యువత స్వయంశక్తితో ఎంచుకున్న రంగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడేలా భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్‌రామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యాప్రణాళిక రూపొందించామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని భాష్యం ఎప్పుడూ నిలబెట్టుకుంటుందన్నారు.

బీఐఎస్ అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న భాష్యం పేరమ్మ, చిత్రంలో భాష్యం రామకృష్ణ కుటుంబసభ్యులు

ఆధ్యాత్మిక బోధనలే సమాజానికి దిక్సూచి

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక బోధనలే సమాజానికి దిక్సూచి అని మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ అన్నారు. అమరావతిలోని యూనివర్సిటీ పీస్ రిట్రీట్ సెంటర్‌లో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో 90వ త్రిమూర్తి శివ జయంతి మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఛైర్‌పర్సన్ శైలజ మాట్లాడుతూ బ్రహ్మకుమారీలు మహిళల్లోని సహనం, ప్రేమ, త్యాగం, నాయకత్వ లక్షణాలను వెలికితీస్తున్నారని చెప్పారు. మహిళలు స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవించేందుకు మార్గదర్శకం అందిస్తూ నైతిక విలువలతో కూడిన జీవితానికి ప్రేరణగా నిలుస్తున్నారన్నారు. శివనామస్మరణతో 110 దేశాలకుపైగా విస్తరించి ప్రపంచశాంతి కోసం కృషి చేస్తున్న బ్రహ్మకుమారీల జీవన విధానం ఆదర్శప్రాయమని కొనియాడారు.

జనసేన కార్యాలయం వద్ద కట్టుదిట్ట భద్రత

అదనపు సిబ్బంది నియామకం

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ క్యాంపు కార్యాలయంతోపాటు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. గత నెల 27వ తేదీ ఉదయం ఓ వ్యక్తి లోపలికి ప్రవేశించి కారు ధ్వంసం చేసిన ఘటనతో ప్రభుత్వం అప్రమత్తమైంది. భద్రతా లోపం బయటపడడంతో అదనంగా దాదాపు పది మంది సిబ్బందిని కొన్ని ముఖ్యమైన ప్రదేశాల్లో నియమించారు. లోపలికి రావాలంటే ముందస్తు అనుమతిని తప్పనిసరి చేశారు. కార్యాలయంలో వారానికి రెండు సార్లు ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన 'జనవాణి' కార్యక్రమం వద్ద బందోబస్తు ఏర్పాట్లను మంగళగిరి పోలీసులకు అప్పగించారు.

ప్రజల కోసం రూ.కోట్ల విరాళం గొప్ప విషయం

తాడికొండ, న్యూస్‌టుడే: నియోజకవర్గానికి సంబంధం లేకపోయినా జిల్లాకు ప్రజల సౌకర్యార్థం సామాజిక భవనాలు నిర్మించిన దాతలు సూర్యగంటి రావెంద్ర ప్రసాద్ దంపతుల కృషి అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. రావెల గ్రామంలో బీసీ సామాజిక భవనాన్ని ఆదివారం ఆయన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రావెంద్రప్రసాద్ వైద్యుడిగా పనిచేసి తన సంపాదన నుంచి రూ.4 కోట్లను సామాజిక భవనాల నిర్మాణానికి ఇవ్వడం గొప్పవిషయమన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 9 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి దాతలు సహకరించారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్సా విధానాలపై అవగాహన

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి పట్టణంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీల సంఘం సర్వసభ్య సమావేశాన్ని కొల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన రిజిష్టర్ మెడికల్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోలా విజయ్ శేఖర్ ప్రథమ చికిత్స, గుంటూరు జీజీహెచ్ వైద్యులు నీరజ నరాలకు సంబంధిత వ్యాధులపై, డాక్టర్ మర్రెడ్డి శ్రీనివాస్ కిడ్నీ వ్యాధులపై, డాక్టర్ గోలి బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన కల్పించారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రావిరి సత్యనారాయణ, కోశాధికారి శ్రీనివాస్, డాక్టర్ గోలి మోహనరావు, హైకోర్టు న్యాయవాది జె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రిపై డీఎస్సీ ఫిర్యాదు

తుళ్లూరు, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలో పంది కొవ్వు జంతు కొవ్వు కలిసిన నెయ్యిని వినియోగించారంటూ పదేపదే ఆరోపణలు చేయడం తనను మనస్తాపానికి గురిచేసిందంటూ ఓ డీఎస్పీ ఆదివారం తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, తితిదే ఛైర్మన్ బీఆర్‌నాయుడు, ఆనం శ్యామలరావు తదితరుల పేర్లను ఫిర్యాదులో పేర్కొన్నారు. భక్తుల మనోభావాలు, విశ్వాసాలు దెబ్బతినేలా వ్యాఖ్యలు సరికావని.. శ్రీవారి లడ్డూ, ప్రసాదం మీద అనేక రకాల దుష్ప్రచారం జరుగుతుండడం తనకు బాధ కలిగించి ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక జగనన్న కాలనీలో పులి రమాదేవి ఇంట్లో జరిగిన చోరీపై ఆదివారం కేసు నమోదైంది. రమాదేవి వాళ్ల అమ్మ మాధవ్‌తో ఇంట్లో ఉంటారు. ఆరోగ్యం సరిగా లేక వారిరువురు 20 రోజుల క్రితం ఆసుపత్రికి వెళ్లారు. ఆదివారం వచ్చి చూస్తే ఇంట్లో బీరువాలో ఉంచిన బంగారం రూ. 50 వేలు నుంచి రూ. 60 వేల విలువైన వస్తువులు అపహరించినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. వేలిముద్ర నిపుణులు నమూనాలు సేకరించారు.

కారుకు నిప్పు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: దుగ్గిరాల పంచాయతీ కార్యాలయం వద్ద ఓ అపార్ట్‌మెంట్ ఎదుట నిలిపిన కారుకు ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. వాహనం అత్తోట నుంచి అదే వీధి ఉండి. తెల్లవారుజాముగా 3.30 గంటల సమయంలో ఒక్కసారిగా మోత రావడంతో అపార్టు బంధువులు బయటకు వచ్చి చూడగా.. అప్పటికే వాహనం 90 శాతం కాలిపోయింది. స్థానికులు మంటల్ని అదుపులోకి తెచ్చారు. ఘటనపై ఎస్సై వెంకటరవి కేసు నమోదు చేశారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

మేడికొండూరు మండలం మందపాడు రెవెన్యూ పరిధిలో మందపాడు నుండి రావెల వెళ్ళు రోడ్డు ఫేసింగ్‌లో 5.1/2 ఎకరముల పొలం అమ్మకం. 80742 96586.

LEASE/ RENT

GENERAL

గుంటూరు ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ దగ్గరలో 1576 చ॥గ॥లు గల ఖాళీ స్థలం అద్దెకు & గోడౌన్ కన్స్ట్రక్షన్ చేసి ఇవ్వబడును. ఫోన్: 98482 31040.

TO LET

COMMERCIAL

గుంటూరు లక్ష్మీపురం 3వలైనులో కమర్షియల్ బిల్డింగ్ 2ఫ్లోర్స్ ఈచ్ ఫ్లోర్ 1740sft. బ్యాంక్స్ / సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ ఆఫీసు / షోరూంలకు అద్దెకు. ✆ 9849900303.

JOBS

Wanted Male Transport Incharges Qualification any Degree, Age limit:30 to 45 years, Salary upto:20,000/-. Eligibility having experience in any Educational organisation will be preferable, Note: Must have valid LMV License & Good Knowledge about auto Gear & Manual gear. Working location: Master Minds College, Guntur. Contact: 89784 80430.

ప్రముఖ లోన్స్ ఏజెన్సీ నందు లోన్స్ చేయుటకు టెలీకాలర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 97014 79569, 80081 00872.

రాజధాని రాయల్ భూమి డెవలపర్స్ నందు మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ ఎంప్లాయిస్ కావలెను. 10th పాస్ / ఫెయిల్, జీతం: 13000 to 60000 & ఇన్సెంటివ్. ✆ 70137 05436.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు క్లాస్ ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 12000 నుండి 14000 వరకు ఇవ్వబడును. (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22సం॥రాల నుండి 40 సం॥రాలు ఉండవలెను. వివరాలకు సంప్ర. ఫోన్: 9248733320.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీలో ఉద్యోగ ఖాళీలు: సీనియర్ బ్యాచ్ ఇన్‌ఛార్జీలు, లింగం: పురుషులు మాత్రమే, విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 25 సం॥ల నుండి 45 సం॥రాల మధ్య ఉండవలెను. నెలకు జీతం:16000 వరకు ఇవ్వబడును. వివరాలకు సంప్రదించగలరు. ఫోన్: 9248722246.

బిజినెస్ మేనేజర్స్/ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, ఫ్రెషర్స్, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న 30 సం॥లలోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఫ్లైయాష్ ఇటుకల పరిశ్రమలను కాపాడండి

మంగళగిరి, న్యూస్‌టుడే: ఫ్లైయాష్ (బూడిద) కొరత కారణంగా ఇటుకలు తయారు చేసే సూక్ష్మ, లఘు పరిశ్రమలు మూతపడుతున్నాయని, వాటిని కాపాడి యజమానులతోపాటు కార్మికులకు ఉపాధి కల్పించాలని అమరావతి ఫ్లైయాష్ బ్రిక్స్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళగిరిలోని హ్యాయ్‌ల్యాండ్ వద్ద ఆదివారం ఆ సంఘం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 500పైగా ఉన్న పరిశ్రమల్లో సుమారు లక్ష మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నారు. 1990లలో ఫ్లైయాష్ ఇటుకల పరిశ్రమలను స్థాపించి వాతావరణ కాలుష్య నియంత్రణలో భాగస్వాములు అయ్యామని గుర్తు చేశారు. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు తగిన ప్రోత్సాహం అందించారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తమ సేవలను విస్మరించిందని, ఉచితంగా లభించే ఫ్లైయాష్‌కు ధర నిర్ణయించడం దారుణమన్నారు. నిర్వహణ లోపాలతోనే బూడిత కొరత ఏర్పడిందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని లేకుంటే ఆందోళన బాటపడతామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం వార్షిక కార్యాచరణను ప్రకటించారు. ఆ సంఘం ముఖ్య సలహాదారు కాళిదాస్, అధ్యక్షుడు వెలగ సాంబశివరావు, ఉపాధ్యక్షుడు ఐబీ చౌదరి, కార్యదర్శి బత్తుల శ్రీనివాసరావు, కోశాధికారి కె.శ్రీనివాసరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

మేదర్లకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలి

తాడికొండ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మేదర్ల ఎదుగుదలకు కూటమి ప్రభుత్వం చేయూత అందించాలని రాష్ట్ర బీసీ విభాగం మేదర సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ దూళిపాళ్ల ఏసుబాబు కోరారు. జిల్లా మేదర సంఘం అధ్యక్షుడు మైలపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తాడికొండ గ్రామంలో ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సెక్రటరీగా సి. రాఘవులు, కోశాధికారిగా చలపతిరావు, యువజన సంఘం అధ్యక్షుడిగా దూళిపాళ్ల శ్రీశైలం, సెక్రటరీగా ప్రసాద్, కోశాధికారిగా గోపి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మహిళలను గౌరవించడం అందరి బాధ్యత

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మహిళలను గౌరవించడం అందరి బాధ్యత అని ఎస్సై ఎన్. నరహరి అన్నారు. ఆదివారం సాయంత్రం పోలీసులు ప్రత్తిపాడులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహిళల భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, హెల్ప్‌లైన్ నంబర్లను వివరించారు. మహిళలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

9, 10 విద్యార్థులకు నేటి నుంచి ప్రత్యేక పరీక్షలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 9, 10 తరగతుల విద్యార్థులకు సోమవారం నుంచి పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు ఎంఈవోల పర్యవేక్షణలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు. సోమవారం తెలుగు పరీక్షతో ప్రారంభమైన పరీక్షలు 10వ తేదీ సోషల్ పరీక్షతో ముగియనున్నాయి. మిగిలిన రెండు రోజుల్లో సంస్కృతం, అరబిక్, ఒకేషనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.45 వరకు పరీక్షలు జరపనున్నారు. 9వ తరగతి విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్షలు నిర్వహిస్తుండగా, 10వ తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రాండ్ టెస్టు పేరుతో పరీక్షలు నిర్వహించాలని ఆదేశాల్లో అధికారులు పేర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఎంఈవో కార్యాలయాలకు ప్రశ్నపత్రాలు కొన్నిరోజుల క్రితమే చేరాయి.

15 వరకు పోషణ అభియాన్- స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాలు

ప్రత్తిపాడు: అంగన్వాడీ కేంద్రాల్లో మార్చి 1 నుంచి మార్చి 15 వరకు పోషణ అభియాన్- స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. చేపట్టాల్సిన కార్యక్రమాలపై స్పష్టత ఇస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు ఆధ్వర్యంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు అమలుపై ఏర్పాట్లు చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, రిటైల్ ధర - 177, చికెన్ విత్‌స్కిన్ - 257, చికెన్ స్కిన్‌లెస్ - 292.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -150 రిటైల్ ధర 177 చికెన్ విత్ స్కిన్ - 257 చికెన్ స్కిన్‌లెస్ - 292.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 167, 176, 187 చికెన్ విత్ స్కిన్ - 324 చికెన్ స్కిన్‌లెస్ - 334.

త్యాగాలతోనే పోరాటాలు విజయం

మంగళగిరి, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో పోరాడి తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన అమరవీరులకు నాయకులు నివాళులర్పించారు. మంగళగిరి బస్‌స్టాండ్ కూడలిలో ఉన్న డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి చందోలు విక్టర్‌పాల్ మాదిగ మాట్లాడుతూ త్యాగాలు లేకుండా ఏ పోరాటమూ గమ్యాన్ని చేరదన్నారు. నాయకులు అద్దేపల్లి నాగేశ్వరరావు మాదిగ, ఎంఎస్పీ మంగళగిరి అధ్యక్షుడు పాతకోటి బాస్కర్, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి పోగు శ్యామల, గౌరవాధ్యక్షురాలు నాగేంద్ర, ఏడుకొండలు, యాకోబు, ఏసుబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ముట్లూరు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: ముట్లూరు గ్రామంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి నాయకులు ర్యాలీ నిర్వహించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

(c) eenadu

స్వామి కళ్యాణం

శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు, మంగళగిరి

- Advertisement Special Feature

శరణు.. దివ్య తేజాయ..

మంగళగిరి గ్రామీణం, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్ రంజనీ సిస్టర్స్ భజన బృందం కచేరి, కళాకారుల నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామోత్సవాలకు భారీగా భక్తులు తరలివచ్చారు.

కల్పవృక్ష వాహనంపై స్వామి, అమ్మవార్లు

పొన్నవాహన సేవలో పాల్గొన్న భక్తులు

విద్యుద్దీపాలతో తీర్చిదిద్దిన ప్రాంగణం

నేడు నృసింహుని దివ్య కల్యాణం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి లక్ష్మీనృసింహుని దివ్య కల్యాణం సోమవారం అర్ధరాత్రి నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఆలయ అధికారులు పూర్తి చేశారు. ఇప్పటికే వేదికను రంగురంగుల దీపాలతో అలంకరించారు. తొలుత రాత్రి తొమ్మిది గంటలకు స్వామివారిని అశ్వ వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అనంతరం కల్యాణ సమయం వరకు భక్తి గీతాలు వినేలా ఏర్పాట్లు చేశారు. శ్రీరాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళా వేదికలో ప్రతి రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దాతలు ప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. ఆంజనేయస్వామి మిద్దె కూడలిలో కల్యాణం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు పాల్గొని స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పిస్తారు.

✦ కల్యాణం అనంతరం 3వ తేదీ తెల్లవారుజామున 2 గంటలకు బంగారు గరుడోత్సవాన్ని నిర్వహిస్తారు. ఉదయం గంటన్నరపాటు రథంపై స్వామివారిని కొలువుదీర్చి భక్తులకు దర్శనం కల్పిస్తారు. చంద్రగ్రహణం నేపథ్యంలో ఆ రోజు నిర్వహించే రథోత్సవాన్ని రద్దు చేసినట్లు ఆలయ అధికారి సునీల్‌కుమార్ తెలిపారు.

5 నుంచి సీతానగరం కొండపై ప్రతిష్ఠా మహోత్సవాలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: సీతానగరం కొండపై విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో 27 అడుగుల ఎత్తైన ఏకశిలా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు చినజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలోర ఈ నెల 5 నుంచి ప్రారంభంకానున్నాయి. 5వ తేదీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, అంకురారోపణతో మొదలయ్యే క్రతువులు.. ఈ నెల 8 వరకు కొనసాగుతాయి. ఉదయం 10:55 గంటలకు హనుమాన్ విగ్రహానికి ప్రాణప్రతిష్ఠా మహోత్సవం, మహాకుంభ సంప్రోక్షణ నిర్వహిస్తారు. అనంతరం తీర్థగోష్ఠి ఉంటుంది. ప్రతి రోజూ సుందర కాండ, చాలీసా పారాయణం, గోపూజ, అఖండ హరే రామ నామ సంకీర్తన ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రతిష్ఠించనున్న ఆంజనేయస్వామి ఏకశిలా విగ్రహం

అన్ని వర్గాల అభివృద్ధికి మంత్రి లోకేశ్ కృషి

మంగళగిరి గ్రామీణం : మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహ దేవస్థాన ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన రుద్రు త్రిశూల శ్రీనివాసరావు దంపతులను తేదేపా రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతికి మంత్రి లోకేశ్ విశేష కృషి చేస్తున్నారని అన్నారు.



(c) eenadu

ఈనాడు
అమరావతి
కృష్ణా
సోమవారం మార్చి 2, 2026



ప్రహ్లాద వరద.. పరమాత్మ రూపా

మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా నృసింహుని కల్పవృక్ష వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి కీలకమైన పొన్నవాహన సేవ నిర్వహించారు. - మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

సజావుగా గురుకుల ప్రవేశ పరీక్షలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని 13 సాంఘిక సంక్షేమ గురుకులాల ప్రవేశ పరీక్షలు ఆదివారం సజావుగా జరిగాయి. ఐదో తరగతిలో ప్రవేశానికి 1422 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 1246 మంది హాజరయ్యారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశానికి 2351 మంది దరఖాస్తు చేయగా 2205 మంది హాజరయ్యారు. ఐఐటీ, నీట్ అకాడమీలో ప్రవేశానికి 1591 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 1394 మంది పరీక్ష రాసినట్లు డీసీవో ఏ.మురళీ కృష్ణ తెలిపారు. ముప్పాళ్ల, జగ్గయ్యపేట గురుకులాల్లో అత్యధిక మంది ఇంటర్మీడియట్ సీట్ల కోసం దరఖాస్తు చేసి పరీక్షలు రాసినట్లు పేర్కొన్నారు.

అమరావతిలో కీలక అడుగు

★ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాకతో ఆదివారం అమరావతిలో సందడి వాతావరణం నెలకొంది. ఏపీ జ్యుడిషియల్ అకాడమీ, ఏపీ హైకోర్టు అతిథి గృహ నిర్మాణాలకు శంకుస్థాపన..నూతనంగా నిర్మించిన హైకోర్టు న్యాయమూర్తుల రెసిడెన్షియల్ ఎన్‌క్లేవ్ ప్రారంభోత్సవాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వేదపండితులు సీజేఐకు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, సీఎం చంద్రబాబునాయుడు, పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సుమారు 2.05 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణం చేపడుతుండగా..120 మంది ట్రైనీ జడ్జిలకు శిక్షణ ఇచ్చేలా రూపకల్పన చేశారు. **రైతుల సంతోషం..** రాజధానిలో కీలక నిర్మాణాలకు అడుగులు పడడంతో స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

హైకోర్టు న్యాయమూర్తుల బంగళా నమూనా పరిశీలిస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నరసింహా, జస్టిస్ భట్టి, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, సీఎం చంద్రబాబు

జస్టిస్ సూర్యకాంత్‌కు వీడ్కోలు పలుకుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో కలెక్టర్ బాలాజీ

ఆటో.. ఈ తీరేమిటో..!

✪ ఇష్టారీతిన నిబంధనల ఉల్లంఘన

✪ ముంబయి విధానం బెజవాడకు అనుసరణీయం

విజయవాడలో ద్విచక్ర వాహనం లేదా కారుతో రోడ్డెక్కితే పెద్దగా ట్రాఫిక్ ఇబ్బందులు లేని చోట్ల కూడా ఆటోల రూపంలో స్పీడ్ బ్రేకర్లు ఎదురవుతాయి. ఎక్కడపడితే అక్కడ నడిరోడ్డుపై ఆపి ఆటోవాలాలు ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. రోడ్లపై ఇష్టారీతిన ఆపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకోవడంతో పాటు ట్రాఫిక్ అవాంతరాలు తలెత్తుతున్నాయి. ముంబయి తరహాలో కఠిన నిబంధనలు, ప్రత్యేక ఆటో స్టాండ్లు ఉంటేనే సమస్య పరిష్కారానికి నోచుకుంటుంది.- ఈనాడు, అమరావతి

రహదారి మధ్యలోనే ఆపేసి ప్రయాణికులతో డ్రైవర్ల బేరాలు

రోడ్లే ఆటో స్టాండ్లు..

★ నగర పరిధిలో సుమారు 15వేలకు పైగా ఆటోలు తిరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకున్న స్టాండ్లు మినహా ఎక్కువ చోట్ల అసలు నిలిపేందుకూ జాగా లేని పరిస్థితి. దీంతో రోడ్ల మార్జిన్లే ఆటో స్టాండ్లుగా మారిపోయాయి. నగరంలో అత్యంత రద్దీగా ఉండే బందరు, ఏలూరు రోడ్లపై ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది.

★ బెంజి సర్కిల్ పెట్రోల్ బంక్ వద్ద అనధికారికంగా రోడ్డుపైనే ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. ఫలితంగా పటమట వైపు నుంచి పీఎన్‌బీఎస్ వైపు వెళ్లే వాహనాలు ఆగిపోతున్నాయి. ఆటోనగర్ గేట్ వద్ద ఇదే పరిస్థితి. లిడ్‌క్యాప్ కార్యాలయం మలుపు వద్ద పెద్ద సంఖ్యలో ఆటోలు నిలుపుతున్నారు. దీని వల్ల ఆటోనగర్ వైపు వెళ్లాల్సిన వాహనాలు నిలిచిపోతున్నాయి. రాఘవయ్య పార్క్, బీసెంట్ రోడ్డు ప్రాంతాల్లోనూ రోడ్లపైనే ఆటోలను నిలుపుతున్నారు.

నియంత్రణ లేక ప్రమాదాలు

★ రోడ్లపై ప్రయాణికులు కనపడగానే హఠాత్తుగా ఆటోలు ఆపుతుండడం వల్ల వెనుక వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. ప్రయాణికుల్లోనూ పౌర స్పృహ కొరవడడంతో ఆటోల కోసం తమకు అనువుగా ఉన్నచోట నిరీక్షిస్తున్నారు. దీని వల్ల ట్రాఫిక్ ఆగిపోతున్నా పట్టించుకోవడం లేదు. 2025లో నగరంలో ఆటోల కారణంగా 27 పెద్ద ప్రమాదాలు చోటుచేసుకోగా గాయాలపాలైన ఘటనలు 106 ఉన్నాయి.

వీఎంసీ, పోలీసుశాఖ గట్టిగా అనుకుంటే..

ముంబయి నగరంలో ఆటోల కారణంగా తలెత్తిన ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు అక్కడి అధికారులు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. ఆటోలు విధిగా నిర్దేశిత ఆటో స్టాండ్లలోనే నిలపాలి. ఆటో ఎక్కాలంటే నేరుగా సమీపంలోని స్టాండ్‌కు వెళ్లి ఎక్కాల్సిందే. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తున్నారు. ★ ముంబయి తరహాలో బెజవాడలోనూ నిబంధనలు అమలు చేయాలి. ప్రత్యేక ఆటో స్టాండ్లు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. ఈ విషయంలో వీఎంసీ, పోలీసుశాఖ చొరవ చూపాలి.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: (సోమవారం) సాయంత్రం: 6.19

సహరి: (మంగళవారం) ఉదయం: 5.05

3న మోపిదేవి ఆలయం మూసివేత

మోపిదేవి, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం సందర్భంగా ఈ నెల 3వ తేదీ ఉదయం 5 గంటలకు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యాభిషేకం ఏకాంతంగా నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు మహానివేదన సమర్పించిన అనంతరం దేవాలయం తలుపులు మూసివేస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవర ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ బుధవారం ఉదయం 6 గంటలకు తలుపులు తెరిచి సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు.

మంత్రి నారాయణ పర్యటన నేడు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో మంత్రి నారాయణ సోమవారం పర్యటించనున్నారు. నేలపాడు సమీపంలో నిర్మిస్తున్న గెజిటెడ్ ఆఫీసర్ల క్వార్టర్స్, గ్రూప్- డి ఉద్యోగుల భవన సముదాయాలను ఆయన పరిశీలించి..పనుల పురోగతిపై ఆరా తీస్తారని మంత్రి కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి.

పేద గుండెకు.. పెద్ద భరోసా

ప్రభుత్వాస్పత్రిలో పెరిగిన యాంజియోగ్రామ్‌లు

ఈనాడు, అమరావతి

విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలోని కార్డియో వాస్కులర్ కేర్ విభాగంలో రూ.లక్షల విలువైన గుండె వైద్యం పేదలకు ఉచితంగా అందుతోంది. గుండె సంబంధిత సమస్యలతో ఆస్పత్రి ఓపీకి వచ్చేవారి సంఖ్య నిత్యం 300కు పైగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పీపీపీ విధానంలో కేథ్‌ల్యాబ్ ఏర్పాటు చేశారు. ప్రతి నెలా వందల మందికి యాంజియోగ్రామ్ చేస్తున్నారు. అవసరమైన వారికి స్టంట్‌లను ఉచితంగా వేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఒక్కో స్టంట్‌కు కనీసం రూ.1.5లక్షల వరకూ ఖర్చవుతోంది. ✪ ప్రభుత్వ ఆస్పత్రిలోని కార్డియో వాస్కులర్ కేర్ విభాగం ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకూ 11వేల యాంజియోగ్రామ్స్, 5 వేలకు పైగా స్టంట్‌లను రోగులకు ఉచితంగా వేశారు. వాస్తవంగా ఇంతకు రెట్టింపు స్థాయిలోనే శస్త్రచికిత్సలు చేయాల్సి ఉన్నా చాలా మంది పేద, మధ్యతరగతి రోగులకు ఈ ఖరీదైన వైద్య సేవలపై అవగాహన లేదు. దీంతో గుండెకు స్టంట్‌లను వేయించుకునేందుకు ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడుతూ రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు.

శస్త్రచికిత్స జరిగిన మహిళతో మాట్లాడుతున్న డాక్టర్ విజయ్ చైతన్య

క్యాథ్‌ల్యాబ్‌లో అందే సేవలివి..

- ★ యాంజియోగ్రామ్
- ★ అత్యాధునిక ఆప్టికల్ కొహెరెన్స్ టెమోగ్రఫీ
- ★ స్టంట్‌లు, పేజ్ మేకర్లు వేయడం
- ★ రోటాబ్లేషన్ విధానంలో కరోనరీ ఆర్టరీస్‌లోకి ఓ వైరును పంపి కరోనరి యాంజియోప్లాస్టిని చేసి అడ్డుపడిన కాల్షియంను తొలగించే చికిత్స

ప్రతి నెలా 250కు పైగానే..

కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు సహా చుట్టుపక్కల జిల్లాల నుంచి విజయవాడకు ప్రస్తుతం 250 మందికి పైగా రోగులు యాంజియోగ్రామ్, స్టంట్‌లను వేయించుకునేందుకు వస్తున్నారు. వీటిలో కనీసం 50 నుంచి 70 వరకు స్టంట్‌లు ఉంటున్నాయి. ఒక్కో శస్త్రచికిత్సకు ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోంది. వైద్య సేవ కార్డు ఉన్న వారికి కచ్చితమైన ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన స్టంట్‌లను వేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో తక్కువ ధరకే వైద్యం అందిస్తున్నట్లు ప్రచారం చేస్తూ నాణ్యతలేని బేర్ మెటల్ స్టంట్‌లు వేస్తున్నారు. వీటికి కూడా కనీసం రూ.లక్ష వసూలు చేస్తున్నారు. గుండె సమస్యతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే.. 2డీ ఎకో, ఈసీజీ చేశాక.. ఏ చిన్న ఇబ్బంది ఉన్నట్లు తేలినా యాంజియోగ్రామ్ చేస్తున్నారు. ఈ పరీక్షకు రూ.15వేల వరకూ తీసుకుంటున్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చేసి బస్సు ఛార్జీలనూ ఇచ్చి పంపిస్తున్నారు.

చాన్నాళ్లకు కలిశాం..

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎప్పుడో చిన్నప్పుడు ఆడిపాడాం.. చదువులో పోటీపడ్డాం.. చిన్నపాటి అలకలు.. బుజ్జగింపులు నాటి గుర్తులు నేడు కళ్లముందు కదలాడుతున్నాయ్ అంటూ 58 ఏళ్ల నాటి పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.. వారి అపూర్వ సమ్మేళనానికి గొడవర్రు జడ్పీ పాఠశాల వేదికైంది. 1968-69లో ఎస్ఎస్ఎల్‌సీ చదివిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. ప్రస్తుతం ఉన్న 36 మంది విద్యార్థులను ఎక్కడెక్కడ ఉన్నారో గుర్తించిన సహచర విద్యార్థులైన అప్పటి పాఠశాల ఎస్‌పీఎల్ హరికుమారి ఆండాళ్, గుర్నాథంలు వారందరినీ ఒక చోట కలిపారు. తొలుత జాతీయ పతాక ఆవిష్కరణ చేసి జాతీయగీతాలు ఆలపించిన అనంతరం తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయుడికి సన్మానం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ తమనుంచి భౌతికంగా వెళ్లిపోయిన స్నేహితుల ఆత్మశాంతికోసం సంతాపం తెలిపారు. అనంతరం చేసి వారి జ్ఞాపకార్థం వెండి డాలర్లను ఆయా కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం అనంతరం అంతా కలిసి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు.

తమ ఉపాధ్యాయుడితో కలిసి..

కోయంబత్తూరు నుంచి ఓఏబీ సీసాలు

☛ ఒక్కో దానికి రూ.1.79 చెల్లించిన జనార్దనరావు

☛ నకిలీ జీఎస్టీ నంబరుతో రవాణా.. కస్టడీలో వెల్లడించిన సెంథిల్

ఈనాడు, అమరావతి

డిజైన్ పరంగా సంక్లిష్టంగా ఉండే ఓల్డ్ అడ్మిరల్ బ్రాండీ (ఓఏబీ) సీసాల తయారీ కోసం అంతర్జాలంలో వెతికి మరీ జనార్దనరావు (ఏ1) తమిళనాడులోని కోయంబత్తూరులో శ్రీవారు ఇండస్ట్రీస్‌ను ఎంపిక చేశాడు. స్థానికంగా ఏ పరిశ్రమలోనూ తయారు చేసేవారు లేకపోవడంతో ఆర్డర్ ఇచ్చేశాడు. ఈ పరిశ్రమ యజమాని సెంథిల్‌ను (ఏ22) సంప్రదించి ఓఏబీ బ్రాండ్‌కు నకిలీ సీసాలను ఏ1 తెప్పించాడు. దీనికి నకిలీ జీఎస్టీ నంబరు ఉపయోగించాడు. నకిలీ మద్యం కేసులో రెండు రోజుల కస్టడీలో భాగంగా ఎక్సైజ్ పోలీసులు సెంథిల్‌ను ఆదివారం విజయవాడ కారాగారం నుంచి అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించిన అనంతరం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో కీలక అంశాలను వెల్లడించాడు.

శ్రీనివాసరెడ్డి చేతులెత్తేయడంతో..

ఓఏబీ సీసాల తయారీకి మొదట్లో సూరంపల్లి పారిశ్రామికవాడలో పెట్ బాటిల్స్ కర్మాగారాన్ని నడుపుతున్న శ్రీనివాసరెడ్డి (ఏ11)ని అద్దేపల్లి సోదరులు సంప్రదించారు. తన కంపెనీలో ఆ మోడల్ సీసాలు తయారు చేయడం కుదరదని చెప్పడంతో ప్రణాళికను తాత్కాలికంగా వాయిదా వేశారు. బెంగళూరుకు చెందిన బాలాజీ (ఏ3)ని సంప్రదించిన మీదట అంతర్జాలంలో వెతికి శ్రీవారి ఇండస్ట్రీస్‌లో ఇటువంటి సీసాలను తయారు చేస్తారని తెలుసుకున్నారు. సెంథిల్‌ను బాలాజీ పరిచయం చేసుకున్నాడు.

అనుమతి ఉందని నమ్మించి..

జనార్దనరావుకు మద్యం తయారీ చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఉందని.. సీసాలను తయారు చేయాలని నమ్మించారు. దీనికి నకిలీ జీఎస్టీ నంబరును సెంథిల్‌కు పంపించారు. అసలుకు ఏమాత్రం తీసిపోని విధంగా తయారు చేసి అందిస్తానని హామీ ఇవ్వడంతో సెంథిల్‌కు ఆర్డర్ ఇచ్చారు. ఒక్కో సీసాకు రూ.1.79 వెచ్చించారు. ఒక్కో విడతకు 99,840 సీసాలు చొప్పున రెండు విడతల్లో ఇబ్రహీంపట్నం, ములకలచెరువుకు సెంథిల్ రవాణా చేశాడు. సీసాలను సరఫరా చేసినందుకు ఏ22కు జనార్దనరావు రూ.3.57లక్షలను నిందితుడు రవికుమార్ ద్వారా చెల్లించాడు. నకిలీ జీఎస్టీ నంబరు నిజమైనదిగా నమ్మి సీసాలు రవాణా చేశానని, దీని వల్ల తాను కేసులో ఇరుక్కున్నానని సెంథిల్ ఆవేదన వ్యక్తం చేశాడు.

గుంతల దారి... ప్రమాదకరంగా మారి...

అధ్వానంగా గుడివాడ-పోలుకొండ రోడ్డు

గుడివాడ - పోలుకొండ - కనుకొల్లు రోడ్డు అత్యంత అధ్వానంగా మారింది. గత ఆరేళ్లుగా ఇదే దుస్థితి నెలకొంది. సుమారు 10 కి.మీ. ప్రయాణం నరకంగా ఉంది. ఇటీవల కొన్నిచోట్ల గుంతలు పూడ్చినా.. మళ్లీ యథాస్థితికి వచ్చింది. అడుగడుగునా గుంతలు పడ్డాయి. రాళ్లు తేలాయి. వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి లేస్తోంది. గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. లింగవరం మలుపు నుంచి అంబేడ్కర్ నగర్, తమిరిస, గొంగళ్లమూడి, అనమనపూడి, పోలుకొండ గ్రామాలను కలుపుతూ వెళ్లే మార్గమిది. కూటమి ప్రభుత్వం చొరవ చూపి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. - ఈనాడు, కృష్ణా

వాహనం వెళితే ధూళి ఎగసిపడుతోందిలా..

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉంటుందని కలెక్టర్ డీకే.బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌తోపాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పరిష్కార వేదికలు ఉంటాయన్నారు. ప్రజలు తమ సమీప మండల, డివిజన్ కేంద్రాల్లో అర్జీలు సమర్పిస్తే అధికారులు తగు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. కాల్ సెంటరు నంబరు 1100కు కాల్ చేసి అర్జీలు నమోదు చేసుకోవడంతోపాటు అర్జీ స్థితిగతులను తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు.

కాల్వలకు 2,823 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్: ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు ఆదివారం 2,823 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 1,005, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 1,818 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. బ్యారేజీ వద్ద పూర్తి స్థాయిలో 12 అడుగుల నీటి మట్టం ఉంది.

మున్సిపాలిటీలా.. మురుగు కూపాలా..?

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం, న్యూస్‌టుడే, గుడివాడ

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ అధ్వానంగా తయారైంది. కొత్త కాలువలు నిర్మించకపోవడం, మరమ్మతులు చేయకపోవడం.. చాలా వీధుల్లో మట్టి కాలువలే కావడంతో మురుగు పేరుకుపోయి రోడ్లపైకి చేరుతోంది. ఇళ్ల ముందు, ఖాళీ స్థలాలు, ప్రధాన రోడ్లు, పాఠశాలలు తదితర చోట్లా అధ్వానమే. మచిలీపట్నం సహా మిగిలిన 4 పురపాలికల్లో సాయంత్రం అయ్యిందంటే దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఖాళీ స్థలాల నుంచి పాములు, తేళ్లు, ఇతర కీటకాలు నివాసాల్లోకి చేరి దడపుట్టిస్తున్నాయి.

అంతా నిర్లక్ష్యమే

మచిలీపట్నం నగరపాలికలో 285 కి.మీ పొడవు డ్రెయిన్లు ఉన్నాయి. నిర్మించాల్సినవి వందల కి.మీలు ఉంది. అమృత్-1లో డ్రెయిన్ల నిర్మాణాలు సగంలోనే నిలిచాయి. పూడిక తీత, ఇతర నిర్వహణ పనులకు ఏటా రూ.80లక్షలకుపైగా ఖర్చు చేస్తున్నారు. రోజూ 80 టన్నులకు పైగా చెత్త సేకరిస్తున్నా వీధులు, కాలువల్లో చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. వర్షం వస్తే దారులు ఏరులవుతున్నాయి. రూ.కోట్లు వెచ్చించినా అధికారుల పర్యవేక్షణ లేమితో అపరిశుభ్రత వీడట్లేదు. ★ గుడివాడ పరిధిలో 120 కి.మీ పొడవు డ్రెయిన్లు ఉన్నాయి. వీటిలో నుంచి పూడిక తీసి పక్కనే రోడ్డుపై వేస్తున్నారు. ఆ వ్యర్థాలు మళ్లీ డ్రెయిన్లలోకి చేరుతున్నాయి. చాలా చోట్ల కాలువల మరమ్మతులు, కొత్త డ్రెయిన్లు నిర్మించాల్సి ఉంది. ★ తాడిగడపలో సుమారు 600 కి.మీ పొడవు డ్రెయిన్లు ఉండగా.. ఇళ్ల ముందు మురుగుతో పేరుకుపోయే కాలువలే ఎక్కువ. ★ పెడన, ఉయ్యూరులో వర్షం వస్తే దారుణమే.

తాడిగడపలో మురుగు కూపంలా పరిసరాలు

దృష్టి పెట్టు.. సమస్య తీరేట్టు

వీధులతో పాటు ప్రధాన మురుగు కాలువల్లోనూ తరచూ పూడికలు తొలగించి వెంటనే తరలించాలి. ★ వెంటనే బ్లీచింగ్, డ్రెయినేజీల్లో దోమల నివారణకు మందులు పిచికారీ చేయాలి. ★ చెత్త సేకరణ సక్రమంగా నిర్వహించాలి. చెత్త ఎక్కడపడితే అక్కడే వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి. ★ కాలువలపై ఆక్రమణలు తొలగించాలి. ★ అమృత్-2.0 నిధులతో కొత్త కాలువల నిర్మాణాలు.. ఇతర పనులకు చర్యలు తీసుకుంటున్నామని మచిలీపట్నం, గుడివాడ మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు, సింహాద్రి మనోహర్ తెలిపారు.

రాష్ట్ర ఆర్చర్లకు పతకాలు

విజయవాడ క్రీడలు: పుదుచ్చేరిలో గత నెల 27 నుంచి మూడు రోజుల పాటు జరిగిన ఖేలో ఇండియా ఎన్‌టీపీఎస్ ఓపెన్ ఆర్చరీ టోర్నీలో రాష్ట్ర కాంపౌండ్ ఆర్చర్లు పతకాలు కైవసం చేసుకున్నారని రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బెవర వెంకటరమణ తెలిపారు. ఆదివారం జరిగిన స్త్రీ, పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగాల్లో కేపీఎస్ లేహ్యారెడ్డి, బి.రవితేజ రజత పతకాలతో పాటు రూ.15వేలు, కె.భరత్‌కుమార్ నాలుగో స్థానంలో నిలిచి రూ.5వేల నగదు సొంతం చేసుకున్నారన్నారు.

సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలుంటే తెలపండి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని కేడర్ల ఉపాధ్యాయులు, హెచ్ఎంల సాధారణ సీనియార్టీ జాబితాలను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు వెబ్‌సైట్‌లో ఉంచినట్టు జిల్లా విద్యాశాఖాధికారి యూవీ.సుబ్బారావు తెలిపారు. అన్ని కేడర్ల వారు తమ వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి, అభ్యంతరాలుంటే సంబంధిత ఆధారాలతో మార్చి 2 నుంచి 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలన్నారు. గడువు ముగిసిన తర్వాత సమర్పించే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు.

B.Sc (నర్సింగ్), BPT కోర్సులలో చేరదలచిన విద్యార్థులకు సువర్ణ అవకాశం

సవరణ

ది. 01-03-2026న ప్రచురితమైన పై ప్రకటనలో ఫోన్ నెం: 98481 29500గా చదువుకోవలసినదిగా కోరుతున్నాము.

APNIMA-Honorary President

డ్రగ్స్‌పై దండయాత్ర.. ఆరంభం మాత్రమే..!

■ మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిస్తాం : సీపీ

■ విజయవంతంగా 34 రోజుల సైకిల్ యాత్ర

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా 34 రోజులు చేపట్టిన 'డ్రగ్స్‌పై దండయాత్ర' కార్యక్రమం విజయవంతమైందని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు వెల్లడించారు. ఇది ఆరంభం మాత్రమేనని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో.. గత 34 రోజులుగా 510 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్ర ముగింపు కార్యక్రమం ఆదివారం పాత పోలీస్ కంట్రోల్‌రూం కూడలిలో నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ వరకు ప్రదర్శన చేశారు. విజయవంతంగా సైకిల్ యాత్ర పూర్తి చేసిన ఐదుగురు మహిళా పోలీసులకు ఘన స్వాగతం పలికారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు మాట్లాడుతూ.. ఇది ప్రజల ఆకాంక్ష నుంచి, ఒక తల్లి కడుపుకోత నుంచి పుట్టిన యాత్ర అని కొనియాడారు. యువత భవిష్యత్తుపై రాసిన సంతకంగా కలకాలం నిలిచిపోతుందన్నారు. ప్రజల స్పందన అద్భుతంగా ఉందని.. అడుగడుగునా హారతులు పట్టారని తెలిపారు. మాదకద్రవ్యాల మహమ్మారిపై ప్రజల్లో చర్చకు వచ్చేలా చేసిందన్నారు. ఎక్కడ ఏం జరిగినా టోల్‌ఫ్రీ నంబరు 1972కు సమాచారం వస్తోందన్నారు. అందరం కలిసి కట్టుగా పోరాడాల్సిన ఉద్యమం అని అన్నారు.

ఇదొక చరిత్రగా మారుతుంది..

డ్రగ్స్‌పై దండయాత్ర దేశంలోనే ఒక చరిత్రగా మారుతుందని సీపీ పేర్కొన్నారు. ఇందులో భాగంగా 29 రకాల కార్యక్రమాలను నిర్వహించామన్నారు. పోలీసు జాగిలాలు సైతం పాలుపంచుకున్నాయని, పిట్ ఎన్‌డీపీఎస్ యాక్ట్ గురించి ప్రజలకు తెలియజేశామని తెలిపారు. మత్తుకు బానిసైన 2,513 మందిని గుర్తించి, కౌన్సెలింగ్ చేశామని.. 149 హాట్‌స్పాట్‌లు గుర్తించి నిఘా ఉంచామని వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, డ్రోన్ల వినియోగం, వాహన తనిఖీలు, నాకా బందీ చేశామన్నారు. ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ.. 34 రోజుల పాటు మహమ్మారిపై పోరాటం చేసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఎక్కడా ఇలాంటి కార్యక్రమం నిర్వహించలేదని కొనియాడారు. కార్యక్రమ సంధానకర్త అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో ఈ యాత్ర 510 కిలోమీటర్లు పూర్తి చేసుకుందన్నారు. ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, మహిళలు ఘనంగా స్వాగతం పలికారని తెలిపారు. ర్యాలీగా ఏఆర్ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. డీసీపీలు కృష్ణప్రసన్న, షిరీన్‌బేగం, కృష్ణకాంత్ పటేల్, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, బి.లక్ష్మీనారాయణ, ఈగల్ ఎస్పీ నగేష్ ఏసీపీలు, సీఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బెలూన్లను ఎగరేస్తున్న సీపీ రాజశేఖరబాబు, ఈగల్ ఐజీ రవికృష్ణ, డీసీపీలు సరిత, షిరీన్ బేగం, కృష్ణప్రసన్న, తిరుమలేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, ఉదయరాణి తదితరులు

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

నికర దిగుబడి.. స్వల్ప రికవరీ

కేసీపీలో ముగిసిన క్రషింగ్

ఉయ్యూరు, న్యూస్‌టుడే

గతేడాది కంటే సుమారు 30 వేల టన్నులు ఈ ఏడాది ఉయ్యూరు కేసీపీ చక్కెర కర్మాగారం గానుగాడారు. వచ్చే సీజన్ పరిస్థితి కూడా సుమారుగా ఇదే క్రమంలో ఉంటుందని అంచనా. గతంలో ఉమ్మడి కృష్ణాలోనే 12 లక్షల టన్నుల గానుగాడిన ఈ కర్మాగారం ప్రస్తుతం పలు జిల్లాలకు పరిమితమైనా కేవలం 2025-26 క్రషింగ్ సీజన్‌లో 2.96 లక్షల టన్నులే ఆడిందంటే భవిష్యత్తులో చెరకు సాగు మనుగడకు ప్రశ్నార్థకంగా మారింది. ఈ సీజన్‌లో పంచదార రికవరీ (8.40శాతం) స్వల్పంగా పెరిగినా దిగుబడి నిలకడగానే నమోదైంది.

ఫ్యాక్టరీకి ఎడ్ల బండ్లపై తీసుకొస్తున్న చెరకు

కొంత చేయూతతో..: కేసీపీ పరిధిలో పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 46 మండలాల్లోని 392 గ్రామాల్లో 2,898 మంది రైతులు 8,167 ఎకరాల విస్తీర్ణంలో చెరకు సాగు చేశారు. 2026-27 క్రషింగ్ సీజన్‌కు తొమ్మిది వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకు సాగు అంచనా. ఈ లెక్కన చూసినా మూడు లక్షల టన్నుల కంటే ఎక్కువ గానుగాడే పరిస్థితి కనిపించడంలేదు. అదికూడా కేసీపీ సంస్థ టన్నుకు రూ.400 రాయితీలందించడం, కూలీల కొరత లేకుండా కృషి చేయడం, మంచి వంగడాల్ని స్వయంగా పెంచి పోషించి రైతులకు అందిస్తూ రైతులకు కొంత చేయూతగా ఉండబట్టి ఈ మాత్రం రైతులు చెరకు సాగు వైపు చూస్తున్నారు. 2005-06 సీజన్‌లో ఉయ్యూరు కర్మాగారంలోనే అత్యధికంగా 35,915 ఎకరాల్లో చెరకు సాగు చేశారు. అలాగే 2006-07 క్రషింగ్ సీజన్‌లో అత్యధికంగా 12 లక్షల టన్నుల చెరకును గానుగాడించారు. ప్రస్తుతం రెండున్నర మూడు లక్షల టన్నుల పరిస్థితికి పడిపోయింది.

ఫలప్రదమైదమైతే..

ప్రధానంగా యాంత్రీకరణ ప్రయత్నం ఉండాలని, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ధర, ఇతరేతర విషయాల్లో చెరకు రైతులకు న్యాయం చేయాల్సి ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు. వచ్చే సీజన్ నాటికి రాష్ట్రం మొత్తంలో రెండే చక్కెర కర్మాగారాలు నిలబడే పరిస్థితి ఉంటే అందులో ఒకటి ఉయ్యూరు కేసీపీ ఉంటుంది. అదికూడా గడ్డు స్థితిలో కొనసాగే పరిస్థితి. యాజమాన్యం యాంత్రీకరణ విషయంలో విశేష కృషి చేస్తోందని, అది ఫలవంతమైతే చెరకు సాగు పెరిగే సూచనలున్నాయని కేసీపీ వ్యవసాయ విభాగం జనరల్ మేనేజరు వి.వి.పున్నారావు, కేసీపీ యూనిట్ హెడ్ సీతారామదాసు చెబుతున్నారు.

విజయవంతంగా సీజేఐ అమరావతి పర్యటన

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: అమరావతి పర్యటనలో భాగంగా భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం మధ్యాహ్నం 1:35 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. తిరుపతి నుంచి ప్రత్యేక విమానంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, జస్టిస్ నరసింహం, జస్టిస్ ఎస్ వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీతో కలిసి వచ్చిన సీజేఐకు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో అమరావతి బయలుదేరి వెళ్లారు. తిరిగి రాత్రి 8 గంటలకు విమానాశ్రయం చేరుకున్న సీజేఐ ప్రత్యేక విమానంలో దిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు. విమానాశ్రయంలో సీఎం చంద్రబాబు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు సీజేఐకు ఘన వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దోనాడి రమేష్, జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ మహేశ్వరరావు కుంచెయం, జస్టిస్ టీసీడీ శేఖర్, కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జేసీ నవీన్, విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, ప్రొటోకాల్ డైరెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

విద్యాశాఖ వైఖరిపై ఉపాధ్యాయుల మండిపాటు

మచిలీపట్నం(కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పట్ల విద్యాశాఖ వైఖరి గర్హనీయంగా ఉందని ఏపీఎస్టీఎఫ్ నాయకులు ఆరోపించారు. నగరంలోని ఎన్జీవో హోంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ లీప్ యాప్‌లో తరచూ సాంకేతిక దోషాలు వస్తుండటంతో హాజరు సరిగాపడటం లేదన్నారు. సాంకేతిక సమస్యను పరిష్కరించకుండా ఆ లోపాన్ని ఉపాధ్యాయుల ఖాతాలో ఎలా వేస్తారంటూ ప్రశ్నించారు. ఉపాధ్యాయులు హాజరుకావడం లేదంటూ ప్రజల్లో వారిపట్ల చులకన భావన కల్పించేలా విద్యాశాఖ వ్యవహరించడం సముచితం కాదన్నారు. పరిస్థితిని తక్షణం చక్కదిద్దకుంటే ఆందోళన చేయక తప్పదంటూ హెచ్చరించారు. పదో తరగతి పరీక్ష విధుల కేటాయింపులను అసంబద్ధంగా రాష్ట్ర స్థాయిలో చేయడం సరికాదన్నారు. పరీక్ష కేంద్రాల్లో జూనియర్లను సీఎస్‌లుగా, సీనియర్లను డీవోలుగా నియమించడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులను ఉత్సవ విగ్రహాలుగా మార్చి విద్యాశాఖ అన్ని రకాల విధులను రాష్ట్ర స్థాయిలో చేపట్టడం అనైతికమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిల్లా స్థాయిలో నిర్ణయాధికారాలను జిల్లా విద్యాశాఖాధికారులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. పది పరీక్ష విధులకు సంబంధించి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మినహాయింపు ఇవ్వాలని, 8 కి.మీ దూరానికి పైబడి విధులు కేటాయించిన ఉపాధ్యాయులకు టీఏ, డీఏలు ఇవ్వాలన్నారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇమ్మానియేల్, యువీ కృష్ణమూర్తి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమ్ము ప్రసాద్, సతీష్‌బాబు, సీనియర్ నాయకులు ప్రసాద్, కిరణ్‌బాబు, వివిధ మండలాల నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

రంజాన్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా అన్ని మసీదులు, ప్రార్థన మందిరాల వద్ద ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. ఛాంబర్ నుంచి ఆయన రంజాన్ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో ఆదివారం వీసీ నిర్వహించి కల్పించాల్సిన సౌకర్యాలపై పలు సూచనలు చేశారు. అన్ని మసీదుల వద్ద మంచినీరు, విద్యుత్తు సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ముస్లింలు నివసించే ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా చేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా తగు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు. ముస్లింల సౌకర్యం కోసం రాత్రిళ్లు దుకాణాలు, కూరగాయల కొట్లు, మార్కెట్లు, హోటళ్లు తెరిచి ఉంచేలా పోలీసులు అనుమతించాలన్నారు. రంజాన్ మాసంలో నమాజ్ చేసుకునేందుకు వీలుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో పనిచేసే కాంట్రాక్టు, పొరుగుసేవల ఉద్యోగులు, ఉపాధ్యాయులు అన్ని పనిదినాల్లో కార్యాలయాల ముగింపు సమయానికి ఒక గంట ముందుగా వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతించినట్టు తెలిపారు. జిల్లా మైనార్టీ అధికారి రబ్బాని, మచిలీపట్నం, గుడివాడ, ఆర్డీవోలు సాంబశివరావు, బాలసుబ్రహ్మణ్యం, డీఎంహెచ్‌వో డా.యుగంధర్, డీఎస్‌వో మోహన్‌బాబు, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీపీవో అరుణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, కార్మికశాఖ అధికారి విష్ణు, అగ్నిమాపకాధికారి ఏసురత్నం, పోలీస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు వీసీకి హాజరయ్యారు.

సూచనలిస్తున్న కలెక్టర్ బాలాజీ

మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహావిష్కరణ

లక్ష్మీపురం(చల్లపల్లి), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా విశేష సేవలందించిన కొణిజేటి రోశయ్య జీవితం ఆదర్శప్రాయమని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామసత్యనారాయణ అన్నారు. చల్లపల్లి మండలం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీపురం సెంటర్‌లో రోశయ్య విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. వివాద రహితునిగా, అజాతశత్రువుగా రోశయ్య రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకొన్నారన్నారు. వాసవీమాత పతాకాన్ని ఆవిష్కరించారు. చల్లపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు శ్రీనివాసరావు, సన్నిధి నాగసాయి శ్రీనివాసు, మోటుమర్రి వెంకట బాబాప్రసాద్, నేతలు తూనుగుంట్ల సాయిబాబు, అన్నవరపు పాండురంగారావు, ఘంటసాల రాజమోహనరావు, కొల్లిపర సురేంద్రబాబు, యార్లగడ్డ లంకబాబు, బొగ్గవరపు మధుసూదనరావు సోదరులు, వరదా హరిగోపాల్, తమ్మన సతీష్ పాల్గొన్నారు.

రోశయ్య విగ్రహావిష్కరణలో నేతలు

సమావేశంలో జోసెఫ్ సుధీర్‌బాబు, ఇతర నేతలు

రాష్ట్ర విద్యాశాఖ వైఖరిపై నిరసన

గుడివాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి సమర్థనీయం కాదని అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆర్థిక కార్యదర్శి సీహెచ్.జోసెఫ్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓల భవనంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లీప్ యాప్‌లో లెక్కలేనన్ని సార్లు సాంకేతిక లోపాలు వచ్చినా, హాజరు నమోదు కాకున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. ఆ లోపాలను ఉపాధ్యాయుల ఖాతాలో వేసి హాజరు కావడంలేదని చులకన చేస్తున్నారన్నారు. తక్షణం విద్యాశాఖ తన తీరు మార్చుకోకపోతే ఆందోళన తప్పదన్నారు. డీఈవోలను ఉత్సవ విగ్రహాలుగా చేసి అన్ని రకాల విధులను రాష్ట్ర స్థాయి నుంచి ఆన్‌లైన్‌లో జారీ చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నేతలు డి.చంద్రశేఖర్, పి.ఇమ్మానియేలు, యూవీ కృష్ణమూర్తి, ఎంవీఎస్ఎన్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల తనిఖీ

గుడివాడ: బాణసంచా దుకాణాలలో జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా గుడివాడ టూటౌన్ సీఐ జె.ఆర్.కె.హనీష్, అగ్నిమాపక సిబ్బందితో కలిసి బంటుమిల్లి రోడ్డులోని లైసెన్సు కలిగిన పైడి సీతారామయ్య బాణసంచా దుకాణాన్ని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అగ్నిమాపక నియంత్రణ పరికరాలను పరిశీలించారు. గుడివాడ రూరల్ మండలం మల్లాయపాలెం గ్రామపరిధిలో ఉన్న బాణసంచా దుకాణాలను గుడివాడ రూరల్ సీఐ ఎస్.ఎల్.ఆర్.సోమేశ్వరరావు, తహసీల్దారు కిరణ్‌కుమార్, ఎస్.ఐ ఎన్.చంటిబాబు, అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. దుకాణంలో తీసుకుంటున్న ప్రమాద నియంత్రణ చర్యల్ని క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు.

దుకాణాన్ని తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ సోమేశ్వరరావు, తహసీల్దారు కిరణ్ కుమార్

వివాహితకు ఓదార్పు.. ఆత్మహత్యాయత్నం విరమణ

అవనిగడ్డ గ్రామీణం: కుటుంబ సమస్యలతో ఇద్దరు బిడ్డలతో కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి పెనుమూడి-పులిగడ్డ వారధిపై నిరీక్షిస్తున్న మహిళను పులిగడ్డ గ్రామ సర్పంచి విజయ్‌కుమార్ అనునయించి రేపల్లె పోలీస్ స్టేషన్‌కు తరలించిన సంఘటన చోటుచేసుకుంది. వారధి గట్టుపై ఆదివారం రాత్రి ఇద్దరు బిడ్డలతో ఒక మహిళ ఉన్న విషయాన్ని తన మిత్రుడు వాసు గమనించి తనకు చెప్పాడని సర్పంచి తెలిపారు. వెంటనే ద్విచక్ర వాహనంపై సంఘటన ప్రాంతానికి చేరుకుని మహిళకు నచ్చజెప్పి రేపల్లె పోలీసులకు సమాచారం ఇచ్చానన్నారు. కానిస్టేబుల్ వచ్చి ఆ మహిళను స్టేషన్‌కు తరలించారు. ఆపై సర్పంచి రేపల్లె ఎస్సై రాజశేఖర్‌తో మాట్లాడి మహిళకు రక్షణ కల్పించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

ఇరాన్‌పై దాడులు అమానవీయం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దాడులు అమానవీయమని పలువురు ముస్లిం పెద్దలు, సంఘాల నాయకులు అన్నారు. ఇరాన్ సర్వోన్నత నాయకుడు ఆయాతుల్లా సయ్యద్ అలీ ఖమేని మృతి చెందిన సందర్భంగా ఆదివారం సాయంత్రం మచిలీపట్నంలోని చింతచెట్టు సెంటరు నుంచి కోనేరు సెంటరు వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. మహిళలు కూడా అధిక సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు. ఇరాన్‌పై దాడులను ప్రపంచ దేశాలు ఖండించాలని నినాదాలు చేశారు. మతగురువులు రాషద్ హుస్సేన్ సాహెబ్, షా అబ్బాస్ జైదీసాహెబ్, ఆబిద్ అలీ సాహెబ్, జవ్వార్ హుస్సేన్ సాహెబ్, ముసూద్ అబ్బాస్ రిజ్వీ తదితరులు కోనేరుసెంటరు సభలో ప్రసంగించారు. దక్షిణ ఇరాన్‌లోని ఓ బాలికల పాఠశాలపై జరిపిన దాడిలో 160 మంది విద్యార్థినులు మృతి చెందారనే వార్తలు తీవ్రంగా కలిచివేస్తున్నాయన్నారు. అమెరికా, ఇజ్రాయేల్ దేశాలు అంతర్జాతీయ సమాజానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

చదరంగం విజేతలు సుప్రీత, టాటా కీర్తి రాణా

విజయవాడ క్రీడలు: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ది విజయవాడ చెస్ సంఘం, రాష్ట్ర చెస్ సంఘం సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల చెస్ టోర్నీలో పొట్లూరి సుప్రీత, టాటా కీర్తి రాణా విజేతలుగా నిలిచారు. మొత్తం 200 మంది క్రీడాకారులు తలపడగా.. మహిళల విభాగంలో సుప్రీత (కృష్ణా), సీహెచ్ రాధికాదేవి (గుంటూరు), పి.సహస్రవర్మ (పశ్చిమ గోదావరి), అల్లూరి నేహశ్రీ (తూర్పు గోదావరి), పి.యశ్వితవర్మ (పశ్చిమ గోదావరి) వరుస స్థానాలు కైవసం చేసుకున్నారు. పురుషుల విభాగంలో గుంటూరుకు చెందిన టాటా కీర్తి రాణా, షేక్ అబ్దుల్ నబీ, ఎ.హరిసూర్యనారాయణ, జి.మేఘ శ్యామ్‌సాయి, పి.జయ సాకేత్ వరుస స్థానాల్లో నిలిచారు. వైద్యుడు ఎంజే నాయుడు, రాష్ట్ర సిటీ కేబుల్ ఆపరేటర్స్ సంక్షేమ సొసైటీ ప్రధాన కార్యదర్శి కేవీ శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందజేశారు. ది విజయవాడ చెస్ సంఘం కార్యదర్శి మందుల రాజీవ్ మాట్లాడుతూ.. తొలి అయిదు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు ఈ నెలలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రకటించారు.

నర్సింగ్ కోర్సుకు నీట్ నిబంధనాలు

న్యూస్‌టుడే, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

నర్సింగ్ కోర్సు ప్రవేశాలకు నీట్ యూజీ రాయాలన్న నిబంధన పేద విద్యార్థినులకు శాపంగా మారింది. అదీ మార్చి ఎనిమిదో తేదీలోగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించడంతో గ్రామీణ విద్యార్థినులు ఈ కోర్సుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. దరఖాస్తుకు గడువు దగ్గరపడటం, ఈ నిబంధనలపై ప్రచారం లేకపోవడం ముప్పుగా పరిణమిస్తోంది. సాధారణంగా ఉన్నత చదువులకు వెళ్లలేని పేద కుటుంబాల బాలికలకు బీఎస్సీ నర్సింగ్ కోర్సు ఓ వరం. మారుమూల పల్లెల నుంచి ఎందరో ఈ కోర్సులో చేరుతుంటారు. ఏఎన్ఎం, జీఎన్ఎం డిప్లమోలు చేసిన వారు కూడా ఇందులో చేరవచ్చు. ఇంటర్‌లో బైపీసీ పూర్తి చేసిన తర్వాత బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సు, ఫిజియోథెరపీ (బీపీటీ) అందుబాటులో ఉండేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎందరో విద్యార్థినులు ఈ కోర్సులో చేరేవారు. కొన్నేళ్ల తర్వాత ఎంసెట్ నిబంధన తెచ్చి అందులో ర్యాంకుల ఆధారంగా సీట్ల భర్తీ చేపట్టారు. రెండేళ్లనాడు ప్రవేశాలు కల్పించే విశ్వవిద్యాలయమే ప్రత్యేక పరీక్ష నిర్వహించి ప్రవేశాలు చేపట్టాలని నర్సింగ్ కౌన్సిల్ ఆదేశించింది. విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులకు ఆహ్వానించగా ఆశించినంతగా అభ్యర్థులనుంచి స్పందన లేదు. రెండు సార్లు పొడిగించిన తర్వాత దరఖాస్తుదారుల సంఖ్య పెరిగింది. తాజాగా ఈ విద్యా సంవత్సరం నుంచి జాతీయ స్థాయిలో ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల నిమిత్తం రాసే నీట్ యూజీ ప్రవేశ పరీక్ష అర్హత ఉండాలనే నిబంధన శాపమవుతోంది. నీట్ అర్హత నిబంధనలు మారుమూల ప్రాంతాల బాలికలకు తెలిసేలా ప్రచారం లేకపోవడంతో చాలా మంది ఈ విద్యా సంవత్సరం చేరే అవకాశాన్ని కోల్పోగలరన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ప్రచారం చేపట్టాల్సిన ఆరోగ్య విశ్వవిద్యాలయం వెనకడుగు వేస్తోంది. ఫిజియోథెరపీ డిగ్రీకి సంబంధించి కూడా విజయవాడ పాత ఆస్పత్రిలోని ఎ.పి.స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ పట్టించుకోవడం లేదు. వేలల్లో సీట్లు మిగిలిపోయే పరిస్థితి ఉందంటున్నారు.

గత ఐదేళ్లలో సీట్ల భర్తీ ఇలా..

విద్యా సంవత్సరం	కళాశాలలు	మొత్తం సీట్లు	మిగిలినవి
2021-22	179	9315	546
2022-23	195	11869	1980
2023-24	237	12560	2876
2024-25	253	13716	2125
2025-26	266	14765	4739

అంతా గందరగోళమే

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని బాలికలకు ప్రవేశాల ప్రక్రియను తెలియపర్చడంలో విఫలమయ్యారు. ఏటా ఆగస్టులో ప్రవేశాలుంటాయని భావిస్తున్నారు. ఎన్టీఏ అర్ధాంతరంగా దేశమంతా ఒకే ప్రక్రియ అన్నట్లు నీట్ యూజీ ప్రవేశ పరీక్ష అర్హత నిబంధన విధించింది. జాతీయ స్థాయిలో ఈ పరీక్షకు దరఖాస్తు ప్రక్రియ ఏవిధంగా ఉంటుందో గ్రామీణ ప్రాంతాల వారికి అవగాహన ఉండదు. దీని దృష్ట్యా గడువు మరింత పెంచితే పేద బాలికలకు వెసులుబాటుగా ఉంటుంది.

- అర్జునరావు, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కళాశాలల గౌరవ అధ్యక్షుడు

ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పిద్దాం

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : మంచి, చెడుల జ్ఞానం, జయాపజయాలను ఒకేలాగా చూసే దృఢ సంకల్పం అలవర్చేది ప్రభుత్వ బడి మాత్రమేనని.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం గవర్నర్‌పేటలోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రచార గోడపత్రికలు ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాద్‌లు మాట్లాడారు. గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్, అబ్దుల్ కలాం వంటి ప్రపంచం గర్వించే మేధావులంతా ప్రభుత్వ బడిలోనే చదివారని తెలిపారు. నైతిక, రాజ్యాంగ విలువలు నేర్పేది ప్రభుత్వ బడి మాత్రమేనని అన్నారు. బడిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజం తీసుకోవాలని కోరారు. పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలు ఉచితంగా అందించారని తెలిపారు. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు వ్యాయామం, గ్రంథాలయం, ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మీ పిల్లలను తమ బిడ్డలుగా భావించే మంచి ఉపాధ్యాయులు ప్రభుత్వ బడిలో ఉన్నారని.. అవసరమైతే అదనంగా ఒక గంట పని చేసేవారూ ఉన్నారని పేర్కొన్నారు. యూటీఎఫ్ చేస్తున్న ప్రభుత్వ బడి అభివృద్ధి కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు కొమ్మోజు శ్రీనివాసరావు, కె.సురేష్‌కుమార్, కుసుమకుమారి, రెడ్డి మోహనరావు, బి.లక్ష్మీరాజా, ఎస్.పి.మనోహర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుని శేషవాహన మహోత్సవం

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : నెమలి వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారికి శేషవాహన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. యాగశాలలో జరిగిన నిత్య హోమం, నవ కుంభారోహణంలో పాలకవర్గ సభ్యులు, ఉభయ దాతలు పాల్గొన్నారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంలో శేషవాహనంపై గ్రామోత్సవం చేశారు. ఆలయ ఉప ప్రధానార్చకుడు తిరునఘరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ కూడలి వద్ద ఎదురుకోల(వధూవరుల పరిచయం) ఉత్సవం నిర్వహించారు. పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశిరేఖ, సహాయ కమిషనర్ ఎన్.సంధ్య పర్యవేక్షించారు.

నిత్య హోమం వద్ద అధికారులు, పాలకవర్గ సభ్యులు

స్వామి కల్యాణం నేడు : వేణుగోపాల స్వామి తిరు కల్యాణం సోమవారం రాత్రి 9 గంటలకు ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని భావించి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. దాతల వితరణతో అన్నప్రసాదం పంపిణీ చేస్తారు.

ఎమ్మెల్యేలకు ఆహ్వానం : స్వామి వారి తిరు కల్యాణంలో పాల్గొనేందుకు నెమలి గుడికి రావాలని కోరుతూ జగ్గయ్యపేట, మైలవరం, నందిగామ, ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్, వసంత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, రాందాస్ నాయక్‌కు తెదేపా నాయకులు వడ్లమూడి రాజశేఖర్, బెల్లం మధుసూదనరావు ఆధ్వర్యంలో ఆదివారం ఆహ్వాన పత్రాలు అందజేశారు.

ఉచిత శిక్షణ తరగతులు

గన్నవరం గ్రామీణం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గన్నవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ తెలిపారు. కస్టమర్ కేర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుపై ఉచిత శిక్షణ ఈ నెలలో ప్రారంభమవుతుందన్నారు. నూతన సాంకేతికత ఆధారంగా నిపుణుల ద్వారా శిక్షణ అందించి, స్థానిక పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఆసక్తిగల యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కోర్సుకు ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన 18-30 సంవత్సరాల మధ్య వయసులోపు యువత అర్హులన్నారు. ఆసక్తిగల యువత 90226 79999 నంబరును సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఆదివారం వెల్లడించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -150 రిటైల్ ధర 177 చికెన్ విత్ స్కిన్ - 257 చికెన్ స్కిన్‌లెస్ - 292.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాలని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో జిల్లా ఐకాస నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన ఛైర్మన్‌గా సత్యనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ శాఖలు, సంఘాలు, నాయకులతో కార్యవర్గం ఏర్పాటైన నూతన ఐకాస ఉద్యోగుల పక్షాన నిర్విరామంగా పోరాడేందుకు సిద్ధంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వంతో చర్చించి న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేస్తామని చెప్పారు. ఐకాస కో ఛైర్మన్‌లుగా పి.రమేష్, జి.అనుగ్రహ ప్రసాద్, రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా జి.నారాయణరావు, ఎస్.కె.నవాబ్‌జానీ, కె.ప్రభాకర్, జి.అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.డి.ఖాసీం, కార్యదర్శిగా జి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా ఎం.అక్కిరాజు, సుందరయ్య, షమాబేగం, రవీంద్ర, పి.నాగరాజు, జి.సుదర్శనరావు, బి.సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.



ఐక్యత చాటుతున్న సత్యనారాయణరెడ్డి, రమేష్, అనుగ్రహ ప్రసాద్, రామకృష్ణ తదితరులు

91.9FM Vijayawada 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. 81422 92071

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువుపెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు, విజయవాడ: శ్రీశరణంలాడ్జి, పాతబస్టాండ్ ఎదురుగా, బందర్‌రోడ్, ప్రతీనెల 2, 16 తేదీల్లో మందులు.

INDUSTRY

విజయవాడ మరియు సరిహద్దు ప్రాంతాల్లో 10,000- 12,000 SFT, 3Phase Power కలిగి ఉన్న ఇండస్ట్రియల్ షెడ్ రెంటుకి కావలెను. ✆ 88866 10123

REAL ESTATE

FLAT FOR SALE

3BHK East Facing 1600 Sft. Flat with Car Parking for Sale in Royal Rightway Homes on Ramavarapupadu Inner Ring Road, Beside SLV Villas. Conact: 96666 78830.

VJA, ప్రజాశక్తి నగర్ నారాయణస్కూల్ ప్రక్కన గ్రూప్‌హౌస్ నందు గ్రౌండ్‌ఫ్లోర్ 1035 చ||అ|| 2BHK ఫ్లాట్ కార్‌పార్కింగ్‌తో అమ్మకం. ✆ 99854 60188.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

JOBS

Wanted Freshers for Vijayawada and Hanuman Junction. Salary -10,000. On Job Training will be Provided. Contact: 76808 27755

అనుభవంగల క్వాలిఫైడ్ నర్సులు ANM/GNM కావలెను. పున్నమ్మ ఫిజియోథెరపీ హాస్పిటల్, జడగం వారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ ✆ 98852 22525

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ నందు వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్‌వారికి ఉచితభోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ to డిగ్రీ వరకు, వయస్సు: 22 సం||ల నుండి 40 సం||లు ఉండవలెను. వివరములకు సంప్ర: ✆ 92487 33372.

బుక్ వర్క్ చేయుటకు అనుభవం గల DTP ఆపరేటర్స్ కావలెను. జీతం 25000/- వరకు విజయవాడ నందు సంప్రదించగలరు. 99631 31354.

కొటక్‌బ్యాంక్ అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS, స్టేట్ & సెంట్రల్ ఎంప్లాయిస్, టీచర్స్ కావలెను. వ:35-70, Q:10th, జీ:12-15 వేలు. సంప్ర: 63041 81391

ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు ANM, GNM, MPHW, చదివి అనుభవం ఉన్నా, లేని మహిళలు కావలెను. సంప్ర: 93973 41745.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన

కనుల పండువగా స్వామి వారి కల్యాణం

పామర్రు (గ్రామీణం, న్యూస్‌టుడే: విజయ వాడ శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధీనంలోని పామర్రు మండలం కొమరవో లులో శ్రీఅమరలింగేశ్వర దుర్గా నాగేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి వార్షిక కల్యాణం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధా కృష్ణ(గాంధీ) ఈవో శీనానాయక్ తదితరులు పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామి వారికి నూతన పట్టు వస్త్రాలు అందజేశారు. గ్రామస్థులు మోటూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కృష్ణవేణి దంపతులు, యుగంధర్ దంపతులు పీటలపై కూర్చొని కల్యాణం జరిపించగా భక్తులు తిలకించారు.

ధర వరలు

టమాట 13, వంగ 16, బెండ 19, పచ్చి మిర్చి 38, కాకర 26, క్యాబేజీ 16, క్యారట్ 24, దొండ 25, బంగాళదుంప 23, ఉల్లిపా యలు 22, గోరుచిక్కుడు 20, దోస 23, సొర 07,08, అరటికాయ 7/6, చిక్కుళ్లు 24, బీర 24, చామదుంప 24, మునగ 08/07, కంద 38, బీట్‌రూట్ 22, కీరదోస 32, బీన్స్ 50, క్యాప్సికం 58, అలసందలు 22, చిలకడదుంప 26, కొత్తిమీర 12/06, పుదీనా 15/05 సోమవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. వివరాలకు ఎస్టేట్ అధికారి బలిశెట్టి వెంకటేశ్వరరావు ఫోన్ నంబరు 91823 61295లో సంప్రదించవచ్చు. – మచిలీపట్నం గొడుగుపేట

సినిమాలు

రేవతి : అతడు, మినీ రేవతి : ది రైజ్ ఆఫ్ అశోక్, సి లక్ష్మి : మన శంకరవరప్రసాద్ గారు సిరివెంకట్ : విష్ణు విన్యాసం – మచిలీపట్నం (గొడుగుపేట)

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

? నేలకొండపల్లి గ్రామంలో పబ్లిక్ కుళాయిలు పెంచాలి. ప్రస్తుతం 39 ఉన్నాయి. మరో 20 ఏర్పాటు చేయాలి. - స్థానికులు ✔ పబ్లిక్ కుళాయిలు పెంచడానికి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈకి ప్రతిపాదనలు పంపించాం. అనుమతి రాగానే ఏర్పాటు చేస్తాం. - బి.వాసు, గ్రామ కార్యదర్శి

- న్యూస్‌టుడే, పెడన గ్రామీణం

స్పందన: ఖొజ్జిల్లిపేటలో రహదారి సమీపంలో ఉన్న చెత్త మేటను తొలగించకపోవడంతో స్థానికులు, రాకపోకలు సాగించే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా అధికారుల దృష్టికి తీసుకురాగా సిబ్బందిని పంపి చెత్త తొల గించేలా చర్యలు తీసుకున్నారు.

* వలందపాలెం డ్రైన్‌లో పూడిక తొలగించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులు అధికారులకు వివరించడంతో సిబ్బందిని పంపి పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు. -న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

అన్ని ప్రాంతాలకు శుద్ధి జలం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

నగరంలో తాగునీటి సరఫరాలో ఉన్న సమస్యలు పరిష్కరించడంతోపాటు అన్ని ప్రాంతాలకూ శుద్ధిజలం అందించేలా కృషిచేస్తున్నామని నగరపాలకసంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు అన్నారు. వివిధ ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ల లీకులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వేసవి సమీపిస్తున్న తరుణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కార్యాచరణ ఏమిటి తదితర అంశాలపై ఆయన న్యూస్‌టుడే ముఖాముఖిలో వెల్లడించారు.

న్యూస్‌టుడే: వివిధ ప్రాంతాల్లో పైపులైన్ల లీకులు ఏర్పడుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదు కదా?

కమిషనర్: పైపులైన్ల లీకులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది స్పందించపోతే వెంటనే ప్రజలు మా దృష్టికి తీసుకొస్తే తక్షణ చర్యలు తీసుకుంటాం.

కమిషనర్ బాపిరాజు

? ఫిల్టర్‌బెడ్‌లలో సిల్టు తొలగించకపోవడంతో తాగునీరు రంగు మారి సరఫరా అవుతోంది.. పూడిక తొలగింపు చర్యలు ఎంత వరకు వచ్చాయి?

✔ నాలుగు ఫిల్టర్ బెడ్‌లకు గాను ఎప్పటినుంచో సమస్యగా ఉన్న రెండింటిలో పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నాం. తాజా మరొకటి విని యోగంలోకి తీసు కొచ్చాం. మిగిలిన ఫిల్టర్ బెడ్‌నూ త్వరలో వినియోగం లోకి తెస్తాం.

ముఖాముఖి

? వేసవి కార్యాచరణలో భాగంగా ముందస్తు చర్య లేంటి?

✔ ప్రస్తుతం తరకటూరు సామాహిక రక్షితనీటి పథక చెరువు, నగరంలోని చెరువుల్లో సరిపడా నీటి నిల్వలు ఉన్నాయి. ఇంకా అవసరమైన నీరు నింపేందుకు రూ. 20 లక్షలతో 75 హెచ్‌పీ మోటార్లు రెండింటిని సిద్ధం చేశాం.

? శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలేంటి?

✔ ఇప్పటికే గిలకలదిండి, మాచవరంలో ఉన్న రిజర్వాయర్లను వినియోగంలోకి తెచ్చాం. 23 వడివిజన్ పరిసరాల్లో రిజర్వాయర్ నిర్మాణంతోపాటు అమృత్ 2.0 పథకంలో కొత్తగాపైపులైన్లు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాం. శివారు ప్రాంతాలకు 7 ప్రైవేటు, 8 నగరపాలక సంస్థ ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నాం.

? నీటి శుద్ధి పరీక్షలపై పర్యవేక్షణ లేదన్న ఆరోపణలున్నాయి?

✔ నీటి శుద్ధి పరీక్షలకు ఇటీవల కొత్తగా ల్యాబ్ ఏర్పాటు చేశాం. సిబ్బందితో డివిజన్ల వారీగా రోజూ పరీక్షలు చేయిస్తున్నాం. నీరొచ్చిన ప్రాంతంలో ఒకసారి, కుళాయి వద్ద మరోసారి పరీక్షలు చేస్తున్నాం.

? ప్రభుత్వ వైద్యశాలలకు పైపులైన్ పనులు సగంలో ఆగిపోయాయి. ఎప్పటికి పూర్తిచేస్తారు?

✔ పనులు ఆగిన మాట వాస్తవమే. మధ్యలో రైల్వేట్రాక్ ఉండటంతో ఆశాఖ అధికారుల అనుమతి కోసం చూస్తున్నాం. అయినా కళాశాలకు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నాం. నిధులు ఉన్నాయి. రైల్వే అధికారులతో సంప్రదింపులు జరిపి త్వరలోనే పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

సీఎం సహాయనిధి పేదల పాలిట వరం

గూడూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరమని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని గూడూరు, పోసినవారిపాలెం, గంట్లమ్మపాలెం, కప్పలదొడ్డి, కంకటావ, లెల్లగరువు గ్రామాల్లోని లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా అనేక వ్యాధులకు ఉచితంగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవలో లేని వ్యాధులకు కూడా సీఎం సహాయనిధి ద్వారా సాయం అందించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. దీనికోసం పెడన కార్యాలయంలో ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. డీసీ ఛైర్మన్ పోతన లక్ష్మీనరసింహస్వామి, తెదేపా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపి నాగబాబు, తోట వేణు, మహ్మద్ రఫీ, మద్దాల మోహన్‌రావు, తలుపుల కృష్ణ, సమ్మెట రామప్రసాదు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు శిక్షణ

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో గ్యారంటీ ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ (జీఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని 75 రోజుల ప్రణాళికలో అమలు చేసినప్పటికీ.. ఇంకా చదువులో వెనుకబడిన విద్యార్థులకు వాలంటీర్లతో శిక్షణకు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఎస్ఏఎంవో ఆర్ శ్యాంసుందరరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు వాలంటీర్లతో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 2413 మంది విద్యార్థులు సీ, డీ గ్రేడ్లలో ఉన్నారని.. వారికి 1800 మంది వాలంటీర్లు రోజు ఒక గంట చదువు చెప్పడానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ వద్దు.. పర్యావరణమే ముద్దు!

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే : 'ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అంటూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నినదించారు. నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథక విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ నరసింహారావు ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ఎదురయ్యే ఇబ్బందులు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పఠాన్ హజ్, అసిస్టెంట్ జైనబ్, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా కేంద్రాల మూసివేతకు ఆదేశాలు

కృత్తివెన్ను మండలంలోని బాణసంచా కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్సై

పెడన, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన విస్ఫోటనం నేపథ్యంలో పెడన రూరల్, సర్కిల్ పోలీసులు అప్రమత్తమయ్యారు. సర్కిల్ పరిధిలో నాలుగు పోలీసు స్టేషన్లు ఉండగా.. కృత్తివెన్ను పరిధిలోని చినగొల్లపాలెం, పడతడిక, పోడు గ్రామాల్లో తయారీ కేంద్రాలున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాలను ఎస్సై పైడిబాబు తనిఖీ చేసి రక్షణ చర్యలను పరిశీలించారు. మూడింటిలో తయారీని ఈ వేసవి వరకు నిలిపివేయాలని నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ ఇతర శాఖల అధికారులు తిరిగి పరిశీలించి పూర్తిస్థాయిలో పరిస్థితిని సమీక్షిస్తామని ఎస్సై చెప్పారు.

శిల్పాల ఏర్పాటుకు శంకుస్థాపన

అవనిగడ్డ, న్యూస్‌టుడే: గ్రామ దేవత లంకమ్మ అమ్మవారి దేవాలయం గోపురంపై శిల్పాల ఏర్పాటుకు ఆదివారం జనసేన నేత మండలి వెంకట్రామ్ శంకుస్థాపన చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అన్నవరపు వెంకటస్వామి పూజలు చేశారు. శిల్పాల ఖర్చు రూ. 1,40,000ను పోతురాజు కృష్ణమూర్తి కుమారుడు శ్రీనివాసరావు ఇస్తారన్నారు. ఆదివారం భక్తులు అమ్మవారికి ఘటం బిందెలు సమర్పించారు.

రాష్ట్ర కార్యదర్శిగా గౌరీ ప్రసాద్

పెడన, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కార్యదర్శిగా పెడనకు చెందిన విశ్వభారతి హైస్కూలు అధినేత అనుమకొండ గౌరీ ప్రసాద్ ఎంపికయ్యారు. విశాఖలో ఆదివారం జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికలో గౌరీ ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేస్తూ రాష్ట్ర అధ్యక్షుడు వీఎస్ రాజు ఉత్తర్వులు జారీచేశారు. గౌరీ ప్రసాద్ కృష్ణా జిల్లా కమిటీలో పలు పదవులను సమర్థంగా నిర్వహించారు.. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా రుద్రాభిషేకం

హోమం చేస్తున్న పండితులు, భక్తులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: లోక కల్యాణార్థం మచిలీపట్నం శైవ మహాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని వివేకానంద మందిరంలో వేద పండితుల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, రుద్రహోమం జరిపించారు. భక్తులు పాల్గొనగా నిర్వాహకులు సింగరాజు గోవర్ధన్, శాస్త్రి, రవికుమార్, నగేష్, నాగేశ్వరరావు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఎస్ఈగా రవీంద్రబాబు బాధ్యతల స్వీకరణ

రవీంద్రబాబుకు మొక్క అందజేస్తున్న ఈఈ గోవిందరావు తదితరులు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ ఎస్ఈగా రవీంద్ర బాబు ఆదివారం మచిలీపట్నంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చిరంజీవి పదవీ విరమణ చేయడంతో విజయవాడలో ఈఈగా విధులు నిర్వహిస్తున్న రవీంద్రబాబును పదోన్నతిపై జిల్లా విద్యుత్తు శాఖాధికారిగా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన ఆయన్ని మచిలీపట్నం ఆ శాఖ ఈఈ గోవిందరావు, జిల్లాలోని వివిధ డివిజన్ల ఈఈలు, ఏడీఈలు, ఏఈలు, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, మొక్కలు అందించి అభినందనలు తెలియజేశారు.

ఆర్టీసీ బస్టేషన్‌కు నూతన కళ

పెడన, న్యూస్‌టుడే: పెడనలోని ఆర్టీసీ బస్టేషన్ రూపురేఖలు మారిపోయాయి. దుస్థితిలో ఉన్న ఈ బస్‌స్టేషన్‌కు ఆర్టీసీ రూ. 10 లక్షల వరకు నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టింది. దీంతో ఈ ప్రాంగణం కొత్త రూపు సంతరించుకుంది. ప్రాంగణానికి సిమెంటు ఫ్లోరింగ్ చేయించారు. ఫలితంగా ప్రయాణికులకు కంకర రాళ్లపై నిరీక్షించే సమస్య తీరింది. దాదాపు 20 ఏళ్ల అనంతరం ప్రధాన భవనానికి రంగులు వేయించారు. దీంతో భవనం కళకళలాడుతోంది. గతంలో దూరంగా ఒక ప్రైవేటు భవనంలో ఉన్న కార్గో సర్వీసును బస్టేషన్‌లోకి తీసుకొచ్చారు. ఫలితంగా బుకింగ్, డెలివరీలు పెరిగి ఆదాయం వృద్ధి చెందింది.

క్రీడాకారుల అ'పూర్వ' కలయిక

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని నోబుల్ కళాశాల పూర్వ క్రీడాకారుల అపూర్వ కలయిక కార్యక్రమాన్ని ఆదివారం కళాశాలలో నిర్వహించారు. 1966 నుంచి కళాశాలలో చదివి క్రీడాకారులుగా వివిధ స్థాయిల్లో ఉన్నవారందరూ తరలి వచ్చారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని మధుర స్మృతులు నెమరవేసుకున్నారు. ఎవరెవరు ఎప్పుడు చదివారు... ప్రస్తుతం ఏమి చేస్తున్నారో వేదికపైకి వచ్చి వివరించారు. బిషప్ డా.జి దైవాశీర్వాదం, కళాశాల ప్రిన్సిపల్ డా.ఎంజె సుభకర్‌లు కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. నాగార్జున విశ్వవిద్యాలయ ఫ్యాకల్టీ సభ్యులు డా.బి.ఇన్నయ్యచౌదరి, శాప్ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డి.రవి, నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ పూర్వ డైరెక్టర్ డా.వై.కిషోర్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పూర్వసభ్యులు ఎస్ఆర్‌వై ప్రసాద్, నోబుల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డా.ఎన్ శామ్యూల్ తదితరులు తమ ఎదుగుదలలో కళాశాల పాత్రను వివరించారు. కళాశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

దారిలో గుంత.. పూడిస్తే తీరు చింత

నగరంలోని ఏఎంసీ కార్యాలయ ప్రాంగణంలో రహదారి మధ్యలో కల్వర్టు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అక్కడ ఉన్న ఎంఎల్ఎస్ కేంద్రానికి భారీ వాహనాలు వచ్చి పోతుంటాయి. కల్వర్టుపై గుంతలు పూడ్చడంలో అధికారులు అలసత్వం వీడి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

మురుగు పోక అవస్థలు

నగరంలోని మాచవరం ఏఎంసీ కార్యాలయ సమీపంలో రహదారి పక్కన ఉన్న డ్రెయిన్ అధ్వానంగా తయారైంది. పొదలు పెరిగి కాలువ నిండా వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మురుగు పోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

- మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

రక్షణ గోడలే ప్రమాద హేతువులు

నగరంలోని బైపాస్ రోడ్డు నుంచి పంచాయతీరాజ్ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు పగిలిపోయాయి. పగిలిన వాటినే రోడ్డు పక్కన అడ్డుగా ఉంచడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలనికోరుతున్నారు.

- మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

ఎంగిలి ఆకులతో అపరిశుభ్రత

కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలోని బ్రహ్మపురం వీధి ఎంగిలి ఆకులతో నిండి అపరిశుభ్రతకు నిలయంగా మారింది. పారిశుద్ధ్య సిబ్బంది కూడా వాటిని తొలగించకపోవడంతో వీధంతా దుర్గంధం వ్యాపించింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, భాస్కరపురం(మచిలీపట్నం)

చుక్క నీరు లేని చిట్టిపాలెం కాలువ

ఈ నెలాఖరు వరకు కాలువలకు నీరు అందిస్తామని చెప్పిన జలవనరుల శాఖ అధికారులు చిట్టిపాలెం కాలువకు నెలరోజుల ముందే సరఫరా ఆపేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో గ్రామ చెరువును నీటితో నింపలేకపోయామని, నీటి ఎద్దడి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. చెరువులు నింపేవరకు నీరివ్వాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, చిట్టిపాలెం (మచిలీపట్నంరూరల్)

మడకలో పందెం కోళ్ల చోరీ

పెడన, న్యూస్‌టుడే: ఒంగోలు.. కత్తిపూడి 216 జాతీయ రహదారిపై మడకలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పక్క పక్క ఇళ్లలోని మూగజీవాలను అపహరించారు. మురాల బాబ్జీకి చెందిన మూడు ఖరీదైన పందెం కోళ్లు, జోగి వెంకన్నకు చెందిన గొర్రెపోతును అపహరించినట్లు బాధితులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి కారులో వచ్చి ఈ చోరీకి పాల్పడినట్లు బాధితులు పేర్కొన్నారు. గతంలోనూ పెడన ప్రాంతంలో ఈ తరహా చోరీలు జరిగాయి.

నడుపూరులో రోడ్డు ప్రమాదం: పెడన-గుడివాడ ప్రధాన రహదారిపై నడుపూరు అగ్రహారం వద్ద ఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను విజయవాడకు తరలించారు.

సమావేశానికి అధికారులంతా హాజరు కావాలి

కృత్తివెన్ను, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులంతా హాజరు కావాలని పేర్కొన్నారు.

115 ప్రాజెక్టుల ఎంపిక

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే : ఇన్‌స్పైర్ మనక్ 2025-26 సంవత్సరానికి జిల్లా నుంచి 115 ప్రాజెక్టులు ఎంపికైనట్లు డీఈవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించి ఒక్కో ప్రాజెక్టుకు రూ.10 వేల చొప్పున విద్యార్థుల ఖాతాల్లో జమ చేశామన్నారు.

రోడ్డు నిర్మించారు.. కష్టాలు తీర్చారు!



బందరు మండలం పోతేపల్లి జ్యువెలరీ పార్కులో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధాన రహదారులు సైతం గుంతలమయంగా మారడం, వాటిలో మురుగు చేరడంతో స్థానికులతోపాటు పరిశ్రమల నిర్వాహకులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైకాపా హయాంలోనే ఈరోడ్ల సమస్యను వివరించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇటీవల ఈనాడులో ఈ రహదారులపై చిత్రకథనం ప్రచురించగా అధికారులు స్పందించారు. రూ.27.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. మిగిలిన రోడ్లను కూడా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

వేదవ్యాస్‌ను కలిసిన మండల కమిటీ నాయకులు

నాయకులను సత్కరిస్తున్న వేదవ్యాస్

గూడూరు, న్యూస్‌టుడే: తెదేపా మండల నూతన కమిటీ నాయకులు ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపినాగబాబు, తోట వేణు, మాజీ ఎంపీపీ కాసగాని శ్రీనివాసరావు, కాట్రగడ్డ రత్నబాబు, బేతాళస్వామి, బొర్రా నాగరాజు, గొరిపర్తి చంద్రశేఖర్, తదితరులు ఆయన్ను కలువగా ఆయన వారిని సత్కరించి అభినందించారు. మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ఫ్యూజ్ బాక్సు ఏర్పాటు

మచిచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని ఆర్టీసీ కాలనీ పరిధిలోని విద్యుత్తు ఫ్యూజు బాక్స్ ప్రమాదకరంగా మారిందని ఆ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పటినుంచో అధికారులకు విన్నవిస్తున్నా స్పందించడం లేదని స్థానికులు వాపోయారు. ఈ సమస్యపై ఇటీవలే ఈనాడులో 'రక్షణ శూన్యం.. చూస్తే కలవరం' అన్న శీర్షికన కథనం ప్రచురించగా స్పందించిన అధికారులు కొత్త ఫ్యూజ్ బాక్సు ఏర్పాటు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దేవాదాయశాఖ అధికారి

పిట్టల్లంక(కోడూరు), న్యూస్‌టుడే: పిట్టల్లంక గ్రామంలో కొలువై ఉన్న ఉభయ నాగేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. యువ నాయకుడు మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి ధర్మకర్తలు కృషి చేయాలన్నారు. అధ్యక్షులుగా బండే కొండలరావు, సభ్యులుగా చింతా వరలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, బావిశెట్టి శివనాగమల్లేశ్వరరావు, కొప్పుల నరసింహారావు, తెనాలి లక్ష్మీరత్నకుమారి, అట్లూరి తులసి కృష్ణ, సన్నిధి రాజు, స్వర్ణకుమారిలతో దేవాదాయ శాఖ ఇనస్పెక్టర్ కె.శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. నీటి సంఘం ఉపాధ్యక్షులు గాదె భాస్కరరావు, సర్పంచి కనగాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పామర్రు, న్యూస్‌టుడే : ఆర్యవైశ్య సంఘాలు సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉన్నాయని రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్న రామసత్యనారాయణ చెప్పారు. ఆదివారం చల్లపల్లిలో జరిగిన మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణకు వెళ్తున్న ఆయనకు పామర్రులో స్థానిక నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం కన్యకాపరమేశ్వరి ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. వీరాంజనేయులు, రంగనాథ్, రఘురామబాబు, నాంచారయ్య తదితరులు ఆయన్ను సత్కరించారు.

యువత క్రీడల్లో రాణించాలి

పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, తిలకిస్తున్న అసోసియేషన్ నాయకులు

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే : యువత క్రీడల్లో రాణించాలని హాకీ అసోసియేషన్ రాష్ట్ర డైరెక్టర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. నగరంలోని పోలీస్ కల్యాణ మండపంలో ఆదివారం ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఆయనతో పాటు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సన్నిధి నాగసాయి శ్రీనివాస్, కార్యదర్శి హరికృష్ణ, నాయకులు నాగభూషణం తదితరులు పోటీలను సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పోటీల్లో ప్రతిభ చాటుకున్న వారికి బహుమతులు అందజేశారు. నిర్వాహకులు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామి వార్షికోత్సవాలు ప్రారంభం

పెడన, న్యూస్‌టుడే: పెడన మండలం ఉరివిలో వెలసిన శ్రీపార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఈ నెల 4 వరకు రోజూ అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు ఈవో గోవాడ వెంకటకృష్ణారావు తెలిపారు. తొలి రోజు ఆదివారం వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు.

జనసేన సభ్యత్వ నమోదుపై ఎమ్మెల్యే సమీక్ష

కోడూరు, న్యూస్‌టుడే: కోడూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ 'ఉద్యమి' సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ప్రజల్లో పార్టీ పట్ల ఉన్న అభిప్రాయాలను గురించి చర్చించారు. నేతలు మర్రే గంగయ్య, కోట రాంబాబు, కొండవీటి సునీత, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు..

చల్లపల్లి, న్యూస్‌టుడే: జనసేన పార్టీ పట్ల అన్ని సామాజికవర్గాల ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని యువనేత మండలి వెంకట్రామ్ అన్నారు. చల్లపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఉరిమి మణికాంత్, ఏటీఎం సెంటర్‌లో అనుమకొండ పూర్ణచంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యమి సభ్యత్వ నమోదు శిబిరాలను ఆయన ప్రారంభించారు. వక్కలగడ్డ నుంచి మట్టా చిన్నా ఆధ్వర్యంలో 20మంది ఎస్సీ మహిళలు, నేతలు పార్టీలో చేరారు.

నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కృష్ణారావు విగ్రహం వద్ద నేతలు

కృష్ణారావు లేని దివిసీమను ఊహించడమే కష్టం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: దివంగత మండలి వెంకటకృష్ణారావు లేని దివిసీమను ఊహించడమే కష్టమని దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ మండవ బాలవర్ధిరావు చెప్పారు. అవనిగడ్డలోని కృష్ణారావు విగ్రహానికి నాగాయలంక కూటమి నాయకులతో కలసి ఆయన నివాళులర్పించారు. తలశిల వెంకట శ్రీనివాస్, కనగాల శ్రీనివాసరావు, మద్ది సాంబశివరావు, పి.కుటుంబరావు, టి.తేజ, కర్రి కృష్ణమూర్తి, సజ్జా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కమనీయం... శాంతి కల్యాణం

కల్యాణమూర్తి సూర్యదేవుడు

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: వేకనూరులోని సూర్యదేవాలయంలో ఆదివారం సూర్యదేవుడి శాంతి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. పురవీధుల్లో గ్రామోత్సవాన్ని జరిపారు. భక్తులకు ఆలయ వ్యవస్థాపకులు తుంగల వీరవసంతరావు- ఇందిర దంపతులు అన్న సంతర్పణ చేశారు.

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

బాగుచేస్తే మీరు.. సేవలందుతాయి సారూ..!

కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) పాత భవనం, ప్రాంగణంలో పుట్టలు, ముళ్లపొదలతో చిట్టడివిలా తయారైంది. పాములు, తేళ్లు, విష పురుగులకు ఆవాసంగా మారింది. అవన్నీ ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా గాలికి వదిలేయడంతో కాలు పెట్టడానికి వీల్లేని విధంగా వ్యర్థాలతో నిండిపోయింది. విశాలమైన ప్రాంగణంలో ప్రధాన భవనంతోపాటు ఉప కట్టడాలు నాలుగున్నాయి. వీటిలో విశ్రాంతి మందిరంపై చెట్టుకూలి ధ్వంసమైంది. రాత్రి సమయాల్లో ఆకతాయిలు, మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. శిథిలమైనవాటిని తొలగించి పటిష్ఠంగా ఉన్న కట్టడాలను సద్వినియోగం చేసుకునే విధంగా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కంకిపాడు

పెరిగిన ముళ్లపొదలు, పుట్టలు

చెట్టుకూలడంతో ధ్వంసమైన విశ్రాంత మందిరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

మురుగు వెతలు తొలిగాయి

తాడిగడప కార్మికనగర్‌కట్టపై కొన్ని రోజులుగా మురుగుకాల్వలో పూడిక తీత పనులు జరగక ఇబ్బందిగా ఉందని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి సిబ్బందిని పంపి పూడిక తీత పనులు చేయించారు. తాడిగడప రామానగర్ కట్టపై గత కొన్ని రోజులుగా వీధిదీపాలు వెలగడంలేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా విషయాన్ని కమిషనర్‌కు తెలపగా స్పందించారు. సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, తాడిగడప

రోగులకు వైద్యసేవలు

పెనమలూరు, న్యూస్‌టుడే: అనుమోలు ఆదరణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పోరంకిలోని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కార్యాలయంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు మధుమేహం, రక్తపోటు, కీళ్లనొప్పులు, జ్వరాలు, ఇతర సాధారణ వ్యాధులతో పాటు నేత్ర వైద్య పరీక్షలు వైద్యులు నిర్వహించారు. ట్రస్టు అధ్యక్షుడు ప్రభాకరరావు ఉచితంగా మందులు అందజేశారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న సముచితం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వడం సముచితమని విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కోరుతూ సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన బీఎల్ నరసింహులు చేపట్టిన పాదయాత్ర ఆదివారం హనుమాన్‌జంక్షన్ చేరుకుంది. ఈ సందర్భంగా అతడిని సత్కరించారు. నాయకులు యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, నందిగం స్వామి, పాలడుగు శ్రీధర్, దావులూరి భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

నాడు విసుగ్గా.. నేడు దొరక్క

కనుమరుగవుతున్న రూ. పది నాణేలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే:

★ నాలుగు రోజుల కిందట రమేష్ అనే వ్యక్తి హనుమాన్‌జంక్షన్‌లో ఆర్టీసీ బస్సులో ఎక్కి విజయవాడ వెళ్లేందుకు టికెట్ కోసం రూ.100 నోటు ఇచ్చాడు. టికెట్ వెల పోనూ కండక్టర్ అతనికి రూ.10 చిల్లర ఇవ్వడానికి సంచి మొత్తం వెతికి.. చివరకు ఆ మొత్తాన్ని రమేష్‌కు ఫోన్‌పే ద్వారా చెల్లించారు. అతనే కాదు ఆ బస్సులో పలువురు ఈ విధంగానే తమకు రావాల్సిన చిల్లర తీసుకోవాల్సి వచ్చింది.

★ గన్నవరంలో ఉండే నాగేశ్వరరావు ఉదయం ఉద్యోగానికి వెళ్లే ముందు సమీపంలో ఉన్న ఆర్వో మంచినీటి పథకం నుంచి డబ్బాలో 20 లీటర్ల నీటిని ఇంటికి తీసుకురావడం అలవాటు. ఇందుకోసం అతను నగదు రూపేణా, లేకుంటే యూపీఐ ద్వారా ప్రతిరోజూ చెల్లింపులు జరిపేవారు. కానీ కొద్ది రోజుల కింద ఆర్వో ప్లాంటు నిర్వాహకుడు తన సౌలభ్యం కోసం రూ.10 నాణెం వేస్తే 20 లీటర్ల నీరు వచ్చేలా ఆటోమేటిక్ వెండింగ్ పరికరాన్ని అమర్చారు. దీంతో రూ.10 నాణేల కోసం నాగేశ్వరరావు నానా తిప్పలు పడాల్సి వస్తోంది.

గతంలో ఓ పెట్రోల్ బంకులో రూ.10 నాణేలు తీసుకోమని పెట్టిన బోర్డు

44 సంవత్సరాలుగా ✆ 81252 65651 ✆ 0866 2471617, 2477470
ఆటలు • పాటలు • రోబోటిక్స్ • క్రియేటివ్ లెర్నింగ్ • డ్రోన్ తయారీ • 3డి ప్రింటింగ్ • LKG to 10th
డాన్ బాస్కో స్కూల్
Affiliated to CBSE
గురునానక్ రోడ్, ఆటోనగర్ కాలని ఎదురుగా, విజయవాడ-7.

కనబడితే ఒట్టు..: పదేళ్ల కిందట మార్కెట్లో చెలామణిలోకి తేవడానికి ఆర్బీఐ రూ.10 నాణేలను విస్తృతంగా అందుబాటులోకి తెచ్చింది. కానీ వీటిపై నెలకొన్న అపోహలు, పుకార్లపై రిజర్వ్‌బ్యాంకు పదేపదే స్పష్టత ఇచ్చినా కూడా చిరు వ్యాపారులు మొదలుకుని ఎవరూ వాటిని చెలామణీ చేసేందుకు సుముఖత చూపలేదు. మరోవైపు బ్యాంకర్లు కూడా వీటిని ఖాతాల్లో జమ చేసుకోవడానికి తిప్పలు పెట్టారు. కొన్నిచోట్ల నాణేలు తీసుకోమంటూ ఏకంగా సూచికలు పెట్టేశారు. కానీ ఇప్పుడు కావాలన్నా ఎక్కడా రూ.10 నాణేలు లభించడం లేదు.

బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు: గత కొన్ని నెలల నుంచి రూ.10 నాణేలు నామమాత్రంగానే బ్యాంకుల ద్వారా పంపిణీ అవుతున్నాయి. ఆర్బీఐ రూ.10, రూ.20, రూ.50 నోట్ల ముద్రణను పరిమితం చేసేసింది. ముఖ్యంగా రూ.10 నోట్లు కొత్తవి దాదాపు విడుదల కావడంలేదు. దీంతో ఏడాది నుంచి నాణేల వినియోగం బాగా పెరిగింది. కానీ ఇప్పుడు అవి కూడా దొరక్కపోవడంతో చిన్నపాటి అవసరాలకు యూపీఐ చెల్లింపులు అనివార్యంగా మారిపోయాయి.

ఇరాన్‌పై దాడులు సరికాదు

వామపక్ష నాయకుల ఆందోళన

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇరాన్‌పై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం గన్నవరంలో నిరసన తెలిపారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడానికి అవకాశం ఉన్నప్పటికీ దాడులు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, బెజవాడ తాతబ్బాయి, సూరగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మృతిపై ఆందోళన

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కొత్తమల్లవల్లికి చెందిన మందడ ఏడుకొండలుకు చెందిన గొర్రెలు మృతిచెందడం కలకలం రేగింది. గొర్రెలు పెంచుకుంటూ జీవనం సాగించే ఏడుకొండలు శనివారం మేత నిమిత్తం రేమల్లె శివారులోని బహిరంగ ప్రదేశంలో జీవాల్ని తోలుకెళ్లాడు. ఓ పరిశ్రమకు చెందిన వ్యర్థాలను తిని అప్పటి నుంచి కొన్ని ఒక్కొక్కటిగా అనారోగ్యానికి గురయ్యాయన్నారు. వాటిలో ఆదివారం ఉదయానికి 10 గొర్రెలు మృతిచెందాయని మరో ఆయిదు గొర్రెల పరిస్థితి విషమంగా ఉందని వాపోయారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

కానూరు, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ 2026 మచిలీపట్నంలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించారని కానూరుకు చెందిన జోష్ అకాడమీ మాస్టర్ పి. సత్య తెలిపారు. ప్రతిభ చాటిన బి. కనీష, బి. ధన్వి, కె. నిత్యశ్రీ, సైన, ఎండీ ఆసియాషిరీన్, ఎస్. జోష్‌లను ఆదివారం జరిగిన కార్యక్రమంలో పలువురు అభినందించారు.

ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పోరంకి, న్యూస్‌టుడే: తాడిగడప పురపాలికలోని అన్ని సర్కిళ్లలోనూ ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. ఆదివారం పోరంకి నిడమానూరు రోడ్డులోని బాలాజీ హైట్స్ అపార్ట్‌మెంట్ వరకు రూ.78.55 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు రూ.100 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పేదలందరికీ తప్పనిసరిగా సాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

సుదీర్ఘ సేవలు అభినందనీయం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పోలీసుశాఖలో 40 ఏళ్ల పాటు సుదీర్ఘంగా సేవలందించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. స్పెషల్‌బ్రాంచి ఎస్సైగా పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేసిన గాదె మురళీకృష్ణ, వనజ దంపతులను ఆదివారం హనుమాన్‌జంక్షన్‌లో పోలీసుశాఖ అధికారులు, సిబ్బంది, నాయకులు సత్కరించారు. ఇంటెలిజెన్స్ డీఎస్పీ బి. శ్రీనివాసులు, విశ్రాంత అదనపు ఎస్పీ విజయరావు, జనసేన నాయకుడు చలమలశెట్టి రమేష్, ఆర్టీసీ డైరెక్టర్ గరికపాటి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.


మురళీకృష్ణ దంపతులను సత్కరిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు, నాయకులు

100 శాతం వసూళ్లకు కృషి

బాపులపాడులో పన్నులు వసూళ్లు చేస్తున్న సిబ్బంది, ఎంపీడీవో జోగేశ్వరరావు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ఇంటిపన్నుల వసూళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం, పంచాయతీరాజ్ కమిషనర్ స్థాయిలో నిరంతరం పన్నుల వసూళ్ల పురోగతిని సమీక్షిస్తున్న నేపథ్యంలో గ్రామ, మండల స్థాయి యంత్రాంగం శ్రమిస్తోంది. ఈ నెల 15 నాటికి అన్ని పంచాయతీల్లోనూ 100 శాతం బకాయిలు వసూళ్ల లక్ష్యం చేరుకోవాలనే ఆదేశాలతో ఆదివారం కూడా ఇంటింటికి తిరుగుతూ మండల వ్యాప్తంగా పన్నులు వసూలు చేశారు. ఎంపీడీవో జోగేశ్వరరావు పర్యవేక్షించారు.

ప్రతిభగలవారిని గుర్తించాలి

ఉయ్యూరు: అన్ని రంగాల్లో ప్రతిభచూపే మట్టిలో మాణిక్యాలు ఎన్నో గ్రామీణ ప్రాంతాల్లోను ఉంటాయనేది గుర్తించాలని శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీ ఛైర్మన్ శరత్‌చంద్ర అన్నారు. ఉయ్యూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సైతం ఓ లక్ష్యంతో అడుగులేస్తే కచ్చితంగా ఉన్నత శిఖరాలు అందుకుంటారన్నారు. ఈ ఏడాది 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన ఇద్దరు ఉత్తమ విద్యార్థులకు తమ అకాడమీ ఉచితంగా విద్యనందిస్తామన్నారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు టి.వి.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఉయ్యూరు డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిణి పద్మారాణి, ఎంఈవో దుర్గాసాగర్, ఏఎంసీ ఛైర్మన్ కొండా ప్రవీణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శరత్‌చంద్ర

మురుగు.. శుభ్రత కనుమరుగు

మండల కేంద్రమైన కంకిపాడులో మురుగు బెడద అధికంగా ఉంది. దోమలు, ఈగలు, క్రిమి కీటకాలు, దుర్వాసనతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా స్థానిక బస్టాండ్ నుంచి వడ్డెర కాలనీ వరకు రహదారికి ఇరువైపులా డ్రెయినులు వ్యర్థాలతో నిండాయి. పూడికతీత పనులు చేపట్టడానికి రూ.లక్షల్లో ఖర్చవుతోందని గ్రామ పంచాయతీ పాలకవర్గం చెబుతోంది. వేసవిలోనైనా పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కంకిపాడు

కంకిపాడు లాకుల రోడ్డులో పడమర వైపు ఇలా

సరిచేయాలి.. సమస్య తీరాలి

కాటూరు-ఉయ్యూరు ప్రధాన రహదారి నుంచి బీసీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి కొంత మేర దెబ్బతింది. సగానికి చీలిక ఏర్పడడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు, సైక్లిస్టులు అదుపుతప్పి పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అభివృద్ధి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కాటూరు(ఉయ్యూరు(గ్రామీణం)

గుంత.. చూడకపోతే చింత

కడవకొల్లు- పొట్టిపాడు వెళ్లే రహదారి దెబ్బతింది. పలు చోట్ల గోతులు నెలకొన్నాయి. రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు. అభివృద్ధి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కడవకొల్లు (ఉయ్యూరు(గ్రామీణం)

రహదారి పై నెలకొన్న గోతులు

ముక్కు మూసుకోవాల్సిందేనా

కానూరు పంట కాలువ రోడ్డులో పోలీసుస్టేషన్ నుంచి జంక్షన్ వరకు రోడ్డు పక్కనే మురుగు కాల్వల నుంచి తీసిన మురుగు వ్యర్థాలను కుప్పలుగా పోశారు. దాదాపుగా పది వరకు కుప్పలు ఈ రోడ్డులో దుర్వాసన వెదజల్లుతున్నాయి. కొన్ని కుప్పలు ఎండిపోయినా తొలగించిచడంలేదని స్థానికులు వాపోతున్నారు. రెండు వారాలుగా ఈ వ్యర్థాల దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని ఫిర్యాదులు చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కానూరు

కానూరు పంటకాలువ రోడ్డులో

దాతల సాయం.. సమకూరిన భవనం

ఎట్టకేలకు ఈడుపుగల్లు ఆరోగ్య ఉప కేంద్ర భవనం అందుబాటులోకి వచ్చింది. అప్పటి రాజ్యసభ సభ్యుడు శీలం జేసుదాసు రూ.5లక్షల ఎంపీ నిధులు కేటాయించగా నిర్మాణానికి 2016లో శంకుస్థాపన చేశారు. నిధులు చాలకపోవడం, సాంకేతిక అడ్డంకులతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. గ్రామానికి చెందిన పర్వతనేని నాగేశ్వరరావు రూ.10 లక్షలు, నీరుకొండ పూర్ణచంద్రరావు, పర్వతనేని వెంకటశ్రీనివాస్‌లు రూ.2లక్షల చొప్పున విరాళం ఇచ్చారు. మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సర్పంచి పి. ఇందిర, పాలకవర్గం చొరవతో పంచాయతీ, మండల పరిషత్ అదనపు నిధులు మంజూరయ్యాయి. ఈ మొత్తంతో రెండు అంతస్తుల భవనాన్ని అన్ని సదుపాయాలతో నిర్మించారు. భవనం అందుబాటు, సిబ్బంది నియామకంతో దాదాపు పదివేల మంది గ్రామస్థులకు మెరుగైన వైద్య సేవలు అందడం దాతల ఔదార్యమే - న్యూస్‌టుడే, ఈడుపుగల్లు (కంకిపాడు)

లక్ష్మీ తిరుపతమ్మ.. శరణు

తెన్నేరు (కంకిపాడు), న్యూస్‌టుడే: తెన్నేరు పంటపొలాల్లో కొలువైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్లకు ఆదివారం జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఎడ్ల బండ్లపై ప్రభలను ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి దర్శనానికి బారులుదీరారు. మహిళలు పాల పొంగళ్లు తయారు చేసి నైవేద్యం సమర్పించారు. పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ పశువులు, గొర్రెలు, మేకలను దేవాలయం ప్రదక్షిణ చేయించారు. సామూహిక కుంకుమపూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బ్రహ్మాజీరావు, అనిల్‌కుమార్, మనోజ్‌కుమార్, రామకృష్ణ, కృష్ణకిషోర్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

పొంగళ్లు వండుతున్న మహిళలు

ఎడ్ల బండ్లపై ప్రభలతో వస్తున్న భక్తులు

వైభవం.. శ్రీనివాసుని కల్యాణం

ఉయ్యూరు, న్యూస్‌టుడే: డోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూమాత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఉయ్యూరులో శ్రీ భూసమేత శ్రీనివాస భక్తానుగ్రహ విశేష కల్యాణ మహోత్సవం వైభవంగా ఆలయ వ్యవస్థాపకులు, ధర్మకర్తలు వి.వి.కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యం వహించారు. తొలుత కల్యాణ మూర్తులను మంగళవాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సుధారెడ్డి, ప్రసన్న, కె.బాపిరెడ్డి, విజయభాస్కరమ్మలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వేలాది మందికి అన్నప్రసాదం అందించారు. ఉయ్యూరు సీఐ టి.వి.నాగేశ్వరరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రతువు జరిపిస్తున్న పండితులు

అమ్మకు భక్తుల నీరాజనం

ఘనంగా గ్రామోత్సవం జరిపిస్తూ..

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వీరవల్లిలో శ్రీతిరుపతమ్మ, గోపయ్యల ఊరేగింపు కార్యక్రమం వైభవంగా సాగుతోంది. గత నెల 27 నుంచి ప్రారంభమైన తిరునాళ్లలో భాగంగా భారీ గ్రామప్రభల మధ్య గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. ఆదివారం కూడా సుంకర వంశీకుల ప్రభల మధ్య కోలాహలం కార్యక్రమం జరిగింది. ఆలయ నిర్వాహకులు కృష్ణప్రసాద్, రవి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ.. శిఖర ప్రతిష్ఠ నేడు

ముదునూరు(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ముదునూరులోని బూసిమ్మతల్లి ఆలయం వద్ద ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ సోమవారం నిర్వహించనున్నారు. ఆదివారం ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఏకశిల స్తంభాన్ని గ్రామానికి చెందిన స్థిరాస్తి వ్యాపారి పల్లపోతు భగవాన్‌దాస్ ఏర్పాటు చేయగా ఆలయ శిఖరాలను గుత్తేదారు బొరుకాటి ప్రసాదరాజు సమకూర్చారు.

పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

కంటి క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం

తాడిగడప, న్యూస్‌టుడే: ముందుగా గుర్తిస్తే కంటి క్యాన్సర్‌ను ఆధునిక చికిత్స ద్వారా నివారించవచ్చని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ కన్సల్టెంట్ ఆప్తమాలజిస్ట్ హెడ్ డాక్టర్ అనసూయ కపూర్ అన్నారు. ఆదివారం ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. కళ్లకూ క్యాన్సర్ వస్తుందని చాలా మందికి తెలియదన్నారు. కనుగుడ్డు లోపల, కనురెప్పలపై ఈ క్యాన్సర్ కణాలు వృద్ధి చెందుతాయన్నారు. ఇది అరుదుగా సంభవించినప్పటికీ సకాలంలో గుర్తించకపోతే ప్రాణాంతకంగా మారుతుందన్నారు. ఇది సాధారణంగా 3 ఏళ్ల కన్నా తక్కువ వయసు ఉన్న పిల్లల్లో కనిపిస్తుందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నందీశ్వరా.. నమోస్తుతే

యనమలకుదురు, న్యూస్‌టుడే: యనమలకుదురు శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం త్రయోదశి సందర్భంగా ప్రదోషకాలంలో శ్రీమహానందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో భవానీ మాట్లాడుతూ 2 వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు స్వామి వారి గిరిప్రదక్షిణ జరుగుతుందన్నారు. మంగళవారం చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం 8 గంటలకు దేవస్థానం మూసేస్తామన్నారు. అనంతరం 4వ తేదీ ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహారావు నేతృత్వంలో భక్తులకు ఉచిత ప్రసాదాలు అందజేశారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం

పెదపులిపాక (పెనమలూరు), న్యూస్‌టుడే: పెదపులిపాక జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి కోలాహలంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్పంచి గుంటూరు శ్రీనివాస్‌చౌదరి, డీవైఈవో పద్మారాణిలు బహుమతులు, ప్రసంశాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు వల్లూరి శ్రీమన్నారాయణ, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీవైఈవో పద్మారాణి

వృద్ధులకు అన్నదానం

కానూరు, న్యూస్‌టుడే: దుర్గగుడి పాలకవర్గసభ్యుడు వెలగపూడి శంకరబాబు పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మొక్కపాటి శ్రీనివాస్, అంగిరేకుల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

దయ చూపారా... మాయం చేస్తారు!

కొత్త మార్గాల్లో సెల్‌ఫోన్ల దొంగతనం

ప్రసాదంపాడు, రామవరప్పాడు, న్యూస్‌టుడే

☛ గత నెల 26న రామవరప్పాడుకు చెందిన రమేష్ ఆటో ఎక్కేందుకు రింగ్ సెంటర్‌కు వెళ్తున్నారు. ఆ సమయంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడినట్లు నటించారు. రమేష్ వెళ్లి ఆ యువకులను పైకి లేపారు. తిరిగి ద్విచక్ర వాహనంపై వెళ్తూ బాగా సహాయం చేశావంటూ వెకిలిగా నవ్వుతూ వెళ్లారు. అనుమానం వచ్చి రమేష్ చూసుకుంటే జేబులో సెల్‌ఫోన్ మాయం చేశారు.

☛ గత నెల 20న ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో సరోజిని అనే వృద్ధురాలు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఓ యువకుడు వచ్చి తన ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యిందని... కాల్ చేసుకుంటానని చెప్పి ఆమె ఫోన్ తీసుకున్నాడు. కాల్ చేస్తున్నట్లు నటించి ఫోన్ తీసుకొని పరారయ్యాడు.

మహిళలు, వృద్ధులే లక్ష్యం

సెల్‌ఫోన్ల చోరీ ముఠాలు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నాయి. ముఖ్యంగా మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా జన సంచారం తక్కువున్న ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. కాల్ చేయడానికి ఫోన్ కావాలని అడిగి... మాట్లాడుతున్నట్లు నటించి క్షణాల్లో సెల్‌ఫోన్లు చోరీ చేసి వెళ్లిపోతున్నారు. మరికొంత మంది ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడినట్లు నటిస్తున్నారు. జాలి పడి వెళ్లి పైకి లేపితే సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోతున్నారు. ఇటీవల సెంట్రల్ డివిజన్‌లోని స్టేషన్లలో నమోదైన ఫిర్యాదుల్లో ఈ తరహా చోరీలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

☛ సెల్‌ఫోన్ చోరీ ముఠాలు పథకం ప్రకారం వ్యవహరిస్తున్నారు. సీసీ కెమెరాలు తక్కువగా ఉండే ప్రాంతాల్లో, ద్విచక్ర వాహనాల నంబర్ ప్లేట్లు తీసివేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. జన సంచారం లేని ప్రాంతాల్లో మహిళలు, వృద్ధులు కనిపిస్తే మభ్యపెట్టి చోరీ చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి ఘటనల వల్ల నిజంగా అవసరమైన వారికి సహాయం చేయలేని పరిస్థితి ఉంటోంది. పోలీసులు ఇటువంటి ముఠాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

గాలింపు చర్యలు చేపట్టాం

గుర్తుతెలియని వ్యక్తులకు సెల్‌ఫోన్ ఇవ్వకండి. అత్యవసరమైతే కాల్ అవసరమైతే మీరే స్వయంగా డయల్ చేసి స్పీకర్‌లో మాట్లాడేలా చేయండి. అనుమానాస్పదంగా తిరిగే వారిని గమనించండి. ఇలాంటి ముఠాల గురించి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాం. అత్యవసరమైతే 112కు సమాచారం ఇవ్వండి.
- దామోదర్, సెంట్రల్ జోన్ ఏసీపీ

ప్రకటన

[illegible]

డోరు నెం.23-2-1, సత్యనారాయణపురం, విజయవాడ-11, సెల్: 9392114922

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

కృష్ణారావు విగ్రహం వద్ద నేతలు

కృష్ణారావు లేని దివిసీమను ఊహించడమే కష్టం

అవనిగడ్డ: దివంగత మండలి వెంకటకృష్ణారావు లేని దివిసీమను ఊహించడమే కష్టమని దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ మండవ బాలవర్ధిరావు చెప్పారు. అవనిగడ్డలోని కృష్ణారావు విగ్రహానికి నాగాయలంక కూటమి నాయకులతో కలసి ఆయన నివాళులర్పించారు. తలశిల వెంకట శ్రీనివాస్, కనగాల శ్రీనివాసరావు, మద్ది సాంబశివరావు, పి.కుటుంబరావు, టి.తేజ, కర్రి కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల సందడి

గుడివాడ, పామర్రు - న్యూస్‌టుడే: విశాఖపట్నంలో నిర్వహించిన సెలబ్రిటీ క్రికెట్ మ్యాచ్‌లో గుడివాడ, పామర్రు ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా పాల్గొని సందడి చేశారు. రాష్ట్ర తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కెప్టెన్సీలో ఏపీ లయన్స్ జట్టులో వారు ఆడారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

గుడివాడ: 89775 35999 పామర్రు: 80085 74684 అవనిగడ్డ: 80085 74679

? గుడివాడ పట్టణం పాత హోమియోపతి కళాశాల రోడ్డులో ఇంటింటికే చెత్త సేకరణ వాహనాలు సమయపాలన పాటించడం లేదు. సేకరించేందుకు మూడు రోజులకోసారి సిబ్బంది వస్తున్నారు. - టి.పద్మావతి స్థానికురాలు ✔ సమస్యను పరిష్కరిస్తాం. - మున్సిపల్ సహాయ కమిషనర్ పి.శ్రీనివాసరావు

? పట్టణంలోని ఎంపీ హాల్ ఎదురు రోడ్డుపై విద్యుత్తు దీపాలు కిందకు వేలాడుతూ... పాదచారులకు చేతికందే విధంగా ఉన్నాయి. - చలమలశెట్టి లక్ష్మణరావు, స్థానికుడు ✔ పరిశీలించి దీపాలను సరిచేస్తాం. - విద్యుత్తు ఏఈఈ బాలాజీ - న్యూస్‌టుడే, గుడివాడ(సత్యనారాయణపురం)

❖ పెదపారుపూడి మండలం భూషణగుళ్ల గ్రామంలో చెరువు చుట్టూ చెత్త వేస్తున్నారని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం... మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తీయించారు. ❖ భూషణగుళ్ల బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్థులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను కార్యదర్శి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే సిబ్బందితో దీపాలు ఏర్పాటు చేయించారు. ❖ భూషణగుళ్లలోని డ్రెయిన్లు పొంగి మురుగు రోడ్డుపైకి వస్తోందని గ్రామస్థులు సమస్యను కార్యదర్శి ప్రసాద్‌కు తెలిపారు. స్పందించిన ఆయన పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, పెదపారుపూడి

కమనీయం... శాంతి కల్యాణం

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: వేకనూరులోని సూర్యదేవాలయంలో ఆదివారం సూర్యదేవుడికి శాంతి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. పురవీధుల్లో గ్రామోత్సవాన్ని జరిపారు. భక్తులకు ఆలయ వ్యవస్థాపకులు తుంగల వీరవసంతరావు- ఇందిర దంపతులు అన్న సంతర్పణ చేశారు.

పల్లెలకు కొత్త రోడ్ల కళ

పామర్రు నియోజకవర్గంలో 451 కిలో మీటర్లలో నిర్మాణాలు పూర్తి

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: రాళ్లపై నడిచిన పాదాలకు సిమెంటు రోడ్లపై నడిచే యోగం వచ్చింది. ఐదేళ్ల వైకాపా పాలనలో చిన్న గుంత కూడా పూడ్చటానికి నోచుకోనివి కొన్ని నేడు సీసీ రోడ్లుగా రూపాంతరం చెందాయి. పామర్రు నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 106 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వం పంచాయతీ నిధులను మళ్లించేయడంతో కనీస మౌలిక వసతుల కల్పనకు నాడు ఇబ్బందులు ఎదురయ్యాయి. మరీ ముఖ్యంగా పాడైన రహదారులపై కూసింత తారు పోసిన సందర్భాలు లేవు. నాటి ప్రభుత్వాన్ని మా నిధులు మాకివ్వండంటూ సర్పంచిలు భిక్షాటన, ఇతరత్రా నిరసన కార్యక్రమాలతో వేడుకున్నా కనికరించని పరిస్థితి.

సీసీ రోడ్ల నిర్మాణాలను పరిశీలిస్తే...

మండలం	మంజూరైన రోడ్లు	వ్యయం (రూ.లక్షల్లో)	పూర్తయిన రోడ్లు
మొవ్వ	105	1109	88
పామర్రు	149	990.3	135
పమిడిముక్కల	132	1158.86	110
పెదపారుపూడి	65	540.95	63
తోట్లవల్లూరు	67	758.06	55

రిమ్మనపూడిలో నిర్మితమైన అంతర్గత రోడ్డు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నాటి పరిస్థితుల్లో స్పష్టమైన మార్పు గోచరిస్తోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే నిధులు, పంచాయతీలకి వచ్చే ఆదాయాలు తోడవ్వడంతో నేడు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు వీలు కలుగుతోంది. కూటమి ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేసే క్రమంలో నియోజకవర్గంలో 518 రోడ్లకు రూ. 45.74 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో ఇప్పటి వరకు 87.06 శాతంతో 451 రోడ్లు పూర్తయ్యాయి. 39.56 కి.మీ మేర నూతన సీసీ రోడ్లు దర్శనమిస్తున్నాయి. మొవ్వ మండలంలో ఐదు, పామర్రు మండలంలో మూడు, పమిడిముక్కలలో ఎనిమిది, పెదపారుపూడిలో ఒక బీటీ రోడ్ల పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి.

జనసేన సభ్యత్వ నమోదుపై ఎమ్మెల్యే సమీక్ష

కోడూరు, న్యూస్‌టుడే: కోడూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ 'ఉద్యమి' సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ప్రజల్లో పార్టీ పట్ల ఉన్న అభిప్రాయాలను గురించి చర్చించారు. నేతలు మర్రె గంగయ్య, కోట రాంబాబు, కొండవీటి సునీత, తదితరులు పాల్గొన్నారు.

నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

పార్టీలో చేరికలు...

చల్లపల్లి, న్యూస్‌టుడే: జనసేన పార్టీ పట్ల అన్ని సామాజికవర్గాల ప్రజలు ఆకర్షితులు అవుతున్నారని యువనేత మండలి వెంకట్రామ్ అన్నారు. చల్లపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఐరిమి మణికంఠ, ఏటిమ సెంటర్‌లో అనుమకొండ పూర్ణచంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యమి సభ్యత్వ నమోదు శిబిరాలను ఆయన ప్రారంభించారు. వక్కలగడ్డ నుంచి మట్టా చిన్నా ఆధ్వర్యంలో 20మంది ఎస్సీ మహిళలు, నేతలు పార్టీలో చేరారు. దళిత నేత బుల్లా కిషోర్, మరికొందరు సభ్యత్వాలను తీసుకున్నారు. ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, చోడగం విమల్ కృష్ణ, తోట మురళీకృష్ణ పాల్గొన్నారు.

తప్పులుంటే వెంటనే సరిచేయించుకోండి

పెదపారుపూడి, న్యూస్‌టుడే : ఓటర్ లిస్టులో ఏవైనా తప్పులుంటే ప్రజలు వెంటనే సరి చేయించుకోవాలని తహసీల్దారు శ్రీనునాయక్ సూచించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఓటర్ల మ్యాపింగ్ పురోగతిని పరిశీలించి బీఎల్వోలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పత్రాలు పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీనునాయక్

వైభవంగా జగజ్యోతి కార్యక్రమం

కూచిపూడి, న్యూస్‌టుడే : కూచిపూడిలోని శ్రీరామలింగేశ్వర స్వామి సమేత శ్రీబాలాత్రిపురసుందరి అమ్మవారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం జగజ్యోతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భాగవతుల రామకోటయ్య, రామలక్ష్మి కుమారుడు వెంకటసత్య సేతురామ్‌శర్మ, లక్ష్మీ కనకదుర్గ దంపతులు, నాగసాయి మోహిత్‌రామ్, అనంత ఆండాళ్‌శ్రీలేఖలు శాశ్వత ఉభయదాతలుగా జగజ్యోతి కార్యక్రమాన్ని జరిపారు. రాత్రికి ఎదుర్కోలు ఉత్సవాన్ని పసుమర్తి నారాయణమూర్తి, మురళీకృష్ణలతో చేపట్టారు. అంతకు ముందు ముత్తైదువులు స్వామి వారి కల్యాణానికి శ్రీకారం చుట్టి పసుపు కొట్టారు.

కూచిపూడి: పెండ్లి వేడుకలకు పసుపు కొడుతున్న ముత్తైదువులు

రాష్ట్ర కార్యదర్శిగా గౌరీ ప్రసాద్

పెడన, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కార్యదర్శిగా పెడనకు చెందిన విశ్వభారతి హైస్కూలు అధినేత అనుమకొండ గౌరీ ప్రసాద్ ఎంపికయ్యారు. విశాఖలో ఆదివారం జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికలో గౌరీ ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

6న ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధి కురుమద్దాలిలోని రూరల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరులో ఈ నెల 6న బయోమెట్రిక్ డేటా ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్ ఆదివారం తెలిపారు. ఇతర వివరాలకు 80743 70846నంబరును సంప్రదించాలని కోరారు.

వంతెన శిథిలం..ప్రయాణం ప్రమాదం

ఉయ్యూరు నుంచి భద్రిరాజుపాలెం వెళ్లే బందరు కాలువపై ఉన్న వంతెన బ్రిటీష్ కాలంలో నిర్మించింది. ఈ క్రమంలో దీని పక్కనున్న ఇనుప గ్రిల్స్ తుప్పపట్టి ప్రమాదకరంగా మారాయి. ఈ వారధి నిర్మించి సుమారు 113 ఏళ్లు అయ్యింది. ప్రస్తుతానికి దీనిపై నుంచి ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్తున్నాయి. కార్లు, ఎడ్ల బండ్లు, లారీలు వెళ్లాలంటే తోట్లవల్లూరు వైపు ఉన్న బందరు కాలువ వంతెన వైపు నుంచి వెళ్లాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

తాగునీరు వృథా

స్థానిక 8వ వార్డు కృష్ణా కరకట్టపై అవనిగడ్డ నుంచి ఎడ్లంక వెళ్లే మంచినీటి పైపు లైనుకు ఏర్పాటు చేసిన ఎయిర్ వాల్వు నుంచి పెద్ద మొత్తంలో తాగునీరు వృథాగా పోతోంది. ఆ నీరు కరకట్ట దిగువన కాలువలా చేరింది. వేసవిలో సైతం అక్కడ చెరువును తలపించడం విశేషం.
- అవనిగడ్డ, న్యూస్‌టుడే

దెబ్బతిన్న వంతెన రెయిలింగ్

చంద్రయ్య కాలువపై వంతెన రెయిలింగ్‌లు దెబ్బతిని ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. బేతవోలు, నిమ్మతోట ప్రజలు ఈ వంతెన మీదుగా గుడివాడకు ప్రయాణాలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో వంతెనపై విద్యుత్తు దీపాలు లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, గుడివాడ(సత్యనారాయణపురం)

బాబోయ్.. చెత్త కంపు

అవనిగడ్డ-నాగాయలంక ప్రధాన రహదారిపై డంపింగ్ యార్డు మార్గం బ్బందికరంగామారింది. చెత్తను రహదారి పైనే వేయడం, నిప్పు పెడుతుడడంతో పొగ కమ్మేస్తోంది. చెత్త నుంచి వచ్చే దుర్గంధంతో వాహనదారులు ముక్కు మూసుకుని వెళుతున్నారు. - న్యూస్‌టుడే, అవనిగడ్డ గ్రామీణం

పూడిక తీసి.. రోడ్డుపై పోసి..

గుడివాడ పట్టణంలోని డ్రెయిన్లలో పూడిక తొలగించిన పారిశుద్ధ్య సిబ్బంది ఆ మట్టిని రోడ్డుపైనే పారబోయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. మార్వాడీ వీధిలో కాలువలు శుభ్రం చేస్తే క్రమంలో ఈ మట్టిని బంటుమిల్లి రోడ్డు, మార్కెట్ సెంటర్, నెహ్రూచౌక్ వరకు రహదారిపై పారబోసి వదిలేశారు.
- న్యూస్‌టుడే, గుడివాడ

రహదారికి బీటలు

పెదపాలెం సమీప నాగాయలంక-గుల్లలమోద ప్రధాన రహదారిలో ప్రమాదం పొంచి ఉంది. పంట కాలువ వైపు రోడ్డు నిలువునా బీటలు వారింది. వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనచోదకులు భయపడుతున్నారు. అధికారులు తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, నాగాయలంక

కొండలమ్మ ఆలయంపై ఓంకార త్రిశూలం !

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని ప్రసిద్ధ వేమవరం శ్రీకొండలమ్మ తల్లి దేవస్థానానికి ఆదివారం జిల్లా నలమూలల నుంచి 15 వేల మంది భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక పాలపొంగళ్లు వండి సమర్పించారు. మొక్కుబడులు తీర్చుకుని బంధుమిత్రులకు అన్నసమారాధన నిర్వహించారు. గుడ్లవల్లేరు ఐటీఐ కళాశాల ఉద్యోగి వెణుతురుమిల్లికి చెందిన దాసరి భాస్కరరావు దంపతులు రూ.50 వేలతో అమ్మవారి ఆలయం పైన ఏర్పాటు చేసిన త్రిశూలం, ఓంకార విద్యుత్‌దీపాల బోర్డును ప్రారంభించారు. దాత కుటుంబీకులను ఈవో కొండలరావు, ఛైర్మన్ ఈడే విష్ణుమోహన్ సత్కరించారు. విజయవాడ సీఐ అద్దంకి ఉమామహేశ్వరరావు దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గుడిపై శిల్పాల ఏర్పాటుకు శంకుస్థాపన

అవనిగడ్డ, న్యూస్‌టుడే: గ్రామ దేవత లంకమ్మ అమ్మవారి దేవాలయం గోపురంపై శిల్పాల ఏర్పాటుకు ఆదివారం జనసేన నేత మండలి వెంకట్రామ్‌తో కలసి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అన్నపరెడ్డి వెంకటస్వామి పూజలు చేశారు. శిల్పాల ఖర్చు రూ.1,40,000ను పోతురాజు కృష్ణమూర్తి కుమారుడు శ్రీనివాసరావు ఇస్తారన్నారు. ఆదివారం భక్తులు అమ్మవారికి ఘటం బిందెలు సమర్పించారు.

భీమవరం రైల్వే గేటు తిరిగి ప్రారంభం!

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: పట్టణంలో ఎంతో ప్రాధాన్యత సంచరించుకున్న భీమవరం రైల్వే గేటు తిరిగి ప్రారంభమయ్యింది. ఫ్లైఓవర్ నిర్మాణ నేపథ్యంలో ఈ గేటును గత నెల 25 నుంచి మూసివేశారు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతూ కేటీఆర్ రైల్వే గేటు మీదుగా రాకపోకలను సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే రైల్వే అధికారులు, గుత్తేదారు అనుకున్న సమయానికి పూర్తి చేయడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు

పెదపారుపూడి, న్యూస్‌టుడే : అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ కాకర్స్ గోడౌన్ల వద్ద చర్యలు తీసుకోవాలని తహసీల్దారు శ్రీనునాయక్ అన్నారు. స్థానిక గౌరి ఫైర్‌వర్క్స్, సేల్స్ గోడౌన్‌ను ఎస్సై శ్రీధర్ బాబుతో కలసి ఆయన ఆదివారం తనిఖీ చేశారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా గోడౌన్ల వద్ద అన్ని వసతులు ఉండాలని చెప్పారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందెం బరిపై పోలీసుల దాడి

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని కొండిపర్రులో నిర్వహిస్తున్న కోడిపందేల బరిపై దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నామని పామర్రు ఎస్సై- 2 విజయభాస్కర్ ఆదివారం తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి అయిదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6,350 నగదు, రెండు కోళ్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పాలిటెక్నిక్ విద్యార్థులకు బహుమతులు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అమలాపురం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన యూత్‌ఫెస్ట్‌లో పలు బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ వెల్లడించారు. బాలుర విభాగంలో బాల్‌బ్యాడ్మింటన్ డబుల్స్, టేబుల్‌టెన్నిస్ సింగిల్స్‌లో విన్నర్స్‌గా, టేబుల్‌టెన్నిస్ డబుల్స్‌లో రన్నర్స్‌గా, బాలికల విభాగంలో బ్యాడ్మింటన్ డబుల్స్, సింగిల్స్‌లో విన్నర్స్‌గా, టేబుల్‌టెన్నిస్ సింగిల్స్‌లో రన్నర్స్‌గా బహుమతులు సాధించారు. విజేతలను, పీడీ వేమూరి శ్రీనివాసరావు, భవదీప్‌లను అభినందించారు.

విజేతలతో ప్రిన్సిపల్ రాజశేఖర్, పీడీ శ్రీనివాస్

చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపండి

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక ఏఏఎన్ఎం, వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్‌లో ఆదివారం పాఠశాల 38వ వార్షికోత్సవంలో భాగంగా సాహితీ, క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గుడివాడ సీఐ సోమేశ్వరరావు పాల్గొని విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోనూ ప్రతిభ చూపడం ద్వారా అటు శారీరక శక్తి, ఇటు ఉద్యోగావకాశాలు కలుగుతాయన్నారు. పెదపారుపూడి డిప్యూటీ ఎంపీడీవో వంగా వంశీ మాట్లాడుతూ చదువుతో పాటు సాహిత్యాభిలాష ఉంటే మానసికవికాసంతో మరింత విజ్ఞాన సముపార్జన సాధించవచ్చునన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు సాహితీవేత్తల వేషధారణలో అలరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం కుంజుమన్, విద్యా డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టర్ శిరోమణి పాల్గొన్నారు.

క్రీడా విజేతలతో సీఐ సోమేశ్వరరావు తదితరులు

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

పిట్టల్లంక(కోడూరు), న్యూస్‌టుడే: పిట్టల్లంక గ్రామంలో కొలువై ఉన్న ఉభయ నాగేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆదివారం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. యువ నాయకుడు మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి ధర్మకర్తలు కృషి చేయాలన్నారు. అధ్యక్షులుగా బండే కొండలరావు, సభ్యులుగా చింతా వరలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, బావిశెట్టి శివనాగమల్లేశ్వరరావు, కొప్పుల నరసింహారావు, తెనాలి లక్ష్మీరత్నకుమారి, అట్లూరి తులసి కృష్ణ, సన్నిధి రాజు, స్వర్ణకు మారిలతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. నీటిసంఘం ఉపాధ్యక్షులు గాదె భాస్కరరావు, సర్పంచి కనగాల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ధర్మకర్తల మండలిచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దేవాదాయశాఖ అధికారి

కనుల పండువగా స్వామి వారి కల్యాణం

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : విజయవాడ శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధీనంలోని పామర్రు మండలం కొమరవోలులో శ్రీఅమరలింగేశ్వర దుర్గా నాగేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి వార్షిక కల్యాణం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ(గాంధీ) ఈవో శీనానాయక్ తదితరులు పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామి వారికి నూతన పట్టు వస్త్రాలు అందజేశారు. గ్రామస్థులు మోటూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కృష్ణవేణి దంపతులు, యుగంధర్ దంపతులు పీటలపై కూర్చొని కల్యాణం జరిపించగా భక్తులు తిలకించారు.

కొమరవోలు : కార్యక్రమంలో రాధాకృష్ణ, శీనానాయక్, వేద పండితులు

మంటాడలో..

మంటాడ(పమిడిముక్కల) : మంటాడలోని శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో వీడీడీ ప్రసాద్, ఛైర్మన్ అగస్త్యరాజు రామమోహనరావు, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు. **రేపు ఆలయం మూసివేత..** చంద్రగ్రహణం సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటలకు తలుపులు తాత్కాలికంగా మూసివేస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి వీడీడీ ప్రసాద్ తెలిపారు. గ్రహణ కాలం ముగియగానే ఆలయాన్ని శుభ్రం చేసి బుధవారం ఉదయం 10 గంటల నుంచి స్వామి వారి దర్శనాలు, పూజలు జరుగుతాయని చెప్పారు

ఆర్యవైశ్య నాయకుడికి సన్మానం

పామర్రు: ఆర్యవైశ్య సంఘాలు సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉన్నాయని రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్న రామసత్యనారాయణ చెప్పారు. ఆదివారం చల్లపల్లిలో జరిగిన మాజీ ముఖ్యమంత్రి, దివంగత కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణకు వెళ్తున్న ఆయనకు పామర్రులో స్థానిక నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం కన్యకాపరమేశ్వరి ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. వీరాంజనేయులు, రంగనాథ్, రఘురామబాబు, నాంచారయ్య తదితరులు ఆయన్ను సత్కరించారు.

రామసత్యనారాయణను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘాల నాయకులు

శివారు గ్రామాలకు తాగునీటి సరఫరా పునరుద్ధరణ

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: పులిగడ్డ పంచాయతీ పరిధిలోని రజకపాలెం, పల్లెపాలెం గ్రామాలకు తాగునీటి సరఫరాను ఆదివారం ఎట్టకేలకు పునరుద్ధరించారు. ఆయా ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే గొట్టాలపై భారీగా ముళ్ల పొదలు పెరిగి గొట్టాలు పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిపివేశారు. సర్పంచి విజయ్‌కుమార్, ఈవో అనిత జేసీబీ సాయంతో ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేయించారు.

మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అవీ ఇవీ

గుడివాడ, న్యూస్‌టుడే: పక్షవాతంతో బాధపడుతున్న షేక్ కరీంకు శుభంకర మానవ మహోదయ క్షేత్రం నిర్వాహకుడు రామశెట్టి మురళి తన తండ్రి సుబ్రహ్మణ్యేశ్వరరావు జ్ఞాపకార్థం రూ.10 వేలను సాయంగా అందించారు. నేతలు మాచర్ల రామకృష్ణ, రాంబాబు, సోమేశ్వరరావు, నరసింహరావు, జయరాజు, భోగాది యర్రబాబు, పండు పాల్గొన్నారు.

లింగారెడ్డిపాలెం(కోడూరు), న్యూస్‌టుడే: కోడూరు మండలంలోని లింగారెడ్డిపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని కోడూరు నాగరత్నకుమారి పదవీ విరమణ ఆదివారం జరిగింది. పాఠశాలను తీర్చిదిద్దడానికి ఎంతగానో కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, మండల ప్రముఖులు వారిని ఘనంగా సత్కరించారు.

స్వతంత్రపురం(కోడూరు), న్యూస్‌టుడే: కోడూరు శివారు స్వతంత్రపురంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కంచర్లపల్లి సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. హెచ్.ఎం. మెండు ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యులు యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, బసవయ్య, సుదర్శన్, సీతారత్నసాయిబాబు, ఎంఈవోలు టీవీఎం.రామదాసు, కె.నాంచారయ్య, వెన్నా గజేంద్రరావు పాల్గొన్నారు.

శ్రీరాంపురం(కోడూరు), న్యూస్‌టుడే: కోడూరు మండల తెదేపా కన్వీనర్ వేములపల్లి రాజేష్ తల్లి మాధురి మృతి నేపథ్యంలో జడ్పీటీసీ సభ్యులు యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. తిమ్మన వెంకట నాంచారయ్య, హేమగంగాధర వరప్రసాద్ పాల్గొన్నారు.

గుడివాడ, న్యూస్‌టుడే: చిరు వ్యాపారి పుల్లగూర లక్ష్మీ నారాయణ మృతిచెందడంతో కుటుంబానికి ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు బెజవాడ బాజేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్ కుమార్ తదితరులు రూ.38 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఇరాన్‌పై యుద్ధం ఆపాలి

గుడివాడ: అమెరికా, ఇజ్రాయెల్‌లు తక్షణం ఇరాన్‌పై యుద్ధాన్ని నిలుపుదల చేయాలని, ప్రపంచ శాంతికి విఘాతం కల్గించేలా చేయరాదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.సమరం పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఇరాన్‌పై దాడులను ఖండిస్తోందన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - దేవదాయ ధర్మదాయ శాఖ

భూమి బహిరంగ వేలం పాట ప్రకటన

కృష్ణా జిల్లా, గుడివాడ బేతవోలులో వేంచేసియున్న శ్రీ ఆనందేశ్వర స్వామి వారి దేవస్థానమునకు చెందిన సంపూర్ణ హక్కు భుక్తములు కలిగి యున్నటువంటి ఈ దిగువ తెలుపబడిన షెడ్యూలు వ్యవసాయ భూమిని 2026–2027 నుండి 2028–2029 వరకు అనగా 3 సంవత్సరముల కాలపరిమితికి సాగు చేసుకొను హక్కుకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో ది. 10–3–2026 మంగళవారం మధ్యాహ్నం 2.00 గంటలకు శ్రీ తనిఖీ అధికారి వారి సమక్షంలో శ్రీ స్వామివారి దేవస్థానం వద్ద బహిరంగ వేలం పాట జరుపబడును. కావున ఆసక్తి కలవారు ధరావత్తు చెల్లించి బహిరంగ వేలం పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

వ నెం.	భూమి ఉన్న గ్రామము	సర్వే నెం.	విస్తీర్ణము య.సెంట్లు	ధరావత్తు	కాలపరిమితి
1	బేతవోలు	296/7 305, 307/3	10.79	20,000	ది. 1-4-2026 నుండి ది. 31-3-2029 వరకు 3 సం॥లు

షరతులు

1. ఈ వేలం పాట హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారుల అనుమతి ఉత్తర్వులకు లోబడి సంస్థ యొక్క కార్యనిర్వహణాధికారి వారిచే నిర్వహించబడుచున్నది. 2. దేవస్థానముతో ఎటువంటి లావాదేవీలు వున్నవారు పాటలో పాల్గొనరాదు. 3. హెచ్చు పాటదారుని పేర పాట కొట్టివేయబడిన వెంటనే పాడిన మొత్తము సొమ్ము ధరావత్తు కాకుండా పూర్తి సొమ్ము చెల్లించవలెను. 4. మిగిలిన షరతులు పాటకాలమందు చదివి వినిపించబడును.

బేతవోలు, గుడివాడ, ది. 26-2-2026 ఇట్లు : గంగు శిరీష, కార్యనిర్వహణాధికారి మరియు ధర్మకర్తల మండలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - దేవదాయ ధర్మదాయ శాఖ

చేపల చెరువు బహిరంగ వేలం పాట ప్రకటన

కృష్ణా జిల్లా, గుడివాడ మండలం, బొమ్ములూరు గ్రామములో వేంచేసియున్న శ్రీ సోమేశ్వర స్వామివారి దేవస్థానమునకు చెందిన సంపూర్ణ హక్కు భుక్తములు కలిగి యున్నటువంటి ఈ దిగువ తెలుపబడిన షెడ్యూలు దాఖలా చేపల చెరువును 2026-2027 నుండి 2028-2029 వరకు అనగా 3 సంవత్సరముల కాలపరిమితికి చేపలు పెంచి పట్టుకొను హక్కుకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో ది. 10–3–2026 మంగళవారం ఉదయం 11.00 గంటలకు శ్రీ తనిఖీ అధికారి వారి సమక్షంలో తుమ్మలపల్లి పంచాయితీ ఆఫీసు వద్ద బహిరంగ వేలం పాట జరుపబడును. కావున ఆసక్తి కలవారు ధరావత్తు చెల్లించి బహిరంగ వేలం పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

వ నెం.	చెరువు ఉన్న గ్రామము	సర్వే నెం.	విస్తీర్ణము య. సెంట్లు	ధరావత్తు	కాలపరిమితి
1	తుమ్మలపల్లి	313	6.52	50,000	ది. 1-4-2026 నుండి ది. 31-3-2029 వరకు 3 సం॥లు

షరతులు

1. ఈ వేలంపాట హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారుల అనుమతి ఉత్తర్వులకు లోబడి సంస్థ యొక్క కార్యనిర్వహణాధికారి వారిచే నిర్వహించబడుచున్నది. 2. దేవస్థానముతో ఎటువంటి లావాదేవీలు వున్నవారు పాటలో పాల్గొనరాదు. 3. హెచ్చు పాటదారుని పేర పాట కొట్టివేయబడిన వెంటనే పాడిన మొత్తము సొమ్ము ధరావత్తు కాకుండా పూర్తి సొమ్ము చెల్లించవలెను. 4. మిగిలిన షరతులు పాటకాలమందు చదివి వినిపించబడును.

బొమ్ములూరు, ది. 26-2-2026 ఇట్లు : గంగు శిరీష, కార్యనిర్వహణాధికారి

శ్రీరస్తు శుభమస్తు
దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ అద్దంకి నాంచారమ్మ దేవతాయైనమః



శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవ ఆహ్వానము
విశ్వనాధపల్లి గ్రామము కోడూరు మండలం, కృష్ణా జిల్లా
ది. 02-03-2026 సోమవారం నుండి ది. 03-03-2026 మంగళవారం వరకు
శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవములు
ఆలయ ఛైర్మన్ తోట వెంకట సూర్యనారాయణరావు మరియు పాలకవర్గ సభ్యులు
కార్యనిర్వహణాధికారి ఇక్కుర్తి వీర వెంకట మోహనరావు మరియు ఆలయ సిబ్బంది

(c) eenadu



ప్రహ్లాద వరద.. పరమాత్మ రూపా

మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా నృసింహుని కల్పవృక్ష వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి కీలకమైన పొన్నవాహన సేవ నిర్వహించారు. - మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

సజావుగా గురుకులాల ప్రవేశ పరీక్ష

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (జనరల్, ఐఐటీ-నీట్)లో ప్రవేశాల కోసం కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా జరిగినట్లు గురుకులాల సమన్వయ అధికారి ఎ.మురళీకృష్ణ తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. సహకరించిన జిల్లా పరిపాలన, పోలీస్, పరీక్షా సిబ్బంది, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అమరావతిలో కీలక అడుగు

★ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాకతో ఆదివారం అమరావతిలో సందడి వాతావరణం నెలకొంది. ఏపీ జ్యుడిషియల్ అకాడమీ, ఏపీ హైకోర్టు అతిథి గృహ నిర్మాణాలకు శంకుస్థాపన..నూతనంగా నిర్మించిన హైకోర్టు న్యాయమూర్తుల రెసిడెన్షియల్ ఎన్‌క్లేవ్ ప్రారంభోత్సవాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వేదపండితులు సీజేఐకు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, సీఎం చంద్రబాబునాయుడు, పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సుమారు 2.05 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణం చేపడుతుండగా..120 మంది ట్రైనీ జడ్జిలకు శిక్షణ ఇచ్చేలా రూపకల్పన చేశారు. **రైతుల సంతోషం..**రాజధానిలో కీలక నిర్మాణాలకు అడుగులు పడడంతో స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

హైకోర్టు న్యాయమూర్తుల బంగళా నమూనా పరిశీలిస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నరసింహ, జస్టిస్ భట్టి, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, సీఎం చంద్రబాబు

పటమటలోని ఆంత్రాలక్ కన్వెన్షన్ సెంటర్‌లో మధ్యవర్తిత్వంపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సుకు హాజరైన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

ఆటో.. ఈ తీరేమిటో..!

✪ ఇష్టారీతిన నిబంధనల ఉల్లంఘన
✪ ముంబయి విధానం బెజవాడకు అనుసరణీయం

విజయవాడలో ద్విచక్ర వాహనం లేదా కారుతో రోడ్డెక్కితే పెద్దగా ట్రాఫిక్ ఇబ్బందులు లేని చోట్ల కూడా ఆటోల రూపంలో స్పీడ్ బ్రేకర్లు ఎదురవుతాయి. ఎక్కడపడితే అక్కడ నడిరోడ్డుపై ఆపి ఆటోవాలాలు ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. రోడ్లపై ఇష్టారీతిన ఆపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకోవడంతో పాటు ట్రాఫిక్ అవాంతరాలు తలెత్తుతున్నాయి. ముంబయి తరహాలో కఠిన నిబంధనలు, ప్రత్యేక ఆటో స్టాండ్లు ఉంటేనే సమస్య పరిష్కారానికి నోచుకుంటుంది.– ఈనాడు, అమరావతి

రహదారి మధ్యలోనే ఆపేసి ప్రయాణికులతో డ్రైవర్ల బేరాలు

రోడ్లే ఆటో స్టాండ్లు..

★ నగర పరిధిలో సుమారు 15వేలకు పైగా ఆటోలు తిరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కార్మిక సంఘాలు ఏర్పాటు చేసుకున్న స్టాండ్లు మినహా ఎక్కువ చోట్ల అసలు నిలిపేందుకూ జాగా లేని పరిస్థితి. దీంతో రోడ్ల మార్జిన్లే ఆటో స్టాండ్లుగా మారిపోయాయి. నగరంలో అత్యంత రద్దీగా ఉండే బందరు, ఏలూరు రోడ్లపై ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది.

★ బెంజి సర్కిల్ పెట్రోల్ బంక్ వద్ద అనధికారికంగా రోడ్డుపైనే ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. ఫలితంగా పటమట వైపు నుంచి పీఎన్‌బీఎస్ వైపు వెళ్లే వాహనాలు ఆగిపోతున్నాయి. ఆటోనగర్ గేట్ వద్ద ఇదే పరిస్థితి. లిడ్‌క్యాప్ కార్యాలయం మలుపు వద్ద పెద్ద సంఖ్యలో ఆటోలు నిలుపుతున్నారు. దీని వల్ల ఆటోనగర్ వైపు వెళ్లాల్సిన వాహనాలు నిలిచిపోతున్నాయి. రాఘవయ్య పార్క్, బీసెంట్ రోడ్డు ప్రాంతాల్లోనూ రోడ్డపైనే ఆటోలను నిలుపుతున్నారు.

వీఎంసీ, పోలీసుశాఖ గట్టిగా అనుకుంటే..

ముంబయి నగరంలో ఆటోల కారణంగా తలెత్తిన ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు అక్కడి అధికారులు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. ఆటోలు విధిగా నిర్దేశిత ఆటో స్టాండ్లలోనే నిలపాలి. ఆటో ఎక్కాలంటే నేరుగా సమీపంలోని స్టాండ్‌కు వెళ్లి ఎక్కాల్సిందే. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తున్నారు. ★ ముంబయి తరహాలో బెజవాడలోనూ నిబంధనలు అమలు చేయాలి. ప్రత్యేక ఆటో స్టాండ్లు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. ఈ విషయంలో వీఎంసీ, పోలీసుశాఖ చొరవ చూపాలి.

నియంత్రణ లేక ప్రమాదాలు

★ రోడ్లపై ప్రయాణికులు కనపడగానే హఠాత్తుగా ఆటోలు ఆపుతుండడం వల్ల వెనుక వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. ప్రయాణికుల్లోనూ పౌర స్పృహ కొరవడడంతో ఆటోల కోసం తమకు అనువుగా ఉన్నచోట నిరీక్షిస్తున్నారు. దీని వల్ల ట్రాఫిక్ ఆగిపోతున్నా పట్టించుకోవడం లేదు. 2025లో నగరంలో ఆటోల కారణంగా 27 పెద్ద ప్రమాదాలు చోటుచేసుకోగా గాయాలపాలైన ఘటనలు 106 ఉన్నాయి.

రంజాన్ వేళలు



ఇఫ్తార్: (సోమవారం)
సాయంత్రం: 6.19
సహరి: (మంగళవారం)
ఉదయం: 5.07

మంత్రి నారాయణ పర్యటన నేడు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో మంత్రి నారాయణ సోమవారం పర్యటించనున్నారు. నేలపాడు సమీపంలో నిర్మిస్తున్న గెజిటెడ్ ఆఫీసర్ల క్వార్టర్స్, గ్రూపు- డి ఉద్యోగుల భవన సముదాయాలను ఆయన పరిశీలించి..పనుల పురోగతిపై ఆరా తీస్తారని మంత్రి కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి.

కాల్వలకు 2,823 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు ఆదివారం 2,823 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ(కేఈ)కు 1,005, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వ(కేడబ్ల్యూ)కు 1,818 క్యూసెక్కుల నీటిని ఇస్తున్నారు. బ్యారేజీ వద్ద పూర్తి స్థాయిలో 12 అడుగుల నీటి మట్టం ఉంది.

డ్రగ్స్‌పై దండయాత్ర.. ఆరంభం మాత్రమే..!

■ మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిస్తాం : సీపీ
■ విజయవంతంగా 34 రోజుల సైకిల్ యాత్ర

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా 34 రోజులు చేపట్టిన 'డ్రగ్స్‌పై దండయాత్ర' కార్యక్రమం విజయవంతమైందని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు వెల్లడించారు. ఇది ఆరంభం మాత్రమేనని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో.. గత 34 రోజులుగా 510 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్ర ముగింపు కార్యక్రమం ఆదివారం పాత పోలీస్ కంట్రోల్‌రూం కూడలిలో నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ వరకు ప్రదర్శన చేశారు. విజయవంతంగా సైకిల్ యాత్ర పూర్తి చేసిన ఐదుగురు మహిళా పోలీసులకు ఘన స్వాగతం పలికారు. పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు మాట్లాడుతూ.. ఇది ప్రజల ఆకాంక్ష నుంచి, ఒక తల్లి కడుపుకోత నుంచి పుట్టిన యాత్ర అని కొనియాడారు. యువత భవిష్యత్తుపై రాసిన సంతకంగా కలకాలం నిలిచిపోతుందన్నారు. ప్రజల స్పందన అద్భుతంగా ఉందని.. అడుగడుగునా హారతులు పట్టారని తెలిపారు. మాదకద్రవ్యాల మహమ్మారిపై ప్రజల్లో చర్చకు వచ్చేలా చేసిందన్నారు. ఎక్కడ ఏం జరిగినా టోల్‌ఫ్రీ నంబరు 1972కు సమాచారం వస్తోందన్నారు. అందరం కలిసి కట్టుగా పోరాడాల్సిన ఉద్యమం అని అన్నారు.

ఇదొక చరిత్రగా మారుతుంది..

డ్రగ్స్‌పై దండయాత్ర దేశంలోనే ఒక చరిత్రగా మారుతుందని సీపీ పేర్కొన్నారు. ఇందులో భాగంగా 29 రకాల కార్యక్రమాలను నిర్వహించామన్నారు. పోలీసు జాగిలాలు సైతం పాలు పంచుకున్నాయని, పిట్ ఎన్‌డీపీఎస్ యాక్ట్ గురించి ప్రజలకు తెలియజేశామని తెలిపారు. మత్తుకు బానిసైన 2,513 మందిని గుర్తించి, కౌన్సెలింగ్ చేశామని.. 149 హాట్‌స్పాట్‌లు గుర్తించి నిఘా ఉంచామని వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, డ్రోన్ల వినియోగం, వాహన తనిఖీలు, నాకా బందీ చేశామన్నారు. ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ.. 34 రోజుల పాటు మహమ్మారిపై పోరాటం చేసిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఎక్కడా ఇలాంటి కార్యక్రమం నిర్వహించలేదని కొనియాడారు. కార్యక్రమ సంధానకర్త అడ్మిన్ డీసీపీ కె.జి.వి.సరిత మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో ఈ యాత్ర 510 కిలోమీటర్లు పూర్తి చేసుకుందన్నారు. ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, మహిళలు ఘనంగా స్వాగతం పలికారని తెలిపారు. ర్యాలీగా ఏఆర్ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. డీసీపీలు కృష్ణప్రసన్న, షిరీన్‌బేగం, కృష్ణకాంత్ పటేల్, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, బి.లక్ష్మీనారాయణ, ఈగల్ ఎస్పీ నగేష్ ఏసీపీలు, సీఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బెలూన్లను ఎగరేస్తున్న సీపీ రాజశేఖరబాబు, ఈగల్ ఐజీ రవికృష్ణ, డీసీపీలు సరిత, షిరీన్ బేగం, కృష్ణప్రసన్న, తిరుమలేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, ఉదయరాణి తదితరులు

హారతులు ఇస్తున్న యువతులు

కోయంబత్తూరు నుంచి ఓఏబీ సీసాలు

☛ ఒక్కో దానికి రూ.1.79 చెల్లించిన జనార్దనరావు
☛ నకిలీ జీఎస్టీ నంబరుతో రవాణా.. కస్టడీలో వెల్లడించిన సెంథిల్

ఈనాడు, అమరావతి

డిజైన్ పరంగా సంక్లిష్టంగా ఉండే ఓల్డ్ అడ్మిరల్ బ్రాండీ (ఓఏబీ) సీసాల తయారీ కోసం అంతర్జాలంలో వెతికి మరీ జనార్దనరావు (ఏ1) తమిళనాడులోని కోయంబత్తూరులో శ్రీవారు ఇండస్ట్రీస్‌ను ఎంపిక చేశాడు. స్థానికంగా ఏ పరిశ్రమలోనూ తయారు చేసేవారు లేకపోవడంతో ఆర్డర్ ఇచ్చేశాడు. ఈ పరిశ్రమ యజమాని సెంథిల్‌ను (ఏ22) సంప్రదించి ఓఏబీ బ్రాండ్‌కు నకిలీ సీసాలను ఏ1 తెప్పించాడు. దీనికి నకిలీ జీఎస్టీ నంబరు ఉపయోగించాడు. నకిలీ మద్యం కేసులో రెండు రోజుల కస్టడీలో భాగంగా ఎక్సైజ్ పోలీసులు సెంథిల్‌ను ఆదివారం విజయవాడ కారాగారం నుంచి అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించిన అనంతరం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో కీలక అంశాలను వెల్లడించాడు.

శ్రీనివాసరెడ్డి చేతులెత్తేయడంతో..

ఓఏబీ సీసాల తయారీకి మొదట్లో సూరంపల్లి పారిశ్రామికవాడలో పెట్ బాటిల్స్ కర్మాగారాన్ని నడుపుతున్న శ్రీనివాసరెడ్డి (ఏ11)ని అద్దేపల్లి సోదరులు సంప్రదించారు. తన కంపెనీలో ఆ మోడల్ సీసాలు తయారు చేయడం కుదరదని చెప్పడంతో ప్రణాళికను తాత్కాలికంగా వాయిదా వేశారు. బెంగళూరుకు చెందిన బాలాజీ (ఏ3)ని సంప్రదించిన మీదట అంతర్జాలంలో వెతికి శ్రీవారి ఇండస్ట్రీస్‌లో ఇటువంటి సీసాలను తయారు చేస్తారని తెలుసుకున్నారు. సెంథిల్‌ను బాలాజీ పరిచయం చేసుకున్నాడు.

అనుమతి ఉందని నమ్మించి..

జనార్దనరావుకు మద్యం తయారీ చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఉందని.. సీసాలను తయారు చేసి సరఫరా చేయాలని నమ్మించారు. దీనికిగాను నకిలీ జీఎస్టీ నంబరును సెంథిల్‌కు పంపించారు. అసలుకు ఏమాత్రం తీసిపోని విధంగా తయారు చేసి అందిస్తానని హామీ ఇవ్వడంతో సెంథిల్‌కు ఆర్డర్ ఇచ్చారు. ఒక్కో సీసాకు రూ.1.79 వెచ్చించారు. ఒక్కో విడతకు 99,840 సీసాలు చొప్పున రెండు విడతల్లో ఇబ్రహీంపట్నం, ములకలచెరువుకు సెంథిల్ రవాణా చేశాడు. సీసాలను సరఫరా చేసినందుకు ఏ22కు జనార్దనరావు రూ.3.57లక్షలను నిందితుడు రవికు మార్ ద్వారా చెల్లించాడు. నకిలీ జీఎస్టీ నంబరు నిజమైనదిగా నమ్మి తాను సీసాలు రవాణా చేశానని, దీని వల్ల తాను కేసులో ఇరుక్కున్నానని సెంథిల్ ఆవేదన వ్యక్తం చేశాడు.

వెలగని దీపం.. చీకటి శాపం..

జాతీయ రహదారులపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ విధానంపై ఎవరికీ పట్టక చీకట్లు కమ్ముకుంటున్నాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. నిర్వహణ విషయంలో సంబంధిత శాఖ, ఆయా స్థానిక సంస్థలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. తరచూ వస్తున్న ఫిర్యాదులు ప్రజల్లో అసహనాన్ని పెంచుతుంటే.. మరో వైపు పట్టపగలే వెలుగుతున్న దీపాలను చూసి జనాలు అవాక్కవుతున్నారు. ఈ క్రమంలో శనివారం జాతీయ రహదారి- 30పై కొండపల్లి ఐడీఏ నుంచి కట్టుబడిపాలెం దాటే వరకు వెలుగుతున్న దీపాలను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. రాత్రులు మాత్రం అంధకారం నెలకొంటుందని ఆవేదన చెందుతున్నారు.
- న్యూస్‌టుడే, మైలవరం, జి.కొండూరు

నేడు కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్

ఇద్దరే ఆర్డీవోలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి 'రెవెన్యూ క్లినిక్' కార్యక్రమంలో ముగ్గురు ఆర్డీవోలకుగాను, ఈ సారి ఇద్దరు మాత్రమే పాల్గొనే పరిస్థితి ఏర్పడింది. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్యను బదిలీ చేసి, జీఏడీలో రిపోర్టు చేయాలనే ఆదేశాలతో ఖాళీ అయింది. నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణకు విజయవాడ డివిజను బాధ్యతలను అప్పగించారు. ఈ కారణంగా నందిగామ, విజయవాడ డివిజన్ల తరఫున ఆర్డీవో ఒకరే హాజరుకానున్నారు. రెవెన్యూ క్లినిక్‌లో తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో బాలకృష్ణ ఉంటారు. జేసీ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, రెవెన్యూ సంబంధిత అధికారులు పాల్గొంటున్న విషయం తెలిసిందే.

పేద గుండెకు.. పెద్ద భరోసా

ప్రభుత్వాస్పత్రిలో పెరిగిన యాంజియోగ్రామ్‌లు

ఈనాడు, అమరావతి

విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలోని కార్డియో వాస్కులర్ కేర్ విభాగంలో రూ.లక్షల విలువైన గుండె వైద్యం పేదలకు ఉచితంగా అందుతోంది. గుండె సంబంధిత సమస్యలతో ఆస్పత్రి ఓపీకి వచ్చేవారి సంఖ్య నిత్యం 300కు పైగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పీపీపీ విధానంలో కేథ్‌ల్యాబ్ ఏర్పాటు చేశారు. ప్రతి నెలా వందల మందికి యాంజియోగ్రామ్ చేస్తున్నారు. అవసరమైన వారికి స్టంట్‌లను ఉచితంగా వేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఒక్కో స్టంట్‌కు కనీసం రూ.1.5లక్షల వరకూ ఖర్చవుతోంది.
✪ ప్రభుత్వ ఆస్పత్రిలోని కార్డియో వాస్కులర్ కేర్ విభాగం ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకూ 11వేల యాంజియోగ్రామ్స్, 5 వేలకు పైగా స్టంట్‌లను రోగులకు ఉచితంగా వేశారు. వాస్తవంగా ఇంతకు రెట్టింపు స్థాయిలోనే శస్త్రచికిత్సలు చేయాల్సి ఉన్నా చాలా మంది పేద, మధ్యతరగతి రోగులకు ఈ ఖరీదైన వైద్య సేవలపై అవగాహన లేదు. దీంతో గుండెకు స్టంట్‌లను వేయించుకునేందుకు ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడుతూ రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు.

శస్త్రచికిత్స జరిగిన మహిళతో మాట్లాడుతున్న డాక్టర్ విజయ్ చైతన్య

క్యాథ్‌ల్యాబ్‌లో అందే సేవలివి..

★ యాంజియోగ్రామ్
★ అత్యాధునిక ఆప్టికల్ కొహెరెన్స్ టెమోగ్రఫీ
★ స్టంట్‌లు, పేజ్ మేకర్లు వేయడం
★ రోటాబ్లేషన్ విధానంలో కరోనరీ ఆర్టరీస్‌లోకి ఓ వైరును పంపి కరోనరి యాంజియోప్లాస్టిని చేసి అడ్డుపడిన కాల్షియంను తొలగించే చికిత్స

ప్రతి నెలా 250కు పైగానే..

కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు సహా చుట్టుపక్కల జిల్లాల నుంచి విజయవాడకు ప్రస్తుతం 250 మందికి పైగా రోగులు యాంజియోగ్రామ్, స్టంట్‌లను వేయించుకునేందుకు వస్తున్నారు. వీటిలో కనీసం 50 నుంచి 70 వరకు స్టంట్‌లు ఉంటున్నాయి. ఒక్కో శస్త్రచికిత్సకు ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోంది. వైద్య సేవ కార్డు ఉన్న వారికి కచ్చితమైన ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన స్టంట్‌లను వేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో తక్కువ ధరకే వైద్యం అందిస్తున్నట్లు ప్రచారం చేస్తూ నాణ్యత లేని బేర్ మెటల్ స్టంట్‌లు వేస్తున్నారు. వీటికి కూడా కనీసం రూ.లక్ష వసూలు చేస్తున్నారు. గుండె సమస్యతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే.. 2డీ ఎకో, ఈసీజీ చేశాక.. ఏ చిన్న ఇబ్బంది ఉన్నట్లు తేలినా యాంజియోగ్రామ్ చేస్తున్నారు. ఈ పరీక్షకు రూ.15వేల వరకూ తీసుకుంటున్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చేసి బస్సు ఛార్జీలనూ ఇచ్చి పంపిస్తున్నారు.

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 2వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో వినతి పత్రాలు ఇవ్వొచ్చని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్ అందుబాటులో ఉంటుందని వివరించారు.

మీకోసం వెబ్‌సైట్‌లోనూ..

★ ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ meekosam.ap.gov.in లోనూ దాఖలు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని తెలిపారు.

B.Sc (నర్సింగ్), BPT కోర్సులలో చేరదలచిన విద్యార్థులకు సువర్ణ అవకాశం
సవరణ
ది. 01-03-2026న ప్రచురితమైన పై ప్రకటనలో ఫోన్ నెం: 98481 29500గా చదువుకోవలసినదిగా కోరుతున్నాము.
APNIMA-Honorary President

అత్యవసర సమాచారం.. ఇక సులభతరం

ఇబ్రహీంపట్నం గ్రామీణం (గుంటుపల్లి), న్యూస్‌టుడే

విజయవాడ జాతీయ రహదారుల సంస్థ పరిధిలో విజయవాడ- హైదరాబాద్, ఇబ్రహీంపట్నం- ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు అత్యవసర సేవల సమాచారానికి ఇకపై ఇబ్బందులు పడక్కర్లేదు. వాహన మరమ్మతులు, టైర్ పంక్చర్ దుకాణాలు, పెట్రోలు బంకులు, ఆసుపత్రులు తదితర వివరాలను ఎవరిని అడగాల్సిన అవసరం లేదు. దీనికోసం జాతీయ రహదారులపై క్యూఆర్ కోడ్ సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

ఇబ్రహీంపట్నం భీమరాజుగుట్ట వద్ద క్యూఆర్ సైన్‌బోర్డు

ఏమేం తెలుసుకోవచ్చు.. అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు, హైవే నంబరు, దాని పొడవు, చైనేజ్ (స్థాన గుర్తులు), ఎన్‌హెచ్ఏఐ ఫీల్డ్ కార్యాలయం, గస్తీ, టోల్ ప్లాజాలు, పెట్రోలు బంకులు, ఆసుపత్రులు, పోలీసు స్టేషన్లు, రెస్టారెంట్లు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదుల వివరాలను తెలుసుకోవచ్చు.

రాత్రి సమయాల్లోనే అధికం... : జాతీయ రహదారులపై రాత్రివేళ ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆ సమయంలో ఎవరికి సమాచారం అందించాలో తెలియక బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తగిన సమాచార వ్యవస్థ లేక తీవ్రజాప్యంతో సకాలంలో సేవలు అందక అవస్థలకు గురవుతున్నారు. ఇటువంటి వారికి జాతీయ రహదారుల సంస్థ ప్రతి కిలో మీటరుకు రోడ్డుకు ఇరువైపులా ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తున్న క్యూఆర్ కోడ్ సైన్ బోర్డులు ఎంతో ప్రయోజనకరం.★ జిల్లా పరిధిలోని ముఖ్య ప్రదేశాలు, బ్లాక్ స్పాట్లు, ముఖ్య కూడళ్ల ఇతర కీలక ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్‌హెచ్ఏఐ సంస్థ అధికారి సుబ్బారావు తెలిపారు.

అగ్నికి ఆజ్యం!

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు పెరుగుతున్నాయి. 2025లో నాలుగు అగ్ని ప్రమాదాలు కలకలం రేపాయి. వేల మంది జనం వచ్చే ప్రైవేటు ఎగ్జిబిషన్లలోనూ నిర్లక్ష్యం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతూ ఆందోళన రేకెత్తిస్తున్నాయి. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం, విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ లాంటివి కారణంగా మారుతున్నాయి. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడో ఎగ్జిబిషన్, ప్రదర్శన పెట్టేందుకు మున్సిపాలిటీ, పోలీసు, ఫైర్ విభాగాల అనుమతులిచ్చేస్తున్నాయి. విద్యాధరపురం లేబర్‌కాలనీ మైదానం, పున్నమిఘాట్, శాతవాహన కళాశాల సహా నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడో ప్రదర్శన పుట్టుకొస్తోంది. గతేడాది లేబర్‌కాలనీ మైదానంలోని ఎగ్జిబిషన్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఇదే ఎగ్జిబిషన్‌లో అంతకు

అడ్డగోలు అనుమతులతో ప్రమాదాలు

ముందు ఏడాది కూడా అగ్ని ప్రమాదం జరిగి కృష్ణలంకకు చెందిన ఓ యువకుడు చనిపోయాడు. అయినా నిర్లక్ష్యంతో మళ్లీ అనుమతి ఇచ్చారు. మళ్లీ ప్రమాదం జరిగింది.

విచ్చలవిడిగా ఉల్లంఘనలు..

★ స్టాళ్ల మధ్య కనీసం ఐదారు అడుగుల దూరం ఉండాలి. ★ అగ్నిమాపక శకటం వెళ్లి వచ్చేలా నాలుగు వైపులా దారులుండాలి. ఈ నిబంధనలు పాటించడం లేదు. ★ అసలు రెండో గేటే ఉండడం లేదు. ఒక ప్రధాన మార్గం ఏర్పాటు చేసి.. దానిలోంచే వెళ్లడం, రావడం. ఒకవేళ ప్రధాన ద్వారం వైపు ప్రమాదం జరిగితే.. అందరూ లోపల ఉండిపోవాల్సిందే.

గతేడాది జరిగిన ప్రమాదాలు..

☛ 12.02.25: విజయవాడ సితార గ్రౌండ్‌లోని కశ్మీరి జలకన్య ఎగ్జిబిషన్‌లోనూ భారీ అగ్నిప్రమాదం జరిగింది. గ్యాస్ సిలిండర్లు పేలిపోయి ఎగ్జిబిషన్‌లోని దుకాణాల పైకప్పులు ఎగిరిపోయాయి. ఇది మధ్యాహ్నం వేళలో జరగడంతో సందర్శకులు లేరు. ☛ 04.09.25: ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామ శివార్లలోని భీమేశ్వరకాలనీ భారీ పేలుడు ధాటికి వణికిపోయింది. పేలుడు ధాటికి భవనం సిమెంట్ గోడలు ముక్కముక్కలైపోయి. ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఇంటిలో ఉన్న దీపావళి మందుగుండు సామగ్రి, అక్కడే ఉన్న వెల్డింగ్ సిలిండర్ కలిపి ఒకేసారి పేలడంతో భారీ ప్రమాదం సంభవించింది. ☛ 06.10.25: ఎనికేపాడులోని ఓ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల గోదాములో భారీ అగ్నిప్రమాదం జరిగింది. రూ.5కోట్లకు పైగా విలువైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు కాలి బూడిదయ్యాయి. ☛ 19.10.25: విజయవాడ రామరాజ్యనగర్‌లోని టిన్నర్ డిపోలో అర్ధరాత్రి సమయంలో పెద్ద అగ్నిప్రమాదం జరిగింది. షణ్ముక శ్రీనివాస్ అనే వ్యక్తి చనిపోగా మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

విజయవంతంగా సీజేఐ అమరావతి పర్యటన

జస్టిస్ సూర్యకాంత్‌కు వీడ్కోలు పలుకుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: అమరావతి పర్యటనలో భాగంగా భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం మధ్యాహ్నం 1:35 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. తిరుపతి నుంచి ప్రత్యేక విమానంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్ర, జస్టిస్ నరసింహం, జస్టిస్ ఎస్ వీఎన్ భట్టి, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీతో కలిసి వచ్చిన సీజేఐకు రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో అమరావతి బయలుదేరి వెళ్లారు. తిరిగి రాత్రి 8 గంటలకు విమానాశ్రయం చేరుకున్న సీజేఐ ప్రత్యేక విమానంలో దిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు. విమానాశ్రయంలో సీఎం చంద్రబాబు, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, ఇతర న్యాయమూర్తులు సీజేఐకు ఘన వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ దోనాడి రమేష్, జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ మహేశ్వరరావు కుంచెయం, జస్టిస్ టీసీడీ శేఖర్, కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జేసీ నవీన్, విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి, ప్రొటోకాల్ డైరెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా చంద్రబాబు: అనురాధ

పటమట, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, సూపర్‌వైజర్లకు సీఎం చంద్రబాబు అండగా నిలిచారని తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీల వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు, ఒకటో తేదీనే జీతాల చెల్లింపు వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నది గత తెదేపా ప్రభుత్వమేనని గుర్తు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు రెండు సార్లు వేతనాలు పెంచి.. వారి గౌరవాన్ని కాపాడిన చరిత్ర చంద్రబాబుదేనని పేర్కొన్నారు. మినీ అంగన్‌వాడీలను పూర్తి స్థాయి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడం, వేలాది మందికి ఉద్యోగోన్నతులు కల్పించడం, స్మార్ట్‌ఫోన్ల పంపిణీ, మౌలిక సదుపాయాల మెరుగుదల.. అంగన్‌వాడీల పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు.

నర్సింగ్ కోర్సుకు నీట్ నిబంధనాలు

న్యూస్‌టుడే, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

నర్సింగ్ కోర్సు ప్రవేశాలకు నీట్ యూజీ రాయాలన్న నిబంధన పేద విద్యార్థులకు శాపంగా మారింది. అది మార్చి ఎనిమిదో తేదీలోగా ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని ఆదేశం చదవడంతో గ్రామీణ విద్యార్థులు ఈ కోర్సుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. దరఖాస్తుకు గడువు దగ్గరపడటం, ఈ నిబంధనలపై ప్రచారం లేకపోవడం ముప్పుగా పరిణమిస్తోంది. సాధారణంగా ఉన్నత చదువులకు వెళ్లలేని పేద కుటుంబాల బాలికలకు బీఎస్సీ నర్సింగ్ కోర్సు ఓ వరం. మారుమూల పల్లెల నుంచి ఎందరో ఈ కోర్సుల్లో చేరుతుంటారు. ఏఎన్ఎం, జీఎన్ఎం డిప్లొమాలు చేసిన వారు కూడా ఇందులో చేరవచ్చు. ఇంటర్‌లో బైపీసీ పూర్తి చేసిన తర్వాత బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సు, ఫిజియోథెరపీ (బీపీటీ) అందుబాటులో ఉండేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎందరో విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేవారు. కొన్నేళ్ల తర్వాత ఎంసెట్ నిబంధన తెచ్చి అందులో ర్యాంకు ఆధారంగా సీట్ల భర్తీ చేపట్టారు. రెండేళ్లనాడు ప్రవేశాలు కల్పించే విశ్వవిద్యాలయమే ప్రత్యేక పరీక్ష నిర్వహించి ప్రవేశాలు చేపట్టాలని నర్సింగ్ కౌన్సిల్ ఆదేశించింది. విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులను ఆహ్వానించగా ఆశించినంతగా అభ్యర్థులనుంచి స్పందన లేదు. రెండు సార్లు పొడిగించిన తర్వాత దరఖాస్తుదారుల సంఖ్య పెరిగింది. తాజాగా ఈ విద్యా సంవత్సరం నుంచి జాతీయ స్థాయిలో ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల నిమిత్తం రాసే నీట్ యూజీ ప్రవేశ పరీక్ష అర్హత ఉండాలనే నిబంధన శాపమవుతోంది. నీట్ అర్హత నిబంధనలపై మారుమూల ప్రాంతాల బాలికలకు తెలిసేలా ప్రచారం లేకపోవడంతో చాలా మంది ఈ విద్యా సంవత్సరం చేరే అవకాశాన్ని కోల్పోనున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ప్రచారం చేపట్టాల్సిన ఆరోగ్య విశ్వవిద్యాలయం వెనకడుగు వేస్తోంది. ఫిజియోథెరపీ డిగ్రీకి సంబంధించి కూడా విజయవాడ పాత ఆస్పత్రిలోని ఏపీ స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ పట్టించుకోవడం లేదు. వేలల్లో సీట్లు మిగిలిపోయే పరిస్థితి ఉండనుంది.

గత ఐదేళ్లలో సీట్ల భర్తీ ఇలా..

విద్యా సంవత్సరం	కళాశాలలు	మొత్తం సీట్లు	మిగిలినవి
2021-22	179	9315	546
2022-23	195	11869	1980
2023-24	237	12560	2876
2024-25	253	13716	2125
2025-26	266	14765	4739

అంతా గందరగోళమే

రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని బాలికలకు ప్రవేశాల ప్రక్రియను తెలియపర్చడంలో విఫలమయ్యారు. ఏటా ఆగస్టులో ప్రవేశాలుంటాయని భావిస్తున్నారు. ఎన్‌ఎంసీ ఆధ్వర్యంలో దేశమంతా ఒకే ప్రక్రియ అన్నట్లు నీట్ యూజీ ప్రవేశ పరీక్ష అర్హత నిబంధన విధించింది. జాతీయ స్థాయిలో ఈ పరీక్షకు దరఖాస్తు ప్రక్రియ ఏవిధంగా ఉంటుందో గ్రామీణ ప్రాంతాల వారికి అవగాహన ఉండదు. దీని దృష్ట్యా గడువును మరింత పెంచితే పేద బాలికలకు ప్రయోజనం ఉంటుంది.

- అరుణరావు, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కళాశాలల గౌరవ అధ్యక్షుడు

వైభవంగా వేణుగోపాలుని శేషవాహన మహోత్సవం

నిత్య హోమం వద్ద అధికారులు, పాలకవర్గ సభ్యులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : నెమలి వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారికి శేషవాహన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. యాగశాలలో జరిగిన నిత్య హోమం, నవ కుంభారోహణంలో పాలకవర్గ సభ్యులు, ఉభయదాతలు పాల్గొన్నారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంలో శేష వాహనంపై గ్రామోత్సవం చేశారు. ఆలయ ఉప ప్రధానార్చకుడు తిరునఘరి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ కూడలి వద్ద ఎదురుకోల(వధూవరుల పరిచయం) ఉత్సవం నిర్వహించారు. పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశిరేఖ, సహాయ కమిషనర్ ఎన్.సంధ్య పర్యవేక్షించారు.

స్వామి కల్యాణం నేడు : వేణుగోపాల స్వామి తిరు కల్యాణం సోమవారం రాత్రి 9 గంటలకు ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని భావించి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. దాతల వితరణతో అన్నప్రసాదం పంపిణీ చేస్తారు.

ఎమ్మెల్యేలకు ఆహ్వానం : స్వామి వారి తిరు కల్యాణంలో పాల్గొనేందుకు నెమలి గుడికి రావాలని కోరుతూ జగ్గయ్యపేట, మైలవరం, నందిగామ, ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్, వసంత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, రాందాస్ నాయక్‌కు తెదేపా నాయకులు వడ్లమూడి రాజశేఖర్, బెల్లం మధుసూదనరావు ఆధ్వర్యంలో ఆదివారం ఆహ్వాన పత్రాలు అందజేశారు.

మహిళలు రాజకీయంగా ఎదగాలి

పురస్కారాలు అందజేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, గజల్ శ్రీనివాస్, రమావతి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : మహిళలు రాజకీయాలపై అవగాహన పెంచుకుని ఉన్నత పదవులు అధిరోహించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో విశ్వ సాహితీ కళా వేదిక వ్యవస్థాపకురాలు కల్లి రమావతి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన మహిళలకు 'స్త్రీ శక్తి- 2026' పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా భాగ్యలక్ష్మి, గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షుడు జి.వి.పూర్ణచంద్ హాజరయ్యారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఇంటికే పరిమితం కాకుండా పలువురు మహిళలు రాజకీయ రంగంలో రాణిస్తున్నారని, అలాగే ప్రతి మహిళా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వక్తలు మాట్లాడుతూ. . స్త్రీ తన రక్తం ధారపోసి మరొకరికి జీవం పోస్తుందని, అలాంటి ఆమెను ప్రతి ఒక్కరూ దైవంగా కొలవాలని కోరారు. ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో వారు ముందుంటున్నారని పేర్కొన్నారు. అతివల ఆశయాలు, ఆకాంక్షలు, అభిరుచులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రోత్సహిస్తూ.. వారి ఎదుగుదలకు దోహదపడాలని పేర్కొన్నారు. సుమారు వంద మంది మహిళలకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.ఆర్.కె.పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ళ నారాయణరావు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, విశ్వ సాహితీ కళా వేదిక గౌరవ అధ్యక్షుడు రంగిశెట్టి రమేష్, మల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జి.భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు.. ఉన్నతికి మెట్టు

ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న రామేశ్వర్‌గౌడ్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ఆంగ్లం వస్తే ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లొచ్చు.. అలాంటి భాషపై ముందుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు పట్టు సాధించాలని హైదరాబాద్‌లోని విల్ టు కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్ గౌడ్ అన్నారు. గురువులు పూర్తిగా నేర్చుకొని... తర్వాత విద్యార్థులకు నేర్పించి వారి ఉన్నతికి తోడ్పడాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించలేకపోతున్నారు. ఆ విషయాన్ని గుర్తించి.. వారికి పాఠాలు బోధించే ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు రామేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం నగరంలోని బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాలలో గురువులకు ఆయన శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తెలుగులో ఎలాగైతే స్పష్టంగా, అనర్గళంగా మాట్లాడుతున్నారో... ఆంగ్లంలో కూడా అలాగే మాట్లాడాలనేది తన లక్ష్యమని అన్నారు. విద్యాశాఖ సహకారంతో ఇప్పటివరకు రాష్ట్రంలోని 25 వేల మంది ఉపాధ్యాయులకు ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. ప్రస్తుతం రోజూ 2500 మంది గురువులకు ఆన్‌లైన్‌లో కూడా తర్ఫీదునిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి భాషపై పట్టు సాధించాలంటే పాఠశాల స్థాయిలోనే నేర్చుకోవాలని అన్నారు. ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేశారు. సమగ్రశిక్షా జిల్లా ఏఎంఓ ఎస్.అశోక్‌బాబు, ఏఏఎంఓ సీహెచ్ శిరీషరాణి తదితరులు పాల్గొన్నారు. రామేశ్వర్‌గౌడ్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు.

నేటి నుంచి అగ్రిగోల్డ్ బాధితుల నిరవధిక నిరాహార దీక్షలు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : అగ్రిగోల్డ్ బాధితులకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి.. సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి ధర్నా చౌక్‌లో తలపెట్టిన రిలే, నిరవధిక నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఏపీ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన దాసరి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బాధితుల సమస్యల పరిష్కారంపై మరోసారి అసోసియేషన్ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ఏడాది జనవరి నాటికి తమ అసోసియేషన్ చేపట్టిన ఉద్యమం పుష్కరకాలానికి చేరిందని గుర్తుచేశారు. అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ అలసత్వం, యాజమాన్య మోసపూరిత విధానాలను నిరసిస్తూ ఈ నెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు రిలే దీక్షలు, 5వ తేదీ నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో బాధితులకు కంపెనీ ఆస్తులు అమ్మి డబ్బులు చెల్లిస్తామని ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఛైర్మన్ అవ్వా వెంకట రామారావు, సీతారామరావులు విజ్ఞత ప్రదర్శించి.. బాధితులకు సొమ్ము చెల్లించడానికి సహకరించాలని డిమాండ్ చేశారు. నిరవధిక నిరాహార దీక్షలో అగ్రిగోల్డ్ బాధితులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు అఫ్సర్, కె.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

ఐక్యత చాటుతున్న సత్యనారాయణరెడ్డి, రమేష్, అనుగ్రహ ప్రసాద్, రామకృష్ణ తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాలని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో జిల్లా ఐకాస నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన ఛైర్మన్‌గా సత్యనారాయణరెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ శాఖలు, సంఘాలు, నాయకులతో కార్యవర్గం ఏర్పాటైన నూతన ఐకాస ఉద్యోగుల పక్షాన నిర్విరామంగా పోరాడేందుకు సిద్ధంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వంతో చర్చించి న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేస్తామని చెప్పారు. ఐకాస కో ఛైర్మన్‌లుగా పి.రమేష్, జి.అనుగ్రహ ప్రసాద్, రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా జి.నారాయణరావు, ఎస్.కె.నవాబ్‌జానీ, కె.ప్రభాకర్, జి.అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.డి.ఖాసీం, కార్యదర్శిగా జి.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా ఎం.అక్కిరాజు, సుందరయ్య, షమాబేగం, రవీంద్ర, పి.నాగరాజు, జి.సుదర్శనరావు, బి.సతీష్ కుమార్ ఎన్నికయ్యారు. పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

విద్యుత్తు టౌన్ డివిజన్ ఈఈ బాధ్యతల స్వీకరణ

కొండలరావు

సూర్యారావుపేట : విద్యుత్తు విజయవాడ టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కె.వై.కొండలరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలో శనివారం రాత్రి పలువురు అధికారులకు పదోన్నతులు లభించాయి. బదిలీల్లో భాగంగా విజయవాడ టౌన్ డివిజన్ ఈఈగా కొండలరావును నియమించారు. ఆయన గతంలో కానూరు, గుణదల, ఇబ్రహీంపట్నం సబ్ డివిజన్లలో డిప్యూటీ ఈఈగా పని చేశారు. బాపట్ల సర్కిల్‌లో విజిలెన్స్ ఈఈగా పని చేసి ఎన్టీఆర్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఎన్టీఆర్ విద్యుత్తు సర్కిల్‌లో ఎంఆర్‌టీ ఈఈగా పని చేస్తూ.. టౌన్ డివిజన్‌కు బదిలీ ఆయ్యారు. ఆదివారం సూర్యారావుపేట సర్కిల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ని పలువురు అధికారులు కలిసి అభినందనలు తెలియజేశారు.

ఈఈ రవీంద్రబాబుకు ఉద్యోగోన్నతి.. విజయవాడ టౌన్ డివిజన్ ఈఈగా పని చేస్తున్న రవీంద్రబాబుకు సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. అనంతరం ఆయన్ని కృష్ణా సర్కిల్ ఎస్ఈగా బదిలీ చేస్తూ సీఎండీ పి.పుల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

కార్యరూపం దాల్చని ఆభరణాలు.. వాహన ప్రదర్శనశాల

న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

దుర్గమ్మ బంగారు ఆభరణాలు

ఇంద్రకీలాద్రిపై ఆది దంపతుల ఆభరణాలు, వాహనాల ప్రదర్శనశాల ప్రతిపాదన ఏడేళ్లుగా కార్యరూపం దాల్చలేదు. దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులు గణనీయంగా పెరుగుతున్నారు. దసరా, కార్తిక మాసం, మహాశివరాత్రి పర్వదినాలకు గంగా, పార్వతీ సమేత దుర్గామల్లేశ్వర స్వామి వార్ల మూలవిరాట్‌లతోపాటు ఉత్సవమూర్తులకు ప్రత్యేక ఆభరణాలతో అలంకరించి చేపట్టే నగరోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. తరువాత ఆభరణాలను లాకర్లలో భద్రపరుస్తారు. దసరా ఉత్సవాల్లో అమ్మవారిని సరస్వతీ దేవి, లక్ష్మీదేవి, రాజరాజేశ్వరి దేవిగా అలంకరిస్తారు. బంగారు వీణ, అష్ట భుజాలు, అభయహస్తాలు, వజ్రకిరీటాలు, కాసుల హారాలు, స్వర్ణ కవచం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఆదిదంపతుల నగరోత్సవానికి సైతం ప్రత్యేక వాహన సేవలు ఉంటాయి. రావణ, నంది, సింహ, పల్లకి, వెండి రథం, హంస వాహన సేవలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటాయి. వాటిని ప్రతి రోజూ వీక్షించేలా ప్రదర్శన శాల ఏర్పాటు చేయాలని దుర్గగుడికి తొలి ఐఏఎస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సూర్యకుమారి ప్రతిపాదించారు. రాజధాని నగరంలో కీలకంగా మారిన దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో తిరుమల తరహాలో ఆభరణాలు, సేవల వాహనాలతో ప్రదర్శనశాల ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

కమ్యూనిస్టు పార్టీకి ప్రజలు అండగా నిలవాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

బ్రహ్మానందరెడ్డి నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రామకృష్ణ, శంకర్, కోటేశ్వరరావు తదితరులు

చుట్టుగుంట(విజయవాడ), న్యూస్‌టుడే: ప్రజా ఉద్యమాల కమ్యూనిస్టు పార్టీకి ప్రజలు అండగా నిలవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఆదివారం విజయవాడ బ్రహ్మానందరెడ్డి నగర్‌లో నిర్వహించిన 'గడప గడపకు సీపీఐ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ.. 'కమ్యూనిస్టు పార్టీకి ప్రజలు ఆర్థిక సాయం అందించి సమస్యలపై నిరంతరం పోరాడే శ్రేణులకు ప్రోత్సాహాన్ని అందించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై అందరూ సమష్టిగా పోరాడాల్సిన ఆవశ్యకత ఉంది. పోలవరం వంటి అనేక సాగునీటి ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలి. ఇళ్లు లేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. ఆ దిశగా ఎటువంటి కార్యాచరణ చేపట్టలేదు. అందుకు నిరసనగా అనేక ఉద్యమాలు చేసిన ఘనత సీపీఐకే దక్కుతుంది. అటువంటి పార్టీకి ప్రజలు విరివిగా విరాళాలు ఇచ్చి తోడ్పాటునందించాలి' అని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ... నగర సమగ్రాభివృద్ధిలో కమ్యూనిస్టుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. స్థానిక నాయకత్వం ప్రజా సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారానికి కృషి చేయాలని, ఫలితంగా పార్టీ బలోపేతం అవుతుందని అన్నారు. నాయకులు నక్కా వీరభద్రరావు, అప్పురబోతు రాము, మూలి సాంబశివరావు, ఇజ్జాడ లక్ష్మి, పడాల కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కెనోయింగ్.. కయాకింగ్ పోటీలు

సీనియర్ సి-I విజేతలతో త్రిభువన్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక పున్నమి ఘాట్‌లో జరిగిన అస్మిత ఖేలో ఇండియా కెనోయింగ్, కయాకింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. ☛ సీనియర్ మహిళల కె-2 (500 మీ.)లో ఎన్.పూర్ణ, ఎన్.గాయత్రి జోడీ ప్రథమ, ఎం.చైతన్య, పి.శరణ్య జోడీ ద్వితీయ, ఎ.తనూజ, కె.సత్యశ్రీ జోడీ తృతీయ స్థానంలో నిలిచింది. సీనియర్ కె-1లో ఎన్.గాయత్రి, పి.శరణ్య, జె.త్రివేణి, జూనియర్ కె-1లో డి.చేతన భగవతి, ఎండీ సమీన, ఎన్.పూర్ణశ్రీ తొలి మూడు స్థానాలు సాధించారు. ☛ జూనియర్ కె-2లో ఎండీ సమీన, ఎన్.పూర్ణశ్రీ జోడీ ప్రథమ, ఎం.చరితశ్రీ, ఎ.నోవిక జోడీ ద్వితీయ, డి.చేతన భగవతి, ఎస్.తేజేశ్వరి జోడీ, సీనియర్ సి-1లో జె.సౌజన్య, జి.శ్రీకృష్ణమ్మ, ఎస్కే షబానా వరుస స్థానాల్లో నిలిచారు. ☛ సి-2లో జె.సౌజన్య, డి.చేతన భగవతి జోడీ, జె.సరస్వతి, జి.కృష్ణమ్మ జోడీ, ఎస్కే షబానా, జి.విజయలక్ష్మి జోడీ తొలి మూడు స్థానాలు సాధించారు. ☛ సీనియర్ మహిళల కె-1 (200 మీ)లో ఎన్.గాయత్రి, పి.శరణ్య, ఎ.తనూజ, జూనియర్ కె-1 (200 మీ)లో డి.చేతన, సమీన, ఎం.చరితశ్రీ, బేబీ కె-1లో ఎ.మోక్షిత శ్రీజ, పి.కిషిత, పి.రిషితలకు వరుస స్థానాలు వరించాయి. ☛ ఏపీ హౌసింగ్ బోర్డు ఎండీ త్రిభువన్, డీఎస్పీ కృష్ణరాజు, విజయకృష్ణ సూపర్ బజార్ ఛైర్మన్ వి.సురేష్, కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ కన్వీనర్ వీరపనేని శశికళ విజేతలకు పతకాలు అందించారు. ఎన్టీఆర్ జిల్లా కెనోయింగ్, కయాకింగ్ సంఘం అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి పి.కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పిద్దాం

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : మంచి, చెడుల జ్ఞానం, జయాపజయాలను ఒకేలాగా చూసే దృఢ సంకల్పం అలవర్చేది ప్రభుత్వ బడి మాత్రమేనని.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం గవర్నర్‌పేటలోని సంఘ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రచార గోడపత్రికలు ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాద్‌లు మాట్లాడారు. గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్, అబ్దుల్ కలాం వంటి ప్రపంచం గర్వించే మేధావులంతా ప్రభుత్వ బడిలోనే చదివారని తెలిపారు. నైతిక, రాజ్యాంగ విలువలు నేర్పేది ప్రభుత్వ బడి మాత్రమేనని అన్నారు. బడిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజం తీసుకోవాలని కోరారు. పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలు ఉచితంగా అందించారని తెలిపారు. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు వ్యాయామం, గ్రంథాలయం, ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. మీ పిల్లలను తమ బిడ్డలుగా భావించే మంచి ఉపాధ్యాయులు ప్రభుత్వ బడిలో ఉన్నారని.. అవసరమైతే అదనంగా ఒక గంట పని చేసే వారూ ఉన్నారని పేర్కొన్నారు. యూటీఎఫ్ చేస్తున్న ప్రభుత్వ బడి అభివృద్ధి కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు కొమ్మోజు శ్రీనివాసరావు, కె.సురేష్‌కుమార్, కుసుమకుమారి, రెడ్డి మోహనరావు, బి.లక్ష్మీరాజా, ఎస్.పి.మనోహర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్చర్లకు పతకాలు

విజయవాడ క్రీడలు: పుదుచ్చేరిలో గత నెల 27 నుంచి మూడు రోజుల పాటు జరిగిన ఖేలో ఇండియా ఎన్‌టీపీఎస్ ఓపెన్ ఆర్చరీ టోర్నీలో రాష్ట్ర కాంపౌండ్ ఆర్చర్లు పతకాలు కైవసం చేసుకున్నారని రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బెవర వెంకట రమణ తెలిపారు. ఆదివారం జరిగిన స్త్రీ, పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగాల్లో కేపీఎస్ లేహ్యారెడ్డి, బి.రవితేజ రజత పతకాలతో పాటు రూ.15 వేల చొప్పున నగదు, కె.భరత్‌కుమార్ నాలుగో స్థానంలో నిలిచి రూ.5 వేల నగదు సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. వారంతా ఓల్గా ఆర్చరీ అకాడమీలో శిక్షణ పొందుతున్నారని వివరించారు. పతకాలు గెలుపొందిన ఆర్చర్లను, కోచ్‌లు నవీన్‌కుమార్, గౌరవపోదార్‌లను రాష్ట్ర ఆర్చరీ సంఘం కోశాధికారి చెరుకూరి కృష్ణకుమారి, జడ్జి కమిటీ ఛైర్మన్ భరద్వాజ అభినందించారు.

చదరంగం విజేతలు సుప్రీత, టాటా కీర్తి రాణా

విజేతలతో డాక్టర్ ఎంజే నాయుడు, కేవీ శ్రీనివాస్, రాజీవ్ తదితరులు

విజయవాడ క్రీడలు: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ది విజయవాడ చెస్ సంఘం, రాష్ట్ర చెస్ సంఘం సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్త్రీ, పురుషుల చెస్ టోర్నీలో పొట్లూరి సుప్రీత, టాటా కీర్తి రాణా విజేతలుగా నిలిచారు. మొత్తం 200 మంది క్రీడాకారులు తలపడగా.. మహిళల విభాగంలో సుప్రీత (కృష్ణా), సీహెచ్ రాధికాదేవి (గుంటూరు), పి.సహస్రవర్మ (పశ్చిమ గోదావరి), అల్లూరి నేహాశ్రీ (తూర్పు గోదావరి), పి.యశ్వితవర్మ (పశ్చిమ గోదావరి) వరుస స్థానాలు కైవసం చేసుకున్నారు. పురుషుల విభాగంలో గుంటూరుకు చెందిన టాటా కీర్తి రాణా, షేక్ అబ్దుల్ నబీ, ఎ.హరిసూర్యనారాయణ, జి.మేఘ శ్యామ్‌సాయి, పి.జయ సాకేత్ వరుస స్థానాల్లో నిలిచారు. వైద్యుడు ఎంజే నాయుడు, రాష్ట్ర సిటీ కేబుల్ ఆపరేటర్స్ సంక్షేమ సొసైటీ ప్రధాన కార్యదర్శి కేవీ శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందజేశారు. ది విజయవాడ చెస్ సంఘం కార్యదర్శి మందుల రాజీవ్ మాట్లాడుతూ.. తొలి అయిదు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు ఈ నెలలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రకటించారు.

బ్రాయిలర్ ధరలు
(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -150 రిటైల్ ధర 177 చికెన్ విత్ స్కిన్ - 257 చికెన్ స్కిన్‌లెస్ - 292.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

కారు కొందామని యత్నించి.. మోసపోయిన బిల్డర్

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : ఓఎల్ఎక్స్‌లో కారు కొందామని యత్నించిన.. ఓ బిల్డర్ రూ.15 లక్షలు మోసపోయిన ఘటనపై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. వై.ఎస్.ఆర్. కడప జిల్లా పోరుమామిళ్ల మండలం రెడ్డినగర్‌కు చెందిన ఏరువ గురుపూర్ణ బిల్డర్‌గా పని చేస్తున్నారు. ఫార్చ్యూనర్ కారు కొనేందుకు ఓఎల్ఎక్స్ వెబ్‌సైట్లో చూశారు. గత నెల 13న ఒక ప్రకటన చూసి.. తన చరవాణి నంబరును దానిలో నమోదు చేశారు. వెంటనే గుర్తు తెలియని ఓ వ్యక్తి ఫోన్ చేసి.. తన పేరు అజిత్‌కుమార్ అని పరిచయం చేసుకున్నాడు. తనకు ఇన్నోవా క్రిస్టా కారు ఉందని.. దాన్ని అమ్ముతానని, జగ్గయ్యపేటలోని తన సోదరుడు జలపతిరావు ఇంట్లో కారు ఉందని తెలిపారు. డబ్బులు తనకు పంపించి, ఆ కారు తీసుకువెళ్లవచ్చని చెప్పారు. తనకు కొన్ని అప్పులు ఉన్నాయని.. కారు అమ్మే ముందే వాటిని తీర్చాలని చెప్పడంతో అతని మాటలు నమ్మారు. గురుపూర్ణ.. విడతల వారీగా అతనికి రూ.15లక్షలు పంపించారు. ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో మోసపోయినట్లు గుర్తించారు. శనివారం రాత్రి విజయవాడ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. 81422 92071

HEALTH & CARE

మద్యపానం మానేయడం ఎలా? బరువుపెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు, విజయవాడః శ్రీశరణంలాడ్జి, పాతబస్టాండ్ ఎదురుగా, బందర్‌రోడ్, ప్రతీనెల 2, 16 తేదీల్లో మందులు.

INDUSTRY

విజయవాడ మరియు సరిహద్దు ప్రాంతాల్లో 10,000- 12,000 SFT, 3Phase Power కలిగి ఉన్న ఇండస్ట్రియల్ షెడ్ రెంటుకి కావలెను. ✆ 88866 10123

REAL ESTATE

FLAT FOR SALE

3BHK East Facing 1600 Sft. Flat with Car Parking for Sale in Royal Rightway Homes on Ramavarapupadu Inner Ring Road, Beside SLV Villas. Conact: 96666 78830.

VJA, ప్రజాశక్తి నగర్ నారాయణస్కూల్ ప్రక్కన గ్రూప్‌హౌస్ నందు గ్రౌండ్‌ఫ్లోర్ 1035 చ॥అ॥ 2BHK ఫ్లాట్ కార్‌పార్కింగ్‌తో అమ్మకం. ✆ 99854 60188.

JOBS

Wanted Freshers for Vijayawada and Hanuman Junction. Salary -10,000. On Job Training will be Provided. Contact: 76808 27755

అనుభవంగల క్వాలిఫైడ్ నర్సులు ANM/GNM కావలెను. పున్నమ్మ ఫిజియోథెరపి హాస్పిటల్, జడగం వారి వీధి, సూర్యారావుపేట, విజయవాడ ✆ 98852 22525

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్‌చార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతముః 12000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్‌వారికి ఉచితభోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ to డిగ్రీ వరకు, వయస్సు: 22 సం॥ల నుండి 40 సం॥లు ఉండవలెను. వివరములకు సంప్ర: ✆ 92487 33372.

బుక్ వర్క్ చేయుటకు అనుభవం గల DTP ఆపరేటర్స్ కావలెను. జీతం 25000/- వరకు విజయవాడ నందు సంప్రదించగలరు. 99631 31354.

కొటక్‌బ్యాంక్ అనుబంధ సంస్థకు రిటైర్డ్, VRS, స్టేట్ & సెంట్రల్ ఎంప్లాయీస్, టీచర్స్ కావలెను. వ:35-70, Q:10th, జీ:12-15 వేలు. సంప్ర: 63041 81391

ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు ANM, GNM, MPHW, చదివి అనుభవం ఉన్నా, లేని మహిళలు కావలెను. సంప్ర: 93973 41745.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR COLOUR CLASSIFIED
₹1200/- (5 Lines)
PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ◆ తిరువూరు 7వ వార్డులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు కిషోర్ సమస్యను 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ శానిటరీ అధికారి స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పూడిక తీయించారు.
◆ తిరువూరు 9వ వార్డులో చెత్తను తొలగించడం లేదని స్థానికుడు ప్రభాకర్ సమస్యను 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ అధికారులకు తెలిపారు. దీనిపై వారు స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి తీయించి ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**
◆ ఎన్టీటీపీఎస్ క్రికెట్ మైదానం అస్తవ్యస్తంగా ఉందని, నీరు వచ్చి వాకింగ్‌కు ఇబ్బందిగా ఉందని స్థానికులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎన్టీటీపీఎస్ పరిపాలన విభాగం ఆదివారం ఆ గ్రౌండ్‌లో మెరక, చదును పనులు నిర్వహించి వాకింగ్‌కు సిద్ధం చేశారు. సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం**

? విస్సన్నపేట- సత్తుపల్లి రోడ్డు తిరుపతమ్మ గుడి ఏరియాలో చెత్త తీయడం లేదు. **- స్థానికులు** ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయిస్తాం. **- కేశవ హరి కృష్ణ కుమార్, పంచాయతీ కార్యదర్శి, విస్సన్నపేట**
- న్యూస్‌టుడే, విస్సన్నపేట ? మునగపాడులో ఎస్సీ కాలనీ శివారులో రహదారి పక్కనే చెత్తా చెదారం పేరుకుపోయింది. **- కోటేశ్వరరావు, గ్రామస్థుడు**
✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- మనోజ్ పంచాయతీ కార్యదర్శి**
- న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందించారు.. నీరు అందించారు

జి.కొండూరు, న్యూస్‌టుడే : గుర్రాజుపాలెం గ్రామంలో కృష్ణా జలాల సంపులోని విద్యుత్తు మోటారు మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయిందని స్థానికులు ఆవేదన చెందారు. ఈ నేపథ్యంలో 'నిధుల కేటాయింపులే.. పనుల్లేవ్..!' శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి సహాయక ఇంజినీర్ దయానంద్ స్పందించారు. మోటారుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

ఇన్‌స్పైర్‌కు ఎస్ఎస్‌కే విద్యార్థిని ఎంపిక

దుర్గాశ్రావణి

మైలవరం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమానికి స్థానిక ఎస్ఎస్‌కే పాఠశాలలో 8వ తరగతి చదివే విద్యార్థిని జి.దుర్గా శ్రావణి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ జి.శ్రీభావన తెలిపారు. జిల్లా స్థాయిలో వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొననున్నట్లు చెప్పారు. విద్యార్థినిని కరస్పాండెంట్ గొల్లపూడి మోహనరావు, ఉపాధ్యాయులు ఆదివారం అభినందించారు.

కొండపల్లి పురపాలిక నూతన కమిషనర్‌గా శ్రీనివాసరావు

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా బి.శ్రీనివాసరావును నియమించినట్లు ఆ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్నారు. విజయవాడ జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ డిప్యూటేషన్‌పై కొండపల్లి కమిషనర్‌గా ఉన్న రమ్యకీర్తన అయిదు నెలల కిందట తిరిగి జోనల్ పరిధిలోకి వెళ్లారు. అప్పటి నుంచి పురపాలిక మేనేజర్‌గా ఉన్న వెంకటరత్నం ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో నూతన కమిషనర్‌గా నియమితులైన శ్రీనివాసరావు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

మారనున్న రూపురేఖలు.. తీరనున్న ట్రాఫిక్ వెతలు

ఇబ్రహీంపట్నం, కొండపల్లి, న్యూస్‌టుడే

మరికొన్ని నెలల్లో ఇబ్రహీంపట్నం రింగుకూడలి రూపురేఖలు మారనున్నాయి. జాతీయ రహదారి(65) నందిగామ నుంచి విజయవాడ వరకూ ఆరు వరుసలుగా విస్తరించడంతో పాటు ఇబ్రహీంపట్నం వద్ద పైవంతెన ఏర్పాటుకు జాతీయ రహదారుల భాగస్వామ్య(స్టేక్ హోల్డర్స్) సదస్సులో అంగీకారం తెలిపిన సంగతి విదితమే. దీనిపై సదస్సులో పాల్గొన్న కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)లతో మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, జాతీయ రహదారి అధికారులు అంగీకారం తెలిపారు. ఈ క్రమంలో రింగుకూడలిపై వంతెన రావడంతో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఇదిలా ఉంటే రింగు నుంచే ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి(30) ప్రారంభం కానున్న నేపథ్యంలో పైవంతెన ఏర్పాటు ఎంతో అవసరమని ట్రాఫిక్ పోలీసు అధికారులు సైతం పేర్కొంటున్నారు. పైవంతెన నిర్మించడంతో భద్రాచలం, తిరువూరు వైపుల నుంచి వచ్చే వాహనాలు రింగుకూడలి ట్రాఫిక్ పద్మవ్యూహంలో ఉండిపోకుండా నేరుగా తుమ్మలపాలెం వద్దకు వెళ్తాయి. అదే విధంగా హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు తుమ్మలపాలెం చేరుకుంటాయి. దీంతో పర్వదినాల సమయాల్లో ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంది.

ప్రస్తుతం ఇబ్రహీంపట్నం రింగు కూడలి ఇలా..

★ **ఇబ్బంది లేకుండా.. :** ఇప్పటికే నందిగామ పై భాగంలో ఆరు వరుసలతో పాటు సర్వీసు రోడ్డు ఉన్నాయి. దీంతో ఎనిమిది వరుసలుగా రహదారి విస్తరిస్తోంది. అదే సమయంలో గ్రామాల వద్ద పాస్‌వేలు ఉంటాయి. ఇబ్రహీంపట్నం రింగుకూడలి పైవంతెన ఏర్పాటు కాగానే లారీలు, కార్లు పై భాగం నుంచి రాకపోకలు సాగిస్తే ద్విచక్ర వాహనదారులు ఎటువంటి ఇబ్బంది లేకుండా గమ్యస్థానాలకు వెళ్లిపోతారు. దీంతో ప్రమాదాల స్థాయి జీరోగా ఉంటుంది. **- కృష్ణ, లక్ష్మణరావు, ట్రాఫిక్ ఎస్సైలు**

★ **పురపాలికకు ఓ కళ.. :** పైవంతెన ఏర్పాటుతో కొండపల్లి పురపాలికకు నూతన కళ వస్తుంది. ఇప్పటి వరకూ నాలుగు వరుసల రోడ్డులో అనేక ప్రమాదాలు సంభవించాయి. ఆరు వరుసల రహదారి విస్తరణతో పాటు రింగు వద్ద పైవంతెన ఏర్పాటు జరగ్గానే అనేక సమస్యలు తొలగిపోతాయి.
- చిట్టిబాబు, మున్సిపల్ ఛైర్మన్, కొండపల్లి

సజావుగా గురుకులం ప్రవేశ పరీక్షలు

ప్రశ్నపత్రాలను సరి చూస్తున్న రాజ్యలక్ష్మి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కృష్ణారావుపాలెం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం 2026- 27 విద్యా ఏడాదికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ప్రిన్సిపల్ కె.సిద్ధయ్య తెలిపారు. వీటిని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా అడిషనల్ సెక్రటరీ రాజ్యలక్ష్మి పర్యవేక్షించారు

వృద్ధాశ్రమం పునఃప్రారంభం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో రెడ్డిగూడెం ఎస్సీవాడలో వృద్ధాశ్రమం తిరిగి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు 150 మందికి చీరలు పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్షుడు సీహెచ్. వెంకటేశ్వరరావు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని పుట్రేల, వీరరాఘవాపురం, చంద్రపట్ల గ్రామాల్లో 5 మంది లబ్ధిదారులకు రూ.2,30,202ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం పంపిణీ చేశారు. నాయకులు గాదె వెంకటేశ్వరరావు, దార్ల రాజేష్, పిల్లి పాపారావు, కొలికపోగు సర్వేశ్వరరావు, ముక్కయ్య, మురళీ, గరిమెళ్ల లోకేశ్వరరావు, నారాయణ, బాలు, ప్రసాద్ పాల్గొన్నారు.
తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలోని పలు వార్డులు, పరిసర గ్రామాల్లోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే శ్రీనివాసరావు పంపిణీ చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్రేల: లబ్ధిదారులకు చెక్కులు ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తిరువూరు: కూటమి నాయకుల ఆధ్వర్యంలో...

మహిళల ఆర్థికాభివృద్ధికి శిక్షణలు దోహదం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ప్రతి ఇంటి నుంచి ఒక ఎంటర్‌ప్రెన్యూర్ రావాలన్నదే ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఉద్దేశమని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సీతారామయ్య అన్నారు. పొదుపు సంఘ మహిళలు స్వయం ప్రతిపాదిన వృద్ధి సాధించేందుకు పలు శిక్షణా కార్యక్రమాలను కేశినేని ఫౌండేషన్ నిర్వహిస్తోంది. అందులో భాగంగా శిక్షణ హైదరాబాద్ వెళ్తున్న మహిళా బృందం బస్సుకు వీరు జెండా ఊపి ప్రారంభించారు. సూపర్ సంప కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు నెహ్రూ, సంజయ్‌వర్మ, ప్రకాష్, శ్రీను, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

బస్సు వద్ద తెదేపా నేతలు, ప్రజాప్రతినిధులు

వైభవంగా శ్రీలక్ష్మీ అచ్చమ్మ పేరంటాళ్లమ్మ జాతర

వినగడప (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని వినగడప సమీప గట్టు వద్ద శ్రీలక్ష్మీ అచ్చమ్మ పేరంటాళ్లమ్మ జాతర ఆదివారం ప్రారంభమైంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోటగిరి శ్రీనివాసరావు, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో డప్పు వాయిద్యాలతో మామిడి తోరణాలు కట్టి, బోనంతో గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి అమ్మవారికి సమర్పించారు. శ్రీలక్ష్మీ స్టోన్ క్రషర్స్ యజమాని యలమంచిలి వెంకటరత్నం, త్రిపురసుందరి దంపతులు అమ్మవారికి వస్త్రాలు, పుష్పాలు అందించారు.

వినగడప: గ్రామరాశి బోనంతో కమిటీ సభ్యుల ప్రదక్షిణ

పెళ్లి కుమారుడిగా వేణుగోపాల స్వామి

జి.కొండూరు, న్యూస్‌టుడే : వెల్లటూరులో వేణుగోపాల స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండో రోజు ఆదివారం కలకండ వంశస్థుల ఆధ్వర్యంలో స్వామి వారిని పెళ్లి కుమారుడిని చేశారు. తొలత అర్చకుడు కోమలి వెంకటాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.
తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు రాజుపేట అష్టలక్ష్మి దేవాలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వెల్లటూరులో ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

తిరువూరు రాజుపేట అష్టలక్ష్మి దేవాలయంలో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

గొల్లపూడి, న్యూస్‌టుడే : యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవనశైలిని పొందవచ్చని శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకుడు వెంకటేశ్వర యోగి గురూజీ తెలిపారు. స్థానిక అనిల్ క్యాజిల్స్ అపార్టుమెంటులో ఆదివారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని కోరారు. 25 యోగ శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిన మంజుల యోగి మాతాజీని అభినందించారు. పాత కలుగ మాజీ ఛైర్మన్ బొమ్మ మధు, నిర్వాహకులు తిరుమల రమేష్ బాబు, కె.సూరిబాబు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సభలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వర యోగి గురూజీ

రైతుల కష్టాలపై అసెంబ్లీలో చర్చించాలి

మైలవరం, న్యూస్‌టుడే: నల్ల ప్రజా మంతో మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, దానిపై మైలవరం, తిరువూరు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చర్చించేలా చొరవ చూపాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు కోరారు. ఆదివారం పుల్లూరు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో రైతులతో కలిసి మామిడి తోటలను వారు పరిశీలించి పలు అంశాలను చర్చించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి, పీవీ ఆంజనేయులు, ధనలక్ష్మి, సుబ్బారావు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని మామిడి తోటలను ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి ఆ సంఘ నాయకులు, రైతులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఆమర్ భవన్ ఎం.మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పి.వి.ఆంజనేయులు, వీరారెడ్డి, ధనలక్ష్మి, కె.పరమేశ్వరరావు, వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కొత్త మంగాపురం: మామిడి తోటలో సీపీఎం, రైతు సంఘం నాయకులు

పట్టాలు కప్పరు.. అక్రమ రవాణా ఆపరు

టిప్పర్లలో తరలిస్తున్న మట్టిపై ఏ విధమైన పట్టాలు కట్టకుండానే తీసుకెళ్తున్నారు. కొత్తూరు తాడేపల్లిలోని క్వారీల నుంచి టిప్పర్లలో మట్టి రవాణా పెద్ద ఎత్తున జరుగుతోంది. నిత్యం వందలాది టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నారు. దీంతో గాలికి మట్టి కళ్లలో పడి వాహన చోదకులు, పాదచారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి టిప్పర్లపై పట్టాలు కట్టి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

పొదలు.. నిత్యం ప్రమాదాలు

మండల పరిధిలోని జీళ్ల కుంట వెళ్లే మార్గంలో మలుపు వద్ద పిచ్చి మొక్కలు, పొదలు పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు చోదకులకు కన్పించడం లేదు. ఈ క్రమంలో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సత్వరమే చర్యలు తీసుకుని ప్రమాదాల బారి నుంచి కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఎ.కొండూరు**

వయ్యారిభామ వదలవా..?

సాగు పొలాలను వయ్యారిభామలు కమ్మేస్తున్నాయి. దీంతో పంటలతో పాటు అందులో తిరిగే మనుషులకు చర్మవ్యాధులు సోకడానికి కారణమవుతున్నాయి. వయ్యారిభామ అంటే కలుపు జాతికి చెందిన ప్రమాదకరమైన మొక్క. దశాబ్ద కాలంగా రైతులను అతలాకుతలం చేస్తున్న ప్రమాదకారి. అయితే దీన్ని అన్నదాతలు ఎప్పటికప్పుడు దుక్కిలో దున్నడం తప్ప నివారించలేక పోతున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

సూచిక బోర్డులు లేక.. అవస్థలు తీరక..

మండల పరిధిలోని రేపూడి తండా వద్ద యంఎన్‌కే రహదారిపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. దీని వద్ద సూచిక బోర్డులు లేవు. ఈ క్రమంలో రాత్రి సమయంలో వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోర్డులు ఏర్పాటు చేయించి ప్రమాదాల బారి నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఎ.కొండూరు**

బైపాస్‌పై వేగ నిరోధకాల నిర్మాణం

ప్రమాదాల నివారణకు అధికారులు గొల్లపూడి బైపాస్‌పై వేగ నిరోధకాలను ఏర్పాటు చేశారు. స్థానిక మహాత్మా గాంధీ టోకు వ్యాపార కేంద్రం తదితర చోట్ల వీటిని నిర్మించారు. టోకు వ్యాపార కేంద్రం వద్ద గతంలో ఇద్దరు ముఠా కార్మికులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణలో భాగంగా వీటిని నిర్మాణం చేయించి రంగులు వేశారు. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

ఎస్సీల హక్కులు కాపాడుకోవాలని తీర్మానం

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని తోటమూలలో కేకేఆర్ అతిథి గృహంలో ఆదివారం ఎస్సీ సంక్షేమ సంఘం మండల సమావేశం నిర్వహించారు. మండల సంఘానికి ఇన్‌ఛార్జిగా డి.నారాయణను ఎన్నుకున్నారు. రాజ్యాంగం ద్వారా ఎస్సీలకు కల్పించిన హక్కులను రాజకీయాలకు అతీతంగా కాపాడుకోవాలని తీర్మానించారు. డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. డి.వెంకటేశ్వరరావు, జి.ఆదాం, పి.కోటేశ్వరరావు, ఎం.రంజిత్ కుమార్, ఎం.వేణుబాబు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి

మైలవరం, న్యూస్‌టుడే : మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పాత యూనియన్ బ్యాంకు కూడలిలోని బీఆర్.అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. వీరాస్వామి, బెనర్జీ, రామారావు, యోహాన్, ఏసురత్నం, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీబీ-జీ రామ్‌జీపై అవగాహన సదస్సులు

నందిగామ గ్రామీణం, రెడ్డిగూడెం : కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వీబీ-జీ రామ్‌జీగా మార్పు చేయడంతో దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. పాత పథకంలో లోపాలను సవరించి కొత్త పథకంలో తీసుకువచ్చిన మార్పులపై కూలీలకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులు ఉత్తర్వులిచ్చారు. ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు పత్రికా, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తారు. ఏడాదికి 125 రోజుల పని దినాలు కల్పించడానికి చట్టబద్ధమైన హామీ, వేతనాల చెల్లింపుల్లో జాప్యం ఏర్పడితే నిబంధనలు, నిరుద్యోగ భృతి, నూతన చట్టంలో చేపట్టే పనులు గురించి చెప్పాలి. 7 నుంచి 9వ తేదీ వరకు హక్కుల పరిరక్షణ దినం, గ్రామాల్లో సామూహిక ప్రతిజ్ఞలు, బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శన, 10 నుంచి 13 వరకు వికసిత్ భారత్ గ్రామ సంవాద్ కార్యక్రమంలో భాగంగా పనులపై గ్రామాల్లో రచ్చబండ చర్చలు, 16 నుంచి 22 వరకు అహింస నుంచి హక్కుల వరకు అనే అంశంపై పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, గాంధీ సూక్తుల బ్యానర్లతో ప్రదర్శనలు చేయాలి. 23 నుంచి 25 వరకు పంచాయతీరాజ్ కార్యకర్తలతో సంభాషణ, 26 నుంచి 28 వరకు 100 రోజులు పని పూర్తి చేసిన కూలీలను సన్మానిస్తారు

ప్రతిభావంతులకు అభినందన

తిరువూరు, న్యూస్‌టుడే : విజయవాడలో నిర్వహించిన జాతీయ బాలల ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో తిరువూరు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. ఇందులో 20 మంది గోల్డ్ మెడల్స్ సాధించగా, 5 గురు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ప్రిన్సిపల్ ఎస్.రవిబాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, చిత్రలేఖన ఉపాధ్యాయుడిని ఆయన ఆదివారం అభినందించారు.

పతకాలు అందుకుంటున్న గురుకుల విద్యార్థులు

గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాల సమస్య అధికం

మాట్లాడుతున్న డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను

గంపలగూడెం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల హాజరు నమోదులో ఇప్పటి వరకు ఉన్న పది నిమిషాల గ్రేస్ పిరియడ్‌ను అలాగే కొనసాగించాలని డీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను కోరారు. ఆదివారం మండలంలోని ఊటుకూరు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాల సమస్యతో చరవాణులు సరిగా పని చేయక ఉపాధ్యాయులు ముఖ హాజరు నమోదులో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. డీపీఆర్టీయూ జిల్లా, మండల నాయకులు కె.సుందరరావు, ఎన్.నరసింహారావు, కె.రాంబాబు, ఎస్.దయాకర్, డాక్టర్ జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆవుల సంచారం.. రాకపోకలకు అంతరాయం

విస్సన్నపేటలోని రోడ్లపై ఆవుల సంచారంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు, పాఠశాలల విద్యార్థులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి వీటి కదలికలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, విస్సన్నపేట

సంక్షేమ పథకాలు అమలు చేయండి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలన్నింటినీ కార్మికులకు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లి నరసింహారావు కోరారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు సీహెచ్ సుధాకర్, రాజు, ఆంజనేయులు, కోటి, శ్రీనివాసరావు, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముతో పంటలకు నష్టం

గడ్డమణుగలోయ ప్రాంతంలో క్వారీల నిర్వహణతో అవస్థలు పడుతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. క్వారీల నుంచి జిల్లాలోని పలు ప్రాంతాలకు నిత్యం కంకర రవాణాకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రహదారిపై దుమ్ము లేస్తూ తమ పంటలపై పడుతోందని అన్నదాతలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పంట నాణ్యత, దిగుబడి తగ్గుతోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

➤ వివాహిత అనుమానాస్పద మృతిపై కేసు

అనుముల్లంక(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని అనుముల్లంకలో మల్లాది జాహ్నవి రెడ్డి(23) అనే వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్సై జి.అనిల్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మల్లాది సురేంద్ర రెడ్డితో ఏలూరు జిల్లా మండవల్లి మండలం పెరికేగూడెం గ్రామానికి చెందిన జాహ్నవి రెడ్డికి ఏడాది కిందట వివాహమైంది. తదుపరి భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉండడంతో ఆమె తరచూ ప్రశ్నిస్తోంది. ఈ విషయమై ఆమె మానసిక ఒత్తిడితో ఆదివారం ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి తల్లి పేరం చంద్రావతి తన కుమార్తె మృతికి అల్లుడు కారణమని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సాయంత్రం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

భద్రత ప్రశ్నార్థకం.. అడిగితే వివాదం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, కొండపల్లి, న్యూస్‌టుడే

ఎన్టీటీపీఎస్ కాలనీ వాసుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఎన్టీటీపీఎస్‌లో విధులు నిర్వహించే ఇంజినీర్లు, కార్మికులు, సిబ్బందికి కేటాయించిన క్వార్టర్స్‌ను వారు ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇవ్వడంతో కాలనీలు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయి. ఇంజినీర్లు, కార్మికులు ఇబ్రహీంపట్నం పరిసర గ్రామాల్లో సొంత గృహాలు నిర్మించుకొని వారికి సంస్థ కేటాయించిన వాటిని ఇతరులకు అద్దెకు ఇవ్వడంతో ఈ పరిస్థితి వచ్చిందని కాలనీలోనే నివాసముంటున్న సంస్థ సిబ్బంది వాపోతున్నారు. ఇటీవల ఓ గుర్తు తెలియని వ్యక్తి మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడ ఉంటేనే భృతి చెల్లించేలా...

ఏపీ జెన్‌కో ఎన్టీటీపీఎస్‌లో విధులకు హాజరైందుకు ఇబ్రహీంపట్నం, కొండపల్లిలోని అయిదు ప్రదేశాల్లో వివిధ రకాలైన దాదాపు నాలుగు వేల క్వార్టర్లను అయిదు బహుళ అంతుస్తుల సముదాయంగా నిర్మించి వారి హోదాకు తగ్గట్టు కేటాయించింది. ఇక్కడ ఉంటేనే ఇంటి అద్దె భృతి చెల్లించేలా నిబంధనలు ఉండటంతో సొంత గృహాలు ఉన్నా వారు అద్దెలకిచ్చుకుంటూ తామే ఉన్నట్లు అద్దెను పొందుతున్నారు. గ్రామాల్లో ఒకటి, రెండు పడక గదుల ఇల్లు సుమారు రూ.3 నుంచి రూ.5 వేలు వరకు పలుకుతోంది. కాలనీలో గ్రామంలో కన్నా తక్కువ అద్దెతో నిరంతర ఉచిత విద్యుత్తు, తాగునీటి సౌకర్యం లభిస్తుండటంతో బయట వ్యక్తులు క్వార్టర్లలో ఉండేందుకు మక్కువ చూపుతున్నారు.

పరస్పరం వివాదం జరగడంతో..

ఇటీవల ఏ- కాలనీలో ఏడీఈ స్థాయి అధికారి నివసించే క్వార్టర్లలో బయటి వ్యక్తులు అద్దెకు ఉన్నారు. వారికి క్వార్టర్లలో నివాసముండే సిబ్బందికి మధ్య వివాదం రావడంతో సమస్య బయటకు వచ్చింది. గత నెలలో ఇక్కడ వరుస చోరీలు జరగడం వెనుక కూడా అద్దెకు ఉండే బయట వ్యక్తులు ఇచ్చిన సమాచారమే కారణమని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి క్వార్టర్స్‌లో నివసిస్తున్న ప్రైవేటు వ్యక్తులను గుర్తించి ఖాళీ చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇంత వరకు క్వార్టర్స్‌ను అద్దెకు ఇస్తున్న వైనం, కాలనీలో అసాంఘిక కార్యకలాపాలు తమ దృష్టికి రాలేదు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. **- వాసుదేవరావు, ఎన్టీటీపీఎస్ కాలనీల నిర్వహణాధికారి**

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

విజయవాడ తూర్పు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో నివాసం ఉండే ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లిఖిత పూర్వకంగా తెలియజేయవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ధర వరలు

వంకాయలు-16/18, టమాటా-12, బెండ-18, పచ్చిమిర్చి-38, కాకర-26, బీర-26/24, క్యాలీ ఫ్లవర్-15/20, క్యాబేజీ-14, క్యారెట్-24, దొండ-24, బంగాళదుంప-22, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుడు-20, దోస-22, సొర-8/7, పొట్ల-25, అరటికాయ-5/6, చామదుంప-24, అల్లం-70, మునగ-7/8, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-38, బీట్ రూట్-22, కీరదోస-32, బీన్స్-50, క్యాప్సికమ్-58, చింతకాయలు-65, నిమ్మ (డజను)-36/48, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/25/30. (న్యూస్‌టుడే). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కరెన్సీనగర్ :80085 74652

స్పందన: ❖ గుణదల బెత్లెహం నగర్‌లో డ్రైనేజీ పొంగుతోందని స్థానిక నివాసి రాబర్ట్ 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో పూడిక తీయించారు. ❖ గుణదల విష్ణునగర్ ఫ్లైఓవర్ కట్ట ప్రాంతంలో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి రాజ్యలక్ష్మి 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా మలేరియా అధికారి పాండ్ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల ఫాగ్ పెట్టించారు. ❖ సిద్ధార్థ నగర్ ఎస్బీఐ కాలనీ-1లో 8-12/63 విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధి దీపం వెలగడం లేదని స్థానిక నివాసి రామారావు 'మేమున్నాం... మీకు తోడుగా' ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

దయ చూపారా... మాయం చేస్తారు!

కొత్త మార్గాల్లో సెల్‌ఫోన్ల దొంగతనం

పటమట, రామవరప్పాడు, న్యూస్‌టుడే

☛ గత నెల 26న రామవరప్పాడులోని రమేష్ ఆటో ఎక్కించుకుని రింగ్ సెంటర్‌కు వెళ్తున్నారు. ఆ సమయంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడినట్లు నటించారు. రమేష్ వెళ్లి ఆ యువకులను పైకి లేపారు. తిరిగి ద్విచక్ర వాహనంపై వెళ్తూ బాగా సహాయం చేశావంటూ వెకిలిగా నవ్వుతూ వెళ్లారు. అనుమానం వచ్చి రమేష్ చూసుకుంటే జేబులో సెల్‌ఫోన్ మాయం చేశారు.

☛ గత నెల 20న ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలో సరోజిని అనే వృద్ధురాలు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఓ యువకుడు వచ్చి తన ఫోన్ స్విచ్ఛాఫ్ అయ్యిందని... కాల్ చేసుకుంటానని చెప్పి ఆమె ఫోన్ తీసుకున్నాడు. కాల్ చేస్తున్నట్లు నటించి ఫోన్ తీసుకొని పరారయ్యాడు.

మహిళలు, వృద్ధులే లక్ష్యం

సెల్‌ఫోన్ల చోరీ ముఠాలు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నాయి. ముఖ్యంగా మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నాయి. ముఖ్యంగా జన సంచారం తక్కువున్న ప్రాంతాల్లో ఒంటరి మహిళలు వెళ్తుంటే కాల్ చేయడానికి ఫోన్ కావాలని అడిగి... మాట్లాడుతున్నట్లు నటించి క్షణాల్లో సెల్‌ఫోన్ చోరీ చేసి వెళ్తిపోతున్నారు. మరికొంతమంది ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడినట్లు నటిస్తున్నారు. జాలి పడి వెళ్లి పైకి లేపితే సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోతున్నారు. ఇటీవల సెంట్రల్ డివిజన్‌లోని స్టేషన్లలో నమోదైన ఫిర్యాదుల్లో ఈ తరహా చోరీలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

☛ సెల్‌ఫోన్ చోరీ ముఠాలు పథకం ప్రకారం వ్యవహరిస్తున్నారు. సీసీ కెమెరాలు తక్కువగా ఉండే ప్రాంతాల్లో, ద్విచక్ర వాహనాల నంబర్ ప్లేట్లు తీసేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. జన సంచారం లేని ప్రాంతాల్లో మహిళలు, వృద్ధులు కనిపిస్తే మభ్యపెట్టి చోరీ చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇలాంటి మోసాల పట్ల నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని, సహాయం చేసేటప్పుడు పరిస్థితి అంచనా వేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇలాంటి ముఠాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

గాలింపు చర్యలు చేపట్టాం

గుర్తుతెలియని వ్యక్తులకు సెల్‌ఫోన్ ఇవ్వకండి. అత్యవసర కాల్ అవసరమైతే మీరే స్వయంగా డయల్ చేసి స్పీకర్‌లో మాట్లాడేలా చేయండి. అనుమానం వస్తే వెంటనే తిరిగి వెళ్లేలా గమనించండి. ఇలాంటి ముఠాల గురించి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాం. అత్యవసరమైతే 112కు సమాచారం ఇవ్వండి. - దామోదర్, సెంట్రల్ జోన్ ఏసీపీ

44 సంవత్సరాలుగా ✆ 81252 65651 ✆ 0866 2471617, 2477470
❍ ఆటలు ❍ పాటలు ❍ రోబోటిక్స్ ❍ క్రియేటివ్ లెర్నింగ్ ❍ డ్రోన్ తయారీ ❍ 3డి ప్రింటింగ్ ❍ LKG to 10th
డాన్ బాస్కో స్కూల్
Affiliated to CBSE
గురునానక్ రోడ్, ఆటోనగర్ కాలనీ ఎదురుగా, విజయవాడ-7.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

పటమట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లను పరిష్కరించి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందని, చంద్రబాబు తన పాలన అనుభవంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నారని తెలిపారు. ఆర్థికంగా పుంజుకోగానే సమస్యలను పరిష్కరిస్తామని సీఎం స్పష్టంగా తెలియజేశారని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తలపెట్టిన ఆందోళనలను విరమించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

8న సామూహిక ఉపనయనాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన గాంధీనగర్ కొత్త సేవా వేదికలో సామూహిక ఉపనయనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి దశరథ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు గోత్ర నామాలను ఫోన్ నంబరు 996609 6999లో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

మహా కుంభాభిషేక క్రతువుకు పక్కా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల 6 నుంచి 8 వరకు నిర్వహించనున్న మహా కుంభాభిషేక క్రతువును పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనా నాయక్ అన్నారు. దేవస్థానం పాలకమండలి సభ్యులు, వైదిక కమిటీ సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈవో శీనానాయక్ క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఆదివారం పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ మూడు రోజులు జరిగే ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసే కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారు వేదికలో వేదపండితులు, అర్చకుల నిర్వహిస్తారన్నారు. విమాన గోపురం, ఆలయ ప్రాంగణం, దర్శనం క్యూలైన్లు ఏర్పాటు పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈవో అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద శర్మ, ఈఈ రమాదేవి, పాలకమండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వసతులపై చర్చిస్తున్న ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాదశర్మ, ఈఈ రమాదేవి

అభివృద్ధి.. సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్య ఉంటూ.. వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం ఏడో డివిజన్ జనసేన నాయకుడు దోమకొండ అశోక్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మొగల్రాజపురంలో నిర్వహించిన జనసేన (ఉద్యమి) సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి చేయడంతో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

సభ్యత్వ నమోదులో ఉదయభాను

సామాజిక సేవ.. అభినందనీయం

బాబూరావు, వెంకటేశ్వరరావు, అజయ్‌లను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పటమట, న్యూస్‌టుడే: పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం పటమటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఇటీవల అవార్డులు అందుకున్న సీనియర్ సిటిజన్స్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వేమూరి బాబూరావు, కార్యదర్శి మోతుక్కూరి వెంకటేశ్వరరావు, పటమట వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పరుచూరి అజయ్ కుమార్‌లను ఘనంగా సన్మానించారు. సభ్యులు మాట్లాడుతూ.. బాబూరావు, వెంకటేశ్వరరావు, అజయ్... సామాజిక సేవ, సీనియర్ సిటిజన్స్ సేవలో ముందు ఉంటూ.. ఆదర్శంగా నిలుస్తున్నారని, రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు సూర్యదేవర పాపారావు, కార్యదర్శి కొల్లిపర రామ్మోహన్‌రావు, సభ్యులు కోనేరు వెంకటేశ్వరరావు, మృత్యుంజయరావు, కొల్లి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే... ప్రమాదమే

బెంజి సర్కిల్ సర్వీస్ రోడ్డు పక్కనున్న మురుగు కాలువను సిబ్బంది శుభ్రం చేయడానికి వీలుగా ఇనుప గ్రిల్‌తో కూడిన మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేశారు. అవి చాలాచోట్ల దెబ్బతిన్నాయి. పాదచారులు గమనించకపోతే ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేయించాలని అధికారులను కోరుతున్నారు.

- బెంజిసర్కిల్ (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే

వాహనాల నిలిపివేతతో ఇక్కట్లు

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట నిరుపయోగ అంబులెన్స్‌లను ఇష్టానుసారం నిలిపివేశారు. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో అవి ఉండడంతో రామవరప్పాడు రింగ్ మీదుగా వచ్చి వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. వాటిని తొలగించాలని ట్రాఫిక్ సిబ్బంది చెబుతున్నా.. ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. - కరెన్సీనగర్, న్యూస్‌టుడే

పాదచారుల రాకపోకలకు అడ్డు

వెంకటేశ్వర పురం తపాలా కార్యాలయం రోడ్డు నుంచి బెంజి సర్కిల్ సర్వీస్ రహదారి వైపునకు వెళ్లే రహదారి పక్కన పాదచారుల కోసం రూ.లక్షలు వెచ్చించి నగర పాలక సంస్థ పేవర్ బ్రిక్స్ ఏర్పాటు చేసింది. దానిపై కొన్ని నెలల నుంచి భవన నిర్మాణ సామగ్రి ఉంది. వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. పాదచారుల రాకపోకలకు అసౌకర్యంగా ఉంది.

- బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే

అల్లుకున్న తీగలతో భయాందోళన

19వ డివిజన్ ఏ కన్వెన్షన్ వెనుక వైపు రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి పిచ్చితీగలు అల్లుకున్నాయి. కొన్ని రోజుల నుంచి అవి పెరిగిపోతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుదాఘాతం చోటుచేసుకొనే అవకాశం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు అధికారులు వాటిని తొలగించాలని కోరుతున్నారు.

- లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే

కాలువలో వ్యర్థాలు తొలగించండి

2వ డివిజన్ బెత్లేహం నగర్ అంబేడ్కర్ విగ్రహం డౌన్ రోడ్డులోని కాలువలో వ్యర్థాలు తొలగించకపోవడంతో మురుగు పారడం లేదు. తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. దోమల వ్యాప్తి కూడా అధికంగా ఉందని, వీఎంసీ వాట్సప్ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే పారిశుద్ధ్య అధికారులు ఇళ్ల వద్దకు వచ్చి గొడవ పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. - గుణదల (పటమట), న్యూస్‌టుడే

ప్రజలకు మేలైన వైద్య సేవలే లక్ష్యం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ప్రజలకు మేలైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పని చేస్తోందని ఐ.ఎం.ఎ. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ పేర్కొన్నారు. నకిలీ వైద్యుల బారిన పడకుండా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివారం ఐ.ఎం.ఎ. హాలులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జోన్-2 పరిధిలోని ఐ.ఎం.ఎ. నగర శాఖల సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. ఆర్ఎంపీ, పీఎంపీ పేరుతో కొందరు అరకొర వైద్యం అందిస్తున్నారని, వారిని నియంత్రించాల్సిన అవసరం సభ్యులపై ఉందన్నారు. నకిలీ వైద్యుల కారణంగా వైద్య వృత్తిపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. దీన్ని కలిసి కట్టుగా కట్టడి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యులు తుమ్మల కార్తిక్, ఎన్.వరప్రసాద్, అనురూప్, కేశవరావు బాబు, ఫణిధర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. నగర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ వందన సమర్పణ చేశారు.

సమావేశమైన వైద్యులు

నిర్వహణ కొరవడి.. తీగలు తగలబడి

కృష్ణలంక పరిధిలో విద్యుత్తు స్తంభాలకు వేలాడుతున్న తీగలు

విద్యుత్తు స్తంభాలకు కట్టిన కేబుల్, ఇంటర్నెట్ తీగలు, బాక్సులు ప్రమాదకరంగా మారుతున్నాయి. వాటిని సామర్థ్యానికి మించి స్తంభాలకు బిగించడంతో పాటు లోపాలు తలెత్తి మంటలు రేగుతున్నాయి. ఇటీవల పీఎన్‌బీఎస్ ప్రవేశ ద్వారం సమీపంలోని స్తంభం వద్ద, గతేడాది జులైలో పోలీస్ కాలనీలోని విద్యుత్తు స్తంభానికి అమర్చిన ఇంటర్నెట్ బాక్సులోని కెపాసిటర్లలో లోపాలు తలెత్తి అగ్ని ప్రమాదాలు సంభవించాయి. కేబుల్, ఇంటర్నెట్ ప్రొవైడర్లు వాటి నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. స్తంభాలకు కట్టిన కేబుళ్లు ఒక్కోసారి ఊడి గాల్లో వేలాడటం... షార్ట్ సర్క్యూట్‌కు గురవుతున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్తంభాలకు వేలాడుతున్న తీగల్లో చాలావరకు పనికిరానివి ఉన్నాయి. సమస్యలు తలెత్తినప్పుడు మరమ్మతులు చేయడానికి, కనెక్షన్ ఇచ్చినప్పుడు విద్యుత్తు సిబ్బంది స్తంభాలను ఎక్కుతారు. ఆ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాల సమయంలో రేగుతున్న మంటలు కేబుళ్లకు, సమీపంలోని జనావాసాలకు వ్యాపించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిరుపయోగమైన తీగలు తొలగించుకోవాలని నగర పాలక సంస్థ అధికారులు సంస్థల నిర్వాహకులకు చెప్పినా... పట్టించుకోవడం లేదు. అధికారులే స్పందించి పనికిరాని తీగలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కృష్ణలంక

నగరం పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. మహాత్మాగాంధీరోడ్డు, పటమట, బెంజిసర్కిల్ ప్రాంతాల్లో కమిషనర్ ఆదివారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ రహదారులపై గుంతలు పడితే వెంటనే మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనధికారిక బ్యానర్లను తొలగించాలని పేర్కొన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె.అర్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

కనకదుర్గమ్మ విగ్రహం ఊరేగింపు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని గురునానక్ కాలనీ రామ మందిరంలో ప్రతిష్ఠ చేయనున్న కనకదుర్గమ్మ విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ఊరేగించారు. భక్తుల కోలాహలం.. డప్పువాయిద్యాల మధ్య శోభాయాత్ర సాగింది. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ నెల 5న విగ్రహాన్ని ప్రతిష్ఠ చేయనున్నారు. కార్పొరేటర్ దేవినేని అపర్ణ, తెదేపా నాయకులు గల్లా సదాశివరావు, రామ మందిరం కమిటీ సభ్యులు గోపాల్ శర్మ, సుశీల్ చడ్డా, పవన్ కుమార్, సుభాష్ చంద్ర గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వేడుకలో పాల్గొన్న భక్తులు

దూసుకొస్తున్న ప్రమాదం!

వేగ నిరోధకాల ఏర్పాటుకు వినతి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

కరెన్సీ నగర్ నుంచి మహానాడు రోడ్డు వెళ్లే హైటెన్షన్ రహదారి ప్రమాదాలకు నెలవుగా మారింది. విజేత మాల్ ఎదురుగా రోజూ వాహనాలు ఢీకొంటున్నాయి. గతంలో ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని బారికేడ్లు ఏర్పాటు చేశారు. కొంత కాలానికి తొలగించారు. కరెన్సీనగర్ ప్రధాన వీధి నుంచి హైవే సర్వీస్ రోడ్డు, హైటెన్షన్ రోడ్డుకు వెళ్లే సమయంలో ఎదురుగా వాహనాలు వేగంగా వచ్చి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

☛ బాయన బాబూజీ రహదారి నుంచి హైటెన్షన్ రోడ్డు కలిసే ప్రాంతంలోనూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపు వద్ద వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి. ☛ శ్రీరామచంద్రనగర్ ప్రధాన వీధికి వెళ్లే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. హైటెన్షన్ రోడ్డు గ్రీనరీ వద్ద పాసింగ్ ఉండడంతో వేగంగా వాహనాలు దూసుకెళ్తున్నాయి. ఇక్కడా ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి.

తరచూ వాహనాలు ఢీ కొంటున్న ప్రాంతం

☛ నాగార్జుననగర్, మహానాడు రోడ్డు ప్రాంతంలోనూ హైటెన్షన్ రోడ్డుపై వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. అక్కడ కూడా వాహనాల వేగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది.

☛ లయోల కళాశాలలో నడిచేందుకు వాకర్లకు అనుమతి ఇవ్వకపోవడంతో ఎక్కువ మంది హైటెన్షన్ రోడ్డులో వాకింగ్ చేస్తున్నారు. వేగంగా వచ్చే వాహనాలతో హడలి పోతున్నారు. అధికారులు స్పందించి అవసరమైన చోట వేగ నిరోధకాలు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

పటమట: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానిక భగత్‌సింగ్ రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మాచవరం భగత్‌సింగ్ రోడ్డుకు చెందిన కిషోర్ ప్రింటింగ్ వర్క్స్ చేస్తుంటారు. ఆరేళ్ల కిందట బజిమున్నిసాను ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆరు నెలలుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఆ క్రమంలోనే శనివారం రాత్రి కూడా గొడవ జరిగింది. అనంతరం అందరూ పడుకున్నారు. రాత్రి 1.30 గంటలకు భార్య గదిలో లేదనే విషయాన్ని కిషోర్ గ్రహించారు. లేచి చూడగా వంట గదిలో ఉరి వేసుకొని కనిపించింది. ఆమెను కిందకు దింపి 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట రమణ తెలిపారు.

కృష్ణా నదిలో పడి మహిళ మృతి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ప్రకాశం బ్యారేజీపై నుంచి కృష్ణా నదిలో పడి మహిళ మృతిచెందిన ఘటనపై ఆదివారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం తిమ్మనపాలేనికి చెందిన కడవకుదురు మహాలక్ష్మి(42)కి భర్త, ఇద్దరు సంతానం వేర్వేరు కారణాలతో మృతిచెందారు. అప్పటి నుంచి మద్యానికి బానిసైంది. మహిళా స్నేహితురాలితో కలిసి ఆమె ఆదివారం వేకువజామున మద్యం తాగి ప్రకాశం బ్యారేజీపైకి వచ్చింది. అక్కడ సెల్ఫీ దిగే క్రమంలో రెయిలింగ్ పైనుంచి నదిలో పడిపోయింది. పక్కన ఉన్న ఆమె స్నేహితురాలు ఇచ్చిన సమాచారంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. హైదరాబాద్‌లో నివాస ముంటున్న మృతురాలి, సోదరుడు, సోదరికి సమాచారం అందించారు. వారు వచ్చిన తరువాత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎస్సై భాగ్యశ్రీ తెలిపారు.

చిట్టీ డబ్బు చెల్లించలేదని కేసు నమోదు

చిట్టినగర్, న్యూస్‌టుడే: చిట్టీలు పేరుతో మోసం చేశాడని ఓ వ్యక్తిపై పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోజినగర్, 4వ వీధికి చెందిన జమల్ల అనితా మాధురి చిట్టినగర్‌లోని ముత్యాలమ్మ వీధిలోని వారి పిన్ని వద్ద ఉంటున్నారు. వారి ఇంటికి దగ్గర్లో ఉండే మడుగు శ్రీనివాస్ మధురానగర్‌లో చికెన్ దుకాణంతోపాటు చిట్టీలు నిర్వహిస్తుంటాడు. అతను 18 ఏళ్లుగా తెలిసిన వ్యక్తి కావడంతో, అతని వద్ద రూ.3లక్షలకు చిట్టీ వేసింది. 2025 డిసెంబరు నాటికి చిట్టీ పూర్తిగా చెల్లించింది. జనవరిలో చిట్టీ డబ్బులు మొత్తం ఇవ్వాల్సి ఉంది. డబ్బులు అడిగితే రావాల్సినవి, రాగానే ఇస్తానని కాలయాపన చేస్తూ వచ్చాడు. ఈనెల 27వ తేదీన ఎవరికీ కనిపించకుండా వెళ్లిపోయాడు. తనకు మాదిరిగానే మరి కొందరికి కూడా చిట్టీ డబ్బులు ఇవ్వాల్సి ఉందని తెలిసి మోసపోయినట్లుగా గ్రహించి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రకటన

మా క్లయింటు అయిన గుంటూరు, కుంచనపల్లె, అరవింద హైస్కూల్ వెనుక, పాతూర్ క్రాస్ రోడ్, శ్రీరామ్ స్నేహ ఎవెన్యూ, డోర్ నెం.402, వాస్తవ్యులు అయిన మోపిదేవి లక్ష్మణరాజు గారి కుమారుడైన మోపిదేవి వీర నాగేంద్ర శ్రీనివాస్ గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... విజయవాడ, కృష్ణలంక, డి.నెం. 41-11-6, డా. బాబూరావు వీధి కాపురస్తులు యర్రపోతు (లేటు) నాగమల్లేశ్వరరావు గారికి చెందిన ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని వారి ముఖ్య వారసులైన భార్య శ్రీమతి ఉషారాణి, వీరి సంతతి సుశీలాబాయి, సత్యప్రియ మరియు కుమారుడు సాయిరామ్ గార్లకు చెందిన ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని మా క్లయింటు కొనుగోలు చేయుటకు ఒప్పందము కుదుర్చుకొనియున్నారు. కావున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనను ఏ విధమైన అభ్యంతరములు, క్లయిములు, తనఖాలు భాగలబ్ధ తగాయిదాలు, కోర్టు జప్తులు, మరి ఏ విధమైన లావాదేవీలు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన 15 రోజుల లోగా తగిన ఆధారములతో లిఖిత పూర్వకముగా, రిజిస్టర్ పోస్టు తిరుగు రశీదు ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు. గడువులోపు ఏ విధమైన అభ్యంతరములు రానియెడల షెడ్యూలు దాఖలా ఆస్తిని నిర్వివాదమైన ఆస్తిగా భావించి మా క్లయింటు పేరున గానీ, వారు కోరిన వారి పేరున గానీ రిజిస్ట్రేషన్ పొందగలరు. గడువు దరిమిలా వచ్చు ఎట్టి అభ్యంతరములు మా క్లయింటును గానీ, షెడ్యూలు ఆస్తిని గానీ బైండు చేయజాలవు. **షెడ్యూలు:** ఎన్టీఆర్ జిల్లా (లోగడ కృష్ణాజిల్లా), పటమట రిజిస్ట్రేషన్ విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి యిలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా. విజయవాడ, కృష్ణలంక, హరనాథపురం, డాక్టర్ బాబూరావు వీదిలో యున్నట్టిన్నీ, మున్సిపల్ పాత వార్డు నెం. 29బి, కొత్త వార్డు నెం. 34, రెవెన్యూ వార్డు నెం. 10, బ్లాకు నెం. 11, ఎన్.టి.ఎస్ నెం. 355, పాత అసెస్మెంట్ నెం. 27278, కొత్త అసెస్మెంట్ నెం. 235908, పాత డోర్ నెం. 4-1-10, కొత్త డోర్ నెం. 41-11-6ర్లు దాఖలా **హద్దులు: తూర్పు:** లింగంశెట్టి సత్యనారాయణ వగైరాల ఆస్తికి, యీ ఆస్తికి మధ్య జాయింటు గోడ, **దక్షిణం:** కటకం కోటేశ్వరరావు వగైరాల ఆస్తి, **పడమర:** బాబూరావు వీధి అనే మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం:** బి-షెడ్యూలు 1వ అయిటం ఆస్తి, యీ హద్దుల మధ్య చ.గ. 247.6లు లేక చ.మీ. 207.02ర్ల స్థిరాస్తి స్థలం, అందలి గ్రౌండు, ఫస్టు ఫ్లోర్లుగా గల మద్రాస్ టెర్రస్, ఆర్.సి.సి. బిల్డింగ్ మరియు రేకుల షెడ్డు వగైరా యావత్తు కట్టడములు యాజమెంట్ హక్కులతో సహా గల స్థిరాస్తి.

తోట శివనాగేశ్వరరావు, తులిమిల్లి లక్ష్మణరావు, ఎస్. కీర్తన, న్యాయవాదులు
సత్యనారాయణ నగర్, 3వ లైన్, కృష్ణలంక, విజయవాడ - 13
సెల్: 9032563461

విజయవాడ ది.01-03-2026

భాజపా బలోపేతానికి కృషి చేయాలి

భవానీపురం: భాజపా బలోపేతానికి యువమోర్చా నాయకులు కృషి చేయాలని భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం పేర్కొన్నారు. విజయవాడలోని భాజపా జిల్లా కార్యాలయంలో యువమోర్చా కార్యవర్గం ప్రకటన కార్యక్రమం ఆదివారం జరిగింది. అడ్డూరి శ్రీరాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా పని చేయాలన్నారు. యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా గొట్టిక శివకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా దాసం దుర్గా శివసాయి, రెడ్డిపల్లి చాణక్య, ఉపాధ్యక్షులుగా కేశర గోపి, చిట్టిబాబు, జ్యోతిర్మయి, శ్రీకాంత్, ప్రమోద్, కార్యదర్శులుగా సంజయ్‌కుమార్, సాయితేజ, మనోజ్‌కుమార్, పెద్ద వెంకయ్య, ఎన్.ఎస్.శ్రీకాంత్, కోశాధికారిగా గాయత్రిని ఎంపిక చేశారు.

కమిటీని ప్రకటిస్తున్న అడ్డూరి శ్రీరాం, నాయకులు

సందడిగా నృత్య సంగీతోత్సవాలు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : అభినయ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు చింతా వెంకట్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జాతీయ స్థాయి నృత్య సంగీతోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఎల్‌వీ గ్రూప్ ఛైర్మన్ పెనుమత్స శ్రీనివాసరాజు హాజరయ్యారు. గురువులకు నాట్యకౌముది, విద్యార్థులకు నాట్య మయూరి, సంగీత సుధ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాకారులను ఇలా అభినందించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

శ్రీమతి కోనేరు ఇందిరా దేవి గారు
జననం : 04-05-1966, మరణం : 20-02-2026
సహనశీలిగా, ఆదర్శ గృహిణిగా మీ ప్రస్థానం మాకు సదా మార్గదర్శకం.
మీ ఆత్మ శాంతికై భగవంతుని ప్రార్థిస్తూ..
భర్త: కోనేరు వెంకట విష్ణు వర్ధన ప్రసాద్ (విష్ణు)
కుమార్తెలు / అల్లుళ్ళు: డా॥ కోనేరు మానస దేవి - ఏమిడి భానుచందర్; కోనేరు సౌమ్యా దేవి - కర్లపూడి మురళీకృష్ణ
తమ్ముడు - మరదలు: ఆరిగపూడి శ్యామ్‌కుమార్, మాధవి
పెద్దకర్మ : ది. 02-03-2026 సోమవారం నాడు పటమట డొంక రోడ్డులోని ANTRA LUXE ఫంక్షన్ హాలు నందు జరుపబడును.

నందిగామ
• నందిగామ • జగ్గయ్యపేట

సీఎం సహాయ నిధితో పేదలకు భరోసా

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

నందిగామ (గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని రామిరెడ్డిపల్లిలో ఆదివారం రాత్రి జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఏపీటీడీసీ ప్రాంగణంలో చెందిన 15 మంది బాధితులకు రూ.5.95 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. వీరంతా అనారోగ్యంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం సీఎంఆర్ ఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేసింది. సీఎం సహాయనిధి పేదలకు భరోసాగా నిలుస్తోందన్నారు. బాధితులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు అబ్బూరి నాగమణి, తెదేపా నాయకులు తాటి నాగమల్లేశ్వరరావు, కొత్తపల్లి బ్రహ్మం, ఉప్పుకొండూరు గురుప్రసాద్, అబ్బూరి వెంకటేశ్వరరావు, మన్నేపల్లి వినయ్, బెల్లం కోటేశ్వరరావు, గింజుపల్లి శ్రీనివాసరావు, సూరంపల్లి అప్పారావు, చెరుకుమల్లి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందన: ★ స్థానిక డీవీఆర్ కాలనీ వద్ద కృష్ణా నది నుంచి నందిగామకు తాగునీరు సరఫరా చేసే పైపులైన్ పగిలి వృథాగా పోతోందని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా ఆయన ఏఈ అధికారులతో మాట్లాడి మరమ్మతులు పనులు చేపట్టారు. మూడు చోట్ల లీకులకు మరమ్మతులు చేస్తున్నారు. ★ స్థానిక మూడో వార్డులో డ్రైనేజీ శుభ్రం చేయకపోవడం వల్ల ఇబ్బందులు ఉన్నాయని దుర్గంధం వస్తోందని స్థానికులు కమిషనర్ లోవరాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను పంపి కాలువలు శుభ్రం చేయించారు. ★ స్థానిక కాకతీయ అపోలో స్కూలు సమీపంలో కుండీల్లో చెత్త నిండిపోయిందని స్థానికులు కమిషనర్‌కు తెలియజేయగా ఆయన స్పందించి కార్మికులతో చెత్త తొలగించి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, నందిగామ

టైలర్స్ సంఘం అధ్యక్షుడిగా జగన్నాథం ఎన్నిక

నందిగామ: నందిగామ టైలర్స్ సంఘ అధ్యక్షుడిగా తుమ్మా జగన్నాథం ఎన్నికయ్యారు. నందిగామలో టైలర్స్ డే వేడుకల్లో సంఘ ఎన్నికలు నిర్వహించారు. అనంతరం ఆయనను తెదేపా నాయకులు మండవ పిచ్చయ్య, పంగా సతీష్, టైలర్లు సన్మానించారు. టైలర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

నందిగామ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య తెలిపారు. స్థానిక కాకానినగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇప్పటికే రెండు సార్లు తెదేపా ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు వేతనాలు పెంచారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు చర్యలు తీసుకున్నారని తెలిపారు. దీనికోసం రూ.86.88 కోట్లు కేటాయించారన్నారు. ప్రతినెల ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఐదు వేల మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నారని తెలిపారు.

తిరునాళ్లలో అప్రమత్తతే రక్ష

గత వేడుకల్లో భయానక సంఘటనలు ★ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే మేలు

పెనుగంచిప్రోలు, నందిగామ (న్యూస్‌టుడే)

పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ చిన్న తిరునాళ్లకు రంగం సిద్ధమయ్యింది. ఐదు రోజులు జరిగే ఈ ఉత్సవాలు ఈ నెల 4 నుంచి 8 వరకు జరగనున్నాయి. గత ఏడాది చిన్న తిరునాళ్లలో భయానక సంఘటనలు చోటుచేసుకోవడంతో భక్తులు భయాందోళన చెందారు. ఈసారి అవి పునరావృతం కాకుండా అధికారులు సమన్వయంతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కానీ ఇప్పటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకుండానే వేడుకలకు సిద్ధం కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆర్డీవో కె.బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమన్వయ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలుకు నోచుకోవట్లేదు.

ఎగ్జిబిషన్‌లో జెయింట్‌వీల్స్ ఏర్పాటు

వీటి ఫిట్‌నెస్ పరిశీలించారా?

గత తిరునాళ్లలో ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన క్రాస్‌వీల్ తొట్టె రన్నింగ్‌లో ఊడి కింద పడింది. దీంతో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఇప్పుడు కూడా ఇదే స్థలంలో జెయింట్ వీల్‌లు, టూరటోర్, డ్రాగన్ ట్రైన్, కొలంబస్ తదితర పరికరాలను రెండేసి చొప్పున ప్రమాదకరంగా ఏర్పాటు చేశారు. గత ఏడాది ఒక్కొక్క పరికరం పెడితేనే ఇరుకుగా ఉండి భక్తులు ఇబ్బందిపడ్డారు. ఈసారి అంత కంటే ఎక్కువగా ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం గమనార్హం. వీటి ఫిట్‌నెస్‌లను ఆర్‌అండ్‌బీ, దేవాదాయ, రెవెన్యూ, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు పరిశీలించి ధ్రువీకరించాలి.

పసుపు, కుంకుమల సమర్పణ రోజే కీలకం

అమ్మవారికి పుట్టింటి పసుపు కుంకుమలు సమర్పించే 7వ తేదీ వేడుకల్లో కీలకం. ఆరోజు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తారు. గత తిరునాళ్లలో వైకాపా కార్యకర్తలు పార్టీ జెండాలతో డీజేలు పెట్టుకుని బండి కట్టి హంగామా చేశారు. రెచ్చగొట్టే పాటలతో కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దాడులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపైనే రాళ్లు, నీళ్ల క్యాన్లతో దాడికి పాల్పడ్డారు. ఈసారి ఆయా శాఖలు మరింత అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆక్రమణలతో కుంచించుకుపోయిన మునేరు రోడ్డు

స్నానాలకు వెళ్లాలంటే కష్టమే..

ఆలయం వద్ద నుంచి మునేరు వైపునకు వెళ్లే రహదారి ఆక్రమణలతో ఇరుకుగా మారింది. భక్తులు మునేరులో స్నానమాచరించడానికి, భోజనాలు చేయడానికి వెళ్లి వస్తుంటారు. తలనీలాలు సమర్పించేందుకు కల్యాణకట్టను మునేరులోనే పెడుతున్నారు. స్టేషన్ వద్ద నుంచి ఆలయం వరకు కి.మీ రోడ్డుకు ఇరుపక్కలా ఆక్రమణలు చోటుచేసుకున్నాయి.

ముత్యాలమ్మ-పోతురాజు ఆలయ వార్షికోత్సవం

కీసర (కంచికచర్ల): రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని, దేవుడి దయతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. ఆదివారం కీసరలో నిర్మించిన ముత్యాలమ్మ-పోతురాజు ఆలయ ద్వితీయ వార్షికోత్సవం, అమ్మవారి బోనాల కార్యక్రమంలో ఆమె పాల్గొని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హోమాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కోగంటి బాబు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాలికలకు హెచ్‌పీవీ టీకా సిద్ధం

నందిగామ (గ్రామీణం, న్యూస్‌టుడే: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం హెచ్‌పీవీ టీకా అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే దీనిపై ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. 14-15 ఏళ్ల లోపు బాలికలకు ఒకసారి టీకా వేయడంవల్ల వీరు ఈ క్యాన్సర్ ముప్పు నుంచి కాపాడుకోవచ్చు. గోళ్లమూడి పీహెచ్‌సీ పరిధిలో 186 మంది, లింగాలపాడు పీహెచ్‌సీ పరిధిలో 236 మంది బాలికలకు ఈ టీకా వేయాల్సి ఉంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలు ఈ వ్యాధి బారినపడకుండా బాలికలకు అవగాహన కల్పించారు. టీకాలు వేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ వ్యాక్సిన్ వేయించడానికి రూ.4 వేలు ఖర్చు అవుతుండటంతో ప్రభుత్వం ఉచితంగా ఈ టీకా అందుబాటులోకి తెచ్చింది. దీనిపై గోళ్లమూడి పీహెచ్‌సీ వైద్యాధికారి విజయకృష్ణ మాట్లాడుతూ డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ఇంకా ఆదేశాలు రావాల్సి ఉందన్నారు. ఎంతమంది బాలికలకు వ్యాక్సిన్ వేయాలన్న సమాచారం సిద్ధం చేశామన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే ఈ టీకా వేయాల్సి ఉంటుందన్నారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ

నందిగామ: నందిగామలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో పేద ఆర్యవైశ్యులకు వాసవీ వృద్ధాప్య పింఛను పంపిణీ చేశారు. సంఘ నాయకుడు పారేపల్లి సాయిబాబు నేతృత్వంలో దివంగత పారేపల్లి సీతారాములు, నాగరత్నంల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల వితరణతో ఒక్కొక్కరికి రూ.750 చొప్పున పది మందికి రూ.7500 అందజేశారు. దాతలు సుబ్బలక్ష్మి, ధనలక్ష్మి, మంగతాయరు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం

పట్టా ప్రదానం చేస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య

నందిగామ (గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ పల్లెటి గ్లోబల్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ సౌమ్య ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు, బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక వేడుకలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మండవ కృష్ణకుమారి, డీవైఈవో యు.గురునాథం, ఎంఈవో-2 ఎం.పద్మ, పాఠశాల తెలుగు రాష్ట్రాల హెడ్ పాడర్ బాలాజీ, ప్రిన్సిపల్ పాడర్ కిరణ్, అకడమిక్ డైరెక్టర్ ఆరోగ్యదాస్ తదితరులు పాల్గొన్నారు. ★ నందిగామ డాన్‌బోస్కో ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే ఉత్సవం నిర్వహించారు. పై తరగతులకు ప్రమోట్ అయిన విద్యార్థులకు ప్రభుత్వ విప్ సౌమ్య, డీవైఈవో యు.గురునాథం, ఎంఈవో-2 ఎం.పద్మ, కరస్పాండెంట్ సిస్టర్ విజయ, పాడర్ విజయకుమార్‌లు పట్టాలు అందజేశారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కోగంటి సరోజినికి నివాళి

చిత్రపటం వద్ద తానా ప్రముఖులు

కంచికచర్ల, న్యూస్‌టుడే: తానా ఉపాధ్యక్షుడు కోగంటి వెంకట్, స్టేట్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగి వీరాస్వామి మాతృమూర్తి కోగంటి సరోజిని ద్వితీయ వర్ధంతి కార్యక్రమం కంచికచర్ల ఓసీ క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. తానా ప్రముఖులు జయరాం కోమటి, రవి మందలపు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి జీవీఎన్ ప్రసాద్, గుంటూరు మిర్చి యార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, సాంఘిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, సుధాకర్ కోమటి, ఆళ్ల గోపాలకృష్ణ, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జా అజయ్, తానా ప్రతినిధులు రాజా కసుకుర్తి, కృష్ణ ప్రసాద్ సోంపల్లి తదితరులు కోగంటి సరోజిని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కేంద్రం సరే.. చిన్నారులేరీ?

మండలంలోని చందాపురం సత్యం అంగన్‌వాడీ కేంద్రంలో పనులు చేస్తున్న చిన్నారులు తక్కువమంది ఉన్నారు. దీని చుట్టూ అరటి, బొప్పాయి చెట్లు పెంచారు. కిచెన్‌గార్డెన్‌లో మొక్కలకు నీరు పెట్టి పెంచుతున్నారు. మూడు నుంచి ఆయిదేళ్లలోపు చిన్నారులు ఆరుగురు, గర్భిణులు, ఇద్దరు, బాలింతలు ముగ్గురు ఉన్నారు. గ్రామ సచివాలయం వెనుక ఈ కేంద్రం ఉంది. ఓసీ కాలనీకి దూరంగా ఉండడంతో చిన్నారుల నమోదుకు తక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. చిన్నారుల నమోదు పెంపునకు కృషి చేయాల్సి ఉంది.
- చందాపురం (నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే

కర్ర జారితే ప్రమాదమే..



వీరులపాడు ప్రాంతంలో ఎటువంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా కొంతమంది డ్రైవర్లు రాత్రి సమయంలో ట్రాక్టర్లపై సుబాబుల్ కర్ర తరలిస్తున్నారు. ప్రమాదకర రీతిలో డ్రైవర్లు ఇష్టారీతిన డ్రైవింగ్ చేసుకుంటూ పొలంలో నరికిన సుబాబుల్ కర్రను కాటాల వద్దకు రవాణా చేస్తున్నారు. ట్రక్కుల్లో కర్రలు బయటకు జారిపడే పరిస్థితి కళ్లముందు కన్పిస్తున్నా రవాణా ఆపడం లేదు. దీనివల్ల ఈ వాహనాల వెనుక వచ్చే ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. కనీసం ట్రాక్టరు వెనుక భాగంలో రిఫ్లెక్టివ్ టేపులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, పెద్దాపురం(వీరులపాడు)

ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్ ఏడుకొండలు

పరిటాల (కంచికచర్ల), న్యూస్‌టుడే: సరైన దిశానిర్దేశం, నాణ్యమైన విద్యా బోధనతో సివిల్ ఇంజినీరింగ్‌లోనూ మంచి ఉద్యోగాలు సాధించవచ్చని ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా.యు.ఏడుకొండలు అన్నారు. ఆదివారం తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో సివిల్ విభాగానికి చెందిన ఏడుగురు విద్యార్థులు అయాతి కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ఉద్యోగాలు సాధించినట్లు ఏడుకొండలు తెలిపారు. వారు రూ.2లక్షలు, రూ.3 లక్షల వార్షిక వేతనంతో కొలువులకు ఎంపికయ్యారని తెలిపారు. వారిని ఆయన అభినందించారు.

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక పెద్ద మసీదులో ఇస్లాం గురువు ముఫ్తీ అబ్దుల్ హలీం రహమ్‌తుల్లా అలైహి ఐదో వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. మసీదు ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. మసీదు మతగురువు ఇమామ్ సాధిక్ అఫ్జల్‌రజా, హఫీజ్ సాబ్ హరున్‌రాజా మార్కాజి, ముతవలి ఖాజా మొహిద్దీన్, పెద్దలు పఠాన్ బడేమియా, బాబు, షూకూర్, షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి

నందిగామ, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో ప్రజారోగ్యం ప్రమాదంలో పడిందని వైకాపా రాష్ట్ర సహాయ కార్యదర్శి మద్దుకూరు సాయిబాబు విమర్శించారు. ఆదివారం నందిగామలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కల్తీ పాలు, కలుషిత నీరు తాగి అనారోగ్యం పాలవుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాలు, తాగునీరు తాగాలన్నా ప్రజలు భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

వైకాపా పాలనలో కల్తీ సారా మరణాలు లేవా?

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో జంగారెడ్డిగూడెంలో కల్తీసారా తాగి 25 మంది మృతిచెందారని, ప్రస్తుతం ఆ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం మానుకోవాలని తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్ అసమర్థపాలనలో రామతీర్థం, కాకినాడ ప్రాంతాల్లో అతిసారంతో పలువురు చనిపోయారని తెలిపారు. కల్తీపాల సంఘటనలో బాధితులకు సీఎం చంద్రబాబునాయుడు అండగా ఉండి వైద్యం అందించారని, దీనిపై వైకాపా విషప్రచారం మానుకోవాలని తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

వీడని నిర్లక్ష్యం.. తొలగింపులో జాప్యం

కంపచెట్లలో ఒరిగిపోయిన స్తంభం


తాగునీటి పైలట్ ప్రాజెక్టు వద్ద ఇలా..

పల్లగిరికొండ వద్ద, రాఘవాపురం తాగునీటి పైలట్ ప్రాజెక్టు వద్ద ముళ్లచెట్లలో మూసుకుపోయిన పాత విద్యుత్తు స్తంభాలు, తీగలను తొలగించకుండా విద్యుత్తు శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గతంలో ఈ తాగునీటి పంప్‌హౌస్ మోటార్లకు, పల్లగిరికొండపైకి నందిగామ విద్యుత్తు సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్తు సరఫరా చేసేవారు. ఏడాది క్రితం తొర్రగుడిపాడు విద్యుత్తు ఉపకేంద్రం నుంచి 11కేవీ విద్యుత్తు లైన్ ద్వారా వీటికి సరఫరా చేస్తున్నారు. దొంగలు ఎత్తుకుపోకముందే పాత లోటెన్షన్ లైన్(ఎల్‌టీ) స్తంభాలు, తీగలను తొలగించి విద్యుత్తు ఉపకేంద్రానికి తరలించాలి. కానీ సిబ్బంది వీటిని పూర్తిగా వదిలేశారు. దీనిపై నందిగామ విద్యుత్తు ఏఈ నాగేశ్వరరావును వివరణ కోరగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి పాత ఎల్‌టీ లైన్ తీగలు, స్తంభాలను తొలగిస్తామని చెప్పారు.
-నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

నేటి నుంచి వీబీ-జీ రామ్‌జీపై అవగాహన సదస్సులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వీబీ-జీ రామ్‌జీగా మార్పు చేయడంతో దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. పాత పథకంలో లోపాలను సవరించి కొత్త పథకంలో తీసుకువచ్చిన మార్పులపై కూలీలకు, ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులు ఉత్తర్వులిచ్చారు. ఈనెల 2 నుంచి 6వ తేదీ వరకు పత్రికా, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తారు. ఏడాదికి 125 రోజుల పనిదినాలు కల్పించడానికి చట్టబద్ధమైన హామీ, వేతనాలు చెల్లింపుల్లో జాప్యం ఏర్పడితే నిబంధనలు, నిరుద్యోగ భృతి, నూతన చట్టంలో చేపట్టే పనులు గురించి చెప్పాలి. 7 నుంచి 9వ తేదీ వరకు హక్కుల పరిరక్షణ దినం, గ్రామాల్లో సామూహిక ప్రతిజ్ఞలు, బ్యానర్లు, పోస్టర్లు ప్రదర్శన, 10 నుంచి 13 వరకు వికసిత్ భారత్ గ్రామ సంవాద్ కార్యక్రమంలో భాగంగా పనులపై గ్రామాల్లో రచ్చబండ చర్చలు, 16 నుంచి 22 వరకు అహింస నుంచి హక్కుల వరకు అనే అంశంపై పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, గాంధీ సూక్తుల బ్యానర్లతో ప్రదర్శనలు చేయాలి. 23 నుంచి 25 వరకు పంచాయతీరాజ్ కార్యకర్తలతో సంభాషణ, 26 నుంచి 28 వరకు 100 రోజులు పని పూర్తిచేసిన కూలీలను సన్మానిస్తారు. ఈ మేరకు కలెక్టర్ జిల్లాలోని పథకం పీవోలు, ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవోలకు ఆదేశాలు జారీచేశారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా వినూత్న ప్రచారం

విచిత్ర వేషధారణలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న పోలీసులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ ఆలయం వద్ద భక్తులకు, యువకులకు అవగాహన కల్పించారు. విచిత్ర వేషధారణతో మైక్ పట్టుకుని మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దని కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. వీటివల్ల కలిగే శారీరక, మానసిక అనారోగ్య, ఆర్థిక సమస్యలు వివరించారు. అలాగే రోడ్డు భద్రత నిబంధనలను పాటించకపోతే ప్రమాదాల్లో ప్రాణాలే కోల్పోతారని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో.. వారపు సంతలు, తిరునాళ్లలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడిని ఆలయ అధికారులు, పోలీసులు అభినందించారు.

4వ తేదీన అమ్మవారికి తొలి పొంగళ్లు

కరపత్రాలు ప్రదర్శిస్తున్న మాదిగ కుల ఐక్యవేదిక ప్రతినిధులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: స్థానిక తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల సందర్భంగా 4వ తేదీన మాదిగ కులస్థుల తొలి పొంగళ్లు, బోనాల జాతర జరుగుతుందని మాదిగ కుల ఐక్యవేదిక ప్రతినిధులు తెలిపారు. అమ్మవారి సత్రాల వద్ద మాది ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. వేడుకల తొలి రోజు ఉదయం 4.45 గంటలకు సంప్రదాయం ప్రకారం తొలి పొంగళ్లు సమర్పించనున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథిగా మంద కృష్ణమాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. మాదిగలు, భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు ముండ్లపాటి ప్రసాదరావు, జిల్లేపల్లి సుధీర్‌బాబు, పొట్టపింజర రాము, జిల్లేపల్లి ప్రభాకరావు, బెజవాడ శ్రీనివాసరావు, కోట రాజా, పరగటి మధు మురళీ, బొడ్డు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు తిరుపతమ్మ ఆలయం మూసివేత

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం వల్ల ఈ నెల 3వ తేదీన పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఈవో మహేశ్వరరెడ్డి తెలిపారు. బాలభోగం, మహానివేదన అనంతరం ఉదయం 7.30 గంటలకు ఆలయానికి కవాటబంధనం చేయనున్నట్లు చెప్పారు. తిరిగి 4వ తేదీ ఉదయం నిత్యపూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులు గమనించాలని కోరారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: స్థానిక తిరుపతమ్మ ఆలయంలో నిత్యాన్నదానానికి పల్నాడు జిల్లా కారంపూడి మండలం గోదావరిపల్లి గ్రామానికి చెందిన హరిదాసు సాంబశివరావు దంపతులు రూ.10,116 విరాళాన్ని ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుడు రమేష్‌బాబులకు అందజేశారు. అలాగే విజయవాడకు చెందిన ఎం.కేదారేశ్వరరావు, పెనుగంచిప్రోలు వైపీఆర్ గార్డెన్స్‌కు చెందిన వై.పురుషోత్తంలు రూ.10,116 చొప్పున విజయవాడ పోరంకికి చెందిన ఘంటా శ్రీకాంత్ రూ.10 వేలు విరాళంగా ఇచ్చారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు, వేదపండితులు వేద ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. వైకాపా నాయకుడు కాకాని హరి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెంలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని సహకార సంఘ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్ ప్రారంభించగా.. 350 మందికి వైద్య పరీక్షలు చేసి మందులతో పాటు 30 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైద్యులు సీతారామ్, యోజేంద్ర, వెంకటరమణ, ప్రేమ్‌సాయి, రమ్య, ట్రస్ట్ సమన్వయకర్త వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా గురుకుల ప్రవేశ పరీక్షలు

ఎ.కొండూరు: మండల పరిధిలోని కృష్ణారావుపాలెం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం 2026- 27 విద్యా ఏడాదికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ప్రవేశ పరీక్షలు సజావుగా జరిగాయని ప్రిన్సిపల్ కె.సిద్ధయ్య తెలిపారు. వీటిని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా అడిషనల్ సెక్రటరీ రాజ్యలక్ష్మి పర్యవేక్షించారు

వృద్ధాశ్రమం పునః ప్రారంభం

రెడ్డిగూడెం, : అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో రెడ్డిగూడెం ఎస్సీవాడలో వృద్ధాశ్రమం తిరిగి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు 150 మందికి చీరలు పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్.. డ్రైవర్ మృతి

పొక్లెయిన్‌తో వాహనాన్ని బయటకు తీస్తున్నారిలా..

జుజ్జూరు (వీరులపాడు): ట్రాక్టర్ అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లడంతో డ్రైవర్ అదే ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన ఘటన మండల పరిధి జుజ్జూరు శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధి గోకరాజుపల్లి గ్రామానికి చెందిన మెల్లెంపూడి మహేష్(45) వ్యవసాయ కూలీలను సమీప జుజ్జూరు గ్రామంలో దించి తిరుగు ప్రయాణంలో గోకరాజుపల్లి వస్తున్నాడు. మార్గమధ్యలో ఇంజిన్‌కు, ట్రక్కుకు మధ్యలో ఉన్న లింక్ తెగిపోవడంతో అదుపుతప్పిన రోడ్డు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ మహేష్ జారి కింద పడిపోగా.. అతనిపై ట్రాక్టర్ ఉండిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై అభిమన్యు సంఘటనా స్థలానికి చేరుకుని మహేష్ మృతదేహాన్ని నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వసతిగృహ ఉద్యోగికి సత్కారం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బాయ్స్ వసతిగృహంలో కుక్‌గా సుదీర్ఘకాలం పనిచేసిన వాంకుడోత్ శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా గోర్‌బాయ్ సేవా సంఘం సభ్యులు ఆయనను సన్మానించారు. సంఘం అధ్యక్షుడు లహోరి బందునాయక్, భూక్యా, బద్యానాయక్, శ్రీకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు శాఖ ఏఈ బాధ్యతల స్వీకరణ

అల్లూరు(వీరులపాడు), న్యూస్‌టుడే: వీరులపాడు మండల విద్యుత్తు శాఖ ఏఈగా వి.సురేష్‌కుమార్ అల్లూరు సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయవాడ పరిధి ముత్యాలంపాడు జేఈగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

చెత్త కుప్పలు తొలగించరూ..



మండలంలోని షేర్‌మహమ్మద్‌పేట గ్రామం నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఇరువైపులా చెత్తకుప్పలు అధికంగా ఉన్నాయి. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలికి వ్యర్థాలు ఒక్కసారిగా కొట్టుకొచ్చి వాహనదారులపై పడుతున్నాయి. ఈ వ్యర్థాలను తినడానికి వచ్చిన కుక్కలు ప్రయాణికులపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తకుప్పలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జగ్గయ్యపేట గ్రామీణం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మాట్లాడుతున్న వెంకటేశ్వర యోగి గురూజీ

గొల్లపూడి: యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవనశైలి పొందవచ్చని శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకుడు వెంకటేశ్వర యోగి గురూజీ తెలిపారు. స్థానిక అనిల్ క్యాజిల్స్ అపార్టుమెంటులో ఆదివారం నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని కోరారు. 25 యోగా శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిన మంజుల యోగి మాతాజీని అభినందించారు. పాత శివాలయం మాజీ ఛైర్మన్ బొమ్ము మధు, నిర్వాహకులు పాల్గొన్నారు.

(c) eenadu

విజయవాడ పశ్చిమ

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో నివాసం ఉండే ప్రజలు తమ ఎదుర్కొంటున్న సమస్యలను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

? నెహ్రూ బొమ్మ కూడలిలో, ఐదో లైన్ కుమ్మరి వీధి కాలువలో పూడిక పేరుకుపోయింది. -నరేష్, స్థానికుడు

✔ పూడిక తీయిస్తాం.- నరసింహారావు, శానిటరీ అధికారి

? పాతబస్తీ శివాలయం వీధిలో రాత్రి వేళ కుక్కల బెడద అధికంగా ఉంది. - మహేంద్ర, స్థానికుడు ✔ వాటిని పట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - సోమశేఖర్, అసిస్టెంట్ వెటర్నరీ విభాగం అధికారి – న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

స్పందన: చిట్టినగర్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురు వీధి కాలువలో పూడిక పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. ఆదివారం వార్త ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు. ✦ గొల్లపాలెం గట్టు సాయిబాబా ఆలయం మార్గంలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. ఆదివారం వార్త ప్రచురితమైంది. స్పందించిన వెటర్నరీ విభాగం అధికారులు వాటిని పట్టారు. - **న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్**

ఇద్దరు ముఖ్యమంత్రుల శంకుస్థాపన.. అయినా కాలయాపన

న్యూస్‌టుడే, విద్యాధరపురం: గట్టు వెనక లేబరు కాలనీలో స్టేడియం నిర్మాణం పుష్కరకాలం గడచినా పట్టాలెక్కలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చిట్టచివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, విభజిత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి చంద్రబాబు పశ్చిమ నియోజకవర్గంలో బహిరంగ క్రీడా ప్రాంగణ నిర్మాణం ఆవశ్యకతను గుర్తించి ఎకరాల విలువైన స్థలంలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గడచిన వైకాపా పాలనలో దీన్ని నిర్మిస్తామని చెప్పి ప్రతిపాదనను ఇండోర్ స్టేడియం నిర్మాణానికి పరిమితం చేశారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు వేసిన శిలాఫలకాన్ని సైతం నాటి పాలకులు తొలగించారు. గడచిన ఐదేళ్లలో రూ.6 కోట్ల వ్యయంతో చేపట్టిన ఇండోర్ స్టేడియం పనులు కూడా నత్తనడకతో పోటీపడ్డాయి. పనులు కూడా నాసిరకంగా ఉన్నాయని ప్రజాప్రతినిధులు కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకొచ్చినా.. ఫలితం లేదు. కూటమి ప్రభుత్వం నేతలు జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొనే విధంగా లేబరుకాలనీ ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశారు. గడచిన రెండేళ్ల కాలంలో రెండు సార్లు ఎగ్జిబిషన్‌కు, మరో రెండు సార్లు దీపావళి బాణాసంచా విక్రయాలకు ఈ స్టేడియం స్థలాన్ని కేటాయించి సరిపెట్టారు. నగరపాలక సంస్థకు ఆదాయం స్వల్పంగా లభించినా రూ. కోటి వెచ్చించి చేపట్టిన నడకమార్గం(వాకింగ్ ట్రాక్) ధ్వంసమైందని అధికారులే చెబుతున్నారు. ఈవిషయమై స్థానిక కార్పొరేటర్ బత్తుల మారిని సంప్రదించగా స్టేడియం నిర్మాణ పనులు వేగవంతం చేసేవిషయం కౌన్సిల్లో ప్రస్తావన చేశామన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఎంపీ కేశినేని శివనాథ్ ఇక్కడ జాతీయ స్థాయి స్టేడియం నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తున్నారని తెలిపారు.

పట్టాలెక్కని లేబరు కాలనీ క్రీడా ప్రాంగణం

కొండపై మంటలు.. హడలెత్తిన ప్రజలు

చిట్టినగర్, న్యూస్‌టుడే: భీమనవారిపేట కొండప్రాంతంలో ఆదివారం సాయంత్రం కొండపై మంటలు రేగడంతో ఆ ప్రాంతవాసులు హడలిపోయారు. మంటలు ఇళ్లకు అంటుకుంటాయేమోనని ఆందోళన చెందారు. వీటిని ఆర్పేందుకు బకెట్లతో నీళ్లు సిద్ధం చేసుకున్నారు. అగ్నికీలలు కొండపైకి ఎగబాకడంతో ఊపిరి పీల్చుకున్నారు. విష పురుగులు ఇళ్లలోకి రాకుండా ఎవరో నిప్పు అంటించి ఉంటారని స్థానికులు చెబుతున్నారు.

మహా కుంభాభిషేక క్రతువుకు పక్కా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల 6 నుంచి 8 వరకు నిర్వహించనున్న మహా కుంభాభిషేక క్రతువుకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ అన్నారు. దేవస్థానం పాలకమండలి సభ్యులు, వైదిక కమిటీ సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈవో శీనానాయక్ క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఆదివారం పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ మూడు రోజులు జరిగే ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసే కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పర్యవేక్షణలో వేదపండితులు, అర్చకులు నిర్వహిస్తారన్నారు. విమాన గోపురం, ఆలయ ప్రాంగణం, దర్శనం క్యూలైన్లు ఏర్పాటు పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈవో అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద శర్మ, ఈఈ రమాదేవి, పాలకమండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఈఈ రమాదేవి

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి గుడివాడకు చెందిన పి.పిచ్చంశెట్టి రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణస్వామి వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దాత పి.పిచ్చంశెట్టికి విరాళం రసీదు అందజేస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ స్వామి

చిట్టినగర్ అమ్మవారి గుడి పాలకపక్షంపై ప్రశ్నల వర్షం

చిట్టినగర్, న్యూస్‌టుడే: చిట్టినగర్‌లోని శ్రీనగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన ఆలయ కమిటీ సర్వసభ్య సమావేశం గందరగోళం నడుమ ముగిసింది. కమిటీ కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు జమ, ఖర్చులు సభలో వివరించారు. ఈ విషయమై సభ్యులు కొన్ని అభ్యంతరాలను వ్యక్తంచేస్తూ పాలక పక్షంపై ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో కాసేపు రసాభాసాగా మారింది. కమిటీ సమన్వయంతో పాలన సాగించలేదని అవగాహనా లోపంతో కొన్ని సమస్యలు తలెత్తాయని సభ్యులు ఆరోపించారు. పాలక పక్షం వాటికి సమాధానం చెప్పినా వినే స్థితి కనిపించలేదు. ప్రస్తుత కమిటీ గడువు ముగియడంతో ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించారు. కో-ఆపరేటివ్ సొసైటీ విశ్రాంత అధికారి, హైకోర్టు న్యాయవాది రామచంద్రరావును ఎన్నికల అధికారిగా నియమించేందుకు సభ అనుమతించింది. ఆయనను కలిసిన అనంతరం ఎన్నికల తేదీ, షెడ్యూల్‌ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఏప్రిల్‌లో ఎన్నికల జరిగే అవకాశం ఉన్నట్లు చెప్పారు. దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి పెద్ద పీట వేసినట్లు పాలక పక్షం తెలిపింది. సమావేశంలో ఆలయ కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, మజ్జి శ్రీనివాసరావు, పోతిన భేసుకంఠేశ్వరుడు, కె.నరసింహారావు, శీరం వెంకట్రావు, కొరగంజి భాస్కరరావు, పలువురు కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జమ, ఖర్చులు వెల్లడిస్తున్న కోశాధికారి శ్రీనివాసరావు

భాజపా బలోపేతానికి కృషి చేయాలి

భవానీపురం, న్యూస్‌టుడే: భాజపా బలోపేతానికి యువమోర్చా నాయకులు కృషిచేయాలని భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం పేర్కొన్నారు. విజయవాడలోని భాజపా జిల్లా కార్యాలయంలో యువమోర్చా కార్యవర్గం ప్రకటన కార్యక్రమం ఆదివారం జరిగింది. అడ్డూరి శ్రీరాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా పని చేయాలన్నారు. కష్టపడి పని చేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని వెల్లడించారు. యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా గొట్టిక శివకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా దాసం దుర్గా శివసాయి, రెడ్డిపల్లి చాణక్య, ఉపాధ్యక్షులుగా కేశర గోపి, చిట్టిబాబు, జ్యోతిర్మయి, శ్రీకాంత్, ప్రమోద్, కార్యదర్శులుగా సంజయ్‌కుమార్, సాయితేజ, మనోజ్‌కుమార్, పెద్ద వెంకయ్య, ఎన్.ఎస్.శ్రీకాంత్, కోశాధికారిగా గాయత్రి, సభ్యులను ఎంపిక చేశారు.

యువమోర్చా జిల్లా కమిటీని ప్రకటిస్తున్న అడ్డూరి శ్రీరాం, నాయకులు

కొమరవోలు స్వామికి పట్టువస్త్రాల సమర్పణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం దత్తత దేవాలయమైన పామర్రు మండలం కొమరవోలు అమరలింగేశ్వర దుర్గా నాగేశ్వర స్వామి వార్ల కల్యాణాన్ని పురస్కరించుకొని దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ ఆదివారం పట్టువస్త్రాలను అందజేశారు. సంప్రదాయబద్ధంగా మంగళ వాయిద్యాలతో పట్టువస్త్రాలను నెత్తిన పెట్టుకొని వచ్చిన వారు ఆలయ అర్చకులకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాదశర్మ, ఈఈ రమాదేవి, ఏఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

చిట్టినగర్, న్యూస్‌టుడే: కొత్తపేట కేబీఎన్ కళాశాలలో సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ వ్యాన్ల ద్వారా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. 38, 51, 52 డివిజన్లలోని కొత్తపేట, మల్లికార్జునపేట, బ్రాహ్మణ వీధి, చేపల మార్కెట్ ప్రాంతం, గుప్తా సెంటర్, కుమ్మరిపాలెం సెంటర్, తదితర ప్రాంతాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కంటి వైద్య పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు చేయాల్సిన వారిని గుర్తించారు. వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నారు. దంత పరీక్షలు చేయించుకున్న వారికి కొన్ని సూచనలతోపాటు మందులు ఉచితంగా అందించారు. ఈసీజీ, 2డీ ఎకో, ఎక్స్‌రే వంటివి కూడా తీశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో వి.నారాయణరావు, కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, సుజనామిత్ర సభ్యులు పాల్గొన్నారు.

కేబీఎన్ కళాశాలలో ప్రజలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

నగరం పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. మహాత్మాగాంధీరోడ్డు, పటమట, బెంజిసర్కిల్ ప్రాంతాల్లో కమిషనర్ ఆదివారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ రహదారులపై గుంతలు పడితే వెంటనే మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనధికారిక బ్యానర్లను తొలగించాలని పేర్కొన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె.అర్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

ఈ బుడతలు.. కరాటేలో దిట్టలు

న్యూస్‌టుడే, చిట్టినగర్

కొత్తపేట కేబీఎన్ కళాశాల యాజమాన్యం కొన్ని సంవత్సరాలుగా వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు కరాటే శిక్షకురాలు వరలక్ష్మీదేవి ద్వారా ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. తర్ఫీదులో రాటుదేలి పతకాలు, బెల్టులు సాధిస్తున్నారు. ఇటీవల తమ పంచ్‌లతో ప్రత్యర్థులను మట్టికరిపిస్తున్న కొందరు బుడతలు తమ మనోభావాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

కరాటే నేర్చుకుంటూ..

ధైర్యం పెరిగింది: నేను ఎల్‌పీసీటీ గుజరాతీ పాఠశాలలో చదువుతున్నాను. కరాటే అంటే ఆసక్తి. మూడేళ్లుగా శిక్షణ పొందుతున్నాను. ప్రస్తుతం పర్పుల్ బెల్టు స్థాయిలో ఉన్నాను. కటా, కుమితే విభాగాల్లో 2 బంగారు, 4 రజత, 4 కాంస్య పతకాలు సాధించాను. చిన్న విషయానికి భయపడే వాడిని.. ఇప్పుడు నాకు ధైర్యం పెరిగింది. **- ఆర్.లోకేష్, 6వ తరగతి**

ముగ్గుర్ని ఎదుర్కోగలను: చిట్టూరి పాఠశాలలో చదువుతున్న నాకు మా తల్లిదండ్రులు కరాటే శిక్షణకు చేర్పించారు. కటా, కుమితే విభాగాల్లో మూడేళ్లుగా తర్ఫీదు పొందుతున్నాను. పలు పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాను. ఆత్మస్థైర్యం పెరిగింది. ఇద్దరు, ముగ్గురిని ఎదుర్కోగలను. పంచ్‌లు కొట్టడంలో మెలకువలు నేర్చుకుంటున్నాను. **- సిహెచ్.సాయిస్మరణ్, 8వ తరగతి**

సాధన చేస్తున్నాను: చదువుతో పాటు ఇతర అంశాల్లోనూ ప్రావీణ్యత సంపాదించాలనే ఉద్దేశంతో మా తల్లిదండ్రులు కరాటే శిక్షణ ఇప్పిస్తున్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం పెరిగి చదువులో బాగా రాణిస్తారని ఉపాధ్యాయులు చెప్పారు. బాగా సాధన చేస్తున్నాను. పలు పోటీల్లో పాల్గొని బహుమతులు అందుకున్నాను. **- కె.తీనీష్ సాయితేజ, 8వ తరగతి**

చదివింది గుర్తుంటోంది: మద్ది సుబ్బారావు ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో చదువుతున్నాను. నాన్న కోరిక మేరకు కరాటేలో చేరాను. పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాను. ఎల్లో బెల్టు స్థాయిలో ఉన్నాను. ఎంతో హుషారుగా ఉంటున్నాను. మెదడు చురుగ్గా పని చేస్తుంది. ఒకసారి పాఠం విన్నా ఇట్టే గుర్తుండిపోతుంది. **- కె.హర్షిత్, 4వ తరగతి**

భయం తగ్గింది: నాది కొత్తపేట. కూరపాటి చంద్రశేఖరరావు ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో చదువుతున్నాను. కరాటేలో కుమితే, కటా విభాగంలో రెండేళ్లుగా శిక్షణ పొందుతున్నాను. పరీక్షలు అంటే భయపడేవాడిని. ఇప్పుడు పోయింది. ఆరెంజ్ బెల్టు స్థాయిలో ఉన్నాను. పలు పోటీలలో బహుమతులు అందుకున్నాను. **- బి.గౌతమ్, 5వ తరగతి**

సమావేశమైన వైద్యులు

ప్రజలకు మేలైన వైద్య సేవలే లక్ష్యం

గవర్నర్‌పేట: ప్రజలకు మేలైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పని చేస్తోందని ఐ.ఎం.ఎ. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ పేర్కొన్నారు. నకిలీ వైద్యుల బారిన పడకుండా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివారం ఐ.ఎం.ఎ. హాలులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జోన్-2 పరిధిలోని ఐ.ఎం.ఎ. నగర శాఖల సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. ఆర్ఎంపీ, పీఎంపీ పేరుతో కొందరు అరకొర వైద్యం అందిస్తున్నారని, వారిని నియంత్రించాల్సిన అవసరం సభ్యులపై ఉందన్నారు. నకిలీ వైద్యుల కారణంగా వైద్య వృత్తిపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. దీన్ని కలిసి కట్టుగా కట్టడి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యులు తుమ్మల కార్తిక్, ఎన్.వరప్రసాద్, అనురూప్, కేశవరావు బాబు, ఫణిధర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. నగర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ వందన సమర్పణ చేశారు.

కృష్ణా నదిలో పడి మహిళ మృతి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ప్రకాశం బ్యారేజీపై నుంచి కృష్ణా నదిలో పడి మహిళ మృతిచెందిన ఘటనపై ఆదివారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం తిమ్మనపాలేనికి చెందిన కడవకుదురు మహాలక్ష్మి(42)కి భర్త, ఇద్దరు సంతానం వేర్వేరు కారణాలతో మృతిచెందారు. అప్పటి నుంచి మద్యానికి బానిసైంది. మహిళా స్నేహితురాలితో కలిసి ఆమె ఆదివారం వేకువజామున మద్యం తాగి ప్రకాశం బ్యారేజీపైకి వచ్చింది. అక్కడ సెల్ఫీ దిగే క్రమంలో రెయిలింగ్ పైనుంచి నదిలో పడిపోయింది. పక్కన ఉన్న ఆమె స్నేహితురాలు ఇచ్చిన సమాచారంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. హైదరాబాద్‌లో నివాసముంటున్న మృతురాలి, సోదరుడు, సోదరికి సమాచారం అందించారు. వారు వచ్చిన తరువాత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎస్సై భాగ్యశ్రీ తెలిపారు.

చిట్టీ డబ్బు చెల్లించలేదని కేసు నమోదు

చిట్టినగర్, న్యూస్‌టుడే: చిట్టీలు పేరుతో మోసం చేశాడని ఓ వ్యక్తిపై పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోజినగర్, 4వ వీధికి చెందిన జమళ్ల అనితా మాధురి చిట్టినగర్‌లోని ముత్యాలమ్మ వీధిలోని వారి పిన్ని వద్ద ఉంటున్నారు. వారి ఇంటికి దగ్గర్లో ఉండే మడుగు శ్రీనివాస్ మధురానగర్‌లో చికెన్ దుకాణంతోపాటు చిట్టీలు నిర్వహిస్తుంటాడు. అతను 18 ఏళ్లుగా తెలిసిన వ్యక్తి కావడంతో, అతని వద్ద రూ.3లక్షలకు చిట్టీ వేసింది. 2025 డిసెంబరు నాటికి చిట్టీ పూర్తిగా చెల్లించింది. జనవరిలో చిట్టీ డబ్బులు మొత్తం ఇవ్వాల్సి ఉంది. డబ్బులు అడిగితే రావాల్సినవి, రాగానే ఇస్తానని కాలయాపన చేస్తూ వచ్చాడు. ఈనెల 27వ తేదీన ఎవరికీ కనిపించకుండా వెళ్లిపోయాడు. తనకు మాదిరిగానే మరి కొందరికి కూడా చిట్టీ డబ్బులు ఇవ్వాల్సి ఉందని తెలిసి మోసపోయినట్లుగా గ్రహించి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వంకాయలు-16/18, టమాటా-12, బెండ-18, పచ్చిమిర్చి-38, కాకర-26, బీర-26/24, క్యాలీ ఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-24, దొండ-24, బంగాళదుంప-22, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-20, దోస-22, సొర-8/7, పొట్ల-25, అరటికాయ-5/6, చామదుంప-24, అల్లం-70, మునగ-7/8, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-38, బీట్ రూట్-22, కీరదోస-32, బీన్స్-50, క్యాప్సికమ్-58, చింతకాయలు-65, నిమ్మ (డజను)-36/48, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/25/30. (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు**

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయండి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఫోరం ఫర్ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు టి.జ్యోతిరాణి, ఐ.వేమేశ్వరి ఒక సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మారుమూల, గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, పసి పిల్లలకు సేవలు అందిస్తున్న అంగన్‌వాడీలు.. కనీస సౌకర్యాలు లేకుండానే గౌరవ వేతనంతో పని చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజులు సమ్మె చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం కొన్ని సౌకర్యాలు కల్పించిందని, మినీలను మెయిన్ వర్కర్లుగా గర్తించారన్నారు. గత ఏడు సంవత్సరాలుగా వేతనాలు పెంచలేదనే అసంతృప్తితో.. అంగన్‌వాడీలు రోడ్డు మీదకు వచ్చి నిరసనలు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని వారు కోరారు.

అభివృద్ధి.. సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్య ఉంటూ.. వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం ఏడో డివిజన్ జనసేన నాయకుడు దోమకొండ అశోక్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మొగల్రాజపురంలో నిర్వహించిన జనసేన (ఉద్యమి) సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి చేయడంతో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్యపరీక్షలు

భవానీపురం: భవానీపురం 40వ డివిజన్‌లోని పారిశుద్ధ్య కార్మికుల [illegible] వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్మికులకు బీపీ, మధుమేహం, తదితర పరీక్షలు చేశారు. [illegible] శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

దర్గా ప్రాంతం.. దుర్గంధం

న్యూస్‌టుడే, భవానీపురం: భవానీపురం దర్గా ప్రాంతంలో కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. వందలాది మంది నివాసం ఉండే ఈ ప్రాంతంలో మురుగు పారుదల వ్యవస్థ అధ్వానంగా మారింది. [illegible] కారులు చెబుతున్నా అమలుకు నోచుకోని పరిస్థితి ఉంది. మురుగు ఖాళీ స్థలాల్లోకి చేరుతుండటంతో ప్రజలు జ్వరాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు.

మురుగు మధ్య దర్గా ప్రాంత నివాసాలు

కనీస సౌకర్యాలు కొరవడి..

దర్గా ప్రాంతంలో [illegible]

కుటుంబాలు:	300కు పైగా
జనాభా:	1500 మంది
ఓటర్లు:	800 మంది

కాలువ నిర్మాణం జరగలేదు - సిద్దికా (దర్గా ప్రాంతం)

[illegible]

చిన్న పిల్లలు పడిపోతున్నారు - షేక్.అక్బర్, అప్పర్ (భవానీపురం)

[illegible]

సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం

పటమట: పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం పటమటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఇటీవల అవార్డులు అందుకున్న సీనియర్ సిటిజన్స్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వేమూరి బాబూరావు, కార్యదర్శి మొత్కూరి వెంకటేశ్వరరావు, పటమట వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పరుచూరి అజయ్ కుమార్‌లను ఘనంగా సన్మానించారు. [illegible]

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

పటమట, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన [illegible]

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

స్పందన: పాయకాపురం: వాంబేకాలనీ హెచ్‌బ్లాక్ ఆవరణలో రోడ్డుపై చెత్త పేరుకుపోతోంది. స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు సమాచారం ఇచ్చారు. దీనిపై ఆదివారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పారిశుధ్య అధికారులు.. కార్మికులతో చెత్తను తరలింపజేశారు.

? ప్రశాంతినగర్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో చెత్త పేరుకుపోతోంది. - **సాగర్, స్థానికుడు** ✔ సకాలంలో చెత్త తరలిస్తాం. - **శివరామకృష్ణ, శానిటరీ అధికారి**
– పాయకాపురం, న్యూస్‌టుడే

ప్రజల భద్రతకు సురక్షా కమిటీలు

సైకిల్ అందిస్తున్న సీపీ రాజశేఖరబాబు. చిత్రంలో నరసయ్య తదితరులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : సురక్షా కమిటీ కన్వీనర్ కె.వి.నరసయ్య ఆధ్వర్యంలో 150 మంది పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు చేతుల మీదుగా అందజేశారు. సీపీ మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా సురక్షా కమిటీలు పని చేస్తున్నట్లు తెలిపారు. నగరంలో దాదాపు 10,500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో సురక్షా కమిటీలు కీలకంగా వ్యవహరించాయన్నారు. సురక్షా కమిటీ కన్వీనర్ నరసయ్య.. సురక్ష కమిటీల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. మహిళా పోలీస్ సిబ్బందికి ఉచితంగా వైద్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణకు కొండలపై 70వేల విత్తనాలను డ్రోన్ల ద్వారా చల్లించారని వివరించారు. తితిదే అన్నదానానికి కూరగాయల పంపిణీ, పేద మహిళలకు 20 కుట్టుమిషన్లు, వృద్ధులకు 6 టిఫిన్ బళ్లను అందించారని తెలిపారు. తాజాగా పేద విద్యార్థులు 150 మందికి కె.వి.నరసయ్య, మెడ్ ప్లస్ ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు కృష్ణకాంత్ పటేల్, కె.జి.వి.సరిత, షిరీన్‌బేగం, కృష్ణ ప్రసన్న, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, బి.లక్ష్మీనారాయణ ఏడీసీపీలు, ఏసీపీలు, సీఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయండి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఫోరం ఫర్ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు టి.జ్యోతిరాణి, ఐ.వేమేశ్వరి ఒక సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మారుమూల, గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, పసి పిల్లలకు సేవలు అందిస్తున్న అంగన్‌వాడీలు.. కనీస సౌకర్యాలు లేకుండానే గౌరవ వేతనంతో పని చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజులు సమ్మె చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం కొన్ని సౌకర్యాలు కల్పించిందని, మినీలను మెయిన్ వర్కర్లుగా గుర్తించారన్నారు. గత ఏడు సంవత్సరాలుగా వేతనాలు పెంచలేదనే అసంతృప్తితో.. అంగన్‌వాడీలు రోడ్డు మీదకు వచ్చి నిరసనలు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని వారు కోరారు.

ధర వరలు

వంకాయలు-16/18, టమాటా-12, బెండ-18, పచ్చిమిర్చి-38, కాకర-26, బీర-26/24, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజి-14, క్యారెట్-24, దొండ-24, బంగాళదుంప-22, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుళ్లు-20, దోస-22, సొర-8/7, పొట్ల-25, అరటికాయ-5/6, చామదుంప-24, అల్లం-70, మునగ-7/8, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-38, బీట్ రూట్-22, కీరదోస-32, బీన్స్-50, క్యాప్సికమ్-58 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు**

రైతుబజారులో అక్రమ వసూళ్లు!

దుకాణాల పునరుద్ధరణ పేరుతో దందా

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే

అజిత్‌సింగ్‌నగర్ రైతు బజారులో దుకాణాల పునరుద్ధరణకు అక్రమంగా వసూలు చేస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వ్యాపారాలు లేక.. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని.. ఈ అనధికార చెల్లింపులు ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. నగదు కట్టకపోతే దుకాణాలు రద్దు చేస్తామని రైతు బజారులో మైకు ద్వారా బహిరంగంగా హెచ్చరిస్తున్నారంటూ విమర్శిస్తున్నారు. ప్రజాప్రతినిధులు పేర్లు చెప్పి మరీ వసూళ్లు చేస్తుండడంతో.. ఎమ్మెల్యేని కలిసి తమ సమస్యలు తెలిపేందుకు రైతులు సిద్ధమయ్యారు.

మూడు రకాలు...

అజిత్‌సింగ్‌నగర్ రైతు బజారులో మొత్తం 45 దుకాణాలు ఉన్నాయి. వీటిలో డ్వాక్రా సంఘాలకు 15, దివ్యాంగులు 15, రైతులకు 15 చొప్పున దుకాణాలు కేటాయించారు. రైతులకు కేటాయించిన దుకాణాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి రెన్యువల్ చేయాలి. దీనికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ ఒక్కో దుకాణానికి రూ.2 వేలు చొప్పున అధికారులు అక్రమంగా వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఎనిమిది మంది రూ.2 వేలు చొప్పున కట్టారు. మిగిలిన ఆరుగురు నగదు చెల్లించడంలో ఆలస్యం కావడంతో ఇబ్బందికి గురిచేస్తున్నారని దుకాణదారులు తెలిపారు. డ్వాక్రా, దివ్యాంగుల దుకాణాల పునరుద్ధరణకు ఏడాదికి రూ.10వేల చొప్పున తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే కార్యాలయానికి పంపాలంటూ హెచ్చరించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇక్కడున్న అధికారి గతంలో పటమట రైతు బజారులో.. ఎమ్మెల్యే కార్యాలయం పేరు చెప్పి నగదు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్.. తక్షణమే సదరు అధికారిని బదిలీ చేయాలని అధికారులను ఆదేశించడంతో అజిత్‌సింగ్‌నగర్ రైతుబజారుకు పంపించారు. ఇక్కడా అదేవిధంగా వ్యవహరిస్తుండడంతో రైతులందరూ కలిసి అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడికి ఫిర్యాదు చేశారు. ఆయన.. ఎమ్మెల్యే ఉమా దృష్టికి తీసుకువెళ్లమని సూచించారు. ఉన్నతాధికారులు స్పందించి.. దీనిపై దర్యాప్తు చేసి అదనపు వసూళ్లు నిలిపివేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం : ఎమ్మెల్యే

రైతుబజారులో ఈవోగా పనిచేసిన కోటేశ్వరరావు 5 నెలల క్రితం డీఎస్సీలో ఉద్యోగం సాధించడంతో.. ఆయన అందులో చేరారు. అప్పటి నుంచి ఈవోను కేటాయించలేదు. సూపర్‌వైజర్ మణి.. రైతుబజారు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అక్రమ వసూళ్లపై ఆమెను వివరణ కోరగా.. దుకాణాల నిర్వాహకుల నుంచి తాను నగదు తీసుకోలేదని చెప్పారు. తనపై కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా.. పరిశీలించి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో నివాసం ఉండే ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సంక్షేమానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన అజిత్‌సింగ్‌నగర్ తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రెండు సార్లు సిబ్బందికి వేతనాలు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రతి కేంద్రంలోనూ మౌలిక వసతులు, అభివృద్ధికి రూ.86.68 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నట్లు వివరించారు. 58,204 మంది సిబ్బందికి రూ.75 కోట్లతో 5జీ స్మార్ట్‌ఫోన్లు అందజేయడం వల్ల సేవలు వేగవంతమయ్యాయని, హాజరు శాతం 70 నుంచి 96కు పెరిగిందని వెల్లడించారు. గ్రాట్యుటీ కోసం 2025 బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించామని చెప్పారు. 5వేల మినీ అంగన్‌వాడీలను పూర్తి స్థాయి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టమైనా.. ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఉమా పేర్కొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వం నమోదు

పేర్లు నమోదు చేస్తున్న కృష్ణ, భవానీ తదితరులు

మధురానగర్, న్యూస్‌టుడే : స్థానిక 29వ డివిజన్, మధురానగర్ మెయిన్‌రోడ్డులో ఆదివారం జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. డివిజన్ అధ్యక్షుడు కెంబూరి కృష్ణ, భవానీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. రూ.400లు కట్టి సభ్యత్వం తీసుకుంటే రూ.1600లు పార్టీ తరపున కడతారని తెలిపారు. బీమా వర్తిస్తుందని, కార్యకర్తలకు ఎలాంటి ప్రమాదం జరిగినా వారికి అండగా ఉండాలన్న లక్ష్యంతో ఈ క్రియాశీల సభ్యత్వ నమోదు చేపట్టామన్నారు. కార్యకర్తలు, నాయకులు తప్పనిసరిగా సభ్యత్వం నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్కూరి కిరణ్, కాయల రవి, లంక శ్రీనివాస్, కార్తిక్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేక క్రతువుకు పక్కా ఏర్పాట్లు

సౌకర్యాలపై చర్చిస్తున్న ఈవో శీనానాయక్, స్థానాచార్య శివప్రసాద శర్మ, ఈఈ రమాదేవి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల 6 నుంచి 8 వరకు నిర్వహించనున్న మహా కుంభాభిషేక క్రతువుకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ అన్నారు. దేవస్థానం పాలకమండలి సభ్యులు, వైదిక కమిటీ సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈవో శీనానాయక్ క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఆదివారం పరిశీలించారు. ఈవో మాట్లాడుతూ.. మూడు రోజులు జరిగే ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా విచ్చేసే కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి పర్యవేక్షణలో వేదపండితులు, అర్చకులు నిర్వహిస్తారన్నారు. విమాన గోపురం, ఆలయప్రాంగణం, దర్శనం క్యూలైన్లు ఏర్పాటు పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈవో అధికారులను సూచించారు. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద శర్మ, ఈఈ రమాదేవి, పాలకమండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా నృత్య సంగీతోత్సవాలు

పురస్కారాలతో వెంకట్, చిట్టిబాబు తదితరులు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : అభినయ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు చింతా వెంకట్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జాతీయ స్థాయి నృత్య సంగీతోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఎల్‌వీ గ్రూప్ ఛైర్మన్ పెనుమత్స శ్రీనివాసరాజు హాజరయ్యారు. గురువులకు నాట్యకౌముది, విద్యార్థులకు నాట్యమయూరి, సంగీత సుధ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . కళాకారులను ఇలా అభినందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించాలంటే ఇలాంటి కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. 20 మంది గురువులకు వారి శిష్య బృందాలకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో కూచిపూడి గురువు చింతా వెంకటశివరామ కృష్ణకుమార్, చింతకాయల చిట్టిబాబు, సి. హెచ్. మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి గుడివాడకు చెందిన పి.పిచ్చంశెట్టి రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణస్వామి వారికి విరాళం రసీదుతో పాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

10న సాయిబాబా మందిర వార్షికోత్సవం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గౌతమ్‌రెడ్డి, సత్యశ్రీహరి, విష్ణువర్ధన్

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఈ నెల 10న ముత్యాలంపాడులోని శ్రీ సాయిబాబా మందిర 38వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం మందిర ఆవరణలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఉదయం 5 గంటలకు కాగడ హారతితో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. విష్ణుసహస్ర నామ పారాయణం, సాయినామ సంకీర్త, హారతి, అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సాయంత్రం 7గంటలకు సాయి సేవకులచే పల్లకి ఉత్సవం, 9గంటలకు హారతితో వేడుకలు ముగుస్తాయిని వివరించారు. కమిటీ సభ్యులు ఎం.సత్యశ్రీహరి, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా డ్రైన్ల ఆక్రమణలు

దుకాణం ముందు మూసుకుపోయిన డ్రైన్

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : స్థానిక 33వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో దుకాణాల సముదాయాల ముందు డ్రైన్లు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయి. రద్దీగా ఉండే రహదారులకు ఇరువైపులా.. దుకాణాల నిర్వాహకులు ముందుకు జరగడంతో దారి కుంచించుకుపోతోంది. ఎన్ఆర్పీ రోడ్డు, సీకే రెడ్డి రోడ్డు, శివాజీకేఫ్ సెంటర్, జీఎస్ రాజు రోడ్డు, పాత పోలీస్ స్టేషన్ రోడ్డులలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా సైడు కాలువలను అక్రమంగా నిర్మిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కాలువలో పూడిక తొలగింపునకు పారిశుద్ధ్య సిబ్బందికి సమస్యగా మారుతోంది. కొందరు కాలువపై బడ్డీ కొట్లు ఏర్పాటు చేయగా.. మరికొందరు పూర్తిగా మూసివేస్తున్నారు. సంబంధిత అధికారులు పలు మార్లు దీనిపై నోటీసులు జారీ చేసినా.. వారి వైఖరిలో మార్పు రావడం లేదు. ఆయా ప్రాంతాల్లో దుకాణాల వ్యర్థాలను సైతం కాలువల్లో పడేయడంతో.. మురుగు సమస్య తలెత్తుతోంది. దోమలు విజృంభిస్తుండడంతో స్థానికులు వ్యాధుల బారినపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మురుగు నీటి ప్రవాహం నిలిచిపోయి.. సమీపంలోని నివాసాల మధ్య డ్రైన్లు పొంగుతున్నాయి. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటోలతో ఇబ్బందులు

స్థానిక దుర్గివారి వీధిలో ఇంటి ముందు ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపి ఉంటున్నాయి. రాత్రి సమయాల్లో కొందరు వాటిల్లో చేరి మద్యం తాగుతూ.. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ట్రాఫిక్ సిబ్బంది పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గాంధీనగర్**

జారి పడతారు... చూసుకొని వెళ్లండి..!

వాంబేకాలనీ సీ1 బ్లాకుల్లోని రహదారుల పక్కన ఇసుక వేశారు. వాహనాల రాకపోకలకు అది దారంతా విస్తరించి ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనాల చోదకులు జారిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అజిత్‌సింగ్‌నగర్**

నాటక రంగానికి కృష్ణ విశేష కృషి

కృష్ణకు పురస్కారం అందిస్తున్న రామయ్య, పూర్ణచంద్, సుమతి రామ్మోహనరావు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : సాంస్కృతిక కార్యక్రమాలు విధిగా నిర్వర్తించడంలో పి.వి.ఎన్.కృష్ణ చేస్తున్న కృషి అనిర్వచనీయమని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. ఆదివారం దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో దండమూడి రామ్మోహనరావు జయంతి వేడుకలు నిర్వహించారు. రంగస్థల కళాకారుడు పి.వి.ఎన్.కృష్ణకు దండమూడి రామ్మోహనరావు స్మారక ప్రతిభా పురస్కారం అందజేశారు. వర్ల రామయ్య మాట్లాడుతూ.. పద్యనాటక రంగంలో రచయిత, దర్శకుడు, నటుడిగా అనేక విభాగాల్లో విశేష కృషి చేశారని కొనియాడారు. తెలుగు నాటక రంగానికి చక్కని సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జి.వి.పూర్ణచంద్ సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం తదితరాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఎస్.శంకర్ సుజాత వీణావాద్యంతో కచేరి చేశారు. కె.కార్తికేయ ఆదినారాయణ శర్మ మృదంగంతో, కె.వి.కిషోర్ ఘటంతో చక్కటి సహకారం అందించారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత దండమూడి సుమతి రామ్మోహనరావు, మాజీ సైనిక పరిషత్ అధ్యక్షుడు కర్నల్ రాంబాబు, మాడుగుల రామకృష్ణ, వేముల హజరత్తయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత

సత్యనారాయణపురం(గాంధీనగర్): భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శారద పాఠశాలలో దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు చందోలు ఆంజనేయులు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇప్పటి వరకు 115 మందికి కృత్రిమ కాళ్లు, చేతులు అందజేశామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన శిబిరంలో మరో 120 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలైన వైద్య సేవలే లక్ష్యం

సమావేశమైన వైద్యులు

గవర్నర్‌పేట: ప్రజలకు మేలైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పని చేస్తోందని ఐ.ఎం.ఎ. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ పేర్కొన్నారు. నకిలీ వైద్యుల బారిన పడకుండా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆదివారం ఐ.ఎం.ఎ. హాలులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జోన్-2 పరిధిలోని ఐ.ఎం.ఎ. నగర శాఖల సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. ఆర్ఎంపీ, పీఎంపీ పేరుతో కొందరు అరకొర వైద్యం అందిస్తున్నారని, వారిని నియంత్రించాల్సిన అవసరం సభ్యులపై ఉందన్నారు. నకిలీ వైద్యుల కారణంగా వైద్య వృత్తిపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. దీన్ని కలిసి కట్టుగా కట్టడి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యులు తుమ్మల కార్తిక్, ఎన్.వరప్రసాద్, అనురూప్, కేశవరావు బాబు, ఫణిధర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. నగర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ వందన సమర్పణ చేశారు.

నగరం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు

నగరపాలక సంస్థ: విజయవాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. మహాత్మాగాంధీరోడ్డు, పటమట, బెంజిసర్కిల్ ప్రాంతాల్లో కమిషనర్ ఆదివారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ రహదారులపై గుంతలు పడితే వెంటనే మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనధికారిక బ్యానర్లను తొలగించాలని పేర్కొన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె.అర్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా నదిలో పడి మహిళ మృతి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ప్రకాశం బ్యారేజీపై నుంచి కృష్ణా నదిలో పడి మహిళ మృతిచెందిన ఘటనపై ఆదివారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం తిమ్మనపాలేనికి చెందిన కడవకుదురు మహాలక్ష్మి(42)కి భర్త, ఇద్దరు సంతానం వేర్వేరు కారణాలతో మృతిచెందారు. అప్పటి నుంచి మద్యానికి బానిసైంది. మహిళా స్నేహితురాలితో కలిసి ఆమె ఆదివారం వేకువజామున మద్యం తాగి ప్రకాశం బ్యారేజీపైకి వచ్చింది. అక్కడ సెల్ఫీ దిగే క్రమంలో రెయిలింగ్ పైనుంచి నదిలో పడిపోయింది. పక్కన ఉన్న ఆమె స్నేహితురాలు ఇచ్చిన సమాచారంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. హైదరాబాద్‌లో నివాస ముంటున్న మృతురాలి, సోదరుడు, సోదరికి సమాచారం అందించారు. వారు వచ్చిన తరువాత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తామని ఎస్సై భాగ్యశ్రీ తెలిపారు.

పర్యావరణహిత ప్రయోగాలతో ప్రయోజనం

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : అత్యాధునిక క్వాంటమ్ టెక్నాలజీ గురించి విద్యార్థులకు అవగాహన ఉండడం అభినందనీయమని ఎస్ఆర్ఎస్‌వీ బీఈడీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి.స్వరూప అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని సైన్స్ ఎక్స్‌పో-2026 పేరుతో స్థానిక నెల్లూరు రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులన్నీ పర్యావరణ హితంగా ఉన్నాయని ప్రశంసించారు. ఎక్కువ ఖర్చు లేకుండా విజ్ఞానం పెంపొందించేందుకు ఇలాంటి వినూత్న ప్రయోగాలు దోహదపడతాయని చెప్పారు. తెదేపా డివిజన్ ఇన్‌ఛార్జి గార్లపాటి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేలా పాఠశాల ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. సైన్స్‌లో చక్కని విద్య అందించడం తొలి ప్రాధాన్యంగా చూస్తున్నామని ప్రిన్సిపల్ యడవల్లి రాధ అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్, హైడ్రాలిక్ బ్రిడ్జి, కంటి, గుండె నమూనాలు, ఐకానిక్ టవర్, ప్రకృతి, పర్యావరణం, ప్లాస్టిక్, ఆహార పదార్థాల కల్తీ, వాయు కాలుష్యం తదితర అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

ప్రజా సహకారంతోనే దర్జీల మనుగడ

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే : ప్రజలందరూ దర్జీలు కుట్టిన దుస్తులు ధరించి తమను ఆదరించాలని టైలర్ రామకృష్ణ కోరారు. ఆదివారం లూనా సెంటర్‌లో ప్రపంచ టైలర్స్ డే నిర్వహించారు. మరో టైలర్ సుభాని మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మార్కెట్, రెడీమేడ్ దుస్తుల వల్ల తమకు పని దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు దర్జీలను ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టైలర్లు కాకర్ల రామకృష్ణ, పటాన్, సత్యనారాయణ, ఎస్.కె.బాషా, రమేష్, వెంకటేశ్వరరావు, వెంకన్న, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

8న సామూహిక ఉపనయనాలు

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన గాంధీనగర్ కౌతా కళావేదికలో సామూహిక ఉపనయనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి దశరథ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు గోత్ర నామాలను ఫోన్ నంబరు 996609 6999లో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 20వ తేదీ ఉదయం శివరామ క్షేత్రం (రామకోటి)లో ఉచిత సామూహిక ఉపనయనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తణుకు రామకృష్ణ, కొప్పరపు మారుతీ తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. కమలానంద భారతీ స్వామి ఆశీస్సులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేర్లు నమోదు చేసుకోవడానికి శృంగేరి పాదుకాక్షేత్రంలో సంప్రదించాలని వారు కోరారు.

భవనం కట్టాలి.. బాధలు తీర్చాలి..!

పాయకాపురం, న్యూస్‌టుడే

మధ్యలో నిలిచిపోయిన భవన నిర్మాణం

స్థానిక 62వ డివిజన్, ఎల్బీఎస్ నగర్. . రామారావు హోటల్ వీధిలో సుమారు 1500 గజాల ప్రభుత్వ స్థలం ఉంది. ఇందులో 100 గజాల్లో ఆంజనేయస్వామి ఆలయం ఉంది. మిగిలినదంతా ప్రభుత్వ స్థలమే. ఇందులో పాఠశాల నిర్మించాలని పిల్లర్లు వేశారు. నిర్మాణం చేపట్టారు. గత ఎన్నికలకు ఏడాది ముందుగానే పనులన్నీ వదిలేశారు. 'నాడు-నేడు' అంటూ గత పాలకులు ప్రచారం చేసి.. చివరికి నిధులు విడుదల చేయలేదు.

కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే..

ఈ డివిజన్‌లో వార్డు సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలన్నీ అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటి నిర్వహణకు ప్రతి నెలా రూ.లక్షల్లో ఖర్చవుతోంది. ఆగిపోయిన నిర్మాణాన్ని పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో సుమారు 15 గదులకు అవకాశం ఉంది. మొదటి అంతస్తులో వార్డు సచివాలయం, రెండో అంతస్తులో మీసేవ, కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే స్పందిస్తే..

గత వైకాపా ప్రభుత్వం అభివృద్ధి అంతా తామే చేసేశామనే ప్రచారానికి దిగింది. కానీ ఆఖరికి నిధులు విడుదల చేయకుండా జాప్యం చేసింది. గత సార్వత్రిక ఎన్నికల్లో చిత్తుగా ఓడింది. ఈ స్థలానికి దగ్గరలోనే పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్ ఉంది. పాఠశాల ఆధునికీకరణతో పాటు రామారావు హోటల్ వీధిలోని స్థలంలో కొత్త పాఠశాల నిర్మించేందుకు గత పాలకులు సన్నాహాలు చేశారు. రూ.20 లక్షలు అంచనావేశారు. పిల్లర్లు వేశారు. తర్వాత వదిలేయడంతో.. ఆ ప్రాంతమంతా చెత్తా చెదారంతో నిండిపోయింది. పిచ్చి మొక్కలు భారీగా పెరిగాయి. రాత్రివేళ ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించి.. గత పాలకులు చేసిన తప్పును సరిదిద్దాలని కోరుతున్నారు. మధ్యలో ఆగిపోయిన భవనాన్ని పూర్తి చేయించి వినియోగంలోకి తీసుకొచ్చేలా చొరవ చూపాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సామాజిక సేవ.. అభినందనీయం

బాబూరావు, వెంకటేశ్వరరావు, అజయ్‌లను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పటమట, న్యూస్‌టుడే: పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం పటమటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఇటీవల అవార్డులు అందుకున్న సీనియర్ సిటిజన్స్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వేమూరి బాబూరావు, కార్యదర్శి మొత్కూరి వెంకటేశ్వరరావు, పటమట వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పరుచూరి అజయ్ కుమార్‌లను ఘనంగా సన్మానించారు. సభ్యులు మాట్లాడుతూ.. బాబూరావు, వెంకటేశ్వరరావు, అజయ్... సామాజిక సేవ, సీనియర్ సిటిజన్స్ సేవలో ముందు ఉంటూ.. ఆదర్శంగా నిలుస్తున్నారని, రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. సంఘ గౌరవాధ్యక్షుడు సూర్యదేవర పాపారావు, కార్యదర్శి కొల్లిపర రామ్మోహన్‌రావు, సభ్యులు కోనేరు వెంకటేశ్వరరావు, మృత్యుంజయరావు, వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

ఆటపాటల ఉదయం.. ఆరోగ్య దేహం!

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం బీచ్ రోడ్డులో ఫిట్ ఇండియా పేరుతో సైకిల్ థాన్ నిర్వహించారు. వేలాది మంది యువత పాల్గొని సందడి చేశారు. ప్రారంభంలో జరిగిన జుంబా నృత్యాల్లో యువత హుషారు మిన్నంటింది. కరాటే, స్కిప్పింగ్ తదితర క్రీడాంశాల్లో బాలలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. – ఈనాడు, విశాఖపట్నం

నూకాలమ్మ దర్శనం నిలిపివేత రేపు

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మ దర్శనాలు మంగళవారం నిలిపివేయనున్నట్లు దేవస్థానం ఛైర్మన్ పీలా నాగశ్రీను, ఈవో శ్రీధర్ తెలిపారు. పాక్షిక చంద్ర గ్రహణం కారణంగా ఉదయం 10 గంటలకు ఆలయాన్ని మూసివేస్తారు. గ్రహణ మోక్ష కాలం అనంతరం సంప్రోక్షణ చేసి బుధవారం ఉదయం 6 గంటలకు యథావిధిగా ఆలయం తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

కేంద్రం సాయం.. అనాథలకు ఊతం

మిషన్ వాత్సల్య పథకంలో రూ.2.1 కోట్ల మంజూరు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: అనాథల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం అందించే సాయం ఎంతో ఊరటనిస్తోంది. మిషన్ వాత్సల్య పథకం కింద ఈ ఏడాది జిల్లాకు రూ.2.1 కోట్లు విడుదలయ్యాయి. విద్య, వైద్య అవసరాలు, పోషకాహారం, రవాణా ఖర్చులకు ఏటా ఈ మొత్తాన్ని పిల్లలకు అందజేస్తుంటారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందులు అనాథ చిన్నారుల భవిష్యత్తుకు అవరోధంగా మారకూడదనే ఉద్దేశంతో కేంద్ర 60 శాతం, రాష్ట్రం 40 శాతం చొప్పున భరిస్తున్నాయి.

➽ జిల్లాలో 1,098 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అనాథలను మిషన్ వాత్సల్య పథకంలో గుర్తించి సాయం వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన, విడాకులు తీసుకున్న వారి పిల్లలు, పేదరికంతో నిరాదరణకు గురైన వారి చదువు, ఆరోగ్యాలకు ఈ పథకం ద్వారా భరోసా కల్పిస్తున్నారు. గతేడాది 721 మంది అనాథలకు రూ.1.42 కోట్లు మంజూరయ్యారు. ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేల చొప్పున ఏడు నెలలకు ఒకసారి జమ చేస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 759 మందికి రూ.2.1 కోట్లు విడుదలయ్యాయి. జిల్లాలోని 23 మంది బాధిత మహిళలకు రూ.8.65 లక్షలు మంజూరైందని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: సోమవారం సాయంత్రం 6:07 గం॥లకు
సహరి: మంగళవారం తెల్లవారుజాము 4.59 గం॥లకు

పెద్దాసుపత్రిలో మెరుగైన వైద్యం!

● కూటమి ప్రభుత్వం చొరవ
● అందుబాటులో ఆధునిక పరికరాలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే
జిల్లా ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. గతంలో పలు పరీక్షలు బయట చేయించుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ఈ ఇబ్బందులను తొలగించేందుకు రూ.6 కోట్లతో అత్యాధునిక పరికరాలను సమకూర్చింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్ చొరవతో సీఎస్ఆర్ నిధులతోపాటు ప్రభుత్వం సమకూర్చిన పరికరాలు, ఆధునిక వసతులతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోంది. ఆ పరికరాలేంటో తెలుసుకుందామా..

■ **ఒకేసారి వంద మందికి:** పుల్లీ ఆటోమేటిక్ బయోకెమిస్ట్రీ ఎనలైజర్ పరికరం. ఒకేసారి వంద మందికి 20 రకాల రక్త పరీక్షలు చేయొచ్చు. జిల్లా ఆసుపత్రిలో రోజుకు 400 మంది రోగులకు వివిధ రకాల రక్త పరీక్షలు చేస్తుంటారు. గతంలో పలు పరీక్షలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో బయట ల్యాబ్‌లకు వెళ్లి చేయించుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆసుపత్రిలోనే అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నారు. తద్వారా రోగులపై ఆర్థికంగా భారం తప్పింది.

■ **టిఫా స్కాన్:** వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చొరవతో ఈ పరికరం సమకూరింది. గతంలో గర్భిణులు స్కానింగ్ చేయించుకునేందుకు ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్లాల్సి వచ్చేది. పుట్టబోయే బిడ్డ శారీరక లోపాలు లేకుండా ఉండేలా ముందుగానే గుర్తించేందుకు ఇది ఉపయోగపడుతుంది. శిశువు మెదడు, గుండె, కిడ్నీ వంటివి ఈ పరికరం ద్వారా స్కాన్ చేస్తారు.

■ **ప్లాస్మా, ప్లేట్‌లెట్స్‌ను వేరుచేసే పరికరాలు:** ఆసుపత్రిలోని రక్తనిధి కేంద్రానికి అవసరమైన పరికరాలను సమకూర్చారు. గతంలో ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ వేరుచేసే పరికరాలు లేక ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వచ్చేది. రక్తం నుంచి ప్లేట్‌లెట్స్‌ను వేరుచేసి భద్రపరిచే పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. డెంగీ జ్వర పీడితులకు ఇది ఎంతో ఉపయోగపడుతోంది. అధిక రక్తహీనతతో ఉన్న వారికి ప్లాస్మా ఎక్కించే పరికరాలూ సమకూరాయి.

■ **సీటీ స్కాన్:** గత ప్రభుత్వ హయాంలోనే సీఎస్ఆర్ నిధులతో సమకూరినా వినియోగంలోకి రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సిబ్బందిని నియమించి సీటీ స్కాన్ చేయిస్తున్నారు. రేడియాలజిస్టులు రిపోర్ట్‌లను జారీ చేస్తున్నారు. ప్రమాదాల్లో క్షతగాత్రులు, అనారోగ్య సమస్యలతో ఉన్న వారికి సీటీ స్కాన్ ఎంతో ఉపయోగపడుతుంది. బ్రెయిన్ స్ట్రోక్, తలకు గాయాలైన వారికి వెంటనే సీటీ స్కాన్ చేసి సేవలు అందిస్తున్నారు.

ఆసుపత్రిలో వివరాలు

పడకలు: 250	వైద్యులు: 42
ఓపీ: 800	జనాభా: 18 లక్షలు
ఆసుపత్రి పరిధిలో నియోజకవర్గాలు: 7	

■ **మూడు ఆపరేషన్ థియేటర్లు:** సీఎస్ఆర్ నిధులతో ఆధునిక వసతులతో మూడు ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటయ్యాయి. మోడరన్ ఓటీ టేబుల్స్, హై క్వాలిటీ ఓటీ లైట్స్, ఆధునిక పరికరాలతో ఆపరేషన్లు చేస్తున్నారు.

కొబ్బరి ధర మరింత పతనం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మార్కెట్లో కొబ్బరి ధర మరింత పతనమైంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో కాయలకు డిమాండ్ ఉంటుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. గతేడాది ఈపాటికి వెయ్యి కాయల ధర పెరిగింది. డిసెంబరు నుంచి క్రమేణా తగ్గుముఖం పడుతూ వచ్చింది. జిల్లాలో నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో కొబ్బరి సాగు అధికం. గతేడాది వెయ్యి కాయల ధర రూ.35 ఉండగా.. జనవరిలో రూ.18. ప్రస్తుతం రూ.16 పలుకుతోంది. ముదురు కాయ ధర రూ.13కి పడిపోయింది. వేసవిలో ధర పెరిగే అవకాశముందని పెదరామభద్రపురం రైతు కలిగట్ల శ్రీను పేర్కొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: బాణసంచా తయారీదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్పీ తుహిన్‌సిన్హా స్పష్టం చేశారు. కాకినాడ జిల్లా వేట్లపాలెంలో పేలుడు ఘటన దృష్ట్యా డీఎస్పీలు బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాల్లో ఆదివారం తనిఖీలు చేపట్టారు. అనకాపల్లి మండలం కొప్పాకలో తయారీ కేంద్రం, రాజుపాలెం, వల్లూరులోని ఫైర్‌వర్క్స్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దారు ఆనంద్, అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు, గ్రామీణ ఎస్సై రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

మేడమ్.. దివ్యాంగుల గోడు ఆలకించరూ!

కలగానే సంక్షేమ కార్యాలయం ఏర్పాటు

నర్సీపట్నం, న్యూస్‌టుడే
నిర్లక్ష్యరాసులైన దివ్యాంగుల గోడు అరణ్య రోదనే అవుతోంది. జిల్లాల పునర్విభజన తర్వాత వీరి సంక్షేమం చూడాల్సిన కార్యాలయం అందుబాటులో లేదు. సంబంధిత అధికారి ఆరు నెలలుగా సెలవులో ఉన్నారు. అనకాపల్లి జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు సంబంధించి కార్యాలయం కొన్నేళ్లుగా విజయనగరంలోనే కొనసాగుతోంది. బ్యాక్‌లాగ్ పోస్టులు, పరికరాలు, ఏ అవసరం వచ్చినా విజయనగరం వెళ్లలేక, జిల్లా కేంద్రంలో ఎవరికి చెప్పుకోవాలో ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చామని, కలెక్టర్ దృష్టిసారిస్తే కార్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగులతో సమావేశమైన సభాపతి అయ్యన్న దంపతులు

➡ జిల్లాకు చెందిన దివ్యాంగుల కోసం గతంలో కలెక్టరేట్‌లో ఒక ఉద్యోగి అందుబాటులో ఉండేవారు. ఈయన పదవీ విరమణ చేయడంతో తిరిగి ఆ పోస్టులో ఎవరూ నియమితులు కాలేదు. ఏ చిన్న పని ఉన్నా విజయనగరం వెళ్లాల్సి వస్తోంది. నర్సీపట్నం ప్రాంతంలోని దివ్యాంగులు పలువురు సభాపతి అయ్యన్నపాత్రుడిని కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, అనకాపల్లిలో సంక్షేమ కార్యాలయం ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్పందించి సభాపతి వారి సమక్షంలోనే కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో కార్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

➡ సమాజంలో విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయో వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక శాఖ కొనసాగుతోంది. గతంలో ఈ కార్యాలయం విశాఖపట్నంలో ఉండేది. జిల్లాల పునర్విభజన తర్వాత అనకాపల్లి జిల్లాలో దివ్యాంగుల సంక్షేమ కార్యాలయం ఏర్పాటు కాలేదు. ఇక్కడి వారంతా విజయనగరం జిల్లాలోని కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. కార్యాలయ అధికారి బదిలీ కావడం, ఇన్‌ఛార్జి అధికారి అందుబాటులో ఉండటం లేదు. ఆరు నెలలుగా ఇన్‌ఛార్జి అధికారి సెలవులో ఉన్నారు. ఇటీవల బదిలీపై వచ్చిన జూనియర్ అసిస్టెంట్ రామరాజు ఒక్కటే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగంగా పరిష్కరించే లక్ష్యంతో గురుద్వారాలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 11 జిల్లాలకు చెందిన వినియోగదారులు 8688400499 ఫోన్ నెంబర్‌కు ఉదయం 10.30 నుంచి 11.30 వరకు తమ సమస్యలను తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని సీఎండీ ప్రకటించారు. ఈ అవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

కలెక్టరేట్ , న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం రెవెన్యూ క్లినిక్, పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లోనూ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. 1100 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి అర్జీల స్థితిగతులను తెలుసుకోవచ్చని చెప్పారు. మీకోసం వెబ్‌సైట్‌లోనూ అర్జీలను అప్‌లోడ్ చేయవచ్చని పేర్కొన్నారు.

సర్కారు సహకారం.. సొంతింటి కల సాకారం

పల్లెల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం

అచ్యుతాపురం, ఎలమంచిలి, న్యూస్‌టుడే
సొంతిల్లు ప్రతి ఒక్కరి కల. తిన డానికి ఉన్నా, లేకున్నా.. ఓ గూడు ఉంటే చాలు. గంజి నీళ్లు తాగైనా బతికేయవచ్చంటారు. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా పూట గడవని పరిస్థితుల్లో పేద కుటుంబాలున్నాయి. ఆయా కుటుంబాల్లో అర్హులందరికీ సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చింది. ఆర్థికంగా తోడ్పాటు అందించడంతోపాటు పల్లెల్లో మూడు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని నిర్ణయించింది.

✦ ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0 కింద రాష్ట్రంలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తోంది. గతంలో మంజూరైనవి కాకుండా కొత్తగా మంజూరయ్యే వారికి రూ.2.39 లక్షలు చొప్పున అందజేయనుంది. ఇందులో కేంద్రం వాటా రూ.95,400 కాగా రాష్ట్రం రూ.63,600 భరిస్తోంది. వీబీ జీరామ్‌జీ పథకంలో రూ.27 వేలు, స్వచ్ఛభారత్ మిషన్ కింద రూ.12 వేలు అందుతాయి. డ్వాక్రా మహిళలకు ఇచ్చే ఇంటి రుణంపై వడ్డీ భారం తగ్గించేందుకూ చర్యలు చేపడుతోంది.

✦ వైకాపా ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో ఇళ్లు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నట్లు ఊదరగొట్టింది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను సైతం నిర్మించకుండా ప్రచారానికే పరిమితమైంది. ఆప్షన్-3 ఎంపిక చేసుకున్న లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి చేతులెత్తేసింది. కేంద్రం మంజూరు చేసిన రూ.1.80 లక్షల సాయం తప్ప ప్రభుత్వం నుంచి పైసా ఇవ్వలేదు. ఇళ్ల నిర్మాణానికి కేంద్రం ప్రకటించిన రూ.5 వేల కోట్లను పక్కదారి పట్టించింది. కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణం పేరుతో ప్రజాప్రతినిధులు, నాయకులు అక్రమాలకు పాల్పడ్డారు. కూటమి సర్కారు కేంద్రం ఇచ్చే నిధులకు అదనంగా ఇస్తూ ఇళ్ల నిర్మాణాలకు తోడ్పాటు అందిస్తోంది. జిల్లాలో 65,800 ఇళ్లు మంజూరుకాగా ఇప్పటి వరకు 32 వేలు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి.

పది మూల్యాంకనంలో నూతన ఒరవడి

ట్యాబుల్లో మార్కుల నమోదు

పాయకరావుపేట/గ్రామీణం, న్యూస్‌టుడే
నూరు శాతం మార్కులు వస్తాయనుకున్న పదో తరగతి విద్యార్థి 10 మార్కులు వచ్చి ఫెయిలైన ఉదంతాలు చూశాం. ఆ తర్వాత పేపరు రీవేల్యూ చేయించుకుంటే పొరపాటు సరిదిద్దేవారు. ఈలోగా సదరు విద్యార్థి మానసికంగా కుంగుబాటుకు లోనయ్యేవారు. ఫలితాలు విడుదలైన ప్రతిఏటా ఇటువంటి ఘటనలు మామూలే. మూల్యాంకనంలో ఇకపై ఇలాంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వినూత్న పద్ధతిని అమలు చేయనున్నారు.

నమూనా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

● ఈ సంవత్సరం జిల్లాలో 20577 మంది పదో తరగతి పరీక్షల రాసేందుకు సిద్ధమవుతున్నారు. వీరికి 102 పరీక్ష కేంద్రాలు, 1325 మంది ఉపాధ్యాయులకు ఇన్విజిలేషన్ బాధ్యతలు అప్పగిస్తున్నారు. పరీక్షలు పూర్తయిన వెంటనే జవాబు పత్రాల మూల్యాంకనం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

● ఇప్పటివరకు విద్యార్థి ప్రగతిపై దృష్టి సారించిన విద్యా శాఖ తాజాగా పదో తరగతి పరీక్షల మూల్యాంకనంలోనూ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఒక పేపరును ఇద్దరు ఉపాధ్యాయులు పరిశీలిస్తారు. ఒకరు మూల్యాంకనం చేస్తారు. మరొకరు ఆ మార్కులను ట్యాబు ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీనివల్ల మూల్యాంకనంలో తప్పులను క్షేత్రస్థాయిలోనే అడ్డుకట్ట అవకాశముంది.

● గతేడాది వరకు మూల్యాంకనం కోసం కేంద్రాలు నిర్వహించేవారు. ఒక ఉపాధ్యాయుడికి 50 జవాబు పత్రాలు ఇస్తుండేవారు. పేపరు దిద్దిన తర్వాత వాటిని ఓఎంఆర్ షీటులో నమోదు చేసేవారు. పెన్సిల్‌తో బబుల్ చేస్తుండేవారు. వీటిని కేంద్రంలో సీఈలు పరిశీలించి స్ట్రాంగు రూంకు తరలించేవారు. దానిని మరో బృందం పరిశీలిస్తుంది. అక్కడ తప్పులు గుర్తిస్తే సరి చేయించి స్కాన్ చేయించేవారు.

● ప్రస్తుతం పొరపాట్లకు తావు లేకుండా రెండంచెల విధానం అమలు చేయనున్నారు. మొదట ఉపాధ్యాయుడు పేపరు దిద్దిమార్కులు ఒక పేజీపై వేస్తారు. అనంతరం అదే జవాబు పత్రాన్ని మరో ఉపాధ్యాయుడు మూల్యాంకనం చేసి ప్రత్యేక ట్యాబ్‌లో నమోదు చేస్తారు. ఇద్దరు టీచర్లు వేసిన మార్కులు ఒకేలా ఉంటేనే పేపరును స్కానింగ్‌కు పంపిస్తారు. రోజుకు 40 పేపర్లు చొప్పున ఒక్కోదానికి 12 నిమిషాలు దిద్దాలనే నిబంధన విధించారు. ఛాయిస్ ప్రశ్నకు జవాబు రాస్తే ఎక్కువ మార్కులు వచ్చిన దానినే పరిగణనలోకి తీసుకుంటారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు సుమారు 400 ట్యాబ్‌లు అవసరమని అధికారులు గుర్తించారు.

ట్యాబుల సేకరణ

జిల్లాలోని 2,214 ట్యాబులను 2022-23లో పాఠశాలలకు అందించారు. సుమారు 250 ట్యాబులను సేకరించాలని నిర్ణయించాం. మూల్యాంకనం తర్వాత తిరిగి వాటిని ఇచ్చేస్తాం. ఒక ఉపాధ్యాయుడు పేపరు దిద్దితే మరొకరు ట్యాబులో నమోదు చేయనున్నారు. దీనివల్ల ఫలితాలు వేగంగా ఇవ్వవచ్చు. రీకౌంటింగు ఇబ్బందులు తప్పుతాయి.

– జి.అప్పారావునాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి

కంటితుడుపుగా శిక్షణ.. సందర్శనకు రారాం!

● రెండు జిల్లాల నుంచి ఏడుగురు హాజరు
● వ్యవసాయ అనుబంధ శాఖల ఊసే లేదు

అనకాపల్లి, న్యూస్‌టుడే
వ్యవసాయ అధికారులకు ప్రతి నెలా నిర్వహిస్తున్న శిక్షణ, సందర్శన (టీఅండ్‌వీ) కార్యక్రమం కంటితుడుపుగా మారింది. గతంలో ఉదయం శిక్షణ తరగతులు, మధ్యాహ్నం పరిశోధన స్థానంలో వ్యవసాయ క్షేత్రాల సందర్శన ఉండేది. అన్ని మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు విధిగా హాజరయ్యేవారు. ఇప్పుడు ఒక్క పూటకే పరిమితం చేశారు. డివిజన్ స్థాయి అధికారులు మాత్రమే వస్తున్నారు. వాస్తవానికి వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల అధికారులూ రావాల్సి ఉండగా వీరి ఉనికే లేదు.

★ అనకాపల్లిలోని పరిశోధన కేంద్రంలో శనివారం ఏర్పాటైన శిక్షణ, సందర్శన కార్యక్రమానికి అనకాపల్లి, విశాఖ జిల్లాల నుంచి వ్యవసాయాధికారులు ఏడుగురే హాజరయ్యారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు 16 మంది శాస్త్రవేత్తలు రావడం గమనార్హం. అనుబంధ శాఖల నుంచి ఒక్కరూ రాలేదు.

★ ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి నెలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో చెరకుతోపాటు అన్ని పంటలపైనా పరిశోధనలు జరుగుతున్నాయి. సాగులో ఎదురవుతున్న సమస్యలను రైతులు నేరుగా శాస్త్రవేత్తలకు వివరించడం సాధ్యం కాదు. క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకువస్తుంటారు. ఈ క్రమంలో ప్రతి నెలా మండల వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులకు ఒకరోజు శిక్షణ ఇవ్వాలని వర్సిటీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆ నెలలో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను శాస్త్రవేత్తలకు వివరిస్తే.. వారు నివారణోపాయాలను సూచిస్తారు. శాస్త్రవేత్తల సూచనలను గ్రామ స్థాయి సిబ్బందికి వివరించి వారి ద్వారా రైతులకు తెలియజేయవచ్చు. తద్వారా పరిశోధన ఫలితాలు త్వరగా రైతులకు చేరతాయి. ప్రారంభంలో రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించేవారు. మొదటి శిక్షణ, రెండో రోజు క్షేత్ర సందర్శన ఉండేది. తర్వాత ఒక రోజుకు తగ్గించారు. ఇప్పుడు ఒక్క పూటకే పరిమితం చేశారు. ఉదయం శిక్షణ కార్యక్రమంతో ముగిస్తున్నారు. డివిజన్ స్థాయి అధికారులతో రైతులకు నేరుగా సంబంధాలు పెద్దగా ఉండవు. వీరు వ్యవసాయాధికారులకు చెబితే వారు సిబ్బంది ద్వారా రైతులకు చేరవేయాలి

హాజరైన వ్యవసాయాధికారులు

★ రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే వ్యవసాయంతోపాటు పాడి, మత్స్య, ఉద్యాన పంటల సాగుపై దృష్టిసారించాలని ప్రతి సదస్సులోనూ అధికారులు సూచిస్తున్నారు. ఇందుకు అనుగుణంగానే జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. శిక్షణ తరగతులకు వ్యవసాయాధికారులతోపాటు పాడి, మత్స్య, ఉద్యాన, జలవనరుల శాఖ అధికారులకూ ఆహ్వానం పంపుతున్నారు. వ్యవసాయ శాఖ నుంచి మినహా ఏడాదిలో ఒక్కసారి కూడా అనుబంధ శాఖల నుంచి ఒక్కరూ హాజరైంది లేదు. ఈ విషయమై పరిశోధన కేంద్రం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు మాట్లాడుతూ.. శిక్షణతో పాటు పంటల సందర్శన పక్కాగా జరిగేలా చూస్తామన్నారు.

మెడ్‌టెక్ జోన్‌లో 'జీనోమ్ సీక్వెన్సింగ్'

పరవాడ, న్యూస్‌టుడే: దేశంలో ప్రాణాంతక వ్యాధులను నయం చేసేందుకు వీలుగా మెడ్‌టెక్ జోన్‌లో జీనోమ్ సీక్వెన్సింగ్ సెంటర్ ఏర్పాటుకు తొలి అడుగు పడింది. ఈ కేంద్రం ఏర్పాటుకు వీలుగా బయోవ్యాలీ, 4బేస్‌కేర్, డిఫైన్ బయో లిమిటెడ్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఆయా సంస్థలు సంయుక్తంగా జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం బయోస్ఫియర్ పేరిట సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయనున్నాయి. తద్వారా వైద్యులు, విద్యాసంస్థలు, పరిశ్రమ భాగస్వాములు, వివిధ అంకుర సంస్థలు పరిశోధన చేయడానికి అవకాశం లభిస్తుంది. ఔత్సాహిక శాస్త్రవేత్తలు, వ్యవస్థాపకులకు శిక్షణ ఇవ్వడానికి ఒక వేదికగా పని చేస్తుంది. ఈ సందర్భంగా 4బేస్ కేర్ సహ వ్యవస్థాపకులు హితేష్ గోస్వామి మాట్లాడుతూ దేశంలో బయోటిక్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి కీలక అడుగు పడినట్లు పేర్కొన్నారు. అధునాతన జన్యుశాస్త్ర నైపుణ్యం, ఇంక్యుబేషన్ మద్దతు, పరిశోధన సామర్థ్యాలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రాణాంతక వ్యాధులకు కచ్చితమైన వైద్య పరిష్కారాలు చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బయోవ్యాలీ సీఈవో డాక్టర్ సుశీల బ్రహ్మామ్ మాట్లాడుతూ ఈ కేంద్రం ఏర్పాటుతో దేశంలో తదుపరి తరం జన్యు సంబంధ పర్యావరణ వ్యవస్థ నిర్మాణం, జన్యు సంబంధ ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

వంద రోజులు పని కొందరికే..!

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

▌ వెంకుపాలెంలో 363 మందికి జాబ్‌కార్డులు ఉండగా 6 కుటుంబాలకే వంద రోజుల పని కల్పించారు. మిగతా వారికి పనులు కల్పించడంతో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

▌ కుంచంగిలో 496 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరిలో 17 మందికే వంద రోజులు పని చూపారు. కూలీలకు కనీస వేతనం రూ.307 రావాల్సి ఉండగా.. వంద రోజులు పని కల్పించకపోవడంతో రూ.286 మాత్రమే వచ్చిందని శ్రామికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి ఉన్నచోటే పనులు చూపాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. పని అడిగిన ప్రతి ఒక్కరికీ కల్పించాలన్న నిబంధన ఉన్నా.. క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. జిల్లాలో ఆశించిన స్థాయిలో కూలీలకు వంద రోజులు పని చూపేలా అడుగులు పడటం లేదు. ఫలితంగా పథకం ఆశయం నీరుగారుతోంది.

చెరువులో పూడికతీత పనులు

▌ జిల్లాలోని 24 మండలాల పరిధిలో 646 పంచాయతీలు ఉన్నాయి. 4,15,810 మంది ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు, పంట కుంటలు, పశుగ్రాసం, పండ్ల తోటల పెంపకం, పశువులకు నీటి తొట్టెలు, సీసీ రహదారుల నిర్మాణం పనులు చేస్తున్నారు. 2,67,217 మందికి జాబ్ కార్డులు ఉండగా 2,02,322 మందికే ఉపాధి పనులు చూపారు. వీరిలో 10,328 మందికే వంద రోజుల పని కల్పించారు. కనీసం వేతనం రూ.307 పొందాల్సిన కూలీలు రూ.250 తో సరిపెట్టుకోవాల్సిన వస్తోంది.

▌ వైకాపా ప్రభుత్వ హయాంలో కొన్నిచోట్ల చోటుచేసుకున్న అవినీతి, అక్రమాల వల్ల కూలీలు నష్టపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పథకం అమలులో పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. ఉపాధి శ్రామికులకు ఈ-కేవైసీ, ముఖ ఆధారిత హాజరు అమలుకు శ్రీకారం చుట్టింది. ఈ విధానంలో అవకతవకలకు ఆస్కారం లేకుండా పోయింది. దీంతో కొంతమేర పనులు మందగించాయి. ఇటీవల అనకాపల్లిలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో కూలీలకు వంద రోజులు పనులు చూపని క్షేత్ర స్థాయి సిబ్బందిపై డ్వామా పీడీ పూర్ణిమాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ వంద రోజులు పనులు కల్పించాల్సిందేనని ఆదేశించారు. మార్చి నెలాఖరులోగా లక్ష్యం చేరుకోవాలని స్పష్టం చేశారు.

రోగి భద్రతలో స్టెరైల్ ప్రాసెసింగ్ కీలకం

ఇషాకాన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ జితేంద్రశర్మ తదితరులు

పరవాడ, న్యూస్‌టుడే: విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో ఇండియన్ స్టెరైల్ హెల్త్‌కేర్ అసోసియేషన్(ఇషా) ఆధ్వర్యంలో 8వ జాతీయ వార్షిక సదస్సు ఇషాకాన్-2026ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్టెరైల్ ప్రాసెసింగ్ భవిష్యత్తు, ఆవిష్కరణ, దోరణులు అనే థీమ్‌తో నిర్వహించిన ఈ సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. సెంట్రల్ స్టెరైల్ ప్రాసెసింగ్ సహాయక చర్య మాత్రమే కాదని రోగి భద్రత, ఇన్ఫెక్షన్ నివారణ, మెరుగైన క్లినికల్ ఫలితాలకు కీలకమని పేర్కొన్నారు. డానిష్ సొసైటీ ఫర్ పేషెంట్ సేఫ్టీ సీఈవో బెంగ్ క్రిస్టెన్సెన్ మాట్లాడుతూ అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, సురక్షితమైన, అధిక నాణ్యత గల ఆరోగ్య సంరక్షణ అందించడానికి స్టెరైల్ ప్రాసెసింగ్ సాంకేతికత, శిక్షణ వృత్తిపరమైన ప్రమాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. విశాఖ జోన్‌ చెందిన సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో పన్ను చెల్లింపుదారుల పాత్ర కీలకమన్నారు. జీఎస్టీ.. పన్ను విధానం మాత్రమే కాదని దేశాభివృద్ధికి సమిష్టి సహకారమన్నారు. పారిశ్రామికవేత్తలు జీఎస్టీ ద్వారా ప్రజల మౌలిక సదుపాయాల వృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఎంతో సహకరిస్తున్నట్లు చెప్పారు. 2017లో 65లక్షలుగా ఉన్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య 2025నాటికి 1.51 కోట్లకు పెరిగిందన్నారు. ఇండియన్ స్టెరైల్ హెల్త్‌కేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కెప్టెన్ జాబ్‌రాజ్ మాట్లాడుతూ స్టెరైల్ ప్రాసెసింగ్ భవిష్యత్తు ఆటోమేషన్, కృత్రిమ మేధ, డిజిటల్ ట్రాకింగ్, ఆధునాతన సాంకేతికతలపై ఆధారపడి ఉంటుందన్నారు. మెడ్‌టెక్ జోన్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ సంక్లిష్టమైన ప్రక్రియ గనుక సరైన భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. దేశంలోనే తొలిసారిగా మెడ్‌టెక్ జోన్‌లో స్టెరిలైజేషన్ టెక్నాలజీ అకాడమీని స్థాపించినట్లు చెప్పారు.

ఉపమాక వెంకన్నపై తొలిపాట రచన

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్నను కీర్తిస్తూ తొలిపాటను రచించారు. దీన్ని ఆదివారం రాత్రి ఆలయం వద్ద ఆవిష్కరించారు. అష్టావధాని, కవి డాక్టర్ గొట్టిముక్కల గాయత్రీదేవి ఈ పాట రచించారు. దీన్ని తిరితేజ చెందిన దోర విద్యాసంస్థ స్వరపరిచారు. ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆలయం వద్ద పీవీఎస్‌ఎస్ అధ్యక్షుడు కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పాటద్వారా ఆలయ విశిష్టత భక్తులకు మరింత చేరువ అవుతుందన్నారు. భక్తితత్వం పెరుగుతుందన్నారు. అనంతరం రచయిత్రి, స్వరకర్తను అభినంది సత్కరించారు. స్వరకర్తకు ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాదాయాలు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో తితిదే అధికారులు, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు క్రాంతికుమార్, సత్యనారాయణ, డీవీ రామారావు పాల్గొన్నారు.

బాధితులకు అండగా.. సాయపడిన వారికి తోడుగా

★ క్షతగాత్రులకు రూ. 1.25లక్షల వరకు అత్యవసర ఉచిత కార్పొరేట్ వైద్యం
★ సాయపడిన వారికి రాహ్‌వీర్ పురస్కారం రూ. 25వేలకు పెంపు

నక్కపల్లి, న్యూస్‌టుడే: తెల్లారితే చాలు ప్రమాదం జరగని రోజంటూ ఉండడం లేదు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల్లో తీవ్రగాయాలతో సకాలంలో వైద్యం అందక మరణిస్తున్నవారి సంఖ్య అధికంగానే ఉంటోంది. క్షతగాత్రులను తొలి గంటలోగా (గోల్డెన్ అవర్) ఆసుపత్రికి తీసుకెళ్లగలిగితే ప్రాణాలు నిలిచిన వారుంటారు. ఇలా సాయమందించిన వారికి కేంద్రం రాహ్ వీర్ కింద నగదు పురస్కారం ఇవ్వడమే కాదు, క్షతగాత్రులకూ అత్యవసర ఉచిత వైద్యం అందించనుంది.

జిల్లాలో 65 కిలోమీటర్ల పరిధిలో జాతీయ రహదారి ఉండగా, రాష్ట్ర, గ్రామీణ ప్రాంత రహదారులు దీనికి అదనం. వీటి పరిధిలో జరిగే ప్రమాదాల్లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడానికి ముందుకు వచ్చేది అంతంతమాత్రమే. సాయమందిస్తే పోలీసు స్టేషన్‌కు పిలిపిస్తారని, కోర్టుల చుట్టూ తిప్పుతారని భయం చాలామందిలో ఉండటమే దీనికి కారణం. ఫలితంగా ఆసుపత్రికి తరలించే ప్రక్రియలో జాప్యం జరిగి అనేక మంది మృత్యువాత పడుతున్నారు. ఈ జాప్యాన్ని అరికట్టేందుకు కేంద్రం రాహ్ వీర్ పథకం తెచ్చింది. గతేడాది జిల్లాలో 649 ప్రమాదాలు జరిగితే, 308 మంది మరణించారు. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నవారి సంఖ్య ఆందోళనకరంగా ఉండటంతో ప్రజల్లో చైతన్యం తెచ్చి గాయపడిన వారిని రక్షించేందుకు కేంద్రం మూడేళ్ల క్రితం గుడ్ సమారిటన్ తెచ్చి... తాజాగా దీన్ని రాహ్ వీర్‌గా మార్పు చేసింది.

క్షతగాత్రుల తరలింపు (పాత చిత్రం)

★ రోడ్డు ప్రమాద క్షతగాత్రుడిని గోల్డెన్ అవర్‌లోగా ఆసుపత్రికి పంపించి ప్రాణాలు కాపాడటంలో కృషి చేసినట్లు వైద్యులుగాని, పోలీసులుగాని ధ్రువీకరిస్తే సదరు వ్యక్తికి రూ. 25వేల బహుమతి, ప్రశంసా పత్రం ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఇప్పటివరకు ఇది రూ. 5వేలు మాత్రమే ఉండేది. ★ ప్రధానంగా ద్విచక్ర వాహన ప్రమాదాల్లో గాయపడిన వారిలోనే ఎక్కువ మంది మరణిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి ప్రమాదాల్లోనే జిల్లాలో గతేడాది 220మంది వరకు మరణించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ★ తీవ్రంగా గాయపడిన వారిని ఏ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినా ఎలాంటి షరతులు లేకుండా రూ. 1.5లక్షల విలువైన వైద్యాన్ని అందించాలని కేంద్రం ఆదేశించింది. ఈ మొత్తం ఆసుపత్రికి కేంద్రం చెల్లిస్తుంది. దీని ద్వారా క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లడమే కాదు, ప్రాణ రక్షణకు దోహదం చేస్తుంది. ప్రస్తుతం ముమ్మర ప్రచారానికి సిద్ధమవుతున్నారు.

విస్తృత ప్రచారం: రాహ్ వీర్ పురస్కారాన్ని కేంద్రం భారీగా పెంచింది. దీనిపై వైద్యులు, పోలీసు అధికారులతో సమావేశమై క్షతగాత్రులను రక్షించి ప్రాణాలు కాపాడే వారికి అందించే పురస్కారం కోసం వివరించాం. ఇందుకోసం కరపత్రాలు ముద్రించి విస్తృత ప్రచారం చేయిస్తున్నాం. అంతే కాకుండా తీవ్రంగా గాయపడిన వారికి ఎలాంటి షరతు లేకుండా ఏ ఆసుపత్రిలోనైనా రూ. 1.50 లక్షల వరకు ఉచిత చికిత్స చేయాలి. దీనికి సంబంధించి ఆసుపత్రులకు సర్క్యులర్ సిద్ధం చేస్తున్నాం. అతి త్వరలోనే ఇవి అమలుకానుంది. క్షతగాత్రులకు తక్షణ సాయమనేది ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలి.
- మనోహర్, జిల్లా రవాణాశాఖ అధికారి

నేటి నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి పాతజైలు రోడ్డులోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఆర్‌ఐఓ పి.మురళీధర్ తెలిపారు. మొదటి రోజు సంస్కృతం జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ ఎగ్జామినర్లు మధ్యాహ్నం ఒంటి గంటకు మూల్యాంకనం నిర్వహించే కేంద్రానికి వచ్చి రిపోర్టు చేయాలని సూచించారు.

లింగంపేటలో ఆక్రమణల తొలగింపు

నాతవరం, న్యూస్‌టుడే: పలు వివాదాల మధ్య లింగంపేట గ్రామ కంఠంలో ఆక్రమణలను పోలీస్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా తొలగించారు. ఇక్కడ సర్వే నంబరు 46లో 12 సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకుని తప్పుడు ధ్రువపత్రాలతో రిజిస్టర్ చేయించిన వైనంపై ఉమ్మడి సర్వే చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆక్రమణలను తొలగించి పంచాయతీకి స్థలాన్ని అప్పగించారు. ఇందులో త్వరలోనే పంచాయతీ భవనం నిర్మాణం చేయనున్నారు.

సైబర్ 'వేషాలు'.. నిలువెత్తు మోసాలు

ఈనాడు-విశాఖపట్నం, మధురవాడ-న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రధానంగా డిజిటల్ అరెస్టు, మనీలాండరింగ్, హవాలా కేసుల పేరుతో భయభ్రాంతులకు గురి చేసి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఇటీవల విశాఖ నగరంలో సైబర్ మోసాల బారిన పడిన బాధితుల్లో ఎక్కువ మంది వృద్ధులే ఉన్నారు.

హవాలా, మనీలాండరింగ్ పేరుతో బెదిరింపులు

విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులే బాధితులు

నగరంలో సైబర్ కేసులు ఇలా..	కేసులు	రికవరీ (రూ.కోట్లలో)
2023	409	1.10
2024	374	3.89
2025	286	14.64

అరెస్టయిన సైబర్ నేరగాళ్లు

2024	2025
160	205

ఇటీవల జరిగిన ఘటనలు..

1 ★ సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన 67ఏళ్ల విశ్రాంత ప్రొఫెసర్ పేరిట నకిలీ ఏటీఎం కార్డు సృష్టించారు. ఆ కార్డుకు, డ్రగ్స్ కేసుకు సంబంధం ఉందని ఆయన్ను బెదిరించి రూ.1.05కోట్లు కాజేశారు.

2 ★ నగరానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగికి గుర్తు తెలియని వ్యక్తి మహారాష్ట్ర డీఐజీ పేరుతో ఫోన్ చేశాడు. మనీలాండరింగ్ కేసులో మీ బ్యాంకు ఖాతాను గుర్తించామని, సుప్రీంకోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిందని భయపెట్టి రూ.66లక్షలు దోచేశాడు.

3 ★ రుషికొండ ప్రాంతానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగికి సైబర్ మోసగాడు ఫోన్ చేసి హవాలా లావాదేవీల్లో మీ బ్యాంకు ఖాతా గుర్తించామని, రూ.1.60కోట్లు ఇస్తే పేరు తొలగిస్తామని నమ్మించి నగదును ఖాతాకు జమ చేయించుకున్నాడు.

4 ★ ఎంవీపీ కాలనీలోని ఓ వృద్ధురాలిని సైతం హవాలా కేసు పేరుతో బెదిరించి రూ. 8.50లక్షలు కొట్టేశారు.

చాకచక్యంగా స్పందించాలి: స్కామర్లు వీడియోకాల్‌లో పోలీస్ యూనిఫాం వేసుకుని మాట్లాడతారు. వాస్తవంగా పోలీసులు అలా మాట్లాడరు. అరెస్టు అనేది చట్టపరమైన ప్రక్రియ. అరెస్టయితే డబ్బు జమ చేయాలని అడిగారంటే మోసపోతున్నట్లే అనుమానించాలి. నగరంలో డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ హెడ్ నర్సును బెదిరించి రూ.50లక్షలు డిమాండ్ చేశారు. ఆమె బ్యాంకుకు వెళ్లి డబ్బులు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. బ్యాంకు మేనేజర్ బాధితురాలి ఆందోళన గమనించి, వివరాలు తెలుసుకుని సీపీకి ఫిర్యాదు చేయడంతో సైబర్ దోపిడీకి అడ్డుకట్ట పడింది.

బాధితులు ఈ నెంబరుకు ఫోన్ చేయాలి..

మోసపోయామని గుర్తించిన గంటలోపు బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి చెప్పాలి. స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. వెంటనే పోలీసులు ఖాతాలోని నగదును ఫ్రీజ్ చేస్తారు. తర్వాత ఆ నగదు బాధితులకు తిరిగి అందేలా చూస్తారు.

సైనిక్ పాఠశాల ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

కుషాల్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

హేమచంద్ర

ఇలేష్

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: సైనిక్ పాఠశాలల్లో ఆరు, తొమ్మిది తరగతుల ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆరోతరగతి ప్రవేశానికి పరీక్ష రాసిన అనకాపల్లికి చెందిన యల్లపు కుషాల్ 285/300 మార్కులు సాధించి ఆల్ ఇండియాలో 116 ర్యాంక్ సాధించాడు. తమ కుమారుడు మెరుగైన ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులు యల్లపు శ్రీనివాసరావు, రేవతి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.
★ తొమ్మిదో తరగతి ప్రవేశం కోసం పరీక్ష రాసిన పట్టణానికి చెందిన వెలగాయల హేమచంద్ర 364/400 మార్కులు సాధించి ఆల్ ఇండియా 142 ర్యాంక్ సాధించాడు. విద్యార్థి ప్రతిభ పట్ల తల్లిదండ్రులు దుర్గలక్ష్మి, గోవిందలతో పాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు ఎ.సాయిబాబా సంతోషం వ్యక్తం చేశారు.
అచ్యుతాపురం: అచ్యుతాపురంలోని భవాని విద్యానికేతన్‌లో ఆయిదో తరగతి చదువుతున్న చెంచెంగారి ఇలేష్ సైనిక్ పాఠశాలకు ఎంపికయ్యాడని కరస్పాండెంట్ సంతోష్, ప్రిన్సిపల్ శ్రీలత చెప్పారు. ప్రవేశ పరీక్షలో 300 మార్కులకు 234 మార్కులు సాధించాడని పేర్కొన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు కూండ్రపు మూర్తిప్రసాద్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు, చిత్రంలో మాజీ ఎంపీ చలపతిరావు తదితరులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయాలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఎలమంచిలి తెదేపా కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. చిరుద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ పాటుపడుతోందన్నారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా రెండు సార్లు వీరికి వేతనాలు పెంచారన్నారు. అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పెంచామన్నారు. ప్రతి కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారన్నారు. వీరి డిమాండ్లలో తొమ్మిది ఇప్పటికే కూటమి ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, పట్టణపార్టీ అధ్యక్షులు గొర్లె నానాజీ ఆడారి ఆదిమూర్తి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధర లేక తోటల తొలగింపు

దొంకాడ వద్ద తొలగించిన టమాటా మొక్కలతో రైతులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: టమాటా ధర పతనమైపోవడంతో రైతులు నష్టాలబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే నక్కపల్లి మండలం దొంకాడలో కొందరు రైతులు తమ తోటలు తీసేస్తున్నారు. ప్రస్తుతం క్రేటు (సగటు బరువు 28 కేజీలు) విక్రయిస్తే కేవలం రూ.100 మాత్రమే లభిస్తుంది. కూలీలను పెట్టి టమాటాలు ఏరేందుకు రూ.600 చెల్లిస్తున్నారు. వీరు ఒకరోజుకు సేకరించిన పంటను విక్రయిస్తుంటే రూ. 500 మాత్రమే వస్తోందని రైతులు చెబుతున్నారు. నష్టం వస్తుండటంతో కొందరు రైతులు పొలాల్లో టమాటా తోటలు తొలగించారు. గ్రామంలో సుమారు 100 ఎకరాల వరకు తోటలున్నాయని, ఇప్పటికే పలువురు తొలగించారని, గ్రామానికి చెందిన రైతు శ్రీను తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

భగీరథీ ఆలయం వద్ద..

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మండలంలోని హరిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అందలాపల్లిలోని భగీరథీ ఆలయం వద్ద ఆదివారం సమావేశమయ్యారు. కుటుంబ సభ్యులతో హాజరై ఆటపాటలతో సాయంత్రం వరకు సందడి చేశారు. పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
☛ కొండకర్ల ఆవ వద్ద అచ్యుతాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. పాఠశాల అభివృద్ధికి కృషిచేద్దామని నిర్ణయం తీసుకున్నారు. ప్రతిఏటా కలుస్తూ ఉండాలని నిర్ణయించుకున్నారు. మద్దెల నానాజీ, ద్వారపరెడ్డి బాబ్జీ, సత్తిబాబు, గోవాడ నాయుడు, హరికృష్ణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

కొండకర్ల ఆవ వద్ద 1994-95 బ్యాచ్ విద్యార్థులు

'పాత పింఛను పునరుద్ధరించాలి'

ఆందోళనలో ప్రభుత్వ ఉద్యోగులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛను పథకాన్ని రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పింఛనుపథకం ఉద్యోగుల సంఘం ఐక్యవేదిక ఛైర్మన్ కేఆర్.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ ఉద్యోగులు 'సాగరఘోష' పేరిట జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ...సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం ఓపీఎస్ మాత్రమే అన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. సంఘం అధ్యక్షుడు బాజీపఠాన్ మాట్లాడుతూ... ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు. ఇదే డిమాండ్‌తో కార్మిక దినోత్సవం సందర్భంగా కడపలో ప్రభుత్వ ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహిస్తారని స్పష్టం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్, నాయకులు కేదారేశ్వరరావు, అప్పలనాయుడు, జి.మురళీ, ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు మిగిలింది రెండు వారాలే

పుస్తకాలు పరిశీలిస్తున్న డీఈఓ

నక్కపల్లి, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల ప్రారంభానికి ఇంకా రెండు వారాల గడువే ఉందని.. విద్యార్థులు, ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ పెట్టాలని డీఈఓ గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. వేంపాడు, ఉద్దండపురం ఉన్నత పాఠశాలలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు.

సమన్వయంతో పనిచేయండి

నెహ్రూచౌక్ (అనకాపల్లి): సోమవారం నుంచి నిర్వహించనున్న సార్వత్రిక విద్యాపీఠం ఇంటర్ పరీక్షల నిర్వహణకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని డీఈఓ గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందు చేరుకోవాలన్నారు. ఇన్విజిలేటర్లు పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకురాకుడదన్నారు

విద్యావంతులతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఏ ప్రాంతమైనా, కుటుంబమైనా విద్యావంతులలోనే అభివృద్ధి చెందుతుందని సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకట రమణ పేర్కొన్నారు. సత్యనారాయణపురం పంచాయతీ సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో ఆదివారం చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి దేవాంగ కుటుంబాల ఆత్మీయ సమారాధన, సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. సీఆర్ఎం సంస్థలు వ్యాపార అభివృద్ధితోపాటు సేవా కార్యక్రమాలు పెంచుకుంటూ వస్తున్నాయన్నారు. ఉప్పు సత్యనారాయణ, శీలా వెంకట రమణారావు, కొమ్మన లక్ష్మణరావులు మాట్లాడారు. సంఘ గౌరవాధ్యక్షులు ముప్పన వ్యాపార సంస్థల అధినేత ముప్పన సుబ్రహ్మణ్యం, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి వరప్రసాద్, బూడిద నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని.. అలరిస్తుంది'

కార్యక్రమంలో పాల్గొన్న లయ, శివాజీ

విశాఖపట్నం, న్యూస్‌టుడే : 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' చిత్రం అన్ని వర్గాలను అలరిస్తుందని కథానాయకుడు శివాజీ అన్నారు. ఆదివారం చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా హోటల్ దసపల్లా ఎగ్జిక్యూటివ్ కోర్టులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివాజీ మాట్లాడారు. ఈనెల 6న విడుదలయ్యే చిత్రాన్ని ప్రతి ఒక్కరూ థియేటర్‌లో చూసి, ఆదరించాలని కోరారు. సినిమాలో ఆఖరి 45 నిమిషాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటుందన్నారు. ఓవైపు సినిమాలు చేస్తూనే, మరో వైపు ప్రజా సమస్యలపై స్పందిస్తుండడంతో ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, గతంలో రాజధాని అమరావతి కోసం మాట్లాడానని శివాజీ అన్నారు. హీరోయిన్ లయ మాట్లాడుతూ... సినిమాలో ఊహించని ట్విస్టులు ప్రేక్షకులను అలరిస్తాయన్నారు. విశాఖతో ఎంతో అనుబంధం ఉందని ఆమె గుర్తు చేసుకున్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

EDUCATION

BPT (4 1/2 Years) Seats available Paramedical DMLT, DECG, DMIT, DANS, D.Cardio DDIALY @ SUN COLLEGE. Ph.: 9573365333.

FINANCIAL SERVICES

Loans: Home, Plot Purchase, Mortgage & MSME's Schemes & Need Good Cibil Score Profiles we offer collaterals Ph:9542157967.

Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు EMI వాయిదా పద్ధతిలో పర్సనల్ ఫైనాన్స్, అన్నితరగతుల వారికి స్థిరాస్తులపై ఫైనాన్స్ ఇవ్వబడును. Cell: 73862 01191.

REAL ESTATE

PLOT FOR SALE

KOTHAVALASA

కొత్తవలస- రాయపూర్ హైవేకి 1KMలో 516E పెందుర్తి-అరకు రానున్నహైవేకి 2KMలో VMRDA Plots గజం12వేలు. 7416862947, 9182857713

TO LET

KURMANNAPALEM

3BHK Fully furnished Flat in Kurmannapalem 1800 SFT . Fully furnished, ACs, Cots, Gas stove, Fridge, Sofa, dining table. For Families/ Company GH. Contact: 9866182944

SECOND SALE

Office Furniture for Sale. New looking Furniture and Computers. Contact ✆ : 8905890542.

JOBS

WALK IN INTERVIEW
A multicrore org. No.1 position in 2 States (AP & Telangana) as per job calender FY 25-26 last quarter, appointing the following positions in Vizag Branches.
1. DIVISIONAL MANAGERS - 6 No's
2. CHIEF MANAGERS: 10 No's
3. PROBATIONARY OFFICERS : 30 No's
Qulf: Post-1: Retd. Gazetted Officers. Packge: 20 Lakhs PA (Salary + Allow). Post-2: Working / Retd. / VRS in Govt. / Pvt. Package: 15 Lakhs PA (Salary + Allow). Post-3: 30+ Age, Any Degree, Exp No Bar. Package: 6 Lakhs PA.
Interviews on 2nd & 3rd March 2026
Cont: C. RAMAKRISHNA, DGM SEETHAMMADHARA, VIZAG
9676811666

మా కంపెనీలో పనిచేయుటకు Telecallers (M) Marketing Executives (M) Min. 1 Year Exp. కావలెను. Ct: 6309160945.

ఫైనాన్స్ రంగంలో అనుభవం గల వైజాగ్‌లో పనిచేయుటకు బ్రాంచ్ మేనేజర్ & అనకాపల్లి, గాజువాక, చోడవరం, నర్సీపట్నం ఏరియాలలో పనిచేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ స్టాఫ్ కంప్యూటర్ నాలెడ్జ్ (F) కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ +TA రాఘవ ఆటో ఫైనాన్సియర్స్, దొండపర్తి VSP 7680880513, 9100902198 9100980842

*లేడీ ఆఫీస్ ఇంచార్జి-2, అర్హత: డిగ్రీ, శాలరీ-15వేలు, *లేడీ రిసెప్షనిస్ట్-2, *లేడీ టెలికాలర్స్-3, అర్హత: ఇంటర్, శాలరీ-10వేలు, ఆఫీస్ బాయ్-1, ఆయా-3, శాలరీ-9వేలు అర్జెంటుగా కావలెను. క్రిస్టియన్ డిఫెన్స్ అకాడమీ, శ్రీకన్య థియేటర్ దగ్గర, న్యూ కాలనీ, Ph.9121232326

బుక్ డిస్ట్రిబ్యూటర్స్ కొరకు నో పెట్టుబడి మీ ఏరియాలో ప్రైవేట్ స్కూల్స్ పరిచయం & అనుభవమున్న వారికి ప్రాధాన్యత. ఉమా పబ్లిషర్స్, Guntur. ✆ 98493 70729.

Tally అకౌంటెంట్ బిల్లింగ్ పర్సన్, అడ్మినిస్ట్రేటివ్ & మార్కెటింగ్ పర్సన్స్ కావలెను. Qly:డిగ్రీ /MBA అనుభవం, ఉత్సాహవంతులైన వారు వైజాగ్ సిటీలో పనిచేయుటకు కావలెను.ఆకర్షణీయమైన జీతం. 9703402722, 9866546060

DRIVERS

Non Local experienced car drivers age 20 to 50 years. Food and accommodation available. Con. 8897663366

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ముంచుకొచ్చిన మృత్యువు

★ పశువుల షెడ్డు నిర్మిస్తుండగా విద్యుదాఘాతం ★ ఇద్దరు మృతి

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెం గ్రామంలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి గురై ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ ఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. షెడ్డు నిర్మాణానికి జేసీబీతో స్తంభాన్ని నిలబెట్టే క్రమంలో పైనున్న 11 కేవీ విద్యుత్ తీగలకు తాకడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇసకలపాలెం గ్రామానికి చెందిన కాళ్ల సూరీడు (70), కుమారుడు సూరిబాబు (46) కళ్లం వద్ద పాత స్తంభాలు సేకరించి పశువుల షెడ్డు నిర్మిస్తున్నారు. తాపీ మేస్త్రి కంటుబోతు శ్రీను (36) స్తంభాలు నిలబెట్టడానికి వెళ్లారు. మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో చివరి స్తంభం జేసీబీతో నిలబెట్టే క్రమంలో పైనున్న 11 కేవీ విద్యుత్ తీగలకు తాకడంతో దాన్ని పట్టుకొని నిల్చొని ఉన్న ముగ్గురూ తుళ్లిపడ్డారు. సూరీడు, శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా సూరిబాబు గాయాలతో బయటపడ్డాడు. అక్కడున్న ఇద్దరు యువకులు స్పందించి సీపీఆర్ చేసి బతికించే ప్రయత్నం చేయగా అప్పటికే ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన సూరిబాబును చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.



సూరీడు (పాతచిత్రం)



శ్రీను (పాతచిత్రం)

★ **బతుకుదెరువు కోసం వచ్చి..:** విద్యుదాఘాతంతో మృతి చెందిన తాపీ మేస్త్రి కంటుబోతు శ్రీను స్వస్థలం విజయనగరం జిల్లా డెంకాడ మండలం గుండాలపేట గ్రామం. బతుకుదెరువు కోసం 13 ఏళ్ల క్రితం పద్మనాభం వచ్చి స్థిరపడ్డారు. కృష్ణాపురం జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. భార్య రాజు (35), కుమార్తె మాధురి (14), కుమారుడు పవన్ సాయి (12) ఉన్నారు. అందరితో చనువుగా ఉండేవాడు. శ్రీను కుమార్తె పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఆయన మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ★ కాళ్ల సూరీడుకు భార్య కనకం, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఒక పక్క భర్త విగతజీవిగా పడి ఉండగా.. మరో పక్క కొడుకు సూరిబాబు గాయాలపాలై ఆసుపత్రిలో ఉండటంతో కనకం రోదిస్తున్న తీరు చూపరులను కలచివేసింది.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రమాదానికి కారణమైన స్తంభం

ఆటో బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ ఆటోడ్రైవర్ మృతి చెందినట్లు మూడో పట్టణ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు తెలిపారు. ఆ వివరాలిలా.. చినజాలరిపేటకు చెందిన చింతల గురుమూర్తి (50) ఆదివారం సాయంత్రం అతివేగంగా ఆటో నడుపుతూ సిరిపురం సమీపంలో ఓ ప్రైవేటు హోటల్ వద్ద డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో వాహనం బోల్తా పడి డ్రైవర్ కింద పడ్డాడు. తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులు లేరు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. డ్రైవర్ మద్యం తాగి ఆటో నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ విషయం శవపరీక్ష నివేదికలో తెలుస్తుందని పోలీసులు అంటున్నారు.

వివాహిత ఆత్మహత్య

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి సమీపంలోని ఉమ్మలాడ వంతెన వద్ద శారదానదిలో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అనకాపల్లిలోని ముత్రాసుకాలనీలో ఉంటున్న బి. నూకేశ్వరి (36) శనివారం సాయంత్రం శారదానదిలో దూకింది. మృతదేహాన్ని గుర్తించారు. కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. మృతురాలి సోదరుడు మోహన్ గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

హోలీ రద్దీకి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం: హోలీ రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.
యశ్వంత్‌పూర్ - సంత్రాగచ్చి (06233/34): ఈనెల 1న ఉదయం 7.30 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి, అదే రోజు రాత్రి 8.45 గంటలకు సంత్రాగచ్చికి చేరుతుంది. 3వ తేదీ తెల్లవారుజామున 2.45 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి, గురువారం తెల్లవారుజామున 4 గంటలకు యశ్వంత్‌పూర్‌కు చేరుతుంది.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	150	145
లైవ్	177	165
డ్రెస్డ్	257	300
స్కిన్‌లెస్	292	310

(c) eenadu

తెరపై ఈనాడు

అనకాపల్లి పట్టణం: రాజా- హాయ్ బల్వంత్, రామచంద్ర: సన్‌ఆఫ్, వెంకటేశ్వర: 100 డేస్ లవ్‌స్టోరీ, సత్యనారాయణ స్క్రీన్-1: అనగనగా ఒక రాజు, స్క్రీన్-2: అల్లా, పద్మసాయి: మన శంకర వరప్రసాద్‌గారు, షిర్డీసాయి: విష్ణువిన్యాసం, అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: విష్ణువిన్యాసం స్క్రీన్-2: సన్‌ఆఫ్

అ వీ ఇ వీ

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లిలో బాలికల గురుకుల పాఠశాలలో అయిదు, ఇంటర్ తొలి ఏడాది ప్రవేశాల నిమిత్తం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇక్కడకు పలు మండలాల్లో విద్యార్థులు చేరుకోగా పాఠశాల సిబ్బంది తనిఖీల అనంతరం వారిని లోనికి పంపించారు. ఉదయం అయిదో తరగతి, మధ్యాహ్నం ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. దాదాపు 250 మంది వరకు హాజరైనట్లు ప్రిన్సిపల్ ఉషారాణి తెలిపారు.

నక్కపల్లి పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

కేంద్రీయ విద్యాలయ నిర్మాణం ప్రారంభించాలి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి మండలం సుందరయ్యపేట పంచాయతీ అచ్చియ్యపేటలో కేటాయించిన పది ఎకరాల స్థలంలోనే కేంద్రీయ విద్యాలయం పక్కా భవనాల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపిక చేసిన స్థలాన్ని ఆదివారం సీపీఎం అనుబంధ సంఘాల ప్రతినిధులతో కలిసి సందర్శించారు. కేంద్రీయ విద్యాలయం కోసమే ఇక్కడ స్థలాన్ని రూ. లక్షలు ఖర్చు చేసి అభివృద్ధి చేశారన్నారు. ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధితో పనుల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. సీపీఎం మండల కార్యదర్శి వియ్యపు రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జి.ఫణీంద్రకుమార్, వియ్యపు గణేష్, ఒమ్మి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవరం సర్పంచి మృతి



పాయకరావుపేట (గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని సత్యవరం గ్రామ సర్పంచి నక్క లేటి రాము (62) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కొన్ని రోజుల క్రితం గుండెనొప్పి రావడంతో కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి వైద్యుల పర్యవేక్షణలో ఉంటూ ఆదివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. సర్పంచిగా గ్రామాభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేశారు. ఆయన మృతికి వివిధ పార్టీల నాయకులు, అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఖాజీపాలెంలో మద్యం గొలుసు దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖరరావు ఆదివారం చెప్పారు. ముందస్తు సమాచారంతో దాడి చేయగా మద్యం సీసాలు పట్టుబడ్డాయన్నారు.

రహదారులకు మహర్దశ

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు సైతం మహర్దశ పట్టిందని తెదేపా మండల శాఖ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం తెలిపారు. రేవుపోలవరంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రహదారికి నాయకులతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. తెదేపా మండల శాఖ మాజీ అధ్యక్షుడు వెంకటరాజు, కొరుప్రోలు పీఏసీఎస్ ఛైర్మన్ గుర్రం రామకృష్ణ, తెలుగు యువత మండల అధ్యక్షుడు కోడా లోవరాజు, సీనియర్ నాయకులు వాసుపల్లి అడవిరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి విధ్వంసం సృష్టించి అవినీతికి పాల్పడిన నాయకులను నిలదీయాలని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి మోటూరు శ్రీవేణి పిలుపునిచ్చారు. మడుతూరు శివారు ఎరికిరెడ్డిపాలెంలో రూ.5.1 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. నాయకులు శ్రీనివాసరావు, అప్పారావు, సత్యారావు, నాగేశ్వరరావు, పవన్‌కుమార్, రాంబాబు, నాయుడు, అప్పలరత్నం పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు

కోటవురట్ల, న్యూస్‌టుడే: మండలంలోని గ్రామాల్లో పాడైపోయిన బోర్లను ప్రత్యేక కార్యక్రమం ద్వారా మరమ్మతు చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. పాములవాక, జల్లూరు, బాపిరాజు కొత్తపల్లి, బోడపాలెం, కొత్తూరు, పి.కొత్తపల్లి గ్రామాల్లోని 15 బోర్లను బాగు చేశామన్నారు. వేసవి నేపథ్యంలో ఈ ప్రత్యేక కార్యక్రమం చేపట్టామన్నారు. బోర్లు పాడైతే గ్రామస్థులు కూడా సమాచారం ఇవ్వాలని ఏఈ కోరారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

ప్లాస్టిక్ వ్యర్థాలతో.. ప్రజారోగ్యానికి ముప్పు...

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం, పరవాడ సెజ్‌ల పరిధిలో వందలాది ఫార్మా, రసాయన కంపెనీలు ఉన్నాయి. మందులు, రసాయనాలు ఉత్పత్తి కోసం ఈ కంపెనీలు ముడి సరుకులను ప్లాస్టిక్ కవర్లలో తీసుకొస్తుంటాయి. ఇవి ఎక్కడ పడేయాలో తెలియక కంపెనీలు ఉచితంగా ఇచ్చేస్తున్నాయి. దీంతో కొందరు వీటిని సేకరించి.. నిల్వ చేస్తూ విక్రయించి వ్యాపారం చేస్తున్నారు.

నారపాక వద్ద నిల్వ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

★ ఇలా ప్రమాదకరమైన రసాయనాలతో నిండిన కవర్లను మండలంలోని నారపాక సమీపంలో ఖాళీ ప్రదేశంలో నిల్వ చేస్తున్నారు. దొప్పెర్ల, ఆవసోమవరం, చీమలాపల్లి, మడుతూరు, నునపర్తి సమీపాల్లో ఇటువంటి ప్లాస్టిక్ కవర్ల వ్యాపారాలు జరుగుతున్నాయి. అమాయకపు కూలీలకు కూలి డబ్బులు చెల్లించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా వీటిని వేరుచేయిస్తున్నారు. కవర్లను అంటుకుని ప్రమాదకరమైన రసాయనాలు ఉన్నాయనే విషయం తెలియక ఖాళీ స్థలాలకు అద్దె వస్తుందనే ఆశతో వారు స్థలాలను సమకూర్చుతున్నారు. వీటితోపాటు ప్రమాదకరమైన ప్లాస్టిక్ డ్రమ్ములను సైతం ఈ ప్రాంతాల్లో నిల్వ అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప అధికార యంత్రాంగం ఇటువైపు కన్నెత్తి చూడటంలేదు. అధికారులు, పోలీసులకు వీరు ప్రతినెలా మామూళ్లు అందించి వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే బహిరంగంగా ఇంత ప్రమాదకరమైన వ్యాపారం ఎటువంటి అనుమతులు, జాగ్రత్తలు తీసుకోకుండా చేస్తున్నా ఎవరూ కనీసం పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి.

ఉపమాక, పెదగుమ్ములూరు చెరువులకు మహర్దశ

రూ. 2.5 కోట్లతో అభివృద్ధికి మంత్రి అనిత చర్యలు

నక్కపల్లి, ఎస్.రాయవరం న్యూస్‌టుడే: 'పేట' నియోజకవర్గంలోని రెండు చెరువులను భారీ ఎత్తున అభివృద్ధి చేయడానికి మంత్రి వంగలపూడి అనిత సంకల్పించారు. వీటిని ట్యాంక్‌బండ్ తరహాలో తీర్చిదిద్దనున్నారు. ఇందుకోసం సీఎస్ఆర్ నిధులు రూ. 2.50 కోట్లు వరకు వెచ్చించనున్నారు. తద్వారా స్థానికంగా మరింత అభివృద్ధి జరగనుంది.

★ నక్కపల్లి మండలం ఉపమాక వెంకన్న బందరు సరస్సు, పెద్ద చెరువు కలిసి ఉంటాయి. వైజాగ్ పాలనలో తిరిగే వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో నిరంతరం కలుషితమైంది. దీంతో దేవుడి సేవలకు ఈ నీటిని వాడటం మానేశారు. దీన్ని ఆనుకుని 20 ఎకరాల్లో పెద్ద చెరువు ఉంది. వర్షాకాలంలో ఎగువ ప్రాంతం నుంచి పంట కాలువల ద్వారా నీరు ఇందులోకి వచ్చి చేరి నిండేది. ప్రస్తుతం పంట కాలువ ఎక్కడికక్కడే గండ్లు పడటంతో నీరు సక్రమంగా రావడంలేదు. దీనికి తోడు బందరు సరస్సుకు అనుసంధానంగా ఉన్న కాలువను గతంలోనే మూసేశారు. ఫలితంగా చెరువులో నీరు కలుషితమవుతుండగా, స్థానికులు ఇందులో చెత్త వేస్తున్నారు. ఈ చెరువును అన్నివిధాల అభివృద్ధి చేయాలని మంత్రి అనిత నిర్ణయించారు. ఈ మేరకు కలుషిత జలాలు తొలగించడంతోపాటు, చుట్టూ వాకింగ్ ట్రాక్, సోలార్ దీపాలు, మినీ పార్కు ఏర్పాటు చేసేలా ఇప్పటికే ఏషియన్ పెయింట్స్ సంస్థతో మాట్లాడారు. ప్రస్తుతం పెద్ద చెరువులో వ్యర్థాలను తొలగించే పనులు చేస్తున్నారు. కల్యాణోత్సవాల అనంతరం పూర్తిస్థాయిలో పని చేయనున్నారు.

★ ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరు గ్రామాన్ని, జాతీయ రహదారిని ఆనుకుని 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎర్ర చెరువును ఇదేతరహాలో అభివృద్ధి చేయడానికి సంకల్పించారు. ఈ చెరువు ద్వారా వంద ఎకరాలకు పైగా సాగునీరు అందుతుంది. చేపల పెంపకం ద్వారా ఏటా దాదాపు రూ. లక్ష వరకు ఆదాయం వస్తోంది. ఈ మొత్తాన్ని గ్రామాభివృద్ధికి వినియోగిస్తున్నారు. ఈ చెరువుకు ఓ వైపు జాతీయ రహదారి, మరోవైపు నర్సీపట్నం రోడ్డు, ఇంకోవైపు గ్రామాలకు వెళ్లే రహదారి ఉంది. ఈ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, లైటింగ్, కూర్చునే బల్లలు ఏర్పాటు చేయనున్నారు.

అభివృద్ధి చేయనున్న పెదగుమ్ములూరు చెరువు

సాగునీటి కాలువల్లో మురుగు

మునగపాక, న్యూస్‌టుడే: సాగునీటి కాలువల్లో మురుగు ప్రవహిస్తోంది. గ్రామంలో ఊడ్చిన చెత్తను ఈ కాలువల్లో పోసేస్తున్నారు. ఇవి రూపం కోల్పోయి.. చెత్తతో నిండిపోయాయి. నాగులాపల్లి చానల్ ఉమ్మలాడ, నాగులాపల్లి గ్రామాల మధ్య ఉండటంతో ఇదో డంపింగ్ యార్డ్‌గా మారింది. కృష్ణం రాజు చానల్ దుర్గంధం వెదజల్లుతోంది. కాలువల్లో పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

గవర్లఅనకాపల్లి వద్ద కాలువలో చెత్త

తలుపులకు తుప్పు...

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఆనకట్టల తలుపులకు తుప్పు పడుతోంది. పట్టణంలోని తాండవ నదిలో సుమారు 15 ఏళ్ల క్రితం రూ.14 కోట్ల వ్యయంతో భూమి, మురా ఆనకట్టలు నిర్మించారు. కట్టాకొండ వద్ద భూమి, పేట శివారులో మురా ఆనకట్ట కట్టారు. వీటి నుంచి మాసాహెబ్‌పేట, సత్యవరం, మంగవరం, అరట్లకోట, రాజవరం, భూమి, మురా కాలువల్లోకి నీరు చేరేలా రూపొందించారు. దీనికోసం ఇనుప తలుపులు ఏర్పాటు చేశారు. తలుపుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో తుప్పు పట్టాయి. తలుపుల పై భాగంలో రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతోపాటు వరదల సమయంలో తలుపులు ఎత్తేందుకు ఇబ్బందులు వస్తున్నాయి. రెండు ఆనకట్టల నుంచి పాయకరావుపేట, నక్కపల్లి మండలాల పరిధిలో సుమారు 30 వేల ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీరు సరఫరా అవుతోంది. సకాలంలో మరమ్మతు చేపట్టకపోవడంతో ఆనకట్టల మనుగడకే ముప్పు వాటిల్లనుంది. జల వనరుల శాఖ డీఈ సురేష్‌కుమార్ మాట్లాడుతూ తలుపుల మరమ్మతులు చేపడతామన్నారు.

మురా ఆనకట్ట

అభివృద్ధి మాటల్లో.. రహదారి బురదలో

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం సైతంతెన నిర్మాణ పనుల ప్రభావం ప్రత్యక్ష నరకాన్ని రుచి చూపిస్తున్నాయి. దీనికి ఉదాహరణే సెజ్ సాక్ష్యం. అచ్యుతాపురాన్ని సెజ్‌ని కలపడానికి ఉపయోగిస్తున్న పల్లె రహదారిని జనం పట్టించుకోకపోవడంతో ఇలా బురదమయంగా మారి ప్రజలకు గాయాలను శిక్షగా అందిస్తుంది. సమీపంలో ఉండే బహుళఅంతస్తుల భవనాల వాడకనీరు ఇలా ఈ రోడ్డు మీద ప్రవహించడం పట్టించుకోకపోవడంతో బురదగా మారింది. గుత్తేదారు, అధికారులు కనీసం పట్టించుకోకుండా ఇలా వదిలేయడంతో వాహనాలు కదలకుండా నిత్యం ఇబ్బందిపడుతున్నారు. ప్రజలు ప్రత్యామ్నాయంగా వాడుతున్న రోడ్డును కొద్దిపాటి గ్రావెల్ వేసి చదును చేసినా ఈ ఇబ్బంది ఉండదని అంటున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రజలు బాధలు ప్రజలకే వదిలేశారని మండిపడుతున్నారు.

సెజ్‌ని కలిపే ప్రత్యామ్నాయ రోడ్డు

కూలేట్టుంది..... పట్టించుకోరు

అనకాపల్లి (గ్రామీణం), న్యూస్‌టుడే: శంకరంలో సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకుంది. గ్రామ అవసరాల కోసం 20 ఏళ్ల క్రితం ఈ భవనాన్ని నిర్మించారు. సభలు, సమావేశాలు ఇక్కడే నిర్వహించేవారు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరుకుని స్లాబు పెచ్చులు పెచ్చులుగా ఊడిపడుతున్నాయి. ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. ఏక్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్థులు భవనం వైపు వెళ్లడానికి వణికిపోతున్నారు. చిన్నారులు ఈ భవనం వద్ద ఆటపాటలతో గడుపుతున్నారు. అధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

శిథిలావస్థలో సామాజిక భవనం

50శాతం ఇంటి పన్నుల వసూలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: మండలంలోని 28 పంచాయతీల్లో 50 శాతం ఇంటి పన్నుల వసూలు పూర్తయినట్లు డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. కొరుప్రోలు, ధర్మవరం, చినగుమ్ములూరు, తిమ్మాపురం పంచాయతీల్లో ఇళ్ల పన్నుల వసూలును ఆదివారం ఆయన పరిశీలించారు. ఇంటి పన్నుల వసూలు లక్ష్యం రూ.2.54 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.1.26 కోట్లు వసూలైనట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఇంటి పన్నులు ఉపకరిస్తాయని, ప్రజలంతా సహకరించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, సాయి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొరుప్రోలులో ఇంటి పన్నులు వసూలు చేస్తున్న సిబ్బంది

ఏటిగట్లనూ వదలడం లేదు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఆక్రమణలకు కాదేదీ అనర్హం అన్న రీతిలో ఆక్రమణదారులు బరితెగిస్తున్నారు. ప్రభుత్వ స్థలం కనబడితే చాలు గద్దల్లా వాలిపోతున్నారు. పట్టణ పరిధిలో తాండవ ఏటి గట్టు ఆక్రమణకు గురవుతోంది. నాగరాజుపేట, చాకలిపేట తదితర ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టారు. దీంతోపాటు మురా ఆనకట్ట సమీపంలోనూ ఇంటిని నిర్మించారు. నది గట్టును ఆక్రమించి యథేచ్ఛగా ఇళ్లు కడుతున్నారు. తుని వైపు తాండవ ఆక్రమణల బారిన పడింది. మార్కెట్ వద్ద ఉన్న గోడను పడగొట్టి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో నది గట్టు వెడల్పు తగ్గుతోంది. వాస్తవానికి జంట పట్టణాలైన తుని, పాయకరావుపేట మధ్య 150 మీటర్ల వెడల్పుతో నది ఉండాలి. ఆక్రమణల కారణంగా 70 మీటర్లకు తగ్గిపోయింది. గట్టుపై ముందుగా షెడ్లు నిర్మిస్తున్నారు. వాటికి విద్యుత్తు కనెక్షన్ తీసుకుంటున్నారు. ఆ తర్వాత దాన్ని తొలగించి శాశ్వతంగా కట్టడాలు కడుతున్నారు.

తాండవ గట్టుపై నిర్మాణాలు

మధుమేహంపై అప్రమత్తం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: మధుమేహం పట్ల అప్రమత్తత అవసరమని వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షులు యల్లపు శివ పేర్కొన్నారు. వాకర్స్ క్లబ్, యుప్పైమ్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వంద మందికి పైగా సభ్యులకు మధుమేహం, రక్తపోటు, ఈసీజీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సంతులిత ఆహారం తీసుకుంటూ, వ్యాయామం చేయాలని సభ్యులకు సూచనలు చేశారు. క్లబ్ కార్యదర్శి కేవీ.సత్యనారాయణ, కోశాధికారి వీకేఎం.నాయుడు, సీనియర్ నల్లల దేముళ్ల, రాపేటి నారాయణరావు, మల్లికార్జున, అరుణాచలం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పెదగుమ్ములూరులో నూకాంబిక, మరిడిమాంబ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ వినోదరాజు పోటీలు ప్రారంభించగా, గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారుడు సీతారామరాజు టాస్ వేశారు. పురుషుల విభాగంలో 20, మహిళల విభాగంలో ఆరు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు హోరాహోరీగా జరిగాయి. విజేత జట్లకు ఈ నెల అయిదున జరిగే కార్యక్రమంలో బహుమతులు అందించనున్నారు.

హోరాహోరీగా ఇరు జట్ల మధ్య పోరు

చెరకు రైతులను ఆదుకోవాలి

మునగపాక, న్యూస్‌టుడే: అగ్నిప్రమాదం కారణంగా చెరకుతోట దగ్ధమై ఆర్థిక నష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ తహసీల్దార్‌ను కోరారు. పూరిడిగెడ్డ మూలప్రాంతంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌కి రైతు వేగి నాగసూరి అప్పారావుకు చెందిన 75 సెంట్ల విస్తీర్ణంలోని చెరకు తోట శనివారం దగ్ధమైన విషయం తెలిసిందే. సాయికృష్ణ, మండల తెదేపా అధ్యక్షుడు పెంటకోట విజయ్ ఆదివారం దగ్ధమైన చెరకుతోటను పరిశీలించారు. విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతుండటం వల్ల గాలికి తీగలు తగిలి నిప్పులుపడి తోటకు అంటుకుందని రైతు తెలిపారు. అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తుచేసి బాధిత రైతుకి పరిహారం అందజేయాలని నేతలు కోరారు.

స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

మునగపాక, న్యూస్‌టుడే: అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థికమండలిలో నూతనంగా ఏర్పాటవుతున్న పరిశ్రమల్లో ఎలమంచిలి నియోజకవర్గ పరిధిలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు కోరారు. ఈ మేరకు విశాఖ వచ్చిన ఐటీ మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. సెజ్‌లో భూములు కోల్పోయిన బాధితుల పిల్లలకు, స్థానిక నిరుద్యోగులకు, తెదేపా కార్యకర్తలకు పరిశ్రమల్లో పూర్తిస్థాయిలో ఉద్యోగ అవకాశాలు దక్కలేదన్నారు. ప్రత్యేక దృష్టిసారించి స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని విన్నవించానన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

భక్తిశ్రద్ధలతో మోదకొండమ్మ జాతర

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: భట్లపూడి, రాయుడుపేట గ్రామాల్లో ఆదివారం మోదకొండమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఘటాలను పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. ప్రతి ప్రత్యేకంగా పూలదండలతో అమ్మవారిని అలంకరించారు. జాతరను తిలకించడానికి ఇతర జిల్లాల నుంచి భారీగా బంధువులు, యువకులు తరలివచ్చారు.

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట వెలమపేట గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఆదివారం ఉదయం అమ్మవారి నిమజ్జనంతో ముగిసింది. పరిసర గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు ఉత్సవాన్ని తిలకించారు. సీఐ అల్లుస్వామినాయుడు ఆధ్వర్యంలో ఎస్సైలు పి.మనోజ్‌కుమార్, కె.లక్ష్మణరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ

మునగపాక, న్యూస్‌టుడే: మూలపేటలో ఆంజనేయస్వామి ఆలయ 17వవార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. దిద్దుకూరి మోహనరావు కుటుంబీకులు సొంతసొమ్ముతో గ్రామంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆర్ఈసీఎస్‌మాజీ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాదు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ దొడ్డి శ్రీనివాసరావు, మూలపేట, పాటిపల్లి, మంగళవరపుపేట గ్రామాలకు చెందిన వేలాదిమందిభక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకొన్నారు. మధ్యాహ్నం భారీఎత్తున అన్నసమారాధన చేశారు. సర్పంచి భీశెట్టి గంగప్పలనాయుడు పాల్గొన్నారు.

ఉపమాకలో కళాకారులకు సత్కారం

వేడుకగా పండిత సభ

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన పండిత సభ వేడుకగా సాగింది. ప్రధానార్చకులు ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు తదితరులు స్వామి, అమ్మవార్లకు ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత పండిత సభ జరిపారు. పలువురు పండితులను సత్కరించారు. ఆలయం వద్ద కళాకారులు చేసిన నృత్యాలు అలరించాయి. వీరిని పీఏసీఎస్ ఛైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, ఇఓబీస్పెక్టర్ కూర్మేశ్వరరావు తదితరులు అభినందించి సత్కరించారు.

శారదానదిలో గౌరీ పరమేశ్వరుల నిమజ్జనం

ఉపమాకలో అలంకరణలో స్వామి

మునగపాక: మునగపాకలో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి వెలగ శ్రీనివాసరావు, ఉమాదేవి దంపతులు రూ.25,116 విరాళం ఆదివారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులకు అందజేశారు. పెంటకోట ఉమేష్, శ్రీను పాల్గొన్నారు.

ఏప్రిల్ తొమ్మిది నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఎలమంచిలి గ్రామీణం: ములకలాపల్లి మైహోమ్ సిమెంట్ ప్యాక్టరీ ఆవరణలోని వ్యూహలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏప్రిల్ తొమ్మిది నుంచి 12వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ప్యాక్టరీ యూనిట్ హెడ్ రామస్వామి పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలకు ఆదివారం స్వామివారి కల్యాణానికి పందిరి రాట వేశారు.

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి కన్యపరమేశ్వరి అయ్యప్పస్వామి ఆలయం 32వ వార్షికోత్సవ వేడుక సోమవారం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కటకం లక్ష్మణరావు తెలిపారు.

కరపత్రాలు చూపుతున్న తాపీమేస్త్రీలు

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు పేర్కొన్నారు. తాపీ మేస్త్రీల సంఘం కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ బోర్డు ద్వారా వచ్చే పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేసేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. నిర్మాణరంగ కార్మికుల సభ్యత్వాలను నమోదు చేయించుకోవాలని చెప్పారు. గత ఐదేళ్లలో కార్మికులకు ఏ పథకాలు అందలేదన్నారు. కొత్తగా నమోదు చేసుకుంటే సంక్షేమ పథకాలకు అర్హత వస్తుందన్నారు. దీంతోపాటు ఈ ఏడాది నుంచి తాపీ మేస్త్రీకి రూ.900 , మగకూలికి రూ.750, ఆడకూలికి రూ.600 కూలి రేట్లు పెంచామని తెలిపారు. రాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

6న చలో కలెక్టరేట్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్న డిమాండుతో ఈ నెల 6న చలో కలెక్టరేట్ చేపట్టనున్నట్లు సంఘ నాయకులు చెప్పారు. సీఐటీయూ మండల కార్యదర్శి సోమునాయుడు, సంఘ నాయకులు అప్పలనాయుడు, రాజు, రమేష్ తదితరులు అచ్యుతాపురంలో ఆదివారం సమావేశమయ్యారు.

కశింకోట: ప్రభుత్వం ప్రకటించిన విధంగా సంక్షేమ బోర్డు పునరుద్ధరించి గతంలో అమలుచేసిన విధంగా పథకాలు అమలు చేయాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యాన కశింకోటలో నిరసన తెలిపారు. జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు నాగేశ్వరరావు, శివ,సోమేశ్వరరావు, లక్ష్మి పాల్గొన్నారు.

కొత్తూరు (అనకాపల్లి): భవన నిర్మాణ కార్మికులకే ఏడేళ్లుగా నిలిచి పోయిన పరిహారాలు, ప్రోత్సాహాల చెల్లింపులు, పథకాల అమలు చర్యలను వెంటనే ప్రారంభించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం కోరారు. మామిడిపాలెంలో ఆదివారం జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘ ప్రతినిధులు చెల్లుబోయిన అప్పలనాయుడు, మిర్తిపాటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో కార్మికుల నినాదాలు

కేకేబీ చర్చి నూతన కార్యవర్గం ఏర్పాటు

కోటవురట్ల, న్యూస్‌టుడే : కోటవురట్ల క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చి నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆనందరాజు, కార్యదర్శిగా ఆర్.ప్రసన్నకుమార్, కోశాధికారిగా ఎస్.సందీప్, ఉపాధ్యక్షుడిగా జేవీ ప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా ఎం.సునాదబాబు, ఆడిటర్‌గా మైలపల్లి రాజు, ఉమెన్ కన్వీనర్‌గా ఎం.సువర్ణ, గౌరవ అధ్యక్షుడిగా ఎ.అప్పారావు, ఆర్.కన్నారావు, చీఫ్ అడ్వైజర్‌గా ఎం.శ్యాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చర్చి సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని ఎన్నికైన సభ్యులు చెప్పారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు పాల్గొన్న సత్యసాయి భజనమండలి ప్రతినిధులు

కంటి వైద్య శిబిరానికి స్పందన

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మండలంలోని హరిపాలెంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటైంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి 145 మంది శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 30 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి విశాఖలోని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. విష్ణు డెంటల్ ఆసుపత్రి వైద్యుడు సుధీర్ పలువురికి దంత పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. సర్పంచి లక్ష్మీకాంతం, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతిర్మయి, సత్యసాయి భజన మండలి ప్రతినిధులు నాగేశ్వరరావు, శేఖర్, నాయుడు, శ్రీను, అరుణకుమారి, వైద్యులు రత్నరాజు, రమ్య, దేవి, సతీష్, అనీషా, లావణ్య, రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

అనకాపల్లి, న్యూస్‌టుడే: స్థానిక పరుశరామ్ కాలనీలో కాలువలు శుభ్రం చేయడం లేదు. - ఎం. రామకృష్ణ, అనకాపల్లి. ✔: కాలువలు శుభ్రం చేయిస్తాం. - రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి.

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం-కుమారపురం రోడ్డుపై వాడుక నీరు వదిలేస్తున్నారు.- కిషోర్‌కుమార్, కోనెంపాలెం, ✔: కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాల్తేరు శివారు అంకంపేటలో గుంతల్లో కుళాయిలు ఏర్పాటు చేశారు. నీటిని పట్టుకునేందుకు . ఇబ్బంది పడుతున్నాం. - కె.బుజ్జి, స్థానికుడు, ✔: కుళాయిలను మార్పిస్తాం. కొత్తవి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - వై.సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని న్యూ కాలనీలో తాగునీటికి పైపులైను ఏర్పాటు చేయాలి. కుళాయిలు లేక ఇబ్బంది పడుతున్నాం. - జె.రవి, స్థానికుడు, ✔: కుళాయిల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. - శివరాం, పంచాయతీ ఈవో

ఎలమంచిలి, న్యూస్‌టుడే: పట్టణంలోని దిమిలి రోడ్డులో ఆక్రమణలు పెరిగిపోయాయి. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. - జి.విద్యాధర్, ఎలమంచిలి, ✔: దిమిలి రోడ్డులో ఆక్రమణలపై సర్వే చేయిస్తాం. ఆక్రమణలన్నీ తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. - బాకూరి ప్రసాదరాజు కమిషనర్ ఎలమంచిలి

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

వడ్డాదిలో ట్రాఫికర్

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది వంతెన దగ్గర ఆదివారం ట్రాఫిక్ స్తంభించిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వాహనాల రద్దీకితోడు దుకాణాలన్నీ రోడ్డుపైనే ఉండటంతో వ్యాపారులు, కొనుగోలుదారులతో రోడ్డంతా కిక్కిరిసిపోతోంది. వాహనాలు రాకపోకలకు మార్గం ఉండట్లేదు. దీనికి తోడు శిథిలవంతెనపై భారీ వాహనాలు వెళ్లకుండా సిమెంటు దిమ్మెలను అడ్డండా పెట్టారు. కాజ్‌వే మీదుగా వెళ్లడానికి వంతెన దగ్గర మలుపు తిరగాలి. ఇక్కడ వాహనాలు అడ్డదిడ్డంగా రావడం, రోడ్డు పక్కనే దుకాణాలతో తప్పుకోవడానికి స్థలం లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

వంతెన వద్ద తరచూ ఇదే పరిస్థితి

నాణ్యత లోపంపై తనిఖీలకు ఆదేశం

సిబ్బందికి సూచనలు ఇస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రి భవనాలకు రూ.40 లక్షల ఖర్చుతో మరమ్మతులు, రంగులేసే పనులను శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం తనిఖీ చేశారు. నాబార్డు నిధులతో చేపడుతున్న ఈ పనులపై నాణ్యత లోపాలు గమనించారు. విచారణ చేయాలని విజిలెన్స్ అధికారులను ఫోన్‌ద్వారా ఆదేశించారు. అవకతవకలు జరిగినట్లు తేలితే సంబంధిత గుత్తేదారును బ్లాక్‌లిస్టులో పెట్టాలని సూచించారు. పనుల్లో అవకతవకలు జరిగితే బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఇరవై ఆరోవార్డు చింతకాయల పద్మావతి ఆయన వెంట పాల్గొన్నారు.

▼ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రిషి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 108 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడంపై అయ్యన్న హర్షం వ్యక్తం చేశారు. నియామకపత్రాలు పొందినవారంతా వెంటనే ఉద్యోగాల్లో చేరాలని కోరారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. ఇందుకోసం విస్తృతంగా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఆదివారం ప్రారంభించారు. చింతపాకలో మినీ గోకులం షెడ్డును, పెదమదిన-చింతపాక తారు రోడ్డును తెదేపా నాయకుడు కలిమి శ్రీను సొంతనిధులతో ఏర్పాటు చేసిన వీధి దీపాలను ప్రారంభించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తెదేపా కార్యకర్త సిగిరెడ్డి సత్యారావు భార్యకు రూ. 5 లక్షల బీమా పరిహారం చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టరు గేదెల సత్యనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చింతపాకలో మినీ గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రశాంతంగా గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

చీడికాడ, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష ఆదివారం కోనాంలో జరిగింది. ఐదో తరగతి, ఇంటర్ మొదటి ఏడాదిలో గురుకులాల్లో ప్రవేశానికి పరీక్ష నిర్వహించారు. కోనాంలో పరీక్ష కేంద్రాన్ని డీసీఓ గ్రేస్ పరిశీలించారు. పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాట్లు చేశారు. కోనాంలో ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 225 మంది, ఇంటర్ మొదటి ప్రవేశ పరీక్షకు 144 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ పద్మకుమారి చెప్పారు. పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ కిశోర్‌లింకన్, పరిశీలకుడు వరహామూర్తి పరిశీలించారు. చీడికాడ ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: విష్ణు విన్యాసం, ఆడి2: నీలవేణి, కపుల్ ఫ్రెండ్లీ, బంగార్రాజు : విష్ణు విన్యాసం

చోడవరం: సాయిలక్ష్మి: విష్ణు విన్యాసం, పూర్ణా: మన శంకర వరప్రసాద్ గారు

ఇందిరా మార్కెట్‌కు మహర్దశ

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఇందిరా మార్కెట్‌కు మహర్దశ పట్టనుంది. ఇందులో భారీ వాణిజ్యం సముదాయం ప్రాజెక్టు ఏర్పాటుకు అవకాశం దక్కింది. సభాపతి అయ్యన్న చొరవ ఫలితంగానే దీనికి మార్గం సుగమం అయింది. ప్రాజెక్టుకు ప్రాథమికంగా వివరణాత్మక నివేదిక (డీపీఆర్) తయారీకి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సైతం ఆమోదం తెలిపింది. ఈ బజారు ప్రస్తుతం మండల పరిషత్తు ఆధీనంలో ఉంది. దీనిని మున్సిపాలిటీకి బదలాయించే విషయంపై ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగుతున్నాయి. అన్నీ కొలిక్కి వస్తే ఇది అత్యాధునిక సకల సదుపాయాల బజారుగా రూపుదిద్దుకోనుంది.

మౌలికవసతులు కొరవడిన మార్కెట్

▼ పురపాలికలోనే భాగంగా ఉన్న ఈ మార్కెట్ ఇప్పటికీ మండల పరిషత్తు ఆధీనంలోనే కొనసాగుతోంది. దీంతో అధికారికంగా స్వాధీనానికి గతంలో అధికారులు చేసిన ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. కొంతకాలం ఎవరికీ పట్టనట్లు.. ఎవరూ తమకు సంబంధం లేదని ఇరు సంస్థల అధికారులు పట్టించుకోకపోవడంతో ఇది డంపింగ్ యార్డులామారి రోగాలకు కారణమయ్యేది. సభాపతి ఆదేశాలతో ఇప్పుడు ఇందులో పారిశుద్ధ్యం మెరుగుపడింది. అయ్యన్నపాత్రుడు దీని అభివృద్ధిపై మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. కాకినాడలోని మార్కెట్ తరహా కార్ల పార్కింగ్‌కు సైతం అవకాశం ఉన్న బహుళ అంతస్తులతో బజారును ఏర్పాటు చేయాలన్నది ఆయన ఆకాంక్ష. అది ఇప్పుడు కార్యరూపం దాల్చనుంది.

▼ అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రారంభమైన క్రెడిట్ ఎన్‌హాన్స్‌మెంటు ఇనిషియేటివ్ పథకం కింద రాష్ట్రంలో ఎంపికైన మూడు మున్సిపాలిటీల్లో నర్సీపట్నం ఒకటి. ఇందులోని ఇందిరా మార్కెట్ స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మాణానికి వీలుగా ఆంధ్రప్రదేశ్ అర్బన్ మౌలికవసతుల అసెట్ మేనేజ్‌మెంటు లిమిటెడ్ (ఏపీయూఐఏఎంఎల్)కు డీపీఆర్‌ను అందజేయాల్సి ఉంది. దీనిపై శనివారం ఏర్పాటైన కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది. మార్కెట్ అధికారిక బదలాయింపు కొలిక్కి రావడానికి సమయం పట్టనున్న దృష్ట్యా ఈలోగా డీపీఆర్ పూర్తి చేయాలని నిర్ణయించారు. దీని సమగ్ర నివేదికలు రూపొందించి సుమారు రూ.15 లక్షల ఖర్చు కాగలదని అంచనా.

▼ సభాపతి కృషి ఫలితంగా ఈ వాణిజ్య సముదాయం ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసిందని మున్సిపల్ కమిషనర్ సురేంద్ర తెలిపారు. కేంద్రం, రాష్ట్రం, మున్సిపాలిటీల మధ్య అనుమతులు, విధానాలతోనే ఇది అందుబాటులోకి వస్తుంది. మూడుదశల్లో అన్ని విషయాలతో సమగ్రంగా రూపుదిద్దుకునే డీపీఆర్‌లతో ప్రాజెక్టుకు నిధులు ఎంత అవసరమన్నది స్పష్టమవుతుందన్నారు. అన్నీ కార్యరూపం దాల్చడానికి ఏడాది లేదా రెండేళ్లు పట్టవచ్చని ఆయన వివరించారు.

అంగన్‌వాడీలకు అండగా ఉంటాం..

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు పేర్కొన్నారు. వడ్డాదిలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలికవసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లలో ఇప్పటికే చాలా వరకు పరిష్కరించినట్లు తాతయ్యబాబు పేర్కొన్నారు. ప్రధానంగా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ కేంద్రాలలో పనిచేసే చిరు ఉద్యోగులను ఆదుకోవడమే కాకుండా కేంద్రాల అభివృద్ధికి తీసుకున్న చర్యలను ఆయన వివరించారు.

చోడవరం, న్యూస్‌టుడే: చిరు ఉద్యోగుల సంక్షేమానికి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని కూటమి ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు అన్నారు. రూ.75 కోట్ల వ్యయంతో 5జీ చరవాణులు 58,204 మందికి అందజేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గ్రాట్యూటీ చెల్లింపుల కోసం బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఒకటోతేదీన వేతనాలు అందించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాళా తీయించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గాడిలో పెట్టి పనిచేసేవారందరికి ఆదుకునేలా చర్యలు చేపడుతూ రాష్ట్రాన్ని ప్రగతిబాటలో నడిచేలా ఆహర్నిశలు శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే రాజు అన్నారు.

రహదారి నిర్మాణ పనులు పూర్తి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.కోటపాడు మండలం వారాడ నుంచి దేవరాపల్లి మండలం ఎం.అలమండ వరకు సుమారు 2 కి.మీ మేర రూ.2.60 కోట్లతో చేపట్టిన తారు రోడ్డు పనులు పూర్తికావచ్చాయి. దీంతో వారాడ నుంచి ఎం.అలమండ మీదుగా ఇతర చోడవరం, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలు చేరుకోవడానికి దారి సౌకర్యం మెరుగుపడింది. ఈ నిధులను ఈ ప్రాంతీయ విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంజూరు చేయించారు.

దోమలు పెరుగుతున్నాయ్

మాకవరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక బీసీ కాలనీ నుంచి ప్రవహించే ప్రధాన కాలువలో చెత్త చెదారాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు పారేందుకు అవకాశం లేకుండా ప్లాస్టిక్ సంచులు, వ్యర్థాలు కల్వర్టుల వద్ద ఉండిపోవడంతో దుర్గంధం, దోమలు అధికమవ్వడంతో వ్యాధులు వ్యాపిస్తాయని కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

పచ్చని చెట్లపై నిర్లక్ష్యపు వేటు

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: చోడవరం నుంచి ఖండేపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుపక్కన ఏపుగా పెరిగిన చెట్లను విద్యుత్తు సిబ్బంది నరికివేశారు. గత ఐదేళ్ల కిందట అటవీశాఖ రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటారు. ఇక్కడ నిర్మిస్తున్న చర్చికి సరఫరా అందించాలన్న ఉద్దేశంతో వీటిని తొలగించారు. దీన్ని స్థానికంగా పలువురు యువకులు అడ్డుకున్నా ఎవరూలేని సమయంలో యంత్రాలతో నరికేశారు. కిలోమీటరు మేర మొక్కలను కొట్టేయడంపై జిల్లా అటవీ అధికారి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు సామాజిక కార్యకర్త పల్లేటి గణేష్ తెలిపారు.

ఘనంగా కల్యాణ విందు

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణంలో కొలువైన స్వయంభూ గౌరీశ్వర ఆలయంలో మహాశివరాత్రి కల్యాణం ముగింపు ఉత్సవ విందును ఆదివారం ఏర్పాటు చేశారు. విశాఖలో స్థిరపడిన విజ్ఞపు సోమనాథ్ సోదరులు ఏటా మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు తర్వాత విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో భక్తులకు భోజనాలు అందించారు. దాతలు సోమనాథ్ సోదరులుతో పాటు ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ గూనూరు సురేష్, అర్చకులు చలపతి తదితరులు పాల్గొన్నారు.

క్యాడెట్ల సేవా భావం

నాతవరం, న్యూస్‌టుడే: ఇక్కడి ఆసుపత్రి వద్ద రోడ్డు దాటుతుండగా పడిపోయి గాయపడిన కె.రాంబాబు (60) వృద్ధునికి జడ్పీ పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్లు సేవ లందించారు. జడ్డీదీపుడికి చెందిన రాంబాబు తన కుమార్తె ఇంటికి ఉదయం నాతవరం వెళ్లారు. రోడ్డు దాటుతుండగా కళ్లు తిరగడంతో కుప్ప కూలిపోయారు. ఇదే సమయంలో ఎన్‌సీసీ విద్యార్థులు శిక్షణ కోసం వెళ్తున్నారు. పరిస్థితి చూసి వెంటనే ఆసుపత్రిలో చేర్చారు. వైద్య సిబ్బంది వెంటనే సేవలందించడంతో ప్రాణాపాయం తప్పింది. విద్యార్థుల తక్షణ సేవలను పలువురు అభినందించారు.

చోడవరంపై గ్రంథ రచన

చోడవరం, న్యూస్‌టుడే: గౌరీశ్వరుడు, విఘ్నేశ్వరుడు స్వయంభువులుగా వెలసిన చోడవరంపై గ్రంథ రచనకు సన్నాహక బృందం సంకల్పించింది. ఇందుకోసం బృంద నాయకుడు కొప్పాక రాజేష్ ఆధ్వర్యంలో బృంద సభ్యులు ఆదివారం స్థానిక విఘ్నేశ్వరాలయంలో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని సమాచారాన్ని సేకరించి 21 అంశాలుగా విభజించి సమగ్ర చరిత్రను ఇందులో పొందుపర్చాలని తీర్మానించుకున్నారు. ★ కమ్యూనిటీ ఫ్రిడ్జ్ ఏర్పాటు చేసి ఆదివారం నాటికి 500 రోజులు పూర్తయిన సందర్భంగా అందరికీ అల్పాహారం అందజేశారు.

నెలలైనా పనులు ప్రారంభించరా?

అనంతగిరి గ్రామీణం: దిలకోట పంచాయతీ దసపల్లి నుంచి మెట్టపాలెం వరకు బీటీ రహదారి పనులు ప్రారంభించాలని కోరుతూ మెట్టపాలెం గ్రామస్థులు ఆదివారం ఆందోళన చేపట్టారు. అడవి తల్లి 2.0లో భాగంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ రహదారి పనులకు శంకుస్థాపన చేసి. 11 నెలలు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో సుమారు 180 మంది వరకు గిరిజనులు జీవనం సాగిస్తున్నారని, సుమారు 4 కిలోమీటర్ల రహదారికి రూ.3.77 కోట్లు కేటాయించినట్లు స్థానికులు శోభ మధు తదితరులు పేర్కొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే బండారు

చీడికాడ, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మండలంలోని చెట్టుపల్లిలో ఈనెల 5న అభయాంజనేయస్వామి తీర్థం సందర్భంగా చీడికాడ మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటు ఏర్పాటు చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 16 జట్లు ఇందులో పాల్గొన్నాయి. కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు జి.వి.మూర్తి, నాయకులు కృష్ణ, సోమునాయుడు, గణేశ్, సూరిబాబు, తెదేపా మండలాధ్యక్షుడు చిన్నంనాయుడు, చెట్టుపల్లి సర్పంచి గణేశ్, జాజిమొగ్గల సత్యనారాయణ, గణపతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వడ్డాది క్రికెట్ లీగ్

బుచ్చెయ్యపేట: వడ్డాది క్రికెట్ లీగ్ (వీసీఎల్) పేరుతో ఆదివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో టోర్నమెంటు నిర్వహించారు. గత 30 ఏళ్ల నుంచి క్రికెట్ ఆడుతున్న పూర్వపు విద్యార్థులందరూ ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో వడ్డాది-ఏ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీ అందుకుంది.

ట్రోఫీ గెలుచుకున్న ఆనందంలో క్రీడాకారులు

మాడుగులలో కోలాటం ఆడుతున్న మహిళలు

మాడుగుల/గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఘాటీరోడ్డు కూడలి వద్ద వెలసిన అమ్మవారి పాదాల తీర్థ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా గుర్రం పరుగు పోటీలు ప్రారంభించారు. ఒమ్మలి, సత్యవరం, గ్రామాల మహిళల కోలాటం ఆకట్టుకుంది.

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం అప్పలరాజుపురంలో అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మూల

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

మంత్రహోమం, శాంతి హోమం, మహాపూర్ణాహుతి, త్రిశూల స్నానం తదితర కార్యక్రమాలను ఘనంగా పండితులు నిర్వహించారు. పలువురు దంపతులు సామూహికంగా పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

రావికమతం, న్యూస్‌టుడే: మండలంలోని దొండపూడి గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం, తీర్థ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామి దర్శించుకున్నారు.

సామూహిక హోమంలో దంపతులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది కేఏడీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. 2024-25 విద్యాసంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఆరు నుంచి పదోతరగతి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, అదద్రావు వెంకట్రావు సహకారంతో పాఠశాలకు పది సీలింగ్ ఫ్యాన్లు అందించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర మానవహక్కుల కౌన్సిల్ ఫౌండర్ శ్యామ్‌ప్రసాద్, కోవెల జనార్దనరావు, ఎస్.వి.రమణ, వరహాలబాబు, భాస్కరరావు, మేఘరావు, సీతారామయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

సభ్యత్వాలను రెన్యువల్ చేసుకోవాలి

చోడవరం/పట్టణం, న్యూస్‌టుడే: చోడవరం సహాయ కార్మికశాఖాధికారి పరిధిలోని సబ్బవరం, దేవరాపల్లి, కోటపాడు, బుచ్చెయ్యపేట, రావికమతం, మాడుగుల, చీడికాడ మండలాల్లోని భవన, ఇతర నిర్మాణ కార్మికులు గతంలో అందించిన సంక్షేమ పథకాల పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవాలని కార్మికశాఖాధికారి సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. కార్మికుల కుటుంబాలకు ప్రసూతికి రూ.20వేలు, వివాహానికి రూ.40వేలు, సహజ మరణానికి రూ.60వేలు, అంత్యక్రియలకు రూ.20వేలు అందిస్తారన్నారు. ఈ పథకాలు లబ్ధి పొందాలంటే లేబర్‌కార్డు కోసం రూ.110 బ్యాంకులో చెల్లించి కార్యాలయానికి అందజేయాలని కోరారు.

దరఖాస్తు రాస్తున్న సహాయ అధికారి సూర్యనారాయణ

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డులో పథకాలన్నీ వర్తింపజేయాలని చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆదివారం పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు ఉత్తర్వులు జారీచేయడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.వి.నాయుడు, దేముడు, రమణ, జోగినాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

గొలుగొండ, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలతోపాటు భవన నిర్మాణ కార్మికులకు రక్షణకు అవసరమైన నిధులు అందించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రాజు డిమాండ్ చేశారు. జోగుంపేటలో కార్మిక సంఘాల సభ్యులతో సమావేశమై మాట్లాడారు. ఎత్తైన భవనాల నిర్మాణాల సమయంలో కార్మికులు ప్రమాదాలకు గురైనవారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అమరవీరుల త్యాగ ఫలమే ఎస్సీ వర్గీకరణ

దేవరాపల్లి, న్యూస్‌టుడే : అమర వీరుల త్యాగాల ఫలితంగానే ఎస్సీల ఉమ్మడి ఏబీసీడీ వర్గీకరణ ఫలాలను తమలాంటి వారంతా అనుభవిస్తున్నారని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్తా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మాదిగల అమరవీరుల దినోత్సవం మండలంలోని కలిగోట్లలో ఆదివారం జరిగింది. ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లపాటు చేసిన ఉద్యమంలో అమరులైన వారందరికీ ఘన నివాళుల ర్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూరిదేముడు, సత్తిబాబు, మహేష్, గణేష్, సముద్రం, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. వాతావరణం కాలుష్యం

మాకవరపాలెం, న్యూస్‌టుడే : తూటిపాల గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన చెత్తను గ్రామ శివారు రహదారి పక్కన వేసి తగలెడుతున్నారు. చెత్తను మంట పెట్టి వాతావరణాన్ని కాలుష్యంగా మారుస్తున్నారు. పొగ కారణంగా పొలాలకు వెళ్లే రైతులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి చెత్తను తగుల పెట్టకుండా పరిష్కారం ఆలోచించాలని స్థానికులు కోరుతున్నారు.

చెత్తను తగలెడుతున్న కార్మికుడు

టెండర్ నోటీసు మరియు వేలం ప్రకటన

Rc.No:04/2026/ప.కా/02.03.2026 గ్రామపంచాయతీ కె.కోటపాడు

కె.కోటపాడు మండలంలోని కె.కోటపాడు గ్రామ పంచాయతీ పరిధిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి క్రింది సేవలు, సరఫరాలు మరియు సంత హక్కుల కేటాయింపునకు అర్హులైన వ్యక్తులు/కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ కవర్ టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

వ. నెం.	అంశం పేరు	సంఖ్య	భద్రతా డిపాజిట్ (రూ.)	ధరకాస్తు గడువు	ఓపెనింగ్ తేదీ & సమయం
1	పారిశుద్ధ్య కార్మికులు	2	2,000/-	28-03-2026 మ. 3:00 వరకు	28-03-2026 మ. 3:00 Negotiation నిర్వహించబడును.
2	ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్	1	2,000/-	ఆదే 28-03-2026 మ. 3:00 వరకు	28-03-2026 మ. 3:00 Negotiation నిర్వహించబడును.
3	ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబింగ్‌కి హెల్పర్	1	2,000/-	28-03-2026 మ. 3:00 వరకు	28-03-2026 మ. 3:00 Negotiation నిర్వహించబడును.
4	ట్రాక్టర్ డ్రైవర్ కమ్ పారిశుద్ధ్య మేస్త్రీ	1	2,000/-	28-03-2026 మ. 3:00 వరకు	28-03-2026 మ. 3:00 Negotiation నిర్వహించబడును.
5	ఆఫీసు అటెండర్	1	2,000/-	28-03-2026 మ. 3:00 వరకు	28-03-2026 మ. 3:00 Negotiation నిర్వహించబడును.
6	ఆఫీసు స్వీపర్ కమ్ వాచ్‌మెన్	1	2,000/-	28-03-2026 మ. 3:00 వరకు	28-03-2026 మ. 3:00 Negotiation నిర్వహించబడును.
7	వీధి దీపాల విడి భాగాల సరఫరా	-	5,000/-	28-03-2026 మ. 3:00 వరకు	28-03-2026 సా. 4:00 Negotiation నిర్వహించబడును.
8	పారిశుద్ధ్య సామగ్రి మరియు పనిముట్ల సరఫరా	-	5,000/-	28-03-2026 మ. 3:00 వరకు	28-03-2026 సా. 4:00 Negotiation నిర్వహించబడును.
9	రోజువారీ మరియు వారపు సంత వసూలు హక్కులు	-	15,000/-	28-03-2026 మ. 3:00 వరకు	28-03-2026 సా. 5:00 Negotiation నిర్వహించబడును.

గమనిక: 1. గ్రామ పంచాయతీకి ఏ టెండర్‌నైనా అంగీకరించు / తిరస్కరించు పూర్తి హక్కు కలదు. టెండర్ దరఖాస్తులు మరియు పూర్తి వివరాలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యాలయ సమయాలలో పొందవలెను.

తేదీ 02.03.2026 గ్రామపంచాయతీ కార్యదర్శి కె.కోటపాడు గ్రామ పంచాయతీ

స్టీలు సామగ్రి అందజేత

దేవరాపల్లి, న్యూస్‌టుడే : వనవాసీ కళ్యాణ యోజన పథకంలో భాగంగా భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో పౌర్ణమి సేవా సంస్థ, నిర్మల ఛారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహకారంతో స్టీలు సామగ్రి, రగ్గుల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. మండలంలోని చింతలపూడి పంచాయతీ గిరిజన కుటుంబాలకు వీటిని అందజేశారు. సుమారు రూ. 1 లక్ష విలువజేసే ఈ సామగ్రిని 82 కుటుంబాలకు భారత వికాస్ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.గోపాలరావు, పౌర్ణమి సేవా సంస్థ వ్యవస్థాపకుడు కేకేవీపీ నారాయణరావు, నిర్మల ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు నిర్మల చేతుల మీదుగా వీటిని ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ పైడిరాజు, వర్మ, శివరాం, ఆదికోటి, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

సామగ్రిని అందజేస్తున్న దాతలతో గిరిజనులు

వర్మ దంపతులను సన్మానిస్తున్న డీఎఫ్‌వో శామ్యూల్, అధికారులు

నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు

చోడవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కొలువులో నిబద్ధతతో పనిచేస్తే విధి నిర్వహణలో మంచి పేరు వస్తుందని జిల్లా అటవీశాఖాధికారి ఎం.శామ్యూల్ అన్నారు. చోడవరం అటవీ పరిధి అధికారి పెనుమత్స వెంకటరవి వర్మ పదవీ విరమణ సందర్భంగా అటవీ ఉద్యోగులు ఆదివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రవివర్మ సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా రవివర్మ దంపతులను పలువురు సత్కరించారు. అటవీ పరిధి అధికారుల రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.శ్రీనివాసరావు, కోశాధికారి వి.లావణ్యలతో పాటు అటవీ పరిధి అధికారులు అనిల్‌కుమార్, కె.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

బకాయిల చెల్లింపు వేగవంతం చేయండి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీలోని పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలన్నీ పూర్వం మాదిరిగా నెలరోజుల్లోనే చెల్లించాలని రాష్ట్ర ఏపీ పీటీడీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ కోరారు. నర్సీపట్నంలోని డ్రైవర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఏపీపీటీడీ జోనల్ సంయుక్త కార్యదర్శి వై.రాము సన్మాన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిపో మేనేజర్ ధీరజ్, సాలూరు డిపో మేనేజర్ ఆచారి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, ఎం.ఎస్.రావు, తాతాలు పాల్గొన్నారు.

రామును సత్కరిస్తున్న ఏపీ పీటీడీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దామోదర్

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ ట్రీ5-1 - కపుల్ ఫ్రెండ్లీ (మార్నింగ్, ఫస్ట్ షో), ట్రీ-2 - హే బలవంత్ (మ్యాట్నీ, సెకండ్ షో), ట్రీ-2 - విష్ణు విన్యాసం

'ప్రజల్లోకి కల్తీ నెయ్యి వ్యవహారం'

సీతానగరం (పెందుర్తి), న్యూస్‌టుడే: కల్తీనెయ్యి వ్యవహారంలో వైకాపా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెదేపా నగర ఉపాధ్యక్షుడు పులి రమణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం 75వ వార్డు సీతానగరం ఎన్టీఆర్ కూడలిలో 'మహాపాపం' గోడపత్రిక ఆవిష్కరణ, వైకాపా తీరుపై మహా నిరసన చేపట్టారు. వార్డు అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, ముఠంపల్లి పెంటయ్య, తెలుగు యువత జిల్లా కార్యదర్శి ముల్లి పెంటేరాజు, నాయకులు గోళ్ల ముత్యాలు, ఉరుకూటి అప్పలరాజు, కణితి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులూ సమస్యలా..ఫోన్ చేయండి!

నేడు 'ఈనాడు' డయల్ యువర్ సింహాచలం ఆర్టీసీ డీఎం

వేపగుంట, న్యూస్‌టుడే: సింహాచలం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సుల్లో మీ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారా... బస్సులు సమయానికి రావడం లేదా... సకాలంలో బస్సులు రాకపోవడం వంటి సమస్యలు ఉన్నాయా... తదితర సమస్యలను డిపో మేనేజరు సురేశ్ దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' అవకాశం కల్పిస్తుంది. ప్రయాణికులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఆయా ఫిర్యాదులకు డిపో మేనేజరు సమాధానాలు ఇస్తారు.

తేదీ	: 02-03-2026
సమయం	: ఉదయం 10 నుంచి 11 వరకు
ఫోన్ నంబరు	: 93472 79909

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ: 10 నుంచి ఉ: ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: వేపగుంట సీపీఎం కాలనీలో వీధిదీపాలు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. -శ్రీనివాసరావు ✓: వీధిదీపాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం. -శ్రావణ్‌రాజు, ఏఈ, జీవీఎంసీ

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం బుడగ జంగాల కాలనీలో వృథాగా పైపుల నుంచి నీరు పోతోంది. -ఓ పాఠకుడు, సబ్బవరం ✓: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -పి.ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: సబ్బవరం ఎస్టీబీఎల్ కూడలి నుంచి చినగొల్లలపాలెం వెళ్లే రహదారి పూర్తిగా శిథిలమైంది. -పి.సన్యాసిరావు, సబ్బవరం ✓: ఈ విషయం మండల పరిషత్ సమావేశంలో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -బోకం సూర్యకుమారి, ఎంపీపీ

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం సర్దార్ గౌతు లచ్చన్ననగర్ కూడలి నుంచి ఫార్మాసిటీ కాలనీకి వెళ్లే మార్గంలో వేగనిరోధకాలు ప్రమాదకరంగా మారాయి. -నాయుడు, ఫార్మాసిటీకాలనీ. ✓: మీప్రాంతంలోని వేగనిరోధకాలు వేయడానికి కృషి చేస్తాం. -మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో, పరవాడ

ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా ఆక్రమణలు

వేపగుంట, న్యూస్‌టుడే: నగర పరిధిలోని శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలం కనిపిస్తే ఆక్రమణదారులు కబ్జాకు పాల్పడుతున్నారు. కొంతమంది స్థానిక నాయకులు తెర వెనుక ఉండి వీటిని ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. తొలుత చిన్న చిన్న గుడారాలు, పాకలు వేయించి తర్వాత సంబంధిత స్థలాలను పెద్ద మొత్తంలో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా వారికి సహకరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ★ 95వవార్డు వరలక్ష్మీనగర్ శివారునున్న ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ఇది నిత్యకృత్యంగా మారింది. రోజురోజుకు ఇక్కడ పాకల సంఖ్య పెరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ★ వరలక్ష్మీనగర్ శ్మశానవాటిక స్థలం, చీమలాపల్లి బ్రహ్మంగారి మఠం వెనుక ఉన్న గెడ్డ స్థలం, యూత్ ట్రైనింగ్ సెంటర్ వెనుక ఉన్న ఖాళీ స్థలం వరకు పాకలు పెద్దఎత్తున వెలిశాయి. నగరంలోని కంచరపాలెం, గోపాలపట్నం, ఆర్.వెంకటాపురం, చీమలపల్లి, పొర్లుపాలెం, లక్ష్మీపురం, పెందుర్తి పరిసర ప్రాంతాల నుంచి పలువురు ఇక్కడకు వచ్చి పాకలు వేస్తున్నారు. ★ ఇక్కడ పాకలు వేసుకునే వారి సంఖ్య పెరగడంతో తెరవెనుక ఉన్న ఆక్రమణదారుల ఆగడాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. తాము చెప్పినట్టే ఇక్కడ నడచుకోవాలంటూ ఇతర ప్రాంతాల వారిని హెచ్చరిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు పలువురు అంటున్నారు. పాకలు తమ మనుషులే నిర్మిస్తారని వారికే కాంట్రాక్టు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ఇంకొందరు అంటున్నారు. తొలుత పాకలు వేయించి తర్వాత వాటిని రూ.లక్షల్లో అమ్ముకునేందుకు ప్రణాళిక వేసినట్లు తెలుస్తోంది. ★ ఇక్కడి శ్మశానవాటికలో చెత్త వేరు కుప్పేయించిన వరలక్ష్మీనగర్ వాసులు ఇటీవల ఫిర్యాదు చేయడంతో అధికారులు శ్మశానవాటికలో చెత్త తీయించారు. ఈ క్రమంలో శ్మశానవాటిక స్థలం ఖాళీగా కనిపించడంతో ఆక్రమణదారులు అక్కడ పాకలు వేసేస్తున్నారు.

ఆక్రమణకు గురవుతున్న శ్మశానవాటిక స్థలం

ఈ విషయం మా దృష్టికి వచ్చింది. ఇటీవల ఖాళీ చేయాలని ఆదేశించాం. అయినప్పటికీ కొందరు పాకలు వేస్తున్నట్లు తెలిసింది. త్వరలో పాకలన్నింటినీ తొలగించి ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం. -వెంకట అప్పారావు, పెందుర్తి తహసీల్దార్

రూ.5.30 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వవార్డు పరిధి దేశపాత్రునిపాలెం గ్రామంలో జీవీఎంసీ నిధులు సుమారు రూ.5.30 కోట్లు వెచ్చించి సీసీరోడ్లు, కాలువల నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపనతో పాటు ఓపెన్‌జిమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తొలుత స్థానిక వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావుతో కలిసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే వెళ్లిపోయాక నగర మేయర్ పీలా శ్రీనివాసరావు చేరుకుని మరికొన్ని పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వార్డులో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామన్నారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డీఈ నారాయణ, ఏపీడీ దుర్గాప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు చిత్రంలో కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

గురుకుల బాలురకు పతకాలు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన సైన్స్ ఒలింపియాడ్ పోటీలో సబ్బవరం అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ కేశవరావు తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం 60మంది పాల్గొనగా సబ్బవరం గురుకుల పాఠశాలకు సంబంధించి 8, 9, 10 తరగతులకు చెందిన 10మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈమేరకు అంబేడ్కర్ గురుకులాల సంయుక్త కార్యదర్శి ఎస్.రూపవతి హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి సైన్స్ ఒలింపియాడ్‌లో పది మంది బంగారు పతకాలు సాధించడం గురుకులాలకు గర్వకారణమని అన్నారు. పతకాలు సాధించిన వారిలో 8వ తరగతికి చెందిన బి.మదన్‌కుమార్, హేమన్ వికాస్, ఎం.లోకేశ్, 9వ తరగతికి చెందిన బి.మనోహర్ష, జె.విశాల్, ఎం.ధనుంజయ్, కె.శివహేమంత్, టి.భవానీప్రసాద్, 10వ తరగతికి చెందిన జె.సందీప్, వి.డి.ధర్మతేజ, జి.కూర్మారావు ఉన్నారు. సంబంధిత విద్యార్థులను, వారికి మార్గ నిర్దేశం చేసిన టీచర్ టి.రాంబాబును ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో సంయుక్త కార్యదర్శి రూపవతి, ప్రిన్సిపల్ కేశవరావు, తదితరులు

అంగన్‌వాడీల సంక్షేమానికి కృషి

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి, ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండుసార్లు అంగన్‌వాడీల వేతనాలు పెంచిన ఘటన తెదేపాకు ఉందన్నారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం స్మార్ట్‌ఫోన్లు అందించిందన్నారు. దశల వారీగా సమస్యలు పరిష్కరించేందుకు సర్కారు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

అవీ ఇవీ

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

పెందుర్తి, న్యూస్‌టుడే: మోసం కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసినట్లు పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ఆ వివరాలిలా.. ఒడిశా రాష్ట్రానికి చెందిన నబీనా బాహా అలియాస్ నవీన్ నకిలీ దస్త్రాలు సృష్టించి భూమి అమ్మకానికి పన్నాగం పన్నాడు. ఈ మేరకు నగరానికి చెందిన దుగ్గిరాల ప్రసాద్‌బాబుకు రూ.28లక్షల మేర మోసం చేసి పరారయ్యాడు. దీనిపై ప్రసాద్‌బాబు గత ఏడాది ఆగస్టులో పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి నిందితుడి కోసం గాలించిన పోలీసులు ఎట్టకేలకు ఒడిశాలోని సునాబెడ ప్రాంతంలో ఉన్నట్లు కనుగొన్నారు. ఆ మేరకు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పురోగతిలో ప్రతిభ చూపిన ఎస్ఐ ఎన్.వి.భాస్కరరావును సీఐ అభినందించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెందుర్తి, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకుని మంచి నడవడికతో మెలగాలని పెందుర్తి ఎస్ఐ పి.లక్ష్మి సూచించారు. ఆదివారం పెందుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. సంబంధిత నిందితులంతా ప్రతివారం తప్పనిసరిగా స్టేషన్‌లో హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. రౌడీషీటర్ల కదలికలపై నిత్యం నిఘా ఉంటుందని హెచ్చరించారు.

రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న పెందుర్తి ఎస్ఐ పి.లక్ష్మి

తిరుమలనగర్ నూతన కార్యవర్గం ఎన్నిక

కూర్మన్నపాలెం(తిరుమలనగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షునిగా ఎం.పరమానందం, ఉపాధ్యక్షునిగా జి.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.విశ్వేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.వసంతరెడ్డి, కోశాధికారిగా పి.తిరుపతినాయుడు, సహాయ కోశాధికారిగా వి.విశ్వనాథం, కార్యనిర్వాహక అధ్యక్షునిగా ఎన్.అప్పలనాయుడు, కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శిగా ఎ.సన్యాసిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.పరమేశ్వరరావు, ఎన్.రాములును రెండేళ్లకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతనంగా ఎన్నికైన తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గొట్టివాడ ప్రాథమిక పాఠశాల పరిధిలో ప్రవేశాల కోసం ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు పాల్గొన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ మేరకు కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పంపిస్తామని భరోసా చెప్పారు. మరి కొంతమంది తల్లిదండ్రులతో మాట్లాడి ఆయనే కొందరిని స్వయంగా చేర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, పూర్వ విద్యార్థి దినకర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు

చదువంటే మాకిష్టం..!

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : బాలల్లో పుస్తక పఠనాసక్తి పెంచాలనే ఉద్దేశంతో పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో 'చదువంటే మాకిష్టం..' పేరుతో ప్రత్యేక పుస్తక పఠన కార్యక్రమం నిర్వహించారు. గ్రంథపాలకులు పిల్లలకు కథలు చెప్పి, నీతి పుస్తకాలను చదివించారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ పర్యవేక్షించారు. ★ పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా పిల్లలతో కథలు చెప్పించారు. కళారత్న ఎస్.చలపతి రావు 'గర్వభంగం' అనే కథను పిల్లలకు చెప్పారు. గ్రంథాలయ అధికారి అజయ్‌కుమార్, బాలలు పాల్గొన్నారు.

కథలు చదువుతున్న బాలలు

ఘనంగా చిన్నారుల స్నాతకోత్సవం

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధి సుజాతనగర్‌లోని షిర్డీసాయి ఆక్స్‌ఫర్డ్ పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. ప్రిన్సిపల్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ మల్లికారెడ్డి ఆధ్వర్యంలో తొలుత పూర్వ ప్రాథమిక విద్యార్థుల స్నాతకోత్సవం జరిగింది. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృసింహావతారం, కల్కి అవతరణ ఘట్టాలతో పాటు నృత్య కార్యక్రమాలు అలరించాయి.

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

12న శ్రీ మరిడిమాంబ జాతర

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి కొండయ్యవలస కాలనీవాసుల ఆరాధ్య దేవత శ్రీ మరిడిమాంబ అనుపు జాతర ఈనెల 12న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బలిరెడ్డి శ్రీను ప్రకటించారు. ఆదివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు, భక్తులు పండగను జయప్రదం చేయాలని కోరారు.

రూ.82.63 లక్షలతో పార్కు అభివృద్ధి

పాపయ్యరాజుపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని పాపయ్యరాజుపాలెం సమీప గొల్లవిల్లివానిపాలెం ఎల్ఐసీ కాలనీలో రూ.82.63 లక్షలతో పార్కు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయని వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు తెలిపారు. ఆదివారం ఆయన కాలనీవాసులతో కలిసి పనులు పరిశీలించారు. ప్రహరీ, బహిరంగ వ్యాయామ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు పరిశీలించారు. త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 95, 97 వార్డుల భాజపా అధ్యక్షుడు చిక్కాల సతీశ్, సామాజిక మాధ్యమ కన్వీనర్ కేవీ సంతోష్, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ మణి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పార్కులోని జారుడు బల్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

ప్రాణాధారం.. నేలపాలు

సింహపురికాలనీ(వేపగుంట), న్యూస్‌టుడే: సింహపురి కాలనీ ఎల్ఐజీ వీధిలో వారం రోజులుగా పైపులైను లీకుల కారణంగా ప్రాణాధారమైన మంచినీరు వృథాగా పోతోంది. ప్రతీరోజూ నీటి సరఫరా సమయంలో తాగునీరు రహదారిపై ప్రవహిస్తూ రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత విభాగం అధికారులు వెంటనే స్పందించి ఇక్కడి లీకులను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఫోకస్

సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలి

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని పెందుర్తి ఎమ్మెల్యే, విశాఖ ఉమ్మడి గ్రామీణ జిల్లా జనసేన అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. 97వ వార్డు చినముషిడివాడ కూడలిలో వార్డు అధ్యక్షుడు సేనాపతి సోమశేఖర్‌నాయుడు, ముక్కా సంతోష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సేనాపతి లీలాధరరావు, ముక్కా చిన్నారావు, బుచ్చిబాబు, ముమ్మన శ్రీనివాసరావు, గురువులు, రాజా సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో చేసిన సభ్యత్వ నమోదును చూపుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

ఆరిపాక విద్యార్థుల ప్రతిభ

సబ్బవరం, న్యూస్‌టుడే: సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల విజయవాడలో జరిగిన 'సైన్స్ సమగ్ర మహోత్సవ్-2026'లో అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు కె.కోమలి, కె.వర్షిణి, ఎం.మాధురి ప్రదర్శించిన 'కార్బన్ ప్యూరిఫికేషన్' ప్రాజెక్టు ఉన్నతాధికారుల ప్రశంసలు పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.జె.రవీంద్రబాబు తెలిపారు. ఈమేరకు ఏపీ సైన్స్ సిటీ సీఈవో వెంకటేశ్వర్లు, ఎయిర్‌పోర్టు అథారిటీ కమిషనర్ ప్రవీణ్‌ఆదిత్య అభినందించారన్నారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందించారన్నారు. ఈ మేరకు రవీంద్రబాబు సంబంధిత విద్యార్థులను, సైన్స్ ఉపాధ్యాయిని దువ్వాడ శిరీషను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు

నవ్వులు పంచిన పేరడీ అవధానం

పేరడీ అవధానం చెబుతున్న జె.ఎల్.నరసింహారావు

సీతంపేట, న్యూస్‌టుడే: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విశాఖ పౌర గ్రంథాలయంలో 'నవ్వుకుందాం రండి' పేరుతో పేరడీ అవధాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. హెల్మెట్ పెట్టుకుంటే లాభాలు, తెలుగు ప్రస్తుత పరిస్థితి, భగవంతుడి లీలలు, వారఫలాలు, కవితలు, అంత్యప్రాసలు, తాగడం వల్ల నష్టాలు, వాస్తు పిచ్చి, చమత్కారం మాట్లాడే ఆడవారి అంశాలపై అవధానం చేస్తూ నవ్వులు పూయించారు. అవధానిగా జె.ఎల్.నరసింహారావు, సభ్యులు కె.ఎల్.కామేశ్వరరావు, ఎం.వి.సుబ్రహ్మణ్యం, నండూరి రామకృష్ణ, రామానుజం, శ్రీధర్, రజని, జేపీ శర్మ, నాయుడు, బోను నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. తిలక్ పట్నాయక్, సినీ నటులు భద్రం, శివకుమార్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ పరస

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: అడివివరం గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారి పరస మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. మహిళలు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఈవో జె.వెంకటరావు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

పూజల్లో పాల్గొన్న ఈవో వెంకటరావు

హరేరామ.. హరేకృష్ణ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిరం(సాగర్‌నగర్)లో హరేరామ.. హరేకృష్ణ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్రబలభద్ర జగన్నాథ స్వామి విగ్రహాలను పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించి భజనలు నిర్వహణ, గీతాలాపనలు చేశారు. అన్నసమారాధన చేపట్టారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్, మాతాజీనితాయిసేవిని, తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణుల ఉత్సవమూర్తులు

ఆర్వో ప్లాంటు ఉన్నా..లేనట్లే..

ముత్యాలమ్మపాలెంలో మూలకు చేరిన మంచినీటి పథకం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలోని ఆర్వో ప్లాంటు నిరుపయోగంగా ఉంది. గ్రామప్రజలకు శుద్ధి నీటిని అందించాలనే లక్ష్యంతో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.12లక్షలు వెచ్చించి 2016లో దీన్ని నిర్మించారు. ప్లాంటుకు ఎన్టీపీసీ అధికారులు సౌర పలకలు ఏర్పాటు చేశారు. కొన్నేళ్లపాటు బాగానే పనిచేయడంతో స్థానికులు ఇక్కడి శుద్ధి నీటిని పట్టుకుని వెళ్లేవారు. కాగా..కొంతకాలంగా ఇది మూలకు చేరి నిరుపయోగంగా ఉంది. దాంతో గ్రామస్థులు శుద్ధినీటికి అవస్థలు పడుతున్నారు. వ్యయప్రయాసలకు గురై పరిసర గ్రామాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్లాంటును వినియోగంలోకి తీసుకురావడానికి తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరుల సమేతంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవం కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

జ్యోతిర్లింగ ప్రదర్శన ప్రారంభం

అగనంపూడి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం గ్రామీణ బ్యాంకు వద్ద ఆదివారం ప్రజాపిత బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో సోమనాథ జ్యోతిర్లింగ ప్రదర్శన ఏర్పాటు చేశారు. పరవాడ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.నీలబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు అపరంజి, రామకోటి, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఫాల్గుణ పక్షోత్సవాలు

పూజలందుకుంటున్న అమ్మవారు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై జరుగుతున్న ఫాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం క్షీరాబ్ధి కన్యకు శ్రీమహాలక్ష్మి అమ్మవారికి శోడషాభిషేకం, శ్రీసూక్త హవనం వైభవోపేతంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారికి పదహారు రకాల ద్రవ్యాలతో శోడష ద్రవ్యాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతన వస్త్రాలతో జగన్మాతను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండంలో శ్రీసూక్త హవనం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హోమగుండం ప్రదక్షిణం చేశారు. సామూహిక అష్టలక్ష్మి స్తోత్ర పారాయణం చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

శ్రీసూక్త హవనంలో పాల్గొన్న భక్తులు

రేపు వేంకన్న ఆలయం మూసివేత

పెందుర్తి, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం సందర్భంగా వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడి ఆలయాన్ని మంగళవారం మూసివేయనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున శ్రీవారికి ఆరాధన, అర్చనలు పూర్తి చేసి ఉదయం 8.30 గంటలకు ఆలయ ద్వారాలు మూసివేస్తామన్నారు. బుధవారం తెల్లవారుజామున 5.30గంటలకు గుడి తలుపులు తెరిచి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు చేస్తామన్నారు. ఆలయ సంప్రోక్షణ అనంతరం సుమారు ఉదయం 8గంటల నుంచి భక్తులకు తిరిగి శ్రీవారి దర్శనం కల్పిస్తామని వివరించారు.

ముత్యమాంబ పండగ చాటింపు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట పరిసర 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం ముత్యమాంబ అమ్మవారి పండగ చాటింపు ఉత్సవం ఆదివారం జరిగింది. ఈనెల 5న అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించనున్నారు. గురువారం జరగనున్న అనుపోత్సవానికి ముందు ఐదు రోజులపాటు ఈ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం చాటింపు ఉత్సవం చేపట్టారు. భక్తులు మాంసాహారానికి దూరంగా ఉండేందుకు సంబంధిత దుకాణాలను వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేయడం ఇక్కడి ఆచారంగా వస్తోంది. అమ్మవారు బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారుగా గుర్తింపు పొందడంతో అప్పటి నుంచి ఈ సంప్రదాయాన్ని పెద్దలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వేపగుంట నాలుగురోడ్ల కూడలిని విద్యుత్తు దీపాలతో తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా ప్రతీరోజూ ఆలయ ప్రాంగణంలో భజనలు, కోలాటం తదితర ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పెందుర్తి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు పరిహారం అందజేత

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: అడివివరం-నీళ్లకుండీలు కూడలి వరకు రహదారి విస్తరణలో భాగంగా పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురం గ్రామంలో తొలగించిన ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు నష్టపరిహారం పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. స్థానిక రత్నగిరినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ సమకూర్చిన రూ.16లక్షలు విలువైన పరిహారం చెక్కులను ఆయా కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ప్రణాళికాధికారి కిశోర్‌కుమార్, ఏడీఎం రహీం బేబీ, గ్రామ నాయకులు దూది వెంకటరమణ, జి.సోమునాయుడు, కాయిత ఎర్రిబాబు, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ప్రతినిధులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

ఈనాడు అనంతపురం

సోమవారం మార్చి 2, 2026

హంస వాహనంపై నృసింహుడు

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆదివారం హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు రాత్రి శ్రీవారు హంస వాహన అలంకారంతో తిరువీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా స్వామిని పరిమళ పుష్పాలతో అలంకరించారు. విశేష పూజలు జరిపి తిరుమాడ వీధుల్లో ఉత్సవాన్ని ప్రారంభించారు. రథంపై కొలువుదీరిన నారసింహునికి ప్రత్యేక వాయిద్యాలతో భక్తి గీతాలు ఆలపిస్తుండగా ఉత్సవం ముందుకు సాగింది. ఉదయం మండపోత్సవం వేడుకగా జరిపారు. పురప్రజలు పెద్దసంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. సోమవారం ఖాద్రీశుడు సింహ వాహనంపై ఊరేగనున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా వేదిక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఎప్పటిలాగే ఈ సోమవారం(2న) కూడా కలెక్టర్ కార్యాలయ రెవెన్యూ భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. దీనితోపాటు రెవెన్యూ క్లినిక్ కూడా జరుగుతుందన్నారు. బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కూత వినిపించినా.. పట్టాలెక్కలేదు!

గుంతకల్లు, న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం అధికారులు కొన్ని రైళ్లను పొడిగించడానికి, కొత్త రైళ్లను నడపడానికి నిర్ణయాలు తీసుకున్నారు. నెలల గడుస్తున్నా ఆ రైళ్లు పట్టాలెక్కలేదు. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కరోనా సమయంలో, డబుల్ లైన్ నిర్మాణాల పేరుతో రద్దు చేసిన రైళ్లను కూడా ప్రభుత్వం తిరిగి నడపడానికి ఆదేశాలు జారి చేయడంలో జాప్యం చేస్తోంది. ✦ ప్రస్తుతం నర్సాపూర్- ధర్మవరం మధ్య నడుస్తున్న రైలును గుంతకల్లు వరకు పొడిగించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. దీంతో రైలును పొడిగిస్తున్నట్లు అధికారులు మూడు నెలల కిందట ప్రకటించారు కానీ అమల్లోకి రాలేదు. ✦ గుంతకల్లు నుంచి కడప వరకు ప్యాసింజర్ రైలుగా, కడప నుంచి తిరుపతి మీదుగా విశాఖపట్టణానికి ఎక్స్‌ప్రెస్‌గా ప్రయాణిస్తున్న తిరుమల రైలును గుంతకల్లు నుంచి విశాఖపట్టణం వరకు ఎక్స్‌ప్రెస్‌గా నడపాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కానీ అమలు కావడం లేదు. ఈ రైలును పూర్తిగా ఎక్స్‌ప్రెస్‌గా నడిపితే తిరుపతి వెళ్లే భక్తులకు వెసులుబాటు కలుగుతుంది. ఈ మూడు రైళ్ల విషయంలో ఉన్నతాధికారులు త్వరగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

> గుంతకల్లు- మార్కాపురం మధ్య కొత్త ప్యాసింజర్ రైలును నడపడానికి రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇది కూడా పట్టాలెక్కలేదు.

కొవిడ్ సమయంలో రద్దయిన రైళ్లు..

గుంతకల్లు మీదుగా హుబ్బళ్లి - విజయవాడ, బెంగళూరు - విజయవాడ మధ్య ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను కొవిడ్ సమయంలో రద్దుచేశారు. తిరిగి వాటిని ప్రవేశపెట్టడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. గేజ్‌మార్పిడి, డబుల్‌లైన్ నిర్మాణం కోసమని రద్దు చేసిన అనంతపురం, గుంతకల్లు మీదుగా ప్రయాణించే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, గుంతకల్లు-ధర్మవరం-తిరుపతి ఫాస్ట్ ప్యాసింజర్ రైలు తిరిగి ప్రారంభం కాలేదు.

ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాం

- శ్రావణ్‌కుమార్, సీనియర్ డివిజనల్ ఆపరేటింగ్ మేనేజరు

రైళ్ల పొడిగింపు, కొత్త రైళ్లను నడపడం, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును పూర్తి స్థాయిలో ఎక్స్‌ప్రెస్‌గా నడపడానికి ప్రాథమిక స్థాయిలో నిర్ణయాలు జరిగాయి. అయితే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాలేదు. మార్కాపురం-గుంతకల్లు మధ్య కొత్త రైలును నడపాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఇంకా తేదీ ఖరారు కాలేదు. రైలును ఎప్పుడు ప్రారంభించాలనే తేదీ ఖరారు కోసం ఎదురు చూస్తున్నాం. గతంలో రద్దయిన రైళ్ల విషయంలో ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

కూడేరు మండలంలో రైతు రామాంజనేయులు గత ఏడాది నవంబరులో రెండు వ్యవసాయ సర్వీసులకు దరఖాస్తు చేశారు. ఇందుకుగాను రూ.26 వేలు డీడీలు తీసి అందజేశారు. ఇప్పటి వరకు స్తంభాలు, సామగ్రి విడుదల చేయలేదు. అరటి సాగు చేసేందుకు రూ.లక్షలు ఖర్చు చేసి పొలాన్ని చదును చేసుకున్నారు. పైప్‌లైన్ పనులు పూర్తి చేసుకున్నారు. విద్యుత్తు సరఫరా లేకపోవడంతో పంట సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రిక.. నిరీక్షించలేక!

అనంతపురం(విద్యుత్తు), న్యూస్‌టుడే:

➤ వ్యవసాయ సర్వీసుల మంజూరులో తీవ్ర జాప్యం
➤ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

వ్యవసాయ సర్వీసులు పొందేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. శాఖ నిబంధనల ప్రకారం డీడీలు తీసి అందించినప్పటికీ విద్యుత్తు నియంత్రికల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. సామగ్రి, నియంత్రికల కోసం రైతులు కాళ్లరిగేలా విద్యుత్తు సెక్షన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదని, కొందరు ఏఈలు అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలకు విద్యుత్తు నియంత్రికలు, సామగ్రి అనంతపురం స్టోర్ నుంచి సరఫరా చేయాల్సి ఉంది. అయితే స్టోర్‌లో 25కేవీ, 16కేవీ నియంత్రికలు అందుబాటులో లేవు. నెల రోజులుగా నియంత్రికల సరఫరా లేకపోవటంతో రైతులకు విడుదల చేయలేదని అధికారులు చెబుతున్నారు. కాగా.. మామూళ్లు ఇచ్చిన వారికి అన్నీ సమకూర్చి సర్వీసులు కూడా విడుదల చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

జిల్లా: అనంతపురం
- వ్యవసాయ సర్వీసులకు నమోదైన దరఖాస్తులు : 32,000
- రైతులు అందించిన డీడీలు : 7,200
- చెల్లించిన మొత్తం : రూ. 8.78 కోట్లు
- సర్వీసుల విడుదలకు అవసరమయ్యే నియంత్రికలు : 3,200

త్వరలోనే వస్తాయి

విద్యుత్తు నియంత్రికల సరఫరా ఆగిన మాట వాస్తవమే. కొన్ని రోజులుగా విడుదల చేయటం లేదు. రైతుల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. పారదర్శకంగా వ్యవసాయ సర్వీసుల మంజూరుకు తగిన చర్యలు తీసుకుంటాం. అధికారులు, సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుంటే రైతులు ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

- శేషాద్రిశేఖర్, ఎస్ఈ, అనంతపురం జిల్లా

ఇరాన్- ఇజ్రాయెల్ బాధితులకు కంట్రోల్ రూం

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో బాధిత కుటుంబాల కోసం ప్రత్యేక కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. అనంత కలెక్టరేట్, అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు డివిజన్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూంలను ప్రారంభించామని చెప్పారు. ఈ యుద్ధం నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న బంధువుల సమాచారం, సహాయం కోసం సమీప కంట్రోల్ రూం నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ కంట్రోల్ రూం నంబరు 85002 92992, అనంత ఆర్డీఓ కార్యాలయం 94931 88818, కళ్యాణదుర్గం కార్యాలయం 83095 98111, గుంతకల్లు కార్యాలయం నంబరు 98666 46648లను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సా॥)	సహర్ (ఉ॥)
అనంతపురం	6.29	5.20
గుంతకల్లు	6.30	5.21
తాడిపత్రి	6.30	5.12

> ఆ ముగ్గురు తోబుట్టువులు. అంతా కుటుంబాలతో సహా బెంగళూరులో కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జీవితాలపై పెద్దగా ఆశలు లేకపోయినా ఉన్నదాంట్లో ఆనందంగా జీవిస్తున్నారు. బంధువుల పెళ్లి ఉండటంతో ముగ్గురూ సంబరంగా బయలుదేరారు. శుభకార్యం ముగియగానే అందర్నీ పలకరించడానికి స్వగ్రామం బాట పట్టారు. ఊరి ఊసులు చెప్పుకొంటూ నవ్వుల పువ్వులు పూయిస్తూ వెళ్తుండగా మృత్యువు వెంటాడింది. బస్సు ఢీకొనడం.. ముగ్గురి ప్రాణాలు పోవడం అంతా క్షణాల్లో జరిగిపోయింది. ఆ ముగ్గురు ఇక లేరని తెలిశాక ఆ కుటుంబాల సభ్యులు రోదించిన తీరు అందర్నీ కలచివేసింది. వీరినే నమ్ముకొని బతుకులీడుస్తున్న వారంతా గుండెలవిసేలా విలపించారు.

తోబుట్టువులను వెంటాడిన.. మృత్యువు

కారును బస్సు ఢీకొని ముగ్గురి దుర్మరణం

బస్సు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన కారు

కళ్యాణదుర్గం (గ్రామీణం), న్యూస్‌టుడే: కారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృత్యువాతపడ్డారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పరిధిలోని గూబనపల్లి వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం పరిధిలోని మదిగుబ్బ చెందిన అన్నాచెల్లెలు శివకుమార్ (30), చంద్రకళ (29), వీరి పెద్దనాన్న కుమారుడు హనుమంతరాయుడు (42) పదిహేనేళ్లుగా బెంగళూరులో స్థిరపడ్డారు. రెండు రోజుల కిందట కర్ణాటకలోని మొలకాల్మూరు తాలూకా కొండ్లపల్లిలో బంధువుల వివాహం ఉండటంతో వచ్చారు. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం స్వగ్రామానికి వెళ్లి బంధువులను, స్నేహితులను పలకరించి రాత్రికి బెంగళూరు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో కారులో స్వగ్రామానికి బయల్దేరారు. అనంతపురం నుంచి కళ్యాణదుర్గం మీదుగా రాయదుర్గం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురూ అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. బస్సులో వెళ్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. మృతి చెందిన వారిలో శివకుమార్‌కు వివాహం కాలేదు. చంద్రకళకు భర్త నరసింహమూర్తి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హనుమంతరాయుడుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరి మరణంతో ఆయా కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపించాయి. ఘటనా స్థలానికి డీఎస్పీ రవిబాబు, పట్టణ సీఐ హరినాథ్ సిబ్బందితో చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించి మృతదేహాలను పంచనామా నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. బస్సు డ్రైవర్ అతివేగం ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటానని ఈసందర్భంగా ప్రకటించారు.

హనుమంతరాయుడు

శివకుమార్

చంద్రకళ

చీనీ ధరలకు లెక్కే లేదు!

పని చేయని ధరల డిస్‌ప్లే బోర్డు

డిజిటల్ డిస్‌ప్లే బోర్డు దుస్థితి

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని చీనీకాయల సంతలో డిజిటల్ డిస్‌ప్లే బోర్డు ఏర్పాటు చేశారు. అందులో నిత్యం చీనీ కాయల ఆన్‌లైన్ ధరలు ప్రదర్శిస్తుంటారు. నాగ్‌పూర్, గడ్డిఅన్నారం చీనీ ధరలు కూడా అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గరిష్ఠం, మధ్యస్థం, కనిష్ఠ ధరలను బోర్డులో కనిపించేవి. గతేడాది భారీ వర్షాలకు బోర్డు శిథిలమైంది. అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌యార్డులోని ఈ-నామ్ కార్యాలయం వద్ద రోజూ ధరలు రాసి నోటీస్ బోర్డులో ఉంచుతున్నారు. అక్కడ వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని చీనీ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏఎంసీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఏడీఎం రామచంద్రమూర్తి స్పందిస్తూ బోర్డుకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి ఇంటర్ సార్వత్రిక పరీక్షలు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: చదువులపై సరైన అవగాహన లేక బడి మానేసిన వారికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం విద్యాపీఠం నెలకొల్పింది. ప్రభుత్వ చిరు ఉద్యోగులు కూడా సార్వత్రిక పీఠం ద్వారా 10, ఇంటర్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా పదోన్నతులు కూడా లభిస్తాయి. జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు కూడా సార్వత్రిక విద్య అభ్యసించే అవకాశం కల్పించారు. వీటిపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి, వీలైనంత ఎక్కువ స్థాయిలో ప్రవేశాలు కల్పించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయి. అయితే అనంత జిల్లాలోని సార్వత్రిక విద్యాపీఠం అధికారులు ప్రచార కార్యక్రమాలే నిర్వహించలేదు. అవగాహన కార్యక్రమాలు లేవు. కనీస ప్రచారం కూడా చేయకపోవడంతో ఈ సారి ప్రవేశాల సంఖ్య చాలా తగ్గిపోయింది. విద్యాశాఖ పరిధిలోనే సార్వత్రిక పీఠం కూడా పని చేస్తుంది. అధికార నిర్లక్ష్యం కారణంగా చాలా మంది ప్రవేశాలు కోల్పోయారు.

అంతా గోప్యంగా...

సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 2వ తేదీన (సోమవారం) ఆరంభం కానున్నాయి. 13వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. అనంత జిల్లాలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు 2500 మంది వరకు పరీక్షలు రాయనున్నట్లు సమాచారం. డీఈవో, సీఎస్‌లకు, ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమాలు కూడా తూతూ మంత్రంగా నిర్వహించారు, చేతులు దులుపుకొన్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

పరీక్షల విభాగం అధికారిదే బాధ్యత

- ప్రసాద్‌బాబు, డీఈవో, అనంతపురం

సార్వత్రిక ఇంటర్‌పరీక్షలు సోమవారం నుంచి ఆరంభమవుతాయి. పరీక్షల విభాగం సహాయ సంచాలకులు ప్రవేశాలు, పరీక్షల నిర్వహణపై బాధ్యత వహిస్తున్నారు. సమన్వయంతో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

3న లేపాక్షి ఆలయం మూసివేత

హిందూపురం: ఈనెల 3వ తేదీన చంద్రగ్రహణం సందర్భంగా లేపాక్షిలోని వీరభద్రస్వామి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంహెచ్ నరసింహమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆ రోజు ఉదయం 6గంటల లోపు నిత్యపూజలు నిర్వహించి 8.30 గంటలకు తలుపులు మూసివేస్తామన్నారు. తిరిగి 4వ తేదీ బుధవారం ఉదయం 7 గంటలకు తలుపులు తీసి ఆలయ శుద్ధి, స్వామివారికి అభిషేకాలు, అర్చనల అనంతరం 8గంటల నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించి సహకరించాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

'రెవెన్యూ క్లినిక్'తో ఉపయోగమెంత!?

కౌంటర్ల వద్ద బాధితుల నిరీక్షణ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఒక ముఖ్యోద్దేశంతో ప్రారంభించిన 'రెవెన్యూ క్లినిక్' వ్యవహారం 'ఎక్కడేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారైంది. ఈ కార్యక్రమ నిర్వహణ, పురోగతిపై నీలినీడలు కమ్ముకున్నాయి. హడావుడి.. గందరగోళం తప్ప.. అర్జీల పరిష్కారంపై రెవెన్యూ అధికారుల్లో కనీస శ్రద్ధ కనబడటం లేదు.

కలగా అర్జీల సత్వర పరిష్కారం

ఈ క్లినిక్ ఏర్పాటు ఉద్దేశం మంచిదే అయినా.. నిర్వహణ లోపం.. నిర్లక్ష్యం మూలంగా అభాసుపాలవుతోంది. పీజీఆర్ఎస్ తరహాలోనే.. రెవెన్యూ క్లినిక్‌లోనూ అర్జీల పరిష్కారాన్ని అటకెక్కించారు. ఇంతకాలనికి యావత్తు జిల్లా రెవెన్యూ యంత్రాంగాన్ని ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో మోహరించజేయడం ప్రజలకు ఏమాత్రం ఉపయుక్తంగా లేదు. కలెక్టరేట్‌కు రావడం వల్ల ఇక్కడ పని జరగదు.. అక్కడ పని చేయరన్న విమర్శ ప్రజల్లో ఉంది.

రెవెన్యూ క్లినిక్‌కు వచ్చిన అర్జీల వివరాలు

మొత్తం అర్జీలు	:	1,237
పరిష్కృతమైనవి	:	113
తిరస్కరణ	:	43
పెండింగ్	:	1,081

2024 జూన్ 15 నుంచి ఇప్పటి దాకా పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులు

మొత్తం వినతులు	:	23,579
పరిష్కారం	:	20,136
పెండింగ్	:	3443

గందరగోళం..

జిల్లాలో జనవరి 5వ తేదీ నుంచి రెవెన్యూ క్లినిక్ మొదలైంది. ప్రతి సోమవారం అన్ని మండలాల తహసీల్దార్లు, ఆర్డీఓ, ఆర్ఐ, వీఆర్ఓలు.. వంటి కేడర్ మొత్తం కలెక్టరేట్‌కే వస్తున్నారు. రెవెన్యూ భవన్‌లో పీజీఆర్ఎస్ ఒక వైపు.. క్లినిక్ మరొక వైపు కొనసాగుతుంది. ఈ రెండింటికి సంబంధించి ఏక కాలంలోనే అర్జీలు ఇస్తున్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ యంత్రాంగం అక్కడే ఉండటంతో రెవెన్యూ భవన్‌లో గజిబిజి.. గందరగోళం ఏర్పడింది. ఏ అధికారి ఎక్కడ ఉన్నారో తెలుసుకోడానికి చాలా సమయం పడుతోంది. ✦ రెవెన్యూ క్లినిక్ ప్రారంభమై నాలుగు వారాలు గడిచింది. క్లినిక్‌కు వచ్చే అర్జీలన్నీ పరిష్కరించే అవకాశం ఉన్నవే. ఆర్ఓఆర్, మ్యుటేషన్, వెబ్‌ల్యాండ్, 22ఏ, రీసర్వే, భూ కబ్జాలు.. వంటి సమస్యలే ఉన్నాయి. అధికారులు కనీస శ్రద్ధ పెడితే ఈ సమస్యలన్నీ రెండు వారాల్లో పూర్తయ్యే వీలుంది. 32 మండలాల్లో.. గార్లదిన్నె, బీకే సముద్రం, కూడేరు, రాప్తాడు, అనంత గ్రామీణం, ఆత్మకూరు, తాడిపత్రి, శింగనమల, నార్పల మండలాల్లోనే సింహభాగం అర్జీలు ఉన్నాయంతే.

ముగిసిన గురుకుల ప్రవేశ పరీక్షలు

హిందూపురంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీఓ జయలక్ష్మి

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్, ఐదో తరగతిలో ప్రవేశానికి ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 16 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఆయా కేంద్రాలను గురుకుల విద్యాలయాల సమన్వయకర్త జయలక్ష్మి, ఇతర అధికారులు పర్యవేక్షించారు. హిందూపురం, మలుగూరు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఉదయం జరిగిన ఐదో తరగతి పరీక్షకు మొత్తం 6,457 మంది విద్యార్థులు హాజరు కాగా....583 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు 3,528 మంది హాజరు కాగా 510 మంది హాజరు కాలేదు. ఐఐటీ, నీట్ శిక్షణతో కూడిన ఇంటర్ ప్రవేశానికి 2,374 మంది హాజరు కాగా 457 మంది గైర్హాజరయ్యారు. ఫలితాలు త్వరలోనే ప్రకటిస్తారని జయలక్ష్మి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

లక్ష్మీనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే:

> ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా కూలీలకు ముఖ హాజరు(ఫేషియల్ అథన్టికేషన్) ప్రవేశపెట్టింది. మార్చి 2వ తేదీ నుంచి ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని అన్ని రాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. దీంతో సోమవారం నుంచే ఈ నూతన విధానం అమల్లోకి రానుంది.

ముఖహాజరు లేకపోతే.. ఉపాధి గల్లంతే

■ నేటి నుంచి తప్పనిసరి

ఈ-కేవైసీ ఉంటేనే పనులకు...

గతంలో ఉపాధి హామీ పనులు చేసేటప్పుడు జాబ్‌కార్డులో ఒకరుంటే వారికి బదులు మరొకరు పనులకు వెళ్లి మస్టర్‌లో దొంగ సంతకాలు చేసేవారు. దీని వల్ల నిధులు దుర్వినియోగం అయ్యేవి. పనులకు హాజరయ్యే ప్రతి కూలీకి ఈ-కేవైసీ చేసి దాన్ని సక్రమంగా అమలు చేస్తే అక్రమాలకు పూర్తిగా స్వస్తి పలికే అవకాశం ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి ఈ విధానాన్ని ప్రవేశపెట్టాయి. దీంతో ప్రతి కూలీ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని అధికారులు తేల్చి చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఈకేవైసీని గత ఏడాది అక్టోబర్ 25 నుంచి ప్రారంభించి ఇప్పటి వరకు 85 శాతం పూర్తి చేశారు.

పనులు చేస్తున్న కూలీలు

ఏ ఒక్కటి మర్చిపోయినా..

పనుల వద్ద కూలీలకు ఐడీని క్రియేట్ చేస్తారు. మొదట ఫీల్డ్ అసిస్టెంట్, క్షేత్ర సహాయకులు(టీఏ)లు కూలీల ఫొటో తీస్తారు. పని పూర్తయిన నాలుగు గంటల తరువాత మరొకసారి కూలీల ఫొటో తీస్తారు. దీంతో పనులు పూర్తి చేసినట్లు వారికి సమాచారం అందుతుంది. ఈ నిబంధనల్లో ఏదీ మర్చిపోయినా బిల్లులు జమకావు.

అవాంతరాలను అధిగమిస్తారా..

జిల్లాలో నేటికీ పలు గ్రామాల్లో నెట్‌వర్క్ సిగ్నళ్లు సరిగా లేవు. దీంతో ముఖ హాజరు విధానం అధికారులకు సవాలుగా మారనుంది. దీని కోసం అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఓ ముఖ్య సూచన చేస్తున్నారు. పని ప్రదేశంలో కూలీల ఫొటోలు తీసి సిగ్నల్ వచ్చే ప్రాంతంలో యాప్‌లో అప్లోడ్ చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ఈ విధానం అమలైతే మంచిదే. ఒకవేళ ఇది పనిచేయకుంటే కూలీలతో సమస్యల వస్తాయేమోనని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆందోళన చెందుతున్నారు. మొదటిరోజు ముఖ హాజరు పనితీరుపై సందేహాలు తెలుస్తాయని, అంతవరకు వేచి ఉండాలని అందరూ అనుకుంటున్నారు.

జిల్లా: అనంతపురం
- జాబ్‌కార్డులు: 2,50,000
- యాక్టివ్‌లో ఉన్నవి : 2,05,000
- నమోదైన కూలీలు: 4,47,000
- క్రియాశీలకంగా ఉన్నవారు: 3,54,000
- ఈ-కేవైసీ పూర్తి చేసిన కూలీలు: 3,40,000
- ఉపాధిహామీ పనుల సంఖ్య: 64 వేలు (వీటిలో సుమారు 60 రకాల పనులు చేపడతారు)

అక్రమాలను అరికట్టేందుకే..

- సలీంబాషా, డ్వామా పీడీ

ఉపాధిహామీ పనుల్లో పారదర్శకంగా ఉండాలనే ముఖ హాజరును ప్రవేశపెట్టారు. ఈ విధానంతో కూలీలకు వేతనాలు సకాలంలో అందుతాయి. ఈ-కేవైసీ ఉంటేనే పనులకు హాజరుకావాలని కూలీలకు సూచించాం. ఉపాధి హామీ సిబ్బందికి చాలా వరకు సమస్యలు తగ్గిపోతాయి.

సర్పరూపునికి విశేష పూజలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సర్పరూపునికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అర్చనలు, అభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేశారు. రాహుకేతు, సర్పదోష, కాలసర్పదోష, కుజ దోష నివారణార్థం యాగ మండపంలో సుబ్రహ్మణ్యేశ్వర మూలమంత్ర బీజాక్షర హోమం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామికి పల్లకీసేవ, మహామంగళహారతి అందించారు.

(c) eenadu

సంతల ఆదాయం రూ.3.83 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం రూ.3,83,360 ఆదాయం వచ్చింది. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ.2,40,530 ఆదాయం రాగా ఆదివారం జరిగిన పశువుల సంతలో రూ.1,42,830 రాబడి వచ్చిందని యార్డు ఎంపికశ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. (రిట్రైడ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ ✆: 7382114647

REAL ESTATE

హిందూపురం రైల్వేస్టేషన్‌కి 3km లో అద్భుతంగా డెవలప్ చేసిన ప్రాజెక్టులో ప్లాట్లు & 38 లక్షలకే డబుల్ బెడ్‌రూమ్ హౌసెస్ కలవు. సం: 6281824204.

PLOT FOR SALE

EMI ద్వారా విబిజిఎ అప్రూవల్ ప్లాట్లు బెంగుళూరు హైవే అనంతపూర్ 3 నెలలు, 6 నెలలు, 9 నెలలు EMI ద్వారా వీకెండ్ గార్డెన్ మెడోస్‌లో వెంటనే ప్లాటు బుకింగ్ చేయండి. Cont: 9703727786, 7989576111.

JOBS

Required Sales Excutives for Tanishq Jewellery Store, Inter Pass with Retail Experience # Tanishq Jewellery, R.F.Road, Anantapur. Ph: 9441719143.

Wanted: Lady Tele callers, Receptionist, Computer Operator, Pros in Anantapur. ✆: 6302037812

Rajahamsa Grand ఇన్ Hotel నందు రూమ్ బాయ్స్‌గా పనిచేయుటకు కావలెను. సంప్రదించండి: 99482 66888.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ్ నందు వార్డెన్స్ మరియు క్లాస్ ఇన్‌ఛార్జిగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 12000 నుండి 14000 వరకు ఇవ్వబడును. (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22 సం॥రాల నుండి 40 సం॥రాలు ఉండవలెను. వివరాలకు సంప్ర. ఫోన్: 9248733320.

మా కంపెనీలో పనిచేయుటకు Computer Operator పురుషులు కావలెను. అర్హత: Computer వచ్చి ఉండాలి, వయస్సు 40 లోపు, జీతం: 9000 to 10000. సంప్ర: ATP. ✆: 9493181828.

ATPలో ప్రముఖ రైసుమిల్‌లో పనిచేయుటకు Logistics కొరకు 1 సం॥ అనుభవం ఉన్న పురుషులు కావలెను. మంచి జీతం. ✆: 9032543196

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిముతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారుల సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏదో డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తల బ్లాక్‌లిస్ట్‌లో ఉంచే మరియు/లేదా ఆతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU Classifieds 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ప్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు: 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

చదరంగం.. ప్రతిభకు పట్టం

అంతర్జాతీయ ఫిడే క్లాసికల్ రేటింగ్‌లో ఘనత

హిందూపురం, న్యూస్‌టుడే: చదరంగంలో అరుదైన ఆలోచనలతో ఎత్తుకు పైఎత్తులు వేస్తూ పట్టణానికి చెందిన చదరంగం క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి అర్జిస్తున్నారు. ఫిబ్రవరి 13, 14, 15వ తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరులో వరల్డ్ చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ ఓపెన్ క్లాసికల్ ఫిడేలో స్థానిక స్పర్టన్‌చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న జి.జ్ఞాపికారెడ్డి (1407), ఎన్‌పీ చార్విక్ (1506), సి.మిధున్ పెద్దన్న (1495), సి.మహాన్‌పెద్దన్న (1447) క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ టోర్నమెంట్‌కు అంతర్జాతీయంగా 426 మంది క్రీడాకారులు పాల్గొని రేటింగ్‌కు పోటీపడగా స్థానిక క్రీడాకారులు తమ మేధస్సుతో అరుదైన ర్యాంకులు సొంతం చేసుకొన్నారు. ఈ రేటింగ్ ఫలితాలను వరల్డ్ చెస్ ఫెడరేషన్ వారు ఆదివారం ప్రకటించారు. వీరు ఈ ర్యాంకులు సాధించేందుకు చేసిన కృషి వారి మాటల్లోనే..

ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది

చిన్నప్పటి నుంచి చదరంగంపై ఆసక్తి. పట్టణంలోని స్పర్టన్ శిక్షణ కేంద్రంలో మూడేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నాను. స్థానిక వేలంగి మాత పాఠశాలలో 8వ తరగతి చదువుతూ జిల్లా, రాష్ట్రస్థాయిలో పలుచోట్ల నిర్వహించిన పోటీల్లో పాల్గొని ద్వితీయ శ్రేణిలో రాణించాను. భవిష్యత్తులో ప్రపంచ ఛాంపియన్ స్థాయికి ఎదగాలని ఉంది. **- జి.జ్ఞాపికారెడ్డి**

పట్టువదలకుండా సాధన చేశాను

చదరంగం అంటే ఎంతో ఇష్టం అందుకే స్థానిక స్పర్టన్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్నా పలు దఫాలు విఫలమయ్యాను. అయినా పట్టు వదలకుండా పోటీల్లో పాల్గొంటున్నందున రాణించేందుకు అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఎల్ఆర్‌జీ విద్యాలయంలో అయిదో తరగతి చదువుతున్నాను. భవిష్యత్తులో చదరంగంలో మంచి క్రీడాకారుడిగా రాణించాలని ఉంది. **- ఎన్‌పీ చార్విక్**

మెలకువలు నేర్చుకుంటున్నాను

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో స్థానిక స్పర్టన్ శిక్షణ కేంద్రంలో రెండున్నర సంవత్సరాలుగా శిక్షణ పొందుతున్నాను. అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించాలనే పట్టుదలతో శిక్షణలో మెలకువలు నేర్చుకుంటున్నాను. అంతర్జాతీయ ఫిడే రేటింగ్‌లో 1495 ర్యాంకు సాధించాను. భవిష్యత్తులో గ్రాండ్ మాస్టర్ కావాలనే పట్టుదలతో ఆటలో మెలకువలు నేర్చుకొంటున్నాను. **- సి.మిధున్‌పెద్దన్న**

విశ్వనాథ్‌ఆనంద్ స్థాయికి ఎదగాలని..

చదరంగంలో గ్రాండ్ మాస్టర్ విశ్వనాథ్ ఆనంద్ స్థాయికి ఎదగాలని ఉంది. అందుకోసం రెండేళ్లుగా శిక్షణ పొందుతున్నాను. తొలుత కర్నూల్‌లో జరిగిన అంతర్జాతీయ రాపిడ్ టోర్నమెంట్‌లో 1470 రేటింగ్ వచ్చింది. తమిళనాడులో జరిగిన అంతర్జాతీయ ఫిడే క్లాసికల్ పోటీలో అధిక రేటింగ్ రావటం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. **- సి.మహాన్‌పెద్దన్న**

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ సర్కిల్ స్థాయిలో వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించుకునేందుకు సోమవారం డయల్ యువర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తున్నామని, విద్యుత్తు వినియోగదారులు సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ● సీఎండీ ఫోన్ నంబరు: 89777 16661 ● ఎస్ఈలు అనంతపురం: 9154790350, శ్రీసత్యసాయి: 9963707847

అశ్వత్థనారాయణుడికి పసుపు పండగ

నాగులకు పసుపు, కుంకుమ సమర్పిస్తున్న భక్తులు

హిందూపురం సాంస్కృతికం: పట్టణ సమీపంలో ఉన్న విదురాశ్వత్థంలో ఆదివారం పసుపు పండగ ఘనంగా నిర్వహించారు. దత్త ఉపాసకుడు అశ్వత్థనారాయణస్వామి ఆశీస్సులతో వారి శిష్య బృందం సభ్యులు, సుదూర ప్రాంతాల నుంచి భక్తుల నడుమ ఆలయంలో ఉన్న నాగులన్నింటికీ పసుపు, కుంకుమ, పుష్పాలతో అలంకరించడం ప్రత్యేకత. అనంతరం మూలవిరాట్‌కు సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

రెవెన్యూ, పోలీసుల జట్ల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

ఇరుజట్ల సభ్యులతో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: క్రీడలతో మానసిక ఒత్తిడిని జయించవచ్చని, అభిరుచులకు అనుగుణంగా అలవర్చుకోవాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం హిల్‌వ్యూ స్టేడియంలో జిల్లా రెవెన్యూ, జిల్లా పోలీసుల జట్ల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది. రెవెన్యూ జట్టుకు కలెక్టర్, పోలీస్ టీంకు ఎస్పీ కెప్టెన్‌గా వ్యవహరించారు. మొదట బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 120 పరుగుల స్కోర్ చేశారు. ఎస్పీ 40 పరుగులతో టాప్‌గా నిలిచారు. అనంతరం బరిలోకి దిగిన రెవెన్యూ జట్టు 18.1 ఓవర్లలో 121 పరుగులు చేసి, పోలీస్ టీంపై విజయం సాధించారు. రెవెన్యూ జట్టులో అశోక్ 34, ఇమ్రాన్ 24, కలెక్టర్ 13 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. నిత్యం ఒత్తిడితో ఉండే ఉద్యోగులకు క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం, పరస్పర స్నేహబంధాలు పెంపొందేందుకు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే దివ్యాంగుల సంక్షేమం

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఛైర్మన్ నారాయణస్వామి

అనంతపురం ఆర్టీసీ, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించడం దివ్యమైన ప్రయోజనమని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ఛైర్మన్ గడుపూటి నారాయణస్వామి పేర్కొన్నారు. దివ్యాంగులకు ఇచ్చిన హామీ అమలు చేస్తూ జీఓ విడుదల చేసిన సందర్భంగా అనంతపురంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి దివ్యాంగులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి కేకు కోసి మిఠాయిలు పంచి సంబరాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలత్వం 40 శాతం, అంతకంటే ఎక్కువ ఉన్న వారందరికీ ఉచిత ప్రయాణం లభిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు చేశారని గుర్తు చేశారు. దివ్యాంగ సంఘాల నేతలు నరసింహులు, గంగన్న, నారాయణస్వామి, విజయభాస్కర్‌రెడ్డి, గంగానాయుడు పాల్గొన్నారు.

5న జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు

అనంతపురం క్రీడలు: జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5న ఆర్డీటీ స్టేడియంలో జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. రికర్వ్, ఇండియన్, కాంపౌండ్ అంశాల్లో అండర్-10, 13, 15 విభాగాల్లో పోటీలు నిర్వహించి అందులో నైపుణ్యం చాటిన బాలబాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు కృష్ణా జిల్లా నూజివీడులో ఈ నెల 11 నుంచి 13వరకు నిర్వహించనున్నారు. ఆసక్తిగల జిల్లా క్రీడాకారులు ఆధార్, వయసు ధ్రువీకరణ, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

గరుడ వాహనంపై చెన్నకేశవుడు

యాడికి, న్యూస్‌టుడే: యాడికిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గరుడవాహనంలో లక్ష్మీచెన్నకేశవులు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాలు, హోమాలు తదితర కార్యక్రమాలు చెన్నైకు చెందిన రాచమడుగు రామమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన గరుడోత్సవం వేలాది భక్తుల నడుమ సాగింది.

అభివృద్ధి చూశారు.. తెదేపాలో చేరారు: మంత్రి

కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సవిత

గోరంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 20 నెలల్లో చేసిన అభివృద్ధిని చూసి వైకాపా నాయకులు తెదేపాలో చేరుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. గోరంట్ల మండలంలో ఆదివారం మంత్రి పర్యటించిన సందర్భంగా ఎర్రబల్లి గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు పద్మనాభరెడ్డి 80 కుటుంబాల అనుచరులతో మంత్రి సమక్షంలో తెదేపాలో చేరారు. మంత్రి మాట్లాడుతూ పద్మనాభరెడ్డి లాంటి రైతులకు కావాల్సింది సాగునీరు, మార్కెటింగ్, పనిముట్లు, సాంకేతిక అభివృద్ధి. అవన్నీ తెదేపా పాలనలోనే ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు పాలన వరకు అందుతున్నాయన్నారు. రాయలసీమకు తాగు, సాగునీరు అందివ్వడానికి అపర భగీరథుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషిని ప్రతిఒక్కరూ గమనించాలని కోరారు. శ్రీసత్యసాయి జిల్లాలో నేడు విరివిగా ఉద్యాన పంటలు సాగుచేసి అద్భుతాలు సృష్టిస్తున్నారని తెలిపారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో ఎంపీటీసీ సభ్యురాలు తిప్పమ్మ, ఇతరులు ఉన్నారు. ఉదయం మండల పర్యటనకు వచ్చిన మంత్రి మొదట గొల్లపల్లికి రూ.కోటితో నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించారు. మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నార్శింపల్లి పంచాయతీ నాయకులు రాజశేఖరరెడ్డి, నందమోహన్‌రెడ్డి, సోమలింగారెడ్డి, వడిగేపల్లి పంచాయతీ సర్పంచి నరసింహమూర్తి, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ చెస్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా

నగదు బహుమతి అందుకుంటున్న ఉదయ్‌కుమార్ నాయుడు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: తమిళనాడులోని హోసూరులో గత నెల 25 నుంచి ఆదివారం వరకు జరిగిన జాతీయస్థాయి అమెచ్యూర్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారుడు ఎ.ఉదయ్‌కుమార్ నాయుడు మెరిశాడు. దేశవ్యాప్తంగా ఆరు విభాగాల్లో జరిగిన పోటీల్లో వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అమెచ్యూర్ బీలో 1700 ఓపెన్ చెస్ విభాగంలో 467 మంది పోటీపడ్డారు. అంతర్జాతీయ అర్బిటర్‌గా ఉన్న ఆయన ఆరోస్థానం సాధించాడు. మొత్తం తొమ్మిది రౌండ్లలో తలపడగా 7.5 పాయింట్లతో ఆరోస్థానం సాధించి రూ.4వేల నగదు బహుమతి అందుకున్నాడు. ఈ విజయంతో ఏషియా చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కింది. అమెచ్యూర్ 2300 విభాగం చెస్ పోటీల్లో శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ 10వ స్థానం సాధించాడు. ఈ బాలుడికి రూ. 3వేల నగదు బహుమతి దక్కింది. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం కూడా దక్కింది.

దుబాయ్‌లో చిక్కుకున్న అనంత వాసులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలోని ఓ గోల్డ్ లోన్ సంస్థలో ఏరియా బ్రాంచ్ మేనేజర్లుగా పని చేస్తున్న ఎర్రిస్వామి, చెన్నయ్య, రామాంజి (కళ్యాణదుర్గం), తిప్పేస్వామి, శామీర్ (రాయదుర్గం), మల్లికార్జున (ఉరవకొండ), నాగరాజు, మారుతి, ప్రసాద్‌రెడ్డి (గుంతకల్లు) దుబాయ్‌లో చిక్కుకున్నారు. ఆ సంస్థ తరపున టూర్ ఏర్పాటు చేయగా వీరంతా కలిసి గత నెల 26న బయల్దేరి వెళ్లారు. 29న దుబాయ్ నుంచి తిరుగు ప్రయాణం కావాల్సి ఉంది. ఇరాన్‌లో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో విమానాలను నిలిపి వేయడంతో వారు దుబాయ్‌లోనే ఉండిపోయారు. తాము ఇక్కడ సురక్షిత ప్రాంతంలో ఉన్నామని వారు కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్‌ల ద్వారా సమాచారం ఇచ్చారు.

ఫార్మసీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు

గోరంట్ల: ఉమ్మడి అనంతపురం జిల్లా ఫార్మసీ అధికారుల సంఘం అధ్యక్షుడిగా కేఆర్.నాగరాజును ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీకేపల్లి సీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు అక్కడే పనిచేస్తున్న నాగరాజు తెలిపారు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆదిలక్ష్మి ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా ఉరవకొండ బాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా మజిహాభాను, అమర్‌నాథ్, విశాలక్ష్మి, యామిని, జ్యోతి, తులసీదేవి, నజ్మాభాను, శ్రీలేఖ, కౌసర్, రుబీనా, ఇర్షాద్‌ఖాన్, కాంతరాజు, నూతనప్రసాద్, హరినాథ్, తేజస్విని, నరేష్, రామునాయక్, వినయ్ తదితరులను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు పేర్కొన్నారు. ఫార్మసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ ప్రకటించినట్లు వివరించారు.

శంకరేశ్వరస్వామి ఆలయ సందర్శన

అగళి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని చెరువుకట్ట వద్ద ఉన్న పురాతన శంకరేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సందర్శించారు. నాలుగు నెలల క్రితం ఆలయంలో గణపతి విగ్రహం చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. దొంగలను పట్టుకోవాలని సీఐ రాజ్‌కుమార్‌కు సూచించారు. గ్రామస్థులతో, పూజారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలి

సమావేశంలో పాల్గొన్న వైకాపా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి చిత్రంలో నాయకులు

కడప నగరపాలక: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై వైకాపా నాయకులు కడప నగరంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాల వైకాపా ప్రజా ప్రతినిధులు, ఆయా జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కొన్ని నెలలుగా పొరుగురాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలు సీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు గొడ్డలిపెట్టుగా మారాయన్నారు. పనులను ఆపేస్తున్నామని ఏపీ సీఎం తనకు హామీ ఇచ్చినట్టు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును బ్యారేజీ స్థాయికి తెచ్చి నామమాత్రంగా పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో గ్రేటర్ రాయలసీమ జిల్లాల సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా దశలవారీ ఉద్యమాన్ని చేపడతామన్నారు. అనంతరం లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై పలు తీర్మానాలు చేశారు. ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, గురుమూర్తి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు ప్రసంగించారు.

రివాల్వర్‌తో విశ్రాంత సీఆర్‌పీఎఫ్ పోలీసు హల్‌చల్

సీటు కోసం ప్రయాణికులకు బెదిరింపులు

రివాల్వర్‌తో జనరల్ బోగీలో నిలబడిన విశ్రాంత సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మనోహర్

గుంతకల్లు, న్యూస్‌టుడే : రైలు జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న సీఆర్‌పీఎఫ్ విశ్రాంత పోలీసు మనోహర్ సీటు కోసం ప్రయాణికులను తన లైసెన్స్డ్ రివాల్వర్‌తో బెదిరింపులకు దిగాడు. ప్రయాణికులంతా భయాందోళనకు గురయ్యారు. ఆదివారం రాత్రి యలహంక నుంచి కాచిగూడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ఈఘటన జరిగింది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం ఆర్.కృష్ణాపురం గ్రామానికి చెందిన మనోహర్ రైలులో ప్రయాణిస్తూ రివాల్వర్ తీసుకొని హల్‌చల్ చేశాడు. తనకు సీటు ఇవ్వాలంటూ ప్రయాణికులను బెదిరించాడు. కొందరు ప్రయాణికులు గుంతకల్లు ఆర్పీఎఫ్‌లకు సమాచారమిచ్చారు. రైలు గుంతకల్లు జంక్షన్‌కు చేరుకోగానే బోగీ వద్దకు చేరుకుని విశ్రాంత పోలీసును అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. తాను రివాల్వర్‌తో ప్రయాణికులను బెదిరించలేదని పోలీసులకు సమాధానమిచ్చారు. ఇక ముందు ఈ విధంగా ప్రవర్తిస్తే గట్టి చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించి పంపారు.

ఆటో డ్రైవర్‌పై వడ్డీవ్యాపారి దాడి

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద శనివారం రాత్రి ఆటో డ్రైవర్ అశ్వర్థనారాయణపై వడ్డీ వ్యాపారి ప్రవీణ్ దాడి చేశాడు. సిద్దయ్యగుట్ట కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ అశ్వర్థనారాయణ అదే కాలనీలోని వడ్డీ వ్యాపారి ప్రవీణ్ వద్ద రూ.10 వేలు అప్పు చేశాడు. శనివారం రాత్రి వడ్డీవ్యాపారి కంతు చెల్లించాలని ఆటోడ్రైవర్‌ను అడిగారు. కొంతకాలం గడువు ఇవ్వాలని అశ్వర్థనారాయణ చెప్పడంతో ప్రవీణ్ విచక్షణారహితంగా దాడి చేసినట్లు బాధితుడు ధర్మవరం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వడ్డీవ్యాపారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

ANANTAPURAMU MUNICIPAL CORPORATION

e-PROCUREMENT- TENDER NOTICE

1	Tender Notice No.	376 to 388/General Funds/2025-26/TO
2	Scope of Work	Supply of Tractors on hire basis and CID Joints and CI Sluice Valves and painting in BT and CC Patches and Liqued chlorine and chalivendram in Anantapuramu Municipal Corporation
3	No.of Works	14 Nos
4	Estimate Cost	Rs. 1.20 to 27.00 Lakhs

Note: The details of tender may be seen on e-procurement market Place available @ https://tender.apeprocurement.gov.in

Sd/- Commissioner, Municipal Corporation, Anantapuramu

వేర్వేరు ప్రమాదాల్లో పది మందికి గాయాలు

మడకశిర ఆసుపత్రిలో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

గోరంట్ల-కదిరి 716జీ జాతీయ రహదారిపై, అమరాపురం మండలం పేలుబండ సమీపంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పది మంది గాయపడ్డారు.

టైరు పంక్చరై ఇన్నోవా బోల్తా

గోరంట్ల : గోరంట్ల మండలంలోని 716జీ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఇన్నోవా వాహనం బోల్తాపడి బెంగళూరుకు చెందిన అయిదుగురు గాయపడ్డారు. వీరు కడపలోని దర్గా దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. వీరు ప్రయాణిస్తున్న వాహన టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి పల్టీలు కొట్టింది. సయ్యద్‌అలీ, మహమ్మద్ జావీద్, ఇస్మాయిల్, తిరుపతయ్య, సయ్యద్ తాహీర్ గాయపడిన వారిలో ఉన్నారు. క్షతగాత్రులకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు అందించారు. వీరిలో జావీద్‌కు బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు.

బొలెరో వాహనం అదుపుతప్పి..

అమరాపురం : మండలంలోని పేలుబండ సమీపంలో ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు బొలెరో వాహనం బోల్తా పడి అయిదుగురు మహిళలకు గాయాలయ్యాయి. తమ్మడేపల్లి నుంచి రొళ్ల మండలం హెచ్.టి.హళ్లి గ్రామానికి పుట్టువెంట్రుకల కార్యక్రమానికి వెళుతూ వాహనం బోల్తా పడింది. ఈ విషయాన్ని 108 సిబ్బందికి తెలపడంతో గాయపడిన వారిని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పరామర్శించి క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

అప్పుల భారంతో అన్నదాత ఆత్మహత్య



రామాంజనేయులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తూరు గ్రామంలోని రైతు రామాంజనేయులు (50) అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన ఆదివారం చోటు చేసుకొంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. మృతునికి నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో 13 బోరుబావులు తవ్వించగా రెండింటిలో మాత్రమే అరకొరగా నీళ్లు పడ్డాయి. వాటిలో కూడా నీరు రాక సాగు చేస్తున్న వేరుసెగన, కర్బూజ, టమాటా పంటలకు పక్క తోటలోని నీటితో తడుపుతున్నాడు. పంటల సాగుకు, బోరుబావులకు సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. ఒక పక్క వేసిన బోరుల్లో నీరు లేక , మరోపక్క సాగు చేసిన పంటలు చేతికందక చేసిన అప్పులను తీర్చలేక మనస్తాపంతో ఇంటి నుంచి పొలానికి వెళ్లిన ఆయన కట్టుకున్న పంచతో చింత చెట్టుకు ఉరివేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, పక్క పొలం వారు రక్షించే ప్రయత్నం చేసినా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య హనుమక్క, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

టిప్పర్ ఢీకొని బీటెక్ విద్యార్థి దుర్మరణం

రఘువంశీ

బత్తలపల్లి న్యూస్‌టుడే: టిప్పర్ ఢీకొనడంతో బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందిన ఘటన బెంగళూరులో శనివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు మండలంలోని ముష్టూరు గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ రిటైర్డ్ జవాన్ నరసింహులు రెండో కుమారుడు రఘువంశీ(20) బెంగళూరులోని ఓ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. శనివారం అక్కడ ఓ ఆలయానికి వెళ్లి అనంతరం కాలేజీకి తన బైక్‌పై వస్తుండగా ఎలక్ట్రానిక్ సిటీ ఎంపైర్ మాల్ వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న టిప్పరు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదివారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగా తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం అంత్యక్రియలు పూర్తిచేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రాచానపల్లి(రాప్తాడు), న్యూస్‌టుడే : రాప్తాడు మండలం మరూరు గ్రామానికి చెందిన రాధమ్మ(45) ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తాకి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మరూరు గ్రామానికి చెందిన రాధమ్మను ధర్మవరానికి చెందిన ఆంజనేయులకు ఇచ్చి పెద్దలు పెళ్లి చేశారు. భర్త మృతి చెందడంతో స్వగ్రామంలోనే ఉంటోంది. ఆదివారం ఉదయం ఇంటిని శుభ్రం చేస్తుండగా దుస్తులు ఆరబెట్టే ఇనుప తీగకు విద్యుత్తు సరఫరా అయింది. ఆ తీగను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన స్థానికులు దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

(c) eenadu

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

శివలింగానికి ప్రత్యేక పూజలు

కంబదూరు, న్యూస్‌టుడే: స్థానిక కమల మల్లేశ్వరస్వామి ఆలయంలో ఏకకాలంలో నందీశ్వరునికి, శివలింగానికి అభిషేకం నిర్వహించారు. త్రయోదశి సందర్భంగా పూజ కార్యక్రమం, సాయంకాలం మహా మంగళారతులు, విశిష్ట పూజలు చేశారు. ప్రత్యేక పూజలో ఉన్న శివలింగాన్ని భారీ సంఖ్యలో భక్తులు హాజరవ్వడంతో ఆలయం కిటకిటలాడింది. అనంతరం తమ మొక్కుబడులు తీర్చుకున్న తరవాత తీర్థప్రసాదాలు అందజేశారు. మూలవిరాట్‌ను చూసి భక్తులు పులకించిపోయారు.

నేటి నుంచి భంభం సాహెబ్ ఉరుసు

భంభంబాబా జీవ సమాధి

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రసిద్ధి చెందిన భంషేక్ అబ్దుల్ వహాబ్ సాహెబ్ 57వ ఉరుసు సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఉత్సవాలు రెండు రోజులు నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు బషీర్ అహ్మద్, అబ్దుల్ వహాబ్‌లు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. సోమవారం తెల్లవారుజామున సందల్ ముబారక్ (శ్రీగంధం), సాయంత్రం స్వామి వారి చిత్రపటం ఊరేగింపు, దీపారాధన, మంగళవారం ఉదయం 5గంటల నుంచి షంషీర్(బ్రహ్మోత్సవం), జియారత్, రాత్రి 10గంటలకు ఆశ్రమ పీఠాధిపతులతో ఆధ్యాత్మిక ఉపన్యాసం, గురుపూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భంభంబాబా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: తాళ్లకెరలో గ్రామ సచివాలయం పునఃనిర్మాణం ఇంతవరకు చేపట్టలేదు. సంబంధించిన అధికారులు సమస్యను పరిష్కరించాలి. -భీమన్న, తాళ్లకెర

సమాధానం: గతంలో గ్రామంలోని భూ సమస్యల వల్ల నిర్మాణం ఆగిపోయింది. ఉన్నతాధికారులకు నివేదిస్తాం. -జయరాములు, ఎంపీడీఓ గుమ్మఘట్ట

సమస్య: పూలకుంట అయ్యప్ప నగర్‌లోని కాలనీల్లో సీసీ రోడ్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. -తిప్పేస్వామి, స్థానికుడు

సమాధానం: ఇప్పటికే చాలా కాలనీల్లో సీసీ రోడ్లు వేశారు. అయ్యప్పనగర్‌లో సీసీ రోడ్లు వేసేలా ఉన్నతాధికారులకు నివేదిస్తాం. -రాధమ్మ, సర్పంచ్, పూలకుంట

సమస్య: మారెంపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన రైతు భరోసా కేంద్రం అర్ధాంతరంగా ఆగిపోయింది. - వెంకటేశులు, స్థానికుడు

సమాధానం: ఇప్పటికే దాదాపు 65శాతం పూర్తయ్యింది. నిర్మాణం పూర్తయ్యేలా చూస్తాం. -జయరాములు, ఎంపీడీఓ గుమ్మఘట్ట

- న్యూస్‌టుడే, గుమ్మఘట్ట

సమస్య: అండేపల్లి గ్రామంలో తాగునీటి తీవ్రతతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. -నాగరాజు, గ్రామస్థుడు

సమస్య: ఎర్రబండ గ్రామంలోని వీధుల్లో చెత్తాచెదారం కుప్పలుగా పేరుకొని అపరిశుభ్రత నెలకొంది. -గంగప్ప, స్థానికుడు

సమాధానం: పై రెండు గ్రామాలను పరిశీలించి అక్కడి పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తాం. -మహేష్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, కంబదూరు

- న్యూస్‌టుడే, కంబదూరు

పేరుకుపోయిన బకాయిలు.. వసూళ్లకు అవస్థలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో వివిధ రకాల పన్నులు పేరుకుపోయాయి. ఈనెల 31న ఆర్థిక సంవత్సరం ముగియనుంది. వసూళ్లకు ఒక నెల మాత్రమే గడువు ఉండటంతో వార్డు సిబ్బంది రేయింబవళ్లు ఇంటింటికి తిరుగుతున్నారు. పన్నులు అధికంగా ఉంటే నల్లాల కనెక్షన్‌లు తొలగిస్తామని ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్నారు. కంప్యూటర్‌లు ఏర్పాటుచేసి పన్ను కట్టిన వెంటనే రశీదులు ఇస్తున్నారు. పన్నుల వసూళ్ల కంటే రావాల్సినవే అధికంగా ఉన్నాయంటూ.. ఎలా వసూలు చేయాలంటూ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొత్తం పన్నులు : రూ.11.29 కోట్లు
వసూలైనవి : రూ.4.66 కోట్లు
రావాల్సినవి : రూ.6.63కోట్లు

పన్నుల వసూళ్లు ఇలా..

పురపాలక సంఘంలో ఆస్తి పన్నులు దాదాపు రూ. 6కోట్ల దాకా డిమాండు ఉండగా రూ.3.36 కోట్లు వసూలు చేశారు. రూ.2.62 కోట్లమేర బకాయిలు ఉన్నాయి. దీంట్లో కోటి రుపాయలకు పైగా ప్రభుత్వ కార్యాలయాలూ బకాయి పడ్డాయి. నీటి పన్నులు రూ.3.33 కోట్లు ఉండగా రూ.1.14 కోట్లు వసూలు చేశారు. రూ. 2.19 కోట్ల మేర పేరుకుపోయాయి. అక్రమ కుళాయి కనెక్షన్లు అధికంగా ఉండటం, లైన్‌మెన్‌లు పట్టించుకోకపోవటం వంటి కారణాలతో నీటి పన్నులు వసూలు కావటం లేదు. ఖాళీ స్థలాల పన్నులు రూ.2కోట్ల దాకా ఉండగా కేవలం రూ.16.96లక్షలు వసూలయ్యాయి. ఇంకా రూ.1.83 కోట్లకు పైగా వసూలు కావాల్సి ఉంది.

ఆలస్యం కావటానికి కారణాలు..

పట్టణంలో గార్మెంట్స్ వ్యాపారం పడిపోయి ప్రజల జీవన ప్రమాణాలు పడిపోవటం, రాజకీయ ఒత్తిళ్లు, గతంలో లాగా పన్నుల వసూళ్లకు ముందస్తు నోటీసులు, ఫోన్ మెసేజ్‌లు వంటివి ఇవ్వకపోవటంతో పన్నులు విపరీతంగా పెరిగిపోయాయి. డబుల్ అసెస్‌మెంట్లు, ఆర్థిక సంవత్సరంలో 9 నెలలు పట్టించుకోకుండా 3నెలలు మాత్రమే వాటిపై దృష్టి పెట్టడం తదితర కారణాల వల్ల పన్ను చెల్లింపునకు ప్రజలు ముందుకు రావటం లేదు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు..

వి.దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

మున్సిపల్ పన్నుల వసూళ్లకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. ఆటోల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నాం. పన్నులు చెల్లిస్తేనే పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు సాధ్యమవుతుంది. ప్రజలు పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

రాత్రివేళ పన్ను వసూలు చేస్తున్న ఉద్యోగులు

ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ఉరవకొండ: గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ చెన్నబసవ రాజేంద్రస్వామి, ఇతరులు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, ఆ ధర్మమే మనల్ని కాపాడుతుందని గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ చెన్నబసవ రాజేంద్రస్వామి ఆదివారం తెలిపారు. వీరశైవ సంప్రదాయ తొలి గురువు స్వామి రేణుకాచార్యుల జయంతిని ఉరవకొండలో జంగమ సంక్షేమ సంఘం మల్లేశ్వర ఆలయం, వీరశైవ సంక్షేమ సంఘం కల్యాణ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూజలు చేశారు. వీరశైవ ధర్మ ప్రచారానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండయ్య, కార్యదర్శి బసవరాజు, ప్రతినిధులు రుషేంద్ర, విజయ్‌కుమార్, నటరాజు, అఖిలభారత వీరశైవన మహాసభ ఉపాధ్యక్షురాలు హేమావతి, స్థానిక అధ్యక్ష, కార్యదర్శులు నాగన్నగౌడ్, నిరంజన్‌గౌడ్, నాయకులు జయరామిరెడ్డి, మల్లికార్జున, గంగాధర్, యోగేశ్, వీరేశ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనందాల వేడుక

బెస్తరపల్లి పాఠశాలలో పూర్వ విద్యార్థులు, గురువులు

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలోని బెస్తరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-82వ బ్యాచ్ చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు 45ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయిక సమావేశాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాటి గురువులను సత్కరించారు. అనంతరం ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పాఠశాల ఆవరణలో ఆనందంగా గడిపి విందు భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుబ్బరామప్ప, నాగభూషణ, కృష్ణమూర్తి, హనుమప్ప, ముష్టప్ప, సత్యనారాయణ, చిన్నరాయప్ప, ఇందిరమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిలోని 74ఉడేగోళం సమీపంలో శనివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన గరుడచేడు గ్రామానికి చెందిన వృద్ధురాలు హెచ్. మారెక్క (85) మృతిచెందింది. పోలీసుల వివరాల మేరకు మృతురాలు మారెక్క పుట్టినిల్లు 74ఉడేగోళంలోని మద్దానేశ్వరస్వామి జాతర సందర్భంగా తమ్ముడు మద్దనప్ప ఇంటికి వెళ్లింది. ఆమె రోడ్డు పక్కన నడుస్తుండగా.. బైకుపై వస్తున్న వన్నూరుస్వామి, రవికుమార్ ఢీకొట్టారు. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా రాయదుర్గం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం వారిని అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మారెక్క మరణించింది. రవికుమార్ కోమాలో ఉన్నాడు. మృతురాలి మనవడు నాగరాజు ఫిర్యాదు మేరకు రాయదుర్గం అర్బన్ సీఐ జయనాయక్ దర్యాప్తు చేపట్టారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) శనివారం ఇంటి నుంచి అదృశ్యమైంది. బాలిక అదే గ్రామంలోని కుట్టుమిషన్ నేర్పించేవద్దకు వెళ్లి, సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. ఆమె తల్లి ఆదివారం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక స్వాధీనం

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: మండల శివారులోని ఆపిల్ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ సమీపంలోని ముళ్లపొదలలో అక్రమంగా 5 ట్రాక్టర్ల ఇసుకను నిల్వ ఉంచారు. దీంతో పోలీసులు ఆ ఇసుకడంపింగ్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురుప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

'సామాన్యుల సేవే ప్రధాన లక్ష్యం'

రోగులను పరీక్షిస్తున్న ఆర్థోవిభాగం వైద్యుడు

కుందుర్పి, న్యూస్‌టుడే: సామాన్యులు, నిరుపేదలకు, మహిళలకు సేవ చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలంగాణ హైకోర్టు న్యాయవాది బీటీ మల్లారెడ్డి, దీరవాత ట్రస్టు అధ్యక్షురాలు శాంతకుమారి పేర్కొన్నారు. ఆదివారం కుందుర్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివేకానంద మిషన్ ట్రస్టు ఆధ్వర్యంలో రోగులకు ఇతర జిల్లా నుంచి వచ్చిన ఆర్థోవిభాగ నిపుణులుతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 350 మంది రోగులకు చికిత్సలు అందించి, ఉచిత మందులు అందజేశారు. మల్లారెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంతో తన సొంత ఊరికి సేవ చేస్తున్నానన్నారు. రాధాకృష్ణ, రాజు, కృష్ణమూర్తి, శివారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడ నిర్మించారు

స్పందనకు వందనం

కణేకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని కణేకల్లు ఉరవకొండ రహదారిలో ఎన్.హనుమాపురం వైపు సొల్లాపురం సమీపంలో కోతకు గురైన వంతెనకు ర.భ అధికారులు ఎట్టకేలకు రక్షణ గోడ నిర్మించారు. 'కోతకు గురై నాలుగేళ్లు.. మరమ్మతులకు ఇంకెన్నాళ్లు' అనే శీర్షికన ఫిబ్రవరి 2న 'ఈనాడు' జిల్లా ప్రధాన సంచికలో ప్రచురితమైంది. ఈ చిత్ర కథనానికి డీఈ రవి శంకరరెడ్డి స్పందించి రహదారి నిర్వహణ మరమ్మతులలో భాగంగా ప్రత్యేక చొరవ తీసుకొని రూ.1లక్ష అంచనా వ్యయంతో రక్షణ గోడ నిర్మించారు. ప్రమాదకర సమస్య పరిష్కారానికి నోచుకోవడంతో గ్రామస్థులు, చోదకులు హర్షం వ్యక్తం చేశారు.

కాలువలో కదలని మురుగు

ఉరవకొండలో జాతీయ రహదారిలో మూడు రోడ్ల కూడలి సమీపంలో ప్రధాన కాలువలో మురుగు ముందుకు కదలడంలేదు. ప్రవాహానికి అడ్డుకాకుండా కాలువ నిర్మాణం పేరుతో ఆ రహదారి అంచున మూణ్నెళ్ల క్రితం అధికారులు గుంతను తవ్వించారు. అయితే అది పూర్తి చేయకుండానే వదిలేశారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో రవిప్రసాద్‌ను వివరణ కోరగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి, తగిన చర్యలు చేపడతామన్నారు. -న్యూస్‌టుడే, ఉరవకొండ

నీటి తొట్టె.. శుభ్రత ఏదీ?

కూడేరు మండలం జల్లిపల్లిలో ప్రధాన రహదారి పక్కన పల్లె పండుగలో భాగంగా నిర్మించిన పశువుల తాగునీటి తొట్టి చుట్టూ తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. వ్యర్థాలూ పేరుకు పోయాయి. గాలికి అవి నీటిలో కలుస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. చుట్టూ ముళ్ల పొదలు పెరగడంతో పశువులకు ఇబ్బంది కలుగుతోంది. పంచాయతీ అధికారులు స్పందించి, ఆ పరిసరాల్లో శుభ్రత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, కూడేరు

లీకేజీని మరమ్మతు చేయరూ..

కూడేరు మండలం జల్లిపల్లి తాగునీటి కేంద్రం నుంచి అనంతపురం నగరానికి వెళ్లే ప్రధాన తాగునీటి పైపులైన్ కూడేరు పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి పక్కనే లీకేజీ ఏర్పడింది. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. ఇలానే ఉంటే నీటి కొరతతోపాటు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. రాకపోకలకు అంతరాయం కలుగుతోందని చోదకులు చెబుతున్నారు. నీటి వృథాను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కూడేరు

ముళ్ల పొదలు తొలగించరూ..!

బొమ్మనహాళ్ మండలంలోని ఏళంజి రైతు సేవా కేంద్రం ఎదుట కంపచెట్లు, పిచ్చి మొక్కలు మధ్య పశు వైద్యం అందించే బోన్ అలంకార ప్రాయంగా మారింది. అసంపూర్తిగా ఉన్న ఆర్‌ఎస్‌కే ముందు వైద్యం అందించడానికి బోన్ ఏర్పాటు చేసిన, నిరుపయోగంగా మారడంతో చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోయాయి. ఈ విషయంపై శ్రీధరఘట్ట పశువైద్యాధికారి మధన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, బొమ్మనహాళ్

హుండీ ఆదాయం లెక్కింపు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని 74ఉడేగోళం గ్రామ సమీపంలో ప్రసిద్ధి చెందిన మద్దానేశ్వరస్వామి ఆలయ హుండీని అనంతపురం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి ఆధ్వర్యంలో లెక్కించగా రూ.1,28,082ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. రాయదుర్గం ఎండోమెంట్ ఈఓ కె.నరసింహారెడ్డి, సిబ్బంది, ఆలయ కమిటీ అధ్యక్షుడు జి. బసవరాజు, సభ్యులు,జయన్న, అప్పాజి, మంజునాథ, దరణేష్, మహానంది, మల్లికార్జున, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

In The Court Of The Hon'ble Junior Civil Judge, Kalyanadurgam
E.P. No: 15/2023 in O.S. No: 127/2007

Between :
1. P.T.Venkatesulu, 2. Paladugu Thimmakka ...Petitioners / D.Hrs
And
M.Gopal. ...Respondent / J.Dr

To,
M.Gopal S/o M.Anjineyulu, Business, Resident of Palavenkatapuram Village, Bramhasamudram Mandal, Anantapur Dist

J.Dr. కు Order.21. Rule. 37 (1) CPC Notice

Petitioners డిక్రీ మొత్తము రాబట్టుకోనుటకు గాను మీపై దాఖలు చేసిన **E.P.** లో **J.Dr** అయిన మీరు 19-03-2026 వ తేదీన హాజరు అగుటకుగాను వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట ఖుద్దున మీరు గానీ, మీ తరుపున వకీలుగానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

(By Order Of The Court)

P.THIMMAPPA CHOWDARY, Advocate, Kalyanadurgam. Cell No : 9440565849

భాజపా బలోపేతానికి కృషి

కణేకల్లు, న్యూస్‌టుడే : భాజపా బలోపేతానికి కృషి చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ పేర్కొన్నారు. ఆదివారం కణేకల్లుకు వెళ్లిన ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నాగేపల్లి గ్రామానికి చెందిన ఆర్‌ఎస్‌ఎస్ యువకులు పార్టీలో చేరిన సందర్భంగా కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీ నాయకులు వసుంధర దేవి, హీరోజీ రావు, అరుణ, నరేంద్ర, మండల అధ్యక్షుడు తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

In The Court Of The Hon'ble Junior Civil Judge Uravakonda
E.P. No: 33/2025 in O.S. No: 65/2024

Between :
Smt. K.Jayamma ...Petitioner / D.Hr.
And
Gonuguntla Somasekhar ...Respondent / J.Dr.

J.Dr కు Order 21 Rule - 54 CPC Notice

To,
Gonuguntla Somasekhar, S/o G.Jayaprakash, Software Engineer, R/of 6th Ward, R.Kottala Village and Post, Vidapanakal Mandal, Ananthapuramu Dist.

డిక్రీ హోల్డర్‌కు రావలసిన ఇ.పి. మొత్తము వసూలు చేయుటకు గాను **E.P.** లోని షెడ్యూలు ఆస్తిని జప్తుచేసియున్నారు. సదరు **E.P.** వేలము షరతులు నిర్ణయించుటకు మీ హాజరు నిమిత్తం **24-03-2026** వ తేదీకి వాయిదా వేసియున్నారు. అందుకు మీకు ఆక్షేపణలున్న యెడల సదరి దినము ఉదయం **10-30** గంటలకు స్వయంగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టు యందు హాజరు కావలెను. లేనియెడల మీ పరోక్షమునందు పై అర్జీని విచారించి తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ANDRA DAMODAR NAIDU, Smt. DEVINENI LEELAVATHY, Advocates, Uravakonda. Mobile No : 9985142024

పిల్లర్ల దశలోనే నిర్మాణం

వజ్రకరూరు మండలం గడేహోతూరు గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రం పిల్లర్ల దశలోనే దర్శనమిస్తోంది. ఇళ్ల నుండి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్ట్ ఎరువుగా మార్చాలి. పరిశుభ్రతలో భాగంగా వీధుల్లోని డ్రైనేజీల్లో చెత్త సేకరించాలి. ఇప్పటికైనా సంపద తయారీ కేంద్రం పూర్తిచేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంగా కార్యదర్శి సుభాంజి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.
-న్యూస్‌టుడే, వజ్రకరూరు

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: పి.వెంకటంపల్లి గ్రామానికి చెందిన కరియప్పకు ఆర్నెల్ల కిందట బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కావడానికి డబ్బులు చెల్లించలేని పరిస్థితిలో ఉండడంతో ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టును ఆశ్రయించారు. ట్రస్టు ఛైర్మన్ బద్దే నాయక్, ట్రస్టు ప్రతినిధులు స్పందించి బాధితుడికి రూ. 34,780 ఆర్థిక సాయం అందించారు. ట్రస్ట్ ప్రతినిధులు సురేష్ కుమార్, హరీష్, అబ్దుల్ వహాబ్, సభ్యులు తిప్పేస్వామి, మహేష్, రాము, ఓబుళేసు, రామాంజినేయులు పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపాలని ర్యాలీ

వజ్రకరూరు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హోం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సై నాగస్వామి అధ్యక్షతన వజ్రకరూరు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలపై హింస, లింగ వివక్షతను రూపుమాపి అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోనాలిసా, స్థానిక మహిళలు, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అ వీ.. ఇ వీ.. అ న్నీ..

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

కుందుర్పి, న్యూస్‌టుడే: విత్తన శుద్ధి సాగుతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఎఫ్‌ఎంటీ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బెస్తరపల్లి గ్రామంలో భాగ్యమ్మ అనే రైతు వ్యవసాయ పొలంలో 5 రకాలైన కంది, అనుములు, అలసంద, గోరుచిక్కుడు, ఆముదం వంటి 20 రకాల పంటల సాగు విత్తనాలను జీవామృతం, ఘనామృతం, బీజామృతంతో విత్తన శుద్ధి చేసి, వాటిని నేలలో విత్తారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఎఫ్‌ఎంటీలు భాస్కర్‌రెడ్డి, మంజమ్మ, సన్నమల్లప్ప, సీఆర్‌పీలు ఆనందమ్మ, భాగ్యమ్మ రైతులు పాల్గొన్నారు.

మెడికల్ మాఫియాపై విచారణకు డిమాండ్

ఉరవకొండ, న్యూస్‌టుడే: మెడికల్ మాఫియాను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాధారణ జ్వరంతో ఆసుపత్రికి వెళ్తే అవసరం లేని పరీక్షలు చేసి, అధిక బిల్లులు వసూలు చేస్తున్నాయన్నారు. దీనిపై ప్రభుత్వాలు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి, విచారణ చేయించాలని డిమాండు చేశారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9నుంచి 10.30గంటలకు 5వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించగా 480మందికి గానూ 460మంది, ఇంటర్ ప్రవేశ పరీక్షకు 380మందికి గానూ 302మంది, ఐఐటీకి 253 మందికి 236మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ శిలా సౌజన్య తెలిపారు.

ఘనంగా రేణుకాచార్య జయంతి

కణేకల్లు: మండల కేంద్రంలో వీరశైవ ధర్మ సంస్థాపకులు జగద్గురు శ్రీ రేణుకాచార్య జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం వీరశైవ సంఘం ఆధ్వర్యంలో జగద్గురు చిత్రపటానికి పూజలు నిర్వహించారు. గ్రామ వీధుల్లో చిత్రపటాన్ని ఊరేగింపు నిర్వహించారు. వీరశైవులు విశేషంగా తరలివచ్చి ఊరేగింపులో పాల్గొన్నారు. వీరశైవ సంఘం పెద్దలు మరియప్ప, న్యాయవాది హనుమంతరెడ్డి, మృత్యుంజయ, పెండేకల్లు నాగరాజు పాల్గొన్నారు.

చేతి పంపులకు మరమ్మతులు ఏవీ?

ఉరవకొండ, న్యూస్‌టుడే: వేసవి ప్రారంభం అయ్యింది. మానవులకు, పశుపక్ష్యాదులకు నీటి అవసరాలు పెరుగుతున్నాయి. గ్రామాల్లో ప్రధాన నీటి వనరులైన చేతి పంపులు మరమ్మతుకు గురయ్యాయి. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో సమస్య ఎదురవుతోంది. ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా 837 చేతి పంపులు ఉన్నాయి. వాటిలో 469 పని చేస్తుండగా.. 368 మరమ్మతుకు చేరాయి. కుళాయిలకు నీరు రానప్పుడు ప్రత్యామ్నాయంగా వీటిని వినియోగించేవారు. ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో చేతి పంపు నీటిని తాగడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు.

తగిన చర్యలు చేపట్టాలి..

ఐదు మండలాల్లో మరమ్మతుకు గురైన చేతికి పంపులను అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా క్షేత్రస్థాయిలో తగిన చర్యలు కనిపించడం లేదు. వాటిలో చాలా వరకు పాడైపోయాయి. మరోకొన్నింటికి పూర్తిస్థాయిలో పైపులు లేకపోవడంతో నీరు అందడం లేదు. మరోవైపు అవసరమైన సామగ్రి లేకపోవడం, మెకానిక్‌ల కొరత వేధిస్తుండటంతో సకాలంలో మరమ్మతు చర్యలు కరవయ్యాయి. వేసవిలో నీటి ఎద్దడికి అవకాశం తావివ్వకుండా అధికార యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇవి అందుబాటులో ఉంటే ఏ సమయంలోనైనా ప్రజలు నీటిని పట్టుకోవడానికి అవకాశం ఉంది. దీనిని గుర్తించి చేతి పంపులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గంలోని చేతి పంపుల వివరాలిలా..

మండలం	మొత్తం	పని చేస్తున్నవి	మరమ్మతుకు గురైనవి
బెళుగుప్ప	157	62	95
కూడేరు	92	38	54
ఉరవకొండ	205	108	97
విడపనకల్లు	163	110	53
వజ్రకరూరు	220	151	69

గడేహోతూరులో మరమ్మతుకు గురైన చేతి పంపు

సామగ్రిని సమకూర్చుకుంటాం..

- అంజుమన్ షఫీన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఉరవకొండ

వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికార యంత్రాంగంతో కలిసి క్రాస్ కార్యక్రమంలో భాగంగా పనిచేయని వాటిని మరమ్మతులు చేయిస్తున్నాం. ఒకదాని తరువాత ఒకటి చొప్పున ఆ ప్రక్రియ నడుస్తోంది. మరింత సామగ్రిని సమకూర్చుకొని, వేగంగా ముందుకు సాగుతాం.

శరవేగంగా బాలికల వసతి గృహ నిర్మాణ పనులు

కణేకల్లు, న్యూస్‌టుడే : మండలంలో ఎస్సీ బాలికల వసతి గృహ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వంలో మూతపడిన భవనం శిథిలావస్థకు చేరింది. కూటమి ప్రభుత్వం చొరవతో అధునాతన భవన నిర్మాణానికి పీఎం ఏజేఏవై కింద రూ.3కోట్ల నిధుల మంజూరుకు కృషి చేసి, గత డిసెంబరులో పనులు ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా మంజూరైన 24 వసతి గృహాల్లో, కణేకల్లు మండలానికి రావడం విశేషం. 120 మంది బాలికలకు వసతి కల్పించే భవనంలో 12 వసతి గదులు, కిచెన్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, మెడికల్ రూమ్ తదితర గదులు నిర్మించనున్నారు. ప్రస్తుతం 2వ అంతస్తు పిల్లర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఏడాది లోపు పనులు పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో గుత్తేదారులు వేగంగా పనులు కొనసాగిస్తున్నారు.

రెండో అంతస్తు నిర్మాణ పనులు

In The Court Of The Hon'ble Junior Civil Judge, Uravakonda
O.S.No : 204/2024

Between :
Andhra Pragathi Grameena Bank, Uravakonda by its Branch Manager, Uravakonda. ...Plaintiff
And
1. Eediga Viswanath, 2. Shaik Basha ...Defendants

Notice to Defendant No : 2

D2. Shaik Basha, S/o Shaik Mastan Sab, R/of D.No. 10-6-52, Uravakonda.

పై నెంబరు కేసులో 2వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 31-03-2026వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ANDRA DAMODAR NAIDU, Smt. DEVINENI LEELAVATHY, Advocates, Uravakonda. Mobile No. 9985142024

తాగునీరందక ప్రజల అవస్థలు

శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకం కింద ఉన్న కుళాయిలకు కొన్ని నెలలుగా నీరందక మండలంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దర్గాహొన్నూరు, ఉద్దేహాళ్, దేవగిరి, కల్లుదేవనహళ్లి, కల్‌హోళ, బొల్లనగుడ్డం, లింగదహాళ్, కొలగానహళ్లి గ్రామాల్లోని ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. పగిలిపోయిన పైపులకు సిబ్బంది సకాలంలో మరమ్మతులు చేయడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీరందించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఏఈఈ దీపికను వివరణ అడగ్గా.. శ్రీరామి రెడ్డి తాగునీటి పథకం అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, బొమ్మనహాళ్

(c) eenadu

గుంతకల్లు
•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

నీలంపల్లిలో ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ పుల్లయ్య

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: నీలంపల్లిలో వెలసిన నాగలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా గ్రామస్థులు పోలీసులకు సహకరించాలని సీఐ పుల్లయ్య కోరారు. ఆయన నీలంపల్లిలో ఈ నెల 2, 3వ తేదిల్లో జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. భక్తులు స్వామిని దర్శించుకోవడానికి బారికేడ్లు ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ అధికారులకు సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో గ్రామం బయటే పార్కింగ్ ఏర్పాట్లు చేస్తామన్నారు. ఉత్సవాలకు ఆటంకం కలిగించాలని యత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

గుంటి సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రామాచార్యులు ఉదయం అర్చనలు, క్షీరాభిషేకాలు, ఆకుల పూజ వంటి విశేష పూజలు చేసి స్వామిని అలంకరించారు. భక్తులు ఆలయానికి పెద్దఎత్తున వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన సదుపాయం కల్పించారు.

ప్రత్యేకాలంకరణలో స్వామి

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: గుంతకల్లులో ఆలూరు రోడ్డు ఏరియా ప్రశాంతి నగర్‌లో డబ్ల్యూఎస్/15 నంబరు గల విద్యుత్తు స్తంభం ఒక వైపు ఒరిగింది.
- వలి, స్థానికుడు

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - రఘు, ఏఈ, ట్రాన్స్‌కో, గుంతకల్లు

సమస్య: పాత గుంతకల్లులో వాల్మీకి సర్కిల్‌లో కొనకొండ్ల రోడ్డు క్రాస్‌లో కల్వర్టు దెబ్బతింది. కొత్తది నిర్మించాలి. - శీనా, స్థానికుడు

సమాధానం: కల్వర్టును పరిశీలిస్తాం.
- హరికృష్ణ, ఏఈ, గుంతకల్లు పురపాలిక
- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

సెపక్ తక్రాలో విద్యార్థినుల సత్తా

గుంతకల్లు పట్టణం: పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేదింటి బిడ్డలు జాతీయ స్థాయి సెపక్ తక్రాలో సత్తా చాటుతున్నారు. బాలికలు పీఈటీల వద్ద మెలకువలు నేర్చుకొని ప్రతిభ చాటుతున్నారు. క్రీడలపై ఆసక్తి కనబరుస్తూ విజయాలు సాధిస్తున్నారు.

జాతీయ స్థాయిలో రాణిస్తూ..

గుంతకల్లు దోనిముక్కల రోడ్డు ఏరియాలో కేజీబీవీలో ఇంటర్ చదువుతున్న కె.పవిత్ర అండర్-19 విభాగంలో సెపక్ తక్రాలో సత్తా చాటుతోంది. 2025 డిసెంబర్‌లో రాజస్థాన్‌లో జరిగిన 64వ జాతీయ ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. 2025 మే నెల బిహార్‌లో ఖేలో ఇండియా పోటీల్లో కేరళ, రాజస్థాన్, హరియాణా జట్లపై ప్రతిభ చాటింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన పేదింటి విద్యార్థిని చక్కని ప్రతిభతో రాణిస్తోంది. - కె.పవిత్ర

గెలుపే లక్ష్యంగా..

గుంతకల్లు పట్టణం సత్యనారాయణ పేటకు చెందిన సి.మానస సెపక్ తక్రా క్రీడలో సత్తా చాటుతోంది. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. 2023 విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది. 2025లో గోవా, నంద్యాలలో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించింది. 2025, 2026 బిహార్, గుజరాత్ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటింది. రాష్ట్రస్థాయిలో 15 సార్లు, జాతీయ స్థాయిలో 7 సార్లు విజేతగా నిలిచింది. ఇటీవల బ్యాంకాక్‌లో అంతర్జాతీయ క్రీడ క్యాంపులో 20రోజుల పాటు శిక్షణ పొందింది. ఆర్మీలో దేశ రక్షణ కోసం సేవ చేస్తా అని అంటోంది. - సి.మానస

అశ్వర్థ ఆలయంలో విశేష పూజలు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన అశ్వర్థ ఆలయంలో ఆదివారం ఆనంద రూపంలో ప్రత్యేక పూజలు చేశారు. అశ్వర్థనారాయణ స్వామి, శ్రీభీమలింగేశ్వరస్వామి వారికి వేదపండితులు అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అలంకరణలో స్వామి వారు

చెరువులకు కృష్ణా జలాలు తీసుకొస్తాం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: హంద్రీనీవా కాలువ నుంచి మండలంలోని 12 చెరువులకు కృష్ణా జలాలు తీసుకొస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. గుంతకల్లులో మున్సిపల్ కార్యాలయం దగ్గర పరిధిలోని రైతు సంఘాల సామూహిక దీక్షలు చేపట్టారు... ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరై మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం చేసింది ఏమీలేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రతి నియోజకవర్గానికి కేటాయిస్తున్న నిధుల విషయమై మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దీనిలో భాగంగా మేము పనులు జరిపిస్తున్నాం. మొదటిది రాగులపాడు నుంచి గుంతకల్లు మండలంలోని 12 చెరువులకు నీరు తీసుకురావాలని కోరామన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి జీవో తీసుకువచ్చి జూన్ లేదా జులైలో కాలువ పనులకు భూమిపూజ చేసి పనులు చేపడతామని రైతులకు హామీ ఇచ్చి, దీక్షలను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలో పోలీసులు, విద్యార్థినులకు చట్టాలపై ఆదివారం అవగాహన కల్పించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి గాంధీచౌక్ వరకు ర్యాలీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులకు సీఐ రామారావు, ఎస్సైలు సురేశ్, అమరీశ్వర్ చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలు వివరించారు. ఈవ్‌టీజింగ్, గృహహింసను వ్యతిరేకించాలన్నారు.

ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు, పోలీసులు

'జనసేన బలోపేతానికి కృషి'

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు పార్టీని బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు జనసేన సీనియర్ నాయకులు పూలరమణ పేర్కొన్నారు. ఆదివారం గుంతకల్లులో కసాపురం రోడ్డులో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు, బాలాజీ, గోపీ, పవన్, విజయజ్యోతి తదరులు క్రియాశీలక సభ్యత్వాన్ని చేపట్టారు. మార్చి 10తేదీ వరకు నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. అడ్వకేట్ పీజీఎస్ బాబు పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

సభ్యత్వ నమోదులో జనసేన నాయకులు

టిడ్కో ఇళ్లకు పైపులైను పనులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో దోనిముక్కల రోడ్డు ఏరియాలో టిడ్కో ఇళ్ల అపార్టుమెంట్లకు మౌలిక వసతులు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంజినీర్లు తాగునీటి పైపులైను, అంతర్గత సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. 30 బ్లాకులు టిడ్కో అపార్టుమెంట్లలో డోర్లు, కిటికీలు అమర్చుట, పెయింటింగ్, ఎలక్ట్రికల్ తదితర ఫినిషింగ్ పనులు పూర్తి కావాల్సి ఉంది. జూన్ కల్లా పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని కూటమి ప్రభుత్వం మౌలిక వసతుల ఏర్పాట్లను వేగవంతం చేసింది.

అపార్టుమెంట్ల వద్ద సాగుతున్న పనులు

సుందరీకరణకు శ్రీకారం

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి పట్టణంలో సుందరీకరణ పనులను మరోమారు చేపట్టేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. గాంధీ చౌక్ నుంచి అనంతపురంరోడ్డు వరకు విభాగినులను ఎత్తు పెంచుతున్నారు.

గుత్తిలో విభాగినుల ఎత్తుపెంచే పనులు చేస్తున్నారిలా..

రెండేళ్ల కిందట సుమారు రూ.కోటితో లైటింగ్‌తో పాటు రూ.10లక్షలతో సుందరీకరణ పనులు చేశారు. అప్పట్లో అధికారులు విభాగినుల్లో మొక్కలు నాటించారు. గోడలకు రంగులతో బొమ్మలు వేయించారు. కేవలం బొమ్మలు వేయించేందుకే రూ.4లక్షలు వ్యయం చేశారు. విభాగినులలో ఏర్పాటు చేసిన మొక్కలు చాలావరకు బతకలేదు. సుందరంగా కనిపించే మొక్కలను కాకుండా ఇతర మొక్కలను నాటించారు. అక్కడక్కడ ఉన్న మొక్కలను తొలగిస్తున్నారు. రూ.6 లక్షలతో మళ్లీ సుందరీకరణ పనులు చేపట్టారు. సుందరంగా ఉండే మొక్కలను మాత్రమే పెంచాలని ప్రస్తుతం అధికారులు తీర్మానించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గార్లదిన్నె గ్రామీణం, బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు సీఎం సహాయనిధి సంజీవనిలా సహాయపడుతోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. ఆదివారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శింగనమల నియోజకవర్గంలో ఆరు మండలాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న 35 మంది బాధితులకు రూ.31.29 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు అందించారు. నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులు తన కార్యాలయంలో ధరఖాస్తు చేసుకుంటే సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

అలరించిన విద్యార్థినుల నృత్య పోటీలు

యాడికి, న్యూస్‌టుడే: లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో సందర్భంగా ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విద్యార్థినుల నృత్య పోటీలు అలరించాయి. మండలంలోని వివిధ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు భక్తి, వివిధ రకాల గేయాలకు నృత్యాలు చేశారు. ఇందులో రాయలచెరువులోని శ్రీవిద్య పాఠశాల ప్రథమ స్థానంలో నిలవడంతో వారికి దాత రుద్రమనాయుడు రూ.10 వేల నగదు, జ్ఞాపికను స్టార్ పాఠశాల యాజమాన్యం అందచేశారు. అలాగే ద్వితీయ స్థానంలో రాణించిన విజన్ పాఠశాల (సాయి అంకిత)విద్యార్థినులకు దాత రాజశేఖర్ రూ.ఐదు వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వాగ్దేవి పాఠశాలకు చెందిన శ్రావ్య బృందానికి దాత కేశవ రూ.2500నగదును అందించారు.

బహుమతులు అందజేస్తున్న రుద్రమనాయుడు

ప్రమాదకరంగా నియంత్రిక

గుత్తిలోని అనంతపురం రోడ్డులో విద్యుత్తు నియంత్రికలు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డుకు సమీపంలోనే రెండు నియంత్రికలను ఏర్పాటు చేశారు. ఒక్కదానికి కూడా కంచెలేదు. దీంతో పశువులు, ప్రజలు ప్రమాదవశాత్తు నియంత్రికలకు తగిలే వీలుంది. ఎత్తైన దిమ్మె నిర్మించి దానిపై వాటిని ఏర్పాటు చేస్తే ఇబ్బంది ఉండదు. ఇప్పటికైనా విద్యుత్తుశాఖ అధికారులు కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గుత్తి

పైకప్పులేని షెల్టర్

జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణకు ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయి. ప్రయాణికుల ప్రాథమిక అవసరాలు తీర్చడంలో మాత్రం విఫలమవుతున్నారు. కనుంపల్లి సమీపంలోని బస్సు షెల్టర్ ఏర్పాటుచేశారు. కొన్ని సంవత్సరాలకే రేకులు లేకుండా పోయాయి. ప్రస్తుతం వేసవి ప్రారంభమవుతుండటంతో నీడలేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారి పక్కన ఉన్న షెల్టర్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, గార్లదిన్నె గ్రామీణం

వైభవంగా ముగిసిన వేడుకలు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మర్తాడు గ్రామంలో తాతారూఢ స్వామి రథోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు సహకారంతో నిర్వహించిన వేడుకలకు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. శనివారం రాత్రి స్వామి ప్రతిమను పూల రథంపై ఉంచి వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



అలంకరణలో తాతారూఢ స్వామి

తగ్గిన ధరలు.. పత్తి రైతు బెంబేలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి రైతులను ఆదుకుంటారు అనుకుంటే కొన్నాళ్లు ఏర్పాటు చేసి తిరిగి కేంద్రాలను కొనసాగించకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. పెద్దవడుగూరు మండలంలోని రైతులు ప్రధాన పంటగా సాగుచేసిన పత్తిపంటకు ప్రస్తుతం ధరలు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన బాటపట్టారు. అధిక విస్తీర్ణంలో సాగు చేసిన పత్తిపంటను విక్రయించడానికి ప్రభుత్వం గుత్తి, తాడిపత్రి ప్రాంతాల్లో సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయగా నాణ్యమైన పత్తి కేంద్రాలకు లభించకపోవడంతో రైతులు రావడంలేదని కేంద్రాలను మూసేశారు. సీసీఐని నమ్ముకుని కొందరు రైతులు పత్తిపంటను అలానే ఉంచుకోగా ప్రస్తుతం కేంద్రాలు ఎత్తివేయడం వల్ల ధరలు తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటా రూ.6,500 నుంచి రూ.6800 వరకు ధరలు ఉండగా సీసీఐ కేంద్రాల ద్వారా ప్రభుత్వం క్వింటా రూ.8,100 వరకు కొనుగోలు చేసింది. ఈ ధరలతో పోలిస్తే చాలా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఏటా పత్తి పంటకు ధరలు తగ్గుముఖం పట్టడం వల్ల చాలామంది రైతులు ధరలు వచ్చేవరకు పంటను ఇళ్లలో అలానే నిల్వ ఉంచుకుంటున్నారు. కొట్టాలపల్లి, దిమ్మగుడి, కండ్లగూడూరు, పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, తెలికి, మేడిమాకులపల్లి, లక్షుంపల్లి గ్రామాల్లో పత్తిపంట నిల్వలను అలానే ఉంచుకుని ధరలకోసం వేచిచూస్తున్నారు. పత్తి పంటనే కాకుండా జొన్న, మొక్కజొన్న, కందులు, కొర్ర పంటలకు ధరలు తగ్గడం వల్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కొట్టాలపల్లిలో ఓ ఇంటి వద్ద పత్తి నిల్వలు

కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: తల్లి మరణంతో పిల్లల పోషణకు కష్టంగా మారిందని మా కుటుంబాన్ని ఆదుకోవాలని అమ్మమ్మ భాను ఆదివారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు వినతి పత్రం అందజేశారు. గుంతకల్లులో భాగ్యనగర్‌కు చెందిన భాను పెద్దకుమార్తె రుక్సానా, షాహీర్ అనే అబ్బాయిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఆమె భర్త ఆటో డ్రైవరు కావడంతో తాగుడుకు బానిస అయ్యి గొడవ పడుతుండేవాడు. వీరికి ముగ్గురు పిల్లలు. అతని వేధింపుల వల్ల పెద్దకుమార్తె చనిపోయిందని ఎమ్మెల్యేతో వాపోయింది. పెళ్లి కావాల్సిన రెండో కుమార్తె ఉందని, ముగ్గురి చిన్నపిల్లలను పోషణ కష్టంగా మారిందని ప్రభుత్వం నుంచి సాయం అందించి పిల్లలను హస్టల్లో చదవించడానికి ఆదుకోవాలని మాజీ కౌన్సిలర్ అంజి, నందీశ్వర్, హనుమంతు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

నిర్వహణలేక.. నిరుపయోగంగా మరుగుదొడ్లు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తిలోని పలు కాలనీల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు నిర్వహణలేక మూలనపడ్డాయి. ప్రభుత్వం స్కావెంజర్ల వ్యవస్థను రద్దు చేసి ఓపెన్‌టైపు మరుగుదొడ్లను కూల్చివేసి మహిళలకు ప్రత్యేకంగా ఐదేళ్ల కిందట మరుగుదొడ్లను నిర్మించారు. కోటలో నివాసాలకు దూరంగా మరుగుదొడ్లు ఉన్నాయి. వాటిని ప్రజలు వినియోగించడంలేదు. దీంతో నిరుపయోగంగా మారాయి. అలాగే బండగేరిలో నిర్మించిన మరుగుదొడ్లు కూడా నిరుపయోగంగా మారాయి. దాసరికాలనీ ప్రజలకోసం నిర్మించిన మరుగుదొడ్లు కూడా వృథాగా ఉన్నాయి. నిర్మించినప్పటి నుంచి ఏనాడు వాటిని ప్రజలు వినియోగించడంలేదు. ఎన్టీఆర్ కాలనీలో ప్రజలు ఎవరూ నివాసంలేరు.

గుత్తిలో మరుగుదొడ్లు ఇలా..

అయినా అక్కడ రూ.3లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు సైతం నిరుపయోగంగా ఉన్నాయి. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న వాటి పరిస్థితి కూడా అంతే. ఇప్పటికైనా మరుగుదొడ్లను శానిటరీ ఉద్యోగులు సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్య శిబిరాలతో రోగులకు సాంత్వన

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో రైల్వే గ్రౌండు సమీపంలో ఆదివారం నారాయణ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రపంచ పౌర దినోత్సవం సందర్భంగా ట్రస్టు ప్రజలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు నారాయణనాయక్, సభ్యులు చలపతి, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డెంటల్ హాస్పిటల్ డాక్టర్ అభిషేక్ ప్రఖ్యాత్, ఇంజినీరు నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 70మంది ప్రజలు హాజరై దంత చికిత్స చేయించుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ తిరుపతి నాయుడు, డాక్టర్ శాంతి ప్రియ, శ్రీనివాసులు, శేషక్, మహేష్, సురేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఎంప్లాయిన్ రిక్రియేషన్ క్లబ్, రవికాంత్ క్యాటరింగ్ ఆధ్వర్యంలో ఉమ్మడిగా ఆదివారం బుక్కరాయసముద్రంలో కంటి సంబంధిత జబ్బులతో బాధపడుతున్న 65 మంది బాధితులకు కళ్లఅద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సూర్యనారాయణరావు, నాగేంద్ర, శివకుమార్, సత్యనారాయణ, ప్రభాకర్, తెదేపా నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ తగాదాలతో వ్యక్తిపై దాడి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో కుటుంబ తగాదాల కారణంగా పెద్దనరసింహులు అనే వ్యక్తిపై సమీప బంధువు రమేశ్ దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు పెద్దనరసింహులు, వెంకటేశ్ సమీప బంధువులు. వీరికి కొన్ని నెలలుగా కుటుంబ తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆదివారం ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. వెంకటేశ్ కుమారుడు క్షణికావేశంతో వేటకొడవలితో పెద్దనరసింహులు తలపై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బంధువులు చికిత్స నిమిత్తం అనంతపురం వైద్యశాలకు తరలించారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఒకరి ఆత్మహత్య

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో ఏసీఎస్ మిల్లు కాలనీలో ప్రసాద్(60) అనే వ్యక్తి మోకాళ్ల నొప్పులు భరించలేక శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామీణ ఎస్సై బాలముని తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. అతని మొదటి భార్య 20 ఏళ్ల కిందట చనిపోయిందని, రెండో పెళ్లి చేసుకుని భార్య నుంచి విడిగా ఉంటున్నాడు. ఇంట్లో ఒక్కడే ఉండటంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని అదృశ్యం అయింది. ఆదివారం తనకు ప్రత్యేక తరగతులున్నాయని ఇంటి నుంచి వెళ్లింది. ఆ బాలిక ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కట్నం వేధింపులు.. కేసు నమోదు

గుత్తి, న్యూస్‌టుడే: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తూ పుట్టింటికి పంపిన భర్తపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని అనగానదొడ్డికి చెందిన గంగావతికి ఈశ్వరపల్లికి చెందిన రాజశేఖర్‌తో మూడేళ్ల కిందట వివాహం అయింది. మొదటి భార్య చనిపోవడంతో అతడు గంగాదేవిని రెండో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి సందర్భంగా ఆమె తల్లిదండ్రులు రూ.లక్ష కట్నంతో పాటు ఆరున్నర తులాల బంగారం కట్నంగా ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. రాజశేఖర్ గుత్తిలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిపారు. అదనంగా కట్నం కావాలని అతడు ఆమెను పుట్టింటికి పంపినట్లు చెప్పారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దొంగను పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ దొంగను ప్రజలు పట్టుకుని ఆదివారం సాయంత్రం పోలీసులకు అప్పగించారు. ఓ ప్రయాణికుడు బస్సు ఎక్కుతుండగా జేబులోని చరవాణిని చోరీ చేయడానికి ప్రయత్నించాడు. సహప్రయాణికులు గమనించి అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతడిని విచారిస్తున్నారు. ఇటీవల కాలంలో బస్టాండ్‌లో చోరీలు ఎక్కువవుతుండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

జూదరుల అరెస్టు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని కాశేపల్లి సమీపంలోని పొలాల్లో శనివారం రాత్రి జూదం ఆడుతున్న 17 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వారి నుంచి రూ.42,600 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పట్టుకున్న సామగ్రిని చూపుతున్న పోలీసులు

నాటుసారా తయారీ కేంద్రంపై దాడి

నార్పల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గూగూడు, జంగమరెడ్డిపల్లి గ్రామాల మధ్య నాటు సారా తయారీకి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుసుకొని ఎస్సై సాగర్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా తయారీకి వినియోగించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పప్పూరు గ్రామంలో కూడా తనిఖీలు నిర్వహించి పది బ్రాందీ సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై వెల్లడించారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

శింగనమల, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాల పాటు కొనసాగిన ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన వారిని స్మరించుకుంటూ శింగనమలలో ఆదివారం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘం నాయకులు నివాళులర్పించారు. వర్గీకరణ కోసం పోరాడిన మందకృష్ణ మాదిగకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు నల్లప్ప, రాము, మురళి, ఓబులేశు, పవన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఓర్వలేకే అసత్య ఆరోపణలు'

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: నీలంపల్లి గ్రామంలో తెదేపాలో రాజకీయంగా ఎదుగుతున్న తమను చూసి ఓర్వలేకే కొందరు వ్యక్తులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెదేపా కార్యకర్తలు పుల్లయ్య, ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. 2018లో అప్పటి తెదేపా ప్రభుత్వంలో నీలంపల్లిలో తాగునీటి శుద్ధ జలయంత్రం ఏర్పాటు చేసిన విషయం వాస్తవమేనని తెలిపారు. తర్వాత వైకాపా అధికారంలోకి రావడంతో ప్లాంటు ఏర్పాటు చేసిన నిర్వాహకులు మోటారు, పైపులు, సామగ్రి మొత్తం తీసుకుపోయాన్నారు. నీలంపల్లి ప్రజల దాహార్తి తీర్చడానికి ఎంపీ లక్ష్మీనారాయణ నిధులు విడుదల చేశారన్నారు. ప్లాంటులో సామగ్రి, మోటారు, పైపులు కొత్తవి కొనుగోలు చేశామన్నారు. మరమ్మత్తులు చేసి ప్లాంటును మళ్లీ ప్రారంభిస్తున్నామన్నారు. ఇది నచ్చని కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాపోయారు.

నీటి పథకం పనుల అప్పగింత

గుత్తిలో అసంపూర్తిగా సంపు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి పురపాలికలో శాశ్వతంగా తాగునీటి సమస్యను తీర్చేందుకు ఉద్దేశించిన నీటి పథకం పనులను ఎట్టకేలకు జిందాల్ కంపెనీకి అప్పగించారు. 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.173 కోట్లతో పథకాన్ని మంజూరు చేయగా తరవాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. గార్లదిన్నెలోని ఎంపీఆర్ డ్యాం నుంచి పామిడి, గుత్తి పట్టణాలకు పైపులైన్‌లను ఏర్పాటు చేయాలి. పామిడి ప్రజలకు కూడా ఈ పథకం కిందనే తాగునీరు అందించాల్సి ఉంది. గత ప్రభుత్వం కేవలం మూడు కిలోమీటర్లు మాత్రమే పైపులైన్‌లను ఏర్పాటు చేయించింది. పామిడి, గుత్తి, సూరశింగనపల్లిలలో ట్యాంకుల నిర్మాణాలను అసంపూర్తిగా ఉంచారు. 30 ఏళ్ల వరకు తాగునీటి సమస్య రాకుండా ఉండే విధంగా పథకానికి రూపకల్పన చేశారు.

పెరిగిన అంచనాలు

గత ప్రభుత్వ నిర్వాకం వల్ల అంచనా వ్యయం పెరిగింది. గతంలో రూ.173 కోట్లతో ఉన్న అంచనాలు ఇప్పుడు రూ.200 కోట్లకు చేరాయి. పథకం పూర్తికి కూటమి ప్రభుత్వం ఇప్పుడు చర్యలు చేపట్టింది. ఏఐబీ రుణంతో పథకాన్ని పూర్తి చేయనున్నారు. అసంపూర్తి పనుల పూర్తికి గత డిసెంబరులోనే టెండర్లు నిర్వహించినా పనులు అప్పగింతలో జాప్యం చోటు చేసుకుంది. పనులను జిందాల్ కంపెనీకి రెండు రోజుల కిందట ఖరారు చేశారు. పనులను త్వరలోనే చేపడతామని గుంతకల్లు ప్రజారోగ్య విభాగం డీఈఈ కేతన్‌రెడ్డి తెలిపారు. తిరిగి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి

పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలి

తాడిపత్రి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని సీవీ రామన్ కళాశాలల ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి ఆకాంక్షించారు. తాడిపత్రిలో ఉన్న సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. ఆధునికతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. అలాగే ఆటల పోటీలు, సాంస్కృతిక పోటీలలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇందూధర్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ ప్రవీణ పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

(c) eenadu

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

వేడుకగా లక్ష్మీనరసింహుడి హోమం

హోమం నిర్వహణలో అర్చక బృందం

అనంత సాంస్కృతికం: పాతూరు శ్రీశృంగేరి శారదా పీఠం దత్తాత్రేయ స్వామి దేవస్థానంలో ఆదివారం లక్ష్మీనరసింహస్వామి హోమం వైభవంగా జరిగింది. శ్రీశంకర విజయ వరపుర బ్రాహ్మణ సభ్యులతో నిర్వహించిన ఈ కార్యక్రమం గోపూజ, గణపతి పూజతో ప్రారంభమైంది. రుద్రాభిషేకం, కలశస్థాపన, గణపతి, రుద్ర, నవగ్రహ హోమాలతోపాటు ప్రధానమైన లక్ష్మీనరసింహ స్వామి యజ్ఞాన్ని నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

లక్ష్మీనగర్: 9849771687
అరవింద్‌నగర్: 8008573004
రాప్తాడు: 6304766286

సమస్య: రాంనగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ప్రధాన రోడ్డులో తాగునీరు లీకేజీ అవుతోంది. -సుబ్బారావు
సమాధానం: తాగునీటి విభాగం సిబ్బందిని పంపి వెంటనే లీకేజీని సరిచేస్తాం.
సమస్య: ఎన్టీఆర్ మార్గ్ నుంచి వినాయకనగర్ మొదటి క్రాస్ వెళ్లే చోట చెత్త కుండీ తొలగించడంతో రోడ్డుపైనే చెత్త పడుతోంది. -ఓబులపతి
సమాధానం: పరిశీలించి చెత్త కుండీ ఏర్పాటు చేయిస్తాం. (ప్రశ్నలకు నగరపాలక తాగునీటి విభాగం ఈఈ చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి ఎంహెచ్‌ఓ నరసింహ సమాధానాలు ఇచ్చారు.) -న్యూస్‌టుడే, అశోక్‌నగర్

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: గౌరవి: సన్ ఆఫ్ ఎన్నో సినిమా: అతడు, నిరిమ: ఉత్తర హీరోలు, త్రివేణి: ది రైజ్ ఆఫ్ అశోక, శాంతి: 100 డేస్ లవ్‌స్టోరీ, శాంతి: విష్ణు విన్యాసం, సుధా: మన శంకర వరప్రసాద్.

నగరంలో ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్, పోలీసు కార్యాలయాల్లో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ.

బృంద నృత్యం చేస్తున్న బాలికలు

విద్యార్థినుల సైకిల్ ర్యాలీ

సింధికేట్‌నగర్(రాప్తాడు), న్యూస్‌టుడే: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాప్తాడు పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆదివారం సీఐ హర్ష ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్ నుంచి రాప్తాడు కేంద్రంలో విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీసులు మహిళ హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, పోలీసులు

స్వామి సన్నిధిలో...

పాతూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం

ఉదయం 5.30కు సుప్రభాత సేవ ● 7గంటలకు భక్తి గీతాలాపన ● 7.15కు అర్చనలు ● 7.30కు పంచామృతాభిషేకం ● 8గంటలకు అలంకరణ సేవ ● 11.30కు మంగళహారతులు, ప్రసాద వితరణ ● సాయంత్రం 6గంటలకు అభిషేకాలు, అర్చనలు ● 7గంటలకు ఆకాశదీప ప్రజ్వలన ● 7.30 నుంచి 8.30వరకు వివిధ బృందాలతో భజన, భక్తి గీతాలాపన

మొదటి రోడ్డు శివాలయం

ఉదయం 5.30కు సుప్రభాత సేవ ● 7.00 గంటలకు హోమం ● 7.30కు అర్చనలు ● 8కు పంచామృతాభిషేకం ● 9.00 గంటలకు అలంకరణ సేవ ● 9.30కు పల్లకి, ప్రాకారోత్సవ సేవ ● 9.30కు ప్రసాద వితరణ ● సాయంత్రం 5.00కు అర్చనలు, పూజలు ● 5.30కు భక్తి తారావళి ● రాత్రి 8.00 గంటలకు మహా మంగళ హారతులు

హౌసింగ్ బోర్డు కాశీ విశ్వేశ్వరాలయం

● ఉదయం 6.00కు సుప్రభాత సేవ ● 6.30కు పంచామృతాభిషేకం ● 8.30కు మహా మంగళ హారతులు ● 8.45 ప్రసాద వితరణ ● సాయంత్రం 5గంటలకు సర్వదర్శనం ● 6.30 మహా మంగళ హారతులు ● రాత్రి 8కు పవళింపు సేవ

- అనంత సాంస్కృతికం, న్యూస్‌టుడే

శివబాలయోగి ఆశ్రమం

ఉదయం 6.30కు సుప్రభాత సేవ ● 7.30 నుంచి 9 వరకు భక్తుల సహస్రాభిషేకం, పరమేశ్వరుడికి రుద్రాభిషేకం ● 9గంటలకు అలంకార సేవ ● 10.30కు అర్చనలు, పూజలు ● 11 గంటలకు మహా మంగళ హారతులు, ప్రసాద వితరణ ● సాయంత్రం 5గంటలకు అర్చనలు, పూజలు ● 8గంటలకు మహామంగళ హారతులు, ప్రసాద వితరణ.

చిన్మయ జగదీశ్వరాలయం

ఉదయం 6గంటలకు ఏకవార రుద్రాభిషేకం ● 8గంటలకు అలంకరణ సేవ ● 9కు మహా మంగళ హారతులు, ప్రసాద వితరణ ● సాయంత్రం 6.30నుంచి 8వరకు భజన సంకీర్తనలు ● 8గంటలకు పల్లకి సేవ ● 8.30కు మహామంగళ హారతులు, ప్రసాద వితరణ

నగర ప్రగతికి పన్నులే ఊతం!

◆ వసూళ్లపై దృష్టిసారించిన యంత్రాంగం
◆ రోజుకు రూ.2.34 కోట్లు లక్ష్యం

నగరంలో పన్నులు వసూలు చేస్తున్న అధికారులు

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: నగరపాలిక ఎంత ఆదాయం సమకూరితే అంత అభివృద్ధి పనులకు ఖర్చు చేసేవీలుంటుంది. ఈనెల 31వతేదీతో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో ఆస్తి పన్ను, ఖాళీ జాగా పన్ను, నీటి పన్ను మొత్తం లక్ష్యాలను నిర్దేశించారు. ఆస్తి పన్ను, నీటి పన్ను రెండూ కలిపి రోజుకు రూ.2.34కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఆయా సచివాలయ వార్డు పరిధిలో ఉన్న బకాయిలను బట్టి రోజు వారీగా వసూలు చేయాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో నగరంలోని అన్ని స్థాయిల్లోని అధికార యంత్రాంగం ఉరుకులు, పరుగులతో పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. రోజూ ఎవరికి వారు డిప్యూటీ కమిషనర్, ఆర్‌ఓలు సమన్వయంతో సచివాలయ స్థాయి సిబ్బందిని పన్నుల వసూలుకు సంసిద్ధం చేయాల్సి ఉంటుంది.

పన్ను బకాయిల నివాసాలు	59,650
చెల్లించాల్సిన బకాయి	రూ.64.74కోట్లు
రోజు వారీ లక్ష్యం	రూ.2.02కోట్లు
కుళాయి కనెక్షన్లు	35,131
బకాయి	రూ.10.43కోట్లు
రోజు వారీ లక్ష్యం	రూ.32.59లక్షలు

నేటి నుంచి ప్రత్యేక డ్రైవ్

ఏటా మార్చిలో మాత్రమే అధికార యంత్రాంగం వ్యాపార సముదాయాలు, కల్యాణ మండపాలు, ఆసుపత్రులు, లాడ్జీలు, హోటళ్ల వద్దకు వెళ్లి బకాయిలను చెల్లించాలని అడగడం అప్పుడు వారు ఏదో సాకు చెప్పి చెల్లించకుండా ఉండటం సర్వసాధారణంగా మారింది. రూ.5లక్షల నుంచి రూ.కోట్ల వరకు ఉన్న బకాయిలపైనే దృష్టి సారించి వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం నుంచి నగరం పరిధిలోని 74 సచివాలయ వార్డుల పరిధిలో రెవెన్యూ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, సచివాలయ వార్డు సిబ్బంది అంతా బృందంగా వెళ్లి నగరపాలికకు చెల్లించాల్సిన బకాయిలను వసూలు చేయనున్నారు. చెల్లించకుంటే చట్టప్రకారం అధికారాలను ఉపయోగించి చర్యలకు ఉపక్రమించనున్నారు.

ఇసుకలో అక్షరాలు దిద్ది సివిల్స్ సాధించా

మాట్లాడుతున్న విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి నరసింహప్ప

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: పలకలు, బలపాలు లేని కాలంలో ఇసుకలో అక్షరాలు దిద్ది మొదటి ప్రయత్నంలోనే సివిల్స్‌లో ర్యాంకు సాధించానని విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి ఎం.నరసింహప్ప పేర్కొన్నారు. సాధారణ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మాధ్యమంలో చదువుకున్న పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ఉన్నతస్థాయిని అధిరోహించానని వెల్లడించారు. ఆదివారం అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం, కళాశాల వ్యవస్థాపకుడు అనంతరాముడి జన్మదిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సంబోధిస్తూ ప్రణాళిక బద్ధంగా చదివితే కలలు కన్న ఉద్యోగాలను సాధించడం పెద్ద కష్టం కాదన్నారు. జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల ఛైర్మన్ అనంతరాముడు మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

బుక్కరాయసముద్రం: నీలంపల్లిలో వెలిసిన నాగలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా గ్రామస్థులు పోలీసులకు సహకరించాలని సీఐ పుల్లయ్య కోరారు. ఆయన నీలంపల్లిలో ఈ నెల 2, 3వ తేదీల్లో జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. భక్తులు స్వామిని దర్శించుకోవడానికి బారికేడ్లు ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో గ్రామ బయట పార్కింగ్ ఏర్పాట్లు చేస్తామన్నారు.

అలరించిన సాంస్కృతిక సంబరాలు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: శిల్పారామంలో ఆదివారం సాయంత్రం జరిగిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. శ్రేయ ఏకో వరల్డ్ వారి సహకారంతో ఆర్కే డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారులు నవ్య, పూజిత, గగన, దర్శిని, సమంత, హాసిణులు నృత్య ప్రదర్శనలు చేశారు. ప్రదర్శన రెండు గంటల పాటు సాగాయి. ఈ కార్యక్రమాలను శిల్పారామం ఏవో పి.శివప్రసాద్‌రెడ్డి, ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో రేణుకాచార్యుల జయంతి

బసవేశ్వర, రేణుకాచార్యుల చిత్రపటాలకు పూజలు చేస్తున్న జంగమ సమాజ సభ్యులు

అనంత సాంస్కృతికం: వీర శైవ జంగమ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం జగద్గురు రేణుకాచార్యుల జయంతి ఉత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక పాతూరు పేట బసవేశ్వరస్వామి దేవస్థానంలో బసవేశ్వర స్వామికి, రేణుకాచార్యుల చిత్రపటాలకు పూజలు నిర్వహించి, భక్తి గీతాలాపన, భజనలు నిర్వహించారు. జంగమ,వీరశైవ లింగాయత్ సమాజ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శిథిలావస్థలో సాంకేతిక సేవా కేంద్రం

అనంతపురంలోని జిల్లా పట్టుపరిశ్రమశాఖ కార్యాలయ ఆవరణలోని సాంకేతిక సేవా కేంద్రం శిథిలావస్థకు చేరింది. ఇక్కడ సెరికల్చర్ ఆఫీసర్(ఎస్‌ఓ) ఉంటారు. కేంద్రంలో జిల్లాలోని రైతులకు మల్బరీసాగు, పట్టుగూళ్ల పెంపకంపై సాంకేతిక సలహాలు, సూచనలిస్తారు. సేవా కేంద్రం పైకప్పునకు రేకులు ఉన్నాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు పీవోపీ తరహాలో అతికించిన అట్టముక్కలు ఊడి కింద పడుతున్నాయి. అధికారులు స్పందించి పైకప్పునకుమరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, అనంతపురం(వ్యవసాయం)

వసతిగృహం.. చెత్తమయం

అది ఒకప్పుడు వేల మంది విద్యార్థులకు వసతి కల్పించిన వసతి గృహాల సముదాయం. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో మార్పులు చేశారు. దీంతో వసతి గృహం నిరుపయోగంగా మారింది. ఏళ్లుగా ఎవరూ లేకపోవడంతో వసతి గృహం శిథిలావస్థకు చేరింది. ఆదిమూర్తినగర్‌లోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల సముదాయం దుస్థితి ఇది. పరిసర ప్రాంతాల వారు ఇక్కడే చెత్త వేస్తున్నారు. విషపురుగులకు నిలయంగా మారింది. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. -న్యూస్‌టుడే, అశోక్‌నగర్

యాభై వసంతాల సంబరం

వేదికపై పూర్వ విద్యార్థులు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో 50 ఏళ్ల కిందట అభ్యసించిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. 1973-76 సంవత్సరాల్లో బీఎస్సీ విభాగంలో 21 మంది అభ్యసించారు. నాటి విద్యార్థులు సమావేశమయ్యారు. అప్పటి గురువులు వాసుదేవరావు, సుబ్బన్న, మాధవరావు, కృపాకర్, శ్రీనివాసశెట్టి, లక్ష్మీనారాయణ తదితరులను గుర్తుచేసుకొన్నారు. అప్పటి విద్యార్థిని ప్రవీణా జిల్లా జడ్జిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం మానవహక్కుల కమిషన్ సభ్యురాలుగా ఉండటం గర్వకారణమన్నారు. నాటి గురువు వాసుదేవరావు పేరిట ఎండోమెంట్ బహుమతి ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే పేదల సంక్షేమం

మహిళకు కుట్టు మిషన్ అందిస్తున్న తెదేపా నాయకులు

బళ్లారిరోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని 40వ డివిజన్ బళ్లారిరోడ్డు సమీపంలో ఉన్న ఆజాద్‌నగర్‌లో కార్పొరేటర్ శ్రీలక్ష్మి, తెదేపా నాయకుల నలుబోలు మధు రాయల్ ఆధ్వర్యంలో ఆదివారం తమ కుమార్తె డాక్టర్ సాయిదీక్షిత పుట్టిన రోజు సందర్భంగా తల్లి లేదా తండ్రి లేని 56 మంది చిన్నారులు, విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. చిన్నారులు విద్యార్థులతో పాటు భర్తలను కోల్పోయిన ఇద్దరు మహిళలకు ఉపాధి నిమిత్తం కుట్టుమిషన్‌తో పాటు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని డివిజన్ పరిధిలో ఉన్న 300 మంది ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతున్నారన్నారు. సాయంత్రం హసేన్ మసీదులో ముస్లిం మైనార్టీలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు రమేష్, హరి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్ల పరిష్కారానికి చర్యలు

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ తెలిపారు. సమస్యపై అంగన్‌వాడీలు చేస్తున్న దీక్షలపై ఎమ్మెల్యే స్పందించారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయనుందన్నారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు పదోన్నతి కల్పించి, పూర్తి స్థాయి వేతనాలు అందిస్తుందన్నారు. కొత్తగా అంగన్‌వాడీ సహాయకులను నియమిస్తారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అర్థం చేసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

'ఉపాధ్యాయుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి'

అనంతపురం విద్య: ఉపాధ్యాయ, విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై శాసనసభలో చర్చించాలని ఏపీటీఎఫ్-1938 నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, ఎం.ఎస్. రాజులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసనాయక్ పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

అలంకరణలో లక్ష్మీ నరసింహ స్వామి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని వై.కొత్తపల్లి పరిధిలో వెలసిన మలహోబుల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఆదివారం ఉత్సవాల్లో భాగంగా గరుడ సేవను నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహాలను గరుడవాహనంపై ఊరేగించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గతంలో లేని పలు ఆర్జిత సేవలను బ్రహ్మోత్సవాల నుంచి ప్రారంభించినట్లు ఈవో దేవదాసు తెలిపారు. నేడు రాత్రి 10గంటలకు స్వామి వారి కల్యాణం ప్రారంభం కానుందని, భక్తులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

కేజీబీవీ ఉద్యోగులకు వేతనాలివ్వాలి

అనంతపురం విద్య: సమగ్రశిక్ష పథకం పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర ఉద్యోగులకు వేతనాలు వెంటనే చెల్లించాలని సమగ్రశిక్ష, కేజీబీవీ ఉద్యోగుల ఫోరం ఐకాస అధ్యక్షుడు విజయ్ విజ్ఞప్తి చేశారు. కేజీబీవీల్లో వంట మనుషులు, సహాయ వంట మనుషులు, చౌకీదార్లు, వాచ్‌మెన్లు, స్వీపర్లు, వార్డెన్లు తదితర స్థాయిల్లో చాలా మంది పని చేస్తున్నారన్నారు. ఆరు నెలలుగా వేతనాలు అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా రూ.15వేలు చొప్పున వేతనాలు చెల్లించాలన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్మశాన స్థలాల ఏర్పాటుకు జీపు యాత్ర

అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కమలానగర్, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో శ్మశాన వాటికల స్థలాల కేటాయింపు కోసం ఈ నెల 5న కల్యాణదుర్గం నుంచి 16వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా జీపు యాత్ర చేపడుతున్నట్లు ఎస్సీ ఎస్టీ సంఘాల ఐకాస అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేసి ఆయన మాట్లాడారు. చనిపోతే పూడ్చటానికి శ్మశానాలు లేక ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి జిల్లాలో ఉందన్నారు. శ్మశానాలను కబ్జాలు చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్లకు అనేకమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా జీపు యాత్ర చేసి, 16న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేపడతామన్నారు.

మహిళలను గౌరవించడం అందరి బాధ్యత

గడియార స్తంభం వద్ద మానవహారం

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో ఆదివారం మహిళా పోలీసులు ర్యాలీ నిర్వహించారు. మహిళల భద్రత, గౌరవం, సాధికారతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతపురం మహిళా విభాగం డీఎస్పీ మహబూబ్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభమైంది. పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ విగ్రహం కూడలి, సప్తగిరి కూడలి, సుభాష్‌రోడ్డు మీదుగా గడియారస్తంభం వరకు సాగింది. కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, కళాశాలలు, పాఠశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారమాల

పురస్కారం అందుకుంటున్న శ్యామలాదేవి

కమలానగర్, న్యూస్‌టుడే: ప్రజాసేవ, రాయలసీమ బలిజ సంఘం కోశాధికారిగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు అనంత నగరానికి చెందిన శ్యామలాదేవికి విశ్వ సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందించారు. జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం విజయవాడలో పురస్కారం అందించినట్లు ఆమె తెలిపారు. ఉమెన్ పవర్ ఆఫ్ ఎక్సలెన్స్ పురస్కారం రావడం ఆనందంగా ఉందని, ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతగా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

మాజీ సైనికుడి మృతికి సంతాపం

తపోవనం (అనంత గ్రామీణం): భారత సైన్యంలో పని చేసి పదవీ విరమణ పొందిన కె.వన్నూరప్ప (77) ఆదివారం మరణించారు. ఆయనకు భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఆయన భౌతిక కాయానికి జిల్లా మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేకన్న, సభ్యులు నరసింహులు, సిద్ధన్న నివాళి అర్పించారు.

బహిరంగ ప్రకటన

నా కక్షిదారురాలు **యస్.సావిత్రి** భర్త **బి.యల్. బాలాజి నాగేంద్ర కుమార్,** డోర్ నెం: 15-499, సూర్యానగర్, 3వ క్రాస్, అనంతపురము టౌన్ మరియు జిల్లా నివాసి తన షెడ్యూలు ఇంటి దాన విక్రయ దస్తావేజు నెం: 8972/2000 తేది: 29-11-2000 అనంతపురము టౌన్ నందు సప్తగిరి సర్కిల్ నందు జిరాక్స్‌కు వెళ్లినప్పుడు పోగొట్టుకు పోయినది. పై తెలిపిన డాక్యుమెంటు ఎవరికైనా దొరికినచో నాకు గాని నా కక్షిదారునికి గాని తెలియచేయగలరు.

షెడ్యూలు

అనంతపురము ఆర్.డి. మరియు యస్.ఆర్.డి., అనంతపురము మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో గల ఇంటి వివరములు.

వార్డు	బ్లాక్	టీయస్.నెం.	డోర్.నెం.	అసెస్మెంట్ నెంబర్
పాత-4 కొత్త-9 సరికొత్త-15	15	1946	15/281	9565

చెక్కుబంది: తూర్పు: దేశాయి క్రిష్టప్ప మరియు ఆదిమూర్తి జమీను, **పడమర:** తమ్మినేని మేదర అంజనప్ప ఇల్లు, **ఉత్తరం:** రోడ్డు, **దక్షిణం:** ఇదే ఇంటికి పైకి నేను నిలుపుకున్న మిగతా ఇల్లు, **కొలతలు: తూర్పు-పడమర:** 18 అడుగులు లేదా 5.46 మీటర్లు, **ఉత్తరం-దక్షిణం:** 15 అడుగులు.

డి. మహబూబ్, బి.ఎ., బి.యల్.
అడ్వకేట్ & నోటరీ,
అనంతపురము టౌన్ మరియు జిల్లా.
సెల్: నెం: 9000616370

ఇరాన్‌పై దాడులు ఆపాలి

నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌యూసీఐ(సి) నాయకులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఇరాన్‌పై సామ్రాజ్యవాద దేశాల దాడులు ఆపాలని ఎస్‌యూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌యూసీఐ (సీ) ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, నాయకులు తబ్రేజ్‌ఖాన్, నాగ ముత్యాలు, మహేష్, నాగరాజు, కిశోర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

నిత్యావసరాలు అందిస్తున్న నిర్మలా మురళి, సూపరింటెండెంట్ మల్లీశ్వరి

కమలానగర్, న్యూస్‌టుడే: నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ నిర్మలా మురళి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరి ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. నగర శివారులోని పేద కుటుంబాలకు చెందిన 11 మందికి రూ.12 వేల విలువ చేసే వస్తువులను ఆదివారం ఆదర్శనగర్‌లోని పుట్టినిల్లు ఆశ్రమంలో అందించారు.

విద్యారంగ సమస్యలపై నిర్విరామ పోరాటం

సంతోశ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సీపీఐ, ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా అనంతపురం జిల్లాకు చెందిన సంతోశ్‌కుమార్ ఎంపికయ్యారు. అతన్ని అభినందిస్తూ ఆదివారం సీపీఐ జిల్లా సమితి నాయకులు సత్కారం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగం, విద్య, సామాజిక న్యాయం వంటి అంశాలపై యువతను సంఘటితం చేసి ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు రమణయ్య, కుళ్లాయిస్వామి, కోట్రేశ్, ధనుదేవ, శ్రీనివాస్, అల్లీపీరా, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో 'బాలు శత గళార్చన'

దీపారాధన చేస్తున్న అతిథులు

అనంత సాంస్కృతికం: లలిత కళాపరిషత్‌లో ఆదివారం జరిగిన 'బాలు శత గళార్చన' కార్యక్రమం సంగీతాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. అనంత్‌నాగ్ సంగీత్ స్వర్ కల్చరల్ అసోసియేషన్ సహకారంతో ఎస్పీ బాలు అనంత కళా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9నుంచి రాత్రి 9గంటల వరకు నిరవధికంగా వందమంది గాయకులతో వంద పాటలకు సంగీతాలాపన జరిగింది. ఎస్పీ బాలు కాంస్య విగ్రహ స్థాపన, కళాక్షేత్ర నిర్మాణ నిర్వహణలో భాగంగా తొలి ప్రయత్నంగా నిర్వహించిన గళార్చనకు సినీ దర్శకుడు మాధవపెద్ది సురేశ్, దూరదర్శన్ వ్యాఖ్యాత విజయదుర్గ విశిష్ట అతిథులుగా, డీఆర్వో మాలోల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంత కళా సమితి ఆహ్వాన కమిటీ కార్యదర్శి గుంతకల్లు రాము, ఉపాధ్యక్షులు మాయకుంట్ల ఓబుళదాసు, కన్వీనర్ బాల మురళీల ఆధ్వర్యంలో వేడుక జరిగింది. బాలు అభిమానులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

ఉపాధ్యాయులకు టెట్ మినహాయించరూ!

గోడపత్రాలు విడుదల చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న చలోదిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ పిలుపునిచ్చింది. స్థానిక ఉపాధ్యాయభవన్‌లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో చలోదిల్లీ పేరుతో గోడపత్రాలు విడుదల చేశారు. ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, రాష్ట్రకార్యదర్శి పాతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మార్చి 10న దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు గురురాజ, డేనియల్, రామాంజనేయులు, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

సమ్మె ఫలితంగానే డిమాండ్లకు ఆమోదం

జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులును సత్కరిస్తున్న సొసైటీల సీఈఓలు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: సహకార సంఘాల ఉద్యోగుల డిమాండ్లలో నాలుగింటిని కూటమి ప్రభుత్వం ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని ఆ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం యాదవ కల్యాణ మండపంలో ఉద్యోగుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన శ్రీనివాసులు, ఆర్‌వీ నాయుడిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు పి.హనుమంతరెడ్డి, కోశాధికారి ఎం.హనుమంతరెడ్డి, డివిజనల్ కార్యదర్శులు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

(c) eenadu

ఇక పదింతల పర్యవేక్షణ

పక్కాగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

కంభంవారిపల్లి, కలకడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థలో మార్పులు చేపట్టింది. వంద శాతం ఉత్తీర్ణతకు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పరీక్షల్లో అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ కట్టుదిట్టం చేస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఇన్విజిలేషన్ బృందాల నియామకం చేపట్టింది. ఇన్విజిలేటర్లు, డీవో, చీఫ్ సూపరింటెండెంట్లు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల నియామకానికి నూతన విధానం తెచ్చింది. దీనికి జిల్లాకు ఎంతమంది అవసరమనే విషయాన్ని సేకరించింది. గతంలో మాదిరిగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 20 మంది సిబ్బందిని పరీక్షలకు వినియోగించే ఏర్పాట్లు చేశారు.

కొందరికి మినహాయింపు

● దివ్యాంగులు, మహిళలు, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడే వారితో పాటు అనారోగ్యంతో ఉన్న వారు, ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నవారు స్వచ్ఛందంగా వస్తే తప్ప, వారిని ఇన్విజిలేషన్‌కు నియమించరాదని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆసక్తి ఉన్న వారి వివరాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. ● గతంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన వారు, సస్పెన్షన్‌లో ఉన్న వారిని విధులకు దూరంగా ఉంచనున్నారు. పాఠ్యాంశాల వారీగా ఇన్విజిలేషన్ విధులు కేటాయిస్తారు. ● భాషా పరీక్షల సమయంలో గ్రూప్ సబ్జెక్టు బోధించే వారికి, గ్రూప్ సబ్జెక్టు పరీక్షల సమయంలో భాషోపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ● పరీక్షల విధుల్లో స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే ఉంటారని, ఎస్జీటీలు విధుల్లో ఉండే అవకాశం లేదన్నారు.

జిల్లాలో కేంద్రాలు: 124
ఇన్విజిలేటర్లు: 1,200 మంది
డీవోలు: 124 మంది
సూపరింటెండెంట్లు: 124 మంది
ఫ్లయింగ్ స్క్వాడ్లు: 6
పదో తరగతి విద్యార్థులు: 21,526 మంది

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి

ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇన్విజిలేటర్ల నియామకం రాష్ట్రస్థాయి నుంచే జరుగుతుంది. వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారు.

- సుబ్రహ్మణ్యం, డీఈవో

న్యాయసౌధం.. దామినేడు సొంతం

శంకుస్థాపన చేసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుపతి(లీగల్, కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక నగరి తిరుపతిలో న్యాయసేవలు మరింత చేరువయ్యేలా అడుగులు పడ్డాయి. దామినేడు వద్ద సుమారు 14.49 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న 16 కోర్టుల నూతన సముదాయానికి ఆదివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ భూమిపూజ చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయమూర్తులు, కలెక్టర్

తిరుపతి జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.గజేంద్ర మాట్లాడుతూ.. ఈరోజు తమ జీవితాల్లో అత్యంత ముఖ్యమైనదన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక న్యాయమూర్తులను శాలువాలతో సత్కరించి శ్రీవారి ప్రతిమలు బహూకరించారు.

నేడు మదనపల్లెకు ఇన్‌ఛార్జి మంత్రి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి సోమవారం మదనపల్లె రానున్నారు. ఉదయం 10.35 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు మదనపల్లె వస్తారు. మదనపల్లె పట్టణం శివారులోని వైకూడలి సమీపంలో తెదేపా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద బాబు, ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశానికి హాజరుకానున్నారు.

సీఎంతో తంబళ్లపల్లె తెలుగు తమ్ముళ్ల భేటీ వాయిదా

ఈనాడు, అన్నమయ్య, ములకలచెరువు, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబుతో తంబళ్లపల్లె తెదేపా కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జుల భేటీ వాయిదా పడింది. తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌ను ప్రకటించేందుకు అధిష్ఠానం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో రెండ్రోజుల క్రితం నియోజకవర్గంలోని మండల పార్టీ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి ఆదివారం చేరుకోవాలని కబురు వచ్చింది. శనివారం కాకినాడ జిల్లా, వేట్లపాలెంలో చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో.. ఈ భేటీ వాయిదా పడినట్లు సమాచారం. దీంతో తంబళ్లపల్లె తెదేపా నేతల తదుపరి భేటీ ఎప్పుడనేది తెలియజేస్తామని అధిష్ఠానం.. స్థానిక నేతలకు తెలియజేసింది. శంకర్‌యాదవ్‌ను ఇన్‌ఛార్జిగా త్వరలో ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

రంజాన్ వేళలు	ఇఫ్తార్ సోమవారం(సా)	సహర్ మంగళవారం(ఉ)
మదనపల్లె	6.29	5.12
రాయచోటి	6.28	5.10

(c) eenadu

ఏపీఎన్జీవో మహిళా విభాగం జిల్లా కమిటీ ఏర్పాటు

నాయకులతో సత్కారం పొందిన కమిటీ సభ్యులు

రాయచోటి, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో మహిళా విభాగం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. రాయచోటిలో అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగినులు హాజరయ్యారు. జిల్లా ఛైర్‌పర్సన్‌గా ప్రతిభకుమారి, కోఛైర్‌పర్సన్‌గా టి.సునీత, ఉపాధ్యక్షులుగా ఎ.పద్మజ, ఎం.అంజనమ్మ, నీలిమ, శిరీష, అర్చన యాదవ్, కన్వీనర్లుగా జె.పవనకుమారి, జె.శశికళ, ఎం.సుహాసిని, లావణ్యకుమారి, రమణమ్మ, పి.లక్ష్మమ్మ, రెడ్డెమ్మ, కోశాధికారిగా పార్వతమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీ సభ్యులు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రెండు జిల్లాల కార్యదర్శులు నిత్యపూజయ్య, శ్రీనివాస్, నాగేశ్వర్, పద్మనాభరావు, డి.వి.శివారెడ్డి, మహదేవ తదితరులు పాల్గొన్నారు.

వరములియవే.. గంగమ్మ

అలంకరణలో అమ్మవారు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలోని రాయుడుకాలనీలో ఆదివారం గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున బోనాలు తీసుకొని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు నృత్యాలు, చెక్క భజనలు, కోలాటం చేశారు. రాత్రి చాందినీ బండ్ల ఊరేగింపు నిర్వహించారు. తెదేపా నాయకులు శ్రీనివాసులురెడ్డి, రంజిత్‌రాయల్, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతరలో కోలాటం చేస్తున్న యువత

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
రాయచోటి : 9703622242
పీలేరు : 8008574958
చిన్నమండెం: 9440170752

న్యూస్‌టుడే, కంభంవారిపల్లి: ? గర్నిమిట్ట సమీప ఝరికోన పైపులైను లీకైంది. మరమ్మతు చేయాలి. - **వెంకటరమణ** ● మరమ్మతులు చేయిస్తాం. - **మధుసూదన్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్**

న్యూస్‌టుడే, సంబేపల్లె: ? జాతీయ రహదారిపై గ్రంథాలయం వద్ద రైస్‌మిల్లు దారిలో ఉన్న వీధిలైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. - **రెడ్డెయ్య** ● త్వరలో మూడో లైను ఏర్పాటు చేసి వీధిలైట్లకు స్విచ్ అమర్చి రాత్రి వేళ మాత్రమే వెలిగేలా ఏర్పాటు చేస్తాం.
- మోహన్‌బాబు, పంచాయతీ కార్యదర్శి, సంబేపల్లె

న్యూస్‌టుడే, కలకడ: ? స్థానిక దిగువవీధిలోని కాలువలో మురుగు పేరుకుపోయి అధ్వానంగా మారింది. - **జమృత్‌ఖాన్** ● కాలువను శుభ్రం చేసి, దుర్వాసన లేకుండా చర్యలు తీసుకుంటాం. - **శైలజ, కార్యదర్శి కలకడ**

న్యూస్‌టుడే, గాలివీడు: ? వెలిగల్లు ప్రభుత్వ పాఠశాల ప్రహరీ వద్ద ఉన్న ఆర్వో ప్లాంటు మరమ్మతుకు గురైంది. - **వెంకటరమణ** ● ప్లాంటుకు మరమ్మతులు చేయిస్తాం. - **వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎంపీడీవో**

న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ: ? డిష్ రెడ్డెన్న వీధిలో సీసీ రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. - **సౌజన్య** ● పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. - **రవి, కమిషనర్**

న్యూస్‌టుడే, గుర్రంకొండ: ? తరిగొండ దళితవాడ రహదారికి ఇరువైపులా కాల్వల్లో చెత్త పేరుకుపోయింది. - **అన్వర్‌బాషా** ● శుభ్రం చేయిస్తాం. - **పరమేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో**

న్యూస్‌టుడే, కలికిరి: ? కలికిరి మండలం మహల్ మెయిన్ బజారులో నీటి సరఫరా గేట్‌వాల్వు గుంతపై పైకప్పు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. - **ఇర్ఫాన్** ● పైకప్పు ఏర్పాటు చేస్తాం - **రెడ్డిశేఖర్, కార్యదర్శి**

న్యూస్‌టుడే, గాలివీడు: ? గాలివీడు రోడ్డులో ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే దారిలో, ఎలక్కాయ చెట్టు వద్ద చెత్త ఎక్కువగా ఉంది. - **వి.వాసు** పాత గ్రామీ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న చెత్త కుండీ తొలగించడంతో వ్యర్థాలు రోడ్డుపై వేస్తున్నారు. - **ఎస్.కే.హుస్సేన్** ● ఆంజనేయస్వామి ఆలయం దారిలో చెత్త తొలగిస్తాం. పంచాయతీ కార్యాలయం వద్ద కుండీ ఏర్పాటు చేస్తాం.
- జి. రవి, పురపాలక కమిషనర్

చిన్నమండెం, న్యూస్‌టుడే: ? పాత పోలీసుస్టేషను సమీపంలో చెత్త పేరుకుపోయింది. - **స్థానికులు** ● చెత్త తొలగిస్తాం. - **శ్రీధర్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో**

రాయచోటి గ్రామీణం, న్యూస్‌టుడే: ? పాత కూరగాయల మార్కెట్ ప్రాంతంలో మరుగుదొడ్లు లేవు. మార్కెట్‌కు వచ్చిన వారు ఇబ్బంది పడుతున్నారు. - **సక్లాయిన్** ● పరిశీలించి మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.
- రవి, పురపాలక కమిషనర్, రాయచోటి

అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం అండ

ఎస్.ప్రసాద్‌బాబు

రాయచోటి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని రాజంపేట పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచిన ఘనత ప్రభుత్వానికి దక్కిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. వేసవిలో 15 రోజుల సెలవులు, పిల్లలకు పాఠాలు చెప్పేందుకు ఆట వస్తువులు, సౌకర్యాలు కల్పించారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడానికి సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం


పూజలు అందుకుంటున్న స్వామివారు

గుర్రంకొండ, న్యూస్‌టుడే: వేద మంత్రాలు, గోవింద నామస్మరణ నడుమ తరిగొండలో లక్ష్మీనరసింహుని కల్యాణం వైభవంగా జరిగింది. ఆదివారం స్వామి వారికి అభిషేకం, అర్చన, తిరుచ్చి ఉత్సవాలు నిర్వహించారు. స్వామికి తితిదే ప్రతినిధులు పట్టువస్త్రాలు, ప్రత్యేకాభరణాలు సమర్పించారు.

ఖాళీగా కనిపిస్తే.. కబ్జా

ఆక్రమణదారుల చేతుల్లోకి స్థలాలు

గాలివీడు, న్యూస్‌టుడే: గాలివీడు పరిధిలోని ప్రభుత్వ భూములపై కొంత మంది అక్రమార్కులు కన్నేశారు.. ఆర్థిక, రాజకీయ పలుకుబడితో పక్కా నిర్మాణాలను గుట్టుచప్పుడు కాకుండా చేపట్టారు. నాలుగురోడ్ల కూడలి(గేటు) ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ, ఆర్‌అండ్‌బీ స్థలంపై కన్నేశారు.

అగ్రిమెంట్ చేసుకొని నిర్మాణాలు..

గాలివీడు ప్రాంతం కదిరి, రాయచోటి, మదనపల్లె, లక్కిరెడ్డిపల్లె మార్గాల వలయం కావడంతో వాణిజ్య సముదాయాలకు అనుకూలం. తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు పక్కా భవనాలు దర్జాగా నిర్మిస్తున్నారు. కొందరు అగ్రిమెంటు చేసుకొని మరీ భవనాలు విక్రయిస్తుండటం గమనార్హం. నాలుగు రోడ్ల కూడలి ఏర్పాటుకు అక్రమ నిర్మాణాలు తొలగించాలని రెవెన్యూ అధికారులు తాఖీదులు ఇచ్చారు. వలయం పనులు అసంపూర్తిగా వదిలేయడంతో మళ్లీ దర్జాగా కొందరు ఇళ్ల పనులు చేపట్టారు.

ఎవరూ అడగకపోవడంతో..

లక్కిరెడ్డిపల్లె రోడ్డులో ఆవులశెట్టిగారిపల్లి సమీపంలో వంక వద్ద సర్వే నంబరు 833-బిలో 1.51 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గుట్టుచప్పుడు కాకుండా ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీనిపై ప్రజలు ఆందోళన చేయడంతో రెవెన్యూ అధికారులు రంగ ప్రవేశం చేసి అక్రమాలు అడ్డుకున్నారు. ఇప్పటికే కొందరు సమాధులు వేసి భూమి సొంతం చేసుకున్నారు. రాయచోటి రోడ్డులో సర్వే నంబరు 945-1లో 1.68 ఎకరాల భూమిలో 20 సెంట్లలో ఉర్దూ పాఠశాల భవనం, ప్రహరీ నిర్మించారు.

హద్దులు గుర్తించిన స్థలంలో మట్టి తవ్వకాలు

ఈ ప్రాంతాల్లోనూ అంతే..

రాయచోటిలోని కొంత స్థలాన్ని గ్రంథాలయం, గుడి, దారికి కేటాయించారు. పాఠశాల వెనుక ఇంటి నిర్మాణాలకు చదును చేసి ముగ్గువేశారు. రెవెన్యూ అధికారులు గుర్తించి పనులను ప్రారంభంలోనే అడ్డుకుని నిలిపేశారు. మండల రెవెన్యూ కార్యాలయం సమీప సర్వే నంబరు 900బీ-8, బీ9లో 0.40, 1.78 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూమిలో రాళ్లు పాతి హద్దులు గుర్తించారు. ఎవరూ ప్రవేశించకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ ఆక్రమణదారులు బోర్డును మాయం చేశారు. ఆ స్థలం నుంచి మట్టి తవ్వి తరలిస్తున్నారు. మరికొందరు రాళ్లు వేసి పనులు ప్రారంభించారు. రెవెన్యూ అధికారులు నిఘా పెంచడంతో కబ్జా ప్రయత్నాలకు బ్రేకులు పడ్డాయి.

భూములు కాపాడతాం..

ప్రభుత్వ భూముల్లో ప్రైవేటు నిర్మాణాలు జరగకుండా నిఘా పెంచాం. లక్కిరెడ్డిపల్లి మార్గంలో, ఉర్దూ పాఠశాల వద్ద పనులు నిలిపేశాం. ఎస్.ఎన్.900 బీలో తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు చెప్పడంతో వెళ్లి అడ్డుకున్నాం. అన్ని చోట్లా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. అనుమతి లేకుండా ప్రవేశించే వారిపై చర్యలు తీసుకుంటాం. గ్రామస్థులు సహకరించాలి.
– భాగ్యలత, తహసీల్దారు, గాలివీడు

వసతిగృహానికి మోక్షం

తుదిమెరుగులు దిద్దుకుంటున్న మైనార్టీ వసతిగృహం

ఈనాడు స్పందన

కలికిరి సమీప కె.మాదిగపల్లె కాలనీ వద్ద నిర్మాణం చేపట్టిన ఇంటర్మీడియట్ మైనార్టీ బాలుర వసతిగృహం ప్రారంభానికి తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ఆరేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేయగా.. పనులు చేపట్టిన గుత్తేదారు బిల్లులు రాలేదని ఆపేశారు. ఇక్కడ సమస్యపై 'ఈనాడు'లో పలు మార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.65 లక్షలు విడుదల చేయడంతో పనులు చురుగ్గా సాగి ప్రారంభానికి సిద్ధమవుతోంది. **- న్యూస్‌టుడే, కలికిరి**

ఆటంకం లేకుండా.. ప్రయాణం సులువుగా

రాయచోటి ఠాణా సర్కిల్ రాజంపేట వైపు వాహనదారులు సులువుగా వెళ్లడానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టారు. స్థిరంగా, స్థలం తక్కువ ఉండేలా డ్రిల్లింగ్ చేసి ఇనుప స్టాండ్లు(బారికేడ్లు) బిగిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసుల సూచన మేరకు వీటిని ఆ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కొంతమేరైనా వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలనేది అధికారుల ఆలోచన. **-న్యూస్‌టుడే, రాయచోటి**

సిమెంట్ దిమ్మెలపై వారపుసంత

పెద్ద పంచాయతీగా ఉన్న పీలేరులో బస్టాండు పక్కన మంగళవారం జరిగే వారపు సంతతో పంచాయతీకి రూ.25 లక్షల ఆదాయం వస్తోంది. సంత ప్రాంతంలో ఏడేళ్ల కిందట నిర్మించిన సిమెంట్ దిమ్మెలు తప్ప వ్యాపారులకు నీడగా రేకుల షెడ్లు ఏర్పాటు చేయలేదు. సంత రోజున దిమ్మెలపై సరకులు పెట్టుకుని ప్లాస్టిక్ పరదాలు కట్టుకుంటున్నారు. పీలేరు, పులిచెర్ల, సదం, కంభంవారిపల్లె, యర్రావారిపాళెం ప్రజలు వచ్చి సరకులు తీసుకెళ్తారు. దిమ్మెలు లేనిచోట మట్టిపైనే బుట్టల్లో కూరగాయలు విక్రయిస్తుంటారు. సంత గుత్తేదారుడు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పీలేరు**

తప్పుడు ప్రచారంపై ఫిర్యాదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడుపై డీప్ ఫేక్ ఏఐ వీడియోలు, ఫొటోలతో చేస్తున్న తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోవాలని మదనపల్లెకు చెందిన రమేష్‌బాబు ఆదివారం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కొందరు ఉద్దేశపూర్వకంగా తితిదే ఛైర్మన్ స్వరం, రూపం, వ్యక్తిత్వాన్ని అనుకరించేలా నకిలీ వీడియోలు, ఫొటోలు సృష్టించి సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారన్నారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన తితిదే గౌరవాన్ని దెబ్బతీయడానికి పన్నిన కుట్రగా కన్పిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని, చర్యలు తీసుకుంటామని సీఐ రాజారెడ్డి తెలిపారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చండి

సంఘీభావం తెలుపుతున్న వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని. లేకపోతే ఉద్యమం ఉద్ధృతం చేస్తామని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి(వీఆర్‌ఎస్ఎస్) అధ్యక్షుడు పొదల నరసింహులు తెలిపారు. ఆదివారం వీఆర్‌ఎస్ఎస్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌ను పార్లమెంట్, అసెంబ్లీలో పలువురు ప్రజాప్రతినిధులు ప్రస్తావించడం సంతోషకరమన్నారు. అయిదు దశాబ్దాలుగా దీనిపై పోరాటం చేస్తున్నామని, ప్రభుత్వాలు, పాలకులు మారినా సాధ్యం కాలేదన్నారు. పార్లమెంట్‌లో ఈ అంశంపై మాట్లాడిన నంద్యాల ఎంపీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా న్యాయం జరగలేదన్నారు. సమితి నాయకులు శ్రీరాములు, విజయ్‌మోహన్, విష్ణుచైతన్య, ఆనంద్, శివ, గౌరమ్మ, పార్వతమ్మ, తేజ, మధు, మునిలక్ష్మి, శంకరమ్మ పాల్గొన్నారు.

గాలివీడులో రూ.70 లక్షలతో మెగా పార్కు

గాలివీడు, న్యూస్‌టుడే: స్థానిక పెద్దచెరువు సమీపంలో రూ.70 లక్షలతో మెగా పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు, తెదేపా నేత లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇందుకు చెరువు సమీపంలో ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లె రోడ్డు నుంచి ఉద్యానం మీదుగా రాయచోటి రోడ్డు వరకు ఉదయపు నడక మార్గాన్ని నిర్మిస్తామన్నారు. సంబంధిత నమూనా పరిశీలించారు. తెదేపా మండల అధ్యక్షుడు హేమకుమార్‌రెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, ఫరీద్‌బాషా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, దాసరి చిన్నరెడ్డి, రైతు సంఘం కార్యదర్శి వెంకట శివారెడ్డి, ఆవుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఇండియన్ సూపర్ గేమింగ్ లీగ్ కార్యక్రమంలో మండిపల్లి

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: ముంబయిలో జరిగిన ఇండియన్ సూపర్ గేమింగ్ లీగ్ కర్టన్ రైజర్ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయనకు క్రీడాకారులు, ప్రముఖులు స్వాగతం పలికారు. ఆ రంగంలో భారతదేశానికి ఉన్న అపార అవకాశాలను ఆయన తెలియజేశారు. యువతలోని ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా రంగాన్ని డిజిటల్ దిశగా విస్తరించేందుకు లీగ్‌లు దోహదం చేస్తాయన్నారు. విశాఖలో ఫైనల్స్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గ్రామీణ విద్యార్థులు.. క్రీడల్లో మెరికలు

☛ అందివచ్చిన ప్రోత్సాహం ☛ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా

వాలీబాల్ సాధనలో విద్యార్థులు

న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ, రామాపురం: గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారు.. గెలవాలనే తపన, ఆసక్తితో వివిధ క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు.. తమ భవితకు బంగారు బాట వేసుకుంటున్నారు.. పాల్గొన్న ప్రతి పోటీలో చక్కటి ప్రతిభ చూపి పతకాలు కైవసం చేసుకుంటున్నారు.. ఆపై పలువురికి ఆదర్శంగా నిలిచి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా..

నేను రాయచోటి ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. తల్లి విజయలక్ష్మి, తండ్రి విశ్వనాథ్‌రెడ్డి. తండ్రి చిన్నప్పుడే చనిపోవడంతో మా అమ్మే.. అన్నీ తానై చూసుకుంటోంది. తల్లి కష్టాన్ని చూస్తూ పెరిగా. 2024-25లో కడపలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపా. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. 2025-26లో చిత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-19 వాలీబాల్ పోటీల్లో సత్తా చూపా. ఎలాగైనా కష్టపడి క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని సాధన చేస్తున్నా. **-నవదీప్ రెడ్డి**

క్రీడల్లో సత్తా..

నేను రామాపురం మండలంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. నాకు కబడ్డీ, వాలీబాల్ క్రీడలంటే ఎంతో ఇష్టం. 2025-26లో కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-15 కబడ్డీ పోటీల్లో పాల్గొని పతకం సాధించా. జిల్లా స్థాయి పోటీల్లో అనేక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్నా. జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కఠోర సాధన చేస్తున్నా. **-యశ్వంత్**

అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తా..

మా స్వగ్రామం మట్లి. పెద్దూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. తల్లి రాణి. తండ్రి నగేష్. మాది వ్యవసాయ కుటుంబం. నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఎంతో మక్కువ. పీడీ జగదీశ్వరయ్య ప్రోత్సాహంతో పులివెందులలో గతేడాది నవంబరులో నిర్వహించిన 69వ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో కడప జట్టు తరఫున ఆడి జట్టును ప్రథమ స్థానంలో నిలిపా. త్వరలో దిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించా. జాతీయ స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని నిరంతరం సాధన చేస్తున్నా. **-హేమశ్రీ**

వైద్యురాలిగా సేవ చేస్తా..

మా ఊరు మట్లి. పెద్దూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. తల్లి అంజలి, తండ్రి ఆంజనేయరాజు. మాది వ్యవసాయ కుటుంబం. క్రీడలంటే ఎంతో మక్కువ. పీడీ జగదీశ్వరయ్య ప్రోత్సాహంతో కడప జిల్లా పులివెందులలో గతేడాది నవంబరులో జరిగిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో కడప జట్టు తరఫున ఆడి జాతీయ పోటీలకు ఎంపికయ్యా. త్వరలో డిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనబోతున్నా. క్రీడల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి క్రీడా కోటాలో మెడిసిన్ సీటు సాధించి వైద్యురాలినై ప్రజలకు సేవ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా. **-రెడ్డిగీత**

హామీల అమలుకు కృషి

రాయచోటి, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రాల్లో సదుపాయాలు కల్పించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 58,204 మంది సిబ్బందికి రూ.75 కోట్లతో 5జీ స్మార్ట్ ఫోన్లు అందించామన్నారు.

సౌర విద్యుత్తు సీసీ కెమెరాల ఏర్పాటు

గరుగుపల్లి(గాలివీడు), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్తుతో పనిచేసే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి చట్ట వ్యతిరేక పనులపై నిఘా పెంచామని ఎస్సై నరసింహారెడ్డి తెలిపారు. గరుగుపల్లి కస్పాలో మోపూరివాండ్లపల్లికు చెందిన దాత మాజీ మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు మోపూరి రమణయ్య సమకూర్చిన సోలార్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. చరవాణికి అనుసంధానంగా ఇవి పనిచేస్తాయని ఎస్సై వివరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్రగాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె పట్టణం రెడ్డెప్పనాయుడుకాలనీకి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌రెడ్డి(65) ఆయన భార్య విశ్రాంత అధ్యాపకురాలు భవానీదేవి(63) ఆదివారం బి.కొత్తకోట మండలంలోని ఆలయానికి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా కురబలకోట మండలం చెన్నామర్రిమిట్ట వద్ద అదుపుతప్పి కారు పొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వీరు తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

● మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన రమేష్, వెంకటరమణ గుర్రంకొండ మండలంలోని తరిగొండ ఆలయానికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి మదనపల్లెకు వస్తుండగా సీటీఎం వద్ద కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

● నిమ్మనపల్లె మండలం జాండ్రబైలుకు చెందిన విశ్వనాథనాయుడు ఆదివారం సొంత పనిపై పుంగనూరు వెళ్లాడు. స్వగ్రామానికి వస్తుండగా వనమలదిన్నె సమీపంలో బొలేరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అవుట్ పోస్టు సిబ్బంది సమాచారాన్ని పుంగనూరు పోలీసులకు తెలియజేశారు.

ప్రాణత్యాగాల ఫలితమే వర్గీకరణ

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎందరో ప్రాణ త్యాగాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ అని పీలేరు నియోజకవర్గ ఎంఎస్‌పీ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ అన్నారు. ఎమ్మార్పీఎస్ ద్వారా ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అమరులైన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆదివారం పీలేరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటాలతో ఎస్సీ ఉప కులాలకు న్యాయం జరిగిందన్నారు. వెంకట్రమణ, బాలసుబ్రహ్మణ్యం, హరినాథ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

EENADU e Classifieds

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Mishra Sharmila Devi (OldName)W/o M.Niranjan Prasad, 205FirstFloor, SaiKrishnaBuilding, BalajiColony, Opp:Rallapalli Rest House, Tirupati, AP 517501.I Changed My Name to Mishra Sharmila. Henceforth I Willbe known as Mishra Sharmila.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

తిరుపతి గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డుకు AB AAVAS Phoenix Tower Smart Homesలో 2 BHK, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346.

PLOT FOR SALE

GENERAL

తిరుపతి IIT దగ్గర దుర్గిపేరినందు 25x40 కొలతలతో West ఫేసింగ్ ప్లాట్ కలదు. కేవలం 4,20,000/- మాత్రమే. ✆ 80997 85333.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నేషనల్ హైవేలకి ఆనుకొని తిరుపతిలో ప్లాట్‌లు చూస్తున్నారా? అయితే ఫైనల్‌అప్రూవ్డ్ కలిగిన ప్లాట్లు స్పాట్ రిజిస్ట్రేషన్ డైరెక్ట్ ఓనర్ ✆ 95027 74175 / 79959 92114.

WANTED

GENERAL

తిరుపతిలో 3BHK ఇండివిడ్యువల్ హౌస్ లేదా అపార్ట్‌మెంట్ ఫ్లాట్ అన్ని వసతులు గలది కావలెను. Con: 9393601489.

JOBS

Wanted Female Hostel Incharges Qualification any Degree. Age limit: 25 to 45 years. Salary upto: 15000/- Working Location: Master Minds College, Tirupati. Contact: 73822 59722.

We are Hiring 1.Charted Accountant (Male/ Female) 2.Office Asst. Executive (Female). Experience: Preferred, Salary: Depend on Experience, Location: TPT, Email:gurappaparameswara @ gmail.com ✆ 81234 59658.

తిరుపతిలో ప్రముఖ హోటల్‌లో పనిచేయుటకు మేనేజర్ కావలెను. మంచి జీతం+ అలవెన్సు Q: ఇంటర్. Contact: 9502561265.

తిరుపతి చుట్టుప్రక్కల సివిల్‌వర్క్స్ చేయించుటకు సూపర్‌వైజర్స్ కావలెను. Qua: డిప్లొమా/ B.Tech/ Any Degree. ఆకర్షణీయమైన జీతం ✆ 94941 77700.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్ / హౌస్‌కీపింగ్ కావలెను. 50 సం॥ వయస్సు, 12Hr డ్యూటీ, జీతం: 12,000 - 14,000, తిరుపతి, మదనపల్లిలో. ✆ 72880 04466.

EENADU THE Ec WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

రాయచోటి
• రాయచోటి • పీలేరు

అలంకరణలో అమ్మవారు

వైభవంగా అనంతపురమ్మ జాతర

శాఖంవారిపల్లె (వాల్మీకిపురం), న్యూస్‌టుడే: మండలంలోని శాఖంవారిపల్లెలో కొలువైన అనంతపురమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. శనివారం రాత్రి నుంచి బోనాలు సమర్పించారు. ఆదివారం పుష్పపల్లకిపై అమ్మవారిని అధిరోహించి గ్రామోత్సవం నిర్వహించారు. ● **గుర్రంకొండ:** సంతాన ప్రదాతగా ప్రసిద్ధిగాంచిన చెర్లోపల్లె రెడ్డెమ్మ దేవతకు వైభవంగా పూజలు జరిగాయి. ఆదివారం మహిళలు వరపడు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ఆర్డీవో కార్యాలయంలో గ్రీవెన్స్

పీలేరు, న్యూస్‌టుడే: సోమవారం పీలేరు మదనపల్లె మార్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక ఉన్న కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ జరుగుతుందని కార్యాలయ పరిపాలనాధికారి సురేష్‌బాబు తెలిపారు. రైతులు, ప్రజలు సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందజేయాలన్నారు. ● **పీలేరు గ్రామీణం:** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పీలేరు ఇన్‌ఛార్జి ఆర్డీవో శ్రీనివాసులు ఆదివారం తెలియజేశారు. భూమి స్వభావం, వర్గీకరణ, సర్వే నంబర్ లేకపోవడం వంటి సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతులు ఆర్డీవో, తహసీల్దారు కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

నిహారికకు జ్ఞాపిక ఇస్తున్న నిర్వాహకులు

రాష్ట్రస్థాయి పరీక్షల్లో ప్రతిభ

గాలివీడు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్‌వో)లో గాలివీడు కేజీబీవీ 9వ తరగతి విద్యార్థిని నిహారిక రెండో ర్యాంక్ సాధించింది. తిరుపతిలో బాలికకు రూ.3 వేల నగదు, ధ్రువపత్రం, జ్ఞాపికను అందించినట్లు ప్రిన్సిపల్ శిల్ప తెలిపారు.

జాతీయ రహదారి అధ్వానంగా మారి

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు ఆర్టీసీ బస్టాండు నుంచి రెండు కిలోమీటర్ల దూరం తిరుపతి మార్గం దోబీఘాట్ వద్ద రోడ్డు మధ్యలో తారు లేచిపోయి అధ్వానంగా మారింది. ఇటుగా రాకపోకలు సాగించాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం అవస్థల నడుమ ప్రయాణాలు సాగిస్తున్నారు. మదనపల్లె- తిరుపతి జాతీయ రహదారి పీలేరు పట్టణానికి కిలోమీటరు దూరంలో ఉంది. దీంతో పట్టణంలో ఉన్న ప్రస్తుత తారు రోడ్డుకు మరమ్మతులు చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన జాతీయ రహదారిలో దూర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు పీలేరు పట్టణంలోకి రాకుండా నేరుగా వెళ్తున్నాయి. పాత తారు రోడ్డులో కేవలం ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మాత్రమే వెళ్తున్నాయి. తిరుపతి-మదనపల్లె మధ్య తిరిగే మదనపల్లె డిపోకు చెందిన నాన్‌స్టాప్ బస్సులకు పీలేరులో స్టాప్ లేక నేరుగా హైవే పైనుంచి వెళ్లిపోతున్నాయి.

బస్సులు రాకపోవడంతో..

మదనపల్లె- తిరుపతి మధ్య తిరుగుతున్న ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు జాతీయ రహదారిపై వచ్చి కడప మార్గంలో ప్రవేశించి.. ఆపై పీలేరు బస్టాండ్‌కు వచ్చి మళ్లీ కడప మార్గంలోనే మదనపల్లె వెళ్తున్నాయి. దీంతో తిరుపతికి వెళ్లే పాత రోడ్డును ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానికంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా తారురోడ్డుకు మరమ్మతులు చేయిస్తే వాహనదారులకు, పాదచారులకు సౌకర్యంగా ఉంటుందని వాపోతున్నారు.

అవస్థల్లో ప్రజలు

దోబీఘాట్ వద్ద దెబ్బతిన్న తారు రోడ్డు

గౌతమ్‌ను సత్కరిస్తున్న సంఘం నాయకులు

అల్లుఅర్జున్ అభిమాన సంఘం కార్యదర్శి నియామకం

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా అల్లుఅర్జున్ అభిమాన సంఘం కార్యదర్శిగా మండలంలోని ఈతచెట్లవారిపల్లెకు చెందిన చింతపర్తి గౌతమ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం సంఘ సభ్యులు గౌతమ్‌ను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ అభిమాన సంఘం ద్వారా సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు కుట్టిరాయల్, ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

చింతపర్తి (వాల్మీకిపురం), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో తెదేపా కార్యకర్తల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం చింతపర్తిలో తెదేపా నాయకుడు నిరంజన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డితో కలిసి పర్యటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.2 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మాజీ సర్పంచి జి.రమణయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కుమారుడు భాస్కర్ అనారోగ్యంతో మృతిచెందడం బాధాకరమన్నారు. రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల, పార్టీ మండలాధ్యక్షుడు దాము రెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, శేషాద్రిరెడ్డి, సత్యారెడ్డి తదితరులున్నారు. ● **కంభంవారిపల్లి:** గ్రామాల్లో తెదేపా నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి సూచించారు. వంగిమళ్లవారిపల్లెలో నాయకులతో సమావేశమయ్యారు. మండల అధ్యక్షురాలు గీతాంజలి, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వ్యవస్థాపక అధ్యక్షుడు హరినాథరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో దేవళంపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్లబ్ ఆధ్వర్యంలో 28 జతల స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. సంఘ సభ్యులు ఉన్నారు.

ఇంటిపై తీగలు తొలగించరూ..?

టి.పసలవాండ్లపల్లె పంచాయతీ గుట్టకిందపల్లెలో లక్ష్మీపతి నాయుడు, శివప్పనాయుడు, మధుసూదన్ నాయుడు నివాసాలపై విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఇంటిపైకి వెళ్లాలంటేనే ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో మరింత కష్టంగా ఉందని వాపోతున్నారు. విద్యుత్తు తీగలు ఉండటంతో ఇంటి పైకప్పు పైన వరిగడ్డి, వేరుసెనగ తండు తదితరాలు వేయడానికి భయపడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు ఎప్పుడు పైకి వెళ్తారోనని కంట కనిపెడుతున్నట్లు చెప్పారు. తీగలు తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గుర్రంకొండ**



భజన చేస్తున్న రమణమూర్తి, భక్తులు

సత్యసాయి భజన మండలి ఏర్పాటు

పీలేరు, న్యూస్‌టుడే: సత్యసాయి బాబా అందరి ఆరాధ్య దైవమని భజన మండలి జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి అన్నారు. ఆదివారం పీలేరులో శ్రీసత్యసాయి భజన మండలిని ప్రారంభించారు. పీలేరు సాయి బాలాజీ ఆసుపత్రిలో డాక్టరు ఈశ్వరసురేంద్ర అధ్యక్షతన మండలి కన్వీనర్‌గా ఎస్.హరిప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. సత్యసాయిని పూజిస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు.

ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నైమిశారణ్య పీఠాధిపతి శ్రీబాలబ్రహ్మానంద సరస్వతి స్వామీజీ తెలిపారు. ఆదివారం అనంతపురం గ్రామంలోని గంగమ్మ ఆలయంలో పూజలు చేసి, ప్రవచనాలు బోధించారు. ఆలయ ఈవో శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ గుర్రం రామారావు

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ గుర్రం రామారావు పేర్కొన్నారు. పీలేరులో ఆదివారం మాలల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గుర్రం నారాయణ, నక్కా వెంకటరమణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరస్థుడి అనుచరులపై నిఘా

రాయచోటి, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం మంగళూరుకు చెందిన నేరస్థుడు నసీర్ అరెస్టు తర్వాత రాయచోటికి చెందిన అనుచరులపై పోలీసులు నిఘా ఉంచారు. నసీర్‌కు వివాహం చేయడం, ఆస్తుల కొనుగోలు లాంటి వ్యవహారాల్లో కీలకంగా ఉన్న మహబూబ్‌బాషాపై కర్ణాటకలో కేసు నమోదు చేశారు. అతనిని అరెస్టు చేసేందుకు శనివారం కర్ణాటక పోలీసులు రాయచోటికి వచ్చారు. వారి రాకను పసిగట్టిన బాషా పరారయ్యారు. ఆయన అరెస్టయితే మరెన్నో విషయాలు వెలుగు చూస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
మా నాయకులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు గారు నేడు తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేయుచున్న శుభ సందర్భంగా వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు. వారు భవిష్యత్తులో ఇలాంటి ఉన్నత పదవులు మరెన్నో అధిరోహించాలని మనసారా కోరుకుంటూ...
సుగవాసి జానకిరామ్
శ్రీ విజయలక్ష్మి జ్యువెలర్స్ రాయచోటి
ఏనుగుల విశ్వనాథ్
ప్రొ॥ K.L.H. బార్ & రెస్టారెంట్ రాయచోటి
పోత రమణ
S.N. కాలనీ రాయచోటి
కోలా అయ్యవారయ్య
IOC పెట్రోల్ బంకు మాసాపేట, రాయచోటి
పసుపులేటి నాగేంద్ర
లక్ష్మీపురం, రాయచోటి
పేట సురేష్
లక్ష్మీపురం, రాయచోటి
సుగవాసి మురళిమోహన్
ప్రొ॥ S.N.S. మోడ్రన్ రైస్‌మిల్ & శ్రీ విశ్వభారతి హైస్కూల్ మాసాపేట, రాయచోటి
శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు గారు
TDP రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు,
Ex. TTDపాలకమండలి సభ్యులు
బండక్రింద మనోహర్
DVMC సభ్యులు
బెల్లం చిన్నరెడ్డెప్ప
కొట్టె వెంకటరమణ
చోలరాజు ప్రవీణ్‌కుమార్ రాజు
కటారి శివ
యల్లం శరత్‌కుమార్
సంగరాజు రాజేష్ కుమార్‌రాజు

ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులుగా నేడు ప్రమాణస్వీకారం చేయుచున్న మా నాయకులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు గారు
టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు
సుగవాసి శ్రీనివాసులు
టీడీపీ నాయకులు, రాయచోటి
మన్నేరు రామాంజనేయులు
టీడీపీ నాయకులు, రాయచోటి
మన్నూరు రాజశేఖర్
టీడీపీ నాయకులు, రాయచోటి
సి.వి.ప్రసాద్, ప్రసాద్ రెసిడెన్సీ & ప్రసాద్ స్టూడియో , రాయచోటి
బండి మల్లికార్జున
హరిత హోటల్, రాయచోటి
జి.త్యాగరాజు
టీడీపీ నాయకులు, రాయచోటి

(c) eenadu

బ్రహ్మోత్సవాలకు 7.89 లక్షల మంది హాజరు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మును పెన్నడూ లేని విధంగా శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని రికార్డు స్థాయిలో భక్తులు దర్శించుకున్నట్లు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. 28 రోజుల్లో 7,89,179 మంది రాగా, శివరాత్రి ఒక్క రోజే సుమారు 1.28 లక్షల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడం విశేషం అని పేర్కొన్నారు.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి భక్తుల రద్దీ పెరిగింది. ప్రస్తుతం భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయి శిలాతోరణం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి 14 గంటల్లో, రూ.300 ఎస్‌ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 75,428 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.56 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

మూత్రగండాలు

• జిల్లాలో పెరుగుతున్న కిడ్నీ బాధితులు

మదనపల్లె డయాలసిస్ కేంద్రం

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే: జిల్లాలో డయాలసిస్ కేసులు పెరుగుతున్నాయి. తక్కువ వయసులోనే పలువురు కిడ్నీ బాధితులుగా మారుతున్నారు. ఆహార అలవాట్లు, మందుల వినియోగం తదితరాల ప్రభావం కిడ్నీలపై పడుతోంది. చివరి వరకు వ్యాధిని గుర్తించలేకపోవడంతో చాలా మంది డయాలసిస్ కేంద్రాలకు వరుస కడుతున్నారు.

ఆహార అలవాట్లతో..

ఇటీవల కాలంలో ఆహారపు అలవాట్లు మారిపోతున్నాయి. ప్రజలు ఎక్కువగా జంక్ ఫుడ్స్‌కు అలవాటు పడుతున్నారు. దీనికి తోడు సక్రమంగా నీరు తాగకపోవడం, ఆహారం కల్తీ, మధుమేహం, రక్తపోటు బారిన పడే వారు మందులు ఎక్కువగా వినియోగిస్తుండటంతో కిడ్నీలు పాడవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. మదనపల్లె, పుంగనూరు ప్రభుత్వ డయాలసిస్ కేంద్రాల్లో చికిత్సలు పొందుతున్న వారిలో 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు బాధితులు ఎక్కువగా ఉన్నారు.

ఇవీ వివరాలు..

ప్రభుత్వ డయాలసిస్ కేంద్రాలు: 2

ఎక్కడెక్కడ: మదనపల్లె, పుంగనూరు

పడకలు: 28

చికిత్సలు పొందుతున్నది: 185 మంది

ప్రైవేటు కేంద్రాలు: 10

డయాలసిస్‌కు వస్తున్నది: 800 మంది

పెరుగుతోన్న రోగులు..

మదనపల్లె, పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు రాయచోటిలో ప్రభుత్వ, ప్రైవేటు డయాలసిస్ కేంద్రాలు నడుస్తున్నాయి. వారంలో మూడు రోజుల పాటు బాధితులకు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. ఆయా చోట్ల 950 మందికి పైగా రోగులు సేవలు వినియోగించుకుంటున్నారు. రోగుల తాకిడి పెరగడంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఉన్న 15 పడకలతో పాటు అదనంగా నాలుగు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

లక్షణాలుంటే పరీక్షలు తప్పనిసరి..

మూత్ర విసర్జనలో మార్పులు, ఆకలి తగ్గిపోవడం, కాళ్ల వాపు, నీరసం, శరీరం మొత్తం దురదలు, వాంతులు, కడుపు ఉబ్బడం, చిన్న చిన్న పనులకు ఆయాసం రావాడం, మూత్రంలో నురగ కనిపిస్తే కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి. సరైన మోతాదులో రోజూ నీరు తాగాలి. నొప్పి మాత్రలకు దూరంగా ఉండాలి. **- వెంకటేశ్, డయాలసిస్ కేంద్రం ఇన్‌ఛార్జి, మదనపల్లె**

దయచేసి వినండి.. సమస్యలు పరిష్కరించండి

డిజిటల్ బోర్డులు లేని ఆరో ప్లాట్‌ఫాం

తిరుపతి (రైల్వే), న్యూస్‌టుడే: తిరునగరిలో రైల్వే ప్రయాణికులకు పరుగులు తప్పడం లేదు. రైళ్ల సమయం, చేరుకునే ప్లాట్‌ఫాం, బోగీ నంబర్లు సూచించే డిజిటల్ బోర్డులు, అనౌన్స్‌మెంట్ వంటివి సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రోజుకు 90కి పైగా రాకపోకలు సాగించే రైళ్లలో 1.20 లక్షల మంది వరకు ప్రయాణిస్తుంటారు. కానీ ఆఖరు నిమిషం వరకు రైళ్ల ప్లాట్‌ఫాంలు ఖరారు చేయడం లేదు. స్టేషన్‌కు వచ్చేసరికి మరొకటి సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, లగేజీతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు ఎక్స్‌లేటర్లు, లిఫ్టులు పనిచేయకపోవడం, ఆరో ప్లాట్‌ఫాంపై డిజిటల్ బోర్డులు లేకపోవడంతో ఏ బోగీ ఎక్కడ ఆగుతుందో తెలియక తికమక పడుతున్నారు.

సౌకర్యాలకు ప్రాధాన్యం

స్టేషన్‌లో ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్లాట్‌ఫాంలు, రైళ్ల సమాచారానికి సంబంధించి ప్రైవేటు యాప్‌లు ప్రయాణికులను తప్పుదారి పట్టిస్తున్నాయి. రైల్వేశాఖ 'ఎన్‌టీఈఎస్' యాప్‌లో కచ్చితమైన సమాచారం లభిస్తోంది. **- చిన్నప్పరెడ్డి, స్టేషన్ మేనేజర్**

కన్నేస్తారు.. కప్పేస్తారు..

☛ జిల్లాలో యథేచ్ఛగా చెరువుల చదును

నక్కల చెరువులో చదును చేసిన స్థలం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా కేంద్రంగా మదనపల్లెను ప్రకటించిన తర్వాత భూముల విలువ భారీగా పెరిగిపోయింది. దీంతో కొందరు ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలపై కన్నేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కలిసిరావడంతో రాత్రికి రాత్రి ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు.

రాత్రివేళ పూడుస్తూ..

మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో 300 ఎకరాల విస్తీర్ణంలో అమ్మచెరువు ఉంది. పట్టణ జనాభాతో పాటు భూమి విలువ పెరుగుతోంది. రెండున్నర సెంట్లు రూ.40 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ఉంది. దీంతో అమ్మ చెరువులో ఇప్పటికే రెండు ఎకరాలకు పైగా భూమిని ఆక్రమించేశారు. కోళ్లబైలు పరిధిలో వర్షం నీరు ప్రవహించే వంకలను సైతం కబ్జా చేస్తున్నారు. కదిరిరోడ్డులోని చెరువు ప్రాంతం అడవిని తలపిస్తుండటంతో రాత్రి వేళ వ్యర్థాలు వేసి పూడ్చేస్తున్నారు.

60 నుంచి నాలుగు అడుగులకు..

మదనపల్లె సమీపంలోని తట్టివారిపల్లెలో ఎర్రగానిమిట్ట నుంచి లింకిశెట్టి చెరువు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ కొండ వంక మీదుగా వర్షాల సమయంలో నీరు పారుతుంది. ఈ వంక పూర్తి స్థాయిలో అన్యాక్రాంతమైంది. 60 అడుగుల వెడల్పు ఉండాల్సిన వంక నాలుగు అడుగులకు తగ్గిపోయింది. దీని కింద సుమారు 100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. రైతులు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఫిర్యాదులు చేస్తున్నా..

మదనపల్లె సరిహద్దు పంచాయతీ బసినికొండలోని పుంగనూరు రోడ్డు సమీపంలో నక్కలచెరువు 30 ఎకరాల్లో ఉంది. రోడ్డుకు ఆనుకొని ఉండటంతో కొందరు ఆక్రమిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా ఫలితం రాలేదు. విఘ్నేశ్వరుడి కుంట, స్వామి, పాముల చెరువుల పరిస్థితీ అంతే.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం..

పట్టణంలోని అమ్మ, కోమటివాని చెరువులు పురపాలక సంఘానికి అప్పగించాం. వీటిని పుర అధికారులు పర్యవేక్షించాలి. బసినికొండలోని చెరువు, వంకలు, కుంటలు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతాం. పంచాయతీ అధికారులకు తెలియజేసి ఆక్రమణలు జరగకుండా చూస్తాం. **- సురేష్‌బాబు, ఈఈ, జలవనరుల శాఖ**

ఇక అరచేతిలోనే.. డిజిటల్ గ్రంథాలయం

ఎన్‌డీఎల్ఐ యాప్‌తో ప్రయోజనం

న్యూస్‌టుడే, గాలివీడు, కలకడ

విజ్ఞానం పెంచుకొనేందుకు అవసరమైన సమాచారం కోసం చాలామంది గ్రంథాలయాలకు వెళ్తుంటారు. అక్కడికి వెళ్లినా కావాల్సిన పుస్తకం లభించకపోతే నిరాశ పడతారు. వీటన్నింటినీ పరిష్కరించేలా అరచేతిలో డిజిటల్ గ్రంథాలయాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. చరవాణి, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ కంప్యూటర్ అందుబాటులో ఉండి నెట్ సౌకర్యం ఉంటే చాలు. కావాల్సిన పుస్తక ప్రపంచమంతా మీ చెంతనే ఉంటుంది. నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా(ఎన్‌డీఎల్ఐ) యాప్‌ను కేంద్రం తీసుకొచ్చింది. తద్వారా పుస్తకాలు చదువుకోవడం సహా కావాల్సిన సమాచారం సైతం తెలుసుకునే వీలుంది.

● ఈ యాప్‌లో సెంట్రల్ లైబ్రరీలో ఉండే వేలాది పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన వివరాలు ఉంటాయి. డిజిటల్ గ్రంథాలయానికి సంబంధించిన ఎన్‌డీఎల్ఐ యాప్‌ను ఖరగ్‌పూర్ ఐఐటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

అన్ని భాషల్లో..

పాఠశాల, కళాశాల స్థాయి నుంచి ఇంజినీరింగ్, న్యాయశాఖ, వైద్య, విద్య, సివిల్స్ తదితర వాటికి లైబ్రరీలో సంక్షిప్తం చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్న నిపుణుల వీడియో పాఠాలను సైతం ఇందులో వీక్షించొచ్చు. సాహిత్యం, సంస్కృతి, ఇతిహాసం, రామాయణం, మహాభారతం తదితర గ్రంథాలనూ చదివేయొచ్చు. అన్ని విభాగాలకు సంబంధించిన స్టడీ మెటీరీయల్‌ను అన్ని భాషల్లో అందుబాటులో ఉంచారు.

వినియోగం ఇలా....

ల్యాప్‌టాప్.. డెస్క్‌టాప్‌ను వినియోగించే పాఠకులు, వీక్షకులు ndli.iitkgp.ac.in వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయగానే పలు అంశాలు కనిపిస్తాయి. ముందుగా భాష ఎంపిక చేసుకోవాలి. అనంతరం కావాల్సిన అంశంపై క్లిక్ చేసి చదువుకోవచ్చు. ఆయా అంశాలను డౌన్‌లోడ్ చేసుకుని సేవ్ చేసుకోవచ్చు. ప్లే స్టోర్‌లో నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా(ఎన్‌డీఎల్ఐ) అని టైప్ చేసి సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

6న ఉద్యోగ మేళా

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 6న ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున తెలిపారు. మేళాలో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఫోన్‌పే, ఎస్ఆర్ షాపింగ్ మాల్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టం లిమిటెడ్, టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్, టాటా ఎలక్ట్రానిక్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఎంగ్ ఇండియా, అపోలో ఫార్మసీతో పాటు పలు సంస్థల వస్తాయన్నారు. నిరుద్యోగులు https://naipunyam.ap.gov.in లింక్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

పనుల్లో వేగం.. ఊరిలోనే వైద్యం

రూ.2,364 లక్షలతో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు..

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో అట్టహాసంగా ప్రారంభమైన గ్రామీణ ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. బిల్లుల చెల్లింపులో జాప్యంతో గుత్తేదారులు పనులు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో గ్రామీణ ప్రజలు వైద్య సేవల కోసం పట్టణాలు, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిధులు మంజూరు చేయడంతో అసంపూర్తి పనులు పునఃప్రారంభించారు.

92 కేంద్రాలకు నిధులు..

కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. వివిధ పథకాలను గ్రామీణ ఆరోగ్య కేంద్రాల పనులకు అనుసంధానం చేసి నిధులు కేటాయించారు. జిల్లాలో వేర్వేరుగా 15వ ఆర్థిక సంఘంతో పాటు ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్), పీఎంఏబీమ్ (ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్) కింద నిధులు మంజూరు చేశారు. మొత్తం 92 కేంద్రాల భవనాలకు రూ.2,364.65 లక్షలు కేటాయించారు. వీటితో పంచాయతీ రాజ్ శాఖ పర్యవేక్షణలో పనులు ప్రారంభించారు.

బసినికొండలో విలేజ్ హెల్త్ క్లినిక్ పనులు

ఒక్కో కేంద్రానికి రూ.36 లక్షలు..

15వ ఆర్థిక సంఘం ద్వారా ఒక్కో గ్రామీణ ఆరోగ్య కేంద్రానికి రూ.36 లక్షల చొప్పున మంజూరు చేశారు. జిల్లాలో 37 కేంద్రాలకు రూ.1332 లక్షలు కేటాయించారు. పీఎంఏబీహెచ్ఐఎం కింద రూ.55 లక్షల చొప్పున మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో 12 క్లినిక్‌లకు రూ.605 లక్షలు ఇచ్చారు. మరో 43 కేంద్రాలకు ఎన్‌హెచ్‌ఎం నిధులు రూ.427.65 లక్షలు వచ్చాయి. ఈ నిధులతో అసంపూర్తి, గ్రౌండ్ లెవల్‌లో నిలిచిపోయిన పనులు ప్రారంభించినట్లు ఈఈ చంద్రశేఖర్ తెలిపారు.

ఆరోగ్య కేంద్రాల వివరాలు..

నియోజకవర్గం	మంజూరు
మదనపల్లె	26
రాయచోటి	12
పుంగనూరు	10
పీలేరు	25
తంబళ్లపల్లె	19

అంగన్‌వాడీలకు బీమా ధీమా

☛ పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై వర్తింపు

కలకడ, న్యూస్‌టుడే : మాత, శిశు సంరక్షణలో కీలకంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు బీమా ధీమా కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వైకాపా ప్రభుత్వంలో అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయలేదు. అధిక ఆదాయం పొందుతున్నారనే సాకుతో నవరత్నాలను వారి కుటుంబాలకు దూరం చేశారు. అనుకోని ప్రమాదం వాటిల్లి... అనారోగ్య సమస్యతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి చెందితే ఎలాంటి సాయం అందేది కాదు. విధుల్లో ఉండి మరణించిన వారికి కూటమి ప్రభుత్వం సాయం అందించడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను వర్తింపజేసేలా చర్యలు తీసుకుంది. తద్వారా అంగన్‌వాడీల కుటుంబాలకు బీమా రక్షణ కలగనుంది.

☛ ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై)కు జిల్లాలో 1,484 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు (18 నుంచి 50 ఏళ్లలోపు), ఆయాలు 1,388 మందిని అర్హులుగా గుర్తించారు. వారు ఏడాదికి రూ.436 నగదు బ్యాంకు ఖాతా లేదా తపాలాశాఖ ద్వారా చెల్లిస్తే రూ.2 లక్షల బీమా వర్తిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగి మృతి చెందినా సహజ మరణం పొందినా బీమా నగదు అందుతుంది. 50 ఏళ్లు పైబడిన అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇది వర్తించదు.

☛ పద్దెనిమిది నుంచి 70 ఏళ్లలోపు వారికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) వర్తింపజేయనున్నారు. పథకం లబ్ధికి వార్షిక ప్రీమియంగా రూ.20 నగదు చెల్లిస్తే సరిపోతుంది. ఇది ప్రమాదవశాత్తు మరణానికి వర్తిస్తుంది. మృతి చెందినా, పూర్తి వైకల్యం పొందినా రూ.2 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.లక్ష అందిస్తారు. ఏటా జూన్ 1 నుంచి మరుసటి ఏడాది మే 31 వరకు బీమా కవరేజీ ఉంటుంది. ఆటో డెబిట్ ద్వారా ప్రీమియం నగదు చెల్లించవచ్చు.

☛ ఉమ్మడి జిల్లాలోని 2,275 అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాలు సేవలందిస్తున్నారు. అందరితో బీమా ప్రీమియం కట్టించి వారితో పాటు కుటుంబాలకు రక్షణ కల్పించేలా స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారులు చొరవ చూపిస్తున్నారు. అర్హులందరూ ప్రీమియం చెల్లించి బీమా పథకాల్లో చేరాలని ఐసీడీఎస్ పీడీ హైమావతి పేర్కొన్నారు.

వెంటాడే దాహం.. అల్లాడే ప్రాణం

● ముంచుకొస్తున్న ముందస్తు ఎండలు ● 200 ఆవాసాల్లో నీటి వనరుల కొరత

తిరుపతి (జీవకోన), చంద్రగిరి, పలమనేరు, న్యూస్‌టుడే: వేసవి వచ్చిందంటే శేషాచలం అడవులను వరుస అగ్నిప్రమాదాలు కబళిస్తుంటాయి.. లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం దగ్ధమవుతూ ఉంటోంది. దీంతో ఆహారం, నీటి అవసరాలకు వన్యప్రాణులు అలమటించాల్సిన పరిస్థితి. మార్చి, ఏప్రిల్‌లో మొదలయ్యే ఎండల తీవ్రత ఈసారి ఫిబ్రవరి ఆఖరు నుంచి మొదలవడంతో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది.

శేషాచలంలో తగ్గిన నీటిమట్టాలు

శేషాచలం పరిధి సుమారు ఐదువేల హెక్టార్లలో విస్తరించింది. మామండూరు, బాలపల్లె, కోడూరు వరకు జలపాతాలు, నీటిచెలమలు, కుంటలు, పాతబావులు ఎన్నో ఉన్నాయి. అయితే తిరుమల, అవ్వాచారికోనకు దక్షిణ భాగంలో ఉండే అటవీ ప్రాంతంలో ఎలాంటి నీటివనరులు లేవు. దీంతో వేసవిలో ఇక్కడి జంతువులు తరచూ జనావాసాల్లోకి వస్తుంటాయి. ఈసారి శేషాచలం అడవుల్లో నీటిమట్టాలు బాగా పడిపోయినట్లు అధికారులు గుర్తించారు. తిరుపతితోపాటు శ్రీకాళహస్తి, ఏర్పేడు, వెంకటగిరి, వడమాలపేట, పుత్తూరు, భాకరాపేట, యర్రావారిపాలెం, కోడూరు పరిధిలో 200 పైగా నీటి కొరత ప్రదేశాలు గుర్తించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న నీటితొట్టెలు, సాసర్ పిట్లతోపాటు కొత్తవి ఏర్పాటు చేసి అవసరాన్ని బట్టి నీరు అందించాల్సిన అవసరం ఉంది.

తిరుపతి డివిజన్‌లో (2004-25)

ఏనుగులు	50
చిరుతలు	35
ఎలుగుబంట్లు	26
దేవాంగపిల్లులు	419
జింకలు, కణితులు	వేలల్లో

బయోట్రిమ్ అటవీ ప్రాంతంలోని కుంటలో నీటిని నింపుతున్న దృశ్యం

పొంచి ఉంటున్న వేటగాళ్లు

చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని పనపాకం, భాకరపేట రేంజ్‌ల పరిధిలో మనుషులు, వన్యప్రాణుల మధ్య నిత్య ఘర్షణలు జరుగుతున్నాయి. వీటి పరిధిలో మూడు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. వేసవిలో అడవి జంతువులు దాహార్తితో రహదారుల తోపాటు గ్రామాలవైపు వస్తూ కుక్కలతోపాటు వేటగాళ్ల బారినపడుతున్నాయి. ఇక్కడ కొందరు అక్రమార్కులకు వేట నిత్యకృత్యం కాగా వేసవి మరింత కలిసి వస్తోంది. వీటి పరిధిలో ఇప్పటివరకు 80 సాసర్ పిట్లు, 14 నీటితొట్టెలు ఏర్పాటు చేసినట్లు చెబుతున్న అధికారులు వేటగాళ్లను సైతం కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

పలమనేరు డివిజన్ ● మొత్తం విస్తీర్ణం: 70 కి.మీ ● ఏనుగులు: సుమారు 70 వరకు ● నీటి కుంటలు: 20 ఉండగా.. అందులో సగానికి పైగా ఎండిపోయాయి. ● వేటగాళ్లు సంచరించే ప్రాంతాలు: ఎం.కోటూరు, చెత్తపెంట, ఊసరపెంట, కలిమిచెట్ల పెంట.

చర్యలు తీసుకుంటున్నాం

వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే కొన్నిచోట్ల నీటిని సరఫరా చేస్తున్నాం. కుంటలు, సాసర్‌పిట్లలో ట్యాంకర్ల ద్వారా నీరు నింపేలా చర్యలు తీసుకుంటాం. వర్షాలు కురిసేవరకు పర్యవేక్షణ కొనసాగిస్తాం. **- సిసెల్వం, అటవీ సంరక్షణాధికారి (సీఎఫ్), తిరుపతి సర్కిల్**

కార్గో ఆదాయం రూ.30.13 లక్షలు

పీలేరు, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లాలోని ఐదు ఆర్టీసీ డిపోలకు సంబంధించి ఫిబ్రవరి నెలలో కార్గో ఆదాయం లక్ష్యం రూ.40.86 లక్షలకు గాను.. రూ.30.13 లక్షలతో 73.75 శాతం లక్ష్యాలు సాధించారు.

డిపోల వారీగా.. మదనపల్లె-1 రూ.1.7 లక్షలతో(72.81 శాతం), మదనపల్లె-2 రూ.18.81 లక్షలు(78.61 శాతం), పీలేరు రూ.2.34 లక్షలు(65.25 శాతం), పుంగనూరు రూ.1.89 లక్షలు(58.41 శాతం), రాయచోటి రూ.5.37 లక్షలు (69.4 శాతం) సాధించారు. ● 2025 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి చివరి వరకు అన్నమయ్య జిల్లాలోని ఐదు డిపోల ద్వారా కార్గో ఆదాయం రూ.3.94 కోట్లు వచ్చింది. ● అదే 2024లో ఏప్రిల్ ఒకటి నుంచి 2025 ఫిబ్రవరి చివరి వరకు రూ.3.46 కోట్లు సాధించారు. ● సరాసరి గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి చివరి వరకు 11 నెలలకు.. 113.82 శాతం లక్ష్యాలు సాధించారు. ప్రజా రవాణశాఖ కార్గో ద్వారా సరకులు పంపితే త్వరగా డెలివరీ అవుతాయనే ప్రజల నమ్మకంతో ఆదాయం పెరుగుతోందని డీపీటీవో పి.రాము తెలిపారు. కార్గో సిబ్బంది కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

మదనపల్లెలో టమాటా కిలో రూ.12

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం టమాటా కిలో రూ. 8 నుంచి నాణ్యమైనది అత్యధికంగా రూ.12.50 పలికింది. ఈ మార్కెట్‌కు మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి రైతులు 53 టన్నుల కాయలు తెచ్చారు. ఏ గ్రేడ్ కిలో రూ.11 నుంచి రూ.12.50, బి గ్రేడ్ కిలో రూ.8 నుంచి రూ.11 పలికింది. సగటున కిలో రూ.9 నుంచి రూ.12తో రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలి

కడప నగరపాలక, న్యూస్‌టుడే: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై వైకాపా నాయకులు కడప నగరంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. సీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాల వైకాపా ప్రజాప్రతినిధులు, ఆయా జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కొన్ని నెలలుగా పొరుగురాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలు సీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు గొడ్డలిపెట్టుగా మారాయన్నారు. పనులను ఆపేస్తున్నామని ఏపీ సీఎం తనకు హామీ ఇచ్చినట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును బ్యారేజీ స్థాయికి తెచ్చి నామమాత్రంగా పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సాగు, తాగు నీటి సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా దశలవారీ ఉద్యమాన్ని చేపడతామన్నారు. అనంతరం లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై పలు తీర్మానాలు చేశారు. ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, గురుమూర్తి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు ఈ అంశంపై ప్రసంగించారు.

దళారుల.. అడ్డగోలు దర్శనాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారులు మళ్లీ చక్రం తిప్పుతున్నారు. పీఆర్వో కార్యాలయం నుంచి వచ్చే వీఐపీలకు ఎంత విలువనో.. దళారులు తీసుకువచ్చే బృందాలకు అంతేరీతిలో రాచమర్యాదలు జరుగుతున్నాయి. దీంతో స్వామి, అమ్మవార్ల అంతరాలయ దర్శనాలకు క్యూలైన్లు బారులు తీరుతున్నాయి.

నేతల పేర్లు చెప్పి బురిడీ..

బ్రహ్మోత్సవాలకు ముందు దళారులను ఆలయ కమిటీ వీలైనంతగా కట్టడి చేసింది. విధిగా టికెట్లు తీసుకుని దర్శనాలు చేసుకున్నారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యాక మళ్లీ గాడి తప్పింది. పీఆర్వో కార్యాలయాల ద్వారా అధికారిక ప్రోటోకాల్ భక్తులు పాతిక శాతం మాత్రమే ఉండగా మిగిలినవి దళారుల అడ్డగోలు దర్శనాలే. మహద్వారం వద్ద ట్రస్టుబోర్డు సభ్యులు, అధికారులు ఎవరైనా అడిగితే నేతల పేర్లు చెప్పి పదుల సంఖ్యలో తీసుకెళ్తున్నారు. ప్రధాన మార్గాల వద్ద విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులను బెదిరించి పబ్బం గడుపుకొంటూ ముక్కంటీశుని ఆదాయానికి గండి కొడుతున్నారు.

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఏపీ ఎస్పీడీసీఎల్ సర్కిల్ స్థాయిలో వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించుకునేందుకు సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని తొమ్మిది జిల్లాలకు సంబంధించిన వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

సీఎండీ 89777 16661,
ఎస్ఈ : 94408 17449

సబ్‌కలెక్టర్, తహసీల్దార్లకు అధికారాలు

■ జేసీ నుంచి మార్పు చేస్తూ ఉత్తర్వులు

మదనపల్లె గ్రామీణ, రాయచోటి, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలోని సమస్యల పరిష్కారానికి జేసీ నుంచి సబ్ కలెక్టర్, తహసీల్దార్లకు అధికారాలు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి పేర్కొన్నారు. మదనపల్లె డివిజన్‌లో భూ సంబంధిత మార్పులు, సవరణలు, మ్యుటేషన్ల సమస్యల పరిష్కారానికి ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

సర్వే నంబర్ల నమోదు..

రీ సర్వేకు సంబంధించి గ్రామాల్లో ఎల్‌పీఎం సవరణ (పాత సర్వే నంబరు, భూ వినియోగం, నీటి వనరులు, పట్టాదారు పేరు, స్వాధీన విధానం, అనుభవదారు పేర్లు), ఆర్వోఆర్ విస్తీర్ణం షేప్‌ఫైల్ సరిచేయడం మొదలైన పనులు సబ్‌కలెక్టర్ చేపట్టే వీలు కల్పించారు. దరఖాస్తు ఆధారంగా ఎల్‌పీఎంలో తప్పుల సవరణ, పట్టాదారులను చేర్చడం, మిస్సింగ్ సర్వే నంబర్లను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయడం, భూమి స్వభావం, వర్గీకరణ మార్పులు, వివాద రిజిస్టర్లకు సంబంధించి నమోదు, తొలగింపులు చేపట్టే అవకాశం ఉందన్నారు.

● తహసీల్దార్లు సివిల్, రెవెన్యూ కోర్టుల ఉత్తర్వుల మేరకు అవసరమైన మార్పులు చేయడం, భూ అన్యాక్రాంతంపై (ల్యాండ్ అలినేషన్), భూ సేకరణ, కేటాయింపు, మార్పిడి, ఆధార్ డీ-సీడింగ్ (భూ రికార్డులు, ఇతర ప్రభుత్వ రికార్డులకు అనుసంధానించి ఆధార్ సంఖ్య తొలగించి సరిచేయడం), ఒకే గ్రామంలో పట్టాదారుకు ఉన్న బహుళ ఖాతాల తొలగింపు, మృతుల పట్టాదారు ఖాతాలు తొలగించి చట్టబద్ధ వారసులను నమోదు చేయొచ్చు. అన్ని ప్రైవేటు నోషనల్ ఖాతాలను రెగ్యులర్‌గా మార్చి సేవలు అందుబాటులోకి తీసుకురావడం, జీరో ఖాతాలను ఆర్వోఆర్ చట్టం ప్రకారం రెగ్యులర్‌గా మార్చడం, డూప్లికేట్ సర్వే నంబర్ల తొలగింపు తదితరాలు చేయొచ్చు.

ఉగాదికి వెళ్దాం.. సొంతింట్లోకి!

☛ 8,800 గృహాలు సిద్ధం

న్యూస్‌టుడే, కంభంవారిపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టింది. పేదల సొంతింటి కల నిజం చేయాలనే లక్ష్యంతో గృహ నిర్మాణాల్లో వేగం పెంచింది. వైకాపా ప్రభుత్వంలో అసంపూర్తిగా వదిలేసిన ఇళ్లను పూర్తి చేయాలనే సంకల్పంతో చర్యలు చేపట్టింది. జిల్లా, మండల స్థాయిలో లక్ష్యాలు విధించడంతో.. ఉగాదికి గృహ ప్రవేశం జరిగేలా చాలా వరకు పనులు పూర్తి చేశారు.

రోజూ లబ్ధిదారులను కలుస్తూ..

ఉగాది నాటికి జిల్లా లక్ష్యంగా ఉన్న 8,800 ఇళ్లను పూర్తిచేసి, గృహ ప్రవేశాలు చేయించాలని అధికారులు పని చేస్తున్నారు. రోజూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. పనులు పూర్తి చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సకాలంలో సిమెంటు ఇస్తూ, బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో ఇంటికి గత ప్రభుత్వం రూ.1.80 లక్షలు చెల్లించగా.. నిధులు సరిపోక చాలా మంది పనులు చేపట్టలేదు. దీంతో కూటమి ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అందిస్తోంది.

గోడలు పూర్తయిన ఇళ్లపై దృష్టి..

లక్ష్యం చేరేందుకు అధికారులు గోడలు పూర్తైన, పైకప్పు వేసిన ఇళ్లపై దృష్టి పెట్టారు. జిల్లాలో గోడలు పూర్తైనవి 4,300, పైకప్పు వేసినవి 700 ఉన్నాయి. ఎలాగైనా 5 వేలు గృహ ప్రవేశాలు చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. రోజూ లబ్ధిదారుల వద్దకు వెళ్లి, నిర్మాణాలు పూర్తి చేయాలని సూచిస్తున్నారు. గతంలో నవంబరులో గృహ ప్రవేశాలు చేయగా, మరో విడతగా మార్చి 19, ఉగాది నాటికి రెండో విడత గృహ ప్రవేశాలకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న గృహ నిర్మాణశాఖ అధికారులు

లక్ష్య సాధనకు చర్యలు..

ఉగాది నాటికి లక్ష్యం మేరకు గృహ ప్రవేశాలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుత లక్ష్యం 8,800 ఇళ్లు. రోజూ అధికారులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వ పరంగా అదనపు సాయం, సిమెంటు, కమ్మీలు అందజేస్తాం. **- రమేష్‌రెడ్డి, పీడీ, గృహనిర్మాణ శాఖ, అన్నమయ్య జిల్లా**

(c) eenadu

మదనపల్లె

• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలపాలి

మాట్లాడుతున్న మహేష్

తంబళ్లపల్లె, ములకలచెరువు, న్యూస్‌టుడే: జనసేన పార్టీ సభ్యత్వాల నమోదులో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుదామని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ అన్నారు. ఆదివారం స్థానిక పాత కళాశాల మైదానంలో పార్టీ నియోజకవర్గ నేత హరినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ మహాయజ్ఞం సమావేశానికి మహేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆపై పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. సమావేశంలో నాయకులు హరినాథ్, రాజారెడ్డి, సురేష్, రఘు, నరసింహులు, అరవిందు, రామకృష్ణ, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో సౌకర్యాలు

పుంగనూరు గ్రామీణం: ఎస్సీ వసతిగృహాల్లో సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని ఎస్సీ హాస్టల్ వార్డెన్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్సీ బాలుర వసతిగృహంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు.

సీఎం సహాయనిధి గొప్ప వరం

మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ద్రాక్షాయణి

పుంగనూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సీఎం సహాయనిధి పథకం పేదలకు వరమని పట్టణ తెదేపా నాయకుడు మధుసూదనరాయల్ అన్నారు. ఆదివారం స్థానిక కట్ట కిందపాళ్యంకు చెందిన మణి మొదలియార్‌కు మంజూరైన రూ.85 వేల సీఎం సహాయ నిధి చెక్కును అతడి కుటుంబ సభ్యులకు తెదేపా నాయకురాలు ద్రాక్షాయణి అందజేశారు. నాయకులు నాగరాజ ఆచారి, శివ, జగదీష్, అఫ్రోజ్, నూర్ పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారి విహారం

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని కల్యాణ వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు మాడవీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం మత్స్యావతారంలో స్వామి దర్శనమిచ్చారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని దీపాలతో అలంకరించారు. **రామసముద్రం:** చెంబకూరులో జరుగుతున్న గట్టు వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు సింహ వాహనంపై విహరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రామసముద్రం: సింహ వాహనంపై గట్టువెంకటేశ్వరస్వామి ★ పుంగనూరు: సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

రామసముద్రం: పెద్దకురప్పల్లె గ్రామపంచాయతీ సందూరుచెరువు కట్టపై స్వయంభుగా వెలసిన గంగమ్మ తల్లికి ఆయకట్టుదారులు ఆలయాన్ని నిర్మించి ఆదివారం విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మట్లవారిపల్లె, తిరుమలరెడ్డిపల్లె, పెద్దకురప్పల్లె, ఓబులనాయుని పల్లెలకు చెందిన ఆయకట్టుదారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఆపై అన్నదానం చేశారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం

పేదలకు రంజాన్ తోఫా అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కెహెచ్‌కె ఫల్లాహ్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ట్రస్టు కార్యదర్శి ఇస్మాయిల్‌ఖాన్ తెలిపారు. ఆదివారం స్థానిక కొత్తపేటలో ట్రస్టు ఆధ్వర్యంలో వంద మంది పేదలకు ఒకొక్కరికి రూ.2 వేలు విలువజేసే రంజాన్ తోఫా కిట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ తన తండ్రి, ట్రస్టు వ్యవస్థాపకులు హఫీజ్‌ఖాన్ రెండున్నర దశాబ్దాల కిందట దీన్ని ప్రారంభించారన్నారు. ఆయన మరణానంతరం ఆ కార్యక్రమాలను తాము కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉస్సానుఖాన్, అబ్దుల్ అలీం, ఉమ్మి, ఇంతియాజ్‌ఖాన్, అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యలో నైపుణ్యం సాధించాలి

పోటీ పడుతున్న విద్యార్థులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఆత్మరక్షణ విద్యలో రాణించాలని విజయ భారతి విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.సేతు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక ఓ కల్యాణ మండపంలో మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వాహకుడు మణిసాయి ఆధ్వర్యంలో ఒకటో ఇంటర్ స్కూల్ ఒకినవ గొజురియో కరాటే ఛాంపియన్ షిప్-2026 పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో మదనపల్లెలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత, బృంద కుమితే, కటా పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయా పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కరాటే మాస్టర్ దేవీద్రాక్షాయణి, పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు, కరాటే మాస్టర్లు పాల్గొన్నారు.

IN THE COURT OF THE 2nd ADDITIONAL DISTRICT JUDGE MADANAPALLE

O.E.P. 18/2016 / O.S. 99/2012

Degree Holders : 1. K.Srinivas, 2. S. Jagadeesh
Judgement Debtor : M. Vijaya Kumari.

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమేమనగా క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిని పైకోర్టు నందు 13.03.2026వ తేదీ నాడు ఉ॥గం॥ 10.30 మొదలు సాయంకాలం గం॥ 5.00 లోపల వేలం వేయబడును. వేలం షరతులు పై కోర్టు నందు తెలుసుకొని వేలం నందు పాల్గొనవచ్చును.

SCHEDULE: Chittoor Dist. Madanapalle Sub- Dist. Madanapalle Municipality Area, Bandameeda kammapalle Village, 2nd Ward S.No. 156/13 Paiki, Ree Moulding House bearing D.No. 2-249-E. Bounded on: East: The House of Surendra, West: The House of Muneer, North: The House retaired by Mudamala Marthamma, South: Road. Within the above boundaries, East to West: 24 feet- or 7.31 Metrs, North to South : 34 feet or 10.36 Metrs, Equivalent to 90.66 Sq yards house site and Ree roofed mouldng house measuring. East to west 24 feet, North to South 28.5 feet Equivalent to 684 Sq. feet with doors, door frames, windows, roof, eleastic fittings and half share in the electrict service conection 5211300011785 borewell, electrict motor, etc.

పై షెడ్యూలు దాఖలా ఆస్తికి 01-01-1988 నండి 16-01-2017వ తేదీ వరకు మదనపల్లి సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు నండి ఇసి తీసి దాఖలు చేయడమైనది. సదరు ఇ.సి., ప్రకారం వాదులకు ప్రతివాది 10-10-2012 నాడు రూ॥ 10,00,000/-లకు రాసిచ్చిన చూపుడాయకం తప్ప వేరే తాకట్లు లేవు. కావున వీటికి లోబడి వేలం గావించ ప్రార్థన

Degree Holder Value Rs. 15,00,000/-
Field Assisant Value Rs. 18,00,000/-
//By Order of the Court//

Y. Samba Siva Reddy, B.A.,B.L.
Advocate for D.Hrs.
Madanapalle.

తెదేపా కార్యకర్త మృతికి సంతాపం

మదనపల్లె పట్టణం: తెదేపా సీనియర్ కార్యకర్త పొన్నూటిపాళెంకు చెందిన గోవిందరాజు మృతి పార్టీకి తీరని లోటని తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు తెలిపారు. ఆదివారం మృతుడి గ్రామానికి వెళ్లి. . అతడి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

ఇరువర్గాల ఘర్షణ

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: గానుగచింత పంచాయతీలోని మద్దిపట్లవారిపల్లెలో ఇంటి జాగా విషయమై జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారని ఎస్సై మధుసుదన్ తెలిపారు. మద్దిపట్లవారిపల్లెకు చెందిన గిరిప్రసాద్‌నాయుడు, శంకరనాయుడు ఒక ఇంటి జాగాను శుభ్రం చేస్తుండగా.. సమీప బంధువు రామచంద్రనాయుడు ఆ జాగాలోకి వచ్చాడు. దీనిపై అతడు ఎందుకొచ్చావని ప్రశ్నించాడు. దీంతో వాగ్వాదమై రామచంద్రనాయుడి కుమారుడు జనార్దన్ నాయుడు, అల్లుడు రమణయ్యానాయుడు వచ్చి ప్రశ్నించగా.. గిరిప్రసాద్‌నాయుడి వర్గం కొడవలితో జనార్దన్‌నాయుడిపై దాడి చేయడంతో గాయపడ్డాడు. ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

మదనపల్లె నేరవార్తలు: చెంబకూరు రోడ్డుకు చెందిన మహబూబ్ జానీ(38) ఆదివారం ఓ ఇంటిలో డిష్ యాంటినా వైరు మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చి.. ఆపై ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అత్తపై.. అల్లుడి దాడి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: సీటీఎం పంచాయతీ చిలకవారిపల్లెకు చెందిన గంగులప్ప, జయమ్మల కుమార్తె శ్వేతను.. ఐదేళ్ల క్రితం లక్ష్మీకాంత్ ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారం క్రితం లక్ష్మీకాంత్.. భార్యతో గొడవ పడటంతో ఆమె అలిగి పుట్టింటికి వెళ్లింది. ఆదివారం అత్తగారింటికి వెళ్లిన అతడు గొడవపడి అత్త జయమ్మపై దాడి చేయడంతో ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

చింతచెట్టు పైనుంచి పడి రైతుకు తీవ్రగాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె మండలంలోని పులసరవాండ్లపల్లెకు చెందిన శివకుమార్ (49) గ్రామ సమీప చింతచెట్టులో కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. కాలు విరిగి తీవ్రంగా గాయపడగా 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి ఆపై తిరుపతికి రెఫర్ చేశారు. ఆసుపత్రి అవుట్ పోస్టు సిబ్బంది సమాచారాన్ని తంబళ్లపల్లె పోలీసులకు తెలియజేశారు.

టపాసులు అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు

పుంగనూరు గ్రామీణం: లైసెన్సు లేకుండా టపాసులు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక ఠాణాలో మాట్లాడారు.

అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం అండ

ప్రసాద్‌బాబు

రాయచోటి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని రాజంపేట పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచిన ఘనత ప్రభుత్వానికి దక్కిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. వేసవిలో 15 రోజుల సెలవులు, పిల్లలకు పోషకాలు చేసేందుకు ఆట వస్తువులు, సౌకర్యాలు కల్పించారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించడానికి సీఎం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.

అడిగేదెవరు.. ఆపేదెవరు..?

★ ఇష్టారాజ్యంగా ఇసుక తరలింపు
★ ప్రేక్షకపాత్ర పోషిస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, ములకలచెరువు, పెద్దమండ్యం, పీటీఎం, బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇసుకాసురుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. వాగులు, వంకలు, చెరువుల్లో లెక్కచేయకుండా ఇసుకను తోడేసి సొమ్ము చేసుకుంటున్నారు.. వాగులు, వంకలు, చెరువుల్లోని ఇసుక అక్రమార్కుల పాలిట కామధేనువుగా మారింది. పలువురి అండదండలతో రాత్రింబవళ్లు దర్జాగా తరలిస్తున్నారు. పెద్దమండ్యంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే నాథుడే కరవయ్యారు. ఇక్కడి వైకాపా నాయకులు ఇసుకను వ్యాపారంగా మార్చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారు.

★ తంబళ్లపల్లె నియోజకవర్గం, ములకలచెరువు మండలంలోని దేవళచెరువు సమీప ఏరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. అంతేకాక.. సమీప వాగుల నుంచి తరలిస్తున్నారు. ★ బి.కొత్తకోట మండలంలో ఇసుక ట్రాక్టర్ రూ.2,500. పీటీఎం మండలం నుంచి ఇసుకను జోరుగా తెచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ★ బి.కొత్తకోట సమీప ఏటిలో ఉన్న ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ★ ములకలచెరువు మండలంలోని వాగుల్లో, వంకల్లో నీరున్నా ఇసుక లోడేసి దర్జాగా తరలిస్తున్నారు.

పెద్దమండ్యం దిగువపల్లి సమీపంలో నిల్వ చేసిన ఇసుక నిల్వలు

అధిక ధరకు విక్రయిస్తూ..

పీటీఎం మండలం నుంచి చేలూరుకు ఇసుక అక్రమంగా అధిక ధరకు తరలిస్తున్నారు. టి.సదుం సమీప పాపొచ్చి నది నుంచి ప్రతి రోజు 15 ట్రాక్టర్ల ద్వారా ఇసుక తవ్వేస్తున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా తరలిపోతుంది. ఇక్కడి నుంచి బి.కొత్తకోట, ములకలచెరువు, శ్రీనివాసపురం జిల్లా తనకల్లు మండలాలకు తెచ్చిపోతున్నారు. ఇక్కడి నుంచి ములకలచెరువుకు రూ.3,500 చొప్పున తరలిస్తున్నారు.

దర్జాగా అక్రమాలు..

పెద్దమండ్యం మండలంలోని కుషావతి నది నుంచి వైకాపా నాయకులు ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నారు. పలువురు వైకాపా నాయకులు.. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో దీన్ని తరలించి వాటాలు పంచుకుంటున్నారు. జేసీబీల ద్వారా పట్టపగలే దందాలు నిల్వ చేసి రాత్రి వేళ తరలిస్తున్నారు. ఇక పెద్దమండ్యం నుంచి గుర్రంకొండ, చిన్నమండ్యం, గాలివీడు మండలాలకు అధిక ధరకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ ధర రూ.3,500 పలుకుతోంది.

చర్యలు తీసుకుంటాం..

ఇసుక అక్రమ రవాణా ఎవరైనా మా దృష్టికి తీసుకువస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇసుకను అధిక ధరకు విక్రయిస్తే వాహనాలు సీజ్ చేస్తాం. -శ్రావణి ఎస్సై, పెద్దమండ్యం

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


శాసనసభ విద్యాపర్యటనకు వెళ్లొచ్చిన విద్యార్థులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ సి.యువరాజ్ కోరారు. విద్యా పర్యటనలో భాగంగా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఇటీవల అమరావతిలోని శాసనసభను సందర్శించడంతో పాటు రాష్ట్ర బడ్జెట్ సమీక్ష సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం పొందారన్నారు. విద్యార్థులు ఈ పర్యటనలో శాసనసభలో జరిగిన ప్రత్యక్ష చర్చలు, ప్రజా సమస్యలపై సభ్యులు వ్యక్తపరిచే అభిప్రాయాలు, ప్రభుత్వ ఆర్థిక విధానాలపై జరిగే విశ్లేషణలు, ప్రజా సంక్షేమ పథకాల గురించి సమగ్రంగా తెలుసుకున్నారన్నారు. దీనివల్ల వారిలో నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలతో ప్రజాసేవ భావనలో ముందుకెళ్లేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులను.. విశ్వవిద్యాలయ ఫౌండర్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ప్రో-ఛాన్సలర్ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, డీన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డాక్టర్ భానుశ్రీరెడ్డి అభినందించారు.

ఏపీఎన్జీవో మహిళా విభాగం జిల్లా కమిటీ ఏర్పాటు

కమిటీ సభ్యులకు సత్కారం

రాయచోటి, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో మహిళా విభాగం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. రాయచోటిలో అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగినులు హాజరయ్యారు. జిల్లా ఛైర్‌పర్సన్‌గా ప్రభావతమ్మ, కోఛైర్‌పర్సన్‌గా టి.సునీత, ఉపాధ్యక్షులుగా ఎ.పద్మజ, ఎం.అంజనమ్మ, నీలిమ, శిరీష, అర్చనయాదవ్, కన్వీనర్లుగా జి.పవన కుమారి, జె.శశికళ, ఎం.సుహాసిని, లావణ్యకుమారి, రమణమ్మ, పి.లక్ష్మమ్మ, రెడ్డెమ్మ, కోశాధికారిగా పార్వతమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీ సభ్యులు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రెండు జిల్లాల కార్యదర్శులు నిత్యపూజయ్య, శ్రీనివాస్, నాగేశ్వర్, పద్మనాభరావు, డి.వి.శివారెడ్డి, మహదేవ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మల్లీశ్వరి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్, ఐఐటీ నీట్ ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. చంద్రకాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి 130 మంది విద్యార్థులకు గాను 125 మంది హాజరయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు..139 మందికిగాను 135 మంది హాజరయ్యారు. ఐఐటీ నీట్‌కు 95 మంది విద్యార్థులకు గాను 92 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని ప్రిన్సిపల్ మల్లీశ్వరితో పాటు ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరిగాయి.

టైలర్ల సంఘం ఆధ్వర్యంలో చాందిని బండి

అలంకరణలో చాందిని బండి

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: తరిగొండ తిరునాలలో జిల్లా టైలర్ల సంఘం ఏర్పాటు చేసిన చాందిని బండ్లు ఆకర్షణగా నిలిచాయి. విద్యుద్దీపాలతో అలంకరించిన బండ్లు.. ఆలయ ఆవరణలో అవి ప్రత్యేక ఆకర్షణగా అలరించాయి. అంకిశెట్టిపల్లెకు చెందిన జిల్లా టైలర్ల సంఘం నాయకులు పార్థసారథి ఆధ్వర్యంలో వీటిని ఏటా ప్రదర్శించడం ఆనవాయితీ. కార్యక్రమంలో టైలర్ల సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తితిదే పవిత్రత దెబ్బతీయడమే వైకాపా లక్ష్యం

మాట్లాడుతున్న తెదేపా నాయకుడు వెంకటేశ్

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: తితిదే పవిత్రత దెబ్బతీయడమే వైకాపా నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారని తెదేపా నాయకుడు ఆర్.జె.వెంకటేశ్ విమర్శించారు. తన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా పాలనలో తిరుమల లడ్డూను అపవిత్రం చేశారని, దాని నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు తాజాగా తితిదే ఛైర్మన్ బీ.ఆర్.నాయుడిపై సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాన్ని ప్రారంభించారన్నారు. ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో బీ.ఆర్.నాయుడు ప్రతిష్ఠ దెబ్బతీయడానికి కుట్రపన్నారన్నారు. ఛైర్మన్‌గా ఆయన తితిదే పవిత్రతను కాపాడేందుకు తన బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తున్నారని, హిందువుల మనోభావాలు గౌరవించి తిరుమలలో అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. గతంలో ఛైర్మన్లుగా ఉన్న కరుణాకరరెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి అనేక అక్రమాలకు పాల్పడి తిరుమల పవిత్రతను మంటగలిపారన్నారు. హిందువుల పవిత్ర దేవాలయం తిరుమలలో అన్యమత ప్రచారం నిర్వహించి హిందువుల మనోభావాలు దెబ్బతీశారన్నారు. నాయకులు విజయమ్మ, మల్లికార్జున, ఉషారాణి, శివకృష్ణ, గణేశ్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చకుంటే ఉద్యమం ఉద్ధృతం

చేతులు జోడించి నినాదాలు చేస్తున్న వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి(వీఆర్ఎస్ఎస్) అధ్యక్షుడు పొదల నరసింహులు తెలిపారు. ఆదివారం స్థానిక బేబి వెల్‌కం హోంలో వీఆర్ఎస్ఎస్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌ను పార్లమెంట్, అసెంబ్లీలో పలువురు ప్రజాప్రతినిధులు ప్రస్తావించడం సంతోషకరమన్నారు. 5 దశాబ్దాలుగా దీనిపై పోరాటం చేస్తున్నామని, ప్రభుత్వాలు, పాలకులు మారినా అది సాధ్యం కాలేదన్నారు. ఈ ఒకేఒక డిమాండ్‌తో క్షేత్రస్థాయి నుంచి పోరాటానికి వాల్మీకులు కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు. రాజకీయ నాయకులు వాల్మీకులను ఎన్నికల్లో ఓటుబ్యాంకుగా వాడుకుని గెలిచాక మోసం చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్‌లో ఈ అంశంపై మాట్లాడిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి రాగానే ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా న్యాయం జరగలేదన్నారు. సమితి నాయకులు శ్రీరాములు, విజయ్‌మోహన్, విష్ణుచైతన్య, ఆనంద్, శివ, గౌరమ్మ, పార్వతమ్మ, తేజ, మధు, మునిలక్ష్మి, శంకరమ్మ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ఆదర్శంగా నిలవాలి

మంత్రి మనోహర్‌తో చిన్నా రాయల్

పుంగనూరు, న్యూస్‌టుడే: జనసేన పార్టీ ప్రారంభించిన సభ్యత్వ నమోదులో పుంగనూరు నియోజకవర్గం ఆదర్శంగా నిలవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారని. . నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి, జిల్లా కార్యదర్శి చిన్నా రాయల్ తెలిపారు. రెండ్రోజుల ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రిని ఆదివారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశామని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యలపై అధికారుల స్పందన, తదితర అంశాలపై చర్చించారని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వాడవాడలా ముమ్మరంగా చేపట్టాలని మంత్రి తనకు సూచించారని పేర్కొన్నారు.

మదనపల్లె నటుడు నరేష్‌కు కళాభిషేకం అవార్డు

అవార్డు అందుకుంటున్న నటుడు, కొరియోగ్రాఫర్ నరేష్ (టిట్లాబాయ్)

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన నటుడు, కొరియోగ్రాఫర్ నరేష్(టిట్లాబాయ్)కి కళాభిషేకం అవార్డు వచ్చింది. ఫిబ్రవరి 28న హైదరాబాదులోని రవీంద్రభారతిలో జై జవాన్, జైకిసాన్ జై కళాకార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కళాభిషేకం అవార్డుల ప్రదానోత్సవంలో ఆయనకు ఈ అవార్డు అందజేశారు. నరేష్ పలు చిత్రాల్లో, సీరియల్స్‌లో విలన్ క్యారెక్టర్‌లో నటించారు. ఇటీవల విడుదలైన స్కూల్‌లైఫ్ చిత్రంలో ప్రతినాయకుడిగా అలరించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అవార్డు రావడం తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. అవార్డు అందజేసిన సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అడవి దగ్ధంపై ఉన్నతాధికారులకు నివేదిక

అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు ఎ.బావాజాన్

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: హార్సిలీహిల్స్ సెక్షన్ పరిధిలో దగ్ధమైన అటవీ ప్రాంతాన్ని ఆదివారం తహసీల్దారు ఎ.బావాజాన్ పరిశీలించారు. వేసవి ప్రారంభం కాకముందే.. భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంపై మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి అధికారుల ద్వారా సమాచారాన్ని తెలుసుకున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు పరిశీలించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్.. గట్టు, నాయనిబావి, సూరపువారిపల్లె, చలిమామిడి గ్రామాలకు దగ్గరగా కాలిపోయిన అటవీ ప్రాంతాన్ని చూశారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడం వల్ల రెండ్రోజులు మంటలు వేగంగా విస్తరించి వృక్ష, జంతు సంపదకు నష్టం కలిగినట్లు స్థానికులు ఆయనకు వివరించారు. అటవీ ప్రాంతం ఎంత విస్తీర్ణంలో కాలిపోయిందో గూగుల్ మ్యాపుల ద్వారా గుర్తించి అంచనా వేయాలని సర్వేయర్‌ను.. ఆదేశించామని తహసీల్దార్ పేర్కొన్నారు. అడవుల్లో అగ్ని ప్రమాదంపై ప్రాథమికంగా అందిన వివరాలు ఉన్నతాధికారులకు నివేదించామని చెప్పారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉన్నాం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: హార్సిలీహిల్స్ అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలను ఆర్పడానికి సత్వర చర్యలు తీసుకున్నామని మదనపల్లె అటవీశాఖ రేంజ్ అధికారి జయప్రసాదరావు తెలిపారు. గత నెల 26న గట్టుకొండ, ముక్కొండ ప్రాంతంలో చెలరేగిన మంటలను స్థానికుల సహకారంతో మరుసటిరోజు ఉదయానికి అదుపు చేశామన్నారు. 0-15 హెక్టార్లలోనే అటవీ ప్రాంతం కాలిపోయిందని, మిగిలినదంతా ఎండిన ఆకులు, బోద గడ్డి దగ్ధమయ్యాయన్నారు. తాజాగా జరిగిన అగ్ని ప్రమాదం వల్ల వృక్ష, జంతు సంపదకు నష్టం కలగలేదని, అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడానికి గణనీయంగా కృషి చేస్తున్నామని, స్వల్ప వ్యవధిలోనే మంటలు ఆర్పివేశామని వివరించారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడుపై డీప్ ఫేక్ ఏఐ వీడియోలు, ఫొటోలతో చేస్తున్న తప్పుడు ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని మదనపల్లెకు చెందిన రమేష్‌బాబు ఆదివారం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కొందరు ఉద్దేశపూర్వకంగా తితిదే ఛైర్మన్ స్వరం, రూపం, వ్యక్తిత్వాన్ని అనుకరించేలా నకిలీ వీడియోలు, ఫొటోలు సృష్టించి సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన తితిదే గౌరవాన్ని దెబ్బతీయడానికి పన్నిన కుట్రగా కన్పిస్తోందని, దీని వెనక బలమైన రాజకీయ దురుద్దేశముందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వైకాపాకు చెందిన పలువురు, వారి సోషల్ మీడియా వ్యవస్థలు ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఒకటో పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు.

వెలిగిన దీపాలు

స్పందనకు వందనం

ఎన్వీఆర్ విస్తరణ ప్రాంతాల్లో పురపాలక సంఘం అధికారులు విద్యుత్తు దీపాల సమస్యపై పురపాలక సంఘ కమిషనర్ ప్రమీల స్పందించారు. ఆమె ఆదేశాలతో సిబ్బంది మరమ్మతులు చేపట్టి వీధిదీపాలు వెలిగింపజేశారు. ★ మడికయ్యల శివాలయం నుంచి ముస్లిం శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో చెత్తదిబ్బలు పేరుకుపోయిన సమస్యపై అధికారులు స్పందించారు. అక్కడ శుభ్రం చేశారు.

-న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

విద్యార్థులూ.. ఇటు వస్తే జాగ్రత్త

పుంగనూరు మండల పరిధిలోని మద్దనపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణలో బోరు ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డు మధ్యలో బోరుతో పాటు విద్యుత్తు తీగలు నేలకు ఆనుకొని ఉన్నాయి. కొన్నిసార్లు వాటిపై నుంచి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం

వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి

మదనపల్లె వైద్యం: వృద్ధులు వేసవిలో ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీ హోమియోకేర్ వైద్యులు జయశ్రీ, అర్చన అన్నారు. ఆదివారం పట్టణంలోని ధాత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమ వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. నిర్వాహకులు స్వాతి, చక్రపాణి, బీకేపల్లె కాలనీవాసులు పాల్గొన్నారు.

జనగణన క్షుణ్ణంగా చేపట్టాలి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిర్దేశాల మేరకు జనగణన క్షుణ్ణంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో మధుసూదన్‌రావు అధికారులు ఆదేశించారు. పుంగనూరు రోడ్డులో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జనగణనపై జరుగుతున్న శిక్షణ ఆదివారం ముగిసింది. డీఆర్వో అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లాలోని తహసీల్దార్లు,

రికార్డు స్థాయిలో ఒకటో డిపోకు ఆదాయం

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో రికార్డు స్థాయిలో 1వ డిపోకు గత నెలలో ఆదాయం సమకూరిందని ఆర్టీసీ డిపో మేనేజరు ఎం.వి.రమణారెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 28 రోజులకు రూ.6 కోట్ల 26 లక్షల 77 వేల రూపాయలు ఆదాయం సమకూరగా, లీటర్ డీజిల్‌తో 5.39 కిమీ దూరం బస్సులు సిబ్బంది నడపటమే కాక, గత నెలలో ప్రమాదాలు లేకుండా నడిపారని డీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. గ్యారేజీ పర్యవేక్షకులు, సిబ్బంది, ట్రాఫిక్ పర్యవేక్షకులు, సిబ్బందిని డీఎం ప్రశంసించారు. ఎంపీడీవోలు, మండల గణాంకాధికారులు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలి

మదనపల్లె పట్టణం: నేడు మదనపల్లెలో జరగనున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు, ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్‌తో పాటు కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు, బాలయ్య, పవన్‌కల్యాణ్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ బైపాస్ రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరుగుతుందన్నారు. రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ తెదేపా ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్, మదనపల్లె కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు షంషీర్ పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి

తంబళ్లపల్లె, ములకలచెరువు, న్యూస్‌టుడే: ఎస్సీల వర్గీకరణ పోరాటంలో మరణించిన మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం నివాళులర్పించారు. మాదిగ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హరిత కూడలి వద్ద అమరవీరుల చిత్రపటాలను ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గంగాధర, ఇన్‌ఛార్జి వేటా మల్లికార్జున, రమణ, కదిరప్ప, రమేష్, రమణ, నరసింహులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: చలిమామిడిలో ఆదివారం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. రాత్రి విగ్రహాలు ఊరేగించారు. వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. దాతల సహకారంతో రూ.40 లక్షలతో ఈ ఆలయాన్ని నిర్మించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్రగాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె పట్టణం రెడ్డెప్పనాయుడుకాలనీకి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆనంద్‌రెడ్డి(65) ఆయన భార్య విశ్రాంత అధ్యాపకురాలు భవానీదేవి(63) ఆదివారం బి.కొత్తకోట మండలంలోని ఆలయానికి వెళ్లి తిరిగి కారులో వస్తుండగా కురబలకోట మండలం చెన్నామర్రిమిట్ట వద్ద అదుపుతప్పి కారు పొలాల్లో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వీరు తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు. ● మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన రమేష్, వెంకటరమణ గుర్రంకొండ మండలంలోని తరిగొండ ఆలయానికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి మదనపల్లెకు వస్తుండగా సీటీఎం వద్ద కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు. ● నిమ్మనపల్లె మండలం జాండ్రబైలుకు చెందిన విశ్వనాథనాయుడు ఆదివారం సొంత పనిపై పుంగనూరు వెళ్లాడు. స్వగ్రామానికి వస్తుండగా వనమలదిన్నె సమీపంలో బొలెరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అవుట్ పోస్టు సిబ్బంది సమాచారాన్ని పుంగనూరు పోలీసులకు తెలియజేశారు.

దివాకర్ హత్య కేసులో ముమ్మర దర్యాప్తు

మదనపల్లె నేరవార్తలు: అరవవాండ్లపల్లెకు చెందిన దివాకర్ హత్యకేసులో దర్యాప్తు ప్రారంభించినట్లు రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు. దివాకర్ అదృశ్యమైన రోజు ఎవరెవరు అతడితో ఉన్నారు.. హత్య వెనుక కారణాలపై గ్రామంలో పలువురిని స్టేషన్‌కు పిలిచి విచారణ చేపట్టారు. పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరోవైపు సాంకేతిక పరంగా కూడా విచారణ ప్రారంభించారు.

పోక్సో కేసు నమోదుపై విచారణ..

ములకలచెరువు, న్యూస్‌టుడే: ములకలచెరువు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో భాగంగా ఆదివారం ఏఎస్పీ వెంకటాద్రి విచారించారు. గత నెల 19న మండలానికి చెందిన ఓ బాలిక కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొదట అదృశ్యం కేసుగా నమోదు చేసి బాలిక కోసం పోలీసులు గాలించగా బెంగళూరులోని ఇస్కాన్ టెంపుల్ వద్ద ఉండగా అదుపులోకి తీసుకుని ఆరు రోజుల క్రితం తిరుపతి సీడబ్ల్యూసీ అధికారులకు అప్పగించారు. దీంతో మండలానికి హరినాథ్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఏఎస్పీ వెంకటాద్రి.. బాలిక కుటుంబ సభ్యులు విచారించారు.

EENADU Classifieds

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Mishra Sharmila Devi (OldName)W/o M.Niranjan Prasad, 205FirstFloor, SaiKrishnaBuilding, BalajiColony, Opp:Rallapalli Rest House, Tirupati, AP 517501.I Changed My Name to Mishra Sharmila. Henceforth I Willbe known as Mishra Sharmila.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

తిరుపతి గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డుకు AB AAVAS Phoenix Tower Smart Homesలో 2 BHK, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346.

PLOT FOR SALE

GENERAL

తిరుపతి IIT దగ్గర దుర్గిపేరినందు 25x40 కొలతలతో West పేసింగ్ ప్లాట్ కలదు. కేవలం 4,20,000/- మాత్రమే. ✆ 80997 85333.

నేషనల్ హైవేలకి ఆనుకొని తిరుపతిలో ప్లాట్లు చూస్తున్నారా? అయితే ఫైనల్అప్రూవ్ కలిగిన ప్లాట్లు స్పాట్ రిజిస్ట్రేషన్ డైరెక్ట్ ఓనర్ ✆ 95027 74175 / 79959 92114.

WANTED

GENERAL

తిరుపతిలో 3BHK ఇండివిడ్యువల్ హౌస్ లేదా అపార్ట్‌మెంట్ ఫ్లాట్ అన్ని వసతులు గలది కావలెను. Con: 9393601489.

JOBS

Wanted Female Hostel Incharges Qualification any Degree. Age limit: 25 to 45 years. Salary upto: 15000/- Working Location: Master Minds College, Tirupati. Contact: 73822 59722.

We are Hiring 1.Charted Accountant (Male/ Female) 2.Office Asst. Executive (Female). Experience: Preferred, Salary: Depend on Experience, Location: TPT, Email:gurappaparameswara@gmail.com ✆ 81234 59658.

తిరుపతిలో ప్రముఖ హోటల్‌లో పనిచేయుటకు మేనేజర్ కావలెను. మంచి జీతం+ అలవెన్సు Q: ఇంటర్. Contact: 9502561265.

తిరుపతి చుట్టుప్రక్కల సివిల్‌వర్క్స్ చేయించుటకు సూపర్‌వైజర్స్ కావలెను. Qua: డిప్లొమా/ B.Tech/ Any Degree. ఆకర్షణీయమైన జీతం ✆ 94941 77700.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్ / హౌస్‌కీపింగ్ కావలెను. 50 సం॥ వయస్సు, 12Hr డ్యూటీ, జీతం: 12,000 - 14,000, తిరుపతి, మదనపల్లిలో. ✆ 72880 04466.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS THE WAY
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

ఈనాడు
బాపట్ల
సోమవారం మార్చి 2, 2026 5

క్యాన్సర్ చికిత్సల్లో ఏఐ సేవలు!

గుంటూరు జీజీహెచ్ నాట్కో సెంటర్‌లో ప్రయోగాత్మక అమలు

"క్యాన్సర్ చికిత్సల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని నాట్కో సెంటర్‌లో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక ఒప్పందం చేసుకొని.. ఖర్చుకు వెనకాడకుండా విస్తృతమైన సేవలను దృష్టిలో పెట్టుకుని సొంతంగా డేటా రూపొందించుకునేందుకు వైద్య నిపుణులు దృష్టి పెట్టారు."

ఆధునిక యంత్రాలపై రోగులకు సేవలందిస్తున్న వైద్యులు

ఈనాడు, అమరావతి

ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో క్యాన్సర్ రోగులకు మెరుగైన, కచ్చితత్వంతో కూడిన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఏపీ చాప్టర్‌ను ఏర్పాటు చేసింది. టాటా మెమోరియల్ సెంటర్, హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్(విశాఖపట్నం), నవ్య కేర్ నెట్‌వర్క్‌తో కలిసి నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌తో పనిచేసే ఎన్‌సీజీ పైలట్ ప్రాజెక్టు సేవలు గుంటూరు జీజీహెచ్‌లోని క్యాన్సర్ సెంటర్‌లోనూ ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించి అందులో రోగుల వివరాలు, నివేదికలు పొందుపరుస్తున్నారు. ఇప్పటివరకు విశాఖపట్నం, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే క్యాన్సర్ చికిత్సల్లో అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు వినియోగిస్తుండగా.. తాజాగా గుంటూరు, కర్నూలు ఆసుపత్రుల్లోనూ అందుబాటులోకి వచ్చాయి. గుంటూరు జీజీహెచ్ అంకాలజీ విభాగం నోడల్ సెంటర్‌గా.. విశాఖపట్నం, కాకినాడ, కర్నూలు ప్రభుత్వాసుపత్రులను అనుసంధానం చేశారు.

సొంత డేటాపై దృష్టి

ఎన్‌సీజీ పైలట్ ప్రాజెక్టులోని కోస్టల్‌ఏఐకు విస్తృతమైన సేవలు గుంటూరు నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు వస్తున్న నేపథ్యంలో రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ దుర్గాప్రసాద్ నేతృత్వంలోని వైద్యుల బృందం స్వయంగా ఏఐ సేవల ఆధారిత ప్రాజెక్టుపైనా దృష్టి పెట్టింది. ఇప్పటికే ఏపీలో తొలి సమగ్ర క్యాన్సర్ ఆసుపత్రిగా గుర్తింపు తెచ్చుకున్న గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ రోగులకు తమదైన సేవలు అందిస్తోంది. ఇక్కడికి ఎక్కువగా గర్భకోశ, రొమ్ము, చర్మ క్యాన్సర్ బాధితులు వస్తుండగా.. ఇవి ఎన్‌సీజీ పైలట్ కేసులతో విభిన్నంగా ఉండటంతో వైద్యవర్గాలు ఆ కోణంలోనూ సునిశిత పరిశీలన చేస్తున్నారు. సొంత డేటా ఆధారిత ఏఐ సేవల్ని అందుబాటులోకి తీసుకురావడం వల్ల రోగాన్ని ప్రారంభంలోనే గుర్తించేందుకు, అత్యుత్తమ వైద్య విధానాలు అనుసరించేందుకు వీలుంటుందని ఇక్కడి క్యాన్సర్ వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

నేడు కలెక్టరేట్లో 'పీజీఆర్ఎస్'

బాపట్ల, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ డివిజన్, మండల కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలపై అందజేసిన అర్జీలను అధికారులు పరిశీలించి చర్యలు చేపడతారని, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఆన్‌లైన్‌లో మీ కోసం వెబ్‌సైట్ ద్వారా సమస్యలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. గతంలో అందజేసిన అర్జీలు ఇప్పటి వరకు పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదు స్థితి సంబంధించిన సమాచారం తెలుసుకోవటానికి 1100 నంబరుకు కాల్ చేయవచ్చని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని, మంచానికే పరిమితమైన వారిని పీజీఆర్ఎస్‌కు తీసుకురావద్దన్నారు. సమస్యలపై వారి తరఫున కుటుంబసభ్యులు, బంధువులు వచ్చి అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు. అర్జీలు ఇచ్చేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చే అర్జీదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని సూచించారు.

సూక్ష్మ సేద్యం.. లక్ష్యానికి దూరం

రూ.కోట్లలో బిల్లుల పెండింగ్ పరికరాలు ఇవ్వని కంపెనీలు

న్యూస్‌టుడే, బాపట్ల

జిల్లాలో బిందు, తుంపర సేద్యం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు సాగటం లేదు. ఉద్యాన పంటల రైతులు సూక్ష్మ సేద్యానికి ఆసక్తిగా ఉన్నా కంపెనీలు పరికరాలు సరఫరా చేయటం లేదు. మూడేళ్లుగా రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉండటమే దీనికి ప్రధాన కారణం. ఈ ఏడాది లక్ష్యంలో 50 శాతానికి మాత్రమే సాగు పరిమితమైన దుస్థితి నెలకొంది.

❖ జిల్లాలో ఉద్యాన పంటలు 45 వేల ఎకరాల్లో సాగవుతున్నాయి. వ్యవసాయ పంటలతో పోలిస్తే ఉద్యాన పంటల సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు. లంక భూముల్లో అరటి, పసుపు, కంద, బొప్పాయి, మెట్ట భూముల్లో జామ, సపోటా, మామిడి, గరువు, ఇసుక నేలల్లో పచ్చి మిర్చి, పూలతోటలు, కూరగాయలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. కొందరు డ్రాగన్ ఫ్రూట్, వేరు సెనగ వంటివి పండిస్తున్నారు.

తుంపర విధానంలో సాగవుతున్న వేరుసెనగ

❖ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. దీనివల్ల తక్కువ నీటితో పంటలు సాగు చేయటంతో పాటు కూలీల ఖర్చు తగ్గుతోంది. బిందు సేద్యానికి ఐదెకరాల్లోపు 90 శాతం, 5-10 ఎకరాల మధ్య ఉంటే 70 శాతం, పది కన్నా ఎక్కువ ఎకరాల్లో ఉంటే 50 శాతం రాయితీపై ఉద్యానశాఖ పరికరాలు అందజేస్తోంది. అదే తుంపర సేద్యమైతే పంట విస్తీర్ణం ఎంతున్నా 50 శాతం రాయితీ వర్తిస్తోంది. జిల్లాలో గత మూడేళ్లుగా ఉద్యాన పంటల సాగు పరిశీలిస్తే వంద శాతం లక్ష్యం సాధించటం కలగానే మిగిలిపోయింది. చిన్న, సన్నకారు రైతులు బిందు, తుంపర సేద్యం చేయడానికి ఆసక్తిగా ఉన్నా రాయితీ అందక వారిపై రూ.లక్షల్లో భారం పడుతోంది. ఆర్థిక స్థోమత లేనివారు సూక్ష్మ సేద్యానికి దూరంగా ఉంటున్నారు.

❖ గత ప్రభుత్వ పాలనలో 2022-23లో 1209 ఎకరాల్లో సూక్ష్మ సేద్యం కింద రైతులు పంటలు సాగు చేశారు. పైపులు, మోటార్ల రూపంలో రూ.11.39 కోట్ల రాయితీ రైతులకు అందాల్సి ఉంది. కంపెనీలు ముందుగానే పరికరాలు అందజేసినా అప్పటి ప్రభుత్వం రెండేళ్ల పాటు రాయితీ సొమ్ము విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది బకాయిలు విడుదల చేసింది. వైకాపా పాలనలో ఓ ఏడాది పాటు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మరో రెండేళ్లకు సంబంధించి కలిపి మొత్తం రూ.30.50 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో గత మూడేళ్లలో బిందు, తుంపర సేద్య సాగు లక్ష్యం మేరకు సాగలేదు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియటానికి మరో 30 రోజుల గడువు మాత్రమే ఉంది. ఇప్పటి వరకు కేవలం 50 శాతం సాగు మాత్రమే జరిగింది. దీనిపై జిల్లా సూక్ష్మ సేద్య ప్రాజెక్టు పీడీ వెంకటరమణ మాట్లాడుతూ ప్రత్యేక పరిస్థితుల వల్ల లక్ష్యం మేరకు పంటల సాగు జరగలేదన్నారు. రావాల్సిన బకాయిలు త్వరలోనే విడుదలవుతాయని తెలిపారు.

జిల్లాలో ఇలా..

సంవత్సరం	లక్ష్యం	సాగు	అందాల్సిన
	(హెక్టార్లలో)		(రూ.కోట్లు)
2023–24	1300	1023	9.23
2024–25	2000	1417.24	13.65
2025–26	1500	762	7.62

నగదు ప్రోత్సాహం పేరుతో దోపిడీలు

కొత్త తరహా సైబర్ మోసాలు

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్

యడ్లపాడు మండలం ఉన్నవ జడ్పీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి తల్లిదండ్రులకు స్కాలర్‌షిప్ పేరిట ఫోన్ వచ్చింది. ఆదిమ్యాలకు చెందిన ఉపాధ్యాయుడి పేరు చెప్పి రూ.25వేల స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేయాలి. అందుకు రూ.3 వేలు ఫోన్‌పే చేయాలంటూ ఫోన్‌లో కోరారు. స్కూలుకు వచ్చి ఇస్తామని చెప్పినా వినిపించుకోలేదు. అనుమానం వచ్చిన విద్యార్థి స్కూలుకు వెళ్లి సదరు ఉపాధ్యాయుడికి విషయం చెబితే ఆ నంబరు తనది కాదని.. తాను చేయలేదని, సైబర్ నేరగాళ్ల పనని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

❖ నరసరావుపేటకు చెందిన మహిళ ఎనిమిది నెలల గర్భిణి. ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించుకుని ప్రతినెలా మందులు వాడుతున్నారు. అందులో భాగంగా అదే ఆసుపత్రికి చెందిన ఓ నర్సు పేరిట ఫోన్ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం గర్భిణులకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోందని.. రూ.50 వేలు వస్తాయని.. అందుకు ముందు ప్రాసెసింగ్ ఫీజు కోసం రూ.5వేలు ఫోన్ పే చేయాలని గర్భిణికి ఫోన్‌లో కోరారు. ఆసుపత్రికి వచ్చి ప్రత్యక్షంగా ఇస్తామని చెప్పినా వినకుండా పదేపదే ఫోన్లతో విసిగించారు.

స్కాలర్‌షిప్‌నకు అర్హులు.. వెబ్‌సైట్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసి కొంత మొత్తం చెల్లించాలనే సందేశాలు.. కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నగదు పొందే అవకాశం సందేశంపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని పోస్టు ఆఫీసు తరఫున వస్తున్నాయి. సైబర్ నేరగాళ్లు ఏ రూపంలో వల వేస్తారో తెలియని పరిస్థితి. కొత్తగా మనకు తెలిసిన వాళ్లలా మాట్లాడుతున్నారు. మన అవసరం ఏంటో గుర్తించి.. అందుకు సాయం చేస్తున్నట్లు నటించి డబ్బులు గుంజే ప్రయత్నం చేస్తున్నారు. అందుకు అప్రమత్తంగా ఉంటే మంచిదని సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అత్యాశ వద్దు.. ఏదైనా ప్రభుత్వ పథకం లబ్ధి దరఖాస్తు చేసుకోవాలంటే గ్రామ సచివాలయం, మీ సేవ కేంద్రాలకు వెళ్లడం ఉత్తమం. మనకు తెలిసిన వ్యక్తుల వద్ద, మన కంటికి ఎదురుగానే దరఖాస్తు చేయాలి. ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లను నమ్మొద్దు. నగదు ప్రోత్సాహకమైనా.. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలైనా ముందు అధికారులు, ఉద్యోగులకు తెలుస్తాయి. కాబట్టి ఫోన్‌లో ఎవరో చెప్పిన వాటిని నమ్మి బ్యాంకు ఖాతా వివరాలు వారి చేతికి చిక్కేలా చేసుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

అమరావతిలో కీలక అడుగు

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు

తుళ్లూరు: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాకతో ఆదివారం అమరావతిలో సందడి నెలకొంది. ఏపీ జ్యుడీషియల్ అకాడమీ, ఏపీ హైకోర్టు అతిథి గృహ నిర్మాణాలకు శంకుస్థాపన.. నూతనంగా నిర్మించిన హైకోర్టు న్యాయమూర్తుల రెసిడెన్షియల్ ఎన్‌క్లేవ్‌ను సీజేఐ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, సీఎం చంద్రబాబు పలువురు సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సుమారు 2.05 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణం చేపడుతుండగా..120 మంది ట్రైనీ జడ్జిలకు శిక్షణ ఇచ్చేలా రూపకల్పన చేశారు.

హైకోర్టు న్యాయమూర్తుల బంగళా నమూనా పరిశీలిస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నరసింహ, జస్టిస్ భట్టి, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, సీఎం చంద్రబాబు

☛ రాజధానిలో కీలక నిర్మాణాలకు అడుగులు పడడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. తాజాగా న్యాయవ్యవస్థకు సంబంధించిన ముఖ్యమైన వసతుల కల్పన పట్టాలెక్కడంపై ఆనందించారు. శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేసే ప్రాంతంలో నిర్మాణాలకు సంబంధించి మ్యాపులను ప్రదర్శనలో ఉంచగా పలువురు ఆసక్తిగా వీక్షించారు.

పల్లెలకు సౌర వెలుగులు

నూరుశాతం ఏర్పాటు గ్రామాలకు రూ.కోటి ప్రోత్సాహకం

న్యూస్‌టుడే, బాపట్ల

గ్రామాల్లో నూరుశాతం సౌర విద్యుత్తు వినియోగం ద్వారా పునరుత్పాదక ఇంధన వనరులను కేంద్రం ప్రోత్సహించనుంది. ప్రధానమంత్రి సూర్యఘర్ ఆదర్శ గ్రామాల పేరుతో పంచాయతీలో నూరుశాతం గృహాలకు సౌర విద్యుత్తు కనెక్షన్లు ఇస్తే రూ.కోటి మేర ప్రోత్సాహకం అందించనున్నారు. సర్వే చేసి జిల్లాలో తొలివిడత పలు గ్రామాలు ఎంపిక చేశారు. లక్ష్యం మేరకు కనెక్షన్లు పూర్తి చేస్తే పల్లె వాసులపై విద్యుత్తు బిల్లుల భారం తగ్గనుంది. లోవోల్టేజీ, కరెంటు సరఫరాలో అంతరాయం సమస్యలు చాలా వరకు పరిష్కారం కానున్నాయి.

సూర్యఘర్ ఆదర్శ గ్రామాల వివరాలు..

గ్రామం	మొత్తం గృహాలు
పిట్టలవానిపాలెం	12,036
కొత్తపేట	16,931
కారంచేడు	11,667
కనగాల	7,192
యడ్లపల్లి	8,300

❖ గృహాల్లో సౌర విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు రెండు కిలోవాట్ల వరకు పూర్తి ఉచితంగా సౌర విద్యుత్తు కనెక్షన్లు ఇస్తున్నారు. ఇతరులు మూడు కిలోవాట్ల సామర్థ్యం మేరకు సౌర విద్యుత్తు ఫలకాలు ఏర్పాటు చేసుకోవటానికి రూ.78 వేల రాయితీ లభిస్తోంది. బీసీలకు అదనంగా మరో రూ.20 వేల రాయితీని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. వారికి గరిష్ఠంగా రూ.98 వేల వరకు ఆర్థిక ప్రయోజనం దక్కనుంది. ❖ జిల్లాలో అయిదు వేలకు పైగా జనాభా కలిగిన వాటిని ప్రధానమంత్రి సూర్యఘర్ ఆదర్శ గ్రామాల కింద ఎంపిక చేశారు. గ్రామంలో మొత్తం గృహాలను సర్వేచేసి సౌర విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చి నూరుశాతం లక్ష్యం చేరుకోవాలని నిర్దేశించారు. తొలివిడతలో పిట్టలవానిపాలెం, కొత్త పేట, కారంచేడు, కనగాల, యడ్లపల్లి, రావినూతల గ్రామాలు ఎంపిక చేశారు. ప్రయోగాత్మకంగా తొలుత ఓ గ్రామంలో నూరుశాతం ఇళ్లపై సౌరవిద్యుత్తు ఫలకాలు అమర్చటానికి విద్యుత్తుశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లక్ష్యాన్ని పూర్తి చేసిన గ్రామానికి కేంద్రం నుంచి రూ.కోటి ప్రోత్సాహక నగదు విడుదల కానుంది.

ఎన్నాళ్లీ జాగు..అందితే బాగు!

ఉమ్మడి జిల్లాలో 400 ఈ-ఆటోలకు ఎదురుచూపులు

"కాలుష్యానికి చెక్ పెట్టాలనే ఉద్దేశం.. సంప్రదాయ ఇంధన వనరులను పరిరక్షించుకుంటూ, విద్యుత్తు వాహనాలను అందిపుచ్చుకోవాలన్న లక్ష్యం..వెరసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో 400 ఈ-ఆటోల కొనుగోలుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ గతేడాది కసరత్తు మొదలుపెట్టింది. వీటి కొనుగోలుకు సిద్ధం కాగా.. జాప్యం జరుగుతుండడం చర్చనీయాంశమైంది."

ఈనాడు, అమరావతి: దేశంలో వాయుకాలుష్యం ఎక్కువైంది. ఏడేళ్ల కిందట గుంటూరునూ కాలుష్య నగరంగా గుర్తించారు. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం(ఎన్‌సీఏపీ) ద్వారా బాధిత నగరాల్లో 2029 కల్లా 70 నుంచి 80 శాతం మేర కాలుష్య స్థాయిలను తగ్గించాలనే లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళికలు రచించారు. అలా గుంటూరులోనూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నాలుగుచోట్ల ఎన్ఏఎంపీ స్టేషన్లను ఏర్పాటు చేసి గాలి నాణ్యత పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలోనే సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సూచనల మేరకు విభిన్న మార్గాల్లో సమస్యకు చెక్ పెట్టేందుకు సంకల్పించి..ఇప్పటికే 220 ఈ-ఆటోలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సమకూర్చారు. అయితే, అవి సరిగా నిర్వహించకపోవడం, నిధులు ఇవ్వట్లేదనే సాకుతో సంబంధిత ఏజెన్సీ మరమ్మతులకు గురైన వాటిపై దృష్టి పెట్టకపోవడంతో 100 వరకు మూలకు చేరి కనిపిస్తున్నాయి.

జీఎంసీలో ఉన్న ఈ-ఆటోలు

ఉమ్మడి జిల్లాలో మరో 400.. కాలుష్య కోరల్లో చిక్కిన నగరాలే కాదు..రాష్ట్రంలో 83 పుర, నగరపాలికలకు సంబంధించి 19.14 లక్షల మంది జనాభాకి గాను 1910 ఈ-ఆటోలు అవసరమని గతేడాది చివర్లో ప్రతిపాదించారు. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 400 కావాలని ప్రతిపాదించారు. వెయ్యి కుటుంబాలకు ఒక ఈ-ఆటో చొప్పున ఈ ప్రతిపాదన చేయగా..ఒక్కో ఈ-ఆటో వెయ్యి కిలోల వ్యర్థాలను తరలించాలన్నది నిబంధన. అయిదేళ్లపాటు ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ నిర్వహించేలా ఒక్కో ఈ-ఆటోను రూ.68,949 చొప్పున సరఫరా చేసేందుకు నాలుగు ఏజెన్సీలు ముందుకొచ్చాయి. అయితే, వాటిని ఖరారు చేసి, సరఫరా చేయించడంలో జాప్యం జరుగుతోంది. ఆ ప్రభావం చెత్త తరలింపుపై పడుతోంది. జీపీఎస్, కెమెరా, ఇతర అధునాతన సౌకర్యాలు వీటిలో ఉండేలా ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొనగా..గతేడాది ఆగస్టు నుంచి కసరత్తు జరుగుతోంది. డిసెంబర్ 12న ఏజెన్సీల వివరాలు పేర్కొంటూ ఉత్తర్వులు కూడా వెలువరించారు.

ఇదీ లెక్క ❖ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రతిపాదించిన 400 ఈ-ఆటోల్లో..గుంటూరు జిల్లా పరంగానే 284 ఉన్నాయి. ఇందులో మంగళగిరి-తాడేపల్లిలో 35, గుంటూరు నగరంలో 200, తెనాలిలో 49 అవసరమని పేర్కొన్నారు. ❖ పల్నాడు జిల్లాలో 51 అవసరమని పేర్కొనగా..ఇందులో నరసరావుపేటలో 20, మాచర్లలో 19, వినుకొండలో 12 కావాలని ప్రతిపాదనల్లో చూపారు. ❖ ఇక, బాపట్ల జిల్లాలో 65 అవసరమని చూపగా..ఇందులో బాపట్లలో 24, రేపల్లెలో 14, చీరాలలో 27 ఈ-ఆటోలు కావాలని ఆయా పురపాలికలు ప్రతిపాదించాయి.

చరవాణిలోనే ఆధార్ మార్పులు, చేర్పులు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: సాంకేతికతపై పట్టు ఉంటే ఆధార్ కార్డు డౌన్‌లోడ్, వివరాల మార్పులు చేర్పుల కోసం ఆధార్ కేంద్రాలు, నెట్ సెంటర్ల చుట్టూ తిరిగి వ్యయ ప్రయాసలకు లోను కావాల్సిన అవసరం ఉండదు. అండ్రాయిడ్ ఫోను ఉంటే చాలు. క్షణాల్లో ఈ పనులన్నీ మీరే స్వయంగా చేసుకోవచ్చు. గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్లి ఆధార్ అని టైప్ చేయగానే యాప్ కనిపిస్తుంది. డౌన్‌లోడ్ పూర్తికాగానే ఆధార్ వివరాలు నమోదు చేసి ఓటీపీ, ముఖ నిర్ధారణ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం ఫొటోతో కూడిన ఆధార్ కార్డు కనిపిస్తుంది. కింద డౌన్‌లోడ్, షేర్, బయోమెట్రిక్ లాక్ వంటి ఐచ్ఛికాలు కనిపిస్తాయి. వీటి ద్వారా కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు, ఇతరులకు పంపొచ్చు. సర్వీసు పేజీ తెరవగానే చరవాణి నంబరు, అప్‌డేట్, అడ్రస్ అప్‌డేట్ ఐచ్ఛికాలు కనిపిస్తాయి. వీటిని ఎంపిక చేసుకుని మార్పులు, చేర్పులను ముఖఆధారిత నిర్ధారణ ద్వారా క్షణాల్లో పూర్తి చేసుకోవచ్చు. కుటుంబ సభ్యులవీ నవీకరించుకోవచ్చు.

వనామీ రొయ్యకు వైరస్‌ల బెడద

నష్టపోతున్న సాగుదారులు

న్యూస్‌టుడే, బాపట్ల, నిజాంపట్నం

ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఆక్వా రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. రొయ్యల్లో ఎదుగుదల ఉండటం లేదు. వైరస్‌లు విజృంభించి తీరంలో వనామీ రొయ్యల పంటను తుడిచి పెట్టేస్తోంది. రొయ్యలు చనిపోయి సాగుదారులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. డిసెంబరు, జనవరిలో చెరువుల్లో రొయ్య పిల్లలు వేసిన సాగుదారులు ఎదుగుదల లేక ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వంద కౌంట్ రొయ్యల ధర రూ.265కు పెరిగింది. చేతిలో పంట లేకపోవటం వల్ల మంచి ధర పొందలేకపోతున్నారు.

జిల్లాలో 23,700 ఎకరాల్లో ఆక్వా సాగు ఉంది. చినగంజాం, వేటపాలెం, చీరాల, బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, నగరం, నిజాంపట్నం, రేపల్లె మండలాల్లో రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు.

❖ నవంబరు నుంచి చలి వాతావరణం ఎక్కువగా ఉంది. విపరీతమైన చలి వల్ల రొయ్యలు రెండు నెలలుగా మేత సరిగా తినటం లేదు. రొయ్యలకు మంచు వాతావరణంలో వైరస్‌లు సోకుతుంటాయి. ఇటీవల వరకు ఉదయం ఎనిమిది గంటలైనా మంచు పట్టి ఉండటం, రాత్రులు ఉష్ణోగ్రతలు పడిపోవటంతో వనామీ రొయ్యల్లో ఎదుగుదల మందగించింది. ఈ క్రమంలోనే విబ్రియో వైరస్‌తో రొయ్యలు చనిపోతున్నాయి.

జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు

ఉదయం, రాత్రులు నీటి ఉష్ణోగ్రతలు పడిపోవటం వల్ల రొయ్యల్లో ఆకలి తగ్గుతుంది. మేత తీసుకునే స్థాయి, జీర్ణశక్తి పడిపోతుంది. చెక్‌ట్రేలు పరిశీలించి రొయ్యలు తినేంత స్థాయిలోనే మేత వేయాలి. నీటి పీహెచ్ విలువల్లో మార్పును తనిఖీ చేసి వ్యత్యాసం ఎక్కువ లేకుండా జాగ్రత్తలు చేపట్టాలి. వ్యాధి నివారణ చికిత్స కోసం జీవ రసాయనాలు, ప్రోబయోటిక్స్‌ను సిద్ధంగా ఉంచాలి. చెరువు బయో సెక్యూరిటీని మెరుగుపరచాలి. లోడ్ పెరిగితే వైరస్‌ల బారిన పడి రొయ్యలు చనిపోతాయి.

➻ చెరువుల్లో పోసే రొయ్యల స్టాకింగ్ సాంద్రత తగ్గిస్తే మంచిది. చెరువులో మీటరున్నర కంటే ఎక్కువ లోతులో నీరు ఉండాలి. ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా పడిపోతే మేతను ఆపటం లేదా తగ్గించాలి. మేఘావృతమై ఉంటే ఏరియేటర్లను ఎక్కువ సేపు తిప్పి ఆక్సిజన్ బాగా అందేలా చూడాలి. రొయ్యల పెరుగుదల స్థితి, ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. మేతలో విటమిన్ 'సి', బీ కాంప్లెక్స్ ఔషధాలు, జీర్ణశక్తిని పెంచే ఎంజైమ్‌లు కలపాలి. వెనువెంటనే పంటలు వేయకుండా చెరువులను బాగా ఆరబెట్టి తగిన విధంగా సిద్ధం చేసిన తర్వాతే మళ్లీ సాగు ప్రారంభించాలి. హేచరీల్లో కొనుగోలు చేసే ముందు పరీక్షలు చేయించి నాణ్యమైన రొయ్య పిల్లలనే చెరువులో వేయాలి.

జాగిలం... నేర పరిశోధనలో కీలకం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: నేర పరిశోధనలో పోలీసు జాగిలాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. అందుకే వీటికి ఆ శాఖలో అత్యంత ప్రాధాన్యం ఉంటోంది. దోపిడీలు, చోరీలు, హత్య కేసుల్లో నిందితులను గుర్తించేందుకు ట్రాకర్, పేలుడు పదార్థాల కోసం స్నిఫింగ్, మాదక ద్రవ్యాలను పసిగట్టడానికి నార్కోటిక్స్ అండ్ ట్రాకర్ డాగ్స్ ఉంటాయి. జిల్లాలో మూడు ఎక్స్‌ప్లోజివ్, ఒకటి ట్రాకర్ ట్రేడ్‌కి చెందిన జాగిలాలు ఉన్నాయి. వీటిల్లో లాబ్రడార్ రెట్రీవర్, బెల్జియం మెల్నోయిస్ జాతులకు చెందినవి ఉన్నాయి. గంజాయిని పట్టుకోవడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఖాకీ యూనిఫాం ధరించిన పోలీసులతో పాటు బెల్టు పెట్టుకున్న జాగిలం అదేస్థాయిలో విధులు నిర్వహిస్తోంది. హ్యాండ్లర్లతో పాటు వీటికి ఏడాది పాటు శిక్షణ ఇస్తారు. ప్రతి అయిదు నెలల కొకసారి వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. ఈ సమయంలో అనారోగ్యంగా ఉంటే విధుల్లో కొనసాగించరు. హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు నడుచుకుంటాయి. వీరు వీటికి బెల్టు ధరింపజేస్తే విధుల్లోకి వచ్చినట్లే. వీటికోసం ప్రత్యేకమైన ఆహారం, ఇతరత్రా సౌకర్యాలను పోలీసు శాఖ సమకూర్చుతోంది. దాదాపు పది సంవత్సరాలు సర్వీసులో ఉంటాయి. ఉద్యోగ విరమణ పొందిన తరువాత తుది శ్వాస విడిచే వరకు పూర్తి బాధ్యత పోలీసు శాఖదే. మరణించిన వాటికి అంత్యక్రియలు పోలీసు లాంఛనాలతో జరుగుతాయి.

సాహస విన్యాసం చేస్తున్న షాడో

అయిదుగురికి ప్రాణదానం

గుంటూరు, న్యూస్‌టుడే: చిలకలూరిపేటకు చెందిన యువకుడు **నల్లపనేని చైతన్య(25)** తాను చనిపోతూ అయిదుగురికి ప్రాణదానం చేశారు. చిలకలూరిపేటకు చెందిన చైతన్య గత నెల 27న ద్విచక్ర వాహనంపై వెళుతుండగా తాతపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మెదడుకు తీవ్రగాయం కావడంతో గుంటూరులోని ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో చేర్పించారు. అతని ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. శనివారం బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో జీవన్‌దాన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేషన్ బృందం అవగాహన కల్పించడంతో చైతన్య తల్లిదండ్రులు వెంకటశివ, ఆదిలక్ష్మి, సోదరుడు మానసకుమార్‌లు చైతన్య అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఆదివారం చైతన్య నుంచి కిడ్నీలు, లివర్, నేత్రాలను సేకరించారు. ఒక కిడ్నీ, లివర్‌లను గుంటూరు ఆస్టర్ రమేష్ ఆసుపత్రికి, మరో కిడ్నీని విజయవాడలోని అమెరికన్ కిడ్నీ ఇన్‌స్టిట్యూట్‌కు తరలించారు. రెండు కార్నియాలను విజయవాడ ఎల్‌వీ ప్రసాదు కంటి ఆసుపత్రికి తరలించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆసుపత్రికి వచ్చి చైతన్య తల్లిదండ్రులు, సోదరుడిని పరామర్శించి వారు తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు చైతన్య కుటుంబసభ్యులను అభినందించారు.

ప్రహ్లాద వరద.. పరమాత్మ రూపా

తాడేపల్లి, మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా నృసింహుని కల్పవృక్ష వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల ముఖమండపం వద్ద స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి హారతులిచ్చిన అనంతరం స్వామివారిని ఆలయ ప్రదక్షిణం చేయించారు. అనంతరం మాడ వీధుల గుండా తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

పొన్న వాహన సేవ.. రాత్రి కీలకమైన పొన్నవాహన సేవ నిర్వహించారు. గోపికలు నదిలో స్నానమాచరిస్తుండగా శ్రీకృష్ణుని అవతారంలో ఉన్న స్వామివారు.. వారి వస్త్రాలను అపహరించే ఘట్టాన్ని కళ్లకు కట్టే విధంగా వాహనాన్ని అలంకరించారు. ఈ విధంగా దేహంపై గోపికలకు ఉన్న అభిమానాన్ని స్వామి వారు తొలగించి వారికి మోక్షం ప్రసాదించారని, ఆ సన్నివేశాన్ని వివరిస్తూ పొన్న వాహన సేవ నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

నృసింహుని గ్రామోత్సవం

పొన్నచెట్టుపై శ్రీకృష్ణుని అవతారంలో నృసింహుడు, చెట్టు కింద గోపికలు

అసిస్టెంట్ సేల్స్‌మెన్ కావలెను
బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, పిడుగురాళ్ళ, మాచర్లలో
ఈనాడు దినపత్రిక కొరకు ప్రకటనలు సేకరించుటకు
చురుకైన, చొరవ కలిగిన యువకులు కావలెను.
జీతము రూ. 20,000/- (అన్ని అలవెన్సులు కలిపి)
మరియు ఆకర్షణీయమైన ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును.
అనుభవం ఉన్నవారికి అర్హతను బట్టి వేతనం ఉంటుంది.
అర్హతలు: వయస్సు: 19 సం॥ - 30 సం॥ మధ్య
* 10th or ఇంటర్ పాస్
* తెలుగు, ఇంగ్లీషు చదవడం, రాయడం వచ్చియుండాలి.
ఆసక్తిగల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికేట్స్, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో తేది. 02-03-2026 సోమవారం ఉదయం 10 గం॥ల నుండి 4 గం॥ల లోపు స్వయంగా సంప్రదించండి.
CIEL HR inspired by science
C/o. ఈనాడు ఆఫీస్, 9వ లైను, అరండల్‌పేట, గుంటూరు
Ph: 800085 10541
Email: gnt_hr@eenadu.net

(c) eenadu

సజావుగా గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు

కేంద్రంలో తనిఖీ చేస్తున్న శ్రీదేవి, ఉషారాణి

నాగులుపాలెం(పర్చూరు), యద్దనపూడి, న్యూస్‌టుడే: నాగులపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం ప్రవేశ పరీక్షలు జరిగాయి. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివేందుకు పరీక్షలు నిర్వహించారు. ఐదో తరగతి పరీక్షకు 37మందికి 36మంది, ఇంటర్‌కు 118మందికి 105 మంది, ఐఐటీ, నీట్‌లో ప్రవేశానికి 75మందికి గానూ 65 మంది పరీక్షలు రాశారు. కేంద్రాన్ని గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీదేవి, పరీక్షల పరిశీలకురాలు ఉషారాణి, పరీక్షల నిర్వహణాధికారి పి.విశ్వరాణి, ఎంఈవో ఎ.శివకోటేశ్వరరావులు పరిశీలించారు. యద్దనపూడిలోని గురుకుల పాఠశాలలో ఐదో తరగతికి 41 మందికి 35మంది, ఇంటర్మీడియట్ పరీక్షకు 98 మందికి గానూ 91మంది, ఐఐటీ, నీట్‌కు 90మందికి గానూ 84మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి తెలిపారు.

అందని దీపం రాయితీ సొమ్ము

బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు

దర్శి రోడ్డు (చీరాల అర్బన్), న్యూస్‌టుడే: దీపం-2 పథకం కింద రాయితీ సొమ్ము జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి కోసం బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రారంభంలో నగదు జమైంది. రెండో విడత ఇచ్చారు... మూడో విడత ఇంకా రాలేదని పేర్కొంటున్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందాలంటే తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఒక వేళ చేయించుకున్నా సాంకేతిక సమస్యలతో అది పూర్తి కాని పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లా వ్యాప్తంగా 4,63,135 గ్యాస్ కనెక్షన్లు ఉండగా వీటిల్లో దాదాపు లక్ష వరకు దీపం పథకం కింద లబ్ధిదారులు ఉన్నారు.

★ ఈ పథకం కింద రాయితీ సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ కావాలంటే కచ్చితంగా ఆరంచెల విధానాన్ని అధిగమించాల్సిందే. 300 యూనిట్ల కన్నా ఎక్కువ విద్యుత్తు వినియోగం, సొంత కారు, అనుమతించిన దాని కంటే ఎక్కువ స్థలం, ఆదాయ పన్ను చెల్లింపు, నెలకు రూ.12 వేల ఆదాయం మించకూడదు, కుటుంబ సభ్యుల్లో ఒకరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా ఈ పథకానికి అనర్హులు. పైన పేర్కొన్న వాటిల్లో ఏ ఒక్కటి ఉన్నా లబ్ధి చేకూరడంలేదు. దీనికితోడు లబ్ధిదారులకు ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలుంటే ఏదో ఒక దానిలో రాయితీ సొమ్ము జమయ్యే అవకాశం ఉన్నందున వారు వాటిని పరిశీలించుకోవాలనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

అబాకస్ పోటీలతో ప్రతిభకు పదును

విజేతలుగా నిలిచిన విద్యార్థులు

బాపట్ల, న్యూస్‌టుడే: అబాకస్ పోటీలు విద్యార్థుల ప్రతిభకు పదును పెడతాయని డీఎస్పీ జగదీష్ నాయక్ అన్నారు. పట్టణంలో యూసీమాస్ సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల, చీరాల విద్యార్థులకు అబాకస్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందన్నారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన వారే పోటీ ప్రపంచంలో విజేతలుగా నిలుస్తారని పేర్కొన్నారు. ప్రపంచంలో ప్రముఖ కంపెనీల సీఈవోలు భారతీయులు కావటం గర్వకారణమన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుని తల్లిదండ్రులు, గురువులకు గర్వకారణంగా నిలవాలన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, స్మైలీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కందిపప్పు దూరం

రూ.20కే గోధుమ పిండితో ఊరట

పేటేరు(రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ప్రభుత్వం అందించే నిత్యావసర సరకుల్లో కందిపప్పు లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నెలలోనూ చౌకధరల దుకాణాలకు కందిపప్పు సరఫరా కాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. బియ్యం, పంచదారతో సరిపెట్టుకోక తప్పదని వాపోతున్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు ఒక్కో సభ్యునికి ఐదు కిలోల చొప్పున బియ్యం అందిస్తోంది. కార్డుకు రూ.17.50కే అరకిలో పంచదార ప్రభుత్వం సరఫరా చేస్తోంది. గతంలో రాయితీపై కిలో కందిపప్పు రూ.67కే పంపిణీ చేసేది. బహిరంగ మార్కెట్లో కిలో రూ.120 ధర ఉండడంతో కొనేందుకు ఆర్థిక భారానికి గురవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. రెక్కాడితే డొక్కాడని పేదలకు కందిపప్పు అందని ద్రాక్షగా మారిందని ఇంట్లో పప్పు ఉడికించి ఏడాది కావస్తోందని వాపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు పేదల పాలిట శాపంగా మారిందని మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా పేదలకు కందిపప్పు సరఫరా చేయాలని కోరుతున్నారు.

★ కిలో గోధుమ పిండి రూ.20కే పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మార్కెట్లో రూ.50 ధర పలికే గోధుమపిండి తక్కువ ధరకే లభ్యం కానుండడంతో లబ్ధిదారులు కొంత మేరకు ఊరట చెందుతున్నారు. రేపల్లె, బాపట్ల, చీరాల పట్టణాలకు 68 టన్నుల గోధుమపిండి సరఫరా చేశామని జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజరు శ్రీలక్ష్మి తెలిపారు. ప్రభుత్వం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే కందిపప్పు సరఫరా అవుతుందని తెలిపారు.

జిల్లాలో ఇలా	
రేషన్ దుకాణాలు	1123
మొత్తం కార్డులు	471387
అవసరమైన కందిపప్పు మెట్రిక్ టన్నులు	90

అంగన్‌వాడీల సంక్షేమానికి పెద్దపీట

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుందన్నారు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలతో పాటు ప్రతి కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించామన్నారు. రూ.75 కోట్లతో రాష్ట్రంలో 58,204 మంది కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కో-ఆర్డినేటర్లకు 5 జీ చరవాణులు అందజేశామని చెప్పారు. టీవీ, ఆర్వో ప్లాంటు, ఆట వస్తువులు, చార్టులు, మెడికల్ కిట్టు, ఇండక్షన్ స్టౌవ్, వంట సామగ్రి పంపిణీ, 5 వేల మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయిస్తున్నామన్నారు. అందులో భాగంగా మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు టీచర్‌గా పదోన్నతి కల్పించి పూర్తిస్థాయి వేతనం అందించనున్నామన్నారు. అంగన్‌వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో ఇప్పటికే తొమ్మిది పరిష్కరించామన్నారు. రెండు సార్లు వేతనాలు పెంచిన ఘనత తెదేపాకు ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వేతనాలు పెంపు అంశాన్ని అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

అంకమ్మరావు సేవలు అభినందనీయం

అంకమ్మరావు దంపతులను సత్కరించిన డీటీవో పరంధామరెడ్డి

బాపట్ల, న్యూస్‌టుడే: రవాణా శాఖలో మూడున్నర దశాబ్దాలకు పైగా పి.అంకమ్మరావు అందించిన సేవలు అభినందనీయమని జిల్లా రవాణాశాఖాధికారి పరంధామరెడ్డి అన్నారు. సహాయ మోటారు వాహనాల తనిఖీ అధికారి అంకమ్మరావు ఉద్యోగ విరమణ సందర్భంగా పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో అభినందన, వీడ్కోలు సభ నిర్వహించారు. అంకమ్మరావు దంపతులను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి సహచర అధికారులకు ఆదర్శంగా నిలిచారన్నారు. డీటీవో సత్యనారాయణ, మోటారు వాహనాల తనిఖీ అధికారులు రంగారావు, ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

మహిళల్లో నాయకత్వ నైపుణ్యాలు పెంపు

స్త్రీ శక్తి పంచకం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మనోహరి

బాపట్ల, న్యూస్‌టుడే: మహిళల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ నైపుణ్యాలు పెంచటమే లక్ష్యంగా స్త్రీ శక్తి పంచకం అనే నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు భాజపా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పరిమి మనోహరి అన్నారు. భాజపా జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో స్త్రీ శక్తి పంచకం కరపత్రాలను పార్టీ నేతలు ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సాహం, ఆరోగ్యకరమైన అలవాట్లపై అవగాహన కల్పించే ఉద్దేశంతో తృణధాన్యాల ఆహార ఫెస్టివల్‌ను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అతివలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు కొండముది బంగారుబాబు మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఎన్డీయే ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. నేతలు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు, వెంకట రామకృష్ణ, రత్తయ్య, అనిల్‌కుమార్, జయలక్ష్మి, సత్యవతి పాల్గొన్నారు.

14 నుంచి సామాజిక శిక్షణ తరగతులు

చీరాల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి విమర్శించారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాల్యాద్రి మాట్లాడుతూ దళితుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు మార్చి 14 నుంచి 16 వరకు చీరాలలో రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వేట్లపాలెం ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. బాధితులకు కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్నవారికి రక్షణ కల్పించే చట్టాన్ని తీసుకురావాలని కోరారు. లింగం జయరాజు, శరత్, ఎన్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో పిలుస్తోంది.. పదపద

యువికా-26కు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

ఇస్రో సందర్శనలో విద్యార్థి బృందం

విజయపురిసౌత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థి పీవీ నాగార్జునకు గతేడాది ఇస్రో యువికాలో పాల్గొనే అవకాశం లభించింది. యువికాలో భాగంగా అంతరిక్ష పరిశోధన కేంద్రాలను వీక్షించడం, సైన్సు, శాస్త్ర సాంకేతిక రంగంపై అవగాహన పెంపొందడంతో అక్కడి నుంచి వచ్చాక నాగార్జున సైన్సు ప్రాజెక్టుల రూపకల్పనలో ఎంతో రాటుదేలాడు. సొంతంగా యాప్‌లు రూపకల్పన చేసే స్థాయికి వెళ్లాడు. దిల్లీతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైన్సు వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్టులు ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నాడు.

ఇదో చక్కటి అవకాశం: యువికా-2026 (యువ విజ్ఞాన కార్యక్రమం)లో పాల్గొనేందుకు రండంటూ తొమ్మిదో తరగతి విద్యార్థుల్ని ఇస్రో ఆహ్వానిస్తోంది. సైన్సుపట్ల ఆసక్తి, అంతరిక్ష పరిశోధనలపై జిజ్ఞాస ఉన్న వారికి అరుదైన అవకాశమిది. 8వ తరగతిలో పొందిన మార్కులు, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీస్థాయిలో వ్యాస రచన, వక్తృత్వం పోటీలో చూపిన ప్రతిభ, స్పేస్, సైన్సు క్లబ్‌లలో సభ్యత్వం, క్రీడల్లో ప్రతిభ, గ్రామీణ ప్రాంత నేపథ్యానికి వెయిటేజీ మార్కులు ఇస్తారు. యువికాకు ఎంపికైన విద్యార్థులను మే నెలలో రెండు వారాలపాటు కేరళ, ఆంధ్రప్రదేశ్, డెహ్రాడూన్, అహ్మదాబాద్, మేఘాలయ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని స్పేస్ సెంటర్ల సందర్శనకు తీసుకెళ్తారు. ఎన్నో కొత్త విషయాలు నేర్పిస్తారు.

31 వరకు గడువు: రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఫిబ్రవరి 27వ తేదీన ప్రారంభమైంది. ఈ నెల 31వ తేదీతో గడువు ముగియనుంది. మే 11 నుంచి 22 వరకు యువికా-26 కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

రిజిస్ట్రేషన్ ఇలా.. తొలుత జిగ్యాస వెబ్‌సైట్ లోకి వెళ్లి విద్యార్థి పేరు, ఈ-మెయిల్ ఐడీతో రిజిస్టర్ చేసుకోవాలి. మీ ఈ-మెయిల్‌కు ఇచ్చే లింకుపై క్లిక్‌చేసి వివరాలు సరిచూసుకోవాలి. లాగిన్ అయిన తర్వాత ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. క్విజ్ పూర్తయ్యాక వ్యక్తిగత, చదువుకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ ఫారంలో నింపాలి. మీ అర్హతను నిర్ధారించే ధ్రువపత్రాలను స్కాన్‌చేసి అప్‌లోడ్ చేస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ★ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు యువికా-26లో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైన్సు అధికారి ఎస్.రాజశేఖర్ కోరారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు అప్పగింత

వేటపాలెం, న్యూస్‌టుడే: సంవత్సరం కిందట ఇంటి నుంచి వచ్చేసిన వ్యక్తిని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం.. చినగంజాం మండలం అంబేడ్కర్ నగర్‌కు చెందిన పులగోర వేదమూర్తి మతిస్థిమితం కోల్పోయి ఏడాది క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. ఇతను వేటపాలెం చుట్టుపక్కల ప్రాంతాల్లో జుట్టు పెంచుకుని అనుమానాస్పదంగా తిరగడాన్ని పోలీసులు గుర్తించి, స్టేషన్‌కి తీసుకొచ్చి ప్రశ్నించారు. దీంతో అతడు చిరునామా వెల్లడించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఆధారాలు చూపించి, ఇంటికి తీసుకెళ్లారు.

యువకుడి ఆత్మహత్య

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని గంజిపాలేనికి చెందిన వావిలపల్లి యశ్వంత్ మణి(23) తన ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుడే బజారుకు వెళ్లి వచ్చిన తల్లి లోపలికి వెళ్లిచూడగా ఉరివేసుకుని ఉండటంతో స్థానికుల సహాయంతో కిందకు దించి, ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లడంతో అప్పటికే అతడు మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. యువకుడి మృతికి కారణాలు తెలియరాలేదు. దీనిపై ఒకటో పట్టణ పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

తల్లీ పిల్లల ఆత్మహత్యాయత్నం

అడ్డుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: భార్యాభర్తల గొడవల నేపథ్యంలో తల్లి ఇద్దరు పిల్లలతో కలిసి కృష్ణానదిలో దూకి ఆత్మహత్యాయత్నం చేస్తుండగా స్థానికులు అడ్డుకొని మానవత్వాన్ని చాటుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రేపల్లె మండలం మైనేనివారిపాలెంకు చెందిన చంద్రకళ తన 3, 2 ఏళ్ల వయసున్న పిల్లలతో ఆదివారం సాయంత్రం పెనుమూడి వారధి వద్దకు వచ్చి రోదిస్తోంది. ఇది గమనించిన స్థానికులు ఎందుకు బాధపడుతున్నారని ఆరా తీశారు. భర్త వేధింపులు తాళలేక పిల్లలతో నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చానని చెప్పి విలపించింది. వెంటనే స్థానికులు రేపల్లె పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై రాజశేఖర్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యాయత్నానికి కారణం అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో రేపల్లె నుంచి కృష్ణా జిల్లా పులిగడ్డ వెళ్తున్న పులిగడ్డ సర్పంచి పులిగడ్డ సర్పంచి దాసరి విజయ్‌కుమార్ మరో వ్యక్తి భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరారు. సకాలంలో స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం ఇచ్చి ముగ్గురు ప్రాణాలను కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు.

వాలిందా.. గుండె జారిందే!

మార్టూరు, న్యూస్‌టుడే: రోడ్డు పైకి ఒరిగిపోతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు నియంత్రిక, స్తంభం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మార్టూరు నుంచి రాజుపాలెం ప్రయాణించే చెరువు వైపు దారి వెంట ఏళ్ల కింద ఏర్పాటు చేసిన నియంత్రిక, స్తంభాలు నేలకు ఒరిగిపోతున్నాయి. ఒక్కసారిగా అది మరింత కిందకు వాలిందా ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు గుండె జారిపోయే ప్రమాదం లేకపోలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

మార్టూరు-రాజుపాలెం చెరువు వైపు మార్గంలో..

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

మేడికొండూరు మండలం మందపాడు రెవెన్యూ పరిధిలో మందపాడు నుండి రావెల వెళ్ళు రోడ్డు ఫేసింగ్‌లో 5.1/2 ఎకరముల పొలం అమ్మకం. 80742 96586.

LEASE/ RENT

GENERAL

గుంటూరు ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ దగ్గరలో 1576 చ||గ||లు గల ఖాళీ స్థలం అద్దెకు & గోడౌన్ కన్‌స్ట్రక్షన్ చేసి ఇవ్వబడును. ఫోన్: 98482 31040.

TO LET

COMMERCIAL

గుంటూరు లక్ష్మీపురం 3వలైనులో కమర్షియల్ బిల్డింగ్ 2ఫ్లోర్స్ ఈచ్ ఫ్లోర్ 1740sft. బ్యాంక్స్ / సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ ఆఫీసు / షోరూంలకు అద్దెకు. ✆ 9849900303.

JOBS

Wanted Male Transport Incharges Qualification any Degree, Age limit:30 to 45 years, Salary upto:20,000/-. Eligibility having experience in any Educational organisation will be preferable, Note: Must have valid LMV License & Good Knowledge about auto Gear & Manual gear. Working location: Master Minds College, Guntur. Contact: 89784 80430.

ప్రముఖ లోన్స్ ఏజెన్సీ నందు లోన్స్ చేయుటకు టెలికాలర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 97014 79569, 80081 00872.

రాజధాని రాయల్ భూమి డెవలపర్స్ నందు మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ ఎంప్లాయిస్ కావలెను. 10th పాస్ / ఫెయిల్, జీతం: 13000 to 60000 & ఇన్సెంటివ్. ✆ 70137 05436.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు క్లాస్ ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 12000 నుండి 14000 వరకు ఇవ్వబడును. (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22సం||రాల నుండి 40 సం||రాలు ఉండవలెను. వివరాలకు సంప్ర. ఫోన్: 9248733320.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీలో ఉద్యోగ ఖాళీలు: సీనియర్ బ్యాచ్ ఇన్‌ఛార్జీలు, లింగం: పురుషులు మాత్రమే, విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 25 సం||ల నుండి 45 సం||రాల మధ్య ఉండవలెను. నెలకు జీతం:16000 వరకు ఇవ్వబడును. వివరాలకు సంప్రదించగలరు. ఫోన్: 9248722246.

బిజినెస్ మేనేజర్స్/ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ ఫ్రెషర్స్, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న 30 సం||లలోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం సెక్రటరీ జనరల్ వాసిరెడ్డి శివాజీ

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: పోస్టల్ ఉద్యోగుల సమస్యలను మానవతా దృక్పథంతో ప్రభుత్వం పరిష్కరించాలని అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం సెక్రటరీ జనరల్ వాసిరెడ్డి శివాజీ కోరారు. గుంటూరులోని జిల్లాపరిషత్తు సమావేశ మందిరంలో గుంటూరు డివిజన్ పోస్టల్ ఉద్యోగుల జాతీయ సంఘం ద్వైవార్షిక సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శివాజీ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 8వ వేతన సవరణ సంఘంలో జీడీఎస్ ఉద్యోగులను చేర్చాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలను మార్పు చేయాలన్నారు. పోస్టల్ శాఖ ప్రైవేటీకరణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తున్నామన్నారు. పోస్టల్ శాఖను ప్రజలకు సేవలు అందజేసే గొప్ప సంస్థగా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో పోస్టల్ ఉద్యోగుల సంఘం ఏపీ సర్కిల్ అధ్యక్షుడు కృష్ణప్రసాద్, కార్యదర్శి డేవిడ్‌రాజు, పోస్ట్‌మ్యాన్-ఎంటీఎస్ సంఘం సర్కిల్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, డిప్యూటీ సర్కిల్ కార్యదర్శి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

పింఛను అందుకుని.. ప్రాణాలు విడిచి

షేక్ సాబీరా (పాత చిత్రం)

నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ప్రభుత్వం అందించే ఒంటరి మహిళ మార్చి నెల పింఛను అందుకున్న కొద్ది నిమిషాలకే ప్రాణం విడిచింది. తన పింఛను సొమ్మును చివరి కార్యక్రమాలకు ఖర్చు చేయాలని, అప్పులు చేయవద్దని ఆమె కోరడం విశేషం. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నడింపల్లికి చెందిన షేక్ సాబీరా (40) కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. అక్కడ పరిస్థితి విషమంగా ఉండటంతో రెండు రోజులుగా ఆమె వెంటిలేటర్‌పై ఉంది. ఈ క్రమంలో శనివారం ఆమె ఇంటి వద్ద లేకపోవడంతో విషయం తెలుసుకున్న పంచాయతీ సిబ్బంది గోపాల్ ఆమెకు పింఛను అందించేందుకు ఆదివారం ఉదయం జీజీహెచ్‌కి వెళ్లాడు. ఆమె స్పందించి వేలిముద్ర వేసి నగదు తీసుకుని భావోద్వేగానికి గురైంది. ఈ నేపథ్యంలో ఆమె పరిస్థితి విషమించడంతో తన కుటుంబ సభ్యులకు తాను ఇంక బతకనని పింఛను నగదుతోనే చివరి కార్యక్రమాలు నిర్వహించాలని అప్పులు చేసి ఎవరినీ ఇబ్బంది పెట్టొద్దని కుటుంబ సభ్యులను కోరడంతో వారు భావోద్వేగానికి గురయ్యారు. వైద్యులు చికిత్స అందించినా ఫలించలేదు. ఆమె మృతి చెందింది. వైద్యశాల వరకు వచ్చి పింఛను అందించిన కూటమి ప్రభుత్వానికి, సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు చెప్పడం విశేషం.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

నిందితులను రోడ్డుపై నడిపిస్తున్న పోలీసులు

గురజాల, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో నిందితులను పోలీసులు నడిరోడ్డుపై నడిపించారు. నేరాలకు పాల్పడే వారికి ఇదో గుణపాఠం కావాలని హెచ్చరించారు. ఈ ఘటన ఆదివారం పల్నాడు జిల్లా గురజాలలో చోటుచేసుకుంది. వివరాలిలా.. గురజాల మండలం తేలుకుట్ల గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు బత్తుల ఏడుకొండలుపై గత నెల 25న వైకాపా మూకలు కర్రలు, రాడ్లతో దాడి చేశారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఆయనను పులిపాడు సమీపంలో అడ్డుకుని రెండు కాళ్లపై విచక్షణారహితంగా దాడి చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. సీఐ భాస్కర్, ఎస్సై వినోద్‌కుమార్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. చల్లా గురుదేవరాజు (చిన్నా), చల్లా ప్రేమ్‌కుమార్, బత్తుల శ్రీనివాసరావు, చల్లా ఆంజనేయులు, మొగిలి కోటేశ్వరరావు, చల్లా మణికంఠ, వేముల కిషోర్ అరెస్టయిన వారిలో ఉన్నారు. నిందితులను ఆదివారం గురజాల ప్రధాన రహదారిపై నడిపించుకుంటూ స్టేషన్ నుంచి కోర్టు వరకు తీసుకెళ్లారు. అనంతరం పిడుగురాళ్ల కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. వీరికి 15 రోజుల రిమాండు విధిస్తూ గురజాల సబ్‌జైలుకు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డుపై నడిపించడం వంటి చర్యలతో నేరాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు.

అలరించిన జాతీయ స్థాయి నాటిక పోటీలు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: నరసరావుపేట రంగస్థలి 46వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక భువన చంద్ర టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్న 25వ జాతీయ స్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు హైదరాబాద్ వారు ప్రదర్శించిన అమ్మ చెక్కిన బొమ్మ, గేమ్ నాటికలు ప్రేక్షకులను అలరించాయి. రంగస్థల టీవీ, చలన చిత్రనటి, ద్రాక్షారామం పరిషత్ నిర్వాహకురాలు సరోజకు రంగస్థలి ప్రతిభా పురస్కారం అందజేశారు. ఉత్తమ నాటికలకు అతిథులు ఏపీ నాటక అకాడమి ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు బహుమతులు అందజేశారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శాలివాహనుల అభ్యున్నతికి ప్రభుత్వం సహకరించాలి

ఏటీ అగ్రహారం: రాష్ట్రంలోని శాలివాహన సంఘీయులు అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్తామని కుమ్మర శాలివాహన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని సీఏఎన్ కోటేశ్వరరావు కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పారెళ్ల బసవేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి బెజవాడ ఆదిశేషయ్య మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుమ్మర శాలివాహనుల అభ్యున్నతికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ మాట్లాడారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, రిటైల్ ధర - 177, చికెన్ విత్‌స్కిన్ - 257, చికెన్ స్కిన్‌లెస్ - 292.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -150 రిటైల్ ధర 177 చికెన్ విత్ స్కిన్ - 257 చికెన్ స్కిన్‌లెస్ - 292.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 167, 176, 187 చికెన్ విత్ స్కిన్ - 324 చికెన్ స్కిన్‌లెస్ - 334.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

రూ.20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం

నూతనంగా నిర్మించిన పక్కా డ్రైనేజీ

కూచిపూడి, (అమృతలూరు), న్యూస్‌టుడే: కూచిపూడి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సౌకర్యం లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులపై ఈ ఏడాది జనవరి 21న 'డ్రైనేజీ నిర్మించరూ..' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో శేషమాంబ, ఎంపీపీ నరేంద్రకుమార్ మండల ప్రజా పరిషత్తు 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.20లక్షలతో పక్కా డ్రైనేజీ నిర్మింపజేశారు. ముఖ్య సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈనాడు స్పందన

నేడు హిందూ సద్భావనా సదస్సు

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: రేపల్లె ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం హిందూ సద్భావన సదస్సు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సంయోజక్ ఉప్పు సాంబశివరావు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సద్భావన కార్య ప్రాంత సహ సంయోజక్ డాక్టర్ కల్లగుంట నాగార్జున ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు. హిందూ సమాజ పెద్దలు పెద్దసంఖ్యలో హాజరై సలహాలు అందించాలని కోరారు.

ఆరోగ్య పరీక్షలతో వ్యాధుల నివారణ

బాపట్ల, బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: నలభై ఏళ్ల వయసు దాటిన వారు ఆరు నెలలకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా నివారించటం సాధ్యపడుతుందని ప్రముఖ వైద్యులు సల్లమోతు రవికిరణ్ అన్నారు. బావపురి బ్రాహ్మణ సమాఖ్య, రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బావపురి బ్రాహ్మణ సదన్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుండె, ఊపిరితిత్తులు, ఎముకలు, ఇతర అనారోగ్య సమస్యలతో శిబిరానికి వచ్చిన వారికి వైద్యులు ఉచితంగా పరీక్షలు చేసి ఔషధాలు పంపిణీ చేశారు.

శిబిరంలో మాట్లాడుతున్న వైద్యుడు రవికిరణ్

ట్యాంకర్లు లేక.. నీరు అందక

శివారు ప్రాంతాలకు వారానికొకసారే సరఫరా

రైలుపేట, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (బాపట్ల), న్యూస్‌టుడే

వేసవి రాకముందే ఫిబ్రవరిలోనే ఎండల తీవ్రత పెరిగింది. 35 డిగ్రీల పైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తీరప్రాంత పట్టణం కావటంతో ఉక్కపోత ఎక్కువగా ఉంది. ప్రజల నీటి అవసరాలు పెరిగాయి. జిల్లా కేంద్రం బాపట్లలో శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా వారానికొకసారే నీరు సరఫరా చేస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ట్యాంకర్ ఎప్పుడు వస్తుందో అని ఎదురుచూస్తున్నారు. అదనపు ట్యాంకర్లు ఏర్పాటు చేసి కనీసం రెండ్రోజులకోసారైనా నీరు సరఫరా చేయాల్సిన బాధ్యత పురపాలక అధికారులపై ఉంది. శివారు కాలనీలైన బాలకృష్ణాపురం, దర్గా సెంటర్, దేవుడిమాన్యం, గులాం హుస్సేన్ తోట, డ్రైవర్స్ కాలనీ, పాండురంగపేట, ఉప్పరపాలెం, శారదాపురికాలనీ, శాంతినగర్, రామకృష్ణాపురం, బేతని కాలనీ, ఆంధ్రకేసరి నగర్, ఆచంట రంగనాయకులు నగర్, రాజీవ్ గాంధీ కాలనీ, రాజీవ్ నగర్, ఇందిరా కాలనీ, వైయస్ కాలనీ, కారుమూరి హనుమంతరావు నగర్, ఇమ్మడిశెట్టిపాలెం, నరాలశెట్టిపాలెం, పెయింటర్స్ కాలనీ, రజకపేట, నాలుగో వార్డు, జమ్ముదరుపేట, మల్లికార్జున బృందావననగర్ కొళాయిల ద్వారా నీరు అందటం లేదు. ట్యాంకర్ల ద్వారా కానీ నివాసాలకు నీరు సరఫరా చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన మూడు పేదల లేఔట్లలో పేదల కాలనీలు పైపులైన్లు వేయలేదు. రెండు వేల మందికి పైగా గృహాలు ట్యాంకర్ల నీటి పైనే ఆధారపడ్డాయి.

ట్యాంకరు వద్ద నీరు పట్టుకుంటున్న పట్టణవాసులు

నాలుగింటితోనే అందిస్తున్నారు

ట్యాంకర్లు కూడా తక్కువగా ఉండటం వల్ల శివారు కాలనీలు, పేదల గృహాల లేఔట్లకు ట్యాంకర్ల ద్వారా రోజూ నీటి సరఫరా జరగటం లేదు. వారం రోజుల కొకసారి మాత్రమే నీరు అందుతోంది. దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే మరో రెండు ట్యాంకర్లు లీజుకు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రైవేటు ట్యాంకర్లకు ఒక్క ట్రిప్పునకు రూ.900 పురపాలక సంఘం నుంచి చెల్లిస్తున్నారు. మొత్తం ఎనిమిది ట్యాంకర్లు పని చేస్తేనే కనీసం రెండ్రోజులకోసారైనా కాలనీలకు నీటి సరఫరా చేయగలుగుతారు. కానీ నాలుగు ట్యాంకర్లే ఉండటం వల్ల నీరు సక్రమంగా అందటం లేదు. సమస్యపై పురపాలక డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ రూ.70 లక్షలతో ఉప్పరపాలెం ఓవర్‌హెడ్ ట్యాంకుకు ప్రధాన పైపులైను అనుసంధానం చేసే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇవి పూర్తయితే రైలుపేటలో ఎనిమిది వార్డులకు కొళాయిల ద్వారా నీరు అందుతుందని తెలిపారు. అవసరాన్ని బట్టి వేసవిలో అదనంగా ట్యాంకర్లు లీజుకు తీసుకుని ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాణసంచా విక్రయ కేంద్రాల్లో తనిఖీలు

పత్రాలు పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరియా

కర్లపాలెం, రేపల్లె అర్బన్, అరుంబాక (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: బాణసంచా విక్రయ కేంద్రాల యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆర్డీవో గ్లోరియా తెలిపారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనలో 20 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్డీవో అధికారులతో కలిసి కర్లపాలెంలోని బాణసంచా విక్రయ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించడంతో పాటు దుకాణంలో ఏర్పాటు చేసిన సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాపట్ల డీఎస్పీ నాయక్, తహసీల్దార్ శ్రీదేవి, ఎస్సై రవీంద్ర పాల్గొన్నారు. ★ నిబంధనలకు విరుద్ధంగా దీపావళి మందుగుండు సామగ్రి నిల్వ ఉంచితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని 9 మండలాల్లో టపాసులు నిల్వ ఉంచిన వారి సమాచారం అందించిన వారికి తగిన ప్రోత్సాహకం అందజేస్తామని ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ★ చెరుకుపల్లి మండలం అరుంబాక, తెనాలి రోడ్డులోని బాణసంచా దుకాణాల్లో చెరుకుపల్లి ఎస్సై అనిల్ కుమార్ తనిఖీ చేశారు.

నేటి నుంచి రిలే దీక్షలు

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు మారుతున్నా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవటం లేదని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రేపల్లె ఏరియా కన్వీనర్ గొట్టుముక్కల బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన చెరుకుపల్లిలో మాట్లాడుతూ బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం నుంచి విజయవాడలో సంఘం ఆధ్వర్యంలో రిలే నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. బాధితులు పెద్దసంఖ్యలో దీక్షల్లో పాల్గొని సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తేవాలని ఆయన కోరారు.

గిరిజనులకు ఆధార్ కార్డులు అందించాలి

రాంభొట్లపాలెం (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: దేశం అభివృద్ధిపథంలో పరుగులు పెడుతుంటే సమాజంలో నేటికీ గుర్తింపునకు నోచని వాళ్లు ఎందరో ఉన్నారని గిరిజన యూత్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చొప్పా రమేష్ అన్నారు. మండలంలోని రాంభొట్లపాలెం కాల్వ కట్టపై గుడిసెల్లో నివసిస్తున్న గిరిజనులను ఆయన జిల్లా బృందంతో ఆదివారం సందర్శించారు. జిల్లా వ్యాప్తంగా గిరిజనుల వివరాల సేకరణ, వెనుకబడిన వారిని గుర్తించే కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లోని గిరిజనులను తాము కలిసి వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. రాంభొట్లపాలెం కాలువ కట్టపై పది గిరిజన కుటుంబాలు ఉన్నాయని, వారిలో అధికశాతం మందికి ఆధార్ గుర్తింపు కూడా లేకపోవడం శోచనీయమన్నారు. అధికారులు స్పందించి ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తే తాము వీరికి ఆధార్ నమోదు చేయిస్తామని తెలిపారు.

సీఎం సహాయనిధి మంజూరు పత్రాలు అందజేత

వేమూరు, న్యూస్‌టుడే: వేమూరుకు చెందిన కొంత మంది సుహాసిని, కొమ్మూరు వెంకటసత్యవతి, అబ్బనగూడెంకి చెందిన కోసూరి సింగారావు, అల్లంశెట్టి వెంకమ్మ, చావలి శోభారాణి, బసవమ్మ, దండే శివలక్ష్మి, చదలవాడకు చెందిన బొల్లిముంత అంకమ్మ, జంపనికి చెందిన తుటుకూరి దాసు అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు వైద్యశాలలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. వారు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా వారికి రూ. 5.43లక్షల సాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను ఎమ్మెల్యే ఆనందబాబు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

రెండుసార్లు జీతాలు పెంచింది కూటమి ప్రభుత్వమే

అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు వేతనాలు పెంచిందని ఎమ్మెల్యే ఆనందబాబు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమస్యల పరిష్కారం కోసం సోమవారం విజయవాడలో ధర్నా చేపడుతున్నారన్న నేపథ్యంలో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలు ఉంటే నిరసనలు చేపట్టకుండా, శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమానికి కృషి

బాపట్ల: అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలోనే రెండు సార్లు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల వేతనాన్ని పెంచినట్లు గుర్తు చేశారు. ప్రతి నెలా ఒకటిన వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో వేతనాల చెల్లింపులో ఆలస్యం జరిగిందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్న విధంగా వేతనాల పెంపు అంశాన్ని సాధ్యమైనంత త్వరగా అమలు చేయటానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు

కాపూరు (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని కాపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన దాత నాగళ్ల మురళీ కృష్ణ తన తండ్రి జ్ఞాపకార్థం తాను చదివిన పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. రూ.1.20 లక్షల వ్యయంతో దీన్ని బడి, కళాశాల విద్యార్థుల కోసం అందుబాటులోకి తీసుకువచ్చారు. దీని ద్వారా దాదాపు 600 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి స్వచ్ఛ నీరు అందనుంది. ఆదివారంతో పనులు ముగియడంతో ప్లాంట్లు అందుబాటులోకి తీసుకువచ్చారు. గ్రామస్థులు, ఉపాధ్యాయు, అధ్యాపకులు దాతను అభినందించారు.

నీటిశుద్ధి ప్లాంట్ వద్ద దాత మురళీకృష్ణ

బండ్లమ్మ ఆలయాల్లో పూజలు

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలు బండ్లమ్మ అమ్మవారికి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాత్రా బంగారు కాసులహారం, రజిత కవచంతో అలంకరించగా 'ఆదిపరాశక్తి'గా భక్తులకు దర్శనమిచ్చారు. పిట్టలవానిపాలెం, గోకర్ణపు నల్లిబోయినవారిపాలెంలోని బండ్లమ్మ వార్లకు భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆదిపరాశక్తిగా బండ్లమ్మ

అలంకరణలో చందోలు చెన్నకేశవస్వామి

ఘనంగా హంస వాహనోత్సవం

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: చందోలు చెన్నకేశవస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీ విశ్వావసునామ వార్షిక కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి కల్యోత్సవం నిర్వహించారు. హంస వాహనంలో స్వామిని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. భవనంవారిపాలెం వీరాంజనేయ భజన సమాజం వారు భజన కాలక్షేపం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి కార్యక్రమాలను తిలకించారు.

రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు

నగరం, న్యూస్‌టుడే: పెద్దవరంలో రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గత నెల 21న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఈనెల 4న ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని శేష వాహనంపై ఊరేగించి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పెద్దవరం, తోటపల్లి, జిల్లేపల్లి తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అభయప్రదాయినిగా అల్లూరమ్మ

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని అల్లూరు గ్రామ దేవత అల్లూరమ్మకు ఫాల్గుణ మాసం రెండో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో 'అభయప్రదాయిని'గా భక్తులకు దర్శనమిచ్చారు.

బడి ప్రాంగణంలో రాళ్ల గుట్టలు తొలగించరూ

రేపల్లె 23వ వార్డు లాల్‌బహదూర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో రాళ్లగుట్ట ఉండడంతో విద్యార్థులు ఆడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. రెండేళ్ల క్రితం శిథిలమైన పాత బడి భవనాన్ని కూల్చి అక్కడే వదిలేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రాళ్లను చదును చేయించడంలో అధికారులు విఫలమయ్యారు. పిల్లలు మానసిక ఉల్లాసానికి దూరమవుతున్నారని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. కనీస సదుపాయాలైన మూత్రశాల, తాగునీరు, చుట్టూ ప్రహరీ, వంట గది సదుపాయం కల్పించకపోవడంతో ఇక్కడ చదువుకునే పిల్లల సంఖ్య తగ్గుతోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్**

ఖరీఫ్ నాటికైనా శుభ్రం చేయిస్తారా?

రేపల్లె మండలం నల్లూరు సౌత్ శివారు పంట కాలువలో గుర్రపుడెక్క పేరుకుని పారుదలకు అవరోధంగా మారింది. మొక్కజొన్న సాగు చేసే రైతులకు నీరందక అవస్థలు పడుతున్నారు. మోటార్లు ఏర్పాటు చేసుకుని నీరందించాల్సి వస్తోందని అదనపు భారమవుతోందని ఆవేదన చెందుతున్నారు. వేసవి తాపానికి పశువులు సైతం కాలువలో నీరు తాగే అవకాశం లేక అలమటిస్తున్నాయి. ఖరీఫ్ నాటికి పూర్తిగా పూడిక తీయించి రైతులకు మేలు జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, రేపల్లె అర్బన్**



రహదారి నిర్మించి.. అంచులు వదిలేసి

రూ.లక్షలతో రహదారులు నిర్మించిన అధికారులు అంచులు ఏర్పాటు చేయడాన్ని విస్మరిస్తున్నారు. యేలేటిపాలెం శివారు వెలమవారిపాలెం ఎస్సీ కాలనీలోని అంతర్గత రహదారిని సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ప్రభుత్వ పాఠశాలకు వచ్చిపోయే మలుపులో రహదారికి ఇరువైపులా అంచులు పూడ్చకపోవడంతో స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి అంచులు పూడ్చి ప్రమాదాలను నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, నగరం**

ధర తగ్గి దోస రైతుల ఆందోళన

మండల పరిధిలోని దోస పంట విస్తారంగా పండింది. కొన్ని గ్రామాల్లోని రైతులు తెగుళ్లతో కుదేలైనా కొన్ని గ్రామాల్లో పంట విస్తారంగా పండింది. అన్ని గ్రామాల్లో పంట ఒకేసారి రావటంతో పంటకు రేటు పడిపోయింది. వారం క్రితం టిక్కీ గోతాం దోసకాయలు రూ.1200 ఉండగా ఈ వారం అమాంతంగా రేటు పడిపోయింది. ఒక్కసారిగా రూ.500లకు పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం పంట పండించిన రైతుల కంటే వ్యాపారులే లాభాలు గడిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. **-న్యూస్‌టుడే, బాపట్ల టౌన్**

ప్రారంభించి ఏడేళ్లు.. పూర్తవడానికి ఎన్నేళ్లో?

మండలంలోని భవనంవారిపాలెంలో ఏడేళ్ల కిందట ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో ప్రారంభించిన డంపింగ్ యార్డు పనులు నేటికీ పూర్తికాలేదు. ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ప్రభుత్వం మారడంతో పనులు అర్ధాంతరంగా నిలిచాయి. వైకాపా పాలనలో దీని గురించి పట్టించుకున్న నాథుడే లేడు. అధికారులు స్పందించి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, భవనంవారిపాలెం (పిట్టలవానిపాలెం)

కుక్కలున్నాయ్.. పిక్కలు పట్టేస్తున్నాయ్

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే:

కుక్కల బెడద నానాటికి పెరిగిపోతోంది. నడిచి వెళ్లే వారిమీద, ఆడుకుంటున్న చిన్నారులను, వాహనాలపై వెళుతున్న వారిని వదలని పరిస్థితి నెలకొంది. కుక్కలు వెంటపడి మరీ దాడి చేసి గాయపరుస్తున్నాయి. పిల్లలు, మహిళలు వృద్ధులు ఇలా ఎవరినైనా వదలటం లేదు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలు బయటకు రావాలంటే బెంబేలెత్తుతున్నారు. వీధి కుక్కల సంతతి తగ్గించాలని సర్వోన్నత న్యాయస్థానం చెప్పే తీర్పులను స్థానిక అధికారులు పట్టించుకోవటం లేదు. గ్రామాలతో పాటు పట్టణాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. ఇటీవల తూర్పు పిన్నిబోయినవారిపాలెంలో వీధి కుక్క చిన్నారిని నోట కరుచుకుని లాక్కెళ్తుంటే గ్రామస్థులు చిన్నారిని కాపాడారు.

బాపట్ల మండలంలో 9 నెలల్లో 1700 కేసులు

జాతీయ రహదారిపై కుక్కలు

ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు

బాపట్ల మండల పరిధిలో గత 9 నెలల్లో 1700 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. ఏరియా వైద్యశాలకు రోజుకు 6నుంచి 8 మంది కుక్క కరిచిన బాధితులు వస్తున్నారంటే వాటి బెడద ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కర్లపాలెం మండలంలో 270 కేసులు నమోదయ్యాయి. పిట్టలవానిపాలెం మండలంలో రోజుకు 2 నుంచి 5 కేసులు నమోదవుతున్నాయి. ఇంకా ఆసుపత్రులలో నమోదయ్యే కేసులే కాకుండా కుక్క కాటుకు గ్రామాల్లో కొందరు పోస్టు మందు తీసుకునేవారు ఉంటారు. ఇలా బాధితులు ఎక్కువ అవుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ విషయమై ఎంపీడీవో బి.బాబురావు మాట్లాడుతూ వెటర్నరీ ఆధ్వర్యంలో కుక్కల సంతానం ఎక్కువ కాకుండా ఇంజెక్షన్ వేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుక్కలను బంధించి అడవిలో విడిచిపెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పాఠశాలలపై మమకారం.. పూర్వ విద్యార్థుల సహకారం

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే:

ఎంతో మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతుంటారు. వారిలో కొందరు పాఠశాల రుణం తీర్చుకుంటారు. ఈ కోవకు చెందిన వారే.. పిట్టలవానిపాలెం మండలం అల్లూరు, చందోలు, ఉన్నత పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థులు. వీరంతా పాఠశాలలకు గదులు, మంచినీటి ట్యాంకు, వేదికలు నిర్మించడంతో పాటు వసతులు కల్పించారు. అంతేకాక విద్యార్థులను ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిగా నిలిచారు.

చందోలులో రూ.10 లక్షలతో మరమ్మతులు చేసిన గదులు

భావితరాల కోసం..

అల్లూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల అనేక సమస్యలతో సతమతమయ్యేది. పూర్వ విద్యార్థులు చూపిన ఔదార్యంతో పాఠశాలకు నూతన రూపు సంతరించుకుంది. శిథిలావస్థకు చేరిన పెంకుల గదులను తొలగించి దాని స్థానంలో రూ.8 లక్షలతో నాలుగు తరగతి గదులను రేకులతో పునర్నిర్మించారు. పూర్వ విద్యార్థులు రూ.లక్షతో కళావేదిక నిర్మించారు. విద్యార్థుల సైకిళ్లు ఎండలో ఎండుతూ వానలో తడుస్తూ ఉండటంతో పూర్వ విద్యార్థి కొమ్మూరి బాలకృష్ణమూర్తి తన తల్లిదండ్రుల పేరు మీద సుమారు రూ. 2 లక్షలతో సైకిల్ షెడ్డు నిర్మించారు.

ఏటా సాయం

చందోలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 1982-83వ సంవత్సరం పదో తరగతి విద్యార్థులు 2022లో తొలిసారిగా సమావేశమయ్యారు. ప్రతి ఏడాది సమావేశమై పాఠశాలకు తమ వంతుగా సహకారం అందించాలని తీర్మానించుకున్నారు. ఈ పూర్వ విద్యార్థులు అదే సంవత్సరం రూ.1.5 లక్షలతో సైకిల్ షెడ్డు ఏర్పాటు చేశారు. అనంతరం తాగునీటి సమస్యను పరిష్కరించారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల పెంకుల గదులను రూ.10 లక్షలతో గ్రామ అభ్యుదయ కమిటీతో కలిసి మరమ్మతులు చేయించారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

ఏటా గురు పూజోత్సవంలో ఉపాధ్యాయులను సన్మానిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం తరఫున విద్యార్థులకు ఏటా పోటీ పరీక్షల పుస్తకాలను అందజేస్తున్నారు. ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్న పేద విద్యార్థులను గుర్తించి వారికి నగదు ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులు చేరేలా గ్రామీణ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

ఘనంగా పంతాని పుట్టినరోజు వేడుక

కేకు కోస్తున్న పంతాని మురళీధరరావు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె తెదేపా కార్యాలయంలో ఆదివారం కృష్ణా, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి నాయకులకు పంపిణీ చేశారు. పలువురు పుష్పగుచ్ఛం, శాలువా, పూలమాల బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు అనగాని శివప్రసాద్, నర్రా సుబ్బయ్య, గుర్రం మురహరిరావు, కొపనాతి రాజశేఖర్, దండుప్రోలు వెంకటేశ్వరరావు, లక్ష్మీజి, సురేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జూద స్థావరంపై దాడి

బాపట్ల, న్యూస్‌టుడే: రైలుపేటలో జూద స్థావరంపై పట్టణ పోలీసులు ఆదివారం దాడి చేశారు. తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ. 1.10 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

నిరంతర అధ్యయన, కార్యశీలి మేడూరి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: నిరంతర అధ్యయన, కార్యశీలి మేడూరి సత్యనారాయణ అని భారత హేతువాద సంఘ కోశాధికారి షేక్ బాబు పేర్కొన్నారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి జాతీయ పురస్కార గ్రహీత మేడూరి అభినందన సభ ఆదివారం స్థానిక రావిపూడి వెంకటాద్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. బాబు మాట్లాడుతూ మేడూరి 30 ఏళ్లుగా హేతువాద మానవవాద ఉద్యమ కార్యదర్శకత్వం వహిస్తున్నారన్నారు. 72 పుస్తకాలు రచించి వాటిలో 65 పుస్తకాల ముద్రించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరణం రవీంద్రబాబు మాట్లాడారు. భారత, ఏపీ హేతువాద సంఘాల ప్రముఖులు రాజశేఖర్, అబ్రహాం లింకన్, కమలేశ్వరరావు, రాజా, మల్లేశ్వరరావు, లక్ష్మీనారాయణ, శుభ, నాగేశ్వరరావు, రఘురామారావు, నాగేశ్వరి, కుమారి తదితరులు మేడూరిని శాలువాలతో సన్మానించారు.

చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: భట్టిప్రోలు బౌద్ధ స్తూపం పక్కనే ఉన్న చెరువు అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. పర్యాటక శాఖ ద్వారా రూ. 50 లక్షల నిధులతో పనులు జరగనున్నాయి. స్తూపం పక్కనే చెరువు, బుద్ధుని ధ్యాన విగ్రహం ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షించేలా అభివృద్ధి జరగాలన్నదే ప్రజల ఆకాంక్ష. గ్రామానికి చెందిన తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు కేటాయించారు. త్వరలోనే టెండరు ప్రక్రియ పూర్తయితే పనులు జరిగే అవకాశం ఉంది. పెద్ద చెరువు కావడంతో చెరువు చుట్టూ మెరక వేసి నడవటానికి వాకింగ్ ట్రాక్, చెట్లు నాటడం వంటి పనులు జరుగుతాయి. చెరువులో చిన్నారులు, పర్యాటకుల కోసం బోటు షికారు ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ అధికారులు నిర్ణయించారు. పూర్తిస్థాయిలో పనులు జరిగితే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుంది.

అభివృద్ధి చేయనున్న చెరువు

ఆరోగ్యం కోసం నడిచే వారికి ఉపయోగమే

గ్రామంలో చాలామంది యువకులు, పెద్దలు ఆరోగ్యం కోసం ఉదయం, సాయంత్రం సమయాల్లో రోడ్ల వెంబడి నడుస్తున్నారు. చెరువును వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేస్తే రోడ్ల వెంబడి నడవకుండా చెరువు గట్టులపై నడుస్తారు. పక్కనే కాలువ ఉండటంతో చల్లని గాలితోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుంది. సమీపంలోనూ మినీ ట్యాంక్‌బండ్ ఉండటంతో చుట్టు పక్కల గ్రామాల్లోనివారు సెలవు దినాల్లో ఈప్రాంతానికి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న చెరువుకు నిధులు మంజూరు కావడంతో పనులు జరుగుతాయేమో ఆసక్తితో ఉన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే

మండలంలోని ఖాజీపాలెం నుంచి కోమలి వెళ్లే ప్రధాన రహదారికి పాతరెడ్డిపాలెం వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఈ రహదారిలో అరమండ్ల ఛానల్‌పై ఉన్న వంతెన రెయిలింగ్ విరిగి రక్షణ లేకుండా పోయింది. ఎలాంటి ప్రమాద సూచికలు లేవు. వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి వంతెన వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం)**

(c) eenadu

చీరాల

•చీరాల •పర్చూరు

తల్లిదండ్రుల చేతుల్లోనే విద్యార్థుల భవిత

మాట్లాడుతున్న సుధీర్ సండ్ర

ఇంకొల్లు: విద్యార్థుల భవిష్యత్తు తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని మోటివేషనల్ స్పీకర్ సుధీర్ సండ్ర పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవితకు తల్లిదండ్రుల పాత్ర ఎంత ముఖ్యమో వివరించారు. పిల్లలు ఒత్తిడికి గురికాకుండా మంచి మార్గదర్శకత్వంతో ముందుకు తీసుకెళ్లాలన్నారు. చదువుతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సమయపాలన విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి నేర్పించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి తల్లిదండ్రులదే ప్రధాన భూమిక అన్నారు.

నేడు అమరేశ్వరుడి శాంతి కల్యాణం

పర్చూరు, న్యూస్‌టుడే: మండల పరిధి ఉప్పుటూరులోని శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీఅమరేశ్వరస్వామి, శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర స్వామివార్ల ఏకాహ్నిక శాంతి కల్యాణ మహోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఈవో దామా నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. రాత్రి 7 గంటలకు జరిగే స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఉరుమాకుమార వీరభద్రరావు కోరారు.

మార్టూరు ఎస్సై, ఏఎస్సై బదిలీ

మార్టూరు: మార్టూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై షేక్ సైదా, ఏఎస్సై ఎం.బాషాలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల్లో భాగంగా వీరిద్దర్నీ వీఆర్‌కు పంపారు.

కాలువలు అసంపూర్ణం.. కష్టాలకు లేదు మోక్షం!

'గత పాలకుల పాపాలు ఇంకా వెంటాడుతున్నాయి. భూగర్భ కాలువల పేరుతో ఇష్టానుసారంగా పనులు మొదలుపెట్టారు. ఆ తరువాత నిధులు మంజూరుకాలేదు.. అంతే కాలువల పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా మురుగు ముందుకు కదలని స్థితి ఏర్పడింది... దీంతో చీకటి పడితే చాలు దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

యూనియన్ బ్యాంకు వద్ద నిలిచిన మురుగు

వేటపాలెం, న్యూస్‌టుడే

మండల కేంద్రమైన వేటపాలెం పంచాయతీకి వందేళ్ల పైబడి చరిత్ర ఉంది. సుమారు 15 వేలకుపైగా జనాభా నివసిస్తున్నారు. 17 వార్డులు ఉన్నాయి. పంచాయతీ ఆదాయం దాదాపు రూ.అరకోటిపైనే ఉంది. ఇంతటి చరిత్ర ఉన్న పంచాయతీలో వైకాపా ప్రభుత్వ హయాంలో భూగర్భ మురుగు కాలువల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అధికారంలో ఉన్నంత కాలం వీటిని పూర్తి చేయలేకపోయారు. ఆ సమస్య నేటికి పరిష్కారం కాకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరోనా సమయంలో మురుగు కాలువల పనులు మొదలెట్టారు. పంచాయతీ కార్యాలయం దగ్గర నుంచి చిన్నబజారు, తుపానుపేట, రోటరీ క్లబ్ రోడ్డు, రైల్వేస్టేషను రోడ్డు, గొల్లపూడివారి వీధి, సర్వోదయ కాలనీ ప్రాంతాల్లో కొత్త కాలువల నిర్మాణం ప్రారంభించారు. కొన్నింటిని నిర్మించారు. దీనికోసం రూ.70 లక్షలు వ్యయం చేశారు. ఆ తరువాత నిధులు మంజూరు కాకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

అనుసంధానం చేయక.. కొన్ని కాలువలు నిర్మించినప్పటికి అనుసంధానం చేయలేదు. దీనివల్ల గృహాల్లో వినియోగించిన మురుగు పారుదల లేక నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు రాత్రులు దోమల విజృంభిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో తవ్విన కాలువలను స్థానికులే మూసివేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య స్థానిక పంచాయతీ కార్యాలయానికి విచ్చేశారు. ప్రధానంగా డ్రైనేజీ సమస్యను ప్రజలు, నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమ బాధలు తీరుతాయని ప్రజలు భావించారు. అయినా నేటికి పనుల్లో కదలిక లేకపోవడంతో మురుగుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

ర్యాలీలో బాలికలు, పోలీసులు

మంచి, చెడు స్పర్శలపై అవగాహన

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: మహిళా దినోత్సవంలో భాగంగా చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం, పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పట్టణంలో బాలికలతో ర్యాలీ చేపట్టారు. ర్యాలీ గడియార స్తంభం వద్దకు చేరుకుని, మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా శక్తి యాప్, మంచి చెడు స్పర్శలు, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఒకటో, రెండో పట్టణ సీఐలు సుబ్బారావు, నాగభూషణం, ఎస్సై వెంకటేశ్వరరెడ్డి, మహిళా ఎస్సై రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శిలా విగ్రహాల ప్రతిష్ఠ పూజలు

చినగంజాం, న్యూస్‌టుడే: మండలంలోని పూలవారిపాలెం శ్రీరామాలయంలో శ్రీహనుమత్ సీతాలక్ష్మణ సమేత కోదండ రామస్వామి వారి నూతన రాతి విగ్రహాల ప్రతిష్ఠాపన తొలి రోజు పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని గతంలో నిర్మించారు. అందులో పంచలోహ ఉత్సవ విగ్రహాలతో ఇప్పటి వరకు పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. నూతన రాతి విగ్రహాల ప్రతిష్ఠ పూజలు సోమవారం ఉంటాయని, అలాగే అన్నసంతర్పణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తొలి రోజు వివిధ పూజలు నిర్వహించగా గ్రామ పెద్దలు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

హోమ పూజల్లో భక్తులు, నిర్వాహకులు

చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఏలూరి

పేదల ఆరోగ్యానికి పెద్దపీట

మార్టూరు, న్యూస్‌టుడే: పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఆదుకుంటోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం మండల పరిధి ఇసుకదర్శిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) కింద 61 మంది లబ్ధిదారులకు రూ.38 లక్షల నగదు చెక్కులు అందించారు. నోవా అగ్రిగ్రూప్, గ్రీన్‌స్పార్క్ ఫౌండేషన్, ఏలూరి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 20మంది దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు.

అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

మార్టూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం ఇసుకదర్శిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏలూరి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయటానికి కూటమి సర్కారు నిరంతరం కృషి చేస్తోందన్నారు. వేసవిలో 15 రోజుల సెలవులు, పిల్లలకు ఆట వస్తువులు, పాఠాలు బోధించేందుకు సామగ్రి అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 58,204 మంది కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, కో-ఆర్డినేటర్లకు రూ.75 కోట్లతో 5జీ స్మార్ట్ ఫోన్లు అందించినట్లు చెప్పారు. 5 వేల మినీ అంగన్‌వాడీలను పూర్తిస్థాయి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసినట్లు ఎమ్మెల్యే ఏలూరి వివరించారు.

చీరాల, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా చిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం చంద్రబాబు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో అంగన్‌వాడీల వేతనాలు రెండుసార్లు పెంచిన ఘనత తెదేపా ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. కార్యకర్తల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఆందోళనలు విరమించాలని సూచించారు.

స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్, సీఐ రమణయ్య

భద్రత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు

చీరాల అర్బన్, చీరాల గ్రామీణం, కారంచేడు న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటం జరిగి పలువురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్పీ మహ్మద్ మొయిన్ చీరాల మండలం ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బాణసంచా తయారీ కేంద్రాలతో పాటు అమ్మకాలు చేసే గోదాములను ఆదివారం తనిఖీ చేశారు. అలాగే స్వర్ణ-చీరాల మార్గంలో దండుబాట రహదారిలోని టపాసులు విక్రయించే దుకాణంలో అమ్మకాలు, నిల్వల రికార్డులు, అనుమతి పత్రాలు పరిశీలించారు. ఎంతమంది పనిచేస్తున్నారు, ఏయే సమయాల్లో దుకాణాలు తెరుస్తారనే విషయాలను యజమానులను అడిగి తెలుసుకున్నారు. దుకాణదారులు భద్రత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. వెంట సీఐలు ఎం.శేషగిరిరావు, రమణయ్య, ఎస్సైలు చంద్రశేఖర్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

కొత్త రోడ్డు సరే... పాతది పట్టించుకోరా?

పేరాల (చీరాల అర్బన్), న్యూస్‌టుడే: వాడరేవు-పిడుగురాళ్ల రోడ్డు చీరాల పట్టణ పరిధిలోని కారంచేడు గేటు దగ్గర నుంచి వాడరేవు వరకు దాదాపు ఐదు కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంది. గడిచిన రెండేళ్ల నుంచి దీన్ని 167ఏ కింద నాలుగు వరసల జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం దీని పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే చిలకలూరిపేట, పర్చూరు, కారంచేడు ప్రాంతాల్లో ఈ పనులు పూర్తయ్యాయి. చీరాల ప్రాంతంలో మార్చి నాటికి పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇంత వరకు బాగానే ఉంది. ఇదే సమయంలో పాత రోడ్డు గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారైందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేరాల బాలాజీ థియేటరు, కోర్టు భవనాల సముదాయం, కొత్తపేట ప్రసాద్‌నగర్, వాడరేవు ప్రాంతాల పరిధిలో ఉన్న ఈ రోడ్డు దాదాపు కిలోమీటరు వరకు దెబ్బతింది. కొన్నిచోట్ల గుంతలు పడ్డాయి. మరికొన్ని చోట్ల తారు లేచిపోయింది. దీంతో దీనిపై రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడు దెబ్బతిన్న చోట మరమ్మతులు చేస్తున్నా... తాత్కాలికమే... ఫలితంగా మళ్లీ రహదారికి గుంతలు పడుతున్నాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డును శాశ్వతంగా మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి బాగుకు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంత ప్రజలతో పాటు వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గుంతలతో పాత వాడరేవు రహదారి

ఎన్‌హెచ్ నిర్వహణలో నిర్లక్ష్యం

ఈపూరుపాలెం, తోటవారిపాలెం, కొత్తపేట(చీరాల గ్రామీణం): జాతీయ రహదారుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం పెరుగుతోంది. విద్యుత్తు దీపాల నుంచి ప్రయాణికుల మార్గ నిర్దేశనం కోసం అమర్చిన సూచికల వరకు అస్తవ్యస్తంగా ఉన్నా... వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం లేదు. 216ఏ జాతీయ రహదారి వాడరేవు కూడలికి ఇరువైపులా 200 మీటర్ల పొడవున స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇవి పని చేయకపోయినా.. పట్టించుకోవడం లేదు. హైవేలో ప్రమాదకరమైన కూడళ్లలో వాడరేవు ముందు వరుసలో ఉంది. రాత్రి పది గంటల వరకు జన సంచారం అధికంగా ఉంటుంది. వ్యాపార దుకాణాలు క్రమంగా పెరుగుతున్నాయి. అయినా.. నిరుపయోగంగా ఉన్న స్తంభాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రయాణికులకు సమాచారం ఇచ్చేందుకు పలు చోట్ల అధికారులు సూచికలు ఏర్పాటు చేశారు. అవి దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా ఎన్‌హెచ్ నుంచి సమీపంలో ఉన్న గ్రామాలకు వెళ్లే మార్గాల వివరాలు తెలిపే సూచికలు చినిగి, రూపుమారాయి. ఏ ప్రాంతంలో ఎంత వేగంతో వెళ్లాలో తెలిపే ఇనుప సూచికలతో పాటు మైలేజీ రాళ్లు రంగు కోల్పోతున్నాయి. చెరువులు, కాల్వల చెంత ఏర్పాటు చేసిన ఇనుప రైలింగ్ దెబ్బతింటున్నాయి. కొన్నిచోట్ల వాటిని చోరులు దొంగిలించారు. అయినా అధికారుల నుంచి ఎటువంటి స్పందన ఉండటం లేదు. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు.

కొత్తపేట సమీపంలో దెబ్బతిన్న సూచిక

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కారంచేడు, న్యూస్‌టుడే: కారంచేడులోని అరవ కాలనీలో ఆదివారం మధ్యాహ్నం పోలీసులు తనిఖీ చేశారు. పత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ తనిఖీలు చేసినట్లు కారంచేడు ఎస్సై షేక్ ఖాదర్‌బాషా తెలిపారు. వాహనాలకు సరైన పత్రాలు చూపితే సంబంధిత వ్యక్తులకు అందజేస్తామని, లేని పక్షంలో కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని చెప్పారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, ఆటో

వాడరేవులో 16.. చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల మండలం వాడరేవు వైఎస్ఆర్ కాలనీలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అన్ని గృహాలను తనిఖీ చేసి పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానికులకు కౌన్సెలింగ్ నిర్వహించి, మత్తు పదార్థాల క్రయవిక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్పీ మొయిన్ పర్యవేక్షణలో సీఐ శేషగిరిరావు, ఈపూరుపాలెం, వేటపాలెం ఎస్సైలు చంద్రశేఖర్, జనార్దన్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

చీరాల, న్యూస్‌టుడే: సేవా కార్యక్రమాల్లో రోటరీ ఎప్పుడూ ముందుంటుందని ఆ క్లబ్ గవర్నర్ ఎస్వీ రాంప్రసాద్ తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాలను ఆదివారం రాంప్రసాద్ ప్రారంభించారు. దీనిలో భాగంగా బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటను, ఆవరణలో గార్డెన్‌ను డీఎం శ్యామలతో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ వైద్యశాల వద్ద సిమెంటు బల్లలు, పట్టణం నలువైపుల స్వాగత బోర్డులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా రోటరీ గవర్నర్ మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహాయ గవర్నర్ ఎన్.శ్రీనివాసరావు, అడ్డగడ మల్లికార్జునరావు, బండారుపల్లి హేమంత్‌కుమార్, బాచిన నాగమల్లేశ్వరరావు, మువ్వల వంశీకృష్ణ, బి.రవితేజ, ఎస్వీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు. ✦ ప్రభుత్వ వైద్యశాలలో రెండు వీల్‌ఛైర్లు, రెండు స్ట్రెచ్చర్లు అందజేశారు. గవర్నర్ ఎస్వీ రాంప్రసాద్, సహాయ గవర్నర్ ఎన్.శ్రీనివాసరావు, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు జాలాది కృష్ణమూర్తి, లక్ష్మీప్రతాప్, డాక్టర్ ఐ.బాబూరావు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం, రోటరీ గవర్నర్

ఉత్తమ సేవలకు సమాజంలో గుర్తింపు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. చీరాల ఎక్సైజ్ సీఐగా పనిచేసిన పేరం నాగేశ్వరరావు ఉద్యోగ విరమణను పురస్కరించుకుని ఆదివారం కొత్తపేటలో అభినందన సభ నిర్వహించారు. నాగేశ్వరరావు వెంకటరమణ దంపతులను ఉద్యోగులు, మద్యం వ్యాపారులు గజమాలతో సత్కరించారు. ఒంగోలు డిప్యూటీ కమిషనరు హేమంత నాగరాజు, గుంటూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారిణి అరుణకుమారి, బాపట్ల సూపరింటెండెంట్ డాక్టరు సీహెచ్ నరేష్ కుమార్, ఒంగోలు, గుంటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్‌లు జనార్దన్, బాబు పాల్గొన్నారు.

సత్కారం అందుకుంటున్న నాగేశ్వరరావు దంపతులు

వృద్ధులకు దుస్తుల పంపిణీ

మార్టూరు: స్థానిక అమ్మ ఆశ్రమంలోని వృద్ధులకు ఆదివారం పలువురు దాతలు అన్నదానం, దుస్తులు పంపిణీ చేశారు. షేక్ ఖాదర్‌మస్తాన్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు దుస్తులను, గన్నవరం గ్రామానికి చెందిన కొల్లా వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆయన భార్య సింగమ్మ, కుమారుడు శ్రీనివాసరావు, జ్యోతి దంపతులు అన్నదానం చేశారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకుడు జి.చందు కృతజ్ఞతలు తెలిపారు.

బండ్లమ్మ ఆలయాల్లో పూజలు

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలు బండ్లమ్మ అమ్మవారికి ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాతృకా బంగారు కాసులహారం, రజత కవచంతో అలంకరించంగా 'ఆదిపరాశక్తి'గా భక్తులకు దర్శనమిచ్చారు. పిట్టలవానిపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెంలోని బండ్లమ్మ వార్లకు భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆరునెలలుగా ఇదే పరిస్థితి!

ఈ చిత్రంలో మీరు చూస్తున్న స్తంభం నుంచి కిందకు దించిన ఐమాస్ట్ దీపాలు 216 బైపాస్ నుంచి ఈపూరుపాలేనికి వెళ్లే మలుపులో ఉన్నాయి. దీపాలు బాగుచేయడానికి వీటిని కిందకు దింపారు... ఆ తరువాత ఏమైందో తెలియదు... వాటిని బాగుచేయలేదు... పైన పెట్టలేదు... గడిచిన ఆరునెలలుగా ఇదే పరిస్థితి... ఫలితంగా రాత్రులు ఆ దారిన వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారుల అధికారులు స్పందించి వాటిని బాగుచేసి, యథాస్థితికి చేర్చాలని వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, చీరాల అర్బన్

స్తంభం నుంచి కిందకు దించిన దీపాలు

నడవాలన్నా... నరకమే

జాతీయ స్థాయిలో పేరుగాంచిన మార్టూరు కూరగాయల మార్కెట్‌లో కాలుతీసి కాలు పెట్టాలంటే రద్దీతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక్కసారిగా రైతులు తాము పండించిన పచ్చి సరకును విక్రయించేందుకు మార్కెట్‌కు వాహనాలతోనూ, అదే సమయంలో కొనుగోలు చేసేందుకు వినియోగదారులు, చిరు వ్యాపారులూ తరలిరావడంతో కాలు తీసి కాలు పెట్టేందుకు జాగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్రమపద్ధతిన వాహనాల్లోకి కూరగాయలను ఎగుమతి, దిగుమతి చేస్తే కొంతమేరైనా ఇబ్బందులు తొలగేందుకు అవకాశం ఉందని ప్రజలు విజ్ఞప్తిచేస్తున్నారు. - న్యూస్‌టుడే, మార్టూరు

కూరగాయల మార్కెట్‌లో ఇలా..

తల్లీబిడ్డ సురక్షితంగా ఉన్నారని చూపుతున్న డాక్టర్ పృథ్వీరాజు, వైద్యసిబ్బంది

కాన్పులకు ప్రభుత్వ వైద్యశాలలు సురక్షితం

కారంచేడు, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం కారంచేడు మసీదు సెంటర్‌కు చెందిన ఓ గర్భిణికి సాధారణ కాన్పు చేశారు. ఉదయం 5 గంటలకు వైద్యశాలకు నొప్పులతో షేక్ సుమియా రావడంతో డాక్టర్ పృథ్వీరాజు సాధారణ ప్రసవం జరిగేలా వైద్యసేవలు అందించడంతో మగ శిశువుకు జన్మనిచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగితే జననీ సురక్ష యోజన కింద రూ.1000, మూడు రోజుల పాటు భోజన సదుపాయాల కింద రూ.300 ప్రభుత్వం అందిస్తుందని వైద్యులు తెలిపారు. ఆసుపత్రి నుంచి వెళ్లే సమయంలో 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఇంటికి సురక్షితంగా చేరుస్తారన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రభుత్వ వైద్యశాలల్లో సేవలు పొందాలని సూచించారు. స్టాఫ్ నర్సు జానకి, ఏఎన్ఎం మల్లేశ్వరి, రాణి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల: 9154846713 వేటపాలెం: 8008574099
చీరాల గ్రామీణ: 6309994673 పర్చూరు: 9063144743
మార్టూరు: 8008574106 ఇంకొల్లు: 8008574102
చినగంజాం: 8008574103

? రామన్నపేట పంచాయతీ గద్దలగుంట కాలనీకి వెళ్లేదారిలో వీధిలైటు వెలగడంలేదు. రాత్రులు ఇబ్బందిగా ఉంది. - సుధాకర్, స్థానికుడు

✔ వెంటనే సిబ్బందిని పంపి అక్కడ లైటు ఏర్పాటు చేయిస్తా. - మాల్యాద్రి, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, రామన్నపేట - న్యూస్‌టుడే, వేటపాలెం

ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక

చీరాల అర్బన్: శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్.తమన్ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కె.హరిబాబు తెలిపారు. పక్షవాత రోగులకు సహాయంగా ఉండే పరికరాన్ని విద్యార్థి రూపొందించడంతో దీనికి అర్హత సాధించినట్లు చెప్పారు. అవార్డుతో పాటు రూ.10 వేల నగదు పురస్కారం అందుకోనున్నట్లు వివరించారు. తమన్‌ను యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

తమన్

నిరంతర అధ్యయన, కార్యశీలి మేడూరి

ఇంకొల్లు, న్యూస్‌టుడే: నిరంతర అధ్యయన, కార్యశీలి మేడూరి సత్యనారాయణ అని భారత హేతువాద సంఘ కోశాధికారి షేక్ బాబు పేర్కొన్నారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి జాతీయ పురస్కార గ్రహీత మేడూరి అభినందన సభ ఆదివారం స్థానిక రావిపూడి వెంకటాద్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. బాబు మాట్లాడుతూ మేడూరి 30 ఏళ్లుగా హేతువాద మానవవాద ఉద్యమ కార్య దర్శకత్వం వహిస్తున్నారన్నారు. 72 పుస్తకాలు రచించి వాటిలో 65 పుస్తకాల ముద్రించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరణం రవీంద్రబాబు మాట్లాడారు. భారత, ఏపీ హేతువాద సంఘాల ప్రముఖులు రాజశేఖర్, అబ్రహం లింకన్, కమలేశ్వరరావు, రాజా, మల్లేశ్వరరావు, లక్ష్మీనారాయణ, శుభ, నాగేశ్వరరావు, రఘురామారావు, నాగేశ్వరి, కుమారి తదితరులు మేడూరిని శాలువాలతో సన్మానించారు.

సత్యనారాయణను సన్మానిస్తున్న హేతువాద సంఘాల ప్రముఖులు

అమరవీరుల త్యాగంతోనే వర్గీకరణ

చీరాల, పర్చూరు, న్యూస్‌టుడే: ఎంతో మంది అమరవీరుల త్యాగఫలం నేటి వర్గీకరణ అని నాయకులు పేర్కొన్నారు. మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆదివారం చీరాల అంబేడ్కర్ విగ్రహం వద్ద, పర్చూరు బొమ్మల కూడలిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో మృతులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వందనం, నేత పిడతల అభిషేక్ మాట్లాడుతూ 1994లో ప్రారంభమైన ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఎందరో తమ ప్రాణాలు త్యాగం చేశారన్నారు. తేళ్ల రమేష్, మాధవ్, మత్తయ్య, రాజు, రమేష్, వంశీ, సైమన్, రాంబాబు, టి.ప్రభుదాస్, కె.డేవిడ్, పి.వీరయ్య, ఆదియ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పబ్లిక్ నోటీసు

మాక్లయింటు మద్దులూరి రమణమ్మ W/o శ్రీనివాసరావు డోర్.నెం: 2-15, సీతమ్మవారి తోట, సాల్మన్ సెంటర్ పంచాయితీ, చీరాల మండలం అనువారి వలన సంజాయిషీపొంది ఇందువెంట యావన్మందికి తెలియజేయునది ఏమనగా

మాక్లయింట్ సాల్మన్ సెంటర్ పంచాయితీలో డోర్.నెం: 2-15 ఇంటిలో తన పిల్లలతో నివాసము ఉంటూయున్నారు. సదరు ఆస్థి మాక్లయింటు హక్కుభుక్తములలో ఉండియున్నది. మాక్లయింటు భర్తగారైన మద్దులూరి శ్రీనివాసరావు గారు మాక్లయింటుకు తెలియకుండా రహస్యంగా, లాలూచీగా సదరు ఆస్థిని ఇతరులకు విక్రయించుటకు ప్రయత్నములు చేయుచున్నారు. ఎవరు సదరు ఆస్థిని కొనుగోలు చేయరాదు. చేసిన ఎడల మాక్లయింటు వాటిపై సివిల్, క్రిమినల్ చేసుకొనగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు, యం.వి.చలపతిరావు, అడ్వకేట్, చీరాల.

పబ్లిక్ నోటీసు

మా క్లయింటు కరణం చిన్నమ్మ W/o శ్రీరాములు చింతగుంపల్లె గ్రామము, చినగంజాం మండలం, బాపట్ల జిల్లా అను వారి నుండి సంజాయిషీ పొంది యిందు వెంట యిచ్చిన పబ్లిక్ నోటీసు

మా క్లయింటు చింతగుంపల్లె గ్రామము, సర్వేనంబరు 36లో య 1-25 సెంట్లలో తనకు సగం ఆస్తిలో వాటా కలదని, ఆమె యొక్క చెల్లెలు కరణం శీతామహాలక్ష్మీ ఆమె కుమారుడు కరణం వెంచుబాబుతో సివిల్ వివాదములు జరుగుతున్నాయని మరియు మాక్లయింటుకు కరణం రామకృష్ణ గారికి మా క్లయింటు ఆస్తి 192 చ.గ.ల స్తలం మరియు ఇంటికి దక్షిణం వైపున వాస్తు రీత్యా మా క్లయింటు వదులుకున్న స్తలంలోనికి అక్రమముగా డ్రైనేజ పైప్స్ ద్వారా మురుగునీరు మరియు నిరుపయోగమైన వస్తువులు పెట్టి మా క్లయింటును కష్టపరచుచున్నందున వారితో సివిల్ వివాదములు నడుచుచున్నందున పై వివాదములు ఉన్నందున ఎవరు పొలం కొనుగోలు చేయరాదనియు మరియు కరణం రామకృష్ణ మాక్లయింటు 192 చ.గ.ల స్తలం మరియు ఇంటిలోనికి రాకూడదని యిందు వెంట పబ్లిక్ నోటీసు ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది. లేని యెడల మా క్లైయింటు సివిల్ క్రిమినల్ చర్యలు తీసుకొనగలరని యిందుమూలముగా తెలియజేయడమైనది.

యం.వి.చలపతిరావు, అడ్వకేట్, చీరాల

ఫారం నెం. INC-26
(కంపెనీస్ (ఇన్‌కార్పొరేషన్) రూల్స్,2014 లోని రూల్ 30 ప్రకారం)
కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి కర్ణాటక రాష్ట్రానికి మార్చుటకు సంబంధించిన ప్రజా ప్రకటన
కేంద్ర ప్రభుత్వం ముందు, దక్షిణ తూర్పుప్రాంతం, హైదరాబాద్

కంపెనీస్ యాక్ట్, 2013 లోని సెక్షన్ 13 ఉపవిభాగం (4) మరియు కంపెనీస్ (ఇంకార్పొరేషన్) రూల్స్, 2014 లోని రూల్ 30 ఉపనియమం (5) క్లాజ్ (a) ప్రకారం
మరియు
M/s. KSR TEXTILES INDIA PRIVATE LIMITED
(CIN: U17299AP2019PTC111428)
రిజిస్టర్డ్ కార్యాలయం:
12-2-124/32, GF-32, C-Mall స్టేషన్ రోడ్, చీరాల, ప్రకాశం జిల్లా - 523155, ఆంధ్రప్రదేశ్, భారతదేశం.
........పిటిషనర్
దీని ద్వారా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, పై కంపెనీ తన రిజిస్టర్డ్ కార్యాలయాన్ని "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం" నుండి "కర్ణాటక రాష్ట్రం" కు మార్చుటకు, కంపెనీస్ యాక్ట్, 2013 సెక్షన్ 13 ప్రకారం మెమోరాండం ఆఫ్ అసోసియేషన్‌లో మార్పులకు కేంద్ర ప్రభుత్వ అనుమతి పొందుటకు దరఖాస్తు చేయుటకు ప్రతిపాదించుచున్నది.
ఈ సంబంధంగా, కంపెనీ షేర్ హోల్డర్ల అత్యవసర సాధారణ సమావేశం (Extra-Ordinary General Meeting) లేది 21 ఫిబ్రవరి 2026, శనివారం న ఆమోదించిన ప్రత్యేక తీర్మానం ప్రకారం ఈ మార్పు చేపట్టబడుచున్నది. కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయం మార్పువలన ఎవరి ప్రయోజనాలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్నదో, వారు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి పద్నాలుగు (14)రోజులలోపు, తమ అభ్యంతరాలను అఫిడవిట్‌తో సహా క్రింది విధంగా సమర్పించవచ్చును:
. MCA-21 పోర్టల్ (www.mca.gov.in) ద్వారా ఇన్వెస్టర్ కంప్లైంట్ ఫారం దాఖలు చేయవచ్చు లేదా
. రిజిస్టర్డ్ పోస్టు ద్వారా క్రింది చిరునామాకు పంపవచ్చును:
రీజినల్ డైరెక్టర్
4వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టిఅన్నారం గ్రామం, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్- 500 068, తెలంగాణ, భారతదేశం.
అభ్యంతరాల ప్రతిని దరఖాస్తుదారైన కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయానికి కూడా పంపవలెను:
KSR TEXTILES INDIA PRIVATE LIMITED
రిజిస్టర్డ్ కార్యాలయం: 12-2-124/32, GF-32, C-Mall స్టేషన్ రోడ్, చీరాల, ప్రకాశం జిల్లా - 523 155, ఆంధ్రప్రదేశ్, భారతదేశం
KSR TEXTILES INDIA PRIVATE LIMITED తరపున
Sd దేవంగ ఆదినారాయణ కుమార్ రాజా
డైరెక్టర్
తేదీ: 02/03/2026
స్థలం: చీరాల
DIN: 08389891

(c) eenadu

దొంగ చేతికే ఇంటి తాళం

■ ఊరందూరు లేఅవుట్‌లో అక్రమాలకు పాల్పడ్డ అధికారికి అందలం

ఈనాడు- తిరుపతి, న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి: ఒక అధికారి గతంలో విధులు నిర్వర్తించిన ప్రాంతంలోని అవినీతిపై విజిలెన్స్, శాఖాపరంగా విచారణ జరుగుతుంటే సంబంధిత వ్యక్తికి అక్కడ పోస్టింగ్ ఇవ్వరు. ఎవరినీ ప్రభావితం చేయకుండా, పారదర్శకంగా విచారణ చేయాలనే ఉద్దేశంతోనే ఈవిధంగా వ్యవహరిస్తారు. శ్రీకాళహస్తిలో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతోంది. గృహనిర్మాణ శాఖలో ఆరోపణ లున్న సదరు అధికారికి ఇప్పటికే పక్క మండలంలో రెగ్యులర్ పోస్టింగ్ ఉండగా, విమర్శలు ఎదుర్కొంటున్న ప్రాంతంలోనే రెండు చోట్ల ఇన్‌ఛార్జిగా కొనసాగిస్తున్నారు. ఇది చాలదన్నట్టు ఇప్పుడు ఆయనకు అంతకంటే కీలక హోదాలో ఇన్‌ఛార్జిగా నియమించారు. దొంగ చేతికి ఇంటి 'తాళం' ఇవ్వడం అంటే ఇదేనేమో మరి! ఇదంతా కీలక ప్రజాప్రతినిధి సిఫార్సుతోనే జరిగింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో గృహ నిర్మాణ శాఖలో ఎక్కడా లేనంత అక్రమాలు జరిగాయని గగ్గోలు పెడుతోన్న నాయకుడే ఇప్పుడు అవినీతి అధికారికి వంత పాడుతున్నారు. వైకాపాతో అంటకాగిన అధికారికి పోస్టింగ్ ఇప్పించడం వెనుక మతలబేంటని కూటమి శ్రేణులే ప్రశ్నిస్తున్నాయి.

ఊరందూరు లేఅవుట్

160 ఎకరాల కొనుగోలులో..

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శ్రీకాళహస్తి మండలం ఊరందూరు పరిధిలో లో 160 ఎకరాల్లో కాలనీ ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎకరా ధర రూ.7 లక్షలు ఉంటే అప్పట్లో రూ.18 లక్షలకు కొనుగోలు చేశారు. ఇందులో వైకాపా నేతలతోపాటు అధికారులు కొందరు లబ్ధి పొందారు. ఇళ్ల నిర్మాణంలోనూ అవకతవకలు జరిగాయి. ఆప్షన్- 3 కింద కొందరు పేదలకు గుత్తేదారులు నాసికరంగా గృహ నిర్మాణాలు చేశారు. దీనిపై అప్పట్లోనే తీవ్ర ఆరోపణలు వచ్చాయి. టిడ్కో ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను సంప్రదించకుండానే వారందరి పేర్లనూ ఊరందూరు లేఅవుట్‌కు మార్చారు.

ఉద్యోగోన్నతి, ఇన్‌ఛార్జి బాధ్యతలా!

ఈ వ్యవహారాల్లో ప్రస్తుతం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గృహనిర్మాణ శాఖలో పనిచేస్తోన్న సదరు అధికారికీ ప్రమేయం ఉంది. ఒక్క ఊరందూరు లేఅవుట్‌లోనే కోట్లాది రూపాయల అవినీతి జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక విజిలెన్స్, గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేయగా ప్రాథమికంగా వాస్తవమేనని తేలింది. ఈ మొత్తం వ్యవహారం కొలిక్కి రాకముందే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సదరు అధికారిని రెండుచోట్ల ఇన్‌ఛార్జి ఏఈఈగా కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం అతనికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ శ్రీకాళహస్తిలోనే పోస్టింగ్ ఇచ్చారు. ఇంతకుముందు నాయుడుపేటలోనూ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే సమయంలోనూ అక్కడ ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు పొందిన లబ్ధిదారులను పట్టణ హౌసింగు పథకంలోనూ చేర్పించడంపైనా ఇప్పటికీ విచారణ సాగుతూనే ఉంది.

● **పాదర్శకతపై సందేహాలు :** ఇలాంటి వ్యక్తికి కూటమి ప్రజాప్రతినిధి అండగా ఉండటం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇటువంటప్పుడు పారదర్శక విచారణ ఎక్కడ జరుగుతుందని గృహ నిర్మాణ శాఖలోని సిబ్బందే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ జరిగిన అవినీతి, అక్రమాల్లో ప్రధాన భూమిక పోషించిన వాళ్ల అవినీతి గుట్టును వెలుగులోనికి తీసుకువచ్చేలా హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి భక్తుల రద్దీ పెరిగింది. ప్రస్తుతం భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్ నారాయణగిరి షెడ్లు నిండి పోయి శిలాతోరణం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి 14 గంటల్లో, రూ.300 ఎస్‌ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. శనివారం శ్రీవారిని 75,428 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.56 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

న్యాయసౌధం.. దామినేడు సొంతం

ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుపతి(రేణిగ్, కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక నగరి తిరుపతిలో న్యాయసేవలు మరింత చేరువయ్యేలా అధు గుల స్థలంలో దామినేడు వద్ద సుమారు 14.49 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న 16 కోర్టుల నూతన సముదాయానికి ఆదివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ భూమిపూజ చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. వందేళ్ల పైగా చరిత్రగల తిరుపతి బార్ అసోసియేషన్ సేవలను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.గజేంద్ర మాట్లాడుతూ.. ఈరోజు తమ జీవితాల్లో అత్యంత ముఖ్యమైనదన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు, కలెక్టర్

● అంకురార్పణ చేసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

సముదాయం నిర్మాణానికి ఇటుక అందిస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక న్యాయమూర్తులను శాలువాలతో సత్కరించి శ్రీవారి ప్రతిమలు బహూకరించారు.

వెంటాడే దాహం.. అల్లాడే ప్రాణం

● ముంచుకొస్తున్న ముందస్తు ఎండలు ● 200 ఆవాసాల్లో నీటి వనరుల కొరత

తిరుపతి (జీవకోన), చంద్రగిరి, పలమనేరు, న్యూస్‌టుడే: వేసవి వచ్చిందంటే శేషాచలం అడవులను వరుస అగ్ని ప్రమాదాలు కబళిస్తుంటాయి.. లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం దగ్ధమవుతూ ఉంటోంది. దీంతో ఆహారం, నీటి అవసరాలకు వన్యప్రాణులు అలమటించాల్సిన పరిస్థితి. మార్చి, ఏప్రిల్‌లో మొదలయ్యే ఎండల తీవ్రత ఈసారి ఫిబ్రవరి ఆఖరు నుంచి మొదలవడంతో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది.

శేషాచలంలో తగ్గిన నీటిమట్టాలు

శేషాచలం పరిధి సుమారు ఐదువేల హెక్టార్లలో విస్తరించింది. మామండూరు, బాలపల్లె, కోడూరు వరకు జలపాతాలు, నీటిచెలమలు, కుంటలు, పాతబావులు ఎన్నో ఉన్నాయి. అయితే తిరుమల, అవ్వాచారికోనకు దక్షిణ భాగంలో ఉండే అటవీ ప్రాంతంలో ఎలాంటి నీటివనరులు లేవు. దీంతో వేసవిలో ఇక్కడి జంతువులు తరచూ జనావాసాల్లోకి వస్తుంటాయి. ఈసారి శేషాచలం అడవుల్లో నీటిమట్టాలు బాగా పడిపోయినట్లు అధికారులు గుర్తించారు. తిరుపతితోపాటు శ్రీకాళహస్తి, ఏర్పేడు, వెంకటగిరి, వడమాలపేట, పుత్తూరు, భాకరాపేట, యర్రావారిపాలెం, కోడూరు పరిధిలో 200 పైగా నీటి కొరత ప్రదేశాలు గుర్తించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న నీటితొట్టెలు, సాసర్ పిట్లతోపాటు కొత్తవి ఏర్పాటు చేసి అవసరాన్ని బట్టి నీరు అందించాల్సిన అవసరం ఉంది.

తిరుపతి డివిజన్‌లో (2004-25)

- ఏనుగులు: 50
- చిరుతలు: 35
- ఎలుగుబంట్లు: 26
- దేవాంగపిల్లులు: 419
- జింకలు, కణితులు: వేలల్లో

బయోట్రిమ్ అటవీ ప్రాంతంలోని కుంటలో నీటిని నింపుతున్న దృశ్యం

పొంచి ఉంటున్న వేటగాళ్లు

చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని పనబాకం, భాకరపేట రేంజ్‌ల పరిధిలో మనుషులు, వన్యప్రాణుల మధ్య నిత్య ఘర్షణలు జరుగుతున్నాయి. వీటి పరిధిలో మూడు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. వేసవిలో అడవి జంతువులు దాహార్తితో రహదారుల తోపాటు గ్రామాలవైపు వస్తూ కుక్కలతోపాటు వేటగాళ్ల బారినపడుతున్నాయి. ఇక్కడ కొందరు అక్రమార్కులకు వేట నిత్యకృత్యం కాగా వేసవి మరింత కలిసివస్తోంది. వీటి పరిధిలో ఇప్పటివరకు 80 సాసర్ పిట్లు, 14 నీటితొట్టెలు ఏర్పాటు చేసినట్లు చెబుతున్న అధికారులు వేటగాళ్లను సైతం కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

పలమనేరు డివిజన్

● మొత్తం విస్తీర్ణం: 70 కి.మీ ● ఏనుగులు: సుమారు 70 వరకు ● నీటి కుంటలు: 20 ఉండగా.. అందులో సగానికి పైగా ఎండిపోయాయి. ● వేటగాళ్లు సంచరించే ప్రాంతాలు: ఎం.కోటూరు, చెత్తపెంట, ఊసరపెంట, కలిమిచెట్ల పెంట.

చర్యలు తీసుకుంటున్నాం

వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే కొన్నిచోట్ల నీటిని సరఫరా చేస్తున్నాం. కుంటలు, సాసర్‌పిట్లలో ట్యాంకర్ల ద్వారా నీరు నింపేలా చర్యలు తీసుకుంటాం. వర్షాలు కురిసేవరకు పర్యవేక్షణ కొనసాగిస్తాం. - **సి.సెల్వం, అటవీ సంరక్షణాధికారి (సీఎఫ్), తిరుపతి సర్కిల్**

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?

చిత్తూరు జిల్లాలోని కొన్ని రోడ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. అందులో బెంగుళూరు-చెన్నై నాలుగు వరుసల రహదారి ఒకటి. ఈ మార్గంలో పలు ప్రమాదాలు జరుగుతున్నా అనుమతి లేనిచోట్ల రోడ్ల వెంట పెద్ద పెద్ద లారీలు నిలిపేస్తున్నారు. ప్రధానంగా బంగారుపాళ్యం శివారులోని పలమనేరు రోడ్డులో ఇలా పదుల సంఖ్యలో ఆపిన లారీలతో తోటి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ఈనాడు, చిత్తూరు

నేడు 'డయల్ యువర్ ఎస్ఈ'

☛ సంప్రదించాల్సిన నంబరు: 79931 47979

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తు సరఫరా, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమం ఉంటుందని జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ తెలిపారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. విద్యుత్తు సమస్యలు, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకం అమలులో ఎదురవుతున్న సమస్యలను తెలియజేస్తే.. పరిష్కరిస్తామని చెప్పారు. వినియోగదారులకు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ కోరారు.



మెచ్చిన పుస్తకం.. ఇక మీ చెంతనే

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: పోటీ పరీక్షలు, ఇతిహాసాల పుస్తకాల పఠనం కోసం చాలామంది గ్రంథాలయాలకు వెళ్తుంటారు. అక్కడికి వెళ్లినా కావాల్సిన పుస్తకం లభించకపోతే నిరాశపడుతుంటారు. ఇలాంటి వాటన్నింటినీ పరిష్కరించేలా అరచేతిలో డిజిటల్ గ్రంథాలయాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. చరవాణి, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ కంప్యూటరు అందుబాటులో ఉండి.. ఇంటర్నెట్ సౌకర్యం ఉంటే చాలు.. కావాల్సిన పుస్తక ప్రపంచమంతా మీ చెంతనే ఉంటుంది. నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా(ఎన్‌డీఎల్ఐ) యాప్‌ను కేంద్రం తీసుకొచ్చింది.

● ఈ యాప్‌లో సెంట్రల్ లైబ్రరీలో ఉండే వేలాది పుస్తకాలతోపాటు పోటీ పరీక్షలకు అవసరమైన వివరాలు ఉంటాయి. ఎన్‌డీఎల్ఐ యాప్‌ను ఖరగ్‌పూర్ ఐఐటీ రూపొందించింది.

అందుబాటులో వెబ్‌సైట్, ఎన్‌డీఎల్ఐ యాప్ వివరాలిలా..

● ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయాలు: 71 ● ప్రతిరోజూ గ్రంథాలయాల్ని సందర్శించే వారు: 4 వేలకు పైగా ● గ్రంథాలయాల్లోని పుస్తకాలు : 6 లక్షలకు పైగా

అన్ని భాషల్లో

పాఠశాల, కళాశాల స్థాయి నుంచి ఇంజినీరింగ్, న్యాయశాఖ, వైద్యవిద్య, సివిల్స్, తదితర వాటికి కావాల్సిన సమగ్ర సమాచారాన్ని సంక్షిప్తం చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్న నిపుణుల వీడియో పాఠాలను సైతం వీక్షించొచ్చు. సాహిత్యం, సంస్కృతి, ఇతిహాసం, రామాయణం, మహాభారతం వంటి గ్రంథాలయాను చదివేయొచ్చు. అన్ని విభాగాలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను అన్ని భాషల్లో అందుబాటులో ఉంచారు.

వినియోగం ఇలా

ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌ను వినియోగించే పాఠకులు, వీక్షకులు ndli.iitkgp.ac.in వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే పలు అంశాలు కనిపిస్తాయి. ముందుగా భాషను ఎంపిక చేసుకోవాలి. అనంతరం కావాల్సిన అంశంపై క్లిక్ చేసి చదువుకోవచ్చు. ఆయా అంశాలను డౌన్‌లోడ్ చేసుకుని సేవ్ చేసుకోవచ్చు. ప్లేస్టోర్‌లో నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా(ఎన్‌డీఎల్ఐ) అని టైప్ చేసి సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ కూడా చేసుకోవచ్చు.

సాకారం కానున్న పుత్తూరు 100 పడకల ఆసుపత్రి కల

పుత్తూరు, న్యూస్‌టుడే: దశాబ్దాల కాలంలో పుత్తూరు వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచాలని ప్రతిపాదనలు పంపుతున్నా అవి బుట్టదాఖలు అవుతున్నాయి. 2001 నుంచి ఆసుపత్రిగా స్థాయిని పెంచాలని కోరుతున్నా ఇప్పటికి సాకారం అయ్యేలా ఉంది. పుత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల స్థాయి నుంచి వంద పడకల స్థాయికి పెంచాలని గతంలో దివంగత ఎమ్మెల్యే గాలి ముద్దుకృష్ణమనాయుడు ప్రయత్నం చేశారు. పలు దఫాలు ఉమ్మడి ఏపీ అసెంబ్లీలోనూ తన గళాన్ని వినిపించారు.

గతంలో చంద్రబాబు హామీ

2002లో ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పకుండా పుత్తూరు ఆసుపత్రి స్థాయి పెంచుతామని హామీ ఇచ్చారు. 2004లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పుత్తూరు, నగరి నియోజకవర్గాలు వేర్వేరుగా ఉండటంతో అప్పట్లో మంత్రిగా ఉన్న రెడ్డివారి చెంగారెడ్డి నగరిలో ఆసుపత్రిని మంజూరు చేయించుకున్నారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో ఆ ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. 2022లో జిల్లా విభజనలో నగరి నియోజకవర్గం నగరి, నిండ్ర, విజయపురం చిత్తూరు జిల్లాలోను, పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాలోకి చేర్చారు.

అసెంబ్లీ వేదికగా ప్రస్తావన

2024లో జరిగిన ఎన్నికల్లో నగరిలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గెలిచారు. అప్పటి నుంచి పుత్తూరు ఆసుపత్రి స్థాయి పెంచాలని ప్రయత్నం చేస్తున్నారు. ఇదే సమయంలో అసెంబ్లీ వేదికగా ప్రస్తావించారు. పలు దఫాలు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఇక్కడ ఉన్న పరిస్థితుల గురించి వివరించారు. ఈ నేపథ్యంలో మూడు మాసాలకు ముందు ఓ కమిటీని ముఖ్యమంత్రి ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వాలని కోరారు. అధికారులు సైతం పర్యటించి నివేదికను సీఎంవోకు నివేదించారు. ఈ నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల నుంచి కలెక్టరుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆ శాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రతిపాదనలకు ఆమోదం లభిస్తే ప్రజల దశాబ్దాల కళ నెరవేరనుంది.

సాంకేతిక పోటీలు.. మిన్నంటిన సంబరాలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: సరికొత్త ఆలోచనలను పెంపొందించే సాంకేతిక పోటీలు, ఉత్సాహంగా జోష్‌ను నింపే సంగీతాలతో మూడురోజులపాటు తిరుపతి ఐఐటీలో విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన తిరుఉత్సవ-2026 ఆదివారం ముగిశాయి. హత్య జరిగిన సమయంలో పదునైన ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలతో తక్కువ వ్యవధిలో నేరాన్ని ఛేదించే, సాహసం, వ్యూహాత్మక నైపుణ్యాలు పరీక్షించే ఎస్కేప్ రూమ్, బ్లైండ్ ఫొటోగ్రఫీ, స్క్విడ్ గేమ్‌లు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాయంత్రం జరగాల్సిన కార్యక్రమాలు సాంకేతిక కారణాలతో రద్దవడంతో విద్యార్థులు కాస్త నిరుత్సాహ పడ్డారు.

విద్యార్థులతో ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

సెల్ఫీ పాయింట్‌లో..

అమ్మాయిల సరదా

95శాతం ఈ-పంట పూర్తి

☛ నమోదుకు ఆఖరు నేడే

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో రబీ పంటల సాగు ఈ-పంట నమోదు గడువు సోమవారంతో ముగియనుంది. జిల్లాలో 3.85 లక్షల పార్శిల్స్(సర్వే నంబరు)ఈ-పంట నమోదు చేయాల్సి ఉండగా..ఇప్పటివరకు 3.66లక్షల పార్శిల్ పూర్తిచేసి..95 శాతం ఈ-పంట నమోదు పూర్తయినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి తెలిపారు. వంద శాతం ఈ-పంట నమోదుకు దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సహాయకులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్..
చిత్తూరు కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.



(c) eenadu

వరసిద్ధుడి దర్శనానికి ఐదు గంటలు

క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దర్శనానికి భక్తులు ఆలయానికి ఆదివారం పోటెత్తారు. స్వామి వారి దర్శనార్థం భక్తులు వేకువజాము నుంచి క్యూలైన్లలో బారులు తీరారు. దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టింది. భక్తులకు కావాల్సిన వసతులను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీవారి విహారం

రామసముద్రం: సింహ వాహనంపై గట్టువెంకటేశ్వరస్వామి

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని కల్యాణ వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు మాడవీధుల్లో విహరించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం మత్స్యావతారంలో స్వామి దర్శనమిచ్చారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని దీపాలతో అలంకరించారు. **రామసముద్రం:** చెంబకూరులో జరుగుతున్న గట్టువెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు సింహ వాహనంపై విహరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు ‘పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్’

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా ఏఆర్(పాత డీపీవో) కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు తమ సమస్యలను ఫిర్యాదు రూపంలో అందించి న్యాయం పొందొచ్చని వివరించారు. ఫిర్యాదులను ఎస్పీ, ఏఎస్పీలు స్వీకరించి పరిశీలించి, వారం రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

ముక్కంటి సేవలో త్రిపుర సీఎం


త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహాను దర్శనానికి తీసుకెళ్తున్న ఈవో బాపిరెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహ కుటుంబ సభ్యులతో కలిసి వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. వీరికి ఆదివారం ఆలయ ఈవో బాపిరెడ్డి నేతృత్వంలో వేదపండితులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం పలికారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం ఆలయం తరఫున తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు గుర్రప్పశెట్టి, లక్ష్మమ్మ, ఆలయ ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.జయచంద్ర దంపతులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద కలిసి దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. వీరితోపాటు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.జయచంద్ర, అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ భన్సాలీ, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చంద్రశేఖర్ శర్మ, జస్టిస్ బిపిన్ గుప్తా, జస్టిస్ యోగేంద్ర కుమార్ పురోహిత్, ముంబయి హైకోర్టు జస్టిస్ మంజూషా దేశ్‌పాండే, కర్ణాటక లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్ శ్రీవారిని దర్శించుకున్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే వైకాపా అసత్య ప్రచారం

మాట్లాడుతున్న సప్తగిరిప్రసాద్, నాయకులు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: కల్తీ నెయ్యి, పరకామణి చోరీ కేసుల నుంచి భక్తుల దృష్టి మరల్చేందుకే తితిదే ఛైర్మన్ బి.ఆర్.నాయుడుపై నకిలీ వీడియోలతో వైకాపా అసత్య ప్రచారం చేస్తున్నట్లు తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్ ఆరోపించారు. ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామిని అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం కరుణాకర్‌రెడ్డికి తగదన్నారు. త్వరలో ఏకసభ్య కమిషన్ కల్తీనెయ్యి, పరకామణి చోరీ, ఇతర స్కామ్‌లపై విచారణకు రానున్న సందర్భంలో ప్రజలను మభ్య పెట్టేందుకు మార్ఫింగ్ వీడియోలతో సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. తితిదేలో కోటి భగవద్గీతల ముద్రణ పేరుతో రూ.70 కోట్లను స్వాహా చేసి, ముద్రించిన భగవద్గీతలన్నీ ఇప్పటికీ గోడౌన్‌లోనే ఉన్నాయని, కరుణాకర్‌రెడ్డి హయాంలో జరిగిన రూ.వందల కోట్ల అవినీతి బండారం త్వరలోనే బయటపడుతుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో తెదేపా జిల్లా కార్యదర్శి ధరణిప్రకాష్, గోపాల్ పాల్గొన్నారు.

బంతి విరిసి.. కానరాని సిరి

- గిట్టుబాటు ధర లేక రైతులకు నష్టాలు
- పెట్టుబడి దక్కని వైనం

కొత్తయిండ్లు వద్ద సాగు చేసిన బంతిపూలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: పండగలు.. పెళ్లిళ్ల సీజను వస్తుందని బంతిపూలు సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర కరవైంది. బంతి పూలకు గిరాకీ లేక రైతులు నష్టాలను మూటగట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఆరుతడి పంటగా బంతిపూలు సాగు చేసిన రైతులను నిలువునా ముంచేసింది. ఫిబ్రవరి.. మార్చి.. ఏప్రిల్ మాసాల్లో పండగలు, శుభకార్యాలు, జాతరలు వస్తాయని రైతులు బంతి పూల సాగుపై దృష్టి సారించారు.

పలమనేరు, కుప్పం నియోజకవర్గాల పరిధిలో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా బంతి పూలు సాగు చేశారు. మార్కెట్‌లో బంతిపూల ధరలు పతనం కావడంతో రైతాంగానికి కోత కూలీలు చేతికి దక్కడం లేదు. కిలో రూ.3 నుంచి 5 ధర పలకడంతో పలువురు రైతులు తోటల్లోనే వదిలేస్తున్నారు. పూలు తోటలో వదిలేస్తే మచ్చలు ఏర్పడి పంట నష్టపోయే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. దీంతో పూలను కోసి పారబోయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉగాది పండగపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఉగాదికైనా కాస్త ధర పలికితే పెట్టుబడి ఖర్చులైనా చేతికొస్తాయని రైతులు ఆశలు పెట్టుకున్నారు.

నెల రోజులుగా నష్టాలే

పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో బంతి, చామంతి పూల సాగుకు అనుకూలం. ఇక్కడ పండించే పూలు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ సీజన్‌లో పూలకు గిరాకీ లేక ఎగుమతులు తగ్గాయి. పూల అమ్మకాలు లేక ధర పతనమైంది. కిలో రూ.5 కూడా ధర పలకక రైతులకు పెట్టుబడి ఖర్చులు చేతికి రావట్లేదు. మార్కెట్‌కు బంతి పూలు తీసుకెళ్తే కోత కూలీలు, రవాణా ఛార్జీలకే జేబు నుంచి వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. గత నెల రోజులుగా పూలకు ధర లేక రైతులు అప్పుల పాలయ్యారు. ప్రస్తుతం కిలో రూ.3-5 వరకూ ధర పలుకుతోంది.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

చాందిని

కార్వేటినగరం, న్యూస్‌టుడే: మండలంలోని కత్తెరపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థిని జిల్లాస్థాయి విజ్ఞాన మేళాకు ఎంపికైనట్లు హెచ్‌ఎం చెంగల్‌రాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మానక్ అవార్డుకు ఎంపికైందని, స్మార్ట్ హెల్మెట్ బైక్ రైడర్ ప్రాజెక్టు ద్వారా ఈ గుర్తింపు వచ్చిందని వివరించారు. విద్యార్థిని త్వరలో జరిగే జిల్లాస్థాయి పోటీలో పాల్గొంటుందని చెప్పారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలి

కడప నగరపాలక, న్యూస్‌టుడే: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై వైకాపా నాయకులు కడప నగరంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాల వైకాపా ప్రజాప్రతినిధులు, ఆయా జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కొన్ని నెలలుగా పోరుగురాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలు సీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు గొడ్డలిపెట్టుగా మారాయన్నారు. పనులు ఆపేస్తున్నామని ఏపీ సీఎం తనకు హామీ ఇచ్చినట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును బ్యారేజీ స్థాయికి తెచ్చి నామమాత్రంగా పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా దశలవారీ ఉద్యమాన్ని చేపడతామన్నారు. అనంతరం లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై పలు తీర్మానాలు చేశారు. ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, గురుమూర్తి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు ఈ అంశంపై ప్రసంగించారు.

10లోగా అభ్యంతరాలు తెలపండి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను టిస్ ఆధారంగా సిద్ధం చేసి డీఈవో, డీవైఈవో, ఎంఈవోల మెయిల్స్‌లో పొందుపరిచామని, వాటిలో ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 10లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయ పనివేళల్లో తెలియజేయాలని డీఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. తగిన ఆధారాలతో సంబంధిత ఉప, మండల విద్యాశాఖాధికారుల ద్వారా ప్రవేశపెట్టాలని వాటిని అందజేయాలన్నారు. జడ్పీ, ప్రభుత్వ, పురపాలక, నగరపాలక సంస్థ పరిధిలోని ఉపాధ్యాయుల సీనియార్టీ వేర్వేరుగా తయారు చేసినట్లు చెప్పారు.

పంచాయతీల్లో పన్ను వసూలుకు 15 వరకు గడువు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు ఈనెల 15 వరకు గడువు పొడిగించినట్లు డీపీవో సుధాకర్‌రావు తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ వరకు జిల్లాలో 75 శాతం పన్నులు వసూలు చేసినట్లు స్పష్టం చేశారు. మొత్తం లక్ష్యం రూ.27.41 కోట్లు కాగా, అందులో 75 శాతం రూ.20.55 కోట్లు రాబట్టినట్లు ఆయన వెల్లడించారు. గడువులోపు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

3న తితిదే స్థానికాలయాల మూసివేత

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఉదయం 9 గంటలకు ఉమ్మడి జిల్లాలోని తితిదే స్థానికాలయాలను మూసివేయనున్నారు. రాత్రి 7.30 గంటలకు ఆలయాల తలుపులు తెరిచి శుద్ధి అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

రేపు ప్రసన్న వేంకన్న ఆలయం..

వడమాలపేట, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం కారణంగా అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం ఉదయం 9 గంటలకు మూసివేస్తున్నట్లు ఆలయాధికారి వేణుగోపాల్‌రాజు ఆదివారం తెలిపారు. రాత్రి 7 గంటలకు తలుపులు తెరిచి శుద్ధి, పుణ్యాహవచనం అనంతరం సర్వదర్శనానికి అనుమతిస్తారని ఆయన పేర్కొన్నారు.

బీసీల డిమాండ్ల సాధనకు కృషి చేయండి

కృష్ణయ్యను సత్కరిస్తున్న షణ్ముగం

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: బీసీల డిమాండ్ల సాధనకు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరుణ్‌కుమార్‌ను ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి షణ్ముగం కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో వారిని షణ్ముగం కలిశారు. ఈ సందర్భంగా బీసీల హక్కుల సాధనకు భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

పీఎస్‌హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అదనపు కార్యదర్శి శ్రీనివాసులు

పుత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పీఎస్‌హెచ్‌ఎం సమస్యల పరిష్కారం కోసం అధికారులకు నివేదిస్తామని, సమస్య తీవ్రతపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఏపీ పీఎస్‌హెచ్‌ఎంల అసోసియేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. పుత్తూరులో ఆదివారం ఏపీ పీఎస్‌హెచ్‌ఎం తిరుపతి శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో ఉపాధ్యాయుల బదిలీల సమయంలో బలవంతంగా స్కూల్ అసిస్టెంట్లను పీఎస్‌హెచ్‌ఎంలుగా పంపిచారన్నారు. జిల్లాస్థాయిలో సీనియార్టీ జాబితాలో పీఎస్‌హెచ్‌ఎంలుగా పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను వారి సబ్జెక్టుల సీనియార్టీ జాబితాల్లో చేర్చాలని కోరారు. జిల్లా ఉపాధ్యాయ సీనియార్టీ జాబితాను సవరించి, రాబోయే బదిలీల కంటే ముందే పీఎస్‌హెచ్‌ఎంలుగా పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తిరుపతి జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మధుసూదనరాజు, ఉపాధ్యక్షులు శేఖరాచ్చారి, శ్రీధర్, మురళి పాల్గొన్నారు.

పంచ్ కొడుతూ.. పతకాలు పడుతూ..!

- చదువేకాదు.. సహపాఠ్యాంశాల్లోనూ గుర్తింపు
- రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్న చిన్నారులు

ఆ హూ.. అంటూ పంచ్‌లు, కిక్‌లతో ప్రత్యర్థుల్ని పడకొడతారు. బరిలో దిగితే పతకాలు కొడుతూ.. అతిచిన్న వయసులోనే బ్లాక్‌బెల్టులో తొలి డిగ్రీలు(డాన్) అందుకొని.. గుర్తింపు సాధించారు ఆ యువత. కరాటేలో రాష్ట్రస్థాయిలో మెరుస్తున్నారు. కరాటేనే కాకుండా అటు చదువులోనూ రాణిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆ పిడుగుల విజయాలు వారి మాటల్లోనే..- **న్యూస్‌టుడే, చిత్తూరు గ్రామీణ**

ఐఏఎస్ సాధించడమే నా ఆశయం

నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నా. నాన్న ఈశ్వర్‌బాబు, అమ్మ షాలినీ. ఆత్మరక్షణ నైపుణ్యం కోసం ఏడాదిగా కరాటేలో శిక్షణ తీసుకొంటున్నా. గతేడాది బ్లాక్ బెల్టులో నిర్వహించిన పరీక్షలో బ్లాక్‌బెల్టు తొలి డిగ్రీ అందుకున్నా. గతేడాది చిత్తూరులో జరిగిన జాతీయస్థాయి గోజూ-రై కరాటే డూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో చక్కటి ప్రతిభ చూపా. కుమితే, కట్టా విభాగాల్లో బంగారు పతకం, టీం కటా విభాగాలలో వెండి పతకాలు అందుకున్నా. ఐఏఎస్ కావడమే నా కల.

- **మోహన్‌కృష్ణ, చిత్తూరు**

డాక్టర్‌గా ఎదగాలి

స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా.. అమ్మ దీప ఉపాధ్యాయురాలు, నాన్న భగవతిప్రసాద్ వ్యాపారి. వారి ప్రోత్సహంతోనే మూడేళ్లుగా కరాటేలో శిక్షణ తీసుకుంటున్నా. ఇటీవల జరిగిన బ్లాక్‌బెల్టు పరీక్షలో తొలి పట్టా అందుకున్నా. చిత్తూరులో గతేడాది జరిగిన జాతీయస్థాయి గోజూ-రై కరాటే డూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కుమితే విభాగంలో రెండు బంగారు పతకాలు అందుకున్నా. గొప్ప డాక్టర్‌గా పేదలకు సేవ చేయాలనేది నా ఆశయం.

- **భర్గవ్‌శ్రీరాం, చిత్తూరు**

శాస్త్రవేత్తగా రాణించాలి

బీటెక్‌లో పూర్తి చేశా. అమ్మ నిర్మల, నాన్న రాజారెడ్డి. నాన్న ప్రోత్సాహంతో కరాటేలో శిక్షణ తీసుకొంటున్నా. బ్లాక్ బెల్టులో జరిగిన పరీక్షలో ఏడు డిగ్రీ అందుకున్నా. జాతీయస్థాయి గోజూ-రై కరాటే డూ ఛాంపియన్‌షిప్ పోటీలో కట్టాలో వెండి పతకం, రాష్ట్రస్థాయి పోటీల్లో టీం కట్టా, కుమితే, విభాగాల్లో పలు పతకాలు అందుకున్నా. ఏరోస్పేస్ ఇంజినీర్ కావాలనేదే నా లక్ష్యం.

- **నీతిన్‌ప్రసాద్‌రెడ్డి, చిత్తూరు**

అంతరించిపోతున్న వృక్షాలు

చింతకాయలు రాలుస్తున్న కూలీలు

పలమనేరు, న్యూస్‌టుడే: చింతచెట్లు పూర్తిగా అంతరించిపోతున్నాయి. ఒకప్పుడు వేల సంఖ్యలో ఉన్న చెట్లు ఇప్పుడు వందల సంఖ్యకు పరిమితమయ్యాయి. చెట్ల ద్వారా వచ్చే ఫలసాయం కూడా తగ్గిపోతోంది. రోడ్ల విస్తరణ పేరుతో విచ్చలవిడిగా నరికేస్తున్నారు. ఒకప్పుడు చింతచెట్లను ఆయా పరిధిలోని పంచాయతీ అధికారులు వేలం వేసి ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగించేవారు. ఇప్పుడు దాన్ని ఆర్‌అండ్‌బీ విభాగానికి అప్పగించారు. వారు గతంలో చెట్లకు నంబర్లు వేసి కాపలా కాచేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో చెట్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

వేలల్లో నరికివేత.. రోడ్ల పక్కనున్న చింత చెట్ల నుంచి కాయలను ఎవరు పడితే వారు రాల్చేస్తున్నారు. మరికొందరు చెట్ల బెరడును సారా కాయడం కోసం చెక్కేస్తున్నా దిక్కు లేకుండా పోయింది. సమయానికి వేలాలు వేయకపోవడం మరో సమస్యగా మారింది. మదనపల్లె-కృష్ణగిరి రహదారి విస్తరణ కోసం మూడు వేల చింత చెట్లను నరికేశారు. ఇక పలమనేరు నుంచి చిత్తూరు వరకు రోడ్డు విస్తరణ కోసం వెయ్యి చెట్లు కోతకు గురయ్యాయి.

ధర పెరిగింది.. ప్రస్తుతం చింతపండు కిలో రూ.120 కాగా రాల్చిన చింతకాయలు కిలో రూ.100లు పలుకుతోంది. అయితే చెట్ల నుంచి పంట గణనీయంగా తగ్గిపోయింది. ఒకప్పుడు ఒక చెట్టు నుంచి 500 కిలోల కాయ పండితే ఇప్పుడు 250 కిలోలు మాత్రమే పండుతోంది. వేలం పాడే వారు కూడా అతి తక్కువ పాడుతున్నారు.

పరిశోధన నైపుణ్యాల పెంపునకు ఒప్పందం

ఒప్పంద పత్రాలు చూపుతున్న ఐఐటీ, ఐసర్ డైరెక్టర్లు సత్యనారాయణ, భట్టాచార్య, కెనడా ప్రతినిధి

ఏర్పేడు, న్యూస్‌టుడే: విద్యా, పరిశోధన నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు కెనడాలోని డల్హౌసీ విశ్వవిద్యాలయంతో తిరుపతి ఐఐటీ, ఐసర్‌లు ఒప్పందం కుదుర్చుకున్నాయి. కెనడా ఎడ్యుకేషన్ షోకేస్ -2026లో ఆ దేశ విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ ఆధ్వర్యంలో ఆదివారం ఆ వర్సిటీ సీఈవో గాబ్రియేల్ మిల్లర్, ఐఐటీ, ఐసర్ డైరెక్టర్లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇండో- కెనడియన్ సహకారంతో అత్యధిక పరిశోధనలు, ప్రభావవంతమైన ఆవిష్కరణలతో సైన్స్, టెక్నాలజీ, పారిశ్రామిక ప్రగతిపై దృష్టిసారిస్తామన్నారు. డల్హౌసీ వర్సిటీ ఉపకులపతి డా.కిమ్ బ్రూక్స్, బలరామకృష్ణన్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ఆదర్శంగా నిలవాలి

మంత్రి మనోహర్‌తో చిన్నా రాయల్

పుంగనూరు, న్యూస్‌టుడే: జనసేన పార్టీ ప్రారంభించిన సభ్యత్వ నమోదులో పుంగనూరు నియోజకవర్గం ఆదర్శంగా నిలవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారని.. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి, జిల్లా కార్యదర్శి చిన్నా రాయల్ తెలిపారు. రెండ్రోజుల ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రిని ఆదివారం తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశామని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యలపై అధికారుల స్పందన, తదితర అంశాలపై చర్చించారని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వాడవాడలా ముమ్మరంగా చేపట్టాలని మంత్రి తనకు సూచించారని పేర్కొన్నారు.

నాలుగురోజుల క్రితం పెళ్లి.. అంతలో ఆత్మహత్య

మురళి (పాతచిత్రం)

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఇంటి ముంగిట వేసిన పందిరి వాడనేలేదు. పెళ్లికి వచ్చిన బంధువులు ఇంకా ఇళ్లకు చేరనే లేదు. కోలాహలంగా ఉండాల్సిన ఇంట్లో విషాదం నెలకొంది. నాలుగురోజుల కిందట వివాహం చేసుకున్న యువకుడు చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడటంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..

బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె పంచాయతీ జోగిండ్లుకు చెందిన నరసింహులు కుమారుడు జె.మురళి (30) స్థానిక సీఎస్‌సీ కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల కిందట బంధువుల అమ్మాయిని వివాహం చేసుకోగా కొన్నాళ్లకే వారి మధ్య మనస్పర్ధలు ఏర్పడి విడిపోయారు. అనంతరం విడాకులు తీసుకున్నారు. ఫిబ్రవరి 25న ఇచ్ఛాపురానికి చెందిన సుజాతతో వివాహం జరిగింది. సీఎస్‌సీ కేంద్రానికి రోజూ వెళ్లినట్లు 28న ఉదయం ఇంటి నుంచి వెళ్లి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బైరెడ్డిపల్లె పెద్దచెరువులో చేపలుపట్టే వ్యక్తులు ఒడ్డుపై చెప్పులు ఉండటంతో గుర్తించి సమాచారం అందించారు. అనంతరం చెరువులో గాలించి మృతదేహాన్ని ఒడ్డుకు తీశారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చందనప్రియ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: చిత్తూరు నగరం మురకంబట్టులోని ఇందిరమ్మకాలనీ వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి(50) మృతి చెందారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. చిత్తూరు తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో పడిపోయి.. మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తేనెటీగల దాడిలో 20 మందికి గాయాలు

వి.కోట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో తేనెటీగల దాడిలో 20 మంది గాయపడ్డ ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకొంది. వి.కోటకు చెందిన వెంకటరమణ కుటుంబ సభ్యులు స్థానిక మునేశ్వరస్వామి ఆలయం వద్ద మునిదేవర కార్యక్రమం నిర్వహించడానికి వెళ్లారు. అక్కడ చెట్టుపై ఉన్న తేనెటీగలు అగరబత్తుల పొగకు ఒక్కసారిగా అక్కడ ఉన్నవారిపై దాడి చేశాయి. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు

క్రైం కార్నర్

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడుపై డీప్ ఫేక్ ఏఐ వీడియోలు, ఫొటోలతో చేస్తున్న తప్పుడు ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని మదనపల్లెకు చెందిన రమేష్‌బాబు ఆదివారం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కొందరు ఉద్దేశపూర్వకంగా తితిదే ఛైర్మన్ స్వరం, రూపం, వ్యక్తిత్వాన్ని అనుకరించేలా నకిలీ వీడియోలు, ఫొటోలు సృష్టించి సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన తితిదే గౌరవాన్ని దెబ్బతీయడానికి పన్నిన కుట్రగా కన్పిస్తోందని, దీని వెనక బలమైన రాజకీయ దురుద్దేశముందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వైకాపాకు చెందిన పలువురు, వారి సోషల్ మీడియా వ్యవస్థలు ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఒకటో పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు.

EENADU Classifieds

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Mishra Sharmila Devi (OldName)W/o M.Niranjan Prasad, 205FirstFloor, SaiKrishnaBuilding, BalajiColony, Opp:Rallapalli Rest House, Tirupati, AP 517501.I Changed My Name to Mishra Sharmila. Henceforth I Willbe known as Mishra Sharmila.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

తిరుపతి గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డుకు AB AAVAS Phoenix Tower Smart Homesలో 2 BHK, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346.

PLOT FOR SALE

GENERAL

తిరుపతి IIT దగ్గర దుర్గిపేరి నందు 25x40 కొలతలతో West పేసింగ్ ప్లాట్ కలదు. కేవలం 4,20,000/- మాత్రమే. ✆ 80997 85333.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నేషనల్ హైవేలకి ఆనుకొని తిరుపతిలో ప్లాట్‌లు చూస్తున్నారా? అయితే ఫైనల్‌అప్రూవ్డ్ కలిగిన ప్లాట్లు స్పాట్ రిజిస్ట్రేషన్ డైరెక్ట్ ఓనర్ ✆ 95027 74175 / 79959 92114.

WANTED

GENERAL

తిరుపతిలో 3BHK ఇండివిడ్యువల్ హౌస్ లేదా అపార్ట్‌మెంట్ ప్లాట్ అన్ని వసతులు గలది కావలెను. Con: 9393601489.

JOBS

Wanted Female Hostel Incharges Qualification any Degree. Age limit: 25 to 45 years. Salary upto: 15000/- Working Location: Master Minds College, Tirupati. Contact: 73822 59722.

We are Hiring 1.Charted Accountant (Male/ Female) 2.Office Asst. Executive (Female). Experience: Preferred, Salary: Depend on Experience, Location: TPT, Email:gurappaparameswara @ gmail.com ✆ 81234 59658.

తిరుపతిలో ప్రముఖ హోటల్‌లో పనిచేయుటకు మేనేజర్ కావలెను. మంచి జీతం+ అలవెన్సు Q: ఇంటర్. Contact: 9502561265.

తిరుపతి చుట్టుప్రక్కల సివిల్‌వర్క్స్ చేయించుటకు సూపర్‌వైజర్స్ కావలెను. Qua: డిప్లొమా/ B.Tech/ Any Degree. ఆకర్షణీయమైన జీతం ✆ 94941 77700.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్ / హౌస్‌కీపింగ్ కావలెను. 50 సం॥ వయస్సు, 12Hr డ్యూటీ, జీతం: 12,000 - 14,000, తిరుపతి, మదనపల్లిలో. ✆ 72880 04466.

EENADU THE Ec WAY CLASSIFIEDS

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-

Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే

తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు...

80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600

Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

చిత్తూరు

•చిత్తూరు •పూతలపట్టు •గంగాధరనెల్లూరు •నగరి

ఆలయ అభివృద్ధికి సహకరించండి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: మండలంలోని కుమారగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ ఛైర్మన్ రామిశెట్టి రాజశేఖర్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరారు. ఆదివారం నెల్లూరులో మంత్రిని కలిసి ఈ మేరకు విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఛైర్మన్ తెలిపారు.

మంత్రి రామనారాయణరెడ్డితో ఆలయ ఛైర్మన్ రామిశెట్టి రాజశేఖర్

గణనాథుడి సేవలో కర్ణాటక లోకాయుక్త

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామిని కర్ణాటక లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ వాసు, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. మూలమూర్తి దర్శన అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, కాణిపాకం ఎస్సై నరసింహులు, చిత్తూరు న్యాయస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్‌కు జ్ఞాపిక అందిస్తున్న వాసు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సత్కారం



సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను సత్కరిస్తున్న చిత్తూరు బార్ అసోసియేషన్ నాయకులు

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతికి ఆదివారం విచ్చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను చిత్తూరు బార్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిత్తూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి, నాయకులు బాబుప్రసన్న, సయ్యద్ అక్బర్ పాల్గొన్నారు.

జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం ఏర్పాటు

నూతనంగా ఎన్నికైన నాయకులు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం చిత్తూరు నగరం గిరింపేట గాయత్రీ నగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా విక్రమన్, ప్రధాన కార్యదర్శిగా కుప్పస్వామి, ఆర్థిక కార్యదర్శి-శంకర్, గౌరవాధ్యక్షులు-రామచంద్ర, గౌరవ సలహాదారు-చిట్టిబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు-బంగారమ్మ, రాష్ట్ర కౌన్సిలర్‌గా దేవేంద్ర ఎన్నికయ్యారు. ముఖ్య నాయకులు లింగమూర్తి, దేవేంద్ర, గురుమూర్తి, గోవిందస్వామి, వెంకటేశు, మోహనమురళి, బాబు, దేవయ్య పాల్గొన్నారు.

పాత సీసాలతో కొత్త రోగం

❖ నెలల తరబడి వినియోగిస్తే అనారోగ్యం

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరం. ప్లాస్టిక్ వస్తువులను వినియోగించవద్దని నిత్యం చెబుతూనే ఉన్నాం. అయితే ఆచరణలో మాత్రం రోజురోజుకు ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోంది. ప్రధానంగా శీతల పానీయాలు, తాగునీటి బాటిళ్ల వంటివి దుకాణాల్లో తాగిన వెంటనే పడేయాలి. అయితే వాటిని నెలల తరబడి వాడుతున్నారు. కానీ కొందరు వాటిని తాగునీటికి వినియోగించుకుంటున్నారు. తద్వారా కొత్త రోగాలు వస్తున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అవగాహన లోపం కారణంగా ప్లాస్టిక్ సీసాల్లోనే నీటిని తీసుకెళ్తున్నారు.

ప్లాస్టిక్‌తో వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరిగిపోతోంది. పర్యావరణ శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని హెచ్చరికలు చేస్తున్నారు. అయినా మనలో మాత్రం మార్పు రావడంలేదు. ఆఖరికి పాఠశాలలకు వెళ్లే పిల్లలు సైతం నేడు తాగునీటిని ప్లాస్టిక్ బాటిళ్లలోనే తీసుకెళ్తున్నారు. తద్వారా పిల్లలు అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదముంది.

ప్లాస్టిక్ బాటిళ్లు విషపూరితం..

ప్లాస్టిక్ సీసాల వినియోగం వల్ల మహిళలు, పురుషుల్లో సంతానోత్పత్తి సమస్యగా మారుతోందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. సీసాలు శుభ్రంగా లేకపోవడంతో నీరు కలుషితమై వాంతులు, విరేచనాలు, విషజ్వరాలు ఇతర వ్యాధులు కూడా వస్తున్నాయి. విద్యార్థులు ప్లాస్టిక్ సీసాలను కడిగి ఎండలో పెడుతున్నారు. ఎండ వేడికి సీసా తయారీ సందర్భంగా ఉపయోగించిన చిన్న రసాయనాలు వేడికి కరిగి అందులోనే మిళితమవుతున్నాయి. మరుసటి రోజు అందులోనే నీళ్లు పోసుకొని తాగడం వల్ల అనేక జబ్బులకు కారణాలవుతున్నాయి.

ఏ పాఠశాలలో చూసినా ఇదే పరిస్థితి

ఏ పాఠశాలలో చూసినా ఇదే పరిస్థితి నెలకొంది. పాఠశాలల్లో అధికశాతం మంది విద్యార్థులు తాగి పడేసిన ప్లాస్టిక్ సీసాల్లో నీటిని నింపుకొని పాఠశాలలకు వస్తున్నారు. కొన్ని సీసాలు ముడితో ఉంటున్నాయి. మరికొన్ని బాటిళ్లు నాలుగైదు నెలలుగా వాడుతున్నవి ఉన్నాయి.

ఇలా చేస్తే మేలు..

- అత్యవసరం అయితే తప్ప ప్లాస్టిక్ సీసాలను వాడకపోవడం మంచిది
- పాఠశాలల్లో విద్యార్థులకు సురక్షితమైన నీటిని అందించాలి. తద్వారా విద్యార్థులు బాటిళ్లు తీసుకురారు.
- తరగతి గదుల్లో విధిగా మట్టి కుండలు ఏర్పాటు చేయాలి.
- మట్టికుండలో నీటిని తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు పెద్దగా ఉండవు.

విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించాలి

ప్లాస్టిక్ బాటిళ్ల తయారీ ప్రక్రియలో రకరకాల రసాయనాలు కలుపుతారు. విద్యార్థులు ఎండలో పెట్టడం, నెలల తరబడి వాడడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. మొదటగా జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులు వీటిని గుర్తించాలి. - డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, పుత్తూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

తవణంపల్లె, న్యూస్‌టుడే: సమస్య: వెంగంపల్లె పంచాయతీ వడ్డివానిచెరువు గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. **- స్థానికులు**

సమాధానం: పంచాయతీ పరిధిలోని అధికారులతో మాట్లాడి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో

పాలసముద్రం, న్యూస్‌టుడే: సమస్య: గంగమాంబపురం పంచాయతీ పరిధిలోని గ్రామ వీధిలోని కుళాయిలో తాగునీరు వృథాగా పోతోంది. కుళాయికి అమర్చిన పైపు విరిగిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. **- రామయ్య**

సమాధానం: తాగునీటి పైపును బాగు చేయించి నీటి వృథాను అరికడతాం. **- సత్యనారాయణ, కార్యదర్శి**

పెనుమూరు: సమస్య: కలికిరి పంచాయతీ గొల్లపల్లెలో మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. **- స్థానికులు**

సమాధానం: సమస్యను పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతాం.
- డిల్లీబాబు, డిప్యూటీ ఎంపీడీవో

నూతన రెయిలింగ్ ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: జాతీయ రహదారుల సంస్థ అధికారులు మొగిలి ఘాట్‌లో రెయిలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇటీవల 'ఈనాడు'లో 'పాడైన రెయిలింగ్.. పొంచి ఉన్న ప్రమాదం' శీర్షిక కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు ఆ మేరకు స్పందించారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర పాడైన రెయిలింగ్‌ను తొలగించి నూతన రెయిలింగ్‌ను అమర్చారు.

వైభవంగా మైలారు పండగ

పూజలందుకుంటున్న స్వామివారు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: పట్టణంలో మైలారు పండగను రజకులు వైభవంగా నిర్వహించారు. స్థానిక గంగినేని చెరువు తీరంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ఉబ్బదేవర ఉత్సవాన్ని నిర్వహించారు. రజక కులస్థులు సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సీకేబాబు స్వామివారికి తొలిపూజ చేశారు. తెదేపా నాయకులు సీకే సాయికృష్ణారెడ్డి, ఉత్సవ నిర్వాహకులు సురేష్, కుట్టి, సూరి, వెంకటేష్, శ్రీహరి, బుజ్జి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

కాణిపాకం, న్యూస్‌టుడే: కాణిపాకం పరిసరాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ కన్పిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్సై నరసింహులు హెచ్చరించారు. పంచాయతీ పరిధిలోని కాకర్లవారిపల్లె సమీపంలో ముళ్లపొదలు, రాళ్ల గుట్టలను శుభ్రం చేసి... అక్కడ ధైర్యస్పర్శ హోర్డింగును ఏర్పాటు చేసి మాట్లాడారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ముళ్లపొదలు, ఇతర వ్యర్థాలను తొలగించి భక్తులు కూర్చొనేందుకు వీలుగా బల్లలు, విద్యుత్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పోలీసు, పంచాయతీ సిబ్బంది, విద్యుత్తుశాఖ అధికారులు పాల్గొన్నారు.

తొలి తెలుగు పద్య కవయిత్రి మొల్ల

సన్మాన గ్రహీతలతో డీఆర్వో మోహన్‌కుమార్, దేవేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: తొలి తెలుగు పద్య కవయిత్రిగా మొల్ల సాహితీ చరితం పరిమళభరితమని డీఆర్వో మోహన్‌కుమార్ అన్నారు. భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లెలోని బ్రెయిన్ బాక్స్ అకాడమీలో ఆదివారం కవయిత్రి మొల్ల సాహితీ వైభవం పేరిట కవి సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సరళ పదాలతో పామరులకు సైతం అర్థమయ్యే రీతిలో ఆమె రచనలు ఉండేవని తెలిపారు. అనంతరం పలువురు సాహితీవేత్తలకు మొల్ల జాతీయ పురస్కారాల్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షులు మర్రిపూడి దేవేంద్రరావు, నారాయణస్వామి, మరుపూడి కన్నయ్యనాయుడు, మునీంద్ర, గోవిందన్, చక్రపాణి, శ్రీరాజు, యువన్య తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో పీఈఎస్ విద్యార్థుల ప్రభంజనం

యాదమరి, న్యూస్‌టుడే: చిత్రలేఖనంలో పీఈఎస్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ, ఫైన్ ఆర్ట్స్ ఫౌండేషన్ ట్రస్టు.. 13వ నేషనల్ యూత్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఫిబ్రవరి 28న విజయవాడలో నిర్వహించింది. జాతీయస్థాయిలో 250కి పైగా పాఠశాలలకు చెందిన ఐదు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో పీఈఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు 20 మంది బంగారు, 15 మంది సిల్వర్, ఇద్దరు ఆల్ ఇండియా క్విడ్స్ ఆర్టిస్ట్ పతకాలు కైవసం చేసుకున్నారు. పీఈఎస్ పాఠశాలకు ఆల్ ఇండియా బెస్ట్ ఆర్ట్ స్కూల్ అవార్డు రాగా.. ఆర్ట్ మాస్టర్ దినేష్ ఆల్ ఇండియా బెస్ట్ ఆర్ట్ టీచర్ అవార్డును సొంతం చేసుకున్నారు. తెదేపా రాజకీయ వ్యవహారాల జాతీయ కార్యదర్శి జనార్దన్, ఏపీ క్రియేటివ్ కల్చరల్ కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. గెలుపొందిన విద్యార్థులు, ఆర్ట్ మాస్టర్ దినేష్‌ను పీఈఎస్ పాఠశాల ప్రిన్సిపల్ వై.వి.కృష్ణబాబు ఆదివారం అభినందించారు.

అవార్డు అందుకుంటున్న ఆర్ట్ మాస్టారు దినేష్

నిత్యావసర సరకులు సక్రమంగా అందించాలి

గుడిపాల, న్యూస్‌టుడే: చౌక దుకాణాల్లో డీలర్లు లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులను సక్రమంగా అందించాలని ఎంపీపీ గొల్ల హరిప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని సి.బండపల్లెలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. సరకులు సక్రమంగా అందుతున్నాయా, తూకం సరిగ్గా ఉందా, సమయానికి అందుబాటులో ఉండి అందిస్తున్నారా, అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగరాజయాదవ్, నాయకులు అనిల్ కుమార్, ఏకాంబరం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు తప్పనిసరిగా హాజరుకావాలి

పాలసముద్రం, న్యూస్‌టుడే: ప్రతి సోమవారం ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ డేకు తప్పనిసరిగా మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఎంపీడీవో సతీష్‌రాజు ఆదివారం ఓ ప్రకటలో తెలిపారు.

తూగుండ్రంలో అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తూగుండ్రం హైస్కూలులో 1978-79, 1979-80లో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. కనీస మౌలిక వసతులు లేని కాలంలో కష్టపడి విద్యను అభ్యసించి.. ప్రస్తుతం దేశవిదేశాల్లో వ్యాపార, ఉద్యోగ రంగాల్లో స్థిరపడిన వారంతా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులైన సుబ్రహ్మణ్యంరెడ్డి, మాధవన్, మోహన్‌పిళ్లై, మనోహర్‌ను సమన్వయకర్తలు మార్కొండనాయుడు, పద్మనాభం, దేవరాజులు, రవిరెడ్డితో కలిసి పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

కొత్తగా వేశారు.. అంతలోనే కూలింది

బెంగుళూరు-చెన్నై జాతీయ రహదారిలోని బంగారుపాళ్యం మండలం కల్లూరుపల్లి వద్ద కాలువపై ఉన్న పైకప్పు కూలి ప్రమాదకరంగా ఉంది. రోడ్డు పక్కన ఇరువైపులా కొత్తగా కాలువ నిర్మించారు. దీనిపై ఉన్న పైకప్పు అనేక చోట్ల కూలిపోయింది. మరికొన్ని చోట్ల పెద్ద పెద్ద రంధ్రాలు పడి వాటిపై చెట్లు కమ్ముకున్నాయి. పొరబాటున పాదచారులు అటుగా నడక సాగిస్తే గుంతలో పడక తప్పదు. నిర్మించిన కొద్ది రోజులకే ఇలా కూలిపోవడం నిర్మాణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. **- ఈనాడు, చిత్తూరు**

వాలిన స్తంభం.. కూలితే ప్రమాదం

మండలంలోని లక్కలపూడివాండ్లఊరు పంచాయతీ వెంకటేశ్వరపురం సమీపంలో రోడ్డు పక్కనే స్తంభం వాలిపోయింది. స్తంభం కూలితే పెను ప్రమాదం జరిగే అవకాశముంది. విద్యుత్తు అధికారులు స్పందించి వాలిన స్తంభాన్ని బాగు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ తులసిప్రసాద్‌ను వివరణ కోరగా... సిబ్బంది సహకారంతో స్తంభాన్ని వెంటనే బాగు చేయిస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, పెనుమూరు**

వీధి బురదమయంగా మారి..!

పాలసముద్రంలోని దళితవాడ గ్రామ ప్రజలు మురుగు నీటితో నానా అవస్థలు పడుతున్నారు. అంబేడ్కర్ విగ్రహం పక్కనున్న వీధిలో కాలువలు సరిగా లేకపోవడంతో నీరు రోడ్లపై చేరుతోంది. పైగా కుళాయిల నుంచి వచ్చే నీటిని సైతం రోడ్డుపై నిల్వ ఉండటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. బురదతో దోమలు విపరీతంగా ఉంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వీధిని పరిశీలించి వృథాగా పోతున్న నీటిని, మురుగునీటిని కట్టడి చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పాలసముద్రం**

ఆరని నిప్పు.. వన్యప్రాణులకు ముప్పు

అడవికి నిప్పు జీవరాశులకు ముప్పుగా మారింది. నగరి సమీపంలోని ముక్కు కొండకు శనివారం సాయంత్రం ఎవరో నిప్పు పెట్టడంతో మంటలు కొండకు వ్యాపించాయి. వన్యప్రాణులకు ఈ మంటలు ప్రాణహాని కలిగిస్తున్నాయి. కొండలో జింకలు, కుందేళ్లు, అడవి పందులు, నక్కలు ఉంటున్నాయి. ఈ మంటల కారణంగా వాటికి రక్షణ లేకుండా పోతోంది. **- న్యూస్‌టుడే, నగరి**

వాకర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు

నగరి వాకర్స్ అసోసియేషన్‌లో సభ్యత్వ నమోదు చేస్తున్న సభ్యులు

నగరి, న్యూస్‌టుడే: నగరి వాకర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించినట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు డా.రామచంద్రన్ తెలిపారు. అసోసియేషన్ ద్వారా ఉచిత డయాలసిస్ పరీక్షలు, వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు, మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు లక్ష్మీపతి, గుణశేఖర్, మోహన్, సోము, రమేష్ మనోహర్ నాయుడు, కుప్పయ్య పాల్గొన్నారు.

కళాశాలలో వార్షికోత్సవాలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం డిగ్రీ కళాశాల 16వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సినీ గాయని సమీరా భరద్వాజ్ పాటలతో అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల ఛైర్ పర్సన్ శాంతా నాగరాజ్, వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్ బహుమతులు అందించారు. ప్రిన్సిపల్ సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాట పాడుతున్న గాయని సమీరా భరద్వాజ్

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయండి

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు పట్టణంలోని సౌత్ ఆంధ్ర లూథరిన్ చర్చి ఆస్తుల అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని ఆ సంఘ సభ్యులు నిరసన తెలిపారు. ఆదివారం పట్టణంలోని చర్చి స్థలంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబరు 238/3లో 5.28 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డుల్లో క్రైస్తవుల ఆస్తిగా ఉందన్నారు. అయితే కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని విక్రయించడానికి సిద్ధ పడుతున్నారన్నారు. పుత్తూరు మున్సిపల్ కమిషనర్ ప్లాట్లు వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం సభ్యులు ఏకాంబరం(యాకోబు), సురేష్, శ్యామ్, మోహన్, బాబు, రాజేశ్వరి, జైశంకర్ పాల్గొన్నారు.

5న ఉద్యోగ మేళా

పెనుమూరు, న్యూస్‌టుడే: స్థానిక ఎస్వీవీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 5న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ సురేంద్రరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ, బీఫాం పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు ఉన్న వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కామధేను వాహనంపై సుబ్రహ్మణ్యేశ్వరుడు

పుత్తూరు, న్యూస్‌టుడే: శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుడు కామధేను వాహనంపై ఆదివారం రాత్రి ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. పట్టణంలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఉదయం స్వామి, అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి కామధేను వాహనంపై ఆశీనుడై పురవీధుల్లో విహరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుందరం, అర్చకులు పాల్గొన్నారు.

'కోటి అర్చన' పూజలు

పాలసముద్రం, న్యూస్‌టుడే: శ్రీబంగారు అడిగల్ ఓంశక్తి అమ్మవారికి గురుపోర్రి కోటి అర్చన పూజలను మహిళలు నిర్వహించారు. ఆదివారం స్థానిక ఓంశక్తి ఆలయంలో ఆధ్యాత్మిక గురువు బంగారు అడిగల్ ఓంశక్తి అమ్మవారి పెరుమంగళ మహోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించారు.

కోలాహలంగా పశువుల పరస

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని గౌనితిమ్మేపల్లెలో పశువుల పరస కోలాహలంగా జరిగింది. స్థానిక గ్రామదేవత ఆలయం వద్ద గ్రామస్థులు పశువులకు పూజలు చేసి మైలేరు పండగ పరుగు పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, తమిళనాడు సరిహద్దు నుంచి తీసుకొచ్చిన కోడెగిత్తలు, రెండుపళ్ల దూడలను మైలేరు పండగలో పరుగు తీయించారు. పరుగు తీస్తున్న గిత్తలను నిలువరిస్తూ యువత సందడి చేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు పండగను ఆసక్తిగా తిలకించారు. నిర్వాహకులు విజేతగా నిలిచిన కోడెగిత్తల యజమానులకు బహుమతులు అందజేశారు.

సొంత భవనాలు సమకూరేనా..?

✦ అద్దె గదుల్లో కార్యాలయాల నిర్వహణ

నగరి, న్యూస్‌టుడే: పేదవారికి సొంతింటి కల సాకారం చేస్తున్న ప్రభుత్వానికి, ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు సమకూర్చుకోవడంలో జాప్యం జరుగుతోంది. నగరి పురపాలక సంఘం ఏర్పడి ఈ ఏడాది మే నాటికి 21 సంవత్సరాలు నిండింది. ఎప్పుడో మేజర్ పంచాయతీగా ఉన్న నాడు నిర్మించిన పాత భవనంలోనే నేటికీ కొనసాగుతోంది. మూడు సార్లు పాలకవర్గాలు ఎన్నికైనా, ఎవరూ స్వంత భవనంపై దృష్టి పెట్టలేదు. పురపాలక సంఘం కార్యాలయంలో చాలీచాలని గదుల్లో మున్సిపల్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

స్థలం కేటాయించినా... సొంత భవన నిర్మాణానికి రెండు సంవత్సరాల కిందట జాతీయ రహదారి పక్కనే ప్రభుత్వం స్థలం కేటాయించింది. పాత ఆర్టీసీ బస్టాండ్ స్థలాను పురపాలక సంఘానికి కేటాయించి, అందుకు బదులుగా సంత మైదానంలో మున్సిపల్ బస్టాండ్ స్థలాన్ని ఆర్టీసీకి బదిలీ చేశారు. అప్పటి నుంచి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా ఇప్పటివరకు పునాది వేయలేదు. ఆర్డీవో కార్యాలయం నగరిలో ఏర్పాటు చేసే నాటికి తగిన భవనం లేక, పశుసంవర్ధకశాఖకు చెందిన భవనంలో పైఅంతస్తులో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అందులోనే కొనసాగుతున్నారు. డీఎస్పీ కార్యాలయం నగరిలో అద్దె భవనంలో నెట్టుకొస్తున్నారు.

పాత పంచాయతీ భవనంలో కొనసాగుతున్న నగరి పురపాలక కార్యాలయం

శివారులో ఓ చిన్న గదిలో.. మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం పట్టణ శివారులో ఓ చిన్న అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. నిత్యం ఆర్థిక లావాదేవీలతో రద్దీగా ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సుమారు 25 సంవత్సరాలుగా అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. ఉప ఖజానా కార్యాలయం సైతం ఇదే పరిస్థితి. వీటన్నింటికి సొంత భవనాలు ఎప్పటికి సమకూరునోనని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

తల్లీకుమార్తె అదృశ్యం

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామంలో భర్తతో గొడవ పడి నాలుగేళ్ల చిన్నారితో ఓ తల్లి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మణికంటేశ్వర్‌రెడ్డి ఆదివారం తెలిపారు.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: దేవళంపేట పంచాయతీ దిగువమూర్తివారిపల్లెలో శనివారం రాత్రి ఒంటరి ఏనుగు పంట పొలాలపై దాడి చేసింది. గ్రామానికి చెందిన రాజన్న, నాగరాజు, నరసింహులు, శివయ్య, చిన్నబ్బ పొలాల్లో మామిడి చెట్ల కొమ్మలను విరిచి నష్టం చేసింది.

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణస్వామి (70) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఆయన స్వగ్రామం తిరుపతి జిల్లా మొగరాల గ్రామంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

నారాయణస్వామి (పాతచిత్రం)

'వైకాపావి అసత్య ఆరోపణలు'

పెనుమూరు, న్యూస్‌టుడే: తితిదే ఛైర్మన్ బీఆర్‌నాయుడుపై వైకాపా చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని మాజీ ఎంపీపీ వి.హరిబాబునాయుడు ఖండించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కల్తీ నెయ్యి వ్యవహారం ఎక్కడ బయట పడుతుందనే భయంతో ఫేక్ వీడియోలను విడుదల చేశారన్నారు. కల్తీ నెయ్యిపై విచారణ కోసం ఏకసభ్య కమిషన్ వస్తున్న నేపథ్యంలో తమ తప్పులను కప్పి పుచ్చుకోవడానికే తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు.

ముస్లింల నిరసన ర్యాలీ

గంగాధరనెల్లూరు, న్యూస్‌టుడే: అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యపై ఆదివారం మండల పరిధి ఆవలకొండలో షియా ముస్లింలు నిరసన చేపట్టారు. ఖమేనీ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు.

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR.
O.E.P.No. 11 of 2025
O.S.No. 276 of 2007
Between:
V. Yugandhar ...Decree holder
And:
B.K. Vijay Kumar (died) and others ...Judgment debtors
RULE 22 NOTICE TO JUDGEMENT DEBTORS. No.3 TO 6
To
3. B.V. Dhrakshayani, W/o late B.K.Vijaya Kumar,
4. B.V. Vamseekrishna, S/o late B.K. Vijaya Kumar,
5. K.B.V. Swetha, D/o late B.K. Vijaya Kumar,
6. B.V. Muralikrishna, S/o late B.K. Vijaya Kumar,
Nos. 3 to 6 are residents of Gunthur Village,G.K.V.Vandla Vooru post, Bangarupalyam Mandal,Chittoor District.
Sir/Madam,
Please take notice that the above named petitioner filed the above petition against B.K.Vijaya Kumar and yourself, you all being legal representatives of B.K.Vijaya Kumar, for attachment of amount of yours in E.P.6/2016. This is the rule 22 notice for your appearance and filing of objections if any. The above matter is posted to 12-03-2026 for your appearance and to raise objections if any. Please take notice and be present on the said date before the said Hon'ble court by 10-30 A.M., to raise objections, if any, either in person or through any counsel. If failed to do so, the matter will be decided ex-parte in your absence.
Sd/-D.RAJENDRA REDDY
Advocate for D.Hr.

(c) eenadu

ఘనంగా గంగమ్మ శికారోత్సవం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం మండలం కొత్తపేటలో కొలువైన పెద్దపల్లి గంగమ్మ జాతరలో భాగంగా ఆదివారం శికారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిపై గంగమ్మను ఉంచి మేళ తాళాల మధ్య ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు అన్నదానం చేశారు.

పలమనేరు

•పలమనేరు • కుప్పం

పాఠశాల ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

శాంతిపురం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 2026-27 విద్యాసంవత్సరం ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలిందిగా ప్రిన్సిపల్ లత పేర్కొన్నారు. ఈనెల 31 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మే 12న ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు అర్హత పరీక్షను నిర్వహిస్తామన్నారు.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: దేవళంపేట పంచాయతీ దిగువమూర్తివారిపల్లెలో శనివారం రాత్రి ఒంటరి ఏనుగు పంట పొలాలపై దాడి చేసింది. గ్రామానికి చెందిన రాజన్న, నాగరాజు, నరసింహులు, శివయ్య, చిన్నబ్బ పొలాల్లో మామిడి చెట్ల కొమ్మలను విరిచి నష్టం చేసింది.

అంగన్‌వాడీల సంక్షేమానికి కృషి

పలమనేరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా మొదటి సారి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతున్నారు. ఎన్నికల్లో అంగన్‌వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఏళ్ల తరబడి ఎదురు చూసిన గ్రాట్యుటీ కలను కూటమి ప్రభుత్వం నిజం చేయడానికి బడ్జెట్‌లో కేటాయింపులు చేసిందన్నారు.

గదులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

రిక్రియేషన్ క్లబ్ గదులు ప్రారంభం

పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్‌లో నూతనంగా నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్వీబాలాజీ, క్లబ్ నిర్వాహకులు బాలాజీయాదవ్, ప్రభాకర్, బాబు, చెంగారెడ్డి నాయకులు గిరిబాబు, కుట్టి, సుబ్రహ్మణ్యం, ఖాజా పాల్గొన్నారు.

నిప్పు పెడితే.. సంపద సృష్టి ఎలా?

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: చెత్త నుంచి సంపద సృష్టించాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే క్షేత్ర స్థాయిలో కొందరు అధికారులు, నాయకులు దీనికి తూట్లు పొడుస్తున్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని చేస్తున్న ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంతో దీనికి కేటాయించిన నిధులు వృథా అవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కనీసం చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని స్థానికులు వాపోతున్నారు.

నిధులు వృథా

ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ నిధులతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. ఈ కేంద్రాల నిర్వహణను పట్టించుకునేవారు లేకపోవడంతో కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. వీటి నిర్మాణం కోసం కేటాయించిన నిధులు వ్యర్థమయ్యాయి.

చందం పంచాయతీలో సంపద తయారీ కేంద్రం వద్ద చెత్తకు నిప్పు పెట్టిన వైనం

కొన్నిచోట్ల చెరువుల సమీపంలో కేంద్రాలు నిర్మించారు. హంద్రీ నీవా జలాలతో చెరువులు నిండటం వల్ల ఇవి నీట మునిగాయి. వీటిని మరోచోట నిర్మించాల్సిన అవసరం ఉంది.

పర్యావరణానికి ముప్పు

చెత్తకు ఎక్కడపడితే అక్కడ కాలుస్తున్నారని, తద్వారా ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇక్కడ చెత్త పోగు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేయాలనుకున్నారు. తక్కువ ధరకు రైతులకు ఇవ్వాలనుకున్నారు. అయితే ఇలా చేసిన దాఖలాలు ఎక్కడా కనిపించలేదు. పైగా చెత్తను సేకరించి కేంద్రాల్లోనే నిప్పు పెడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది.

నిరుపయోగంగా మారిన కేంద్రాలు

కుప్పం మండలం చందం పంచాయతీ కేంద్రంలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పిచ్చి మొక్కల నడుమ దర్శనమిస్తోంది. గ్రామంలో సేకరించిన చెత్తను కేంద్రం బయట నిల్వ చేసి నిప్పు పెడుతున్నారు. దీనివల్ల పరిసరాలు నిత్యం పొగతో నిండిపోతున్నాయి. దీంతో ఇటువైపు రావాలంటేనే గ్రామస్థులు భయపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పర్యావరణానికి హాని కలిగించకుండా చెత్త నుంచి సంపద సృష్టించాలని స్థానికులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: సమస్య: రాయలపేట పంచాయతీ కేంద్రంలోని మురుగునీటి కాలువలు చెత్తతో నిండిపోయాయి. శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది.

- శంకర్, స్థానికుడు

సమాధానం: మురుగు కాలువలను శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

- శారదాదేవి, డిప్యూటీ ఎంపీడీవో, పెద్దపంజాణి

పశువుల పరుగులు.. జనం ఈలలు

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల పరిధి దండికుప్పంలో పశువుల పండగను ఆదివారం కోలాహలంగా నిర్వహించారు. కుప్పం పరిసర ప్రాంతాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పశువులను తీసుకొచ్చి పరుగులు తీయించారు. మంచి ప్రదర్శన చేసిన పశువుల యజమానులకు నగదు బహుమతులను అందజేశారు.

కోలాహలంగా దూడల మైలేరు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని గౌనితిమ్మేపల్లెలో దూడల మైలేరు పండగ కోలాహలంగా జరిగింది. స్థానిక గ్రామదేవత ఆలయం వద్ద గ్రామస్థులు పశువులకు పూజలు చేసి మైలేరు పండగ పరుగు పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక, తమిళనాడు సరిహద్దు నుంచి తీసుకొచ్చిన కోడెగిత్తలు, రెండుపళ్ల దూడలను మైలేరు పండగలో పరుగు తీయించారు. పరుగు తీస్తున్న గిత్తలను నిలువరిస్తూ యువత సందడి చేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు పండగను ఆసక్తిగా తిలకించారు. నిర్వాహకులు విజేతగా నిలిచిన కోడెగిత్తల యజమానులకు బహుమతులు అందజేశారు.

జనం మధ్యలో పరుగులు తీస్తున్న ఎద్దు

నేత్ర పరీక్షలు విజయవంతం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో పీఈఎస్ ఆస్పత్రి వైద్యులు 45 మందికి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యతో బాధపడుతున్న ఐదుగురిని చికిత్సకు ఎంపిక చేశారు. వారికి ఉచితంగా చికిత్స చేస్తామన్నారు. సంస్థ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో ఉచిత భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు శ్రీనివాసులు, శాంతమ్మ, మునెప్ప పాల్గొన్నారు.

నేత్ర చికిత్సకు ఎంపికైన వారితో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులు, మహతి ఫౌండేషన్ నిర్వాహకులు

కళాశాల వార్షికోత్సవాలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం డిగ్రీ కళాశాల 16వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సినీ గాయని సమీరా భరద్వాజ్ పాటలతో అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల ఛైర్ పర్సన్ శాంతా నాగరాజ్, వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్ బహుమతులు అందించారు. ప్రిన్సిపల్ సుధారాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాట పాడుతున్న గాయని సమీరా భరద్వాజ్

నిర్మించారు.. వదిలేశారు..!

పెద్దపంజాణి మండలంలోని చలమంగళం పంచాయతీ ముద్దేపల్లె గ్రామంలో నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకు దాదాపు పదేళ్లుగా నిరుపయోగంగా ఉంది. నీటి అవసరాల కోసం రూ. లక్షల వ్యయంతో నిర్మించిన దీని ద్వారా పట్టుమని నెలరోజులు కూడా నీరు అందించలేదు. బోరు నుంచి ట్యాంకు వరకు వేసిన పైపులైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పెద్దపంజాణి

మురుగు పారదు.. వెతలు తీరవు

బైరెడ్డిపల్లె మండలం పాతపేట గ్రామ శివారులో మురుగు నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి కాలువల ద్వారా వచ్చే మురుగు శివారులో నిల్వ ఉంటోంది. కాలువలో వ్యర్థాలు పేరకుపోవడంతో పరిసరాలు దుర్వాసన వస్తున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, బైరెడ్డిపల్లె**

అల్లుకున్న పొదలు.. పొంచి ఉన్న సర్పాలు

శాంతిపురం మండలం చిన్నారిదొడ్డి పంచాయతీ కేటీపల్లె కాలనీలో పారిశుద్ధ్యం కొరవడింది. నివాసాల మధ్యలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగిపోయాయి. దీంతో ఇవి సర్పాలకు ఆవాసంగా మారినట్లు కాలనీవాసులు తెలిపారు. వీధి దీపాలు లేనందున రాత్రి వేళల్లో ఇళ్లనుంచి కాలు బయటపెట్టలేని పరిస్థితిని ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, శాంతిపురం

మరమ్మతులకు గురై.. మూలకు చేరి

శాంతిపురం మండలం మఠం పంచాయతీలో చెత్త సేకరణకు వినియోగించాల్సిన ఈ-ఆటో మూలకు చేరింది. నిర్వహణ లేమితో మరమ్మతులకు గురైన ఆటో గ్రామ సచివాలయం ఎదుట తుప్పు పడుతోంది. అధికారులు స్పందించి ఆటోకు మరమ్మతులు చేసి స్వచ్ఛత లక్ష్యసాధనకు వినియోగించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, శాంతిపురం**

కూలిన ప్రహరీ.. పట్టించుకునేవారేరీ!

పెద్దపంజాణి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ గతేడాది కురిసిన వర్షాలకు కూలిపోయింది. ప్రహరీని నిర్మించడానికి విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో పాఠశాలకు రక్షణ లేకుండా పోతోంది. రాత్రి వేళల్లో కొందరు లోపలికి వస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, పెద్దపంజాణి**

వ్యర్థాలు.. తొలగించేదెవరు?

పెద్దపంజాణి మండలంలోని శంకరాయలపేటలో హోటళ్లు, చికెన్ దుకాణదారులు వ్యర్థాలను చెరువుకట్టపై ఉన్న రోడ్డుపై పడేస్తున్నారు. మరికొందరు చెరువు నీటిలోకి వేస్తున్నారు. ఈ మార్గంలో వెళ్లే వారు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, పెద్దపంజాణి**

గరుడ వాహనంపై నలగుంద్రాయస్వామి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: కడపనత్తంలో శ్రీనలగుంద్రాయస్వామి గరుడోత్సవం వేడుకగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం అర్చకులు స్వామివారికి సుప్రభాత సేవ, కలశారాధన హోమం, పూజలు నిర్వహించారు. అలివేలుమంగమ్మ, పద్మావతి సమేత నలగుంద్రాయస్వామి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి గరుడ వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. రాత్రి గజ వాహనంపై స్వామివారు విహరించారు. గౌనితిమ్మేపల్లె గ్రామస్థులు ఉభయదారులుగా స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

పల్లె ప్రగతికి.. రోడ్లే కీలకం

కూటమి ప్రభుత్వంలో పూర్తవుతున్న పనులు

కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామీణ రోడ్లకు మహర్దశ వచ్చింది. గత వైకాపా పాలనలో గ్రామీణ రోడ్ల గురించి పట్టించుకోకపోవడంతో రోడ్లు దారుణంగా తయారయ్యాయి. కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

ఎక్కడెక్కడంటే

మండలంలోని కీలపట్లరోడ్డు నుంచి నలసానపల్లెకు సిమెంట్ రోడ్డు, నలసానపల్లె నుంచి కొత్తపల్లె క్రాస్ వరకు తారురోడ్డు, మదనపల్లె రోడ్డు నుంచి మేలుమాయికి పక్కా రోడ్డు, మదనపల్లెరోడ్డు నుంచి చిన్నమనాయనపల్లె వరకు సిమెంట్ రోడ్డు, బెంగళూరు రోడ్డు నుంచి కీలపల్లె వరకు పక్కా రోడ్డు, కూర్నిపల్లె క్రాస్ నుంచి రామాపురం వరకు పక్కా రోడ్డు, రామాపురం నుంచి ఏడూరు క్రాస్, రామాపురం నుంచి దండపల్లె క్రాస్ వరకు ఇప్పటికే పక్కారోడ్లు వేశారు.

వీధి రోడ్లకు మోక్షం

గ్రామాల్లో ప్రధాన వీధుల్లో పక్కా రోడ్లు వేస్తున్నారు. మండలంలో ఇంకా వేయవలసిన రోడ్లను త్వరలో పక్కా రోడ్లుగా మారుస్తామని అధికారులు చెబుతున్నారు. **- గంగవరం, న్యూస్‌టుడే**

పైపాళ్యంలో పనులు ప్రారంభిస్తున్న ఆర్టీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరత్నం తదితరులు

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని పైపాళ్యం గ్రామంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.17 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆదివారం నిర్మాణ పనులను ఆర్టీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరత్నం, తెదేపా మండల అధ్యక్షుడు రాజగోపాల్, స్థానిక నాయకులు వల్లప్ప, గోవిందరాజులు, భరణి పూజలు చేసి ప్రారంభించారు.

వెంకన్నకు వైభవంగా చక్రస్నానం

కల్లూరు, (మంగళంపేట), న్యూస్‌టుడే: మంగళంపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామివారికి ఆలయ ప్రాంగణంలో చక్రస్నానం నిర్వహించారు. ఉత్సవమూర్తుల విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ద్వారతోరణ పూజ, ధ్వజకుంభారాధన, మహాపూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేశారు. అనంతరం స్వామివారిని పురవీధుల్లో కల్పవృక్షంపై ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం ఏర్పాటు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం చిత్తూరు నగరం గిరింపేట గాయత్రీ నగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా విక్రమన్, ప్రధాన కార్యదర్శిగా కుప్పస్వామి, ఆర్థిక కార్యదర్శి-శంకర్, గౌరవాధ్యక్షులు-రామచంద్ర, గౌరవ సలహాదారు-చిట్టిబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు-బంగారమ్మ, రాష్ట్ర కౌన్సిలర్‌గా దేవేంద్ర ఎన్నికయ్యారు. ముఖ్య నాయకులు లింగమూర్తి, దేవేంద్ర, గురుమూర్తి, గోవిందస్వామి, వెంకటేశు, మోహనమురళి, బాబు, దేవయ్య పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన నాయకులు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సత్కారం

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను సత్కరిస్తున్న చిత్తూరు బార్ అసోసియేషన్ నాయకులు

చిత్తూరు(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతికి ఆదివారం విచ్చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను చిత్తూరు బార్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిత్తూరు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి, నాయకులు భూప్రసన్న, సయ్యద్ అక్బర్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు సక్రమంగా అందించాలి

గుడిపాల, న్యూస్‌టుడే: చౌక దుకాణాల్లో డీలర్లు లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులను సక్రమంగా అందించాలని ఎంపీపీ గోల్ల హరిప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని సి.బండపల్లెలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. సరకులు సక్రమంగా అందుతున్నాయా, తూకం సరిగ్గా ఉందా, సమయానికి అందుబాటులో ఉండి అందిస్తున్నారా, అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగరాజయాదవ్, నాయకులు అనిల్ కుమార్, ఏకాంబరం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై నరసింహస్వామి



కల్లూరు, న్యూస్‌టుడే: దేవళంపేట గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారు హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

టపాసులు అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు

పుంగనూరు గ్రామీణం: లైసెన్సు లేకుండా టపాసులు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆదివారం దుకాణ యజమానులు స్థానిక ఠాణాలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సై, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించండి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: మండలంలోని కుమారగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ ఛైర్మన్ రామిశెట్టి రాజశేఖర్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరారు. ఆదివారం నెల్లూరులో మంత్రిని కలిసి ఈ మేరకు విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఛైర్మన్ తెలిపారు.

మంత్రి రామనారాయణరెడ్డితో ఆలయ ఛైర్మన్ రామిశెట్టి రాజశేఖర్

గణనాథుడి సేవలో కర్ణాటక లోకాయుక్త

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామిని కర్ణాటక లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ వాసు, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. మూలమూర్తి దర్శన అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, కాణిపాకం ఎస్సై నరసింహులు, చిత్తూరు న్యాయస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్‌కు జ్ఞాపిక అందిస్తున్న వాసు

ఇరువర్గాల ఘర్షణ

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: గానుగచింత పంచాయతీలోని మద్దిపట్లవారిపల్లెలో ఇంటి జాగా విషయమై జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారని ఎస్సై మధుసుదన్ తెలిపారు. మద్దిపట్లవారిపల్లెకు చెందిన గిరిప్రసాద్‌నాయుడు, శంకరనాయుడు ఒక ఇంటి జాగాను శుభ్రం చేస్తుండగా.. సమీప బంధువు రామచంద్రనాయుడు ఆ జాగాలోకి వచ్చాడు. దీనిపై అతడు ఎందుకొచ్చావని ప్రశ్నించాడు. దీంతో వాగ్వాదమై రామచంద్రనాయుడి కుమారుడు జనార్దన్ నాయుడు, అల్లుడు రమణయ్యనాయుడు వచ్చి ప్రశ్నించగా.. గిరిప్రసాద్‌నాయుడి వర్గం కొడవలితో జనార్దన్‌నాయుడిపై దాడి చేయడంతో గాయపడ్డాడు. ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించారు.

పెరిగిన అనధికార చిట్టీలు.. నష్టపోతున్న ప్రజలు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలో ఇటీవల అనధికార చిట్టీల వ్యాపారాలు పెరిగిపోయాయి. వీధికి ఒకరు చిట్టీలు నడుపుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. కొంత కాలం నమ్మకాన్ని పెంచుకుని ప్రజల నుంచి భారీ ఎత్తున సొమ్ములు వసూలు చేసుకుని చేతులెత్తేస్తున్నారు. మధ్య తరగతి కుటుంబాల వారిని లక్ష్యంగా చేసుకుని డబ్బు దోచుకుంటున్నారు. రాజకీయంగా పలుకుబడి పెంచుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

పల్లెల్లో పెరిగిన మోసాలు

పల్లెల్లో దేవాలయాల ఆవరణాల్లో చిట్టీలు నిర్వహిస్తూ రైతులను ఆకట్టుకుంటారు. అనధికారికంగా నడపడమే కాకుండా మొదటి చిట్టీ వారే తీసుకుని లాభాలు పొందుతారు. ఒకరిద్దరికి చిట్టీలు ఇచ్చేసి 10 మందికి చేతులెత్తేస్తున్నారు. రూ.5 లక్షల చిట్టీ నడిపితే రూ.5 లక్షలు కమీషన్ రూపంలో తీసేసుకుంటున్నారు.

బాధితులు వందల్లో

పట్టణంలో ఇటీవల ఒక వ్యాపారి చిట్టీలు వేసి రూ. కోట్లలో డబ్బు తీసుకుని పారిపోయాడు. దీంతో వందల మంది బాధితులు లబోదిబోమంటున్నారు. ఆ వ్యాపారి ఇంటి ఎదుట బాధితులు ఆందోళన కూడా చేశారు. పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అయితే వ్యాపారి ఐపీ పెట్టి సమస్య నుంచి తప్పించుకున్నాడు.

అప్రమత్తంగా ఉండాలి

చిట్టీల పేరుతో మోసం చేసే వారి నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మోసాలు చేస్తున్న వారి గురించి తెలుసుకోవాలి. ఎవరైనా తమకు మోసం జరిగిందని గుర్తిస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలి.

- దేగల ప్రభాకర్, డీఎస్పీ, పలమనేరు

తొలి తెలుగు పద్య కవయిత్రి మొల్ల

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: తొలి తెలుగు పద్య కవయిత్రిగా మొల్ల సాహితీ చరితం పరిమళభరితమని డీఆర్వో మోహన్‌కుమార్ అన్నారు. భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లెలోని బ్రెయిన్ బాక్స్ అకాడమీలో ఆదివారం కవయిత్రి మొల్ల సాహితీ వైభవం పేరిట కవి సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సరళ పదాలతో పామరులకు సైతం అర్థమయ్యే రీతిలో ఆమె రచనలు ఉండేవని తెలిపారు. అనంతరం పలువురు సాహితీవేత్తలకు మొల్ల జాతీయ పురస్కారాల్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షులు మద్రిపూడి దేవేంద్రరావు, నారాయణస్వామి, మరుపూడి కన్నయ్యనాయుడు, మునీంద్ర, గోవిందన్, చక్రపాణి, శ్రీరాజు, యువన్య తదితరులు పాల్గొన్నారు.

సన్మాన గ్రహీతలతో డీఆర్వో మోహన్‌కుమార్, దేవేంద్రరావు

విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి



నారాయణస్వామి

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు నారాయణస్వామి (70) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఆయన స్వగ్రామం తిరుపతి జిల్లా మొగరాల గ్రామంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రాణాలు అర్పించిన వారికి నివాళి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన వారికి ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు చేసిన త్యాగాలు స్మరించుకున్నారు. నాయకులు వెంకటేష్, రాజేష్, ప్రకాశ్, గోవిందప్ప, విజయ్, జయప్ప తదితరులు ఉన్నారు.

(c) eenadu

సాగర తీరంలో పరుగుల సందడి

కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ రోడ్డులో కాకినాడ రన్నర్స్ ట్రస్టు, కాకినాడ సీపోర్ట్, ఎపెక్స్ ఫ్రొజెన్ ఫుడ్స్ ఆధ్వర్యంలో రన్ ఫర్ హర్ సేఫ్టీ- అవర్ రెస్పాన్సిబులిటీ పేరుతో మహిళల భద్రత మన బాధ్యత అంటూ 21.5 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ నిర్వహించారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ యార్లగడ్డ దశరథరామారావు, ఓఎన్‌జీసీ ఈడీ ప్రభల్‌సేన్‌గుప్తా, కాకినాడ సీపోర్ట్స్ సీవో మురళీధర్, ఎపెక్స్ ఫ్రొజెన్ ఫుడ్స్ ఎండీ చౌదరి, జీఆర్‌టీ హోటల్స్ జీయం శివకిరణ్, రిలయన్స్ సీఎస్ఆర్ మేనేజర్ సుబ్రహ్మణ్యం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 1500 మంది ఏకరూప దుస్తులు ధరించి ఉత్సాహంగా పరుగులో పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, సర్పవరం

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. వేలాది మంది స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మారుమోగాయి. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హారతి చూపుతున్న అర్చకస్వామి

సుస్వరాల తెలుగు.. ఇంటింటా వెలుగు

ఈనాడు, అమలాపురం, న్యూస్‌టుడే, గ్రామీణం, కలెక్టరేట్: తెలుగు అంటే.. కోనసీమ లాంటి పచ్చని అందాలు. సవ్వడి చేసే గోదారమ్మ పరవళ్లు.. నిత్య స్ఫూర్తిని కలిగించే సముద్ర కెరటాలు అంటూ వివిధ రంగాలలోని ప్రముఖులు తెలుగు భాష గురించి మాట్లాడారు. అమలాపురంలో నిర్వహిస్తున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలు ఆదివారం వేడుకగా ముగిశాయి. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ చాన్సలర్, కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాలలోని ప్రముఖులు హాజరయ్యారు. సాహితీవేత్తలు, కళాకారులు, భాషా ప్రేమికులు తెలియజేశారు. అమ్మ లాంటి భాషను భావితరాలకు అందించాల్సిన ప్రాధాన్యాన్ని వివరించారు.

ఎన్నెన్నో ప్రత్యేక ఆకర్షణలు..

సభా ప్రాంగణంలో తెలుగు కోసం విశేష కృషి చేసిన ప్రముఖుల విగ్రహాలు ఆకట్టుకున్నాయి. [illegible] సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందర్నీ అలరించాయి.

వేదికపై కళాకారుల నృత్య ప్రదర్శన

ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రముఖులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్లు జస్టిస్ అబ్దుల్ నజీర్, జిష్ణుదేవ్ వర్మ, మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మొహియుద్దీన్, జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ చలపతిరావు, జస్టిస్ రామకృష్ణారెడ్డి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో టీటీడీ మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, కిమ్స్ ఛైర్మన్ చైతన్యరాజు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

విజేతలకు బహుమతుల ప్రదానం..

ప్రముఖ సంగీత దర్శకులు, రచయిత, గాయకుడు ఆర్పీ పట్నాయక్ వేదికపై 'తెలుగు భాష కమ్మదనం..' 'వానా.. వానా.. వానా.. నీలాకాశంలోన' 'ఒక్కటై రావలి.. ఒక్కటై పోదాం..' ఆ నలుగురు తదితర పాటలు పాడారు. అంతకుముందు చైతన్యరాజుతో కలిసి తెలుగు మహాసభల పోస్టల్‌స్టాంపును ఆవిష్కరించారు. ● వివిధ పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రామోజీరావు వేదికపై విద్యార్థినులతో నిర్వహించిన ముఖాముఖిలో మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్ పాల్గొన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ, విలువైన సూచనలు చేశారు.

చదువుకుంటూనే పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి

● విద్యార్థి దశలో ప్రతి నిమిషం విలువైంది. ప్రణాళిక ప్రకారం కష్టపడాలి. లక్ష్య సాధనకు క్రమశిక్షణ, కృషి అంతకు మించి స్థిరత్వం అవసరం. అప్పుడే విజయం సాధ్యం.

ప్రశ్న: కుటుంబం, వృత్తి సమన్వయం ఎలా?

● సమాజంలో పురుషుడైనా.. స్త్రీ అయినా స్వార్థాన్ని వీడాలి. ప్రస్తుత తరంలో స్త్రీ స్వావలంబన అధికంగా ఉంది. మనం సమాజానికి ఏం ఇస్తున్నామో కూడా ఆలోచించాలి. ఒత్తిడి అధిగమించేందుకు ధ్యానం చేయాలి. సర్దుబాటుతత్వం ఉంటే ఎక్కడైనా సమన్వయంతో రాణించగలం.

మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్

మహిళా రక్షణకు చట్టాలెన్నొచ్చినా నేరాలు ఆగట్లేదు ఎందుకు?

● రక్షణ పరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అనవసర ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లకూడదు. యుద్ధకళలు, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి. అందరూ మంచివారనే ఉంటారు. కొందరు మాత్రమే నేర స్వభావంతో ఉంటారు.

ఆకట్టుకున్న అచ్చమైన తెలుగింటి లోగిలి

కార్యక్రమానికి హాజరైన వివిధ రంగాల ప్రముఖులు, భాషాభిమానులు

వివిధ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులతో న్యాయమూర్తులు, చైతన్యరాజు

గల్ఫ్‌లో.. భయం గుప్పిట్లో..

● యుద్ధ మేఘాలతో భయ కంపితం..!
● తెలుగు కుటుంబాల్లో ఆందోళన

న్యూస్‌టుడే, అల్లవరం

పశ్చిమాసియాలో ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధవాతావరణం కారణంగా కోనసీమలోని పలు కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. కువైట్, దుబాయ్, ఖతార్ వంటి గల్ఫ్ దేశాల్లో అత్యధికంగా జిల్లావాసులు పలు రకాల పనుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఈ దేశాల్లో జనావాసాల మధ్య ఇరాన్ క్షిపణులతో బాంబుల వర్షం కురిపిస్తుండటంతో సామాజిక మాధ్యమాలు, ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వార్తలతో ఉమ్మడి జిల్లా వాసులు కలవరపాటుకు గురవుతున్నారు.

సుమారు 2 లక్షల మంది

ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి 2 లక్షల మంది వరకు గల్ఫ్ దేశాల్లో వివిధ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. వీరిలో కోనసీమ నుంచే ఎక్కువ మంది ఉన్నారు. మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు, అల్లవరం, ఉప్పలగుప్తం, ఐ.పోలవరం, రామచంద్రపురం, తదితర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో మహిళలు, పురుషులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు.

విమానాశ్రయాల నుంచి వెనక్కి..

యుద్ధ వాతావరణం నేపథ్యంలో కొంత మంది జిల్లా వాసులు స్వగ్రామాలకు తిరిగి వచ్చేందుకు సామగ్రితో విమానాశ్రయాలకు వెళ్లారు. విమానాలు రద్దవ్వడంతో వారిని తిరిగి వెనక్కి పంపించేశారు. కువైట్‌లో జనావాసాలు, క్రూడ్ ఆయిల్ బావులకు సమీపంలో క్షిపణులు, డ్రోన్‌లకు సంబంధించిన శకలాలు పడుతుండటంతో గదులకు మాత్రమే పరిమతమవుతున్నట్లు జిల్లా వాసులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలని అక్కడి భారత రాయభార కార్యాలయం అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు జిల్లా వాసులు తెలిపారు?

ఆర్థికంగా స్థిరపడాలని..

గల్ఫ్, ఇండియా కరెన్సీకి 10 నుంచి 15 రెట్లు వ్యత్యాసం ఉండటంతో అప్పులు చేసి మరీ ఉపాధి నిమిత్తం అక్కడికి వెళ్తున్నారు. ఒక్కొక్కరు సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. మన కరెన్సీ ప్రకారం.. నెలకు రూ.30వేల నుంచి రూ.40వేలు వస్తుంది. నాలుగేళ్లు కష్టపడితే స్వగ్రామంలో సొంతంగా ఇళ్లు కట్టుకోవచ్చని, పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవచ్చని, పిల్లలకు వివాహం చేయవచ్చనే ఆశతో గల్ఫ్‌కు వెళుతున్నారు.

చురుగ్గా అక్విడక్టు మరమ్మతులు

న్యూస్‌టుడే, పి.గన్నవరం

పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదిపై డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డువంతెన మరమ్మతు పనులకు సంబంధించి కీలకమైన ఎక్స్‌పాన్షన్ జాయింట్లలో కాంక్రీటు విచ్ఛిన్నం పనులు పూర్తిచేశారు. 34 జాయింట్లకు ఇనుపకడ్డీలు అమర్చారు. ప్రస్తుతం వీటికి సంబంధించి వెల్డింగ్ పనులు చేస్తున్నారు. రూ.49.03 లక్షలతో చేపట్టే మరమ్మతుల నిమిత్తం ఫిబ్రవరి 10 నుంచి దీనిపై రాకపోకలు పూర్తిగా నిలుపుదల చేశారు. భారీ వాహనాలు వెళ్లకుండా కాటన్ అక్విడక్టుపై ట్రాఫిక్‌ను మళ్లించారు. మూడు ట్రాక్టర్ బ్రేకర్లతో ఎక్స్‌పాన్షన్ జాయింట్లలో పాత కాంక్రీటును ధ్వంసం చేసి వాటిమధ్య కొత్తగా తయారు చేసిన ఇనుపకడ్డీలు అమర్చారు. వీటిల్లో సోమవారం నుంచి కాంక్రీటు పనులు మొదలుపెట్టి మూడు రోజుల్లో పూర్తి చేస్తామని జలవనరులశాఖ ఏఈఈ బెహరా రమేష్‌బాబు తెలిపారు. మరో వైపు రోడ్డుపై దెబ్బతిన్న కాంక్రీటును తొలగించి నూతనంగా వేయడం, పాదచారులు నడిచే మార్గంలో దెబ్బతిన్న 80 కాంక్రీటు బల్లలను కొత్తగా వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

డొక్కా సీతమ్మ అక్విడక్టు రోడ్డువంతెనపై పనులు

లోవ దేవస్థానానికి పోటెత్తిన భక్తులు

తుని గ్రామీణం: తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అమ్మవారిని దర్శించుకున్నారు. [illegible] ఆలయ ప్రాంగణంలోని చెట్ల కింద వంటావార్పు చేసుకుని సామూహిక భోజనాలు చేశారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా దేవస్థానానికి రూ.5.40లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.

3వ తేదీన ఆలయం మూసివేత: చంద్రగ్రహణం కారణంగా ఈ నెల 3వ తేదీన ఆలయాన్ని మూసివేస్తున్నట్లు వేద పండితులు తెలిపారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాత్రమే సేవలు ఉంటాయని వివరించారు. 4వ తేదీన ఉదయం సంప్రోక్షణ అనంతరం ఉదయం 8 గంటల నుంచి తిరిగి భక్తులకు పునః దర్శనం కలుగుతుందని తెలిపారు.

బాలికలకు టీకా రక్ష

☛ క్యాన్సర్ నిరోధానికి ఉచితంగా వ్యాక్సిన్
☛ జిల్లాలో 13వేల మందికి వేసేందుకు ఏర్పాట్లు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఆధునిక జీవనశైలి, ఆరోగ్య అలవాట్లతో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. వైద్యారోగ్య శాఖ ఇటీవల నిర్వహించిన ఎన్‌సీడీ 4.0 సర్వే ద్వారా 1200 మందిని క్యాన్సర్ నిర్ధారిత పరీక్షలకు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. వందల సంఖ్యలో అనుమానిత కేసులను గుర్తించారు. చాలా మంది నిర్ధారణ పరీక్షలకు ముందుకు రావడం లేదు. దీని వల్ల నష్టం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. బాధితుల్లో 60 శాతం మంది మహిళలే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బాలికల్లో నాలుగు రకాల గర్భాశయ క్యాన్సర్లను నిరోధించే హెచ్‌పీవీ టీకాను ఉచితంగా వేయడానికి ఇప్పటికే కార్యాచరణ సిద్ధమైంది. 14-15 ఏళ్ల మధ్య బాలికలకు హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఈ టీకాను ఇవ్వనున్నారు.

జిల్లాలో ప్రత్యేక సర్వే..

హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కోసం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో ఆశ, ఏఎన్ఎంల ద్వారా ప్రత్యేక సర్వే నిర్వహించారు. 14 ఏళ్లు పూర్తయి 15 ఏళ్లు నిండని బాలికల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఇలాంటి వారు 13వేల మంది ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ 90 రోజుల పాటు టీకాలు వేయనున్నారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, ప్రాంతీయ, ఉప, జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఈ టీకాను వేయనున్నారు.

ఇప్పటి వరకు ప్రైవేటుగా..

హెచ్‌పీవీ టీకా ఎప్పటి నుంచో ప్రైవేటుగా అందుబాటులో ఉంది. ఆర్థిక స్తోమత ఉన్న తల్లిదండ్రులు రూ.10 వేలు వరకు చెల్లించి ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ టీకా వేయిస్తున్నారు. దీనివల్ల క్యాన్సర్ నుంచి దీర్ఘకాలిక రక్షణ లభిస్తుంది. అవగాహన లేక.. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా చాలా మంది ఈ రక్షణకు దూరంగా ఉన్నారు.

బాలికల గుర్తింపు సర్వే పూర్తి

హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను త్వరలో ప్రారంభిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా 14 ఏళ్లు దాటి.. 15 ఏళ్లు పూర్తికాని బాలికల గుర్తింపునకు సర్వే చేపట్టాం. ఆ వయసువారు జిల్లాలో 13వేల మంది బాలికలు ఉన్నట్లు తేలింది. వీరందరికీ తల్లిదండ్రుల అనుమతితో వ్యాక్సిన్ వేస్తాం.

-ఎం.దుర్గారావు దొర, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

పేరుకే యార్డు.. రోడ్డుపైనే బేరాలు..

ఆవరణంతా ఖాళీగానే ఉన్నా..

న్యూస్‌టుడే, రావులపాలెం గ్రామీణం

రాష్ట్రంలోనే అతి పెద్దదైన రావులపాలెం మండలం రావులపాడులోని అరటి మార్కెట్ యార్డులో విక్రయాలకు సంబంధించి పలు నిబంధనలు ఉన్నా వాటిని ఏమాత్రం పట్టించుకోకపోవడంతో నిత్యం అనేక మంది రైతులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి నిత్యం ఇక్కడికి పెద్దఎత్తున గెలలను తీసుకుని వచ్చి విక్రయిస్తుంటారు. వీరికోసం యార్డులో షెడ్డు, పెద్ద ఆవరణ ఉంది. కొందరు వర్తకులు రైతులను రోడ్డుపైనే ఆపేసి బేరాలు చేయడంతో వెనక వచ్చే వాహనాలు, సైకిళ్లు పెద్దఎత్తున నిలిచిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది.

యార్డు గేటుముందే గెలల విక్రయాలు

యార్డు ఆవరణ ఖాళీగా ఉన్నా అక్కడికి గెలలను తీసుకుని రాకుండా గేటు బయట నుంచి రావులపాడు కూడలి వరకు ఉన్న రోడ్డుపైనే వాహనాలను ఆపేస్తున్నారు. గతంలో గేటు నుంచి 50 మీటర్ల దూరంలో ఒక గీతగీసి దాని అవతల మాత్రమే విక్రయాలు చేయాలని, ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తే అపరాధ రుసుము విధించడంతో కొన్నాళ్ల పాటు పక్కాగా అమలైంది. ప్రస్తుతం పట్టించుకునే నాథుడే కరవయ్యారు. అధికారులు వెంటనే స్పందించి సెక్యూరిటీ సిబ్బందిని నియమించి గెలల విక్రయాలు యార్డు ఆవరణలోనే జరిగేలా చూడాలని అంతా కోరుతున్నారు.

అవినీతిని ప్రశ్నిస్తే హిందూ ధర్మంపై దాడి..?

వైకాపాను నిలదీసిన తితిదే పాలకవర్గ సభ్యుడు నెహ్రూ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో తిరుమల లడ్డూ తయారీలో అవినీతి జరిగిందని ప్రశ్నించినందుకు ఆ పార్టీ నాయకులు సీఎం చంద్రబాబుపై సొంత మీడియాలో ఎదురు దాడికి దిగుతున్నారని తితిదే పాలకవర్గ సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. అవినీతిని ప్రశ్నిస్తే హిందూ ధర్మంపై దాడి చేసినట్లా..? అని ఆయన నిలదీశారు. తెదేపా కాకినాడ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యిలో చుక్క పాలు కూడా వాడలేదని ఎన్‌డీడీబీ ప్రయోగశాల నివేదిక ఇచ్చిందన్నారు. 'హిందూ ధర్మంపై దాడి' అంటూ సాక్షిపత్రికలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని నెహ్రూ ఆరోపించారు. ఇప్పటికైనా వైకాపా నాయకులు స్వామివారి ప్రతిష్టను దిగజార్చే ప్రకటనలు మానుకోవాలని నెహ్రూ హితవు పలికారు. సమావేశంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, తదితరులు ఉన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

అంతులేని శోకం

☛ వేట్లపాలెం బాధిత కుటుంబాల్లో తీరని వేదన
☛ పేలుడు ఘటనలో మృతులకు అంత్యక్రియలు పూర్తి

అమ్మా పనికి వెళుతున్నా.. నాన్నా పనిచూసుకొని వేగంగా వచ్చేస్తా అంటూ ఉదయం వెళ్లినవారు మధ్యాహ్నానికే మంటల్లో సజీవ దహనమైపోయారు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోయినవారు కొందరు.. బిడ్డలను పోగొట్టుకున్నవారు ఇంకొందరు.. ఆఖరి చూపునకు కూడా నోచుకోలేకపోయామని ఆయా కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి.

మృతిచెందిన గొడతా నాని పిల్లలను ఎత్తుకొని ఓదార్చుతున్న మంత్రి నారాయణ, ఎంపీ సానా సతీష్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, సామర్లకోట, సామర్లకోట గ్రామీణం, పెద్దాపురం: ఘోర ప్రమాదం ఆ ఊరంతటిని విషాదంలోకి నెట్టింది. 22 మందిని బాణసంచా తయారీ కేంద్రం పొట్టనపెట్టుకుంది. మరో ఏడుగురు ఆసుపత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. శనివారం సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన పేలుడు ఘటనకు సంబంధించి చనిపోయినవారిలో ఈ గ్రామానికే చెందినవారే 15 మంది ఉన్నారు. ఆదివారం ఏ ఇల్లు చూసినా తీవ్ర రోదనలే. బరువెక్కిన హృదయాలతో మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తిచేశారు.

బాధితులను ఓదార్చుతున్న మంత్రి అనిత

అవే చివరి మాటలు..

● సామర్లకోటకు చెందిన ఏడిద సంపత్‌కుమార్(25) ఆరోగ్యం బాగాలేకపోవడంతో మూడు రోజులు పనిలోకి వెళ్లలేదు. ఇంటి పోషణ కష్టతరంగా ఉండడంతో శనివారం వెళ్లాడు. మధ్యాహ్నం 1.30 సమయంలో ఫోన్ చేసి పిల్లలు భోజనం చేశారా అని అడిగాడు. అవే ఆఖరి మాటలని భార్య శ్రావణి విలపించారు. బాబు, పాపతో బతికేదెలా అంటూ ఆవేదన చెందారు.

● సామర్లకోటకు చెందిన దర్శిపాటి యోహాన్(నాని)(38) ఫైర్ వర్క్స్‌లో గత ఏడాదిన్నరగా పనిచేస్తున్నాడు. భార్య గంగాభవానీ, ఇద్దరు కుమార్తెలు మానస, అఖిల ఉన్నారు. చిన్న బిడ్డకు ఆరోగ్యం బాగోలేదని ఎక్స్‌రే రిపోర్టు వాట్సాప్‌లో పంపాను.. చూడమని ఫోన్‌చేసి మాట్లాడాడు. అవే చివరి మాటలంటూ బోరున విలపిస్తోంది నాని తల్లి మరియమ్మ.

నీటి కోసం బయటకు వచ్చి బతికా..

దాహంగా ఉండడంతో నీళ్లు తాగడానికి బాణసంచా షెడ్ నుంచి బయటకు వచ్చాను. మాకు చివరనున్న షెడ్ నుంచి మందుగుండు నిప్పురవ్వలు ఎగిసి మా షెడ్ వరకు వచ్చాయి. దీంతో అక్కడ పనిచేస్తున్న పది మంది ప్రాణాలను రక్షించుకోవడానికి పరుగులు తీశాం. కిందపడి మోకాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. దాహమే నా ప్రాణాలను కాపాడింది. - చేపల శామ్యూల్, పెద్దాపురం

వాహనాల్లో తరలించి..

శవ పంచనామా పూర్తయ్యాక మృతదేహాలను ఆదివారం ఉదయం మహాప్రస్థానం వాహనాల్లో గ్రామానికి పంపించి బంధువులకు అప్పగించారు. ఒకే ప్రాంతంలో 6 నుంచి 8 మందికి అంత్యక్రియలు జరిగాయి.

ఉత్కంఠభరితంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు

గొల్లప్రోలు: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు మల్లవరం రోడ్డులో పెద్దింటమ్మతల్లి రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఆదివారం ఉత్కంఠభరితంగా సాగాయి. మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ ప్రారంభించి విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్స్ విభాగంలో ఆరు జతల ఎడ్లు, జూనియర్స్ విభాగంలో 33 జతల ఎడ్లు పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి ఎడ్లు ప్రథమ, మండపేటకు చెందిన వేగుళ్ల తేజబాబు ఎడ్లు ద్వితీయ, కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్‌శ్రీమణికంఠ ఎడ్లు తృతీయ స్థానాలుగా నిలిచాయి. జూనియర్స్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరావీర వెంకటసత్యవేణి ఎడ్లకు ప్రథమ, వెల్దుర్తికి చెందిన ఎనుగంటి సూర్యవెంకటరామారావు ఎడ్లకు ద్వితీయ, వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి ఎడ్లకు తృతీయ బహుమతులు లభించాయి. న్యాయనిర్ణేతలుగా సిద్దా నానాజి, యనమల కృష్ణుడు వ్యవహరించారు.

అమృతమూర్తికి అశ్రునివాళి
మంచి మనసుకు ప్రతిరూపం, మమతానురాగాల మణిదీపం, మరువలేము నీ రూపం, ఆత్మీయతను పంచిన అమృతమూర్తి, మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా ఇంటి దీపం
శ్రీమతి కందుల ఉషాలక్ష్మి గారు
ది.23-02-2026 సోమవారం స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతిస్తూ, వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
కీ.శే. శ్రీమతి కందుల ఉషాలక్ష్మి గారు
జననం : 04-12-1959 మరణం : 23-02-2026
రాజమహేంద్రవరం
భర్త: కందుల సాయి
కుమారుడు : డా॥ కందుల సాయి సుమంత్, M.D.
కోడలు : కందుల లక్ష్మీరమణి
కుమార్తె : డా॥ వరప్పుల చర్విత BDS
అల్లుడు : డా॥ వరప్పుల సురేష్ MD(Radiology)
మరిది : కందుల రవికుమార్
ఆడపడుచు : కొణిదల కిరణ్మయి- మునిరత్నం
పెద్దకార్యం: ది.05-03-2026 గురువారం, రాజమండ్రి, J.N.రోడ్డులో SALT రెస్టారెంట్ ఎదురుగా V. కన్వెన్షన్ నందు జరుగును.

(c) eenadu

సంప్రదాయ సవ్వడి

బుర్రకథ చెబుతున్న కళాకారులు

సింహాచలం దేవస్థానానికి చెందిన నాదస్వర విద్వాంసుల కచేరి

పేరూరు ఉన్నత పాఠశాల విద్యార్థుల కోలాటం

అమలాపురంలోని కిమ్స్ ప్రాంగణంలో తెలుగు మహాసభలు ఎంతో వేడుకగా జరిగాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భాషాభిమానులు తరలివచ్చారు. వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు వచ్చారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్నారు. తెలుగింటి సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమాలు, ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

– న్యూస్‌టుడే, కోనసీమ, అమలాపురం కలెక్టరేట్, అమలాపురం గ్రామీణం

కొబ్బరి పత్రం.. విభిన్న రూపం

పందిరి

పచ్చని కొబ్బరి ఆకులతో వివిధ రూపాలను తీర్చిదిద్దడంలో పాశర్లపూడికి చెందిన వస్త్ర వ్యాపారి బళ్ల వెంకటరత్నం నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. శివలింగ రూపాలు, వేలాడే తోరణాలు, స్తంభ నమూనాలతో ఆకట్టుకుంటారు. తాను సొంతంగా నేర్చుకున్న అల్లికలతో చేసే

గణపతి


శివలింగం

బొమ్మలను కళాభిమానులకు స్వచ్ఛందంగా అందజేస్తుంటానని వెంకటరత్నం తెలిపారు. బంధువులు, స్నేహితులకు సంబంధించిన ఉత్సవాలకు ఉచితంగా ఇస్తుంటానన్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

పాఠ్యాంశాలపై పట్టు.. పదిలో మెరిసేట్టు

- విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసిన సబ్జెక్టు నిపుణులు
- 'ఈనాడు' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన

ఈనాడు మీ తోడు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: పది పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. ఈ నేపథ్యంలో సందేహాలు నివృత్తి చేసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లాతో పాటు కడప, కర్నూలు, బాపట్ల, తూర్పుగోదావరి జిల్లాల నుంచి సైతం భారీ సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఫోన్ చేశారు. వారు అడిగిన ప్రశ్నలకు ఉపాధ్యాయులు వివరంగా సమాధానాలు చెప్పారు. ఫోన్ ఇన్ కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని డీఈవో పి.నాగేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మీ, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావు పేర్కొన్నారు. వివిధ ప్రశ్నలకు సబ్జెక్టు నిపుణులు ఇచ్చిన సమాధానాల సారాంశం ఇది..

చేతి రాత బాగుండాలి

చక్కని చేతిరాతతో అక్షరదోషాలు లేకుండా రాయాలి. పద్య, గద్య, రామాయణం, సృజనాత్మక, లేఖ తదితరాలపై ప్రశ్నలు వస్తాయి. పేరాలోని ప్రశ్నలకు జవాబులు అక్కడే ఉంటాయి. వాటిని గుర్తించాలి. రామాయణంలోని వాక్యాలు ఏయే కాండలకు చెందినవో చెబితే 8 మార్కులు సులువుగా సాధించవచ్చు. వ్యక్తీకరణ- సృజనాత్మకతలోని కవి పరిచయం ప్రక్రియ లేదా నేపథ్యం, పాత్ర స్వభావాలు ఒకసారి చదివితే రాయవచ్చు. అలంకారాలు, ఛందస్సు, అర్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి-వికృతి, సంధులు, సమాసాలు, ప్రశ్నలు చదివితే ఉత్తీర్ణత సాధించవచ్చు. – జి.ప్రభావతి, తెలుగు ఉపాధ్యాయురాలు, జడ్పీహెచ్ఎస్, నక్కిరేవుపల్లి

బ్లూప్రింట్‌ను అనుసరించాలి

ఎన్‌సీఈఆర్టీ బ్లూప్రింట్ ప్రకారం చదవాలి. కాంతి పరావర్తనం, వక్రీభవనం, దీర్ఘ, హ్రస్వదృష్టి లోపాలు వాటి సవరణలను చదవాలి. ఆమ్లాలు- క్షారాలు, లవణాలు, లోహాలు, అలోహాలు, ఆల్కేన్, ఆల్కీన్, ఆల్కైన్ ప్రమేయ సమూహాల ఫార్ములాలు అభ్యాసం చేయాలి. పటాలు గీయడం, విద్యుత్తు, విద్యుత్తు ప్రవాహం పాఠంలోని భౌతిక అంశాలను గుర్తుల రూపంలో ఎలా తెలియజేస్తున్నామో.. స్పష్టంగా చూసుకోవాలి. – జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్సు అధికారి

గణితంలో 100 మార్కులు సాధ్యమే

గణితంలో తప్పులు లేకుండా ప్రమాణాలు రాయాలి. ఒకటి, రెండు మార్కుల ప్రశ్నలకు సమస్యను పరిష్కరించి రాయాలి. జవాబు.. అవును.. కాదు అనే దానిని విధిగా రాయాలి. లేకుంటే మార్కులు తగ్గిస్తారు. సమయపాలన పాటిస్తూ.. రాస్తే వందకు వంద మార్కులు సాధించవచ్చు. సాంఖ్యక శాస్త్రం, సంభావ్యత, బహుపదులు, రేఖీయసమీకరణాలు, వాస్తవసంఖ్యలు, నిరూపకజ్యామితి నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తాయి. – డా.టీఎస్‌వీవీ సూర్యనారాయణమూర్తి, గణిత ఉపాధ్యాయులు, ఎంపీయూపీఎస్, చిందాడగరువు

పటాలను సక్రమంగా గుర్తించాలి



సాంఘికశాస్త్రంలో పటాల గుర్తింపులో 15 మార్కులు ఉంటాయి. ప్రపంచపటంలో దేశాలు, సముద్రాలు, మహాసముద్రాలు, భారతదేశ పటంలో రాష్ట్రాలు, రాజధానులు, పోర్టులు వంటివి కీలకం. వినియోగదారుల విద్యపై నినాదాలు (స్లోగన్స్) అడిగే అవకాశం ఉంటుంది. మహిళా సమస్యలు, ఆదాయ అసమానతలపై సాధన చేయాలి. భూగోళంలో 2, 4, 6, 7, అర్థశాస్త్రంలో మూడో పాఠం ముఖ్యమైనవి. – కేఎస్‌వీ కృష్ణారెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, జీహెచ్ఎం జడ్పీ ఉన్నత పాఠశాల, లొల్ల

వ్యాకరణాంశాలు సాధనతో..

వ్యాకరణాంశాల్లో 16-30 బిట్లు పాఠ్య పుస్తకం నుంచే వస్తాయి. ఉపవాచకంలో డోక లాకర్, అనోకా ఉపాయ్ ఇస్తారు. పత్రలేఖన్ చుట్టీ పత్ర్, పితాజీకో పత్ర్, పుస్తక విక్రేతకే నామ్ పత్ర్ వంటివి చూసుకోవాలి. గద్యభాగ సారాంశంలో ఈద్గాహ్, లోకోక్తి, పద్యభాగ సారాంశంలో బరసేబదల్, కన్-కన్ కా అధికారి ముఖ్యమైనవి. కవి పరిచయాల్లో కబీర్ దాస్, మీరాబాయిలపై పట్టు సాధించాలి. – మహ్మద్ కాసిమ్ పాషా, హిందీ ఉపాధ్యాయులు, జడ్పీహెచ్‌ఎస్, అంతర్వేదిపాలెం మధ్య గ్రూప్

పాఠ్య పుస్తకాల నుంచే ఎక్కువ ప్రశ్నలు

ఆంగ్లంలో ఎక్కువ ప్రశ్నలు పాఠ్య పుస్తకాల నుంచే వస్తాయి. అక్షర, వ్యాకరణ దోషాలు లేకుండా చక్కటి దస్తూరీతో రాయాలి. గత ఏడాది మోడల్, ఎస్‌సీఈఆర్‌టీ నమూనా పేపర్లను చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. రీడింగ్ కాంప్రహెన్షన్, నాన్‌వెర్బల్ డేటా, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. యాక్టివ్ వాయిస్, పాసివ్ వాయిస్, రిపోర్టెడ్ స్పీచ్ చూసుకోవాలి. వీటిలో 30 మార్కులు వస్తాయి. – డా.కె.సరోజాదేవి, ఆంగ్ల ఉపాధ్యాయురాలు, జడ్పీ బాలికోన్నత పాఠశాల, ముమ్మిడివరం

పాయింట్ల రూపంలో రాయాలి

జీవశాస్త్రంలో ప్రశ్నలకు జవాబులు పాయింట్ల రూపంలో రాయాలి. పటాలు చక్కగా గీసి వాటి భాగాలను గుర్తించాలి. స్పెల్లింగ్ తప్పులు లేకుండా రాయాలి. ఈసారి పరీక్ష బ్లూప్రింట్ టాక్సానమీ, అబ్జెక్టివ్ ఆధారంగా జరుగుతుంది. ఇందులో అవగాహన, వినియోగం, విశ్లేషణ ఉంటాయి. ప్రశ్నలు అర్థం చేసుకుని పాయింట్ల వారీగా.. ప్రయోగాల వివరణలు చక్కగా అర్థమయ్యేలా రాయాలి. జీవక్రియలు, ప్రత్యుత్పత్తి, అనువంశికతలపై పట్టు సాధించాలి. – మేకా రామలక్ష్మి, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు, మున్సిపల్ హైస్కూల్, మండపేట

రామోజీ ఫిల్మ్‌సిటీలో మహిళలకు ప్రత్యేక ఆఫర్లు

SheShines 1st - 31st March - 2026

ఈ నెల 31 వరకు అవకాశం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: రంగమేదైనా తమకు సాటి లేదని మహిళామణులు చాటిచెబుతున్నారు. వారి స్ఫూర్తిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకొనే వేళ రామోజీ ఫిల్మ్‌సిటీ మార్చి నెలను అతివలకు అంకితం చేస్తూ మాసోత్సవాలను నిర్వహిస్తోంది. నేటి నుంచి మార్చి 31 వరకు ప్రత్యేక ఆఫర్లతో మహిళలు ఫిల్మ్‌సిటీని సందర్శించేందుకు వీలు కల్పించింది. వివిధ ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటూ అన్ని వయసుల మహిళలు సినీ ప్రపంచంలో వినోదం, విహారం, సినిమాటిక్ వైభవాన్ని ఆస్వాదించే అవకాశం ఉంది. రామోజీ స్టూడియో టూర్‌లో అద్వితీయ సినిమా సెట్ల వీక్షణం, లైవ్ షోలు, రైడ్స్, సాహసాల నెలవు సాహస్ సందర్శన, అలరించే పక్షుల పార్కు, సీతాకోకచిలుకల గార్డెన్, మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్, మాయాలోక్ ఇలా ఎన్నో ఆకర్షణలను తిలకించవచ్చు.

సద్వినియోగం చేసుకోండి..

రామోజీ ఫిల్మ్‌సిటీ మహిళా దినోత్సవ ఆఫర్‌లో భాగంగా అన్ని వయసుల మహిళలకు ఒకరికి రూ.1111 + జీఎస్‌టీ, కనీసం 11 మంది బృందంగా వస్తే ఒక్కొక్కరికి రూ.999 + జీఎస్‌టీతో ప్రవేశ రుసుం ఉంటుంది. బృందాలుగా వచ్చి వేడుకలు మరింత ఉత్సాహంగా జరుపుకోవడానికి ఇదే మంచి తరుణం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళా మాసోత్సవాల్లో పాల్గొని మరిచిపోలేని మధురానుభూతి పొందండి.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.comలో లాగిన్ అవ్వండి. లేదా 76598 76598కు కాల్ చేయండి.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

సఖినేటిపల్లిలో బాణసంచా దుకాణంలో అధికారుల తనిఖీ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: బాణసంచా తయారు చేసే కేంద్రాలు, విక్రయించే దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పీ రాహుల్‌మీనా హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐలు, ఎస్సైలు, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూశాఖ అధికారులు ఆదివారం జిల్లాలో బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బాణసంచా తయారీకేంద్రాలు, దుకాణాలను పరిశీలించామన్నారు. పరిమితికి మించి బాణసంచా నిల్వ చేసినా, లైసెన్సు లేకుండా విక్రయించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం

హెలిప్యాడ్ వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, జేసీ నిశాంతి, చైతన్యరాజు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అమలాపురంలో నిర్వహించిన మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆదివారం ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని హెలిప్యాడ్ వద్ద అధికారులు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, జేసీ నిశాంతి, కిమ్స్ అధినేత చైతన్యరాజు, జిల్లా ఉద్యానశాఖ అధికారి బీవీ రమణ తదితరులు ఆయనకు స్వాగతంపలికి ఆహ్వానించారు. అమలాపురంలోని ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని ప్రసంగించిన అనంతరం విజయవాడ ప్రయాణమైన ఆయనకు హెలిప్యాడ్ వద్ద వీడ్కోలు పలికారు.

ముస్లింల నిరసన ప్రదర్శన

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ, కుటుంబ సభ్యులను బాంబు దాడులతో హతమార్చడాన్ని నిరసిస్తూ ముస్లిం సోదరులు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన జరిపారు. వారి వీర మరణానికి సంతాపం వ్యక్తం చేస్తూ నినదించారు. మండలంలోని నగరం పెదపంజేషా నుంచి మామిడికుదురు కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రబోధకులు, సంఘ నాయకులు పలువురు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న ముస్లింలు

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలు విడుదల

పామర్రు, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాల పరిధిలోని విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాలను విద్యాశాఖ అధికారుల విడుదల చేశారు. ఆయా వివరాలను వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలతో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంల వివరాలను సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారుల వెబ్‌సైట్లో పరిశీలించుకోవచ్చు. వీటిపై ఏవైనా అభ్యంతరాలుంటే మార్చి ఏడో తేదీలోగా డీఈవో కార్యాలయాల్లో సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు వెల్లడించారు.

3న ఆలయాల మూసివేత

అయినవిల్లి: చంద్ర గ్రహణం సందర్భంగా ఈ నెల 3(మంగళవారం)న అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయం ఉదయం 9.30 గంటల నుంచి మూసివేయనున్నట్లు ఆలయ ఏసీ సత్యనారాయణరాజు ఆదివారం తెలిపారు. బుధవారం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం 7.30 గంటల నుంచి యథావిధిగా భక్తులకు దర్శనాలు ఉంటాయన్నారు.

ఆత్రేయపురం: ఈ నెల 3న చంద్ర గ్రహణం సందర్భంగా కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆ రోజు ఉదయం 8.50 గంటల వరకే దర్శనాలు ఉంటాయని అనంతరం 9 గంటలకు గర్భాలయ తలుపులు మూసివేస్తామని ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. మళ్లీ 4న ఉదయం 6 గంటలకు సంప్రోక్షణ పూజలు, నిత్య కైంకర్యాలు నిర్వహించిన అనంతరం యథావిధిగా భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని వెల్లడించారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

శ్రీ లలితా రైస్‌మిల్ పెద్దాపురం వారి ఇన్నోవా కార్లు అమ్మకమునకు కలవు. Contact Cell: 94941 54551.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

HEALTH & CARE

మద్యపానం మానేయడంఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు రాజమండ్రి శ్రీ సాయిలక్ష్మి లాడ్జి SVG మార్కెట్ రోడ్, ఆర్‌టీసీబస్టాండ్ ఎదురుగా, ప్రతీనెల 3,17 తేదీల్లో మందులు.

RHEUMATOLOGY

రుమటాలజిస్ట్
డా॥ ఎ.రామకృష్ణంనాయుడు
MD, DM (Rheumatology, NIMS, HYD)
07-03-2026న (శనివారం) 02 PM to 07 PMవరకు రాజమండ్రిలో ప్రైమ్ పాత్ ల్యాబ్స్, సీసీసీ ఛానెల్ ఎదురుగా, దానవాయిపేట వద్ద
ఫోన్: 94929 41177
మరియు
08-03-2026న (ఆదివారం) కాకినాడలో సేఫ్ హాస్పిటల్ నందు 11 AM to 6 PM వరకు అందుబాటులో ఉంటారు.
ఫోన్: 0884 2383366

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

బిగ్ ఫ్లాష్ న్యూస్. ప్రతిపాదిత తుని, అన్నవరం ఎయిర్‌పోర్ట్, అన్నవరం 6 లైన్ల రోడ్డుని ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ (RERA) KAUDA లేఅవుట్‌లో Open Plots, Simplex Houses, Villas, 80% బ్యాంకు Loan, ఫ్రీ సైట్ విజిట్కై. ✆ 96031 94449.

JOBS

Wanted Male Counselors and Admission Dept. Staff Qualification any Degree. Age Limit: 25 to 45 years having experience in Educational Organisations will be preferable. Salary upto: 18000/-. Working location: Master Minds College, Rajahmundry.Contact Cell: 92487 33370.

కాకినాడలో MEGA సంస్థనందు పనిచేయుటకు Marketing Executive (M) కావలెను. టూవీలర్ తప్పనిసరి. Contact Cell: 8247332564.

ఉద్యోగం: East & West జిల్లాల్లో ప్ర॥ కంపెనీలకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్ టెలీకాలర్స్ స్త్రీ/పు. కావలెను. జీతం, రూం+ భోజనం ఫ్రీ. R.S. సర్వీసెస్, RJY, 99633 27756.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-58 పైII
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	18,000
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముచ్చు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	150-00
రిటైల్ లైవ్	177-00
డ్రెస్ట్	257-00
స్కిన్‌లెస్	292-00

92.7 FM Rajamahendravaram Mee FM
ఈఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

కుట్టు శిక్షణ సరే.. మిషన్లు ఏవీ..?

- ఏడాది గడుస్తున్నా పట్టించుకోని వైనం
- నెరవేరని మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యం

గతంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం

న్యూస్‌టుడే, కొత్తపేట

మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన కుట్టు శిక్షణ కార్యక్రమం మొదటి దశలోనే నిలిచిపోయింది. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు ఇళ్లవద్దే ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యం నెరవేరడం లేదని శిక్షణ పొందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నిరుద్యోగ యువతులు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో బీసీ కార్పొరేషన్ ద్వారా కొన్ని నెలల కిందట కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో రోజుకు రెండు బ్యాచ్‌ల చొప్పున తరగతులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,625 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా.. 11,014 మందికి శిక్షణ అందించామని, మూడు నెలల పాటు సాగిన ఈ శిక్షణకు 75 శాతం హాజరుతో విజయవంతంగా పూర్తి చేసిన యువతులు, మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అల్లికలు, ఆధునిక డిజైన్లపై అవగాహన కల్పించి, శిక్షణ ముగిసిన అనంతరం ధ్రువపత్రాలు అందజేశారు. శిక్షణ పూర్తి చేసి నెలలు గడుస్తున్నా మిషన్లు అందకపోవడంతో మహిళలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు త్వరగా అమలు చేస్తేనే శిక్షణ లక్ష్యం నెరవేరుతుందని వారు అంటున్నారు. 104 శిక్షణ కేంద్రాల్లో మహిళా ట్రైనర్, హెల్పర్ చొప్పున 208 మందిని నియమించి, జీతం ఇస్తామని ఆదిలో చెప్పారు. వారికి ఇప్పటికీ సహాయం అందక ఏమి చేయ్యాలో తెలియని స్థితిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి వారిని ఆదుకోవాలని కోరుతున్నారు.

జిల్లాల వారీ వివరాలు ఇలా..

జిల్లా	లక్ష్యం	కేంద్రాలు	శిక్షణ పొందినవారు
కాకినాడ	3,789	50	4,920
తూర్పుగోదావరి	3,593	25	2,904
అంబేడ్కర్ కోనసీమ	3,243	29	3,190

త్వరలోనే పంపిణీ..

శిక్షణ పూర్తి చేసిన మహిళలందరికీ కుట్టుమిషన్లు పంపిణీ చేస్తాం. రెండో దశ శిక్షణకు పెద్ద సంఖ్యలో మహిళలు ముందుకు వస్తున్నారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. శిక్షణ పొందిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – రెడ్డి అనంతకుమారి, ఛైర్మన్, ఏపీ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్

ఆశీర్వచనం అందజేస్తున్న వేదపండితులు

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి వేంకటేశ్వరస్వామిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గౌస్ మీరా మొహుద్దీన్, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌లు ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తులకు దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం వసంత మండపంలో వేదపండితులు శేషవస్త్రాలు కప్పి వేదాశీర్వచనం అందించారు. వారికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాలు అందజేశారు.

జీవన సంకీర్తన కవితా సంకలనం ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్పీ పట్నాయక్ తదితరులు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: అమలాపురంలో జరుగుతున్న మూడో తెలుగు మహాసభల వేదికపై ద్రాక్షారామకు చెందిన రచయిత్రి తెలగాని మెహర్ సుజాత కవితా సంకలనం 'జీవన సంకీర్తన' పుస్తకాన్ని ఆదివారం ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్పీపట్నాయక్ ఆవిష్కరించారు. గోదావరి తీరం ఆత్మీయత, పాపికొండల సౌందర్యం, సంక్రాంతి సంబరాల సుగంధం, ద్రాక్షారామ భీమేశ్వరస్వామిపై భక్తిభావాలు ఈ పుస్తకంలో ప్రతిబింబించాయని ఆర్పీ పట్నాయక్, రచయిత తనికెళ్ల భరణి వంటి ప్రముఖులు కొనియాడారు. కార్యక్రమంలో కిమ్స్ విద్యాసంస్థల అధినేత చైతన్యరాజు, రవికిరణ్‌వర్మ, యాళ్ల పళ్లంరాజు, తిలక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సుదీర్ఘ నిరీక్షణ ఫలించిన వేళ..

రక్షిత తాగునీటి పథకాలకు శ్రీకారం

మసకపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి సుభాష్ తదితరులు

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలంలోని గోదావరి తీర ప్రాంత గ్రామాలు సుందరపల్లి, మసకపల్లి. చుట్టూ నీరు కనబడుతున్నా తాగేందుకు చుక్కనీరు కరవు. వేసవి వచ్చిందంటే ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయాల్సిన దుస్థితి. సుమారు 30 ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ సమస్యకు తెరదించాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సీఎస్ఆర్ నిధుల నుంచి ప్రజల దాహార్తి తీర్చాలని కాకినాడలోని కోరమాండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ కంపెనీ వారిని కోరారు. వారు స్పందించి రూ.60 లక్షలు విడుదల చేశారు. ఆదివారం మంత్రి ఆయా గ్రామాల్లో రక్షిత నీటి పథకాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. నియోజకవర్గంలో కియా మోటార్స్ సహకారంతో రూ.2 కోట్లతో డాక్టర్ ఆన్ వీల్స్ సేవలు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఓఎన్‌జీసీ సహకారంతో రూ.5 కోట్లతో గుండె సంబంధిత వ్యాధుల చికిత్సాలయం కూడా వస్తోందని వివరించారు. కోరమాండల్ ప్రతినిధి పద్మనాభం మాట్లాడుతూ నియోజకవర్గంలో కంపెనీ తరఫున ఇదే తొలి సేవా కార్యక్రమమని చెప్పారు. తక్షణ సాయంగా సుందరపల్లిలో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. స్థలదాతలు నిమ్మకాయల నాగేశ్వరరావు, నంబూరు శివప్రసాద్‌లను మంత్రి అభినందించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు రవ్వా భూషణం, కాటే సుబ్రహ్మణ్యం, సర్పంచి పిల్లి అన్నపూర్ణ కల్యాణ్, గెద్దం శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

కోటిపల్లి-ముక్తేశ్వరం రోడ్డు వంతెనకు కృషి

రామ్‌మాధవ్‌ను కలిసిన పార్టీ నాయకులు

పామర్రు, న్యూస్‌టుడే: కోనసీమకు ముఖద్వారంగా భాసిల్లే కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య గోదావరి నదిపై రోడ్డు, వంతెన నిర్మాణానికి సహకారం అందించాలని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం భాజపా ఇన్‌ఛార్జి కర్రి చిట్టిబాబు, స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు భాజపా జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌కు ఆదివారం వినతిపత్రం అందించారు. అమలాపురంలో ప్రపంచ తెలుగు మహాసభలకు విచ్చేసిన ఆయన్ను కలిసి పరిస్థితిని వివరించామన్నారు. ఈ విషయమై దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీను త్వరలోనే కలిసి నిధులు మంజూరుచేసేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. కోనసీమ వాసిగా ఇది తన కర్తవ్యమని ఆయన చెప్పారని వెల్లడించారు. పార్టీ నేతలు అవసరాల వెంకటరమణమూర్తి, ఆకేటి శ్రీకృష్ణ, ఆర్.వి.నాయుడు, పలువురు పెద్దలు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

పింఛనర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నకారా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘ సభ్యులు పోరాడి హక్కులు సాధించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘ అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు సూచించారు. అమలాపురంలోని కొంకాపల్లి ఏవీఆర్ నగర్ పింఛనర్ల భవనంలో జిల్లా అధ్యక్షుడు సాయివరప్రసాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పింఛనర్ల జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా నాయుడు, కోశాధికారిగా బందా రత్నాకర కామేశ్వరరావును, ముగ్గురు ఆడిట్ కమిటీ సభ్యులు, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో డీఎస్ నకారా విగ్రహాన్ని ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, ఏపీఎన్‌జీజీవో జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లు, మాండలిక ఆదినారాయణ, తటవర్తి శర్మ, ఆచంట రామరాయుడు, మేడేపల్లి వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

రాజోలు
• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

మేమున్నాం.. మీకు తోడుగా
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884
ఉ. 10 - మ. 1

స్పందనకు పందనం

వ్యర్థాల తొలగింపు

రావులపాలెం పట్టణం: స్థానిక కొత్తకాలనీలో రోడ్డు చెంతన చెత్త పేరుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి తీయించారు.

ఆత్రేయపురం: పులిదిండి కాలువలో పూడిక పేరుకుపోయి దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచి కనుమూరి సూర్య సుందర సీతాకుమారి వద్ద ప్రస్తావించగా స్పందించి శుభ్రం చేయించారు.

కొమరాజులంకలో డ్రెయినేజీ శుభ్రం

రావులపాలెం పట్టణం: కొమరాజులంక శ్రీనివాసనగర్‌లో డ్రెయిన్ పూడిపోవడంతో మురుగు పారక ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమస్యను పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి వద్ద ప్రస్తావించగా సిబ్బందితో శుభ్రం చేయించారు.

తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు

మామిడికుదురు: ఆదుర్రు పరిధి రావిలంక సమీపంలో తాగునీటి పైప్‌లైన్ దెబ్బతినడంతో సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెప్పిన సమస్యను సర్పంచి బళ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి బీవీవీ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా వెంటనే స్పందించారు. పాత పైప్‌ను తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు.

రహదారుల నాణ్యతలో రాజీ పడొద్దు

కొత్తపేట న్యూస్‌టుడే: కూటమి పాలనలో రహదారుల అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం కొత్తపేట మండలంలోని కమ్మిరెడ్డిపాలెం-వాడపాలెం రహదారుల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ రహదారి పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా, నిర్దేశిత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

రైతుల శ్రేయస్సుకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే వరప్రసాద్

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక సహకార సంఘంలో లక్ష్మీనరసింహ కోకోనట్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంఘంలోని 463 మందికి ఉచితంగా ఎరువులు, 4,478 కొబ్బరి మొక్కలు, వేపనూనె, పొటాష్, మెగ్నీషియం సల్ఫేట్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాఘురి సూర్యనారాయణ, పెదకాపు, గుబ్బల ఫణికుమార్, గెద్దం మహాలక్ష్మీప్రసాద్, తాడి మోహన్ కుమార్, దేవ మల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కర్షకులకు సాగునీటి ఇక్కట్లు రానివ్వం

– న్యూస్‌టుడే, అంబాజీపేట

ముఖాముఖి

జలవనరులశాఖ ఏఈ నవీన్‌కుమార్

జలవనరుల శాఖ కొత్తపేట సెక్షన్ పరిధిలోని పంటపొలాలకు సాగునీరు సమృద్ధిగా సరఫరా చేసేందుకు ప్రణాళిక తయారు చేశామని ఆ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ వి.నవీన్‌కుమార్ వెల్లడించారు. వంతుల వారీ విధానంలో చివరి ఆయకట్టు వరకూ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తమ పరిధిలోని పంటకాలువలు, పూడికతీత, సాగునీటి సరఫరా తదితర అంశాలను ఆయన 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వెల్లడించారు. ఆ వివరాలు ఇలా..

పూడికతీత పనులు మంజూరు

సెక్షన్ పరిధిలో 2025-26 సంవత్సరానికి సంబంధించి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సహకారంతో అంబాజీపేట మండలంలోని కె.పెదపూడి, వ్యాఘ్రేశ్వరం, గంగలకుర్రు, గంగలకుర్రు బ్రాంచ్, ముక్కామల పశ్చిమ, పుల్లేటికుర్రు బ్రాంచ్ కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత పనులు మంజూరు అయ్యాయి. వీటిని విజయవంతంగా పూర్తి చేయడంతో ఖరీఫ్ పంట సమయంలో చివరి ఆయకట్టు వరకు రైతుల పొలాలకు సాగునీరు అందించాం.

● 2026-27 సంవత్సరానికి సంబంధించి అన్ని పంట కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాం.

డీజిల్‌కు నగదు ఇచ్చేందుకు ప్రతిపాదనలు

రబీ పంటకాలానికి ఎద్దడి లేకుండా సాగునీరు అందించేందుకు అన్ని కాలువల్లో తూడు, గుర్రపుడెక్క పనులు చేపట్టి పూర్తిచేశాం. రాబోవు రోజుల్లో నీటిలభ్యత తగ్గిన తరుణంలో బోర్ల ద్వారా అందించుకునేందుకు రైతులకు డీజిల్‌కు నగదు ఇచ్చేందుకు ప్రతిపాదనలు తయారు చేశాం. వీటిని కలెక్టర్, జలవనరులశాఖ ఉన్నతాధికారులకు పంపించాం.

పంట బోదెలను శుభ్రం చేసుకోవాలి

గోదావరి నదిలో స్వయవృద్ధి ఫిబ్రవరి నెలలో తగ్గడంతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. అందువల్ల ఏటా మాదిరిగానే సెంట్రల్ డెల్టా పరిధిలోని అన్ని లాకుల ద్వారా వంతుల వారీ విధానంలో సాగునీరు సరఫరా చేస్తున్నాం. రైతులు ఈ విషయాన్ని గమనించి కాలువల నుంచి తమ పొలాల వరకు బోదెలను శుభ్రం చేసుకుని శివారు వరకు సాగునీరు అందేలా చూసుకోవాలి.

● 2025 అక్టోబర్, నవంబర్‌లలో వచ్చిన తుపాన్ల సమయాల్లో అన్నదాతలు నష్టపోకుండా ఉండేలా కాలువల్లోని నీటి మట్టాలను నియంత్రించి పంటలు ముంపునకు గురికాకుండా అన్ని చర్యలు తీసుకున్నాం.

మోరిలో వైభవంగా రథోత్సవం

పురవీధుల్లో ఊరేగుతున్న మహాలక్ష్మి అమ్మవారు

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: సఖినేటిపల్లి మండలం మోరి మహాలక్ష్మి అమ్మవారి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. జాతర మహోత్సవంలో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ● మొండిపాలెం పెద్దింట్లమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయం కిటకిటలాడింది.

కాకినాడ సీపోర్ట్స్ మారథాన్‌లో ప్రతిభ

పతకం అందుకుంటున్న శ్రీరామరాజు

లొల్ల(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో ఆదివారం నిర్వహించిన సీపోర్ట్స్ మారథాన్‌లో లొల్లకు చెందిన మాజీ సైనికుడు దాట్ల శ్రీనాగశ్రీరామరాజు ప్రతిభ చాటారు. 20 సంవత్సరాల వారితో పోటీపడి 21.1 కి.మీ. పరుగును 1.24 గంటల్లో పూర్తిచేసి మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా నిర్వాహకుల నుంచి పతకం అందుకున్నారు.

రూ.8.82 కోట్లతో ఏటిగట్టు అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, న్యూస్‌టుడే: మామిడికుదురు మండలం వైనతేయ గోదావరి నదీపాయకు సంబంధించిన కుడి ఏటిగట్టుపై పాశర్లపూడి నుంచి ఆదుర్రు శివారు మోరి పోలం వరకు 9 కిలోమీటర్ల మేర రూ.8.82 కోట్ల నరేగా నిధులతో చేపట్టనున్న సిమెంటు రహదారి పనులకు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇరువైపులా ఆయన ఆదివారం కలిసి 5 మీటర్ల వెడల్పున రహదారి నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక తీర గ్రామాల ప్రజలతో పాటు సమీపంలోని ఆదుర్రు గ్రామంలో ఉన్న బౌద్ధ స్థూపానికి వెళ్లే పర్యాటకులకు ఈ రహదారి నిర్మాణంతో శాశ్వత ప్రయోజనం చేకూరనుందన్నారు. దీనికి నిధులు మంజూరు కావడానికి పాశర్లపూడిలంకకు చెందిన ఐఏఎస్ అధికారులు రాజశేఖర్, కాంతారావు పూర్తి సహకారం అందించినట్లు చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచులు కొనుకు ప్రేమజ్యోతి, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, అడబాల తాతకాపు, బళ్ల శ్రీనివాసరావు, నగరం ఏఎంసీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు జాలెం శ్రీనివాసరాజా, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లిలో కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే బండారు

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

రావులపాలెం పట్టణం, కొత్తపేట, న్యూస్‌టుడే: కార్యకర్తలు, నాయకులు కుటుంబ సభ్యులుగా భావించే ఏకైక పార్టీ తెలుగుదేశం అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం వాడపల్లిలోని కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ కార్యకర్తలకు తగిన ప్రాధాన్యమివ్వడంలో ముందుంటున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గనిశెట్టి వీరేష్, బండారు వీరబాబు, కడలి భీమేష్, భూసి వెంకటరామన్, బండారు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా..

అంగన్‌వాడీలకు అండగా ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గతంలో ఎవరూ లేని విధంగా రెండుసార్లు వేతనాలు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదే అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి నిరంతరం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్మార్ట్‌ఫోన్లు ఇవ్వడం జరిగిందని, ఏళ్ల తరబడి ఎదురుచూసిన గ్రాట్యుటీ కలను నిజం చేసిందన్నారు. వేతనాల పెంపు అంశాన్ని కూడా వీలైనంత వరకు అమలు చేసే దిశగా కృషి చేస్తోందన్నారు.

పిల్లలను నైతిక విలువలతో పెంచాలి

స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోళ్ల తిరుమలరావు

తిరుమలరావు దంపతులకు పౌరసన్మానం

పి.గన్నవరం, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు పిల్లలను నైతిక విలువలతో పెంచాలని రామచంద్రపురం స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోళ్ల తిరుమలరావు సూచించారు. బాలికలను బాగా చదివించడం ద్వారా కుటుంబ వ్యవస్థ పటిష్ఠంగా ఉంటుందన్నారు. మానేపల్లికి చెందిన ఆయన స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గ్రామంలోని శ్రీరామ ఐక్యశెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆదివారం సన్మానించింది. ప్రతిఒక్కరూ న్యాయచట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సంఘ అధ్యక్షుడు కడలి వీరవెంకటసత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచులు పితాని చంద్రకళ, గుబ్బల దుర్గ, సాగునీటిసంఘ అధ్యక్షుడు చొల్లంగి సత్యనారాయణమూర్తి, గుబ్బల శ్రీనివాస్, గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన కార్మికులందరికీ గుర్తింపు కార్డులు

ఆలమూరు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.శివనాగమల్లేశ్వరరావు అన్నారు. ఆలమూరు జనార్దనస్వామి ఆలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన కార్మికులందరూ గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. ఈ-శ్రమ్ కార్డు ఆవశ్యకత, ప్రధానమంత్రి శ్రమయోగి మంథన్ పెన్షన్ స్కీం గురించి వివరించారు. ఏమైనా సందేహాలు, సమస్యలు ఉత్పన్నమైతే సత్వరమే కార్మిక శాఖను సంప్రదించాలని కోరారు.

ఆలయాల్లో సినీ ప్రముఖుల పూజలు

అయినవిల్లి, కొత్తపేట, ఆత్రేయపురం, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధి వినాయకస్వామిని ఆదివారం సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ దర్శించుకున్నారు. ఆయనకు అర్చకుడు వినాయకరావు స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం బహూకరించారు. ● కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామిని బ్యాండ్‌మేళం చిత్ర యూనిట్ దర్శించుకుంది. దర్శకుడు సతీష్ జవ్వాజి, నటులు శ్రీదేవి, హరీష్‌రోషన్ ప్రత్యేక పూజలు చేశారు. ● మందపల్లిలో వేంచేసిన మందేశ్వరస్వామిని సినీనటి అన్నపూర్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అయినవిల్లిలో ఆర్పీ పట్నాయక్

వాడపల్లిలో శ్రీదేవి, హరీష్‌రోషన్

నిత్యాన్నదాన పథకానికి విరాళం

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని నిత్యాన్నదాన పథకానికి సికింద్రాబాద్‌లోని తిరుమలగిరికి చెందిన గుంటూరి గంగాధరశాస్త్రి, సీతమ్మ దంపతులు ఆదివారం రూ.1,01,116 విరాళం సమర్పించారు. దాతకు స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు అభినందించారు.

కాలువలో వ్యర్థాలు.. నీరందక అవస్థలు

ఆత్రేయపురం బులిపేట వద్ద ఉన్న పంట కాలువ చెత్తతోపాటు తుప్పలు పెరిగిపోవడంతో రూపం కోల్పోయింది. వ్యర్థాలు అడ్డుపడటంతో పొలాలకు సాగునీరు అందదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ఇరిగేషన్ ఏఈ వెన్నా సాయిమాధవ ప్రసన్న వద్ద ప్రస్తావించగా కాలువ పూడికతీత, ఎత్తిపోతల పథకం మరమ్మతుల విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

అమ్మో.. చెట్టు కూలితే అంతే..

పుల్లేటికుర్రు పంచాయతీ పరిధిలోని నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాల ఎదుట పనస చెట్టు ప్రమాదకరంగా ఉంది. వేర్లు పైకితేలి బలం కోల్పోవడంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్టుపై నుంచి విద్యుత్తు తీగలు వెళ్లాయని, చెంతనే విద్యార్థులు ఆటలాడుతుంటారని చెబుతున్నారు. పనస చెట్టును తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. సర్పంచి జల్లి బాలరాజును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, అంబాజీపేట

సిమెంట్ బల్లలు.. రాకపోకలకు ఇక్కట్లు

ఇటీవల తొత్తరమూడి ప్రధాన రహదారి నిర్మించడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ రోడ్డులోని ముక్తేశ్వరం కూడలిలో మురుగు కాలువపై వేసిన సిమెంట్ బల్లలు పక్కకు జరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పలు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి అన్వర్ తెలిపారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

ప్రమాదకరంగా కల్వర్టు

రాజవరం-పొదలాడ ర.భ.శాఖ రాష్ట్ర రహదారిలో పి.గన్నవరం వద్ద ఉన్న ఏనుగుపల్లి పంటకాలువ కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. మలుపు తిరిగే ప్రదేశంలో ఉన్న ఈ కల్వర్టు సుమారు 60 సంవత్సరాల క్రితం నిర్మించారు. ఇరువైపులా రక్షణగోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తుప్పలతో మూసుకుపోయి దగ్గరకొస్తేగాని కనిపించని పరిస్థితి నెలకొంది. పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఈఈ జి.రాజేంద్ర తెలిపారు. – న్యూస్‌టుడే, పి.గన్నవరం

16 ఏళ్లుగా అసంపూర్తిగానే..

అంబాజీపేట మండల వెలుగు పథకం కార్యాలయం పైఅంతస్తులో ఉపాధిహామీ పథకం భవన నిర్మాణం పనులు 16 ఏళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ నిర్మాణం పూర్తయితే ఉపాధిహామీ పథకం సిబ్బందికి వసతి వెతలు తప్పుతాయి. దీనిపై ఏపీవో అడపా శ్రీవెంకటకృష్ణను వివరణ కోరగా గతంలో ప్రతిపాదనలు పంపామని, రూ.50 లక్షలు ఉంటే వసతులు సమకూరుతాయన్నారు. – న్యూస్‌టుడే, అంబాజీపేట

ప్రభుత్వ పింఛనుదారుల సంక్షేమానికి కృషి

మామిడికుదురు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని సంఘ జిల్లా సంయుక్త కార్యదర్శిగా నియమితులైన మొగలికుదురుకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ మునీర్ అన్నారు. దీనికి సంబంధించి ఆదివారం అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో 2026-29 సంవత్సరానికి గాను బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. సంఘ నాయకులు పలువురు ఆయన్ని అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం.. రావులపాలెం పట్టణం: ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ ఆధ్వర్యంలో ఆదివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వస్థ క్లినిక్ ఆధ్వర్యంలో వైద్యురాలు దోనిపాటి శిరీష హాజరై ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. ఎంఎస్‌పీ అధ్యక్షుడు కాపా నాగరాజు, ముప్పిడి పండు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు నివాళి

రాజోలులో నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అంబాజీపేట, రాజోలు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ పోరులో అమరులైన ఉద్యమ నాయకుల సంస్మరణ కార్యక్రమాన్ని అంబాజీపేటలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. మండల శాఖ అధ్యక్షుడు తొత్తరమూడి గోవింద్, తెదేపా ఎస్సీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాస్, నాయకులు మంద రాజేష్, ఈతకోట నాగరాజు, చోడే కృష్ణమూర్తి, దిగుమర్తి సత్యనారాయణ పాల్గొన్నారు. ● రాజోలులోని ఎమ్మార్పీఎస్ స్తూపం వద్ద నియోజకవర్గ ఎంఎస్‌పీ ఇన్‌ఛార్జి తెన్నేటి నగేష్‌మాదిగ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముస్కూడి జగదీష్, ఉల్లంపర్తి దర్శనం, కనపాల రాముడు, ఉల్లంపర్తి నాని, యాలంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

మహాసభల్లో 'తెలుగు' విజేతలు

పద్య పఠనంలో బహుమతులు సాధించిన గుడిమెళ్లంక, మేడిచర్లపాలెం విద్యార్థులతో నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయులు

మలికిపురం, అంబాజీపేట, ఆలమూరు, న్యూస్‌టుడే: అమలాపురం కిమ్స్ ప్రాంగణంలో జరిగిన మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో పద్యపఠనం అంశంలో గుడిమెళ్లంక సాగి నరసింహరాజు మెమోరియల్ మండల పరిషత్తు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు చెందిన కె.అక్షయ(4వ తరగతి), సంప్రదాయ వేషధారణలో జి.సంతోషిని(నాలుగో తరగతి) ప్రథమ స్థానాల్లో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు జి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయిని జి.అరుణకుమారి చెప్పారు. 6, 7 తరగతుల స్థాయి పద్య పఠనంలో మేడిచర్లపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.రాజేశ్‌కుమార్(7వ తరగతి) ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు ఆరేటి త్రిమూర్తులు చెప్పారు.

నవహర్షిత్, సత్యసూర్యలతో హెచ్‌ఎంలు

● విశిష్ట వేషధారణలో అంబాజీపేట మండలం పసుపల్లి ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థి మారిశెట్టి నవహర్షిత్ జిల్లా స్థాయిలో ద్వితీయ, గంగలకుర్రు సిద్ధార్థ నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి కమిడి మోనేష్ సత్యసూర్య తృతీయ బహుమతులను సాధించారు.

● ఆలమూరు బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు రెండు విభాగాల్లో బహుమతులు అందుకున్నారు. విశిష్ట వేషధారణలో గంగుల వెంకటలక్ష్మి జిల్లా ప్రథమ స్థానంలోను, జూనియర్ చిత్రలేఖనం విభాగంలో వి.దివ్యవెంకటసాయి ద్వితీయ స్థానంలోను నిలిచినట్లు ఉపాధ్యాయురాలు పిడుగు వెంకటలక్ష్మీకుమారి తెలిపారు.

సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

అడబాలకు ఘన సన్మానం

మలికిపురం, న్యూస్‌టుడే: మలికిపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన అడబాల సత్యనారాయణను ఆదివారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. వక్తలు సత్యనారాయణ సేవలను ప్రశంసించారు. ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, సర్పంచి గెడ్డం రాజ్యలక్ష్మి, ఎంఈవోలు ఎం.విజయశ్రీ, వైవీ సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పెద్దకాపు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

– న్యూస్‌టుడే, రాజోలు

కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామీణులకు గుంతల రోడ్లకు విముక్తి కలుగుతోంది. గత పాలకులు పట్టించుకోకపోవడంతో తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించడంతో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకుంటున్నాయి. దీంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఇప్పటివరకు పూర్తయినవి

ఇటీవల రూ.33 కోట్లతో పది ర.భ.శాఖ రోడ్లను 112 కిలోమీటర్ల మేర పూర్తి చేశారు. రూ.25 కోట్లతో శృంగవరప్పాడు నుంచి అంతర్వేది దేవస్థానం వరకు పది కిలోమీటర్ల మేర, రూ.2.10 కోట్లతో మామిడికుదురు నుంచి గోగన్నమఠం వరకు 6.6 కిలోమీటర్లు, రూ.60 లక్షలతో గెద్దాడ రింగ్‌రోడ్, రూ.87 లక్షలతో అంతర్వేది రథం రింగ్‌రోడ్, రూ.60 లక్షలతో మోరిపోలం నుంచి మగటపల్లి, రూ.1.14 కోట్లతో దిండి వై-జంక్షన్ నుంచి రామరాజులంక వరకు, రూ.94 లక్షలతో శివకోటి ముసలమ్మ గుడి నుంచి మట్టపర్రు వరకు 3 కిలోమీటర్లు, రూ.42 లక్షలతో శంకరగుప్తం బ్రిడ్జి అప్రోచ్‌రోడ్డు, రూ.1.25 కోట్లతో మూడు తూముల నుంచి అంతర్వేదికర వరకు 5.8 కిలోమీటర్లు, రూ.70 లక్షలతో 3 కిలోమీటర్ల మేర ములికిపల్లి నుంచి గూడపల్లి గంటాలమ్మగుడి వరకు పూర్తయ్యాయి.

ప్రస్తుతం మరమ్మతులు ఇలా..

రూ.5.31 కోట్లతో పలు రోడ్లకు మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయి. రూ.4.75 కోట్లతో 105 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయి. రూ.40 లక్షలతో కేశవదాసుపాలెం మెయిన్‌రోడ్డు నుంచి అంతర్వేది గుర్రాలక్క గుడి వరకు, రూ.16 లక్షలతో అంతర్వేది బీచ్, లైట్‌హౌస్ రోడ్, రూ.17.84 కోట్లతో 32.60 కిలోమీటర్ల మేర 11 కొత్త రోడ్లు, 28.50 కిలోమీటర్ల మేర మూడు రోడ్లకు మరమ్మతులు జరుగుతున్నాయి.



ములికిపల్లిలో నిర్మించిన రోడ్డు

ప్రణాళిక ప్రకారం పూర్తి చేస్తున్నాం

నియోజకవర్గంలో గత రెండేళ్ల కాలంలో చాలావరకు రోడ్ల నిర్మాణాలు పూర్తిచేశాం. మిగిలినవి ప్రాధాన్యతా క్రమంలో నిర్మిస్తున్నాం. గ్రామాల్లో గుంతలు లేని రోడ్లు దర్శనమిచ్చేలా ప్రణాళికలు రూపొందించి పూర్తి చేస్తున్నాం.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

రోడ్డు మధ్యలో స్తంభం

పెదపట్నంలో సీసీరోడ్డు విస్తరణకు నోచుకున్నా మధ్యలో విద్యుత్తు స్తంభాన్ని తొలగించకపోవడంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఏడాదిన్నర కాలంగా ఈ పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై విద్యుత్తు శాఖ ఏఈ వెంకటేశ్ వివరణ కోరగా స్తంభాన్ని దూరంగా మార్పు చేసేందుకు ర.భ.శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన చర్యలు చేపడతామన్నారు.–న్యూస్‌టుడే, మామిడికుదురు

అలాగే వదిలేశారు!

గుబ్బలపాలెంలో ర.భ.రహదారి పక్కన దుంగలు ప్రమాదకరంగా ఉన్నాయి. సంక్రాంతి పండక్కి భోగిమంట కోసం వేసినవి సగంకాలి మిగిలినవి ఉండిపోయాయి. రోడ్డు పక్కనే ఉండటం వల్ల రాత్రివేళల్లో వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి బి.వి.రమణని వివరణ కోరగా దుంగలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, మలికిపురం

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • రామచంద్రపురం

ఆ ఘనత కూటమి ప్రభుత్వానిదే: ఎమ్మెల్యే

ముమ్మిడివరం: అంగన్‌వాడీ సిబ్బందికి రెండు సార్లు వేతనాలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, తెదేపా జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గ్రాట్యుటీ చెల్లింపుల కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ఉన్నతీకరణ, స్మార్ట్ ఫోన్ల పంపిణీ, వంటి 9 ప్రధాన డిమాండ్లు ఇప్పటికే పరిష్కరించినట్లు బుచ్చిబాబు తెలిపారు. అంగన్‌వాడీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

రైతుబజార్‌లో ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: టమాట - 10, వంకాయలు నలుపు - 20, తెలుపు - 25, బెండకాయలు - 28, పచ్చిమిర్చి - 42, కాకరకాయ - 36, బీరకాయలు - 35, కాలీఫ్లవర్ - 20, క్యాబేజీ - 18, క్యారెట్ - 30, దొండకాయలు -30, బంగాళదుంపలు - 20, ఉల్లిపాయలు - 18, 24, గోరుచిక్కుళ్లు - 30 దోసకాయలు - 20, చిక్కుడుకాయలు - 28, చేమదుంపలు - 35, కంద - 54, బీట్‌రూట్ - 30, కీరదోసకాయలు - 32, అల్లం - 75, క్యాప్సికం - 75, చిలకడదుంపలు - 40, 50, గుమ్మడి - 22, ఉసిరి - 80, ముల్లంగి - 40, కరివేపాకు - 100, నిమ్మకాయలు - 75, మామిడికాయ - 100. ● ఆనబకాయ - 15, పొట్లకాయ -20, అరటికాయ -6, మునగకాయ -12, ఆకుకూరలు కట్ట - 10, 15, కొత్తిమీర కట్ట - 8, కొబ్బరికాయ - 20.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ముమ్మిడివరం : ముమ్మిడివరంలోని డా. బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. అయిదో తరగతిలో ప్రవేశ పరీక్షకు 79 మంది, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి 155 మంది, ఐఐటీ, నీట్ కోచింగ్ అర్హత ప్రవేశ పరీక్షకు 96 మంది హాజరయ్యారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శకుంతల తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరంలోని విద్యుత్తు ఉపకేంద్రంలో సోమవారం వార్షిక మరమ్మతులు చేపడుతున్నామని, ఈ కారణంగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. కె.గంగవరం, తామరపల్లి, సత్యవాడ, కుందూరు గ్రామాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

బీసీ వసతిగృహం తనిఖీ

యానాం, న్యూస్‌టుడే: స్థానిక ద్రాక్షారామ రోడ్డు మార్గంలోని జ్యోతిరావు పూలే బీసీ విద్యార్థుల వసతి గృహాన్ని యానాం పరిపాలనాధికారి శివరాజ్‌మీనా ఆదివారం పరిశీలించారు. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల బందోబస్తు విధుల నిర్వహణకు 200 మంది కేంద్ర సాయుధ పోలీసు బలగం మంగళవారం యానాం రానుండటంతో వీరికి వసతి సదుపాయం కల్పించడానికి బీసీ హాస్టల్‌ను ఎంపిక చేశారు. వసతిగృహంలో ఏర్పాట్లను మీనా తనిఖీ చేశారు. సాంఘిక సంక్షేమ శాఖాధికారి సూరంపూడి రాజేంద్రప్రసాద్ ఏర్పాట్ల గురించి వివరించారు.

7 నుంచి దీన్‌దయాళ్ ప్రశిక్షణ అభియాన్

ద్రాక్షారామ: పండిట్ దీన్‌దయాళ్ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమాలను ఈనెల 7 నుంచి ఏప్రిల్ 14 వరకు నియోజకవర్గంలో నిర్వహిస్తామని కోనసీమ జిల్లా భాజపా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ద్రాక్షారామ రిసార్ట్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈనెల 6, 7 తేదీల్లో కాజులూరు, 14, 15 తేదీల్లో రామచంద్రపురం రూరల్, 21, 22 తేదీల్లో పట్టణం, 28, 29 తేదీల్లో గంగవరం మండలాల్లో ప్రశిక్షణ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, కర్రి చిట్టిబాబు, సలాది వీరబాబు, నాగిరెడ్డి సతీష్‌రావు, ఆకేటి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాటలో మమకారం.. భాషలో మాధుర్యం

◆ మూడో ప్రపంచ తెలుగు మహా సభల ముగింపు ఉత్సవాల్లో వక్తలు

అమలాపురం కలెక్టరేట్, గ్రామీణం, న్యూస్‌టుడే: మాతృ భాషను పరిరక్షించి, భావి తరాలకు అందించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు అమలాపురంలోని నందమూరి తారక రామారావు వేదిక వద్ద నిర్వహించిన మూడో ప్రపంచ తెలుగు మహా సభలు ఆదివారంతో ముగిశాయి. వీటిలో పలువురు తెలుగు భాష ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని వివరించారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ముగింపు ఉత్సవాల నేపథ్యంలో సభా వేదికపై పలువురు చిన్నారులు, విద్యార్థులు సాంస్కృతి నృత్యాలను ప్రదర్శించారు. సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన పలు రకాల స్టాల్స్‌ను ఆసక్తిగా తిలకించారు. తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన సాహితీవేత్తలు, భాషా పండితులు, కవుల విగ్రహాల వద్ద స్వీయ చిత్రాలు తీసుకుంటూ సందడి చేశారు. రెండో రోజు ఆదివారం కావడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి హాజరయ్యారు. సభా ప్రాంగణం జనాలతో కిక్కిరిసిపోయింది.

తెలుగు మహా సభల్లో సుమన్‌కు సత్కారం

అవార్డుల ప్రదానం

ఈ ఉత్సవాల విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన పలు విభాగాల వారిని సత్కరించి వారికి అవార్డులు ప్రదానం చేశారు. తెలుగు మహా సభల్లో పలువురు కవులు రచించిన గ్రంథాలు, సాహిత్య పుస్తకాలను ఆవిష్కరించారు. ● రామోజీరావు వేదిక, నన్నయ వేదికల్లో సాహితీవేత్తల ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో విజయం సాధించిన వారిని మనసారా సత్కరించారు. ● తెలుగు మహా సభల నిర్వహణలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పద్యపఠనం వంటి వాటిలో పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో విజయం సాధించిన వారికి సభా వేదిక వద్ద జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. వారిలో మొదటి, రెండు స్థానాలు సాధించిన వారికి ప్రశంసా పత్రం, నగదు బహుమతి అందించారు.

హీరో హీరోయిన్ రోషన్, శ్రీదేవి

సినీ ప్రముఖుల సందడి

ప్రపంచ తెలుగు మహా సభల ముగింపు ఉత్సవాల్లో పలువురు సినీ ప్రముఖులు సందడి చేశారు. ఉదయం తనికెళ్ల భరణి, గౌతం రాజు, సుమన్, బ్యాండ్ మేళం చిత్ర కథానాయకుడు రోషన్, కథానాయకి శ్రీదేవి, దర్శకుడు సతీష్, నిర్మాత, రచయిత కోన వెంకట్‌లు సందడి చేశారు. ఈ సందర్భంగా చిత్రంలోని రెండో పాటను కిమ్స్ ఛైర్మన్ చైతన్య రాజు విడుదల చేశారు. ఈ నెల 13న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందని, ఆదరించాలని కోరారు.

సభకు హాజరైన రఘు కుంచె

తెలుగు విలువ తెలిసింది..!

★ బహుమతులు పొందిన విద్యార్థుల అభిప్రాయాలు

అమలాపురం కలెక్టరేట్, గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించడం వల్ల వారిలో మాతృ భాషపై ఆసక్తి పెరుగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలుగు మహాసభల నిర్వహణలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మండల, జిల్లా స్థాయిలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందించారు.

8,572 మంది విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో కలిపి 8,572 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో మండల స్థాయిలో 360 మంది విజయం సాధించగా, జిల్లా స్థాయిలో 30 మంది విజేతలుగా నిలిచారు. మండల స్థాయిలో విజేతలకు రూ.2వేలు, రూ.1500 చొప్పున, జిల్లా స్థాయిలో విజయం సాధించిన వారికి రూ.4 వేలు, రూ.5వేల చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందించారు.

సంతోషంగా ఉంది

ఈ పోటీల్లో మండల స్థాయిలో విజయం సాధించినందుకు సంతోషంగా ఉంది. నేను కోనసీమ అందాలు అనే అంశంపై చిత్రం గీసి మండల స్థాయిలో మొదటి బహుమతి సాధించా. దీంతో నాకు తెలుగు భాషపై ఇష్టం ఏర్పడింది. – మట్లా వరుణ్, మామిడికుదురు

మాతృభాష ఎంతో గొప్పది

అమలాపురంలో నిర్వహించిన మూడో ప్రపంచం తెలుగు మహాసభ వల్ల తెలుగు గొప్పతనం తెలిసింది. మన మాతృభాషకు ఇంతటి గొప్పదనం ఉందా.. అని ఆశ్చర్యం కలిగింది. నేడు సఖినేటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నా.. మండల స్థాయిలో బహుమతి సాధించా. – రాయుడు అవినాష్, సఖినేటిపల్లి

తెలుగుపై ఇష్టం కలిగింది

నేను అల్లవరం మండలం ఓడలరేవు జడ్పీ ఉన్నత పాఠశాలో ఏడో తరగతి చదువుతున్నా. ఈ సభలకు హాజరు కావడం వల్ల తెలుగు భాషపై ఇష్టం కలిగింది. తెలుగు ఔన్నత్యంపై వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో బహుమతి సాధించా. – కానుబోయిన శ్యామల

ఇకపై అమ్మ, నాన్న అని పిలుస్తా

నేను అమలాపురం మండలం పాలగుమ్మి జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. చిత్రలేఖనం విభాగంలో మండల స్థాయిలో విజయం సాధించా. ఇక్కడి వచ్చిన తర్వాత ఎంతో మంది గొప్పవారు తెలుగు నశించి మమ్మీ భాష వ్యాప్తి చెందుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో నేను ఈ రోజు నుంచి మా తల్లిదండ్రులను అమ్మా, నాన్నా అని పిలుస్తా. – బీడీ శ్రీదీప్తి జ్ఞానేశ్వరి, పాలగుమ్మి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ఆదేశాల మేరకు 'ప్రజల వద్దకే పాలన' లక్ష్యంగా సాగుతున్నామని, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా నిరంతరం అందుబాటులో ఉంటున్నామని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే ఆనందరావు ఆదివారం 'ప్రజా దర్బార్' కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో మహిళలు, వృద్ధులు, ప్రజల నుంచి 32 వినతులు, ఫిర్యాదులు, అర్జీలను స్వీకరించారు. మురుగుకాలువలు, రోడ్లు నిర్మించాలని, ఇళ్ల పట్టాలు, పింఛన్లు ఇప్పించాలని, వ్యక్తిగత ఆర్థిక సహాయం చేయాలని తదితర సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని, ప్రతి అర్జీని పరిశీలించి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పంటబోదెలో పూడిక తొలగింపు

పామర్రు, న్యూస్‌టుడే: పామర్రులోని 750 ఎకరాలకు నీరందించే రావిదొడ్డి పంటబోదెలో పేరుకుపోయిన పూడిక, వ్యర్థాలను రైతులు శ్రమదానంతో తొలగించారు. వ్యర్థాలు అడ్డుపడడంతో పొలాలకు నీరు అందడం లేదని అధికారులు, నీటి సంఘాల సారథులకు చెప్పినా వారు పట్టించుకోకపోవడంతో రైతులు శని, ఆదివారాల్లో రంగంలోకి దిగారు. పరిసర గ్రామాలైన నాగులచెరువు, యండగండి కాల్వలు బాగానే ఉన్నాయని, ఈ కాల్వకే సరిగా పనులు చేయకపోవడంతో నీటి ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. శ్రమదానంతో రావిదొడ్డి, లంకపొలం, కాల్వ పొలాలకు సరఫరా మెరుగైందని తెలిపారు. నీటి సంఘం అధ్యక్షుడు ఆచంట శ్రీను, అధికారులను వివరణ కోరగా గతంలో బోదెను బాగుచేయించామని చెప్పారు. ఇకపై నీటి సరఫరాలో అడ్డంకుల్లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పూడిక తొలగింపు పనుల్లో రైతులు

విద్యార్థినులకు అభినందన

కాట్రేనికోన, న్యూస్‌టుడే: అమలాపురంలోని కిమ్స్ కళాశాలలో నిర్వహించిన 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో బలుసుతిప్ప హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు మానస, దీవెన భారతి చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపారు. తెలుగు మహాసభల్లో ప్రముఖుల చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం పీవీ సత్యనారాయణ, పద్మావతి, విద్యార్థులను ఎంఈవోలు, గ్రామస్థులు అభినందించారు.

ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థినులు

రహదారుల చెంతనే చెత్త

అమలాపురం పట్టణంలోని భూపయ్య అగ్రహారం రెడ్ ఫోర్ట్‌లో రోడ్డు పక్కన్న చుట్టుపక్కలవారు ప్లాస్టిక్‌వ్యర్థాలను పడేస్తున్నారు. ఇక్కడ జనసంచారం లేకపోవడంతో వాటికి నిప్పు పెడుతున్నారు. పొగ కారణంగా స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరతున్నారు.
–న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

ఒరిగిన విద్యుత్తు స్తంభం

మండలంలోని పల్లంకుర్రు నుంచి బలుసుతిప్ప వెళ్లే రోడ్డులో రెండు చోట్ల విద్యుత్తు స్తంభాలు పంట కాలువ వైపు ఒరిగాయి. ఇక్కడ బొంతువారిపేట, రామాలయం పేట పరిసరాల్లో స్తంభాలు పంటకాలువ వైపునకు ఒరిగి తీగల ఆధారంపై నిలిచాయి. గాలులు వీస్తే తీగలు తెగి స్తంభాలు పడిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కాట్రేనికోన

రూ.లక్షల భవనం నిరుపయోగం

ఉప్పలగుప్తంలో దివ్యాంగుల కోసం సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. ఏడాది క్రితం భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. అప్పటి నుంచి ఖాళీగా వదిలేయడంతో చుట్టూ తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగి పోతున్నాయి. పరిసరాల్లో విషపురుగులు సంచారం పెరిగింది. అధికారులు భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

పట్టుతప్పితే.. పెనుప్రమాదమే

ఇదిగో ఇలాంటి దృశ్యాలు చూస్తే ఎవరికైనా ఆందోళన కలుగుతుంది. విద్యా సంస్థలకు వెళ్లే పలువురు విద్యార్థులు బస్సుల్లో ఫుట్‌పాత్‌పైనే వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. రద్దీ రోడ్లపై.. మలుపుల వద్ద పట్టు జారితే.. ఏమవుతుందోననే ఆందోళన తల్లిదండ్రులను తీవ్రంగా వేధిస్తోంది. రామచంద్రపురం పట్టణంలో రోజూ ఇలాంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. దీనిపై ఆర్టీసీ డిపో మేనేజర్ పి.భాస్కరరావును వివరణ కోరగా విద్యార్థులను బస్‌స్టాపులు, బస్టేషన్‌లో పైకి వెళ్లేలా సిబ్బందితో చెప్పిస్తున్నామని వివరించారు.– న్యూస్‌టుడే, రామచంద్రపురం

రాజీవ్‌బీచ్‌లో విద్యార్థుల స్వచ్ఛభారత్

యానాం, న్యూస్‌టుడే: నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ, సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులతో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంప్‌లో భాగంగా ఆదివారం స్థానిక రాజీవ్‌బీచ్, ఫెర్రీరోడ్ పరిసరాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. మహనీయుల విగ్రహాల్ని కడిగి శుభ్రం చేశారు. కురసాంపేట, అయ్యన్ననగర్ గ్రామాల్లో డెంగీ, మలేరియా వ్యాధుల గురించి విద్యార్థులు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు వాసంశెట్టి ఆనంద్, శ్రీనివాస్, శాంతరాజు కార్యక్రమాల్ని నిర్వహించారు.

అంబేడ్కర్ జీవితంపై వ్యాసరచన పోటీలు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అయినాపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద విశాఖపట్నానికి చెందిన ఆర్కే పిన్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జీవితం- విజయోత్సవ గాథపై వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. కేబీకే ఉచిత స్టడీ సర్కిల్ నిర్వాహకుడు కాశి బాలకృష్ణ ఈ పోటీలను పర్యవేక్షించారు. పోటీల్లో రూ.5 నామమాత్రపు ఫీజు చెల్లించి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.7,500, ద్వితీయ బహుమతి రూ.5,000, తృతీయ స్థానానికి రూ.2,500 అందజేస్తామని బాలకృష్ణ తెలిపారు. మెల్లం రవికుమార్, సర్పంచి మోకా రామారావు, ఎం.ఆశీర్వాదం, గెడ్డం బాబ్జి, ఇసుకపట్ల శివకుమార్, తిరుకోటి సురేష్, మధుర నాగేశ్వరరావు, కె.రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

సేవలతో గుర్తింపు

నూకల నాగేశ్వరరావు దంపతులకు చిత్రపటాలు అందిస్తున్న కుటుంబసభ్యులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: పోలీస్‌శాఖలో ఎస్సై నూకల నాగేశ్వరరావు 42 ఏళ్లుగా అందించిన సేవలు ప్రశంసనీయమని ఎస్పీ రాహుల్‌మీనా అన్నారు. ఎస్పీ కార్యాలయం డీసీఆర్‌బీ ఎస్సై నూకల నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం అమలాపురం అబ్బిరెడ్డివారివీధిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, సుబ్బలక్ష్మి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ వీరబాబు, ఎస్సైలు కిషోర్‌బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

ముమ్మిడివరంలో మాదిగ అమరవీరులకు నివాళి అర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం : ఎస్సీ వర్గీకరణ పోరాటంలో మృతిచెందిన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ముమ్మిడివరం పోలమ్మచెరువుగట్టు వద్ద నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు ఖండవిల్లి ఏలియా, మండల అధ్యక్షుడు లంక వరప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత డా.బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు, అనంతరం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ నాయకులు మాదిగ అమరవీరులకు నివాళి అర్పించారు. సీహెచ్ సురేష్ మాదిగ, లంక బాలయోగి, చేట్ల శ్రీఅఖిల, బొమ్మి హరికృష్ణ, మడికి వెంకటేశ్వరరావు, గంజి మురళీ కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా పొన్నవాహనోత్సవం

● నేడు మీసాల వెంకన్న రథోత్సవం

ప్రత్యేక అలంకరణలో వెంకన్న రథం

యానాం, న్యూస్‌టుడే: యానాం ప్రజల ఆరాధ్య దైవం మీసాల వెంకన్న కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పొన్నవాహనోత్సవం వేడుకగా జరిగింది. కాపగంటి సూర్యప్రకాశరావు కుమారులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. రథోత్సవం సోమవారం నిర్వహించడానికి అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవేరులతో మీసాల వెంకన్నను చిన్నరథంపై యానాం పట్టణంలో ఊరేగించిన అనంతరం మధ్యాహ్నం 3.45 గంటల తర్వాత కె జంక్షన్ నుంచి కొత్త బస్టాండ్ వరకు రథయాత్రను నిర్వహిస్తారు. ఎస్పీ వరదరాజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

రామచంద్రపురం: వేట్లపాలెం బాణసంచా ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ప్రకటించాలని పీడీఎస్‌యూ, పీవైఎల్, ఏఐకేఎంఎస్ ప్రజా సంఘాలు నేతలు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం, పీవైఎల్ నాయకులు ఎ.కృష్ణ, ఐఎఫ్‌టీయూ నాయకులు చింతా రాజారెడ్డి మాట్లాడారు.

శాస్త్ర చిత్రలేఖనంపై కార్యశాల

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో కృష్ణసాయి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: సైన్స్ అంటే సూత్రాలు, నిర్వచనాలు మాత్రమే కాకుండా దృశ్యరూపంలో కూడా అర్థం చేసుకునే అంశమని, భౌతిక, రసాయన, జీవశాస్త్రాలలో బొమ్మల ద్వారా విద్యార్థులకు విషయాన్ని సులభంగా అర్థమవుతుందని రేవతి సైన్సు ఫౌండేషన్ అధ్యక్షుడు కె.కృష్ణసాయి అన్నారు. శాస్త్రబోధన, పరీక్షలలో చిత్రలేఖనం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఆదివారం నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. విషయ నిపుణులుగా డాక్టర్ .ఎం.సత్యానందం వ్యవహరించారు. మొక్కల్లోని వివిధ భాగాలు, మానవ హృదయం, కాంతి లక్షణాలు, విద్యుత్ వలయం, వివిధ రసాయన పరికరాలు, పరీక్షనాళిక, కొలజాడి వంటి చిత్రాలు గీయడంలో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.కె.వి.వి.సత్యనారాయణ, ఎస్.రఘురామ గణేష్, డి.సతీష్, పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

పూజలు నిర్వహిస్తున్న పరిపాలనాధికారి శివరాజ్‌మీనా

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో బహిరంగ సభలో పాల్గొనేందుకు వచ్చిన భారత ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం మధ్యాహ్నం రూ.2,700 కోట్లు విలువైన పనుల్ని ప్రారంభించారు. లాస్‌పేట మైదానంలో నిర్వహించిన సభలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా యానాంలో రూ.31.62 కోట్ల వ్యయంతో 60 లక్షల లీటర్ల మురుగునీటి శుద్ధి ప్రాజెక్టు నిర్మాణ పనికి, రూ.10కోట్లు వ్యయంతో ద్రాక్షారామ రోడ్డు నుంచి మూడు తూములు వరకు రహదారి అభివృద్ధి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. బహిరంగసభలో ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాసఅశోక్ పాల్గొన్నారు. నిర్మాణ పనులకు పరిపాలనాధికారి శివరాజ్‌మీనా పూజలు చేశారు. మున్సిపల్ కమిషనర్ రాఘవన్, ప్రజాపనులశాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో సెక్షన్ 30 అమలు

రామచంద్రపురం: రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలోని రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు పోలీస్‌స్టేషన్ల ప్రాంతాల్లో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నామని డీఎస్పీ ఇన్‌ఛార్జి టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి ఒకటో తేదీ నుంచి 31 వరకు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. అవసరమైన వారు కార్యాలయంలో ముందస్తుగా అనుమతి తీసుకోవాలని కోరారు.

కొవ్వొత్తులతో ముస్లింల ర్యాలీ

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి చింతిస్తూ ముమ్మిడివరంలోని గొల్లగూడెం వద్ద మస్జిద్ ఎ జహరా వద్ద ప్రార్థనలు చేశారు. ఖమేనీ ఆత్మకు శాంతి చేకూరాలని.. ఆదివారం రాత్రి ముస్లింలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని నినాదాలు చేశారు. ముమ్మిడివరం ముస్లిం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

చిన్నారి వైద్యానికి ఆర్థిక చేయూత

ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ సభ్యులు

కాట్రేనికోన : అరుదైన వ్యాధితో బాధపడుతున్న కర్నూలుకు చెందిన 8 నెలల చిన్నారి పునర్వికి చికిత్సకు ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ సభ్యులు ఆర్థిక చేయూత అందించారు. సంస్థ సభ్యులు, స్నేహితులు సేకరించిన రూ.ఒక లక్షా పది వేల నగదును చిన్నారి తల్లిదండ్రులకు అందించారు. చిన్నారి చికిత్సకు ముందుకు వచ్చిన వారి సేవలను పలువురు కొనియాడారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

దేశ రక్షణ కోసం 24 సంవత్సరాలు దేశ సేవకు తన జీవితాన్ని అంకితంచేసి అకాల మరణం పొందిన వీరసైనికుడు కీ॥శే॥ బడుగు నాగబాబు గారి మృతికి చింతిస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, శోకతప్త హృదయాలతో...

కీ॥శే॥ బడుగు నాగబాబు గారు
HAV (OPR) 27 AD MSL REGT-INDIAN ARMY
జననం: 10-06-1981, మరణం: 20-02-2026.

తండ్రి : బడుగు చంద్రరావు (లేటు) తల్లి: శాంతకుమారి
సోదరులు : శేఖర్, శ్రీనివాసరావు
సోదరీమణులు : క్రిష్ణవేణి, దుర్గాదేవి
బావ : కోన రవికుమార్
మేనమామలు : సాపే నాగేశ్వరరావు - శ్రీమతి విజయకుమారి
సాపే రాజేశ్వరరావు - శ్రీమతి లక్ష్మి
కుటుంబసభ్యులు, బంధుమిత్రులు మరియు గ్రామ ప్రజలు

పెదకార్యం: ది. 2-3-2026 సోమవారం, అల్లవరం మండలం, బోడసకుర్రు గౌతమి నగర్‌లో మా స్వగృహము నందు జరుపబడును.

(c) eenadu

సాగర తీరంలో సందడి

కాకినాడ గ్రామీణం + సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ రోడ్డులో కాకినాడ రన్నర్స్ ట్రస్ట్, కాకినాడ సీపోర్ట్, ఎపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ ఆధ్వర్యంలో రన్ ఫర్ హర్ నేవీ- అవర్ రెస్పాన్సిబిలిటీ పేరుతో మహిళల భద్రత మన బాధ్యత అంటూ 21.5 కిలోమీటర్లు హాఫ్ మారథాన్ నిర్వహించారు. కాకినాడతో పాటు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1500 మంది విద్యార్థులు, యువత, గృహిణులు, వృద్ధులు నారీలు వర్షం ఏకరూప దుస్తులు ధరించి ఉత్సాహంగా పరుగులో పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, సర్పవరం

వైభవంగా సోమాలమ్మ జాతర

రాజమహేంద్రవరం నగర దేవత పాత సోమాలమ్మ జాతర వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలోని వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని సౌభాగ్యలక్ష్మిగా అలంకరించి విశేష పూజలు చేశారు.

-న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

సౌభాగ్యలక్ష్మి అలంకరణలో అమ్మవారు

సుస్వరాల తెలుగు.. ఇంటింటా వెలుగు

ఈనాడు, అమలాపురం, న్యూస్‌టుడే, గ్రామీణం, కలెక్టరేట్: తెలుగు అంటే.. కోనసీమ లాంటి పచ్చని అందాలు. . సవ్వడి చేసే గోదారమ్మ పరవళ్లు.. నిత్య స్ఫూర్తిని కలిగించే సముద్ర కెరటాలు అంటూ వివిధ రంగాల్లోని ప్రముఖులు తెలుగు భాష గురించి మాట్లాడారు. అమలాపురంలో నిర్వహిస్తున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలు ఆదివారం వేడుకగా ముగిశాయి. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాలలోని ప్రముఖులు హాజరయ్యారు. సాహితీవేత్తలు, కళాకారులు, భాష ఔన్నత్యాన్ని తెలియజేశారు. అమ్మలాంటి భాషను భావితరాలకు అందించాల్సిన ప్రాధాన్యాన్ని వివరించారు.

ఎన్నెన్నో ప్రత్యేక ఆకర్షణలు..

సభా ప్రాంగణంలో తెలుగు కోసం విశేష కృషి చేసిన ప్రముఖుల విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యువతీయువకులు వాటి వద్ద స్వీయచిత్రాలు తీసుకుని సందడి చేశారు. తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందర్నీ అలరించాయి.

వేడుకలో కళాకారుల నృత్య ప్రదర్శన

ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రముఖులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్లు జస్టిస్ అబ్దుల్ నజీర్, జిష్ణుదేవ్ వర్మ, మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మొహిసుద్దీన్, జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ చలపతిరావు, జస్టిస్ రామకృష్ణారెడ్డి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నశ్రీ, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, అమలాపురం, కొత్తపేట ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చిత్రంలో డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, కిమ్స్ ఛైర్మన్ చైతన్యరాజు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

విజేతలకు బహుమతుల ప్రదానం..

ప్రముఖ సంగీత దర్శకుడు, రచయిత, గాయకుడు ఆర్పీ పట్నాయక్ వేదికపై 'తెలుగు భాష కమ్మదనం..' 'వానా.. వానా.. వాన.. నీలాకాశంలోన' 'ఒక్కడై రావడం.. ఒక్కడై పోవడం..' ఆ నలుగురు తదితర పాటలు పాడారు. అంతకుముందు చైతన్యరాజుతో కలిసి తెలుగు మహాసభల పోస్టల్‌స్టాంపు ఆవిష్కరించారు. ● వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రామోజీరావు వేదికపై విద్యార్థినులతో నిర్వహించిన ముఖాముఖిలో మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్ పాల్గొన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. విలువైన సూచనలు చేశారు.

చదువుకుంటూనే పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి

● విద్యార్థి దశలో ప్రతి నిమిషం విలువైంది. ప్రణాళిక ప్రకారం కష్టపడాలి. లక్ష్య సాధనకు క్రమశిక్షణ, కృషి అంతకు మించి స్థిరత్వం అవసరం. అప్పుడే విజయం సాధ్యం.

ప్రశ్న: కుటుంబం, వృత్తి సమన్వయం ఎలా?

● సమాజంలో పురుషులైనా.. స్త్రీ అయినా స్వార్థాన్ని వీడాలి. ప్రస్తుత తరంలో ఆ స్వభావం అధికంగా ఉంది. మనం సమాజానికి ఏం ఇస్తున్నామో ఆలోచించాలి. ఒత్తిడి అధిగమించేందుకు ధ్యానం చేయాలి. సర్దుబాటుతత్వం ఉంటే చక్కని సమన్వయంతో రాణించగలం.

మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్

మహిళా రక్షణకు చట్టాలొచ్చినా నేరాలు ఆగట్లేదు ఎందుకు?

● రక్షణ పరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అనవసర ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లకూడదు. యుద్ధవిద్యలు, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి. అందరూ మంచిగానే ఉంటారు, కొందరు మాత్రమే నేర స్వభావంతో ఉంటారు.

ఆకట్టుకున్న అచ్చమైన తెలుగింటి లోగిలి

హాజరైన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, నటుడు తనికెళ్ల భరణి, భాషాభిమానులు

వివిధ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులతో న్యాయమూర్తులు, చైతన్యరాజు

పురపాలికల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి : మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: పురపాలికల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని పురపాలక శాఖ మంత్రి నారాయణ సూచించారు. వేట్లపాలెం బాణసంచా సంఘటన నేపథ్యంలో బాధితులను పరామర్శించేందుకు ఆదివారం కాకినాడ జిల్లాలో పర్యటించారు. అనంతరం తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రవరం చేరుకున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ నగరాల సాధనలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణ, డంపింగ్ యార్డుల నియంత్రణ సక్రమంగా జరగాలన్నారు. రహదారుల శుభ్రతకు స్వీపింగ్ యంత్రాలు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఎంపీ సానా సతీష్, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

వెంటిలేటర్లపైనే చికిత్స

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: కల్తీ పాల ఘటనకు సంబంధించి రాజమహేంద్రవరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. ఆదివారానికి 11 మంది బాధితులను వెంటిలేటర్‌పై ఉంచి డయాలసిస్ చేస్తున్నారు. మరో నలుగురికి ఐసీయూ చికిత్స అందిస్తున్నారు. హైదరాబాద్, విశాఖపట్టణం నుంచి వచ్చిన నిపుణుల బృందం పర్యవేక్షణలో ప్రొటోకాల్ వైద్య విధానంతో చికిత్స అందిస్తున్నారు.

స్త్రీ శక్తి బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

'స్త్రీశక్తి' పథకం అమలు ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన సర్కారు ఇప్పుడు ఆ పథకాన్ని దివ్యాంగ పురుషులకు వర్తింపచేయనున్నారు. దివ్యాంగ రాయితీ పాసులు వారికి లబ్ధి చేకూరనుంది. దూరప్రాంత, నాన్‌స్టాప్ సర్వీసుల్లో ఎప్పటిలాగే 50 శాతం రాయితీ కొనసాగనుంది. జిల్లాలో దివ్యాంగ రాయితీ బస్సులు 1,764 ఉన్నాయి. మొత్తం పాసుల్లో సగానికి పైనే పురుష దివ్యాంగులవేనని ఆర్టీసీ సిబ్బంది తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి మార్గదర్శకాలు రావాల్సి ఉందని చెబుతున్నారు.

డిపో	పీహెచ్‌సీ పాసులు
రాజమహేంద్రవరం	979
గోకవరం	304
కొవ్వూరు	156
నిడదవోలు	325

పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ నేడు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ సోమవారం కలెక్టరేట్‌లో యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఉదయం 10 గంటల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మండల కార్యాలయాల్లోనూ పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తామన్నారు. ప్రజలు తమ సమీపంలోని కార్యాలయాల్లోనూ అర్జీలు అందించవచ్చని, నేరుగా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందవచ్చని సూచించారు. కార్యాలయాల వరకు రాలేనివారు మీ కోసం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులు చేయవచ్చని వివరించారు.

చారిత్రక నగరి ఉక్కిరి బిక్కిరి..!

● దిగజారుతున్న గాలి నాణ్యత..

పరిశీలన

రాజమహేంద్రవరం నగరంలో కాలుష్యం జాతీయ ప్రమాణాలను మించిపోతోంది. విజయవాడలో కంటే ఎక్కువ స్థాయిలో నమోదు అవుతోంది. రానున్న గోదావరి మహా పుష్కరాల నేపథ్యంలో స్వచ్ఛ గాలి ప్యాకేజీలో భాగంగా రూ.150 కోట్లు కేటాయించండి. దీనిని నియంత్రించ లేకపోతే పుష్కరాలకు వచ్చే భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఇటీవల పార్లమెంట్ సమావేశంలో ఎంపీ పురందేశ్వరి

ఈనాడు, రాజమహేంద్రవరం, టి.నగర్,న్యూస్‌టుడే :

చారిత్రక నగరం రాజమహేంద్రవరంలో కాలుష్య తీవ్రత నానాటికీ తీవ్రమవుతోంది. గాలి నాణ్యత అత్యంత నాసిరకంగా ఉందని జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అయిదేళ్ల కిందట పోల్చితే కాలుష్య తీవ్రత రెట్టింపైంది. ప్రస్తుతం నగరంలో గాలి పీల్చడం ద్వారా రోజుకు సగటున 3.4 సిగరెట్లు తాగితే ఆరోగ్యంపై ఎంత ప్రభావం చూపుతుందో.. ఆ స్థాయిలో కాలుష్య తీవ్రత ఉందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ స్థాయి 50 (పీఎం) నుంచి 150 పాయింట్ల మధ్య ఉంటే అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది.

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

కాలుష్య గాలి వల్ల ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, చర్మ వ్యాధులు, సైనస్ తదితర అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నగరంలో ధూళి కణాల తీవ్రత సైతం అధికంగానే ఉంటోంది.

దీన్ని నియంత్రించేందుకు నగరపాలక సంస్థ అప్పుడప్పుడూ గాలిలో రసాయనాలు పిచికారీ చేయిస్తున్నా, వాయు కాలుష్యం నియంత్రణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

వేకువ జామునే తీవ్రత

గాలి నాణ్యత 50 ఉంచి 150 పాయింట్ల మధ్య ఉంటే నాణ్యత లేమి (పూర్)ని, 200 పాయింట్ల స్థాయికి చేరితే అనారోగ్యహేతువును స్పష్టం చేస్తోంది.

ఆదివారం గణాంకాలు పరిశీలిస్తే కాలుష్య తీవ్రత (పాయింట్లలో)

వేకువజామున 5.00 గంటలకు గరిష్ఠంగా:	220
ఉదయం 7.00 గంటలకు	210
సాయంత్రం 4 గంటలకు	140
రాత్రి 8 గంటలకు	180

● డిసెంబరు 2025లో గరిష్ఠంగా 224 పీఎంతో ప్రమాదకర స్థాయిలో గాలి నాణ్యత నమోదైంది. 2022 ఆగస్టులో 31 పీఎంతో తక్కువ స్థాయిలో నమోదైంది.

సంవత్సరం:	పాయింట్లు
2022	85
2023	96
2024	82
2025	104
2026	171

ముఖ్యాంశాలపై పట్టు.. మంచి మార్కులు కొట్టు

● 'ఈనాడు' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన

న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్ : కొన్ని రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

సందేహాలను నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయులు చిత్రంలో డీఎస్ఈవో వాసుదేవరావు

ఈ నేపథ్యంలో ఆయా పాఠ్యాంశాల్లోని ముఖ్యాంశాలపై పట్టు సాధిస్తే మెరుగైన మార్కులు పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. డీఎస్ఈవో కె.వాసుదేవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, పీఎస్, ఎన్ఎస్, సోషల్ ఉపాధ్యాయులు హాజరై ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

? రామాయణం నుంచి ఏయే ప్రశ్నలు వస్తాయి.

-వెలుగుబంటి ఐశ్వర్య (కడియం), పి.భువనేశ్వరి (మహేష్, విద్యార్థి తల్లి)

సీతారాముల కల్యాణం, శ్రీరాముడు వనవాసానికి వెళ్లడానికి కారణం, శ్రీరామ, సుగ్రీవుల మైత్రి, సీతాపహరణ, సేతు నిర్మాణం, లంకా దహనం, రామాయణం ఎందుకు చదవాలి వంటి అంశాలు చదివితే తప్పనిసరిగా 8మార్కుల ప్రశ్న వస్తుంది. లఘు ప్రశ్నలకు చాయిస్ ఉండదు..కాబట్టి అన్నీ చదవాలి.

? ఆంగ్లం పరీక్షలో ప్రధానంగా తీసుకోవల్సిన జాగ్రత్తలు

- ఇస్సాక్, కుమార్ రాజా, దీపిక, రోహిణి (రాజమహేంద్రవరం)

వ్యాసరూప ప్రశ్నలకు జవాబులు రాసేటప్పుడు మొదటి పేరాలో ఇంట్రడక్షన్, రెండో పేరాలో ఎక్స్‌ప్లనేషన్, మూడో పేరాలో కంక్లూజన్ రాయాలి.

? : గణితంలో మార్కులు ఎలా సాధించాలి? - పి.శ్రుతిక, టి.కుసుమ

సంభావ్యత (ప్రాబబిలిటీ) నుంచి 13, సాంఖ్యాక శాస్త్రం (స్టాటిస్టిక్స్), నిరూపకరేఖా గణితం నుంచి 12 చొప్పున మార్కులు వస్తాయి. త్రిభుజాలు, వాస్తవ సంఖ్యల పై పట్టు సాధిస్తే మంచి మార్కులు సాధించవచ్చు.

? : భౌతిక శాస్త్రంలో 8 మార్కులు ప్రశ్నలు వేటి నుంచి వస్తాయి - కె.దుర్గాదేవి (కడియం)

సబ్బు , రసాయన చర్యల రకాలు ఒక్కో ఉదాహరణ, ఇనుము తుప్పు పట్టడానికి అనుకూల పరిస్థితులు, అయస్కాంత క్షేత్రంలో విద్యుత్తు తీగ చుట్ట ఉంచినప్పుడు ఏవిధంగా ప్రవర్తిస్తుందో వివరించాలి. దీని నుంచి 8 మార్కుల ప్రశ్నలు వస్తాయి.

-మరిన్ని ప్రశ్నలు.. సమాధానాలు 6లో

గల్ఫ్‌లో.. భయం గుప్పిట్లో..

● యుద్ధ మేఘాలతో భయ కంపితం
● తెలుగు కుటుంబాల్లో ఆందోళన

న్యూస్‌టుడే, అల్లవరం

పశ్చిమాసియాలో ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధవాతావరణం కారణంగా కోనసీమలోని వేల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. కువైట్, దుబాయ్, ఖతార్ వంటి గల్ఫ్ దేశాల్లో అత్యధికంగా జిల్లావాసులు పలు రకాల పనుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఈ దేశాల్లో జనావాసాల మధ్య ఇరాన్ క్షిపణులతో బాంబుల వర్షం కురిపిస్తోందంటూ సామాజిక మాధ్యమాలు, ప్రసార మాధ్యమాల్లో వస్తున్న వార్తలతో ఉమ్మడి జిల్లా వాసులు కలవరపాటుకు గురవుతున్నారు.

సుమారు 2 లక్షల మంది

ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి 2 లక్షల మంది వరకు గల్ఫ్ దేశాల్లో వివిధ పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. వీరిలో కోనసీమ నుంచే ఎక్కువ మంది ఉన్నారు. మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు, అల్లవరం, ఉప్పలగుప్తం, ఐ.పోలవరం, రామచంద్రపురం, తదితర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో మహిళలు, పురుషులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు.

విమానాశ్రయాల నుంచి వెనక్కి..

యుద్ధ వాతావరణం నేపథ్యంలో కొంత మంది జిల్లా వాసులు స్వగ్రామాలకు తిరిగి వచ్చేందుకు సామగ్రితో విమానాశ్రయాలకు వెళ్లారు. విమానాలు రద్దవడంతో వారిని తిరిగి వెనక్కి పంపించేశారు. కువైట్‌లో జనావాసాలు, క్రూడ్ ఆయిల్ బావులకు సమీపంలో క్షిపణులు, డ్రోన్లకు సంబంధించిన శకలాలు పడుతుండటంతో గదులకు మాత్రమే పరిమితమవుతున్నట్లు జిల్లా వాసులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలని అక్కడి భారత రాయబార కార్యాలయం అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు జిల్లా వాసులు తెలిపారు?

ఆర్థికంగా స్థిరపడాలని..

గల్ఫ్, ఇండియా కరెన్సీకి 10 నుంచి 15 రెట్లు వ్యత్యాసం ఉండటంతో అప్పులు చేసి మరీ ఉపాధి నిమిత్తం అక్కడికి వెళ్తున్నారు. ఒక్కొక్కరు సుమారు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. మన కరెన్సీ ప్రకారం.. నెలకు రూ.30వేల నుంచి రూ.40వేలు వస్తుంది. నాలుగేళ్లు కష్టపడితే స్వగ్రామంలో సొంతంగా ఇళ్లు కట్టుకోవచ్చని, పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవచ్చని, పిల్లలకు వివాహం చేయవచ్చనే ఆశతో గల్ఫ్‌కు వెళుతున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

అంతులేని శోకం

☛ వేట్లపాలెం బాధిత కుటుంబాల్లో తీరని వేదన
☛ పేలుడు ఘటనలో మృతులకు అంత్యక్రియలు పూర్తి

అమ్మా పనికి వెళుతున్నా.. నాన్నా పనిచూసుకొని వేగంగా వచ్చేస్తా అంటూ ఉదయం వెళ్లినవారు మధ్యాహ్నానికే మంటల్లో సజీవ దహనమైపోయారు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోయినవారు కొందరు.. బిడ్డలను పోగొట్టుకున్నవారు ఇంకొందరు.. ఆఖరి చూపునకు కూడా నోచుకోలేకపోయామని ఆయా కుటుంబాలు ఆవేదన చెందుతున్నాయి.



మృతిచెందిన గొడతా నాని పిల్లలను ఎత్తుకొని ఓదార్చుతున్న మంత్రి నారాయణ, ఎంపీ సానా సతీష్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, సామర్లకోట, సామర్లకోట గ్రామీణం, పెద్దాపురం: ఘోర ప్రమాదం ఆ ఊరంతటిని విషాదంలోకి నెట్టింది. 22 మందిని బాణసంచా తయారీ కేంద్రం పొట్టనపెట్టుకుంది. మరో ఏడుగురు ఆసుపత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. శనివారం సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన పేలుడు ఘటనకు సంబంధించి చనిపోయినవారిలో ఈ గ్రామానికే చెందినవారే 15 మంది ఉన్నారు. ఆదివారం ఏ ఇల్లు చూసినా తీవ్ర రోదనలే. బరువెక్కిన హృదయాలతో మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తిచేశారు.

బాధితులను ఓదార్చుతున్న మంత్రి అనిత

అవే చివరి మాటలు..

● సామర్లకోటకు చెందిన ఏడిద సంపత్‌కుమార్(25) ఆరోగ్యం బాగాలేకపోవడంతో మూడు రోజులు పనిలోకి వెళ్లలేదు. ఇంటి పోషణ కష్టతరంగా ఉండడంతో శనివారం వెళ్లాడు. మధ్యాహ్నం 1.30 సమయంలో ఫోన్ చేసి పిల్లలు భోజనం చేశారా అని అడిగాడు. అవే ఆఖరి మాటలని భార్య శ్రావణి విలపించారు. బాబు, పాపతో బతికేదెలా అంటూ ఆవేదన చెందారు.

● సామర్లకోటకు చెందిన దర్శిపాటి యోహన్(నాని)(38) ఫైర్ వర్క్స్‌లో గత ఏడాదిన్నరగా పనిచేస్తున్నాడు. భార్య గంగాభవానీ, ఇద్దరు కుమార్తెలు మానస, అఖిల ఉన్నారు. చిన్న బిడ్డకు ఆరోగ్యం బాగోలేదని ఎక్స్‌రే రిపోర్టు వాట్సాప్‌లో పంపాను.. చూడమని ఫోన్‌చేసి మాట్లాడాడు. అవే చివరి మాటలంటూ బోరున విలపిస్తోంది నాని తల్లి మరియమ్మ.

నీటి కోసం బయటకు వచ్చి బతికా..

దాహంగా ఉండడంతో నీళ్లు తాగడానికి బాణసంచా షెడ్ నుంచి బయటకు వచ్చాను. మాకు చివరనున్న షెడ్ నుంచి మందుగుండు నిప్పురవ్వలు ఎగిసి మా షెడ్ వరకు వచ్చాయి. దీంతో అక్కడ పనిచేస్తున్న పది మంది ప్రాణాలను రక్షించుకోవడానికి పరుగులు తీశాం. కిందపడి మోకాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. దాహమే నా ప్రాణాలను కాపాడింది. - చేపల శామ్యూల్, పెద్దాపురం

వాహనాల్లో తరలించి..

శవ పంచనామా పూర్తయ్యాక మృతదేహాలను ఆదివారం ఉదయం మహాప్రస్థానం వాహనాల్లో గ్రామానికి పంపించి బంధువులకు అప్పగించారు. ఒకే ప్రాంతంలో 6 నుంచి 8 మందికి అంత్యక్రియలు జరిగాయి.

బుర్రకథ చెబుతున్న కళాకారులు

సింహాచలం దేవస్థానానికి చెందిన నాదస్వర విద్వాంసుల కచేరి

సంప్రదాయ సవ్వడి

అమలాపురంలోని కిమ్స్ ప్రాంగణంలో తెలుగు మహాసభలు ఎంతో వేడుకగా జరిగాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భాషాభిమానులు తరలివచ్చారు. వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్నారు. తెలుగింటి సంప్రదాయం ఉట్టి పడేలా నిర్వహించిన కార్యక్రమాలు, ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే, కోనసీమ, అమలాపురం కలెక్టరేట్, అమలాపురం గ్రామీణం

పేరూరు ఉన్నత పాఠశాల విద్యార్థినుల కోలాటం

మహా మారేడు

మారేడు కాయలతో ఏలేటి రాజశేఖర్

సాధారణంగా మారేడు కాయ 100 నుంచి 150 గ్రాముల బరువు ఉంటుంది. పోతవరానికి చెందిన పిచ్చికల సత్తిబాబు వ్యవసాయ క్షేత్రంలోని మారేడు చెట్టుకు కాసిన కాయలు ఒక్కొక్కటి 2 కిలోలు బరువుతో ఆశ్చర్యపరుస్తున్నాయి. ఇదేళ్ల కిందట మొక్క నాటితే గతేడాది నుంచి కాయలు కాస్తోందని ప్రస్తుతం పొలం చేస్తున్న ఏలేటి రాజశేఖర్ తెలిపారు. కాగా మొక్కలకు సేంద్రియ పదార్థాలు, పోషకాలు సమృద్ధిగా అందడంతోపాటు భూమిలో సారం ఎక్కువగా ఉంటే పెద్ద పరిమాణంలో కాయలు కాయడానికి అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి సోమశేఖరం తెలిపారు. - న్యూస్‌టుడే, నల్లజర్ల

రామోజీ ఫిల్మ్‌సిటీలో మహిళలకు ప్రత్యేక ఆఫర్లు

ఈ నెల 31 వరకు అవకాశం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: రంగమేదైనా తమకు సాటి లేదని మహిళామణులు చాటిచెబుతున్నారు. వారి స్ఫూర్తిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకొనే వేళ రామోజీ ఫిల్మ్‌సిటీ మార్చి నెలను అతివలకు అంకితం చేస్తూ మాసోత్సవాలను నిర్వహిస్తోంది. నేటి నుంచి మార్చి 31 వరకు ప్రత్యేక ఆఫర్లతో మహిళలు ఫిల్మ్‌సిటీని సందర్శించేందుకు వీలు కల్పించింది. వివిధ ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటూ అన్ని వయసుల మహిళలు సినీ ప్రపంచంలో వినోదం, విహారం, సినిమాటిక్ వైభవాన్ని ఆస్వాదించే అవకాశం ఉంది. రామోజీ స్టూడియో టూర్‌లో అద్వితీయ సినిమా సెట్ల వీక్షణం, లైవ్ షోలు, రైడ్స్, సాహసాల నెలవు సాహస్ సందర్శన, అలరించే పక్షుల పార్కు, సీతాకోకచిలుకల గార్డెన్, మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్, మాయాలోక్ ఇలా ఎన్నో ఆకర్షణలను తిలకించవచ్చు.

సద్వినియోగం చేసుకోండి..

రామోజీ ఫిల్మ్‌సిటీ మహిళా దినోత్సవ ఆఫర్‌లో భాగంగా అన్ని వయసుల మహిళలకు ఒకరికి రూ.1111 + జీఎస్టీ, కనీసం 11 మంది బృందంగా వస్తే ఒక్కొక్కరికి రూ.999 + జీఎస్టీతో ప్రవేశ రుసుం ఉంటుంది. బృందాలుగా వచ్చి వేడుకలు మరింత ఉత్సాహంగా జరుపుకోవడానికి ఇదే మంచి తరుణం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళా మాసోత్సవాల్లో పాల్గొని మరిచిపోలేని మధురానుభూతి పొందండి.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.comలో లాగిన్ అవ్వండి. లేదా 76598 76598కు కాల్ చేయండి.

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలు విడుదల

పామర్రు, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాల పరిధిలోని విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాలను విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. ఆయా వివరాలను వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలతో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల వివరాలను సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారుల వెబ్‌సైట్లో పరిశీలించుకోవచ్చు. వీటిపై ఏవైనా అభ్యంతరాలుంటే మార్చి ఏడో తేదీలోగా డీఈవో కార్యాలయాల్లో సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు వెల్లడించారు.

కోటిపల్లి-ముక్తేశ్వరం రోడ్డు వంతెనకు కృషి

పామర్రు, న్యూస్‌టుడే: కోనసీమకు ముఖద్వారంగా భాసిల్లే కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య గోదావరి నదిపై రోడ్డు, వంతెన నిర్మాణానికి సహకారం అందించాలని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం భాజపా ఇన్‌ఛార్జి కర్రి చిట్టిబాబు, స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు భాజపా జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌కు ఆదివారం వినతి పత్రం అందించారు. అమలాపురంలో ప్రపంచ తెలుగు మహాసభలకు విచ్చేసిన ఆయన్ను కలిసి పరిస్థితిని వివరించామన్నారు. ఈ విషయమై దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీను త్వరలోనే కలిసి నిధులు మంజూరుచేసేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. కోనసీమ వాసిగా ఇది తన కర్తవ్యమని ఆయన చెప్పారని వెల్లడించారు. పార్టీ నేతలు అవసరాల వెంకటరమణమూర్తి, ఆకేటి శ్రీకృష్ణ, ఆర్.వి.నాయుడు, పలువురు పెద్దలు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

భయం లేదు మిత్రమా.. విజయం నీదే..!

• 'ఈనాడు' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన

ఈనాడు మీ తోడు

న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్: 'ఈనాడు' ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 75మందికి పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఫోన్ చేసి తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు. డీఎస్‌ఈవో కె.వాసుదేవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, పీఎస్, ఎన్ఎస్, సోషల్ ఉపాధ్యాయులు హాజరై ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

జి.సత్యనారాయణ (తెలుగు)

? తెలుగులో మెరుగైన మార్కులతో ఉత్తీర్ణత సాధించాలంటే ఏ అంశాలపై దృష్టి సారించాలి? -కె.బాలచంద్ర, పి.రమేష్, కె.సుభాని, మల్లేష్

✔ తెలుగులో సులువుగానే 24 మార్కులు సాధించేవిగా ప్రశ్నలు ఉంటాయి. పరిచిత పద్యం, పరిచిత గద్యం, రామాయణంలోని వాక్యాలు ఏ కాండకు చెందినవి వంటి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ● ప్రత్యక్షదైవాలు మొదటి పాఠం, జలియన్ వాలాబాగ్, రాజధర్మం మూడు పద్య భాగాల్లో నుంచి ఒక 8 మార్కులు వస్తాయి. ● బ్రతుకు గంప, సూక్తి సుధ, ప్రకృతి సందేశం, ఉపన్యాస కళ నుంచి 8మార్కులు వచ్చే అవకాశం ఉంది. ● వ్యాసం, కథ, నాటకం ఈ మూడు ప్రక్రియలు వస్తే 4 మార్కులు మన జేబులో ఉన్నట్లే..

? పద్య, గద్య భాగాల్లో ముఖ్యమైనవి ఏమిటి.? -హారిక, సావారం

✔ రాజనీతి, యుద్ధాలు నివారించటం, శాంతిని నెలకొల్పడానికి ఏం చేయాలి వంటి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ● గద్యభాగం నుంచి జీవని తల్లి నుంచి, ఆధునిక విద్య వల్ల కలిగే ప్రయోజనాలు, ఎల్లమ్మ వ్యక్తిత్వం నుంచి 8మార్కులు వస్తాయి.

? లేఖకు ఎన్నిమార్కులు..వాటిని ఎలా రాయాలి? - ప్రేమ్‌కుమార్, రావులపాలెం, సుగుణ (కాకినాడ)

✔ 8 మార్కులకు లేఖ ఉంటుంది. లేదా సంభాషణ లేదా కరపత్రం తయారు చేయటం వంటివి అవగాహన చేసి ఉండాలి. కంఠస్థం చేయరాదు. కొంచెం అర్థం చేసుకుని సమాధానాలు రాయాలి.


వేణుమాధవ్ (హిందీ)

? హిందీలో సులువుగా మార్కులు సాధించటం ఎలా? - ఎస్‌కే.ఫాజియా (కొంతమూరు)

✔ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వందరోజుల ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. ఒకటికి రెండుసార్లు చదవటంతోపాటు రాయటం కూడా అలవాటు చేసుకోవాలి.

? వ్యాకరణాంశాలు ఎలా చదవాలి? - రేణుక

✔ లింగ్‌కు సంబంధించి కర్తతోపాటు క్రియని కూడా మార్చాల్సి ఉంటుంది. వచనంలో మూడు విషయాల్లో జాగ్రత్తగా ఉండాలి. అ కారాన్ని ఎ కారం చేయటం, ఈ కారాన్ని ఇ కారం చేసి దీర్ఘం పెట్టి దానిపైన చంద్రబిందువు పెట్టాలి. గద్యరూప ప్రశ్నల్లో ఇదిగా, లోక్ గీత్ నుంచి వ్యాసరూప ప్రశ్నలు వస్తాయి.


రాజుకిషోర్ (ఆంగ్లం)

? డైరీ ప్రశ్నకు జవాబు రాయటం ఎలా? - ప్రీతి, సుప్రియ, నరేష్ (రాజమహేంద్రవరం, కడియం)

✔ ఫస్ట్‌పోర్షన్‌లో పాస్ట్‌టెన్స్ ఉపయోగించి హ్యాపీ, సేడ్, ఎక్సైటెడ్, నెర్వస్, థ్రిల్లిడ్, డిజప్పాయింటెడ్ వంటి ఎమోషనల్ పదాలను ఉపయోగించి రాయాలి.

? ఇన్ఫర్మేషన్ ట్రాన్స్‌ఫర్ ప్రశ్నకు సమాధానం ఎలా రాయాలి? - రవికిషోర్, కుసుమ (రావులపాలెం, రాజమహేంద్రవరం)

✔ ఇంట్రడక్షన్, డిస్క్రిప్షన్, ఎనాలసిస్, కంక్లూజన్ వంటి అంశాలను సైడ్ హెడ్డింగ్స్ పెట్టి రాస్తే మంచి మార్కులు పొందవచ్చు.


పి.దుర్గాప్రసాద్ (గణితం)

? గ్రాఫ్ లెక్కలపై సాధించాలంటే? - కె.అన్నపూర్ణ, (విజయవాడ), సిద్ధార్థ (కడియం)

✔ ఎక్కువ సార్లు సాధన చేయాలి. వీటిపై 8 మార్కులు వస్తాయి. అడ్డుగీత, నిలువుగీత, ఎక్స్, వై రాస్తే కనీస మార్కులు వస్తాయి.

? మాదిరి ప్రశ్నపత్రాలు సాధన మంచిదేనా - విరూప

✔ వీటిని వీలైనన్ని సాధన చేయటం వల్ల ఏ ప్రశ్న అడిగినా సమాధానం రాయగల ధైర్యం వస్తుంది. కొన్ని ప్రశ్నలు వీటిలో నుంచి వచ్చే అవకాశం ఉంది. అందువల్ల వీటిని నిర్లక్ష్యం చేయకూడదు.

పాల్ శంకర్ (సామాన్యశాస్త్రం)

? వ్యాసరూప ప్రశ్నలు, రెండు మార్కుల ప్రశ్నలు వేటి నుంచి వస్తాయి ? - రాజ్‌కిరణ్

✔ మానవుల్లో లింగనిర్ధారణ, ప్రయోగం నుంచి కిరణజన్య సంయోగక్రియలో పీవో2 అవసరమని నిరూపించే ప్రయోగం నుంచి ప్రశ్నలు వస్తాయి. అలాగే అవయవదానం నినాదాలు వంటివి 2 మార్కులకు అడుగుతారు.

? ఏ ప్రశ్నకు ఛాయిస్ ఉంటుంది.? -కుసుమ

✔ 12వ ప్రశ్నలో అంటే నాలుగు మార్కుల ప్రశ్నకు ఛాయిస్ ఉంటుంది. దీనిపై దృష్టిసారించాలి.


ఆనంద్‌బాబు (భౌతికశాస్త్రం)

? నాలుగు మార్కులు ప్రశ్నలు ముఖ్యమైనవి చెప్పండి? - డి.ఉదయభాస్కర్, కోరుకొండ మండలం

✔ కాంతి విక్షేపణం, రామన్ ప్రభావం, దర్పణాలు కటకాల ద్వారా కాంతి ప్రయాణం చేసేటప్పుడు ఏర్పడే ప్రతిబింబాల లక్షణాలు, దీర్ఘదృష్టి లేదా దృష్టిలోపాలు వాటి సవరణ నుంచి అడిగే అవకాశం ఉంది.

? ఛాయా చిత్రాలు (పటాల) వేటి నుంచి వస్తాయి? - అరవింద్ (నిడదవోలు)

✔ కార్బన్ డయాక్సైడ్, హైడ్రోజన్‌ల తయారీ, ద్రవాల ద్వారా విద్యుత్తు వాహకత, అల్యూమినో థర్మిక్ ప్రక్రియ, పీహెచ్ స్కేల్ నుంచి పటాలు అడిగే అవకాశం ఉంది.

సర్వేశ్వరరావు (సాంఘికశాస్త్రం)

? మ్యాప్ పాయింటింగ్ నుంచి ఎటువంటి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. - శ్యామల (రాజమహేంద్రవరం), దీపక్, వరుణ్ (కొంతమూరు)

✔ జపాన్, రష్యా వంటి దేశాలను గుర్తించటంతోపాటు ప్రస్తుతం యుద్ధవాతావరణం నేపథ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా వంటి దేశాల గురించి అడిగే అవకాశం ఉంది.

? వందరోజుల ప్రణాళిక నుంచే ప్రశ్నలు వస్తాయా?బయటి నుంచి కూడా వస్తాయా? - మంగారాణి, వీరవరం, శ్రీనివాస్ (రాజమహేంద్రవరం)

✔ ప్రభుత్వం చేపట్టిన వందరోజుల ప్రణాళిక నుంచే ప్రశ్నలు వస్తాయి. కరెంట్ అఫైర్స్ నుంచి కొన్ని ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది.

భవానీ గ్రాండ్ ఫైర్‌వర్క్స్ ప్రాంగణాన్ని తడిపిస్తున్న ఎస్సై సురేష్‌బాబు

రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రం సీజ్

రాయవరం, న్యూస్‌టుడే: రాయవరం శివారులోని భవానీ గ్రాండ్ ఫైర్‌వర్క్స్ ప్రాంగణాన్ని అధికారులు ఆదివారం సీజ్ చేశారు. కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో శనివారం జరిగిన ప్రమాదం నేపథ్యంలో రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు, వీఆర్వో నాగేశ్వరరావు బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రాంగణాన్ని నీటితో పిచికారీ చేయించిన అనంతరం తాళాలు వేశారు. ఎస్సై మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలతో కేంద్రాన్ని సీజ్ చేశామన్నారు. మందుగుండు తయారీ కేంద్రాల్లో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఆకస్మిక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. శుభకార్యాలు, వేడుకల్లో వీటిని కాల్చొద్దని, అక్రమంగా కలిగియున్నా, నిల్వచేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అదరహో.. ఆయిల్‌పామ్ ధర

న్యూస్‌టుడే, గోపాలపురం, బిక్కవోలు

ఆయిల్‌పామ్ రైతులకు చాలా రోజుల తర్వాత మంచి ధర లభిస్తోంది. ప్రస్తుతం టన్ను గెలలు రూ.20,680 పలుకుతున్నాయి. గత కొన్నేళ్లుగా తెలంగాణలో ఎక్కువ ధర ఉండేది. ఇప్పుడు మన రైతులకు మరో రూ.224 అదనంగా లభిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా కలిసి రావడంతో ఎక్కువ మంది ఆటువైపు మొగ్గు చూపుతున్నారు. దీని వల్ల క్రమంగా సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. పంట మార్పిడి అవసరమంటున్న వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సూచనలతో మెట్ట భూముల్లోనే కాకుండా మాగాణిలోనూ మంచి లాభాలు ఆర్జించే ఈ సాగుపై రైతులు దృష్టిపెడుతున్నారు.

ఆయిల్‌పామ్ గెలలు

• టన్ను రూ.20,680
• తెలంగాణ కంటే ఇక్కడే అధికం

చెట్టు వయస్సును బట్టి దిగుబడి..

చెట్టు మంచి వయస్సులో ఉంటే అత్యధికంగా పండితే ఎకరాకు సుమారు 10 టన్నులు, అత్యల్పంగా 8 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. సరాసరిన 8 టన్నుల దిగుబడి వస్తే రూ.1,65,440, పది టన్నులు వస్తే రూ.2,06,800 వరకు ఆదాయం సమకూరుతుంది. నీటి తడులు, మందులు, ఎరువుల తదితరాలకు ఎకరాకు రూ.70 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఇవి పోను రైతుకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు లాభం వచ్చే అవకాశం ఉంది. గతంలో టన్ను రూ.15 వేల వరకు ఉండేది. సాగు ఖర్చులు దక్కడమూ గగనంగా ఉండేది.

26వేల హెక్టార్లలో సాగు...

తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 26 వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగవుతోంది. వీటిలో 22,726 హెక్టార్లలో పంట దశలో ఉండగా వీటి ద్వారా 4,55,323 టన్నుల గెలలు దిగుబడి వస్తుంది. గడిచిన రెండేళ్ల కాలంలో రైతులు ప్రస్తుతం 350 హెక్టార్లలో తోటలు వేశారు. వీటి నుంచి పంట చేతికి రావడానికి కనీసం మరో రెండేళ్లు పడుతుంది. గోపాలపురం, కొవ్వూరు, రాజానగరం, అనపర్తి, నిడదవోలు నియోజకవర్గాల్లో ఆయిల్‌పామ్ సాగు అధికంగా ఉంది. తోటలకు పుష్కలంగా నీరు అందించేలా బోరు బావులు, ట్రాక్టర్, ట్రెంచ్, నీటిపారుదల, డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వం రాయితీ కల్పిస్తుంది.

మంచి ప్రోత్సాహకాలు..

ఆయిల్‌పామ్ సాగు రైతులకు ప్రభుత్వమే మొక్కలు ఉచితంగా సరఫరా చేస్తుంది. ఎరువులు, అంతర పంటల సాగుకు హెక్టారుకు ఏడాది సుమారు రూ.10,500 ఇస్తోంది. గెలలు ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఒకసారి మొక్క నాటితే 25 ఏళ్ల వరకు ఆదాయం సమకూరుతుంది. - మల్లికార్జునరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి

కొబ్బరి పత్రం.. విభిన్న రూపం

పందిరి

పచ్చని కొబ్బరి ఆకులతో వివిధ రూపాలను తీర్చిదిద్దడంలో పాశర్లపూడికి చెందిన వస్త్ర వ్యాపారి బళ్ల వెంకటరత్నం నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. శివలింగ రూపాలు, వేలాడే తోరణాలు, స్తంభ నమూనాలతో ఆకట్టుకుంటారు. తాను సొంతంగా నేర్చుకున్న అల్లికలతో చేసే బొమ్మలను కళాభిమానులకు స్వచ్ఛందంగా అందజేస్తుంటానని వెంకటరత్నం తెలిపారు. బంధువులు, స్నేహితులకు సంబంధించిన ఉత్సవాలకు ఉచితంగా ఇస్తుంటానన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

గణపతి


శివలింగం

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	150-00
రిటైల్ లైవ్	177-00
డ్రెస్డ్	257-00
స్కిన్‌లెస్	292-00

జీవన సంకీర్తన కవితా సంకలనం ఆవిష్కరణ

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: అమలాపురంలో జరుగుతున్న మూడో తెలుగు మహాసభల వేదికపై ద్రాక్షారామకు చెందిన రచయిత్రి తెలగాని మెహర్ సుజాత కవితా సంకలనం 'జీవన సంకీర్తన' పుస్తకాన్ని ఆదివారం ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్పీపట్నాయక్ ఆవిష్కరించారు. గోదావరి తీరం ఆత్మీయత, పాపికొండల సౌందర్యం, సంక్రాంతి సంబరాల సుగంధం, ద్రాక్షారామ భీమేశ్వరస్వామిపై భక్తిభావాలు ఈ పుస్తకంలో ప్రతిబింబించాయని ఆర్పీ పట్నాయక్, రచయిత తనికెళ్ల భరణి తదితర ప్రముఖులు కొనియాడారు. కార్యక్రమంలో కిమ్స్ విద్యాసంస్థల అధినేత చైతన్యరాజు, రవికిరణ్ వర్మ, యాళ్ల పళ్లంరాజు, తిలక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్పీ పట్నాయక్ తదితరులు

కుట్టు శిక్షణ సరే.. మిషన్లు ఏవీ..?

● ఏడాది గడుస్తున్నా పట్టించుకోని వైనం ● నెరవేరని మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యం

గతంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం

న్యూస్‌టుడే, కొత్తపేట

మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన కుట్టు శిక్షణ కార్యక్రమం మొదటి దశలోనే నిలిచిపోయింది. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు ఇళ్లవద్దే ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యం నెరవేరడం లేదని శిక్షణ పొందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నిరుద్యోగ యువతులు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో బీసీ కార్పొరేషన్ ద్వారా కొన్ని నెలల కిందట కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో రోజుకు రెండు బ్యాచ్‌ల చొప్పున తరగతులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,625 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా.. 11,014 మందికి శిక్షణ అందించామని, మూడు నెలల పాటు సాగిన ఈ శిక్షణకు 75 శాతం హాజరుతో విజయవంతంగా పూర్తి చేసిన యువతులు, మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అల్లికలు, ఆధునిక డిజైన్లపై అవగాహన కల్పించి, శిక్షణ ముగిసిన అనంతరం ధ్రువపత్రాలు అందజేశారు. శిక్షణ పూర్తి చేసి నెలలు గడుస్తున్నా మిషన్లు అందకపోవడంతో మహిళలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు త్వరగా అమలు చేస్తేనే శిక్షణ లక్ష్యం నెరవేరుతుందని వారు అంటున్నారు. 104 శిక్షణ కేంద్రాల్లో మహిళా ట్రైనర్, హెల్పర్ చొప్పున 208 మందిని నియమించి, జీతం ఇస్తామని ఆదిలో చెప్పారు. వారికి ఇప్పటికీ సహాయం అందక ఏమి చేయ్యాలో తెలియని స్థితిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి వారిని ఆదుకోవాలని కోరుతున్నారు.

జిల్లాల వారీ వివరాలు ఇలా..

జిల్లా	లక్ష్యం	కేంద్రాలు	శిక్షణ పొందినవారు
కాకినాడ	3,789	50	4,920
తూర్పుగోదావరి	3,593	25	2,904
అంబేడ్కర్ కోనసీమ	3,243	29	3,190

త్వరలోనే పంపిణీ..

శిక్షణ పూర్తి చేసిన మహిళలందరికీ కుట్టుమిషన్లు పంపిణీ చేస్తాం. రెండో దశ శిక్షణకు పెద్ద సంఖ్యలో మహిళలు ముందుకు వస్తున్నారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. శిక్షణ పొందిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. - రెడ్డి అనంతకుమారి, ఛైర్మన్, ఏపీ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్

EENADU Classifieds

AUTO
VEHICLES FOR SALE
శ్రీ లలితా రైస్‌మిల్ పెద్దాపురం వారి ఇన్నోవా కార్లు అమ్మకమునకు కలవు. Contact Cell: 94941 54551.

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

HEALTH & CARE
మద్యపానం మానేయడంఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు రాజమండ్రి శ్రీ సాయిలక్ష్మి లాడ్జి SVG మార్కెట్ రోడ్, ఆర్‌టిసిబస్టాండ్ ఎదురుగా, ప్రతినెల 3,17 తేదీల్లో మందులు.

RHEUMATOLOGY
రుమటాలజిస్ట్
డా॥ ఎ.రామకృష్ణంనాయుడు MD, DM (Rheumatology, NIMS, HYD)
07-03-2026న (శనివారం) 02 PM to 07 PMవరకు రాజమండ్రిలో ప్రైమ్ పాత్ ల్యాబ్స్, సిసిసి ఛానెల్ ఎదురుగా, దానవాయిపేట వద్ద ఫోన్: 94929 41177
మరియు
08-03-2026న (ఆదివారం) కాకినాడలో సేఫ్ హాస్పిటల్ నందు 11 AM to 6 PM వరకు అందుబాటులో ఉంటారు.
ఫోన్: 0884 2383366

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL
బిగ్ ఫ్లాష్ న్యూస్. ప్రతిపాదిత తుని, అన్నవరం ఎయిర్‌పోర్ట్, అన్నవరం 6 లైన్ల రోడ్డుని ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ (RERA) KAUDA లేఅవుట్‌లో Open Plots, Simplex Houses, Villas, 80% బ్యాంకు Loan, ఫ్రీ సైట్ విజిట్కై. ✆ 96031 94449.

JOBS
Wanted Male Counselors and Admission Dept. Staff Qualification any Degree. Age Limit: 25 to 45 years having experience in Educational Organisations will be preferable. Salary upto: 18000/-. Working location: Master Minds College, Rajahmundry. Contact Cell: 92487 33370.

కాకినాడలో MEGA సంస్థనందు పనిచేయుటకు Marketing Executive (M) కావలెను. టూవీలర్ తప్పనిసరి. Contact Cell: 8247332564.

ఉద్యోగం: East & West జిల్లాల్లో ప్ర॥ కంపెనీలకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, టెలికాలర్స్ స్త్రీ/పు. కావలెను. జీతం, రూం+ భోజనం ఫ్రీ. R.S. సర్వీసెస్, RJY, 99633 27756.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-58 పైII
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

(c) eenadu

రాజమహేంద్రవరం

వైభవంగా హనుమాన్ చాలీసా

కోరుకొండ: కోరుకొండ నరసింహస్వామి తీర్థమహోత్సవాల్లో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఆదివారం 1,008 మంది చిన్నారులతో 11 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం వైభవంగా నిర్వహించారు. పిల్లల నోట రామ నామం, చాలీసా, ఆధ్యాత్మిక గీతాలాపనలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. పెరవలికి చెందిన విశ్వ హిందూ ధర్మపరిరక్షణ సేవా సమితి నిర్వాహకుడు నాగభూషణం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల యాజమాన్యం సహకారంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అధ్యాపకుడి సేవలకు అభినందన

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల గణితశాస్త్ర విభాగంలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న సి.వి.ప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపల్ ప్రభల శ్రీవల్లి అభినందించారు. దాదాపుగా మూడు దశాబ్దాలుగా విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తూ క్రమశిక్షణతో పనిచేసిన ప్రసాద్ పదవీ విరమణ తర్వాత ప్రశాంత జీవనం సాగించాలని ఆకాంక్షించారు.

మెరుగైన విద్యుత్తు సరఫరాపై దృష్టి సారించండి : ఆదిరెడ్డి

టి.నగర్, న్యూస్‌టుడే: వేసవిలో విద్యుత్తు సరఫరా అంతరాయంపై దృష్టి సారించాల్సి ఉందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తిలక్ రోడ్డులో ఎమ్మెల్యే కార్యాలయంలో విద్యుత్తు శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రానున్న వేసవిలో నాణ్యమైన సరఫరా, లో-వోల్టేజి సమస్యలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అర్బన్‌లో 88 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు.

● మత సామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. దానవాయిపేట మదీనా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఇటీవల నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

స్వచ్ఛ నగరం.. అందనంత దూరం..!

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్ లక్ష్యంలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో చెత్త నిర్వహణ సమర్థంగా నిర్వహించాల్సి ఉంది. నగరంలో ఈ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. భవిష్యత్తులో చెత్త ప్రధాన సమస్యగా ఉంటుందని అప్పట్లోనే గుర్తించిన గాంధీజీ స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ స్ఫూర్తితో పురపాలికల్లో మెరుగైన వసతి సౌకర్యాలను కల్పించాల్సిన ఆవశ్యకత ఉంది. ఇంటింటా చెత్త సేకరణ, తడి-పొడి వేరు చేయడం, రీ-సైక్లింగ్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. చెత్తను యథావిధిగా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. కొన్ని చోట్ల అవీ కూడా లేకుండా ఖాళీ స్థలాల్లో డంప్ చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జాతీయ కాలుష్య నియంత్రణ మండలి సైతం చెత్త నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ అమలు కావడం లేదు. తద్వారా పట్టణాల్లో కాలుష్యం పెరుగుతోంది.

ఇలా చేయాలి

❖ రాజమహేంద్రవరంలో ఇళ్ల నుంచి తడి-పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాల్సి ఉంది.

❖ తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయాలి.

❖ సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలు విరివిగా ఏర్పాటు చేయాలి.

❖ తడి, పొడి చెత్త సేకరణపై పారిశుద్ధ్య సిబ్బందికి అవగాహన కల్పించాలి.

ఇదీ పరిస్థితి

◆ గతంలో ఏర్పాటు చేసిన ఏడు సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలు మూలకు చేరాయి.

◆ డంపింగ్ యార్డులో 15 ఏళ్లుగా చెత్త పేరుకుపోయింది.

◆ పారిశుద్ధ్య సిబ్బంది చెత్త సేకరణ చేస్తున్నా... అవగాహన లోపంతో రహదారులపై వ్యర్థాలు వేస్తున్నారు.

◆ నగరంలోని మురుగు కాలువలు చెత్తతో మేట వేశాయి.

◆ సేకరించిన చెత్తలో ఎక్కువగా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి.

పట్టింపులేని సూచనలు

ప్రస్తుతం యంత్రాలతో రీ-సైక్లింగ్ ఆరంభించినా పూర్తి స్థాయిలో జరగడం లేదు. పట్టణ ప్రాంతాల్లో డంపింగ్ యార్డులను తొలగించాలని కాలుష్య నియంత్రణ మండలి సూచించింది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా డంపింగ్ యార్డులపైనే దృష్టి సారించాల్సి ఉంది. పొడి చెత్తలో వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగం కోసం తరలించాల్సి ఉంటుంది. నగరంలో ప్రతి రోజూ 120 టన్నుల తడి చెత్త, 45 టన్నుల చెత్త సిబ్బంది సేకరిస్తున్నారు. అయినా చాలా వీధుల్లో చెత్త మేటలు దర్శనమిస్తూనే ఉన్నాయి.

నగరంలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్

సోమాలమ్మా.. దీవించమ్మా..

మూలవిరాట్‌కు విశేష అలంకారం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న రాజమహేంద్రవరం నగర దేవత పాత సోమాలమ్మ జాతర వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్యామలానగర్‌లోని ఆలయంలో ఆదివారం ఉదయం అమ్మవారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. అర్చకులు భక్తులతో సామూహిక సౌభాగ్య వ్రతాలు జరిపించారు. మహిళలు సోమాలమ్మా.. దీవించమ్మా అంటూ భక్తితో పూజించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయ ఆవరణలో భక్తుల కోలాట ప్రదర్శన

ఉద్యోగుల ఐక్యతతోనే హక్కుల సాధన

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఐక్యతతోనే హక్కులు సాధించుకోవచ్చని జేఏసీ ఛైర్మన్ మీసాల మాధవరావు అన్నారు. జిల్లా జేఏసీ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక ఎన్జీజీవో హోమ్‌లో జరిగింది. జేఏసీ నూతన ఛైర్మన్‌గా మాధవరావు, ప్రధాన కార్యదర్శిగా కె.వి.వి.సత్యనారాయణ, కో ఛైర్మన్లుగా అహ్మద్‌షరీఫ్, సయ్యద్ ముఖర్జీ, కేజీకే.మూర్తి, వైస్ ఛైర్మన్లుగా జోడాల వెంకటేశ్వరరావు, జె.శ్రీనివాసబాలాజీ, ఎం.లక్ష్మణరావు, సి.హెచ్.విజయకృష్ణ, కోశాధికారిగా ఎస్.ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.వెంకటరమణ, డి.దుర్గారావు, డి.జగ్గారావు, ఎస్.వీర్రాజు, సి.హెచ్.వెంకటరమణ, ఎం.రాజాబాబు, మరో పది మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా జేఏసీ నూతన ఛైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు అయిన పీఆర్సీ ఏర్పాటు, డీఏ బకాయిలు తదితర సమస్యలపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్జీజీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సత్యనారాయణ రాజు తదితరులు మాట్లాడుతూ అపరిష్కృత సమస్యలపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పింఛనుదారులు కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన జేఏసీ నూతన కార్యవర్గ సభ్యులు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

టి.నగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతులకు ఈ నెల 2, 3 తేదీల్లో ఆయా ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నక్కపల్లి శామ్యూల్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కాతేరు రోడ్డు, కొంతమూరు గ్రామంలో కళ్యాణ్‌నగర్, ఆదర్శనగర్, జంగాల కాలనీ, ఉద్యోగుల కాలనీ, క్వారీ ప్రాంతం, ముస్లింపేట, బ్రాహ్మణ అగ్రహారం, సాయిరాం కాలనీ, బొమ్మన కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.

బాణసంచా గోదాముల తనిఖీ

రాజానగరం: వేట్లపాలెం పేలుడు ఘటనలో పలువురు మృతి చెందిన నేపథ్యంలో మండలంలోని బాణసంచా గోదాముల తనిఖీని ఆదివారం చేపట్టారు. ఇన్‌ఛార్జి డీఎస్పీ రామకృష్ణ, రాజానగరం సి.ఐ ఎస్.ప్రసన్నవీరయ్య, ఎస్సై సత్యనారాయణ సిబ్బందితో కలిసి రాధేయపాలెం, చక్రద్వారబంధం, పాలచర్ల గ్రామాల్లో బాణసంచా నిల్వ గోదాములను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని యజమానులను ఆదేశించారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోదామును తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

ఉద్యోగుల సమస్యలపై పోరాటం : ఈయూ

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ఆర్టీసీ ప్రజారవాణా విభాగం (పీటీడీ) ఉద్యోగుల సమస్యలపై ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) పోరాటం చేస్తుందని యూనియన్ విజయవాడ జోనల్ అధ్యక్షుడు చిరంజీవి అన్నారు. ఈయూ జిల్లా కార్యదర్శిగా ఉన్న ఆయన విజయవాడ జోనల్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరం డిపో యూనియన్ తరఫున ఆదివారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన అభినందన సభలో చిరంజీవిని సత్కరించి మెమొంటో అందజేశారు. ఈయూ జిల్లా అధ్యక్షుడు విజయప్రకాశ్‌బాబు, జిల్లా కమిటీ సభ్యులు కె.త్రిమూర్తులు, ఎం.ఎస్.ప్రసాద్ తదితరులు మాట్లాడారు. యూనియన్‌లో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు పి.ఆర్.బాబు, ఎం.ఎన్.రావు, డిపో కమిటీ సభ్యులు కామరాజు, ఏఎస్.రావు, ఎంఎన్.దొర, కృష్ణమూర్తి, రాజేశ్వరి, ఎస్.కె.వలీ తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవిని సత్కరిస్తున్న డిపో కమిటీ సభ్యులు

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి : గోరంట్ల

టి.నగర్, న్యూస్‌టుడే: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఆదివారం గోరంట్ల నివాసంలో రుడా, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నీటి ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయా శాఖల సమన్వయంతో దృష్టి సారించాల్సి ఉందన్నారు. ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తే చర్యలు

కడియం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదని జిల్లా మైనింగ్‌శాఖ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి అన్నారు. ఆ మేరకు ఆదివారం గనులు భూగర్భశాఖ ఆధ్వర్యంలో బొమ్మూరు నుంచి వేమగిరి జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఈ దాడుల్లో పంగిడి నుంచి వస్తున్న 12 రోడ్ మెటల్ లారీలు, రంగంపేట నుంచి 8 గ్రావెల్ లారీలు, రాఘవాపురం నుంచి 5 సాధారణ గ్రావెల్ లారీలను తనిఖీ చేశామన్నారు. వాటికి మైనింగ్ బిల్లులు లేని కారణంగా వాహనాలపై కేసులు నమోదు చేసి కడియం పోలీసు స్టేషన్‌కు అప్పగించామన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిపై నియమాలను అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు. అసిస్టెంట్ జియోలజిస్ట్ జి.విఘ్నేశ్వరుడు, ఆర్.ఐ జ్యోతిర్మయి, టీఏలు శైలజ, మనీషా, జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అలముకున్న అంధకారం

ఏవీఏ రోడ్డు నుంచి లాలాచెరువు జాతీయ రహదారి ప్రాంతం ఇది. వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం అలముకుంది. మరోవైపు సర్వీస్ రోడ్డుపై నిలిపిన భారీ లారీలతో నిత్యం వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఏవీఏ రోడ్డు నుంచి లాలాచెరువు వైపు వెళ్లే జాతీయ రహదారిలో దీపాలు వెలగక చీకట్లో ఒంటరిగా ప్రయాణించాలంటే నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాలకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రెండు దశాబ్దాలుగా గుర్రపుడెక్కతో ఊరచెరువు

మండలంలోని దివాన్‌చెరువులో జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ఊరచెరువులో దాదాపు రెండు దశాబ్దాలుగా గుర్రపుడెక్కతో మూసుకుపోయి ఉంది. ఒకప్పుడు గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చిన ఈ చెరువులోకి కాలక్రమంలో మురుగు నీరు వదిలేయడంతో అధ్వానంగా మారింది. దీంతో చెరువు గర్భం నుంచి గడ్డి, గుర్రపుడెక్క విస్తృతంగా పెరిగిపోయి వాటిని తొలగించేందుకు వీల్లేనంత లోతుగా వేళ్లూనుకుపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువును శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, రాజానగరం

మార్గం.. అధ్వానం

రాజమహేంద్రవరం నగరంలోని లాలాచెరువు జాతీయ రహదారి ఆనుకుని సాయి దుర్గానగర్ ప్రాంతంలో రోడ్డు మొత్తం గుంతల మయంగా మారింది. ఇది జాతీయ రహదారికి ఆనుకుని ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఎవరైనా ఏమరపాటుగా ప్రయాణం చేస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. -న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

చారిత్రక కట్టడం చెంత.. వ్యర్థాలతో చింత

ప్రపంచ చారిత్రక కట్టడంగా నిలిచిన దవళేశ్వరం కాటన్ బ్యారేజీ వారధి చెంతలో వ్యర్థాలు సందర్శకులకు స్వాగతం పలుకుతున్నాయి. పంచాయతీ సిబ్బంది గ్రామంలో సేకరించిన చెత్తను ట్రాక్టర్లలో తీసుకొచ్చి కాలువగట్టుపై వేస్తున్నారు. కాలువగట్టుపై వ్యర్థాలను గుట్టలుగా వేసి నిప్పు పెడుతుండటంతో పొగతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. దీనిపై జలవనరుల శాఖ అధికారుల వివరణ కోరగా, వ్యర్థాలు డంపింగ్ చేయొద్దని పలుమార్లు హెచ్చరించామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, కడియం

పగలే వెలుగుతున్న వీధి దీపాలు

రాజానగరం మండలం పరిజల్లిపేట కూడలి వద్ద పగలే మూడు దీపాలు వెలుగుతున్నాయి. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పరిస్థితి ఇలానే ఉందని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. కొన్ని చోట్ల దీపాలు మరమ్మతులకు గురైతే సంబంధిత సిబ్బంది మాత్రం పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు దీనిపై శ్రద్ధ వహించి రాత్రి మాత్రమే వెలిగేటట్లు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రాజానగరం

వివేకానంద ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటుతున్న వాలంటీర్లు

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఆదిత్య డిగ్రీ కళాశాల, వైఆర్‌సీ వాలంటీర్లు ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ సభ్యులతో కలిసి పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఆదివారం ఉదయం బొమ్మూరులోని వివేకానంద మహా ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో 12 అడుగుల ఎత్తుగల 30 మొక్కలు నాటారు. ముందుగా ప్రాంగణంలో పేరుకున్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. జి.వి.ఎస్.నాగేశ్వరరావు, కె.సుధాకర్ పట్నాయక్, ధర్మారెడ్డి, కె.సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల్లో నష్టాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వెళ్లే రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆదివారం జరిగింది. దొమ్మేరు సమీపంలోని సావరం గ్రామానికి చెందిన నరేష్ కార్ల క్రయవిక్రయ కంపెనీలో పనిచేస్తున్నారు. అతని స్నేహితుడితో ఆర్థిక లావాదేవీల్లో మోసపోయారు. ఆదివారం వంతెనపై నుంచి గోదావరిలో దూకేశారు. జాలర్లు గమనించి అతడిని రక్షించారు. పోలీసులు అతడికి రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స అందించారు.

బ్రాహ్మణ పుష్కర సేవాకమిటీ ఏర్పాటు

ప్రమాణ స్వీకారం చేసిన కమిటీ సభ్యులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : గోదావరి పుష్కరాలకు నగరానికి వచ్చే భక్తులకు వివిధ సేవలు అందించేందుకు నగర బ్రాహ్మణ పుష్కర సేవా కమిటీ ఆదివారం ఏర్పాటైంది. స్వాతంత్య్ర సమరయోధుల పార్కులో జరిగిన సమావేశానికి మాదిరాజు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. బ్రాహ్మణ పెద్దలు అజ్జరపు హరిబాబు సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. పరిశీలకులుగా పొన్నా సుబ్రహ్మణ్యం, భమిడిపల్లి బాబు, ముదునూరి వాణిశ్రీ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా బ్రాహ్మణ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కె.సూర్యకుమారి హాజరయ్యారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా పుట్రేవు ప్రసాద్, అధ్యక్షుడిగా దూర్వాసుల సత్యనారాయణ, నగర కమిటీ ప్రధాన కార్యదర్శిగా నిడమర్తి వెంకట్, కోశాధికారిగా నందనవనం జయకృష్ణ, ఉపాధ్యక్షులుగా ముత్యాల సత్తిబాబు, ఆకెళ్ల ఫణి, ఆచంట ప్రభాకర్, దినవహి నాగసాయి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. రానున్న పుష్కరాల్లో బ్రాహ్మణ యాత్రికులకు సౌకర్యాలు కల్పించాలని, ప్రతి కుటుంబం పుష్కరనిధి ఏర్పాటు చేయాలని, ఉభయ గోదావరి జిల్లాల ఆధ్వర్యంలో త్వరలో బ్రాహ్మణ పుష్కర గర్జన వేలాది మందితో ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

ఇంకా ౯౫ శాతమే..!

గడువు పెంచినా పూర్తి కాని ఈ పంట నమోదు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం: రబీ సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు 95 శాతమే పూర్తయింది. ఇంకా ఏడు వేల ల్యాండ్ పర్సిల్(ఎల్‌పీ) నమోదు పెండింగ్‌లో ఉంది. గత నెల 20తోనే గడువు ముగిసినా నూరు శాతం పూర్తి కాకపోవడంతో సమయాన్ని పొడిగించారు. గతంలో సాగు విస్తీర్ణం వారీగా నమోదు జరిగేది. ఈ సారి సర్వే నంబరులో యాజమాని ఆధీనంలో ఉన్న సరిహద్దులు కలిగిన భూమి ప్రత్యేక భాగం(ఎల్‌పీ) ఆధారంగా ఈ ప్రక్రియ చేపడుతున్నారు. జిల్లాలో 3.15 లక్షల ఎల్‌పీల్లో నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 3.08 లక్షల ఎల్‌పీల్లో నమోదు పూర్తయిందని వ్యవసాయ అధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. సోమవారం వరకు గడువు ఉండటంతో నూరుశాతం నమోదు పూర్తవుతుందని చెబుతున్నారు.

కారణాలివే..

▼ ల్యాండ్ పార్సిల్ వారీగా నమోదు చేయాల్సి రావడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

▼ రైతులే స్వయంగా ఈ-పంట నమోదు చేసుకునేలా అందుబాటులోకి తీసుకొచ్చిన ఏపీ ఏఐఎంఎస్ 2.0 యాప్‌పై అవగాహన కల్పించ లేదు.

ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

త్వరలో జాబితా ప్రదర్శన

రైతు సేవా కేంద్రాల్లో ఈ పంట నమోదు జాబితా ప్రదర్శించనున్నారు. నమోదులో తప్పులు ఉన్నా, పంట వివరాలు, సాగు విస్తీర్ణంలో హెచ్చు, తగ్గుల వంటి లోపాలున్నా.. సరిచేసుకునే అవకాశం కల్పించనున్నారు. www.karshak.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆధార్ సంఖ్యతో లాగిన్ అయ్యి నమోదు సమయంలో ఇచ్చిన వివరాలు, సమాచారం సరిగ్గా ఉందో లేదో రైతులే స్వయంగా పరిశీలించుకుని సరి చేసుకోవచ్చు.

కచేరీలో తాడేపల్లి శ్రీకృష్ణ

వీనుల విందుగా గాత్ర సంగీతం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: శ్రీసద్గురు సన్నిధి నెలవారీ శాస్త్రీయ సంగీత సభ ఆదివారం సాయంత్రం గోదావరిగట్టున ఉన్న శ్రీత్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో జరిగింది. తిరుచ్చికి చెందిన తాడేపల్లి శ్రీకృష్ణ గాత్రానికి విజయవాడకు చెందిన కూరపాటి సుబ్రహ్మణ్యరాజు వయోలిన్, కందుల అనిల్ కుమార్ మృదంగం, కె.జగన్మోహిని ఘటంపై సహకరించారు. నగరానికి చెందిన పలువురు సంగీతాభిమానులు హాజరయ్యారు.

9 రోజులు.. 15 క్షేత్రాలు

● 5న 'కర్ణాటక-మైసూర్ యాత్ర' ఆర్టీసీ ప్రత్యేక బస్సు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

వివిధ ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలు దర్శించాలనుకునే భక్తులకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి 'కర్ణాటక-మైసూర్ యాత్ర' పేరిట ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేస్తున్నారు. మార్చి 5న సాయంత్రం 4 గంటలకు ఇక్కడ డిపో నుంచి బయలుదేరుతుంది. తొమ్మిది రోజులపాటు సాగే యాత్రలో భాగంగా 15 క్షేత్రాల్లోని ఆలయాలను భక్తుల దర్శించుకునే అవకాశం కల్పించినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవ్ తెలిపారు. పుణ్యక్షేత్రాలను సందర్శించాలనుకునే వారు ఆర్టీసీ కల్పిస్తున్న ప్రత్యేక యాత్ర బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

దర్శించే క్షేత్రాలివి..

శ్రీశైలంలో మల్లికార్జున భ్రమరాంబిక, మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి, హంపీలో విరూపాక్ష, గోకర్ణలో ఆత్మ శివలింగం, ఇడిగంజిలో మహాగణపతి, మురుడేశ్వర్‌లో మురుడేశ్వరస్వామి, కొల్లూరులో మూకాంబికాదేవి, ఉడిపిలో కృష్ణదేవాలయం, శృంగేరిలో శారదాంబ, శక్తిపీఠం, హొర్నాడులో అన్నపూర్ణేశ్వరి దేవి, ధర్మస్థలంలో మంజునాథస్వామి, శ్రీరంగపట్నంలో రంగనాథస్వామి, మైసూర్‌లో చాముండేశ్వరి దేవి శక్తిపీఠం, కమ్మసంద్రలో కోటిలింగాల ఆలయాలను భక్తులు దర్శించుకోవచ్చు.

టికెట్ ఛార్జీలు ఇలా ..

ఒక్కొక్కరికి రూ.11,500 ఛార్జీగా నిర్ణయించారు. బస్సులో 2ప్లస్2 సీట్లు, టీవీ సౌకర్యం ఉంటుంది. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, భోజనం, రాత్రి అల్పాహారం అందిస్తారు. మార్గంమధ్యలో విశ్రాంతి కోసం హోటళ్లలో గదులు తీసుకోవాలనుకుంటే దానికయ్యే అదనపు ఛార్జీని భక్తులే భరించాల్సి ఉంటుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

మరిన్ని వివరాల కోసం..

సమాచారం, టికెట్ల బుకింగ్ కోసం నేరుగా స్థానిక ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో అధికారులను లేదా ఫోన్ నంబర్లు 9502300189లో సంప్రదించవచ్చు.

ద్వితీయ వర్ధంతి
మీ చెరగని చిరునవ్వు మా మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచినా, మీ మరణం మాకు తీరని లోటు. మీరు మా నుండి దూరమై రెండు సంవత్సరాలకాలం గడచినా, మీ మధురస్మృతులు, జ్ఞాపకాలు మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రీమతి యెనుముల కమలావతి గారు
జననం: 1945 కేశనపల్లి మరణం: 23-03-2024
భర్త: యెనుముల వెంకట సూర్యనారాయణమూర్తి
మాజీ అధ్యక్షులు, PACS, కేశనపల్లి
కుమారులు: కోడళ్లు :
వెంకట బ్రహ్మానందం - తులసి లక్ష్మీ లలితకుమారి
రంగారావు (రంగబాబు) - శ్రీదేవి
డైరెక్టర్: ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్
కుమార్తెలు, అల్లుళ్లు, వదిన, మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాండ్రు,

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం

వీనుల విందుగా గాత్ర సంగీతం

గాత్ర సంగీతం వినిపిస్తున్న తాడేపల్లి శ్రీకృష్ణ

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీసద్గురు సన్నిధి నిలవారీ శాస్త్రీయ సంగీత సభ ఆదివారం సాయంత్రం గోదావరిగట్టున ఉన్న శ్రీత్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో జరిగింది. తిరుపతికి చెందిన తాడేపల్లి శ్రీకృష్ణ గాత్రానికి విజయవాడకు చెందిన కూరపాటి సుబ్రహ్మణ్యరాజు వయొలిన్, కందుల అనిల్ కుమార్ మృదంగం, కె.జగన్మోహిని ఘటంపై సహకరించారు. నగరానికి చెందిన పలువురు సంగీతాభిమానులు హాజరయ్యారు.

అధ్యాపకుడి సేవలకు అభినందన

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల గణితశాస్త్ర విభాగంలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న సి.వి.ప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపల్ ప్రభ శ్రీవల్లి అభినందించారు. దాదాపుగా మూడు దశాబ్దాలుగా విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తూ క్రమశిక్షణతో పనిచేసిన ప్రసాద్ పదవీ విరమణ తర్వాత ప్రశాంత జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ఆయన బోధనలో అనేక మంది విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని అధ్యాపకులు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు		
ధవళేశ్వరం: 91212 29057	కడియం: 91212 29062	
బొమ్మూరు: 91549 78039	మోరంపూడి: 94935 92696	
రాజానగరం: 98492 36167	కోరుకొండ: 80085 74213	

వీధి దీపం వెలగడం లేదు

సమస్య: బొమ్మూరు ప్రశాంతినగర్‌లో వీధి దీపం వారం నుంచి వెలగడం లేదు. పంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. – దేవ, స్థానికుడు

సమాధానం: మరమ్మతులు చేసి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – కాశీ, గ్రామకార్యదర్శి, బొమ్మూరు

– న్యూస్‌టుడే, బొమ్మూరు

నైపుణ్యాలకు నెలవు.. కదిలొచ్చె కొలువు

ప్రాంగణ ఎంపికల్లో పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

ధవళేశ్వరం, కడియం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించాయి. ప్రాంగణ ఎంపికల్లో ఎక్కువ మంది కొలువులు సాధించారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్నప్పుడే ఆకర్షణీయమైన ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించారు.

ఏడాది	విద్యార్థులు	ఎంపికైన వారు
2023–24	180	126
2024–25	190	152
2025–26	170	119

● పాలిటెక్నిక్ పూర్తిచేసిన తర్వాత ఇంజినీరింగ్ విద్యకు ఎక్కువ మంది ఆకర్షితులవుతున్నా డిప్లమా కోర్సులు అభ్యసిస్తుండగా వచ్చిన అవకాశాన్ని వదులుకోవడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. మొదట్లో జీతభత్యాలు తక్కువగా ఉన్నా అనుభవం సాధించిన తర్వాత మెరుగైన జీతం వస్తుందని కొలువుల్లో చేరుతున్నారు.

బాధ్యతగా తీసుకొని..

జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్, ఈసీఈ, కంప్యూటర్ సైన్స్ తరగతులు బోధిస్తున్నారు. ఆయా కోర్సులు అభ్యసించే విద్యార్థులు కొలువులు సాధించేలా బాధ్యత తీసుకొని అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ప్రిన్సిపాల్ ఎ.మురళి తెలిపారు.

● ఏడాది కాలంలో 18 కంపెనీల నుంచి ప్రతినిధులు కళాశాలకు విచ్చేసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఒక్కో విద్యార్థి రెండు నుంచి నాలుగు కంపెనీలకు ఎంపికై ఆఫర్లు అందుకున్నారు. ఏడాదికి రూ.1.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ప్యాకేజీలు అందుకుంటున్నారు.

● ఈ ఏడాదిలో ఈసీఈ, మెకానికల్, కంప్యూటర్ సైన్సు విద్యార్థులు 126 మంది ఉద్యోగావకాశాలు అందుకున్నారు. వీరిలో అత్యధికంగా రూ.3 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యారు.

బొమ్మూరులోని ప్రభుత్వ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల

ఏడాదికి రూ.3 లక్షల ప్యాకేజీ

ఈ ఏడాదిలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఎన్‌ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, తిరుపతిలో సీఎన్‌సీ మిషన్ ఆపరేటర్‌గా ఉద్యోగం సాధించాను. వార్షిక వేతనం రూ.3 లక్షలు. ఇదే కంపెనీలో అంకితభావంతో పనిచేసి ఉన్నతస్థానానికి వెళ్లాలన్నది నా లక్ష్యం. – వినతి నాగచైతన్య

ఇంజినీరింగ్ ట్రైనీగా ఎంపికయ్యాను

మాది విశాఖ జిల్లా పాయకరావుపేట. చివరి ఏడాదిలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో స్మార్ట్‌వేవ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ ట్రైనీగా ఎంపికయ్యాను. వార్షిక వేతనం రూ.1.80 లక్షలు ఇస్తున్నారు. – కాండ్రేగుల భార్గవ్

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

మండపేట, న్యూస్‌టుడే: పార్టీ బలోపేతానికి కృషిచేయాలని భాజపా జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం సీతారామ కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దిశా నిర్దేశం చేశారు. మార్చి 7వ తేదీ నుంచి ఏప్రిల్ 14 వరకు మండపేటలో నిర్వహించే శిక్షణ తరగతులకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు శకుంతల, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సాదిక్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాట్రాతి జానకి రాంబాబు, నియోజకవర్గం కన్వీనర్ కె.వి.వి. సాయిరాం, కోటీశ్వర్రావు, అధ్యక్షుడు నామాల శ్రీనివాస్, పణిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పులి తిరుగుతుందంటూ వదంతులు

గోకవరం, న్యూస్‌టుడే: తంటికొండ, గోపాలపురం, గాదెలపాలెం గ్రామాల్లో పులి సంచరిస్తుందని వదంతులు సృష్టించడంతో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దీనిపై అటవీశాఖ అధికారులను ‘న్యూస్‌టుడే’ వివరణ కోరగా.. పరిశీలించాం.. ఎక్కడా ఆనవాళ్లు లేవని తెలిపారు.

ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగిస్తే చర్యలు

కడియం పోలీసుస్టేషన్ వద్ద పట్టుకున్న లారీలతో ఏడీ, సిబ్బంది

కడియం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే చర్యలను ఉపేక్షించేది లేదని జిల్లా మైనింగ్ శాఖ అధికారి డి.ఫణిభూషణ్ రెడ్డి అన్నారు. ఆ మేరకు ఆదివారం గనుల భూగర్భశాఖ ఆధ్వర్యంలో బొమ్మూరు నుంచి వేమగిరి జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఈ దాడుల్లో పంగిడి నుంచి వస్తున్న 12 రోడ్ మెటల్ లారీలు, రంగంపేట నుంచి 8 గ్రావెల్ లారీలు, రామవరం నుంచి 5 సాధారణ గ్రావెల్ లారీలను తనిఖీ చేశామన్నారు. వాటికి మైనింగ్ బిల్లులు లేని కారణంగా వాహనాలపై కేసులు నమోదు చేసి కడియం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిపై ఏపీఎం.ఎం.సి 1996 చట్టం నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు. అసిస్టెంట్ జియాలజిస్ట్ జి.విష్ణువర్ధన్, ఆర్.ఐ జ్యోతిర్మయి, టీఏలు శైలజ, మనీషా, జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో బ్రిడ్జి కోర్సు

మండపేట: విద్యా శాఖ నిర్ణయం మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా బ్రిడ్జి కోర్సు ప్రవేశపెట్టినట్లు ఎంఈవో నాయుడు రామచంద్రరావు తెలిపారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మార్చి నుంచి 10వ తరగతి పాఠాలు బోధించనున్నామని పేర్కొన్నారు. మార్చి 12వ తేదీలోగా ఎస్ఏ-2 పరీక్షలు పూర్తిచేసి ఆ మరుసటి రోజు నుంచి ఏప్రిల్ 23 వరకు 10వ తరగతి పాఠాలు బోధిస్తామని వివరించారు. అన్ని సబ్జెక్టుల్లోను 4 చాప్టర్లు చొప్పున బోధించనున్నట్లు తెలిపారు.

ఉద్యోగుల ఐక్యతతోనే హక్కుల సాధన

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఐక్యతతోనే హక్కులు సాధించుకోవచ్చని జేఏసీ ఛైర్మన్ మీసాల మాధవరావు అన్నారు. జిల్లా జేఏసీ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక ఎన్జీజీవో హోమ్‌లో జరిగింది. జేఏసీ నూతన ఛైర్మన్‌గా మాధవరావు, ప్రధాన కార్యదర్శిగా కె.వి.వి.సత్యనారాయణ, కో ఛైర్మన్లుగా ఎం.హుస్సేన్, సయ్యద్ ముఖర్జీ, కేజీకే.మూర్తి, వైస్ ఛైర్మన్లుగా జోడాల వెంకటేశ్వరరావు, జె.శ్రీనివాసబాలాజీ, ఎం.లక్ష్మణరావు, సి.హెచ్.విజయలక్ష్మి, కోశాధికారిగా ఎస్.ప్రవీణ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.వెంకటరమణ, డి.దుర్గారావు, డి.జగ్గారావు, ఎస్.వీర్రాజు, సి.హెచ్.వెంకటరమణ, ఎం.రాజాబాబు, మరో పది మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా జేఏసీ ఛైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు అయిన పీఆర్సీ ఏర్పాటు, డీఏ బకాయిలు తదితర సమస్యలపై ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్జీజీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ అపరిష్కృత సమస్యలపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పింఛనుదారులు కలిసి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన జేఏసీ నూతన కార్యవర్గ సభ్యులు

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ఠ చర్యలు

కడియం, న్యూస్‌టుడే: రానున్న వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను గ్రామీణ నియోజకవర్గ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సూచించారు. ఆదివారం ఆయన స్వగృహంలో రుడా, పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, ఇతర పనులపై కూడా అధికారులు సమీక్షించారు. రుడా కార్యదర్శి ఎస్వీఎస్ సాయిబాబు, జేఈఈ లక్ష్మీజ్యోతి, పీఆర్‌డీఈ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్, ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్, ఏఈలు సంపత్‌కుమార్, రమేశ్, వెంకట్, సత్యంధర్గ్ తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో ఆధ్యాత్మిక సంబరం

మండపేట: వారణాశికి చెందిన శివనాగేంద్ర సరస్వతిస్వామి మండపేటలో ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇచ్చేందుకు ఆదివారం సాయంత్రం పట్టణానికి చేరుకున్నారు. తొలుత ఆయనను కలువపువ్వు సెంటరు నుంచి అలంకరించిన గుర్రపుబండిపై భారీ ఊరేగింపుగా భక్తులు తోడ్కొని వచ్చారు. ధర్మగుండం చెరువు సమీపంలోని రాజరాజేశ్వరి పీఠం వరకు ఊరేగింపు సాగింది.

శివనాగేంద్ర సరస్వతి స్వామికి పాదపూజ

వారణాశి నుంచి వచ్చిన శివనాగేంద్ర సరస్వతిస్వామికి మండపేటలో భక్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి ఆయనకు పాదపూజ చేశారు. పీఠం నిర్వాహకుడు, మున్సిపల్ కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు

కుతుకులూరులో పూజలు చేస్తున్న భక్తులు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి మండలం కుతుకులూరు పార్వతీ సమేత కూటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య ఆధ్వర్యంలో సప్తనదీ జలాలతో కుంభాభిషేకం, మహాకుంభాభిషేకం, గణపతి పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక శాఖ జాయింట్ కమిషనర్ (ముంబయి) కర్రి రామ్‌గోపాల్‌రెడ్డి, డా.సిందూర దంపతులు పూజలు జరిపించారు.

బాణసంచా గోదాముల తనిఖీ

గోదామును తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

రాజానగరం, న్యూస్‌టుడే: వేట్లపాలెం పేలుడు ఘటనలో పలువురు మృతి చెందిన నేపథ్యంలో మండలంలోని బాణసంచా గోదాములను తనిఖీలు ఆదివారం చేపట్టారు. ఇన్‌ఛార్జి డీఎస్పీ రామకృష్ణ, రాజానగరం సీఐ, ఎస్.ఐ ప్రసన్నవీరయ్య, ఎస్సై సత్యనారాయణ సిబ్బందితో కలిసి రాధేయపాలెం, చక్రద్వారబంధం, పాలచర్ల గ్రామాల్లో బాణసంచా నిల్వ గోదాములను తనిఖీ చేశారు. నిబంధనల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని యజమానులను ఆదేశించారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెత్త తొలగక.. మురుగు పారక

ధవళేశ్వరంలో కెనాల్ కాలువ వద్ద డ్రెయినేజీలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు పారడం లేదు. గ్రామంలో అన్ని మురుగు కాలువల పరిస్థితి అదే విధంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పందుల సంచారం, దోమలు ఉద్ధృతి పెరిగిందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మోరంపూడి(ధవళేశ్వరం)

తాగునీటి కలుషితం అరికట్టండి

కడియం మండలం వీరవరం కూడలి రహదారి సమీపంలో ఉన్న తాగునీటి పైపులైన్ పగిలి డ్రెయిన్ మురుగుతో కలుషితం అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ శివారు ప్రాంతాలకు సరఫరా అయ్యే ఈ నీటిని తాగితే విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందని వాపోతున్నారు. దీనిపై ఎంపీడీవో రమేశ్‌ను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి పంచాయతీ సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. – న్యూస్‌టుడే, కడియం

గుంతల దారి.. రాకపోకలెలా మరి?

కొంతమూరు అఫిషియల్ కాలనీలో మట్టి రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు, వృద్ధులు ప్రయాణించేందుకు ఇక్కట్ల పాలవుతున్నారని గగ్గోలు పెడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కొంతమూరు

చారిత్రక కట్టడం చెంత.. వ్యర్థాలతో చింత



ప్రపంచ చారిత్రక కట్టడంలా నిలిచిన ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వారధి చేరువలో వ్యర్థాలు సందర్శకులకు స్వాగతం పలుకుతున్నాయి. పంచాయతీ సిబ్బంది గ్రామంలో సేకరించిన చెత్తను ట్రాక్టర్లలో తీసుకొచ్చి కాలువగట్టుపై వేస్తున్నారు. కాలువగట్టుపై వ్యర్థాలను గుట్టలుగా వేసి నిప్పు పెడుతుండటంతో పొగతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. దీనిపై జలవనరుల శాఖ అధికారుల వివరణ కోరగా, వ్యర్థాలు డంపింగ్ చేయొద్దని పలుమార్లు హెచ్చరించామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, కడియం

పగలే వెలుగుతున్న వీధి దీపాలు



రాజానగరం మండలం పరిజల్లిపేట కూడలి వద్ద పగలే మూడు దీపాలు వెలుగుతున్నాయి. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పరిస్థితి ఇలానే ఉందని ఆయా గ్రామస్థులు వాపోతున్నారు. కొన్ని చోట్ల దీపాలు మరమ్మతులకు గురైతే సంబంధిత సిబ్బంది మాత్రం పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు దీనిపై శ్రద్ధ వహించి రాత్రి మాత్రమే వెలిగేటట్లు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, రాజానగరం

ప్రమాణ స్వీకారం చేసిన కమిటీ సభ్యులు

బ్రాహ్మణ పుష్కర సేవా కమిటీ ఏర్పాటు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : గోదావరి పుష్కరాలకు నగరానికి వచ్చే భక్తులకు వివిధ సేవలు అందించేందుకు నగర బ్రాహ్మణ పుష్కర సేవా కమిటీ ఆదివారం ఏర్పాటైంది. స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో జరిగిన సమావేశానికి మాదిరాజు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. బ్రాహ్మణ పెద్దలు అజ్జరపు హరిబాబు సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. పరిశీలకులుగా పొన్నా సుబ్రహ్మణ్యం, భమిడిపల్లి బాబు, ముదునూరి వాణిశ్రీ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా బ్రాహ్మణ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కె.సూర్యకుమారి హాజరయ్యారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా పుల్లేవు ప్రసాద్, అధ్యక్షుడిగా దూర్వాసుల సత్యనారాయణ, నగర కమిటీ ప్రధాన కార్యదర్శిగా నిడమర్తి వెంకట్, కోశాధికారిగా నందనవనం జయకృష్ణ, ఉపాధ్యక్షులుగా ముత్యాల సత్తిబాబు, ఆకెళ్ల ఫణి, ఆచంట ప్రభాకర్, దినవహి నాగసాయి తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. రానున్న పుష్కరాల్లో బ్రాహ్మణ యాత్రికులకు సౌకర్యాలు కల్పించాలని, ప్రతి కుటుంబం పుష్కర నిధి ఏర్పాటు చేయాలని, ఉభయ గోదావరి జిల్లాల ఆధ్వర్యంలో త్వరలో బ్రాహ్మణ పుష్కర గర్జన వేలాది మందితో ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఆర్థిక లావాదేవీల్లో నష్టాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వెళ్లే రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఆదివారం జరిగింది. దొమ్మేరు సమీపంలోని సావరం గ్రామానికి చెందిన నరేష్ కార్ల క్రయవిక్రయ కంపెనీలో పనిచేస్తున్నారు. అతని స్నేహితుడితో ఆర్థిక లావాదేవీల్లో మోసపోయారు. ఆదివారం వంతెనపై నుంచి గోదావరిలో దూకేశారు. జాలర్లు గమనించి అతడిని రక్షించారు. పోలీసులు అతడికి రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స అందించారు.

ప్రశాంతంగా పరీక్ష

గోపాలపురం: డా. బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదు, ఇంటర్‌లో ప్రవేశాలకు గోపాలపురంలోని బాలికల గురుకులంలో ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పలు ప్రాంతాల నుంచి 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

వైభవంగా హనుమాన్ చాలీసా

కోరుకొండ, న్యూస్‌టుడే: కోరుకొండ నరసింహస్వామి తీర్థమహోత్సవాల్లో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం 1,008 మంది చిన్నారులతో 11 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం వైభవంగా నిర్వహించారు. పిల్లల నోట రామనామం, చాలీసా, ఆధ్యాత్మిక గీతాలాపనలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. పెరవలికి చెందిన విశ్వహిందూ ధర్మపరిరక్షణ సేవా సమితి నిర్వాహకుడు నాగభూషణం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల యాజమాన్యం సహకారంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ చెంచురెడ్డి మాట్లాడుతూ భక్తి మార్గం చిన్నారులకు మంచి నడవడిక నేర్పుతుందని పేర్కొన్నారు. హనుమాన్ జెండాలతో చిన్నారులు, పెద్దలు వీధుల్లో ర్యాలీగా గిరి ప్రదక్షిణ చేశారు.

చాలీసా పారాయణంలో పాల్గొన్న చిన్నారులు

ఆంజనేయ వాహనంపై గ్రామోత్సవం

ఘనంగా స్వామి సదస్యం

ప్రలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారి సదస్యం వైభవంగా జరిగింది. వేద పండితులు చతుర్వేదాలను వల్లిస్తూ సదస్యం జరిగింది. ముఖమండపంలో ఆగమ పండితులు పాణింగపల్లి పవన్‌కుమారాచార్యులు ఆధ్వర్యంలో అర్చకస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామిని విశేష అలంకరణలతో వేంచేయించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరంగం స్థానాచార్యులు లక్ష్మీనృసింహభట్టర్ స్వామి, ధర్మకర్త ఎస్వీ రంగరాజభట్టర్‌స్వామి, అన్నవరం సూపరింటెండెంట్ గుర్రాజు, ఆలయ ఇన్‌ఛార్జి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆంజనేయ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ● సోమవారం స్థానిక ఆలయంలో రంగనాథస్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రెండు దశాబ్దాలుగా గుర్రపుడెక్కతో ఊరచెరువు

గడ్డి, గుర్రపుడెక్కతో మూసుకుపోయిన ఊరచెరువు

రాజానగరం, న్యూస్‌టుడే: మండలంలోని దివాన్‌చెరువులో జాతీయరహదారికి ఆనుకుని ఉన్న ఊరచెరువులో దాదాపు రెండు దశాబ్దాలుగా గుర్రపుడెక్కతో మూసుకుపోయి ఉంది. ఒకప్పుడు గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చిన ఈ చెరువులోకి కాలక్రమంలో మురుగునీరు వదిలేయడంతో అధ్వానంగా మారింది. దీంతో చెరువు గర్భం నుంచి గడ్డి, గుర్రపుడెక్క విస్తృతంగా పెరిగిపోయి వాటిని తొలగించేందుకు వీల్లేనంత లోతుగా వేళ్లూనుకుపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువును శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెరువుగట్టును సుందరీకరించి చట్టూ నడక, వ్యాయామాలు చేయడానికి వీలుగా తీర్చిదిద్దితే యువత, పెద్దలకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు. చిన్నారులు ఆడుకునేందుకు చిల్డ్రన్ పార్కును ఏర్పాటు చేయాలంటున్నారు.

సోమాలమ్మా.. దీవించమ్మా..

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న రాజమహేంద్రవరం నగర దేవత పాత సోమాలమ్మ జాతర వైభవంగా నిర్వహిస్తున్నారు. శ్యామలానగర్‌లోని ఆలయంలో ఆదివారం ఉదయం అమ్మవారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. అర్చకులు భక్తులతో సామూహిక సౌభాగ్య వ్రతాలు జరిపించారు. మహిళలు సోమాలమ్మా.. దీవించమ్మా అంటూ భక్తితో పూజించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి భక్తుల సామూహిక సౌభాగ్య వ్రతాలు

9 రోజులు.. 15 క్షేత్రాలు

• 5న ‘కర్ణాటక-మైసూర్ యాత్ర’ ఆర్టీసీ ప్రత్యేక బస్సు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

వివిధ ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలు దర్శించాలనుకునే భక్తులకు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి ‘కర్ణాటక-మైసూర్ యాత్ర’ పేరిట ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేస్తున్నారు. మార్చి 5న సాయంత్రం 4 గంటలకు ఇక్కడ డిపో నుంచి బయలుదేరుతుంది. తొమ్మిది రోజులపాటు సాగే యాత్రలో భాగంగా 15 క్షేత్రాల్లోని ఆలయాలను భక్తుల దర్శించుకునే అవకాశం కల్పించినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవ్ తెలిపారు. పుణ్యక్షేత్రాలను సందర్శించాలనుకునే వారు ఆర్టీసీ కల్పిస్తున్న ప్రత్యేక యాత్ర బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

దర్శించే క్షేత్రాలివి..

శ్రీశైలంలో మల్లికార్జున భ్రమరాంబిక, మంత్రాలయంలో రాఘేంద్రస్వామి, హంపీలో విరూపాక్ష, గోకర్ణలో ఆత్మ శివలింగం, ఇడిగుంజిలో మహాగణపతి, మురుడేశ్వర్‌లో మురుడేశ్వరస్వామి, కొల్లూరులో మూకాంబికాదేవి, ఉడిపిలో కృష్ణదేవాలయం, శృంగేరిలో శారదాంబ, శక్తిపీఠం, హొర్నాడులో అన్నపూర్ణేశ్వరిదేవి, ధర్మస్థలంలో మంజునాథస్వామి, శ్రీరంగపట్నంలో రంగనాథస్వామి, మైసూర్‌లో చాముండేశ్వరిదేవి శక్తిపీఠం, కమ్మసంద్రలో కోటిలింగాల ఆలయాలను భక్తులు దర్శించుకోవచ్చు.

టికెట్ ఛార్జీ ..

ఒక్కొక్కరికి రూ.11,500 ఛార్జీగా నిర్ణయించారు. బస్సులో 2ప్లస్2 సీట్లు, టీవీ సౌకర్యం ఉంటుంది. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, భోజనం, రాత్రి అల్పాహారం అందిస్తారు. మార్గమధ్యలో విశ్రాంతి కోసం హోటళ్లలో గదులు తీసుకోవాలనుకుంటే దానికయ్యే అదనపు ఛార్జీని భక్తులే భరించాల్సి ఉంటుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

మరిన్ని వివరాల కోసం..

సమాచారం, టికెట్ల బుకింగ్ కోసం నేరుగా స్థానిక ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో అధికారులను లేదా ఫోన్ నంబర్లు 95023 00189లో సంప్రదించవచ్చు.

(c) eenadu

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఎమ్మెల్యే మద్దిపాటి కృషితో గ్రామాల అభివృద్ధి

దేవరపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు తంగేళ్ల మునేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కృషితో దేవరపల్లి పంచాయతీ పరిధిలోని బుచ్చియ్యపాలెంలో ఉపాధి హామీ నిధులు రూ.62 లక్షలతో సీసీ రహదారుల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసే విధంగా ఎమ్మెల్యే శ్రమిస్తున్నారన్నారు. మండల పార్టీ మాజీ అధ్యక్షులు సుంకర దుర్గారావు, సొసైటీ అధ్యక్షుడు ఉప్పులూరి రామారావు, తెదేపా గ్రామ పార్టీ అధ్యక్షుడు నందిగం శ్రీధర్, నాయకులు కాట్రు సత్యనారాయణ, కాట్రు భీమరాజు, కరుటూరి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

వేలివెన్నులో ముక్కుళ్లమ్మ జాతర

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మండలంలోని వేలివెన్నులో ముక్కుళ్లమ్మతల్లి జాతర ఆదివారం వైభవంగా సాగింది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. వేలివెన్ను, కాల్దరి, నిడదవోలు, అట్లపాడు, శెట్టిపేట తదితర గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు, మొక్కులు చెల్లించుకున్నారు. అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

పూజలందుకున్న అమ్మవారు

మేమున్నాం.. మీకు తోడుగా

మురుగు పారక ఇక్కట్లు..

సమస్య : తాళ్లపూడి ప్రధాన రహదారి నుంచి మోదుగులమ్మ ఆలయం, ఏటిగట్టుకు వెళ్లే మార్గంలో ప్రధాన డ్రెయిన్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు పారడం లేదు. దుర్వాసన వస్తుండడంతో అటుగా రాకపోకలు సాగించే వారు, పరిసరాల్లోని వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- వి.రామారావు, తాళ్లపూడి

సమాధానం : ప్రధాన డ్రెయిన్‌ను శుభ్రం చేయిస్తాం.
- సుభద్ర, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, తాళ్లపూడి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497
నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

గోదారి తీరం.. కాలుష్య కాసారం

• యథేచ్ఛగా వ్యర్థాల పారబోత
• కఠినచర్యలకు అధికారులు దూరం

న్యూస్‌టుడే, నిడదవోలు

ప్రాణికోటికి జీవనాధారమైన గోదావరి నది మానవ తప్పిదాలతో కలుషితమవుతోంది. పరిశ్రమల నుంచి వదులుతున్న వ్యర్థాలు, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల నుంచి వస్తున్న మురుగు సరాసరి గోదావరిలో కలుస్తున్నాయి. అక్కడి నుంచి కాలువల్లోకి చేరుతున్నాయి. కలుషిత నీటిని తాగుతున్న ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. విజ్జేశ్వరం హెడ్ స్లూయిస్ నుంచి నిడదవోలు మండలం తాళ్లపాలెం వరకు ప్రధాన కాలువ నిండా కాలుష్య కారకాలు కలుస్తున్నాయి. రాజమహేంద్రవరం నగరంలో జాతీయవ్యాధి నియంత్రణ మండలి గతంలో జరిపిన సర్వేలో ఎక్కడపడితే అక్కడ ఏడిస్ దోమల లార్వా ఉన్నట్లు గుర్తించారు. ఈ రకం దోమలతో డెంగీ, చికున్‌గన్యా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నది ఒడ్డునే వేస్తున్న చెత్తాచెదారం వల్ల కాలుష్య కారకాలు పెరుగుతున్నాయి. వేమగిరి నుంచి కడియం, అనపర్తి, బలభద్రపురం, బిక్కవోలు, సామర్లకోట మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న అవుటలెట్ డ్రెయిన్లు గోదావరి కాలువలోకే ఉన్నాయి. జలాల్లో ఈ-కోలీ బ్యాక్టీరియా కూడా పెరుగుతోంది. తద్వారా అతిసారం ప్రబలుతుంది.

మురుగుకూపాలుగా కాలువలు

పశ్చిమడెల్టా ప్రధాన కాలువ విజ్జేశ్వరం నుంచి ప్రారంభమై నిడదవోలు మండలం శెట్టిపేట వరకు ప్రవహిస్తోంది. దీని పరిధిలో హెడ్ స్లూయిస్‌కు సమీపంలో ఉన్న సీతంపేట వద్ద నాలుగు నుంచి ఐదు వరకు మురుగునీరు కలిసే ప్రాంతాలు ఉన్నాయి. గోపవరం, సమిశ్రగూడెంకు చెందిన మురుగు అంతా ఈ కాలువలోనే కలుస్తుంది. ఇదే నీరు పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలోని కాలువల్లో ప్రవహిస్తోంది. ప్రజలు తాగడానికి కలుషిత నీరే దిక్కవుతోంది. తాళ్లపూడి, చాగల్లు, కొవ్వూరు మండలాల్లో కలుషిత నీరు వేముల కాలువ ద్వారా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలోకి చేరుతోంది.

సమిశ్రగూడెం వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలో కలుస్తున్న మురుగునీరు

‘అమరజీవి జలధార’తో ఇంటింటికీ తాగునీరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ‘అమరజీవి జలధార’తో ఇంటింటికీ తాగునీరు అందించే ప్రాజెక్టుకు గతేడాది డిసెంబరు 20న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని పెరవలిలో శంకుస్థాపన చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రజలకు ఈ పథకం ద్వారా సురక్షిత తాగునీరు అందించాలనేది ధ్యేయం. రూ.3,050 కోట్లతో ఈ ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ జిల్లాల పరిధిలో 23 నియోజకవర్గాలు, 66 మండలాల్లోని 67.82 లక్షల మందికి శుద్ధి చేసిన గోదావరి జలాలు అందనున్నాయి.

3, 4న విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : వేములూరులో నూతన లైన్ల ఏర్పాటు పనులు చేయపడుతున్నందున మంగళ, బుధవారాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని ఆ శాఖ ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. వ్యవసాయ సర్వీసులకు తెల్లవారుజాము 4 నుంచి ఉదయం 9, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు.

మానవత సంస్థ ఆర్థిక సాయం

నల్లజర్ల, న్యూస్‌టుడే: నడవలేని స్థితిలో ఉన్న చింతపల్లి సూర్యారావుకు మూడు చక్రాల వాహనం, అనారోగ్యంతో బాధపడుతున్న కాకర్లమూడి మరియమ్మకు రూ.5 వేలు, విద్యార్థిని గెల్లా లావణ్యకు కళాశాల ఫీజు రూ.10 వేలు చొప్పున మానవత సంస్థ సభ్యులు ఆదివారం అందజేశారు. కృష్ణమ్మగూడేనికి చెందిన సరిపల్లి భాగ్యలక్ష్మికి వైద్య ఖర్చుల కోసం రూ.5 వేలు ఇచ్చారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు కండెపు వెంకటసూర్యనారాయణ, భోగవల్లి వెంకట సుబ్బారావు, గుళ్లపూడి వెంకటరత్నం పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

మీనానగరంలో బాణసంచా తయారీ కేంద్ర నిర్వాహకులు, కార్మికులతో మాట్లాడుతున్న డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: అనధికారికంగా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ జి.దేవకుమార్ హెచ్చరించారు. కొవ్వూరు, చాగల్లు మండలాల్లోని బాణసంచా దుకాణాలను ఆదివారం తనిఖీ చేసి మూసివేతకు చర్యలు చేపట్టారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న బాణసంచాను స్వాధీనం చేసుకోవాలని అగ్నిమాపక కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. కొవ్వూరు సబ్ డివిజన్‌లోని చాగల్లు మండలంలో 8, కొవ్వూరు మండలంలో 5, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున తయారీ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాటిని మూసివేయించామన్నారు. బాణసంచా తయారీ, రవాణా, నిల్వపై ప్రత్యేక నిఘా ఉంటుందని, తెలిపారు. కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం, చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది సంక్షేమానికి కృషి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ సిబ్బంది సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా చరిత్రలో రెండుసార్లు అంగన్‌వాడీ సిబ్బందికి జీతాలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏళ్ల తరబడి సిబ్బంది ఎదురుచూసిన గ్రాట్యూటీ కలను ప్రభుత్వం నిజం చేసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. సమావేశంలో తెదేపా పక్ష నాయకుడు సూరపనేని చిన్ని, మండల తెదేపా అధ్యక్షుడు బేతిన నారాయణ, సూర్యదేవర రంజిత్, ఉప్పులూరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

సత్ప్రవర్తన నేర్పిన గురువు ఆదర్శం

రామానుజాన్ని సన్మానించిన ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్, ఏఎస్పీడీ రవీంద్రనాథ్‌రెడ్డి, డీఈవో వాసుదేవరావు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : బోధనతోపాటు సత్ప్రవర్తనను నేర్పించి విద్యార్థి భవితకు బాటలు వేసే గురువు సమాజానికి ఆదర్శమని ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. కొవ్వూరు అల్లూరి నాగరత్నం బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.రామానుజం ఉద్యోగ విరమణ సందర్భంలో అభినందన సత్కార సభను ఆదివారం నిర్వహించారు. స్థానిక లిటరరీక్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జవహర్, సమగ్ర శిక్షా రాష్ట్ర సహాయక ప్రాజెక్టు డైరెక్టర్ (ఏఎస్‌పీడీ) రవీంద్రనాథ్‌రెడ్డి, డీఈవో కె.వాసుదేవరావు, డీవైఈవో దిలీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మంగెన శ్రీరామారావు, వ్యాయామోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు నాగరాజు తదితరులు రామానుజం సేవలను కొనియాడారు. అనంతరం రామానుజం, ప్రశాంతి దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు.

ఉద్యోగ విరమణ సత్కారాలు

నల్లజర్ల: కవులూరు2 ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగవిరమణ చేసిన ప్రత్తిపాటి మురళీధర్ దంపతులను ఎంఈవో సత్యనారాయణ శనివారం రాత్రి సత్కరించారు. డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మనోహర్‌కుమార్, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, బండి కిశోర్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

మురళీధర్ దంపతులను సత్కరిస్తున్న ఎంఈవోలు

చాగల్లు: కొవ్వూరు పట్టణ ఏఎస్సై జి.జి.ప్రకాశరావు ఉద్యోగ విరమణ సన్మాన సభ స్థానిక కల్యాణ మండపంలో శనివారం రాత్రి నిర్వహించారు. డీఎస్పీ దేవకుమార్, సీఐ కె.విశ్వం హాజరై అభినందనలు తెలిపారు.

ఉండ్రాజవరం: వైద్యారోగ్య శాఖలో 38 ఏళ్లుగా వివిధ విభాగాల్లో పనిచేసి ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌ఎన్‌గా ఉద్యోగ విరమణ చెందిన కేడీవీఎల్ కుమారి వీడ్కోలు సభను పీహెచ్‌సీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆమె అందించిన సేవలను కొనియాడుతూ మండల వైద్యాధికారి బి.దుర్గామహేశ్వరరావు, సిబ్బంది ఆధ్వర్యంలో సత్కరించారు.

కార్మికులకు పథకాలు అమలుచేయండి

నిడదవోలు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ పథకాలను సమగ్రంగా అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈమని గ్రీష్మకుమార్ కోరారు. ఐఎఫ్‌టీయూ అనుబంధ ఆదర్శ ప్లాట్‌ఫాం రిక్షా వర్కర్స్ సంఘ సమావేశాన్ని అధ్యక్షుడు కోనేటి మల్లేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సంఘ నాయకులు పిచ్చా సూర్యకిరణ్, లంకాడ గణపతి, నాగరాజు, చొక్కాకుల సత్తిబాబు, సత్యనారాయణ, వెంకట్రావు పాల్గొన్నారు.

ఓటు నమోదు ప్రతి పౌరుని హక్కు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ఓటు నమోదు ప్రతి పౌరుడి హక్కు అని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాదు అన్నారు. ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను మండలంలోని 58 పోలింగ్ కేంద్రాల వద్ద ఆదివారం నిర్వహించారు. ఓటు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు, బదిలీలు తదితర ప్రక్రియలు చేపట్టారు. మండలంలో ప్రస్తుతం 62,281 మంది ఓటర్లు ఉన్నారని, 350 మంది కొత్త ఓటు నమోదు చేసుకున్నారన్నారు. సహాయ గణాంకాధికారిణి మట్టపర్తి సత్యవాణి, ఆర్ఐ పి.ప్రసాదు, బీఎల్వోలు పాల్గొన్నారు.

అన్ని మతాలను గౌరవించాలి

రంజాన్ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు

నల్లజర్ల, న్యూస్‌టుడే: మన మతంతోపాటు అన్ని మతాలను గౌరవించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ఆదివారం రాత్రి నల్లజర్ల సొసైటీ కార్యాలయ సమావేశ మందిరంలో మీనార్ మసీద్ ఆధ్వర్యంలో ఆత్మీయ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ పండుగ పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఈ నెల 8న దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్ హాలులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పేద ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా అందజేశారు. ప్రవచనకర్త సహీద్ సలీం మాట్లాడుతూ సర్వ మానవాళి ఒక్కరే అని ఖురాన్ చెబుతోందన్నారు. హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరాసాహెబ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కూచిపూడి ఉదయ్‌భాస్కర్, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, సొసైటీ ఛైర్మన్ రావూరి వెంకటరమణ, శెట్టిపల్లి శివనాగరాజు, జేడీ, బేతిన దుర్గారావు, ఉండవల్లి గోపి, మీనార్ మసీదు పెద్దలు అలీ మాస్టర్, షరీఫ్, రఫీ, అజీజ్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్న చంద్రబాబు

గోపాలపురం: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన రిలే నిరాహార దీక్షలపై ఎమ్మెల్యే ఆదివారం పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేరుస్తూ వేతనాలు పెంచారని, కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించారన్నారు. ఇప్పుడు మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా ఉన్నతీకరించారన్నారు. కేంద్రాల్లో టీవీలు ఏర్పాటు, సిబ్బందికి చరవాణిలు, తదితర సౌకర్యాలు కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. రానున్న రోజుల్లో వారికి పూర్తిస్థాయిలో అండగా నిలిచి ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు.

ఖాళీ బొండాలతో దోమల ఉద్ధృతి..

కొవ్వూరు పట్టణంలో పలు ప్రాంతాల్లో తాగేసిన ఖాళీ కొబ్బరి బొండాలను రోడ్డు పక్కగా పడేస్తున్నారు. వర్షం కురిసినప్పుడు, ఇతర కారణాలతో వాటిలో నీరు చేరి దోమల ఉత్పత్తికి కారణమవుతున్నాయి. ఖాళీ బొండాలను రైల్వే బైపాస్ రోడ్డు, సత్యవతినగర్, ఏటిగట్టు రోడ్డు, జాతీయ రహదారికి చేర్చి శ్రీరామాకాలనీ ప్రాంతాల్లో పడేస్తుండడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ విషయం కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా విక్రయదారులను పిలిపించి రోడ్డు పక్కన వేయకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

గుంతలతో ప్రధాన రహదారి అధ్వానం

పెరవలి-ప్రక్కిలంక రహదారి కానూరు నుంచి రాళ్లతేలి, గుంతలతో అధ్వానంగా తయారవడంతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస మరమ్మతులు లేకపోవడంతో పాట్లు తప్పడం లేదు. ఈ విషయం ర.భ.శాఖ ఏఈ నందశ్రీనివాసు దృష్టికి తీసుకువెళ్లగా కొంతమేర మరమ్మతులు చేయించామన్నారు. కానూరు నుంచి రహదారి మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, పెరవలి

రూపు కోల్పోయిన ఉద్యానాలు

గోదావరి పొడవునా ప్రకృతి ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. గత గోదావరి పుష్కరాల సమయంలో విజ్జేశ్వరం నుంచి ధవళేశ్వరం వరకు కాటన్ ఆనకట్ట పొడవునా మూడు కిలోమీటర్ల మేర నాలుగు ఉద్యానాలను తీర్చిదిద్దారు. ఆకట్టుకునే విధంగా ఫౌంటెయిన్‌లు, సందర్శకులు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేశారు. అనంతరం వాటి నిర్వహణను అధికారులు విస్మరించడంతో పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. రానున్న గోదావరి పుష్కరాల నాటికైనా వీటిని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు

మరణానంతరం నేత్ర దానం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: మండలంలోని మలకపల్లికి చెందిన ఉండవల్లి శ్రీనివాసరావు(58) ఆదివారం మృతి చెందారు. ఆయన నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులను గ్రామానికి చెందిన మద్దుకూరి శ్రీనివాసరావు ఒప్పించారు. నిడదవోలులోని రాజేశ్వరి రామకృష్ణన్ నేత్రవైద్యశాలకు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి కార్నియాలను సేకరించారు.

SRILALITHA
• RICE
• IDLY RAVVA • RICE RAVVA
• ATTA • MAIDA • SUJI
Valuthimmapuram Road, Peddapuram, A.P.
ఈ క్రింది ఏరియాలకు డీలర్లు నిర్వహించుటకు కావలెను.
దేవరపల్లి, కొవ్వూరు, నిడదవోలు
97013 11115
94941 54528

క్వారీ లోడు లారీలకు జరిమానా

ఈనాడు కథనానికి స్పందన

దేవరపల్లి: క్వారీ బండరాళ్ల లోడుపై ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకుండా లారీలు, టిప్పర్లు తిరుగుతుండటంపై ‘దూసుకెళ్తూ.. దడ పుట్టిస్తూ’ శీర్షికన గత నెల 9న ‘ఈనాడు’లో ప్రచురితమైన చిత్రవార్తకు సీఐ బి.నాగేశ్వర్ నాయక్, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం స్పందించారు. గత మూడు రోజుల్లో తనిఖీలు నిర్వహించి 20 లోడు లారీల చోదకుల నుంచి అపరాధ రుసుము వసూలు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెరవలి, న్యూస్‌టుడే: పెరవలి మండలం ఉసులుమర్రు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిడదవోలుకు చెందిన హెచ్‌పీ గ్యాస్ ఆటో డ్రైవర్ **అంగర కృష్ణదుర్గాప్రసాద్** (37) మృతి చెందినట్లు ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. నిడదవోలు నుంచి పెరవలి వైపు వస్తున్న గ్యాస్ ఆటోను అదేవైపు నుంచి వస్తున్న లారీ ఢీకొనడంతో దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిడదవోలు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయనకు భార్య సాయిరామ్‌తులసి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

గోపాలపురం: డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదు, ఇంటర్‌లో ప్రవేశాలకు గోపాలపురంలోని బాలికల గురుకులంలో ఆదివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకుకు ఐదు, మధ్యాహ్నం 12 నుంచి 1.30 వరకు ఇంటర్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మంచి, చెడు స్పర్శపై అవగాహన

నిడదవోలు: అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా వ్యవహరించాలని నిడదవోలు ఏఎస్సై రాజేంద్రప్రసాద్ సూచించారు. పట్టణంలోని బసివిరెడ్డిపేట శివారు హెబ్రోన్ బాలికల వసతిగృహంలో కొవ్వూరు జోన్ శక్తి టీం ఆధ్వర్యంలో బాలికలకు ఆదివారం మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు తీసుకోవద్దని, ఇంట్లో చెప్పకుండా వారి వెంట వెళ్లరాదన్నారు. పరిసర ప్రాంతాల్లో మత్తు పదార్థాలకు బానిసైన వారు సంచరిస్తున్నట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. శక్తి టీం ఏఎస్సై గంగాధర్, ప్రమీలాకుమారి, దీప్తి అమూల్య, కానిస్టేబుల్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని ముఖారవిందమే భగవద్గీత

ప్రవచనం చెబుతున్న స్వస్వరూపానందగిరి స్వామి

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే : శ్రీకృష్ణుని ముఖారవిందమే భగవద్గీత గ్రంథమని.. భగవత్కథా శ్రవణమే ముక్తి మార్గానికి మూలమని తిరుపతి వశిష్టాశ్రమ, లలితా పీఠాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి అన్నారు. కొవ్వూరు ఆంధ్రాసుగర్స్ కర్మాగార క్లబ్ ప్రాంగణంలో శ్రీపురుషోత్తమ ధర్మప్రచార సభ ఆధ్వర్యంలో శ్రీమద్భగవద్గీతోపన్యాస కార్యక్రమం ఆదివారం కొనసాగింది. క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగం, కైవల్యోపనిషద్‌పై ఉపన్యసించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు, పండితులు, ప్రముఖులు హాజరయ్యారు.

నందిగూడెంలో పోటెత్తిన భక్తులు

గోపాలపురం: నందిగూడెంలో కనకదుర్గమ్మ ఉత్సవాలు మూడో రోజు ఆదివారం ఘనంగా కొనసాగాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీసులు, ఆలయ కమిటీ వారు ఏర్పాట్లు చేశారు. దేవరపల్లి సీఐ నాగేశ్వర నాయక్ పర్యవేక్షణలో స్థానిక ఎస్సై శివగణేష్ బందోబస్తు పర్యవేక్షించారు.

వేంకటేశ్వరస్వామికి లక్ష తులసి పూజ

నిడదవోలు: చిన్నకాశీరేవులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి లక్షతులసి పూజ, శ్రీకాకుళపు పురుషోత్తం ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు పచ్చిపులుసు ఆదినారాయణ, కార్యదర్శి నడుపల్లె ఆంజనేయులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా జనసేన

దేవరపల్లి, న్యూస్‌టుడే: జనసేన కార్యకర్తలకు ఎటువంటి ఆపద వచ్చినా పార్టీ అండగా ఉంటుందని నియోజకవర్గ నాయకురాలు దిరిసిన ఫాతిమారాణి అన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో జనసేన ఉద్యమి సభ్యత్వ కార్యక్రమాన్ని ఆమె ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సభ్యత్వం తీసుకోవడం వల్ల ఉపయోగాలను వివరించారు. రాము, ప్రసన్న, రోహిణి, వీరన్న, ప్రసాద్, రాజు, అన్నవరం తదితరులు, పాల్గొన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో
E.P.27/22
AC 202/2016
Between
M/s. శ్రీ [illegible] ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ Co-Ltd. రాజమండ్రి
Rep. by its GPA Holder ... DHR
Vs
మల్లిపూడి [illegible] ... JDRS
1st JDR
[illegible] ...1st JDR
వేలం తేది: 17-03-2026
[illegible] 2026వ [illegible]
షెడ్యూల్
[illegible]
DHR Value: 3,00,000/-
Amin Value: 8,00,000/-
JDR Value: Nil
M.S.Chakrapani, B.Com., B.L.
Advocate, Kovvur, 93476 26845.

బహుళ ప్రయోజన భవనాలు నిర్మించాలి

కొవ్వూరు పట్టణం: ప్రతి నియోజకవర్గ కేంద్రంలోనూ జగ్జీవన్‌రామ్ మల్టీపర్పస్ కమ్యూనిటీ భవనాలను నిర్మించాలని దళిత నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ వర్గీకరణ పోరులో అశువులు బాసిన మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని కొవ్వూరు 3వ వార్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆదివారం నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి అమర వీరుల చిత్రాలను ప్రదర్శించారు. సివిల్ సర్వీస్ కోచింగ్ సెంటరును రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు పెనుమాక జయరాజు, అయినపర్తి రాజేంద్రప్రసాద్, మెరిపో జలమి, బొల్లిపో మధు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ పోరులో అమరులైన వారి చిత్రాలను ప్రదర్శిస్తున్న దళిత నాయకులు

మరమ్మతులకు నిధుల్లేక మూలకు..!

• పంచాయతీల్లో ఈ-ఆటోల దుస్థితి

న్యూస్‌టుడే, చాగల్లు

పంచాయతీల్లో చెత్త సేకరణ మరింత సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సమకూర్చిన ఈ-ఆటోలు నిర్వహణ లోపంతో మూలకు చేరాయి. చిన్నచిన్న మరమ్మతులకు నోచుకోక తుప్పుపట్టి మట్టిలో కలిసిపోతున్నాయి. కొవ్వూరు నియోజకవర్గం పరిధిలోని పంచాయతీలకు నాలుగేళ్ల కిందట 30 ఈ-ఆటోలు అందించారు. రెండేళ్ల వ్యవధిలోనే అవి మరమ్మతులకు గురయ్యాయి. ఇవి నడవడానికి బ్యాటరీ కీలకం. పనులు ముగిసిన తర్వాత వాటిని ఆయా కార్యాలయాల వద్ద ఉంచడంతో బ్యాటరీలు చోరీలకు గురయ్యాయని అధికారులు చెబుతున్నారు. కొత్తవి కొనుగోలు చేయాలంటే ధర అధికంగా ఉండడం, కొనుగోలుకు అనుమతులు లేకపోవడమే ఈ దుస్థితి కారణంగా కనిపిస్తోంది.

భారమైన పారిశుద్ధ్య నిర్వహణ

ఈ-ఆటోలు పలుచోట్ల మూలకు చేరడంతో పారిశుద్ధ్య నిర్వహణ భారమైంది. దీంతో చెత్త సేకరణకు రిక్షాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఆనాలోచితంగా ప్రజా ధనం దుర్వినియోగం అయ్యిందని ప్రజలు విమర్శిస్తున్నారు.

దారవరంలో చెత్తలో కలిసిపోయి..

బ్యాటరీలకు అధిక ఖర్చు..

ఈ-ఆటోలు రెండేళ్ల కాలం చక్కని సేవలు అందించాయి. మరమ్మతులు చేయించడానికి ప్రత్యేక నిధులు లేకపోవడంతో వాటి వినియోగం ఆపేశారు. ముఖ్యంగా బ్యాటరీల కొనుగోలు అధిక ఖర్చుతో కూడుకున్నది. నూతన సాంకేతిక వాహనాలకు ప్రభుత్వం దృష్టి సారిస్తుండడంతో ఆ దిశగా చర్యలు చేపడుతున్నాం.
– స్లీవా రెడ్డి, డీఎల్‌డీవో, కొవ్వూరు

శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: పసలపూడిలో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు మండల పరిషత్తు నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేశారని ఎంపీటీసీ సభ్యురాలు కట్టా విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ప్రజా విరాళాలు సుమారు రూ.15 లక్షలు సమకూరాయన్నారు. శ్మశానవాటిక వద్ద ప్రహరీ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

(c) eenadu

మండపేట

• మండపేట • అనపర్తి

ప్రభుత్వ పాఠశాలల్లో బ్రిడ్జి కోర్సు

మండపేట: విద్యా శాఖ నిర్ణయం మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో తొలిసారిగా బ్రిడ్జి కోర్సు ప్రవేశపెట్టినట్లు ఎంఈవో నాయుడు రామచంద్రరావు తెలిపారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మార్చి నుంచి 10వ తరగతి పాఠాలు బోధించనున్నామని పేర్కొన్నారు. మార్చి 12వ తేదీలోగా ఎస్ఏ-2 పరీక్షలు పూర్తిచేసి ఆ మరుసటి రోజు నుంచి ఏప్రిల్ 23 వరకు 10వ తరగతి పాఠాలు బోధిస్తామని వివరించారు. అన్ని సబ్జెక్టుల్లోను 4 చాప్టర్లు చొప్పున బోధించనున్నట్లు తెలిపారు.

రహదారుల నిర్మాణానికి రూ.16.81 కోట్లు మంజూరు

మండపేట, న్యూస్‌టుడే: మండపేట నియోజకవర్గం పరిధిలోని గ్రామీణ రహదారుల నిర్మాణానికి మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.16.81 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు మార్చి నెలాఖరులోగా ఈ నిధులతో పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ కారణంగా పనులను వెంటనే ప్రారంభిస్తామని వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ.10 - మ.1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
మండపేట: 80085 74183 ద్వారపూడి: 98490 93850
అనపర్తి: 95333 66637 అంగర: 97044 16418
రాయవరం: 80085 74185

మురుగు పారడంలేదు..

సమస్య: మండపేట మండలం మారేడుబాక సాయినగర్ రెండో వీధి డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. - డి.భార్గవ్, మారేడుబాక

సమాధానం: సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌కు తెలియజేయగా సిబ్బందిని పంపించి మురుగు పారుదలకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, ద్వారపూడి

మండపేటలో ఆధ్యాత్మిక సంబరం

గుర్రపుబండిపై ఊరేగింపుగా వస్తున్న స్వామీజీ

మండపేట, న్యూస్‌టుడే: వారణాశికి చెందిన శ్రీశివనాగేంద్ర సరస్వతిస్వామి మండపేటలో ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇచ్చేందుకు ఆదివారం సాయంత్రం పట్టణానికి చేరుకున్నారు. తొలుత స్వామివారిని కలువపువ్వు సెంటరు నుంచి అలంకరించిన గుర్రపుబండిపై వేంచేయించి భారీ ఊరేగింపుగా భక్తులు తోడ్కొని వచ్చారు. ధర్మగుండం చెరువు సమీపంలోని రాజరాజేశ్వరి పీఠం వరకు ఊరేగింపు సాగింది. అధికసంఖ్యలో మహిళలు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు. సోమవారం నుంచి అయిదు రోజుల సీతారామ కల్యాణ మండపంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

శివనాగేంద్ర సరస్వతి స్వామికి పాదపూజ..

వారణాశి నుంచి వచ్చిన శివనాగేంద్ర సరస్వతిస్వామికి మండపేటలో భక్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి ఆయనకు పాదపూజ చేశారు. పీఠం నిర్వాహకుడు, మున్సిపల్ కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ధనమ్మతల్లికి ప్రత్యేక పూజలు

పూజలనంతరం అమ్మవారు

కపిలేశ్వరపురం, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం కేదార్లంక సమీపంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం ధనమ్మమర్రికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో చుట్టుపక్కల మండలాల నుంచి పెద్దఎత్తున భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలోని షెడ్లు నిండిపోవడంతో మర్రిచెట్టు నీడలోనే పిండివంటలు వండి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా అంగర ఎస్సై హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పీఎంశ్రీ బడి.. నైపుణ్య ఒడి

తాపేశ్వరం జడ్పీ పాఠశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

• విద్యార్థి దశ నుంచే శిక్షణ

రాయవరం, న్యూస్‌టుడే: చదువుకున్న ప్రతి విద్యార్థికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే ప్రత్యేకంగా వృత్తి విద్యలో శిక్షణ ఇప్పిస్తోంది. ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పేరుతో కేంద్ర ప్రభుత్వం 2023లో జిల్లాలోని 44 పాఠశాలల్లో వృత్తి విద్యా నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రవేశపెట్టింది. జిల్లాలోని వివిధ పీఎంశ్రీ పాఠశాలల్లో 8,382 మంది వృత్తి విద్యా శిక్షణ తీసుకుంటున్నారు. 2023-24, 2024-25 సంవత్సరాల్లో కోర్సులున్నా శిక్షణకు అవసరమైన సిబ్బంది, సామగ్రి సమకూర్చుకోవడం ఆలస్యం కావడంతో ఈ రెండేళ్లూ తూతూ మంత్రంగానే సాగాయి. ఈ ఏడాది ఎనిమిది రకాల కోర్సులకు సమగ్ర శిక్షా అధికారుల ఆధ్వర్యంలో నైపుణ్యం కలిగిన శిక్షకులను నియమించడంతో పాటు సామగ్రిని అందుబాటులోకి తీసుకొచ్చారు. పదో తరగతి పూర్తయ్యే నాటికి 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు వృత్తి నైపుణ్యం సాధించేలా శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా ఆయా ట్రేడుల్లో తర్ఫీదు పొందవచ్చు.

తరగతుల వారీగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు

12	373
11	408
10	3,746
9	3,855
మొత్తం	8,382

శిక్షణనిస్తున్న కోర్సులు ఇవే...

ఆటోమోటివ్, బ్యూటీషియన్ అండ్ వెల్‌నెస్, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, బ్యాంకింగ్, రిటైల్, అగ్రికల్చర్, హార్డ్‌వేర్, బీఎఫ్ఎస్ఐ కోర్సు (వృత్తి నైపుణ్యాభివృద్ధి శిక్షణ), ఫ్యాషన్ టెక్నాలజీ రంగంలో దుస్తుల తయారీ తదితర పది కోర్సుల్లో 90 మంది ప్రత్యేక శిక్షకులు విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగంలో తర్ఫీదు ఇవ్వనున్నారు. ప్రతీ నెలా ఆయా రంగాల్లో నిష్ణాతులైన వ్యక్తులతో కార్యశాల, నాలుగు నెలలకోసారి క్షేత్రస్థాయిలో విషయాలు ఆకళింపు చేసుకునేందుకు పరిశ్రమల్లో పర్యటనలు ఉంటాయి.

క్షేత్రస్థాయి పరిశీలనకు నిధులు..

విద్యార్థులు క్షేత్రస్థాయి అనుభవం కోసం ఒకేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ పేరుతో దగ్గర్లోని ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు వెళ్లేలా ప్రభుత్వం ఒక్కో పాఠశాలకు రూ.15 వేల చొప్పున నిధులు మంజూరుచేసింది. దీనివల్ల వారు నేర్చుకున్న అంశాలకు సంబంధించి దగ్గర్లోని చిన్న పరిశ్రమలు, సంస్థలను విద్యార్థులు సందర్శించి క్షేత్రస్థాయిలో అవగాహన పెంచుకుంటారు. పాఠశాల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తారు.

ఉపాధి అవకాశాలు మెరుగు..

పాఠశాల స్థాయి నుంచే నైపుణ్య శిక్షణ పొందడంతో విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణించడానికి అవకాశాలు వస్తాయి. తద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందవచ్చు. - పి.రాంబాబు, అకడమిక్ మానిటరింగ్ అధికారి, సమగ్ర శిక్షా విభాగం

పీఠాధిపతి సమక్షంలో శ్రీనివాసులును సత్కరిస్తున్న పీఠం సభ్యులు

విజయదుర్గా పీఠంలో హెచ్‌డీపీటీ ఛైర్మన్

రాయవరం, న్యూస్‌టుడే: వెదురుపాక విజయదుర్గా పీఠాన్ని రాష్ట్ర హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్‌డీపీటీ) ఛైర్మన్ డా.దాసరి శ్రీనివాసులు ఆదివారం సందర్శించారు. ముందుగా విజయదుర్గా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించిన అనంతరం పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్)ని ఏకాంతంగా కలిసి ఆశీస్సులందుకున్నారు. పీఠాధిపతి సమక్షంలో ఆయనను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో పీఠం పర్యవేక్షకుడు వీవీ బాపిరాజు, పీఆర్వో బాబీ తదితరులు ఉన్నారు.

స్వామిప్రసాద్‌కు పలువురి అభినందన

మండపేట, న్యూస్‌టుడే: అమలాపురంలో నిర్వహించిన తెలుగు మహాసభల్లో పాల్గొన్న మండపేట పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి, రచయిత గండి స్వామిప్రసాద్‌ను పలువురు అభినందించారు. తెలుగు కవిత్వంలో మాండలికాలు అనే అంశంపై ఆయన ప్రసంగించారు. పట్టణానికి చెందిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చల్లా రవికుమార్, పండిత పరిషత్తు జిల్లా అధ్యక్షుడు పెరవలి యేసుబాబు తదితరులు ఆయనను అభినందించారు.

పందలపాకలో కంటి వైద్య శిబిరం

బిక్కవోలు, న్యూస్‌టుడే: బిక్కవోలు మండలం పందలపాకలో పడాల సూర్యనారాయణరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరాల్ని ఆదివారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందలపాక సొసైటీ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి సేవలను కొనియాడారు. కరోనా సమయంలో గ్రామ ప్రజలకు నిత్యావసరాలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలనే తొలగించాం: ఎమ్మెల్యే నల్లమిల్లి

శంకుస్థాపన శిలాఫలాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎనిమిది నెలలు సమయం ఇచ్చి.. వేచి చూసి చట్ట ప్రకారమే జీబీఆర్ అక్రమ కట్టడాలను తొలగించామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి శ్రీరామారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.35 లక్షలతో చేపట్టే ప్రహరీ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. పాఠశాలకు దాత ఇచ్చిన స్థలాన్ని కాపాడడానికి, రైతుల హక్కుల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు. పొలాలకు వెళ్లేదారిని ఆక్రమించి బస్సులు నిలిపే స్థలంగా వాడుకోవడం సరికాదన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సమీపంలోని ఆంజనేయనగర్‌లోకి రాకపోకల నిమిత్తం ప్రహరీ నిర్మిస్తుండడంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ సూర్యకుమారి, సొసైటీ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, గోదావరి తూర్పు డెల్టా కమిటీ వైస్‌ఛైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి, కూటమి నాయకులు కర్రి వెంకట రామారెడ్డి, సత్తి దేవదానందరెడ్డి, కర్రి శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంతో సుపరిపాలన..: అనపర్తి గ్రామీణం: అభివృద్ధి, సంక్షేమంతో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనపర్తి ఎర్రకాలువ వద్ద రూ.80 లక్షలతో చేపట్టే బీటీరోడ్డు, అనపర్తి నుంచి కొత్తూరు వరకు రూ.50 లక్షలతో చేపట్టే సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే వేగుళ్ల

తెదేపాలో చేరిన వైకాపా కార్యకర్తలు

మండపేట: పట్టణంలోని 26వ వార్డుకు చెందిన పలువురు వైకాపా కార్యకర్తలు ఎస్ఈసీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో తెదేపాలో చేరారు. ఆదివారం తెదేపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వార్డు తెదేపా అధ్యక్షుడు పంతం వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పోటూరి సత్యనారాయణ, మావూరి శ్రీనివాస్, బండారు జయమ్మ, వాతా అనంతలక్ష్మి తదితరులు తెదేపా తీర్థం స్వీకరించారు. వీరికి పసుపు కండువాలు వేసి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. పట్టణ తెదేపా అధ్యక్షుడు మత్సా నాగు, మాజీ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మతల్లి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు..: రాయవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల నీరాజనాలందుకుంటున్న వెంటూరు గ్రామదేవత దండు మారెమ్మతల్లి జాగరణ వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పాడిపంటలు, పిల్లాపాపలను చల్లగా చూడాలని కోరుతూ చలివిడి, పానకాలు, సారె సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో మండల తెదేపా అధ్యక్షుడు కొప్పిశెట్టి మాధవరావు, చెల్లూరు సహకార సంఘం అధ్యక్షుడు దేవళ్ల వెంకట్రావు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు రిమ్మలపూడి వేణుగోపాలదొర, పోతుల వీర్రాజు చౌదరి తదితరులు ఉన్నారు. సోమవారం అమ్మవారి తీర్థం జరగనుంది.

తాగునీటి ట్యాంకు శిథిలం

కపిలేశ్వరపురం మండలం వాకతిప్పలో తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరినా నీటి సరఫరా అవసరాలకు వినియోగించడం విమర్శలకు తావిస్తోంది. గ్రామంలోని వనువులమ్మ ఆలయం వద్ద గతంలో నిర్మించిన తాగునీటి ట్యాంకు కొన్నేళ్ల క్రితమే శిథిలావస్థకు చేరింది. స్తంభాలు, బీములు, స్లాబు నుంచి పెచ్చులూడి, ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరో ట్యాంకు నిర్మించినా దానిలో నిల్వచేస్తున్న తాగునీరు గ్రామమంతా సరిపోక పాత ట్యాంకునూ వినియోగంలోకి తెచ్చారు. ఇది ఎప్పుడు కూలిపోతుందో తెలియక గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. - న్యూస్‌టుడే, కపిలేశ్వరపురం

దుకాణ సముదాయం.. నిర్వహణ దారుణం

మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదురు దుకాణ సముదాయం మెట్ల వద్ద వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయాయి. వివిధ లావాదేవీల నిమిత్తం దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులు, వినియోగదారులు వీటితో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దుకాణాలను ఆదాయ వనరుగా పరిగణిస్తున్న మున్సిపల్ అధికారులు వాటిని శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పర్యవేక్షకుడిని ఏర్పాటుచేసి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావుని వివరణ కోరగా వెంటనే వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, మండపేట

బాణసంచా తయారీ నిలిపివేయాలని నోటీసులు

బిక్కవోలులో కేంద్రం యజమానికి నోటీసు అందిస్తున్న డీఎస్పీ విద్య

బిక్కవోలు, న్యూస్‌టుడే: మండలంలో బాణసంచా తయారీని నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు. రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ విద్య, డీటీసీ ఇన్‌స్పెక్టర్ ఆర్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ అధికారులతో కలిసి ఆదివారం కేంద్రాలను తనిఖీ చేశారు. తయారీ, క్రయవిక్రయాలను కొన్నిరోజుల పాటు నిలిపివేయాలని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చేవరకు పనులు చేయవద్దని నోటీసులు అందించారు. కార్యక్రమంలో సీఐ సుమంత్, బిక్కవోలు ఎస్సై రవిచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు

మండపేట గ్రామీణం: బాణసంచా తయారీ కేంద్రాల్లో ప్రమాదాలు జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండపేట గ్రామీణ సీఐ పి.దొరరాజు సూచించారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పేలుడు పదార్థాల తయారీ, నిల్వ విషయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. తయారీ కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి తగిన శిక్షణ లేకపోవడంతో తీవ్ర ప్రమాదాలు, ప్రాణనష్టం సంభవిస్తున్నాయన్నారు. మండపేట సర్కిల్ పరిధిలో అనుమతి లేకుండా బాణసంచా తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలు చేసేవారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక సందర్భాలు, వేడుకల్లో మందుగుండు కాల్చడానికి పోలీసుల నుంచి లిఖితపూర్వకంగా అనుమతులు తీసుకోవాలన్నారు.

సుబ్బారెడ్డిని పరామర్శించిన ఎంపీ బోస్

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి భార్య, మాజీ సర్పంచి పడాల భూలక్ష్మి ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఆదివారం నివాళి అర్పించారు. సుబ్బారెడ్డితో పాటు భూలక్ష్మి సోదరుడు, వైకాపా రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడును పరామర్శించారు. కార్యక్రమంలో రామచంద్రపురం నియోజకవర్గం వైకాపా ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్, నేతలు దూలం వెంకన్నబాబు, ఎస్‌బీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సత్తి బులిస్వామిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అమరవీరులకు నివాళి

కపిలేశ్వరపురంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మాదిగ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. డా.బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద అమరవీరులకు నివాళి అర్పించారు. మాదిగ సంఘం ప్రతినిధులు పిప్పర సంపతరావు, మల్లిపూడి నాగరాజు మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో ముమ్మిడివరపు చినసత్యం, మల్లిపూడి శివకుమార్, నేదునూరి వెంకన్నబాబు, రాయి సుధాకర్, పలివెల శ్యామ్, లంక కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డిగుంటలో ఎమ్మెస్సార్ వర్ధంతి

రంగంపేట, న్యూస్‌టుడే: రైతు నాయకుడు, దివంగత మన్యం సుబ్బారావు 28వ వర్ధంతిని ఆదివారం రంగంపేట మండలం దొడ్డిగుంటలో నిర్వహించారు. రాజకీయ విశ్లేషకుడు అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో సుబ్బారావు చిత్రపటానికి పలువురు రైతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఐకాస సభ్యులకు సత్కారం

మండపేట: మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేసేందుకు కృషిచేసిన ఐకాస సభ్యులను ఆదివారం సత్కరించారు. ఐకాస అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కోన సత్యనారాయణ, వేమగిరి నూకరాజు, దూలి జయరాజు పాల్గొన్నారు

నమ్మించి మోసం చేసిన ఆర్పీ

న్యాయం చేయాలని ఫిర్యాదు

వివరాలు వెల్లడిస్తున్న పొదుపు సంఘాల సభ్యులు

మండపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల సభ్యుల నుంచి వసూలుచేసిన సొమ్మును బ్యాంకులో జమ చేస్తానని నమ్మించి మోసం చేసిన ఆర్పీపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన బాధిత మహిళలు కోరారు. ఆదివారం గంగాభవానీ సంఘం, పద్మశ్రీ సంఘం సభ్యులు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. పొదుపు సంఘం అధ్యక్షురాలు ఎం.సుభాషిణీదేవి మాట్లాడుతూ.. 2022లో రుణం తీసుకున్నామని, సంవత్సరం వరకు నేరుగా బ్యాంకులో వాయిదాలు జమ చేయగా ఆ తరవాత ఆర్పీ ఎ.నాగవిజయకు గ్రూపు సభ్యుల నుంచి వసూలుచేసిన నగదు రూ.51 వేలు అప్పగించామన్నారు. ఇలా ఏడాది పాటు ఆమెకే చెల్లించామని పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు రుణ వాయిదాలు ఎందుకు చెల్లించడం లేదని అడిగే వరకు తాము మోసపోయినట్లు తెలియలేదన్నారు. సుమారు రూ.6 లక్షల వరకు తాము చెల్లించామని, ఆమెను నిలదీయగా డబ్బు ఇవ్వలేదని బుకాయిస్తున్నారని వాపోయారు. దీంతో జిల్లా కలెక్టర్‌కు రెండుసార్లు ఫిర్యాదు చేశామని, చెప్పారు. ఈ విషయంపై ఏపీఎం బి.విష్ణుమూర్తిని వివరణ కోరగా గతంలో పొదుపు సంఘాల సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేయడంతో ఆర్పీ నాగవిజయకు నోటీసులు జారీచేశామని వివరించారు.

సంక్షేమ పథకాల పునరుద్ధరణ

భవన నిర్మాణ కార్మికులకు ప్రయోజనం

భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖ అధికారి

మండపేట, న్యూస్‌టుడే: భవన, ఇతర నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల సంక్షేమానికి అమల్లో ఉన్న చట్టాలు, పథకాలను గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గతంలో తెదేపా ప్రభుత్వం ఉన్న సమయంలో కార్మికులు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి పథకాలపై అవగాహన కల్పించడం, వాటి ప్రయోజనాల గురించి ప్రచారం చేస్తూ ఎక్కువ మందితో రిజిస్ట్రేషన్ చేయించేవారు. దీనివల్ల కార్మికుల్లో ఎక్కువ మందికి లబ్ధి చేకూరేది. అప్పటివరకు అమల్లో ఉన్న పలు సంక్షేమ పథకాలను 2020 సంవత్సరం నుంచి నిలిపివేయడంతో కార్మికులకు ప్రయోజనం అందడం లేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరవాత కార్మికుల సంక్షేమం కోసం ఆయా పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 27వ తేదీన కార్మిక శాఖ కమిషనర్ నిర్వహించిన గూగుల్ సమావేశం ద్వారా మార్చి ఒకటో తేదీ నుంచి ఆయా పథకాలను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు.

అమల్లోకి పథకాలు..

పెళ్లికానుక పథకం ద్వారా రూ.40,000 నగదు అందిస్తారు. ప్రసూతి ఆర్థిక సాయంగా రూ.20,000, సహజ మరణం (ఎక్స్‌గ్రేషియా) రూ.60,000, మట్టిఖర్చులకు (అంత్యక్రియల సాయం) రూ.20,000 అందజేస్తారు.

దరఖాస్తులకు అవసరమైన పత్రాలు..

కార్మికుని లేబర్ కార్డు రిజిస్ట్రేషన్ గడువు ముగిసి ఉంటే వెంటనే రెన్యువల్ చేయించుకోవాలి, కొత్తగా ధ్రువీకరణ పత్రం కోసం ఆధార్ కార్డు, కుటుంబ వివరాల కోసం రేషన్‌కార్డు జెరాక్సులు అందించాలి. నగదు జమచేయడానికి బ్యాంకు ఖాతా వివరాలు (ఐఎఫ్ఎస్‌సీ) ఉండాలి. పెళ్లికానుక పథకం కోసం వివాహ ఆహ్వాన పత్రిక (వెడ్డింగ్ కార్డు), పెళ్లి జరిగినట్లు ధ్రువీకరణ పత్రం జతచేయాలి. ప్రసూతి సాయం కోసం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు పత్రం, పుట్టిన తేదీ ఉండాలి. మట్టి ఖర్చుల కోసం మరణ ధ్రువీకరణ పత్రం ఉండాలి.

అవగాహన కల్పిస్తున్నాం..

గతంలో నిలిపివేసిన పథకాలు పునరుద్ధరించిన విషయంపై కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం. కార్మికులు పనిచేసే ప్రాంతాలకు వెళ్లి గతంలో కార్మిక శాఖ జారీచేసిన లేబర్‌కార్డులు పునరుద్ధరణ చేయించుకోవాలని సూచిస్తున్నాం. దీనివల్ల కార్మికులతో పాటు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ప్రయోజనం కలుగుతుంది. కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్నా, పాతకార్డు రెన్యువల్ చేయించుకోవాలన్నా కార్మిక శాఖ కార్యాలయంలో సంబంధిత పత్రాలు అందజేస్తే కార్డు జారీ చేస్తారు. - కాశీశివనాగమల్లేశ్వరరావు, కార్మిక శాఖ అధికారి, మండపేట

కుతుకులూరులో పూజలు చేస్తున్న భక్తులు

కూటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ పూజలు

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి మండలం కుతుకులూరు పార్వతీ సమేత కూటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య ఆధ్వర్యంలో సప్తనదీ జలాలతో కుంభాభిషేకం, మహాకుంభాభిషేకం, గణపతి పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆదాయపన్ను శాఖ జాయింట్ కమిషనర్ (ముంబయి) కర్రి రామ్‌గోపాలరెడ్డి, డా.సింధూర దంపతులు పూజలు జరిపించారు.

ఘనంగా సదస్యం

పూజలు నిర్వహిస్తున్న పండితులు

మండపేట: అగస్త్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి సదస్యం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అయినవిల్లి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి బూరెలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భాజపా బలోపేతానికి కృషి చేయాలి

సభలో మాట్లాడుతున్న సత్యనారాయణ

మండపేట: పార్టీ బలోపేతానికి కృషిచేయాలని భాజపా జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం సీతారామ కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దిశానిర్దేశం చేశారు. మార్చి 7వ తేదీ నుంచి ఏప్రిల్ 14 వరకు మండపేటలో నిర్వహించే శిక్షణ తరగతులకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమ, జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు శకుంతల, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సాదిక్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు, నియోజకవర్గం కన్వీనర్ కె.వి.వి.సాయిరాం, కపిలేశ్వరపురం అధ్యక్షుడు నామాల శ్రీనివాస్, ఫణిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

రేపు శ్రీవారి ఆలయం మూసివేత

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం సందర్భంగా ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని ఈ నెల 3న మూసివేయనున్నట్లు ఆలయ ఈవో వై.భద్రాజీ తెలిపారు. ఆ రోజు ఉదయం 6.20 గంటల లోపు స్వామి ప్రాతఃకాలార్చనాదికాలను ముగించి ఆలయాన్ని మూసి వేస్తామన్నారు. తిరిగి రాత్రి 7.30 గంటలకు దేవాలయాన్ని తెరచి శుద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. ఆ రోజు ఆర్జిత సేవలు, దర్శనాలను రద్దు చేస్తున్నట్లు వివరించారు. 4వ తేదీ నుంచి ఆర్జిత సేవలు, దర్శనాలు యథావిధిగా జరుగుతాయని తెలిపారు.

కల్యాణం తిలకిస్తున్న భక్తులు, క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా జలదుర్గా గోకర్ణేశ్వరుడి కల్యాణం

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటి సరస్సు తీరాన కొలువైన మహిమాన్విత మాత జల దుర్గమ్మ పెండ్లి కూతురుగా ముస్తాబవగా.. అమ్మను పరిణయం ఆడేందుకు పల్లకిలో తరలివచ్చాడు అందాల గోకర్ణయ్య. ముత్యాల పందిరిలో వేద మంత్రాల నడుమ ఒక్కటైన ఆ ఆది దంపతుల కల్యాణ వైభవం అంబరాన్ని తాకింది. కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో భాగంగా జల దుర్గా సమేత గోకర్ణేశ్వరస్వామి కల్యాణం ఆదివారం తెల్లవారుజామున కనుల పండువగా సాగింది. గోకర్ణపురం నుంచి గోకర్ణేశ్వరస్వామిని గ్రామస్థులు పల్లకిలో కొల్లేటికోటకు తీసుకొచ్చారు. అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించిన ఆది దంపతులను మండపానికి చేర్చి వేద పండితులు కల్యాణ తంతు జరిపించారు. దేవస్థానం తరపున ఈవో కె.శ్రీనివాస్ పట్టు వస్త్రాలు సమర్పించారు.

'నేను ఎవరో మీకు తెలుసా?'

నగరంలో దొంగల పేరిట ఫ్లెక్సీల ఏర్పాటు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: 'నేను ఎవరో మీకు తెలుసా'.. ఇదేదో చిక్కుముడి ప్రశ్న అనుకుంటున్నారా? కాదండోయ్. ఏలూరు నగరంలోని పలు ప్రాంతాల్లో.. ఈ ప్రశ్నతో ఫ్లెక్సీలు రాత్రికి రాత్రే వెలిశాయి. ప్రస్తుతం నగరంలో ఇదో చర్చనీయాంశంగా మారింది. ఈ ఫ్లెక్సీలో కొందరు యువకుల చిత్రాలు ప్రదర్శించారు. బంగారు గొలుసులు, ద్విచక్ర వాహనాలు, విద్యుత్తు పరికరాల రాగి తీగలు, ఇళ్లలో చోరీలకు పాల్పడే వ్యక్తులను ప్రతిబింబించేలా చిత్రాలు వారి పేర్లు, ఊళ్లతో సహా ప్రదర్శించారు. వీటిపై పోలీసు శాఖ, ఇతర సంస్థల పేర్లు లేకపోవడం గమనార్హం. ప్రజలను అప్రమత్తం చేయడానికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారా? లేదా కక్ష సాధింపుతో ఫ్లెక్సీలు ప్రదర్శించారా? అన్నది ప్రశ్నగా మారింది. నేరాలు అరికట్టడానికి పోలీసు అధికారులే ఏర్పాటు చేసి ఉండొచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఫ్లెక్సీలకు, పోలీసు శాఖకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎవరైనా దొంగతనానికి గురైన బాధితులు కానీ, ఏదైనా స్వచ్ఛంద సేవా సంస్థ కానీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఉండొచ్చని వ్యాఖ్యానించారు.

గుట్ట మింగేసి.. గట్టు కలిపేసి!

పరిశీలన

పోలవరం కుడి కాలువ వెంబడి తవ్వకాలు

భీమడోలు, ఉంగుటూరు, ద్వారకాతిరుమల, దెందులూరు, పెదవేగి- న్యూస్‌టుడే: గోదావరి జలాలను కృష్ణా నదికి అనుసంధానం చేస్తూ.. 178 కి.మీ. మేర పోలవరం కుడి కాలువ నిర్మించారు. ఏటా ఖరీఫ్‌లో పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా సుమారు 8,500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. పోలవరం, కొయ్యలగూడెం, దేవరపల్లి, నల్లజర్ల, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, పెదవేగి మండలాల మీదుగా కాలువ ప్రవహిస్తోంది. భవిష్యత్తు అవసరాల నిమిత్తం కాలువకు ఇరువైపులా అధిక మొత్తంలో భూములు సేకరించారు. అందులో కాలువ మట్టిని గుట్టలుగా పోశారు.

మాయం చేసేశారు.. ఈ గుట్టలపై కన్నేసిన అక్రమార్కులు.. యంత్రాల సాయంతో ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టి తరలిస్తూ మాయం చేసేశారు. స్థిరాస్తి వ్యాపారులు తమ లేఅవుట్లకు ఈ మట్టిని రాత్రింబవళ్లు తరలించి చదును చేయించుకున్నారు. మరోవైపు ఇక్కడి ఖాళీ స్థలాల్లో సైతం తవ్వకాలు చేపడుతున్నారు. కొందరు రైతులు కాలువ భూముల్ని తమ పొలాల్లో కలిపేసుకుంటూ సాగు చేస్తున్నారు. కాలువ నిర్మాణానికి భూములు సేకరించినప్పుడు తమకు తక్కువ పరిహారం ఇచ్చారని, ఖాళీ భూమిని సాగు చేస్తే తప్పేమిటని వారు వాదిస్తున్నారు.

భీమడోలు మండలం పోలసానిపల్లి సమీప పోలవరం కుడి కాలువ గట్టుపై యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతుండటంతో గ్రావెల్ గుట్టలు కరిగిపోతున్నాయి. దెందులూరు మండలం పెరుగుగూడెం, చల్లచింతలపూడి, రామారావుగూడెం, మేదీనరావుపాలెం; పెదవేగి మండలం ముందూరు, కొప్పులవారిగూడెం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో గ్రావెల్ తవ్వకాలు నిర్విరామంగా సాగుతున్నాయి.

ఉంగుటూరు మండలం గొల్లగూడెం సమీప పోలవరం కుడి కాలువ భూములు ఆక్రమించి వరి సాగు చేస్తున్నారు. కాలువ నిర్మాణానికి మండలంలో మొత్తం 165.70 ఎకరాలు సేకరించగా.. సుమారు 70 ఎకరాలు ఆక్రమణకు గురైందని అంచనా.

ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి, గుణ్ణంపల్లి ప్రాంతాల్లో పోలవరం కుడి కాలువ గట్టు వెంబడి ఖాళీ భూములను కొందరు రైతులు ఆక్రమించేసి తమ చేలల్లో కలిపేసుకున్నారు. పంగిడిగూడెంలో ఆక్రమించిన భూముల్లో మొక్కజొన్న, కొబ్బరి, ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు.

పర్యవేక్షణ లోపం.. పోలవరం కుడి కాలువ నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఏళ్లు గడుస్తున్నా వివిధ పోస్టులు భర్తీ చేయలేదు. కుడి కాలువ పరిధిలో ఏఈఈలు అందుబాటులో లేరు. జలవనరుల శాఖలో ఎనిమిది కిలోమీటర్లకు ఒక లష్కరు ఉండాల్సి ఉండగా.. ఒక్కరూ లేకపోవడం గమనార్హం. 'కాలువ గట్టు వెంబడి మట్టి తవ్వకాలు చేసేవారిపై కేసులు నమోదు చేస్తున్నాం. భూములు ఆక్రమించే వారికి నోటీసులు ఇస్తున్నాం' అని పోలవరం కుడి కాలువ ఏఈ బాపూజీ తెలిపారు.

అక్కడ యుద్ధం.. ఇక్కడ కలవరం!

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు.. గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడుల నేపథ్యంలో ఆయా దేశాల్లో ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వాసుల పరిస్థితిపై వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం ఉమ్మడి జిల్లాకు చెందిన 1.5 లక్షల మంది ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లో ఉన్నట్లు అధికార వర్గాల అంచనా.

ఎక్కడి వారు అక్కడే.. మొగల్తూరుకు చెందిన దంపతులు ఉపాధి నిమిత్తం ఇజ్రాయెల్‌కు వెళ్లారు. ప్రస్తుతం వారికి ఫోన్ చేయగా క్షేమంగానే ఉన్నామని.. ఇక్కడ రక్షణ దళాలు తరచూ అప్రమత్తం చేస్తున్నాయని, సైరన్లు మోగుతున్నాయని వారు చెబుతున్నారు. కొత్తపాలేనికి చెందిన పలువురు కువైట్‌లో ఉపాధి పొందుతున్నారు. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు ఆ దేశంలోని ఎయిర్‌పోర్టు వద్ద పడటంతో ప్రజలందరినీ అప్రమత్తం చేశారు. తమను కూడా ఇళ్ల నుంచి బయటకు రానివ్వడం లేదని అక్కడ ఉపాధి పొందుతున్న కార్మికులు చెబుతున్నారు. ఇతర గల్ఫ్ దేశాల్లో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది.

నేడు యథావిధిగా 'మీ కోసం'

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'(మీ కోసం) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మండల, పురపాలక, డివిజనల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. 'మీ కోసం' వినతుల పరిష్కార స్థితి తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించవచ్చని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దివ్యాంగుల ఉచిత ప్రయాణానికి రైట్‌రైట్..!

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: దివ్యాంగులకు ఇక నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కలగనుంది. కూటమి ప్రభుత్వం జీవో నం.21 ద్వారా ఈ వెసులుబాటు కల్పించింది. 'ఇంద్ర ధనుస్సు' పథకంలో భాగంగా 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు ఉచిత బస్సు ప్రయాణానికి అర్హులు. వీరు అయిదు రకాల బస్సు సర్వీసుల్లో రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. వారికి సహాయం (ఎస్కార్టు)గా వెళ్లేవారికి టికెట్ ధరలో 50 శాతం రాయితీ కల్పించారు. ఎస్కార్టు తప్పనిసరైన పక్షంలోనే వారికి రాయితీ వర్తిస్తుంది.

35 వేల మందికి పైగా.. ఇతర అంతర్రాష్ట్ర సర్వీసులు, నాన్‌స్టాప్, అల్ట్రా డీలక్స్ సర్వీసుల్లో 50 శాతం రాయితీతో ప్రయాణ సౌకర్యం ఉంది. ఏలూరు జిల్లాలో మొత్తం 35 వేల మందికి పైగా 40 శాతానికి మించి వైకల్యం ఉన్న దివ్యాంగులు ఉన్నారు. వీరంతా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. వీరు ప్రయాణ సమయంలో ఆర్టీసీ జారీ చేసిన పాసు లేదా ప్రభుత్వం గుర్తించిన వైకల్య ధ్రువీకరణ పత్రం కండక్టరుకు చూపించాల్సి ఉంటుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విధి విధానాలు పూర్తి స్థాయిలో వచ్చిన తర్వాత దివ్యాంగుల ఉచిత ప్రయాణానికి అవకాశం ఉంటుందని జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజరు పీవీ గంగాధరరావు తెలిపారు.

అమ్మలేక.. ఉంచలేక..!

జాడలేని కొనుగోలు కేంద్రాలు ● త్రిశంకు స్వర్గంలో అపరాల రైతులు

దెందులూరు, ఏలూరు గ్రామీణ- న్యూస్‌టుడే: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందాన తయారైంది అపరాల రైతుల పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతినిచ్చినా.. అధికారులు మాత్రం తెరవలేదు. రబీలో ఆరుగాలం శ్రమించి అపరాలు సాగు చేసిన రైతులు.. పంట అమ్ముకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

పంటను సంచుల్లో నింపుతున్న కర్షకులు

మొత్తం 40 వేల ఎకరాల్లో.. జిల్లా వ్యాప్తంగా 40,745 ఎకరాల్లో పెసర, మినుములు సాగు చేశారు. ప్రస్తుతం పంట మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పంట అమ్ముకునేందుకు రైతులు ఎక్కడా ఇబ్బంది పడకూడదన్న సదుద్దేశంతో.. అపరాల కొనుగోలు కేంద్రాలు తెరవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు అపరాలు కొనేందుకు దళారులు, వ్యాపారులు ముందుకు రావడం లేదు. తాము చెప్పిన ధరకు అమ్మినోళ్ల వద్దే కొనేందుకు మొగ్గుచూపుతున్నారు.

పంట	విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి అంచనా (క్వింటాల్లో)	కొనుగోలు లక్ష్యం (క్వింటాళ్లు)	ప్రభుత్వ మద్దతు ధర (రూ.ల్లో)
పెసర	16,932	81,034	1,200	8,768
మినుము	23,813	1,10,063	12,000	7,800

పెదపాడుకు చెందిన రైతు శ్రీనివాస్ మూడెకరాల్లో పెసర సాగు చేశారు. తొమ్మిది బస్తాల దిగుబడి వచ్చింది. అపరాల కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో.. బయట వ్యాపారికి బస్తా రూ.7,200 చొప్పున విక్రయించారు. ఫలితంగా రూ.13 వేలకు పైగా నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరు మంజూరు.. 'జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు మంజూరయ్యాయి త్వరలోనే తెరుస్తాం. రైతుల నుంచి మద్దతు ధరకు అపరాలు కొనుగోలు చేస్తాం' అని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గుప్తా తెలిపారు.

మఖానా.. కొల్లేరు ఖజానా

● బోర్డు ప్రతిపాదనపై అభినందన
● మత్స్యకారులకు మంచి రోజులు

మండవల్లి, కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేరులో ఫూల్ మాఖానా(తామర, కలువ గింజలు) సాగుతో ఇక్కడ మత్స్యకారులకు ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు రాష్ట్రంలో మఖానా బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరడంపై కొల్లేరు ప్రాంతంలో ఆశలు చిగురిస్తున్నాయి. ఎంతో సారవంతమైన కొల్లేరు భూములు చేపల పెంపకంతో పాటు సహజ సిద్ధంగా పెరిగే తామర, కలువ గింజలకు ప్రసిద్ధి. ఇప్పుడు వీటిని పరిశ్రమగా మార్చి భారీ స్థాయిలో పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇక్కడ పండే ఈ గింజలకు జాతీయ, అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. రాష్ట్ర ప్రభుత్వ చొరవను అసెంబ్లీ సాక్షిగా కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అభినందించడంతో ప్రాధాన్యం సంతరించుకుంది.

సరస్సులో కలువ పువ్వులు

ఆక్రమణలు, వలసలు తగ్గే అవకాశం.. కొల్లేరులో మఖానా సాగును ప్రోత్సహించేందుకు బోర్డు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం నుంచి వలసలు తగ్గే అవకాశం ఉంటుంది. 2006 కొల్లేరు ఆపరేషన్ తర్వాత లంక గ్రామాల్లో 30శాతం ప్రజలు ఒడిశా, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. మరోపక్క ఏటికేడు పెరుగుతున్న కొల్లేరు ఆక్రమణలు సైతం తగ్గుతాయని అంచనా వేస్తున్నారు.

అధిక ప్రోటీన్లకు చిరునామా.. మఖానాలో ప్రోటీన్లు అధికంగా ఉండటంతో సూపర్ ఫుడ్‌గా గుర్తింపు పొందింది. ప్రస్తుతం చేపలతో పోల్చితే ప్రోటీన్లు, ధర రెండూ అధికంగా ఉండటంతో కొల్లేరులో సాగుతో మత్స్యకారులకు మంచి ఆదాయ వనరులుగా మార్చవచ్చు. తక్కువ పెట్టుబడి మందులు లేకుండా పెంచే వీటితో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చునని విశ్లేషకులు చెబుతున్నారు.

3 లక్షల మందికి ప్రయోజనం.. కొల్లేరులో మఖానా సాగును ప్రోత్సహిస్తే ఏలూరు జిల్లాలోని ఏడు మండలాల్లోని 3 లక్షల మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూరనుంది. మరో పక్క వీటిని మార్కెటింగ్, ప్రాసెసింగ్ విభాగాల్లో మరికొందరికి ఉపాధి లభించే అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ చొరవ అభినందనీయం.. కొల్లేరు ప్రస్తుతానికి చేపల ఆధారిత వ్యవస్థగా కొనసాగుతోంది. మఖానా సాగుకు కొల్లేరు భూములు ఎంతో అనువైనవని ఇప్పటికే శాస్త్రవేత్తలతో పాటు అటవీ శాఖ అధికారులు సైతం ధ్రువీకరించారు.

- డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే, కైకలూరు

పేరు సంక్షేమం.. తీరు సంక్షోభం!

ఆగిరిపల్లి, నూజివీడు రూరల్, ముసునూరు, కైకలూరు, ముదినేపల్లి, కలిదిండి, న్యూస్‌టుడే: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు సమస్యల ఊబిలో కూరుకుపోయాయి. ఇంటర్ పరీక్షలు ఇప్పటికే జరుగుతుండగా.. మార్చి 16 నుంచి పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మరోపక్క సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చాలా చోట్ల భవనాలు శిథిలస్థితికి చేరాయి. పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. మరుగుదొడ్లకు తలుపులు.. కిటికీలకు దోమ తెరల్లేవు. ఫలితంగా దోమలు విజృంభిస్తున్నాయి. విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. కొన్ని చోట్ల అరకొరగా దుప్పట్లు ఇవ్వగా.. మరికొన్ని చోట్ల అసలు ఇవ్వలేదు. అద్దె భవనాల్లో సరైన వసతులు లేక పిల్లలు అల్లాడిపోతున్నారు.

☛ ఆగిరిపల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 67 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు లభించడం లేదు. కుళాయి తాగునీటినే ఉపయోగిస్తున్నారు.

జిల్లాలో వివరాలు ఇలా...

స్థాయి	ఎస్సీ	బీసీ
పాఠశాల	42	19
కళాశాల	14	16
విద్యార్థులు	4,962	2,720

వసతి గృహాల్లో వెంటాడుతున్న సమస్యలు

శ్లాబు పెచ్చులూడి కనిపిస్తున్న ముసునూరు బీసీ బాలుర వసతి గృహం

☛ **నూజివీడు**లో బాలికల ఎస్సీ వసతి గృహాలు-3, బాలికల కళాశాల వసతి గృహాలు-2, బాలుర ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు-3 ఉన్నాయి. వీటిలో ఎక్కడా అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ ఉండటం లేదు. మెనూ అమలు జరగడం లేదు. ఫలితంగా విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

☛ **ముసునూరు** లో బాలుర బీసీ వసతి గృహం పూర్తిగా శిథిలమైంది. శ్లాబు పెచ్చులూడి కింద పడుతున్నాయి. వంట గది, భోజన శాల గోడలు బీటలు వచ్చాయి. కిటికీలకు దోమ తెరలు లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

☛ **కైకలూరు** బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

☛ **కలిదిండి** శివారు పడమటిపాలెం పంచాయతీలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 90 మంది పిల్లలు ఉన్నారు. ప్రహరీ లేకపోవడం, భవనాల కిటికీలు కూడా మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు సరైన రక్షణ లేక ఇబ్బందులు పడుతున్నారు.

☛ **ముదినేపల్లి** ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహ భవనం శిథిలస్థితికి చేరి పెచ్చులూడటంతో రేకుల షెడ్డును ఏర్పాటు చేసి దానిలో విద్యార్థులు వసతి పొందుతున్నారు. పక్కా భవనం లేక అవస్థలు పడుతున్నారు.

కూటమి పాలనలో ఉపశమనం.. గత వైకాపా సర్కారు నిర్లక్ష్యం కారణంగా సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తీసికట్టుగా మారింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా నిధులతో దెబ్బతిన్న కిటికీలు, తలుపులు బాగు చేశారు. విద్యుత్తు, తాగునీటి సమస్యలు తీర్చడం, రంగులు వేయడం, అదనపు షెడ్లు నిర్మించడం తదితర పనులు చేశారు.

పది రోజుల్లో పనుల పూర్తి.. ఇటీవల 44 వసతి గృహాలకు రూ.510.30 లక్షలతో మరమ్మతులు, అభివృద్ధి పనులు చేస్తున్నామని, మరో పది రోజుల్లో పూర్తి స్థాయిలో వసతి గృహాల్లో ఇబ్బంది లేకుండా పూర్తిచేస్తామని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు విశ్వమోహన్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి నాగరాణి తెలిపారు.

స్వీయ సన్నద్ధతకు పరీక్ష!

'పది' విద్యార్థులకు నేటి నుంచి గ్రాండ్ టెస్టులు

మార్టేరు, వీరవాసరం, న్యూస్‌టుడే: పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేసింది. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక తరగతులతోపాటు నిత్యం సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించారు. వాటిలో వచ్చిన మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పిల్లలు వారి స్వీయ సన్నద్ధతను అంచనా వేసుకొనేలా సోమవారం నుంచి గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఇవి పూర్తిగా పబ్లిక్ పరీక్షల నమూనాలో ఉంటాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

హాజరు తప్పనిసరి.. పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 9 నుంచి 17వ తేదీ వరకు ప్రీ పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. వాటి ఫలితాలను ప్రకటించాక విద్యార్థులకు వచ్చిన మార్కులను బట్టి వెనుకబడిన సబ్జెక్టులు, పాఠ్యాంశాల్లో పది రోజులపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఇప్పుడు నిర్వహించే గ్రాండ్ టెస్టుల ఫలితాలను బట్టి మార్చి 16 నుంచి జరిగే పబ్లిక్ పరీక్షల నాటికి మరో మారు విద్యార్థులకు తర్ఫీదు ఇస్తారు. ఈ పరీక్షలకు విద్యార్థులంతా తప్పనిసరిగా హాజరు కావాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

షెడ్యూలు ఇలా.. 2న తెలుగు, 4న హిందీ, 5న ఆంగ్లం, 6న గణితం, 7న భౌతిక శాస్త్రం, 9న జీవశాస్త్రం, 10న సాంఘిక శాస్త్రం పరీక్షలు జరగనున్నాయి. భౌతిక, జీవ శాస్త్రం పరీక్షలు మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 గంటల వరకు, మిగిలినవి మధ్యాహ్నం 1.30 నుంచి 4.45 గంటల వరకు జరగనున్నాయి.

తొమ్మిదో తరగతికి ఎస్‌ఏ- 2.. సోమవారం నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఎస్ఏ 2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఇవి పూర్తయిన వెంటనే పదో తరగతికి సంబంధించి బ్రిడ్జి కోర్సు తరగతులు ప్రారంభమవుతాయి.

లోసరి వంతెనపై ఊచలు తేలి.. ముత్యాలపల్లిలో విరిగిన స్తంభం

లేదు.. నా సేతుల్లో

216వ నంబరు జాతీయ రహదారిలో భీమవరం మండలం లోసరి నుంచి నరసాపురం మధ్య పలు వంతెనలపై రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల ఊచలు పైకి తేలడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ముత్యాలపల్లి వద్ద రహదారి పక్కన విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. **- ఈనాడు, నరసాపురం**

గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 11 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. అయిదో తరగతిలో ప్రవేశానికి 1,674 మంది దరఖాస్తు చేసుకోగా.. 1396 మంది హాజరయ్యారు. 278 మంది పరీక్ష రాయలేదు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశ పరీక్షకు 2,141కి 1,943 మంది హాజరయ్యారు. 198 మంది గైర్హాజరయ్యారు. ఐఐటీ, నీట్ కోచింగ్ పరీక్షకు 1,602కి 1,411 మంది హాజరయ్యారు. 191 మంది గైర్హాజరయ్యారని జిల్లా సమన్వయకర్త ఎన్.భారతి తెలిపారు.

వేసవి మొదట్లోనే మంటలు | 6లో | ఇంటి పన్ను పేరిట పింఛను కోత

నేటి నుంచి దూరవిద్య..

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీవోఎస్ఎస్) దూరవిద్య ఇంటర్ వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 13 వరకు కొనసాగనున్నాయి. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 4 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏలూరు తూర్పు వీధి, గాంధీనగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలు, జిల్లా కేంద్ర కారాగారం, చింతలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. మొత్తం 736 మంది విద్యార్థులు హాజరు కానున్నారని విద్యా శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆటకు లేదు చోటు!

ప్రైవేటు బడుల్లో మైదానాలు కరవు

ప్రభుత్వ ఉత్తర్వుల అమలైతే మేలు

పాలకొల్లు పట్టణ పరిధిలో దాదాపు 20 వరకు ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో మూడు, నాలుగింటికి మాత్రమే క్రీడా మైదానాలున్నాయి. వాటిలోనూ క్రీడల నిర్వహణ మొక్కుబడి తంతే. బాలల దినోత్సవం, పండగలు, వేడుకల సమయంలో మాత్రం ఒకటి రెండు పోటీలు పెట్టి మమ అనిపిస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 90 శాతం ప్రైవేటు పాఠశాలల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

పాలకొల్లు, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల్లో రోజంతా పాఠాలు, పుస్తకాలతో విద్యార్థులపై ఒత్తిడి పెంచుతూ వారి మానసిక వికాసం, ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదనే అంశం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు వచ్చింది. దీనిపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ ప్రైవేటు పాఠశాలల్లోనూ క్రీడలకు తగు సమయం కేటాయించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైతే సమీప ప్రభుత్వ పాఠశాలల మైదానాలు వినియోగించుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని విద్యాశాఖకు సూచించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో క్రీడల పరిస్థితి మెరుగయ్యేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

బాలల ఆరోగ్యానికి భరోసా.. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ విద్య కొనసాగుతోంది. తాజా ఉత్తర్వుల ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లోనూ క్రీడలను తప్పనిసరి చేయడంతో బాలల ఆరోగ్యానికి భరోసా లభించనుంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు నిత్యం ఒక పిరియడ్‌ను క్రీడలకు కేటాయిస్తే పిల్లల మానసిక, శారీరక వికాసానికి దోహదపడుతుందని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధి రేలంగి రామకృష్ణ తెలిపారు.

ఆరోగ్య విద్య.. నిత్యం ఉదయం అసెంబ్లీ సమయంలో పది నిమిషాల పాటు విద్యార్థులతో ధ్యాన సాధన చేయించాల్సి ఉంటుంది. వారంలో ఒకసారి యోగ, ఆరోగ్య విద్యపై ఒక తరగతి జరగాలి. సమతుల ఆహారం తీసుకోవడం, రక్తహీనత రాకుండా జాగ్రత్త పడటం వంటి అంశాలు తెలియజేయాల్సి ఉంది. వ్యసనాలు, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఈ అంశంపై డీఈవో నారాయణ స్పందిస్తూ అన్ని ప్రయివేటు పాఠశాలల్లో పిల్లలకు నిత్యం క్రీడలు నిర్వహించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని.. ఇప్పట్నుంచే ఈ ఉత్తర్వులు అమలు చేయాలని సూచించామని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో..
ప్రైవేటు పాఠశాలలు- 1,120
విద్యార్థులు- 2.45 లక్షలు (సుమారుగా)

(c) eenadu

గుప్తా ఫౌండేషన్ సేవలు నిరుపమానం

సత్యవతికి పురస్కారం అందజేస్తున్న అనిల్‌కుమార్, గుప్తా తదితరులు

ఏలూరు (గ్రామీణ, న్యూస్‌టుడే: సమాజ హితానికి గుప్తా ఫౌండేషన్ అందిస్తున్న సేవలు నిరుపమానమని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎ.అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యాన శ్రీకృష్ణమూర్తి సాహిత్య పురస్కార ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన రచయిత్రి పి.సత్యవతికి అనిల్ కుమార్, గుప్తా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మధుసూదన మోహన్‌గుప్తా పురస్కారం ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ.. సాహితీవేత్తలను గౌరవించడం ద్వారా సమాజానికి మంచి సందేశం ఇచ్చిన వారవుతామన్నారు. కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం అందుకోవడం ప్రయాణ మజిలీలో గొప్ప అనుభూతి అని సత్యవతి పేర్కొన్నారు. సత్యవతి రచనల్లోని లోతు, సామాజిక స్పృహను కాలిఫోర్నియా ఆరియా విశ్వవిద్యాలయం తెలుగు ఛైర్‌పర్సన్ ఆచార్య చుండూరి మృణాళిని వివరించారు.

రేపటి నుంచి గుడివాడ రైల్వే గేటు మూత

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గుడివాడ నుంచి ముదినేపల్లి వెళ్లే రహదారిలోని మల్లయ్యపాలెం వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా ఈ నెల 3 నుంచి నాలుగు రోజుల పాటు గేటు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుడివాడ నుంచి ముదినేపల్లి, కైకలూరు, కలిదిండి, భీమవరం, బంటుమిల్లి వెళ్లే వాహనాలు, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సూచించారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్నా విజయవంతానికి పిలుపు

పవరుపేట(ఏలూరు విద్యా విభాగం), న్యూస్‌టుడే: విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 3న కలెక్టరేట్ ఎదుట నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్-1938 రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జి.కృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక పవరుపేట నగరపాలకోన్నత పాఠశాలలో ఆదివారం సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చాలని పలుమార్లు పాలకులు, అధికారులకు వినతులు అందజేసినా స్పందించలేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ధర్నాకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. 11వ పీఆర్సీ బకాయిలు విడుదల చేయాలని, 12వ పీఆర్సీని నియమించాలని సంఘ జిల్లా అధ్యక్షుడు ఈ.రామ్మోహన్ డిమాండ్ చేశారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. సంఘ నాయకులు జి.మోహన్, జి.శ్రీనివాసరావు, ఎన్‌వీ దుర్గారావు, జి.ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ఏలూరు (గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు బార్ అసోసియేషన్‌లో ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చుక్కపల్లి రమేశ్(జిల్లా కోర్టు పీపీ గుంటూరు), ప్రధాన కార్యదర్శిగా జీవీఎస్ ప్రసాద్(ఏపీపీ పల్నాడు జిల్లా), గౌరవాధ్యక్షుడు కుసులూరి శివరామకృష్ణ(ఎనిమిదో అదనపు జిల్లా అడిషనల్ పీపీ తాడేపల్లిగూడెం), కోశాధికారిగా ఇలపకుర్తి రాజశేఖర్(అదనపు పీపీ ఫ్యామిలీ కోర్టు ఏలూరు), కార్యనిర్వాహక కార్యదర్శిగా అంబుల వెంకటనారాయణ(జిల్లా కోర్టు పీపీ ఏలూరు), మహిళా ప్రతినిధిగా సీహెచ్ గీతా పూర్ణిమ(అదనపు జిల్లా పీపీ విజయవాడ) ఎన్నికయ్యారు.

దేశభక్తి.. సేవా దీప్తి

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో రాణిస్తున్న విద్యార్థులు

నూజివీడు, న్యూస్‌టుడే: చదువు, క్రమశిక్షణ, సమాజంపై బాధ్యత, సేవాభావం పెంపొందేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపకరిస్తోంది. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సేవలు అందిస్తున్నారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు పి.వి.రమణ ప్రోత్సాహంతో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు జి.సురేశ్‌బాబు, వై.మౌనిక శిక్షణ అందిస్తున్నారు.

కార్యక్రమాలు ఇవీ..

పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి వాటి పర్యవేక్షణ, దేవాలయాల వార్షికోత్సవాలు, వివిధ వేడుకల సమయంలో వచ్చే భక్తులకు క్యూలైన్లలో వేళ్లేలా పర్యవేక్షించడం, తాగునీరు, మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేస్తారు. స్వాతంత్ర్య దినోత్సవాలు, రిపబ్లిక్ డే తదితర కార్యక్రమాల్లో భాగస్వాములవుతారు.

ఐపీఎస్ కావాలన్నదే ధ్యేయం..

నా పేరు వి.జెస్సిక, 8వ తరగతి చదువుతున్నా. మా ఊరు అడవినెక్కలం. రెండేళ్లుగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సేవలు అందిస్తున్నా. దీని ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు విలువలు, క్రమశిక్షణ పెంపొందించుకుంటున్నా. ఐపీఎస్ కావాలన్నదే నా లక్ష్యం.

నాయకత్వ లక్షణాలు..

నా పేరు టి.హేమలత. మాది నెక్కలం గొల్లగూడెం గ్రామం. ఏడో తరగతి చదువుతున్నా. ఏడాదిగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సేవలు అందిస్తున్నాను. దీనిలో చేరడం వల్ల నాయకత్వ లక్షణాలు అలవడతాయి. సమయ నిర్వహణ, ధైర్యం, ప్రణాళిక బద్ధంగా పని చేసే నైపుణ్యాలు అలవర్చుకున్నాను. పోలీస్ అధికారిణి అవుతా.

బాధ్యతలపై అవగాహన

ఎం.ప్రేమ్‌సాయి నా పేరు. ఆరవిల్లి ఖిలం గ్రామం. ఏడో తరగతి చదువుతున్నా. ఏడాదిగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సేవలు అందిస్తున్నాను. దీనిలో చేరడం వల్ల సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటా.. పౌరుల బాధ్యతను అర్థం చేసుకుంటున్నాను. మంచి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా.

చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ..

నా పేరు ఎస్.శివనాగరాజు, మాదలవారిగూడెం గ్రామం. 8వ తరగతి చదువుతున్నా. రెండు సంవత్సరాలుగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సేవలు అందిస్తున్నా. దీనిలో చేరడం వల్ల నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ పొందుతూ.. చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించడానికి చక్కని అవకాశం లభించింది.

వ్యక్తిత్వ వికాసానికి దోహదం..

విద్యార్థి దశలోనే వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది. పాఠశాలలు, గ్రామం, ఇతర ప్రాంతాల్లో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడతాయి. సమాజంలో ఎలా ప్రవర్తించాలి, పౌరుల బాధ్యతలపై అవగాహన కలుగుతుంది.

- పి.ఎన్.సుధాకర్, డీవైఈవో, నూజివీడు

మావుళ్లమ్మ సేవలో 'బ్యాండ్ మేళం'

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఈ నెల 13న విడుదల కానున్న 'బ్యాండ్ మేళం' చిత్ర బృంద సభ్యులు మావుళ్లమ్మను ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సినిమా ప్రచారంలో భాగంగా అమ్మవారి ఆలయానికి వచ్చినట్లు హీరో, హీరోయిన్ హర్ష రోషన్, శ్రీదేవి, దర్శకుడు సతీష్, మాటల రచయిత, నిర్మాత కోన వెంకట్ తెలిపారు.

ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఎంపిక

ఉంగుటూరు, కొయ్యలగూడెం గ్రామీణ, తాడేపల్లిగూడెం పట్టణం- న్యూస్‌టుడే: విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆసక్తి పెంపొందించే ఉద్దేశంతో కేంద్ర శాస్త్రసాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించే ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఏలూరు జిల్లా నుంచి 101, పశ్చిమ నుంచి 71 ఆలోచనలు అర్హత సాధించాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు ప్రాజెక్టులు ఆలోచనలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీటిలో మెరుగైన వాటిని ఎంపిక చేసి విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున ప్రోత్సాహం అందజేస్తారు. ఈ నగదుతో వారు ప్రాజెక్టు తయారు చేసి.. జిల్లా స్థాయిలో ప్రదర్శిస్తారు. అక్కడ ప్రతిభ చాటితే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

గురుద్వారా, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగంగా పరిష్కరించే లక్ష్యంతో విశాఖలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 11 జిల్లాలకు చెందిన వినియోగదారులు 86884 00499 ఫోన్ నంబర్‌కు ఉదయం 10.30 నుంచి 11.30 వరకు తమ సమస్యలను తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని సీఎండీ ప్రకటించారు. ఈ అవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వేసవి మొదట్లోనే మంటలు

- పశ్చిమలో 38.. ఏలూరులో 36 డిగ్రీలు
- ఇప్పుడే ఇలా ఉంటే.. మే లో ఎలా?

కుక్కునూరు, న్యూస్‌టుడే: వేసవి ముంగిట్లోనే మంటలు మండిస్తున్నాయి. పశ్చిమలో ఎప్పుడూ పచ్చదనం, సౌగనీటి సవ్వడులతో చల్లగా ఉండాల్సిన వాతావరణం అందుకు భిన్నంగా మారింది. ఆ జిల్లాలోని పోడూరులో అత్యధికంగా 38.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావటం గమనార్హం. ఏలూరు జిల్లాలో అత్యధికంగా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో 35.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ల ద్వారా శనివారం ఉదయం 8.30 నుంచి ఆదివారం ఉదయం 8.30 వరకు నమోదైన ఉష్ణోగ్రతల వివరాలను పరిశీలించినపుడు జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఇలా నమోదయ్యాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండల పరిస్థితి తలచుకొని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది. వేసవి ఆరంభంలోనే ఈ స్థాయిలో ఉంటాయని ఎవరూ ఊహించలేదు. ఉమ్మడి జిల్లా అంతటా ఎండలు మండుతూనే ఉన్నాయి. మండే ఎండలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పశ్చిమలో, మెట్టప్రాంతం ఏలూరు కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావటం గమనార్హం.

శీతలం నుంచి ఉష్ణంలోకి.. చలి క్రమేపీ తగ్గుతూ ఉష్ణోగ్రతలు నెమ్మదిగా పెరుగుతూ వస్తుంటాయి. ఈ ఏడాది చలి తగ్గడం, ఉష్ణోగ్రత గరిష్ఠ స్థాయిలకు చేరటం ఒకేసారి జరిగింది. దీంతో చలికాలం ఎప్పుడు ముగిసిందో.. ఎండకాలం ఎప్పుడు మొదలైందో కూడా తెలియకుండానే వేసవి వచ్చేసింది. అకస్మాత్తుగా ఎండలు పెరగటంతో, విద్యుత్తు వినియోగం ఒకేసారి పెరిగిపోయింది.

పశ్చిమ, ఏలూరు జిల్లాల్లో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతల వివరాలు ఇలా ఉన్నాయి..

పశ్చిమ మండలం	ఏలూరు ప్రాంతం	నమోదైన ఉష్ణోగ్రత
పోడూరు	పోడూరు	38.1
తాడేపల్లిగూడెం	తాడేపల్లి	35.7
ఆచంట	ఆచంట	35.0
భీమవరం	గొల్లవానితిప్ప	34.1
తణుకు	దువ్వ	33.4
లింగపాలెం	ధర్మాజీగూడెం	35.9
చింతలపూడి	అల్లిపల్లి	35.5
చింతలపూడి	చింతలపూడి	35.3
కొయ్యలగూడెం	గవరవరం	33.9

ఐక్యతతో ప్రగతి పథం: నిమ్మల

గ్రామస్థులతో కలిసి శ్రమదానం చేస్తున్న మంత్రి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఐక్యతా స్ఫూర్తిని పెంపొందించేలా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం ఆగర్తిపాలెం గ్రామంలో శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి పునాదుల తవ్వకం పనుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో గ్రామంలో ప్రతి ఇంటి నుంచి ఒకరు స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. గ్రామస్థులంతా కలిసికట్టుగా ఉంటే పల్లెలు ప్రగతి బాటలో పయనిస్తాయన్నారు.

శ్రీవారి ఆలయంలో కొనసాగిన భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. సెలవు రోజు కావడంతో రాష్ట్ర నలు మూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే శ్రీవారి దర్శన క్యూలు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం క్యూలు, కేశఖండనశాల వద్ద భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శనమిచ్చారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుబ్బలమంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చెట్ల కింద కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు.

అంగన్‌వాడీల మహా ధర్నా

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం విజయవాడలో మహా ధర్నా చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ తెలిపారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకుండా, సమస్యలు పరిష్కరించకుండా మంత్రులు అసత్య ప్రకటనలు చేయడం మానుకోవాలన్నారు. మహా ధర్నాను విఫలయత్నం చేసేందుకు అంగన్‌వాడీల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీలిస్తుండటం దుర్మార్గమన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు 42 రోజుల సమ్మె చేసిన కాలంలో.. చంద్రబాబు ఎన్నో వాగ్దానాలు చేశారని, వాటిని నెరవేర్చాలని వారు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా నిల్వలు

రూ.30 లక్షల విలువైన సరకు సీజ్

పెదపాడు, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుళ్ల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏపూరులోని లక్ష్మీనారాయణ క్రాకర్స్ గోదాము, విక్రయ దుకాణాలపై ఆదివారం ఎస్సై ఆర్.శ్రీను ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన సుమారు రూ.30 లక్షల విలువైన బాణసంచాను గుర్తించారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో యజమాని పైడి సుధాకర్‌పై కేసు నమోదు చేశారు. అగ్నిమాపక శాఖాధికారి నాగరాజు, పౌరసరఫరాల శాఖ డీటీ రామారావు, వీఆర్వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం దొరమామిడి సమీపాన ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం ఆకుల గణపవరం గ్రామానికి చెందిన మొరిగిపూటి నాని(19) వర్జీనియా పొగాకు పనుల నిమిత్తం దొరమామిడి వచ్చాడు. బుట్టాయగూడెం- దొరమామిడి వైపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదానికి గురైనట్లు భావిస్తున్నారు. ఘటన స్థలంలో నాని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రమాదానికి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యూట్యూబర్‌పై కేసు

మాట్లాడుతున్న మహిళా నాయకులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: తనపై ఓ యూట్యూబర్ అఘాయిత్యానికి పాల్పడ్డాడంటూ ఓ మహిళ జంగారెడ్డిగూడెం పోలీసులను ఆదివారం ఆశ్రయించారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఓ మహిళ.. ఎంసీ మీడియా పేరుతో యూట్యూబ్ ఛానల్‌ను నడుపుతున్న మిథున్ వద్దకు ఓ సమస్య నిమిత్తం శనివారం వెళ్లారు. ఆమెపై సదరు వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడంటూ మహిళ ఆదివారం జంగారెడ్డిగూడెం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై వీర ప్రసాద్ కేసు నమోదు చేయగా.. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎంవీ సుభాశ్ తెలిపారు. ఇదిలా ఉండగా బాధిత మహిళకు న్యాయం చేయాలంటూ పలువురు మహిళలు ర్యాలీగా వెళ్లి ఏఎస్పీ సుస్మితను కలిసి వినతిపత్రం అందించారు. సమగ్ర దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పీసుపాటి రామలక్ష్మి, పాకనాటి ఝాన్సీరాణి, దారా జ్యోతి, గుళ్లపూడి శ్రీదేవి, షేక్ హసీనా తదితరులు పాల్గొన్నారు.

వదిలేస్తే.. పుట్టమా.. కుట్టమా!

➠ 300 మంది జనాభా ఉండే పాలకొల్లు శివారు చిత్రాయిచెరువు ప్రాంతంలో మురుగు నిలిచిపోవడంతో ఇటీవల దోమలు విజృంభించాయి. రేయింబవళ్లు వాటి కాట్లతో స్థానికులు నరకరం అనుభవిస్తున్నారు. సుమారు 50 మంది చిన్నారులకు ఒంటిపై దద్దుర్లు వచ్చి అస్వస్థతకు గురయ్యారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

పాలకొల్లు, ఆకివీడు, న్యూస్‌టుడే: పట్టణాల నుంచి పల్లెల వరకు దోమల నివారణ చర్యలు మొక్కుబడి తంతులా మారాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అన్ని ప్రాంతాల్లో దోమల బెడద విపరీతంగా పెరిగిపోయింది. వీటి కాట్లతో ప్రజలే కాదు పశువులు సైతం విలవిల్లాడుతున్నాయి. పాడి గేదెలకు దోమకాట్లతో పాల ఉత్పత్తి తగ్గిపోయిందని యలమంచిలి మండలం ఊటాడకు చెందిన రైతు కవురు సత్యనారాయణ వాపోయారు. గత నెల 24న జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురవడంతో ఒక్కసారిగా దోమల బెడద పెరిగిందని పురపాలక అధికారులు చెబుతున్నారు.

దోమల బెడదతో ప్రజలు బెంబేలు

➠ ఆకివీడు నగర పంచాయతీలో 45 వేల జనాభా ఉండగా రెండు ఫాగింగ్ యంత్రాలు మాత్రమే ఉన్నాయి. అయిదు సచివాలయాల పరిధిలో నాలుగు చొప్పున వార్డులుండగా రెండు యంత్రాలతో ఫాగింగ్ చేయడం ఎలా సాధ్యమో అధికారులకే తెలియాలి. నెలకోసారి కూడా ఫాగింగ్ చేస్తున్న దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు.

మొక్కుబడి తంతుగా ఫాగింగ్

అలంకార ప్రాయం

పట్టణాలు, పంచాయతీలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా గతంలో ఫాగింగ్ యంత్రాలు పంపిణీ చేయగా నిర్వహణ భారంతో వాటిలో చాలా వరకు మూలకు చేరాయి. మలేరియా నిర్మూలన విభాగం ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం నిర్వహించాల్సిన డ్రైడే నామమాత్రంగా సాగుతోంది. మురుగు కాలువల్లో చమురు బంతులు వేయడం, ఖాళీ స్థలాల్లోని నీటిమడుగుల్లో గంబూషియా చేపలు వదలడం వంటి చర్యలు దాదాపు కనుమరుగయ్యాయి. ఈ అంశంపై జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి గీతాబాయి స్పందిస్తూ పాలకొల్లు ప్రాంతంలో శుక్రవారం క్షేత్ర పరిశీలన చేసి దోమకాట్లతో ఒంటిపై దద్దుర్లు వచ్చిన వారికి పరీక్షలు చేయించామన్నారు. రక్త నమూనాలను ఏలూరులో ల్యాబ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరించిన విజయకుమార్, పూర్ణచంద్రరావు తదితరులు

ఉద్యమాలతోనే బీసీలకు రాజ్యాధికారం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉద్యమాలతోనే బీసీలకు రాజ్యాధికారం సొంతమవుతుందని బీసీ ఐకాస నాయకుడు, ఐఏఎస్ విశ్రాంత అధికారి విజయకుమార్, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ జాతీయ సమన్వయకర్త, విశ్రాంత డీజీపీ పూర్ణచంద్రరావు అన్నారు. నగరంలోని సాహిత్య మండలిలో బీసీ చైతన్య వేదిక, బీసీ కుల సంఘాల ఐకాస ఆధ్వర్యాన ఆదివారం బీసీ మేధోమథన సభ నిర్వహించారు. బీసీ చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ.. బీసీలకు స్థానిక సంస్థల్లో 52 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల రక్షణకు ప్రత్యేకంగా చట్టం తేవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కుల గణన చేపట్టాలన్నారు. జూన్ 3న విజయవాడలో బీసీల సమావేశం నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున బీసీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. బీసీ కుల సంఘాల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్వీఆర్ విఠల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల శ్రమదానం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో భాగంగా ఏఐఎస్ఎఫ్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకులు స్థానిక అమీనాపేటలోని బాలికల వసతి గృహంలో ఆదివారం శ్రమదానం చేశారు. ప్రాంగణంలోని మురుగు కాలువల్లో పూడిక తీశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఎం.యామిని మాట్లాడుతూ.. బాలికల వసతి గృహం పరిసరాలు అధ్వానంగా ఉండటంతో విద్యార్థినులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. తమవంతు బాధ్యతగా శ్రమదానం చేసినట్లు పేర్కొన్నారు. ఆయా సంఘాల నాయకులు సాధిక్‌బాబు, డి.శివకుమార్, సిద్ధు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

హాజరు నమోదుపై ఒత్తిడి తగదు: పీఆర్‌టీయూ

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల హాజరు నమోదుపై ఒత్తిడి తగదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా గైర్హాజరుగా పరిగణిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మార్గదర్శకాల్లో పేర్కొనడం సమంజసం కాదన్నారు. గత మార్గదర్శకాల ప్రకారం ఇప్పటి వరకు అమల్లో ఉన్న 10 నిమిషాల అదనపు సమయాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ హాజరు నమోదు యాప్ సక్రమంగా పని చేయని సందర్భాల్లో ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం తగదని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ

ఇ. ప్రొక్యూర్‌మెంట్ నోటీసు (2వ పిలుపు)

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా మల్లిపూడి గ్రామం, పెనుమంట్ర మండలం, పశ్చిమగోదావరి జిల్లా నందు గల శ్రీ మదన గోపాల స్వామి వారి దేవాలయము నందు గల వాహనశాలను పునర్నిర్మించుటకు రూ. 15.00 లక్షలకు టెండరు పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్ సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

సం/- కార్యనిర్వహణాధికారి

ఆరోగ్యకర మాంసం ఉత్పత్తులు విక్రయించండి

దుకాణాన్ని పరిశీలిస్తున్న ప్రకాశ్‌నాయుడు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజారోగ్య పరిరక్షణకు శుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకర మాంసం ఉత్పత్తులు విక్రయించాలని ఏపీ మాంసాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రకాశ్ నాయుడు సూచించారు. నగరంలోని అంబికా థియేటర్ కూడలి, చేపల తూముల కూడలి, ఆదివారపుపేట చిన్న మార్కెట్‌లోని మాంసం దుకాణాలపై ఆదివారం తనిఖీ చేశారు. జీవాలను ఎక్కణ్నుంచి తీసుకొస్తున్నారు? మాంసం వ్యర్థాలు ఎక్కడికి తరలిస్తున్నారు? తదితరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటించని దుకాణాలకు జరిమానా విధిస్తామన్నారు. వ్యర్థాలు కాలువలు, చెరువులు, ఏటి గట్లు, రహదారుల అంచుల్లో పడేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీ మీట్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రవీణ్, అదనపు కమిషనర్ డి.శ్రీనివాసరావు, పశు వైద్యాధికారి ఉదయ్‌కుమార్, ఆహార భద్రత అధికారి కె.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏటి గట్టు పనుల పరిశీలన

ఈనాడు కథనానికి స్పందన

పాలకొల్లు, న్యూస్‌టుడే: యలమంచిలి మండలం గంగడపాలెం- అబ్బిరాజుపాలెం గ్రామాల మధ్యలో జరుగుతున్న ఏటిగట్టు పనుల్లో లోపాలపై 'లోగుట్టు.. నాణ్యత తీసిగట్టు' శీర్షికతో గత నెల 28న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఏటి గట్ల పరిరక్షణ శాఖ అధికారులు స్పందించారు. పనులు జరుగుతున్న ప్రాంతాలను ఆదివారం పరిశీలించిన నరసాపురం ఏఈ పవన్ మట్టిలో వ్యర్థాలను పూర్తిగా తొలగించిన తర్వాతే రోలింగ్ చేయాలని గుత్తేదారును ఆదేశించారు.

ఇంటి పన్ను పేరిట పింఛను కోత

ఆశన్నగూడెం(చింతలపూడి), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఒక రోజు ముందుగానే సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్న పింఛనుదారులకు సచివాలయ సిబ్బంది షాక్ ఇస్తున్నారు. పింఛను సొమ్మును ఇంటి పన్నులకు మినహాయిస్తుండటంతో పింఛనుదారులు నివ్వెరపోతున్నారు. లింగపాలెం మండలం ఆశన్నగూడెం, బాదరాల పంచాయతీల్లో సుమారు 300కు పైగా పింఛనుదారులు ఉన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీకి ముందే వృద్ధులు, వితంతువుల ఇంటికి వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందిస్తున్నారు. ఈ నెలాఖరులోపు పన్నులు పూర్తిగా వసూలు చేయాలని సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి పెరగడంతో చేసేదేం లేక వీరు పింఛను డబ్బుల నుంచి పన్ను మినహాయించి ఇస్తున్నారు. దాదాపు సగం మంది లబ్ధిదారుల నుంచి 50 శాతం పైగా మినహాయించి ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.

లబ్ధిదారుల గగ్గోలు..

ప్రతి నెలా మందులు, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు పింఛను డబ్బు వినియోగిస్తున్నామని, పన్ను పేరిట మినహాయించడం ఎంత వరకు సబబని పింఛనుదారులు ప్రశ్నిస్తున్నారు. పింఛను మొత్తం నుంచి పన్నుల పేరిట మినహాయించాలని ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేకపోయినా సచివాలయ సిబ్బంది ఈ విధంగా చేయటంపై పింఛనుదారులు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై ఎంపీడీవో వాణిని సంప్రదించగా పింఛనుదారులకు పూర్తి మొత్తం పింఛను ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. పన్నుల కోసం పింఛను సొమ్ము మినహాయించడంపై సచివాలయ సిబ్బందిని వివరణ కోరతామన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -150 రిటైల్ ధర 177 చికెన్ విత్ స్కిన్ - 257 చికెన్ స్కిన్‌లెస్ - 292. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

92.7 FM Rajamahendravaram

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

LAND FOR SALE

ఏలూరు చాటపర్రు మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న సుమారు 7 ఎకరముల పొలం అమ్మకమునకు కలదు. సంప్ర॥ శ్రీమతి ఆచంట రజని, ✆ +16303867373.

2 ఎకరాల 20 సెంట్లు చేపల చెరువు అమ్మకం. దొడ్డనపూడి గ్రామం కాళ్ల మండలం, భీమవరం, ప. గో. జిల్లా సెల్: 8500405678, 9885912559

JOBS

Wanted Pharma.D, B.Sc. Nursing ANM, GNM Staff to work in reputed hospital in Bhimavaram with attractive Salaries. Cont: 93982 32949.

ఉద్యోగం: East&West జిల్లాల్లో ప్ర॥ కంపెనీలకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, టెలీకాలర్స్ స్త్రీ/పు. కావలెను. జీతం, రూం+భోజనం ఫ్రీ. R.S. సర్వీసెస్, RJY, 99633 27756.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 4.58 పైII

తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం CLASSIFIEDS

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

చంద్రగ్రహణం ప్రభావం.. ఆలయాల మూసివేత రేపు

పెదపాడు, న్యూస్‌టుడే: సంపూర్ణ చంద్ర గ్రహణం కారణంగా అప్పనవీడు అభయాంజనేయ స్వామి ఆలయాన్ని మంగళవారం మూసివేస్తున్నట్లు కార్యనిర్వాహణాధికారి టి.తారకేశ్వరరావు తెలిపారు. సంప్రోక్షణ అనంతరం బుధవారం ఉదయం ఆలయాన్ని తిరిగి తెరుస్తామన్నారు. భక్తులు గమనించి సహకరించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● పెదవేగి మండలం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయాన్ని మంగళవారం మూసివేస్తున్నట్లు ఆలయ ఈవో ఎన్.సతీశ్‌కుమార్ తెలిపారు. మరుసటి రోజు ఉదయం తిరిగి తలుపులు తెరుస్తామని చెప్పారు. ఆ తర్వాత భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తామని ఆయన పేర్కొన్నారు.

పకడ్బందీగా మహిళా చట్టాల అమలు: ఏఎస్పీ

మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, పోలీసులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు తెలిపారు. మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా.. నగరంలో ఆదివారం భారీ ప్రదర్శన చేపట్టారు. 'మహిళా శక్తికి వందనం' నినాదంతో పోలీసు సంక్షేమ భవనం నుంచి అగ్నిమాపక కేంద్రం కూడలి వరకు ర్యాలీ సాగింది. పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

తిరిగిరాని.. మరపురాని గుర్తులండి!

నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పాఠశాలలో 37 ఏళ్ల కిందట పదో తరగతి అభ్యసించిన వారంతా ఒకచోట కలిశారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఆర్.రామకృష్ణంరాజు, కె.నాగేశ్వరరావు, కె.కృష్ణారావు, కె.రామసుబ్బారావు, పి.రామారావు, వేగిరెడ్డి లక్ష్మణరావు, శాంత కుమారిలను సన్మానించారు. వారికి నూతన వస్త్రాలు, శాలువా, పూలమాలలు, జ్ఞాపికలు అందజేసి గురు భక్తిని చాటుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ ప్రసాద్, పూర్వ విద్యార్థులు ప్రసాద్, సాయిశ్రీనివాస్, సూర్యరాజు, రాంబాబు, రామినాయుడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు అండ.. ఆర్థిక పూదండ!

వరంగా ప్రధానమంత్రి మాతృ వందన యోజన

నా పేరు బొమ్ము ఉదయ మహాలక్ష్మి. మాది భీమడోలు గ్రామం. మాతృవందన పథకం పేదలకు వరం. గర్భిణులకు నిర్ణీత సమయంలో ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్నారు. ప్రసవానికి ముందే ఆర్థికసాయం అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గుడ్లు, పప్పులు, బియ్యం ఇస్తున్నారు. తొలి విడతగా నా బ్యాంకు ఖాతాకు రూ.3 వేలు జమ చేశారు.

ఏలూరు వన్‌టౌన్, ఉంగుటూరు, భీమడోలు - న్యూస్‌టుడే

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయి. ప్రసవానంతరం బిడ్డలకు పోషకాహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి మాతృ వందన యోజన సత్ఫలితాలిస్తోంది. ఈ పథకాన్ని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తోంది. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి.. లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తోంది.

రెండు విడతల్లో రూ.5 వేలు.. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేకంగా లాగిన్ కేటాయించారు. వారు ఆయా కేంద్రాల్లోని గర్భిణుల వివరాలు నమోదు చేస్తున్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి తొమ్మిది నెలలోపు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. రేషన్ కార్డు, బ్యాంకు ఖాతాలున్న గర్భిణులు అర్హులే. రిజిస్ట్రేషన్ పూర్తయిన మూడ్నెల్ల తర్వాత రూ.3 వేలు, బిడ్డ పుట్టిన తర్వాత టీకాలు వేయించిన అనంతరం మరో రూ.2 వేలు జమ చేస్తారు. మొదటి కాన్పులో ఆడ బిడ్డ జన్మిస్తే పథకం వర్తిస్తుంది.

భీమడోలులో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న సిబ్బంది

మహిళలకు ఆర్థిక భరోసా.. మూడు ప్రాజెక్టుల పరిధిలో 1,154 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 823 మంది ఖాతాల్లో నగదు జమయ్యింది. మరో 331 మందికి సీఎఫ్ఎంఎస్ ఐడీ వచ్చాక.. వారి ఖాతాల్లోనూ నగదు జమవుతుందని ఏలూరు అర్బన్, భీమడోలు సీడీపీవోలు పద్మావతి, రాజశేఖర్ తెలిపారు.

మూడు నియోజకవర్గాల వివరాలిలా..

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారులు	గర్భిణులు/ బాలింతలు
ఏలూరు అర్బన్	205	10,355	2,500
పెదపాడు	241	11,043	1,076
భీమడోలు	196	8,046	1,507

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

నిడమర్రు, న్యూస్‌టుడే: ? నిడమర్రు ఎంపీపీ పాఠశాల సమీపం రహదారిపై మురుగు నిలిచిపోతోంది. పిల్లలు మురుగులోంచి నడుచుకుంటూ బడికి వెళ్తున్నారు. **- వెంకటేశ్వరరావు, స్థానికుడు**

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మురుగు తొలగిస్తాం. మరో మారు రోడ్డుపై రాకుండా చూస్తాం. **- సంజీవరావు, పంచాయతీ కార్యదర్శి**

? దేవరగోపవరం కాలనీలో సీసీ రోడ్డు నిర్మించారు. ఎక్కడా డ్రెయిన్లు లేకపోవడంతో.. మురుగు నిలిచిపోతోంది. **- రాముడు**

✔ డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరవ్వగానే పనులు చేపడతాం. **- విజయకుమారి, ఎంపీడీవో**

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: ? జాతీయ రహదారి నుంచి అమ్మపాలేనికి రహదారి గుంతలమయంగా మారింది. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడుతున్నారు. **- సుధాకర్**

✔ సమస్య నా దృష్టికి రాలేదు. రహదారిని పరిశీలించి, మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. **- శ్రీకర్, ర.భ.శా. డీఈ**

జనసేనానికి ప్రజల్లో మరింత ఆదరణ

పార్టీలో చేరిన వారితో ధర్మరాజు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. స్థానిక విడిది కార్యాలయంలో అక్కుపల్లిగోవరానికి చెందిన పలువురు ఆదివారం జనసేనలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ రోజురోజుకూ బలపడుతోందన్నారు. జనసేనలో పెద్దఎత్తున చేరికలే ఇందుకు నిదర్శనమన్నారు. పల్లెల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ మంత్రిగా పవన్ కల్యాణ్ గ్రామాల సమగ్ర ప్రగతికి తోడ్పాటునిస్తున్నారని కొనియాడారు. నాయకులు సూరత్తుల అయ్యప్ప, నెరుసు శ్రీను, ఇల్లిందుల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తాం

సంఘ నాయకులతో చర్చిస్తున్న చంటి

పవరుపేట(ఏలూరు అర్బన్), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యలన్నిటినీ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి. పవరుపేట విడిది కార్యాలయంలో ఆదివారం అంగన్‌వాడీ కార్మిక సంఘ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల డిమాండ్లను దశలవారీగా నెరవేర్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఇందుకు సామరస్య వాతావరణంలో చర్చించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, సంఘ నాయకుడు బి.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆనంద నిలయానికి వితరణ

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఉంగుటూరులో ఆనంద నిలయం పేరిట ఏర్పాటు చేస్తున్న వృద్ధాశ్రమానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ 70 కుర్చీలు వితరణ చేసింది. నారాయణపురంలో ఆదివారం సంస్థ నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ఛైర్మన్ పుప్పాల గోపి చేతులమీదుగా ఆనంద నిలయం ట్రస్టు ఛైర్మన్ గుణ్ణం బుల్లెబ్బాయికి కుర్చీలు అందజేశారు. వృద్ధాశ్రమం అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అధ్యక్షుడు కోనే వీర వెంకట సత్యనారాయణ, సభ్యులు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, శీతాల సత్యనారాయణ, గురువెల్లి రాజారావు, పుసులూరి ప్రకాశ్ పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న పిల్లలు

దుగ్గిరాల(పెదవేగి), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల విడిది కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై దృష్టి సారించిందన్నారు. అన్ని కేంద్రాలకు తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ తదితర సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీల వేతనాలు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గ్రాట్యుటీ చెల్లింపులకు గత బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. ఎన్నికల హామీలన్నింటినీ ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం కార్యకర్తలు, సహాయకులకు తప్పకుండా న్యాయం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఒరిగాయి.. కబళించేలా ఉన్నాయి

నిడమర్రు పందికోడు వంతెన నుంచి దేవరగోపవరం వెళ్లే దారిలో విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. చేతికందే ఎత్తులో విద్యుత్తు తీగలు వెళ్తుండటంతో.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

దాతలిస్తారు.. మూలన పెడతారు

ఏలూరు రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వరాలయానికొచ్చే భక్తుల సౌకర్యార్థం ఓ దాత నీటి పరికరం అందజేశారు. అది చిన్నపాటి మరమ్మతుకు గురవడంతో.. మూలన పెట్టేశారు. భక్తులు దాహమేస్తే ఇబ్బంది పడుతున్నారు. పరికరాన్ని బాగు చేయిస్తామని ఈవో సతీశ్ కుమార్ తెలిపారు. **- న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం**

ఏళ్లుగా.. అసంపూర్తిగా!

భీమడోలు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గత ప్రభుత్వ హయాంలో రూ.2.10 కోట్ల అంచనా వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గత పాలకులు గుత్తేదారుకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో.. చివరి దశలో నిలిపివేశారు. **- న్యూస్‌టుడే, భీమడోలు**

రక్షణ కరవు.. ప్రమాద నెలవు

పెదపాడు పెదఇందిరమ్మ కాలనీ నుంచి కేశవరాయుడుపాలేనికెళ్లే దారిలో డ్రెయినేజీపై నిర్మించిన వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. రోడ్డు అంచున పూర్తిగా శిథిలమైంది. రాత్రివేళ ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు. **- న్యూస్‌టుడే, పెదపాడు**

ఇసుక దిబ్బ.. ఇబ్బందబ్బా!

గణపవరం శ్రీచింతలపాటి వరప్రసాద మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని నడక దారిపై ఇసుక వేశారు. దాన్ని పక్కకు తొలగించకపోవడంతో.. ఉదయం, సాయంత్రం వేళల్లో నడిచేందుకు పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఇసుక తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గణపవరం**

భద్రత లేక.. భరోసానివ్వక!

ఏలూరు ఒకటో పట్టణం గజవల్లివారి చెరువులోని బుద్ధా పార్కులో బోటు షికారు ప్రమాదకరంగా మారింది. సందర్శకులకు కనీస భద్రత కల్పించలేకపోతున్నారు. లైఫ్ జాకెట్లు లేకుండానే బోటు షికారుకు అనుమతిస్తున్నారు. కొన్ని బోట్లుకు రంధ్రాలు పడినా.. వాటిని బాగు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు నగరం**

శిరస్త్రాణంతో ప్రాణాలకు రక్ష

చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న రజనీకుమార్

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని.. ప్రమాద సమయంలో అదే ప్రాణాలు కాపాడుతుందని నిడమర్రు సీఐ రజనీకుమార్ అన్నారు. ఉంగుటూరు టోల్‌గేటు వద్ద ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శిరస్త్రాణం ధరించని చోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని విధిగా శిరస్త్రాణం ధరించాలని సూచించారు. అనంతరం 52 మందితో శిరస్త్రాణాలు కొనుగోలు చేయించారు. చేబ్రోలు ఎస్సై మామిడాల సూర్యభగవాన్, సిబ్బంది పాల్గొన్నారు.

గోతుల దారికి మోక్షం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: అక్కుపల్లిగోవరం నుంచి కంసాలిగుంట మీదుగా నల్లమాడు వెళ్లే జడ్పీ రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. అడుగుకో గొయ్యి చందాన మారిన రోడ్డును గత వైకాపా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చొరవతో ఉపాధిహామీ నిధులు రూ.2.20 కోట్ల అంచనా వ్యయంతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు. జనవరి 5న రహదారి పనులకు ఎమ్మెల్యే ధర్మరాజు శంకుస్థాపన చేయగా.. పనులు శరవేగంగా సాగుతున్నాయి.



ఏలూరు గ్రామీణ మండలం చాటపర్రు శివారు జాలిపూడి డ్రెయిన్‌లో వ్యర్థాలు పేరుకుపోయిన దృశ్యమిది. ఇక్కడి మద్యం దుకాణంలో మందుబాబులు మద్యం తాగేసి.. ప్లాస్టిక్ గ్లాసులు, తాగునీటి కవర్లు డ్రెయిన్‌లో పడేస్తున్నారు. వీటిని తొలగించకపోవడంతో.. నీరు ముందుకెళ్లడం లేదు. శివారు ప్రాంతాలకు సాగునీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

వారు ఆచరించరు.. వీరు అడ్డుకోరు!

విచ్చలవిడిగా పాలిథిన్ వినియోగం

చాటపర్రు(ఏలూరు గ్రామీణ), న్యూస్‌టుడే

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర పేరిట అటు పరిశుభ్రత, ఇటు ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రతినెలా మూడో శనివారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం సత్ఫలితాలు కనిపించడం లేదు. ప్రధానంగా రహదారుల అంచుల్లో, డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. వాటిని తిని మూగజీవాలు అనారోగ్యం బారిన పడుతున్నాయి. పాలిథిన్ వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో నగరపాలక సంస్థ అధికారులు విఫలమవుతున్నారు.

నగర వివరాలిలా..	
డివిజన్లు:	50
జనాభా:	2.75 లక్షలు
కుటుంబాలు:	1.90 "

బహిరంగంగా విక్రయిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం 125 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న పాలిథిన్ కవర్లను నిషేధించింది. క్షేత్రస్థాయిలో మాత్రం వాటి వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. నగరంలోని కూరగాయలు, అల్పాహారం, కిరాణా, మాంసం, మద్యం దుకాణాలతో పాటు వాణిజ్య సముదాయాలు, హోల్‌సేల్ షాపుల్లో విక్రయిస్తున్నారు. వాటిని ప్రజలు వాడేసి రహదారుల పక్కన, శివారు ప్రాంతాలు, మురుగు కాలువల్లో పడేస్తున్నారు. దాంతో పర్యావరణానికి హాని కలుగుతోంది. భూసారం తగ్గి సాగుకు ఆటంకం కలుగుతోంది.

ముడుపులిస్తే చాలు..

నగరపాలక సంస్థ అధికారులకు కొందరు హోల్‌సేల్ దుకాణాల యజమానులు నెలవారీ ముడుపులు ఇస్తున్నారు. దాంతో వారు ప్లాస్టిక్ కవర్ల విక్రయాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి నిషేధిత పాలిథిన్ సంచులపై ఉక్కుపాదం మోపాలని స్థానికులు కోరుతున్నారు. 'నిషేధిత పాలిథిన్ సంచులు కనిపిస్తే స్వాధీనం చేసుకుంటున్నాం. దుకాణదారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తున్నాం. తీరు మార్చుకోని పక్షంలో దుకాణాల అనుమతులు రద్దు చేస్తాం' అని నగరపాలక సంస్థ కమిషనర్ భాను ప్రతాప్ తెలిపారు.

విద్యుత్తు ఫ్యూజు సరిజేత

చల్లపల్లి(పెదవేగి), న్యూస్‌టుడే: చల్లపల్లిలో రహదారి పక్కన విద్యుత్తు స్తంభానికి ప్రమాదకరంగా అమర్చిన విద్యుత్తు ఫ్యూజు పెట్టెను సరిచేశారు. 'ప్రమాదం ఆగదు' శీర్షికన ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి విద్యుత్తు అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించారు.

నెరవేరని పేదల సొంతింటి కల: సీపీఎం

పాదయాత్ర చేస్తున్న నాయకులు

గణపవరం, న్యూస్‌టుడే: అయిదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నా.. పేదల సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదని సీపీఎం నాయకుడు జేఎన్వీ గోపాలన్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర ఆదివారం సరిపల్లె చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు స్వాగతం పలికారు. గోపాలన్ మాట్లాడుతూ.. సరిపల్లెలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు ఎక్కువ ఉందన్నారు. దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు వెంకటేశ్వరరావు, అజయ్ కుమార్, పూర్ణక్రాంతి బాబు, ఇంజేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలని డిమాండ్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పరువు హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని తెలకుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నగరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో తమ సామాజిక వర్గానికి చెందిన పోలిపల్లి సూర్యప్రకాశ్‌ను పరువు హత్య చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు అంబటి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి కాశిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కొమడవోలు పారేపల్లి ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ అంబేడ్కర్ తెలిపారు. కొమడవోలు, చాటపర్రు రోడ్డు, హమాలీ కాలనీ, దుర్గగ్రాండ్ సిటీ, ఆండాలమ్మతోట, రామానగర్, మారుతీనగర్, మస్తాన్‌మన్యం, నాగేంద్ర కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, శాస్త్రి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సరఫరా ఉండదని ఆదివారం పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

బాణసంచా దుకాణాలపై అధికారుల దాడులు

వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

గుండుగొలను(భీమడోలు), న్యూస్‌టుడే: బాణాసంచాను అక్రమంగా తయారు చేసినా, నిల్వ ఉంచిన బాధ్యులపై చర్యలు తప్పవని సీఐ యు.జె.విల్సన్ హెచ్చరించారు. కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో శనివారం పెను ప్రమాదం సంభవించిన నేపథ్యంలో పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. గుండుగొలనులోని రెండు బాణసంచా దుకాణాలను తనిఖీ చేశారు. ఎస్సై మదీనాబాషా, అగ్నిమాపక కేంద్రం అధికారి రవికుమార్, ఆర్ఐ ఎం.పి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

గణపవరం: పిప్పరలోని బాణసంచా తయారీ కేంద్రాన్ని నిడమర్రు సీఐ రజనీ కుమార్, గణపవరం ఎస్సై మణికుమార్ ఆదివారం తనిఖీ చేశారు. కేంద్రం జనావాసాలకు దూరంగా ఉందా? అనుమతించిన మేరకే నిల్వలు ఉంచారా? లేదానని ఆరా తీశారు.

నిడమర్రు: పెదనిండ్రకొలను భీమేశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించనున్న తెప్పోత్సవంలో బాణసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు ఆలయ ఈవో బీవీ చంద్రశేఖరరావు తెలిపారు. వేట్లపాలెం ఘటన నేపథ్యంలో.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేత్రపర్వంగా శ్రీరామ పట్టాభిషేకం

నిడమర్రు, న్యూస్‌టుడే: అడవికొలనులో ఆదివారం శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేకం నేత్రపర్వంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి క్రతువును తిలకించారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.

రాట్నాలమ్మకు అభిషేకం

రాట్నాలకుంట(పెదవేగి): రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకం, అర్చన చేసి పట్టువస్త్రాలు, ఆభరణాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. పూజా ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ.97,956 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు, ఈవో ఎన్.సతీశ్‌కుమార్ తెలిపారు.

సూర్యభగవానుడికి అలంకరణ

పవరుపేట(ఏలూరు ఆధ్యాత్మికం): పవరుపేటలోని సూర్య దేవాలయంలో స్వామివారిని ఆదివారం వివిధ రకాల పుష్పాలు, తులసి మాలలతో విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

మారెమ్మ ఆలయ వార్షికోత్సవం.. గణపవరం: గ్రామ దేవత దండు మారెమ్మ ఆలయ వార్షికోత్సవం కనులపండువగా నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే ధర్మరాజు దర్శించుకున్నారు. భీమవరానికి చెందిన బొలిశెట్టి చేతన భగవద్గీత పారాయణం ఆకట్టుకొంది.

శ్రీవారి కల్యాణోత్సవాలు ప్రారంభం

పవరుపేట(ఏలూరు ఆధ్యాత్మికం), న్యూస్‌టుడే: పవరుపేటలోని శ్రీదేవి భూదేవి సమేత వాసుదేవస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేసి.. ఉభయ దేవేరుల సమేత వాసుదేవుడ్ని సుందరంగా అలంకరించారు. అనంతరం కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా చేపట్టారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	కపుల్ ఫ్రెండ్లీ
అంబిక మినీ	హే బల్‌వంత్
సాయి బాలాజీ	విష్ణు విన్యాసం
బాలాజీ	అతడు
సత్యనారాయణ 1	సన్ ఆఫ్
సత్యనారాయణ 2	బూకి
సత్యనారాయణ 3	నవాబ్ కేఫ్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మన శంకర వరప్రసాద్ గారు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	ఉత్తిత్తి హీరోలు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	సీతా పయనం
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	ఫంకీ
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	మన శంకర వరప్రసాద్ గారు
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	విష్ణు విన్యాసం

పదింతల ఫలితాలకు!

ప్రత్యేక తరగతులకు స్పందన

వట్లూరులో బాలికకు సూచనలిస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

పెదపాడు, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యా శాఖ అడుగులేస్తోంది. పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి ఉత్తమ మార్కులు పొందేలా తర్ఫీదునిస్తోంది. దెందులూరు నియోజకవర్గంలో పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఏలూరు గ్రామీణ మండలాలున్నాయి. మొత్తం 41 ఉన్నత పాఠశాలల నుంచి 2,334 మంది విద్యార్థులు పరీక్ష పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. వీరికి ఉపాధ్యాయులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు ఎస్సీఈఆర్టీ రూపొందించిన ప్రణాళిక అమలు చేస్తున్నారు.

రోజుకు రెండు.. ఆయా పాఠశాలల విద్యార్థులకు రోజూ రెండు సబ్జెక్టుల చొప్పున గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. పరీక్ష పత్రాలను అప్పటికప్పుడే మూల్యాంకనం చేసి.. మార్కుల పరంగా వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురవకుండా అవగాహన కల్పిస్తున్నారు. 'పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులతో నిత్య సాధన చేయిస్తున్నాం. వారికి స్టార్ ర్యాంకింగ్‌లు ఇచ్చాం. తక్కువ మార్కులొస్తున్న పిల్లలను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు' అని పెదపాడు మండల విద్యాశాఖాధికారి-1 సబ్బితి నరసింహమూర్తి తెలిపారు.

నియోజకవర్గ వివరాలిలా..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
పెదపాడు	11	563
పెదవేగి	13	634
దెందులూరు	7	502
ఏలూరు గ్రామీణ	10	635

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ!

పెదనిండ్రకొలను పాఠశాలలో ఆరుబయట సైకిళ్లు

నిడమర్రు, న్యూస్‌టుడే: మండలంలోని మూడు ఉన్నత పాఠశాలల విద్యార్థులు సైకిళ్లు పెట్టుకోవడానికి వసతి లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఫలితంగా సైకిళ్లు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ దెబ్బతింటున్నాయి. మండలంలో మొత్తం ఉన్నత పాఠశాలలున్నాయి. సుమారు 2 వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో సగం మందికి పైగా సైకిళ్లు వేసుకుని వస్తుంటారు. వీటిని పెట్టేందుకు సదుపాయం లేకపోవడంతో ఆరుబయట ఉంచుతున్నారు.

ఎక్కడెక్కడ అంటే.. పత్తేపురం, నిడమర్రు, అడవికొలను ఉన్నత పాఠశాలల్లో మాత్రమే సైకిళ్ల షెడ్లు ఉన్నాయి. వాటిని పాఠశాల పూర్వ విద్యార్థులు, దాతలు, గ్రామస్థుల తోడ్పాటుతో ఏర్పాటు చేశారు. అక్కడి పిల్లలకు ఎలాంటి ఇబ్బందుల్లేవు. పెదనిండ్రకొలను, తోకలపల్లి, బువ్వనపల్లి, చానమిల్లి, బావాయిపాలెం ఉన్నత పాఠశాలల్లో మాత్రం సైకిళ్ల షెడ్లు లేకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. 'మూడు ఉన్నత పాఠశాలల్లో సైకిళ్ల షెడ్లు ఏర్పాటు నిధులు మంజూరయ్యాయి. మిగతా బడుల్లోనూ దాతలు, పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి షెడ్లు నిర్మించాలి' అని ఎంఈవో-1, 2 అనురాధ, శేషగిరిరావు తెలిపారు.

(c) eenadu

చింతలపూడి

• చింతలపూడి • పోలవరం

ఉచిత వైద్యశిబిరం

కామవరపుకోట, న్యూస్‌టుడే: ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో కాపు సంఘం కె9 ఆధ్వర్యంలో ఆదివారం రావికంపాడులో నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని జంగారెడ్డిగూడెం జడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జీ, సర్పంచి అడ్డరోడ్డు శ్రీను ప్రారంభించారు. అగర్వాల్ ఆసుపత్రి వైద్యులు 110 మంది రోగులకు సేవలు అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు టి.శ్రీనివాస్, కార్యదర్శి శీలం కృష్ణంరాజు, పి.మోహన్, దుట్టా శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

రోడ్డు అభివృద్ధి పనులకు భూమి పూజ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి నుంచి పోతవరం వరకు రోడ్డు అభివృద్ధి పనులకు కూటమి నాయకులు ఆదివారం భూమి పూజ చేశారు. సుమారు రూ.10 కోట్లతో చేపట్టనున్న ఈ పనులకు మండలంలోని రామసింగవరంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రేగంటి రాంబాబు, రమణ, శ్రీను, సిద్ధిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కామవరపుకోట, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల, తడికలపూడి 33 కె.వి.విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల పనుల కారణంగా ఆడమిల్లి, వీరిశెట్టిగూడెం, తడికలపూడి, సాగిపాడు గ్రామాల పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు.

నాగ కనకదుర్గమ్మ ఉత్సవాలు ప్రారంభం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు నాగ కనకదుర్గ అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయాన్ని మామిడి తోరణాలు, అరటి బాదులు, పచ్చిపూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం, ప్రాకారాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు..

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు వాడపల్లి వెంకట శివరామ లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. కాగా ఆదివారం ఆలయంలో బాలభోగము, వికాస తరంగిణి వారిచే విష్ణు సహస్ర పారాయణం, నిత్యహోమం, ధ్వజారోహణతో పాటు స్వామిని పెండ్లి కుమారుడిని చేసే క్రతువు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే సోమవారం స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుండటంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈవో తెలిపారు.

అలంకరణలో జంగారెడ్డిగూడెం వేణుగోపాలస్వామి

పడకేసిన నిఘా నేత్రాలు!

ఆశ్రమ పాఠశాలల్లో మరమ్మతులకు నోచని సీసీ కెమెరాలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం మండలాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పలు చోట్ల పని చేయక నిరుపయోగంగా మారాయి. సాంకేతిక లోపాలు, నాసిరకం పరికరాలు తదితర కారణాలతో ఇవి మూలకు చేరాయి. వాటిని మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చే వారే కరవయ్యారు.

నిర్వహణ కొరవడి.. బుట్టాయగూడెం మండలం పులిరాముడుగూడెం ఆశ్రమ బాలుర పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థి 2023లో హత్యకు గురయ్యాడు. అప్పట్లో ఈ ఘటన సంచలనంగా మారింది. ఇటువంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు ఆశ్రమ పాఠశాలల్లో అప్పట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మొదట పులిరాముడుగూడెం వసతిగృహ ఆవరణలో అమర్చారు. అనంతరం కేఆర్‌పురం ఐటీడీఏ ద్వారా 13 బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. అవి కొంత కాలం పాటు బాగానే పనిచేసినా.. తర్వాత నిర్వహణ కొరవడి, సాంకేతిక లోపాలతో పలు చోట్ల చెడిపోయి నిరుపయోగంగా ఉన్నాయి.

జీలుగుమిల్లి మండలంలో పనిచేయని సీసీ కెమెరా

నాణ్యత లేక.. పరికరాలు, సామగ్రి నాసిరకంవి కావడంతో తక్కువ సమయంలోనే మరమ్మతులకు గురయ్యాయని భావిస్తున్నారు. అంతర్జాల సమస్యలు ఉండటంతో కొన్ని చోట్ల సక్రమంగా పని చేయడం లేదు. లంకాలపల్లి, పాలకుంట తదితర పాఠశాలల్లో అసలు పని చేయడం లేదు. తెల్లంవారిగూడెంలో కొన్ని కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయి. కామయ్యకుంటలో వీటి పనితీరు బాగానే ఉంది. సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు జగన్నాథరావు తెలిపారు.

ఐటీడీఏ పరిధిలోని వివరాలు

మండలాలు: బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు

ఆశ్రమ పాఠశాలలు: బాలురు-12 బాలికలు- 13 విద్యార్థులు: 5,415 మంది

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ? బుట్టాయగూడెంలో వారపు సంత దుకాణాలు నిర్వహించిన ప్రదేశాల్లో వ్యర్థాలు, చెత్త తొలగించక పోవడంతో దుర్వాసన వస్తోంది. **-స్థానికులు**

✔ చర్యలు తీసుకుంటాం. **-కిరణ్‌కుమార్, ఇన్‌ఛార్జి పంచాయతీ అభివృద్ధి అధికారి**

టి.నరసాపురం: న్యూస్‌టుడే: ? గ్రామంలోని జగనన్న కాలనీలో బోరు ఉన్నా, పైపులైను లేకపోవడంతో ఇళ్లకు నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నాం. **-శ్రీనివాసరావు, బొర్రంపాలెం**

✔ జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఆ కాలనీకి ట్యాంకు, పైపు లైను మంజూరైంది. త్వరలో పనులు ప్రారంభమవుతాయి. **- హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి, బొర్రంపాలెం**

చింతలపూడి, న్యూస్‌టుడే: ? ఫాతిమాపురంలోని రక్షిత మంచి నీటి ట్యాంకును సక్రమంగా శుభ్రం చేయటం లేదు. నెలకు ఒకసారైనా శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలి. **-సుందరం, ఫాతిమాపురం**

✔ ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ప్రతి పదిహేను రోజులకు ఒకసారి శుభ్రం చేయించేలా చూస్తాం. **-అప్పాజీ, పంచాయతీ కార్యదర్శి**

? సిప్రియన్‌పేటలో పైప్‌లైన్ లీకేజీలతో నీరు కలుషితం అవుతోంది. **-రాములు, సిప్రియన్‌పేట**

✔ మరమ్మతులు చేపడతాం. **-అంబటి రాంబాబు, కమిషనర్**

కోలాట భజన మండలి సభ్యులకు సత్కారం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: వట్లూరు శ్రీవెంకటలక్ష్మి నందన కోలాట భజన మండలి సభ్యులను ద్వారకాతిరుమల దేవస్థానం అధికారులు ఆదివారం ఘనంగా సత్కరించారు. శ్రీవారి ఆలయంలో ఆదివారం కోలాట భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో దుర్గారావు, డీఈ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన జాతర

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మారుమూల గ్రామమైన కామవరం సమీపాన దుద్దుకూరు, గుబ్బల మంగమ్మ, నాగదేవి, గద్దె రాజులు ఆలయం వద్ద ఐదు రోజులుగా జరుగుతున్న జాతర కార్యక్రమాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవార్లు, గద్దె రాజులు ఆలయ పీఠాధిపతి ఆధ్వర్యంలో ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయం వద్ద నిర్వహించిన నిప్పుల గుండంపై పలువురు భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు దంపతులు అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గిరిజన సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. ఎస్సై దుర్గామహేశ్వరరావు తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అమ్మవార్లను దర్శించుకుంటున్న వెంకటేశ్వరరావు దంపతులు

ప్రమాదాల నివారణపై అవగాహన

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా జీలుగుమిల్లి పోలీసులు వాహనాలు నిలుపుదల చేసి చోదకులతో ముఖం కడిగించారు. ఎస్సై క్రాంతికుమార్ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు జీలుగుమిల్లిలోని దేవరపల్లి- తల్లాడ జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లారీలు, వ్యాన్లు, కార్లు, ఇతర వాహనాలు నిలిపి పత్రాలు పరిశీలించడంతో పాటు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నిద్రమత్తు వీడేందుకు తరచూ చల్లని నీటితో ముఖం కడుక్కుంటూ గమ్యానికి చేరుకోవాలని సూచించారు.

చోదకుడితో ముఖం కడిగిస్తున్న పోలీసులు

రంజాన్ పవిత్ర నమాజ్‌లు

కామవరపుకోట, న్యూస్‌టుడే: రంజాన్ పవిత్ర మాసం పురస్కరించుకుని ఆదివారం కామవరపుకోట జామియా మసీదులో అధ్యక్షుడు లాల్ జాన్ బాషా ఆధ్వర్యంలో ఉపవాస దీక్షల విరమణ అనంతరం ప్రత్యేక నమాజ్ చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఇబ్రహీం, వజీర్, నూర్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు చేస్తున్న ముస్లింలు

జగదాంబకు విశేష పూజలు

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జీలుగుమిల్లిలోని జగదాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. పూలమాలలు, ఆభరణాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు.

రామాలయ నిర్మాణానికి విరాళం

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరంలోని ముప్పిడివారిపేట వీధిలో నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి గ్రామస్థుడు మంగిన వెంకటరమణ ఆదివారం కుటుంబ సమేతంగా ఆలయ కమిటీ సభ్యులకు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సింగం సాయి, కోరసిక శ్రీనివాస్, రెల్లి.కొండ బాబు, బండి ఆంజి బాబు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: బయ్యనగూడెంలోని శ్రీచక్ర సహిత కనక దుర్గ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. తొలిరోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం కనకదుర్గ మల్లికార్జునస్వామి వార్ల కల్యాణం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పేదల పక్షాన పోరాటం

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: పేదల పక్షాన పోరాటం నిత్యం సీపీఐ ముందుంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాడిగడప ఆంజనేయరాజు పేర్కొన్నారు. పార్టీ శత వసంతాల కార్యక్రమంలో భాగంగా యర్రంపేటలో ఇంటింటా ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ చేపట్టిన వివిధ పోరాటాల వివరాలతో కరపత్రాలు పంపిణీ చేశారు. దుగ్గిరాల నారాయణరావు, పెదకాపు, ఆదినారాయణ, రామకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాడదాం'

చింతలపూడి, న్యూస్‌టుడే: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పార్టీలకతీతంగా అందరూ కలిసికట్టుగా పోరాడాలని వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు వేముల బేబీ రాణి అన్నారు. పట్టణంలోని భట్టువారిగూడెంలో ఆదివారం జరిగిన వడ్డెర సంక్షేమ సంఘం సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన వడ్డెరలకు చట్టసభల్లో రెండు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే, ఒక రాజ్యసభ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడ్డెరలకు 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్లు, రాయితీతో జేసీబీలు, పొక్లెయిన్‌లు ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చినా.. ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాంబాబు, ఉపాధ్యక్షుడు సోంబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బేబీరాణి

వైభవంగా లూర్దుమాత ఉత్సవాలు ప్రారంభం

కామవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలోని తడికలపూడి పోలీసు గట్టుపై ఉన్న లూర్దుమాత ఆలయం వద్ద వార్షిక ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అధిక సంఖ్యలో ఆరాధకులు లూర్దుమాతను దర్శించుకున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయకాల సమర్పణ, దివ్యసత్ప్రసాద ఆరాధన, మధ్యాహ్నం దివ్యబలిపూజ, జపమాల, రాత్రి గురువుల సమిష్టి పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పుణ్యక్షేత్ర డైరెక్టర్ మరియ ఎలియాస్ తెలిపారు.

'గడపగడపకు సీపీఐ' ప్రారంభం

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలో 'గడపగడపకు సీపీఐ' కార్యక్రమాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సన్నెపల్లి సాయిబాబు భూదేవిపేటలో ఆదివారం ప్రారంభించారు. పార్టీ చేసిన పోరాటాలను ఇంటింటా తిరుగుతూ వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు ప్రకారం..బిహార్ రాష్ట్రానికి చెందిన మహవీర్ మాంజీ (23) జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఓ ఆయిల్‌పామ్ కర్మాగారంలో హమాలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ప్రొడక్షన్ యూనిట్ ఫ్లోర్ శుభ్రం చేస్తుండగా ఓ ట్యాంకుకు వెళ్లే పైపు జాయింట్ ఊడి వేడి ద్రావణం మీదపడటంతో మహవీర్‌మాంజీకి తీవ్ర గాయాలయ్యాయి. సిబ్బంది అతడిని జంగారెడ్డిగూడెం ప్రాంతీయా సుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. దీనిపై కర్మాగారం ప్రతినిధి వీరరాఘవులు ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

ఉన్నా.. లేనట్టే..

దుకాణాలు లేక రైతుబజార్ వెలవెల

చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడిలో 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన రైతుబజార్ నిరుపయోగంగా మారింది. అప్పట్లో మొత్తం పది దుకాణాలు నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం వాటిలో ఒక దుకాణం మాత్రమే నిర్వహిస్తుండటంతో ప్రజలు బయట దుకాణాల్లో ఎక్కువ ధరకు కూరగాయలు కొనుగోలు చేయాల్సిన దుస్థితి.

తక్కువ ధరకు అమ్మాలని.. చింతలపూడి నగర పంచాయతీలోని పాతబస్టాండు, గురుభట్లగూడెం కూడలి, ఫైర్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో రహదారుల పక్కన కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. రైతుబజార్‌లో తక్కువ ధరకు అమ్మాల్సి వస్తుందనే కారణంతో రహదారుల పక్కన అమ్మేందుకు వ్యాపారులు ఇష్టపడుతున్నారు. కానీ కేవలం ఒక దుకాణంలో మాత్రమే ప్రస్తుతం కూరగాయలు అమ్ముతున్నారు. మిగిలిన దుకాణాలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

ఖాళీగా దర్శనమిస్తున్న దుకాణాలు

అధికారులు విఫలం అన్ని సౌకర్యాలతో దుకాణాలు నిర్మించినా వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. రహదారుల పక్కన కూరగాయలు అమ్మడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయి. వీరిని రైతుబజార్‌లో అమ్ముకునేలా అవగాహన కల్పించడంలో మార్కెటింగ్ శాఖ, నగర పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు. 'రైతుబజార్‌లో కూరగాయల దుకాణాలు ఖాళీగా ఉంటున్నాయి. వీటిని వ్యాపారులు వినియోగించుకోవాలి. వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం' అని కమిషనర్ అంబటి రాంబాబు తెలిపారు.

అంతా గోతులమయం

ధర్మాజీగూడెం(చింతలపూడి), న్యూస్‌టుడే: చింతలపూడి-ఏలూరు ప్రధాన రహదారి మార్గంలో లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ధర్మాజీగూడెంలో దాదాపు కి.మీ ప్రయాణం చేయాలంటే వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికి తోడు విపరీతంగా దుమ్ము లేస్తుండటంతో వాహనదారులు కళ్లల్లో ఇసుక, దుమ్ము పడి నరకం చూస్తున్నారు. ఏడాది క్రితం మరమ్మతులు చేపట్టినా మళ్లీ గోతులు ఏర్పడ్డాయి. రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆర్ అండ్ బీ డీఈ శ్రీకర్ తెలిపారు.

ధర్మాజీగూడెంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గొయ్యి

హంగులతో సరి.. చెత్త లేదు మరి

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం పంచాయతీ పరిధిలో సేకరించిన చెత్త వేయడం కోసం ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డు నిరుపయోగంగా మారింది. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో తోటగొందికి వెళ్లే మార్గంలో రెండు సంవత్సరాల కిందట డంపింగ్ యార్డు నిర్మించారు. ఇప్పటి వరకు విద్యుత్తు, నీటి సదుపాయాలు కల్పించలేదు. పంచాయతీ దాని చుట్టూ సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేసి ఇనుప కంచె వేయించి గేటుకు తాళం పెట్టారు. ఎప్పటిలాగే ఏటిగట్టు వెంబడి, రహదారుల పక్కన వేసి తగలబెడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డును వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

తోటగొంది సమీపంలో నిర్మించిన డంపింగ్‌యార్డు

మహిళ అదృశ్యంపై కేసు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెడ్లం గ్రామానికి చెందిన కంకిపాటి వెంకన్నబాబు ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా సిరిగుమ్మకు చెందిన మహిళ రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. గతనెల 27న ఇంట్లో భార్యాభర్తలు భోజనం అనంతరం నిద్రించారు. ఉదయం లేచి చూసేసరికి తన భార్య కనిపించలేదని వెంకన్నబాబు ఫిర్యాదు చేశారని ఎస్సై చెప్పారు.

యువతి.. జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: యువతి అదృశ్యంపై జంగారెడ్డిగూడెం పోలీసులు ఆదివారం కేసునమోదు చేశారు. ఎస్సై వీరప్రసాద్ కథనం మేరకు...జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన ఓ యువతి (20) డిగ్రీ ప్రైవేటుగా కట్టి.. మిగతా సమయాల్లో కూలి పనులకు వెళుతోంది. శనివారం తోటి కూలీలతో జంగారెడ్డిగూడెం పనికి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం జంగారెడ్డిగూడెం పోలీసులను ఆశ్రయించారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంలో కోడి పందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.3500 నగదు, ఒక కోడి పుంజు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధీర్ తెలిపారు.

నీరు పుష్కలంగా ఉన్నా.. తప్పని తాగు నీటి కష్టాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం పంచాయతీ శివారు హనుమాన్‌గూడెంలో నీరు పుష్కలంగా ఉన్నా తాగడానికి ఉపయోగపడటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో సుమారు 150కి పైగా కుటుంబాలు ఉన్నాయి. తాగు నీటి సౌకర్యార్థం పంచాయతీ 13 సంవత్సరాల క్రితం బోరు ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి బోరు నీటిలో సుద్ద, ఇసుక వస్తుందని వాపోతున్నారు. దీంతో తాగు నీటి కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. బోర్లు ఎప్పుడు ఆడతాయా అని ఎదురు చూస్తూ ఎండలోనూ పడిగాపులు కాస్తున్నారు. అలాగే గేట్ వాల్వ్ మరమ్మతులకు గురికావడంతో నీరు ట్యాంకులోకి ఎక్కడం లేదు. దీంతో నిరుపయోగంగా మారింది.

వ్యవసాయ బోర్లు వద్ద నుంచి బిందెలతో నీరు తెచ్చుకుంటున్న మహిళలు

ఆరోగ్య సమస్యలు.. పంచాయతీ బోరు నుంచి వస్తున్న సుద్ద నీరు తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. బయట నుంచి తెచ్చుకుంటున్నాం. **-వీరవల్లి శ్రావణి**

పరీక్షలు చేయాలి.. గ్రామంలో బోరు నుంచి వస్తున్న నీటికి ఇప్పటి వరకు పరీక్షలు చేయలేదు. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. **- వీరవల్లి రామ తులసి**

స్వచ్ఛమైన నీరు అందేలా చర్యలు.. నీటి పరీక్షలు నిర్వహించి సమస్యను తెలుసుకుని పరిష్కరిస్తాం. ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటాను. **- రాజేంద్ర ప్రసాద్, ఏఈ, ఆర్ డబ్ల్యూఎస్**

వాసవీక్లబ్ గోల్డ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని లయన్స్ క్లబ్ కమిటీ హాలులో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ 213ఏ క్లబ్ గవర్నర్ కామరాజు అధ్యక్షతన ఆఫీస్ బేరర్స్ ట్రైనింగ్ సెమినార్-2026 కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం వాసవి క్లబ్ గోల్డ్ నూతన అధ్యక్షుడుగా నియమితులైన నాగసూరి బాలసుబ్రహ్మణ్యం, కార్యవర్గంతో క్లబ్ సీనియర్ సభ్యుడు మహంకాళి మురళీకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. వివిధ మండలాలకు చెందిన వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్‌కు సంబంధించి 11 నూతన వాసవి క్లబ్ కార్యవర్గాలతో గవర్నర్ కామరాజు ప్రమాణస్వీకారం చేయించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ పూర్వ గవర్నర్ వెంకటేశ్, సభ్యులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: అప్పులు తీర్చలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఓ యువకుడ్ని పోలీసులు కాపాడారు. జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన ఓ యువకుడు అప్పుల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునేందుకు కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయానికి వెళ్లాడు. జంగారెడ్డిగూడెంకు చెందిన తన స్నేహితుడికి చరవాణిలో ఈ విషయాన్ని చెప్పాడు. అతడు 112కు సమాచారం అందించడంతో లక్కవరం ఎస్సై జబీర్ ఘటనా స్థలికి చేరుకుని యువకుడిని పురుగుల మందు తాగకుండా కాపాడారు.

కావలెను
JSR మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ జంగారెడ్డిగూడెం నందు కంప్యూటర్ మరియు మెడిసిన్ వర్క్ చేయుటకు లేడీ ఎంప్లాయి కావలెను.
జంగారెడ్డిగూడెం లోకల్ వారికి మాత్రమే
JSR మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్
స్ట్రీట్ నెం: 100 డోర్ నెం: 437
సాయి బాలాజి టౌన్‌షిప్, జంగారెడ్డిగూడెం.
కాంటాక్ట్: 94401 76115

తరలించాలంటే... చేయిని తడపాల్సిందే

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: మన్యం మండలమైన వేలేరుపాడులో తాటి చెట్ల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. తాటి చెట్లు పిడుగుల నివారణకే కాకుండా.. పలు విధాలుగా మనకు ఉపయోగపడతాయి. అలాగే వాటితో నష్టాలు కూడా ఉన్నాయి. వాటిల్లుతోంది. పొలం చుట్టూ తాటి చెట్లు ఉంటే వాటి విత్తనాలు నేలపై పడి కొత్త మొలకలు పుట్టుకొచ్చి ఆ ప్రదేశమంతా విస్తరిస్తున్నాయి. ఎండు ఆకులు, మట్టలు పడటంతో తొలకరిలో కూలీలను పెట్టి పొలాన్ని బాగుచేయాల్సిన పరిస్థితి. పంటపై సూర్య కిరణాలు పడక నష్టం వాటిల్లుతోంది. పట్టా భూముల రైతులు ఈ శ్రమ పడలేక తాటి చెట్లను పొగాకు బ్యారన్‌లకు అమ్ముకుంటున్నారు.

రాళ్లపూడి సమీపంలో ట్రాక్టర్‌లో తరలిస్తున్న తాటి మొద్దులు

వీఆర్‌ఏలకు ఆదాయ వనరు.. తాటి మొద్దులను జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం మండలాల రైతులు తీసుకెళ్తున్నారు. ఐతే ఈ రవాణాను కొందరు వీఆర్‌ఏలు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాళ్లపూడి జంక్షన్ వద్ద సాయంత్రం సమయంలో వీఆర్‌ఏలు కొందరు.. వచ్చిన ప్రతి ట్రాక్టర్‌ను ఆపి పలు పత్రాలు చూపాలంటూ రచ్చ చేస్తున్నారు. ఇవేమీ లేకపోతే చేతిని తడపాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే వాహనాలు ఆపి సొమ్ములు చేసుకుంటున్నారు. 'పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్ఐ భుజంగరావు తెలిపారు'.

తేనెలాంటి ఉపాధి

ఉండి, న్యూస్‌టుడే: వంటింటికే పరిమితం కాకుండా ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి అండగా నిలవాలని ముందుకెళ్తున్నారు మహిళలు. ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకునేందుకు ఉన్న మార్గాల వైపు దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా చింతూరు, పోలవరం, బుట్టాయగూడెం తదితర ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన కొందరు ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై ప్రత్యేక శిక్షణ తరగతులకు హాజరై నేర్చుకున్నారు.

ఆసరాగా నిలుస్తా.. మాది చింతూరు మండలం వీరాపురం. డిగ్రీ చదివా. వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. తల్లిదండ్రులిద్దరు వ్యవసాయం చేస్తారు. అక్క, తమ్ముడు చదువుకుంటున్నారు. కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు తేనెటీగల పెంపకం యూనిట్ స్థాపన మంచి అవకాశంగా కనిపించింది. **- పీసం శైలజ, చింతూరు**

ఐటీడీఏ సహకారం తీసుకుంటా.. డిగ్రీ చదువుకున్నా. ప్రకృతి వ్యవసాయంలో ఎన్జీవో సభ్యురాలిగా రైతులకు సేవలందిస్తున్నా. తేనె, ఉత్పత్తుల రకాలపై నేర్చుకున్న పరిజ్ఞానంతో మా ఐటీడీఏ అధికారుల సహకారంతో యూనిట్ ఏర్పాటు చేస్తా. తద్వారా మరికొంత ఆదాయాన్ని సంపాదిస్తా. **- మొడియం వీరభారతి, కొండ్రుకోట, పోలవరం మండలం**

గ్రూపుగా ఏర్పడతాం.. ఉద్యాన విభాగంలో డిప్లొమా చేశా. ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు వివరిస్తా. ఇక్కడ తేనెటీగల రకాలు, ఉత్పత్తులపై శాస్త్రవేత్తలు మంచి పరిజ్ఞానం అందించారు. మా ప్రాంతంలో మరికొందరితో గ్రూపుగా ఏర్పడి తేనే ఉత్పత్తితో ఆదాయాన్ని ఆర్జిస్తా. **- తెల్లం ప్రమీల, నూతిరామన్నపాలెం, బుట్టాయగూడెం**

'బ్రాండ్' పేరుతో విక్రయిస్తా.. నేను అగ్రికల్చర్ బీఎస్సీ చదివా. వ్యవసాయం చేస్తున్నా. ఉపాధి కోసం అన్వేషించే సమయంలో నాణ్యమైన తేనెకు మార్కెట్‌లో గిరాకీ ఉందని తెలుసుకుని శిక్షణ పొందా. 'బ్రాండ్' పేరుతో విక్రయించి ఉపాధి మెరుగుపరచుకోవచ్చు. ఆన్‌లైన్ మార్కెట్‌లో విక్రయాలతో మరికొందరికి ఉపాధి కల్పిస్తా. **- ఎస్.సుబ్బలక్ష్మి, కంచులూరు, చింతూరు**

అమరవీరుల ఆశయ సాధనకు కృషి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు విస్సంపల్లి సిద్ధా మాదిగ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మాదిగ అమర వీరుల సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగంతోనే మాదిగ, వాటి ఉపకులాలు విద్య, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రంగాల్లో ఓ అడుగు ముందుకు వేయగలిగాయన్నారు. కార్యక్రమంలో బొడ్డపాటి పండు, వసంతాటి మంగరాజు, బొబ్బిలి స్వామి, సాధనాల రమేశ్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
చింతలపూడి, ఏలూరు జిల్లా
ఓ.ఎస్.నెం. 57/2021
గుడివాడ వరలక్ష్మి (భర్త) గంగాధరరావు — వాది
బిట్వీన్
మొక్కపాటి విశారధ (భర్త) శ్రీనివాసరావు, చింతలపూడి గ్రామం & మండలం, ఏలూరు జిల్లా — ప్రతివాది
వాది దాఖలు చేసిన పబ్లికేషన్
పై నెంబరు గల దావాలో ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా, పై తెలిపిన కోర్టులో ది. 17-03-2026వ తేదీన వాయిదా కలదు. ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై తమ యొక్క విచారణకు హాజరై ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని యెడల కోర్టు వారు పరోక్షంగా తీర్మానం చేయగలరని తెలియజేయుచున్నాము.
సం/- కొండేటి శ్రీనివాసరావు, అడ్వకేట్
చింతలపూడి పానుగంటి వారి వీధి,
27-02-2026 ఏలూరు, సెల్: 94412 76324

(c) eenadu

నూజివీడు

•నూజివీడు •కైకలూరు

వైభవంగా వేణుగోపాలుడి కల్యాణం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గురజలిలో పురాతన ఆలయమైన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆర్.తేజోరాం, పరాశరం రంగనాధాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువు నిర్వహించారు. అంతకుముందు జగజ్యోతి, ఎదుర్కోలు సన్నాహం, పుష్పక వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

చందన స్వరూపా.. సర్వ జగద్రక్షకా.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెంలోని లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బావాజీ మఠం అర్చకుడు ఆసూరి రంగనాధాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి పంచామృత స్నపన తిరుమంజనం(అభిషేకం) నిర్వహించారు. అనంతరం సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ బాలాజీ, ఈవో కొండలరావు ఉభయదాతలు పాల్గొన్నారు.

నరసింహునికి గరుడోత్సవం.. కైకలూరు, న్యూస్‌టుడే: మండలంలోని వరహాపట్నంలోని భూసమేత లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ 124వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం గరుడ వాహనంపై స్వామివారు గ్రామ పురవీధుల్లో విహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. అంతకు ముందు దేవస్థానంలో అర్చకులు అష్టోత్తర శతనామావళి, నిత్యహోమం వంటి విశేష పూజలు జరిపారు. సాయంత్రం కల్పవృక్ష వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈవో వీఎన్‌కే శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దత్తాశ్రమంలో ప్రత్యేక పూజలు.. మండవల్లి, న్యూస్‌టుడే: శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశీస్సులతో లోకకల్యాణార్థం దత్తాశ్రమంలో ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. కార్యనిర్వాహణాధికారి గురజాడ వీరవెంకటశంకర్ దంపతులు పీఠంపై కొలువుదీరిన ప్రత్యేక అనఘాదేవి సమేత దత్తాత్రేయ స్వామికి పంచామృతాభిషేకం, గణపతి పూజ, కుంకుమ పూజలు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు ముగిసి శాంతి స్థాపన జరగాలని స్వామిని వేడుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున వచ్చిన మహిళలు విష్ణుసహస్ర పూజ, లలిత సహస్ర నామార్చన చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

చిత్తపూరు - బూరుగుగూడెం రోడ్డుకు మహర్దశ

చాట్రాయి, న్యూస్‌టుడే: చిత్తపూరు - బూరుగుగూడెం రోడ్డులో జనార్దనవరం - బూరుగుగూడెం నడుమ రహదారి అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రూ.3 కోట్ల నిధులతో ఈ రహదారిని తారు రోడ్డుగా మారుస్తున్నారు. వైకాపా పాలనలో అయిదేళ్ల కాలంలో ఏనాడూ మరమ్మతులు చేయక ఈ రహదారిలో వాహనాల రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉండేది. చాట్రాయి నుంచి జనార్దనవరం మీదుగా నూజివీడుకు ఇది చాలా దగ్గరి మార్గంగా ఉంది. గోతులతో ఉన్న ఈ రహదారిని కూటమి పాలన వచ్చాక తారు రోడ్డుగా మార్చాలని పనులు చేపట్టారు. నిధులు మంజూరు కావడంతో తారు రోడ్డు పనులు చేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనులను తెదేపా మండల అధ్యక్షుడు ఇజ్జాని వెంకటేశ్వరరావు పరిశీలించారు.

అక్రమ లేఅవుట్లు.. అమాయకుల పాట్లు

- నిబంధనలు బేఖాతరు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

మండవల్లి, కైకలూరు, న్యూస్‌టుడే: స్థలాలకు విలువ పెరగడంతో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. నిబంధనలకు నీళ్లొదిలి, ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండి కొడుతున్నారు. అడ్డుకున్న అధికారులకు నోట్లు ఆశచూపి కొట్టు వెనకేసుకుంటున్నారు. 'ముడా' నుంచి అనుమతులు పొందకుండానే వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి విక్రయిస్తున్నారు. వీటిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తరువాత కొన్నవారు ఇబ్బందులు పడుతున్నారు.

కాలువ కబ్జా మండవల్లి మండలం చింతపాడు పంచాయతీ దెయ్యంపాడులో రెండెకరాల భూమిని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారు. వీటిని కనీసం అధికారులు పట్టించుకోవడం లేదు. ముందున్న కాలువను, రోడ్డు భవనాల శాఖ భూమిని సైతం ఆక్రమించేశారు.

మండవల్లి మండల కేంద్రంలోని గన్నవరం జాతీయరహదారి 165 పక్కనే 3 వెంచర్లు వేశారు. వీటిలో ఒక్క దానికి సైతం అనుమతులు లేవు. ఏ ప్లాట్లకీ పక్కనే అమ్మిన ప్లాట్ల నేటికీ దారి లేకపోవడంతో కొనుగోలు చేసిన వారు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

లోకుమూడిలో చావలిపాడు గ్రామాన్ని ఆనుకుని వేసిన వెంచర్లకు నేటికీ పంచాయతీ అనుమతులు లేకపోవడంతో విద్యుత్తు మీటర్లు పొందేందుకు లబ్ధిదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

మొత్తం అమ్మేస్తున్నారు.. వెంచర్లలో రహదారులు, పార్కు, సామాజిక కార్యక్రమాలకు కొంత భూమిని వదలాలి. ప్రధాన రహదారి 40 అడుగులు, అంతర్గత రోడ్లు 30 అడుగులు ఉండాలి. మొత్తం భూమిలో 10శాతం గ్రామ పంచాయతీకి దఖలు పరచాలి. వేస్తున్న లేఅవుట్లలో సెంటు భూమిని ఇవ్వకుండానే మొత్తం భూమిని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.



చింతపాడులో ఇలా..

అనుమతులు తప్పని సరి.. లేఅవుట్లకు 'ముడా' లేదా పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సిందే. అనుమతులు లేకుండా ప్లాట్లు అమ్మితే చర్యలు తీసుకుంటాం. అన్ని అనుమతులు ఉన్న లేఅవుట్లలోనే ప్లాట్లు కొనుగోలు చేయడం ఉత్తమం. - గోపాల్, ఇన్‌ఛార్జి తహసీల్దారు

ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం రమణక్కపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని హాసిని ప్రియ రూపొందించిన 'మెట్రో రైలులో అగ్ని ప్రమాద నివారణ చర్య' అనే అంశానికి ఇన్‌స్పైర్ అవార్డు లభించిందని ప్రధానోపాధ్యాయుడు పసుమర్తి రామకృష్ణారావు ఆదివారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ ద్వారా రూ.10 వేలు నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నగదుతో ప్రాజెక్టును తయారు చేసి సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించనున్నట్లు వివరించనున్నారు. ఎంపికైన విద్యార్థినిని ఉపాధ్యాయులు, తెదేపా నాయకులు రంగు వాసు, పాశం నాగబాబు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు :80085 74698	ఆగిరిపల్లి: 9121229090
ముసునూరు: 93983 81268	చాట్రాయి: 8008574700
కైకలూరు :73060 88555	మండవల్లి: 8106099008
కలిదిండి :90594 84862	ముదినేపల్లి: 8008574693

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు తితిదే కల్యాణ మండపం సమీపంలో పంచాయతీ వీధి దీపం వెలగక స్థానికులు రాత్రి సమయంలో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై స్థానికుడు మోహన్ 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో పాణిరాజకుమారి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె కొత్త దీపం ఏర్పాటు చేయించి సమస్య పరిష్కరించారు.

మరియ మాత ఉత్సవాలు ప్రారంభం

కలిదిండి : ర్యాలీ ప్రారంభించిన కూటమి నేతలు

కలిదిండి, న్యూస్‌టుడే: కలిదిండిలోని మరియ మాత ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పాదర్ బంటుమిల్లి యోహాను నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం తెదేపా మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు వల్లభనేని శ్రీనివాస చౌదరి 'మరియ మాత' ర్యాలీని ప్రారంభించారు. కూటమి నేతలు పేటేటి సత్యనారాయణ, కురెళ్ల ఏడుకొండలు, విశ్వాసులు పాల్గొన్నారు.

వైకాపా హయాంలో జీతాలందని పరిస్థితి: మంత్రి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే కార్యకర్తలు, ఆయాలకు కనీసం నెలవారీ జీతాలు లభించని పరిస్థితి ఉండేదని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. వారి తొమ్మిది డిమాండ్లలో ప్రధాన డిమాండ్లను పరిష్కరించామన్నారు. జీతాలను ఒకటి రెండు తేదీల్లో అందిస్తున్నామన్నారు. ఆదివారం సమాచార శాఖ ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదు వేల మినీ అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి స్థాయిలో అప్‌గ్రేడ్ చేశామన్నారు. సెంటర్లలో నీరు, మరుగుదొడ్లకు రూ.86.68 లక్షలు ఖర్చు చేశామన్నారు. రూ.75 కోట్లు ఖర్చు చేసి 5జీ మొబైళ్లను 58,204 మందికి ఇచ్చామన్నారు. గత వైకాపా ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిని దివాలా తీయిస్తే కూటమి ప్రభుత్వం వారి చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో టెలివిజన్, ఆర్వో ప్లాంట్, ఆట వస్తువులు, ఇండక్షన్ స్టౌ, నాణ్యమైన వంట పాత్రలు పలు రకాల మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కేంద్రాల్లో పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ప్రతి కేంద్రానికి సొంత భవనం సమకూర్చనున్నామన్నారు. మాతా శిశు మరణాల సంఖ్య తగ్గించడంలో మీ పాత్ర గణనీయమన్నారు.

తెదేపా మండల అధ్యక్షుడిగా రాధాకృష్ణ

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు మండల తెదేపా అధ్యక్షుడిగా ఆచవరం గ్రామానికి చెందిన పి.రాధాకృష్ణ నియమితులయ్యారు. గతంలో నాలుగు పర్యాయాలు మండల పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన ఆయన తొలిసారిగా అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. మండలాధ్యక్షుడి పదవి కోసం తెదేపాకు చెందిన నలుగురు పోటీ పడగా గతంలో అధిష్ఠానం మరో నియోజకవర్గానికి చెందిన నాయకులను పరిశీలకులుగా పంపి ఎన్నిక ప్రక్రియ నిర్వహించింది.. ఫలితాలను వెల్లడించలేదు. అయితే ఇటీవల అధిష్ఠానం రాధాకృష్ణతో పాటు పోటీలో ఉన్న కె.కె.బాబు పేర్లు ప్రస్తావిస్తూ ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించారు. ఇందులో అధికశాతం నాయకులు రాధాకృష్ణ మద్దతు తెలపడంతో అధ్యక్షుడిగా నియమించినట్టు జిల్లా తెదేపా అధ్యక్షుడు బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ప్రకటించారు.

భాషా ఉత్సవంలో ప్రతిభ

ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం కొవ్వాడపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఏలూరులో నిర్వహించిన జిల్లా స్థాయి భాషా ఉత్సవాల్లో ప్రతిభను చాటినట్లు హెచ్.ఎం. సువర్ణరాజు తెలిపారు. ఆంగ్లభాషా ప్రాథమిక విభాగంలో పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థులు ఎం.సత్య ఖడ్గ ప్రతాప్, ప్రేమ్‌కుమార్ జిల్లా స్థాయిలో తృతీయ స్థానాన్ని సాధించారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందుకున్నారు. గెలుపొందిన విద్యార్థులను హెచ్.ఎం., గ్రామస్థులు, అభినందించారు.

రేపు ఆలయాల మూసివేత

కలిదిండి, న్యూస్‌టుడే: ఈ నెల 3వ తేదీన చంద్ర గ్రహణం ఉన్నందున కలిదిండి మండలంలోని ప్రధాన ఆలయాలు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మూసి వేయనున్నట్లు ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. బుధవారం ఉదయం 7 గంటలకు సంప్రోక్షణ, పూజా కార్యక్రమాల అనంతరం తిరిగి ఆలయ తలుపులు తెరుస్తారని చెప్పారు. గ్రహణ సమయంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

అంగన్‌వాడీలకు అండగా ప్రభుత్వం

మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి వీరమల్లు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు, చిరు ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. వడాలిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండుసార్లు అంగన్‌వాడీల వేతనాలు పెంచిన ఘనత తెదేపాదేనన్నారు. వారికి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందన్నారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు పదోన్నతి కల్పించి వారి డిమాండ్లలో తొమ్మిదింటిని పరిష్కరించి వారి భరోసా కల్పించిన ఘనత కూటమిదని వివరించారు. నాయకులు నక్కా అప్పారావు, బొర్రా సత్యనారాయణ, జోగి వెంకట సుబ్రహ్మణ్యం, గొర్రెల అర్జునరావు, వీరమల్లు శేషు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథాలతో ప్రచారం

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రతి వ్యక్తి దైవత్వాన్ని ఆధ్యాత్మిక తత్వాన్ని పెంపొందించుకోవాలని త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు తెలిపారని ఇందు జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అధ్యక్షుడు పోలిమెట్ల అరుణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని మర్రిబందంలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలను చేతబట్టుకుని ప్రచారం నిర్వహించారు. ప్రతి మతంలో ఒక సిద్ధాంతం ఇమిడి ఉందని ఆయా గ్రంథాల్లో చెప్పారన్నారు. ఏసు క్రీస్తు ఒక గొప్ప యోగి అని, భగవద్గీతలోని కర్మయోగ విధానాన్నే తన సువార్త వాక్యంతో నిర్వహించారన్నారు. భగవద్గీత, ఖురాన్‌లలోని పలు అంశాలను బోధిస్తూ గ్రామ ప్రజలను చైతన్యవంతులను చేశారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, అశోక్, రామాంజనేయులు, మోహన్‌కుమార్, రమాదేవి, విశ్రాంతమ్మ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి పైపు లైన్ లీక్

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు- కోరుకొల్లు ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డుపై నీరు చేరి ప్రమాదాలకు నెలవుగా మారింది. కాళీమాత ఆలయానికి సమీపంలో కొన్నిరోజులుగా తాగునీటి పైపులైను లీకవుతోంది. రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన గుంతల్లో వృథాగా పోతున్న నీరంతా తిష్ఠ వేస్తోంది. దీంతో వాహనదారులు పాదచారులు రాకపోకలకు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. రాత్రి సమయంలో వీధిలైట్లు ఈ ప్రాంతంలో సక్రమంగా వెలగక దగ్గరకు వచ్చే వరకు ప్రమాదాన్ని గుర్తించలేక వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. ఇక సమీప నివాసితులు మురుగు నీరు రోడ్డుపైకి విడుదల చేయడంతో బురదమయంగా మారింది.

పేదల కాలనీ మొత్తానికి ఒకే ఇంటి నిర్మాణం పూర్తి

చాట్రాయి, న్యూస్‌టుడే: జగనన్న కాలనీల కోసమని లక్షలాది రూపాయలు వెచ్చించి స్థలాలను కొనుగోలు చేశారు. ఆపై అస్తవ్యస్త పనులు చేసి పట్టాలిచ్చి చేతులు దులుపుకొన్నారు. ఫలితంగా కాలనీ స్థలాల్లో నడిచేందుకు వీల్లేకుండా మారాయి. ఇలా మారిన కాలనీలో చనుబండ ఎస్టీ కాలనీ ఉంది. ఇక్కడ ఎకరాకు పైగా స్థలాన్ని కొనుగోలు 42 మందికి పట్టాలను పంపిణీ చేశారు. కానీ ఇళ్లు మంజూరు చేయలేదు. పట్టాలున్నా చాలా మందికి తమ స్థలాలు ఎక్కడున్నాయో తెలియదు. ఇద్దరు లబ్ధిదారులు నిర్మాణానికి సిద్ధం కాగా ఒక్కరు మాత్రమే పూర్తి చేశారు. సమీపంలోని ఎస్టీ ఏరియాలోని ఇళ్ల వద్ద నుంచి కరెంటు వైర్లతో కాలం గడుపుతున్నారు. లక్షలు వెచ్చించిన స్థలాన్ని వసతులు కల్పించకుండా వదిలేయడంతో ముళ్ల పొదలు పెరిగి నాటి పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి.

రైతు సేవలకు దూరం

ముసునూరు, న్యూస్‌టుడే: అన్నదాతలకు మెరుగైన సేవలందిస్తామని గత ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా వినియోగంలోకి తెచ్చిన కియోస్క్ యంత్రాలు మున్నాళ్ల ముచ్చటగానే మారాయి. రైతులకు రాయితీలపై ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు వీలుగా ఈ యంత్రాలను రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. కానీ గత ప్రభుత్వం యంత్రాలిచ్చి ఈ సదుపాయాన్ని విస్మరించింది. సిబ్బంది తమ చరవాణుల నుంచే అంతర్జాలాన్ని ఉపయోగించుకుని నెట్టుకొస్తున్నారు. ముసునూరు మండలంలో 12 యంత్రాలను అందజేశారు. ఒక్కో కియోస్క్ యంత్రానికి రూ.75 వేలు వెచ్చించారు. నిర్వహణ లేక, బ్యాటరీలు పనిచేయక, పలుచోట్ల విద్యుత్తు సరఫరా, ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడం తదితర సమస్యలతో నిరుపయోగంగా మారాయి. దీనిపై ఏవో చాముండేశ్వరిని వివరణ కోరగా.. వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం

చాట్రాయి, న్యూస్‌టుడే: సర్కారు వైద్యానికి సకల సదుపాయాలను కల్పిస్తూ పల్లెల్లోనే కార్పొరేట్ వసతులతో ఆస్పత్రి నిర్మిస్తామని వైకాపా పాలనలో హడావుడి చేసినా నిధులు రాక అసంపూర్తిగా మిగిలాయి. చాట్రాయి మండలంలో 80 శాతం మంది గిరిజనులున్న పోతనపల్లిలో విలేజ్ హెల్త్ క్లినిక్ మూడున్నరేళ్లుగా అసంపూర్తిగా ఉంది. వీటిలో ఏర్పాటు చేసిన పరికరాలు చోరీకి గురయ్యాయి. మరుగుదొడ్డి, కరెంటు వసతి కల్పించక భవనం తలుపుల్లేకుండా నిరుపయోగమై అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇక్కడ ఇటీవల గిరిజన మహిళ చిన్నపాటి వైద్యం అందక మృతి చెందింది. వచ్చిన మందులు, ఇతర పరికరాలు భద్రపరచడానికి కూడా సిబ్బందికి ఇబ్బందిగా మారింది.

చిత్రపటం వద్ద గద్దె రామ్మోహన్, నాయకులు

పద్మనాభరావుకు ప్రముఖుల నివాళి

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం వేల్పుచర్లకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు మానం పద్మనాభరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆదివారం ఆయన దిశ దిన కర్మకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తెదేపా మండలాధ్యక్షుడు గద్దె రఘు, సీనియర్ నాయకులు దేవినేని ఢలారాం, మానం వంశీ, రాంబాబు కార్యకర్తలతో కలిసి వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పద్మనాభరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజీ వద్ద ఆర్టీసీ ఉద్యోగులు ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. డ్రైవర్లు పలువురు ఉన్నప్పటికీ జూనియర్ వ్యక్తులకు పదోన్నతులు కల్పిస్తున్నారన్నారు. సీనియార్టీ అర్హతల ప్రకారమే పదోన్నతులు ఇవ్వాలన్నారు. అక్రమ ఓడీలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పలువురు కార్మిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఓడీఎఫ్ పట్టణంగా నూజివీడు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు పురపాలక సంఘం స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 పోటీల్లో మెరుగైన ర్యాంకు సాధన కోసం నూజివీడు పట్టణాన్ని ఓడీఎఫ్ ప్లస్‌గా తీర్చిదిద్దేందుకు ప్రజలు కృషి చేయాలని నూజివీడు పురపాలక సంఘం కమిషనర్ కొర్రపాటి పీరయ్య తెలిపారు. చెత్త రహిత నగరాల్లో 1 స్టార్ రేటింగ్ ఆఫ్ గార్బేజి సిటీగా ఉంచేందుకు బహిరంగ మల మూత్ర విసర్జన రహితంగా, తడిపొడి చెత్తను వేర్వేరుగా శానిటరీ, ప్రమాదకరమైన చెత్తలను నివాసాల వద్దనే విభజించి అందజేయాల్సి ఉందన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజులలోపు పురపాలక సంఘంలో రాతపూర్వకంగా తెలపాలన్నారు.

జన సైనికులకు సభ్యత్వంతో భరోసా

మాట్లాడుతున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మండవల్లి, న్యూస్‌టుడే: జనసైనికులకు పార్టీ అందిస్తున్న సభ్యత్వంతో మరింత భరోసా కలగనుందని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పేర్కొన్నారు. మండవల్లి మండలం చింతపాడు, దెయ్యంపాడులో ఆదివారం పార్టీ సభ్యత్వాల నమోదు చేపట్టారు. కూటమి ప్రభుత్వంలో క్రియాశీలకంగా ఉంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు జనసేన ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రతి జన సైనికుడి వృద్ధికి అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని వివరించారు. కైకలూరు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున పార్టీ సభ్యత్వాలను నమోదుచేసి అధినేతకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. కేవలం రూ.400 రుసుముతో రూ.5 లక్షల ప్రమాద బీమా పొందవచ్చునని తెలిపారు. ఇందులో నాయకుల ఏసుబాబు, ముంగర కొండలు, మైగాపుల రామాంజనేయులు, జయమంగళ నాగేశ్వరరావు, రాయవరపు సాంబశివరావు, నాగేశ్వరరావు, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

దెయ్యంపాడులో సభ్యత్వాల నమోదు చేపట్టిన ఎమ్మెల్సీ జయమంగళ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదు ప్రతి కార్యకర్తకు భరోసా ఇచ్చే కార్యక్రమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బర్మా ఫణిబాబు కార్యాలయంలో క్రియాశీల సభ్యత్వ నమోదు చేపట్టిన వాలంటీర్ల(సాధక్)తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తీసుకున్న నిర్ణయాలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. సభ్యత్వ నమోదుకు అనుగుణంగానే నామినేటెడ్ పోస్టులు తదితర పదవులు దక్కుతాయని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి బర్మా ఫణిబాబు పార్టీ ఆశయాలు తదితరాల గురించి వివరించారు., వెంకటాచల స్వామి దేవస్థానం ఛైర్మన్ కస్తూరి రాము, ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ సభ్యులు ముత్యాల కామేష్, చాట్రాయి మండల ఉపాధ్యక్షుడు తుమ్మల జగన్, ఆగిరిపల్లి మండల ఉపాధ్యక్షుడు ముక్కు మహేష్, బొబ్బిలి శ్రీకాంత్, సూరిశెట్టి శివ తదితరులు పాల్గొన్నారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారు.

'ఎస్సీ వర్గీకరణకోసం ప్రాణాలొదిలారు'

నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మంద కృష్ణ నాయకత్వంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాడిన అమరవీరులకు ఆదివారం నూజివీడులోని చిన్న గాంధీ బొమ్మ సెంటరులో నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి తొమ్మండ్రు రుద్రయ్య,ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు విశ్వనాథపల్లి శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఆదివారం ఆగిరిపల్లి బస్సుస్టాండ్ కూడలిలో డా.బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరులకు ఘన నివాళి అర్పించారు. పిన్నమరెడ్డిపల్లిలో అమరవీరులకు నివాళి అర్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. మండల ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బట్టుమర్తి రాము మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నీటిని తరలించుకునేందుకు ఏర్పాటు చేసిన ఆయిల్ ఇంజిన్

ఆక్రమణల చెరలో కురివిడి చెరువు

పంటలు రక్షించుకునేందుకు రైతుల పాట్లు..

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణ శివార్లలోని గొడుగువారిగూడెం నుంచి రెడ్డిగూడెం వెళ్లే రహదారిలో ఉన్న కురివిడి చెరువు ఇది. 35 ఎకరాలకు పైగా ఉండాల్సిన చెరువు ఆక్రమణదారుల కారణంగా పదిహేను ఎకరాలకు మించి లేదు. ఉన్న కొద్దిపాటి చెరువులోను పూడిక పెరిగింది. తూటికాడ తదితరాలతో నిండిపోయింది. చెరువు దిగువున 50 ఎకరాలకు పైగా రైతులకు ఈ నీరే ఆధారంగా వ్యవసాయం చేసుకుంటున్నారు. ఉన్న కొద్దిపాటి నీటిని పంట పొలాలకు తీసుకు వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. రూ. వేల ఖర్చుతో ఆయిల్ ఇంజన్లను ఏర్పాటు చేసుకుని నీటిని తరలించేందుకు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. గత ఏడాది కురిసిన ఆకస్మిక వర్షాలకు ఈ చెరువు కట్ట గండి పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు స్పందించి ఈ చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో పాటు ఆక్రమణలు తొలగించాల్సిన అవసరం ఉంది.

నీట మునిగిన వేరు సెనగ

చేతికందివచ్చిన సమయంలో నష్టం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: కాలువకు నిండుగా నీరు వదలడంతో ఓ రైతు సాగు చేసుకున్న వేరు సెనగ పంట నీట మునిగింది. సింగరాయపాలెంలోని ఇసుక కాలవ రోడ్డులో శ్రీహరిపురానికి చెందిన పామర్తి కనకదుర్గ సుమారు ఎకరం విస్తీర్ణంలో వేరు సెనగ పంట సాగు చేశారు. మరో వారం రోజుల్లో పంట చేతికందుతుందనే ఆశాభావంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో పెదగొన్నూరు కాలువకు ఆదివారం కనీస సమాచారం ఇవ్వకుండా నీరు విడుదల చేశారు. తూము కట్టక పోవడంతో కనకదుర్గ పొలంలోకి నీరు చేరింది. జలవనరుల శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తాను పూర్తిగా నష్ట పోయానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ. 30 వేలు వరకు అప్పు చేసి పెట్టుబడి పెట్టినట్లు ఆమె తెలిపారు.

ఇంకా మట్టి రోడ్డే దిక్కు

ముసునూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు, పాలకులు మారినా గ్రామాలకు వెళ్లే రోడ్ల స్థితిగతులు మాత్రం మారడం లేదు. ముసునూరు మండలం రమణక్కపేట నుంచి విస్సన్నపేట మండలం కొండపర్వ వైపు వెళ్లే మట్టి రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రమణక్కపేట నుంచి కొండపర్వ వైపు వెళ్లే లింక్ రోడ్డు నిర్మాణానికి 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో 3 కి.మీ .మేర రహదారి నిర్మాణానికి రూ.2.10 కోట్ల నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించిన గుత్తేదారు రూ.70 లక్షల వరకు పనులు చేసి మధ్యలో నిలిపివేశాడు. మధ్యలో నిలిపేసిన పనులు ప్రారంభించి రహదారిని నిర్మించాలని ప్రజలు అధికారులకు వినతిపత్రాలు అందించినా, ధర్నాలు, ఆందోళనలు చేసినాపట్టించుకోవట్లేదు.

మురుగు కాలువలపై చెత్త

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పారిశుధ్య కార్యక్రమాల విషయంలో పురపాలక సంఘం కార్మికులు, అధికారులు నిత్యం శ్రమిస్తున్నా ప్రజల్లో మాత్రం మార్పు రావడం లేదు. షాపులు, గృహాల్లో చెత్త రహదారులపై, మురుగు కాలువలపై వేసి పురపాలక సంఘం అధికారులు, కార్మికుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. కొన్ని ప్రదేశాల్లో ఈ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

గాంధీనగర్‌లో దుస్థితి

పాఠశాలకు ప్రహరీ నిర్మించండి మహాప్రభో

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలోని గొడుగు వారిగూడెంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఇది. పాఠశాలకు భవనం నిర్మించి దశాబ్ద కాలం పైనే గడిచిపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాలకు ప్రహరీ నిర్మించలేదు. పాఠశాల చుట్టూ పశువుల ఎరువుల కుప్పలు, మురుగుతో కూడిన అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చెట్టును కాల్చేసిన నిర్లక్ష్యం

కలిదిండి, న్యూస్‌టుడే: ఓ ఆకతాయి నిర్లక్ష్యం భారీ వృక్షాన్ని నిలువునా దహించి వేసింది. పడమటిపాలెంలో గుడివాడ-భీమవరం రహదారికి ఆనుకుని పెద్ద చెట్లు ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ తాగి.. నిప్పు ఆర్పకుండా దానిని రోడ్డు పక్కన ఉన్న చెత్తలో పారేసి వెళ్లిపోయారు. ఆ నిప్పు క్రమంగా రాజుకుని మంటలు ఎగిసి పడ్డాయి. పక్కనే ఉన్న చెట్టు పైకి మంటలు వ్యాపించడంతో ఆ భారీ వృక్షం అగ్నికి ఆహుతైంది. మంటలు చుట్టు పక్కలకు వ్యాపించకుండా కైకలూరు అగ్నిమాపక సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

(c) eenadu

మృతిచెందిన గొడతా నాని పిల్లలను ఎత్తుకొని ఓదార్చుతున్న మంత్రి నారాయణ, ఎంపీ సానా సతీష్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మంత్రి దుర్గేష్, ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ తదితరులు..

బాధితులను ఓదార్చుతున్న మంత్రి అనిత

అంతులేని శోకం

- వేట్లపాలెం బాధిత కుటుంబాల్లో తీరని వేదన
- పేలుడు ఘటనలో మృతులకు అంత్యక్రియలు పూర్తి

ఈనాడు, కాకినాడ, న్యూస్‌టుడే, సామర్లకోట, సామర్లకోట గ్రామీణం, పెద్దాపురం: ఘోర ప్రమాదం ఆ ఊరంతటిని విషాదంలోకి నెట్టింది. బతుకుతెరువు కోసం ఉపాధి మార్గంగా ఎంచుకున్న వృత్తి జీవితాలనే బుగ్గి చేసింది. 22 మందిని బాణసంచా తయారీ కేంద్రం పొట్టన పెట్టుకుంది. మరో ఏడుగురు ఆసుపత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. శనివారం సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన పేలుడు ఘటనకు సంబంధించి చనిపోయినవారిలో ఈ గ్రామానికే చెందినవారే 15 మంది ఉన్నారు. ఆదివారం ఏ ఇల్లు చూసినా తీవ్ర రోదనలే. బరువెక్కిన హృదయాలతో మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తిచేశారు.

జీజీహెచ్‌లోని వార్డులో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

వాహనాల్లో తరలించి..

బాణసంచా పేలుడులో చనిపోయిన వారికి శనివారం రాత్రంతా శవపంచనామా పూర్తి చేశారు. ఇద్దరు ఆర్డీవోల పర్యవేక్షణలో తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మృతదేహాలను ఆదివారం ఉదయం మహాప్రస్థానం వాహనాల్లో వరుసగా గ్రామానికి పంపించి బంధువులకు అప్పగించారు. ఒకే ప్రాంతంలో ఆరు నుంచి ఎనిమిది మందికి వారి సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు జరిగాయి.

అవే చివరి మాటలు

మా పిల్లలు దివ్యాంగులు. వారి మానసిక పరిస్థితి బాగుండదు. ఎంత పనిలో ఉన్నా పిల్లలు భోజనం చేశారా లేదా అని ఫోన్‌చేసి అడుగుతుంటారు నా భర్త పెదలోవరాజు. శనివారం నాకు ఫోన్ చేయలేదు. బంధువులు వచ్చి మందు కొట్టు పేలిపోయింది లోవరాజుని ఆసుపత్రిలో చేర్చారని చెప్పడంతో గుండె ఒక్కసారిగా ఆగిపోయింది. ఆదివారం తెల్లవారుజామున ఆయన చనిపోయారని విలపించారు సామర్లకోటకు చెందిన దర్శిపాటి వెంకటలక్ష్మి.

అమ్మా పనికి వెళుతున్నా.. నాన్నా పనిచూసుకొని వేగంగా వచ్చేస్తా అంటూ ఉదయం వెళ్లినవారు మధ్యాహ్నానికే మంటల్లో సజీవ దహనమైపోయారు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోయినవారు కొందరు.. బిడ్డలను పోగొట్టుకున్నవారు ఇంకొందరు.. ఆఖరి చూపునకు కూడా నోచుకోలేకపోయామని ఆయా కుటుంబాలు అంతులేని ఆవేదన చెందుతున్నాయి.

సామర్లకోటకు చెందిన ఏడిద సంపత్‌కుమార్(25) ఆరోగ్యం బాగాలేకపోవడంతో మూడు రోజులు పనిలోకి వెళ్లలేదు. ఇంటి పోషణ కష్టతరంగా ఉండడంతో శనివారం వెళ్లాడు. మధ్యాహ్నం 1.30 సమయంలో ఫోన్ చేసి పిల్లలు భోజనం చేశారా అని అడిగాడు. అవే ఆఖరి మాటలని భార్య శ్రావణి విలపించారు. బాబు, పాపతో బతికేదెలా అంటూ ఆవేదన చెందారు.

సామర్లకోటకు చెందిన దర్శిపాటి యోహాన్ (నాని)(38) ఫైర్ వర్క్స్‌లో గత ఏడాదిన్నరగా పనిచేస్తున్నాడు. భార్య గంగాభవానీ, ఇద్దరు కుమార్తెలు మానస, అఖిల ఉన్నారు. చిన్న బిడ్డకు ఆరోగ్యం బాగోలేదని ఎక్స్‌రే రిపోర్టు వాట్సాప్‌లో పంపాను.. చూడమని ఫోన్‌చేసి మాట్లాడాడు. అవే చివరి మాటలంటూ బోరున విలపిస్తోంది నాని తల్లి మరియమ్మ.

కాలి బూడిదైన బాణసంచా తయారీ కేంద్రం షెడ్డు

నీటి కోసం బయటకు వచ్చి బతికా..

దాహంగా ఉండడంతో నీళ్లు తాగడానికి బాణసంచా షెడ్ నుంచి బయటకు వచ్చాను. మాకు చివరనున్న షెడ్ నుంచి మందుగుండు నిప్పురవ్వలు ఎగిసి మా షెడ్ వరకు వచ్చాయి. దీంతో అక్కడ పనిచేస్తున్న పది మంది ప్రాణాలను రక్షించుకోవడానికి పరుగులు తీశాం. కింద పడి మోకాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. దాహమే నా ప్రాణాలను కాపాడింది. - చేపల శామ్యూల్, పెద్దాపురం

సాగర తీరంలో పరుగుల సందడి

కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ రోడ్డులో కాకినాడ రన్నర్స్ ట్రస్టు, కాకినాడ సపోర్ట్, ఎవ్వెక్ ప్రోజెన్ ఫుడ్స్ ఆధ్వర్యంలో మహిళల భద్రత మన బాధ్యత అంటూ 21.5 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ నిర్వహించారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ యర్రా రామారావు, ఓఎన్‌జీసీ ఈడీ ప్రభులోకేశ్వర్, కాకినాడ సపోర్టు సీఈవో మురళీధర్, ఎవ్వెక్ ప్రోజెన్ ఫుడ్స్ ఎండీ చౌదరి, జీఆర్టీ హోటల్స్ జీఎం శేఖర్, రిలయన్స్ సీనియర్ మేనేజర్ సుబ్రహ్మణ్యం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాకినాడతో పాటు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1,500 మంది విద్యార్థులు, యువత, గృహిణులు, వృద్ధులు ఇందులో పాల్గొన్నారు. నారింజ రంగు ఏకరూప దుస్తులు ధరించి ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. కాకినాడ రన్నర్స్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డా.సుధ కేశవ రాజు, కమాండెంట్ ఎస్సీ శ్రీనివాస్ బృందం అవసరమైన ఏర్పాట్లు చేసింది. - న్యూస్‌టుడే, సర్పవరం

వామ్మో.. ఎన్ని చక్రాలో..

భారీ విద్యుత్తు నియంత్రికను తరలిస్తున్న 74 చక్రాల ప్రత్యేక వాహనం వాహన చోదకులు ఆసక్తిగా తిలకించారు. జాతీయ రహదారిపై విశాఖపట్నం వైపు వెళ్తుండగా తుని మండలం జగన్నాథగిరి వద్ద 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. చక్రాలను లెక్కించేందుకు పలువురు వాహనదారులు పోటీపడ్డారు. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం

సుస్వరాల తెలుగు.. ఇంటింటా వెలుగు

ఈనాడు, అమలాపురం, న్యూస్‌టుడే, గ్రామీణం, కలెక్టరేట్: తెలుగు అంటే.. కోనసీమ లాంటి పచ్చని అందాలు.. సవ్వడి చేసే గోదారమ్మ పరవళ్లు.. నిత్య స్ఫూర్తిని కలిగించే సముద్ర కెరటాలు అంటూ వివిధ రంగాల్లోని ప్రముఖులు తెలుగు భాష గురించి మాట్లాడారు. అమలాపురంలో నిర్వహిస్తున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలు ఆదివారం వేడుకగా ముగిశాయి. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాలలోని ప్రముఖులు హాజరయ్యారు. సాహితీవేత్తలు, కళాకారులు, భాష ఔన్నత్యాన్ని తెలియజేశారు. అమ్మ లాంటి భాషను భావితరాలకు అందించాల్సిన ప్రాధాన్యాన్ని వివరించారు.

ఎన్నెన్నో ప్రత్యేక ఆకర్షణలు..

సభా ప్రాంగణంలో తెలుగు కోసం విశేష కృషి చేసిన ప్రముఖుల విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యువతీయువకులు వాటి వద్ద స్వీయచిత్రాలు తీసుకుని సందడి చేశారు. తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందర్నీ అలరించాయి.

వేడుకలో కళాకారుల నృత్య ప్రదర్శన

ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రముఖులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్లు జస్టిస్ అబ్దుల్ నజీర్, జిష్ణుదేవ్ వర్మ, మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మొహియుద్దీన్, జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ చలపతిరావు, జస్టిస్ రామకృష్ణారెడ్డి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నశ్రీ, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, అమలాపురం, కొత్తపేట ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, చిత్రంలో డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, కిమ్స్ ఛైర్మన్ చైతన్యరాజు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

విజేతలకు బహుమతుల ప్రదానం..

ప్రముఖ సంగీత దర్శకుడు, రచయిత, గాయకుడు ఆర్పీ పట్నాయక్ వేదికపై 'తెలుగు భాష కమ్మదనం..' 'వానా.. వానా.. వాన.. నీలాకాశంలోన' 'ఒక్కటే రావడం.. ఒక్కటే పోవడం.. ఆ నలుగురు' తదితర పాటలు పాడారు. అంతకుముందు చైతన్యరాజుతో కలిసి తెలుగు మహాసభ పోస్టల్‌స్టాంప్‌ను ఆవిష్కరించారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రామోజీరావు వేదికపై విద్యార్థినులతో నిర్వహించిన ముఖాముఖిలో మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్ పాల్గొన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. విలువైన సూచనలు చేశారు.

చదువుకుంటూనే పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి

- విద్యార్థి దశలో ప్రతి నిమిషం విలువైంది. ప్రణాళిక ప్రకారం కష్టపడాలి. లక్ష్య సాధనకు క్రమశిక్షణ, కృషి అంతకు మించి స్థిరత్వం అవసరం. అప్పుడే విజయం సాధ్యం.

ప్రశ్న: కుటుంబం, వృత్తి సమన్వయం ఎలా?

- సమాజంలో పురుషుడైనా.. స్త్రీ అయినా స్వార్థాన్ని వీడాలి. ప్రస్తుత తరంలో ఆ స్వభావం అధికంగా ఉంది. మనం సమాజానికి ఏం ఇస్తున్నామో ఆలోచించాలి. ఒక్కరి ఆధిపత్యంతో కాకుండా ధ్యానం చేయాలి. సర్దుబాటుతత్వం ఉంటే చక్కని సమన్వయంతో రాణించగలం.



మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్

మహిళా రక్షణకు చట్టాలెన్నిఉన్నా నేరాలు ఆగట్లేదు ఎందుకు?

- రక్షణ పరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అవసర ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లకూడదు. యుద్ధవిద్యలు, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి. అందరూ మంచిగానే ఉంటారు, కొందరు మాత్రమే నేర స్వభావంతో ఉంటారు.



ఆకట్టుకున్న అచ్చమైన తెలుగింటి లోగిలి

కార్యక్రమానికి హాజరైన వివిధ రంగాల ప్రముఖులు, భాషాభిమానులు



వివిధ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులతో న్యాయమూర్తులు, చైతన్యరాజు

సార్వత్రిక ఇంటర్ పరీక్షలు నేటి నుంచే

జిల్లాలో 22 కేంద్రాల్లో నిర్వహణ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్యా పీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 13 వరకు ఆరు రోజుల పాటు పరీక్షలు జరుగుతాయి. జిల్లాలో 22 కేంద్రాల్లో ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. ఇంటర్ పరీక్షలకు జిల్లా నుంచి ఆయా కేంద్రాలలో 6,422 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. డీఈవో పిల్లి రమేష్ పర్యవేక్షణలో పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. సైన్స్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ఏప్రిల్ 11 నుంచి 18 వరకు జరుగుతాయి.

సబ్జెక్టుల వారీ వివరాలివీ..

2న ఆంగ్లం, 5న హిందీ, తెలుగు, ఉర్దూ, 7న రసాయశాస్త్రం, అర్థ శాస్త్రం, సామాజికశాస్త్రం, 9న భౌతికశాస్త్రం, రాజనీతిశాస్త్రం, పౌరశాస్త్రం, మనో విజ్ఞాన శాస్త్రం, 11న గణితం, చరిత్ర, వ్యాపార గణక శాస్త్రం, 13న జీవశాస్త్రం, వాణిజ్య శాస్త్రం, వ్యాపార శాస్త్రం, గృహ విజ్ఞానశాస్త్ర పరీక్షలు జరుగుతాయి.

ఈ-పంట సమాప్తం..!

8,846 ఎల్‌పీల్లో జరగని నమోదు

జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి వ్యవసాయ, అనుబంధ పంటల సాగు నమోదు (ఈ-పంట) ప్రక్రియ పూర్తయ్యింది. గతంలో విస్తీర్ణం వారీగా ఈ- పంట నమోదు జరిగేది. రబీ సీజన్ 2025 నుంచి ల్యాండ్ పార్సిల్ (ఎల్‌పీ) ఆధారంగా ఈ-పంట నమోదుకు శ్రీకారం చుట్టారు. ఎన్ఐసీ వెబ్‌సైట్ నుంచి జిల్లాకు సంబంధించి ఎల్‌పీ వివరాలను వ్యవసాయశాఖకు నివేదించగా, 342 రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) పరిధిలో జనవరి నుంచి ఈ-పంట నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఎల్‌పీల్లో ఏ పంట సాగు చేస్తే అది జరిగినట్లుగా నమోదు చేశారు. జిల్లాలో 3,87,046 ఎల్‌పీల వివరాలు రాగా, వీటిలో 3,78,200 ఎల్‌పీల్లో ఈ-పంట నమోదు చేశారు. 99 శాతంతో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. - న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

పెదపూడిలో ఈ-పంట నమోదు చేస్తున్న అధికారులు, సిబ్బంది

త్వరలో అభ్యంతరాల స్వీకరణ

త్వరలో ఈ-పంట నమోదు వివరాలను ఆర్ఎస్‌కేల వారీగా ప్రదర్శించనున్నారు. రైతులతో సమావేశాలు పెట్టి ఈ జాబితాను చదివి వినిపిస్తారు. తప్పులుంటే అభ్యంతరాలు స్వీకరిస్తారు. సాగు చేసిన రకానికి బదులు మరొకటి నమోదైనా, విస్తీర్ణం తగ్గినా.. వాటిని సరిచేసుకునే అవకాశం కల్పించనున్నారని జేడీ ఎన్.విజయ్‌కుమార్ చెప్పారు. ఈ-పంట వివరాలను వీఏఏ ధ్రువీకరణ తర్వాత వీఆర్వో, తహసీల్దార్లు ఆమోదిస్తారు.

ఎల్‌పీల వివరాలు లేక..

వెబ్‌ల్యాండ్‌లో వివరాల్లేని.. ఎన్ఐసీ నుంచి వచ్చిన కొన్ని ఎల్‌పీల సమాచారం నిక్షిప్తం చేయడం కుదరక ఈ-పంట వంద శాతం నమోదు కాలేదని అధికారులు చెబుతున్నారు. ఏపీఐఐసీ సేకరించిన భూములు ఖాళీ ఉన్నచోట్ల సాగు జరిగినా నమోదుకు అవకాశం ఏర్పడలేదు. దేవాదాయ శాఖకు సంబంధించిన ఎల్‌పీల్లో లీజుదారుడు పేరుతో భూమి ఉన్నా.. సబ్ లీజుకు ఇవ్వడం వంటి కారణాలతో వీటికి ఈ-పంట నమోదు కాలేదు. జాయింట్ ఎల్‌పీలు విభజన జరగక, కొన్ని భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో ఉన్నా.. ఈ-పంట పోర్టల్‌లోకి రాలేదు. ఇలా జిల్లాలో 8,846 ఎల్‌పీల్లో నమోదు జరగలేదు.

కౌలు రైతులకు మొండి చేయి..

ఈ-పంట నమోదులో ఈసారి కొందరు కౌలురైతులకు అన్యాయం జరిగిందని చెబుతున్నారు. వాస్తవ సాగుదారుడి వివరాలు నమోదు చేయాల్సి ఉన్నా.. కౌలుకు ఇచ్చిన రైతు ఒప్పుకోకపోవడంతో రైతుల పేర్లతోనే నమోదు చేశారు. కొందరు రైతులు వాస్తవ సాగుదారుడి వివరాల నమోదుకు అంగీకారం తెలపడంతో కొందరు కౌలురైతులకు మేలు జరిగింది.

ప్రయోజనాలు ఇవీ..

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటలు విక్రయించుకోవచ్చు.
- ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తుంది
- పంట బీమా కల్పిస్తారు.
- యూరియా, ఇతర పథకాలు వర్తింపజేస్తారు.

రాష్ట్రంలో బలమైన శక్తిగా సీపీఐ

గాంధీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తిగా సీపీఐ పార్టీని తీర్చిదిద్దుతామని, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు పేర్కొన్నారు. రెల్లిపేటలో ఆదివారం మున్సిపల్ కార్మికుల నివాస ప్రాంతాల్లో 'గడపగడపకు సీపీఐ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని, వారి నుంచి పార్టీ ఉద్యమానికి విరాళాలు కోరారు. ఆయన మాట్లాడుతూ.. 1 నుంచి 15 వరకూ రాష్ట్రవ్యాప్తంగా 'సీపీఐ గడపగడపకు..' పేరుతో ప్రజల వద్దకు వెళుతున్నామన్నారు. రాష్ట్ర సమితి సమావేశాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, నిత్యావసరాల ధరలు తగ్గించాలని తీర్మానించామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహ కార్యదర్శి తోకల ప్రసాద్, సభ్యులు బి.శ్రీనివాసు, ఏ.భవానీ, సత్యనారాయణ, బొబ్బిలి సత్యనారాయణ, రాజేష్, కుమారి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

LECTURERS / STAFF WANTED

LECTURERS	Pass LL.M.
LIBRARIAN	Pass B.Li.Sc

EXPERIENCED COMPUTER OPERATOR

CONTACT WITH BIO-DATA (RAVI SHANKAR)

0884-2376654, 9849889359

నేడు పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి

Cell: 80085 97607

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80082 34669

ఒక్క ఇంజెక్షన్‌తో రక్తహీనత దూరం..

ప్రభుత్వ నిర్ణయంతో గర్భిణులకు మేలు

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: జిల్లాలో అధిక సంఖ్యలో గర్భిణులు అవగాహన కొరవడి రక్తహీనతతో బాధపడుతున్నారు. తగినంత పోషకాహారం తీసుకోకపోవడంతో ఎక్కువ మంది ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. గర్భం వచ్చిందని తెలియగానే ఆసుపత్రులకు వెళ్లకుండా ఉండడం.. అయిదు, ఆరు నెలలు వచ్చేవరకూ అశ్రద్ధ చేయడంతో రక్తహీనతకు గురవుతున్నట్లు వైద్యుల పరిశీలనలో తేలింది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది. ఇప్పటివరకూ రక్తం తక్కువగా ఉండే బాలింతలకు మాత్రమే ఇచ్చే ఫెర్రిక్ కార్బాక్సీ మల్టోస్ (ఎఫ్‌సీఎం) ఇంజెక్షన్‌ను ఇక నుంచి గర్భిణులకు ఇవ్వాలని నిర్ణయించింది.

ఏటా జిల్లాలో సుమారు 20 వేలకు పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో సగానికి పైగా రక్తహీన బాధితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గర్భిణులకు ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పోషకాహారం అందిస్తోంది. పలు కారణాలతో చాలామంది వీటిని సద్వినియోగం చేసుకోవడం లేదు. ఫలితంగా రక్తహీనత బారిన పడుతున్నారు. దీంతో ప్రసవ సమయంలో తల్లి, బిడ్డల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. ప్రసవం అయ్యాక రక్తం చాలా తక్కువగా ఉన్నవారికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఐరన్, సూక్రోజ్ సూదిమందు వేసేవారు.

గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఎఫ్‌సీఎం ఇంజక్షన్ ధర ఇలా..

ఎఫ్‌సీఎం ఇంజెక్షన్ ధర మార్కెట్‌లో సుమారు రూ. 1500 ఉండగా, ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ. 2,000కు పైగా వసూలు చేస్తున్నారు. ఒకటి, రెండుసార్లు ఆ ఇంజెక్షన్ చేయించుకుంటే రక్తహీనత సమస్య ఉండదు.

అందుబాటులో ఉన్నాయి..

జిల్లాలో జీజీహెచ్, సీహెచ్‌సీ ఆసుపత్రుల్లో ఎఫ్‌సీఎం ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన గర్భిణులు వెళ్లి ఉచితంగా పొందవచ్చు. అలాగే పీహెచ్‌సీల్లో ఐరన్, సూక్రోజ్ సూది మందు వేస్తున్నారు. తద్వారా గర్భిణులకు రక్తహీనత లేకుండా చూస్తున్నాం. జిల్లాలో మాతృమరణాలు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం.

- డా.నరసింహనాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ జిల్లా.

సంప్రదాయ సవ్వడి

బుర్రకథ

సింహాచలం దేవస్థానానికి చెందిన నాదస్వరం విద్వాంసుల కచేరి

పేరూరు ఉన్నత పాఠశాల విద్యార్థినులు కోలాటం

అమలాపురంలోని కిమ్స్ ప్రాంగణంలో తెలుగు మహాసభలు ఎంతో వేడుకగా జరిగాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భాషాభిమానులు తరలివచ్చారు. వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు వచ్చారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్నారు. తెలుగింటి సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమాలు, ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.
– న్యూస్‌టుడే, కోనసీమ, అమలాపురం కలెక్టరేట్, అమలాపురం గ్రామీణం

కొబ్బరి పత్రం.. విభిన్న రూపం

పందిరి

గణపతి రూపం


శివలింగం

పచ్చని కొబ్బరి ఆకులతో వివిధ రూపాలను తీర్చిదిద్దడంలో పాశర్లపూడికి చెందిన వస్త్ర వ్యాపారి బళ్ల వెంకటరత్నం నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. శివలింగ రూపాలు, వేలాడే తోరణాలు, స్తంభ నమూనాలతో ఆకట్టుకుంటారు. తాను సొంతంగా నేర్చుకున్న అల్లికలతో చేసే బొమ్మలను కళాభిమానులకు స్వచ్ఛందంగా అందజేస్తుంటానని వెంకటరత్నం తెలిపారు. బంధువులు, స్నేహితులకు సంబంధించిన ఉత్సవాలకు ఉచితంగా ఇస్తుంటానన్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం నియోజకవర్గ పరిధిలో బాణసంచా తయారీ కేంద్రాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో నిరంతర తనిఖీలు చేపట్టాలన్నారు. అనాధికారిక కేంద్రాలుంటే చర్యలకు వెనకాడొద్దన్నారు. సమీక్షలో సీఐ శ్రీనివాస్, ఎస్సై జాన్‌భాష, ఎంపీడీవోలు స్వప్న, సెలట్రాజ్, లక్ష్మీరెడ్డి, కార్మికశాఖ అధికారి సతీష్, ఫైర్ అధికారి రామకృష్ణరాజు, కమిషనర్ కనకారావు పాల్గొన్నారు.

వైద్యరంగంలో.. చెట్టపట్టాల్

రంగరాయలో స్నాతకోత్సవ సందడి

పట్టాలు పొందే ముందు విద్యార్థుల ప్రతిజ్ఞ

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ఏళ్ల నాటి కల.. చేతిలో వైద్య విద్య పట్టా.. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితుల కరతాళధ్వనులు.. ఆ ఆనంద క్షణాలు తమ జీవితంలో ఎప్పటికీ నిలిచిపోయేలా చిత్రాలు తీసుకున్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్ అధ్యక్షతన ఆదివారం 63వ స్నాతకోత్సవ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఆర్ఎంసీ ప్రాంగణంలో 2020 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. ముఖ్యఅతిథిగా డా.అశోక్‌కుమార్, గౌరవఅతిథులుగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.ఎస్.లావణ్యకుమారి, విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.బి.దేవి మాధవి, డా.ఎన్టీఆర్‌యూహెచ్‌ఎస్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డా.బి.విష్ణు మహేష్ బాబు, ప్రత్యేక అతిథులుగా రామ్‌కోస అధ్యక్షుడు డా.ఎంవీవీ ఆనంద్, ఏఎంఏ అధ్యక్షుడు డా.కె.వెంకటరమణ, డా.వి.వరప్రసాద్, డా.ఎస్.లక్ష్మీనారాయణ, డా.ఎం.రాజేష్, డా.వీవీ రమేష్‌తోపాటు వైస్ ప్రిన్సిపల్స్ డా.డీపీవీఎస్ శశి, డా.ఎంవీ విజయశేఖర్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డా.పి.శ్రీనివాసన్, కల్చరల్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ డా.కె.శైలజ, స్పోర్ట్స్ బోర్డు వైస్ ప్రెసిడెంట్ డా.జీఎస్ ముఖర్జీ తదితరులు హాజరయ్యారు. వైద్య విద్యార్థులకు పట్టాలు అందజేశారు.

వైద్య వృత్తి ఉన్నతమైంది..

వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైందని, సమాజంలోకి వెళ్తున్న మీరంతా నైతిక విలువలు కలిగి ఉండాలని బీసీ రాయ్ అవార్డు గ్రహీత, లఖ్‌నవూ ఎస్‌జీపీజీఐ పూర్వపు డైరెక్టర్, భువనేశ్వరం ఏఐఐఎంఎస్ పూర్వపు డైరెక్టర్ డా.అశోక్‌కుమార్ మహాపాత్ర పేర్కొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యఅతిథి డా.అశోక్‌కుమార్ మహాపాత్ర

రామోజీ ఫిల్మ్‌సిటీలో మహిళలకు ప్రత్యేక ఆఫర్లు

She Shines
1st - 31st March - 2026

ఈ నెల 31 వరకు అవకాశం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: రంగమేదైనా తమకు సాటి లేదని మహిళామణులు చాటిచెబుతున్నారు. వారి స్ఫూర్తిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకునే వేళ రామోజీ ఫిల్మ్‌సిటీ మార్చి నెలను అతివలకు అంకితం చేస్తూ మహోత్సవాన్ని నిర్వహిస్తోంది. నేటి నుంచి మార్చి 31 వరకు ప్రత్యేక ఆఫర్లతో మహిళలు ఫిల్మ్‌సిటీని సందర్శించేందుకు వీలు కల్పించింది. వివిధ ప్రత్యేక కార్యక్రమాలతో పాటు అన్ని వయసుల మహిళలకు సినీ ప్రపంచంలో వినోదం, విహారం, సినిమాటిక్ వైభవాన్ని ఆస్వాదించే అవకాశం ఉంది. రామోజీ స్టూడియో టూర్‌లో అద్వితీయ సినిమా సెట్ల వీక్షణం, లైవ్ షోలు, రైడ్స్, సాహసాల నెలవు సాహస్ సందర్శన, అలరించే పక్షుల పార్కు, సీతాకోకచిలుకల గార్డెన్, మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్, మాయాలోక్ ఇలా ఎన్నో ఆకర్షణలను తిలకించవచ్చు.

సద్వినియోగం చేసుకోండి..

రామోజీ ఫిల్మ్‌సిటీ మహిళా దినోత్సవ ఆఫర్‌లో భాగంగా అన్ని వయసుల మహిళలకు ఒక్కొక్కరికి రూ.1111 + జీఎస్టీ, కనీసం 11 మంది బృందంగా వస్తే ఒక్కొక్కరికి రూ.999 + జీఎస్టీతో ప్రవేశ రుసుము ఉంటుంది. బృందాలుగా వచ్చి వేడుకలు మరింత ఉత్సాహంగా జరుపుకోవడానికి ఇదే మంచి తరుణం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మహిళా మహోత్సవాల్లో పాల్గొని మరిచిపోలేని మధురానుభూతి పొందండి.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.comలో లాగిన్ అవ్వండి. లేదా 76598 76598కు కాల్ చేయండి.

లోవ దేవస్థానానికి పోటెత్తిన భక్తులు

తుని గ్రామీణం: ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీ కారణంగా వసతి గదులు నిండిపోవడంతో ఆలయ ప్రాంగణంలోని చెట్ల కింద వంటావార్పు చేసుకొని సామూహిక భోజనాలు చేశారు. సుమారు 20 వేలకు పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో దాదాపు రూ.5.40లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.

3వ తేదీన ఆలయం మూసివేత

చంద్రగ్రహణం కారణంగా ఈ నెల 3వ తేదీన ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ వేద పండితులు తెలిపారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మాత్రమే సేవలు ఉంటాయని వివరించారు. 4వ తేదీన ఉదయం సంప్రోక్షణ అనంతరం ఉదయం 8 గంటల నుంచి తిరిగి భక్తులకు పునః దర్శనం కలుగుతుందని తెలిపారు.

అవినీతిని ప్రశ్నిస్తే హిందూ ధర్మంపై దాడి..?

వైకాపాను నిలదీసిన తితిదే పాలకవర్గ సభ్యుడు నెహ్రూ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో తిరుమల లడ్డూ తయారీలో అవినీతి జరిగిందని ప్రశ్నించినందుకు ఆ పార్టీ నాయకులు సీఎం చంద్రబాబుపై సొంత మీడియాలో ఎదురు దాడికి దిగుతున్నారని తితిదే పాలకవర్గ సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. అవినీతిని ప్రశ్నిస్తే హిందూ ధర్మంపై దాడి చేసినట్లా..? అని ఆయన నిలదీశారు. తెదేపా కాకినాడ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. లడ్డూ తయారీకి వినియోగించిన నెయ్యిలో చుక్క పాలు కూడా వాడలేదని ఎన్‌డీడీబీ ప్రయోగశాల నివేదిక ఇచ్చిందన్నారు. 'హిందూ ధర్మంపై దాడి' అంటూ సాక్షిపత్రికలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని నెహ్రూ ఆరోపించారు. ఇప్పటికైనా వైకాపా నాయకులు, ఆ పార్టీ మీడియా స్వామివారి ప్రతిష్ఠను దిగజార్చే ప్రకటనలు మానుకోవాలని నెహ్రూ హితవు పలికారు. సమావేశంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, తదితరులు ఉన్నారు.

కాకినాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ఉత్కంఠభరితంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు

సీనియర్స్, జూనియర్స్‌లో గుమ్మిలేరు ఎడ్లకు ప్రథమ బహుమతులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు మల్లవరం రోడ్డులో పెద్దింటమ్మతల్లి రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఆదివారం ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీలను మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ ప్రారంభించి విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్స్ విభాగంలో ఆరు జతల ఎడ్లు, జూనియర్స్ విభాగంలో 33 జతల ఎడ్లు ఇందులో పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరుకు చెందిన కోరా శృతి చౌదరి ఎడ్లు ప్రథమ, మండపేటకు చెందిన వేగుళ్ల తేజబాబు ఎడ్లు ద్వితీయ, కాకినాడ గ్రామీణ మండలం కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ ఎడ్లు తృతీయ స్థానాలుగా నిలిచాయి. జూనియర్స్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరావీర వెంకట సత్యవేణి ఎడ్లకు ప్రథమ, పిఠాపురం మండలం వెల్దుర్తికి చెందిన ఎనుగంటి సూర్యవెంకటరామారావు ఎడ్లకు ద్వితీయ, గొల్లప్రోలు మండలం వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి ఎడ్లకు తృతీయ బహుమతులు లభించాయి. న్యాయనిర్ణేతలుగా సిద్దా నానాజి, యనమల కృష్ణుడు వ్యవహరించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు పోటీలను పర్యవేక్షించారు.

మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం నుంచి రాజమహేంద్రవరం వెళ్లే రహదారిలోని రామేశంమెట్ట వద్ద నిర్మాణం జరుగుతున్న జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను ఆదివారం రాష్ట్ర పురపాలిక మంత్రి పొంగురు నారాయణ, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు పరిశీలించారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సతీష్‌బాబు మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణలో ఆధునిక విధానాలు అమలు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కూడా సృష్టించబడతాయన్నారు. కలెక్టర్ షాన్ మోహన్, జేసీ అపూర్వ భారత్, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ, పెద్దాపురం పురపాలిక కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి వీరి వెంట ఉన్నారు.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు విడుదల

పామర్రు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాల పరిధిలోని విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాలను విద్యాశాఖ అధికారులు విడుదల చేశారు. ఆయా వివరాలను వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలతో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు, ఉన్నత పాఠశాలల హెచ్ఎంల వివరాలను సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారుల వెబ్‌సైట్లో పరిశీలించుకోవచ్చు. వీటిపై ఏవైనా అభ్యంతరాలుంటే మార్చి ఏడో తేదీలోగా డీఈవో కార్యాలయాల్లో సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు వెల్లడించారు.

పేలుడు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రులు అనిత, నారాయణ, సుభాష్

కాకినాడ జీజీహెచ్‌లో బాధితులను పరామర్శించిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

వేట్లపాలెంలో శనివారం జరిగిన బాణసంచా పేలుడు జరిగిన స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న నిపుణుల బృందం

EENADU Classifieds

AUTO
VEHICLES FOR SALE
శ్రీ లలితా రైస్‌మిల్ పెద్దాపురం వారి ఇన్నోవా కార్లు అమ్మకమునకు కలవు. Contact Cell: 94941 54551.

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

HEALTH & CARE
మద్యపానం మానేయడంఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు రాజమండ్రి శ్రీ సాయిలక్ష్మీ లాడ్జి SVG మార్కెట్ రోడ్, ఆర్టీసీబస్టాండ్ ఎదురుగా, ప్రతినెల 3,17 తేదీల్లో మందులు.

RHEUMATOLOGY
రుమటాలజిస్ట్
డా॥ ఎ.రామకృష్ణంనాయుడు
MD, DM (Rheumatology, NIMS, HYD)
07-03-2026న (శనివారం) 02 PM to 07 PMవరకు రాజమండ్రిలో ప్రైమ్ పాత్ ల్యాబ్స్, సీసీసీ ఛానెల్ ఎదురుగా, దానవాయిపేట వద్ద
ఫోన్: 94929 41177
మరియు
08-03-2026న (ఆదివారం) కాకినాడలో సేఫ్ హాస్పిటల్ నందు 11 AM to 6 PM వరకు అందుబాటులో ఉంటారు.
ఫోన్: 0884 2383366

REAL ESTATE
PLOT FOR SALE

GENERAL
బిగ్ ఫ్లాష్ న్యూస్. ప్రతిపాదిత తుని, అన్నవరం ఎయిర్‌పోర్ట్, అన్నవరం 6 లైన్లు రోడ్డుని ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ (RERA) KAUDA లేఅవుట్‌లో Open Plots, Simplex Houses, Villas, 80% బ్యాంకు Loan, ఫ్రీ సైట్ విజిట్కై. ✆ 96031 94449.

JOBS
Wanted Male Counselors and Admission Dept. Staff Qualification any Degree. Age Limit: 25 to 45 years having experience in Educational Organisations will be preferable. Salary upto: 18000/-. Working location: Master Minds College, Rajahmundry.Contact Cell: 92487 33370.

కాకినాడలో MEGA సంస్థనందు పనిచేయుటకు Marketing Executive (M) కావలెను. టూవీలర్ తప్పనిసరి. Contact Cell: 8247332564.

ఉద్యోగం: East & West జిల్లాల్లో ప్ర॥ కంపెనీలకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, టెలీకాలర్స్ స్త్రీ/పు. కావలెను. జీతం, రూం+ భోజనం ఫ్రీ. R.S. సర్వీసెస్, RJY, 99633 27756.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-58 పైII
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU
for Advertisement
Contact:
8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి)	18,000
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	150-00
రిటైల్ లైవ్	177-00
డ్రెస్ట్	257-00
స్కిన్‌లెస్	292-00

మహా మారేడు

మారేడు కాయలతో ఏలేటి రాజశేఖర్

సాధారణంగా మారేడు కాయ 100 నుంచి 150 గ్రాముల బరువు ఉంటుంది. పోతవరానికి చెందిన పిచ్చికల సత్తిబాబు వ్యవసాయ క్షేత్రంలోని మారేడు చెట్టుకు కాసిన కాయలు ఒక్కొక్కటి 2 కిలోలు బరువుతో ఆశ్చర్యపరుస్తున్నాయి. ఇదేళ్ల కిందట మొక్క నాటితే గతేడాది నుంచి కాయలు కాస్తోందని ప్రస్తుతం పొలం చేస్తున్న ఏలేటి రాజశేఖర్ తెలిపారు. కాగా మొక్కలకు సేంద్రియ పదార్థాలు, పోషకాలు సమృద్ధిగా అందడంతోపాటు భూమిలో సారం ఎక్కువగా ఉంటే పెద్ద పరిమాణంలో కాయలు కాయడానికి అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి సోమశేఖరం తెలిపారు. – న్యూస్‌టుడే, నల్లజర్ల

కుట్టు శిక్షణ సరే.. మిషన్లు ఏవీ..?

● ఏడాది గడుస్తున్నా పట్టించుకోని వైనం ● నెరవేరని మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యం

గతంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం

న్యూస్‌టుడే, కొత్తపేట

మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన కుట్టు శిక్షణ కార్యక్రమం మొదటి దశలోనే నిలిచిపోయింది. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు ఇళ్లవద్దే ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యం నెరవేరడం లేదని శిక్షణ పొందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నిరుద్యోగ యువతులు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో బీసీ కార్పొరేషన్ ద్వారా కొన్ని నెలల కిందట కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో రోజుకు రెండు బ్యాచ్‌ల చొప్పున తరగతులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,625 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా.. 11,014 మందికి శిక్షణ అందించామని, మూడు నెలల పాటు సాగిన ఈ శిక్షణకు 75 శాతం హాజరుతో విజయవంతంగా పూర్తి చేసిన యువతులు, మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అల్లికలు, ఆధునిక డిజైన్లపై అవగాహన కల్పించి, శిక్షణ ముగిసిన అనంతరం ధ్రువపత్రాలు అందజేశారు. శిక్షణ పూర్తి చేసి నెలలు గడుస్తున్నా మిషన్లు అందకపోవడంతో మహిళలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు త్వరగా అమలు చేస్తేనే శిక్షణ లక్ష్యం నెరవేరుతుందని వారు అంటున్నారు. 104 శిక్షణ కేంద్రాల్లో మహిళా ట్రైనర్, హెల్పర్ చొప్పున 208 మందిని నియమించి, జీతం ఇస్తామని ఆదిలో చెప్పారు. వారికి ఇప్పటికీ సహాయం అందక ఏమి చేయ్యాలో తెలియని స్థితిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి వారిని ఆదుకోవాలని కోరుతున్నారు.

జిల్లాల వారీ వివరాలు ఇలా..

జిల్లా	లక్ష్యం	కేంద్రాలు	శిక్షణ పొందినవారు
కాకినాడ	3,789	50	4,920
తూర్పుగోదావరి	3,593	25	2,904
అంబేడ్కర్ కోనసీమ	3,243	29	3,190

త్వరలోనే పంపిణీ..

శిక్షణ పూర్తి చేసిన మహిళలందరికీ కుట్టుమిషన్లు పంపిణీ చేస్తాం. రెండో దశ శిక్షణకు పెద్ద సంఖ్యలో మహిళలు ముందుకు వస్తున్నారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. శిక్షణ పొందిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. - రెడ్డి అనంతకుమారి, ఛైర్మన్, ఏపీ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

కోటిపల్లి-ముక్తేశ్వరం రోడ్డు వంతెనకు కృషి

రామ్‌మాధవ్‌ను కలిసిన పార్టీ నాయకులు

పామర్రు, న్యూస్‌టుడే: కోనసీమకు ముఖద్వారంగా భాసిల్లే కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య గోదావరి నదిపై రోడ్డు, వంతెన నిర్మాణానికి సహకారం అందించాలని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం భాజపా ఇన్‌ఛార్జి కర్రి చిట్టిబాబు, స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు భాజపా జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌కు ఆదివారం వినతిపత్రం అందించారు. అమలాపురంలో ప్రపంచ తెలుగు మహాసభలకు విచ్చేసిన ఆయన్ను కలిసి పరిస్థితిని వివరించామన్నారు. ఈ విషయమై దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీను త్వరలోనే కలిసి నిధులు మంజూరుచేసేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. కోనసీమ వాసిగా ఇది తన కర్తవ్యమని ఆయన చెప్పారని వెల్లడించారు. పార్టీ నేతలు అవసరాల వెంకటరమణమూర్తి, ఆకేటి శ్రీకృష్ణ, ఆర్.వి.నాయుడు, పలువురు పెద్దలు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం

హెలిప్యాడ్ వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, జేసీ నిశాంతి, చైతన్యరాజు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అమలాపురంలో నిర్వహించిన మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆదివారం ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని హెలిప్యాడ్ వద్ద అధికారులు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, జేసీ నిశాంతి, కిమ్స్ అధినేత చైతన్యరాజు, జిల్లా ఉద్యానశాఖ అధికారి బీవీ రమణ తదితరులు ఆయనకు స్వాగతంపలికి ఆహ్వానించారు. అమలా పురంలోని ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని ప్రసంగించిన అనంతరం విజయవాడ ప్రయాణమైన ఆయనకు హెలిప్యాడ్ వద్ద వీడ్కోలు పలికారు.

(c) eenadu

కాకినాడ

రైతుబజార్‌లో కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాట- 6, 8, వంకాయలు- 15, 20, 22, బెండకాయలు- 30, పచ్చిమిర్చి- 52, 55, 60, కాకరకాయ- 36, బీర- 32, 36, కాలీఫ్లవర్- 15, 20, క్యాబేజీ- 18, క్యారెట్- 26, దొండకాయలు- 32, 36, బంగాళాదుంపలు- 16, 20, ఉల్లి- 18, 24, దోసకాయలు- 26, చిక్కుళ్లు- 25, చేమదుంపలు- 30, బీట్‌రూట్- 24, కీరదోస- 30, బీన్స్‌కాయలు- 50, అల్లం- 70, క్యాప్సికం- 56, బొబ్బర్లు- 18, చిలకడదుంపలు- 36, ఒకటి చొప్పున ఆనపకాయ- 15, 18, పొట్లకాయ- 20, 25, అరటికాయ- 6, 8, మునగకాడ- 8, 10, మామిడికాయ- 10, 15, నిమ్మకాయలు(డజన్) - 36, 60.

నగరంలో సినిమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- దరైజ్ ఆఫ్ అశోక, కపుల్ ఫ్రెండ్లీ, మన శంకరవరప్రసాద్ గారు, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- విష్ణువిన్యాసం, కపుల్ ఫ్రెండ్లీ, విత్ లవ్, లక్ష్మి- విష్ణువిన్యాసం, సత్యగౌరి - ఉత్తుత్తి హీరోలు, తిరుమల- మన శంకరవరప్రసాద్ గారు, శ్రీప్రియ - హే బలవంత్, పద్మప్రియ- విష్ణువిన్యాసం

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ నగరం: 80085 74157
సాంబమూర్తినగర్: 91548 46719, మసీదుసెంటర్: 91541 18210
గాంధీనగర్: 80085 74159, బాలాజీచెరువు: 80085 74154

గుంత పూడ్చారు..

మసీదుసెంటర్: కాకినాడ, భాస్కర్‌నగర్ ప్రధాన రహదారిపై కొంత కాలంగా గుంత అధ్వానంగా ఉంది. ఇటీవల ఈనాడులో వార్త ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చారు.

స్పందనకు వందనం

నీటి వృథా అరికట్టారు

మసీదుసెంటర్: కాకినాడ, మాదిరెడ్డివారివీధిలో కొళాయి నుంచి వృథాగా తాగునీరు పోతోంది. కొళాయి బిరడా లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఇటీవల ఈనాడు లో 'వృథాను అరికట్టరూ..' శీర్షికతో వార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు.

సమస్య: ఎల్‌బీ నగర్‌లో పలు వీధులు చీకటిమయంలో ఉన్నాయి. 'దృష్టి' ఆస్పత్రి సమీపంలో దీపాలు వెలగకపోవటంతో రాత్రి పూట రోగులు, వృద్ధులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. - ప్రదీప్, స్థానికుడు

సమాధానం: విద్యుత్తు విభాగంతో మాట్లాడి ఎల్‌బీనగర్ వీధుల్లో దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- కమిషనర్, ఎన్‌వీవీ సత్యనారాయణ

సమస్య: నగరంలోని 49వ డివిజన్ పరిధి నాగవనం రోడ్డు వెనక కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రోడ్లపై గుంపులుగా సంచరిస్తూ పాదచారులపై దాడులు చేస్తున్నాయి.
- కామేశ్వరరావు, స్థానికుడు

సమాధానం: కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. నాగవనం వెనక వీధిలోగల కుక్కలకు కు.ని.శస్త్ర చికిత్సలు, ఏఆర్‌వీ వ్యాక్సిన్లు వేయిస్తాం. - పృథ్వీచరణ్, ఎంహెచ్‌వో

- న్యూస్‌టుడే, కాకినాడ నగరం

సాంకేతికతపై పట్టు.. పరిశోధనకు మెట్టు

జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ

న్యూస్‌టుడే, గాంధీనగర్

ప్రస్తుతం సాంకేతికత ఎప్పటికప్పుడు కొత్తపుంతలు తొక్కుతోంది. దీనిపై అధ్యాపకులు పట్టు సాధిస్తే విద్యార్థులకు దాని ఫలాలు పరిపూర్ణంగా అందుతాయి. ఈ నేపథ్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. అన్నింటికీ కేంద్రంగా మారుతున్నాయి. దీనిపై అధ్యాపకులు అవగాహన పెంపొందించుకునేలా జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో రెండు వారాల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల అధ్యాపకులు, పీజీ విద్యార్థులు హాజరవుతున్నారు. సమన్వయకర్తగా జేఎన్‌టీయూకే ఈసీఈ ప్రొఫెసర్ ఎ.రజని వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ఆన్‌లైన్ జూమ్‌లో జరిగే ఈ తరగతులకు దేశంలోని ప్రముఖ ఐఐటీలు, ఎన్ఐటీలకు చెందిన ప్రొఫెసర్లు, ఆయా పరిశ్రమలకు చెందిన నిపుణులు హాజరై వివరాలు తెలుపుతున్నారు. ఇది మరిన్ని పరిశోధనలకు ఉపయుక్తంగా ఉంటుందని అధ్యాపకులు, పీజీ విద్యార్థులు పేర్కొంటున్నారు.

పరిశోధనలకు ఊతం..

ఐవోటీ, ఎడ్జ్ ఏఐతో రానున్న ఐదేళ్ల కాలంలో సాంకేతిక పరంగా అనేక మార్పులు కళ్లారా చూస్తాం. ఈ కార్యక్రమం ద్వారా సివిల్, మెకానికల్, ఈఈఈ వంటి విభాగాలకు చెందిన అధ్యాపకులు, పీజీ విద్యార్థులకు ఏఐ టూల్స్‌ను ఉపయోగించుకుని వారివారి రంగాల్లో ఎటువంటి పరిశోధనలు చేయవచ్చో తెలుస్తుంది. పీజీ విద్యార్థులు సొంతంగా ప్రాజెక్టులు తయారు చేయడానికి వీలవుతుంది.
- ఎ.రజని, ప్రొఫెసర్, సమన్వయకర్త, జేఎన్‌టీయూకే

ప్రాజెక్టుకు ఉపయుక్తంగా..

నిపుణులు ఆయా అంశాలపై ప్రయోగాలు నేరుగా చేసి చూపిస్తున్నారు. ఇవి మేము చేసే ప్రాజెక్టులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. సాంకేతికతను ఎలా ఉపయోగించాలి, దాని ఫలాలు ఎలా అందుకోవాలో నేర్చుకుంటున్నాం. నేను బ్లైండ్ స్టిక్ ప్రాజెక్టు చేస్తున్నా. అందులో సెన్సార్ బోర్డులు ఎలాంటివి వాడితే మంచి ఫలితాలు వస్తాయో తెలుసుకుంటున్నా. - ఐశ్వర్య, ఎంటెక్ విద్యార్థిని

ప్రయోగాలు చేసి చూపిస్తున్నారు..

ఈ శిక్షణ అన్ని బ్రాంచిల విద్యార్థులందరికీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఇందులో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లను ఎలా కలిపి ఉపయోగించవచ్చో నిపుణులు వివరిస్తున్నారు. రియల్ టైంలో మనం కేవలం చదువుతాం, చిన్నచిన్న ప్రయోగాలు చేస్తాం. ఈ కార్యక్రమంలో భాగంగా నిపుణులు సాంకేతిక ప్రయోజనాలు స్వయంగా చేసి చూపిస్తున్నారు. ఐవోటీతో వ్యవసాయ రంగంలో ఏఐను ఎలా ఉపయోగించాలో తెలిసింది. - అనూహ్య, ఎంటెక్ విద్యార్థిని

లోకేశ్ ఫౌండేషన్‌తో పేదలకు సేవలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: లోకేశ్ ఫౌండేషన్ పేరుతో పేదలకు పలు రకాల సేవలందిస్తున్నామని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బు అన్నారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ సోదరుడు, తెదేపా సీనియర్ నాయకుడు తొండపు రవి 11వ వర్ధంతిని ఆదివారం సంతచెరువు ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సుబ్బుతో పాటు ఫౌండేషన్ మహిళా విభాగ అధ్యక్ష, కార్యదర్శులు సత్యవతి, పద్మకుమారి తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 50 పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు నగదు అందించి అన్నదానం చేశారు.

రైల్వేగేటు వద్ద ఒకవైపే రాకపోకలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలో రోజూ రద్దీగా ఉండే ఎస్.అచ్యుతాపురం రైల్వేగేటు వద్ద వన్‌వే ట్రాఫిక్ పటిష్ఠ అమలుకు పోలీసులు చర్యలు చేపట్టారు. కొన్నేళ్లుగా ఇక్కడ వన్‌వే ట్రాఫిక్ అమలు చేస్తున్నా.. నిబంధనలు ఉల్లంఘించి వాహన రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ట్రాఫిక్ పోలీసు అధికారులు వన్‌వే కచ్చితంగా అమలు చేసేలా ఏర్పాట్లు చేశారు. ఆదివారం ట్రాఫిక్ పోలీసులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. వన్‌వేకు ఏర్పాటు చేసిన దిమ్మెలను పక్కకు నెట్టేయడంతో వాటిని సరిచేయించారు.

నగరంలో పూర్ణిమ మహోత్సవం

వైభవంగా భవ్య నగర సంకీర్తన కార్యక్రమం

గాంధీనగర్, న్యూస్‌టుడే: గౌర పూర్ణిమ మహోత్సవం సందర్భంగా ఆదివారం కాకినాడ నగరం హరి నామ సంకీర్తనలతో మారుమోగింది. శ్రీచైతన్య మహాప్రభు అవతార మహోత్సవం శ్రీగౌర పూర్ణిమ సందర్భంగా హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో భవ్య నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నిర్వహించారు. సర్పవరం వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన సంకీర్తన యాత్ర ఎన్ఎఫ్‌సి ఎల్‌రోడ్డు, ఐఎంఏ హాల్, జయేంద్రనగర్ మీదుగా స్థానికంగా ఉన్న హరేకృష్ణ మూమెంట్ ఆలయం వద్ద ముగిసింది. ముఖ్య అతిథిగా హరేకృష్ణ మూమెంట్ విశాఖపట్నం అధ్యక్షుడు నిష్కించన భక్తదాస పాల్గొని భక్తులను ఆశీర్వదించారు. నగర సంకీర్తనా యాత్ర పిల్లలు, పెద్దలతో వాయిద్యాల నడుమ వీధులు మార్మోగాయి. వాహన చోదకులకు ప్రసాద వితరణ జరిగింది.

నగర సంకీర్తన యాత్రలో పాల్గొన్న చిన్నారులు, భక్తులు

సమావేశంలో చేయూత సంస్థ నూతన మహిళా కార్యవర్గ సభ్యులు

సంపాదనపరులు సమాజానికి తిరిగివ్వాలి

చేయూత అధ్యక్షుడు రవికుమార్

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఉద్యోగులు, ఇతర సంపాదనాపరులుకొంత సమాజానికి తిరిగివ్వాలని చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. రోటరీ భవన్‌లో ఆదివారం చేయూత సంస్థ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ. . మెరుగైన సమాజ స్థాపనకు ఉద్యోగులు, వ్యాపారస్తులు, దాతలు తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. జీజీహెచ్ వద్ద 1700 రోజులుగా పేదలకు అన్నదానం చేస్తున్నామని తెలిపారు.

సంస్థ మహిళా కార్యవర్గం నియామకం

మహిళా అధ్యక్షురాలిగా తేజస్విని, అసోసియేటెడ్ అధ్యక్షురాలిగా సుందరి, కార్యదర్శిగా ఉమా సుశీల, ఉపాధ్యక్షులుగా ఝాన్సీ, అంగాడి లక్ష్మి, ఆర్థిక కార్యదర్శిగా మేకా పద్మను నియమించారు. వీరు ఈనెల 7న పిఠాపురంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, పోషకాహారం పంపిణీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాన్ని కాపాడుకోండి

ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థినులు కలిసి కరపత్రాలు పంచుతున్న దృశ్యం

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాలు నడిపే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా శిరస్త్రాణం (హెల్మెట్) ధరించాలని, హెల్మెట్ లేకుండా నడిపితే జరిమానా విధిస్తామని కాకినాడ ట్రాఫిక్-1 సీఐ ఎన్.రమేష్ అన్నారు. స్థానిక కల్పనా సెంటర్ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే ఉద్దేశంతో కాకినాడ ట్రాఫిక్-1 పోలీసులు, ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. పాదచారులు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. 'హెల్మెట్ ధరించండి..మీ ప్రాణాన్ని కాపాడుకోండి రోడ్డు భద్రత మీ చేతుల్లోనే ఉందనే' నినాదంలో ముందుకు సాగారు. సీఐ రమేష్ మాట్లాడుతూ.. సీటుబెల్ట్ ధరించి ప్రయాణాన్ని సుఖమయం చేసుకోవాలన్నారు. అతివేగం వద్దని నిదానమే ప్రధానమన్నారు. ద్విచక్రవాహనంపై ఇద్దరికి మించి ప్రయాణించరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ టీఆర్ఎస్సై సత్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఎమ్మెల్యే కొండబాబు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అంగన్‌వాడీ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఎన్నికల్లో అంగన్‌వాడీలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని ఆయన గుర్తు చేశారు. జగన్నాథపురంలోని తన నివాసంలో కొండబాబు ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా అంగన్‌వాడీలకు రెండు సార్లు వేతనాలు పెంచిన ఘనత చంద్రబాబుదేన్నారు. ఏళ్ల తరబడి అంగన్‌వాడీలు ఎదురుచూస్తోన్న గ్రాట్యుటీ సమస్యను ప్రభుత్వం పరిష్కరించిందని గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మినీ అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిగా అప్‌గ్రేడ్ చేస్తోందన్నారు. ఇందులో పనిచేసే చేసే సిబ్బందిని కార్యకర్తలుగా గుర్తించి వేతనాలు పెంపుదల చేస్తారని వివరించారు. ఇప్పటికే అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, బ్లాక్‌స్థాయి సమన్వయకర్తలకు రూ.75 కోట్ల విలువ చేసే స్మార్ట్‌ఫోన్లు అందించిన విషయాన్ని కొండబాబు గుర్తుచేశారు. అంగన్‌వాడీలు ప్రతిపాదిస్తున్న డిమాండ్లలో ఇప్పటికే తొమ్మిదింటిని కూటమి ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. వేతనాల పెంపు అంశాన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుందని కొండబాబు వెల్లడించారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, KAKINADA
E.P. No.37/2025 in O.S.No.61/2021
Between:
1) Sri Surya Agencies, Gollalamamidada, rep. by its Proprietor Mallidi Surya Vara Prasada Reddy
2) Medapati Appareddy ...DHrs/Plaintiffs
and
Gullapudi Alivelu Mangatayaru and others ...JDrs/Defendants
To: JDr1: Gullapudi Alivelu Mangatayaru, W/o. (late) Nooka Veera Naga Satya Vara Prasad, R/o. V.G.P. Plaza, Second Floor, Flat No.S-3, D.No.28-1-18, Main Road, Kakinada.
JDr2: Gullapdi Sivanand Kiran, S/o. (late) Nooka Veera Naga Satya Vara Prasad, R/o. V.G.P. Plaza, Second Floor, Flat No.S-3, D.No.28-1-18, Main Road, Kakinada.
JDr3: Gullapudi Kalyan Sudhakar, S/o. (late) Nooka Veera Naga Satya Vara Prasad, R/o. V.G.P. Plaza, Second Floor, Flat No.S-3, D.No.28-1-18, Main Road, Kakinada.
పై నెంబరు అమలు గ్రంథములో 1వ, 2వ మరియు 3వ JDrs అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు సేల్ నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది. 23-03-2026 తేదిన వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు పై శ్రీ కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై అమలు గ్రంథము మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.
Dr. మేడపాటి ధర్మారెడ్డి
A.U.V. స్వామి, న్యాయవాదులు
ప్రతాప్‌నగర్, కాకినాడ, సెల్: 8099505050

పట్టాల సంబరం..

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

అదిగో.. నేనిక్కడున్నానంటూ తల్లికి తన చిత్రాన్ని చూపెడుతున్న వైద్య విద్యార్థిని

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: అదిగో మా అబ్బాయి.. ఇదిగో మా అమ్మాయి.. ఇప్పుడిక డాక్టర్.. మా వంశంలోనే తొలి వైద్యురాలు. ఎన్నేళ్ల శ్రమో.. ఇప్పుడు తలుచుకుంటుంటే ఆనందబాష్పాలు వస్తున్నాయి. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పట్టాల వేడుక సందర్భంగా ఎక్కడ చూసినా ఈ మాటలే వినిపించాయి. ఆదివారం జరిగిన స్నాతకోత్సవ వేడుకలో సందడి వాతావరణం నెలకొంది. కళాశాల ప్రాంగణమంతా పండగను తలపించింది. దేశ విదేశాల నుంచి తల్లిదండ్రులు తమ బిడ్డల పట్టాల వేడుకలో పాల్గొన్నారు. అయిదేళ్ల జ్ఞాపకాలను, అనుభూతులను గుర్తుచేసుకుంటూ ఆనందంలో తేలిపోయారు. కుటుంబ సభ్యులు, బంధువులతో స్వీయచిత్రాలు తీసుకుంటూ సందడి చేశారు.

పట్టాలు పొందిన వైద్య విద్యార్థినులు

ఆకట్టుకున్న ఫొటో ఆల్బమ్స్..

అదిగో.. ఇది నేనే.. ఇది నా ఫొటోనో.. అంటూ తమ తల్లిదండ్రులకు ఓ విద్యార్థిని చూపెడుతున్న చిత్రాన్ని చూసిన వారు.. ఒక్కసారిగా తన్మయులై మురిసిపోయారు. వేడుక ప్రాంగణానికి వెళ్లే మార్గంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫొటో అల్బమ్స్‌తో కూడిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.

రూ.50 లక్షల పరిహారం ప్రకటించాలి

సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు తదితరులు

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వేట్లపాలెం బాధితులను సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాక మధు తదితరులు పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే పేలుడు ఘటన చోటుచేసుకుందని విమర్శించారు. మరోసారి పునరాలోచించి మృతులకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. ఇటువంటి తయారీ కేంద్రాల్లో పటిష్ఠ తనిఖీలు నిర్వహించి, ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

వేట్లపాలెం బాధితులకు పరామర్శ

మసీదుసెంటర్: కాకినాడ జీజీహెచ్‌లోని బర్న్స్ వార్డులో వేట్లపాలెంలో గాయపడ్డ క్షతగాత్రులను వైఎస్ఆర్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దాపురం కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఆదివారం పరామర్శించారు. వారు మాట్లాడుతూ.. వేట్లపాలెం ఘటన దురదృష్టకరమన్నారు.

కాకినాడ నగరం: వేట్లపాలెం బాణసంచా దుకాణంలో చోటుచేసుకున్న విస్ఫోటంపై సమగ్ర విచారణ జరపాలని బీసీవై డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీసీవై జిల్లా అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, గ్రామీణ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కర్రి గోపాలకృష్ణ విలేకరులతో మాట్లాడారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు తమ పార్టీ అధినేత బోడ రామచంద్రయాదవ్ సోమవారం జిల్లాకు వస్తున్నట్లు వారు తెలిపారు.

కాకినాడ నగరం: వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు స్పందించిన తీరు అభినందనీయమని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్, పాయకరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు డా.చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గాంధీనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో చెల్లింపులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే : ప్రభుత్వం కేంద్రాల్లో విక్రయించే పట్టుగూళ్లకు సంబంధించిన చెల్లింపులు అదే రోజు ఆన్‌లైన్ ద్వారా జమచేయనున్నట్లు పట్టు పరిశ్రమశాఖ జిల్లా అధికారిణి పరమేశ్వరి తెలిపారు. 'గేట్‌వే పేమెంట్ సిస్టం' విధానాన్ని అమలు చేయనున్నట్లు వివరించారు. రైతులకు చెల్లింపుల విషయంలో పారదర్శకత, వేగం, భద్రత కల్పించబడుతుందన్నారు. రైతుల బ్యాంకు ఖాతాకు నేరుగా అదేరోజు సొమ్ము జమకావడం వల్ల ఆర్థిక లావాదేవీలు సులభతరమై, మధ్యవర్తిత్వ సమస్యలు తొలగించబడతాయన్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి అధికారికంగా ఆన్‌లైన్ ద్వారా రైతులకు చెల్లింపులు చేసేందుకు పట్టు పరిశ్రమశాఖ సంచాలకులు అనుమతి మంజూరు చేశారన్నారు.

అభివృద్ధి, సంక్షేమం నిరంతర ప్రక్రియ

కాజులూరు, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలో రూ.1.43 కోట్లతో చేపట్టే పలు రహదారుల అభివృద్ధి పనులకు మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఏజీ కేపేట రోడ్డు రూ.50 లక్షలు, రేగుబాడవ రోడ్డు రూ.50 లక్షలు, ఉప్పుమిల్లి రోడ్డు రూ.15 లక్షలు, నామవానిపాలెం రోడ్డుకు రూ.28 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మొక్కలు నాటుతున్న సంస్థ సభ్యులు

సాంబమూర్తినగర్(కాకినాడ), గాంధీనగర్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యతని కాకినాడ అల్ ఈజ్ సంస్థ అధ్యక్షుడు ఎన్.కిషోర్‌కుమార్ అన్నారు. ఆదివారం మూడో డివిజన్ పరిధిలోగల సిద్ధార్థనగర్ ఉద్యానంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో సభ్యుల బృందం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఉద్యానంలో పలురకాల మొక్కలు నాటారు.

ఆలయం వద్ద అన్నదానం

గాంధీనగర్: బర్మా కాలనీలోని విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించి, గణేష పురాణం ప్రవచించారు.

అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను సాగిద్దామని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్యభవన్‌లో అమరవీరుల సంస్మరణ సభను నగర కన్వీనర్ పలివెల వీరబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఇనుగంటి నారాయణరావు, జీఎస్.బాలాజీదాస్, గుండపు చిట్టియ్య మాస్టారు, బీబీ.నాయుడుల చిత్రపటాలకు సీపీఎం నాయకులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటకాలం నుంచి ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొని, కష్టజీవుల శ్రేయస్సు కోసం జీవితాలను త్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తితో నేటి తరం పార్టీ కార్యకర్తలు ప్రజా ఉద్యమాలు చేయాలన్నారు. నాయకులు కె.వీరబాబు, సి.వెంకట్రావు, ఎన్.సూర్యనారాయణ, స్వామి, మలక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సరిపెల్లకు భారవి ప్రశంసలు

గాంధీనగర్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన జ్యోతిష్య, సాహితీ ప్రముఖుడు, పంచాంగకర్త సరిపెల్ల శ్రీరామ చంద్ర మూర్తిని సినీ రచయిత జేకే భారవి అభినందించారు. ఆదివారం కాకినాడ రామారావుపేటలోని శ్రీగాయత్రీ శాస్త్రీయ జోతిష్యాలయాన్ని భారవి సందర్శించారు. జ్యోతిష్య రంగంతోపాటు, మనోవైజ్ఞానిక శాస్త్రం, తెలుగు సాహిత్యానికి సరిపెల్ల చేస్తున్న కృషిని ప్రశంసించారు. భాషా లిపి రూపశిల్పి చిలమరి శ్రీనివాసశాస్త్రి, హోమియోపతి వైద్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు, శ్రీప్రకాష్ విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సరిపెల్లను అభినందిస్తున్న సినీ రచయిత జేకే.భారవి

PUBLIC NOTICE
IN THE COURT OF THE 1st. Addl SENIOR CIVIL JUDGE, KAKINADA
I. P. No. 1 of 2026
Between:
Sesetty Venkataramana ... Petitioner
AND
Addanki Veerababu and others ... Respondents
Respondents
1) Addanki Veerababu S/o Veerraju, Age:38, Agriculture, Main Road, Opp.Cycle Shop, SAMPARA, Peddapudi Mandal
2) Matta Govindh, S/o Narasimha Murthy, Age:42, Agriculture, Beside Chinni Cycle Shop, Opp: to welding, Shop, SAMPARA, Peddapudi Mandal.
3) Sana Yesu, S/o Venkata Rao, Age:42, Agriculture, Near water tank lake, Anjaneya Swami Temple Center, SAMPARA, Peddapudi Mandal
4) Chinna Rao Bojanki, S/o Yerraiya, Age:55, Business, Near MPP School, KANDREGULA VILLAGE, Karapa Mandal.
5) Palivela Bhagvan, S/o Satyanarayana, Age:40, Business, General Store, Opp. Pepakayalapalem Road, KARAPA.
6) Adinarayana Kaki, S/o Apparao, Age:50, Business, Alluminium shop, Opp. Durga devi Temple, Besides Chinta Kindha, Brothers Shop, KARAPA.
7) Madhav Vallu, S/o Ramu, Age:46, Business, Near Gram Panchayati, Building, Main road, KARAPA.
8) Thumu Sattibabu, S/o Sriramulu, Age:42, Agriculture, Near Durgadevi Temple, Jagan Colony, SAMPARA.
9) Pappu Joga Rao, S/o Simhachalam Raju, Age:60, Business, Near Gairamma Gudi, Main Road, PEDDAPUDI Village & Mandal.
10) Sesetti Jogarao, S/o Suryanarayana, Age:50, Business, Near Ramalayam, Yalampeta, PEDDAPUDI Village & Mandal.
11) Gollapalli Venkateswara Rao, S/o Kondagaru, Age:55, Business, Beside Vanaja Cut Piece Shop, KOTHAPETA, Karapa (M)
12) Addanki Suryanarayana, S/o Rupulu, Age:60, Agriculture Salipeta Street, SAMPARA, Pedapudi Mandal.
13) Matta Haribabu, S/o Satyakapu, Age:48, Business, Main Road, Near. High School, SAMPARA.
14) Thibirisetti Trimurtulu, S/o Suryanarayana, Age:60, Agriculture, Uppana Gari Veedhi, SAMPARA, Pedapudi (M)
15) Puliveera Suresh, S/o Veerabhadra Rao, Age:35, Business, Near Bank Of. Baroda, Beside MPP School, Main Road, KARAPA.
16) Penke Parvathirao, S/o Subbarao, Age:48, Business, Near Ramalaym, G.MAMIDADA, Pedapudi (M).
17) Matta Saibabu, S/o Subbarao, Age:50, Agriculture, Near Chinni Cycle Shop, Main Road, SAMPARA.
18) Pepakayala Srinu, S/o Rambabu, Age:25, Worker, Near Pesu Kottu, Kothapeta, KARAPA (M).
19) Beri Veerababu, S/o Veerabadram, Age:39, Business, Near Cement Shop, Meraka Veedi, KARAPA.
20) Sri Lalitha Devi Industries, (Owner Gopi), Age:35, Business, D.No.3-157/1, Near Ghee Factory, Maredukurru Road, MANDAPETA.
21) Yajrala Rambhadra Raju, S/o Raju, Age:50, Business, Iron Shop, Main Road, VELANGI, Karapa Mandal.
22) Polar Fans (Sai Datta Enterprises), Business, Main Road, RAVULAPALEM.
23) Shyam Home Appliance (Owner/Yogesh Kumar), Age:50, Business, Back side Of Atkinson, High School, GOLLAPUDI, Vijayawada- 520 012.
24) HDFC Finance Company, Nagamallithota, Junction, II nd Floor, D.No.70-1-28, Surya Prabha Complex, Beside HP Petrol, Bunk, KAKINADA.
25) T.V.S Finance Company, II Floor, D.No. 79-2-10/1 Tilak Road, Gandhi Nagar, RAJAMAHENDRAVARAM.
26) Veritas Finance Company, Pallamraju Street, Sambhamurthy Nagar, Kakinada.
27) Bajaj Finance Company, D.No. 13/1 /57, NVR Complex, Main Road, Opp: Appollo Hospital KAKINADA.
28) Kinara Capital Company, 1s1 floor, Avani Plaza, D.No. 12-1-15 &16, Jawahar Street, Opp Siva Statue, Rayudupalem, KAKINADA.
29) Aye Finance Company, D.No. 67-1-40, Near Cancer Hospital, Nagamallithota Junction, KAKINADA.
30) Aditya Birla Finance Company, Nukalamma Temple St, Near Dr.Care Homeopathy Clinic, Ramarao peta, KAKINADA.
31) Kisetsu Saison Finance Company, Politha Smart Solutions, 40-1-144, Corporate Centre, MG Road, Brindavan Colony, VIJAYAWADA.
32) Hero Fincorp Ltd., (Paytm Personal Loan), Company, Lakshmi Nagar Road, Gudarigunta, KAKINADA.
33) Cered Finance Company, D.No.65-1-1, Jalumuri Trudent 1st Floor, FF2, Karnamgari Centre, Kakinada.
34) Aditya Birla Capital Company Ltd ., (Paytm Personal Loan), Nukalamma Temple St., Near Dr. Care Homeopathy Clinic, Ramaraopeta, KAKINADA.
35) Kurumilli Satyanarayana, S/o Narayana, Age:58, Business, Kotturu Colony, Main Road, KOTTURU, Karapa Mandal.
36) Addanki Satish, S/o Shankar, Age:49, Business, Near Vinayaka Temple, Cheruvu Centre, SAMPARA, Pedapudi Mandal.
37) Vijayalakshmi Furnitures (Sathi Narsireddy), 45, Business, Annampeta, Kutukuluru (V), Anaparthi (M)-533264
సదరు పై నెంబర్ పిటీషన్‌లో పిటీషనర్‌ను ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై కోర్టువారి ఎదుట పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. కావున సదరు పిటీషన్‌లో పేర్కొనిన క్రెడిటార్స్ మరియు ఇతర వాటీ దారులు ఎవరైన ఉన్నచో పై శ్రీకోర్టువారి ఎదుట ది. 09-03-2026 ఉ॥ గం॥ 10.30 ని॥లకు స్వయంగానైనా మీ ప్లీడరుగారి ద్వారా కాని హాజరై ఏమైన ఆక్షేపణలు ఉన్నచో తెలియపరచుకొనవలెను. (by Court Order)
Yeluri Subrahmanyam,
Ch. Amos, అడ్వకేట్స్
D.No. 27-5-13, బుద్ధవరపువారి వీధి,
కాకినాడ, 98483 33171
కాకినాడ,
తేది: 01-03-2026

అధ్వానంగా రహదారి..

కాకినాడ, వెంకట్‌నగర్ ప్రధాన రహదారి కూడలి వద్ద రహదారి అధ్వానంగా ఉంది. కొన్ని నెలల కిందట పైపులైను మరమ్మతులు చేపట్టి కొంత మేర తవ్వి రహదారి వేయకుండా వదిలేశారు. కూడలి ప్రాంతం కావడంతో వాహనదారులు ఎడమవైపు గొడారిగుంటకి వెళ్లే సమయంలో ద్విచక్రవాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మసీదు సెంటర్,

ఇలా ఉంటే.. మురుగు పారేదెలా!

కాకినాడ అశోక్‌నగర్ ప్రధాన రహదారి నుంచి మాదిరెడ్డి వెంకన్నబాబు వీధిలోకి వెళ్లే ప్రాంతంలో కాలువలో స్తంభం అడ్డుగా ఉంది. దీనికి తోడు కాలువ నిండా పిచ్చి మొక్కలు మొలిచి మురుగుపారడం లేదు. మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

ప్రమాదకరంగా విద్యుత్తు పెట్టె

కాకినాడ రామారావుపేటలోని ఓ వీధిలో రహదారి పక్కన విద్యుత్తు పెట్టెకు మూతలేకుండా ప్రమాదకరంగా ఉంది. కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి. విద్యుత్తు పెట్టెకు మూత లేకపోవడంతో తీగలు చేతికి అందే ఎత్తులో ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.
- మసీదు సెంటర్, కాకినాడ

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అచ్చంపేట నివాసంలో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ ఎన్నికల్లో అంగన్‌వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రాల మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల కోసం ఒక్కో కేంద్రానికి ప్రత్యేక నిధులు కేటాయించి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో చెల్లింపులు

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ప్రభుత్వం కేంద్రాల్లో విక్రయించే పట్టుగూళ్లకు సంబంధించిన చెల్లింపులు అదే రోజు ఆన్‌లైన్ ద్వారా జమచేయనున్నట్లు పట్టు పరిశ్రమశాఖ జిల్లా అధికారిణి పరమేశ్వరి తెలిపారు. 'గేట్‌వే పేమెంట్ సిస్టం' విధానాన్ని అమలు చేయనున్నట్లు వివరించారు. రైతులకు చెల్లింపుల విషయంలో పారదర్శకత, వేగం, భద్రత కల్పించబడుతుందన్నారు. రైతుల బ్యాంకు ఖాతాకు నేరుగా అదేరోజు సొమ్ము జమకావడం వల్ల ఆర్థిక లావాదేవీలు సులభతరమై, మధ్యవర్తిత్వ సమస్యలు తొలగించబడతాయన్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి అధికారికంగా ఆన్‌లైన్ ద్వారా రైతులకు చెల్లింపులు చేసేందుకు పట్టు పరిశ్రమశాఖ సంచాలకులు అనుమతి మంజూరు చేశారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325, పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544
ఉ॥ 10 - మ॥ 1

సమస్య: గొల్లప్రోలు మార్కెట్ యార్డు వీధిలో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి సమీప ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- స్థానికులు**

పరిష్కారం: ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రామప్రసాద్ సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు. **– న్యూస్‌టుడే, గొల్లప్రోలు**

సమస్య: పిఠాపురం వైఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలో డ్రైనేజీల్లో పూడికలు సక్రమంగా తొలగించక, దుర్వాసన వస్తున్నాయి. **-రమణ**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించారు. **– న్యూస్‌టుడే, పిఠాపురం**

సమస్య: స్థానిక కాకర్లవారి వీధిలో మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయడానికి చర్యలు తీసుకోవాలి. **- రాజు, పెద్దాపురం**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణను తెలపగా కార్మికులను పంపి శుభ్రం చేయించారు. **- పెద్దాపురం, న్యూస్‌టుడే**

సమస్య: కరపమండలం అరట్లకట్ట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ వద్ద చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. **- సుబ్బారావు**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి రాంజీ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించారు. **– న్యూస్‌టుడే, కరప**

ట్యాంకునీరు.. పట్టించుకోరు

పిఠాపురం, కొత్తపల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య, మంచినీటి పర్యవేక్షణ బృందాలు తనిఖీలే చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. రాబోయే వేసవిలో వీటిని శుభ్రం చేసి, ప్రజలకు శుద్ధమైన మంచినీరు అందించాల్సి ఉండగా, ఇప్పటి వరకు ఎటువంటి ప్రణాళికలు అమలు చేయలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల సమస్యలపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.

చినజగ్గంపేటలో జీఎల్ఆర్ చుట్టూ అపరిశుభ్రంగా ఇలా..

ఇవీ సమస్యలు..

పరిశీలన

ఉప్పాడ కొత్తపల్లి మండలం కొత్తపల్లిలో తాగునీటి ట్యాంకు శిథిలమై ఉంది. అందులో నుంచే తాగునీరు పదివేలు పైబడిన జనాభాకు సరఫరా చేస్తున్నారు. శుభ్రపరిచిన తేదీలు, తదుపరి చేయాల్సిన సమయాలు నోట్ చేయడం లేదు. ట్యాంకులు శిథిలమై ఉండడంతో కార్మికులు పైకి ఎక్కి శుభ్రం చేసేందుకు భయాందోళనకు గురవుతున్నారు.

● కాకినాడ గ్రామీణంలోని సర్పవరం, రేపూర్‌లలో వేలల్లో ఉన్న జనాభాకు మంచినీటి సరఫరా చేసే ట్యాంకులు అధ్వానంగా ఉన్నాయి. బాగా ఎత్తుగా ఉండడంతో శుభ్రత గాలికొదిలేస్తున్నారు. తిమ్మాపురం కూడలి వద్ద పైపులైన్ పగిలి నీరు వృథా అవుతున్న మరమ్మతులు చేపట్టలేదు.

● కరప మండలంలో యండమూరు, ఉప్పలంక శివారు మొండిలలో మంచినీటి ట్యాంకులు మెట్లు శిథిలమై ఉన్నాయి. దీంతో పైకి వెళ్లి ట్యాంకు శుభ్రం చేయడం, క్లోరినేషన్ చేయడం, శాంపిల్స్ సేకరించడం మానేశారు. జెడ్ భావారం, పాతర్లగడ్డ, వలసపాకల, కూరాడ, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, కొంగోడు, గుజనాపల్లిలో సరిగా క్లోరినేషన్ చేయడంలేదని స్థానికులు వాపోతున్నారు.

● గొల్లప్రోలులోని చినజగ్గంపేట వద్ద జీఎల్ఆర్ ట్యాంకు చుట్టూ నాచు పట్టి అపరిశుభ్రంగా ఉంది. దీర్ఘకాలికంగా ట్యాంకు శుభ్రత గాలికొదిలేశారు. స్లాబ్ సగం భాగం కూలిపోవడంతో వ్యర్థాలు చేరుతున్నాయి.

● పిఠాపురం మండలం చిత్రాడలో ట్యాంకు శిథిలమైంది. మెట్లు బాగోలేక ఇక్కడ కూడా క్లోరినేషన్ చేయడం కష్టంగా మారింది. మరోపక్క వెల్దుర్తి, మల్లాంలో జీఎల్ఆర్ ట్యాంకులు చుట్టూ శుభ్రత లేదు.

కొత్త ట్యాంకులు అందుబాటులోకి..

పంచాయతీలో మంచినీటి ట్యాంకుల పరిస్థితిని నిత్యం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వర్షాకాలం, ఇతర ఇబ్బంది పరిస్థితుల్లో 15 రోజులకోసారి, మిగిలిన రోజుల్లో నెలకోసారి ట్యాంకులు శుభ్రం చేస్తుంటారు. ఈ బాధ్యత పంచాయతీ సిబ్బందిదే. ముఖ్యంగా పైపులైన్ల లీకేజీలు ఎప్పటికప్పుడు అరికట్టాలి. శిథిలమైన ట్యాంకుల స్థానంలో జల్‌జీవన్ మిషన్‌లో కొత్త ట్యాంకుల అందుబాటులోకి వస్తున్నాయి. – కృష్ణ, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పిఠాపురం

నేడు పీజీఆర్ఎస్‌లో అర్జీల స్వీకరణ

పిఠాపురం : పాడా కార్యాలయంలో సోమవారం యథావిధిగా పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని పీడీ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలు స్వీకరిస్తామన్నారు. గతంలో ఇచ్చిన అర్జీలకు పరిష్కారం దొరుకుతుందని, మళ్లీ ఇవ్వనవసరం లేదన్నారు. డివిజనల్, నియోజకవర్గస్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

ఉపకరణాల పంపిణీ

రమణయ్యపేట, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల సంక్షేమం, భద్రత, సంరక్షణకు పలు చట్టాలు అమలు చేస్తున్నాయని, వాటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మన్ యార్లగడ్డ దశరథరామారావు తెలిపారు. రమణయ్యపేటలోని మల్టీ సర్వీస్ లయన్స్ క్లబ్ హాలులో జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి వృద్ధులకు వీల్‌ఛైర్లు, చేతి కర్రలు దశరథరావు చేతుల మీదుగా అందజేశారు.

తీరంలో పర్యాటకుల సందడి

సర్పవరం, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణ మండలం సూర్యారావుపేట సముద్రతీరంలో ఆదివారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు సందడి చేశారు. చిన్నారులు, పెద్దలు ఆటపాటలతో కాలక్షేపం చేశారు. వాకలపూడి మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, గజ ఈతగాళ్లు భద్రత చర్యలు చేపట్టారు.

అభివృద్ధి, సంక్షేమం నిరంతర ప్రక్రియ

శంకుస్థాపన చేస్తున్న మంత్రి సుభాష్

కాజులూరు, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలో రూ.1.43 కోట్లతో చేపట్టే పలు రహదారుల అభివృద్ధి పనులకు మంత్రి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఏజీకేపేట రోడ్డు రూ.50 లక్షలు, రేగుబాడవ రోడ్డు రూ.50 లక్షలు, ఉప్పుమిల్లి రోడ్డు రూ.15 లక్షలు, నామవానిపాలెం రోడ్డుకు రూ.28 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు.

పేదలకు ఆర్థిక భరోసా

చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, న్యూస్‌టుడే: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం నిత్యం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. ఆదివారం పిఠాపురం మండలం ఎల్ఎన్‌పురం, కోలంక, పి.రాయవరం, గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామాల్లో ఆయన పర్యటించారు. రూ.4 లక్షలు విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అనంతరం వర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి అన్నివర్గాల ప్రజల మేలుకు పాటుపడుతోందన్నారు. సకుమళ్ల గంగాధర్, మడికి ప్రసాద్, బెజవాడ సురేష్, ఎలుబండి బాబులు, గట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి

కాజులూరు, న్యూస్‌టుడే: యువత క్రీడల్లో రాణించాలని గొల్లపాలెం సర్పంచి ప్రసన్న మౌనిక కోరారు. డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి జ్ఞాపకార్థం శివాజీ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో అయిదు రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. అయిదు మండలాల నుంచి 28 జట్లు పోటీపడగా రామచంద్రపురం క్రికెట్ జట్టు విజేతగా నిలిచింది. పెద్దాపురప్పాడు జట్టు ద్వితీయస్థానం సాధించింది. విజేత జట్టుకు రూ.20 వేల నగదు, జ్ఞాపిక, ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేల నగదు, జ్ఞాపిక అందించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన పలువురికి బహుమతులు అందజేశారు. నీటి సంఘం అధ్యక్షుడు తాడి మాచారెడ్డి, శివాజీ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు నల్లమిల్లి ఈశ్వరరెడ్డి, డాక్టర్ సుమనప్రియ, డాక్టర్ సిద్ధార్థరెడ్డి, పలువురు సర్పంచులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాణసంచా కేంద్రాల అనుమతులు తాత్కాలికంగా రద్దు

కేంద్రంలో తనిఖీ చేస్తున్న అధికారులు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం నియోజకవర్గంలో బాణసంచా కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. ఆదివారం సీఐ శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి రామకృష్ణ రాజు, గ్రామీణ ఎస్సై జాన్‌భాష, రెవెన్యూ అధికారులు ఎఫ్‌కేపాలెం, గొల్లప్రోలులోని కేంద్రాల అనుమతులు తాత్కాలికంగా రద్దు చేసి, తాళాలు వేశారు. అనుమతిలు ఇచ్చేంత వరకు వాటిని తెరవకూడదని నిర్వాహకులను హెచ్చరించారు. సీసీ కెమెరాలు, కంట్రోల్ రూమ్స్ వ్యవస్థ ఏర్పాటు చేస్తారన్నారు.

రైల్వేగేటు వద్ద వన్‌వేకు చర్యలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలో రోజూ రద్దీగా ఉండే ఎస్.అచ్యుతాపురం రైల్వేగేటు వద్ద వన్‌వే ట్రాఫిక్ పటిష్ట అమలుకు పోలీసులు చర్యలు చేపట్టారు. కొన్నేళ్లుగా ఇక్కడ వన్‌వే ట్రాఫిక్ అమలు చేస్తున్నా.. నిబంధనలు ఉల్లంఘించి వాహన రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ట్రాఫిక్ పోలీసు అధికారులు వన్‌వే కచ్చితంగా అమలు చేసేలా ఏర్పాట్లు చేశారు. ఆదివారం ట్రాఫిక్ పోలీసులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. వన్‌వేకు ఏర్పాటు చేసిన దిమ్మెలను పక్కకు నెట్టేయడంతో వాటిని సరిచేయించారు.

బాధిత కుటుంబాలకు చెక్కుల అందజేత

వేట్లపాలెం ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు చెక్కు అందజేస్తున్న మంత్రులు అనిత, నారాయణ, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తదితరులు. – న్యూస్‌టుడే, పెద్దాపురం

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

గొల్లప్రోలు, న్యూస్‌టుడే : తాటిపర్తిలో అపర్ణాసమేత నాగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక పోటీల్లో నాల్గొవ ప్రదర్శనగా జరుగుల రామారావు రచించి, దర్శకత్వం వహించిన అందరూ మంచివారే కానీ.. నాటకాన్ని శనివారం రాత్రి ప్రదర్శించారు. మంచివాళ్లు చేసిన తప్పులే మహా విపత్తులకు కారణమవుతాయని ఈనాటకంలో చూపారు.

వారాహి అమ్మవారికి సారె సమర్పణ

కరప : కరప-పెనుగుదురు రహదారిలో నూతనంగా నిర్మించిన కాశీ వారాహి అమ్మవారికి ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పలువురు ముత్తైదువులు చీర, సారెలను సమర్పించారు. ఆదివారం కొరిపల్లికి చెందిన మహిళా భక్తులు వివిధ రకాల పిండి వంటలను చేతబట్టుకుని గ్రామం నుంచి పాదయాత్ర చేసి వారాహిమాతకు అందజేశారు.

కుక్కల బెడద తీవ్రం

కాకినాడ గ్రామీణ మండలంలోని గ్రామాల్లో కుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోంది. పెద్ద సంఖ్యలో గుంపులుగా నిత్యం రహదారులపై విచ్చలవిడిగా సంచరించడంతో ప్రజలు బయట తిరగడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లిరావడానికి భయపడుతున్నారు. ఇంద్రపాలెం, తూరంగి, రమణయ్యపేట, వాకలపూడి, సర్పవరం, తిమ్మాపురం తదితర గ్రామాల్లో మరింత ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, సర్పవరం

నెలలు గడుస్తున్నా.. వేయని బెర్మలు

కరపమండలం జడ్.భావారం ఈబీసీ కాలనీలో సీసీ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. గ్రావెల్‌తో బెర్మలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై ఎంపీడీవో శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కరప

తాగునీరు వృథా

పిఠాపురం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట వీధిలో కొద్దిరోజులు పైపులీకేజీకి గురై నీరంతా వృథా అవుతోంది. ఈ నేపథ్యంలో మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. సరఫరా సైతం సక్రమంగా జరగడం లేదంటున్నారు. మంచినీటి పర్యవేక్షణాధికారి జనార్దన్‌కు చెప్పగా పరిశీలించి.. మరమ్మతులు చేస్తామన్నారు. –న్యూస్‌టుడే, పిఠాపురం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్తపల్లి, న్యూస్‌టుడే: యు.కొత్తపల్లి మండలం ఉప్పాడకు చెందిన ఓసిపల్లి దుర్గాప్రసాద్(17) ఆదివారం ద్విచక్ర వాహనంపై కోనపాపపేట వెళ్తుండగా మూలపేట సమీపంలో ఎదురుగా వస్తున్న ఓ ఆటో ఢీకొట్టింది. యువకుడి తలకి తీవ్రంగా గాయాలు కావడంతో అపస్మారకస్థితికి చేరాడు. స్థానికులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పట్టణం దర్గాసెంటర్‌లో ఏడుస్తూ వివరాలు చెప్పలేని స్థితిలో ఉన్న ఓ బాలికను పెద్దాపురం పోలీసులు స్టేషన్‌కి తీసుకెళ్లారు. అనంతరం బాలిక స్టేషన్‌లో ఉందని వివిధ వాట్సప్ గ్రూపుల్లో పెట్టారు. విషయం తెలుసుకుని స్టేషన్‌కు వెళ్లిన తల్లిదండ్రులకు బాలికను అప్పగించారు.

ఉచిత వైద్య శిబిరం

శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న శ్రీధర్, సురేష్‌కుమార్

గొల్లప్రోలు, న్యూస్‌టుడే : ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో ఆరోగ్య పిఠాపురం నియోజకవర్గంగా చేసేందుకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని జనసేన పార్టీ నాయకుడు, డాక్టర్ పిల్లా శ్రీధర్ తెలిపారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జనసేన పార్టీ నాయకుడు గొల్లపల్లి వీరబాబు ఆధ్వర్యంలో విష్ణు ఆసుపత్రి అధినేత డాక్టర్ శ్రీధర్ మెగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం ఏర్పాటుచేశారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. గొల్లప్రోలు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాలశెట్టి తమ్మారావు, సామినీడి అప్పారావు, కోన రాధాకృష్ణ, గారపాటి ప్రసాద్, చంటిబాబు, అర్జునలోవరాజు, పిల్లా శివశంకర్, జవ్వాది జోగేశ్వరరావు, జ్యోతుల సతీష్ పాల్గొన్నారు.

సూర్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి మండలం జి.మామిడాడలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే అర్చకులు రేజేటి వెంకటనరసింహాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకాలు జరిపించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారిని తీర్చిదిద్దగా భక్తులు అధిక సంఖ్యలో దర్శనం చేసుకున్నారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి దంపతులతో అష్టోత్తరనామార్చనలు చేయించారు. భక్తులు వివిధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి సూర్యనమస్కారాలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పాము కలకలం

సామర్లకోట, న్యూస్‌టుడే : సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో భారీ సర్పం కలకలం రేపింది. ఆదివారం ఆసుపత్రిలోనికి పాము రావడంతో సిబ్బంది, రోగులు భయాందోళన చెందారు. ఆసుపత్రి వెనుక భాగంలో తుప్పలు పెరిగిపోవడంతో విషసర్పాలు ఈ పరిస్థితి వస్తోందని స్థానికులు చెబుతున్నారు.

వెండి, బంగారు ఆభరణాల చోరీ

కరప, న్యూస్‌టుడే: కొరుపల్లిలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి విలువైన వెండి, బంగారు ఆభరణాలు అపహరించుకునిపోయారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్టీసీ కండక్టర్ పలివెల వెంకటసూర్యనారాయణ తన భార్య వీరవెంకట సత్యవతితో కలిసి గత నెల 17న హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న చిన్నకుమారుడు దుర్గాప్రసాద్ వద్దకు వెళ్లారు. తిరిగి ఆదివారం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా తెరిచి ఉండి లాకర్‌లో ఉంచిన 4కేజీల వెండి, 5 తులాల బంగారు ఆభరణాలు, రూ.12వేల నగదు, విలువైన పట్టు చీరలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. అనంతరం కరప పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాణ సంచా తయారీ కేంద్రాలు నిషేధించాలి

దమ్ముపేటలో నిరసన తెలియజేస్తున్న ఏపీ రైతు కూలీ సంఘం నాయకులు

పెద్దాపురం, న్యూస్‌టుడే: ప్రజల ప్రాణాలను అరిస్తున్న బాణ సంచా కేంద్రాలను నిషేధించాలంటూ పెద్దాపురం పట్టణం ఒకటోవార్డు పరిధి దమ్ముపేటలో ఆదివారం ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ వేట్లపాలెం మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం అందించాలన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి వి.చిట్టిబాబు మాట్లాడారు.

రూ. కోటి నష్టపరిహారం ఇవ్వాలి

సామర్లకోట గ్రామీణం, సామర్లకోట న్యూస్‌టుడే : బాణసంచా తయారీ కేంద్రం ప్రమాదంలోని బాధిత కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఆదివారం వేట్లపాలెంలోని బాధిత కుటుంబాలను పరామర్శించారు.

PUBLIC NOTICE

IN THE COURT OF THE 1st. Addl SENIOR CIVIL JUDGE, KAKINADA

I. P. No. 1 of 2026

Between:
Sesetty Venkataramana ... Petitioner
AND
Addanki Veerababu and others ... Respondents

Respondents

1) **Addanki Veerababu** S/o Veerraju, Age:38, Agriculture, Main Road, Opp.Cycle Shop, SAMPARA, Peddapudi Mandal
2) **Matta Govindh,** S/o Narasimha Murthy, Age:42, Agriculture, Beside Chinni Cycle Shop, Opp: to welding, Shop, SAMPARA, Peddapudi Mandal.
3) **Sana Yesu,** S/o Venkata Rao, Age:42, Agriculture, Near water tank lake, Anjaneya Swami Temple Center, SAMPARA, Peddapudi Mandal
4) **Chinna Rao Bojanki,** S/o Yerraiya, Age:55, Business, Near MPP School, KANDREGULA VILLAGE, Karapa Mandal.
5) **Palivela Bhagvan,** S/o Satyanarayana, Age:40, Business, General Store, Opp. Pepakayalapalem Road, KARAPA.
6) **Adinarayana Kaki,** S/o Apparao, Age:50, Business, Alluminium shop, Opp. Durga devi Temple, Besides Chinta Kindha, Brothers Shop, KARAPA.
7) **Madhav Vallu,** S/o Ramu, Age:46, Business, Near Gram Panchayati, Building, Main road, KARAPA.
8) **Thumu Sattibabu,** S/o Sriramulu, Age:42, Agriculture, Near Durgadevi Temple, Jagan Colony, SAMPARA.
9) **Pappu Joga Rao,** S/o Simhachalam Raju, Age:60, Business, Near Gairamma Gudi, Main Road, PEDDAPUDI Village & Mandal.
10) **Sesetti Jogarao,** S/o Suryanarayana, Age:50, Business, Near Ramalayam, Yalampeta, PEDDAPUDI Village & Mandal.
11) **Gollapalli Venkateswara Rao,** S/o Kondagaru, Age:55, Business, Beside Vanaja Cut Piece Shop, KOTHAPETA, Karapa (M)
12) **Addanki Suryanarayana,** S/o Rupulu, Age:60, Agriculture Salipeta Street, SAMPARA, Pedapudi Mandal.
13) **Matta Haribabu,** S/o Satyakapu, Age:48, Business, Main Road, Near. High School, SAMPARA.
14) **Thibirisetti Trimurtulu,** S/o Suryanarayana, Age:60, Agriculture, Uppana Gari Veedhi, SAMPARA, Pedapudi (M)
15) **Puliveera Suresh,** S/o Veerabhadra Rao, Age:35, Business, Near Bank Of. Baroda, Beside MPP School, Main Road, KARAPA.
16) **Penke Parvathirao,** S/o Subbarao, Age:48, Business, Near Ramalaym, G.MAMIDADA, Pedapudi (M).
17) **Matta Saibabu,** S/o Subbarao, Age:50, Agriculture, Near Chinni Cycle Shop, Main Road, SAMPARA.
18) **Pepakayala Srinu,** S/o Rambabu, Age:25, Worker, Near Pesu Kottu, Kothapeta, KARAPA (M).
19) **Beri Veerababu,** S/o Veerabadram, Age:39, Business, Near Cement Shop, Meraka Veedi, KARAPA.
20) **Sri Lalitha Devi Industries, (Owner Gopi),** Age:35, Business, D.No.3-157/1, Near Ghee Factory, Maredukurru Road, MANDAPETA.
21) **Yajrala Rambhadra Raju,** S/o Raju, Age:50, Business, Iron Shop, Main Road, VELANGI, Karapa Mandal.
22) **Polar Fans (Sai Datta Enterprises),** Business, Main Road, RAVULAPALEM.
23) **Shyam Home Appliance (Owner/Yogesh Kumar),** Age:50, Business, Back side Of Atkinson, High School, GOLLAPUDI, Vijayawada- 520 012.
24) **HDFC Finance Company,** Nagamallithota, Junction, II nd Floor, D.No.70-1-28, Surya Prabha Complex, Beside HP Petrol, Bunk, KAKINADA.
25) **T.V.S Finance Company,** II Floor, D.No. 79-2-10/1 Tilak Road, Gandhi Nagar, RAJAMAHENDRAVARAM.
26) **Veritas Finance Company,** Pallamraju Street, Sambhamurthy Nagar, Kakinada.
27) **Bajaj Finance Company,** D.No. 13/1 /57, NVR Complex, Main Road, Opp: Appollo Hospital KAKINADA.
28) **Kinara Capital Company,** 1st floor, Avani Plaza, D.No. 12-1-15 &16, Jawahar Street, Opp Siva Statue, Rayudupalem, KAKINADA.
29) **Aye Finance Company,** D.No. 67-1-40, Near Cancer Hospital, Nagamallithota Junction, KAKINADA.
30) **Aditya Birla Finance Company,** Nukalamma Temple St, Near Dr.Care Homeopathy Clinic, Ramarao peta, KAKINADA.
31) **Kisetsu Saison Finance Company,** Politha Smart Solutions, 40-1-144, Corporate Centre, MG Road, Brindavan Colony, VIJAYAWADA.
32) **Hero Fincorp Ltd.,** (Paytm Personal Loan), Company, Lakshmi Nagar Road, Gudarigunta, KAKINADA.
33) **Cered Finance Company,** D.No.65-1-1, Jalumuri Trudent 1st Floor, FF2, Karnamgari Centre, Kakinada.
34) **Aditya Birla Capital Company Ltd .,** (Paytm Personal Loan), Nukalamma Temple St., Near Dr. Care Homeopathy Clinic, Ramaraopeta, KAKINADA.
35) **Kurumilli Satyanarayana,** S/o Narayana, Age:58, Business, Kotturu Colony, Main Road, KOTTURU, Karapa Mandal.
36) **Addanki Satish,** S/o Shankar, Age:49, Business, Near Vinayaka Temple, Cheruvu Centre, SAMPARA, Pedapudi Mandal.
37) **Vijayalakshmi Furnitures (Sathi Narsireddy),** 45, Business, Annampeta, Kutukuluru (V), Anaparthi (M)-533264

సదరు పై నెంబర్ పిటీషన్‌లో పిటీషనరును ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుతూ పై కోర్టువారి ఎదుట పిటీషన్ దాఖలు చేసి ఉన్నారు. కావున సదరు పిటీషన్‌లో పేర్కొనిన క్రెడిటార్స్ మరియు ఇతర వాటి దారులు ఎవరైన ఉన్నచో పై కోర్టువారి ఎదుట ది. 09-03-2026 ఉ॥ గం॥ 10.30 ని॥లకు స్వయంగాగాని మీ ప్లీడరుగారి ద్వారా కాని హాజరై ఏమైన అభ్యంతరాలు ఉన్నచో తెలియపరచుకోవలెను. (by Court Order) **Yeluri Subrahmanyam,** Ch. Amos, అడ్వకేట్స్
కాకినాడ, D.No. 27-5-13, బుద్ధవరపువారి వీధి,
తేది. 01-03-2026 కాకినాడ, **98483 33171**

శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం

కాండ్రకోట గ్రామం, పెద్దాపురం మండలం, కాకినాడ జిల్లా

టెండరు ప్రకటన (2వ పిలుపు)

కాకినాడ జిల్లా, పెద్దాపురం మండలం, కాండ్రకోట గ్రామంలో వేంచేసియున్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానం నందు శ్రీ అమ్మవారి జాతర మహోత్సవాలు సందర్భముగా ది.17-03-2026 నుండి 03-05-2026 వరకు మ్యాన్‌పవర్, NMR, సెక్యూరిటీ గార్డ్స్ సప్లై చేయుటకు గాను ది.12-03-2026 ఉ॥ 11.గం॥లకు సీల్డు టెండర్లు తెరువబడును. సీల్డు టెండర్లు వేయదలచినవారు ఆఫీసు పనివేళలలో సంప్రదించవలెను.

కాండ్రకోట, సం/- కార్యనిర్వహణాధికారి
01-03-2026. సెల్: 89850 71835

గ్రామ పంచాయితీ కార్యాలయం, గాడిమొగ తాళ్లరేవు మండలం కాకినాడ జిల్లా

టెండరు నోటీసు తేది: 27-02-2026

కాకినాడ జిల్లా, తాళ్లరేవు మండలం, గాడిమొగ గ్రామపంచాయితీ ఏరియాలో గ్రామపంచాయితీ నిధుల నుండి చేపట్టు ఈ దిగువ ఉదహరించిన పనులు పూర్తి చేయుటకు 13-03-2026 తేదీన ఉదయం 10:30 ని॥ల నుండి మధ్యాహ్నం గం.1:00ల వరకు పంచాయితీరాజ్, ఆర్&బి మరియు పిడబ్ల్యుడి ప్రభుత్వ శాఖల్లో రిజిష్టర్ కాబడిన కాంట్రాక్టర్లచే సీల్డ్ టెండర్లు నిర్వహించబడి అదేరోజు మధ్యాహ్నం గం 2.00 లకు అప్పటికి హాజరైన టెండర్‌దారుల సమక్షంలో టెండర్లు తెరవబడును. టెండరు షరతులు తదితర విషయాలు గ్రామపంచాయితీ కార్యాలయం పనిచేయు వేళల్లో అడిగి తెలుసుకోవలెను

వ. సం	పని పేరు	అంచనా విలువ	షెడ్యూల్	డిపాజిట్ రూ.
1	గాడిమొగ ఆవాసంలో పాలెపు మహాలక్ష్మి (H), చెక్క లోవరాజు(H) నుండి కవర్ స్లాబ్‌లతో CC డ్రెయిన్ నిర్మాణం	1,40,000/-	1000/-	7000/-
2	గాడిమొగలో ఇప్పటికే ఉన్న సిసి డ్రెయిన్‌లకు కవర్ స్లాబ్‌లను మరియు మరమ్మతులు చేయుటకు	3,00,000/-	1000/-	15,000/-
3	పెదవలసల ఆవాసంలో ఇప్పటికే ఉన్న CC డ్రెయిన్లపై కవర్ స్లాబ్లను నిర్మాణం చేయుటకు	3,00,000/-	1000/-	15,000/-
4	పెదవలసల ఆవాసంలో చెక్క కామేశ్వరరావు (హెచ్) నుంచి అరదాడి కాసులయ్య (హెచ్) వరకు కవర్ స్లాబ్‌లతో సిసి డ్రెయిన్ నిర్మాణం	1,60,000/-	1000/-	8000/-
5	పెదవలసల ఆవాసంలో మల్లాడి చినసత్యనారాయణ (హెచ్) నుంచి మల్లాడి కాసులయ్య (హెచ్) వరకు కవర్ స్లాబ్‌లతో సిసి డ్రెయిన్ నిర్మాణం	1,40,000/-	1000/-	7000/-
6	లక్ష్మీపతిపురం ఆవాసంలో సంగడి వెంకటేశ్వరవర్మ (హెచ్) నుంచి కాలువ వరకు కవర్ స్లాబ్‌లతో సిసి డ్రెయిన్ నిర్మాణం	3,65,000/-	1000/-	18,250/-
7	లక్ష్మీపతిపురం నివాసంలో ఇప్పటికే ఉన్న సిసి డ్రెయిన్‌లకు కవర్ స్లాబ్‌లు మరియు మరమ్మతులు చేయుటకు	3,00,000/-	1000/-	15,000/-
8	చినవలసల గ్రామంలో కర్రి నాగబాబు (H) నుండి యేటిగట్టు వరకు సిసి డ్రెయిన్ మరియు బెడ్ లెవలింగ్ నిర్మాణం	2,00,000/-	1000/-	10,000/-
9	లక్ష్మీపతిపురం పంతెన నుంచి వాడ్రేవు సూర్యారావు (హెచ్) వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం	2,00,000/-	1000/-	10,000/-
10	లక్ష్మీపతిపురం హెచ్/ఓ వద్ద వాడ్రేవు సూర్యారావు (హెచ్) నుంచి దాసరి అప్పయ్యమ్మ (హెచ్) వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం	2,00,000/-	1000/-	10,000/-
11	లక్ష్మీపతిపురం దాసరి అప్పయమ్మ(హెచ్) నుంచి శ్మశానవాటిక వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం	2,00,000/-	1000/-	10,000/-
12	లక్ష్మీపతిపురం శ్మశానవాటిక నుండి కొక్కిలిగడ్డ బాబూరావు (హెచ్) వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం	2,00,000/-	1000/-	10,000/-
13	లక్ష్మీపతిపురం 150 KL OHSR ట్యాంక్ రిపేర్స్ చేయు పని	5,00,000/-	1000/-	25,000/-
14	చినవలసల గ్రామంలో 90 KL OHSR రిపేర్స్ చేయు పని	5,00,000/-	1000/-	25,000/-
15	గాడిమొగ 120 KL OHSR ట్యాంక్ రిపేర్స్ చేయు పని	5,00,000/-	1000/-	25,000/-

గమనిక: 1. 9-03-2026వ తేదీ సాయంత్రం గం 5:00 వరకు షెడ్యూల్ A కొరకు దరఖాస్తులు తీసుకోబడును. దరఖాస్తుతో డిపాజిట్ చలానా రూపంలో SBI ట్రెజరీ బ్రాంచ్, కాకినాడ యందు చెల్లుబాటు అయ్యే విధంగా సమర్పించవలెను.
2. 11-03-2026వ తేదీ ఉదయం 10:30 నుండి సాయంత్రం గం 5:00 వరకు షెడ్యూల్ A ఇవ్వబడును.
3. టెండరు వ్రాయు వారు స్వయంగా టెండర్ డిపాజిట్ వారి పేరున తీసి సమర్పించవలెను, వారే స్వయంగా టెండర్ సమర్పించవలెను.
4. టెండరు ఏ కారణం చేతనైనను రద్దు చేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని పంచాయితీ కార్యదర్శి వారికి అధికారం కలదు.
5. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి ప్రాధాన్యత క్రమంలో సి.ఎఫ్.ఎం.ఎస్.ఐ.డి. ఉన్నవారికి చెల్లింపులు జరుపబడును.

సం/- **కామాడి గోవలక్ష్మి,** సర్పంచ్, గాడిమొగ గ్రామపంచాయతి, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా
సం/- **ఎస్.రాజ్,** పంచాయితీ కార్యదర్శి, గాడిమొగ గ్రామపంచాయితీ, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

అంగన్‌వాడీల హామీలను ప్రభుత్వం నెరవేర్చింది

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ వర్కర్లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ యనమల దివ్య ఓ ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని మౌలిక వసతుల కల్పన, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు ప్రతిపాదించిన తొమ్మిది డిమాండ్లను కూటమి ప్రభుత్వం పరిష్కరించిందని పేర్కొన్నారు.

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీలకు జీతాలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఓ ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీల్లో వసతులు మెరుగుపరచడంతో పాటు కార్యకర్తలు, సహాయకులు, చిరుద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి పాలన సాగుతోందని వివరించారు.

రామాలయంలో చోరీ

తొండంగి, న్యూస్‌టుడే: మండలంలోని రావికంపాడు రాజుల రామాలయంలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మల్లవరం వెళ్లే మార్గంలో ఉన్న రామాలయంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు రూ.40 వేలు విలువ చేసే వెండి ఆభరణాలు అపహరించారు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పాండురంగారావు తెలిపారు.

వేట్లపాలెం ఘటనపై దిగ్భ్రాంతి

గాంధీనగర్, న్యూస్‌టుడే: జిల్లాలోని వేట్లపాలెం గ్రామంలో బాణసంచా తయారీకేంద్రంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో 20మంది కార్మికులు సజీవ దహనం కావడం, 9మంది తీవ్రంగా గాయపడటం పట్ల భాజపా జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, పార్టీ సీనియర్ నేత దువ్వూరి సుబ్రహ్మణ్యంలు ఆందోళన ప్రకటించారు. మరణించిన వారి కుటుంబాలకు పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కార్యక్రమంలో పాల్గొన్న జ్యోతుల నవీన్

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు అభివృద్ధి పనులకు తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆదివారం శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. మామిడాలలోని మూడు వీధులకు మంజూరైన రూ.10లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తికావడంతో ప్రారంభించారు. నరేంద్రపట్నం, కాండ్రేగుల, భావవరం, గుర్రంపాలెం, రామవరం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నవీన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మారుమూల గ్రామాల్లో సైతం ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, బుర్రి సత్తిబాబు, వేగి రామకృష్ణ, బొడ్డేటి సుమన్, రామిశెట్టి చంద్రరావు, యల్లపు దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ప్రతి ఒక్కరూ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని ఎంపీడీవో ఎ.వి.ఎస్. చంద్రశేఖర్ కోరారు. మండల కేంద్రం జగ్గంపేటలో అధికారుల బృందం ఆదివారం ఇంటింటికీ వెళ్లి పన్నుల వసూలు కార్యక్రమం చేపట్టారు. బకాయిలకు సంబంధించిన నోటీసులను ఇళ్ల యజమానులకు అందించారు. పలువురు స్వచ్ఛందంగా బిల్లులు చెల్లించగా.. మరికొంత మంది గడువు కోరారు. చెల్లించిన పన్నులతో గ్రామాల అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

100 రోజుల ప్రణాళిక శతం ఫలించేలా..?

నేటి నుంచి గ్రాండ్ టెస్ట్‌లు

న్యూస్‌టుడే, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు విద్యార్థులు సాధించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందు చూపుతో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను గత ఏడాది డిసెంబర్ 6 నుంచి అమలులోకి తీసుకువచ్చింది. ఈ ప్రణాళిక భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా పాఠ్యాంశాలను రివిజన్ చేయించి.. సంబంధిత అంశాలపై పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల ప్రగతిని గుర్తించి గ్రేడ్‌లుగా విభజించి వెనుకబడిన వారిని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టారు.

ప్రత్యేక తరగతిలో పదోతరగతి విద్యార్థులు

● గత నెల ఫిబ్రవరి 28వ తేదీతో ఈ ప్రక్రియ పూర్తయింది. సోమవారం నుంచి అంశాల వారీగా కాకుండా సబ్జెక్టుల వారీగా గ్రాండ్‌టెస్ట్‌లు తుది పరీక్ష ఉండే విధంగా నిర్వహించనున్నారు. పరీక్షలు ప్రారంభమయ్యే మార్చి 16వ తేదీ నాటికి విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ప్రావీణ్యం సాధించేలా కృషి చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

మెలకువలు పాటిస్తే..

తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని తొండంగి, కోటనందూరు, రౌతులపూడి మండలాలకు చెందిన సుమారు రెండు వేల మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఆయా మండలాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు గ్రాండ్ టెస్టుల తీరును విద్యార్థులకు ఇప్పటికే వివరించారు. సమయపాలన, ప్రశ్నల సరళిని అర్థం చేసుకోవడం, సులువుగా మార్కులు సాధించే విభాగాలను గుర్తించడం.. వంటివి చిట్కాలు గ్రాండ్ టెస్టుల్లో పాటించాలని సూచించారు. ఇదే తరహాలో తుది పరీక్ష ఉంటుందని.. అక్కడ కూడా ఇటువంటి మెలకువలే పాటిస్తే మంచి ఫలితాలను సులువుగా సాధించవచ్చని వివరించారు

మండలం	ఉన్నత పాఠశాలలు	విద్యార్థులు
తొండంగి	13	1,005
కోటనందూరు	7	535
రౌతులపూడి	6	460

సిలబస్ పూర్తి చేశాం

ప్రత్యేక తరగతులు, పరీక్షలు నిర్వహించాం. పరీక్షలు దగ్గరవుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఆందోళన చెందకుండా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నాం. అన్ని పాఠశాలలు వందశాతం ఫలితాలు సాధించేలా అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్నాం. – ఎ.శ్రీనివాస్, ఎంఈవో, కోటనందూరు మండలం.

కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా గన్నియ్య

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఏలేశ్వరం భాజపా కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా బొగ్గు గన్నియ్య, లింగంపర్తికి చెందిన ఆకుల రాజు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సంఘ నాయకులు వీరాస్వామి, నాగబాబు, సత్యనారాయణ ఈ సందర్భంగా వారిని సత్కరించారు.

పులి తిరుగుతుందంటూ వదంతులు

గోకవరం, న్యూస్‌టుడే: తంటికొండ, గోపాలపురం, గాదెలపాలెం గ్రామాల్లో పులి కనిపించిందని ఆదివారం కొందరు వదంతులు సృష్టించడంతో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దీనిపై అటవీశాఖ అధికారులను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పరిశీలించామని.. ఎక్కడా ఆనవాళ్లు లేవని తెలిపారు.

సత్తా చాటిన విద్యార్థి

రౌతులపూడి, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో రౌతులపూడికి చెందిన **ఎల్.లోకేశ్** 300కి 261 మార్కులు సాధించాడని శ్రీహర్ష పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

ఐక్యతతో మెలగాలి

మాట్లాడుతున్న ఆమంచి ఆంజనేయ గురుస్వామి

గండేపల్లి, న్యూస్‌టుడే: పద్మశాలీలంతా ఐక్యతతో ముందుకు సాగాలని అఖిల భారత పురోహిత సంఘ గౌరవ అధ్యక్షుడు ఆమంచి ఆంజనేయ గురుస్వామి అన్నారు. గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో కోదండ రామాంజనేయ పద్మశాలి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా కాకి వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా చింతలపూడి శ్రీనివాస్, సెక్రటరీగా రఘుపతిరావు, సభ్యులు బాబురావు, సూర్యప్రకాశరావు, రామకృష్ణ, వెంకన్న, వీరబాబు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉమ్మడిజిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పంపన రామకృష్ణ, సర్పంచి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్వ సాహితీ కళా వేదిక అవార్డుల ప్రదానం

అవార్డు అందుకుంటున్న శ్రీలక్ష్మి

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సాహిత్యం, విద్య, వైద్య, ఉద్యోగ రంగాల్లో సేవ దృక్పథంతో ఉన్న మహిళలకు విశ్వ సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో విజయవాడలోని బాలోత్సవం భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డుల ప్రదానం చేశారు. మండలంలోని రాజపూడికి చెందిన మంచాల శ్రీలక్ష్మి 800 పైగా కవితలు, 50 కథలు రాసి ప్రముఖుల మన్ననలు పొందడంతో ఆమెకు 'ఉమెన్ పవర్ ఆఫ్ ఎక్సలెన్స్' అవార్డు దక్కింది.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

రౌతులపూడి, తుని గ్రామీణం, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాల, కళాశాలల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని ఎ.మల్లవరంలో 5వ తరగతికి 28 మంది, ఇంటర్‌కి 69 మంది, ఐఐటీ, నీట్ శిక్షణకి 46 మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ● తుని గ్రామీణం పరిధి వి.కొత్తూరు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షల కేంద్రానికి 518 మంది హాజరు కావాల్సి ఉండగా.. 84 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ప్రిన్సిపల్ ప్రసన్నరాణి తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్తకు రిమాండు

పోలీసుల అదుపులో నిందితుడు

చేగుంట, న్యూస్‌టుడే: భార్యను హత్య చేసిన భర్తను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా చేగుంట ఠాణాలో రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామానికి చెందిన మురా త్రిమూర్తులకు చేగుంటకు చెందిన వరలక్ష్మితో రెండో వివాహమైంది. ఇల్లరికం వచ్చాడు. వరలక్ష్మి ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. త్రిమూర్తులు ఏ పనిచేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. అవసరాలకు డబ్బులు ఇవ్వాలని తరచూ భార్యను వేధిస్తుండేవాడు. ఇవ్వకపోవడంతో కక్ష పెంచుకొని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. గత నెల 21న రాత్రి కుటుంబీకులు నిద్రపోతుండగా.. పారతో భార్య తలపై బలంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. విషయం ఎవ్వరికి చెప్పొద్దని.. చెబితే నిన్ను కూడా చంపేస్తానని తన పదేళ్ల కుమారుడిని బెదిరించాడు. అనంతరం భార్య మెడలోని పుస్తెలతాడు, రూ.5 వేల నగదు, ఫోను తీసుకొని పరారయ్యాడు. ఆదివారం కుమారుడిని చూసేందుకు వెళ్లడంతో నిందితుడిని చేగుంట బస్టాండు వద్ద పట్టుకొని అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు. నిందితుడి వద్ద ఉన్న 39.55 గ్రాముల పుస్తెలతాడు, రెండు చరవాణులు స్వాధీనం చేసుకొని రిమాండుకు తరలించారు.

పారిశుద్ధ్య మెరుగునకు చర్యలు

కార్మికులతో ఛైర్‌పర్సన్ భువన సుందరి

తుని, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణకు కార్మికుల కొరత కారణంగా పనులు సకాలంలో చేపట్టలేకపోతున్నామని ఎమ్మెల్యే యనమల దివ్య దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె స్పందించి డెక్కన్ ఫైన్ కెమికల్స్ సంస్థతో మాట్లాడి పది మంది కార్మికులను కేటాయించేలా చర్యలు తీసుకున్నారని పురపాలక సంఘ ఛైర్ పర్సన్ నార్ల భువన సుందరి తెలిపారు. ఆయా వార్డుల్లో కాలువలు, రోడ్లు శుభ్రం చేసేలా వారికి ఆదివారం నుంచి బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు.

గింజ దశలో పొల్లుకాయలు

వరి రైతుల ఆవేదన

తెల్లని వరి కంకులు

గండేపల్లి, న్యూస్‌టుడే: మెట్ట ప్రాంతంలో ఖరీఫ్, రబీ రెండు సీజన్‌లలో వరి సాగుచేస్తుంటారు. ఫెర్టిలైజర్స్ మోసం, వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చిన్న, సన్నకారు రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. దాళ్వా పంటలో గింజ దశలో తెల్లగా పిట్టపోటు వైరస్ (పొల్లుకాయలు)గా రావడంతో సుమారు వెయ్యి ఎకరాల రైతులు లబోదిబోమంటున్నారు. రెండు పర్యాయాలుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పరిశీలించినా తగిన న్యాయం జరగలేదని వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

జడ్.రాగంపేట, జగ్గంపేట, కాట్రావులపల్లి, తాళ్లూరు తదితర గ్రామాలకు చెందిన రైతులు అరన్నర (15048) విత్తనాలను నాట్లు వేసేందుకు వినియోగించారు. నాట్లు వేసి సుమారు 90 నుంచి 100 రోజులవుతుంది. ప్రస్తుతం గింజలు పాలు పోసుకునే సమయంలో కొన్ని తెల్లగా పొల్లు కాయలుగా మారుతున్నాయి. దీంతో దిగుమతి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. సాధారణంగా ఎకరానికి 50 బస్తాల ధాన్యం వస్తుందని.. ఇప్పుడు ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

వాతావరణం అనుకూలించక..

విత్తనాల లోపం ఓ కారణమైతే.. వాతావరణం కూడా అనుకూలించకపోవడం మరో కారణం. గింజ పాలుపోసుకునే సమయంలో తెల్లగా వస్తున్న కంకిలు తొడుకోవడం లేదు. డీలర్లతో మాట్లాడి రైతులకు మేలు చేస్తాం. శాస్త్రీయ పద్ధతిలో నష్టం అంచనా వేస్తున్నాం. – శ్రీనివాస్ ఏడీఏ జగ్గంపేట

ప్రమాదకరంగా ప్రయాణం

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అధికారులు ఓ వైపు హెచ్చరిస్తున్నా వాహన చోదకులు మాత్రం పట్టడం లేదు. లోవ దేవస్థానానికి వచ్చేందుకు ఆర్టీసి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆదివారం గూడ్స్‌ఆటోపై నిలబడి, వేలాడుతూ కొందరు ప్రమాదకరంగా ప్రయాణం చేశారు. దీనిపై ఆర్టీసీ అధికారులు, పోలీసులు దృష్టిసారించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తుని గ్రామీణం

గుంతలతో అవస్థలు

ఒంటిమామిడి-అన్నవరం ప్రధాన రహదారిలో గోపాలపట్నం, రైల్వే గేటు మధ్య ఉన్న మార్గంలో గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తొండంగి

రోడ్డు మధ్యలో సూచిక

మండలంలోని పి.కొట్టాం నుంచి కె.ఈ.చిన్నాయి పాలెం వెళ్లే రహదారి మధ్యలో ఏర్పడిన గుంత స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. ప్రమాదాన్ని గుర్తించేందుకు కర్రలు, పాత బట్టలతో తాత్కాలిక సూచికను ఏర్పాటు చేశారు. సరైన హెచ్చరిక బోర్డు, రిఫ్లెక్టర్లు లేకపోవడంతో సమస్య తీవ్రంగా మారే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోటనందూరు

నిర్లక్ష్యంగా నిలుపుదల

గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట శివారు గోకవరం రోడ్డులో నెహ్రూ కాలనీ ఏదురుగా ఉన్న చెరువు గట్టుపై అక్రమంగా మాంసం, ద్విచక్ర వాహనాల మరమ్మతుల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆయా దుకాణాలకు వచ్చే ప్రజలు రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపేస్తున్నారు. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

నడిచి వెళ్లేదెలా..?

మండలంలోని జె.కొత్తూరు చిన్నయ్యమ్మపేటలో సీసీ రోడ్డుపైకి మురుగు నీరు చేరి అధ్వానంగా ఉంది. నడిచి వెళ్లేందుకు కూడా వీలులేకపోవడంతో స్థానికులు పక్క వీధిలో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కాలువలను శుభ్రం చేయాల్సిన పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

బాణసంచా తయారీ కేంద్రాలను నిలుపుదల చేయాలి

నిరసన చేస్తున్న సంఘ నాయకులు

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మనుషుల ప్రాణాలను హరిస్తున్న బాణసంచా తయారీ కేంద్రాలను నిలుపుదల చేయాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. రామవరం శివారు రంగవల్లినగర్ కాలనీలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వేట్లపాలెంలో జరిగిన ఘటనతో అధికారుల పర్యవేక్షణ లోపం, వైఫల్యం తేటతెల్లమైందన్నారు. పని ప్రదేశంలో కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం, భద్రత చర్యలు తీసుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు రూ.50లక్షలు, క్షతగాత్రులకు రూ.25లక్షలు నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు కె.రామలింగేశ్వరరావు, సోమరాజు, శివ దుర్గారావు, వీరబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

మండలంలోని లింగంపర్తిలో కొలువైన రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా ప్రారంభించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కిశోర్ ఆధ్వర్యంలో సదస్యం నిర్వహించారు. అర్చకులు వింజరపు వెంకటప్రసాద్, సత్యరాంగోపాల్ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ నెల అయిదో తేదీన స్వామి వారి పుష్పోత్సవంతో వార్షికోత్సవం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. – న్యూస్‌టుడే, ఏలేశ్వరం

వేడుకగా సత్యదేవుని రథ సేవ

స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యదేవుని రథ సేవ ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేసి అర్చకులు పూజలు చేశారు. మంగళవాయిద్యాలతో ఆలయ ప్రాకారం చుట్టూ ఊరేగించారు.

నూకాలమ్మ పూలగరగ..

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కొత్త అమావాస్యను రానున్న నేపథ్యంలో రామచంద్రపురం గ్రామంలోని నూకాలమ్మ అమ్మవారి పూలగరగకు గ్రామస్థుల సమక్షంలో జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేశ్ పూజలు చేశారు. పూలగరగను బయటకుతీసి ఊరేగింపు నిర్వహించారు.

పూజలు చేస్తున్న జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్

సందడిగా రాజులబాబు పండగ

రామకృష్ణాపురంలో రాజులబాబు పండగ ఆదివారం సందడిగా నిర్వహించారు. స్థానిక లవకుశల ఆలయంలో భక్తులు పూజలు చేశారు. – న్యూస్‌టుడే, రౌతులపూడి

అమ్మవారికి ప్రత్యేక పూజ

గండేపల్లి మండలం జడ్.రాగంపేట పొలిమేరలోని దుర్గమ్మ అమ్మవారి ఆలయ 10వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం జడ్.రాగంపేట, నీలాద్రిరావుపేట ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. – న్యూస్‌టుడే, గండేపల్లి

మూడు తాటాకిళ్లు దగ్ధం

శంఖవరం, న్యూస్‌టుడే: మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పల్లా నారాయణమ్మ, బర్ల సింహాచలం, పి.వరలక్ష్మిలకు చెందిన ఇళ్లు కాలిపోయాయని.. అప్రమత్తం కావడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని.. సుమారు రూ.3లక్షలు ఆస్తినష్టం ఉంటుందని వీఆర్వో సింహాచలం తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

రౌతులపూడి, న్యూస్‌టుడే: మండలంలోని రాఘవపట్నంలో ఏసీటీఎస్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. 273 మందికి వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కృపా పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు బండారు బైరాగి, బీర జయరాజు, పౌలు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి, న్యూస్‌టుడే: జగపతినగరం గ్రామంలోని ఎస్ఎల్‌వీ ఉన్నత పాఠశాలలో సంకల్పం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జగపతినగరం, కిర్లంపూడి, చిల్లంగి గ్రామాలకు చెందిన పలువురు దాతలు ముందుకు వచ్చారు.

హైవే చిక్కులు వీడేనా..?

న్యూస్‌టుడే, ప్రత్తిపాడు, శంఖవరం

పట్టణాలు, గ్రామీణ రోడ్ల మాదిరి జాతీయ రహదారిపైనా ట్రాఫిక్ ఇబ్బందులు నిత్య సమస్యగా మారాయి. సాఫీగా, త్వరగా సాగే ప్రయాణానికి బ్రేకులు పడుతున్నాయి. సర్వీసు రోడ్లున్న కూడళ్ల వద్ద, పోలీసులు బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన చోట చిక్కుముళ్లు రహదారి భద్రతకు సవాలు విసురుతున్నాయి.

నెల్లిపూడి కూడలి వద్ద..

భయం.. భయంగా..

జగ్గంపేట నుంచి అన్నవరం వరకు సుమారు 51 కిమీ పొడవున ఉన్న హైవేపై ఆరు చోట్ల కూడళ్లు ఉన్నాయి. వీటిని దాటడం సాహసంగా మారుతోంది. ప్రమాదాలు జరిగినపుడు, ఇతరత్రా అవాంతరాల వల్ల ట్రాఫిక్ స్తంభిస్తోంది. సర్వీసు రోడ్లలో నుంచి వచ్చే వాహనాలు హైవేపై ఉన్న కూడళ్ల వద్ద నిలిచి పోతున్నాయి. క్వారీలారీల, 40 నుంచి 60 గ్రామాల ప్రజల తాకిడి ఎక్కువగా ఉంటుంది.

● ఎర్రవరం, కత్తిపూడిల పైవంతెన సమీపంలోని నెల్లిపూడి కూడలి వద్ద, రాచపల్లి అడ్డురోడ్డులో రోజూ రద్దీ నెలకొంటుంది. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. పెరుగుతున్న వాహన రద్దీకి అనుగుణంగా నియంత్రణ వ్యవస్థలు లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ● చిన్నింపేట కూడలి దాటే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. విభాజకం సన్నగా ఉండి సిరిపురం వెళ్లే సర్వీసు రోడ్డులో నుంచి వచ్చే వాహనాలు హైవేపై వెళ్లే వారికి కనిపించవు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. హైవేపై వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరమైన కూడళ్లు దాటే చోట నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

సురక్షితంగా దాటేలా చర్యలు

హైవే కూడళ్లను సురక్షితంగా దాటేలా స్టాపర్లు, ఇతరత్రా ఏర్పాట్లు చేస్తున్నాం. హైవే అథారిటీ చేపట్టాల్సిన చర్యలను నివేదించాం. పోలీసు పెట్రోలింగ్ వాహనం తరచూ పరిస్థితిని సమీక్షించి చక్కదిద్దుతుంది. వీలయినంత నిర్వహణ సమస్యను పరిష్కరిస్తాం. – బి.సూర్యఅప్పారావు, సీఐ, ప్రత్తిపాడు

పురస్కారం అందుకుంటున్న క్లబ్ ప్రతినిధులు

అలయన్స్ క్లబ్‌కు ఉత్తమ సేవా పురస్కారం

తుని పట్టణం, న్యూస్‌టుడే: తుని పట్టణానికి చెందిన అలయన్స్ క్లబ్‌కు ఉత్తమ సేవా పురస్కారం దక్కింది. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన ఇంటర్నేషనల్ క్లబ్ సమావేశంలో అధ్యక్షుడు తిరుపతి రాజు, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉషారాణి చేతుల మీదుగా క్లబ్ ప్రతినిధులు అవార్డు అందుకున్నారు. వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించడం, సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టడంతో గుర్తింపు లభించింది. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు ఏ.దేవరాజు, అధ్యక్షుడు జీపీ నాయుడు, జెడ్సీ కె.సత్యనారాయణ, డీసీ వివిఎస్ఆర్ ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సత్కారం

కోటనందూరు, న్యూస్‌టుడే: కోటనందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభ జరిగింది. కిల్లందూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఫిబ్రవరి 28న ఉద్యోగవిరమణ పొందిన మాతిరెడ్డి యర్రాపాత్రుడి దంపతులను తెదేపా జిల్లా అధికార ప్రతినిధి గాడి రాజుబాబు స్థానిక నాయకులతో కలసి ఆదివారం సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాస్, ఎంఈవో ఎ.శ్రీనివాస్, యూటీఎఫ్ నాయకులు ప్రభాకర్ వర్మ, బాబా, డి.గోవిందరాజులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింటు కాకినాడ రమణయ్య పేటలో గల M/s Mourya Enterprises Repr by its Managing partner అజ్జరపు మల్లిఖార్జునరావు గారి సంజాయిషీ పై యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి ప్రప్రథమముగా యల్లపు మోదయ్య గారి కుమారుడు సోమయ్య మరియు సరిశె పోతయ్య గారి కుమారుడు వీరాస్వామి గార్లు ఇరువురు కలిసి కిర్లంపూడి మండలం, జగపతి నగరం గ్రామం లో గల సర్వే నెం. 123/2 య.1-93, సర్వే నెం. 124/3, 125/1 లలో గల య.39 సెంట్లు, సర్వే నెం. 119/3, 120/3 లలో య.3-26 సెంట్లు వెరసి య.6-58 సెంట్లు, జక్కా చిన్నయ్య గారి తరుపున GPA Holder అయిన రాపర్తి జగన్నాధరావు వారి వద్ద నుండి క్రియ దస్తావేజు నెం.1231/1960 గా 30-04-1960వ తేదీన క్రియం పొంది ప్రత్తిపాడు SRO లో రిజిష్టర్ చేయించ కొనియున్నారు.దరిమిలా వారివురూ 31-03-1970 సం॥ తేదీన ఒక unregistered వాటాల జాబితా వ్రాసుకొని ఉన్నారని, సదరు రీత్యా యల్లపు సోమయ్య గారికి A schedule గా య.3-32 సెంట్లు ధఖలు పడిందని తదుపరి సోమయ్య గారు Intestate గా చనిపోయినందున వారి ఏకైక వారసుడైన రాజారావుకు, మరిన్ని వారి కుమారులు, కుమార్తెలు అయిన వెంకటరమణ, రాంబాబు, దుర్గాదేవి, సూరిశెట్టి పార్వతమ్మ,అయిదుగురు కలిసి అరవ సూర్య నారాయణ మూర్తి గారి కుమారుడు వెంకట్రావు గారికి 08-04-2004 వ సం॥ తేదీన క్రియ దస్తావేజు నెం.540/2004 రీత్యా సర్వే నెం.123/2ఎ లో య.0.97 సెంట్లు, సర్వే నెం.124/3 లో య.0-72 సెంట్లు వెరసి య.1.69 సెంట్లు మరియు క్రియ దస్తావేజు తేది 02-07-2004 దా.నెం.1408/2004 రీత్యా ఎల్లపు పెద కాంతమ్మ వగైరా న వద్ద నుండి సర్వే నెం.119/3 లో య.0.56 సెంట్లు మరియు 120/3 లో య.0.55 సెంట్లు వెరశి య.01-11 సెంట్లు సదర్లు రీత్యా వెరశి మొత్తం య.02-80 సెంట్లు క్రియ పరచినారని మా క్లయింటుకి తెలియ చేసియున్నారు. దరిమిలా D-734578 గా పాస్ పుస్తకాలు, జగపతి నగరం VAO గారి నుండి Agriculture certificate ద్వారా సదరు భూమి య.2-80 సెంట్లు మాత్రమే పొందియున్నారని, దరిమిలా అడంగల్ report, ROR 1B - Report ప్రకారం చూడగా సదరాస్తి సర్వే నెం. 119-3, 120/3 లలో య.1-0540 సెంట్లు, సర్వే నెం.124/3 లో య.0-7130 సెంట్లు, సర్వే నెం.123/2 ఏ లో య.0-9830 వెరశి య.2-75 సెంట్లు మాత్రమే అరవ వెంకట్రావు గారు కలిగి యున్నారని తహసీల్దారు గారు దృవీకరస్తూ 19-01-2026 వ సం॥ తేదీన ఒక ధృవపత్రంను వారి పేర ఇచ్చి యున్నారని, మరిన్ని 20-09-2008 వ సం॥ తేదీన D.Dis-A. 1619/2008 గా సర్వే నెం.123/2ఎ నందలి య.0.97 సెంట్ల భూమిని వ్యవసాయ భూమి నుండి వ్యవసాయేతర భూమిగా ఉపయోగించుకొనుటకు మార్చుకొని యున్నారని తెలియజేయుచున్నారు. కావున సదరు ఆస్తిపై ఎటువంటి అభ్యంతరములు ఉన్నను, కోర్టు లావాదేవీలు, భాగ భరణాదులు ఉన్నను ఈ తేదీ లగాయతు 7 రోజులలోగా మాకు గానీ, మా క్లయింటుకు గానీ తెలియజేయవలెను. లేని యెడల సదరాస్తిని నిర్వివాద, నిష్పేచి ఆస్తిగా భావించి మా క్లయింటు క్రమమైన రిజిష్టర్ దస్తావేజులు పొందగలరని యావన్మందికి తెలియ జేయడమైనది.

చక్కా శ్రీనివాస్, అడ్వకేట్,
కాకినాడ, Mobile.9848293766

(c) eenadu

ఈనాడు కర్ణాటక
సోమవారం మార్చి 2, 2026

నేరరహిత సమాజమే లక్ష్యం

విధానసౌధ వద్ద పోలీసు వాక్‌థాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ పరమేశ్వర్, డీజీపీ డాక్టర్ ఎం.ఎ.సలీం తదితరులు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జాగ్రుతి, సైబర్ క్రైమ్ తదితర అంశాలను గురించి ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు నగర పోలీసులు ఆదివారం ఇక్కడ విధానసౌధ ముందు చేపట్టిన వాక్‌థాన్ కార్యక్రమాన్ని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ ప్రారంభించారు. విధానసౌధ వద్ద ప్రారంభమైన వాక్‌థాన్ కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. ఐదు, పది కిలోమీటర్ల వాక్‌థాన్‌లో పాల్గొన్న పోలీసులు ప్రజలు విధాన సౌధ నుంచి బయలుదేరి కబ్బన్ రోడ్డు, ఎంజీ రోడ్డు మీదుగా మళ్లీ కబ్బన్ పార్కు గుండా విధానసౌధకు చేరుకున్నారు. వాక్‌థాన్ విజేతలకు డీజీపీ డాక్టర్ ఎం.ఎ.సలీం తదితరులు కలిసి పతకాలను అందజేశారు. ఎస్‌బీఐ వాక్‌థాన్‌కు అన్ని విధాలుగా సహాయ, సహకారాలను అందించింది. మాదక ద్రవ్యాల విక్రయాలు పెద్ద సవాల్‌గా మారిందని, సైబర్ నేరాలు నానాటికీ పెరుగుతున్నాయని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. రెండింటినీ నిర్మూలించేందుకు ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్, వివిధ విభాగాల డీసీసీలు, ఏసీపీలు హాజరయ్యారు.

వాక్‌థాన్‌కు హాజరైన ప్రజలు పోలీసులు

కన్నడిగుల రక్షణకు కంకణం

- పశ్చిమాసియా యుద్ధ జ్వాలల్లో చిక్కుకున్న మనవారు క్షేమమే
- అమెరికా యుద్ధనీతిపై సర్కారు ధ్వజం

అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ అలీపురలో నల్లదుస్తులు ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న షియా ముస్లిం నేతలు

ఈనాడు, బెంగళూరు: విద్య, ఉపాధి, ఆధ్యాత్మిక, వ్యాపారాల కోసమని అరబ్ దేశాలకు తరలిన కన్నడిగులు పశ్చిమాసియా యుద్ధ జ్వాలల మధ్య చిక్కుకున్నారు. ఏటా వేలాది మంది ఇరాన్, ఇజ్రాయెల్, లెబియాన్, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఒమన్, ఇరాక్ తదితర ప్రాంతాలకు వెళ్తుండగా ఆ దేశ ఏజెన్సీలతో పాటు రాష్ట్ర హజ్ సమితి వీరి పర్యటనలకు, చదువులకు సహకరిస్తోంది. శనివారం అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఒక్కసారిగా ఇరాన్‌పై సైనిక దాడులతో విరుచుకుపడటంతో పశ్చిమాసియా, మధ్యతూర్పు ప్రాంతాల్లో నివసిస్తున్న భారతీయులు ఆందోళనకు లోనయ్యారు. వీరిలో ఎక్కువ మంది కన్నడిగులు ఉండటంతో సర్కారు అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సూచనతో హోంమంత్రి, దిల్లీలోని ప్రత్యేక కమిషనర్ కార్యాలయం సమన్వయంగా కన్నడిగుల రక్షణ చర్యలకు సిద్ధమైంది.

కన్నడిగులతో మాట్లాడా -ముఖ్యమంత్రి

దుబాయిలో చిక్కుకున్న కన్నడిగులతో స్వయంగా మాట్లాడినట్లు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. వారంతా ప్రస్తుతం క్షేమంగా ఉన్నారు. వారితో పాటు వారి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరుతున్నారు. రాష్ట్ర హోం, రెవెన్యూశాఖలతో పాటు జిల్లా అత్యవసర నిర్వహణ కేంద్రాల నుంచి దిల్లీ కార్యాలయాల ద్వారా కన్నడిగుల వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటున్నాం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిత్యం విదేశీ దౌత్య కార్యాలయాల అధికారులతో మాట్లాడుతూ ఏ మాత్రం వీలున్నా కన్నడిగులను సురక్షితంగా తరలించే ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఎమ్మెల్సీ భోజేగౌడ, ఎమ్మెల్యే భరత్‌రెడ్డితో పాటు పలువురు పర్యాటకులు, విద్యార్థులతోనూ తాను నేరుగా మాట్లాడినట్లు చెప్పారు. ఇక దుబాయ్‌లో చిక్కుకున్న బళ్లారివాసులతో ఆ జిల్లా ఎమ్మెల్యేల నాగేంద్ర మాట్లాడుతున్నారు. వీరికి ఏమైనా నగదు అవసరమైతే దుబాయ్‌లోని తన స్నేహితుడు నజీబ్ ద్వారా సహకరించే ఏర్పాట్లు చేశారని గుర్తు చేశారు. మధ్య ప్రాచ్య, పశ్చిమాసియాలో ఉన్న కన్నడిగులను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

అమెరికా వైఖరిపై ధ్వజం

అమెరికా యుద్ధనీతిపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ధ్వజమెత్తారు. ఓ వైపు శాంతి గురించి మాట్లాడే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోవైపు సైనిక చర్యలకు పాల్పడటం ఎందుకని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఇరాన్‌పై దాడి అనవసరమని అభిప్రాయపడిన ముఖ్యమంత్రి అమెరికా ద్వంద్వ విధానాలను తప్పుబట్టారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయాతొల్లా ఖమేనీ మరణించారని తెలిసింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పరిస్థితులపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ దేశాల మధ్య వైరంతో పాఠశాలల విద్యార్థులను హతమార్చటం సరికాదన్నారు. అమెరికా సైనిక దాడుల కారణంగా 70 మంది అమాయక విద్యార్థులు మృతి చెందారు. ఈ సంఘటనపై గల్ఫ్, దుబాయ్‌ల్లో ఉన్న భారతీయులు ప్రశ్నించాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పౌరుల రక్షణకు జోక్యం చేసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కన్నడిగులే కాదు ఏ భారతీయుడైనా ఈ పరిస్థితుల నుంచి సురక్షితంగా బయటపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయాల్సి ఉందన్నారు. అరబ్ దేశాల్లోని విద్యా సంస్థలు, వ్యాపార కేంద్రాల్లో పని చేసే భారతీయులు, కన్నడిగుల రక్షణకు సర్కారు నిబద్ధతతో ఉందన్నారు.

సిద్ధరామయ్య, డీకే శివకుమార్

సహాయవాణి ఇదిగో

మరో రెండ్రోజుల పాటు అరబ్ ఎమిరేట్, ఖతర్, ఇరాక్, ఇరాన్, ఇజ్రాయెల్, దుబాయ్, సౌదీ అరేబియా తదితర మధ్య ప్రాచ్య దేశాల నుంచి విమానాల రాకపోకలు నిలిపివేసినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రకటించింది. ఈ యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో వందలాది మంది కన్నడిగులు చిక్కుకున్నట్లు ఇప్పటికే ముఖ్యమంత్రి, హోం మంత్రులు ప్రకటించారు. వీరి వివరాలు సేకరించి భరోసాతో పాటు రక్షణ చర్యలకు సహకరించేలా రాష్ట్ర అత్యవసర నిర్వహణ కేంద్రం (ఎస్‌ఈఓసీ), జిల్లా అత్యవసర కేంద్రం (డీఈఓసీ) ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలు భారతీయ దౌత్య కార్యాలయాల సహకారంతో సహాయ వాణిని ఏర్పాటు చేశాయి. ఈ వివరాలిలా ఉన్నాయి.. ● **ఇజ్రాయెల్** - +972-54 - 7520711, ● **ఇరాన్** - +989128109115, +989128109109, +989128109102, ● **సౌదీ అరేబియా-రియాద్** - 00-966-11-4884697, 00-966-542126748, 8002471234 (వాట్సప్ టోల్‌ఫ్రీ), ● **జేద్దా** - 966536209704, ● ల్యాండ్‌లైన్ - 00966126648660, 00966122614093, మొబైల్ - 966556122301, టోల్‌ఫ్రీ - 8002440003, ● **యూఏఈ** - 80046342, వాట్సప్-971543090571, ● **ఖతర్** -00974-55647502, ● **బహ్రెయిన్** -00973-39418071, ● **జోర్డాన్** -00962-770422276, ● **ఒమన్** -80071234, ● **ఇరాక్** - +9647716511185, +9647704444899, ● **కువైట్** - +96565501946, ● **పాలస్తీనా** - +970592916418

కర్ణాటక డీఈఓసీ నంబర్లు

● **దక్షిణ కన్నడ** -0824-2442590, ● **ఉడుపి** -0820-1077, 0820-222102

ఇంత హింస చూడలేదు - హోంమంత్రి

రెండో ప్రపంచ యుద్ధ సమయంలోనూ ఇంతటి సైనికదాడి, హింసను కూడదలేదని హోంమంత్రి డా.జి.పరమేశ్వర్ ప్రకటించారు. దేశాల యుద్ధ కాంక్షకు పౌరులు బలవుతున్నారు. వేలాది కన్నడిగులు భయంతో వణికిపోతున్నారన్నారు. ఒక్క చిక్కబళ్లాపుర నుంచే 150 మంది విద్యార్థులు, దుబాయ్, సౌదీ అరేబియాకు వెళ్లి చదువుతున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేశామన్నారు. రష్యా ఉక్రెయిన్ తర్వాత అమెరికా, ఇరాన్, ఇరాక్‌లు ఇలాంటి యుద్ధ కాంక్షతో చెలరేగటం ప్రపంచానికి మంచి సందేశాన్ని ఇవ్వదన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి హింస, అమాయక పౌరుల మరణాలు చూడలేదన్నారు.

డా.జి.పరమేశ్వర్

విమానాల రాకపోకలు రద్దు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ఇజ్రాయిల్- ఇరాన్ యుద్ధం కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గల్ఫ్ దేశాలకు సంచరించే విమానాల సంచారాన్ని ఆదివారం పూర్తి రద్దుగా చేశారు. వివిధ విమాన సంస్థలు తమ విమానాల రాకపోకలను రద్దు చేశాయి. ఈ సమాచారం ముందుగా ప్రయాణికులకు తెలియకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. విమానాశ్రయానికి వచ్చే ముందు ప్రయాణికులు విమానాల రాకపోకల సమాచారాన్ని గురించి ముందుగా తెలుసుకుని రావాలని కేఐఏ అధికారులు సూచించారు. మరోవైపు మంగళూరు విమానాశ్రయం నుంచి హఠాత్తుగా దుబాయ్ తదితర అరేబియా దేశాలకు విమానాల రాకపోకలను రద్దు చేశారు. ఎయిర్‌ఇండియా, ఇండిగో విమానాలను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. దుబాయ్‌కి సంచరించే విమానాలను నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దుబాయ్‌కి విమానాలు సంచరిస్తున్నాయా లేదా అనే అంశాన్ని ముందుగా పరిశీలించుకున్న తరువాతే విమానాశ్రయానికి రావాలని సూచించారు. గల్ఫ్ దేశాలకు సంచరించే అన్ని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాల రాకపోకలను నిలిపివేశారు.

10వేల వాహనాలపై కేసులు నమోదు

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: గుజరాత్ రాష్ట్రంలో రిజిస్టర్ అయిన 10,200 వాహనాలను పరిశీలించిన హెచ్.ఎస్.ఆర్ లేఔట్ పోలీసులు వాటికి వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ వాహనాలు ఫారం-38ఏ ప్రమాణ పత్రం అందించకపోవడంతో కేసులు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు. అక్రమంగా సంచరిస్తున్న గుజరాత్‌లో రిజిస్టర్ అయిన వాహనాలపై న్యాయవాది నటరాజ్ శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి కేసులు నమోదు చేశారు.

రూ.1.6 కోట్ల విలువైన చరవాణుల అప్పగింత

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నగర తూర్పు విభాగం పోలీసులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న రూ.1.6 కోట్ల విలువైన చరవాణులను యజమానులకు పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ అందజేశారు. వివిధ పోలీసుఠాణాల పరిధిలో దొంగతనానికి గురైన 641 చరవాణులను స్వాధీనం చేసుకున్నారు. ఇందిరానగరలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వాటిని పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్, సంయుక్త కమిషనర్ బి.రమేష్ తదితరులు కలిసి వాటిని యజమానులకు అందించారు.

‘యడియూరప్ప ఉత్సవాలు నిర్వహిస్తాం’

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: 2028 విధానసభ ఎన్నికలకు ముందు భాజపా నేత, మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్.యడియూరప్ప ఉత్సవాలను భారీస్థాయిలో నిర్వహిస్తామని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై తెలిపారు. ఆదివారం హావేరిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ యడియూరప్ప భాజపాకు పెద్ద ఆస్తి, శక్తి దాన్ని ఉపయోగించుకుంటామన్నారు. ఆయన ఉత్సవాలు నిర్వహించడంలో ఎలాంటి తప్పులేదన్నారు. రాష్ట్రంలో 50 ఏళ్లపాటు క్రియాశీల రాజకీయాల్లో ఉండే వారి సంఖ్య తక్కువ. యడియూరప్ప నాలుగుసార్లు ముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టారని, రాజకీయాలపై పట్టు, అపారమైన అనుభవం ఉందన్నారు. కాంగ్రెస్ అవినీతి పరిపాలనకు యడియూరప్ప ఉత్సవాలు సరైన సమాధానమని తెలిపారు. రాష్ట్రం బాగుండాలని, ప్రజాపరిపాలన అందించేందుకు ఆయన మార్గదర్శనం అవసరమన్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవాలు చేస్తామని తెలియజేశారు. భాజపా నుంచి బయటకు వెళ్లిన కె.ఎస్.ఈశ్వరప్ప, తదితర నాయకులను ఘర్ వాపస్ కార్యక్రమాన్ని చేపట్టాలనే ఆలోచన ఉందన్నారు. ఇందుకు సంబంధించి పార్టీ కోర్ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. 2028 విధానసభ ఎన్నికల్లో గెలుపు కోసం ఏమి చేయాలో అన్ని ప్రయత్నాలు చేయాలని పార్టీ తీర్మానిస్తుందని చెప్పారు. కాంగ్రెస్ అధిష్ఠానం శక్తిహీనమైందని, ఇద్దరు నాయకులను పిలిచి చర్చించే శక్తి లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఇంటికి పంపిస్తారని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు చిన్నారులు బలి కావడం తనకు బాధ కలుగుతోందని, శివమొగ్గలో బాలుడి హత్య ఆవేదన కలిగించిందన్నారు.

‘జోగ్’కు తగ్గిన ‘జోష్’ శివమొగ్గ జిల్లాలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన జోగ్ జలపాతంలో ప్రవాహం మందగించింది. వేసవిలో సరదాగా జలపాత హొయలను చూద్దామని వెళ్లే పర్యాటకులకు నిరాశే మిగులుతోంది. ఆదివారం జోగ్ జలపాతంలో సన్నగా వస్తున్న జలధారలను చిత్రంలో చూడవచ్చు. **-బెంగళూరు, న్యూస్‌టుడే**

తోబుట్టువులను వెంటాడిన మృత్యువు

కారును బస్సు ఢీకొని ముగ్గురి దుర్మరణం

హనుమంత రాయుడు

శివకుమార్

చంద్రకళ

ఆ ముగ్గురు తోబుట్టువులు. అంతా కుటుంబాలతో సహా బెంగళూరులో కులవృత్తి(రజక) చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జీవితాలపై పెద్దగా ఆశలు లేకపోయినా ఉన్నదాంట్లో ఆనందంగా జీవిస్తున్నారు. బంధువుల పెళ్లి ఉండటంతో ముగ్గురూ సంబరంగా బయలుదేరారు. శుభకార్యం ముగియగానే అందర్నీ పలకరించడానికి స్వగ్రామం బాట పట్టారు. ఊరి ఊసులు చెప్పుకొంటూ నవ్వుల పువ్వులు పూయిస్తూ వెళ్తుండగా మృత్యువు వెంటాడింది. బస్సు ఢీకొనడం.. ముగ్గురి ప్రాణాలు పోవడం అంతా క్షణాల్లో జరిగిపోయింది. ఆ ముగ్గురు ఇక లేరని తెలిశాక ఆ కుటుంబాల సభ్యులు రోదించిన తీరు అందర్నీ కలచి వేసింది. వీరినే నమ్ముకొని బతుకులీడుస్తున్న వారంతా గుండెలవిసేలా విలపించారు.

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : కారు.. ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృత్యువాతపడ్డారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పరిధిలోని గూబనపల్లి వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు కళ్యాణదుర్గం పరిధిలోని ముదిగల్లుకు చెందిన అన్నాచెల్లెళ్లు శివకుమార్ (30), చంద్రకళ (29), వీరి పెద్దనాన్న కుమారుడు హనుమంతరాయుడు (42) 15 ఏళ్లుగా బెంగళూరులోనే ఉంటూ కులవృత్తి (రజక) చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. రెండు రోజుల కిందట కర్ణాటకలోని మొలకాల్మూరు తాలూకా కొండ్లపల్లిలో బంధువుల వివాహం ఉండటంతో వచ్చారు. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం స్వగ్రామానికి వెళ్లి బంధువులను, స్నేహితులను పలకరించి రాత్రికి బెంగళూరు వెళ్దామని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో కారులో స్వగ్రామానికి బయల్దేరారు. అనంతపురం నుంచి కళ్యాణదుర్గం మీదుగా రాయదుర్గం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురూ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. బస్సులో వెళ్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. మృతి చెందిన వారిలో శివకుమార్‌కు వివాహం కాలేదు. చంద్రకళకు భర్త నరసింహమూర్తి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హనుమంతరాయుడుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరి మరణంతో ఆయా కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపించాయి. ఘటనా స్థలానికి డీఎస్పీ రవిబాబు, పట్టణ సీఐ హరినాథ్ సిబ్బందితో చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించి మృతదేహాలను పంచనామా నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. బస్సు డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలుస్తోంది. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు బాధిత కుటుంబాలను ఆదుకుంటానని ప్రకటించారు.

బస్సు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన కారు

పారాణి ఆరకనే కడతేరిపోయారు

- దైవ దర్శనానికి వెళ్లొస్తూ.. తిరిగిరాని లోకాలకు
- రోడ్డు ప్రమాదంలో నవదంపతుల దుర్మరణం

హావేరి(హొసపేటె), న్యూస్‌టుడే: పెళ్లై పట్టుమని 15 రోజులు కూడా కాలేదు, కాళ్ల పారాణి కూడా ఆరకముందే నవదంపతులను మృత్యువు కబళించింది. దైవదర్శనానికి వెళ్లి ఎంతో ఆనందంగా స్వస్థలానికి వెనుదిరుగుతుండగా, వారు ప్రయాణిస్తున్న కారు లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నవదంపతులు కార్తిక్(34), ఐశ్వర్య(30) ప్రమాద స్థలంలోనే మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ దుర్ఘటన హావేరి జిల్లా వధువు పుట్టినిల్లు నీలగిరి క్రాస్ వద్ద ఆదివారం జరిగింది. హావేరి జిల్లా శిగ్గావ్‌కి చెందిన చెందిన సోదరులు కర్ణ, కార్తిక్ వివాహం ఫిబ్రవరి 14న జరిగింది. కార్తిక్ తన భార్య ఐశ్వర్యతో కలిసి గదగ్ జిల్లా నవలగుందలో ఉన్న కామణ్ణ ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా, రహదారిపై ఆగి ఉన్న లారీని వీరి కారు వెనుక నుంచి వేగంగా ఢీకొంది. కారులో ఉన్న మల్లికార్జున, వినాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే హావేరి ఎస్పీ యశోద వంటగోడి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తడస పోలీసులు ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆ రెండూ కుటుంబాల్లో రోదనలు మిన్నంటాయి.

ప్రమాదంలో నుజ్జయిన కారు

ప్రమాదంలో మృతిచెందిన నవదంపతులు ఐశ్వర్య, కార్తిక్

ఇంకుడు గుంతలో రసాయనాలు పీల్చి ముగ్గురి మృతి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: వాననీటి ఇంకుడు గుంతను శుభ్రం చేసే సమయంలో ముగ్గురు మృతి చెందిన సంఘటన వైట్‌ఫీల్డ్ పోలీసుఠాణా పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతులను మునిశామప్ప (67), రుద్రకుమార్ (40) విశ్వనాథ్ ఆచారి (24గా) పోలీసులు గుర్తించారు. వారి వివరాల మేరకు.. 12 ఏళ్ల కిందట నిర్మించిన ఇంకుడు గుంతను వినియోగించలేదు. దీంతో గుంతలో చెత్త పడి దుర్వాసన వస్తోంది. శనివారం సాయంత్రం ఇంటి యజమాని మునిశామప్ప రసాయనిక మందులు చల్లి శుభ్రం చేసేందుకు ప్రయత్నించారు. గుంతను శుభ్రం చేసేటప్పుడు మునిశామప్ప స్పృహ తప్పిపడిపోయారు. ఆయనను రక్షించేందుకు వెళ్లిన ప్లంబర్ రుద్రకుమార్ కూడా అలాగే పడిపోగా.. వారిద్దరినీ కాపాడేందుకు గుంతలో దిగిన విశ్వనాథ్ స్పృహ తప్పి పడిపోయారు. ముగ్గురిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు పోలీసులు తెలియజేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సురక్షితంగా ఉన్నాం.. రెండ్రోజుల్లో వస్తాం

సింధనూరు, న్యూస్‌టుడే: ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ శివరాజ్ దుబాయ్‌లో చిక్కుకున్నారు. ఓ ప్రముఖ ప్రచురణ సంస్థ విజయరత్న అనే ప్రశస్తికి ఆయనను ఎంపిక చేసింది. శివరాజ్‌తో పాటు రాష్ట్రంలోని పలువురు ప్రముఖులను ఈ పురస్కారానికి ఎంపిక చేసి ప్రశస్తి ప్రదానోత్సవాన్ని దుబాయ్‌లో ఏర్పాటు చేసింది. స్వీకరించేందుకు శివరాజ్ సతీ సమేతంగా రెండ్రోజుల క్రితం దుబాయ్ వెళ్లారు. తిరిగి భారత్ రావడానికి ఆదివారం తిరుగు ప్రయాణానికి టికెట్లు కూడా బుక్ చేసుకున్నారు. ఇంతలో ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో విమానాలు రద్దు కావడంతో వారు దుబాయ్‌లోనే చిక్కుబడిపోయారు. ఓ హోటల్లో సురక్షితంగా ఉన్నాం.. ఇక్కడి అధికారుల ఆదేశాలతో గది కిటికీలు కూడా తెరవడం లేదు.. రెండ్రోజుల్లో విమానాల రాకపోకలు ఆరంభమైతే వచ్చేస్తాం.. ఆందోళన చెందొద్దంటూ శివరాజ్ సింధనూరులోని వాళ్ల బంధువులకు సమాచారం అందించారు.

భార్యతో కలిసి తీసుకొన్న ఫొటోను పంపిన డాక్టర్ శివరాజ్

సంగమేశ.. శభాష్!

అంతర్జాతీయ స్థాయి ఐరన్‌మ్యాన్ పోటీలో అద్భుత సాధన

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: అంతర్జాతీయ స్థాయి ‘ఐరన్‌మ్యాన్’ పోటీలో బెళగావీకు చెందిన పోలీసు అధికారి సంగమేశ్ ఆనీ అద్భుతమైన సాధన చేసి భారత ఘనతను నిలబెట్టారు. ఈ సాధనలకు పూనుకున్న నాలుగో పోలీసు అధికారిగా పేరుపొంది బెళగావి ఘనతను పెంచారు సంగమేశ్ ఆనీ.. ఇంతకీ ఆయనేం సాధించారో తెలుసుకుందామా.. విజయపుర జిల్లా కుర్తి కొల్హాపురకు చెందిన సంగమేశ్ తండ్రి సంకప్ప, తల్లి నాగవ్వ. మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన సంగేమశ్ బీఎస్‌సీ పూర్తి చేశారు. తన కఠోర అభ్యాసం, పరిశ్రమతో 2021లో ఆర్.ఎస్.ఐ.గా నియామకమయ్యారు. అంతకు ముందు కానిస్టేబుల్‌గా చేరిన సంగమేశ్ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను పొందిన ప్రతిభాన్వితుడు. బెళగావి నగర పోలీసు కమిషనరేట్ పరిధికి చెందిన సీఏఆర్ విభాగంలో ఆర్.ఎస్.ఐ.గా విధులు నిర్వహిస్తున్న సంగమేశ ఆనీ ఈనెల 22న శ్రీలంక దేశం కొలంబోలో జరిగిన ఐరన్‌మ్యాన్ 70.3 పోటీలో పాల్గొని భారత కీర్తిని నిలబెట్టారు. ఫిట్ అండ్ ఫైన్‌గా ఉన్న ఈ పోలీసు అధికారి సాధన ఇతర పోలీసులకు ఆదర్శమైంది. కొలంబో పోటీల్లో దాదాపుగా యాభై దేశాల నుంచి 560 మంది పోటీదారులు పాల్గొన్నారు. కఠినమైన సవాల్‌గా ఉన్న ఈ పోటీలో భారత తరఫున పాల్గొన్న 29 ఏళ్ల సంగమేశ్ 90 కిలోమీటర్ల సైక్లింగ్‌ను రెండు గంటల 51 నిమిషాల్లో ముగించి, హాఫ్ మారథాన్ 21.1 కిలోమీటర్ల పోటీలను రెండు గంటల 15 నిమిషాల్లో పూర్తి చేసి రికార్డు నమోదు చేశారు. మొత్తం ఐదు గంటల ఆరు నిమిషాల్లో లక్ష్యాన్ని చేరిన ఈయన శారీరక, మానసిక సామర్థ్యంతో తన ఈ గమ్యాన్ని చేరారు. సైక్లోన్ పరిణామంగా మొసళ్ల సమస్యతో ఈ పోటీలో ఉన్న ఈతను రద్దు చేశారు. ఐరన్‌మ్యాన్ గౌరవాన్ని పొంది బెళగావికి విచ్చేసిన సంగమేశ్ ఆనీని సహూద్యోగులు ఘనంగా స్వాగతించారు. నగర పోలీసు కమిషనర్ భూషణ్‌బొరేసే, డీసీపీ నారాయణ బరమని సంగమేశ్ సాధనకు మెచ్చుకొని సత్కరించారు. సంగమేశ్ ఈ సాధన చేసేందుకు ముందు అంతర్జాతీయ ఐరన్‌మ్యాన్ పోటీల్లో డీజీపీ సందీప్‌పాటిల్, సీపీఐ మురుగేశ్ చెన్నణ్ణవర, సీపీఐ శ్రీశైల, బ్యాకోడ ఈ జాబితాలో చేరుకున్నారు. శ్రీలంకకు వెళ్లే ముందు సంగమేశ్ మైసూరులో జరిగిన ట్రయథ్లాన్ పోటీలో పాల్గొన్నారు. కేఆర్ఎస్ వెనుకనీటిలో జరిగిన రెండు కిలోమీటర్ల ఈత, 80 కిలోమీటర్ల సైక్లింగ్, 20 కిలోమీటర్ల పరుగులో పాల్గొన్న ఈయన తన వయోవిభాగంలో అగ్రస్థానంలో నిలిచారు. నేడు అంతర్జాతీయస్థాయి ఐరన్‌మ్యాన్ సాధన కూడా చేశానని తన ఆనందాన్ని పంచుకున్నాడు. ప్రతి రోజు ఈత, పరుగు, సైక్లింగ్ కార్యక్రమాల్లో సాధన చేసే అలవాటు చేసుకున్నారు. పోలీసు కమిషనర్ భూషణ్‌బోరస, డీసీపీలు నారాయణ బరమని, నిరంజన్ రాజేఅరస్, సీఏఆర్ డీసీపీ ఎం.వై.కాశప్ప, ఆర్‌పీఐ సంగమేశ్ బిరేదార ప్రోత్సహించారు. ఎమ్మెల్యే ఆసిఫ్‌సేఠ్ తనను ప్రోత్సహించారని చెప్పారు. యువకులు దేశం ఆస్తి. ఈ కారణంగా దురలవాట్లకు దూరంగా ఉండాలి. చక్కని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సందేశమిచ్చాడు. సంగమేశ్ సాధనలు పోలీసు శాఖకు గర్వకారణంగా ఉన్నదని రైతు కుమారుడిగా కష్టపడి చదివి ఆర్.ఎస్.ఐ. అయిన సంగమేశ్ భారతకు పేరు తెచ్చాడని ఆర్‌పీఐ సంగమేశ్ బిరేదార హర్షం వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ పోటీలో పాల్గొన్న సంగమేశ్ ఆనీ

సహోద్యోగులతో సంగమేశ్ ఆనీకి సన్మానం

30 మంది పారిశుద్ధ్య కార్మికులకు విమానయాన భాగ్యం

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప తన పుట్టిన రోజు సందర్భంగా సొరబ, ఆనవట్టిలో ఉన్న 30 మంది పారిశుద్ధ్య కార్మికులకు విమానంలో ప్రయాణించే అవకాశం కల్పించారు. ఆదివారం ఇక్కడ శివమొగ్గ నుంచి కార్మికులు విమానం ఎక్కి బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగారు. వారితో మంత్రి మధుబంగారప్ప ప్రయాణించారు. బెంగళూరు నగరానికి వచ్చిన కార్మికులను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వద్దకు తీసుకెళ్లి పరిచయం చేశారు. పుట్టిన రోజును విభిన్నంగా నిత్యం నగర, పట్టణాలను శుభ్రం చేసే కార్మికులతో కలిసి విమానంలో ప్రయాణించి వారితో కలిసి జరుపుకొన్నట్లు మంత్రి తెలిపారు. మంత్రి ఏటా విభిన్నంగా తన పుట్టిన రోజు వేడుకను చేసుకుంటారని కార్మికులు తెలిపారు. విమానంలో సంచరించే కోరికను ఆయన తీర్చినట్లు చెప్పారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

ఆటోవాలా కూతురు.. అయ్యింది వకీలు

సంచార సముదాయ యువతి అద్భుత ప్రతిభ

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: ఓ సంఘటనలో తన పెద్దనాన్న న్యాయస్థానం చుట్టూ తిరుగుతున్న దృశ్యాన్ని చూసి తానూ న్యాయ విద్యను చదివి న్యాయవాది కావాలనే సంకల్పాన్ని చేపట్టిన సంచార సముదాయానికి చెందిన వి.అరుణ ఎట్టకేలకు తన ఆశయాన్ని నెరవేర్చుకొంది. సంచార సముదాయంలో తొలిసారిగా ఉన్నత శిక్షణ పొందడంతో పాటు తొలి న్యాయవాదిగా కీర్తి సాధించింది. కఠోర పరిశ్రమతో తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్న అరుణ సంచార సముదాయంలో తొలి మహిళ కావడం విశేషం. మైసూరులోని ఏకలవ్య నగరంలో నివసిస్తున్న అరుణ బాల్యం నుంచి అస్పృశ్యత, అసమానతను చూసి తండ్రి, పెద్దనాన్న కోరిక మేరకు న్యాయవాది కావాలని నిర్ణయించుకుంది. ఈ ఏడాది జూన్‌లో జరుగనున్న అఖిల భారత బార్ అసోసియేషన్ పరీక్షల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతోంది. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత పొందితే సుప్రీం కోర్టు వకీలుగా వెళ్లే అవకాశం పొందవచ్చు.

అరుణ తండ్రి వెంకటేశ్ ఆటోడ్రైవరు. తల్లి మంగళ గృహిణి. కష్టాల మధ్య చదివిన అరుణ న్యాయవాది కావడం ఆ కుటుంబంలో ఆనందాన్ని కల్గించింది. ఏకలవ్య నగరలోని గోమాళ షెడ్‌లో ఉన్న ఇంట్లో ఒకటి నుంచి పది వరకు కిరోసిన్ దీపం వెలుగులో చదువుకున్న అరుణ పీయూసీ సమయంలో ప్రభుత్వం తరఫున జె.ఎన్.నర్మ్ పథకంలో తమ కుటుంబానికి విద్యుత్తు దీపం మంజూరైంది. ప్రాథమిక పాఠశాల నుంచి లా శిక్షణ వరకు కన్నడభాషలోనే అధ్యయనం చేసింది. 2025 న్యాయ శిక్షణను ముగించుకొంది. తన పెదనాన్న ఓ కేసు విచారణ సందర్భంగా న్యాయస్థానం చుట్టూ తిరుగుతూ అసహాయతతో నిరాశ చెందారు. ఆయన న్యాయస్థానానికి వెళ్లేముందు అరుణకు 'నీవు న్యాయవాది అయితే నా కష్టం తీరుతుంద'ని చెప్పేవారు. ఈమె తండ్రి కూడా వకీలు కావాలని పట్టుబట్టి చదివించారు. చిన్నతనంలో తాను సేన విభాగానికి చేరుకోవాలని ఆశపడిన అరుణ పీయూసీ తర్వాత లా విద్యను అభ్యసించి బాధల్లో ఉన్న వారికి సాయం చేయాలని సంకల్పించింది. హైకోర్టు న్యాయాధీశురాలు కావాలని లక్ష్యంగా పెట్టుకున్న అరుణ్ వకీలు శిల్పాహిరేమఠ దగ్గర అభ్యాసం చేసింది. ప్రస్తుతం వకీలు నాగరాజ్‌తో న్యాయవాదిగా అభ్యాసం చేస్తున్న ఆమె ఇటీవలే సివిల్ న్యాయాధీశుల ఉద్యోగ పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేయాలనుకుంది. మూడేళ్ల పాటు న్యాయవాదిగా అభ్యాసం చేస్తే దరఖాస్తు చేసుకోవచ్చని ఈ పరీక్ష రాయలేదు. భవిష్యత్తులో ఈ పరీక్షను రాసేందుకు కూడా సిద్ధమవుతున్నట్లు పేర్కొంది. తల్లి మంగళ మాట్లాడుతూ సంచార సముదాయ వర్గాల్లో తన కుమార్తె ఉన్నత శిక్షణ పొంది న్యాయవాదిగా ఎదగడం తమకు గర్వకారణంగా ఉందని ఆనందనం వ్యక్తం చేశారు.

అరుణ

తల్లి మంగళతో మాట్లాడుతున్న అరుణ

కర్ణాటక దర్శనకు బయలుదేరిన విద్యార్థులు

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: విద్యార్థులు క్షేత్ర పర్యటనలను జ్ఞానార్జనకు ఉపయోగించుకోవాలని హొళల్కెర ఎమ్మెల్యే ఎం.చంద్రప్ప సూచించారు. ఆదివారం ఆయన హొళల్కెరలో ప్రభుత్వోన్నత పాఠశాల్లో 8, 9వ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నాల్గురోజులు పర్యటనకు వీడ్కోలు పలికి మాట్లాడారు. విద్యార్థులు తోటి స్నేహితులతో కలిసి చేపట్టే పర్యటనలు, తిలకించే పర్యాటక కేంద్రాలు జీవితాంతం గుర్తుండి పోతాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొత్తం 96 మంది విద్యార్థులు రెండు ఆర్టీసీ బస్సుల్లో పర్యటనకు బయలుదేరారు.

వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యే చంద్రప్ప

10 సూత్రాలతో ప్రపంచ శాంతి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: జగద్గురు రేణుకాచార్య ప్రపంచంలో శాంతిని నెలకొల్పడానికి ప్రచారం చేసిన అహింస, సత్యం, దయా, క్షమ తదితర 10 సూత్రాలు నేడు కూడా అందరూ ఆచరించదగినవని సహాయక కమిషనర్ డాక్టర్. కాంతరాజ్ పేర్కొన్నారు. ఆదివారం జగద్గురు రేణుకాచార్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పార్చన చేసి నివాళులు సమర్పించి మాట్లాడారు. మనుషులు సన్మార్గంలో నడవాలని, శాంతియుతంగా జీవనం సాగించాలని రేణుకాచార్య ఆశించారన్నారు. కార్యక్రమంలో కన్నడ సంస్కృతి శాఖ సహాయక డైరెక్టర్ బి.ఎం.గుర్నాథ్, అధ్యాపకులు నిరంజన దేవరమనే, అఖిల భారత వీరశైవ లింగాయత్ మహాసభ జిల్లా అధ్యక్షుడు శివమూర్తి, జంగమ సమాజం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం రేణుకాచార్య జయంతి భక్తి శ్రద్ధలతో జరిగింది. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి పూజలు జరిపారు. వీరశైవ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎం.నాగరాజ్, డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర కుమార్, నాయకులు హేమయ్య స్వామి తదితరులు మాట్లాడారు. వీరశైవ సంఘ భవనంలోనూ జయంతిని ఆచరించారు.

రేణుకాచార్యకు పుష్పార్చన చేసి నివాళులు సమర్పించిన సహాయక కమిషనర్

ప్రభుత్వ బడుల మూసివేత నిర్ణయం తగదు

హొసపేటె, న్యూస్‌టుడే: కర్ణాటక పబ్లిక్ పాఠశాలలను ప్రారంభిస్తామన్న సాకుతో ప్రభుత్వబడుల మూసివేత నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రజాస్వామ్య యువజన సంఘటన ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆదివారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. నేతృత్వం వహించిన సంఘటన ముఖ్యురాలు ఉమాదేవి మాట్లాడుతూ కర్ణాటక పబ్లిక్ పాఠశాలలను ప్రారంభించేందుకు రాష్ట్రంలో సుమారు 7 వేల ప్రభుత్వ ప్రాథమిక బడులను మూసివేయాలన్న ప్రభుత్వ నిర్ణయం అశాస్త్రీయమన్నారు. కొత్తగా పబ్లిక్ పాఠశాలలను ప్రారంభించడం మానేసి ఉన్న బడులనే అభివృద్ధి చెయడం ఉత్తమమని సూచించారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ప్రముఖ రచయిత పీర్‌బాషా ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రముఖులు ఎర్రిస్వామి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శన చేపట్టిన ఏఐడీఎస్ఓ కార్యకర్తలు

6న తిప్పేరుద్రస్వామి రథోత్సవం

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రసిద్ధి చెందిన నాయకనహట్టి తిప్పేరుద్రస్వామి బ్రహ్మ రథోత్సవం ఈనెల 6న అంగరంగ వైభవంగా జరుగనుంది. ఇందులో భాగంగా దేవాలయంలో తిరునాళ్ల వేడుకలు ప్రారంభమయ్యాయి. దేవాలయంలో కంకణ ధారణ, గోపూజతో ఆగమోక్త పూజలు ప్రారంభమైనట్లు దేవాలయ పరిపాలన అధికారి గంగాధరయ్య తెలిపారు. అర్చకులు మఠ శీర్షప్పశెట్టి నేతృత్వంలో పండితులు తిరునాళ్ల ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. వారం రోజుల పాటు జరిగే తిరునాళ్లలో పలు రాష్ట్రాల నుంచి సుమారు 4 లక్షల మంది భక్తులు పాల్గొంటారని అంచనా. ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్టీసీ సుమారు 200 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనుంది. కార్యక్రమంలో అదనపు జిల్లా పాలనాధికారి కుమారస్వామి, పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు మంజుల, ఉపాధ్యక్షురాలు బోసమ్మ, పట్టణ పంచాయతీ ఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాయకనహట్టి దేవాలయం ముంగిట నిర్వహిస్తున్న పూజలు

సమితి ఆశయాలకు కట్టుబడి ఉందాం

కంప్లి, న్యూస్‌టుడే: దళిత సంఘర్ష సమితి సిద్ధాంతాలు (ప్రొఫెసర్ కృష్ణప్ప), ఆశయాలకు అందరం కట్టుబడి ఉండామని సమితి తాలూకా సంచాలకుడు హెచ్.గుండప్ప కోరారు. కంప్లి ప్రభుత్వ అతిథి గృహంలో ఆదివారం ఏర్పాటైన సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఆర్థిక, రాజకీయ, సామాజిక తదితర రంగాల్లో వెనుకబడిన వారందరూ దళితులే. సమస్యల సాధనకు కలిసికట్టుగా ముందుకు సాగుదాం. రాష్ట్ర సంచాలకుడు ముండ్రిగి నాగరాజ్ నేతృత్వంలో తాలూకాలో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం 10.ముద్దాపుర గ్రామ సమితి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంచాలకుడిగా హెచ్.కుమార స్వామి, సంఘటన సంచాలకులుగా ఆనె కల్ల, శివ కుమార్, తమ్మణ్ణ, ఎం. సూర్యప్రకాశ్, కోశాధికారిగా కట్టె మహేశ్ తదితర కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. నాయకులు మరియప్ప, బాళప్ప, ఎ.లక్ష్మీనారాయణ, హెచ్.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తాలూకా సంచాలకుడు గుండప్ప

పవిత్ర మాసం.. పసందైన వంటకం

ఉద్యాన నగరిలో రంజాన్ రుచులు

వివిధ రకాల మాంసాహార పదార్థాలు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రంజాన్ మాసం పర్వదినంలో వివిధ రకాల ఆహార పదార్థాలను రుచి చూడవచ్చనే కోరిక ప్రజల్లో ఉంది. మాసం ప్రారంభమైనప్పటి నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆహార పదార్థాల ప్రదర్శన అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఆహార పదార్థాల రుచులను చూసేందుకు ఆహార ప్రియులు పోటీ పడుతున్నారు. పులికేశినగర మస్జిద్ రహదారిలో ఆహార బజార్ ఈ ఏడాది లేకపోయినా శివాజినగర, కోరమంగల, మడివాళ ప్రాంతాల్లో ఆహార బజారులను ఏర్పాటు చేశారు. మాంసాహారంలో వివిధ రకాల ఆహార పదార్థాలను రుచి చూసేందుకు వివిధ ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం, చిత్తూరు, తమిళనాడు హోసూరు, కృష్ణగిరి, సేలం తదితర ప్రాంతాల నుంచి ఆహార ప్రియులు వస్తున్నారు. తక్కువ ధరలకు నాణ్యమైన రుచికరమైన ఆహార పదార్థాలు ఆయా ప్రాంతాల్లో దొరుకుతాయి. మాంసాహారంతో పాటు శాకాహార ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో వీకెండ్ పడితే ఆహార బజార్లు జనం రద్దీతో నిండిపోతాయి. అర్ధరాత్రి వరకు ప్రజలు అక్కడికి వచ్చి ఆహార పదార్థాలను భుజిస్తారు. ప్రధానంగా ఐటీ బీటీ ఉద్యోగులు కోరమంగల ఆహార బజారు వచ్చి వంటలను ఆస్వాదిస్తున్నారు. సమోసా, తీపి ఖర్జూరం, వివిధ రకాల బజ్జీలు అందుబాటులో ఉంటాయి. రంజాన్ మాసంలో సమోసా వ్యాపారం నగరంలో రూ.7 కోట్లకు పైగా ఉంటుందని వ్యాపారులు తెలిపారు. పులికేశినగర బజారులో అన్ని రకాల పండ్లు అందుబాటులో ఉంటాయి. అత్తర వ్యాపారం జోరుగా సాగుతోంది. వీధుల్లో చౌకగా ఖర్జూరం పండ్లు విక్రయిస్తున్నారు. రంజాన్ మాసంలో అన్నిరకాల ఆహార పదార్థాలను రుచి చూసేందుకు అవకాశం ప్రజలకు ఉంటుందని వ్యాపారులు తెలిపారు.

చౌకగా దొరికే ఖర్జూరం

రంజాన్ సందర్భంగా శాకాహార వంటకాలు

రెట్టింపు కానున్న దళ్ బలం

హొసపేటె, న్యూస్‌టుడే: రెండున్నరేళ్ల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల సమయానికి రాష్ట్రంలో జేడీఎస్ బలపడతుందని ఆ పార్టీ యువ నాయకుడు నిఖిల్ కుమారస్వామి స్పష్టం చేశారు. ఆదివారం విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయటానికి రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నాం. అన్ని చోట్ల ఉత్తమ స్పందన లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలకు కూడా ఇప్పటి నుంచే పార్టీని సంఘటిత పరుస్తున్నాం, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తమ వెంట ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జేడీఎస్ ఉనికి లేదని విపక్షాలు నోరు పారేసుకుంటున్నాయి, రాబోయే ఎన్నికల్లో వారికి తగిన సమాధానం ఇస్తామని తేల్చి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలని పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. పార్టీలో యువకులకు పెద్దపీట వేస్తున్నాం, నిష్ఠాతులకు మంచి అవకాశాలు ఉన్నాయని భరోసా ఇచ్చారు. రెండుసార్లు హగరిబొమ్మనహళ్లిలో పార్టీ అభ్యర్థులను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నేమరాజ్ నాయక్, వెంకట్రావు నాడగౌడ, మాజీ ఎంపీ అనిల్‌లాడ్ తదితరులు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి కార్యకర్తల సమావేశాన్ని ప్రారంభిస్తున్న జేడీఎస్ యువనాయకుడు నిఖిల్ కుమారస్వామి

నృత్యంతో మానసికోల్లాసం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: సంగీతం, నృత్యం తదితర కళలతో మనసు ఉల్లాసంగా ఉండేందుకు దోహదపడుతుందని బ్రహ్మకుమారి పూర్ణిమ పేర్కొన్నారు. పట్టణంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనను ప్రారంభించి ఆమె మాట్లాడారు. సౌభాల కూచి పూడి నృత్య నికేతన ట్రస్టు ఆధ్వర్యంలో లక్ష్మీ టీమ్ ఆధ్వర్యంలో భక్తి, దేశభక్తి, గేయాలకు శాస్త్రీయ, హాస్యం, భరతనాట్య నృత్యాలతో విద్యార్థినులు ఆకట్టుకున్నారు.

వాకథాన్ కార్యక్రమంలో మంత్రి మహదేవప్ప, ఎమ్మెల్యే జీటీ దేవేగౌడ, సినీనటులు వినయ్ రాజ్‌కుమార్, అమృత అయ్యంగార్, బృందా ఆచార్య, బీజేపీ బోరలింగయ్య, పోలీసు కమిషనర్ సీమా తదితరులు

మైసూరు ప్యాలెస్ వద్ద ప్రారంభమైన వాక్‌థాన్‌లో పాల్గొన్న మంత్రి మహదేవప్ప తదితరులు

ప్రజాచైతన్యంతోనే మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: సమాజంలో జరుగుతున్న నేరాలు నియంత్రణ, మాదక ద్రవ్యాల విక్రయాలు, సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఆదివారం మైసూరులోని ప్యాలెస్ మైదానంలో మైసూరు నగర పోలీసులు మాదక ద్రవ్యాల నిర్మూలన వాక్‌థాన్ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మహదేవప్ప పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ప్యాలెస్ మైదానం నుంచి ప్రారంభమైన వాక్‌థాన్‌లో విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు పోలీసులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. ఐదు కిలోమీటర్ల వాక్‌థాన్‌లో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ మహదేవప్ప మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు వాక్‌థాన్ చేపట్టారన్నారు. మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య కంకణం కట్టుకున్నారని తెలిపారు. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో శాసనసభ్యులు జీటీ దేవేగౌడ, శ్రీవత్స, సినీనటులు వినయ్‌రాజ్‌కుమార్, అమృత అయ్యంగార్, బృందా ఆచార్య తదితరులు హాజరయ్యారు.

వాక్‌థాన్ విజేత సినీనటి అమృత అయ్యంగార్‌కు జ్ఞాపిక అందిస్తున్న మంత్రి డాక్టర్ మహదేవప్ప

అలరిస్తున్న ఫల, పుష్ప ప్రదర్శన

బెంగళూరు (కెంగేరి), దావణగెరె (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: దావణగెరె పట్టణ శివార్లలోని అద్దాల మేడలో ఏర్పాటు చేసిన ఫల,పుష్ప ప్రదర్శన ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకర్షిస్తోంది. జిల్లా తోటలు ఉద్యానవనాల అభివృద్ధి శాఖ జేడీ రాఘవేంద్ర విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో సుమారు 10 లక్షల రంగురంగుల గులాబీలు, చామంతులు, బంతి తదితర పూలతో ఏర్పాటు చేసిన అనేక ఆకృతులు ప్రేక్షకుల్ని రంజింపజేస్తున్నాయి. వివిధ రంగుల పూలతో నిర్మించిన విధానసౌధ ఆకృతి ప్రదర్శనకు కేంద్ర బిందువన్నారు. అద్దాల భవనం మధ్యన సుమారు 4 లక్షల పూలతో 42 అడుగుల పొడవు, 16 అడుగుల వెడల్పు, 14 అడుగుల ఎత్తుతో నిర్మించిన విధానసౌధ భవనం నమూనా చూపరులను భలే ఆకట్టుకుంటోందన్నారు. సుమారు 50 వేల పూలతో ఏర్పాటు చేసిన హంపీ రాతి రథం నమూనా కూడా సందర్శకుల్ని అలరిస్తోంది. వివిధ రకాల కూరగాయలతో నిర్మించిన స్వాగత లక్ష్మీ..లవ్ యూ దావణగెరె కళాకృతి, వివిధ తృణ ధాన్యాలతో రూపుదిద్దుకొన్న గ్రామ దేవత దుర్గాంబికా అమ్మవారు చిత్రం, దావణగెరె జిల్లాలో పండిస్తున్న వివిధ రకాల పండ్లు, కూరగాయలు, వివిధ రకాల పూల మొక్కలు, క్రోటాన్ మొక్కలు, బోన్సాయ్ మొక్కల ప్రదర్శన పర్యాటకులకు కనువిందు చేస్తోందన్నారు. దావణగెరెతో పాటుగా చిత్రదుర్గం, హావేరి, శివమొగ్గ, విజయనగర, గదగ్ తదితర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వస్తున్న పర్యాటకులు దావణగెరెను సందర్శించి దుర్గాంబికా అమ్మవారికి మొక్కులు సమర్పించుకొని, ఫలపుష్ప ప్రదర్శనను తిలకించి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఫల, పుష్ప ప్రదర్శనను ఎంపీ ప్రభా మల్లికార్జున, డీసీ గంగాధరస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ ఎమ్మెల్యే శామనూరు శివశంకరప్ప, వృక్షమాత సాలుమరద తిమ్మక్కకు గౌరవాన్ని తెలిపారు.

పూల విధానసౌధ ముందు యువకుల సందడి

వివిధ రకాలు పూలతో నిర్మించిన హంపీ రాతిరథం

దావణగెరెలో ఏర్పాటు చేసిన అద్దాల మేడ

EENADU Classifieds
REAL ESTATE
హిందూపురం రైల్వేస్టేషన్‌కి 3km లో అద్భుతంగా డెవెలప్ చేసిన ప్రాజెక్ట్‌లో ప్లాట్లు & 38 లక్షలకే డబుల్ బెడ్‌రూమ్ హౌసెస్ కలవు. సం: 6281824204.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

డైరెక్టర్స్ కట్ చిత్రంలో సురేజ్ గౌడ, రాధి ఎస్.బాగి, దివ్యజైన్

'డైరెక్టర్స్ కట్' హీరో సురజ్‌గౌడ

రాజేశ్వరి ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్‌పై హేమలత నిర్మిస్తున్న 'డైరెక్టర్స్ కట్' చిత్రం హీరో సురేజ్ గౌడ నటిస్తున్నారు. నగరంలోని కెంగేరిలోని విశ్వ విద్యాగణపతి దేవస్థానంలో చిత్రీకరణ ప్రారంభమైంది. దేవభూమిగా ఖ్యాతి పొందిన ఉత్తరాఖండ్‌లో పలు దృశ్యాలను చిత్రీకరిస్తామని దర్శకుడు భరత్ వి.జె తెలిపారు. అన్నివర్గాలను ఆకట్టుకునే విధంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. సురేజ్‌గౌడతో పాటు రాధా ఎస్.బాగి, దివ్యజైన్ పీడీ సతీశ్, స్వాతి తదితరులు నటిస్తున్నారు.

6న 'గార్జియస్ రాస్కల్' విడుదల

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: కన్నడ చలనచిత్ర పరిశ్రమలో కొత్త ప్రయత్నమైన అదృష్టలక్ష్మీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించిన 'గార్జియస్ రాస్కల్' చిత్రం ఈనెల 6న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. తమిళ గాయకుడు వేలుమురుగన్, దర్శన్ నారాయణ రెండు పాటలకు గానం అందించగా చేతన్‌కృష్ణ సంగీతం అందించారు. విభిన్నమైన చిత్రకథను ప్రేక్షకులు అదరిస్తారని దర్శకుడు ప్రమోద్ జోయిస్ తెలిపారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరించారు. ప్రేరణాభట్, యునిస్, రాజవీర్‌సింగ్, చేతన్ మహేశ్, శక్తికుమార్, సునీల్ పురాణిక్, స్వాతి తదితరులు నటిస్తున్నారు.

గార్జియస్ రాస్కల్ చిత్రంలో ప్రేరణ భట్

'రాయరదర్శన' చిత్రీకరణ

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దివ్యచరిత్రను గురించి 'రాయరదర్శన' చిత్రంతో పాటు ప్రత్యేక ఆల్బం చిత్రీకరణ ప్రారంభమైంది. మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ స్వామి కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్రీకరణ ప్రారంభించి చిత్ర బృందాన్ని దీవించారు. చిత్రంలో ప్రముఖ హీరోలు రజనీకాంత్, శివరాజ్‌కుమార్, జగ్గేష్, ప్రేమ్ తదితరులు నటిస్తున్నారు. తెలుగు, కన్నడ భాషల్లో ఏకాలంలో చిత్రీకరిస్తున్నట్లు దర్శకుడు రఘుభట్ తెలిపారు. సంగీతాన్ని సి.ఆర్. బాబి, అజనీశ్ లోక్‌నాథ్ అందిస్తున్నారు.

రాయర దర్శన చిత్రీకరణను ప్రారంభిస్తున్న మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ స్వామి తదితరులు

దైజి చిత్రంలో రాధికా నారాయణ్, అవినాశ్

'దైజి' వచ్చేస్తోంది

ప్రముఖ హీరో రమేష్ అరవింద్‌తో పాటు రాధికా నారాయణ్, అవినాశ్, దిగంత్, గురుదేశ్‌పాండెలతో పాటు దియా చిత్రం హీరో ఖుషి రవి నటిస్తున్న 'దైజి' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఆధ్యాత్మిక కథతో పాటు హాస్యం, థ్రిల్లర్‌తో కూడిన చిత్రమని ఆకాశ్ శ్రీవత్స తెలిపారు. కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరించామన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులు చిత్రాన్ని ఆదరిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

భాజపా రాష్ట్ర కార్యవర్గసభ్యుడి నియామకం

కారటగి, న్యూస్‌టుడే: కనకగిరి విధానసభ క్షేత్ర భాజపా సీనియర్ నాయకుడు నాగరాజ్ బిల్గార్‌ను పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర నియమించారు. కారటగిలో నాగరాజ్ బిల్గార్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ ఈ బాధ్యతలు అప్పగించింది. పార్టీ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మంజునాథ మస్కి తదితరులు నాగరాజ్ బిల్గార్‌ను సత్కరించారు.

నాగరాజ్ బిల్గార్

సజావుగా ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

కంప్లి, న్యూస్‌టుడే: 2026-27 విద్యా సంవత్సరం వసతి పాఠశాలల ఆరో తరగతి ప్రవేశానికి కంప్లిలోని రెండు కేంద్రాల్లో ఆదివారం 989 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 9 మంది గైర్హాజరయ్యారు. బాలికల ప్రభుత్వ పాఠశాల్లో 582 మంది, షామియాచంద్ ప్రభుత్వ పాఠశాల్లో 407 మంది పరీక్ష రాశారు. రెండు కేంద్రాల్లోనూ పరీక్ష సజావుగా జరిగింది.

పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

1171 రోజుకు చేరిన నిరవధిక సత్యాగ్రహం

రైతుల్ని సన్మానించి అభినందిస్తున్న స్థానిక ప్రముఖులు

బళ్లారి: కుడతిని భూ పోరాట సమితి చేస్తున్న నిరవధిక సత్యాగ్రహం ఆదివారానికి 1171వ రోజుకు చేరుకుంది. కుడతిని, వేణివీరాపురం, హరగినడోణి, జానెకుంటె, సిద్ధమ్మనహళ్లి, యరంగలి, కొళగల్లు తదితర గ్రామాలకు చెందిన రైతులు సత్యగ్రహంలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. తమ డిమాండ్లు పరిష్కరించే ఆందోళన చేస్తామని గట్టిగా హెచ్చరించారు. నిరవధిక సత్యాగ్రహంలో పాల్గొంటున్న రైతులను స్థానిక ప్రముఖులు సన్మానించి అభినందించారు.

ఇంత నిర్లక్ష్యమా!

కేబుల్ కోసం తవ్విన రహదారి, మట్టి వదిలేశారిలా

బళ్లారి: నగర పాలికె సిద్ధార్థ కాలనీ రెండో క్రాస్‌లో రహదారులు భూతద్దం మాదిరిగా వేయడంతో స్థానికులు సంతోషపడ్డారు. ఆ తర్వాత ప్రైవేట్ కేబుల్ వేయడానికి రోడ్డును తవ్వారు.. మట్టిని మాత్రం తొలగించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కేబుల్ వేయడానికి ముందు కంపెనీలు నగర పాలికెకు రుసుం చెల్లించారు. వాటిని నగర పాలికె అధికారులు మరమ్మతు చేయాలి. సరిగ్గా చేయక పోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

విద్యార్థుల సంక్షేమానికి కృషి

శంకుస్థాపన చేస్తున్న మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే నాయక్

మాన్వి, న్యూస్‌టుడే : విద్యార్థులకు ఉత్తమ సదుపాయాలు, సౌకర్యాల కల్పన దిశగా ప్రభుత్వ అనేక యోజనలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందని మంత్రి ఎన్.ఎస్. బోసురాజు పేర్కొన్నారు. స్థానిక దేవణ్ణ తోట ప్రగతి గార్డెన్ వద్ద మౌలానా అజాద్ మాదిరి ఆంగ్ల మాధ్యమ పాఠశాల నిర్మాణానికి ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌తో కలిసి భూమిపూజ చేసి మాట్లాడారు. విద్యార్థులకు సకల సౌకర్యాలతో రూ. 5.27కోట్లతో ఈ పాఠశాల, కళాశాల భవనాలని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కర్ణాటక అల్పసంఖ్యాక అభివృద్ధి శాఖ బెంగళూరు, జిల్లా పంచాయతీ రాయచూరు సంయుక్త ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌తో మాట్లాడారు. పంచగ్యారంటీ సమితి అధ్యక్షుడు బి.కె.అమరేశప్ప, ముడా అధ్యక్షుడు గఫూర్‌సాబ్, ప్రముఖులు అక్బర్‌సాబ్, శరణయ్యగుడదిన్ని, శాంతప్ప, చంద్రశేఖర్ కురిడి, మహంతేశ్‌స్వామి, అధికారులు పాల్గొన్నారు.

3న విరూపాక్షేశ్వర ఆలయం మూసివేత

హొసపేటె, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం నేపథ్యంలో మంగళవారం హంపీ విరూపాక్షేశ్వర ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తామని ఈవో హనుమంతప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రగ్రహణం సాయంత్రం నుంచి రాత్రి వరకు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఆ రోజంతా ఆలయాన్ని మూసి వేస్తామన్నారు. మరుసటి రోజు నుంచి యథావిధిగా భక్తుల ప్రవేశాన్ని కల్పిస్తామని తెలిపారు.

మారథాన్‌కు విశేష స్పందన

మాదక ద్రవ్యాలపై జాగృతి ప్రదర్శన

జెండా ఊపి ప్రారంభిస్తున్న న్యాయమూర్తి హోసమని, ఎస్పీ పెన్నేకర్, డి.ఎఫ్.ఒ బసవరాజు, ఏడీసీ మహమ్మద్ ఝుభేర తదితరులు

విజేతలకు జ్ఞాపికతో పాటు, శిరస్త్రాణాలు వితరణ చేస్తున్న న్యాయమూర్తి, ఎస్పీ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్ క్రీడామైదానం నుంచి ప్రారంభించిన మారథాన్‌కు విశేష స్పందన లభించింది. వేయిమందికి పైగా వృద్ధులు, క్రీడాకారులు, యువతి, యువకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మారథాన్‌ను న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సదస్య కార్యదర్శి రాజేష్ ఎన్.హొసమని, జిల్లా పోలీస్ అధికారి డి. సుమన్ పెన్నేకర్, జిల్లా అటవీశాఖ ఉప సంరక్షణాధికారి బసవరాజు, అదనపు జిల్లా పాలనాధికారి మహమ్మద్ ఝుభేర, ఏఎస్పీలు రవికుమార్, నవీన్‌కుమార్, డీఎస్పీలు తిప్పేస్వామి, గోవిందరాజులు, ప్రసాద్ గోఖలే, మహంతేష్‌లు పాల్గొని జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారి డి.సుమన్ పెన్నేకర్ మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న మాదక ద్రవ్యాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడానికి పోలీస్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా మూడోసారి ఈ మారథాన్‌ను నిర్వహించామన్నారు. బళ్లారిలో మొదటిసారి మారథాన్ నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. న్యాయమూర్తి రాజేష్ ఎన్.హొసమని మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మారథాన్‌ను మూడు విభాగాలుగా నిర్వహించారు. 2 కిలోమీటర్ల నడకను డీఆర్ఏ పోలీస్ క్రీడామైదానం నుంచి ఇందిరా కూడలి, డా.రాజ్‌కుమార్ రహదారి గడిగి చెన్నప్ప కూడలి నుంచి డి.ఆర్.ఎ మైదానం వరకు సాగింది, 5కిలోమీటర్ల మారథాన్ డి.ఆర్.ఎ.మైదానం నుంచి ఇందిరా కూడలి, గడిగి చెన్నప్ప కూడలి బెంగళూరు రహదారి, బ్రూస్‌పేటె, హెచ్.ఆర్.గవియప్ప కూడలి, స్టేషన్ రహదారి, గడిగి చెన్నప్ప కూడలి నుంచి పోలీస్ క్రీడామైదానం వరకు నిర్వహించారు. 10కిలోమీటర్ల మారథాన్ డి.ఆర్.ఎ పోలీస్ క్రీడామైదానం నుంచి ఇందిరా కూడలి, రాజ్‌కుమార్ రహదారి, గడిగి చెన్నప్ప కూడలి, బ్రూస్‌పేటె కూడలి, హెచ్.ఆర్.గవియప్ప కూడలి, బి.ఆర్.అంబేడ్కర్ కూడలి, బసవనకుంటె, వాల్మీకి కూడలి, పార్వతి నగర, దుర్గమ్మ గుడి, గాంధీనగర్ మోకా రహదారి, గాంధీ నగర్ బూస్టర్, బసవేశ్వర నగర, సత్యనారాయణపేటె ఫ్లైవంతెన, డి.ఆర్.ఎ. మైదానం వరకు సాగింది. అనంతరం విజేతలకు నగదు బహుమతితో పాటు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

పిల్లల విభాగంలో విజేతలకు పతకం, ప్రశంసాపత్రాలు అందిస్తున్న న్యాయమూర్తులు

ఉత్సాహంగా పోటీలు

హొసపేటె, న్యూస్‌టుడే: జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో 'మన పోలీస్-మన గర్వకారణం' అనే నినాదంతో ఆదివారం పట్టణంలో నిర్వహించిన మారథాన్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా న్యాయమూర్తి కె.ఎం.రాజశేఖర్, తాలూకా న్యాయమూర్తులు సుబ్రహ్మణ్యం, ప్రశాంత్ నాగలాపుర, ఎస్పీ జాహ్నవి, అదనపు ఎస్పీ మంజునాథ్‌లు పాల్గొని ప్రారంభించారు. టీబీడ్యాం వైకుంఠ అతిథి గృహం, ప్రవేశద్వారం నుంచి మారథాన్ పోటీలు జరిగాయి. విజేతలకు నగదు బహుమతి, పతకం, ప్రశంసాపత్రాలు అందించారు.

కళలే భారతీయ సంస్కృతికి దర్పణం

బళ్లారి గ్రామీణ: లలిత కళలు భారతీయ సంస్కృతికి దర్పణం వంటివని కిష్కింద విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాజుజాడర పేర్కొన్నారు. శనివారం రాత్రి కన్నడ సాంస్కృతిక శాఖ సహకారంతో శ్రీకళాంజలి ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ సుభద్రమ్మ మన్సూర్ రంగమందిరంలో ఏర్పాటు చేసిన గజ్జెపూజె-2026 కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నటరాజ కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. భరతనాట్యం ప్రారంభానికి గజ్జపూజె నాందిలాంటిదని..పిల్లల్లో సంస్కృతీ, సంప్రదాయాల్ని నేర్పించేందుకు ఇలాంటి కళలు దోహదం చేస్తాయన్నారు. కళాంజలి ట్రస్ట్ అందిస్తున్న సేవలను కొనియాడారు. సంగీత ఉపాధ్యాయులు బెళగల్లు హనుమంత మాట్లాడారు. అనంతరం ప్రతిభా బృందం సమూహ నృత్యం, శృతికా, అమృత నృత్య ప్రదర్శన ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షురాలు పరిమళ జనార్దన్, పరిసరవాది నాగేశ్, సరగువివేక్, భీమరెడ్డి, రేఖ బెళగల్లు, దీక్ష, సోను, విద్యా, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయనృత్యం చేస్తున్న కళాకారులు

విద్యతోనే సంస్కారం, జ్ఞానం పొందుతాం

సింధనూరు,: చదువు అంటే నేటి యువతలో చాలా మంది మదిలో ఉద్యోగం కోసమే అనే భావన ఏర్పడింది. అది తప్పు విద్య మనిషికి సంస్కారాన్ని నేర్పుతుంది. విలువలు తెలుసుకునేలా చేస్తుంది. వ్యక్తికి జ్ఞానాన్ని అందిస్తుంది. వాటితో మన జీవితాన్ని మలుచుకోవాలి అని బెంగళూరు బీఎంఎస్ సంస్థ ఉపాధ్యక్షుడు నికేత్‌రాజ్ మౌర్య విద్యార్థులకు వివరించారు. సింధనూరులోని అన్వితా కళాశాల యాజమాన్యం ఆదివారం స్థానిక శ్రీకృష్ణా గార్డెన్స్‌లో సంస్కార కుటుంబం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న రాజ్ తన ప్రసంగంతో యువతకు విద్యపై మార్గదర్శనం చేశారు. దీనికి ముందు ఆయన అభిమానుల కోరిక మేరకు సింధనూరు తాలూకా గోరేబాళక్యాంపు సందర్శించారు. అక్కడున్న ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. అభిమానులు నికేత్‌రాజ్‌కు మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్‌కలాం చిత్రపటాన్ని జ్ఞాపికగా ఇచ్చారు. అన్విత కళాశాల కార్యక్రమంలో ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి, ఆర్డీసీసీ నిర్దేశకుడు సోమనగౌడ, యద్దలదొడ్డి మహాలింగస్వామి, వెంకటగిరి క్యాంపు సిద్ధాశ్రమం సదానంద శరణులు పాల్గొన్నారు.

అభిమానులను పలకరిస్తున్న నికేత్‌రాజ్ మౌర్య

సనాతన ధర్మాన్ని పరిరక్షించాలి

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: సనాతన హిందూ ధర్మాన్ని రక్షించాల్సిన అవసరం ఉందని విద్యాసింధు మాధవతీర్థ స్వామీజీ పిలుపునిచ్చారు. రాఘవ కళా మందిరంలో పంచాంగ కర్త గురురాజ కులకర్ణి రచించిన గౌతమ సూర్యసిద్ధాంత పంచాంగాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గత 17 ఏళ్లుగా పంచాంగాన్ని రచించి భక్తులకు ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన డాక్టర్ ప్రణీత, డాక్టర్ చేతన, అహిరాజ్, ప్రసన్నాచార్, డాక్టర్ సుందర్, రాఘవేంద్ర మోహన్, అనిల్‌కుమార్ తదితరులను ఘనంగా సత్కరించారు. డాక్టర్ విద్యాభూషణ దాసవాణి భక్తులను తన్మయంలో ముంచెత్తింది. కార్యక్రమంలో వాణిజ్య పారిశ్రామిక మండలి అధ్యక్షుడు మంజునాథ్, అయ్యప్ప ఆలయ ఛైర్మన్ జయప్రకాశ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

గౌతమ సూర్యసిద్ధాంత పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న విద్యాసింధు స్వామీజీ, విద్యాభూషణ తదితరులు

భక్తిశ్రద్ధలతో రేణుకాచార్య జయంతి

కిద్మత్ శాఖా మఠంలో రేణుకాచార్య చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న ప్రముఖులు

మాన్వి, న్యూస్‌టుడే : రేణుకాచార్య జయంత్యుత్సవాన్ని తాలూకాల అధికార యంత్రాంగాలు, సంఘ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాన్వి, సిరివార, లింగసుగూరు తాలూకా కేంద్రాల్లో తహసీల్దార్లు రేణుకాచార్య చిత్రపటాలకు పూల మాలలేసి నివాళులర్పించి మాట్లాడారు. వీరశైవలింగాయత్, బేడ జంగమ సముదాయం ప్రముఖులు కిడిగణయ్య స్వామి, ఎ.బి.ఉప్పళమఠ తదితరులు ఉపన్యాసం చేశారు. రేణుకాచార్య పుట్టుపుర్వోత్తరాలను వివరించారు. ఆయన మహా సంఘ సంస్కర్త అని కొనియాడారు. ప్రత్యేక పూజలు చేశారు. తహసీలార్లు భీమరాయ రామసంద్ర, అశోక్ పవార్, వీరశైవ సంఘం అధ్యక్షుడు హరిహరపాటిల్, అఖిల కర్ణాటక వీరశైవలింగాయత్ మహాసభా తాలూకా అధ్యక్షుడు అరుణ్, కల్మఠం పరిపాలనాధికారి సంగయ్యస్వామి హిరేమఠ, న్యాయవాదులు మల్లనగౌడ, సముదాయం ప్రముఖులు మాట్లాడారు.

కురుగోడు(బళ్లారి): వీరశైవ క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జగద్గురు రేణుకాచర్య జయంత్యుత్సవం నిర్వహించారు. దొడ్డ బసవేశ్వర దేవస్థానం ఆవరణ నుంచి ప్రారంభమైన చిత్రపటం ఊరేగింపు రాఘవాంక శివాచార్య మఠం వరకు సాగింది. ఊరేగింపులో వీరగాని, నంది ధ్వజం, పూర్ణకుంభం, డొళ్లుకుణిత, తదితర కళాకారుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో సిద్ధలింగేశ్వరాచార్య, ఉప తహసీల్దార్ మల్లేశప్ప తదితర జగద్గురు రేణుకాచార్య చిత్రపటానికి పూలమాల వేశారు.

అనుభవంతో అభివృద్ధికి తోడ్పాటు

మాన్వి, న్యూస్‌టుడే : మాజీ అధికారులు, ప్రజాప్రతినిధులు తమ అనుభవాలను అభివృద్ధికి వినియోగించాలని మంత్రి ఎన్.ఎస్.బోసురాజు సూచించారు. తాలూకా మాజీ ఉద్యోగుల రెండో సమ్మేళనాన్ని స్థానిక నీలకంఠేశ్వర దేవస్థానం వద్ద మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది సహజ ప్రక్రియ అన్నారు. తమ అధికార అవధిలో నేర్చుకున్న అనుభవాలను అభివృద్ధికి కోసం ఉపయోగించాలన్నారు. బడ్జెట్‌లో సీనియర్ సిటిజన్లుకు అవసరమైన నిధులు, సదుపాయాల అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ మాట్లాడుతూ అవసరమైన ధ్రువపత్రాలు అందిస్తే సినియర్ సిటిజన్ల కట్టడ నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మహాదేవప్ప ఏగనూరు మాజీ ఉద్యోగుల సమస్యలు, పరిష్కారాల విషయమై మాట్లాడారు. ప్రభుత్వ కట్టడాలకు భూదానం చేసిన వి.రవిబాబు, మాజీ ఉద్యోగులు, వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారిని ఘనంగా సత్కరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యకాంత్, తాలూకా అధ్యక్షుడు రేవణ సిద్ధయ్యహిరేమఠ, ప్రముఖులు మడివాళయ్య, శ్రీశైలగౌడ, మూకప్ప కట్టిమని, డి.జి.కర్కిహళ్లి, రామలింగప్ప, హుసేనప్ప, శాంతప్ప, పరప్ప బెనకనాళ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

నిరసన తెలుపుతున్న ఎస్.యు.సి.ఐ సభ్యులు

ఇరాన్‌పై దాడిని ఖండిస్తూ ఆందోళన

బళ్లారి, న్యూస్‌టుడే: అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై బాంబు దాడులు చేయడాన్ని ఖండిస్తూ ఎస్.యు.సి.ఐ నేతృత్వంలో ఆదివారం నగరంలో నిరసన చేపట్టింది. ఎస్.యు.సి.ఐ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ ఉపాధ్య నేతృత్వంలో సభ్యులు సోమశేఖర్‌గౌడ, దేవదాస్, మంజుల, శాంత, గోవింద్, రాజ, జగదీష్ తదితరులు గడిగి చెన్నప్ప కూడలి సమీపంలోని గాంధీ భవన్ చేరుకుని నిరసన ప్రకటించారు. అమెరికా, ఇజ్రాయెల్ ఇతర దేశాలపై పెత్తనం సాధించడానికి ఈ విధంగా దాడి చేయడం సరికాదన్నారు. తాజా యుద్ధం వల్ల మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

శ్రవణానందంగా సాగిన సంగీతాలాపన

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: బళ్లారి మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి దేవస్థాన ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రభాత సంగీతం కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన స్మృతి భాస్కర్ భక్తిగీతాలను ఆలపించారు. భక్తులు, సంగీతప్రియుల్ని కార్యక్రమం అలరించింది. గాయకురాలిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జయప్రకాశ్ గుప్త, కార్యదర్శి సంధ్యారావు, సభ్యులు, మాయారావు, శ్రీధర్, డాక్టర్ వీణ, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ అరుణాంగ్షు

శిరస్త్రాణం ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

రాయచూరు, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహన చోదకులు శిరస్త్రాణాన్ని తప్పనిసరిగా పెట్టుకోవాలని ఎస్పీ అరుణాంగ్షు గిరి సూచించారు. పోలీస్ శాఖ, ఎస్‌బీఐ సంయుక్తంగా ఆదివారం మహాత్మాగాంధీ మైదానంలో 'మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఐదు కిలోమీటర్ల పరుగు పోటీలను ఎస్పీ ప్రారంభించారు. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో హెల్మెట్ ధరించని వారే ఎక్కువ మంది ఉన్నట్లు తేలడం ఆందోళన కల్గిస్తోందన్నారు. కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని సంచార నియమాలను పాటించాలని కోరారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఉండేందుకు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. జీవితాన్ని నాశనం చేసే దురలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. శారీరక దృఢత్వం కోసం నిత్యం వ్యాయామం, నడక, యోగా, ధ్యానం చేయాలని కోరారు.

చిన్నారులతో మంత్రి సుధాకర్, ఉపాధ్యాయులు

దివ్యాంగులతో ముచ్చటించిన మంత్రి సుధాకర్

చెళ్లకెర (చిత్రదుర్గం), న్యూస్‌టుడే : హిరియూరు సిద్ధేశ్వర దివ్యాంగుల గురుకుల పాఠశాలను సందర్శించిన జిల్లా బాధ్యమంత్రి డి. సుధాకర్ అక్కడ దివ్యాంగ పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు. టీబీ సర్కిల్‌లోని పాఠశాలకు వెళ్లి 30 మంది విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు అవసరమైన సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగ పిల్లలకు బోధించడం సవాలుతో కూడుకున్న విషయమని మంత్రి అభిప్రాయపడ్డారు.

వివేకానంద ఆదర్శాలు అనుసరణీయం

బళ్లారి, న్యూస్‌టుడే: స్వామి వివేకానంద ఆదర్శాలను విద్యార్థులు జీవితాల్లో అలవర్చుకొని ఉత్తమ జీవనం సాగించాలని అఖిల భారత వీరశైవ మహాసభ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు దండిన శివానంద సూచించారు. బళ్లారి పంచాక్షరి మార్షల్ ఆర్ట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బాలభారతి పాఠశాల్లో విద్యార్థులకు కరాటే పోటీలను నిర్వహించారు. తొలుత వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి కరాటే, యోగా, ధ్యానం, క్రీడలు తదితరాలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. బి.కె.బి.ఎన్.మూర్తి మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరి విరూపాక్షప్ప విచ్చేయగా కట్టేగౌడ, సురేష్, కరాటే మాస్టర్ మృత్యుంజయస్వామి, వాసుదేవరాజు పాల్గొన్నారు. అనంతరం కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

కరాటే సాధన చేస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న ప్రదర్శన

కురుగోడు(బళ్లారి), న్యూస్‌టుడే: తాలూకా కల్లుకంబ గ్రామంలోని మేఘన ఆంగ్ల మాధ్యమ పాఠశాల్లో శనివారం సాయంత్రం జాతీయ విజ్ఞాన దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ఛైర్మన్ సిద్ధప్ప, రేవతి, ద్యావణ్ణ, మంజుల, సల్మాబేగం, శారత, చెన్నమ్మ, నేత్రా, గౌతమి, శ్రేయా, శేక్షావలి తదితరులు పాల్గొన్నారు. విజ్ఞాన ప్రదర్శన సందర్భంగా ఏర్పాటు చేసిన విజ్ఞానశాస్త్ర ప్రయోగాలు తిలకించి వాటి గురించి వివరాలు తెలుసుకున్నారు.

దినదిన గండం.. రద్దీ జంఝాటం

పద్మవ్యూహంలో వాహన సంచారం

బ్రూస్‌పేటె దేవస్థానం కూడలిలో నెలకొన్న రద్దీ

అంబేడ్కర్ కూడలిలో నిలిచిపోయిన వాహనాలు

బళ్లారి, న్యూస్‌టుడే: నగరంలో వాహనసంచారం నిత్యం రద్దీ మధ్య నరకప్రాయంగా మారింది. రహదారులు వేయడం, కూడళ్ల అభివృద్ధి..ట్రాఫిక్ పోలీసులకు ఇచ్చిన లక్ష్యం కోసం కేసుల నమోదు..ప్రమాదాలు ఇలా పలు అంశాల కారణంగా సజావుగా వాహనసంచారం సాగడం లేదు. మరోవైపు పెరుగుతున్న ఎండల్లో వాహన చోదకుల అగచాట్లు అన్నీఇన్నీ కావు. వాహనదారులతో పాటు పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా బెంగళూరు రహదారిలో పాదాచారుల కోసం వేసిన ఫుట్‌పాత్‌లు వ్యాపారులకు అడ్డాగా మారిపోవడం మరో సమస్య. అక్రమంగా దుకాణాదారులు, వీధి వ్యాపారులు ఆక్రమించుకోవడంతో పాదాచారులు రహదారుల పైకి రావడం..ఆటోలకు ప్రత్యేకంగా ఆటో స్టాండ్లు ఏర్పాటు చేసినా..అక్కడ పార్కింగ్ చేయకుండా ఇష్టారాజ్యంగా రద్దీగా ఉండే రహదారులపై అడ్డదిడ్డంగా ఆటోలను పార్కింగ్ చేయడంతో రద్దీ సమస్య నిత్యకృత్యమైంది. బ్రూస్‌పేటె డీఎస్పీ కార్యాలయానికి నాలుగు వైపులా ట్రాఫిక్ సమస్య అంతకంతకూ పద్మవ్యూహంగా మారుతోంది. అక్కడ ట్రాఫిక్ పోలీసుల్ని మోహరించినా ఇబ్బందులు తప్పటం లేదని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. బ్రూస్‌పేటె పీఎస్ కూడలి నుంచి ఏపీఎంసీ మార్కెట్‌కు వెళ్లే రహదారిలో నాగేశ్వర దేవస్థానం ముందు వాణిజ్య దుకాణాలు, హోటళ్లు ఉండే ప్రదేశం కావడంతో ద్విచక్రవాహనాలు ఇరువైపులా ఓ వరుసలో పార్కింగ్ చేస్తారు. దాని పక్కనే రహదారి సగం వరకు ఆటోలు పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం		
పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు		
01-03-2026 (ఉ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1601.59	1607.26
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	405	7,068
నీటి నిల్వ (టి.ఎం.సి)	23.704	32.490
గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు)	వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు	

నిలిచిపోయిన విమాన సర్వీసులు

దుబాయ్‌లో చిక్కుకున్న బళ్లారి, చిత్రదుర్గం వాసులు

బళ్లారి, న్యూస్‌టుడే: ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా దుబాయ్ యాత్రకు వెళ్లిన బళ్లారి, చిత్రదుర్గం జిల్లాలకు చెందిన 50 మంది ప్రయాణికులు దుబాయ్ విమానాశ్రయంలో చిక్కుకున్నారు. దీనిపై బళ్లారికి చెందిన యాత్రికులు మాజీ మంత్రి, గ్రామీణ ఎమ్మెల్యే బి. నాగేంద్ర, నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డితో చరవాణిలో మాట్లాడారు. ఎమ్మెల్యే బి.నాగేంద్ర కూడా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. జిల్లాలోని బళ్లారి నగరం, గ్రామీణ ప్రాంతం, సిరుగుప్ప తాలూకాలతో చిత్రదుర్గం జిల్లాకు చెందిన 50మంది ప్రయాణికులు ఫిబ్రవరి 24న దుబాయ్ పర్యటనకు వెళ్లారు. దుబాయ్ చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. ఈ నెల 28న దుబాయ్ నుంచి విమానంలో బెంగళూరుకు రావల్సి ఉండగా యుద్ధం మొదలై విమాన సర్వీసులు పూర్తిగా నిలిచిపోవడంతో అక్కడే చిక్కుకుపోయారు. 50 మంది యాత్రికుల్లో 23మంది మహిళలు, 27 మంది పురుషులు ఉన్నారు. వారిలో ఎక్కువ మంది 60 ఏళ్లు పైబడిన వారు ఉన్నారు. ఐదు రోజుల పాటు పర్యాటక ప్రాంతాలను తిరిగి రావడంతో డబ్బులు కూడా అయిపోయాయి. దీంతో ఇబ్బందులు పడుతూ గ్రామీణ ఎమ్మెల్యే బి.నాగేంద్రతో చరవాణిలో మాట్లాడారు. దుబాయ్ పర్యటన కోసం 50 మంది వచ్చాం. 28న సాయంత్రం తిరుగు ప్రయాణ సమయానికి విమాన సర్వీసులు పూర్తిగా నిలిపివేయడంతో విమానాశ్రయం లోపలికి కూడా అనుమతించడం లేదు. జేబుల్లో డబ్బులు ఖాళీ అయ్యాయి. వయసు మీదపడిన ఎక్కువ మంది ఉండటంతో ఇక్కడ ఉండటం కష్టమైంది. దీనిపై ఎమ్మెల్యేలు బి.నాగేంద్ర, నారా భరత్‌రెడ్డితో మాట్లాడాం. ప్రభుత్వంతో చర్చించి దుబాయ్‌లో చిక్కుకున్న అందర్నీ భారత్‌కు తరలించాలని కోరారు. మీరు ధైర్యంగా ఉండండి. మిమ్మల్ని సురక్షితంగా స్వదేశానికి తీసుకొస్తామని ఎమ్మెల్యే నాగేంద్ర భరోసా ఇచ్చారు. ఆందోళన చెందుతున్న పర్యాటకుల కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడి ధైర్యం చెప్పారు.

ఆందోళనలో ఉన్న పురుషులు

బళ్లారికి చెందిన మహిళలు

(c) eenadu

ఆటోవాలా కూతురు.. అయ్యింది వకీలు

సంచార సముదాయ యువతి అద్భుత ప్రతిభ

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: ఓ సంచార సముదాయంలో తన పెద్దనాన్న న్యాయస్థానం చుట్టూ తిరుగుతున్న దృశ్యాన్ని చూసిన తాను న్యాయ విద్య చదివి న్యాయవాది కావాలని సంకల్పాన్ని చేపట్టిన సంచార సముదాయానికి చెందిన వి.అరుణ పట్టుదలతో తన ఆశయాన్ని నెరవేర్చుకొంది. సంచార సముదాయంలో తొలిసారిగా ఉన్నత శిక్షణ పొందటంతో పాటు తొలి న్యాయవాదిగా కీర్తి సాధించింది. కఠోర పరిశ్రమతో తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్న అరుణ సంచార సముదాయంలో తొలి మహిళ కావడం విశేషం. మైసూరులోని ఏకలవ్య నగరంలో నివసిస్తున్న అరుణ బాల్యం నుంచి అస్పృస్యత, అసమానతను చూసి తండ్రి, పెద్దనాన్న కోరిక మేరకు న్యాయవాది కావాలని నిర్ణయించుకుంది. ఈ ఏడాది జూన్‌లో జరగనున్న అఖిలభారత బార్ అసోసియేషన్ పరీక్షలో పాల్గొనేందుకు సిద్ధమవుతోంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత పొందితే సుప్రీం కోర్టు వకీలుగా వెళ్లే అవకాశం పొందవచ్చు. అరుణ తండ్రి వెంకటేశ్ ఆటోడ్రైవరు. తల్లి మంగళ గృహిణి. కష్టాల మధ్య చదివిన అరుణ న్యాయవాది కావడం ఆ కుటుంబానికి ఆనందాన్ని కలిగించింది. ఏకలవ్య నగరంలోని గోమాళ షెడ్‌లో ఉన్న ఇంట్లో ఒకటి నుంచి పది వరకు కిరోసిన్ దీపం వెలుగులో చదువుకున్న అరుణ పీయూసీ సమయంలో ప్రభుత్వ తరఫున జె.ఎస్.ఎస్. వసతి కలలో తమ కుటుంబానికి విద్యుత్ దీపం మంజూరైంది. ప్రాథమిక పాఠశాల నుంచి లా శిక్షణ వరకు కన్నడభాషలోనే అధ్యయనం చేసింది. 2025 న్యాయ శిక్షణను ముగించుకొంది. తన పెదనాన్న ఓ కేసు విచారణ సందర్భంగా న్యాయస్థానం చుట్టూ తిరుగుతూ అసహాయంతో నిరాశ పొందారు. ఆయన న్యాయస్థానానికి వెళ్లేముందు అరుణకు 'నీవు న్యాయవాది అయితే నా కష్టం తీరుతుంద'ని చెప్పేవారు. ఈమె తండ్రి కూడా వకీలు కావాలని పట్టుబట్టి చదివించారు. చిన్నతనంలో తాను సేన విభాగానికి చేరుకోవాలని ఆశలు పెట్టుకున్న అరుణ పీయూసీ తర్వాత లా విద్యను అభ్యసించి బాధలో ఉన్న వారికి సాయం చేయాలని సంకల్పించింది. హైకోర్టు న్యాయాధికారిగా కావాలని లక్ష్యంగా పెట్టుకున్న అరుణ వకీలు శిల్పాహిరేమఠ దగ్గర అభ్యాసం చేసింది. ప్రస్తుతం వకీలు నాగరాజ్‌తో న్యాయవాదిగా అభ్యాసం చేస్తున్న ఆమె ఇటీవలే సివిల్ న్యాయాధీశుల ఉద్యోగ పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేయాలనుకుంది. మూడేళ్ల పాటు న్యాయవాదిగా అభ్యాసం చేస్తే దరఖాస్తు చేసుకోవచ్చని ఈ పరీక్ష రాయలేదు. భవిష్యత్తులో ఈ పరీక్షను రాసేందుకు కూడా సిద్ధ మవుతున్నట్లు పేర్కొంది. తల్లి మంగళ మాట్లాడుతూ సంచార సముదాయ వర్గాల్లో తన కుమార్తె ఉన్నత శిక్షణ పొంది న్యాయవాదిగా ఎదగడం తమకు గర్వకారణంగా ఉందని ఆనందనం వ్యక్తం చేశారు.

తల్లి మంగళతో మాట్లాడుతున్న అరుణ

అరుణ

3న విరూపాక్షేశ్వర ఆలయం మూసివేత

హొసపేటె, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం నేపథ్యంలో మంగళవారం హంపీ విరూపాక్షేశ్వర ఆలయాన్ని పూర్తిగా మూసివేస్తామని ఈవో హనుమంతప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రగ్రహణం సాయంత్రం నుంచి రాత్రి వరకు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఆ రోజంతా ఆలయాన్ని మూసి వేస్తామన్నారు. మరుసటి రోజు నుంచి యథావిధిగా భక్తులకు ప్రవేశాన్ని కల్పిస్తామని తెలిపారు.

మారథాన్‌లో రాణాధికారి ఆకస్మిక మృతి

నాసీర్ హుసేన్

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: ఉడుపిలో 'జిల్లా పోలీసు, నమ్మ పోలీసు, నమ్మ హెమ్మె (డ్రగ్ ఫ్రీ కర్ణాటక' పేరిట ఆదివారం నిర్వహించిన మారథాన్ పరుగు కార్యక్రమంలో కుందాపుర గ్రామాంతర రాణాధికారి నాసీర్ హుసేన్ (59) గుండెపోటుతో కుప్పకూలి మృతి చెందారు. జిల్లా పోలీసు శాఖ తరఫున ఉడుపి అజ్జరకాడు మైదానంలో ఏర్పాటు చేసిన ఐదు కిలోమీటర్ల మారథాన్‌లో పాల్గొన్న ఎస్ఐ నాసీర్ హుసేన్ తాలూకా పంచాయతీ ముందు కుప్పకూలారు. వెంటనే సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించగా అప్పటికే నాసీర్‌హుసేన్ మృతి చెందారని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలిసిన వెంటనే జిల్లా పోలీసు అధికారి హరిరామ్‌శంకర్ ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. చిక్కమగళూరుకు చెందిన నాసీర్ 2010 బ్యాచ్ పోలీసు అధికారిగా విధులు నిర్వహించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. భారతీయ సేనలో సేవలు చేసిన తర్వాత పోలీసు శాఖకు చేరుకున్న నాసీర్ తన కర్తవ్యంలో చక్కని అధికారిగా ప్రజల మన్ననలు పొందారు.

సామూహిక అత్యాచారం కేసులో ముగ్గురి అరెస్టు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: మత్తు పదార్థాలు తాగించి యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన సంఘటనపై అమృతహళ్లి పోలీసులు దర్యాప్తును తీవ్రతరం చేశారు. అత్యాచారానికి సహకరించిన నిందితులు శివమొగ్గ నివాసి శ్రవణ్ (21), దావణగెరె నివాసి అనిరుద్ధ (33) గుజరాత్ నివాసి మోహిత్ జైన్ (23)లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఇప్పటికే నిందితులు డిక్సన్ సాంత్రా(21), హాసన్ నివాసి నిఖిల్ (24)ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన యువతితో నిందితులు స్నేహం చేసి మోడలింగ్, ఫోటోషూట్‌తో పాటు పార్టీ పేరుతో పబ్‌లకు రప్పించి మాట్లాడేవారు. తన ఇంట్లో జరుగుతున్న పార్టీకి ఆమెను నిందితుడు డిక్సన్ ఆహ్వానించాడు. శీతల పానీయంలో మత్తు మందు కలిపి తాగించి అనంతరం సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనతో మరికొందరికీ సంబంధం ఉందని వారి కోసం గాలింపు చర్యలు సాగిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

జ్యోతి వెలిగించి కార్యకర్తల సమావేశాన్ని ప్రారంభిస్తున్న జేడీఎస్ యువనాయకుడు నిఖిల్ కుమారస్వామి

దేశాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం

అతీక్, తదితరుల చేతులమీదుగా పదవీ పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థి

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే: దేశంలో ఇంజినీరింగ్ డిగ్రీ పొందిన వారి సంఖ్య ఎక్కువగా ఉండాలని.. దేశాభివృద్ధిలో వారు ప్రధాన పాత్ర వహిస్తారని ప్రభుత్వ బెంగళూరు బిజినెస్ కారిడార్ లిమిటెడ్ అధ్యక్షుడు ఎల్. కె. అతీక్ పేర్కొన్నారు. విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ విశ్వవిద్యాలయం (వీటీయు)కు చెందిన బీ.ఎం.ఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో 2025 బ్యాచ్ విద్యార్థుల పట్టా ప్రదాన దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలను ఎల్. కె. అతీక్, అల్ఫా డిసైన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ అధ్యక్షుడు, వ్యవస్థాపక డైరెక్టర్, బీ.ఎం.ఎస్ ఇంజినీరింగ్ కళాశాల బీవోజీ, సభ్యుడు కర్నల్ (విశ్రాంత) హెచ్. ఎస్. శంకర్, ప్రిన్సిపల్ డా. భీమశా ఆర్యరు, ట్రస్టీలు, అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అతీక్ మాట్లాడుతూ దేశంలో ఇంజినీర్లకు చక్కని అవకాశాలు ఉన్నాయన్నారు. సాధనలు చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాంకులు పొందిన విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటు పట్టాలను ప్రదానం చేశారు.

'కర్ణాటక దర్శన'కు బయలుదేరిన విద్యార్థులు

చెళ్లకెర(చిత్రదుర్గ),న్యూస్‌టుడే: విద్యార్థులు క్షేత్ర పర్యటనలను జ్ఞానార్జనకు ఉపయోగించుకోవాలని హొళల్కెర ఎమ్మెల్యే ఎం.చంద్రప్ప సూచించారు. ఆదివారం ఆయన హొళల్కెరలో ప్రభుత్వోన్నత పాఠశాల్లో 8, 9వ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నాల్గురోజులు పర్యటనకు వీడ్కోలు పలికి మాట్లాడారు. విద్యార్థులు తోటి స్నేహితులతో కలిసి చేపట్టే పర్యటనలు, తిలకించే పర్యాటక కేంద్రాలు జీవితాంతం గుర్తుండి పోతాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొత్తం 96 మంది విద్యార్థులు రెండు ఆర్టీసీ బస్సుల్లో పర్యటనకు బయలుదేరారు.

విద్యార్థులకు వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యే చంద్రప్ప

మహనీయులకు వర్గం అంటగట్టడం తగదు

దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ఈశ్వర్ బి.ఖండ్రె, శివరాజ్ తంగడగి తదితరులు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: సమాజ శాంతి, అసమానతల నిర్మూలన సామాజిక న్యాయం కోసం శ్రమించిన మహనీయులు ఒక వర్గానికి పరిమితం చేయకూడదని అటవీ పరిసరాల శాఖ మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రె పేర్కొన్నారు. ఆదివారం ఇక్కడ రవీంద్ర కళాక్షేత్రలో కన్నడ సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన జగద్గురు మహామహిమర జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గురువులు, స్వామీజీలు విశ్వశాంతి కోసం శ్రమించారన్నారు. సమాజంలో ఉన్న సంపద అన్నివర్గాలకు సమానంగా దొరకాలని బసవేశ్వరుడు బోధించి సమసమాజ నిర్మాణం కోసం పాటు పడ్డారని తెలియజేశారు. వీరశైవ లింగాయతులు తమ మఠాలను అన్నివర్గాల ప్రజలకు ప్రవేశం కల్పించారని చెప్పారు. ఆశ్రయం, అన్నం, విద్య మొదటి నుంచి కల్పిస్తూ వస్తున్నారని గుర్తు చేశారు. పూర్వీకులు చూపించిన బాటలో అందరం నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి శివరాజ తంగడగి తదితరులు హాజరయ్యారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	70
క్యారెట్-	65
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	115
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	35
టమాటా(సాధారణ)-	25
గుమ్మడి-	30
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	25
ఉల్లి(సాధారణ)-	20
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	45
ముల్లంగి-	50
నిమ్మకాయ-	280

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	395
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	345
అరటి కాయలు-	35
సపోటా-	45
పైనాపిల్-	65
బొప్పాయి-	40
ఆరంజి-	110
బత్తాయి -	55

పవిత్ర మాసం.. పసందైన వంటకం

ఉద్యాన నగరిలో రంజాన్ రుచులు

వివిధ రకాల మాంసాహార పదార్థాలు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రంజాన్ మాసం వచ్చిందంటే వివిధ రకాల ఆహార పదార్థాలను రుచి చూడవచ్చనే కోరిక ప్రజల్లో ఉంది. మాసం ప్రారంభమైనప్పటి నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆహార పదార్థాల ప్రదర్శన అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఆహార పదార్థాల రుచులు చూసేందుకు ఆహార ప్రియులు పోటీ పడుతున్నారు. పులికేశినగర మస్కట్ రహదారిలో ఆహార బజార్ ఈ ఏడాది లేకపోయినా శివాజినగర, కోరమంగల, మడివాళ ప్రాంతాల్లో ఆహార బజారులను ఏర్పాటు చేశారు. మాంసాహారంలో వివిధ రకాల ఆహార పదార్థాలను రుచి చూసేందుకు వివిధ ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం, చిత్తూరు, తమిళనాడు హోసూరు, కృష్ణగిరి, సేలం తదితర ప్రాంతాల నుంచి ఆహార ప్రియులు వస్తున్నారు. తక్కువ ధరలకు నాణ్యమైన రుచికరమైన ఆహార పదార్థాలు ఆయా ప్రాంతాల్లో దొరుకుతాయి. మాంసాహారంతో పాటు శాకాహారం ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచారు. ఆయా ప్రాంతాల్లో చీకటి పడితే ఆహార బజార్లు జనం రద్దీతో నిండిపోతాయి. అర్ధరాత్రి వరకు ప్రజలు అక్కడికి వచ్చిన ఆహార పదార్థాలను భుజిస్తారు. ప్రధానంగా ఐటీ బీటీ ఉద్యోగులు కోరమంగల ఆహార బజారు వచ్చి వంటలను ఆస్వాదిస్తున్నారు. సమోసా, తీపి ఖర్జూరం, వివిధ రకాల బజ్జీలు అందుబాటులో ఉన్నాయి. రంజాన్ మాసంలో సమోసా వ్యాపారం నగరంలో రూ. 7 కోట్లకు పైగా ఉంటుందని వ్యాపారులు తెలిపారు. పులికేశినగర బజారులో అన్ని రకాల పండ్లు అందుబాటులో ఉంచారు. అత్తర్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. వీధుల్లో చౌకగా ఖర్జూరం పండ్లు విక్రయిస్తున్నారు. రంజాన్ మాసంలో అన్నిరకాల పండ్లు, ఆహార పదార్థాలను రుచి చూసేందుకు అవకాశం ప్రజలకు ఉంటుందని వ్యాపారులు తెలిపారు.

చౌకగా దొరికే ఖర్జూరం

రంజాన్ సందర్భంగా శాకాహార వంటకాలు

రెట్టింపు కానున్న దళ్ బలం

హొసపేటె, న్యూస్‌టుడే: రెండున్నరేళ్ల తర్వాత వచ్చే అసెంబ్లీ ఎన్నికల సమయానికి రాష్ట్రంలో జేడీఎస్ బలపడుతుందని ఆ పార్టీ యువ నాయకుడు నిఖిల్ కుమారస్వామి స్పష్టం చేశారు. ఆదివారం విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని బలోపేతం చేయటానికి రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నాం, అన్నీ చోట్ల ఉత్తమ స్పందన లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలకు కూడా ఇప్పటి నుంచే పార్టీని సంఘటితపరుస్తున్నాం, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తమ వెంట ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జేడీఎస్ ఉనికి లేదని విపక్షాలు నోరు పారేసుకుంటున్నాయి, రాబోయే ఎన్నికల్లో వారికి తగిన సమాధానం ఇస్తామని తేల్చి చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోవాలని పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. పార్టీలో యువకులకు పెద్దపీట వేస్తున్నాం, నిష్ఠాతులకు మంచి అవకాశాలు ఉన్నాయని భరోసా ఇచ్చారు. రెండుసార్లు హగరిబొమ్మనహళ్లిలో పార్టీ అభ్యర్థులను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నేమరాజ్ నాయక్, వెంకట్రావు నాడగౌడ, మాజీ ఎంపీ అనిల్‌లాడ్ తదితరులు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వాక్‌థాన్ కార్యక్రమంలో మంత్రి డాక్టర్ మహదేవప్ప, ఎమ్మెల్యే జీటీ దేవేగౌడ, సినీనటులు వినయ్ రాజ్‌కుమార్, అమృత అయ్యంగార్, బృందా ఆచార్య, ఐజీపీ బోరలింగయ్య, పోలీసు కమిషనర్ సీమా లాట్కర్ తదితరులు

మైసూరు ప్యాలెస్ వద్ద ప్రారంభమైన వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ మహదేవప్ప తదితరులు

ప్రజాచైతన్యంతోనే మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: సమాజంలో జరుగుతున్న నేరాలు నియంత్రణ, మాదక ద్రవ్యాల విక్రయాలు, సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు ఆదివారం మైసూరులోని ప్యాలెస్ మైదానంలో మైసూరు నగర పోలీసులు మాదక ద్రవ్యాల నిర్మూలన వాక్‌థాన్ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మహదేవప్ప పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ప్యాలెస్ మైదానం నుంచి ప్రారంభమైన వాక్‌థాన్‌లో విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు పోలీసులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. ఐదు కిలోమీటర్ల వాక్‌థాన్‌లో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ మహదేవప్ప మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు వాక్‌థాన్ చేపట్టారన్నారు. మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కంకణం కట్టుకున్నారని తెలిపారు. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో శాసనసభ్యులు జీటీ దేవేగౌడ, శ్రీవత్స, సినీనటులు వినయ్‌రాజ్‌కుమార్, అమృత అయ్యంగార్, బృందా ఆచార్య తదితరులు హాజరయ్యారు.

వాక్‌థాన్ విజేత సినీనటి అమృత అయ్యంగార్‌కు జ్ఞాపికను అందిస్తున్న మంత్రి డాక్టర్ మహదేవప్ప

నయనమనోహరం .. పూల సోయగం

పూల విధానసౌధ అలంకారం వద్ద యువకుల స్వీయచిత్రం

బెంగళూరు (కెంగేరి), దావణగెరె (చిత్రదుర్గం), న్యూస్‌టుడే: దావణగెరె పట్టణ శివార్లలోని అద్దాల మేడలో ఏర్పాటు చేసిన ఫల,పుష్ప ప్రదర్శన ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకర్షిస్తోంది. జిల్లా తోటలు ఉద్యానవనాల అభివృద్ధి శాఖ జేడీ రాఘవేంద్ర విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో సుమారు 10 లక్షల రంగురంగుల గులాబీలు, చామంతులు, బంతి తదితర పూలతో ఏర్పాటు చేసిన అనేక ఆకృతులు ప్రేక్షకుల్ని రంజింపజేస్తున్నాయి. వివిధ రంగుల పూలతో నిర్మించిన విధానసౌధ ఆకృతి ప్రదర్శనకు కేంద్ర బిందువన్నారు. అద్దాల భవనం మధ్యన సుమారు 4 లక్షల పూలతో 42 అడుగుల పొడవు, 16 అడుగుల వెడల్పు, 14 అడుగుల ఎత్తుతో నిర్మించిన విధానసౌధ భవనం నమూనా చూపరులను భలే ఆకట్టుకుంటోందన్నారు. సుమారు 50 వేల పూలతో ఏర్పాటు చేసిన హంపీ రాతి రథం నమూనా కూడా సందర్శకుల్ని అలరిస్తోంది. వివిధ రకాల కూరగాయలతో నిర్మించిన స్వాగత లక్ష్మీ..లవ్ యూ దావణగెరె కళాకృతి, వివిధ తృణ ధాన్యాలతో రూపుదిద్దుకొన్న గ్రామ దేవత దుర్గాంబికా అమ్మవారు చిత్రం, దావణగెరె జిల్లాలో పండిస్తున్న వివిధ రకాల పండ్లు, కూరగాయలు, వివిధ రకాల పూల మొక్కలు, క్రోటాన్ మొక్కలు, బోన్సాయ్ మొక్కల ప్రదర్శన పర్యాటకులకు కనువిందు చేస్తోందన్నారు. దావణగెరెతో పాటుగా చిత్రదుర్గం, హావేరి, శివమొగ్గ, విజయనగర, గదగ్ తదితర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వస్తున్న పర్యాటకులు దావణగెరెను సందర్శించి దుర్గాంబికా అమ్మవారికి మొక్కులు సమర్పించుకొని, ఫలపుష్ప ప్రదర్శనను తిలకించి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఫల, పుష్ప ప్రదర్శనను ఎంపీ ప్రభా మల్లికార్జున, డీసీ గంగాధరస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ ఎమ్మెల్యే శామనూరు శివశంకరప్ప, వృక్షమాత సాలుమరద తిమ్మక్కకు గౌరవాన్ని తెలిపారు.

వివిధ రకాలు పూలతో నిర్మించిన హంపీ రాతిరథం

ప్రదర్శన సందర్భంగా దావణగెరెలో ఏర్పాటు చేసిన అద్దాల మేడ

EENADU eClassifieds

REAL ESTATE

హిందూపురం రైల్వేస్టేషన్‌కి 3km లో అద్భుతంగా డెవెలప్ చేసిన ప్రాజెక్ట్‌లో ప్లాట్లు & 38 లక్షలకే డబుల్ బెడ్‌రూమ్ హౌసెస్ కలవు. సం: 6281824204.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
బళ్ళారి : 9121167525
బెంగుళూరు : 9121167527
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

డైరెక్టర్స్ కట్ చిత్రంలో సురేజ్ గౌడ, రాధి ఎస్.బాగి, దివ్యజైన్

'డైరెక్టర్స్ కట్' హీరో సురజ్‌గౌడ

రాజేశ్వరి ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్‌పై హేమలత నిర్మిస్తున్న 'డైరెక్టర్స్ కట్' చిత్రం హీరో సురేజ్ గౌడ నటిస్తున్నారు. నగరంలోని కెంగేరిలోని విశ్వ విద్యాగణపతి దేవస్థానంలో చిత్రీకరణ ప్రారంభమైంది. దేవభూమిగా ఖ్యాతి పొందిన ఉత్తరాఖండ్‌లో పలు దృశ్యాలను చిత్రీకరిస్తామని దర్శకుడు భరత్ వి.జె తెలిపారు. అన్నివర్గాలను ఆకట్టుకునే విధంగా చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. సురేజ్‌గౌడతో పాటు రాధా ఎస్.బాగి, దివ్యజైన్ పీడీ సతీశ్, స్వాతి తదితరులు నటిస్తున్నారు.

6న 'గార్జియస్ రాస్కల్' విడుదల

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: కన్నడ చలనచిత్ర పరిశ్రమలో కొత్త ప్రయత్నమైన అదృష్టలక్ష్మీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించిన 'గార్జియస్ రాస్కల్' చిత్రం ఈనెల 6న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. తమిళ గాయకుడు వేలుమురుగన్, దర్శన్ నారాయణ రెండు పాటలకు గానం అందించగా చేతన్‌కృష్ణ సంగీతం అందించారు. విభిన్నమైన చిత్రకథను ప్రేక్షకులు ఆదరిస్తారని దర్శకుడు ప్రమోద్ జోయిస్ తెలిపారు. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరించారు. ప్రేరణాభట్, యునిస్, రాజవీర్‌సింగ్, చేతన్ మహేశ్, శక్తికుమార్, సునీల్ పురాణిక్, స్వాతి తదితరులు నటిస్తున్నారు.

గార్జియస్ రాస్కల్ చిత్రంలో ప్రేరణ భట్

'రాయరదర్శన' చిత్రీకరణ

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దివ్యచరిత్రను గురించి 'రాయరదర్శన' చిత్రంతో పాటు ప్రత్యేక ఆల్బం చిత్రీకరణ ప్రారంభమైంది. మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ స్వామి కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్రీకరణ ప్రారంభించి చిత్ర బృందాన్ని దీవించారు. చిత్రంలో ప్రముఖ హీరోలు రజనీకాంత్, శివరాజ్‌కుమార్, జగ్గేష్, ప్రేమ్ తదితరులు నటిస్తున్నారు. తెలుగు, కన్నడ భాషల్లో ఏకాలంలో చిత్రీకరిస్తున్నట్లు దర్శకుడు రఘుభట్ తెలిపారు. సంగీతాన్ని సి. ఆర్. బాబి, అజనీశ్ లోక్‌నాథ్ అందిస్తున్నారు.

రాయర దర్శన చిత్రీకరణను ప్రారంభిస్తున్న మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ స్వామి తదితరులు

దైజి చిత్రంలో రాధికా నారాయణ్, అవినాశ్

'దైజి' వచ్చేస్తోంది

ప్రముఖ హీరో రమేష్ అరవింద్‌తో పాటు రాధికా నారాయణ్, అవినాశ్, దిగంత్, గురుదేశ్‌పాండెలతో పాటు దియా చిత్రం హీరో ఖుషి రవి నటిస్తున్న 'దైజి' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఆధ్యాత్మిక కథతో పాటు హాస్యం, థ్రిల్లర్‌తో కూడిన చిత్రమని ఆకాశ్ శ్రీవత్స తెలిపారు. కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరించామన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులు చిత్రాన్ని ఆదరిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

భాజపా రాష్ట్ర కార్యవర్గసభ్యుడి నియామకం

నాగరాజ్ బిల్గార్

కారటగి: కనకగిరి విధానసభ క్షేత్ర భాజపా సీనియర్ నాయకుడు నాగరాజ్ బిల్గార్‌ను పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర నియమించారు. కారటగిలో నాగరాజ్ బిల్గార్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ ఈ బాధ్యతలు అప్పగించింది. పార్టీ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మంజునాథ మస్కి తదితరులు నాగరాజ్ బిల్గార్‌ను సత్కరించారు.

శ్రీవారిని దర్శించుకున్న కర్ణాటక లోకాయుక్త

తిరుమల, న్యూస్‌టుడే: కర్ణాటక లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్ ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వారికి వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.


కుటుంబ సభ్యులతో లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

శాంతి కోసం సత్యనారాయణ వ్రతం

సమాజంలో శాంతి కోసం సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించినట్లు మాజీ మంత్రి కట్టా సుబ్రహ్మణ్యనాయుడు తెలిపారు. ఆదివారం ఇక్కడి హెబ్బాళ్ భాజపా కార్యాలయంలో ఆయన సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రజలందరు బాగు కోసం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మహిళలు పూజ కార్యక్రమంలో పాల్గొని వ్రతం చేసినట్లు వెల్లడించారు. - న్యూస్‌టుడే, బెంగళూరు (యలహంక)

ఉత్తమ పాదచారి మార్గాల కోసం హెజ్జె (నడక)

నగరంలో ఉత్తమ పాదచారి మార్గాల కోసం ఆదివారం గ్రేటర్ బెంగళూరు ప్రాధికార వివిధ సంస్థల సహకారంతో వైట్‌ఫీల్డ్ ప్రాంతంలో బీఎం కమిషనర్ మహేశ్వరరావు స్థానిక ప్రజలతో కలిసి హెజ్జె (నడక) కార్యక్రమాన్ని నిర్వహించారు. వైట్‌ఫీల్డ్ ఫినిక్స్ మాల్ నుంచి హోప్ మాల్ పది కిలోమీటర్ల వరకు నడిచారు. నగర ప్రజలు స్వేచ్ఛగా సంచరించేందుకు ఉత్తమ పాదచారి మార్గాలు ఉండాలన్నారు. ఉత్తమ పాదచారి మార్గాలు ఉంటే ప్రజలు ప్రమాదాలకు గురికారని వెల్లడించారు. - న్యూస్‌టుడే, బెంగళూరు (బాణసవాడి)

హోసూరు కబుర్లు

వేర్వేరుగా దరఖాస్తులు అందిస్తున్న మేయర్ సత్య, మద్దతుదారులు, ఎమ్మెల్యే ప్రకాశ్, సన్నిహితులు

అసెంబ్లీ స్థానానికి పోటాపోటీ

హోసూరు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి వివిధ పార్టీల నుంచి పలువురు అభ్యర్థులు పోటీపడుతున్నారు. డీఎంకే పార్టీ నుంచి హోసూరు అసెంబ్లీకి పోటీ చేయడానికి సిట్టింగ్ ఎమ్మెల్యే వై.ప్రకాశ్, మేయర్ ఎస్.ఎ.సత్య వేర్వేరుగా చెన్నై డీఎంకే ప్రధాన కార్యాలయంలో దరఖాస్తులు అందజేయడం సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎమ్మెల్యే, మేయర్ ఇద్దరూ డీఎంకే పార్టీకి చెందినవారే. ఈ ఇద్దరి మధ్య కొంతకాలంగా శీతల సమరం జరుగుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఇద్దరూ చెన్నై వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తులు అందజేశారు. ఎమ్మెల్యే ప్రకాశ్ దరఖాస్తు అందజేసే కార్యక్రమంలో నాయకులు మురుగన్, వీరారెడ్డి, పాతకోట శ్రీనివాస్, ఎన్.ఎస్.మాదేశ్వరన్, దివాకర్, బేలూరు నాగేష్, జయరామన్, రఘునాథ్, భాగ్యరాజ్, కరుణాకరన్, రామమూర్తి, లోకేష్‌రెడ్డి, చిన్నరాజ్ తదితరులు ఉన్నారు. మేయర్ ఎస్.ఎ.సత్య మద్దతుగా డీఎంకే ప్రముఖులు సుకుమార్, ఎల్లోరమణి, గజేంద్రమూర్తి, వెంకటేష్, రాజా, ఆర సనత్ రవి, జయఆనంద్, నాగరాజ్, కార్తిక్, రమేశ్ చెన్నై వెళ్లారు.

ఉత్సాహంగా ఎద్దుల పండగ

డెంకణికోట, న్యూస్‌టుడే : డెంకణికోట శివారు మల్లికార్జున దుర్గం కొండపైన మల్లికార్జున స్వామి రథోత్సవం సందర్భంగా ఎద్దుల పండగ ఉత్సాహంగా జరిగింది. ఉదయాన్నే ఎద్దులను సింగారించి బరిలోకి దింపారు. ఎద్దులను పట్టేందుకు జిల్లాలో నలుమూలల నుంచి వెయ్యిమంది పైగా వచ్చారు. ఎద్దులను నిలువరించిన విజేతలకు బహుమతులు అందజేశారు. డెంకణికోట, అంచెట్టి, తళి, కెలమంగలం, హోసూరు, శూళగిరి, కృష్ణగిరి ప్రాంతాల నుంచి 500 పైగా ఎద్దులను బరిలో నిలిపారు. ఎద్దుల పరుగును చూసేందుకు వేలాది మంది హాజరయ్యారు.

పరుగులు తీస్తున్న ఎద్దులను అడ్డుకుంటున్న యువకులు

'రేపు తమిళనాడు మనదే'

డెంకణికోట, న్యూస్‌టుడే : డెంకణీకోట పట్టణం శ్రీఆంజనేయస్వామి గుడి వీధిలో భాజపా, కూటమి పక్షాల ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. రేపు మనదే తమిళనాడు అనే ప్రచారం ప్రారంభించారు. భాజపా జిల్లా కార్యదర్శి బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నారాయణన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా, మిత్రపక్షాలను గెలిపించాలని పిలుపునిచ్చారు. అన్నాడీఎంకే నాయకులు నాగేశ్, పళని, భాజపా నేతలు శివకుమార్, ప్రభు, రాము తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బార్ మేనేజర్ హత్య కేసులో ఆరుగురి అరెస్టు

కెలమంగలం (డెంకణీకోట), న్యూస్‌టుడే : కెలమంగలం రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో బార్ మేనేజర్ దినేశ్‌కుమార్ హత్య కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. డెంకణీకోట డీఎస్పీ ఆనందరాజ్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ శంకర్ నేతృత్వంలో కెలమంగలం పోలీసులు ధర్మపురి శివారు తొప్పూర్ వద్ద కుంభకోణంకు చెందిన ప్రభాకరన్, విశ్వ, శివానందం, కృష్ణగిరి టోల్‌గేట్ వద్ద సిలంబరసన్, విష్ణు, అణ్ణాదురైలను అరెస్టు చేసినట్లు తెలిపారు.

యువతిని వంచించిన యువకుడు

డెంకణీకోట, న్యూస్‌టుడే : డెంకణీకోట ఇంద్రానగర్ ప్రాంతానికి చెందిన జిప్సన్ (27) స్థానికంగా ప్రైవేటు ట్రస్టులో సమన్వయకర్తగా పనిచేస్తున్నాడు. అదే సంస్థలో పనిచేసే బేళగొండపల్లికి చెందిన ఒక యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. పెళ్లి చేసుకోమని అడిగితే చేసుకోనని, ఎవరికైనా చెబితే హత్య చేస్తానని బెదిరించాడు. మోసపోయినట్లు గుర్తించిన యువతి డెంకణీకోట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు జిప్సన్‌ను అరెస్టు చేసి విచారిస్తున్నారు.

ప్రాధికారకు పాతవాహనాల సమస్య

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగర పోలీసులు నేరగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ)కు పెద్దసమస్యగా మారింది. ఆ వాహనాలను సంరక్షించేందుకు పోలీసుశాఖ ప్రత్యేకంగా వాహనాల బ్యాంకు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఆ తీర్మానం నేటికి అమలులోకి రాలేదు. వాహనాల సంఖ్య నానాటికీ పెరుగుతున్నాయి. నేరగాళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు కార్లు, ఆటోలు, ట్రాక్టర్ల తదితర వాటిని తెచ్చి పోలీసు ఠాణాల సమీపంలోని రహదారులు, పాదచారి మార్గాల్లో ఉంచుతున్నారు. దీని వల్ల ప్రజల సంచారం పెద్ద ఇబ్బందిగా మారింది. స్వచ్ఛమైన పాదచారి మార్గం అనే నినాదంతో జీబీఏ అధికారులు పలు ప్రాంతాల్లో పాదచారి మార్గాల ఆక్రమణలు తొలగిస్తున్నారు. ఇప్పుడు నేరగాళ్ల నుంచి పోలీసులు వశపరుచుకున్న వాహనాలు పెద్ద సమస్యగా మారింది. వాహనాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తామని, పాదచారి మార్గం, రహదారుల్లో ఉండే అన్ని వాహనాలను న్యాయస్థానం అనుమతితో డంపింగ్ యార్డులకు తరలిస్తామని జీబీఏ అధికారులు తెలిపారు. వాహనాలు పాడై ఎందుకూ పనికి రాకుండా ఉన్నాయి. నిలిపిన్నప్పుడు వాహనాల్లో ఉన్న ప్రధానమైన వస్తువులను కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రే మాయం చేశారు. దీంతో వాటి విలువ కట్టలేని విధంగా ఉన్నాయి. ఆయా కేసులు న్యాయస్థానాల్లో పరిష్కారం కాకపోవడంతో పోలీసులు వాహనాలను రహదారులు పాదచారి మార్గాలపై ఉంచుతున్నారు. పోలీసులు లెక్కలు ప్రకారం దాదాపు పదిలక్షలకు పైగా వాహనాలు ఉండవచ్చును. పాదచారి మార్గాలను శుభ్రత, అక్రమాల తొలగింపులో భాగంగా వాహనాలను డంపింగ్ యార్డులకు తరలించనున్నారు.

జయనగర పాదచారి మార్గంపై పాతకార్లు

పాదచారి మార్గంపై ద్విచక్రవాహనాలు

తాగునీరు కోసం ముప్పతిప్పలు

పావగడ, న్యూస్‌టుడే : వేసవి కాలంలో దప్పిక తీరాలంటే మంచినీరు తాగక తప్పదు. తాలూకాలోని క్రిష్టాపురం గ్రామంలోని ప్రజల దాహార్తి తీరాలంటే సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలంలోని దొడమట్ల గ్రామానికి వెళ్లాల్సిందేనని తాలూకా మాజీ పంచాయతీ సభ్యుడు, సమాజసేవకుడు కె.వి.రామక్రిష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 2012 సంవత్సరంలో శుద్ధ తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా 2017 వరకు గ్రామస్థులు మంచినీరు తాగారు. 2017లో మరమ్మతు కోసం నిలిచిపోయిన కేంద్రం ఇప్పటికి పనిచేయలేదు. తాగడానికి నీళ్ల కోసం 5 కి.మీ.దూరం దొడమట్ల గ్రామానికి వెళ్లి తెచ్చుకుంటున్నారు. సామాన్య ప్రజలు గ్రామంలో దొరికే ఫ్లోరైడ్ నీరు తాగడం వలన యువకులకు మోకాళ్ల నొప్పులు, పళ్లు పుచ్చిపోయి పంటి నొప్పులు, దేహంలోని ఎముకలు, కీళ్లనొప్పులతో బాధపడుతూ వృద్ధులుగా మారుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శుద్ధజల నీటి కేంద్రాన్ని మరమ్మతు చేపట్టి వేసవి కాలంలో గ్రామంలోని ప్రజల కాపాడాలని రామక్రిష్ణయ్య తెలిపారు.

మూతపడిన తాగునీటి శుద్ధజల కేంద్రం

వాహనాల తయారీపై అవగాహన అవసరం

నర్సాపూర్: విద్యార్థులు సొంతంగా ఇంజినీరింగ్ డిజైన్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ ద్వారా రూపొందించిన బగ్గీలు ఎంతో బాగున్నాయని తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. యువ ఇంజినీర్లు చదువుకుంటూనే వాహనాల తయారీపై అవగాహన పెంచుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. జిల్లాలోని నర్సాపూర్‌లో ఐదు రోజులపాటు జరిగిన మెకానికల్ బాజా సే ఇండియా-2026 జాతీయ స్థాయి బగ్గీల పోటీలను ఆదివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణు విద్యా సంస్థల కార్యదర్శి ఆదిత్య విస్సం మాట్లాడుతూ.. ఇంజినీరింగ్‌లో కోర్ విభాగాలకు డిమాండు పెరుగుతోందని, క్రమంగా విద్యార్థులు ఈ విభాగాల వైపు దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సంజయ్‌దూబే, ఒలెక్ట్రా ఎండీ మహేష్‌బాబు, సే ఇండియా అధ్యక్షుడు డాక్టర్ నాగరాజన్, కన్వీనర్ సయ్యద్‌అలీ, కోకన్వీనర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

విజేతలు వీరే... జాతీయ స్థాయి బగ్గీల పోటీల్లో డాక్టర్ విశ్వనాథ్ కరద్ ఎంఐటీ వరల్డ్ పీస్ యూనివర్సిటీ(పుణె) జట్టు ప్రథమ బహుమతి పొందగా రూ.1.50 లక్షల బహుమతి అందజేశారు. కేఎల్‌ఈ సాంకేతిక విశ్వవిద్యాలయం(కర్ణాటక) ద్వితీయ బహుమతి పొందగా రూ.లక్ష బహుమతి అందించారు. తృతీయ స్థానంలో నిలిచిన డీవై పాటిల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టుకు(కొల్హాపూర్) రూ.75 వేలు అందజేశారు. వాహన తయారీ ఎక్సలెన్స్ అవార్డు, కంప్యూటర్ ఎయిడెడ్ ఇంజినీరింగ్ అవార్డులు భీమవరం మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు దక్కాయి. ద్రోణాచార్య అవార్డును డాక్టర్ ముత్తులాగు(బీవీఆర్ఐటీ)అందుకున్నారు.

ప్రథమ బహుమతి పొందిన పుణె జట్టు

చార్వాక సంస్కృతికి పుట్టినిల్లు..కర్ణాటక

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కులమతాలు, ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం పాటు పడిన చార్వాకుడి సంస్కృతికి కర్ణాటక పుట్టినిల్లుగా ఉందని మానవ వికాస వేదిక జాతీయ అధ్యక్షుడు బి.సాంబశివరావు తెలిపారు. ఆదివారం ఇక్కడి వయాలికావల్‌లోని ఫటి భవన్‌లో మానవ వికాస వేదిక కర్ణాటక విభాగం పరిచయ సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. దక్షిణ కన్నడ జిల్లాలో చార్వాక గ్రామం ఉందని, శివమొగ్గ, చిత్రదుర్గ తదితర జిల్లాల్లో చార్వాక సంస్కృతి ఉన్నట్లు చరిత్ర చెబుతోందన్నారు. కర్ణాటక అనేక సామాజిక మార్పులకు నిలయంగా ఉండేదన్నారు. మానవతావాదుల సంఖ్య ఎక్కువగా ఉన్నా..వారికి ఒక వేదిక లేదన్నారు. మూఢనమ్మకాల నిర్మూలన చట్టం సక్రమంగా అమలు కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ భాస్కర్ వేదిక చేపడుతున్న పోరాట సామాజిక కార్యక్రమాలు, ప్రణాళికను వివరించారు. స్వేచ్ఛాలోచన నిర్వాహకుడు డి.హనుమంతరావు, రిటైర్డ్ బ్యాంకు మేనేజరు డాక్టర్ వెంకటయ్య అప్పగెరె, ఏఐటీయుసీ బెంగళూరు నగర జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బి.గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాంబశివరావు, తదితరులు

సామాజిక సేవతో మానసిక ప్రశాంతత

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : ప్రాణపాయస్థితిలో ఉన్న వారిని ఆదుకోవడం, సామాజిక సేవలు చేయడం అభినందనీయమని మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్ నాగలక్ష్మిచౌదరి తెలిపారు. నూరాని మసీద్ కమ్మగుండనహళ్లి ఒక నేషన్ ఒక ట్రస్టు నేతృత్వంలో చిక్కబానువారలో ఆదివారం రెండు ఉచిత అంబులెన్సులను మానవహక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీఎం చిక్కణ్ణతో కలిసి ఆమె జెండా ఊపి ప్రారంభించారు. మనం సమాజం నుంచి స్వీకరించడమే కాకుండా సమాజానికి ఏదైనా తిరిగివ్వాలనే సూత్రాన్ని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖులు మహమ్మద్ ముస్తఫా, జగదీశ్, మహమ్మద్ సలీమ్, అజీమ్, కిషోర్, రియా, రిహానా, మన్సూర్, యాసిర్, అబ్దుల్లా, హీరిష్‌పార్జా, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

అంబులెన్స్ ప్రారంభిస్తున్న నాగలక్ష్మిచౌదరి, చిక్కణ్ణ, తదితరులు

ఇరాన్‌పై దాడిని ఖండించిన రెడ్‌ఫ్లాగ్

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా సంయుక్తంగా దాడి చేయడాన్ని రెడ్‌ఫ్లాగ్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇరాన్‌పై అమెరికా దాడి అంతర్జాతీయ ఒప్పందాలను ఉల్లంఘించడమేనని ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జయకుమార్, కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి బసవలింగప్ప తెలిపారు. చమురు నిల్వలు అధికంగా ఉన్న ఇరాన్‌ను ఆక్రమించునేందుకు అమెరికా, ఇజ్రాయిల్ దాడులకు తెగబడ్డారని, దుర్మార్గ పూరితమైన దాడులను ప్రపంచ దేశాలు నిరసిస్తున్న దాడులు ఆపలేదని తెలిపారు. భారత్ ప్రభుత్వం దాడులపై తన వైఖరి స్పష్టం చేసి ఇరాన్‌కు మద్దతుగా నిలబడాలని డిమాండ్ చేశారు.

కళాశాల ప్రిన్సిపల్‌కు నోటీసు

చిత్రదుర్గ, న్యూస్‌టుడే : చిత్రదుర్గ లోక్‌సభ సభ్యుడు గోవిందకారజోళను కళాశాలలోకి అనుమతించిన ఆరోపణలపై కళాశాల ప్రిన్సిపల్ దొడ్డయ్యకు జిల్లా పీయూ డీడీ తిమ్మయ్య తాఖీదులను జారీ చేశారు. రెండో సంవత్సరం పీయూసీ పరీక్షల ప్రారంభం వేళ ఎంపీ శనివారం కళాశాల వద్దకు వెళ్లి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. ఈ సంఘటనపై పీయూ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్‌కు నోటీసు ఇవ్వడంపసై విద్యార్థుల తల్లిదండ్రులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

ఉత్కంఠభరితంగా జంగీ కుస్తీ పోటీలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : దావణగెరె బెణ్ణెదోసె-వెన్నదోసెగా పేరు గాంచిన దావణగెరెలో దుర్గాంబికాదేవి జాతర సందర్భంగా మూడు రోజులుగా జరుగుతున్న జంగీ కుస్తీ పోటీలు ఆసక్తికరంగా చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఎరుపు మట్టిలో జరిగే ఈ పోటీలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గాంచాయి. రెండేళ్లకొకసారిగా భారీ ఎత్తున నిర్వహించే జాతర వేడుకల్లో ఏర్పాటు చేసిన కుస్తీ పోటీలకు భారతతో పాటు ఇరాన్, దక్షిణాఫ్రికా నుంచి ఫహిల్వాన్లు విచ్చేశారు. బీరలింగేశ్వర ఆలయ సమీపంలో నిర్వహిస్తున్న పోటీల్లో ఫైల్వాన్ల బలాబాలల ప్రదర్శనతో ప్రత్యర్థిని మట్టికరింపించే దృశ్యాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. హరియాణా క్రీడాకారుడు దీపాజు ఆటతీరు చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు తరలివచ్చారు. తొలి రౌండ్‌లో గెలుపొందిన దీపాజుకు అభిమానులు డబ్బు రూపంలో తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఐదువందల మంది పాల్గొంటున్న పోటీలను వీక్షించేందుకు విచ్చేసిన అభిమానులు విజిల్స్ వేస్తూ పోటీదారుల్లో ఉత్సాహం నింపారు. హరియాణా నుంచి శేరాగుజ్జార్, విక్కి, పంజాబ్‌కు చెందిన వీర్ కుహాలీ, మహారాష్ట్రకు చెందిన శివ, విక్రం ఘోర్పడే, కాలీచరణ్ సోలంకర్, యూపీ నుంచి అభినాయక్, రోహిత్‌పోజీ, కుహాలీ, లక్కీ, కర్ణాటక నుంచి సంజు, గణేశ్ పాల్గొన్నారు. ఇరాన్‌కు చెందిన జలాల్, మిర్జా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, కిజికిస్థాన్ నుంచి క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొడం విశేషం. 1948లో దుర్గాంబిక దేవస్థానం కమిటీ కుస్తీ పోటీలను ప్రారంభించింది. దావణగెరెలో పదిహేను మంది గరడీమనె-కుస్తీ నేర్పేవారు ఇక్కడ ఉన్నారు. క్రీడా విద్యార్థి నిలయం, రాష్ట్ర స్థాయి కుస్తీహాల్ ఇక్కడ ఉన్నాయి. రఫిక్‌హొళ్లి, కార్తీక్‌కాటె కర్ణాటక తరపున ప్రాతినిధ్యం వహించి బంగారు, వెండి, కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. విజేతలకు వెండిగధతో పాటు ఆకర్షకమైన బహుమతి అందిస్తారు. రెఫరీ వీరేశ్ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న ఫైల్వాన్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ఆఫ్రికాకు చెందిన క్రీడాకారుడితో తలపడి గెలుపొందిన దిల్లీకి చెందిన విక్కికి కమిటీ తరపున రూ.75వేల బహుమతిని ప్రకటించారు.

నువ్వా నేనా అంటూ..పట్టుబిగించిన ఫహిల్వాన్లు

భార్యను హత్య చేసి భర్త ఆత్మహత్య

బెంగళూరు (యశ్వంతపుర) న్యూస్‌టుడే: కుటుంబ కలహాల కారణంగా భార్య మంజుళ (27)ను హత్య చేసి ఒడిశా నివాసి, భర్త దీపాంతర సబర (31) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి సూర్యనగర పోలీసుఠాణా పరిధిలో జరిగింది. భార్యభర్తలిద్దరు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బొమ్మసంద్రలోని ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు. సూర్యనగర సమీపంలోని హీలలిగె గ్రామంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. భార్యను హత్య చేసి దుఃఖిస్తూ తాను ఆత్మహత్యకు పాల్పడే స్వయం చిత్రాన్ని చరవాణిలో చిత్రీకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనకు కారణాలు తెలియరాలేదు. మృతదేహాలను ఆనేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లాల్‌బాగ్‌లో కొత్త గేటు ఏర్పాటుకు వ్యతిరేకత

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: నగరంలోని లాల్‌బాగ్ ఉద్యానవనం వద్ద కొత్త గేటు నిర్మాణానికి పరిసరవాదులు, వాయువిహారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉద్యానవనాల శాఖ ప్రస్తుతం ఉన్న క్యాంటీన్ సమీపంలో నూతన గేటు నిర్మాణం చేపట్టాలని తీర్మానించింది. ఇందుకు లాల్‌బాగ్ వాయువిహారులు పరిసర ప్రేమికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. లాల్‌బాగ్ ఉద్యానవనంలోకి ప్రవేశించేందుకు ప్రస్తుతం నలుదిక్కులా నాలుగు గేట్లు ఉండగా మరొకటి ఎందుకని ప్రశ్నించారు.

కబ్బన్‌పార్కులో ప్రకృతి సౌందర్యాలు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : వేసవి వచ్చిందంటే కబ్బన్‌పార్కు ఉద్యానవనంలో ప్రకృతి సౌందర్యాలు ప్రజలను కనువిందు చేస్తున్నాయి. ఆ దృశ్యాలను తమ చరవాణిలో బంధించేందుకు పోటీ పడుతున్నారు. మొన్నటి వరకు రహదారికి ఇరువైపులా పెరిగిన వృక్షాలు పచ్చగా రహదారికి పందిళ్లు వేసినట్లుగా ఉండేవి. ఇప్పుడు ఆకులు ఎండి రాలిపోగా పుష్పాలు మాత్రం కనిపిస్తున్నాయి. పసుపు పచ్చ పువ్వులు, నీలి రంగు పువ్వులు, ఎరుపు, గులాబి రంగు పువ్వులతో కూడిన వృక్షాలు సందర్శకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే వివిధ రహదారులు పువ్వులు దారులుగా మారాయి. ఆ దారుల్లో సంచరిస్తుంటే బెంగళూరు ఉన్నామా? విదేశీ నగరాల్లో ఉన్నామా? అనే అనుభూతి కలుగుతోంది. కబ్బన్‌పార్కు ఉద్యానవనంలో ప్రస్తుత ప్రకృతి అందాలను తిలకించేందుకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. మరోవైపు ఉద్యానవనాల శాఖ సిబ్బంది పువ్వుల వృక్షాలకు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.

పసుపు రంగు పువ్వుల వృక్షం వద్ద సందర్శకులు

ఇందిరానగర పూలచెట్ల రహదారి

మోటారు రేస్‌లో విజేతలుగా మంగళూరు, కొడుగు జంట

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : ఎఫ్‌ఎంఎస్‌సీఐ బ్లూబ్యాండ్ ఇండియన్ నేషనల్ మోటారు రేస్‌లో మంగళూరుకు చెందిన డీన్ మస్కరెన్హాస్, కో డ్రైవర్ కొడుగుకు చెందిన గగన్ కురుంబయ్య ఛాంపియన్స్‌గా ప్రశస్తి అందుకున్నారు. ఆదివారం నాసిక్‌లో జరిగిన చివరి ఆరో రౌండ్ పోటీలో మంగళూరు, కొడుగు రైడర్లు అగ్రస్థానం చేపట్టారు.

విజేతలు డీన్‌మస్కరెన్హాస్, గగన్‌కురుంబయ్య

మత్తు పదార్థాలకు బానిసలు కాకండి

చిత్రదుర్గ, న్యూస్‌టుడే : యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఆరోగ్యవంతమైన జీవితాన్ని రూపొందించుకోవాలని ఎస్పీ రంజిత్ కుమార్ బండారు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహించిన జనజాగృతి మారథాన్ పరుగు పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువతీ యువకులు వ్యాయామం, నడక, పరుగు, యోగా తదితర అలవాట్లను అలవరచుకోవాలన్నారు. పరుగు పోటీలో 700 మందికి పైగా పోలీసులు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీలో విజేతలైన సచిన్, జోశ్యా, సమ్మద్‌లకు ఎస్పీ బహుమతులు అందజేశారు.

మారథాన్ పరుగు పోటీలో పాల్గొన్న విద్యార్థులు

గోదాములో అగ్నిప్రమాదం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: నగర శివార్లలోని తలఘట్టపుర పోలీసుఠాణా పరిధిలోని ఆంజానపుర సమీపంలోని కెంబత్తహళ్లి వద్ద ఉన్న సోఫా గోదాములో అగ్నిప్రమాదం సంభవించింది. ఆదివారం ఉదయం 8.30 గంటలు గోదాము నుంచి దట్టమైన పొగతో కూడిన మంటలు పైకి ఎగిశాయి. నిమిషాల్లో గోదాము పూర్తిగా కాలిపోయింది. విషయం తెలిసిన వెంటనే ఎనిమిది అగ్నిమాపక వాహనాలు అక్కడికి వచ్చి దాదాపు మూడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. గోదాము ఆవరణలో ఉన్న మూడు కార్లు, రెండు సరకు రవాణా వాహనాలు పూర్తిగా కాలిపోయినట్లు పోలీసులు తెలిపారు. గోదాము పక్కన ఉన్న అపార్ట్‌మెంట్‌కు మంటలు వ్యాపించడంతో కిటికీ అద్దాలు పగిలాయి. గోదాము పక్కన నివాస దారులను ఖాళీ చేయించి పక్క ప్లాట్లకు తరలించారు. విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు సంఘాలకు ఆదామ్ ప్రోత్సాహం

బెంగళూరు (యడియూరు), న్యూస్‌టుడే : స్థానిక గంగనగర్‌లోని హెబ్రోన్ తెలుగు ప్రార్థనాలయంలో పాస్టర్ సి.హెచ్.ఆదామ్‌కు ఎం.బెంజిమన్, సాల్మాన్ పాస్టర్‌గా పట్టా అందజేశారు. ఈ సందర్భంగా బెంజిమన్ మాట్లాడుతూ ఆదామ్ చేస్తున్న సామాజిక, ప్రజా చైతన్య సేవలను గుర్తించి పట్టా అందజేశామన్నారు. కొన్నేళ్లుగా తెలుగు సంఘాలను ప్రోత్సహిస్తు పేదప్రజలకు క్రీస్తు బోధనలు తెలియజేస్తూ వారిని ఆధ్యాత్మిక మార్గంలో పయనించజేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు ఎన్.ప్రేమానందం, సాల్మన్, ఎ.జి.జయానందం, యోహాన్, హానోక్ తదితరులు పాల్గొన్నారు.



ఆదామ్‌కు పట్టా అందజేస్తున్న బెంజిమన్ తదితరులు

ఏఐలో నైపుణ్యం సాధించాలి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కృత్రిమ మేథ (ఏఐ) పట్ల నైపుణ్యం సాధించాలని, ప్రస్తుతం ఏఐ కాలమని స్వర్ణగ్రూపు సీఎండీ డాక్టర్ చిగురుపాటి వి.ఎస్.వి.ప్రసాద్ విద్యార్థులకు హితవు పలికారు. ఆదివారం హుబ్బళ్లిలోని కె.ఎల్.ఈ సొసైటీ పీసీ జాబిన విజ్ఞాన కళాశాలలోని బీసీఏ విభాగం ఏర్పాటు చేసిన అక్యుమెన్-2026 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనేక కంపెనీలు ఉద్యోగుల సంఖ్య తగ్గిస్తున్నాయని, సమస్యను దృష్టిలో పెట్టుకుని కృత్రిమమేథలో నైపుణ్యం సాధిస్తే అవకాశాలు దొరుకుతాయన్నారు. ఉద్యోగం చేసే బదులు మీరే ఉద్యోగాలను సృష్టించవచ్చని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంధ్యా కులకర్ణి, బీసీఏ సంచాలకుడు సిద్ధలింగప్ప, శివరాజ్, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు ఇస్తున్న చిగురుపాటి ప్రసాద్ తదితరులు

అనుమానాస్పదంగా కొంగల మృతి

ముళబాగిలు : కోలారు జిల్లా శ్రీనివాసపుర తాలూకా ఆర్ఆర్ తిమ్మసంద్ర చెరువులో కొంగలు అనుమానాస్పదంగా మృతి చెందాయి. విషయం తెలుసుకున్న పశు సంవర్ధక విభాగం డిప్యూటీ డైరెక్టర్ రమేశ్, ప్రాంతీయ పరిశోధన విభాగం అధికారి నటరాజ్ బృందం చెరువు చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. ప్రాథమిక తనిఖీ ప్రకారం 47కు పైగా కొంగలు మరణించాయి. చెరువులో చేపలు పట్టడానికి వేసిన వలల దారాలు పక్షుల కాళ్లకు చుట్టుకుని ఉన్నాయి. పక్షులు అలాగే ఎగిరి చెట్టుకొమ్మపై వాలి చిక్కులు విడిపించుకోలేక మృతి చెంది ఉంటాయని అంచనా వేశారు. కొంగల సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. పక్షుల మరణానికి కారణం తెలుసుకోవడానికి వాటి నమూనాలను సేకరించారు.

అంటరానితనంపై అవగాహన

పావగడ, న్యూస్‌టుడే : అంటరానితనంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి వీధి నాటకాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయని రంగాంతరంగ కళాతండ నాయకుడు కోటగుడ్డ హనుమంతరాయప్ప తెలిపారు. పట్టణంలోని బస్టాండులో అంటరానితనానికి వ్యతిరేకంగా నిర్వహించిన వీధి నాటకాల ప్రదర్శన, గేయాలు, పాటలు, పద్యాల గీతాలాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంటరానితనాన్ని నిర్మూలించడానికి, సమాజంలో సమానత్వం, మానవ హక్కులపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో వీధి నాటకాలు ప్రభావం చూపుతాయన్నారు. ఈ సందర్భంగా అట్రాసిటీ చట్టం ప్రాధాన్యం, కుల వివక్షత, జాత్యాహంకారానికి వ్యతిరేకంగా చట్టపరమైన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డెన్ రాధాకృష్ణ, పురసభ సిద్ధప్ప, కళాకారులు మమత, నింగమ్మ, రాజగోపాల్, రవికుమార్, మోహన్, నాగయ్య, మంజు తదితరులు పాల్గొన్నారు.

డప్పు మోగించి ప్రారంభిస్తున్న కళాకారులు

బాలల రక్షణ కోసం న్యాయ సమావేశం

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : కర్ణాటక న్యాయ సేవల ప్రాధికార, కర్ణాటక న్యాయ అకాడమీ, కర్ణాటక హైకోర్టు బాలల న్యాయ-పోక్సో సమితులు, బాలల హక్కులు-బాలల రక్షణ ఆధ్వర్యంలో బాలల రక్షణ కోసం కర్ణాటక న్యాయ అకాడమీలో ఆదివారం రాష్ట్ర స్థాయి న్యాయ సమావేశం నిర్వహించారు. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షుడు శివరామన్ ప్రారంభించారు. కార్యక్రమంలో పోక్సో సమితి అధ్యక్షుడు ఎస్.సునీల్‌యాదవ్, బాలల హక్కుల జాతీయ సంచాలకుడు రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేదికపై శివరామన్, సునీల్‌యాదవ్, రవీకాంత్ తదితరులు

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

నేరరహిత సమాజమే లక్ష్యం

విధానసౌధ వద్ద పోలీసు వాక్‌థాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ పరమేశ్వర్, డీజీపీ డాక్టర్ ఎం.ఎ.సలీం తదితరులు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జాగృతి, సైబర్ క్రైమ్ తదితర అంశాలను గురించి ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు నగర పోలీసులు ఆదివారం ఇక్కడ విధానసౌధ ముందు చేపట్టిన వాక్‌థాన్ కార్యక్రమాన్ని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ ప్రారంభించారు. విధానసౌధ వద్ద ప్రారంభమైన వాక్‌థాన్ కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. ఐదు, పది కిలోమీటర్ల వాక్‌థాన్‌లో పాల్గొన్న పోలీసులు ప్రజలు విధాన సౌధ నుంచి బయలుదేరి కబ్బన్ రోడ్డు, ఎంజీ రోడ్డు మీదుగా మళ్లీ కబ్బన్ పార్కు గుండా విధానసౌధకు చేరుకున్నారు. వాక్‌థాన్ విజేతలకు డీజీపీ డాక్టర్ ఎం.ఎ.సలీం తదితరులు కలిసి పతకాలను అందజేశారు. ఎస్‌బీఐ వాక్‌థాన్‌కు అన్నివిధాలుగా సహాయ, సహకారాలను అందించింది. మాదక ద్రవ్యాల విక్రయాలు పెద్ద సవాల్‌గా మారిందని, సైబర్ నేరాలు నానాటికీ పెరుగుతున్నాయని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. రెండింటినీ నిర్మూలించేందుకు ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ వివిధ విభాగాల డీసీపీలు, ఏసీపీలు హాజరయ్యారు.

వాక్‌థాన్‌కు హాజరైన ప్రజలు పోలీసులు

జాబ్ క్యాలెండర్ కోసం నేడు ఆందోళన

రాయచూరు, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని కోరుతూ సోమవారం నగరంలో ఆందోళన చేపడుతామని ఉద్యోగ ఆకాంక్షుల పోరాట సమితి సంయుక్త కార్యదర్శి వినోదకుమార్ వెల్లడించారు. అంబేడ్కర్ కూడలి వద్ద ఉదయం 11.30 గంటలకు మొదలయ్యే కార్యక్రమంలో నిరుద్యోగులు పాల్గొనాలని కోరారు. రాష్ట్ర సర్కారు ఉద్యోగాల భర్తీకి సూచనను వెలువరించాలని, దరఖాస్తు ఫీజు ఎత్తి వేయాలని, పరీక్ష, ముఖాముఖి (ఇంటర్వ్యూ)కి హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత ప్రయాణం కల్పించేలా ఒత్తిడి తెస్తామని వివరించారు.

విమానాల రాకపోకలు రద్దు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధం కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గల్ఫ్ దేశాలకు సంచరించే విమానాల సంచారాన్ని ఆదివారం పూర్తి రద్దుగా చేశారు. వివిధ విమాన సంస్థలు తమ విమానాల రాకపోకలను రద్దు చేశాయి. ఈ సమాచారం ముందుగా ప్రయాణికులకు తెలియకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. మరోవైపు మంగళూరు విమానాశ్రయం నుంచి హఠాత్తుగా దుబాయి తదితర అరేబియా దేశాలకు విమానాల రాకపోకలను రద్దు చేశారు. ఎయిర్‌ఇండియా, ఇండిగో విమానాలను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. దుబాయికి సంచరించే విమానాలను నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

రేణుకాచార్య సందేశాలు విలువైనవి

చిత్రపటంతో ఊరేగింపు

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం రాయచూరులో జగద్గురు రేణుకాచార్య జయంతిని వైభవంగా జరుపుకొన్నారు. రాయచూరు విభాగం సహాయ కమిషనర్ పంపణ్ణ సజ్జన్ వీరశైవ కళ్యాణ మంటపంలో జయంత్యుత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. రేణుకాచార్య బోధనలు, సందేశాలు అన్ని కాలాలకు అనుసరణీయమైనవన్నారు. యువత, విద్యార్థులు ఆ మహనీయుడి వచనాలు చదివి పఠజ్ఞానాన్ని పెంపొందించాలని సూచించారు. స్వామీజి రాచోటేశ్వర శివాచార్య (కలబురగి) తన ఉపన్యాసంలో వీర శైవ ధర్మం అన్ని ధర్మాల వారిని అక్కున చేర్చుకున్న గొప్ప మానవతా మతమని అభివర్ణించారు. బాలకు చిన్ననాటి నుంచే సంస్కారం, లింగాయత నేర్పిస్తున్న వీరశైవ ధర్మం మిగిలిన వాటికంటే భిన్నమైందని తెలిపారు. ఆధ్యాత్మిక, ధార్మిక రంగాల విస్తరణకు పంచ పీఠాలు నెలకొల్పిందని వెల్లడించారు. సంఘ శ్రేయస్సు కోసం తపించిన రేణుకాచార్య అన్ని సామాజిక వర్గాల అభిమానాన్ని చూరగొన్నారని వివరించారు. ఉదయం బైపాస్ రహదారిలోని రేణుకాచార్య కూడలిలో చిత్రపటం ఊరేగింపును ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ ప్రారంభించారు. స్వామీజీలు శంతమల్ల శివాచార్యులు, రాచోటి వీరశివాచార్య, సంగమేశ్వర శివాచార్య, నగర పాలక సంస్థ ఉప కమిషనర్ సంతోషి రాణి, వీరశైవ సమాజం అధ్యక్షుడు శరణ భూపాల నాడగౌడ పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న కమిషనర్ సజ్జన్

మాన్వి : రేణుకాచార్య జయంత్యుత్సవాన్ని తాలూకాల అధికార యంత్రాంగాలు, సంఘ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాన్వి, సిరివార, లింగసుగూరు తాలూకా కేంద్రాల్లో తహసీల్దార్లు రేణుకాచార్య చిత్రపటాలకు పూల మాల లేసి నివాళులర్పించి మాట్లాడారు. వీరశైవలింగాయత్, బేడజంగమ సముదాయం ప్రముఖులు కిడిగణయ్యస్వామి, ఎ.బి.ఉప్పళమఠ తదితరులు ఉపన్యాసం చేశారు. రేణుకాచార్య పుట్టుపుర్వోత్తరాలను వివరించారు. ఆయన మహా సంఘ సంస్కర్త అని కొనియాడారు. మాన్వి సంగాపూర కిద్మత్‌శాఖ మఠంలో రేణుకాచార్య జయంతిలో మహిళలు, యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. తహసీల్దారు భీమరాయ రామసంద్ర, ఆశోక్ పవార్, వీరశైవ సంఘం అధ్యక్షుడు హరిహరపాటిల్, అఖిల కర్నాటక వీరశైవలింగాయత్ మహాసభా తాలూకా అధ్యక్షుడు అడవీ, కల్యాణ పరిపాలనాధికారి సంగయ్యస్వామి హిరేమఠ, న్యాయవాదులు మల్లనగౌడ, సముదాయం ప్రముఖులు మాట్లాడారు.

మాన్విలో మాట్లాడుతున్న కిడిగణయ్యస్వామి

కిద్మత్ మఠంలో చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న ప్రముఖులు

స్కౌట్స్, గైడ్స్ భవనం ప్రారంభం

ప్రసంగిసున్న మంత్రి బోసురాజు

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా స్కౌట్స్, గైడ్స్ శిక్షణ కేంద్రం నూతన భవనం జాతికి అంకితమైంది. చిన్ననీటి పారుదల శాఖ మంత్రి బోసురాజు ఆదివారం రిబ్బన్ కత్తిరించి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ కల్యాణ కర్ణాటక ప్రదేశ్ అభివృద్ధి మండలి నిధులతో నిర్ణీత సమయంలో పనులను ముగించడం హర్షణీయమని పేర్కొన్నారు. కొత్త భవనం సేవల విస్తరణకు తోడ్పడుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. స్కౌట్స్, గైడ్స్ రాష్ట్ర ముఖ్య కమిషనర్ పి.జి.ఆర్.సింధ్యా, జిల్లా కమిషనర్ బసవరాజ బోరెడ్డి, మాజీ కమిషనర్ అజీజ్ సుల్తాన్, ప్రముఖులు రుద్రప్ప అంగడి, ప్రభాకర్ భట్, గద్ది బసప్ప, మల్లికార్జున హల్లూరు, అంబణ్ణ నాయక్ హాజరయ్యారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బోసురాజు

అనుభవం అభివృద్ధికి ఉపయోగపడాలి

మాన్వి : మాజీ అధికారులు, ప్రజాప్రతినిధులు తమ అనుభవాలను అభివృద్ధికి వినియోగించాలని మంత్రి ఎన్.ఎస్.బోసురాజు సూచించారు. తాలూకా మాజీ ఉద్యోగుల రెండో సమ్మేళనాన్ని స్థానిక నీలకంఠేశ్వర దేవస్థానం వద్ద మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది సహజ ప్రక్రియ అన్నారు. తమ అధికార అవధిలో నేర్చుకున్న అనుభవాలను అభివృద్ధికి కోసం ఉపయోగించాలన్నారు. బడ్జెట్‌లో సీనియర్ సిటిజన్లుకు అవసరమైన నిధులు, సదుపాయాల అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని బరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ మాట్లాడుతూ అవసరమైన ధ్రువపత్రాలు అందిస్తే సీనియర్ సిటిజన్ల కట్టడ నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మహాదేవప్ప ఏగనూరు మాజీ ఉద్యోగుల సమస్యలు, పరిష్కారాల విషయమై మాట్లాడారు. ప్రభుత్వ కట్టడాలకు భూదానం చేసిన వి.రవిబాబు, మాజీ ఉద్యోగులు, వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారిని ఘనంగా సత్కరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యకాంత్, తాలూకా అధ్యక్షుడు రేవణ సిద్ధయ్యహిరేమఠ, ప్రముఖులు మడివాళయ్య, శ్రీశైలగౌడ, మూకప్పకట్టిమని, డి.జి.కర్కిహళ్లి, రామలింగప్ప, హుసేనప్ప, శాంతప్ప, పరప్ప బెనకనాళ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి కృషి

మాన్వి : విద్యార్థులకు ఉత్తమ సదుపాయాలు, సౌకర్యాల కల్పన దిశగా ప్రభుత్వ అనేక యోజనలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందని మంత్రి ఎన్.ఎస్.బోసురాజు పేర్కొన్నారు. స్థానిక దేవణ్ణ తోట ప్రగతి గార్డెన్ వద్ద మౌలానా అజాద్ మాదిరి ఆంగ్ల మాధ్యమ పాఠశాల నిర్మాణానికి ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌తో కలిసి భూమిపూజ చేసి మాట్లాడారు. విద్యార్థులకు సకల సౌకర్యాలతో రూ.5.27 కోట్లతో ఈ పాఠశాల, కళాశాల భవనాలని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కర్ణాటక అల్పసంఖ్యాక అభివృద్ధి శాఖ బెంగళూరు, జిల్లా పంచాయతీ రాయచూరు సంయుక్త ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే హంపయ్యనాయక్ మాట్లాడారు. పంచ గ్యారంటీ సమితి అధ్యక్షుడు బి.కె.అమరేశప్ప, ముడా అధ్యక్షుడు గఫూర్‌సాబ్, ప్రముఖులు అక్బర్‌సాబ్, శరణయ్యగుడదిన్ని, శాంతప్ప, చంద్రశేఖర్ కురిడి, మహాంతేశ్ స్వామి, అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

హోళిని శాంతియుతంగా జరుపుకోండి

రాయచూరు, న్యూస్‌టుడే : హోళి పండగను శాంతియుతంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం కల్పించవద్దని ఏఎస్పీ కుమారస్వామి కోరారు. నగరంలోని సదరబజార్ పోలీస్ ఠాణా ఆవరణలో ఆదివారం శాంతిపాలనా సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన ఏఎస్పీ ప్రసంగిస్తూ సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకుని ఆచరించాలని విజ్ఞప్తి చేశారు. ద్విచక్ర వాహనాలను వేగంగా నడపటం, మద్యం సేవించి బైకులపై ప్రయాణించడం, సైలెన్సర్లను తొలగించి ధ్వని కాలుష్యాన్ని కలగజేయవద్దని సూచించారు. పరిచయం లేని వారిపై రంగులు చల్లవద్దన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. సీఐ ఉమేశ్‌కాంబ్లె, జెస్కాం అధికారి రవిచంద్ర, నగర పాలక సంస్థ మేనేజర్ రాజు, ప్రముఖులు రసూల్‌సాబ్, సయ్యద్ ముక్తియార్, శరణబసవ, కె.ఇ.కుమార్, అంబాజీరావు, శ్రీనివాస పతంగె, మహావీర పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ఏఎస్పీ కుమారస్వామి

సామూహిక అత్యాచారం కేసులో ముగ్గురి అరెస్టు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే : మత్తు పదార్థాలు తాగించి యువతిపై సామూహిక అత్యాచారం సంఘటనపై అమృతహళ్లి పోలీసులు దర్యాప్తును తీవ్రతరం చేశారు. అకృత్యానికి సహకరించిన నిందితులు శివమొగ్గ నివాసి శ్రవణ్ (21), దావణగెరె నివాసి అనిరుద్ధ (33) గుజరాత్ నివాసి మోహిత్‌జైన్ (23)లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఇప్పటికే నిందితులు డిక్సన్ సాంత్రా(21), హసన్ నివాసి నిఖిల్ (24)ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన యువతితో నిందితులు స్నేహం చేసి మోడలింగ్, ఫోటోషూట్‌తో పాటు పార్టీ పేరుతో పబ్‌లకు రప్పించి మాట్లాడేవారు. తన ఇంట్లో జరుగుతున్న పార్టీకి ఆమెను నిందితుడు డిక్సన్ ఆహ్వానించాడు. శీతల పానీయంలో మత్తు మందు కలిపి తాగించి అనంతరం సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనతో మరికొందరికీ సంబంధం ఉందని వారి కోసం గాలింపు చర్యలు సాగిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

వినియోగం గరిష్ఠం.. ఉత్పాదన కనిష్ఠం

ఆర్‌టీపీఎస్ ముఖద్వారం

రాయచూరు, న్యూస్‌టుడే : వేసవి మొదలైనందున రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం అధికమవుతోంది. ఉగాది తర్వాత వాడకం మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో..ఎండకాలంలో ఆదుకునే శాఖోత్పన్న కేంద్రాల్లో ఉత్పాదన పుంజుకోకపోవడం ఆందోళన కల్గిస్తోంది. కర్ణాటక విద్యుత్తు నిగమ పెంపుపై దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా ఉత్పత్తి క్షీణిస్తోంది. ఆదివారం రాత్రి 8.25 గంటలకు రాయచూరు కేంద్రంలో 1394 మెగావాట్లు (మొత్తం 1720), బళ్లారిలో 1463 మెగవాట్లు (సామర్థ్యం 1700), ఉడుపిలో 993 మెగావాట్లు (సామర్థ్యం 1200) తయారీ జరుగుతోంది. యరమరాస్‌లోని రెండు యూనిట్లు స్తంభించినందున 1600 మెగావాట్ల ఉత్పత్తికి బ్రేక్ పడింది. జిందాల్‌లో 1460 మెగావాట్లకు బదులుగా కేవలం వంద మెగావాట్ల తయారీ నమోదైంది. రాయచూరులోని ఎనిమిది యూనిట్లలో ఒకటోది పడకేసింది. గత నెల రెండో వారంతో పోలిస్తే మెరుగుపడింది. బళ్లారి, ఉడుపిలో ఉత్పాదన మెరుగ్గానే ఉంది. యరమరాస్‌లో ఒక యూనిట్ పనిచేసేది. రెండు మొండికేసినందున రాష్ట్రంలోని మొత్తం ఉత్పాదనపై ప్రభావం చూపిస్తోంది. ఐదు కేంద్రాల ద్వారా ప్రతి రోజూ 7680 మెగావాట్లు తయారీ కావాలి. ప్రస్తుతం 3950 మెగావాట్ల ఉత్పాదన సాధ్యపడుతోంది. విద్యుత్తు నిగమ 3730 మెగావాట్లను కోల్పోయింది. ఉత్పాదన పెంచకపోతే కోతలు తప్పవని విద్యుత్తు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో కోతలు పెట్టడం లేదు.

హైడ్రాలిక్ ప్రాజెక్టుల్లో ..

మెగావాట్లలో... శరావతి 747, నాగజహరి 696, వారాహి 357, సూపా 99, జోగ్ 72, ఎల్‌పీహెచ్ 21, శివసముద్రం 9, షింషా 6, బాద్రాలో 5, మణిడ్యామ్‌లో 4 మెగావాట్లను తీస్తున్నారు. కొడసల్లి, కాద్రా, గేరుసుప్పా, మునీరాబాద్, ఘటక ప్రభ, ఆలమట్టిలో ఉత్పాదనను నిలిపివేశారు. మొత్తం 16 ప్రాజెక్టుల ద్వారా 3666.6 మెగావాట్లను తీయాల్సి ఉండగా.. ప్రస్తుతం 1972 మెగావాట్లను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం 2016 మెగావాట్లు తయారవుతోంది.

శాస్త్రీయ దృక్పథం అవసరం

విద్యార్థికి పుస్తకం అందిస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో శాస్త్రీయ భావాలు పెంపొందించాలని ఉపాధ్యాయుడు రవి పేర్కొన్నారు. తాలూకాలోని ఆశాపూరు ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఆచరించారు. రవి ప్రసంగిస్తూ మూఢ విశ్వాసాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయలేక ప్రశ్నలగానే మిగిలిపోయాయని విచారం వ్యక్తం చేశారు. ఏ విషయాన్ని అయినా శాస్త్రీయ కోణంలో ఆలోచించటాన్ని అలవరచుకోవాలని సూచించారు. పర్యావరణానికి ముప్పుగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించేందుకు విద్యార్థులు తమ వంతు శ్రమించాలని కోరారు. పొలాల్లో రసాయిన ఎరువులను మితంగా వినియోగించేలా రైతుల్లో చైతన్యం తేవాల్సిన అవసరముందని చెప్పారు. ఉద్యోగి తాయమ్మ, సిబ్బంది రత్నమ్మ, శశికళా, మరియమ్మ విజ్ఞాన పోటీల్లో గెలుపొందిన వారికి పుస్తకాలను ప్రదానం చేశారు. అతిథి ఉపాధ్యాయులు గిరిజా, సునితా పాల్గొన్నారు.

విజ్ఞానంతో ప్రగతి సాధ్యం

రాయచూరు : తాలూకాలోని ఉడమగల్ ఖానాపూరు పాఠశాలలో సర్కారీ బడిలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్ చిత్రపటానికి జిల్లా రెడ్ క్రాస్ విద్యా విభాగం సంచాలకుడు దండప్ప బిరాదార్ పూల మాల వేశారు. ఉపాధ్యాయులతో కలసి నివాళులర్పించారు. దేశాల అభివృద్ధిలో విజ్ఞానమే ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు వివరించారు. సాంకేతిక విషయాలపై పరిశోధనలను చేయటానికి విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. ముఖ్య గురువు వీరేశ్ అంగడి, టీచర్లు అనితా, వీణా కులకర్ణి, శివలీలా, సరస్వతి, సావిత్రి, నఫిజ్ అంజుమ హాజరయ్యారు.

ప్రజాచైతన్యంతోనే మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: సమాజంలో జరుగుతున్న నేరాలు నియంత్రణ, మాదక ద్రవ్యాల విక్రయాలు, సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు ఆదివారం మైసూరులోని ప్యాలెస్ మైదానంలో మైసూరు నగర పోలీసులు మాదక ద్రవ్యాల నిర్మూలన వాక్‌థాన్ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మహదేవప్ప పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ప్యాలెస్ మైదానం నుంచి ప్రారంభమైన వాక్‌థాన్‌లో విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు పోలీసులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. ఐదు కిలోమీటర్ల వాక్‌థాన్‌లో అన్నివర్గాల ప్రజలు ఆనందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ మహదేవప్ప మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు వాక్‌థాన్ చేపట్టారన్నారు. మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కంకణం కట్టుకున్నారని తెలిపారు. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులుపై ఉందన్నారు. కార్యక్రమంలో శాసనసభ్యులు జీటీ దేవేగౌడ, శ్రీవత్స, సినీనటులు వినయ్‌రాజ్‌కుమార్, అమృత అయ్యంగార్, బృందా ఆచార్య తదితరులు హాజరయ్యారు.

భార్యను హత్య చేసి భర్త ఆత్మహత్య

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: కుటుంబ కలహాల కారణంగా భార్య మంజుళ (27)ను హత్య చేసి ఒడిశా నివాసి, భర్త దీపాంతర సబర (31) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి సూర్యనగర పోలీసురాణా పరిధిలో జరిగింది. భార్యభర్తలిద్దరూ బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బొమ్మసంద్రలోని ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు. సూర్యనగర సమీపంలోని హీలలిగె గ్రామంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. భార్యను హత్య చేసి దుఃఖిస్తూ తాను ఆత్మహత్యకు పాల్పడే స్వయం చిత్రాన్ని చరవాణిలో చిత్రీకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనకు కారణాలు తెలియరాలేదు. మృతదేహాలను ఆనేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లాల్‌బాగ్‌లో కొత్త గేటు ఏర్పాటుకు వ్యతిరేకత

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: నగరంలోని లాల్‌బాగ్ ఉద్యానవనం వద్ద కొత్త గేటు నిర్మాణానికి పరిసరవాదులు, వాయువిహారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉద్యానవనాల శాఖ ప్రస్తుతం ఉన్న క్యాంటీన్ సమీపంలో నూతన గేటు నిర్మాణం చేపట్టాలని తీర్మానించింది. ఇందుకు లాల్‌బాగ్ వాయువిహారులు పరిసర ప్రేమికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకుడుగుంతలో రసాయనాలు పీల్చి ముగ్గురి మృతి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: వాననీటి ఇంకుడు గుంతను శుభ్రం చేసే సమయంలో ముగ్గురు మృతి చెందిన సంఘటన వైట్‌ఫీల్డ్ పోలీసురాణా పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతులను మునిశామప్ప (67), రుద్రకుమార్ (40) విశ్వనాథ్‌ఆచారి (24గా) పోలీసులు గుర్తించారు. వారి వివరాల మేరకు.. శనివారం సాయంత్రం ఇంటి యజమాని మునిశామప్ప 12 ఏళ్ల కిందట నిర్మించిన ఇంకుడు గుంతను వినియోగించలేదు. దీంతో గుంతలో చెత్త పడి దుర్వాసన వస్తోంది. రసాయనిక మందులు చల్లి శుభ్రం చేసేందుకు ప్రయత్నించారు. గుంతను శుభ్రం చేసేటప్పుడు మునిశామప్ప స్పృహ తప్పి పడిపోయారు. ఆయనను రక్షించేందుకు వెళ్లిన ప్లంబర్ రుద్రకుమార్ కూడా అలాగే పడిపోగా.. వారిద్దరినీ కాపాడేందుకు గుంతలో దిగిన విశ్వనాథ్ స్పృ తప్పి పడిపోయారు. ముగ్గురిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు పోలీసులు తెలియజేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నవ దంపతుల విషాదాంతం

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: రహదారి పక్కన నిలబడి ఉన్న లారీని వేగంగా సంచరిస్తూ వచ్చిన కారు ఢీకొన్న ఘటనలో నవదంపతులు దుర్మరణం చెందారు. ఈ ఘటన ఆదివారం ఉదయం హావేరి జిల్లా తడక పోలీసురాణా పరిధిలో జరిగింది. హావేరి నివాసులు కార్తీక్ హొగార (34), ఐశ్వర్య (30) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన మరో ఇద్దరు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిద్దరికి 15 రోజుల కిందట వివాహమైంది. దైవదర్శనం కోసం నలుగురు కారులో బయలుదేరారు. శిగ్గావి తాలూకా కడవళ్లి గ్రామం వద్ద తెల్లవారుజామున 5.45 గంటలకు రహదారి పక్కన నిలబడి ఉన్న లారీని కారు ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు.

విద్యతోనే సంస్కారం, జ్ఞానం పొందుతాం

అభిమానులను పలకరిస్తున్న నికేత్‌రాజ్ మౌర్య

సింధనూరు, న్యూస్‌టుడే: చదువు అంటే నేటి యువతలో చాలా మంది మదిలో ఉద్యోగం కోసమే అనే భావన ఏర్పడింది. అది తప్పు విద్య మనిషికి సంస్కారాన్ని నేర్పుతుంది. విలువలు తెలుసుకునేలా చేస్తుంది. చక్కని జ్ఞానాన్ని అందిస్తుంది. వాటితో మన జీవితాన్ని మలుచుకోవాలి అని బెంగళూరు బీఎంటీసీ సంస్థ ఉపాధ్యక్షుడు నికేత్‌రాజ్ మౌర్య విద్యార్థులకు వివరించారు. సింధనూరులోని అన్విత కళాశాల యాజమాన్యం ఆదివారం స్థానిక శ్రీసత్యా గార్డెన్స్‌లో సంస్కార కుటుంబం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న రాజ్ తన ప్రసంగంతో యువతకు విద్యపై మార్గదర్శనం చేశారు. దీనికి ముందు ఆయన అభిమానుల కోరిక మేరకు సింధనూరు తాలూకా గొరేబాళక్యాంపు సందర్శించారు. అక్కడున్న ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. అభిమానులు నికేత్‌రాజ్‌కు మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్‌కలాం చిత్రపటాన్ని జ్ఞాపికగా ఇచ్చారు. అన్విత కళాశాల కార్యక్రమంలో ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి, ఆర్డీసీసీ నిర్దేశకుడు సోమనగౌడ, యద్దలదొడ్డి మహాలింగస్వామి, వెంకటగిరి క్యాంపు సిద్ధాశ్రమం సదానంద శరణులు పాల్గొన్నారు.

శిరస్త్రాణం ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

మాట్లాడుతున్న ఎస్పీ అరుణాంగ్షు

రాయచూరు, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహన చోదకులు శిరస్త్రాణాన్ని తప్పనిసరిగా పెట్టుకోవాలని ఎస్పీ అరుణాంగ్షు గిరి సూచించారు. పోలీస్ శాఖ, ఎస్‌బీఐ సంయుక్తంగా ఆదివారం మహాత్మాగాంధీ మైదానంలో 'మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఐదు కిలోమీటర్ల పరుగు పోటీలను ఎస్పీ ప్రారంభించారు. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో హెల్మెట్ ధరించని వారే ఎక్కువ మంది ఉన్నట్లు తేలడం ఆందోళన కల్గిస్తోందన్నారు. కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని సంచార నియమాలను పాటించాలని కోరారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఉండేందుకు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. జీవితాన్ని నాశనం చేసే దురలవాట్లకు దూరంగా ఉండాలని హితవు పలికారు. శారీరక దృఢత్వం కోసం నిత్యం వ్యాయామం, నడక, యోగా, ధ్యానం చేయాలని కోరారు.

దుబాయ్‌లో చిక్కుకున్న సింధనూరు వైద్యుడు శివరాజ్

దుబాయ్‌లో భార్యతో కలిసి తీసుకొన్న ఫొటోను పంపిన డాక్టర్ శివరాజ్

సింధనూరు, న్యూస్‌టుడే: ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ శివరాజ్ దుబాయ్‌లో చిక్కుకున్నారు. ఓ ప్రముఖ ప్రచురణ సంస్థ విజయరత్న అనే ప్రశస్తికి ఆయనను ఎంపిక చేసింది. శివరాజ్‌తో పాటు రాష్ట్రంలోని పలువురు ప్రముఖులను ఈ పురస్కారానికి ఎంపిక చేసి ప్రశస్తి ప్రదానోత్సవాన్ని దుబాయ్‌లో ఏర్పాటు చేసింది. స్వీకరించేందుకు శివరాజ్ సతీ సమేతంగా రెండ్రోజుల క్రితం దుబాయ్ వెళ్లారు. తిరిగి భారత్ రావడానికి ఆదివారం తిరుగు ప్రయాణానికి టికెట్లు కూడా బుక్ చేసుకున్నారు. ఇంతలో ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పర దాడుల నేపథ్యంలో విమానాలు రద్దు కావడంతో వారు దుబాయ్‌లోనే చిక్కుబడిపోయారు. ఓ హోటల్లో సురక్షితంగా ఉన్నాం.. ఇక్కడి అధికారుల ఆదేశాలతో గది కిటికీలు కూడా తెరవడం లేదు.. రెండ్రోజుల్లో విమానాల రాకపోకలు ఆరంభమైతే వచ్చేస్తాం.. ఆందోళన చెందొద్దంటూ శివరాజ్ సింధనూరులోని వాళ్ల బంధువులకు సమాచారం అందించారు.

(c) eenadu

భయం వీడండి.. విజయాలు లిఖించండి

● 'ఈనాడు-ఈటీవీ, జిల్లా విద్యాశాఖ' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : పదో తరగతి విద్యార్థులు భయాన్ని వీడితేనే రానున్న వార్షిక పరీక్షల్లో అనుకున్న మార్కులు సాధించగలరని నిపుణులు సూచించారు. 'పది' వార్షిక పరీక్షల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో.. ఉత్తమ మార్కులు సాధించాలంటే ఎలా సన్నద్ధమవ్వాలి? జవాబులు రాసే క్రమంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే అంశంపై 'ఈనాడు-ఈటీవీ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఫోన్ ఇన్ కార్యక్రమం జరిగింది. ఉమ్మడి (తెలుగు), రవీంద్రబాబు (హిందీ), వినోద్ కుమార్ (ఇంగ్లిష్), ఆర్ అహ్మద్ (గణితం), ఉస్మాన్‌పాషా (భౌతిక శాస్త్రం), రాజశేఖర్ (జీవ శాస్త్రం), అబ్దుల్‌రహీం (సాంఘిక శాస్త్రం) పాల్గొని విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. డీఈవో సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన 'పదో తరగతి విద్యార్థుల సందేహాల నివృత్తి' కార్యక్రమంలో చాలామంది విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో సుధాకర్, ఉపాధ్యాయులు

కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు బృందాలుగా ఏర్పడి ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మొత్తం 108 మంది ఫోన్ చేసి సబ్జెక్టు నిపుణులతో మాట్లాడారు. కర్నూలు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన ఫోన్ ఇన్‌లో ఉపాధ్యాయులు వెంకటరమణ గౌడ్ సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికతో చదివితే ఉత్తమ మార్కులు సాధించవచ్చన్నారు. నిపుణులు సూచనలు పాటించాలన్నారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● గణిత పరీక్షల్లో పాటించాల్సిన మెలకువలు, సూచనలు 6లో

ఐనకల్లు.. తప్పని కన్నీళ్లు

ఆస్పరి మండలం అట్టేకల్లు పంచాయతీ పరిధి.. మజరా ఐనకల్లులో ఏటా తాగునీటి సమస్య వేధిస్తోంది. గ్రామంలో 1,600 మంది ఉన్నారు. హంద్రీ వాగులో బోరు వేసి గొట్టాల ద్వారా గ్రామంలోకి నీరు సరఫరా చేస్తున్నారు. ట్యాంకు ఉన్నా నీరు పైకి చేరడం లేదు. ఊరి బయట, పాఠశాల వద్ద మరో కుళాయి ఏర్పాటు చేశారు. దూరం నుంచి నీరు తెచ్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనం, మూడు చక్రాల బండ్లపై తెచ్చుకుంటున్నారు. – న్యూస్‌టుడే, ఆస్పరి

ఆన్‌లైన్‌లో జాబితా

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : పాఠశాల సహాయకుల పదోన్నతులకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు డీఈవో సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే 2 నుంచి 4వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు సరైన పత్రాలు సమర్పించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డా.ఎ.సిరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కార్యాలయాలు, రెవెన్యూ డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని చెప్పారు.

అధనం.. వీడని గృహణం

ముందుకు కదలని నిర్మాణాలు ◆ ఉగాది నాటికి పూర్తయ్యేనా..

పరిశీలన

ఇళ్లు కాదు.. ఊళ్లే నిర్మిస్తాం.. పేదల సొంతింటి కల నెరవేరుస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసింది. అనువుగానిచోట స్థలాలు కేటాయించింది. అడపాదడపా నిర్మించుకున్నా చాలామందికి బిల్లులు మంజూరు చేయలేదు. ఫలితంగా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి ఉగాది నాటికి పూర్తి చేయించాలని గృహనిర్మాణ శాఖకు లక్ష్యాలు విధించింది. – న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

గూడూరులో గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. సుదూర ప్రాంతంలో ఇవ్వడం.. అవసరమైన వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఫలితంగా కాలనీ మొత్తం ముళ్ల పొదలతో నిండిపోయింది.

రూ.11.88 కోట్లు పంపిణీ

● ఎస్సీ, బీసీలకు ఒక్కో ఇంటి నిర్మాణానికి అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున సాయం అందించింది. గతేడాది మార్చిలో కర్నూలు జిల్లాలో 3,499 మందికి రూ.5.14 కోట్లు, నంద్యాల జిల్లాలో 4,522 మందికి రూ.6.74 కోట్లు కలిపి మొత్తం రూ.11.88 కోట్లు పంపిణీ చేశారు. 1,400 మంది పనులు ప్రారంభించారు. అందులో కనీసం 25 శాతం నిర్మాణాలు పూర్తి కాలేదు.

● గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రూ.1.80 లక్షలతో పాటు ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు కలిపి రూ.2.30 లక్షలు, ఎస్టీలకు రూ.2.55 లక్షలను కూటమి ప్రభుత్వం అందిస్తున్నా లబ్ధిదారులు స్పందించడం లేదు.

వీరికి స్థలాలు ఇస్తే..

● పీఎం ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 కింద సర్వే చేపట్టారు. కర్నూలు జిల్లాలో 31,015, నంద్యాలలో 34,880 మందికి ఇళ్లు లేనట్లు గుర్తించారు. వీరి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో కర్నూలులో 27,948, నంద్యాలలో 30,268 మంది అర్హులుగా గుర్తించారు. వీరిలో సొంత స్థలాలు ఉన్నవారు 80 శాతం మంది ఉండగా మిగిలినవారికి లేవు. వీరికి పట్టాలిస్తే ఇళ్లు నిర్మించుకొనేందుకు సిద్ధంగా ఉన్నారు.

బతిమాలుతున్నా వినిపించుకోరు..

● అదనపు సాయం తీసుకున్న నేపథ్యంలో పనులు ప్రారంభించాలంటూ వార్డు అమినిటీస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

● నిర్మాణాలు చేపట్టండి.. లేదా.. అడ్వాన్స్ రూపంలో పొందిన మొత్తం వెనక్కి ఇవ్వాలంటూ అధికారులు తాఖీదులిచ్చినా ప్రయోజనం లేకపోయింది. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.. చాలా కాలనీల్లో పునాదులు, బేస్‌మెంట్ల వద్దే ఆగిపోయాయి.

అంశం	కర్నూలు	నంద్యాల
పనులు ప్రారంభించనివి	2,112	1,876
వివిధ దశల్లో ఉన్నవి	12,229	12,897
ఉగాదికి లక్ష్యం	14,431	14,773

పత్రాలు ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు పేర్కొన్నారు. నగరంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 3న కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్నా నేటికీ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి మరియానందం తదితరులు పాల్గొన్నారు.

రహదారిన పడనున్నాయ్

● మరమ్మతులకు ఏపీఆర్ఆర్ఎస్పీ నిధులు

ఉమ్మడి జిల్లాలోని రహదారులకు కొత్త రూపు రానుంది. ఏపీఆర్ఆర్ఎస్పీ (ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ స్ట్రెంథనింగ్ ప్రాజెక్టు) కింద పంచాయతీరాజ్ శాఖకు నిధులు మంజూరయ్యాయి. గ్రామీణ రహదారులకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ఫలితంగా చాలా ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం దెబ్బతిన్న వివిధ రహదారులను గుర్తించి ఏపీఆర్ఆర్ఎస్పీ కింద అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.
–న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

రూ.155.71 కోట్లు మంజూరు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 64 రహదారులను 260.873 కి.మీ. పొడవునా అభివృద్ధి చేసేందుకు రూ.155.71 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు రాష్ట్ర స్థాయిలో త్వరలో టెండర్లు పిలవనున్నారు. ఈ వేసవిలోనే పనులు ప్రారంభించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. పనులన్నీ పూర్తైతే జనం కష్టాలు తీరనున్నాయి. రాకపోకలు సాగించేందుకు అనుకూలమైన మార్గం ఏర్పడుతుంది.

ఈ చిత్రంలోనిది బండిఆత్మకూరు-కరిమద్దెల రహదారి. సుమారు 1.302 కి.మీ. పొడవునా దెబ్బతింది. ఈ మార్గం అభివృద్ధికి రూ.72 లక్షలు మంజూరయ్యాయి. రెండు మండలాలను కలిపే ఈ రహదారి గత ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ఫలితంగా జనం ఇబ్బందులు పడేవారు. పనులు పూర్తైతే సాఫీగా ప్రయాణం సాగించొచ్చు.

దెబ్బతిన్నవాటికి ప్రాధాన్యం

● ఉమ్మడి జిల్లాలో పలు గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంచాయతీరాజ్ అధికారులు వీటిని గుర్తించి నిధులకు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం ఆమోదించింది.

● ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలంలో చాగలమర్రి-చిన్నవంగలి రహదారి 8.76 కి.మీ. పొడవునా దెబ్బతినగా దీనికి రూ.4.37 కోట్లు మంజూరయ్యాయి.

● బనగానపల్లి నియోజకవర్గంలోని పసుపుల-పెద్ద మల్కాపురం రహదారిపై 5.32 కి.మీ. పొడవునా గుంతలు పడ్డాయి. ఈ రోడ్డుకు రూ.4.21 కోట్లు కేటాయించారు.

● కర్నూలు జిల్లా.. ఆదోని మండలంలోని హనవాళు-పెద్దహరివాణం రహదారికి రూ.3.51 కోట్లు మంజూరు చేశారు.

● పత్తికొండ నియోజకవర్గంలోని దేవనకొండ మండలంలో పి.కోటకొండ క్రాస్ రహదారి నుంచి లక్కసాగరం వరకు 7.401 కి.మీ. మార్గానికి సుమారు రూ.4.07 కోట్లు కేటాయించారు.

● మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం మండలంలో కౌతాళం-బదినేహాల్ రహదారిని 6.721 కి.మీ. పొడవునా అభివృద్ధి చేసేందుకు రూ.3.87 కోట్లు మంజూరయ్యాయి.

ఏపీఆర్ఆర్ఎస్పీ కింద చేపట్టనున్న పనులు (రూ.కోట్లలో)

జిల్లా	రహదారులు	కి.మీ.లు	నిధులు
కర్నూలు	20	89.33	59.16
నంద్యాల	44	171.543	96.550

ప్రత్యేకత చూపని శిబిరాలు

● 90 శాతానికిపైగా తెరుచుకోని పోలింగ్ కేంద్రాలు

ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. 2002 నుంచి ప్రస్తుత ఓటరు జాబితాతో సరిపోల్చుతూ ఓటరు మ్యాపింగ్ చేపట్టాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇప్పటికీ 60 శాతంలోపే ఓటరు మ్యాపింగ్ జరగడం గమనార్హం. ఎస్ఐఆర్‌ను మార్చి 15వ తేదీనాటికి 80 నుంచి 90 శాతానికి తీసుకొచ్చే ఉద్దేశంతో శని, ఆదివారాల్లో అన్ని నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని, బీఎల్వోలు అందుబాటులో ఉండాలని దరఖాస్తులు స్వీకరించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆ పరిస్థితి ఎక్కడా కానరాలేదు.
– న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో ఉన్న కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో మొత్తం పది పోలింగ్ కేంద్రాలుండగా ఒక్కరంటే ఒక్క బీఎల్వో కూడా హాజరు కాలేదు. చివరికి ఈ పాఠశాలకు తాళం వేసి ఉంచారు.

నెలలుగా సాగుతూ..

ఉమ్మడి జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ గతేడాది సెప్టెంబరు నుంచి కొనసాగుతోంది. 2025 ఓటరు జాబితా ప్రకారం.. కర్నూలు జిల్లాలో 20,82,374 మంది ఓటర్లకుగాను 11.0 లక్షల మందికి సంబంధించి బీఎల్వో యాప్‌లో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయింది.

పర్యవేక్షణ కరవై..

● సచివాలయ ఉద్యోగులైన బీఎల్వోలు శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటరు సవరణ శిబిరాలు 5 శాతం కూడా నిర్వహించలేదు. ఆదివారం సైతం అంతంతమాత్రంగానే సాగింది.

● ఈఆర్వోలు, ఏఈఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడంతో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు వెలవెలబోయాయి.

● ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 3,853కుపైగా పోలింగ్ కేంద్రాలుండగా.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కేవలం 5-10 శాతం మంది బీఎల్వోలు మాత్రమే ప్రత్యేక శిబిరాలకు హాజరయ్యారు.

ప్రహ్లాదవరదుని పరిణయం...
పరవశించెను భక్తజనం



దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదుని పరిణయం అంగరంగ వైభవంగా జరిగింది. అశేష జనవాహిని తిలకిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ ప్రహ్లాదవరదుడు.. అమృతవల్లి అమ్మవారిని పరిణయమాడారు. బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన స్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఉదయం ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అభిషేకం జరిపారు. సాయంత్రం స్వామివారు విశేష అలంకరణలో గజవాహనంపై కొలువుదీరి ఆలయ పురవీధుల్లో విహరించారు. రాత్రి స్వామి, అమ్మవార్లను రత్నాలు, వజ్రాలతో పొదిగిన ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులను కొలువుంచారు. పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ తిరుమాంగల్యధారణ చేసి హోమం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఎగువ అహోబిలంలో ఉదయం జ్వాలా నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై కొలువుంచి కాళింగ నర్తనోత్సవం నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంపై జ్వాలా నృసింహస్వామి విహరించారు.
–న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

మాజీ సైనికుల కుటుంబాలకు అండగా ఉంటాం

ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, వారి కుటుంబాలకు అండగా ఉంటామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హామీ ఇచ్చారు. నగరంలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లోని కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు జరిగిన మాజీ సైనికుల సమస్యల పరిష్కార వేదిక మెగా ఈఎస్ఎం ర్యాలీ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా, ఎయిర్‌వైస్ మార్షల్ సుభాని, కల్నల్ ఇమామ్ సయ్యద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ.. మాజీ సైనికులు, వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. టీఏఎస్ఏ జనరల్ ఆఫీసర్ అజయ్‌మిశ్రా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో 1200 ఫిర్యాదులు అందాయని, 823 అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. కర్నూలులో డిఫెన్స్ కారిడార్ ఏర్పాటవుతున్న దృష్ట్యా రాబోవు రోజుల్లో మాజీ సైనికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వెల్లడించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎనిమిది మంది వీర్ నారీలను సత్కరించారు. మాజీ సైనికులకు వీల్‌ఛైర్లు, వాకింగ్ స్టిక్‌లు అందజేశారు.

రైతులకు గాలం.. సెస్సుకు నామం

తక్కువ ధరకు కొంటున్న వ్యాపారులు ● 'మద్దతు'కు అమ్ముకునేలా పావులు

ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంటలను వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేశారు. వాటిని ఇతరులకు విక్రయించకుండా ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకునేలా పావులు కదుపుతున్నారు. శనగపై కన్నేసిన వ్యాపారులు పెద్దఎత్తున కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు. మరోవైపు వ్యవసాయ మార్కెట్లకు రావాల్సిన సెస్సు సైతం ఎగ్గొడుతున్నారు. కర్నూలు జిల్లాలో 50 వేల ఎకరాల్లో పప్పు శనగ సాగైంది. ఎకరాకు 4 నుంచి నుంచి 5 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో 7 క్వింటాళ్ల వరకు లభించింది. చాలామంది రైతులు పెట్టుబడుల కోసం పెద్దఎత్తున అప్పులు చేశారు. ఈ నేపథ్యంలో వీటిని తీర్చేందుకు.. ఇతర అవసరాల నిమిత్తం చాలామంది అమ్మేసుకున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు సరకును భారీగా కొనుగోలు చేసుకుని వివిధ ప్రాంతాల్లో నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం పప్పుశనగకు క్వింటా మద్దతు ధర రూ.5,827గా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పలు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు సైతం ఏర్పాటు చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా చాలా మంది సరకును కొనుగోలు కేంద్రాలకు తరలించలేక వ్యాపారులకే అమ్మేస్తున్నారు. కొందరు వ్యాపారులు సైతం మాయమాటలు చెప్పి రైతులను మోసగిస్తుండటం గమనార్హం.
– న్యూస్‌టుడే, ఆలూరు గ్రామీణం, హాలహర్వి

ట్రాక్టరులో తరలుతున్న శనగ దిగుబడులు

వివరాలు నమోదు చేసుకోక..

ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించాలంటే ముందుగా సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకొని ఉండాలి. పంట విక్రయించే సమయంలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రైతు సేవా కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పంట కొనుగోలు తేదీకి సంబంధించిన వివరాలు రైతు చరవాణికి వస్తుంది. అప్పుడు సరకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. పలువురు ఈ-పంట నమోదు చేసుకోకపోవడం.. కొన్ని కేంద్రాలు దూరంగా ఉండటంతో వ్యాపారులకు సరకు అమ్మేస్తున్నారు.

ఆదాయం కోల్పోతూ..

● రబీలో పప్పుశనగ సాగు చేసి పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలను వ్యాపారులు గుర్తించే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా ఆర్ఎస్‌కేలలో రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు వారిని తీసుకెళ్తున్నారు. మరికొందరు రాకుంటే వారిని మభ్యపెట్టి కొంత నగదు అందించేలా ఒప్పందం చేసుకుంటున్నారు.

● రైతుల పేర్లతో దిగుబడులను తరలించి అమ్ముకుంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ మార్కెట్ యార్డులు పెద్దఎత్తున ఆదాయాన్ని కోల్పోతున్నాయి. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

పనులంతా నాసి..
నిధులు మేసి

● అధ్వానంగా ఉప కాలువ కట్టడాలు

తుంగభద్ర దిగువ కాలువ పరిధిలో ఉప కాలువల నిర్మాణానికి గతంలో రూ. కోట్ల నిధులు వెచ్చించారు. పనులు చేపట్టిన గుత్తేదారుడు అధ్వానంగా చేసి నిధులంతా స్వాహా చేశారు. ప్రస్తుతం కాలువ రూపు కోల్పోయింది. చుక్కనీరు ప్రవహించని పరిస్థితి ఏర్పడింది. – న్యూస్‌టుడే,ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు గ్రామీణం

పూర్తిగా దెబ్బతిన్న ఉప కాలువ

రూ.35 లక్షలకుపైగా వెచ్చించినా..

మండల పరిధిలోని దైవందిన్నె-తూర్పు కంబదహాల్ ఆయకట్టుకు సాగునీరు అందించేందుకుగాను ఉప కాలువ నిర్మించారు. పొనకలదిన్నె డిస్ట్రిబ్యూటరీ పరిధిలో వచ్చే ఈ ఉప కాలువకురూ.35 లక్షలకుపైగా ఖర్చు చేసి సీసీ లైనింగ్ ఏర్పాటు చేశారు. పనులు అడుగడుగునా అధ్వానంగా జరిగాయి.

ఆయకట్టుకు నీరందక..

సుమారు 2.50 కిలోమీటర్ల పొడవు ఉన్న కాలువతోపాటు పిల్ల కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు శిథిలమయ్యాయి. ఫలితంగా ఆయకట్టు పొలాలకు సాగునీరు పారక అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ కాలువ కింద దాదాపు 3 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కాలువ దెబ్బతినడం.. దీనికి తోడు పెద్దఎత్తున పూడిక పేరుకుపోవడంతో సాగు నీరు ప్రవహించడం లేదు. కాలువకు లైనింగ్ పనులు జరుగుతున్న సమయంలో తమ కష్టాలు తీరాయని అన్నదాతలు భావించారు. తీరా జరిగిన పనులను పరిశీలించి నీరుగారిపోయారు. చివరి ఆయకట్టు పొలాలకు ఏటా నీరందడం లేదు.

రంజాన్ వేళలు

పట్టణం	ఇఫ్తార్ (సోమ)	సహెరీ (మంగళ)
కర్నూలు	6:31	5:13
నంద్యాల	6:12	5:12
ఆదోని	6:28	5:11
ఆళ్లగడ్డ	6:27	5:16
బనగానపల్లి	6:29	5:09

–న్యూస్‌టుడే (కర్నూలు పాతబస్తీ)

మూడుముళ్ల బాటలో బాల్యం

ఏటా పెరుగుతున్న బాల్య వివాహాలు ● చదువుకు దూరమవుతున్న విద్యార్థినులు

నిరక్షరాస్యత, పేదరికం, అభద్రతాభావం వంటి కారణాలతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో బాల్య వివాహాలు క్రమంగా పెరుగుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సర గణాంకాలు దీనిని స్పష్టం చేస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నా.. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి అడ్డుకోవాల్సిన గ్రామస్థాయి కమిటీలు ఉలుకూపలుకు లేకుండా ఉన్నాయి. కర్నూలు జిల్లాలో బాల్య వివాహాలు, టీనేజీ ప్రసవాలు పెరిగిపోతుండటంపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. వీటి కట్టడికి అన్నిశాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
– న్యూస్‌టుడే, కర్నూలు విద్య

ఇక్కడే అధికం

2024-25 ప్రకారం 19 ఏళ్ల లోపువారు 6,550 మంది తల్లులు అయినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో ఆదోని, పత్తికొండ డివిజన్లతో పాటు కర్నూలు నగర శివారు ప్రాంతాలు, నంద్యాల జిల్లాలో ఆత్మకూరు, వెలుగోడు, చాగలమర్రి, సంజామల, బనగానపల్లి, ఆళ్లగడ్డ, శిరివెళ్ల ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఎక్కువ శాతం జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిని ముందే పసిగట్టి అడ్డుకోగలిగితే బాలికలు ఉన్నత చదువులు చదివే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పేరుకే కమిటీలు

బాల్య వివాహాల నియంత్రణ కోసం జిల్లా, డివిజన్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ ఛైర్మన్/ ఛైర్‌పర్సన్‌గా, ఎస్పీ, డీఎంహెచ్‌వో కన్వీనర్లుగా, ఐసీడీఎస్ అధికారి, గైనకాలజీ హెచ్‌వోడీ, డీఈవో, ఆర్ఐవో సభ్యులుగా ఉంటారు. డివిజన్, గ్రామ స్థాయిలోనూ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు పట్టించుకోవడం లేదు.

సమాచారం ఇవ్వొచ్చు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండాకే వివాహం చేయాలి. ఎక్కడైనా తక్కువ వయసు వారికి పెళ్లి చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వొచ్చు. వివరాలు గోప్యంగా ఉంచుతారు. ఛైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసు హెల్ప్‌లైన్ 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181 నంబర్లకు ఫోన్ చేసి బాల్య వివాహాల గురించి సమాచారం తెలియజేయొచ్చు.

ఉమ్మడి జిల్లాలో జరిగిన బాల్య వివాహాలు (2024-25)

వయసు	సంఖ్య
16 ఏళ్లు	1,014
17 ఏళ్లు	1,190
18 ఏళ్లు	1,370

వీరి పాత్ర కీలకం

ఉమ్మడి జిల్లాలోని ప్రతి గ్రామంలో జనాభాను బట్టి రెండు మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఎక్కడ బాల్య వివాహాలు జరుగుతున్నా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు తెలుస్తుంది. పెళ్లిళ్లు జరగకముందే వారు ఉన్నతాధికారులకు సమాచారమిస్తే అడ్డుకునే అవకాశం ఉంటుంది. తాము చెప్పినట్లు తెలిస్తే గ్రామంలో ఇబ్బందులు ఎదురవుతాయన్న ఉద్దేశంతో చాలామంది మిన్నకుంటున్నారు. ఫలితంగా ఐసీడీఎస్ ఉన్నతాధికారులకు సమాచారం అందడం లేదు.

(c) eenadu

అదుపు తప్పితే.. తప్పదు ముప్పు

డోన్ మండలంలోని ఎద్దుపెంట గ్రామ సమీపంలో పంట నూర్పిడి యంత్రంపై కూలీలు ప్రమాదకరంగా వెళుతున్నారు. ఈ యంత్రం గింజలు, పొట్టును వేరు చేస్తుంది. ఒక పొలం నుంచి మరొక పొలంలోకి వెళ్లేటప్పుడు ట్రాక్టర్ ఇంజిన్‌పై ఏడుగురు, నూర్పిడి యంత్రంపై నలుగురు మొత్తం 11 మంది ప్రయాణిస్తున్నారు. ఇలా ప్రమాదకరంగా ప్రయాణించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, డోన్ గ్రామీణం

చెంతనే జలం.. చేను తడపాలంటే భారం

నందికొట్కూరు మండలం మల్యాల వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ ఎత్తిపోతల పథకం నుంచి పంటకాలువ ద్వారా దిగువకు నీరు ప్రవహిస్తుంటుంది. ఈ కాలువ పొడవునా సమీప గ్రామాల రైతులు వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేస్తుంటారు. వారి పొలాలకు మాత్రం ఈ హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా చుక్కనీరు అందదు. దీంతో పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో పైపులు అమర్చి డీజిల్ ఇంజిన్ల ద్వారా నీరు తోడుకుని పంటలకు తడులు అందిస్తున్నారు. ఇంధనం కోసం భారీ మొత్తం ఖర్చవుతోందని రైతులు వాపోతున్నారు. – ఈనాడు, నంద్యాల

దిగువన.. కాల్వగట్టు ఇంతేనా

తుంగభద్ర డ్యామ్ గేట్ల మరమ్మతుల నేపథ్యంలో దిగువ కాల్వకు నీటి విడుదల నిలిపివేశారు. హొళగుంద మండలంలోని దిగువ కాల్వ 193 కి.మీ. పరిధిలోని కడ్లమాగి క్యాంపు వద్ద, కోటేహాల్ డీపీ క్రాస్ రెగ్యులేటర్ వద్ద ఉన్న గట్టు కోతకు గురైంది. ఏడాదిగా అలాగే ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. కోతకు గురైన గట్టు అంచును నిర్మించి, రైతులకు ఇబ్బంది కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, దిగువ కాల్వకు నీరు వచ్చేలోగా సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హొళగుంద

గోడు కనరు.. గోడ కట్టరు

నందికొట్కూరు మండలం 10బొల్లవరం సమీపంలోని వంకపై ఉన్న వంతెనపై రక్షణ గోడ లేదు. నంద్యాల- నందికొట్కూరు మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏమాత్రం అదుపుతప్పినా వాహనాలు వంకలోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. కనీసం ఇక్కడ హెచ్చరిక బోర్డులు కూడా లేవు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు. – ఈనాడు, నంద్యాల

నీటి సమస్యలపై అధికారుల నిలదీత

◆ జడ్పీ సర్వసభ్య సమావేశంలో గళమెత్తిన సభ్యులు

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో వేధిస్తున్న తాగునీటి సమస్యలపై జిల్లా పరిషత్ పాలకవర్గ సభ్యులు గళమెత్తారు. ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన ఆదివారం జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కర్నూలు కలెక్టర్ డా. సిరి, నంద్యాల కలెక్టర్ రాజకుమారి, జడ్పీ సీఈవో జి.నాసర్‌రెడ్డి, ఉప సీఈవో వెంకటసుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం, విద్య, ప్రజా పంపిణీ వ్యవస్థపై చర్చ జరిగింది. జిల్లా పరిషత్ 2026–27 వార్షిక బడ్జెట్‌ను ఉప సీఈవో వెంకటసుబ్బారెడ్డి సభలో ప్రవేశపెట్టారు. రూ.15.78 కోట్ల ఆదాయం, రూ.15.64 కోట్ల వ్యయంతో కూడిన బడ్జెట్‌ను సభ ఆమోదించింది.

మాట్లాడుతున్న ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి. చిత్రంలో సీఈవో నాసర్‌రెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు డా.సిరి, రాజకుమారి

నిధులు వృథాచేస్తే ఎలా?

తాగునీటి సమస్యపై చర్చ సందర్భంగా ఛైర్మన్ పాపిరెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లపై అసహనం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలోని కోడుమూరు, వెల్దుర్తి, తుగ్గలి, నందికొట్కూరు, కొలిమిగుండ్ల, కృష్ణగిరి, నందవరం, కౌతాళం కేంద్రాల్లో రూ.14 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సుజల ప్లాంట్ల నిర్వహణను పట్టించుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని వినియోగంలోకి తేకుండా కొత్తగా ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడాన్ని నిలదీశారు. ప్రజాధనాన్ని వృథా చేయడం తగదన్నారు.

ప్రజల కష్టాలు చూడండి

తమ పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను జడ్పీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల కష్టాలపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. కోడుమూరులో నీటి సమస్య కారణాలను జడ్పీటీసీ సభ్యుడు రఘునాథరెడ్డి వివరించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేయడం లేదని, శిథిలావస్థకు చేరుకుంటున్నా పట్టించుకోవడం లేదని జడ్పీటీసీ సభ్యురాలు శకుంతలమ్మ చెప్పారు. హాలహర్వి, కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామం, డోన్, ప్యాపిలి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడిని సభ్యులు వివరించారు.

రూ.9 లక్షలు ఇవ్వమన్నా స్పందనలేదు

పాణ్యం మండలం తమ్మరాజుపల్లి, గడివేముల మండలం తిరోగం గ్రామాల్లో నీటి వసతి కల్పించేందుకు రూ.9 లక్షలు కేటాయించాలని ఎన్నిసార్లు అడుగుతున్నా జడ్పీ నిధులు విడుదల చేయడం లేదని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'రెండేళ్ల కిందట జడ్పీ నిధులతో చేసిన పనులకే ఇంత వరకు బిల్లులు లేక గుత్తేదారులు ఇబ్బందులు పడుతున్నారు. మీరు కూడా జడ్పీ నిధులు కేటాయించాలంటే ఎలా.. అధికార పార్టీలో ఉన్న మీరు ఏదో ఒక విధంగా నిధులు తీసుకురండి. జడ్పీ నుంచి నిధులు అడగొద్దు' అని కోడుమూరు జడ్పీటీసీ సభ్యుడు రఘునాథరెడ్డి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని కోరారు. కూటమి ప్రభుత్వంలో నిధుల కేటాయింపు లేక చిన్న పనులకు మాత్రమే జడ్పీ నిధులు కోరుతున్నామని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు.

◆ వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డా.సిరి చెప్పారు. 70 శాతం ఎస్ఎస్ ట్యాంకుల్లో నీటిని నింపామని, ఏప్రిల్ రెండో వారంలో టీబీ డ్యాం నుంచి మరోసారి నీరు విడుదల చేయాలని ప్రతిపాదించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.18 కోట్లతో ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

◆ పశ్చిమ ప్రాంతంలో వలసలు కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆశ్రయం ఇచ్చేందుకు సీజనల్ హాస్టళ్లను ఉపయోగంలోకి తేవాలని కోసిగి జడ్పీటీసీ సభ్యురాలు పవిత్రాపాటిల్ కోరారు.

సూత్రాలపై పట్టు.. మార్కుల సాధనకు మెట్టు

➤ 'ఈనాడు-ఈటీవీ, జిల్లా విద్యాశాఖ' ఫోన్‌ఇన్‌లో గణిత ఉపాధ్యాయుడి సూచనలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : చాలామంది విద్యార్థులు గణితమంటే భయపడుతుంటారు. దీనిని అర్థం చేసుకుంటే మార్కులు సులువుగా సాధించవచ్చని వెల్దుర్తి మండలం సూదేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఎస్. ఆరిఫ్ అహ్మద్ పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థుల సందేహాల నివృత్తి చేసేందుకు 'ఈనాడు-ఈటీవీ, జిల్లా విద్యాశాఖ' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ఆయన విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి గణిత పాఠంలోని సూత్రాలపై పట్టు సాధిస్తే పరీక్షల్లో వచ్చే ప్రశ్నలకు సులువుగా సమాధానాలు రాయవచ్చన్నారు. గణితంలో ఉన్న బహుపదులు, వృత్తాలు, త్రికోణమితి, అనువర్తనాలు, ఉపరితల వైశాల్యాలలో పటాలు గీయడంపై సాధన చేయాలని చెప్పారు. మూడు రోజులకు ఒకసారి ఎస్సీఈఆర్టీ మోడల్ ప్రశ్నపత్రాలను సాధన చేయాలన్నారు. ముఖ్యంగా త్రికోణమితి పట్టికలు, సర్వసమీకరణాలు, ఉపరితల వైశాల్యాల పట్టికలపై పట్టు అవసరమన్నారు. సాధన సమయంలో సందేహాలు వస్తే రాసుకుని ఉపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లి వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు.

ఎస్.ఆరిఫ్ అహ్మద్

విద్యార్థి : పాస్ మార్కుల కోసం ఏయే ప్రశ్నలు చదవాలి?

టీచర్: గణితంలోని 1, 2, 3, 7, 13, 14 పాఠాల నుంచి ప్రశ్నలు వస్తాయి. వీటిని బాగా సాధన చేస్తే 40 మార్కులకు పైగానే తెచ్చుకోవచ్చు.

విద్యార్థి : ప్రశ్నలు బ్లూప్రింట్ బేస్‌గా వస్తాయా.. అడిషనల్ బుక్‌లెట్ ఇస్తారా?

టీచర్: వందశాతం బ్లూప్రింట్ బేస్‌గా ప్రశ్నలు వస్తాయి. జవాబులు రాసేందుకు ఇచ్చిన బుక్‌లెట్ పూర్తిగా అయిపోతే మరొక బుక్‌లెట్ ఇస్తారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

విద్యార్థి : గణితంలో ఉత్తమ మార్కులు ఎలా సాధించాలి?

టీచర్: పదో తరగతి ప్రారంభం నుంచే నిత్యం తరగతి గదికి హాజరవ్వాలి. వంద రోజుల ప్రణాళికలో భాగంగా నిత్యం స్లిప్ టెస్టులు రాయాలి. వాటిలో వచ్చిన మార్కుల ఆధారంగా సాధన చేయాలి. ఇలా ప్రణాళికతో లెక్కలు సాధన చేస్తే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించవచ్చు.

విద్యార్థి : ప్రభుత్వం నిర్వహిస్తున్న వంద రోజుల ప్రణాళికలో సాధన చేస్తున్న ప్రశ్నలు పరీక్షల్లో వస్తాయా?

✔ పదో తరగతి గణిత పాఠ్య పుస్తకం నుంచే ప్రశ్నలు వస్తాయి. ఏదైనా నుంచి నేర్చుకున్న అంశాలను వంద రోజుల ప్రణాళికలో అమలు చేస్తారు. ఇందులో తప్పులు సరిదిద్దుకుని, సందేహాలు నివృత్తి చేసుకుంటే పబ్లిక్ పరీక్షల్లో ఒత్తిడి లేకుండా రాసేందుకు వీలుంటుంది.

విద్యార్థి : త్రికోణమితి, ఉపరితల వైశాల్యాల్లో ఏఏ అంశాలు నేర్చుకోవాలి?

✔ ఫార్ములా వాల్యూస్, ఫార్ములా బేస్డ్ ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

విద్యార్థి : ప్రాబబిలిటీ క్రియేటింగ్ ప్రశ్నలకు జవాబు రాయాలా.. వద్దా?

✔ తప్పనిసరి కాదు. ఎక్కువ మార్కులు కావాలనుకునే వారు ప్రాబబిలిటీ క్రియేటింగ్ జవాబులు రాస్తే మేలు.

విద్యార్థి : రఫ్ వర్క్ ఎక్కడ చేయాలి. మార్జిన్ వేయాలా.. ఏ పెన్నుతో రాస్తే బాగుంటుంది?

✔ పరీక్ష సమయంలో బ్లూ, బ్లాక్ పెన్ మాత్రమే ఉపయోగించాలి. ప్రతి పేజీకి మార్జిన్ ఉంటే జవాబు పత్రం ఆకర్షణీయంగా కన్పిస్తుంది. రఫ్ వర్క్‌ను బుక్‌లెట్‌లోని చివరి పేజీలో చేసుకోవడం ఉత్తమం.

ప్రోత్సాహం తోడుగా.. కళలో మెరవగా

◆ నాట్యంలో ప్రతిభ కనబరుస్తున్న బాలికలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సంప్రదాయ నృత్యంపై మక్కువ పెంచుకొని బాలికలు సత్తా చాటుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడుగా కళలో రాణిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో నృత్య పోటీల్లో పాల్గొని భళా అనిపించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ సాధించారు. రాష్ట్రస్థాయితో పాటు జాతీయ స్థాయిలో అవార్డులు పొందాలని నిరంతరం సాధన చేస్తున్నారు.

నాట్యమయూరి.. వెంకటలక్ష్మి

ఈ చిత్రంలోని బాలిక పేరు వెంకటలక్ష్మి. ప్రభుత్వ వీవర్స్‌కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు రుక్మిణి, వెంకటేశ్. గౌండ్ల పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తమ కుమార్తెకు ఇష్టమైన రంగంలో ప్రోత్సహించి కూచిపూడి నృత్యం నేర్పిస్తున్నారు. వెంకటలక్ష్మి జతులు, స్వరాలతో... నృత్య ప్రదర్శనలో భళా అనిపిస్తోంది. అంతర్రాష్ట్ర కూచిపూడి పోటీల విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. 2021లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ పురస్కారం అందుకుంది. 2022 మార్చిలో హంపిలో జరిగిన నృత్య ప్రదర్శనలో పాల్గొని ప్రతిభా పురస్కారం తీసుకుంది. ఇప్పటి వరకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో 98 ప్రదర్శనలు ఇవ్వగా 15 చోట్ల ప్రతిభా పురస్కారాలు అందుకుంది. 2023లో తిరుపతి, హైదరాబాదు, శ్రీశైలం, రాయచూర్, బెంగుళూరు, నెల్లూరు, మహానంది, బళ్లారి, హంపి, గుంటూరు మొదలైన చోట్ల రాష్ట్ర స్థాయి ప్రదర్శనలు ఇచ్చింది. నాట్యబాల, నాట్య సుధ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించి అబ్బురపరిచింది.

ప్రియ సమ్మోహనం

పట్టణానికి చెందిన ప్రియాంక స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో 8 తరగతి చదువుతోంది. చిన్నప్పటి నుంచి నాట్యంపై మక్కువ పెంచుకుంది. తల్లిదండ్రులు గోరంట్ల, శశికళ కూలీలు. కూచిపూడిలో వందకు పైగానే ప్రదర్శనలు ఇచ్చింది ప్రియాంక. మూడేళ్లగా సాధన చేస్తూ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ద్వారా ప్రదర్శనలిస్తోంది. తన హావభావాలతో నాట్యం చేస్తూ భరతనాట్యంలో రాణిస్తోంది. నృత్యంలో వంద ప్రదర్శనలు పైగానే ఇచ్చారు. మూడేళ్లుగా నెల్లూరు, బెంగళూరు, తిరుపతి, మహానంది, బళ్లారి, మంత్రాలయం, శ్రీశైలం, నంద్యాల, హైదరాబాద్, రాయచూరు, హంపి ప్రాంతాల్లో జరిగిన నృత్య ప్రదర్శన పోటీల్లో పాల్గొని అవార్డులు తీసుకుంది. 2022లో తెలంగాణ రాష్ట్రస్థాయిలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన పోటీల్లో రెండోస్థానంలో నిలిచింది. 8 రాష్ట్రాలకు సంబంధించి జరిగిన పోటీల్లో జాతీయ స్థాయిలో 3వ స్థానం సాధించింది.

తక్కువ ధరకు విక్రయిస్తామంటే నమ్మొద్దు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : సైబర్‌నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి తక్కువ ధరలకే వస్తువులు విక్రయిస్తున్నామని మోసగిస్తున్నారని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్‌నేరగాళ్లు పలు బ్రాండెడ్ సంస్థల పేర్లలో నకిలీ వెబ్‌సైట్లను రూపొందించి ఎర వేస్తున్నారన్నారు. ముందుస్తు చెల్లింపులు చేయించుకుని వస్తువులు పంపకుండా మోసగిస్తున్నారన్నారు. ప్రజలు అధికారిక వెబ్‌సైట్‌లలో మాత్రమే వస్తువులు కొనుగోలు చేయాలన్నారు. తక్కువ ధరలకే ఇస్తామంటే త్వరపడి నమ్మవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దని, బ్యాంకు ఖాతా ఓటీపీ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. క్యాష్‌ఆన్ డెలివరీ విధానంలోనే వస్తువులు కొనుగోలు చేయాలన్నారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో నష్టపోయిన బాధితులు టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఏపీ ఎస్పీడీసీఎల్ సర్కిల్ స్థాయిలో వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించుకునేందుకు సోమవారం డయల్ యువర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. కర్నూలుకు సంబంధించిన విద్యుత్తు వినియోగదారులు సమస్యలనున తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

సీఎండీ ఫోన్ నంబరు: 89777 16661
కర్నూలు నంబరు : 7382614308

రూ.5 కోట్లకు బంగారు వ్యాపారుల కుచ్చుటోపీ

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరులో వారం రోజుల వ్యవధిలో ఇద్దరు బంగారు వ్యాపారులు ఉడాయించడం కలకలంగా మారింది. వీరిద్దరూ కలిసి రూ.5 కోట్లకుపైగా కుచ్చుటోపి పెట్టినట్లు తెలుస్తోంది. పట్టణంలోని ఓ దేవాలయం ప్రాంతంలో దుకాణం పెట్టుకున్న వ్యాపారి బంగారు ఆభరణాలను ఆర్డర్‌పై చేయిస్తూ ఉంటారు. నగలు కుదువ పెట్టుకొని డబ్బులు ఇస్తుంటాడు. ఇతను ఆభరణాల కోసం తీసుకున్న డబ్బులు, కుదువపెట్టిన బంగారం విలువ రూ.2 కోట్లకు పైగా ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇతను కొద్ది రోజులుగా దుకాణానికి రావడం లేదు. చివరికి ఉడాయించినట్లు గుర్తించిన బాధితులు జిల్లా ఎస్పీ, స్థానిక పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరుతున్నారు. బంగారు ఆభరణాల కోసం ఇచ్చిన ఆర్డర్‌కు సంబంధించి పలువురి వద్ద సరైన ఆధారాలు లేవు. దీంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఇతను ఓ నేతను ఆశ్రయించి పక్క రాష్ట్రంలో ఆశ్రయం పొందుతున్నట్లు తెలుస్తోంది.

◆ బంగారు ఆభరణాలు తయారుచేసే మరో వ్యాపారి నమ్మకంగా ఉండేవాడు. ఆభరణాల కోసం బంగారు వ్యాపారులు కొందరు, బాధితులు కలిసి సుమారు రూ.3 కోట్ల వరకు బంగారు ఇచ్చినట్లు సమాచారం. ఆభరణాలు తయారు చేయించి ఇవ్వకుండా పత్తా లేకుండా పోవడంతో.. బాధితులు మోసపోయినట్లు తెలుసుకొని మనోవేదన చెందుతున్నారు. బంగారం పేరిట పెద్దఎత్తున మోసానికి పాల్పడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

భక్తులతో కిక్కిరిసిన అహోబిలం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. బ్రహ్మోత్సవాలు కావడంతో దూరప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఎగువ, దిగువ ఆలయాలతో పాటు నల్లమల అటవీ ప్రాంతంలోని పావన, మాలోల, జ్వాలా నృసింహస్వామి ఆలయాలను దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది. భక్తులు బారులు తీరి క్యూలైన్లలో వేచిచూడక తప్పలేదు.

దర్శనానికి బారులు తీరిన భక్తులు

పోలీసుల ఆంక్షలతో ఇబ్బందులు

బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులు పోలీసుల ఆంక్షలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా దిగువ అహోబిలంలో ఆరంభంలోనే చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి పార్కింగ్ స్థలం వద్ద వాహనాలు నిలిపేస్తున్నారు. పార్కింగ్ స్థలం నుంచి ఆలయానికి చాలా దూరం ఉండటంతో కాలినడకన అవస్థలు పడుతూ ఆలయానికి చేరుకుంటున్నారు. పోలీసులు బందోబస్తు పేరుతో చేస్తున్న ఆంక్షలతో ఆలయ నిర్వాహకులకు తలనొప్పిగా మారింది. సమీక్ష సమావేశంలో కూడా ఆలయ సీఏవో రామానుజన్ దీనిపై ప్రస్తావించారు. ఇకనైనా పోలీసు అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

బాంబుల వర్షంతో భయపడుతున్నాం

ప్రేమసాగర్, సివిల్ ఇంజినీరు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: యునైటెడ్ అరబ్ మెరిట్స్(యూఏఈ) దేశంలోని దుబాయిలో రెండు రోజులుగా ఇరాన్ దేశం బాంబులు కురిపిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో యూఏఈ దేశంలోని ఆయా నగరాల్లో ఉంటున్న మన తెలుగు రాష్ట్రాల వాళ్లు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పుడు బాంబులు పడతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఆదోని మండలం సాంబగల్లు గ్రామానికి చెందిన సూరిపోగుల ప్రేమసాగర్ యూఏఈ దేశంలోని ఉమ్మి అల్ క్విన్ నగరంలో సివిల్ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నగరం దుబాయి నగరానికి కేవలం 58 కి.మీ.ల దూరంలో ఉంటుంది. ఇక్కడ సుమారు వంద మందికి పైగానే మన తెలుగోళ్లు ఉన్నారని, దుబాయి నగరంపై బాంబుల వర్షం కురుస్తున్న నేపథ్యంలో మేమందరం ఇక్కడ భయాందోళన చెందుతున్నాం. ప్రస్తుతం మాత్రం మేము ఉన్న ప్రాంతంలో బాంబులు పడడం లేదు. ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావద్దని ప్రభుత్వ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తాను క్షేమంగా ఉన్నట్లు ఆదోనిలోని తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు ప్రేమసాగర్ తండ్రి ఛార్లెస్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

విద్యుత్తు దీపాల అలంకరణలో ఆలయ రాజగోపురం

పెరవలి(మద్దికెర), న్యూస్‌టుడే: పెరవలి రంగనాథస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఆలయం ఎదుట సంప్రదాయ పద్ధతిలో పందిరి వేశారు. అనంతరం ధ్వజారోహణంతో ఉత్సవాలకు ఆలయ కార్యనిర్వహణాధికారి వీరయ్య, ప్రధాన అర్చకులు రంగస్వామి, ఆలయ పాలక మండలి సభ్యులు, గ్రామస్థులతో కలిసి అంకురార్పణ చేశారు. స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఈనెల 8న రాతి దూలం పోటీలు నిర్వహించనున్నారు.

రివాల్వర్‌తో విశ్రాంత సీఆర్‌పీఎఫ్ పోలీసు హల్‌చల్

☛ సీటు కోసం ప్రయాణికులకు బెదిరింపులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లు పరిధిలో రైలు జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న సీఆర్‌పీఎఫ్ విశ్రాంత పోలీసు మనోహర్ సీటు కోసం ప్రయాణికులను తన లైసెన్స్డ్ రివాల్వర్‌తో బెదిరింపులకు దిగాడు. ప్రయాణికులంతా భయాందోళనకు గురయ్యారు. ఆదివారం రాత్రి యలహంక నుంచి కాచిగూడకు వెళ్లే ప్రశాంతినిలయం ఎక్స్‌ప్రెస్‌లో ఈఘటన జరిగింది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం ఆర్.కృష్ణాపురం గ్రామానికి చెందిన మనోహర్ రైలులో ప్రయాణిస్తూ రివాల్వర్ తీసుకొని హల్‌చల్ చేశాడు. తనకు సీటు ఇవ్వాలంటూ ప్రయాణికులను బెదిరించాడు. కొందరు ప్రయాణికులు గుంతకల్లు ఆర్పీఎఫ్‌లకు సమాచారమిచ్చారు. రైలు గుంతకల్లు జంక్షన్‌కు చేరుకోగానే వెంటనే వారు బోగీ వద్దకు చేరుకుని విశ్రాంత పోలీసును అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. తాను రివాల్వర్‌తో ప్రయాణికులను బెదిరించలేదని పోలీసులకు సమాధానమిచ్చారు. ఇక ముందు ఈ విధంగా ప్రవర్తిస్తే గట్టి చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించి పంపారు.

ఏపీ ఐకాస జిల్లా చైర్మన్‌గా జవహర్‌లాల్

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లా ఏపీ జేఏసీ ఛైర్మన్‌గా వి.జవహర్‌లాల్, కార్యదర్శిగా ఇస్మాయిల్ ఎన్నికయ్యారు. నగరంలోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఏపీ జేఏసీ భాగస్వామ్య సంఘాల సభ్యులంతా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులుగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు పాల్గొన్నారు. సంఘం ఐక్యత, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కర్నూలు జిల్లా ఏపీ జేఏసీ ఛైర్మన్‌గా జవహర్‌లాల్ (ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు), కార్యదర్శిగా ఇస్మాయిల్ (ఏపీటీఎఫ్-1938 జిల్లా అధ్యక్షుడు), కోఛైర్మన్లుగా ఇస్మాయిల్ (ఆర్టీసీ ఎన్ఎంయూఏ), సుంకన్న (ఎస్టీయూ), ఎంసీ కాశన్న (ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి), వెంకటేశ్వర్లు (వెటర్నరీ), వైస్ ఛైర్మన్లుగా కృష్ణారెడ్డి, లింగన్న, చాంద్‌బాషా, నాగకిషోర్, మధుసూదన్‌రెడ్డి, నవీన్‌పాటిల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా సాంబశివారెడ్డి, కోశాధికారిగా భాస్కర్‌నాయుడు, జాయింట్ సెక్రెటరీలుగా వివిధ సంఘాలకు చెందిన పదిమంది, కార్యవర్గ సభ్యులుగా 15 మందిని ఎన్నుకున్నారు. సుమారు 75 ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు ఎన్నికల్లో పాల్గొన్నారు.

కేసీ కాల్వలో యువకుడి గల్లంతు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: బండిఆత్మకూరు-శింగవరం గ్రామాల మధ్య ఉన్న కేసీ కాల్వ నీటి ప్రవాహంలో హేమంత్(17) అనే యువకుడు ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడు. పల్లె సృజన కార్యక్రమంలో భాగంగా సుమారు పది మంది జట్టుగా ఆదివారం శింగవరం గ్రామానికి వచ్చారు. ఉదయం 11గంటల సమయంలో కేసీ కాల్వ సమీపంలో పంట పొలాల్లో ఉన్న రైతులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించారు. తిరిగి వచ్చే సమయంలో కేసీ కాల్వలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు హేమంత్ అనే యువకులు కాల్వలో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సై జగన్ మోహన్ సిబ్బందితో కేసీ కాల్వ వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో డ్రోన్ ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. కాల్వలో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో యువకుడి ఆచూకీ లభించలేదు. హేమంత్ ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం శివపురం గ్రామానికి చెందిన శివయ్య కుమారుడిగా గుర్తించినట్లు ఎస్సై వివరించారు.

రహదారి ప్రమాదంలో ఒకరి మృతి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని జాతీయ రహదారి బైపాస్‌పై ఆదివారం వేకువజామున జరిగిన రహదారి ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. నంద్యాల నుంచి కర్ణాటక రాష్ట్రం చింతామణి పట్టణానికి వెళ్తున్న అంబులెన్స్.. ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. పట్టణ ఎస్సై నగీనా తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల పట్టణంలోని చాంద్‌బాడకు చెందిన చాంద్‌బాషా వారం రోజులు క్రితం కిందపడటంతో వెన్నముక దెబ్బ తింది. చికిత్స కోసం చాంద్‌బాషాతోపాటు మరికొందరు చింతామణి పట్టణానికి వెళ్లేందుకు శనివారం రాత్రి అంబులెన్స్‌లో బయలుదేరారు. పట్టణ పరిధిలోని బైపాస్ రహదారి వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని దాటే క్రమంలో ప్రమాదం జరిగింది. చాంద్‌బాషా సోదరుడి వరుసయ్యే ఖాజామొహిద్దీన్(45) తీవ్ర గాయాలతో మృతి చెందారు. డ్రైవరు రాముడు, చాంద్‌బాషా, జాకీర్ గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఖాజా మొహిద్దీన్ (పాత చిత్రం)

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని కాల్వలో ఉన్న పుట్టగొడుగుల పరిశ్రమలో పనిచేస్తున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన హేమంత్‌దాస్ కూలీలను తీసుకువచ్చి పని చేయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇతనికి ఒడిశాకే చెందిన సుష్మిత (23)తో పరిచయమైంది. రెండు నెలల కిందట వీరు వివాహం చేసుకున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో తరచూ గొడవలు జరిగేవి. దీంతో జీవితంపై విరక్తి చెందిన సుష్మిత ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో పంకాకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు విషయం తెలుసుకుని 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కడితోటలో ఉరేసుకొని..

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: కడితోట గ్రామానికి చెందిన శ్రీకాంత్(21) ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దతుంబళం ఎస్సై విద్యశ్రీ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్రీకాంత్ కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. కొన్నేళ్లు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER
బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించికొనబడును. (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెని ✆ 73821 14647.

EDUCATION
విద్యార్థులకు వారి కెరీర్ విద్యా ప్రవేశాల గురించి సలహాలు సూచనలు చేయడానికి టీచర్స్, రిటైర్డ్ టీచర్స్, ప్రిన్సిపల్స్‌ను ఖాళీ సమయంలో ఫ్రీలాన్స్ - జాబ్ పద్ధతిన చేయడానికి ఆహ్వానం ట్రైనింగ్ ఇవ్వబడును. కర్నూలు. ✆ 72077 70916, 89777 97830.

MARRIAGE SERVICES
అన్ని కులముల వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. వనజారావు క్విక్ మ్యారేజెస్, S.V. కాంప్లెక్స్, కర్నూలు. సంప్రదించండి: 93938 23550, 08518 249195.

REAL ESTATE

PLOT FOR SALE
ఓర్వకల్ ఇండస్ట్రియల్ ఏరియాలో ఎయిర్ పోర్ట్ దగ్గరలో తక్కువ ధరలో ప్లాట్లు కలవు&కర్నూలు టౌన్ నందు డ్యూప్లెక్స్‌లు, విల్లాస్‌లు, హౌస్‌లు, ప్లాట్లు కలవు. సంప్ర: 80999 09366.

JOBS
Wanted Male Marketing Staff, Male Admin Incharges and Female Telecallers (Must be Married) Qual: Any Degree, Age Limit: 25 to 45 years, Salary: 10000/- to 20000/- Working Location: Master Minds College, Kurnool, Contact: 92487 33342.

కర్నూలు నంద్యాల చెక్ పోస్ట్ లో మల్లికార్జున ఫర్నిచర్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ. సంప్ర॥ Cell: 98493 50328.

కర్నూలు, నంద్యాల చెక్‌పోస్ట్ నందుగల వినాయక సోలార్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం 15,000+ Incentive ఇవ్వబడును. సంప్ర. 95025 92654.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

ఆలయ నిర్మాణానికి విరాళం

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలూరు పట్టణం లోని కోటవీధిలో భీమలింగేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపడుతున్నారు. పట్టణానికి చెందిన ఏసప్ప కుమారుడు చిన్నబాబు రూ.50 వేలు, మరో యువకుడు నాని రూ.20 వేలు కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు యుగంధరస్వామి, ఎర్రిస్వామి, కమిటీ సభ్యులు గజేంద్ర, మల్లికార్జున, రఘురామిరెడ్డి, మల్లి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీమద్భగవద్గీత పారాయణం

ఆదోని సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని ఫారెస్టు లైను అంబాభవాని దేవాలయంలో వెలసిన శ్రీవేణుగోపాలస్వామి సన్నిధిలో శ్రీమద్భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వెలసిన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

మద్దికెర, న్యూస్‌టుడే: మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చే కుటుంబ సభ్యులపై చర్యలు తప్పవని ఎస్సై హరిత పేర్కొన్నారు. స్థానిక బస్టాండు సమీపంలో ఆదివారం వాహనాల తనిఖీలో భాగంగా ఆమె మాట్లాడారు. డ్రైవింగ్ లైసెన్సులు లేకపోవడంతో పాటు కొందరు ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు.

నాటి జ్ఞాపకం.. పదిలం

మద్దికెర, న్యూస్‌టుడే: నాలుగు దశాబ్దాల కిందట పదో తరగతి పూర్తిచేసి, ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పాఠశాల వేదికగా కలుసుకున్నారు. మద్దికెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86లో చదువుకున్న ఈ బృందం ఆదివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులు నాగేశ్వరరావు, రామమోహన్, గోపాలకృష్ణ, బాజాహుసేన్ తదితరులను ఘనంగా సత్కరించారు.

జిల్లా సాధించే వరకు దీక్షలు కొనసాగిస్తాం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని ఆదోని జిల్లా ఐకాస నాయకులు కోదండ, ప్రకాశ్ తదితరులు పేర్కొన్నారు. ఆదోని జిల్లాగా ప్రకటించాలని డిమాండు చేస్తూ ఐకాస ఆధ్వర్యంలో నాయకులసాదివారం రిలే నిరహారదీక్షలు చేపట్టారు.

మొరాయిస్తున్న యంత్రాలు.. చెత్త వీధిపాలు

☛ నిర్వహణపై దృష్టిసారించని అధికారులు ☛ పనిచేయని డంపర్ బిన్‌లు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘం ప్రజారోగ్య విభాగం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ప్రత్యేక శ్రేణి ఉన్న పురపాలికల్లో చెత్త తరలింపు వాహనాల దగ్గర నుంచి డంపర్ బిన్‌ల వరకు సమస్యలున్నాయి. వీటిని ఎప్పటికప్పుడు యంత్రాంగం పరిష్కరించి గాడిన పెట్టలేకపోతోంది. మరోవైపు ప్రజారోగ్య నిర్వహణ పేరుతో ఏటా రూ. కోట్లు ఖర్చు చేస్తున్నా.. ఫలితం ఉండటం లేదు. 2025-26 ఏడాదిలో రూ.11.50 కోట్లు ఖర్చు చేశారు. 2026-26 ఏడాదికి రూ. 11.32 కోట్లు అంచనా వేశారు. ఇంత మొత్తంలో వెచ్చించినా వార్డుల్లో స్వచ్ఛత కనిపించడం లేదు. ఇటు ప్రజారోగ్యానికి రక్షణ లేకుండా పోతోంది.

రూ.లక్షల విలువైనవి వృథా

గతంలో పురపాలికకు అందజేసిన రెండు రహదారి స్వీపర్ వాహనాలు నేటికీ మూలన పెట్టారు. వాటిని వెనక్కి పంపి, వాటి స్థానంలో అవసరమయ్యే వాహనాలను తెచ్చుకుంటే మేలు జరుగుతుంది. చిన్న పాటి నాలా క్లీనరు వాహనాలు మూడు ఇచ్చారు. వాటిలో ఒక్కటి మాత్రమే పనిచేస్తోంది. మిగిలిన రెండు షెడ్డుకు చేరాయి. ఫాగింగ్ చేసే ఆటో పరిస్థితీ అంతే. రూ.లక్షలు విలువ చేసే వాహనాలను ప్రజారోగ్య రక్షణకు వినియోగించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల ప్రజాధనం దుర్వినియోగం చేసినట్లే నన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సమస్యలు లేకుండా చూడాలని పుర జనం కోరుతున్నారు.

హ్యాండిల్ లేకపోవడంతో తాడు కట్టి పైకి లేపినప్పుడు చెత్త బరువుకు వేలాడుతున్న డంపర్ బిన్

వాహనాల ఇబ్బందులు

పట్టణ జనాభా రెండు లక్షలు దాటింది. 42 వార్డుల్లో రోజు 70-80 మెట్రిక్ టన్నుల మేర చెత్త పోగవుతోంది. చెత్తనంతా తరలించేందుకు నాలుగు కాంప్యాక్టర్లు, ఎనిమిది ట్రాక్టర్లున్నాయి. వీటిలో ఓ పెద్ద కాంప్యాక్టర్ మరమ్మతుల పేరుతో కర్నూలుకు తరలించి, నెల్లలు గడుస్తోంది. మరోటి క్లచ్ ప్లేట్లు, ఆయిల్ మార్పిడి సమస్యతో రోజుల తరబడి నిలిచిపోయింది. ఓ మూలనకు చేరింది.

క్షేత్రస్థాయిలో తప్పని సవాళ్లు

తెదేపా ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చెత్త తరలింపును వేగవంతం చేసేందుకు కాంప్యాక్టర్ వాహనాలు అందుబాటులోకి తెచ్చారు. వీటి ద్వారా డంపర్ బిన్ల నుంచి చెత్తను నిమిషాల్లో ఎత్తివేయొచ్చు. పట్టణ వ్యాప్తంగా సరాసరి 80 దాకా పాయింట్లున్నాయి. వీటిలో 75 చోట్ల డంపర్ బిన్లు ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన డంపర్ బిన్లకు సైతం చాలా వాటికి హ్యాండిల్ ఎత్తి పోయింది. దొరికే తాళ్లు, రబ్బర్లు కట్టి, తాత్కాలికంగా ఎత్తి పోయడం తప్పడం లేదు. చెత్త బరువుకు తాళ్లు సైతం తెగిపోయి వేలాడుతుంటాయి. ఆ సమయంలో ప్రజారోగ్య సిబ్బంది, రహదారులపై పాదచారులు, వాహనదారులు అప్రమత్తంగా లేకపోయిన డంపర్ బిన్ ఊడి పడి, ప్రమాదం సంభవించే పరిస్థితి ఉంది. చిన్న పాటి సమస్యలు సైతం పరిష్కరించకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 80085 73822

ఆస్పరి, న్యూస్‌టుడే: ?: గ్రామ సచివాలయం వద్ద ఉన్న కాలనీకి సీసీ రహదారి, మురుగుకాలువలు లేవు. – గోపాల్, చిన్నహోతూరు గ్రామం

✔: సమస్యలను పరిశీలించి అవసరమైన చోట సీసీ రహదారి, మురుగుకాలువలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – వెంకటేశ్వర్లు, పీఆర్ఏఈ ఆస్పరి.

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: ఖాజీపురం ప్రధాన వీధిలో చెత్తాచెదారం పేరుకుపోయింది. పరిసరాలు శుభ్రం చేయాలి. – నాగరాజు, ఖాజీపురం ✔: గ్రామ పంచాయతీ సిబ్బందితో పరిసరాలను శుభ్రం చేయిస్తాం. – రమాదేవి, సర్పంచి ఖాజీపురం

హొళగుంద, న్యూస్‌టుడే: ?: లింగంపల్లి గ్రామంలో శ్మశాన వాటిక వద్ద ఉన్న చేతిపంపు నిరుపయోగంగా ఉంది. – రమేష్, లింగంపల్లి ✔: పరిశీలించి, చేతిపంపు మరమ్మతు చేసి, సమస్యను పరిష్కరిస్తాం. – చక్రవర్తి, డిప్యూటీ ఎంపీడీఓ హొళగుంద

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోయనగర్ కాలనీలో మురుగుకాలువ నుంచి తీసిన చెత్తను అలాగే వదిలేశారు. దీంతో కాలనీలో తిరిగేందుకు ఇబ్బందిగా ఉంది. – నిఖిల్, కోయనగర్ కాలనీవాసి, ఆలూరు ✔: సిబ్బందిని పంపించి వెంటనే చెత్తను ఎత్తివేస్తాం. – జిలాని, పంచాయతీ కార్యదర్శి, ఆలూరు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: మేదరవీధి కొత్త ఆకాశవాణి కింది భాగంలో మురుగు కాల్వలు లేవు. ఇబ్బందులు పడుతున్నాం. – మంజునాథ్‌స్వామి, ఆదోని ✔: ఆ ప్రాంతంలో పర్యటించి సమస్య పరిష్కరిస్తాం. – సయ్యద్ అహ్మద్, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

పెరవలి, (మద్దికెర), న్యూస్‌టుడే: ?: పెరవలి రంగనాథస్వామి వారి ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉంచాలి. – రాఘవేంద్ర, పెరవలి

✔: పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం. – సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, పెరవలి

వంతెనపై వెళ్లాలంటే భయమే

ఆలూరు-గుంతకల్లు (తుంగభద్ర) రహదారిలో చిప్పగిరి సమీపంలోని పెద్ద వంతెన రక్షణ గోడలు కూలి ప్రమాదకరంగా మారింది. అదుపు తప్పితే వాహనాలు సుమారు 20 అడుగుల లోతున్న వంకలోకి పడిపోవాల్సిందే. ఈ దారిలో రోజూ సుమారు 700 వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు భవనాల శాఖాధికారులు స్పందించి, ప్రమాదకరంగా మారిన వంతెనకు రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు జరకుండా చర్యలు తీసుకోవాలని గుంతకల్లు, ఆలూరు నియోజకవర్గాల ప్రజలు కోరారు. – న్యూస్‌టుడే, చిప్పగిరి

సారూ.. కాలనీ చూడరూ

ఆస్పరి మండలం బిణిగేర గ్రామంలోని ప్రధాన వీధిలో సీసీ రహదారి ఉన్నా.. మురుగు కాల్వలు లేవు. ఇళ్ల నుంచి వృథా నీరంతా రహదారిపై పారుతోంది. వీధంతా అపరిశుభ్రంగా మారి దోమలు ప్రబలుతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోకి వెళ్లాలంటే అపరిశుభ్రంగా ఉన్న మురుగుపై నడుచుకుంటు వెళ్లాల్సిందే. రహదారికి ఇరువైపులా కాల్వలు నిర్మించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆస్పరి

ప్రమాదాల తలుపులు

ఆదోని పట్టణంలో ఓ ద్విచక్ర వాహనంపై తలుపులు ఇలా అడ్డంగా పెట్టుకొని ప్రయాణి ఇతరులకు ప్రమాదం కలిగేలా తీసుకెళ్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలతో ఎదుటి వారిని ప్రమాదం బారిన పడేస్తోందని గ్రహించలేకపోతున్నారు. సాయంత్రం కొంత చీకటి పడితే, గ్రామాలకు వెళ్లే దారిలో తలుపు కనిపించక ఎదుటి వారి వాహనాన్ని ఢీ కొంటే, ప్రాణాలకే ముప్పు. ఇప్పటికైనా ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలు మానుకోవాల్సిన అవసరముంది. – న్యూస్‌టుడే, ఆదోని పాత పట్టణం

ప్రతి ఉద్యోగి ప్రజలకు అండగా నిలవాలి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ఉద్యోగి ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ.. వారికి అండగా నిలవాలని ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్, అనంతపురం జిల్లా డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదోని డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే విజయభాస్కర్ పదవీ విరమణ సందర్భంగా ఓ కల్యాణ మండపంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా సర్వేశాఖ డీడీ హరికృష్ణ, సర్వే, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు, తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే విజయభాస్కర్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

సమస్య జటిలం.. తీరని దాహం

మద్దికెర, న్యూస్‌టుడే: బురుజుల గ్రామంలో 3,370 మంది జనాభా ఉంది. గ్రామస్థులు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి చేపట్టిన పనులు సత్ఫలితాలు ఇవ్వలేదు. గతంలో శుద్ధజలం అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ రూ.18.50 లక్షలు వెచ్చించింది. పొలాల్లో బోరు వేసి అక్కడి నుంచి గ్రామంలో నిర్మించిన శుద్ధజల కేంద్రానికి చేర్చి, అక్కడ శుద్ధిచేసిన అనంతరం గ్రామంలోకి సరఫరా చేసేలా చర్యలు చేపట్టినా అది మూన్నాళ్ల ముచ్చటగానే నిలిచింది. ఆపై పథకం మూలకు చేరింది. అప్పటి నుంచి ప్రజల దాహార్తి తీర్చేందుకు పత్తికొండ, హోసూరు గ్రామాల్లోని ప్రైవేటు శుద్ధజల కేంద్రాలే దిక్కయ్యాయి.

● వేసవి మొదలైంది. తాగునీటి సమస్యలు మీరూ ఎదుర్కొంటున్నారా? పైపులైన్ లీకేజీ అవుతోందా? పథకాలు పనిచేయడం లేదా? మోటారు మరమ్మతుకు గురైందా? ఇలాంటి వాటితో సతమతమవుతున్నారా? ఎవరికి వివరించాలో తెలియడం లేదా? వేసవి తాగునీటి సమస్యల పరిష్కారానికి 'ఈనాడు' వారధిగా నిలుస్తుంది. మీ చరవాణి ద్వారా వివరించండి.

ఆదోని: 80085 73738, ఆలూరు: 90006 62029, పత్తికొండ: 80085 73822

ఎయిర్‌బ్యాగ్స్‌తో తప్పిన ప్రాణాపాయం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి సమీపంలోని 44వ జాతీయ రహదారిలో ఆదివారం రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరచుకోవడంతో కారులో ప్రయణిస్తున్న దంపతులకు ప్రాణాపాయం తప్పింది. మరో ప్రమాదంలో సైతం కారులో ప్రయాణిస్తున్న వారు క్షేమంగా బయటపడ్డారు.

● కోల్‌కతా నుంచి బిహార్‌కు దంపతులు కారులో వెళ్తున్నారు. నార్లాపురం స్టేజీ సమీపంలో కారు అదుపుతప్పి కొంత దూరం వెళ్లి బోల్తా పడింది. ప్రమాదంతో కారులోని ఎయిర్‌బ్యాగ్స్ తెరచుకోవడంతో ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు.

● వెల్దుర్తి నుంచి కోడుమూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మలుపు తిప్పుతున్న సమయంలో బస్సు వెనక వస్తున్న కారు ఢీకొంది. దీంతో కారు అద్దాలు ధ్వంసం కాగా.. ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు.

గడ్డి వాముల దగ్ధం

చిట్యాల(కృష్ణగిరి), న్యూస్‌టుడే: చిట్యాల గ్రామంలో సుంకన్న, రామాంజినేయులుకు చెందిన రెండు గడ్డి వాములకు ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు. వెంటనే డోన్ అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు అదుపు చేశారు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

వ్యక్తిపై కొడవలితో దాడి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ నుంచి చక్కరాళ్లకు వెళ్లే మార్గంలో ఆటో, ఎడ్లబండికి దారిచ్చే విషయమై జరిగిన ఘటనలో చక్కరాళ్ల గ్రామానికి చెందిన బుల్లేని చంద్ర అనే ఆటో చోదకుడిపై పత్తికొండకు చెందిన డి.కిష్టప్ప దాడి చేసినట్లు సీఐ జయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. చక్కరాళ్ల నుంచి పత్తికొండకు ఆదివారం వెళ్తున్న ఆటోకు ఎదురుగా ఎడ్లబండి రావడంతో.. రోడ్డు కిందకు దిగే విషయంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహానికి గురైన కిష్టప్ప కొడవలితో దాడి చేశారు. చేతికి గాయలైన చంద్రను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఇంటి విషయంలో ఘర్షణ

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని షేర్‌ఖాన్ కొట్టాల ప్రాంతంలో ఆదివారం ఓ ఇంటి విషయంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. అద్దెకు ఇచ్చిన ఇంటిని ఖాళీ చేయడం లేదనే విషయంలో ఇరువర్గాలు ఘర్షణపడి వాదనలకు పాల్పడ్డారు. ఇరువర్గాలు పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు కౌన్సిలింగ్ ఇవ్వడంతో సమస్య ముగిసింది.

నాటుసారా స్థావరాలపై దాడులు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారు రణమండల కొండ ప్రాంతాల్లో నాటుసారా తయారీ స్థావరాలపై ఆదివారం ఒకటో పట్టణ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు విస్తృతంగా దాడులు చేపట్టారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాలుగు సారా బట్టీలు, దాదాపు 1800 లీటర్ల నాటుసారా తయారీకి ఉపయోగించే ఊట ధ్వంసం చేసి, 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైభవంగా రేణుకాచార్య స్వామి జయంతి

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో వీరశైవ, జంగమ సంఘాల ఆధ్వర్యంలో జగద్గురువు రేణుకాచార్య స్వామి జయంతి పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక పేటవీరభద్రస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో కల్లుమఠాధిపతి గురుసిద్ధదేవరుతో పాటు కర్ణాటకకు చెందిన వివిధ మఠాధిపతులతో పాటు వీరశైవ, జంగమ కార్పొరేషన్ల రాష్ట్ర ఛైర్మన్లు తుల్జాపూర్ స్వప్న, చంద్రశేఖర్ సంఘం పెద్దలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సూగురప్ప, గూళ్యం శివరుద్రప్ప, ఎర్రిస్వామి, మంజునాథ్‌స్వామి, జగదీష్‌స్వామి, దేవిశెట్టి ప్రకాష్, బెల్లం వీరేష్, రవి, శరణ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆదోని: పూజల్లో పాల్గొన్న మఠాధిపతులు, వీరశైవ, జంగమ సంఘం పెద్దలు

హొళగుంద, న్యూస్‌టుడే: వీరశైవ ఆది జగద్గురు రేణుకాచార్య జయంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రం విరక్తి మఠంలో, చిత్రపటానికి పూలమాల వేసి నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్‌లు, విరక్తి మఠం యువకులు పాల్గొన్నారు.

స్వర్ణామృత ఔషధం పంపిణీ

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలోని అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఆవోపా(ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) వామ్, ఐఐఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో చిన్నారులకు స్వర్ణామృత ఔషధం పంపిణీ ఆదివారం చేపట్టారు. త్రిదండి చిన్నజీయర్ స్వామి ఆశీస్సులతో, వికాసతరంగణి నేతృత్వంలో 219 మంది చిన్నారులకు ఔషధం అందించినట్లు ఆవోపా అధ్యక్షులు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు మానసిక, శారీరక ఎదుగుదల, మేధాశక్తి పెంపుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు ప్రతాప్‌ఈరన్నశెట్టి, యాతిగిరి వెంకటేశ్వర్లు, వెంకటేష్‌బాబు, రత్నయ్య, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఔషధం వేస్తున్న ఆవోపా సభ్యులు

భక్తిశ్రద్ధలతో మూగితాత ఉరుసు

దేవనకొండ, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో వెలసిన హజరత్ దివానే మూగితాత ఉరుసు భక్తిశ్రద్ధలతో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అంతకు ముందు స్వామివారి అశ్వాన్ని వెండి ఆభరణాలతో అలంకరించి వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు. దర్గా ఆవరణలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో అన్నదానం చేపట్టారు. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బొజ్జమ్మ దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ విజయ్, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, సింగిల్ విండో ఛైర్మన్ రాజశేఖర్, మాజీ సర్పంచి ఉచ్చీరప్ప, రామారావ్‌నాయుడు పాల్గొన్నారు.

స్వామివారి అశ్వాన్ని ఊరేగిస్తున్న నిర్వాహకులు

పరీక్ష కేంద్రం వద్ద గందరగోళం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం, ఐఐటీ కోర్సుల్లో చేరేందుకు అవసరమైన ప్రవేశ పరీక్ష పత్తికొండ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఆయా పరీక్షలు రాసేందుకు వందలాది మంది విద్యార్థులు తరలివచ్చారు. పట్టణంలోని చక్కరాళ్ల రోడ్డులో రాకపోకలు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాఠశాల బయట హాల్‌టికెట్లు, గదులు చూసుకొనేందుకు ఏర్పాటు చేసిన నోటీసు బోర్డు వద్ద తీవ్ర గందరగోళం ఏర్పడింది. సరైన వసతులు కల్పించలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. వాహనాల రాకపోకలు నిలిచిపోవటంతో పోలీసులు పునరుద్ధరించారు. పాఠశాల ప్రిన్సిపల్ హరిణి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలను మండల విద్యాధికారి రమేశ్ పర్యవేక్షించారు. మొత్తం 825 మంది విద్యార్థులకు గానూ 769 మంది పరీక్షలకు హాజరు కాగా 56 మంది గైర్హాజరు అయినట్లు ఎంఈవో తెలిపారు.

హాల్‌టికెట్ నెంబర్లు సరిచూసుకుంటున్న విద్యార్థులు

అరేకలు (ఆదోని విద్య), న్యూస్‌టుడే: అరేకలు ఎస్సీ గురుకుల బాలికల వసతి గృహంలో 5వ తరగతిలో చేరే విద్యార్థినులకు ప్రవేశ పరీక్షలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. 29 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను ఆదోని మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు పర్యవేక్షించారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదు, ఇంటర్మీడియేట్, ఐఐటీ, నీట్‌లో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ప్రిన్సిపల్ లక్ష్మి ప్రసూన అన్నారు.ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 901కి గాను 841 మంది, ఇంటర్మీడియేట్‌కు 541, ఐఐటీ, నీట్‌కు 328 మంది పరీక్షలకు హాజరయ్యారని ఆమె అన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

చిట్యాల(కృష్ణగిరి), న్యూస్‌టుడే: ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని వేడుకున్నట్లు కర్నూలు జిల్లా తెదేపా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, తెదేపా ఆలూరు బాధ్యురాలు వైకుంఠం జ్యోతి అన్నారు. చిట్యాల గ్రామంలో గ్రామస్థులు, అంజిస్వామి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆంజనేయ స్వామి రాజశ్యామల యాగంలో వారు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, నాయకులు రంగన్న నాయుడు, విజయ భాస్కర్‌గౌడు, భాస్కర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న గుడిసె కృష్ణమ్మ, వైకుంఠం జ్యోతి

ఎస్సీ వర్గీకరణకు ప్రాణాలు అర్పించారు

ఆస్పరి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులకు అశ్రునివాళి అర్పించినట్లు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చిన్న సంజన్న, మాదిగ ఎంఎస్పీ మండల అధ్యక్షులు రామాంజనేయులు ఆదివారం తెలిపారు. ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ కోసం చాలా మంది ప్రాణాలు అర్పించారన్నారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్, కరుణాకర్, జైపాల్, ఆంజనేయ, హనుమంతు, తిమ్మయ్య, మహానంది తదితరులు పాల్గొన్నారు.

పుటకలమర్రిలో వైద్య శిబిరం

పుటకలమర్రి (ఆస్పరి), న్యూస్‌టుడే: ఇటీవల వ్యవసాయ కూలీలు పనుల నిమిత్తం బొలెరోలో వెళ్తుండగా వాహనం బోల్తా పడటంతో చాలా మంది గాయపడ్డారు. తెదేపా నియోజకవర్గ బాధ్యురాలు వైకుంఠంజ్యోతి శనివారం గ్రామానికి వెళ్లి వారిని పరామర్శించారు. ఆదివారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించినట్లు ఆస్పరి సహకర సంఘం సొసైటీ డైరెక్టర్ మల్లికార్జున తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు బాలకృష్ణారెడ్డి, ఏఎన్ఎం పద్మబాయి, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా ఉంటే సమాచారం ఇవ్వండి

ఆస్పరి, న్యూస్‌టుడే: గ్రామాల్లో జాతరలు, ఉత్సవాలు, దేవరలు, ఉరుసులు, పెళ్లిళ్లకు ఎవరైనా టపాసులు, మందుగుండు సామగ్రి తెచ్చుకొని ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని ఆస్పరి సీఐ గంగాధర్ ఆదివారం తెలిపారు. ప్రస్తుతం వేసవి కావడంతో వేడికి మందుగుండు సామగ్రి, టపాసులు పేలే అవకాశం ఉందన్నారు. అనుమతులు లేకుండా అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా రంగస్వామి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: భాజపా అనుబంధ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా పత్తికొండకు చెందిన సీసీ రంగస్వామిని పార్టీ జిల్లా కమిటీ నియమించింది. ఆయన నియామకం పట్ల ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు దండి మల్లికార్జున, గోవర్ధన్‌నాయుడు, నరేశ్, శంకరయ్య, గోరంట్ల, లక్ష్మణస్వామినాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఏపీజేఏసీ జిల్లా కో-ఛైర్మన్‌గా సుంకన్న

ఆదోని విద్య, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సి.సుంకన్న ఏపీజేఏసీ జిల్లా కో-ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కర్నూలులోని ఏపీఎన్జీవోస్ కార్యాలయంలో జరిగిన ఏపీజేఏసీ పునర్ వ్యవస్థీకరణ, నూతన కార్యవర్గం ఎన్నికలో సుంకన్నను ఎన్నుకున్నారు. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు మహాదేవప్ప, జిల్లా నాయకులు రమేశ్‌నాయుడు, రామాంజనేయులు, సూర్యుడు, లోక్యనాయక్, గోపాల్, సుధాకర్ బాబు, లక్ష్మన్న, రామకృష్ణ తదితరులు అభినందనలు తెలిపారు.

మితిమీరిన నిర్లక్ష్యం.. గమ్యం చేరని ప్రయాణం

☛ "మహిళా కూలీలు ఓర్వకల్లు మండలం కాల్వ హుస్సేనాపురం గ్రామంలో పత్తి కోత పని నిమిత్తం శుక్రవారం ఆటోలో బయల్దేరారు. బేతంచెర్ల మండలం గొరుమానుకొండ, సీతారామ్‌పురం గ్రామాల మధ్య ఆటో ప్రమాదవశాత్తు అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందగా.. మరో 12 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు."

☛ "ఆస్పరి మండలం పుటకలమర్రి గ్రామానికి చెందిన సుమారు 45 మంది పత్తికొండ మండలం నలకదొడ్డి గ్రామంలో మొక్కజొన్న పంట కూలీ పనుల కోసం బొలెరో ట్రాలీ ఆటోలో బయల్దేరారు. డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. 29 మంది గాయపడ్డారు."

ఆస్పరి నుంచి ఆదోని వైపు రోజూ బొలెరో ట్రాలీ ఆటోలో లెక్కకు మించి ప్రయాణిస్తుంటారు. కూలీలు అధికంగా ఈ వాహనాలను ఆశ్రయిస్తుంటారు. ప్రమాదం జరిగితే పదుల సంఖ్యలో ప్రయాణికులకు ముప్పు తప్పదనే విషయం గుర్తించడం లేదు.

హాలహర్వి, న్యూస్‌టుడే: ఆలూరు, ఆస్పరి, ఆదోని, హాలహర్వి మండలాల నుంచి కర్ణాటకలో మిరప కోత పనులకు వేకువజామునే ఇలా వాహనాల్లో ప్రమాదకరంగా వెళ్తున్నారు. వాహన యజమానులు స్వలాభం కోసం పరిమితికి మించి కూలీలను తరలిస్తున్నారు. దీనికి తోడు అతివేగంగా వెళ్తుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ సమీపంలో నూర్పిడి యంత్రంపై కూర్చొని ప్రయాణిస్తున్న వ్యవసాయ కూలీలు

కూలీలు రోజూ ప్రాణాలు పణంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఆస్పరి నుంచి మహిళలు కూలీలు మూడు చక్రాల ఆటో పైన కూర్చొని, వెనుక ప్రమాదకరంగా నిలబడి రాకపోకలు సాగిస్తున్నారు.

(c) eenadu

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

నందవరంలో భూమి పూజ చేస్తున్న తెదేపా నాయకులు

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

నందవరం, న్యూస్‌టుడే: నందవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఆదివారం తెదేపా మండల కన్వీనర్ కాశీంవలి, సీనియర్ నాయకులు మాధవరావు దేశాయ్, నాగరాజు గౌడ్‌లు భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే బి.జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బి.జయనాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఆదివారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తెదేపాను బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని ప్రజలకు వివరించాలన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలు గురించి తెలియజెప్పాలన్నారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత కూటమి సర్కారు దక్కించుకున్నారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు మహేష్, దామా నరసింహులు, మహేంద్రచౌదరి, నరసప్ప, రాందాస్‌గౌడ్, రాజేంద్ర, ముల్లకట్టిమల్లూ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు ప్రహరీ నిర్మించాలని వినతి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: గోనెగండ్ల జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలని ఆర్‌వైఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజేష్ నాయుడు కోరారు. ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే బి.జయనాగేశ్వరరెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని స్పందించాలని కోరారు.

ఎమ్మెల్యేకు న్యాయవాదుల సన్మానం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరుకు సబ్ కోర్ట్, అదనపు కోర్టుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే బి.జయనాగేశ్వర రెడ్డి శాసనసభలో మాట్లాడినందుకు న్యాయవాదులు ఆదివారం ఆయన్ను సన్మానించారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఆయన్ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. త్వరలో ఎమ్మిగనూరులో సబ్‌కోర్ట్, అదనపు కోర్టును ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రషీదుల్లా, రామకృష్ణనాయుడు, గురుప్రసాద్, చంద్ర, రామ్మూర్తి, నూర్‌అహ్మద్, మధు, దిల్షాద్ అలీ, బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయం మూసివేత

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 3న ఉదయం కేతు చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని కె.నాగలాపురంలో ఉన్న సుంకులా పరమేశ్వరి ఆలయాన్ని మూసివేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి పీఎన్ రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆలయం శుద్ధి, సంప్రోక్షణ అనంతరం బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.

తీరని దాహం.. నిర్వహణ శూన్యం

☛ పలు గ్రామాల్లో అసంపూర్తిగా జేజేఎం పనులు

పెద్దకడబూరు, కోసిగి, మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: వేసవి ముంచుకొస్తోంది. తాగునీటి ఎద్దడిపై ముందస్తు ప్రణాళికలతో సంబంధిత అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. ఏటా ఎండాకాలం వచ్చిందంటే గ్రామీణ ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం కన్నీరు పడుతున్నారు. నియోజకవర్గంలోని తాగునీటి ఎద్దడి నివారణకు గత ప్రభుత్వంలో రూ.కోట్లు వెచ్చించారు. కానీ నిధుల లేమితో పనులు అసంపూర్తిగా మిగిలాయి.

బాపురం ట్యాంకు నుంచి నీరు తెచ్చుకుంటున్న చిన్నతుంబళం గ్రామస్థులు

బోరు నీరే దిక్కు

మండలంలోని 26 గ్రామాలకు గాను 14 గ్రామాలకే తాగునీటి సౌకర్యం ఉంది. గత ప్రభుత్వంలో జల్ జీవన్ మిషన్(జేజేఎం) కింద 13 గ్రామాలను ఎంపిక చేసి సుమారు రూ.8 కోట్లు మంజూరు చేశారు. 10 గ్రామాల్లో పనులు పూర్తి చేయగా, రాగిమానొడ్డి, కల్లుకుంట, కంబదిన్నె గ్రామాల్లో పూర్తి కాలేదు. దీంతో ఆ ప్రాంతాల వారికి పొలాల బోర్ల నీరే దిక్కవుతోంది.

ఎస్ఎస్ ట్యాంకుల ఏర్పాటే పరిష్కారం

మండలంలోని పీకలబెట్ట, గవిగట్టు, బాపుల దొడ్డి, హులికన్వి, బసలదొడ్డి గ్రామాలకు శుద్ధ జలం అందించడానికి ఈ గ్రామాల మధ్య ఓ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే హెచ్.మురవణి, దొడ్డిమేకల, కంబదహాల్, జాలవాడి, కంబళదిన్నె, కొత్తగొల్లదొడ్డి గ్రామాలకు సంబంధించి మరో ఎస్ఎస్ ట్యాంకు ఏర్పాటు చేయాలి.

పక్క ఊరికి వెళ్లాల్సిందే

– మారెన్న, చిన్నతుంబళం

వేసవి వచ్చిందంటే మా గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. ఏటా ఎండాకాలం బాపురం గ్రామాన్ని ఆశ్రయిస్తాం. గ్రామంలో ఏళ్ల తరబడి తాగునీటి ఎద్దడి ఉంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

కోసిగిలో..

కోసిగి మండలంలో జేజేఎం కింద 38 పనులకు సుమారు రూ.20 కోట్లు మంజూరయ్యాయి. కానీ పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రాక 23 పనులు వెనక్కి వెళ్లినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. కేవలం 15 పనులు ప్రారంభించగా మండల కేంద్రం, సాతనూరులో పనులు అసంపూర్తిగా మిగిలాయి.

కౌతాళంలో..

కౌతాళం మండలంలో 10 పనులకు రూ.4 కోట్లు మంజూరయ్యాయి. ఇక్కడ 3 పనులు అసంపూర్తిగా మిగిలాయి. గుడి కంబాలిలో స్థల సమస్యతో ఓహెచ్ఆర్ ట్యాంకు పనులు ప్రారంభించలేదు. రౌడూరులో నిధుల సమస్యతో పనులు మధ్యలో నిలిచాయి.

మంత్రాలయంలో..

మంత్రాలయం మండలానికి 39 పనులకు 25.76 కోట్లు మంజూరు కాగా గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో 14 పనులు వెనక్కి వెళ్లాయి. 22 పనులను రూ.13 కోట్లతో చేపట్టారు. ఇందులో 14 పూర్తి కాగా.. 8 పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

నందవరం, న్యూస్‌టుడే: ?: ముగతి గ్రామంలో స్మశాన వాటికకు వెళ్లే రహదారిలో కంప చెట్లు ఏపుగా పెరిగాయి. వెంటనే వాటిని తొలగించాలి. – **తులసి రామ్ గౌడ్, స్థానికుడు** ✔: సంబంధిత అధికారులకు తెలియజేసి, కంపచెట్లు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. - వీరుపాక్షిరెడ్డి, సర్పంచి, ముగతి గ్రామం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండలంలోని గంగులపాడులో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో రాత్రి పూట దోమల బెడద ఎక్కువైంది. – **శివ, గంగులపాడు** ✔: అపరిశుభ్రత సమస్య గురించి గ్రామ కార్యదర్శి, సర్పంచిలతో చర్చించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. - ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: కల్లుకుంట గ్రామంలో తెలుగువారి గేరిలో మిద్దెపై విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. పలుమార్లు గ్రామ విద్యుత్తు సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదు. – **తెలుగు బసన్న, స్థానికుడు** ✔: సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషా చేస్తాం. – **నారాయణ స్వామి, ఏఈ, పెద్దకడబూరు**

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: మిలటరీ కాలనీలో మూడు రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సమస్యను పరిష్కరించండి. – **కుమార్, కాలనీవాసి** ✔: నీటి సమస్యను పరిష్కరిస్తాం. – **నీరజ, డీఈ** ?: మునెప్పనగర్ కాలనీలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. – **నాగరాజు, స్థానికుడు** ✔: సిబ్బందికి సూచించి చర్యలు చేపడతాం. – **నీరజ, డీఈ**

కోడుమూరు: ?: పట్టణంలోని శ్రీనివాస థియేటరు ప్రధాన రహదారి వెంట వీధిదీపాలు సరిగా వెలగడం లేదు. – **ఎల్లాకృష్ణ, కోడుమూరు** ✔: సమస్య పునరావృతం కాకుండా చూసుకుంటాం. వీధి దీపాల నిర్వహణను ఓ వ్యక్తి చూసుకునేలా చర్యలు చేపడతాం. – **విద్యుత్తు శాఖ అధికారులు**

కోసిగి, న్యూస్‌టుడే: ?: కోసిగిలోని సిద్దప్ప పాలెం కాలనీలో మురుగు కాల్వ నిండి దుర్వాసన వస్తుంది. – **సురేష్, స్థానికుడు** ✔: కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం. –రంగస్వామి, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, కోసిగి

రాళ్లు తేలి.. ప్రమాదకరంగా మారి

గోరంట్ల గురుకుల పాఠశాలలో దారి అధ్వానంగా మారింది. ఏళ్లుగా రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ మార్గంలో రాకపోకలకు అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దారి గుంతలమయంగా ఉండటంతో అవస్థలు తప్పడం లేదు. అధికారులు దారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

చిన్నారుల బడి.. పెచ్చులూడి

పట్టణంలో అంగన్‌వాడీ ప్రధాన కార్యాలయం బయట ఉన్న గోడ పెచ్చులూడిపోతున్నాయి. ఆర్చి పెచ్చులూడిపోయి కడ్డీలు తేలాయి. భవనం లోపల పై భాగంలో రెండు చోట్ల సిమెంట్ పెచ్చులు ఊడిపోయాయి. ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు సత్వరం మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

నీటి శుద్ధి కేంద్రం.. నిరుపయోగం

మండలంలోని గుడిపాడు గ్రామంలో బస్టాండ్ వెనుక ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రం నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వ హయంలో ఏర్పాటు చేసి అలంకారప్రాయంగా వదిలేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రారంభంలో నీరు పట్టుకునేవాళ్లమని, ప్రస్తుతం తాగునీరు అందించడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి తాగునీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

నిర్లక్ష్యం హెచ్చు.. సంపద తుస్సు

రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ఇందుకు గోనెగండ్ల మండలంలోని నెరుడుప్పల పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ ఇందుకు నిదర్శనం. తడి, పొడి చెత్తల కోసం ఏర్పాటు చేసిన తొట్లలో మొక్కలు పెరిగిపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారిస్తే చెత్త తొలగడంతో పాటు పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. – న్యూస్‌టుడే, గోనెగండ్ల

రూ.8 లక్షలతో కార్యాలయానికి మరమ్మతులు

స్పందనకు వందనం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రమాదకరంగా ఉన్న మండల విద్యా శాఖ కార్యాలయానికి రూ.8 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. కార్యాలయం ముందు భాగం దెబ్బతిని ఉండటంపై 'పైన పడితే ప్రమాదమే' శీర్షికన గతేడాది డిసెంబరు 31న 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ప్రభుత్వం ఎస్ఎస్ఏ కింద మరమ్మతు పనులు చేపట్టింది. ఏఈ రవికుమార్ మాట్లాడుతూ.. పై కప్పు ముందు భాగం, ప్రహరీ, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలకు రంగులు వేయటం తదితర పనులను చేపట్టినట్లు చెప్పారు.

తాగి వాహనాలు నడిపితే కేసులు

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: హనుమాపురం గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం ఎస్ఐ నిరంజన్‌రెడ్డి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్సులు లేని, శిరస్త్రాణం ధరించని 17 మంది వాహనదారులకు రూ.3,995 జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10 వేల జరిమానా తప్పదని హెచ్చరించారు.

పరీక్ష కేంద్రం వద్ద పాట్లు

సి.బెళగల్ గ్రామీణం, సి.బెళగల్, న్యూస్‌టుడే: అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5, ఇంటర్, ఐఐటీ, నీట్ ప్రవేశాలకు ఆదివారం పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రమైన సి.బెళగల్‌లోని గురుకుల పాఠశాలకు వందల సంఖ్యలో విద్యార్థులు రావడంతో సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏ గదిలో పరీక్ష రాయాలో తెలుసుకునేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నానా అవస్థలు పడ్డారు. ఒకేసారి వందల మంది గుమికూడటంతో నంబర్లు చూసుకునే సమయంలో తోపులాట జరిగింది.

సి.బెళగల్ గ్రామీణం: హాల్‌టికెట్ నంబరు చూసుకునేందుకు తోపులాట

దీంతో గురుకుల ప్రవేశపరీక్ష 10 నిమిషాలు ఆలస్యంగా పరీక్ష మొదలైంది. విద్యార్థుల వెంట వచ్చిన సంరక్షకులకు కనీసం తాగునీరు, నీడ సౌకర్యం కల్పించకపోవడంతో అవస్థలు పడ్డారు. విద్యార్థులు స్నానాలకు వినియోగించే నీటితో దప్పిక తీర్చుకున్నారు. దీంతో పాటు నేలపై కూర్చోబెట్టి పరీక్షలు రాయించడంపై తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు.

పేలుడు పదార్థాలు నిల్వ చేయొద్దు

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో అనుమతులు లేకుండా బాణసంచా, పేలుడు పదార్థాలను నిల్వ ఉంచుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామాంజులు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కిరాణా దుకాణాలు, చిల్లర కొట్లలో అనుమతులు లేకుండా టపాసులు ఉన్నట్లు గుర్తిస్తే సీజ్ చేస్తామన్నారు.

పోలకల్ (సి.బెళగల్), న్యూస్‌టుడే: పోలకల్ గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించే రథోత్సవంపై ఎస్సై వేణుగోపాల్‌రాజ్ గ్రామ పెద్దలతో ఆదివారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఇటీవల కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన ప్రమాదం దృష్ట్యా పలు సూచనలు చేశారు. స్థానికంగా పేలుడు పదార్థాల తయారీ, విక్రయాలను పూర్తిగా నిషేధించాలని సూచించారు. గ్రామంలో ఎవరైనా పేలుడు పదార్థాలను నిల్వ చేయడం గానీ, తయారీ లేదా విక్రయాలు చేస్తున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

రౌడీషీటర్లు నేరప్రవృత్తికి స్వస్తి పలకాలి

సి.బెళగల్, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు నేరచరితకు స్వస్తి పలికి మంచి నడవడికతో మెలగాలని ఎస్సై వేణుగోపాల్‌రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన సి.బెళగల్ ఠాణాలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల్లో రౌడీషీటర్లను ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు రప్పించి ఎస్ఐ నిరంజన్‌రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలతో గౌరవంగా మెలగాలన్నారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడేందుకు పోలీసులకు సహకరించాలన్నారు.

50 లక్షల సభ్యత్వాల నమోదే లక్ష్యం

కోడుమూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల సభ్యత్వాలు నమోదు చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని జనసేన కర్నూలు పార్లమెంటు సమన్వయ కర్త మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఫంక్షన్‌హాలులో ఆదివారం ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యకర్తలతో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో పార్టీ కోడుమూరు సమన్వయకర్త ఆకేపోగు రాంబాబు, రాజశేఖర్, ఎల్లప్ప, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పెరిగిన వేరుసెనగ దిగుబడుల రాక

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌కు ఆదివారం వేరుసెనగ దిగుబడుల రాక పెరిగి కళకళలాడింది. క్వింటా గరిష్ఠ ధర రూ.9,882, మధ్యస్థ ధర రూ.8,400, కనిష్ఠ ధర రూ.4,001కు వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు 310 మంది రైతులు 9,972 వేరుసెనగ బస్తాలు అమ్మకానికి తెచ్చారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,983, మధ్యస్థ ధర రూ.5,871, కనిష్ఠ ధర రూ.5,421 పలికింది. కందులు గరిష్ఠ ధర రూ.7,209, మధ్యస్థ ధర రూ.6,469, కనిష్ఠ ధర రూ.5,730కు కొన్నారు.

శ్రీమఠంలో స్వర్ణ పల్లకోత్సవం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం స్వర్ణ పల్లకోత్సవం నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి మృత్తికా బృందావనాన్ని స్వర్ణ పల్లకిలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. జయతీర్థ స్వామి, వేదవ్యాస స్వామి, సహాయ పీఆర్వో హొన్నళ్లి వ్యాసరాజ స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీమఠం దివాన్ శ్రీనాథ్ ఆచార్, సహాయ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ధార్మిక అధికారి శ్రీపతి స్వామి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పల్లకోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా ధీరేంద్ర తీర్థుల మద్యారాధన మహోత్సవం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పూర్వ పీఠాధిపతి ధీరేంద్ర తీర్థుల మద్యారాధన మహోత్సవాలు ఆదివారం కర్ణాటకలోని హవేరి జిల్లా హొసరిత్తిలో ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి ధార్మిక పర్యటనలో భాగంగా అక్కడకు వెళ్లి ధీరేంద్ర తీర్థుల బృందావనానికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సోమేశ్వర స్వామికి ప్రభోత్సవం

పోలకల్ (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రభోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఊరేగింపుగా ప్రభోత్సవం దగ్గరికి చేర్చి ఆసీనం చేశారు. అనంతరం ప్రభను కదిలించి ఎదురుగా బసవన్న గుడి వరకు ఊరేగించి తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని తెదేపా కౌతాళం మండల నాయకులు వల్లూరి నాగేశ్వరరావు, పట్టాభిలు తెలిపారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలసి తమ రాజీనామా వ్యవహారాన్ని వివరించారు. ఆయన మంత్రి టీజీ భరత్‌తో మాట్లాడి చర్చించారు. అనంతరం వారు పార్టీ పదవులకు, సభ్యత్వానికి రాజీనామాలను వెనక్కు తీసుకుంటున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ ఛైర్మన్‌గా టీజీ పాండురంగశెట్టిని నియమించడంతో వారు అసహనానికి గురై రాజీనామాలు చేయడంతో పార్టీ పెద్దలు అమరావతికి పిలిపించి మాట్లాడారు. వారి వెంట తెదేపా మండల అధ్యక్షుడు సురేష్‌నాయుడు, మంత్రాలయం బాధ్యుడు రాఘవేంద్ర రెడ్డి తదితరులు ఉన్నారు.

పల్లా శ్రీనివాసరావును కలిసిన తెదేపా కౌతాళం మండల నాయకులు

సంక్షిప్త సమాచారం

సి.బెళగల్, న్యూస్‌టుడే: తహసీల్దారు, మండల పరిషత్ కార్యాలయాల్లో తహసీల్దారు, ఎంపీడీవో అధ్యక్షతన పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు ఉప తహసీల్దారు పురుషోత్తమ్ డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి తెలిపారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే అర్జీలు సమర్పించాలని కోరారు.

సి.బెళగల్: సి.బెళగల్ పీహెచ్‌సీలో వైద్యాధికారి మిధున్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీహెచ్‌వో ఉమామల్లేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు గీతాప్రియదర్శిని తెలిపారు. మండలంలో సమస్యలు ఎదుర్కొనే బాధితులు అర్జీలు సమర్పించుకోవచ్చని తెలిపారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో ఇంటి స్థలానికి దారి వదిలే విషయంలో గొడవపడ్డ వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బోయ హనుమంతు, కడబూరు హరికృష్ణలపై అదే గ్రామానికి చెందిన లింగన్న, మహదేవ, మహేశ్ దాడి చేసి గాయపరిచారన్నారు. హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రశాంత వాతావరణం కోసం నేర బాటను వీడి సత్ప్రవర్తనతో మెలగాలని పట్టణ ఎస్సై మధుసూధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నేరప్రవృత్తి ఉన్న పలువురికి స్థానిక స్టేషన్‌లో మంత్రణం చేశారు. అలాగే పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించారు.

గోనెగండ్ల: సకాలంలో ఇంటి, కొళాయి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో అనంతశయన కోరారు. గోనెగండ్ల, పుట్టపాశం గ్రామాల్లో ఇంటి పన్నుల నిమిత్తం కాలనీల ప్రజలను కలిశారు.

మహిమాన్వితుడు మాధవుడు

■ నేటి నుంచి గోరంట్లలో బ్రహ్మోత్సవాలు

II రోజులపాటు ప్రత్యేక పూజలు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కొలిచిన వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న మాధవస్వామి రాజ వంశీయుల కాలం నుంచి పూజలందుకుంటున్నారు. వైష్ణవ క్షేత్రంగా విరాజిల్లుతున్న గోరంట్ల హంద్రీ నది ఒడ్డున వెలసియుంది. ఏటా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు, ధనుర్మాసోత్సవాలు, బ్రహ్మోత్సవాలు తదితర కార్యక్రమాలు జరుగుతాయి. రథోత్సవం తిలకించేందుకు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు.



కొలువుదీరిన మాధవస్వామి

ఉత్సవాల్లో భాగంగా సోమవారం అంకురార్పణం, విష్వక్సేన పూజ, రక్షాబంధనం, 3న సింహోత్సవం, 4న శేషోత్సవం, 5న హనుమంతోత్సవం, 6న శ్రీవారి కల్యాణం(7వ తేదీ తెల్లవారుజామున), 7న గరుడోత్సవం, 8న గజోత్సవం, శిభికోత్సవం, 9న రథారోహణం, 10న స్వామి, అమ్మవార్ల రథోత్సవం, 11న అశ్వవాహనంపై పార్వేట, 12న హంస వాహనోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

కల్లుకుంటలో గడ్డి వాముల దగ్ధం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని రెండు గ్రామాల్లో ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. కల్లుకుంటలో కురువ గజ్జెల్లి అల్లప్పకు చెందిన రెండు గడ్డివాములు కాలిపోయాయి. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. పెద్దకడబూరుకు చెందిన కోటేకల్ రాజుకు చెందిన మరో గడ్డివామి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. రూ.50 వేలు నష్టం వచ్చిందని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. ఎమ్మిగనూరు అగ్నిమాపక సీఐ రామాంజినేయులు మంటలను అదుపు చేశారు. లేదంటే మరో 15 గడ్డివాములు దగ్ధమయ్యేవని ఆయన తెలిపారు. పెద్దకడబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తన సిబ్బందితో పరిశీలించారు.

మౌలిక సదుపాయాల కల్పనలో విఫలం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో శివారు ప్రాంతాల అభివృద్ధిని అధికారులు పూర్తిగా విస్మరించారని ప్రగతిశీల యువజన సంఘం నాయకుడు చిన్నిప్రసాద్ మండిపడ్డారు. ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మిలటరీకాలనీలో తక్షణమే రోడ్లు నిర్మించాలన్నారు. పట్టణంలో ఉన్న అక్రమ లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఎద్దుల సంత మార్కెట్ పశువులకు నీటి వసతి కల్పించలేదన్నారు. ఎస్సీ శ్మశాన వాటికలో బోరు, రోడ్లు, వీధి దీపాలు నిర్మించాలని కోరారు. బీసీ శ్మశాన వాటికలో అభివృద్ధి చేపట్టలేదన్నారు. కొత్తగా నియమించిన 11 మంది పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు విడుదల చేయాలని కోరారు.

స్వచ్ఛ లక్ష్యం కనుమురుగు

▸▸ పట్టణంలో అధ్వానంగా పారిశుద్ధ్యం ▸▸ జనాల్లో వ్యాధుల భయం

కోడుమూరు, న్యూస్‌టుడే: కోడుమూరు పట్టణం మేజరు గ్రామ పంచాయతీగా ఉన్నప్పటికీ పారిశుద్ధ్య నిర్వహణ తూతూ మంత్రంగా చేపడుతున్నారు. కర్నూలు నుంచి బళ్లారి వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న మురుగు కాల్వలు నెలల తరబడి వ్యర్థాలతో నిండిపోయి ఉన్నా పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారుల పరిస్థితే ఇంత దారుణంగా ఉంటే పట్టణంలోని కాలనీల్లో పారిశుద్ధ్య నిర్వహణ ఎలా ఉంటుందో అర్థమవుతోంది.

● పట్టణంలో దాదాపుగా 40 వేల మంది జనాభా నివాసముంటున్నారు. 20 వార్డులు, సచివాలయాలు ఉన్నాయి. వార్డుల్లో పదుల సంఖ్యలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీటితో పాటుగా మేజరు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణకు సిబ్బంది ఉన్నప్పటికీ అపరిశుభ్రతే నెలకొంది. కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. సంబంధిత అధికారులు ఇకనైనా పట్టించుకుని పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వ్యర్థాలతో నిండిన మురుగు కాల్వ

క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం లేదు

- చంద్రశేఖర్, కోడుమూరు

కోడుమూరు పేరుకే మేజరు గ్రామ పంచాయతీగా కొనసాగుతోంది. నేతలు పట్టించుకోక ఏళ్ల తరబడి అభివృద్ధి జరగడం లేదు. అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పర్యవేక్షించి పరిష్కరించడం లేదు. దీంతో పారిశుద్ధ్య సిబ్బంది తూతూ మంత్రంగా పనులు చేస్తున్నారు. దుర్వాసన, దోమలతో ఇక్కట్లు పడుతున్నాం.

వ్యర్థాలను తొలగింపజేస్తాం

- వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అక్కడక్కడా పారిశుద్ధ్యం, వ్యర్థాలు ఉండవచ్చు. ఎక్కడైనా సమస్య ఉంటే మా దృష్టికి తీసుకువస్తే పరిశీలించి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం. సిబ్బందిని పంపించి సత్వరం వ్యర్థాలను తొలగింపజేస్తాం. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకుంటాం.

(c) eenadu

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయండి

ప్రత్యేక శిబిరాన్ని తనిఖీ చేస్తున్న పాణ్యం ఈఆర్వో, జేసీ నూరుల్ ఖమర్

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణలో భాగంగా ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ నూరుల్‌ఖమర్ బీఎల్వోలను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక శిబిరాలను ఆయన తనిఖీ చేశారు. స్థానిక నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సెయింట్ జోసఫ్ స్కూల్‌లోని 182, 183, 194, 195, 186 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పాణ్యం ఎన్నికల డీటీ అనురాధ, సూపర్‌వైజర్లు ఇస్మాయిల్, శ్రీధర్, సతీష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : స్థానిక ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు తమ సమస్యలపై వినతులను ఇస్తే పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632,
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ?: పందిపాడు, ముజఫర్‌నగర్‌లలో మురుగునీటి కాలువలను శుభ్రం చేయాలి. - **స్థానికులు**, ?: వెంకటరమణ కాలనీ, బాలాజీనగర్, కల్లూరు ప్రాంతాలలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. మనుషులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి - **స్థానికులు**, ✔: కాలువలను శుభ్రం చేయిస్తాం. కుక్కల సమస్య తీరుస్తాం. - **నగరపాలక అధికారులు**

యువతులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : బాలికలు, యువతులు బాగా చదువుకుని ఉన్నతస్థానాలు చేరుకోవాలని అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం నుంచి చేపట్టిన ర్యాలీని ఆయన ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సాధికారత, భద్రత అంశాలపై అవగాహన పెంచేలా వారంరోజుల పాటు అవగాహన ర్యాలీలు, పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వైద్య శిబిరాలు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్, సీఐలు రామయ్యానాయుడు, విజయలక్ష్మి, నాగరాజరావు, పార్థసారథి, మన్సూరుద్దీన్, ఇతర పోలీసు అధికారులు శ్రీలక్ష్మీ, చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అదనపు ఎస్పీ హుస్సేన్‌పీరా

ఓటరు సవరణ.. ఒట్టిమాటలేనా

☛ పోలింగ్ కేంద్రాల్లో కానరాని ప్రత్యేక శిబిరాలు

☛ ఎన్నికల విధులకు బీఎల్వోల డుమ్మా

కర్నూలు కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని.. ఓటరు మ్యాపింగ్ ప్రక్రియతో పాటు కొత్తగా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు దరఖాస్తులు స్వీకరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. కర్నూలు నగరంలో ఈ కార్యక్రమం అమలుపై అధికారులు, సిబ్బంది దృష్టిపెట్టనే లేదు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాల్సిన బీఎల్వోలు.. అటువైపు తొంగిచూడనే లేదు. దీంతో ఓటు నమోదు, మార్పు, చేర్పుల కోసం పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన ఓటర్లకు నిరాశే మిగిలింది.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు
కర్నూలు	258	2,74,553
పాణ్యం	355	3,32,842
కోడుమూరు	275	2,47,475

అన్నిచోట్లా తాళం వేశారు

● వీకర్‌సెక్షన్ కాలనీలో ప్రాథమికోన్నత (ఉర్దూ) పాఠశాలలో 85, 86, 86ఏ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. శని, ఆదివారాల్లో బీఎల్వోలు ఇటువైపు చూడనేలేదు.

ఇది కల్లూరు పట్టణం నిర్మల్‌నగర్ ప్రాథమిక పాఠశాల. 90, 90ఏ పోలింగ్ కేంద్రాలున్న ఈ బడి గేటుకు ఆదివారం ఇలా తాళం వేశారు

● కల్లూరు ఐజీబీసీ కాలనీలోని ఉన్నత పాఠశాలలో 70, 71, 72, 73, 87, 88 కలిపి మొత్తం ఆరు పోలింగ్ కేంద్రాలున్నాయి. ఈ పాఠశాలలో కూడా ప్రత్యేక శిబిరాలను నిర్వహించలేదు.

● సీతారాంనగర్‌లోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలోని 59, 60, వ్యవసాయ మార్కెట్‌యార్డులోని 55, 56, 57వ పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు పత్తాలేకుండా పోయారు.

పింఛన్ల పేరుతో మస్కా

ఈనెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగా శనివారమే సామాజిక పింఛన్లు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నామనే సాకుతో బీఎల్వోలు ఎన్నికల విధులకు గైర్హాజరయ్యారు. 90 శాతం మంది బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల్లో విధులకు హాజరుకాలేదు. ఆదివారం కూడా ఇదే పరిస్థితి. వారు ఎన్నికల విధుల్లో పాల్గొన్నారా లేదా అని పర్యవేక్షించాల్సిన నియోజకవర్గ ఓటరు నమోదు అధికారులు (ఈఆర్వోలు), సహాయ ఓటరు నమోదు అధికారులు (ఏఈఆర్వోలు), ఉప తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బంది శనివారం జన గణన- 2027 శిక్షణకు హాజరవడంతో క్షేత్రస్థాయిలో పట్టించుకునే వారు కరవయ్యారు. ఫలితంగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించాల్సిన రెండు రోజులూ పోలింగ్ కేంద్రాలు వెలవెలబోయాయి.

మండలాభివృద్ధికి కృషి చేద్దాం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి కల్లూరు మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ శారదమ్మ పిలుపునిచ్చారు. కల్లూరు మండల పరిషత్ సమావేశ భవనంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఎంపీడీవో జీఎన్ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో స్వర్ణ పల్లకోత్సవం

మంత్రాలయం గ్రామీణం, న్యూస్‌టుడే: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం స్వర్ణ పల్లకోత్సవం నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి మృత్తికా బృందావనాన్ని స్వర్ణ పల్లకిలో ఉంచి మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా ఊరేగించారు. జయతీర్థ స్వామి, వేదవ్యాస స్వామి, సహాయ పీఆర్వో హొన్నళ్లి వ్యాసరాజ స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీమఠం దివాన్ శ్రీనాథ్ ఆచార్, సహాయ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ధార్మిక అధికారి శ్రీపతి స్వామి పాల్గొన్నారు.

ప్రమాదాలకు సందు ఇచ్చారు

నగరంలోని ఎ.క్యాంపు నుంచి మాంటిస్సోరి పాఠశాల మలుపు వరకు అర కిలోమీటరు మేర ఉన్న ఫుట్‌పాత్ నిర్మించారు. దీని కింద లోతైన మురుగు కాలువ ఉంది. ఓ కంపెనీ నుంచి వచ్చే మురుగునీరు కాలువలోకి వెళ్లేందుకు పైపులు ఏర్పాటు చేశారు. పైపులు అమర్చిన చోట ఫుట్‌పాత్ నిర్మించకుండా నాలుగు అడుగుల మేర వదిలేయడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై మూతలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు వి.క్యాంపు

ఉయ్యాలవాడ.. అధ్వాన జాడ

ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడలో ప్రధాన సీసీ రహదారి గుంతలమయమైంది. పుల్లగుమ్మి, కలుగొట్ల, రామళ్లకోట తదితర గ్రామాలకు స్థానికులు ఈ రహదారిలోనే రాకపోకలు సాగించాల్సి ఉంది. రహదారి అధ్వానంగా ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, ఓర్వకల్లు

ఉన్నది తొలగించి.. నిర్మాణం విస్మరించి

నగరంలోని రాజవిహార్ కూడలి నుంచి మౌర్యఇన్ సర్కిల్ వరకు ప్రధాన రహదారి పక్కన కొత్త ఫుట్‌పాత్ నిర్మించాలని నగరపాలక అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా శిథిలావస్థకు చేరిన పాత ఫుట్‌పాత్‌ను తొలగించారు. రెండు వారాలైనా పనులు మాత్రం చేపట్టలేదు. మురుగు కాలువపై కప్పు పూర్తిగా తొలగించడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

నీటి వృథా.. కట్టడి పట్టదా

కల్లూరు అర్బన్ పరిధిలోని వీకర్‌సెక్షన్ కాలనీలో తాగునీటి పైపులైన్ వాల్వు నుంచి నిత్యం తాగునీరు లీకవుతోంది. కొంతకాలం నుంచి తాగునీరు వృథా అవుతోందని నగరపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. త్వరగా వాల్వుకు మరమ్మతులు చేయించి వృథాను అరికట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

ముప్పు మరిచారు.. తప్పుకొన్నారు

కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో పైవంతెన కింద రహదారిపై ఉన్న కల్వర్టు మధ్యలో రంధ్రం ఏర్పడింది. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉంది. వాహనాల రాకపోకల సమయంలో ప్రమాదాలు జరుగుతుండటంతో రంధ్రంపై ప్లాస్టిక్ విభాగిని అడ్డుగా పెట్టారు. దీనివల్ల ఇబ్బందిగా ఉందని.. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

ముగిసిన ఎన్‌సీసీ బి సర్టిఫికెట్ పరీక్షలు

కర్నూలు వి.క్యాంపు, న్యూస్‌టుడే : స్థానిక కర్నూలు మెడికల్ కళాశాలలో 28 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఎన్‌సీసీ బి సర్టిఫికెట్ పరీక్షలు ఆదివారం ముగిశాయి. బెటాలియన్ లెఫ్ట్‌నెంట్ కల్నల్ శశికుమార్ పరీక్షలను పర్యవేక్షించారు. గ్రూప్ కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి, గ్రూప్ పరిపాలనాధికారి కల్నల్ పీటర్ తనిఖీ చేశారు. కర్నూలు జిల్లాలో 800 మంది పరీక్షలు రాశారని ఎన్‌సీసీ అధికారులు వెల్లడించారు.



పరీక్ష రాస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

భవన నిర్మాణ వ్యర్థాలను తీసుకోవద్దు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరంలో నిర్మాణ రంగం నుంచి వెలువడే సీ, డీ వ్యర్థాలను ప్రజలు తీసుకోవద్దని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. వ్యర్థాల నిర్వహణకు నగరపాలక ప్రత్యేక విధానం అమలు చేస్తోందన్నారు. ఆదివారం బళ్లారి చౌరస్తా సమీపంలో ఓ వ్యాపారి పారిశుద్ధ్య సిబ్బందిని సీ, డీ వ్యర్థాలను తీసుకెళ్లాలని కోరగా వారు తెలియక తీసుకెళ్లారు. కంపాక్టర్ చెడిపోతుందనే ఉద్దేశంతో తిరిగి వ్యర్థాలను వెనక్కి ఇచ్చారు. వ్యర్థాలను కిందకు దింపుతున్నప్పుడు ఓ వ్యక్తి వీడియో చిత్రీకరించి సిబ్బంది డబ్బు డిమాండ్ చేశారని ఆరోపణలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఎంహెచ్‌వోను ఆదేశించారు.

అమెరికాతో ఒప్పందాలు రద్దు చేసుకోవాలి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : రైతులకు హానికలిగించే అమెరికా వాణిజ్య ఒప్పందాలపై దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంతకాలు చేయరాదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. తక్షణమే అమెరికాతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రామకృష్ణారెడ్డి, భాస్కరరెడ్డి, నాగన్న, శ్రీధర్, షాజహాన్, తదితరులు పాల్గొన్నారు.

సేవా సైనికులు.. పోటీల్లో విజేతలు

☛ ఎన్‌సీసీ శిబిరాల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు

☛ క్రీడల్లో పతకాలు సొంతం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : విద్యార్థి దశలోనే దేశానికి సేవ చేయాలన్న ఆశయంతో కర్నూలుకు చెందిన పలువురు విద్యార్థులు ఎన్‌సీసీలో చేరారు. చదువులో రాణిస్తూనే.. ఎన్‌సీసీ శిబిరాల్లో పాల్గొంటూ.. క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్పంచుకుంటున్నారు. ప్రత్యేక శిబిరాల్లో నిర్వహించే పోటీల్లో సత్తాచాటి పతకాలు, ధ్రువపత్రాలు అందుకుంటూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. సైన్యం, పోలీసు శాఖల్లో ఉద్యోగాలు సాధించడం ద్వారా భవిష్యత్తులో భారతదేశానికి సేవ చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

ఉత్తమ క్రీడాకారుడు విజయ్

కర్నూలు మండలం గొందిపర్ల గ్రామానికి చెందిన కావలి విజయ్ కుమార్ నగరంలోని ఉస్మానియా కళాశాలలో 2025లో బీబీఏ డిగ్రీ పట్టా పొందారు. దేశానికి సేవ చేయాలన్న లక్ష్యంతో 2023లో ఎన్‌సీసీ చేరారు. ● 2024 సెప్టెంబరు 21 నుంచి 30వ తేదీ వరకు అనంతపురంలో జరిగిన సీఏటీసీ- 4 శిబిరంలో వాలీబాల్ క్రీడలో రాణించి ఉత్తమ క్రీడాకారుడిగా బంగారు పతకం అందుకున్నారు. ● 2023 నవంబరు 15 నుంచి 24వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెళగావిలో జరిగిన ట్రెక్కింగ్ శిబిరంలో పర్వతారోహకుడిగా పతకం అందుకున్నారు. ● 2024 అక్టోబరు 25 నుంచి నవంబరు 4వ తేదీ వరకు సికింద్రాబాద్‌లో జరిగిన శిబిరంలో వాలీబాల్ క్రీడల్లో బంగారు పతకం సాధించి మ్యాన్ ఆఫ్ ది ప్లేయర్ అవార్డు అందుకున్నారు. ● గతనెల 19న గుంటూరులో జరిగిన అగ్నివీర్ ర్యాలీలో పాల్గొని 1600 మీటర్ల పరుగులో 5.33 నిమిషాల్లో లక్ష్యం చేరుకున్నారు.

ఇమ్రాన్.. పరుగులో తిరుగులేదు

ఉస్మానియా కళాశాలలో డిగ్రీ బీబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇమ్రాన్ బాషా ఎన్‌సీసీ శిబిరాల్లో ప్రతిభ చూపుతున్నారు. వెలుగోడు మండలం రేగడ గూడూరుకు చెందిన ఈ విద్యార్థి 2024లో ఎన్‌సీసీలో చేరారు. ● 2025 ఆగస్టు 7 నుంచి 17వ తేదీన అనంతపురం జిల్లా బ్రాహ్మణపల్లెలో జరిగిన సీఏటీసీ- 9 శిబిరంలో వాలీబాల్ క్రీడలో రాణించి ఉత్తమ క్రీడాకారుడిగా బంగారు పతకం అందుకున్నారు. కబడ్డీ క్రీడల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నారు. ● 2025 సెప్టెంబరు 7 నుంచి 16 వరకు అనంతపురంలో జరిగిన సీఏటీఏ- 11 శిబిరంలో వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో రెండు బంగారు పతకాలు అందుకున్నారు. ● గతనెల 20వ తేదీన గుంటూరులో జరిగిన అగ్నివీర్ ర్యాలీలో 1600 మీటర్ల పరుగును 5 నిమిషాల్లో పూర్తిచేసి మొదటి స్థానంలో నిలిచారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలులోని గాయత్రీ ఎస్టేట్‌కు చెందిన శ్రీనివాసులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. స్థానిక మాధవీనగర్ వద్ద ఆదివారం రోడ్డు దాటుతున్న ఆయన్ను ఆటో ఢీకొంది. గాయపడిన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని గుట్టపాడు స్టేజి వద్ద జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కొమరోలుకు చెందిన రాజేష్, ప్రవీణ్ ద్విచక్రవాహనంపై కర్నూలుకు వెళ్లి తిరిగి వస్తుండగా గుట్టపాడు మెట్ట వద్ద వెనక నుంచి ఆటో ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాత నేరస్థులకు మంత్రణం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో పలువురు సీఐ, ఎస్సైలు ఆదివారం తమ పోలీసుస్టేషన్ల పరిధిలోని పాత నేరస్థులకు మంత్రణం చేశారు. వారు ఏవిధంగా జీవనం సాగిస్తున్నారో తెలుసుకున్నారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

గాడిచర్ల ఆశయాలు నెరవేర్చాలి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేసిన గాడిచర్ల ఆశయాలను నెరవేర్చేందుకు యువత ముందుకురావాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుతోటలో ఆదివారం గాడచర్ల వర్ధంతి సభ జరిగింది. టీజీ, చంద్రశేఖర్ కల్కూర, జేఎస్ఆర్‌కే శర్మ, సుబ్బలక్ష్మమ్మ, పార్వతి తదితరులు గాడిచర్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రావి శారద రచించిన 'ఆంధ్ర తొలి రాజకీయ ఖైదీ గాడిచర్ల' పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయితను సత్కరించారు.

పుస్తకం ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ తదితరులు

నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటేనే ఉపాధి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా దర్జీలు నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవనంలో ఆదివారం జరిగిన టైలర్స్ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా టైలర్ల సంఘం అధ్యక్షుడు రంగ అధ్యక్షతన కుట్టు యంత్రాన్ని కనిపెట్టిన ఇలియాస్ హో చిత్రపటానికి టీజీ వెంకటేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు రంగ మాట్లాడుతూ సంఘంలో సభ్యత్వం కలిగిన టైలర్లు మరణిస్తే తక్షణ సాయంగా రూ.5 వేలు అందజేస్తామని తెలిపారు.

రంగముని సేవలు ఆదర్శం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : కళారంగానికి దాసరి రంగముని అందించిన సేవలను ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు పేర్కొన్నారు. స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రంగముని వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కథా రచయిత డా.హరికిషన్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాకారులు శ్రీనివాసరెడ్డి, యుగంధర్‌బాబు యాదవ్, కొప్పుల ప్రసాద్, శివచంద్రమౌళి, సర్దార్ రాముడును సత్కరించారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న 'దంత వేదాంతం' నాటకం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి విజయవాడకు చెందిన కళాకారులు ప్రదర్శించిన 'దంత వేదాంతం' సాంఘిక నాటకం ఆకట్టుకుంది. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సభ్యులు దర్శకుడు రమేష్‌బాబుకు రూ.25 వేల పారితోషికం ఇచ్చి సత్కరించారు. నాటక ప్రదర్శనకు ముందు మహ్మద్‌మియ్యా గజల్స్ ఆలపించారు.

నాటకంలోని ఓ సన్నివేశం

ఎస్ఐఆర్‌కు సహకరించాలి

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : సమగ్ర ఓటరు సవరణకు(ఎస్ఐఆర్) ప్రజలు సహకరించాలని కర్నూలు నియోజకవర్గ ఆర్వో, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. సవరణకు సంబంధించి ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. ఆదివారం ఆయన ఏక్యాంపు మాంటిస్సోరి పాఠశాల, ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలోని ప్రత్యేక శిబిరాలను పరిశీలించారు. తహసీల్దారు రవికుమార్, డీటీ ధనుంజయ, ఎస్ఈ రమణమూర్తి పాల్గొన్నారు.

బీఎల్వోలతో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

గ్రేస్ పీరియడ్‌ను కొనసాగించాలి

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల హాజరు విషయంలో పది నిమిషాల గ్రేస్ పీరియడ్‌ను యథావిధిగా కొనసాగించాలని ఏపీఎంటీఎఫ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఒక నిమిషం ఆలస్యమైనా ఆబ్సెంట్‌గా పరిగణిస్తామని విద్యాశాఖ చేసిన ప్రకటన సమంజసం కాదన్నారు. పాఠశాల అసెంబ్లీ ముగిసి తరగతులు ప్రారంభమయ్యే సమయం వరకు గ్రేస్ పీరియడ్ ఇవ్వాలని కోరారు.

మురుగు కదలక.. చెత్త తొలగక

☛ శివారులో పారిశుద్ధ్యం అధ్వానం

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : నగరపాలక సంస్థ పరిధిలోని శివారు కాలనీల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఎటుచూసినా కాలువలు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో పూడిపోయాయి. పూడికతీత పనులు సరిగా జరగడం లేదు. పారిశుద్ధ్య సిబ్బంది పైపై పనులు చేసి వదిలేస్తున్నారు. కొన్ని కాలనీల్లో నెలల తరబడి కాలువల్లో పూడిక తీయడం లేదు. దీంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దుర్వాసన, దోమల బెడదతో జనం అల్లాడుతున్నారు.

గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన డ్రైనేజీ

● నగరపాలక సంస్థ పరిధిలో 1070 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఇంతమంది ఉన్నా వీరిపై పర్యవేక్షణ కరవైంది. దీంతో చాలా కాలనీల్లో పూడికతీత పనులు సక్రమంగా జరగడం లేదు. ఫలితంగా నగరంలో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.

● కల్లూరు కాలనీలతో పాటు నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతంలో ఎటుచూసినా చెత్త పేరుకుపోయింది. సి.క్యాంపు, కృష్ణానగర్, రాజ్‌విహార్, వీకర్‌సెక్షన్ కాలనీ, కిడ్స్‌వరల్డ్ రస్తా, బుధవారపేట, శరీన్‌నగర్, బి.క్యాంపు, గణేశ్‌నగర్, విలీన గ్రామాలైన లక్ష్మీపురం, పందిపాడు, పెద్దపాడు, స్టాంటన్‌పురం, మామిదాలపాడు, మాస మసీదు ప్రాంతం తదితర కాలనీల్లో పూడికతీత పనులు సరిగా జరగక కాలువలు దారుణంగా మారాయి.

కల్లూరు ప్రాంతంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

● జొహరాపురం నుంచి వెంకాయపల్లెకు వెళ్లే దారిలో చెత్త, వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. రోజుల తరబడి తొలగించడం లేదు.

అలగనూరు జలాశయం పనులు చేపట్టాలి

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : ప్రభుత్వం అలగనూరు జలాశయం పనులను వెంటనే చేపట్టాలని సీపీఐ కార్యకర్తలు, నాయకులు జడ్పీ ఆవరణలో ఆదివారం ఆందోళన చేపట్టారు. సర్వసభ్య సమావేశంలో కొనసాగుతుండగా వెలుపల నినాదాలు చేశారు. సమావేశంలో ఉన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి బయటకు వచ్చి వారితో మాట్లాడారు. సీపీఐ నాయకులు ఆమెకు వినతిపత్రం అందచేశారు. అలగనూరు జలాశయానికి కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, రూ.36 కోట్ల విడుదల చేస్తూ త్వరలోనే జీవో విడుదల అవుతుందని ఆమె హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నాయకులు రామాంజనేయులు, రంగనాయుడు, రామకృష్ణారెడ్డి, రమేష్ బాబు, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న సీపీఐ నాయకులు

అమాయకుల మృతి బాధాకరం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ సైనిక దాడిలో అమాయక ప్రజలు మరణించడం బాధాకరమని ఎస్‌యూసీఐ(సీ) జిల్లా ఇన్‌ఛార్జి వి.హరీష్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇరాన్‌పై దాడిని ఖండిస్తూ ఎస్‌యూసీఐ(సీ) పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా చేస్తున్న ఈ యుద్ధాన్ని తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలను అడ్డుకోవడం అమానుషం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : హక్కుల సాధన కోసం చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను అడ్డుకుని కర్నూలు, డోన్ రైల్వే స్టేషన్లలో రైళ్ల నుంచి దించివేయడం అమానుషమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.రాధాకృష్ణ పేర్కొన్నారు. రైలు నుంచి తమను దించివేయడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీలు కర్నూలు రైల్వే స్టేషన్ ప్రాంగణంలోనే ఆందోళన చేపట్టారు.

ఆందోళన చేస్తున్న కోడుమూరు ప్రాజెక్టు అంగన్‌వాడీలు

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా! నా క్లయింట్ అయిన శ్రీ రానాల బాలశంకరరెడ్డి, S/o. రానాల వెంకటరమణా రెడ్డి, H.No.12-52, పోలీస్ లైన్ వీధి, బేతంచర్ల (గ్రా॥) & మం॥. నంద్యాల జిల్లా. అయిన వారు, క్రింద తెలిపిన షెడ్యూల్ స్థిరాస్తిని శ్రీ జెట్టి సుబ్బరాయుడు S/o. Late. జెట్టి పిచ్చయ్య, H.No.94/1, సాయిశ్రీ పాలెంట్రి, విల్లా నెంబరు.15, మామిదాలపాడు దగ్గర, సుంకేసుల రోడ్, కర్నూలు మరియు ఇతరులు నుండి కొనుగోలు చేయుటకు ఒప్పందము కుదుర్చుకున్నారు. క్రింద తెల్పిన షెడ్యూల్ ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన దినం నుండి 15 రోజులలోగా క్రింది అడ్రస్సుకు తెలుపగలరు. 15 రోజుల పిదప వచ్చే అభ్యంతరాలు పరిగణలోకి తీసుకొనబడవు.

షెడ్యూల్: కర్నూలు డి॥, కర్నూలు సబ్ డి॥, కర్నూలు మం॥, దిన్నెదేవరపాడు గ్రామ పొలము సర్వే నెం.20, 21 & 22 నెంబర్లు గల భూమి యందు ఇండ్ల ప్లాట్లుగాను పంచాయతీ వారిచే 12-11-1972 తేదీన 3/72గా అప్రూవల్ కాబడిన విద్యుత్ నగర్ కాలనీ నందలి నెం.162 పూర్తి ప్లాటు మరియు 163వ నెంబరు మిగులు ప్లాటు స్థలమునకు చెక్కుబంది.

తూర్పు: NH.18 రోడ్డు, **పడమర:** 143&144 ప్లాట్లు, **ఉత్తరం:** 163 ప్లాటులో మిగులు స్థలము, **దక్షిణం:** 161 నెంబరు ప్లాటు

కొలతలు: తూర్పు: 79.5 F, **పడమర:** 75 F, **ఉత్తరం:**107.5 F, **దక్షిణం:**130 F

Extent: 1019.2 Sq.Y. బయలు స్థలము

Sd/- S.SANDEEP KUMAR
M.Com., B.Ed., LL.B., Advocate
120/3-331, Opp: B.R.Reddy Colony,
Pandipadu (V), Kallur (M),
Kurnool. Cell: 72878 93352.

(c) eenadu

రిమ్స్‌కి మహర్దశ! రూ.10 కోట్లతో కొత్తరూపు

ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) తలమానికం. బోధనాసుపత్రి కావడంతో అనుబంధంగా నర్సింగ్ పాఠశాల, కళాశాలలున్నాయి. మొత్తం 200 మంది వైద్యులు, 400 మంది వైద్య సిబ్బంది, 550 మంది వైద్యవిద్యార్థులు కలిగి ఉన్న ఆసుపత్రికి నిత్యం సరాసరిన 1,100 మంది అవుట్ పేషంట్లు వస్తుంటారు. మరో 350 మంది ఇన్ పేషంట్లుగా ఉన్నారు. ఇంత ప్రాధాన్యం గల ఆసుపత్రిలో పూర్తిస్థాయి సౌకర్యాల్లేవు. నిధుల కొరతతో అధునాతన వసతులు సైతం సమకూరలేదు. ఇటీవల జరిగిన హెచ్‌డీఎస్ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు 'న్యూస్‌టుడే'కి వివరించారు. –న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ఆసుపత్రిలోని ఓపీ విభాగంలో రోగులు

- ఆసుపత్రి ఆధునికీకరణకు రూ.10 కోట్ల మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను కలెక్టర్ రాజాబాబు కేటాయించారు. దీంతో ఆసుపత్రిలో కార్పొరేట్ తరహా సేవలందుతాయి. భవనాలను అందంగా తీర్చిదిద్దడంతోపాటు రిసెప్షన్ కౌంటర్ సైతం ఏర్పాటు చేయనున్నారు. రోగి పేరు, ఆధార్ నంబరు ఆయుష్మాన్ భారత్ యాప్‌లో నమోదు చేస్తారు. ఏ జబ్బుకు ఎవరిని కలవాలి?, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఇతర సౌకర్యాలు, మందులు ఇచ్చాక వాటిని వాడే విధానం తెలియజేస్తారు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు ఏ రోజు ఏ డాక్టర్ చూస్తారనేది వివరిస్తారు.
- ఆసుపత్రిలో లాండ్రీ మిషన్లు మరమ్మతులకు గురయ్యాయి. దుస్తులు, బెడ్‌షీట్లు ఉతకడానికి ఏడాదికి రూ.40 లక్షల వరకు వ్యయం చేయాల్సి వస్తోంది. కొత్త లాండ్రీ మిషన్లు కొనుగోలుకు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి రూ.32 లక్షలు ఇవ్వనున్నారు. ఆసుపత్రిలో 15 శస్త్రచికిత్స గదులుండగా, ఆరు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన వాటిలో శీతల యంత్రాలు, ఇతరత్రా పరికరాలు పాడైపోయాయి. త్వరలో అన్ని శస్త్రచికిత్సల గదులను వినియోగంలోకి తీసుకురావడానికి నిధులు కేటాయించారు. ఐసీయూ, క్యాథ్‌ల్యాబ్ ఆధునికీకరణ, మరో లిఫ్టు ఏర్పాటుకు హెచ్‌డీఎస్ నిధులు రూ.30 లక్షలు కేటాయించారు. మరుగుదొడ్లకు మరమ్మతులతోపాటు డ్రైనేజీ వ్యవస్థ లోపాలు చక్క దిద్దడం, తాగునీరు, వాడుక నీటి సమస్యల పరిష్కారం, అవుట్ పేషంట్లతో వచ్చే సహాయకులకు షెడ్ల నిర్మాణం త్వరలో చేపట్టనున్నారు. ప్రస్తుతం ఎంబీబీఎస్ చివరి ఏడాది విద్యార్థులకు పరీక్షలు జరగనందున హౌస్‌సర్జన్ల కొరత నెలకొంది. ప్రత్యామ్నాయంగా మే వరకు ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్, పారామెడికల్, ఫార్మసిస్టులు, ఫిజియో థెరపిస్టుల సేవలు వినియోగించుకుంటున్నారు.

ఉష్ట్ర వాహనంపై ప్రసన్నాంజనేయుడు



శింగరకొండ వార్షిక తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా రెండో రోజైన ఆదివారం సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామిని ఉష్ట్ర వాహనంపై ఘనంగా ఊరేగించారు. వేద మంత్రాల నడుమ యువత కోలాటం మధ్య ఆలయ మాడ వీధుల్లో విహరించారు. ఊరేగింపులో పెద్దసంఖ్యలో భక్తులు, పాలక మండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకర్, సహాయ కమిషనర్ తిమ్మానాయుడు, తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, శింగరకొండ(అద్దంకి)

భూ అక్రమాలపై మీనమేషాలు!

- మార్కాపురంలో జరిగిన కుంభకోణంపై నాన్చుడు ధోరణి
- ఇటీవల బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రస్తావన

గత వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రమైన మార్కాపురం ప్రాంతంలో పెద్దఎత్తున భూ అక్రమాలు చోటుచేసుకున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులతో చేతులు కలిపి నిబంధనలకు విరుద్ధంగా అసైన్‌మెంట్ కమిటీ చట్టాన్ని తుంగలోకి తొక్కారు. వందలాది ఎకరాల ప్రభుత్వ పోరంబోకు, వాగు పోరంబోకు, చుక్కలు, గయాలు, బావులు, పట్టా భూములను పప్పుబెల్లాల్లా పంచు కున్నారు. రాష్ట్రంతోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మార్కాపురంలోనే అత్యధికంగా భూ అక్రమాలు జరిగినట్లు విచారణాధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. భూఅక్రమాలు జరిగినట్లు తెలినా ఇంతవరకు రద్దు చేయకపోవడం గమనార్హం. –న్యూస్‌టుడే, మార్కాపురం

గతంలో మార్కాపురంలో దస్త్రాలు తనిఖీ చేస్తున్న అధికారులు

మార్కాపురంలో భూ అక్రమాలు ఎక్కువగా జరిగాయని పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. 2021, జూన్‌లో జరిగిన భూ కుంభకోణంలో అధికారులపై చర్యలు తీసుకున్నా అధికారులు మాత్రం అక్రమాలు జరిగిన భూములను రద్దు చేయలేదని ఇటీవల అసెంబ్లీలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రస్తావించారు. అప్పట్లో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని, వెబ్‌ల్యాండ్ నుంచి భూములను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ మంత్రిని కోరారు.

2021, జూన్ నెల 30వ తేదీన ఓ తహసీల్దారు ఉద్యోగ విరమణ నేపథ్యంలో మార్కాపురం మండలంలో ఆ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇష్టానుసారంగా వైకాపా నాయకుల ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు, అనుచరులకు భూమిని ఇష్టానుసారంగా అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయడం సంచలన రేకెత్తించింది. కేవలం వైకాపాకు చెందినవారికి మాత్రమే పనులు చేయడం, మిగిలిన రైతులకు పనులు చేయకపోవడంతో పలువురు రైతులు అప్పటి కలెక్టర్‌తో పాటు రెవెన్యూశాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. అనేక ఆందోళనలు, ఫిర్యాదుల నేపథ్యంలో అప్పటి వెలిగొండ ప్రాజెక్టు జిల్లా ప్రత్యేక కలెక్టర్ సరళావందనను విచారణాధికారిగా నియమించారు. మార్కాపురంలో నెల రోజుల పాటు విచారణ అధికారులు దస్త్రాలు తనిఖీ చేసి ఒక్క జూన్‌లోనే 750 మ్యుటేషన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు గుర్తించారు.

మార్కాపురం మండలం భూపతిపల్లె, బడేఖాన్‌పేట, మాల్యవంతునిపాడు, తిప్పాయపాలెం, నరసింహపురం, నికరంపల్లి, జమ్మనపల్లె, కోల భీమునిపాడు, గజ్జలకొండ, శివరాంపురం, గోగులదిన్నె, ఇడుపూరు, రాయవరం, బొందలపాడు, పెద్దయాచవరం, చింతకుంట, మార్కాపురం పట్టణంలోని ప్రభుత్వ, అసైన్‌మెంట్, వాగుపోరంబోకు, చుక్కలు, గయాలు, ప్రభుత్వ బావులను నిబంధనలకు విరుద్ధంగా 750 మ్యుటేషన్లు చేశారు. తద్వారా 378.89 ఎకరాలను అక్రమంగా ఇతరులకు ఎటువంటి ఆధారాలు లేకుండా ఆన్‌లైన్ చేశారని, అక్రమాలు జరిగాయని అప్పటి విచారణ అధికారి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. దీంతో అప్పటి విశ్రాంత తహసీల్దారుతో పాటు అందుకు కారణమైన 15 మంది వీఆర్వోలను సస్పెండ్ చేశారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రకాశం, మార్కాపురం జిల్లాలకు సంబంధించి ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆర్ఐవో కె.ఆంజనేయులు తెలిపారు. స్థానిక ఏకేవీకే కళాశాలలో మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభమయ్యే మూల్యాంకనానికి ఆర్డర్లు పొందిన అధ్యాపకులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. తమకు కేటాయించిన విధులకు హాజరుకాని అధ్యాపకులతోపాటు సంబంధిత కళాశాల యాజమాన్యంపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో సీవీ రేణుక తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పరిశీలించుకొని ఏదైనా అభ్యంతరాలుంటే ఈ నెల 9 లోగా ఆధారాలతో డీఈవో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

పోలేరమ్మకు ప్రణామం

జిల్లా కేంద్రం మార్కాపురం పట్టణ శివారులోని మార్కాపురం గ్రామదేవత శ్రీఅల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కుంకుమ బండ్లు, డప్పుల వాద్యాలతో పట్టణ వీధులు మార్మోగాయి. అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పొంగళ్ల నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. –న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

నేడు కలెక్టరేట్‌లో మీ కోసం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఈనెల 2వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (మీ కోసం) నిర్వహిస్తున్నట్లు ఆదివారం జేసీ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రజలు, రైతులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేస్తే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

డ్రమ్ములుంటేనే దాహం తీరేది

చిత్రంలో కనిపిస్తున్నవి కనిగిరి పట్టణంలోని నక్కలతిప్పలో రహదారికిరువైపులా ఉన్న నీటి డ్రమ్ములు. వేసవి వచ్చిందంటేచాలు ఇలా డ్రమ్ములతో నీటి ట్యాంకర్ల కోసం ఎదురుచూడాల్సిందే. పట్టణంలో 13వేలకు పైగా కుటుంబాలుండగా, నిత్యం 5 వేల కుటుంబాలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సిందే. ప్రధానంగా కొత్తపేట, ఎన్జీవో కాలనీ, బీసీ కాలనీ, ఇందిరా కాలనీ, బొగ్గులగొంది కాలనీ, నక్కల తిప్ప, చింతలపాలెం, శంకవరం తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ ప్రజలను గత 15 ఏళ్లుగా ఇంటింటికి కుళాయి పథకం ఊరిస్తోంది. ఇటీవల ఇంటింటికి కుళాయి పథకం పనులు ఓ ప్రైవేటు సంస్థ దక్కించుకుందని, టెండర్లు వేశారని అధికారులు చెబుతున్నారే తప్ప ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. పథకం పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో, తాగునీటి కష్టాలు ఎప్పుడు తొలగు తాయోనని కనిగిరి ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. –న్యూస్‌టుడే, కనిగిరి

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సంతనూతలపాడు, గణపవరం, అమ్మనబ్రోలు గురుకుల విద్యాలయాల్లో 5, 6, 7, 8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో రేణుక తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని ఏడు జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్, నాగార్జునసాగర్‌లో బాలుర డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వీటి కోసం ఏపీఆర్ఎస్ కాట్-2026 ఏప్రిల్ 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఏపీఆర్‌జేసీ, డీసీసెట్ అదే తేదీన మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అర్హత, నిబంధనలు వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 8712625043లో సంప్రదించాలని సూచించారు.

ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు 123 మంది ఎంపిక

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 123 మంది విద్యార్థులను ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు ఎంపిక చేసింది. ఏటా అవార్డులకు విద్యార్థులను ఎంపిక చేసి వారి వ్యక్తిగత ఖాతాలకు రూ.10 వేల చొప్పున .జమ చేస్తారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడంతోపాటు సృజనాత్మకతను వెలికి తీయడం లక్ష్యంగా ఇన్‌స్పైర్ పథకం అమలవుతోంది. రాష్ట్రంలో ఈ ఏడాది 3,424 మంది విద్యార్థులను ఎంపిక చేయగా, ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి 123 మందికి అవకాశం లభించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరు నుంచి పదోతరగతి వరకు చదివే విద్యార్థులు అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని గతేడాది అక్టోబరులో కోరారు. ఆ మేరకు జిల్లా నుంచి 1,500 మంది దరఖాస్తు చేశారు. వారు పేర్కొన్న ప్రాజెక్టులు, వాటిని వివరించిన తీరు పరిశీలించి 123 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి నెల రోజుల్లో నగదు జమచేస్తారు. వారు ప్రాజెక్టులు తయారు చేసి వచ్చే విద్యాసంవత్సరంలో జరిగే ఇన్‌స్పైర్‌లో ప్రదర్శించాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి, అక్కడ నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన ప్రాజెక్టులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రముఖుల చేతులమీదుగా అందజేస్తారు.

వెలిగొండ సొరంగాల బలోపేతం!

- 361 మీటర్లలో ప్రత్యేక ఇనుప రిబ్స్ ఏర్పాటు

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానమైన రెండో సొరంగంలో మెత్తటి ప్రదేశం బలోపేతానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిని హైదరాబాద్‌కు చెందిన జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి జియాలజిస్టులు పరిశీలించి పటిష్ఠతకు ఇనుప రిబ్స్ ఉపయోగించాలని సూచించారు. దీంతో వీటిని వినియోగించి పనులు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల వెలిగొండ పనులు పరిశీలనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి మెత్తటి ప్రదేశంలో చేపట్టే నిర్మాణ పనుల్లో వినియోగించనున్న ఇనుప రిబ్స్‌పై వివరించారు.

ప్రతిబంధకంగా మారిన 361 మీటర్లు..: కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు అందించేందుకు నల్లమల అటవీ ప్రాంతంలో 18.89 కిలోమీటర్ల పొడవునా రెండు సమాంతర సొరంగాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే తొలి సొరంగం నిర్మాణ పనులు పూర్తవ్వగా, రెండో సొరంగంలో లైనింగ్ పనులు జరుగుతున్నాయి. సొరంగం తవ్వే యంత్రం (టీబీఎం) నిలిచిపోయిన ప్రదేశంలో 61 మీటర్లు, 15.250 కిలోమీటరు నుంచి 15.550 కిలోమీటరు వరకు 300 మీటర్లు మొత్తం 361 మీటర్ల ప్రదేశం మెత్తగా ఉంది. దీంతో మట్టి, రాళ్లు పడుతుండడంతో బెంచింగ్ పనులు కష్టంగా మారాయి. ఈ ప్రాంతం పటిష్ఠంగా ఉండేందుకు ప్రతి 0.5 మీటర్ల నుంచి 0.8 మీటర్ల మధ్య ఒక ఇనుప రిబ్‌ను బిగించాలని సూచించారు. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ 200 హైఎంబీ రిబ్స్ డిజైన్ తయారు చేసి ఇచ్చింది. ఆ డిజైన్‌లో తయారు చేసిన రిబ్స్‌ను తెప్పించారు. 361 మీటర్ల బెంచింగ్ పనితో పాటు లైనింగ్ చేసేందుకు మూడు నెలలు పడుతుందని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

రెండో సొరంగంలోని మెత్తటి ప్రదేశంలో ఉపయోగించనున్న ఇనుప రిబ్స్

శిక్షణ సరే... కుట్టు ఎలా...?

- యంత్రాలకు మహిళల ఎదురు చూపు

న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

సంతనూతలపాడులోని కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం ఎంపిక చేసిన కేంద్రాల్లో గతేడాది మే నుంచి జులై నెలాఖరు వరకు ఉచితంగా కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించారు. తొలి విడతగా ఒంగోలు నియోజకవర్గానికి ఏడు, సంతనూతలపాడు నియోజకవర్గానికి మూడు కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆ తరువాత ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లోనూ మూడు కేంద్రాల చొప్పున శిక్షణ నిర్వహించారు. శిక్షణ తరగతులు పూర్తయి ఏడు నెలలు గడిచినా ఇంతవరకు కుట్టు యంత్రాలు ఇవ్వలేదు. దీంతో మహిళలు ఉపాధి నిమిత్తం వాటి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

32 కేంద్రాల్లో 3,475 మంది

గతేడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసక్తి గల మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభించేందుకు బీసీ కార్పొరేషన్ అధికారులు ప్రణాళిక చేశారు. ఇందుకు స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకుని అర్హులైన వారిని ఎంపిక చేశారు. దీనిలో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 32 కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉచిత శిక్షణతోపాటు యంత్రాల అందజేతకు ఒక్కొక్కరికి రూ.25 వేల అంచనా వ్యయంతో కార్యాచరణ ప్రణాళిక తయారు చేశారు. ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో యంత్రాలు సమకూర్చి బోధకుల ద్వారా మొత్తం 3,475 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. కుట్టు, అల్లికలపై ఆసక్తి కలిగి ఉండి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న మహిళలను పరిగణనలోకి తీసుకున్నారు. అగ్రవర్ణ పేదల కోటాలో కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణులతోపాటు బీసీ, కాపులకు ఉచితంగా కుట్టు శిక్షణతో పాటు యంత్రాలకు అర్హులు కావడంతో ఆయా సామాజిక వర్గాల నుంచి మంచి స్పందన లభించింది. ప్రతి కేంద్రంలోనూ ఉదయం, మధ్యాహ్నం 72 మంది చొప్పున మొత్తం 144 మందికి 90 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. అందులో 75 శాతం ముఖ ఆధారిత హాజరు ఉన్న వారికి ఉచితంగా కుట్టు యంత్రం ఇవ్వాలని నిర్ణయించారు. శిక్షణ పూర్తి చేసుకుని ఏడు నెలలు గడిచినా నేటికి కుట్టు యంత్రాలు ఇవ్వకపోవడంతో మహిళలు ఇళ్ల వద్ద ఖాళీగా ఎదురు చూడాల్సి వస్తోంది. యంత్రాలు సమకూర్చి, శిక్షణ ఇచ్చిన కేంద్రాల నిర్వహకులు సైతం బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమ సా.6-24

సహరీ : మంగళ ఉ.5-06

నేటి నుంచి సార్వత్రిక పరీక్షలు ప్రారంభం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్యాపీఠం ద్వారా నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం 2,909 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష ప్రారంభమయ్యాక 15 నిమిషాల్లోపు 9.15 వరకు మాత్రమే అభ్యర్థులను అనుమతిస్తారు. అంతకన్నా ఆలస్యమైతే అనుమతించరు. డీఈవో సీవీ రేణుక మాట్లాడుతూ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించామని డీఈవో తెలిపారు.

పొగాకు కొనేదెప్పుడు?

- వేలం కేంద్రాల ప్రారంభంపై అధికారుల కసరత్తు

జిల్లాలో 2025-26 పంట కాలానికి పొగాకు కొనుగోళ్లు ఆలస్యమయ్యేలా కనిపిస్తున్నాయి. ఈ సీజన్‌కు సంబంధించి ఎప్పుడూ వేలం కేంద్రాలు తెరవాలన్న దానిపై స్పష్టత లేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 24,500 బ్యారన్లు ఉండగా, 30,250 మంది రైతులు ఉన్నారు. గత నెలలో వేలం కేంద్రాల అధికారులు, రైతు ప్రతినిధులతో బోర్డు కార్యదర్శి సమావేశమయ్యారు. వేలం కేంద్రాల వారీగా రైతులతో మాట్లాడాలని వారి అభిప్రాయాలు సేకరించి పంపాలని కార్యదర్శి ఆదేశించారు. ప్రస్తుతం కర్ణాటకలో పొగాకు కొనుగోళ్లు పూర్తికానందున అక్కడి పరిస్థితులను సైతం పరిగణనలోనికి తీసుకోవాల్సిన అవసరం ఉందని చర్చించారు. ఇక్కడ రైతులు ఈ ఏడాది ముందస్తుగానే పొగాకు నాట్లు వేసినందున ఎక్కువ భాగం పొగాకు క్యూరింగ్‌లు పూర్తయ్యాయి. గ్రేడింగ్ చేసిన ఆకును అమ్మకాలకు సిద్ధం చేశారు. మరికొంతమంది రైతులు పొగాకు బేళ్లను శీతల కేంద్రాల్లో భద్రపరచుకుంటున్నారు. ఎండలు పెరిగితే రంగు మారి నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క గతేడాది మార్చి 10న తొలి విడత కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మార్కెట్ ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు నష్టపోయారు. ఈ ఏడాది ఆకు నాణ్యత బాగుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలో సరాసరి ధర కిలో రూ.270కు పైగానే ఉండడంతో ఇక్కడ కూడా ధర తగ్గకుండా రావాలని రైతులు ఆశిస్తున్నారు. పొగాకు కొనుగోళ్లు ఆలస్యమయ్యేకొద్దీ బయట మార్కెట్‌లో రైతులు అమ్ముకునే అవకాశం ఉంది. బోర్డు అధికారులు మాత్రం రైతులు బయట పొగాకు అమ్ముకోవద్దని సూచిస్తున్నారు. మార్చి చివరి నాటికైనా వేలం కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, పొదిలి

నిండుకుండలా వేసవి జలాశయాలు

న్యూస్‌టుడే, త్రిపురాంతకం

మార్కాపురానికి తాగునీరందించే వేసవి జలాశయం

వేసవి మొదలైంది. జిల్లాలోని త్రిపురాంతకంలో ఉన్న నాలుగు వేసవి జలాశయాలు (సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు) ప్రణాళిక బద్ధంగా వినియోగించుకుంటే లక్ష మందికి పైగా ప్రజల దాహార్తి తీరుస్తాయి. గత ప్రభుత్వ హయాంలో చివరి రెండేళ్లు నీరు వెలవెలబోయాయి. దీంతో సాగర్ నీరు సరఫరా పరిధిలోని గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాగర్ ప్రధాన కాలువ ద్వారా తాగు, సాగు నీటిని విడుదల చేసింది. దీంతో ప్రత్యేక చర్యలు తీసుకున్న స్థానిక పాలకులు త్రిపురాంతకంలోని వేసవి జలాశయాలను పైపులైన్ల ద్వారా నింపడంతో కళకళలాడుతున్నాయి. జిల్లా కేంద్రం మార్కాపురం, యర్రగొండపాలెం, పెద్దారవీడు, త్రిపురాంతకం మండలాల్లోని సాగర్ నీరు సరఫరా జరిగే 50కు పైగా నివాస గ్రామాల్లోని లక్ష మందికి పైగా ఈ ఏడాది తాగునీటికి ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు.

ఎస్ఎస్ ట్యాంకు	సామర్థ్యం (ఎంఎల్)	విస్తీర్ణం (ఎకరాల్లో)	కుటుంబాల లబ్ధి(వేలల్లో)
మార్కాపురం	2,200	120	13
త్రిపురాంతకం	420	35	10
పెద్దారవీడు	1,156	70	15
వైపాలెం	746	50	12

బస్సులు దూరం.. ఆటోలే ఆధారం!

కనిగిరి పట్టణ సమీప మండలాలు, గ్రామాలకు సరిపడా బస్సులు లేకపోవడంతో అత్యవసర పనుల నిమిత్తం పట్టణానికి వచ్చేందుకు ఆటోల్లో ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ప్రయాణికులు ఎక్కకపోవడంతో రద్దు చేశామని అధికారులు చెబుతుండగా, బస్సులు లేకుంటే ఎలా ప్రయాణించేదని ప్రయాణికులు వాపోతున్నారు. దీంతో గ్రామీణ ప్రజలు ప్రమాదమని తెలిసినా ఇలా ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోంది. బస్సుల్లేక పోలవరం నుంచి కనిగిరికి ఆటోలో వస్తున్న ప్రయాణికులను చిత్రంలో చూడొచ్చు. –న్యూస్‌టుడే, కనిగిరి

దారి చూస్తే గుండె కంభం చెరువే!

చారిత్రక కంభం చెరువుకు వెళ్లే రహదారి పలుచోట్ల గుంతలమయంగా మారింది. గతేడాది అక్టోబరులో కురిసిన వర్షాలకు అలుగు వాగు వద్ద రహదారి కోతకు గురవ్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం చెరువు అందాలు చూసేందుకు వచ్చే వందలాది మంది పర్యాటకులు, పొలాలకు వెళ్లే రైతులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనచోదకులు వాపోతున్నారు. ఈ విషయమై రహదారులు, భవనాలశాఖ జేఈ పాపారావు మాట్లాడుతూ గుంతలు పూడ్చేందుకు ప్రతిపాదనలు పంపించామని, త్వరలో మరమ్మతులు చేపడతామని తెలిపారు. –న్యూస్‌టుడే, కంభం

పేరు మార్పు ప్రకటన

నేను నలిపినేని మాల్యాద్రి, తండ్రి పేరు అంకయ్య, వయస్సు 65 సంవత్సరాలు, నివాసం: ఫ్లాట్ నెం.502, సాయి ప్రగతి అపార్ట్‌మెంట్, 1వ లైను, 2వ క్రాస్, సోనియా గాంధీ నగర్, ఒంగోలు-523001, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్. నా పేరును నల్లపనేని మాల్యాద్రి నాయుడు (Nallapaneni Malyadri Naidu) గా పిలవబడుదును. నలిపినేని మాల్యాద్రి మరియు నల్లపనేని మాల్యాద్రి నాయుడు అనే పేరు రెండు ఒకే వ్యక్తిని సూచిస్తాయి.

(c) eenadu

నల్లమలలో పురాతన ఆంజనేయుడు

దద్దనాల వద్ద కొలువుదీరిన ఆంజనేయస్వామి

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెం మండలం నల్లమల అడవిలో దద్దనాల ఆంజనేయస్వామి ప్రసిద్ధిగాంచారు. పూర్వకాలంలో అడవి నుంచి శ్రీశైలం నడిచి వెళ్లే యాత్రికులు వెంకటాద్రిపాలెం నుంచి దద్దనాల ఆంజనేయస్వామిని దర్శించుకుని వెళ్లేవారని పెద్దలు చెబుతుంటారు. ఇక్కడ ఆంజనేయస్వామికి మొక్కుకుంటే అనుకున్న పనులు నెరవేరతాయని భక్తుల నమ్మకం.

చెంచుగిరిజనులే పూజారులు

పూర్వకాలం నుంచి ఇప్పటి వరకు ఇక్కడ పూజలు జరుగుతున్నాయి. పూజారులుగా చెంచు గిరిజనులు వ్యవహరించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతి మంగళవారం, శనివారం ఆంజనేయస్వామి వద్దకు భక్తులు ఎక్కువగా తరలి వస్తుంటారు. ఈ మధ్య కాలంలో ఫారెస్టు శాఖ కఠిన ఆంక్షలు విధించడంతో అక్కడికి భక్తులు వెళ్లడం కష్టంగా మారింది. దద్దనాల వద్ద అప్పట్లో పెద్దకోట ఉండేది. ప్రస్తుతం శిథిలమైపోయింది. ఆంజనేయస్వామిని దర్శించుకునే వారు పక్కన శివాలయంలో శివ లింగానికి సైతం పూజలు చేస్తుంటారు.

ముద్దసానమ్మా.. కరుణించవమ్మా..

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జమ్మనపల్లి-కోలభీమునిపాడు గ్రామశివారుల్లో వెలసిన శ్రీముద్దసానమ్మ దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పుర, సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించి భక్తితో తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

పృధుల గిరి తిరునాళ్లకు ప్రత్యేక బస్సులు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి ఆర్టీసి డిపో నుంచి శ్రీ పృధులగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి వెళ్లే భక్తులకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు డీఎం ఎం.శంకరరావు తెలిపారు. ఆదివారం ఆర్ఎం సత్యనారాయణ, డీఎం శంకరరావులు పృధులగిరి లక్ష్మీనరసింహ స్వామి కొండకింద వరకు వెళ్లి బస్సులు నిలిపే స్థలాన్ని పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యార్థం తగినన్ని సర్వీసులు నడిపేందుకు ఆర్టీసి సిద్ధంగా ఉందన్నారు. ప్రయాణికులు ప్రైవేటు బస్సులను ఆశ్రయించకుండా ఆర్టీసి బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు.

సమాన హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలి

ఒంగోలు గ్రామీణం: సమాన హక్కుల సాధన కోసం మహిళలు ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఒంగోలు నగర ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక మోటూరు ఉదయం కాలనీలో ఆదివారం సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు నేటికీ సమాన హక్కులు పొందలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్య్రం వచ్చి 77 సంవత్సరాలు గడిచినా మహిళలు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలు చదువుకోవడానికి మంచి విద్యా వ్యవస్థ, భద్రత లేదన్నారు. ఈ సమస్యల కారణంగానే బాలికలు చదువులో వెనుకబాటులో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు కె.విజయమ్మ, సీహెచ్.వెంకటేశ్వరమ్మ, సత్యవతి, వసంత తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై డ్రోన్ కెమెరాలతో నిఘా

ఒంగోలు నేరవిభాగం: ఒంగోలు మండలం గుండాయిపాలెం సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. అక్కడ నిత్యం జూదం నిర్వహిస్తున్నారనే సమాచారంతో డ్రోన్ సాయంతో నిర్ధారించుకుని టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. సీఐ యు.సుధాకర్, ఎస్సైలు శివరామయ్య, చెంచయ్య, ఏఎస్సై మహబూబ్ బాషా ఆధ్వర్యంలో పోలీసులు వెళ్లి తనిఖీలు చేపట్టారు. అక్కడ కోడిపందేలు నిర్వహిస్తున్న 15 మంది వ్యక్తులతో పాటు రెండు కోళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.

విద్యార్థులకు అండగా కూటమి ప్రభుత్వం

బల్లికురవ, న్యూస్‌టుడే: విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం వేమవరంలో 44మందికి ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దాతల సాయంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తోందన్నారు. సెయిల్ కంపెనీ సహకారంతో వాటిని అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్యా వ్యవస్థను ఎలాంటి రాజకీయ మకిలీ అంటకుండా మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. [illegible] ఈ సందర్భంగా విద్యార్థులు, స్థానికులు సమస్యలను మంత్రి వద్ద ప్రస్తావించారు. మండల సీనియర్ నాయకులు మల్లినేని గోవిందరావు, మండల తెదేపా అధ్యక్షులు బాలినేని హనుమంతరావు, గ్రామ నేత గొట్టిపాటి మారుతి, విద్యుత్తు శాఖ ఈఈ మస్తాన్‌రావు, తహసీల్దార్ రవీనాయక్, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లు అందుకున్న విద్యార్థినులతో మంత్రి గొట్టిపాటి

కారు ఢీకొని కూలీకి తీవ్ర గాయాలు

తిమ్మాయపాలెం(అద్దంకి): ఇటుక బట్టీల వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొన్న సంఘటనలో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి తిమ్మాయపాలెం-శంకరాపురం మధ్య చోటు చేసుకుంది. 108 సిబ్బంది అందించిన సమాచారం మేరకు కాకినాడ ప్రాంతానికి చెందిన ఇటుకబట్టీ కూలీ నాగేశ్వరరావు ఆదివారం రాత్రి తిమ్మాయపాలెం ఇటుకబట్టీల సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. దర్శి వైపు నుంచి వస్తున్న కారు ఆయన్ను ఢీకొట్టడంతో తలకు, కాలికి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దేవాదాయ ధర్మాదాయశాఖ
శ్రీ వల్లూరమ్మ దేవస్థానము - వల్లూరు
టంగుటూరు మండలం - ప్రకాశం జిల్లా
ఈ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన

ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, వల్లూరు గ్రామము నందు వేంచేసియున్న శ్రీ వల్లూరమ్మవారి దేవస్థానమునకు సంబంధించిన ఈ క్రింది తెలియపరచిన వివిధ ఐటములకు తేది 01.04.2026 నుండి 31.03.2027 వరకు నడుపుకొను హక్కులను పొందుటకుగాను ఈ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డు టెండరు మరియు బహిరంగ వేలం ద్వారా తేది 13.03.2026 ఉదయం గం॥ 11.00లకు కార్యనిర్వహణాధికారి కార్యాలయము, శ్రీ వల్లూరమ్మవారి దేవస్థానము, వల్లూరులో దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డు టెండరు మరియు బహిరంగ వేలం జరుపబడును.

వ.నెం.	పాటకు పెట్టబడు ఐటము వివరము	ధరావత్తు
1.	దేవాలయమునకు వచ్చు భక్తుల పాదరక్షలను భద్రపరిచెడి హక్కు మరియు గోరింటాకు ముద్రలు వేయు హక్కు. (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	25,000.00
2.	పార్కింగ్ ఫీజు, టాయిలెట్ ఫీజు వసూలు హక్కు (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	25,000.00
3.	గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చుకొను హక్కు. (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	10,000.00
4.	షాపు నెం. 1, 2, 3, 4ల యందు (ఒకే షాపుగా) పూజాద్రవ్యములు అమ్ముకొను హక్కు. (ఈ-ప్రొక్యూర్‌మెంట్ సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	1,00,000.00
5.	షాపు నెం. 9లో మండపాలలంకరణ మరియు ఎలక్ట్రికల్ డెకరేషన్ ఏర్పాటు చేయు హక్కు (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	25,000.00

టెండర్ షెడ్యూలు జారీ చేయు తేదీలు: ది.02.03.2026 నుండి 12.03.2026 సా.5.00ల వరకు టెండర్ షెడ్యూలు దాఖలు చేయు ఆఖరి తేది 13.03.2026 ఉ. 9.00 వరకు, టెండర్ షెడ్యూలు ఖరీదు రూ. 500/- ఈ-ప్రొక్యూర్‌మెంట్ బిడ్‌డౌన్‌లోడ్ మొదలు తేది. 02.03.2026 ఉ. 10.00లకు బిడ్ స్వీకరించు చివరి తేది 12.03.2026 సా. 5.00ల వరకు బిడ్ తెరుచు తేది 13.03.2026 ఉ.11.00లకు ఈ-టెండరు వివరములు www.eprocurement.gov.in లో AP Endowments Department Marketing నందు చూడగలరు. మిగిలిన షరతులు దేవస్థానము కార్యాలయము నందు తెలుసుకొనవచ్చును.

వల్లూరు 01.03.2026
శ్రీ బొజ్జా శ్రీనివాసులు, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు
ఇట్లు/- బి.రమేష్, కార్యనిర్వహణాధికారి సెల్ నెం. 7013429148

హలో అనలేం.. సేవలందించలేం!

❖ చెంచు గిరిజన గూడేల్లో పనిచేయని ఫోన్లు

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల:

ప్రపంచీకరణ నేపథ్యంలో రోజురోజుకీ సాంకేతికత పెరుగుతోంది. ప్రపంచంలో ఏ మూలనుంచైనా జరిగే సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునే పరిస్థితి అందుబాటులోకి వచ్చింది. కానీ అందుకు విరుద్ధమైన పరిస్థితి నల్లమల అటవీ ప్రాంతంలోని పలు చెంచు గిరిజన గూడేల్లో నెలకొంది. 'హలో' అనే పరిస్థితే లేదు.

మైదాన ప్రాంతాల్లో గిరిజన గర్భిణి ముఖ ఫొటో తీసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్త

ఎందుకు పనిచేయవంటే..

పెద్దదోర్నాల - శ్రీశైలం రహదారిలో బోడేనాయక్ తండా నుంచి చిన్నారుట్ల వరకు (30 కి.మీ దూరం), పెద్దదోర్నాల-ఆత్మకూరు ఘాట్ రహదారిలో కొర్రప్రోలు నుంచి బైర్లూటీ వరకు (30 కి.మీ.దూరం) చరవాణిలు మూగబోతాయి. ఎందుకంటే ఇదంతా అటవీ ప్రాంతం. ఇక్కడ పర్యావరణ పరిరక్షణ దృష్టిలో పెట్టుకుని సెల్ టవర్ల ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వడంలేదు.

వివరాల నమోదుకు ఇబ్బంది

సిగ్నల్స్ లేని కారణంగా..ఫోన్లు పనిచేయక చింతల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది ముఖ హాజరు, వివరాల నమోదుకు బోడేనాయక్ తండా సమీపం వరకు వచ్చి అక్కడ నమోదు చేసుకుంటున్నారు. చింతల, తుమ్మలబైలు, మర్రిపాలెం, పెద్దమంతనాల ఆశ్రమ పాఠశాలలకు చరవాణి మోగే అవకాశం లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులకు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలంటే ముఖ హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. వారిని మైదాన ప్రాంతాల్లోకి తీసుకుని వచ్చి నమోదు చేసుకోవాల్సి రావడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలకు కష్టాలు తప్పడంలేదు.

ప్రమాదాల బారిన పడితే నరకమే..

నల్లమల రహదారుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. వాహనాలు ఘాట్ ఎక్కలేక అప్పుడప్పుడు మొరాయిస్తుంటాయి. ఆ సమయంలో వాహనాల రాకపోకలు స్తంభించిపోతాయి. చరవాణి సిగ్నల్స్ లేకపోవడంతో పోలీసులకు సమాచారం అంది వచ్చేసరికి గంటల సమయం పడుతోంది. మూడు, నాలుగు గంటలు నట్టడవిలో ఉండాల్సి రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు సమాచారం అందుకుని 108 వాహనాలు వచ్చే లోగా క్షతగాత్రులు అధిక రక్తస్రావంతో ఒక్కొక్క సారి ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నల్లమలలో సమాచార వ్యవస్థను మెరుగు పరచాలని చెంచు గిరిజన ప్రజలు కోరుతున్నారు.

వెలిగొండ బ్రహ్మోత్సవాలకు వేళాయె

❖ 3 నుంచి 13 రోజుల పాటు నిర్వహణ

న్యూస్‌టుడే, కొనకనమిట్ల:

కొనకనమిట్ల మండలంలోని గార్లదిన్నె పంచాయతీలోని వెలిగొండ క్షేత్రంలో వెలసిన లక్ష్మీ అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వేళైంది. నేటి రాత్రి నుంచి (మంగళవారం) అంకురార్పణ సేవతో 13 రోజులపాటు సాగే ఈ ఉత్సవాల్లో స్వామి దర్శనానికి భక్తులు వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. 4వ తేదీన కల్యాణోత్సవం జరుగుతుంది. 13న రథోత్సవం, 14న అశ్వవాహనం, 15న పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థంతో ముగుస్తుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

❖ ఉత్సవాల్లో భాగంగా 12వ తేదీన భారీ ఎత్తున తిరునాళ్ల జరుగుతుంది. 11, 12వ తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ఏర్పాటు చేశారు.

❖ **సామాజిక సత్రాల్లో అన్నదానం..**

వెలిగొండ పుణ్య క్షేత్రంలో అన్ని సామాజిక వర్గాల వారీగా సత్రాలు నెలకొల్పారు. 11, 12, 13 తేదీల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఆయా సత్రాల్లోకి వచ్చిన భక్తులకు భారీ అన్నదానం చేస్తారు.

❖ **ప్రత్యేక బస్సులు..**

12, 13 తేదీల్లో తిరునాళ్ల సందర్భంగా పొదిలి, మార్కాపురం, కనిగిరి ఆర్టీసీ డిపోల వారు ప్రత్యేక బస్సులు నడుపుతారు. 13న విద్యుత్ ప్రభలు, కుంకుమ బండ్లు, రథం బండ్లు ఉంటాయి. ❖ వేడుకలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు చేసినట్లు ఈవో చెన్నకేశవరెడ్డి తెలిపారు.

విద్యుత్తు ఏఈల నియామకం

ఒంగోలు గ్రామీణం: జిల్లాలోని ఆరు మండలాల్లో ఖాళీగా ఉన్న విద్యుత్తు శాఖ ఏఈ పోస్టులను భర్తీ చేస్తూ సీఎండీ పుల్లారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల వారీగా ప్రసాద్ (కొత్తపట్నం), గోపి (సంతనూతలపాడు), రామకృష్ణ (టంగుటూరు), నాగేశ్వరరావు (కొండపి), రఘురామయ్య (గుడ్లూరు), ఆంజనేయులు (జె.పంగులూరు)ను నియమించారు. వీరంతా ప్రస్తుతం సబ్ ఇంజినీర్లుగా పనిచేస్తుండగా, సీనియారిటీ ప్రాతిపదికన ఉద్యోగోన్నతిపై రెగ్యులర్ ఏఈలుగా నియమితులయ్యారు. అందులో రామకృష్ణ, ఆంజనేయులు ప్రస్తుతం ఆయా మండలాల్లో పనిచేస్తుండగా, వారికి అక్కడే ఏఈగా పోస్టింగ్ ఇచ్చారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలి

కడప నగరపాలక, న్యూస్‌టుడే: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై వైకాపా నాయకులు కడపలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాల వైకాపా ప్రజాప్రతినిధులు, ఆయా జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు హాజరయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కొన్ని నెలలుగా పొరుగురాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలు సీమ పనులకు గొడ్డలిపెట్టుగా మారాయన్నారు.

రోడ్డు.. అడుగడుగునా గుంతలే..

కొనకనమిట్ల..మండలంలోని వాగుమడుగు- గనివిన పాడు గ్రామానికి వెళ్లే రహదారి ఇది. రాళ్లు తేలి అధ్వానంగా తయారైంది. ఎక్కడికక్కడే తారు ఊడిపోయి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణం సాగించలేక పోతున్నామని వాహన చోదకులు, స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో పలువురు ప్రమాదాల బారిన పడ్డారన్నారు. రహదారిని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని నిధులు మంజూరైతే మరమ్మతులు చేయిస్తామని పీఆర్ ఏఈ శ్రీనువాసరెడ్డి తెలిపారు. - న్యూస్‌టుడే, కొనకనమిట్ల

ప్రసన్నాంజనేయుడి దర్శనానికి నాలుగు క్యూలు

సిబ్బందికి సూచనలిస్తున్న సహాయ కమిషనర్ తిమ్మానాయుడు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే : శింగరకొండ తిరునాళ్లను ప్లాస్టిక్ రహితంగా జరగాలని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ సహాయ కమిషనర్ ఎం. తిమ్మానాయుడు అన్నారు. ఆదివారం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ చరవాణి సిగ్నల్స్ పనిచేయకుంటే వాకీటాకీలు తప్పక వినియోగించుకోవాలన్నారు. దీనివల్ల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికెళ్లే వీలుంటుందన్నారు. ఉద్యోగులంతా ఏక రూప దుస్తులు ధరించాలని, గుర్తింపు కార్డులు ఉంచుకోవాలన్నారు. కార్యాలయం, అన్నదాన మండపం, ఉచిత ప్రసాదాలు తదితర కీలక ప్రదేశాల్లో చురుగ్గా పనిచేసే సిబ్బంది ఉండాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు. ప్రసన్నాంజనేయస్వామి దర్శనానికి నాలుగు క్యూలు ఏర్పాటుచేసినట్లు సహాయ కమిషనర్ తెలిపారు. రూ.50, రూ.100, వీఐపీ, ఉచిత దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తిరుమల మాదిరిగా లడ్డూ ప్రసాదాలు తయారు చేయించామని, వాటిని భక్తులకు అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు మంచి నీరు, పులిహోర, ప్రసాదాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆలయంలోకి వచ్చిన భక్తులు ఉత్తర ద్వారం ద్వారా బయటకు రావాల్సి ఉంటుందన్నారు.

❖ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద భక్తులకు ఉచిత అన్నదానం చేసేందుకు దాత కొల్లి సీతారామయ్య ఏర్పాటు చేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి మద్దినేని శ్రీనివాస్ తెలిపారు. మూడు వేల రవ్వలడ్డూలు విక్రయిస్తున్నామని, ఆంజనేయ డెయిరీ వారు మజ్జిగ ప్యాకెట్లు, దత్తపాదుకాక్షేత్రానికి చెందిన సిబ్బంది మంచినీటి సరఫరా, వెంకటరమణ మిఠాయి దుకాణం తరఫున పులిహోర, పొంగలి ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

గొర్రెల పెంపకం దారుల సంక్షేమానికి తోడ్పడాలి

మార్కాపురం, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రూ.10 వేల కోట్లు కేటాయించాలని జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నక్కా గంగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న విజయవాడలో గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలోని పెంపకం దారులు అందరూ పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలో వ్యవసాయం, పాడిపరిశ్రమ తర్వాత గొర్రెలు, మేకల పెంపకం కీలకమైన వృత్తిగా ఉందన్నారు. ప్రభుత్వానికి రూ.వేల కోట్ల ఆదాయం వస్తున్నా వారి సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు ఏళ్లు కావస్తున్నా నేటికీ ఎన్నికల్లో వృత్తిదారులకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.బాలకృష్ణ, శివయ్య, సంపతి శ్రీను, చెన్నయ్య, అనిల్, బాలయ్య, బాదరయ్య, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ధర్నా కరపత్రం ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి తిరుపతిరావు, నాయకులు

అడవి పంది దాడిలో మహిళకు గాయాలు

అర్ధవీడు, న్యూస్‌టుడే: అడవిపంది దాడిలో మహిళకు గాయాలైన సంఘటన మొహిద్దీన్‌పురంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బండారు శివమ్మ పశువులకు మేత తెచ్చేందుకు సమీప మొక్కజొన్న తోటకు వెళ్లింది. తోటలో గడ్డి కోస్తుండగా అడవిపంది ఆమెపై దాడి చేసింది. కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల రైతులు గమనించి పంది దాడి నుంచి ఆమెను తప్పించారు. ఈ దాడిలో శివమ్మకు కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. గిద్దలూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

అతివకు శిక్షణ... ఉపాధికి ఆలంబన!

న్యూస్‌టుడే, సంతనూతలపాడు

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ మహిళలు

నిరుద్యోగ మహిళలకు ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా అక్కడ శిక్షణ అందిస్తున్నారు. సంతనూతలపాడు మండలంలోని ఎండ్లూరుడొంకలో గల ఎన్టీఆర్ మహిళా ప్రాంగణంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ హబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటర్ కోర్సులు, బ్యూటీషియన్, కుట్టుపై తర్ఫీదు అందిస్తున్నారు. దీన్ని ఎంతో మంది మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రస్తుతం 9వ బ్యాచ్‌కు కంప్యూటర్ శిక్షణ మొదలైంది. ఇక్కడికి ఎంతో మంది మహిళలు వచ్చి ఉత్సాహంగా వాటిని నేర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా కొందరు తమ అభిప్రాయాలను పంచుకున్నారిలా.

ఖాళీ సమయం సద్వినియోగం చేసుకుంటున్నా..

ప్రస్తుతం ఏ ఉద్యోగం కావాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరం. బయట నేర్చుకోవాలంటే ఎంతో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎండ్లూరు డొంకలోని మహిళా ప్రాంగణంలో ఉచితంగా ఉద్యోగాలకు కావాల్సిన అన్ని అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. నేను బీఈడీ పూర్తిచేశాను. చదువు పూర్తవ్వగానే పెళ్లి, పిల్లలు ఇలా సమయం గడిచిపోయింది. ప్రస్తుతం పిల్లలు పాఠశాలకు వెళ్లడంతో ఉద్యోగం చేయాలని నిర్ణయించుకొని ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నా. పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తామని చెప్పారు.

-చాగంటి లక్ష్మి, ఒంగోలు

❖ **కుటుంబానికి అండగా నిలవాలని..**

నేను ఇంటర్ వరకు చదువుకున్నా. ప్రస్తుతం డ్వాక్రా గ్రూప్‌లో రీసోర్స్ పర్సన్‌గా పనిచేస్తున్నా. కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడంతో పనిచేసే ప్రదేశంలోను, బయటకు సైతం వెళ్లలేకున్నాను. నా భర్త గ్రానైట్ కంపెనీల్లో పనిచేస్తుంటారు. తాను సంపాదించేది కుటుంబానికి చాలడం లేదు. కుటుంబానికి నా వంతుగా తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో కంప్యూటర్ నేర్చుకోవాలని నిర్ణయించుకొని ఇక్కడ ఉచితంగా శిక్షణ పొందుతున్నా. -సూరం చంద్రకళ, పేర్నమిట్ట

నిర్వాసితుల సమస్యలు వింటున్న సీపీఎం బృందం

నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలించాలి

పెద్దారవీడు, న్యూస్‌టుడే: పునరావాస కాలనీలను అభివృద్ధి చేసి ముంపు గ్రామాల్లోని నిర్వాసితులను తరలించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో కనీసం నిర్వాసితుల ప్రస్తావన లేకపోవడం బాధాకరమని, పొలాలు, భూములు కోల్పోయిన వారి త్యాగం పునాదులపై ప్రాజెక్టు నిర్మిస్తున్నారని, నిర్వాసితులకు చట్ట ప్రకారం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సుంకేసుల గ్రామంలో పర్యటించి వారితో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...అర్హులైన వారిని జాబితాలో చేర్చాలని, నిబంధనల మేరకు 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందించేలా నిర్వాసితులకు మద్దతుగా పోరాడతామన్నారు. సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, రైతు సంఘం నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య, హనీఫ్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాహకులతో పతకాలు సాధించిన విద్యార్థులు

కరాటేలో పొదిలి విద్యార్థుల ప్రతిభ

పొదిలి, న్యూస్‌టుడే: గుంటూరులో ఆదివారం జరిగిన నేషనల్ లెవల్ ఓపెన్ కరాటే, కుంగుఫూ, తైక్వాండో ఛాంపియన్స్ టోర్నమెంట్‌లో పొదిలి విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. పొదిలిలో కరాటే మాస్టర్ కఠారి చిన్నరాజు వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులు కుంగుఫూ, కట్టా విభాగాల్లో బంగారు, రజత పతకాలు సాధించారు. జె.హన్విక, పి.వాత్సల్య, మన్విత్‌రాజ్‌దీప్, బి.శాన్విక, కె.కార్తికేయ, ఎస్.నరేంద్ర, జైన్, ఎల్.శివ, చేతన్, జాహ్నవి, అనన్యలు వివిధ బెల్ట్‌ల విభాగాల్లో బంగారు, రజత పతకాలు సాధించారు. మాస్టర్ రాజు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నూతనంగా ఎన్నికైన నాయకులు

ఉపాధిహామీ సహాయకుల నూతన కమిటీ ఎన్నిక

మార్కాపురం: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించి సాంకేతిక సహాయకుల యూనియన్ మార్కాపురం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గోన ధర్నబాబు (పీసీపల్లి), కందుల అనిల్‌కుమార్ (పెద్దారవీడు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా ఎం.మనోహర్, ఉపాధ్యక్షుడుగా వెంకటరెడ్డి, కోశాధికారిగా పి.జోయల్‌రాజ్, సహాయ కార్యదర్శిగా ఎ.వెంకట శివారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎ.లక్ష్మీరెడ్డి, కమిటీ సభ్యులుగా ఓబయ్య, కృష్ణంరాజులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ యూనియన్ బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యలపై పరిష్కారానికి కృషి చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు అన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 150, రిటైల్ లైవ్ - 177, చికెన్ విత్ స్కిన్ - 257, చికెన్ స్కిన్‌లెస్- 292

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

EDUCATION

DISTANCE EDUCATION

ఆచార్యనాగార్జున యూనివర్శిటీ దూరవిద్యాకేంద్రం నిర్వహిస్తున్న M.Sc, M.A(అన్ని కోర్సులు), MBA, MCA, M.Com, MLiSc కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. MBA, MCA ఎంట్రన్స్‌కు అర్హతా పరీక్ష తేది 15-3-2026న జరుగును. పూర్తి: గీతం డిగ్రీ కాలేజి, ఒంగోలు. సెల్: 9030568558, 9849124970

REAL ESTATE

LAND FOR SALE

వ్యవసాయభూమి అమ్మకమునకు ప్రకాశం జిల్లా దర్శి మం, వెంకటాచలంపల్లె గ్రామంలో సర్వేనం. 33 & 35 నందుగల 16.24 ఎకరాలు (మెట్ట) వ్యవసాయ భూమి అమ్మకమునకు కలదు. సంప్రదించవలసిన ఫోన్ నం: 90000 18931.

JOBS

WANTED Exp. Female Telicallers/Computer Operators in Edu. Consultancy in VIP Rd,Ongole. Sal:15k-20k, Q: Degree ✆ 9052975353.

ప్రముఖ దినపత్రికలో ప్రకటనల సేకరణకు ప్రకాశం జిల్లాలో కనిగిరి, దర్శి, కందుకూరుటౌన్‌లో పనిచేయుటకు అసిస్టెంట్ సేల్స్‌మెన్స్ కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత అర్హత: ఇంటర్ పాస్, డిగ్రీ. జీతం:20,000. TA.DA,ఇన్సెంటివ్ ఇవ్వబడును. ✆97011 12824.

ప్రముఖ లోన్స్ ఏజెన్సీ నందు లోన్స్ చేయుటకు టెలికాలర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 97014 79569, 80081 00872.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు క్లాస్ ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 12000 నుండి 14000 వరకు ఇవ్వబడును. (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22సం||రాల నుండి 40 సం||రాలు ఉండవలెను. వివరాలకు సంప్ర. ఫోన్: 9248733320.

షణ్ముఖ స్టేట్ & సెంట్రల్ ప్రాజెక్ట్స్ ఆఫీసు నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్, టెలికాలర్స్, ఫ్రంట్ ఆఫీసు స్టాఫ్ కావలెను. సెల్: 90303 27779.

ఒంగోలు అంజయ్యరోడ్ ప్రముఖ బాయ్స్‌హాస్టల్ నందు పని చేయుటకు వంట మనిషి కావలెను. (అనుభవం గల). Cell: 89774 05389, 86888 64165.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు 80087 09902
మార్కాపురం 80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.

B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కనిగిరి

•కనిగిరి •గిద్దలూరు

మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం తన కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద పేదలకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్సలు చేయించుకొనేందుకు పేదలకు కూటమి ప్రభుత్వం చేయూత అందిస్తోందని తెలిపారు. నియోజకవర్గంలోని 73 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ. 42.19 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు, కంభం మార్కెట్ కమిటీ ఛైర్మన్లు బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్‌రెడ్డి, ఆరు మండలాలకు చెందిన తెదేపా నాయకులు పాల్గొన్నారు.

గిరిజన గురుకుల పాఠశాలకు మోక్షం

భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో నిలిచిపోయిన కనిగిరి గురుకుల పాఠశాల భవన సముదాయం నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వంలో తిరిగి ప్రారంభమయ్యాయి. కనిగిరి పురపాలక సంఘం పరిధిలోని శంకవరం సమీపంలో సుమారు రూ. 8.75 కోట్లతో గత ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన గురుకుల పాఠశాల నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకు సంబంధించి వసతిగృహం, పాఠశాల, బోధన, బోధనేతర సంబంధించిన భవనాలు, గదుల నిర్మాణం చేపట్టారు. కొంత నిర్మాణం చేపట్టిన అనంతరం గుత్తేదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో భవనాలను పైకప్పు స్థాయిలో నిలిచిపోవడంతో నిరుపయోగంగా మారాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గత నెలలో పనులు ప్రారంభించారు. మరో నాలుగైదు నెలల్లో పూర్తి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కనిగిరిలోని శివనగర్ కాలనీలో ఎస్టీ వసతి గృహంలో అరకొర వసతుల మధ్య నడుస్తున్న గిరిగిజన పాఠశాలను భవనం పూర్తయిన వెంటనే తరలించనున్నట్లు ఐటీడీఏ ఏఈఈ జయరాజు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల పనులను ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

పామూరు, న్యూస్‌టుడే: పామూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన ఆదివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పలు శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. సింగిల్ విండో అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఆవులు, గేదెలకు రేడియం స్టిక్కర్లు అందజేస్తామని, పశువుల యజమానులు వీటిని తీసుకోవాలని కోరారు. వ్యవసాయాధికారి అబ్రహంలింకన్ మాట్లాడుతూ.. రైతులు తాము సాగుచేసిన పంటలను తప్పని సరిగా ఈ-క్రాప్ చేయించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. హౌసింగ్ ఏఈ సురేష్ మాట్లాడుతూ.. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో పామూరు మండలంలో 2019-2024 మధ్యలో మంజూరైన 110 ఇళ్లను త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన 2.0 కింద మండలంలో 2,210 దరఖాస్తులు రాగా.. సొంత స్థలం లేని 335 మంది జాబితాను తహసీల్దార్‌కు అందజేసినట్లు వెల్లడించారు. దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యాక త్వరలో అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాసుదేవరావు, ఎంపీడీవో నారాయణగుప్తా, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాటంరాజుకు ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెద్దారవీడు, న్యూస్‌టుడే: గుండంచర్ల సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన వేనూతుల కాటంరాజు గంగాభవానీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటంరాజు, గంగాభవానీ అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

క్యారమ్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు

గిద్దలూరు పట్టణం: గిద్దలూరు పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో యూ.చంద్రిక, డి.హబీబా, డి.ధాయిఫా, జూనియర్స్ విభాగంలో ఎం.వరుణ్, కె.షణ్ముఖ, డి.దస్తగిరిలు విజేతలుగా నిలిచారు. వారికి దాతల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు బి.రామిరెడ్డి, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆడుతున్నారు.. ప్రతిభ చూపుతున్నారు

విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయులను దాటి జాతీయ స్థాయిలో ప్రతిభ చూపుతున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న గోసుల సాక్షి రగ్బీలో, గోన కార్తిక్, నాగార్జున అన్నదమ్ములు కరాటేలో సత్తాచాటుతున్నారు. పలు బహుమతులు గెలిచి అందరి మన్ననలు పొందుతున్నారు. - న్యూస్‌టుడే, కంభం

☛ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్న విద్యార్థులు

అంతర్జాతీయ పోటీల్లో రాణించడమే లక్ష్యం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం బైపీసీ చదువుతోంది గోసుల సాక్షి. ఇటీవల దిల్లీలోని త్యాగరాజు స్టేడియంలో జరిగిన అండర్ -19 జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ చూపింది. రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించింది. హైస్కూల్ స్థాయిలో జరిగిన పోటీల్లో ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయుల్లో సత్తాచాటి బహుమతులు గెలుచుకుంది. దేశం తరఫున అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనడమే లక్ష్యంగా రోజూ సాధన చేస్తోంది.

నేర్చుకున్న విద్యను పలువురికి నేర్పుతా

వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న గోనా నాగార్జున కరాటేలోని స్పాంగ్ విభాగంలో రాణిస్తున్నాడు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో హెచ్ఈసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఇప్పటికే ఎల్లో బెల్ట్ సాధించాడు. తాను నేర్చుకున్న విద్యను పలువురికి నేర్పిస్తానంటున్నాడు.

బ్లాక్‌బెల్ట్ సాధించడమే లక్ష్యం

దోర్నాల మండలం కడపరాజుపల్లికి చెందిన గోన కార్తిక్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. స్థానిక వసతి గృహంలో ఉంటూ కరాటే శిక్షణ పొందుతున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటాడు. చదువుల్లోనూ రాణిస్తున్నాడు. కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానన్నాడు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114

గిద్దలూరు పట్టణం : 8008574135

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే

?: మండలంలోని హాజీపురం అడ్డరోడ్డు వద్ద గుర్రప్పడి ఆలయానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. మరమ్మతులు చేయించాలి. -జి.శ్రీనివాసులు

✓: ఉపాధి నిధులతో మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. -బ్రహ్మయ్య, పంచాయతీరాజ్ ఏఈ

-న్యూస్‌టుడే, అర్ధవీడు

?: కాకర్ల ఆరోగ్య ఉపకేంద్రం పరిసరాల్లో చెత్తాచెదారం పడేయటంతో పారిశుద్ధ్యం లోపించింది. -రాజయ్య, స్థానికుడు

✓: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -కాశిరావు, పంచాయతీ కార్యదర్శి

?: మాగుటూరు తండా వెళ్లే రహదారిలోని మినీ నీటిట్యాంకు వద్ద మురుగునీరు చేరింది. నీటిని పట్టుకునేందుకు ఇబ్బందిగా మారింది. -కేశవ, స్థానికుడు

✓: మురుగునీరు తొలగించి సమస్య పరిష్కరిస్తాం. -నరేష్, పంచాయతీ కార్యదర్శి

కంభం, న్యూస్‌టుడే

?: స్థానిక అర్బన్ కాలనీ చివరి వీధిలో కుళాయి వద్ద ప్లాట్‌ఫాం లేదు. దీంతో నీరు పట్టుకునేందుకు ఇబ్బందికరంగా ఉంది. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. – శ్రీను, స్థానికుడు

✓: కుళాయి చుట్టూ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. -ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి, కంభం

పరిశుభ్రతకు చర్యలు

ఇడమకల్లు (కొమరోలు గ్రామీణం), న్యూస్‌టుడే: గత నెల 28న ఈనాడులో 'నిండా పాచి.ప్రజారోగ్యానికేదీ పూచీ' శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం ఈ ట్యాంకును శుభ్రపరిచి పరిసరాల్లోని దుర్గంధాన్ని తొలగించారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శి తన సొంత నిధులు వెచ్చించి ట్యాంకును శుభ్రం చేయించారు. సర్పంచితో మాట్లాడి ట్యాంకుకు మూతను ఏర్పాటు చేయిస్తానని పంచాయతీ కార్యదర్శి జానకీరాం తెలిపారు.

ఏఐ సాంకేతిక సదస్సును ఉపయోగించుకోండి

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 6,7 తేదీల్లో మార్కాపురంలోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కాలేజీ (ఎస్జీఐటీ)లో నిర్వహించే 20వ జాతీయ టెక్నో అండ్ కల్చరల్ ఫెస్ట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సయ్యద్ ఖాసిం కోరారు. ఆదివారం కళాశాల ఆవరణలో ఎమర్జ్-2026 గోడ ప్రతిని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం జరగబోయే సాంకేతిక సదస్సులో కృత్రిమమేధ (ఏఐ) ప్రధానాంశంగా ఉండబోతోందని, నేటి పోటీ ప్రపంచంలో అత్యావశ్యకమైన ఏఐపై మేధోమధనం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఇటువంటి ఫెస్ట్‌లు ఎంతో దోహదం చేస్తాయన్నారు.

వెలిగొండ పరిహారం అప్పులకే సరిపోయింది


జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన సోమయ్య

ప్లీనరీ సమావేశంలో పాల్గొన్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి, నాయకులు

మార్కాపురం, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు నిమిత్తం గతంలో భూములు, నివాసాలకు ఇచ్చిన నష్ట పరిహారం నిర్వాసితుల అప్పులు బ్యాంకు రుణాలకే సరిపోయిందని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీతో కనీసం ఎకరా పొలం కూడా ప్రస్తుత రోజుల్లో వచ్చే పరిస్థితి లేదన్నారు.

❖ ఆయిల్ నిక్షేపాలను కొల్లగొట్టడం కోసం ఇరాన్‌పై కుంటి సాకులతో సంయుక్తంగా అమెరికా, ఇజ్రాయిల్ దాడులు చేస్తున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. మార్కాపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మార్కాపురం జిల్లా ప్లీనరీ సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా సీపీఎం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆవులయ్య, బాల నరసయ్య, డి.తిరుపతిరెడ్డి, పి.రూబెన్, ఏనుగుల సురేష్‌కుమార్, వై.రవికుమార్, జవ్వాజి రాజు, దర్శి శారా, మాలకొండయ్య, జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎం మార్కాపురం జిల్లా కమిటీ ఎన్నిక

మార్కాపురం జిల్లా సీపీఎం ప్రధాన కార్యదర్శిగా దగ్గుపాటి సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులుగా సయ్యద్ హనీఫ్, ఉసా వెంకటేశ్వర్లు, పి.సి.కేశవరావు, కొమ్మలపాటి మాల్యాద్రి, డి.కె.ఎం.రఫీ, గుమ్మా బాల నాగయ్యలను ఎన్నుకున్నారు.

కోట సత్యమాంబదేవి... మనసా స్మరామి

కంభం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని కోట సత్యమాంబదేవి అమ్మవారికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మను పుష్పాలు, పసుపు, చందనం, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. బోనాలు, చీరలు, గాజులు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీచక్రం, శివుడు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, పుట్టాలమ్మ వద్ద పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కిక్కిరిసింది.

చౌక ధరల దుకాణాల్లో గోధుమపిండి పంపిణీ

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం పేదలకు చౌకదుకాణాల ద్వారా కిలో గోధుమ పిండిని రూ.20కి అందజేస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గిద్దలూరు పురపాలక సంఘంలోని కొంగళవీడు రహదారిలో గల చౌకదుకాణంలో కార్డుదారులకు గోధుమ పిండి పంపిణీ చేశారు. అనంతరం బీసీ వసతిగృహంలో 10వ తరగతి విద్యార్థులు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు నడవాలని సూచించారు.

అంచుల్లో ఆక్రమణలు.. రాకపోకలకు అవస్థలు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గిద్దలూరు-రాజుపాలెం ఆర్అండ్‌బీ మార్గంలో నరవ గ్రామంలో పలువురు గృహయజమానులు రహదారి అంచును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో పక్కకు తప్పుకొనేందుకు అవకాశం లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. వెంటనే ఆక్రమణలు తొలగించి రహదారిని విస్తరించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర సందర్శన

సీఎస్‌పురం, న్యూస్‌టుడే: స్థానిక కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థులు ఆదివారం దర్శి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి షేడ్‌నెట్ హౌస్, కూరగాయల ప్రదర్శన శాల, మ్యారిగోల్డ్ బ్లాక్ చూశారు. ఈ సందర్భంగా వారికి వ్యవసాయ శాస్త్ర విషయ నిపుణుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పలు సాగు పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో సహాయ ఆచార్యులు బసవరాజు, సంతోషి పాల్గొన్నారు.

దర్శి కేవీకే వద్ద విద్యార్థులు, అధ్యాపకులు

అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంకు

పీర్ల చావిడి ట్యాంకు ఇలా..

రాచర్ల, న్యూస్‌టుడే : మండలంలోని ఆకవీడు ఇవతలిపాలెంలోని పీర్ల చావిడి వద్ద మినీ మంచినీటి ట్యాంకు అధ్వానంగా ఉంది. అక్కడ సుమారు వంద కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. అపరిశుభ్రత తొలగించకపోతే రోగాలు ప్రబలే ప్రమాదముంది. దీనిపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ట్యాంకు పరిసరాలు బాగు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణ తెలిపారు.

బాణసంచా అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు

తనిఖీ చేస్తున్న కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై రవీంద్రారెడ్డి

బేస్తవారపేట, న్యూస్‌టుడే: దుకాణాదారులు లైసెన్స్ లేకుండా నివాస ప్రాంతాల్లో బాణసంచాను నిల్వ చేయడం, రహస్యంగా విక్రయించడం చట్టారీత్యా నేరమని కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై రవీంద్రారెడ్డి అన్నారు. ఆదివారం బేస్తవారపేటలో కొన్ని బాణసంచా విక్రయ దుకాణాలను వారు తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను గుర్తించి చర్యలు తీసుకున్నారు. ఇలాంటి చర్యలను సహించబోమని దుకాణదారులను హెచ్చరించారు.

లక్ష్య సాధనతో ముందుకు సాగాలి

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచించారు. శనివారం రాత్రి గిద్దలూరు పట్టణంలోని స్ప్రింగ్ బోర్డు పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎమ్మెల్యే జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకుడు ఫిరోజ్, పాఠశాల కరస్పాండెంట్ డా.జె.వి.నారాయణ, ఎంఈవో అశ్వనికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత


గుంటూరు జీజీహెచ్‌లో నగదు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి

బేస్తవారపేట, న్యూస్‌టుడే: గలిజేరుగుళ్లకు చెందిన పులుగుజ్జు యేసుదాసు మంచానికి పరిమితమవ్వడంతో గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి ఆదివారం అక్కడికి వెళ్లి పింఛను నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను స్థానికులు అభినందించారు.

ఎస్‌సీవీకే నూతన కార్యవర్గం ఎన్నిక

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్‌సీవీకే నిలయం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక గడియార స్తంభం వద్ద ఉన్న రీడింగ్ రూమ్ ఆవరణలో అందరి సభ్యుల సమక్షంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సొసైటీ అధ్యక్షులు ఐ. సుబ్బారావు తెలిపారు. అధ్యక్షులుగా సుబ్బారావు, కార్యదర్శిగా గుంటక సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా శాసనాల వీరబ్రహ్మం, జాయింటు సెక్రటరీగా కనిగిరి బాలవెంకటరమణ, కోశాధికారిగా యక్కలి రమేష్‌లు ఎన్నికయ్యారు.

మురుగు.. రోడ్డుపైనే పరుగు!

పవిత్ర కల్యాణ మండపం వీధిలో ఇలా..

కనిగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు వార్డుల్లో కాలువలు లేక మురుగు రోడ్డుపై పారుతోంది. ఓవైపు మున్సిపల్ అధికారులు అవసరమైన చోట డ్రెయిన్లు నిర్మిస్తున్నామని, అందుకోసం రూ.6 కోట్లు కేటాయించి, పనులు చేయిస్తున్నట్లు చెబుతుండగా.. మరోవైపు ఏ వార్డులో చూసినా రోడ్లపై మురుగు తటాకాలు కనిపిస్తున్నాయి. ఫలితంగా ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పవిత్ర కల్యాణ మండపం వీధి, జర్నలిస్టుల కాలనీ తదితర ప్రాంతాల్లో సమస్య ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పది విద్యార్థులకు అల్పాహారం అందజేత

వెలిగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఇమ్మడి చెరువు, పందువనాగులవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థులకు.. 'ఈనాడు' చొరవతో డీసీఎంఎస్ ఛైర్మన్ శ్యామల కాశిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అల్పాహారం అందజేశారు. సుమారు 145 మందికి ఎంఈవో దేవిరెడ్డి రామిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. దాత చొరవ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. చక్కగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.అబ్రహం, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, రామారావు, చంద్రకళ, ఇందిర, రాధాకుమారి, భాస్కరరావు, ప్రవల్లిక, భాస్కరరావు, నాగార్జున, ఝాన్సిలక్ష్మీబాయి, రవి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అల్పాహారం అందజేస్తున్న ఎంఈవో రామిరెడ్డి, ఉపాధ్యాయులు

తరగతుల్లేవు.. పరీక్షలున్నాయి!

కనిగిరిలో ఓ కళాశాల వద్ద బీఎడ్ అభ్యర్థులు

న్యూస్‌టుడే, కనిగిరి:

☛ బీఎడ్ కోర్సు నిర్వహణ తీరే వేరయా

వాస్తవంగా పరీక్షలు అంటే.. తరగతులు నిర్వహించాలి.. విద్యార్థులు హాజరవ్వాలి... ప్రాక్టికల్స్ జరగాలి. కాని కనిగిరిలో మాత్రం అలా జరగడం లేదు. అస్సలు తరగతులకు రావాల్సిన పనిలేదు. ప్రాక్టికల్స్ చేయాల్సిన అవసరం లేదు. కేవలం పరీక్ష సమయంలో వస్తే చాలు.... ఇలాంటి తంతు.. కనిగిరిలో బీఎడ్ పరీక్షల్లో జరుగుతోంది.

అధికశాతం ఇతర రాష్ట్రాలకు చెందిన వారే..

కనిగిరి పట్టణంలో గడిచిన అయిదు రోజులుగా ఐదు ప్రైవేటు బీఎడ్ కళాశాలల్లో సుమారు 600 మంది సెమిస్టర్ పరీక్షలు రాస్తున్నారు. వీరిలో రెగ్యులర్ వాళ్లు, సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైన వారున్నారు. అయితే 90 శాతం మంది బీఎడ్ పరీక్షలు రాసేవాళ్లు ఒడిశా, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందినవారే కావడం విశేషం. స్థానిక విద్యార్థులు మాత్రం 10 శాతం మంది మాత్రమే ఉండటం గమనార్హం.

ఒక్కొక్కరి నుంచి రూ.25 వేలు వసూలు

విద్యార్థి పరీక్షకు వచ్చిన రాకున్నా ఒక్కొక్కరికి నుంచి రూ. 25వేలు వంతున ఒక్కో సెమిస్టర్‌కు కళాశాలకు చెల్లించాలి. పరీక్షలు సమయంలో మరో రూ. 5వేలు ప్రయివేటు కళాశాల యజమాన్యానికి చెల్లించాలి. ఇలా చెల్లిస్తే చాలు విద్యార్థులు తరగతులకు హాజరుకావాల్సిన అవసరం లేదు. ప్రాక్టికల్స్ చేయాల్సిన అవసరం లేదు.. కేవలం సెమిస్టర్ పరీక్షల సమయంలో హాజరైతే చాలు.. ఇంకో విషయం ఏంటంటే పరీక్షలు జరిగే కేంద్రాల్లో సీసీ కెమెరాలు కూడా ఉండటం లేదని ఆరోపణలున్నాయి. ◗ పరీక్షల సమయంలో ఏదో ఒక భవనం చూపి పరీక్షలు రాయిస్తున్నారు.

ఇలా జరగడం బాధాకరమే...

ఎంతో ఉన్నతమైన విద్యావ్యవస్థకు మూలస్తంభమైన బీఎడ్ పరీక్షలు ఇలా జరగడం బాధాకరమే.. అయితే ఇది ఒక్క కనిగిరిలోనే కాకుండా మార్కాపురం, గిద్దలూరు, ఉమ్మడి ప్రకాశంలోను ఇదే తంతు జరుగుతోంది. అయితే ఈ పరీక్షల తంతు అంతా యూనివర్సిటీ స్థాయిలో ఉండటం వల్ల చేతులు తడపడం వల్ల ఆడిందే ఆటగా పాడిందే పాటకు సాగుతోంది. ఈ విషయమై డిప్యూటీ డీఈవో ఎం. శ్రీనివాసులరెడ్డిని వివరణ కోరగా ఇది మా పరిధిలోకి రాదు యూనివర్సిటీ పరిధిలోకి వస్తుందన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన చోదకులు విధిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్సై కె.మాధవరావు సూచించారు. హెచ్ఎంపాడు-కనిగిరి మార్గంలోని కూడలి వద్ద ఆదివారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు చేశారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, అతివేగంతో వెళ్లినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

మిట్టపాలెం నారాయణస్వామికి పొంగళ్లు

సీఎస్‌పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు గోపూజ చేశారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామివారికి పొంగళ్లు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. మూలవిరాట్‌ను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పల్లకీసేవ, రథోత్సవం నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో ఎస్.నరసింహబాబు, వ్యవస్థాపక ధర్మకర్త కె.చిన్నఆదినారాయణ, సిబ్బంది పర్యవేక్షించారు.

ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

(c) eenadu

వెలిగొండ పరిహారం అప్పులకే సరిపోయింది

జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన సోమయ్య

ప్లీనరీ సమావేశంలో పాల్గొన్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి, నాయకులు

మార్కాపురం, న్యూస్‌టుడే: వెలిగొండ ప్రాజెక్టు నిమిత్తం గతంలో భూములు, నివాసాలకు ఇచ్చిన నష్ట పరిహారం నిర్వాసితుల అప్పులు బ్యాంకు రుణాలకే సరిపోయిందని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ కోసం ఎకరా పొలం కూడా ప్రస్తుత రోజుల్లో వచ్చే పరిస్థితి లేదన్నారు.

❖ ఆయిల్ నిక్షేపాలు కొల్లగొట్టడం కోసం ఇరాన్‌పై కుంటి సాకులతో సంయుక్తంగా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. మార్కాపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మార్కాపురం జిల్లా ప్లీనరీ సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లా సీపీఎం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆవులయ్య, బాలనరసయ్య, డి.తిరుపతిరెడ్డి, పి.రూబెన్, ఏనుగుల సురేష్‌కుమార్, వై.రవికుమార్, బివ్వాల రాజు, దర్శి శార, మాలకొండయ్య, జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎం మార్కాపురం జిల్లా కమిటీ ఎన్నిక

మార్కాపురం జిల్లా సీపీఎం ప్రధాన కార్యదర్శిగా దగ్గుపాటి సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులుగా సయ్యద్ హనీఫ్, ఉసా వెంకటేశ్వర్లు, పి.సి. కేశవ రావు, కొమ్మలపాటి మల్లయ్య, డి.కె.ఎం.రఫీ, గుమ్మా బాల నాగయ్యలను ఎన్నుకున్నారు.

మార్కాపురం

•మార్కాపురం •యర్రగొండపాలెం

నారాయణస్వామికి ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు గోపూజ చేశారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామివారికి పొంగళ్లు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. మూలవిరాట్టును వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పల్లకీసేవ, రథోత్సవం నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

కాగితాల్లో కళాశాలలు.. రూ.లక్షల్లో ఫీజులు

■ బీఈడీ పరీక్షలు రాస్తున్న 90 శాతం పొరుగు రాష్ట్రాల విద్యార్థులు

పరిశీలన

పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, మార్కాపురం:

రాష్ట్రంలో బీఈడీ కోర్సు చేయాలంటే ప్రతి రోజు కళాశాలకు వెళ్లి రికార్డులు రాసి, శిక్షణ పాఠశాలలకు వెళ్లి పాఠ్యాంశాలు బోధించిన తర్వాత చివరగా పబ్లిక్ (సెమిస్టర్) పరీక్షలు రాసేవారు. అయితే ఇప్పుడు కళాశాలలు, తరగతులు, అధ్యాపకులు, సౌకర్యాలు ఇలా ఏమీ కనిపించడం లేదు. కాగితాల్లో లెక్కలు కింద కనిపిస్తున్నాయి. కేవలం చివరగా రాసే పబ్లిక్ పరీక్షలకు మాత్రమే విద్యార్థులు హాజరు అవుతున్నారు. ఆ విద్యార్థులు కూడా మన జిల్లానో, ఇతర జిల్లాలు, రాష్ట్రంలోని విద్యార్థులు కాదు 90 శాతం ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఉంటారు.

ఉమ్మడి జిల్లాలో 108 బీఈడీ కళాశాలలు

మార్కాపురం, ప్రకాశం జిల్లాలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ద్వారా బీఈడీ మొదటి సంవత్సరం ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 108 బీఈడీ కళాశాలలున్నాయి. మార్కాపురం జిల్లాలోని మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాల్లోని 21 మండలాల్లో 69 బీఈడీ కళాశాలలు ఉన్నాయి. మార్కాపురం పట్టణంతో పాటు మండలంలోని 16 బీఈడీ కళాశాలలున్నాయి. మార్కాపురం జిల్లాలో అత్యధికంగా గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం, బేస్తవారిపేట, గిద్దలూరు ప్రాంతాల్లో సగం వరకు కళాశాలలు ఉన్నాయి. ఆ తర్వాత మార్కాపురం నియోజకవర్గంలో అధికంగా ఉన్నాయి.

రూ.90 వేల నుంచి రూ.1.30 లక్షల మేర వసూలు

మార్కాపురం జిల్లాలో గతనెల 25న బీఈడీ మొదటి సంవత్సరం పరీక్షలు మొదలయ్యాయి. మార్చి 2వ తేదీ వరకు జరుగుతాయి. జిల్లాలో ఉన్న 69 కళాశాలల్లో 6,900 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారి నుంచి బీఈడీకు రూ.90 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు వసూలు చేస్తూ వారికి అడ్మిషన్లు ఇస్తున్నారు. ప్రస్తుతం బీఈడీ కళాశాలలు నడుస్తున్నదే కేవలం ఒడిశా, బీహార్, యూపీ రాష్ట్రాలకు చెందిన వారి కోసం మాత్రమే అన్నట్లుగా ఉంటోంది. పరిస్థితి ఇలా ఉన్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

మౌలిక వసతుల కల్పనకు కృషి

విద్యా వివరాలు వెల్లడిస్తున్న ఎంఈవో మస్తాన్‌నాయక్

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: గ్రామాల్లో అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో ప్రసూనదేవి కోరారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ...గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులకు సహకరించాలని ఆమె ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులను కోరారు. ఎంఈవో బి.మస్తాన్‌నాయక్, పంచాయతీరాజ్ ఏఈ సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శివకోటేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఏపీఎం చాణక్య తదితరులు తమ శాఖల ద్వారా చేపడుతున్న పనులను వివరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దర్శనం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాటంరాజుకు ప్రత్యేక పూజలు

అలంకరణలో కాటంరాజు స్వామి, పూజలో పాల్గొన్న భక్తులు

పెద్దారవీడు, న్యూస్‌టుడే: గుండంచర్ల సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన వేనూతుల కాటంరాజు గంగాభవానీ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటంరాజు, గంగాభవానీ అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ఏఐ సాంకేతిక సదస్సును ఉపయోగించుకోండి

'ఎమర్జ్' గోడ ప్రతిని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ ఖాసిం, తదితరులు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 6,7 తేదీల్లో మార్కాపురంలోని డాక్టర్ శామ్యూల్‌జార్జి ఇంజినీరింగ్ కాలేజీ (ఎస్జీఐటీ)లో నిర్వహించే 20వ జాతీయ టెక్నో అండ్ కల్చరల్ ఫెస్టను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సయ్యద్ ఖాసిం కోరారు. ఆదివారం కళాశాల ఆవరణలో ఎమర్జ్-2026 గోడ ప్రతిని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం జరగబోయే సాంకేతిక సదస్సులో కృత్రిమమేధ (ఏఐ) ప్రధానాంశంగా ఉండబోతోందని, నేటి పోటీ ప్రపంచంలో అత్యావశ్యకమైన ఏఐపై మేధోమధనం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఇటువంటి ఫెస్టలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ మస్తానయ్య, వైస్ ప్రిన్సిపల్ రాజాబాబు, సీఎస్ఈ, ఈసీఈ తదితర విభాగాధిపతులు పాల్గొన్నారు.

వై.పాలెం ఎస్సైగా బాధ్యతల స్వీకరణ

దేవకుమార్

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెం ఎస్సైగా ఎం.దేవకుమార్ ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలు డీసీబీఆర్ నుంచి బదిలీపై యర్రగొండపాలెం వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై చౌడయ్య ఒంగోలు వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా దేవకుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

శాంతిభద్రతల అమలుకు కృషి

సాంబశివరావు

పుల్లలచెరువు(యర్రగొండపాలెం), న్యూస్‌టుడే: పుల్లలచెరువు ఎస్సైగా బి.సాంబశివరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఒంగోలు-2టౌన్‌లో పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఉన్నతాధికారులకు ఇక్కడికి కేటాయించారు. శాంతిభద్రతల అమలుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

బాణసంచా దుకాణాలు నిబంధనలు పాటించాలి

దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్ఐ సైదుబాబు

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలోని బాణసంచా నిల్వ గోడౌన్‌ను ఆదివారం సీఐ సుబ్బారావు, ఎస్ఐ సైదుబాబు తనిఖీ చేశారు. స్థానిక సాయిబాలాజీ థియేటర్ రోడ్డులోని మహాలక్ష్మి బాణసంచా నిల్వ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిల్వ కేంద్రం వద్ద ఇసుక, నీళ్లు లేకపోవడంపై సీఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదకర వస్తువులు ఉంటున్న ప్రదేశం కావడంతో అందుకు తగిన వసతులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఇలాంటి తనిఖీలు ఇక నుంచి నిత్యం జరుగుతాయని నిబంధనలు పాటించకపోతే దుకాణం సీజ్ చేస్తానని ఆయన హెచ్చరించారు.

తాగి నడిపితే జైలుకే...

వాహనాలు తనిఖీచేస్తున్న ఎస్సై రాజేష్

పొదిలి, న్యూస్‌టుడే: వాహనచోదకులు రోడ్డుభద్రతా సూత్రాలు పాటించాలని పొదిలి ఎస్సై ఎస్.రాజేష్ సూచించారు. ఆదివారం పొదిలిలోని మార్కాపురం అడ్డరోడ్డు వద్ద వాహనాలను తనిఖీచేశారు. నిబంధనలు పాటించని పలు వాహనాలకు జరిమానాలు విధించారు. అనంతరం చోదకులకు అవగాహన కల్పించారు. మద్యంతాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్తారని హెచ్చరించారు. వాహనదారుడు వెంట ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్సు, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ ధ్రువీకరణ పత్రాలు ఉండాలని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313

యర్రగొండపాలెం : 8008552658

పెద్దారవీడు, న్యూస్‌టుడే:

?: కుక్కలు వీధుల వెంట గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వాటిని బంధించి అటవీ ప్రాంతాలకు తరలించాలి. – మోహన్, మల్లవరం.

✓: పంచాయతీ సిబ్బందితో మాట్లాడి, గ్రామంలోని కుక్కలను పట్టించి దూర ప్రాంతంలో వదిలిపెడతాం. స్థానికులు సిబ్బందికి సహకరించాలి. – శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో

తర్లుపాడు, న్యూస్‌టుడే:

?: జిల్లాలోనే ఎంతో ప్రాముఖ్యం ఉన్న తుమ్మలచెరువు కాశింస్వామి దర్గా చుట్టూ చెత్త, చెదారంతో నిండిపోయింది. భక్తులు అటుగా వెళ్లాలంటే దుర్గంధం వెదజల్లుతోంది. దర్గా చుట్టూ శుభ్రం చేయించండి. – కాశయ్య, తుమ్మలచెరువు.

✓: కాశింస్వామి దర్గా చుట్టూ చెత్తాచెదారాన్ని త్వరలోనే తొలగించి భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. – పద్మ, పంచాయతీ అధికారి, తుమ్మలచెరువు

మార్కాపురం, న్యూస్‌టుడే:

?: మార్కాపురం మండలంలోని పెద్దయాచవరం గ్రామంలోని ఎస్సీపాలెంలో మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. రాత్రిపూట దోమల వ్యాప్తి అధికంగా ఉంటోంది. తక్షణమే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నాం.

– రాజు, పెద్దయాచవరం, మార్కాపురం

✓: పెద్దయాచవరం గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. త్వరలో పారిశుద్ధ్య పనులు చేపడుతాం.– ఎన్.వి.నారాయణరెడ్డి, పీడీవో, పెద్దయాచవరం, మార్కాపురం

?: మార్కాపురం మండలంలోని బొందలపాడు గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారికి ముందు మురుగు నీరు నిల్వ ఉంటోంది. రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సమస్యను పరిష్కరించగలరు. – వెంకటయ్య, బొందలపాడు, మార్కాపురం

✓: బొందలపాడు గ్రామంలో తక్షణమే పారిశుద్ధ్య పనులు చేయించి సమస్యను పరిష్కరిస్తాం. – జి.మహేశ్వరరెడ్డి, పీడీవో, బొందలపాడు, మార్కాపురం

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

?: మండలంలో ~~ఎక్కువ మంది రైతులు~~ కంది సాగు చేసినా ఇక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాక దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. – వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల

✓: వారం రోజుల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. తక్కువ ధరకు ఎవరూ అమ్ముకోవద్దు.

–ప్రకాష్, ఏవో, కొనకనమిట్ల

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే:

?: స్థానిక తర్లుపాడు రోడ్డులోని పలు వీధుల్లో వీధి లైట్లు సక్రమంగా వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – నరసింహ, స్థానికుడు.

✓: వీధి లైట్లు వెలగని ప్రాంతాల్లో మరమ్మతులు ఇప్పటికే ప్రారంభించాం. సమస్య ఉన్న ప్రాంతాల్లో త్వరలో పరిశీలించి కొత్తవి ఏర్పాటు చేస్తాం.

– నారాయణరావు, మున్సిపల్ కమిషనర్

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం వీధిలో కొన్ని వీధిలైట్లు పనిచేయడంలేదు. రాత్రివేళ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సమస్య పరిష్కరించాలి.

– రెహమాన్, స్థానికుడు

✓: సమస్య ఉన్న ప్రాంతానికి సిబ్బందిని పంపించి పరిశీలిస్తాం. అవసరమైన మరమ్మతులు చేయించి ఇబ్బందిలేకుండా చూస్తాం.

– రామసుబ్బయ్య, పీఎస్

వ్యవసాయ కళాశాల విద్యార్థుల క్షేత్ర సందర్శన

సీఎస్‌పురం, న్యూస్‌టుడే: స్థానిక కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థులు ఆదివారం దర్శి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి షేడ్‌నెట్ హౌస్, కూరగాయల ప్రదర్శన శాల, మ్యారిగోల్డ్ బ్లాక్ చూశారు. ఈ సందర్భంగా వారికి వ్యవసాయ శాస్త్ర విషయ నిపుణుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పలు సాగు పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో సహాయ ఆచార్యులు బసవరాజు, సంతోషి పాల్గొన్నారు.

కోట సత్యమాంబకు విశేష పూజలు

కంభం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని కోట సత్యమాంబదేవి అమ్మవారికి ఆదివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మను పుష్పాలు, పసుపు, చందనం, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. బోనాలు, చీరలు, గాజులు సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీచక్రం, శివుడు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, పుట్టాలమ్మ వద్ద పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కిక్కిరిసింది.

సిమెంట్ రోడ్డు వచ్చింది.. ఆనందం తెచ్చింది

వై.పాలెం పట్టణంలో పెద్ద మసీదుగా పిలిచే జామియా మసీదు వెనుక ఈద్గ మైదాన ఆవరణలో కూటమి ప్రభుత్వం రూ.10లక్షలతో సిమెంట్ రహదారి నిర్మాణం చేపట్టింది. మైదానం నుంచి ముస్లింల శ్మశాన వాటిక వరకు ప్రధాన రోడ్డు ఇటీవలే నిర్మించారు. గతంలో వర్షం పడితే నడిచి వెళ్లే పరిస్థితి లేదు. ఈ రోడ్డు నిర్మాణంతో ఇబ్బందులు తొలగిపోతాయని పలువురు తెలిపారు. ఎంతో కాలం నుంచి ఎదురు చూస్తున్న ఈ రోడ్డు సమస్యను కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. దీంతో ముస్లిం సోదరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

విస్తృత తనిఖీలు.. అనుమానితుల విచారణ

స్థానిక సుందరయ్య కాలనీలో ఎస్సై వెంకటరమణయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇంటింటా తిరిగి పరిశీలించారు. అనుమానితులను విచారించారు. సరైన ధ్రువపత్రాలు లేని ఐదు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. పెద్దదోర్నాలలో బాణసంచా విక్రయించే దుకాణాలను తనిఖీ చేశారు. అనుమతి లేని వాటిని సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు.

– న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

వృథా గోదాములు.. ఉపయోగిస్తే నయం

పెద్దదోర్నాలలోని గిరిజన సహకార సంస్థ గోదాములు నిరుపయోగంగా మారాయి. చెంచు గిరిజనులు సేకరించిన అటవీ ఫలసాయాలు కొనుగోలు చేసి నిల్వ చేసేందుకు గోదాములు ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఫల సేకరణ తగ్గిపోయింది. కొనుగోలు లేకపోవడంతో గోదాములు ఖాళీగా ఉన్నాయి. అవి శిథిలావస్థకు చేరుతున్నాయి. ఆర్థికాభివృద్ధిలో భాగంగా ఉపాధి శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు, ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసేందుకు వాటిని వినియోగించాలని చెంచు గిరిజనులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

రవీంద్ర దంపతులను సన్మానిస్తున్న యక్కలి రాఘవులు తదితరులు

ప్రజా సేవ అభినందనీయం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెం తెదేపా సీనియర్ నాయకుడు డాక్టర్ మన్నెరవీంద్రకు గ్రామీణ వైద్యులు(ఆర్ఎంపీలు) ఆదివారం ఘన సన్మానం చేశారు. ముందుగా ప్రత్యేక వాహనం పట్టణంలో రవీంద్ర దంపతులను ఊరేగించారు. అనంతరం వైష్ణవి హాల్లో జరిగిన సన్మాన కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జాతీయ కార్యదర్శి యక్కలి రాఘవులు మాట్లాడారు. గత 40 ఏళ్ల నుంచి వై.పాలెం ప్రాంతంలో పేదలకు అందిస్తున్న వైద్యసేలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెదేపా మాజీ ఏఎంసీ ఛైర్మన్ చేకూరి ఆంజనేయులు, తెదేపా మాజీ అధ్యక్షులు వడ్లమూడి లింగయ్య, జిలాని, రమణారెడ్డి, వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది గ్రామీణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక వైద్యానికి చేయూత

పూర్ణిమ తండ్రికి చెక్కు అందజేస్తున్న ముస్లిం పెద్దలు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: తలలో క్యాన్సర్ గడ్డతో చికిత్స పొందుతున్న బాలిక గోపిక పూర్ణిమకు పట్టణానికి చెందిన జమియతుల్ ఉలమా ఎ హిందూ ఆధ్వర్యంలో ముస్లిమ్ పెద్దలు రూ. 25వేల చెక్కును బాలిక తండ్రి నారాయణకు అందజేశారు. ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం యూత్ అధ్యక్షుడు ఇస్మాయిల్, మునాఫ్, జిలాని, సత్తార్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ అవర్‌కు హాజరు తప్పనిసరి

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు స్టడీ అవర్‌కు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంఈవో బి.మస్తాన్‌నాయక్ కోరారు. స్థానిక ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం స్టడీ అవర్‌ను ఆయన పరిశీలించారు. స్టడీ అవర్ నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. విద్యార్థుల చదువును పరిశీలించారు. సందేహాలు తీర్చారు. పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున అందరూ శ్రద్ధగా చదవాలని సూచించారు.


పదో తరగతి స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న ఎంఈవో మస్తాన్‌నాయక్

పైపులైను లీకేజీ... తాగునీరు వృథా

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి కొత్తూరులోని జహంగీర్ బాషా వీధిలో ఉన్న తాగునీటి పైపులైను లీకై నీరు వృథాగా పోతోంది. ఆ ప్రాంతంలోని పైపులైను రోడ్డుమీద ఉండగా దాన్ని కొంతమంది కాలువలోకి నెట్టేశారు. ఆ ప్రాంతంలో పెద్దవాహనాలు పైపులపై నుంచివెళ్లడం వల్ల తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని స్థానికులు తెలిపారు. కొన్నిరోజులుగా పైపులైను జాయింట్ వద్ద నీరు లీకై కాలువలోకి వెళ్తోంది. ఈ వీధిలో కింది ప్రాంతాలకు సరిగ్గా నీరు అందడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్‌సీవీకే నూతన కార్యవర్గం ఎన్నిక

మాట్లాడుతున్న నూతన కార్యదర్శి గుంటక సుబ్బారెడ్డి

మార్కాపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్‌సీవీకే నిలయం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక గడియార స్తంభం వద్ద ఉన్న రీడింగ్ రూమ్ ఆవరణలో అందరి సభ్యుల సమక్షంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సొసైటీ అధ్యక్షులు ఐ. సుబ్బారావు తెలిపారు. అధ్యక్షులుగా సుబ్బారావు, కార్యదర్శిగా గుంటక సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా శాసనాల వీరబ్రహ్మం, జాయింటు సెక్రటరీగా కనిగిరి బాలవెంకటరమణ, కోశాధికారిగా యక్కలి రమేష్‌లు ఎన్నికయ్యారు.

చలివేంద్రం ప్రారంభం

పొదిలిలో మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ, తాగు నీటి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధులు చెప్పారు. ఆదివారం చిన్నబస్టాండ్‌లో కొండా సుబ్రమణ్యం, కె.వెంకట లక్ష్మీ నారాయణ, పి.వెంకట సత్యనారాయణ, ఎం.రంగారావుల సహకారంతో తాగునీరు, మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు.

– న్యూస్‌టుడే, పొదిలి

అడిగితేనే.. కడుగుతారా..?

మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామంలోని ఎస్సీపాలెంలో తాగునీటి ట్యాంకు పాచిపట్టి అధ్వానంగా ఉంది. ట్యాంకు చుట్టూ పరిసరాలు మురుగుతో ట్యాంకు వద్దకు వెళ్లడానికి కూడా గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకు చుట్టూ ఉన్న ఫ్లోరింగ్ కూడా పగిలిపోయింది. కుళాయిలు అన్నీ విరిగిపోయాయి. రెండు మాత్రమే ఉండటంతో నీటిని పట్టుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. తక్షణమే ట్యాంకును శుభ్రం చేసి నీటిని పట్టుకునే విధంగా చేయడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మార్కాపురం

పబ్లిక్ నోటీసు

మా క్లయింట్ పల్నాడు జిల్లా, వినుకొండ పట్టణం, మోటపోతుల ఈశ్వరయ్య, కుమారుడు వెంకటనారాయణ వలన సంజాయిషీ పొంది ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా

పల్నాడు జిల్లా వినుకొండ పట్టణకాపురస్తుడు ఏల్చూరి గాలెయ్య కుమారుడు వెంకట నారాయణ, మా క్లయింట్ వద్ద తేది. 14.07.2023న ఐదు లక్షల రూపాయలు నగదు అప్పుగా తీసుకొని మా క్లయింట్ పేరిట పై తేదీన తన స్వహస్తంతో ఒక ప్రామిసరి నోటు వ్రాసి ఇచ్చి దరిమిల అనేక మార్లు మా క్లయింట్ తిరిగి అప్పు తీర్చమని అడిగినప్పటికీ సదరు ఏల్చూరి వెంకట నారాయణ అప్పు చెల్లించిక కాలయాపన చేయుచూ, బుద్ధి పూర్వకముగా, సదరు ఏల్చూరి వెంకట నారాయణ ఈక్రింది షెడ్యూల్ ఆస్తిని నామమాత్రముగా మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం గ్రామ మరియు మండల కాపురస్తుడైన తుమ్మలపల్లి లక్ష్మిసుబ్బయ్యగారి కుమారుడు తుమ్మలపల్లి నాగేశ్వరరావుగారి పేరిట తేది. 19.04.2025న విక్రయ దస్తావేజును సృష్టించినట్లు తెలిసి మా క్లయింట్ సదరు ఏల్చూరి వెంకట నారాయణను దివాళాదారునిగా ప్రకటించమని, మార్కాపురంలోని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టునందు creditor I.P.No.49/2025 దాఖలు చేసి ఒంగోలు Official Receiver గారిని క్రింది షెడ్యూల్ ఆస్తిని ఆధీనంలోనికి తీసుకొని దరిమిలా షెడ్యూల్ ఆస్తిని అమ్మి రుణదాతలకు పంచమని I.P దాఖలు చేసివుండగా మరియు దివాలా పిటిషన్ 49/2025 పెండింగ్‌లో వుండగా సదరు పై తెల్పిన తుమ్మలపల్లి నాగేశ్వరరావు మరియు ఏల్చూరి వెంకట నారాయణ ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని వేరొకరికి, అమ్ముటకు, మరియు నామ మాత్రపు డాక్యుమెంట్లు సృష్టించుచున్నట్లు తెలియుచున్నది. కావున అందరికీ తెలియజేయునది ఏమనగా, ఎవ్వరును ఈ క్రింది షెడ్యూల్ ఆస్తిని కొనుగోలు, అమ్మకాలు చేయరాదనియు కోర్టు నందు I.P పెండింగ్ వుందని ఎవ్వరూ కొనుగోలు చేసినను అవి మా క్లయింట్‌ను బద్ధుని చేయజాలవనియు మరియు చెల్లదని ఖండితంగా తెలియపరచడమైనది. మరియు వారిపై కోర్టు నందు తగు చర్యలు తీసుకొనబడునని తెల్పడమైనది.

షెడ్యూలు: మార్కాపురం జిల్లా, యర్రగొండపాలెం పట్టణ పరిధిలోని సర్వే నెం. 57/1లోని పది సెంట్ల స్థలము లేదా 484 చ॥ గజముల Plot No. 40 (NGO కాలని కొలుకల రోడ్డు నందు) హద్దులు. **తూర్పు:** ముప్పది అడుగుల రోడ్డు, **దక్షిణం:** మాగులూరి బక్కయ్యగారి ఖాళీ స్థలం Plot No. 39 **పడమర:** దొంతా కృష్ణగౌడ్ గారి ఖాళీ స్థలం Plot No. 37 **ఉత్తరం:** ఇరవై అడుగుల రోడ్డు.

ఇట్లు శ్రీ కె.శ్రీనివాస్, శ్రీమతి కరణం విజయలక్ష్మి, ఆర్.బాలు, అడ్వకేట్స్

మార్కాపురం, మార్కాపురం జిల్లా. సెల్: 63036 54394

ఈనాడు
ప్రకటనల ప్రత్యేక అనుబంధం
2 మార్చి 2026



శింగరకొండ.. భక్తులకు అండ

(c) eenadu

సెంటు భూమీ లేకున్నా సంపన్నుడే!

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి సెంటు భూమి లేదు. కానీ కోటీశ్వరుడు. భక్తుల కానుకలు, హుండీ, దుకాణాల వేలం ద్వారా వచ్చే ఆదాయంతోనే సిబ్బంది జీతాలు, వార్షిక ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఎటొచ్చీ ఏడాదికి అన్నిరకాలుగా సుమారు రూ.నాలుగు కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ప్రతి మంగళ, శని, ఆదివారాల్లో భక్తులు పెద్ద ఎత్తున క్షేత్రానికి వస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అందించే కానుకలే స్వామి వారి ఆస్తి.

వంద రోజులకొకసారి హుండీ లెక్కింపు

ప్రతి వంద రోజులకొక పర్యాయం హుండీలను లెక్కిస్తుంటారు. అద్దంకి నుంచి వాణిజ్య బ్యాంక్‌ల సిబ్బంది హుండీ ఆదాయాన్ని క్షేత్రం వద్దనే లెక్కించి, బ్యాంక్‌కు జమ చేస్తుంటారు. హుండీ లెక్కింపు రోజు పెద్దసంఖ్యలో ఔత్సాహిక భక్తులు హాజరవుతుంటారు. భారతీయ కరెన్సీతో పాటు ఆభరణాలు, విదేశీ కరెన్సీ కూడా హుండీల్లో లభ్యమవుతుంటుంది. తిరుమల శ్రీవారి ఆలయంలో మాదిరి హుండీని దేవాలయంలో ఏర్పాటు చేశారు.

లక్ష్మీనరసింహుడికి సుమారు 50 ఎకరాల మాన్యం

లక్ష్మీనరసింహస్వామి లక్షాధికారి. కలవకూరు రెవెన్యూ పరిధిలో మొత్తం 50 ఎకరాల మాన్యం భూములుండగా ఏటా రూ.10లక్షల వరకూ ఆదాయం సమకూరుతోంది. అలాగే హుండీ, టికెట్ కలెక్షన్, దుకాణాల అద్దెల రూపంలో మరో రూ.30 లక్షలు, వెరసి రూ.40లక్షల వరకు ఆదాయం సమకూరుతుంటుంది. ప్రభుత్వం, భక్తుల సహకారంతో గణనీయంగా ఆలయ అభివృద్ధి జరిగింది. ప్రస్తుతం కొండపై కార్యాలయం, సత్రాలు, శంఖు/చక్రం/నామం, గరుడ విగ్రహం వంటివి దాతల సహకారంతో నిర్మించారు. గత తెదేపా ప్రభుత్వం హయాంలో కొండపైకి 1.5 కిమీ రహదారి నిర్మించారు. అందువల్లే భక్తులు కొండపైకి వాహనాల్లోకి వెళ్లగలుగుతున్నారు.

సంతానలక్ష్మి ఊయల....

కొండపై కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఎదురుగా గల రావిచెట్టు ఏళ్ల తరబడి భక్తుల పూజలందుకుంటోంది. ఆలయానికి వచ్చే నూతన దంపతులు, దీర్ఘకాలంగా సంతానం కోసం ఎదురు చూస్తున్న దంపతులు ఈ రావిచెట్టుకు ఊయలకట్టినట్లయితే సంతానం కలుగుతుందని నమ్మకం. ఊయలలో రాయిని ఉంచి ఊపడం ద్వారా సంతాన ప్రాప్తి లభిస్తుందని విశ్వసిస్తారు.

- శింగరకొండ (అద్దంకి)

శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి
71వ వార్షిక తిరునాళ్ళ శుభాకాంక్షలు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్‌శాఖామాత్యులు
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి
శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్ల 71వ వార్షిక తిరునాళ్ళకు
విచ్చేయుచున్న రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి
స్వామి వార్ల భక్తులకు, అతిరథమహారథులకు, ప్రజలకు
స్వాగతం... సుస్వాగతం
గార్లపాటి
శ్రీనివాసరావు
టి.డి.పి నాయకులు,
అద్దంకి

(c) eenadu

మహిమాన్విత క్షేత్రం.. పిలిస్తే పలికే దైవం

ప్రకాశం జిల్లాలో మహిమాన్విత క్షేత్రంగా..భక్తుల కొంగుబంగారంలా శింగరకొండ వెలుగొందుతోంది. ప్రతి ఏటా ఫాల్గుణశుద్ధ పౌర్ణమి నాడు వార్షిక తిరునాళ్ల నిర్వహిస్తారు. ప్రకాశం, మార్కాపురం, బాపట్ల, నెల్లూరు, పల్నాడు, గుంటూరు, విజయవాడ తదితర జిల్లాల నుంచి వచ్చే వారితో భక్త జనసంద్రంగా మారుతుంది. మూడు రోజులు జరిగే ఈ వార్షిక బ్రహ్మోత్స వాలకు వేళయింది. ఈ వేడుకను చూస్తే తనువు, మనసు పులకిస్తాయి. గత నెల 28 నుంచి ఉత్సవాలకు శ్రీకారం చుట్టి ఈ నెల 2న నిర్వహించే ప్రధాన తిరునాళ్ల ఘట్టంతో ముగింపు పలుకుతారు. రాత్రంతా భక్తులు జాగారం చేస్తారు. రెండో తేదీ ఉదయం నుంచి మూడో తేదీ ఉదయం వరకు నిరాటంకంగా స్వామి వారి దర్శన భాగ్యం కల్పిస్తారు. ఆ వేడుకల వేళ అద్దంకి సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యుత్తు ప్రభలు చూడాలంటే రెండు కళ్లూ చాలవు. రాత్రి వేళల్లో సాంస్కృతిక సందడి అంబరాన్నంటు తుంది. సుమారు మూడు లక్షలకు పైగా భక్తులు ఈ ఉత్సవాలకు హాజరయ్యే అవకాశముందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. తిరునాళ్లను సమ న్వయ కమిటీ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తారు. అద్దంకి ఆర్డీవో కె. లక్ష్మీప్రసన్న నేతృత్వంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులూ భక్తులకు కావాల్సిన సదుపాయాల కల్పనలో నిమగ్నమయ్యారు.



ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖమండపం, ధ్వజస్తంభం

శతాబ్దాల ఘనచరిత..

వందల ఏళ్ల చరిత్ర శింగరకొండ ఆలయ సొంతం. అక్కడి గరుడ స్తంభంపై క్రీశ 1443లో చెక్కిన శాస నాల ఆధారంగా ఈ ప్రాంతమంతా దేవరాయల ప్రభువు పాలనలో ఉన్నట్లు తెలుస్తోంది. తొలి నాళ్లలో 'సింగనకొండ'గా పిలిచేవారు.. కాలక్రమంలో 'శింగర కొండ'గా రూపాంతరం చెందింది. శింగరకొండ పాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఆలయం ఉంది. 1956వ సంవత్సరం నుంచి దేవాదాయ శాఖ ద్వారా వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. కొంతకాలం కార్యని ర్వహణాధికారి స్థాయి అధికారి పర్యవేక్షణలో ఉండగా, ప్రస్తుతం సహాయ కమిష నర్ స్థాయి అధికారి పర్య వేక్షిస్తున్నారు. ఇంతింతై వటుడింతై అన్న చందంగా తొలి నాళ్లలో రూ.వేలల్లో వచ్చే వార్షిక ఆదాయం ఇప్పుడు రూ. కోట్లకు చేరడం ప్రస న్నాంజనేయునిపై భక్తుల కున్న అచంచల విశ్వాసా నికి అద్దం పడుతోంది.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ శిఖరం

సుబ్రహ్మణ్యేశ్వరుడు

కొండపైకి మెట్లు

అనంత భవనాశి..

దాతల సహకారంతో ఏర్పడిన భవనాశి తటాకం రెండు వేల ఎక రాల్లో ఉండేది. చిన్నకొత్తపల్లి, శింగరకొండపాలెం, చక్రాయపాలెం, శాంతినగర్ గ్రామాల సరిహద్దుల్లో విస్తరించింది. అయితే సమీప గ్రామాల వారు భవనాశిని ఆక్రమించుకోగా, ప్రస్తుతం 600 ఎకరాలకే పరిమితమైంది. భవనాశి చెరువులో జాలర్ల సహకార సంఘంలోని 170 మంది మత్స్యకారులు చేపలవేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రతి సంవత్సరం పెద్దఎత్తున చేప పిల్లల్ని వదిలి వాటి పెంపకం ద్వారా కుటుంబ పోషణ గావిస్తున్నారు.

కుంభాభిషేకం అనంతరం తొలి తిరునాళ్ల

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం రాతిముఖ మండపం నిర్మాణం జరిగిన అనంతరం గతేడాది మే 12న కుంభాభిషేకం నిర్వహించారు. కర్ణాటక నుంచి గజవాహనాన్ని రప్పించి, గుండ్ల కమ్మ, సప్తనదీజలాలు తెచ్చి రాతిముఖ మండపాన్ని అభిషేకించారు. సుమారు రూ.ఏడు కోట్ల అంచనాతో గర్భాలయం, ముఖమండపం రాతితో నిర్మించారు. తితిదే, ప్రభుత్వ, దాతల సహకారంతో రాతిముఖ మండపం నిర్మించారు. వార్షికోత్సవం అనం తరం జరుగుతున్న తొలి వార్షికోత్సవం అయినం దున ఈ తిరునాళ్లకు ఎనలేని ప్రాధాన్యం దక్కుతోంది.

వినాయకస్వామి

- శింగరకొండ (అద్దంకి)

(c) eenadu

శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి
71 వ తిరునాళ్ళ మహోత్సవ శుభాకాంక్షలు
దివ్య మహిమలుగల పుణ్యక్షేత్రం
కోరిన కోర్కెలు తీర్చే శింగరకొండ
శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్ల
71వ తిరునాళ్ళకు
విచ్చేయుచున్న రాష్ట్ర మంత్రివర్యులు
" శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి" ప్రజాప్రతినిధులకు
అధికారులకు, భక్తజనులకు, ప్రజలకు మా స్వాగతం.. సుస్వాగతం...
బాలినేని ఆంజనేయులు
మలినేని నరేంద్రబాబు
బొడ్డు వెంకటేశ్వర్లు
స్నేహ కన్‌స్ట్రక్షన్స్
ఒంగోలు
స్నేహ ఇండస్ట్రీస్
గ్రానైట్ కటింగ్ & పాలిషింగ్ గ్రోత్ సెంటర్, గుళ్ళాపల్లి
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
ఆం.ప్ర రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు

(c) eenadu

రాతిముఖ మండపంతో అంజన్నకు ఖ్యాతి

ప్రసన్నాంజనేయస్వామి ఆలయ రాతిముఖ మండప నిర్మాణంతో ఆ క్షేత్రం ఖ్యాతి దశదిశలకూ వ్యాపించింది. ప్రకాశం, గుంటూరు, పల్నాడు, బాపట్ల, నెల్లూరు జిల్లాల నుంచి భక్తజనం పెద్దఎత్తున తరలివస్తున్నారు. రూ.కోటి వరకు విరాళాలిచ్చేందుకు వెనుకాడరంటే స్వామి వారి మహిమ ఎంతో ఇట్టే అర్థమవుతుంది. ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నాం. సుమారు మూడు లక్షలమంది వరకు భక్తులు హాజరవుతారని భావిస్తున్నాం. భక్తులకు ఎప్పుడూ సర్వ సదుపాయాలు కల్పిస్తున్నాం. సాధారణ భక్తులకు కూడా రోజూ నిత్యాన్నదానం నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. సెంటు భూమి లేనప్పటికీ స్వామి వారి వార్షికాదాయం రూ.౩.౫ కోట్లు పైమాటే. దుకాణాల అద్దెలు, హుండీలు, టికెట్ల ఆదాయంతోనే సహాయ కమిషనర్ స్థాయికి చేరింది. భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలయ పాలకమండలి, అధికార యంత్రాంగం పని చేస్తోంది.

- మదమంచి తిమ్మానాయుడు, సహాయ కమిషనర్, ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, శింగరకొండ

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం

శింగరకొండ క్షేత్రానికి వచ్చే భక్తులకు అన్నిరకాల సదుపాయాలు కల్పించేందుకు పాలకమండలి తరఫున సిద్ధంగా ఉన్నాం. పాలకమండలి ఛైర్మన్‌గా నాకు అవకాశం కల్పించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. క్షేత్రంలో పెరిగిన ఆక్రమణలు తొలగించబోతున్నాం, ఆయా ప్రదేశాల్లోని ఆక్రమణదారులకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వనున్నాం. దేవాలయ ప్రాకార మండపాలు, గాలి గోపురాలు రాతితో నిర్మించబోతున్నాం. గోశాల, పుష్కరిణి నిర్మాణాలకు అన్నిరకాల ప్రయత్నాలూ పూర్తయ్యాయి. తితిదే కల్యాణ మండపం పక్కనే మినీ కల్యాణ మండపం నిర్మాణానికి దాతలు ముందుకొచ్చారు. అన్నదాన మండపం నుంచి మారుతీభవన్‌కు రహదారి నిర్మించాం. పొంగలిశాలకు సరైన స్థలం చూసి మార్పు చేస్తాం.

- చుండూరి మురళీ సుధాకరరావు, ఛైర్మన్, ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలి, శింగరకొండ

- శింగరకొండ (అద్దంకి)

స్వామికి సేవ చేయడం నా అదృష్టం

ప్రసన్నాంజనేయస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. స్వామి వారి ఆశీస్సులు అందరికీ ఉండాలి. పర్యాటకంగా భవనాశి తటాకాన్ని అభివృద్ధి చేయాలి. బుద్ధ విగ్రహం, బోటుషికారు, రిసార్ట్స్ వంటివి ఏర్పాటు చేస్తే మరింత ఆహ్లాదభరిత వాతావరణం నెలకొంటుంది. ౨౦౨౧- ౨౦౨౩ వరకు ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్‌గా పనిచేసిన సమయంలో వసతుల కల్పనకు కృషిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. దేవాలయ రాతి ముఖమండపం నిర్మాణానికి రూ.70 లక్షల విలువైన గ్రానైట్ రాళ్లను అందించా. ఆలయం చుట్టూ మాడవీధులకు రూ.65 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణం చేయించడం ఆ ప్రసన్నాంజనేయుడి కృపగా భావిస్తున్నా. రెండేళ్ల పదవీకాలంలో నిత్యాన్నదాన భవనం, పరిపాలనా భవనం, వంటశాల ఆధునికీకరణ, విశ్రాంతిశాల భవనం పనులు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. **-కోట శ్రీనివాసకుమార్, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్, అద్దంకి**

మంత్రి చొరవతో వసతుల కల్పన

ప్రసన్నాంజనేయస్వామి ఆలయం అభివృద్ధి చెందుతోంది. మంత్రి గొట్టిపాటి చొరవతో ఇక్కడ వసతులు సమకూరాయి. పర్యాటకంగా శింగరకొండ క్షేత్రాభివృద్ధికి ప్రభుత్వం కూడా కట్టుబడి ఉంది. గతంలో స్వామి వారికి రూ.50 వేలతో బంగారు నామాలు అందించా. ఇటీవల మారుతీభవన్ ఫ్లోర్‌కు కోతుల బెడద నుంచి కాపాడేందుకు ఇనుప గ్రిల్స్ సమకూర్చా. ౨౨ అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహానికి రూ.లక్ష విరాళం అందించడం భాగ్యంగా భావిస్తున్నా. ౧౨౨౬లో లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి హుండీ అందించాను. **- గార్లపాటి శ్రీనివాసరావు, దాత, భాస్కర్ సప్లయర్స్ అధినేత, అద్దంకి**

చెరకు గడలతో అలంకరణ

శింగరకొండ 71వ వార్షిక తిరునాళ్లకు ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా చెరకు గడలతో అలంకరణ చేయనున్నారు. సుమారు మూడు వేల చెరకు గడలతో మండపం నిర్మించి, అందులో నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, సహాయ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. అలాగే ఆలయం ఎదుట ఫొటో షూట్ (తిరుమలలో మాదిరి) నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

- శింగరకొండ (అద్దంకి)

(c) eenadu

౨౨ అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం

శింగరకొండ సమీపం లోని ౨౨ అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం జిల్లాకే తలమానికంగా వెలుగొందుతోంది. రెండు దశాబ్దాల క్రితం ఈ విగ్రహాన్ని దాతల సహకారంతో నామ్ రహదారి అంచులో నెలకొల్పారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీకళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో నెలకొల్పారు. ఆంజనేయస్వామి విగ్రహ పరిసరాల్లో నివాసముంటున్న వారికి ఎలాంటి భయాందోళనలు, గ్రహదోషాలు ఉండవని ప్రతీతి.

\- శింగరకొండ (అద్దంకి)

(c) eenadu

సిరులు కురిపిస్తున్న గ్రానైట్ కొండలు

❖ ఏటా ప్రభుత్వానికి రూ. వంద కోట్ల ఆదాయం

సంతమాగులూరు, బల్లికురవ మండలాల పరిధిలో ఉన్న గ్రానైట్ కొండలు వ్యాపారులకు సిరులు కురిపిస్తున్నాయి. వేల మంది జీవనోపాధికి వనరులుగా మారాయి. గురిజేపల్లిలో బ్లాక్ పెరల్, బల్లికురవలో స్టీల్ గ్రే రకాల గ్రానైట్ లభిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాలకు ఈ బండలు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడి ఫ్యాక్టరీలలో తయారై మెరుగులద్దిన గ్రానైట్ పలకలు దేశవ్యాప్తంగా గృహాల్లో అంతర్గత అలంకరణకు వినియోగిస్తున్నారు. గురిజేపల్లి, బల్లికురవ మండలాల్లో 140కు పైగా గ్రానైట్ కంపెనీలు రాళ్లను వెలికితీస్తున్నాయి.

బల్లికురవలోని స్టీల్‌గ్రే గ్రానైట్ క్వారీలు

300కుపైగా పరిశ్రమల్లో...

ఏడాదికి 16 వేల క్యూబిక్ మీటర్లకు పైగా రాయిని ఇక్కడ నుంచి వెలికి తీస్తున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో 300కు పైగా ఫ్యాక్టరీలు గ్రానైట్ పలకలను పాలిషింగ్ చేసే ప్రక్రియలో నిమగ్నమయ్యాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి పైగా కార్మికులు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏడాదికి రూ.వంద కోట్లకు పైగా ఆదాయం రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి అందుతోంది.

\- సంతమాగులూరు, బల్లికురవ

ఆధ్యాత్మిక వీచిక.. అపురూప వేడుక

• అలరించిన మహా కుంభాభిషేకం

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ చరిత్రలో ఓ అపురూప ఘట్టం మహాకుంభాభిషేకం. 2025 మే నెల 19న ఇది ఆవిష్కృతమైంది. తితిదే, ప్రభుత్వం, దాతల సహకారంతో ఆలయ రాతిముఖ మండపం జీర్ణోద్ధరణ పనులు జరిగాయి. ఈ సందర్భంగా సుమారు పదివేల మంది మహిళల ఆధ్వర్యంలో కలశశోభాయాత్ర అద్దంకి నుంచి శింగరకొండకు సాగింది. వారికి వేలాదిమంది స్వాగతం పలికారు.

జోరువానలో..

శింగరకొండకు పాదయాత్ర వేడుక నభూతో నభవిష్యత్ అన్న రీతిలో సాగింది. కేరళ బృందాల డప్పు వాయిద్యాలతో ఆ ప్రాంతం మార్మోగింది. అరకు ప్రాంత సంప్రదాయ నృత్యాలు అలరించాయి. గజరాజుపై అర్చకులు వేలమూరి శ్రీరామ్మూర్తి ముందుకు సాగారు. యువతులు కలశాలతో ఈ వేడుకలో పాల్గొన్నారు. ఓవైపు జోరు వాన కురుస్తున్నప్పటికీ మొక్కవోని దీక్షతో నడుస్తూ శింగరకొండకు చేరుకున్నారు. ప్రతి భక్తుడూ ఆలయ శిఖరం వద్ద పవిత్ర నదీ జలాలు ఉంచేవిధంగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఒంగోలు, కందుకూరు శాసనసభ్యులు దామచర్ల జనార్దనరావు, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

\- శింగరకొండ (అద్దంకి)

రాతిముఖ మండప ప్రారంభోత్సవంలో మంత్రులు గొట్టిపాటి, స్వామి, ఎమ్మెల్యే జనార్దన్

అరకు మహిళల సంప్రదాయ నృత్యాలు

కలశాలతో గుండ్లకమ్మ నుంచి శింగరకొండకు శోభాయాత్ర

(c) eenadu

71 వ వార్షిక తిరునాళ్ళ శుభాకాంక్షలు
కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం...
ఇద్దరు స్వాముల పుణ్యక్షేత్రం... దివ్యమహిమలు గల
శ్రీ ప్రసన్నాంజనేయస్వామి,
శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్ల
71వ వార్షిక తిరునాళ్ళ శుభాకాంక్షలు...
విచ్చేయుచున్న రాష్ట్ర
విద్యుత్ శాఖామాత్యులు
శ్రీ గొట్టిపాటి
రవికుమార్ గారికి,
భక్తులకు స్వాగతం... సుస్వాగతం..
స్వామివార్లను దర్శించి... తరించి..
కృపకు పాత్రులు కాగలరని మనవి...
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
ఆం.ప్ర రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
అమూల్య మినరల్స్
దూళిపాళ్ళ రామ గోవిందు & దూళిపాళ్ళ శ్రీకాంత్
కొండాయపాలెం, బల్లికురవ (మం)
వెంకటాద్రి మినరల్స్
& బివిఎల్ రాక్స్, తలశిల వినోద్‌కుమార్
సత్యకృష్ణ గ్రానైట్స్, దివ్య గ్రానైట్
బట్టికొండ ఆంజనేయులు
S.R.కన్‌స్ట్రక్షన్స్
కోగంటి రామ్మోహన్‌రావు
K.S.R గ్రానైట్స్
కొమ్మినేని శ్రీనివాసరావు
వింటార్ గ్రానైట్స్
కక్కెర ఆంజనేయులు
కె. సామ్రాజ్యం గ్రానైట్, మైన్
కామేపల్లి లక్ష్మీప్రసాద్
శ్రీ శ్రీనివాస గ్రానైట్స్
ముక్కు కాశిరెడ్డి
సాయిశ్రీనివాస మినరల్స్
కొణిదెన
V.K. గ్రానైట్స్
వల్లూరి హనుమంతరావు
కృష్ణసాయి ఎక్స్‌పోర్ట్స్ ప్రై.లి.
శ్రీశిద్దా వెంకటేశ్వరరావు
ఇంపీరియల్ గ్రానైట్స్
వి. సురేష్‌బాబు
సాయి స్టోన్స్
పత్తిపాటి సురేష్
గిరిరాజ్ గ్రానైట్స్
రావిపూడి లక్ష్మీ నారాయణ
హనుమాన్ ఎక్స్‌పోర్ట్
శిద్దా సూర్యప్రకాష్, రావుపొత్తూరి వెంకట్రావు, వెంకారెడ్డి
లక్ష్మీ గ్రానైట్స్
శిద్దా రాఘవరావు
వారాహి రాక్స్ & మినరల్స్
చెన్నుపల్లి
M.V.R. గ్రానైట్స్
మారం వెంకారెడ్డి, కొణిదెన
బల్లికురవ మండల కలర్ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్

(c) eenadu

ప్రసన్నాంజనేయునికి పసిడి కాంతులు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయుడు బంగారుకాంతులీననున్నాడు. స్వామివారికి బంగారు కిరీటం చేయించేందుకు బాపట్ల జిల్లా చీరాల కొత్తపేటకు చెందిన దాత, సాఫ్ట్‌వేర్ ఇంజినీరు ముప్పవరపు సుధీర్-ప్రత్యూష దంపతులు ముందుకొచ్చారు. గత నెల రెండో వారంలో 600 గ్రాముల బంగారు బిస్కట్లను కిరీటం తయారీ నిమిత్తం ఆలయ సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడుకు అందించారు. ఈ మేరకు బంగారాన్ని మంగళగిరికి చెందిన స్వర్ణకారుడు కాటూరి సుబ్బారావు, ఆయన మిత్రబృందానికి గత నెల 13న పాలక మండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, ట్రస్టీలతో కలిసి సహాయ కమిషనర్ అందించారు. వాటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.98 లక్షలుంటుందని, కిరీటం తయారీకి మరో రూ.10 లక్షలు అవుతుందన్నారు. మొత్తంగా రూ.1.08 కోట్ల విలువైన బంగారు కిరీటాన్ని స్వామివారికి అందించేందుకు దాత అంగీకారం తెలిపారని సహాయ కమిషనర్ చెప్పారు. 40 రోజుల వ్యవధిలో కిరీటం సమకూర్చనున్నట్లు స్వర్ణకారుడు సుబ్బారావు వెల్లడించారు. దేవస్థానం చరిత్రలోనే ప్రసన్నాంజనేయస్వామికి విలువైన బంగారు కిరీటం అందించడం ఇదే ప్రథమం అని సహాయ కమిషనర్ చెప్పారు. - శింగరకొండ (అద్దంకి)

స్వర్ణకారులకు బంగారు బిస్కట్లు ఇచ్చిన దాత ముప్పవరం సుధీర్, ప్రత్యూష దంపతులు, దాత తల్లి సుధ

కోర్కెలు తీర్చే ఏల్చూరు నృసింహుడు

భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం ఏల్చూరులోని లక్ష్మీనృసింహుడు. నాలుగొందల ఏళ్ల క్రితం చోళరాజుల కాలంలో కొండపై స్వామి స్వయంభువుగా వెలిసినట్లు భక్తుల నమ్మకం. ఆ తరువాత ఓరుగల్లు రాజుల కలలో స్వామి కనిపించి కొండపై వెలిసినట్లు చెప్పారు. దీంతో అక్కడ ముఖ మండపాన్ని, ఆలయాన్ని నిర్మించినట్లు ప్రతీతి. గుడికి చేరుకునేందుకు కొండ దిగువ వరకు నిర్మించిన రాళ్ల మెట్ల మార్గం నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఈ మెట్ల మార్గం ద్వారానే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకుని పూజలు చేస్తారు.

కొండ దిగువన రెండొందల ఏళ్లక్రితం బాలాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆలయ నిర్మాణం చేపట్టారు. గ్రామానికి ఆనుకుని లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ విగ్రహాలను భద్రపరిచేందుకు చిన్నపాటి ఆలయాన్ని అంతకుముందే నిర్మించారు. అప్పటినుంచి ఇప్పటి దాకా ఏటా ఫాల్గుణ పంచమి రోజున తిరునాళ్ల జరపడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామానికి దక్షిణ దిశగా ఎత్తయిన కొండ మీద లక్ష్మీనృసింహాలయం, దిగువన బాలాంజనేయస్వామి ఆలయం, ఈ కొండకు ఉత్తర దిశన 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భారీ తటాకం చూపరులకు కనువిందు చేస్తాయి. ఆ పక్కనుంచే నామ్ రహదారి ఉంది. ఈ ఆలయం కింద 24 ఎకరాల వ్యవసాయ భూముల్ని అప్పట్లో దాతలు సమకూర్చారు. ఇందులో మూడు ఎకరాలు కాలువ కింద పోగా, మిగిలిన దానిలో ఎనిమిది ఎకరాలు దేవాదాయ శాఖ కింద, 13 ఎకరాలు అర్చక స్వాముల కింద ఉంది. గత మూడు తరాలుగా లక్ష్మీనృసింహస్వామి సేవలో తరిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు వినుకొండ శ్రీనివాసమూర్తి తెలిపారు. తాత ముత్తాతల నుంచి ఆలయ అర్చకత్వం కొనసాగిస్తూ స్వామి ధూప, దీప నైవేద్యాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఏటా ఫాల్గుణ పంచమి రోజున జరిగే ఉత్సవం, విద్యుద్దీపాలతో అలంకరించిన ప్రభలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు శోభాయమానంగా జరుగుతున్నాయన్నారు.

- ఏల్చూరు (సంతమాగులూరు)

ఏల్చూరు కొండపై లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్

ఏల్చూరు కొండ దిగువనున్న బాలాంజనేయస్వామి మూలవిరాట్

శింగరకొండ సమీపంలోని టిడ్కో ఇళ్ల వద్ద ఏర్పాటు కానున్న విద్యుత్తు ఉపకేంద్రం

చీకట్లు తొలిగాయి.. పల్లెలు కాంతులీనాయి

విద్యుత్తు సమస్యల పరిష్కారం, నాణ్యమైన..నిరంతర విద్యుత్తు సరఫరా దరి చేరింది. దీంతో పల్లెల్లోనూ చీకట్లు తొలిగాయి..విద్యుత్తు కాంతులీనాయి. మొత్తం రూ.105 కోట్ల వ్యయంతో విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణం, గ్రామాల్లో విద్యుత్తు స్తంభాల మార్పు వంటివి చేపట్టారు. అద్దంకిలో మూడు, బల్లికురవ మండలం మల్లాయపాలెం, సంతమాగులూరు మండలం కొప్పరం, జె.పంగులూరు మండలం టి.కొప్పెరపాడు, అద్దంకి మండలం పేరాయపాలెం గ్రామాల్లో విద్యుత్తు ఉపకేంద్రాలు నెలకొల్పనున్నారు. దీనివల్ల గ్రామాల్లో లో-వోల్టేజీ సమస్య కిందకు వేలాడుతున్న తీగలు, ప్రమాదకర నియంత్రికలు వంటి సమస్యలు తొలగనున్నాయి. విద్యుత్తు శాఖామంత్రిగా గొట్టిపాటి రవికుమార్ బాధ్యతలు చేపట్టిన 20 నెలల కాలంలో ఉపకేంద్రాల నిర్మాణాలకు రూ.34 కోట్లు ఖర్చుచేయడం ఎంతో ఫలితాన్నిచ్చింది. గ్రామాల్లో ఆర్‌డీఎస్‌ఎస్ పథకం, అయిదువేల జనాభా కలిగిన గ్రామ పంచాయతీల్లో విద్యుత్తు సంస్కరణలు చేపట్టారు. దీనికి గాను రూ.71 కోట్ల వరకు ఖర్చు చేశారు. దీంతో పాటు 2024-25 సంవత్సరంలో 726 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,737 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు అందించారు. ఇప్పటి వరకు మొత్తం 2467 మంది రైతులకు మేలు చేకూరింది. - అద్దంకి

(c) eenadu

నామ్ కష్టాలకు చెల్లుచీటీ!

ఏళ్లుగా ఉన్న నామ్ (నార్కట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల) ఎక్స్‌ప్రెస్ రహదారి విస్తరణ చిక్కులకు కూటమి ప్రభుత్వ చొరవతో ఎట్టకేలకు పరిష్కారం లభించింది. మొత్తం ౨౧౨ కి.మీ. పొడవు కలిగిన రహదారి విస్తరణ అభివృద్ధికి ౨౦౦౮ లోనే అంకురార్పణ జరిగింది. కి.మీ.కు రూ.కోటి చొప్పున మంజూరు చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తరించిన రహదారి నిర్మాణం దాదాపుగా పూర్తయింది. టోల్‌వసూలు కేంద్రాలు సైతం ఏర్పాటు చేశారు. భూసేకరణ, పరిహారం సమస్యలతో అద్దంకి మండలం గోపాలపురం, చక్రాయపాలెం, కలవకూరు; సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు వద్ద విస్తరణ పనులు నిలిచిపోయాయి. పరిహారం ఇవ్వడంలో జాప్యం కారణంగా సమస్య నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం... విద్యుత్తు శాఖ మంత్రిగా ఉన్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ చొరవ చూపడంతో పరిహారం చెల్లింపునకు మార్గం సుగమమైంది. త్వరలోనే భూములు కోల్పోయిన రైతులకు ఆ మొత్తం అందజేయనున్నారు. దీంతో ఇన్నాళ్లుగా ఆయా ప్రాంతాల్లో రోడ్డు విస్తరణకు నోచుకోక తలెత్తుతున్న సమస్యలకు తెరపడనుంది.

- అద్దంకి, సంతమాగులూరు

కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వే

అద్దంకి పట్టణంలో చేపట్టిన మినీబైపాస్ రోడ్డు

మినీ బైపాస్.. వాహనాల రద్దీకి పరిష్కారం

నామ్ రహదారిపై పెరిగిన వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని మినీ బైపాస్ నిర్మాణానికి మంత్రి రవికుమార్ శ్రీకారం చుట్టారు. రామ్‌నగర్ నుంచి గరటయ్యకాలనీ వరకు సుమారు ౧.౫ కి.మీ. పొడవునా సాగర్‌కాలువకు ఇరువైపులా మినీ బైపాస్ నిర్మాణం చేపట్టనున్నారు. రూ.౧౭ కోట్ల అంచనాతో ప్రతిపాదనలు తయారు చేయగా నిధులు మంజూరయ్యాయి. ఈలోపు సాగర్ కాలువకు ఇరువైపులా ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న ౧౬౫ మంది మంత్రి పిలుపుతో స్వచ్ఛందంగా ఖాళీ చేశారు. వారందరికీ శింగరకొండపాలెం వద్ద ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయించారు. అన్ని రకాల మౌలిక వసతులు సమకూర్చడంతో పేదలంతా ఇంటి నిర్మాణానికి సిద్ధ పడ్డారు. మినీ బైపాస్ నిర్మాణంతో రహదారికి ఇరువైపులా ఉన్న కట్టడాలకు విలువ పెరిగింది. ఎందుకూ పనికి రాని ఖాళీ స్థలాల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం కొత్త విద్యుత్తు స్తంభాలను అమర్చుతున్నారు. తొలి విడతలో రామ్‌నగర్ నుంచి గరటయ్యకాలనీ వరకు మినీ బైపాస్ నిర్మాణం చేపట్టారు. రెండోవిడతలో గరటయ్య కాలనీ నుంచి ౨౨ అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం వరకు సాగర్ కాలువ వెంబడే రహదారి నిర్మాణం చేపడతారు. ఇది పూర్తి అయితే అద్దంకి పట్టణ వాసులకు ప్రమాదాల బారి నుంచి మోక్షం కలిగినట్లేనని భావించొచ్చు

- అద్దంకి

(c) eenadu

శ్రీఆంజనేయం.. భక్తులకు అభయం

- భవనాశి అంచున సింధూర ప్రియుడు
- గిరిపై కొలువైన లక్ష్మీనరసింహుడు

శింగరకొండ క్షేత్రంలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం భవనాశి తటాకం అంచున ఏర్పాటైంది. దక్షిణ ముఖంగా, స్వయంభువుగా వెలిసిన ప్రసన్నాంజనేయ స్వామిని భక్తులు 'పిలిచిన పలికే దైవం'గా కొలుస్తుంటారు. ప్రతి మంగళ, శని, ఆదివారాల్లో క్షేత్రానికి భక్తులు వచ్చి పొంగళ్లు తలపై ఉంచుకుని స్వామి వారికి మొక్కులు చెల్లిస్తుంటారు. తలపై ఉన్న పొంగలిగిన్నెను స్వామి వారికి తొలుత చూపించడం ద్వారా..స్వామి వారే స్వయంగా పొంగలి తిన్నట్లు భక్తులు భావిస్తుంటారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటాడని, కష్టాలు తీరుస్తుంటాడని ప్రసన్నాంజనేయునిపై భక్తులకు ప్రగాఢ విశ్వాసం.

తాటాకు పందిరి నుంచి ఎకరం విస్తీర్ణం...

తొలి నాళ్లలో తాటాకు పందిరిగా ఉన్న ఆలయం ప్రస్తుతం సుమారు ఎకరం విస్తీర్ణంలో విస్తరించింది. నాలుగు దిక్కుల్లో రాజగోపురాలను దాతల సహకారంతో నిర్మించారు. గతంలో కార్యనిర్వహణాధికారిగా పని చేసిన యడ్లపల్లి భూషయ్య, అప్పటి పాలకమండలి ఛైర్మన్ దివంగత మట్టుపల్లి నాగేశ్వరరావు ఆలయాభివృద్ధికి చేయూతనిచ్చారు. రాతి ముఖ మండపం, ధ్వజ స్తంభం, ఉష్ట్రవాహనంతో పాటు పరివార దేవతామూర్తులైన విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలున్నాయి.

బావి నేటికీ చెక్కు చెదరలేదు...

ఆలయ ఈశాన్య దిక్కులో దాత తవ్వించిన బావి నేటికీ చెక్కు చెదరలేదు. తాజా పరిణామాల్లో ప్రభుత్వ, తితిదే, దాతల సహకారాలతో కార్యాలయం, పోటుభవనం, భోజనశాల వంటివి ఏర్పడ్డాయి. దేవాలయానికి ఎదురుగా పది దుకాణ సముదాయాలను దాతలు నిర్మింపజేశారు. గతంలో అద్దంకి సీఐగా పనిచేసిన అశోక్‌వర్ధన్ సహకారంతో శుద్ధజల కేంద్రం ఏర్పాటైంది. ఒంగోలు మాజీ శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో ప్రార్థనామందిరాన్ని నిర్మించారు. రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి సహకారంతో వంటశాల నిర్మించారు. భవిష్యత్తులో భవనాశి తటాకం వద్ద ఎకరం విస్తీర్ణంలో పుష్కరిణి, గోశాల వంటివి నెలకొల్పనున్నారు.

కొండపై విస్తరించి.. ఆలయ మందిరం నిర్మించి...

లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధిలో తెదేపా ప్రభుత్వ కృషి ఎక్కువగా ఉంది. నాటి పాలకుల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సర్వశ్రేయోనిధిగా రూ.18 లక్షలు కేటాయించడంతో కొండకు ఉత్తరం వైపున శ్లాబు నిర్మించి, విస్తరించారు. దీనివల్ల ఆలయ ప్రాంగణం విస్తరించింది. అనంతరం తూర్పువైపున కూడా రూ.35 లక్షల వ్యయంతో రెండంతస్తుల భవనాన్ని నిర్మించారు. దీన్ని త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నారు. దాతల సహకారంతో రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. అద్దంకి పట్టణానికి చెందిన కంభంపాటి శ్రీనివాసరావు సహకారంతో కుమారుడు దివంగత వెంకటేశ్ జ్ఞాపకార్థం రూ.45 లక్షల వ్యయంతో డార్మెటరీ నిర్మించారు. - శింగరకొండ (అద్దంకి)

దృష్టి సారిస్తే పర్యాటక ధామమే!

- శింగరకొండ అభివృద్ధికి ఎన్నో సానుకూలతలు

నామ్ (నార్కట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల) రాష్ట్రీయ రహదారిని ఆనుకుని ఉన్న శింగరకొండ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కసరత్తు జరుగుతోంది. దిగువన ప్రసన్నాంజనేయ స్వామి, కొండపై లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాలతో పాటు ఆరు వందలకు పైగా ఎకరాల్లో భవనాశి తటాకం విస్తరించి ఉంది. నిత్యం వందలాది మంది భక్తులు వస్తుంటారు.

గతంలో అడుగులు పడినా...

శింగరకొండ అభివృద్ధికి 17 ఏళ్ల క్రితమే అడుగులు పడ్డాయి. భవనాశి తటాకం మధ్యలో బుద్ధ విగ్రహం, బోటు షికారు, నామ్ రహదారి వెంబడి మత్స్యశాఖ స్థలంలో రిసార్టుల ఏర్పాటుకు ప్రణాళికలు చేశారు. ఇందుకోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.రెండు కోట్లు కేటాయించింది. ప్రాథమికంగా కొంత కసరత్తు జరిగినా తరువాత ప్రక్రియ నిలిచిపోయింది. కొద్ది పాటి మార్పులతో మళ్లీ ఈ ప్రతిపాదనల్లో కదలిక వచ్చింది. శింగరకొండతో పాటు బాపట్ల జిల్లాలోని చీరాల ఓడరేవు, పల్నాడు జిల్లాలోని కోటప్పకొండను అనుసంధానించి... అభివృద్ధి చేయాలన్న దిశగా ఆలోచనలు చేస్తున్నారు. సాకారమైతే మూడు జిల్లాలకూ ఇదో పర్యాటక మణిహారం అవుతుందనడంలో సందేహం లేదు.

- శింగరకొండ(అద్దంకి)

భవనాశి తటాకం

ఉపాధికి ఊతం...

పర్యాటకంగా ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా కనీసం 200 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. అనుబంధ రంగాలు సైతం విస్తరించి ఈ ప్రాంత ప్రాధాన్యమూ పెరుగుతుంది. ఈ విషయమై మంత్రి గొట్టిపాటి రవికుమార్ సైతం ఆయా శాఖల అధికారులతో వివిధ వేదికలపై చర్చించారు.

(c) eenadu

శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి
71 వ వార్షిక తిరునాళ్ళ శుభాకాంక్షలు...
శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి దేవస్థానము
శింగరకొండ గ్రామం, అద్దంకి (మం), ప్రకాశం జిల్లా
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్‌శాఖామాత్యులు
స్వామియే స్వయంగా వెలసిన, దివ్యమహిమలు గల పుణ్యక్షేత్రం,
కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం శింగరకొండ
శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి 71 వ వార్షిక తిరునాళ్ళకు
విచ్చేయుచున్న రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
అద్దంకి నియోజకవర్గ శాసనసభ్యులు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి,
అతిరథ మహారథులకు, స్వామి వారి భక్తులకు,
ప్రజలకు స్వాగతం... సుస్వాగతం...
ఇట్లు: స్వామివారి సేవలో...
చుండూరి మురళీ సుధాకరరావు
ధర్మకర్తల కమిటీ ఛైర్మన్
మదమంచి తిమ్మానాయుడు
సహాయకమీషనర్
మరియు కార్యనిర్వహణాధికారి
పాలక మండలి సభ్యులు: ఆకుల కోటేశ్వరమ్మ, బత్తుల చంద్రశేఖర్,
నూతి లక్ష్మీప్రసాద్, మద్దా సునీత, ఏల్చూరి వెంకట నారాయణమ్మ,
ధూళిపాళ్ళ వెంకట రత్నం, గొర్రెపాటి పద్మజ, అరబోలు నాగమ్మ,
దేవరపల్లి సురేష్‌బాబు, కోనంకి సుబ్బారావు, కోట లక్ష్మీనారాయణ

(c) eenadu

తిరునాళ్ల కార్యక్రమాలు

తేది: 28-02-2026 శనివారం

ఉదయం 8.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీపస్థాపన, మండపారాధన

ఉదయం 9 గంటలకు జీవధ్వజ పూజ, ఉత్సవపతాక పూజ, ధ్వజారోహణ కార్యక్రమం

సాయంత్రం 5 గంటలకు జ్యోతి వెలిగింపు, పట్టువస్త్ర సమర్పణ

తేది: 01-03-2026 ఆదివారం

ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ

ఉదయం 5.30 గంటలకు బిందె తీర్థం

ఉదయం 6 గంటల నుంచి శ్రీ స్వామివారికి విశేష అభిషేకం, మహాన్యాస పూర్వక ఏకాదశ మన్యుసూక్త వారాభిషేకం, సుందరకాండ పారాయణ, సూర్య నమస్కారాలు, సప్తశతి పారాయణం, పంచామృతాలు, దశవిధద్రవ్యములతో విశేష అభిషేకం తదుపరి విశేష అలంకరణ, దర్శనం, తీర్థప్రసాద వినియోగం

రాత్రి 7 గంటలకు ఉత్సవవాహన సేవ

తేది: 02-03-2026 సోమవారం

ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ

ఉదయం 4.45 గంటలకు బిందె తీర్థం

ఉదయం 5 గంటల నుంచి ప్రాత:కాలార్చన

ఉదయం 10 గంటలకు దేవస్థాన వేదపండితులు, అర్చకులు, వేద విద్యార్థులతో మన్యుసూక్త పారాయణ, హోమం, తిరునాళ్ల మహోత్సవం

రాత్రి 7 గంటలకు రథోత్సవం

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని భూదత్త ఆళ్వార్, తొందరదిప్పొడి ఆళ్వార్, విశ్వక్సేనులు

ప్రభవించిన ఆళ్వార్లు

విష్ణుతత్వాన్ని, లీలల్ని, విశిష్ట కల్యాణ గుణాలను విభూతుల్ని గానం చేసి, విన్న వారిని విష్ణుభక్తులుగా మార్చడంలో సఫలీకృతులయ్యారు ఆళ్వార్లు. వైష్ణవ మత వ్యాప్తికి వారు ఇతోధికంగా సేవ చేశారు. ఆ మహావిష్ణు సంకల్పం వల్ల ఆయన వస్తు వాహనాలే ఆళ్వారులుగా ప్రభవించాయని వైష్ణవుల అచంచల విశ్వాసం. మొత్తం పన్నెండుమంది ఆళ్వార్‌లున్నారు. వారంతా ఒకే సంవత్సరంలో ఒక్కో రోజు తేడాలో జన్మించి ఉండవచ్చని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

- శింగరకొండ (అద్దంకి)

పోయిగై ఆళ్వార్

తిరుమంగై ఆళ్వార్

తిరుమళిసై ఆళ్వార్

(c) eenadu

దశాబ్దాలుగా స్వామి సేవలో తరిస్తూ..

వేద పండితులు వంగల హరిశంకరావధాని, ఉప ప్రధానార్చకులు కోట లక్ష్మీనారాయణ, ఎన్ఎన్ఆర్.ఆచార్యులు

శింగరాద్రి నివాసాయ నృసింహ క్షేత్ర భాసినే
భవనాశీ విహారాయ ఆంజనేయాయ మంగళం
వైశాఖమాసకృష్ణాయాం దశమ్యాం మందవాసరే
పూర్వాభాద్ర ప్రభూతాయం మంగళం శ్రీహనూమతే॥

ఘనాపాఠి కుటుంబంలో పుట్టి..

దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి సేవలో తరిస్తున్నారు వేదపండితులు వంగల హరిశంకరావధాని. ఈయన తండ్రి దివంగత రామ్మూర్తి భారతదేశంలోనే ప్రముఖ ఘనాపాఠిగా పేరొందారు. ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న హరిశంకరావధాని, ఆయన కుమారుడు ఆంజనేయ అవధాని ఇదే పవిత్రమార్గంలో పయనిస్తున్నారు. ప్రతిరోజూ వేద పారాయణం చేస్తుంటారు. ఉదయం అభిషేకం, సాయంత్రం ప్రదోషకాల పూజల్లో పాల్గొంటారు.

మూడు దశాబ్దాలకు పైగా..

కోట లక్ష్మీనారాయణ ఆలయ ఉప ప్రధానార్చకులుగా పని చేస్తున్నారు. 1992 డిసెంబరు ఒకటో తేదీన అర్చకులుగా ఆలయం ప్రవేశం చేసిన ఈయన అనంతరం ఉపప్రధానార్చకులుగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం పాలకమండలి ఎక్స్అఫీషియో సభ్యునిగా ఉన్నారు.

ఉప ప్రధానార్చకులుగా..

విజయవాడ ప్రాంతానికి చెందిన సుదర్శనం సీతారామాంజనేయాచార్యులు 1993 జులై ఒకటో తేదీన అర్చకునిగా విధుల్లో చేరారు. నిత్యం స్వామి వారి సేవలో తరిస్తూ ఆలయ ఉప ప్రధానార్చకునిగా విధులు నిర్వహిస్తున్నారు.

- శింగరకొండ (అద్దంకి)

నాదస్వరంతో పులకించే భక్తజనం

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో నలుగురు వాద్యకారులు బాజాభజంత్రీలు మోగిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 4.30 నుంచి రాత్రి పవళింపు సేవ వరకూ వారిదే కీలక పాత్ర. మూడు దశాబ్దాలుగా షేక్ పీరూసాహెబ్, మూడేళ్ల నుంచి ఉప్పలపాటి జాలరామయ్య నాదస్వరంతో భక్తజనులు పులకిస్తున్నారు. 2003 నుంచి డోలు విద్వాంసులుగా గోనుగుంట ఆంజనేయులు, 2001 నుంచి ముద్దపాటి శ్రీనివాసులు పనిచేస్తున్నారు. - శింగరకొండ(అద్దంకి)

ఆలయంలో బాజాభజంత్రీలతో..

(c) eenadu

ప్రసన్నాంజనేయస్వామి నిత్యార్చన వేళలు

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. పౌర్ణమి, అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తారు. అమావాస్య సందర్భంగా 10 వేల అరటిపండ్ల పూజ, పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకుల పూజ నిర్వహిస్తారు. మంగళ, శనివారాల్లో సాయంత్రం వేళల్లో దేవతామూర్తులకు పల్లకీ సేవ ఉంటుంది. మేళతాళాలు, భాజా భజంత్రీలు, వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ ప్రదక్షిణ చేస్తారు. రోజూ మధ్యాహ్నం పంచ హారతి ఇస్తారు. సాయంత్రం 7.45 గంటలకు స్వామి వారికి పవళింపు సేవ చేస్తారు. మూలవిరాట్‌కు ఆకుపూజ చేస్తారు. అంతర్జాలం ద్వారానూ స్వామి వారికి దాతలు పరోక్షంగా సేవలు అందించే అవకాశం ఉంది. దేవస్థానం వెబ్‌సైట్‌లో ఆ వివరాలు ఉంచారు.

- శింగరకొండ(అద్దంకి)

సామాజిక వర్గాల వారీగా సత్రాలు

శింగరకొండలో సామాజిక వర్గాల వారీగా సత్రాలు ఉన్నాయి. తిరునాళ్ల సందర్భంగా వాటిలో ఉదయం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు వచ్చిన వారికి కాదనకుండా అల్పాహారం, భోజనాలు పెడుతుంటారు. ఆయా కార్యక్రమాల నిర్వహణకు దాతలు విరాళాలు ఇస్తుంటారు. కాకతీయ, శాలివాహన, జైభీం, వడ్డెర, నాయీబ్రాహ్మణ, కాపు, బ్రాహ్మణ, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ, రజక తదితర సామాజిక వర్గాల వారు వారి సత్రాలను ఆశ్రయిస్తుంటారు. శిర్డీ సాయిబాబా మందిరం వద్ద విద్యుత్తు అధికారులు కూడా సత్రం నిర్వహిస్తూ భక్తులకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్తు ప్రభలు

శింగరకొండ వార్షిక తిరునాళ్లకు విద్యుత్తు ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి కనీసం పది వస్తాయి. తిరునాళ్ల ప్రదేశం వద్ద వాటిని ఏర్పాటు చేస్తారు. అద్దంకి కొండ ప్రదేశంలో వీటిని నెలకొల్పుతారు. దేవాలయానికి వచ్చే భక్తుల కంటే ప్రభల వద్దకు వచ్చే వారే మూడింతలు అధికం. మార్చి 2న సాయంత్రం 6 నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీంతో పాటు రంగుల రాట్నాలు, సర్కస్‌లు, బొమ్మల దుకాణాలు, చెరకు గడలు తినుబండారాలు విక్రయిస్తారు.

చదువుల చిన్నారులకు ఉచిత సైకిళ్లు

సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే గ్రామీణ విద్యార్థులు చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో పెద్దఎత్తున సైకిళ్లు పంపిణీ చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గ స్థాయిలో పదివేల మందికి వీటిని పంపిణీ చేసే దిశగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అడుగులేస్తున్నారు. నియోజకవర్గంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు వీటిని అందించారు. ఇప్పటి వరకు 80 శాతం విద్యార్థులకు పంపిణీ చేశారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే అందిస్తామని ఆయనంటున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో దూరప్రాంతాల నుంచి విద్యార్థులు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లడం గమనించినట్లు చెప్పారు. సామాజిక బాధ్యతలో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తల సహకారంతో ఈ క్రతువు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు సమీపంలోని మూడు కి.మీ. దూరం నుంచి విద్యార్థులు నడిచి పాఠశాలకు వస్తుండటం తనను ఎంతో ఆలోచింపజేసిందని ఆయన పలు సభల్లో చెబుతూ వచ్చారు.

రూ.1.5 లక్షల విలువ చేసే స్కూటీలు..

నియోజకవర్గంలో ఇప్పటి వరకు 167 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలను ఉచితంగా అందించామని, మరో 140 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఒక్కో స్కూటీ విలువ రూ.1.50 లక్షల వరకు ఉంటుందని వెల్లడించారు. గత నెల 23 జె.పంగులూరు మండలం ముప్పవరం వద్ద 35 మంది దివ్యాంగులకు స్కూటీలు అందించారు.

- అద్దంకి, బల్లికురవ

(c) eenadu

ఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకం

ఆంజనేయ మాల దీక్ష విరమణకు వచ్చిన భక్తులు

జగమెరిగిన ధీశాలీ.. దీవెనలివ్వు!

తిరుగులేని బలం..అంతకుమించిన మనో బలం ఆ ధీశాలి సొంతం. అదే స్ఫూర్తిని అందిపుచ్చుకున్న వేలాదిమంది అంజనీపుత్రుడు చూపిన బాటలో పయనిస్తున్నారు. అందులో భాగంగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఏటా మార్గశిర శుద్ధ త్రయోదశి నాడు అంజన్నమాల దీక్ష చేపడతారు. 40 రోజుల కఠిన దీక్ష ఆచరించి..హనుమత్ వ్రతం నాడు విరమణ చేస్తారు. బాపట్ల, పల్నాడు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన సుమారు నాలుగొందల మందికి పైగా భక్తులు ఏటా ఇక్కడే దీక్షలు చేపడుతుంటారు. దీక్ష స్వీకరణ, విరమణ ఆలయం ప్రాంగణం వద్దే జరుగుతాయి. ఆంజనేయుడు అపురూప బలశాలి అని వంగల హరిశంకరావధాని కీర్తిస్తారు. అందువల్లే పలువురు భక్తులు ఆయన మాల వేసుకుంటారు.

స్వామి సేవలో రుత్వికుల బృందం

రుత్వికుల బృందం నిత్యం స్వామి సేవలో తరిస్తుంది. ప్రధానార్చకులు కోట లక్ష్మీనారాయణ. అర్చకులు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు, అన్నవరపు చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, కోట గిరిధర్ కిషోర్, అన్నవరపు సత్యనారాయణ, వేలమూరి శ్రీరామ్మూర్తితో కూడిన రుత్వికుల బృందం భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమాల్లో పాల్గొంటుంది. రెండు దశాబ్దాలుగా అంజన్న దీక్ష చేపట్టిన వారు ఇక్కడే విరమిస్తున్నారు. ఆ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దీక్షాధారులు, వారి బంధువులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడుతుంటుంది. దేవస్థాన పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకర్, సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు, పాలకమండలి సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

\- శింగరకొండ (అద్దంకి)

(c) eenadu

అంజన్న అభయం.. అద్దంకి అభ్యుదయం

రాష్ట్ర విద్యుత్తుశాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్

శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో అద్దంకి ప్రాంతాన్ని ప్రగతిబాటలో నిలుపుతున్నామని రాష్ట్ర విద్యుత్తుశాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శింగరకొండ 71వ వార్షిక తిరునాళ్ల నిర్వహించే మహద్భాగ్యాన్ని స్వామి వారు కల్పించారన్నారు. స్వామి వారి సన్నిధిలో ఉంటూ.. వేడుకను నిర్వహించడం ఓ అనిర్వచనీయమైన అనుభూతి కలిగిస్తోందన్నారు. తిరునాళ్ల వేడుక వేళ ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతిసారీ శింగరకొండలో పూజల అనంతరమే నామపత్రం దాఖలు చేయడమన్నది తన జీవితంలో ఓ భాగమైపోయిందన్నారు. స్వామి వారి దివ్య ఆశీస్సులతోనే జిల్లా ప్రజల మన్ననలు అందుకున్నానన్నారు. ఇంకా ఆయన చెప్పిన వివరాలు ఇవీ..

ప్రతి రూపాయికీ జవాబుదారీ

భక్తులు విరాళం రూపంలో ఇచ్చే ప్రతి రూపాయికీ జవాబుదారీతనం ఉండేలా కార్యవర్గానికి దిశానిర్దేశం చేస్తున్నాం. ఆలయాలకు వచ్చిన భక్తులకు నాణ్యమైన ప్రసాదాలు అందిస్తున్నాం. పాలకమండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ భక్తుల మన్ననలు పొందేలా చూసుకోవాలి. కొండపైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కొండదిగువన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, భవనాశి తటాకం మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళిక రచిస్తున్నాం.

రెవెన్యూ డివిజన్ హామీ నెరవేర్చాం

ఎన్నికల సమయంలో అద్దంకి నియోజకవర్గ ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నా. ఈ నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపడమే కాకుండా రెవెన్యూ డివిజన్ కార్యాలయం కూడా మంజూరు చేయించా. దీనివల్ల రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయి. దూరప్రాంతాలకు వెళ్లే పని కూడా తప్పుతుంది.

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

రంగస్థల కళాకారుల పుట్టినిల్లులాంటి అద్దంకిలో రూ.3.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో 'అద్దంకి టౌన్‌హాల్' నిర్మాణం చేపడతాం. హెచ్ఐవీ పీడిత రోగులు మందుల కోసం ఒంగోలు వెళ్లకుండా రూ.65 లక్షల వ్యయంతో ఏఆర్‌టీ కేంద్రాన్ని పది గదులతో నిర్మిస్తున్నాం. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రూ.25 లక్షల వ్యయంతో డైనింగ్ హాల్ నిర్మిస్తున్నాం.

రూ.132 కేవీ ఉపకేంద్రం, రహదారుల నిర్మాణం

ఏల్చూరు వద్ద 132 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేయించాం. నియోజకవర్గంలో అయిదు విద్యుత్తు ఉపకేంద్రాలు నిర్మాణంలో ఉండగా, మరో రెండు ఉపకేంద్రాలు మంజూరయ్యాయి. సీఎస్ఆర్ గ్రాంటు కింద నియోజకవర్గంలో 23 సామాజిక భవనాలు నిర్మించాం. పురపాలక పరిధిలోని వసుమర్తిపాలెం, ఎన్టీఆర్‌నగర్‌లో సామాజిక భవనాల నిర్మాణం పూర్తి చేశాం. ప్రభుత్వ విద్యాలయాల్లో సురక్షిత మంచినీటి పథకానికి రూ.12 లక్షలను దాత ద్వారా సమకూర్చాం.

భక్తులకు వసతులపై శ్రద్ధ

శింగరకొండ క్షేత్రానికి వచ్చిన భక్తులపై అధికారులు, పాలకవర్గాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. మూడువైపులా కొండ, ఓ వైపు భవనాశి తటాకంతో ఈ ప్రాంతం అలరారుతోంది. ఇదో అద్భుతమైన స్వామివారి క్షేత్రం. ఇది మరింత అభివృద్ధి చెందేలా కృషిచేస్తాం.

- అద్దంకి

ప్రకాశంలో చేరిక.. డివిజన్ కానుక

• లోకేశ్, గొట్టిపాటి కృషితో కల సాకారం

అద్దంకివాసుల ఆనందం రెట్టింపయ్యింది. ఇటు ప్రకాశం జిల్లాలోకి రావడమే చాలనుకున్న తరుణంలో.. వారికి రెవెన్యూ డివిజన్‌ను ప్రభుత్వం కానుకగా ఇచ్చింది. ఈ కల సాకారం కావడంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్ విశేష కృషి చేశారు. గత పాలకులు జిల్లాల విభజన సమయంలో పరిపక్వత లేకుండా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో ప్రకాశంలో ఉన్న అద్దంకి నియోజకవర్గం కాస్తా బాపట్ల జిల్లాలో చేరింది. 2022 ఏప్రిల్ నాలుగో తేదీన ప్రకాశం నుంచి అద్దంకి వేరుకావడంతో స్థానికులు తీవ్ర వేదనకు గురయ్యారు. దీంతో 30 రోజుల పాటు వారు ఆందోళన, నిరాహారదీక్షలు చేపట్టారు. అనంతరం యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ ఫలితంగా 2025 డిసెంబరు 30న తిరిగి ప్రకాశం జిల్లాలోకి అద్దంకి నియోజకవర్గం చేరింది. దీంతో స్థానికులు సంబరాలు చేసుకున్నారు. తదనంతరం అద్దంకి, దర్శి నియోజకవర్గాలను కలుపుతూ రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ర.భ.శాఖ అతిథిగృహంలో దీన్ని నెలకొల్పారు. ప్రకాశంలో కలిపితే చాలనుకున్న తరుణంలో మంత్రి గొట్టిపాటి చొరవ చూపారని స్థానికులు చెప్పారు. - అద్దంకి

ర.భ. అతిథి గృహంలో ఏర్పాటైన రెవెన్యూ డివిజన్ కార్యాలయం

శింగరకొండలో టిడ్కో ఇళ్లు

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారి

(c) eenadu

శుభాకాంక్షలు



ఉభయరాష్ట్రాలలో ప్రసిద్ధిగాంచిన
దివ్యమహిమలు గల శ్రీ స్వామియే స్వయంగా వెలసిన
శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి,
శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్ల
71వ వార్షిక తిరునాళ్ళ శుభాకాంక్షలు..
తెలియజేస్తూ.. విచ్చేయుచున్న భక్తులకు, ప్రజలకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు స్వాగతం... సుస్వాగతం...
స్వామివార్లను దర్శించుకుని
స్వామి వార్ల కృపకు పాత్రులు కాగలరని మనవి.

మీ

కోట శ్రీనివాసకుమార్

మాజీ చైర్మన్: శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానము
శింగరకొండ (2021 - 2023)
మాజీ అధ్యక్షులు: శ్రీ చక్రసహిత శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి
అమ్మవారి దేవస్థానము, అద్దంకి (2014 - 2024)

K & K కన్సల్టెంట్స్

(c) eenadu

71వ వార్షిక శింగరకొండ తిరునాళ్ళ
శుభాకాంక్షలు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
ఇద్దరు స్వాముల పుణ్యక్షేత్రం, ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధిగాంచిన దివ్యమహిమలు గల
శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి 71వ వార్షిక తిరునాళ్ళ శుభాకాంక్షలు.. ఈ తిరునాళ్ళకు
విచ్చేయుచున్న రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రివర్యులు శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి,
అతిరథమహారథులకు, స్వామివారి భక్తులకు, ప్రజలకు స్వాగతం... సుస్వాగతం
అద్దంకి నియోజకవర్గ కూటమి పార్టీల
నాయకులు, అభిమానులు

(c) eenadu

భయం వీడండి.. విజయాలు లిఖించండి

'ఈనాడు-ఈటీవీ, జిల్లా విద్యాశాఖ' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు భయాన్ని వీడితే రానున్న వార్షిక పరీక్షల్లో అనుకున్న మార్కులు సాధించగలరని నిపుణులు సూచించారు. 'పది' వార్షిక పరీక్షల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ఉత్తమ మార్కులు సాధించాలంటే ఎలా సన్నద్ధమవ్వాలి? జవాబులు రాసే క్రమంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే అంశంపై 'ఈనాడు- ఈటీవీ', జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఫోన్ ఇన్ కార్యక్రమం జరిగింది. ఉమ్మడి (తెలుగు), రవీంద్రలాల్ (హిందీ), వినోద్ కుమార్ (ఇంగ్లిష్), అలీ అహ్మద్ (గణితం), ఉస్మాన్‌బాషా (భౌతిక శాస్త్రం), రాజశేఖర్ (జీవ శాస్త్రం), అబ్దుల్‌రహీం (సాంఘిక శాస్త్రం) పాల్గొని విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. డీఈవో సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 'ఈనాడు- ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన 'పది' తరగతి విద్యార్థులకు సందేహాల నివృత్తి' కార్యక్రమంలో చాలామంది విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో సుధాకర్, ఉపాధ్యాయులు

కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు బృందాలుగా ఏర్పడి పాల్గొని నిపుణులను ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. మొత్తం 108 మంది ఫోన్ చేసి సబ్జెక్టు నిపుణులతో మాట్లాడారు. కర్నూలు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన ఫోన్ ఇన్‌లో ఉపాధ్యాయులు వెంకటరమణ గౌడ్ సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికతో చదివితే ఉత్తమ మార్కులు సాధించవచ్చన్నారు. నిపుణుల సూచనలు పాటించాలన్నారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గణిత పరీక్షలో పాటించాల్సిన మెలకువలు, సూచనలు 6లో

కల్వర్టు శిథిలం.. రక్షణ గగనం

మండల పరిధిలోని పుల్లగుమ్మలపల్లె-కాకరవాడ మధ్యలో ఆర్‌అండ్‌బీ మార్గంలో ఏళ్లవాగుపై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. నిర్మాణం దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ మార్గంలో వందలాది వాహనదారులు ప్రతిరోజూ కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాలు వెళ్తుంటాయి. ఎప్పుడు కూలిపోతుందోనని జనం ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా స్పందించి నూతన కల్వర్టును నిర్మించాల్సిన అవసరం ఉంది.
– న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఆమె ఆదివారం తెలిపారు. జిల్లా అధికారులందరూ హాజరుకావాలని చెప్పారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ వినతులు స్వీకరించనున్నట్లు వివరించారు.

అధనం.. వీడని గృహణం

ముందుకు కదలని నిర్మాణాలు ◆ ఉగాది నాటికి పూర్తయ్యేనా..

పరిశీలన

ఇళ్లు కాదు.. ఊళ్లే నిర్మిస్తాం.. పేదల సొంతింటి కల నెరవేరుస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం ఆర్భాటం చేసింది. అనువుగానిచోట స్థలాలు కేటాయించింది. అడపాదడపా నిర్మించుకున్నా చాలామందికి బిల్లులు మంజూరు చేయలేదు. ఫలితంగా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించి ఉగాది నాటికి పూర్తి చేయించాలని గృహనిర్మాణ శాఖకు లక్ష్యాలు విధించింది. – న్యూస్‌టుడే, కర్నూలు కలెక్టరేట్

గూడూరులో గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. సుదూర ప్రాంతంలో ఇవ్వడం.. అవసరమైన వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు ముందుకు రాలేదు. ఫలితంగా కాలనీ మొత్తం ముళ్ల పొదలతో నిండిపోయింది.

రూ.11.88 కోట్లు పంపిణీ

- ఎస్సీ, బీసీలకు ఒక్కో ఇంటి నిర్మాణానికి అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేల చొప్పున సాయం అందించింది. గతేడాది మార్చిలో కర్నూలు జిల్లాలో 3,499 మందికి రూ.5.14 కోట్లు, నంద్యాల జిల్లాలో 4,522 మందికి రూ.6.74 కోట్లు కలిపి మొత్తం రూ.11.88 కోట్లు పంపిణీ చేశారు. 1,400 మంది పనులు ప్రారంభించారు. అందులో కనీసం 25 శాతం నిర్మాణాలు పూర్తి కాలేదు.
- గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రూ.1.80 లక్షలతో పాటు ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు కలిపి రూ.2.30 లక్షలు, ఎస్టీలకు రూ.2.55 లక్షలను కూటమి ప్రభుత్వం అందిస్తున్నా లబ్ధిదారులు స్పందించడం లేదు.

వీరికి స్థలాలు ఇస్తే..

- పీఎం ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 కింద సర్వే చేపట్టారు. కర్నూలు జిల్లాలో 31,015, నంద్యాలలో 34,880 మందికి ఇళ్లు లేనట్లు గుర్తించారు. వీరి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో కర్నూలులో 27,948, నంద్యాలలో 30,268 మంది అర్హులుగా గుర్తించారు. వీరిలో సొంత స్థలాలు ఉన్నవారు 80 శాతం మంది ఉండగా మిగిలినవారికి లేవు. వీరికి పట్టాలిస్తే ఇళ్లు నిర్మించుకొనేందుకు సిద్ధంగా ఉన్నారు.

బతిమాలుతున్నా వినిపించుకోరు..

- అదనపు సాయం తీసుకున్న నేపథ్యంలో పనులు ప్రారంభించాలంటూ వార్డు అమినిటీస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
- నిర్మాణాలు చేపట్టండి.. లేదా.. అడ్వాన్స్ రూపంలో పొందిన మొత్తం వెనక్కి ఇవ్వాలంటూ అధికారులు తాఖీదులిచ్చినా ప్రయోజనం లేకపోయింది. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.. చాలా కాలనీల్లో పునాదులు, బేస్‌మెంట్ల వద్దే ఆగిపోయాయి.

అంశం	కర్నూలు	నంద్యాల
పనులు ప్రారంభించనవి	2,112	1,876
వివిధ దశల్లో ఉన్నవి	12,229	12,897
ఉగాదికి లక్ష్యం	14,431	14,773

శాస్త్రోక్తంగా కామ దహనం

మన్మథుడి చిత్రపటాన్ని దహనం చేస్తున్న ఈవో, అర్చకులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం కామ దహనం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను, మన్మథుడి రూపంతో చేసిన చిత్రపటాన్ని ఈవో ఎం.శ్రీనివాసరావు, అర్చకులు, వేద పండితులు గంగాధర మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించిన అనంతరం గడ్డిపై మన్మథుడి చిత్రపటాన్ని ఉంచి దహనం చేశారు. తపస్సుకు భంగం కలిగించినందుకు మన్మథుడిని పరమేశ్వరుడు దహించి వేశాడన్న పురాణోక్తి కథనం మేరకు సంప్రదాయబద్ధంగా ఈ క్రతువు జరిపారు.

ఆక్రముంచుతున్నారు

● రూపు కోల్పోతున్న చెరువులు

గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులపై దృష్టి సారించకపోవడం.. అక్రమార్కులకు వరంగా మారింది. నియోజకవర్గ పరిధిలో చిన్ననీటి పారుదల ఆధ్వర్యంలో 20 చెరువులు ఉన్నాయి. వీటిల్లో చాలావరకు రూపు కోల్పోతున్నాయి.
– న్యూస్‌టుడే, బనగానపల్లి, సంజామల

సంజామల మండలంలోని కానాల చెరువు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. సమీపంలో ఉన్న కొందరు చెరువును ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. దీని కింద 200 ఎకరాలకు సాగునీరు అందేది. ప్రస్తుతం సాగు విస్తీర్ణం పడిపోయింది.

అభివృద్ధి చేసినా..

- బనగానపల్లి సమీపంలోని రాచెరువు గతంలో వంద ఎకరాల్లో విస్తరించి ఉండేది. పలువురు ఆక్రమించుకోవడంతో ప్రస్తుతం 20 ఎకరాలు కూడా కనిపించడం లేదు. గతంలో రెవెన్యూ అధికారులు సుమారు 40 మందికి.. ఒక్కొక్కరికి ఎకరా చొప్పున పట్టాలిచ్చారు. మిగిలిన పొలాన్ని మరికొందరు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. చెరువును అభివృద్ధి చేసి పట్టణ అవసరాలకు తగ్గట్టు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు చేయాలని గతంలో అంచనాలు రూపొందించారు. అవుకు రిజర్వాయర్ నుంచి పైపులైను ద్వారా నీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. కానీ పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం చెరువు ఆక్రమణలతో కుచించుకుపోయింది. పదేళ్ల కిందట దీని అభివృద్ధికి రూ.30 లక్షలతో తూములు, కాలువ పనులు చేపట్టినా ఫలితం లేకుండా పోయింది.

తగ్గిన సాగు విస్తీర్ణం

- బనగానపల్లి మండలంలోని కైప చెరువు 50 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఎస్సార్బీసీ ద్వారా నీరందుతుంది. 100 ఎకరాలకు సాగునీరు అందేది. కొందరు చెరువు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదు. 'చెరువులు ఆక్రమణకు గురైనట్లు గుర్తించాం. ఆక్రమణదారులను గుర్తించి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటాం' అని మైనర్ ఇరిగేషన్ ఏఈ రాంమోహన్‌రెడ్డి చెప్పారు.

ప్రహ్లాదవరదుని పరిణయం...
పరవశించెను భక్తజనం

దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదుని పరిణయం అంగరంగ వైభవంగా జరిగింది. అశేష జనవాహిని తిలకిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ ప్రహ్లాదవరదుడు.. అమృతవల్లి అమ్మవారిని పరిణయమాడారు. బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన స్వామి కల్యాణోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఉదయం ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అభిషేకం జరిపారు. సాయంత్రం స్వామివారు విశేష అలంకరణలో గజవాహనంపై కొలువుదీరి ఆలయ పురవీధుల్లో విహరించారు. రాత్రి స్వామి, అమ్మవార్లను రత్నాలు, వజ్రాలతో పొదిగిన ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో కొలువుంచారు. పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ తిరుమాంగల్యధారణ చేసి హోమం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఎగువ అహోబిలంలో ఉదయం జ్వాలా నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై కొలువుంచి కాళింగ నర్తనోత్సవం నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంపై జ్వాలా నృసింహస్వామి విహరించారు.
– న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

ఆగిన జలం.. తడవని పొలం

● ఎస్సార్బీసీ ఆయకట్టుకు తప్పని కష్టాలు

దెబ్బతింటున్న మిరప

గతేడాది వర్షాలు సకాలంలో పడటంతో శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు చేరింది. ఎస్సార్బీసీ కింద సాగు చేసే పొలాలకు ఎలాంటి నీటి ఇబ్బందులు ఉండవని అందరూ భావించారు. రబీలో వేలాది ఎకరాల్లో రైతులు మిరప, మొక్కజొన్న సాగు చేశారు. పంట చేతికి వచ్చే సమయానికి ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకుండా కాలువకు సాగు నీరు ఆపేశారు. పంట కాలువల్లో అరకొర నీరు ఉండగా.. ఆ నీటిని పంటలకు పెట్టుకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు.
– న్యూస్‌టుడే, కోవెలకుంట్ల, సంజామల

రూ.లక్షల్లో పెట్టుబడి

- సంజామల మండలంలోని ముదిగేడులో ఎస్సార్బీసీ 10వ బ్లాక్ కాలువ కింద వంద ఎకరాలకు పైగా మిరప, 150 ఎకరాల్లో మొక్కజొన్నను రైతులు సాగు చేశారు. మిరప పంటకు ఎకరాకు రూ.2.50 లక్షలు, మొక్కజొన్నకు ఎకరాకు రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం మిరప, మొక్కజొన్న పంటలు పూత, పిందె, కాయ దశకు చేరుకున్నాయి. ఈ తరుణంలో పంట కాలువలకు సాగు నీరు ఆగిపోయింది.
- పంట కాలువల్లో అరకొరగా ఉన్న నీటిని పొలాలకు మళ్లించుకునేందుకు ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని పైపుల ద్వారా నీటిని మళ్లించుకుంటున్నారు. అదనపు ఖర్చులు ఎక్కువవుతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తీవ్రంగా నష్టపోతాం - ఇర్ఫాన్, రైతు, ముదిగేడు

ఎస్సార్బీసీ కింద ఎకరాకు రూ.2 లక్షల పెట్టుబడితో నాలుగెకరాల్లో మిరప సాగు చేశా. పంట చేతికి వస్తున్న తరుణంలో సాగు నీరు ఆపేయడంతో దిగుబడులు చేతికి అందే పరిస్థితి కనపడటం లేదు. అధికారులు స్పందించి నెల రోజులైనా నీరు విడుదల చేసి ఆదుకోవాలి. లేకుంటే అప్పులపాలవుతాం.

మల్లన్న ఆలయం మూసివేత రేపు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం నేపథ్యంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్ల ఆలయాన్ని ఈనెల 3న మూసివేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. తెల్లవారుజామున 3 గంటలకు మంగళవాయిద్యాలు, సుప్రభాతసేవ, ప్రాతఃకాల పూజలు, మహామంగళహారతులు జరుగుతాయన్నారు. ఉదయం 4.30 గంటల నుంచి భక్తులను స్వామి, అమ్మవార్ల అలంకార దర్శనానికి అనుమతించనున్నట్లు చెప్పారు. ఉదయం 6 గంటలకు ఆలయ ద్వారాలు మూసివేస్తామని.. రాత్రి 7.30 గంటలకు తెరవనున్నట్లు చెప్పారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించి రాత్రి 9 గంటల నుంచి 10.30 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతించనున్నట్లు ఈవో తెలిపారు. గ్రహణం కారణంగా భక్తులకు అన్నప్రసాద వితరణ సైతం నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

మహాధర్నా 3న

నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఈనెల 3న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు అన్నారు. ఆత్మకూరులో ఆదివారం నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయినా వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయలేదని అన్నారు. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించలేదని విమర్శించారు. పలు డిమాండ్ల సాధన కోసం కలెక్టరేట్ వద్ద చేస్తున్న ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి, సహాధ్యక్షుడు షేక్ ఉమర్, గౌరవాధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

పట్టణం	ఇఫ్తార్ (సోమ)	సహెరీ (మంగళ)
కర్నూలు	6:31	5:13
నంద్యాల	6:12	5:12
ఆదోని	6:28	5:11
ఆళ్లగడ్డ	6:27	5:16
బనగానపల్లి	6:29	5:09

–న్యూస్‌టుడే (కర్నూలు పాతబస్తీ)

ఉగాది ఉత్సవాల్లో స్పర్శ దర్శనం నిలుపుదల

మాట్లాడుతున్న ఛైర్మన్ రమేష్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ఉగాది ఉత్సవాల సమయంలో ఐదు రోజులపాటు శ్రీశైల మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం నిలుపుదల చేస్తున్నట్లు ధర్మకర్తల మండలి అధ్యక్షులు రమేష్‌నాయుడు, ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శ్రీశైలం పరిపాలనా భవనంలో కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన పాదయాత్ర భక్త బృందాలు, స్వచ్ఛంద సేవకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈనెల 16 నుంచి 20 వరకు జరగనున్న ఉగాది మహోత్సవాల నేపథ్యంలో వారి సమక్షంలోనే లాటరీ పద్ధతిలో సేవా ప్రదేశాలను అధికారులు కేటాయించారు. వారు మాట్లాడుతూ 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతిరోజూ నాలుగు విడతలుగా స్పర్శ దర్శనం కల్పిస్తామన్నారు. కరెంట్ బుకింగ్ ద్వారా ఒక్కో విడతకు 1,500, ఆన్‌లైన్ ద్వారా మరో 500 స్పర్శ దర్శనం టికెట్లు అందుబాటులో ఉంచుతామన్నారు. ఆలయ వెబ్‌సైట్లు www.srisailadevasthanam.org, www.aptemples.ap.gov.in , మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ 95523 00009 ద్వారా స్పర్శ దర్శనం టికెట్లు పొందవచ్చన్నారు.

రహదారిన పడనున్నాయ్

● మరమ్మతులకు ఏపీఆర్ఆర్ఎస్పీ నిధులు

ఉమ్మడి జిల్లాలోని రహదారులకు కొత్త రూపు రానుంది. ఏపీఆర్ఆర్ఎస్పీ (ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ స్ట్రెంథనింగ్ ప్రాజెక్టు) కింద పంచాయతీరాజ్ శాఖకు నిధులు మంజూరయ్యాయి. గ్రామీణ రహదారులకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ఫలితంగా చాలా ప్రాంతాల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం దెబ్బతిన్న వివిధ రహదారులను గుర్తించి ఏపీఆర్ఆర్ఎస్పీ కింద అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.
–న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

రూ.155.71 కోట్లు మంజూరు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 64 రహదారులను 260.873 కి.మీ. పొడవునా అభివృద్ధి చేసేందుకు రూ.155.71 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు రాష్ట్ర స్థాయిలో త్వరలో టెండర్లు పిలవనున్నారు. ఈ వేసవిలోనే పనులు ప్రారంభించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. పనులన్నీ పూర్తైతే జనం కష్టాలు తీరనున్నాయి. రాకపోకలు సాగించేందుకు అనుకూలమైన మార్గం ఏర్పడుతుంది.

ఈ చిత్రంలోనిది బండిఆత్మకూరు-కరిమద్దెల రహదారి. సుమారు 1.302 కి.మీ. పొడవునా దెబ్బతింది. ఈ మార్గం అభివృద్ధికి రూ.72 లక్షలు మంజూరయ్యాయి. రెండు మండలాలను కలిపే ఈ రహదారి గత ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. ఫలితంగా జనం ఇబ్బందులు పడేవారు. పనులు పూర్తైతే సాఫీగా ప్రయాణం సాగించొచ్చు.

దెబ్బతిన్నవాటికి ప్రాధాన్యం

- ఉమ్మడి జిల్లాలో పలు గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పంచాయతీరాజ్ అధికారులు వీటిని గుర్తించి నిధులకు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం ఆమోదించింది.
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలంలో చాగలమర్రి-చిన్నవంగలి రహదారి 8.76 కి.మీ. పొడవునా దెబ్బతినగా దీనికి రూ.4.37 కోట్లు మంజూరయ్యాయి.
- బనగానపల్లి నియోజకవర్గంలోని పసుపుల-పెద్ద మల్కాపురం రహదారిపై 5.32 కి.మీ. పొడవునా గుంతలు పడ్డాయి. ఈ రోడ్డుకు రూ.4.21 కోట్లు కేటాయించారు.
- నందికొట్కూరు నియోజకవర్గం.. మిడుతూరు మండలంలోని నందికొట్కూరు-గని మధ్య 9.12 కి.మీల రహదారికి రూ.5.21 కోట్లు విడుదల చేశారు.
- కర్నూలు జిల్లా.. ఆదోని మండలంలోని హనవాళు-పెద్దహరివాణం మధ్య 4.50 కి.మీ. రహదారికి రూ.3.51 కోట్లు మంజూరు చేశారు.
- పత్తికొండ నియోజకవర్గంలోని దేవనకొండ మండలంలో పి.కోటకొండ క్రాస్ రహదారి నుంచి లక్కసాగరం వరకు 7.401 కి.మీ. మార్గానికి సుమారు రూ.4.07 కోట్లు కేటాయించారు.

ఏపీఆర్ఆర్ఎస్పీ కింద చేపట్టనున్న పనులు (రూ.కోట్లలో)

జిల్లా	రహదారులు	కి.మీ.లు	నిధులు
కర్నూలు	20	89.33	59.16
నంద్యాల	44	171.543	96.550

మూడుముళ్ల బాటలో బాల్యం

ఏటా పెరుగుతున్న బాల్య వివాహాలు ● చదువుకు దూరమవుతున్న విద్యార్థినులు

నిరక్షరాస్యత, పేదరికం, అభద్రతాభావం వంటి కారణాలతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో బాల్య వివాహాలు క్రమంగా పెరుగుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సర గణాంకాలు దీనిని స్పష్టం చేస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నా.. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి అడ్డుకోవాల్సిన గ్రామస్థాయి కమిటీలు ఉలుకూపలుకు లేకుండా ఉన్నాయి. కర్నూలు జిల్లాలో బాల్య వివాహాలు, టీనేజీ ప్రసవాలు పెరిగిపోతుండటంపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. వీటి కట్టడికి అన్నిశాఖల అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
– న్యూస్‌టుడే, కర్నూలు విద్య

ఇక్కడే అధికం

2024-25 ప్రకారం 19 ఏళ్లలోపువారు 6,550 మంది తల్లులు అయినట్లు తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో ఆదోని, పత్తికొండ డివిజన్లతో పాటు కర్నూలు నగర శివారు ప్రాంతాలు, నంద్యాల జిల్లాలో ఆత్మకూరు, వెలుగోడు, చాగలమర్రి, సంజామల, బనగానపల్లి, ఆళ్లగడ్డ, శిరివెళ్ల ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఎక్కువ శాతం జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిని ముందే పసిగట్టి అడ్డుకోగలిగితే బాలికలు ఉన్నత చదువులు చదివే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పేరుకే కమిటీలు

బాల్య వివాహాల నియంత్రణ కోసం జిల్లా, డివిజన్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ ఛైర్మన్/ ఛైర్‌పర్సన్‌గా, ఎస్పీ, డీఎంహెచ్‌వో కన్వీనర్లుగా, ఐసీడీఎస్ అధికారి, గైనకాలజీ హెచ్‌వోడీ, డీఈవో, ఆర్ఐవో సభ్యులుగా ఉంటారు. డివిజన్, గ్రామ స్థాయిలోనూ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు పట్టించుకోవడం లేదు.

సమాచారం ఇవ్వొచ్చు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండాకే వివాహం చేయాలి. ఎక్కడైనా తక్కువ వయసు వారికి పెళ్లి చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వొచ్చు. వివరాలు గోప్యంగా ఉంచుతారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసు హెల్ప్‌లైన్ 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181 నంబర్లకు ఫోన్ చేసి బాల్య వివాహాల గురించి సమాచారం తెలియజేయొచ్చు.

ఉమ్మడి జిల్లాలో జరిగిన బాల్య వివాహాలు (2024-25)

16 ఏళ్లు	1,014
17 ఏళ్లు	1,190
18 ఏళ్లు	1,370

వీరి పాత్ర కీలకం

ఉమ్మడి జిల్లాలోని ప్రతి గ్రామంలో జనాభాను బట్టి రెండు మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఎక్కడ బాల్య వివాహాలు జరుగుతున్నా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు తెలుస్తుంది. పెళ్లిళ్లు జరగకముందే వారు ఉన్నతాధికారులకు సమాచారమిస్తే అడ్డుకునే అవకాశం ఉంటుంది. తాము చెప్పినట్లు తెలిస్తే గ్రామంలో ఇబ్బందులు ఎదురవుతాయన్న ఉద్దేశంతో చాలామంది మిన్నకుంటున్నారు. ఫలితంగా ఐసీడీఎస్ ఉన్నతాధికారులకు సమాచారం అందడం లేదు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని డా.బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు సంబంధించి ఆదివారం పరీక్ష నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో ప్రశాంతంగా జరిగినట్లు ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త (డీసీవో) ఎం.ఇ.గీత తెలిపారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించి 9,192 మందికి గాను 8,160 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకుగాను నిర్వహించిన పరీక్షకు 7,520 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 6,772 మంది వచ్చారు. డోన్ పట్టణంలోని గురుకుల పాఠశాలతో పాటు కంబాలపాడులోని గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్షలను డీసీవో గీత పరిశీలించారు. మరోవైపు ఎక్కడా ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.

ప్రవేశ పరీక్షను పరిశీలిస్తున్న డీసీవో గీత తదితరులు

(c) eenadu

అదుపు తప్పితే.. తప్పదు ముప్పు

డోన్ మండలంలోని ఎద్దుపెంట గ్రామ సమీపంలో పంట నూర్పిడి యంత్రంపై కూలీలు ప్రమాదకరంగా వెళుతున్నారు. ఈ యంత్రం గింజలు, పొట్టును వేరు చేస్తుంది. ఒక పొలం నుంచి మరొక పొలంలోకి వెళ్లేటప్పుడు ట్రాక్టర్ ఇంజిన్‌పై ఏడుగురు, నూర్పిడి యంత్రంపై నలుగురు మొత్తం 11 మంది ప్రయాణిస్తున్నారు. ఇలా ప్రమాదకరంగా ప్రయాణించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, డోన్ గ్రామీణం

చెంతనే జలం.. చేను తడపాలంటే భారం

నందికొట్కూరు మండలం మల్యాల వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ ఎత్తిపోతల పథకం నుంచి పంటకాలువ ద్వారా దిగువకు నీరు ప్రవహిస్తుంటుంది. ఈ కాలువ పొడవునా సమీప గ్రామాల రైతులు వేలాది ఎకరాల్లో పంటలు సాగు చేస్తుంటారు. వారి పొలాలకు మాత్రం ఈ హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా చుక్కనీరు అందదు. దీంతో పంటలను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో పైపులు అమర్చి డీజిల్ ఇంజిన్ల ద్వారా నీరు తోడుకుని పంటలకు తడులు అందిస్తున్నారు. ఇంధనం కోసం భారీ మొత్తం ఖర్చవుతోందని రైతులు వాపోతున్నారు. – ఈనాడు, నంద్యాల

దిగువన.. కాల్వగట్టు ఇంతేనా

తుంగభద్ర డ్యామ్ గేట్ల మరమ్మతుల నేపథ్యంలో దిగువ కాల్వకు నీటి విడుదల నిలిపివేశారు. హొళగుంద మండలంలోని దిగువ కాల్వ 193 కి.మీ. పరిధిలోని కడ్లమాగి క్యాంపు వద్ద, కోటేహాల్ డీపీ క్రాస్ రెగ్యులేటర్ వద్ద ఉన్న గట్టు కోతకు గురైంది. ఏడాదిగా అలాగే ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. కోతకు గురైన గట్టు అంచును నిర్మించి, రైతులకు ఇబ్బంది కలగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, దిగువ కాల్వకు నీరు వచ్చేలోగా సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హొళగుంద

గోడు కనరు.. గోడ కట్టరు

నందికొట్కూరు మండలం 10బొల్లవరం సమీపంలోని వంకపై ఉన్న వంతెనపై రక్షణ గోడ లేదు. నంద్యాల- నందికొట్కూరు మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏమాత్రం అదుపుతప్పినా వాహనాలు వంకలోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. కనీసం ఇక్కడ హెచ్చరిక బోర్డులు కూడా లేవు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాలు నివారించాలని కోరుతున్నారు. – ఈనాడు, నంద్యాల

నీటి సమస్యలపై అధికారుల నిలదీత

◆ జడ్పీ సర్వసభ్య సమావేశంలో గళమెత్తిన సభ్యులు

కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో వేధిస్తున్న తాగునీటి సమస్యలపై జిల్లా పరిషత్ పాలకవర్గ సభ్యులు గళమెత్తారు. ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన ఆదివారం జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కర్నూలు కలెక్టర్ డా. సిరి, నంద్యాల కలెక్టర్ రాజకుమారి, జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి, ఉప సీఈవో వెంకటసుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం, విద్య, ప్రజా పంపిణీ వ్యవస్థలపై చర్చ జరిగింది. జిల్లా పరిషత్ 2026– 27 వార్షిక బడ్జెట్‌ను ఉప సీఈవో వెంకటసుబ్బారెడ్డి సభలో ప్రవేశపెట్టారు. రూ.15.78 కోట్ల ఆదాయం, రూ.15.64 కోట్ల వ్యయంతో కూడిన బడ్జెట్‌ను సభ ఆమోదించింది.

మాట్లాడుతున్న ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి. చిత్రంలో సీఈవో నాసరరెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్లు డా.సిరి, రాజకుమారి

నిధులు వృథాచేస్తే ఎలా?

తాగునీటి సమస్యపై చర్చ సందర్భంగా ఛైర్మన్ పాపిరెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లపై అసహనం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలోని కోడుమూరు, వెల్దుర్తి, తుగ్గలి, నందికొట్కూరు, కొలిమిగుండ్ల, కృష్ణగిరి, నందవరం, కౌతాళం కేంద్రాల్లో రూ.14 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సుజల ప్లాంట్ల నిర్వహణను పట్టించుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని వినియోగంలోకి తేకుండా కొత్తగా ఆర్‌ఓ ప్లాంట్లను ఎలా ప్రతిపాదిస్తారని నిలదీశారు. ఇది ప్రజాధనాన్ని వృథా చేయడం తగదన్నారు.

ప్రజల కష్టాలు చూడండి

తమ పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను జడ్పీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల కష్టంపై అధికారులు దృష్టిపెట్టాలని కోరారు. కోడుమూరులో నీటి సమస్యకు కారణాలను జడ్పీటీసీ సభ్యుడు రఘునాథరెడ్డి వివరించారు. దొర్నిపాడులో ఓహెచ్‌ఆర్ ట్యాంకులు శుభ్రం చేయడం లేదని, శిథిలావస్థకు చేరుకుంటున్నా పట్టించుకోవడం లేదని జడ్పీటీసీ సభ్యురాలు శకుంతలమ్మ చెప్పారు. హాలహర్వి, కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామం, డోన్, ప్యాపిలి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడిని సభ్యులు వివరించారు.

రూ.9 లక్షలు ఇవ్వమన్నా స్పందనలేదు

పాణ్యం మండలం తమ్మరాజుపల్లి, గడివేముల మండలం తిరిగోపుల గ్రామాల్లో నీటి పథకం కల్పం చేయడం కోసం రూ.9 లక్షలు కేటాయించాలని ఎన్నిసార్లు అడుగుతున్నా జడ్పీ నిధులు విడుదల చేయడం లేదని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 'రెండేళ్ల కిందట జడ్పీ నిధులతో చేసిన పనులకే ఇంత వరకు బిల్లులు లేక గుత్తేదారులు ఇబ్బందులు పడుతున్నారు. మీరు కూడా జడ్పీ నిధులు కేటాయించాలంటే ఎలా.. అధికార పార్టీలో ఉన్న మీరు ఏదో ఒక విధంగా నిధులు తీసుకురండి. జడ్పీ నిధులు అడగొద్దు' అని కోడుమూరు జడ్పీటీసీ సభ్యుడు రఘునాథరెడ్డి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని కోరారు. కూటమి ప్రభుత్వంలో నిధులు కేటాయిస్తున్నామని, చిన్న పనులకు మాత్రమే జడ్పీ నిధులు కోరుతున్నామని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు.

◆ వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డా.సిరి చెప్పారు. 70 శాతం ఎస్‌ఎస్ ట్యాంకుల్లో నీటిని నింపామని, ఏప్రిల్ రెండో వారంలో టీబీ డ్యాం నుంచి మరోసారి నీరు విడుదల చేయాలని ప్రతిపాదించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.18 కోట్లతో ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

◆ పశ్చిమ ప్రాంతంలో వలసలు కొనసాగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఆశ్రయం ఇచ్చేందుకు సీజనల్ హాస్టళ్లను ఉపయోగంలోకి తేవాలని కోసిగి జడ్పీటీసీ సభ్యురాలు పవిత్రాపాటిల్ కోరారు.

సూత్రాలపై పట్టు.. మార్కుల సాధనకు మెట్టు

➤ 'ఈనాడు-ఈటీవీ, జిల్లా విద్యాశాఖ' ఫోన్‌ఇన్‌లో గణిత ఉపాధ్యాయుడి సూచనలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : చాలామంది విద్యార్థులు గణితమంటే భయపడుతుంటారు. దీనిని అర్థం చేసుకుంటే మార్కులు సులువుగా సాధించవచ్చని వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఎస్. ఆరిఫ్ అహ్మద్ పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థుల సందేహాలు నివృత్తి చేసేందుకు 'ఈనాడు-ఈటీవీ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ఆయన విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రతి గణిత పాఠంలోని సూత్రాలపై పట్టు సాధిస్తే పరీక్షల్లో వచ్చే ప్రశ్నలకు సులువుగా సమాధానాలు రాయవచ్చన్నారు. గణితంలో ఉన్న బహుపదులు, వృత్తాలు, త్రికోణమితి, అసమానతలు, ఉపరితల వైశాల్యాల్లో పాఠాలు గేయడంపై సాధన చేయాలని చెప్పారు. మూడు రోజులకు ఒకసారి ఎస్‌సీఈఆర్టీ మోడల్ ప్రశ్నపత్రాలను సాధన చేయాలన్నారు. ముఖ్యంగా త్రికోణమితి పట్టికలు, సర్వసమీకరణాల ఉపరితల వైశాల్యాల పట్టికలపై పట్టు అవసరమన్నారు. సాధన సమయంలో సందేహాలు వస్తే రాసుకొని ఉపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లి వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు.

ఎస్.ఆరిఫ్ అహ్మద్

విద్యార్థి : పాస్ మార్కులు కోసం ఏయే ప్రశ్నలు చదవాలి?

టీచర్: గణితంలోని 1, 2, 3, 7, 13, 14 పాఠాల నుంచి ప్రశ్నలు వస్తాయి. వీటిని బాగా సాధన చేస్తే 40 మార్కులకు పైగానే తెచ్చుకోవచ్చు.

విద్యార్థి : ప్రశ్నలు బ్లూప్రింట్ బేస్‌గా వస్తాయా.. అడిషనల్ బుక్‌లెట్ ఇస్తారా?

✔ వందశాతం బ్లూప్రింట్ బేస్‌గా ప్రశ్నలు వస్తాయి. జవాబులు రాసేందుకు ఇచ్చిన బుక్‌లెట్ పూర్తిగా అయిపోతే మరొక బుక్‌లెట్ ఇస్తారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

విద్యార్థి : గణితంలో ఉత్తమ మార్కులు ఎలా సాధించాలి?

✔ పదో తరగతి ప్రారంభం నుంచే నిత్యం తరగతికి హాజరుకావాలి. వంద రోజుల ప్రణాళికలో భాగంగా నిత్యం స్లిప్ టెస్టులు రాయాలి. వాటిలో వచ్చిన మార్కుల ఆధారంగా సాధన చేయాలి. ఇలా ప్రణాళికతో లెక్కలు సాధన చేస్తే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించవచ్చు.

విద్యార్థి : ప్రభుత్వం నిర్వహిస్తున్న వంద రోజుల ప్రణాళికలో సాధన చేస్తున్న ప్రశ్నలు పరీక్షల్లో వస్తాయా?

✔ పదో తరగతి గణిత పాఠ్య పుస్తకం నుంచే ప్రశ్నలు వస్తాయి. ఏడాది నుంచి నేర్చుకున్న అంశాలను వంద రోజుల ప్రణాళికలో అమలు చేస్తారు. ఇందులో తప్పులు సరిదిద్దుకుని, సందేహాలు నివృత్తి చేసుకుంటే పబ్లిక్ పరీక్షను ఒత్తిడి లేకుండా రాసేందుకు వీలుంటుంది.

విద్యార్థి : త్రికోణమితి, ఉపరితల వైశాల్యాల్లో ఏఏ అంశాలు నేర్చుకోవాలి?

✔ ఫార్ములా వాల్యూస్, ఫార్ములా బేస్డ్ ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

విద్యార్థి : ప్రాబబులిటీ క్రియేటింగ్ ప్రశ్నలకు జవాబు రాయాలా.. వద్దా?

✔ తప్పనిసరి కాదు. ఎక్కువ మార్కులు కావాలనుకునే వారు ప్రాబబులిటీ క్రియేటింగ్ జవాబులు రాస్తే మేలు.

విద్యార్థి : రఫ్ వర్క్ ఎక్కడ చేయాలి. మార్జిన్ వేయాలా.. ఏ పెన్నుతో రాస్తే బాగుంటుంది?

✔ పరీక్ష సమయంలో బ్లూ, బ్లాక్ పెన్ మాత్రమే ఉపయోగించాలి. ప్రతి పేజీకి మార్జిన్ ఉంటే జవాబు పత్రం ఆకర్షణీయంగా కన్పిస్తుంది. రఫ్ వర్క్‌ను బుక్‌లెట్‌లోని చివరి పేజీలో చేసుకోవడం ఉత్తమం.

ప్రోత్సాహం తోడుగా.. కళలో మెరవగా

◆ నాట్యంలో ప్రతిభ కనబరుస్తున్న బాలికలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: సంప్రదాయ నృత్యంపై మక్కువ పెంచుకొని బాలికలు సత్తా చాటుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడుగా కళలో రాణిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో నృత్య పోటీల్లో పాల్గొని భళా అనిపించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని ప్రతిభ సాధించారు. రాష్ట్రస్థాయితో పాటు జాతీయ స్థాయిలో అవార్డులు పొందాలని నిరంతరం సాధన చేస్తున్నారు.

నాట్యమయూరి.. వెంకటలక్ష్మి

ఈ చిత్రంలోని బాలిక పేరు వెంకటలక్ష్మి. ప్రభుత్వ వీవర్స్‌కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు రుక్మిణి, వెంకటేశ్. గౌండ్ల పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తమ కుమార్తెకు ఇష్టమైన రంగంలో ప్రోత్సహించి కూచిపూడి నృత్యం నేర్పిస్తున్నారు. వెంకటలక్ష్మి జతులు, స్వరాలతో... నృత్య ప్రదర్శనలో భళా అనిపిస్తోంది. అంతర్రాష్ట్ర కూచిపూడి పోటీల విభాగంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచింది. 2021లో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ పురస్కారం అందుకుంది. 2022 మార్చిలో హంపిలో జరిగిన నృత్య ప్రదర్శనలో పాల్గొని ప్రతిభా పురస్కారం తీసుకుంది. ఇప్పటి వరకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో 98 ప్రదర్శనలు ఇవ్వగా 15 చోట్ల ప్రతిభా పురస్కారాలు అందుకుంది. 2023లో తిరుపతి, హైదరాబాదు, శ్రీశైలం, రాయచూర్, బెంగుళూరు, నెల్లూరు, మహానంది, బళ్లారి, హంపి, గుంటూరు మొదలైన చోట్ల రాష్ట్ర స్థాయి ప్రదర్శనలు ఇచ్చింది. నాట్యబాల, నాట్య సుధ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించి అబ్బురపరిచింది.

ప్రియ సమ్మోహనం

పట్టణానికి చెందిన ప్రియాంక స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో 8 తరగతి చదువుతోంది. చిన్నప్పటి నుంచి నాట్యంపై మక్కువ పెంచుకుంది. తల్లిదండ్రులు గోరంట్ల, శశికళ కూలీలు. కూచిపూడిలో వందకు పైగానే ప్రదర్శనలు ఇచ్చింది ప్రియాంక. మూడేళ్లగా సాధన చేస్తూ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ద్వారా ప్రదర్శనలిస్తోంది. తన హావభావాలతో నాట్యం చేస్తూ భరతనాట్యంలో రాణిస్తోంది. నృత్యంలో వంద ప్రదర్శనలు పైగానే ఇచ్చారు. మూడేళ్లుగా నెల్లూరు, బెంగళూరు, తిరుపతి, మహానంది, బళ్లారి, మంత్రాలయం, శ్రీశైలం, నంద్యాల, హైదరాబాద్, రాయచూరు, హంపి ప్రాంతాల్లో జరిగిన నృత్య ప్రదర్శన పోటీల్లో పాల్గొని అవార్డులు తీసుకుంది. 2022లో తెలంగాణ రాష్ట్రస్థాయిలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన పోటీల్లో రెండోస్థానంలో నిలిచింది. 8 రాష్ట్రాలకు సంబంధించి జరిగిన పోటీల్లో జాతీయ స్థాయిలో 3వ స్థానం సాధించింది.

కార్యకర్తలకు అండగా తెదేపా

బనగానపల్లి, న్యూస్‌టుడే: కార్యకర్తలకు తెదేపా అండగా ఉంటుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. తెదేపా ప్రాథమిక సభ్యత్వం తీసుకున్న ఇద్దరు కార్యకర్తలు ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల చొప్పున చెక్కులను మంత్రి బీసీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజూరైన సొమ్మును కుటుంబ అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేశారని కొనియాడారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు భరోసా ఉండాలనే ప్రమాద బీమా ప్రవేశపెట్టారని వెల్లడించారు. భవిష్యత్తులో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దేశంలో ఏ పార్టీకి లేని బలమైన కార్యకర్తలు తెదేపాకు ఉన్నారని మంత్రి అన్నారు. పలువురు అంగన్‌వాడీ సిబ్బంది మంత్రి బీసీని కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చారు.

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

భక్తులతో కిక్కిరిసిన అహోబిలం

అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. బ్రహ్మోత్సవాలు కావడంతో దూరప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఎగువ, దిగువ ఆలయాలతో పాటు నల్లమల అటవీ ప్రాంతంలోని పావన, మాలోల, జ్వాలా నృసింహస్వామి ఆలయాలను దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది. భక్తులు బారులు తీరి క్యూలైన్లలో వేచిచూడక తప్పలేదు.

దర్శనానికి బారులు తీరిన భక్తులు

పోలీసుల ఆంక్షలతో ఇబ్బందులు

బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులు పోలీసుల ఆంక్షలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా దిగువ అహోబిలంలో ఆరంభంలోనే చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి పార్కింగ్ స్థలం వద్ద వాహనాలు నిలిపేస్తున్నారు. పార్కింగ్ స్థలం నుంచి ఆలయానికి చాలా దూరం ఉండటంతో కాలినడకన అవస్థలు పడుతూ ఆలయానికి చేరుకుంటున్నారు. పోలీసులు బందోబస్తు పేరుతో చేస్తున్న ఆంక్షలతో ఆలయ నిర్వాహకులకు తలనొప్పిగా మారింది. సమీక్ష సమావేశంలో కూడా ఆలయ సీఏవో రామానుజన్ దీనిపై ప్రస్తావించారు. ఇకనైనా పోలీసు అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

రూ.5 కోట్లకు బంగారు వ్యాపారుల కుచ్చుటోపీ

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరులో వారం రోజుల వ్యవధిలో ఇద్దరు బంగారు వ్యాపారులు ఉడాయించడం కలకలంగా మారింది. వీరిద్దరూ కలిసి రూ.5 కోట్లకుపైగా కుచ్చుటోపి పెట్టినట్లు తెలుస్తోంది. పట్టణంలోని ఓ దేవాలయం ప్రాంతంలో దుకాణం పెట్టుకున్న వ్యాపారి బంగారు ఆభరణాలను ఆర్డర్‌పై చేయిస్తూ ఉంటారు. నగలు కుదువ పెట్టుకొని డబ్బులు ఇస్తుంటాడు. ఇతను ఆభరణాల కోసం తీసుకున్న డబ్బులు, కుదువపెట్టిన బంగారం విలువ రూ.2 కోట్లకు పైగా ఉంటుందని పలువురు చర్చించుకుంటున్నారు. ఇతను కొద్ది రోజులుగా దుకాణానికి రావడం లేదు. చివరికి ఉడాయించినట్లు గుర్తించిన బాధితులు జిల్లా ఎస్పీ, స్థానిక పోలీసులను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరుతున్నారు. బంగారు ఆభరణాల కోసం ఇచ్చిన ఆర్డర్‌కు సంబంధించి పలువురి వద్ద సరైన ఆధారాలు లేవు. దీంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఇతను ఓ నేతను ఆశ్రయించి పక్క రాష్ట్రంలో ఆశ్రయం పొందుతున్నట్లు తెలుస్తోంది.

◆ బంగారు ఆభరణాలు తయారుచేసే మరో వ్యాపారి నమ్మకంగా ఉండేవాడు. ఆభరణాల కోసం బంగారు వ్యాపారులు కొందరు, బాధితులు కలిసి సుమారు రూ.3 కోట్ల వరకు బంగారు ఇచ్చినట్లు సమాచారం. ఆభరణాలు తయారు చేయించి ఇవ్వకుండా పత్తా లేకుండా పోవడంతో.. బాధితులు మోసపోయినట్లు తెలుసుకొని మనోవేదన చెందుతున్నారు. బంగారం పేరిట పెద్దఎత్తున మోసానికి పాల్పడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

బాంబుల వర్షంతో భయపడుతున్నాం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: యునైటెడ్ అరబ్ మెరిట్స్(యూఏఈ) దేశంలోని దుబాయిలో రెండు రోజులుగా ఇరాన్ దేశం బాంబులు కురిపిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో యూఏఈ దేశంలోని ఆయా నగరాల్లో ఉంటున్న మన తెలుగు రాష్ట్రాల వాళ్ల బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పుడు బాంబులు పడతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఆదోని మండలం సాంబగల్లు గ్రామానికి చెందిన సూరిపోగుల ప్రేమసాగర్ యూఏఈ దేశంలోని ఉమ్మి అల్ క్విన్ నగరంలో సివిల్ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నగరం దుబాయి నగరానికి కేవలం 58 కి.మీ.ల దూరంలో ఉంటుంది. ఇక్కడ సుమారు వంద మందికి పైగానే మన తెలుగోళ్లు ఉన్నారని, దుబాయి నగరంపై బాంబుల వర్షం కురుస్తున్న నేపథ్యంలో మేమందరం ఇక్కడ భయాందోళన చెందుతున్నాం. ప్రస్తుతం మాత్రం మేము ఉన్న ప్రాంతంలో బాంబులు పడడం లేదు. ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావద్దని ప్రభుత్వ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తాను క్షేమంగా ఉన్నట్లు ఆదోనిలోని తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు ప్రేమసాగర్ తండ్రి ఛార్లెస్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ప్రేమసాగర్, సివిల్ ఇంజినీరు

రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

విద్యుత్తు దీపాల అలంకరణలో ఆలయ రాజగోపురం

పెరవలి(మద్దికెర), న్యూస్‌టుడే: పెరవలి రంగనాథస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఆలయం ఎదుట సంప్రదాయ పద్ధతిలో పందిరి వేశారు. అనంతరం ధ్వజారోహణంతో ఉత్సవాలకు ఆలయ కార్యనిర్వహణాధికారి వీరయ్య, ప్రధాన అర్చకులు రంగస్వామి, ఆలయ పాలక మండలి సభ్యులు, గ్రామస్థులతో కలిసి అంకురార్పణ చేశారు. స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఈనెల 8న రాతి దూలం పోటీలు నిర్వహించనున్నారు.

రివాల్వర్‌తో విశ్రాంత సీఆర్‌పీఎఫ్ పోలీసు హల్‌చల్

☛ సీటు కోసం ప్రయాణికులకు బెదిరింపులు

గుంతకల్లు, న్యూస్‌టుడే: గుంతకల్లు పరిధిలో రైలు జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న సీఆర్‌పీఎఫ్ విశ్రాంత పోలీసు మనోహర్ సీటు కోసం ప్రయాణికులను తన లైసెన్స్డ్ రివాల్వర్‌తో బెదిరింపులకు దిగాడు. ప్రయాణికులంతా భయాందోళనకు గురయ్యారు. ఆదివారం రాత్రి యలహంక నుంచి కాచిగూడకు వెళ్లే ప్రశాంతినిలయం ఎక్స్‌ప్రెస్‌లో ఈఘటన జరిగింది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం ఆర్.కృష్ణాపురం గ్రామానికి చెందిన మనోహర్ రైలులో ప్రయాణిస్తూ రివాల్వర్ తీసుకొని హల్‌చల్ చేశాడు. తనకు సీటు ఇవ్వాలంటూ ప్రయాణికులను బెదిరించాడు. కొందరు ప్రయాణికులు గుంతకల్లు ఆర్పీఎఫ్‌లకు సమాచారమిచ్చారు. రైలు గుంతకల్లు జంక్షన్‌కు చేరుకోగానే వెంటనే వారు బోగీ వద్దకు చేరుకుని విశ్రాంత పోలీసును అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. తాను రివాల్వర్‌తో ప్రయాణికులను బెదిరించలేదని పోలీసులకు సమాధానమిచ్చారు. ఇక ముందు ఈ విధంగా ప్రవర్తిస్తే గట్టి చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించి పంపారు.

శ్రీ చౌడేశ్వరి దేవత దేవస్థానం, నందవరం, నంద్యాల జిల్లా.

సీల్డు టెండర్-కమ్-బహిరంగ వేలము ప్రకటన

Rc No: A4/2025 Date: 01/03/2026

శ్రీ చౌడేశ్వరి దేవత దేవస్థానం, నందవరం గ్రామం, బనగానపల్లె మండలం, నంద్యాల జిల్లా. 2026 - ఉగాది బ్రహ్మోత్సవముల సందర్భముగా క్రింద తెలిపిన ఐటములకు సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తి, అర్హత గలవారు షరతులకు లోబడి సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం నందు పాల్గొనవచ్చును.

వ. నెం.	ఐటమ్ వివరములు	ధరావత్తు
1	2026 - ఉగాది బ్రహ్మోత్సవముల సందర్భముగా ప్రత్యేక విద్యుత్ అలంకరణ, లైటింగ్ ఏర్పాటు చేయుట.	25,000/-
2	2026 - ఉగాది బ్రహ్మోత్సవముల సందర్భముగా షామియానాలు, పెండల్స్, కుర్చీలు ఇతరములు ఏర్పాటు చేయుట.	25,000/-

➠ సీల్డ్ టెండర్ (ఆఫ్‌లైన్) నందు పాల్గొనదలచినవారు తేది. 05.03.2026 నుండి 06.03.2026 వరకు ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటలలోపు షెడ్యూలు ఖరీదు 1000/- రూపాయలు చెల్లించి సీల్డ్ టెండరు షెడ్యూలు పొందవచ్చును.

➠ పూర్తిగా నింపిన సీల్డు టెండర్ షెడ్యూళ్ళను తేది: 07.03.2026న దేవస్థాన కార్యాలయం నందు ఉంచు టెండరు బాక్సు నందు సాయంత్రం 5.00 గంటలలోపు వేయవలెను.

➠ సీల్డ్ టెండర్ నందు పాల్గొనువారు ప్రతి ఐటమునకు 25,000/- రూపాయలు దరావత్తు దేవస్థానం పేరు మీద డి.డి. తీసి సీల్డ్ కొటేషనుకు జతపరచవలెను. సీల్డ్ టెండరు బాక్సును తేది: 08.03.2026 ఉదయం 10.00 గంటలకు దేవస్థానము ఆవరణములో తీయబడును.

➠ పై ఐటమ్‌నకు సంబంధించిన తేది: 08.03.2026 ఉదయం 10.00 గంటలకు దేవస్థానము ఆవరణములో బహిరంగ వేలం నిర్వహించబడును.

➠ ఇతర వివరములకు దేవస్థానము కార్యాలయం నందు సంప్రదించవచ్చును.

ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ మరియు సభ్యులు ఇట్లు:- కార్యనిర్వహణాధికారి

కేసీ కాల్వలో యువకుడి గల్లంతు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: బండిఆత్మకూరు-శింగవరం గ్రామాల మధ్య ఉన్న కేసీ కాల్వ నీటి ప్రవాహంలో హేమంత్(17) అనే యువకుడు ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడు. పల్లె సృజన కార్యక్రమంలో భాగంగా సుమారు పది మంది జట్టుగా ఆదివారం శింగవరం గ్రామానికి వచ్చారు. ఉదయం 11గంటల సమయంలో కేసీ కాల్వ సమీపంలో పంట పొలాల్లో ఉన్న రైతులతో మాట్లాడి వారికి అవగాహన కల్పించారు. తిరిగి వచ్చే సమయంలో కేసీ కాల్వలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు హేమంత్ అనే యువకులు కాల్వలో పడి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఎస్సై జగన్ మోహన్ సిబ్బందితో కేసీ కాల్వ వద్దకు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో డ్రోన్ ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. కాల్వలో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో యువకుడి ఆచూకీ లభించలేదు. హేమంత్ ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం శివపురం గ్రామానికి చెందిన శివయ్య కుమారుడిగా గుర్తించినట్లు ఎస్సై వివరించారు.

రహదారి ప్రమాదంలో ఒకరి మృతి

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని జాతీయ రహదారి బైపాస్‌పై ఆదివారం వేకువజామున జరిగిన రహదారి ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. నంద్యాల నుంచి కర్ణాటక రాష్ట్రం చింతామణి పట్టణానికి వెళ్తున్న అంబులెన్స్.. ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. పట్టణ ఎస్సై నగీనా తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల పట్టణంలోని చాంద్‌బాడకు చెందిన చాంద్‌బాషా వారం రోజులు క్రితం కిందపడటంతో వెన్నముక దెబ్బ తింది. చికిత్స కోసం చాంద్‌బాషాతోపాటు మరికొందరు చింతామణి పట్టణానికి వెళ్లేందుకు శనివారం రాత్రి అంబులెన్స్‌లో బయలుదేరారు. పట్టణ పరిధిలోని బైపాస్ రహదారి వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని దాటే క్రమంలో ప్రమాదం జరిగింది. చాంద్‌బాషా సోదరుడి వరుసయ్యే ఖాజామొహిద్దీన్(45) తీవ్ర గాయాలతో మృతి చెందారు. డ్రైవరు రాముడు, చాంద్‌బాషా, జాకీర్ గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



ఖాజా మొహిద్దీన్ (పాత చిత్రం)

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని కాల్వలో ఉన్న పుట్టగొడుగుల పరిశ్రమలో పనిచేస్తున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన హేమంత్‌దాస్ కూలీలను తీసుకువచ్చి పని చేయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇతనికి ఒడిశాకే చెందిన సుష్మిత (23)తో పరిచయమైంది. రెండు నెలల కిందట వీరు వివాహం చేసుకున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో తరచూ గొడవలు జరిగేవి. దీంతో జీవితంపై విరక్తి చెందిన సుష్మిత ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో పంకాకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు విషయం తెలుసుకుని 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కడితోటలో ఉరేసుకొని..

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: కడితోట గ్రామానికి చెందిన శ్రీకాంత్(21) ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దతుంబళం ఎస్సై విద్యశ్రీ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శ్రీకాంత్ కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి అండగా ఉంటున్నాడు. కొన్నేళ్లు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించికొనబడును. (రిడైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెని ✆ 73821 14647.

EDUCATION

విద్యార్థులకు వారి కెరీర్ విద్యా ప్రవేశాల గురించి సలహాలు సూచనలు చేయడానికి టీచర్స్, రిటైర్డ్ టీచర్స్, ప్రిన్సిపల్స్‌ను ఖాళీ సమయంలో ఫ్రీలాన్స్ - జాబ్ పద్ధతిన చేయడానికి ఆహ్వానం ట్రైనింగ్ ఇవ్వబడును. కర్నూలు. ✆ 72077 70916, 89777 97830.

MARRIAGE SERVICES

అన్ని కులముల వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. వనజారావు క్విక్ మ్యారేజెస్, S.V. కాంప్లెక్స్, కర్నూలు. సంప్రదించండి: 93938 23550, 08518 249195.

REAL ESTATE

PLOT FOR SALE

ఓర్వకల్ ఇండస్ట్రీయల్ ఏరియాలో ఎయిర్ పోర్ట్ దగ్గరలో తక్కువ ధరలో ప్లాట్లు కలవు&కర్నూలు టౌన్ నందు డ్యూప్లెక్స్‌లు, విల్లాస్‌లు, హౌస్‌లు, ప్లాట్లు కలవు. సంప్ర: 80999 09366.

JOBS

Wanted Male Marketing Staff, Male Admin Incharges and Female Telecallers (Must be Married) Qual: Any Degree, Age Limit: 25 to 45 years, Salary: 10000/- to 20000/- .Working Location: Master Minds College, Kurnool, Contact: 92487 33342.

కర్నూలు నంద్యాల చెక్ పోస్ట్ లో మల్లికార్జున ఫర్నిచర్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ. సంప్ర: Cell: 98493 50328.

కర్నూలు, నంద్యాల చెక్‌పోస్ట్ నందుగల వినాయక సోలార్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్స్ కావలెను. జీతం 15,000+ Incentive ఇవ్వబడును. సంప్ర. 95025 92654.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాధవస్వామి

ధర్నాను జయప్రదం చేయండి

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 3వ తేదీన చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అన్నారు. పట్టణంలోని స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదార్ల డిమాండ్ల సాధనకై ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కార్యదర్శి పుల్లయ్య, గోపాల్‌రావు, జయరాం, రామాంజనేయులు ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు ఆలయం మూసివేత 3న

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం నేపథ్యంలో ఈనెల 3వ తేదీన మూసివేస్తున్నట్లు ఈవో రామకృష్ణ, అర్చకులు నారాయణస్వామి, సురేష్‌శర్మ తెలిపారు. మంగళవారం ఉదయం ఏకాంత సేవల అనంతరం మూసివేసి బుధవారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం పునఃదర్శనం కల్పించనున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ?: నంద్యాల పట్టణం వైఎస్సార్ నగర్‌లో దోమల మందు పిచికారి చేయడంలేదు. **-విజయకుమార్, స్థానికుడు** ?: విజయపురి కాలనీలో కాల్వలు శుభ్రం చేయకపోవడంతో మురుగు కదలడం లేదు. **- లక్ష్మి, స్థానికురాలు** ✓: సిబ్బందితో కాల్వలను శుభ్రం చేయిస్తాం. కాలనీల్లో ఫాగింగ్ చేయిస్తాం. కాల్వల్లో దోమల మందు పిచికారి చేయిస్తాం. **- లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

ఆత్మకూరు పట్టణం: ?: లక్ష్మినగర్‌లో మలుపు వద్ద ఉన్న చేతిపంపు పని చేయటం లేదు. **-రాజు, స్థానికుడు.** ✓: చేతి పంపునకు మరమ్మతులు చేయిస్తాం. **-షాహిర్‌బాషా, పురపాలక ఏఈ.** ?: ఇస్లాంపేటలో మురుగు కాల్వలోని పూడిక తొలగించి కాల్వపై వేశారు. ఈ వ్యర్థాలన్నీ మరలా కాల్వలోకి చేరుతున్నాయి. **- ఖాజా, స్థానికుడు.** ✓: కాల్వలో పూడిక, చెత్తకుప్పలు తొలగిస్తాం. **- జీవన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టరు.**

నంద్యాల పురపాలకం: ?: పట్టణంలోని జ్ఞానాపురం కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- చంటి స్థానికుడు.** ?: పట్టణంలోని చాబోలు రహదారిలో కాల్వలు శుభ్రం చేయడం లేదు. **- నాగులు, స్థానికుడు.** ?: పట్టణంలోని క్రాంతినగర్, రైతునగర్‌లో కుక్కల బెడద అధికమైంది. **- సుంకన్న, రాజేష్, స్థానికుడు.** ✓: కాల్వలు శుభ్రం చేయించి, స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయిస్తాం. త్వరలోనే కుక్కలను పట్టించి సమస్యను పరిష్కరిస్తాం.
- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించండి

మంత్రి ఫరూక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను జిల్లా కాప్స్ రాక్స్, బలిజ సంఘం నాయకులు కోరారు. ఆదివారం స్థానిక మంత్రి కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చెన్నంశెట్టి శ్రీనివాసులు, కామిని మల్లిఖార్జున, వర్ధంశెట్టి రాజారాం, గుద్దేటి వెంకటేశ్వర్లు, తోట భూపాల్, బద్రి సుబ్బరాయుడు, సింహాద్రి సురేశ్, కొప్పుల మురళి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు. విగ్రహ ఏర్పాటుకు తగిన సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పల్లె భీమ్ శంకర్, పత్తి మహేశ్, పత్తి వెంకటేశ్వర్లు, మిడత వెంకటేశ్వర్లు, దేవసం గిరిబాబు, కొమ్మ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది తక్కువ... ఇబ్బంది ఎక్కువ

★ ఎక్స్‌రే విభాగంలో ఇద్దరే

ఎక్స్‌రే కోసం వేచి ఉన్న రోగులు

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల చుట్టూ పలు జాతీయ రహదారులు ఉండటంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వ్యక్తులకు అత్యవసర వైద్యం అందించాల్సి ఉంటుంది. శరీరంలోని ఎముకలు, కాలు, చేయి విరిగిన వారికి ఎక్స్‌రే తీయాల్సి ఉంది. ఇందుకోసం ఆసుపత్రిలో సిబ్బంది ఇద్దరే ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. వాళ్ల సెలవుపై వెళ్తే రోగులు ఎక్స్‌రే కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

రోగుల సంఖ్య పెరిగి..

నంద్యాల సర్వజన ఆసుపత్రిలో రోజుకు ఓపీ 1300 వరకు ఉంటుంది. అందులో ఎక్స్‌రేకు 130 నుంచి 150 మంది రోగులకు తీస్తున్నారు. ఎక్స్‌రే తీయడానికి ఒకరు రెగ్యులర్, మరొకరు ఒప్పంద ఉద్యోగి మాత్రమే ఉన్నారు. వారితో పాటు మరో ఇద్దరు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఉన్నారు. రోజురోజుకు రోగుల సంఖ్య పెరగడంతో అవస్థలు తప్పడం లేదు. పగలుతో పాటు రాత్రిళ్లు కూడా వారు విధులు నిర్వహించాల్సి వస్తోంది. వారు సెలవుపై వెళ్తే రోగులకు తప్పని తిప్పలు.

బయట రూ.300లు..

నంద్యాల జీజీహెచ్ ఆసుపత్రికి రోజు దాదాపు 10 రోడ్డు ప్రమాదాల బాధితులు వస్తుంటారు. బాధితులకు కాలు విరగడం, చేయి, ఇతర భాగాలకు సంబంధించి ఎక్స్‌రే కోసం వైద్యులు రాస్తున్నారు. ఇతర సమస్యలతో రోజు 120 మందికి పైగా రోగులకు ఎక్స్‌రే తీయాల్సి వస్తుంది. ఎక్స్‌రే విభాగం సిబ్బంది తక్కువగా ఉండటంతో రోగులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తుంది. అత్యవసర రోగులకు ముందుగా ఎక్స్‌రే తీయాల్సి రావడంతో కొందరు రోగులు గంటల కొద్దీ వేచి ఉండక తప్పని పరిస్థితి నెలకొంది. మరికొందరికి మరుసటి రోజు తీయాల్సి వస్తోంది. ఇలా వైద్యం కోసం రెండు మూడు రోజులు ఆసుపత్రి చుట్టు తిరగాల్సి వస్తుందని రోగులు, వారి బంధువులు వాపోతున్నారు. నిరీక్షించలేని వారు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తే ఎక్స్‌రేకు రూ.300 వరకు ఖర్చు అవుతుంది. దీంతో పేద రోగులు ఎక్స్‌రే కోసం ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

- హరినాథ్ రెడ్డి, రేడియాలజీ, హెచ్‌వోడీ, జీజీహెచ్, నంద్యాల

ఎక్స్‌రేకు సంబంధించిన సిబ్బంది తక్కువగా ఉన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పోస్టులు భర్తీ చేయనున్నారు. రోడ్డు ప్రమాద బాధితులతో పాటు ఎక్కువ మంది ఎక్స్‌రేకు వస్తున్నారు. కాని బాధితులకు సమస్య లేకుండా చూస్తున్నాం.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకుపోవాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. నిరంతరం ప్రజల చెంత ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఆదివారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంపై కీలక సూచనలు చేశారు.

ఉత్తమ విద్య అందించాలి

బాబానగర్(గోస్పాడు), న్యూస్‌టుడే: విద్యార్థులకు ఉత్తమ విద్య అందిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గోస్పాడు మండలం బాబానగర్‌లో నిర్మించిన గురురాజ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో గురురాఘవేంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి, శ్రీరామకృష్ణా విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మౌలాలిరెడ్డి, పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయ నిధి

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. జూపాడుబంగ్లా, పాములపాడు మండలాల్లోని 11 మంది లబ్ధిదారులకు రూ. 8,66,845 విలువ చేసే చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రెండు మండలాల్లోని మండ్లెమ్, తంగడంచ, లింగాపురం, బానుముక్కుల, ఎర్రగూడూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కేసీ కాల్వ ఛైర్మన్ పరమేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రసాదరెడ్డి, సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, జూపాడుబంగ్లా మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

150 మందికి రంజాన్ కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న ఫిరోజ్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల జమీయతే ఉలేమా హింద్, జిల్లా ఇమాముల సంఘం ఆధ్వర్యంలో రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక కుబ్రా మసీదులో మౌలానా అంజద్ బాషా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ. ఫిరోజ్ 150 మంది పేద కుటుంబాలకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జమీయతే ఉలేమా హింద్ సంస్థ సామాజిక సేవలో ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో అబూబకర్ సిద్దిఖీ సాహెబ్, మౌలానా మెహబూబ్ బాషా సాహెబ్, మౌల్వి అబ్దుల్ రావుఫ్ సాహెబ్, హఫీజ్ అబ్దుల్ సలాం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఘనంగా రుద్ర ఉపాసన

రుద్ర ఉపాసనలో పాల్గొన్న భక్తులు

శ్రీశైలం, సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో శివాజీ గోపురం పక్కన ఆదివారం రుద్ర ఉపాసన కార్యక్రమం ఘనంగా జరిగింది. శ్రీసత్యసాయి బాబా 100 సంవత్సరాల జయంతిని పురస్కరించుకొని సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి సాయిబాబా భక్తులు సుమారు 5 వేల మందికి పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులందరికీ చంద్రవతి కల్యాణ మండపంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పాహారం, భోజన వసతిని ఏర్పాటు చేశారు.

వైభవంగా రథోత్సవం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొణిదెల గ్రామంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి రథోత్సవం ఆదివారం ఆలయ ఈవో కార్తీక్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గిత్తాజయసూర్య మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. తిరుణాళ్ల సందర్భంగా బండలాగుడు పోటీలు అందరిని అలరించాయి.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గోడ పడితే.. గోస

నంద్యాల పట్టణంలోని నూనెపల్లెలో నుంచి పట్టణంలోకి వచ్చేవారు రైల్వే గోడ పక్క నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. గోడ కింద రాళ్లు పడిపోవడంతో పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో గోడ ఎప్పుడు పడిపోతుందోనని భయాందోళన చెందుతున్నారు. తక్షణమే తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పాదచారులు కోరుకుంటున్నారు. –న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

కప్పు లేక పొంచి ఉన్న ముప్పు

నంద్యాల పట్టణం బాలాజీ కాంప్లెక్స్‌లోని రహదారిలో మురుగు కాల్వపై కప్పు తొలగి ఉంది. దీంతో వాహనదారులు రాత్రివేళ ఆ గుంతలో పడి ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రమాదం నుంచి రక్షించేందుకు స్థానికులు అడ్డంగా రాయిని ఉంచారు. అయినప్పటికీ ఆ కాల్వ పైకప్పు వేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల పాతపట్టణం

పెచ్చులూడి.. ఇబ్బందిగా మారి..

నంద్యాల పట్టణంలోని నూనెపల్లెలో ఉన్న వంతెనకు సిమెంటు ఊడిపోయి.. ఇనుప కడ్డీలు బయటపడ్డాయి. అటు ఇటు తిరిగే వారిపైన తరచూ పెచ్చులూడి తలపైన పడి గాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుకుంటున్నారు.–న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

నియంత్రిక ప్రమాదకరంగా...

ఆత్మకూరు పట్టణం అప్పలరావువీధిలో నియంత్రిక చుట్టూ రక్షణ కంచె లేకపోవటంతో ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో నిత్యం పదుల సంఖ్యలో వాహనదారులు, పాదచారులు తిరుగుతున్నారు. ఈ మార్గంలో వెళ్లాలంటే నియంత్రికను ఆనుకొనే వెళ్లాలి. రహదారిపై వెళ్లే సమయంలో ఎదురుగా ఏదైనా వాహనం వస్తే నియంత్రిక కిందకు వెళ్తున్నారు. ప్రజలకు ప్రమాదం జరగకుండా నియంత్రిక చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

ఉపాధ్యాయ వ్యతిరేక చర్యలు మానుకోవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల హాజరు వ్యవస్థపై అమలు చేస్తున్న కఠిన, కేంద్రీకృత విధానాలు విద్యా వాతావరణాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ఎస్. విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా పది నిమిషాల గ్రేస్ పీరియడ్ కూడా లేకుండా చేయడం అన్యాయమన్నారు. ఒక నిమిషం ఆలస్యాన్ని తీవ్రంగా పరిగణించడం, అవుట్ టైమ్ నమోదుపై శిక్షణాత్మక హెచ్చరికలు జారీ చేయడం లాంటి చర్యలు ఉపాధ్యాయులను అవమానించేలా ఉన్నాయన్నారు.

వెండి నాగ పడిగెను అందిస్తున్న భక్తులు

వెండి నాగ పడిగె వితరణ

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు వెండి నాగ పడిగెను వితరణ చేసినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. ఆదివారం కొత్తూరు ఆలయంలో ఆలయ సిబ్బందికి వెండి నాగపడిగెను అందజేశారు. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన ఉప్పరి సుబ్బరాయుడు, కుటుంబ సభ్యులతో కలిసి సుమారు రూ. 3.50 లక్షల విలువైన 1.05 కిలో వెండి నాగ పడిగెను, రూ. 70 వేల విలువైన నిత్యావసర సరకులు అందజేశారన్నారు.

పోటీల్లో పాణ్యం విద్యార్థి ప్రతిభ

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: నంద్యాలలో బ్రాహ్మణ దేవ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ సెర్చ్ పరీక్షలో పాణ్యం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ దినేష్‌బాబు తెలిపారు. ఆదివారం జిల్లాలోని ప్రైవేటు, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో మహేంద్ర మూడో స్థానంలో నిలిచి బహుమతి అందుకున్నట్లు తెలిపారు. లాస్య, ప్రవళిక పాల్గొన్నట్లు వివరించారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు అందజేత

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభాన్వేషణ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. ఆదివారం గాయత్రి మాత ఆలయ ప్రాంగణంలో సమాఖ్య గౌరవాధ్యక్షులు రవీంద్రనాథ్, అధ్యక్ష, కార్యదర్శులు కేశవమూర్తి, సుధీంద్రాచార్యులు, సమాఖ్య నాయకుల హెగ్డే సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ముబీనా, రోహన్ శ్రీనివాస్, మహేంద్రలు బహుమతులు సాధించగా, ప్రైవేట్ పాఠశాలల విభాగంలో సాయి శ్రీనిధి, ధరణి రోహిత్, చర్విత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. సాల్మన్, సలీమా, సహస్ర, సుమయ, రిహాన్‌లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రవీంద్రనాథరెడ్డి, సుందరరావు, శేష ఫణి, వరాహమయ్య, వేణుమాధవ్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్య శాస్త్రి, హరికృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

కొప్పుల ప్రసాద్‌కు కళాతరంగ పురస్కారం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలకు చెందిన రచయిత కొప్పుల ప్రసాద్ కళాతరంగ విశిష్ట పురస్కారం అందుకున్నారు. కర్నూలులో ఆదివారం నిర్వహించిన హార్మోనిస్ట్ రంగముని సంస్మరణ సభలో పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో మిడుతూరు ఎంపీడీవో దశరథరామయ్య, డా.హరికిషన్ తదితరులు పాల్గొన్నారు. పురస్కార గ్రహీతను అంతర్జాతీయ శాస్త్రవేత్త రవీంద్రనాథ్, డా.ఉదయ్‌శంకర్, డా.సహదేవుడు, అన్నెం శ్రీనివాసరెడ్డి, నరేంద్ర, నీలం వెంకటేశ్వర్లు, రఫీ తదితర సాహితీవేత్తలు, పండితులు అభినందించారు.

నేడు మహానందిలో 16 రోజుల పండుగ

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రంలో నేడు మహానందిలో 16 రోజుల పండుగ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు దేవస్థానం పండితులు రవిశంకరఅవధాని, నాగేశ్వరశర్మలు తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే 16వ రోజున ఈ వేడుకను చేయడం ఆనవాయితీగా వస్తోంది. రథాది దేవతలకు నైవేద్యాలు సమర్పించి వీడ్కోలు పలుకుతారని వివరించారు.

శ్రద్ధలేని పూజలు నిష్ఫలమే

పీఠాధిపతిని సత్కరించిన ఆలయ పర్యవేక్షకులు నీలకంఠేశ్వరరాజు

మహానంది, న్యూస్‌టుడే: శ్రద్ధ లేకుండా ఎన్ని పూజలు, దానాలు, యజ్ఞాలు, తపస్సు, వ్రతాలు చేసినా అన్నీ నిష్ఫలమేనని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వారాహీ పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతీస్వామీజీ పేర్కొన్నారు. మహానందిలో ఆదివారం దేవస్థానం కళావేదికపై 'శ్రీశివలీలా విలాసం'పై ప్రవచనం చేశారు. మహానంది దేవస్థాన పర్యవేక్షకులు నీలకంఠేశ్వర రాజు పీఠాధిపతిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మంచి పౌరులుగా మెలగాలి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: రౌడీ షీటర్లు నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలని ఒకటో పట్టణ సీఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

ఆత్మకూరు, వెలుగోడు, న్యూస్‌టుడే: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ రామాంజి నాయక్ అన్నారు. ఆత్మకూరు, వెలుగోడులోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో ఆదివారం విద్యార్థినులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా కష్టపడి చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మంచి మార్గంలో పయనించాలన్నారు. సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్సై సురేష్, ప్రిన్సిపల్ శ్యామలాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

మృతదేహం రమేశ్ నాయక్‌దిగా గుర్తింపు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: అయ్యలూరు గ్రామ శివారులో చెరువులో లభ్యమైన మృతదేహం కర్నూలు జిల్లా పత్తికొండ మండలం జేఎం తండాకు చెందిన రమేశ్ నాయక్‌దిగా(35) గుర్తించినట్లు గ్రామీణ సీఐ ఈశ్వరయ్య ఆదివారం తెలిపారు. రమేశ్ కొంత కాలంగా శ్రీశైలంలో ఓ ప్రైవేటు హోటల్‌లో పని చేస్తున్నాడు. ఆయన భార్య రమాదేవితో గొడవపడి విడిపోయారు. రమాదేవి తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. మూడు రోజుల క్రితం శ్రీశైలం నుంచి వచ్చాడని అప్పటి నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. శనివారం చెరువులో శవమై కనిపించాడని తెలిపారు.

విత్తనం పసుపు దగ్ధం

తిమ్మాపురం, (మహానంది), న్యూస్‌టుడే: మహానంది మండల కేంద్రం ఎం.తిమ్మాపురం గ్రామ శివారులోని పోలేరమ్మ ఆలయం పరిసరాల్లో నిల్వ ఉంచిన 6 క్వింటాళ్ల విత్తనం పసుపు దగ్ధమైంది. గ్రామానికి చెందిన బోడెద్దుల ఆంజనేయులు రాబోవు పసుపు పంట సాగుకోసం విత్తనాన్ని దాచుకున్నారు. అయితే అది ఆదివారం ఉదయం విత్తనం పసుపు కాలిపోయింది.

కత్తి దూస్తే పతకమే

★ జాతీయ స్థాయిలో రాణిస్తున్న హేమంత్‌రాజ్

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాడు హేమంత్‌రాజ్. కత్తి సాములో కఠోరంగా శ్రమిస్తూ విజయాల బాటలో కొనసాగుతున్నాడు. ఫెన్సింగ్ క్రీడలో రాణించడం కోసం శిక్షణను తీసుకుంటున్నాడు. పలు పోటీల్లో పాల్గొంటూ ఇప్పటి వరకు జాతీయస్థాయిలో పతకాలు అందుకున్నాడు.

★ నాగరాజు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు హేమంత్‌రాజ్ పట్టణంలోని న్యూక్లియస్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. చదువుతో పాటు క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఇటు క్రీడలు, అటు చదువులో ప్రతిభ చూపుతున్నాడు. ఖాళీ సమయాల్లో ఫెన్సింగ్‌లో శిక్షణ తీసుకుని మెలకువలతో ఆటలో రాణిస్తున్నాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరుస్తూ ప్రశంసలు అందుకుంటున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు.

సాధించిన విజయాలు...

- 2025 కర్నూలులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.
- 2025 గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వెండి పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.
- గత నెల మణిపూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రశంసా పత్రం అందుకున్నాడు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచిన ఘనత చంద్రబాబుదే

ఆత్మకూరు, న్యూస్‌టుడే: చరిత్రలోనే తొలిసారిగా అంగన్‌వాడీల వేతనాలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే దక్కుతుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దివాలా తీసి వెళ్లిందన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రవేశ పరీక్షలు

పగిడ్యాల: పగిడ్యాల మండలం లక్ష్మాపురం బాలికల గురుకుల విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఐదో తరగతి, ఇంటర్, ఐఐటీ, నీట్ గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపల్ వెంకట రమణమ్మ తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 228 విద్యార్థులకు గాను 198 మంది హాజరైనట్లు, జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు 227 విద్యార్థులకు గాను 210 మంది హాజరైనట్లు, ఇంటర్ ఐఐటీ, నీట్ పరీక్షలకు 169 మంది విద్యార్థులకు గాను 152 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారులు, ప్రిన్సిపల్ రమణమ్మ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పల్లెల్లో భూసార పరీక్షలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పల్లెల్లో భూసార పరీక్షల కోసం నమూనాలు సేకరిస్తున్నారు. నందికొట్కూరు మండలం అల్లూరు, శాతనకోట, మల్యాల గ్రామాల పరిధిలోని పొలాల నుంచి మట్టి నమూనాలు సేకరించారు. నమూనాల పరీక్షల అనంతరం వచ్చే ఫలితాలకు అనుగుణంగా అన్నదాతలు సాగు చేసుకుంటారన్నారు. ఫలితాలు ఈ నెలలో వస్తే బాగుంటుందని అన్నదాతలు కోరుకుంటున్నారు.

భూసార పరీక్ష కోసం సేకరించిన మట్టి నమూనాలతో వ్యవసాయశాఖ సిబ్బంది

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పాములపాడు మండలంలోని భానుముక్కల గ్రామంలో నిర్మించనున్న ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. పాములపాడులో పీఎంఎఫ్ఎంఈ పథకంతో ఏర్పాటు చేసిన అరకు కాఫీ సెంటర్‌ను ప్రారంభించారు. పొదుపు సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

లింగాపురం(బండిఆత్మకూరు), న్యూస్‌టుడే: మండలంలోని లింగాపురం గ్రామంలో ఎస్సై జగన్ మోహన్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లల్లో ముమ్మరంగా సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఓ ఇంట్లో మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని గొలుసు దుకాణం నిర్వహిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. తర్వాత సరైన ధ్రువపత్రాలు లేని ఆరు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టాలు, కేసులు, శిక్షలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

బనగానపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు చూసి పార్టీలోకి వస్తున్నారని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొలిమిగుండ్ల మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన పలువురు వైకాపా కార్యకర్తలు, నాయకులు స్వచ్ఛందంగా మంత్రి బీసీ సమక్షంలో తెదేపాలో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని అన్నారు. అన్ని వర్గాల వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు సముచిత స్థానం ఇచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు తెదేపా న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ముందుకు పోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు వెంకటరెడ్డి, వెంగళరెడ్డి, రామాంజనేయరెడ్డి, రఘునాథరెడ్డి, ఓబులేసు, విజయభాస్కర్, రంగయ్య, శేఖర్ పాల్గొన్నారు.

పార్టీలో చేరిన కార్యకర్తలతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

చాగలమర్రి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలియజేశారు. పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభ కార్యక్రమంలో ఆదివారం ఆమె పాల్గొన్నారు. దస్తగిరిస్వామి కాలనీ, గుంతపాలెం, ఎస్సీ, భూమానగర్ కాలనీల్లో పూర్తైన సీసీ రహదారులను ప్రారంభించారు. అనంతరం స్వర్ణ రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాగలమర్రి మండలంలో రూ.2.5 కోట్లతో రహదారులు, మురుగు కాల్వ పనులు చేపట్టామన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్‌బాషా, నంద్యాల పార్లమెంట్ బీసీసెల్ స్పోక్స్ పర్సన్ సల్లా నాగరాజు, తెదేపా నాయకులు కొలిమి ఉసేన్‌వలి, మౌలాలి, కొలిమి షరీఫ్, ఆవుల ప్రతాప్, మురళి, మాబులాల్ పాల్గొన్నారు.

దస్తగిరిస్వామి కాలనీలో శిలా ఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

నీరుగారిన పథకం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ పురపాలికలో జనాభా 50 వేలు దాటింది. ఇంత పెద్ద జనాభాకు నీరందించేందుకు పాత బస్టాండులో 41 ఏళ్ల క్రితం నిర్మించిన రెండు ట్యాంకులే దిక్కయ్యాయి.

చింతకుంటలో అసంపూర్తిగా ఉన్న నీటి ట్యాంకు

మాత్రే కిందట ఐవి శిథిలావస్థకు చేరుకున్నాయి. కూలిపోయే ప్రమాదం ఉన్న భయంతో నీళ్లు నింపడం ఆపేశారు. అయితే ప్రత్యామ్నాయం లేకపోవడంతో గత్యంతరం లేక మళ్లీ ట్యాంకులనే ఉపయోగించుకుంటూ పురపాలిక జనాభాలో 40 శాతం ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం

☛ ఆళ్లగడ్డ పురపాలికలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఏఐఐబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు) ద్వారా రూ.111.48 కోట్లను 2018లో కేటాయించారు. గండ్లేరు జలాశయం నుంచి నీటిని గొట్టాల ద్వారా తరలించి పుర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంది. వైకాపా హయాంలో కేవలం 10 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. మరోవైపు ట్యాంకుల నిర్మాణాలు ఆగిపోయాయి. బిల్లులు సక్రమంగా రాకపోవడంతో గుత్తేదారుడు పనులను మధ్యలోనే ఆపేశారు.

☛ ఆళ్లగడ్డ పురపాలికకు ప్రత్యేక నీటి సరఫరా వ్యవస్థ కోసం ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. కేవలం రెండు పాత ట్యాంకులే అందుబాటులో ఉండటంతో మిగతా 60 శాతం జనాభాకు నేరుగా బోర్ల ద్వారా ఎలాంటి శుద్ధీకరణ లేకుండానే నీటిని సరఫరా చేస్తున్నారు. వేసవి కాలంలో బోర్లు ఎండిపోతే పరిస్థితి తమ పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యూఐడీఎఫ్ నిధులతో..

☛ ఆళ్లగడ్డ తాగునీటి పథకాన్ని ఏఐఐబీ నిధులతో కాకుండా యూఐడీఎఫ్(అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్) నిధులతో ఈ పథకం పనులు పూర్తిచేయాలని ఇంజినీర్ ఇన్ చీఫ్, పబ్లిక్ హెల్త్ ఆదేశించారు. దీంతో పురపాలక అధికారులు స్పందించి రూ.133.05 కోట్ల నిధులతో పథకానికి సంబంధించి డీపీఆర్ సిద్ధం చేశారు.

☛ యూఐడీఎఫ్ కింద పనులు చేపట్టాలని ఆదేశాలు వెలువడి ఏడాదవుతున్నా పనులు ముందుకు సాగకపోవడం ఆందోళనకరంగా మారింది. పనులు త్వరగా పూర్తి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇప్పటికీ ఆళ్లగడ్డ ప్రజల తాగునీటి అవసరాలను ఆర్‌డబ్ల్యూఎస్ కింద ఏర్పాటు చేసిన సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ నుంచే పూర్తవుతున్నాయి.

ఆళ్లగడ్డ
జనాభా: 50 వేలకు పైగా
వార్డులు: 27
గృహాలు: 14,100
కుళాయిలు: 9,200
ప్రస్తుతం వినియోగిస్తున్న నీరు: 20 లక్షల లీటర్లు
నిబంధనల ప్రకారం అందాల్సిన నీరు: 33 లక్షల లీటర్లు

సమస్యలపై అర్జీల స్వీకరణ

శిరివెళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి సోమవారం అర్జీలను స్వీకరించనున్నట్లు తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు సమస్యలపై అర్జీలు ఇవ్వాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ వెంబడిస్తున్నాయి. -వెంకటయ్య, స్థానికుడు. ✔: పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. -ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: శిరివెళ్ల గ్రామం బీసీ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి. -రమేష్ ✔: పారిశుద్ధ్య పనులు చేపడతాం. - శ్రీనివాసశర్మ, డిప్యూటీ ఎంపీడీవో.

సంజామల, న్యూస్‌టుడే: ?: రెడ్డిపల్లి గ్రామంలోని పొలాల దారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. -శ్రీనివాసులు, రెడ్డిపల్లి. ✔: ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతాం. - సాల్మన్, ఎంపీడీవో

ఆర్.కృష్ణాపురం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ?: ఆర్.కృష్ణాపురం గ్రామంలోని బీసీ కాలనీలో రోడ్డుపై మురుగు పారుతోంది. - షరీఫ్, ఆర్.కృష్ణాపురం. ✔: దోమల నివారణ మందులు పిచికారీ చేయిస్తాం. - నూర్జహాన్, ఎంపీడీవో.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: ?: పోచా ప్రభాకర్‌రెడ్డినగర్‌లోని వీధుల్లో పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేయడం లేదు. -రామారావు, కాలనీవాసి. ✔: సిబ్బందితో సీసీ రహదారులు శుభ్రం చేయిస్తాం. -రంగన్న, శానిటరీ ఇన్‌ఛార్జి అధికారి.

?: ఆటోనగర్‌లో సీసీ రహదారికి ఇరువైపులా కాల్వలను నిర్మించకుండా వదిలేశారు. -ప్రభాకర్, ఆటోనగర్. ✔: ప్రతిపాదనలు రూపొందించి నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేస్తాం. - సురేష్, మున్సిపల్ ఏఈ.

బాధితుడికి సేవా సంస్థ ఆర్థిక సాయం

డోన్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమానుల సంఘం నాయకులు హుసేన్‌పీరా ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలిసిన చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు రూ.25 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. హుసేన్‌పీరా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్‌రెడ్డి, సుంకన్న, చంద్రశేఖర్, రామానాయుడు, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య.. గ్రామస్థుల అవస్థ

ఆళ్లగడ్డ మండలంలోని నల్లగట్ల గ్రామంలో బీసీ కాలనీలో నీటి సమస్యతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి నీరు సరఫరా చేసే పైపు మరమ్మతులకు గురి కావడంతో కుళాయిలకు నీరు సరఫరా నిలిచిపోయింది. దీంతో మినీ ట్యాంకుల నీటిని ఆశ్రయిస్తున్నారు.

అర్జునాపురం రస్తాలోని మినీ ట్యాంకు పైపు సైతం లీకేజీ ఏర్పడటంతో నీరు అరకొరగా సరఫరా అవుతున్నాయి. దీంతో కాలనీ వాసులు సుదూరం వెళ్లి నీటిని బిందెల్లో తరలించుకుంటున్నారు. - న్యూస్‌టుడే, నల్లగట్ల (ఆళ్లగడ్డ గ్రామీణం)

దారి ఇరుకు.. ప్రయాణించాలంటే బెరుకు

ఆళ్లగడ్డ ప్రజలకు పొరుగునే ఉన్న వైఎస్సార్ జిల్లా కడప జిల్లా జమ్మలమడుగు పట్టణ ప్రజలతో విడదీయరాని బంధం ఉంది. అయితే ఆళ్లగడ్డ-జమ్మలమడుగు రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ దారిలోనే నిత్యం పెద్ద సంఖ్యలో ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారి వైఎస్సార్ కడప జిల్లా పరిధిలో డబుల్ లైన్‌గా మారినా.. నంద్యాల జిల్లా పరిధిలోని 8 కి.మీ. మేర సింగిల్ లైన్‌గానే ఉండటం గమనార్హం. చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

కుంగిన కల్వర్టు.. రాకపోకలకు ఇక్కట్లు

కోవెలకుంట్లలోని స్వామినగర్ కాలనీలో ఎస్సార్బీసీ ఎదురుగా ఉన్న వీధికి వెళ్లే దారి మధ్యలో కల్వర్టు కుంగి పెద్ద రంధ్రం ఏర్పడింది. సుమారు 40ఏళ్ల కిందట నిర్మించిన కల్వర్టు కావడంతో శిథిలావస్థకు చేరి కుంగిపోయింది. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా రంధ్రంలో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.-న్యూస్‌టుడే, కోవెలకుంట్ల

అదుపు తప్పితే.. తప్పదు ప్రమాదం

రేషన్ బియ్యం గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు తరలించే క్రమంలో కూలీలు ప్రమాదకరంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ట్రాక్టర్లలో వందల బస్తాలపై కూర్చొని ప్రయాణిస్తున్నారు. వాహనాలు అదుపుతప్పినా, బస్తాలు జారినా కింద పడి ప్రమాదాలకు గురికాక తప్పదు. దొర్నిపాడు మండలంలోని భాగ్యనగర్ గ్రామ శివారులో ఆళ్లగడ్డ-దొర్నిపాడు ప్రధాన రహదారిలో ట్రాక్టర్‌పై కూలీలు ప్రయాణించారు. ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉంది.-న్యూస్‌టుడే, దొర్నిపాడు

అసంపూర్తి పనులు.. తీరని వెతలు

సంజామల మండలంలోని నొస్సం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వం రూ.68 లక్షల నిధులు మంజూరు చేసింది. నిధుల్లేక ప్రహరీతో పాటు శౌచాలయం నిర్మాణం కూడా మధ్యలో ఆగిపోయింది. దీంతో పాఠశాలలోకి యథేచ్ఛగా పశువులు సంచరిస్తున్నాయి. మైదానంలో ఆటలు ఆడుకునేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇదే పాఠశాలలో పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సంజామల

సంక్షిప్త సమాచారం

డోన్, న్యూస్‌టుడే: పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ప్రార్థన సమయం నిర్వాహకులు జాన ప్రభాకర్ అన్నారు. దాత చిదంబరం ఆర్థిక సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులు, మహిళలకు ఆదివారం పౌష్టికాహారం అందజేశారు.

డోన్, న్యూస్‌టుడే: చింతలపేటకు చెందిన లారీడ్రైవర్ సురేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు భాస్కర్, డోన్ నాయకులు శివరాంలు పరామర్శించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన విశ్రాంత ఎంఈవో ఉసేనయ్య(81) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. పలువురు ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు నివాళి అర్పించారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు భారతీదేవి పదవీ విరమణ పొందారు. గండ్లూరి దత్తాత్రేయ శర్మ, నరసింహులు, షణ్మూర్తి తదితరులు భారతీదేవి దంపతులను సన్మానించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: చాగలమర్రి సమీపంలోని టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో రెండు తరగతి గదులకు అవసరమైన సామగ్రిని అందించారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టు హెడ్ మదన్‌మోహన్, ఎంటీడీ వ్యవస్థాపకుడు దీపక్‌విశ్వకర్మ పాల్గొన్నారు.

అవుకు, న్యూస్‌టుడే: ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం చదవాలని పదో తరగతి విద్యార్థులకు స్థానిక ఎస్సై అశోక్ సూచించారు. స్థానిక కేజీబీవీలో ఆదివారం విద్యార్థులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

అవుకు, న్యూస్‌టుడే: వీబీ జీ రామ్‌జీ పథకంపై అవగాహన కల్పించేందుకు సోమవారం నుంచి గ్రామాల వారీగా సభలు నిర్వహించనున్నట్లు ఏపీఎం ప్రకాష్ తెలిపారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: యశ్వంత్‌పుర్- భువనేశ్వర్‌కు ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సుక్ర దిగ్గి(36) అనే వ్యక్తి డోన్ సమీపంలో శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్లు రైల్వే ఎస్సై బిందుమాధవి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: బేతంచెర్ల పట్టణంలో డోన్ రోడ్డులో ఈనెల 27న శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజస్థాన్‌కు చెందిన ప్రహ్లాద్(27) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై చెప్పారు.

మహిళా శక్తి.. ఆర్థిక వృద్ధి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: నేటి తరం గృహిణులు ఇంటికే పరిమితం కావడం లేదు. ఆత్మవిశ్వాసంతో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలు, చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని ముందుకు నడిపించడం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు తలకు మించిన భారమవుతోంది. స్వయం ఉపాధిలో శిక్షణ తీసుకుని కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నారు. ఇంటి పట్టునే ఉపాధి పొందుతూ పలువురి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు గృహిణులు.

రుణం సద్వినియోగం చేసుకున్నా
–ప్రసన్నలక్ష్మి, ఆర్ఎస్ రంగాపురం



రంగాపురం గ్రామానికి చెందిన ప్రసన్నలక్ష్మి తన ఇంటి వద్ద చిన్న రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొని పిండి మిషన్ ఏర్పాటు చేసుకొన్నారు. దీనికి స్వయం సహాయక సంఘం కొంత ఆర్థిక సహాయం అందించింది. మరికొంత సొమ్ము సమకూర్చుకుని పిండి జిన్నుతో ఉపాధి పొందుతున్నారు. పొదుపు ద్వారా రూ.50 వేలు, బ్యాంకు రుణం రూ.75 వేలు, స్త్రీనిధి కింద రూ.55 వేలు తీసుకున్నారు. తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తూ పిల్లల్ని చక్కగా చదివిస్తున్నారు. నెలకు రూ.18 వేలు ఆదాయం వస్తోంది. బ్యాంకు రుణం సద్వినియోగం చేసుకున్నానని చెబుతున్నారు ప్రసన్నలక్ష్మి.

కుటుంబానికి ఆసరాగా నిలిచా
– శ్రీదేవి, ఆర్ఎస్ రంగాపురం

పదేళ్ల కిందట పది మంది సభ్యులతో జయలక్ష్మి పొదుపు సంఘాన్ని స్థాపించాం. బ్యాంకు రుణం రూ.75 వేలు, స్త్రీ నిధిలో రూ.50 వేలు, గ్రామైక్య సంఘంలో రూ.లక్ష రుణం తీసుకొని దుస్తుల దుకాణాన్ని ఏర్పాటు చేశా. అందులోనే విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు, పాఠశాల బ్యాగులను విక్రయించడంతో వ్యాపారం బాగానే నడుస్తోంది. ప్రస్తుతం నెలకు రూ.50 వేల వరకు వ్యాపారం జరుగుతోంది. ఇందులో నెలకు రూ.15 నుంచి రూ.18 వేల వరకు మిగులుతుంది. ఈ ఆదాయంతో పిల్లలను చదివించుకుంటున్నాని శ్రీదేవి చెబుతున్నారు. పొదుపు మహిళ సంఘం కుటుంబ ఆర్థిక పరిస్థితిని మార్చిందంటున్నారు.

ఉత్సవ వైభవం.. భక్తుల సంబరం

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రాత్రి జరిగిన స్వామి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హాజరయ్యారు. స్వామి,అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కళారాధన కార్యక్రమంలో భాగంగా ఆదివారం కూచిపూడి నృత్యాలు అలరించాయి. ఆర్.కృష్ణాపురం గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థం పుట్టాలమ్మ ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం మొదటి రోజు ఉదయం స్వామిని సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి తిరువీధిలో ఊరేగించారు. అనంతరం చక్రపెరుమాళ్ల ఉత్సవం జరిపారు. రాత్రి చంద్రప్రభపై స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

సూర్యప్రభ వాహనంపై స్వామి ఊరేగింపు

నృత్యం చేస్తున్న కళాకారిణులు

దొర్నిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో ఆదివారం మూల పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయం, యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయాలు ఆదివారం భక్తుల సందడితో కనిపించాయి. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు.

కొలిమిగుండ్ల, అవుకు, న్యూస్‌టుడే: కోరుమానుపల్లె గ్రామ సమీపంలోని పట్టాభిరామ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. కోనాపురం సమీపంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మూడు రోజులపాటు జరిగిన కల్యాణోత్సవాలు ఆదివారం ముగిశాయి.

గోరుకల్లు పైపులైన్‌కు మరమ్మతులు

స్పందనకు వందనం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పట్టణంలో కొత్తబస్టాండు నుంచి పాతబస్టాండు వరకు ప్రధాన రహదారి పక్కన చాలా రోజులుగా గోరుకల్లు పైపులైన్ లీకేజీ కావడంతో నీరు నిరంతరం వృథాగా పారుతోంది. సమస్య తెలియజేస్తూ జనవరి 27న 'ఈనాడు'లో 'అసలే కరవు.. ఆపై లీకేజీల దరువు' శీర్షికన కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన వాటర్ గ్రిడ్ ఇంజినీరింగ్ అధికారి వాసు ఆదేశాలతో పైపులైన్ లీకేజీకి గ్రిడ్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

బనగానపల్లి, న్యూస్‌టుడే: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ పేర్కొన్నారు. ఆదివారం కొండపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 2025 మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందిరమ్మ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం భారీ స్థాయిలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో స్వరూప, ఉపాధ్యాయులు సతీష్, మంజుల, ప్రతాప్ పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులు లక్ష్య సాధనతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సుమేధా ఉన్నత పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, గుండా గోపాల్, విజయనాగరాజు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సుమేధా ఉన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి చదువుకోవాలన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పద్మశ్రీ, కోఆర్డినేటర్ మహేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులను సత్కరిస్తున్న పాఠశాల డైరెక్టర్లు

వాహన పత్రాలు, లైసెన్సు తప్పనిసరి

అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం పోలీసు స్టేషన్‌లో ఎస్సై రమేష్‌బాబుతో కలిసి ట్రాక్టరు యజమానులు, డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే వారు శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలన్నారు. ట్రాక్టరు, ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, అధికలోడుతో వెళ్లే వాహనంపై కేసు నమోదు చేస్తామన్నారు. రోడ్డు నిబంధనలు పాటించకుండా ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేసి, లైసెన్సు రద్దు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో విజయుడు, మోహన్‌రావు, నాగేశ్వరరెడ్డి, ఉపేంద్ర, తిరుమలేష్‌రెడ్డి, యల్లారెడ్డి పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో ఉంటేనే ప్రశాంత జీవనం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: సత్ప్రవర్తనతో మెలిగితేనే ప్రశాంత జీవనం ఉంటుందని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం బేతంచెర్ల పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు కష్టపడి చదివి తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్, బైండోవర్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగార్జున రౌడీషీటర్లకు హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు మంత్రణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వదిలి సన్మార్గంలో నడవాలని సూచించారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: శిరివెళ్ల సర్కిల్ పరిధిలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు సీఐ రాము ఆదివారం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన వ్యక్తుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలపై ఎవరైనా తమ ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ఆళ్లగడ్డ, ప్యాపిలి, చాగలమర్రి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో అమరులైన అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ అమరవీరుల దినోత్సవాన్ని ఆదివారం ఆయా పట్టణాలు, గ్రామాల్లో నిర్వహించారు. అమరవీరులను స్మరించుకోవడం తమ బాధ్యతన్నారు. వారి త్యాగాలతోనే నేడు వర్గీకరణ సాధన దిశగా పురోగతి సాధించామన్నారు.

ఆళ్లగడ్డ: ఎమ్మార్పీఎస్ అమరవీరులకు నివాళి అర్పిస్తున్న కార్యకర్తలు

భాజపాను బలోపేతం చేద్దాం

బనగానపల్లి, న్యూస్‌టుడే: గ్రామీణ స్థాయిలో భాజపాను బలోపేతం చేద్దామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శివకృష్ణ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం రామకృష్ణాపురం, పలుకూరు గ్రామాలకు చెందిన పలువురు గని కార్మికులు, యువత పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరిపాలన నచ్చి పలువురు పార్టీలోకి స్వచ్ఛందంగా వస్తున్నారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కూటమి నాయకులతో కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో యాదగిరి, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన కార్యకర్తలతో శివకృష్ణ యాదవ్

నిర్వహణ శూన్యం.. తీరని దాహం

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: వేసవిలో పశువులు, మూగజీవాల దప్పిక తీర్చేందుకు ఉపాధి హామీ పథకం నిధులతో కూటమి ప్రభుత్వం నీటి తొట్టెలను నిర్మించింది. అయితే క్షేత్ర స్థాయిలో పనులు పూర్తికాలేదు. బనగానపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 2025-26 సంవత్సరానికి దాదాపుగా 141 నీటి తొట్టెలు మంజూరు కాగా.. ఇప్పటి వరకు 97 మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి. ఉద్దేశం మంచిదే అయినా లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు.

పట్టించుకోని యంత్రాంగం

☛ ప్రభుత్వం ఒక్కో నీటి తొట్టెకు రూ.32 వేలు వెచ్చించింది. క్షేత్ర స్థాయిలో వీటి నిర్వహణ లేకపోవడంతో చాలా వరకు తొట్టెలు నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారింది. వేసవి తాపం ప్రారంభమవుతున్న వేళ వాటిలో నీరు నింపి మూగజీవాల దప్పికను తీర్చాలని అన్నదాతలు కోరుతున్నారు.

అమడాల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పశువుల నీటి తొట్టె

మండలం	మంజూరైనవి	పూర్తయిన నిర్మాణాలు
బనగానపల్లి	35	19
కోవెలకుంట్ల	21	17
కొలిమిగుండ్ల	30	16
అవుకు	35	30
సంజామల	20	15

☛ బనగానపల్లి మండలంలోని ఇల్లూరుకొత్తపేట, సాధుకొట్టం గ్రామాల్లో నీటి తొట్టెలు నిరుపయోగంగా ఉన్నాయి. కోవెలకుంట్ల మండలం అమడాల గ్రామంలో తొట్టెలో నీరు లేకుండా దర్శనమిస్తోంది. తొట్టెలకు నీటి సరఫరా చేసే పైప్‌లైన్ చాలా చోట్ల ఏర్పాటు చేయలేదు. నిర్వహణ చూసుకోవాల్సిన పంచాయతీ శాఖ వాటిని పట్టించుకోవడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతోందంటున్నారు.

త్వరలో నిర్మాణాలు పూర్తి చేస్తాం
–వెంకటరమణ, ఏపీవో, బనగానపల్లి

నీటి తొట్టె నిర్మాణమే మా పరిధిలో ఉంటుంది. నిర్మాణాలు పూర్తి అయిన వెంటనే వాటిని గ్రామ పంచాయతీలే వాటి నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. చాలా వరకు గ్రామాల్లో ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేశాం. మరికొన్ని చోట్ల పూర్తి చేయాల్సి ఉంది.

(c) eenadu

ఈనాడు ఒడిశా

సోమవారం మార్చి 2, 2026 5

యోగా, ప్రాణాయామం చేయాలి

ఉప ముఖ్యమంత్రి సింగ్‌దేవ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: నిత్యం యోగా, ప్రాణాయామం చేసేవారు ఆయురారోగ్యాలతో ఉంటారని, వ్యాధులు తొందరగా సోకవని ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ చెప్పారు. ఆదివారం బొలంగీర్ జిల్లాలోని టిట్లాగడ్‌లో 'ఉత్కళశ్రీ-2026' దేహదారుఢ్య పోటీలు జరిగాయి. జిల్లాకు చెందిన మల్ల యోధులు పాల్గొన్నారు. బహుమతుల వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సింగ్‌దేవ్ మాట్లాడారు. మల్లయోధులు రాష్ట్ర ప్రతిష్ఠ అని, బొలంగీర్‌లో జిల్లాస్థాయి పోటీలు చేపట్టడం అభినందనీయమన్నారు. విజేతలకు జ్ఞాపికలు అందజేశారు.

ఉపముఖ్యమంత్రి సింగ్‌దేవ్ ఎదుట వేదికపై విజేతలుగా నిలిచిన మల్లయోధులు

పేదలకు ఆర్థిక సాయం

పేదలకు సహాయం అందజేస్తున్న టున్నగౌడ్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణానికి చెందిన సమాజ సేవకుడు టున్నగౌడ్ పేదలకు ఆర్థిక సహాయం అందజేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఏడాదిగా ప్రతినెలా సుమారు 50 మందికి రూ.200 చొప్పున ఆర్థిక సహాయం అందజేయడంతోపాటు ఎవరైనా పేద కుటుంబ సభ్యులు మృత్యువాత పడితే వారి మొదటి కార్యానికి సహాయం అందజేస్తూ పేదల వెంట ఉంటున్నారని పలువురు తెలిపారు. మూగజీవులకు ఆహారం అందజేస్తూ వాటికి ప్రమాద సమయాల్లో చికిత్స అందిస్తున్నారు. ఆయనకు పట్టణ ప్రజలతోపాటు భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరు నారాయణరావు, పట్టణ ఉపాధ్యక్షుడు రఘురాం రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

వైద్య రంగానికి ఎక్కువ కేటాయింపులు

ముఖ్యమంత్రి మోహన్

ప్రసంగిస్తున్న సీఎం మోహన్

కార్యక్రమంలో పాల్గొన్న ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధి, మౌలిక సౌకర్యాలు, మానవ వనరుల అభివృద్ధికి గడిచిన 20 నెలల్లో ఎంతో చేశామని, చేయాల్సిందెంతో ఉందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. భువనేశ్వర్‌లోని లోక్‌సేవా భవన్ వేదికగా 'వికాస్ మంథన్, గవర్నెన్స్ ఇన్ యాక్షన్' కార్యక్రమాలపై రెండు రోజుల సదస్సు ఏర్పాటైన సంగతి తెలిసిందే. కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొని సూచనలు చేశారు. శనివారం రాత్రి జరిగిన ముగింపు వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎం 'సమృద్ధ ఒడిశా' ధ్యేయంగా ఇంతవరకు తమ ప్రభుత్వం ఏం చేసిందన్నది వివరించారు. భవిష్యత్తులో ఏం చేయాల్సి ఉందన్న దానిపైనా చెప్పారు.

ముఖ్యమంత్రి చెప్పిన అంశాల్లో ముఖ్యమైనవి...

- 2026-27 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో అభివృద్ధి రేటు 7.9 శాతంగా ఉంటుంది. ఇది జాతీయ స్థాయికంటే ఎక్కువ.
- గడిచిన 20 నెలల భాజపా పాలనా కాలంలో రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్లు పెట్టుబడులకు బాటలు పడ్డాయి. రూ.2.40 లక్షల కోట్ల వ్యయంతో కూడిన 109 ప్రాజెక్టుల నిర్మాణాలు పట్టాలకెక్కాయి..
- 1.67 లక్షల మందికి ఉపాధి అవకాశాలకు బాటలు పడ్డాయి.
- 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఒడిశా ఎలక్ట్రానిక్స్, నైపుణ్యత, గ్లోబల్ కేపబిలిటీ, సెమీకండక్టర్ల తయారీ రంగాల్లో ముందంజ వేసింది.
- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఈ ఏడాది (2026-27) బడ్జెట్ రూ.3.10 లక్షల కోట్లకు చేరుకొంది. మానవ వనరుల వికాసానికి రూ.72,100 కోట్లు కేటాయించారు. ఇది గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్‌లో 6.5 శాతం.
- చాలా రాష్ట్రాలు రుణభారంతో సతమతమవుతున్న తరుణంలో ఒడిశాలో ఇది కేవలం 13.6 శాతమే.
- మహిళల ఆర్థిక వికాసమే ధ్యేయంగా తమ ప్రభుత్వం అమలు పరిచిన 'సుభద్ర' పథకం కోటిమందికి పైగా అతివలకు ఊతమిచ్చింది. 17 లక్షల మంది 'లక్షపతి' దీదీలుగా అవతరించారు.
- క్వింటాలు ధాన్యానికి రూ.3,100లు చెల్లిస్తున్న ఏకైక రాష్ట్రం ఒడిశా. 2024-25లో రికార్డుస్థాయిలో 92.63 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి అన్నదాతల బ్యాంకు ఖాతాలకు రూ.28,715 కోట్లు బదిలీ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ పంట కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి.
- 20 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన ప్రభుత్వం 45 వేల శిశు వాటికాలు ప్రారంభించింది. రూ.12 వేల కోట్ల వ్యయంతో 2,200 గోదావరీశ్ ఆదర్శ విద్యాలయాలు ఏర్పాటు చేసింది.
- 2026-27లో వైద్యరంగానికి పెద్దపీట వేసి బడ్జెట్‌లో రూ.23,182 కోట్లు కేటాయింపులయ్యాయి. ఆయుష్మాన్ భారత్, గోపబంధు జన ఆరోగ్య కార్యక్రమాల ద్వారా 1.03 కోట్ల కుటుంబాలకు చెందిన 3.47 కోట్లమందికి ఉచిత వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి.
- ఆర్థిక కారిడార్‌ల ఏర్పాటుతో 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక రంగం 500 బిలియన్ డాలర్లకు చేరుకోనుంది.
- ఉత్కళ వైభవం రెట్టింపు కానుంది. ప్రముఖ క్షేత్రాల ఆధునికీకరణ పనులనూ ప్రభుత్వం చేపట్టింది. ఆలయాలకు కార్పస్ నిధులు సమకూరుస్తోంది.

ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనూగార్గ్, అభివృద్ధి కమిషనర్ దేవ్‌రంజన్ కుమార్ సింగ్, ఇతర ప్రిన్సిపల్ కార్యదర్శులు, నిపుణులు పాల్గొన్నారు. సీఎం అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మహానది పరివాహక ప్రాంతంలో పరిశీలన

అడ్వకేట్ జనరల్ పితంబర ఆచార్య

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మహానది పరివాహక ప్రాంతాల్లో ట్రైబ్యునల్ నాలుగు రోజులపాటు సమగ్ర అధ్యయనం చేసిందని రాష్ట్ర అడ్వకేట్ జనరల్ (ఏజీ) పితంబర ఆచార్య చెప్పారు. ఆదివారం కటక్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జస్టిస్ బెలాత్రివేది అధ్యక్షతన వచ్చిన 10 మంది సభ్యులు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లోని మహానది పరివాహక ప్రాంతాల్లో స్వయంగా పరిశీలించారన్నారు. దీనిపై సంబల్‌పూర్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అంతా చూపించిందని, జల వివాదానికి త్వరలో తెరపడుతుందని చెప్పారు.

ఇరాన్‌లో ఉన్న రాష్ట్ర పౌరులను తీసుకొచ్చేందుకు చర్యలు

మంత్రి హరిచందన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పశ్చిమాసియాలో భీకర యుద్ధం జరుగుతోంది. గల్ఫ్ అంతటా యుద్ధాగ్ని జ్వాలలు ఎగసిపడుతున్న తరుణంలో ఇరాన్‌లో చిక్కుకున్న ఒడిశా వాసుల భద్రత, వెనక్కి రప్పించడానికి ప్రధాని నరేంద్ర మోదీ చర్యలు తీసుకుంటున్నట్లు న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ చెప్పారు. ఆదివారం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి ఒడిశావాసుల భద్రతకు సంబంధించి కేంద్రంతో మాట్లాడినట్లు తెలిపారు. దీనిపై విదేశాంగశాఖ పశ్చిమాసియా దేశాల్లో ఉన్న ఒడిశావాసుల్ని వెనక్కి తేవడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

భారీగా తగ్గిన టమాటా ధరలు

లక్ష్మీపూర్ ప్రాంతంలో విక్రయించేందుకు సిద్ధంగా టమాటా

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో రెండు రోజులుగా టమాటా ధరలు పూర్తిగా పడిపోయాయి. కిలో పది రూపాయలు దానికంటే తక్కువగా మార్కెట్లో విక్రయాలు జరుగుతున్నాయి. గతంలో కిలో రూ.వంద, మధ్యలో రూ.50 నుంచి 40 వరకు ఉండేది. హఠాత్తుగా ధర పడిపోయింది. ఆంధ్ర నుంచి ఈ ప్రాంతానికి టమాటా దిగుమతి అవుతుంది. అక్కడ ధరలు తగ్గడంతో భారీగా దిగుమతి అవుతున్నా ఇక్కడ వ్యాపారులు నిలువ ఉంచేందుకు వీలుకాక పూర్తిగా తక్కువ ధరకు విక్రయాలు చేస్తున్నారు. ఒకవేళ కోల్డ్ స్టోరేజ్ ఉండుంటే నిల్వ ఉంచుకుని మంచి లాభాలు పొందే అవకాశం ఉండేదని వ్యాపారులు అంటున్నారు.

హోలీ ముందు రోజుల్లో ఒడిశాలో సాకర్‌పట్టి తయారీ

బరగఢ్, న్యూస్‌టుడే: పశ్చిమ ఒడిశాలో హోలీ పండగ సమీపించగానే గ్రామాల్లో ఒక ప్రత్యేక వాతావరణం నెలకొంటుంది. రంగుల పండగకంటే ముందే ఇళ్లలో పొయ్యిల మంటలు ఎగసిపడతాయి. అదే సాకర్‌పట్టి అనే సంప్రదాయ మిఠాయి తయారీ ప్రారంభమయ్యే సమయం. దీని తయారీ కుటుంబ సభ్యులందరూ కలిసి చేసే సమష్టి శ్రమ. ఇంట్లోని పెద్దలు పిండి సిద్ధం చేస్తారు. మహిళలు మిశ్రమాన్ని కలుపుతారు, యువకులు మంటలపై పాత్రలను చూసుకుంటారు, పిల్లలు ప్యాకింగ్‌లో సహాయం చేస్తారు. తెల్లవారుజాము నుంచే పని మొదలై సాయంత్రం వరకు కొనసాగుతుంది. ఈ విధంగా ఒక కుటుంబం రోజుకు వందల సంఖ్యలో సాకర్‌పట్టీలను తయారు చేస్తుంది.

సంప్రదాయ పద్ధతిలో

బియ్యం పిండి, బెల్లం, కొబ్బరి తురుము, నెయ్యి, యాలకులు వంటి సహజ పదార్థాలతో సాకర్‌పట్టి తయారు చేస్తారు. రసాయనాలు లేకుండా, సంప్రదాయ పద్ధతిలో చేయడం వల్ల దీనికి ప్రత్యేకమైన రుచి ఉంటుంది. హోలీ సమయంలో ఈ మిఠాయికి గ్రామాలు, పట్టణాల మార్కెట్లలో మంచి డిమాండ్ ఉంటుంది.

సంప్రదాయం, ఉపాధి, ఐక్యత

సాకర్‌పట్టి ఎండబెడుతున్న మహిళలు

కేవలం వంటకమే కాదు ఇది ఒక ఆదాయ వనరు

ఈ సాకర్‌పట్టి కేవలం తీపి వంటకం మాత్రమే కాదు, ఇది గ్రామీణ కుటుంబాలకు ఆదాయ వనరు. హోలీకి ముందు రెండు ,మూడు వారాలపాటు తయారు చేసిన సాకర్‌పట్టిని సంతలు, మార్కెట్లలో విక్రయిస్తారు. కొందరు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి పెద్ద మొత్తంలో తయారు చేసి విక్రయిస్తున్నారు. దీని ద్వారా పండుగ కాలంలో కుటుంబాలకు అదనపు ఆదాయం లభిస్తోంది. మంచి బెల్లంతో తయారు చేసిన దీన్ని ఆకర్షణీయమైన ఆకారాల్లో తయారుచేస్తారు. బరగఢ్ జిల్లాలోని బరపల్లి గ్రామంలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. హోలీ రోజు ఉదయం ఒడిశా ప్రజలు సాకర్‌పట్టిని దేవాలయాలకు తీసుకెళ్లి దేవుడికి నైవేద్యంగా సమర్పిస్తారు.

అత్యవసర పరిస్థితి చీకటి అధ్యాయం

భంజవిహార్ వీసీ గీతాంజలి

వేదికపై వీసీ గీతాంజలి, ఇతర ప్రతినిధులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: దేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జన్సీ) చీకటి అధ్యాయమని, దేశ చరిత్రలో ఎన్నో ఘటనలు జరిగినా ప్రజాస్వామ్య వ్యవస్థ దృఢంగా నిలిచిందని బ్రహ్మపుర విశ్వవిద్యాలయం (భంజవిహార్) వీసీ ఆచార్యిణి గీతాంజలి దాస్ చెప్పారు. ఆదివారం భంజవిహార్ నూతన సమావేశ మందిరంలో ఎన్ఎస్ఎస్ శాఖ, కేంద్ర యువజన సర్వీసుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్-యువ సంసద్' అన్న అంశంపై సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితికి దశాబ్దాలు పూర్తయినా తదనంతర రాజకీయ పరిస్థితులు, భారత్ సాధించిన ప్రగతి గురించి విపులంగా వివరించారు. కార్యక్రమంలో పీజీ కౌన్సిల్ ఇన్‌ఛార్జి అధ్యక్షుడు ఆచార్య జోగేశ్వర్ పాణిగ్రహి, ఎన్నెస్సెస్ బ్యూరో చీఫ్ డా॥ జయంత్‌కుమార్ పండా, విద్యార్థి సంఘం సలహాదారు ఆచార్య గణేశ్‌సెఠి, సదస్సు నిర్వాహకుడు డా. చంద్రికా ప్రసాద్‌దాస్ తదితర అధికారులు పాల్గొన్నారు. 112 మంది ఎన్ఎస్ఎస్ యువ కార్యకర్తలు యువ సంసద్ కార్యక్రమంలో తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించారు.

కటక్‌లో దోలాయాత్ర సందడి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: చారిత్రక నగరం కటక్‌లో దోలాయాత్ర సందడి ప్రారంభం కాగా, శనివారం రాత్రి శ్రీదేవి, గోవిందుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ వేడుకలో కటక్-బారాబటి ఎమ్మెల్యే సోఫియా ఫిర్దోస్, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కటక్ శికరపూర్‌లోని దోలా గోవిందుని ఆలయంలో పౌర్ణమి ముందుగా ఉత్సవాలు చేపట్టడం ఆనవాయితీ. హోలీ వరకు వేడుకలు కొనసాగుతాయి. ఈ నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి.

శ్రీదేవి, గోవిందుడు

ఊరేగింపులో ఎమ్మెల్యే సోఫియా, భక్తులు

గంజాం జిల్లాలో బాలికలకు హెచ్‌పీవీ టీకాలు

టీకా వేసిన బాలికకు ధ్రువపత్రం అందజేస్తున్న ఛత్రపురం ఎమ్మెల్యే కృష్ణచంద్ర నాయక్. చిత్రంలో వైద్యాధికారులు ఇతరులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక టీకాలు (హెచ్‌పీవీ) అభియాన్ గంజాం జిల్లాలో ఆదివారం ప్రారంభమైంది. ఛత్రపురంలోని సబ్ డివిజనల్ ఆసుపత్రిలో జరిగిన జిల్లా స్థాయి కార్యక్రమానికి ఛత్రపురం ఎమ్మెల్యే కృష్ణచంద్ర నాయక్ అతిథిగా హాజరయ్యారు. సర్వైకల్ క్యాన్సర్ నుంచి రక్షణకు చేపట్టిన కార్యక్రమం గురించి ఆయన వివరించారు. అనంతరం 14, 15 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేయగా, వారికి ఆయన ధ్రువపత్రాలు అందజేశారు. జిల్లాలో మే 31వ తేదీలోగా 14, 15 ఏళ్ల వయసు గల 27,153 మంది బాలికలకు ఈ టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా ముఖ్య వైద్యం, ప్రజారోగ్య అధికారి (సీడీఎం, పీహెచ్‌వో) డాక్టర్ భవానీశంకర్ మిశ్ర చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సంతోష్ కుమార్ పాఢి, బాలుంకేశ్వర షడంగి, అలేఖ్ ప్రధాన్, ఇతర అధికారులు బులునాథ్ సాహు, ప్రశాంత కుమార్ బొరాల్ తదితరులు పాల్గొన్నారు.

సిమిలిగుడలో ఎక్సైజ్ దాడులు

స్వాధీనం చేసుకున్న విదేశీ మద్యంతో నిందితులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ పట్టణంలో అక్రమంగా విదేశీ మద్యం విక్రయ కేంద్రాలపై ఆదివారం ఎక్సైజ్ దాడులు జరిగాయి. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ కుమార్ సాహు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో చాలా చోట్ల బహిరంగంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపారు. దాడుల్లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని వాళ్ల వద్ద ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టుకు తరలించారు. ఎక్సైజ్ అధికారి జగబందు జానీ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రాష్ట్రంలో అధికార పార్టీ అవినీతిలో మునిగితేలుతోంది'

మాట్లాడుతున్న నిశికాంత్ మహాపాత్ర్. చిత్రంలో ఆప్ నాయకులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ను బలోపేతం చేద్దామని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. దేశం, రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు, రానున్న పంచాయతీ, పట్టణ సంస్థల ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని ఆప్ ఆధ్వర్యంలో బ్రహ్మపురలో ఆదివారం సన్నాహక సమావేశం జరిగింది. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ ప్రత్యేక సర్క్యూట్ భవనం సమావేశ మందిరంలో ఇది ఏర్పాటైంది. దీనికి పార్టీ రాష్ట్రాధ్యక్షుడు నిశికాంత్ మహాపాత్ర్, ఆర్గనైజేషన్ కార్యదర్శి ఆచార్య కల్యాణ ఆనంద్ హాజరై మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని మోదీ, అమిత్ షాలు కుట్రపన్ని సీబీఐతో తప్పుడు కేసులు బనాయించి కేజ్రీవాల్, మనీష్ సిసోడియా తదితరుల్ని అక్రమంగా అరెస్టు చేయించారని, న్యాయస్థానం తీర్పుతో వారంతా నిర్దోషులుగా బయటపడ్డారని వివరించారు. రాష్ట్రంలో భాజపా అవినీతిలో మునిగి తేలుతోందని వారు ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఒడిశా ప్రజలు భాజపాకు సరైన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఆప్ గంజాం జిల్లా కన్వీనరు సుభాష్‌చంద్ర రౌత్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిత్య నారాయణ రథ్, జిల్లా యువ అధ్యక్షుడు పి.నీలకంఠ రెడ్డి, ఇతర నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కైలాస్ సెఠి తదితరులు పాల్గొని మాట్లాడారు.

అత్యాచారం కేసులో ఒకరి అరెస్టు

జయపురం, న్యూస్‌టుడే: బాలికను అత్యాచారం చేయటంతో పాటు, గర్భస్రావం చేయించిన కేసులో జయపురం పోలీసులు ఒకడ్ని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొరిగుమ్మ సమితి బలియాగూడ గ్రామానికి చెందిన వనమాలి హోరిజాన్ (24) స్థానిక ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలికతో ప్రేమ వ్యవహారం నడిపాడు. 2025 మార్చి 25న ఆమెను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదాల్పూర్‌కి తీసుకెళ్లి వివాహం చేసుకుంటానని నమ్మించి బలవంతం చేశాడు. ఆమె గర్భవతి కావడంతో కడుపులో బిడ్డను చంపి కట్నం తీసుకురావాలని ఇంటి నుంచి గెంటేశాడు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా పోలీసులు ఆదివారం నిందితుడ్ని అరెస్టు చేసి, సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై శకుంతుల దేవి తెలిపారు.

బ్రౌన్‌షుగర్ స్వాధీనం

ఏడుగురి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఝార్సుగుడ జిల్లా ఝార్సుగుడ పోలీసు స్టేషన్ పరిధిలో 'ఆపరేషన్ నేత్ర' కింద పోలీసులు మత్తు పదార్థాల అంతర్ జిల్లా గ్యాంగ్‌కు చెందిన ఏడుగుర్ని అరెస్టు చేసి శనివారం వారిని న్యాయస్థానానికి తరలించారు. నిందితులు ఝార్సుగుడ, సుందర్‌గఢ్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు చెందినవారని ఝార్సుగుడ ఎస్పీ రెడ్డి రాఘవేంద్ర గుండాల ఒక ప్రకటనలో తెలిపారు. నిందితుల నుంచి 12.48 గ్రాముల బ్రౌన్ షుగర్, ఏడు చరవాణులు, రూ.1,550ల నగదు తదితరాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

రాయగడలో 7,587 మందికి లబ్ధి

ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీ సప్తగిరి, అప్పలస్వామి తదితరులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: కౌమార బాలికల ఆరోగ్య భద్రతకు కేంద్రప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన హ్యూమన్ పాపిల్లోమా వైరస్(హెచ్‌పీవీ) టీకాలతో రాయగడ జిల్లాలో 7,587 మందికి లబ్ధి చేకూరనుంది. జిల్లా ఆరోగ్య శాఖ ఆదివారం కేంద్రాసుపత్రిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక ముఖ్యఅతిథిగా, ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ముందుగా టీకాలు పెట్టెను ప్రారంభించిన ఉలక మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఇచ్చే వీటి ద్వారా కౌమార బాలికలకు ప్రయోజనం చేకూరనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముందుగా టీకాలను గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు వేశాక, పట్టణాలకు విస్తరింపజేయాలని ఉలక సూచించారు. జిల్లా ముఖ్య వైద్యాధికారి సరోజినిదేవి మాట్లాడుతూ 14 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు గల బాలికలకు టీకాలను వేయనున్నట్లు చెప్పారు. రూ.4 వేలు మార్కెట్ ధర ఉన్న వీటిని బాలికలకు ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.కె.మిశ్ర, కిషోర్ బరాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీకాలకు సంబంధించి ప్రచార పత్రాలను అతిథులు ఆవిష్కరించారు.

ఊహకందని నవీన్ వ్యూహం... భాజపా మౌనం..

రసవత్తరంగా రాజ్యసభ పోరు

నవీన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాజ్యసభ ఎన్నికల్లో మూడు స్థానాలు నిలబెట్టుకుంటామని పునరుద్ఘాటించిన భాజపాకు విపక్షనేత నవీన్‌పట్నాయక్ ఊహించని షాక్ ఇచ్చారు. బిజద గెలిచే అవకాశం ఉన్న స్థానంలో డాక్టర్ సంతృప్త మిశ్రను అభ్యర్థిగా చేశారు. ఆయన ఏకగ్రీవం కావడం ఖాయం. నాలుగో స్థానానికి ప్రముఖ వైద్యుడు డాక్టర్ దత్తేశ్వర్ హొత్తాను కామన్ అభ్యర్థిగా ప్రకటించి అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వాలని పిలుపుచ్చారు. నవీన్ ఇలాంటి ఎత్తుగడ వేస్తారని అధికార పక్షం (భాజపా) పెద్దలు అనుకోలేదు. ఈ పరిస్థితిలో కమలదళం ఏం చేయనుందన్నదిప్పుడు చర్చనీయాంశమైంది.

బిజదకు దగ్గరైన కాంగ్రెస్

భక్తచరణ్‌దాస్

బిజద కాంగ్రెస్, భాజపాలకు సమాన దూరంలో ఉందంటున్న నవీన్ డాక్టర్ దత్తేశ్వర్‌ను నాలుగో స్థానం అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత కాంగ్రెస్ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్‌దాస్ ప్రకటించారు. రాజ్యసభ గెలుపు గుర్రాల విషయానికొస్తే విజయానికి 31 మంది అవసరం ఉంది. ఈ నేపథ్యంలో బిజద, కాంగ్రెస్‌లు ఏకమైతే సంఖ్యాబలం 62 అవుతుంది. రెండు స్థానాలు కైవసమయ్యే అవకాశం ఉంది. ఇదే జరిగితే సమీకరణాలు మారతాయి. ఇంతవరకు భాజపాకు లోపాయికారీగా మద్దతిస్తూ వచ్చిన బిజద కాంగ్రెస్‌తో చెయ్యి కలిపే పరిస్థితి లేకపోలేదని పరిశీలకులంటున్నారు.

భాజపా వ్యూహమేంటి?

మోహన్‌చరణ్‌మాఝి

నవీన్ ఇద్దరు అభ్యర్థుల పేర్లు ప్రకటించిన తర్వాత భాజపా నేతలెవరూ పెదవి విప్పలేదు. తాను సొంతం చేసుకోనున్న ఒకటి, రెండు స్థానాలకు అభ్యర్థులెవరన్నదింకా స్పష్టం చేయలేదు. ఆశావహుల జాబితా కేంద్ర నాయకత్వానికి పంపించిన రాష్ట్ర నేతలు హస్తిన పెద్దలవైపు చూస్తున్నారు. నాలుగో స్థానానికి అభ్యర్థిని నిలబెడతారా? అన్నదిప్పుడు ఆసక్తికరంగా ఉంది. ఒకవేళ అదే జరిగితే తనకున్న బలంతో మూడు స్థానాలు నిలబెట్టుకునే పరిస్థితి లేదు. ఇది నెరవేరాలంటే క్రాస్ ఓటింగ్ జరిగితేనే సాధ్యమవుతుంది.

క్రాస్ ఓటింగ్‌కు అవకాశం

కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న భాజపా నాలుగో స్థానం నిలబెట్టుకోవడానికి పెద్ద ఎత్తున బేరసారాలకు దిగొచ్చునని పరిశీలకులంటున్నారు. సొమ్ము సంచులు చేతులు మారి క్రాస్ ఓటింగ్ జరిగితే ఏదైనా జరగొచ్చు. ఇదివరకూ జరిగిన దాఖలాలున్నాయి.

సర్వత్రా ఉత్కంఠ

దిల్లీ వెళ్లిన సీఎం మోహన్ చరణ్‌మాఝి భాజపా పెద్దలందరితో మాట్లాడి వచ్చారు. బిజదను నమ్ముకుని ఎంతోకాలంగా నవీన్‌కు విధేయంగా ఉన్నవారిని పక్కనపెట్టి నిన్నగాక మొన్న పార్టీలో చేరిన సంతృప్తకు అవకాశమివ్వడం కొంతమంది సీనియర్ నేతలకు నచ్చలేదు. దీనిపై నిలదీసినందుకు ప్రభాత్‌రంజన్ బిశ్వాల్‌ను శనివారం సస్పెండు చేసిన సంగతి తెలిసిందే. బిజదలో అంతా సవ్యంగా లేదని, పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉందని పరిశీలకులంటున్నారు. ఈ అవకాశాన్ని భాజపా ఎంతవరకు వినియోగించుకోగలదన్నదిప్పుడు చర్చనీయాంశమైంది. రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ విప్ పని చేయదు. క్రాస్ ఓటింగ్ జరిగితే ఫలితాలు తారుమారవుతాయి.

అసెంబ్లీలో వివిధ పార్టీల సంఖ్యాబలం

- మొత్తం స్థానాలు: 147
- భాజపా: 79 ● బిజద: 48
- కాంగ్రెస్: 14 ● సీపీఐ(ఎం): 01
- స్వతంత్రులు: ముగ్గురు
- బిజద నుంచి సస్పెండైన ఇద్దరు

భాజపా తన అభ్యర్థులెవరన్నది ప్రకటించిన తర్వాత ఆసక్తికరమైన పరిణామాలకు అవకాశం ఉందని పరిశీలకులంటున్నారు.

(c) eenadu

ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

● కొల్లిగూడలో శుభ మూహుర్తపు పూజలు

రాయగడలో పూజలు చేస్తున్న కొండబాబు ప్రతినిధులు

రాయగడ గ్రామీణం, పర్లాఖెముండి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం రాయగడలో ఉత్కళ తెలుగు సమాఖ్య అధ్వర్యంలో జరిగే ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిద్దామని సమాఖ్య అధ్యక్షుడు ఎళ్ల కొండబాబు అన్నారు. అందుకు ప్రతి ఒక్కరు సహరించాలని ముఖ్యంగా మహిళలు కీలకపాత్ర వహించాలని కోరారు. ఉత్సవ వేదిక రాయగడ జేకేరోడ్డు కొల్లిగూడలో ఆదివారం శుభమూహర్త కార్యక్రమం జరిపారు. చైతన్య ఆంధ్ర సాహితి సంస్కృతి సమితి ఆధ్వర్యంలో పర్లాఖెముండి పట్టణంలోని ఓ హోటల్‌లో ఆదివారం సాయంత్రం ఉగాది ఉత్సవాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు.

పర్లాఖెముండితో కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

భాజపాలో చేరికలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) పరిధిలో 2వ వార్డు పరిధిలోని శనీశ్వర మందిరం సమీపాన ఆదివారం పలువురు భాజపాలో చేరారు. బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్ దీనికి హాజరయ్యారు. పార్టీలో చేరిన పదుల సంఖ్యలో యువతీ, యువకులు, మహిళలు, పురుషులకు ఆయన కాషాయ కండువాలు కప్పి, టోపీలు ధరింపజేసి స్వాగతించారు. బ్రహ్మపుర అసెంబ్లీ నియోజకవర్గంలో భాజపాను మరింత పటిష్టం చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.జగదీశ్వరరావు, బద్రినారాయణ నాయక్, అశోక్ కుమార్ శుక్లా, బిజయకుమార్ పండా, గోపాల రథ్, అనుప్ పండా తదితరులు పాల్గొన్నారు.

ఓ యువకుడికి కాషాయ కండువా కప్పి పార్టీలోకి స్వాగతిస్తున్న అనిల్ కుమార్. చిత్రంలో భాజపా నేతలు

యువ రెడ్‌క్రాస్ జాతీయ సమ్మేళన సన్నాహక సదస్సు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని హైటెక్ వైద్య కళాశాల ఆడిటోరియం వేదికగా ఈ నెల 25 నుంచి 29 వరకు యువ రెడ్‌క్రాస్ జాతీయ సమ్మేళనం జరగనుంది. కార్యక్రమంలో అన్ని రాష్ట్రాలకు చెందిన 400 మందికిపైగా యువతీ యువకులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం హైటెక్ (గ్రూప్) సంస్థల అధినేత డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. కార్యక్రమంలో పర్లాఖెముండి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, హైటెక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ..., క్రీడల, సాంస్కృతిక శాఖ అధికారి లలిత్ మహంతి, భువనేశ్వర్ రెడ్‌క్రాస్ సంస్థ సీనియర్ అధికారి లక్ష్మణ స్వయిన్, అధికార ప్రతినిధి సురేంద్రనాథ్ సామల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ భువనేశ్వర్‌లో ఏర్పాటవుతున్న జాతీయ సమ్మేళనం కీలకమైనది, రక్తనిధి సేకరణ, సేవలకు ఇది ప్రతీకగా నిలుస్తుందని, అందరూ సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే రూపేష్‌కు రెడ్‌క్రాస్ కిట్ అందజేస్తున్న అధికారులు. చిత్రంలో తిరుపతి తదితరులు

సొరగూడలో త్వరలో పాఠశాల ప్రారంభం

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎన్‌జీఓ సభ్యులు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితిలో కొండ పైన ఉన్న దేవ మండిఖోల్ పంచాయతీ సొరగూడలో త్వరలో పాఠశాల ప్రారంభించనున్నట్టు ఎన్‌జీఓ సభ్యులు తెలిపారు. ఈ గ్రామంలో పాఠశాల లేక దాదాపు 25 మంది చిన్నారులు చదువుకు దూరమై నిరక్షరాస్యులుగా మిగిలిపోయినట్టు సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పూరీకి చెందిన ఒక ఎన్‌జీఓ ముందుకు వచ్చింది. పాఠశాల తెరవనున్నట్టు తమ సభ్యులను గ్రామానికి పంపించారు.

కొత్తగా బస్సు సేవలు

జయపురం, న్యూస్‌టుడే: జయపురం ఓఎస్ఆర్‌టీసీ బస్టాండులో ఆదివారం గంజాం జిల్లాలో సొరడకు వెళ్లే ప్రభుత్వ ఓల్వో బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ పచ్చ జెండా ఊపి సేవలు ప్రారంభించారు. డీఎంఆర్ శ్రీ సాహు మాట్లాడుతూ రాష్ట్రంలో 100 నూతన బస్సులను కొనుగోలు చేయగా జయపురానికి దాదాపు 8 బస్సులు పంపించారు. వివిధ మార్గాలకు ఈ బస్సు సేవలు త్వరలో ప్రారంభం అవుతాయని తెలిపారు.

బస్సుకు పచ్చ జెండా ఊపుతున్న కలెక్టర్ జయపురం

కాంగ్రెస్ నేత మృతి

రమేష్ బాఖ్య (పాతచిత్రం)

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ సమితి మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత రమేష్ బాఖ్య(59) ఆదివారం మృతిచెందారు. ఆయన ఆరోగ్యం క్షీణించడంతో గత కొద్ది రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రూపక్‌టురుక్‌తో పాటు పలు పార్టీల నేతలు సంతాపం తెలిపారు.

ఎల్లమ్మ తల్లికి పూజలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలో నీలకంఠేశ్వరాలయం సమీపంలోని ఎల్లమ్మ తల్లి మందిరంలో మారు జామి యాత్ర ఆదివారం ఘనంగా జరిగింది. మందిరంలో పుట్ట వద్ద కొలువైన ఎల్లమ్మ తల్లికి విశిష్ట పూజలు చేసి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. బ్రహ్మపురంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి తల్లిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పూజలు నిర్వహిస్తున్న పురోహితులు

యువతతోనే దేశ భవిత

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: దేశ భవితను మార్చే శక్తి యువతకు మాత్రమే ఉందని ఎస్పీ జె.కె. పండా అన్నారు. ఆదివారం శ్రీకృష్ణ చంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాలలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధాకాంత్ బుయాన్, ఎన్ఎస్ఎస్ అనుసంధాన కర్త బిగ్నేశ్వర్ మిశ్రా, విశ్రాంత ఉపాధ్యాయుడు సురేంద్ర రథ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ సుబ్రత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ జేకే పండాకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపల్ రాధాకాంత్ బుయాన్

యువ సాధి పథకం కింద దరఖాస్తులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మమతా సర్కార్ నిరుద్యోగులకు ప్రతినెలా అందించే ఆర్థిక సహాయం బంగ్లార్ యువ సాధి పథకం ప్రవేశ పెట్టిన సంగతి తెలిసిందే. దీని చివరి తేదీ ముగిసేనాటికి 3లక్షల 135 మంది దరఖాస్తులు నమోదయ్యాయని జిల్లా అధికారులు ప్రకటించారు. ఈ పథకం కింద అర్హులకు రూ. 1500 ప్రతినెలా ప్రభుత్వం అందజేస్తుంది.

ద్విచక్ర వాహనం చోరీ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా గారబంద ఠాణా పరిధిలో ఓ ద్విచక్ర వాహనం చోరీ జరిగిన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఠాణా అధికారి ప్రశాంత్ నిషిక్ తెలిపిన వివరాల ప్రకారం.. గారబంద గ్రామ ప్రాంతం మహేంద్రగిరికి వెళ్లే రహదారిలోని రామారావు ఇంటి బయట ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఆదివారం వేకువజామున దుండగులు చోరీ చేసినట్లు ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత నేత్ర పరీక్షలు

నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కేర్ నేత్రం మిషన్ సంస్థ ఆధ్వర్యంలో పాడువా పంచాయతీ కేంద్రంలో ఆదివారం ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో నేత్ర నిపుణులు లిజా రాణి పరిడా, పూర్ణిమ పులిక పాల్గొని 50 మందికి నేత్ర పరీక్షలు జరిపి అవసరమైన మందులు అందజేశారు. శిబిరంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ కౌసల్య ఎక్స్ఛేంజ్ ఆఫీస్ దగ్గరలో ఉన్న ఒక రెండు అంతస్తుల భవనంలో శనివారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు సమాచారం అందించడంతో అగ్నిమాపక బృందాలు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

నాల్కో ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: దమన్‌జోడి నాల్కో ఆధ్వర్యంలో నిర్వాసిత గ్రామాల పిల్లల కోసం గ్రామీణ క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలను నాల్కో కార్యనిర్వాహక సంచాలకుడు అమరేంద్ర మిశ్ర ప్రారంభించారు. స్థానిక అంబేడ్కర్ స్టేడియంలో శని, ఆదివారాలు పోటీలు జరగగా సుమారు 1,200 మంది పిల్లలు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఆదివారం బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈడీ మిశ్ర పాల్గొనగా అతిథులుగా జనరల్ మేనేజర్లు సంజయ్‌కుమార్ పట్నాయక్, ఆనంద్ బాసు పాల్గొని విద్యార్థులకు బహుమతి అందజేశారు.

విజేతలతో ఈడీ మిశ్ర

కానిస్టేబుల్ సంఘ కార్యవర్గం ఎన్నికలు

ఎన్నికైన సభ్యులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా హ్యాబిల్దర్, కానిస్టేబుల్ సంఘ ఎన్నికలు గత నెల 26న జరిగాయి. వాటి ఫలితాలు ఆదివారం వెల్లడించారు. సంఘ అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్ సునా, ఉప అధ్యక్షుడిగా నరహరిగౌడ్, ఎడిటర్ మహమ్మద్, కోశాధికారి సంతోష్‌కుమార్ పరిచాతో పాటు సహాయకులుగా పలువురు ఎంపికయ్యారు. వారందరికి అదనపు ఎస్పీ ఆదిత్యసేన్ స్వయంగా వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు.

పాత గ్రంథాలయ భవనం కూల్చివేత

బరగఢ్, న్యూస్‌టుడే: బరగఢ్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా శిథిలావస్థలో ఉన్న బాలుంకి దాస్ స్మృతి పాఠాగార్ భవనాన్ని మున్సిపాలిటీ అధికారులు ఆదివారం కూల్చివేశారు. భవనం ప్రమాదస్థితిలో ఉండటంతో దాన్ని తొలగించాలని అగ్రగామి యువక్ సంఘం కోరిన వినతి మేరకు అధికారులు ఈ చర్య తీసుకున్నారు. 1946లో స్థాపించిన ఈ భవనం 2010 నుంచి మూతపడి ఉంది. ఈ స్థలంలో భవిష్యత్తులో కొత్త గ్రంథాలయం లేదా ప్రజా సదుపాయాన్ని నిర్మించాలని యోచిస్తున్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన

సిమిలిగుడ, న్యూస్‌టుడే: పుట్టగొడుగుల పెంపకంపై చైతన్య శిబిరం సిమిలిగుడకు చెందిన కుడిలో ఆదివారం నిర్వహించారు. సునాబెడకు చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ కౌన్సిల్(ఐసీఏఆర్) ఆధ్వర్యంలో గ్రామంలో స్వయం సహాయక సంఘం మహిళలకు సంస్థ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ట్రైబల్ సబ్ ప్లాన్ కింద గిరిజన మహిళలకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమీప గ్రామాల్లో పుట్టగొడుగులు పెంపకంపై క్షేత్ర పర్యటనకు తీసుకువెళ్లారు.

సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

విశ్వశాంతికి అఖండ బ్రహ్మయజ్ఞం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: నందపూర్ సమితి గొల్లూరు పంచాయతీకి చెందిన కుడుబు-బైలుగూడ గ్రామాల మధ్యలో ఉన్న అలేఖ దీక్షాధారుల మహిమా మందిరంలో ఆదివారం విశ్వశాంతికై అఖండ బ్రహ్మయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఒడిశా, ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల దీక్షాధారులు పాల్గొన్నారు. భువనేశ్వర్‌కు చెందిన బాబా రమేష్ చంద్ర, మల్కాన్‌గిరికి చెందిన లంబోధర్, ముసురీ నుండు భినాకర్, ఆంధ్రాకు చెందిన దేవేంద్ర, సుశాంత్‌లు పాల్గొని భక్తిశ్రద్ధలతో యజ్ఞం నిర్వహించారు.

కార్యక్రమంలో పాల్గొన్న దీక్షాధారులు

విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

బరగఢ్, న్యూస్‌టుడే: బరగఢ్ కళాశాల రహదారి పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు స్థానికులకు నిత్యం ప్రాణ సంకటంగా మారుతున్నాయి. ఆదివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్తు శాఖ అధికారులు ఈ సమస్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

స్తంభంపై చెలరేగుతున్న మంటలు

డోలో ట్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తా..

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: హోలీ పండగను పురస్కరించుకొని పర్లాఖెముండి పట్టణంలో డోలో ట్యాంక్ ప్రాంతంలో 23 వ డోలోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి, పురాధ్యక్షురాలు నిర్మల శెఠి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆరు రోజులు పాటు అక్కడ సందడి వాతావరణం నెలకొంటుంది. డోలోత్సవ మండపంతో పాటు ఆనకట్ట నిర్మాణ అభివృద్ధికి పూర్తి సహకారం అందజేస్తానని ఎమ్మెల్యే అన్నారు.

కళాకారులతో ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి

వృద్ధులపై చిన్న చూపొద్దు

వృద్ధులకు సత్కరిస్తున్న రాజేంద్రకుమార్ పాత్ర్

సిమిలిగుడ, న్యూస్‌టుడే: వృద్ధులపై చిన్నచూపు వద్దని సునాబెడ పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ పాత్ర్ అన్నారు. సునాబెడకు చెందిన సీనియర్ సిటిజన్‌ల సంఘ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ముఖ్యఅతిథిగా అధ్యక్షుడు రాజేంద్ర పాల్గొని ప్రసంగించారు. అనంతరం వృద్ధులను సత్కరించారు.

ప్రకృతి విపత్తులపై మాక్‌డ్రిల్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రకృతి విపత్తుల నియంత్రణపై తూర్పుకోస్తా రైల్వే మాక్‌డ్రిల్ నిర్వహించింది. భువనేశ్వర్‌లోని రైల్ సదన్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. భూకంపాలు, అగ్నిప్రమాదాలు వంటి విపత్తులు ఎదురైనప్పుడు వాటిని ఎలా ఎదుర్కోవాలన్న దానిపై అవగాహన కల్పించారు.

మంటల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆమె సేవలు ప్రశంసనీయం

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కుంద్ర సమితిలో చైల్డ్ డెవెలెప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీఓ)గా బాధ్యతలు నిర్వహించిన ఆరత మహాపాత్ర్ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సమగ్ర శిశు అభివృద్ధి సేవల (ఐసీడీఎస్) కార్యాలయంలో ఆమెకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సమితి వైద్యాధికారి డాక్టర్ గణేష్ ప్రసాద్‌దాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సీడీపీఓకు జ్ఞాపిక అందజేస్తున్న సిబ్బంది

టీకా కేంద్రాలు ప్రారంభం

కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

నవరంగపూర్, న్యూస్‌టుడే: ప్రస్తుత కాలంలో మహిళలు ఎక్కువగా గర్భాశయ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వాటి నివారణకు కేంద్ర, రాష్ట్రం హెచ్‌పీవీ టీకా కేంద్రాలను ప్రారంభిస్తుంది. నవరంగపూర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆదివారం ఎమ్మెల్యే గౌరీశంకర్ మాఝి, కలెక్టర్ శుభంకర్ మహాపాత్ర కేంద్రాన్ని ప్రారంభించారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా కుంద్ర సమితి సాగరగూడ గ్రామంలో విద్యాశాఖ తరపున సురేంద్ర సాయి దివ్య దృష్టి యోజన కింద సమితి స్థాయి కంటి పరీక్షల శిబిరం ఆదివారం జరిగింది. స్థానిక శిక్షణ కేంద్రం, లిమ నోడల్ ఉన్నత పాఠశాలల్లో శిబిరాలు జరగగా 370 మందికి పరీక్షలు చేశారు.

శిబిరంలో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మంచంపై ఆసుపత్రికి తరలింపు

ప్రసూతిని, నవజాత శిశువును మోసుకెళ్తున్న గ్రామస్థులు

నవరంగపూర్, న్యూస్‌టుడే: రహదారులు సరిగా లేక నేటికీ చాలా గ్రామాల్లో ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లక పోవటంతో ప్రసవించిన మహిళను, శిశువును మంచంపై కిలోమీటరు మోసుకెళ్లి అక్కడ నుంచి ఆటోలో ఆసుపత్రికి తరలించిన ఘటన నవరంగపూర్ జిల్లా పపదహండి సమితి మైదాల్పూర్ పంచాయతీ కుసుమగూడ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దామని ప్రధాన్‌కు ఆదివారం ఉదయం పురిటి నొప్పులు మొదలయ్యాయి. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ఆటోను పిలవగా ఇంతలో ఆమె ప్రసవించింది. రహదారి సరిగా లేక ఆటో గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉండిపోయింది. దాంతో గత్యంతరం లేక మోసుకెళ్లినట్టు గ్రామస్థులు తెలిపారు. వారికి ఆరోగ్య పరీక్షలు చేయించి తిరిగి ఇంటికి తీసుకు వచ్చినట్టు తెలిపారు. వర్షాకాలంలో అక్కడ ప్రజల దుస్థితి మరింత దారుణంగా ఉందని, యంత్రాంగం స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యువకుడి హత్య

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని మంచేశ్వర్ జీజీబీ కాలనీ ప్రాంతంలో శనివారం రాత్రి ఒక యువకుని హత్య జరిగింది. ఆసుపత్రులకు ఆక్సిజన్ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే రాహుల్ మహరణ (30) అనే యువకుడు రాత్రి 11.30 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా, దారికాసిన ముగ్గురు కత్తులతో పొడిచి పరారయ్యారు. కుప్పకూలిపోయిన ఆయనను కాలనీవాసులు క్యాపిటల్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం తెల్లవారు జామున ఆయన మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి భువనేశ్వర్ డీసీపీ జగన్మోహన్ మీనా విలేకర్లతో మాట్లాడుతూ సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుల కోసం గాలింపు జరుగుతోందని, కొంతమంది వాంగ్మూలం రికార్డు చేశామన్నారు.

పైక్‌మాల్‌లో గంజాయి రవాణా

బరగఢ్, న్యూస్‌టుడే: బరగఢ్ జిల్లా పైక్‌మాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిజూ ఎక్స్‌ప్రెస్ వే వద్ద ఆదివారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 17 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో హరిమాఝి అనే వ్యక్తిని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద గంజాయితో పాటు నగదు, ఒక మొబైల్, మోటార్‌సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి దిలీప్ కుమార్ చందన్ పాత్ర్‌పై విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

తనిఖీ చేస్తున్న పోలీసులు

బస్టాండ్ సమస్యలపై చర్చలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతంలో సింహాద్రి డైరీఫామ్‌లో ఆదివారం గజపతి ప్రైవేట్ బస్సు యూనియన్ అసోసియేషన్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోసారి సంఘం అధ్యక్షుడిగా చిత్రీ సింహాద్రి ఎన్నికయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో ఉన్న సమస్యలపై చర్చించారు.

సమావేశంలో మాట్లాడుతున్న సంఘం కార్యదర్శి ఇంజా వెంకటరమణ. పక్కన అధ్యక్షుడు చిత్రీ సింహాద్రి

దోపిడీని అడ్డుకున్న పోలీసులు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ

నవరంగపూర్, న్యూస్‌టుడే: దోపిడీ చేయడానికి సిద్ధంగా ఉన్న కొందరి దుండగులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద 5 చరవాణిలు, మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మైదల్పూర్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో కొందరు దుండగులు కారు వద్ద నిల్చుని దోపిడీకి సిద్ధమయ్యారు. ఇంతలో పోలీసులు వాళ్లని అదుపులోకి తీసుకున్నారు.

ఐఐటీని సందర్శించిన విద్యార్థులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ ఆంధ్రా ఉన్నత మాధ్యమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కెవి సుబ్రహ్మణ్యేశ్వర రావు నేతృత్వంలో శనివారం ఖరగ్‌పూర్ ఐఐటిని సందర్శించారు. సైన్స్ డేను పురస్కరించుకొని వీరు నెహ్రూ మ్యూజియంను సందర్శించారు. సైన్స్‌పై పలు అంశాలను తెలుసుకున్నారు. ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం వలన విద్యార్థులు కొత్త అంశాలు నేర్చుకుంటారని సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన పాఠశాల టీచర్ ఇన్‌చార్జ్ డాక్టర్ కర్రి తారకేశ్వరరావుకు అభినందించారు.

సైన్స్ మ్యూజియంలో విద్యార్థులు

మావోయిస్టుల డంప్ స్వాధీనం

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని మెయిన్పూర్ మై ప్రాంతంలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భద్రతా దళాలు భారీ విజయాన్ని సాధించాయి. అడవిలో దాక్కున్న మావోయిస్టుల నుంచి పోలీసులు దాదాపు రూ. 46 లక్షల నగదు, పెద్ద మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. గరియాబంద్ జిల్లా పోలీసులు, ధమ్తారి డీఆర్‌జీ ఇ-30 బృందం సంయుక్తంగా మెయిన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దగోబారా గ్రామంలోని సంపతి అడవిలో సోదాలు నిర్వహించింది. లొంగిపోయిన నక్సల్ నుంచి అందిన సమాచారం ఆధారంగా ఈ దాడి జరిగింది. నిషేధిత సీపీఐ(మావోయిస్ట్) సంస్థకు చెందిన కార్యకర్తలు వీటన్నింటిని కొండ ప్రాంతంలో పడవేస్తున్నట్లు తెలిసింది. స్వాధీనం చేసుకున్న ఆయుధాలు ఒక రైఫిల్, సుర్కారాయ్ ఇఎఫ్ఎల్ ఏకే-47 145 తుటాలు, 32 బీజీఎల్ సెల్, దాదాపు 200 లైవ్ మ్యాగిజిన్‌లు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ పెద్ద విజయం తర్వాత, సంబంధిత ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు మరియు శోధన కార్యకలాపాలను ముమ్మరం చేశారు.

పోలీసుల స్వాధీనంలో సామగ్రి

స్వాధీనం చేసుకున్న నగదు

గుమ్మ లోయలో లారీ బోల్తా

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం రాయగడలో 20కి.మీ దూరంలో కొరాపుట్-రాయగడ గుమ్మ ఘాట్ రోడ్డులో కర్రల లోడుతో వస్తున్న లారీ అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. ఈఘటనలో వాహన చోదకుడు, హెల్పరుకి గాయాలయ్యాయి. క్షతగాత్రులను రాయగడ జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందించారు. శనివారం జరిగిన ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ నుంచి రాయగడ సమీపంలో గల జేకే కంపెనీకి ముడిసరుకు కర్రల లోడు తీసుకొస్తున్న లారీ ఘాట్ రోడ్డు దిగుతుండగా అదుపు తప్పడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు.

సారాబట్టీలపై ఆబ్కారీ దాడులు



అధికారుల స్వాధీనంలో సారా తయారీ సామగ్రి

జయపురం, న్యూస్‌టుడే: జయపురం శాటిలైట్ యూనిట్, ఆబ్కారీ శాఖ సంయుక్తంగా సదర్ బ్లాక్ నీలగూడ ప్రాంతంలో ఆదివారం దాడులు నిర్వహించారు. 6 సారాబట్టీలపై దాడులు జరపగా దాదాపు రూ.2 లక్షలు విలువ చేసే సారాను ధ్వంసం చేశారు. ఓఐసీ శుబ్రత్ కేసరి హిరణ, ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్ నాయక్, శాటిలైట్ ఓఐసీ సుశాంత్ మహంకుడో తదితరులు పాల్గొన్నారు. అనంతరం చందన్ బాద్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా రవాణా చేస్తూ అధికారులకు ఓ వ్యక్తి చిక్కాడు. ఆయన స్థానిక ప్రాంతానికి చెందిన నరసింహ హోరిజాన్(26)గా గుర్తించి అరెస్ట్ చేశారు. అధికారుల రాకను గమనించి సారా కేంద్రాల యజమానులు పరారయ్యారు.

అదుపుతప్పిన ట్రక్కు

బరగఢ్, న్యూస్‌టుడే: జిల్లాలోని అత్తాబిరా ప్రాంతంలో 54వ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గోడభాగా-తురుమ్ రహదారి సైనా పుఖరీ మలుపు వద్ద బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. పోలీసుల సమాచారం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున సోన్‌పూర్ నుంచి గోడబాగా వైపు వెళ్తున్న బొలెరోకు ఎదురుగా ఒక ట్రక్కు రావడంతో చోదకుడు నియంత్రణ కోల్పోయాడు. దీంతో వాహనం రహదారి పక్కకు బోల్తా పడింది. ప్రమాద సమయంలో వాహనంలో ఉన్న ప్రయాణికులను స్థానికులు తీవ్ర శ్రమతో బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రుసుడా పాండి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

ఆకస్మిక తనిఖీలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ డివిజన్‌లో పలు రైళ్లలో శనివారం టికెట్ చెకింగ్ స్టాఫ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారని రైల్వే ప్రకటించింది. 235 కేసులు నమోదు చేసి రూ. 1,22,630 వసూలు చేసి ఆదాయం రైల్వేకి సమకూర్చారు.

జగన్నాథునికి మహాస్నానం

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రంలో ఆదివారం జగన్నాథునికి మహాస్నానం జరిగింది. ఉదయం గర్భగుడిలో దర్శనాలు జరుగుతుండగా, భక్తుడొకరు వాంతి చేసుకున్నాడు. ఇది గమనించిన సేవాయత్‌లు వెంటనే గర్భగుడి తలుపులు మూసేశారు. ఆనవాయితీ ప్రకారం పురుషోత్తమునికి మహాస్నానం, ఇతర సేవలు చేపట్టారు. దీంతో గంటపాటు భక్తుల దర్శనాలు నిలిచిపోయాయి.

మందిరంలో చోరీ

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ సబ్‌డివిజన్ దంతన్ పరిధిలోని కాలీకోథా గ్రామంలో ఒక ప్రాచీన కాళీ మందిరం ఉంది. ఆ మందిరం తలుపులు పగులగొట్టి శనివారం రాత్రి రూ. లక్షల విలువ చేసే వెండి, బంగారు ఆభరణాలు దొంగలు దోచుకుపోయారు. పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.

(c) eenadu

అధ్వానం.. ఆక్రమణలమయం

కోటబొమ్మాళి పరిధి పట్టుపురం గ్రామపంచాయతీ కేంద్రంలో శివాలయానికి సమీపంలో ఉన్న కొండాల చెరువు నిర్వహణకు నోచుకోక అధ్వానంగా మారింది. పట్టించుకునే వారే లేకపోవడంతో ఆక్రమణలకు గురవుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, పంచాయతీ నిధులతో బాగు చేయిస్తే వేసవిలో ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. సమస్యను ఎంపీడీవో ఫణీంద్రకుమార్ దృష్టికి తీసుకెళ్లగా. . చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, ఎత్తురాళ్లపాడు (కోటబొమ్మాళి)

ముందుకు వెళ్లాలా.. మురుగు దాటండి

నరసన్నపేట మేజర్ పంచాయతీ పసారువీధిలో రహదారిపైనే మురుగు నిలిచిపోతోంది. దీంతో రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దుర్వాసన, దోమల బెడదతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా పరిస్థితి ఇలాగే ఉందని, వ్యాధులు ప్రబలక ముందే అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని ఈవో దాక్షాయణి వద్ద ప్రస్తావించగా సిబ్బందికి తెలియజేసి పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, నరసన్నపేట

పనులు అసంపూర్ణం.. అవస్థలు నిత్యం

కొత్తూరు మండలం నివగాం కూడలి నుంచి పాతపాడు గ్రామానికి వెళ్లే రహదారి పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఐదేళ్లుగా ఇదే దుస్థితి నెలకొందని రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. కంకర వేసి వదిలేయడంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు. సమస్యపై పంచాయతీ రాజ్ ఏఈ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా.. త్వరలో రహదారి నిర్మాణం పూర్తి చేయిస్తామని స్పష్టం చేశారు.

– న్యూస్‌టుడే, కొత్తూరు

ముళ్ల పొదలు, కర్రే దిక్కు..!

సారవకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయి. స్థానిక అంబేద్కర్ కాలనీ వాసులతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు కళాశాల ఆవరణ నుంచి నిత్యం రాకపోకలు చేస్తుంటారు. గేటు లేకపోవడం వల్లే సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు చెబుతున్నారు. సిబ్బంది వేరే దారిలేక అడ్డుగా ముళ్ల పొదలు వేసి, కర్ర పెట్టారు. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యను జిల్లా విద్యా శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్తామని కళాశాల ప్రిన్సిపల్ సుశీల్‌కుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, సారవకోట

జిల్లాకు 26,700 దోమతెరలు

పార్వతీపురం, న్యూస్‌టుడే : మలేరియా వ్యాధి ఎక్కువగా ఉన్న పార్వతీపురం మన్యం, ఏఎస్ఆర్ జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం 60 వేల దోమ తెరలను పంపిణీ చేసింది. కేంద్రం నుంచి రసాయన పూతతో కూడిన నాలుగు లక్షలకుపైగా తెరలు జిల్లాకు రావాల్సి ఉండగా. . సాంకేతిక కారణాల నేపథ్యంలో జాప్యం జరుగుతోంది. ప్రస్తుతానికి 26,700 వచ్చాయి. వీటిని మలేరియా వ్యాధి తీవ్రంగా ఉన్న హైరిస్క్ గ్రామాలకు పంపిణీ చేయాలని ప్రతిపాదించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్న నేపథ్యంలో వారికి అందించాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో 70 ఆశ్రమ పాఠశాలలు, 12 గురుకులాలు, 20 వరకు పోస్టుమెట్రిక్ వసతిగృహాలు ఉన్నాయి. ఇందులో విద్యార్థులందరికీ అందిస్తే మలేరియా పీడిత ప్రాంతాలకు ఇవ్వడం సాధ్యం కాదు. ప్రస్తుతం వాటిని పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో భద్రపరిచామని, కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు పంపిణీ చేస్తామని వైద్యశాఖ వర్గాలు తెలిపాయి.

బాధిత కుటుంబానికి చేయూత

ఇచ్ఛాపురం గ్రామీణం, కవిటి, వజ్రపుకొత్తూరు గ్రామీణం,న్యూస్‌టుడే: కేదారిపురం గ్రామానికి చెందిన తెలుకుల హీరమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న గల్ఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. కవిటి మండలం బొరివంకలోని ఉద్దానం యూత్‌క్లబ్ సభ్యులు ఒరియా వీధిలోని మజ్జి గుణనిధి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి నెలకు సరిపడే నిత్యావసర సరకులు, నగదు అందజేశారు. వజ్రపుకొత్తూరు మండలం మురిపింటివానిపేటకు చెందిన ఎం.నిరోషా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో స్థానిక యువతరం సేవాసమితి సభ్యులు స్పందించి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

అలరించిన సంగీత విభావరి

బెజ్జిపుట్టుగలోని చక్రధర పెరుమాళ్ స్వామి డోలోత్సవాలు, చతుర్థ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం నిత్యపూజలు అనంతరం సాయంత్రం నిర్వహించిన శాస్త్రీయ సంగీత విభావరి శ్రోతలను ఆకట్టుకుంది. ఇందులో ఎస్వీ సంగీత నృత్య కళాశాల తితిదే కంచికామకోటి పీఠాధిపతి ఆస్థాన విద్వాంసులు లోల్ల జయరాం (గాత్రం), వెంకటకృష్ణ (వయోలిన్), సుబ్బారాయ పాల్గుణ్ (మృదంగం), హరిబాబు (ఘటం)తో అలరించారు. ఈ సందర్భంగా లోల్ల జయరాంను ఘనంగా సత్కరించారు.

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

మూడేళ్లుగా.. నీరుపయోగంగా..!

జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ రక్షిత తాగునీరందించాలనే లక్ష్యాన్ని వైకాపా హయాంలో నీరుగార్చారనేందుకు అద్దం పడుతోందీ చిత్రం. కొత్తూరు మండలం పారాపురం గ్రామంలో మూడేళ్ల కిందట తీసుకొచ్చిన పైపులు స్థానిక ప్రాథమిక పాఠశాల పక్కన ఇలా వృథాగా వదిలేశారు. నాటి నుంచి పనులు చేపట్టకపోవడంతో అవి ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాగర్ మాట్లాడుతూ.. పరిశీలించి, చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, కొత్తూరు

నైపుణ్యం సాధించు.. ఉపాధి వరించు

కొలువులు సాధిస్తున్న పలాస ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులు

న్యూస్‌టుడే, పలాస పట్టణం

డిగ్రీలు అంటే కేవలం పేరు పక్కన పెట్టుకునే అలంకారం కాదని, జీవన స్థిరత్వాన్ని సాధించేందుకు ఉపయోగపడే ముఖ్యమైన అర్హత పట్టా అనే విషయాన్ని ప్రాంగణ నియామకాల్లో సత్తాచాటి పట్టభద్రులు నిరూపిస్తున్నారు. గత రెండేళ్లుగా వివిధ రంగాల్లో కొలువులు సాధిస్తూ తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ పోటీపడుతున్నారు పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు. అధ్యాపకుల సహకారంతోపాటు ఆంగ్ల భాషా నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్ కోసం 'ఉన్నతి' అనే సర్టిఫికేషన్ కోర్సు నేర్చుకోవడంతో భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు.

● బెంగళూరుకు చెందిన ఉన్నతి అనే సంస్థ ఏడాదిలో 30 రోజుల పాటు కళాశాలకు వచ్చి సర్టిఫికేషన్ కోర్సు నిర్వహిస్తోంది. ఇందులో స్పోకెన్, సాఫ్ట్ స్కిల్స్, రెజ్యూమె తయారీ నేర్పుతారు. తద్వారా విద్యార్థుల ఆంగ్లభాషా నైపుణ్యాలు మెరుగుపడతాయి. ఇందులో ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు అందజేస్తారు.

టాటా ఎలక్ట్రానిక్స్‌లో ఉద్యోగాలకు ఎంపికైన పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

● 2025-26 విద్యా సంవత్సరంలో ఏడాదికి రూ.2 లక్షల 28 వేలు ప్యాకేజీతో టాటా ఎలక్ట్రానిక్స్‌కు 22మంది ఎంపిక కాగా, రక్షణ రంగానికి సంబంధించి అగ్నివీర్‌కు ముగ్గురు, కేంద్రప్రభుత్వ తపాలాశాఖకు ఇద్దరు ఎంపికయ్యారు. గతేడాది కొలువుల్లో 48 చేరారు.

ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నాం..

ఒక చేతికి డిగ్రీ పట్టా ఇస్తూనే మరో చేతిలో ఉద్యోగ నియామక పత్రాన్ని పెట్టేలా పట్టభద్ర బోధన ఉండాలనేది మా ఉన్నతాధికారుల సూచన. అందుకు తగ్గట్టుగానే ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు చూపిస్తున్నాం.

– జె.వెంకటలక్ష్మి, ప్రిన్సిపల్

కుటుంబానికి ఆసరా..

నేను బెంగళూరు సమీపంలోని హోసూర్‌లో టాటా ఎలక్ట్రానిక్స్‌లో చేరాను. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుండగానే ఉద్యోగం వచ్చింది. మా నాన్న ట్రాక్టర్ డ్రైవరు కాగా అమ్మ జీడి పరిశ్రమలో కార్మికురాలు. ఇకపై వీరికి ఆసరాగా నిలుస్తా. - ఎస్.లీలారాణి

గణిత క్విజ్ పోటీల్లో ప్రతిభ

మందస, న్యూస్‌టుడే : హరిపురంలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి గణిత క్విజ్ పోటీల్లో ప్రతిభచాటిన సిరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్ఎం ఎన్.తారకేశ్వరరావు అభినందించారు. వారికి ప్రోత్సాహక బహుమతులు అందించారు.

రబీలో యూరియా అందిస్తాం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: రబీలో వివిధ రకాల పంటలకు అవసరమైన యూరియా అందజేస్తామని వ్యవసాయశాఖ ఏడీఏ భవానీ శంకరరావు అన్నారు. శనివారం కవిటి పీఏసీఎస్‌లో యూరియాను పరిశీలించారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. అనంతరం జగతి, భట్టివానిపాలెం గ్రామాల్లో వరుసల్లో నాటిన రాగి పంటను పరిశీలించారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

పెందుర్తి (విశాఖపట్నం), న్యూస్‌టుడే: మోసం కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏపీలోని విశాఖపట్నం జిల్లా పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ఆ వివరాలిలా.. ఒడిశా రాష్ట్రానికి చెందిన నబీనా బాహా అలియాస్ నవీన్ నకిలీ దస్త్రాలు సృష్టించి భూమి అమ్మకానికి పన్నాగం పన్నాడు. ఈ మేరకు విశాఖ నగరానికి చెందిన దుర్గారావు ప్రసాద్‌బాబుకు రూ.28 లక్షల మేర మోసం చేసి పరారయ్యాడు. దీనిపై ప్రసాద్‌బాబు గత ఏడాది ఆగస్టులో పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి నిందితుడి కోసం గాలించిన పోలీసులు నిందితుడు ఒడిశాలోని సునాబెడ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. ఆ మేరకు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పురోగతిలో ప్రతిభ చూపిన ఎస్ఐ ఎన్.వి.భాస్కరరావును సీఐ అభినందించారు.

బోద రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

బలిజిపేట, గ్రామీణం: జిల్లాలో బోద వ్యాధిని నిర్మూలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి ఆదేశించారు. శనివారం పెదపెంకిలో పర్యటించి, వ్యాధిగ్రస్థులతో మాట్లాడారు. సచివాలయంలో జిల్లాస్థాయి అధికారులతో సమీక్షించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉద్యోగుల జీతాలను నిలిపివేయాలన్నారు. దోమల నియంత్రణకు లార్వా యూనిట్ కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా మలేరియా నివారణాధికారిణి మణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి విజయమోహన్, ఇన్‌ఛార్జి డీఎంవో రామచంద్రరావు, సబ్‌యూనిట్ అధికారి ఈశ్వరరావు, వైద్యాధికారిణి మాధురి పాల్గొన్నారు.

ఇంటి దగ్గరే.. ఆరోగ్య మందిరం

– న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య, సంక్షేమ కేంద్రాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. గతంలో కేవలం మాతా శిశు సంరక్షణకే పరిమితం కాగా.. ఆధునిక హంగులతో వెల్‌నెస్ సెంటర్లుగా మారి సేవలందిస్తున్నాయి. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సుమారు 482 కేంద్రాలు ఏర్పాటైనట్లు అధికారులు చెబుతున్నారు.

గుర్ల మండలం వల్లాపురంలోని క్లినిక్ భవనం

12 రకాల సేవలు..

సాధారణ వైద్యంతో పాటు 12 రకాల సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉన్నాయి. మాతా, శిశు సంరక్షణ, రక్తపోటు, మధుమేహం, 14 వ్యాధులకు సంబంధించిన నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. కొన్నిరకాల క్యాన్సర్లను ప్రాథమికంగా గుర్తించేందుకు యంత్రాలను సమకూర్చారు. 106 రకాల అత్యవసర ఔషధాలున్నాయి. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు అందిస్తున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో జిల్లా ఆసుపత్రుల్లోని వైద్య నిపుణులతో వీడియో కాల్ ద్వారా మాట్లాడేందుకు ఏర్పాట్లు సైతం చేశారు. యోగా, పౌష్టికాహారం, ఆహార సమతుల్యత తదితర అంశాలపై ఎప్పటికప్పుడు సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

సీహెచ్‌వోల ఆధ్వర్యంలో

ఈ కేంద్రాల్లో కమ్యూనిటీ హెల్త్ అధికారి(సీహెచ్‌వో), ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లు సేవలందిస్తారు. పరిధిలో ఉన్న గ్రామాల్లోకి వెళ్లి వివరాలను నమోదు చేయడం, గృహ సందర్శనలు, వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, ఉచితంగా మందులు ఇవ్వడం తదితర విధులు నిర్వహించాల్సి ఉంది. గర్భిణులపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నామని, ఎక్కడైనా వెళ్లి సేవలు పొందవచ్చని ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో కె.రాణి తెలిపారు.

2,500 మందికి ఒకటి..

గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్, పట్టణాల్లో అర్బన్ హెల్త్ క్లినిక్‌లుగా కొనసాగుతున్నాయి. ప్రతి 2,500 మందికీ ఒకటి చొప్పున అందుబాటులో ఉన్నాయి.

జలాలు కలుషితం.. పరీక్షలకు మంగళం

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

తేలుకుంచిలో మురుగు కాలువ వద్దే నీరు పట్టుకుంటున్న మహిళ

గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత నీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం మూడున్నరేళ్ల కిందట నీటి నాణ్యత పరీక్షల కిట్లు పంపిణీ చేసింది. జల్‌జీవన్ మిషన్ పథకం కింద ప్రతి పంచాయతీ పరిధిలో ఉన్న సచివాలయాలకు

సచివాలయాల్లో మూలకు చేరిన నీటి నాణ్యత కిట్లు

2024లో వీటిని అందజేసింది. చాలా చోట్ల వీటిని ఉపయోగించకుండానే పక్కన పెట్టేయడంతో రసాయనాలు, ఔషధాలు కాలం చెల్లి నిరుపయోగంగా మారాయి. దీంతో చాలా చోట్ల నీటి పరీక్షల్లేక కలుషిత జలం తాగుతూ రోగాల బారిన పడుతున్నారు.

❑ ప్రస్తుతం వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో పలు చోట్ల పారిశుద్ధ్య కార్యక్రమాలు లేక నీటి పరీక్షలు చేయక ఎక్కడ చూసినా అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. మరోవైపు పైపులైన్ల లీకేజీలతో నీటి వనరులు, బోరుబావుల చుట్టూ మురుగు చేరుతోంది.

● నియోజకవర్గంలో ఇచ్ఛాపురం-21, కంచిలి-31, కవిటి-22, సోంపేట-23 గ్రామ పంచాయతీలున్నాయి. అన్నింటికి ఒక్కో కిట్ చొప్పున ఈ ఏడాది జనవరిలో అందజేశారు. ఒక కిట్ ధర రూ.7,700. వీటి గడువు 2028 జనవరి వరకు ఉంది. కిట్ల వినియోగంపై సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. వాటిని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించకపోవడంతో నిరుపయోగంగా మిగిలాయి.

కేదారిపురం సచివాలయంలో అట్టపెట్టెల్లో కిట్లు

● ప్రతి పంచాయతీ పరిధిలో రోజూ నీటి పరీక్షలు నిర్వహించాలి. క్లోరినేషన్ చేయాల్సి ఉన్నా ఇక్కడ అలాంటివేమి జరగడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పరీక్షలు చేయడానికి సాంకేతిక సహాయకులు లేకుండా పోయారు. నీటిలో లవణాల లభ్యత, మడ్డితనం, సల్ఫర్, కాల్షియం ఏ మేరకు ఉన్నాయో పరీక్షించి లోపాలుంటే సరిదిద్దే ప్రయత్నం చేయకపోవడం ఇక్కడ గమనార్హం. చాలా చోట్ల ఉప్పు, ఫ్లోరైడ్ నీటిని తాగుతున్నారు. నాణ్యత లేని నీరు తాగడంతో ఎంతోమంది టైఫాయిడ్, విరేచనాలు, కామెర్ల వ్యాధుల బారిన పడుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..

ప్రతి సచివాలయ పరిధిలోని ఇంజినీరింగ్ సహాయకులకు నీటి పరీక్షలపై ఇదివరకే శిక్షణ ఇచ్చాం. ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించాం. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే పరిశీలిస్తున్నాం. శుద్ధ జలం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- విష్ణుమూర్తి, ఏఈఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఇచ్ఛాపురం

లీకవుతున్నా నిర్లక్ష్యమా..

కంచిలి మండలం సాగర్‌నౌగాం ప్రాథమిక పాఠశాల ఎదురుగా జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన పైపులైన్ ట్యాప్ మరమ్మతులకు గురికావడంతో తాగునీరు వృథాగా బయటకు పోతోంది. రోజూ నీటి సరఫరా చేసే సమయంలో ఇదే సమస్య నెలకొంటుందని, అధికారులు స్పందించి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రాజేష్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

తొట్టె ఇలా.. ఎరువు తయారీ ఎలా?

కవిటి మేజర్ పంచాయతీలో చెత్త సంపద కేంద్రానికి సమీపంలో సేంద్రియ ఎరువుల తయారీ కోసం నిర్మించిన వర్మీ కంపోస్టు తొట్టె పనికిరాని మొక్కలతో వృథాగా ఉంది. దీనిని శుభ్రం చేసి సేంద్రియ ఎరువులు తయారు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ ఈవో ఎం.రవిని వివరణ కోరగా పరిశీలించి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

వ్యర్థాలతో అనర్థం..!

వజ్రపుకొత్తూరు మండలంలోని పలు గ్రామాల ప్రధాన కూడళ్లు, రహదారుల పక్కన ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పారబోయడంతో దుర్వాసనతోపాటు, దోమలు విజృంభిస్తున్నాయి. దీనికి తోడు వాటిని పశువులు తిని మృత్యువాత పడుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో రమేష్‌నాయుడిని వివరణ కోరగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

ప్రయాణం.. నిత్య నరకం

ఇచ్ఛాపురం పట్టణం నుంచి మండలంలోని గ్రామాలకు, ఒడిశా వైపు వెళ్లేందుకు ఒకే ప్రధాన మార్గం ఉండటంతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ భారీ వాహనాల రాకపోకలతో రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. పోలీసులు నిషేధం విధించినా భారీ వాహనాలు ఇదే రహదారిలో వస్తున్నాయి. దీంతో స్థానికులతోపాటు వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటుచేస్తామని, భారీ వాహనాల అక్రమ చొరబాటును నియంత్రిస్తామని సీఐ ఎం.చిన్నంనాయుడు తెలిపారు. –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఫోన్ కొనివ్వడంలేదని బాలిక ఆత్మహత్య

రంగశాయిపేట, న్యూస్‌టుడే: తండ్రి ఫోన్ కొనివ్వడం లేదని బాలిక ఆత్మహత్య చేసుకుంది. మిల్స్‌కాలనీ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం కలహండి మండలం కోటాగాన్ గ్రామానికి చెందిన నాగ్ భరత్ కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌లో గల ఉర్సుగుట్ట ప్రాంతంలో ఉంటూ.. కుటుంబ సభ్యులతో అమ్మవారిపేటలోని ఇటుక బట్టీలో పనిచేస్తున్నారు. అతడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు. మూడో కుమార్తె(15) ఇటీవల చరవాణి కావాలని తండ్రిని అడగ్గా.. తర్వాత కొనిస్తానన్నారు. మనస్తాపం చెందిన ఆమె ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అదే సమయంలో ఇంటికి వచ్చిన తల్లి గమనించి చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పల్లెకు రథం.. స్వచ్ఛ పథం..!

– న్యూస్‌టుడే, జలుమూరు

సద్వినియోగం చేసుకుంటున్న పల్లె ప్రజలు

గ్రామ పొలిమేరలు, వీధుల చివర గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలు ప్రజారోగ్యంతో పాటు పర్యావరణానికి పెనుముప్పుగా మారుతుండేవి. పల్లెలను పరిశుభ్రంగా మార్చాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం బృహత్తర ప్రణాళిక రూపొందించింది. ప్రతి మండలానికి ఒక స్వచ్ఛ రథాన్ని మంజూరు చేసింది.

సుసరాం గ్రామంలో సరకులు తీసుకుంటున్న ప్రజలు

నెలకు రెండుసార్లు

ఈ వాహనం నెల రోజుల్లో 25 రోజుల పాటు ప్రతి గ్రామానికి రెండు సార్లు వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. సెలవు రోజుల్లో ఆ వాహనాన్ని ఇతర పనులకు వినియోగించకుండా నిబంధన అమలు చేస్తున్నారు.

నరసన్నపేట నియోజకవర్గ వివరాలు

మండలం	పంచాయతీలు	జనాభా
జలుమూరు	40	59,599
నరసన్నపేట	34	74,200
పోలాకి	31	65,622
సారవకోట	35	60,400

వాహనం నిర్వహణ బాధ్యతలు తీసుకున్న వ్యక్తికి నెలకు రూ.25 వేల వరకు వేతనం అందిస్తున్నారు. ప్రజల వద్ద ప్లాస్టిక్, ఇనుము, ఇతర వ్యర్థాలను కొనుగోలు చేసి వాటి విలువకు తగిన సరకులు అందిస్తున్నారు. ఇది గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రైవేటు వ్యక్తులు కంటే మంచి ధరకు కొనుగోలు చేయడంతో పాటు, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తుండటంతో సత్ఫలితాలు వస్తున్నాయి.

వ్యర్థాల ధరలు ఇలా

పనికిరాని వస్తువులు	కిలో.. రూపాయల్లో	అందించే సరకులు
ఇనుము	22	కొబ్బరి నూనె బాటిల్స్
పేపర్లు	12	సర్ఫ్ పౌడర్
పుస్తకాలు	12	బట్టల సబ్బులు
అట్ట పెట్టెలు	10	ఒంటి సబ్బులు
ప్లాస్టిక్ సీసాలు	5	టీ/కాఫీ పౌడర్
స్టీల్	15	టూత్ పేస్ట్
అల్యూమినియం	125	టూత్ బ్రష్‌లు

పరిశుభ్రమైన గ్రామాలుగా మారుస్తాం

స్వచ్ఛ రథాలతో గ్రామాలను పరిశుభ్రంగా మార్చేందుకు అన్ని విధాలా కృషిచేస్తున్నాం. ప్రతి మండలానికి ఒక వాహనం ఏర్పాటు చేశాం. అది ప్రణాళిక ప్రకారం గ్రామాల్లో తిరుగుతోంది. ముఖ్యంగా పొడి చెత్త సేకరించి, ప్రజలకు ఉపయోగపడే వస్తువులు అందజేస్తున్నాం. - గోపీబాల, డీఎల్‌పీవో, శ్రీకాకుళం

ఒడిశా బాలిక హత్య

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ఒడిశాకు చెందిన బాలిక హత్యకు గురైన ఘటన ఆదివారం తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిధిలో చోటుచేసుకుంది. గ్రామీణ సీఐ పీఎన్డీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని బొలంగీర్ జిల్లాకు చెందిన దంపతులిద్దరు మండల పరిధిలోని గూడూరు గ్రామ శివారులోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె(17) తన సోదరిలను చూసుకుంటూ వారి సొంత గ్రామంలోనే ఉండేది. ఈమెకు సామాజిక మాధ్యమాల్లో అదే ప్రాంతానికి చెందిన తబిరామ్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలో వారిద్దరు ఒకసారి పారిపోయారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు తబిరామ్‌ను గూడూరుకు తీసుకురావాలని, అతడి ప్రవర్తన బాగుంటే వివాహం జరిపిస్తామని చెప్పడంతో ఇద్దరు కలిసి రెండు నెలల క్రితం ఇక్కడికి వచ్చారు. తబిరామ్ సైతం వారికి సమీపంలోనే రేకుల షెడ్డులో నివాసం ఉంటూ ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బాలిక, తబిరామ్‌లు అతడి గదిలో ఉండగా అతడికి భోజనం ఇద్దామని బాలిక తల్లి అతడి షెడ్డు వద్దకు వెళ్లింది. షెడ్డు గడియకు తాడు కట్టి తబిరామ్ పారిపోతుండడంతో అనుమానం వచ్చి ఇటుక బట్టీల నిర్వాహకులను పిలిచి లోపలికి వెళ్లి పరిశీలించగా బాలిక అపస్మారక స్థితిలో ఉంది. తక్షణమే పట్టణంలో ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తబిరామ్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మూడు రోజుల క్రితం ఇద్దరి మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో మద్యం మత్తులో చున్నీతో లేదా తీగను బాలిక మెడకు చుట్టి హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

(c) eenadu

క్యాన్సర్ చికిత్సలో ఏఐ సేవలు..!

గుంటూరు జీజీహెచ్ నాట్కో సెంటర్‌లో ప్రయోగాత్మక అమలు

ఈనాడు, అమరావతి

ఆధునిక యంత్రాలపై రోగులకు సేవలందిస్తున్న వైద్యులు

క్యాన్సర్ చికిత్సలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సేవలు అందుబాటులోకి వచ్చాయి. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని నాట్కో సెంటర్‌లో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక ఒప్పందం చేసుకొని.. ఇక్కడికి వస్తున్న భిన్నమైన కేసులను దృష్టిలో పెట్టుకుని సొంతంగా డేటా రూపొందించుకోవడంపైనా వైద్య నిపుణులు దృష్టి పెట్టారు.

ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో క్యాన్సర్ రోగులకు మెరుగైన, కచ్చితత్వంతో కూడిన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఏపీ చాప్టర్‌ను ఏర్పాటు చేసింది. టాటా మెమోరియల్ సెంటర్, హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్(విశాఖపట్నం), నవ్య కేర్ నెట్‌వర్క్‌తో కలిసి నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ ఒప్పందం చేసుకున్నది. దీంతో ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌తో పనిచేసే ఎన్‌సీజీ పైలట్ ప్రాజెక్టు సేవలు గుంటూరు జీజీహెచ్‌లోని క్యాన్సర్ సెంటర్‌లో ప్రారంభమయ్యాయి. ఇందుకోసం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించి అందులో రోగుల వివరాలు, నివేదికలు పొందుపరుస్తున్నారు. ఇప్పటివరకు విశాఖపట్నం, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే క్యాన్సర్ చికిత్సలో ఆధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు వినియోగిస్తుండగా.. తాజాగా గుంటూరు, కర్నూలు ఆసుపత్రుల్లోనూ అందుబాటులోకి వచ్చినట్లయింది. గుంటూరు జీజీహెచ్ అంకాలజీ విభాగం నోడల్ సెంటర్‌గా.. విశాఖపట్నం, కాకినాడ, కర్నూలు ప్రభుత్వాసుపత్రులు అనుసంధానం చేశారు.

సొంత డేటాపై దృష్టి.. అయితే, ఎన్‌సీజీ పైలట్ ప్రాజెక్టులోని పోర్టల్‌లో కీలకమైన కేసులు గుంటూరు నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు వస్తున్న నేపథ్యంలో రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ దుర్గాప్రసాద్ నేతృత్వంలో వైద్యుల బృందం స్వయంగా ఏఐ సేవల ఆధారిత ప్రాజెక్టుపైనా దృష్టి పెట్టింది. ఇప్పటికే ఏపీలో తొలి సమగ్ర క్యాన్సర్ ఆసుపత్రిగా గుర్తింపు తెచ్చుకున్న గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ రోగులకు తమవంతు సేవలు అందిస్తోంది. ఇక్కడికి ఎక్కువగా గర్భకోశ, రొమ్ము, వక్షస్థల క్యాన్సర్ బాధితులు వస్తుండగా.. ఏఐ ఎన్‌సీజీ పైలట్ కేసులతో విభిన్నంగా ఉండటంతో వైద్యవర్గాలు ఆ కోణంలోనూ సునిశిత పరిశీలన చేస్తున్నారు. సొంత డేటా ఆధారిత ఏఐ సేవల్ని అందుబాటులోకి తీసుకురావడం వల్ల రోగాలను ప్రారంభంలోనే గుర్తించేందుకు, అత్యుత్తమ వైద్య విధానాలు అనుసరించేందుకు వీలుంటుందని ఇక్కడి క్యాన్సర్ వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

నేటినుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు

ఈనాడు, నరసరావుపేట: సోమవారం నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో సర్వం సిద్ధం చేశారు. నరసరావుపేటలో 5, సత్తెనపల్లిలో 2, చిలకలూరిపేటలో ఒకటి ఉన్నాయి. మొత్తం 11,123 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ నెల 2 నుంచి ప్రారంభమై 13తో ముగియనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరగనున్నాయి.

రంజాన్ వేళలు – న్యూస్‌టుడే, సత్తెనపల్లి
ఇఫ్తార్ : సాయంత్రం: 6:22 (సోమవారం)
సహరి : ఉదయం 5:10 (మంగళవారం)

లీకేజీలతో కలుషితం.. గొంతులోకి గరళం

ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం, మాచర్ల పట్టణం, సత్తెనపల్లి : మున్సిపాలిటీల్లో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. చాలాచోట్ల డ్రైనేజీల్లోనే పైపులైన్లు ఏర్పాటు చేయడంతో తరచూ నీరు కలుషితమవుతోందని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. దశాబ్దాల నాటి పైపులైన్లు కావడంతో చాలాచోట్ల లీకవుతున్నాయి. ఈ నేపథ్యంలో కలుషిత జలాలు సరఫరా అవుతుంటే కొళాయి నీరంటేనే బెంబేలెత్తే పరిస్థితి. ఆర్వో ప్లాంట్లు కూడా ప్రమాణాలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. వీటిని తనిఖీ చేయడం లేదు. కలుషిత నీటిని తాగడం వల్ల రెండేళ్ల కిందట పిడుగురాళ్ల, నడికుడిలో అతిసార ప్రబలి పదిమంది వరకు మృతిచెందారు. మరోసారి అలాంటి పరిస్థితులు రాకుండా మున్సిపల్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

✦ చిలకలూరిపేట శ్రీనివాసకాలనీలో 13 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న వాటర్‌ట్యాంకు నిర్వహణ గాలికొదిలేశారు. ప్రధానంగా ఓవర్‌హెడ్ ట్యాంకు వద్దే పైపులైన్‌లు లీకై నీటితో కుంటలా మారింది. ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి గృహాలకు సరఫరా చేసే పైపులు సైతం నీటిలో రోజుల తరబడి ఉండటంతో తుప్పుపట్టి పోయాయి. పట్టణంలో తరచూ లీకులవడం ఆ పైపుల ద్వారానే కలుషితనీరు ఇళ్లకు చేరుతోంది. పట్టణంలో ఎనిమిది ఓవర్ హెడ్ ట్యాంకర్ల ద్వారా ప్రతిరోజు 17.5 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు.

నరసరావుపేటలో మురుగు కాలువ పైనుంచి తాగునీటి పైపు

✦ పిడుగురాళ్లలో పాత శివాలయం, 10వ వార్డులో మురుగుల కాలువల పైనుంచి తాగునీటి పైపులు పోతున్నాయి. వీటిని మార్చాలి. సత్తెనపల్లిలో ప్రధాన రహదారి, వడ్డవల్లి, అబ్బూరు, రంగాకాలనీ రోడ్లలో తరచూ లీకేజీలు ఉంటున్నాయి.

✦ నరసరావుపేటలో పాతూరు శివాలయం, బరంపేట, కోట సెంటర్, వరవకట్ట, ఇస్లాంపేట, బాబాపేట కాలనీల్లో పైపులైన్లు మురుగుకాలువల పైనుంచి ఇళ్లకు పోతున్నాయి. పల్నాడు రోడ్డులో ఎస్ఎస్ఎన్ కాలేజీకి ఎదురుగా, సత్తెనపల్లి రోడ్డులో స్టేడియం వద్ద పైపులైన్లు దశాబ్దాల కాలం నాటివి. ఇక్కడ తరచూ లీకేజీలే. కొత్త పైపులైన్లు వేయకుండా వాటికే తరచూ మరమ్మతులు చేస్తూ కాలయాపన చేస్తున్నారు.

మున్సిపాలిటీల పరిధిలో ఇలా..

మొత్తం కుటుంబాలు:	తాగునీటి కనెక్షన్లు:
98,234	54,398
లీకేజీలతో ఉన్నవి: 18,231	

చాలాచోట్ల జాగ్రత్తలు మరిచారు

నీటిలో బ్యాక్టీరియా, వైరస్ నిర్మూలన కోసం ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి. ఉదయం, సాయంత్రం ట్యాంకులో బ్లీచింగ్ కలిపిన తర్వాత నీటిని సరఫరా చేయాలి. నెలరోజులకోసారి పూర్తిగా శుభ్రపరచాలి. శుభ్రం చేసిన తేదీ, మళ్లీ చేపట్టాల్సిన తేదీలను ట్యాంకులపై రాయాలి. వర్షపు నీరు చేరకుండా ట్యాంకు, సంప్‌వెల్‌పై మూతలు పెట్టాలి. వాల్వ్ పిట్స్ వద్ద నీరు, చెత్తాచెదారం లేకుండా చూడాలి. చాలాచోట్ల ఇవేమీ పాటించడం లేదు. మున్సిపాలిటీల్లో కలుషిత జలాల సమస్యపై నీటి సరఫరా విభాగం ఆర్డీ హరికృష్ణ మాట్లాడుతూ లీకేజీలు లేకుండా చేసి, ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ, క్లోరినేషన్‌తో సరఫరా అయ్యేలా చూడాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.

నగదు ప్రోత్సాహం పేరుతో దోపిడీలు

ఈనాడు, నరసరావుపేట

యడ్లపాడు మండలం ఉన్నవ జడ్పీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి తల్లిదండ్రులకు స్కాలర్‌షిప్ పేరిట ఫోన్ వచ్చింది. జిల్లా స్కూల్స్‌కు చెందిన ఉపాధ్యాయుడి పేరు చెప్పి రూ.50వేల స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేయాలి. అందుకు రూ.3 వేలు ఫోన్‌పే చేయాలని ఫోన్‌లో కోరారు. స్కూలుకు వచ్చి ఇస్తామని చెప్పినా వినిపించుకోలేదు. అనుమానం వచ్చిన విద్యార్థి స్కూలుకు వెళ్లి సదరు ఉపాధ్యాయుడికి విషయం చెప్పి ఆ నంబరు తనది కాదని.. తాను చేయలేదని, సైబర్ నేరాల్లో పనని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నరసరావుపేటకు చెందిన మహిళ ఎనిమిది నెలల గర్భిణి. ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించుకుంటూ ప్రతి నెలా మందులు వాడుతున్నారు. అందులో భాగంగా అదే ఆసుపత్రికి చెందిన ఓ నర్సు పేరిట ఫోన్ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం గర్భిణులకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోందని.. రూ.50 వేలు వస్తాయని. . అందుకు ముందు ప్రాసెసింగ్ ఫీజు కోసం రూ. 5వేలు ఫోన్ పే చేయాలని గర్భిణికి ఫోన్‌లో కోరారు. ఆసుపత్రికి వచ్చి ప్రత్యక్షంగా ఇస్తామని చెప్పినా వినకుండా పదేపదే ఫోన్లతో విసిగించారు.

స్కాలర్‌షిప్‌కు అర్హుల.. వెబ్‌సైట్‌పై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసి కొంత మొత్తం చెల్లించాలనే సందేశాలు.. కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా నగదు పొందే అవకాశం సందేశంలో లింక్ క్లిక్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలనే పోస్టులు ఇటీవల తరచూ వస్తున్నాయి. సైబర్ నేరగాళ్లు కొత్త పంథా ఎంచుకుంటున్నారు. మన అవసరం ఏంటో గుర్తించి.. అందుకు సాయం చేస్తున్నట్లు నటించి డబ్బులు గుంజే ప్రయత్నం చేస్తున్నారు. అందరూ అప్రమత్తంగా ఉంటే మంచిదని సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అత్యాశ వద్దు.. ఏవైనా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలంటే గ్రామ సచివాలయం, మీ సేవ కేంద్రాలకు వెళ్లడం ఉత్తమం. మనకు తెలియని వ్యక్తుల వద్ద, మన కంటికి ఎదురుగాలేని దరఖాస్తు చేయాలి. ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లను నమ్మొద్దు. నగదు ప్రోత్సాహకమైనా.. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలైనా ముందు అధికారులు, ఉద్యోగులకు తెలుస్తాయి. కాబట్టి ఫోన్‌లో ఎవరో చెప్పిన వాటిని నమ్మి బ్యాంకు ఖాతా వివరాలు వారి చేతికి చిక్కేలా చేసుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

ప్రహ్లాద వరద.. పరమాత్మ రూపా

మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా నృసింహుని కల్పవృక్ష వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల ముఖమండపం వద్ద స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి హారతులిచ్చిన అనంతరం స్వామి వారిని ఆలయ ప్రదక్షిణం చేయించారు. అనంతరం మాడ వీధుల గుండా తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

నృసింహుని గ్రామోత్సవం

పొన్నచెట్టుపై శ్రీకృష్ణుని అవతారంలో నృసింహుడు, చెట్టు కింద గోపికలు

పొన్న వాహన సేవ.. రాత్రి కీలకమైన పొన్నవాహన సేవ నిర్వహించారు. గోపికలు నదిలో స్నానమాచరిస్తుండగా శ్రీకృష్ణుని అవతారంలో ఉన్న స్వామివారు.. వారి వస్త్రాలను అపహరించే ఘట్టాన్ని కళ్లకు కట్టే విధంగా వాహనాన్ని అలంకరించారు. ఈ విధంగా దేహంపై గోపికలకు ఉన్న అభిమానాన్ని స్వామివారు తొలగించి వారికి మోక్షం ప్రసాదించారని, ఆ సన్నివేశాన్ని వివరిస్తూ పొన్న వాహన సేవ నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

ఉచిత ప్రయాణం.. దివ్యాంగులకు వరం

న్యూస్‌టుడే, సత్తెనపల్లి

దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారికి ఇచ్చిన హామీ అమల్లో భాగంగా సామాజిక భద్రత పింఛనును రూ.3 వేలు నుంచి రూ.6 వేలకు పెంచింది. తీవ్ర వైకల్యంతో మంచంపై కదల్లేని స్థితిలో ఉన్న వారికి రూ.15 వేలు అందిస్తోంది. దీనికితోడు వారికి ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని నిర్ణయించింది. ఈ నెలలోనే స్త్రీశక్తి పథకం అమలవుతున్న బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనుంది.

❖ దివ్యాంగులు ప్రస్తుతం 50 శాతం రాయితీతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. ఇక నుంచి ఆ నగదు కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా రాష్ట్రంలోని ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించే వెసులుబాటు కలగనుంది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న వారికి ఇది వర్తిస్తుంది. సదరం ధ్రువీకరణ పత్రం వెంట తీసుకెళ్లడం తప్పనిసరి. స్త్రీశక్తి కాకుండా మిగిలిన బస్సుల్లో వారికి 50 శాతం రాయితీ యథావిధిగా వర్తిస్తుంది.

❖ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద 35,465 మంది దివ్యాంగులు ప్రతినెలా పింఛను తీసుకుంటున్నారు. వీరంతా ఉచిత బస్సు ప్రయాణానికి అర్హులు. సదరం ధ్రువపత్రాలు పొంది ఇంకా పింఛన్లు అందుకోని వేలాదిమందికి కూడా ఉచిత ప్రయాణ అవకాశం ఉండనుంది. యూడైస్ ప్రకారం జిల్లాలో ప్రత్యేక అవసరాల పిల్లలు 3,363 మంది ఉన్నారు. వీరిలో భవిత కేంద్రాలకు 540 మంది హాజరవుతున్నారు. వీరికి కూడా ఉచిత బస్సు ప్రయాణం వర్తించనుంది. దివ్యాంగుల ఉచిత ప్రయాణానికి సంబంధించి ఉన్నతస్థాయి మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని డీపీటీవో అజితకుమారి తెలిపారు.

ఎన్నాళ్లీ జాగు..అందితే బాగు!

ఉమ్మడి జిల్లాలో 400 ఈ-ఆటోలకు ఎదురుచూపులు

కాలుష్యానికి చెక్ పెట్టాలనే ఉద్దేశం.. సంప్రదాయ ఇంధన వనరులను పరిరక్షించుకుంటూ, విద్యుత్తు వాహనాలను అందిపుచ్చుకోవాలన్న లక్ష్యం..వెరసి ఉమ్మడి గుంటూరు జిల్లాలో 400 ఈ-ఆటోల కొనుగోలుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ గతేడాది కసరత్తు మొదలుపెట్టింది. వీటి కొనుగోలుకు సిద్ధం కాగా.. జాప్యం జరుగుతుండడం చర్చనీయాంశమైంది.

ఈనాడు, అమరావతి: దేశంలో వాయుకాలుష్యం ఎక్కువైంది. ఏడేళ్ల కిందట గుంటూరునూ కాలుష్య నగరంగా గుర్తించారు. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం(ఎన్‌సీఏపీ) ద్వారా బాధిత నగరాల్లో 2029 కల్లా 70 నుంచి 80 శాతం మేర కాలుష్య స్థాయిలను తగ్గించాలనే లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళికలు రచించారు. అలా గుంటూరులోనూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నాలుగుచోట్ల ఎన్‌ఏఎంపీ స్టేషన్లను ఏర్పాటు చేసి గాలి నాణ్యత పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలోనే సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సూచనల మేరకు విభిన్న మార్గాల్లో సమస్యకు చెక్ పెట్టేందుకు సంకల్పించి..ఇప్పటికే 220 ఈ-ఆటోలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సమకూర్చారు. అయితే, అవి సరిగా నిర్వహించకపోవడం, నిధులు ఇవ్వట్లేదనే సాకుతో సంబంధిత ఏజెన్సీ మరమ్మతులకు గురైన వాటిపై దృష్టి పెట్టకపోవడంతో 100 వరకు మూలకు చేరి కనిపిస్తున్నాయి.

జీఎంసీలో ఈ-ఆటోలు

ఉమ్మడి జిల్లాలో మరో 400.. కాలుష్య కోరల్లో చిక్కిన నగరాలే కాదు..రాష్ట్రంలో 83 పుర, నగరపాలికలకు సంబంధించి 19.14 లక్షల మంది జనాభాకి గాను 1910 ఈ-ఆటోలు అవసరమని గతేడాది చివర్లో ప్రతిపాదించారు. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 400 కావాలని ప్రతిపాదించారు. వెయ్యి కుటుంబాలకు ఒక ఈ-ఆటో చొప్పున ఈ ప్రతిపాదన చేయగా..ఒక్కో ఈ-ఆటో వెయ్యి కిలోల వ్యర్థాలను తరలించాలన్నది నిబంధన. అయిదేళ్లపాటు ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ నిర్వహించేలా ఒక్కో ఈ-ఆటోను రూ.68,949 చొప్పున సరఫరా చేసేందుకు నాలుగు ఏజెన్సీలు ముందుకొచ్చాయి. అయితే, వాటిని ఖరారు చేసి, సరఫరా చేయించడంలో జాప్యం జరుగుతోంది. ఆ ప్రభావం చెత్త తరలింపుపై పడుతోంది. జీపీఎస్, కెమెరా, ఇతర అధునాతన సౌకర్యాలు వీటిలో ఉండేలా ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొనగా..గతేడాది ఆగస్టు నుంచి కసరత్తు జరుగుతోంది. డిసెంబర్ 12న ఏజెన్సీల వివరాలు పేర్కొంటూ ఉత్తర్వులు కూడా వెలువరించారు.

ఇదీ లెక్క ❖ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రతిపాదించిన 400 ఈ-ఆటోల్లో..గుంటూరు జిల్లా పరంగానే 284 ఉన్నాయి. ఇందులో మంగళగిరి-తాడేపల్లిలో 35, గుంటూరు నగరంలో 200, తెనాలిలో 49 అవసరమని పేర్కొన్నారు. ❖ పల్నాడు జిల్లాలో 51 అవసరమని పేర్కొనగా..ఇందులో నరసరావుపేటలో 20, మాచర్లలో 19, వినుకొండలో 12 కావాలని ప్రతిపాదనల్లో చూపారు. ❖ ఇక, బాపట్ల జిల్లాలో 65 అవసరమని చూపగా..ఇందులో బాపట్లలో 24, రేపల్లెలో 14, చీరాలలో 27 ఈ-ఆటోలు కావాలని ఆయా పురపాలికలు ప్రతిపాదించాయి.

నిర్వహణ కొరవడి.. నీటి నిల్వ తగ్గి..

వినుకొండకు ప్రధాన తాగునీటి వనరైన సింగరచెరువు సమ్మర్ స్టోరేజీ ట్యాంకును వ్యర్థాలు, పిచ్చిమొక్కలు కమ్మేస్తున్నాయి. 200 ఎకరాలతో విస్తరించిన ఈ చెరువును సాగర్ కాలువ నుంచి నీటితో నింపి పట్టణ దాహార్తి తీర్చుతున్నారు. చెరువు నిర్వహణ లేక పూడిక, గడ్డి, పిచ్చిమొక్కలతో నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది.
- ఈనాడు అమరావతి, న్యూస్‌టుడే వినుకొండ

అమరావతిలో కీలక అడుగు

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

తుళ్లూరు: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాకతో ఆదివారం అమరావతిలో సందడి నెలకొంది. ఏపీ జ్యుడీషియల్ అకాడమీ, ఏపీ హైకోర్టు అతిథి గృహ నిర్మాణాలకు శంకుస్థాపన.. నూతనంగా నిర్మించిన హైకోర్టు న్యాయమూర్తుల రెసిడెన్షియల్ ఎన్‌క్లేవ్‌ను ఆయన ప్రారంభించారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, సీఎం చంద్రబాబునాయుడు, పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు. సుమారు 2.05 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణం చేపడుతుండగా..120 మంది ట్రైనీ జడ్జిలకు శిక్షణ ఇచ్చేలా రూపకల్పన చేశారు. రాజధానిలో కీలక నిర్మాణాలకు అడుగులు పడడంతో స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

హైకోర్టు న్యాయమూర్తుల బంగళా నమూనా పరిశీలిస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నరసింహా, జస్టిస్ భట్టి, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, సీఎం చంద్రబాబు, హైకోర్టు న్యాయమూర్తులు

అయిదుగురికి ప్రాణదానం

చైతన్య (పాత చిత్రం)

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చిలకలూరిపేటకు చెందిన యువకుడు నల్లపనేని చైతన్య(25) తాను చనిపోతూ అయిదుగురికి ప్రాణదానం చేశారు. చిలకలూరిపేటకు చెందిన చైతన్య గత నెల 27న ద్విచక్రవాహనంపై వెళుతుండగా తాతపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మెదడుకు తీవ్రగాయం కావడంతో గుంటూరులోని ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో చేర్పించారు. అతని ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నం ఫలించలేదు. శనివారం బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. దీంతో జీవన్‌దాన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేషన్ బృందం అవగాహన కల్పించడంతో చైతన్య తల్లిదండ్రులు వెంకటశివ, ఆదిలక్ష్మి, సోదరుడు మానసకుమార్‌లు చైతన్య అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఆదివారం చైతన్య నుంచి కిడ్నీలు, లివర్, నేత్రాలను సేకరించారు. ఒక కిడ్నీ, లివర్‌లను గుంటూరు ఆస్టర్ రమేష్ ఆసుపత్రికి, మరో కిడ్నీని విజయవాడలోని అమెరికన్ కిడ్నీ ఇనిస్టిట్యూట్‌కు తరలించారు. రెండు కార్నియాలను విజయవాడ ఎల్వీ ప్రసాదు కంటి ఆసుపత్రికి తరలించారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆసుపత్రికి వచ్చి చైతన్య తల్లిదండ్రులు, సోదరుడిని పరామర్శించి వారు తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు చైతన్య కుటుంబసభ్యులను అభినందించారు.

అతివేగంగా వాహనాలు నడపడం వల్లనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనికి తోడు డ్రంకెన్ డ్రైవ్‌తోనూ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో పక్కన చెట్లకో.. డివైడర్లకో ఢీకొని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఒక్కోసారి అయితే ఎదురుగా వెళ్లే వాహనాలను ఢీకొని అవతలి వారిని కూడా ప్రమాదాల బారిన పడేలా చేస్తున్నారు.

వేగానికి ఏదీ కళ్లెం?.. తప్పదు భారీ మూల్యం

ఈనాడు, నరసరావుపేట: గ్రామ అంతర్గత రోడ్లపై కూడా ప్రమాదాలు జరగడం.. ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం మద్యం తాగి వాహనాలు నడపడం. పెదకూరపాడు నియోజకవర్గంలో అంతర్గత రోడ్లే అధికం. నెలకు నాలుగైదు రోడ్డు ప్రమాదాలు ఇక్కడ సాధారణమయ్యాయి. 2025లో ఈ నియోజకవర్గంలోనే తాగి వాహనాలు నడుపుతూ 10 మంది ప్రమాదాల బారినపడి చనిపోయారు.

ఈ ఏడాది ప్రారంభంలో చిలకలూరిపేట బైపాస్‌లో గణపవరం వద్ద ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన సంగతి తెలిసిందే. వీరు 100 స్పీడ్‌లో ఉన్నారు. అకస్మాత్తుగా ఎదురుగా భారీ వాహనం రావడంతో ఆ వేగాన్ని నియంత్రించుకోలేక బ్రేక్‌పై కాళ్లు వేసే క్రమంలో ఎక్స్‌లేటర్‌పై వేయడంతోనే ప్రమాదం జరిగినట్లు సాంకేతిక నిపుణులు తేల్చారు. అదే వారు పరిమిత వేగంలో ఉంటే అంతఘోర ప్రమాదం జరిగేది కాదు.

2018 చట్టం ప్రకారం ఆయా రోడ్లపై వాహనాల వేగం

వాహనం	ఎక్స్‌ప్రెస్ హైవే	4లైన్ల రోడ్లు	మున్సిపాలిటీ	ఇతర
కార్లు	120	100	70	70
బస్సులు	100	90	60	60
లారీలు	80	80	60	60
బైకులు	80	80	60	60
ఆటోలు	–	60	50	50

వీధుల్లో కూడా వేగమే .. ప్రస్తుతం చాలామంది వీధుల్లో కూడా అతివేగంతో వాహనాలు నడుపుతున్నారు. అకస్మాత్తుగా ఎవరైనా ఎదురైతే బ్రేక్ వేయడంలో విఫలమవ్వడం.. బండి అదుపు తప్పి వేరేవారిని ఢీకొట్టడం లాంటివి జరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

ఉగాదికి టిడ్కో ఇళ్ల పండగ

న్యూస్‌టుడే, వినుకొండ, నరసరావుపేట సెంట్రల్

లబ్ధిదారులకు అందజేసేలా ప్రభుత్వం చర్యలు

ఉగాది నాటికి టిడ్కో ఇళ్లు కొన్నింటిని లబ్ధిదారులకు అప్పగించాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. మరికొన్ని చోట్ల జూన్ నాటికి అందజేయాలని నిర్ణయించింది. చిలకలూరిపేటలో ఫేజ్-2, పిడుగురాళ్లలో ఫేజ్-1కు సంబంధించి 2304 లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే ప్రయత్నాల్లో అధికారులు ఉన్నారు. పదేళ్లుగా ఆయా పనులు నత్తను తలపిస్తున్నాయి. నిర్మాణ ఏజెన్సీల మార్పులతోనే వైకాపా కాలహరణం చేయగా కూటమి ప్రభుత్వం అర్హులకు అందజేయాలని పనులు మొదలు పెట్టింది. వీటికోసం లబ్ధిదారులు ఎన్నో ఆశతో ఎదురు చూస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా చిలకలూరిపేటకు 5520 మంజూరు కాగా అందులో ఫేజ్-1లో 4512 నిర్మాణం పూర్తిచేసి ఇప్పటికే అప్పగించగా ఫేజ్-2లో మిగిలిన 1008కి అవసరమైన రహదారులు, డ్రైనేజీ, విద్యుత్తు వంటి మౌలిక వసతులకు సంబంధించిన పనులు చేస్తున్నారు. పిడుగురాళ్ల మున్సిపాలిటీకి 2832 కేటాయించగా వాటిల్లో 1296 ఇళ్ల నిర్మాణం చివరి దశకు చేరింది. ఇక్కడ జనావాసాలకు అవసరమైన సదుపాయాల కల్పన పూర్తి చేసి ఈ రెండు చోట్ల వచ్చే ఉగాది నాటికి లబ్ధిదారులకు అప్పగించాలని లక్ష్యంగా నిర్ణయించారు.

జిల్లాలో మొత్తం టిడ్కో ఇళ్ల సంఖ్య: 12,512	
300 చదరపు అడుగులు:	6,496
365 ,,	: 4,032
430 ,,	: 1,984

మిగిలినచోట్ల మరింత ఆలస్యం.. జిల్లా కేంద్రం నరసరావుపేటలో 1504 ఇళ్లు పూర్తి అయినా అందులో 795 మాత్రమే లబ్ధిదారులకు అప్పగించారు. మిగిలిన 709 కేటాయించాల్సి ఉంది. సత్తెనపల్లిలో 160 నిర్మాణం పూర్తయినా మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఖాళీగా ఉన్నాయి. మాచర్ల 1056 చివరి దశ నిర్మాణంలో ఉన్నాయి. రహదారులు, నీటి సరఫరా ఇతరత్రా పనులు చేయాల్సి ఉంది. వినుకొండకు మంజూరైన 1440లో 720 పూర్తి కావచ్చాయి. నిర్మాణ దశలో నిలిచిన మిగిలిన 720గత ఆరేళ్లుగా అలాగే ఉన్నాయి. ఇందులో అత్యధిక భాగం జూన్ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ఉన్నామని టిడ్కో డీఈఈ సేతుబాబు తెలిపారు. మౌలిక వసతులకు సంబంధించిన పనులకు టెండర్లు పూర్తి చేసి కొన్నిచోట్ల మొదలయ్యాయని చెప్పారు.

అసిస్టెంట్ సేల్స్‌మెన్ కావలెను

బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, పిడుగురాళ్ళ, మాచర్లలో ఈనాడు దినపత్రిక కొరకు ప్రకటనలు సేకరించుటకు చురుకైన, చొరవ కలిగిన యువకులు కావలెను.
జీతము రూ. 20,000/- (అన్ని అలవెన్సులు కలిపి) మరియు ఆకర్షణీయమైన ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును.
అనుభవం ఉన్నవారికి అర్హతను బట్టి వేతనం ఉంటుంది.

అర్హతలు: వయస్సు: 19 సం॥ - 30 సం॥ మధ్య
* 10th or ఇంటర్ పాస్
* తెలుగు, ఇంగ్లీషు చదవడం, రాయడం వచ్చియుండాలి.

ఆసక్తిగల అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికేట్స్, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో తేది. 02-03-2026 సోమవారం ఉదయం 10 గం॥ల నుండి 4 గం॥ల లోపు స్వయంగా సంప్రదించండి.

CIEL HR inspired by science
C/o. ఈనాడు ఆఫీస్, 9వ లైను, అరండల్‌పేట, గుంటూరు
Ph: 800085 10541
Email: gnt_hr@eenadu.net

నీళ్లు రాకున్నా పన్ను కట్టాల్సిందే!

సాగర్ కాలువల చివరి భూములకు అందని సాగునీరు

యడ్లపాడు వద్ద నీరు పారని కొండవీడు మేజర్ కాలువ

యడ్లపాడు, న్యూస్‌టుడే: సాగర్ కాలువల చివరి ఆయకట్టుకు నీరు అందని భూముల రైతులకు నీటి తీరువా పన్ను విధించటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరుగాలం శ్రమించే రైతులకు ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయం కలిసి రావటం లేదు. పంటలు పండక, గిట్టుబాటు ధరలు లేక రైతులు ఏటా నష్టాలతో కష్టాల సుడిగుండం నుంచి బయట పడలేక కొట్టుమిట్టాడుతున్నారు. యడ్లపాడు మండలంలో సాగర్ కాలువల ద్వారా సాగునీరు అందక వర్షాధార పంటలు సాగు చేస్తున్న ఆయకట్టు భూముల రైతులకు నీటి తీరువా పన్ను కట్టాలంటూ రెవెన్యూ అధికారులు తాజాగా నోటీసులు అందజేస్తున్నారు.

మూడేళ్ల నీరు తీరువా కట్టాలి

కొండవీడు మేజర్, మైనర్ కాలువల పరిధిలోని చివరిలో ఉన్న ఉప్పరపాలెం, యడ్లపాడు, వంకాయలపాడు, కారుచోల, విశ్వనాథుని కండ్రిక గ్రామాలకు ఆయకట్టు భూములకు ఏళ్లుగా సాగు నీరు అందటం లేదు. అలాగే తుర్లపాడు మేజర్ కాలువ చివరిలో ఉన్న తుర్లపాడు, సందెపూడి, గణేశునివారిపాలెం గ్రామాలకు సాగునీరు అందటం లేదు. వంకాయలపాడు, ఉన్నవ మైనర్ కాలువల పరిధిలోని ఉన్నవ, వంకాయలపాడు, మద్దిపాలెం, కారుచోల గ్రామాలకు సాగునీరు అందటం లేదు. ఆధునీకరణ పేరుతో ఆయా కాలువలకు రూ.కోట్లు వెచ్చించి మరమ్మతులు చేసినా చివరి భూములకు నీరు అందటం లేదు. సాగు నీరు అందని గ్రామాలకు సైతం గత మూడేళ్ల నీటి తీరువా పన్ను విధించటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 13 రెవెన్యూ పంచాయతీల పరిధిలోని 14,792 ఎకరాల సాగు భూములకు ఈఏడాది నీటి తీరువా పన్ను రూ.16.21 లక్షలు వసూలు చేయాలని అధికారులు లక్ష్యం విధించగా ఇప్పటికి రూ.47,480 వసూలయ్యాయి.

ఇస్రో పిలుస్తోంది.. పదపద

యువికా-26కు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

ఇస్రో సందర్శనలో విద్యార్థి బృందం

విజయపురిసౌత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థి పీవీ నాగార్జునకు గతేడాది ఇస్రో యువికాలో పాల్గొనే అవకాశం లభించింది. యువికాలో భాగంగా అంతరిక్ష పరిశోధన కేంద్రాలను వీక్షించడం, సైన్సు, శాస్త్ర సాంకేతిక రంగంపై అవగాహన పెంపొందడంతో అక్కడి నుంచి వచ్చాక నాగార్జున సైన్సు ప్రాజెక్టుల రూపకల్పనలో ఎంతో రాటుదేలాడు. సొంతంగా యాప్‌లు రూపకల్పన చేసే స్థాయికి వెళ్లాడు. దిల్లీతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైన్సు వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్టులు ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నాడు.

ఇదో చక్కటి అవకాశం: యువికా-2026 (యువ విజ్ఞాన కార్యక్రమం)లో పాల్గొనేందుకు రండంటూ తొమ్మిదో తరగతి విద్యార్థుల్ని ఇస్రో ఆహ్వానిస్తోంది. సైన్సుపట్ల ఆసక్తి, అంతరిక్ష పరిశోధనలపై జిజ్ఞాస ఉన్న వారికి అరుదైన అవకాశమిది. 8వ తరగతిలో పొందిన మార్కులు, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీస్థాయిలో వ్యాస రచన, వక్తృత్వం పోటీలో చూపిన ప్రతిభ, స్పేస్, సైన్సు క్లబ్‌లలో సభ్యత్వం, క్రీడల్లో ప్రతిభ, గ్రామీణ ప్రాంత నేపథ్యానికి వెయిటేజీ మార్కులు ఇస్తారు. యువికాకు ఎంపికైన విద్యార్థులను మే నెలలో రెండు వారాలపాటు కేరళ, ఆంధ్రప్రదేశ్, డెహ్రాడూన్, అహ్మదాబాద్, మేఘాలయ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని స్పేస్ సెంటర్ల సందర్శనకు తీసుకెళ్తారు. ఎన్నో కొత్త విషయాలు నేర్పిస్తారు.

31 వరకు గడువు: రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఫిబ్రవరి 27వ తేదీ ప్రారంభమైంది. ఈ నెల 31వ తేదీతో గడువు ముగియనుంది. మే 11 నుంచి 22 వరకు యువికా-26 కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

రిజిస్ట్రేషన్ ఇలా.. తొలుత వెబ్‌సైట్‌లోకి వెళ్లి విద్యార్థి పేరు, ఈ-మెయిల్ ఐడీతో రిజిస్టర్ చేసుకోవాలి. మీ ఈ-మెయిల్‌కు ఇచ్చే లింకుపై క్లిక్‌చేసి వివరాలు సరిచూసుకోవాలి. లాగిన్ అయిన తర్వాత ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. క్విజ్ పూర్తయ్యాక వ్యక్తిగత, చదువుకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ ఫారంలో నింపాలి. మీ అర్హతను నిర్ధారించే ధ్రువపత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ★ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు యువికా-26లో పాల్గొనేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సైన్సు అధికారి ఎస్. రాజశేఖర్ కోరారు.

అలరించిన జాతీయ స్థాయి నాటిక పోటీలు

నాటికలో ఓ సన్నివేశం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: నరసరావుపేట రంగస్థలి 46వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక భువన చంద్ర టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్న 25వ జాతీయ స్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు హైదరాబాద్ వారు ప్రదర్శించిన అమ్మ చెక్కిన బొమ్మ, గేమ్ నాటికలు ప్రేక్షకులను అలరించాయి. రంగస్థల టీవీ, చలన చిత్రనటి, ద్రాక్షారామం పరిషత్ నిర్వాహకురాలు సరోజకు రంగస్థలి ప్రతిభా పురస్కారం అందజేశారు. ఉత్తమ నాటికలకు అతిథులు ఏపీ నాటక అకాడమి ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు బహుమతులు అందజేశారు. తొలుత పట్టణంలోని కేరిడ్జ్ ఇంటర్నేషల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెదేపా జిల్లా ప్రధానకార్యదర్శి నల్లపాటి రాము, నరసరావుపేట రంగస్థలి అధ్యక్షుడు మహబూబ్ సుభాని, వెంకట్రావు, పి.శ్రీనివాసాచార్యులు, మధుకుమార్ ,నల్లపాటి బోస్, మీరావలి పాల్గొన్నారు.

చిన్నారుల ప్రదర్శన

ఎలక్ట్రికల్స్ దుకాణంలో అగ్ని ప్రమాదం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్‌తో పట్టణంలోని గార్లపాడు బస్టాండు సెంటర్‌లోని ఎలక్ట్రికల్స్ దుకాణంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక మహాలక్ష్మి ఎలక్ట్రికల్స్, శానిటరి, ప్లంబింగ్ దుకాణం నుంచి ఒక్కసారిగా పెద్ద శబ్ధం వచ్చి, మంటలు రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. ఆ సమయంలో దుకాణం మూసి వేసి ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. అగ్నిమాపక శాఖ సిబ్బందికి తోడు స్థానికులు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. పలు వస్తువులను దుకాణం నుంచి బయటకు తీసుకొచ్చారు. ఆస్తి నష్టంపై అగ్నిమాపక, పోలీసు శాఖల అధికారులు ఆరా తీస్తున్నారు.

సహాయక చర్యల్లో స్థానికులు

శాలివాహనుల అభ్యున్నతికి ప్రభుత్వం సహకరించాలి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని శాలివాహన సంఘీయులు అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్తామని కుమ్మర శాలివాహన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని సీఏఎన్ కోటేశ్వరరావు కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పారెళ్ల బసవేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి బెజవాడ ఆదిశేషయ్య మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుమ్మర శాలివాహనుల అభ్యున్నతికి ప్రభుత్వం సహకరించాలని కోరారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఇందుర్తి శివన్నారాయణ మాట్లాడుతూ జిల్లాలో సంఘీయులకు ఏ సమస్య వచ్చినా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం ముందుండి పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పద్మనాగేశ్వరరావు, ఎన్.వెంకటేశ్వరరావు, నాగన్న, పైడికొండలు పాల్గొన్నారు.

జన గణనకు వడివడిగా అడుగులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ప్రామాణికమైన జన గణనకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ప్రతి 700 మంది జనాభాకు ఒక గణకుడిని (ఎన్యుమరేటర్) నియమించుకునే అవకాశాన్ని కల్పించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా జనాభా 20.42 లక్షలుకాగా 700 మందికి ఒక గణకుడి చొప్పున 2,918 మంది సేవలందించనున్నారు. అదేవిధంగా ప్రతి ఆరుగురు ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్ పర్యవేక్షణ ఉండనుంది. అలా 486 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షిస్తారు. జిల్లా, మండలస్థాయి అధికారులకు ఈనెల 6వ తేదీ నుంచి 8 వరకు నరసరావుపేటలో మూడ్రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కమిషనర్లు, ఏఎస్‌వోలు పాల్గొంటారు.

❖ ఎన్యుమరేటర్ల నియామకంలో తొలి ప్రాధాన్యం గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఉంటుంది. వారు సరిపడా లేకుంటే రెండో ప్రాధాన్యంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, మూడో ప్రాధాన్యంగా మున్సిపల్, రెవెన్యూ ఉద్యోగుల్ని నియమించనున్నారు. వారికంటే పైస్థాయి అధికారులను సూపర్‌వైజర్లుగా నియమిస్తారు.

ఛార్జ్ యూనిట్లు ఏర్పాటు : జిల్లాలో 28 మండలాలు, రెండు నగర పంచాయతీలు, ఆరు మున్సిపాల్టీలు ఉన్నాయి. వీటన్నింటిని కలిపి 36 ఛార్జ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఒక్కో ఛార్జ్ యూనిట్‌కు నలుగురు చొప్పున 144 మంది అధికారుల్ని నియమించారు. వారే ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకాల్ని చేపట్టనున్నారు. జిల్లా నుంచి ఫీల్డ్ ట్రైనర్లు 70 మంది, మాస్టర్ ట్రైనర్ ఒకరిని ఎంపిక చేశారు.

శిక్షణలతో మొదలు: ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు జిల్లా, మండలస్థాయి అధికారులకు శిక్షణ ఉండబోతుంది. 11 నుంచి 14 వరకు మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆ వెంటనే మాస్టర్ ట్రైనర్లు క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇస్తారు.

16 నుంచి స్వీయ గణన: ఈ నెల 16వ తేదీ నుంచి స్వీయ గణన అవకాశాన్ని ప్రజలకు కల్పించనున్నారు. పబ్లిక్ డొమైన్‌లో ప్రజలే గణకులుగా మారి తమ కుటుంబ వివరాలు నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. ఏప్రిల్ 1 నుంచి 30 వరకు ఫేజ్-1 గృహాల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. జిల్లాలో జన గణన జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్వో నారదముని తెలిపారు.

పల్నాడు అభివృద్ధి ప్రదాత కోడెల

విగ్రహావిష్కరణలో గొట్టిపాటి రామకృష్ణ, ఎమ్మెల్యే అరవిందబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జానీసైదా, కోడెల శివరాం తదితరులు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: రాష్ట్ర రాజకీయాలతో పాటు పల్నాడు ప్రాంత అభివృద్ధికి పాటుపడిన వ్యక్తి డాక్టర్ కోడెల శివప్రసాదరావు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని పెట్లూరివారిపాలెంలో కోడెల శివప్రసాదరావు, గ్రామాభివృద్ధికి కృషి చేసిన బొల్లు రామయ్యల విగ్రహాలను ఎమ్మెల్యే అరవింద బాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జానీసైదా, కోడెల శివరాంలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ పట్ల ఆయనకున్న తపన నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి కోడెల ఎనలేని కృషి చేశారన్నారు. జానీ సైదా మాట్లాడుతూ పల్నాడు ప్రాంత అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్న నాయకుడు కోడెల అని కొనియాడారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంతో పాటు సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కోడెల చేసిన కృషి మరువలేనిదన్నారు. కోడెల శివరాం మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానం కలిగిన వ్యక్తి డాక్టర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. ఆయన మరణించినా ప్రజల గుండెల్లో ఇప్పటికి బతికే ఉన్నారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, కొక్కిరాల శ్రీనివాసరావు, డాక్టర్ బొల్ల రఘుప్రసాద్, మండల, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మనసును తాకేదే అసలైన కవిత్వం

గుంటూరు సాంస్కృతికం: మనసును తాకేలా కవిత్వాన్ని రచించిన జల్ది విద్యాధరరావు అభినందనీయుడని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. బ్రాడీపేట 2/1లోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో అమరావతి సాహితీ మిత్రులు సంస్థ ఆధ్వర్యంలో జల్ది విద్యాధరరావు కవిత్వ సమాలోచన సభ ఆదివారం జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మానవీయత, నవ్యత విద్యాధరరావు కవితల్లో కనిపిస్తాయన్నారు.

బాలికల విద్యతోనే సమాజాభివృద్ధి

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: స్త్రీ లేకపోతే సృష్టే లేదని డీఎస్పీ హనుమంతరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సుబ్బరాయ, నారాయణ కళాశాల నుంచి పల్నాడు బస్టాండ్ వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. సుమారు 300 మందికి పైగా బాలికలు, మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. విద్యార్థులు మానవహారంలా ఏర్పడి స్త్రీ గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో ఐదేళ్ల చిన్నారి నుంచి అరవై ఏళ్ల వృద్ధుల పైనా అఘాయిత్యాలు జరుగుతున్నాయని, ప్రతి మహిళ తనను తాను రక్షించుకోవాలన్నారు. బాలికల విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మహిళలు విద్య, వ్యాపారం, ఉద్యోగాలతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. శిక్షణ డీఎస్పీ జయకృష్ణ, సీఐలు ఫిరోజ్, ప్రభాకర్, లోకనాథం, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు, న్యూస్‌టుడే: పోస్టల్ ఉద్యోగుల సమస్యలను మానవతా దృక్పథంతో ప్రభుత్వం పరిష్కరించాలని అఖిల భారత పోస్టల్ ఉద్యోగుల సంఘం సెక్రటరీ జనరల్ వాసిరెడ్డి శివాజీ కోరారు. గుంటూరులోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో గుంటూరు డివిజన్ పోస్టల్ ఉద్యోగుల జాతీయ సంఘం ద్వైవార్షిక సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శివాజీ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 8వ వేతన సవరణ సంఘంలో జీడీఎస్ ఉద్యోగులను చేర్చాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలను మార్పు చేయాలన్నారు. పోస్టల్ శాఖ ప్రైవేటీకరణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తున్నామన్నారు.

సజావుగా బ్రాగ్ సెట్

విద్యార్థిని వద్ద పరీక్ష పత్రం పరిశీలిస్తున్న డీసీవో శ్రీదేవి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, జూనియర్ ఇంటర్, ఐఐటీ-నీట్ శిక్షణ కళాశాల్లో ప్రవేశాలకు నిర్వహించిన బ్రాగ్ సెట్ సజావుగా జరిగింది. ఆదివారం ఉదయం 9.30 గంటలకు 5వ తరగతి, మధ్యాహ్నం 12 గంటలకు ఇంటర్.. 3 గంటలకు ఐఐటీ, నీట్ శిక్షణ పరీక్షలు జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా గురుకులాల సమన్వయకర్త ఎస్. శ్రీదేవి.. కాకుమాను, నరసాయపాలెం, నాగులపాలెం గురుకులాలు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ డిప్యూటీ ఏఎంవో శాంతివిశాల.. రామకృష్ణాపురం, సత్తెనపల్లి గురుకులాల్లోని కేంద్రాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. 5వ తరగతికి 1,615 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 1,351 మంది హాజరయ్యారు. ఇంటర్‌కు 2,270 మంది దరఖాస్తు చేసుకోగా.. 2,090 మంది హాజరయ్యారు. ఇంటర్ ఐఐటీ, నీట్ ప్రవేశపరీక్షకు 1,728 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 1,551 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు. గురుకులాల్లో 6, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 8న ప్రవేశపరీక్షలు నిర్వహించనున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులను రోడ్డుపై నడిపించిన పోలీసులు

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

నిందితులను రోడ్డుపై నడిపిస్తున్న పోలీసులు

గురజాల, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో నిందితులను పోలీసులు నడిరోడ్డుపై నడిపించారు. నేరాలు పాల్పడే వారికి ఇదో గుణపాఠం కావాలని హెచ్చరించారు. ఈ ఘటన ఆదివారం పల్నాడు జిల్లా గురజాలలో చోటుచేసుకుంది. వివరాలిలా.. గురజాల మండలం తేలుకుట్ల గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు బత్తుల ఏడుకొండలును గత నెల 25న వైకాపా మూకలు కర్రలు, రాడ్లతో దాడి చేశారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఆయనను పులిపాడు సమీపంలో అడ్డుకుని రెండు కాళ్లపై విచక్షణారహితంగా దాడి చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. సీఐ భాస్కర్, ఎస్సై వినోద్‌కుమార్ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. చల్లా గురుదేవ రాజు (చిన్నా), చల్లా ప్రేమ్‌కుమార్, బత్తుల శ్రీనివాసరావు, చల్లా అంజనేయులు, మొగిలి కోటేశ్వరరావు, చల్లా మణికంఠ, వేముల కిషోర్ అరెస్టయిన వారిలో ఉన్నారు. నిందితులను ఆదివారం గురజాల ప్రధాన రహదారిపై నడిపించుకుంటూ స్టేషన్ నుంచి కోర్టు వరకు తీసుకెళ్లారు. అనంతరం పిడుగురాళ్ల కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. వీరికి 15 రోజుల రిమాండు విధిస్తూ గురజాల సబ్‌జైలుకు తరలించారు. సీఐ మాట్లాడుతూ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డుపై నడిపించడం వంటి చర్యలతో నేరాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు.

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

మేడికొండూరు మండలం మందపాడు రెవెన్యూ పరిధిలో మందపాడు నుండి రావెల వెళ్ళు రోడ్డు ఫేసింగ్‌లో 5.1/2 ఎకరముల పొలం అమ్మకం. 80742 96586.

LEASE/ RENT

GENERAL

గుంటూరు ఏటుకూరు రోడ్డులోని వివాహ కన్వెన్షన్ దగ్గరలో 1576 చ||గ||లు గల ఖాళీ స్థలం అద్దెకు & గోడౌన్ కన్స్ట్రక్షన్ చేసి ఇవ్వబడును. ఫోన్: 98482 31040.

TO LET

COMMERCIAL

గుంటూరు లక్ష్మీపురం 3వలైనులో కమర్షియల్ బిల్డింగ్ 2ఫ్లోర్స్ ఈచ్ ఫ్లోర్ 1740sft. బ్యాంక్స్ / సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ ఆఫీసు / షోరూంలకు అద్దెకు. ✆ 9849900303.

JOBS

Wanted Male Transport Incharges Qualification any Degree, Age limit:30 to 45 years, Salary upto:20,000/-. Eligibility having experience in any Educational organisation will be preferable, Note: Must have valid LMV License & Good Knowledge about auto Gear & Manual gear. Working location: Master Minds College, Guntur. Contact: 89784 80430.

ప్రముఖ లోన్స్ ఏజెన్సీ నందు లోన్స్ చేయుటకు టెలికాలర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 97014 79569, 80081 00872.

రాజధాని రాయల్ భూమి డెవలపర్స్ నందు మార్కెటింగ్ చేయుటకు మార్కెటింగ్ ఎంప్లాయీస్ కావలెను. 10th పాస్ / ఫెయిల్, జీతం: 13000 to 60000 & ఇన్సెంటివ్. ✆ 70137 05436.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు క్లాస్ ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 12000 నుండి 14000 వరకు ఇవ్వబడును. (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22సం||రాల నుండి 40 సం||రాలు ఉండవలెను. వివరాలకు సంప్ర. ఫోన్: 9248733320.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీలో ఉద్యోగ ఖాళీలు: సీనియర్ బ్యాచ్ ఇన్‌ఛార్జీలు, లింగం: పురుషులు మాత్రమే, విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 25 సం||ల నుండి 45 సం||రాల మధ్య ఉండవలెను. నెలకు జీతం:16000 వరకు ఇవ్వబడును. వివరాలకు సంప్రదించగలరు. ఫోన్: 9248722246.

బిజినెస్ మేనేజర్స్/ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, ఫ్రెషర్స్, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న 30 సం||లలోపు వారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

మినీలారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

నలుగురికి గాయాలు

ధ్వంసమైన వాహనాలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండ మండలం విఠంరాజుపల్లి సమీపంలోని బాలాజీ ఎస్టేట్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై వేకువజామున 4.30 గంటల సమయంలో నరసరావుపేట నుంచి వినుకొండ వైపు వెళ్లే లారీని డ్రైవర్ సడన్ బ్రేక్ వేసి ఆపాడు. దాని వెనుక తెలంగాణలోని కామారెడ్డికి చెందిన అన్నదమ్ములు బండారు చిరంజీవి, నాగరాజు కుటుంబాలు మినీలారీలో ప్రకాశం జిల్లాలో జరిగే జాతరకు వెళ్తున్నారు. అప్రమత్తమైన డ్రైవర్ మినీలారీని ఆపి ప్రమాదం జరగకుండా చూశాడు. ఇంతలో దాని వెనుక వేగంగా వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు మినీలారీని ఢీకొట్టగా అది ముందున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో మూడు వాహనాలు దెబ్బతిన్నాయి. మినీలారీలో ప్రయాణిస్తున్న చిరంజీవి, నాగరాజు కుటుంబ సభ్యులు నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పోలీసులు రోడ్డుపై నిలిచిన వాహనాలను పక్కకు తీయించి రాకపోకలను పునరుద్ధరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుల్లారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం దొరమామిడి సమీపాన ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం ఆకుల గణపవరం గ్రామానికి చెందిన మొరిగిపూటి నాని(19) వర్జీనియా పొగాకు పనుల నిమిత్తం దొరమామిడి వచ్చాడు. బుట్టాయగూడెం- దొరమామిడి వైపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదానికి గురైనట్లు భావిస్తున్నారు. ఘటన స్థలంలో నాని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

91.9FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

మహిళల సొమ్ము స్వాహాపై కేసు

అమరావతి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో పొదుపు సంఘ మహిళల సొమ్ము కాజేసిన అక్రమార్కులపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో స్థానిక అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అమరావతి మండలంలో సుమారు రూ.2 కోట్ల మహిళల సొమ్ము ఖాతాల్లో జమ చేయకుండా కొంతమంది వెలుగు సీసీలు, యానిమేటర్లు కాజేశారు. ఈ విషయాన్ని 'ఈనాడు' కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చింది. దీనిపై విచారణ చేపట్టారు. కలెక్టర్ల సమావేశంలోనూ కలెక్టరు కృతికా శుక్లా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా.. అక్రమార్కులపై కేసు నమోదు చేసి, వారి ఆస్తులను జప్తు చేయాలని సూచించారు. ఈమేరకు అమరావతి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సీసీలు సతీష్, మరియరాణి, యానిమేటర్లు సాగరి, అచ్యుతకుమారి, రజని, విజయకుమారి, ప్రమీలా, దీపిక, అనితా, ఖాదర్‌బీ నిధులు కాజేశారని జిల్లా ప్రాజెక్టు మేనేజరు శ్రీనివాసులు, స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజరు నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అచ్చయ్య తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

బాణాసంచా దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

చిలకలూరిపేట గ్రామీణ: చిలకలూరిపేట మండలంలో జాతీయ రహదారి పక్కన పసుమర్రు పరిధిలో ఉన్న బాణాసంచా దుకాణాలను పోలీసులు ఆదివారం రాత్రి తనిఖీ చేశారు. శిక్షణ ఐపీఎస్ అధికారి నిరంజన్ ఆధ్వర్యంలో నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావు, చిలకలూరిపేట అర్బన్ సీఐ రమేష్, గ్రామీణ ఎస్సై అనిల్‌కుమార్ దుకాణాలను తెరిపించి సోదా చేశారు. లైసెన్సులు ఉన్నాయా.. లేవా? పరిమితికి మించి బాణాసంచా నిల్వ ఉంచారా? అగ్నిప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు తీసుకున్నారా.. లేదా అనే అంశాలను పరిశీలించారు. శిక్షణ ఐపీఎస్ అధికారి నిరంజన్ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. సోమవారం రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో అన్ని కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తామన్నారు.

కౌన్సిలర్‌పై కేసు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: సత్తెనపల్లి పట్టణం ఏడో వార్డు జనసేన పార్టీ కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్‌కుమార్ తన ఫేస్‌బుక్ ఐడీ ద్వారా వైకాపా మహిళలను అసభ్యకర పదజాలంతో వ్యాఖ్యలు చేశారని, వైకాపా మహిళ కోఆప్షన్ సభ్యురాలు స్వాతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. కేసుపై విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో / కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, రిటైల్ ధర - 177, చికెన్ విత్‌స్కిన్ - 257, చికెన్ స్కిన్‌లెస్ - 292.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -150 రిటైల్ ధర 177 చికెన్ విత్ స్కిన్ - 257 చికెన్ స్కిన్‌లెస్ - 292.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 167, 176, 187 చికెన్ విత్ స్కిన్ - 324 చికెన్ స్కిన్‌లెస్ - 334.

పూర్తి వివరాలతో అర్జీలు ఇవ్వాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీలు స్వీకరిస్తామన్నారు. అర్జీదారులు సమస్యలపై పూర్తి వివరాలతో అర్జీలు ఇవ్వాలన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే పాతరసీదు తీసుకురావాలని సూచించారు. అర్జీ స్టేటస్ ఎస్ఎమ్ఎస్, వాట్సాప్‌కు సమాచారం వస్తుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా http:///meekosam.ap.gov.in// లింక్‌లో అర్జీ దాఖలు చేయవచ్చని సూచించారు.

హత్య కేసు నిందితుల అరెస్టు

రాజుపాలెం: ఉప్పలపాడుకు చెందిన మల్లేశ్వరిని గత నెల 26న ఆమె ప్రియుడు నాగేశ్వరరావు, భర్త ఈశ్వరయ్య కలిసి హతమార్చిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై మృతురాలి కుమార్తె శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు గ్రామీణ సీఐ కిరణ్ కేసు నమోదు చేశారు. కాగా ఆదివారం నిందితులను అరెస్టు చేసి సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై మణికృష్ణ తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

నరసరావుపేట

● నరసరావుపేట ● వినుకొండ ● చిలకలూరిపేట

వైభవంగా ఏనుగుపాలెం అమ్మవారి తిరునాళ్ల

అలంకరణలో అమ్మవారు

వినుకొండ రూరల్: ఏనుగుపాలెంలోని శ్రీలక్ష్మి అమ్మవారి తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ప్రతిమను గ్రామంలో ఊరేగించారు. తిరునాళ్లకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు పొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రికి కోలాటం, నాటికలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యుత్తు ప్రభల వెలుగులు

ఈపూరు, న్యూస్‌టుడే: ఈపూరు బోడిమీద ప్రసన్నాంజనేయ స్వామి వారి తిరునాళ్ల ఆదివారం ఘనంగా జరిగింది. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈపూరు, ఊడిజర్ల, గోపువారిపాలెం, వనికుంట గ్రామాల ప్రజలు ఏర్పాటు చేసిన ఎనిమిది భారీ విద్యుత్తు ప్రభలు ఆకట్టుకున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

నూజండ్ల, న్యూస్‌టుడే: ? ముప్పరాజుపాలెంలో దర్శి వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డుపైన మురుగునీరు ప్రవహించడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులపై బురద పడుతోంది. **- వెంకట్రావు, ముప్పరాజుపాలెం** ✔ మురుగునీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకుంటాం. సైడు కాలువల్లో పూడిక తీయిస్తాం.- చిట్టిబాబు, కార్యదర్శి, ముప్పరాజుపాలెం.

? నరసరావుపేట పట్టణం బరంపేట చాకిరాలమిట్ట బజార్‌లో డ్రైనేజీ కాలువల్లో పూడిక తీయడంలేదు. మురుగు పేరుకుపోయి దోమల బెడద ఎక్కువైంది. **- కాశయ్య, స్థానికుడు** ✔ కాలువల్లో పూడిక తీయిస్తాం. **- రామకోటయ్య, పారిశుద్ధ్య అధికారి**
- న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

ప్రకృతితో మమేకం.. పంటలతో ఆరోగ్యం

పురుగుమందులు వాడకుండా ఉత్పత్తుల దిగుబడి ● ఆదర్శంగా నిలుస్తున్న రైతులు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎరువులు, పురుగుల మందులతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో కొందరు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపుతున్నారు. రసాయనాల వినియోగానికి దూరంగా, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించి సాగు చేస్తున్నారు. జిల్లాలోని 132 గ్రామాల్లో, 46 వేల మంది రైతులు 82 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం విధానంలో పంటలు పండించి ఆదర్శంగా నిలుస్తున్నారు.

సొంతంగా తయారు.. బీజామృతం, ఘన జీవామృతం, కాషాయం వంటివి తయారు చేసుకుని మొక్కల పెరుగుదలకు, చీడపీడల నివారణకు ఉపయోగిస్తున్నారు. రైతులు ఒకసారి శిక్షణ తీసుకుని సొంతంగా తయారు చేసుకుంటున్నారు. అమృతజలం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, వావిలాకుకషాయం, ఉల్లి కషాయాలు వినియోగించడం ద్వారా పురుగుమందుల అవశేషాలు లేని ఉత్పత్తులు పండిస్తున్నారు.

కషాయం తయారు చేస్తున్న శివమస్తాన్‌రావు

పదేళ్లుగా సాగు.. నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన దాడి శివమస్తాన్‌రావు పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మిరప, వరి సాగు చేస్తున్నారు. మిరపలో అంతర పంటలు వేస్తున్నారు. ఈ విధానంతో కొంచెం కష్టమైనా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండించుకుంటున్నారు. కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటూ ఆదాయాన్ని పొందుతున్నారు.

ఆరోగ్యం విలువ తెలిసి.. నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన కొర్రపాటి సాంబశివరావు కల్తీ, రసాయనాలు కలిసిన ఆహార ఉత్పత్తుల ద్వారా అనారోగ్యం పాలవుతున్నామని గుర్తించారు. ఎనిమిది సంవత్సరాల నుంచి తనకున్న 2 ఎకరాల్లో కుజీపటాలియా, మైసూర్‌మల్లి రకాల వరి సాగు చేస్తున్నారు. ఎకరాకు 27 బస్తాల దిగుబడి సాధిస్తున్నారు. తన కుటుంబ అవసరాలకై మిగిలినవి విక్రయించి ఆదాయం పొందుతున్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన బియ్యాన్ని అమ్ముతూ సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు.

కుజీపటాలియా రకం బియ్యం చూపుతున్న రైతు సాంబశివరావు

క్షేత్రస్థాయిలో సమస్యలకు పరిష్కారం

మహిళ సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలోనే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తెదేపా కార్యాలయంలో ఆదివారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ తాగునీరు, రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ, వీధిదీపాలు వంటి చిన్న సమస్యలు తన దృష్టికి రాకముందే పరిష్కరించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎక్కడా చిన్నలోపం కూడా ఉండకూడదన్నారు. ఎన్‌హెచ్ 167-ఎ విస్తరణ కోసం భూములు, ఇళ్లు, స్థలాలిచ్చిన రైతుల్లో కొందరికి పరిహారం అందిందని, మిగిలినవారికి కూడా త్వరలోనే అందుతుందన్నారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ వైద్య సేవ కింద చికిత్స పొందుతున్న రోగుల నుంచి కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు వివిధ సాకులతో అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నాయని నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ● అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల అభ్యున్నతికి పాటుపడింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాత్రమేనని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం కోసం ఒక్కో కేంద్రానికి రూ. 86. 60లక్షల వరకు ప్రత్యేకంగా నిధులు విడుదల చేశారన్నారు.

520 మందికి వైద్య సేవలు

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: పేద ప్రజలకు సేవ చేసేందుకే శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ స్థాపించి 27 ఏళ్లుగా సేవ చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర కంటి వైద్యశాల సహకారంతో గంగినేని కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 520 మంది వృద్ధులు హాజరు కాగా వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వీరిలో 370 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు ఫౌండేషన్ మేనేజర్ ఫణికుమార్ తెలిపారు. శిబిరంలో జీవీ మధుమేహ పరీక్ష చేయించుకున్నారు. కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, గంగినేని బాబు, పెమ్మసాని నాగేశ్వరరావు, బొంకూరి రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

విశ్వవ్యాప్తం.. తెలుగు నాటక కళా వైభవం

విజయ సంకేతం చూపుతున్న సురేష్‌బాబు, నాటక బృందం

యడ్లపాడు, న్యూస్‌టుడే: తెలుగు నాటక రంగ కళా వైభవం దేశం ఎల్లలు దాటి విశ్వ వ్యాప్తమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ నాటకోత్సవం 25వ భారత్ రంగ్ మహోత్సవ్-2026ను విజయవంతంగా నిర్వహించి చరిత్ర సృష్టించడంతో తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘంపై ప్రశంసల జల్లు కురిసింది. ఈ మేరకు దిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా(ఎన్ఎస్‌డీ) పంపిన ప్రత్యేక అభినందన పత్రాన్ని 'వేదిక' అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన ఈ వేడుకలు కేవలం ప్రదర్శనగానే కాకుండా ఒక సాంస్కృతిక ఉత్సవంలా సాగాయన్నారు. విదేశీ కళాకారులకు అందించిన వసతులు, సాంకేతిక తోడ్పాటు, క్రమశిక్షణతో కూడిన సమన్వయం అద్భుతమని, ఇది కళాకారుల గుండెల్లో శాశ్వత ముద్ర వేసిందని లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు.

'భూ అక్రమాల్లో బొల్లాకు శిక్ష తప్పదు'

మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు తదితరులు

వినుకొండ, న్యూస్‌టుడే: భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌ల వ్యవహారంలో వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి శిక్ష తప్పదని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. తెదేపా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బొల్లాపై ఆయన మండిపడ్డారు. ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం చేయలేని పట్టణ తాగునీటి పథకం, ఎన్నెస్పీ స్థలం అభివృద్ధిని తాను చేసి చూపిస్తానన్నారు. గంజాయి, పేకాట ఇతర చట్టవ్యతిరేక కార్యక్రమాల్లో పట్టుబడితే జైలు కెళ్లడం ఖాయమన్నారు. జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు, నూజండ్ల పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి ఆంజనేయరెడ్డి, తెదేపా పట్టణ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ● వైద్య ఖర్చుల నిమిత్తం 76 మందికి మంజూరైన రూ. 42. 38 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను జీవీ ఆంజనేయులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ● శావల్యాపురం మండలం కనుమర్లపూడికి చెందిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి మొక్కపాటి లిఖితకు రూ. 25వేలు సాయం అందించి అభినందించారు. గతనెలలో ఇండోనేషియాలో జరిగిన పోటీల్లో పాల్గొన్న ఆమె ఆదివారం మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలిశారు. పీఈటీ రాధాకృష్ణతో పాటు కనమర్లపూడి గ్రామ పెద్దలు ఉన్నారు.

ఖోఖో విజేతలకు అభినందన

క్రీడాకారిణులతో ప్రిన్సిపల్ నాతాని తదితరులు

నరసరావుపేట క్రీడలు ,న్యూస్‌టుడే: ఏఎన్‌యూ అంతర్ కళాశాలల మహిళా ఖోఖో పోటీల్లో పట్టణానికి చెందిన కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు ప్రతిభ చాటి ఛాంపియన్‌గా నిలిచిందని ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఎం. శిరీష, ఎం. హేమలత, బి. అలేఖ్య, ఎం. సౌదేశ్వరి, కె. అనుషబాయిలు ఏఎన్‌యూ విశ్వవిద్యాలయం ఖోఖో జట్టుకి ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులను ప్రిన్సిపల్‌తోపాటు వైస్ ప్రిన్సిపల్ సతీష్, తిరుపతిరావు, పీడీ ఆదిబాబు, కోచ్‌లు మహమ్మద్, షేక్ షకీలా అభినందించారు. ● ఏఎన్‌యూ అంతర్ కళాశాలల మహిళా ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన విక్టరీ డిగ్రీ కళాశాల క్రీడాకారిణులను డైరెక్టర్ మైనేడి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ పి. వేణుగోపాల్, కోచ్ అనిల్, పీడీ శ్యామ్‌సన్ తదితరులు అభినందించారు.

హక్కులపై మహిళలు అవగాహన పెంచుకోవాలి

ప్రదర్శనలో పోలీసులు, విద్యార్థులు, మహిళలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవాలని పట్టణ సీఐ ప్రభాకర్ అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఆదివారం గీతాంజలి పాఠశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను గుర్తించి లింగ సమానత్వం, మహిళా సాధికారత, హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు ఉదయలక్ష్మి, పుల్లారావు, నరేష్‌కుమార్, గీతాంజలి డైరెక్టర్ లక్ష్మణ కిషోర్, ఉపాధ్యాయినులు, వివిధ వర్గాల మహిళలు పాల్గొన్నారు.

పశువుల మేతకు భయం లేదు

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ వినియోగం పెరిగింది. పెద్ద యంత్రాలను ఉపయోగించి కోత.. నూర్పిడి ఏక కాలంలో నిర్వహించడంతో ధాన్యం గంటల వ్యవధిలో ఇళ్లకు చేరుతోంది. తెలికపాటి యంత్రంతో వరిగడ్డి చుట్టలుగా చుట్టి ఇళ్లకు తరలిస్తున్నారు. ఎక్కువ మంది వరికోత యంత్రాలతో పంటను కోయించి మిగిలిన గడ్డిని ఇలా భద్రపరుస్తున్నారు. రొంపిచర్ల మండలంలో రహదారి వెంట పొలాల్లో ఇలా గడ్డి చుట్టలు కనువిందు చేస్తున్నాయి. పంట అవశేషాలు పొలాల్లో వృథాగా పోకుండా భద్రపరుస్తున్నామని, ఈ గడ్డి ఏడాదంతా పశువులకు మేతగా ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు. **- నరసరావుపేట వ్యవసాయం**

భూమికి రంగేసినట్లు!

పల్లెల్లో భూమికి ఎర్రటి రంగేసినట్లుగా పలు ప్రాంతాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పల్నాడులో మిరప కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మిరప పంట సాగు చేసిన గ్రామాల్లో కాయలు కోసి గ్రేడింగ్ చేసేందుకు ఖాళీ స్థలాల్లో అన్నదాతలు ఆరబెడుతున్నారు. రహదారుల పక్కనే ఎర్ర తివాచీ పరిచినట్లు ఉండటంతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. **- నరసరావుపేట వ్యవసాయం**

నీరు ఎలా పట్టుకోవాలి!

నరసరావుపేట పట్టణంలో లింగంగుంట్ల కాలనీలో చేతి పంపు వద్ద చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. సమీపంలో ఉన్న పాఠశాల విద్యార్థులు నీళ్లు పట్టుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి నానిని వివరణ కోరగా త్వరలోనే సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగిస్తామని చెప్పారు. **- నరసరావుపేట టౌన్**

మూతపై అడుగేస్తే మూడినట్లే!

నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్ నుంచి షాలేమ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న కాలువపైన ఏర్పాటు చేసిన ఇనుప మూత కుంగి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు. మున్సిపల్ ఏఈ జ్యోతిని వివరణ కోరగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. **- మల్లమ్మ సెంటర్, నరసరావుపేట**

ట్రాఫిక్‌తో ఇక్కట్లు

నరసరావుపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్లపై నిలిపేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నా వాహనదారులు పట్టించుకోవడంలేదు. పట్టణంలోని పాండురంగస్వామి గుడి వీధి, మోర్ సెంటర్, కాకుమాను బజార్‌లో తరచూ వాహనరద్దీ నెలకొంటోంది. రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపితే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ లోకనాథం హెచ్చరించారు. **- మల్లమ్మ సెంటర్, నరసరావుపేట**

నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యుడు కృష్ణారావు తదితరులు

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన షేక్ దరియాసుల్తాన బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. విద్యార్థినికి బొల్లు రాజేశ్వరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రూ. 20వేలు ఆర్థికసాయాన్ని ట్రస్ట్ ఛైర్మన్ బొల్లు వెంకట కృష్ణారావు అందజేశారు. పేద విద్యార్థికి అండగా సాయం అందించినట్లు తెలిపారు. బొల్లు వెంకటేశ్వర్లు, మర్లపాటి రామకృష్ణ, బొల్లు రాజేంద్రప్రసాద్, జాస్తి గోపాలకృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేటసెంట్రల్: పట్టణంలోని కత్వా చెరువును ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వాగును వారు పరిశీలించారు. ఆవుల సత్రం పక్కన కత్వా చెరువులో కొందరు నిర్మాణాలు చేస్తున్నారని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటంలేదని, వెంటనే సంబంధిత ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమణ నిర్మాణాలు వెంటనే నిలుపుదల చేయాలన్నారు. అక్రమ నిర్మాణాలు అడ్డుకోకుంటే పట్టణంలో ప్రభుత్వ స్థలాలన్నీ కబ్జా చేస్తారని, వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి ఆక్రమణలను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో వై. వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఆలయ నిర్మాణ పనులు

యడ్లపాడు, న్యూస్‌టుడే: వంకాయలపాడులోని పురాతన శ్రీమల్లికార్జున ఆలయం పునర్నిర్మాణ పనులు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. సుమారు 200 ఏళ్ల నాటి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేయటానికి పూనుకున్నట్లు చెప్పారు.

కళాశాల ప్రారంభించాలని ధర్నా

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: ముస్లిం మైనార్టీల కోసం నిర్మించిన ఐటీఐ కళాశాల, హాస్టల్ భవనాలను వెంటనే ప్రారంభించాలని మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. వైకాపా ఆధ్వర్యంలో ఆదివారం కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (గార్డ్స్) ఆధ్వర్యంలో నరసరావుపేట రోడ్డులోని సాయి ప్రశాంతి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు ఆదివారం అన్నదానం చేశారు. సంస్థ సభ్యులు కొప్పుల బాబురావు కుమార్తె దీక్షిత కీర్తి పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో దాసరి చిట్టిబాబు, బత్తుల విక్రమ్, డాక్టర్ దార్ల బుజ్జిబాబు, కొప్పుల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పదోతరగతి చదువుతున్న గిరిజన వసతి గృహాల విద్యార్థులకు ఆదివారం విద్యా సామగ్రి అందజేశారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి గోవిందనాయక్, గిరిజన నాయకులు కోటనాయక్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

ఆలయ వార్షికోత్సవం

రొంపిచర్ల,న్యూస్‌టుడే: రొంపిచర్లలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. పూజల్లో ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళల సాధికారతతోనే సమాజాభివృద్ధి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: మహిళలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని అర్బన్ సీఐ పి. రమేష్ సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు ప్లకార్డులతో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో సీఐ మాట్లాడారు. మహిళల సాధికారతతోనే సమాజాభివృద్ధి చెందుతుందన్నారు. హక్కుల రక్షణ అందరి బాధ్యతన్నారు. గ్రామీణ సీఐ సుబ్బానాయుడు, ఎస్సైలు చెన్నకేశవులు, సోమేశ్వరరావు, మహిళ పోలీసులు, తెదేపా మహిళ నాయకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ఓంకార బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసరాలు అందజేశారు. రామిరెడ్డిపేటలోని సంస్థ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు నెలకు సరిపడా వస్తువులు ఇచ్చారు. అరిపిరాల వెంకట ఫణిధర్‌శర్మ, సాగి శివకృష్ణప్రసాద్, నంబూరి మురళి, పాలపర్తి మల్లికార్జున, భవాని శంకర్ తదితరులు ఉన్నారు.

శుక్లాల శస్త్రచికిత్సకు 250 మంది ఎంపిక

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చిలకలూకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: సామినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యడ్లపాడు మండలం బోయపాలెం ఆనంత లక్ష్మి నూలుమిల్లులో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కంటి సమస్యలతో బాధ పడుతున్న 500 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో శుక్లాల శస్త్రచికిత్సలకు 250 మందిని ఎంపిక చేశారు. వారికి ఉచితంగా వైద్యం, మందులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్ కుర్రా అప్పారావు మాట్లాడుతూ 11 ఏళ్లుగా సామినేని కోటేశ్వరరావు, ఆయన తల్లిదండ్రులు సామినేని పానయ్య, నాగరత్నమ్మల జ్ఞాపకార్థం ఏటా ఈ కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు విశ్రాంత మేనేజర్ కేవీల్‌రాజు, ట్రస్టు నిర్వాహకులు సామినేని కోటేశ్వరరావు, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఒకరికి గాయాలు

రొంపిచర్ల: వేగంగా వచ్చిన కారు బోల్తాపడి ఒకరికి గాయాలైన ఘటన ఆదివారం జరిగింది. హైదరాబాదు నుంచి మేదరమెట్లకు వెళ్తున్న కారు అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పరిధిలో రొంపిచర్ల సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రక్షణ దిమ్మెను ఢీ కొట్టింది. కారు సుమారు 20 మీటర్ల దూరంలో రోడ్డు పక్కన పంట కాలువ అంచున నిలిచింది. కారులో వ్యక్తిని స్థానికులు బయటకు తీశారు. ఆయన స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

మాణిక్యాలరావుకు నివాళి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కళాశాలల అధ్యాపకుల సంఘం (అక్టా) నేత, మాజీ ఎమ్మెల్సీ ఎంజే మాణిక్యాలరావు శతజయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాణిక్యాలరావు కుమారుడు ముఖ్య అతిథి ఎం. విజయ్‌కుమార్ మాట్లాడుతూ మాణిక్యాలరావు సేవలను కొనియాడారు. అధ్యాపకులకు యూజీసీ వేతనాల కోసం ఆయన కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, రాధాకృష్ణమూర్తి, గోపాలకృష్ణమూర్తి, అప్పిరెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ పథకాలు పునరుద్ధరణ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ పథకాలను ప్రభుత్వం పునరుద్ధరించిందని సహాయ కార్మిక కమిషనర్ మహబూబ్‌సుభాని తెలిపారు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు 1,16,927 మంది ఉన్నారని వారికి వర్తిస్తాయన్నారు. 18-60 ఏళ్ల వయసు కార్మికులు అర్హులని పేర్కొన్నారు. మార్చి 1 నుంచి పెళ్లి కానుక, ప్రసూతి ప్రయోజనం, సహజ మరణ ఉపశమనం పథకాలు అమలు చేస్తారన్నారు. సహజమరణం పొందిన వారి కుటుంబసభ్యులు ఏడాది లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వారికి రూ. 60వేలు సాయం అందుతుందన్నారు. మట్టిఖర్చుల సాయం రూ. 20 వేలు అందిస్తారన్నారు.

కంచె తొలగించేశారు!

వినుకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో రెండు నియంత్రికల వద్ద ఏర్పాటు చేసిన కంచెను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. ఇక్కడ ప్రతి రోజు 200 మంది వరకు పిల్లలు ఆటలాడుకోవడంతో పాటు పెద్దలు వాకింగ్ చేస్తున్నారు. భద్రత కోసం ఇనుప కంచెను రెండు నెలల క్రితం ఏర్పాటు చేశారు. ఆకతాయులు వాటిని తొలగించడంతో ప్రమాదం పొంచి ఉంది. క్రికెట్ ఆడినప్పుడు బాలు తెచ్చుకునేందుకు పిల్లలు నియంత్రికల వద్దకు వెళ్తున్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా మళ్లీ కంచె వేయాలని పలువురు కోరుతున్నారు. చర్యలు తీసుకుంటామని పట్టణ ఏఈ పిచ్చయ్య తెలిపారు.

ఉగాది పంచాంగం ఆవిష్కరణ

పుస్తకం ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు

వినుకొండ, న్యూస్‌టుడే: బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ పరాభవనామ సంవత్సర ఉగాది పంచాంగం పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యానగర్ 4వ వీధిలోని రఘు మాస్టార్ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంచాంగం పుస్తకాన్ని రూపొందించిన శ్రవణ్ కుమార్‌ను శాలువా కప్పి సన్మానించారు. అనంతరం నాలుగు పేద కుటుంబాలకు ఉచితంగా నిత్యావసరాలను పంపిణీ చేశారు. అనంతరం నియోజకవర్గ క్యాటరింగ్ అధ్యక్షుడిగా ఎన్నికైన గోపాలుని నాగరాజును సన్మానించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం పెద్దలు గాలి శ్రీనివాసరావు, జీవీ మాధవరావు, నాగేశ్వరరావు, భద్రయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

పల్నాడు జిల్లా, నాదెండ్ల (మం) గ్రామానికి చెందిన కోయల వరలక్ష్మి (లేటు) W/o పోతురాజు (బొప్పూడి గ్రామం) రెవెన్యూకు సంబంధించిన ఒరిజినల్ పొలం దస్తావేజు నెం:1101/2004 ఇంటి నుండి టూ వీలర్ మీద చిలకలూరిపేట MRO ఆఫీసుకి వెళ్ళుతుండగా దారిలో పోయినవి. దొరికినవారు ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

99896 31594

(c) eenadu

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను తయారు చేసి, ప్రదర్శించారు. ప్రిన్సిపల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ధ్యానం.. ఆరోగ్యదాయకం

దాచేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక నారాయణపురంలో శ్రీసుదర్శన పిరమిడ్ ధ్యాన కేంద్రం 15వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిరమిడ్ వ్యవస్థాపకులు బండ్ల లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధ్యానం ఆరోగ్యదాయకమన్నారు. అందరూ శాకాహారులు కావాలని కోరారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందాలంటే ధ్యానం, సాత్విక ఆహారం అవసరమని సూచించారు. తొలుత పట్టణంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

సత్తెనపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి పట్టణ సీఐ నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మహిళలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు, మహిళా పోలీసులు, విద్యార్థినులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ర్యాలీకి హాజరయ్యారు. మహిళా సాధికారత, భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రభుత్వాసుపత్రి డాక్టర్ సుజాత, సీడీపీవో శ్రీలత, ఎస్సైలు పవన్ కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? కారంపూడి నుంచి నేరుగా గుంటూరుకు ఆర్టీసీ బస్సు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. **- పవన్, కారంపూడి**
✓ ప్రస్తుతం పిడుగురాళ్ల నుంచి వినుకొండ వరకు షిఫ్ట్ బస్సులు నడుపుతున్నాం. బస్సుల కొరత నేపథ్యంలో కొత్త రూట్లు వేయలేని పరిస్థితి. **- కోటేశ్వరరావునాయక్, డిపో మేనేజర్, పిడుగురాళ్ల** - న్యూస్‌టుడే, కారంపూడి

? ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో మైకులను ఎక్కువ ధ్వనితో పెట్టడం వల్ల చదువుకోవటానికి ఇబ్బందిగా ఉంది. **- విద్యార్థులు, ఉప్పలపాడు**
✓ తక్కువ ధ్వని పెట్టేలా కమిటీ సభ్యులకు మహిళా పోలీసుల ద్వారా అవగాహన కల్పిస్తాం. **- మణికృష్ణ, ఎస్సై** - న్యూస్‌టుడే, రాజుపాలెం

అమరులకు నివాళి

పిడుగురాళ్ల: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అమరులైన వారికి పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆదివారం ఆ సంఘం నాయకులు నివాళులర్పించారు. నాయకులు వర్ల అగస్టీన్, మీసాలబాబు తదితరులు పాల్గొన్నారు.

లైమ్‌సిటీ కుర్రాడు.. చదరంగంలో మొనగాడు

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు

ఓపెన్ టోర్నీలో సత్తా

జానపాడురోడ్డు, పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

సాధించిన పతకాలు, కప్పులతో లోకేష్

లైమ్‌సిటీ పిడుగురాళ్లకు చెందిన కుర్రాడు చదరంగం పోటీల్లో సత్తా చాటుతున్నాడు. చిన్నప్పట్నుంచి తండ్రితో కలిసి సరదాగా చదరంగం ఆడుతూ మక్కువ పెంచుకున్నాడు. తెలుగు మండల, జిల్లా స్థాయి పోటీల్లో రాణించడంతో తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడెంలోని చెస్ అకాడమీలో చేర్పారు. అక్కడి శిక్షణతో రాటుదేలాడు. ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ స్థాయి ఓపెన్ టోర్నీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నాడు. అతడే పిడుగురాళ్ల పట్టణానికి చెందిన రెడ్డి లోకేష్. గత నెల 21న హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 24 నిమిషాల్లో 60 బోర్డులను ఆడి ప్రపంచ రికార్డు సొంతం చేసుకున్నాడు. ప్రభుత్వం సహకారం అందిస్తే మరింత రాణిస్తానని, గ్రాండ్‌మాస్టర్ కావాలన్నదే లక్ష్యమని అతడు చెబుతున్నాడు.

లోకేష్ తిరుమల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. తొలిసారి 2024లో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి అందుకున్నాడు. తరువాత జిల్లాస్థాయిలోనూ ప్రథమ స్థానంలో నిలిచాడు. అప్పట్నుంచి వెనుతిరిగి చూడలేదు. గతేడాది విజయవాడలో జరిగిన ఇంటర్నేషనల్ (ఫిడే) టోర్నీలోనూ అండర్-13 విభాగంలో పాల్గొని బహుమతి అందుకున్నాడు. విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీలోనూ సత్తా చాటాడు. ఆలిండియా ఓపెన్ 1600 ఫిడే రేటింగ్ పోటీలు హైదరాబాద్‌లో జరగ్గా.. అందులో పాల్గొని తృతీయ బహుమతి దక్కించుకున్నాడు. కేరళలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ టోర్నీలో జాతీయ స్థాయిలో తొమ్మిదో స్థానంలో నిలిచాడు. అలాగే తాడేపల్లిగూడెం, మాచర్ల, నరసరావుపేటలో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటాడు.

నిధులొచ్చాయ్.. సమస్యలు తీరుతున్నాయ్

దుర్గి, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టారు. రెండు విడతల్లో 15 గ్రామ పంచాయతీలకు రూ.4.50 కోట్లు ఉపాధి నిధులు మంజూరయ్యాయి. మొదటి విడతలో 24 పనులు రూ.2.50 కోట్లతో పూర్తి చేశారు. రెండో విడతలో 22 పనులను రూ.2 కోట్లతో చేపట్టారు. పనులు శరవేగంగా జరుగుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దుర్గిలో మురుగు కాలువ నిర్మాణం

యరపతినేని నిర్ణయంపై హర్షం

మాచవరం, న్యూస్‌టుడే: గురజాల నియోజకవర్గంలో పనిచేసే ఉద్యోగులు పదవీ విరమణ పొందినా, బదిలీ అయినా తన ఖర్చులతో ఆత్మీయ సభ ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రకటించడంపై ఏపీ జేఏసీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల సేవలు గుర్తించి గౌరవించడం ద్వారా పరస్పర విశ్వాసం, సమన్వయం పెంపొందుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల మధ్య ఆదర్శప్రాయ సంబంధానికి ఇదొక నిదర్శనమన్నారు. భవిష్యత్తులోనూ కొనసాగాలని ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు, గురజాల, పిడుగురాళ్ల తహసీల్దార్లు శ్రీనివాసరావు, మధు తదితరులు పేర్కొన్నారు.

ఆహార అలవాట్ల మార్పుతో సంపూర్ణ ఆరోగ్యం

కస్తలలో మెగా వైద్య శిబిరానికి స్పందన

శిబిరంలో మాట్లాడుతున్న వైద్యులు పవన్‌కుమార్ చెరుకూరి

కస్తల (అచ్చంపేట), న్యూస్‌టుడే: బీపీ, షుగర్ నియంత్రణ, ఆహార అలవాట్లలో మార్పులతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ పవన్ కుమార్ చెరుకూరి తెలిపారు. ఆదివారం కస్తల గ్రామంలో డాక్టర్ మనీషా నూకవరపు స్మారకార్థం మనీషా నూకవరపు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని నూకవరపు వెంకటేశ్వరరావు, భారతి ప్రారంభించారు. పది విభాగాలకు చెందిన వైద్యులు రోగులకు సేవలందించారు. 250 మందికి రక్త పరీక్షలు, 150 మందికి ఈసీజీ, 210 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. తెదేపా గ్రామ అధ్యక్షుడు కొర్లకుంట శ్రీధర్, బాలినేని సదాశివరావు తదితరులు పాల్గొన్నారు. ఏపీ హెల్త్‌కేర్ సర్వీసెస్ ప్రతినిధి సుధాకర్ పర్యవేక్షించారు.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: అధికారులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు.

మహిళ నుంచి అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం

కార్యకర్తలకు తెదేపా అండ ఉంటుందని, అందుకు బీమా పథకమే నిదర్శనమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఇటీవల కారంపూడి మండలం [illegible]కి చెందిన [illegible], వెల్దుర్తి మండలం శిరిగిరిపాడుకు చెందిన చిన్న శివ నాగిరెడ్డి రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. వారిద్దరి కుటుంబాలకు బీమా పథకం ద్వారా రూ.5 లక్షల చొప్పున చెక్కులు మంజూరు కాగా, ఆదివారం వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. అలాగే నియోజకవర్గంలోని 53 మందికి సీఎం సహాయనిధి చెక్కులను అందించారు.

కార్యదర్శులపై వేధింపులు తగవు

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: గ్రామపంచాయతీ పన్నుల వసూలులో నిరంతరం శ్రమిస్తున్న పంచాయతీ కార్యదర్శులను జిల్లా, మండల స్థాయి అధికారులు వేధించడం తగదని కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. మాచర్ల మండలం చింతలతండాకు చెందిన కార్యదర్శి సత్యనారాయణ పన్నులు వసూలుకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు గాయపడ్డాడని, అతడికి సెలవు ఇచ్చేందుకు అధికారులు ఒప్పుకోకపోవడం సరికాదన్నారు. కార్యదర్శులపై పని ఒత్తిడి పెరిగిందన్నారు.

మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్

కష్టపడి పనిచేస్తున్నా ఇబ్బందులు పెట్టడం బాధాకరమన్నారు. ఇదే తీరు కొనసాగితే కమిషన్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఉద్యమించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు జాన్‌పీరా, రాజేష్, రహమాన్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

దుర్గి, న్యూస్‌టుడే: దుర్గి జడ్పీ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు 1985-86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పరీక్ష సామగ్రి అందజేస్తున్నారు. 115 మందికి పెన్నులు, అట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతరామయ్య, రమేష్, పూర్వవిద్యార్థులు మౌలాలి, భావన్నారాయణ, నరసింహారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ముప్పై మూడు సంవత్సరాల క్రితం వారందరూ కలిసి చదువుకున్నారు. అనంతరం మాధ్యమిక, ఉన్నత విద్యను వివిధ ప్రాంతాల్లో పూర్తి చేసి, దేశ విదేశాల్లో స్థిరపడ్డారు. వివేకానంద రెసిడెన్సియల్ పాఠశాలలో 1993-94లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం స్థానిక కె.కన్వెన్షన్ హాలులో సమావేశం అయ్యారు. చాలా కాలం తరువాత అందరూ కలుసుకోవడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయింది. నాటి తీపి గుర్తులు, మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. తమ ఉన్నతికి తోడ్పడిన ప్రిన్సిపల్ సీతారామిరెడ్డి, ఉపాధ్యాయులు అప్పిరెడ్డి, నాగేశ్వరరావు, దాసు, రమణ, నళినిలను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ముఖ్యఅతిథిగా గుంటూరు మిర్చియార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి హాజరయ్యారు.

డీఈఈ సేవలు ప్రశంసనీయం

నాగరాజు దంపతులను సన్మానిస్తున్న ఇంజినీర్లు

రెంటచింతల, న్యూస్‌టుడే: విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలో 35 ఏళ్లుగా నాగరాజు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జెన్‌కో సీఈ విశ్వేశ్వరరావు అన్నారు. పదవీ విరమణ పొందిన డీఈఈ నాగరాజుకు ఆదివారం సన్మానసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు రంగ అభివృద్ధిలో డీఈఈ సేవలను సద్వినియోగం చేసుకుంటామన్నారు. ఎస్ఈ వెంకటరమణ, ఇంజినీర్లు శ్రీనివాసన్, అప్పాజీ, డిస్కం, ట్రాన్స్‌కో, జెన్‌కో ఇంజినీర్లు పాల్గొన్నారు.

రజకుల నిరసన

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం కొమ్మెర గ్రామంలో మల్లన్న జాతరలో రజకులపై జరిగిన ఘటనకు నిరసనగా పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాది కంభంపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ మల్లన్న జాతరలో రజకులపై జరిగిన ఘటన హేయమైన చర్య అన్నారు. కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చిన్నారి మౌనిక తల్లిదండ్రులకు న్యాయం చేయాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎ.బాలయ్య, ఎం.రాజు, టి.శ్రీనివాసరావు, దివ్య, నాసరయ్య, యలమందమ్మ, పెద్దిరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చెరువు బాగు పట్టదా

గురజాల నగర పంచాయతీ పరిధిలోని లక్ష్మీ టాకీస్ సెంటర్‌లో హద్దుల చెరువు గడ్డి, జమ్ముతో నిండిపోయింది. నీరు పాచిపట్టి దుర్వాసన వస్తోంది. మరోవైపు ఆక్రమణలకు గురవుతోంది. అధికారులు దృష్టి సారించి చెరువును శుభ్రం చేసి, చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

సూచిక బోర్డు ఏర్పాటు చేయండి

దుర్గి-ఓబులేశునపల్లి ప్రధాన రహదారిపై ఎర్ర వాగుపై 50 ఏళ్ల కిందట వంతెన నిర్మించారు. ప్రస్తుతం రక్షణగోడలు శిథిలావస్థకు చేరాయి. ఇది మూలమలుపులో ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సూచిక బోర్డు ఏర్పాటు చేసి, ప్రమాదాలు నివారించాలని, రక్షణ గోడ నిర్మించాలని వాహన చోదకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, దుర్గి**

ఇదేందన్నా.. చెప్పినా వినరేమన్నా..

మిరప కూలీల బతుకులు ప్రమాదపుటంచులో ఉన్నాయి. మిరప కోతలకు కర్నూలు తదితర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించారు. వారిని పొలాలకు వాహనాల్లో పరిమితికి మించి తరలిస్తున్నారు. ఆటోలు, ట్రాక్టర్లలో కిక్కిరిసి, వేలాడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఏ మాత్రం అదుపు తప్పినా ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. పోలీసులు కౌన్సిలింగ్ ఇస్తున్నా వాహన చోదకుల తీరు మారడం లేదు.

- న్యూస్‌టుడే, పెదకూరపాడు

రోడ్డెక్కిన మురుగు

పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో డ్రైనేజీ కాలువ పొంగిపొర్లింది. మురుగు నీరంతా రోడ్డుపైకి చేరింది. దీంతో వాహన చోదకులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మురుగు కాలువ శుభ్రత పట్టించుకోకపోవడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- న్యూస్‌టుడే, సత్తెనపల్లి

స్తంభాన్ని సరిచేయండి

మండలంలోని కోలగుట్ల - కంచరగుంట మధ్య ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. ఈదురు గాలులు వీస్తే కిందపడేలా ఉందని, ఆ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో తీగెలు తెగి త్రుటిలో ప్రమాదం తప్పిందని గుర్తు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని కోరారు.

- న్యూస్‌టుడే, దుర్గి

సాగర్ జలాలు వృథా

నాగార్జునసాగర్ జలాలు కాలువల ద్వారా పంటల సాగుకు విడుదల చేస్తున్నారు. అవసరం లేని కాలువలకు నీరు విడుదల చేస్తుండటంతో వృథాగా వాగుల్లోకి చేరుతున్నాయి. ఏ కాలువకు ఎంత అవసరమో గుర్తించి, విడుదల చేస్తే వృథా కాదు. కొన్ని మైనర్ల పరిధిలో మెట్ట పంటలు సాగు చేస్తున్నారు. పది రోజులకు ఒకసారి తడులు ఇస్తున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు ఇవన్నీ పట్టించుకోకుండా విడుదల చేస్తున్నారు. **- పిడుగురాళ్ల, న్యూస్‌టుడే**

విశ్వవ్యాప్తం.. తెలుగు నాటక కళా వైభవం

యడ్లపాడు, న్యూస్‌టుడే: తెలుగు నాటక రంగ కళా వైభవం దేశం ఎల్లలు దాటి విశ్వవ్యాప్తమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ నాటకోత్సవం 25వ భారత్ రంగ్ మహోత్సవ్-2026ను విజయవంతంగా నిర్వహించి చరిత్ర సృష్టించడంతో తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘంపై ప్రశంసల జల్లు కురిసింది. ఈ మేరకు దిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా(ఎన్ఎస్‌డీ) పంపిన ప్రత్యేక అభినందన పత్రాన్ని 'వేదిక' అధ్యక్షుడు ముత్తవరపు సురేష్ బాబు ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన ఈ వేడుకలు కేవలం ప్రదర్శనగానే కాకుండా ఒక సాంస్కృతిక ఉత్సవంలా సాగాయన్నారు. విదేశీ కళాకారులకు అందించిన వసతులు, సాంకేతిక తోడ్పాటు, క్రమశిక్షణతో కూడిన సమన్వయం అద్భుతమని, ఇది కళాకారుల గుండెల్లో శాశ్వత ముద్ర వేసిందని లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని గురజాల ఇన్‌ఛార్జి డీఎస్పీ వెంకటరమణ అన్నారు. ఆదివారం మాచర్లలోని బాలికోన్నత పాఠశాలలో మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యాభ్యాసంలో ఉత్తమ ఫలితాలు సాధించి, ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. కార్యక్రమంలో సీఐలు వెంకటరమణ, నఫీజ్ బాషా, ఎస్సైలు సంధ్యారాణి, వెంకట్రావు, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు సూచనలిస్తున్న ఇన్‌ఛార్జి డీఎస్పీ వెంకటరమణ

బాధితుడికి ఆర్థిక సాయం

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరు మండలం విప్పర్ల గ్రామానికి చెందిన చిలకా నెహెమ్యా ఊపిరితిత్తుల జబ్బుతో బాధపడుతున్నాడు. అతడి వైద్యం కోసం చిలకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.50,000 ఆదివారం అందజేశారు. బాధితుడు గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. తమ ఫౌండేషన్ ద్వారా ఇప్పటివరకు పలువురు రోగులకు రూ.8,50,000 అందజేశామని ప్రతినిధి రాంబాబు పేర్కొన్నారు.

నగదు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ఖోఖో విజేతలకు అభినందన

నరసరావుపేట క్రీడలు ,న్యూస్‌టుడే: ఏఎన్‌యూ అంతర్ కళాశాలల మహిళా ఖోఖో పోటీల్లో పట్టణానికి చెందిన కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు ప్రతిభ చాటి ఛాంపియన్‌గా నిలిచిందని ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఎం.శిరీష, ఎం.హేమలత, బి.అలేఖ్య, ఎం.సౌదేశ్వరి, కె.అనుషబాయిలు ఏఎన్‌యూ విశ్వవిద్యాలయం ఖోఖో జట్టుకి ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులను ప్రిన్సిపల్‌తోపాటు వైస్ ప్రిన్సిపల్ సతీష్, తిరుపతిరావు, పీడీ ఆదిబాబు, కోచ్‌లు మహమ్మద్, షేక్ షకీలా అభినందించారు. ః ఏఎన్‌యూ అంతర్ కళాశాలల మహిళా ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన విక్టరీ డిగ్రీ కళాశాల క్రీడాకారిణులను డైరెక్టర్ మైనేడి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ పి.వేణుగోపాల్, కోచ్ అనిల్, పీడీ శ్యామ్‌సన్ తదితరులు అభినందించారు.

కొండమోడులో అడ్డదిడ్డంగా వాహనాలు

గుంటూరు-మాచర్ల, అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారుల కూడలైన కొండమోడులో వాహనాలు అడ్డదిడ్డంగా రాకపోకలు సాగిస్తున్నాయి. నరసరావుపేట నుంచి గుంటూరు వైపు మళ్లే వాహనాలు, గుంటూరు మార్గం నుంచి నామ్ రహదారిపైకి చేరుకునే వాహనాలు ఇష్టారాజ్యంగా క్రాస్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు స్పందించి కూడలిలో ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, (కొండమోడు), రాజుపాలెం

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

పెదకూరపాడు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమన్నారు. వారి సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లోనూ చర్చించామన్నారు. రెండుసార్లు వేతనాలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు.

దొడ్లేరు విద్యార్థుల ప్రతిభ

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: దొడ్లేరు జడ్పీ పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నేషనల్ ఇన్నోవేషన్ ఇండియా సైన్సుఫేర్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని జోస్‌మేరి తెలిపారు. విద్యార్థులు నరసింహారెడ్డి, కావ్య, రిహానా, శశిరేఖ వివిధ విభాగాల్లో ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికయ్యారన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం నెరవేర్చాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి న్యాయం చేయాలని కోరారు. సత్తెనపల్లి సీడీపీవో కార్యాలయం వద్ద సీఐటీయూ నందిగామ సెక్టార్ ఆధ్వర్యంలో నిరసన తెలియచేశారు. కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు, ఉచిత గ్యాస్ అందించాలని నినాదాలు చేశారు.

మత్తులో దాడి చేశారని ఫిర్యాదు

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: మత్తులో తనతోపాటు మరికొందరిపై దాడిచేసి గాయపర్చారని ముప్పాళ్లకు చెందిన జానకినివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లంకెలకూరపాడుకు చెందిన శివనాగిరెడ్డితోపాటు మరొకరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. స్థానిక మద్యం దుకాణం వద్ద జరిగిన గొడవలో శివనాగిరెడ్డి అతడి స్నేహితుడు కొందరిపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని కల్యాణం

మాదిపాడు(అచ్చంపేట): మాదిపాడు అటవీ ప్రాంతంలోని సత్తెమ్మతల్లి ఆలయంలో ఆదివారం సత్యదేవుల కల్యాణం వైభవంగా జరిగింది. యర్రంశెట్టి శ్రీనివాసరావు, సత్యవతి దంపతుల ఆధ్వర్యంలో హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అమ్మవారికి ఇరుముడులు సమర్పించారు. కోలాటం ప్రదర్శన నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

హోమం నిర్వహిస్తున్న పండితులు

విద్యార్థుల విష్ణు సహస్ర పారాయణం

గురజాల గ్రామీణ: స్థానిక నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం విద్యార్థినులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం కోలాటం నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.

వాసవీమాత ఉత్సవాలు ప్రారంభం

దాచేపల్లి: పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి నవమ ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నగర సంకీర్తన నిర్వహించారు. మధ్యాహ్నం రెండు క్వింటాళ్ల వివిధ రకాల పూలతో పుష్పయాగం చేశారు. సాయంత్రం వింధ్య నాగరేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది.

ప్లాస్టిక్ వ్యర్థాలతో విద్యుత్తు ఉత్పత్తి

జిల్లా నుంచి ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపిక

మాదల విద్యార్థుల ప్రతిభ

ముప్పాళ్ల, సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగం గణనీయంగా పెరిగింది. వాటి వ్యర్థాలు గ్రామాలు, పట్టణాల్లో అపరిశుభ్రతకు కారణమవుతున్నాయి. వాతావరణ సమతుల్యతను దెబ్బతీస్తూ.. మానవాళి మనుగడకు ముప్పుగా మారుతున్నాయి. ఇలాంటి తరుణంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో విద్యుత్తు ఉత్పత్తి చేసే భిన్నమైన ఆలోచనను మాదల పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులు చేశారు. ఇటీవల విజయవాడలో జరిగిన సైన్స్ సమగ్ర మహోత్సవ్-2026లో పల్నాడు జిల్లా నుంచి ఉత్తమ ప్రాజెక్టుగా ప్రదర్శించారు. రాష్ట్రస్థాయిలో ఈ ప్రదర్శనకు అవార్డుతోపాటు ప్రశంసలు లభించాయి. విద్యార్థులు నిధిలాక్ష, నాగచైతన్య, లోకేశ్, గైడ్ టీచర్ నందగోపాల్ ప్రాజెక్టు రూపకల్పనలో భాగస్వాములు అయ్యారు.

ప్రాజెక్టు ప్రదర్శిస్తున్న మాదల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పనితీరు ఇలా.. సేకరించిన ప్లాస్టిక్, పొడి వ్యర్థాలను రీసైక్లింగ్ కోసం ప్లాంట్‌కు పంపిస్తారు. కన్వేయర్ బెల్ట్ ద్వారా వ్యర్థాలను హీట్ జనరేటర్‌కు పంపిస్తారు. అక్కడ వ్యర్థాలను కాల్చివేయడంతో ఉత్పత్తి చేయబడిన వేడితో నీటిని మరిగించి ఆవిరిని పొందడానికి ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియలో ఉత్పత్తి అయ్యే పొగను స్మోక్ ఛాంబర్‌లో తొలగిస్తారు. ఈ ప్రక్రియలో టర్బైన్ తిరిగి విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది.

ప్రయోజనాలెన్నో: వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా జరుగుతుంది. వ్యర్థాల పరిమాణాన్ని నిర్ణయిస్తుంది. వేడి, విద్యుత్తు ఉత్పత్తి సాధ్యమవుతుంది. మీథేన్ వాయువు ఉత్పత్తిని నిరోధిస్తుంది. హానికరమైన సూక్ష్మక్రిములు, రసాయనాలు తొలగిస్తుంది. వ్యర్థ పదార్థాల రవాణా సమయాన్ని ఆదా చేస్తుంది. గ్రామ, పట్టణ వ్యర్థాల తొలగింపునకు ఉత్తమ నమూనాగా దోహదం చేస్తుంది. విద్యుత్తు వ్యవసాయ, పారిశ్రామిక, నివాస వినియోగానికి ఉపయోగపడుతుంది.

(c) eenadu

ఈనాడు పార్వతీపురం మన్యం

సోమవారం మార్చి 2, 2026

దుమ్మూ.. ధూళి.. చిన్నారులకు అందేదెలా గాలి!

ఎస్ఎన్‌సీయూ విభాగం దిగువ అంతస్తులో సిమెంటు నిల్వలు

సిమెంటుతో నిండిన విభాగానికి వెళ్లే దారి

పాలకొండ ప్రాంతీయాసుపత్రిలో ఎస్ఎన్‌సీయూ విభాగానికి అవస్థలు తప్పడం లేదు. దీని పక్కనే క్రిటికల్ కేర్ యూనిట్ నూతన భవనాన్ని రూ.24 కోట్లతో నిర్మిస్తున్నారు. దీనికి సంబంధించి సిమెంటు బస్తాలు దిగువ అంతస్తులో ఉంచుతున్నారు. దుమ్ము, ధూళి గదుల్లోకి చేరుతోంది. ఫలితంగా చిన్నారుల అత్యవసర విభాగానికి ఆక్సిజన్ అందించలేకపోతున్నారు. ప్రతి నెలా ఈ విభాగానికి 30కి పైగా కేసులు వస్తున్నాయి. పక్కనే ఉన్న పీడియాట్రిక్ విభాగంలోనూ అవస్థలు తప్పడం లేదు. నడిచే మార్గంలోనూ ధూళి చేరి వైద్యులు, సిబ్బంది, రోగులు అటు నుంచి వెళ్లలేకపోతున్నారు. ఎస్ఎన్‌సీయూ విభాగాన్ని మరో బ్లాక్‌కు తరలిస్తామని, కొత్త విభాగం వద్ద ఆక్సిజన్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్ఎన్‌సీయూ ఇన్‌ఛార్జి తెలిపారు.

– న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

నెల కిందట రూ.30.. నేడు రూ.3

టమాటా ధర పతనంతో రైతు దిగాలు

కొనుగోలుదారులు లేక టమాటా రైతుల పడిగాపులు

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోదామని రైతులు నానా అవస్థలు పడుతున్నారు. సాలూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో వంద ఎకరాల్లో రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. గతేడాది తుపాను, వర్షాల నుంచి పంటను కాపాడుకున్నారు. కష్టానికి తగిన ఫలితం వస్తుందని ఆశించారు. టమాటా ధర పూర్తిగా పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నెలరోజుల కిందట జిల్లాలో కిలో టమాటా ధర రూ.30 ఉండేది. ఫిబ్రవరి ఆఖర్లో రూ.10కి దిగింది. ప్రస్తుతం 30 కిలోల టమాటా కేట్ వంద రూపాయలకు పడిపోయింది. పంట అమ్మితే కూలీ ఖర్చులూ రావడం లేదని, కొనేవారులేక పడిగాపులు కాస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధరకు కొనుగోలు చేసి న్యాయం చేయాలని కోరుతున్నారు. రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపడతామని ఏఎంసీ కార్యదర్శి నరేష్ కుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, సాలూరు

దేవుడి భూమేకదా దోచేయ్!

న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

యథేచ్ఛగా ఆక్రమణలు.. రికార్డుల మార్పు

నిద్రాణంలో అధికార యంత్రాంగం

మన పేరిట ఉన్న సెంటు భూమి ఆక్రమణకు గురైనా వెంటనే ఫిర్యాదు చేస్తాం.. అలాంటిది రూ.కోట్ల విలువైన దేవుడి భూములు పరులపాలవుతున్నా పట్టించుకునే వారే లేరు. మనకెందుకులే అని అధికారులు, ప్రజాప్రతినిధులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. పాలకొండ పట్టణంలోని పలు దేవాలయాల భూములే ఇందుకు నిదర్శనం.

పాలకొండలోని జగన్నాథస్వామి దేవస్థానానికి 122.41 ఎకరాల భూములున్నాయి. వీటిలో 65.41 ఎకరాలు పలు వివాదాలతో కోర్టు పరిధిలో ఉండగా, 56.96 దేవాదాయశాఖ పరిధిలో ఉన్నాయి. వీటిలోని 24 ఎకరాలు లీజుకు వెళ్లకపోవడంతో ఆదాయం లేదు. ఈ ఆలయానికి సంబంధించి శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం జగన్నాథపురం పరిధిలో 62.10 ఎకరాలు, పాలకొండ మండలం వెలగవాడలో 3.31 ఎకరాలు ఆక్రమణల్లో ఉన్నట్లు ఆ శాఖ అధికారులే గతంలో గుర్తించినా ఇంతవరకూ చర్యల్లేవు.

దస్త్రాలు మార్చేసి..

దేవాదాయ శాఖకు చెందిన భూములను దశాబ్దాలుగా పలువురు కౌలుకు తీసుకున్నారు. వీరిలో కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై దస్త్రాలను తమ పేరిట మార్చేసుకున్నారు. భూములకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్‌లు సృష్టించారు. ఇలా రూ.కోట్ల విలువైన స్థలాలు పరుల పాలయ్యాయి.

అన్నసత్రం స్థలాలు ఆవిరి

పట్టణంలోని బెవర గోపాలనాయుడు అన్నసత్రానికి దేవాదాయశాఖ రికార్డుల ప్రకారం 55.74 ఎకరాల పంట భూములున్నాయి. వీటిలో 31.41 ఆక్రమణలకు గురైనట్లు అధికారులు గుర్తించారు. మిగతా భూముల నుంచి ఏటా రూ.2.48 లక్షలు మాత్రమే ఆదాయం వస్తోంది. వీరఘట్టం మండలం తెట్టంగి రెవెన్యూ పరిధిలో 14.61 ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. కొందరు ప్రైవేటు వ్యక్తుల వద్ద కూడా ఇందుకు సంబంధించి దస్త్రాలు ఉండడంతో అధికారులు కోర్టుకు వెళ్లారు. ★ ఇదే సత్రానికి సంబంధించి పనుకువలసలో 7.81 ఎకరాలు వివాదంలో ఉన్నాయి. వీటి దస్త్రాలు, రికార్డులు అధికారుల వద్ద ఉన్నా.. కొందరు ప్రైవేటు వ్యక్తులూ వీటి దస్త్రాలను చూపిస్తుండడం సమస్యగా మారింది.

హనుమా.. కనుమా..

దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయానికి 16.93 ఎకరాల పంట భూములున్నట్లు రికార్డుల్లో ఉన్నాయి. ఇందులో ఆర్టీసీ కాంప్లెక్సు కోసం 3.68 ఎకరాలు అప్పగించారు. 1.06 ఎకరాల పరిధిలో ఆలయం ఉంది. మరో 8.40 ఆక్రమణలకు గురైనట్లు అధికారులు గుర్తించారు. మిగిలిన భూమి దేవాదాయ శాఖ వద్ద ఉంది.

కేసులు వేశాం: బెవర గోపాలనాయుడు అన్నసత్రానికి చెందిన ఆక్రమిత భూముల విషయమై కోర్టులో కేసులు వేశాం. వీటికి సంబంధించి మా వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాం. జగన్నాథస్వామి ఆస్తుల సమగ్ర వివరాలున్నాయి.

– నారాయణ, శివకేశవరావు, ఆలయాల ఈవోలు

బోనొచ్చింది.. పులీ పారాహుషార్

పులులు, ఎలుగుబంట్లు, ఇతర జంతువులను బంధించేందుకు అవసరమైన నాలుగు బోనులు.. జిల్లా అటవీశాఖ కార్యాలయానికి చేరుకున్నాయని డీఎఫ్‌వో ప్రసూన తెలిపారు. వీటిని భద్రపరిచేందుకు అవసరమైన షెడ్ల నిర్మాణం ఆదివారం చేపట్టామని పేర్కొన్నారు.

–న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

ఫలిస్తోంది.. క్లీన్ పాలకొండ

వాట్సప్ గ్రూప్ ద్వారా సమస్యలకు పరిష్కారం

- ఓ పాఠశాల వద్ద కుక్క కళేబరం పడి ఉండడంతో దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. విద్యార్థి తండ్రి సమస్యను గ్రూప్‌లో పోస్ట్ చేసిన వెంటనే దాన్ని తరలించారు.
- కోమటిపేటలో కలుషిత నీటి సమస్యను యువత తెలియజేశారు. అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి, పైపులైన్లు బాగుచేశారు.
- నీలమ్మకాలనీ సచివాలయం ఎదురుగా కాలువ పూడికతో నిండిపోవడంతో నీరు రోడ్డుపైకి చేరింది. స్థానికులు వాట్సప్ ద్వారా విన్నవించడంతో కార్మికులతో దాన్ని తొలగింపజేశారు.

న్యూస్‌టుడే, పాలకొండ, గ్రామీణం

పాలకొండ నగర పంచాయతీ.. పారిశుద్ధ్య పరిస్థితులు తీసికట్టుగా ఉంటాయి. ఇటీవల పర్యటించిన కలెక్టర్ ప్రభాకరరెడ్డి దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసి, మెరుగుకు దృష్టిసారించాలని సూచించారు. దీంతో సబ్‌కలెక్టర్ స్వప్నిల్ పవార్ ప్రత్యేక చర్యలకు ఉపక్రమించారు. వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి.. ప్రజల నుంచి సమస్యలు ఆహ్వానిస్తూ పరిష్కారం దిశగా కృషిచేస్తున్నారు.

క్లీన్ పాలకొండ పేరిట జనవరిలో వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల పరిధిలోని 184 మంది వరకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులను ఇందులో చేర్చారు. 20 వార్డుల పరిధిలో ప్రజలు తమ ప్రాంత ఇబ్బందులను ఈ సమూహం ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. ఇప్పటి వరకు తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలకు సంబంధించి సుమారు 40 సమస్యలు పరిష్కారమయ్యాయి.

సత్వర చర్యలు...: క్లీన్ పాలకొండ గ్రూప్‌లో వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరిస్తున్నాం. ప్రజలు గ్రూప్‌లో పోస్ట్‌చేసిన వెంటనే సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటున్నాం.

- రత్నరాజ్, కమిషనర్, నగర పంచాయతీ

విద్యుత్తు సమస్యలపై ఫోన్ చేయండి

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగంగా పరిష్కరించే లక్ష్యంతో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 వరకు

ఫోన్ నంబరు: 86884 00499

సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అమ్మవారి ఆలయం మూసివేత రేపు

విజయనగరం కంటోన్మెంట్: చంద్ర గ్రహణం సందర్భంగా ఈనెల 3న విజయనగరం పైడితల్లి చదురు, వనంగుడులను మంగళవారం ఉదయం 10 గంటలకు మూసి వేయనున్నట్లు ఈవో కె.శిరీష తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి భక్తులను దర్శనాలకు అనుమతిస్తామన్నారు.

చదవాలా.. సమస్యలు లెక్కించాలా!


పెచ్చులూడిన పైకప్పు కింద బాలల చదువులు

చెదలు పట్టి విరిగిపోయిన తలుపులు

సాలూరు పట్టణంలోని 18వ వార్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇది. 25 మంది విద్యార్థులు చదువుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పెచ్చులూడి ఇనుప ఊచలు పైకి తేలిపోయాయి. తలుపులకు చెదలు పట్టి పాడయ్యాయి. గోడలు బీటలు వారాయి. వానొస్తే ఆ రోజు చదువులకు సెలవే. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ బాలలు బడికి వస్తున్నారు. మరుగుదొడ్లు లేకపోతే ఉపాధ్యాయులు తమ సొంత నిధులు రూ.15 వేలతో నిర్మించారు. నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామని డిప్యూటీ డీఈవో రాజ్‌కుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, సాలూరు

బతుకుబండి లాగుతోంది..

భర్త అనారోగ్యంతో దూరమయ్యాడు. కొన్నాళ్లకే ఇంటి పెద్ద దిక్కు అత్త కూడా మృతిచెందింది. భర్త వద్ద నేర్చుకున్న విద్యతోనే బతుకుబండి లాగుతూ కుమారుడ్ని సాకుతోంది ముగడ సుకన్య. ఈమెది పార్వతీపురం మండలం కృష్ణపల్లి గ్రామం. భర్త శంకరరావు ఆరునెలల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. ఆ వేదన నుంచి కోలుకోకుండానే అమ్మలా చూసుకున్న అత్త మరణం. ఏడో తరగతి చదివే బిడ్డ బాధ్యత, కుటుంబ పోషణ భారమైంది. భర్త బతికున్నప్పుడు సరదాగా నేర్పిన ఆటోనే బతుకు బండి అయ్యింది. గ్రామానికి చెందిన విద్యార్థులను పట్టణంలోని పాఠశాలలకు తీసుకెళ్లి రావడం, ఇతర సమయాల్లో సాధారణ సర్వీసులు చేస్తున్నట్లు సుకన్య తెలిపారు. ఈ మహిళకు వితంతు పింఛను మంజూరు చేయాలని ఇటీవల ఎమ్మెల్యే విజయచంద్ర స్థానిక సచివాలయ, మండల అధికారులకు సూచించారు. పింఛను వస్తే కొంత సాయంగా ఉంటుందని చెబుతున్నారు ఈ వనిత.

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

అందుకోండి.. అంతరిక్ష విజ్ఞానం

బాలల కోసం ఇస్రో 'యువిక'

ప్రత్యేక శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

న్యూస్‌టుడే, వీరఘట్టం

ఖగోళ శాస్త్రవేత్తలుగా ఎదగాలని కలలుగంటున్న బాల మేధావులకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అండగా నిలుస్తోంది. యువ విజ్ఞాన కార్యక్రమం(యువిక-2026) పేరుతో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించనుంది. స్పేస్ టెక్నాలజీ, స్పేస్ సైన్స్, స్పేస్ అప్లికేషన్స్ అంశాలను విద్యార్థులకు పరిచయం చేయడమే దీని ఉద్దేశం.

తొమ్మిదో తరగతి అర్హతతో..

అన్ని యాజమాన్యాల పాఠశాల విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. 2026 జనవరి 1 నాటికి తొమ్మిదో తరగతి చదువుతున్న వారు అర్హులు. https://jigyasa.iirs.gov.in/ yuvika, www.isro.gov.in వెబ్‌సైట్లలో పేరు, ఈమెయిల్ ఐడీని రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం వచ్చే లింక్‌పై క్లిక్ చేసి సరిచూసుకోవాలి. లాగిన్ అయిన తర్వాత, ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొవాలి. ఒకసారి మాత్రమే రాసే అవకాశం ఉంటుంది. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపికలో పది శాతం వెయిటేజీ కల్పిస్తారు. వ్యక్తిగత, చదువుకు సంబంధించిన వివరాలను నింపాలి. అర్హతను నిర్ధారించే ధ్రువపత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి.

- రిజిస్ట్రేషన్లు ప్రారంభం: ఫిబ్రవరి 27
- చివరి తేదీ: మార్చి 31
- మొదటి ఎంపిక జాబితా: ఏప్రిల్ 13
- రెండో జాబితా: ఏప్రిల్ 20
- శిక్షణ: మే 11 నుంచి 22 వరకు

వెయిటేజీ ఇలా.. ★ పంచాయతీ పరిధిలోని పాఠశాలలో చదువుతున్నట్లయితే దానికి సంబంధించిన పత్రాన్ని (సంబంధిత ప్రధానోపాధ్యాయుడి సంతకంతో) అప్‌లోడ్ చేయాలి. దీనికి 15 శాతం అదనంగా.. 8వ తరగతిలో పొందిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఉంటుంది. ★ గత మూడేళ్లలో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు, సైన్స్ ప్రతిభ పరీక్షలు, ఒలింపియాడ్‌లో పాల్గొని మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి పది శాతం వరకు ఇస్తారు. క్రీడలు, అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చినవారు, స్కౌట్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో సభ్యులుగా ఉన్నవారికి 5 శాతం కేటాయిస్తారు.

7 కేంద్రాల్లో శిక్షణ..

ఎంపికైన వారికి దేశవ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రాలకు పిలుస్తారు. ఎంపికైతే ఖర్చులన్నింటినీ ఇస్రోనే భరిస్తుందని విద్యాశాఖాధికారులు తెలిపారు.

పర్యాటక హబ్‌గా తోటపల్లి

స్పీడుబోటును ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

గరుగుబిల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: తోటపల్లి రిజర్వాయర్‌ను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు కలెక్టర్ ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. సుంకి వద్ద ఐటీడీఏ ఉద్యాన క్షేత్రంలోని బోటు షికారును ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్పీడు బోటును ప్రారంభించారు. అవసరమైన లైఫ్ జాకెట్లు, అనుభవజ్ఞులైన చోదకులు, రక్షణ సిబ్బందిని నియమించాలన్నారు. నాగావళి జలాలపై హుషారెత్తించే బోటింగ్‌తో మరింతమంది పర్యాటకులను ఆకట్టుకోవాలన్నారు. స్థానిక గిరిజన యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పడకలు 100.. సేవలు 60 మందికే!

సీతంపేట ప్రాంతీయ ఆసుపత్రిలో సిబ్బంది కొరత

న్యూస్‌టుడే, సీతంపేట

సీతంపేట ప్రాంతీయాసుపత్రి.. గిరిజనుల ఆరోగ్య ప్రదాయిని. వంద పడకల వైద్యాలయంగా నడుస్తున్నా ఆ స్థాయిలో సేవలు అందడం లేదు. సమీపంలోని ఏడెనిమిది మండలాల ప్రజలు దీన్నే ఆశ్రయిస్తారు. రూ.19.07 కోట్ల నాబార్డు నిధులతో నిర్మించిన భవనం కొన్ని రోజుల క్రితమే ప్రారంభమైంది. తగిన సిబ్బంది లేక సేవలకు అవరోధం ఏర్పడుతోంది.

ఈ ఆసుపత్రి సమస్యలపై ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తాజాగా అసెంబ్లీలో ప్రస్తావించారు. నేత్రవైద్య నిపుణుడు దీర్ఘకాలిక సెలవులో ఉన్నందున మరో వైద్యుడ్ని భర్తీ చేయాలన్నారు. చర్మ వ్యాధి నిపుణుడు అవసరమన్నారు. ఆపరేషన్ థియేటర్లలో పరికరాల కొరత తీరేలా.. పూర్తిస్థాయిలో మంజూరు చేయాలని విన్నవించారు.

చేయాల్సినవి..: ★ అత్యవసర బ్లాక్ ఆధునికీకరణ ★ లిఫ్ట్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. ★ ఆక్సిజన్ పైపులైన్ ఏర్పాటు. ★ అవసరమైన పరికరాలు అందించాలి.

ఆసుపత్రిలో సేవలు పొందుతున్న రోగులు

ప్రస్తుతం పరిస్థితి..

సిబ్బంది	ప్రస్తుతం	ఖాళీలు
శానిటేషన్	13	5
సెక్యూరిటీ	8	4
ఎక్స్‌రే టెక్నీషియన్లు	1	2
ఎన్ఆర్సీ స్టాఫ్‌నర్సులు	1	2
వైద్య నిపుణులు	21	2

ఆసుపత్రిలో ఇదీ పరిస్థితి..

రోజుకు..(సుమారుగా)
- ఓపీ: 300
- ఇన్ పేషెంట్లు: 25 నుంచి 30 (సీజన్‌లో అధికం)

నెలలో(సుమారు)
- ప్రసవాలు: 120

శస్త్రచికిత్సలు
- గర్భ సంచి తొలగింపు : 5
- ఆర్థో : 15
- సాధారణం : 20

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

ఆసుపత్రికి అవసరమైన సిబ్బంది భర్తీ కోసం లిఖితపూర్వకంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందేలా చర్యలు తీసుకుంటాం.

– బి.శ్రీనివాసరావు, పర్యవేక్షకుడు

సుపోషిత్ గ్రామ పంచాయతీలు

జిల్లాలో అయిదు పల్లెల ఎంపిక

న్యూస్‌టుడే, పార్వతీపురం

పిల్లలు, గర్భిణులు, బాలింతల్లో పోషక లోపాన్ని అధిగమించి.. ఆరోగ్య భారతాన్ని నిర్మించేందుకు కేంద్రం వివిధ పథకాలను అమలుచేస్తోంది. స్థానిక సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా లబ్ధిదారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడానికి కొత్తగా సుపోషిత్ గ్రామ పంచాయతీ పథకాన్ని తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా వెయ్యి పంచాయతీల్లో దీన్ని అమలు చేయనుండగా.. మన్యం జిల్లాలో అయిదింటిని ఎంపిక చేశారు.

పథకం కింద ఏమిస్తారంటే..

ప్రాథమికంగా పంచాయతీకి కేంద్రం రూ.లక్ష అందిస్తుంది. ఈ మొత్తంలో రూ.25 వేలు అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల్లో మెరుగైన పనితీరు, ఫలితాలు సాధించిన వారికి కేటాయించి, వివిధ కార్యక్రమాలను రూపొందిస్తుంది.

★ మరో 25 శాతం పంచాయతీ పరిధిలో సమాజాన్ని కదిలించేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం, అంగన్‌వాడీలో పిల్లలను చేర్పించడం, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని వారికి అందించడానికి వెచ్చిస్తారు.

★ మిగిలిన రూ.50 వేలతో పోషణ్ వాటికలు ఏర్పాటుచేసి.. ఆకుకూరలు, కూరగాయలు పండించి లబ్ధిదారులకు అందజేయడం వంటి కార్యక్రమాలు చేపడతారు.

మండలాలవారీగా ఎంపికైనవి ఇవే

జీగిరాం(సాలూరు), లఖనాపురం(గరుగుబిల్లి), చినమేరంగి(జియ్యమ్మవలస), అంపిలి(పాలకొండ), వెంకటభైరిపురం(మక్కువ)

సమగ్రంగా అమలు చేస్తాం

అయిదు పంచాయతీలను కేంద్రం ప్రత్యేక వడపోత కార్యక్రమం ద్వారా ఎంపిక చేసింది. పథకాన్ని సమగ్రంగా అమలుచేసేలా చర్యలు చేపడతాం.

– టి.కనకదుర్గ, ఐసీడీఎస్ పీడీ

చిన్న వంతెన.. వస్తే సాంత్వన!

కాజ్‌వే పై ప్రమాదకర ప్రయాణం(పాత చిత్రం)

న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

వట్టిగెడ్డ ప్రాజెక్టు దిగువన కాజ్‌వేపై మినీ వంతెన నిర్మాణం ఆ ప్రాంతీయులకు కలగా మారింది. వారధి నిర్మించాలని ఏళ్లుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం పనులు చేపడితే వచ్చే వర్షాకాలం నాటికి ఇబ్బందులు తీరుతాయని విన్నవిస్తున్నారు.

జియ్యమ్మవలస మండలంలోని టీకే జమ్ము, పీటీమండ, అలమండ, కొండచిలకాం గిరిజన పంచాయతీల పరిధిలోని సుమారు 40 గ్రామాలు వట్టిగెడ్డ జలాశయానికి ఎగువన ఉన్నాయి. కురుపాం మండలం నీలకంఠాపురం, మొండెంఖల్లు తదితర గ్రామాలకు చేరేందుకు జలాశయంపై కాజ్‌వే నిర్మించారు. ఆర్టీసీ బస్సులతో సహా పలు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షాకాలంలో వరద ఉద్ధృతి పెరిగితే రాకపోకలు నిలిచిపోతాయి. ఆ సమయంలో అటవీ ఉత్పత్తులు తరలించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రమాదాలూ జరుగుతున్నాయి..

కాజ్‌వేపై ప్రయాణించే క్రమంలో గతేడాది ఆగస్టులో ఓ ఉపాధ్యాయుడు ద్విచక్ర వాహనంతో కొట్టుకుపోగా స్థానికులు రక్షించారు. ఓ వీఆర్వో వరదలో చిక్కుకున్నారు.

విన్నవించినా..

మినీ వంతెన నిర్మించాలని అధికారులకు పలు మార్లు స్థానికులు విన్నవించారు. ర.భ.శాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

అధికారిణి ఏమన్నారంటే..

నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని ర.భ.శాఖ జేఈ సుశీల చెబుతున్నారు.

(c) eenadu

విద్యుదాఘాతంతో ఇద్దరి దుర్మరణం

శ్రీను(పాతచిత్రం)

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. షెడ్డు నిర్మాణానికి జేసీబీతో స్తంభాన్ని నిలబెట్టే క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇసకలపాలేనికి చెందిన కాళ్ల సూరీడు(70), ఆయన కుమారుడు సూరిబాబు(46) కళ్లం వద్ద పాత స్తంభాలు సేకరించి పశువుల షెడ్డు నిర్మిస్తున్నారు. తాపీ మేస్త్రీ కె.శ్రీను(36) స్తంభాలు నిలబెట్టడానికి వెళ్లారు. పైనున్న 11 కేవీ విద్యుత్తు తీగలకు తాకడంతోముగ్గురూ తుళ్లిపడ్డారు. సూరీడు, శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా, సూరిబాబు గాయాలతో బయటపడ్డాడు. కె.శ్రీను స్వస్థలం విజయనగరం జిల్లా డెంకాడ మండలంలోని గుండాలపేట. బతుకుదెరువు కోసం 13 ఏళ్ల క్రితం పద్మనాభం వచ్చి స్థిరపడ్డారు. కృష్ణాపురం జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకున్నారు. భార్య రాజు(35), కుమార్తె మాధురి(14), కుమారుడు పవన్‌సాయి(12) ఉన్నారు. అందరితో సరదాగా ఉండేవాడు. శ్రీను కుమార్తె పది పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఆయన మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.


సింగిల్స్ విభాగంలో తలపడుతున్న క్రీడాకారిణులు

క్రీడలతో మానసికోల్లాసం

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం దక్కుతుందని, గెలుపోటములతో సంబంధం లేకుండా రాణించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పిలుపునిచ్చారు. విజయనగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి వెటరన్ స్త్రీ, పురుషుల బ్యాడ్మింటన్ పోటీలను సంఘ జిల్లా అధ్యక్షుడు కేఏ నాయుడుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. 35 నుంచి 55 ఏళ్ల వయసు క్రీడాకారులు పోటీపడ్డారు. నిర్వాహక కార్యదర్శి సురేష్, సభ్యులు సుధారాజు, కుసుంబచ్చన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గజపతినగరం, న్యూస్‌టుడే: జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక సీఐ రమణ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి జాతీయ రహదారి మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టి మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎస్సైలు కిరణ్‌కుమార్ నాయుడు, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగురోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడిన మహిళలు

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక

పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి

భోగాపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-21 యూత్ జట్ల ఎంపిక పోటీలను ఎమ్మెల్యే లోకం మాధవి ఆదివారం ప్రారంభించారు. రాష్ట్రంలోని 23 జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 22 మంది పురుషులు, 15 మంది మహిళా క్రీడాకారులతో రెండు జట్లు ఎంపిక చేశారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సత్యేంద్ర వర్మ మాట్లాడుతూ ఎంపికైన జట్లు ఆంధ్రా తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యుడు సూరిబాబు, అంతర్జాతీయ క్రీడాకారుడు కృష్ణంరాజు, రాజు, శేఖర్, నాగన్న పాల్గొన్నారు.

షెడ్లలో తరగతులు.. అయినా అనుమతులు

ఇదీ పలు ప్రైవేటు పాఠశాలల్లో పరిస్థితి

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు పాఠశాలలకు అడ్డుకట్ట వేసేలా కూటమి ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. దీంతో కొత్తగా విద్యాసంస్థలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చేవారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. 2026-27 విద్యా సంవత్సరంలో ఏడు చోట్ల ప్రారంభించేందుకు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ ప్రాథమిక విద్యాలయాలే. ఓ యాజమాన్యం తొమ్మిదో తరగతి వరకు నిర్వహణకు అనుమతి కోరడంతో ఆర్జేడీకి పంపించారు. - న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

అన్నీ అరకొరగానే..

ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 40 వరకు పాఠశాలలు ఏర్పాటయ్యాయి. ఇందులో కొన్నింటికి ఇప్పటివరకు అనుమతులు లేవు. తనిఖీ అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించాల్సి ఉంది. ఒక విద్యార్థికి 6-8 చదరపు అడుగుల స్థలం కేటాయించాలి. గ్రామీణంలో అయితే 2000 చదరపు మీటర్లు, అర్బన్‌లో వెయ్యి చదరపు మీటర్ల ఆటస్థలం తప్పనిసరి. ప్రాథమిక విద్యాలయాల్లో తరగతుల కోసం విడిగా అయిదు గదులు కేటాయించాలి. ల్యాబ్‌లు, గ్రంథాలయం, కంప్యూటర్, మరుగుదొడ్లు, తాగునీరు, తదితర 40 రకాల సదుపాయాలు కల్పించాలి. ఇవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. కొన్నిచోట్ల అరకొరగానే ఉంటున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనల్లో మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

❖ పెట్రోల్ బంకుల పక్కన నిర్వహించకూడదు. దీనికి విరుద్ధంగా బొండపల్లి మండలంలోని ఓ విద్యాలయంలో తరగతులు జరుగుతున్నట్లు గుర్తించారు. దానికి గతంలోనే అనుమతులు సైతం ఇచ్చారు. ప్రాథమిక పాఠశాల అని చెప్పి.. తర్వాత ఉన్నతీకరణ సైతం పొందారు.

లోపాలివిగో..

❖ విజయనగరంలో ఓ ప్రైవేటు పాఠశాలను గుర్తింపు లేదని అధికారులు సీజ్ చేశారు. ఆ విద్యాలయం ఏళ్ల నుంచి నడుస్తోంది.

❖ రేకుల షెడ్లలో పిల్లలను ఉంచుతున్నారు. [illegible]

❖ ఒకే అనుమతి పత్రంతో రెండు, మూడుచోట్ల పాఠశాలలు కొనసాగుతున్నాయి. ముందు చూపించిన స్థలం కాకుండా.. వేరే ప్రాంతానికి వెళ్లడం, రెన్యువల్‌కు పునరుద్ధరించకపోవడం తదితర లోపాలు వెలుగు చూస్తున్నాయి. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని డీఈవో మాణిక్యంనాయుడు తెలిపారు.

కొత్త నిబంధనలివే..

❖ ఇప్పటికే ఓ పాఠశాల(ప్రభుత్వ లేదా ప్రైవేటు) ఉంటే.. దానికి కిలోమీటరు పరిధిలో కొత్తగా ఏర్పాటు చేయాలంటే సంబంధిత యాజమాన్యం నుంచి ఎన్‌వోసీ(నిరభ్యంతర పత్రం) తప్పనిసరి.

❖ గతంలో మార్చి, ఏప్రిల్ వరకు దరఖాస్తులు స్వీకరించేవారు. అపరాధ రుసుము అక్టోబర్ వరకు చెల్లించే అవకాశం ఉండేది. ఈ ఏడాది మాత్రం డిసెంబరుతో ప్రక్రియను నిలిపివేశారు.

❖ గతంలో పత్రాలన్నీ అప్‌లోడ్ చేస్తేనే ప్రారంభ అనుమతి ఇచ్చేవారు. దీంతో పాఠశాలను నిర్వహించుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు డాక్యుమెంట్ల పరిశీలన అనంతరం సంబంధించిన అంశాలను అధికారులు తనిఖీ చేసి, ఆ వివరాలన్నీ అందించాలి. 40 రకాల సదుపాయాలు పక్కాగా ఉంటేనే అవకాశం కల్పిస్తున్నారు.

వెటరన్.. అదిరెన్

క్రీడా కోటాలో ఉద్యోగం..

కేవలం చదువే కాకుండా క్రీడలపైనా దృష్టిపెట్టాలి. నాకు ఆ కోటా కిందే రైల్వేలో ఉద్యోగం దక్కింది. మా నాన్న బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కావడంతో నేనూ సాధన చేసేవాడిని. 2002 నుంచి 2010 వరకు ఆల్ ఇండియా రేటింగ్స్‌లో 4వ స్థానంలో ఉన్నాను. బంగ్లాదేశ్, సింగపూర్, కంబోడియా తదితర దేశాల్లో జరిగిన అంతర్జాతీయస్థాయి పోటీల్లో దేశం తరఫున పాల్గొన్నా. అయిదేళ్లుగా 50+ ఏళ్ల కేటగిరీలో ఉషశ్రీతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో బరిలోకి దిగుతున్నా. అయిదు సార్లు రాష్ట్ర ఛాంపియన్‌షిప్ సాధించాం.
– ఉదయ్ భాస్కర్, అంతర్జాతీయ క్రీడాకారుడు

క్రమశిక్షణ అలవడుతుంది..

రోజూ సాధనతో శారీరక, మానసిక ప్రశాంతతతో పాటు క్రమ శిక్షణ అలవడుతుంది. చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తి. 19 ఏళ్లకే ఎస్పీఎఫ్‌లో ఉద్యోగం వచ్చింది. కొన్నాళ్లుగా ఆల్ ఇండియా పోలీసుశాఖ తరఫున పాల్గొంటున్నా. గతేడాది రజత పతకం సాధించి, ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని పొందా. శ్రీవెంకటగణేష్‌తో కలిసి డబుల్స్‌లో 45+ విభాగంలో ఆడుతున్నా. రాష్ట్ర, జాతీయస్థాయి మీట్‌లలో వందసార్లకు పైగా పాల్గొని పలు పతకాలు సాధించాం.
– సునీల్‌కుమార్, జాతీయ క్రీడాకారుడు

– న్యూస్‌టుడే, విజయనగరం బాబామెట్ట

మనసుండాలే కానీ వయసుతో పనేముంది అని నిరూపిస్తున్నారు పలువురు క్రీడాకారులు.. సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ.. కృషి, పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. పాఠశాల స్థాయిలో అవకాశాలు లేక ఆడనివారు కొందరైతే.. చిన్నతనం నుంచి క్రీడలే శ్వాసగా జీవించి వాటి ద్వారా ఉద్యోగాలు పొందిన వారు ఇంకొందరు.. కొలువుదీరిన తర్వాత కూడా సాధన చేస్తున్న వారు మరికొందరు.. ఇలా నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తూ దూసుకెళ్తున్నారు వెటరన్లు. విజయనగరంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ మీట్‌లో భాగంగా తమ విజయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

యువతలో స్ఫూర్తి నింపేందుకే..

2008లో ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. ప్రస్తుతం విజయనగరంలోని కస్పా ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్నా. ప్రాథమిక స్థాయిలో ఆడుకునే అవకాశాలు తక్కువగా ఉండేవి. దీంతో ఉద్యోగం వచ్చాక పిల్లలతో ఆడిస్తూనే నేనూ సాధన చేస్తున్నా. జాతీయ, అంతర్జాతీయస్థాయి మీట్‌లలో సత్తా చాటా. సివిల్ సర్వీసెస్, వెటరన్ పోటీల్లో పాల్గొంటున్నా. ఆర్థిక పరిస్థితి కారణంగా చాలామంది విద్యార్థులు ముందుకు వెళ్లలేకపోతున్నారు. అలాంటి వారికి ఆర్థికసాయం అవసరం. యువతలో స్ఫూర్తి నింపేందుకు వెటరన్లు రాణిస్తున్నారు. – ఆదిలక్ష్మి, విజయనగరం

పత్రికల్లో చూసి..

మాది సాలూరు మండలంలోని మామిడిపల్లి. క్రీడలపై ఆసక్తి ఉన్నా బయటకు వెళ్లలేని పరిస్థితి. పత్రికల్లో వచ్చిన పలువురు క్రీడాకారుల ఫొటోలు చూసి ఇంట్లో వాళ్లు ప్రోత్సహించారు. అలా పాఠశాల స్థాయిలోనే బ్యాడ్మింటన్‌లో సాధన మొదలు పెట్టా. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ప్రస్తుతం 35+ కేటగిరీలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో తలపడుతున్నా. – మంజుభార్గవి

అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

చిత్రకళా ఉపాధ్యాయుడికి పురస్కారం

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: పూసపాటిరేగ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్ట్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇనపకుర్తి చిన్న సత్యనారాయణకు జాతీయస్థాయి ఉత్తమ చిత్రకళా ఉపాధ్యాయుడిగా పురస్కారం లభించింది. విజయవాడకు చెందిన డ్రీమ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు దీన్ని ప్రదానం చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడం, చిత్రకళ అభివృద్ధికి సత్యనారాయణ అందిస్తున్న సేవలను గుర్తించి పురస్కారం అందించినట్లు ఏపీ తెలుగు కల్చరల్ అకాడమీ ఛైర్మన్ ఆర్డీ విల్సన్, ఏపీ క్రియేటివ్ కల్చరల్ కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి తెలిపారు. కార్యక్రమంలో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, 64 కళలు డాట్‌కామ్ ఎడిటర్ కళాసాగర్ పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.సౌభాగ్యలక్ష్మి ఆయనను అభినందించారు.

ఇళ్లల్లో ఆకస్మిక తనిఖీలు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ప్రజల భద్రత, నిషేధిత వస్తువులు, మత్తు పదార్థాల స్వాధీనమే లక్ష్యంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు విజయనగరం, చీపురుపల్లి డీఎస్పీలు ఆర్.గోవిందరావు, ఎస్.రాఘవులు తెలిపారు. శనివారం రాత్రి విజయనగరంలోని ఫూల్‌బాగ్ కాలనీ, గరివిడి పోలీసు స్టేషన్ సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. 300 మంది సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి పరిశీలించారని చెప్పారు. అపరిచిత వ్యక్తుల సంచారం, గంజాయి, నాటుసారా నిల్వలపై ఆరా తీశారని, కొందరి నుంచి వేలిముద్రలు సేకరించారన్నారు. పత్రాలు సరిగ్గా లేని 30 ద్విచక్ర వాహనాలను స్టేషన్లకు తరలించామన్నారు. సీఐలు టి.శ్రీనివాసరావు, శంకర్రావు, ఉపేంద్ర, ఎస్సైలు పాల్గొన్నారు.

ఓ ఇంట్లో బ్యాగులను పరిశీలిస్తున్న పోలీసులు

గొర్రెల షెడ్డు పేరుతో గోవధ

❖ గోపాలపల్లిలో కబేళాపై దాడులు
❖ పోలీసుల అదుపులో ఇద్దరు

పశుమాంసాన్ని చూపిస్తున్న గ్రామస్థులు, యువత

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: గొర్రెల షెడ్డు పేరుతో అయిదు నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా మండలంలోని గోపాలపల్లి గ్రామంలో గోవధ నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి సీఐ నారాయణమూర్తి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువకులు శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో జాతరకు వెళ్లి వస్తుండగా టేకు తోట వద్ద షెడ్డులో ఆవుల అరుపులు వినిపించడంతో వెళ్లి చూశారు. వాటిని వధిస్తుండడాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఏఎస్సై గోవింద, సిబ్బంది వెళ్లి దాడి చేశారు. మూడు ఆవులను చంపి, మాంసం తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గుర్తించారు. వీరిని చూసి అయిదుగురు నిర్వాహకులు పారిపోగా, విశాఖ రైల్వే న్యూకాలనీకి చెందిన షేక్ సుల్తాన్, షేక్ బాషాను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషనుకు తరలించారు. గ్రామ ఉప సర్పంచి గణేష్, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసప్పడు, యువత రమేష్, కిశోర్ రాజు, నాయుడు, సూరిబాబు, రమణ మాట్లాడుతూ అయిదు నెలల కిందట ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకొని, పక్కనే గొర్రెలు పెంచేందుకు షెడ్డు వేశారన్నారు. చుట్టు పక్కల గ్రామస్థులకు గొర్రెల మాంసం విక్రయిస్తుండడం, రోజూ వ్యానులో మాంసం రవాణా చేస్తుంటే మటన్ వ్యాపారమని భావించామన్నారు. అలమండ సంత నుంచి గోవులను కొని, చంపి ఇక్కడి నుంచి మాంసం రవాణా చేస్తున్నారన్నారు. ఆదివారం ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో సమక్షంలో పశువైద్యాధికారి రామ్‌కుమార్ పంచనామా నిర్వహించారు. మాంసాన్ని గొయ్యి తీసి పూడ్చారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, మాంసాన్ని పరీక్షల నిమిత్తం ఎఫ్‌ఎస్‌ఎల్‌కు పంపుతున్నామని సీఐ తెలిపారు. మిగిలిన రెండు ఆవులు, దూడను సమీపంలోని గోశాలకు పంపుతున్నామన్నారు.

చంపావతి ఎండినది!

కనుచూపు మేర ఇసుక దిబ్బలతో దర్శనమిస్తున్న ఈ చిత్రం చూసి ఎడారి ప్రాంతం అనుకుంటే ఇసుకలో కాలేసినట్లే.. జిల్లాలో వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం ప్రజలకు తాగునీరు అందించే చంపావతి నది దుస్థితి ఇది. వేసవికి ముందే నెల్లిమర్ల ప్రాంతంలో నది పూర్తిగా ఎండింది. ఇప్పుడే ఇలా ఉంటే.. రానున్న రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని కమిషనరు ఎస్.జనార్దనరావు వద్ద ప్రస్తావించగా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

మహాధర్నా విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.వి.పైడిరాజు

విద్యావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు ఈనెల 3న కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వి.పైడిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. విజయనగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీఆర్సీని ప్రకటించాలని, టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండు చేశారు. నాయకులు ఆర్.కృష్ణ, ఎ.వి.శ్రీనివాస్, వి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యావిభాగం: ఉపాధ్యాయుల విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని, హాజరు విధానం అమలులో నిబంధనలు తొలగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొవ్వాడ శ్రీనివాసరావు, బల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ఇజ్జిరోతు రామునాయుడు కోరారు. పది నిమిషాల గ్రేస్ పీరియడ్‌ను కొనసాగించాలని, సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేశారు.

అనుమతులు తప్పనిసరి.. అయ్యన్నపేట: బాణసంచా విక్రయదారులు సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని డీఎస్పీ ఆర్.గోవిందరావు ఆదేశించారు. ఆదివారం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో తయారీ, విక్రయ యజమానులతో మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

చికెన్ ధరలు

రకం (కిలో రూల్లో..)	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	167	304	314

వైభవంగా సామూహిక పూజలు

వైభవంగా సామూహిక పూజలు

గజపతినగరం, న్యూస్‌టుడే: స్థానిక సీతారామ ఆలయ ప్రాంగణంలో ఆదివారం సామూహిక మణిదీప వర్ణన పూజలు వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన గొల్లపేరంటాల జాతర

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మెట్టపల్లిలో నాలుగు రోజులుగా జరుగుతున్న గొల్లపేరంటాల అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. దీనిలో భాగంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంపడాపు రామ్మూర్తినాయుడు ఆధ్వర్యంలో శనివారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ ప్రాంగణం జనసందోహంగా మారింది. ఆదివారం రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు.

విద్యార్థులూ.. ఉపాధ్యాయులవుతారా

న్యూస్‌టుడే- రాజాం పట్టణం

ఇంటర్మీడియట్ పూర్తిచేసిన, పూర్తికావస్తున్న విద్యార్థులకు జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి చక్కటి అవకాశం కల్పిస్తోంది. నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ ఉపాధ్యాయ విద్యా కార్యక్రమం (ఐటీఈపీ) అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనికోసం ఎన్‌టీఏ విడుదల చేసే జాతీయ సాధారణ ప్రవేశ పరీక్ష (ఎన్‌సీఈటీ) రాయాల్సి ఉంటుంది. దీనిలో మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలనుకున్న యువతీ, యువకులకు ఇదో మంచి అవకాశం.

ఇంటిగ్రేటెడ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

★ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ప్రస్తుతం రెండో ఏడాది చదువుతున్న విద్యార్థులు అర్హులు.
★ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 10
★ వెబ్‌సైట్: ncet@nta.ac.in, www.nta.ac.in
★ ప్రవేశ పరీక్ష కేంద్రాలు: విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, విజయవాడ, తిరుపతి, అనంతపురం, కర్నూలు
★ తెలుగులో పరీక్ష రాయొచ్చు

మన పరిధిలో కోర్సు అందుబాటులో ఉన్న కళాశాలలు

★ ఎంఆర్ కళాశాల విజయనగరం : బీఎస్సీ, బీఈడీ
★ సీట్లు: 50 ★ డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం జిల్లా : బీఏ, బీఈడీ, బీఎస్సీ, బీఈడీ
★ మొత్తం సీట్లు : 100
★ మరింత సమచారం కోసం సంప్రదించాల్సిన నంబర్: 98492 52910, ఎన్.శ్రీనివాస్, కోర్సు కోఆర్డినేటర్, డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

రామభద్రపురం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన రామభద్రపురం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బాడంగి మండలం వాడాడ గ్రామానికి చెందిన కళ్లూరి భైరాగి(84) కొన్నిరోజులుగా మెంటాడ మండలం కుంటినవలసలోని పెద్ద కుమార్తె అప్పలనరసమ్మ వద్ద ఉంటున్నారు. కుమారుడి వద్దకని ఆదివారం స్వగ్రామానికి నడిచి వెళ్తుండగా.. రామభద్రపురం మండలం ఆరికతోట వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, వాహనం కోసం గాలిస్తున్నామని హెచ్‌సీ సత్యనారాయణ తెలిపారు.

వృద్ధురాలిపై హత్యాయత్నం

తేరేజమ్మ

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, బెలగాం, న్యూస్‌టుడే: ఇంటి గడపలో నిద్రిస్తున్న వృద్ధురాలిపై గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నం చేశారు. రాయితో తలపై మోది, పింఛను నగదు దోచుకెళ్లిన ఘటన పార్వతీపురం మండలంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల వివరాల మేరకు.. కృష్ణపల్లి గ్రామానికి చెందిన తేరేజమ్మ ఒంటరిగా ఉంటున్నారు. పెద్ద కుమారుడు ఏళ్ల క్రితమే ఇంటి నుంచి వెళ్లిపోగా.. చిన్న కుమారుడు కొన్నాళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్య, పిల్లలు ఉన్నారు. వృద్ధురాలి కుమార్తె తవిటమ్మ పక్కవీధిలో ఉంటున్నారు. శనివారం రాత్రి 7 గంటలకు కుమార్తె భోజనం తీసుకురాగా.. తిని నిద్రపోయింది. ఆదివారం ఉదయం అల్లుడు టీ పట్టుకుని వచ్చేసరికి రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం విజయనగరం తీసుకెళ్లారు.

డబ్బుల కోసమా.. మరేదైనా కారణమా?: పింఛను సొమ్ము రూ.4 వేల కోసం మద్యం, గంజాయికి అలవాటు పడిన వారెవరైనా ఇలా చేసి ఉండొచ్చని తెలుస్తోంది. ఆగంతకులు హత్య చేసేందుకు ఉపయోగించిన కాంక్రీటు రాయి, మంచం కింద రక్తం మరకలు సమీపంలో ఉంటున్న కుటుంబ సభ్యులే శుభ్రం చేయడం.. మరిన్ని సందేహాలకు తావిస్తోంది. తవిటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంగనాథం, ఎస్సై రాజేష్ తెలిపారు.

MAHARAJAH'S COLLEGE (AUTONOMOUS)
Affiliated to Andhra University, Accredited by NAAC with 'B' Grade
FOUNDERS DAY CELEBRATIONS
Estd. 1879
2nd March, 2026
Dr. P.V.G. RAJU D.Litt. (1924 - 1995) Founder MANSAS
MAHARAJAH VIJAYARAMA GAJAPATHI RAJU - III Founder, M.R. College
Dr. P. ANAND GAJAPATHI RAJU Ph.D. (1950 - 2016) Former Chairman MANSAS
Presentation of Merit Scholarships and Medals to the Students at 10.00 AM
"Abhinava Andhrabhoja Maharaja Anand Gajapathi Raju Auditorium, Moti Mahal, Fort"
Sri P. ASHOK GAJAPATHI RAJU Hon'ble Governor, State of GOA & Chairman, MANSAS
CORRESPONDENT, PRINCIPAL, STAFF & STUDENTS

EENADU Classifieds

REAL ESTATE
PLOT FOR SALE
200 Sq.yd site near Likhitha gardens (Gollalapeta (back side of KVR gated community) open for sale for immediate buyers. ✆ 9959222542.

JOBS
ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు మండలానికి ఒక అధికారి కావలెను. జీతం రూ: 20,000/- Cell: 9494684846

బుక్ డిస్ట్రిబ్యూటర్స్ కొరకు నో పెట్టుబడి మీ ఏరియాలో ప్రైవేట్ స్కూల్స్ పరిచయం & అనుభవమున్న వారికి ప్రాధాన్యత. ఉమా పబ్లిషర్స్, Guntur. ✆ 98493 70729.

ADMS ఎలక్ట్రికల్ వెహికల్ మార్కెటింగ్ చేయుటకు (MLM లీడర్స్ LIC అగ్రిగోల్డ్) టీం లీడర్స్ కావలెను. జీతం 20K+ ఇన్సెంటివ్స్. ✆ 8897221102.

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే, బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత:10th-డిగ్రీ. Age:16-25. శిక్షణ 3నెలలు శిక్షణతోపాటు హాస్టల్ ఉచితం 10th, ఇంటర్, డిగ్రీ డిస్టెన్స్ కోర్సులు కలవు.* ముందుగా ఎటువంటి ఫీజులేదు * క్రిస్టియన్ డిఫెన్స్ అకాడమీ, వైజాగ్. 9121232328.

MARKETING/ SALES
విజయనగరంలో పని చేసేందుకు లేడీ స్టాఫ్ కావలెను. జీతం: 15000/ రియల్ ఎస్టేట్ వారికి ప్రాధాన్యత. స్పర్శ: 9908224693

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

నీటి శుద్ధి యంత్రం బాగు చేయరూ!

గత ప్రభుత్వ హయాంలో పాలకొండ మండలం అంపిలి ఎంపీయూపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ఇది. మరమ్మతులకు గురైనా పట్టించుకోకపోవడంతో మూడేళ్లుగా నిరుపయోగంగా ఉంది. దీంతో విద్యార్థులు తాగునీటికోసం ఇబ్బందులు పడుతున్నారు. బోరు నీరు తాగుతున్నారు. వేసవి వస్తుండడంతో మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. దీనిపై హెచ్ఎం గౌరీశంకర్ వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.
–న్యూస్‌టుడే, పాలకొండ

నిరుపయోగంగా వదిలేశారు

పార్వతీపురం మండలం రావికోన పంచాయతీ బట్టివలసలో నిర్మించిన వన్‌ధన్ వికాస కేంద్రం నిరుపయోగం మారింది. గిరిజన మహిళా సంఘాలు స్వయం ప్రతిపత్తి సాధించేదుకు దీన్ని నిర్మించారు. గుత్తేదారుకు సకాలంలో బిల్లులు చెల్లించక తుది దశలో విడిచిపెట్టేశారు. డోకిశీలలో యంత్రాలు లేక వినియోగించడం లేదు. ఏపీఎం సన్నిబాబు మాట్లాడుతూ డోకిశీల కేంద్రానికి యంత్రాల కోసం ప్రతిపాదించామని, బట్టివలస విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

అధ్వాన దారి.. వెళ్లేదెలా మరి?

సీతానగరం మండలంలోని ఏగోటివలస నుంచి దయానిధిపురం మీదుగా గాదెలవలస గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఇరవై ఏళ్ల కిందట నిర్మించిన రోడ్డు కావడంతో గోతులమయంగా మారింది. దీంతో రెండేళ్ల కిందట పనులు చేపట్టారు. రాళ్లు వేసి వదిలేయడంతో ఇలా తయారైంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. పనులు పూర్తి చేస్తామని ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.
– న్యూస్‌టుడే, సీతానగరం

ఎవరూ అడగరు.. నిప్పు పెట్టేయ్

పాలకొండ ప్రభుత్వ ఆసుపత్రి రహదారిలో చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. దీన్ని డంపింగ్‌యార్డుకు తరలించకుండా పారిశుద్ధ్య కార్మికులు అక్కడే నిప్పు పెడుతున్నారు. దీంతో దట్టమైన పొగ వ్యాపించి ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. ప్రయాణానికీ ఇక్కట్లేనని చోదకులు అన్నారు. సమస్యను నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ వద్ద ప్రస్తావించగా నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకుంటామన్నారు.
– న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

ఆనందం నిండుగా.. సందడి చేయగా

సీతంపేటలోని ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కులో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. సాహస ఇతర క్రీడలు, బోటింగ్, కయాకింగ్ చేసి, ఊగే వంతెనపై నడుస్తూ ఆనందంగా గడిపారు. 5డీ థియేటర్‌లో వీడియోలు వీక్షిస్తూ, 3డీ పెయింట్స్ వద్ద స్వీయ చిత్రాలు తీసుకుంటూ సందడి చేశారు. మెట్టుగూడ జలపాతం, ఆడలి, జగతిపల్లి వ్యూ పాయింట్‌ను చూసేందుకు పర్యాటకులు పోటెత్తారు. పాలకొండ తదితర ప్రాంతాలకు చెందిన విద్యా సంస్థల విద్యార్థులు పెద్ద సంఖ్యలో వచ్చారు. – న్యూస్‌టుడే, సీతంపేట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? ములగ ఉన్నత పాఠశాల ఆవరణలో గొట్టపుబావి మరమ్మతులకు గురైంది. - సూరయ్య, స్థానికుడు ★ చర్యలు తీసుకుంటాం. - కె.సత్యం, ఎంపీడీవో - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? స్థానిక హెచ్పీ కాలనీలో కాలువలు మురుగుతో అధ్వానంగా తయారయ్యాయి. - సూరిబాబు ★ పూడిక తొలగిస్తాం. - సురేష్, ఈవో - న్యూస్‌టుడే, సీతానగరం

? తుమరాడ గ్రామ సచివాలయం నుంచి చర్చి వరకు మినీ ఉన్న తారు రోడ్డు పనులు పూర్తి చేయండి. - ఎం.రామకృష్ణ ★ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - అంబేడ్కర్, జేఈ - న్యూస్‌టుడే, బలిజిపేట.

? కురుపాం మండలం కేంద్రంలో సంత కేంద్రం చుట్టూ చెత్త రోడ్డు పక్కన పడేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. - సాయి, స్థానికుడు ★ పరిశీలించి, చెత్త తొలగింపు చర్యలు తీసుకుంటాం. - రమేష్‌బాబు, ఈవోపీఆర్డీ - న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

? బత్తిలి నుంచి జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలి. - స్థానికులు ★ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - మూర్తి, డిపో మేనేజరు - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

?: తోటపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి రామాలయానికి వెళ్లే రహదారి బీటలు వారింది. - స్థానికులు ★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - సింహాచలమమ్మ, సర్పంచి - న్యూస్‌టుడే, గరుగుబిల్లి

అక్షరాంధ్ర ఆశయం.. యాప్‌లకే పరిమితం

భామిని, న్యూస్‌టుడే

చదువుకున్న వాళ్లు ఉంటే కుటుంబం తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుంది. వయోజన విద్యా శాఖ పర్యవేక్షణలో 15-59 ఏళ్ల వయసున్న నిరక్షరాస్యులను గుర్తించి వారికి రోజూ గంటపాటు చదువు చెప్పేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం అక్షరాంధ్ర కార్యక్రమం అమలు చేస్తోంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నామమాత్రంగా నిర్వహిస్తుండటంతో ఆశయం నెరవేరడం లేదు.

యాప్‌లో వివరాల నమోదు కోసం పుస్తకాలు పట్టుకున్న భామినికి చెందిన నిరక్షరాస్యులు

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 15 మండలాల్లో 453 పంచాయతీల పరిధిలో 350 సచివాలయాల్లో 6710 మంది వాలంటీర్లను ఎంపిక చేశారు. ఇప్పటి వరకు 6,71,100 మంది నిరక్షరాస్యులకు చదువు చెప్పేందుకు గుర్తించారు. వారికి శిక్షణ ఇచ్చేందుకు విద్యుత్తు సౌకర్యం ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు సామాజిక భవనాలను గుర్తించారు. అందుకు తగ్గ ప్రణాళికలను సిద్ధం చేశారు. నిర్దేశ కాల వ్యవధిలో వారందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం మార్గదర్శకాలను సూచించింది. కానీ క్షేత్రస్థాయిలో అతీ గతి లేదు. అమలు చేయాల్సిన ఉపాధి హామీ, వెలుగు అధికారులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు.

పుస్తకాల పంపిణీ జరిగినా..

ఇటీవల ఉన్నతాధికారులు కార్యక్రమానికి పుస్తకాలు, సాధన పత్రాలను అన్ని మండలాల్లోని వెలుగు కార్యాలయాలకు సరఫరా చేశారు. పూర్తి స్థాయిలో అభ్యర్థులకు ఇంకా పంపిణీ చేయలేదు. చాలాచోట్ల ఇంకా కార్యాలయాల్లోనే ఉన్నాయి. ఇచ్చిన చోట్ల శిక్షణార్థులను కేంద్రాలకు పిలిపించి పుస్తకాలు తెరిపించి చదువుతున్నట్లు ఫొటో తీసుకుని, యాప్‌లో వివరాలు నమోదు చేసి పంపించేస్తున్నారు. దీంతో మహిళలు చదువుకు దూరమవుతున్నారు. ఆయా ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల కార్యక్రమాన్ని ఐటీడీఏ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల సంక్షేమ విభాగానికి అప్పగించింది. ఈ విషయమై అక్షరాంధ్ర జిల్లా సమన్వయకర్త టి.వైకుంఠరావు మాట్లాడుతూ.. కేంద్రాలు, శిక్షణ ఇచ్చేందుకు నిరక్షరాస్యులను ఎంపిక చేశామన్నారు. ఇప్పటికే వాలంటీర్లకు శిక్షణ ఇచ్చామని జిల్లాలోని అన్ని కేంద్రాల్లో పూర్తి స్థాయిలో నడిపించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

సాలూరు, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి కూటమి పాలన సాగుతోందని గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని మంత్రి కార్యాలయంలో పాచిపెంట మండలం రాయిగుడ్డివలస గ్రామానికి చెందిన వంద గిరిజన కుటుంబాలు ఆదివారం తెదేపాలో చేరాయి. ఈ సందర్భంగా మంత్రి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. యువత భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చేందుకు కృషిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ, మండల తెదేపా అధ్యక్షులు చిట్టి, పరమేశు, యుగంధర్, గుళ్ల వేణు, ఏఎంసీ ఛైర్మన్ సూర్యనారాయణ, జనసేన మండలాధ్యక్షుడు శివకృష్ణ పాల్గొన్నారు.

కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సంధ్యారాణి

శిఖరాగ్ర గ్రామాల్లో తీరనున్న కష్టాలు

మర్రివలస, సలపరబంద మధ్య రోడ్డు నిర్మాణ పనులు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: శిఖరాగ్ర గ్రామాల్లో రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గడివలస-మర్రివలస రూ.160 లక్షలతో, గడివలస-సలపరబంద రూ.160 లక్షలతో పనులు చేపడుతున్నారు. ఇవి పూర్తయితే డెన్సరాయి, సంపెంగిపాడు పంచాయతీలకు మార్గం సుగమం అవుతుంది. నెలలో పూర్తి చేస్తామని ఐటీడీఏ ఏఈ సత్యనారాయణ తెలిపారు.

నేడు త్రిమూర్తుల డోలా యాత్ర

ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట త్రిమూర్తుల ఆలయ ప్రాంగణంలో సోమవారం డోలా యాత్ర నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు అభివృద్ధి కమిటీ సభ్యుడు పి.ఈశ్వరరావు తెలిపారు.

ఘనంగా కోటదుర్గమ్మ సంబరాలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కోటదుర్గమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. మంగళవారం గ్రహణం కావడంతో ఆలయం మూసివేయనున్నందున భక్తుల తాకిడి పెరిగింది. మహిళలు ఘటాలతో ఊరేగింపుగా వచ్చి పూజలు చేశారు.

పుష్పాలంకరణలో అమ్మవారు

సందడిగా వీడ్కోలు వేడుక

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని భాస్కర(వేదాంత) పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బాలలు శాస్త్రీయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న బాలిక

పోస్టుకార్డు ఉద్యమం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పోస్టు కార్డు ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు అందించాలని కోరారు.

ఆస్తి రాయాలని తల్లిపై దాడి

పార్వతీపురం పట్టణం, మక్కువ, న్యూస్‌టుడే: రెండెకరాల పొలాన్ని తన పేరిట రాయాలని కోరుతూ తల్లిపై కుమారుడు, కోడలు దాడి చేసిన ఘటన మక్కువ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గోపాలపురానికి చెందిన బి.నారాయణమ్మ భర్త చనిపోయారు. ఆమెకు ఇద్దరు కుమారులు. 16 ఎకరాల పొలం ఉండగా, ఏడెకరాల చొప్పున ఇద్దరికీ 14 ఎకరాలు రాసిచ్చారు. తనకు రెండెకరాలు ఉంచుకొని చిన్న కోడలు వద్ద ఉంటోంది. అది కూడా తమ పేరిట రాయాలని పెద్ద కొడుకు, కోడలు గొడవకు దిగి దాడి చేశారు. గాయాలవడంతో బాధితురాలిని జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురికి గాయాలు

భామిని, న్యూస్‌టుడే: ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా మొట్టూరుకు చెందిన బి.రామకృష్ణ, తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై బిల్లుమడ వెళ్తుండగా.. అదే సమయంలో పోలవరానికి చెందిన సీమల బాబూరావు స్వగ్రామానికి వస్తున్నాడు. ఘనసర సమీపంలో ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురికీ గాయాలవడంతో స్థానికులు సీతంపేట ఆసుపత్రికి తరలించారు. మహిళకు కంటిపై తీవ్ర గాయం కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

కొండ చీపుర్లకు గిట్టుబాటు ధరేదీ..?

సీతంపేట, న్యూస్‌టుడే

సీతంపేట మన్యంలో కొండ చీపుర్ల సీజన్ ప్రారంభమైంది. పంట చేతికి రావడంతో వీటిని అమ్మేందుకు మార్కెట్‌లు, వారపుసంతలకు గిరిజనులు తీసుకువస్తున్నారు. జీసీసీ, వ్యాపారులు సైతం కొనుగోళ్లు చేసేందుకు గిరిజన గ్రామాలకు వెళ్తున్నారు. గతంలో అనేక రకాల అటవీ పంటలు పండించే వీరు కొన్నేళ్లుగా సాగుపై మక్కువ చూపుతున్నారు. వీటి సైజు, నాణ్యత, పరిమాణం బట్టి రూ.25 నుంచి రూ.40 వరకు మాత్రమే ధర పలుకుతోందంటున్నారు.

వారపు సంతలో అమ్మేందుకు గిరిజనులు తీసుకొచ్చిన కొండచీపుర్లు

కాండీ అమ్మకాలపై ఆసక్తి

కొండ చీపుర్లు కట్టలుగా కట్టి అమ్మకాలు చేసేవారు క్రమంగా తగ్గడంతో కాండీ(చీపురు గడ్డి)ని కిలోల లెక్కన అమ్మకాలు జరుపుతున్నారు. ఇలా అమ్మడం వల్ల కట్టలు కట్టే శ్రమ తగ్గడం, వెంటవెంటనే అమ్మకాలు జరిగి సరకు అంతా చెల్లిపోతోంది. ప్రస్తుతం కిలో కాండీ రూ.60 వరకు చెల్లుబాటు అవుతోంది. జీసీసీ జరిపే అడ్వాన్స్ టెండర్లలో అనుమతి పొంది సరకు రవాణా చేసేందుకు అవకాశం ఉంది. కానీ రవాణా సమయంలో అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. వీటిని రవాణా చేసేందుకు కిలోకు సెస్సు రూపేణా కొంతమొత్తం వసూలు చేసి అనుమతులు కల్పిస్తే వ్యాపారులకు కొనుగోలు చేసేందుకు వీలు కలిగి గిరిజన రైతులకు మేలు చేకూరుతుంది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జీసీసీ ద్వారా కొనుగోళ్లు

గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ద్వారా వారపు సంతలు, గ్రామాల్లో సిబ్బందితో కొండ చీపుర్లు కొనుగోళ్లు చేపడుతున్నాం. ఇప్పటి వరకు 50 వేల వరకు కొన్నాం. మొదటి రకం రూ.45, రెండో రకం రూ.40, మూడో రకం రూ.35గా ధర నిర్ణయించాం. వీటిని విక్రయించేందుకు జీసీసీ ద్వారా ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో అడ్వాన్స్ టెండర్లు సైతం నిర్వహిస్తున్నాం.
–దాసరి కృష్ణ, మేనేజర్, జీసీసీ, సీతంపేట

దశాబ్దాల కల నెరవేరుతున్న వేళ

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ అంటే రాళ్లు తేలి, గుంతలతో ఉన్న రోడ్డే గుర్తొస్తుంది. వర్షాకాలం వచ్చిందంటే ఆవరణ దమ్ముమడిని తలపించేది. దీంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారి ఇక్కట్లు తొలగించాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి రూ.20లక్షల నిధులు మంజూరు చేసింది. ప్రారంభమైన పనులను విప్ జగదీశ్వరి ఆదివారం పరిశీలించారు. సకాలంలో పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాయకులు కొండయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న విప్ జగదీశ్వరి

చోరీల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని 14వ వార్డు రామానంద్‌నగర్‌లో వీధుల సుందరీకరణ, దొంగతనాల నివారణకు సీసీ కెమెరాల ఏర్పాటుకు కాలనీ వాసులు తీర్మానం చేశారు. ఆదివారం పుర మాజీ వైస్ ఛైర్మన్ బి.జయబాబు అధ్యక్షతన కాలనీ పెద్దలతో సమావేశం జరిగింది. ఉగాది వేడుకల నిర్వహణ, యజమానులతో మాట్లాడి ఖాళీ స్థలాలు అభివృద్ధి చేసేందుకు నిర్ణయించారు. మొక్కల పెంపకం, కాలనీ ప్రవేశం వద్ద ఆర్చి ఏర్పాటు, కాలువలు నిర్మించనున్నట్లు చెప్పారు. రామలింగస్వామి, సీహెచ్.లచ్చయ్య, కూర్మినాయుడు, బాపూజీ, కైలాసరావు, నారాయణరావు, సత్యనారాయణ, తిరుపతిరావు, కామేశ్వరరావు, భాస్కరరావు, వాసు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో పారిశుద్ధ్యం పనులు

పనులు చేపడుతున్న కార్మికులు

బలిజిపేట, బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పెదపెంకి గ్రామంలో ఆదివారం పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్త తొలగించారు. జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, ఎంపీడీవో వాణిశ్రీ, డిప్యూటీ ఎంపీడీవో పుష్పరాజు పర్యవేక్షించారు.

వేతనాల పెంపుపై ప్రభుత్వం దృష్టి

పార్వతీపురం, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది వేతనాలను సాధ్యమైనంత త్వరగా పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే బి.విజయచంద్ర అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఉద్యమిస్తున్న నేపథ్యంలో ఆయన ఆదివారం ప్రకటన జారీ చేశారు. ఇప్పటికే డిమాండ్లలో చాలా పరిష్కరించినట్లు చెప్పారు. అంగన్‌వాడీలకు సకాలంలో వేతనాలు చెల్లిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కార్యకర్తల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని స్మార్ట్‌ఫోన్లను అందించామని, కేంద్రాల్లో వసతులు, పిల్లలకు క్రీడా, సాంకేతిక సామగ్రి అందించినట్లు గుర్తు చేశారు.

కాలువల్లో ప్లాస్టిక్ పారుతోంది

పాలకొండ పట్టణంలో కాలువల తీరుకు అద్దం పడుతోందీ చిత్రం. పట్టణంలో 20 వార్డుల పరిధిలో ఏ కాలువ చూసినా ఇదే పరిస్థితి. పట్టణంలో మొత్తం 60 కి.మీ. మేర పక్కా కాలువలు ఉన్నప్పటికీ ఎక్కడా మురుగు నీరు ప్రవహించే పరిస్థితి లేదు. గతంలో పూడికతీతలకు రూ.23 లక్షలు వెచ్చించినా ఇలా దర్శనమిస్తోందంటే సిబ్బంది తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాలువల్లో పూడికలు తీసేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

అంతర్రాష్ట్ర రోడ్డు ప్రమాదాలు బోలెడు

గరుగుబిల్లి మండలం ఖడ్గవలస కూడలి, కొంకడివరం సమీప అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా తయారైంది. భారీ వర్షాలకు అడ్డాపుశీల-కొంకడివరం కూడలి వద్ద కోతకు గురైంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల వీరఘట్టం నుంచి జియ్యమ్మవలస ద్విచక్రవాహనంపై వెళ్తున్న దంపతులు అదుపు తప్పి గోతిలో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. నాగావళి పాత వంతెన వద్ద భారీ వాహనం ఢీకొట్టడంతో రక్షణ గోడ ధ్వంసమైంది. నిధులు మంజూరైతే బాగు చేయిస్తామని ర.భ.శాఖ ఏఈఈ రామ్మోహనరావు తెలిపారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు.
– న్యూస్‌టుడే, గరుగుబిల్లి గ్రామీణం

ఉద్యోగ భద్రత కల్పించాలి

పార్వతీపురం గ్రామీణం: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని బోరు మెకానిక్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 600 మంది సిబ్బంది పని చేస్తున్నారని, గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా సేవలు అందిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

భత్యం.. ఈసారి అందేనా!

న్యూస్‌టుడే, పాలకొండ

ఉపాధి వేతనదారులకు వేసవి కాలంలో నేల పనులు చేయడం కాస్త శ్రమతో కూడుకున్నది. ఈ దృష్ట్యా ప్రభుత్వం గతంలో వేసవిలో చేసే ఉపాధి పనులకు అదనపు భత్యం చెల్లించేది. గడిచిన నాలుగేళ్లుగా వీటిని నిలిపేయడంతో ఉపాధి కూలీలు నష్టపోతున్నారు.

పనులు చేస్తున్న వేతనదారులు

నిలిచి నాలుగేళ్లు..

మిగతా కాలాల కంటే వేసవిలో నేలలో తేమ ఉండదు. దీంతో పనులు చేయడం కష్టంగా ఉంటుంది. దీంతో ప్రభుత్వం ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు పని చేసిన వారికి వేతనంతోపాటు వేసవి భత్యం కలిపి చెల్లించేది. ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్‌లో 30, మేలో 30, జూన్‌లో 20 శాతం అదనంగా ఇచ్చేవారు. ఈ అయిదు నెలలు నిర్దేశించిన పెంపుతోనే చెల్లింపులు జరిగేలా సాఫ్ట్‌వేర్‌లోనే పొందుపరిచారు. ఈ ప్రక్రియ అంతా గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగేది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

గ్రామ పంచాయతీలు	450
జాబ్‌కార్డులు	2.11 లక్షలు
వేతనదారులు	3.89 లక్షలు
యాక్టివ్ జాబ్‌కార్డులు	1.94 లక్షలు
పనులకు వెళ్తున్న వారు	3.43 లక్షలు

వైకాపా వచ్చిన తర్వాత ఉపాధి నిధులు పక్కదారి పడుతున్నాయన్న కారణంతో కేంద్రం పటిష్ఠ చర్యలు చేపట్టింది. 2022 నుంచి చెల్లింపులకు సంబంధించి మార్పులు తీసుకొస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేకుండా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించింది. అప్పటి నుంచి కేంద్రం ఆధీనంలో ఉన్న ఎన్ఐసీ ద్వారానే చెల్లింపులు జరుగుతున్నాయి. శ్రమకు తగ్గ ఫలితం దక్కక వేతనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ ఏపీడీ శ్రీహరి తెలిపారు.

విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు

గరుగుబిల్లి: మండలంలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ప్రవేశపరీక్షలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు జరిగిన పరీక్షల్లో 5వ తరగతి 76 మంది, ఇంటర్ 104 మంది, ఐఐటీ నీట్‌లకు 52 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరిశీలకులుగా పి.ఉషారాణి, ఎన్‌టీ మార్టిన్ వ్యవహరించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కలెక్టరేట్ ప్రాంగణం: కౌలు రైతుల జిల్లా కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా రెడ్డి వేణు, రమణమూర్తి, ఉపాధ్యక్షులుగా దమయంతి, ఈశ్వరరావుతోపాటు మరో ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు. కౌలురైతుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. రాయితీపై విత్తనాలు అందించాలని, ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండు చేశారు.

లక్ష్యంతో సాగాలి

కొమరాడ: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకొని లక్ష్యంతో ముందుకు సాగాలని ఎస్సై జగదీష్‌నాయుడు అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం డా.బి.ఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

‘బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి’

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏపీ, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జిల్లా సమన్వయ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖాళీలు భర్తీ చేయకపోవడం, నియామకాలు చేపట్టకపోవడంతో ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. విస్తృత పోరాటం చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల సమన్వయ కమిటీలను ఎన్నుకున్నారు.

ప్రచార కార్యదర్శిగా శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం ఉత్తరాంధ్ర ప్రచార కార్యదర్శిగా ఎంపీడీవో లోచర్ల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలభాస్కర్ ఆధ్వర్యంలో నాయకులు సత్కరించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే : కౌలు రైతులకు భూయజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం కౌలు రైతుల జిల్లా మహాసభలు పార్వతీపురంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్తు ఒప్పందాల పేరిట స్మార్ట్ మీటర్లను పెట్టి ప్రజల్ని దోచుకుంటున్నారన్నారు. జిల్లాలో 60 వేల మందికి పైగా కౌలు రైతులుండగా, సర్వేలో 11 వేల మందినే గుర్తించారన్నారు. 700 మందికే కార్డులు ఇచ్చారని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి రమణమూర్తి, ప్రతినిధులు ఎం.కృష్ణమూర్తి, బంటుదాసు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి

(c) eenadu

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

హారతి చూపుతున్న అర్చకస్వామి

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. వేలాది మంది స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మారుమోగాయి. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

గన్నవరంలో అవగాహన కల్పిస్తున్న సీఐ కన్నపరాజు

ఎటపాక, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎటపాక సీఐ కన్నపరాజు అన్నారు. చింతూరు ఏఎస్పీ హేమంత్ పర్యవేక్షణలో ఎటపాక పోలీసుల ఆధ్వర్యంలో 'చైతన్య అవగాహన సదస్సు'ను గన్నవరం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. గ్రామస్థులతో మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లోని యువత మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని, వారిని ఆ మహమ్మారి బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. ఎంపీటీసీ రాజు, తెదేపా మండల అధ్యక్షుడు సదస్సులో ఎస్ఐ అప్పలరాజు, సర్పంచి భద్రమ్మ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: గత ఎన్నికల్లో అంగన్‌వాడీలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 86.68 లక్షలు కేటాయించి, విడుదల చేసిందన్నారు. 58,204 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కో-ఆర్డినేటర్లకు రూ. 75కోట్ల వ్యయంతో 5జీ చరవాణులు అందించామన్నారు. వీటి ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వేగంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదువేల మినీ అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి కేంద్రాలుగా స్థాయి పెంచడం జరిగిందన్నారు. అంగన్‌వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో తొమ్మిది ఇప్పటికే పరిష్కరించామన్నారు. వేతనాల పెంపు అంశాన్ని కూడా వీలైనంతవరకు అమలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

పాపికొండల విహారయాత్రకు 5 పర్యాటక బోట్లు

దేవీపట్నం: పాపికొండల విహారయాత్రకు పర్యాటకుల సంఖ్య పెరిగింది. గండిపోశమ్మ అమ్మవారి ఆలయం నుంచి ఆదివారం అయిదు బోట్లలో పర్యాటకులు పాపికొండల అందాలను తిలకించడానికి వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు. మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొండపై నుంచి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గోదావరిలో నీటి మట్టం తగ్గుతోంది. వరద మరింత తగ్గితే దండంగి- డి.రావిలంక గ్రామాల మధ్య ఆర్ అండ్‌బీ రహదారిపై వాహనాల రాకపోకలు పునః ప్రారంభం కానున్నాయి.

జిల్లా ఏర్పడింది సరే అధికారులేరీ?

నూతన జిల్లా పోలవరం పరిస్థితి

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం ప్రధాన కేంద్రంగా ప్రభుత్వం నూతనంగా డిసెంబర్ 30న పోలవరం జిల్లాను ప్రకటించింది. జనవరి 1నుంచి కార్యకలాపాలను ప్రారంభించారు. జిల్లా ఏర్పడి రెండు నెలలు పూర్తయినా నేటికి కలెక్టర్, ఎస్పీ, జేసీ వంటి ఉన్నతాధికారులెవరిని ప్రభుత్వం నియమించలేదు. కేవలం అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను, ఎస్పీ అమిత్‌బర్దర్‌ను పోలవరం జిల్లాకు ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు. వారు కూడా రెండు నెలల్లో మూడు పర్యాయాలు మాత్రమే వచ్చి వెళ్లారు. దీంతో పాలనాపరంగా ఇబ్బందులు తప్పడంలేదు.

జిల్లా పేరు	పోలవరం
కేంద్రం	రంపచోడవరం
రెవెన్యూ డివిజన్లు:	చింతూరు, రంపచోడవరం
మండలాలు:	12 (గుర్తేడుతో కలిపి)
పంచాయతీలు	186
గ్రామాలు	827
అసెంబ్లీ నియోజకవర్గం	రంపచోడవరం
జనాభా	3,49,799
పురుషులు	1,70,645
మహిళలు	1,32,638
ఓటర్లు	2,55,313

ఇన్‌ఛార్జ్‌లతోనే సరి..

రంపచోడవరం పీవో, ఇన్‌ఛార్జ్ జేసీగా వ్యవహరిస్తున్న స్మరణ్‌రాజ్ ఇటీవల వివాహం నిమిత్తం సెలవు పెట్టారు. దీంతో రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం నొక్వాల్‌ను ఐటీడీఏ పీవోతో పాటు జేసీగా ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు. అదనంగా చింతూరు ఐటీడీఏ పీవోగా కూడా కొనసాగుతున్నారు. దీంతో పూర్తి స్థాయిలో విధులు నిర్వహించేందుకు కష్టతరంగా మారింది. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్న అధికారులనే జిల్లా అధికారులుగా అదనపు బాధ్యతలను అప్పగించారు తప్ప కొత్త వారిని నియమించలేదు. దీంతో వివిధ పనులపై పాడేరు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

రంపచోడవరం వైటీసీలో ఏర్పాటు చేసిన కలెక్టరేట్

వేరుకే జిల్లా కార్యాలయాల బోర్డులు..

పోలవరం జిల్లా ఏర్పాటుతో కలెక్టరేట్‌గా స్థానిక వైటీసీని, వివిధ జిల్లాస్థాయి కార్యాలయాల ఏర్పాటుకు స్థానిక మీంఆర్‌సీని ఉన్నతాధికారులు ప్రకటించారు. దీంతో ఆయా కార్యాలయాల్లో వివిధ జిల్లాస్థాయి విభాగాల బోర్డులను పెట్టారు. కనీసం సిబ్బంది కూడా లేరు. వివిధ పనులపై వస్తున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కార్యాలయాలకు తాళాలు వేసి దర్శనమిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని స్థానిక వైటీసీతో పాటు మీంఆర్‌సీని ఆ తర్వాత జర్లపల్లిలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలోను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎక్కడ ఏర్పాటు చేయాలనే సందిగ్ధంలో అధికారులు ఉన్నారు.

రెండు సార్లే కలెక్టర్ గ్రీవెన్స్

కొత్త జిల్లా ఏర్పడి 8 వారాలు గడిచాయి. ప్రతి సోమవారం ఐటీడీఏలో నిర్వహించే గ్రీవెన్స్‌కు జిల్లా కలెక్టర్ హాజరుకావాల్సి ఉండగా కేవలం రెండు పర్యాయాలు మాత్రమే వచ్చారు. ప్రతి సోమవారం కలెక్టర్ వస్తారని వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలపై గిరిజనులు ఐటీడీఏ వద్దకు వస్తున్నారు. అయితే కలెక్టర్ రాకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు.

పెద్దపులి సంచారంపై వదంతులు నమ్మొద్దు

ఇందుకూరు రేంజ్ అధికారి కొండలరావు

పెద్దరమణయ్యపేటలో గాలింపు చర్యలు చేపడుతున్న అటవీశాఖాధికారులు

దేవీపట్నం, న్యూస్‌టుడే: రంపచోడవరం మండలం తాళ్లపాలెం సమీపంలో ఉన్న పెద్దపులి ఒక్కసారిగా దేవీపట్నం మండలం పెద్దరమణయ్యపేట, కొండ మండలం గోపాలపురం వద్ద దూసుకుపోయి కొందరు కూలీల నుంచి ఆదివారం వదంతులు వచ్చాయి. దీంతో ఆయా చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లిన ప్రజలు, పొలాల్లో పనిచేసుకోవడానికి వెళ్లిన కూలీలు భయంతో వణికిపోయారు. ఈ సమయంలో ఇందుకూరు రేంజ్ అధికారి కొండలరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అప్రమత్తమైన ఆయన రెండు బృందాలను పంపించారు. ఒక బృందం స్థానికుల సహాయంతో పెద్దరమణయ్యపేట పరిధిలోని పొలాలు, చెరువుల్లో గాలించారు. ఎక్కడా పాదముద్రలు సైతం లేవని తేల్చారు. మరో బృందం గోపాలపురం పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టి పొలాల్లో రైతులతో మాట్లాడి వివరాలను సేకరించారు. దీనిపై రేంజ్ అధికారి కొండలరావు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ రంపచోడవరం మండలం తాళ్లపాలెం పరిసర ప్రాంతాల్లోనే పెద్దపులి కదలికలు ఉన్నాయని ప్రస్తుతం వస్తున్న వదంతులు ఎవరు నమ్మవద్దన్నారు. పులి పాదముద్రలు కనిపిస్తే మాకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

సైనికులకు, సమాజానికి బంధం బలపరుస్తాం

వీరాంగ్గర్ గ్రామస్థులకు అందించిన వస్తువులతో 212 బెటాలియన్ అధికారులు

ఎటపాక, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాల్లోని ప్రజలకు తక్షణ అవసరాలను తీర్చడమే కాకుండా సైనికదళం, సమాజం మధ్య బంధాన్ని మరింత పెంపొందించడానికి సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని ఎటపాక సీఆర్‌పీఎఫ్ 212 బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండర్ దినేష్‌కుమార్ అన్నారు. సరిహద్దు ప్రాంతం మారాయిగూడ గ్రామ సమీపంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా వీరాంగ్గర్ గ్రామంలో ఎటపాక 212 బెటాలియన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఆగ్రామంలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూపదుస్తులు, బ్యాగులు, యువకులకు క్రీడాసామగ్రి అందజేశారు. సుమారు 400 మంది నివసిస్తున్న గ్రామంలోని ఒక్కొక్క కుటుంబానికి నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు, దుస్తులు, సోలార్‌లైట్లు అందించారు. ఎటపాక సీఆర్‌పీఎఫ్ 212 బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ గౌరవ్‌శర్మ, అసిస్టెంట్ కమాండెంట్ నిశాంత్‌సూద్, మారాయిగూడ ఎస్‌హెచ్‌ఓ ఉత్తమ్‌గావ్డే, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారికి స్కూల్ బ్యాగు అందిస్తున్న సెకండ్ ఇన్ కమాండర్ దినేష్‌కుమార్

పోలవరం జలవిద్యుత్తు కేంద్రం ఎస్‌ఈగా హనుమ



దేవీపట్నం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు జలవిద్యుత్తు కేంద్రం ఎస్‌ఈగా సీహెచ్. హనుమ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇదే ప్రాజెక్టులో సుమారు మూడేళ్ల పాటు ఆయన ఈఈగా విధులు నిర్వహించి పదోన్నతిపై ఎగువ సీలేరు ఎస్ఈగా బదిలీ అయ్యారు. ప్రస్తుతం మళ్లీ పోలవరం ప్రాజెక్టు జలవిద్యుత్తు కేంద్రం ఎస్‌ఈగా బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ (వ్యాప్‌కోస్) కొలగాని మూర్తి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్‌ఈ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు జలవిద్యుత్తు కేంద్రం నిర్దిష్టమైన గడువులో అధికార యంత్రాంగంతో కలిసి పూర్తిచేయడానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఈఈ రాజ్‌కుమార్, రామ్మోహన్, సుబ్రహ్మణ్యం, భీమదనరావు, రమేష్‌నాయుడు పలువురు అధికారులు ఎస్‌ఈని కలిశారు.

పునరావాస కాలనీ నిర్మాణం పునఃప్రారంభం

భైరవపట్నంలో నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

కూనవరం, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది పుష్కరాల నాటికి పోలవరం ఆనకట్ట నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితమివ్వాలన్న సంకల్పంతో ఉన్న ప్రభుత్వం అందుకనుగుణంగా చర్యలు చేపడుతోంది. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోక మధ్యలో ఆపేసిన నిర్వాసితుల పునరావాస కాలనీ నిర్మాణాలను కూటమి ప్రభుత్వం చేపట్టింది. కొత్తగా టెండర్లు ఖరారు కావడంతో గుత్తేదారులు నిర్మాణ పనులు మొదలు పెట్టారు. వీఆర్‌పురం మండలం సీతాపేట, జీడిగుప్ప నిర్మాణాలు కూనవరం మండలం భైరవపట్నంలో పునరావాస కాలనీ నిర్మాణాలను అప్పటి తెదేపా ప్రభుత్వం 2017లో మొదలుపెట్టింది. రెండు గ్రామాల్లోని 194 మంది నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో ఆ పనులు నిలిచిపోయి ఇళ్ల పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన నిర్మాణాలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో అయిదేళ్లుగా నిర్మాణాలు మొండి గోడల స్థాయి వద్ద ఆగిపోయాయి.

పాలకుల ఆదేశాలతో..

ప్రస్తుత కూటమి ప్రభుత్వం పోలవరం పనులను వేగంగా పూర్తి చేస్తున్న నేపథ్యంలో నిర్వాసితుల తరలింపు అత్యంత కీలకంగా మారింది. గడువులోగా కాలనీ నిర్మాణాలు పూర్తి చేయాలని పాలకుల ఆదేశాలు రావడంతో అధికారులు క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేస్తున్నారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు చివరి దశలో ఉండగా... పాఠశాల, అంగన్‌వాడీ, కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులన్నీ నాలుగు నెలలో పూర్తి అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

సుస్వరాల తెలుగు.. ఇంటింటా వెలుగు

ఈనాడు, అమలాపురం, న్యూస్‌టుడే, గ్రామీణం, కలెక్టరేట్: తెలుగు అంటే.. కోనసీమ లాంటి పచ్చని అందాలు.. సవ్వడి చేసే గోదారమ్మ పరవళ్లు.. నిత్య స్ఫూర్తిని కలిగించే సముద్ర కెరటాలు అంటూ వివిధ రంగాల్లోని ప్రముఖులు తెలుగు భాష గురించి మాట్లాడారు. అమలాపురంలో నిర్వహిస్తున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభలు ఆదివారం వేడుకగా ముగిశాయి. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ఛాన్సలర్, కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) ఛైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) అధ్యక్షతన జరిగిన కార్యక్రమాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాలలోని ప్రముఖులు హాజరయ్యారు. సాహితీవేత్తలు, కళాకారులు, భాష ఔన్నత్యాన్ని తెలియజేశారు. అమ్మ లాంటి భాషను భావితరాలకు అందించాల్సిన ప్రాధాన్యాన్ని వివరించారు.

ఎన్నెన్నో ప్రత్యేక ఆకర్షణలు..

సభా ప్రాంగణంలో తెలుగు కోసం విశేష కృషి చేసిన ప్రముఖుల విగ్రహాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యువతీయువకులు వాటి వద్ద స్వీయచిత్రాలు తీసుకుని సందడి చేశారు. తెలుగు సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా విద్యార్థుల చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందర్నీ అలరించాయి.

వేడుకలో కళాకారుల నృత్య ప్రదర్శన

ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రముఖులు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్లు జస్టిస్ అబ్దుల్ నజీర్, జిష్ణుదేవ్ వర్మ, మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మొహినుద్దీన్, జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ చలపతిరావు, జస్టిస్ రామకృష్ణారెడ్డి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నశ్రీ, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, అమలాపురం, కొత్తపేట ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, బండారు సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చిత్రంలో డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీష్‌రెడ్డి, మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్, కిమ్స్ ఛైర్మన్ చైతన్యరాజు, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

విజేతలకు బహుమతుల ప్రదానం..

ప్రముఖ సంగీత దర్శకుడు, రచయిత, గాయకుడు ఆర్పీ పట్నాయక్ వేదికపై 'తెలుగు భాష కమ్మదనం..' 'వానా.. వానా.. వాన.. నీలాకాశంలోన' 'ఒక్కడై రావడం.. ఒక్కడై పోవడం.. ఆ నలుగురు' తదితర పాటలు పాడారు. అంతకుముందు చైతన్యరాజుతో కలిసి తెలుగు మహాసభల పోస్టల్‌స్టాంప్‌ను ఆవిష్కరించారు. ● వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

రామోజీరావు వేదికపై విద్యార్థినులతో నిర్వహించిన ముఖాముఖిలో మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్ పాల్గొన్నారు. వారు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. విలువైన సూచనలు చేశారు.

చదువుకుంటూనే పోటీ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి

● విద్యార్థి దశలో ప్రతి నిమిషం విలువైంది. ప్రణాళిక ప్రకారం కష్టపడాలి. లక్ష్య సాధనకు క్రమశిక్షణ, కృషి అంతకు మించి స్థిరత్వం అవసరం. అప్పుడే విజయం సాధ్యం.

ప్రశ్న: కుటుంబం, వృత్తి సమన్వయం ఎలా?

మార్గదర్శి ఎండీ శైలజా కిరణ్

● సమాజంలో పురుషుడైనా.. స్త్రీ అయినా స్వార్థాన్ని వీడాలి. ప్రస్తుత తరంలో ఆ స్వభావం అధికంగా ఉంది. మనం సమాజానికి ఏం ఇస్తున్నామో కూడా ఆలోచించాలి. ఒత్తిడి అధిగమించేందుకు ధ్యానం చేయాలి. సర్దుబాటుతత్వం ఉంటే చక్కని సమన్వయంతో రాణించగలం.

మహిళా రక్షణకు చట్టాలొచ్చినా నేరాలు ఆగట్లేదు ఎందుకు?

● రక్షణ పరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అనవసర ప్రాంతాలకు ఒంటరిగా వెళ్లకూడదు. యుద్ధక్రీడలు, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి. అందరూ మంచిగానే ఉంటారు, కొందరు మాత్రమే నేర స్వభావంతో ఉంటారు.

ఆకట్టుకున్న అచ్చమైన తెలుగింటి లోగిలి

కార్యక్రమానికి హాజరైన వివిధ రంగాల ప్రముఖులు, భాషాభిమానులు

వివిధ పోటీల్లో బహుమతులు సాధించిన విద్యార్థులతో న్యాయమూర్తులు, చైతన్యరాజు

తొమ్మిదోతరగతి విద్యార్థులకు నేటి నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో సాధారణంగా సెలవులకు ముందు సమ్మెటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు నిర్వహించి.. తర్వాత వేసవి సెలవులు ఇస్తారు. ఈ ఏడాది 9వ తరగతి విద్యార్థులకు మార్చి 2 నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు ప్రారంభించి 12తో ముగిస్తారు. అనంతరం మార్చి 16 నుంచి వేసవి సెలవుల వరకు బ్రిడ్జి కోర్స్ అమలు చేయాలని నిర్ణయించారు. నెలరోజుల పాటు ఈ కోర్సు జరగనుంది. తద్వారా పదో తరగతికి వచ్చేసరికి విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కలుగుతుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో వివరాలు

తొమ్మిదో తరగతి విద్యార్థులు: 4896
బాలురు: 2309 బాలికలు: 2587

పరీక్షల షెడ్యూల్ ఇలా..

2న తెలుగు, 4న హిందీ, 5న ఆంగ్లం, 6న గణితం, 7న భౌతిక శాస్త్రం, 9న జీవశాస్త్రం, 10న సాంఘికశాస్త్రం పరీక్షలు జరగనున్నాయి.

పర్యాటక ప్రాంతాలకు కళ

లోయరు సీలేరు ప్రాజెక్టు మోతుగూడెంలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. ధారాలమ్మ పిక్నిక్ స్పాట్, పొల్లూరు ఎగువ, దిగువ జలపాతాలు, ఫోర్‌బే, డొంకరాయి జలాశయాలు, సీలేరు నది పరివాహక ప్రాంతాలను వీక్షించిన సందర్శకులు తీయని అనుభూతిని పొందారు. అధిక సంఖ్యలో కుటుంబ సమేతంగా వచ్చిన పర్యాటకులు ధారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద సీలేరు నదిలో ఆనందంగా గడిపారు. – న్యూస్‌టుడే, మోతుగూడెం

సమస్యలు పరిష్కరించాలని బొజ్జిరెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న గిరిజనులు

ప్రతీ అర్జీకి పరిష్కారం చూపుతా: బొజ్జిరెడ్డి

రంపచోడవరం, న్యూస్‌టుడే: గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక నివాసంలో బొజ్జిరెడ్డి గిరిజనుల సమస్యలపై వినతులు స్వీకరించారు. వై.రామవరం మండలం యార్లగడ్డ పంచాయతీ శేషరాయి గ్రామానికి చెందిన ప్రజలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. యార్లగడ్డ నుంచి కొమవరం, గంగవరం మీదుగా పెరికివలస గ్రామానికి సుమారుగా 20కిలోమీటర్ల రహదారి నిర్మాణాన్ని మంజూరు చేయాలని కోరారు. వై.రామవరం నుంచి గురమంద శివాలయం వరకు రహదారిని మంజూరు చేయాలన్నారు. నూకలమిద్ది నుంచి దారలోవ గ్రామపరిధిలో సచివాలయం, పాత వాటర్‌ట్యాంకు, ఆశ్రమ పాఠశాల తదితర 5 గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని గిరిజనులు వినతిపత్రాన్ని అందించారు. బొజ్జిరెడ్డి మాట్లాడుతూ సమస్యలపై వచ్చిన ప్రతి వినతిపత్రాన్ని సంబంధిత అధికారులకు పంపించి చర్యలు చేపడతామన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్

మూడు నెలల పాటు ప్రత్యేక కార్యాచరణ



చింతూరు, న్యూస్‌టుడే: మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్ నివారణకు బాలికలకు హ్యూమన్ ప్యాపిలోమావైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్ వేసేవిధంగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు విజయనగరం జిల్లాలో లాంఛనంగా ప్రారంభించారు. ప్రస్తుతం పలు రకాల క్యాన్సర్లు మహిళలను వేధిస్తున్నాయి. ఈవ్యాక్సిన్‌తో జీవితంలో దాదాపుగా 98 శాతం క్యాన్సర్ రాకుండా అడ్డుకోగల శక్తి ఉంది.

ఏ వయసు వారికంటే..

హ్యూమన్ ప్యాపిలోమా వైరస్‌ను నివారించేందుకు ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకువచ్చారు. 14 నుంచి 15 ఏళ్ల లోపు బాలికలకు ప్రధానంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయనున్నారు. ఇది వేయడం వల్ల మహిళలకు సంభవిస్తున్న గర్భాశయ క్యాన్సర్ నివారణలో మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రాష్ట్రాల్లో అమలు చేయడానికి నిర్ణయించింది.

జిల్లాలో ఇప్పటికే...

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ వ్యాక్సిన్ నిల్వ చేసేందుకు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. దీనిని బాలికలకు వేయడానికి ఇప్పటికే అధికారులు అర్హుల జాబితాను గుర్తించే పనిలో పడ్డారు. ఈ వయసు గల బాలికలు ప్రధానంగా ఆశ్రమ పాఠశాలలతో పాటు ఇతర ప్రాంతాల్లో చదువుకుంటున్న దృష్ట్యా సంబంధిత విద్యా సంస్థల ఉన్నతధికారులను సంప్రదించి వారి జాబితాను తయారుచేస్తున్నారు. బాలికలను గుర్తించి పీహెచ్‌సీల్లో బుధవారం, శనివారం వేసే వ్యాక్సిన్లతో పాటు దీన్ని వేయనున్నారు.

(c) eenadu

సంప్రదాయ సవ్వడి

బుర్రకథ చెబుతున్న కళాకారులు

సింహాచలం దేవస్థానానికి చెందిన నాదస్వర విద్వాంసుల కచేరీ

పేరూరు ఉన్నత పాఠశాల విద్యార్థుల కోలాటం

అమలాపురంలోని కిమ్స్ ప్రాంగణంలో తెలుగు మహాసభలు ఎంతో వేడుకగా జరిగాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భాషాభిమానులు తరలివచ్చారు. వివిధ కళాకారులు, పాఠశాలల విద్యార్థులు వచ్చారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్నారు. తెలుగింటి సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించిన కార్యక్రమాలు, ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే, కోనసీమ, అమలాపురం కలెక్టరేట్, అమలాపురం గ్రామీణం

కొబ్బరి పత్రం.. విభిన్న రూపం

పందిరి

గణపతి


శివలింగం

పచ్చని కొబ్బరి ఆకులతో వివిధ రూపాలను తీర్చిదిద్దడంలో పాశర్లపూడికి చెందిన వస్త్ర వ్యాపారి బళ్ల వెంకటరత్నం ప్రత్యేక ప్రతిభ చూపిస్తున్నారు. శివలింగం రూపాలు, వేలాడే తోరణాలు, స్తంభ నమూనాలతో ఆకట్టుకుంటారు. తాను సొంతంగా నేర్చుకున్న అల్లికలతో చేసే బొమ్మలను కళాభిమానులకు స్వచ్ఛందంగా అందజేస్తుంటానని వెంకటరత్నం తెలిపారు. బంధువులు, స్నేహితులకు సంబంధించిన ఉత్సవాలకు ఉచితంగా ఇస్తుంటానన్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

పాఠ్యాంశాలపై పట్టు.. పదిలో మెరిసేట్టు

- విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసిన సబ్జెక్టు నిపుణులు
- 'ఈనాడు' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన

ఈనాడు మీ తోడు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: పది పరీక్షల సమయం దగ్గర పడుతోంది. ఈ నేపథ్యంలో సందేహాలు నివృత్తి చేసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లాతో పాటు కడప, కర్నూలు, బాపట్ల, తూర్పుగోదావరి జిల్లాల నుంచి సైతం భారీ సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఫోన్ చేశారు. వారు అడిగిన ప్రశ్నలకు ఉపాధ్యాయులు వివరంగా సమాధానాలు చెప్పారు. ఫోన్ ఇన్ కార్యక్రమం విద్యార్థులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని డీఈవో పి.నాగేశ్వరరావు, సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీ, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావు పేర్కొన్నారు. వివిధ ప్రశ్నలకు సబ్జెక్టు నిపుణులు ఇచ్చిన సమాధానాల సారాంశం ఇదీ..

చేతి రాత బాగుండాలి

చక్కని చేతిరాతతో అక్షరదోషాలు లేకుండా రాయాలి. పద్య, గద్య, రామాయణం, సృజనాత్మక, లేఖ తదితరాలపై ప్రశ్నలు వస్తాయి. పేరాలోని ప్రశ్నలకు జవాబులు అక్కడే ఉంటాయి. వాటిని గుర్తించాలి. రామాయణంలోని వాక్యాలు ఏయే కాండాలకు చెందినవో చెబితే 8 మార్కులు సులభంగా సాధించవచ్చు. వ్యక్తీకరణ- సృజనాత్మకతలోని కవి పరిచయం ప్రక్రియ లేదా నేపథ్యం, పాత్ర స్వభావాలు ఒకసారి చదివితే మంచిది. అలంకారాలు, ఛందస్సు, అర్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి-వికృతి, సంధులు, సమాసాలు, ప్రత్యక్ష, పరోక్ష కథనాలు చదివితే ఉత్తీర్ణత సాధించవచ్చు. – జి.నవభారతి, తెలుగు ఉపాధ్యాయురాలు, జడ్పీహెచ్ఎస్, నక్కిరేవపల్లిలంక

బ్లూప్రింట్‌ను అనుసరించాలి

ఎస్‌సీఈఆర్‌టీ బ్లూప్రింట్ ప్రకారం చదవాలి. కాంతి పరావర్తనం, వక్రీభవనం, దృష్టి, ప్రస్తుతదృష్టి లోపాలు వాటి సవరణలను చదవాలి. ఆమ్లాలు- క్షారాలు, లవణాలు, లోహాలు, అలోహాలు, ఆల్కేన్, ఆల్కీన్, ఆల్కైన్ ప్రమేయ సమూహాల ఫార్ములాలు అభ్యాసం చేయాలి. పటాలు గీయడం, విద్యుత్తు, విద్యుత్తు ప్రవాహం పాఠంలోని భౌతిక అంశాలను గుర్తుల రూపంలో ఎలా తెలియజేస్తున్నామో.. స్పష్టంగా చూసుకోవాలి. – జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్సు అధికారి

గణితంలో 100 మార్కులు సాధ్యమే

గణితంలో తప్పులు లేకుండా ప్రమాణాలు రాయాలి. ఒకటి, రెండు మార్కుల ప్రశ్నలకు సమస్యను పరిష్కరించి రాయాలి. జవాబు.. అవును.. కాదు అనే దానిని విధిగా రాయాలి. లేకుంటే మార్కులు తగ్గిస్తారు. సమయపాలన పాటిస్తూ.. రాస్తే వందకు వంద మార్కులు సాధించవచ్చు. సాంఖ్యక శాస్త్రం, సంభావ్యత, బహుపదులు, రేఖీయసమీకరణాలు, వాస్తవ సంఖ్యలు, నిరూపకజ్యామితి నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తాయి. – డా.బీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తి, గణిత ఉపాధ్యాయులు, ఎంపీయూపీఎస్, చిందాడగరువు

పటాలను సక్రమంగా గుర్తించాలి



సాంఘికశాస్త్రంలో పటాల గుర్తింపులో 15 మార్కులు వస్తాయి. ప్రపంచపటంలో దేశాలు, సముద్రాలు, మహాసముద్రాలు, భారతదేశ పటంలో రాష్ట్రాలు, రాజధానులు, పోర్టులు వంటివి కీలకం. వినియోగదారుల విద్యపై నినాదాలు (స్లోగన్స్) అడిగే అవకాశం ఉంటుంది. మహిళా సమస్యలు, ఆదాయ అసమానతలపై సాధన చేయాలి. భూగోళంలో 2, 4, 6, 7, అర్థశాస్త్రంలో మూడో పాఠం ముఖ్యమైనవి. – కేఎస్‌వీ కృష్ణారెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, జీహెచ్ఎం జడ్పీ ఉన్నత పాఠశాల, లొల్ల

వ్యాకరణాంశాలు సాధనతో..

వ్యాకరణాంశాల్లో 16-30 బిట్లు పాఠ్య పుస్తకం నుంచే వస్తాయి. ఉపవాచకంలో డోక లాకర్, అనోకా ఉపాయ్ ఇస్తారు. పత్రలేఖన్ చుట్టీ పత్ర్, పితాజీకో పత్ర్, పుస్తక విక్రేతకే నామ్ పత్ర్ వంటివి చూసుకోవాలి. గద్యభాగ సారాంశంలో ఈద్గాహ్, లోక్‌గీత్, పద్యభాగ సారాంశంలో బరస్తేబాదల్, కన్-కన్ కా అధికారి ముఖ్యమైనవి. కవి పరిచయాల్లో కబీర్ దాస్, మీరాబాయిలపై పట్టు సాధించాలి. – మహ్మద్ తాహేర్ పాషా హిందీ ఉపాధ్యాయులు, జడ్పీహెచ్ఎస్, అంతర్వేదిపాలెం మధ్య గ్రూపు

పాఠ్య పుస్తకాల నుంచే ఎక్కువ ప్రశ్నలు

ఆంగ్లంలో ఎక్కువ ప్రశ్నలు పాఠ్య పుస్తకాల నుంచే వస్తాయి. అక్షర, వ్యాకరణ దోషాలు లేకుండా చక్కటి దస్తూరితో రాయాలి. గత ఏడాది మోడల్, ఎస్‌ఈఆర్టీ నమూనా పేపర్లను చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. రీడింగ్ కాంప్రహెన్షన్, నాన్‌వెర్బల్ డేటా, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. క్రమపద్ధతిని తప్పకూడదు. యాక్టివ్ వాయిస్, పాసివ్ వాయిస్, రిపోర్టెడ్ స్పీచ్, నౌన్ మాడిఫయర్స్ చూసుకోవాలి. వీటిలో 30 మార్కులు వస్తాయి. – డా.కె.సురేఖారాణి, ఆంగ్ల ఉపాధ్యాయురాలు, జడ్పీ బాలికోన్నత పాఠశాల, ముమ్మిడివరం

పాయింట్ల రూపంలో రాయాలి

జీవశాస్త్రంలో ప్రశ్నలకు జవాబులు పాయింట్ల రూపంలో రాయాలి. పటాలు చక్కగా గీసి వాటి భాగాలను తప్పులు లేకుండా గుర్తించాలి. ఈసారి పరీక్ష బ్లూమ్స్ టాక్సానమీ, ఆబ్జెక్టివ్‌ల ఆధారంగా జరుగుతుంది. ఇందులో అవగాహన, వినియోగం, విశ్లేషణ ఉంటాయి. ప్రశ్నలు అర్థం చేసుకుని పాయింట్ల వారీగా.. ప్రయోగాల వివరణలు చక్కగా అర్థమయ్యేలా రాయాలి. జీవక్రియలు, ప్రత్యుత్పత్తి, అనువంశికతలపై పట్టు సాధించాలి. – మేకా రామలక్ష్మి, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు, మున్సిపల్ హైస్కూల్, మండపేట

రామోజీ ఫిల్మ్‌సిటీలో మహిళలకు ప్రత్యేక ఆఫర్లు

SheShines 1st - 31st March - 2026

ఈ నెల 31 వరకు అవకాశం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: రంగమేదైనా తమకు సాటి లేదని మహిళామణులు చాటిచెబుతున్నారు. వారి స్ఫూర్తిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకొనే వేళ రామోజీ ఫిల్మ్‌సిటీ మార్చి నెలను అతివలకు అంకితం చేస్తూ మాసోత్సవాలను నిర్వహిస్తోంది. నేటి నుంచి మార్చి 31 వరకు ప్రత్యేక ఆఫర్లతో మహిళలు ఫిల్మ్‌సిటీని సందర్శించేందుకు వీలు కల్పించింది. వివిధ ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొంటూ అన్ని వయసుల మహిళలు సినీ ప్రపంచంలో వినోదం, విహారం, సినిమాటిక్ వైభవాన్ని ఆస్వాదించే అవకాశం ఉంది. రామోజీ స్టూడియో టూర్‌లో అద్వితీయ సినిమా సెట్ల వీక్షణం, లైవ్ షోలు, రైడ్స్, సాహసాల నెలవు సాహస్ సందర్శన, అలరించే పక్షుల పార్కు, సీతాకోకచిలుకల గార్డెన్, మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్, మాయాలోక్ ఇలా ఎన్నో ఆకర్షణలను తిలకించవచ్చు.

సద్వినియోగం చేసుకోండి..

రామోజీ ఫిల్మ్‌సిటీ మహిళా దినోత్సవ ఆఫర్‌లో భాగంగా అన్ని వయసుల మహిళలకు ఒకరికి రూ.1111 + జీఎస్టీ, కనీసం 11 మంది బృందంగా వస్తే ఒక్కొక్కరికి రూ.999 + జీఎస్టీతో ప్రవేశ రుసుం ఉంటుంది. బృందాలుగా వచ్చి వేడుకలు మరింత ఉత్సాహంగా జరుపుకోవడానికి ఇదే మంచి తరుణం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళా మాసోత్సవాల్లో పాల్గొని మరిచిపోలేని మధురానుభూతి పొందండి.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.comలో లాగిన్ అవ్వండి. లేదా 76598 76598కు కాల్ చేయండి.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

సఖినేటిపల్లిలో బాణసంచా దుకాణంలో అధికారుల తనిఖీ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: బాణసంచా తయారు చేసే కేంద్రాలు, విక్రయించే దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పీ రాహుల్‌మీనా హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐలు, ఎస్సైలు, అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూశాఖ అధికారులు ఆదివారం జిల్లాలో బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా బాణసంచా తయారీకేంద్రాలు, దుకాణాలను పరిశీలించామన్నారు. పరిమితికి మించి బాణసంచా నిల్వ చేసినా, లైసెన్సు లేకుండా విక్రయించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం

హెలిప్యాడ్ వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, జేసీ నిశాంతి, చైతన్యరాజు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: అమలాపురంలో నిర్వహించిన మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆదివారం ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని హెలిప్యాడ్ వద్ద అధికారులు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా, జేసీ నిశాంతి, కిమ్స్ అధినేత చైతన్యరాజు, జిల్లా ఉద్యానశాఖ అధికారి బీవీ రమణ తదితరులు ఆయనకు స్వాగతంపలికి ఆహ్వానించారు. అమలాపురంలోని ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని ప్రసంగించిన అనంతరం విజయవాడ ప్రయాణమైన ఆయనకు హెలిప్యాడ్ వద్ద వీడ్కోలు పలికారు.

ముస్లింల నిరసన ప్రదర్శన

మామిడికుదురు, న్యూస్‌టుడే: ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ, కుటుంబ సభ్యులను బాంబు దాడులతో హతమార్చడాన్ని నిరసిస్తూ ముస్లిం సోదరులు ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన జరిపారు. వారి వీర మరణానికి సంతాపం వ్యక్తం చేస్తూ నినదించారు. మండలంలోని నగరం పెదపంజేషా నుంచి మామిడికుదురు కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. ప్రబోధకులు, సంఘ నాయకులు పలువురు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న ముస్లింలు

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలు విడుదల

పామర్రు, న్యూస్‌టుడే: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల యాజమాన్యాల పరిధిలోని విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాలను విద్యాశాఖ అధికారుల విడుదల చేశారు. ఆయా వివరాలను వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలతో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల వివరాలను సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారుల వెబ్‌సైట్లో పరిశీలించుకోవచ్చు. వీటిపై ఏవైనా అభ్యంతరాలుంటే మార్చి ఏడో తేదీలోగా డీఈవో కార్యాలయాల్లో సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు వెల్లడించారు.

3న ఆలయాల మూసివేత

అయినవిల్లి: చంద్ర గ్రహణం సందర్భంగా ఈ నెల 3(మంగళవారం)న అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయం ఉదయం 9.30 గంటల నుంచి మూసివేయనున్నట్లు ఆలయ ఏసీ సత్యనారాయణరాజు ఆదివారం తెలిపారు. బుధవారం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం 7.30 గంటల నుంచి యథావిధిగా భక్తులకు దర్శనాలు ఉంటాయన్నారు.

ఆత్రేయపురం: ఈ నెల 3న చంద్ర గ్రహణం సందర్భంగా కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆ రోజు ఉదయం 8.50 గంటల వరకే దర్శనాలు ఉంటాయని అనంతరం 9 గంటలకు గర్భాలయ తలుపులు మూసివేస్తామని ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. మళ్లీ 4న ఉదయం 6 గంటలకు సంప్రోక్షణ పూజలు, నిత్య కైంకర్యాలు నిర్వహించిన అనంతరం యథావిధిగా భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని వెల్లడించారు.

EENADU e Classifieds

AUTO

VEHICLES FOR SALE

శ్రీ లలితా రైస్‌మిల్ పెద్దాపురం వారి ఇన్నోవా కార్లు అమ్మకమునకు కలవు. Contact Cell: 94941 54551.

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

HEALTH & CARE

మద్యపానం మానేయడంఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్‌కు రాజమండ్రి శ్రీ సాయిలక్ష్మి లాడ్జి SVG మార్కెట్ రోడ్, ఆర్టీసిబస్టాండ్ ఎదురుగా, ప్రతీనెల 3,17 తేదీల్లో మందులు.

RHEUMATOLOGY

రుమటాలజిస్ట్

డా॥ ఎ.రామకృష్ణంనాయుడు
MD, DM (Rheumatology, NIMS, HYD)
07-03-2026న (శనివారం) 02 PM to 07 PMవరకు రాజమండ్రిలో ప్రైమ్ పాత్ ల్యాబ్స్, సిసిసి ఛానల్ ఎదురుగా, దానవాయిపేట వద్ద
ఫోన్: 94929 41177
మరియు
08-03-2026న (ఆదివారం) కాకినాడలో సేఫ్ హాస్పిటల్ నందు 11 AM to 6 PM వరకు అందుబాటులో ఉంటారు.
ఫోన్: 0884 2383366

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

బిగ్ ఫ్లాష్ న్యూస్. ప్రతిపాదిత తుని, అన్నవరం ఎయిర్‌పోర్ట్, అన్నవరం 6 లైన్ల రోడ్డుని ఆనుకొని గేటెడ్ కమ్యూనిటీ (RERA) KAUDA లే-అవుట్‌లో Open Plots, Simplex Houses, Villas, 80% బ్యాంకు Loan, ఫ్రీ సైట్ విజిట్‌కై. ✆ 96031 94449.

JOBS

Wanted Male Counselors and Admission Dept. Staff Qualification any Degree. Age Limit: 25 to 45 years having experience in Educational Organisations will be preferable. Salary upto: 18000/-. Working location: Master Minds College, Rajahmundry.Contact Cell: 92487 33370.

కాకినాడలో MEGA సంస్థనందు పనిచేయుటకు Marketing Executive (M) కావలెను. టూవీలర్ తప్పనిసరి. Contact Cell: 8247332564.

ఉద్యోగం: East & West జిల్లాల్లో ప్ర॥ కంపెనీలకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, టెలీకాలర్స్ స్త్రీ/పు. కావలెను. జీతం, రూం+ భోజనం ఫ్రీ. R.S. సర్వీసెస్, RJY, 99633 27756.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 4-58 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU
for Advertisement
Contact:
8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	30,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	30,000
గటగట	29,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	15,000-16,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	150-00
రిటైల్ లైవ్	177-00
డ్రెస్డ్	257-00
స్కిన్‌లెస్	292-00

92.7 FM Rajamahendravaram
92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

కుట్టు శిక్షణ సరే.. మిషన్లు ఏవీ..?

- ఏడాది గడుస్తున్నా పట్టించుకోని వైనం
- నెరవేరని మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యం

గతంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమం

న్యూస్‌టుడే, కొత్తపేట

మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రారంభించిన కుట్టు శిక్షణ కార్యక్రమం మొదటి దశలోనే నిలిచిపోయింది. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు ఇళ్లవద్దే ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యం నెరవేరడం లేదని శిక్షణ పొందిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నిరుద్యోగ యువతులు, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో బీసీ కార్పొరేషన్ ద్వారా కొన్ని నెలల కిందట కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో రోజుకు రెండు బ్యాచ్‌ల చొప్పున తరగతులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10,625 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా.. 11,014 మందికి శిక్షణ అందించామని, మూడు నెలల పాటు సాగిన ఈ శిక్షణకు 75 శాతం హాజరుతో విజయవంతంగా పూర్తి చేసిన యువతులు, మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అల్లికలు, ఆధునిక డిజైన్లపై అవగాహన కల్పించి, శిక్షణ ముగిసిన అనంతరం ధ్రువపత్రాలు అందజేశారు. శిక్షణ పూర్తి చేసి నెలలు గడుస్తున్నా మిషన్లు అందకపోవడంతో మహిళలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు త్వరగా అమలు చేస్తేనే శిక్షణ లక్ష్యం నెరవేరుతుందని వారు అంటున్నారు. 104 శిక్షణ కేంద్రాల్లో మహిళా ట్రైనర్, హెల్పర్ చొప్పున 208 మందిని నియమించి, జీతం ఇస్తామని ఆదిలో చెప్పారు. వారికి ఇప్పటికీ సహాయం అందక ఏమి చేయ్యాలో తెలియని స్థితిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి వారిని ఆదుకోవాలని కోరుతున్నారు.

జిల్లాల వారీ వివరాలు ఇలా..

జిల్లా	లక్ష్యం	కేంద్రాలు	శిక్షణ పొందినవారు
కాకినాడ	3,789	50	4,920
తూర్పుగోదావరి	3,593	25	2,904
అంబేడ్కర్ కోనసీమ	3,243	29	3,190

త్వరలోనే పంపిణీ..

శిక్షణ పూర్తి చేసిన మహిళలందరికీ కుట్టుమిషన్లు పంపిణీ చేస్తాం. రెండో దశ శిక్షణకు పెద్ద సంఖ్యలో మహిళలు ముందుకు వస్తున్నారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. శిక్షణ పొందిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. - రెడ్డి అనంతకుమారి, ఛైర్మన్, ఏపీ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్

ఆశీర్వచనం అందజేస్తున్న వేదపండితులు

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు

వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి వేంకటేశ్వరస్వామిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గోస్ మీరా మొహుద్దీన్, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ వాకిటి రామకృష్ణారెడ్డి, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌లు ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తులకు దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం వసంత మండపంలో వేదపండితులు శేషవస్త్రాలు కప్పి వేదాశీర్వచనం అందించారు. వారికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాలు అందజేశారు.

జీవన సంకీర్తన కవితా సంకలనం ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్పీ పట్నాయక్ తదితరులు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: అమలాపురంలో జరుగుతున్న మూడో తెలుగు మహాసభల వేదికపై ద్రాక్షారామకు చెందిన రచయిత్రి తెలగాని మెహర్ సుజాత కవితా సంకలనం 'జీవన సంకీర్తన' పుస్తకాన్ని ఆదివారం ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్పీపట్నాయక్ ఆవిష్కరించారు. గోదావరి తీరం ఆత్మీయత, పాపికొండల సౌందర్యం, సంక్రాంతి సంబరాల సుగంధం, ద్రాక్షారామ భీమేశ్వరస్వామిపై భక్తిభావాలు ఈ పుస్తకంలో ప్రతిబింబించాయని ఆర్పీ పట్నాయక్, రచయిత తనికెళ్ల భరణి వంటి ప్రముఖులు కొనియాడారు. కార్యక్రమంలో కిమ్స్ విద్యాసంస్థల అధినేత చైతన్యరాజు, రవికిరణ్‌వర్మ, యాళ్లపళ్లంరాజు, తిలక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సుదీర్ఘ నిరీక్షణ ఫలించిన వేళ..

రక్షిత తాగునీటి పథకాలకు శ్రీకారం

మసకపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి సుభాష్ తదితరులు

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండలంలోని గోదావరి తీర ప్రాంత గ్రామాలు సుందరపల్లి, మసకపల్లి. చుట్టూ నీరు కనబడుతున్నా తాగేందుకు చుక్కనీరు కరవు. వేసవి వచ్చిందంటే ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయాల్సిన దుస్థితి. సుమారు 30 ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ సమస్యకు తెరదించాలని స్థానిక నాయకులు, కార్యకర్తలు మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సీఎస్ఆర్ నిధుల నుంచి ప్రజల దాహార్తి తీర్చాలని కాకినాడలోని కోరమాండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ కంపెనీ వారిని కోరారు. వారు స్పందించి రూ.60 లక్షలు విడుదల చేశారు. ఆదివారం మంత్రి ఆయా గ్రామాల్లో రక్షిత నీటి పథకాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. నియోజకవర్గంలో కియా మోటార్స్ సహకారంతో రూ.2 కోట్లతో డాక్టర్ ఆన్ వీల్స్ సేవలు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఓఎన్జీసీ సహకారంతో రూ.5 కోట్లతో గుండె సంబంధిత వ్యాధుల చికిత్సాలయం కూడా వస్తోందని వివరించారు. కోరమాండల్ ప్రతినిధి పద్మనాభం మాట్లాడుతూ నియోజకవర్గంలో కంపెనీ తరఫున ఇదే తొలి సేవా కార్యక్రమమని చెప్పారు. తక్షణ సాయంగా సుందరపల్లిలో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. స్థలదాతలు నిమ్మకాయల నాగేశ్వరరావు, నంబూరు శివప్రసాద్‌లను మంత్రి అభినందించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు రవ్వా భూషణం, కాటే సుబ్రహ్మణ్యం, సర్పంచి పిల్లి అన్నపూర్ణ కల్యాణ్, గెడ్డం శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

కోటిపల్లి-ముక్తేశ్వరం రోడ్డు వంతెనకు కృషి

రామ్‌మాధవ్‌ను కలిసిన పార్టీ నాయకులు

పామర్రు, న్యూస్‌టుడే: కోనసీమకు ముఖద్వారంగా భాసిల్లే కోటిపల్లి-ముక్తేశ్వరం మధ్య గోదావరి నదిపై రోడ్డు, వంతెన నిర్మాణానికి సహకారం అందించాలని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం భాజపా ఇన్‌ఛార్జి కర్రి చిట్టిబాబు, స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు భాజపా జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్‌కు ఆదివారం వినతిపత్రం అందించారు. అమలాపురంలో ప్రపంచ తెలుగు మహాసభలకు విచ్చేసిన ఆయన్ను కలిసి పరిస్థితిని వివరించామన్నారు. ఈ విషయమై దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీను త్వరలోనే కలిసి నిధులు మంజూరుచేసేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. కోనసీమ వాసిగా ఇది తన కర్తవ్యమని ఆయన చెప్పారని వెల్లడించారు. పార్టీ నేతలు అవసరాల వెంకటరమణమూర్తి, ఆకేటి శ్రీకృష్ణ, ఆర్.వి.నాయుడు, పలువురు పెద్దలు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

పింఛనర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నకారా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘ సభ్యులు పోరాడి హక్కులు సాధించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘ అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు సూచించారు. అమలాపురంలోని కొంకాపల్లి ఏవీఆర్ నగర్ పింఛనర్ల భవనంలో జిల్లా అధ్యక్షుడు సాయివరప్రసాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పింఛనర్ల జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా నాయుడు, కోశాధికారిగా బందా రత్నాకర కామేశ్వరరావును, ముగ్గురు ఆడిట్ కమిటీ సభ్యులు, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో డీఎస్ నకారా విగ్రహాన్ని ఆవిష్కరించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, ఏపీఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు మాధవరపు వెంకటేశ్వర్లు, మాండలిక ఆదినారాయణ, తటవర్తి శర్మ, ఆచంట రామరాయుడు, మేడేపల్లి వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

విద్యుత్తు సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు

ఎర్రంరెడ్డి నగరంలో నూతన నియంత్రికను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రంపచోడవరం, న్యూస్‌టుడే: జిల్లా ప్రధాన కేంద్రమైన రంపచోడవరంలో విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా లోడు అధికంగా ఉన్న ప్రాంతాల్లో అదనంగా నియంత్రికలను ఏర్పాటు చేస్తున్నట్టు రంపచోడవరం విద్యుత్తు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక ఎర్రంరెడ్డి నగరంలో కొత్త నియంత్రికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ వేసవిలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడే వీధుల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామన్నారు. దీంతో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిచిపోయింది.

క్రికెట్ పోటీల్లో స్పిరిట్ లెవన్ విజయం

మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందిస్తున్న ఎస్సై రామకృష్ణ

కూనవరం, న్యూస్‌టుడే: కూనవరం పోలీస్ మైదానంలో నిర్వహిస్తున్న కేపీఎల్ టీ20 క్రికెట్ లీగ్ పోటీల్లో ఆదివారం స్పిరిట్ లెవన్ చొప్పల్లి, చింతూరు లయన్స్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన స్పిరిట్ లెవన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 175 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో చింతూరు లయన్స్ 19.4 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌటై ఓటమి చవిచూశారు. కీలకమైన నాలుగు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన భద్రంకు ఎస్సై రామకృష్ణ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అందించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మారేడుమిల్లి ఎస్సై కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం మారేడుమిల్లి మండలం చట్లవాడ పంచాయతీ పరిధిలోని బోదులూరులో ఆకస్మికంగా కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించి, వాహనాల దస్త్రాలను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద గిరిజనులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాలను నడిపేవారు విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకుని, అప్రమత్తంగా మెలగాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై కృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బోదులూరులో గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

మహిళల హక్కులపై అవగాహన

రాజవొమ్మంగి, రంపచోడవరం: జడ్డంగిలో మహిళా సాధికారత వారోత్సవాల సందర్భంగా ఎస్సై చినబాబు ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ చేశారు. ప్రధాన కూడలి వద్ద మానవహారం చేపట్టారు. మహిళల భద్రత, సమానత్వం, సాధికారతపై, విద్య- స్వయం ఉపాధి అవకాశాల ప్రాముఖ్యతను పోలీసులు వివరించారు. మహిళలు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ● రంపచోడవరంలో మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినులతో ఎస్సై వెంకటరావు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ చేసి అనంతరం మానవహారం నిర్వహించారు. మహిళల రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు.

రంపచోడవరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1

రంపచోడవరం 9490877172	అడ్డతీగల 9491575045
దేవీపట్నం 7673936638	గంగవరం 9493541083

సమస్య: మారేడుమిల్లి నుంచి వేటుకూరు వెళ్లే కూడలి వద్ద అవసరమైన రక్షణ చర్యలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారి కావడంతో వాహనాలు భారీగా తిరుగుతూ ఉంటాయి. సంబంధిత ప్రభుత్వ శాఖలు స్పందించి, రక్షణ చర్యలు చేపట్టాలి. - సురేంద్ర, వేటుకూరు

సమాధానం: కూడలిలో అవసరమైన రక్షణ చర్యలు త్వరలో చేపడతాం. - ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, మారేడుమిల్లి

- న్యూస్‌టుడే, మారేడుమిల్లి

అడవిలో అగ్గి రాజుకుంటే బుగ్గే!

అవగాహనతో ప్రమాదాల నివారణ

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: వేసవి సమీపిస్తుందంటే చాలు.. మన్యంలో కాఫీ రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. అడవిలో నిప్పు రాజుకుంటే కాఫీ తోటలు అగ్నికి ఆహుతి అవుతాయన్న భయం గిరిజన రైతులను వెంటాడుతుంటుంది. గతంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో అనేక సార్లు కాఫీ తోటలు బుగ్గిపాలవడంతో అపార నష్టం వాటిల్లిన ఘటనలు ఉన్నాయి. మన్యం వ్యాప్తంగా 2.5 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. లక్షన్నర కుటుంబాలు తోటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అటవీ శాఖాధికారులు సూచిస్తున్నారు. వేసవి ఆరంభం నుంచే విస్తృతంగా ప్రచారం చేస్తూ గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రమాదాల నివారణకు చేపడుతున్న నిర్వహణ పనులు

▲ ఈ ఏడాది వాతావరణ పరిస్థితుల ప్రభావంతో జిల్లాలో కాఫీ దిగుబడులతోపాటు నాణ్యత బాగా తగ్గింది. సాధారణంగా దిగుబడులు తగ్గితే ధర పెరగాలి. నాణ్యత లేకపోవడం, తేలికపాటి పంట రావడంతో అంతర్జాతీయ మార్కెట్లో కాఫీ ధరలు బాగా తగ్గాయి. ఒకవైపు ధరలు రాక రైతులు గగ్గోలు పెడుతుంటే మరోవైపు తోటల్లో అగ్నిప్రమాదాలు వారిని మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

▲ కాఫీ సాగు దీర్ఘకాలిక ప్రక్రియ. క్లిష్టమైనది. తోటలను నిత్యం కంటికి రెప్పలా కాపాడుకుంటేనే ఆశించిన ఫలితాలు సాధించలేం. మొక్కలు పెరిగి పెద్దవై దిగుబడినిచ్చేందుకు కనీసం మూడేళ్ల పడుతుంది. కాఫీ మొక్క జీవితకాలం 50 ఏళ్లు. మన్యంలో కాఫీ తోటలన్నీ గ్రామాలకు దూరంగా అటవీ ప్రాంతంలోనే ఉన్నాయి. తోటలను సంరక్షించడంపై గిరిజన రైతులు శ్రద్ధ చూపడం లేదు.

▲ 'అటవీ ప్రాంతంలో ఏటా వేసవిలో చెట్లన్నీ ఆకులను రాలుస్తాయి. గిరిజనులు అటవీ ఉత్పత్తుల సేకరణ, వేటకు వెళ్లిన సమయంలో నిప్పు పెట్టడం, చుట్ట, బీడీ కాల్చి ఆర్పకుండా పడేయడం వల్ల అగ్గిరాజుకుని మంటలు చెలరేగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై గిరిజనులకు అటవీ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. శాటిలైట్ ఉపగ్రహ చిత్రాల సాయంతో ముందుగానే అగ్నిప్రమాదాలు సంభవించే ప్రాంతాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నా'మని చింతపల్లి డీఎఫ్‌వో నరసింహారావు పేర్కొన్నారు.

సెలవు దినాల్లోనూ అందుబాటులో వైద్యులు

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి ఆదివారం, రెండో శనివారం వైద్యులు అందుబాటులో ఉంటారని పీహెచ్‌సీ వైద్యులు మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు వీలును బట్టి ప్రభుత్వ సెలవు దినాల్లో వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పీడీఎస్‌యూ మహాసభలను విజయవంతం చేయండి

రంపచోడవరం, న్యూస్‌టుడే: విజయవాడలో ఈనెల 3,4 తేదీల్లో జరిగే 'ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం' మహాసభలను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లాల లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. మహాసభల నిమిత్తం పీడీఎస్‌యూ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఐ.రమణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మార్క్స్ ఏంగిల్స్ భవనంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలతో సతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, తాగునీరు, మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో ఏఐకేఎంఎస్, న్యూ డెమొక్రసీ పార్టీ, పీడీఎస్‌యూ ప్రతినిధులు ప్రసాద్‌దొర, ఆదిరెడ్డి, బాలురెడ్డి, లింగారెడ్డి, ఆదిలక్ష్మి, పండమ్మ, పాపన్నదొర, కాంతం, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

హోలీ వేడుక చూసొద్దాం రండి

తాజంగిలో 80 అడుగుల శిఖరం ఏర్పాటు

మన్యంలో భిన్న ప్రాంతాల సమాహారంగా తాజంగికి పేరుంది. మన్యం, మైదాన ప్రాంత వాతావరణం కలగలిసినట్లు ఇక్కడ ఉంటుంది. జోలాపుట్ జలాశయం నిర్మాణ సమయంలో సుమారు 200 నిర్వాసిత కుటుంబాలు ఇక్కడకు వలస వచ్చాయి. ఇక్కడే ఉంటూ ఇళ్లు నిర్మించుకున్నారు. ఏటా హోలీ పండగను వైభవంగా, మిగతా ప్రాంతాలకు భిన్నంగా నిర్వహిస్తుంటారు. ఈ నెల 3న హోలీ పండగ నిర్వహణకు గ్రామస్థులంతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సంబరాల్లో భాగంగా ఎంపిక చేసిన మైదానంలో 70 నుంచి 80 అడుగుల ఎత్తులో కర్రలతో వెదురు శిఖరాన్ని నిర్మిస్తారు. మామిడి తోరణాలతో అలంకరిస్తారు. శిఖరం పైభాగంలో జెండా ఏర్పాటు చేస్తారు. రాధాకృష్ణుని ఆలయంలో పూజల అనంతరం ఊరేగింపుగా వచ్చి హోలీ రోజు వేకువజామున ఈ శిఖరాన్ని వెలిగిస్తారు. అగ్నికీలల్లో హోలీ శిఖరం దహనమవుతుండగా గిరిజనులంతా ఆనందోత్సాహాలు, ఆటపాటలు, బాణసంచాతో సందడి చేస్తారు. శిఖరంపైనున్న జెండా ఏ దిక్కున పడుతుందో అటు వైపు పంటలు బాగు పండుతాయని గిరిజనుల నమ్మకం. జెండాను కింద పడకుండా పట్టుకున్న వారిని ఊరేగించి బహుమతి అందజేయడంతోపాటు సత్కరిస్తారు.

– న్యూస్‌టుడే, చింతపల్లి

అధికారుల స్పందన భేష్

● కొండవేజువాడలో పురిటినొప్పులతో గర్భిణి

● సమాచారం అందుకుని అంబులెన్స్ ఏర్పాటు

రంపచోడవరంలో వైద్యసేవలు పొందుతున్న తల్లీ, బిడ్డ

మారేడుమిల్లి: ప్రసవవేదనతో బాధపడుతున్న గర్భిణికి సకాలంలో అధికారులు స్పందించి అంబులెన్స్ పంపి తల్లీ, బిడ్డ ప్రాణాలను కాపాడిన ఘటన గుర్తేడు మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. కానివాడ పంచాయతీ పరిధిలోని కొండవేజువాడ గ్రామానికి చెందిన పల్లాల పాపాయమ్మ(29)కు ఆదివారం ఉదయం పురిటినొప్పులు మొదలయ్యాయి. ఆమెకు కనీస వైద్యసేవలు అందించడానికి, ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ఆగ్రామంలో సదుపాయం లేదు. దీంతో గ్రామస్థులు ఎంపీడీవో బాపన్నదొర, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి సరిత, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులకు సమాచారం అందించారు. వారు వెంటనే స్పందించి గ్రామానికి అంబులెన్సును పంపించారు. కొంతదూరం వెళ్లాక నొప్పులు ఎక్కువ కావడంతో ఆమె బంధువుల సహాయంతో అంబులెన్సులోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలో బిడ్డ ఉమ్మనీరు తాగడంతో వారిని హుటాహుటిన రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించడంతో కోలుకున్నారు. అధికారులు సకాలంలో స్పందించడం పట్ల గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

మినీ జలవిద్యుత్కేంద్రం నిర్మాణంలో కదలిక

ముంచంగిపుట్టు గ్రామీణం : ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు విద్యుత్తు వెలుగులు ప్రసరింపజేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న జోలాపుట్ జలాశయం దిగువన మినీ జలవిద్యుత్కేంద్రం నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. జలాశయం దిగువన మాచ్‌ఖండ్ జనరేటర్ల, 18 మెగావాట్ల సామర్థ్యంతో మినీ జలవిద్యుత్కేంద్రం ఏర్పాటుకు 1994లో ఒప్పందం కుదిరింది. తాజాగా ఏపీ జెన్‌కో, ఓహెచ్‌పీసీఎల్ ఒడిశా పవర్ కన్సార్టియమ్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరింది. చిత్రకొండలో నిర్మించే 60 మెగావాట్ల విద్యుత్కేంద్రంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో 50 శాతం ఏపీజెన్‌కోకు సరఫరా చేయాలని మరో ఒప్పందం చేసుకున్నారు.

నిర్మాణం చేసే ప్రాంతం

ఏరియా ఆసుపత్రికి వైద్య పరికరాల అందజేత

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక ఏరియా ఆసుపత్రికి 'సమారిటన్స్ ఫర్ ది నేషన్ సంస్థ', సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ వారి కార్పొరేట్ సామాజిక బాధ్యత సహకారంతో రూ.4లక్షల విలువైన వైద్య పరికరాలను అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సీ-ఆర్మ్ కంపాటిబుల్ ఓటీ టేబుల్-1, యూరిన్ అనలైజర్ మెషిన్-1, డిజిటల్ వేయింగ్ మెషిన్లు-2, హ్యాండ్ హెల్డ్ ఆక్సీమీటర్లు -2, హైడ్రాలిక్ ఓటీ టేబుల్-1, నెబ్యులైజర్లు-4 తదితర పరికరాలను అందించారు. వీటితో రోగులకు శస్త్ర చికిత్సలు, అత్యవసర సేవలు, తల్లి, శిశు ఆరోగ్యసేవలు బలోపేతం అవుతాయని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సమారిటన్స్ ఫర్ ది నేషన్ వ్యవస్థాపకులు పి.రాజ్‌కుమార్, బోర్డు సభ్యులు ఆర్వీ ప్రసాద్, దామోదర్, ప్రోగ్రాం మేనేజర్ సంజయ్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామగ్రి అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

శిథిలావస్థలో వైద్యఆరోగ్యశాఖ ఉప కేంద్రం

గిరిజన గ్రామాల్లోని ప్రజలకు వైద్య సేవలను అందించాల్సిన వైద్య,ఆరోగ్యశాఖ సబ్ సెంటర్లకు సరైన వసతి సదుపాయం లేకపోవడంతో సంబంధిత సిబ్బందితో పాటు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. మారేడుమిల్లి మండలం చావడికోట పంచాయతీ పరిధిలోని బొడ్లంకలో చాలా సంవత్సరాల క్రితమే ఇందుకు అవసరమైన భవనాన్ని నిర్మించారు. అయితే కాలక్రమంలో అది పూర్తిగా శిథిలస్థితికి చేరింది. దీంతో ఏఎన్ఎంలు గ్రామంలోనే వారు అద్దెకు ఉంటున్న ఇంటి వద్ద లేదా మరో ప్రదేశంలో సేవలు అందిస్తున్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖలు స్పందించి, బొడ్లంకలో సబ్ సెంటర్ భవనాన్ని మంజూరు చేసి, వెంటనే నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

జిల్లా పేరు మారినా.. బోర్డులు మార్చరేమీ?

రంపచోడవరం కేంద్రంగా 'పోలవరం' జిల్లాను ఏర్పాటు చేసి జనవరి 1 నుంచి అమలులోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల బోర్డుల్లో జిల్లా పేరు మార్చాలంటూ ఆదేశాలు వచ్చాయి. అయితే ఇప్పటికీ బొడ్లంకలోని జీసీసీ రేషన్ డిపో బోర్డులో మాత్రం పాత జిల్లా పేరే ఉంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

బస్సు షెల్టర్ తుప్పల్లో.. ప్రయాణికులు రోడ్డుపై..!

మారేడుమిల్లి మండలం చట్లవాడ పంచాయతీలోని బోదులూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా గతంలో ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉండేలా బస్సు షెల్టర్‌ను నిర్మించారు. అయితే దీని నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. ఫలితంగా ప్రయాణికులు రోడ్డుపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పీహెచ్‌సీకి వైద్య సేవల కోసం వచ్చే రోగులతో పాటు, చట్లవాడ పరిసర గ్రామాల నుంచి వచ్చే ప్రజలు ఇక్కడి నుంచే బస్సులు, ఇతర వాహనాలను ఆశ్రయించి, వేరే ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి, తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

వైద్యశిబిరం వద్ద బారులుదీరిన వారు

ఆరోగ్య పరిరక్షణతోనే అభివృద్ధి సాధ్యం

సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యం అవుతుందని, అందరూ ఆరోగ్య పరిరక్షణపై దృష్టిసారించాలని రాజమహేంద్రవరానికి చెందిన వైద్య నిపుణులు గోలి వెంకట రామారావు పిలుపునిచ్చారు. మారేడుమిల్లిలో ఆదివారం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక సత్యసాయి సేవా కేంద్రం వద్ద నిర్వహించిన శిబిరంలో ఆయనతో పాటు, వైద్యుడు సుధీర్ పాల్గొని, రోగులకు వైద్య సేవలు అందించారు. సుమారు 150 మంది రోగులకు రక్త, మూత్ర పరీక్షల చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మన్యంలో మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ వంటి వ్యాధులు క్రమంగా పెరిగిపోయాయన్నారు. వాటితో బాధపడుతున్న వారు విధిగా వైద్యుల సలహాలు, ఆహార నియమాలను పాటిస్తూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు యోగేశ్వరరావు, హౌసింగు బోర్డు సుబ్రహ్మణ్యం, రామ్మోహన్‌రావు, వీరయ్య, సేవాదళ్ సభ్యులు గురునాథరెడ్డి, సురేంద్ర, రమణారెడ్డి, జగన్నాధరావు, చంద్రమ్మ, నాగమణి, మాలతి, సుమాంజలి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులకు పచ్చజెండా

ఉద్యోగ విరమణకు చేరువలో ఉత్తర్వులు

ఉపాధ్యాయ వర్గాల్లో హర్షాతిరేకాలు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: కల సాకారమైతే ఆ ఆనందమే వేరు. ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్న పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపితే ఉద్యోగుల సంతోషం మాటల్లో చెప్పలేం. ఉన్నతీకరణ, పదోన్నతి కోసం ఇన్నాళ్లు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసిన ఉపాధ్యాయులకు కూటమి సర్కారు తీపికబురు చెప్పింది. అల్లూరి జిల్లాలో గిరిజన సంక్షేమం, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఉన్నతీకరణ, పదోన్నతి ప్రక్రియను పూర్తి చేసింది. తద్వారా 98 మంది లబ్ధిపొందనున్నారు. ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న సమయంలో పదోన్నతులు రావడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తర్వులు అందుకుంటున్న భాష పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు

▶ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎనిమిది ఐటీడీఏల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో తెలుగు, ఆంగ్లం, హిందీ భాష పండితులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు వేలాది మంది పనిచేస్తున్నారు. వీరంతా ఎస్జీటీ హోదాలోనే కొనసాగుతున్నారు. అర్హతలున్నా వీరంతా దశాబ్దాలుగా పదోన్నతులకు నోచుకోలేదు. స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని డిమాండు చేస్తూ వస్తున్నారు. పదోన్నతి కల్పించేందుకు సాంకేతిక సమస్యలు ప్రతిబంధకంగా మారాయి. వైకాపా ప్రభుత్వ పాలనలో ఎన్నో పర్యాయాలు అప్పటి విద్యాశాఖ మంత్రిని కలిసి విన్నవించినా ఫలితం లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత దస్త్రం కదిలింది. మంత్రులు లోకేశ్, సంధ్యారాణి చొరవతో పరిష్కారం లభించింది. ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నారో అక్కడే కొనసాగుతూ పదోన్నతి కల్పించడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలోని 11 మండలాల్లో 118 గిరిజన ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 88 మందికి డిప్యూటీ డైరెక్టర్ పదోన్నతులకు సంబంధించి ఉత్తర్వుల పత్రాలు అందజేశారు. ▶ ఏజెన్సీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు పది మంది వరకు ఉన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సులు దూరవిద్య విధానంలో పూర్తి చేయడంతో పదోన్నతులు పొందడానికి అర్హులు కారని, తమతో సమానంగా వీరిని పరిగణనలోకి తీసుకోవద్దంటూ అప్పట్లో రెగ్యులర్ డిగ్రీ చేసి ఉద్యోగాలు పొందిన వారు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం దస్త్రాన్ని పక్కన పెట్టింది. దీన్ని సవాల్ చేస్తూ పలువురు కోర్టును ఆశ్రయించారు. ▶ కోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో పది మందికి ప్రభుత్వం పదోన్నతి కల్పించింది.

ఉన్నతీకరణ ఉత్తర్వులపై హర్షం..: పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమాల్లో పనిచేస్తున్న భాషాపండితులు, పీఈటీల ఉన్నతీకరణ పత్రాల పంపిణీ దాదాపు పూర్తయినట్లు గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు పరిమళ చెప్పారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న 86 మంది భాషా పండితులు, 21 మంది పీఈటీలకు ఉత్తర్వులు అందాయని సంఘ జిల్లా అధ్యక్షుడు రాంబాబు పేర్కొన్నారు.

బొర్నగూడెంలో వాహనాల తనిఖీ..

రంపచోడవరం, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రంపచోడవరం మండలం బొర్నగూడెం గ్రామంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆదివారం 'కార్డెన్ సెర్చ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఎస్సై వెంకటరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రతి ఇంటిలోను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. వాహన తనిఖీలు నిర్వహించి రికార్డులు లేని మూడు వాహనాలను సీజ్ చేశారు. ● తాళ్లపాలెంలో నిర్వహిస్తున్న గొలుసు దుకాణంపై దాడి చేసి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని రాజవొమ్మంగి ఎస్సై శివకుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనుమానాస్పద స్థితిలో గిరిజన యువతి మృతి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లిలో అనుమానాస్పదస్థితిలో గిరిజన యువతి మృతి చెందింది. మారేడుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు ఇలా.. వై.రామవరం మండలం చింతలపూడి గ్రామానికి చెందిన బుడమల రాజేశ్వరి (34) ఉపాధి నిమిత్తం మారేడుమిల్లిలో నివాసం ఉంటోంది. ఆదివారం ఉదయం కడుపునొప్పి రావడంతో చుట్టుపక్కల ఉన్నవారు, సన్నిహితులు ఆమెను హుటాహుటిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువెళ్లాల్సిందిగా వైద్య సిబ్బంది సూచించారు. వెంటనే అంబులెన్సులో తరలించగా, అప్పటికే మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. మారేడుమిల్లి ఎస్సై కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి.. ఆ నివేదిక ఆధారంగా మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తామని వెల్లడించారు. అప్పటివరకు చలాకీగా తిరిగిన ఆమె ఆకస్మాత్తుగా మృతి చెందడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బుడమల రాజేశ్వరి (పాతచిత్రం)

పవర్‌కెనాల్‌లో ముమ్మరంగా గాలింపు

మోతుగూడెం, న్యూస్‌టుడే: లోయరు సీలేరు ప్రాజెక్టు డొంకరాయి పవర్‌కెనాల్‌లో శనివారం గల్లంతైన పర్యాటకుడు లోచర్ల హరిరామ ప్రసాద్ ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్టు డొంకరాయి ఎస్సై చరణ్ నాయక్ తెలిపారు. స్థానిక ఏపీపీ జలాశయంలో బెంగాలీ ఈతగాళ్లతో కలిసి పడవలపై శనివారం సాయంత్రం నుంచి ఆదివారం సాయంత్రం వరకు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కాకినాడ నుంచి జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాన్ని(ఎన్‌డీఆర్ఎఫ్) రప్పిస్తున్నట్లు తెలిపారు. ఈ దళం సోమవారం ఉదయానికి ఘటనా స్థలానికి చేరుకుంటుందన్నారు.

పంచాయతీల్లో అభివృద్ధికి అవకాశం

15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి అనుమతిస్తూ ఉత్తర్వులు

ఎటపాక, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు 15వ ఆర్థిక సంఘం నిధుల్ని వినియోగించుకునేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై సర్పంచులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పోలవరం జిల్లా రంపచోడవరం, చింతూరు డివిజన్లో ఉన్న 186 గ్రామ పంచాయతీల్లో పెండింగ్ బిల్లుల చెల్లింపులతో పాటు అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. ఇప్పటివరకు గ్రామపంచాయతీ నిధులు పారిశుద్ధ్యం, విద్యుత్తు నిర్వహణ వంటి వాటికే వినియోగించుకోవడానికి అవకాశముండేది. తాజా ఉత్తర్వుల ప్రకారం పంచాయతీలోని సాధారణ నిధులు ఇతర పనులకూ ఉపయోగించవచ్చు. దీంతో రెండు డివిజన్లలోని ఆగిపోయిన వివిధ పనులు ఊపందుకోనున్నాయి.

తొలగనున్న ఇబ్బందులు..

జనవరిలో స్వచ్ఛ సంక్రాంతి పేరిట రూ.లక్షలు వెచ్చించి గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాలతో పాటు నీటి సమస్యకు పనులను సర్పంచులు, కార్యదర్శులు చేపట్టారు. వాటికి బిల్లులు చేసుకునే అవకాశం పంచాయతీరాజ్ విభాగం కల్పించకపోవటంతో తీర్మానాలు చేసి ఎంబుక్‌లో నమోదు చేశారు. ప్రస్తుతం వచ్చిన ఉత్తర్వుల ప్రకారం వీటికి వెసులుబాటు కలగటంతో సర్పంచులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుద్ధ్యం, క్లాప్‌మిత్ర, నీటి సమస్యకు మాత్రమే

గ్రామాల్లో కొన్ని పనుల నిర్వహణకే 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించే అవకాశం సర్పంచ్‌లకు ఉంది. రోడ్లు, కాలువల నిర్మాణాలకు పంచాయతీ సాధారణ నిధులు వాడుకోవచ్చు. 15వ ఆర్థిక సంఘం ఉత్తర్వుల ప్రకారం కేవలం పారిశుద్ధ్యం పనులకు, క్లాప్‌మిత్రాల జీతాలతో పాటు గ్రామాల్లోని నీటి సమస్యకు కూడా ఈ నిధులను వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం వచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఆయా సర్పంచ్‌లు ఎంబుక్‌లో నమోదు చేసిన నిధులు తీసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది.

- కోటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి, పోలవరం జిల్లా

ఆవు కళేబరాన్ని దహనం చేసిన అధికారులు

రంపచోడవరం: తాళ్లపాలెం అటవీ ప్రాంతంలో పెద్దపులి దాడిచేసి తినేసిన ఆవు కళేబరాన్ని అటవీ అధికారులు దహనం చేశారు. శుక్రవారం రాత్రి పెద్దపులి దూడపై దాడిచేసి తినేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పెద్దపులి తాళ్లపాలెం-కోరుమిల్లి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. పులి వల్ల ఎవరూ భయపడొద్దని ఫోక్సుపేట రేంజ్ అధికారి శ్రీనివాసరావు చెప్పారు. పులి గ్రామాల్లోకి రావడంలేదని అటవీ ప్రాంతంలోనే తిరుగుతుందన్నారు. సబ్‌డీఎఫ్‌వో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు నిత్యం పులి సంచరించే ప్రాంతంలో పర్యవేక్షణ చేస్తున్నారు.

(c) eenadu

ఈనాడు ప్రకాశం
సోమవారం 2 మార్చి 2026

ఉష్ట్ర వాహనంపై ప్రసన్నాంజనేయుడు

శింగరకొండ వార్షిక తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా రెండో రోజైన ఆదివారం సువర్చల సమేత ప్రసన్నాంజనేయ స్వామిని ఉష్ట్ర వాహనంపై ఘనంగా ఊరేగించారు. వేద మంత్రాల నడుమ యువత కోలాటం మధ్య ఆలయ మాడ వీధుల్లో విహరించారు. ఊరేగింపులో పెద్దసంఖ్యలో భక్తులు, పాలక మండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకర్, సహాయ కమిషనర్ తిమ్మనాయుడు, తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, శింగరకొండ(అద్దంకి)

ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు 123 మంది ఎంపిక

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 123 మంది విద్యార్థులను ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు ఎంపిక చేసింది. ఏటా అవార్డులకు విద్యార్థులను ఎంపిక చేసి వారి వ్యక్తిగత ఖాతాలకు రూ.10 వేల చొప్పున .జమ చేస్తారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడంతోపాటు సృజనాత్మకతను వెలికి తీయడం లక్ష్యంగా ఇన్‌స్పైర్ పథకం అమలవుతోంది. రాష్ట్రంలో ఈ ఏడాది 3,424 మంది విద్యార్థులను ఎంపిక చేయగా, ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి 123 మందికి అవకాశం లభించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరు నుంచి పదోతరగతి వరకు చదివే విద్యార్థులు అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని గతేడాది అక్టోబరులో కోరారు. ఆ మేరకు జిల్లా నుంచి 1,500 మంది దరఖాస్తు చేశారు. వారు పేర్కొన్న ప్రాజెక్టులు, వాటిని వివరించిన తీరు పరిశీలించి 123 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి నెల రోజుల్లో నగదు జమచేస్తారు. వారు ప్రాజెక్టులు తయారు చేసి వచ్చే విద్యాసంవత్సరంలో జరిగే ఇన్‌స్పైర్‌లో ప్రదర్శించాల్సి ఉంటుంది.

రిమ్స్‌కి మహర్దశ!

రూ.10 కోట్లతో కొత్తరూపు

ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) తలమానికం. బోధనాసుపత్రి కావడంతో అనుబంధంగా నర్సింగ్ పాఠశాల, కళాశాలలున్నాయి. మొత్తం 200 మంది వైద్యులు, 400 మంది వైద్య సిబ్బంది, 550 మంది వైద్యవిద్యార్థులు కలిగి ఉన్న ఆసుపత్రికి నిత్యం సరాసరిన 1,100 మంది అవుట్ పేషంట్లు వస్తుంటారు. మరో 350 మంది ఇన్ పేషంట్లుగా ఉన్నారు. ఇంత ప్రాధాన్యం గల ఆసుపత్రిలో పూర్తిస్థాయి సౌకర్యాల్లేవు. నిధుల కొరతతో అధునాతన వసతులు సైతం సమకూరలేదు. ఇటీవల జరిగిన హెచ్‌డీఎస్ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు 'న్యూస్‌టుడే'కి వివరించారు. –న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ఆసుపత్రిలోని ఓపీ విభాగంలో రోగులు

▶ ఆసుపత్రి ఆధునికీకరణకు రూ. 10 కోట్ల మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను కలెక్టర్ రాజాబాబు కేటాయించారు. దీంతో ఆసుపత్రిలో కార్పొరేట్ తరహా సేవలందుతాయి. భవనాలను అందంగా తీర్చిదిద్దడంతోపాటు రిసెప్షన్ కౌంటర్ సైతం ఏర్పాటు చేయనున్నారు. రోగి పేరు, ఆధార్ నంబరు ఆధారంగా ఆభా కార్డు యాప్‌లో నమోదు చేస్తారు. ఏ జబ్బుకు ఎవరిని కలవాలి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఇతర సౌకర్యాలు, మందులు ఇవ్వాల్సిన వాటిని విధానం తెలియజేస్తారు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు ఏ రోజు ఏ డాక్టర్ చూస్తారనేది వివరిస్తారు.

▶ ఆసుపత్రిలో లాండ్రీ మిషన్లు మరమ్మతులకు గురయ్యాయి. దుస్తులు, బెడ్‌షీట్లు ఉతకడానికి ఏడాదికి రూ.40 లక్షల వరకు వ్యయం చేయాల్సి వస్తోంది. కొత్త లాండ్రీ మిషన్లు కొనుగోలుకు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి రూ.32 లక్షలు ఇవ్వనున్నారు. ఆసుపత్రిలో 15 శస్త్రచికిత్స గదులుండగా, ఆరు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన వాటిలో శీతల యంత్రాలు, ఇతరత్రా పరికరాలు పాడైపోయాయి. త్వరలో అన్ని శస్త్రచికిత్సల గదులను వినియోగంలోకి తీసుకురావడానికి నిధులు కేటాయించారు. ఐసీయూ, క్యాథ్‌ల్యాబ్ ఆధునికీకరణ, మరో హెచ్‌డీఎస్ నిధులు రూ.30 లక్షలు కేటాయించారు. మరుగుదొడ్ల మరమ్మతులతోపాటు డ్రైనేజీ వ్యవస్థ లోపాలు చక్కదిద్దడం, తాగునీరు, వాడుకనీటి సమస్య పరిష్కారం, అవుట్ పేషెంట్లతో వచ్చే సహాయకులకు షెడ్ నిర్మాణం త్వరలో చేపట్టనున్నారు. ప్రస్తుతం ఎంబీబీఎస్ విద్యార్థులకు పరీక్షలు జరగనుండడంతో హౌస్‌సర్జన్ల కొరత నెలకొంది. ప్రత్యామ్నాయంగా మే వరకు ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్, పారామెడికల్, ఫార్మసిస్టులు, ఫిజియో థెరపిస్టుల సేవలు వినియోగించుకుంటున్నారు.

భూ అక్రమాలపై మీనమేషాలు!

▶ మార్కాపురంలో జరిగిన కుంభకోణంపై నాన్చుడు ధోరణి
▶ ఇటీవల బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రస్తావన

గత వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రమైన మార్కాపురం ప్రాంతంలో పెద్దఎత్తున భూ అక్రమాలు చోటుచేసుకున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులతో చేతులు కలిపి నిబంధనలకు విరుద్ధంగా అసైన్‌మెంట్ కమిటీ చట్టాన్ని తుంగలోకి తొక్కారు. వందలాది ఎకరాల ప్రభుత్వ, పోరంబోకు, వాగు పోరంబోకు, చుక్కలు, గయాలు, బావులు, పట్టా భూములను పప్పుబెల్లాల్లా పంచు కున్నారు. రాష్ట్రంతోపాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మార్కాపురంలోనే అత్యధికంగా భూ అక్రమాలు జరిగినట్లు విచారణాధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. భూఅక్రమాలు జరిగినట్లు తేలినా ఇంతవరకు రద్దు చేయకపోవడం గమనార్హం. –న్యూస్‌టుడే, మార్కాపురం



గతంలో మార్కాపురంలో దస్త్రాలు తనిఖీ చేస్తున్న అధికారులు

▶ మార్కాపురంలో భూ అక్రమాలు ఎక్కువగా జరిగాయని పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. 2021, జూన్‌లో జరిగిన భూ కుంభకోణంలో అధికారులపై చర్యలు తీసుకున్నా అధికారులు మాత్రం అక్రమాలు జరిగిన భూములను రద్దు చేయలేదని ఇటీవల అసెంబ్లీలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రస్తావించారు. అప్పట్లో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని, వెబ్‌ల్యాండ్ నుంచి భూములను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ మంత్రిని కోరారు.

▶ 2021, జూన్ నెల 30వ తేదీన ఓ తహసీల్దారు ఉద్యోగ విరమణ నేపథ్యంలో మార్కాపురం మండలంలో ఆ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇష్టానుసారంగా వైకాపా నాయకుల ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు, అనుచరులకు భూమిని ఇష్టానుసారంగా అధిక మొత్తంలో డబ్బులు తీసుకుని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయడం సంచలన రేకెత్తించింది. కేవలం వైకాపాకు చెందినవారికి మాత్రమే పనులు చేయడం, మిగిలిన రైతులకు పనులు చేయకపోవడంతో పలువురు రైతులు అప్పటి కలెక్టర్‌తో పాటు రెవెన్యూశాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. అనేక ఆందోళనలు, ఫిర్యాదుల నేపథ్యంలో అప్పటి వెలిగొండ ప్రాజెక్టు జిల్లా ప్రత్యేక కలెక్టర్ సరళావందనంను విచారణాధికారిగా నియమించారు. మార్కాపురంలో నెల రోజుల పాటు విచారణ అధికారులు దస్త్రాలు తనిఖీ చేసి ఒక్క జూన్‌లోనే 750 మ్యుటేషన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు గుర్తించారు.

▶ మార్కాపురం మండలం భూపతిపల్లె, బడేఖాన్‌పేట, మాల్యవంతునిపాడు, తిప్పాయపాలెం, నరసింహపురం, నికరంపల్లి, జమ్మనపల్లె, కోల భీమునిపాడు, గజ్జలకొండ, శివరాంపురం, గోగులదిన్నె, ఇడుపూరు, రాయవరం, బొందలపాడు, పెద్దయాచవరం, చింతకుంట, మార్కాపురం పట్టణంలోని ప్రభుత్వ, అసైన్‌మెంట్, వాగుపోరంబోకు, చుక్కలు, గయాలు, ప్రభుత్వ బావులను నిబంధనలకు విరుద్ధంగా 750 మ్యుటేషన్లు చేశారు. తద్వారా 378.89 ఎకరాలను అక్రమంగా ఇతరులకు ఎటువంటి ఆధారాలు లేకుండా ఆన్‌లైన్ చేశారని, అక్రమాలు జరిగాయని అప్పటి విచారణ అధికారి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. దీంతో అప్పటి విశ్రాంత తహసీల్దారుతో పాటు అందుకు కారణమైన 15 మంది వీఆర్వోలను సస్పెండ్ చేశారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రకాశం, మార్కాపురం జిల్లాలకు సంబంధించి ఇంటర్మీడియట్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆర్ఐవో కె.ఆంజనేయులు తెలిపారు. స్థానిక ఏకేవీకే కళాశాలలో మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభమయ్యే మూల్యాంకనానికి అర్హత పొందిన అధ్యాపకులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. తమకు కేటాయించిన విధులకు హాజరుకాని అధ్యాపకులతోపాటు సంబంధిత కళాశాల యాజమాన్యాలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి నుంచి సార్వత్రిక పరీక్షలు ప్రారంభం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్యాపీఠం ద్వారా నిర్వహించే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం 2,909 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష ప్రారంభమయ్యాక 15 నిమిషాల్లోపు 9.15 వరకు మాత్రమే అభ్యర్థులను అనుమతిస్తారు. అంతకన్నా ఆలస్యమైతే అనుమతించరు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమ సా.6-24
సహరీ : మంగళ ఉ.5-06

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాలు వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో సీవీ రేణుక తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పరిశీలించుకొని ఏదైనా అభ్యంతరాలుంటే ఈ నెల 9 లోగా ఆధారాలతో డీఈవో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

వెలిగొండ సొరంగాల బలోపేతం!

▶ 361 మీటర్లలో ప్రత్యేక ఇనుప రిబ్స్ ఏర్పాటు

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానమైన రెండో సొరంగంలో మెత్తటి ప్రదేశం బలోపేతానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిని హైదరాబాద్‌కు చెందిన జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి జియాలజిస్టులు పరిశీలించి పటిష్టతకు ఇనుప రిబ్స్ ఉపయోగించాలని సూచించారు. దీంతో వీటిని వినియోగించి పనులు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల వెలిగొండ పనులు పరిశీలనకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి మెత్తటి ప్రదేశంలో చేపట్టే నిర్మాణ పనుల్లో వినియోగించనున్న ఇనుప రిబ్స్‌పై వివరించారు.

▶ ప్రతిబంధకంగా మారిన 361 మీటర్లు..: కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు అందించేందుకు నల్లమల అటవీ ప్రాంతంలో 18.89 కిలోమీటర్ల పొడవునా రెండు సమాంతర సొరంగాలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే తొలి సొరంగం నిర్మాణ పనులు పూర్తవగా, రెండో సొరంగంలో లైనింగ్ పనులు జరుగుతున్నాయి. సొరంగం తవ్వే యంత్రం (టీబీఎం) నిలిచిపోయిన ప్రదేశంలో 61 మీటర్లు, 15.250 కిలోమీటరు నుంచి 15.550 కిలోమీటరు వరకు 300 మీటర్లు మొత్తం 361 మీటర్ల ప్రదేశం మెత్తగా ఉంది. దీంతో మట్టి, రాళ్లు పడుతుండడంతో బెంచింగ్ పనులు కష్టంగా మారాయి. ఈ ప్రాంతం పటిష్ఠంగా ఉండేందుకు ప్రతి 0.5 మీటర్ల నుంచి 0.8 మీటర్ల మధ్య ఒక ఇనుప రిబ్‌ను బిగించాలని సూచించారు. సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ 200 హైఎంబీ రిబ్స్ డిజైన్ తయారు చేసి ఇచ్చింది. ఆ డిజైన్‌లో తయారు చేసిన రిబ్స్‌ను తెప్పించారు. 361 మీటర్ల బెంచింగ్ పనితో పాటు లైనింగ్ చేసేందుకు మూడు నెలలు పడుతుందని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

రెండో సొరంగంలోని మెత్తటి ప్రదేశంలో ఉపయోగించనున్న ఇనుప రిబ్స్

తప్పుల్లేని పట్టాదారు పాసుపుస్తకాలే లక్ష్యం!

ఈ నెల 9 వరకు గ్రామసభలకు కార్యాచరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న భూ యజమాన్య హక్కుపత్రాల పంపిణీలో తప్పులేకుండా చూడాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి నెలలో నియోజకవర్గానికి రెండు గ్రామాల చొప్పున ఎంపిక చేసి తద్వారా స్థానికంగా గ్రామసభల్లో వచ్చిన తప్పులను పరిశీలించనుంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రీ సర్వే చేసిన గ్రామాల్లోని రైతులకు ఈ ఏడాది జనవరి 2 నుంచి 9వ తేదీ వరకు రాజముద్రతో ముద్రించిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకాల్లో చోటుచేసుకున్న తప్పులే యథాతథంగా వచ్చాయి. రైతుల చిత్రాలు మారిపోవడం...సంయుక్త ఎల్‌పీఎంలు, విస్తీర్ణంలో తేడాలు వంటి లోపాలపై తహసీల్దార్లు, వీఆర్వోలకు ఫిర్యాదులందాయి. ఈ మేరకు పుస్తకాల్లో నమోదైన తప్పులను సరిచేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. –న్యూస్‌టుడే, కలెక్టరేట్

రైతుల సమక్షంలోనే... ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 864 రెవెన్యూ గ్రామాల పరిధిలో మొత్తం 25,07,775 ఎకరాల విస్తీర్ణం ఉంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో 298 గ్రామాల్లో విడతల వారీగా రీ సర్వే చేశారు. ఈ మేరకు గత ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొదటి విడత రీ సర్వే జరిగిన 193 గ్రామాల్లో 74,305 మంది రైతులకు గత నెల రోజులుగా పాసు పుస్తకాలు పంపిణీ చేపట్టారు. ఎంపిక చేసిన గ్రామాల్లో వచ్చిన తప్పులపై రైతుల సమక్షంలోనే రెవెన్యూ దస్త్రాలను పరిశీలించనున్నారు. రైతులకు చెందిన 1బీ ఖాతాల వారీగా రిమార్కులు నమోదు చేస్తారు. మ్యుటేషన్ ప్రక్రియ, సబ్ డివిజన్ తదితర ఏదైనా సమస్యలు పరిష్కరించాల్సి ఉన్నా సూచనలు చేయడంతోపాటు వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. అంతా సక్రమంగా ఉందని తహసీల్దార్ ధ్రువీకరించిన తర్వాతనే పాసు పుస్తకం ముద్రణకు పంపిస్తారు. షెడ్యూల్ ప్రకారం వాటిని ప్రతి నెలా 2 నుంచి 9వ తేదీ వరకు రైతులకు అందజేయనున్నారు.

షెడ్యూలు ప్రకారం గ్రామసభల వివరాలు

తేదీ	మండలం	గ్రామం
2	దర్శి	కొర్లమడుగు
	టంగుటూరు	కారుమంచి
	జరుగుమల్లి	పైడిపాడు
4	కొరిశపాడు	రాచపూడి
5	దొనకొండ	ఆరవల్లిపాడు
	కొత్తపట్నం	మడనూరు
6	పంగులూరు	బైట మంజులూరు
7	చీమకుర్తి	మంచికలపాడు
	సంతనూతలపాడు	లక్ష్మీపురం
	కందుకూరు	ఓగూరు
	వలేటివారిపాలెం	కాకుటూరు
9	ముండ్లమూరు	కొమ్మవరం

శిక్షణ సరే... కుట్టు ఎలా?

▶ యంత్రాలకు మహిళల ఎదురు చూపు

న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

సంతనూతలపాడులోని కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పేద మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం ఎంపిక చేసిన కేంద్రాల్లో గతేడాది మే నుంచి జులై నెలాఖరు వరకు ఉచితంగా కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించారు. తొలి విడతగా ఒంగోలు నియోజకవర్గానికి ఏడు, సంతనూతలపాడు నియోజకవర్గానికి మూడు కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆ తరువాత ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లోనూ మూడు కేంద్రాల చొప్పున శిక్షణ నిర్వహించారు. శిక్షణ తరగతులు పూర్తయి ఏడు నెలలు గడిచినా ఇంతవరకు కుట్టు యంత్రాలు ఇవ్వలేదు. దీంతో మహిళలు ఉపాధి నిమిత్తం వాటి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

32 కేంద్రాల్లో 3,475 మంది

గతేడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆసక్తి గల మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభించేందుకు బీసీ కార్పొరేషన్ అధికారులు ప్రణాళిక చేశారు. ఇందుకు స్థానిక గ్రామ, వార్డు సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకుని అర్హులైన వారిని ఎంపిక చేశారు. దీనిలో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 32 కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉచిత శిక్షణతోపాటు యంత్రాల అందజేతకు ఒక్కొక్కరికి రూ.25 వేల అంచనా వ్యయంతో కార్యాచరణ ప్రణాళిక తయారు చేశారు. ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంతో యంత్రాలు సమకూర్చి బోధకుల ద్వారా మొత్తం 3,475 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. కుట్టు, అల్లికలపై ఆసక్తి కలిగి ఉండి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న మహిళలను పరిగణనలోకి తీసుకున్నారు. అగ్రవర్ణ పేదల కోటాలో కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణులతోపాటు బీసీ, కాపులకు ఉచితంగా కుట్టు శిక్షణతో పాటు యంత్రాలకు అర్హులు కావడంతో ఆయా సామాజిక వర్గాల నుంచి మంచి స్పందన లభించింది. ప్రతి కేంద్రంలోనూ ఉదయం, మధ్యాహ్నం 72 మంది చొప్పున మొత్తం 144 మందికి 90 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. అందులో 75 శాతం ముఖ ఆధారిత హాజరు ఉన్న వారికి ఉచితంగా కుట్టు యంత్రం ఇవ్వాలని నిర్ణయించారు. శిక్షణ పూర్తి చేసుకుని ఏడు నెలలు గడిచినా నేటికి కుట్టు యంత్రాలు ఇవ్వకపోవడంతో మహిళలు ఇళ్ల వద్ద ఖాళీగా ఎదురు చూడాల్సి వస్తోంది. యంత్రాలు సమకూర్చి, శిక్షణ ఇచ్చిన కేంద్రాల నిర్వహకులు సైతం బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు.

పొగాకు కొనేదెప్పుడు?

జిల్లాలో 2025-26 పంట కాలానికి పొగాకు కొనుగోళ్లు ఆలస్యమయ్యేలా కనిపిస్తున్నాయి. ఈ సీజన్‌కు సంబంధించి ఎప్పుడూ వేలం కేంద్రాలు తెరవాలన్న దానిపై స్పష్టత లేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 24,500 బ్యారన్లు ఉండగా, 30,250 మంది రైతులు ఉన్నారు. గత నెలలో వేలం కేంద్రాల అధికారులు, రైతు ప్రతినిధులతో బోర్డు కార్యదర్శి సమావేశమయ్యారు. వేలం కేంద్రాల వారీగా రైతులతో మాట్లాడాలని వారి అభిప్రాయాలు సేకరించి పంపాలని కార్యదర్శి ఆదేశించారు. ప్రస్తుతం కర్ణాటకలో పొగాకు కొనుగోళ్లు పూర్తి కానందున అక్కడి పరిస్థితులను సైతం పరిగణనలోనికి తీసుకోవాల్సిన అవసరం ఉందని చర్చించారు. ఇక్కడ రైతులు ఈ ఏడాది ముందస్తుగానే పొగాకు నాట్లు వేసినందున ఎక్కువ భాగం పొగాకు క్యూరింగ్‌లు పూర్తయ్యాయి. గ్రేడింగ్ చేసిన ఆకును అమ్మకాలకు సిద్ధం చేశారు. మరికొంతమంది రైతులు పొగాకు బేళ్లను శీతల కేంద్రాల్లో భద్రపరచుకుంటున్నారు. ఎండలు పెరిగితే రంగు మారి నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క గతేడాది మార్చి 10న తొలి విడత కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. మార్కెట్ ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు నష్టపోయారు. ఈ ఏడాది ఆకు నాణ్యత బాగుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటకలో సరాసరి ధర కిలో రూ.270కు పైగానే ఉండడంతో ఇక్కడ కూడా ధర తగ్గకుండా రావాలని రైతులు ఆశిస్తున్నారు. పొగాకు కొనుగోళ్లు ఆలస్యమయ్యేకొద్దీ బయట మార్కెట్‌లో రైతులు అమ్ముకునే అవకాశం ఉంది. బోర్డు అధికారులు మాత్రం రైతులు బయట పొగాకు అమ్ముకోవద్దని సూచిస్తున్నారు. మార్చి చివరి నాటికైనా వేలం కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, పొదిలి

తవ్వేసెయ్... తరలించేసెయ్!

▶ యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
▶ పట్టించుకోని అధికార యంత్రాంగం

న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

మాచవరం మీదుగా కందుకూరుకు ట్రాక్టరుతో తరలుతున్న ఇసుక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఉచిత ఇసుక పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇది ఇసుకాసురులకు వరంలా మారింది. కందుకూరు పట్టణానికి రువైపులా ఉన్న మన్నేరు, పాలేరుల్లో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు జరుపుతూ అక్రమంగా తరలిస్తున్నారు. ఇదొక వ్యాపారంగా మార్చుకుని కావలి, కనిగిరి తదితర ప్రాంతాలకు రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ నిబంధనలకు విరుద్ధంగా లోతుగా తవ్వకాలు చేస్తున్నారు. మన్నేరు, పాలేరు నదుల్లో లోతుగా ఇసుకను తవ్వడంతో ప్రమాదకరంగా గోతులేర్పడుతున్నాయని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని శ్రీరంగరాజపురం, మాచవరం, పలుకూరు గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుక తరలిస్తున్నాయి.

ఉచితమే కదా అంటున్న అధికారులు

గ్రామాల్లో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు సాగుతున్నా రెవెన్యూశాఖ అధికారులు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది కదా అని సమాధానాలు ఇస్తున్నారు. ఎక్కడ ఏ స్థాయిలో ఇసుక ఉంది.? ఎంత వరకు తవ్వకాలు చేపట్టాలనే కనీస అవగాహన గ్రామ రెవెన్యూ అధికారులకు లేకపోవడంతో వారు అడ్డుకునే పరిస్థితి లేదు. శ్రీరంగరాజపురం సమీపంలో మన్నేరు నుంచి ఇసుక పెద్దఎత్తున తరలిపోతోంది. మాచవరం గ్రామానికి చెందిన కొంత మంది గుడ్లూరు మండల పరిధిలోని మన్నేరు ఉప్పుటేరుల్లో నీరు లేని ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతున్నారు. కావలికి ఒక ట్రక్కు ఇసుక తరలిస్తే రూ.4 వేలు, కనిగిరి వైపు రూ.4,500 చొప్పున వసూలు చేస్తున్నారు. కందుకూరు పట్టణానికి గుడ్లూరు, మాచవరం గ్రామాల వైపు నుంచి వస్తే రూ.1,600 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు.

తనిఖీలు చేయని రవాణాశాఖ

ట్రాక్టరు రిజిస్ట్రేషన్ చేసుకునేటప్పుడు వ్యవసాయం, వాణిజ్య అవసరాల బట్టి పసుపు, తెలుపు నంబర్ ప్లేట్లు కేటాయిస్తారు. నియోజకవర్గంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లలో సగానికిపైగా వాటికి కనీసం ఎటువంటి నంబర్లు కూడా కనిపించడంలేదు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన రవాణాశాఖాధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ప్రమాదాలు జరిగిన సమయంలోనే విచారణ చేస్తున్నారే తప్ప వాహనాల తనిఖీలు చేపట్టడంలేదు. వాహనచోదకుడికి సరైన లైసెన్స్‌లు కూడా ఉండడం లేదు. వాహనంతోపాటు చోదకుడికి సరైన పత్రాలు లేకున్నా ఇసుక వ్యాపారాలు మాత్రం జోరుగానే సాగిస్తున్నారు. తెల్ల నంబరు ప్లేట్ ఉండే వాహనాలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే చర్యలు తీసుకునే అధికారం ఉన్నా పట్టించుకోవటంలేదనే విమర్శలున్నాయి.

పోలేరమ్మకు ప్రణామం

జిల్లా కేంద్రం మార్కాపురం పట్టణ శివారులోని మార్కాపురం గ్రామదేవత శ్రీఅల్లూరి పోలేరమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో ఆదివారం ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కుంకుమ బండ్లు, డప్పుల వాద్యాలతో పట్టణ వీధులు మార్మోగాయి. అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పొంగళ్ల నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. –న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

ప్రశాంతంగా ఆప్టిట్యూడ్ లెవల్-2 పరీక్ష

ఒంగోలు నగరం: ఈ అభ్యాస్ అకాడమి రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ లెవల్-2 ఒలంపియాడ్ ప్రతిభా పరీక్ష ఆదివారం స్థానిక ఆంధ్ర హైస్కూలులో నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యాస్ అకాడమి ఛైర్మన్ భువనగిరి ఫణిపవన్ మాట్లాడుతూ.. ఈ పరీక్ష రెండు దశల్లో నిర్వహిస్తున్నామన్నారు. తొలిదశలో రాష్ట్రంలో 275కు పైగా తమ అనుబంధ పాఠశాలల్లో నిర్వహించామన్నారు. సుమారు 25వేల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. 3 నుంచి పదోతరగతి వరకు ప్రతి తరగతి నుంచి మొదటి మూడు ర్యాంకులు సాధించిన వారికి రెండో దశ 15 కేంద్రాల్లో ఓఎంఆర్ విధానంలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి ముగ్గురు విజేతలకు ఏప్రిల్ 12న గుంటూరులో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. ఆంధ్ర హైస్కూలు కరస్పాండెంట్ బి.శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ప్రతినిధులు శ్రీరాములురెడ్డి, నారాయణ, జాలిరెడ్డి పాల్గొన్నారు.

దారి చూస్తే గుండె కంభం చెరువే!

చారిత్రక కంభం చెరువుకు వెళ్లే రహదారి పలుచోట్ల గుంతలమయంగా మారింది. గతేడాది అక్టోబరులో కురిసిన వర్షాలకు అలుగు వాగు వద్ద రహదారి కోతకు గురవ్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం చెరువు అందాలు చూసేందుకు వచ్చే వందలాది మంది పర్యాటకులు, పొలాలకు వెళ్లే రైతులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనచోదకులు వాపోతున్నారు. ఈ విషయమై రహదారులు, భవనాలశాఖ జేఈ పాపారావు మాట్లాడుతూ గుంతలు పూడ్చేందుకు ప్రతిపాదనలు పంపించామని, త్వరలో మరమ్మతులు చేపడతామని తెలిపారు. –న్యూస్‌టుడే, కంభం

పేరు మార్పు ప్రకటన

నేను నలిపినేని మాల్యాద్రి, తండ్రి పేరు అంకయ్య, వయస్సు 65 సంవత్సరాలు, నివాసం: ప్లాట్ నెం.502, సాయి ప్రగతి అపార్ట్‌మెంట్, 1వ లైను, 2వ క్రాస్, సోనియా గాంధీ నగర్, ఒంగోలు–523001, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్. నా పేరును నల్లపనేని మాల్యాద్రి నాయుడు (Nallapaneni Malyadri Naidu) గా పిలవబడుదును. నలిపినేని మాల్యాద్రి మరియు నల్లపనేని మాల్యాద్రి నాయుడు అనే పేరు రెండు ఒకే వ్యక్తిని సూచిస్తాయి.

(c) eenadu

సైకిళ్లు అందుకున్న విద్యార్థినులతో మంత్రి గొట్టిపాటి

విద్యార్థులకు అండగా కూటమి ప్రభుత్వం

బల్లికురవ, న్యూస్‌టుడే: విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం వేమవరంలో 44మందికి ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దాతల సాయంతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తోందన్నారు. సెయిల్ కంపెనీ సహకారంతో వాటిని అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్యా వ్యవస్థకు ఎలాంటి రాజకీయ మకిలీ అంటకుండా మంత్రి లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ప్రజాప్రతినిధుల పనితీరును స్వయంగా అంచనా వేసేందుకు విద్యార్థులను అసెంబ్లీకి తీసుకెళ్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల, స్థానికుల సమస్యలను మంత్రి విని పరిష్కారమార్గాలు సూచించారు. మండల సీనియర్ నాయకులు మల్లినీడి గోవిందరావు, మండల తెదేపా అధ్యక్షులు ధూళిపాళ్ల హనుమంతరావు, గ్రామ నేత గొట్టిపాటి మారుతి, విద్యుత్తు శాఖ ఈఈ మస్తాన్‌రావు, తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఏఈల నియామకం

ఒంగోలు గ్రామీణం: జిల్లాలోని ఆరు మండలాల్లో ఖాళీగా ఉన్న విద్యుత్తు శాఖ ఏఈ పోస్టులను భర్తీ చేస్తూ సీఎండీ పుల్లారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల వారీగా ప్రసాద్ (కొత్తపట్నం), గోపి (సంతనూతలపాడు), రామకృష్ణ (టంగుటూరు), నాగేశ్వరరావు (కొండపి), రఘురామయ్య (గుడ్లూరు), ఆంజనేయులు (జె.పంగులూరు)ను నియమించారు. వీరంతా ప్రస్తుతం సబ్ ఇంజినీర్లుగా పనిచేస్తుండగా, సీనియారిటీ ప్రాతిపదికన ఉద్యోగోన్నతిపై రెగ్యులర్ ఏఈలుగా నియమితులయ్యారు. అందులో రామకృష్ణ, ఆంజనేయులు ప్రస్తుతం ఆయా మండలాల్లో పనిచేస్తుండగా, వారికి అక్కడే ఏఈగా పోస్టింగ్ ఇచ్చారు.

విద్యుత్తు సమస్యకు పరిష్కారం

పనులను పరిశీలిస్తున్న ముస్లిం నాయకులు

మణికేశ్వరం (అద్దంకి): అద్దంకి మండలం మణికేశ్వరంలోని ముస్లిం శ్మశాన వాటికలో విద్యుత్తు సమస్యలను ఇటీవల మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కొందరు విన్నవించారు. స్పందించిన మంత్రి వెంటనే సమస్యకు పరిష్కారం చూపించాలని విద్యుత్తు సిబ్బందిని ఆదేశించారు. ఈమేరకు శ్మశానం వరకు నూతన స్తంభాలు, దీపాలు ఏర్పాటు చేశారు. ఆ పనులను స్థానిక ముస్లిం నాయకులు ఆదివారం పరిశీలించారు. నియోజకవర్గం ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరీముల్లా, నాయకులు బడావలీ, మౌలాలీ, పాంటింగ్, అబ్దుల్లా, నన్నే, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై శ్రద్ధ

అద్దంకి, న్యూస్‌టుడే: పన్నుల వసూళ్లపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. అద్దంకి మండలంలోని శింగరకొండ పాలెంలో ఆయన ఆదివారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ..ఇంటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు. రోజువారీ ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు.

రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి

కురిచేడు, న్యూస్‌టుడే: అధికారులు రాజకీయ పార్టీలకు అతీతంగా పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని జడ్పీటీసీ సభ్యుడు వెంకటనాగిరెడ్డి అన్నారు. ఆదివారం కురిచేడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కోటేశ్వరమ్మ అధ్యక్షతన అధికారులు, ప్రజాప్రతినిధులతో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 10మందికిపైగా మండల అధికారులు, కొంతమంది ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో సమావేశం తూతూమంత్రంగా సాగింది. కురిచేడు సర్పంచి కృష్ణయ్య, ఏవో సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటెయినర్ లారీ బోల్తా

బొడ్డువానిపాలెం (మేదరమెట్ల), న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం సమీపంలోని నామ్‌రోడ్డుపై ఆదివారం ఉదయం కంటెయినర్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. లారీలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. మేదరమెట్ల ఎస్సై మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల ప్రకారం.. కొద్ది రోజులుగా నామ్ రహదారికి మరమ్మతులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే మేదరమెట్ల నుంచి అద్దంకి వైపు వెళ్తున్న లారీ బొడ్డువానిపాలెం వద్ద డైవర్షన్ తీసుకునే సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆ దారిలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

కారు ఢీకొని కూలీకి తీవ్ర గాయాలు

తిమ్మాయపాలెం(అద్దంకి): ఇటుక బట్టీల వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి తిమ్మాయపాలెం-శంకరాపురం మధ్య చోటు చేసుకుంది. 108 సిబ్బంది అందించిన సమాచారం మేరకు కాకినాడ ప్రాంతానికి చెందిన ఇటుకబట్టీ కూలీ నాగేశ్వరరావు ఆదివారం రాత్రి తిమ్మాయపాలెం ఇటుకబట్టీల సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. దర్శి వైపు నుంచి వస్తున్న కారు ఆయన్ను ఢీకొట్టడంతో తలకు, కాలికి తీవ్రగాయాలయ్యాయి.

కోతుల దాడిలో మహిళకు...: ముండ్లమూరు: స్థానికంగా ఉంటున్న వీరపనేని సీతారావమ్మపై కోతులు దాడిచేయడంతో తీవ్ర గాయమైంది. అధికారులు స్పందించి కోతుల బెడద లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కొమ్మవరంలో ఇల్లు దగ్ధం

ముండ్లమూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొమ్మవరం గ్రామంలో ప్రమాదవశాత్తు ఓ ఇల్లు దగ్ధమైంది. ఈ సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొల్లూరి గాలెమ్మ ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో నిప్పంటుకుంది. దర్శి నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. రూ.75వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

చిన్నారికి పాముకాటు: అద్దంకి, న్యూస్‌టుడే : ఉత్తర అద్దంకి దామావారిపాలేనికి చెందిన చిన్నారి (2) ఇంటి ముందు ఆడుకుంటుండగా పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది పాపకు ప్రాథమిక చికిత్స అందించి ఒంగోలు తరలించారు.


దేవాదాయ ధర్మాదాయశాఖ
శ్రీ వల్లూరమ్మ దేవస్థానము - వల్లూరు
టంగుటూరు మండలం - ప్రకాశం జిల్లా
ఈ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన

ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, వల్లూరు గ్రామము నందు వేంచేసియున్న శ్రీ వల్లూరమ్మవారి దేవస్థానమునకు సంబంధించిన ఈ క్రింద తెలియపరచిన వివిధ ఐటములకు తేది 01.04.2026 నుండి 31.03.2027 వరకు నడుపుకొను హక్కులను పొందుటకుగాను ఈ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డు టెండరు మరియు బహిరంగ వేలం ద్వారా తేది 13.03.2026 ఉదయం గం 11.00లకు [illegible]

వ.సం.	పాటకు పెట్టబడు ఐటము వివరము	ధరావత్తు
1.	[illegible]	25,000.00
2.	[illegible]	25,000.00
3.	[illegible]	10,000.00
4.	షాపు నెం. 1, 2, 3, 4ల యందు (ఒక పొడుగు) [illegible]	1,00,000.00
5.	[illegible]	25,000.00

[illegible] www.eprocurement.gov.in [illegible] AP Endowments Department Marketing [illegible]

వల్లూరు 01.03.2026 | బొజ్జా శ్రీనివాసులు, ఛైర్మన్ | ఎ.బి.రమేష్, కార్యనిర్వహణాధికారి | సెల్ నెం. 7013429148

నేడే శింగరకొండ రథోత్సవం

❖ భారీగా భక్తులొస్తారని అంచనా

విద్యుత్తు కాంతుల్లో ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణం

శింగరకొండ(అద్దంకి), న్యూస్‌టుడే : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ 71వ వార్షిక తిరునాళ్లలో కీలకమైన రథోత్సవం, ముగింపు వేడుకలు సోమవారం జరగనున్నాయి. ఈ మేరకు సర్వం సిద్ధంచేశారు. శనివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ జ్యోతి వెలిగించి వేడుకలకు శ్రీకారం చుట్టగా, సోమవారం రథోత్సవంతో ముగింపు పలకనున్నారు. గతేడాది వివిధ ప్రాంతాల నుంచి సుమారు మూడు లక్షల మందికిపైగా భక్తులు హాజరయ్యారు. ఈ సారి మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులో ఉండటంతో మరింతమంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి పౌర్ణమితో వేడుకలు ముగియాల్సి ఉండగా, ఆరోజు చంద్రగ్రహణం కావడంతో ఒక రోజు ముందుగానే ఉత్సవాలకు ముగింపు పలకాల్సి వచ్చింది. ఉత్సవాల ప్రత్యేకాధికారి, అద్దంకి ఆర్డీవో లక్ష్మీప్రసన్న, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పర్యవేక్షిస్తున్నారు. సోమవారం ఉదయం 5.30 గంటల నుంచి మంగళవారం ఉదయం పది గంటల వరకు స్వామి వారి దర్శనం నిరాటంకంగా జరుగుతుందని సహాయ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం కల్యాణం జరుగుతుందని కార్యనిర్వహణాధికారి మద్దినేని శ్రీనివాస్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం కొండ పైకి ఉచిత బస్సులు నడుపుతున్నారన్నారు.

అన్ని బస్సులు శింగరకొండ వైపే

తిరునాళ్లకు వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అద్దంకి ఆర్టీసీ యాజమాన్యం నిముషానికో బస్సును ఏర్పాటు చేసింది. అద్దంకి డిపో నుంచి 30 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు బెల్లం రామ్మోహనరావు తెలిపారు. పొదిలి, ఒంగోలు, నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ ఆర్టీసీ డిపోల నుంచి శింగరకొండకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం వెనుక, చక్రాయపాలెం మలుపు వద్ద ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్‌లు నెలకొల్పారు.

అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ, ఆర్డీవో

తిరునాళ్లలో అన్ని ప్రభుత్వశాఖలు వేర్వేరుగా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయి. అత్యవసర సమయాల్లో అద్దంకి ఆర్డీవో (92810 34411), దర్శి డీఎస్పీ (91211 02160)కు సంప్రదించవచ్చు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

శింగరకొండ(అద్దంకి): శింగరకొండ వార్షిక తిరునాళ్ల సందర్భంగా ఆలయం సమీపంలో నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు అలరించాయి. తలపై ఘటాలతో చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆర్డీవో లక్ష్మీప్రసన్న, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణతో కలిసి శింగరకొండలో పర్యటించారు. దేవాలయ క్యూలైన్లు, భక్తుల రాకపోకలు, తీర్థప్రసాదాల కౌంటర్లు, విద్యుత్తు ప్రభల ఏర్పాటుపై ఇరు దేవాలయాల అధికారులు తిమ్మానాయుడు, మద్దినేని శ్రీనివాస్‌తోపాటు పాలకమండళ్ల ఛైర్మన్లతో చర్చించారు. నాలుగు అంబులెన్స్‌లు ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీచరణ్, ఫారెస్ట్ సెటిల్‌మెంటు అధికారి జాన్సన్, అద్దంకి సీఐ సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రధాన ఆకర్షణగా నిలిచిన 99 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం

సమాన హక్కుల కోసం మహిళలు ఉద్యమించాలి

ఒంగోలు గ్రామీణం: సమాన హక్కుల సాధన కోసం మహిళలు ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఒంగోలు నగర ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక మోటూరు ఉదయం కాలనీలో ఆదివారం సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు నేటికీ సమాన హక్కులు పొందలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడిచినా మహిళలు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలు చదువుకోవడానికి మంచి విద్యా వ్యవస్థ, భద్రత లేదన్నారు. ఈ సమస్యల కారణంగానే బాలికలు చదువులో వెనుకబాటులో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు కె.విజయమ్మ, సీహెచ్.వెంకటేశ్వరమ్మ, సత్యవతి, వసంత తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి ఆర్డీవోగా జాన్సన్

అద్దంకి: అద్దంకి ఆర్డీవో (పూర్తి అదనపు బాధ్యతలు)గా ప్రకాశం జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి ఎస్ జాన్సన్‌ను జిల్లా కలెక్టర్ రాజాబాబు నియమించారు. అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేయడమే కాకుండా అద్దంకి, దర్శి నియోజకవర్గాల్లోని పది మండలాలతో నూతన ఆర్డీవో కార్యాలయం మంజూరు చేశారు. ఇన్‌ఛార్జి ఆర్డీవోగా ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్నను నియమించారు. రెండు నెలల అనంతరం పూర్తి అదనపు బాధ్యతలతో జాన్సన్‌ను అద్దంకి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పాఠశాలకు బల్లల అందజేత

తాళ్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని తూర్పుగంగవరం మాజీ సర్పంచి సోమా పుల్లయ్య, సతీమణి సుందరమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు విశ్రాంత ఎస్సై సోమా ఆంజనేయులు ఆదివారం ఎనిమిది బెంచీలు అందజేశారు. వాటిని జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయించారు. సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బయ్య, తెదేపా నాయకులు అన్వర్, జలాలుద్దీన్, హెచ్‌ఎం కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలి

కడప నగరపాలక: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై వైకాపా నాయకులు కడపలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాల వైకాపా ప్రజాప్రతినిధులు, ఆయా జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు హాజరయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కొన్ని నెలలుగా పొరుగురాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలు సీమ పనులకు గొడ్డలిపెట్టుగా మారాయన్నారు.

హలో అనలేం.. సేవలందించలేం!

❖ చెంచు గిరిజన గూడేల్లో పనిచేయని ఫోన్లు

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల:

ప్రపంచీకరణ నేపథ్యంలో రోజురోజుకీ సాంకేతికత పెరుగుతోంది. ప్రపంచంలో ఏ మూలనుంచైనా జరిగే సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునే పరిస్థితి అందుబాటులోకి వచ్చింది. కానీ అందుకు విరుద్ధమైన పరిస్థితి నల్లమల అటవీ ప్రాంతంలోని పలు చెంచు గిరిజన గూడేల్లో నెలకొంది. 'హలో' అనే పరిస్థితే లేదు.

మైదాన ప్రాంతాల్లో గిరిజన గర్భిణి ముఖ చిత్రం తీసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్త

ఎందుకు పనిచేయవంటే..

పెద్దదోర్నాల - శ్రీశైలం రహదారిలో బోడేనాయక్ తండా నుంచి చిన్నారుట్ల వరకు (30 కి.మీ దూరం), పెద్దదోర్నాల-ఆత్మకూరు ఘాట్ రహదారిలో కొర్రప్రోలు నుంచి బైర్లూటీ వరకు (30 కి.మీ.దూరం) చరవాణిలు మూగబోతాయి. ఎందుకంటే ఇదంతా అటవీ ప్రాంతం. ఇక్కడ పర్యావరణ పరిక్షణ దృష్టిలో పెట్టుకుని సెల్ టవర్ల ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వడంలేదు.

వివరాల నమోదుకు ఇబ్బంది

సిగ్నల్స్ లేని కారణంగా..ఫోన్లు పనిచేయక చింతల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సిబ్బంది ముఖ హాజరు, వివరాల నమోదుకు బోడేనాయక్ తండా సమీపం వరకు వచ్చి అక్కడ నమోదు చేసుకుంటున్నారు. చింతల, తుమ్మలబైలు, మర్రిపాలెం, పెద్దమంతనాల ఆశ్రమ పాఠశాలలకు చరవాణి మోగే అవకాశం లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణులకు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలంటే ముఖ హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. వారిని మైదాన ప్రాంతాల్లోకి తీసుకుని వచ్చి నమోదు చేసుకోవాల్సి రావడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలకు కష్టాలు తప్పడంలేదు.

ప్రమాదాల బారిన పడితే నరకమే..

నల్లమల రహదారుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. వాహనాలు ఘాట్ ఎక్కలేక అప్పుడప్పుడు మొరాయిస్తుంటాయి. ఆ సమయంలో వాహనాల రాకపోకలు స్తంభించిపోతాయి. చరవాణి సిగ్నల్స్ లేకపోవడంతో పోలీసులకు సమాచారం అంది వచ్చేసరికి గంటల సయయం పడుతోంది. మూడు, నాలుగు గంటలు నట్టడవిలో ఉండాల్సి రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు సమాచారం అందుకుని 108 వాహనాలు వచ్చే లోగా క్షతగాత్రులు అధిక రక్తస్రావంతో ఒక్కొక్క సారి ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నల్లమలలో సమాచార వ్యవస్థను మెరుగు పరచాలని చెంచు గిరిజన ప్రజలు కోరుతున్నారు.

కనిగిరి వరకూ రైళ్లు నడపండి

దర్శి రైల్వే స్టేషన్‌ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

దర్శి: నడికుడి-శ్రీకాళహస్తి లైన్ పరిధిలో పనులు పూర్తయిన నేపథ్యంలో కనిగిరి వరకు రైళ్లు నడిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు కోరారు. ఆదివారం దర్శి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న నిర్మాణ పనులను సీపీఎం నియోజకవర్గ నాయకుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పిచ్చయ్య, నారాయణ, వెంకయ్య, యలమందారెడ్డి, జాన్, అంజిబాబు, అనిల్ పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న భక్తులు

తాళ్లూరు, న్యూస్‌టుడే : సోమవరప్పాడు పరిధి గుంటిగంగలో కొలువుదీరిన గంగాభవాని అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు కామేశ్వరశర్మ, బాలరాజు, విజయలక్ష్మి కలసి అమ్మవారికి అభిషేకాలు చేశారు. అమ్మవారిని పూలమాలలతో అలంకరించి ముస్తాబు చేశారు. పరిసర జిల్లాల్లోని వివిధ ప్రాంతాలనుంచి వందలాది మంది భక్తులు విచ్చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించి పొంగళ్లు సమర్పించారు. త్వరలో జరగబోయే పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలని అమ్మవారికి పూజలు చేయించారు. అన్నదానం నిర్వహించారు. ఈవో ప్రసాద్, కటకంశెట్టి శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 150, రిటైల్ లైవ్ - 177, చికెన్ విత్ స్కిన్ - 257, చికెన్ స్కిన్‌లెస్- 292

ప్రసన్నాంజనేయుడి దర్శనానికి 4 క్యూలైన్లు

సిబ్బందికి సూచనలిస్తున్న సహాయ కమిషనర్ తిమ్మానాయుడు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే : శింగరకొండ తిరునాళ్లను ప్లాస్టిక్ రహితంగా జరపాలని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు అన్నారు. ఆదివారం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ చరవాణి సిగ్నల్స్ పనిచేయకుంటే వాకీటాకీలు తప్పక వినియోగించుకోవాలన్నారు. దీనివల్ల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికెళ్లే వీలుంటుందన్నారు. ఉద్యోగులంతా ఏకరూప దుస్తులు ధరించాలని, గుర్తింపు కార్డులు ఉంచుకోవాలన్నారు. కార్యాలయం, అన్నదాన మండపం, ఉచిత ప్రసాదాలు తదితర కీలక ప్రదేశాల్లో చురుగ్గా పనిచేసే సిబ్బంది ఉండాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు. ప్రసన్నాంజనేయస్వామి దర్శనానికి నాలుగు క్యూలు ఏర్పాటుచేసినట్లు సహాయ కమిషనర్ తెలిపారు. రూ.50, రూ.100, వీఐపీ, ఉచిత దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తిరుమల మాదిరిగా లడ్డూ ప్రసాదాలు తయారు చేయించామని, వాటిని భక్తులకు అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు మంచి నీరు, పులిహోర, ప్రసాదాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆలయంలోకి వచ్చిన భక్తులు ఉత్తర ద్వారం ద్వారా బయటకు రావాల్సి ఉంటుందన్నారు.

❖ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద భక్తులకు ఉచిత అన్నదానం చేసేందుకు దాత కొల్లి సీతారామయ్య ఏర్పాటు చేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి మద్దినేని శ్రీనివాస్ తెలిపారు. మూడు వేల రవ్వల డ్డూలు విక్రయిస్తున్నామని, ఆంజనేయ డెయిరీ వారు మజ్జిగ ప్యాకెట్లు, దత్తపాదుకాక్షేత్రానికి చెందిన సిబ్బంది మంచినీటి సరఫరా, వెంకటరమణ మిఠాయి దుకాణం తరపున పులిహోర, పొంగలి ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

అద్దంకి రైల్వే స్టేషన్ ఏర్పాటుకు డిమాండు

ప్రదర్శనను ప్రారంభిస్తున్న డాక్టర్ రంగారావు

అద్దంకి, న్యూస్‌టుడే : ప్రజల ఆకాంక్ష మేరకు అద్దంకిలో రైల్వేస్టేషన్, రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ కోగంటి రంగారావు, డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు అన్నారు. రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుంచి పట్టణ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. బాలికల ఉన్నత పాఠశాల వద్ద ప్రదర్శనను డాక్టర్ రంగారావు జెండా ఊపి ప్రారంభించారు. ఎంఈవో-2 కేవీ శ్రీనివాసరావు, సాధన సమితి నేతలు రవిశంకర్, మధుసూదనరావు, నాగసూరి శివప్రసాద్, ఉపాధ్యాయుడు రసూల్, దివ్యాంగ సంక్షేమ సంఘం నాయకులు ఘంటసాల శ్రీరామకృష్ణ, కూరపాటి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ రైల్వే సాధన కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఆదివారం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు విభాగాల్లో నిర్వహించిన పరీక్షలకు గాను ఉదయం 5వ తరగతి, అనంతరం ఇంటర్ మొదటి సంవత్సరం, మధ్యాహ్నం ఐఐటీ/నీట్‌లో శిక్షణ ఇచ్చేందుకు గానూ ప్రవేశ పరీక్షలు జరిగాయి. జిల్లాలోని పలుచోట్ల నుంచి విద్యార్థులు భారీగా హాజరయ్యారని ప్రధానాచార్యురాలు చాముండేశ్వరి తెలిపారు.

తల్లిదండ్రులతో పాటు హాజరైన విద్యార్థులు

అతివకు శిక్షణ... ఉపాధికి ఆలంబన!

కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ మహిళలు

న్యూస్‌టుడే, సంతనూతలపాడు

నిరుద్యోగ మహిళలకు ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా అక్కడ శిక్షణ అందిస్తున్నారు. సంతనూతలపాడు మండలంలోని ఎండ్లూరుడొంకలో గల ఎన్టీఆర్ మహిళా ప్రాంగణంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ హబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటర్ కోర్సులు, బ్యూటీషియన్, కుట్టుపై తర్ఫీదు అందిస్తున్నారు. దీన్ని ఎంతో మంది మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రస్తుతం 9వ బ్యాచ్‌కు కంప్యూటర్ శిక్షణ మొదలైంది. ఇక్కడికి ఎంతో మంది మహిళలు వచ్చి ఉత్సాహంగా వాటిని నేర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా కొందరు తమ అభిప్రాయాలను పంచుకున్నారిలా.

ఖాళీ సమయం సద్వినియోగం చేసుకుంటున్నా..

ప్రస్తుతం ఏ ఉద్యోగం కావాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరం. బయట నేర్చుకోవాలంటే ఎంతో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎండ్లూరు డొంకలోని మహిళా ప్రాంగణంలో ఉచితంగా ఉద్యోగాలకు కావాల్సిన అన్ని అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. నేను బీఈడీ పూర్తిచేశాను. చదువు పూర్తవ్వగానే పెళ్లి, పిల్లలు ఇలా సమయం గడిచిపోయింది. ప్రస్తుతం పిల్లలు పాఠశాలకు వెళ్లడంతో ఉద్యోగం చేయాలని నిర్ణయించుకొని ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నా. పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తామని చెప్పారు.

–చాగంటి లక్ష్మి, ఒంగోలు

❖ కుటుంబానికి అండగా నిలవాలని..

నేను ఇంటర్ వరకు చదువుకున్నా. ప్రస్తుతం డ్వాక్రా గ్రూప్‌లో రీసోర్స్ పర్సన్‌గా పనిచేస్తున్నా. కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడంతో పనిచేసే ప్రదేశంలోను, బయటకు సైతం వెళ్లలేకున్నాను. నా భర్త గ్రానైట్ కంపెనీల్లో పనిచేస్తుంటారు. తాను సంపాదించేది కుటుంబానికి చాలడం లేదు. కుటుంబానికి నా వంతుగా తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో కంప్యూటర్ నేర్చుకోవాలని నిర్ణయించుకొని ఇక్కడ ఉచితంగా శిక్షణ పొందుతున్నా. –సూరం చంద్రకళ, పేర్నమిట్ట

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

EDUCATION

DISTANCE EDUCATION

ఆచార్యనాగార్జున యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం నిర్వహిస్తున్న M.Sc, M.A(అన్ని కోర్సులు), MBA, MCA, M.Com, MLiSc కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. MBA, MCA ఎంట్రన్స్‌కు అర్హతా పరీక్ష తేది 15-3-2026న జరుగును. పూర్తి: గీతం డిగ్రీ కాలేజ్, ఒంగోలు. సెల్: 9030568558, 9849124970

REAL ESTATE

LAND FOR SALE

వ్యవసాయభూమి అమ్మకమునకు ప్రకాశం జిల్లా దర్శి మం, వెంకటాచలంపల్లె గ్రామంలో సర్వేనం. 33 & 35 నందుగల 16.24 ఎకరాలు (మెట్ట) వ్యవసాయ భూమి అమ్మకమునకు కలదు. సంప్రదించవలసిన ఫోన్ నం: 90000 18931.

JOBS

WANTED Exp. Female Telicallers/Computer Operators in Edu. Consultancy in VIP Rd,Ongole. Sal:15k-20k, Q: Degree ✆ 9052975353.

ప్రముఖ దినపత్రికలో ప్రకటనల సేకరణకు ప్రకాశం జిల్లాలో కనిగిరి, దర్శి, కందుకూరుటౌన్‌లో పనిచేయుటకు అసిస్టెంట్ సేల్స్‌మెన్స్ కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత అర్హత: ఇంటర్ పాస్, డిగ్రీ. జీతం:20,000. TA,DA,ఇన్సెంటివ్ ఇవ్వబడును. ✆97011 12824.

ప్రముఖ లోన్స్ ఏజెన్సీ నందు లోన్స్ చేయుటకు టెలికాలర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 97014 79569, 80081 00872.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు క్లాస్ ఇన్‌ఛార్జిన్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 12000 నుండి 14000 వరకు ఇవ్వబడును. (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22సం||రాల నుండి 40 సం||రాలు ఉండవలెను. వివరాలకు సంప్ర. ఫోన్: 9248733320.

షణ్ముఖ స్టేట్ &సెంట్రల్ ప్రాజెక్ట్స్ ఆఫీసు నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్, టెలికాలర్స్, ఫ్రంట్ ఆఫీసు స్టాఫ్ కావలెను. సెల్: 90303 27779.

ఒంగోలు అంజయ్యరోడ్ ప్రముఖ బాయ్స్‌హాస్టల్ నందు పని చేయుటకు వంట మనిషి కావలెను. (అనుభవం గల). Cell: 89774 05389, 86888 64165.

అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు..
B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే
వివరాలకు..
97011 12824
ఒంగోలు
80087 09902
మార్కాపురం
80081 11050
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అభివృద్ధి పనులపై సమాలోచనలు

టంగుటూరు, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పు నాయుడుపాలెంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగు నీటి చెరువుల అభివృద్ధి, చుట్టూ నడక మార్గం, పార్కు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్‌తో కలిసి సమాలోచనలు చేశారు. పలు స్థలాలను పరిశీలించారు. అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న సంపులను తొలగించాలని సూచించారు. అలాగే పార్కు ఏర్పాటు స్థలంలో నీరు నిల్వ ఉండకుండా గ్రావెల్‌తో చదును చేయించాలన్నారు. వారి వెంట సర్పంచి తలపనేని రవికుమార్, పాతూరి వెంకటేశ్వర్లు, గడ్డం నవీన్ తదితరులు ఉన్నారు.

అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి స్వామి

మంత్రి క్యాంపు కార్యాలయానికి పోటెత్తిన అర్జీదారులు

టంగుటూరు, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి క్యాంపు కార్యాలయానికి అర్జీదారులు ఆదివారం పోటెత్తారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, సమస్యలు తదితరాలపై అమాత్యునికి వినతులు అందజేశారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ఎల్‌వోసీ, సీఎం ఆర్ఎఫ్ చెక్కులు మంత్రి పంపిణీ చేశారు. ఆయన వెంట పోకూరి రవీంద్రబాబు, రామా గోపీ తదితరులు ఉన్నారు.

సాహిత్య రంగంలో సేవలకు పురస్కారం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: విజయవాడ నగరంలోని బాలోత్సవ భవన్‌లో విశ్వసాహితీ కళావేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కొల్లి రమాపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహిత్య రంగంలో కృషి చేస్తున్న నరసం ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి పరాంకుశం (ఒంగోలు)కు శ్రీశక్తి ఉమెన్ పవర్ ఎక్సలెన్స్ అవార్డు-2026తో సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. నేటి మహిళలు సంఘటిత శక్తిగా పురోగతి సాధిస్తున్నారని తెలియజేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన నరసరం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ తదితరులు కృష్ణవేణికి అభినందనలు తెలియజేశారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం హర్షణీయం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం హర్షణీయమని తెదేపా విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్‌అజీమ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఇంద్రధనుస్సు పథకం పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడు ప్రయోజనాలు ప్రకటించారన్నారు. స్త్రీశక్తి పథకానికి కేటాయించిన బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణంతో పాటు సహాయకులకు 50శాతం రాయితీ ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

కందుకూరుపట్టణం, న్యూస్‌టుడే: కందుకూరు పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు గ్లోబల్ కంప్యూటర్ సంస్థ నిర్వాహకుడు షేక్ జమీల్ తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా యువత, గృహిణులకు.. ఉద్యోగ ఆధారిత ఎంఎస్ ఆఫీస్, ఫొటోషాప్, టాలీ, ఈఆర్పీ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు బయోడేటా, ఫొటో, ఆధార్ కార్డుతో ఓవీ రోడ్డులోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. త్వరలోనే శిక్షణ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

ఇంటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం తగదు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండలో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీపీవో వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గ్రామ పంచాయతీని ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు దస్త్రాలు పరిశీలించారు. గ్రామంలో రూ.2.39 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.81.54 లక్షలు మాత్రమే వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సిబ్బందిని ఆరు బృందాలుగా నియమించి, ఈ నెల 15లోపు పూర్తిస్థాయిలో ఇంటి పన్నులు, బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో తిరిగి గృహ యజమానుల నుంచి సుమారు రూ.1.38 లక్షల పన్ను వసూలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమేష్‌బాబు, సిబ్బంది చెరుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గృహ యజమానికి నోటీసు అందజేస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

కందుకూరు

• కందుకూరు • కొండపి

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

కందుకూరు పట్టణం: ఐఎఫ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా పట్టణంలోని ప్రధాన కాలనీల్లో ఇంటింటికి తిరిగి మహిళలు, చిన్నారులకు ఉపయోగపడని, సైజులు సరిపోని దుస్తులు సేకరించారు. వాటిని ఆదివారం పట్టణంలోని ఏఎంసీ కార్యాలయం పక్కన, మహదేవపురం రోడ్డు తదితర శివారు ప్రాంతాల్లో గుడిసెల్లో నివాసం ఉంటున్న నిరుపేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సాజిద్, కార్యదర్శి షంషీర్, కోశాధికారి హఫీజ్, ప్రతినిధులు షంషుద్దీన్, అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

పరిష్కరిస్తే చిన్నవే.. పట్టించుకోకనే అవస్థ!

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే:

చిన్న చిన్న అడ్డంకులు తొలగిస్తే తమ కష్టాలు తీరతాయని పలు కాలనీల ప్రజలు అధికారులకు విన్నవించినా ఫలితం ఉండటం లేదు. ఒక్కో పనికి సుమారు రూ.10వేల నుంచి రూ.50వేల లోపు ఖర్చు చేస్తే సరిపోతుంది. అయినప్పటికీ అదిగో.. ఇదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

● పట్టణంలోని విప్పగుంట రోడ్డు నుంచి కనిగిరి మార్గానికి వెళ్లే సీసీ దారిలో ఏడాదిన్నర క్రితం సిమెంట్ కాలువలు ఏర్పాటు చేశారు. అయితే అక్కడి విద్యుత్తు స్తంభాలను పక్కకు జరపకుండానే పనులు చేశారు. దీంతో వర్షాకాలంలో నీరు పోటెత్తినప్పుడు పారుదల సక్రమంగా లేక పొంగుతున్న పరిస్థితి నెలకొంటుందని స్థానికులు వాపోతున్నారు.

ఇరుకుగా సింహాద్రినగర్ రోడ్డు

● స్థానిక పామూరు రోడ్డు నుంచి కోటేశ్వర థియేటర్ వైపు వెళ్లే కూడలి ప్రారంభంలో రామాలయం వెనుక అప్రోచ్ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. అటుగా రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహన చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. నిత్యావసరాలు, కూరగాయలు, మాంసం దుకాణాలకు ఇటుగానే వెళ్తుంటారు. అప్రోచ్ రోడ్డును సరిచేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది.

● పామూరు రోడ్డు నుంచి సింహాద్రినగర్, కేసరగుంట కాలనీలకు వెళ్లే దారి ప్రారంభంలో కాలువపై శ్లాబు లేక ఇబ్బందికరంగా ఉంది. ప్రధాన రోడ్డు విస్తరణలో భాగంగా కాలువను తొలగించారు. దీంతో ప్రస్తుతం ఆ రోడ్డు ద్విచక్ర వాహనాలకే పరిమితమైంది. కార్లు వెళ్లాలంటే కష్టంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.

● కెనరా బ్యాంకు ఎదురు పామూరు రోడ్డు నుంచి యర్రవడ్డెపాలెం, గుర్రంవారిపాలెం వెళ్లే కూడలి ప్రారంభంలో చప్టా వద్ద సీసీ రోడ్డు కుంగింది. సుమారు ఆరు నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయలేదు. లారీలు, ఇతర భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు చెబుతున్నారు.

● పట్టణంలోని పోతురాజుమిట్ట వెనుక డంపింగ్ యార్డుకు వెళ్లే దారిలో రైస్‌మిల్లు సమీపంలో పెద్ద కాలువపై చప్టా శిథిలమైంది. ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కందుకూరు: 70939 81624

కొండపి: 96424 56296

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

గుడ్లూరు, న్యూస్‌టుడే

?: మండలంలోని పాజర్ల ప్రధాన వీధిలో చేతి పంపు మరమ్మతులకు గురైంది. దీంతో నీటికి ఇబ్బందులు పడుతున్నాం. -దినేష్‌వర్మ

✓: పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. -శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

జరుగుమల్లి, న్యూస్‌టుడే

?: జరుగుమల్లిలో కాలువలు లేక ఇళ్లలోని వాడకం నీరు రోడ్డుపైకి చేరుతోంది. -సురేంద్ర, స్థానికుడు

✓: కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. -విద్యులత, పంచాయతీ కార్యదర్శి

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే

?: కాకుటూరు పంచాయతీ బొంతవారిపాలేనికి సీపీడబ్ల్యూ రక్షిత పథకం నుంచి మూడు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచింది. -కోటయ్య, స్థానికుడు

✓: నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటాం. -రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

ఉలవపాడు, న్యూస్‌టుడే

?: ఉలవపాడు హైస్కూల్ సంఘం చివరి వీధిలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. -బుజ్జి, స్థానికుడు

✓: రెండ్రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. -వీరయ్య, పంచాయతీ కార్యదర్శి

?: ఉలవపాడు గణపతి ఆలయం వెనక వీధిలో మురుగు నిలుస్తోంది. దీంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. రాత్రిళ్లు బయట కూర్చొనే పరిస్థితిలేదు. -శ్రీనివాసరావు, ఉలవపాడు

✓: పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాం. -వీరయ్య, పంచాయతీ కార్యదర్శి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే

?: పట్టణంలోని తపాలా శాఖ కూడలి నుంచి జనార్దనస్వామి ఆలయానికి వెళ్లే దారిలో ద్విచక్ర వాహనాలు రోడ్డుకు అడ్డంగా నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. -ఎండీ బాజీ, బృందావనం

✓: సిబ్బందిని నియమించి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. -శివనాగరాజు, పట్టణ ఎస్సై

మద్దిపూడి, న్యూస్‌టుడే

?: కాకర్ల పంచాయతీ శివరాయునిపేట రామాలయం వీధిలో మురుగు నిలుస్తోంది. -బాలకోటయ్య, స్థానికుడు

✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. -నాగూర్‌వలీ, ఎంపీడీవో

సబ్ డివిజన్‌లో 30 పోలీసు యాక్ట్ అమలు

కందుకూరు పట్టణం: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కందుకూరు సబ్‌డివిజన్ పరిధిలో ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నేపథ్యంలో డివిజన్‌లోని 9 పోలీసు స్టేషన్ల పరిధిలో అనుమతి లేకుండా ధర్నాలు, ప్రదర్శనలు, బహిరంగ సభలు, సమావేశాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించకూడదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలి

గుడ్లూరు: మండల పరిధిలో నూతన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. దీంతో పాటు కొత్తపేట మార్గంలో నిర్మించిన నిల్వ కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. ప్రస్తుత ఉత్పత్తిదారుల సంఘం రైతులను చైతన్య పరచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, అక్కడ జరిగే కార్యకలాపాలు తెలియనీయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అందజేసే ప్రోత్సాహకాలు, వ్యవసాయ ఉపకరణాల గురించి వివరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాలువ పూడ్చి.. తటాకంగా మార్చి!

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే:

మండలంలోని పలుకూరు గ్రామంలో 15 ఏళ్ల కిందట 375 మీటర్ల పొడవున పంట కాలువ ఏర్పాటు చేశారు. దాని పక్కనే సిమెంటు రహదారి నిర్మించారు. అయితే రహదారి ఎత్తుగా ఉండటంతో చుట్టుపక్కల నివాసాల్లోని నీరు కాలువలోకి పారిస్తున్నారు. క్రమేపీ దాన్ని పూడ్చివేయడంతో ప్రవాహం నిలిచి మురుగు తటాకం ఏర్పడింది. దీంతో చుట్టుపక్కల నివాసం ఉండే ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమల తీవ్రత అధికంగా ఉండటంతో గత ఆరేళ్లుగా గ్రామంలో విషజ్వరాల బారిన పడే వారి సంఖ్య పెరుగుతోంది. అయిదేళ్ల కిందట ఒకరు చనిపోయారు. ఆ సమయంలో అధికారులు హడావుడి చేసి కాలువను శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వారు బ్లీచింగ్ చల్లి మమ అనిపించారు.

ఎవరి పరిధో తేల్చుకోలేక..

కాలువను శుభ్రం చేయించాలని గ్రామస్థులు జలవనరుల శాఖ అధికారులను కోరితే అది పంచాయతీ పరిధిలో ఉందని చెప్పారు. పంచాయతీ అధికారులను అడిగితే జలవనరుల శాఖ కాలువలో తామేమి చేయలేమని చేతులెత్తేశారు. గ్రామంలో ఇటీవల ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి గ్రామస్థులు సమస్య వివరించారు. ఆయన వెంటనే కాలువను శుభ్రం చేయించి నీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన చెప్పాక కూడా కొందరు ట్రాక్టర్లలో మట్టి తీసుకొచ్చి కాలువను పూడ్చివేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని వారు వర్షాలు పడితే నీరు ఇళ్లలోకి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకుని వర్షాకాలంలో ఉత్పన్నమయ్యే సమస్యలతో పాటు, వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై ప్రజా వినతుల పరిష్కార వేదికలోనూ అర్జీ ఇచ్చినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

అసలే మలుపు.. ఆపై విద్యుత్తు తీగలు

మండలంలోని కొత్తపేట చెరువు కట్ట కింది భాగంలో మలుపు వద్ద విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా మారాయి. ఎస్సీ కాలనీ నుంచి గ్రామంలోకి వచ్చే దారిలో మలుపు వద్ద స్తంభాలు పక్కకు వాలడంతో తీగలు రహదారిపైకి వచ్చాయి. వరిగడ్డి వాహనాలు అటుగా వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గుడ్లూరు

దారి.. గోతులమయంగా మారి..

మండలంలోని స్వర్ణాజీపురం-పాజర్ల మార్గం గోతులతో అధ్వానంగా మారింది. గత నవంబరులో కురిసిన భారీ వర్షాలకు గ్రావెల్ రహదారిపై మోకాలి లోతు గోతులు ఏర్పడ్డాయి. పంటల కాలం కావడంతో ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు తరలించాలంటే మరీ ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేయించాలని రెండు గ్రామాల రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గుడ్లూరు

పగటి వెలుగులు.. నిర్లక్ష్యపు జిలుగులు

మండల పరిధిలోని చెరుకూరు గ్రామ ఎస్సీ కాలనీలో విద్యుత్తు దీపాలు రాత్రి, పగలు తేడా లేకుండా నిరంతరం వెలుగుతున్నాయి. దీంతో అనవసర విద్యుత్తు వినియోగం పెరిగి ప్రజాధనం వృథా అవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆన్-ఆఫ్ స్విచ్‌లు, ఆటోమేటిక్ టైమర్ వ్యవస్థ లేకపోవడమే సమస్యకు కారణమంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పొన్నలూరు

ప్రమాదకరంగా నేల చప్టా

తిమ్మారెడ్డిపాలెం-గంగపాలెం మధ్య నేల చప్టా ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. రాత్రి సమయాల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి చప్టా స్థానంలో వంతెన నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, లింగసముద్రం

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

కొండపి-పొదిలి రోడ్డులో ఇరువైపులా బీసీ కాలనీ వరకు 178 మీటర్ల పొడవునా మురుగు కాలువల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రోడ్డు విస్తరణలో భాగంగా రూ.96 లక్షలతో ప్రస్తుతం ఉన్న సిమెంట్ మార్గం మధ్య నుంచి కుడి, ఎడమ వైపున 33 అడుగుల వెడల్పుతో పనులు ప్రారంభిస్తున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ తెలిపారు. దీంతో కొండపి ప్రజలకు మురుగు సమస్య తొలగిపోతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

ఇంజినీరింగ్ విద్యార్థి అదృశ్యంపై కేసు

ఉలవపాడు, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి బయటకు వెళ్లి.. ఇంజినీరింగ్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన మండలంలోని రామాయపట్నంలో చోటుచేసుకుంది. ఎస్సై సుబ్బారావు కథనం మేరకు.. గ్రామానికి చెందిన పెల్లేటి వెంకట దుర్గాబాబు ఒంగోలు సమీపంలోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గత నెల 9న కళాశాలకు వెళ్లలేదని తల్లిదండ్రులు మందలించారు. దీంతో 10వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో తండ్రి శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జూద స్థావరాలపై దాడి

లింగసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని పెదపవని ఎస్టీ కాలనీ సమీపంలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై శనివారం దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.13,210 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

● కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొండికందుకూరు గ్రామ శివారులో నిర్వహిస్తున్న జూద స్థావరంపై శనివారం దాడిచేసి అయిదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎ.బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారి నుంచి రూ.2150 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

గ్రంథాలయాల్లో అన్ని పుస్తకాలుండేలా చర్యలు

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లో పాఠకులకు అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండేలా చొరవ తీసుకుంటామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. క్రెడాయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయానికి ఆదివారం పుస్తకాలు వితరణ చేశారు. ఇందులో 87 పుస్తకాలు (పోటీ పరీక్షల నిమిత్తం) అందించిన ముప్పా శివకృష్ణను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంగారాయుడు చెరువు కట్టపై వాకర్స్ ఎంతో మంది వస్తుంటారని అక్కడ ముప్పవరపు వీరయ్య చౌదరి పేరుతో మినీ గ్రంథాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ముప్పవరపు సుచిత్ర మాట్లాడుతూ.. గ్రంథాలయానికి పుస్తకాలను అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో దామచర్ల నాగసత్యలత, అసోసియేషన్ సెక్రటరీ రాజేంద్ర, ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివారావు, గ్రంథాలయ సంస్థ సెక్రటరీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పృథులగిరీశుని గరుడోత్సవం

మద్దిపూడి, న్యూస్‌టుడే: పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి హనుమంత వాహనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన గరుడోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసినట్లు ఈవో నారాయణరెడ్డి తెలిపారు.

కమనీయం.. వేంకన్న కల్యాణం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు నల్లూరి జగదీష్ కుమారాచార్యులు, వారి బృందం ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. ఉభయ దాతలుగా అనుమాలశెట్టి చెంచురత్నం, కమలాకుమారి కుటుంబీకులు వ్యవహరించారు. సుమారు 100 మందికి పైగా దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. రాత్రి గరుడ వాహన సేవతో గ్రామోత్సవం నిర్వహించారు.

తాగుతూ.. నానా యాగీ చేస్తూ..!

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

❑ గత నెల 11న సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంట చెరువు వద్ద రహదారిపై కొందరు యువకులు బహిరంగంగా మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో అటుగా వస్తున్న ఓ వ్యక్తి దారి ఇవ్వమని అడిగినందుకు విచక్షణారహితంగా దాడి చేశారు.

❑ గత నెల 26న కనుమళ్ల గిరిజన కాలనీలో కొందరు వ్యక్తులు మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడి చేయగా తలకు తీవ్ర గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

❑ మూడు నెలల క్రితం నెల్లూరు జిల్లా కావలి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి బింగినపల్లి గ్రామంలో బంధువుల ఇంటికి వచ్చి మద్యం మత్తులో పంట పొలాల్లోని బావిలో పడి మృతిచెందాడు.

మూడు నెలల్లో పది కేసులు

సింగరాయకొండ మండల పరిధిలోని గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. మరోవైపు మద్యం మత్తులో జరుగుతున్న నేరాలూ పెరిగిపోతున్నాయి. మందుబాబులు విచక్షణ మరిచి దాడులు చేస్తూ బాధిత కుటుంబాల్లో విషాదం నింపుతున్నారు. గత మూడు నెలల్లో పది వరకు కేసులు నమోదయ్యాయి. తీరప్రాంత గ్రామాల్లో ఏకంగా గొలుసు దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంలో ప్రభుత్వ కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. పది గ్రామాల్లో కొందరు నేతలు అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. వీరి ఆగడాలను అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మిన్నకుండి పోతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

నడిరోడ్లపై తూగుతూ..

ఊళ్లపాలెం గ్రామంలో స్థానిక నాయకులు ముగ్గురు తమ అనుచరులతో బహిరంగంగానే గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. సింగరాయకొండలో మద్యం దుకాణాల వద్ద అనధికారికంగా రెస్టారెంట్లు నిర్వహిస్తుండటంతో మందుబాబులు బహిరంగంగా తాగుతూ నడిరోడ్లపై నానా యాగీ చేస్తున్నారు. అటువైపు రాకపోకలు సాగించాలంటే మహిళలు, విద్యార్థినులు భయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి.. మండలంలోని గొలుసు దుకాణాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై సీఐ హజరత్తయ్య మాట్లాడుతూ నిఘా పెంచి అక్రమార్కులపై చర్యలు చేపడతామని తెలిపారు. మద్యం తాగి గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మూలగుంటపాడులో బహిరంగంగా మద్యం తాగుతున్న యువకులు

అత్యవసరమైతే నరకయాతనే..!

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

మండల కేంద్రం సింగరాయకొండలో బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేక ప్రజాప్రతినిధులు, సామాన్య ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన మంత్రి స్వామి.. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించి.. ఆరు నెలలైనా అడుగు ముందుకు పడలేదు.

చెప్పుకోలేని వ్యథ..

సింగరాయకొండలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది కలిపి సుమారు 60 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ, విద్య, విద్యుత్తు, డ్వామా, డీఆర్‌డీఏ, రిజిస్ట్రార్ కార్యాలయాలు ఒకేచోట ఉన్నాయి. ఎంపీడీవో కార్యాలయంలో తప్ప.. ఎక్కడా కూడా సిబ్బందికి సరిపడా మరుగుదొడ్లు లేవు. పురుషులు ఎలాగోలా సర్దుకుంటున్నా.. మహిళా సిబ్బంది మాత్రం ఎటు వెళ్లాలో తెలియక, ఎవరికీ చెప్పుకోలేక బాధను అనుభవిస్తున్నారు. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం సమీప ప్రాంతాల ప్రజలు నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామంలో ఎక్కడా సామూహిక మరుగుదొడ్లు లేకపోవడంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు నరకయాతన అనుభవిస్తున్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలంటూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరాహార దీక్ష

రైళ్లు, బస్సులు ఎక్కేందుకు..

కందుకూరు, కనిగిరి, కొండపి, తదితర ప్రాంతాల నుంచి విజయవాడ, తిరుపతి, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు రైళ్లు, బస్సుల కోసం నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు సింగరాయకొండ తరలివస్తారు. మరుగుదొడ్లు నిర్మించాలంటూ నాలుగేళ్ల క్రితం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరాహార దీక్ష సైతం చేపట్టి.. అప్పటి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ రమేష్‌బాబు మాట్లాడుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

మిట్టపాలెం నారాయణస్వామికి ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు గోపూజ చేశారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామివారికి పొంగళ్లు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. మూలవిరాట్‌ను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పల్లకీసేవ, రథోత్సవం నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో ఎస్.నరసింహబాబు, వ్యవస్థాపక ధర్మకర్త కె.చిన్నఆదినారాయణ, సిబ్బంది పర్యవేక్షించారు.

ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

(c) eenadu

అద్దంకి

• అద్దంకి • దర్శి

బాధితులకు మంత్రి గొట్టిపాటి పరామర్శ

జె.పంగులూరు, న్యూస్‌టుడే: తెలుగుదేశం కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటామని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో జాగర్లమూడి వారిపాలెం పీఏసీఎస్ అధ్యక్షులు అల్లంనేని బ్రహ్మానందస్వామి, మాజీ అధ్యక్షులు ఇంటూరి పూర్ణచంద్రరావులు ఇటీవల శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. ఈ మేరకు ఆదివారం వారిని మంత్రి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు దాసరి నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కుక్కపల్లి ఏడుకొండలు, గరిమిడి జగన్మోహనరావు, కె.వి.సుబ్బారావు, చింతల సహదేవుడు, రావూరి రమేష్, కుక్కపల్లి ఆంజనేయులు, నార్నె సుబ్బారావు, వలపర్ల సుబ్బారావు, దాసరి హనుమంతరావు పాల్గొన్నారు.

బ్రహ్మానందస్వామిని పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

4న కనకదుర్గమ్మ తిరునాళ్ల

దొనకొండ, న్యూస్‌టుడే: దొనకొండలోని కనకదుర్గమ్మ తిరునాళ్ల ఈ నెల 4న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. ఉదయం కుంకుమ, ప్రత్యేక పూజలు జరుగుతాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహిస్తామన్నారు.

ప్రజాసేవకులకు అండగా ఉందాం

దర్శి, న్యూస్‌టుడే: గెలుపు.. ఓటములతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ సేవ చేస్తున్న గొట్టిపాటి లక్ష్మికి ప్రజలు అండగా ఉండాలని ఒంగోలు పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. గొట్టిపాటి లక్ష్మి ఆధ్వర్యంలో డా.కడియాల వెంకటేశ్వరరావు, డా.లలిత్‌సాగర్‌ల సహకారంతో దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. డా.కడియాల వెంకటేశ్వరరావుతో పాటు 15 మంది ప్రముఖ వైద్యులు పాల్గొని పలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. బాధితులకు ప్రభుత్వం నుంచి వైద్యసాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా లక్ష్మి తెలిపారు. రోగులకు, ప్రజలకు భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాపారావు, మున్సిపల్ ఛైర్మన్ పిచ్చయ్య, నియోజకవర్గ పరిధిలోని కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న తెదేపా ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉగ్ర నరసింహారెడ్డి, పక్కన గొట్టిపాటి లక్ష్మి, నాయకులు

వసతులతో మురిసిన శింగరకొండ

● వాయువేగంతో భక్తులకు విస్తృత ఏర్పాట్లు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే

శింగరకొండ వార్షిక తిరునాళ్లలో సోమవారం కీలకఘట్టం కావడంతో యంత్రాంగం వాయువేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అదనపు పరివర్తకాల ఏర్పాటుతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టినట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. ప్రస్తుతం క్షేత్రం వద్ద 63, 100, 160 కేవీ సామర్థ్యం గల మూడు పరివర్తకాలు ఉన్నాయి. మరో రెండు 100 కేవీ పరివర్తకాలను నెలకొల్పినట్లు వివరించారు. దీనివల్ల విద్యుత్తు లో ఓల్టేజీ, అంతరాయం వంటి సమస్యలు తలెత్తవన్నారు.

❖ భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని శింగరకొండ వద్ద తాత్కాలిక బస్‌స్టాండ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. నరసరావుపేట/వినుకొండ వైపు నుంచి వచ్చే బస్సులు చక్రాయపాలెం మలుపు వద్ద, ఒంగోలు, పొదిలి డిపోల నుంచి వచ్చే బస్సులు తాత్కాలిక బస్టాండ్ వద్ద, చీరాల, చిలకలూరిపేట నుంచి వచ్చే బస్సులు శింగరకొండపాలెం వద్ద తాత్కాలిక బస్‌స్టాపుల్లోనే ప్రయాణికులను ఎక్కించుకుంటాయని డిపో మేనేజరు బెల్లం రామ్మోహనరావు తెలిపారు.

విశేష ద్రవ్యాలతో...

శింగరకొండ వార్షిక తిరునాళ్లలో భాగంగా రెండోరోజు విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మహన్యాసపూర్వక ఏకాదశ మన్యసూక్త వారాభిషేకం నిర్వహించారు. వేదపండితులు వంగల హరిశంకరావధాని నేతృత్వంలో ప్రధానార్చకులు కోట లక్ష్మీనారాయణ, ఉప ప్రధానార్చకులు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు, అర్చకులు అన్నవరపు సత్యనారాయణ, కోట గిరిధర్‌కిషోర్, వేలమూరి శ్రీరామ్మూర్తి, చదలవాడ చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. అనంతరం స్వామి వారిని అలంకరణ గావించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కొండపై లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భాగవతుల నరసింహాచార్యులు, కుమారుడు కొండమాచార్యులు నేతృత్వం వహించారు. రెండు దేవాలయాల పాలక మండళ్ల ఛైర్మన్లు చుండూరి మురళీసుధాకరరావు, గుంజి శ్రీనివాసరావుతోపాటు ట్రస్టీలు పాల్గొన్నారు.



ప్రసన్నాంజనేయునికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు

సంప్రదాయ నృత్య ప్రదర్శనలో యువతులు

(c) eenadu

ఒంగోలు

నవోదయ విద్యాలయంలో ఆర్వోప్లాంటు ఏర్పాటు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని నవోదయ విద్యాలయంలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. విద్యార్థులకు రక్షిత నీరు అందించడానికి ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్‌ను ఆదివారం ప్రిన్సిపల్ సి. శివరామ్ ప్రారంభించారు. 1994-2001 బ్యాచ్ పూర్వవిద్యార్థులు తమ వంతు సహకారం అందించడం వల్ల స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు డాక్టర్ రవీంద్రరెడ్డి, గౌతంరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, రవీంద్రనాయక్, డాక్టర్ లక్ష్మీ రేఖ, షామిలి, నాగార్జున, రత్నాకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సమయం.. ఏకాగ్రత ముఖ్యం

పరీక్షలకు సిద్ధమవుతున్న మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులు

న్యూస్‌టుడే, మద్దిపాడు, నాగులుప్పలపాడు

ఇప్పటికే ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు రాస్తున్న, రాయబోతున్న విద్యార్థులు నిత్యం పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఈ క్రమంలో పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే చదువుతో పాటు ఆరోగ్యం, నిద్ర, మంచి పౌష్టికాహారం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పదోతరగతి విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో ప్రణాళికాయుతంగా ఏకాగ్రతతో చదివితే పరీక్షలు నిర్భయంగా రాయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇదే సమయంలో విద్యార్థుల ఆరోగ్యం దెబ్బ తినకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

వీటిని పాటిస్తే చాలు...

పరీక్షల సమయంలో నిరంతరం చదవకుండా మధ్యలో కొంత సమయం విరామం ఇవ్వాలి. దీనివల్ల చదివిన అంశాలు గుర్తుండడంతో పాటు మంచి మార్కులు సాధించవచ్చు. ఏకాగ్రత దెబ్బ తినకుండా పాఠ్యాంశాలపై దృష్టిసారించి ప్రతి అంశాన్ని ఆకలింపు చేసుకుని చదివితే జ్ఞాపకం ఉంటుంది. పునశ్చరణ ద్వారా మరింత పట్టు సాధించవచ్చు. పరీక్షల సమయంలో ఆందోళన చెందకుండా చక్కగా రాయవచ్చు. చిరుతిళ్లు, చరవాణి, టీవీలకు దూరంగా ఉండాలి.

ఎస్ఎన్.పాడు నియోజకవర్గంలో పదోతరగతి విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
మద్దిపాడు	11	438
నాగులుప్పలపాడు	20	624
చీమకుర్తి	24	1,037
సంతనూతలపాడు	20	868

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం ...

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ రోజుకు ఏడు గంటలు నిద్ర ఉండేలా చూసుకోవాలి. త్వరగా జీర్ణమయ్యే పోషక విలువలు కలిగిన సమతుల ఆహారం, పండ్ల రసాలు తీసుకోవడం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుంది. జంక్ ఫుడ్, శీతలపానీయాలకు దూరంగా ఉండాలి. రోజూ కొద్దిసేపైనా యోగా చేసి ఏకాగ్రతను పెంచుకోవాలి. పాలు, పండ్లు, కాచి చల్లార్చిన నీరు తీసుకోవాలి. ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలి. – శ్రవణ్‌కుమార్, వైద్యుడు, మద్దిపాడు పీహెచ్‌సీ

అమృతమూర్తికి అశ్రునివాళి

కీ॥శే॥ నాగండ్ల లక్ష్మీకాంతం గారు (రిటైర్డ్ తహసీల్దారు) గారి ధర్మపత్ని కీ॥శే॥ నాగండ్ల వరలక్ష్మమ్మ గారు తేది: 21-2-2026న లింగైక్యము చెందినారు. వారి పవిత్రాత్మకు భగవంతుని కటాక్షము కలగాలని కోరుకుంటూ..

కీ॥శే॥ నాగండ్ల వరలక్ష్మమ్మ గారు
W/o కీ॥శే॥ నాగండ్ల లక్ష్మీకాంతం గారు
(రిటైర్డ్ తహసీల్దారు)

కుమారులు: నాగండ్ల బసివయ్య, నాగండ్ల సుబ్రహ్మణ్యం

కూతుర్లు - అల్లుళ్ళు, కుమారులు - కోడళ్ళు
మనువళ్ళు- మనువరాళ్ళు,
ముదిమనవళ్ళు- ముదిమనుమరాళ్ళు

పెద్దకర్మ: తేది: 3.3.2026న విశ్వబ్రాహ్మణ ఆరామక్షేత్రము అంజయ్యరోడ్డు, ఒంగోలు నందు జరుగును.
కావున తెలియజేయడమైనది

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

వేడుక నిర్వహిస్తున్న వేద పండితులు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సంతనూతలపాడులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు నల్లూరి జగదీష్ కుమారాచార్యులు, వారి బృందం ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. ఉభయ దాతలుగా అనుమాలశెట్టి చెంచురత్నం, కమలాకుమారి కుటుంబీకులు వ్యవహరించారు. సుమారు 100 మందికి పైగా దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకున్నారు. వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. రాత్రి గరుడ వాహన సేవతో గ్రామోత్సవం నిర్వహించారు.

15 నుంచి రామోత్సవాలు

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని విశ్వహిందూ పరిషత్తు కార్యాలయంలో ఆదివారం ప్రాంత ప్రముఖులు, ప్రకాశం జిల్లా ప్రముఖుల సమావేశం నిర్వహించారు. దేవాలయాల స్వయం ప్రతిపత్తి ముసాయిదా బిల్లుపై అవగాహన సదస్సును ఈ నెల 29న నిర్వహించాలని నిర్ణయించారు. 15వ తేదీ నుంచి ఏప్రిల్ 2 వరకు రామోత్సవాలు, దేవాలయాల్లో సత్సంగాలు నిర్వహించాలని పరిషత్ సభ్యులు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రాంత సహ కార్యదర్శి ప్రాణేష్‌జీ, సోమ సుబ్బారావు, శివ శంకర్, బ్రహ్మానందరెడ్డి, ఈమని బలరాము, తూముగుంట మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

జననం: 31-01-1957
మరణం: 20-02-2026

కీ॥శే॥ నాగిశెట్టి మోహన్ దాస్ గారు
ప్రముఖ సీనియర్ న్యాయవాది, ఒంగోలు

నిరాడంబరానికి నిలువెత్తు రూపం మీరు.. సహృదయానికి అసలైన రూపం మీరు...
మీ ధృఢ సంకల్పం, కార్యదక్షత మాకు ఆదర్శనీయం... మీ ఆలోచనా దృక్పథం మాకు స్ఫూర్తి దాయకం..
మీరు చూపిన ప్రేమ, ఆప్యాయతానురాగాలు మా హృదయాలలో సదా పదిలం..
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుటుంబ సభ్యులు

కాసాని శ్రీనివాస్ - లక్ష్మి
విష్ణు - నవ్య కౌషిక్ - ప్రాంజల్
కాసాని సోమశేఖర్ - శ్రీదేవి
తన్వి శ్రీ

అద్దంకి విజయలక్ష్మి
శ్రీనివాస్ - సంధ్య
దర్శన్, నితిన్
రమేష్ - హేమలత
షణ్ముఖ సాయి, రుద్రా సాయి

కేసన ఝాన్సీ రాణి
రమాదేవి శార్వాణి, శరణ్య
మనోహర్ - సుకన్య
అహన్, అనూహ్య
ప్రవీణ్ - శ్రీ విద్య ఇషాన్వి

కేసన సుబ్బారాయుడు - ఇందిర
రాఘవేంద్ర సాయి - శివ లీల
అర్హ
వరుణ్ సాయి - సుజన
ధన్విత్

పెద్దకర్మ: తేది: 02-03-2026, సోమవారం, బి 12, దేవుడు చెరువు, శర్మ కాలేజ్ రోడ్డు, ఒంగోలు లో స్వగృహము నందు జరుగును. కావున తెలియపరచడమైనది.

KALYANI ADS

శ్రద్ధాంజలి

కనులలో కరుణత్వం.. చేతులలో దాతృత్వం... ఆచరణలో అభ్యుదయం....
కనబరిచే ఓ మానవతా మూర్తి !
నిండు మనసుతో ఎల్లవేళలా అందరి శ్రేయస్సును కాంక్షించే..
మీరు భౌతికంగా మామధ్య లేకున్నా, మీ స్ఫూర్తి.. మీ మాట...
జీవితాంతం మా ఎదలో మారుమ్రోగుతూనే ఉంటాయి.
మీ ఆత్మకు ఆ దైవం శాంతినివ్వాలని కోరుకుంటూ...

కీ॥శే॥ నాగిశెట్టి మోహన్ దాస్ గారు
ప్రముఖ సీనియర్ న్యాయవాది, ఒంగోలు
జననం: 31-01-1957 - మరణం: 20-02-2026

నాగిశెట్టి కృష్ణ కుమారి
నాగిశెట్టి రవి ప్రసాద్ - శ్రీ కాంత
న్యాయవాది
నాగిశెట్టి రామకృష్ణ - జెస్సీ
నాగిశెట్టి ఉదయశంకర్ - సుధారాణి
నాగిశెట్టి రంగ తేజ -అనూష
నాగిశెట్టి దినకర్ ప్రసాద్ - ఈశ్వర సహజ
శీరం చందన - బాల జగన్నాథ్
కొత్రా హరనాథ్ బాబు
కొత్రా రవిబాబు - చంద్రిక
నున్నా కాలేషా - శాంతి
పసుపులేటి కృష్ణారావు - శ్రీవాణి
విన్నకోట రవీంద్ర బాబు
విన్నకోటపవన్ కుమార్ - సునీత
చాకిరి శారద
చాకిరి మారుతి - శాంతి

తాళ్ళూరు నరసింహారావు
తాళ్ళూరు కళ్యాణ్ చక్రవర్తి - జమునా రాణి
తాళ్ళూరు ఫణి చక్రవర్తి - సుధారాణి
కొల్లా శ్రీ ప్రశాంతి
మద్దెల హరిప్రసాద్ - శిరీషా రాణి
పలనాటి సురేష్ - శశికళా మైథిలి
శయన హిమశైల కుమారి - ప్రసాద్
అడుసుమల్లి రామయ్య - వరలక్ష్మి
కోటిపల్లి పవన్ కుమార్ - రాధ
కోటిపల్లి రమణకుమార్ - జ్యోతి
కోటిపల్లి సురేష్ బాబు - శోభారాణి
పసుపులేటి లక్ష్మి - సంజీవరావు
కందుల మాధవీ లత - గోవింద రావు

మరియు ఇతర
కుటుంబ సభ్యులు

KALYANI ADS

(c) eenadu

గ్రంథాలయాల్లో అన్ని పుస్తకాలుండేలా చర్యలు

పుస్తకాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లో పాఠకులకు అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండేలా చొరవ తీసుకుంటామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. క్రెడాయ్ ఒంగోలు బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయానికి ఆదివారం పుస్తకాలు వితరణ చేశారు. ఇందులో 87 పుస్తకాలు (పోటీ పరీక్షల నిమిత్తం) అందించిన ముప్పా శివకృష్ణను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంగారాయుడు చెరువు కట్టపై వాకర్స్ ఎంతో మంది వస్తుంటారని అక్కడ ముప్పవరపు వీరయ్య చౌదరి పేరుతో మినీ గ్రంథాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ముప్పవరపు సుచిత్ర మాట్లాడుతూ.. గ్రంథాలయానికి పుస్తకాలు అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో దామచర్ల నాగసత్యలత, ఆసోసియేషన్ సెక్రటరీ రాజేంద్ర, ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, గ్రంథాలయ సంస్థ సెక్రటరీ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల్లో నాణ్యత తప్పనిసరి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని గాంధీపార్కు వద్ద రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదివారం పరిశీలించారు. కమిషనర్, ఇతర అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. రహదారి విస్తరణకు సహకరించాలని కోరారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండాలని, అవినీతి, నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలన్నారు. రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనులు అనుకున్న సమయానికన్నా ముందే పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ముప్పవరపు సుచిత్ర, ఏఎంసీ ఛైర్మన్ రాచగర్ల వెంకట్రావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఎంఈ ఏసయ్య, ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెంచయ్య గుప్తా, తెదేపా నగర అధ్యక్షుడు బండారు మదన్, కార్పొరేటర్ శాండిల్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మరమ్మతుల దృష్ట్యా ఒంగోలు నగర పరిధిలోని పీర్లమాన్యం, అరుణోదయ కాలనీ, టీచర్స్ కాలనీ, సమతానగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్తుశాఖ డీఈ పాండు రంగారావు తెలిపారు.

దేవాదాయ ధర్మాదాయశాఖ

శ్రీ వల్లూరమ్మ దేవస్థానము - వల్లూరు

టంగుటూరు మండలం - ప్రకాశం జిల్లా

ఈ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన

ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, వల్లూరు గ్రామము నందు వేంచేసియున్న శ్రీ వల్లూరమ్మవారి దేవస్థానమునకు సంబంధించిన ఈ క్రింది తెలియపరచిన వివిధ ఐటములకు తేది 01.04.2026 నుండి 31.03.2027 వరకు నడుపుకొను హక్కులను పొందుటకుగాను ఈ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డు టెండరు మరియు బహిరంగ వేలం ద్వారా తేది 13.03.2026 ఉదయం గం॥ 11.00లకు కార్యనిర్వహణాధికారి కార్యాలయము, శ్రీ వల్లూరమ్మవారి దేవస్థానము, వల్లూరులో దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డు టెండరు మరియు బహిరంగ వేలం జరుపబడును.

వ.నెం.	పాటకు పెట్టబడు ఐటము వివరము	ధరావత్తు
1.	దేవాలయమునకు వచ్చు భక్తుల పాదరక్షలను భద్రపరిచెడి హక్కు మరియు గోరింటాకు ముద్రలు వేయు హక్కు, (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	25,000.00
2.	పార్కింగ్ ఫీజు, టాయిలెట్ ఫీజు వసూలు హక్కు (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	25,000.00
3.	గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చుకొను హక్కు (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	10,000.00
4.	షాపు నెం. 1, 2, 3, 4ల యందు (ఒకే షాపుగా) పూజాద్రవ్యములు అమ్ముకొను హక్కు. (ఈ-ప్రొక్యూర్‌మెంట్ సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	1,00,000.00
5.	షాపు నెం. 9లో మండపాలలంకరణ మరియు ఎలక్ట్రికల్ డెకరేషన్ ఏర్పాటు చేయు హక్కు (సీల్డు టెండర్ మరియు బహిరంగ వేలం)	25,000.00

టెండర్ షెడ్యూలు జారీ చేయు తేదీలు: ది.02.03.2026 నుండి 12.03.2026 సా.5.00ల వరకు టెండర్ షెడ్యూలు దాఖలు చేయు ఆఖరి తేది 13.03.2026 ఉ. 9.00 వరకు, టెండర్ షెడ్యూలు ఖరీదు రూ. 500/- ఈ-ప్రొక్యూర్‌మెంట్ బిడ్‌డౌన్‌లోడ్ మొదలు తేది. 02.03.2026 ఉ. 10.00లకు బిడ్ స్వీకరించు చివరి తేది 12.03.2026 సా. 5.00ల వరకు బిడ్ తెరుచు తేది 13.03.2026 ఉ.11.00లకు ఈ-టెండరు వివరములు www.eprocurement.gov.in లో AP Endowments Department Marketing నందు చూడగలరు. మిగిలిన షరతులు దేవస్థానము కార్యాలయము నందు తెలుసుకొనవచ్చును.

వల్లూరు 01.03.2026 — శ్రీ బొజ్జా శ్రీనివాసులు, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు — సంతకం/- బి.రమేష్, కార్యనిర్వహణాధికారి, సెల్ నెం. 7013429148

అతివకు శిక్షణ... ఉపాధికి ఆలంబన!

కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ మహిళలు

న్యూస్‌టుడే, సంతనూతలపాడు

నిరుద్యోగ మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పనే లక్ష్యంగా అక్కడ శిక్షణ అందిస్తున్నారు. సంతనూతలపాడు మండలంలోని ఎండ్లూరుడొంకలో గల ఎన్టీఆర్ మహిళా ప్రాంగణంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్కిల్ హబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కంప్యూటర్ కోర్సులు, బ్యూటీషియన్, కుట్లుపై తర్ఫీదు అందిస్తున్నారు. దీన్ని ఎంతో మంది మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రస్తుతం 9వ బ్యాచ్ కంప్యూటర్ శిక్షణ మొదలైంది. ఇక్కడికి ఎంతో మంది మహిళలు వచ్చి ఉత్సాహంగా వాటిని నేర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా కొందరు తమ అభిప్రాయాలను పంచుకున్నారిలా..

ఖాళీ సమయం సద్వినియోగం ..

ప్రస్తుతం ఏ ఉద్యోగం కావాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరం. బయట నేర్చుకోవాలంటే ఎంతో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎండ్లూరు డొంకలోని మహిళా ప్రాంగణంలో ఉచితంగా ఉద్యోగాలకు కావాల్సిన అన్ని అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. నేను బీఈడీ పూర్తిచేశాను. చదువు పూర్తవ్వగానే పెళ్లి, పిల్లలు ఇలా సమయం గడిచిపోయింది. ప్రస్తుతం పిల్లలు పాఠశాలకు వెళ్లడంతో ఏదో ఒకటి చేయాలని నిర్ణయించుకొని ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందుతున్నా. పూర్తయిన వెంటనే ఉద్యోగ అవకాశాలు సైతం కల్పిస్తామని చెప్పారు.

-చాగంటి లక్ష్మి, ఒంగోలు

❖ కుటుంబానికి అండగా నిలవాలని..

నేను ఇంటర్ వరకు చదువుకున్నా. ప్రస్తుతం డ్వాక్రా గ్రూప్‌లో రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తున్నా. కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడంతో పనిచేసే ప్రదేశాల్లోను, బయట కూడా సైతం ఇబ్బందిలేకున్నాను. నా భర్త గ్రానైట్ కంపెనీలో పనిచేస్తుంటారు. తాను సంపాదించేది కుటుంబానికి చాలడం లేదు. కుటుంబానికి నా వంతుగా తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో కంప్యూటర్ నేర్చుకోవాలని నిర్ణయించుకుని ఇక్కడ ఉచితంగా శిక్షణ పొందుతున్నా. -సూరం చంద్రకళ, పేర్నమిట్ట

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

స్ప్రేయర్‌తో చేపట్టిన దోమల నివారణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న కమిషనర్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం స్థానిక 27వ డివిజన్‌లో పి.శ్రీనివాసరావు అనే దాత సమకూర్చిన స్ప్రేయర్‌ను సిబ్బందికి అందజేసి చేపట్టిన పనులను పరిశీలించారు. అన్ని డివిజన్లలో దోమల నివారణకు కొత్తగా ఫాగింగ్ మిషన్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. కాలువల శుభ్రత, స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయడంతోపాటు, అర్బన్ హెల్త్ సెంటర్లలో నమోదవుతున్న డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాల వివరాలు సేకరించి ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. పేదల నివాసమయున్న ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వైష్ణవి, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య పాల్గొన్నారు.

భాగవత పఠనం.. భవితకు మార్గం

ప్రసంగిస్తున్న రంగనాయకి

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వ్యాస మహాముని రచించిన శ్రీమద్భాగవతాన్ని పోతనామాత్యుడు తెలుగులో మధురంగా రచించారని గుంటూరుకు చెందిన శారదానికేతన్ సంస్కృత కళాశాల విశ్రాంత ప్రధాన ఆచార్యురాలు డాక్టర్ కోగంటి రంగనాయకి పేర్కొన్నారు. దామరాజు శకుంతల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి లాయర్‌పేట సాయిబాబా మందిరంలో నిర్వహించిన ధార్మిక కార్యక్రమంలో ఆమె ప్రధాన ప్రసంగం చేశారు. భాగవతంలోని గోకర్ణోపాఖ్యానం గురించి వివరించారు. పితృదేవతల ముక్తి కోసం మన ఆత్మశుద్ధి కోసం చేయాల్సిన అనేక అంశాలను ఈ పట్టం ద్వారా తెలిపారు. భాగవతంలోని వివిధ అంశాలను ఉటంకిస్తూ సాగిన ప్రసంగం శ్రోతలను మైమరపించింది. చిన్ననాటి నుంచే తల్లిదండ్రులు పిల్లలకు భాగవత పద్యాలని, శ్లోకాలను నేర్పించాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు రంగనాయకితో పాటు, లలిత ఉపన్యాసకురాలు శనగవరపు లలితాంబ, నృత్య శిక్షకురాలు ఎన్.వి. శివకామేశ్వరిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాబా మందిర ప్రతినిధులు, వివిధ ధార్మిక సాహిత్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాహిత్య రంగంలో సేవలకు పురస్కారం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: విజయవాడ నగరంలోని బాలోత్సవ భవన్‌లో విశ్వసాహితీ కూడలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కొల్లి రమావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహిత్య రంగంలో కృషి చేస్తున్న నరసం ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి పరాంకుశం (ఒంగోలు)కు శ్రీశక్తి ఉమెన్ పవర్ ఎక్సలెన్స్ అవార్డు-2026తో సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ.. నేటి మహిళలు సంఘటిత శక్తిగా పురోగతి సాధిస్తున్నారని తెలియజేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ తదితరులు కృష్ణవేణికి అభినందనలు తెలియజేశారు.

జీవన శైలిలో మార్పులతో ఆరోగ్యానికి ముప్పు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లలో లోపం, శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల చక్కెర, పక్షవాతం వంటి వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని ప్రముఖ నరాల వైద్య నిపుణుడు జి.శ్రీమన్నారాయణ తెలిపారు. డాక్టర్ రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సంతపేటలోని తితిదే కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 1,710 మంది రోగులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. రోజూ కనీసం అరగంట నడక లేదా వ్యాయామం చేయడం అలవాటుగా మార్చుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చల్లా అమర్‌రాజ్, బి.హరిబాబు, జాన్ రిచర్డ్స్, ఎం.శరత్, శ్రీధర్‌బాబు, సమీర్‌శర్మ, సందీప్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయుడి దర్శనానికి 4 క్యూలైన్లు

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ తిరునాళ్లను ప్లాస్టిక్ రహితంగా జరగాలని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు అన్నారు. ఆదివారం తన ఛాంబర్లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ చలువ పందిళ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకుంటే వాకీటాకీలు తప్పక వినియోగించుకోవాలన్నారు. విధుల సమన్వయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఉద్యోగులంతా ఏకరూప దుస్తులు ధరించాలని, గుర్తింపు కార్డులు ఉంచుకోవాలన్నారు. కార్యాలయం, అన్నదాన మండపం, ఉచిత ప్రసాదాలు తదితర కీలక ప్రదేశాల్లో చురుగ్గా పనిచేసే సిబ్బంది ఉండాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలన్నారు. ప్రసన్నాంజనేయస్వామి దర్శనానికి నాలుగు క్యూలు ఏర్పాటుచేసినట్లు సహాయ కమిషనర్ తెలిపారు. రూ.50, రూ.100, వీఐపీ, ఉచిత దర్శనానికి క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తిరుమల మాదిరిగా లడ్డూ ప్రసాదాలు తయారు చేయించామని, వాటిని భక్తులకు అందుబాటులో ఉంచాలన్నారు. వివిధ స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు మంచినీరు, పులిహోర, ప్రసాదాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఆలయంలోకి వచ్చిన భక్తులు ఉత్తర ద్వారం ద్వారా బయటకు రావాల్సి ఉంటుందన్నారు.

❖ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద భక్తులకు ఉచిత అన్నదానం చేసేందుకు దాత కొల్లి సీతారామయ్య ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి మద్దినేని శ్రీనివాస్ తెలిపారు. మూడు వేల రవ్వలడ్డూలు విక్రయిస్తున్నామని, ఆంజనేయ డెయిరీ వారు మజ్జిగ ప్యాకెట్లు, దక్షప్రజాపతిక్షేత్రానికి చెందిన సిబ్బంది మంచినీటి సరఫరా, వెంకటరమణ మిరాయి దుకాణం తరఫున పులిహోర, పొంగలి ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు.

ఇరుకు రోడ్డులో ఇక్కట్లు!

ఒంగోలు గాంధీ రోడ్డులోని బంగారం దుకాణాలున్న వీధిలో పరిస్థితి ఇది. అసలే ఇరుకు రోడ్డులుతో ద్విచక్ర వాహనాలు అడ్డదిడ్డంగా నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇరువైపులా వాహనాలు నిలిపి ఉండటం, కొన్ని రోడ్డుకు మధ్యలోనే ఆపుతుండటంతో ఇతర వాహనాల రాకపోకల సమయంలో ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాలను రోడ్డుపై నిలుపకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

మద్యం దుకాణంలో చోరీ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఉప్పుగుండూరులోని మద్దిరాల ముప్పాళ్లకు వెళ్లే రహదారిలో ఉన్న సీబీ మద్యం దుకాణంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దుకాణానికి ఉన్న షట్టర్ తాళాలు పగలగొట్టి అందులోని రూ.1.20 లక్షల నగదు అపహరించారు. సమాచారం అందుకొన్న ఎస్సై మహేంద్రనాయక్ ఆదివారం ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దుకాణ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్తు ఏఈల నియామకం

ఒంగోలు గ్రామీణం: జిల్లాలోని ఆరు మండలాల్లో ఖాళీగా ఉన్న విద్యుత్తు శాఖ ఏఈ పోస్టులను భర్తీ చేస్తూ సీఎండీ పుల్లారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల వారీగా ప్రసాద్ (కొత్తపట్నం), గోపి (సంతనూతలపాడు), రామకృష్ణ (టంగుటూరు), నాగేశ్వరరావు (కొండపి), రఘురామయ్య (గుడ్లూరు), ఆంజనేయులు (జె.పంగులూరు)ను నియమించారు. వీరంతా ప్రస్తుత సబ్ ఇంజినీర్లుగా పనిచేస్తుండగా, సీనియారిటీ ప్రాతిపదికన ఉద్యోగోన్నతిపై రెగ్యులర్ ఏఈలుగా నియమితులయ్యారు. అందులో రామకృష్ణ, ఆంజనేయులు ప్రస్తుతం ఆయా మండలాల్లో పనిచేస్తుండగా, వారికి అక్కడే ఏఈగా పోస్టింగ్ ఇచ్చారు.

కోడిపందేలపై డ్రోన్ కెమెరాలతో నిఘా

ఒంగోలు నేరవిభాగం: ఒంగోలు మండలం గుండాయిపాలెం సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. అక్కడ నిత్యం జూదం నిర్వహిస్తున్నారనే సమాచారంతో డ్రోన్ సాయంతో నిర్ధారించుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. సీఐ యు.సుధాకర్, ఎస్సైలు శివరామయ్య, చెంచయ్య, ఏఎస్సై మహబూబ్ బాషా ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడ తనిఖీలు చేపట్టారు. అక్కడ కోడిపందేలు నిర్వహిస్తున్న 15 మంది వ్యక్తులతో పాటు రెండు కోళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.

డ్రమ్ములు పక్కనపెట్టి.. ప్రమాదాలను స్వాగతించి!

నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిపై అధికారుల నిర్లక్ష్యం ప్రమాదాలను స్వాగతించేలా ఉంది. పేర్నమిట్టలోని పోలేరమ్మ ఆలయం వద్ద ప్రమాదకర మలుపు ఉంది. ఇక్కడ రెండు వైపులా వాహనాలు దూసుకొస్తుంటాయి. వేగాన్ని నియంత్రించేందుకు ప్రమాద సూచికలుగా గతంలో రెండు వైపులా డ్రమ్ములు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ డ్రమ్ములను పక్కకు తొలగించారు. మురుగునీరు రోడ్డుపైకి వచ్చే ప్రదేశం వద్ద మాత్రం ఒక పీపాను ఏర్పాటు చేశారు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతూ ఎంతో మంది మృత్యువాత పడ్డారు. ఇటీవల ఒక అంగన్‌వాడీ ఆయా ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఆమె మృతిచెందారు. అందువల్ల ఇక్కడ డ్రమ్ములు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పేర్నమిట్ట(సంతనూతలపాడు)

శ్రీగిరిలో ఆధ్యాత్మిక సందడి

జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో బాలవిహార్ విద్యార్థులు

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: చిన్మయ హనుమాన్ చాలీసా పారాయణం, గోవింద నామాల పఠనంతో ఆదివారం శ్రీగిరి మార్మోగింది. ఆధ్యాత్మిక శిక్షణ సంస్థ చిన్మయ మిషన్ ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న అమృత మహోత్సవంలో భాగంగా శ్రీగిరి దేవస్థానం గోష్ఠీ భవన్‌లో హనుమాన్ చాలీసా పారాయణంతో పాటు ఆంజనేయస్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బాలవిహార్ విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బొల్లాపల్లి పణిదీప్తి భక్తి సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీగిరి ఆలయ నిర్వాహకులు, చిన్మయ మిషన్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజాకవి పిన్నిక మృతి

చీమకుర్తి, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల సమస్యలపై నిరంతరం తన గళాన్ని వినిపిస్తూ ప్రజా కవిగా వాసికెక్కిన చీమకుర్తికి చెందిన పిన్నిక శ్రీనివాస్ (60) ఆదివారం కన్నుమూశారు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఏఎస్ఎఫ్ నాయకుడిగా చీమకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తన ప్రస్థానం ప్రారంభించిన ఆయన ఆ తర్వాత వామపక్ష ఉద్యమాల్లో కీలకంగా పనిచేశారు. గతంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేసిన శ్రీనివాసరావు కొన్ని సంవత్సరాలుగా చీమకుర్తిలోనే ఉంటూ సామాన్య వర్గాల సమస్యలపై కవితల రూపంలో తన గళం వినిపిస్తూ వస్తున్నారు. శ్రీనివాసరావు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పలువురు పేర్కొన్నారు. మండూరి రంగారావు, తెదేపా నాయకులు కందిమళ్ల గంగాధరరావు, గొల్లపూడిసుబ్బారావు, డాక్టర్ బి.జవహర్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు శ్రీనివాస్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో పిన్నిక అంతిమ యాత్ర సాగింది.

అంగన్‌వాడీ సిబ్బంది అభ్యున్నతికి కృషి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ సిబ్బంది అభ్యున్నతి, కేంద్రాల బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీ సిబ్బందికి జీతాలు పెంచినట్లు గుర్తు చేశారు. ఎన్నికల హామీలను సైతం ప్రభుత్వం నెరవేరుస్తుందని, కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

బాణసంచా తయారీ కేంద్రాల తనిఖీ

మద్దిపాడులోని కేంద్రంలో బాణసంచా పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని రెండు బాణసంచా తయారీ కేంద్రాలను ఆదివారం ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తనిఖీ చేశారు. శనివారం కాకినాడ జిల్లా వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనలో 20 మంది సజీవ దహనమై పెను విషాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మద్దిపాడులోని దుర్గా నరసింహ ఫైర్ వర్క్స్, సీతారామపురం కోష్ఠాల్‌లోని సాయి ఫైర్ వర్క్స్‌ను డీఎస్పీ తనిఖీ చేశారు. అన్ని రకాల దస్త్రాలను, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. సాయి ఫైర్‌వర్క్స్‌ను గత ఏడాది లైసెన్స్ రెన్యూవల్ చేయనందున ఒంగోలు ఆర్డీవో సీజ్ చేశారు. దుర్గా నరసింహ ఫైర్ వర్క్స్ లైసెన్స్ ఈ నెల 31తో ముగుస్తుండగా రెన్యువల్ కోసం దరఖాస్తు చేసి ఉండటాన్ని గమనించారు. మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య, ఎస్సైలు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం: 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు: 8247324766
కొత్తపట్నం: 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

?: నాగులుప్పలపాడు మండలం నిడమానూరు ఎస్సీ కాలనీ ఎదుట ఉన్న మురుగు కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. మురుగునీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. -చందు, గ్రామస్థుడు

✓: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. -తేళ్ల రవికుమార్, ఎంపీడీవో

?: చీమకుర్తి గాంధీనగర్ మొదటి, రెండో బజారుల్లో వీధి దీపాలు వెలగడం లేదు. -నరేంద్ర, స్థానికుడు

✓: వెంటనే మరమ్మతులు చేయిస్తాం. -వై.రామకృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్

?: మద్దిపాడు మండలం గుండ్లాపల్లిలోని సంపద కేంద్రం పరిసర ప్రాంతాల్లో పందులు బెడద ఎక్కువగా ఉంది. - కొప్పోలు ఆదిలక్ష్మి, స్థానికురాలు

✓: పందుల కాపరులకు తెలియజేసి గ్రామంలోకి అవి రాకుండా చర్యలు తీసుకుంటాం. -మణిదీప్, పంచాయతీ కార్యదర్శి

?: మద్దిపాడు చెరువు గట్టుపై ఉన్న కంపచెట్లలో వీధి సర్పాలు తిరుగుతున్నాయి. అవి పక్కనే ఉన్న రహదారుల్లోకి వచ్చి ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. - బత్తిని శ్రీనివాసరావు, గ్రామస్థుడు

✓: వెంటనే సిబ్బందిని పంపించి చెరువు గట్టుపై కంప చెట్లను తొలగింపజేయిస్తాం. -నూరుల్లా, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, నాగులుప్పలపాడు, చీమకుర్తి, మద్దిపాడు

సమాన హక్కుల సాధనకు ఉద్యమం

ఒంగోలు గ్రామీణం: సమాన హక్కుల సాధన కోసం మహిళలు ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఒంగోలు నగర ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక మోటూరు ఉదయం కాలనీలో ఆదివారం సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు నేటికీ సమాన హక్కులు పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడిచినా మహిళల విషయంలో గుర్తించదగిన మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలు చదువుకోవడానికి మంచి విద్యా వ్యవస్థ, భద్రత లేదన్నారు. ఈ సమస్యల కారణంగానే బాలికలు చదువులో వెనుకబడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె. విజయమ్మ, సీహెచ్.వెంకటేశ్వరమ్మ, సత్యవతి, వసంత పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 150, రిటైల్ లైవ్ - 177, చికెన్ విత్ స్కిన్ - 257, చికెన్ స్కిన్‌లెస్ - 292

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

EDUCATION

DISTANCE EDUCATION

ఆచార్యనాగార్జున యూనివర్శిటీ దూరవిద్యాకేంద్రం నిర్వహిస్తున్న M.Sc, M.A(అన్ని కోర్సులు), MBA, MCA, M.Com, MLiSc కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. MBA, MCA ఎంట్రన్స్‌కు అర్హతా పరీక్ష తేది 15-3-2026న జరుగును. పూర్తి: గీతం డిగ్రీ కాలేజి, ఒంగోలు. సెల్: 9030568558, 9849124970

REAL ESTATE

LAND FOR SALE

వ్యవసాయభూమి అమ్మకమునకు ప్రకాశం జిల్లా దర్శి మం, వెంకటాచలంపల్లె గ్రామంలో సర్వేనం. 33 & 35 నందుగల 16.24 ఎకరాలు (మెట్ట) వ్యవసాయ భూమి అమ్మకమునకు కలదు. సంప్రదించవలసిన ఫోన్ నం: 90000 18931.

JOBS

WANTED Exp. Female Telicallers/Computer Operators in Edu. Consultancy in VIP Rd,Ongole. Sal:15k-20k, Q: Degree ✆ 9052975353.

ప్రముఖ దినపత్రికలో ప్రకటనల సేకరణకు ప్రకాశం జిల్లాలో కనిగిరి, దర్శి, కందుకూరుటౌన్‌లో పనిచేయుటకు అసిస్టెంట్ సేల్స్‌మెన్స్ కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత అర్హత: ఇంటర్ పాస్, డిగ్రీ. జీతం:20,000. TA,DA,ఇన్సెంటీవ్ ఇవ్వబడును. ✆97011 12824.

ప్రముఖ లోన్స్ ఏజెన్సీ నందు లోన్స్ చేయుటకు టెలికాలర్స్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 97014 79569, 80081 00872.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు క్లాస్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 12000 నుండి 14000 వరకు ఇవ్వబడును. (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22సం||రాల నుండి 40 సం||రాలు ఉండవలెను. వివరాలకు సంప్ర. ఫోన్: 9248733320.

షణ్ముఖ స్టేట్ &సెంట్రల్ ప్రాజెక్ట్స్ ఆఫీసు నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్, టెలికాలర్స్, ఫ్రంట్ ఆఫీసు స్టాఫ్ కావలెను. సెల్: 90303 27779.

ఒంగోలు అంజయ్యరోడ్ ప్రముఖ బాయ్స్‌హాస్టల్ నందు పని చేయుటకు వంట మనిషి కావలెను. (అనుభవం గల). Cell: 89774 05389, 86888 64165.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు..

B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే

వివరాలకు..
97011 12824
ఒంగోలు 80087 09902
మార్కాపురం 80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 500
Colour : రూ. 700

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయం లో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మ రియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
ప్రకటనల ప్రత్యేక అనుబంధం
2 మార్చి 2026



శింగరకొండ.. భక్తులకు అండ

(c) eenadu

సెంటు భూమీ లేకున్నా సంపన్నుడే!

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి సెంటు భూమి లేదు. కానీ కోటీశ్వరుడు. భక్తుల కానుకలు, హుండీ, దుకాణాల వేలం ద్వారా వచ్చే ఆదాయంతోనే సిబ్బంది జీతాలు, వార్షిక ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఏటొచ్చీ ఏడాదికి అన్నిరకాలుగా సుమారు రూ.నాలుగు కోట్ల వరకు ఆదాయం సమకూరుతోంది. ప్రతి మంగళ, శని, ఆదివారాల్లో భక్తులు పెద్ద ఎత్తున క్షేత్రానికి వస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అందించే కానుకలే స్వామి వారి ఆస్తి.

వంద రోజులకొకసారి హుండీ లెక్కింపు

ప్రతి వంద రోజులకొక పర్యాయం హుండీలను లెక్కిస్తుంటారు. అద్దంకి నుంచి వాణిజ్య బ్యాంక్‌ల సిబ్బంది హుండీ ఆదాయాన్ని క్షేత్రం వద్దనే లెక్కించి, బ్యాంక్‌కు జమ చేస్తుంటారు. హుండీ లెక్కింపు రోజు పెద్దసంఖ్యలో ఔత్సాహిక భక్తులు హాజరవుతుంటారు. భారతీయ కరెన్సీతో పాటు ఆభరణాలు, విదేశీ కరెన్సీ కూడా హుండీల్లో లభ్యమవుతుంటుంది. తిరుమల శ్రీవారి ఆలయంలో మాదిరి హుండీని దేవాలయంలో ఏర్పాటు చేశారు.

లక్ష్మీనరసింహుడికి సుమారు 50 ఎకరాల మాన్యం

లక్ష్మీనరసింహస్వామి లక్షాధికారి. కలవకూరు రెవెన్యూ పరిధిలో మొత్తం 50 ఎకరాల మాన్యం భూములుండగా ఏటా రూ.10లక్షల వరకూ ఆదాయం సమకూరుతోంది. అలాగే హుండీ, టికెట్ కలెక్షన్, దుకాణాల అద్దెల రూపంలో మరో రూ.30 లక్షలు, వెరసి రూ.40లక్షల వరకు ఆదాయం సమకూరుతుంటుంది. ప్రభుత్వం, భక్తుల సహకారంతో గణనీయంగా ఆలయ అభివృద్ధి జరిగింది. ప్రస్తుతం కొండపై కార్యాలయం, సత్రాలు, శంఖు/చక్రం/నామం, గరుడ విగ్రహం వంటివి దాతల సహకారంతో నిర్మించారు. గత తెదేపా ప్రభుత్వం హయాంలో కొండపైకి 1.5 కిమీ రహదారి నిర్మించారు. అందువల్లే భక్తులు కొండపైకి వాహనాల్లోకి వెళ్లగలుగుతున్నారు.

సంతానలక్ష్మి ఊయల....

కొండపై కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఎదురుగా గల రావిచెట్టు ఏళ్ల తరబడి భక్తుల పూజలందుకుంటోంది. ఆలయానికి వచ్చే నూతన దంపతులు, దీర్ఘకాలంగా సంతానం కోసం ఎదురు చూస్తున్న దంపతులు ఈ రావిచెట్టుకు ఊయలకట్టినట్లయితే సంతానం కలుగుతుందని నమ్మకం. ఊయలలో రాయిని ఉంచి ఊపడం ద్వారా సంతాన ప్రాప్తి లభిస్తుందని విశ్వసిస్తారు.

- శింగరకొండ (అద్దంకి)

శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి
71వ వార్షిక తిరునాళ్ళ శుభాకాంక్షలు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్‌శాఖామాత్యులు
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి
శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్ల 71వ వార్షిక తిరునాళ్ళకు
విచ్చేయుచున్న రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి
స్వామి వార్ల భక్తులకు, అతిరథమహారథులకు, ప్రజలకు
స్వాగతం... సుస్వాగతం
గార్లపాటి
శ్రీనివాసరావు
టి.డి.పి నాయకులు,
అద్దంకి

(c) eenadu

మహిమాన్విత క్షేత్రం.. పిలిస్తే పలికే దైవం

ప్రకాశం జిల్లాలో మహిమాన్విత క్షేత్రంగా..భక్తుల కొంగుబంగారంలా శింగరకొండ వెలుగొందుతోంది. ప్రతి ఏటా ఫాల్గుణశుద్ధ పౌర్ణమి నాడు వార్షిక తిరునాళ్ల నిర్వహిస్తారు. ప్రకాశం, మార్కాపురం, బాపట్ల, నెల్లూరు, పల్నాడు, గుంటూరు, విజయవాడ తదితర జిల్లాల నుంచి వచ్చే వారితో భక్త జనసంద్రంగా మారుతుంది. మూడు రోజులు జరిగే ఈ వార్షిక బ్రహ్మోత్స వాలకు వేళయింది. ఈ వేడుకను చూస్తే తనువు, మనసు పులకిస్తాయి. గత నెల 28 నుంచి ఉత్సవాలకు శ్రీకారం చుట్టి ఈ నెల 2న నిర్వహించే ప్రధాన తిరునాళ్ల ఘట్టంతో ముగింపు పలుకుతారు. రాత్రంతా భక్తులు జాగారం చేస్తారు. రెండో తేదీ ఉదయం నుంచి మూడో తేదీ ఉదయం వరకు నిరాటంకంగా స్వామి వారి దర్శన భాగ్యం కల్పిస్తారు. ఆ వేడుకల వేళ అద్దంకి సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యుత్తు ప్రభలు చూడాలంటే రెండు కళ్లూ చాలవు. రాత్రి వేళల్లో సాంస్కృతిక సందడి అంబరాన్నంటుతుంది. సుమారు మూడు లక్షలకు పైగా భక్తులు ఈ ఉత్సవాలకు హాజరయ్యే అవకాశముందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. తిరునాళ్లను సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తారు. అద్దంకి ఆర్డీవో కె. లక్ష్మీప్రసన్న నేతృత్వంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులూ భక్తులకు కావాల్సిన సదుపాయాల కల్పనలో నిమగ్నమయ్యారు.


ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖమండపం, ధ్వజస్తంభం

శతాబ్దాల ఘనచరిత..

వందల ఏళ్ల చరిత్ర శింగరకొండ ఆలయ సొంతం. అక్కడి గరుడ స్తంభంపై క్రీశ 1443లో చెక్కిన శాసనాల ఆధారంగా ఈ ప్రాంతమంతా దేవరాయల ప్రభువు పాలనలో ఉన్నట్లు తెలుస్తోంది. తొలి నాళ్లలో 'సింగనకొండ'గా పిలిచేవారు.. కాలక్రమంలో 'శింగరకొండ'గా రూపాంతరం చెందింది. శింగరకొండపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఆలయం ఉంది. 1956వ సంవత్సరం నుంచి దేవాదాయ శాఖ ద్వారా వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. కొంతకాలం కార్యనిర్వహణాధికారి స్థాయి అధికారి పర్యవేక్షణలో ఉండగా, ప్రస్తుతం సహాయ కమిషనర్ స్థాయి అధికారి పర్యవేక్షిస్తున్నారు. ఇంతింతై వటుడింతై అన్న చందంగా తొలి నాళ్లలో రూ.వేలల్లో వచ్చే వార్షిక ఆదాయం ఇప్పుడు రూ.కోట్లకు చేరడం ప్రసన్నాంజనేయునిపై భక్తులకున్న అచంచల విశ్వాసానికి అద్దం పడుతోంది.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ శిఖరం

కొండపైకి మెట్లు

సుబ్రహ్మణ్యేశ్వరుడు

అనంత భవనాశి..

దాతల సహకారంతో ఏర్పడిన భవనాశి తటాకం రెండు వేల ఎకరాల్లో ఉండేది. చిన్నకొత్తపల్లి, శింగరకొండపాలెం, చక్రాయపాలెం, శాంతినగర్ గ్రామాల సరిహద్దుల్లో విస్తరించింది. అయితే సమీప గ్రామాల వారు భవనాశిని ఆక్రమించుకోగా, ప్రస్తుతం 600 ఎకరాలకే పరిమితమైంది. భవనాశి చెరువులో జాలర్ల సహకార సంఘంలోని 170 మంది మత్స్యకారులు చేపలవేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రతి సంవత్సరం పెద్దఎత్తున చేప పిల్లల్ని వదిలి వాటి పెంపకం ద్వారా కుటుంబ పోషణ గావిస్తున్నారు.

కుంభాభిషేకం అనంతరం తొలి తిరునాళ్ల

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం రాతిముఖ మండపం నిర్మాణం జరిగిన అనంతరం గతేడాది మే 12న కుంభాభిషేకం నిర్వహించారు. కర్ణాటక నుంచి గజవాహనాన్ని రప్పించి, గుండ్లకమ్మ, సప్తనదీజలాలు తెచ్చి రాతిముఖ మండపాన్ని అభిషేకించారు. సుమారు రూ.ఏడు కోట్ల అంచనాతో గర్భాలయం, ముఖమండపం రాతితో నిర్మించారు. తితిదే, ప్రభుత్వ, దాతల సహకారంతో రాతిముఖ మండపం నిర్మించారు. వార్షికోత్సవం అనంతరం జరుగుతున్న తొలి వార్షికోత్సవం అయినందున ఈ తిరునాళ్లకు ఎనలేని ప్రాధాన్యం దక్కుతోంది.

వినాయకస్వామి

\- శింగరకొండ (అద్దంకి)

(c) eenadu

శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి
71 వ తిరునాళ్ళ మహోత్సవ శుభాకాంక్షలు
దివ్య మహిమలుగల పుణ్యక్షేత్రం
కోరిన కోర్కెలు తీర్చే శింగరకొండ
శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్ల
71వ తిరునాళ్ళకు
విచ్చేయుచున్న రాష్ట్ర మంత్రివర్యులు
" శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి" ప్రజాప్రతినిధులకు
అధికారులకు, భక్తజనులకు, ప్రజలకు మా స్వాగతం.. సుస్వాగతం...
బాలినేని ఆంజనేయులు
మలినేని నరేంద్రబాబు
బొడ్డు వెంకటేశ్వర్లు
స్నేహ కన్‌స్ట్రక్షన్స్
ఒంగోలు
స్నేహ ఇండస్ట్రీస్
గ్రానైట్ కటింగ్ & పాలిషింగ్ గ్రోత్ సెంటర్, గుళ్ళాపల్లి
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
ఆం.ప్ర రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు

(c) eenadu

రాతిముఖ మండపంతో అంజన్నకు ఖ్యాతి

ప్రసన్నాంజనేయస్వామి ఆలయ రాతిముఖ మండప నిర్మాణంతో ఆ క్షేత్రం ఖ్యాతి దశదిశలకూ వ్యాపించింది. ప్రకాశం, గుంటూరు, పల్నాడు, బాపట్ల, నెల్లూరు జిల్లాల నుంచి భక్తజనం పెద్దఎత్తున తరలివస్తున్నారు. రూ.కోటి వరకు విరాళాలిచ్చేందుకు వెనుకాడరంటే స్వామి వారి మహిమ ఎంతో ఇట్టే అర్థమవుతుంది. ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి నాడు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నాం. సుమారు మూడు లక్షలమంది వరకు భక్తులు హాజరవు తారని భావిస్తున్నాం. భక్తులకు ఎప్పుడూ సర్వ సదుపాయాలు కల్పిస్తున్నాం. సాధారణ భక్తులకు కూడా రోజూ నిత్యాన్నదానం నిర్వహించడం ఇక్కడ ప్రత్యే కత. సెంటు భూమి లేనప్పటికీ స్వామి వారి వార్షికాదాయం రూ.3.5 కోట్లు పైమాటే. దుకాణాల అద్దెలు, హుండీలు, టికెట్ల ఆదాయంతోనే సహాయ కమిష నర్ స్థాయికి చేరింది. భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలయ పాలకమండలి, అధికార యంత్రాంగం పని చేస్తోంది.

- మదమంచి తిమ్మానాయుడు, సహాయ కమిషనర్, ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం, శింగరకొండ

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం

శింగరకొండ క్షేత్రానికి వచ్చే భక్తులకు అన్నిరకాల సదుపాయాలు కల్పించేందుకు పాలకమండలి తరఫున సిద్ధంగా ఉన్నాం. పాలకమండలి ఛైర్మన్‌గా నాకు అవకాశం కల్పించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు. క్షేత్రంలో పెరిగిన ఆక్ర మణలు తొలగించబోతున్నాం, ఆయా ప్రదేశా ల్లోని ఆక్రమణదారులకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వనున్నాం. దేవాలయ ప్రాకార మండపాలు, గాలి గోపు రాలు రాతితో నిర్మించబోతున్నాం. గోశాల, పుష్కరిణి నిర్మాణాలకు అన్నిరకాల ప్రయత్నాలూ పూర్తయ్యాయి. తితిదే కల్యాణ మండపం పక్కనే మినీ కల్యాణ మండపం నిర్మాణానికి దాతలు ముందుకొ చ్చారు. అన్నదాన మండపం నుంచి మారుతీభవన్‌కు రహదారి నిర్మించాం. పొంగలిశాలకు సరైన స్థలం చూసి మార్పు చేస్తాం.

- చుండూరి మురళీ సుధాకరరావు, ఛైర్మన్, ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలి, శింగరకొండ

- శింగరకొండ (అద్దంకి)

స్వామికి సేవ చేయడం నా అదృష్టం

ప్రసన్నాంజనేయస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. స్వామి వారి ఆశీస్సులు అందరికీ ఉండాలి. పర్యాటకంగా భవనాశి తటాకాన్ని అభివృద్ధి చేయాలి. బుద్ధ విగ్రహం, బోటుషికారు, రిసార్ట్స్ వంటివి ఏర్పాటు చేస్తే మరింత ఆహ్లాదభరిత వాతావరణం నెలకొంటుంది. 2021- 2023 వరకు ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి ఛైర్మన్‌గా పనిచేసిన సమయంలో వసతుల కల్పనకు కృషిచేయడం ఎంతో సంతృప్తినిచ్చింది. దేవాలయ రాతి ముఖమండపం నిర్మాణానికి రూ.70 లక్షల విలువైన గ్రానైట్ రాళ్లను అందించా. ఆలయం చుట్టూ మాడవీధులకు రూ.65 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణం చేయించడం ఆ ప్రసన్నాంజనేయుడి కృపగా భావిస్తున్నా. రెండేళ్ల పదవీకాలంలో నిత్యాన్నదాన భవనం, పరిపాలనా భవనం, వంటశాల ఆధునికీకరణ, విశ్రాంతిశాల భవనం పనులు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. **-కోట శ్రీనివాసకుమార్, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్, అద్దంకి**

మంత్రి చొరవతో వసతుల కల్పన

ప్రసన్నాంజనేయస్వామి ఆలయం అభివృద్ధి చెందుతోంది. మంత్రి గొట్టిపాటి చొరవతో ఇక్కడ వసతులు సమకూరాయి. పర్యాటకంగా శింగరకొండ క్షేత్రాభివృద్ధికి ప్రభుత్వం కూడా కట్టుబడి ఉంది. గతంలో స్వామి వారికి రూ.50 వేలతో బంగారు నామాలు అందించా. ఇటీవల మారుతీభవన్ ఫ్లోర్‌కు కోతుల బెడద నుంచి కాపాడేందుకు ఇనుప గ్రిల్స్ సమకూర్చా. 22 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహానికి రూ.లక్ష విరాళం అందిం చడం భాగ్యంగా భావిస్తున్నా. 1992లో లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి హుండీ అందించాను. **- గార్లపాటి శ్రీనివాసరావు, దాత, భాస్కర్ సప్లయర్స్ అధినేత, అద్దంకి**

చెరకు గడలతో అలంకరణ

శింగరకొండ 71వ వార్షిక తిరునాళ్లకు ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా చెరకు గడలతో అలంకరణ చేయనున్నారు. సుమారు మూడు వేల చెరకు గడలతో మండపం నిర్మించి, అందులో నుంచి ఉత్సవాలు నిర్వ హించనున్నట్లు పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, సహాయ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. అలాగే ఆలయం ఎదుట ఫొటో షూట్ (తిరు మలలో మాదిరి) నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

- శింగరకొండ (అద్దంకి)

(c) eenadu

౨౨ అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం

శింగరకొండ సమీపంలోని ౨౨ అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం జిల్లాకే తలమానికంగా వెలుగొందుతోంది. రెండు దశాబ్దాల క్రితం ఈ విగ్రహాన్ని దాతల సహకారంతో నామ్ రహదారి అంచులో నెలకొల్పారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీకళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో నెలకొల్పారు. ఆంజనేయస్వామి విగ్రహ పరిసరాల్లో నివాసముంటున్న వారికి ఎలాంటి భయాందోళనలు, గ్రహదోషాలు ఉండవని ప్రతీతి.

– శింగరకొండ (అద్దంకి)

సిరులు కురిపిస్తున్న గ్రానైట్ కొండలు

❖ ఏటా ప్రభుత్వానికి రూ. వంద కోట్ల ఆదాయం

సంతమాగులూరు, బల్లికురవ మండలాల పరిధిలో ఉన్న గ్రానైట్ కొండలు వ్యాపారులకు సిరులు కురిపిస్తున్నాయి. వేల మంది జీవనోపాధికి వనరులుగా మారాయి. గురిజేపల్లిలో బ్లాక్ పెరల్, బల్లికురవలో స్టీల్ గ్రే రకాల గ్రానైట్ లభిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాలకు ఈ బండలు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడి ఫ్యాక్టరీలలో తయారై మెరుగులద్దిన గ్రానైట్ పలకలు దేశవ్యాప్తంగా గృహాల్లో అంతర్గత అలంకరణకు వినియోగిస్తున్నారు. గురిజేపల్లి, బల్లికురవ మండలాల్లో 140కు పైగా గ్రానైట్ కంపెనీలు రాళ్లను వెలికితీస్తున్నాయి.

బల్లికురవలోని స్టీల్‌గ్రే గ్రానైట్ క్వారీలు

300కుపైగా పరిశ్రమల్లో...

ఏడాదికి 16 వేల క్యూబిక్ మీటర్లకు పైగా రాయిని ఇక్కడ నుంచి వెలికి తీస్తున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో 300కు పైగా ఫ్యాక్టరీలు గ్రానైట్ పలకలను పాలిషింగ్ చేసే ప్రక్రియలో నిమగ్నమయ్యాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా పది వేల మందికి పైగా కార్మికులు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏడాదికి రూ.వంద కోట్లకు పైగా ఆదాయం రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి అందుతోంది.

\- సంతమాగులూరు, బల్లికురవ

ఆధ్యాత్మిక వీచిక.. అపురూప వేడుక

• అలరించిన మహా కుంభాభిషేకం

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ చరిత్రలో ఓ అపురూప ఘట్టం మహాకుంభాభిషేకం. 2025 మే నెల 19న ఇది ఆవిష్కృతమైంది. తితిదే, ప్రభుత్వం, దాతల సహకారంతో ఆలయ రాతిముఖ మండపం జీర్ణోద్ధరణ పనులు జరిగాయి. ఈ సందర్భంగా సుమారు పదివేల మంది మహిళల ఆధ్వర్యంలో కలశశోభాయాత్ర అద్దంకి నుంచి శింగరకొండకు సాగింది. వారికి వేలాదిమంది స్వాగతం పలికారు.

జోరువానలో..

శింగరకొండకు పాదయాత్ర వేడుక నభూతో నభవిష్యత్ అన్న రీతిలో సాగింది. కేరళ బృందాల డప్పు వాయిద్యాలతో ఆ ప్రాంతం మార్మోగింది. అరకు ప్రాంత సంప్రదాయ నృత్యాలు అలరించాయి. గజరాజుపై అర్చకులు వేలమూరి శ్రీరామ్మూర్తి ముందుకు సాగారు. యువతులు కలశాలతో ఈ వేడుకలో పాల్గొన్నారు. ఓవైపు జోరు వాన కురుస్తున్నప్పటికీ మొక్కవోని దీక్షతో నడుస్తూ శింగరకొండకు చేరుకున్నారు. ప్రతి భక్తుడూ ఆలయ శిఖరం వద్ద పవిత్ర నదీ జలాలు ఉంచేవిధంగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఒంగోలు, కందుకూరు శాసనసభ్యులు దామచర్ల జనార్దనరావు, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

\- శింగరకొండ (అద్దంకి)

రాతిముఖ మండప ప్రారంభోత్సవంలో మంత్రులు గొట్టిపాటి, స్వామి, ఎమ్మెల్యే జనార్దన్

అరకు మహిళల సంప్రదాయ నృత్యాలు

కలశాలతో గుండ్లకమ్మ నుంచి శింగరకొండకు శోభాయాత్ర

(c) eenadu

71 వ వార్షిక తిరునాళ్ళ శుభాకాంక్షలు
కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం...
ఇద్దరు స్వాముల పుణ్యక్షేత్రం... దివ్యమహిమలు గల
శ్రీ ప్రసన్నాంజనేయస్వామి,
శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్ల
71వ వార్షిక తిరునాళ్ళ శుభాకాంక్షలు...
విచ్చేయుచున్న రాష్ట్ర
విద్యుత్ శాఖామాత్యులు
శ్రీ గొట్టిపాటి
రవికుమార్ గారికి,
భక్తులకు స్వాగతం... సుస్వాగతం..
స్వామివార్లను దర్శించి... తరించి..
కృపకు పాత్రులు కాగలరని మనవి...
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
ఆం.ప్ర రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
అమూల్య మినరల్స్
దూళిపాళ్ళ రామ గోవిందు & దూళిపాళ్ళ శ్రీకాంత్
కొండాయపాలెం, బల్లికురవ (మం)
వెంకటాద్రి మినరల్స్
& బివిఎల్ రాక్స్, తలశిల వినోద్‌కుమార్
సత్యకృష్ణ గ్రానైట్స్, దివ్య గ్రానైట్
బట్టికొండ ఆంజనేయులు
S.R. కన్‌స్ట్రక్షన్స్
కోగంటి రామ్మోహన్‌రావు
K.S.R గ్రానైట్స్
కొమ్మినేని శ్రీనివాసరావు
వింటార్ గ్రానైట్స్
కక్కెర ఆంజనేయులు
కె. సామ్రాజ్యం గ్రానైట్, మైన్
కామేపల్లి లక్ష్మీప్రసాద్
శ్రీ శ్రీనివాస గ్రానైట్స్
ముక్కు కాశిరెడ్డి
సాయిశ్రీనివాస మినరల్స్
కొణిదెన
V.K. గ్రానైట్స్
వల్లూరి హనుమంతరావు
కృష్ణసాయి ఎక్స్‌పోర్ట్స్ ప్రై.లి.
శ్రీశిద్దా వెంకటేశ్వరరావు
ఇంపీరియల్ గ్రానైట్స్
వి. సురేష్‌బాబు
సాయి స్టోన్స్
పత్తిపాటి సురేష్
గిరిరాజ్ గ్రానైట్స్
రావిపూడి లక్ష్మీ నారాయణ
హనుమాన్ ఎక్స్‌పోర్ట్
శిద్దా సూర్యప్రకాష్, రావుపొత్తూరి వెంకట్రావు, వెంకారెడ్డి
లక్ష్మీ గ్రానైట్స్
శిద్దా రాఘవరావు
వారాహి రాక్స్ & మినరల్స్
చెన్నుపల్లి
M.V.R. గ్రానైట్స్
మారం వెంకారెడ్డి, కొణిదెన
బల్లికురవ మండల కలర్ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్

(c) eenadu

ప్రసన్నాంజనేయునికి పసిడి కాంతులు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయుడు బంగారుకాంతులీననున్నాడు. స్వామివారికి బంగారు కిరీటం చేయించేందుకు బాపట్ల జిల్లా చీరాల కొత్తపేటకు చెందిన దాత, సాఫ్ట్‌వేర్ ఇంజినీరు ముప్పవరపు సుధీర్-ప్రత్యూష దంపతులు ముందుకొచ్చారు. గత నెల రెండో వారంలో 600 గ్రాముల బంగారు బిస్కట్లను కిరీటం తయారీ నిమిత్తం ఆలయ సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడుకు అందించారు. ఈ మేరకు బంగారాన్ని మంగళగిరికి చెందిన స్వర్ణకారుడు కాటూరి సుబ్బారావు, ఆయన మిత్రబృందానికి గత నెల 13న పాలక మండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, ట్రస్టీలతో కలిసి సహాయ కమిషనర్ అందించారు. వాటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.98 లక్షలుంటుందని, కిరీటం తయారీకి మరో రూ.10 లక్షలు అవుతుందన్నారు. మొత్తంగా రూ.1.08 కోట్ల విలువైన బంగారు కిరీటాన్ని స్వామివారికి అందించేందుకు దాత అంగీకారం తెలిపారని సహాయ కమిషనర్ చెప్పారు. 40 రోజుల వ్యవధిలో కిరీటం సమకూర్చనున్నట్లు స్వర్ణకారుడు సుబ్బారావు వెల్లడించారు. దేవస్థానం చరిత్రలోనే ప్రసన్నాంజనేయస్వామికి విలువైన బంగారు కిరీటం అందించడం ఇదే ప్రథమం అని సహాయ కమిషనర్ చెప్పారు. - శింగరకొండ (అద్దంకి)

స్వర్ణకారులకు బంగారు బిస్కట్లు ఇచ్చిన దాత ముప్పవరం సుధీర్, ప్రత్యూష దంపతులు, దాత తల్లి సుధ

కోర్కెలు తీర్చే ఏల్చూరు నృసింహుడు

భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం ఏల్చూరులోని లక్ష్మీనృసింహుడు. నాలుగొందల ఏళ్ల క్రితం చోళరాజుల కాలంలో కొండపై స్వామి స్వయంభువుగా వెలిసినట్లు భక్తుల నమ్మకం. ఆ తరువాత ఓరుగల్లు రాజుల కలలో స్వామి కనిపించి కొండపై వెలిసినట్లు చెప్పారు. దీంతో అక్కడ ముఖ మండపాన్ని, ఆలయాన్ని నిర్మించినట్లు ప్రతీతి. గుడికి చేరుకునేందుకు కొండ దిగువ వరకు నిర్మించిన రాళ్ల మెట్ల మార్గం నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఈ మెట్ల మార్గం ద్వారానే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకుని పూజలు చేస్తారు.

కొండ దిగువన రెండొందల ఏళ్లక్రితం బాలాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ఆలయ నిర్మాణం చేపట్టారు. గ్రామానికి ఆనుకుని లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ విగ్రహాలను భద్రపరిచేందుకు చిన్నపాటి ఆలయాన్ని అంతకుముందే నిర్మించారు. అప్పటినుంచి ఇప్పటి దాకా ఏటా ఫాల్గుణ పంచమి రోజున తిరునాళ్ల జరపడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామానికి దక్షిణ దిశగా ఎత్తయిన కొండ మీద లక్ష్మీనృసింహాలయం, దిగువన బాలాంజనేయస్వామి ఆలయం, ఈ కొండకు ఉత్తర దిశన 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భారీ తటాకం చూపరులకు కనువిందు చేస్తాయి. ఆ పక్కనుంచే నామ్ రహదారి ఉంది. ఈ ఆలయం కింద 24 ఎకరాల వ్యవసాయ భూముల్ని అప్పట్లో దాతలు సమకూర్చారు. ఇందులో మూడు ఎకరాలు కాలువ కింద పోగా, మిగిలిన దానిలో ఎనిమిది ఎకరాలు దేవాదాయ శాఖ కింద, 13 ఎకరాలు అర్చక స్వాముల కింద ఉంది. గత మూడు తరాలుగా లక్ష్మీనృసింహస్వామి సేవలో తరిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు వినుకొండ శ్రీనివాసమూర్తి తెలిపారు. తాత ముత్తాతల నుంచి ఆలయ అర్చకత్వం కొనసాగిస్తూ స్వామి ధూప, దీప నైవేద్యాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఏటా ఫాల్గుణ పంచమి రోజున జరిగే ఉత్సవం, విద్యుద్దీపాలతో అలంకరించిన ప్రభలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు శోభాయమానంగా జరుగుతున్నాయన్నారు.

- ఏల్చూరు (సంతమాగులూరు)

ఏల్చూరు కొండపై లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్

ఏల్చూరు కొండ దిగువనున్న బాలాంజనేయస్వామి మూలవిరాట్

శింగరకొండ సమీపంలోని టిడ్కో ఇళ్ల వద్ద ఏర్పాటు కానున్న విద్యుత్తు ఉపకేంద్రం

చీకట్లు తొలిగాయి.. పల్లెలు కాంతులీనాయి

విద్యుత్తు సమస్యల పరిష్కారం, నాణ్యమైన..నిరంతర విద్యుత్తు సరఫరా దరి చేరింది. దీంతో పల్లెల్లోనూ చీకట్లు తొలిగాయి..విద్యుత్తు కాంతులీనాయి. మొత్తం రూ.105 కోట్ల వ్యయంతో విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణం, గ్రామాల్లో విద్యుత్తు స్తంభాల మార్పు వంటివి చేపట్టారు. అద్దంకిలో మూడు, బల్లికురవ మండలం మల్లాయపాలెం, సంతమాగులూరు మండలం కొప్పరం, జె.పంగులూరు మండలం టి.కొప్పెరపాడు, అద్దంకి మండలం పేరాయపాలెం గ్రామాల్లో విద్యుత్తు ఉపకేంద్రాలు నెలకొల్పనున్నారు. దీనివల్ల గ్రామాల్లో లో-వోల్టేజీ సమస్య కిందకు వేలాడుతున్న తీగలు, ప్రమాదకర నియంత్రికలు వంటి సమస్యలు తొలగనున్నాయి. విద్యుత్తు శాఖామంత్రిగా గొట్టిపాటి రవికుమార్ బాధ్యతలు చేపట్టిన 20 నెలల కాలంలో ఉపకేంద్రాల నిర్మాణాలకు రూ.34 కోట్లు ఖర్చుచేయడం ఎంతో ఫలితాన్నిచ్చింది. గ్రామాల్లో ఆర్‌డీఎస్ఎస్ పథకం, అయిదువేల జనాభా కలిగిన గ్రామ పంచాయతీల్లో విద్యుత్తు సంస్కరణలు చేపట్టారు. దీనికి గాను రూ.71 కోట్ల వరకు ఖర్చు చేశారు. దీంతో పాటు 2024-25 సంవత్సరంలో 726 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,737 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు అందించారు. ఇప్పటి వరకు మొత్తం 2467 మంది రైతులకు మేలు చేకూరింది. - అద్దంకి

(c) eenadu

నామ్ కష్టాలకు చెల్లుచీటీ!

ఏళ్లుగా ఉన్న నామ్ (నార్కట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల) ఎక్స్‌ప్రెస్ రహదారి విస్తరణ చిక్కులకు కూటమి ప్రభుత్వ చొరవతో ఎట్టకేలకు పరిష్కారం లభించింది. మొత్తం 212 కి.మీ. పొడవు కలిగిన రహదారి విస్తరణ అభివృద్ధికి 2008 లోనే అంకురార్పణ జరిగింది. కి.మీ.కు రూ.కోటి చొప్పున మంజూరు చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తరించిన రహదారి నిర్మాణం దాదాపుగా పూర్తయింది. టోల్‌వసూలు కేంద్రాలు సైతం ఏర్పాటు చేశారు. భూసేకరణ, పరిహారం సమస్యలతో అద్దంకి మండలం గోపాలపురం, చక్రాయపాలెం, కలవకూరు; సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు వద్ద విస్తరణ పనులు నిలిచిపోయాయి. పరిహారం ఇవ్వడంలో జాప్యం కారణంగా సమస్య నెలకొంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం... విద్యుత్తు శాఖా మంత్రిగా ఉన్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ చొరవ చూపడంతో పరిహారం చెల్లింపునకు మార్గం సుగమమైంది. త్వరలోనే భూములు కోల్పోయిన రైతులకు ఆ మొత్తం అందజేయనున్నారు. దీంతో ఇన్నాళ్లుగా ఆయా ప్రాంతాల్లో రోడ్డు విస్తరణకు నోచుకోక తలెత్తుతున్న సమస్యలకు తెరపడనుంది.

- అద్దంకి, సంతమాగులూరు

కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వే

అద్దంకి పట్టణంలో చేపట్టిన మినీబైపాస్ రోడ్డు

మినీ బైపాస్.. వాహనాల రద్దీకి పరిష్కారం

నామ్ రహదారిపై పెరిగిన వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని మినీ బైపాస్ నిర్మాణానికి మంత్రి రవికుమార్ శ్రీకారం చుట్టారు. రామ్‌నగర్ నుంచి గరటయ్యకాలనీ వరకు సుమారు 1.5 కి.మీ. పొడవునా సాగర్‌కాలువకు ఇరువైపులా మినీ బైపాస్ నిర్మాణం చేపట్టనున్నారు. రూ.17 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు తయారు చేయగా నిధులు మంజూరయ్యాయి. ఈలోపు సాగర్ కాలువకు ఇరువైపులా ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్న 165 మంది మంత్రి పిలుపుతో స్వచ్ఛందంగా ఖాళీ చేశారు. వారందరికీ శింగరకొండపాలెం వద్ద ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయించారు. అన్ని రకాల మౌలిక వసతులు సమకూర్చడంతో పేదలంతా ఇంటి నిర్మాణానికి సిద్ధ పడ్డారు. మినీ బైపాస్ నిర్మాణంతో రహదారికి ఇరువైపులా ఉన్న కట్టడాలకు విలువ పెరిగింది. ఎందుకూ పనికి రాని ఖాళీ స్థలాల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుతం కొత్త విద్యుత్తు స్తంభాలను అమర్చుతున్నారు. తొలి విడతలో రామ్‌నగర్ నుంచి గరటయ్యకాలనీ వరకు మినీ బైపాస్ నిర్మాణం చేపట్టారు. రెండోవిడతలో గరటయ్య కాలనీ నుంచి 33 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహం వరకు సాగర్ కాలువ వెంబడే రహదారి నిర్మాణం చేపడతారు. ఇది పూర్తి అయితే అద్దంకి పట్టణ వాసులకు ప్రమాదాల బారి నుంచి మోక్షం కలిగినట్లేనని భావించొచ్చు

- అద్దంకి

(c) eenadu

శ్రీఆంజనేయం.. భక్తులకు అభయం

- భవనాశి అంచున సింధూర ప్రియుడు
- గిరిపై కొలువైన లక్ష్మీనరసింహుడు

శింగరకొండ క్షేత్రంలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం భవనాశి తటాకం అంచున ఏర్పాటైంది. దక్షిణ ముఖంగా, స్వయంభువుగా వెలిసిన ప్రసన్నాంజనేయ స్వామిని భక్తులు 'పిలిచిన పలికే దైవం'గా కొలుస్తుంటారు. ప్రతి మంగళ, శని, ఆదివారాల్లో క్షేత్రానికి భక్తులు వచ్చి పొంగళ్లు తలపై ఉంచుకుని స్వామి వారికి మొక్కులు చెల్లిస్తుంటారు. తలపై ఉన్న పొంగలిగిన్నెను స్వామి వారికి తొలుత చూపించడం ద్వారా..స్వామి వారే స్వయంగా పొంగలి తిన్నట్లు భక్తులు భావిస్తుంటారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటాడని, కష్టాలు తీరుస్తుంటాడని ప్రసన్నాంజనేయునిపై భక్తులకు ప్రగాఢ విశ్వాసం.

తాటాకు పందిరి నుంచి ఎకరం విస్తీర్ణం...

తొలి నాళ్లలో తాటాకు పందిరిగా ఉన్న ఆలయం ప్రస్తుతం సుమారు ఎకరం విస్తీర్ణంలో విస్తరించింది. నాలుగు దిక్కుల్లో రాజగోపురాలను దాతల సహకారంతో నిర్మించారు. గతంలో కార్య నిర్వహణాధికారిగా పని చేసిన యడ్లపల్లి భూషయ్య, అప్పటి పాలకమండలి ఛైర్మన్ దివంగత మట్టుపల్లి నాగేశ్వరరావు ఆలయాభివృద్ధికి చేయూతనిచ్చారు. రాతి ముఖ మండపం, ధ్వజ స్తంభం, ఉష్ట్రవాహనంతో పాటు పరివార దేవతామూర్తులైన విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలున్నాయి.

బావి నేటికీ చెక్కు చెదరలేదు...

ఆలయ ఈశాన్య దిక్కులో దాత తవ్వించిన బావి నేటికీ చెక్కు చెదరలేదు. తాజా పరిణామాల్లో ప్రభుత్వ, తితిదే, దాతల సహకారాలతో కార్యాలయం, పోటుభవనం, భోజనశాల వంటివి ఏర్పడ్డాయి. దేవాలయానికి ఎదురుగా పది దుకాణ సముదాయాలను దాతలు నిర్మింపజేశారు. గతంలో అద్దంకి సీఐగా పనిచేసిన అశోక్‌వర్ధన్ సహకారంతో శుద్ధజల కేంద్రం ఏర్పాటైంది. ఒంగోలు మాజీ శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి సహకారంతో ప్రార్థనామందిరాన్ని నిర్మించారు. రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి సహకారంతో వంటశాల నిర్మించారు. భవిష్యత్తులో భవనాశి తటాకం వద్ద ఎకరం విస్తీర్ణంలో పుష్కరిణి, గోశాల వంటివి నెలకొల్పనున్నారు.

కొండపై విస్తరించి.. ఆలయ మందిరం నిర్మించి...

లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధిలో తెదేపా ప్రభుత్వ కృషి ఎక్కువగా ఉంది. నాటి పాలకుల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సర్వశ్రేయోనిధిగా రూ.18 లక్షలు కేటాయించడంతో కొండకు ఉత్తరం వైపున శ్లాబు నిర్మించి, విస్తరించారు. దీనివల్ల ఆలయ ప్రాంగణం విస్తరించింది. అనంతరం తూర్పువైపున కూడా రూ.35 లక్షల వ్యయంతో రెండంతస్తుల భవనాన్ని నిర్మించారు. దీన్ని త్వరలో వినియోగంలోకి తీసుకురానున్నారు. దాతల సహకారంతో రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. అద్దంకి పట్టణానికి చెందిన కంభంపాటి శ్రీనివాసరావు సహకారంతో కుమారుడు దివంగత వెంకటేశ్ జ్ఞాపకార్థం రూ.45 లక్షల వ్యయంతో డార్మెటరీ నిర్మించారు. - శింగరకొండ (అద్దంకి)

దృష్టి సారిస్తే పర్యాటక ధామమే!

- శింగరకొండ అభివృద్ధికి ఎన్నో సానుకూలతలు

నామ్ (నార్కట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల) రాష్ట్రీయ రహదారిని ఆనుకుని ఉన్న శింగరకొండ క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కసరత్తు జరుగుతోంది. దిగువన ప్రసన్నాంజనేయ స్వామి, కొండపై లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాలతో పాటు ఆరు వందలకు పైగా ఎకరాల్లో భవనాశి తటాకం విస్తరించి ఉంది. నిత్యం వందలాది మంది భక్తులు వస్తుంటారు.

భవనాశి తటాకం

గతంలో అడుగులు పడినా...

శింగరకొండ అభివృద్ధికి 17 ఏళ్ల క్రితమే అడుగులు పడ్డాయి. భవనాశి తటాకం మధ్యలో బుద్ధ విగ్రహం, బోటు షికారు, నామ్ రహదారి వెంబడి మత్స్యశాఖ స్థలంలో రిసార్టుల ఏర్పాటుకు ప్రణాళికలు చేశారు. ఇందుకోసం అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ. రెండు కోట్లు కేటాయించింది. ప్రాథమికంగా కొంత కసరత్తు జరిగినా తరువాత ప్రక్రియ నిలిచిపోయింది. కొద్ది పాటి మార్పులతో మళ్లీ ఈ ప్రతిపాదనల్లో కదలిక వచ్చింది. శింగరకొండతో పాటు బాపట్ల జిల్లాలోని చీరాల ఓడరేవు, పల్నాడు జిల్లాలోని కోటప్పకొండను అనుసంధానించి... అభివృద్ధి చేయాలన్న దిశగా ఆలోచనలు చేస్తున్నారు. సాకారమైతే మూడు జిల్లాలకూ ఇదో పర్యాటక మణిహారం అవుతుందనడంలో సందేహం లేదు.

- శింగరకొండ(అద్దంకి)

ఉపాధికి ఊతం...

పర్యాటకంగా ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా కనీసం 200 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. అనుబంధ రంగాలు సైతం విస్తరించి ఈ ప్రాంత ప్రాధాన్యమూ పెరుగుతుంది. ఈ విషయమై మంత్రి గొట్టిపాటి రవికుమార్ సైతం ఆయా శాఖల అధికారులతో వివిధ వేదికలపై చర్చించారు.

(c) eenadu

శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి
71 వ వార్షిక తిరునాళ్ళ శుభాకాంక్షలు...
శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి దేవస్థానము
శింగరకొండ గ్రామం, అద్దంకి (మం), ప్రకాశం జిల్లా
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్‌శాఖామాత్యులు
స్వామియే స్వయంగా వెలసిన, దివ్యమహిమలు గల పుణ్యక్షేత్రం,
కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం శింగరకొండ
శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి 71 వ వార్షిక తిరునాళ్ళకు
విచ్చేయుచున్న రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
అద్దంకి నియోజకవర్గ శాసనసభ్యులు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి,
అతిరథ మహారథులకు, స్వామి వారి భక్తులకు,
ప్రజలకు స్వాగతం... సుస్వాగతం...
ఇట్లు: స్వామివారి సేవలో...
చుండూరి మురళీ సుధాకరరావు
ధర్మకర్తల కమిటీ ఛైర్మన్
మదమంచి తిమ్మానాయుడు
సహాయకమీషనర్
మరియు కార్యనిర్వహణాధికారి
పాలక మండలి సభ్యులు: ఆకుల కోటేశ్వరమ్మ, బత్తుల చంద్రశేఖర్,
నూతి లక్ష్మీప్రసాద్, మద్దా సునీత, ఏల్చూరి వెంకట నారాయణమ్మ,
ధూళిపాళ్ళ వెంకట రత్నం, గొర్రెపాటి పద్మజ, అరబోలు నాగమ్మ,
దేవరపల్లి సురేష్‌బాబు, కోనంకి సుబ్బారావు, కోట లక్ష్మీనారాయణ

(c) eenadu

తిరునాళ్ల కార్యక్రమాలు

తేది: 28-02-2026 శనివారం

ఉదయం 8.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీపస్థాపన, మండపారాధన

ఉదయం 9 గంటలకు జీవధ్వజ పూజ, ఉత్సవపతాక పూజ, ధ్వజారోహణ కార్యక్రమం

సాయంత్రం 5 గంటలకు జ్యోతి వెలిగింపు, పట్టువస్త్ర సమర్పణ

తేది: 01-03-2026 ఆదివారం

ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ

ఉదయం 5.30 గంటలకు బిందె తీర్థం

ఉదయం 6 గంటల నుంచి శ్రీ స్వామివారికి విశేష అభిషేకం, మహాన్యాస పూర్వక ఏకాదశ మన్యుసూక్త వారాభిషేకం, సుందరకాండ పారాయణ, సూర్య నమస్కారాలు, సప్తశతి పారాయణం, పంచామృతాలు, దశవిధద్రవ్యములతో విశేష అభిషేకం తదుపరి విశేష అలంకరణ, దర్శనం, తీర్థప్రసాద వినియోగం

రాత్రి 7 గంటలకు ఉత్సవవాహన సేవ

తేది: 02-03-2026 సోమవారం

ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవ

ఉదయం 4.45 గంటలకు బిందె తీర్థం

ఉదయం 5 గంటల నుంచి ప్రాత:కాలార్చన

ఉదయం 10 గంటలకు దేవస్థాన వేదపండితులు, అర్చకులు, వేద విద్యార్థులతో మన్యుసూక్త పారాయణ, హోమం, తిరునాళ్ల మహోత్సవం

రాత్రి 7 గంటలకు రథోత్సవం

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని భూదత్త ఆళ్వార్, తొందరదిప్పొడి ఆళ్వార్, విశ్వక్సేనులు

ప్రభవించిన ఆళ్వార్లు

విష్ణుతత్వాన్ని, లీలల్ని, విశిష్ట కల్యాణ గుణాలను విభూతుల్ని గానం చేసి, విన్న వారిని విష్ణుభక్తులుగా మార్చడంలో సఫలీకృతులయ్యారు ఆళ్వార్లు. వైష్ణవ మత వ్యాప్తికి వారు ఇతోధికంగా సేవ చేశారు. ఆ మహావిష్ణు సంకల్పం వల్ల ఆయన వస్తు వాహనాలే ఆళ్వారులుగా ప్రభవించాయని వైష్ణవుల అచంచల విశ్వాసం. మొత్తం పన్నెండుమంది ఆళ్వార్‌లున్నారు. వారంతా ఒకే సంవత్సరంలో ఒక్కో రోజు తేడాలో జన్మించి ఉండవచ్చని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.

\- శింగరకొండ (అద్దంకి)

పోయిగై ఆళ్వార్

తిరుమంగై ఆళ్వార్

తిరుమళిసై ఆళ్వార్

(c) eenadu

దశాబ్దాలుగా స్వామి సేవలో తరిస్తూ..

వేద పండితులు వంగల హరిశంకరావధాని, ఉప ప్రధానార్చకులు కోట లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఆర్.ఆచార్యులు

శింగరాద్రి నివాసాయ నృసింహ క్షేత్ర భాసినే
భవనాశీ విహారాయ ఆంజనేయాయ మంగళం
వైశాఖమాసకృష్ణాయాం దశమ్యాం మందవాసరే
పూర్వాభాద్ర ప్రభూతాయం మంగళం శ్రీహనూమతే!!

ఘనాపాఠి కుటుంబంలో పుట్టి..

దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి సేవలో తరిస్తున్నారు వేదపండితులు వంగల హరిశంకరావధాని. ఈయన తండ్రి దివంగత రామ్మూర్తి భారతదేశంలోనే ప్రముఖ ఘనాపాఠిగా పేరొందారు. ఆయన వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న హరిశంకరావధాని, ఆయన కుమారుడు ఆంజనేయ అవధాని ఇదే పవిత్రమార్గంలో పయనిస్తున్నారు. ప్రతిరోజూ వేద పారాయణం చేస్తుంటారు. ఉదయం అభిషేకం, సాయంత్రం ప్రదోషకాల పూజల్లో పాల్గొంటారు.

మూడు దశాబ్దాలకు పైగా..

కోట లక్ష్మీనారాయణ ఆలయ ఉప ప్రధానార్చకులుగా పని చేస్తున్నారు. 1992 డిసెంబరు ఒకటో తేదీన అర్చకులుగా ఆలయం ప్రవేశం చేసిన ఈయన అనంతరం ఉపప్రధానార్చకులుగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం పాలకమండలి ఎక్స్అఫీషియో సభ్యునిగా ఉన్నారు.

ఉప ప్రధానార్చకులుగా..

విజయవాడ ప్రాంతానికి చెందిన సుదర్శనం సీతారామాంజనేయాచార్యులు 1993 జులై ఒకటో తేదీన అర్చకునిగా విధుల్లో చేరారు. నిత్యం స్వామి వారి సేవలో తరిస్తూ ఆలయ ఉప ప్రధానార్చకునిగా విధులు నిర్వహిస్తున్నారు.

- శింగరకొండ (అద్దంకి)

నాదస్వరంతో పులకించే భక్తజనం

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో నలుగురు వాద్యకారులు బాజాభజంత్రీలు మోగిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 4.30 నుంచి రాత్రి పవళింపు సేవ వరకూ వారిదే కీలక పాత్ర. మూడు దశాబ్దాలుగా షేక్ పీరూసాహెబ్, మూడేళ్ల నుంచి ఉప్పలపాటి జాలరామయ్య నాదస్వరంతో భక్తజనులు పులకిస్తున్నారు. 2003 నుంచి డోలు విద్వాంసులుగా గోనుగుంట ఆంజనేయులు, 2001 నుంచి ముద్దపాటి శ్రీనివాసులు పనిచేస్తున్నారు. - శింగరకొండ(అద్దంకి)

ఆలయంలో బాజాభజంత్రీలతో..

(c) eenadu

ప్రసన్నాంజనేయస్వామి నిత్యార్చన వేళలు

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు అభిషేకం, అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. పౌర్ణమి, అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తారు. అమావాస్య సందర్భంగా 10 వేల అరటిపండ్ల పూజ, పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకుల పూజ నిర్వహిస్తారు. మంగళ, శనివారాల్లో సాయంత్రం వేళల్లో దేవతామూర్తులకు పల్లకీ సేవ ఉంటుంది. మేళతాళాలు, భాజా భజంత్రీలు, వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ ప్రదక్షిణ చేస్తారు. రోజు మధ్యాహ్నం పంచ హారతి ఇస్తారు. సాయంత్రం 7.45 గంటలకు స్వామి వారికి పవళింపు సేవ చేస్తారు. మూలవిరాట్‌కు ఆకుపూజ చేస్తారు. అంతర్జాలం ద్వారానూ స్వామి వారికి దాతలు పరోక్షంగా సేవలు అందించే అవకాశం ఉంది. దేవస్థానం వెబ్‌సైట్‌లో ఆ వివరాలు ఉంచారు.

- శింగరకొండ(అద్దంకి)

సామాజిక వర్గాల వారీగా సత్రాలు

శింగరకొండలో సామాజిక వర్గాల వారీగా సత్రాలు ఉన్నాయి. తిరునాళ్ల సందర్భంగా వాటిలో ఉదయం నుంచి మరుసటి రోజు ఉదయం వరకు వచ్చిన వారికి కాదనకుండా అల్పాహారం, భోజనాలు పెడుతుంటారు. ఆయా కార్యక్రమాల నిర్వహణకు దాతలు విరాళాలు ఇస్తుంటారు. కాకతీయ, శాలివాహన, జైభీం, వడ్డెర, నాయీబ్రాహ్మణ, కాపు, బ్రాహ్మణ, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ, రజక తదితర సామాజిక వర్గాల వారు వారి సత్రాలను ఆశ్రయిస్తుంటారు. శిర్డీ సాయిబాబా మందిరం వద్ద విద్యుత్తు అధికారులు కూడా సత్రం నిర్వహిస్తూ భక్తులకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్తు ప్రభలు

శింగరకొండ వార్షిక తిరునాళ్లకు విద్యుత్తు ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి కనీసం పది వస్తాయి. తిరునాళ్ల ప్రదేశం వద్ద వాటిని ఏర్పాటు చేస్తారు. అద్దంకి కొండ ప్రదేశంలో వీటిని నెలకొల్పుతారు. దేవాలయానికి వచ్చే భక్తుల కంటే ప్రభల వద్దకు వచ్చే వారే మూడింతలు అధికం. మార్చి 2న సాయంత్రం 6 నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీంతో పాటు రంగుల రాట్నాలు, సర్కస్‌లు, బొమ్మల దుకాణాలు, చెరకు గడలు తినుబండారాలు విక్రయిస్తారు.

చదువుల చిన్నారులకు ఉచిత సైకిళ్లు

సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే గ్రామీణ విద్యార్థులు చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో పెద్దఎత్తున సైకిళ్లు పంపిణీ చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గ స్థాయిలో పదివేల మందికి వీటిని పంపిణీ చేసే దిశగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ అడుగులేస్తున్నారు. నియోజకవర్గంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు వీటిని అందించారు. ఇప్పటి వరకు 80 శాతం విద్యార్థులకు పంపిణీ చేశారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే అందిస్తామని ఆయనంటున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో దూరప్రాంతాల నుంచి విద్యార్థులు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లడం గమనించినట్లు చెప్పారు. సామాజిక బాధ్యతలో భాగంగా పలువురు పారిశ్రామికవేత్తల సహకారంతో ఈ క్రతువు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు సమీపంలోని మూడు కి.మీ. దూరం నుంచి విద్యార్థులు నడిచి పాఠశాలకు వస్తుండటం తనను ఎంతో ఆలోచింపజేసిందని ఆయన పలు సభల్లో చెబుతూ వచ్చారు.

రూ.1.5 లక్షల విలువ చేసే స్కూటీలు..

నియోజకవర్గంలో ఇప్పటి వరకు 167 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలను ఉచితంగా అందించామని, మరో 140 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఒక్కో స్కూటీ విలువ రూ.1.50 లక్షల వరకు ఉంటుందని వెల్లడించారు. గత నెల 23 జె.పంగులూరు మండలం ముప్పవరం వద్ద 35 మంది దివ్యాంగులకు స్కూటీలు అందించారు.

- అద్దంకి, బల్లికురవ

(c) eenadu

ఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకం

ఆంజనేయ మాల దీక్ష విరమణకు వచ్చిన భక్తులు

జగమెరిగిన ధీశాలీ.. దీవెనలివ్వు!

కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

తిరుగులేని బలం..అంతకుమించిన మనో బలం ఆ ధీశాలి సొంతం. అదే స్ఫూర్తిని అందిపుచ్చుకున్న వేలాదిమంది అంజనీపుత్రుడు చూపిన బాటలో పయనిస్తున్నారు. అందులో భాగంగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఏటా మార్గశిర శుద్ధ త్రయోదశి నాడు అంజన్నమాల దీక్ష చేపడతారు. 40 రోజుల కఠిన దీక్ష ఆచరించి..హనుమత్ వ్రతం నాడు విరమణ చేస్తారు. బాపట్ల, పల్నాడు, ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన సుమారు నాలుగొందల మందికి పైగా భక్తులు ఏటా ఇక్కడే దీక్షలు చేపడుతుంటారు. దీక్ష స్వీకరణ, విరమణ ఆలయం ప్రాంగణం వద్దే జరుగుతాయి. ఆంజనేయుడు అపురూప బలశాలి అని వంగల హరిశంకరావధాని కీర్తిస్తారు. అందువల్లే పలువురు భక్తులు ఆయన మాల వేసుకుంటారు.

స్వామి సేవలో రుత్వికుల బృందం

రుత్వికుల బృందం నిత్యం స్వామి సేవలో తరిస్తుంది. ప్రధానార్చకులు కోట లక్ష్మీనారాయణ. అర్చకులు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు, అన్నవరపు చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ, కోట గిరిధర్ కిషోర్, అన్నవరపు సత్యనారాయణ, వేలమూరి శ్రీరామ్మూర్తితో కూడిన రుత్వికుల బృందం భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమాల్లో పాల్గొంటుంది. రెండు దశాబ్దాలుగా అంజన్న దీక్ష చేపట్టిన వారు ఇక్కడే విరమిస్తున్నారు. ఆ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దీక్షాధారులు, వారి బంధువులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడుతుంటుంది. దేవస్థాన పాలకమండలి ఛైర్మన్ చుండూరి మురళీసుధాకర్, సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు, పాలకమండలి సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

\- శింగరకొండ (అద్దంకి)

(c) eenadu

అంజన్న అభయం.. అద్దంకి అభ్యుదయం

రాష్ట్ర విద్యుత్తుశాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్

శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి, లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో అద్దంకి ప్రాంతాన్ని ప్రగతిబాటలో నిలుపుతున్నామని రాష్ట్ర విద్యుత్తుశాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శింగరకొండ 71వ వార్షిక తిరునాళ్ల నిర్వహించే మహద్భాగ్యాన్ని స్వామి వారు కల్పించారన్నారు. స్వామి వారి సన్నిధిలో ఉంటూ.. వేడుకను నిర్వహించడం ఓ అనిర్వచనీయమైన అనుభూతి కలిగిస్తోందన్నారు. తిరునాళ్ల వేడుక వేళ ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతిసారీ శింగరకొండలో పూజల అనంతరమే నామపత్రం దాఖలు చేయడమన్నది తన జీవితంలో ఓ భాగమైపోయిందన్నారు. స్వామి వారి దివ్య ఆశీస్సులతోనే జిల్లా ప్రజల మన్ననలు అందుకున్నానన్నారు. ఇంకా ఆయన చెప్పిన వివరాలు ఇవీ..

ప్రతి రూపాయికీ జవాబుదారీ

భక్తులు విరాళం రూపంలో ఇచ్చే ప్రతి రూపాయికీ జవాబుదారీతనం ఉండేలా కార్యవర్గానికి దిశానిర్దేశం చేస్తున్నాం. ఆలయాలకు వచ్చిన భక్తులకు నాణ్యమైన ప్రసాదాలు అందిస్తున్నాం. పాలకమండలి సభ్యులు, కార్యనిర్వహణాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ భక్తుల మన్ననలు పొందేలా చూసుకోవాలి. కొండపైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కొండదిగువన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, భవనాశి తటాకం మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళిక రచిస్తున్నాం.

రెవెన్యూ డివిజన్ హామీ నెరవేర్చాం

ఎన్నికల సమయంలో అద్దంకి నియోజకవర్గ ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నా. ఈ నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపడమే కాకుండా రెవెన్యూ డివిజన్ కార్యాలయం కూడా మంజూరు చేయించా. దీనివల్ల రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయి. దూరప్రాంతాలకు వెళ్లే పని కూడా తప్పుతుంది.

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

రంగస్థల కళాకారుల పుట్టినిల్లులాంటి అద్దంకిలో రూ.3.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో 'అద్దంకి టౌన్‌హాల్' నిర్మాణం చేపడతాం. హెచ్ఐవీ పీడిత రోగులు మందుల కోసం ఒంగోలు వెళ్లకుండా రూ.65 లక్షల వ్యయంతో ఏఆర్‌టీ కేంద్రాన్ని పది గదులతో నిర్మిస్తున్నాం. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రూ.25 లక్షల వ్యయంతో డైనింగ్ హాల్ నిర్మిస్తున్నాం.

రూ.132 కేవీ ఉపకేంద్రం, రహదారుల నిర్మాణం

ఏల్చూరు వద్ద 132 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేయించాం. నియోజకవర్గంలో అయిదు విద్యుత్తు ఉపకేంద్రాలు నిర్మాణంలో ఉండగా, మరో రెండు ఉపకేంద్రాలు మంజూరయ్యాయి. సీఎస్ఆర్ గ్రాంటు కింద నియోజకవర్గంలో 23 సామాజిక భవనాలు నిర్మించాం. పురపాలక పరిధిలోని వసుమర్తిపాలెం, ఎన్టీఆర్‌నగర్‌లో సామాజిక భవనాల నిర్మాణం పూర్తి చేశాం. ప్రభుత్వ విద్యాలయాల్లో సురక్షిత మంచినీటి పథకానికి రూ.12 లక్షలను దాత ద్వారా సమకూర్చాం.

భక్తులకు వసతులపై శ్రద్ధ

శింగరకొండ క్షేత్రానికి వచ్చిన భక్తులపై అధికారులు, పాలకవర్గాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. మూడువైపులా కొండ, ఓ వైపు భవనాశి తటాకంతో ఈ ప్రాంతం అలరారుతోంది. ఇదో అద్భుతమైన స్వామివారి క్షేత్రం. ఇది మరింత అభివృద్ధి చెందేలా కృషిచేస్తాం.

- అద్దంకి

ప్రకాశంలో చేరిక.. డివిజన్ కానుక

- లోకేశ్, గొట్టిపాటి కృషితో కల సాకారం

అద్దంకివాసుల ఆనందం రెట్టింపయ్యింది. ఇటు ప్రకాశం జిల్లాలోకి రావడమే చాలనుకున్న తరుణంలో.. వారికి రెవెన్యూ డివిజన్‌ను ప్రభుత్వం కానుకగా ఇచ్చింది. ఈ కల సాకారం కావడంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్ విశేష కృషి చేశారు. గత పాలకులు జిల్లాల విభజన సమయంలో పరిపక్వత లేకుండా తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారు. దీంతో ప్రకాశంలో ఉన్న అద్దంకి నియోజకవర్గం కాస్తా బాపట్ల జిల్లాలో చేరింది. 2022 ఏప్రిల్ నాలుగో తేదీన ప్రకాశం నుంచి అద్దంకి వేరుకావడంతో స్థానికులు తీవ్ర వేదనకు గురయ్యారు. దీంతో 30 రోజుల పాటు వారు ఆందోళన, నిరాహారదీక్షలు చేపట్టారు. అనంతరం యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ ఫలితంగా 2025 డిసెంబరు 30న తిరిగి ప్రకాశం జిల్లాలోకి అద్దంకి నియోజకవర్గం చేరింది. దీంతో స్థానికులు సంబరాలు చేసుకున్నారు. తదనంతరం అద్దంకి, దర్శి నియోజకవర్గాలను కలుపుతూ రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ర.భ.శాఖ అతిథిగృహంలో దీన్ని నెలకొల్పారు. ప్రకాశంలో కలిపితే చాలనుకున్న తరుణంలో మంత్రి గొట్టిపాటి చొరవ చూపారని స్థానికులు చెప్పారు. - అద్దంకి

ర.భ. అతిథి గృహంలో ఏర్పాటైన రెవెన్యూ డివిజన్ కార్యాలయం

శింగరకొండలో టిడ్కో ఇళ్లు

గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారి

(c) eenadu

శుభాకాంక్షలు



ఉభయరాష్ట్రాలలో ప్రసిద్ధిగాంచిన
దివ్యమహిమలు గల శ్రీ స్వామియే స్వయంగా వెలసిన
శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి,
శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్ల
71వ వార్షిక తిరునాళ్ళ శుభాకాంక్షలు..
తెలియజేస్తూ.. విచ్చేయుచున్న భక్తులకు, ప్రజలకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు స్వాగతం... సుస్వాగతం...
స్వామివార్లను దర్శించుకుని
స్వామి వార్ల కృపకు పాత్రులు కాగలరని మనవి.

మీ

కోట శ్రీనివాసకుమార్

మాజీ ఛైర్మన్: శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానము
శింగరకొండ (2021 - 2023)
మాజీ అధ్యక్షులు: శ్రీ చక్రసహిత శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి
అమ్మవారి దేవస్థానము, అద్దంకి (2014 - 2024)

K & K కన్సల్టెంట్స్

(c) eenadu

71వ వార్షిక శింగరకొండ తిరునాళ్ళ
శుభాకాంక్షలు
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు
ఇద్దరు స్వాముల పుణ్యక్షేత్రం, ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధిగాంచిన దివ్యమహిమలు గల
శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి 71వ వార్షిక తిరునాళ్ళ శుభాకాంక్షలు.. ఈ తిరునాళ్ళకు
విచ్చేయుచున్న రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రివర్యులు శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి,
అతిరథమహారథులకు, స్వామివారి భక్తులకు, ప్రజలకు స్వాగతం... సుస్వాగతం
అద్దంకి నియోజకవర్గ కూటమి పార్టీల
నాయకులు, అభిమానులు

సింహ వాహనంపై రంగడి చిద్విలాసం

నెల్లూరులో కొలువు తీరిన శ్రీ తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ఉదయం స్వామి వారు సింహ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాత్రికి చంద్ర ప్రభపై స్వామివారు ఊరేగారు. కార్యక్రమంలో ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (సాంస్కృతికం)

గరుడ గమనం.. ప్రసన్నుడి అభయం

కొండబిట్రగుంట శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గరుడ సేవ వేడుకగా జరిగింది. గరుడ వాహనంపై కొలువుదీరిన ప్రసన్నుడికి పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం స్వామివారు కొండ, పాత బిట్రగుంటల వీధుల్లో విహరించారు. ఉదయం మోహినీ అవతారంలో దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ప్రత్యేకాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, బిట్రగుంట.

ధాన్యం విక్రయించిన 24 గంటల్లో చెల్లింపులు: ఆనం

తేమ నిర్ధారణ వివరాలు తెలుసుకుంటున్న మంత్రి ఆనం

సంగం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పౌర సరఫరాల శాఖ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లో చెల్లింపులు చేస్తారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. జిల్లాలో తొలిసారిగా సంగంలో ఆదివారం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ గతేడాది జిల్లా వ్యాప్తంగా 1.12లక్షల టన్నుల ధాన్యం సేకరించి రూ. 233 కోట్లను అయిదువేల మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పంట కాలంలో 1.5లక్షల టన్నుల సేకరణ లక్ష్యంగా ఉందన్నారు. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. భాజపా రాష్ట్ర నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, డీసీవో గుర్రప్ప, పౌరసరఫరాల శాఖ డైరెక్టరు పట్టాభిరామిరెడ్డి, జిల్లా మేనేజరు అర్జునరావు, ఆర్డీవో బి.పావని, వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి, ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, తెదేపా మండల అధ్యక్షుడు బి.శ్రీనివాసులురెడ్డి, నాయకులు కె.రవీంద్రరెడ్డి, కె.వి.కరుణాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల తోట.. ఉపాధి బాట

11 పెద్ద కంపెనీలతో ఒప్పందాలు

సెజ్‌లో పరిశ్రమకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు, ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ రవిచంద్ర తదితరులు

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

కూటమి ప్రభుత్వంలో జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. పరిశ్రమల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే 11 పెద్ద కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి. ఆరు కంపెనీల కోసం భూ సేకరణ చేస్తున్నారు. మరో అయిదింటికి భూములు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే బీపీసీఎల్ ప్రాజెక్టుకు ఆరువేల ఎకరాలకు 3200 ఎకరాలు భూమి సేకరించారు. ఇండోసోల్ పరిశ్రమకు అడ్డంకులు తొలగిపోయాయి. కొడవలూరు మండలంలోని ఇఫ్కో కిసాన్ ప్రత్యేక ఆర్థిక మండలి రూపురేఖలు మారనున్నాయి. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై 'ఈనాడు-ఈటీవీ' పరిశీలన కథనం.

ఈనాడు ఈటీవీ పరిశీలన

మౌలిక సదుపాయాలకు రూ.870 కోట్లు

ఇఫ్కో కిసాన్ సెజ్‌లో 2,776 ఎకరాల్లో మల్టీ ప్రొడక్ట్ స్పెషల్ ఎకనామికల్ జోన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.870 కోట్లు కేటాయించింది. సెజ్ ద్వారా ప్రత్యక్షంగా 30 వేలు, పరోక్షంగా మరో 30వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అదనంగా మరిన్ని యూనిట్లు స్థాపిస్తే మరో 29,400 మందికి ఉపాధి పెరిగే అవకాశం ఉంది.

ఇథనాల్ ప్రాజెక్టులకు..

రెండు ప్రధాన ఇథనాల్ ప్రాజెక్టులకు అడుగులు పడ్డాయి. రామ్కీ బయో పరిశ్రమ రూ.356 కోట్ల పెట్టుబడి పెడుతోంది. రోజుకు 370 కిలో లీటర్ల ఇథనాల్ ఉత్పత్తి అవుతుంది. ఇది ధాన్యం ఆధారిత పరిశ్రమ. దీంతో పాటు 7.25 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. గాయత్రి రెన్యువబుల్ ఎనర్జీ పరిశ్రమ స్థాపనకు రూ.260 కోట్లు పెట్టుబడి పెడుతున్నారు. దీనికి ఆదివారం ఎంపీ వేమిరెడ్డి దంపతులు శంకుస్థాపన చేశారు. అనుబంధంగా 6 మెగావాట్ల విద్యుత్తు ప్లాంటు ఉంటుంది. మొక్కజొన్న, విరిగిన బియ్యంతో ఇథనాల్ తయారు చేస్తారు. ఈ రెండు యూనిట్ల ద్వారా సుమారు 700 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

రెండు పెద్ద కర్మాగారాలు వస్తున్నాయి

భూ సేకరణ జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క గమేషా తప్ప పెద్ద ఫ్యాక్టరీలు లేవు. రెండు కొత్తవి వస్తున్నాయి. వీటివల్ల స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయి. దీనివల్ల ఎలాంటి పొల్యూషన్ ఉండదు. – స్ఫూర్తిరెడ్డి, కొడవలూరు తహసీల్దారు

అడ్డంకులు తొలగిపోయాయి

ఇఫ్కో కిసాన్‌సెజ్ 1997లో ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రెండు పరిశ్రమలతో ఎంవోయూ కుదిరింది. ఇంకా వచ్చే అవకాశం ఉంది. రూ.30వేల కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు 60 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. – సుధాకర్‌రావు, సీఈవో, ఇఫ్కో కిసాన్ సెజ్ స్పెషల్ ఎకనామిక్ జోన్

పారిశ్రామికాభివృద్ధి ప్రారంభం

కొడవలూరు, న్యూస్‌టుడే: కొడవలూరులోని ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పారిశ్రామికాభివృద్ధి ప్రారంభమైందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రేగడిచెలిక ఇఫ్కో కిసాన్ సెజ్‌లో రూ. 260 కోట్లతో గాయత్రి రెన్యువబుల్ ఎనర్జీ ఇథనాల్ పవర్‌ప్లాంటుకు ఆదివారం శంకుస్థాపన జరిగింది. ఆయన మాట్లాడుతూ సెజ్‌లో పరిశ్రమలు తీసుకువస్తానని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని తెలిపారు. 700 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. దిల్లీలోని ఇఫ్కో కార్యాలయానికి వెళ్లి ఛైర్మన్ దిలీప్ సింఘానియాతో కలిసి రేగడిచెలిక కిసాన్‌సెజ్‌లో పరిశ్రమల స్థాపన గురించి పలుసార్లు కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు సంపూర్ణ సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఎంపీతోపాటు ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర కలిసి శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కిసాన్‌సెజ్ సీఈవో సుధాకర్, గాయత్రి రెన్యువల్ ఎనర్జీ ఛైర్మన్ శ్రీనివాసరావు, తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మార్పు మంచికేగా..

ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులకు ముందుగానే పదో తరగతి పాఠ్యాంశాలను బోధించే కార్యక్రమానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. అందుకు వారికి సమ్మేటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలను సోమవారం నుంచి నిర్వహిస్తున్నారు. తొమ్మిదో తరగతి వారికి మిగిలిన తరగతులతో కలిసి ఏప్రిల్ ఆరు నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్ -2 పరీక్షలు జరగాలి. అయితే నేటి నుంచి ఈనెల 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు.

గాంధీజన సంఘంలో పరీక్షకు సిద్ధమవుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థులు

'తొమ్మిది'లోనే 'పది' పాఠాలు..

న్యూస్‌టుడే, సంగం

2026-27 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో పరీక్షలను ముందుగా నిర్వహిస్తున్నారు. పూర్తయిన వెంటనే ఈనెల 13 నుంచి ఏప్రిల్ 23 వరకు పదో తరగతి పాఠ్యాంశాలను బోధిస్తారు. వేసవి సెలవుల్లో సమయం వృథా కాకుండా, ఎక్కువ రోజులు విరామం లేకుండా నిరంతర అభ్యసన ప్రక్రియ కొనసాగేందుకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. పదో తరగతి పాఠాలను ముందుగా బోధించడంతో వాటిని చదువుకునేందుకు అవకాశం కలుగుతుంది.

ఒత్తిడికి దూరం

సాధారణ విద్యాసంవత్సరానికి ఒక నెల అదనంగా లభిస్తుందున ముందుగా పాఠాలు నేర్చుకోవడంతో విద్యార్థుల్లో ఒత్తిడి దూరమై ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. దాంతో పాటు పదో తరగతిలో నిర్వహించే వందరోజుల ప్రణాళిక ముందుగా జరిగేందుకు, పాఠ్యాంశాల పునఃపరిశీలనకు ప్రయోజనకరంగా ఉంటుంది.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులు	
బాలికలు: 7,633	బాలురు: 6,761

ప్రణాళికాబద్ధంగా..

ఈనెల 12వ తేదీతో పరీక్షలు పూర్తయిన తరువాత 13,14వ తేదీల్లో విద్యార్థులకు ప్రేరణాత్మక ప్రసంగాలు, పాఠ్యాంశాల పరిచయం జరుగుతుంది. 15 నుంచి ఎన్‌సీఈఆర్‌టీ నుంచి లభించే సిలబస్ ఆధారంగా అన్ని సబ్జెక్టుల బోధన ఏప్రిల్ 23వరకు కొనసాగుతుంది. చివరలో స్లిప్ టెస్టులు నిర్వహించి విద్యా సామర్థ్యాలను మదింపు చేస్తారు. ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి జానకీరాం మాట్లాడుతూ నూతన విధానం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.

ప్రయోజకులైతేనే సమాజంలో గౌరవం: ఏఎస్పీ

కష్టపడి చదివి ప్రయోజకులైతేనే మహిళలకు సమాజంలో గౌరవమర్యాదలు దక్కుతాయని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నగరంలో ప్రదర్శన నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమైన కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద మానవహారంగా ఏర్పడి అక్కడి నుంచి తిరిగి ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలుకు చేరుకుంది. – న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

ప్రతిభ గెలిచింది.. వైకల్యం ఓడింది

న్యూస్‌టుడే, పొదలకూరు: ప్రతిభ ముందు వైకల్యం ఓడింది. దివ్యాంగ క్రీడాకారుడు పారాసిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో జాతీయస్థాయిలో ప్రతిభ చూపారు. పొదలకూరుకు చెందిన పెంచలయ్య.. పుట్టుకతోనే దివ్యాంగుడు. ఇతరులపై ఆధారపడకుండా మనోధైర్యంతో ముందుకుసాగుతున్నారు. ఎంఏ బీఈడీ చేశారు. మొదట్లో క్రికెట్ ఆడుతూ అందులో ప్రతిభ చూపారు. అయితే డీఎస్సీలో క్రికెట్‌ను క్రీడా కోటా కింద తీసుకోలేదు. దాంతో పారాసిట్టింగ్ వాలీబాల్ క్రీడపై ఆసక్తి పెంచుకుని ప్రతిభ చూపుతున్నారు. ఇప్పటివరకు మూడుసార్లు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు. గతనెల 25 నుంచి 28 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మేరఠ్ నగరంలో జరిగిన జాతీయ స్థాయి పారాసిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో ఆంధ్రా జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆ జట్టు తరపున పాల్గొని ప్రతిభ చూపాడు. పోటీల్లో దేశం నలుమూలల నుంచి సుమారు 150 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. అంతటి ప్రతిష్ఠాత్మకమైన పోటీల్లో పెంచలయ్య ప్రతిభ చూపారని రాష్ట్ర పారా సిట్టింగ్ వాలీబాల్ సంఘం అధ్యక్షుడు బి.శివదత్ తెలిపారు. 13 ఏళ్ల తరువాత ఆంధ్ర పారా జట్టుకు ఈ విజయం దక్కినట్లు తెలిపారు.

అడగరులే.. ఆక్రమిద్దాం!

ఈ చిత్రంలో కనిపించేది ముసునూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 911-2కు చెందిన సుమారు 73 అంకణాల విస్తీర్ణంలోని ప్రభుత్వ భూమి. ఇక్కడ ప్రైవేట్ నిర్మాణాలు చేపడుతున్నారు. అంకణం రూ.ఏడు లక్షలకు పైమాటే. ఇంత విలువైన భూమి కబ్జా చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

● ఇదే సమస్యపై రెండువారాల కిందట ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో కావలి ఆర్డీవో కార్యాలయానికి ఫిర్యాదు అందింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టరు, వీఆర్వో పరిశీలించి ప్రభుత్వ భూమిగా నిర్ధారణ చేశారు.

న్యూస్‌టుడే, కావలి

కావలి పట్టణంలో ట్రంకురోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములన్నీ ఆక్రమణలకు గురవుతున్నాయి. తాజాగా ముసునూరు అయ్యప్ప ఆలయానికి దక్షిణం పక్క భూమిపై కన్నేశారు. అక్కడి సర్వే నంబర్ కాకుండా మరోదాన్ని వేసి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఇప్పటికే ఈ పరిసరాల్లోని మందాటి చెరువుకట్ట, రాళ్లగుట్ట పోరంబోకు భూముల్లో ప్రైవేటు భవన సముదాయాలు వెలిశాయి. ప్రస్తుతం అక్కడి మార్కెట్ విలువ ప్రకారం రూ. కోట్లలో ఉంటుంది. విలువైన భూముల్ని ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఆర్డీవో స్థానచలనంతో..

ఇటీవల ఫిర్యాదు వచ్చిన రోజున ఆర్డీవో స్థానచలనంపై వెళ్లిపోయారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఆర్డీవో కొనసాగుతుండటంతో అక్రమార్కులు చెలరేగుతున్నారు. గతంలో పలుమార్లు ఎవరికి వారు ఈ భూమి తమదంటూ పోటీగా వ్యవహరించడంతో వివాదాలు తలెత్తాయి. దాంతో ఓ పోలీసు అధికారి ఆ ప్రభుత్వ భూమిని మధ్యస్తంగా స్వాధీనం చేసుకుని ఇతరులకు విక్రయించాడు. ఇదే సందర్భంలో తొలుత కొద్దిపాటి నిర్మాణాలతో మున్సిపాలిటీ నుంచి హోల్డర్ ప్రెమిసిస్ కింద ధ్రువీకరణ, ఆ తరువాత విద్యుత్తు కనెక్షన్ పొందారు. కొంతవరకు ఆక్రమణకు బీజం పడగా, ఇదే సందర్భంలో ఇటీవల ఫిర్యాదు స్వీకరించిన ఆర్డీవో లేకపోవడంతో కబ్జాదారులు ఆక్రమణలు వేగవంతం చేశారు.

● ఈ విషయమై కావలి ఇన్‌ఛార్జి ఆర్డీవో ఎన్.రాజశేఖర్ స్పందిస్తూ ఆక్రమణల విషయం నా దృష్టికి రాలేదన్నారు. తహసీల్దార్‌ను అప్రమత్తం చేసి అడ్డుకుంటామని తెలిపారు.

క్లిక్‌తో.. కిసాన్ డ్రోన్లు, యంత్ర పరికరాలు

మీ కోసం

న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వ్యవసాయ యాంత్రీకరణ నేపథ్యంలో సేవలను రైతులకు చేరువ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కిసాన్ డ్రోన్లు, వ్యవసాయ యంత్ర పరికరాలు బుక్ చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. జిల్లాలో రబీ సీజన్‌లో 5లక్షల ఎకరాలకు పైగా పంటల సాగు జరుగుతోంది. అందులో 3.50లక్షలకు పైగా వరి సాగులో ఉంది. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో కూలీల కొరత అధికంగా ఉండగా.. ఇదే సమయంలో అధునాతన వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి.

సేవలు అందుబాటులోకి.. ఒక్క క్లిక్‌తో కిసాన్ డ్రోన్ సేవలు అందుబాటులోకి వస్తాయి. స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్ ద్వారా ఊబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్ యాప్‌ను రైతులు స్వయంగా డౌన్‌లోడ్ చేసుకుని దాని ద్వారా డ్రోన్లు, ప్రతిపాదిత వ్యవసాయ యంత్ర పరికరాలు బుక్ చేసుకోవచ్చు. లేదంటే రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన డ్రోన్ సేవల వాల్‌పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి డ్రోన్ సేవలను వినియోగించుకోవచ్చు. కిసాన్ డ్రోన్లు, ట్రాక్టర్లు, కంబైన్ హార్వెస్టర్లు, పవర్ టిల్లర్లు, బేలర్లు అందుబాటులో ఉంటాయి. యాప్‌లో పలు సేవలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా జిల్లాలో ఎక్కడైనా పొలాలకు పురుగుమందులు, ఎరువులు, విత్తనాలు చల్లడానికి డ్రోన్లను అద్దెకు తీసుకోవచ్చు. సమయం, కూలీల ఖర్చు ఆదా అవుతుంది. దూరం, విస్తీర్ణం బట్టి డ్రోన్ నిర్వాహకులు రుసుములు వసూలు చేస్తారని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

వ్యవధి తక్కువ.. పనులెక్కువ!

రోజుకు రూ.3కోట్ల ఉపాధి నిధుల ఖర్చు

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

వింజమూరులో డ్వామా సిబ్బందితో కలిసి మొక్క నాటుతున్న పీడీ గంగాభవానీ

జిల్లాలో ఎన్నడూ లేని విధంగా ఉపాధి హామీ పనులకు రోజుకు రూ.3కోట్ల వరకు వెచ్చిస్తున్నారు. కేవలం 30 రోజుల వ్యవధిలోనే పనులు పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు రచించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏప్రిల్ 1వ తేదీ నుంచి వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ గ్రామీణ (వీబీ జీ రామ్ జీ)గా రూపాంతరం చెందనుంది. ఈ క్రమంలో గతంలో మంజూరైన నిధులతో పనులు వేగవంతం చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి.

సకాలంలో పూర్తి చేయాలని..

ఫిబ్రవరి తొలివారం నుంచి రూ.141 కోట్లతో 3610 పనులను లక్ష్యంగా ఎంచుకున్నారు. ఇప్పటికే రూ.93 కోట్ల పనులు పూర్తిచేయగా రూ.91 కోట్లకు పైగానే బిల్లు బకాయిలు ఆగిపోయాయి. నెల రోజుల్లోపు రూ.45కోట్ల పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రోడ్ల నిర్మాణాల నుంచి పంట గుంతలు, ఇంకుడు గుంతలు, మొక్కలు నాటడం తదితర పనులు సాగుతున్నాయి. ఎప్పటికప్పుడు బిల్లులు కూడా అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటికే మంజూరైన గోకులాలు, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలతో పాటు కొన్ని నిర్మాణాలు మార్చి మాసాంతానికి పూర్తవుతాయా లేదా అన్న సందేహం నెలకొంది. మార్చి 10వ తేదీ లోగా పాత పనులు పూర్తి చేయాలని డ్వామా పీడీ ఆధ్వర్యంలోని ఏపీడీలు, క్షేత్రస్థాయి సిబ్బంది, మరో వైపు పీఆర్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. పనులు చేసే చిన్నపాటి గుత్తేదారుల నుంచి ఉపాధి హామీ కార్మికుల వరకు రావాల్సిన బిల్లులు అందడం లేదు.

పదో తేదీలోగా పూర్తిచేసేలా..

రోజుకు రూ.3కోట్ల విలువైన పనులు చేయిస్తున్నాం. మార్చి 30వ తేదీ వరకు గడువు ఉన్నా, పదో తేదీలోగానే రూ. 40 కోట్ల పనులు పూర్తి చేసేలా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం. బిల్లులు కూడా తప్పక విడుదలవుతాయి.
– గంగా భవానీ, పీడీ, డ్వామా

బానిషా!

నెల్లూరు నగరంలో చాప కింద నీరులా గంజాయి విక్రయాలు

ఈనాడు, నెల్లూరు

గంజాయి విక్రయం, వినియోగంపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో అడ్డుకట్ట పడటం లేదు. నెల్లూరు నగరంతో పాటు ఇతర పట్టణాల్లోనూ చాపకింద నీరులా విక్రయాలు జరుగుతున్నాయి. విశాఖపట్నం, ఉభయగోదావరి జిల్లాలోని అటవీ ప్రాంతం నుంచి చెన్నైకు తీసుకెళ్తున్న గంజాయి నిల్వలకు నెల్లూరు కేంద్రంగా మారింది. ఫలితంగా తెలిసీతెలియని వయసు కావడంతో.. విద్యార్థులు గంజాయికి బానిసగా మారుతున్నారు. నేరాలకు పాల్పడుతూ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు. కొందరు అధికారులకు తెలిసినా కనీసం కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా నేర ప్రవృత్తి పెరిగేందుకు కారణమవుతున్నారనే విమర్శలున్నాయి.

యువతే లక్ష్యంగా..

గంజాయి మత్తుకు బానిసలైన యువత జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. మత్తుకు అలవాటు పడిన కొందరు, డబ్బు సంపాదన కోసం మరికొందరు నేరాలకు పాల్పడుతున్నారు. నగరంలో గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఏజెన్సీ ప్రాంతాల నుంచి నగరానికి తీసుకొచ్చి.. విక్రయిస్తున్నారు. పోలీసులకు దొరకకుండా.. ప్యాకింగ్ చేసి, అత్తరు, పౌడరు వంటి సుగంధాలను వెదజల్లే వాటిని పూసి రవాణా చేస్తున్నట్లు సమాచారం. చిన్న పొట్లం ధర సుమారు రూ.50 ఉంటుందని, కిలో సరకును అమ్మితే ఆరు నుంచి ఏడు వేల రూపాయల ఆదాయం వస్తుండటంతో విద్యార్థులే విక్రేతల అవతారమెత్తుతున్నారు. ఇప్పటివరకు పట్టుకున్నట్లు చూపిస్తున్న వారంతా కేవలం పాత్రధారులు కావడం విశేషం.

37 శాతం అసంతృప్తి

జిల్లాలో గంజాయి విక్రయాలపై ప్రభుత్వం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో 25 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. మీ ప్రాంతంలో గంజాయి సమస్య ఉందా.? గంజాయిపై పోలీసులు సమర్థంగా స్పందిస్తున్నారా.? బహిరంగ ప్రదేశాల్లో అమ్మకం.? వినియోగం.. మీరు గమనించారా వంటి ప్రశ్నలు అడిగి వివరాలు సేకరించారు. గంజాయి సమస్య ఉందని 23 శాతం మంది చెప్పగా.. బహిరంగ ప్రదేశాల్లో వినియోగం, విక్రయాలు ఉన్నట్టు 25 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే గంజాయి విక్రయాలపై పోలీసులకు అందుతున్న ఫిర్యాదులపై స్పందన లేదని 37 శాతం చెప్పడం జిల్లాలో పరిస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది.

జిల్లాలో(సుమారుగా)

గంజాయికి బానిసలైన వారు	వారిలో 10-17 ఏళ్ల లోపు వారు	మద్యం వ్యసనపరులు	వారిలో బాలలు
1,02,178	1028	87,897	13,289

నేతల దందా.. అడ్డుకునేదుందా!

ఊనుగుంటపాలెం వద్ద తవ్వకాలు జరిపిన అసైన్డ్ భూములు

గ్రావెల్ మాఫియా గుప్పిట అసైన్డ్ భూములు

న్యూస్‌టుడే, చిల్లకూరు

పేదలు, ప్రభుత్వ భూములే లక్ష్యంగా మట్టి మాఫియా దందా కొనసాగిస్తోంది. గూడూరు నియోజక వర్గ పరిధిలో విరివిగా ప్రైవేటు లేఅవుట్లు వెలుస్తున్నాయి. దీనికితోడు సాగరమాల రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటన్నింటికీ గ్రావెల్ అవసరం. ఇదే అక్రమార్కులకు వరమైంది. కొందరు పేదలను మభ్యపెట్టి తక్కువ ధరకు అసైన్డ్ భూములను కొనుగోలు చేశారు. వాటిల్లో గ్రావెల్ తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూములను సైతం వదల్లేదు. విలువైన భూములు గుంతలుగా మారి పనికిరాకుండా పోతున్నాయి.

ఎక్కడెక్కడంటే..

చిల్లకూరు మండలంలోని తిక్కవరం రెవెన్యూ పరిధిలోని చేడిమాలలో గ్రావెల్ తవ్వకాల పుణ్యమాని ప్రస్తుతం బావులను తలపిస్తున్నాయి. తొణుకుమాల, కలవకొండ, తిమ్మనగారిపాలెం తదితర గ్రామాల్లో తవ్వకాలు సాగుతున్నాయి. కోట మండలంలోని ఊనుగుంటపాలెంలో దాదాపు వంద ఎకరాల అసైన్డ్ భూములు గ్రావెల్ మాఫియా గుప్పిట ఉన్నట్లు సమాచారం. గ్రామంలో పేదల ఇళ్లస్థలాల కోసం కేటాయించిన భూమిని తవ్వేశారు. చిట్టమూరు మండలంలోని మెట్టులో ఏడెకరాల్లో తవ్వకాలకు అనుమతులు తీసుకుని దాదాపు 40 ఎకరాల్లో తవ్వి తరలించారు.

నాయకులే వ్యాపారులై..

ఆయా గ్రామాల్లో స్థానికంగా ఉన్న నేతలే దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పెద్దల నుంచి అభయం ఉండటంతో అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు ఎవరూ సాహసించడం లేదన్న విమర్శలున్నాయి. ఎకరా భూమి రూ.4లక్షలకు కొనుగోలు చేసి అందులో రూ.కోట్ల విలువజేసే గ్రావెల్‌ను కొల్లగొడుతున్నారు. ప్రైవేటు వెంచర్ల నిర్వాహకులకు విక్రయించి జేబులు నింపుకొంటున్నారు. ఇది నిరాటంకంగా సాగుతున్నా ఎక్కడా చర్యలు చేపట్టిన దాఖలాలులేవు.

ఎక్కడా అనుమతుల్లేవు

ఎన్‌హెచ్ఏఐ పీడీ అభ్యర్థన మేరకు రహదారి నిర్మాణ, ప్రభుత్వ పనులకు తాత్కాలిక పర్మిట్లు ఇస్తున్నాం. ప్రైవేటు వ్యక్తులకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. గ్రావెల్ తరలింపుపై తనిఖీ కేంద్రాల్లో చేస్తున్న వసూళ్లు అనధికారికంగానే జరుగుతున్నాయి. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాసరావు, ఏడీఎంజీ, గూడూరు

లీకేజీల నివారణకు గేట్లకు రబ్బరు సీళ్లు: ఎస్ఈ

సంగం బ్యారేజీని పరిశీలిస్తున్న తెలుగుగంగ ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు

సంగం, న్యూస్‌టుడే: సంగం బ్యారేజీని ఆదివారం తెలుగుగంగ ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఈఈ మేకల అనిల్‌కుమార్‌రెడ్డి అత్యవసరంగా పరిశీలించారు. సంగం బ్యారేజీ గేట్ల అడుగు భాగం నుంచి నీరు లీకవుతుండటంపై 'సంగం.. లీకేజీల సంకటం' శీర్షికన 'ఈనాడు'లో ఆదివారం కథనం ప్రచురితమైంది. కలెక్టరు హిమాన్షు శుక్లా స్పందించారు. వెంటనే పరిశీలించి లీకేజీని అరికట్టాలని తెలుగుగంగ విభాగం అధికారులను ఆదేశించడంతో వారు వచ్చి నిర్ధారించుకున్నారు. గేట్లకు రబ్బరు సీళ్లు వేయించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ మార్చి నెలాఖరు వరకు తొలి పంటకు, మే 15 నుంచి రెండో పంటకు సాగునీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. ఏఈ మల్లికార్జున హాజరయ్యారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
పదవీ విరమణ శుభాకాంక్షలు
జన్మదిన శుభాకాంక్షలు
అంత్యక్రియలు, వర్థంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
జీఎస్‌టీ 5% అదనం
ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

(c) eenadu

వసతిగృహం శిథిలం.. జూదానికి స్థావరం

విడవలూరులోని బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరడంతో మూతపడింది. కొందరు ఆకతాయిలు హాస్టల్ తలుపులు, కిటికీలు ధ్వంసం చేసి అందులో పనికొచ్చే విలువైన వస్తువులు ఎత్తుకెళ్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మందు బాబులు, జూదరులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు, పోలీసులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, విడవలూరు

ఆదమరిస్తే అంతే..

కొడవలూరు మండలం యల్లాయపాళెం వద్ద మలిదేవి డ్రెయిన్‌పై ఉన్న వంతెన రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొంచెం ఆదమరిచినా, ఎదురుగా వాహనం వచ్చి పక్కకు వెళ్లినా కాలువలో పడిపోయే ప్రమాదముందని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం వరికోతల సమయంలో లారీలు, ట్రాక్టర్లు ఈ మార్గంలో వెళ్తాయని అధికారులు స్పందించి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొడవలూరు

గాంధీ పార్కు మూసేశారు

కోవూరు పట్టణ నడిబొడ్డులో ఉన్న గాంధీ పార్కు. వినియోగంలో ఉందా..? లేదా..? అన్న సందిగ్ధం నెలకొంది. ఎప్పుడు చూసినా తాళం వేసి ఉండడంతో విశ్రాంత ఉద్యోగులు, చిన్నారులు వచ్చి వెనుదిరుగుతున్నారు. ప్రవేశంలోనే భారీ ఫ్లెక్సీలు ఉండగా, కొందరు ఆటోస్టాండుగా మార్చేశారని పలువురు వాపోతున్నారు. లోపల ప్రైవేట్ వాహనాలు పెడుతున్నారు, అధికారులు నిత్యం ఈ మార్గంలో వెళ్తున్నా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి పార్కులో వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు విన్నవిస్తున్నారు. - న్యూస్‌టుడే, కోవూరు

మరుగుదొడ్లకు కర్రలే తలుపులుగా!

పొదలకూరు ఆర్టీసీ బస్టాండు అధ్వానంగా ఉండడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక కుర్చీలు, ఫ్యాన్లు ఇతర వసతులు సమకూర్చింది. బస్సులు కూడా బస్టాండు లోపలికి వచ్చి వెళుతున్నాయి. నిత్యం వినియోగించే మరుగుదొడ్లకు కనీసం తలుపులు బిగించలేదు. దీంతో కర్రలే రక్షణగా ఉంచారు. ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

బాల్య వివాహాల నియంత్రణకు కృషి: ఎంపీ

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: అధికారులు, స్వచ్ఛంద సంస్థలే కాకుండా ప్రతిఒక్కరూ బాల్య వివాహాల నియంత్రణకు కృషి చేయాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరులోని తమ నివాసం వద్ద బాల్యవివాహాల నియంత్రణపై చైతన్య స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త్ ప్రచార రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఐ.శ్రీనివాసరావు, కోఆర్డినేటర్లు శంకరయ్య, మున్వర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో మత్స్యకారులకు ఉపాధి

నెల్లూరు(గ్రామీణం), న్యూస్‌టుడే: మీనోత్సవం కార్యక్రమంలో భాగంగా నగరంలోని స్వర్ణాలచెరువులో 8.55 లక్షల చేప పిల్లలను ఆదివారం వదిలారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ జేడీ శాంతి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరనుందన్నారు. తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నెల్లూరు ఏఎంసీ ఛైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, బర్నాబాస్, శరత్‌చంద్ర, రవి, వాడనాల చిట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో ఎస్పీబీది చెరగని స్థానం

నెల్లూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే: పాటల రూపంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచే ఉంటారని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. ఆయన పాడిన గీతాలు అజరామరంగా ఉంటాయన్నారు. నెల్లూరులోని మినీబైపాస్ రోడ్డులో ఎస్పీబీ అభిమానుల ఆధ్వర్యంలో అన్నమయ్య విగ్రహం సర్కిల్ సమీపంలో ఎస్పీబీ పార్కు స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటుచేస్తున్నారు. దీనికి ఆదివారం శంకుస్థాపన ఘనంగా జరిగింది. జూన్ నాలుగో తేదీ ఆయన జన్మదినం సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని కమిటీ సభ్యులు ప్రకటించారు. కార్యక్రమంలో శివప్రసాద్‌రెడ్డి, హజరత్‌బాబు, బలరామయ్యనాయుడు, సుబ్బారావు, కాంచని అనంత్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే కోటంరెడ్డి తదితరులు

నేటి నుంచి సార్వత్రిక ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: సార్వత్రిక ఇంటర్ విద్యార్థులకు సోమవారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు, పదోతరగతి విద్యార్థులకు 16 నుంచి 28వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్. బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పదోతరగతి వారికి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. ఇంటర్‌కు 12, పదోతరగతికి 15 కేంద్రాల చొప్పున ఏర్పాటు చేశామని తెలిపారు.

◗ గతేడాది డిసెంబర్ 30న మనుబోలు మండలం గుడిపంద పూడి జాతీయ రహదారి వద్ద విజిలెన్స్, రెవెన్యూ, సీఎస్ అధికారులు దాడులు చేసి అక్రమంగా తరలిస్తున్న రూ.2 లక్షల విలువైన 4250 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు.

◗ జనవరి 22న బద్వేలు అడ్డరోడ్డు కూడలి వద్ద ముందు వెళుతున్న లారీని ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, పౌరసరఫరాల అధికారులు వాహనం పరిశీలించగా రూ.3.65 లక్షల విలువైన 96 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

◗ ఫిబ్రవరి 15న కాగితాలపూరు అడ్డరోడ్డు సమీపంలో పెట్రోలు బంకు వద్ద ప్రకాశం జిల్లా దర్శి నుంచి చెన్నైకి లారీలో బియ్యం తరలిస్తున్నారు. అధికారులు తనిఖీ చేయగా 700 బస్తాల్లో రూ.14.70 లక్షల విలువైన 35 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని పొదలకూరులోని పౌర సరఫరాల గోదాముకు తరలించారు.

◗ ఫిబ్రవరి 28న వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద ఒంగోలు నుంచి లారీలో తరలిస్తున్న 310 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు.

టన్నుల్లో రవాణా.. దొరికేది కొంతేనా..!

కాగితాలపూరు వద్ద రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్న అధికారులు

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్, మనుబోలు

పేదల ఆకలి తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై సరఫరా చేస్తున్న చౌక బియ్యం దొడ్డిదారిన వివిధ ప్రాంతాలకు తరలిపోతోంది. అక్రమార్కులు బియ్యం రవాణాకు జాతీయ రహదారిని ప్రధాన మార్గంగా ఎంచుకుంటున్నారు. క్వింటా, రెండు క్వింటాళ్ల బియ్యం రవాణా చేసే వారిపై పీడీ యాక్టు నమోదు చేసే అధికారులు లారీల్లో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం తరలిపోతున్నా చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయి. డ్రైవర్, యజమానిపై 6ఏ కేసు మాత్రమే చేసి వదిలేస్తున్నారు. గూడూరు, ప్రకాశం జిల్లాలతో పాటు గూడూరు, కావలి, కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి, ఉదయగిరి, నెల్లూరు నుంచి జాతీయ రహదారి మీదుగా చెన్నై పోర్టుకు తరలిస్తున్నారని సమాచారం. జిల్లాలో ఐదేళ్లు విజిలెన్స్ అధికారుల దాడుల్లో భారీగా పట్టుబడుతుంటే, ప్రతి మండలంలో పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. అధికారులు మాత్రం సమాచారం వస్తేనే తనిఖీలు చేసి మమ అనిపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో డీలర్లు, వ్యాపారులతో కుమ్మక్కై, సరిహద్దులు దాటిస్తున్నారు.

● పౌరసరఫరాల డీటీ రవి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడైనా రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని గుర్తిస్తే సమాచారమివ్వాలని కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

పగలు, రాత్రి తేడా లేకుండా ప్రత్యేక వాహనాల్లో తరలిపోతోంది. లారీల్లో టన్నుల కొద్దీ బస్తాలను తరలిస్తున్న వాహనాలను వదిలేసి చిన్న వాహనాలను పట్టుకుంటున్నారు. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు గ్రామాల్లో తిరిగి బియ్యాన్ని సేకరించి తరలించేందుకు వ్యూహం రచిస్తున్నారు. పలుచోట్ల సొంత కిరాణా దుకాణాల్లోనే నిల్వచేసి విక్రయిస్తున్నారు. నిరంతర నిఘాతో తనిఖీలు చేస్తున్నామని చెబుతున్న పౌరసరఫరాల అధికారుల మాటల్లో నిజమెంత అనేది పట్టుబడ్డ బియ్యం సాక్ష్యంగా నిలుస్తోంది.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్, ఐఐటీ, నీట్ కోచింగ్ ప్రవేశాలకు ఆదివారం కోడూరు గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఐదో తరగతి ప్రవేశానికి 102 మంది, ఇంటర్మీడియట్‌కు 156, ఐఐటీ, నీట్ కోచింగ్‌కు 109 మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ తెలిపారు. పరీక్ష నిర్వహణ తీరును తహసీల్దార్ సుధీర్ పరిశీలించారు.

అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని, గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీలకు రెండు నెలల వేతనాలు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇప్పటికే కొన్ని డిమాండ్లను పరిష్కరించామన్నారు. ప్రతి నెలా 1న వేతనాలు చెల్లిస్తున్నామని, స్మార్ట్‌ఫోన్లు అందించామని, వేసవిలో 15 రోజులు సెలవులిచ్చామని, కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి కృషి

మాట్లాడుతున్న మాజీ సీఎండీ రంగనాథం

నెల్లూరు (విద్యుత్తు), న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎస్పీడీసీఎల్ మాజీ సీఎండీ రంగనాథం పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని విద్యుత్తు భవన్‌లో జిల్లా విద్యుత్తు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మరో మాజీ సీఎండీ పొంగూరు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విశ్రాంత జీవితంలో ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయరాదని పేర్కొన్నారు. ఎనెల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ రాఘవేంద్రం, టెక్నికల్ అధికారి బాలచంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు అనిల్‌కుమార్, శివప్రసాద్, సంపత్, అయ్యర్, రాష్ట్ర పవర్ డిప్లొమా అసోసియేట్ నాయకులు శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండు వినియోగంలోకి తీసుకొస్తాం

తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: తోటపల్లిగూడూరు మండల కేంద్రంలోని బస్టాండును అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకొస్తామని ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. తోటపల్లిగూడూరులో నిరుపయోగంగా మారిన ఆర్టీసీ బస్టాండును ఆదివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా బస్టాండు వినియోగించక పోవడంతో నిరుపయోగంగా మారిందన్నారు. ప్రజల కోరిక మేరకు పూర్తిస్థాయి వసతులతో అభివృద్ధి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆర్టీసీ ట్రాఫిక్ మేనేజర్ రమేశ్, భాజపా నాయకులు వెంకురెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వసతులు పరిశీలిస్తున్న ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా i) శ్రీ పేట వెంకట రమణారెడ్డి తండ్రి స్వర్గీయ శ్రీ పేట జానకిరాం రెడ్డి ii) శ్రీమతి పేట ఇందిర రెడ్డి భర్త స్వర్గీయ శ్రీ పేట జానకిరాం రెడ్డి సుండి నా క్లయింటు దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తిని కొనుగోలు చేయుటకు సంప్రదించారు మరియు ఉద్దేశిస్తున్నారు.

ఏదేని ఒప్పందం లేదా ఏదేని డాక్యుమెంట్ రూపంలో వారసత్వం, కానుక, లీజు, కౌలు, తనఖా, అమ్మకం, మార్పిడి, ధారణాధికారం, ఛార్జ్, మెయింటెనెన్స్, అనుభోగ హక్కు, ట్రస్ట్ లేదా ఇతరత్రా రూపంలో సదరు షెడ్యూలు ఆస్తి లేదా అందలి ఏదేని భాగానికి సంబంధించి ఏదేని హక్కు, టైటిల్, క్లెయిమ్ లేదా ప్రయోజనం కలిగిన ఎవరేని వ్యక్తి ఏడు (7) రోజులలోగా దిగువ సంతకందారుకు డాక్యుమెంటరీ రుజువుతో సహా లిఖితపూర్వకంగా తెలియజేయవల్సిందిగా కోరడమైనది, లేనిచో నా క్లయింట్ పేరున సదరు షెడ్యూలు ఆస్తి యొక్క విక్రయ ప్రతిపాదన పట్ల ఎవరికీ ఏలాంటి క్లెయింలు లేదా అభ్యంతరాలు లేవని భావించబడును మరియు ఏ వ్యక్తి నుండి అలాంటి క్లెయింలు మరియు అభ్యంతరాలకు ఏలాంటి రిఫరెన్స్ లేకుండా సదరు ప్రకటన వ్యవధి ముగిసిన మీదట సదరు అమ్మకంను పూర్తి చేయుటకు నా క్లయింట్ స్వేచ్ఛ కలిగి వుంటారు.

షెడ్యూలు ఆస్తి

ఆంధ్రప్రదేశ్, తిరుపతి, ఇప్పుడు తిరుపతి జిల్లా, పాత ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా, సూళ్లూరిపేట రిజిస్ట్రేషన్ జిల్లా, తడ రెవెన్యూ మండలం, తడ గ్రామం మరియు గ్రామపంచాయతీ, పార్క్ అవెన్యూ లేఔట్‌లో సర్వే నెం.లు 8/3బి, 8/4ఎ మరియు 8/5ఎలో i) ప్లాట్ నెం.4 (1779.16 చ.గజాల విస్తీర్ణం), ii) ప్లాట్ నెం.5 (443.88 చ.గజాల విస్తీర్ణం), iii) ప్లాట్ నెం.6 (364.44 చ.గజాల విస్తీర్ణం), మొత్తం విస్తీర్ణం (సుమారు) 2587.48 చ.గజాలతో ప్లాట్లు యావత్తు. సరిహద్దులు: **ఉత్తరం:** ప్లాట్ నెం.3, **దక్షిణం:** రోడ్డు, **తూర్పు:** రోడ్డు, **పడమర:** పొరుగువారి భూమి & సర్వే నెం.8/3బిలో భూమి.

ఎస్.అభయ్ కుమార్ సాగర్, అడ్వొకేట్
ప్లాట్ నెం.302-బి, ఇంటి నెం.8-2-310/ఎ/31,
హిల్‌టాప్ రెసిడెన్సీ, నందినగర్, రోడ్ నెం.14, బంజారాహిల్స్
హైదరాబాద్-500034. **ఫోన్: 9849368215,**
ఇమెయిల్: **sagar.abhay@yahoo.co.in**

తేది:02.03.2026
హైదరాబాద్

నెల్లూరు నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి.నెం. 112/2016/ఎ1

బహిరంగ వేలము ప్రకటన

నెల్లూరు నగరపాలక సంస్థ ఆధీనములో ఉన్నటువంటి ఈ దిగువ తెలిపిన మార్కెట్‌లు మరియు గొర్రెల మరియు పశువుల గంజిఖానాలకు సంబంధించి **2026–2027**వ సంవత్సరమునకు గాను బహిరంగ వేలము నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయములో తేది **07–03–2026**న ఉదయం 11 గంటలకు నిర్వహించబడును.

ఈ దిగువ చూపబడిన పట్టికలో వరుస నెం. 3, 4 మరియు 6 లకు జరుపు వేలం పాట నందు మత్స్యకారులు / మత్స్యకారుల సొసైటీ వారు మాత్రమే పాల్గొనవలయును మరియు బహిరంగ వేలములో పాల్గొనుటకు ధరావత్తు (Deposits) సొమ్ము చెల్లించేటప్పుడు వారి యొక్క కుల ధ్రువీకరణ పత్రమును లేదా ప్రస్తుత మత్స్యకారుల సొసైటీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ఈ కార్యాలయమునకు సమర్పించవలెను.

సదరు బహిరంగ వేలంలో పాల్గొనదలచిన పాటదారులు ఈ దిగువ తెలిపిన విధముగా పూర్తి వివరములతో మరియు గెజిట్ నోటిఫికేషన్ నిబంధనల ప్రకారము వేలం పాటలో పాల్గొనవచ్చును.

వరుస సంఖ్య	ప్రాంతము పేరు	కాల పరిమితి	డిపాజిట్ (రూ.)	సాల్వెన్సీ
1.	డైకస్ రోడ్డు గొర్రెల గంజిఖానా	12 నెలలు	50,000	2,00,000
2.	డైకస్ రోడ్డు మార్కెట్ మరియు పశువుల గంజిఖానా	12 నెలలు	20,000	50,000
3.	డైకస్ రోడ్డు చేపల మార్కెట్టు	12 నెలలు	2,00,000	4,00,000
4.	శెట్టిగుంట రోడ్డు చేపల మార్కెట్టు	12 నెలలు	20,000	1,00,000
5.	మైపాడు రోడ్డు చేపల మార్కెట్టు	12 నెలలు	2,00,000	4,00,000
6.	డైకస్‌రోడ్డులోని చేపలు శుభ్రపరచగా వచ్చు వ్యర్థములు	12 నెలలు	2,00,000	4,00,000

పై తెలిపిన మార్కెట్టులకు, గొర్రెల గంజిఖానాలకు మరియు పశువుల గంజిఖానాలకు సంబంధించిన వివరములకు కార్యాలయము పనిచేయు వేళలో రెవిన్యూ సూపరింటెండెంటు గారిని లేదా ఎ1 గుమాస్తా గారిని సంప్రదించి వివరములు తెలుసుకొనవలసినదిగా కోరడమైనది.

కమీషనర్, నెల్లూరు నగరపాలక సంస్థ

నేడు డయల్ యువర్ ఎస్ఈ

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.రాఘవేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమయంలో 08612320427 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలిపితే పరిష్కరిస్తామని వివరించారు.

15 లోగా పన్ను బకాయిలు వసూలు చేయాలి

రాపూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఇంటిపన్నుల బకాయిలు రూ.13 కోట్లు రావాల్సి ఉందని డీపీవో వసుమతి అన్నారు. ఆదివారం రాత్రి రాపూరులో పర్యటించారు. ఇంటి పన్నుల బకాయిలు ఉన్న వారి వద్దకు సిబ్బందితో వెళ్లి మాట్లాడారు. ఈనెల 15 లోగా పెండింగ్ బకాయిలను వంద శాతం వసూలు చేయాలన్నారు. స్థానికుల వినతి మేరకు రాపూరులో కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని వాటిని పట్టుకొని ఊరికి దూరంగా తరలిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విరాళాలు సేకరించి.. మృతదేహం తరలించి

ఎడపల్లి, న్యూస్‌టుడే : నెల్లూరు జిల్లాకు చెందిన దంపతులు ఇటీవల ఉపాధి నిమిత్తం తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా ఎడపల్లికి వలస వచ్చారు. ఎడపల్లిలో జ్యూస్ విక్రయ కేంద్రం ఏర్పాటు చేసి ఉపాధి పొందుతున్నారు. భర్త అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందారు. మృతదేహాన్ని స్వస్థలానికి తరలించేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో గ్రామస్థులు స్వచ్ఛందంగా స్పందించారు. సర్పంచి రాంచందర్‌తో పాటు పలువురు నగదు విరాళం ఇచ్చారు. మొత్తం రూ.40వేలను ఆయన భార్యకు అందజేశారు. ఆదివారం మృతదేహాన్ని నెల్లూరు జిల్లాకు తరలించారు.

లైంగిక వేధింపులపై పోక్సో కేసు

కోవూరు, న్యూస్‌టుడే: బాలికకు వరుసకు తండ్రి.. లైంగికంగా వేధిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు... కోవూరు మండల పరిధిలోని ఒక గ్రామంలో మహిళ భర్త మృతిచెందగా రెండో వివాహం చేసుకున్నారు. అప్పటికే ఆమెకు పదేళ్ల కుమార్తె ఉంది. అతను బాలికను లైంగికంగా వేధిస్తుండడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

కోట, న్యూస్‌టుడే: పొలాల్లోకి దాహార్తిని తీర్చుకునేందుకు వచ్చిన జింకపై కుక్కలు దాడి చేయడంతో మృత్యువాత పడింది. స్థానికుల వివరాల మేరకు..మండల పరిధిలోని అల్లంపాడు సమీపంలో ఆదివారం పొలాల్లోకి జింకల గుంపు దాహార్తి తీర్చుకునేందుకు వచ్చాయి. గమనించిన కుక్కలు వాటిపై దాడికి పాల్పడ్డాయి. ఒక జింక మాత్రం ఎటూ వెళ్లలేక వాటి బారిన పడి తీవ్ర గాయాలతో పడిపోయింది. రైతులు దానికి సపర్యలు చేసినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే అటవీశాఖాధికారులకు సమాచారమివ్వగా జింక కళేబరాన్ని పంచనామాకు తరలించారు.

ఇస్రో ఆహ్వానం.. యువ శాస్త్రవేత్తలే లక్ష్యం

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు

పాఠశాలల విద్యార్థులకు అంతరిక్ష పరిజ్ఞానాన్ని పెంచుతూ వారిలోని సృజనాత్మకతను వెలికితీసి శిక్షణ ఇచ్చి యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) అవకాశం కల్పిస్తోంది. యువ విజ్ఞాన్ కార్యక్రమం యువికా-2026లో పాల్గొనేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

పరిశోధనలపై ఆసక్తి ఉన్నవారికి..

దేశంలోని పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అంతరిక్ష శాస్త్రంపై అవగాహన, నిజజీవితంలో వాటి ఉపయోగం తదితర ప్రాథమిక పరిజ్ఞానాన్ని దీని ద్వారా కల్పించనున్నారు. వివిధ దశల అనంతరం వారిని ఎంపిక చేసి తరగతులు నిర్వహించి అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన, అభిరుచిని కలిగించడం, అంతరిక్ష విజ్ఞానంపై మరింత సమాచారం అందించడమే లక్ష్యం.

అర్హత.. ఎంపిక

◗ 2026 జనవరి 1 నాటికి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ◗ ఎనిమిదో తరగతి మార్కులకు 50 శాతం, ఆన్‌లైన్ క్విజ్ పది శాతం వెయిటేజీ ఇస్తారు. ◗ స్పేస్, సైన్స్ క్లబ్‌ల్లో ఉంటే 5, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి 10, క్రీడల్లో సత్తా చాటిన వారికి 10, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాల్లో ఉండే వారికి 5, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి 20 శాతం వెయిటేజీ కల్పించనున్నారు. ఎంపికైన వారి జాబితా ఏప్రిల్ 20న విడుదల చేస్తారు. ◗ ఎంపికైన వారికి దేశవ్యాప్తంగా ఉన్న ఏడు ఇస్రో కేంద్రాల్లో శాస్త్ర, సాంకేతికతకు సంబంధించిన వివిధ అంశాలపై మే 11 నుంచి 22 వరకు రెండు వారాల పాటు శిక్షణ ఇస్తారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖి మాట్లాడే అవకాశం కల్పిస్తారు. అంతరిక్షంలో సాధిస్తున్న ప్రగతి, సవాళ్లు, తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారు. నిపుణులతో చర్చాగోష్ఠి నిర్వహిస్తారు. ఖర్చంతా ఇస్రోనే భరిస్తుంది.

దరఖాస్తు ఇలా..

◗ మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు
◗ https://jigyasa.iirs.gov.in/yuvika లేదా www.isro.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి విద్యార్థి పేరు, ఈ-మెయిల్ ఐడీతో రిజిస్టర్ చేసుకోవాలి. మీ ఈ-మెయిల్‌కు వచ్చే లింక్‌పై క్లిక్ చేసి సరి చూసుకోవాలి. ◗ లాగిన్ అనంతరం విద్యార్థులు ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. ◗ క్విజ్ పూర్తయ్యాక వ్యక్తిగత వివరాలు, చదువుకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ ఫామ్‌లో నింపాలి.

సద్వినియోగం చేసుకోవాలి.. ఎన్.శివారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చు. పరిశోధనలపై ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం. అర్హత, ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలి. పూర్తి వివరాలకు 9347121712 చరవాణి నంబరుకు సంప్రదించాలి.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా విడుదల

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : జిల్లాలో వివిధ యాజమాన్యాల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా ఆన్‌లైన్‌లో పొందుపరిచామని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో ఈ నెల ఏడో తేదీ లోపు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయ పనివేళల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలని కోరారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ.15,896
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ.1,27,168
వెండి గ్రాము :	రూ.310.00

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	153
లేయర్	85
బ్రాయిలర్స్	270
బ్రాయిలర్ స్కిన్‌లెస్	300
లేయర్ మాంసం	145

యథేచ్ఛగా ఆక్రమణలు.. కనుమరుగవుతున్న కాలువలు

న్యూస్‌టుడే, కోవూరు, విడవలూరు

డెల్టా ప్రాంతంలో సాగునీటి కాలువలు కనుమరుగవుతున్నాయి. గతంలో 20 అడుగుల మేరకు ఉన్నవి నేడు ఆక్రమణలతో అయిదు అడుగులకు పరిమితమయ్యాయి. కోవూరు చెరువు నుంచి పట్టణం మీదుగా వెళుతున్న కాలువ ఇరువైపులా భారీ భవంతులు నిర్మించారు. బజారు కూడలి వద్ద కల్వర్టు ధ్వంసమైతే వైకాపా పాలనలో పట్టించుకోకపోవడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలతో సతమతమయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కాలువ ఇరవై అడుగులు విస్తరించి నిర్మించడంతో దశాబ్దాలుగా నెలకొన్న సమస్య పరిష్కారమైంది. దీంతో పాటు రెండు వైపులా అక్రమ నిర్మాణాలు తొలగించాలని పలువురు విన్నవిస్తున్నారు.

బజారు కూడలి సమీపంలో ఆక్రమణలతో పీటర్ కాలువ ఇలా...

❖ కోవూరు మేజరు పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో 40 వేల మందికిపైగా జనాభా ఉన్నారు. ఎక్కువ భాగం డ్రెయిన్ల ఆక్రమణలతో వర్షాకాలంలో మురుగు నీరు గృహాల్లోకి చేరుతోంది. గతేడాది అక్టోబరు, నవంబరు నెలలో వర్షాలకు బండారు మాన్యం, రైల్వేగేటు రోడ్డు తదితర ప్రాంతాలు ముంపునకు గురికావడంతో స్థానికులు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లో కాలువలపై ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. వారు కొంత మేరకు చేసి వదిలేయడంతో మరలా యథాస్థితికి చేరాయి. పీటర్ కాలువ, గునేషావలి దర్గా వద్ద కాలువ తదితర కాలువల్లో పూడిక తీయాలన్న భారీ నిర్మాణాలు అడ్డుగా ఉన్నాయి.

❖ గత నెల 27న డ్రైనేజీ కాలువల్లో పూడికతీయిస్తామని దండోరా వేసిన పంచాయతీ అధికారులు తరువాత మమ అనిపించారు. పట్టణంలో శీలంశెట్టివారి వీధి, ఆంజనేయస్వామి గుడి, జంగం వీధి, బజారు కూడలి, మటన్ మార్కెట్ వద్ద, పెళ్లకూరు కాలనీ తదితర ప్రాంతాల్లో కాలువలు ఆక్రమించారని అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులిస్తున్నా బుట్టదాఖలవుతున్నాయి.

❖ విడవలూరు మండలంలోని రామతీర్థం, ముదివర్తి, ఊటుకూరు, విడవలూరు, పార్లపల్లి గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు ఆక్రమణలతో అధ్వానంగా ఉన్నాయి. ఎమ్మెల్యే స్పందించి నీటిపారుదల శాఖ, పంచాయతీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేస్తే ముంపు నుంచి ముప్పు తప్పుతుందని ప్రజలు వేడుకుంటున్నారు.

EENADU Classifieds

EDUCATION

DISTANCE EDUCATION

Ph.D, B.Tech, M.Tech, Diploma, MBA, MCA, MSc, B.Sc, BCA, BBA, Pharmacy, LLB, 10th, Inter. Ph: 9030030125

JOBS

Wanted Experienced and Freshers PRO's (Salary 20000+TA+INC), Front Office Executives & Educational Counsellors for a reputed School in Nellore. Cont:9959493926

A Leading food industry in Nellore requires a experienced Supervisor Personnel with the following credentials. Qualification: B.Com. Experience: In any Manufacturing Industry. Should have exposure in Accounts, HR, Admin & General Operations. Age: Max 35 Yrs. Salary: Commensurate with qualification & experience. Please ping us @ 9866546060

శ్రీ మ్యారేజ్ కన్సల్టెన్సీ నందు పని చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. అడ్రస్: కొండాయపాళెం గేట్ ఎదురువీధి, నెల్లూరు. Ph: 8885567277, 8985048177

కర్నూలులో హోటల్‌కు మంచి నైపుణ్యం కలిగిన వంట మాస్టర్లు మరియు టిఫిన్ మాస్టర్ కావలెను. No Brokers. సంప్ర: 97019 47479.

ABC సోలార్ నందు నెల్లూరు జిల్లాలో పని చేయుటకు అనుభవము కలిగి అభ్యర్థులు కావలెను. జీతం: Rs.25,000+ అలవెన్సు. Ph: 9849799041 / 8801139300

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు... B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే వివరాలకు.. నెల్లూరు 80080 01790
మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 600 Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్‌వారికి ఉచిత భోజనము వసతి కల్పించ బడును) విద్యార్హతలు: ఇంటర్ to డిగ్రీ వరకు, వయస్సు: 22 సం||ల నుండి 40 సం||లు ఉండవలెను. వివరములకు సంప్ర: ✆ 92487 33372.

ప్రముఖ యూట్యూబ్ ఛానల్‌కు కాపీ రైట్ ప్రాబ్లమ్ లేని వీడియోస్, షార్ట్స్ చేయుటలో అనుభవం కలిగి, మంచి సొంత కంటెంట్ కలిగి ఉన్నవారు, & వీడియోస్ షూటింగ్, ఎడిటింగ్ & గ్రాఫిక్‌లో అనుభవం ఉన్నవారు ఫుల్ టైమ్ / పార్ట్ టైమ్ పనిచేయుటకు కావలెను. ✆ 7989048868

FACULTY/ TEACHERS

నలంద CBSE స్కూల్ కావలి, గాయత్రినగర్ నందు పని చేయుటకు A.O., PROs, I to V తెలుగు టీచర్, వాచ్‌మెన్, ఆయాలు కావలెను. మంచి జీతం, ఉచిత భోజనం, వసతి (నాన్ లోకల్స్ వారికి)కల్పించబడును. ✆ 9989433348, 9121024992

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయ రాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

కావలి

•కావలి •ఉదయగిరి •ఆత్మకూరు

సోమశిలకు 985 క్యూసెక్కుల వరద

అనంతసాగరం: సోమశిల జలాశయంలో ఆదివారానికి 985 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరింది. 65.280 టీఎంసీల నీరు నిల్వ ఉండగా -17, -18 రివర్స్ స్లూయీస్ ద్వారా 50, పవర్ టన్నల్ ద్వారా 1,850 క్యూసెక్కులు డెల్టాకు, కండలేరు వరద కాలువకు 50, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

ప్రజలకు భరోసా కల్పించాలి

చేజర్ల: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లను రెండు వారాల్లో పూర్తి చేయాలని డీపీవో వసుమతి సూచించారు. ప్రజల నుంచి వసూలు చేసే పన్నులు సక్రమంగా వినియోగిస్తున్నట్లు వారికి భరోసా కల్పించాలన్నారు. ఆదివారం చేజర్లలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొని సూచనలు చేశారు. స్వామిత్వ ప్రయోజనాలు, పన్నులు చెల్లించటంతో లభించే హక్కులను తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అమర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కళాశాలలో సీసీ కెమెరాలు ధ్వంసం

బిట్రగుంట, న్యూస్‌టుడే: బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి మరికొన్నింటిని దొంగిలించారు. ఆదివారం ఉదయం వచ్చేసరికి సీసీ కెమెరాలు, ఇంటర్‌నెట్ తీగలు, మరుగుదొడ్ల సముదాయంలోని సామగ్రిని ధ్వంసం చేసి ఉండడాన్ని అధ్యాపకులు గమనించారు. ఈ విషయమై ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా అధికారులకు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
ఉదయగిరి : 80085 73944 ఆత్మకూరు: 8008573949

సమస్య: కావలి పట్టణ పరిధిలోని పెదపవని రోడ్డు ప్రాంతంలో చెత్తను ఎక్కడికక్కడ తగలబెడుతున్నారు. – మునాఫ్ బాషా, స్థానికుడు
సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – బషీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కావలి పురపాలకం

? సంగం మండల పరిధిలోని కోలగట్ల గ్రామంలోని గిరిజన కాలనీ వద్ద పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. – చెంగయ్య, స్థానికుడు
✓ వెంటనే పరిసరాలను శుభ్రం చేయిస్తాం. – అమర్‌నాథ్, పంచాయతీ కార్యదర్శి, కోలగట్ల

? ఆత్మకూరు టిడ్కో రోడ్డు కూడలి వద్ద వీధి దీపం సరిగా వెలగడం లేదు. – పెంచలయ్య
✓ కూడలి వద్ద కొత్త దీపాన్ని ఏర్పాటు చేస్తాం.–గంగాప్రసాద్, కమిషనర్, ఆత్మకూరు

? వరికుంటపాడు మండలం కనియంపాడులో ప్రధాన రహదారి పక్కనే ఉన్న మురుగు కాలువ పూడికతో నిండిపోయింది. – వెంకటస్వామి
✓ పరిశీలించి కాలువను శుభ్రం చేయిస్తాం. - రమేష్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో

? మర్రిపాడు మండలం, పొంగూరు ఉన్నత పాఠశాలకు ఒక పక్క ప్రహరీ లేకపోవడంతో విషపురుగులు ఆవరణలోకి వస్తున్నాయి. విద్యార్థులకు ఇబ్బందిగా ఉంది. – రమణయ్య
✓ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. - తిరుపతయ్య, ఎంఈవో

? ఏఎస్‌పేట మండలంలోని పొనుగోడు నుంచి ఏఎస్‌పేటకు వెళ్లే మార్గంలో కంపచెట్లు పెరిగి ద్విచక్రవాహనాలు సైతం రాలేని పరిస్థితి ఉంది. – వెంకటేశ్వర్లు, గ్రామస్థుడు
✓ అధికారులతో మాట్లాడి కంపచెట్లు తొలగిస్తాం. – పద్మయ్యనాయుడు, సర్పంచి

? ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం నవజాత శిశు సంరక్షణ కేంద్రం ఎదురుగా చెత్తాచెదారాలు వేస్తున్నారు.–వెంకటేశ్వర్లు, స్థానికుడు
✓ చెత్తాచెదారాలు పారిశుద్ధ్య సిబ్బందితో తొలగిస్తాం. –కరీముల్లా, పంచాయతీ ఈవో

? మండలంలోని కనియంపాడు ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగడంలేదు. – యాకోబు
✓ సమస్యను పరిష్కరిస్తాం. – రమేష్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో, వరికుంటపాడు

? అనంతసాగరం మండల పరిధిలోని రేవూరు గ్రామంలోని ఎస్టీ కాలనీలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో సంచరించాలంటే భయంగా ఉంది. – పెంచలయ్య, స్థానికుడు
✓ పరిశీలించి వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. – రమణరావు, పంచాయతీ కార్యదర్శి

ఆక్రమించి.. నిర్మాణం చేపట్టి

న్యూస్‌టుడే, సంగం

నెల్లూరు-ముంబయి జాతీయ రహదారి పక్కనే గాంధీజన సంఘం సమీపంలో జలవనరుల శాఖకు చెందిన సుమారు రూ.50లక్షల విలువైన స్థలాన్ని కోళ్ల వ్యర్థాల వ్యాపారి ఒకరు ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. సంబంధిత శాఖాధికారులు చోద్యం చూస్తున్నారు. కనిగిరి జలాశయం ప్రధాన కాలువ, కాంగ్రెస్ కాలువల మధ్య 50 అంకణాలకుపైగా ఉన్న ఖాళీ స్థలం.. జాతీయరహదారికి తూర్పు వైపున ఉండటంతో గణనీయంగా విలువ పెరిగింది. దీంతో సదరు వ్యక్తి కన్ను పడింది. యంత్రసాయంతో ఆ ప్రదేశం రూపురేఖలు మార్చారు. అనంతరం చదును చేసి శాశ్వత భవన నిర్మాణ పనులు చేపట్టారు. కనిగిరి జలాశయం ప్రధాన కాలువ బెడ్ రెగ్యులేటరు నిర్వహణ, పర్యవేక్షణ చేసే సిబ్బంది అక్కడే ఉన్నా, దాన్ని అక్రమ కట్టడాన్ని ఆపేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

జలవనరుల శాఖ స్థలంలో అక్రమ నిర్మాణ పనులు

● జలవనరుల శాఖ ఏ.ఈ వినయ్ కుమార్‌తో మాట్లాడగా ఈ వ్యవహారం గురించి తమకు తెలియదని, వెంటనే నిలిపివేయించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్రాలు.. సమస్యల లోగిళ్లు

కావలి: గదిలో భవన నిర్మాణ సామగ్రి

న్యూస్‌టుడే, కావలి

పదోతరగతి పరీక్షలు ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం వివిధ పరీక్షా కేంద్రాలను 'న్యూస్‌టుడే' పరిశీలించగా, వాటిలో వసతుల లేమి స్పష్టంగా కనిపించింది. దీంతో పరీక్షల సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడనున్నారు.

● పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. అధికారులు కొత్తవి నిర్మించేందుకు పనులు ప్రారంభించి మధ్యలోనే ఆపేయడంతో బాలికలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బాలుర పాఠశాల పక్కనే ముళ్లపొదల్లోకి వెళుతున్నారు. అక్కడ సంచరించే విషసర్పాల కారణంగా గతంలో బయటి వ్యక్తి మృతి చెందారు.

● గత ప్రభుత్వంలో నాడు- నేడు పథకంలో భాగంగా పాతూరు పురపాలకోన్నత పాఠశాలలో పనులు ప్రారంభించి మధ్యలోనే ఆపేశారు. ప్రస్తుతం పీ-4 కార్యక్రమంలో భాగంగా దాతల సహాయంతో పూర్తిచేసేందుకు ఉపాధ్యాయులు నిరీక్షిస్తున్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల వసతి అంతంత మాత్రమే. ఫ్లోరింగ్‌పై కప్పేందుకు అవసరమైన నాపరాళ్లు పాఠశాల ఆవరణలోనే నిల్వ చేశారు.

● కళుగోళమ్మపేట పురపాలకోన్నత పాఠశాల ఆవరణలో సైకిళ్ల పార్కింగ్ ప్రదేశాన్ని ఇటీవల కొందరు ఆక్రమించారు. జడ్పీ బాలికోన్నత పాఠశాలలో వినియోగంలో లేని భవనాన్ని తొలగించాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నా అధికారులు స్పందించడం లేదు. ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లకు అసౌకర్యంగానే ఉంటోంది. ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ అసౌకర్యాలు వెంటాడుతున్నా ఇవేమీ పట్టవన్నట్లు పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

సౌకర్యాలు కల్పిస్తాం

ఆర్.బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి

వసతులు లేని పాఠశాలల్లో సౌకర్యాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. ఈ విషయమై డివిజన్ల వారీగా సమీక్షలు నిర్వహిస్తాం.

జిల్లాలో పరీక్షా కేంద్రాలు	విద్యార్థుల సంఖ్య	ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు	ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నవారు
మొత్తం: 174	28 వేలు	15 వేలు	13 వేలు

బాగా రాయాలి.. ఆల్ ది బెస్ట్

మంత్రి: అందరూ బాగున్నారా.. భోజనం బాగుంటుందా
విద్యార్థినులు: బాగుంది సార్, మీరు భోజనానికి రావాలి
మంత్రి: పాఠశాల పునఃప్రారంభమైన తర్వాత అందరం కలిసి భోజనం చేద్దాం, పరీక్షలు బాగా రాయాలి సరస్వతీదేవికి పూజచేయండి. ఆల్ ది బెస్ట్
విద్యార్థినులు: థ్యాంక్యూ సార్..

ఇలా సాగింది.. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఏపీబాలికల గురుకుల పాఠశాల విద్యార్థుల మధ్య సంభాషణ. ఆదివారం పాఠశాల ఎదురుగా ఉన్న ఆత్మకూరు బైపాస్ రోడ్డు విస్తరణ పనులు పరిశీలన నిమిత్తం ఆయన అక్కడకు వచ్చారు. రోడ్డు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రిని గమనించిన విద్యార్థినులు, ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు ఆయనతో మాట్లాడి వెళ్లారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, ఆర్డీవో పావని, తహసీల్దారు పద్మజాకుమారి తదితరులు ఆయనె వెంట ఉన్నారు. – న్యూస్‌టుడే, ఆత్మకూరు

వైభవం.. పుష్కరిణి కలశ మహోత్సవం

బిట్రగుంట, న్యూస్‌టుడే: వేదమంత్రోచ్ఛారణలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, గోవిందనామస్మరణల మధ్య బిలకూటక్షేత్రం కొండబిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన కొండదిగువన పుష్కరిణిలో కలశ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం దాతలైన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు.. రూ.2.50కోట్లతో నిర్మించిన పుష్కరిణి, నీరాల మండపం కలశ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా జరిపించారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్రలు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, డీఎస్పీ శ్రీధర్, ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, ఈవో రాధాకృష్ణ పాల్గొన్నారు.

కలశాన్ని తీసుకువస్తున్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు, ఎంపీ మస్తాన్‌రావు, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ రవిచంద్ర

అల్లూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

అల్లూరు: అల్లూరు నగర పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ రవిచంద్ర, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అల్లూరులో రూ.90 లక్షలతో చేపట్టనున్న సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. రాజుపాలెం నుంచి రామాయపట్నం వరకు ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు తెదేపా కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఉదయగిరికి మహర్దశ: ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, సీతారామపురం, వింజమూరు, న్యూస్‌టుడే: ఉదయగిరి నియోజకవర్గ మహర్దశ రానుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు.

గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

దుత్తలూరులో రక్షణ రంగ పరికరాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నారు. మరో రెండు భారీ పరిశ్రమలు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయన్నారు. ప్రతి మండలంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. సీతారామపురంలోని కేజీబీవీలో పదోతరగతి విద్యార్థులకు తెదేపా నాయకులు కుర్రా రత్తయ్య సమకూర్చిన పరీక్షాసామగ్రిని పంపిణీ చేశారు. వింజమూరు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యాక్రీడ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ విఠపుబాలసుబ్రమణ్యం, మాజీ జడ్పీఛైర్మన్ చెంచలబాబు, ఎంపీపీ వనిపెంట హైమావతి తదితరులు ఉన్నారు.

నీటి నిల్వ.. దోమలకు ఆవాసమేగా!

ఆత్మకూరు పురపాలిక పరిధిలోని వెంకట్రావుపల్లి గిరిజన కాలనీకి నీటి అవసరాలు తీర్చే చేతి పంపు వద్ద నీరు నిలుస్తోంది. స్థానికులు పట్టుకునే క్రమంలో వృథా నీరు ముందుకు సాగే అవకాశం లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. దీంతో దోమలకు ఆవాసంగా మారింది. చుట్టూ పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. వృథానీరు తరలివెళ్లేలా చూస్తామని కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఆత్మకూరు

పార్కింగ్ ప్రదేశంలో పాగా

కావలి పట్టణం కోర్టు వీధిలో రోడ్డు అంచున చేపడుతున్న ఓ బంకు వంటి నిర్మాణం ఇది. వాహనాల పార్కింగ్‌తో పాటు అక్కడ కూర్చునేందుకు వీలుగా బెంచీలు వేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ప్రస్తుతం పార్కింగ్ కోసం నిర్దేశించిన చోట ఇలా అక్రమంగా బంకులు ఏర్పాటు చేయడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పురపాలక కమిషనర్ శ్రావణ్‌కుమార్ స్పందిస్తూ పార్కింగ్ ప్రదేశం ఆక్రమణకు గురి కాకుండా చూస్తామన్నారు. –న్యూస్‌టుడే, కావలి

మహిళలు.. తగునా ఈ ప్రయాణాలు



రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నా.. కొందరు ప్రమాదకరంగా ప్రయాణించడాన్ని మాత్రం మానడం లేదు. గ్రామాల్లో సెనగ నూర్పిళ్లు సాగుతున్న నేపథ్యంలో కూలీలను ఆటోలు, ఇతర వాహనాల్లో కుక్కి మరీ తరలిస్తున్నారు. ఆటో వెనుక భాగంలో కూర్చొని వెళ్లడమే కాకుండా ప్రమాదకరంగా నిలబడి మరీ మహిళా కూలీలు ప్రయాణిస్తున్న ఈ దృశ్యం ఆదివారం వరికుంటపాడులో కనిపించింది. – న్యూస్‌టుడే, వరికుంటపాడు

గుంతలతో అవస్థలు

వింజమూరు స్థానిక బీసీ కాలనీలో మురుగు కాలువల నిర్మాణం కోసం సిమెంట్ రోడ్లను జాయింట్లు కలపకుండా వదిలేశారు. దీంతో రోడ్డులో గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ తిరుమలయ్య మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, వింజమూరు

పగటి వెలుగులు.. అల్లుకున్న తీగలు

ఓ వైపు కంపచెట్లు.. పక్కనే వెలుగుతున్న వీధి దీపం. ఈ పరిస్థితి ఆత్మకూరు పురపాలిక రెండోవార్డు పరిధిలోని వెంకట్రావుపల్లి గిరిజన కాలనీలో నెలకొంది. నిరంతరంగా దీపాలు వెలుగుతూనే ఉంటున్నా, దారంతా కంపచెట్లు పెరిగి నడవడానికి ఇబ్బందిగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలి కోరుతున్నారు.– న్యూస్‌టుడే, ఆత్మకూరు

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ

చేజర్ల: ఆదిత్యా లెర్నింగ్ టెక్ సంస్థ నెల్లూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో ఆదూరుపల్లి త్రికోటేశ్వర విద్యార్థులు సత్తాచాటారు. సీనియర్ విభాగంలో వెంకటజయదీప్ ప్రథమ స్థానంలో, హేమంత్ మూడో స్థానంలో నిలిచాడు. జూనియర్ విభాగంలో యశ్విత మూడో స్థానం, వేద గణితంలో రిషిత, వెంకట్ మొదటి, లేఖన మూడో స్థానంలో నిలిచారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

అమరవీరుల త్యాగాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ

జలదంకి, న్యూస్‌టుడే: ఎందరో అమర వీరుల త్యాగాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు జి.వెంకటేశ్వర్లు మాదిగ అన్నారు. ఆదివారం తొమ్మిదోమైలు గ్రామంలో ఇంద్రగంటి రమేష్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన మాదిగ అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. **ఉదయగిరి:** స్థానిక అంబేడ్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. **దగదర్తి:** నియోజకవర్గ ఎంఎస్పీ అధ్యక్షుడు ఏసురత్నం ఆధ్వర్యంలో ఉలవపాళ్లలో కార్యక్రమం నిర్వహించారు.

జలదంకిలో నివాళులర్పిస్తున్న నాయకులు

బంగారం చోరీ కేసులో నిందితుల అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న కావలి డీఎస్పీ

కావలి, న్యూస్‌టుడే: ఇటీవల పట్టణంలోని ఓ ఇంటిలో బంగారు, వెండి నగదు చోరీ జరిగిన కేసును పోలీసులు ఛేదించారు. ఆదివారం డీఎస్పీ శ్రీధర్ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని పాతూరు పూనూరువారివీధిలో గతనెల 23న పేరూరి రమేష్ అనే వ్యాపారి ఇంటిలో బంగారం, వెండి, నగదు చోరీ జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ క్రమంలో స్థానిక హిందూ శ్మశానవాటిక వద్ద నిందితులు సాలేటి లక్ష్మణరావు, దేవరకొండ ప్రేమ్‌కుమార్‌లను అరెస్టు చేసి వీరి వద్ద నుంచి 20 సవర్ల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని వెండి రికవరీ చేయాల్సి ఉందని వెల్లడించారు. సీఐ ఫిరోజ్, ఎస్సై సుమన్, సిబ్బంది రవీంద్ర, శివ, కిషోర్, వెంకటేశ్వర్లు, శివప్రసాద్‌లను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు.

కొబ్బరికాయలు అపహరించడంతో..

జలదంకి: కొబ్బరి కాయలను చోరీ చేసి ఆటోలో తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఏఎస్సై హరిబాబు వివరాల మేరకు.. తిమ్మసముద్రానికి చెందిన రావి రమేష్ ఏడు ఎకరాల్లో కొబ్బరి తోట సాగు చేశారు. కలిగిరి మండలంలోని చిన్న అన్నలూరుకు చెందిన దారా సిద్దు, ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలంలోని కేటుపురానికి చెందిన నరసింహారెడ్డిలు ఆటోలో రాత్రి సమయంలో గ్రామానికి వచ్చారు. 150 కొబ్బరి కాయలను కోసి ఆటోలో వేసుకుని బయల్దేరారు. ఆ సమయంలో మామిడి తోట దగ్గరకు వెళ్తున్న రమేష్ సోదరుడు కోటేశ్వరరావు వారి ఇద్దర్ని చూసి అనుమానం వచ్చి గ్రామస్థుల సాయంతో పట్టుకున్నారు. పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పంట కాలువలో పడి ఒకరి మృతి

అల్లూరు, న్యూస్‌టుడే: పంట కాలువలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన అల్లూరులో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. అల్లూరు దళితవాడకు చెందిన కావలి మనోహర్ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆదివారం మద్యం తాగిన అతను గ్రామంలోని బ్యాంక్ కూడలి ప్రాంతంలోని మిట్ట కాలువ వద్ద ఉన్న గోడమీద కూర్చొని ఉన్నారు. మద్యం మత్తులో కాలువలోపడి మృతి చెందారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

దగదర్తి,న్యూస్‌టుడే: చెరువులో ఈతకు వెళ్లి యువకుడు గల్లంతైన సంఘటన సున్నపుబట్టిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. సున్నపుబట్టికి చెందిన యశ్వంత్ మరో ఐదుగురు యువకులతో కలిసి స్థానిక యాలమూరి చెరువులో ఈతకు వెళ్లారు. మిగిలిన వారు ఒడ్డుకు రాగా.. యశ్వంత్ ఆచూకీ తెలియలేదు. గ్రామానికి చెందిన ఈతగాళ్లను తెచ్చి గాలించినా ఫలితం దక్కలేదు. ఎన్డీఆర్ఎఫ్ బలగాలను తెప్పించి గాలింపు చేపడతామని ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.

అదుపు తప్పిన కారు.. ఇద్దరికి గాయాలు

దుత్తలూరు, న్యూస్‌టుడే: నందిపాడు సెంటర్‌కు సమీపంలో 565 జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి బోల్తాపడడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు... కడప నుంచి ప్రకాశం జిల్లా పొదిలికి హరీష్, మరో వ్యక్తి కారులో బయలుదేరారు. ఈ క్రమంలో కారు నందిపాడు సెంటర్‌కు రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలో బోల్తా పడింది. ప్రమాదంలో వారిద్దరికి తీవ్రగాయాలు కాగా కారు నుజ్జునుజ్జయింది. గమనించిన వాహనదారులు వారిని కారులో నుంచి బయటకు తీసి 108 వాహనానికి సమాచారమందించటంతో వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుర్తింపు కార్డుతో లాభాలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులు లేబర్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేయించుకుని గుర్తింపు కార్డులు పొందాలని లేబర్ ఆఫీసర్ హరిబాబు అన్నారు. గుర్తింపు కార్డులో అనేక లాభాలు ఉన్నాయన్నారు. భవన నిర్మాణానికి సంబంధించిన 26 రకాల పనులు చేసే కార్మికులు దీనికి అర్హులన్నారు. 18-60 సంవత్సరాల్లోపు వయసు ఉన్న వారు రూ. 130 చెల్లిస్తే గుర్తింపు కార్డు పొందవచ్చన్నారు. ప్రమాదాలు, సహజమరణాలకు, ఉత్తరక్రియలు, మహిళల ప్రసవ ఖర్చులకు ఈ కార్డును ఉపయోగించుకోవచ్చన్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు

సీతారామపురం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా పది, ఇంటర్, బీటెక్, ఎంబీబీఎస్ చదివే బలిజ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(కాత్వా) తరపున ప్రోత్సాహకాలు అందించనున్నట్లు ఆ సంఘం రాష్ట్రఉపాధ్యక్షుడు కమతం సుబ్బారావు తెలిపారు. సీతారామపురంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. పేదవిద్యార్థులను ప్రోత్సహించేందుకు, వారి ఉన్నత చదువులకు సహకరించేందుకు బలిజసేవాఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తున్నామన్నారు. ఎవరైనా అటువంటి విద్యార్థులన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కాత్వా జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, ఉదయగిరి నియోజవర్గ అధ్యక్షుడు శిగె కొండయ్య, కార్యదర్శి వెంగయ్య పాల్గొన్నారు.

ప్రతిభా పోటీలతో విజ్ఞానం పెంపు

విజేతలతో అపస్ నాయకులు

కలిగిరి, న్యూస్‌టుడే: ప్రతిభా పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతోందని అపస్ జిల్లా అధ్యక్షులు కె.కె.రాజగోపాలాచార్యులు, విశ్వభారతి కార్యదర్శి శేషారెడ్డిలు తెలిపారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(అపస్) ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాలలో అయిదో తరగతి విద్యార్థులకు టాలెంట్‌టెస్ట్ నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతోపాటు విద్యార్థులందరికీ బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మధు, నాయకులు రమణారెడ్డి, రాధయ్య, వెంకటరెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. **సంగం:** స్థానిక మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలల్లో అయిదోతరగతి విద్యార్థులకు అపస్ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీ పరీక్షలు నిర్వహించారు. సిద్దీపురం పాఠశాల విద్యార్థి వి.చంద్రశేఖర్ ప్రథమస్థానం సాధించారు.

సంగంలో ప్రశంసా పత్రాలు చూపుతున్న విద్యార్థులు

గొంతెండుతోంది.. నీళ్లిచ్చి ఆదుకోండి

న్యూస్‌టుడే, వరికుంటపాడు

వేసవి కాలం ప్రారంభమైంది. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని వేంపాడు పంచాయతీ వెంగమాంబాపురం ఎస్సీ కాలనీలో మూడు రోజులుగా గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కాలనీలో 40 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారికి పంచాయతీ తరఫున ఏర్పాటు చేసిన రెండు రక్షిత మంచినీటి పథకాల మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. మూడు చేతిపంపులు ఉన్నప్పటికీ వాటి పరిస్థితి అదే విధంగా ఉంది. దీంతో మూగజీవాలు, ప్రజలు గొంతు తడుపుకోనేందుకు చుక్కనీరు లేక అల్లాడుతున్నారు. గ్రామానికి చెందిన దేవరకొండ కేశవ అనే వ్యక్తి బేల్దారి పనుల నిమిత్తం బెంగళూరులో ఉంటుండగా.. కాలనీవాసుల సమస్య తెలుసుకుని ఆదివారం పొలాల వద్ద నుంచి ట్యాంకర్ల సాయంతో నీటిని తెప్పించి స్థానికులకు సరఫరా చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి పథకం మోటార్లను బాగు చేయించి నీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో రమేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానన్నారు.

ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న కాలనీ వాసులు

తేలేదెంత.. తేల్చేదెంత?

గుట్టుచప్పుడుగా ఉపాధి పనుల తనిఖీలు

న్యూస్‌టుడే, అనంతసాగరం

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బృందం అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రజా ప్రతినిధులు, ప్రజలకు ఆయా గ్రామాల్లో జరిగిన పనుల వివరాలను తెలియజేయాలి. వారి అభిప్రాయాలు తీసుకోవాలి. కానీ ఎవరికీ సమాచారం ఇవ్వకుండా గుట్టుచప్పుడు కాకుండా తనిఖీలు చేసి వెళ్లిపోతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

మండలంలో ఇలా..

అనంతసాగరం మండల పరిధిలో 25 గ్రామ పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.8.92 కోట్లతో పనులు జరిగాయి. కాగా పనులకు రాని కూలీల పేర్లు మస్టర్లలో నమోదు చేసి సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సుమారు రూ.80,000 మాత్రమే రికవరీ చూపించారు. అందులో 15శాతం కూడా నగదు వసూలు చేయలేదు. ఈ నేపథ్యంలో ఈ ఆర్థికసంవత్సరానికి సంబంధించి పడమటి కంభంపాడు పంచాయతీలో రూ.39.22 లక్షలు, పాతాళపల్లి రూ.49.13 లక్షలు, బొమ్మవరం రూ.49.01 లక్షలు, చిలకలమర్రి రూ.23.06 లక్షలు, పాతదేవరాయపల్లి రూ.92.72 లక్షలు, మినగల్లు 44.58 లక్షలు, రేవూరు రూ.41.70 లక్షలు, ఇస్కపల్లి రూ.40.92 లక్షలు ఖర్చు చేశారు. ఈ పంచాయతీల్లో అక్రమాలు భారీగా జరిగాయని పలువురు ఆరోపిస్తున్నారు.

నామమాత్రంగానే..?

అనంతసాగరం మండలానికి ఇటీవల ముగ్గురు సభ్యులున్న సామాజిక తనిఖీ బృందం వచ్చింది. గుడిగుంట, మంగుపల్లి, గౌరవరం, సోమశిల పంచాయతీల్లో గత నెల 12 నుంచి 27వ తేదీ వరకు పనులు పరిశీలించింది. రికార్డులు స్వాధీనం చేసుకుంది. కానీ ఎక్కడా కూడా జరిగిన పనులపై గ్రామసభలు నిర్వహించలేదు. ప్రజాసంఘాలు, సర్పంచులకు సమాచారం ఇవ్వలేదు. తనిఖీ బృందం, అప్పటి ఉపాధి సిబ్బందితో కుమ్మక్కై అవినీతి వెలుగులోకి రాకుండా నామమాత్రంగా కానిచ్చేయాలని ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు చొరవ తీసుకుని సామాజిక తనిఖీ గురించి సమాచారం ఇచ్చి నిష్పక్షపాతంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

– ఐజాక్ ప్రవీణ్, ఎంపీడీవో, అనంతసాగరం

సామాజిక తనిఖీ బృందానికి ఉపాధిహామీ అధికారులు మార్గనిర్దేశం చేయాలి. తనిఖీలు చేపట్టే చోట ప్రజలు, ప్రజా సంఘాలకు సమాచారం ఇచ్చేలా అధికారులను ఆదేశిస్తాం. నిష్పక్షపాతంగా తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

సంగం, న్యూస్‌టుడే: సంగంలోని డా.బీఆర్. అంబేడ్కర్ ఎస్సీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో అయిదు, ఇంటర్ ప్రవేశాల కోసం ఆదివారం జరిగిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం తొమ్మిది నుంచి పదిన్నర గంటల వరకు అయిదో తరగతి పరీక్షకి 111 మందికి గాను 79 మంది హాజరయ్యారు. ఇంటరు సాధారణ కళాశాల ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 11 నుంచి 12.30 గంటల వరకు జరగ్గా 219 మందికి 194, నీట్, జేఈఈ మెయిన్స్ కళాశాల ప్రవేశపరీక్ష సాయంత్రం మూడు నుంచి నాలుగున్నర వరకు జరగ్గా 182 మందికి 138 మంది హాజరైనట్లు ప్రధానాచార్యులు సుమతమ్మ తెలిపారు. గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ ప్రభావతి, తహసీల్దారు సోమ్లానాయక్ పరీక్షలను పర్యవేక్షించారు.

పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

(c) eenadu

గూడూరు

• గూడూరు • కోవూరు • సర్వేపల్లి

పేదలకు అన్యాయం జరిగితే సహించం

కలువాయి, న్యూస్‌టుడే: కలువాయి మండల అభివృద్ధిని కోరుకునేది కూటమి ప్రభుత్వమని, ఎక్కడ అన్యాయం జరిగినా సహించమని తెదేపా మండల అధ్యక్షుడు రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలో జరిగిన భూ కుంభకోణంపై అసెంబ్లీలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీనిపై వైకాపా జడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. తెదేపా నాయకులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పదవులు అనుభవించి మండల ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో భూమార్పిడి జరిగింది వ్వాస్తవం కాదా..? ఎస్సీ, ఎస్టీల భూములు ఇతరుల పేర్లతో మార్చి లక్షల రూపాయలు తీసుకుంది.. మీ అనుచరులు కాదా అని ప్రశ్నించారు. నాయకులు పిచ్చిరెడ్డి, కిషోర్‌రెడ్డి, హరిబాబు నాయుడు, నరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌ను కలిసిన జనసేన నాయకులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: తిరుపతిలో నిర్వహించిన జనసేన నాయకుల సమీక్షా సమావేశంలో ఆదివారం గూడూరు జనసేన నాయకులు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సభ్యత్వ నమోదు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. నాయకులు మోహన్, నవీన్, భాస్కర్, కృష్ణ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) గూడూరు: 85002 02046
కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980

సమస్య: కోట మండలం విజయకాలనీలోని పంచాయతీ పైపులైన్ ద్వారా మురుగునీరు వస్తోంది. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. **– జనార్ధనం, స్థానికుడు**

సమాధానం : పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం **– సాయినవీన్, గ్రామ కార్యదర్శి**

? పొదలకూరు రూరల్ పరిధిలోని రమణారెడ్డికాలనీలో వాల్వ్ గుంతలపై మూతలు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. సత్వరం ఏర్పాటు చేయాలి.**– రమణయ్య**

✓ సమస్య పరిశీలించి ఏర్పాటు చేయిస్తాం. **– యశ్వంత్ సింగ్, పంచాయతీ కార్యదర్శి**

? గూడూరు పట్టణం లయోలా కళాశాల ప్రాంతంలో డ్రైనేజీ కాలువ అధ్వానంగా ఉంది. మురుగునీరు ముందుకు కదలకపోవడంతో దుర్వాసనకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **– గణేష్, గూడూరు**

✓ మురుగు కాలువలను శుభ్రం చేస్తాం. పూడికలు తీసేలా చర్యలు తీసుకుంటాం. **– వెంకటేశ్వర్లు, పురపాలక కమిషనర్**

? పొదలకూరు మండలం ఇనుకుర్తి సమీపంలో పొలాల్లోకి వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పంటలు తెచ్చుకోవాంటే ఇబ్బందులు పడుతున్నారు. మార్కెటింగ్‌శాఖ నిధులతో రోడ్లు నిర్మించాలి.**– స్థానికుడు**

✓ సమస్య పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **– కృష్ణప్రసాద్, కార్యదర్శి**

? తోటపల్లిగూడూరు మండలం ఇస్కపాలెంలో రోడ్డు పక్కనే వ్యర్థాలు పడేస్తున్నారు. దీంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. **– రామకృష్ణ, స్థానికుడు**

✓ ప్రజలకు ఇబ్బంది లేకుండా తొలగిస్తాం. **– లక్ష్మీనరసయ్య, డిప్యూటీ ఎంపీడీవో**

? తోటపల్లిగూడూరు వద్ద పొరుదల కాలువలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. నీటి పారుదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. **– పరమేశ్, స్థానికుడు**

✓ పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **– అలీ, ఇరిగేషన్ ఏఈ**

? రాపూరు మండల పరిధిలోని తూమాయిలో కోతుల బెడద అధికంగా ఉంది. పలువురిపై దాడి చేస్తున్నాయి. **– స్థానికులు**

✓ సమస్య పరిష్కరిస్తాం.**–భవాని,ఎంపీడీవో**

చేనేతలకు అండగా కూటమి ప్రభుత్వం

చేనేతలకు చెక్కు అందజేస్తున్న వేమిరెడ్డి దంపతులు

విడవలూరు కోవూరు, న్యూస్‌టుడే: నేతన్నలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుదని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బలో ఆదివారం పాటూరు, గుమ్మళ్లదిబ్బకు చెందిన 84 మంది చేనేతలకు ఆధునిక చేనేత యంత్ర పరికరాలు, రూ.25 లక్షల ముద్రా రుణాల చెక్కును పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతల సంక్షేమానికి కృషిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత ఉత్పత్తులకు అయిదు శాతం జీఎస్టీ భరిస్తుందని తెలిపారు. నేతన్నలకు విభిన్న రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్న అవసరాన్ని గుర్తించి రూ.5 కోట్ల వ్యయంతో నాలుగు వీవర్స్ కార్యశాలలు ఏర్పాటు చేయనున్నామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం, అడిషనల్ డైరెక్టర్ ప్రసాదరావు, నాయకులు జెట్టి రాజగోపాల్‌రెడ్డి, వెంకటరమణమ్మ, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు చేరువగా వైద్యం..!

ముమ్మరంగా ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణ పనులు

న్యూస్‌టుడే, వెంకటాచలం

గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి జ్వరమొచ్చినా వైద్యం కోసం మండల, జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రులకు వెళ్లక తప్పడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో లేకుంటే అప్పులు చేసి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు. గ్రామీణ ప్రజల ఇబ్బందులకు చెక్‌పెడుతూ కూటమి ప్రభుత్వం గ్రామీణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణంపై దృష్టిపెట్టింది. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో మొత్తం 13.88 కోట్లు కేటాయించడంతో పనులు కొనసాగుతున్నాయి. వీటిద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య సేవలందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది.

వెంకటాచలంలో నిర్మాణంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం

ఎక్కడెక్కడ నిర్మిస్తున్నారంటే...

నియోజకవర్గ పరిధిలో రూ.9.93 కోట్లతో(జాతీయ ఆరోగ్య మిషన్, పీఎం-ఏబీహెచ్ఐఎం, 15వ ఆర్థిక సంఘం) 35 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు నిర్మించనున్నారు. ● మనుబోలు మండలం బద్దెవోలు, గురువిందపూడి, మనుబోలు, జట్లకొండూరు, కాగితాలపూరు, వీరంపల్లి, వెంకన్నపాళెం ● ముత్తుకూరు మండలం ముత్తుకూరు, వల్లూరు, నేలటూరు, సర్వేపల్లి బిట్-5, తాళ్లపూడి, బ్రహ్మదేవం, పంటపాళెం, కృష్ణపట్నం ● పొదలకూరు మండలం బత్తులపల్లి, దుగ్గుంట రాజుపాళెం, నేదురుపల్లి, మొగళ్లూరు, సూరాయపాళెం, పొదలకూరు ● తోటపల్లిగూడూరు మండలం పొట్లపూడి, వెంకన్నపాళెం, ఈదూరు, ఇస్కపాళెం, నరుకూరు, వరిగొండ, చిన్నచెరుకూరు, కోడూరు ● వెంకటాచలం మండలం నిడిగుంటపాళెం, చవటపాళెం అనికేపల్లి, కంటేపల్లి, వెంకటాచలంలో గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

పీహెచ్‌సీ, బ్లాక్ యూనిట్ల ఏర్పాటుతో..

నియోజకవర్గంలో గ్రామీణ ఆరోగ్య కేంద్రాలతో పాటు పీహెచ్‌సీ కేంద్రాలు, బ్లాక్ ఆరోగ్య యూనిట్ల ఏర్పాటుకు కూడా నిధులు మంజూరయ్యాయి. ముత్తుకూరు మండలం తాళ్లపూడిలో రూ.1.43 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రూ.2.52 కోట్లతో ముత్తుకూరు, వరిగొండ, తాళ్లపూడి ఆరోగ్య కేంద్రాల పరిధిలో మూడు బ్లాక్ ఆరోగ్య యూనిట్లు నిర్మించనున్నారు. ● నియోజకవర్గంలోని చాలా చోట్ల ఇప్పటికే కేంద్రాల నిర్మాణ పనులు ప్రారంభం కాగా... కొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పూర్తి చేసేలా పనులు జరుగుతున్నాయి. వైద్య, ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తూ క్షేత్ర స్థాయిలోనే వైద్య సేవలందించేందుకు ఆరోగ్య కేంద్రాలు చేయడంపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ భూమి నుడాకివ్వడం స్కామా: సోమిరెడ్డి

సీవీఆర్ నగర్‌లో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిని నుడాకు అప్పగించాలనుకోవడం స్కామా అని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా బండేపల్లి భూములు ప్రభుత్వానివేనని స్పష్టం చేశారు. ఆదివారం నెల్లూరు వేదాయపాలెంలోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బండేపల్లి భూములపై న్యాయపరమైన చిక్కులన్నీ తొలగించి నుడా ఆధ్వర్యంలో ఎన్టీఆర్ టౌన్‌షిప్ నిర్మించే ప్రయత్నాల్లో కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉన్నారన్నారు. మరోసారి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నోరు పారేసుకుంటే నిలదీస్తామని హెచ్చరించారు. టోల్‌గేట్ తెరిచి కోట్లాది రూపాయలు దండి కంటైనర్ టెర్మినల్‌ను తరిమికొట్టే వరకు ఆయన నిద్రపోలేదన్నారు. కొద్ది గంటల్లో ఎన్నికల కోడ్ వస్తుందనగా రాత్రికి రాత్రే రామదాసుకండ్రిగలో 57 ఎకరాలు బినామీ కంపెనీకి అప్పగించారన్నారు. ఎకరా రూ.1.50 కోట్ల విలువైన భూమిని రూ.15 లక్షల చొప్పున రాసిచ్చారని, ఆ భూముల విలువ ప్రస్తుతం రూ.80 కోట్లు ఉంటుందని వివరించారు. ● సర్వేపల్లి నియోజకవర్గంలో కృష్ణపట్నం పోర్టు, ఇండియన్ కోస్టు గార్డ్‌తో పాటు జాతీయ సంస్థలు ఏర్పాటు కావడం హర్షణీయమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. సీవీఆర్ నగర్‌లో ఉన్న కోస్టుగార్డు కార్యాలయం వద్ద రూ.70 లక్షలతో ఏర్పాటు చేసిన రోడ్డును ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవతో పలు జాతీయ సంస్థలు ఏర్పాటయ్యాయని వివరించారు. వీటి ద్వారా స్థానికులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారన్నారు. కోస్టుగార్డ్ అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కోటలో ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

కోట, న్యూస్‌టుడే: కోటలోని ఎస్సీ గురుకుల కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఐఐటీ, నీట్, అయిదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అందులో నీట్, ఐఐటీకి 58 మంది విద్యార్థులకు గాను 54 మంది విద్యార్థులు హాజరయ్యారు. అదే విధంగా గురుకులాల్లో అయిదో తరగతి ప్రవేశ పరీక్షకు 101 మందిగాను 90 మంది, ఇంటర్మీడియట్‌లో ప్రవేశ పరీక్షకు 148మందికి 144 మంది విద్యార్థులు హాజరైనట్లుగా ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జయజయరావు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే : స్వాతంత్ర్య సాధనలో గాంధీ చేసిన పోరాటాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆశ్రమ మేనేజర్ మనోజ్ అన్నారు. మండలంలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా కమిటీ సభ్యులు దయాకర్ రెడ్డి, మంజుల మహాత్మా గాంధీ, ఆశ్రమ స్థలదాత పొనకా కనకమ్మకు పట్టు, నూలు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, చిన్నారులు పాల్గొన్నారు.

మురుగు పారదు.. సమస్య తీరదు

గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ఎస్సీ కాలనీ ప్రాంతంలో మురుగు కాలువలు సక్రమంగా లేక ఇళ్ల మధ్యనే పారుతోంది. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడద తీవ్రంగా ఉండడంతో పలువురు అనారోగ్యానికి గురై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. పురపాలక అధికారులు స్పందించి మురుగు కాలువల నిర్మాణం చేపట్టాలని స్థానికులు విన్నవిస్తున్నారు.**– న్యూస్‌టుడే, గూడూరు**

నెలలుగా నిరుపయోగం

నరుకూరు పంచాయతీ జానావారి పాలెం వద్ద మంచినీటి బోరు నిరుపయోగంగా ఉంది. స్థానికులకు తాగునీటి సమస్య లేకుండా చూసేందుకు మంచి నీటి బోరు ఏర్పాటు చేశారు. పంచాయతీ పాలకులతో పాటు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజలకు ఉపయోగపడడం లేదు. బోర్లు వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **– న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు**

వీవర్స్ కాలనీలో దాహం..దాహం

పొదలకూరు మండలం తోడేరు పంచాయతీ పరిధిలోని వీవర్స్ కాలనీలో ఏర్పాటు చేసి ఉన్న మంచి నీటి ట్యాంకు ధ్వంసం కాగా దానిని తొలగించారు. సుమారు నలభై కుటుంబాలకు ఒక ట్యాంకు మాత్రమే ఉండటంతో సరిపడ నీరు లభించక ఇబ్బందులు పడుతున్నామని, ఆరు నెలలుగా అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వేసవి దృష్ట్యా ఉన్నతాధికారులు స్పందించి నూతన ట్యాంకు ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు. **– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్**

ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా..

వెంకన్నపాళెం ప్రాథమిక పాఠశాల సమీపంలోని ర.భ రోడ్డు పక్కనే తాగునీటి పైపులైన్ గేట్‌వాల్వు ప్రమాదకరంగా ఉంది. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షమొస్తే బురద నీరంతా గేట్‌వాల్వులోకి వెళుతోంది. అంతేకాకుండా విద్యార్థులు ఈ మార్గంలోనే పాఠశాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఆదమరిస్తే గుంతలో పడిపోతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్ మాట్లాడుతూ సమస్య పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. **– న్యూస్‌టుడే, కోట**

చిట్టడవిలా వినాయక మాన్యం

పొదలకూరు వినాయక మాన్యంలో నివాసాల మధ్య గల ఖాళీ స్థలాల్లో ముళ్ల చెట్లు పెరిగి విష పురుగులకు ఆవాసాలు మారాయి. స్థల యజయానులు పట్టించుకోకపోవడంతో ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో పలు చోట్ల విద్యుత్తు దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.**– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్**

బకాయిలు ఘనం.. వసూళ్లు గగనం

రాపూరు, న్యూస్‌టుడే: జిల్లాలో మేజర్ పంచాయతీల పరిధిలో బకాయిలున్న వాటిలో రాపూరు ముందంజలో ఉండడంతో జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. గత వైకాపా పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో కొన్నేళ్లుగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. సచివాలయాల సిబ్బంది, పంచాయతీ అధికారులు సరిగా పర్యవేక్షించలేదన్న విమర్శలున్నాయి. తాజాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీపీవో, డీఎల్‌పీవో స్థానిక అధికారులతో నిత్యం సమీక్షిస్తున్నారు. అయిదు బృందాలుగా ఏర్పడి వసూలు చేస్తున్నారు. మార్చి 15లోగా శతశాతం పూర్తిచేయాలన్న ఆదేశాలతో సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళుతున్నారు. 21 పంచాయతీల పరిధిలో ఇంటి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. మేజర్ పంచాయతీలో పాత బకాయిలు రూ.70 లక్షలకు పైగా రావాల్సి ఉండగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదికి సంబంధించి రూ. 48 లక్షలు రావాల్సి ఉంది. మిగతా పంచాయతీల పరిధిలో రూ.30 లక్షల వరకు రావాల్సి ఉండగా రూ.10 లక్షలు పాత బకాయిలున్నాయని అధికారులు తెలిపారు.

● రాపూరు పంచాయతీలో 20 మంది విధులు నిర్వహిస్తున్నారు. నెలకు రూ.2.5 లక్షల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు. విద్యుత్తుశాఖకు కోటి రూపాయలకు పైగా చెల్లించాల్సి ఉంది. ఈవోపీఆర్డీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ... ఇంటిపన్ను వసూళ్లలో ప్రజలు సహకరించాలన్నారు.

విచ్చలవిడిగా మద్యం గొలుసు దుకాణాలు

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా గొలుసు దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు. కోవూరు, పడుగుపాడు, పోతిరెడ్డిపాళెం, జమ్మిపాళెం, చెర్లోపాళెం, వేగూరు, పాటూరు, గుమ్మళ్ల దిబ్బ గ్రామాల్లో చిన్నపాటి దుకాణాల్లో విచ్చలవిడిగా అమ్ముతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మద్యం గొలుసు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బొగ్గు బట్టీలతో కాలుష్యం

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు మండల పరిధిలోని లింగంపల్లి సమీపంలో బొగ్గు బట్టీలు కాలుస్తుండడంతో కాలుష్య సమస్య తీవ్రంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. సమీపంలో బొగ్గు బట్టీలు ఏర్పాటుకు అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. తొలగించకుంటే ఆందోళన చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు..

సత్యసాయి ధ్యాన మండలి వార్షికోత్సవం

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు పట్టణంలోని రామమందిరం వీధిలోని శ్రీసత్య సాయి ధ్యానమండలి 11వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురువు నిర్మలానంద స్వామి ప్రసంగించారు. ధ్యానమండలి యోగా గురువు పెంచలయ్య మహా మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. భక్తులు రమణయ్య స్వామి, కొండయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

3న ఆలయం మూసివేత

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: ఈనెల 3న చంద్ర గ్రహణంతో కామాక్షితాయి అమ్మవారి ఆలయం మూసివేస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది గంటలకు మూసివేస్తామని, నాలుగో తేదీన తెరుస్తామని పేర్కొన్నారు.

నీటి గంట.. బడిలో మోగేదెన్నడంట..?

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు

అధికారుల పర్యవేక్షణ లేక సర్కారు పాఠశాలల్లో నీటి గంట మోగడం లేదు. విద్యార్థి దశ నుంచి తగినంత నీరు తాగించి పలు రుగ్మతలు దూరం చేయాలన్న సంకల్పంతో అయిదేళ్ల క్రితం అమలు చేశారు. తరువాత సరియైన పర్యవేక్షణ లేక మరుగున పడింది. ఎన్ని పథకాలు పెట్టినా.. మార్గదర్శకాలు జారీ చేసినా.. సర్కారు విద్యాలయాల్లో శుద్ధ జల కష్టాలు తీరడం లేదు. ప్రభుత్వంతో పాటు దాతలు చాలా పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలు అమర్చారు. వాటిలో చాలావరకు పనిచేయకపోవడం, బయట నుంచి నీరు తెచ్చి పెట్టాల్సి రావడంతో ఎక్కడా అమలు కావడం లేదు.

సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలో వివరాలు

● మండలం	● పాఠశాలలు	● విద్యార్థులు
పొదలకూరు	89	4450
వెంకటాచలం	66	3733
మనుబోలు	41	2100
ముత్తుకూరు	59	3108
తోటపల్లిగూడూరు	58	2651

ఇళ్ల నుంచి సీసాల్లో నీరు తెచ్చుకున్న విద్యార్థులు

ఇలా తాగిస్తే...

ప్రతి పాఠశాలలో ఉదయం, మధ్యాహ్నం స్వల్ప విరామంలో తప్పకుండా నీరు తాగేలా చర్యలు చేపట్టాలి. దీంతోపాటు ఉదయం 10 గంటలు, ఆ తరువాత 11.15, మధ్యాహ్నం 2 గంటలు, చివరిగా 3 గంటలకు నీటి గంట విధానాన్ని అమలు చేయాలి. ఇది కచ్చితంగా సాగేలా ప్రణాళిక అవసరం.

● ప్రభుత్వ వైద్యాధికారిణి హేనా మాట్లాడుతూ... పిల్లలకు నిర్ణీత సమయం ప్రకారం నీటిని తాగడం అలవాటు చేయాలన్నారు. తద్వారా మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో పాటు అనేక రుగ్మతలను దూరం చేయొచ్చని తెలిపారు. శరీరానికి తగినంత నీరందకుంటే రక్తం చిక్కబడుతుందని, దీనివల్ల తలనొప్పి, అలసట, కడుపునొప్పి, మూత్రం రంగు మారడం లాంటి సమస్యలు వచ్చే ప్రమాదముందని పేర్కొన్నారు.

● ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ... పలు పాఠశాలల్లో సక్రమంగా అమలు కావడం లేదన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా నీటి గంట పక్కాగా అమలయ్యేలా ఉపాధ్యాయులకు సూచిస్తామని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యంగా పనిచేద్దాం

తెదేపాలో చేరిన వారితో దశరథరామిరెడ్డి, నాయకులు

కోట : కోట మండలం వావిళ్లదొరువుకు చెందిన ఇరవై కుటుంబాలు ఆదివారం దొరువుకట్ట గ్రామంలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ దశరథరామిరెడ్డి సమక్షంలో తెదేపాలో చేరారు. వారికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు పార్టీ కండువాను కప్పి పార్టీలో చేర్చుకున్నట్లుగా ఆయన తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఐక్యంగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు చెంగళ్‌రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చెరువులో మట్టి తవ్వకాలు

విడవలూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వరిణిలో ఆదివారం కొందరు చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టారు. స్థానికులు గమనించి ప్రశ్నించగా సిమెంట్ రోడ్డు అంచుల్లో మట్టి పోస్తున్నామని తెలిపారు. వెంటనే అధికారులకు సమాచారమివ్వగా వారు వచ్చేలోగా అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పంట కాలువలో పూడిక తీయరూ..!

కోట పంచాయతీ ఆకుతోటదిబ్బ మీదుగా వెళుతున్న పంటకాలువ పూడిపోయింది. కాలువ ద్వారా 600 ఎకరాలకు సాగునీరందుతోంది. అయిదేళ్లుగా కాలువ క్రమేణా పూడిపోతోంది. అందులోనే మురుగు నీరు వదలడంతో సాగుదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు పర్యాయాలు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇరిగేషన్ ఏఈ మునిరత్నం మాట్లాడుతూ పరిశీలించి మరమ్మతులు చేపడతామని పేర్కొన్నారు.**– న్యూస్‌టుడే, కోట**

అదుపుతప్పి ధాన్యం లారీ బోల్తా

కొడవలూరు, న్యూస్‌టుడే: మలుపులో అదుపు తప్పి ధాన్యం లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. స్థానికుల వివరాల మేరకు.. మండల పరిధిలోని బొడ్డువారిపాళెం వద్ద జాతీయరహదారి సర్వీస్ రోడ్డు మలుపులో వాకాడు నుంచి స్థానిక రైస్‌మిల్లుకు ధాన్యం తీసుకొస్తున్న లారీ ఆదివారం బోల్తా పడింది. ఎలాంటి ప్రాణాపాయం జరగలేదని స్థానికులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పొదలకూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన బాబు అనే యువకుడు శనివారం అర్ధరాత్రి పొదలకూరు నుంచి పార్లపల్లికి వెళుతుండగా గూడూరు నుంచి పొదలకూరు వైపు వస్తున్న కారును ఢీకొనడంతో బాబు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు 108 వాహనంలో పొదలకూరు సీహెచ్‌సీకి తరలించగా మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హనీఫ్ తెలిపారు.

కొమరిక మాజీ సర్పంచి మృతికి సంతాపం

ఇందుకూరుపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొమరిక మాజీ సర్పంచి గూడూరు ప్రభాకర్ రెడ్డి(75) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. కోవూరు మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి, తెదేపా మండలం అధ్యక్షులు పవన్ రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం

సైదాపురం-డేగపూడి మార్గంలో ప్రారంభమైన రోడ్డు పనులు

న్యూస్‌టుడే, సైదాపురం

కొన్నేళ్లుగా సైదాపురం నుంచి పొదలకూరు వెళ్లే మార్గంలోని గుంతల రోడ్డులో వెళుతూ ప్రజలు నరకయాతన పడుతున్నారు. పలు మార్లు వాహనాలు అదుపుతప్పి జరిగిన ప్రమాదాల్లో పలువురు మృతిచెందగా, ఎక్కువ మంది తీవ్ర గాయాలయ్యాయి. ఎట్టకేలకు పనులు ప్రారంభం కావడంతో ఆ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

★ సైదాపురం-డేగపూడి మార్గంలో నిర్మాణ పనులకు గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం రూ.45 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. రెండు వరుసల రోడ్డును ఏర్పాటు చేయాల్సి ఉంది. సకాలంలో పనులు చేపట్టక పోవడంతో పనులు రద్దయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గుంతలు పూడ్చేందుకు రూ. ఎనిమిది కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినా పనులు చేయడంలో జాప్యం జరిగింది. నాలుగు రోజుల క్రితం రోడ్డును బాగుచేసేందుకు కంకర మిశ్రమంతోపాటు మార్జిన్లను బాగు చేసే పనులు చేపట్టారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెండువరుసల రోడ్డుగా మార్చి, ప్రమాదాలను నిరోధించాలని ఊటుకూరు, తురిమెర్ల, కలిచేడు, గిద్దలూరు, దేవరవేమూరు, తలుపూరు, మలిచేడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిరాశ్రయులకు దుస్తుల అందజేత

గూడూరులో చీరలు పంపిణీ చేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

గూడూరు పట్టణం, మనుబోలు, న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు సేవ చేయడం సంతోషంగా ఉందని ముహమ్మద్ ఫక్రుద్దీన్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు మగ్దూమ్ తెలిపారు. గూడూరులోని వివిధ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా రంజాన్ మాసంలో పేదలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో విరివిగా సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు ఫరీనా, యజ్దాని, జమీర్, గయాజ్ తదితరులు పాల్గొన్నారు. ● బాధితులకు అండగా నిలుస్తామని శ్రీసేవానాథం ట్రస్టు సభ్యులు అన్నారు. స్థానిక చంద్రమౌళినగర్ గిరిజనకాలనీకి చెందిన పద్మ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో రూ.పది వేల నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. బద్దెవోలు అడ్డరోడ్డు సమీపంలోని సంగమేశ్వర గిరిజనకాలనీలో విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధమై వీధిన పడిన బాధితులకు వంట పాత్రలు, సామగ్రితో నగదును అందజేశారు. ట్రస్టు సభ్యులు మహీధర్‌రెడ్డి, భార్గవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రిజర్వాయర్‌ను అభివృద్ధి చేయాలి

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: కనిగిరి రిజర్వాయర్‌ను అభివృద్ధి చేయాలని భాజపా కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుమారస్వామి అన్నారు. ఆదివారం కనిగిరి రిజర్వాయర్‌ను కిసాన్‌మోర్చా నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కనిగిరి రిజర్వాయర్ పరిధిలో రైతులు పడుతున్న ఇబ్బందులు పరిశీలించేందుకు వచ్చామన్నారు. గేట్లు దారుణంగా ఉన్నాయన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు.

(c) eenadu

నెల్లూరు

• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

3న ఆలయాల మూసివేత

నెల్లూరు(మార్కెట్ సెంటర్, జడ్పీ), న్యూస్‌టుడే: చంద్రగ్రహణం సందర్భంగా ఈ నెల 3వ తేదీ నరసింహకొండపై ఉన్న వేదగిరి నరసింహస్వామి ఆలయంలో దర్శనం ఉదయం 9గంటల వరకే ఉంటుందని ఆలయ పాలకమండలి ఛైర్మన్ శంకర్‌రెడ్డి, ఈవో గోపి ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి ఆలయ శుద్ధి, నివేదన, పూజల అనంతరం 8.30 గంటల నుంచి సర్వదర్శనం అనుమతిస్తామన్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానం మూసివేస్తున్నామని ఆలయ ఈవో జనార్దన్‌రెడ్డి ప్రకటించారు. తిరిగి బుధవారం ఉదయం 9 గంటలకు ఆలయం ప్రత్యేక పూజల అనంతరం తెరుస్తామని వివరించారు. నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం, ఉదయం 10 గంటల నుంచి, మూలాపేట ప్రధాన శివాలయం ఉదయం 8గంటలకు, శ్రీ రంగనాథస్వామి దేవస్థానం 12.30 గంటలకు మూసివేస్తున్నట్లు ఆయా ఆలయాల అధికారులు ప్రకటించారు.

హక్కుల సాధనకు ఉద్యమం

నూతనంగా ఎన్నికైన జేఏసీ జిల్లా కార్యవర్గం

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: నగరంలోని ఎన్జీవో భవన్‌లో ఆదివారం ఏపీ జేఏసీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ఆర్టీసీ, పెన్షనర్లు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి నూతన ఛైర్మన్‌గా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎ.సురేంద్రరెడ్డితో పాటు 32 మందితో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లకు రావాల్సిన ప్రయోజనాల కోసం పోరాటం చేస్తామని ప్రకటించారు. హక్కుల సాధనకు నూతన జేఏసీ ఉద్యమిస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పీఆర్‌సీని నియమించాలని, మధ్యంతర భృతిని 32 శాతం ప్రకటించాలని, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జలం.. గరళం

అప్రమత్తం కాకుంటే మరో శ్రీకాకుళమే

న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

శ్రీకాకుళంలో తాగునీరు కలుషితం కావడంతో పదుల సంఖ్యలో ప్రజలు ఆసుపత్రుల పాలయ్యారు. గత ఏడాది నగరంలోని కుసుమహరిజనవాడతో పాటు బట్వాడిపాలెంలో విద్యార్థినుల వసతి గృహంలో డయేరియా ప్రబలింది. 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అయినా ట్యాంకుల శుభ్రత, పైపులైన్ల మరమ్మతులను గాలికొదిలేశారు.

మురుగు కాలువల్లో పైపులు

150 చదరపు కిలోమీటర్ల పరిధిలో నగరం విస్తరించింది. 54 డివిజన్లలో సుమారు 10 లక్షల మంది ఉన్నారు. 21 బావులు, మూడు పంపింగ్ కేంద్రాల నుంచి ఇళ్లకు నీరు సరఫరా అవుతోంది. రోజుకు 82 ఎంఎల్‌డీలు అందించాల్సి ఉంది. నగరంలో 9.5 కిలోమీటర్ల మేర తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల్లో నుంచి వెళుతున్నాయి. 406 కుళాయిలు కాలువల్లో ఉన్నాయి. 50 ఏళ్ల నాటి పైపులైను వ్యవస్థ కావడంతో గొట్టాలు తుప్పుపట్టి రంధ్రాలు పడుతున్నాయి. అందులోకి మురుగునీరు చేరడంతో కలుషితమై ఇళ్లకు సరఫరా అవుతోంది.

కుళాయిల్లో రంగు మారిన నీరు

నగరంలో చాలా వరకు ప్రధాన పైపులైన్లు మురుగు కాలువల్లో దర్శనమిస్తున్నాయి. వివిధ కారణాలతో తరచూ వీటి నుంచి వచ్చే నీరు కలుషితమవుతోంది. ఈనేపథ్యంలో గత కమిషనర్ మంచినీటి సరఫరాను ఆన్‌లైన్ పద్ధతిలో పర్యవేక్షించే విధానాన్ని తీసుకొచ్చారు. ప్రతి వార్డు అమెనిటీస్ సెక్రటరీ లాగిన్‌కు తాగునీటి వినియోగదారుల సమాచారం, కార్యదర్శి పరిధిలోని వీధులు, ఇళ్లు, వారి పేర్లు, డోర్ నంబర్లు, ఆఇంటి పూర్తి వివరాలు నమోదు చేశారు. సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను పరిశీలించి యాప్‌లో నమోదు చేసేవారు. లీకేజీలను కూడా ఇందులో పొందుపరిచేవారు. సమస్యలు వస్తే 24 గంటల్లో పరిష్కరించేవారు. ఆయన బదిలీ తర్వాత ఆవ్యవస్థను అటకెక్కించడంతో సరఫరా గాడి తప్పింది. ఏటా తాగునీటి సరఫరా కోసం రూ.40 నుంచి రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నా ఫలితం మాత్రం శూన్యం. రూ. 550 కోట్లతో చేపట్టిన తాగునీటి పథకం పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు.

నాణ్యత పరీక్షకు తూట్లు

తాగునీటి నాణ్యత పరీక్షలను ఇంజినీరింగ్ విభాగం అధికారులు మరిచిపోయారు. ట్యాంకు పరిమాణానికి తగ్గట్లుగా నీటిలో బ్లీచింగ్ పొడరు కలపాలి. 10 లీటర్ల పరిమాణమున్న బకెట్ నీటిలో బ్లీచింగ్ పొడి కలిపి అయిదు నిమిషాలు కదల్చకుండా ఉంచాలి. ఆ తర్వాత పైభాగంలోని ద్రావణాన్ని మాత్రమే ట్యాంకులో కలపాలి. 30 నిమిషాల తర్వాత ట్యాంకు నుంచి ఇళ్లకు సరఫరా చేయాలి. చివరి కుళాయి వద్ద క్లోరోస్కోప్ ద్వారా నీటిలో క్లోరిన్ పరీక్షిస్తే 0.2 పీపీఎం-0.5 పీపీఎం మధ్య ఉండాలి. 15 రోజులకోసారి ట్యాంకులు శుభ్రం చేయించాలి. ఈ ప్రక్రియ నిబంధనల మేరకు జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి కలుషితం కాకుండా సరఫరా చేస్తున్నట్లు నగర పాలసంస్థ కమిషనర్ నందన్ వివరించారు.

కూటమి ప్రభుత్వంతో రాష్ట్రం ప్రగతిపథం: రేవతి

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే రాష్ట్రం ప్రగతి దిశగా పయనిస్తుందని తెదేపా మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కప్పిర రేవతి తెలిపారు. ఆదివారం నెల్లూరులోని తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ధర్నా చేసిన అంగన్‌వాడీలకు నేడు చంద్రన్న ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. సుమారు రూ.20 కోట్ల బకాయిలు విడుదల చేయడమే కాకుండా ప్రతి నెలా ఒకటో తేదీ జీతాలు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. సమావేశంలో నాయకులు శ్రీదేవి, మాధవి, లత, అనూష, తులసి, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: పొదలకూరు రోడ్డు చాణక్యపురి కాలనీలో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచిపోతుంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. – వసుమతి, స్థానికురాలు

సమాధానం: కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ దినేష్, ఆరోగ్యాధికారి

? టక్కేమిట్ట మెయిన్‌రోడ్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గుంపులుగా చేరి ప్రజలపై దాడులు చేస్తున్నాయి. – నీలిమ

✓కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

ఇరాన్‌పై దాడికి వామపక్షాల నిరసన

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, యుద్ధోన్మాదం నశించాలంటూ ఆదివారం నగరంలో వామపక్షాల ఆధ్వర్యంలో గాంధీబొమ్మ కూడలిలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ప్రపంచంపై పెత్తనం సాగించాలన్న ఆలోచనతో అమెరికా అనేక దేశాలపై దాడులకు పాల్పడుతుందన్నారు. ఇరాన్‌పై దాడి చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, నగర నాయకులు కత్తి శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు, పౌరహక్కుల సంఘ నాయకులు బ్రహ్మం, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గాంధీ, ఏసీ బొమ్మల మీదుగా పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం తిరిగి గాంధీబొమ్మ వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జాస్తి కిషోర్‌బాబు మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడికి దిగి ఆ దేశాధ్యక్షుడ్ని హత్య చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో నగర నాయకులు యానాదయ్య, సండే మార్కెట్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు హఫీజ్, కార్యదర్శి సెంథిల్‌కుమార్, శరవణ, రఘు పాల్గొన్నారు.

నగరంలో ప్రదర్శన చేస్తున్న వామపక్షాల శ్రేణులు

కృష్ణతత్వం మైమరిపిస్తుంది

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: కృష్ణతత్వం భక్తులను మైమరిపిస్తుందని విశ్రాంత అధ్యాపకుడు లక్ష్మీనరసింహారావు అన్నారు. నెల్లూరు బాలాజీనగర్‌లోని సీతారామ మందిరంలో జరుగుతున్న భాగవత సప్తాహం ముగింపు కార్యక్రమం ఆదివారం ముగిసింది. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, మురళీకృష్ణ, చంద్రశేఖరం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం

నగరంలోని బాలాజీ నగర్‌లో ఉన్న సాయిదర్బార్ (అద్దాల మందిరం)లో ఆదివారం అగ్నిగుండ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మహిళలు నిప్పుల గుండం తొక్కారు. ఈ సందర్భంగా నృత్యాలు, కోలాటాలు జరిగాయి. గురువు లక్ష్మీ సాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మధుసాయి, రాముడు బ్య్రయ్య తదితరులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా..

నగరంలోని శ్రీహరినగర్ నుంచి అరవిందనగర్‌కు వెళ్లే కూడలిలో రైల్వే వంతెన వద్ద కాలువపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు పడడంతో ఇక్కట్లు తప్పడం లేదు. తక్షణమే మరమ్మతులు చేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నెల్లూరు (నవాబుపేట)

డివైడర్‌లో నూతన పూల మొక్కలు

నగరంలోని మినీబైపాసు రోడ్డు డివైడరులో ఎండిపోయిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్త పూల మొక్కలు నాటుతున్నారు. అన్నమయ్య సర్కిల్ నుంచి బీవీ నగర్ వరకు డివైడరు ఇలా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పెద్దవి.. వాటి మధ్యలో చిన్న పూల మొక్కలు ఉంచారు. డివైడరు రంగు రంగులతో ఆకట్టుకుంటోంది.

– న్యూస్‌టుడే, నెల్లూరు (వేదాయపాలెం)

పూడిక తీయక.. మురుగు పారక

నగరంలోని హరనాథపురం రెండో వీధిలో నెలలు గడుస్తున్నా.. కాలువల్లో పూడిక తీయడం లేదు. దీంతో గడ్డి మొలిచిపోయింది. పూడికతో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు చెబుతున్నారు. నగర పాలక అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతిసెంటర్)

వెండి నందిపై శివపార్వతుల విహారం

నగరంలోని మూలస్థానేశ్వరాలయంలో ఆదివారం వెండి నందిపై శివపార్వతులు ఊరేగారు. ప్రదోషం సందర్భంగా వివిధ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈవో ఏ.శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

4న రథం ట్రయల్ రన్

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ తేదీన రథోత్సవం జరగనున్నందున 4వ తేదీన ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

జనసైనికుల ప్రదర్శన

నెల్లూరు(మార్కెట్ సెంటర్): సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పిస్తూ జనసైనికులు ఆదివారం నగరంలో ప్రదర్శన చేశారు. గాంధీ బొమ్మ నుంచి ఏసీ బొమ్మ కూడలి వరకు జరిగింది. ఈసందర్భంగా పలువురితో సభ్యత్వం చేయించారు. నాయకులు గునుకుల కిశోర్, నూనె మల్లికార్జునయాదవ్ మాట్లాడుతూ కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దే ప్రక్రియ సభ్యత్వం ద్వారా కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డికి వేమిరెడ్డి దంపతుల పరామర్శ

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ నాయకుడు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో ఆదివారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట కోట మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

ఆవాజ్ మహాసభలు విజయవంతం చేయాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : దేశంలో మత సామరస్యం పెరగాలంటే ఆవాజ్‌ను బలోపేతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుభహాన్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆవాజ్ మూడో రాష్ట్ర మహాసభకు ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 9, 10వ తేదీల్లో జిల్లాలో జరిగే ఆవాజ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో 71 మందితో ఆహ్వాన కమిటీని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రషీద్, అధ్యక్షుడు షేక్ అజీజ్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి యజాన్, సయ్యద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సుభహాన్

సండే సరదాగా..

నెల్లూరు (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: హ్యాపీ సండే కార్యక్రమానికి నగరవాసుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని నగర మేయర్ సుజాత తెలిపారు. ఆదివారం 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. వేదికపై చిన్నారులు, పెద్దలు చేసిన నృత్యాలు ప్రేక్షకులను కేరింతలు కొట్టించాయి. కార్యక్రమంలో నాయకులు అశోక్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ దినేష్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సుధ, డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీలాటలో మేయర్ సుజాత తదితరులు

యువజనం.. సేవాపథం

న్యూస్‌టుడే, నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)

సేవాభావం గల యువకులంతా ఒక్కటయ్యారు. పేదలను ఆదుకోవడానికి కదిలారు. అన్నార్తులు, అభాగ్యులను అక్కున చేర్చుకుంటున్నారు. ప్రాణాపాయంలో ఉన్న వారి కోసం రక్తదానం చేసి కాపాడుతున్నారు. చదువుకోలేని వారికి చేయూతనిస్తున్నారు. ఆపన్న హస్తాలుగా గుర్తింపు పొందారు మహాయాగ హెల్పింగ్ సొసైటీ సభ్యులు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న మహాయాగ హెల్పింగ్ సొసైటీ సభ్యులు లోకేశ్ తదితరులు

నగరంలోని పత్తేఖాన్‌పేటకు చెందిన రామచంద్ర, శ్రీలక్ష్మి దంపతుల కుమారుడు పురిణం లోకేశ్ ఇంజినీరింగ్ చదివారు. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు సేవ కార్యక్రమాల గురించి చెప్పేవారు. 'ఈనాడు' ఆదివారం పుస్తకంలో ప్రచురితమయ్యే స్ఫూర్తిదాయక కథనాలను చదివేవారు. ఐఐటీ విద్యార్థులు తమ జేబు ఖర్చుల్లో కొంత సొమ్ము ఓ హుండీలో వేసి నెలాఖరులో పేద పిల్లలకు చదువులకు ఇవ్వడం.. అలా చదువుకున్న ఎంతో మంది ఉన్నతస్థానాలకు చేరినట్లు 2009 సంవత్సరంలో చదివిన కథనంతో స్ఫూర్తి పొందారు. పేదలకు సేవ చేయాలనుకున్నారు. స్నేహితులు ఎండూరి దీపక్, పుచ్చలపల్లి సుధీర్, మురళి, వినూత్న, గీత, బాలిరెడ్డి, అనూష్, వినయ్, శివతేజ తదితరులతో కలిసి మహాయాగ సొసైటీ నెలకొల్పారు. 2011 ఆగస్టు 19 నుంచి కార్యక్రమాలు ప్రారంభించారు. నెల్లూరు, అల్లూరు, బుచ్చిరెడ్డిపాలెం, నాయుడుపేట, సూళ్లూరుపేట, విజయవాడ తదితర చోట్ల 270 మందికి పైగా సభ్యులు ఉన్నారు. ఇందులోని వారంతా ఉన్నత చదువులు చదువుతున్న వారే. నగరంలోని ఉన్నత వర్గాల నుంచి దుస్తులను సేకరించి గ్రామాల్లోని నిరుపేదలకు పంపిణీ చేస్తున్నారు. కిడ్నీ బాధితులకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు.

కార్యక్రమాలు ఇలా..

పేద విద్యార్థులను దత్తత తీసుకొని చదివిస్తున్నారు. ఒంగోలులో ఓ నిరుపేద విద్యార్థిని చదువు నిమిత్తం ఫీజులు చెల్లించారు. కరోనాకాలంలో ఓ నిరుపేద విద్యార్థి హాస్టల్ కోసం ప్రతి నెలా రూ.3 వేలు అందజేశారు. నిరుపేద హాకీ క్రీడాకారిణికి నెలకు రూ.2వేలు చొప్పున సాయం. ● బుచ్చిరెడ్డిపాలెం యూపీహెచ్‌సీ, వెంకటాచలం సీహెచ్‌సీలలో ప్రతి నెలా 9వ తేదీ గర్భిణులు, రోగులకు ఆహారం అందజేత. ● తలసేమియాతో బాధపడుతున్న పెన్నా రెడ్డిపాలెం పిల్లలకు మందుల కోసం ఆర్థిక సాయం, రక్తం, పౌష్టికాహారం అందజేత. ● ఇప్పటివరకు 50కు పైగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు. వియోని అనాథాశ్రమంలో చిన్నారులకు బ్యాగులు, నిత్యావసర సరకులు పంపిణీ.

నిరుపేదలకు మరింత సాయం

– లోకేశ్, సొసైటీ వ్యవస్థాపకులు

సభ్యులమంతా కలిసి మహాయాగ హెల్పింగ్ సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. నిరుపేదలకు మరింత సాయం అందించేందుకు కృషి చేస్తాం.

పెద్దాసుపత్రిలో మంటలు.. రోగుల పరుగులు

పేలిన ఏసీలు..

బయటకు వెళుతున్న రోగి

నగరంలోని సర్వజనాసుపత్రి ప్రసూతి విభాగంలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. దీంతో రోగులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. ఆయా వార్డుల్లో ఉన్న తల్లీబిడ్డలు, బాలింతలు వణికిపోయారు. వెంటనే సిబ్బంది వచ్చి వారిని ఇతర వార్డుల్లోకి పంపించారు. మంటలు ఆర్పివేశారు. –న్యూస్‌టుడే, నెల్లూరు (జీజీహెచ్)

వైద్య సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది.. చంటిబిడ్డతో బయటకొస్తున్న తల్లి

సమస్యలపై నాయకులకు ఉపాధ్యాయుల వినతి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : సమస్యలు పరిష్కరించాలని బీటీఏ ఆధ్వర్యంలో ఆదివారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి వారి కార్యాలయాల్లో వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ పీఆర్సీ నియమించాలని, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. డీఏ బకాయిలను విడుదల చేయాలని కోరారు. పలు సమస్యల పరిష్కారం కోసం దశలవారీ పోరాటాలు చేపడుతున్నామని, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, నాయుకులు వేణుగోపాల్, ఆదినారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధాలు ఆగి.. శాంతి నెలకొనాలి

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: యుద్ధాలు ఆగి ప్రపంచ శాంతి నెలకొనాలని వక్ఫ్ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆకాంక్షించారు. నగరంలోని కోటమిట్ట మస్జీద్ ఏ సహాబాలో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచం అల్లకల్లోలంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో యుద్ధాలు నిలిచి.. శాంతి నెలకొనాలని ప్రార్థనలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో తెదేపా మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రార్థనలు చేస్తున్న వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్ తదితరులు

ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతులు కల్పించండి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య శాఖలో కొన్ని క్యాడర్ల ఉద్యోగులకు నష్టం జరుగుతుందని, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు (మహిళ) ఉద్యోగోన్నతుల్లో తీవ్ర జాప్యం జరుగుతుందని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏపీ హంస జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 28 సంవత్సరాలుగా పదోన్నతులు లేక ఏఎన్‌ఎంలుగానే కొనసాగుతున్నారన్నారు. హంస జిల్లా ఉపాధ్యక్షుడిగా జంగా శ్రీనివాసులుఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు ఇందిర, పరిమళ, నాగరాజమ్మ, మజార్, గౌస్‌బాషా, మంజరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులును సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

In the Court of the 2nd Addl. Senior Civil Judge, Nellore (Fast Track Court)
E.P. No. 25/2025
O.S. No. 285/2015
Pesala Vani - DHR
Vs
Allam China Masthanaiah - JDR
NOTICE TO JDR
Allam China Masthanaiah S/o. Raghu Ramaiah, R/o. D. No. 25-6-577, NCC Colony, Dycus Road Center, Nellore City
పై నెంబరు కేసులో డిక్రీ హోల్డరు మీ మీద పై వారి కోర్టులో ఇపి దాఖలు చేసియున్నారు. సదరు ఇపిలో ఆర్డరు 21 రూల్ 54 నోటీసు నిమిత్తం తేది 19-03-2026న వాయిదా వేసియున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని వకీలు ద్వార గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసింది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
పి. జ్ఞానప్రసూనాంబ, B.Sc., BL., డిక్రీ హోల్డరు తరపు అడ్వకేటు, నెల్లూరు.

In The Court of the 1st Addl. Junior Civil Judge, Nellore
O.S.No. 8/2024
Challa Sudhakar Reddy ... Plaintiff
Vs
Pochareddy Sudhakar Reddy ... Defendant
NOTICE TO DEFENDANT
Pochareddy Sudhakar Reddy S/o Late Ramalinga Reddy, New Door No. 24-7-6, Old Door No. 24-2-1172/2, Magunta Layout, Nellore City, SPSR Nellore Dist.
పై నెంబరు కేసులో వాది మీ మీద పై వారి కోర్టులో ప్రామిసరీ నోటు బాకీ రాబట్టు కొనుటకు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం తేది 10-3-2026న వాయిదా వేసియున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసింది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
B.H.V.Malyakumar, B.Com., B.L., వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు తగవు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, అధ్యక్షుడు రాజగోపాలాచార్యులు ఆదివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. లీప్ యాప్‌లో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని కోరారు.

జేవీవీ పోటీల్లో జిల్లాకు రెండో స్థానం

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి 'వక్త 2026' పోటీల్లో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని ఈ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న కుష్బూకుమారి ఈ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.15 వేలు నగదు బహుమతి అందుకుందని వివరించారు. ఈపోటీలతో విద్యార్థుల్లో సృజనాత్మకత వెల్లడైందని వివరించారు.

పార్వీ సినిమాస్ (ఎం.1) షెడ్యూల్ : స్క్రీన్..2. అతడు (తెలుగు) స్క్రీన్..2. విష్ణు విన్యాసం (తెలుగు) స్క్రీన్.. 3..కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు), హే బలవంత్ (తెలుగు) **పార్వీ సినిమాస్ (స్పైస్) :** స్క్రీన్. 2..సన్ ఆఫ్ (తెలుగు), ది రైజ్ ఆఫ్ అశోక (తెలుగు) స్క్రీన్ 3. స్క్రీమ్ 7 (ఇంగ్లిష్) ఫంకీ (తెలుగు) స్క్రీన్ 4. కపుల్ ఫ్రెండ్లీ (తెలుగు), హే బలవంత్ (తెలుగు) స్క్రీన్. 5. విష్ణు విన్యాసం (తెలుగు)

తెరపై ఈనాడు

పేరులో ఘనత.. వసతులు లేక కలత

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

నగరంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుండగా.. కొన్నిచోట్ల చిన్నిచిన్న సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదు. నగరంలోని నివాస యోగ్యమైన ప్రాంతాల్లో పొగతోట ప్రధానమైంది. ఇక్కడ పలు సమస్యలు తిష్ఠ వేశాయి. రైల్వేలైన్ ఏర్పడకముందు నిర్మానుష్యంగా పిచ్చిచెట్లతో దర్శనమిచ్చే ఆ ప్రాంతం ఇప్పుడు ఎంతో అభివృద్ధి చెందింది. ప్రధాన వీధి నుంచి మూడు సినిమా థియేటర్ల రోడ్డు, రెండోవీధి, మూడో వీధులు చిన్నపాటి వర్షానికే జలమయం అవుతున్నాయి. గతంలో నిర్మించిన పాత కాలువల్లో నీరు వెళ్లేందుకు వీలు లేకుండా అక్కడి వ్యాపారులు మూత వేసేశారు. దీంతో వర్షాకాలంలో నీరు వెళ్ల దారి లేక రహదారులపై నిలిచి ఉంటున్నాయి. కాలువల్లో పూడిక తీసే అవకాశం లేక దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువైంది. ఎన్నికలకు ముందుగా సిమెంట్ రోడ్లు వేసినా పలుచోట్ల సిమెంట్ చెదిరిపోయి కంకరరాళ్లు తేలాయి. ప్రధానంగా ట్రంకురోడ్డుకు పక్కనే ఉన్నా, పలు వీధుల్లో ఫ్లడ్‌లైట్లు వేయలేదని, కొన్ని ఉన్నా వెలగడం లేదని ఆ ప్రాంతవాసులు తెలిపారు. నగరపాలక అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వేలైన్ చివరన తవ్విన సిమెంట్ రోడ్డు

దోమల బెడదతో అవస్థలు

స్థానికంగా కాలువల్లో పూడిక తీయక అవస్థలు పడుతున్నాం. ఆసుపత్రులకు వచ్చే రోగులు దోమలతో అల్లాడుతున్నారు. అధికారులు స్పందించి దోమల నివారణకు కాలువల్లో పూడిక తీయించాలి. –శివరామకృష్ణప్రసాద్, వైద్య సహాయకుడు

పోలీసుల పర్యవేక్షణ అవసరం

పొగతోట చివరన మూడు సినిమా థియేటర్ల సమీపంలో చీకటి పడితే అటుగా వెళ్లేందుకు ధైర్యం చేయలేకపోతున్నాం. పోలీసుల పర్యవేక్షణ ఉంటే బాగుంటుంది. –పరమేశ్వరి, గృహిణి

మహిళా శక్తి అవార్డుల ప్రదానం

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: సుజన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్‌లో మహిళా శక్తి అవార్డుల ప్రదానోత్సవం వేడుకగా సాగింది. వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన 10 మంది మహిళలకు ఈ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ మేకపాటి శాంతికుమారి, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డాక్టర్ మాధవీచౌదరి, ఆడిటర్, రచయిత చిన్ని నారాయణరావు, రెడ్‌క్రాస్ ఛైర్మన్ వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ ప్రసన్నలక్ష్మి, డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాశక్తి అవార్డు కార్యక్రమంలో మహిళలు

హంస వాహనంపై నృసింహుడు

శ్రీవారికి హారతి ఇస్తున్న అర్చకులు

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆదివారం హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు రాత్రి శ్రీవారు హంస వాహన అలంకారంతో తిరువీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా స్వామిని పరిమళ పుష్పాలతో అలంకరించారు. విశేష పూజలు జరిపి తిరుమాడ వీధుల్లో ఉత్సవాన్ని ప్రారంభించారు. రథంపై కొలువుదీరిన నారసింహునికి ప్రత్యేక వాయిద్యాలతో భక్తిగీతాలు ఆలపిస్తుండగా ఉత్సవం ముందుకు సాగింది. ఉదయం మండపోత్సవం వేడుకగా జరిపారు. పురప్రజలు పెద్దసంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. సోమవారం ఖాద్రీశుడు సింహ వాహనంపై ఊరేగనున్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారని, వాటిని కూడా పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలుగానే పరిగణించి పరిష్కరిస్తామన్నారు.

● జిల్లా కలెక్టరేట్‌లో పుట్టపర్తి, కదిరి, మడకశిర, ధర్మవరం, పెనుకొండ రెవెన్యూ డివిజన్ల వారీగా ఆయా ఆర్డీవోల ఆధ్వర్యంలో రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఇందులో సంబంధిత తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సార్వత్రిక పరీక్షలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లాలో నేటి నుంచి ఇంటర్మీడియట్ సార్వత్రిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ ఏడీ లాజర్, జిల్లా పరీక్షల మండలి కార్యదర్శి గోపాల్ తెలిపారు. పరీక్షలు ఈనెల 13వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనుములపల్లి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కదిరి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కదిరి, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల తొగరేటి, పెనుకొండలో రెండు కేంద్రాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మడకశిరలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు అర గంట ముందుగానే హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డుతో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని వారు సూచించారు.

3న లేపాక్షి ఆలయం మూసివేత

హిందూపురం: ఈనెల 3వ తేదీన చంద్రగ్రహణం సందర్భంగా లేపాక్షిలోని వీరభద్ర స్వామి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంహెచ్ నరసింహమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆ రోజు ఉదయం 8గంటల లోపు నిత్య పూజలు నిర్వహించి 8:30 గంటలకు తలుపులు మూసివేస్తామన్నారు. తిరిగి 4వ తేదీ బుధవారం ఉదయం 7 గంటలకు తలుపులు తీసి ఆలయ శుద్ధి, స్వామివారికి అభిషేకాలు, అర్చనల అనంతరం 8గంటల నుంచి స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతిస్తామన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించి సహకరించాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సా॥)	సహర్ (ఉ॥)
హిందూపురం	6.31	5.21
కదిరి	6.28	5.17
ధర్మవరం	6.33	5.18

ముఖహాజరు లేకపోతే.. ఉపాధి గల్లంతే

■ నేటి నుంచి తప్పనిసరి

ధర్మవరం పట్టణం, తాడిమర్రి, కదిరి, న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా కూలీలకు ముఖ హాజరు(ఫేషియల్ అథన్టికేషన్) ప్రవేశపెట్టింది. మార్చి 2వ తేదీ నుంచి ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని అన్ని రాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. దీంతో సోమవారం నుంచే ఈ నూతన విధానం అమల్లోకి రానుంది.

ఈ-కేవైసీ ఉంటేనే పనులకు..

గతంలో ఉపాధి హామీ పనులు చేసేటప్పుడు జాబ్‌కార్డులో ఒకరుంటే వారికి బదులు మరొకరు పనులకు వెళ్లి మస్టర్‌లో దొంగ సంతకాలు చేసేవారు. దీని వల్ల నిధులు దుర్వినియోగం అయ్యేవి. పనులకు హాజరయ్యే ప్రతి కూలీకి ఈ-కేవైసీ చేసి దాన్ని సక్రమంగా అమలు చేస్తే అక్రమాలకు పూర్తిగా స్వస్తి పలికే అవకాశం ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించి ఈ విధానాన్ని ప్రవేశపెట్టాయి. దీంతో ప్రతి కూలీ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని అధికారులు తేల్చి చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఈకేవైసీని గత ఏడాది అక్టోబర్ 25 నుంచి ప్రారంభించి ఇప్పటి వరకు 81 శాతం పూర్తి చేశారు.

పిన్నదరిలో పనులు చేస్తున్న కూలీలు

ఏ ఒక్కటి మర్చిపోయినా..

పనుల వద్ద కూలీలకు ఐడీని క్రియేట్ చేస్తారు. మొదట ఫీల్డ్ అసిస్టెంట్, క్షేత్ర సహాయకులు(టీఏ)లు కూలీల ఫొటో తీస్తారు. పని పూర్తయిన నాలుగు గంటల తరువాత మరొకసారి కూలీల ఫొటో తీస్తారు. దీంతో పనులు పూర్తి చేసినట్లు వారికి సమాచారం అందుతుంది. ఈ నిబంధనల్లో ఏ ఒక్కటి మర్చిపోయినా బిల్లులు జమకావు.

జిల్లా: శ్రీసత్యసాయి
జాబ్‌కార్డులు: 2,51,000
యాక్టివ్‌లో ఉన్నవి: 2,09,000
నమోదైన కూలీలు: 4,49,000
క్రియాశీలకంగా ఉన్నవారు: 3,65,000
ఈ-కేవైసీ పూర్తి చేసిన కూలీలు: 2,98,168
ఉపాధిహామీ పనుల సంఖ్య: 38,000 (వీటిలో సుమారు 60 రకాల పనులు చేపడతారు)

అవాంతరాలను అధిగమిస్తారా..

జిల్లాలో నేటికీ పలు గ్రామాల్లో నెట్‌వర్క్ సిగ్నల్స్ సరిగా లేవు. దీంతో ముఖ హాజరు విధానం అధికారులకు సవాలుగా మారనుంది. దీని కోసం అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లకు ఓ ముఖ్య సూచన చేస్తున్నారు. పని ప్రదేశంలో కూలీల ఫొటోలు తీసి సిగ్నల్ వచ్చే ప్రాంతంలో యాప్‌లో అప్లోడ్ చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ఈ విధానం అమలైతే మంచిదే. ఒకవేళ ఇది పనిచేయకుంటే కూలీలతో సమస్యలు వస్తాయేమోనని ఫీల్డ్ అసిస్టెంట్లు ఆందోళన చెందుతున్నారు. మొదటిరోజు ముఖ హాజరు పనితీరుపై సందేహాలు తెలుస్తాయని, అంతవరకు వేచి ఉండాలని అందరూ అనుకుంటున్నారు.

అక్రమాలను అరికట్టేందుకే..

- విజయప్రసాద్, డ్వామా పీడీ

ఉపాధిహామీ పనుల్లో పారదర్శకంగా ఉండాలని ముఖ హాజరును ప్రవేశపెట్టారు. ఈ విధానంతో కూలీలకు వేతనాలు సకాలంలో అందుతాయి. ఈ-కేవైసీ ఉంటేనే పనులకు హాజరుకావాలని కూలీలకు సూచించాం. ఉపాధి హామీ సిబ్బందికి చాలా వరకు సమస్యలు తగ్గిపోతాయి.

సైకిల్‌ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

మహిళల భద్రత ప్రతిఒక్కరి బాధ్యత

పుట్టపర్తి, న్యూస్‌టుడే: మహిళల భద్రతను ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలని, మహిళా సాధికారతతోనే సమాజ పురోగాభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండ్ నుంచి గణేశ్ కూడలి వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సైకిల్ తొక్కడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఎంతో మంది ఆడపిల్లలు స్వేచ్ఛగా పాఠశాలకు వెళ్లి చదువుకోవడం ప్రారంభించారని గుర్తు చేశారు. మహిళల్లో చైతన్యం నింపేలా వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అంకితసురానా, ఆర్డీవో సువర్ణ, ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు. సీఐలు శ్రీనివాసులు, సురేష్, బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, బొజ్జప్ప, శక్తి బృందాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియంత్రిక.. నిరీక్షించలేక

● వ్యవసాయ సర్వీసుల మంజూరులో తీవ్ర జాప్యం ● కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

జిల్లా: శ్రీసత్యసాయి
వ్యవసాయ సర్వీసులకు నమోదైన దరఖాస్తులు : 26,000
రైతులు అందించిన డీడీలు : 8,300
చెల్లించిన మొత్తం : సుమారు రూ.10.40 కోట్లు
సర్వీసుల విడుదలకు అవసరమయ్యే నియంత్రికలు : 3,540

అనంతపురం(విద్యుత్తు), న్యూస్‌టుడే: వ్యవసాయ సర్వీసులు పొందేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. శాఖ నిబంధనల ప్రకారం డీడీలు తీసి అందించినప్పటికీ విద్యుత్తు నియంత్రికల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది. సామగ్రి, నియంత్రికల కోసం రైతులు కాళ్లరిగేలా విద్యుత్తు సెక్షన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదని, కొందరు ఏఈలు అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలకు విద్యుత్తు నియంత్రికలు, సామగ్రి అనంతపురం స్టోర్ నుంచి సరఫరా చేయాల్సి ఉంది. అయితే స్టోర్‌లో 25కేవీ, 16 కేవీ నియంత్రికలు అందుబాటులో లేవు. నెల రోజులుగా నియంత్రికల సరఫరా లేకపోవటంతో రైతులకు విడుదల చేయలేదని అధికారులు చెబుతున్నారు. కాగా.. మామూళ్లు ఇచ్చిన వారికి అన్నీ సమకూర్చి సర్వీసులు కూడా విడుదల చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

త్వరలోనే వస్తాయి - మోసెస్, ఎస్ఈ, శ్రీసత్యసాయి జిల్లా

విద్యుత్తు నియంత్రికల సరఫరా ఆగిన మాట వాస్తవమే. కొన్ని రోజులుగా విడుదల చేయటం లేదు. రైతుల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. పారదర్శకంగా వ్యవసాయ సర్వీసుల మంజూరుకు తగిన చర్యలు తీసుకుంటాం. అధికారులు, సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుంటే రైతులు ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి మీదుగా కోడూరు వరకు నిర్మిస్తున్న 342వ జాతీయ రహదారి నిర్మాణం నేటికీ అసంపూర్తిగానే మిగిలింది. గతంలో ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డును జాతీయ రహదారిగా మార్చినా ఆ స్థాయిలో సౌకర్యాలు కనిపించలేదు. నిధులున్నా.. నిర్ణీత సమయంలో భూసేకరణ చేయకపోవడం, పరిహారం అందక రైతులు ధర్నాలు చేస్తుండటం వంటి కారణాలతో గడువులోపు నిర్మాణ లక్ష్యం చేరుకోలేకపోయింది.

ముదిగుబ్బలో గుట్టను తొలిచి నిర్మిస్తున్న బైపాస్‌రోడ్డు

ఎప్పటికి పూర్తి చేస్తారో?

■ జాతీయ రహదారి పనుల్లో జాప్యం

● అనంతపురం నుంచి చెన్నై వెళ్లే 42వ జాతీయ రహదారిలో ముదిగుబ్బ నుంచి అనంతపురం, బెంగళూరు వెళ్లే 44వ నేషనల్ హైవే కోడూరును కలుపుతూ 342వ జాతీయ రహదారి నిర్మిస్తున్నారు. గతేడాది డిసెంబరుకి గడువు ముగిసింది. అప్పటికి 85 శాతం పనులు మాత్రమే జరిగాయి. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు మరో ఆరు నెలల పాటు గడువు పొడిగించారు. ప్రధానంగా భూసేకరణలో జాప్యం కారణంగా పనులు పూర్తి చేయలేకపోయారు.

జాతీయ రహదారి :	342
దూరం :	78 కి.మీ
భూసేకరణతో కలిపి మొత్తం నిధులు :	రూ.1,900 కోట్లు
పనులు ప్రారంభం :	జనవరి, 2023
నిర్మాణ గడువు :	డిసెంబరు 2025
ఇప్పటి వరకు జరిగింది :	85 శాతం
పెండింగ్‌లో ఉన్నది :	15 శాతం

పరిహారం కోసం రైతుల ఎదురుచూపులు

రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించడంలో తీవ్ర అలసత్వం నెలకొంది. మొదటి విడతలో బాధితులకు పరిహారం అందించినా రెండో విడతలో సర్వీసు రోడ్ల నిర్మాణానికి భూమి సేకరించిన రైతులకు పరిహారం అందివ్వలేదు. మార్కెట్ ధరలకు, రిజిస్ట్రేషన్ విలువకు తేడాలుండటంతో బాధితులు న్యాయమైన పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితంలేదు. ఇటీవల ఓ రైతు కుటుంబం రహదారిపై ముళ్లకంపలు వేసి నిరసన తెలపడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. అయినా పరిహారం ఇవ్వకుండా బాధితులపైనే కేసులు పెట్టడం గమనార్హం.

● జాతీయ రహదారి నిర్మాణం అసంపూర్తిగానే మిగలడంతో ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముదిగుబ్బలో కిలోమీటరు బైపాస్ నిర్మాణం, గరుగుతండా, బుక్కపట్నంలో బుచ్చయ్యగారిపల్లి, పుట్టపర్తి శివారులో ఇంకా సర్వీసు రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తి కాలేదు.

త్వరలోనే పూర్తి చేస్తాం - గిడ్డయ్య, ఎన్‌హెచ్ డీఈ

ముదిగుబ్బ, పుట్టపర్తిలో బైపాస్ పనులు జరుగుతున్నాయి. బుచ్చయ్యగారిపల్లి దగ్గర కల్వర్టు నిర్మాణాలు త్వరలోనే పూర్తి చేస్తాం. బాధితుల పరిహారం సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే అందేలా చూస్తాం.

కాటికోటేశ్వరునికి ప్రత్యేక పూజలు

అలంకారంలో స్వామివారు

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిల్లవారిపల్లి గ్రామ సమీపంలో కొలువైన కాటి కోటేశ్వర క్షేత్రంలో ఆదివారం స్వామివారికి విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవిరాట్టును పురోహితులు ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు చేశారు. రుద్రాభిషేకం, కుంకుమార్చన, పూజ చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గదేగుండం వద్ద పూజలు జరిపారు.

ముగిసిన గురుకుల ప్రవేశ పరీక్షలు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్, ఐదో తరగతిలో ప్రవేశానికి ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షలను నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 16 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఆయా కేంద్రాలను గురుకుల విద్యాలయాల సమన్వయకర్త జయలక్ష్మి, ఇతర అధికారులు పర్యవేక్షించారు. హిందూపురం, మలుగూరు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఉదయం జరిగిన ఐదో తరగతి పరీక్షకు మొత్తం 6,457 మంది విద్యార్థులు హాజరు కాగా.... 583 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు 3,528 మంది హాజరుకాగా 510 మంది హాజరు కాలేదు. ఐఐటీ, నీట్ శిక్షణతో కూడిన ఇంటర్ ప్రవేశానికి 2,374 మంది హాజరు కాగా 457 మంది గైర్హాజరయ్యారు. ఫలితాలు త్వరలోనే ప్రకటిస్తారని జయలక్ష్మి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

హిందూపురంలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీఓ జయలక్ష్మి

గోరంట్లలో ట్రాఫిక్ కష్టాలు

గోరంట్లలో ట్రాఫిక్ కష్టాలు ఎప్పటికి తీరుతాయోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. నిత్యం సమస్యతో సతమతమవుతున్నారు. ఉదయం, సాయంత్రం రోడ్డు దాటడానికి వీలు కాని పరిస్థితి ఉంటోంది. ఏమాత్రం ఏమరపాటుగా రోడ్డుపైకి వచ్చినా ప్రమాదం బారిన పడాల్సిందే. ప్రధాన రహదారిలో వాహనాలు నిలిచిపోయిన చిత్రం ఇది.

- న్యూస్‌టుడే, గోరంట్ల

తోబుట్టువులను వెంటాడిన మృత్యువు

➡ కారును బస్సు ఢీకొని ముగ్గురి దుర్మరణం

ఆ ముగ్గురు తోబుట్టువులు. అంతా కుటుంబాలతో సహా బెంగళూరులో కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జీవితాలపై పెద్దగా ఆశలు లేకపోయినా ఉన్నదాంట్లో ఆనందంగా జీవిస్తున్నారు. బంధువుల పెళ్లి ఉండటంతో ముగ్గురూ సంబరంగా బయలుదేరారు. శుభకార్యం ముగియగానే అందర్నీ పలకరించడానికి స్వగ్రామం బాట పట్టారు. ఊరి ఊసులు చెప్పుకొంటూ నవ్వుల పువ్వులు పూయిస్తూ వెళ్తుండగా మృత్యువు వెంటాడింది. బస్సు ఢీకొనడం.. ముగ్గురి ప్రాణాలు పోవడం అంతా క్షణాల్లో జరిగిపోయింది. ఆ ముగ్గురు ఇక లేరని తెలిశాక ఆ కుటుంబాల సభ్యులు రోదించిన తీరు అందర్నీ కలచివేసింది. వీరినే నమ్ముకొని బతుకు లీడుస్తున్న వారంతా గుండెలవిసేలా విలపించారు.

హనుమంతరాయుడు, శివకుమార్, చంద్రకళ

బస్సు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన కారు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే : కారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృత్యువాతపడ్డారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈఘటన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పరిధిలోని గూబనపల్లి వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం పరిధిలోని ముదిగల్లుకు చెందిన అన్నాచెల్లెలు శివకుమార్ (30), చంద్రకళ (29), వీరి పెద్దనాన్న కుమారుడు హనుమంతరాయుడు (42) పదిహేన్నేళ్లుగా బెంగళూరులో స్థిరపడ్డారు. రెండు రోజుల కిందట కర్ణాటకలోని మొలకాల్మూరు తాలూకా కొండ్లపల్లిలో బంధువుల వివాహం ఉండటంతో వచ్చారు. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం స్వగ్రామానికి వెళ్లి బంధువులను, స్నేహితులను పలకరించి రాత్రికి బెంగళూరు వెళ్దామని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో కారులో స్వగ్రామానికి బయల్దేరారు. అనంతపురం నుంచి కళ్యాణదుర్గం మీదుగా రాయదుర్గం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురూ అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. బస్సులో వెళ్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. మృతి చెందిన వారిలో శివకుమార్‌కు వివాహం కాలేదు. చంద్రకళకు భర్త నరసింహమూర్తి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హనుమంతరాయుడుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరి మరణంతో ఆయా కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపించాయి. ఘటనా స్థలానికి డీఎస్పీ రవిబాబు, పట్టణ సీఐ హరినాథ్ సిబ్బందితో చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించి మృతదేహాలను పంచనామా నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. బస్సు డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తెలుస్తోంది. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఈసందర్భంగా ప్రకటించారు.

చీనీ ధరలకు లెక్కే లేదు!

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని చీనీకాయల సంతలో డిటిజల్ డిస్‌ప్లే బోర్డు ఏర్పాటు చేశారు. అందులో నిత్యం చీనీ కాయల ఆన్‌లైన్ ధరలు ప్రదర్శిస్తుంటారు. నాగపూర్, గడ్డిఅన్నారం చీనీ ధరలు కూడా అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గరిష్ఠం, మధ్యస్థం, కనిష్ఠం బోర్డులో కనిపించేవి. గతేడాది భారీ వర్షాలకు బోర్డు శిథిలమైంది. అప్పటి నుంచి ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌యార్డులోని ఈ-నామ్ కార్యాలయం వద్ద రోజూ ధరలు రాసి నోటీస్ బోర్డులో ఉంచుతున్నారు. అక్కడ వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని చీనీ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపికశ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్రకుమార్ స్పందిస్తూ బోర్డుకు మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

డిజిటల్ డిస్‌ప్లే బోర్డు దుస్థితి

కూత వినిపించినా.. పట్టాలెక్కలేదు!

గుంతకల్లు, న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం అధికారులు కొన్ని రైళ్లను పొడిగించడానికి, కొత్త రైళ్లను నడపడానికి నిర్ణయాలు తీసుకున్నారు. నెలల గడుస్తున్నా ఆ రైళ్లు పట్టాలెక్కలేదు. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కరోనా సమయంలో, డబుల్ లైన్ నిర్మాణాల పేరుతో రద్దు చేసిన రైళ్లను కూడా ప్రభుత్వం తిరిగి నడపడానికి ఆదేశాలు జారి చేయడంలో జాప్యం చేస్తోంది.

★ ప్రస్తుతం నర్సాపూర్-ధర్మవరం మధ్య నడుస్తున్న రైలును గుంతకల్లు వరకు పొడిగించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. దీంతో రైలును పొడిగిస్తున్నట్లు అధికారులు మూడు నెలల కిందట ప్రకటించారు కానీ అమల్లోకి రాలేదు.

★ గుంతకల్లు - మార్కాపురం మధ్య కొత్త ప్యాసింజర్ రైలును నడపడానికి రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇది కూడా పట్టాలెక్కలేదు.

★ గుంతకల్లు నుంచి కడప వరకు ప్యాసింజర్ రైలుగా, కడప నుంచి తిరుపతి మీదుగా విశాఖపట్టణానికి ఎక్స్‌ప్రెస్‌గా ప్రయాణిస్తున్న తిరుమల రైలును గుంతకల్లు నుంచి విశాఖపట్టణం వరకు ఎక్స్‌ప్రెస్‌గా నడపాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. కానీ అమలు కావడం లేదు. ఈ రైలును పూర్తిగా ఎక్స్‌ప్రెస్‌గా నడిపితే తిరుపతి వెళ్లే భక్తులకు వెసులుబాటు కలుగుతుంది. ఈ మూడు రైళ్ల విషయంలో ఉన్నతాధికారులు త్వరగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొవిడ్ సమయంలో రద్దయిన రైళ్లు..: గుంతకల్లు మీదుగా హుబ్బళ్లి - విజయవాడ, బెంగళూరు - విజయవాడ మధ్య ప్రయాణించే ప్యాసింజర్ రైళ్లను కొవిడ్ సమయంలో రద్దుచేశారు. తిరిగి వాటిని ప్రవేశపెట్టడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. గేజ్ మార్పిడి, డబుల్‌లైన్ నిర్మాణం కోసమని రద్దు చేసిన అనంతపురం, గుంతకల్లు మీదుగా ప్రయాణించే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, గుంతకల్లు-ధర్మవరం-తిరుపతి ఫాస్ట్ ప్యాసింజర్ రైలు తిరిగి ప్రారంభం కాలేదు.

ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నాం

- శ్రావణ్‌కుమార్, సీనియర్ డివిజనల్ ఆపరేటింగ్ మేనేజరు

రైళ్ల పొడిగింపు, కొత్త రైళ్లను నడపడం, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును పూర్తి స్థాయిలో ఎక్స్‌ప్రెస్‌గా నడపడానికి ప్రాథమిక స్థాయిలో నిర్ణయాలు జరిగాయి. అయితే ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాలేదు. మార్కాపురం-గుంతకల్లు మధ్య కొత్త రైలును నడపాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఇంకా తేదీ ఖరారు కాలేదు. రైలును ఎప్పుడు ప్రారంభించాలనే తేదీ ఖరారు కోసం ఎదురు చూస్తున్నాం. గతంలో రద్దయిన రైళ్ల విషయంలో ఉన్నతాధికారులు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

సర్పరూపునికి విశేష పూజలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సర్పరూపునికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అర్చనలు, అభిషేకాలు, పంచామృతాభిషేకాలు చేశారు. రాహుకేతు, సర్పదోష, కాలసర్పదోష, కుజ దోష నివారణార్థం యాగ మండపంలో సుబ్రహ్మణ్యేశ్వర మూలమంత్ర బీజాక్షర హోమం నిర్వహించారు. మధ్యాహ్నం స్వామికి పల్లకీసేవ, మహామంగళహారతి అందించారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

పూర్తి వివరములకు: 8008709784

సంతల ఆదాయం రూ.3.83 లక్షలు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం రూ. 3,83,360 ఆదాయం వచ్చింది. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంతలో రూ. 2,40,530 ఆదాయం రాగా ఆదివారం జరిగిన పశువుల సంతలో రూ. 1,42,830 రాబడి వచ్చిందని యార్డు ఎంపిక్‌గ్రేడ్ ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్, ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా దుకాణంలో విడిపించి కొనుగోలు. (లక్ష్మీ పోలీస్ స్టేషన్ ఎదురుగా) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ ©: 7362114647

REAL ESTATE

హిందూపురం రైల్వేస్టేషన్ 3km లో అప్రూవల్ వెంచర్ చేసిన ప్రాజెక్టులో ప్లాట్లు & 38 ఎకరాల డబుల్ బెడ్‌రూమ్ హౌసెస్ అమ్మకం. సం: 6281824201.

PLOT FOR SALE

EMI ద్వారా విజయవాడ అప్రూవల్ ప్లాట్లు బెంగళూరు హైవే అనంతపురంలో 3 నెలలు, 6 నెలలు, 9 నెలలు EMI ద్వారా వీకెండ్ గిఫ్ట్ మెంబర్‌షిప్ వెంటనే ప్లాట్ బుకింగ్ చేయండి. Cont: 9703727786, 7989576111.

JOBS

Required Sales Executives for Tanishq Jewellery Store. Inter Pass with Retail Experience, 4 Tanishq Jewellery, R.F.Road, Anantapur. Ph: 9441719143.

Wanted: Lady Tele callers, Receptionist, Computer Operator, Pros in Anantapur. ©: 6302037812

Rajahamsa Grand ఇన్ Hotel నందు రూమ్ బాయ్స్‌గా పనిచేయుటకు కావలెను. సంప్రదించండి: 99482 66888.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజ్ నందు వార్డెన్స్ మరియు క్లాస్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం 12000 నుండి 14000 వరకు ఇవ్వబడును. (నాన్‌లోకల్ వారికి ఉచిత భోజన వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22 సం||ల నుండి 40 సం||ల లోపలవారు. వివరాలకు సంప్ర. ఫోన్: 9248733320.

మా కంపెనీలో పనిచేయుటకు Computer Operator పురుషులు కావలెను. అర్హత: Computer పట్ల అవగాహన, వయస్సు 40 లోపు, జీతం: 9000 to 10000. సంప్ర: ATP. ©: 9493181828.

ATPలో ప్రముఖ లైవ్ కంపెనీలో పనిచేయుటకు Logistics కొరకు 1 సం|| అనుభవం ఉన్న పురుషులు కావలెను. మంచి జీతం. ©: 9032543196

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లకు ఈనాడు వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించిన విషయాల్లో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజలు నష్టపోయినా ఈనాడు బాధ్యత వహించదు.

Eenadu Classifieds

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్షణ ఖర్చుకో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.. అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం... ఉద్యోగాల భర్తీ.. ఇళ్లు, ప్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలకు..

వివరాలకు 8008709784

ప్రకటనలకు జీ.ఎస్.టీ 5% వర్తించబడును

చదరంగం.. ప్రతిభకు పట్టం

అంతర్జాతీయ ఫిడే క్లాసికల్ రేటింగ్‌లో ఘనత

హిందూపురం, న్యూస్‌టుడే: చదరంగంలో అరుదైన ప్రతిభ కనబరుస్తూ పట్టణానికి చెందిన చదరంగం క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి ఆర్జిస్తున్నారు. ఫిబ్రవరి 13, 14, 15వ తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరులో వరల్డ్ చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ ఓపెన్ క్లాసికల్ పోటీలో స్థానిక స్పర్టన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న జి.జ్ఞాపికారెడ్డి (1407), ఎన్‌పీ చార్విక్ (1506), సి.మిథున్ పెద్దన్న (1495), సి.మహాన్‌పెద్దన్న (1447) క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ టోర్నమెంట్‌లో అంతర్జాతీయంగా 426 మంది క్రీడాకారులు పాల్గొని రేటింగ్ పోటీపడగా స్థానిక క్రీడాకారులు తమ మేధస్సుతో అరుదైన ర్యాంకులు సొంతం చేసుకొన్నారు. ఈ రేటింగ్ ఫలితాలను వరల్డ్ చెస్ ఫెడరేషన్ వారు ఆదివారం ప్రకటించారు. వీరు ఈ ర్యాంకులు సాధించేందుకు చేసిన కృషి వారి మాటల్లోనే..

ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచింది

చిన్నప్పటి నుంచి చదరంగంపై ఆసక్తి. పట్టణంలోని స్పర్టన్ శిక్షణ కేంద్రంలో మూడేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నాను. స్థానిక వేలంగి మాత పాఠశాలలో 8వ తరగతి చదువుతూనే రాష్ట్రస్థాయిలో పలుచోట్ల నిర్వహించిన పోటీల్లో పాల్గొని ద్వితీయ శ్రేణిలో రాణించాను. భవిష్యత్తులో ప్రపంచ ఛాంపియన్ స్థాయికి ఎదగాలని ఉంది. **- జి.జ్ఞాపికారెడ్డి**

పట్టువదలకుండా సాధన చేశాను

చదరంగం అంటే ఎంతో ఇష్టం. అందుకే స్థానిక స్పర్టన్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్నా. పలు దఫాలు విఫలమయ్యాను. అయినా పట్టు వదలకుండా పోటీల్లో పాల్గొంటున్నందున రాణించేందుకు అవకాశం ఏర్పడింది. ప్రస్తుతం ఎల్ఆర్‌జీ విద్యాలయంలో అయిదో తరగతి చదువుతున్నాను. భవిష్యత్తులో చదరంగంలో మంచి క్రీడాకారుడిగా రాణించాలని ఉంది. **- ఎన్‌పీ చార్విక్**

మెలకువలు నేర్చుకుంటున్నాను

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో స్థానిక స్పర్టన్ శిక్షణ కేంద్రంలో రెండున్నర సంవత్సరాలుగా శిక్షణ పొందుతున్నాను. అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించాలనే పట్టుదలతో శిక్షణలో మెలకువలు నేర్చుకుంటున్నాను. అంతర్జాతీయ ఫిడే రేటింగ్‌లో 1495 ర్యాంక్ సాధించాను. భవిష్యత్తులో గ్రాండ్ మాస్టర్ కావాలనే పట్టుదలతో ఆటలో మెలకువలు నేర్చుకొంటున్నాను. **- సి.మిథున్‌పెద్దన్న**

విశ్వనాథ్‌ఆనంద్ స్థాయికి ఎదగాలని..

చదరంగంలో గ్రాండ్ మాస్టర్ విశ్వనాథ్ ఆనంద్ స్థాయికి ఎదగాలని ఉంది. అందుకోసం రెండేళ్లుగా శిక్షణ పొందుతున్నాను. తొలుత కర్నూల్‌లో జరిగిన అంతర్జాతీయ రాపిడ్ టోర్నమెంట్‌లో 1470 రేటింగ్ వచ్చింది. తమిళనాడులో జరిగిన అంతర్జాతీయ ఫిడే క్లాసికల్ పోటీలో అధిక రేటింగ్ రావటం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. **- సి.మహాన్‌పెద్దన్న**

నేడు డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ సర్కిల్ స్థాయిలో వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించుకునేందుకు సోమవారం డయల్ యువర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తామని, విద్యుత్తు వినియోగదారులు సమస్యలను తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ● సీఎండీ ఫోన్ నంబరు: 89777 16661 ● ఎస్ఈలు అనంతపురం: 9154790350, శ్రీసత్యసాయి: 9963707847

అశ్వత్థనారాయణుడికి పసుపు పండగ

నాగులకు పసుపు, కుంకుమ సమర్పిస్తున్న భక్తులు

హిందూపురం సాంస్కృతికం: పట్టణ సమీపంలో ఉన్న విదురాశ్వత్థంలో ఆదివారం పసుపు పండగ ఘనంగా నిర్వహించారు. దత్త ఉపాసకుడు అశ్వత్థనారాయణస్వామి ఆశీస్సులతో వారి శిష్య బృందం సభ్యులు, సుదూర ప్రాంతాల నుంచి భక్తుల నడుమ ఆలయంలో ఉన్న నాగులన్నింటికీ పసుపు, కుంకుమ, పుష్పాలతో అలంకరించి ప్రత్యేక. అనంతరం మూలవిరాట్‌కు సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు.

5న జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు

అనంతపురం క్రీడలు: జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5న ఆర్ట్స్ స్టేడియంలో జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. రికర్వ్, ఇండియన్, కాంపౌండ్ అంశాల్లో అండర్-10, 13, 15 విభాగాల్లో పోటీలు నిర్వహించి అందులో నైపుణ్యం చాటిన బాలబాలికలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు కృష్ణా జిల్లా నూజివీడులో ఈ నెల 11 నుంచి 13వరకు నిర్వహించనున్నారు. ఆసక్తిగల జిల్లా క్రీడాకారులు ఆధార్, వయసు ధ్రువీకరణ, రెండు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

రెవెన్యూ, పోలీసుల జట్ల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

ఇరుజట్ల సభ్యులతో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: క్రీడలతో మానసిక ఒత్తిడిని జయించవచ్చని, అభిరుచులకు అనుగుణంగా అలవర్చుకోవాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం హిల్‌వ్యూ స్టేడియంలో జిల్లా రెవెన్యూ, జిల్లా పోలీసుల జట్ల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది. రెవెన్యూ జట్టుకు కలెక్టర్, పోలీస్ టీంకు ఎస్పీ కెప్టెన్‌గా వ్యవహరించారు. మొదట బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 120 పరుగుల స్కోర్ చేశారు. ఎస్పీ 40 పరుగులతో టాప్‌గా నిలిచారు. అనంతరం బరిలోకి దిగిన రెవెన్యూ జట్టు 18.1 ఓవర్లలో 121 పరుగులు చేసి, పోలీస్ టీంపై విజయం సాధించారు. రెవెన్యూ జట్టులో అశోక్ 34, ఇమ్రాన్ 24, కలెక్టర్ 13 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చారు. నిత్యం ఒత్తిడితో ఉండే ఉద్యోగులకు క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం, పరస్పర స్నేహబంధాలు పెంపొందేందుకు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే దివ్యాంగుల సంక్షేమం

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఛైర్మన్ నారాయణస్వామి

అనంతపురం ఆర్టీసీ, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించడం దివ్యమైన ప్రయోజనమని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ఛైర్మన్ గడుపూటి నారాయణస్వామి పేర్కొన్నారు. దివ్యాంగులకు ఇచ్చిన హామీ అమలు చేస్తూ జీఓ విడుదల చేసిన సందర్భంగా అనంతపురంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి దివ్యాంగులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి కేకు కోసి మిఠాయిలు పంచి సంబరాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలత్వం 40 శాతం, అంతకంటే ఎక్కువ ఉన్న వారందరికీ ఉచిత ప్రయాణం లభిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగులకు పింఛన్ రూ.6వేలు చేశారని గుర్తు చేశారు. దివ్యాంగ సంఘాల నేతలు నరసింహులు, గంగన్న, నారాయణస్వామి, విజయభాస్కర్‌రెడ్డి, గంగానాయుడు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై చెన్నకేశవుడు

యాడికి, న్యూస్‌టుడే: యాడికిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గరుడవాహనంలో లక్ష్మీచెన్నకేశవులు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో అభిషేకాలు, హోమాలు తదితర కార్యక్రమాలు చెన్నైకు చెందిన రాచమడుగు రామమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన గరుడోత్సవం వేలాది భక్తుల నడుమ సాగింది.

అభివృద్ధి చూశారు.. తెదేపాలో చేరారు: మంత్రి

కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి సవిత

గోరంట్ల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 20 నెలల్లో చేసిన అభివృద్ధిని చూసి వైకాపా నాయకులు తెదేపాలో చేరుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. గోరంట్ల మండలంలో ఆదివారం మంత్రి పర్యటించిన సందర్భంగా ఎర్రబల్లి గ్రామానికి చెందిన వైకాపా నాయకుడు పద్మనాభరెడ్డి 80 కుటుంబాల అనుచరులతో మంత్రి సమక్షంలో తెదేపాలో చేరారు. మంత్రి మాట్లాడుతూ పద్మనాభరెడ్డి లాంటి రైతులకు కావాల్సింది సాగునీరు, మార్కెటింగ్, పనిముట్లు, సాంకేతిక అభివృద్ధి. అవన్నీ తెదేపా పాలనలోనే ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు పాలన వరకు అందుతున్నాయన్నారు. రాయలసీమకు తాగు, సాగునీరు అందివ్వడానికి అపర భగీరథుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషిని ప్రతిఒక్కరూ గమనించాలని కోరారు. శ్రీసత్యసాయి జిల్లాలో నేడు విరివిగా ఉద్యాన పంటలు సాగుచేసి అద్భుతాలు సృష్టిస్తున్నారని తెలిపారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో ఎంపీటీసీ సభ్యురాలు తిప్పమ్మ, ఇతరులు ఉన్నారు. ఉదయం మండల పర్యటనకు వచ్చిన మంత్రి మొదట గొల్లపల్లికి రూ. కోటితో నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించారు. మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నార్సింపల్లి పంచాయతీ నాయకులు రాజశేఖరరెడ్డి, నందమోహన్‌రెడ్డి, సోమలింగారెడ్డి, వడిగేపల్లి పంచాయతీ సర్పంచి నరసింహమూర్తి, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ చెస్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా

నగదు బహుమతి అందుకుంటున్న ఉదయ్‌కుమార్ నాయుడు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: తమిళనాడులోని హోసూరులో గత నెల 25 నుంచి ఆదివారం వరకు జరిగిన జాతీయస్థాయి అమెచ్యూర్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారుడు ఎ.ఉదయ్‌కుమార్ నాయుడు మెరిశాడు. దేశవ్యాప్తంగా ఆరు విభాగాల్లో జరిగిన పోటీల్లో వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అమెచ్యూర్ బీలో 1700 ఓపెన్ చెస్ విభాగంలో 467 మంది పోటీపడ్డారు. అంతర్జాతీయ అర్బిటర్‌గా ఉన్న ఆయన ఆరో స్థానం సాధించాడు. మొత్తం తొమ్మిది రౌండ్లలో తలపడగా 7.5 పాయింట్లతో ఆరోస్థానం సాధించి రూ.4వేల నగదు బహుమతి అందుకున్నాడు. ఈ విజయంతో ఏషియా చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కింది. అమెచ్యూర్ 2300 విభాగం చెస్ పోటీల్లో శామ్యూల్ స్టీఫెన్ నోబుల్ 10వ స్థానం సాధించాడు. ఈ బాలుడికి రూ. 3వేల నగదు బహుమతి దక్కింది. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం కూడా దక్కింది.

దుబాయ్‌లో చిక్కుకున్న అనంత వాసులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలోని ఓ గోల్డ్ లోన్ సంస్థలో ఏరియా బ్రాంచ్ మేనేజర్లుగా పని చేస్తున్న ఎర్రిస్వామి, చెన్నయ్య, రామాంజి (కళ్యాణదుర్గం), తిప్పేస్వామి, శామీర్ (రాయదుర్గం), మల్లికార్జున (ఉరవకొండ), నాగరాజు, మారుతి, ప్రసాద్‌రెడ్డి (గుంతకల్లు) దుబాయ్‌లో చిక్కుకున్నారు. ఆ సంస్థ తరపున టూర్ ఏర్పాటు చేయగా వీరంతా కలిసి గత నెల 26న బయల్దేరి వెళ్లారు. 29న దుబాయ్ నుంచి తిరుగు ప్రయాణం కావాల్సి ఉంది. ఇరాన్‌లో యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో విమానాలను నిలిపి వేయడంతో వారు దుబాయ్‌లోనే ఉండిపోయారు. తాము ఇక్కడ సురక్షిత ప్రాంతంలో ఉన్నామని వారు కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్‌ల ద్వారా సమాచారం ఇచ్చారు.

శంకరేశ్వరస్వామి ఆలయ సందర్శన

గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అగళి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని చెరువుకట్ట వద్ద ఉన్న పురాతన శంకరేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు సందర్శించారు. నాలుగు నెలల క్రితం ఆలయంలో గణపతి విగ్రహం చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. దొంగలను పట్టుకోవాలని సీఐ రాజ్‌కుమార్‌కు సూచించారు. గ్రామస్థులతో, పూజారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని, నిందితులను పట్టుకోవడానికి గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. విగ్రహం చోరీకి సంబంధించి గ్రామస్థులు ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి కార్యాలయాలకు ఫిర్యాదు చేయడంతో ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారింది. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఉమేశ్, కన్వీనర్ తిప్పేస్వామి, పీఏసీఎస్ ఛైర్మన్ కుమారస్వామి, మాజీ ఎంపీపీ బసవరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలి

సమావేశంలో పాల్గొన్న వైకాపా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి చిత్రంలో నాయకులు

కడప నగరపాలక: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై వైకాపా నాయకులు కడప నగరంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాల వైకాపా ప్రజాప్రతినిధులు, ఆయా జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కొన్ని నెలలుగా పొరుగురాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలు సీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు గొడ్డలిపెట్టుగా మారాయన్నారు. పనులను ఆపేస్తున్నామని ఏపీ సీఎం తనకు హామీ ఇచ్చినట్టు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును బ్యారేజీ స్థాయికి తెచ్చి నామమాత్రంగా పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో గ్రేటర్ రాయలసీమ జిల్లాల సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా దశలవారీ ఉద్యమాన్ని చేపడతామన్నారు. అనంతరం లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై పలు తీర్మానాలు చేశారు. ఎంపీలు వైఎస్ అవినాష్ రెడ్డి, గురుమూర్తి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు ప్రసంగించారు.

రివాల్వర్‌తో విశ్రాంత సీఆర్‌పీఎఫ్ పోలీసు హల్‌చల్

సీటు కోసం ప్రయాణికులకు బెదిరింపులు

రివాల్వర్‌తో జనరల్ బోగీలో నిలబడిన విశ్రాంత సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మనోహర్

గుంతకల్లు, న్యూస్‌టుడే : రైలు జనరల్ బోగీలో ప్రయాణిస్తున్న సీఆర్‌పీఎఫ్ విశ్రాంత పోలీసు మనోహర్ సీటు కోసం ప్రయాణికులను తన లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో బెదిరింపులకు దిగాడు. ప్రయాణికులంతా భయాందోళనకు గురయ్యారు. ఆదివారం రాత్రి యలహంక నుంచి కాచిగూడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో ఈఘటన జరిగింది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం ఆర్.కృష్ణాపురం గ్రామానికి చెందిన మనోహర్ రైలులో ప్రయాణిస్తూ రివాల్వర్ తీసుకొని హల్‌చల్ చేశాడు. తనకు సీటు ఇవ్వాలంటూ ప్రయాణికులను బెదిరించాడు. కొందరు ప్రయాణికులు గుంతకల్లు ఆర్పీఎఫ్‌లకు సమాచారమిచ్చారు. రైలు గుంతకల్లు జంక్షన్‌కు చేరుకోగానే బోగీ వద్దకు చేరుకుని విశ్రాంత పోలీసును అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. తాను రివాల్వర్‌తో ప్రయాణికులను బెదిరించలేదని పోలీసులకు సమాధానమిచ్చారు. ఇక ముందు ఈ విధంగా ప్రవర్తిస్తే గట్టి చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించి పంపారు.

ఆటో డ్రైవర్‌పై వడ్డీవ్యాపారి దాడి

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద శనివారం రాత్రి ఆటో డ్రైవర్ అశ్వర్థనారాయణపై వడ్డీ వ్యాపారి ప్రవీణ్ దాడి చేశాడు. సిద్దయ్యగుట్ట కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ అశ్వర్థనారాయణ అదే కాలనీలోని వడ్డీ వ్యాపారి ప్రవీణ్ వద్ద రూ.10 వేలు అప్పు చేశాడు. శనివారం రాత్రి వడ్డీవ్యాపారి కంతు చెల్లించాలని ఆటోడ్రైవర్‌ను అడిగారు. కొంతకాలం గడువు ఇవ్వాలని అశ్వర్థనారాయణ చెప్పడంతో ప్రవీణ్ విచక్షణారహితంగా దాడి చేసినట్లు బాధితుడు ధర్మవరం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వడ్డీవ్యాపారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఫార్మసీ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాగరాజు



గోరంట్ల: ఉమ్మడి అనంతపురం జిల్లా ఫార్మసీ అధికారుల సంఘం అధ్యక్షుడిగా కేఆర్.నాగరాజును ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీకేపల్లి సీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు అక్కడే పనిచేస్తున్న నాగరాజు తెలిపారు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఆదిలక్ష్మి ప్రధాన కార్యదర్శిగా, కోశాధికారిగా ఉరవకొండ బాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా మజిహాభాను, అమర్‌నాథ్, విశాలక్షి, యామిని, జ్యోతి, తులసీదేవి, నజ్మాభాను, శ్రీలేఖ, కౌసర్, రుబీనా, ఇర్షాద్‌ఖాన్, కాంతరాజు, నూతనప్రసాద్, హరినాథ్, తేజస్విని, నరేష్, రామునాయక్, వినయ్ తదితరులను ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు పేర్కొన్నారు. ఫార్మసీ ఉద్యోగులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ ప్రకటించినట్లు వివరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో పది మందికి గాయాలు

మడకశిర ఆసుపత్రిలో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

గోరంట్ల-కదిరి 716జీ జాతీయ రహదారిపై, అమరాపురం మండలం పేలుబండ సమీపంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పది మంది గాయపడ్డారు.

టైరు పంక్చరై ఇన్నోవా బోల్తా

గోరంట్ల : గోరంట్ల మండలంలోని 716జీ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఇన్నోవా వాహనం బోల్తాపడి బెంగళూరుకు చెందిన అయిదుగురు గాయపడ్డారు. వీరు కడపలోని దర్గా దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. వీరు ప్రయాణిస్తున్న వాహన టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి పల్టీలు కొట్టింది. సయ్యద్‌అలీ, మహమ్మద్ జావీద్, ఇస్మాయిల్, తిరుపతయ్య, సయ్యద్ తాహీర్ గాయపడిన వారిలో ఉన్నారు. క్షతగాత్రులకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు అందించారు. వీరిలో జావీద్‌కు బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు.

బొలెరో వాహనం అదుపుతప్పి..

అమరాపురం : మండలంలోని పేలుబండ సమీపంలో ఆదివారం ఉదయం ప్రమాదవశాత్తు బొలెరో వాహనం బోల్తా పడి అయిదుగురు మహిళలకు గాయాలయ్యాయి. తమ్మడేపల్లి నుంచి రొళ్ల మండలం హెచ్.టీ.హళ్లి గ్రామానికి పుట్టువెంట్రుకల కార్యక్రమానికి వెళుతూ వాహనం బోల్తా పడింది. ఈ విషయాన్ని 108 సిబ్బందికి తెలపడంతో గాయపడిన వారిని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పరామర్శించి క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

అప్పుల భారంతో అన్నదాత ఆత్మహత్య



రామాంజనేయులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తూరు గ్రామంలోని రైతు రామాంజనేయులు (50) అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన ఆదివారం చోటు చేసుకొంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. మృతునికి నాలుగున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో 13 బోరుబావులు తవ్వించగా రెండింటిలో మాత్రమే అరకొరగా నీళ్లు పడ్డాయి. వాటిలో కూడా నీరు రాక సాగు చేస్తున్న వేరుసెగన, కర్బూజ, టమాటా పంటలకు పక్క తోటలోని నీటితో తడుపుతున్నాడు. పంటల సాగుకు, బోరుబావులకు సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. ఒక పక్క వేసిన బోరుల్లో నీరు లేక , మరోపక్క సాగు చేసిన పంటలు చేతికందక చేసిన అప్పులను తీర్చలేక మనస్తాపంతో ఇంటి నుంచి పొలానికి వెళ్లిన ఆయన కట్టుకున్న పంచతో చింత చెట్టుకు ఉరివేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, పక్క పొలం వారు రక్షించే ప్రయత్నం చేసినా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య హనుమక్క, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

టిప్పర్ ఢీకొని బీటెక్ విద్యార్థి దుర్మరణం

రఘువంశీ

బత్తలపల్లి న్యూస్‌టుడే: టిప్పర్ ఢీకొనడంతో బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందిన ఘటన బెంగళూరులో శనివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు మండలంలోని ముష్టూరు గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ రిటైర్డ్ జవాన్ నరసింహులు రెండో కుమారుడు రఘువంశీ(20) బెంగళూరులోని ఓ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. శనివారం అక్కడ ఓ ఆలయానికి వెళ్లి అనంతరం కాలేజీకి తన బైక్‌పై వస్తుండగా ఎలక్ట్రానిక్ సిటీ ఎంపైర్ మాల్ వద్ద వెనుక నుంచి వేగంగా వస్తున్న టిప్పరు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆదివారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకురాగా తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అనంతరం అంత్యక్రియలు పూర్తిచేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

రాచానపల్లి(రాప్తాడు), న్యూస్‌టుడే : రాప్తాడు మండలం మరూరు గ్రామానికి చెందిన రాధమ్మ(45) ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తాకి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మరూరు గ్రామానికి చెందిన రాధమ్మను ధర్మవరానికి చెందిన ఆంజనేయులుకు ఇచ్చి పెద్దలు పెళ్లి చేశారు. భర్త మృతి చెందడంతో స్వగ్రామంలోనే ఉంటోంది. ఆదివారం ఉదయం ఇంటిని శుభ్రం చేస్తుండగా దుస్తులు ఆరబెట్టే ఇనుప తీగకు విద్యుత్తు సరఫరా అయింది. ఆ తీగను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన స్థానికులు దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

ఘనంగా పేటవెంకటరమణుడి కల్యాణం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని మెయిన్‌బజార్‌లో పేటవెంకటరమణస్వామి ఆలయంలోని ప్రత్యేక వేదికలో శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుడి ఉత్సవమూర్తులను ఉంచి కల్యాణోత్సవాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. మహిళలు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో కలియుగ వైకుంఠుడు

నూతన షెడ్డులోకి బ్రహ్మ రథం

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని పేటవెంకటరమణ స్వామి రథానికి ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి అనంతరం గోవిందనామ స్మరణ నడుమ సింగార్‌రోడ్ నుంచి కోటలో నూతనంగా ఏర్పాటు చేసిన షెడ్డులోకి తరలించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ నవీన్ చంద్ర, రథోత్సవ సమితి వైజీపీ శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.

రథం ముందు ఆలయ కమిటీ, రథోత్సవ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: రాళ్లపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య నెలకొంది. **- మహమ్మద్**
సమాధానం: రెండు రోజుల్లో నీటి సమస్య పరిష్కరిస్తాం. **- లక్ష్మీనారాయణ, సర్పంచి, రాళ్లపల్లి**
సమస్య: పీఎస్‌పాళ్యం ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **- రాజప్ప**
సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **- అమరీశ్, పంచాయతీ కార్యదర్శి, మద్దనకుంట**
సమస్య: హౌసింగ్‌బోర్డులోని ఉద్యానవనం వెనుకభాగాన ప్లాస్టిక్‌కవర్లు, వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **- నటరాజ్**
సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం.**
-న్యూస్‌టుడే, గుడిబండ, హిందూపురం సాంస్కృతికం

కాలువల్లో పైపులు.. నీటి కాలుష్యానికి దారులు

కోటవీధిలో మురుగునీటిలో వేసిన తాగునీటి పైపులైన్

మడకశిర, న్యూస్‌టుడే: మడకశిర నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల వెంటనే ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. వాస్తవానికి పైపులైన్లు ఏర్పాటు చేసిన సమయంలోనే కాలువలగుండా వెళ్లకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఎవరూ పట్టించుకోకపోవడంతో వాటి వెంటనే మురుగు ప్రవహించడం వల్ల తాగునీరు కలుషితం అవుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన పైపులైన్లు కావడంతో అక్కడక్కడ లీకేజీ అయ్యి వీటి గుండా మురుగు మంచినీటిలో చేరే అవకాశం ఎక్కువగా ఉంది.

నిధులు రాగానే చర్యలు తీసుకుంటాం

మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం అమృత్ పనులు చేయాల్సి ఉంది. కొత్తగా ట్యాంకులు, పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మురుగు కాలువల్లో ఉన్న పైపులైన్లు కిలోమీటరు మేర తొలగించి మరోచోట ఏర్పాటు చేశాం. ఈ విషయమై ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ప్రత్యేక నిధులు కావాలని మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులను కోరారు. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటాం. **- మురళీధర్, మున్సిపల్ ఏఈ, మడకశిర**

సమస్య ఇలా..

మడకశిర నగర పంచాయతీ పరిధిలో 20వార్డులు, 35వేల జనాభా ఉంది. ప్రజలకు తాగునీరు అందించేందుకు 2100 కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు దాదాపు 5 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేశారు. పట్టణంలోని గాంధీబజారు, కోటవీధి, శివాపురం, చావిడి, కస్తూరపాపమ్మ వీధి, అమ్మవారి ఆలయం వెనుక భాగంలో ప్రధానంగా ఎక్కువ కిందట వేసిన పైపులైన్లు ఉన్నాయి. అవి కూడా చాలా చోట్ల డ్రైనేజీల లోపల ఉండటంతో నిత్యం ఏదో ఒక చోట లీకేజీ అయ్యి నీరు కలుషితం అవుతున్నాయి.

వైభవంగా దీపోత్సవం

చిలమత్తూరు, న్యూస్‌టుడే: లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, ధవనోత్సవం, లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వామి ఆలయంలో దీపోత్సవం చేపట్టారు. మహిళలు ఉపవాసం ఉంటూ స్వామివారికి ఇంటిలో పిండి పదార్థాలతో తయారు చేసిన దీపాలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి సమర్పించారు. రాత్రికి హనుమంత వాహనోత్సవం ఉంటుందని అర్చకుడు లక్ష్మీనరసింహప్రసాద్ తెలిపారు. సోమవారం కల్యాణోత్సవం ఉంటుందని భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆలయ ధర్మకర్త సుంకు సుధాకర్ తెలిపారు.

భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహస్వామి

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుతో పాటు చంద్రబాబు చిత్రపటం అందజేస్తున్న మంత్రి సవిత, పార్టీశ్రేణులు

ఆపదలో అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

పెనుకొండ, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 40మంది లబ్ధిదారులకు రూ. 26.66 లక్షల సీఎంఆర్‌ఎఫ్ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా చెక్కులతో పాటుగా ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాన్ని లబ్ధిదారులకు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి శ్రేణులతో పాటుగా, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీ భూమిపూజ

పరిగి, న్యూస్‌టుడే: హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి ఆదివారం పరిగి మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. మోదాలో శ్రీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో టీటీడీ కల్యాణ మండపంలో రూ.20లక్షల వ్యయంతో చేపట్టనున్న డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. బిందునగరిలో ఎంపీ నిధులు రూ. 12లక్షలతో చేపట్టనున్న అయ్యప్పస్వామి కమ్యూనిటీ భవన నిర్మాణానికి, పరిగిలో వాల్మీకి విగ్రహం ఎదుట, ధనాపురం హైవేలో ఏర్పాటు చేయనున్న బస్‌షెల్టర్ల భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో యువ నాయకుడు బీకే సాయికళ్యాణ్, పార్టీ నాయకులు నరసింహప్ప, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, చిన్నపల్లి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

జాతీయ రహదారిలో వేగ నిరోధకాల ఏర్పాటు

పరిగి, న్యూస్‌టుడే: పరిగి మండలంలో కొడికొండ-శిర జాతీయ రహదారిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ వాహన చోదకులు దుర్మరణం పాలవుతున్న నేపథ్యంలో నివారణకు పరిగి ఎస్సై రంగడుయాదవ్ పోలీసు శాఖ తరుపున వేగనిరోధకాలు ఏర్పాటు చేయించారు. ధనాపురం, హొన్నంపల్లి క్రాస్, చిన్నపల్లి క్రాస్ వద్ద ప్రమాదాల నివారణకు బారికేడ్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

హొన్నంపల్లి క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

'టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి'

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: టెట్ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఉపాధ్యాయ వర్గాల నుంచి నిరసన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. 2010 సంవత్సరంలోపు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మార్చి 10న ఢిల్లీలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆదివారం గోడపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కరణం గురురాజారావు, రాందాస్‌నాయక్, నరసింహారెడ్డి, అంజనామూర్తి, నాగరాజులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వం డ్వాక్రా సంఘాల మహిళలకు అందజేస్తున్న బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం పెనుకొండ మండలంలోని గుట్టూరు గ్రామానికి చెందిన ఆశ్రిని బ్యాంకు ద్వారా రూ.5.9లక్షలు 35శాతం రాయితీపై రుణం తీసుకుని ఏర్పాటు చేసిన అరకు కాఫీ దుకాణాన్ని మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా రుణం పొందిన మహిళను మంత్రి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తహసీల్దార్ స్వాతి, ఎంపీడీవో రవికుమార్, సిబ్బంది, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ప్రయాణంలో శిరస్త్రాణం తప్పనిసరి

గోరంట్ల: శిరస్త్రాణం ప్రాణాన్ని కాపాడుతుందని పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో జరిగిన చాలా ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకుండా చేసిన ప్రయాణాల్లోనే ఎక్కువగా జరిగినట్లు గుర్తించారు. దీంతో గోరంట్లలోని పెట్రోల్‌బంకు వద్ద ఆదివారం స్థానిక సీఐ శేఖర్‌తో కలిసి వాహన చోదకులకు శిరస్త్రాణంపై డీఎస్పీ అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న చోదకులకు జరిమానాలు వారి సొమ్ముతో కొనిచ్చారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా యువతలో చైతన్యం మార్పు తీసుకురావాలన్నదే లక్ష్యమని డీఎస్పీ పేర్కొన్నారు.

అవగాహన కల్పించి నూతన హెల్మెట్లు కొనిస్తున్న డీఎస్పీ, సీఐ

వృథా నీటిని అరికట్టేదెవరు?

పరిగిలోని స్థానిక మడకశిర బస్టాండు సమీపంలో ఉన్న నీటి ట్యాంకు నుంచి నీరు వృథాగా పొంగి పొర్లుతోంది. నిర్వహణ లోపంతో నిరంతరం వృథాగా డ్రైనేజీ పాలవుతోంది. వేసవి వస్తున్న నేపథ్యంలో నీటి విలువను తెలుసుకోవాలని ప్రజలు అంటున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి అరుణ దృష్టికి తీసుకెళ్లగా వృథా కాకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. **-న్యూస్‌టుడే, పరిగి**

వేసవిలోనే వంతెన నిర్మించండి

పీఎస్‌పాళ్యం, కురుబరపల్లి మధ్యనున్న వంకపై వంతెన లేక రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం మట్టి పోసుకుని వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నారు. వర్షాకాలంలో అది కొట్టుకుపోయి నీరు నిలిచి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ఈ విషయమై మండల ఇంజినీర్ సాయికుమార్ మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. **- న్యూస్‌టుడే, గుడిబండ**

ఈ భవనానికి దారేది?

చాలకూరులో ప్రధాన రహదారి పక్కన ఉన్న గోపాలమిత్ర భవనం నిర్మించారు. దానికి ఎదురుగా ఎత్తుగా నీటితొట్టె నిర్మించడం, పక్కనే నాయకులు అడ్డుగా పార్టీ జెండా కట్టలు నిర్మించడంతో దారిలేక ఇబ్బంది పడుతున్నారు. పశువైద్యాధికారిణి హేమలత మాట్లాడుతూ అక్కడి పరిస్థితిని పరిశీలించి, పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, సోమందేపల్లి**

నీరు రాక ఆరు నెలలు

సున్నకల్లుక్రాస్‌లో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కుళాయిలకు ఆరు నెలలుగా నీరు రావడం లేదని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకుని కుళాయిలకు నీరు వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ ఎస్‌ఆర్ ప్రాజెక్ట్ వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు. **-న్యూస్‌టుడే, అమరాపురం**

కంపచెట్లు తొలగించండి

మద్దనకుంట, ముతుకూరు రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితి ఏర్పడింది. కంపచెట్లు తొలగించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజానాయక్ మాట్లాడుతూ తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, గుడిబండ**

సమాజ హితం.. వైజ్ఞానిక ప్రదర్శనల లక్ష్యం

హిందూపురం సాంస్కృతికం, గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాలన్న ఉద్దేశంతో పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్ పాఠశాలలో విజ్ఞాన వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో సంస్కృతి, సంప్రదాయాలు, నూతన ఆలోచనలు వెల్లివిరిసే లక్ష్యంతో నిర్వాహకులు ప్రదర్శనలు చేపడుతున్నారు. ఫిబ్రవరి 25 నుంచి 26వరకు నిర్వహించిన ప్రదర్శనలో విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా నమూనాలను తయారుచేసి ఆలోచింపజేశారు.

విద్యార్థుల్లో మేధాశక్తి పెంపుదల

చెత్త నుంచి విద్యుత్తు ఉత్పత్తి

ప్రతి ఇంటిలో చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలను బయట పడేస్తుంటారు. అలాకాకుండా అంతా కాల్చి సోలార్ ప్యానల్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయవచ్చు. ఈ ప్రయోగం వల్ల సమాజానికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది. **- షబ్రీన్‌తాజ్, జైనబ్**

విమాన ప్రమాదాల నివారణ : ఆప్స్

నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. దేశంలో విమాన ప్రమాదాలు జరగడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దీనిని నివారించాలన్న ఉద్దేశంతో విమానంలో అల్ట్రా సోనిక్ సెన్స్ పరికరం అమర్చడం ద్వారా ఎప్పుడైనా ప్రమాదం జరిగినప్పుడు అది సిగ్నల్ ఇస్తుంది. దీని వల్ల ప్రమాదాలు నివారించవచ్చు.

చేనేత వస్త్రాల తయారీ..

రేషం గుడ్ల నుంచి పట్టు పురుగులు ఉత్పత్తి చేసి వాటిని వేడి నీటిలో ఉడికించిన తరువాత దారం వస్తుంది. ఈ దారంతో ఎన్నో రకాల వస్త్రాలు, చీరలు తయారు చేయవచ్చనే ప్రదర్శన సమాజ హితం కోసం దారితీస్తుంది. మాలో సామాజిక బాధ్యత పెంచింది. **- లోహిత, ప్రణీత, సుప్రియ**

నాగదేవత నూతన విగ్రహ ప్రతిష్ఠాపన

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలపరిధిలోని గంగమ్మదేవి ఆలయంలో నాగదేవత నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం గంగమ్మదేవిని వివిధ పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

3న చంద్ర గ్రహణం.. ఆలయం మూసివేత

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: చంద్ర గ్రహణం పురస్కరించుకుని ఈనెల 3న(మంగళవారం) పూజలనంతరం పట్టణంలోని పేటవెంకటరమణస్వామి ఆలయాన్ని ఉదయం 8.30గంటల నుంచి మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి, ఛైర్మన్ నవీన్‌చంద్రలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

చాఫ్‌కట్టర్ మిషన్ యూనిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

నేడు పాపిరెడ్డిపల్లిలో మంత్రి పర్యటన

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక పాపిరెడ్డిపల్లి కస్తూర్బా విద్యాలయంలో జూనియర్ కళాశాల అదనపు భవనాల నిర్మాణానికి సోమవారం ఉదయం మంత్రి సవిత భూమిపూజ చేయనున్నారు. అదనపు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 1.60 కోట్లు మంజూరు చేసింది.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో రైతులకు వర్షాధార ప్రాంత పథకం కింద వర్మీబెడ్లు, మూడు శైలేజ్‌బ్యాగ్‌లతో కూడిన 29 చాఫ్‌కట్టర్ యూనిట్లు పంపిణీ చేశారు.

తెదేపా కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

మడకశిర మండలం ఛత్రం గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త విజయ్ పక్షవాతం సోకి మంచానపడ్డాడు. ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ కుటుంబ పోషణ కష్టంగా మారిన విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మనోధైర్యం నింపారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యామందిరాలు సంస్కృతికి నిలయాలు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలు విద్యామందిరాలని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో ఉన్న విద్యారణ్య ఆంగ్ల ఉన్నత పాఠశాలలో ఆదివారం వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యామందిరం కమిటీ సభ్యులు రాధాకృష్ణ, రత్నయ్య, సత్యనారాయణ, గోవిందరాజులు, కరేరమేశ్, శంకరప్ప, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతర మహోత్సవం

గుడిబండ: మండలంలోని పి.గొల్లహట్టి, ఎస్‌ఆర్‌హట్టి గ్రామంలో శ్రీఈరగార సిద్ధేశ్వరస్వామి, శ్రీరంగనాథస్వామిల జలధి, జాతర మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సింగేపల్లి నుంచి శ్రీరంగనాథస్వామిని ఆదివారం పి.గొల్లహట్టికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. సోమవారం ఈరబిళియప్ప కొండపై గంగపూజ, జలధి, అన్నసంతర్పణ, 3న తలనీలాలు, పి.జి.హట్టిలో స్వామి వార్ల ఊరేగింపు, 4న ఎస్.ఆర్.హట్టి గ్రామంలో స్వామి వార్ల ఊరేగింపు, అన్నదానం, 5న పి.గొల్లహట్టికి సిద్ధేశ్వరస్వామి, సింగేపల్లికి రంగనాథస్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అంకురార్పణ

రొళ్ల, న్యూస్‌టుడే: రొళ్లలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అంకురార్పణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, నూతన ఉత్సవమూర్తులకు ప్రాణప్రతిష్ఠ చేశారు. సాయంత్రం మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి మట్టికుండలు, కలశారధనతో వచ్చి నవగ్రహపూజ నిర్వహించారు. రాత్రి కొత్త కుండల్లో నవధాన్యాలు వేసి ఆలయం వరకు ఊరేగించారు.

శివారు కాలనీల్లో సమస్యల బేజారు

నారాయణమ్మకాలనీలో రోడ్డుపై అడ్డంగా పారుతున్న మురుగు

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని శివారుకాలనీలు, గ్రామాల్లో దశాబ్దాలుగా అంతర్గత సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ లాంటి మౌలిక సౌకర్యాలు కల్పించకపోవడంతో అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయాయి. స్థానిక నగరపంచాయతీలోని తిమ్మాపురం, ఇందిరమ్మకాలనీ, నారాయణమ్మకాలనీ, ఎన్టీఆర్‌కాలనీ, న్యూకాలనీ తదితర కాలనీల్లో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగు అంతర్గత సిమెంటురోడ్లు, మట్టిరోడ్లపై అడ్డంగా పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు.

దశాబ్దం గడుస్తున్నా ఇక్కట్లే..

పట్టణంలోని ఎన్టీఆర్‌కాలనీ ఏర్పాటై దశాబ్దం గడుస్తున్నా కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి, అంతర్గత సిమెంటుదారుల నిర్మాణానికి నోచుకోలేదు. కాలనీలోని ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు ఏపుగా పెరిగిపోవడంతో రాత్రులు పాములు, తేళ్లు వస్తున్నాయంటూ ప్రజలు వాపోతున్నారు. రాత్రులు విద్యార్థులు ట్యూషన్లకు వెళ్లి చీకట్లో ఒంటరిగా నడిచెళ్లేందుకు జంకుతున్నారు.

✦ నారాయణమ్మ కాలనీలో సిమెంటురోడ్డుపై మురుగు రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటైన నారాయణమ్మకాలనీలో ప్రస్తుతం వెయ్యి మందికి పైగా జనాభా ఉంది. కాలనీలో అంతర్గత సిమెంటు రోడ్లు వేశారు కాని కాలువలు నిర్మించకపోవడంతో మురుగు రోడ్డుపై అడ్డంగా పారుతోంది. దుర్గంధం, దోమల కారణంగా ప్రజలు తరచు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.10కోట్లతో ప్రతిపాదనలు

-సతీశ్‌కుమార్, కమిషనర్, నగరపంచాయతీ, పెనుకొండ

మండలంలోని ఎర్రమంచిలో కియా పరిశ్రమ, అనుబంధ సంస్థలు రావడంతో పట్టణ జనాభా పెరిగింది. ఇందుకు అనుగుణంగా పట్టణాభివృద్ధి కోసం రూ. 10కోట్లతో డ్రైనేజీలు, అంతర్గత దారుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరవ్వగానే పనులు ప్రారంభించి పట్టణాభివృద్ధికి కృషి చేస్తాం.

ఆంజనేయస్వామికి విశేష పూజలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: బ్రహ్మసముద్రంలో వెలసిన ఆంజనేయ స్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలో స్వామివారి ఆలయ పదో వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులుగా వివిధ పూజలు, హోమాలు చేశారు. సీతారాములు, ఆంజనేయ స్వామి ప్రతిమలను రాత్రి గ్రామంలో ఊరేగించారు.

నీటి సమస్య పరిష్కరించాలని వినతి

రొద్దం: బూచెర్లలో ఉన్న రెండు పంచాయతీ బోరుబావులు పనిచేయక ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని స్థానిక తెదేపా నాయకులు చంద్రమౌళి, కదిరన్న, పంచాయతీ కన్వీనర్ నాగరాజు, శివకుమార్, శ్రీనివాసులు మంత్రి సవితకు విన్నవించారు. మంత్రి స్పందించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



(c) eenadu

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

ధర్మవరంలో మన్మథోత్సవం ప్రారంభం

ప్రత్యేక అలంకరణలో కామన్న, కామక్క

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని నేసేపేటలో మన్మథోత్సవం ఆదివారం ప్రారంభమైంది. కామన్న, కామక్క పౌర్ణమిని పురస్కరించుకొని గత 94 ఏళ్లుగా పట్టణంలోని సాలెవీధిలో మన్మథోత్సవం నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరుగనున్న వేడుకలకు ఏర్పాట్లు చేశారు. రతి, మన్మథుడి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఊరేగింపు అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించారు. ఏర్పాట్లను కమిటీ అధ్యక్షుడు గిర్రాజు పద్మనాభం, ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, రాఘవ, నాగరాజు, కార్యదర్శులు డీఎస్ ఆనంద్, కుళ్లాయప్ప, నాగార్జున పర్యవేక్షించారు. సోమవారం విశేష అలంకరణ, మంగళవారం గ్రామోత్సవం, కామ దహనం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు

అక్కరకురాని బస్‌షెల్టర్

ప్రయాణికులు రాకపోకలు సాగించే సమయంలో బస్సుల కోసం వేచి ఉండేందుకు బస్సు ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. అవి శిథిలావస్థకు చేరుకోవడంతో వినియోగానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. మండలకేంద్రంలో మూడు దశాబ్దాల కిందట బస్సు ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. కనగానపల్లి నుంచి ధర్మవరం, అనంతపురం, రామగిరి, కళ్యాణదుర్గం వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. -న్యూస్‌టుడే, కనగానపల్లి

సజావుగా గురుకుల ప్రవేశ పరీక్షలు

నల్లమాడ, న్యూస్‌టుడే: ఆర్.రామాపురం అంబేడ్కర్ గురుకులంలో గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. పరీక్ష ముఖ్య అధికారిగా ప్రిన్సిపల్ సుధారాణి, ప్రత్యేక పర్యవేక్షణ అధికారిగా ఎస్.జె అరుణ్ కుమార్ వ్యవహరించారు. ముఖ్య అధికారి సుధారాణి మాట్లాడుతూ 6వ తరగతి పరీక్షకు 196 మంది, జనరల్ ఇంటర్‌కు 174 మంది, ఐఐటీ, నీట్‌కు 124 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

గాండ్లపెంట, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ మండల అధ్యక్షుడు పామిడి మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. 2న విజయవాడలో జరగనున్న దీక్షకు అగ్రిగోల్డ్ బాధితులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కూటమి ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అగ్రిగోల్డ్ బాధితులకు సొమ్ము చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. 5న నిర్వహించే మహాదీక్షకు అధిక సంఖ్యలో బాధితులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. షమీవుల్లా, నాగభూషణ, కరీమున్నీసా, సమ్మద్, ఆనందబాబు, ఉత్తన్న పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని యాదవవీధిలో స్వయంభు వరసిద్ధి వినాయక ఆలయ పునర్నిర్మాణానికి యూఏస్‌ఏలో ఉన్న చిందలూరు బాబు ప్రసాద్ రూ. లక్ష విరాళం ప్రకటించారు. ఆయన తరఫున పట్టణానికి చెందిన సీతారామ్ రాము దంపతులు ఆలయ కమిటీకి విరాళం అందించారు.

భక్తిశ్రద్ధలతో విష్ణుదాసు స్వామి జయంతి

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: కోన కణ్వ ఆశ్రమంలో విష్ణుదాసు స్వామి జయంతి వేడుకలను ఆదివారం స్వామి శిష్యులు, భక్తులు ఘనంగా నిర్వహించారు.

గొంతులో దిగుతున్న గరళం

మురుగు కాలువల్లో లీకేజీ అవుతున్న పైపులైన్లు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యం పట్టణ ప్రజల ప్రాణాల మీదికి తెస్తోంది. గొంతు తడపాల్సిన నీరే మురుగుతో కలిసి గరళంగా మారుతోంది. పైపులైన్ల లీకేజీలతో తాగునీరు కలుషితం అవుతోంది. పట్టణంలో ఏడాదిగా పైపులైన్లకు మరమ్మతులు చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. పైపులైన్లు నేటికీ 40 శాతం మేర మురుగు కాలువల్లోనే దర్శనమిస్తున్నాయి.

పట్టని యంత్రాంగం

పట్టణంలో పలుచోట్ల తాగునీరు లీకేజీ అవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. దీంతో పట్టణవాసులు రోగాల బారినపడుతున్నారు. జిల్లా కేంద్రమైనా నీటి సరఫరా వ్యవస్థ తీరు దారుణంగా ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేయడంలో విఫలమవుతున్నారు.

వివరాలిలా..	
పట్టణ జనాభా	40 వేలు
రోజు తాగునీటి సరఫరా	2.55 ఎంఎల్‌డీ
20 వార్డుల్లో లీకులు	46 చోట్ల

ఇక్కడే అధికం

పురపాలికలోని పలు ప్రాంతాల్లో పైపులైన్లు లీకేజీ అవుతున్నాయి. పెద్ద బజార్, కుమ్మరపేట, వివేకానందనగర్, ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి, బీడుపల్లి, ఎస్ఎస్ఆసుపత్రి, పెద్దకమ్మవారిపల్లి తదితర ప్రాంతాల్లో నిత్యం లీకులే దర్శనమిస్తున్నాయి. కాలం చెల్లిన పైపులే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. మురుగు కాలువల్లో పైపులైన్లు ఉన్నచోట పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. అధికారులు కేవలం తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకొంటున్నారు. శాశ్వత చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

పైపులైన్ నుంచి లీకవుతున్న నీరు

చర్యలు తీసుకుంటాం

తాగునీటి పైపులైన్లు లీకేజీ కాకుండా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు శుద్ధిచేసిన నీటినే అందిస్తాం. కాలువల్లో తాగునీటి గొట్టాలు ఉన్న చోట్ల ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం.

- ఏఈ స్వాతి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కదిరి, న్యూస్‌టుడే: కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో హరికథ, బుర్రకథలతో పాటు జానపద కళలను ప్రదర్శించారు. దైవదర్శనం, ఆధ్యాత్మిక సందేశ కీర్తనలు విన్న భక్తులు తన్మయత్వం పొందారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

హరికథ ఆలపిస్తున్న భాగవతారిణి, చిన్నారులు

'అంగన్‌వాడీలకు న్యాయం చేసేది సీఎం చంద్రబాబే'

ధర్మవరం న్యూస్‌టుడే : అంగన్‌వాడీలకు గతంలో ఎప్పుడూ ఎవరూ చేయని విధంగా రెండుసార్లు వేతనాలు పెంచింది సీఎం చంద్రబాబు అని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీలు డిమాండ్ల కోసం ఆందోళన చేస్తున్నారని గత వైకాపా ప్రభుత్వంలో వారికి ఎలాంటి మేలు జరగలేదని ఆయన చెప్పారు. న్యాయం జరిగేది సీఎం చంద్రబాబుతోనేనని తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో అంగన్‌వాడీల వేతనాలు పెంపుపై ఏమాత్రం పట్టించుకోలేదని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వంలో అంగన్‌వాడీలకు సరైన న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. వైకాపా మాయలో పడవద్దని వారికి సూచించారు.

అందుబాటులోకి తాత్కాలిక మరుగుదొడ్లు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం కోనేరు సమీపంలోని బలిజ సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద తాత్కాలిక మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటుచేశారు. వాహనాల పార్కింగ్ ప్రదేశానికి దగ్గరలో భక్తులకు అందుబాటులో ఉండేలా ఆలయ అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు. షామియానాలు సిద్ధం చేస్తున్నారు.

ఏర్పాటుచేసిన తాత్కాలిక మరుగుదొడ్లు

కరాటే విద్యార్థులకు బెల్టు పరీక్షలు

కదిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం కరాటే బెల్టు అర్హత పరీక్షలు నిర్వహించినట్లు మాస్టర్ అక్బర్‌బాషా తెలిపారు. కరాటే విన్యాస పోటీల్లో 29 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పంచెస్, కిక్ బ్లాకింగ్, సెల్ఫ్ డిఫెన్స్, టైల్స్ బ్రేకింగ్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పరీక్షలో 15 మంది ఎల్లో, ఏడుగురు ఆరెంజ్, ముగ్గురు బ్రౌన్ బెల్టులకు అర్హత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. వారికి ఆయా బెల్టులను, ధ్రువపత్రాలను పంపిణీ చేశారు.

ధ్రువపత్రాలు చూపుతున్న విద్యార్థులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు పోటీచేసే అవకాశం కల్పించనున్నట్లు జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని గణేష్ కూడలి నుంచి భాజపా కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి యువమోర్చా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. జిల్లా యువమోర్చా అధ్యక్షునిగా కల్యాణ్‌చక్రవర్తితో పాటు కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, నాయకులు హరికృష్ణగౌడ్, తలుపుల గంగాధర్, సాకే ఓబులేసు, జ్యోతిప్రసాద్, అమరదేవేంద్ర పాల్గొన్నారు.

ర్యాలీలో కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ తదితరులు

దేశీయ రైతులకు హాని చేయొద్దు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేసి దేశీయ రైతులకు హాని చేయవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న కోరారు. అమెరికా- భారత్ వ్యవసాయిక వాణిజ్య ఒప్పందాలపై కేంద్ర ప్రభుత్వం చేసుకోకూడదని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో సంతకాల సేకరణ చేపట్టారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల నుంచి సేకరించిన సంతకాలను రాష్ట్రపతికి పంపిస్తామన్నారు. మారుతి, ఆంజనేయులు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు ఎంపిక

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: సైనిక్‌స్కూల్ ప్రవేశపరీక్ష ఫలితాల్లో పట్టణంలోని కె.ఎల్.ఎన్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 90 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా 85 మంది ఉత్తీర్ణత సాధించినట్లు నిర్వాహకుడు రమేష్ తెలిపారు. శ్రీమంతరెడ్డి 268, జోషిత్ సాయి 242, సాయిసుచిత్ 203, జోషిత్ శ్రీతేజ 202, మొత్తిరెడ్డి 197 మార్కులు సాధించి కలికిరి సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు ఆయన చెప్పారు.

జనసేన నాయకుడికి సన్మానం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: నాలుగు రోజుల్లోనే 250 సభ్యత్వాలు పూర్తి చేసిన జనసేన పార్టీ నాయకుడు లక్ష్మణ్‌ను ఆ పార్టీ ఇన్‌ఛార్జి భైరవప్రసాద్ అభినందించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో లక్ష్మణ్‌ను ఆయన సత్కరించారు. శివశంకర్, చినబాబు, రాజేంద్ర, ప్రతాప్, అంజిబాబు, చక్రి పాల్గొన్నారు.

శిరస్త్రాణ ధారణ తప్పనిసరి

ముదిగుబ్బ: హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్సై మహ్మద్ అర్షద్ తెలిపారు. ఆదివారం జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. శిరస్త్రాణం లేకుండా ప్రయాణించిన వారికి జరిమానా విధించారు.

ఊరూరా తిరిగి.. మూలకు చేరి

ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 104 పాత వాహనాన్ని ఇలా మూలన నిలిపారు. రెండేళ్ల క్రితం పాత వాహనాల స్థానంలో ఒక 104 వాహనం మంజూరైంది. ఎన్నో ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాలకు పల్లె వైద్య సేవలు అందించిన పాత వాహనం ఇలా ఆసుపత్రి ఆవరణలో మూలన నిలపడంతో ఎండకు దెబ్బతింటోంది. ఇప్పటికే టైర్లు పనికి రాకుండా పోయాయి. దీన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ధర్మవరం

పాఠం వినలేం.. చదువుకోలేం

మండలంలోని వంకమద్ది ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. భవనం నిర్మించి ఏళ్లు గడుస్తుండటంతో లోపలి భాగంలో పెచ్చులూడిపోతోంది. వర్షాకాలంలో లీకేజీ ఏర్పడింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పుస్తకాలు తడిసి విద్యార్థులు చదువుకోలేక పోతున్నారు. ప్రమాదకర పరిస్థితుల నడుమ వారు చదువు కొనసాగిస్తున్నారు. కొత్త భవన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంబులపూలకుంట

మడుగు.. ప్రమాదాలకు అడుగు

కుటాగుళ్ల మలుపులో కదిరి- పులివెందుల ప్రధాన రహదారిపై భారీ గోతి ఏర్పడింది. ప్రస్తుతం ఇందులో పైపులైన్ లీకేజీతో నీరు నిలిచి మడుగును తలపిస్తోంది. భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందిగా మారిందని వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగుచేయాలని వారు కోరుతున్నారు. ఎన్‌హెచ్ఏఐ ఏఈ సుజాతను వివరణ కోరగా, రెండురోజుల్లో మరమ్మతు చేపట్టనున్నట్లు చెప్పారు. – న్యూస్‌టుడే, తలుపుల

ల్యాబ్ వెల్ఫేర్ ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం

నరేంద్రప్రసాద్

ఓబుళదేవరచెరువు, న్యూస్‌టుడే: రాష్ట్ర కాంట్రాక్ట్ ల్యాబ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ నరేంద్రప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటూరు ఎన్జీఓ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నరేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

గుండె జబ్బులపై నిర్లక్ష్యం చేయవద్దు

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని స్పందన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత గుండె పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. గుండెపోటు లక్షణాలపై అవగాహన కల్పించారు. సీపీఆర్ చేసే విధానాన్ని వైద్యులు వివరించారు.

అదనపు పనిదినాలు సద్వినియోగం చేసుకోండి

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: మండలంలోని రైతు కూలీలకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద అదనంగా మరో 50 రోజుల పనిదినాలను కల్పించినట్లు ఏపీఓ శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం కరవు మండలంగా గుర్తించడంతో వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు జాబ్ కార్డు ద్వారా మార్చి నెలలో కూలీలకు అదనపు పనిదినాలు కల్పించినట్లు వివరించారు. కూలీలు సోమవారం నుంచి పనికి వెళ్లవచ్చని ఆయన చెప్పారు.

అమరవీరుల త్యాగాలతోనే ఎస్సీ వర్గీకరణ

తాడిమర్రి: ఎందరో అమరవీరుల త్యాగాలతో ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని, వారి పోరాటం వృథా కాలేదని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు రామాంజనేయులు తెలిపారు. ఎస్సీ వర్గీకరణలో అసువులు బాసిన అమరవీరుల దినోత్సవాన్ని ఆదివారం వారు ఘనంగా నిర్వహించారు. తాడిమర్రి ఎస్సీ కాలనీలో అమరువీరుల చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్గీకరణకు అండగా నిలిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలిపారు. మండల అధ్యక్షుడు గంగాధర్, నాయకులు నాగభూషణం, పెద్దిరాజు, సూర్యనారాయణ, గంగులయ్య పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో కళాజ్యోతి ప్రతినిధులు

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన మిరాకిల్ ఎడ్యుకేషన్ సెంటర్ విద్యార్థులు చెన్నైలో నిర్వహించిన అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఆదివారం పట్టణంలోని కళాజ్యోతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు కళాజ్యోతి కార్యదర్శి రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఫిబ్రవరి 8న చెన్నైలో నిర్వహించిన ఈసీ మ్యాథ్స్ 10వ ఇంటర్నేషనల్ అబాకస్ పోటీల్లో పాల్గొని ఇషాన్ అనే విద్యార్థి ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్ బహుమతిని అందుకున్నారని డైరెక్టర్ శ్రీవాణి, ఫ్రాంఛైజ్ హెడ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

ఘనంగా పెద్దయ్య స్వామి ఉత్సవం

రామగిరి, న్యూస్‌టుడే: నసనకోటలో వెలసిన అతకల్లపట్నం పెద్దయ్య స్వామి మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన దేవర్లతో పాటు గ్రామదేవతలు ముత్యాలమ్మ, దుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున ఉదయం 4 గంటల నుంచి గంగపూజ, రుద్రాభిషేకం, బిందె పూజ, గొరవయ్యల సందడితో ఎంతో వైభంగా ఉత్సవం జరిగింది.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

నల్లచెరువు, న్యూస్‌టుడే: చింతకాయలు కోయడానికి చెట్టు ఎక్కిన వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు చిన్నయల్లంపల్లి గ్రామానికి చెందిన డేరంగుల రవి(35) చింత చెట్టు ఎక్కి చింతకాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య మీనాక్షి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్య

అమడగూరు(ఓబుళదేవరచెరువు), న్యూస్‌టుడే: అమడగూరు మండల కేంద్రంలోని చర్చి సమీపంలో సుబ్రహ్మణ్యం భార్య లావణ్య(40) ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు తెలిపిన వివరాల మేరకు లావణ్య గతకొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపాలకృష్ణ తెలిపారు.

క్రైం కార్నర్

పెయింటర్ బలవన్మరణం

ధర్మవరం న్యూస్‌టుడే: మండలంలోని తుంపర్తి కాలనీలో ఆదివారం పెయింటర్ ఉరివేసుకొని మృతి చెందారు. ధర్మవరం గ్రామీణ పోలీసులు తెలిపిన మేరకు వివరాల మేరకు తుంపర్తి కాలనీకి చెందిన కృష్ణమూర్తి(36) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. అతను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఆర్థిక సమస్యలు తోడవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతను ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య చిట్టెమ్మ, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ

బత్తలపల్లి న్యూస్‌టుడే: మండలంలోని రామాపురం సర్కిల్ మలుపు వద్ద బైక్ కారు ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనచోదకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు అసోంకు చెందిన జహ్రుల్ ఇస్లాం మండలంలోని రామాపురంలో ఓ కోళ్ల ఫారంలో పనిచేస్తున్నారు. తోటలో పనులు ముగించుకొని ఇంటికి బైక్‌పై వస్తుండగా గ్రామంలోని మలుపు వద్ద బత్తలపల్లి వైపు నుంచి కదిరి వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను గాయపడ్డాడు. స్థానికులు వెంటనే బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమశేఖర్ తెలిపారు.

ముగ్గురికి తీవ్రగాయాలు

కనుముక్కల (చెన్నేకొత్తపల్లి), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొనడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన చెన్నేకొత్తపల్లి మండలం కనుముక్కల వద్ద శనివారం రాత్రి జరిగింది. కనుముక్కలకు చెందిన క్రిష్టప్ప, నాగరాజు, నాగమ్మ పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి గ్రామానికి వస్తున్నారు. ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి ప్రవేశిస్తుండగా కొత్తచెరువు నుంచి ధర్మవరం వైపు వెళుతున్న కారు ఢీకొంది. ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ధర్మవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, ధర్మవరం.
O.S. No. 253/2020

BETWEEN:
CITY UNION BANK LTD, DHARMAVARAM... వాది.
AND
1) M/s: సాయిదేవ శిల్క్స్, PROP: B.అహోబళప్ప, S/o ఎర్రప్ప, D.No:31-699-1, కొత్తపేట, ధర్మవరం.
2) B.అహోబళప్ప, S/o ఎర్రప్ప, D.No:31-699-1, కొత్తపేట, ధర్మవరం.
3) B.శకుంతల W/o B.అహోబళప్ప, D.No: 31-699-1, కొత్తపేట, ధర్మవరం ...ప్రతివాదులు

దావా నోటీసు

వాది బ్యాంకు పైదావాలో Rs: 4,23,198/- ల నిమిత్తం మీపై దావా దాఖలు చేసియున్నారు. మీకేమైనా ఆక్షేపణలున్న యెడల 5-3-2026వ తేదిన ఉదయం 10-30 గం॥లకు కోర్టులో స్వతహాగా గాని, వకీలు ద్వారా గాని, హాజరై తెలుపుకొనవచ్చును. లేని యెడల, పై దావా మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

డి.డి.హేమకుమార్, B.Com., B.L., ADVOCATE, ధర్మవరం.

IN THE COURT OF THE 1ST ADDL. DISTRICT JUDGE, ANANTHAPURAMU
A.S. No: 87/2024

Between:
Mukthapuram Ramakrishna Reddy and Others ....Appellants
And
M.Venkata Rami Reddy and Others ... ...Respondents

Notice to the Respondent No: 9, 10, 14, 23, 24, 49 and 50

R9. M.Rambhupal Reddy, S/o Thimma Reddy,
R10. M.Narayana Reddy, S/o Thimma Reddy,
R14. Rama Narayana Reddy, S/o M.Venkata Reddy, All are R/at Thippepalli H/o Ravulacheruvu, Dharmavaram Mandal,
R23. Rama Lakshmamma, W/o K.Narayana Reddy, agriculturist, Rallananthapuram cross, Mudigubba Mandal.
R24. M.Chinna Venkata Reddy, S/o Subbareddy, R/at Thippepalli H/o Ravulacheruvu, Dharmavaram Mandal,
R49. M.Mokshitha, D/o Rama Krishna Reddy, Thippepalli village, H/o Ravulacheruvu village, Dharmavaram Mandal,
R50. M.Rajavardhan Reddy, S/o Ramakrishna Reddy, Thippepalli Village, Dharmavaram Mandal,

పై నెంబరు కేసులో Respondents అయిన మీ హాజరు నిమిత్తము 31-03-2026వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(By Order of the Court)

N.R.K.Mohan, Advocate
Anantapur. Cell: 9440787100

నకిలీ కాటు.. అంతా లోటు

■ గుండెలు బాదుకుంటున్న రైతన్నలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: తక్కువ పెట్టుబడి, శ్రమతో అనతి కాలంలో చేతికందే మొక్కజొన్న వైపు ఈసారి అన్నదాతలు మొగ్గు చూపారు. ఇతర పంటలతో పోలిస్తే ధర గిట్టుబాటు అవుతుండటంతో మూకుమ్మడిగా కర్షకులు సాగుచేశారు. ఈసారైనా తమ కష్టాలు తీరుతాయని భావించారు. విత్తు వేసి మొక్క ఎదిగినా కంకి రాకపోవడంతో కల్తీకాటుకు గురయ్యామని తెలిసి రైతన్నలు గుండెలు బాదుకుంటున్నారు.

విక్రయించి మాట మార్చి

ఐదేళ్ల క్రితం క్వింటాలు మొక్కజొన్న ధర రూ. 1200 ఉండేది. ప్రస్తుతం క్వింటాలు ధర రూ. 2400 పలుకుతోంది. ఎకరాకు 25- 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుండటంతో లాభసాటిగా ఉంటుందని శ్రామికులు మొక్కజొన్న బాట పట్టారు. రైతుల ఆసక్తిని గమనించిన ప్రైవేటు కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి నకిలీ విత్తనాలు బహిరంగ మార్కెట్లో విక్రయించి అన్నదాతల వెన్నువిరిచారు. కొత్తచెరువు మండల పరిధిలోని ఎర్రపల్లి, చెన్నరాజుపల్లి, కమ్మవారిపల్లితో పాటు పలు గ్రామాల రైతులు మూకుమ్మడిగా ఓ ప్రైవేటు కంపెనీ విత్తనాలు కొనుగోలు చేసి విత్తారు. మరికొందరు హాలికులు గోరంట్ల, పెనుకొండ, కొత్తచెరువు, ధర్మవరంలోని ప్రైవేటు డీలర్ల దగ్గర విత్తనం కొనుగోలు చేశారు. గతేడాది పంట బాగా పండిందన్న నమ్మకంతో ఈసారి సాగుచేసిన వారికి కన్నీరే మిగిలింది. ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు మాత్రం వాతావరణంలో మార్పులే కారణమంటూ తప్పించుకుంటున్నారు.

అప్పులతో సహవాసం

ఏ పంట సాగుకైనా విత్తనమే కీలకం. అలాంటిది పదుల సంఖ్యలో ప్రైవేటు కంపెనీలు నకిలీ విత్తనాలు హాలికులకు అమ్ముతున్నా అధికారులు ఏం చేస్తున్నారనేది బహిరంగ ప్రశ్నగా మారింది. కల్తీకాటుకు బలైన రైతులు మాత్రం అప్పుల పాలవుతున్నారు. ప్రైవేటు కంపెనీల నుంచి నష్టపరిహారం ఇప్పించాలని వారు కోరుతున్నారు.

కంకి వేయని మొక్కజొన్న

మూడెకరాల్లో ఎదుగుదల లేదు

ఆరు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పెనుకొండలో మొక్కజొన్న విత్తనం తెచ్చి నాటిన మూడు ఎకరాల పొలంలో పైరు ఎదుగుదల లేదు. దాదాపు రూ. 80 వేలు పెట్టుబడి పెట్టా. - కేశప్ప, ఎర్రపల్లి, కొత్తచెరువు

పశుగ్రాసానికి ఇచ్చేశా

రెండు ఎకరాల్లో రూ. 60 వేలు పెట్టి సాగుచేశా. పంటలో ఎదుగుదల లేదు. కనీసం కంకి కూడా రాలేదు. అరెకరం పంట రూ. 6 వేలకు పశుగ్రాసంగా విక్రయించా. - బాబయ్య, ఎర్రపల్లి, కొత్తచెరువు

'తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దు'

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కార్యకర్తలు తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ఆదివారం నెమిళివరం, పాతపాళ్యం గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రహదారులను పరిశీలించారు. అనంతరం పాతపాళ్యంలో నాయకులతో కలిసి పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల, హెల్పర్ల సమస్యలపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. మొదటి నుంచి అంగన్‌వాడీలకు న్యాయం చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమేనని గుర్తు చేశారు. తొమ్మిది డిమాండ్లను ఇప్పటికే కూటమి ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ సుధాకర్ నాయుడు, మండల కన్వీనర్ యాతం పోతలయ్య, డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేశు, సర్పంచులు రాజాకృష్ణ, ముత్యాలు, మాదవరాజు, పాతపాళ్యం వేణు, సంజీవ పాల్గొన్నారు.

క్యాన్సర్ ఉచిత నిర్ధారణ పరీక్షలు

రోగులను పరీక్షిస్తున్న యువర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని ఉషోదయ పాఠశాల ఆవరణలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శింగనమల నాగమణి జ్ఞాపకార్థం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. బెంగళూరు శంకర క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు డా. బీఎస్ శ్రీనాథ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 110 మందికి పరీక్షలు చేశారు. 40 ఏళ్లు పైబడిన వారు ఏడాదికి ఒకసారి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని డా. బీఎస్ శ్రీనాథ్ అన్నారు. డా. సుబ్బరావు, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, జయరామ్, నాగార్జున, సభ్యులు చాంద్‌బాషా, పోలా ప్రభాకర్, వైకే శ్రీనివాసులు, మోహన్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణకు కసరత్తు మొదలైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పంచాయతీలు, వార్డులవారీగా ఓటర్ల జాబితాలు తయారు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించింది. ఈ ఏడాది జనవరి 1 నాటికి అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా అందుబాటులో ఉన్న జాబితాల ప్రాతిపదికన తీసుకుని.. మార్చి 9లోగా ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఆ మేరకు జిల్లా పంచాయతీ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

సంగ్రామం.. సన్నద్ధం..!

★ ఓటర్ల జాబితా తయారీలో అధికారులు నిమగ్నం

అందుబాటులోకి ప్రత్యేక సాఫ్ట్‌వేర్

● ఓటర్ల జాబితాల తయారీకి ప్రభుత్వం ఓ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకొచ్చింది.

● జాబితాలను ఏ విధంగా రూపొందించాలనే దానిపై ఇటీవల జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. వారు కొద్ది రోజులుగా ఎన్నికల సంఘం నియమావళికి అనుగుణంగా పని చేస్తున్నారు.

● జనవరి 1 తర్వాత కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్న వారి వివరాల జాబితా రూపొందించిన అనంతరం మార్పులు, చేర్పుల లిస్టులో చేరుస్తారు.

● ఆ తర్వాత పంచాయతీ సర్పంచి, వార్డుల రిజర్వేషన్ల ప్రక్రియ చేపడతారు.

జిల్లా ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
ఇచ్ఛాపురం	1,32,735	1,39,868	17
పలాస	1,08,308	1,13,299	13
టెక్కలి	1,18,582	1,19,405	09
పాతపట్నం	1,13,377	1,14,147	08
శ్రీకాకుళం	1,36,197	1,39,283	27
ఆమదాలవలస	95,666	97,494	13
ఎచ్చెర్ల	1,24,312	1,23,044	14

24 పంచాయతీలకు మినహాయింపు..

జిల్లాలో 912 గ్రామ పంచాయతీలున్నాయి. వాటిలో 24 పంచాయతీలకు సంబంధించి కోర్టులో వ్యాజ్యాలు నడుస్తున్నాయి. వాటికి మినహా మిగిలిన చోట్ల ఓటర్ల జాబితాలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో పంచాయతీ ఓటర్ల జాబితాలు తయారు చేస్తున్నామని, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేస్తామని ఇన్‌ఛార్జి డీపీవో గోపీబాల తెలిపారు.

అడ్డంగా తవ్వేద్దాం.. అడిగితే చూద్దాం..!

మెళియాపుట్టి మండల కేంద్రంలో రూ.6.28 కోట్ల అంచనా వ్యయంతో పారిశ్రామికవాడ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 60 ఎకరాలకు పైగా కేటాయించింది. గతేడాది మేలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు శంకుస్థాపన చేశారు. ఆ స్థలం లో కంకరను కొందరు అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా పొక్లెయిన్లతో తవ్వేస్తున్నారు. అనంతరం దర్జాగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు కన్నెత్తి చూడట్లేదు. ఈ విషయమై తహసీల్దార్ పాపారావు మాట్లాడుతూ ఆ స్థలంలో కంకర తవ్వకాలకు అనుమతులు ఉండాలని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

– న్యూస్‌టుడే, మెళియాపుట్టి

తాగుదామా.. ఆగుదామా..?

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, పలాస, ఆమదాలవలస పట్టణం

శ్రీకాకుళం నగరంలో అతిసారం విజృంభణకు తాగునీటి పైపులైన్లు మురుగు కాలువలో ఉండటమే ప్రధాన కారణమని తేలింది. ఈ క్రమంలో ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాలవలస పట్టణాల్లోనూ కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీరు విషయంలో సందేహాలు తలెత్తుతున్నాయి. ఆయా గొట్టాల నిర్వహణ అస్తవ్యస్తంగానే ఉంది. తరచూ పైపులైన్లు లీకవ్వడం.. మళ్లీ మరమ్మతులు చేయించడం పరిపాటిగా మారింది. పట్టణాల్లో మురుగునీటి వ్యవస్థపై అధికారులు దృష్టి సారించకపోతే అక్కడ సైతం తాగునీరు కలుషితమయ్యే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పట్టణాల్లోనూ కాలువల్లోనే పైపులైన్లు

శ్రీకాకుళంలో అతిసారం ఘటనతో ఆందోళన

న్యూస్‌టుడే పరిశీలన

పరిస్థితి ఏంటి..?

ఇచ్ఛాపురంలోని 20 వార్డులకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. సంతపేట, బందరువీధి, కూరజీ, రాజావారి కోట, గాంధీ పార్కు, బస్టాండు, దాసన్నపేట, డబ్బూరివీధి, జెహరావీధి, బెల్లుపడకాలనీ, బలరాంపేట, వీకే పేట తదితర ప్రాంతాల్లో చాలా పైపులైన్లు మురుగు కాలువల్లోనే ఉన్నాయి. ఎప్పుడైనా గొట్టం పగిలినా, చట్రాలు కదిలినా కలుషితమయ్యే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. కాలువల వద్ద అదనపు పైపులైన్లు ఏర్పాటు చేసి.. మురుగునీరు కలవకుండా చేశామని పుర కమిషనర్ నల్లి రమేష్ తెలిపారు.

ఆమదాలవలస పట్టణం మేదర వీధిలో కాలువలో దర్శనమిస్తున్న తాగునీటి పైపులైన్లు

తాత్కాలిక చర్యలతో సరి..

పలాస-కాశీబుగ్గ పరిధిలో డొంకివీధి, పలాస హడ్కోకాలనీ, పెట్రోల్ బంకు నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు, నెహ్రూనగర్, శివారు ప్రాంతాలకు వెళ్లే పైపులైన్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. ఎప్పటికప్పుడు పగులుతున్న గొట్టాలకు తాత్కాలికంగా రబ్బరుతో కట్లు వేస్తున్నారు. ఏ సమయంలోనైనా మురుగు కలిస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆ నీరు తాగేందుకు ఆసక్తి చూపట్లేదు. కొత్త మంచినీటి పథకం అందుబాటులోకి వస్తే తప్ప సమస్యకు పరిష్కారం దొరికే పరిస్థితి కనిపించట్లేదు. అప్పటి వరకు నీరు కలుషితం కాకుండా చూస్తామని కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు.

తరచూ మరమ్మతులే..

ఆమదాలవలస పట్టణంలోని పైపులైన్లు ఎన్నో ఏళ్ల కిందట ఏర్పాటు చేసినవి కావడంతో తరచూ దెబ్బతింటున్నాయి. తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. మేదర వీధి, లెప్రసీ కాలనీ, పాత ఆమదాలవలస, వెంగళరావుకాలనీ, ఐజేనాయుడు కాలనీ, గణేష్ నగర్, కృష్ణాపురం, దాబాలవారి వీధి, పూజారిపేట, గేదెలవాని పేట, ఊసవానిపేట, మెట్టక్కివలస, లక్ష్మీనగర్, సాయినగర్ క్వార్టర్ ప్రాంతాల్లో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాలువల్లో పైపులు లీకవుతుండటంతో జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ఎప్పటికప్పుడు పూడిక తీయిస్తున్నామని కమిషనర్ టి.రవి తెలిపారు.

పురపాలక సంఘం	వార్డులు	జనాభా (వేలల్లో..)	మంచినీటి కుళాయిలు	కాలువల్లో ఉన్న పైపులు
ఇచ్ఛాపురం	23	46	1,937	9
పలాస	31	82	1,452	11
ఆమదాలవలస	23	56	2,650	19

రాళ్లున్నాయి.. రోడ్డేది..!

ఈ చిత్రంలో కనిపిస్తున్నది నందిగాం మండలం బడగాం నుంచి మొగిలిపాడు, గనియా పేట మీదుగా సవరలింగుపురానికి వెళ్లే బీటీ రహదారి. దీన్ని కొంత కాలం కిందట మరమ్మతులకు తవ్వి వదిలేశారు. పూర్తి చేయకపోవడంతో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బట్లు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఏఈఈ ఇబ్రహీం పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

విద్యుత్తు సమస్యలా.. సంప్రదించండి

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

గురుద్వారా, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగంగా పరిష్కరించాలనే లక్ష్యంతో విశాఖలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వినియోగదారులు 86884 00499 నంబరుకు ఫోన్ చేస్తే ఉదయం 10.30 నుంచి 11.30 వరకు తమ సమస్యలను తెలియజేయొచ్చన్నారు. సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, నియంత్రికల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని ప్రకటించారు. వినియోగదారులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కోడి మాంసం దుకాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చిత్రంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అధికారులు

చెత్త కనిపించడానికి వీల్లేదు: కలెక్టర్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో చెత్త కనిపించకుండా చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన పర్యటించారు. పారిశుద్ధ్య పనుల్లో లోపాలను గుర్తించారు. అతిసారం ప్రభావిత ప్రాంతాలు నక్క వీధి, మొండేటి వీధి, దమ్మల వీధి, గోల్కొండ రేవు, లెప్రసీ కాలనీ, మంగువారితోట ప్రాంతాలను ఆనుకుని ఉన్న మేదర వీధి, పొట్టి శ్రీరాములు మార్కెట్, ఇప్పిలి వీధి, చిన్న బజారు, చౌక్ రోడ్, నెహ్రూ రోడ్ ప్రాంతాలను సందర్శించారు. పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటాన్ని చూసి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. యుద్ధప్రాతిపదికన మెరుగుపరిచేందుకు 20 ప్రత్యేక బృందాలు, పర్యవేక్షణకు 21 మంది అధికారులను నియమించారు. రోజూ ఉదయం 5.30 గంటల నుంచి పనిలో నిమగ్నమవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. మేదర వీధిలో కోడి మాంసం విక్రయ దుకాణాన్ని పరిశీలించి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ప్రజారోగ్య విభాగాధికారి సుధీర్‌ను హెచ్చరించారు. పొక్లెయిన్, యంత్రాల సాయంతో కాలువల్లో పూడిక తీయించే పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆక్రమణలను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు.

అతిసారం కేసులు 214

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలో అతిసారం కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఆదివారం నాటికి మొత్తం కేసుల సంఖ్య 214కు చేరినట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రకటించారు. 116 మంది కోలుకుని ఇంటికి చేరుకోగా.. ప్రస్తుతం 94 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. డయేరియా ప్రభావిత ప్రాంతాలైన దమ్మలవీధి, కాకివీధి, మంగువారితోట, గుడి వీధుల్లో ఇప్పటి వరకు 135 కేసులు నమోదుకాగా.. 89 మంది పూర్తిగా కోలుకున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, శుభ్రత పాటించాలని అధికారులు చెబుతున్నారు. కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని కోరుతున్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి మంత్రి లోకేశ్ ప్రశంస

జి.సిగడాం, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలానికి చెందిన ప్రధానోపాధ్యాయురాలు సృజనాత్మక బోధనతో విద్యాశాఖ మంత్రి లోకేశ్ మన్ననలు అందుకున్నారు. పున్నం పంచాయతీ బూటుపేట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న **కూర్మాన అరుణకుమారి** పాఠాల్లో విషయాన్ని బొమ్మలు, లఘు చిత్రాలు, వివిధ ఆకృతులుగా తయారు చేసి, వాటి సాయంతో పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నారని 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. బోధనా తీరును మెచ్చుకున్నారు. గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాం, రాష్ట్ర-జాతీయ స్థాయి విద్యా శిక్షణల్లో కేఆర్పీగా, మాడ్యూల్ రచయితగా, ఈ-కంటెంట్ సృష్టికర్తగా అరుణకుమారి చేస్తున్న కృషి ఎనలేనిదని ప్రశంసించారు.

– న్యూస్‌టుడే, మందస, పలాస గ్రామీణం

జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. పర్యవేక్షించే వారు లేక.. కనీస సౌకర్యాలు కరవై విద్యార్థులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. సంక్షేమాధికారుల కొరతతో చాలా చోట్ల కింది స్థాయి సిబ్బంది ఏది పెడితే అదే తినాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్కడా మెనూ సక్రమంగా అమలు కావట్లేదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మందస మండలం జీఆర్‌పురం బీసీ బాలుర వసతి గృహంలో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

ఇదేనా వసతి.. ఇంతేనా గతి..!

అస్తవ్యస్తంగా బీసీ సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితి

జిల్లాలో 81 బీసీ సంక్షేమ వసతి గృహాలున్నాయి. అందులో బాలుర కోసం 53 ప్రీమెట్రిక్ హాస్టళ్లు, బాలికలకు 10, పోస్టుమెట్రిక్ వసతి గృహాలు బాలురకు 10, బాలికలకు 8 నిర్వహిస్తున్నారు. వార్డెన్లు మాత్రం 42 మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఒక్కో అధికారి రెండేసి హాస్టళ్ల బాధ్యతలు చూస్తున్నారు. చాలా మంది వారానికి ఒకట్రెండు రోజులే సందర్శనకు వెళ్తున్నారు. దిగువ స్థాయి సిబ్బందికి బాధ్యతలు అప్పగించడంతో వారు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు.

నేలపైనే నిద్ర.. పెట్టిందే మెనూ..

★ వసతి గృహాలన్నీ ఏళ్ల కిందట నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. కొన్ని చోట్ల గోడలు, పైకప్పుల పెచ్చులూడిపోతున్నాయి.

★ ఎప్పటికప్పుడు రూ.లక్షలు వెచ్చించి మొక్కుబడిగా మరమ్మతులు చేపడుతున్నా సమస్య పునరావృతమవుతోంది.

★ సరైన సౌకర్యాల్లేకపోవడంతో బాలబాలికలు నేలపైనే నిద్రిస్తున్నారు. కొన్నిచోట్ల భోజనాల గదుల్లోనూ నిద్రించాల్సిన పరిస్థితి నెలకొంది.

★ ఇరుకు గదులు కావడంతో సరైన గాలి, వెలుతురు రాక అవస్థలు పడుతున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు.

ఇబ్బందుల్లేకుండా చూస్తాం...

వసతి గృహాల్లో విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం. సిబ్బంది కొరత ఉన్న విషయం వాస్తవమే. భవనాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నాం. సమస్యలను ప్రభుత్వానికి నివేదించి.. ఉన్నతాధికారులకు ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– అనురాధ, డీబీసీడబ్ల్యూవో, శ్రీకాకుళం

జిల్లాలో వసతి గృహాల వివరాలిలా.. ★ ప్రీమెట్రిక్: 63 ★పోస్టుమెట్రిక్: 18 ★విద్యార్థులు: సుమారు 7 వేలు ★సంక్షేమాధికారులు: 42 మంది

– న్యూస్‌టుడే, టెక్కలి

కన్నోళ్ల కష్టం నుంచి పుట్టిందే.. క్యాషూ హబ్..!

జీడి రైతుల సమస్య పరిష్కారానికి ప్రాజెక్టు రూపకల్పన

వారంతా జీడి రైతుల పిల్లలు.. తల్లిదండ్రులు తోటకు వెళ్లి జీడి పండ్ల నుంచి పిక్కలు తీసేందుకు పడే కష్టాలను కళ్లారా చూశారు.. వసతి గృహంలో ఉన్న సమయంలో ఆలోచనలు పంచుకుని ఆవిష్కరణకు ప్రాణం పోశారు. సాంకేతికతను ఉపయోగించి.. కన్నోళ్లకు నిత్యం ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపే పరికరాన్ని రూపొందించారు టెక్కలిలోని ఐతమ్ కళాశాల విద్యార్థులు. దాని గురించి తెలుసుకుందాం రండి..

తయారు చేసిన యంత్రం

★ జీడి పండు నుంచి పిక్కను వేరు చేయడం కష్టంతో కూడుకున్న పని. కొన్ని సందర్భాల్లో పండు ముదిరినా, ఎండిపోయినా, దెబ్బతిన్నా పిక్క వేరు చేయడం కష్టమవుతుంది. ఆ సమయంలో చేతులకు రసాయనం అంటుకుని రైతులకు ఆరోగ్య సమస్యలొస్తుంటాయి. దీంతో పాటు గోళ్లు ఊడిపోవడం, గోరు చుట్టు రావడం జరుగుతుంటాయి.

కంచిలి మండలం కొరికానపుట్టుగకు చెందిన కాళ్ల విష్ణువర్ధన్, విజయనగరం జిల్లా రాజాం మండలం కాగితాపల్లి గ్రామస్థుడు దూబ తరుణ్‌కుమార్, అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చుక్కలవానిలక్ష్మీపురానికి చెందిన గంధం అరవింద్‌స్వామి కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని భావించారు. వారి ఆలోచనను ఐతమ్ రైజ్ సీఈవో మనోజ్‌కుమార్ బగాడియాకు వివరించారు. ఆయన ప్రోత్సహించి ప్రాజెక్టుకు సహకారం అందించడంతో ఓ యంత్రాన్ని తీర్చిదిద్దారు.

★ జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రదర్శించగా తుది పోటీలకు ఎంపికైంది. దీన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేసింది. 'ముగ్గురం కలిసి ఎన్నో నెలలు ఈ ప్రాజెక్టు కోసం శ్రమించాం. జాతీయ స్థాయిలో కచ్చితంగా గుర్తింపు వస్తుందని ఆశిస్తున్నాం' అని ఆవిష్కర్తలు చెబుతున్నారు.

★ ఈ సమస్యకు పరిష్కారంగా విద్యార్థులు 'క్యాషూ హబ్' అనే ప్రాజెక్టును తయారు చేశారు. జీడి పండును యంత్రంలో పెట్టి తిప్పుతూ ఉంటే పిక్క, పండు వేర్వేరై చెరో వైపు వచ్చేస్తాయి. అదే సమయంలో పండు నుంచి వచ్చే గుజ్జును కూడా వేరే అవసరాలకు వినియోగించుకునే అవకాశం కలుగుతుంది.

ఆదుకోమంటే.. అడ్డుకుంటారేం..?

● ఆక్రమణ విషయంలో అధికారుల తీరుపై విమర్శలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట పంచాయతీ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న రూ.6 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ఓ నాయకుడు ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో రాజకీయ పైరవీల కారణంగా అధికారులు ఆక్రమణదారులకు కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవంగా ఆ డీపట్టా భూమి వేరొకరి పేరిట ఉంది. ఆన్‌లైన్‌లోనూ అతని పేరే చూపిస్తోంది. జాతీయ రహదారి విస్తరణలో తమ భూమి పోయినందుకు సదరు వ్యక్తులు పరిహారం కూడా అందుకున్నారు. దీంతో మరొకరికి అదే నంబరుతో పట్టా ఇచ్చే అవకాశమే లేదు. ఇన్ని ఆధారాలున్నా నకిలీ పట్టాలతో కబ్జా చేయాలనుకుంటున్న వారికి రెవెన్యూ, పోలీసు అధికారులు అండగా నిలుస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ దస్త్రాల్లో పేరు ఉన్న పట్టాదారులు ఆదివారం వారి భూమిలో మొక్కలు వేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లారు. తహసీల్దార్‌తో మాట్లాడకుండా ఏ పని చేయొద్దని చెప్పి పంపించేశారు. రాజకీయ నేత ఒత్తిడితో సాగు చేయట్లేదనే సాకు చూపి అధికారులు కూడా తమకు అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పట్టాదారులు ఆరోపిస్తున్నారు.

మొక్కలు నాటకుండా అడ్డుకుంటున్న పోలీసు

జన జాతర

గార మండలం చిన్నవత్సవలస గ్రామం ఆదివారం కిటకిటలాడింది. రాజమ్మ ఉత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. సముద్ర స్నానాల అనంతరం భూలోకమ్మ ఆలయం వద్ద మొక్కులు చెల్లించారు. దాసుడికి కానుకలు సమర్పించారు. అక్కడే వంటావార్పు చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. సీఐలు పైడపునాయుడు, ప్రసాదరావు పర్యవేక్షణలో ఎస్సై గంగరాజు బందోబస్తు చేపట్టారు. వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించారు. శ్రీకూర్మం క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఈవో వాసుదేవరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, గార(చిన్న వత్సవలస)

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీలు నేరుగా లేదా meekosam.ap.gov.in లో సమర్పించొచ్చని పేర్కొన్నారు. నమోదైన వాటి స్థితికి సంబంధించి సమాచారానికి 1100 ఫోన్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, శ్రీకాకుళం అర్బన్, ఇచ్ఛాపురం

● జిల్లాలో స్వయంశక్తి సంఘాలు: 48,844 ● సభ్యులు: 5,36,378 మంది

పెళ్లికి ప్రోత్సాహం.. చదువుకు చేయూత..!

డ్వాక్రా మహిళల పిల్లలకు రుణ సదుపాయం

స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వారి పిల్లల భవిష్యత్తును బంగారుమయం చేసేందుకు పావలా వడ్డీకి రుణ సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ కల్యాణ లక్ష్మి, ఎన్టీఆర్ విద్యాలక్ష్మి పథకాలను అమలు చేయనుంది.

డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు ఇప్పటికే సూక్ష్మ రుణ ప్రణాళిక (ఎంసీపీ) ద్వారా పారదర్శకంగా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. వాటిని వినియోగించుకుని చాలా మంది స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ప్రస్తుత పథకాల ద్వారా పిల్లల విద్య, వివాహ అవసరాల నిమిత్తం గరిష్ఠంగా రూ.లక్ష వరకు అప్పు ఇస్తారు. దాన్ని తిరిగి తీర్చేందుకు నాలుగేళ్ల వరకు గడువు ఉంటుంది.

విద్యాలక్ష్మి కావాలంటే..: సభ్యురాలి కుటుంబంలో పాఠశాల లేదా కళాశాలల్లో చదువుతున్న పిల్లల ఫీజుల అవసరాలకు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ఆర్థిక చేయూతనందిస్తారు. ఇందుకు సంబంధిత విద్యాసంస్థల్లో చేర్పించిన ప్రవేశ పత్రం, ఫీజు రసీదు చూపించాలి. గరిష్ఠంగా ఇద్దరు పిల్లల వరకు మాత్రమే పథకం వర్తిస్తుంది.

కల్యాణలక్ష్మి పొందాలంటే..: కుటుంబంలో వివాహం చేయాల్సిన కుమార్తె ఉంటే పెళ్లి ఖర్చుల నిమిత్తం గరిష్ఠంగా రూ.లక్ష వరకు రుణం ఇస్తారు. పెళ్లి శుభలేఖ, ఖర్చు అంచనా వివరాలు సమర్పించాలి. సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి.. రెండు రోజుల్లో బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తారు.

అర్హతలివి..: సభ్యురాలు సంఘంలో చేరి కనీసం ఆరు నెలలై ఉండాలి. ఇప్పటికే రుణం తీసుకున్నా వాటిని సక్రమంగా చెల్లిస్తూ ఉంటేనే అర్హులవుతారు. రుణగ్రహీత ప్రమాదవశాత్తు మరణిస్తే అప్పు మాఫీ అవుతుంది. వీటికి సంబంధించి పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రావాల్సి ఉంది. అవి రాగానే అర్హులందరికీ ఆర్థిక సాయం అందజేస్తాం' అని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ తెలిపారు.

అరటి గెలలు సమర్పించి.. మొక్కులు చెల్లించి

సారవకోట మండలం వడ్డినవలసలో కొలువైన త్రినాథ స్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ప్రారంభమైంది. కోర్కెలు తీర్చే దైవంగా భావిస్తూ.. భక్తులు అరటి గెలలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజుల్లో సుమారు వెయ్యి గెలలు రావడంతో కమిటీ సభ్యులు వాటిని ఆలయ ప్రాంగణంలో వేలాడదీశారు. ఈ దృశ్యాన్ని చిత్రంలో చూడొచ్చు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని ప్రసాదాలు స్వీకరించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జిల్లా స్థాయి బలప్రదర్శన పోటీలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

– న్యూస్‌టుడే, సారవకోట

వైభవంగా కామదహనం

అరసవల్లిలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం డోలోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా కామదహనం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఉత్సవ విగ్రహాలతో చిన్న తోట వద్దకు తిరువీధిగా వెళ్లారు. ప్రధానార్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆదిత్యాలయానికి భక్తులు భారీగా తరలివచ్చారని.. టికెట్లు, ప్రసాదాలు, ఇతర సేవల రూపంలో మొత్తం రూ.7.18 లక్షలు సమకూరినట్లు ఈవో ప్రసాద్ తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

చెరువులో రోడ్డు.. ఆక్రమణకు లేదా అడ్డు..!

రణస్థలం మండల కేంద్రం జేఆర్ పురంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేస్తున్నారు. జేఆర్ పురం పంచాయతీలోని గరికిపాలెం రెవెన్యూ పరిధిలో 1.82 ఎకరాల విస్తీర్ణంలో కందల చెరువు ఉంది. అక్రమార్కులు చెరువు గర్భంలో మట్టిని పోసి రహదారి నిర్మిస్తున్నారు. ఇక్కడ సెంటు విలువ రూ.5 నుంచి రూ.10 లక్షలు ఉంది. ఆక్రమణదారుల నుంచి చెరువు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. తహసీల్దారు ఎస్.కిరణ్‌కుమార్ వివరణ కోరగా ఆక్రమణ తొలగిస్తామన్నారు. – న్యూస్‌టుడే, రణస్థలం

కేంద్ర ప్రభుత్వ వైఖరితో
బ్యాంకు ఉద్యోగులపై పని ఒత్తిడి

మాట్లాడుతున్న బ్యాంకు ఉద్యోగుల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంబాబు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏపీ, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జిల్లా సమన్వయ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖాళీలు భర్తీ చేయకపోవడం, నియామకాలు చేపట్టకపోవడంతో ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. విస్తృత పోరాటం చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల సమన్వయ కమిటీలను ఎన్నుకున్నారు. శ్రీకాకుళం కమిటీ జిల్లా అధ్యక్షుడిగా గిరిధర్‌నాయక్, కార్యదర్శిగా బి.శ్రీనివాసు, ఉప కార్యదర్శిగా కామరాజు, నలుగురు ఉపాధ్యక్షులు, 10 మంది సంయుక్త కార్యదర్శులు, కమిటీ సభ్యులుగా 14 మందిని ఎన్నుకున్నారు. ఏపీ, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సంఘ కార్యవర్గ ప్రతినిధులు ఉదయ్‌కుమార్, కమలాకర్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం (కిలో రూ.ల్లో..)	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	180	315	335

చిన్నారులు.. రసాయన శాస్త్రంలో దిట్టలు!

● డిగ్రీ స్థాయి అంశాలకు క్షణాల్లో సమాధానం

న్యూస్‌టుడే, సోంపేట

నేర్చుకోవాలన్న తపనకు ఉపాధ్యాయుల చిత్తశుద్ధి తోడైతే ప్రభుత్వ పాఠశాలలో చదివినా రాణించొచ్చని ఆ విద్యార్థులు నిరూపిస్తున్నారు. సోంపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న శరణ్య, నారీమణి, జోషిత, సాయిప్రీతి, రాజ్యలక్ష్మి, జోష్ణవి రసాయనశాస్త్రంలో వివిధ అంశాలను అలవోకగా సమాధానాలు చెబుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆశ్చర్యానికి గురి చేస్తున్నారు. ఇక్కడ రసాయనశాస్త్రం బోధిస్తున్న ప్రభుత్వ పాఠ్యపుస్తక రచయిత ముప్పన ఈశ్వరరావు వారిని దిట్టలుగా మార్చేందుకు చేస్తున్న కృషి ఉత్తమ ఫలితమిస్తోంది. రసాయన సమ్మేళన సదస్సుల్లో డిగ్రీ స్థాయి అంశాలకు సంబంధించి ప్రశ్నలడిగినా క్షణాల్లో సమాధానమిస్తున్నారు. వెయ్యికి పైగా సాంకేతికాలు తడబాటు లేకుండా బోర్డుపై రాసి అభినందనలు అందుకుంటున్నారు.

రసాయన సమ్మేళన సదస్సులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రంలో మొదటిసారి..

ఏడో తరగతిలో మా అబ్బాయి మోహిత్ నేర్చిన అనుభవంతో కొందరు విద్యార్థులను ఎంపిక చేసి రసాయన శాస్త్రంలో వివిధ అంశాలపై సాధన చేయించా. ఆరుగురు విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపుతున్నారు. మరికొందరు సాధన చేస్తున్నారు. రసాయనశాస్త్రం ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సదస్సుల్లో వెయ్యికి పైగా సాంకేతికాలు రాశారు. రాష్ట్రంలో ఇలాంటి కార్యక్రమం ఇక్కడే తొలిసారి నిర్వహించాం. రసాయనశాస్త్రంపై పట్టు సాధిస్తే ఉన్నత భవితకు మార్గం సులభమవుతుందనే ఉద్దేశంతోనే పిల్లల్ని ప్రోత్సహిస్తున్నాం. – ముప్పన ఈశ్వరరావు, రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సోంపేట

8 నెలల్లో పట్టు

ప్రతిభ చూపుతున్న విద్యార్థులందరూ పేద కుటుంబాలకు చెందిన వారే. ఆరో తరగతిలో ఎనిమిది నెలల్లో నిరంతర సాధన, పట్టుదలతో రసాయనశాస్త్రంపై పట్టు సాధించారు. ఆమ్లాలు, క్షారాలు, మూలకాల అణువులు, సంయోగ పదార్థాల సాంకేతికాలు, రసాయన చర్యలను తడబాటు లేకుండా రాస్తున్నారు.

● హైడ్రోక్లోరిక్, సల్ఫ్యూరిక్, నైట్రిక్, ఎసిటిక్ సల్ఫ్యూరిక్ ఆమ్లాలు, అమోనియం, కాల్షియం, పొటాషియం, సోడియం, మెగ్నీషియం హైడ్రాక్సైడ్ వంటి క్షారాలు, హైడ్రోక్లోరికామ్లం, నత్రికామ్లం, సల్ఫ్యూరికామ్లం, సోడియం సల్ఫేట్ వంటి సంయోగ పదార్థాల సాంకేతికాలను అలవోకగా వివరిస్తున్నారు.

నేడు విశాఖకు ప్రత్యేక రైలు
అన్నీ జనరల్ బోగీలే

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని హౌవ్‌డా నుంచి విశాఖపట్నం వరకు ప్రత్యేక సాధారణ రైలును నడుపుతున్నారు. హౌవ్‌డాలో ఆదివారం రాత్రి 11.55కి బయలుదేరి, ఖరగ్‌పూర్, బాలేశ్వర్, జాజ్‌పూర్ కె.రోడ్, కటక్, భువనేశ్వర్, ఖుర్దారోడ్, బలుగాన్, బ్రహ్మపుర మీదుగా ఇచ్ఛాపురానికి సోమవారం ఉదయం 9.25కి చేరుకుంటుంది. రెండు నిమిషాల హాల్ట్ అనంతరం సోంపేట (9.48), పలాస (11.10), నౌపడ (11.53), శ్రీకాకుళం రోడ్ (12.40), విజయనగరం (మధ్యాహ్నం 1.50) నుంచి విశాఖపట్నానికి 3.45కు చేరుకుంటుంది. ఇది 03017 నంబరుతో ఒకవైపునే, ఒకసారి మాత్రమే ఉంటుందని డీఆర్‌యూసీసీ సభ్యుడు కె.సూర్యప్రకాశరావు తెలిపారు. అన్నీ జనరల్ బోగీలే అని, రిజర్వేషన్ అవసరం లేదని, ప్రయాణికులు ఈ రైలును వినియోగించుకోవాలని కోరారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులే కీలకం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులే కీలకమని.. అపరిష్కృత ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రూ.50 వేల కోట్లు కేటాయించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజయ్‌శర్మ, రచయిత అట్టాడ అప్పలనాయుడు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో కార్పొరేట్లకు వందల ఎకరాలు కట్టబెడుతున్నారని.. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే కార్పొరేట్లకు దోచిపెట్టడానికా అని విమర్శించారు. వద్దని చెబుతున్నా కొవ్వాడలో అణు విద్యుత్తు కేంద్రం ఏర్పాటు చేయాలనుకోవడం తగదని స్పష్టం చేశారు. మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాస్, ప్రజా సంఘాల ప్రతినిధులు జి.గిరి, గోవర్ధనరావు, కృష్ణారావు, సుధాకర్, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించరూ..

కలెక్టరేట్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రవి, బి.వెంకటేశ్వర్లు కోరారు. శ్రీకాకుళం నగర పరిధి విశాఖ ఏ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని, మెమో 57 అమలు చేయాలని..ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ ప్రతినిధులు ఆర్‌వీ అనంతాచార్యులు, కృష్ణారావు, గిరిరాజు, ఆనందరావు పాపారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గొండు శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

క్యాప్కో రాష్ట్ర కో-ఛైర్మన్‌గా రామ్మోహనరావు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది బగాది రామ్మోహనరావు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాప్కో) కో-ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో భాగంగా ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు.

రేఖా నెం.09/2026, తేది 01-03-2026

గ్రామ పంచాయతీ కార్యాలయం, సోంపేట

పత్రికా ప్రకటన

తే 10-03-2026 ది మంగళవారం ఉదయం 11.00 గం॥లకు సోంపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో 2026-2027 ఆర్థిక సంవత్సరానికి రోజువారి మార్కెట్టు, బస్సు & కారు స్టాండు, కమేళ, సులభ కాంప్లెక్స్ ఆశీళ్లు వసూళ్లు చేయు గుత్త హక్కు మద్దతు ధర పొందడానికి వేలం పాటలను నిర్వహించబడును. గ్రామ పంచాయతీకి చెందిన 43 షాపులకు నెలవారి అద్దెను నిర్ణయించుటకు ఈ దిగువ షెడ్యూల్డ్ ప్రకారం వేలం పాటలను నిర్వహించబడును.

షెడ్యూల్ - I

S. No.	గ్రామ పంచాయతీ పేరు	వేలాం అంశం	మద్దతు ధర విలువ	చెల్లించవలసిన ధరావత్తు
1	సోంపేట	రోజువారి మార్కెట్	16,31,810-00	2.5 L
2	సోంపేట	బస్సు & కారు స్టాండ్	12,27,193-00	2.5 L
3	సోంపేట	సులభ కాంప్లెక్స్	69,300-00	15,000/-
4	సోంపేట	కమేళ	45,208-00	10,000/-
షెడ్యూల్ - II				
5	సోంపేట	మొత్తం 43 షాపులు		3 నెలలు కనీస అద్దె

వేలం పాటలో పాల్గొనవలసిన అభ్యర్థులు సాల్వెన్సీ ధ్రువపత్రం సమర్పించవలెను. ఈ దిగువ ఉదహరించిన నిబంధనలు పాటించవలెను.

1. వేలం పాటలో పాల్గొన్న అభ్యర్థి ఇంటి పన్ను రశీదు కల్గిన స్థానికుడు అయి ఉండవలెను.
2. లక్ష రూపాయలకు సాల్వెన్సీ ధ్రువపత్రం సమర్పించవలెను.
3. పాట పొందిన వ్యక్తి 1/4 వ వంతు వారం రోజులు లోపు చెల్లించవలెను. అలా చెల్లించని పక్షంలో తర్వాత హెచ్చు పాటదారుడికి కేటాయించబడును.
4. సకాలంలో కిస్తీ మొత్తంను 12 సమాన వాయిదాల్లో చెల్లించని పక్షంలో వేలం పాటలను రద్దు పరిచే అధికారం కార్యదర్శికి ఉంటుంది.

సం/-
ఎం. శాంతకుమారి
పంచాయతీ కార్యదర్శి
సోంపేట

దివ్యాంగులకు భరోసా..!

న్యూస్‌టుడే, పాతబస్టాండ్

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దివ్యాంగులకు పింఛన్ల పెంపు, ఉపకరణాల పంపిణీ ఇతర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. గతేడాది జిల్లావ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతులకు భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద సమకూర్చిన రూ.3 కోట్ల విలువైన 802 ఉపకరణాలు అందజేశారు. వీటిలో బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిళ్లు, కుర్చీలు వంటివి ఉన్నాయి. తాజాగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించడానికి అవకాశం కల్పించింది.

త్వరలో ఉపకరణాల పంపిణీ

● జిల్లాలో 30,453 మంది దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచారు. అర్హులకు సంవత్సరానికి 15 లీటర్ల పెట్రోలు కొనుగోలుకు 50 శాతం రాయితీ కూపన్లు దివ్యాంగుల సంక్షేమ శాఖ అందజేస్తోంది.

● ఉపకరణాలు అవసరమని apdascac.ap.gov.inలో దరఖాస్తు చేసున్న వారికి ల్యాప్‌ట్యాప్‌లు, చేతి కర్రలు, బ్రెయిలీ పుస్తకాలు, ప్లేయర్లు, మూడు చక్రాల వాహనాలు జిల్లా కార్యాలయానికి చేరాయి. ఈ నెలలో వీటిని లబ్ధిదారులకు అందించనున్నారు.

● సదరం ధ్రువపత్రాలకు సచివాలయంలో స్లాట్ నమోదు చేసుకుంటే సంబంధిత ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్ణయించిన రోజున పరీక్షిస్తారు. పత్రం జారీకి సిఫార్సు చేస్తారు

● జాతీయ ఉపకారవేతనాలకు విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు https://depwd.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చు. నైపుణ్య కేంద్రం ఆధ్వర్యంలో naipunyam.ap.gov.in లో ఉపాధి అవకాశాలకు నమోదు చేసుకుని పొందొచ్చు.

ఉచిత ప్రయాణం

40 శాతానికి పైగా వైకల్యం ఉన్న వారు 50 శాతం రాయితీపై ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించొచ్చు. ఇతర సర్వీసుల్లో యథావిధిగా 50 శాతం రాయితీ వర్తిస్తుంది.

సద్వినియోగం చేసుకోండి..

ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఉపకరణాలు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఏఏఐ సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా అవసరమైన వారికి మూడు చక్రాల, బ్యాటరీ వాహనాలు, స్టిక్‌లు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– బి.శైలజ, ఏడీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: జిల్లాలో డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష ఆదివారం 9 కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. 2026-27 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి (ఆంగ్ల మాధ్యమం)లో చేరడానికి 887 మంది దరఖాస్తు చేసుకోగా 756 మంది హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం (జనరల్, ఐఐటీ-నీట్) గ్రూపుల్లో ప్రవేశానికి 1,782 మంది హాజరయ్యారు. కంచిలి, తామరాపల్లి, నందిగాం, మందసలో గురుకులాలను రాష్ట్ర ప్రత్యేక పరిశీలకుడు ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

9 నుంచి ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పర్యటన

సారవకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి ఈ నెల 9 నుంచి 11 వరకు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పర్యటిస్తారని గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు చౌదరి లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని పలు మండలాలను సందర్శించి గిరిజనుల సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుల గుర్తింపు?

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగర పరిధి వాంబే కాలనీకి చెందిన మోహన్ హత్య కేసు దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఎచ్చెర్ల మండలం పొన్నాడ వద్ద వెంకన్నగారి మామిడి తోటలో ఇప్పటివరకు పోలీసులు సేకరించిన ఆధారాల మేరకు ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత సంబంధాలే ఈ ఘటనకు కారణమని తెలిసింది. ఇందులో ఎంత మంది ప్రమేయం ఉందన్న కోణంలో ఆరా తీస్తున్నారు. అతను బయటకు వెళ్లిన సమయంలో ఫోన్లో సంభాషించిన వ్యక్తుల కాల్ డేటా ఆధారంగా నిందితులను గుర్తించినట్లు సమాచారం.

వివిధ సంఘాలకు నాయకత్వం

హత్యకు గురైన మోహన్ హిజ్రాలకు విజయవాడ నుంచి భువనేశ్వర్ వరకు ఉన్న సంఘాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కుటుంబ పోషణకు వాంబే కాలనీ సమీపంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. ఆయన మృతిపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం తెలియగానే రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంఘాలకు నాయకత్వం వహిస్తున్న వారంతా శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్ రోడ్డులో శనివారం సమావేశమయ్యారు. ఆ తర్వాత మందస మండలం ముకుందపురం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. హయాతీనగరానికి చెందిన ఓ వ్యక్తితో మోహన్‌కు స్నేహం ఉంది. వారి మధ్య ఆర్థిక లావాదేవీలూ ఉన్నాయి. ఈ నెల 26న అతని నుంచి ఫోన్ రాగానే ఇంటి నుంచి బయటకు వెళ్లారని భార్య చెబుతున్నారు. ఈ కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాల మేరకు హత్య చేయడానికి ప్రధాన నిందితుడికి మరో ముగ్గురు సహకరించి ఉంటారని అనుమానిస్తున్నారు. వారి కోసం గాలిస్తున్నారు. ఈ కేసును డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో జేఆర్‌పురం సీఐ అవతారం దర్యాప్తు చేస్తున్నారు.

పెయింటర్ దుర్మరణం

శ్రీనివాసరావు (పాత చిత్రం)

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: తిలారు- నారాయణవలస మార్గంలో తుంబయ్యపేట వద్ద ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాండ్రాడ గ్రామానికి చెందిన కల్యాణం శ్రీనివాసరావు (48) నరసన్నపేట సమీపంలోని ఓ బీరువా కంపెనీలో పెయింటర్‌గా పనిచేస్తున్నారు. తండ్రి రామ్మూర్తితో కలిసి సారవకోట మండలం చీడిపూడిలో జరిగే ఓ కార్యక్రమానికి ఆదివారం బయలుదేరారు. తుంబయ్యపేట వద్ద బీసీ కాలనీ మలుపులో జరిగిన ప్రమాదంలో తలపై నుంచి ట్రాక్టర్ చక్రం వెళ్లిపోవడంతో శ్రీనివాసరావు దుర్మరణం చెందారు. రామ్మూర్తి క్షేమంగా బయటపడ్డారు. భార్య శారద, కుమారుడు షణ్ముఖరావు, కుమార్తె భవానీ ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ పేర్కొన్నారు.

పింఛను సొమ్ము చోరీపై కేసు నమోదు

కొత్తూరు, న్యూస్‌టుడే: వసప సచివాలయ పరిధిలో పింఛను సొమ్ము చోరీకి గురవడంపై సచివాలయ ఉద్యోగి కొల్లి సాయివరుణ్‌శంకర్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.వెంకటేశ్ తెలిపిన వివరాల మేరకు వసపలో జేఎల్‌ఎంగా పనిచేస్తున్న ఫిర్యాదుదారుడు రూ.1.56 లక్షల నగదు వెల్ఫేర్ అసిస్టెంట్ నుంచి తీసుకున్నారు. స్నేహితుడు ఎస్.చంటితో కలిసి నివగాం విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో శనివారం రాత్రి నిద్రించారు. తెల్లవారేసరికి నగదు ఉంచిన బ్యాగు కనిపించక పోవడంతో పోలీసులను సంప్రదించారు. కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. దీనిపై ఎంపీడీవో బీవీఆర్ ప్రసాదరావును వివరణ కోరగా.. పింఛన్ల పంపిణీ నిలిచిపోకుండా ఇతర ఉద్యోగుల వద్ద మిగిలిన సొమ్ముతో పది మందికి రూ.40 వేలు నగదు అందజేశామని, మిగతా వారికి సోమవారం డబ్బులు ఇస్తామని తెలిపారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

● జాతీయ రహదారిపై సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు

న్యూస్‌టుడే, నరసన్నపేట

జాతీయ రహదారిపై పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకు సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రయాణికుల ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల జాతీయ రహదారి భద్రతపై ‘ఈనాడు’లో కథనాలు ప్రచురితమయ్యాయి. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పలుమార్లు పార్లమెంటులో వీటి గురించి ప్రస్తావించారు. విశాఖపట్నం నుంచి నరసన్నపేట మండలం తామరాపల్లి వరకు ఆరు వరుసల రోడ్డు విస్తరణ పూర్తయింది. అనివార్య కారణాల వల్ల రణస్థలం వద్ద పనులు నిలిచిపోగా, తాజాగా పునఃప్రారంభమయ్యాయి. తామరాపల్లి నుంచి ఇచ్ఛాపురం వరకు నాలుగు నుంచి ఆరు వరుసలుగా విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

అధికారుల పరిశీలన

జాతీయ రహదారుల శాఖ ఇంజినీర్లు, ర.భ.శాఖ అధికారులు, పోలీసులు సంయుక్తంగా పైడిభీమవరం నుంచి టెక్కలి వరకు తొలివిడతగా ఇటీవల సంయుక్తంగా పరిశీలించారు. పలు గ్రామాల వద్ద ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రమాదాలకు కారణాలు వంటి వాటిపై అధికారుల బృందం సమీక్షించింది. మడపాం టోల్‌ప్లాజా వద్ద వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలపడంతో సమస్యలు ఎదురవుతున్నట్లు గుర్తించారు. ఇక్కడ వాహనాలు నిలపకుండా ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు నిర్ణయించారు. ప్రధాన కూడళ్లలో విద్యుద్దీపాలు లేకపోవడంతో ఇక్కట్లు ఎదురవుతున్నట్లు పేర్కొన్నారు. తామరాపల్లి, జిల్లేడువలస, జడూరు, జర్జంగి, కోటబొమ్మాళి, టెక్కలి ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు స్పష్టం చేశారు. బృందంలో టెక్కలి, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం ఎంవీఐలు సంజీవరావు, గంగాధరరావు, గోవిందరాజుతో పాటు ఎన్‌హెచ్ ఇంజినీర్ మహేశ్, టెక్కలి సీఐ విజయ్‌కుమార్, ఎస్సైలు ఉన్నారు.



మడపాం టోల్‌ప్లాజా వద్ద నిలిపిన లారీలు

పేలుడు సామగ్రి స్వాధీనం

సింగుపురం(శ్రీకాకుళం గ్రామీణం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని ఓ భవనంలో ఆదివారం రాత్రి పోలీసులు పేలుడు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఐదు పెట్టెల్లో ద్రావణ రసాయనాలు, 15 బాక్సుల్లో ఆర్డినరీ డిటోనేటర్లు, ఐదు కట్టల ఫ్యూజ్ వైర్లు, మీటరు పొడవున్న కొండ వత్తులను గుర్తించారు. సమీపంలోని కొండల్లో రాళ్లు పేల్చడానికి అదే గ్రామానికి చెందిన వంజరాపు రామారావు నిల్వ చేసినట్లు ఎస్సై కె.రాము తెలిపారు. వీటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని అంచనా వేశారు. సామగ్రిని ప్రభుత్వ అనుమతి పొందిన మ్యాగజైన్‌కు ఆటోలో తరలించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

EENADU Classifieds

REAL ESTATE

HOUSE FOR SALE

శ్రీకాకుళం టౌన్ మండల వీధిలో 14x45 సైజు గల ఖాళీ స్థలం 14x45 సైజు గల పాత ఇల్లు అమ్మకానికి కలవు సంప్రదించగలరు. ✆ 9063303336

TO LET

COMMERCIAL

శ్రీకాకుళం పెద్దపాడు రోడ్ LG షోరూమ్ ప్రక్కన గ్రౌండ్‌ఫ్లోర్‌లో 25x45, 1st ఫ్లోర్‌లో 12x30 షాపులు అద్దెకు ఇవ్వబడును. ✆ 9177910564.

JOBS

ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు మండలానికి ఒక అధికారి కావలెను. జీతం రూ: 20,000/- Cell: 9494684846

శ్రీకాకుళం జిల్లాలో ఎయిర్ కండిషనర్ ఇన్‌స్టాలేషన్ రిపేర్స్ ఎలక్ట్రికల్, ప్లంబింగ్ కొరకు సీనియర్ / జూనియర్ హెల్పర్స్ కావలెను. ✆ 9440049123.

విజయవాడ ప్రముఖ హోటల్‌లో పనిచేయుటకు హౌస్‌కీపింగ్ బాయ్స్-4, స్టీవార్డ్-2 ఆల్‌రౌండర్ మాస్టర్ అనుభవంకలవారు సంప్ర॥ 9398783987.

బుక్ డిస్ట్రిబ్యూటర్స్ కొరకు నో పెట్టుబడి మీ ఏరియాలో ప్రైవేట్ స్కూల్స్ పరిచయం & అనుభవమున్న వారికి ప్రాధాన్యత. ఉమా పబ్లిషర్స్, Guntur. ✆ 98493 70729.

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే, బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత:10th-డిగ్రీ. Age:16-25. శిక్షణ 3నెలలు శిక్షణతోపాటు హాస్టల్ ఉచితం 10th, ఇంటర్, డిగ్రీ డిస్టెన్స్ కోర్సులు కలవు.* ముందుగా ఎటువంటి ఫీజులేదు * క్రిస్టియన్ డిఫెన్స్ అకాడమీ, వైజాగ్. 9121232328.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

స్కేటింగ్ పోటీలు ప్రారంభం

పలాసలో గోపీచంద్ రోలార్ స్కేటింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి ఇంటర్‌క్లబ్ స్కేటింగ్ పోటీలను పుర కమిషనర్ ఇ.శ్రీనివాసులు ప్రారంభించారు. ఇందులో జిల్లాలోని వివిధ క్లబ్‌ల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నామని రాష్ట్ర స్కేటింగ్ సంఘ సాంకేతిక కమిటీ సభ్యురాలు బి.చంద్రావతి తెలిపారు. జిల్లా స్పీడ్ స్కేటింగ్ సంఘ కార్యదర్శి షణ్ముఖ, ధ్యాన్‌చంద్ స్పీడ్ స్కేటర్స్ క్లబ్ నిర్వాహకుడు వి.ప్రవీణ్, శిక్షకుడు జె.గోపాలకృష్ణ, తల్లిదండ్రులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస క్రీడలు

తెరపై ఈనాడు

పలాసలో.. ఎస్వీ మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు హరిశంకర్: హే బల్‌వంత్, భాస్కరరామ: విష్ణు విన్యాసం **ఇచ్ఛాపురంలో..** మణికంఠ ఎల్ మ్యాక్స్: విష్ణు విన్యాసం, పూర్ణ: మన శంకర వరప్రసాద్ గారు **సోంపేటలో..** ఎస్ఎస్‌మ్యాక్స్: సన్ ఆఫ్, శివ: హే బల్‌వంత్ – న్యూస్‌టుడే, పలాస, కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, సోంపేట

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)
8008574279
9063144707

సమస్య: దాసన్నపేట కూడలిలో చెరువు మార్గం ఆక్రమణకు గురవుతోంది.
- వి.నాగేశ్వరరావు, ఇచ్ఛాపురం

సమాధానం: పరిశీలించి, ఆక్రమణలు తొలగిస్తాం. **- ఎన్.రమేష్, పురపాలక సంఘ కమిషనర్, ఇచ్ఛాపురం** – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

? పలాస మండలం మోదుగులపుట్టి ప్రధాన వీధిలో మూడు దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. **- స్థానికులు**

★ పరిశీలించి, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.
- రవి, పంచాయతీ అభివృద్ధి అధికారి, టెక్కలిపట్నం – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పలాస, ఇచ్ఛాపురం పుర కమిషనర్లు ఇ.శ్రీనివాసులు, నల్లి రమేష్‌తో **ముఖాముఖి**

– న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం

పురపాలక సంఘాల్లో వేసవిలో నీటిఎద్దడి రాకుండా ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం పుర కమిషనర్లు ఇ.శ్రీనివాసులు, నల్లి రమేష్ తెలిపారు. 'సిబ్బంది కొరత వాస్తవమే.. సచివాలయాల్లోనూ ఆ పరిస్థితే ఉంది. అయినా సమష్టిగా అన్ని వ్యవహారాలను సవ్యంగా సాగిస్తున్నాం. సిబ్బంది చక్కగా సహకరిస్తున్నార'ని పేర్కొన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, సచివాలయాల పనితీరు తదితర అంశాలపై కమిషనర్లు 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ఇ.శ్రీనివాసులు

ఎన్.రమేష్

ప్రశ్నలు

1) వేసవిలో నీటిఎద్దడి అధికంగా ఉంటుంది. ఇబ్బందులు లేకుండా ఏం చేస్తున్నారు?
2) సిబ్బంది కొరత ఉందా?
3) పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటోంది. అతిసారం వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. తీసుకుంటున్న చర్యలేంటి?
4) సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. క్షేత్రస్థాయి పర్యటనల పేరిట కార్యాలయాల్లో కానరాని పరిస్థితి ఉంటోంది. పరిష్కార మార్గాలేంటి?
5) పట్టణం అభివృద్ధి చెందుతోంది. శివారు ప్రాంతాల్లో భవన నిర్మాణాలు వెలుస్తున్నా మౌలిక సదుపాయాల కల్పనలో వెనకబడి పోతున్నాం. మీరేమంటారు?

ఇ.శ్రీనివాసులు:

1) పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో ఏటా వేసవిలో నీటిఎద్దడి ఉంటుందనే విషయాన్ని గుర్తించా. ఇప్పటికే సింధూర జలసిరి, చేతి పంపులు, పవర్ బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాం. తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం.

2) సచివాలయ వ్యవస్థ వచ్చాక నూతన ఉద్యోగుల నియామకం లేదు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణతోపాటు పురపాలక సేవలు సచివాలయాల సిబ్బందితోనే నడిపిస్తున్నాం. సిబ్బంది కొరతపై ప్రధానంగా పారిశుద్ధ్య ఉద్యోగుల కోసం ఎమ్మెల్యే శిరీషతోపాటు పురపాలక శాఖ అధికారులకు విన్నవించాం.

3) ప్రధాన రహదారులపై పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక దృష్టి పెట్టాం. రాత్రివేళ కేటీ రోడ్డులో దుకాణాల నుంచి నేరుగా చెత్త సేకరించి తరలించే కార్యక్రమం చేపడుతున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం కాలువల్లో పైపులైను ఉండే చోట లీకులు లేకుండా చర్యలు చేపడతాం. క్లోరినేషన్ చేసి నీటిని విడుదల చేస్తున్నాం.

4) సచివాలయాల్లో సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలి. ప్రతి దగ్గర డిజిటల్ సహాయకులు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకున్నాం. ఎక్కడైనా ఇబ్బంది తలెత్తితే కమిషనర్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందించొచ్చు.

5) పట్టణ పరిధి పెరిగింది. పురపాలక చట్ట ప్రకారం అనుమతులు తీసుకోకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో రహదారులు, కాలువలు, వీధి దీపాల ఏర్పాటుకు స్థలం ఉండటం లేదు. దీంతో మౌలిక సదుపాయాల కల్పనకు ఇబ్బంది పడుతున్నాం.

ఎన్.రమేష్:

1) నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకున్నాం. కుళాయిలకు నది నీరు కాకుండా జల్‌జీవన్ పథకం నీటిని సేకరించి, సరఫరా చేస్తున్నాం. వేసవిలో రెండు రోజులకు ఒకసారి నీరు అందించగలం. ఇంకా నీటి ఎద్దడి ఎక్కడైనా ఉంటే, రెండు అద్దె ట్యాంకర్లతో నీరందిస్తాం. బోర్లు అన్నీ పరిశీలించాం. బావుల్లో క్లోరినేషన్ జరిపిస్తున్నాం. కుళాయి నీటిని తరచూ పరీక్షిస్తున్నాం. ఈ పనులను ఏఈ కిశోర్ పర్యవేక్షిస్తున్నారు.

2) పుర కార్యాలయంలో సాధారణ పనులు, ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, రెవెన్యూ తదితర విభాగాల్లో 84 మందికి 34 మంది సిబ్బందే ఉన్నారు. పనుల నిర్వహణ ఇబ్బందే అయినా, ఉన్న సిబ్బంది చక్కగా సహకారం అందివ్వడంతో పనులు జరిపిస్తున్నాం. ఉద్యోగుల నియామకానికి కౌన్సిల్ ద్వారా ఉన్నతాధికారులకు లేఖ పంపించాం.

3) ప్రాంతాల వారీగా పారిశుద్ధ్యం పనులు చేయించి, సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు చేరవేస్తున్నాం. ఇచ్ఛాపురం, రత్తకన్నల్లో ఉన్న మంచినీటి రిజర్వాయర్లను నిబంధనల మేరకు శుభ్రం చేయిస్తున్నాం. కాలువల్లో గొట్టాల అమరిక చాలా ఏళ్ల కిందట అప్పటి జనాభా, నివాసాలకు అనుగుణంగా జరిపారు. కొత్త పైపులు అమర్చి, సమస్య రాకుండా చర్యలు చేపడతాం.

4) సచివాలయాల్లో సిబ్బంది కొరత పీడిస్తోంది. 10 వార్డు సచివాలయాలకు 100 మంది సిబ్బంది అవసరం కాగా 55 మందే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరే అదనపు బాధ్యతలు నిర్వహించడంతో ఎవరికీ ఇబ్బంది లేదు. విధి నిర్వహణ మేరకు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తుంటారు. ఆ సందర్భంలో ఒక్కరైనా సచివాలయంలో ఉండేలా ఆదేశించాం.

5) శివారు ప్రాంతాల అభివృద్ధికి రెండేళ్లుగా కార్యాచరణ అమలు చేస్తున్నాం. కొంత మేరకు సీసీ రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, బోర్లు ఏర్పాటు తదితర పనులు చేపట్టాం. 15వ ఆర్థిక సంఘం నిధులతో శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రతిపాదించాం.

సమస్యను పరిష్కరించారు

స్పందనకు వందనం

ఇచ్ఛాపురం పట్టణంలో రహదారుల్లో వాహనాలు నిలుపుతున్న వారిని పోలీసులు హెచ్చరించారు. ఈ సమస్యపై ప్రజలు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా నివేదించగా సీఐ చిన్నంనాయుడు స్పందించి, ఎస్సై ముకుందరావు ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

బోరు బాగైంది

ఇచ్ఛాపురం రాజావారి మైదానంలో గొట్టపు బావికి పుర సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఈ సమస్యపై గత సోమవారం 'బోరు.. ఇదేం తీరు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి పుర కమిషనర్ నల్లి రమేష్ స్పందించారు. పుర ఏఈ కిశోర్ ఆధ్వర్యంలో సదరు బోరుకు మరమ్మతు చేయించారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

వంతెనలు ఊగుతున్నాయ్

మందస నుంచి హరిపురం వెళ్లే రహదారిలో మూడు చోట్ల గెడ్డలపై పురాతన వంతెనలు ఉన్నాయి. భారీ వాహనాలు దాటేటప్పుడు అవి ఊగుతున్నాయి. రెండు వైపులా రెయిలింగ్ పాడైంది. ఎదురెదురుగా వాహనాలు వస్తే ఒకటి అవతల వైపు ఆగిపోతేనే వెళ్లిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ ప్రతిపాదనలు పంపించామని, నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ జేఈ విక్రమ్ తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

నిర్లక్ష్యం పెరుగుతోంది..

ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనంపై రావిచెట్టు పెరుగుతోంది. గతంలో సురంగి రాజా వారు నివాసం కోసం రాతితో నిర్మించుకున్న భవనం ఇది. సుమారు 140 ఏళ్ల క్రితం ఉన్నత పాఠశాల నిర్వహణకు వదిలిపెట్టారు. ప్రస్తుతం జూనియర్ కళాశాల అదనపు నిర్వహిస్తున్నారు. మొక్కలు తొలగించి, చర్యలు చేపట్టాలని పూర్వవిద్యార్థులు, పెద్దలు కోరుతున్నారు. నిధుల మేరకు నిర్వహణ పనులు చేపడతామని ప్రిన్సిపల్ శరత్‌బాబు తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మట్టి దారి.. మారదా మరి

అరకభద్రకు వెళ్లే మట్టి రహదారి పనికిరాని మొక్కలతో మూసుకుపోతోంది. మరో వైపు గుంతలతో అవస్థలు తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ ఏఈ ధనంజయను వివరణ కోరగా త్వరలోనే నూతన రోడ్డు నిర్మాణం చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

శిథిలం.. నిరుపయోగం

కవిటి మండలం కపాసుకుద్దిలో గతంలో నిర్మించిన సేంద్రియ ఎరువుల తొట్టి శిథిలావస్థకు చేరి వృథాగా మారింది. గ్రామ సమీపంలో నిర్మించిన తొట్టిల్లో గతంలో చెత్తను వేసేవారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై ఏపీవో మోహనరావును వివరణ కోరగా పరిశీలించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

గొయ్యి తవ్వారు.. పనులు ఆపారు

హంసరాలి పంచాయతీ బూరుసాయి వద్ద జల్‌జీవన్ పనుల్లో భాగంగా ట్యాంకు నిర్మాణానికి గొయ్యి తవ్వారు. రెండు నెలలు కావస్తున్నా పనులు చేపట్టడం లేదు. రహదారి పక్కన గొయ్యి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుత్తేదారుపై ఒత్తిడి తెచ్చి పనులు కొనసాగేలా ఉన్నతాధికారులను కోరుతామని సర్పంచి జగదీష్ తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)

ట్రాఫిక్ మళ్లింపు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: బెజ్జిపుట్టుగలో చక్రధర పెరుమాళ్ స్వామి ఉత్సవాలు సోమవారం ముగియనున్నాయి. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో సీఐ ఎం.చిన్నంనాయుడు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. సోంపేట నుంచి కవిటి వైపు వచ్చే బస్సులు, భారీ వాహనాలు బొరివంక నుంచి ఇద్దివానిపాలెం రోడ్డులో కవిటి చేరుకోవాలని సూచించారు. కవిటి నుంచి సోంపేట వైపు వెళ్లే వాహనాలు కవిటి చింతామణి ఆలయ మార్గంలో ఇద్దివానిపాలెం మీదుగా బొరివంక చేరుకుని అక్కడ నుంచి సోంపేట చేరుకోవాలని కోరారు.

కనుల పండువగా పుష్పయాగం

స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: బెజ్జిపుట్టుగలోని చక్రధర పెరుమాళ్ స్వామి ఆలయంలో డోలోత్సవాలు, చతుర్థ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సింహాచలం ఆగమ పాఠశాల వేద పండితులు ముప్పిరాల నారాయణమూర్తి శిష్య బృందంతో చక్రస్నానం, ధ్వజారోహణం, మహాపూర్ణాహుతి, మహానివేదన, మంగళశాసన కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం పుష్పయాగం, ఊంజలసేవ, ద్వాదశారాధన, రుత్విక్ సన్మానం, ఉత్సవ విసర్జన, నీరాజనం వైభవోపేతంగా జరిగాయి. కృష్ణారావు, రాంబాబు, విజయకృష్ణ పాల్గొన్నారు.

ఊంజల్ సేవ నిర్వహిస్తున్న పండితులు

నువ్వలరేవులో అన్న సమారాధన

నువ్వలరేవులో ఆదివారం భారీ ఎత్తున అన్న సమారాధన ఏర్పాటు చేశారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో గత నెల 26న ఠాకురాణి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకగా నిర్వహించారు. నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహణతో పండగ వాతావరణం నెలకొంది. ఈ మహోత్సవాల్లో భాగంగా భోజనాలు ఏర్పాటు చేయగా దాదాపు 10 వేల మంది పాల్గొన్నారు. గ్రామ ప్రధాన ముఖద్వారం నుంచి బృందావతి ఆలయం వరకు రహదారి పొడవునా ఇరువైపులా కూర్చొని భోజనాలు చేశారు. 15 యువ బృందాలు వడ్డించాయి. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

కవిటి, న్యూస్‌టుడే: పాత కొజ్జిరియాలో యువత ఆధ్వర్యంలో ఎల్‌వీఎస్ మెమోరియల్ మెగా క్రికెట్ పోటీల్లో రెండో రౌండ్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం బల్లిపుట్టుగ, రఘునాథపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రఘునాథపురం విజయం సాధించింది.

నారీశక్తిపై అవగాహన

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై నరసింహమూర్తి కోరారు. తర్లాకోటలో ఆదివారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారీశక్తి, సైబర్ నేరాలు, సంకల్పం, మహిళలపై నేరాలు, బాల్య వివాహాలు మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. అందరూ శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సేవల స్థాయి పెంచితేనే ప్రయోజనం

రోగులను పరామర్శిస్తున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

పలాస, న్యూస్‌టుడే: కిడ్నీ ఆసుపత్రిలో సేవల స్థాయి పెంచితేనే ప్రయోజనం చేకూరుతుందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ అన్నారు. కాశీబుగ్గలో కిడ్నీ ఆసుపత్రిని ఆదివారం పరిశీలించారు. రూ.కోట్ల నిధులతో నిర్మించిన ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది లేకపోతే వైద్యసేవలు పూర్తిస్థాయిలో ఎలా అందుతాయని ప్రశ్నించారు. 59 మంది వైద్యులు ఉండాల్సిన దగ్గర 18 మందే ఉండటం సరికాదన్నారు. రోగుల సహాయకులకు భోజనం పెట్టాలని, అంబులెన్స్ వినియోగంలోకి తీసుకుని రావాలని, బస్ పాయింట్ నుంచి ఆసుపత్రి వరకు విద్యుత్తు లేదా బ్యాటరీ వాహనం అందుబాటులోకి తీసుకురావాలని వైద్యులకు విన్నవించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఉత్తరాంధ్ర వేదిక నాయకులు పి.ధర్మారావు, కె.మణికుమార్, సీఐటీయూ నాయకుడు ఎన్.గణపతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

పలాస, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు అండగా నిలుస్తోందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఓ ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, చిరుద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు సార్లు జీతాలు పెంచిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. అంగన్‌వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో ఇప్పటికే తొమ్మిదింటిని అంగీకరించి పరిష్కరించినట్లు పేర్కొన్నారు. వేతనాల పెంపు అంశంపై ప్రభుత్వం కృషి చేస్తోందని, ఉద్యోగులు ఆందోళన చెందొద్దన్నారు.

ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ విజేత కుసుంపురం



కొండిపుట్టుగ ప్రాథమిక పాఠశాలలో శ్యామలమ్మ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీల్లో కుసుంపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానం సాధించారు. ఇందులో మూడు జిల్లాల నుంచి 120 జట్లు పాల్గొనగా వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట, ఆమదాలవలస మండలం పి.ఎం.టి.వాడ, కవిటి మండలం కొండిపుట్టుగ, నర్తుపుట్టుగ పాఠశాలలు తరవాతి స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఎంఈవో ధనంజయ, కంచిలి ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఎన్.సోమేశ్వరరావు, బెలగాం కాంప్లెక్స్ ఛైర్మన్ కె.ఈశ్వర్ ఆచారి, ఎంపీటీసీ సభ్యుడు నర్తు కర్రయ్య, ఎస్ఎంసీ ఛైర్మన్ పుష్పలత, సర్పంచి ప్రతినిధి కోదండరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ఎట్టకేలకు మోక్షం

ఎమ్మెల్యే శిరీష చొరవతో నిధుల మంజూరుకు చర్యలు

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

గ్రామీణ ప్రాంతాల పురోగతికి మండల పరిషత్తు అభివృద్ధి కార్యాలయం ఎంతో కీలకం. కానీ వజ్రపుకొత్తూరు మండలంలో ఆ కార్యాలయమే సమస్యగా మారింది. గత తెదేపా ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టగా చివరి దశ పనులతో నిలిచిపోయాయి. అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో పనులు పూర్తి కాలేదు. దీంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. ప్రస్తుతం శిథిల కార్యాలయాన్ని మరమ్మతులు చేసుకుంటూ వినియోగిస్తున్నారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురించగా.. ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అమరావతిలో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజను కలిసి పనుల పూర్తికి నిధుల మంజూరు చేయాలని విన్నవించారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా వదిలేసిన ఎంపీడీవో కార్యాలయ భవనం

పనుల పూర్తికి చర్యలు

వైకాపా ప్రభుత్వం కనీస స్థాయి అభివృద్ధి పనులు చేపట్టకుండా తప్పుడు ప్రచారాలతోనే గడిపేశారు. గుత్తేదారులకు బిల్లులు కూడా చెల్లించకుండా కాలయాపన చేశారు. అందుకే ఎన్నికల సమయంలో చెప్పినా, చెప్పకపోయినా నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న ప్రతి అభివృద్ధి పని పూర్తి చేస్తున్నాం. ఇందులో భాగంగా వజ్రపుకొత్తూరు ఎంపీడీవో కార్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే రాష్ట్ర పీఆర్ కమిషనర్ కృష్ణతేజ దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేస్తామన్నారు. కొద్ది రోజుల్లో నిర్మాణ పనులు మొదలవుతాయి.
– గౌతు శిరీష, ఎమ్మెల్యే, పలాస

వినియోగంతోనే ప్రయోజనం

వజ్రపుకొత్తూరు ఎంపీడీవో కార్యాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించి దాదాపు తొమ్మిదేళ్లు కావస్తోంది. గత తెదేపా ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ 2017లో పంచాయతీరాజ్ నిధులు రూ.కోటితో శ్రీకారం చుట్టారు. సార్వత్రిక ఎన్నికల సమయానికి దాదాపు చివర దశకు చేరింది. అనంతరం వైకాపా పాలనలో కనీస పనులు చేపట్టలేదు. దీంతో పరిసరాలు పనికిరాని మొక్కలు పెరిగి విష కీటకాలకు నిలయంగా మారాయి.

★ పాత కార్యాలయంలో సైతం మౌలిక సదుపాయాలు లేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. దస్త్రాలు, పరికరాలకు భద్రత కరవైంది. ఈ సారైనా ఎమ్మెల్యే శిరీష కృషితో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తే ఎంతో ప్రయోజనం చేకూరనుంది.

రేషన్ సరకుల పంపిణీలో అవకతవకలు?

బొగాబెణి రేషన్ డీలర్ సరకుల పంపిణీలో అవకతవకలు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని సర్పంచి గనప సింహాచలం కోరారు. ఎంపీపీ పైల దేవదాసురెడ్డి అధ్యక్షతన ఆదివారం కంచిలి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రేషన్ సరకుల విషయమై సీఎస్‌డీటీ కూర్మారావు మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. గోనె సంచులు, రవాణా ఛార్జీలు, కళాసీల ఖర్చులు ఖరీఫ్‌నకు సంబంధించి నేటి వరకు రైతుల ఖాతాలో జమ కాలేదని ఎంపీపీతోపాటు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ప్రశ్నించారు. ఏవో సురేష్ మాట్లాడుతూ త్వరలోనే జమవుతాయన్నారు. ఎంపీడీవో తిరుమల రావు, తహసీల్దార్ రమేష్, పశు వైద్యురాలు శిరీష పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి/గ్రామీణం

సౌండ్ సిస్టమ్ వితరణ

కవిటి గ్రామీణం: బెజ్జిపుట్టుగలోని చక్రధర పెరుమాళ్ స్వామి ఆలయానికి కవిటికి చెందిన పాండవ రామారావు రూ.75 వేలు విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను ఆదివారం ఆలయ కమిటీకి అందజేశారు. ఇరు గ్రామాల పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈదుపురం గ్రామానికి చెందిన ఉప్పాడ తాతాలు ఇల్లు ఇటీవల కాలిపోయింది. సర్వం కోల్పోయిన ఆ కుటుంబానికి ఆదివారం అదే పంచాయతీకి చెందిన డిఫెన్స్ సర్వీసు అసోసియేషన్ రూ.15వేలు సాయం అందజేసింది. అంబటి ఈశ్వరరావు, ఉప్పాడ జ్యోతి, దువ్వ నారాయణ, జి.జగన్నాథం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రోడ్డు నిర్మాణం

ఇన్నేసుపేటకు చెందిన యువత స్థానిక గ్రామ దేవత దుర్గమ్మ ఆలయానికి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు సొంతంగా విరాళాలు సేకరించి ఆదివారం రూ.7 లక్షలతో సుమారు 380 అడుగుల రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. జగన్నాథం, కూర్మారావు, పరశురాం, గణపతి, చిరంజీవి, రుద్రయ్య, పురుషోత్తం, మోహనరావు, దేవదాసు, సూరినారాయణ, దామోదర్, ధర్మరాజు పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

జనసేన సభ్యత్వాలకు విరాళం

రవికుమార్‌కు చెక్కు అందిస్తున్న కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేష్

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వాలను ముమ్మరంగా చేపట్టేందుకు తన వంతుగా పార్టీకి రూ.లక్ష విరాళాన్ని అందిస్తున్నట్లు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ జిల్లా కార్యదర్శి లోళ్ల రాజేష్ తెలిపారు. ఈ మేరకు తనతోపాటు మరికొందరు సభ్యత్వాలు స్వీకరించేందుకు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయానికి ఆదివారం వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు బాధ్యులు, సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్‌కు చెక్కు అందించారు. నాయకులు కృష్ణయ్య, భాస్కరరావు, దాలయ్య, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆదివారం పలాస మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. సున్నాడలో అనారోగ్యంతో బాధపడుతున్న చింతాడ మాధవరావును కలిసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. కైజోలలో ఇటీవల మరణించిన బత్తిని భారతమ్మ, బంటుకొత్తూరులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎర్ర సదానందం కుటుంబ సభ్యులను పరామర్శించారు. దువ్వాడ రవి, బమ్మిడి దుర్యోధనరావు పాల్గొన్నారు.

ఇంటి పన్నులతోనే గ్రామాభివృద్ధి

పలాస గ్రామీణం: ఇంటి పన్నులతో గ్రామాల అభివృద్ధికి సాధ్యమని, వాటి వసూళ్లకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో వసంతకుమార్ కోరారు. లొద్దభద్ర, రాజగోపాలపురం, రెంటికోటలో డిప్యూటీ ఎంపీడీవో వైకుంఠరావుతో కలిసి ఇంటి పన్నుల వసూళ్లను పర్యవేక్షించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యదర్శులు సద్గుణ, మీనా, పద్మనాభం పాల్గొన్నారు.

గ్రంథాలయం పరిశీలన

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లోనూ మౌలిక వసతులు కల్పిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పీరికట్ల విఠల్ అన్నారు. పలాసలోని శాఖా గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. పాఠకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కాసేపు పత్రికలు చదివారు.

పలాస గ్రంథాలయంలో పత్రిక చదువుతున్న ఛైర్మన్ పీరికట్ల విఠల్, చిత్రంలో పాఠకులు

సాగునీటి వనరులపై సవతి ప్రేమ

హరిపురం (మందస), న్యూస్‌టుడే: సాగునీటి వనరుల అభివృద్ధిపై ప్రభుత్వాలు సవతి ప్రేమ చూపుతున్నాయని ఉత్తరాంధ్ర రైతు నాయకులు అజయ్‌శర్మ అన్నారు. మందస మండలం హరిపురంలో నియోజకవర్గ రైతు నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. అధికారంలోకి రాగానే సాగునీటి వనరులను ఆధునికీకరిస్తామని ఎన్నికల్లో హామీలు ఇస్తున్న రాజకీయ నాయకులు, ప్రభుత్వం ఏర్పాటు చేశాక ఆచరణలో పెట్టడం లేదని విమర్శించారు. జిల్లాలో నిర్లక్ష్యానికి గురైన జలాశయాల గురించి ప్రస్తావించారు. పేదల భూముల్లో కార్గో విమానాశ్రయం ఏర్పాటు సరికాదని, ప్రజాప్రతినిధులు పునరాలోచించాలని సూచించారు. రైతులను విస్మరించి కార్పొరేట్లకు కొమ్ముకాయడమేంటని మండిపడ్డారు. వంశధార సాధన సమితి అధ్యక్షుడు మార్పు మన్మథరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హేమారావు చౌదరి, దిలీప్‌కుమార్, సోమనాథం, హడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

– న్యూస్‌టుడే, పాతపట్నం

వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అప్పలనాయుడు అన్నారు. నది పరీవాహక, గిరిజన గ్రామాలతో పాటు రక్షిత, సమగ్ర రక్షిత తాగునీటి పథకాల పనితీరును వివరించారు. జలజీవన్ మిషన్ ద్వారా పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు చేసి, నిధుల కొరత లేకుండా చూస్తామని ఇలా పలు అంశాలను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో తెలియజేశారు.

ముఖాముఖి

అత్యవసర సమయాల్లో ట్యాంకర్లతో సరఫరా

'న్యూస్‌టుడే'తో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ అప్పలనాయుడు

మరమ్మతులకు చర్యలు

పాతపట్నం నియోజకవర్గంలో 1,683 నీటి పంపులున్నాయి. వీటిలో 34 మరమ్మతులకు గురయ్యాయి. ఆయా మండలాల పరిధిలో ఇద్దరు లేదా ముగ్గురు సిబ్బంది నిత్యం విధుల్లో ఉంటున్నారు. సమస్య తలెత్తిన వెంటనే బాగు చేసేందుకు మండల పరిషత్తు ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నాం.

తగ్గిన నిల్వలు

మహేంద్రతనయ నదిలో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. నది పరీవాహక ప్రాంతంలో వర్షాలు కురవక పోవడంతో అరకొరగా నీటి నిల్వలున్నాయి. పంచాయతీ ద్వారా నాలుగు బోర్లు వేసేందుకు ప్రతిపాదనలు చేశాం. అత్యవసర సమయాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తాం.

ఉద్దానం ప్రాజెక్టు ద్వారా నీరు

నియోజకవర్గంలో 51 సమగ్ర రక్షిత మంచినీటి పథకాలున్నాయి. ఇందులో హిరమండలం ప్రధాన సంప్ నుంచి హిరమండలం, పాతపట్నం మండలాలకు వెళ్లే పైప్‌లైన్ గతంలో రహదారి విస్తరణ పనుల్లో మరమ్మతులకు గురైంది. ఉద్దానం ప్రాజెక్టు పరిధిలో వేసిన పైప్‌లైన్ ద్వారా నీరందించేలా కృషి చేస్తాం.

రూ.115 కోట్లు వెనక్కి

జలజీవన్ మిషన్ ద్వారా పైప్‌లైన్లు, ట్యాప్‌లు, కుళాయిలు వేసేందుకు గతంలో రూ.115 కోట్ల నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వం మారిన తరువాత అవి వెనక్కి మళ్లాయి. నేటి వరకు ఆయా నిధులు విడుదల కాలేదు. జలజీవన్ ఐదు మండలాలకు సంబంధించి 512 పనులకు రూ.115.39 కోట్లు మంజూరు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశాం.

నిర్వహణ బాధ్యత పంచాయతీలదే: ఐదు మండలాల్లో 177 రక్షిత మంచి నీటి పథకాలున్నాయి. ఆయా పథకాల నిర్వహణ పంచాయతీలే చూసుకోవాలి. మరమ్మతులు, ఇతర పనులు స్థానిక పంచాయతీ సిబ్బందితో చేయిస్తాం.

కనీస వేతనాలు చెల్లించాలి

టెక్కలి, న్యూస్‌టుడే: మహిళా సమస్యలపై సంఘటితంగా పోరాడదామని సీఐటీయూ నాయకురాలు కె.నాగమణి పిలుపునిచ్చారు. ఆదివారం టెక్కలిలో సీఐటీయూ అనుబంధ సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘనాయకులు షణ్ముఖరావు, కుంతి, కమల పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా నాయకురాలు నాగమణి

బడి.. రక్షణ కొరవడి..!

పాతపట్నం నియోజకవర్గ వివరాలు			
మండలం	పాఠశాలలు	ప్రహరీలు లేనివి	విద్యార్థులు
కొత్తూరు	86	43	5,705
హిరమండలం	58	22	3,850
పాతపట్నం	84	45	5,748
ఎల్ఎన్‌పేట	48	19	3,150
మెళియాపుట్టి	107	60	6,136

– న్యూస్‌టుడే, కొత్తూరు, హిరమండలం

నాడు-నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామని పైకి చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. సదుపాయాల మాట పక్కన పెడితే విద్యార్థులకు కనీస రక్షణ కరవైంది. ప్రహరీలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులకు ఆనుకుని ఉన్న పాఠశాలల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పిల్లల్ని పంపిస్తున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అబల సింగి బడికి భవనమే లేకపోవడంతో పూరిపాకలో చదువులు సాగిస్తున్నారు.

★ హిరమండలంలోని లోకొండ, అక్కరాపల్లి, జిల్లేడుపేట, పెద్దగూడ, పిండ్రువాడ, పాసుపేట, రెల్లివలస కోట, రోటరీనగర్, స్కాట్‌పేట సుమంతాపురం, వలసపాడు గ్రామాల్లో పరిస్థితి ఇలాగే ఉంది.

పాత హిరమండలంలో రోడ్డు పక్కనే ప్రహరీ లేని ప్రాథమిక పాఠశాల

దశాబ్దాలుగా ఇక్కట్లు

కొత్తూరు మండలంలోని లబ్బ, దొండమానుగూడ, బాంద్రగూడ, గొట్టిపల్లి, చిన్నరాజపురం, తామరగూడ గిరిజన గ్రామాల్లోని పాఠశాలలకు రక్షణ గోడలు లేవు. సమీపంలో కొండలుండటంతో భయంభయంగా ప్రాంతాల్లోని విద్యాలయాలకు ప్రహరీలు లేక చిన్నారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

★ ఎల్ఎన్‌పేట మండలంలోని ఎస్కే బాలేరు, బసవరాజుపేట, బొడ్డువలస, చిట్టిమండలం, చొర్లంగి, గొట్టిపల్లి, జాడుపేట, జంబాడ, కరకవలస, మల్లికార్జునపురం, పెద్ద

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలు

రక్షణ గోడలు లేకపోవడంతో పాఠశాలలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. రాత్రి వేళల్లో మందుబాబులు మద్యం తాగి సీసాలు అక్కడే పడేస్తున్నారు. కొందరు మరుగుదొడ్లను ఉపయోగిస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నారు. కొన్ని బడుల్లోకి సెలవు రోజుల్లో పశువులను వదిలేస్తున్నారు. దీంతో మొక్కలు తినేస్తున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం: ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ప్రహరీలు లేని బడులను గుర్తించి, ఉన్నతాధికారులకు నివేదిస్తాం. నిర్మాణాలు చేపట్టి, విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటాం.

- విలియమ్, డిప్యూటీ డీఈవో, టెక్కలి

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

? నందిగాం మండలం శివరాంపురం పంచాయతీ భరణిగాం గ్రామం పెరటి వీధిలో కాలువల్లేక మురుగు నీరు రోడ్డుపై నిలిచిపోతోంది. దుర్వాసన, దోమలు బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. **- దట్టి మల్లేశ్వరరావు, స్థానికుడు** ● సమస్యను సర్పంచి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- జానకమ్మ, పంచాయతీ కార్యదర్శి, శివరాంపురం** – న్యూస్‌టుడే, నందిగాం

? కొత్తపేట విద్యుత్తు ఉపకేంద్రానికి ఎదురుగా ఉన్న ఇందిరమ్మ కాలనీలో విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులతో ఉపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయి. **- కాలనీవాసులు, కొత్తపేట** ● సిబ్బందికి తెలియజేసి, శాశ్వతంగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తాం. **- కోటేశ్వరరావు, ఏఈఈ, ఏపీఈపీడీసీఎల్** – న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

సమస్యల పరిష్కారానికి కృషి

హిరమండలం, న్యూస్‌టుడే: రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శిగా హిరమండలానికి చెందిన ఏవీ సురేష్ ఎన్నికయ్యారు. ఆదివారం అమరావతిలో రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ఎన్నిక జరిగినట్లు ఆయన చెప్పారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

గ్రహణం సందర్భంగా ఆలయాల మూసివేత

జలుమూరు, పాతపట్నం, న్యూస్‌టుడే: ఈనెల 3న చంద్ర గ్రహణం సందర్భంగా శైవక్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయాన్ని మూసి వేస్తున్నట్లు ఈవో ఏడుకొండలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రహణం విడిచాక క్షేత్రాన్ని శుద్ధి చేసి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ★ పాతపట్నంలోని శ్రీనీలమణిదుర్గ, వేంకటేశ్వరస్వామి, నీలకంఠేశ్వరస్వామి దేవాలయాలను మంగళవారం ఉదయం 11 గంటలకు మూసివేస్తున్నట్లు దేవాదాయ శాఖ కార్య నిర్వాహణాధికారి టి. వాసుదేవరావు పేర్కొన్నారు.

మురుగుమయం.. అవస్థలకు నిలయం

సారవకోట మండలం తొగిరి గ్రామంలోని బీటీ రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉంటోంది. ఇరువైపులా కాలువలున్నా రహదారి లోతట్టుగా మారడంతో చిన్నపాటి వర్షం కురిసినా రోజులు తరబడి నీరు నిలిచిపోతోందని ప్రయాణికులు వాపోతున్నారు. రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నామని, మార్గాన్ని ఎత్తుచేయాలని కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని ర.భ. శాఖ ఏఈ సరోజ పేర్కొన్నారు.

– సారవకోట, న్యూస్‌టుడే

సౌర పథకం.. అందని ఉదకం

నందిగాం మండలం బడగాం పంచాయతీ కాశీరాజుకాశీపురంలో ఉన్న సౌర రక్షిత మంచినీటి పథకం మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో నాలుగు నెలలు నుంచి తాగునీటికి ఇక్కట్లు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. వేసవి సమీపిస్తోందని, బాగు చేయించి అవస్థలు తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కురేష్ బెహరా స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, నందిగాం

వదిలేశారు.. వినియోగించరూ

కొత్తూరు మండలం ఉప్పరపేట గ్రామంలోని పాఠశాల పాత భవనం వృథాగా మిగిలి శిథిలావస్థకు చేరింది. కొంతమంది సొంత అవసరాలకు వినియోగిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. మరమ్మతులు చేయించి సామాజిక అవసరాలకు ఉపయోగించుకుంటే ఎంతో మేలని, అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఉన్నతాధికారులకు తెలియజేసి, ముందుకెళ్తామన్నారు.

– న్యూస్‌టుడే, కొత్తూరు

ఒరిగింది.. కూలేలా ఉంది..!

కోటబొమ్మాళి మండలం జర్జంగి సమీపంలో జాతీయరహదారి పక్కన విద్యుత్తు స్తంభం ఒరిగిపోయింది. సమీప పొలాల్లో తీగలు వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని రైతులు, ఆ మార్గంలో రాకపోకలు చేసేవారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరువైపులా రక్షణ కోసం స్తంభాలున్నప్పటికీ ప్రమాదం జరగకముందే స్పందించాలని కోరుతున్నారు. సిబ్బందికి తెలియజేస్తామని ఏఈ కోటేశ్వరరావు చెప్పారు.

– న్యూస్‌టుడే, ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి)

ప్రయాణం రాళ్ల మీద.. రోడ్డు పైనా?

జలుమూరు మండలం జేపీ రోడ్డు నుంచి సుబ్రహ్మణ్యపురం వెళ్లే మార్గంలో కెల్లివానిపేట సమీపంలో రహదారి పెచ్చులూడి రాళ్లు తేలాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో పనులు చేపట్టిన మూడేళ్లలోనే ఇలా అధ్వానంగా మారిందని వాహన చోదకులు పెదవి విరుస్తున్నారు. ప్రమాదాల బారిన పడుతున్నామని, మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. సమస్యను ప్రాజెక్టు జేఈ లావణ్య వద్ద ప్రస్తావించగా.. నిధులు మంజూరైతే పనులు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, జలుమూరు

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం మోదుగువలసలో ఆయన పర్యటించారు. నాయకులు శివ్వాల కిశోర్‌బాబు, ఒమ్మి ఆనందరావు, చిరంజీవి, మెండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలమట పరామర్శ

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: గౌడో సంక్షేమ రాష్ట్ర డైరెక్టర్ భాస్కర్ గౌడోను మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి ఆదివారం పరామర్శించారు. ఆయన తల్లి కమలా గౌడో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడం మెళియాపుట్టిలో ప్రగాఢ సంతాపం తెలిపారు. వసంత్‌కుమార్, మజ్జి పోలినాయుడు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే సహించేది లేదు

జలుమూరు, న్యూస్‌టుడే: అధికారులు అలసత్వంగా పనిచేస్తే సహించేది లేదని ఎంపీపీ వాన గోపి అన్నారు. మండల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. వ్యవసాయశాఖపై సమీక్షించిన సమయంలో శ్రీముఖలింగం ఎంపీటీసీ సభ్యుడు కరుకోల హరిప్రసాద్, పలువురు సర్పంచులు మాట్లాడుతూ.. రబీలో యూరియా సకాలంలో అందక రైతులు అవస్థలు పడుతున్నా వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదని సభ దృష్టికి తెచ్చారు. సమస్యపై శ్రీముఖలింగం వ్యవసాయ సహాయకుడు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీపీ వివరణ ఇస్తూ వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు కింజరాపు సత్యనారాయణ, మెండ రాంబాబు, ఎంపీడీవో చిన్నమ్మడు పాల్గొన్నారు.

జామియాత్రకు పోటెత్తిన భక్తులు

కొత్తూరు, న్యూస్‌టుడే: నివగాంలోని సిర్లిపోతన్న, ఎల్లమాంబ జామి యాత్రకు భక్తులు ఆదివారం పోటెత్తారు. సెలవు రోజు కావడంతో ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, భాజపా జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు ఎల్లమాంబకు పూజలు చేశారు.

ప్రజాదర్బార్‌కు ఫిర్యాదుల వెల్లువ

వినతులు పరిశీలిస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: నిమ్మాడ కార్యాలయంలో ఆదివారం రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వినతులు వెల్లువెత్తాయి. సమస్యలు తెలుసుకున్న మంత్రి వెంటనే అధికారులతో చరవాణిలో మాట్లాడారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. ★ సోమవారం కోటబొమ్మాళి కార్యాలయంలో మంత్రి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తారని కార్యాలయ ప్రతినిధి లాడి శ్రీను తెలిపారు.

వైభవంగా చక్రతీర్థస్నానం

ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: మోదుగువలస కూడలిలో శ్రీరామలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నాన ఘట్టం వంశధార నదిలో ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలు మూడు రోజులుగా జరుగుతున్నాయి. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొని అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయం అభివృద్ధికి రూ.20 వేలు నగదు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి ప్రత్యేక పూజలు చేశారు.

గ్రామాలను పరిశుభ్రంగా మార్చుకుందాం

చెత్త సేకరణ బళ్లు అందజేస్తున్న ఎంపీపీ వాన గోపి, తెదేపా నాయకులు

జలుమూరు, ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: గ్రామాలను పరిశుభ్రంగా మార్చుకుందామని ఎంపీపీ వాన గోపి అన్నారు. జలుమూరు మండలంలోని 12 పంచాయతీలకు సంబంధించి చెత్త సేకరణ బళ్లను పంచాయతీ కార్యదర్శులకు ఆదివారం అందజేశారు. చల్లవానిపేట, అల్లాడ పీఏసీఎస్ అధ్యక్షులు దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణరావు, ఎంపీడీవో బి.చిన్నమ్మడు పాల్గొన్నారు. ★ ఎల్ఎన్‌పేట మండలం బొర్రంపేటలో స్వచ్ఛరథాన్ని ఏఎంసీ వైస్ ఛైర్మన్ కొవిలాపు కృష్ణమాచార్యులు ప్రారంభించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, పోలినాయుడు, చిరంజీవి పాల్గొన్నారు.

పాపం.. పాపయ్య చెరువు..!

నరసన్నపేట, న్యూస్‌టుడే: నరసన్నపేటలో ఇప్పటికే పలు కాసారాలు కనుమరుగు కాగా, తాజాగా అక్రమార్కులు దృష్టి జమ్ము కూడలి సమీపంలోని దాదాపు 7 ఎకరాల విస్తీర్ణం గల పాపయ్య చెరువుపై పడింది. రాత్రి వేళల్లో ఈ తటాకంలోని మట్టిని యంత్రాలతో యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. అధికారులు పట్టించుకోక పోవడంతో గుట్టు చప్పుడు కాకుండా పదుల సంఖ్యలో వాహనాలతో తరలించేస్తున్నారు. దీనిపై సంబంధిత వీఆర్వో శ్యామ్ మాట్లాడుతూ.. విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా పెట్టామన్నారు.

కాసారం గట్టును ఛిద్రం చేసిన అక్రమార్కులు

అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

పాతపట్నం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో రెండుసార్లు వేతనాలు పెంచారని చెప్పారు. 5జీ స్మార్ట్ ఫోన్లు సరఫరా చేసి సేవల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. నాయకులు సైలాడ సతీష్, మంచు కృష్ణారావు, ఎస్.మధుబాబు పాల్గొన్నారు.

ఇంటిపన్ను బకాయిలు చెల్లించాలి

సారవకోట, న్యూస్‌టుడే: ఇంటి పన్ను బకాయిలు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో అప్పన్న కోరారు. 15లోగా ఇంటి పన్ను వసూలు చేయాలని సంబంధిత శాఖ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. మండలంలో రూ.54 లక్షలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.43 లక్షలు వసూలైనట్లు చెప్పారు.

సంక్షిప్త సమాచారం

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

నరసన్నపేట, న్యూస్‌టుడే: తామరాపల్లి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో ఆదివారం పలు ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 5వ తరగతికి సంబంధించి 72 మంది, ఇంటర్ ప్రవేశాలకు 114 మంది హాజరైనట్లు ప్రిన్సిపల్ కృష్ణతార తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: పోలవరంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఎస్.ఎన్.ఆర్ ఛారిటబుల్ ట్రస్టు, ప్రగడ సాయి సంయుక్తంగా చేపట్టిన కార్యక్రమంలో 30 ఏళ్లు దాటిన వారికి ఉచితంగా రక్త, కంటి పరీక్షలు జరిపారు. వైద్యులు సిగిలిపల్లి దయ, మొదలవలస సుధీర్‌బాబు, సర్పంచి బాలకృష్ణ, కూర్మారావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత ప్రయాణంపై హర్షం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ అవకాశం కల్పించడంపై దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి పి.ఎర్రయ్య హర్షం వ్యక్తం చేశారు. 40 శాతం వికలాంగత్వం ఉన్నవారికి రాష్ట్రప్రభుత్వ నిర్ణయం ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. దివ్యాంగ పింఛన్లు సైతం కూటమి ప్రభుత్వం పెంచడం వల్ల ఆర్థిక చేయూత లభిస్తోందన్నారు.

విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: తిర్లంగిలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి దవళ రామచంద్రుడు, సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు, దవళ వైకుంఠరావు, బగాది కోదండరావు, భాస్కరరావు, ఆదివాసీ పరిషత్తు నాయకుడు గేదెల రమణమూర్తి పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లికి పూజలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కొత్తమ్మతల్లి దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఎటువంటి ఇబ్బందుల్లేకుండా దేవాదాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని శక్తి టీమ్ కోటబొమ్మాళి, టెక్కలి హెచ్‌సీలు గణేష్, గిరిధర్ సూచించారు. మంచాలపేటలో ఆదివారం ప్రదర్శన నిర్వహిస్తూ అవగాహన కల్పించారు. శిరస్త్రాణం ప్రాముఖ్యం, ట్రాఫిక్ నిబంధనలు గురించి వివరించారు. మహిళా కానిస్టేబుల్ రమణమ్మ పాల్గొన్నారు.

పవన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

కొత్తూరు, న్యూస్‌టుడే: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్, నియోజకవర్గ జనసేన బాధ్యులు భవానీ అన్నారు. మండలంలోని కొత్తూరు, సిరుసువాడ, బమ్మిడి గ్రామాల్లో ఆదివారం వారు పర్యటించారు. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. నాయకులు సారిపల్లి ప్రసాదరావు, ఎల్.తిరుపతిరావు పాల్గొన్నారు.

జాగిలంతో దుకాణాల్లో తనిఖీలు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: మెళియాపుట్టి మండల కేంద్రంతో పాటు చాపర లో పలు దుకాణాల్లో ఆదివారం పోలీసులు జాగిలంతో తనిఖీ చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై అమీర్ అలీ పేర్కొన్నారు.

నిరంతర అభ్యసనతో ఉత్తమ ఫలితాలు

అమరేదీప్ మిశ్రాను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

టెక్కలి, న్యూస్‌టుడే: నిరంతర అభ్యసనతో ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని ఈపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ అమరేదీప్ మిశ్రా పేర్కొన్నారు. టెక్కలి సమీపంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో రెండు రోజులపాటు జరిగిన వతార 2కె 26 ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, సృజనాత్మక ఆలోచన, విశ్లేషణాత్మక దృక్పథం అవసరమని సూచించారు. జాతీయ స్థాయిలో 30 కళాశాలల నుంచి 300 మంది మేనేజ్‌మెంట్ విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి నాగరాజు, ప్రిన్సిపల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్పందించారు.. ఇబ్బందులు తీర్చారు

ఈనాడు కథనానికి స్పందన

నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల వ్యాప్తంగా ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు పడేవారు. వీటిపై ఈనాడులో పలుమార్లు కథనాలు ప్రచురితమవడంతో స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కారం చూపారు. దీంతో ఆయా ప్రాంతాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్తు స్తంభం ఏర్పాటు

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: బాలిసమలో బసివలస కూడలి వద్ద కొన్ని నెలలుగా విద్యుత్తు స్తంభం వాలిపోయి ప్రమాదకరంగా ఉండేది. దీనిపై గతనెల 18న 'వాలింది.. వణికిస్తోంది' శీర్షికతో వార్త వెలువడింది. ఉద్యోగ విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ బాలకృష్ణ స్పందించి, కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయించారు.

తీగలు సరిచేశారు

పోలాకి, న్యూస్‌టుడే: చీడివలస గ్రామంలో రైతుసేవా కేంద్రం సమీపంలోని విద్యుత్తు స్తంభానికి తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉండేవి. దీనిపై గతనెల 27న 'ప్రమాదం జరగకముందే స్పందించండి' శీర్షికన వార్తకు ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. తీగలు సరిచేసి, ఫ్యూజ్‌బాక్స్ అమర్చారు.

మర్రి ఊడలు తొలగించారు

నందిగాం, న్యూస్‌టుడే: పెద్దతామరాపల్లి జాతీయ రహదారి వంతెన కింద అనుసంధాన రోడ్డు పక్కనే మర్రి చెట్టు ఊడలు ప్రమాదకరంగా ఉండేవి. తరచూ ఆర్టీసీ బస్సులతో పాటు, భారీ వాహనాలకు తగులుతుండేవి. సమస్యపై ఇటీవల 'మర్రి ఊడలు తొలగించాలని' పేరుతో వార్త ప్రచురితమైంది. పెద్దతామరాపల్లి గ్రామానికి చెందిన బస్సు కండక్టర్ పోలాకి పాపారావు చర్యలు తీసుకున్నారు.

నరసన్నపేట పట్టణంలో ప్రధాన రహదారిపై కమ్మేసిన పొగమంచు

కనుచూపు మేర.. మంచుతెర

నరసన్నపేట, న్యూస్‌టుడే: మంచు తీవ్రతతో జనం ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జాము నుంచే దట్టంగా కురుస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని పలువురు వాపోతున్నారు. లైట్లు వేసుకుని రాకపోకలు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. పొగమంచు వల్ల జీడి, మామిడి పంటలకు నష్టం కలుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మురుగు బాధ తీరింది

స్పందనకు వందనం

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కనుకుల పేట రైల్వే అండర్ పాసేజ్‌లో మురుగు నీరు నిలిచి రాకపోకలకు సాగించే వారు ఇబ్బంది పడేవారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై గతనెల 21న 'నిర్వహణ సిద్ధిలేదా' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీనిపై శ్రీకాకుళం రోడ్ ఏఈఎన్ బీబీఎస్ మూర్తి స్పందించి మోటార్లతో మురుగు నీటిని తోడించారు. ఇక్కట్లు తీరడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

శ్రీకాకుళం

●శ్రీకాకుళం ●ఆమదాలవలస ●ఎచ్చెర్ల

అదుపు తప్పితే.. అంతే సంగతి..!

బూర్జ మండలంలో గజ్జిలిగెడ్డ జలాశయానికి చేరుకునే రహదారిది. జలాశయం నుంచి లీకుల ద్వారా వచ్చిన వరదనీటితో రహదారి కోతకు గురైంది. వాహనాల రాకపోకలు చేసే సమయంలో ఏ మాత్రం అదుపు తప్పినా.. ఊహించని ప్రమాదం జరుగుతుంది. సంబంధిత అధికారులు గుర్తించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. నీటిపారుదలశాఖ ఏఈ దాలయ్య వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, బూర్జ

ముందు చూపు.. తప్పుతుంది ముప్పు

లెప్రసీ కాలనీలో కాలువలో ఉన్న తాగునీటి గొట్టం

శ్రీకాకుళం నగరంలో అతిసారం విజృంభించడంతో జిల్లా వ్యాప్తంగా కలకలం రేగింది. జిల్లా యంత్రాంగం త్వరితగతిన స్పందించి, నియంత్రణలోనికి తీసుకొచ్చారు. ఆయా ప్రాంతాల్లో నీటిని సేకరించి పరీక్షించగా ఈ-కోలీ ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. కాలువల్లో పైపులైన్లు ఉండటంతో సమస్య ఉత్పన్నమైందని అధికారులు తెలిపారు. ఆమదాలవలస పుర పరిధిలోని తాగునీటి పైపులైన్లు సైతం కాలువల్లోనే ఉన్నాయి. 30 ఏళ్ల కిందట ఏర్పాటు చేసినవి కావడంతో శిథిలమయ్యాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆ నీరు తాగి రోగాల బారిన పడక మునుపే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. దీనిపై ఎమ్మెల్యే కూన రవికుమార్ వివరణ కోరగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ.100 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామని, విడతల వారీగా పనులు పూర్తి చేస్తామన్నారు. -న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9502198883 8008552704

?: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు కొత్తూరు, బత్తిలి, పాలకొండకు వెళ్లే బస్సులు రావడం లేదు. **- రమణ, స్థానికుడు**

❖ అన్ని బస్సులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. **- శర్మ, రెండో డిపో మేనేజర్, శ్రీకాకుళం**

?: రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి గోతులుమయంగా మారింది. **-మురళి, స్థానికుడు** ❖ త్వరలో నూతన రహదారి నిర్మిస్తాం. **-జనార్దనరావు, రైల్వే స్టేషన్ - మేనేజర్, శ్రీకాకుళంరోడ్డు**

- న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

తెరపై ఈనాడు

❖ సరస్వతి: నిలవే ❖ ఎస్వీసీ (రామలక్ష్మణ): మన శంకరవరప్రసాద్ గారు ❖ సన్ మ్యాక్స్: హే బల్వంత్ ❖ మారుతి : విష్ణు విన్యాసం ❖ కిన్నెర : సన్నాఫ్ ❖ కీర్తన: ద రైజ్ ఆఫ్ అశోక ❖ కీర్తిక: ఉత్తుత్త హీరోలు ❖ సూర్య : కపుల్ ఫ్రెండ్లీ - న్యూస్‌టుడే, పాతబస్టాండ్

ప్రపంచ శాంతికి మహమ్మద్ ప్రవక్త బోధనలు దోహదం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: మహమ్మద్ ప్రవక్త బోధనలు అనుసరణీయమని తహసీల్దార్ గణపతి రావు అన్నారు. నగరంలో జి.టి.రహదారిలో జామియా మసీదులో ఆదివారం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. మసీదు అభివృద్ధికి తనవంతుగా రూ.12 వేలు విరాళం ప్రకటించారు.

రేపు దేవాలయాల మూసివేత

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సంపూర్ణ చంద్ర గ్రహణం సందర్భంగా శ్రీకాకుళం నగర పరిధి గుడి వీధిలోని ఉమారుద్ర కోటేశ్వరాలయాన్ని ఈ నెల 3న ఉదయం 10 గంటలకు మూసివేస్తామని ఈవో మునగవలస సుకన్య తెలిపారు. 4న ఉదయం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని పేర్కొన్నారు. పీఎన్ కాలనీలో నారాయణ తిరుమల వేంకటేశ్వరాలయం, పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత దేవస్థానం, ఉమాజలలేశ్వరాలయం, పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయాన్ని, ఇతర దేవాలయాలను అదే సమయానికి మూసివేయనున్నారు.

ప్రపంచ తెలుగు సభల్లో పత్ర సమర్పణ

సింగుపురం(శ్రీకాకుళం గ్రామీణం), న్యూస్‌టుడే: అమలాపురంలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మూడో ప్రపంచ తెలుగు సభల్లో గాయత్రి కళాశాల తెలుగు విభాగాధిపతి భమిడిపాటి గౌరీశంకర్ ప్రసంగించారు. వేదిక నిర్వాహకుడిగా వ్యవహరించారు. ఆంధ్రుల భక్తి సాహిత్యం అనే అంశంపై పత్ర సమర్పణ చేసినట్లు ప్రిన్సిపల్ కేవీవీ సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గురజాడ విద్యాసంస్థల అధినేత జీవీ స్వామినాయుడు, ఐక్యూ ఏసీ డాక్టర్ మార్తాండ కృష్ణ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. రహదారులు, కాలువలు, విద్యుత్తు సౌకర్యం లేకపోవడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలకు శివారున ఉండటంతో భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

❖ పొందూరు మండలంలో మొత్తం 16 జగనన్న లేఅవుట్లు ఉండగా పొందూరు, బాణాం, తోలాపి, నందివాడ, తాడివలస, కొంచాడ, లైదాం తదితర కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువలు లేవు. పొందూరు మండల కేంద్రం నుంచి స్థానికంగా ఉన్న కాలనీకి వెళ్లే రహదారి నిర్మాణం చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

జగనన్న గూడు.. సమస్యలే తోడు..!

మౌలిక వసతులకు దూరంగా నివాసితులు

❖ ఆమదాలవలస మండలంలో చింతాడ, గాజులకొల్లివలస, తిమ్మాపురం ఇతర ప్రాంతాల్లో జగనన్న కాలనీల్లో రోడ్లు ఉన్నా.. కాలువలు నిర్మించలేదు. దీంతో మురుగు రోడ్లపైకి వచ్చేస్తోంది.

❖ సరుబుజ్జిలి మండలంలో మొత్తం 12 కాలనీల్లో తెలికపెంట, చిగురువలస, బురిడివలస, రొట్టవలస, కొండవలస, పెద్దపాలెం, నందికొండ కాలనీ, మతలాబుపేట, తలంతరి ఇతర ప్రాంతాల్లో రాత్రయితే మందుబాబుల ఆగడాలు అధికమవుతున్నాయని మహిళలు వాపోతున్నారు.

❖ జగనన్న కాలనీల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే కాలనీల వివరాలు సేకరించాం.' అని డివిజనల్ పంచాయతీ అధికారి గోపీబాల, తెలిపారు.

పొందూరు జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారి

స్పందనకు వందనం

నిర్మాణం పూర్తి

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం తండ్యాంలో ఈ భవన నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. జనవరి 5న వదిలేస్తారా..ఉపయోగిస్తారా? అనే శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు, సర్పంచి భాస్కర్‌రావు స్పందించారు. త్వరతగతిన పనులు చేపట్టి, పూర్తిచేశారు.

తీరిన సమస్య

గార (నిజామాబాద్), న్యూస్‌టుడే: గార మండలం నిజామాబాద్ గ్రామంలో సీఎస్పీ రహదారిని ఆనుకుని వ్యర్థాలు కుప్పగా వేయడంతో దుర్గంధం వెలువడటంతో 'దుర్గంధం.. దోమల బెడద' శీర్షికన ఫిబ్రవరి 28న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పర్యవేక్షించారు.

రహదారికి మరమ్మతులు

బూర్జ, న్యూస్‌టుడే: శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారిలో పలు కూడళ్ల వద్ద గుంతలు పడి అధ్వానంగా మారింది. 'ఈనాడు'లో రోడ్డా..చెరువా.., గుంత..చింత, ప్రయాణం..ప్రహసనం! వంటి శీర్షికలతో పలుమార్లు వార్తలు ప్రచురితం చేయగా రహదారి, భవనాలశాఖ అధికారులు స్పందించారు. తుడ్డలి నుంచి కొల్లివలస మధ్య ప్రధాన రహదారిలో ఏర్పడిన గుంతలను రూ.5 లక్షల నిధులతో పూడ్చుతున్నట్లు జేఈ ఆంజనేయ నాయక్ తెలిపారు.

కాలువ శుభ్రం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలం కొంచాడ గ్రామంలో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుని దోమల బెడద ఎక్కువైంది. గత నెల 2న 'కదలని మురుగు 'శీర్షికన ఈనాడులో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేశారు.

పాత నేరస్థుల్లో పరివర్తన రావాలి

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: నేరాలతో సంబంధం ఉన్న పాత నేరస్థులు సన్మార్గంలో నడుచుకోవాలని రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం పాత నేరస్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వారి కదలికలపై నిఘా ఉంచామని హెచ్చరించారు.

బాబోయ్ దుర్వాసన..!

పుర పరిధిలోని వెంగళరావుకాలనీలోని ప్రధాన కాలువ పూడిక, పనికిరాని మొక్కలతో నిండింది. మురుగు నిలిచి దుర్వాసన వస్తోందని స్థానికులు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు పూడిక తొలగించాలని కోరారు. సమస్య పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ టి.రవి చెప్పారు. -న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

సేవలు దూరం.. భవనం నిరుపయోగం..!

వైకాపా హయాంలో మతలబుపేటలో రైతు సేవా కేంద్రం నిర్మించారు. అనంతరం ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. స్థానికులు మూగజీవాలను కట్టేసుకునేందుకు వినియోగిస్తున్నారు. పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ కార్యనారాయణ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పనులు పూర్తవడంతో ప్రారంభించలేదన్నారు. -న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

వ్యర్థాలు ఇలా.. రోగాలు రావా..!

పొందూరు మండలం తాడివలస గ్రామ పరిధిలో గోరింట గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన వ్యర్థాలు పడేస్తున్నారు. దుర్వాసన, దోమల బెడద ఎక్కువైందని గ్రామస్థులు వాపోతున్నారు. చెత్త సేకరణ చేపట్టడం లేదన్నారు. ఎంపీడీవో వాసుదేవ రావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

రోడ్డు ఛిద్రం.. ప్రయాణం కష్టం

సరుబుజ్జిలి మండలంలోని చిగురువలస రహదారి అధ్వానంగా మారింది. 20 ఏళ్లుగా రోడ్డు ఇలాగే ఉందని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోయారు. విషయాన్ని పంచాయతీ రాజ్‌శాఖ ఏఈ కార్యనారాయణ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

పగలు.. రాత్రి తేడా లేదు..!

పొందూరు మండలం కొంచాడ గ్రామంలో వీధి దీపాలు పగలు..రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. ఇక్కడ 100 వరకూ ఇలా ఉండటంతో పాడై, విద్యుత్తు వృథా అవుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి, సమస్య పరిష్కరిస్తామన్నారు. -న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

విస్తరణ పనులు వేగవంతం చేయండి

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: నగరంలో విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలని శాసన సభ్యులు గొండు శంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, బలగ మెట్టు రోడ్లలో జరుగుతున్న విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీ పడొద్దని ఆయన సూచించారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అలవాటు చేసుకోండి

లావేరు, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని లావేరు శాఖ గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. మహాభారతంలోని కథలను క్లుప్తంగా వివరించారు.

అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం

రణస్థలం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు సార్లు అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. ● జేఆర్‌పురానికి చెందిన గండామణి రమణకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.83,500 చెక్కు అందించారు.

స్వచ్ఛ రథాన్ని సద్వినియోగం చేసుకోండి

ఆమదాలవలస గ్రామీణం, ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛ రథాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో వాహనం ప్రారంభించారు. ఆయా గ్రామాలకు వచ్చిన సమయంలో ఇంట్లో ఉన్న చెత్త, ప్లాస్టిక్ సామగ్రిని అందించి నిత్యావసరాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీపాన రామ్మోహన్, ఈవోపీఆర్డీ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. ● పేదలకు అండగా ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో 59 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ● పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. ఆదివారం బీఆర్‌నగర్‌లోని అమరావతి పార్కులో మొక్కలు నాటారు. ● ఆమదాలవలస మండలంలో 30 పంచాయతీలకు చెత్త సేకరణ రిక్షాలు, తోపుడు బళ్లు, చెత్త బుట్టలు పంపిణీ చేశారు.

వాహనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఉప ఎంపీపీ-2 జరుగుళ్ల విజయకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్యసమావేశం జరిగింది. జాతీయ ఉపాధిహామీ పనులు, వ్యవసాయశాఖ, పశుసంవర్ధక, పారిశుద్ధ్యం, డ్వాక్రాసంఘాల పనితీరు తదితర శాఖల పనితీరుపై సభ్యులంతా చర్చించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ-1 బెండు ఆదిలక్ష్మి, ఎంపీడీవో సీపాన హరిహరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఉప ఎంపీపీ జరుగుళ్ల విజయకుమారి, అధికారులు

సమాజ సేవకులుగా మారుదాం

పాతపట్నం, న్యూస్‌టుడే: మాజీ సైనికులు సమాజ సేవకులుగా మారాలని జిల్లా సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని రెల్లి వీధిలో ఆదివారం మాజీ సైనికుల సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధానంగా ఎంప్యానెల్ ఆసుపత్రి పునరుద్ధరణకు కృషి చేయాలన్నారు. సంఘానికి సంబంధించిన ఆదాయ, వ్యయాల పద్దులను కోశాధికారి ఎం. సింహాచలం వివరించారు. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ హౌసింగ్ సొసైటీ విధి విధానాలను ఉపాధ్యక్షుడు వి.సూర్యనారాయణ తెలిపారు. రక్షసెప్తమి నాడు సేవలందించిన పలువురు మాజీ సైనికులు, వీరనారీమణులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

జ్ఞాపికలతో సత్కరిస్తున్న సంఘ సభ్యులు

ఉపనిషన్మందిరంలో డా.మోహనరావుకు సత్కారం

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలో పాలకొండ రోడ్డులో కోదండరామాలయం ప్రాంగణంలో ఉపనిషన్మందిరంలో ఆదివారం సత్సంగం, క్యాన్సర్ దినోత్సవ కార్యక్రమం జరిగింది. డా.మందుల మోహనరావు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. విశ్రాంత విద్యాశాఖాధికారి బలివాడ మల్లేశ్వరరావు, బి.ఏ.మోహనరావు, బాపయ్య శాస్త్రి పాల్గొని మోహనరావును సత్కరించారు. నరసింహమూర్తి, నారాయణమూర్తి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలో రక్త నిల్వల కొరత ఉన్నందున యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. తలసేమియా పేషెంట్లకు 15 నుంచి 20 యూనిట్ల వరకు అవసరం ఉంటుందని పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 215 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. స్కూల్ డైరెక్టర్లు శ్రీకాంత్, శ్రీదేవి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు సోమసుందరరావు, శ్రీనివాసరావు, రమణ పాల్గొన్నారు.

న్యూ సెంట్రల్ స్కూల్లో రక్తదానం చేస్తున్న దాతలు

కుళాయిల పనులు ప్రారంభం

ఎచ్చెర్ల, రణస్థలం, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం ముద్దాడ పంచాయతీలోని పెద్దకొయ్యవానిపేట, అంబేడ్కర్‌నగర్ గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా కుళాయి పనులు ఆదివారం ప్రారంభించారు. మండల తెదేపా అధ్యక్షుడు బెండు మల్లేసు పనులు ప్రారంభించారు. ● రణస్థలం పంచాయతీ చినలంకపేట గ్రామంలో కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. సర్పంచి పిన్నింటి భానోజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యవర్గం సమావేశం ఓ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు హారికా ప్రసాద్, ఉపాధ్యక్షుడు బూర్లె సత్యనారాయణ, కార్యదర్శి సురేష్, వాండ్రంగి శ్రీనివాసరావు పాల్గొని ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ పథకాలు ఇవ్వడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ స్టేట్ ఛైర్మన్ కుమార మంగళం, ఎస్.రాంబాబు, కార్యదర్శి ఎం.లక్ష్మణ్, కోశాధికారి ఆదినారాయణ పాల్గొన్నారు.

బాణసంచా తయారీ పదార్థాల స్వాధీనం

రణస్థలం, న్యూస్‌టుడే: రణస్థలం మండలంలోని పైడిభీమవరంలో బీసీ కాలనీలో ఆదివారం బాణసంచా సామగ్రి తయారు చేస్తున్న గొర్లె వెంకటరమణ ఇంటిపై పోలీసులు దాడి చేశారు. 3 కిలోల గంధకం, గన్‌పౌడరు ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేస్తామని ఎస్సై చిరంజీవి తెలిపారు.

తెరవే సాహితీ సమ్మేళనం

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలో శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం తెలుగు రచయితల వేదిక నెలవారీ సాహితీ సమ్మేళనం జరిగింది. తెరవే అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావిల్లి నాగేశ్వరరావు, ఆర్.వి. రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన సాహితీ సమ్మేళనంలో రచయిత్రి రెడ్డి లలిత పాల్గొని సమాజ చైతన్యం కలిగించే రచనలు చేయాలని అన్నారు. కిల్లాన శ్రీనివాసరావు, ఇద్ది పాపయ్య పాల్గొన్నారు.

శాసనసభాపతి ప్రకటనపై హర్షం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: కోనసీమ జిల్లా అమలాపురంలో జరుగుతున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడారు. అన్ని యాజమాన్య విద్యాసంస్థల్లో ఇంటర్ వరకు తెలుగు బోధన కచ్చితంగా ఉండేలా శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదం అయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్ష తదితరులు పాల్గొన్నారు.

ఉన్నది కొన్ని రోజులే.. పూర్తికాని పనులు

-న్యూస్‌టుడే, రణస్థలం

ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో గ్రామాలకు సిమెంటు, తారు రోడ్లు నిర్మించాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా నిధులతో పనులు పూర్తి చేయాలని తెలిపింది. గడువు ముగుస్తున్నా.. పనులు పూర్తి కాలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లిపోయే ఆస్కారం ఉంది.

❖ మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకం వీబీజీరామ్‌జీగా మారడంతో వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి విధివిధానాలు మారనున్నాయి. నిధులు సైతం రద్దవుతాయి. అప్పట్లోగా పల్లెల్లో రహదారులు, కాలువలు నిర్మించొచ్చు. అయితే సకాలంలో బిల్లులు మంజూరు కావడం లేదని గుత్తేదారులు వెనక్కి తగ్గుతుండడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది.

అసంపూర్తిగా నిలిచిన బండిపాలెం-నగరపాలెం బీటీ రహదారి

❖ ఎచ్చెర్ల నియోజకవర్గంలో రణస్థలం, ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.58 కోట్లు మంజూరు చేయగా రూ. 27 కోట్లు ఖర్చయ్యాయి. బీటీ రహదారులకు రూ.73 కోట్లు అందజేయగా రూ. 6 కోట్లు వినియోగించారు.

'నిధులన్నీ మార్చి 10వ తేదీలోపు ఖర్చు చేస్తే 15న బిల్లులు అప్‌లోడు చేయాలి. మార్చి 31 తరువాత వీబీజీరామ్‌జీ అమల్లోకి వస్తుంది. ఆ పథకం ద్వారా వచ్చే నిధులే ఖర్చు చేయాల్సి ఉటుంది.' అని పంచాయతీరాజ్ డీఈ శ్రీరాములు తెలిపారు.

సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

లావేరు, న్యూస్‌టుడే: 'కూటమి అధికారంలోకి రావడానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కారణం' అని విజయనగరం పార్లమెంట్ సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. జనసైనికుల కుటుంబాలతో పాటు సభ్యత్వం చేయించుకున్న వారికి ఆర్థిక భద్రత, సేవలకు గుర్తింపు వస్తుందన్నారు. నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం లావేరు మండల కేంద్రం సమీపంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు పరిధిలో 1.50 లక్షల సభ్యత్వాలు నమోదు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి డాక్టర్ విశ్వక్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రసవాలు పెరగాలి.. పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న హెల్త్ డైరెక్టర్ డా.కె.పద్మావతి

లావేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెరిగే విధంగా వైద్యులు, సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డా.కె.పద్మావతి అన్నారు. ఆదివారం లావేరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మౌనిక తదితరులు పాల్గొన్నారు.

హిందీపై పట్టు సాధించేందుకు ప్రతిభా పరీక్ష దోహదం

రణస్థలం, న్యూస్‌టుడే: హిందీపై పట్టు సాధించేందుకు హిందీ ప్రతిభా పరీక్ష దోహదపడుతుందని కేంద్ర సహకార, భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖల హిందీ సలహామండలి సభ్యుడు ఎస్.గైబువల్లి అన్నారు. ఆదివారం రణస్థలంలో హిందీ ప్రతిభా పరీక్ష పురస్కారాలు అందించారు. హిందీ సేవాసదన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పరీక్ష నిర్వహించామని, 60 మంది టాపర్లకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశామన్నారు.

విద్యార్థులకు కలాల పంపిణీ

పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో ఆదివారం విద్యార్థులకు ఉచితంగా కలాలు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్, సూర్య నగేష్‌ల నిర్వహణలో స్వామి వద్ద 5,008 పెన్నులు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యార్థులకు అందజేశారు. ఆలయ ధర్మకర్త వీనస్ హరి పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

పోలీసులు ఆకస్మిక తనిఖీలు

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు పట్టణంలో ఆదివారం జగనన్న కాలనీ, నాయుడు వీధి, కస్పావీధి ఇతర ప్రాంతాల్లో ఎస్సై సత్యనారాయణ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వాహనాలు తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారుల అనుమతి పత్రాలు పరిశీలించారు. బాలుడు ద్విచక్రవాహనం నడుపుతూ కనిపించడంతో అవగాహన కల్పించారు.

పంటకు చీరలే రక్ష

పొందూరు మండలంలోని నీటి వసతులు ఉన్న ప్రాంతాల్లో ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులు కొందరు రెండో పంటగా రబీలో మొక్కజొన్న వేస్తారు. ఈ ఏడాది 5, 400 ఎకరాల్లో పండిస్తున్నారు. వాటిని కీటకాలు, జంతువులు నుంచి రక్షించుకునేందుకు పొలాలకు ఇలా చీరలతో కర్షకులు రక్షణ వలయం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. -న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

(c) eenadu

తిరుప్పరంకుండ్రంలో గుండె బరువెక్కింది

● డీఎంకే తీరుతోనే రెండు వర్గాల మధ్య వివాదం ● ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

మదురై ఎన్డీయే సభలో ప్రధాని మోదీతో కూటమి నేతలు

తిరుప్పరంకుండ్రంలో ఆత్మహత్యకు పాల్పడ్డ తిరుపూర్ణచంద్రన్ భార్య, పిల్లలతో మాట్లాడుతున్న ప్రధాని

ఈనాడు-చెన్నై: "తిరుపరంకుండ్రం మురుగన్ ఆలయాన్ని దర్శించుకున్నా. ఆ సమయంలో నా గుండె బరువెక్కింది. యువ భక్తుడు తిరుపూర్ణచంద్రన్ ఇక్కడ తన ప్రాణాన్ని వదిలారు. ఆయన భార్య ఇందుమతి, ఇద్దరు పిల్లల్ని కలిశాను. నా ప్రగాఢ సానుభూతి తెలియజేశాను. ఆయన ప్రాణం పోయినందుకు నాకెంతో బాధగా ఉంది. ఇక్కడి డీఎంకే తీరు వల్లే ఇదంతా జరిగింది. నిజం గెలిచేరోజు దగ్గర్లో ఉంది'' అని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు చేశాక.. మదురైలో ఏర్పాటుచేసిన ఎన్డీయే బహిరంగ సభలో పాల్గొని ఆయన ఇలా వ్యాఖ్యానించారు. తమిళనాడులో మళ్లీ అధికారంలోకి వస్తామని డీఎంకేవారు కలలు కంటున్నారని, అది కలేనని సభకొచ్చిన జనాన్ని చూస్తే వారికి తెలుస్తుందని తెలిపారు. డీఎంకే ఈ రాష్ట్రాన్ని దోచుకుంటోందని, వారికి డబ్బు తప్ప ప్రజలు అక్కర్లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 6లక్షల పేదల ఇళ్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంచి పేదలు బాధపడేలా చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని, డ్రగ్ మాఫియా, మద్యంతో వారి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని, ప్రతీ తల్లి, చెల్లి, కుమార్తె రానున్న ఎన్నికల్లో ఎన్డీయేకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం రాగానే శాంతిభద్రతలపై దృష్టిపెట్టి నేరస్థులను, డ్రగ్ మాఫియాను నిర్మూలించి మహిళల భద్రత, సాధికారత దిశగా ముందుకెళ్తామని తెలిపారు. ఈ సభలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, ఎన్డీయేపక్ష నేతలు పాల్గొన్నారు.

బుల్లెట్ రైలుతో కొత్త విప్లవం

బెంగళూరు-చెన్నై, చెన్నై-హైదరాబాద్ బుల్లెట్ రైలు కారిడార్‌లను తీసుకొస్తున్నామని, ఇదో విప్లవం అవుతుందని ప్రధాని మోదీ తెలిపారు. మదురైలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాజా బడ్జెట్‌లో తమిళనాడుకు రేర్ ఎర్త్ కారిడార్‌ను ప్రకటించామని, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రిసెర్చ్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ అనుసంధానిస్తున్నామని అన్నారు. ఆదిచనల్లూరును గ్లోబల్ హెరిటేజ్ కేంద్రంగా ప్రకటించి, పులికాట్ సరస్సును వృద్ధి చేస్తున్నామని వివరించారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యం కోసం తమిళనాడు కీలకంగా ఉందని, ఈ రాష్ట్రం అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందినట్లేనని చెప్పారు. ఈ సందర్భంగా రోడ్డు, రైలు, ఇతర ప్రాజెక్టులకు సంబంధించి రూ.4,400కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించి కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. పుదుచ్చేరి-మరక్కాణం, పరమకుడి-రామనాథపురం 4 వరుసల రహదారుల ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్, గవర్నర్ ఆర్.ఎన్.రవి, భాజపా రాష్ట్ర అధ్యక్షులు నయినార్ నాగేంద్రన్, ఎడప్పాడి పళనిసామి, పీఎంకే నేత అన్బుమణి, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, ఐజేకే అధ్యక్షులు టీఆర్ పారివేందర్, టీఎంఎంకే వ్యవస్థాపకులు జాన్ పాండియన్, టీఎంకే అధ్యక్షులు జీకే వాసన్, పీఎన్‌కే అధ్యక్షులు ఏసీ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి మురుగన్ విగ్రహం అందిస్తున్న పుదుచ్చేరి సీఎం రంగసామి

పుదుచ్చేరిని ఏటీఎంలా వాడుకున్నారు

గతంలో కాంగ్రెస్, డీఎంకే కూటమి పాలనతో పుదుచ్చేరి తీవ్ర మోసానికి గురైందని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. పుదుచ్చేరిలో ఆదివారం పర్యటించిన ఆయన రూ.2700కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ.. కాంగ్రెస్, డీఎంకే పాలనలో పుదుచ్చేరిలో రేషన్ సరిగా రాకపోయేదని, జీతాలు సమయానికి పడేవి కాదని, డ్రగ్స్ వాడకం పెరిగిపోయిందన్నారు. ఈ ప్రాంతాన్ని దిల్లీలోని కాంగ్రెస్ కుటుంబం ఏటీఎంలా వాడుకుందని ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక వాటన్నింటికీ చెక్ పెట్టి అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామన్నారు. యువత దేశ ప్రగతికి పునాది అని, వారి కలలకు ప్రాధాన్యమిచ్చేలా.. ఎన్ఐటీ కారైకాల్, పుదుచ్చేరి యూనివర్సిటీల్లో ప్రత్యేక భవనాలు, వసతిగృహాలు తెచ్చామన్నారు. పుదుచ్చేరిని మెడికల్ టూరిజం హబ్‌గా మార్చేలా ఇక్కడ 9 మెడికల్ కాలేజీలున్నాయని గుర్తుచేశారు. చెన్నై-పుదుచ్చేరి ఈసీఆర్‌ను కన్నియాకుమరి వరకు వృద్ధి చేశామని, దీంతోపాటు జీఎస్టీరోడ్, పుదుచ్చేరి-కడలూర్, పుదుచ్చేరి-కారైకాల్ జాతీయ రహదారుల్ని తెచ్చామన్నారు. చెన్నై, బెంగళూరు, కోయంబత్తూరు లాంటి నగరాల్ని పుదుచ్చేరితో అనుసంధానిస్తూ.. ఈ ప్రాంతాన్ని పర్యాటక, వాణిజ్య హబ్‌గా తయారుచేస్తున్నామన్నారు. ఎన్డీయే డబులింజన్ ప్రభుత్వం పుదుచ్చేరిని 'బెస్ట్'గా తయారుచేస్తోందని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి మన్‌సుఖ్‌మాండవియా, పుదుచ్చేరి గవర్నర్ కె.కైలాష్‌నాథ్, ముఖ్యమంత్రి రంగసామి, స్పీకర్ ఆర్.సెల్వం, హోంమంత్రి నమశ్శివాయం తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న తిరుప్పరంకుండ్రం ఆలయ అర్చకులు

పుదుచ్చేరికి రాష్ట్ర హోదా ఇవ్వండి

● ప్రధానిని కోరిన పుదువై సీఎం రంగసామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వానికి అధికారం లేదని, పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి రంగసామి కోరారు. పుదుచ్చేరిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఏళ్లుగా రాష్ట్ర ప్రజలు రాష్ట్ర హోదాని కోరుకుంటున్నారని చెప్పారు. అందుకు ప్రధాని.. అభ్యర్థనను సాధ్యం చేస్తానని హామీ ఇచ్చారు.

వచ్చేది అన్నాడీఎంకే ప్రభుత్వమే: ఈపీఎస్

ప్యారిస్: రానున్న ఎన్నికల్లో 210 నియోజకవర్గాల్లో విజయం సాధించి అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ధీమా వ్యక్తం చేశారు. మదురై బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... తమిళనాడుకి వేల కోట్ల నిధులను ప్రధాని కేటాయించారని, డీఎంకే నేతలు అబద్ధాలు ఆడుతున్నారని విమర్శించారు.

ఉదయనిధిని సీఎం చేయాలని స్టాలిన్ ప్రయత్నం: టీటీవీ

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఉదయనిధిని ముఖ్యమంత్రిని చేయాలని స్టాలిన్ ప్రయత్నాలు చేస్తున్నారని ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తెలిపారు. ఆయన కలలు నాశనం చేసేలా ఈ ప్రభుత్వానికి ముగింపు పలుకుతామన్నారు. మరో రెండు నెలల్లో ముఖ్యమంత్రిగా ఎడప్పాడి పళనిసామి బాధ్యతలు స్వీకరిస్తారని చెప్పారు.

ధర్మం, అధర్మానికి మధ్య యుద్ధం: నయినార్

పుస్తకాలు పట్టుకోవాల్సిన విద్యార్థులు చేతిలో గంజాయి ఉంచుకునేందుకు డీఎంకే ప్రభుత్వమే కారణమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. రానున్న శాసనసభ ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే యుద్ధమని పేర్కొన్నారు.

సామాజిక న్యాయానికి డీఎంకే సమాధి: అన్బుమణి

పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి మాట్లాడుతూ... సామాజిక న్యాయాన్ని పాటించే తమిళనాడులో కుల గణన నిర్వహించి ఉండాలని, కానీ స్వాతంత్ర్య భారతదేశంలో మొట్టమొదటిసారిగా కుల గణన నిర్వహించింది భాజపా అధికారంలో ఉన్న బిహార్‌లోనే అని పేర్కొన్నారు. తమిళనాడులో సామాజిక న్యాయాన్ని డీఎంకే సమాధి చేసిందని ఆగ్రహించారు.

కనులపండువగా మురుగన్ తిరుకల్యాణోత్సవం

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మాసి మాస బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రధాన ఘట్టమైన వల్లి, మురుగన్ తిరుకల్యాణ మహోత్సవం ఆదివారం తెల్లవారుజామున నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరుళర్ సామాజిక వర్గానికి చెందిన భక్తులు స్వామి, అమ్మవార్లకు సారె సమర్పించారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు. పాల్గొన్న భక్తులు

ముగిసిన కచ్చతీవు ఆలయ ఉత్సవాలు

జాలర్ల పడవలకు రక్షణ కల్పించిన తీర గస్తీ నౌక

● సురక్షితంగా తిరిగొచ్చిన జాలర్లు

వడపళని, న్యూస్‌టుడే: కచ్చతీవు ద్వీపంలోని ప్రసిద్ధ సెయింట్ ఆంటోనీ చర్చిలో ఫిబ్రవరి 27, 28 తేదీల్లో వార్షిక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాలను తిలకించేందుకు దేశీయ జాలర్లు, ఇతర ప్రాంతాల నుంచి 3,741 మంది తరలివెళ్లారు. రామేశ్వరం నుంచి అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ వరకు యాత్రికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ద్వీపంలో రాత్రిపూట బసచేసిన తర్వాత యాత్రికులు సురక్షితంగా రాష్ట్రానికి తిరిగొచ్చారు. తీర ప్రాంత నావికాదళం, వాయు విభాగాలు జాలర్ల రక్షణకు చర్యలు చేపట్టాయి. రక్షణగా నిలిచి సహకరించాయని రక్షణశాఖ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది.

టేబుళ్లపై హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయినులు

నేటి నుంచి ప్లస్‌టూ పరీక్షలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు 2వ తేదీ ప్రారంభమై 26వ తేదీ వరకు జరుగనున్నాయి. ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా 3,412 కేంద్రాలలో 8,27,475 మంది విద్యార్థులు రాయనున్నారు. ఇందులో 7,545 పాఠశాలల నుంచి 7,99,692 మంది, ప్రైవేటు అభ్యర్థులు 27,783మంది, ఖైదీలు 281మంది ఉన్నారు. 7,465మంది విద్యార్థులు స్క్రైబ్స్ సాయంతో పరీక్ష రాయనున్నారు. ఈ ఏడాది నుంచి అభ్యర్థులు అకౌంటింగ్ సబ్జెక్టుకు కూడా సాధారణ కాలిక్యులేటర్లను ఉపయోగించడానికి అనుమతించారు. 44,624 మంది ఇన్విజిలేటర్లు, 4,540మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు.

రేపు పొత్తుపై రామదాస్ ప్రకటన?

సైదాపేట, న్యూస్‌టుడే: పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ ఈనెల 3న పొత్తు గురించి ప్రకటించనున్నట్లు సమాచారం. డీఎంకే కూటమిలో ఉండే వీసీకేకు రామదాస్‌ను డీఎంకే కూటమిలోకి చేర్చుకోవడం ఇష్టం లేనట్లు తెలుస్తోంది. దీంతో రామదాస్ ఎవరితో పొత్తు కుదుర్చుకుంటారనే ఆసక్తి రాష్ట్ర రాజకీయవర్గాల్లో నెలకొంది. ఇందుకు సంబంధించి ఆయన తరచుగా నిర్వాహకులతో ఆలోచనలు జరపుతున్నారు. మంగళవారం తైలాపురం తోటలో పీఎంకేలోని పలు విభాగాలతో సమావేశం జరగనుంది. ఆరోజు పొత్తు గురించి రామదాస్ ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.

రంగులు మారుస్తున్న ఓపీఎస్

మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం డీఎంకేలో చేరిన నేపథ్యంలో తేని జిల్లా పెరియకుళంలోని ఆయన ఇంటికి డీఎంకే జెండా రంగులు వేయిస్తున్నారు. ఇంటి బయట ఇనుప గేటుకున్న రెండు ఆకుల చిహ్నాన్ని తొలగించి ఉదయసూర్యుడి చిహ్నం రూపొందిస్తున్నారు.
– ట్రిప్లికేన్, న్యూస్‌టుడే

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు ప్రారంభం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కింద రాష్ట్ర వ్యాప్తంగా 37,554 పాఠశాలలు నడుస్తున్నాయి. వీటిలో సుమారు 52 లక్షల మందికిపైగా విద్యార్థినీ విద్యార్థులు చదువుతున్నారు. ఈ క్రమంలో 2026-27 విద్యా సంవత్సరానికిగాను విద్యార్థుల ప్రవేశాలు ఆయా పాఠశాలల్లో సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం ముందుస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలలో ఐదేళ్లు దాటిన పిల్లలను సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా పాఠశాలలకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రవేశాలు పెంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించింది.

తన 72వ జన్మదినం సందర్భంగా ఆదివారం కరుణానిధి సమాధి వద్ద అంజలి ఘటిస్తున్న స్టాలిన్ ● కేక్ కోస్తున్న దృశ్యం

గల్ఫ్ దేశాల్లోని తమిళుల కోసం సహాయ నంబర్లు

చెన్నై, న్యూస్‌టుడే: యుద్ధ వాతావరణంతో గల్ఫ్ దేశాల్లో భయానక పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అక్కడి తమిళుల భద్రత దృష్ట్యా సహాయ నంబర్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త దాడిలో కువైట్, బహ్రెయిన్, ఒమన్, సౌదీ అరేబియా, ఖతర్ వంటి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. అక్కడ నివసిస్తున్న తమిళుల భద్రతపై ముఖ్యమంత్రి స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుని అవసరమైన సహాయాలు అందించడానికి రాష్ట్ర విదేశీ తమిళుల సంక్షేమం, పునరావాసశాఖకు తగిన సూచనలు చేశారు. దిల్లీలోని తమిళనాడు హౌస్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి పరిస్థితిని అధికారులు సమీక్షిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లోని తమిళులను సంప్రదించి వారి పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారికి ఏమైనా అత్యవసర సహాయం అవసరమైతే వారు, లేదా రాష్ట్రంలోని వారి కుటుంబ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ విదేశీ తమిళుల సంక్షేమ శాఖను 24 గంటలపాటు సంప్రదించేలా సహాయ నంబర్లను ప్రకటించారు. దిల్లీలోని కంట్రోల్ రూమ్‌ను 011-2419 3300, 92895 16712, విదేశీ తమిళుల సంక్షేమశాఖను భారతదేశంలో ఉన్న వారు 1800 309 3793, విదేశాల నుంచి +91 80690 09900 (మిస్డ్‌కాల్), +91 80690 09901 నంబర్లను సంప్రదించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

దుబాయ్‌లో అజిత్ సురక్షితం

చెన్నై: దుబాయ్‌లో నటుడు అజిత్‌కుమార్ సురక్షితంగా ఉన్నారని ఆయన మేనేజరు సురేశ్ చంద్ర తెలిపారు. కారు రేసులో పాల్గొనడానికి అజిత్‌కుమార్ దుబాయ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

చెన్నై విమానాశ్రయంలో వరుసలో నిలబడి ఉన్న ప్రయాణికులు

ఎమిరేట్స్ విమాన సేవలు రద్దు

అంతర్జాతీయ ప్రయాణికుల అవస్థ

వడపళని, న్యూస్‌టుడే: గల్ఫ్ దేశాల్లో యుద్ధ వాతావరణం నెలకొనడంతో చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎమిరేట్స్ విమాన సర్వీసులు ఆదివారం రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దుబాయ్, మిడిల్ ఈస్ట్ దేశాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు విమానాశ్రయంలోనే వేచి ఉన్నారు. యురోపియన్, దుబాయ్ మీదుగా ఇతర దేశాలకు కూడా విమాన సౌకర్యాలు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఎప్పటివరకు రద్దు చేస్తున్నారో కూడా తెలియక ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. దీంతో విమానాశ్రయ అధికారులు విమాన సంస్థల ఉన్నత ప్రతినిధులతో ప్రత్యామ్నాయాలపై చర్చిస్తున్నారు.

ఐయూఎంఎల్, ఎంఎంకేలకు రెండేసి చొప్పున సీట్లు

చెన్నై, న్యూస్‌టుడే: ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో కూటమి పార్టీలతో డీఎంకే సీట్ల సర్దుబాటు చర్చలు జరుపుతున్న విషయం తెలిసిందే. ఐయూఎంఎల్, ఎంఎంకేలతో చర్చలు ముగిసిన నేపథ్యంలో ఆ పార్టీలకు రెండేసి చొప్పున సీట్లను కేటాయించారు. దీనికి సంబంధించి ఐయూఎంఎల్ అధ్యక్షుడు ఖాదర్ మొహిదీన్, ఎంఎంకే అధ్యక్షుడు జవాహిరుల్లాతో స్టాలిన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. గత ఎన్నికల్లో ఐయూఎంఎల్‌కు 3 సీట్లను కేటాయించగా వాటన్నిటిలోనూ ఆ పార్టీ ఓడింది. ఆ ఎన్నికల్లోనూ ఎంఎంకేకు 2 సీట్లే కేటాయించారు.

ఒప్పంద పత్రాలతో ఖాదర్ మొహిదీన్, జవాహిరుల్లా, స్టాలిన్

వితంతువుల ఆదాయ పరిమితి రూ.8 వేలకు పెంపు

సైదాపేట, న్యూస్‌టుడే: ఎలాంటి ఆధారం లేని వితంతువుల ఆదాయ పరిమితి రూ.8 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి మానవ వనరుల నిర్వహణ విభాగం ముఖ్య కార్యదర్శి సమయమూర్తి విడుదల చేసిన ఆదేశాల్లో.. రాష్ట్రంలో నిరాధార వితంతువు సర్టిఫికెట్ పొందేందుకు నెలవారీ ఆదాయ పరిమితి 1993లో రూ.1000గా ఉందని, తర్వాత 2006లో రూ.4000కు పెరిగిందని, ప్రస్తుతం ధరల పెరుగుదల, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని 20ఏళ్ల తర్వాత రూ.8వేలకు పెంచినట్లు తెలిపారు. ఆ ప్రకారం కుటుంబ పింఛను, వ్యక్తిగత ఆదాయం సహా అన్ని వనరుల నుంచి వచ్చే నెలవారీ ఆదాయం రూ.8000కు మించకుండా ఉండాలని, భర్తను కోల్పోయిన మహిళలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. విడాకులు తీసుకున్న మహిళలు వితంతువుల విభాగంలోకి రారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు కేటాయించే 30శాతం రిజర్వేషన్‌లో 10శాతం వీరికి కేటాయిస్తారని వెల్లడించారు.

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యను నిరసిస్తూ చెన్నై రాయపేట పీటర్స్ సాలైలో ఉన్న షియా ముస్లింలు ఆదివారం యూఎస్ కాన్సులేట్ వరకు ర్యాలీ చేపట్టారు.



(c) eenadu

అరుణాచలేశ్వరుని సేవలో నటుడు శరత్‌కుమార్

శరత్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న వేదపండితులు

తిరువన్నామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయానికి ప్రముఖ తమిళ సినీనటుడు శరత్‌కుమార్ ఆదివారం విచ్చేశారు. ఆయనకు ఆలయ వేద పండితులు స్వాగతం పలికారు. తర్వాత ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రసాదాలు అందజేశారు.

కోవై-అబుదాబి విమాన సర్వీసు రద్దు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: గల్ఫ్ దేశాల్లో యుద్ధ వాతావరణ పరిస్థితుల కారణంగా ఆయా దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి. దీంతో కోయంబత్తూరు నుంచి అబుదాబికి నడిచే ఇండిగో విమాన సర్వీసును రద్దు చేశారు. ఈ కారణంగా శనివారం అబుదాబి వెళ్లే 160మందికి పైగా ప్రయాణికులు కోయంబత్తూర్ విమానాశ్రయానికి చేరుకుని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం కూడా విమానాన్ని రద్దు చేశారు. టికెట్ ఛార్జీలను ప్రయాణికులకు తిరిగి చెల్లిస్తామని సంస్థ పేర్కొంది.

జూ పార్కులో ఆకట్టుకునే ట్రీ పార్క్

మామల్లపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా వండలూర్‌లోని అరిజ్ఞర్ అన్నా జంతు ప్రదర్శనశాల ఆగ్నేయాసియాలో అతి పెద్దది. అత్యంత ఆధునిక జూలలో ఒకటి. ఇక్కడ ఏనుగుల సఫారీ, సీతాకోకచిలుకల పార్క్, చేపల మ్యూజియంతో పాటు అరుదైన పక్షులు, వన్యప్రాణులను అటవీ శాఖ తరఫున సంరక్షిస్తున్నారు. అయితే జూలో 'గ్రీన్ వరల్డ్' పేరుతో ఏర్పాటు చేసిన ట్రీ పార్క్ గురించి చాలామందికి తెలియదు. ఇది అటవీశాఖ పరిరక్షణలో ఉంది. సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ పార్క్‌కు ఫారెస్ట్ జెనెటిక్ రిసోర్సెస్ ట్రీ పార్క్ అని పేరు పెట్టారు. ఈ పార్క్‌ను వినోద ప్రదేశంగా కాకుండా వృక్ష శాస్త్ర విద్య కోసం బహిరంగ ప్రయోగశాలను అభివృద్ధి చేశారు. ఇది అరుదైన వైవిధ్యభరితమైన వృక్ష జాతులను సంరక్షించే ఓ ప్రత్యేకమైన పచ్చని ప్రదేశం. దీని గురించి అటవీశాఖ అధికారి శేఖర్ మాట్లాడుతూ.. 2018లో దాదాపు రూ.2కోట్ల వ్యయంతో ట్రీ ఫారెస్ట్‌ను ప్రారంభించామని తెలిపారు. ఇక్కడ 300కు పైగా వృక్ష జాతులు, వెదురు తోటలు, ఎర్రచందనం, ఎర్ర కలప, టేకు, పసుపు కదంబు, లవంగం చెట్లు, మర్రి చెట్లు, రకరకాల పండ్ల చెట్లు, వనమూలికల మొక్కలను పెంచుతున్నామని తెలిపారు.

పిల్లల ఆట స్థలం

సందర్శకులకు సకల సౌకర్యాలు

అంతేకాకుండా ట్రీ పార్క్‌ను సందర్శించేవారికి ఆహ్లాదాన్ని పంచేందుకు పిల్లలకు ఆట స్థలం, చెట్ల నీడన నడక మార్గాలు, సెల్ఫీ పాయింట్లు, ప్రత్యేకమైన సీటింగ్ ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. సందర్శకులకు శుద్ధి చేసిన తాగునీరు, మరుగుదొడ్లు, దివ్యాంగుల కోసం వీల్ ఛైర్లు, భద్రతకు సీసీ కెమెరాలు, డిజిటల్ చెల్లింపుల సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. పార్క్‌ను సందర్శించడానికి వీలుగా బ్యాటరీతో నడిచే వాహనాన్ని ఏర్పాటు చేశామని, కేవలం రూ.10కే వివిధ రకాల మూలికా మొక్కలను విక్రయానికి ఉంచామని తెలిపారు. ఈ జెనెటిక్ ట్రీ పార్క్ మంగళవారం మినహా మిగతా అన్నీ రోజుల్లో తెరచి ఉంటుందని తెలిపారు. ఎన్నో ప్రత్యేకతలు సంతరించుకున్న పార్క్ సందర్శనకు పెద్దలకు రూ.20, ఐదేళ్లకు పైబడిన పిల్లలకు రూ.5 రుసుములు వసూలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శనకు అనుమతి ఉంటుందని చెప్పారు. ఉదయం, సాయంత్రం వేళల్లో 2 గంటలపాటు వ్యాహ్యాళి(వాకింగ్)కి రూ.50 వసూలు చేస్తామని తెలిపారు.

ఫారెస్ట్ జెనెటిక్ రిసోర్స్ ట్రీ పార్క్

హిందూ కళాశాలలో 4న జాతీయ సదస్సు

గిండి, న్యూస్‌టుడే: చెన్నైలోని ధర్మమూర్తి రావుబహదూర్ కలవల కణ్ణన్ చెట్టి హిందూ కళాశాల, చెన్నపురి తెలుగు అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి దివంగత పరవస్తు చిన్నయసూరి జీవిత విశేషాలపై జాతీయ సదస్సు, 'చిన్నయసూరి వైదుష్యం' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం మార్చి 4న నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విశ్రాంత అదనపు ప్రధాన కార్యదర్శి కె.ఫణీంద్ర రెడ్డి పాల్గొననున్నారు. యోజన మాసపత్రిక సంపాదకులు నాగసాయి సూరి పరవస్తు, విశ్రాంత ప్రధాన అధ్యాపకులు డా.చింతలపాటి పూర్ణానంద శాస్త్రి అతిథులుగా పాల్గొని ప్రసంగిస్తారు. మొదటి సమావేశంలో డా.నిర్మలా పళనివేలు అధ్యక్షతన డా.వడ్లమాని కనకదుర్గ పత్ర సమర్పణ చేయనున్నారు. రెండో సదస్సులో విశ్రాంత తెలుగు ఉపాధ్యాయిని న్యూదిల్లీ కమలాకర రాజేశ్వరి అధ్యక్షతన విశ్రాంత ప్రిన్సిపల్ డా.అద్దంకి గాలిగుణశేఖర్ పత్ర సమర్పణ చేయనున్నారు. చెన్నపురి తెలుగు అకాడమీ తరఫున డా.తూమాటి సంజీవరావు, డా.తుమ్మపూడి కల్పన, హిందూ కళాశాల తెలుగు శాఖాధ్యక్షుడు డా.ముద్దులూరు సురేష్ తదితరులు హాజరవనున్నారు. కార్యక్రమానికి తెలుగు సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

మూడుచోట్ల ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూర్ జిల్లా పొళ్లాచ్చి సమీపం ఆనైమలై సేత్తుమడైలో ఏర్పాటు చేసిన అత్యాధునిక టెంట్ హాస్టల్‌ను ఆదివారం అటవీశాఖ మంత్రి రాజకణ్ణప్పన్ ప్రారంభించారు. తర్వాత తమిళనాడు ట్రెక్కింగ్ లోగోను ఆవిష్కరించారు. అటవీ ప్రాంతాల్లో కార్చిచ్చు నివారణకు అన్ని సౌకర్యాలతో కూడిన 35 కొత్త వాహనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అటవీశాఖ అదనపు కార్యదర్శి సుప్రియా సాహు, పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... ఆనైమలై టైగర్ రిజర్వ్, పొళ్లాచ్చి, సేత్తుమడై ఫారెస్ట్ రిజర్వులలో ప్రైవేటు సంస్థ తరఫున ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు చేశారని, ఆధునిక సౌకర్యాలతో ఐదు టెంట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు ఏకాంబరనాథర్ ఆలయంలో తిరువూరల్ ఉత్సవం

ఏలవార్ కుళలి సమేత ఏకాంబరనాథస్వామి

కాంచీపురం,న్యూస్‌టుడే: కాంచీపురం ఏకాంబనాథర్ ఆలయంలో 46ఏళ్ల తరువాత మాసి మహ తిరువూరల్ ఉత్సవాన్ని సోమవారం రాత్రి నిర్వహించనున్నారు. అనేక కారణాలతో ఈ ఉత్సవం 1980లో నిలిచిపోయింది. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారు జామున ఏలవార్ కుళలి సమేత ఏకాంబరనాథర్ ఉత్సవమూర్తులు ఆలయం నుంచి బయలుదేరుతారు. మధ్యాహ్నం 1 గంటకు తిరువళ్లూరు జిల్లా వెంబాక్కం తాలూకా చిట్టాళపాక్కం గ్రామంలోని దర్శలింగేశ్వర ఆలయానికి చేరుకుని భక్తులకు దర్శనమిస్తారు. దీపారాధన అనంతరం అక్కడి నుంచి 2 గంటలకు బయలుదేరి చెట్టితాంగళ్ గ్రామంలోని అరసంగుప్పం ఆలయానికి చేరుకుంటారు. అక్కడ మంగకపడి దీపారాధన నిర్వహిస్తారు. అక్కడ భక్తుల దర్శనానంతరం రాత్రి 11 గంటలకు అరసంగుప్పం వద్ద పాలార్ నదిలో తిరువూరల్ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అక్కడి నుంచి అర్ధరాత్రి దాటిన తరువాత బయలుదేరే స్వామి, అమ్మవార్లు మంగళవారం ఆలయానికి చేరుకుంటారు.

ఎన్డీయే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు

సైదాపేట, న్యూస్‌టుడే: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని తమిళనాడు భాజపా విభాగం తెలిపింది. భాజపా అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... ప్రధాని రాక సమయంలో ప్రజల దృష్టి మరల్చడానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో నల్ల జెండాలు ప్రదర్శించి ఆందోళన చేయడాన్ని ఖండించారు. నిజానికి కాంగ్రెస్ శ్రేణులు నల్ల జెండాలు ప్రదర్శించాల్సింది ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు వ్యతిరేకంగా అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎప్పుడో తమిళనాడు ప్రజలకు చాలా దూరంగా వెళ్లిందని తెలిపారు. భారతదేశంలో ఉండేందుకు కాంగ్రెస్‌కు అర్హత లేదని దేశ ప్రజలు నిర్ణయించారన్నారు. మదురైకి చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు డీఎంకేకు వ్యతిరేకంగా ఉన్నారని, ఇది గ్రహించి యువజన కాంగ్రెస్ పేరుతో సంఘ విద్రోహులతో ప్రధానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు చేయించారని పేర్కొన్నారు.

బీచ్ పరిశుభ్రతపై అవగాహన

మామల్లపురం, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రమైన మామల్లపురానికి పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారు. ఇక్కడి సీషోర్ టెంపుల్ ప్రాంతంలో ఉన్న సముద్ర తీరంలో ఉల్లాసంగా గడుపుతుంటారు. ఎప్పుడూ బీచ్ రద్దీగానే ఉంటుంది. ఈ క్రమంలో ప్లాస్టిక్ సీసాలు, సంచులు, ఇతరత్రా వస్తువులను బీచ్‌లో ఎక్కడపడితే అక్కడ పడేస్తూ తీరాన్ని అపరిశుభ్రం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్విరాన్‌మెంట్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (ఈటీఐ) తరఫున ఆదివారం వాలంటీర్లు బీచ్‌లో వ్యర్థాలు, చెత్త తొలగించారు. పర్యాటకులకు బీచ్ శుభ్రతపై అవగాహన కల్పించారు.

తీరంలో చెత్త సేకరిస్తున్న వాలంటీర్లు

18న మద్రాసు వర్సిటీలో ఉగాది వేడుకలు

టీనగర్, న్యూస్‌టుడే: మద్రాసు విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖ ఆధ్వర్యంలో మార్చి 18వ తేదీ ఉగాది వేడుకలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సంగీత, సాహిత్య, కళా విభాగాలకు సంబంధించిన వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ముఖ్యంగా తెలుగు సాహితీ ప్రియుల కోసం ప్రత్యేక కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న తెలుగు కవులు, కవయిత్రులు తమ పేర్లను 10వ తేదీలోగా నమోదు చేసుకోవాలని తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు కోరారు. మరిన్ని వివరాలకు తనను 94452 03041 నంబరును, డా.పాండురంగం కాళియప్పను 97018 69674 నంబరుపై సంప్రదించాలని సూచించారు.

సేలం ఆలయానికి చేరిన ఆదిపరాశక్తి భారీ పంచలోహ విగ్రహం

టీనగర్, న్యూస్‌టుడే: తమిళనాడులోని కుంభకోణంలో రూ.10 కోట్ల వ్యయంతో తయారైన భారీ ఆదిపరాశక్తి అమ్మవారి పంచలోహ విగ్రహం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 38 అడుగుల ఎత్తు(పీఠంతో కలిపి 51 అడుగుల ఎత్తు), 65 టన్నుల బరువు కలిగిన ఈ భారీ విగ్రహాన్ని సేలంలోని పనమరత్తుపట్టి ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించేందుకు శనివారం అక్కడికి తరలించారు. పనమరత్తుపట్టి ఆదిపరాశక్తి ఆలయ నిర్వాహకులు ఆర్డర్ చేసిన మేరకు తంజావూరులోని ప్రముఖ స్తపతి గోపి, ఆయన బృందానికి చెందిన 25 మంది సభ్యులు ఈ విగ్రహాన్ని గత నాలుగేళ్లుగా రూపొందించారు. బంగారం, వెండి, రాగి, సీసం, ఇనుముతో తయారు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం పనమరత్తుపట్టిలోని ఆదిపరాశక్తి ఆలయం వద్దకు చేరగా భక్తులు భారీగా తరలివచ్చి విగ్రహాన్ని తిలకించారు. త్వరలోనే వైభవంగా కుంభాభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రపంచంలోనే ఒకే అచ్చులో తయారైన అతి పెద్ద పంచలోహ విగ్రహం ఇదేనని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

విగ్రహాన్ని క్రేన్ల సాయంతో దించుతున్న దృశ్యం

ఎన్నికల్లో సొంత గుర్తుతోనే పోటీ

☛ తిరుమావళవన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సొంత గుర్తుతోనే పోటీ చేస్తామని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ పేర్కొన్నారు. దిండుగల్‌లో ఆదివారం జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ... డీఎంకే, కాంగ్రెస్ మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు ప్రశాంతంగా ముగుస్తాయని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. తిరుప్పరంకుండ్రం అయోధ్యగా మారడాన్ని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని చెప్పారు. రాష్ట్రంలో మతవాద రాజకీయాలకు చోటులేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టో తయారీకి త్వరలో కమిటీని ప్రకటిస్తామన్నారు. తమ కుండ గుర్తుకు ఎలాంటి సమస్య లేదన్నారు. ఈ ఎన్నికల్లో సొంత గుర్తుతోనే పోటీ చేస్తామన్నారు. మోదీ, అమిత్‌షా రాష్ట్రానికి రావడం కొత్తేమీ కాదన్నారు. ఎన్నికల సందర్భంగా వస్తునే ఉంటారన్నారు. కానీ ఇప్పటివరకు వారు ఆశించినదేదీ రాష్ట్రంలో జరగకపోవడం చేదు నిజం అన్నారు.

తిరుమావళవన్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

న్యాయవాదులు ఖైదీలను కలిసే సమయం పెంచాలి

☛ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు

ప్యారిస్, న్యూస్‌టుడే: పుళల్ జైల్లో ఖైదీలను కలిసే సమయాన్ని పెంచాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై లీగల్ సర్వీసెస్ అథారిటీ నివేదిక దాఖలు చేయాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. తమిళగన్ అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో... పుళల్ కేంద్ర కారాగారంలో వెయ్యి మందికి పైగా ఖైదీలు ఉన్నారని, వారికి చట్టపరంగా సాయం అందించేందుకు వసతులు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. ఖైదీలు చట్టపరమైన సాయం పొందేందుకు న్యాయవాదులను కలిసే సమయం చాలా తక్కువ అని తెలిపారు. అర్ధ గంటలో ఐదుగురు ఖైదీలను న్యాయవాదులు కలవాల్సిన పరిస్థితి నెలకొందని, చట్టపరమైన సూచనలు ఇవ్వడం కుదరట్లేదన్నారు. కావున న్యాయవాదులు కలిసే సమయాన్ని పెంచేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎం.శ్రీవాస్తవ, జస్టిస్ అరుళ్‌మురుగన్ ధర్మాసనంలో శనివారం విచారణకు వచ్చింది. విచారణ జరిపిన న్యాయమూర్తులు.. ఈ కేసులో లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీని ప్రతివాదిగా చేర్చుతున్నామని, ఆయన పిటిషనరు కోరికపై న్యాయవాదులతో చర్చించి నివేదిక దాఖలు చేయాలని ఆదేశించి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఒ.పన్నీర్‌సెల్వం ▸ సెల్వ పెరుంతగై ▸ వైగో ▸ తిరుమావళవన్

కుట్రలను ఏకమై తిప్పికొట్టాలి

జన్మదినం సందర్భంగా ప్రజలకు స్టాలిన్ పిలుపు

చెన్నై, న్యూస్‌టుడే: చుట్టుముడుతున్న కుట్రలను అందరూ ఏకమై తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయన తన జన్మదినం సందర్భంగా 'ఎక్స్'లో.. యుక్తవయసు నుంచి 73వ ఏడాది చూస్తున్న నేటి వరకు రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు సేవ చేయడమే తన జీవితకాల కర్తవ్యంగా వ్యవహరిస్తున్నానని తెలిపారు. ద్రావిడ మోడల్‌లో తమిళనాడును అగ్రరాష్ట్రంగా తీర్చిదిద్ది అభివృద్ధి పథంలో నడుపుతున్నామని తెలిపారు. ప్రపంచం తిరిగి చూసేలా దేశంలోని అత్యుత్తమ రాష్ట్రంగా మార్చామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో కోట్లాది మంది తలెత్తుకుని జీవిస్తున్నారని తెలిపారు. చుట్టుముడుతున్న కుట్రలను మేధోశక్తితో అందరూ ఏకమై తిప్పికొట్టాలని, ఇందుకోసం తనను పూర్తిగా అంకితం చేసుకుంటున్నానని తెలిపారు. ● చెన్నై: తన జన్మదిన వేడుకల సందర్భంగా స్టాలిన్ ఆదివారం ఉదయం మెరినా తీరంలోని దివంగత ముఖ్యమంత్రి అన్నాదురై, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సమాధులను సందర్శించి పుష్పాంజలి ఘటించారు. 105 మంది శుభ్రతా కార్మికులకు సాయం అందించారు. వేప్పేరిలోని పెరియార్ స్మారక ప్రదేశంలో అంజలి ఘటించారు. గోపాలపురం నివాసంలో తల్లి దయాళు అమ్మాళ్ ఆశీస్సులు పొందారు. అన్నా అరివాలయంలో నిర్వాహకుల మధ్య కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు రాజకీయ ప్రముఖులు పుష్పగుచ్ఛాలు, పుస్తకాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, తమిళ సినీ సూపర్‌స్టార్ రజనీకాంత్ తదితరులు ఫోన్ ద్వారా, గవర్నర్ ఆర్.ఎన్.రవి, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కమల్‌హాసన్ తదితరులు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు.

కార్యకర్తలు భారీ సంఖ్యలో రావడంతో అన్నా అరివాలయం వద్ద నిలిచిన వాహనాలు

అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా 3న ఆందోళనలు

చెన్నై, న్యూస్‌టుడే: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా రాష్ట్రంలోని ముఖ్యమైన నగరాల్లో ఆందోళనలు చేయనున్నట్లు కమ్యూనిస్టు పార్టీలు, వీసీకే ఉమ్మడిగా ప్రకటించాయి. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్, వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్, సీపీఐ (ఎం.ఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఆశైతంబి సంయుక్తంగా ఆదివారం ప్రకటన విడుదల చేశారు. అందులో... ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడి ఖండించదగిందని పేర్కొన్నారు. ఈ చర్యలు ఇరాన్ జాతీయ సార్వభౌమత్వాన్ని, ఐక్యరాజ్య శాసనం, అన్ని అంతర్జాతీయ ఒప్పందాలను ధిక్కరించడమేనని తెలిపారు. ఈ యుద్ధం పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తత, భీతిని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది భారతీయుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ఖండించాలని, పశ్చిమాసియా, గల్ఫ్ దేశాల్లో జీవనాధారం పొందిన భారతీయుల భద్రతను ధ్రువీకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మంగళవారం చెన్నై, కోయంబత్తూర్, మదురై, తిరునెల్వేలి, తిరువారూర్ నగరాల్లో ఆందోళనలు చేయనున్నట్లు ప్రకటించారు.

చెంగల్పట్టు జిల్లాలో 19 మంది తహసీల్దార్ల బదిలీ

మామల్లపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లాలో ఒకే ప్రాంతంలో 3ఏళ్లకు పైగా పనిచేస్తున్న 19 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ మాలతీ హెలెన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో.. జిల్లాలోని తిరుక్కళికుండ్రం, తిరుప్పోరూర్, వండలూర్, తాంబరం, పల్లావరం, తాలూకాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లతో పాటు వ్యక్తిగత తహసీల్దార్లు, నలుగురు డిప్యూటీ తహసీల్దార్లను ఎన్నికలు, పరిపాలన కారణాల వలన వేర్వేరు తాలూకాలకు బదిలీ చేస్తున్నట్లు తెలిపారు.

ఈసీఆర్ బీచ్‌లలో పెరిగిన ప్రమాదాలు

☛ నియంత్రణకు పోలీసుల చర్యలు ☛ భద్రతా మార్గదర్శకాలు జారీ

మామల్లపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లాలోని ప్రధాన మార్గమైన ఈస్ట్ కోస్ట్ రోడ్డు(ఈసీఆర్)లోని బీచుల్లో ఇటీవలి కాలంలో ప్రమాదాలు అధికమవుతున్నాయి. మరణాల రేటును తగ్గించడానికి తాంబరం పోలీస్ కమిషనరేట్ భద్రతా మార్గదర్శకాలను ఆదివారం విడుదల చేసింది. ఆ మేరకు గత కొన్ని రోజులుగా ఈసీఆర్‌లోని సముద్ర తీరాల్లో సరదాగా గడపడానికి వెళ్లి సముద్రపు అలల్లో చిక్కుకొని మృతి చెందుతున్నవారి సంఖ్య పెరుగుతోందని తెలిపింది. ఆ క్రమంలో 2025 జనవరి నుంచి 2026 ఫిబ్రవరి వరకు గానాత్తూర్ నుంచి నైనార్‌కుప్పం వరకు ఉన్న బీచుల్లో స్నానానికి దిగి 17 మంది యువకులు మృతి చెందారని వివరించింది. సెలవు రోజుల్లో వచ్చే యువకులు ముందస్తు జాగ్రత్తలు లేకుండా సముద్రంలో దిగి లోతైన ప్రాంతంలో అలల్లో చిక్కుకొని ప్రమాదాల బారినపడి మృతి చెందుతున్నారని తెలిపింది. ఈ ప్రమాదాల నియంత్రణకు గానాత్తూర్, కోవళం, ముట్టుక్కాడు, ఉద్దండి, రెడ్డికుప్పం, నైనార్‌కుప్పం తీర ప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు స్నానానికి దిగకూడదని, పర్యాటకులు సముద్రంలోకి దిగే సమయంలో అక్కడ విధుల్లో ఉన్న లైఫ్ గార్డులను సంప్రదించి ఏ ప్రాంతంలో ఎంత లోతు ఉందో అడిగి తెలుసుకోవాలని, పోలీసులు ప్రమాదమని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో దిగకూడదని సూచించింది. ఎర్ర జెండా ఉన్న ప్రాంతాలు ప్రమాదకరమైనవని, కావున ఆ ప్రాంతాల్లో సముద్రంలోకి దిగకూడదని, అలలు వచ్చేటప్పుడు పర్యాటకులు, యువకులు సెల్ఫీలు దిగడం మానుకోవాలని హితవుపలికింది. మద్యం సేవించి సముద్రంలోకి దిగకూడదని, చిన్నపిల్లలను తీసుకెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ఒకవేళ అత్యవసర పరిస్థితులు ఏర్పడితే సమీపంలో ఉన్న పోలీసులకు వెంటనే తెలియజేయాలని, 100, 112, 101 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొంది. తీర ప్రాంతాల్లో పోలీసుల గస్తీని ముమ్మరం చేసినందున పోలీసులు విధించే నిబంధనలను అతిక్రమించి సముద్రంలో దిగేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

తిరువొత్తియూర్ బోట్ హౌస్ ప్రారంభం

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై తిరువొత్తియూర్‌లోని అన్నై శివకామి నగర్‌లో రూ.4.62 కోట్ల వ్యయంతో బోట్ హౌస్‌ను ఏర్పాటు చేశారు. దీనిని ఆదివారం చెన్నై మహానగర పాలకసంస్థ మేయర్ ప్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా బోటింగ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుదర్శనం, కార్పొరేషన్ కమిషనరు జె.కుమరగురుభరన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బోటులో విహరిస్తున్న మేయర్ ప్రియ తదితరులు

విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి సమీపం కవరప్పేటలోని ఆర్ఎంకే ఇంజినీరింగ్ కళాశాలలో ఇండియన్ రాకెట్ సైన్స్‌పై సదస్సు ఆదివారం నిర్వహించారు. ఆర్ఎంకే విద్యా సంస్థల ఉప ఛైర్మన్ కిషోర్ అధ్యక్షత వహించారు. పద్మభూషన్ పురస్కార గ్రహీత, బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ వ్యవస్థాపకుడు శివథాను పిళ్లై ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన దేశాన్ని 2047లో అగ్రరాజ్యంగా మార్చేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. ఇటీవల పాకిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడానికి బ్రహ్మోస్ క్షిపణులు ప్రధాన పాత్ర పోషించాయని తెలిపారు. సదస్సులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 170 పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో చెన్నై తాంబరానికి చెందిన సాయిరాం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సరికొత్త ఆవిష్కరణలకు ప్రథమ బహుమతి లభించింది. ఇస్రో శాస్త్రవేత్త గోకుల్, ప్రిన్సిపల్ మహ్మద్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.

సాయిరాం పాఠశాల ప్రిన్సిపల్‌కు బహుమతి అందిస్తున్న శివథాను పిళ్లై

అన్నా కల్యాణ మండపం ప్రారంభిస్తున్న ఉదయనిధి

పూర్తయిన ప్రాజెక్టులను ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నైలోని పలు ప్రాంతాల్లో పూర్తయిన ప్రాజెక్టులను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ శనివారం ప్రారంభించారు. ఆ మేరకు చెన్నై థౌజండ్ లైట్స్ నియోజకవర్గం పరిధిలోని వళ్లువర్‌కోట్టం హైరోడ్డులో పాలసీ అండ్ గవర్నెన్స్ అభ్యాస కేంద్రం, రామా వీధిలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో అదనపు భవనం, నూర్‌వీరాసామి వీధిలో మహిళా ఆరోగ్య కేంద్రం, వళ్లలార్ వీధిలో పేరఱిఞర్ అన్నా కల్యాణ మండపం, అన్నానగర్ నియోజకవర్గంలోని అమైందకర్రై మాధ్యమిక పాఠశాలలో అదనపు భవనం, థౌజండ్ లైట్స్ నియోజకవర్గ పరిధిలోని తేనాంపేట అన్నాసాలైలో కాలుష్య నియంత్రణ మండలి తరఫున ఏర్పాటైన సామాజిక న్యాయ పార్కుని ఉదయనిధి స్టాలిన్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో మేయర్ ప్రియ, ఎంపీ దయానిధి మారన్, ఎమ్మెల్యేలు ఎళిలన్, మోహన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రైళ్ల సమాచారం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై ఎగ్మోర్ స్టేషనులో 10, 11 ప్లాట్‌ఫారాలపై జరుగుతున్న పునరుద్ధరణ పనుల కారణంగా పలు రైళ్లు టెర్మినల్, బయలుదేరు సమయంలో మార్పులు జరిగాయని దక్షిణ రైల్వే ప్రకటనలో పేర్కొంది.
● 12661 చెన్నై ఎగ్మోర్-సెంగోట్టై పొదిగై ఎక్స్‌ప్రెస్ మార్చి 2 నుంచి మార్చి 16వ తేదీ వరకు తాంబరం టెర్మినల్‌గా నడుస్తుంది. ఈ రైలు తాంబరంలో 20.05కి బయలుదేరుతుంది. ● 12632 తిరునెల్వేలి-ఎగ్మోర్ నెల్లై ఎక్స్‌ప్రెస్ మార్చి 1 నుంచి మార్చి 15వ తేదీ వరకు తాంబరానికి 06.25 గంటలకు చేరుకుంటుంది.

మెము సర్వీసుల్లో...

తిరుపతి స్టేషనులో జరుగుతున్న పనుల కారణంగా అన్‌రిజర్వ్‌డ్ మెము రైళ్లకు తాత్కాలికంగా టెర్మినల్‌లో చేసిన మార్పులను మార్చి 1 నుంచి మే 30వ తేదీ వరకు పొడిగించినట్టు దక్షిణ రైల్వే పేర్కొంది. ● 66043 అరక్కోణం-తిరుపతి మెము 09.15 రైలు తిరుచానూరుకు 11.45కి చేరుతుంది. ● 66070 తిరుపతి-ఎంఎంసీ మెము 13.25 రైలు తిరుచానూరులో 13.30కి బయలుదేరుతుంది. ● 66069 ఎంఎంసీ-తిరుపతి మెము 09.50 రైలు తిరుచానూరుకి 13.45కి వెళ్తుంది. ● 66044 తిరుపతి-అరక్కోణం మెము 15.40 రైలు తిరుచానూరులో 15.50కి బయలుదేరుతుంది.

ప్రత్యేక రైలుకి బోగీల్లో మార్పు...

06019/06020 డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-హజరత్ నిజాముద్దీన్-డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఒక ఫస్ట్ క్లాస్ కమ్ ఏసీ టూ టైర్, 3 ఏసీ టూ టైర్, 2 ఏసీ త్రీ టైర్, 10 స్లీపర్, 2 జనరల్ బోగీలు, దివ్యాంగులకు 2 బోగీలతో నడుస్తుంది. చెన్నై సెంట్రల్ మార్చి 2 నుంచి 9, హజరత్ నిజాముద్దీన్‌లో మార్చి 5 నుంచి 12వరకు బోగీలు అమల్లో ఉంటాయి.

హోలీ ప్రత్యేకం...

● 06005 చెన్నై ఎగ్మోర్‌లో మార్చి 3న 23.55కు బయలుదేరి నాలుగో రోజు 04.45కి జైసల్మేర్ చేరుతుంది. ● 06006 జైసల్మేర్‌లో మార్చి 8వ తేదీ 23.30కి బయలుదేరి నాలుగో రోజు 05.00 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. రిజర్వేషన్లు అందుబాటులో ఉన్నాయి.

సత్యజ్ఞాన సభలో జ్యోతి దర్శనం

వేళచ్చేరి: కడలూర్ జిల్లా వడలూర్ సత్యజ్ఞాన సభలో ప్రతి నెలా పూస నక్షత్రం రోజున జ్యోతి దర్శన కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తారు. ఆ క్రమంలో ఈ నెలకుగాను శనివారం పూస నక్షత్రం కావడంతో రాత్రి 7.45 గంటలకు జ్యోతి దర్శనాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని జ్యోతిని దర్శించుకున్నారు.

తమిళుల భద్రతను నిర్ధారించాలి

సైదాపేట, న్యూస్‌టుడే: తూర్పు మధ్య దేశాల్లో ఉన్న తమిళుల భద్రతను నిర్ధారించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి కోరారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల దృష్ట్యా అక్కడ నివసించే, పనిచేసే భారతీయులు, తమిళులు సురక్షితంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అక్కడుండే తమిళుల భద్రతను నిర్ధారించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

(c) eenadu

వేదికపై చిత్రబృందం

కథ బలంగా ఉంటే స్టార్లు అవసరం లేదు

హారిస్ జయరాజ్

చెన్నై, న్యూస్‌టుడే: విజయ్ దర్శకత్వంలో రూపొందిన 'కాదల్ రీసెట్ రిపీట్' ఈ నెల 6న విడుదల కానున్న సందర్భంగా ముందస్తు విడుదల కార్యక్రమాన్ని చెన్నైలో నిర్వహించారు. చిత్రపరిశ్రమలో రజతోత్సవాన్ని చూస్తున్న సంగీత దర్శకుడు హారిస్ జయరాజ్‌ను సత్కరించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హారిస్ జయరాజ్ మాట్లాడుతూ... 'మిన్నలే' చిత్రంలో నిర్మాత మాత్రమే స్టార్ అని, తనతో సహా అందరూ కొత్తవారేనని తెలిపారు. కథ బలంగా ఉంటే చిత్రానికి ఎలాంటి స్టార్లు అవసరంలేదని పేర్కొన్నారు. 'మిన్నలే' చిత్రానికి కొత్త గాయకులను పరిచయం చేశానన్నారు. ఇప్పటివరకు 64 మంది కొత్త గాయకులను పరిచయం చేయగా 65వ గాయని గాయత్రి రాజా అని తెలిపారు. 12 మంది నూతన కథానాయకులకు సంగీతం అందించానని, సంగీతం, గేయరచన బాగుంటే హీరోలను అవే స్టార్లను చేస్తాయని పేర్కొన్నారు. ఈ చిత్రంలో మలయాళ దర్శకుడు వినీత్‌ను గాయకుడిగా పరిచయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిత్రం నటులు మధుంకేశ్, జియా శంకర్, అర్జున్ అశోకన్, ఎం.ఎస్. భాస్కర్, జయప్రకాశ్, విజీ చంద్రశేఖర్, చిత్ర దర్శకుడు విజయ్, దర్శకులు బాలా, గణేశ్ కె.బాబు, సినీ గేయరచయిత మదన్ కార్కి, నిర్మాత ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీఆర్ చిత్రంపై అశ్వద్ మారిముత్తు అప్డేట్

అశ్వద్ మారిముత్తు పంచుకున్న ఫొటో

చెన్నై: 'డ్రాగన్' చిత్రం తర్వాత శింబు చిత్రానికి అశ్వద్ మారిముత్తు దర్శకత్వం వహించనున్నారు. దీనిని జీవీస్ నిర్మాణ సంస్థ నిర్మించనుంది. దీని చిత్రీకరణ ప్రారంభంలోనే జాప్యం జరగడంతో 'అరసన్' చిత్రంలో శింబు నటిస్తున్నారు. దీంతో అశ్వద్ మారిముత్తు చిత్రాన్ని ఆయన వదులుకున్నట్లు ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో నిర్మాత అర్చన, శింబుతో ఉన్న ఫొటోను అశ్వద్ మారిముత్తు తన 'ఎక్స్‌'లో పంచుకోవడంతో పాటు శింబు చిత్రాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు అప్డేట్ చేశారు.

అన్బే డయానా టైటిల్ టీజర్ విడుదల

చెన్నై: 'జమా' ఫేమ్ పారి ఇళవళగన్, రమ్య రంగనాథన్ జంటగా నటించిన చిత్రం 'అన్బే డయానా'. నార్త్ చెన్నైలోని పెరంబూర్‌ను నేపథ్యంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం బాధ్యతలను పారి ఇళవళగన్ చేపట్టారు. చిత్రం టైటిల్ టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నార్త్ చెన్నైకు సంబంధించిన మాండలికంలోని డైలాగ్‌లు టీజర్‌లో చోటుచేసుకున్నాయి.

చెన్నైలో ప్రధానికి వీడ్కోలు

పరస్పర అభివాదం చేసుకుంటున్న మోదీ, తంగం తెన్నరసు

చెన్నై, న్యూస్‌టుడే: పుదుచ్చేరి, మదురైలో పర్యటన నిమిత్తం చెన్నై విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి ఆదివారం చెన్నై నగరంలో వీడ్కోలు పలికారు. పుదుచ్చేరి, మదురైలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి శనివారం రాత్రి ప్రధాని మోదీ చెన్నై చేరుకుని లోక్‌భవన్‌లో బస చేశారు. ఆదివారం ఉదయం పుదుచ్చేరి బయలుదేరిన ఆయనకు చెన్నై విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రి తంగం తెన్నరసు వీడ్కోలు పలికారు. వెంట చెన్నై మహానగర పాలక సంస్థ మేయర్ ప్రియ ఉన్నారు.

తమిళనాడు తీర గస్తీ దళం, క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ సంయుక్తంగా చెన్నై మెరినాలో 'మెరినా ఓషన్ ఛాలెంజ్' పేరుతో ఓపెన్ స్విమ్మింగ్ మారథాన్ ఆదివారం నిర్వహించాయి. ఇందులో క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ తరఫున శిక్షణ పొందుతున్న బాలబాలికలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సైదాపేట

పలు రైళ్ల దారి మళ్లింపు

వడపళని, న్యూస్‌టుడే: దుర్గాపూర్ బదులుగా ఆండాళ్ వద్ద అన్ని లోకో మోటివ్ రివర్సల్ కారణంగా ఈశాన్య రైల్వే సేవలను మళ్లించేందుకు ప్రకటన జారీ చేసింది. ఆ మేరకు అసన్‌సోల్ డివిజన్‌లో మార్చి 31వ తేదీ వరకు పలు రైళ్ల దారి మళ్లింపును పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఆదివారం ప్రకటనలో తెలిపింది. ★ **15629** తాంబరం-సిల్చాట్ టౌన్ నాగోన్ ఎక్స్‌ప్రెస్ మార్చి 2, 9, 16, 23, 30 తేదీలు 18.40కి బయలుదేరే రైలు అసన్‌సోల్, ఆండాళ్, సైంథియా మీదుగా వెళ్తుంది. ★ **15630** సిల్చాట్ టౌన్-తాంబరం 6, 13, 20, 27 తేదీలు 10.50 రైలు సైంథియా, ఆండాళ్, అసన్‌సోల్ మార్గంగా దారి మళ్లింది. * **15929** తాంబరం-న్యూ టిన్‌సుకియా 5, 12, 19, 26 తేదీలు 18.40 రైలు అసన్‌సోల్, ఆండాళ్, సైంథియా మార్గంగా వెళ్తుంది. ★ **15930** న్యూ టిన్‌సుకియా-తాంబరం 2, 9, 16, 23, 30 తేదీలు 06.30 రైలు సైంథియా, ఆండాళ్, అసన్‌సోల్ మీదుగా పయనిస్తుంది. ★ **అదనపు హాల్ట్...** అట్టుక్కల్ భగవతి ఆలయంలో 'పొంగల్' వేడుకలను పురస్కరించుకుని **12624** తిరువనంతపురం సెంట్రల్-చెన్నై సెంట్రల్ (వయా కోట్టయం), 12696 తిరువనంతపురం సెంట్రల్-చెన్నై సెంట్రల్ 3వ తేదీ రైలు 'తిరువనంతపురం పేట్ట' స్టేషనులో ఒక నిమిషం ఆగుతుంది.

డీఎంకే కూటమికి ఓటమి తప్పదు: తమిళిసై

ప్యారిస్, న్యూస్‌టుడే: డీఎంకే కూటమికి ఓటమి తప్పదని భాజపా సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. మదురై విమానాశ్రయంలో ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... ఎవరు వచ్చినా స్వాగతం పలకడమే తమిళనాడు సంస్కృతి అని, శనివారం రాష్ట్రానికి విచ్చేసిన ప్రధానికి ముఖ్యమంత్రి స్వాగతం పలకడానికి ఇబ్బందేంటని ప్రశ్నించారు. ఆయన రాజకీయ నేతగా రాలేదని, మంచి పథకాలను ప్రారంభించేందుకు వచ్చారని తెలిపారు. ఇదే విధంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవర్తించారని, ఇప్పుడు ఆయన ఇంట్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. వ్యక్తిగత కక్ష సాధింపు సంస్కృతికి ముగింపు పలకాలని చెప్పారు. కూటమి పార్టీలను డీఎంకే గుర్తుపై పోటీ చేయాలని బలవంతం చేస్తున్నారని ఆరోపించారు.

పరీక్షలు బాగా రాయాలని ప్రత్యేక పూజలు

టీనగర్, న్యూస్‌టుడే: పది, ప్లస్‌టూ వార్షిక పరీక్షలు రాయనున్న విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరుతూ సేలం జిల్లా దాదగాపట్టిలోని ప్రసిద్ధ అరుల్మిగు శ్రీ పాండురంగనాథర్ ఆలయంలో ఆదివారం టీవీకే తరఫున ప్రత్యేక పూజలు జరిపారు. పార్టీ సేలం సెంట్రల్ జిల్లా విభాగం ఆధ్వర్యంలో శ్రీ హయగ్రీవ విద్యా మహా హోమం నిర్వహించారు. పార్టీ సేలం సెంట్రల్ జిల్లా కార్యదర్శి తమిళన్ పార్తిబన్ నేతృత్వంలో పార్టీ వర్గీయులు అనేకమంది పాల్గొన్నారు.

ఘనంగా స్టాలిన్ జన్మదిన వేడుకలు

గుమ్మిడిపూండి: స్టాలిన్‌కు పుస్తకం అందిస్తున్న సీహెచ్ శేఖర్

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణం, నెమిలి పట్టణాల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ 73వ జన్మదిన వేడుకలను ఆదివారం నిర్వహించారు. అరక్కోణం పట్టణంలో డీఎంకే పట్టణ మాజీ ఉప కార్యదర్శి ఎస్.మణి నేతృత్వంలో పేదలకు వస్త్రాలు అందజేసి అన్నదానం చేశారు. నెమిలి సమీపం సైనాపురం వద్ద తూర్పు జిల్లా కార్యదర్శి ఎస్‌జీసీ పెరుమాళ్ నేతృత్వంలో వేడుకలు జరిగాయి. నెమిలి పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు వడివేలు నేతృత్వంలో నెమిలి బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆర్.గాంధీ పాల్గొని క్రీడాకారులకు ఉపకరణాలు అందజేశారు. పాల్గొన్న మహిళలకు అన్నదానం చేశారు. **గుమ్మిడిపూండి:** తిరువళ్లూర్ జిల్లా ఊత్తుకోట, పెరియపాళ్యం, గుమ్మిడిపూండి, పొన్నేరి, రెడ్‌హిల్స్ తదితర ప్రాంతాల్లో నిరుపేదలకు అన్నదానం చేసి మిఠాయిలు పంచి పెట్టారు. గుమ్మిడిపూండి మాజీ ఎమ్మెల్యే సీహెచ్ శేఖర్ చెన్నైలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి పెరియార్‌కు సంబంధించిన పుస్తకాన్ని అందజేశారు.

క్రీడాకారులకు ఉపకరణాలు అందజేస్తున్న మంత్రి ఆర్.గాంధీ

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: పది, ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలను ఆత్మవిశ్వాసంతో రాయాలంటూ విద్యార్థులకు ముఖ్యమంత్రి స్టాలిన్ సూచించారు. ఆయన తన 'ఎక్స్‌'లో... ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు సోమవారం, పదో తరగతి పబ్లిక్ పరీక్షలు 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని, ఏడాది పొడవునా ఉత్సాహంగా చదివిన విద్యార్థులు 'నాకు సాధ్యమే' అనే మంత్రాన్ని మనసులో ఉంచుకుని పరీక్షలు రాయాలన్నారు. స్పష్టత, మానసిక స్థైర్యం, నిబ్బరం ఉంటే పరీక్షల్లో భయం అవసరంలేదని, పరీక్షలను పూర్తి ఏకాగ్రతతో రాయాలని సూచించారు. శ్రమకు తగిన ఫలితాన్ని కచ్చితంగా పొందుతారని తెలిపారు. విద్యార్థుల ఉన్నతే రాష్ట్ర అభివృద్ధి అన్నారు. పరీక్షలు రాయనున్న విద్యార్థులందరూ ఉత్తీర్ణులు కావాలంటూ శుభాకాంక్షలు తెలిపారు.

తమిళుల భద్రతకు చర్యలు చేపట్టండి

చెన్నై, న్యూస్‌టుడే: గల్ఫ్ దేశాల్లోని తమిళుల భద్రతకు చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డీఎండీకే ప్రధానకార్యదర్శి ప్రేమలత కోరారు. ఆమె తన ప్రకటనలో... గల్ఫ్ దేశాల్లో చోటుచేసుకున్న ఉద్రిక్తత పరిస్థితుల దృష్ట్యా అక్కడ నివసిస్తున్న, ఉద్యోగం చేస్తున్న తమిళులు సహా భారతీయులు సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు. అక్కడ నివసించే తమిళుల భద్రతకు అవసరమైన, తగిన చర్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని కోరారు.

శ్రీవారి సేవలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి

ఆలయం ఎదుట జస్టిస్ జి.జయచంద్ర దంపతులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.జయచంద్ర దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

హిందీకి వ్యతిరేకంగా నిరసన

నినాదాలు చేస్తున్న దృశ్యం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా రైల్వే స్టేషన్లలో ఉన్న హిందీ పేర్లను వ్యతిరేకిస్తూ, వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ మే 17 ఉద్యమం తరఫున కోయంబత్తూర్ రైల్వేస్టేషన్ ఎదుట ఆదివారం నిరసన జరిగింది. ఇందులో ఉద్యమ సమన్వయకర్త తిరుమురుగన్ గాంధీ, తంథై పెరియార్ ద్రావిడ కళగం ప్రధాన కార్యదర్శి రామకృష్ణన్, ఎండీఎంకే సహా వివిధ ద్రావిడ ఉద్యమాల సభ్యులు పాల్గొన్నారు. తమిళ భాషకు మద్దతుగా, హిందీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బాక్సింగ్ పోటీలు ప్రారంభం

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా మీంజూరు సమీపం అత్తిపట్టులో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. తమిళనాడు బాక్సింగ్ ఫెడరేషన్ ఛైర్మన్ పొన్‌భాస్కర్ ప్రారంభించారు. మంగళవారం వరకు పోటీలు జరుగనున్నాయి. మొత్తం 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. విజేతలకు నగదు బహుమతితో పాటు కప్పు అందజేస్తామని మాస్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ లోకేష్ తెలిపారు.

వైగోకి రాజ్యసభ సీటు దక్కేనా?

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రానికి చెందిన ఆరుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ఏప్రిల్ 2వ తేదీతో పూర్తవుతుంది. ఈ స్థానాలకు మార్చి 16వ తేదీ ఎన్నికలు జరుపనున్నట్లు ప్రకటించారు. గత రాజ్యసభ ఎన్నికల సమయంలో డీఎంకే కూటమిలోని ఎండీఎంకేకి ఒక సీటు కేటాయించారు. అప్పుడు మౌఖికంగా ఎండీఎంకేకి, ముఖ్యంగా వైగోకి రాజ్యసభ సీటు కేటాయించనున్నట్లు డీఎంకే చెప్పింది. కానీ, అలా జరగలేదు. ముందస్తు ఒప్పందం ప్రకారం ఎంఎన్‌ఎం అధ్యక్షుడు కమల్‌హాసన్‌కి కేటాయించారు. దీంతో వైగో, దురై వైగో బహిరంగంగా అసంతృప్తి తెలియజేశారు. ఈ నేపథ్యంలో మూడోసారైనా రాజ్యసభ సీటు దక్కుతుందో లేదో అని ఎండీఎంకే గుబులు పడుతోంది. ఒకవేళ రాజ్యసభ సీటు కేటాయిస్తే శాసనసభ ఎన్నికలలో గత ఎన్నికల్లోలా తక్కువ సీట్లు కేటాయించనున్నట్లు డీఎంకే తెలిపినట్లు తెలుస్తోంది. దీని గురించి కొందరు ఎండీఎంకే నిర్వాహకులు మాట్లాడుతూ.. ఎండీఎంకే రాష్ట్ర పార్టీ హోదా పొందడానికి శాసనసభ ఎన్నికల్లో 12 స్థానాలలో పోటీ చేయాలని డీఎంకేకి తెలిపినట్లు గుర్తు చేశారు. కానీ, ప్రస్తుత పరిస్థితులలో 6 సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారని చెప్పారు. ఈలోగా రాజ్యసభ ఎన్నికలు వస్తున్నందున గతంలో చేజారిన అవకాశం ఈసారి దక్కించుకోవాలని చూస్తున్నామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

మామల్లపురం, న్యూస్‌టుడే: చెన్నై రాయపురానికి చెందిన బాలాజీ(21), పెరుంగుడి ప్రాంతానికి చెందిన కార్తికేయన్(20) స్నేహితులు. ఇద్దరూ శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై చెన్నై నుంచి ఈస్ట్ కోస్ట్ రోడ్డులో పుదుచ్చేరికి బయలుదేరారు. చెంగల్పట్టు జిల్లా కూవత్తూర్ బస్టాండు వద్ద ఎదురుగా టమాటా లోడుతో వచ్చిన మినీ వ్యాన్ ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందారు. కూవత్తూర్ పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు జరుపుతున్నారు.

నీటి గుంతలో పడి ఇద్దరు బాలురు...

ధరణీష్, హరిహరన్

ఆర్కేనగర్: తిరుప్పూర్ జిల్లా అవినాశి సమీపం ఆనందగిరి ప్రాంతానికి చెందిన ధరణీష్(11) కడలూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన తిరుమురుగన్ కుమారుడు హరిహరన్(8) ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. ఇద్దరు బాలురు శనివారం పాఠశాలలకు సెలవు కావడంతో ఆడుకునేందుకు బయటకు వెళ్లారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల గాలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అవినాశి సమీపం నంబియంపాళ్యం వద్ద నీటి గుంతలో ఆదివారం ఇద్దరు బాలుర మృతదేహాలు తేలుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాలు ధరణీష్, హరిహరన్‌గా గుర్తించి వెలికితీసి పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో డీఎంకే నిర్వాహకుడు...



ప్రమాదానికి గురైన కారు

అరక్కోణం: సేలం జిల్లా ఓమలూరు సమీపం డీఎంకే కరియంపట్టి వెస్ట్ యూనియన్ కార్యదర్శి పెరుమాళ్, డీఎంకే కరియంపట్టి నగర కార్యదర్శి ప్రభాకరన్, కరియంపట్టి తూర్పు యూనియన్ కార్యదర్శి అరివళగన్, యూనియన్ డిప్యూటీ కార్యదర్శి లక్ష్మణన్ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి పార్టీ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేసేందుకు ఆదివారం రాత్రి కారులో కరియంపట్టి నుంచి చెన్నై బయలుదేరారు. మార్గంమధ్యలో తిరుపత్తూరు జిల్లా ఆంబూరు కీల్మురుంగై వద్ద బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో వెళ్తుండగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ప్రమాదంలో అందులో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కారులో చిక్కుకున్న వారిని బయటకు తీసి ఆంబూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణన్ మృతి చెందారు. మిగిలిన ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని కళాశాల విద్యార్థి...

రెడ్‌హిల్స్: చెన్నై కొరుక్కుపేట నేతాజీ నగర్‌కు చెందిన ఇంతియాజ్(18) మధురవాయల్‌లోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతను శనివారం రాత్రి తిరువళ్లూర్ జిల్లా రెడ్‌హిల్స్ సమీపం కళ్లికుప్పంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రెడ్‌హిల్స్ పోలీసులు కళ్లకురిచ్చికి చెందిన లారీ డ్రైవర్ సెంథిల్ కుమార్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో ఐదుగురి అరెస్టు

నిందితులు కుమార్, మునియసామి, నెల్లైయప్పన్

ప్యారిస్, న్యూస్‌టుడే: తూత్తుకుడి జిల్లా కోవిల్పట్టికి చెందిన మారిముత్తు(18) ఎలక్ట్రీషియన్. ఇతను గత గురువారం రాత్రి తన స్నేహితులతో మాట్లాడుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి కోవిల్పట్టిలోని ఓ పాఠశాలలో 10, ప్లస్‌వన్ చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన గొడవ రెండు వర్గాల ఘర్షణగా మారిందని, దీంతో హత్య జరిగినట్లు తెలిసింది. ఈ కేసులో కుమార్, మునియసామి, నెల్లైయప్పన్, ఇద్దరు బాలురను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నారు.

మహిళను చంపిన ప్రియుడు...

గిండి: చెన్నై అయనంబాక్కం చెరువు ఒడ్డున గత నెల 26న ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు తిరువేర్కాడు పోలీసులకు సమాచారం అందింది. అక్కడకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు. మృతురాలు కోయంబేడు ప్రాంతానికి చెందిన రాధ(50)గా గుర్తించారు. ఈమెకు అదే ప్రాంతానికి చెందిన పెళ్లైన కూలీ సురేష్‌తో వివాహేతర సంబంధం ఉందని, అతనితో కలిసి గత గురువారం అయనంబాక్కం చెరువు ఒడ్డున మద్యం సేవించారని, అప్పుడు రాధ ప్రియుడి భార్య గురించి తప్పుగా మాట్లాడటంతో సురేష్ ఆమెపై మద్యం సీసాతో దాడి చేసి హతమార్చినట్లు తేలింది. ఈ నేపథ్యంలో సురేష్‌ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు.

బాలికలు స్నానం చేస్తుండగా వీడియో తీసిన యువకుడు...

ఆర్కేనగర్: తిరువారూర్ జిల్లా కోరడాచ్చేరి ప్రాంతానికి చెందిన ఉదయకుమార్(20) అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు బాలికలు స్నానం చేస్తుండగా సెల్‌ఫోన్‌లో రహస్యంగా వీడియో తీసినట్లు తెలుస్తోంది. గమనించిన బాలికలు తల్లిదండ్రులకు చెప్పారు. వారి ఫిర్యాదు మేరకు తిరువారూర్ పోలీసులు కేసు నమోదు చేసి శనివారం ఉదయకుమార్‌ని అరెస్ట్ చేశారు. అతని సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బిడ్డను విక్రయించిన మహిళ...

ఆర్కేనగర్: తిరువారూర్ నగరం అత్తికడై ప్రాంతానికి చెందిన రాజేష్ కన్నన్, జన్నత్ భార్యాభర్తలు. వీరికి ఓ బిడ్డ ఉన్న నేపథ్యంలో రెండోసారి జన్నత్ గర్భం దాల్చింది. తిరువారూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో 14వ తేదీ మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇదిలా ఉండగా శిశువుకు టీకా వేయించడానికి నర్సు శనివారం జన్నత్ ఇంటికి వెళ్లింది. శిశువు కనిపించకపోవడంతో జన్నత్‌ను అడిగింది. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో జిల్లా బాలల సంరక్షణ కేంద్రానికి సమాచారం ఇచ్చింది. అధికారులు దర్యాప్తు చేపట్టగా.. జన్నత్ బిడ్డను తిరుత్తురైపూండికి చెందిన ఉమామహేశ్వరి అనే మహిళకు రూ.30వేలకు విక్రయించినట్లు తేలింది. దీంతో తిరువారూర్ తాలూకా పోలీసులు జన్నత్, శిశువుని కొనుగోలు చేసిన ఉమామహేశ్వరిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి పాల్పడిన తండ్రి, కుమారుడు...

ప్యారిస్: తూత్తుకుడి సమీపం పుదుక్కోట్టైకి చెందిన మారిముత్తు వీఏవో. ఈయన భార్య కౌసల్య తిరునెల్వేలిలోని ఓ కళాశాలలో ప్రొఫెసరుగా పనిచేస్తోంది. ఇదిలా ఉండగా గత నెల 14వ తేదీ భార్యాభర్తలు ఊరెళ్లి తిరిగి 16వ తేదీ వచ్చారు. తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికెళ్లి చూడగా బీరువాలో ఉన్న 12 సవర్ల బంగారు నగలు కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి కర్ణాటకు చెందిన అర్జున్, అతని కుమారుడు మోహన్‌కుమార్‌లను శనివారం బెంగళూరులో అరెస్టు చేశారు.

మరో కేసులో తండ్రి, కుమార్తె...

గిండి: చెన్నై విల్లివాక్కం సిడ్కో నగర్‌కు చెందిన సెంథిల్ కుమార్ తన ఇంట్లో బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, ఇంట్లోని వెండి వస్తువులు కొన్ని చోరీకి గురైనట్టు గుర్తించారు. పనిమనిషిపై సందేహించి విల్లివాక్కం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు జరిపి పనిమనిషి మీంజూరుకు చెందిన కమలిని విచారించారు. ఓ బంగారు గొలుసు, 2 చేతి కడియాలు, 105 గ్రాముల వెండి గిన్నె తదితర వస్తువులు దొంగిలించి తన తండ్రి వద్ద ఉంచినట్టు చెప్పింది. దీంతో పోలీసులు కమలి, ఆమె తండ్రి వెంకటేశన్‌ను అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

10 సవర్ల నగలు చోరీ చేసిన నిందితుడు...

తమీమ్ అన్సారి, స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

గిండి: చెన్నై మన్నడి ప్రాంతానికి చెందిన ముహమదు షాజలాల్ అనే వ్యక్తి ఆ ప్రాంతంలోని ఓ దుకాణంలో పనిచేస్తున్నారు. ఈయన గత నెల 25న కుమార్తెను పాఠశాల నుంచి తీసుకొచ్చి ఇంట్లో వదిలి పనికెళ్లారు. కుమార్తె తలుపు వేయకుండా సమీపంలోని దుకాణానికి వెళ్లిన సమయంలో ఇంట్లో చోరీ జరిగింది. 10 సవర్ల బంగారు నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముత్తియాల్‌పేట పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడు అంగప్పన్ వీధికి చెందిన తమీమ్ అన్సారీని అరెస్టు చేశారు. అతని నుంచి 10 సవర్ల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించినట్లు పోలీసులు ఆదివారం ప్రకటన విడుదల చేశారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు...

పొన్నేరి: తిరువళ్లూర్ జిల్లా పొన్నేరి రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు ఆదివారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. అటుగా వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని సోదా చేశారు. వారి చేతి సంచుల్లో ఉన్న 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చెన్నై కొరట్టూరుకు చెందిన శశికుమార్, మహ్మద్‌అలీ, సుభాష్‌గా తేలింది. వారిని కోర్టులో హాజరుపరచి పుళల్ జైలుకు తరలించారు

కుటుంబ పరువు తీసిందని అక్కను హత్య చేసిన తమ్ముడు

గిండి, న్యూస్‌టుడే: తూత్తుకుడి జిల్లా సెయ్‌దుంగానల్లూర్‌కు చెందిన సుమిత్ర(35) భర్తతో విడిపోయి ఏడాదిగా ఒంటరిగా జీవిస్తోంది. ఇదిలా ఉండగా గత వారం ఓ ఇల్లు అద్దెకు తీసుకుందని, కొంతమందితో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు సుమిత్ర తమ్ముడు ముత్తురాజాకు విషయం తెలిసింది. దీంతో అతను అక్కను మందలించాడు. శనివారం రాత్రి స్నేహితుడు వసంత్‌తో కలిసి సుమిత్ర ఇంటికి వెళ్లిన ముత్తురాజా.. కుటుంబానికి చెడ్డ పేరు తీసుకొస్తున్నావని సుమిత్రతో గొడవపడ్డాడు. వినకపోవడంతో కత్తితో దాడి చేసి హతమార్చాడు. సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని ముత్తురాజా, వసంత్‌ను అరెస్టు చేశారు.

చిరు వ్యాపారి ఆత్మహత్యాయత్నం

సేలం, న్యూస్‌టుడే: సేలం మున్సిపల్ కార్పొరేషన్ 45వ వార్డు పంచాంగి ప్రాంతానికి చెందిన బాలాజీ డీఎంకే మత్స్యకార విభాగ డిప్యూటీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నాడు. ఆయన తన ఇంటి ముందు ఓ చిన్న షెడ్ వేసుకుని టిఫిన్ దుకాణం నడుపుతున్నారు. ఇటీవల తన ఇంటి వద్ద మురుగు తొలగించాలని అధికారులను కోరగా వారు పట్టించుకోలేదు. ఈ నెల 23న బాలాజీ అధికారుల తీరుకు నిరసనగా ఇంటి వద్ద ధర్నా చేశారు. విషయం వార్తాపత్రికల్లో రావడంతో అధికారులు డ్రైనేజీ శుభ్రం చేశారు. ఈ క్రమంలో స్థానిక కౌన్సిలర్ సుహాసిని భర్త సెంథిల్ ఆయనపై కక్ష పెంచుకున్నాడు. అధికారుల సాయంతో బాలాజీ ఇంటి వద్ద ఉన్న టిఫిన్ షెడ్ తొలగించాడు. బాలాజీని దూషించి క్షమాపణ చెప్పాలని సెంథిల్ బెదిరించినట్లు తెలుస్తోంది. దీంతో మనస్తాపానికి గురైన బాలాజీ శనివారం విషం తాగారు. కుటుంబీకులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉంది.

లండన్‌లో ఉద్యోగం పేరిట రూ.5.94 లక్షల మోసం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన రాజప్పన్(54) రైతు. ఈయన పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. విదేశాల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా గత ఏడాది జూన్ 2వ తేదీ లండన్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో టెక్నికల్ ప్రాజెక్ట్ మేనేజర్ పోస్ట్ ఖాళీగా ఉందని ఈ-మెయిల్ వచ్చింది. కంపెనీ మెయిల్‌ను సంప్రదించిన రాజప్పన్‌కు కొన్నిరోజుల తర్వాత ఉద్యోగం వచ్చినట్లు లేఖ వచ్చింది. అందులోని ఫోన్ నెంబర్‌ని సంప్రదించారు. ఆయనకు మెయిల్ ద్వారా దరఖాస్తు ఫారాన్ని పంపారు. దానిని పూర్తి చేసిన రాజప్పన్ తిరిగి పంపించారు. ఆయన ఎంపికైనట్లు చెప్పి కొన్నిరోజులకే నియామకపత్రాన్ని వాట్సప్‌కు పంపారు. అనంతరం వీసా, విమాన టికెట్, ప్రాసెసింగ్, కన్సల్టింగ్ ఫీజులని చెప్పి డబ్బులు అడిగారు. దీంతో రాజప్పన్ ఐదు విడతలుగా రూ.5.94లక్షలు ఆన్‌లైన్ ద్వారా పంపించారు. అనంతరం ఎప్పుడూ ఫోన్ చేసే నంబరును సంప్రదించగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మోసపోయినట్లు గ్రహించిన రాజప్పన్ తంజావూర్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవర్ స్మారక మందిరంలో కిరోసిన్ బాంబు దాడి

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లా పాళయంగోట్టయ్ తాలూకా తిమ్మరాజపురంలో ముత్తురామలింగ దేవర్ జ్ఞాపకార్థం చిన్న స్మారక మండపం నిర్మించారు. శనివారం అర్ధరాత్రి కొందరు దుండగులు అక్కడి దేవర్ చిత్రపటంపై కిరోసిన్ బాంబు విసిరి పరారయ్యారు. దీంతో చిత్రపటం ధ్వంసమై మండపం లోపలి భాగం కాలిపోయింది. ఉదయాన్నే చూసిన స్థానికులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

మాదకద్రవ్యాలు స్వాధీనం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరు జిల్లా చెట్టిపాళైయం, మదుక్కరై సహా వివిధ ప్రాంతాల్లో 300మందికి పైగా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెట్టిపాళైయంలో 4.5 కిలోల గంజాయి, 50 మి.గ్రా గంజాయి నూనె, సింథటిక్ డ్రగ్స్, మెథాంఫెటమైన్, గంజాయి చాక్లెట్, సెల్‌ఫోన్లు, పత్రాలు లేని 22 వాహనాలను స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేశారు.

క్రైం కార్నర్

లంచం తీసుకున్న అధికారికి మూడేళ్ల జైలు శిక్ష

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా మీంజూరు సమీపం అత్తిపట్టుకు చెందిన ఆయేషా బేగం 2012లో తన ఇంటికి విద్యుత్తు కనెక్షన్ మంజూరు చేయాలని మేలూర్ టీఎన్‌ఈబీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకుగాను రూ.4 వేలు లంచం తీసుకున్న అధికారి మదియళగన్‌ను అవినీతి నిరోధకశాఖ అధికారులు అరెస్టు చేసి తిరువళ్లూర్ కోర్టులో కేసు దాఖలు చేశారు. కేసు విచారణ శనివారం ముగిసింది. నేరం రుజువు కావడంతో మదియళగన్‌కు 3 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

ఈనాడు తిరుపతి
సోమవారం మార్చి 2, 2026 5

దొంగ చేతికే ఇంటి తాళం

■ ఊరందూరులో అక్రమాలకు పాల్పడిన అధికారికి అందలం

ఉద్యోగోన్నతి, ఇన్‌ఛార్జి బాధ్యతలా!

ఊరందూరు లేఅవుట్

ఈనాడు - తిరుపతి, న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి: ఒక అధికారి గతంలో విధులు నిర్వర్తించిన ప్రాంతంలోని అవినీతిపై విజిలెన్స్, శాఖాపరంగా విచారణ జరుగుతుంటే సంబంధిత వ్యక్తికి అక్కడ పోస్టింగ్ ఇవ్వరు. ఎవరినీ ప్రభావితం చేయకుండా, పారదర్శకంగా విచారణ చేయాలనే ఉద్దేశంతోనే ఇవిధంగా వ్యవహరిస్తారు. శ్రీకాళహస్తిలో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతోంది. గృహనిర్మాణ శాఖలో ఆరోపణలున్న సదరు అధికారికి ఇప్పటికే పక్క మండలంలో రెగ్యులర్ పోస్టింగ్ ఉండగా, విమర్శలు ఎదుర్కొంటున్న ప్రాంతంలోనే రెండు చోట్ల ఇన్‌ఛార్జిగా కొనసాగిస్తున్నారు. ఇది చాలదన్నట్లు ఇప్పుడు ఆయనకు అంతకంటే కీలక హోదాలో ఇన్‌ఛార్జిగా నియమించారు. దొంగ చేతికి ఇంటి 'తాళం' ఇవ్వడం అంటే ఇదేనేమో మరి! ఇదంతా కీలక ప్రజాప్రతినిధి సిపార్సుతోనే జరిగింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో గృహ నిర్మాణ శాఖలో ఎక్కడా లేనంత అక్రమాలు జరిగాయని గగ్గోలు పెడుతోన్న నాయకుడే ఇప్పుడు అవినీతి అధికారికి వంత పాడుతున్నారు. వైకాపాతో అంటకాగిన అధికారికి పోస్టింగ్ ఇప్పించడం వెనుక మతలబేంటని కూటమి శ్రేణులే ప్రశ్నిస్తున్నాయి.

160 ఎకరాల కొనుగోలులో..

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శ్రీకాళహస్తి మండలం ఊరందూరు పరిధిలో 160 ఎకరాల్లో కాలనీ ఏర్పాటు చేశారు. అక్కడ ఎకరా ధర రూ.7 లక్షలు ఉంటే అప్పట్లో రూ.18 లక్షలకు కొనుగోలు చేశారు. ఇందులో వైకాపా నేతలతోపాటు అధికారులు కొందరు లబ్ధి పొందారు. ఇళ్ల నిర్మాణంలోనూ అవకతవకలు జరిగాయి. ఆప్షన్-3 కింద కొందరు పేదలకు గుత్తేదారులు నాసిరకంగా గృహ నిర్మాణాలు చేశారు. దీనిపై అప్పట్లోనే తీవ్ర ఆరోపణలు వచ్చాయి. టిడ్కో ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను సంప్రదించకుండానే వారందరి పేర్లనూ లేఅవుట్‌కు మార్చారు.

ఈ వ్యవహారంలో ప్రస్తుతం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గృహనిర్మాణ శాఖలో పనిచేసే సదరు అధికారిదే ప్రమేయం ఉంది. ఒక్క ఊరందూరు లేఅవుట్‌లోనే కోట్లాది రూపాయల అవినీతి జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక విజిలెన్స్, గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేయగా ప్రాథమికంగా వాస్తవమేనని తేలింది. ఈ మొత్తం వ్యవహారం కొలిక్కి రాక ముందే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సదరు అధికారికి రెండుచోట్ల ఇన్‌ఛార్జి ఏఈగానూ కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం అతనికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ శ్రీకాళహస్తిలోనే పోస్టింగ్ ఇచ్చారు. ఇంతకు ముందు నాయుడుపేటలోనూ ఏఈ, ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే సమయంలోనూ అక్కడ ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు పొందిన లబ్ధిదారులను పట్టణ హౌసింగ్ పథకంలోనూ చేర్పించడంపైనా ఇప్పటికీ విచారణ సాగుతోంది.

● **పారదర్శకతపై సందేహాలు:** అలాంటి వ్యక్తికి కూటమి ప్రజాప్రతినిధి అండగా ఉండటం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇటువంటప్పుడు పారదర్శక విచారణ ఎక్కడ జరుగుతుందని గృహ నిర్మాణ శాఖలోని సిబ్బందే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ జరిగిన అవినీతి, అక్రమాల్లో ప్రధాన భూమిక పోషించిన వాళ్ల అవినీతి గుట్టును వెలుగులోనికి తీసుకువచ్చేలా హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి భక్తుల రద్దీ పెరిగింది. ప్రస్తుతం భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయి శిలాతోరణం వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి 14 గంటల్లో, రూ.300 ఎస్‌ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది.

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులు, కలెక్టర్ ● కోర్టుల సముదాయ నిర్మాణానికి ఇటుక అందిస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

న్యాయసౌధం.. దామినేడు సొంతం

☛ శంకుస్థాపన చేసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక నగరి తిరుపతిలో న్యాయసేవలు మరింత చేరువయ్యేలా అడుగులు పడ్డాయి. దామినేడు వద్ద సుమారు 14.49 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న 16 కోర్టుల నూతన సముదాయానికి ఆదివారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ భూమిపూజ చేశారు. వందేళ్లకు పైగా చరిత్రగల తిరుపతి బార్ అసోసియేషన్ సేవలను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. గజేంద్ర మాట్లాడుతూ.. ఈరోజు తమ జీవితాల్లో అత్యంత ముఖ్యమైనదన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక న్యాయమూర్తులను శాలువాలతో సత్కరించి శ్రీవారి ప్రతిమలు బహూకరించారు.

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: ఏపీ ఎస్పీడీసీఎల్ సర్కిల్ స్థాయిలో వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, పరిష్కరించుకునేందుకు సోమవారం డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

సీఎండీ 89777 16661,
ఎస్ఈ : 87126 52679

7.89 లక్షల భక్తుల దర్శనం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరున్ని గత నెలలో భక్తులు రికార్డు స్థాయిలో దర్శించుకున్నారు. 28 రోజుల్లో 7,89,179 మంది, శివరాత్రి రోజునే 1.28 లక్షల మంది దర్శించుకున్నారు.

వెంటాడే దాహం.. అల్లాడే ప్రాణం

● ముంచుకొస్తున్న ముందస్తు ఎండలు ● 200 ఆవాసాల్లో నీటి వనరుల కొరత

తిరుపతి (జీవకోన), చంద్రగిరి, పలమనేరు, న్యూస్‌టుడే: వేసవి వచ్చిందంటే శేషాచలం అడవులను వరుస అగ్నిప్రమాదాలు కబళిస్తుంటాయి.. లక్షల హెక్టార్ల అటవీ ప్రాంతం దగ్ధమవుతూ ఉంటోంది. దీంతో ఆహారం, నీటి అవసరాలకు వన్యప్రాణులు అలమటించాల్సిన పరిస్థితి. మార్చి, ఏప్రిల్‌లో మొదలయ్యే ఎండల తీవ్రత ఈసారి ఫిబ్రవరి ఆఖరు నుంచి మొదలవడంతో మరింత ఆందోళన వ్యక్తమవుతోంది.

శేషాచలంలో తగ్గిన నీటిమట్టాలు

తిరుపతి డివిజన్‌లో (2004-25)

ఏనుగులు: 50
చిరుతలు: 35
ఎలుగుబంట్లు: 26
దేవాంగపిల్లులు: 419
జింకలు, కణితులు: వేలల్లో

శేషాచలం పరిధి సుమారు ఐదువేల హెక్టార్లలో విస్తరించింది. మామండూరు, బాలపల్లె, కోడూరు వరకు జలపాతాలు, నీటిచెలమలు, కుంటలు, పాతబావులు ఎన్నో ఉన్నాయి. అయితే తిరుమల, అవ్వాచారికోనకు దక్షిణ భాగంలో ఉండే అటవీ ప్రాంతంలో ఎలాంటి నీటివనరులు లేవు. దీంతో వేసవిలో ఇక్కడి జంతువులు తరచూ జనావాసాల్లోకి వస్తుంటాయి. ఈసారి శేషాచలం అడవుల్లో నీటిమట్టాలు బాగా పడిపోయినట్లు అధికారులు గుర్తించారు. తిరుపతితోపాటు శ్రీకాళహస్తి, ఏర్పేడు, వెంకటగిరి, వడమాలపేట, పుత్తూరు, భాకరాపేట, యర్రావారిపాలెం, కోడూరు పరిధిలో 200 పైగా నీటి కొరత ప్రదేశాలు గుర్తించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న నీటితొట్టెలు, సాసర్ పిట్లతోపాటు కొత్తవి ఏర్పాటు చేసి అవసరాన్ని బట్టి నీరు అందించాల్సిన అవసరం ఉంది.

బయోట్రిమ్ అటవీ ప్రాంతంలోని కుంటలో నీటిని నింపుతున్న దృశ్యం

పలమనేరు డివిజన్ ● మొత్తం విస్తీర్ణం: 70 కి.మీ ● ఏనుగులు: సుమారు 70 వరకు ● నీటి కుంటలు: 20 ఉండగా.. అందులో సగానికి పైగా ఎండిపోయాయి. ● వేటగాళ్లు సంచరించే ప్రాంతాలు: ఎం.కోటూరు, చెత్తపెంట, ఊసరపెంట, కలిమిచెట్ల పెంట.

చర్యలు తీసుకుంటున్నాం

వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే కొన్నిచోట్ల నీటిని సరఫరా చేస్తున్నాం. కుంటలు, సాసర్‌పిట్లలో ట్యాంకర్ల ద్వారా నీరు నింపేలా చర్యలు తీసుకుంటాం. వర్షాలు కురిసేవరకు పర్యవేక్షణ కొనసాగిస్తాం. - **సి.సెల్వం, అటవీ సంరక్షణాధికారి (సీఎఫ్), తిరుపతి సర్కిల్**

పొంచి ఉంటున్న వేటగాళ్లు

చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని పనపాకం, భాకరపేట రేంజ్‌ల పరిధిలో మనుషులు, వన్యప్రాణుల మధ్య నిత్య ఘర్షణలు జరుగుతున్నాయి. వీటి పరిధిలో మూడు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. వేసవిలో అడవి జంతువులు దాహార్తితో రహదారులతోపాటు గ్రామాలవైపు వస్తూ కుక్కలతోపాటు వేటగాళ్ల బారినపడుతున్నాయి. ఇక్కడ కొందరు అక్రమార్కులకు వేట నిత్యకృత్యం కాగా వేసవి మరింత కలిసి వస్తోంది. వీటి పరిధిలో ఇప్పటివరకు 80 సాసర్ పిట్లు, 14 నీటితొట్టెలు ఏర్పాటు చేసినట్లు చెబుతున్న అధికారులు వేటగాళ్లను సైతం కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

దళారులదే దర్శనాల దందా

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో దళారులు మళ్లీ చక్రం తిప్పుతున్నారు. పీఆర్వో కార్యాలయం నుంచి వచ్చే వీఐపీలకు ఎంత విలువనో.. దళారులు తీసుకు వచ్చే బృందాలకు అంతేరీతిలో రాచమర్యాదలు జరుగుతున్నాయి. దీంతో అంతరాలయ దర్శనాలకు బారులు తీరుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు ముందు దళారులను ఆలయ కమిటీ వీలైనంతగా కట్టడి చేసింది. విధిగా టికెట్లు తీసుకుని దర్శనాలు చేసుకున్నారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యాక మళ్లీ గాడి తప్పింది. పీఆర్వో కార్యాలయాల ద్వారా అధికారిక ప్రోటోకాల్ భక్తులు పాతిక శాతం మాత్రమే ఉండగా మిగిలినవి దళారుల అడ్డగోలు దర్శనాలే. మహద్వారం వద్ద ట్రస్టుబోర్డు సభ్యులు, అధికారులు ఎవరైనా అడిగితే నేతల పేర్లు చెప్పి పదుల సంఖ్యలో తీసుకెళ్తున్నారు. ఉద్యోగులను బెదిరించి పబ్బం గడుపుకొంటూ ముక్కంటీశుని ఆదాయానికి గండి కొడుతున్నారు.

వారాంతం లక్ష్యంగా..: వారాంతంలో దర్శనాలకు వచ్చే భక్తుల సంఖ్య అధికం. ఇదే అదనుగా దళారులు ఇష్టానుసారం దర్శనాలకు తీసుకెళ్లడంతో సామాన్య భక్తులకు అవస్థలు తప్పడం లేదు. ఈతరహా అడ్డదారి దర్శనాలను అధికారులు, ట్రస్టుబోర్డు అడ్డుకట్ట వేయాలని భక్తులు కోరుతున్నారు.

స్థిరాస్తి గుప్పిట్లోకి రూ.3 కోట్ల భూమి

ప్రభుత్వ భూమిని చదునుచేసిన దృశ్యం

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఏ మైదానమో అనుకుంటే పొరబడినట్లే. తిరుపతి గ్రామీణ మండలంలోని చిగురువాడ పంచాయతీలోని ప్రభుత్వ భూమి. నగరం విస్తరిస్తుండటంతో ఆక్రమణదారులు ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు ఆక్రమించేస్తున్నారు. కాసింత పలుకుబడి ఉంటే రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. తిరుపతి గ్రామీణ మండలం చిగురువాడ దక్షిణపు కండ్రిగలో స్వర్ణముఖి నుంచి గ్రామానికి అనుసంధాన కాలువలు ఉన్నాయి. దీనికి పక్కనే గతంలో పంచాయతీ ఆధ్వర్యంలో 80 అడుగుల రోడ్డు నిర్మాణానికి హద్దులు ఏర్పాటుచేశారు. తర్వాత 30 అడుగుల వెడల్పుతో గ్రావెల్ రోడ్డు నిర్మించారు. దీని చుట్టూ స్థిరాస్తి వ్యాపారం విస్తరించింది. ఇక్కడ అంకణం విలువ రూ.70 వేలు, అప్రూవల్ ప్లాటు అయితే రూ.90వేలకు విక్రయిస్తున్నారు. ఓ వ్యక్తి తాను కొనుగోలుచేసిన ప్లాటు పక్కనే వంద అంకణాలకుపైగా ప్రభుత్వ భూమిని చదును చేసి కలిపేసుకున్నాడు. దీనివిలువ ప్రైవేట్ మార్కెట్‌లో రూ.3 కోట్లు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. కందకం తవ్వి పరిరక్షించాలని కోరుతున్నారు.

● **పరిశీలించి చర్యలు :** ఆక్రమణ విషయం నా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- జనార్దన్‌రాజు, తహసీల్దార్**

ఇసుక తోడేసి.. పీకల్లోతు కష్టాలకు తెరతీసి

శివాలయం సమీపంలో స్వర్ణముఖిలో అక్రమ ఇసుక తవ్వకాలు

కొందరు నాయకులు కాసులకు కక్కుర్తిపడి తాగునీటి పథకాల చెంతనే భారీగా ఇసుక తవ్వి తరలిస్తున్నారు. దీంతో స్వర్ణముఖి నీటి వనరులపై ఆధారపడిన నాయుడుపేట పట్టణ, గ్రామీణ ప్రజలు భవిష్యత్తులో క్షామంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. శివాలయం, బీడీకాలనీ, తుమ్మూరు తదితర నదీ ప్రాంతాల పరిధిలో 25 వరకు తాగునీటి పథకాలు, బావులు ఉన్నాయి. వీటి ద్వారా పట్టణంలో 65 వేల మందికి నిత్యం తాగునీరు సరఫరా అవుతోంది. ఇవి కాకుండా చిట్టమూరు, దొరవారిసత్రం మండలాల్లో తీర గ్రామాలకు ఇక్కడి నుంచి ఫిల్టర్ బావుల ద్వారా రాజీవ్ టెక్నాలజీ పథకాలకు నీటి సరఫరా జరుగుతోంది. నీరు-చెట్టు చట్టంతోపాటు హరిత ట్రైబ్యునల్ ఆదేశాలు ఉల్లంఘించి కొందరు నాయకుల అండతో ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. ఐదు నుంచి పది అడుగుల లోతువరకు తవ్వకాలతో భూగర్భంలో నీరు నిలిచే అవకాశం లేకుండాపోయింది. ఫిల్టరు పాయింట్లలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. అక్రమ తవ్వకాలపై తహసీల్దారు రాజేంద్ర స్పందిస్తూ తవ్వకాలు నిషేధిస్తామన్నారు. - **న్యూస్‌టుడే, నాయుడుపేట**

3న తితిదే స్థానికాలయాల మూసివేత

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: చంద్రగ్రహణం కారణంగా మంగళవారం ఉదయం 9 గంటలకు ఉమ్మడి జిల్లాలోని తితిదే స్థానికాలయాలను మూసివేయనున్నారు. రాత్రి 7.30 గంటలకు ఆలయాల తలుపులు తెరచి శుద్ధి అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

6న ఉద్యోగ మేళా

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 6న ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున తెలిపారు. మేళాలో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఫోన్‌పే, ఎస్ఆర్ షాపింగ్‌మాల్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టం లిమిటెడ్, టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్, టాటా ఎలక్ట్రానిక్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఎంగ్ ఇండియా, అపోలో ఫార్మసీతో పాటు పలు సంస్థల వస్తాయన్నారు. నిరుద్యోగులు https://naipunyam.ap.gov.in లింక్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

నేటి నుంచి పది విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్‌లు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులకు ఈనెల 16 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం నుంచి గ్రాండ్ టెస్ట్‌లు ప్రారంభం కానున్నాయి. ఈనెల 12వ తేదీ వరకు వాటిని నిర్వహించనున్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు సంబంధించి ముఖ్యమైన ప్రశ్నలను ఈ పరీక్షల ద్వారా విద్యార్థులను సంసిద్ధత చేసే కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రతిరోజు మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నారు. పాఠశాలల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులకు ఈ గ్రాండ్ టెస్ట్ ద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెంచి, అత్యున్నత మార్కులతో పాటు ఫలితాల మెరుగుకు చర్యలు తీసుకోనున్నారు.

దయచేసి వినండి.. సమస్యలు పరిష్కరించండి

డిజిటల్ బోర్డులు లేని ఆరో ప్లాట్‌ఫాం

తిరుపతి (రైల్వే), న్యూస్‌టుడే: తిరునగరిలో రైల్వే ప్రయాణికులను అటూఇటూ పరుగులు తీయిస్తున్నారు. రైళ్ల సమయం, అవి చేరుకునే ప్లాట్‌ఫాం, బోగీ నంబర్లు సూచించే డిజిటల్ బోర్డులు, అనౌన్స్‌మెంట్ వంటివి సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిరుమల, తిరుపతి సందర్శనకు వచ్చే భక్తుల్లో 80 శాతం మంది రైలు ప్రయాణం ఎంచుకుంటారు. ఈ నేపథ్యంలో రోజుకు 90 రైళ్లలో 1.20 లక్షల మంది వరకు ప్రయాణిస్తుంటారు. ఆఖరు నిమిషం వరకు రైళ్ల ప్లాట్‌ఫాంలు ఖరారు చేయడం లేదు. తీరా స్టేషన్‌కు వచ్చేసరికి మరోటి సూచిస్తున్నారు. దీంతో వృద్ధులు, చిన్నారులు, లగేజీతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోని ఒకే రైలుకు ఒకే ప్లాట్‌ఫాం అమలు చేస్తున్నారా? అంటే అదీ లేదు. కొన్నిసార్లు ఎక్స్‌లేటర్లు, లిఫ్ట్‌లు పనిచేయకపోవడం, ఆరో ప్లాట్‌ఫాంపై డిజిటల్ బోర్డులు లేకపోవడంతో ఏ బోగీ ఎక్కడ ఆగుతుందో తెలియక తికమక పడుతున్నారు.

అక్కడే నిత్యం రద్దీ...

ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం నిత్యం రద్దీతో కిటకిటలాడుతోంది. ప్రవేశ మార్గాలు, బుకింగ్ కౌంటర్లు, ఐఆర్‌సీటీసీ క్యాంటీన్, లగేజీ లాకర్లు వంటివి ఉండటంతో ఉదయం, సాయంత్రం కిటకిటలాడుతోంది. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు.

ప్రాధాన్యం ఇచ్చి పరిష్కారం

స్టేషన్‌లో ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్లాట్‌ఫాంలు, రైళ్ల సమాచారానికి సంబంధించి ప్రైవేటు యాప్‌లు ప్రయాణికులను తప్పుదారి పట్టిస్తున్నాయి. రైల్వేశాఖ 'ఎన్‌టీఈఎస్' యాప్‌లో కచ్చితమైన సమాచారం లభిస్తోంది.
- చిన్నప్పరెడ్డి, స్టేషన్ మేనేజర్

సాంకేతిక పోటీలు.. మిన్నంటిన సంబరాలు

అమ్మాయిల సరదా

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఆలోచనలను పెంపొందించే సాంకేతిక పోటీలు, ఉత్సాహంగా జోష్‌ను నింపే సంగీతాలతో మూడురోజులపాటు తిరుపతి ఐఐటీలో విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన తిరుఉత్సవ-2026 ఆదివారం ముగిసింది. సాంకేతిక నైపుణ్యాలతో తక్కువ వ్యవధిలో నేరాన్ని ఛేదించడం, సాహసం, వ్యూహాత్మక నైపుణ్యాలు పరీక్షించే ఎస్కేప్ రూమ్, బ్లైండ్ ఫొటోగ్రఫీ, స్క్విడ్ గేమ్‌లు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సాయంత్రం జరగాల్సిన కార్యక్రమాలను సాంకేతిక కారణాలతో రద్దు చేశారు.

సెల్ఫీ పాయింట్‌లో

104 FM Tirupati 104 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499



(c) eenadu

వృత్తివిద్యకు నైపుణ్యాలద్ది..

పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

■ ఐటీ శిక్షణలో విద్యార్థులు ■ బ్యూటీ-వెల్నెస్ అంశాల్లో తర్ఫీదు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: పీఎంశ్రీ పాఠశాలలు నైపుణ్య శిక్షణకు వేదికగా మారుతున్నాయి. నూతన జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా వాటిలో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా డిజిటల్ తరగతులు, స్మార్ట్‌బోర్డులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాల విస్తరణ వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయి. జిల్లాలో 44 పాఠశాలలు ఉండగా వాటిలో 6-10 తరగతులతో పాటు హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు వృత్తివిద్య కోర్సులు నేర్పిస్తున్నారు. ఇందుకు అనుభవజ్ఞులైన శిక్షకులను నియమించారు. కేంద్రం ఆదేశానుసారం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రీ-వొకేషనల్ తరగతులు నిర్వహిస్తున్నారు. వారంలో మూడు గంటలపాటు ముగ్గురు నిపుణులు ప్రత్యేక తరగతులు తీసుకుంటారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 1,804 మంది శిక్షణ పొందుతున్నారు. పాఠశాలల ప్రారంభం నుంచే ఈ శిక్షణలు ఇస్తుండగా వాటిని ఎప్పటికప్పుడు నవీకరిస్తున్నారు.

పది అంశాల్లో కార్యక్రమాలు..

విద్యార్థులకు వృత్తివిద్య కోర్సులు పట్ల మక్కువ పెంచడంతోపాటు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్), ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ ఈఎస్, అపరెల్, రిటైల్, బ్యూటీ-వెల్నెస్, ఆటోమోటివ్, అగ్రికల్చర్, హెల్త్‌కేర్ వంటి పది అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. వారిలో ఆత్మస్థైర్యం పెరిగి స్వశక్తితో ఎదిగేందుకు మార్గం ఏర్పాటు చేస్తున్నాం. కిచెన్ గార్డెనింగ్ నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలు వంటివి ప్రోత్సహిస్తున్నాం.

- పుష్ప, జీసీడీవో, తిరుపతి

మెచ్చిన పుస్తకం.. ఇక మీ చెంతనే

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: పోటీ పరీక్షలు, ఇతిహాసాల పుస్తకాల పఠనం కోసం చాలామంది గ్రంథాలయాలకు వెళ్తుంటారు. అక్కడికి వెళ్లినా కావాల్సిన పుస్తకం లభించకపోతే నిరాశపడుతుంటారు. ఇలాంటి వాటన్నింటినీ పరిష్కరించేలా అరచేతిలో డిజిటల్ గ్రంథాలయాన్ని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. చరవాణి, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ కంప్యూటరు అందుబాటులో ఉండి.. ఇంటర్నెట్ సౌకర్యం ఉంటే చాలు.. కావాల్సిన పుస్తక ప్రపంచమంతా మీ చెంతనే ఉంటుంది. నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా(ఎన్‌డీఎల్ఐ) యాప్ కేంద్రం తీసుకొచ్చింది.

■ ఈ యాప్‌లో సెంట్రల్ లైబ్రరీలో ఉండే వేలాది పుస్తకాలతోపాటు పోటీ పరీక్షలకు అవసరమైన వివరాలు ఉంటాయి. ఎన్‌డీఎల్ఐ యాప్‌ను ఖరగ్‌పూర్ ఐఐటీ రూపొందించింది.

వివరాలిలా..

ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయాలు: 71

ప్రతిరోజూ గ్రంథాలయాల్ని సందర్శించేవారు: 4 వేలకు పైగా

గ్రంథాలయాల్లోని పుస్తకాలు : 6 లక్షలకుపైగా

అందుబాటులో వెబ్‌సైట్, ఎన్‌డీఎల్ఐ యాప్

అన్ని భాషల్లో అందుబాటులో

పాఠశాల, కళాశాల స్థాయి నుంచి ఇంజినీరింగ్, న్యాయశాఖ, వైద్యవిద్య, సివిల్స్ తదితర వాటికి కావాల్సిన సమగ్ర సమాచారాన్ని సంక్షిప్తం చేశారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్న నిపుణుల వీడియో పాఠాలను సైతం వీక్షించొచ్చు. సాహిత్యం, సంస్కృతి, ఇతిహాసం, రామాయణం, మహాభారతం వంటి గ్రంథాలను చదివేయొచ్చు. అన్ని విభాగాలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను అన్ని భాషల్లో అందుబాటులో ఉంచారు.

వినియోగం ఇలా

ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌ను వినియోగించే పాఠకులు, వీక్షకులు Rndli.iitkgp.ac.in వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే పలు అంశాలు కనిపిస్తాయి. ముందుగా భాషను ఎంపిక చేసుకోవాలి. అనంతరం కావాల్సిన అంశంపై క్లిక్ చేసి చదువుకోవచ్చు. ఆయా అంశాలను డౌన్‌లోడ్ చేసుకుని సేవ్ చేసుకోవచ్చు. ప్లేస్టోర్‌లో నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా (ఎన్‌డీఎల్ఐ) అని టైప్ చేసి సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ కూడా చేసుకోవచ్చు.

శ్రీవారిని దర్శించుకున్న త్రిపుర సీఎం

తిరుమల, శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీవారిని త్రిపుర సీఎం మాణిక్ ఆదివారం ఉదయం దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న త్రిపుర సీఎంకు తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెలంగాణ మెడికల్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ రాజేషన్ గౌడ్, సినీనటుడు గౌతమ్ కూడా స్వామిని దర్శించుకున్నారు.

త్రిపుర సీఎం మాణిక్ దంపతులకు, తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి

శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

■ ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నంద ■ మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.జయచంద్ర దంపతులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నంద కలిసి దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. వీరితో పాటు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.జయచంద్ర, అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ భన్సాలీ, రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చంద్రశేఖర్ శర్మ, జస్టిస్ బిపిన్ గుప్తా, జస్టిస్ యోగేంద్రకుమార్ పురోహిత్, ముంబయి హైకోర్టు జస్టిస్ మంజూషా దేశ్‌పాండే, కర్ణాటక లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్ శ్రీవారిని దర్శించుకున్నారు.

పరిశోధన నైపుణ్యాల పెంపునకు ఒప్పందం

ఏర్పేడు, న్యూస్‌టుడే: విద్య, పరిశోధన నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు కెనడాలోని డల్హౌసీ విశ్వవిద్యాలయంతో తిరుపతి ఐఐటీ, ఐసర్‌లు ఒప్పందం కుదుర్చుకున్నాయి. కెనడా ఎడ్యుకేషన్ షోకేస్ -2026లో ఆ దేశ విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ ఆధ్వర్యంలో ఆదివారం ఆ వర్సిటీ సీఈవో గాబ్రియేల్ మిల్లర్, ఐఐటీ, ఐసర్ డైరెక్టర్లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇండో- కెనడియన్ సహకారంతో అత్యధిక పరిశోధనలు, ప్రభావంతమైన ఆవిష్కరణలతో సైన్స్, టెక్నాలజీ, పారిశ్రామిక ప్రగతిపై దృష్టి సారిస్తామన్నారు. డల్హౌసీ వర్సిటీ ఉపకులపతి డా.కిమ్ బ్రూక్స్, బలరామకృష్ణన్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలు చూపుతున్న ఐఐటీ, ఐసర్ డైరెక్టర్లు సత్యనారాయణ, భట్టాచార్య, కెనడా ప్రతినిధి

ఎస్టీ జాబితాలో చేర్చకుంటే ఉద్యమం ఉద్ధృతం

మదనపల్లె పట్టణం: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి(వీఆర్ఎస్ఎస్) అధ్యక్షుడు పొదల నరసింహులు తెలిపారు. ఆదివారం స్థానిక బేబి వెల్‌కం హోంలో వీఆర్ఎస్ఎస్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌ను పార్లమెంట్, అసెంబ్లీలో పలువురు ప్రజాప్రతినిధులు ప్రస్తావించడం సంతోషకరమన్నారు. 5 దశాబ్దాలుగా దీనిపై పోరాటం చేస్తున్నామని, ప్రభుత్వాలు, పాలకులు మారినా అది సాధ్యం కాలేదన్నారు. ఈ ఒకేఒక డిమాండ్‌తో క్షేత్రస్థాయి నుంచి పోరాటానికి వాల్మీకులు కార్యోన్ముఖులు కావాలని పిలుపునిచ్చారు.

10లోగా అభ్యంతరాలు తెలపండి

చిత్తూరు విద్య: ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను టిస్ ఆధారంగా సిద్ధం చేసి డీఈవో, డీవైఈవో, ఎంఈవోల మెయిల్స్‌లో పొందుపరిచామని, వాటిలో ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 10లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయ పనివేళల్లో తెలియజేయాలని డీఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. తగిన ఆధారాలతో సంబంధిత ఉప, మండల విద్యాశాఖాధికారుల ధ్రువీకరణతో వాటిని అందజేయాలన్నారు. జడ్పీ, ప్రభుత్వ, పురపాలక, నగరపాలక సంస్థ పరిధిలోని ఉపాధ్యాయుల సీనియార్టీ వేర్వేరుగా తయారు చేసినట్లు చెప్పారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులు అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా i) శ్రీ పేట వెంకట రమణారెడ్డి తండ్రి స్వర్గీయ శ్రీ పేట జానకిరాం రెడ్డి ii) శ్రీమతి పేట ఇందిర రెడ్డి భర్త స్వర్గీయ శ్రీ పేట జానకిరాం రెడ్డి నుండి నా క్లయింటు దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తిని కొనుగోలు చేయుటకు సంప్రదించారు మరియు ఉద్దేశిస్తున్నారు.

ఏదేని ఒప్పందం లేదా ఏదేని డాక్యుమెంట్ రూపంలో వారసత్వం, కానుక, లీజు, కౌలు, తనఖా, అమ్మకం, మార్పిడి, ధారణాధికారం, ఛార్జ్, మెయింటెనెన్స్, అనుభోగ హక్కు, ట్రస్ట్ లేదా ఇతరత్రా రూపంలో సదరు షెడ్యూలు ఆస్తి లేదా అందలి ఏదేని భాగానికి సంబంధించి ఏదేని హక్కు, టైటిల్, క్లెయిమ్ లేదా ప్రయోజనం కలిగిన ఎవరేని వ్యక్తి ఏడు (7) రోజులలోగా దిగువ సంతకందారుకు డాక్యుమెంటరీ రుజువుతో సహా లిఖితపూర్వకంగా తెలియజేయవల్సిందిగా కోరడమైనది, లేనిచో నా క్లయింట్ పేరున సదరు షెడ్యూలు ఆస్తి యొక్క విక్రయ ప్రతిపాదన పట్ల ఎవరికీ ఏలాంటి క్లెయింలు లేదా అభ్యంతరాలు లేవని భావించబడును మరియు ఏ వ్యక్తి నుండి అలాంటి క్లెయింలు మరియు అభ్యంతరాలకు ఏలాంటి రిఫరెన్స్ లేకుండా సదరు ప్రకటన వ్యవధి ముగిసిన మీదట సదరు అమ్మకంను పూర్తి చేయుటకు నా క్లయింట్ స్వేచ్ఛ కలిగి వుంటారు.

షెడ్యూలు ఆస్తి

ఆంధ్రప్రదేశ్, తిరుపతి, ఇప్పుడు తిరుపతి జిల్లా, పాత ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా, సూళ్లూరిపేట రిజిస్ట్రేషన్ జిల్లా, తడ రెవెన్యూ మండలం, తడ గ్రామం మరియు గ్రామపంచాయతీ, పార్క్ అవెన్యూ లేఔట్‌లో సర్వే నెం.లు 8/3బి, 8/4ఎ మరియు 8/5ఎలో i) ప్లాట్ నెం.4 (1779.16 చ.గజాల విస్తీర్ణం), ii) ప్లాట్ నెం.5 (443.88 చ.గజాల విస్తీర్ణం), iii) ప్లాట్ నెం.6 (364.44 చ.గజాల విస్తీర్ణం), మొత్తం విస్తీర్ణం (సుమారు) 2587.48 చ.గజాలతో ప్లాట్లు యావత్తు. సరిహద్దులు: **ఉత్తరం:** ప్లాట్ నెం.3, **దక్షిణం:** రోడ్డు, **తూర్పు:** రోడ్డు, **పడమర:** పొరుగువారి భూమి & సర్వే నెం.8/3బిలో భూమి.

ఎస్.అభయ్ కుమార్ సాగర్, అడ్వొకేట్
ప్లాట్ నెం.302-బి, ఇంటి నెం.8-2-310/ఎ/31,
హిల్‌టాప్ రెసిడెన్సీ, నందినగర్, రోడ్ నెం.14, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034. **ఫోన్: 9849368215,**
ఇమెయిల్: **sagar.abhay@yahoo.co.in**

తేది:02.03.2026
హైదరాబాద్

కష్టపడి పనిచేసే వారికే పార్టీలో గుర్తింపు

తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: కష్టపడి పనిచేసే వారికే పార్టీలో గుర్తింపు ఉంటుందని జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం స్థానిక రేణిగుంట రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సంబంధించి తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ ముఖ్య నేతలు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ పార్టీ శ్రేణులు గట్టిగా నిలబడి ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదును పెంచారని, ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరు పని చేయాలని పిలుపునిచ్చారు. మార్చి 14వ తేదీన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సభ్యత్వ నమోదుకు నాయకులు కష్టించి పనిచేయాలని పేర్కొన్నారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం సభ్యత్వ నమోదు బాధ్యతలను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకి పార్టీ అప్పజెప్పిందని, ఆయన నేతృత్వంలో ప్రతి అసెంబ్లీ పరిధిలో ఈ ప్రయాసం సభ్యత్వాల సంఖ్య పెంచాలని చెప్పారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డా.పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి కొట్టేసాయి ప్రసాద్, నేతలు సురేష్ నాయుడు, మోహన్, ప్రవీణ్, లావణ్య కుమార్, కృష్ణయ్య, రాజారెడ్డి, కిరణ్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి మనోహర్, చిత్రంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నాయకులు

వ్యాపారవేత్త గిరిబాబుకు ఇంటర్నేషనల్ అవార్డు

తిరుపతి (బైరాగిపట్టెడ): తిరుపతికి చెందిన ప్రముఖ యువ వ్యాపార వేత్త నిత్యశ్రీ డిస్ట్రిబ్యూటర్స్ అధినేత యనమందల గిరిబాబు థాయిలాండ్ మాజీ డిప్యూటీ ప్రధాని చేతుల మీదుగా అత్యంత ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ బిజినెస్ కాంక్లేవ్ ఆన్ గ్లోబల్ బిజినెస్ ఆపర్చునిటీస్ కార్యక్రమంలో మోస్ట్ రిలయబుల్ కంపెనీ లీడర్‌షిప్ అచీవర్స్-2026 ఇంటర్నేషనల్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును అందుకున్న వ్యక్తుల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఈయన ఏకైక వ్యక్తి కావడం విశేషం.

అవార్డు అందుకుంటున్న యనమందల గిరిబాబు

సీజేఐకు ఘన వీడ్కోలు

రేణిగుంట, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ దంపతులకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన వీడ్కోలు లభించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా డిస్ట్రిక్ ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారి, తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ప్రొటోకాల్ మేజిస్ట్రేట్ కోటేశ్వరరావు తదితరులు ఆయనకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ సీజేఐ దంపతులకు ప్రసిద్ధిగాంచిన లేపాక్షి రోజ్‌ఉడ్‌తో తయారు చేసిన శ్రీనివాస స్వామి కళ్యాణ చిత్రపటం జ్ఞాపికను అందజేశారు.

సీజేఐ దంపతులకు చిత్రపటాన్ని అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

రేపు ప్రసన్న వెంకన్న ఆలయం మూసివేత

వడమాలపేట, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం కారణంగా అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం ఉదయం 9 గంటలకు మూసివేస్తున్నట్లు ఆలయాధికారి వేణుగోపాల్‌రాజు ఆదివారం తెలిపారు.

నోటీసులిచ్చారా.. తర్వాత చూస్తాం..!

సాగునీటి పనులు.. వాయిదాల వెతలు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ(జైకా) సహకారంతో చేపట్టిన పనుల్లో కదలిక లేకుండా పోయింది. వైకాపా హయాంలో బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారు. గుత్తేదారులకు పలుమార్లు నోటీసులిచ్చినా.. ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. సాగునీటి పథకాల ఆధునికీకరణకు 2019-20 ఎస్ఎస్ఆర్ ప్రకారం అంచనాలు రూపొందించగా ఆ ధరలతో ప్రస్తుతం పనులు చేపట్టలేయమంటూ గుత్తేదారులు మొండికేస్తున్నారు. నోటీసులనూ లెక్క చేయకుండా తర్వాత చూస్తాంలే అన్న ధోరణి కనబరుస్తున్నారు. ప్రస్తుతం పనులు దక్కించుకున్న గుత్తేదారులకే ప్రస్తుత ఎస్ఎస్ఆర్ ప్రకారం ధరలు చెల్లించడం లేదా.. టెండర్లను పూర్తిగా రద్దుచేసి.. కొత్తగా టెండర్లు ఆహ్వానించి.. కొత్త గుత్తేదారులకు పనులు అప్పగిస్తే పనుల్లో కదలిక వస్తుందని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయం మేరకు ముందుకెళ్తామని జలవనరుల శాఖ అధికారి వెంకటేశ్వరరాజు తెలిపారు.

పనుల వివరాలిలా..

■ చిత్తూరు : చేపట్టిన పనులు: 41, అంచనా విలువ: రూ.38.18 కోట్లు

■ తిరుపతి : చేపట్టిన పనులు: 24, అంచనా విలువ: రూ.42.36 కోట్లు

ప్రజల దృష్టి మరల్చేందుకే వైకాపా అసత్య ప్రచారం

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: కల్తీ నెయ్యి, పరకామణి చోరీ కేసుల నుంచి భక్తుల దృష్టి మరల్చేందుకే తితిదే ఛైర్మన్ బి.ఆర్. నాయుడుపై నకిలీ వీడియోలతో వైకాపా అసత్య ప్రచారం చేస్తున్నట్లు తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్ ఆరోపించారు. ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామిని అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం కరుణాకర్‌రెడ్డికి తగదన్నారు. త్వరలో ఏకసభ్య కమిషన్ కల్తీనెయ్యి, పరకామణి చోరీ, ఇతర స్కామ్‌లపై విచారణకు రానున్న సందర్భంలో ప్రజలను మభ్య పెట్టేందుకు మార్ఫింగ్ వీడియోలతో సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. తితిదేలో కోటి భగవద్గీతల ముద్రణ పేరుతో రూ.70 కోట్లను స్వాహా చేసి, ముద్రించిన భగవద్గీతలన్నీ ఇప్పటికీ గోడౌన్‌లోనే ఉన్నాయని, కరుణాకర్‌రెడ్డి హయాంలో జరిగిన రూ.వందల కోట్ల అవినీతి బండారం త్వరలోనే బయటపడుతుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో తెదేపా జిల్లా కార్యదర్శి ధరణీప్రకాష్, గోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సప్తగిరిప్రసాద్

వరసిద్ధుడి దర్శనానికి ఐదు గంటలు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దర్శనానికి భక్తులు ఆలయానికి ఆదివారం పోటెత్తారు. స్వామివారి దర్శనార్థం భక్తులు వేకువజాము నుంచి క్యూలైన్లలో బారులు తీరారు. దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టింది. భక్తులకు కావాల్సిన వసతులను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

నాయీ.. జమానా

☛ ఆర్థిక చేయూతగా ఉచిత విద్యుత్తు పథకం

☛ దేవాలయాల్లో సభ్యులుగా అవకాశం

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణుల ఆర్థిక, సామాజిక భద్రత కోసం కూటమి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. తిరుపతి పార్లమెంట్ పరిధిలో 2,200 మంది ఉండగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు ఐదువేల మంది సెలూన్ దుకాణాలు నిర్వహిస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. కరోనా తర్వాత పుట్టుకొచ్చిన కార్పొరేట్ సెలూన్ షాపులతో వారి జీవనోపాధి పూర్తిగా దెబ్బతింది. బ్లేడ్ నుంచి ఫేషియల్ క్రీముల వరకు ధరలు పెరిగిపోవడంతో కనీసం దుకాణాల అద్దెలు చెల్లించుకోలేక అవస్థలు పడుతూ వచ్చారు. కాలానుగుణంగా దుకాణంలో ఏర్పాటు చేసుకున్న ఏసీలు, ట్రిమ్మర్లు ఇతర వాటికి విద్యుత్తు ప్రామాణికం. విద్యుత్తు లేనిదే పని జరగదు. ఈ నేపథ్యంలో దుకాణాలకు ఉచిత విద్యుత్తు అందించేందుకు 2026-27 బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయిస్తూ గతంలోని 150 యూనిట్ల ఉచిత విద్యుత్తు పరిమితిని 200 యూనిట్లకు పెంచుతూ ప్రభుత్వం ఊరటనిచ్చింది.

- నాయీ బ్రాహ్మణుల సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రంలోని ప్రతి దేవాలయ పాలక మండలిలో ఒకరికి సభ్యుడిగా అవకాశం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఆ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 15 నుంచి 20 మంది వరకు ఉన్నారు. శ్రీకాళహస్తి, కాణిపాకం వంటి కీలక ఆలయాల్లోనూ అవకాశం దక్కింది.

త్వరలో ఆదరణ 3.O.

ఆదరణ 2.0 పథకం ద్వారా గతంలో సెలూన్ దుకాణాలు, నాదస్వరం, డోలు, బ్యాండ్‌సెట్ వంటి పరికరాలు పొందారు. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో చేతి, కుల వృత్తిదారులకు రూ.వెయ్యి కోట్లు కేటాయించడంలో ఆదరణ 3.0 ద్వారా మరింత మంది లబ్ధిపొందనున్నారు.

సామాజిక గౌరవానికి రక్షణ కవచం

కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా వారి సామాజిక గౌరవానికి రక్షణ కవచంలా నిలుస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు త్వరలోనే బీసీ సమగ్ర రక్షణ చట్టం తీసుకురానుంది. - రుద్రకోటి సదాశివం, కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్

చిత్తశుద్ధి చాటుకుంది

సెలూన్ దుకాణాలకు ఉచిత విద్యుత్తు అందిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీను నిలబెట్టుకోవడంతో పాటు కూటమి ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులపై చిత్తశుద్ధి చాటుకుంది. గతేడాదిలోనూ నేను ఉచిత విద్యుత్తు పథకంతో లబ్ధిపొందా. ఈ బడ్జెట్‌లో 200 యూనిట్ల వరకు పెంచడం సంతోషంగా ఉంది. - పి.మోహన్, దుకాణదారు

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడుపై డీప్ ఫేక్ ఏఐ వీడియోలు, ఫొటోలతో చేస్తున్న తప్పుడు ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని మదనపల్లెకు చెందిన రమేష్‌బాబు ఆదివారం ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కొందరు ఉద్దేశపూర్వకంగా తితిదే ఛైర్మన్ స్వరం, రూపం, వ్యక్తిత్వాన్ని అనుకరించేలా నకిలీ వీడియోలు, ఫొటోలు సృష్టించి సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన తితిదే గౌరవాన్ని దెబ్బతీయడానికి పన్నిన కుట్రగా కన్పిస్తోందని, దీని వెనక బలమైన రాజకీయ దురుద్దేశముందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వైకాపాకు చెందిన పలువురు, వారి సోషల్ మీడియా వ్యవస్థలు ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఒకటో పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు.

పంచాయతీల్లో పన్ను వసూలుకు 15 వరకు గడువు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు ఈనెల 15 వరకు గడువు పొడిగించినట్లు డీపీవో సుధాకర్‌రావు తెలిపారు. ఫిబ్రవరి 28వ తేదీ వరకు జిల్లాలో 75 శాతం పన్నులు వసూలు చేసినట్లు స్పష్టం చేశారు. మొత్తం లక్ష్యం రూ.27.41 కోట్లు కాగా, అందులో 75 శాతం రూ.20.55 కోట్లు రాబట్టినట్లు ఆయన వెల్లడించారు. గడువులోపు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలి

కడప నగరపాలక, న్యూస్‌టుడే: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై వైకాపా నాయకులు కడప నగరంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాల వైకాపా ప్రజాప్రతినిధులు, ఆయా జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కొన్ని నెలలుగా పొరుగురాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలు సీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు గొడ్డలిపెట్టుగా మారాయన్నారు. పనులను ఆపేస్తున్నామని ఏపీ సీఎం తనకు హామీ ఇచ్చినట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును బ్యారేజీ స్థాయికి తెచ్చి నామమాత్రంగా పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా దశలవారీ ఉద్యమాన్ని చేపడతామన్నారు. అనంతరం లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై పలు తీర్మానాలు చేశారు. ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, గురుమూర్తి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు ఈ అంశంపై ప్రసంగించారు.

బీసీల డిమాండ్ల సాధనకు కృషి చేయండి

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: బీసీల డిమాండ్ల సాధనకు కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరుణ్‌కుమార్‌ను ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి షణ్ముగం కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో వారిని షణ్ముగం కలిశారు. ఈ సందర్భంగా బీసీల హక్కుల సాధనకు భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు ఆయన తెలిపారు.

నాలుగురోజుల కిందట పెళ్లి.. అంతలో ఆత్మహత్య

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఇంటి ముంగిట వేసిన పందిరి వాడనే లేదు. పెళ్లికి వచ్చిన బంధువులు ఇంకా ఇళ్లకు చేరనేలేదు. కోలాహలంగా ఉండాల్సిన ఇంట్లో విషాదం నెలకొంది. నాలుగురోజుల కిందట వివాహం చేసుకున్న యువకుడు చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడటంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..

నాలుగురోజుల క్రితం పెళ్లిఫొటోలో భార్య సుజాతతో మురళి

బైరెడ్డిపల్లె మండలం కమ్మనపల్లె పంచాయతీ జోగిండ్లుకు చెందిన నరసింహులు కుమారుడు జె.మురళి (30) స్థానిక సీఎస్‌సీ కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. నాలుగేళ్ల కిందట బంధువుల అమ్మాయిని వివాహం చేసుకోగా కొన్నాళ్లకే వారి మధ్య మనస్పర్థలు ఏర్పడి విడిపోయారు. అనంతరం విడాకులు తీసుకున్నారు. ఫిబ్రవరి 25న ఇచ్ఛాపురానికి చెందిన సుజాతతో వివాహం జరిగింది. సీఎస్‌సీ కేంద్రానికి రోజూ వెళ్లినట్లు 28న ఉదయం ఇంటి నుంచి వెళ్లి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బైరెడ్డిపల్లె పెద్దచెరువులో చేపలుపట్టే వ్యక్తులు ఒడ్డుపై చెప్పులు ఉండటంతో గుర్తించి సమాచారం అందించారు. అనంతరం చెరువులో గాలించి మృతదేహాన్ని ఒడ్డుకు తీశారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చందన ప్రియ తెలిపారు.

EENADU Classifieds

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Mishra Sharmila Devi (OldName)W/o M.Niranjan Prasad, 205FirstFloor, SaiKrishnaBuilding, BalajiColony, Opp:Rallapalli Rest House, Tirupati, AP 517501.I Changed My Name to Mishra Sharmila. Henceforth I Willbe known as Mishra Sharmila.

REAL ESTATE

FLAT FOR SALE

GENERAL

తిరుపతి గెస్ట్‌లైన్ హోటల్‌కి ఆనుకొని మాస్టర్ ప్లాన్ 80 feet రోడ్డుకు AB AAVAS Phoenix Tower Smart Homesలో 2 BHK, 3 BHK Flats సేల్స్‌కు కలవు. RERA Project. 9505502346.

PLOT FOR SALE

GENERAL

తిరుపతి IIT దగ్గర దుర్గిపేరి నందు 25x40 కొలతలతో West ఫేసింగ్ ప్లాట్ కలదు. కేవలం 4,20,000/- మాత్రమే. ✆ 80997 85333.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నేషనల్ హైవేలకి ఆనుకొని తిరుపతిలో ప్లాట్‌లు చూస్తున్నారా? అయితే ఫైనల్‌అప్రూవ్డ్ కలిగిన ప్లాట్లు స్పాట్ రిజిస్ట్రేషన్ డైరెక్ట్ ఓనర్ ✆ 95027 74175 / 79959 92114.

WANTED

GENERAL

తిరుపతిలో 3BHK ఇండివిడ్యువల్ హౌస్ లేదా అపార్ట్‌మెంట్ ప్లాట్ అన్ని వసతులు గలది కావలెను. Con: 9393601489.

JOBS

Wanted Female Hostel Incharges Qualification any Degree. Age limit: 25 to 45 years. Salary upto: 15000/- Working Location: Master Minds College, Tirupati. Contact: 73822 59722.

We are Hiring 1.Charted Accountant (Male/ Female) 2.Office Asst. Executive (Female). Experience: Preferred, Salary: Depend on Experience, Location: TPT, Email:gurappaparameswara @ gmail.com ✆ 81234 59658.

తిరుపతిలో ప్రముఖ హోటల్‌లో పనిచేయుటకు మేనేజర్ కావలెను. మంచి జీతం+ అలవెన్సు Q: ఇంటర్. Contact: 9502561265.

తిరుపతి చుట్టుప్రక్కల సివిల్‌వర్క్స్ చేయించుటకు సూపర్‌వైజర్స్ కావలెను. Qua: డిప్లొమా/ B.Tech/ Any Degree. ఆకర్షణీయమైన జీతం ✆ 94941 77700.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డ్స్ / హౌస్‌కీపింగ్ కావలెను. 50 సం॥ వయస్సు, 12Hr డ్యూటీ, జీతం: 12,000 - 14,000, తిరుపతి, మదనపల్లిలో. ✆ 72880 04466.

THE EENADU WAY CLASSIFIEDS

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

తిరుపతి

•తిరుపతి •చంద్రగిరి

తితిదే కల్యాణకట్ట డిప్యూటీ ఈవో ఉద్యోగ విరమణ

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే కల్యాణకట్ట డిప్యూటీ ఈవోగా ఉద్యోగ విరమణ చేసిన పి.వెంకటయ్యను తితిదే ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు పూజారి రత్నప్రభాకర్ సన్మానించారు. ఆదివారం స్థానిక అన్నదానంలో విశ్రాంత డిప్యూటీ ఈవోను పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. ప్రస్తుతం అన్నదానం డిప్యూటీ ఈవో రాజేంద్ర కల్యాణకట్ట ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో అన్నదానం సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి ఘన వీడ్కోలు

రేణిగుంట, న్యూస్‌టుడే: పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన వీడ్కోలు లభించింది. ఆదివారం జిల్లా పర్యటన ముగించుకున్నా ఆయనకు విమానాశ్రయంలో అధికారులు, జనసేన నాయకులు వీడ్కోలు పలికారు.

చీరల వేలంతో అమ్మవారికి ఆదాయం

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి గ్రామదేవత శక్తి స్వరూపిణి శ్రీమూలస్థాన ఎల్లమ్మ తల్లికి భక్తులు సమర్పించిన చీరలు, రవికలు ఆదివారం శ్రీవరసిద్ధి వినాయకస్వామి మివారి దేవాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించారు. 133 చీరలు, రవికల వేలం ద్వారా అమ్మవారికి రూ.25,700 ఆదాయం వచ్చిందని ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ఈవో మమత వివరించారు.

8 నుంచి బాలాలయం

ఏర్పేడు, న్యూస్‌టుడే: దేశంలో మొట్టమొదటి శివాలయంగా గుర్తింపు పొందిన ఏర్పేడు మండలంలోని గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయంలో ఏప్రిల్ 18 నుంచి 23 వరకు మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ నెల 8 నుంచి బాలాలయం చేపట్టనున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

ఆలయం ఎదుట సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని ఆదివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా దర్శించుకున్నారు. వీరికి ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, ఏవీఎస్వో రాధాకృష్ణ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. త్రిపుర ముఖ్యమంత్రి వెంట తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

ఉద్యోగులకు ఆటల పోటీలు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వైద్య ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఏటుకూరి గిరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా మహేంద్ర, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, కేతారి రాధాకృష్ణ, ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: మార్చి 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తితిదే ఉద్యోగుల సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు వివిధ క్రీడా, వినోద పోటీలు నిర్వహించారు.

సదస్సు విజయవంతానికి పిలుపు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: శ్రీకాళహస్తిలో ఈనెల 9న జరిగే దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సదస్సును జయప్రదం చేయాలని సామాజిక జిల్లా హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయం ఆవరణలో జిల్లా సదస్సు ప్రచార కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు.

వెంకటరమణ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నాయకులు

దివంగత ఎమ్మెల్యే వెంకటరమణ జయంతి

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: దివంగత ఎమ్మెల్యే వెంకటరమణ జయంతిని ఆదివారం ఆయన అభిమానులు, సన్నిహితులు, తెదేపా నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక జీవకోనలోని రోడ్డులోని వెంకటరమణ ఘాట్ వద్ద ఆయనకు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కుటుంబ సభ్యులు, ఎమ్మెల్సీ ఆరణి శ్రీనివాసులు, భాజపా జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతలు కోడూరు బాలసుబ్రహ్మణ్యం, సింగంశెట్టి సుబ్బరామయ్య, కీర్తి, సంజయ్, నాగభూషణం, బ్యాంకు శాంతమ్మ, రామ్మూర్తి రాయల్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

ఇదేమి చోద్యం!

● నగరపాలిక వాహనాలతో కార్పొరేటర్ సొంత పనులు ● ప్రభుత్వం మారినా అధికార దుర్వినియోగం తప్పదా?

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి నగరపాలక సంస్థ కార్పొరేటర్ అనీష్‌కుమార్ మరో మారు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు.. కార్పొరేటర్‌గా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఆయన ఆది నుంచి వివాదాలకు నిలయంగా మారారు. తాజాగా వెస్ట్ చర్చి-మహిళా వర్సిటీ మార్గంలోని తన అనుమతులు లేని ఏడు అంతస్తుల అక్రమ నిర్మాణానికి ఆనుకుని మరో భవన నిర్మాణం కోసం నగరపాలిక వాహనాల్ని వాడుకోవడం పెద్ద చర్చనీయాంశమైంది.

అనీష్‌కుమార్ ఇంటి వద్ద మట్టి నింపుకొంటున్న నగరపాలిక టిప్పర్

సెలవు రోజు చూసుకుని..

ఇంటి నిర్మాణ పనులు సెలవు రోజైన ఆదివారం ప్రారంభమయ్యాయి. వివాదాస్పద స్థలం కావడంతో స్థానికులంతా వివరాలు ఆరా తీశారు. ఇంతలో నగరపాలిక వాహనం వచ్చి పునాదుల కోసం తవ్విన మట్టిని తరలించడంతో అధికారుల అండతోనే అదంతా జరుగుతున్నట్లు వారిలో భావని ప్రశ్నించలేకపోయారు. ఇన్నాళ్లు చెత్తతో నిండిన స్థలంలో రెండు రోజుల క్రితం భూమిపూజ చేసి శుభ్రం చేశారని, పునాదుల పనులు ఆదివారం ప్రారంభం కావడంతో మట్టి తరలింపునకు నగరపాలిక వాహనాన్ని విని యోగించారని ఆరోపిస్తూ స్థానికులు ఆ ఫొటోలు, వీడియోలు తీసి వైరల్ చేశారు. ఈ విషయాన్ని అనీష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. తాను కొనుగోలు చేసిన స్థలంలో చెత్త ఉండటంతో నగరపాలిక సిబ్బందిని కోరడంతో చెత్తను తరలించేందుకు నగరపాలిక టిప్పర్ వచ్చిందని సమాధానం ఇచ్చారు. వాస్తవానికి చెత్త తరలింపు కోసం అధికారికంగా విన్నవిస్తే.. అధికారులు జేసీబీ సహా టిప్పర్‌ను పంపేవారని, ప్రైవేటు జేసీబీ, నగరపాలిక టిప్పర్ ఎప్పుడూ రావని నగరపాలిక అధికారులు అంటున్నారు.

వైకాపా పాలనలో అధికారం అడ్డం పెట్టుకుని..

కార్పొరేటర్ అనీష్‌కుమార్ ఆది నుంచి వివాదాలు, అధికార దుర్వినియోగానికి పెట్టింది పేరు. ఈనెల 16తో పదవీకాలం ముగుస్తున్నా ఆయన మాత్రం నగరపాలిక యంత్రాంగాన్ని ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారు. వైకాపా పాలనలో నగరపాలిక అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఏడు అంతస్తుల భవనాన్ని నిర్మించడం, నగరవ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తినా.. అప్పటి అధికారులు సహకారంతో నిర్మాణం పూర్తిచేశారు. ఆ ఇంటిని ఆనుకుని ఉన్న కొంత స్థలాన్ని ఇటీవల అనీష్‌కుమార్ కొనుగోలు చేయగా.. అతో మ్యూటేషన్ విధానంతో ఖాళీ జాగా పన్ను విధించారు. ఖాళీ జాగా పన్ను చెల్లించి చిన్నది స్థలం అక్కడ లేకపోగా.. అందులో కొంత భాగం భవన నిర్మాణం కోసం అనుమతులు పొందారు. దీంతో రాసిన ప్రణాళికలో ఉన్న ఖాళీగా ఉన్న స్థల విస్తీర్ణానికి పొంతన లేకపోవడం విశేషం.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) తిరుపతి : 80080 20003 చంద్రగిరి : 80085 74561 పాకాల : 80085 74563

చంద్రగిరి, న్యూస్‌టుడే: సమస్య: చంద్రగిరి పంచాయతీ కొత్తపేటలోని రైల్వే ఫీడర్ రోడ్డుమార్గంలో ఉన్న మురుగునీటికాల్వలో చెత్త చెదారం నిల్వ ఉంది. -గురునాథంరెడ్డి, స్థానికుడు సమాధానం: రైల్వే ఫీడర్ రోడ్డులోని రోడ్డుపక్కన ఉన్న మురుగునీటి కాల్వను శుభ్రం చేయించడంతో పాటు దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తాం. -చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ ఈవో

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: సమస్య: కాలేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ వీధి దీపాలకు స్విచ్చులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రింబవళ్లు వెలుగుతూనే ఉన్నాయి. -స్థానికులు సమాధానం: సమస్యను సంబంధిత పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి ఆన్ అండ్ ఆఫ్ స్విచ్చులు లేని విద్యుత్ వీధి దీపాలకు వెంటనే ఏర్పాటు చేయిస్తాం. -గిడ్డయ్య, ఇన్‌ఛార్జి ఎంపీడీవో

ఆక్రమణ అడ్డుకున్న సర్పంచి

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని అవిలాల పంచాయతీకి చెందిన మంచినీటి బోరు ఆక్రమణను సర్పంచి వెంకటరమణ, స్థానికులు ఆదివారం అడ్డుకున్నారు. బోరు పక్కన ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఆ బోరును సైతం తన ఇంటి స్థలంలోకి కలిపేసుకుని ప్రహరీ నిర్మాణానికి పనులు చేపట్టడంతో అడ్డుకున్నారు.

'ఇల్లొక రాజకీయం' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గీతాంజలి రచించిన ఇల్లొక రాజకీయం పుస్తకాన్ని ప్రముఖులు ఆవిష్కరించారు. ఎస్వీయూ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విభాగాధిపతి డా.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఈ పుస్తకంలో అనేక అంశాలను క్షుణ్ణంగా ప్రస్తావించారంటూ కొనియాడారు. ఆకుల మల్లేశ్వరరావు, వాణి ప్రసాద్, డా.బాలాజీ, పరమేశ్వరరావు, రామవరాజు తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ ఉద్యోగులకు క్రీడా పోటీలు

పాల్గొన్న పసుపులేటి శివప్రసాద్, ఎంఎల్‌ఎన్ వరప్రసాద్

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: స్థానిక ఎస్వీయూ తారకరామ క్రీడా మైదానంలో ఆదివారం జల వనరుల శాఖ ఆధ్వర్యంలో జలతరంగిణి జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. జోనల్ స్థాయిలోని ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని క్రికెట్ ఆడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా (ప్రధాన స్పాన్సర్) అనంత రాజ్ ఆక్వా-2 ఛైర్మన్ పసుపులేటి శివప్రసాద్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలకు చెందిన జలవనరుల శాఖ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. మరో ముఖ్య అతిథి చీఫ్ ఇంజినీర్ ఎం.ఎల్.ఎన్.వరప్రసాద్, తెలుగుగంగా సూపరింటెండెంట్ ఇంజినీర్ రాధాకృష్ణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పసుపులేటి వెంకటేశ్వర ప్రసాద్, రవిశంకర్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భాజపాను బలోపేతం చేయాలి

పృథ్వీ కుమార్‌ను సన్మానిస్తున్న మండల అధ్యక్షుడు కిషోర్‌కుమార్ తదితరులు

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: గ్రామస్థాయి నుంచి భాజపాను బలోపేతం చేయాలని భాజపా యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పృథ్వీ తెలిపారు. ఆదివారం చిన్నగొట్టిగల్లులోని భాజపా పార్టీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో జీవన్ కుమార్, పార్థసారధి, మండల అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌లు పాల్గొన్నారు.

కనువిందు చేసిన కూచిపూడి ప్రదర్శన

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కూచిపూడి ప్రదర్శన సందర్శకులను కనువిందు చేసింది. ఆదివారం చిత్తూరుకు చెందిన జయంతి స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శన జరిగింది. ఇందులో భాగంగా పలు సంకీర్తనలకు కళాకారులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఏవోలు సుధాకర్, ఖాదర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి: బీటీఏ

పాకాల, న్యూస్‌టుడే: బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 4న అమరావతిలో నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గంధ్యపల్లి అంజనేయులు పిలుపునిచ్చారు. పాకాలలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రామమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య, మండల శాఖ అధ్యక్షుడు జ్యోతిప్రసాద్, నాయకులు జయబాల, రాజేంద్రుడు, కృష్ణమూర్తి, ఆదికేశవులు, శివ, రెడ్డెప్ప, తులసీరాం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ ఘోరం.. మరుగుదొడ్లు భారం

పాకాలలో వారపుసంత ఆవరణలో నిరుపయోగంగా మరుగుదొడ్డి

నిర్మించారు.. నిర్వహణ గాలికొదిలేశారు

పాకాల, న్యూస్‌టుడే: మండల కేంద్రం పాకాల టౌన్‌తో పాటు దామలచెరువు టౌన్‌లోనూ ప్రజా మరుగుదొడ్ల సమస్య ప్రహసనమైంది. అవసరమైన ప్రాంతాల్లో జనానికి పరుగు రివాజుగా మారింది. పాకాలలో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు దినసరి కూరగాయల మార్కెట్, రైల్వేజంక్షన్ కూడా ఉండటంతో నిత్యం వేలాది మంది ఇక్కడకు రాకపోకలు సాగిస్తారు. సోమవారం వారపు సంత కావడంతో పరిసర గ్రామాల నుంచి భారీగా జనం చేరుకుంటారు. దామలచెరువులోనూ జాతీయ రహదారితో పాటు శనివారం వారపుసంత, వేసవిలో మామిడి మార్కెట్ వల్ల జనం రద్దీ తీవ్రంగా ఉంటుంది. విధిలేని స్థితిలో జనాలు పరిసర ఓపిక పట్టినా వీటికి పడిందంటే ప్రధాన కూడళ్ల పరిసరాలనే మరుగుదొడ్లుగా భావిస్తుండటంతో అంతా దుర్గంధ భరితమౌతోంది.

పాకాల పంచాయతీ అధికారులు స్వచ్ఛభారత్ పథకం ద్వారా పలుచోట్ల మరుగుదొడ్లను నిర్మించి నిర్వహణను గాలికొదిలేశారు. వారపు సంత ఆవరణలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి నిర్వహణ ప్రారంభమైన దుర్గంధం వెదజల్లుతోంది. స్టేట్ బ్యాంకు ఎదుట, పూలమార్కెట్ పక్కన ఉన్న ప్రజా మరుగుదొడ్లను ఏ లక్ష్యంతో నిర్మించారో అధికారులకే మరిచిపోయారు. తలుపులు సైతం విరిగిపోయి వ్యర్థాలా మారాయి. వీటికి తోడు రెండు చోట్ల ఈ-టాయిలెట్లు నిర్మించి వాటినీ వదిలేశారు. నిత్యం మండల స్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది ఇక్కడే తిరుగుతున్నా వీటిని పట్టించుకోకపోవడంతో పరిస్థితి ఘోరంగా మారింది. అత్యవసరమైన స్థితిలో మహిళలు సైతం పరుగులు నిత్యకృత్యంగా మారాయి. దామలచెరువు పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న ఏకైక మరుగుదొడ్డి కేవలం సిబ్బందికే మాత్రమే ఉపయోగపడుతున్నాయి. నిత్యం టౌన్‌కు వచ్చే ప్రయాణికులు, శనివారం వారపుసంతకు వచ్చే జనం కష్టాలను పట్టించుకోవడం లేదు.

వినియోగంలోకి తీసుకొస్తాం: అబిద్ బాషా, పంచాయతీ కార్యదర్శి

గతంలో నిర్మించిన మరుగుదొడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. వీటిని బాగు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

తందూరీ.. వెరై'టీ'గా

తిరుపతి ఐఐటీలో మూడురోజుల పాటు టెక్నోఫెస్ట్ జరిగే ఆవరణలో వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. తిరుపతికి చెందిన చందు తందూరీ స్టాల్ ప్రత్యేకంగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకుండా ఏర్పాటు చేశారు. తందూరీ టీ అంటే మట్టి కుండలను నిప్పులపై బాగా వేడి చేసి అందులో అల్లం యాలకులు వేసి, తయారు చేసిన మసాలా టీని పోసి, ప్రత్యేకమైన స్మోకీ ఫ్లేవర్‌తో సుగంధద్రవ్యాలు, మట్టి వాసన కలిసిపోయి మంచి రుచి వస్తుంది. సాధారణ టీ కంటే ప్రత్యేకంగా ఉంటూ.. జీర్ణక్రియకు బాగుంటుందని నిర్వాహకుడు తెలిపారు. -ఈనాడు, తిరుపతి

నిర్వహణ లేని తితిదే చిహ్నం

తిరుమల, న్యూస్‌టుడే: తితిదే చిహ్నం మైన 'దర్శనాన్ని ఆచరించండి.. ధర్మమే మిమ్మల్ని రక్షిస్తుంది' నినాదంతో స్థానిక షాపింగ్ కాంప్లెక్స్‌లో ఓ విద్యుత్ బోర్డును ఏర్పాటు చేశారు. కానీ సదరు బోర్డును కొంతకాలంగా నిర్వహణ చేయకపోవడంతో దుమ్ము పట్టింది. అదే సమయంలో విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో వెలగడం లేదు. నిత్యం వేల మంది భక్తులు సందర్శించే షాపింగ్ కాంప్లెక్స్‌లోని తితిదే చిహ్నాన్ని నిర్వహణ చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నిజాయతీ చాటుకున్న ఆటో చోదకుడు

రేణిగుంట, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఓ ఆటోచోదకుడు తన నిజాయతీ చాటుకున్నాడు. కడప జిల్లా కేసీ దిన్నె మండలానికి సుధా, వెంకటరత్నం ఆటోలో రేణిగుంటకు ప్రయాణించింది. అనంతరం ఆటోలో ల్యాప్‌టాప్, బంగారు గొలుసును మరిచిపోయింది. వాటిని గుర్తించి పోలీసులకు అప్పగించాడు.



9వ వర్ధంతి

మీరు దైవసన్నిధికి చేరి 9 సంవత్సరములు గడిచినను మీ జ్ఞాపకలు మా మదిలో ఎల్లప్పుడు నిలిచే ఉంటాయి. మీ ఆత్మకు శాంతికలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కీ.శే. శ్రీ మద్దూరు రామచంద్రన్ గారు
H.O.D. of English (Retd), S.V.Arts College, TTD.
DOD - 02-03-2017

కుమారుడు: Professor M.వెంకటేశ్వర రావు 93813 12445
కోడలు: Professor V.సుమతి
మనవడు: మద్దూరు రోహిత్ కుమార్ USA
మనవడి భార్య: దేవరకొండ హర్షశ్రీ USA

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ మంత్రి పరసారత్నం

విద్యతోనే ఉత్తమ భవిత

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని మాజీ మంత్రి పరసా వెంకటరత్నం పేర్కొన్నారు. మన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం యూత్ హాస్టల్‌లో నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్ విజేతలకు అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఉయ్ సపోర్టు ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత్రి తహసున్నీసాబేగం, మన సంస్కృతి సంస్థ సంచాలకులు షేక్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులను సన్మానించిన అధికారులు

నీటి కొరత లేకుండా చూడండి

చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే: వేసవిలో గ్రామాలలో నీటి కొరత రాకుండా చూడాలని ఎంపీడీ యుగంధర్‌రెడ్డి అధికారులకు తెలిపారు. ఆదివారం చిన్నగొట్టిగల్లులోని మండల సర్వసభ్య సమావేశ నిర్వహించారు. సీడీపీవో ప్రమీల మాట్లాడుతూ నెల్లుట్లవారిపల్లిలో గల అంగన్‌వాడీ కేంద్రం మిషన్ వాత్సల్య కార్యక్రమానికి ఎంపికైనట్లు తెలిపారు. ఏవో ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సర్పంచుల పదవీకాలం ముగియనుండడంతో వారిని సన్మానించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ క్రిష్ణారెడ్డి, ఎంపీడీవో గిడ్డయ్య, డీటీ భాస్కర్, జడ్పీటీసీ స్వరూపలు పాల్గొన్నారు.

సాగు పనులకు మంగళం

విస్తరిస్తున్న రియల్ బూమ్

ఇరంగారిపల్లి వద్ద నూతన వెంచర్

పాకాల, న్యూస్‌టుడే: పచ్చని పొలాలు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుతున్నాయి. గతంలో తిరుపతి, చిత్తూరు వంటి నగరాల్లో మాత్రమే కనిపించిన రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇప్పుడు పాకాల, దామలచెరువు తదితర చిన్న టౌన్‌లకు విస్తరిస్తోంది. మండల కేంద్రం పాకాల భారతం మిట్ట పరిసరాల్లోని పచ్చని పొలాల్లోనూ ఇప్పుడు భారీ భవంతుల దర్శనమిస్తున్నాయి. నేండ్రగుంట, ఇరంగారిపల్లి, పాలినేనిపల్లి, తోటపల్లి ప్రాంతాల్లో రోడ్డు పక్కనున్న భూములు లేఔట్లుగా మారిపోయాయి. తుడా అప్రూవల్ కాగానే వ్యాపారులు ప్లాట్లను అమ్మకానికి పెడుతున్నారు. దామలచెరువులోనూ మ్యాంగోనగర్, బాలిరెడ్డిగారిపల్లె ప్రాంతాల్లోనూ నూతన లేఔట్లు వెలిశాయి. ● నగరాలతో దీటుగా చిన్న టౌన్‌లలోనూ పార్కులు, జిమ్, స్విమ్మింగ్‌పూల్, పార్కింగ్ వంటి ఆధునిక వసతులతో వెంచర్లు వేస్తున్నారు. పాకాల-నేండ్రగుంట, పాకాల-కొత్తకోట, పాకాల-తోటపల్లి, దామలచెరువు-నేండ్రగుంట, దామలచెరువు-పులిచెర్ల రహదారులను ఆనుకుని ఉన్న పొలాలను కొనేందుకు రియల్ వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. ప్రాంతాన్ని బట్టి ఎకరానికి రూ.20-50 లక్షల వరకు చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు. కొనుగోలుదారుల ప్లాట్ ఉన్న ప్రాంతాన్ని బట్టి చదరపు అడుగుకు రూ.750 నుంచి రూ.2500 వరకు చెల్లిస్తున్నారు. వీటికి తోడు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కాలనీల్లో 1829 పెండింగ్ పట్టాలు మంజూరు చేయగా అందులోనూ 50 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

అనుమానితుల సమాచారం అందించండి

గ్రామస్థులతో డీఎస్పీ శ్రీనివాసరావు

రేణిగుంట, న్యూస్‌టుడే: పట్టణంలో ఎవరైనా అనుమానంగా కనిపిస్తే వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. చట్టాలు, భద్రత అంశాల అవగాహనలో భాగంగా తూకివాకం పంచాయతీలోని ఎస్ఎస్‌పురంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ మంజునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని పాత అన్నదాన భవనం, షాపింగ్ కాంప్లెక్స్ నుంచి సుపథం వైపు వెళ్లే భక్తులు ఆదమరిస్తే రాళ్లు పాదాలకు అడ్డపడి పడిపోయే పరిస్థితి నెలకొంది. రోజూ కొన్ని వేల మంది నడిచే ఈ మార్గంలో ఇటీవల తితిదే అభివృద్ధిలో భాగంగా బండరాళ్లను ఏర్పాటు చేసింది. అయితే వేసిన కొన్ని రోజులకే రాళ్ల కింద సరిగా సిమెంట్‌తో సక్రమంగా చేయకపోవడంతో ఊడిన కొన్ని రోజులకు బండరాళ్లు అమరికలో లోటుపాట్లు ఏర్పడ్డాయి. దీంతో ఆయా మార్గంలో వెళ్లే భక్తులు రాత్రి సమయంలో, చూసుకోకుండా నడిచినా రాళ్లు కాళ్లకు తగిలి గాయాల పాలవుతున్నారు. దీనిపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు దృష్టిసారించి సరిచేయాలని భక్తులు కోరుతున్నారు.

నత్తనడకన అభివృద్ధి పనులు

రాంభగీచా బస్టాండుకు సమీపంలోని 'హెచ్‌టీ షాపింగ్ కాంప్లెక్స్' వద్ద తితిదే ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా అక్కడ సిమెంట్ మెట్ల స్థానంలో రాతితో మెట్లను, కాలువలను నిర్మిస్తున్నారు. ఆ పనులు నత్తనడకన సాగుతుండడంతో ఆటుగా వెళ్లే భక్తులు ఇబ్బందిపడుతున్నారు.

అస్తవ్యస్తంగా ఉన్న దారిలో నడిచి వెళ్తున్న భక్తులు

దీనిపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

దహనక్రియలు



మాకు ప్రేమానురాగాలు పంచి, మా ఉన్నతికి అహర్నిశలు శ్రమించిన మా ఇంటి దైవం కీ.శే. శ్రీ కె.వి. సుబ్రమణ్యం శెట్టి గారు 01-03-2026వ తేది ఆదివారం సా. 5.30గం.లకు స్వర్గస్తులైనారు.

వీరి దహనక్రియలు 02-03-2026వ తేది సోమవారం మ. 1.30గంలకు తిరుపతి, కరకంబాడి రోడ్డు పద్మావతి గోవిందధామం నందు జరుగును. తెలియజేయుచున్నాము. వీరి పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..

కుమారులు: కె.ఎస్. వెంకటాచలం, కె.ఎస్. పార్థసారధి
18-2-69, అశోక్‌నగర్, తిరుపతి. ఫోన్: 9440266381, 9032080487

(c) eenadu

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు • రైల్వేకోడూరు

రూ.3.66 లక్షల చెక్కుల పంపిణీ

చెక్కులు పంపిణీ చేస్తున్న భాజపా నాయకులు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమమే సీఎం చంద్రబాబు ప్రధాన లక్ష్యమని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు అన్నారు. ఆదివారం కొర్లకుంటలో భాజపా నియోజకవర్గ బాధ్యులు గడ్డం చంగల్‌రాజు, మండలాధ్యక్షుడు ముక్క రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధితులకు రూ.3.66 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాజపా నాయకులు మనోహర్ రెడ్డి, రవీంద్రరెడ్డి, శంకరయ్య, విశ్వనాథ్, బాలాజీ, కేశవ రాజు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన వీడ్కోలు

రేణిగుంట, న్యూస్‌టుడే: పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన వీడ్కోలు లభించింది. ఆదివారం జిల్లా పర్యటన ముగించుకున్నా ఆయనకు విమానాశ్రయంలో అధికారులు, జనసేన నాయకులు తదితరులు వీడ్కోలు పలికారు.

నిజాయతీ చాటుకున్న ఆటో చోదకుడు

రేణిగుంట, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఓ ఆటోచోదకుడు తన నిజాయతీ చాటుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. కడప జిల్లా సీకే దిన్నె మండలానికి సుధా, వెంకటరత్నం ఆటోలో రేణిగుంటకు ప్రయాణించింది. అనంతరం సంచిలో ల్యాప్‌టాప్, బంగారు గొలుసును మరిచిపోయింది. వాటిని గుర్తించి పోలీసులకు అప్పగించాడు. బాధితురాలు సుధా, పోలీసులు వెంకటరత్నాన్ని అభినందించారు.

గుడిమల్లం ఆలయాభివృద్ధికి ప్రణాళిక

ఆలయ ఛైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డితో చర్చిస్తున్న మునిరత్నంరెడ్డి

ఏర్పేడు, న్యూస్‌టుడే: మాస్టర్ ప్లాన్‌తో గుడిమల్లంలో వెలిసిన శ్రీ పరశురామేశ్వర స్వామి ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని పురావస్తుశాఖ డైరెక్టర్ డా. మునిరత్నంరెడ్డి తెలిపారు. ఆదివారం గుడిమల్లంకు చేరుకుని ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మాస్టర్ ప్లాన్‌పై ఈవో రామచంద్రారెడ్డి, ఛైర్మన్ గిరినాయుడు, గ్రామపెద్దలతో చర్చించారు. ఒంటిమిట్ట ఆలయం తరహాలో గుడిమల్లం ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

పరమేశ్వరుడికి ప్రదోష పూజలు

నాగలాపురం, న్యూస్‌టుడే: సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో ప్రదోష పూజలను ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం మూలవర్లకు తైలకాభిషేకం చేశారు. సాయంత్రం ప్రదోష మండపంలో కొలువైన ఏకాంత నందీశ్వరునికి అర్చకులు పంచతీర్థాలతో అభిషేకించి విశేషాలంకరణ చేశారు. ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు, ఈవో లత పర్యవేక్షించారు.

'వృథా'.. తప్పదు 'వ్యధ'

లీకేజీల నియంత్రణపై చర్యలు శూన్యం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వేసవి కాలం మొదలవుతున్న నేపథ్యంలో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రజలు ప్రైవేట్ ట్యాంకర్ల పైనే ఆధారపడాల్సి వస్తోంది. అయితే ముందస్తు ప్రణాళికలు, పొదుపుగా వాడుకోవడం, నీటి నిల్వల పెంపు, భూగర్భ జలాల సంరక్షణ, పైపుల మరమ్మతులపై చర్యలు చేపడితే తాగునీటి కష్టాలకు పరిష్కారం లభిస్తుంది. ఈ మేరకు వృథాపై కూడా అడ్డుకట్ట పడుతుంది.

పట్టణానికి తాగునీరు అందించే జలాశయ నీటి నిల్వలు

ఆదుకుంటున్న 'గంగ'..

పురపాలక సంఘంలో తాగునీటి దాహార్తిని దూరం చేస్తోంది తెలుగుగంగ పథకం. ఇక్కడి వేసవి జలాశయం పూర్తి స్థాయి సామర్థ్యం 67 ఎంసీఎఫ్‌టీలు. కండలేరు నుంచి తెలుగుగంగ కాల్వ ద్వారా నీటి నిల్వ చేస్తున్నారు. వీటిని పంప్‌హౌస్‌కు పంపి అక్కడ నుంచి పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఉన్న సంపుకు పంపు చేస్తారు. పట్టణంలోని ప్రధాన రక్షిత మంచినీటి పథకాలకు మళ్లింపు చేస్తున్నారు.

నిత్యం మరమ్మతులు

నిల్వ చేసిన వృథా కాకుండా అరికట్టాలి. పట్టణంలో ఇటీవల లీకేజీల సమస్యల తరచూ తలెత్తుతున్నాయి. శాశ్వత మంచినీటి పథకం తూతూమంత్రంగా జరగడంతో తరచూ పైప్‌లైన్లు మరమ్మత్తులకు గురవుతూనే ఉన్నాయి. ఒక్కసారి పైప్‌లైన్లు దెబ్బతింటే దాన్ని బాగు చేసేందుకు సిబ్బంది నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఎందుకంటే ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్లు కావడంతో తరచూ లీకేజీ సమస్యలతో పైప్‌లైన్లను మరమ్మతులు చేస్తూ రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఏదీ ఏమైనా వేసవి దృష్ట్యా అధికారులు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నివాస గృహాల సంఖ్య: 20,030, వార్డుల సంఖ్య: 35, తాగునీటి కుళాయిల సంఖ్య: 7329, రక్షిత మంచినీటి పథకాల సంఖ్య: 9, చేతిపంపులు: 327, పవర్‌బోర్ల సంఖ్య: 34, రోజుకు అవసరం: 6.7 ఎంఎల్‌డీ, ప్రస్తుతం అందిస్తున్నది: 6.5 ఎంఎల్‌డీ, వేసవి జలాశయంలో నీటి నిల్వలు: 35 ఎంసీఎఫ్‌టీలు

విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

నైపుణ్యాభివృద్ధితో ఉజ్వల భవిష్యత్తు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు తమలోని నైపుణ్యాలను గుర్తించడం, వాటిని మెరుగుపరచుకోవడం ద్వారా మంచి భవిష్యత్తును సాధించవచ్చని సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య పేర్కొన్నారు. గత వారం నుంచి విద్యార్థులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులతో శిక్షణ ఇప్పించారు. దీంతో ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి : 80085 74555
నాగలాపురం : 98854 43308
ఓబులవారిపల్లె : 99664 67525
రైల్వేకోడూరు : 97035 72572

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: **సమస్య:** వ్యర్థాలను కాల్వలో పడేస్తున్నారు. **- సుజాత, మార్కెట్ వీధి**

సమాధానం: సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాం. **- తిరుమల, పారిశుద్ధ్య అధికారి**

నారాయణవనం, న్యూస్‌టుడే: **సమస్య:** ఇప్పతాంగేల్ గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో విషసర్పాల భయంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- మణి, స్థానికుడు**

సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేసే ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటాం. **- అరుణ, ఎంపీడీవో**

నాగలాపురం, న్యూస్‌టుడే: **సమస్య:** నాగలాపురం గణపతి వీధిలో మురుగునీటి కాలువలు అధ్వానంగా ఉన్నాయి. పిచ్చిమొక్కలతో పెరిగాయి. **- శరవణ, నాగలాపురం**

సమాధానం: సిబ్బందితో కాలువలకు మరమ్మతులు చేయిస్తాం. **- చిన్నదురైసుధ, సర్పంచి**

8 నుంచి బాలాలయం

ఏర్పేడు, న్యూస్‌టుడే: దేశంలో మొట్టమొదటి శివాలయంగా గుర్తింపు పొందిన ఏర్పేడు మండలంలోని గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయంలో ఏప్రిల్ 18 నుంచి 23 వరకు మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8 నుంచి బాలాలయం చేపట్టనున్నారు. దీంతో 45 రోజులపాటు భక్తులకు సాధారణ దర్శనం మాత్రమే లభించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శ్రీ పరశురామేశ్వరస్వామి

ఉపాధ్యాయుడి పాత్ర చిరస్మరణీయం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర చిరస్మరణీయంగా మిగిలిపోతుందని శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ మాజీ అంజూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన తొట్టంబేడు ఎంఈవో-2 భాస్కర్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం భాస్కర్ దంపతులను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. శ్రీకాళహస్తి ఎంఈవో-2 బాలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్ఞాపికను అందజేస్తున్న అంజూరు శ్రీనివాసులు తదితరులు

అనుమానితుల సమాచారం అందించండి

రేణిగుంట, న్యూస్‌టుడే: పట్టణంలో ఎవరైనా అనుమానంగా కనిపిస్తే వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. చట్టాల, భద్రత అంశాల అవగాహనలో భాగంగా తూకివాకం పంచాయతీలోని ఎస్ఎన్‌పురంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి నిర్మూలన, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులతో డీఎస్పీ శ్రీనివాసరావు

కాలువలో పూడిక.. మురుగు పారక

చిలకావారికండ్రిగలో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. ఎటు చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడిక కాలువలో పేరుకు పోయాయి. మురుగు ముందుకు కదిలే పరిస్థితి లేక ఎక్కడికక్కడ స్తంభించింది. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా కాలువల్లో పూడిక తొలగించలేదు. మురుగునీరు నిల్వతో సాయంత్రం సమయాల్లో దోమల దాడితో అనారోగ్యాలకు గురవుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేయించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తొట్టంబేడు**

ఆదమరిస్తే.. అంతే సంగతి

శ్రీకాళహస్తి-తిరుపతి మార్గంలో నక్కలకాల్వపై ఏర్పాటు చేసిన వంతెన ప్రమాదకరంగా మారింది. అభివృద్ధి పనుల దృష్ట్యా వంతెన వద్ద తవ్వకాలు చేపట్టారు. మళ్లీ సక్రమంగా పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారింది. అజాగ్రత్తగా ఉంటే వాహనాలు నేరుగా నక్కలకాల్వలోకి దూసుకెళ్లే ప్రమాదముంది. దీన్ని బాగు చేయడంతో పాటు సిమెంటు డివైడర్‌ను ఇక్కడ ఏర్పాటుచేసి ప్రమాదాలను నియంత్రించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

తందూరీ.. వెరై'టీ'గా

తిరుపతి బైపాస్‌లో మూడురోజుల పాటు టెక్నో ఫెస్ట్ జరిగే ఆవరణలో వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. తిరుపతికి చెందిన చందు తందూరి స్టాల్ ప్రత్యేకంగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకుండా ఏర్పాటు చేశారు. తందూరి టీ అంటే మట్టి కుండలను నిప్పులపై బాగా వేడి చేసి అందులో అల్లం యాలకులు వేసి, తయారు చేసిన మసాల టీని పోసి, ప్రత్యేకమైన స్మోకీ ఫ్లేవర్‌తో సుగంధద్రవ్యాలు, మట్టి వాసన కలిసిపోయి మంచి రుచిని ఇస్తుంది. సాధారణ టీ కంటే ప్రత్యేకంగా ఉంటూ.. జీర్ణక్రియకు బాగుంటుందని నిర్వాహకుడు తెలిపారు.. **-ఈనాడు, తిరుపతి**

రైల్వే డివిజన్ సాధనకు కృషి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని సాధన సమితి సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, నాగేంద్ర, టీవీ రావు, జయకుమార్, రవికుమార్‌లు కోరారు. పట్టణంలోని బత్యాల భవన్‌లో ఆదివారం స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. రైల్వే డివిజన్ ఆవశ్యకతను, ప్రయోజనాలను వివరించారు. ఆర్థిక అభివృద్ధి, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డివిజన్ సాధించడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. తెదేపా నాయకులు రమేష్, హేమరాజ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మహారాజ రాజశ్రీ మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టు: రాజంపేట

I.A. No.1039/2018 in O.S. No.7/2014

కస్తూరి అభిలాష్, మైనర్, వారి తరపున వారి తల్లి కస్తూరి శోభారాణి ...పిటిషనర్

Vs

R4. కస్తూరి పద్మమ్మ, భర్త కీ॥శే॥ యానాదయ్య, డి.నెం.10/894, చిట్వేలి రోడ్, రైల్వేకోడూరు టౌన్,
R5. కట్టా పరమేశ్వరి, భర్త రంగయ్య చౌదరి, ఉంగరాల నగర్, రైల్వేకోడూరు టౌన్,
R6. కస్తూరి శివశంకరయ్య, తండ్రి కీ॥శే॥ యానాదయ్య, డి.నెం.10/894, చిట్వేలి రోడ్, రైల్వేకోడూరు టౌన్,
R7. గడికోట స్రవంతి, భర్త సుధాకర్, ఓబనపల్లి (Vi & Po), రైల్వేకోడూరు (మం). ...రెస్పాండెంట్లు

NOTICE

పై కనిన పిటిషనర్ రెస్పాండెంట్లు R4 to R7 అయిన మీపై డిక్లరేషన్ ఆఫ్ టైటిల్ అండ్ దావా ఆస్తిని తనకు స్వాధీనము చేయమని పై కనిన కోర్టులో పై దావా దాఖలు చేసి ఉన్నారు. ఆ దావా పిటిషన్ వేయడంలో 62 రోజుల ఆలస్యాన్ని మన్నించమని కోరుతూ పై పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. ఇందులకు గాను మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల **13.03.2026** తేదీ ఉ॥ 10.30 గం॥కు పై కోర్టు నందు మీరు ప్రత్యక్షంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

By Order of the Court
యం.శంకరయ్య
పిటీషనర్ తరపు న్యాయవాది, రైల్వేకోడూరు.

సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కండి

సత్యవేడు, న్యూస్‌టుడే: జిల్లా పర్యటనకు వచ్చిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని ఆదివారం స్థానిక జనసేన నాయకుడు బాలమురళీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. సంస్థాగత ఎన్నికల్లో గెలుపు కోసం జనసేన సభ్యత్వం నమోదు ఉద్యమంలా చేయాలని ఆయన సూచించారు. మండలంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సభ్యతం కోసం సొంత నగదు ఇస్తానని ఆయన మంత్రికి వివరించారు.

మంత్రి నాదెండ్ల మనోహర్‌తో మురళి

ఉపాధి దిశగా అడుగులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మహిళలు ఉపాధి దిశగా అడుగులు వేయడం ఆనందంగా ఉందని శ్రీసత్యసాయి సేవా ట్రస్టు సమన్వయకర్త పాండురంగయ్యశెట్టి అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసత్యసాయి సేవా మందిరంలో టైలర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం నమోదు చేయిస్తున్న జనసేన నాయకులు

ఆటో డ్రైవర్లకు జనసేన సభ్యత్వం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు జనసేన సభ్యత్వం కల్పిస్తూ, సదరు రుసుమును కూడా తామే చెల్లిస్తామని జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు పగడాల వరలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం ఆటో యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆటో యూనియన్ గౌరవ సలహాదారు బత్తిన గంగయ్యయాదవ్, అధ్యక్షుడు సిద్దేశ్వర తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ శ్రీనివాసులు, ఎస్సైలు

పర్యవేక్షణ పకడ్బందీగా ఉండాలి

పుల్లంపేట, న్యూస్‌టుడే: కనకదుర్గమ్మ తిరునాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షణ పకడ్బందీగా ఉండాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పుల్లంపేట మండలంలోని దేవరకొండలో సోమవారం జరిగే కనకదుర్గమ్మ తిరునాలకు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అమరవీరులకు నివాళి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మాదిగల అమర వీరులకు ఎమ్మార్పీఎస్ నేతలు నివాళులర్పించారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో ఆదివారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి అమరవీరుల త్యాగాల గురించి కొనియాడారు. రాజ, వెంకటముని, ఈశ్వర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

యువత అభ్యున్నతికి కృషి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వన్నెకుల క్షత్రియులైన యువకులు ఉన్నత చదువులు అభ్యసించి రాజకీయంగా, సామాజికంగా అభ్యున్నతిని సాధించాలని ఆ సంఘ నేతలు కోరారు. పట్టణంలోని పొన్నాలమ్మ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 8వ తేదీన నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.గురవారెడ్డి, రవి, తేజోవతి, బాలసుబ్రహ్మణ్యం, మునిరత్నం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజ రాజశ్రీ మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టు: రాజంపేట

I.A. No.1040/2018 in O.S. No.7/2014

కస్తూరి అభిలాష్, మైనర్, వారి తరపున వారి తల్లి కస్తూరి శోభారాణి ...పిటిషనర్

Vs

R4. కస్తూరి పద్మమ్మ, భర్త కీ॥శే॥ యానాదయ్య, డి.నెం.10/894, చిట్వేలి రోడ్, రైల్వేకోడూరు టౌన్,
R5. కట్టా పరమేశ్వరి, భర్త రంగయ్య చౌదరి, ఉంగరాల నగర్, రైల్వేకోడూరు టౌన్,
R6. కస్తూరి శివశంకరయ్య, తండ్రి కీ॥శే॥ యానాదయ్య, డి.నెం.10/894, చిట్వేలి రోడ్, రైల్వేకోడూరు టౌన్,
R7. గడికోట స్రవంతి, భర్త సుధాకర్, ఓబనపల్లి (Vi & Po), రైల్వేకోడూరు (మం). ...రెస్పాండెంట్లు

NOTICE

పై కనిన పిటిషనర్ రెస్పాండెంట్లు R4 to R7 అయిన మీపై డిక్లరేషన్ ఆఫ్ టైటిల్ అండ్ దావా ఆస్తిని తనకు స్వాధీనము చేయమని పై కనిన కోర్టులో పై దావా దాఖలు చేసి ఉన్నారు. ఆ దావా డీఫాల్ట్ డిస్మిస్ అయినందున దానిని తిరిగి పునరుద్ధరించమని కోరుతూ పై పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. ఇందులకు గాను మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల **13.03.2026** తేదీ ఉ॥ 10.30 గం॥కు పై కోర్టు నందు మీరు ప్రత్యక్షంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

By Order of the Court
యం.శంకరయ్య
పిటీషనర్ తరపు న్యాయవాది, రైల్వేకోడూరు.

విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: విద్యార్థులకు అందుబాటులో పుస్తకాలు, గ్రంథాలయాలకు వచ్చే విధంగా చైతన్యం తీసుకురావాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ గురవారెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీకాళహస్తి గ్రంథాలయాన్ని ఆదివారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. 'చదవడం మాకు ఇష్టం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ గురవారెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

పుల్లంపేట, న్యూస్‌టుడే: ఆయిల్ ట్యాంకర్, కారు ఢీకొనడంతో ఐదుగురికి గాయాలయిన ఘటన పుల్లంపేట ఆదర్శపాఠశాల సమీపంలో చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తూ గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఐసర్‌లో 'మై ఆక్టోపస్ టీచర్'

ఏర్పేడు, న్యూస్‌టుడే: జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా తిరుపతి ఐసర్‌లో ఆదివారం 'మై ఆక్టోపస్ టీచర్' కార్యక్రమం నిర్వహించారు. అనుభవాలతో సైన్స్‌ను సజీవంగా కాపాడుకునే విధానం, చేపట్టాల్సిన పరిశోధనలు గురించి ఆడిటోరియంలో ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు ప్రత్యేక విందు చేశారు. స్నేహభావం పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించారు.

వ్యాను ఢీకొని మహిళ మృతి

చిలకమ్మ

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని వీకేఆర్‌వైకాలనీ సమీపంలో రోడ్డు దాటుతుండగా, వాహనం ఢీకొని మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. శనివారం రాత్రి చిన్నపాండూరు పంచాయతీ వడ్డికండ్రిగకు చెందిన చిలకమ్మ(48) తన కుమారుడు పృథ్వీతో కలిసి కట్టెల కోసం వెళ్లారు. పృథ్వీ కట్టెలమోపును బైకుపై పెట్టుకుని వస్తుండగా, నడుస్తూ వస్తున్న చిలకమ్మ రోడ్డు దాటే క్రమంలో సత్యవేడు వైపుగా ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొనడంతో మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీసిటీ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు..

చిట్వేలి, ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన ఘటన చిట్వేలిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిట్వేలి మండలం పోల్లోపల్లె పంచాయతీ పత్తికుంటవారిపల్లె గ్రామానికి చెందిన రాఘవ నరసరాజు(59) ఆదివారం తన పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లారు. మోటార్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు సర్వీస్ వైరు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

సంఘం చేయూత..

మహిళల ఆర్థిక సాధికారత

నారాయణవనం, న్యూస్‌టుడే: తమ కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ఉపాధి, కూలీ పనులకు వెళ్లలేని పరిస్థితి ఆ మహిళలది. మరోవైపు తమ చదువులకు ఉద్యోగం దొరకక పోవడంతో స్వయం సహాయక పొదుపు సంఘమే వారికి అండగా నిలిచి కుటుంబాలకు భరోసా కల్పించి ఆర్థిక స్వావలంబనకు దారి చూపింది. ఆర్థికంగా వెనుకబడిన పలువురు మహిళలు డ్వాక్రా సంఘం చేయూతతో అభివృద్ధి చెందుతూ కుటుంబ పోషణలో భాగస్వాములు అవుతున్నారు. సంఘం ద్వారా రుణాలు పొంది వివిధ రకాల వ్యాపారాలు చేస్తూ మహిళా సాధికారత సాధిస్తున్నారు.

పరిమళించిన స్వావలంబన

మండలంలోని వెంకటకృష్ణపాళెంకు చెందిన పరిమళ సంఘం ద్వారా తీసుకున్న రుణంతో టైలరింగ్‌లో శిక్షణ పొంది, సొంతంగా కుట్టు మిషన్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తూ కుటుంబ పోషణలో తన వంతు భాగస్వామిగా మారారు. దర్జీ పని ద్వారా ఆదాయం అంతంత మాత్రమే కావడంతో మళ్లీ సంఘం ద్వారా రుణం తీసుకుని ఇంటి వద్దే చిన్నకొట్టు ఏర్పాటు చేశారు. వ్యాపారం పెరగడంతో మరోమారు రుణం తీసుకుని కిరాణా దుకాణంగా మార్చారు. దీంతో రెండు వైపులా ఆదాయం పెరగడంతో ఆర్థికంగా భరోసా కలిగింది. భర్త దూరమైనా స్వశక్తితో నిలబడి ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు.

ప్లాస్టిక్ ప్లేట్ల వ్యాపారంతో జీవనజ్యోతి

మండలంలోని కల్యాణపురం పంచాయతీకి చెందిన ఎస్.జ్యోతి భర్త మేస్త్రి పనితో చాలీచాలని ఆదాయంతో కుటుంబ పోషణ భారంగా ఉండేది. దీంతో ఆమె 2005లో బాలాజీ పొదుపు సంఘంలో చేరి వ్యాపారాన్ని ప్రారంభించి హోటళ్లు, టీ దుకాణాలకు అవసరమైన కాగితపు భోజన ప్లేట్లు, కప్పులు విక్రయిస్తున్నారు. సొంతంగా యంత్రాలు ఏర్పాటు చేసుకుని అవసరమైన వస్తువులను తయారుచేసి విక్రయించి ఆదాయం పొందుతున్నారు. భర్త మేస్త్రి పని మానేసి ఆమెకు సాయంగా ఉంటున్నారు. వ్యాపార విస్తరణకు సంఘం ద్వారా పొందిన రుణంతో వ్యాన్ కొనుగోలుచేసి దుకాణాలకు అందిస్తూ ఎదుగుతున్నారు.

రుణం పొంది.. ఆర్థికంగా ఎదిగి

నారాయణవనంకు చెందిన ఎల్లమ్మ 2007లో సంఘంలో చేరారు. తన భర్త ఎకరా పొలంలో చేసే వ్యవసాయంతో కుటుంబ పోషణ భారంగా మారింది. తాను కుటుంబానికి ఆసరాగా ఉండాలనే ఉద్దేశంతో సంఘం ద్వారా రుణం తీసుకుని చిన్న బంకు పెట్టుకుని కిరాణా దుకాణం నడుపుతున్నారు. వచ్చిన ఆదాయంతో చిట్టీలు కడుతూ, పొదుపు చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఆ ఆదాయంతో నలుగురు పిల్లలను ఉన్నత చదువులు చదివించారు. ఓ కుమార్తెకు వివాహం చేసి కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

సూళ్లూరుపేట
• సూళ్లూరుపేట • వెంకటగిరి

పట్టణంలో ఆకస్మిక తనిఖీ

స్వాధీనం చేసుకున్న వాహనాలు

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం సూళ్లూరుపేట పట్టణంలో సూళ్లూరుపేటలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఇళ్లలో సమగ్రంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని వివిధ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ మురళీకృష్ణ, శ్రీహరికోట ఎస్సై నాగబాబు, సూళ్లూరుపేట సర్కిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 80 నుంచి రూ. 87 వరకు
రెండో రకం: కిలో రూ. 70 నుంచి రూ. 80 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్ (రైతు ధర)	153
లేయర్	85
బ్రాయిలర్స్	270
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	300
లేయర్ మాంసం	145

పరమేశ్వరుడికి ప్రదోష పూజలు

నాగలాపురం, న్యూస్‌టుడే: సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో ప్రదోష పూజలు ఆదివారం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం ప్రదోష సమయంలో కొలువైన ఏకాంత నందీశ్వరునికి అర్చకులు పంచామృతాలతో అభిషేకించి విశేషాలంకరణ చేశారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి

తెదేపా నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

వాకాడు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రధాన సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఆదివారం వాకాడు మండలం ముట్టెంబాక గ్రామంలో శ్రీహరిరెడ్డి, జయమ్మ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం సహకార సంఘం అధ్యక్షుడు ఉచ్చూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి నివాసంలో మండల నేతలతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు మధురెడ్డి, కృష్ణమూర్తి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, దయాకర్, అజికిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాజయ్య, పరంధామరెడ్డి, అరుణ్‌కుమార్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలు

సదస్సులో పాల్గొన్న డాక్టర్ తేజస్విని

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ తేజస్విని తెలిపారు. ఆదివారం సూళ్లూరుపేట పట్టణ పరిధిలోని మన్నారు పోలూరు మన్నారుస్వామి ఆలయం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లోని రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకుతోట రమేష్, పిట్ల సుబ్రహ్మణ్యం, డాక్టర్ హరిప్రసాద్, వైద్య సిబ్బంది, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూలో వీడని అవినీతి

- ప్రతి ఫైలుకు పైసలు
- రైతులను వదలని అవినీతిపరులు

సూళ్లూరుపేట, నాయుడుపేట, న్యూస్‌టుడే: డివిజన్‌లో రెవెన్యూ వ్యవస్థలో అవినీతి పెరుగుతోంది. న్యాయబద్ధంగా చేయాల్సిన చిన్నపాటి పనులకు వేలల్లో లంచాలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో రైతులు ఇతర వర్గాలు రెవెన్యూ కార్యాలయాలకు వెళ్లాలంటే హడలిపోతున్నారు. దీంతో అసలే అధికారులు ఆశ్చర్యపోతున్నారు.

● సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లో 11 మండలాలున్నాయి. రెవెన్యూశాఖ గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వే కారణంగా పలు గ్రామాల్లో రైతులకు చెందిన భూముల రికార్డులు తారుమారయ్యాయి. సిబ్బంది చేసిన పొరపాట్లు కారణంగా పట్టా భూములకు చెందిన సర్వేనంబర్లు నోషనల్‌ఖాతాలో పడడం, క్లియర్ టైటిల్ ఉన్న భూములు 22ఏ జాబితాల్లో చేర్చడం. భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉండడం. వీటిని లోపాలు లేకుండా సరిచేసుకునేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెవెన్యూ సదస్సులు, క్లినిక్‌లు నిర్వహించి సరిచేయాలని ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రెవెన్యూలో కొందరు అధికారులు అడిగిన మేరకు వేలల్లో సొమ్ము చెల్లిస్తే తప్పా బాధ్యత పరంగా వీటిని సరిచేయడం లేదు. ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఇచ్చుకోలేని రైతులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది.

అడిగిన మేరకు ఇస్తేనే

డివిజన్‌లో నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల్లో ఇటీవల జాతీయ రహదార్ల నిర్మాణానికి రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారం చెల్లించాల్సి ఉంది. ఇందుకు కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాలకు పంపాల్సి ఉంటుంది. ఇలాంటి వాటిని సిఫార్సు చేయాలంటే రైతుల నుంచి లక్షల్లో డిమాండ్ చేస్తున్నారు. వారసత్వ పరంగాను, కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు, లేఅవుట్లకు సంబంధించి భూ మార్పిడి, అనుమతులకు తహసీల్దారు కార్యాలయం వరకు అంచెలంచెలుగా సొమ్ము చెల్లిస్తేనే పని జరుగుతుందన్న విమర్శలు ఉన్నాయి.

వేటు పడుతున్నా వీడని అవినీతి

గతంలో సత్యవేడు తహసీల్దారు కార్యాలయంలో ప్రైవేటు భూముకు పట్టాలు ఇచ్చిన ఘటనలో కొందరు రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. రెండు నెలల క్రితం ఓజిలిలో పని చేసిన తహసీల్దారు భూముల విషయంలో తప్పుడు నివేదికలు ఇవ్వడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. డివిజన్‌లో మొన్నటి వరకు కీలకంగా వ్యవహరించిన ఒక అధికారిపై అవినీతి విమర్శలు వెల్లువ అవుతున్నాయి. రాజగారి సంతవేలూరు రైతుకు చెందిన భూమి రికార్డు సరిచేయడానికి రూ.40వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఘటన రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 88979 08890
వెంకటగిరి: 80085 73966
10 AM TO 1 PM

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: నాయుడుపేట పాత ఐసీఐసీఐ కార్యాలయం వీధిలో దుమ్ము లేవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **- సాయికుమార్**

సమాధానం: దుమ్ములేవకుండా నీరు చల్లేలా చర్యలు తీసుకుంటాం. **- పరమేశ్వరం, డీఈ నాయుడుపేట**

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: నాయుడుపేట బాలాజీగార్డెన్‌లో నీరు సరిగా రావడంలేదు. **- చంద్ర, స్థానికుడు**

సమాధానం: గ్యాస్ పైపులైన్ల గోతులతో తాగునీటి పైపులు దెబ్బతిన్నాయి. వెంటనే మరమ్మతులు చేసి నీటి సరఫరా చేస్తాం. **- వజులుల్లా, కమిషనర్**

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: సూళ్లూరుపేట మండలంలోని పెద్దపడవ, కొమ్మినేనిపల్లి గ్రామాల్లో రాత్రి పూట వెలగాల్సిన విద్యుత్తు దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. **- వీరయ్య**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- శేఖర్‌బాబు, ఏఈ, విద్యుత్‌శాఖ**

వాకాడు, న్యూస్‌టుడే: సమస్య: వాకాడు జాతీయ రహదారి పైపాస్ రోడ్డు శివాలయం కూడలిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. **- గోపిరెడ్డి, వాకాడు**

సమాధానం: పరిశీలించి చర్యలు చేపేలా సత్వరం చర్యలు తీసుకుంటాం. **- రామాంజనేయులు, రభ ఈఈ, గూడూరు**

నియోజకవర్గ అభివృద్ధే ఎమ్మెల్యే లక్ష్యం

సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ తెదేపా నాయకులు

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకే ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శ్రమిస్తున్నారని సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్ పేర్కొన్నారు. ఆదివారం సూళ్లూరుపేట పట్టణం ఆర్అండ్‌బీ బంగ్లాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కొందరు ఆమె కుటుంబ సభ్యులపైన అసత్య ఆరోపణలు చేస్తున్నారని అది సరైన పద్ధతి కాదన్నారు. సీసీరోడ్లు, మురుగు కాలువలు, మున్సిపాలిటీ అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. అలాంటిది వారి కుటుంబంపై నిందలు వేయడం మంచిదికాదన్నారు. సూళ్లూరుపేట రూరల్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, తడ మండల అధ్యక్షుడు సెల్వం, దొరవారిసత్రం మండల అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, రైతు సంఘం ఛైర్మన్ ఏజీ కిషోర్, ఏపీ బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ పళని, సుధాకర్‌రెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

4న అగ్నిగుండ మహోత్సవం

బాలాయపల్లి, న్యూస్‌టుడే: ఈ నెల 4వ తేదీన పెరిమిడి పొందరంగస్వామి ఆలయం వద్ద 84వ సంవత్సర ఆనంద అగ్నిగుండ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రతి ఏటా ఫల్గుణ మాసం పౌర్ణమి నాడు నిర్వహించే ఈ వేడుకలను ఆదివారం సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. సోమవారం ధ్వజారోహణ, మంగళవారం కంకణ ధారణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీలో సమగ్ర మార్పులు

వెంకటగిరి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమగ్రమైన మార్పులు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, పోషణ సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. కార్యకర్తల సేవలకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. వీరి సేవలు నిరంతరం కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ఇనుప పైపు

నాయుడుపేట-వెంకటగిరి రోడ్డు మలుపులో రోడ్డు పక్కన ఇనుప పైపు ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ర.భ.రోడ్డు పక్కన గ్యాస్ పైపులైన్ల తవ్వకాల్లో ఇనుప పైపును అమర్చారు. ఈ పైపు పైకిలేచి ఉంది. రాత్రి వేళల్లో వాహనాలు ఢీకొనే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని తొలగించాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

వృథాగా నీరు

నాయుడుపేట పురపాలక సంఘం బిరదవాడ సమీప ప్రాంతాల్లోకి తెలుగుగంగ జలాలు వృథా అవుతున్నాయి. ఈ నీరు ఖాళీ స్థలాల్లోకి చేరుతోంది. సమీపంలోని 7వ బ్రాంచి కాల్వ నుంచి బిరదవాడ చెరువులోకి నీరు చేరుతోంది. చెరువు తూముల నుంచి ఈ నీరు చేరుతుంది. అవసరాలకు ఉపయోగ పడాల్సిన గంగ జలాలు వృథా అవుతున్నాయి. వేసవిలో నీటికి కటకటలాడే పరిస్థితుల్లో ఇలా నీరు వృథా అవుతున్నా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదు.

- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

మురుగు.. తొలగించేదెవరు?

సూళ్లూరుపేట పట్టణంలోని గాండ్ల వీధిలో రహదారి పక్కన మురుగు నీటి కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకు పోయాయి. మురుగు ముందుకు కదలక దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడద అధికంగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సూళ్లూరుపేట పట్టణం

చేనేతలకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యేకు సూక్ష్మ రాట్నం అందిస్తున్న పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్

వెంకటగిరి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేనేతలకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం మహేశ్వరి స్కిల్ డిపో కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేతలకు అందించే రాయితీ 15 శాతం నుంచి 25కు పెంచాలని కోరినట్లు తెలిపారు. పట్టణంలో చేనేతలందరూ ఒకే ప్రాంతంలో మగ్గాలు ఏర్పాటు చేసుకునేలా షెడ్‌లు ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. వైకాపా పాలకులవల్ల అన్ని వర్గాలు దెబ్బతిన్నాయన్నారు. అన్ని వర్గాల వారికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. త్వరలోనే చేనేతలకు అవసరమైన పరికరాలు అందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో స్కిల్ కేంద్రం ఏర్పాటుతో చేనేతలకు రాయితీపై పట్టు ఇక్కడే అందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు రమణయ్య, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, ఏఎంసీ ఛైర్మన్ విశ్వనాథం, నేతలు రాజేశ్వరరావు, సీసీనాయుడు, సత్యనారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఫ్లెక్సీలపై ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి చిత్రాలతో సహా కేంద్ర, రాష్ట్ర జౌళి శాఖా మంత్రుల చిత్రాలు లేక పోవడంపై ఎమ్మెల్యే సంబంధిత అధికారులపై మండిపడ్డాడు.

ఖాళీ స్థలాలతో ఇక్కట్లు

అపరిశుభ్రంగా ఖాళీ స్థలం

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట రూరల్ మండలంలోని కోటపోలూరు గ్రామంలో ఖాళీ స్థలాల్లో మురుగు చేరి అధ్వానంగా మారింది. పంచాయతీ అధికారులు వాటి నిర్వహణను పట్టించుకోక పోవడంతో పిచ్చి మొక్కలు పెరగడంతో చుట్టు పక్కల నివశించే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముళ్ల కంపలు పెరిగి అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. ముఖ్యంగా రాత్రి వేళ విష పురుగులు నివాసాల్లోకి రావడంతో పరిసర ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకునేదెవరు: గ్రామాల పరిధిలో ఖాళీ స్థలాలను శుభ్రం చేయించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలి. పంచాయతీ స్థలాల్లో అధికారులు స్పందించి శుభ్రం చేయించాలి. కోటపోలూరు గ్రామంలో తూర్పుహరిజనవాడ దేవాలయం పక్కన ఉన్న స్థలంలో నీరు నిలుస్తోంది. ఈ స్థలం నుంచి ర.భ రహదారి అవతల వైపునకు తూము ఉంది. ఆ తూము మూసుకు పోవడంతో నీరు పోకపోవడంతో చుట్టు పక్కల ఇళ్లలో దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా విషజ్వరాల భారిన పడుతున్నామంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉచిత విద్యుత్తును సద్వినియోగం చేసుకోండి

సెలూన్‌ను పరిశీలిస్తున్న సదాశివం

వెంకటగిరి, న్యూస్‌టుడే: నాయీ బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం అందించే 200 యూనిట్లు ఉచిత విద్యుత్తును సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం కోరారు. ఆదివారం పట్టణంలోని పలు సెలూన్ దుకాణాలను స్వయంగా పరిశీలించి ఉచిత విద్యుత్తుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సదాశివం మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అవకతవకల పాలనతో రాష్ట్రం తిరోగమనం చెందిందన్నారు. దేవాలయాల్లో పని చేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేలు వేతనం ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఆదరణ-3 పథకం ద్వారా పనిముట్లు అందించనున్నారన్నారు. సూపర్‌సిక్స్ అమలు చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వీటిని చూసి ఓర్వలేక వైకాపా నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కోటేశ్వరరావు, వరదరాజులు, ప్రకాష్, వెంకటేష్, శివ, కృష్ణ, దినేష్, చిరంజీవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5.2 కోట్లతో సిమెంటు రోడ్లు

ఓజిలి, న్యూస్‌టుడే: మండలంలో 2024, 2025 సంవత్సరంలో రూ.5.2 కోట్లతో గ్రామాల్లో సిమెంటు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో నారాయణరెడ్డి తెలిపారు. హర్మేనిపాడు, అత్తివరం, భట్లకనుపూరు, భువనగిరిపాళెం, చిలమానుచేను, గ్రద్దగుంట, గుర్రంకొండ, ఇనుగుంట, క్రబల్లువోలు, కొండవల్లిపాడు, కొత్తచెరువు, కుందాం, కురుగొండ, మాచవరం, మనమాల, మనవాలి, ముమ్మాయిపాళెం, నెమళ్లపూడి, ఓజిలి, పెద్దపరియా, పున్నేపల్లి, రాచపాళెం, రావిపాడు, సగుటూరు, తిరుమలపూడి, వెంకటరెడ్డిపాళెం, గ్రామ పంచాయతీల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శాసన సభ్యులు నెలవల విజయశ్రీ చొరవతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమ్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పలు గ్రామాలకు రోడ్లు గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో అధికారులు మరమ్మతులు చేపడుతున్నారన్నారు.

జనసేన సభ్యత్వాన్ని స్వీకరించాలి

వెంకటగిరి, న్యూస్‌టుడే: జనసేన ఉద్యమ సభ్యత్వాన్ని స్వీకరించాలని జనసేన పార్టీ నియోజకవర్గం నేత తోట కృష్ణయ్య కార్యకర్తలను కోరారు. ఆదివారం తిరుపతిలో పార్లమెంట్ పరిధిలో చేపట్టిన జనసేన ఉద్యమ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్, తిరుపతి జిల్లా జనసేన అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వెంకటగిరి నియోజకవర్గ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గతంలో కంటే ఈ ఏడాది మరిన్ని సభ్యత్వాలు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రతినిధులు రాజేష్, హరిప్రసాద్, కస్తూరమ్మ, తిరుపాల్, రవీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణం.. అమ్మవారి దర్శనం నిలుపుదల

శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో చంద్రగ్రహణం కారణంగా గ్రహణ సమయంలో అమ్మవారి దర్శనం నిలుపుదల చేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి ప్రసన్నలక్ష్మి తెలిపారు. మంగళవారం ఉదయం 9.00 గంటల నుంచి బుధవారం ఉదయం 9.00 గంటల వరకు దర్శనాన్ని నిలిపి వేసినట్లు తెలిపారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం అమ్మవారి దర్శనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. భక్తులు గమనించాలన్నారు.

నిందితులను అరెస్టు చేయాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న బాధితులు

తడ, న్యూస్‌టుడే: హత్యకు పాల్పడ్డ నిందితులను అరెస్టు చేయడంలో పోలీసులు జాప్యం చేస్తున్నారని బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం ఆందోళన చేశారు. మండలంలోని పెరియవట్టు గ్రామంలో ప్రభాకర్‌ను ఆదివారం అత్యంత దారుణంగా కత్తులతో దాడి చేసి హత్య చేసిన విషయం తెలిసిందే. అయితే నిందితులను ఇప్పటికీ ఎందుకు అరెస్టు చేయలేదని మృతుని బంధువులు, కుటుంబ సభ్యులు జాతీయ రహదారిపై వాహనాలను అడ్డుకుని ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న నాయుడుపేట సీఐ సంఘమేశ్వరరావు పెరియవట్టు చేరుకుని విరమింపజేశారు. నిందితుల కోసం రెండు బృందాలు గాలిస్తున్నాయని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని హామీతో ఆందోళన విరమించారు.

8 నుంచి బాలాలయం

శ్రీ పరశురామేశ్వరస్వామి

ఏర్పేడు, న్యూస్‌టుడే: దేశంలో మొట్టమొదటి శివాలయంగా గుర్తింపు పొందిన ఏర్పేడు మండలంలోని గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయంలో ఏప్రిల్ 18 నుంచి 23 వరకు మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8 నుంచి బాలాలయం చేపట్టనున్నారు. దీంతో 45 రోజులపాటు భక్తులకు సాధారణ దర్శనం మాత్రమే లభించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శిల్పారామంలో కనువిందు

కూచిపూడి ప్రదర్శన

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కూచిపూడి ప్రదర్శన సందర్శకులను కనువిందు చేసింది. ఆదివారం చిత్తూరుకు చెందిన విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఇందులో భాగంగా పలు సంకీర్తనలకు కళాకారులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఏవోలు సుధాకర్, ఖాదర్‌వల్లీ పాల్గొన్నారు.

ఇల్లొక రాజకీయం పుస్తకం ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గీతాంజలి రచించిన ఇల్లొక రాజకీయం పుస్తకాన్ని పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. ఎస్వీయూ ఓరియంటల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విభాగాధిపతి డా.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పుస్తకంలో అనేక అంశాలను చాలా చక్కగా ప్రస్తావించారంటూ కొనియాడారు. కార్యక్రమంలో మల్లేశ్వరరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

కుస్తీలో పతకాల పంట

నాయుడుపేట, సూళ్లూరుపేట న్యూస్‌టుడే: బాల్యంలో కొందరు యువతీ యువకులు చదువుతో పాటు కుస్తీలో ప్రతిభ కనపరుస్తున్నారు. సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న గ్రామీణ విద్యార్థులు పెళ్లకూరు మండలం రోసనూరు కేంద్రంగా తర్ఫీదు పొందుతున్నారు. ఉదయ్‌కుమార్ శిక్షణలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

ఐదు పసిడి పతకాలు

ఓజిలి మండలం క్రబల్లవోలు గ్రామానికి చెందిన కె.ముత్యాలయ్య పెళ్లకూరు మండలం రోసనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. బాల్యం నుంచి కుస్తీపై ఉన్న ఆసక్తితో శిక్షణ తీసుకుంటుంది. అండర్ 15, 17 విభాగాల్లో పూణే, హర్యానా, ఉత్తర ప్రదేశ్, మణిపూర్, చిత్తూరులో జరిగిన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఐదు పసిడి పతకాలు కైవసం చేసుకుంది. రక్షణ రంగంలో ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో శారీరక దృఢత్వంపై దృష్టి సారిస్తోంది.

ఆటపై ఆసక్తి

డక్కిలి మండలం నాలులపాడు గ్రామానికి చెందిన అన్నెం ప్రత్యూష డక్కిలి బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. శారీరక దృఢత్వాన్ని సాధించే దిశగా కుస్తీ పోటీల పట్ల ఉన్న ఆసక్తితో నిత్యం తర్ఫీతు పొందింది. అండర్ 17, 19 విభాగాల్లో దిల్లీ చత్రశాల ఇండోర్ మైదానం, హర్యానా రాష్ట్రం సోనిపట్టు ప్రాంతాల్లో జరిగిన జాతీయ కుస్తీ పోటీల్లోను, ఇటీవల చిత్తూరు కేంద్రంగా జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని మూడు పసిడి పతకాలు సాధించింది.

చదువుతో పాటు తర్ఫీదు

సూళ్లూరుపేట మండలం పెద్దపడవ గ్రామానికి చెందిన జి.గ్రీష్మంత్ ప్రస్తుతం నాయుడుపేట అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శారీరక బలమే ఆరోగ్య రక్షణగా భావించి సెలవు రోజుల్లో కుస్తీలో శిక్షణ పొందుతున్నాడు. అండర్ 15, 17, 19 విభాగాల్లో దిల్లీ, ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాల్లో జరిగిన కుస్తీ పోటీల్లోనూ జాతీయ స్థాయిలో, ఏపీలో చిత్తూరు కేంద్రంగా జరిగిన పోటీల్లో ఐదు పసిడి పతకాలు సాధించాడు.

ఖాళీ సమయం సద్వినియోగం

తడ మండలం చేనుగుంట గ్రామానికి చెందిన కొమ్మల గీత ప్రస్తుతం సూళ్లూరుపేట గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. బాల్యం నుంచి ఆటలు, క్రీడల పట్ల ఉన్న ఆసక్తితో కుస్తీని అభిమాన క్రీడగా భావించి సెలవు రోజుల్లో తర్ఫీదు పొందుతోంది. ఉత్తర ప్రదేశ్ గోరఖ్‌పూర్, మహారాష్ట్ర పూణే, తమిళనాడు రాష్ట్రం సేలంలో అండర్ 14, 15 విభాగాల్లో పాల్గొని మూడు పసిడి పతకాలు కైవసం చేసుకుంది. సూళ్లూరుపేట బాలికల గురుకుల పాఠశాలకు కుస్తీలో గుర్తింపు తెచ్చింది.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర చికిత్సా శిబిరం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీనాగేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా ఉచిత నేత్ర చికిత్సా శిబిరం నిర్వహించారు. ఆదివారం ఏఎంసీ ఛైర్మన్ ఆకుతోట రమేష్ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్, డీసీబీఎస్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ నారాయణరెడ్డి, కమిటీ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

తడ, న్యూస్‌టుడే: తడకండ్రిగ పంచాయతీ బీసీ కాలనీలో అద్దె ఇంట్లో కాపురం ఉంటున్న యార్లగడ్డ శ్రీకాంత్(37) ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తడ పోలీసుల కథనం మేరకు.. శ్రీకాంత్ శ్రీసిటీలోని పరిశ్రమలో సీనియర్ మేనేజరుగా పని చేస్తున్నాడు. బాపట్ల జిల్లా రేపల్లె స్వగ్రామం. భార్య, కుమార్తెతో కలిసి తడలో కాపురం ఉంటున్నాడు. ఇటీవల కుటుంబ సభ్యులు కొన్ని ఆర్థిక సమస్యలను పరిష్కరించారు. మిగిలిన అప్పుల ఒత్తిడి తట్టుకోలేక ఆదివారం తెల్లవారు జామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుప్పకూలి లారీ డ్రైవరు మృతి

క్రైం కార్నర్

తడ, న్యూస్‌టుడే: శ్రీసిటీ కూడలి సమీపంలోని డాబా వద్ద లారీ డ్రైవరు రాధాకృష్ణన్(50) శనివారం రాత్రి మృతి చెందాడు. కోయంబత్తూరు నుంచి శ్రీసిటీకి లోడుతో శనివారం చేరుకున్నాడు. అన్‌లోడు చేయడానికి ఆలస్యం కావడంతో డాబావద్ద లారీ నిలిపి అల్పాహారం అనంతరం కుప్పకూలి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

(c) eenadu

ఆటపాటల ఉదయం.. ఆరోగ్య దేహం!

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్డులో ఫిట్ ఇండియా కార్నివాల్ పేరుతో సైకిల్ థాన్ నిర్వహించారు. వేలాది మంది యువత పాల్గొని సందడి చేశారు. ప్రారంభంలో జరిగిన జుంబా నృత్యాల్లో యువత హుషారు మిన్నంటింది. కరాటే, స్కిప్పింగ్ తదితర క్రీడాంశాల్లో బాలలు విన్యాసాలు ప్రదర్శించి అలరించారు. పశ్చిమ, ఉత్తరం ఎమ్మెల్యేలు గణబాబు, విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు. – ఈనాడు, విశాఖపట్నం

ఈనాడు విశాఖపట్నం



రంజాన్ వేళలు
ఇఫ్తార్: సోమవారం 6:06 గంటలకు
సహరి: మంగళవారం 4:57 గంటలకు

నేటి నుంచి ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి పాత జైలు రోడ్డులోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐఓ పి.మురళీధర్ తెలిపారు. మొదటి రోజు సంస్కృతం జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నట్లు పేర్కొన్నారు. అసిస్టెంట్ ఎగ్జామినర్లు మధ్యాహ్నం ఒంటి గంటకు మూల్యాంకనం నిర్వహించే కేంద్రానికి వచ్చి రిపోర్టు చేయాలని సూచించారు.

రోగులు వేలల్లో... నర్సులు వందల్లో..!

ఈనాడు, విశాఖపట్నం

ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా పేరుగాంచిన కేజీహెచ్‌లో నర్సుల కొరత వేధిస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. ఆసుపత్రిలో నెలకు సగటున 6వేల మంది వరకు ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. రద్దీకి సరిపడా నర్సులు లేకపోవడంతో రోగులకు పూర్తిస్థాయిలో సేవలందడం లేదనే విమర్శలున్నాయి. ఈ సమస్యపై 2024 జులైలో జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించినా ఇప్పటికీ పరిష్కారం కాలేదు.

క్రిటికల్ కేర్ ప్రారంభిస్తే అవస్థలే: ఆసుపత్రిలో సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌తో కలిపి 1562 పడకలు ఉన్నాయి. 2024 జులై నాటికి వివిధ విభాగాల్లో 616 మంది నర్సులు ఉండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 550కి తగ్గిపోయింది.

★ కేజీహెచ్ మొత్తం మీద ఐసీయూ పడకలే దాదాపు 500 వరకు ఉంటాయి. ఈ నేపథ్యంలో కనీసం అక్కడ 1000 మంది స్టాఫ్‌నర్సులు అవసరం కాగా.. ప్రస్తుతం సగం మందే విధుల్లో ఉన్నారు.

★ సాధారణంగా జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు రోగుల సంరక్షణలో సహకారం అందిస్తుంటారు. పరీక్షల సమయం కావడంతో మే వరకు వారెవరూ అందుబాటులో ఉండే పరిస్థితి లేదు.

★ త్వరలో కేజీహెచ్‌లో 50 పడకలతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ప్రారంభించనున్నారు. ప్రతి అయిదు పడకలకు ఒక నర్సు అందుబాటులో ఉండాలి. మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించాలి. కనీసం 50 మంది లేకపోతే ఆ విభాగం నిర్వహించడం కష్టమవుతుందని వైద్యులు చెబుతున్నారు.

★ కేజీహెచ్‌లో సిబ్బంది కొరత
★ వైద్య సేవల్లో ఇబ్బందులు

నిలిచిన నియామక ప్రక్రియ

సాధారణంగా వైద్యారోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్(ఆర్డీ) కార్యాలయం ద్వారా స్టాఫ్ నర్సుల పోస్టులు భర్తీ చేస్తుంటారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎంఈ ఆధ్వర్యంలో ఉన్న ఆసుపత్రుల్లో ఆర్డీ కార్యాలయం ద్వారా పోస్టులు భర్తీ చేయట్లేదని తెలిసింది. పీహెచ్‌సీలు, ఏపీవీవీపీ ఆధ్వర్యంలోని పోస్టులనే భర్తీ చేస్తున్నారు. మళ్లీ డీఎంఈ కార్యాలయం నుంచి సమాచారం వస్తే.. నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయగలమని అధికారులు చెబుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం: 'స్టాఫ్ నర్సుల కొరతపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. పెంచిన పడకలకు అనుగుణంగా నియామకాలు చేపట్టాలని కోరాం. ఆసుపత్రిలో ఉన్నవారితోనే రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలందిస్తున్నాం' అని సూపరింటెండెంట్ **డాక్టర్ ఐ.వాణి** పేర్కొన్నారు.

క్షీరాబ్ధి కన్యకు శోడషాభిషేకం

పెందుర్తి వేంకటాద్రిపై జరుగుతున్న ఫాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం క్షీరాబ్ధి కన్య శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి శోడషాభిషేకం, శ్రీసూక్త హవనం వైభవోపేతంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు అమ్మవారికి పదహారు రకాల ద్రవ్యాలతో అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతన వస్త్రాలతో జగన్మాతను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. –న్యూస్‌టుడే, పెందుర్తి

హోలీ రద్దీకి ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : హోలీ రద్దీ దృష్ట్యా పలు ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. **యశ్వంత్‌పుర్- సంత్రాగచ్చి (06233/34) :** ఈనెల 1న ఉదయం 7.30 గంటలకు యశ్వంత్‌పుర్‌లో బయలుదేరిన రైలు, ఈ రోజు రాత్రి 8.45 గంటలకు సంత్రాగచ్చికి చేరుతుంది. 3వ తేదీ తెల్లవారుజామున 2.45 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరే రైలు, గురువారం తెల్లవారుజామున 4 గంటలకు యశ్వంత్‌పుర్‌కు చేరుతుంది.

'దువ్వాడ'.. దశ తిరిగేలా..!

● రూ.26.31 కోట్లతో ఆధునికీకరణ
● మారనున్న రైల్వేస్టేషన్ రూపురేఖలు

కూర్మన్నపాలెం (దువ్వాడ), న్యూస్‌టుడే : దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ పనులు చకచకా జరుగుతున్నాయి. పనులన్నీ పూర్తయితే స్టేషన్ రూపురేఖలు మారిపోనున్నాయి. రూ.26.31 కోట్ల వ్యయంతో జరుగుతున్న ఈ పనులు ఆగస్టు 5, 2023లో ప్రారంభమయ్యాయి. ఇప్పటికి సుమారు 80 శాతం మేర పూర్తయ్యాయి. మిగతావి మార్చి నెలాఖరుకల్లా పూర్తయ్యే అవకాశం ఉంది.

ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం వైపు ఇలా..: ప్రధాన పరిపాలనా భవనం చివరి దశకు చేరుకుంది. దీన్ని 109 మీటర్ల పొడవు, 40 మీటర్ల వెడల్పుతో రెండు అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. ఇందులో బుకింగ్ కౌంటర్, రిటైరింగ్ రూమ్ క్యాబిన్, పీఆర్ఎస్ కౌంటర్, విశ్రాంత గదులు, మరుగుదొడ్లు ఉంటాయి. పై అంతస్తులో రెస్టారెంట్ ఏర్పాటు చేస్తున్నారు.

▼ మొదటి ప్లాట్‌ఫాంకు చేరుకునేందుకు 100 అడుగుల డబుల్ రోడ్డు మధ్యలో రెండు మీటర్ల పాత్‌వే పనులు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలకు వేర్వేరుగా పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నారు.

★ కొత్తగా నిర్మిస్తున్న ప్రధాన భవనం నుంచి ప్లాట్‌ఫాంలను అనుసంధానిస్తూ 12 అడుగుల ఫుట్‌ఓవర్ బ్రిడ్జి (కారిడార్) చేపడుతున్నారు. ప్రధాన భవనానికి అనుసంధానంగా నిర్మిస్తున్న 12 మీటర్ల ఎఫ్‌వోబీ నుంచి మొదటి, నాలుగో ప్లాట్‌ఫాంలకు వెళ్లేందుకు రెండు లిఫ్టులు ఏర్పాటు చేయనున్నారు. కొత్తగా రెండు మినరల్ వాటర్ వెండింగ్ మెషిన్‌లు అందుబాటులోకి తేనున్నారు.

ప్లాట్‌ఫాంలను అనుసంధానిస్తూ నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి

నాలుగో నెంబరు ప్లాట్‌ఫాం వైపు..

▲ నాలుగో నెంబరు ప్లాట్‌ఫాం వైపు ఇప్పటికే పలు పనులు పూర్తయ్యాయి. ప్లాట్‌ఫాం బయట డబుల్ రోడ్డు నిర్మించారు. కొండవాలు వైపు వరద నీరు రహదారిపైకి రాకుండా రక్షణ గోడ నిర్మించారు. ప్లాట్‌ఫాంపై కొత్తగా నాలుగు షెడ్లు ఏర్పాటు చేశారు. అనకాపల్లి వైపు 100 మీటర్ల ప్లాట్‌ఫాం విస్తరించారు. ప్లాట్‌ఫాం ఎత్తు పెంచడంతో పాటు స్టోన్స్ వేసి అభివృద్ధి చేశారు.

▲ మహిళల విశ్రాంత గదిని అందుబాటులోకి తెచ్చారు. పాత ముఖద్వారం తొలగించి కొత్తది అభివృద్ధి చేయనున్నారు. ఆర్పీఎఫ్ భవనం అందుబాటులోకి వచ్చింది. అధునాతన కోచ్ ఇండికేటర్లు ఏర్పాటు చేయనున్నారు. బస్సులు నిలిపేందుకు బస్ బే కూడా అందుబాటులోకి తెచ్చారు.

బ్యాటర్ల జోరు.. బౌలర్ల హుషారు..!

ముగిసిన తెలుగు సెలబ్రిటీ క్రికెట్ లీగ్

మిస్ తెలంగాణ కశ్వీ

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : తెలుగు సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోటీలు ఆదివారం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ముగిశాయి. సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టీసీఏ(తెలుగు క్రికెట్ అసోసియేషన్) ఎలెవన్ జట్టు 4 వికెట్ల తేడాతో ఎస్.ఎం. స్పేస్ జట్టుపై ఘన విజయం సాధించింది. తొలుత ఎస్.ఎం. స్పేస్ జట్టు 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. జట్టులో దినేష్, పవన్ చెరో 52 పరుగులు చేశారు. అనంతరం టీసీఏ ఎలెవన్ జట్టు 19.2 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. జట్టులో సుధీర్ బాబు 35, అశ్విన్‌బాబు 44 పరుగులు చేశారు.

విజయానందంలో టీసీఏ జట్టు

విజేత, రన్నర్స్ జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, సీఎంఆర్ (గ్రూపు) సంస్థల అధినేత మావూరి వెంకటరమణ తదితరులు

★ ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో ఎస్.ఎం. స్పేస్ జట్టు 9 వికెట్ల తేడాతో పోలీస్ వారియర్స్ జట్టుపై విజయం సాధించింది. పోలీస్ వారియర్స్ జట్టు 18 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 162 పరుగులు చేసింది. ఎస్.ఎం. స్పేస్ జట్టు బౌలర్ శరత్ 3 వికెట్లు తీశాడు. ఎస్.ఎం. స్పేస్ జట్టు 12.5 ఓవర్లలో ఓ వికెట్ నష్టానికి 163 పరుగులు చేసింది. జట్టు బ్యాటర్లు ఎస్.ఎస్.భరత్‌కుమార్ 58, డి.కిరీటి 48 పరుగులు చేశారు.

★ మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో టీవీ కింగ్స్ జట్టు 42 పరుగుల తేడాతో టీవీ టైగర్స్ జట్టుపై గెలుపొందింది. మొదట టీవీ కింగ్స్ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. జట్టులో వై. అభిషేక్ 74, కరమ్ 37 పరుగులు చేశారు. అనంతరం టీవీ టైగర్స్ జట్టు 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. టీవీ కింగ్స్ జట్టు బౌలర్ నరేష్‌రాజ్ 4 వికెట్లు తీశాడు. ★ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగు సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోటీలు విశాఖలో నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు అందించారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, సినీ హీరోలు శ్రీకాంత్, తరుణ్, సంగీత దర్శకుడు ఎస్ఎస్. తమన్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేస్తున్నాడు.. ప్రపంచ యాత్రికుడు..!

భారత నౌకాదళానికి చెందిన 'ఐఎన్ఎస్‌వీ కౌండిన్య' నౌక సోమవారం స్వదేశానికి చేరుకోనుందని ఆదివారం నేవీ వర్గాలు తెలిపాయి. ఈ నౌక గత ఏడాది డిసెంబరు 29న పోరుబందర్ నుంచి ప్రపంచ సముద్ర యాత్రకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. జనవరి 14న ఒమన్ చేరుకుంది. తిరుగు ప్రయాణంలో ముంబయి హార్బర్‌కు చేరుకోనున్న ఈ నౌకకు కేంద్ర రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సాదరంగా స్వాగతం పలకనున్నారని నేవీ వర్గాలు వెల్లడించాయి.
– సింధియా, న్యూస్‌టుడే



ఐఎన్ఎస్‌వీ కౌండిన్య

చక్కని కోర్సులు.. మెచ్చిన ఉపాధి..!

దయాల్బాగ్ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ
యువత, మహిళల సాధికారతకు పెద్దపీట

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాధారణ డిగ్రీలు, పీజీలు చేస్తే ఉద్యోగాలు దొరకని పరిస్థితి. వాటికి అనుబంధంగా వృత్తివిద్యా కోర్సులను నేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ చదవలేని విద్యార్థులకు విశాలాక్షినగర్‌లోని దయాల్బాగ్ విద్యాకేంద్రం ఆధ్వర్యంలో తక్కువ ఫీజుతో శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా యువత, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని కోర్సుల సమన్వయకర్త దక్షిణామూర్తి తెలిపారు.

స్క్రీన్ ప్రింటింగ్: ఎనిమిదో తరగతి విద్యార్హత. కోర్సు కాల వ్యవధి మూడు నెలలు. టీషర్టులు, బ్యాగులు, గ్లాస్, మెటల్‌పై స్టిక్కర్లు వేయడం నేర్పిస్తారు. కలర్ ప్రిపరేషన్‌లో మెలకువలు, కెమికల్స్ వాడకంలో శిక్షణ అందిస్తారు. తయారు చేసిన ఉత్పత్తులను ఏవిధంగా మార్కెట్ చేయాలి, యూనిట్ స్థాపనకు ఎలా సిద్ధం కావాలో మార్గనిర్దేశం చేస్తారు.

వాహనాల మరమ్మతుల కోర్సు: యమహా, మారుతీ సంస్థల పర్యవేక్షణలో ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల మరమ్మతుల కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. పదోతరగతి విద్యార్హత. ఏడాది శిక్షణ అనంతరం ఆయా సంస్థల షోరూంలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

దుస్తుల తయారీలో థియరీ పాఠాలు బోధిస్తున్న శిక్షకులు

డిప్లమో ఇన్ ఎలక్ట్రానిక్స్: పదో తరగతి విద్యార్హత. కోర్సు కాల వ్యవధి మూడేళ్లు. ఇప్పటి వరకు నాలుగు బ్యాచ్‌లలో 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 90శాతం మందికి పూర్వ విద్యార్థుల సంఘం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి.

చరవాణి రిపేర్: ఈ కోర్సుకు పదో తరగతి విద్యార్హత. మూడు నెలల వ్యవధి గల ఈ కోర్సులో స్మార్ట్‌ఫోన్ మరమ్మతులతోపాటు సాఫ్ట్‌వేర్ ట్రబుల్ షూటింగ్‌లో మెలకువలు నేర్పిస్తారు. ఇప్పటి వరకు మూడు బ్యాచ్‌లలో 60 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వగా 40 మంది సెల్‌ఫోన్ మరమ్మతు దుకాణాలు ఏర్పాటు చేసుకోగా, మిగిలినవారికి షోరూంలలో ఉద్యోగాలు లభించాయి.

ఆఫీస్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్: ఇంటర్మీడియట్ విద్యార్హత. కోర్సు వ్యవధి ఏడాది. కంప్యూటర్ బేసిక్స్, టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, టాలీ, షార్ట్‌హ్యాండ్, జావాలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు.

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

గురుద్వారా, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగంగా పరిష్కరించే లక్ష్యంతో గురుద్వారాలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 11 జిల్లాలకు చెందిన వినియోగదారులు 86884 00499 ఫోన్ నెంబరుకు ఉదయం 10.30 నుంచి 11.30 వరకు సమస్యలను తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని సీఎండీ ప్రకటించారు. ఈ అవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సైబర్ 'వేషాలు'.. నిలువెత్తు మోసాలు

హవాలా, మనీలాండరింగ్ పేరుతో బెదిరింపులు
విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులే బాధితులు

ఈనాడు–విశాఖపట్నం, మధురవాడ–న్యూస్‌టుడే: విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రధానంగా డిజిటల్ అరెస్టు, మనీ లాండరింగ్, హవాలా కేసుల పేరుతో భయభ్రాంతులకు గురి చేసి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ఇటీవల విశాఖ నగరంలో సైబర్ మోసాల బారిన పడిన బాధితుల్లో ఎక్కువ మంది వృద్ధులే ఉన్నారు.

నగరంలో సైబర్ కేసులు ఇలా..

ఏడాది	కేసులు	రికవరీ (రూ.కోట్లలో)
2023	409	1.10
2024	374	3.89
2025	286	14.64

అరెస్టయిన సైబర్ నేరగాళ్లు

2024	2025
160	205

చాకచక్యంగా స్పందించాలి: స్కామర్లు వీడియోకాల్‌లో పోలీస్ యూనిఫాం వేసుకుని మాట్లాడతారు. వాస్తవంగా పోలీసులు అలా మాట్లాడరు. అరెస్టు అనేది చట్టపరమైన ప్రక్రియ. అర్జెంటుగా డబ్బు జమ చేయాలని అడిగారంటే వెంటనే అనుమానించాలి. ఇటీవల నగరంలో డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ఓ హెడ్ నర్సును బెదిరించి రూ.50లక్షలు డిమాండ్ చేశారు. ఆమె బ్యాంకులోని ఆర్డీ డబ్బులు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. బ్యాంకు మేనేజర్ బాధితురాలి ఆందోళన గమనించి, వివరాలు తెలుసుకుని సీపీకి ఫిర్యాదు చేయడంతో సైబర్ దోపిడీకి అడ్డుకట్ట పడింది.

ఇటీవల జరిగిన ఘటనలు..

1. ★ సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన 67ఏళ్ల విశ్రాంత ప్రొఫెసర్ పేరిట నకిలీ ఏటీఎం కార్డు సృష్టించారు. ఆ కార్డుకు, డ్రగ్స్ కేసుకు సంబంధం ఉందని ఆయన్ను బెదిరించి రూ.1.05కోట్లు కాజేశారు.
2. ★ నగరానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగికి గుర్తు తెలియని వ్యక్తి మహారాష్ట్ర డీజీపీ పేరుతో ఫోన్ చేశాడు. మనీలాండరింగ్ కేసులో మీ బ్యాంకు ఖాతాను గుర్తించామని, సుప్రీంకోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిందని భయపెట్టి రూ.66లక్షలు దోచేశాడు.
3. ★ రుషికొండ ప్రాంతానికి చెందిన ఓ విశ్రాంత ఉద్యోగికి సైబర్ మోసగాడు ఫోన్ చేసి హవాలా లావాదేవీల్లో మీ బ్యాంకు ఖాతా గుర్తించామని, రూ.1.60కోట్లు ఇస్తే పేరు తొలగిస్తామని నమ్మించి నగదును ఖాతాకు జమ చేయించుకున్నాడు.
4. ★ ఎంవీపీ కాలనీలోని ఓ వృద్ధురాలిని సైతం హవాలా కేసు పేరుతో బెదిరించి రూ.8.50లక్షలు కొట్టేశారు.

బాధితులు ఈ నెంబరుకు ఫోన్ చేయాలి..

మోసపోయామని గుర్తించిన గంటలోపు బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి చెప్పాలి. స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. వెంటనే పోలీసులు ఖాతాలోని నగదును ఫ్రీజ్ చేస్తారు. తర్వాత ఆ నగదు బాధితులకు తిరిగి అందేలా చూస్తారు.

అమలులోకి నిర్మాణ రంగ కార్మికుల పథకాలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు ఈ నెల ఒకటో తేదీ నుంచి పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందని కార్మిక శాఖ ఉప కమిషనర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు. వివాహ కానుక, ప్రసూతి ప్రయోజనాలు, సహజ మరణ ఉపశమన పథకం, అంత్యక్రియల వ్యయ సహాయ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి సంభవించే సంఘటనలు, అర్హత గల ఘటనపై క్లెయిమ్ దరఖాస్తులను సహాయ కార్మిక అధికారులు స్వీకరిస్తారన్నారు. 18 ఏళ్లు నిండి భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్నవారు సహాయ కార్మిక అధికారి కార్యాలయానికి వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

శునకం.. శత్రువును చీల్చి చెండాడేలా..

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: శునకాలు యజమానిపై విశ్వాసం చూపించడమే కాదు ప్రాణాలను ఎదురొడ్డి శత్రువుల నుంచి రక్షణ కూడా కల్పిస్తుంటాయి. శునకాలు ఆ స్థాయికి చేరుకోవాలంటే వాటికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. కనీసం ఏడాది నుంచి ఐదు సంవత్సరాల వరకు అవి శిక్షణ పొందాలని ట్రైనర్లు చెబుతున్నారు. బీచ్‌రోడ్డు వై.ఎం.సి.ఎ. ఆవరణలో ఆదివారం ఉదయం బెల్జియన్ మలినోయిస్ శునకాలకు ట్రైనర్లు ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తూ కనిపించారు. శత్రువులు యజమాని ముందు నుంచి వచ్చినా.. వెనుక నుంచి వచ్చిన ఈ శునకాలు పసిగట్టి భద్రత కల్పిస్తాయి. కత్తి తీసుకొని వెనుక నుంచి వచ్చినా, ప్రత్యక్షంగా దాడికి వచ్చినా యజమానిని కాపాడుతాయని ట్రైనర్లు తెలిపారు. దీంతో సెక్యూరిటీ లేకపోయినా ఈ శునకాల సహాయంతో ఎలాంటి భయం లేకుండా బయటకు వెళ్లొచ్చని చెప్పారు. శత్రువును గుర్తించి శునకాలు దాడి చేయడం ప్రారంభిస్తే యజమాని చెప్పే వరకు వదలవని పేర్కొన్నారు.

శునకానికి శిక్షణ ఇస్తున్న ట్రైనర్లు

★ బెల్జియన్ శునకాలకు శిక్షణ ఇచ్చే సమయంలో ట్రైనర్లు గాయపడకుండా ప్రత్యేకంగా దస్తులు ధరిస్తున్నారు. అయినా కొన్ని సందర్భాల్లో గాయాలవుతుంటాయని ట్రైనర్లు తెలిపారు.

అక్రమాలు హెచ్చే.. ఉచ్చు బిగిసే..!

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా వ్యవహరించిన జీవీఎంసీ పట్టణ ప్రణాళికాధికారులు నాటి నాయకులకు రూ.కోట్లలో లబ్ధి చేకూర్చారు. ఇష్టానుసారంగా టీడీఆర్‌లు జారీ చేసి, కొన్ని ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసి... అందుకు ప్రతిఫలంగా వసూళ్లకు పాల్పడ్డారు. ఇప్పుడు అవన్నీ అవినీతి అధికారుల మెడకు చుట్టుకోనున్నాయి.

రూ.27 కోట్ల నష్టం: అప్పట్లో మంజూరు చేసిన ప్లాన్లు, జారీ చేసిన టీడీఆర్‌లు, చేపట్టిన నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర విచారణకు ఆదేశించడంతో... ఆ ప్రక్రియను సీబీఐ వేగవంతం చేసింది. ఇప్పుడు ఆడిట్ విభాగం రంగంలోకి దిగి, నాటి నిర్మాణాలతో జీవీఎంసీకి రూ.27 కోట్ల నష్టం వాటిల్లినట్లు నివేదిక సమర్పించింది. దీంతో నాటి పట్టణ ప్రణాళికాధికారులపై కఠిన చర్యలు తప్పేలాలేవు.

అడ్డగోలు ప్రణాళికాధికారులపై చర్యలకు రంగం సిద్ధం

ఇదీ జరిగింది..!

● మధురవాడ, కూర్మన్నపాలెంలో ఓ ప్రజాప్రతినిధి చేపట్టిన రెండు భారీ ప్రాజెక్టుల నుంచి రూ.11 కోట్లను భవన నిర్మాణ రుసుము కింద వసూలు చేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యం వహించారు. నేటికీ ఆ నిధులు జీవీఎంసీకి జమ కాలేదు. అయినా ప్లాన్లు, ఓసీ (ఆక్యుపెన్సీ) ధ్రువీకరణపత్రాలు జారీ అయ్యాయి. ఆయా భవనాలకు సంబంధించి నాలా ఛార్జీల కింద రూ.10 కోట్ల బకాయిలు ఉన్నాయి.

● కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఓ భారీ ప్రాజెక్టుపై విచారణ చేయించగా 40 సెంట్లకు పైగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు తేలింది. అయినా.. జీవీఎంసీ ప్రణాళికాధికారులు తదుపరి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

● రుషికొండలో భారీ నిర్మాణాలకు సంబంధించి జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగానికి చెల్లించాల్సిన రూ.16 కోట్లు జమ కాలేదు. పర్యాటకశాఖ ద్వారా చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన రుసుములను దశల వారీగా చెల్లిస్తామని గత ప్రభుత్వం జీఓ జారీ చేసినా, దాన్ని అమలు చేయకపోవడంపై ఆడిట్ అభ్యంతరం తెలిపింది.

విభేదాలు తలెత్తి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. కొంత మంది అధికారులు గత ప్రభుత్వానికి, ఇంకొందరు కూటమికి అనుకూలంగా మారారు. దీంతో కొందరు అధికారులు అక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా, ఇంకొందరు వాటిని అడ్డుకుంటున్నారు.

ఇలాంటి విభేదాలతో అధికారులు రెండు వర్గాలుగా విడిపోయారు. అందులో భాగంగానే తాజాగా ఓ అధికారిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు.

(c) eenadu

'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని.. అలరిస్తుంది'

కార్యక్రమంలో పాల్గొన్న లయ, శివాజీ

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' చిత్రం అన్ని వర్గాలను అలరిస్తుందని కథానాయకుడు శివాజీ అన్నారు. ఆదివారం చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా హోటల్ దసపల్లా ఎగ్జిక్యూటివ్ కోర్ట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శివాజీ మాట్లాడారు. ఈనెల 6న విడుదలయ్యే చిత్రాన్ని ప్రతి ఒక్కరూ థియేటర్‌లో చూసి, ఆదరించాలని కోరారు. సినిమాలో ఆఖరి 45 నిమిషాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటుందన్నారు. ఓవైపు సినిమాలు చేస్తూనే, మరోవైపు ప్రజా సమస్యలపై స్పందిస్తుండడంతో ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, గతంలో రాజధాని అమరావతి కోసం మాట్లాడానని శివాజీ అన్నారు. హీరోయిన్ లయ మాట్లాడుతూ... సినిమాలో ఊహించని ట్విస్ట్‌లు ప్రేక్షకులను అలరిస్తాయన్నారు. విశాఖతో ఎంతో అనుబంధం ఉందని ఆమె గుర్తు చేసుకున్నారు.

ముంచుకొచ్చిన మృత్యువు

★ పశువుల షెడ్డు నిర్మిస్తుండగా విద్యుదాఘాతం ★ ఇద్దరు మృతి

సూరీడు (పాతచిత్రం)

శ్రీను (పాతచిత్రం)

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెం గ్రామంలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి గురై ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ ఘటన రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. షెడ్డు నిర్మాణానికి జేసీబీతో స్తంభాన్ని నిలబెట్టే క్రమంలో పైనున్న 11 కేవీ విద్యుత్ తీగలకు తాకడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇసకలపాలెం గ్రామానికి చెందిన కాళ్ల సూరీడు (70), కుమారుడు సూరిబాబు (46) కళ్లం వద్ద పాత స్తంభాలు సేకరించి పశువుల షెడ్డు నిర్మిస్తున్నారు. తాపీ మేస్త్రి కంటుబోతు శ్రీను (36) స్తంభాలు నిలబెట్టడానికి వెళ్లారు. మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో చివరి స్తంభం జేసీబీతో నిలబెట్టే క్రమంలో పైనున్న 11 కేవీ విద్యుత్ తీగలకు తాకడంతో దాన్ని పట్టుకొని నిల్చొని ఉన్న ముగ్గురూ విద్యుదాఘాతానికి తుళ్లిపడ్డారు. సూరీడు, శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా సూరిబాబు గాయాలతో బయటపడ్డాడు. అక్కడున్న ఇద్దరు యువకులు స్పందించి సీపీఆర్ చేసి బతికించే ప్రయత్నం చేయగా అప్పటికే ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన సూరిబాబును చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

★ బతుకుదెరువు కోసం వచ్చి..: విద్యుదాఘాతంతో మృతి చెందిన తాపీ మేస్త్రి కంటుబోతు శ్రీను స్వస్థలం విజయనగరం జిల్లా డెంకాడ మండలం గుండాలపేట గ్రామం. బతుకుదెరువు కోసం 13 ఏళ్ల క్రితం పద్మనాభం వచ్చి స్థిరపడ్డారు. కృష్ణాపురం జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నారు. భార్య రాజు (35), కుమార్తె మాధురి (14), కుమారుడు పవన్ సాయి (12) ఉన్నారు. అందరితో చనువుగా ఉండేవాడు. శ్రీను కుమార్తె పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఆయన మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రమాదానికి కారణమైన స్తంభం

★ కాళ్ల సూరీడుకు భార్య కనకం, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఒక పక్క భర్త విగతజీవిగా పడి ఉండగా.. మరో పక్క కొడుకు సూరిబాబు గాయాలపాలై ఆసుపత్రిలో ఉండటంతో కనకం రోదించిన తీరు చూపరులను కలచివేసింది.

మెడ్‌టెక్ జోన్‌లో 'జీనోమ్ సీక్వెన్సింగ్'

పరవాడ, న్యూస్‌టుడే: దేశంలో ప్రాణాంతక వ్యాధులను నయం చేసేందుకు వీలుగా మెడ్‌టెక్ జోన్‌లో జీనోమ్ సీక్వెన్సింగ్ సెంటర్ ఏర్పాటుకు తొలి అడుగు పడింది. ఈ కేంద్రం ఏర్పాటుకు వీలుగా బయోవ్యాలీ, 4బేస్‌కేర్, డిఫైన్ బయో లిమిటెడ్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. ఆయా సంస్థలు సంయుక్తంగా జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం బయోస్ఫియర్ పేరిట సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయనున్నాయి. తద్వారా వైద్యులు, విద్యాసంస్థలు, పరిశ్రమ భాగస్వాములు, వివిధ అంకుర సంస్థలు పరిశోధన చేయడానికి అవకాశం లభిస్తుంది. ఔత్సాహిక శాస్త్రవేత్తలు, వ్యవస్థాపకులకు శిక్షణ ఇవ్వడానికి ఒక వేదికగా పని చేస్తుంది. ఈ సందర్భంగా 4బేస్ కేర్ సహ వ్యవస్థాపకులు హితేష్ గోస్వామి మాట్లాడుతూ దేశంలో బయోటెక్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి కీలక అడుగు పడినట్లు పేర్కొన్నారు. అధునాతన జన్యుశాస్త్ర నైపుణ్యం, ఇంక్యుబేషన్ మద్దతు, పరిశోధన సామర్థ్యాలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రాణాంతక వ్యాధులకు కచ్చితమైన వైద్య పరిష్కారాలు చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బయోవ్యాలీ సీఈవో డాక్టర్ సుశీల బ్రన్హామ్ మాట్లాడుతూ ఈ కేంద్రం ఏర్పాటుతో దేశంలో తదుపరి తరం జన్యు సంబంధ పర్యావరణ వ్యవస్థ నిర్మాణం, జన్యు సంబంధ ఆవిష్కరణలను ముందుకు తీసుకెళ్లేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న సంస్థల ప్రతినిధులు

రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ప్రారంభం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ఆదివారం నగరంలో ప్రారంభమయ్యాయి. బిర్లా జంక్షన్ సమీప బొత్స స్క్వేర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సినీనటుడు సుమన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి యువతతో పాటు మహిళలు కరాటేలో మెలకువలు నేర్చుకోవాలన్నారు. కరాటేతో ఆరోగ్యం, ఆత్మరక్షణ సాధ్యమవుతుందన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన 350 మంది క్రీడాకారులు పలు విభాగాల్లో తలపడ్డారు. పోటీలు సోమవారం ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్, భాజపా నాయకుడు బొత్స సురేష్, జనసేన నాయకులు బొడ్డేపల్లి రఘు, రమణి కుమారి, వై.నర్సింహ రాజు, క్రీడా సంఘాల ప్రతినిధులు కె.సూర్యనారాయణ, సీహెచ్.సతీష్ కుమార్, ఎ.కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న సినీనటుడు సుమన్, తదితరులు

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

బీచ్ రోడ్డులో సైకిల్ థాన్

జుంబా డ్యాన్స్ చేస్తూ యువత సందడి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం ఆవరణలో ఆదివారం ఉదయం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా కార్నివాల్ పేరిట సైకిల్ థాన్ నిర్వహించారు. యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు గణబాబు, విష్ణుకుమార్‌రాజు, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ రవినాయుడు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సైకిల్ ర్యాలీ ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం నుంచి వై.ఎం.సి.ఎ. వరకు కొనసాగింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాంతీయ డైరెక్టర్ విష్ణు సుధాకరన్, ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన జిన్సన్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 'యోగాసన భారత్' ఆధ్వర్యంలో పలు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా యువత చేసిన జుంబా నృత్యాలు విశేషంగా అలరించాయి. అగ్నిమాపక సిబ్బంది ప్రదర్శించిన సేఫ్టీ డ్రిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా సమాజంలో ఆరోగ్యం కోసం ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పలువురిని ఘనంగా సత్కరించారు.

★ మిసెస్ ఇండియా 2023 ఎస్ ఫరా, ఇన్‌ఫ్లూయెన్సర్ కర్ణాటకకు చెందిన సుమన్ మోహితె(శాంతాబాయి), ఫిట్ ఇండియా అంబాసిడర్ చందా జయరామ్ పాల్గొన్నారు.

చిన్నారుల మార్షల్ ఆర్ట్స్

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కార్పొరేషన్, జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విశాఖ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల్ని పరిష్కరించేలా సోమవారం కలెక్టరేట్‌లో, జీవీఎంసీ కార్యాలయాల్లో, పోలీస్ కమిషనరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మేయర్ పీలా శ్రీనివాసరావు, సీపీ శంఖబ్రతబాగ్చీ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి, జీవీఎంసీ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో, పోలీస్ కమిషనరేట్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లో అందించిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకునేందుకు కాల్ సెంటర్ (1100) సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో 'రెవెన్యూ క్లినిక్' అందుబాటులో ఉంటుందని అధికారులు సూచించారు.

మహిళల భద్రతపై అవగాహన ర్యాలీ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మహిళల భద్రత, హక్కులపై అవగాహన కల్పించారు. ఈ మేరకు బీచ్‌రోడ్డులో ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ చేపట్టారు. మహిళలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా వేధింపులకు గురికాకుండా అవగాహన కలిగి ఉండాలన్నారు. [illegible] ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించాలని అన్నారు. బాలికలందరూ చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. [illegible] ఈ కార్యక్రమంలో పోలీసు శాఖకు చెందిన పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, అధికారులు, తదితరులు

సింహాద్రి అప్పన్నకు రేపు పెళ్లిచూపులు

● కొండ దిగువన డోలోత్సవానికి సన్నాహాలు

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో ఏటా జరిగే ప్రధాన ఉత్సవాలకు తొలి అడుగు పడనుంది. [illegible] శ్రీపైడితల్లి అమ్మవారి కుమార్తెతో పెళ్లిచూపులు జరుగుతాయని విశ్వసిస్తారు. స్వామివారి కల్యాణోత్సవాలకు ముందు జరిగే ఈ ఉత్సవం కోసం గ్రామీణ భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తారు.

★ సింహగిరిపై నుంచి తరలిరానున్న స్వామి..: డోలోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై నుంచి స్వామివారు దేవేరుల సమేతంగా [illegible] ముందు అర్చకులు వేకువజామున 1 గంటకే ఆలయంలో సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు నిర్వహించి చూర్ణోత్సవం నిర్వహిస్తారు. [illegible] గులు, గ్రామస్థులు సంతోషంతో రంగులు చల్లుకుని సంబరాలు చేస్తారు. ఉదయం 6 గంటలకు స్వామి, అమ్మవార్ల గ్రామ తిరువీధి వేడుకగా జరుగుతుంది. అనంతరం మెట్లమార్గంలో తిరిగి స్వామిని కొండపైకి తీసుకెళ్తారు.

ఉత్సవానికి ముస్తాబవుతున్న పుష్కరిణి ఉద్యానవన మండపం

3న దర్శనాలు నిలిపివేత: ఈ నెల 3న చంద్రగ్రహణం సందర్భంగా భక్తులకు అప్పన్న స్వామి దర్శనాలు లభించవని ఈవో జె.వెంకటరావు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3.21 గంటలకు గ్రహణం సంభవించి సాయంత్రం 6.49 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఆ రోజంతా స్వామివారి దర్శనాలు భక్తులకు లభించవని పేర్కొన్నారు. ఆలయంలో జరిగే [illegible]

★ ఉత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు..: [illegible] విభాగాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఇంజినీరింగ్ పనులపై సమీక్షించారు. మార్చి నెలాఖరు నాటికి అన్ని నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు, పర్యవేక్షకులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో ఆలయాలు మూసివేత

వన్‌టౌన్, కార్పొరేషన్, న్యూస్‌టుడే : చంద్రగ్రహణం సందర్భంగా 3వ తేదీ మంగళవారం ఇసుక కొండ సత్యనారాయణస్వామి ఆలయాన్ని మూసివేస్తామని ఈఓ రాజగోపాల్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు తెల్ల [illegible]

★ ఆశీలుమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయాన్ని మంగళవారం ఉదయం 11 గంటలకు మూసివేస్తామని ఈఓ డీవీవీ.ప్రసాదరావు తెలిపారు. సంప్రోక్షణ కార్యక్రమాలు పూర్తి చేసి, బుధవారం ఉదయం 6 గంటల నుంచి భక్తుల దర్శనానికి అనుమతి ఇస్తామన్నారు.

రోగి భద్రతలో స్టెరైల్ ప్రాసెసింగ్ కీలకం..

ఇషాకన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ జితేంద్రశర్మ, తదితరులు

పరవాడ, న్యూస్‌టుడే: విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో ఇండియన్ స్టెరైల్ హెల్త్‌కేర్ అసోసియేషన్(ఇషా) ఆధ్వర్యంలో 8వ జాతీయ శాస్త్రీయ సదస్సు ఇషాకన్-2026ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్టెరైల్ ప్రాసెసింగ్ భవిష్యత్తు, ఆవిష్కరణ, ధోరణులు అనే థీమ్‌తో నిర్వహించిన ఈ సదస్సులో పలువురు వక్తలు మాట్లాడారు. స్టెరైల్ ప్రాసెసింగ్ సహాయక చర్య మాత్రమే కాదని రోగి భద్రత, ఇన్ఫెక్షన్ నివారణ, మెరుగైన క్లినికల్ ఫలితాలు కీలకమని పేర్కొన్నారు. డానిష్ సొసైటీ ఫర్ పేషెంట్స్ సేఫ్టీ సీఈవో ఇంగే క్రిస్టెన్సెన్ మాట్లాడుతూ అంతర్జాతీయ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, సురక్షితమైన, అధిక నాణ్యత గల ఆరోగ్య సంరక్షణ అందించడానికి స్టెరైల్ ప్రాసెసింగ్ సాంకేతికత, శిక్షణ వృత్తిపరమైన ప్రమాణాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విశాఖ జోన్‌కి చెందిన సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో పన్ను చెల్లింపుదారుల పాత్ర కీలమన్నారు. జీఎస్టీ.. పన్ను విధానం మాత్రమే కాదని దేశాభివృద్ధికి సమష్టి సహకారమన్నారు. పారిశ్రామికవేత్తలు జీఎస్టీ చెల్లించి పరోక్షంగా మౌలిక సదుపాయాల వృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఎంతో సహకరిస్తున్నట్లు చెప్పారు. 2017లో 65లక్షలుగా ఉన్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య 2025నాటికి 1.51 కోట్లకు పెరిగిందన్నారు. ఇండియన్ స్టెరైల్ హెల్త్‌కేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కెప్టెన్ బాబన్ రాయ్ మాట్లాడుతూ స్టెరైల్ ప్రాసెసింగ్ భవిష్యత్తు.. ఆటోమేషన్, కృత్రిమ మేధ, డిజిటల్ ట్రాకింగ్, అధునాతన సాంకేతికతపై ఆధారపడి ఉంటుందన్నారు. మెడ్‌టెక్ జోన్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ సంక్లిష్టమైన ప్రక్రియ గనుక సరైన భద్రతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. దేశంలోనే తొలిసారిగా మెడ్‌టెక్ జోన్‌లో స్టెరిలైజేషన్ టెక్నాలజీ అకాడమీని స్థాపించినట్లు చెప్పారు.

వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : విశాఖ జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఈఓ ప్రేమ కుమార్ తెలిపారు. ఆయా వివరాలు డీఈఓ కార్యాలయం నోటీసుబోర్డులో ఉంచామని, అభ్యంతరాలు ఉన్న వారు మార్చి 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తెలియజేసి, పూర్తి ఆధారాలు సమర్పించాలన్నారు. వాటిని ఫిర్యాదుల పరిష్కార కమిటీ పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందని డీఈఓ పేర్కొన్నారు.

నేత్రపర్వంగా అనంత పద్మనాభుడి తెప్పోత్సవం

కన్నయ్య కోనేరులో తెప్పపై విహరిస్తున్న ఉత్సవమూర్తులు

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం క్షేత్రంలో కొలువైన శ్రీఅనంత పద్మనాభ స్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అనంతుని తెప్పోత్సవం నేత్ర పర్వంగా సాగింది. ముందుగా గ్రామ బలిహరణ నిర్వహించారు. రాత్రి ఏడున్నర గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి వారిని ఊరేగింపుగా కన్నయ్య కోనేరు వరకు తోడ్కొని వచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులను హంస వాహన తెప్పపై ఆశీనులను చేశారు. కోనేరులో స్వామివారు హంస వాహనంపై విహరిస్తుంటే ఆధ్యాత్మిక తన్మయత్వంలో భక్తులు లీనమైపోయారు. మహిళలు స్వామివారికి హారతులిచ్చారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెదేపా యువ నాయకుడు గంటా రవితేజ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాజు, ఎంపీపీ కె.రాంబాబు, సర్పంచి తాలాడ పాప, ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్సతో క్యాన్సర్ నివారణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా ఆదివారం ఉదయం ఆర్కేబీచ్ కాళీమాత విగ్రహం నుంచి వైఎంసీఏ వరకు అసోసియేషన్ ఆఫ్ రేడియేషన్ అంకాలజిస్ట్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. '50 ఇయర్స్ ఆఫ్ హీలింగ్ రేసింగ్ టువర్డ్స్ ఏ క్యాన్సర్ ఫ్రీ టుమారో' పేరుతో నిర్వహించిన ర్యాలీలో సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎన్.సుజాత, కార్యదర్శి డాక్టర్ ఆనందరావు మాట్లాడారు. క్యాన్సర్ నిర్మూలనకు సంబంధించి వైద్యరంగంలో అనేక పరిశోధనలు జరిగాయని, వాటి ఫలితాలతో మెరుగైన చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సంఘం ప్రతినిధులు డాక్టర్ బి.రవిశంకర్, డాక్టర్ సురేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న అంకాలజిస్ట్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

EENADU eClassifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

EDUCATION

BPT (4 1/2 Years) Seats available Paramedical DMLT, DECG, DMIT, DANS, D.Cardio DDIALY @ SUN COLLEGE. Ph.: 9573365333.

FINANCIAL SERVICES

Loans: Home, Plot Purchase, Mortgage & MSME's Schemes & Need Good Cibil Score Profiles we offer collaterals Ph:9542157967.

Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు EMI వాయిదా పద్ధతిలో పర్సనల్ ఫైనాన్స్, అన్నితరగతుల వారికి స్థిరాస్తులపై ఫైనాన్స్ ఇవ్వబడును. Cell: 73862 01191.

REAL ESTATE

PLOT FOR SALE

KOTHAVALASA

కొత్తవలస- రాయపూర్ హైవేకి 1KMలో 516E పెందుర్తి-అరకు రానున్నహైవేకి 2KMలో VMRDA Plots గజం12వేలు. 7416862947, 9182857713

TO LET

KURMANNAPALEM

3BHK Fully furnished Flat in Kurmannapalem 1800 SFT . Fully furnished, ACs, Cots, Gas stove, Fridge, Sofa, dining table. For Families/ Company GH. Contact: 9866182944

SECOND SALE

Office Furniture for Sale. New looking Furniture and Computers. Contact ✆ : 8905890542.

JOBS

WALK IN INTERVIEW
A multicrore org. No.1 position in 2 States (AP & Telangana) as per job calender FY 25-26 last quarter, appointing the following positions in Vizag Branches.
1. DIVISIONAL MANAGERS - 6 No's
2. CHIEF MANAGERS: 10 No's
3. PROBATIONARY OFFICERS : 30 No's
Qulf: Post-1: Retd. Gazetted Officers. Packge: 20 Lakhs PA (Salary + Allow). Post-2: Working / Retd. / VRS in Govt. / Pvt. Package: 15 Lakhs PA (Salary + Allow). Post-3: 30+ Age, Any Degree, Exp No Bar. Package: 6 Lakhs PA.
Interviews on 2nd & 3rd March 2026
Cont: C. RAMAKRISHNA, DGM SEETHAMMADHARA, VIZAG
✆ 9676811666

మా కంపెనీలో పనిచేయుటకు Telecallers (M) Marketing Executives (M) Min. 1 Year Exp. కావలెను. Ct: 6309160945.

ఫైనాన్స్ రంగంలో అనుభవం గల వైజాగ్‌లో పనిచేయుటకు బ్రాంచ్ మేనేజర్ & అనకాపల్లి, గాజువాక, చోడవరం, నర్సీపట్నం ఏరియాలలో పనిచేయుటకు ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ స్టాఫ్ కంప్యూటర్ నాలెడ్జ్ (F) కావలెను. ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్ +TA రాఘవ ఆటో ఫైనాన్సియర్స్, దొండపర్తి VSP 7680880513, 9100902198 9100980842

*లేడీ ఆఫీస్ ఇంచార్జి-2, అర్హత: డిగ్రీ, శాలరీ-15వేలు, *లేడీ రిసెప్షనిస్ట్-2, *లేడీ టెలికాలర్స్-3, అర్హత: ఇంటర్, శాలరీ-10వేలు, ఆఫీస్ బాయ్-1, ఆయా-3, శాలరీ-9వేలు అర్జెంటుగా కావలెను. క్రిస్టియన్ డిఫెన్స్ అకాడమీ, శ్రీకన్య థియేటర్ దగ్గర, న్యూ కాలనీ, Ph.9121232326

బుక్ డిస్ట్రిబ్యూటర్స్ కొరకు నో పెట్టుబడి మీ ఏరియాలో ప్రైవేట్ స్కూల్స్ పరిచయం & అనుభవమున్న వారికి ప్రాధాన్యత. ఉమా పబ్లిషర్స్, Guntur. ✆ 98493 70729.

Tally అకౌంటెంట్ బిల్లింగ్ పర్సన్, అడ్మినిస్ట్రేటివ్ & మార్కెటింగ్ పర్సన్స్ కావలెను. Qly:డిగ్రీ /MBA అనుభవం, ఉత్సాహవంతులైన వారు వైజాగ్ సిటీలో పనిచేయుటకు కావలెను.ఆకర్షణీయమైన జీతం. 9703402722, 9866546060

DRIVERS

Non Local experienced car drivers age 20 to 50 years. Food and accommodation available. Con. 8897663366

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

'పాత పింఛను పునరుద్ధరించాలి'

ఆందోళనలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛను పథకాన్ని రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం ఐక్యవేదిక ఛైర్మన్ కేఆర్.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ ఉద్యోగులు 'సాగరఘోష' పేరిట జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ... సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం ఓపీఎస్ మాత్రమే అన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. సంఘం అధ్యక్షుడు బాజీపఠాన్ మాట్లాడుతూ... ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు. ఇదే డిమాండ్‌తో కార్మిక దినోత్సవం సందర్భంగా కడపలో ప్రభుత్వ ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహిస్తారని స్పష్టం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్, నాయకులు కేదారేశ్వరరావు, అప్పలనాయుడు, జి.మురళీ, ఎం.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విచారణ సంస్థలపై చర్యలకు డిమాండ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన ఆయేషా మీరా హత్య కేసుకు సంబంధించి.. దర్యాప్తు, విచారణ సంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయేషామీరా, సినీ నటి ప్రత్యూష, వాకపల్లి కేసుల్లో ఆధారాలను ధ్వంసం చేసిన దర్యాప్తు అధికారులపై చట్టపరమైన విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలన్నారు. ఆందోళనలో సంఘం జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న పీఓడబ్ల్యూ కార్యకర్తలు, ప్రతినిధులు

ఖమేనీ ఆత్మకు శాంతి చేకూరాలి

నగరంలో షియా ముస్లింల ర్యాలీ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఇజ్రాయెల్, అమెరికా చేపట్టిన ఉమ్మడి దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మరణం పట్ల జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెం(పెద్దూరు)లోని షియా ముస్లింలు శాంతి ర్యాలీ చేపట్టారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆయన చిత్రపటాలు పట్టుకుని, కొవ్వొత్తులు వెలిగించి పెద్దూరు, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి మీదుగా జాతీయ రహదారి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ సాగించారు.

అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో ఖమేనీ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహిస్తున్న షియా ముస్లింలు

ముగ్గులు వేస్తున్న మహిళా పోలీస్ సిబ్బంది

ఆకట్టుకున్న రంగవల్లులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సూర్యాబాగ్ పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల ముగ్గుల్ని అందంగా తీర్చిదిద్దారు. విజేతలకు మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందిస్తామని సీపీ శంఖబ్రతబాగ్చీ తెలిపారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ ఆటోడ్రైవర్ మృతి చెందినట్లు మూడో పట్టణ ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు తెలిపారు. ఆ వివరాలిలా.. చినజాలరిపేటకు చెందిన చింతల గురుమూర్తి (50) ఆదివారం సాయంత్రం అతివేగంగా ఆటో నడుపుతూ సిరిపురం సమీపంలో ఓ ప్రైవేటు హోటల్ వద్ద డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో వాహనం బోల్తా పడి డ్రైవర్ కింద పడ్డాడు. తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మూడో పట్టణ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులు లేరు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. డ్రైవర్ మద్యం తాగి ఆటో నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగిందా? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ విషయం శవపరీక్ష నివేదికలో తెలుస్తుందని పోలీసులు అంటున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	150	145
లైవ్	177	165
డ్రెస్డ్	257	300
స్కిన్‌లెస్	292	310

(c) eenadu

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్ ట్రీ5-1 - కపుల్ ఫ్రెండ్లీ (మార్నింగ్, ఫస్ట్ షో), హే బల్వంత్ (మ్యాట్నీ, సెకండ్ షో), ట్రీ5-2 - విష్ణు విన్యాసం

'ప్రజల్లోకి కల్తీ నెయ్యి వ్యవహారం'

సీతానగరం (పెందుర్తి), న్యూస్‌టుడే: కల్తీనెయ్యి వ్యవహారంలో వైకాపా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెదేపా నగర ఉపాధ్యక్షుడు పులి రమణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం 75వ వార్డు సీతానగరం ఎన్టీఆర్ కూడలిలో 'మహాపాపం' గోడపత్రిక ఆవిష్కరణ, వైకాపా తీరుపై మహా నిరసన చేపట్టారు. వార్డు అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, ముఠలపల్లి పెంటయ్య, తెలుగు యువత జిల్లా కార్యదర్శి ముల్లి పెంటిరాజు, నాయకులు గోళ్ల ముత్యాలు, ఉరుకూటి అప్పలరాజు, కణితి సన్యాసిరావు పాల్గొన్నారు.

పెందుర్తి

ఆర్టీసీ ప్రయాణికులూ సమస్యలా..ఫోన్ చేయండి!

నేడు 'ఈనాడు' డయల్ యువర్ సింహాచలం ఆర్టీసీ డీఎం

వేపగుంట, న్యూస్‌టుడే: సింహాచలం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులు మీ గ్రామానికి, మీ ఊరికి గతంలో మాదిరిగానే వస్తున్నాయా... ట్రిప్పులు సక్రమంగా నడుస్తున్నాయా... సకాలానికి బస్సులు వస్తున్నాయా.. తదితర సమస్యలను డిపో మేనేజరు సురేష్ దృష్టికి తీసుకెళ్లేందుకు 'ఈనాడు' అవకాశం కల్పిస్తుంది. ప్రయాణికులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఆయా ఫిర్యాదులకు డిపో మేనేజరు సమాధానాలు ఇస్తారు.

తేదీ	: 02-03-2026
సమయం	: ఉదయం 10 నుంచి 11 వరకు
ఫోన్ నంబరు	: 93472 79909

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

వేపగుంట, న్యూస్‌టుడే: ?: వేపగుంట సీపీఎం కాలనీలో వీధిదీపాలు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. -శ్రీనివాసరావు ✓: వీధిదీపాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. త్వరలో సమస్య పరిష్కరిస్తాం. -శ్రవణ్‌రాజు, ఏఈ, జీవీఎంసీ

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం బుడగ జంగాల కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెంటాడుతోంది. -పి.పాల్ నాగరాజు, సబ్బవరం ✓: వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -పి.ఆనంద రావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

?: సబ్బవరం ఎన్టీఆర్ కూడలి నుంచి చినగొల్లలపాలెం వెళ్లే రహదారి పూర్తిగా శిథిలమైంది. -పి.సన్యాసిరావు, సబ్బవరం ✓: ఈ విషయం మండల పరిషత్ సమావేశంలో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -భోకం సూర్యకుమారి, ఎంపీపీ

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం సర్దార్ గౌతు లచ్చన్ననగర్ కూడలి నుంచి ఫార్మాసిటీ కాలనీకి వెళ్లే మార్గంలో వేగనిరోధకాలు ప్రమాదకరంగా మారాయి. -నాయుడు, ఫార్మాసిటీ కాలనీ. ✓: మీ ప్రాంతంలోని వేగనిరోధకాలు వేయడానికి కృషి చేస్తాం. -మల్లికార్జునరావు, డిప్యూటీ ఎంపీడీవో, పరవాడ

ప్రభుత్వ స్థలంలో యథేచ్ఛగా ఆక్రమణలు

ఆక్రమణకు గురవుతున్న శ్మశానవాటిక స్థలం

వేపగుంట, న్యూస్‌టుడే: నగర పరిధిలోని శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలం కనిపిస్తే ఆక్రమణదారులు కబ్జాకు పాల్పడుతున్నారు. కొంతమంది స్థానిక నాయకులు తెర వెనుక ఉండి వీటిని ప్రోత్సహిస్తున్నట్టు తెలుస్తోంది. తొలుత చిన్న చిన్న గుడారాలు, పాకలు వేయించి తర్వాత సంబంధిత స్థలాలను పెద్ద మొత్తంలో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా వారికి సహకరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ★ 95వార్డు వరలక్ష్మీనగర్ శివారున్నున్న ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. అధికారులు కన్నెత్తి చూడక పోవడంతో ఇది నిత్యకృత్యంగా మారింది. రోజురోజుకు ఇక్కడ పాకల సంఖ్య పెరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. ★ వరలక్ష్మీనగర్ శ్మశానవాటిక స్థలం, చీమలాపల్లి బ్రహ్మంగారి మఠం వెనుక ఉన్న గెడ్డ స్థలం, యూత్ ట్రైనింగ్ సెంటర్ వెనుక ఉన్న ఖాళీ స్థలం వరకు పాకలు పెద్దఎత్తున వెలిశాయి. నగరంలోని కంచరపాలెం, గోపాలపట్నం, ఆర్.వెంకటాపురం, చీమలాపల్లి, పొర్లుపాలెం, లక్ష్మీపురం, పెందుర్తి పరిసర ప్రాంతాల నుంచి పలువురు ఇక్కడకు వచ్చి పాకలు వేస్తున్నారు. ★ ఇక్కడ పాకలు వేసుకునే వారి సంఖ్య పెరగడంతో తెరవెనుక ఉన్న ఆక్రమణదారుల ఆగడాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. తాము చెప్పినట్టే ఇక్కడ నడుచుకోవాలంటూ ఇతర ప్రాంతాల వారిని హెచ్చరిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు పలువురు అంటున్నారు. పాకలు తమ మనుషులే నిర్మిస్తారని వారికి కాంట్రాక్టు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు కొందరు అంటున్నారు. తొలుత పాకలు వేయించి తర్వాత వాటిని రూ.లక్షల్లో అమ్ముకునేందుకు ప్రణాళిక వేసినట్లు తెలుస్తోంది. ★ ఇక్కడే శ్మశానవాటికలో చెత్త పేరుకుపోయిందని వరలక్ష్మీనగర్ వాసులు ఇటీవల ఫిర్యాదు చేయడంతో అధికారులు శ్మశానవాటికలో చెత్త తీయించారు. ఈ క్రమంలో శ్మశానవాటిక స్థలం ఖాళీగా కనిపించడంతో ఆక్రమణదారులు అక్కడ పాకలు వేసేస్తున్నారు.

ఈ విషయం మా దృష్టికి వచ్చింది. ఇటీవల ఖాళీ చేయాలని ఆదేశించాం. అయినప్పటికీ కొందరు పాకలు వేస్తున్నట్లు తెలిసింది. త్వరలో పాకలన్నింటినీ తొలగించి ప్రభుత్వ భూములను పరిరక్షిస్తాం. -వెంకట అప్పారావు, పెందుర్తి తహసీల్దార్

రూ.5.30 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శిలాఫలకాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రమేష్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు చిత్రంలో కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

దేశపాత్రునిపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం గ్రామంలో జీవీఎంసీ నిధులు సుమారు రూ.5.30 కోట్లు వెచ్చించి సీసీరోడ్లు, కాలువల నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపనతో పాటు ఓపెన్‌జిమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తొలుత స్థానిక వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావుతో కలిసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే వెళ్లిపోయాక నగర మేయర్ పీలా శ్రీనివాసరావు చేరుకుని మరికొన్ని పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వార్డులో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డీఈ నారాయణ, ఏపీడీ దుర్గాప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గురుకుల బాలురకు పతకాలు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన స్పెషల్ ఒలింపిక్స్ పోటీల్లో సబ్బవరం అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ కేశవరావు తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం 60మంది పాల్గొనగా సబ్బవరం గురుకుల పాఠశాలకు సంబంధించి 8, 9, 10 తరగతులకు చెందిన 10మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈమేరకు అంబేడ్కర్ గురుకులాల సంయుక్త కార్యదర్శి ఎస్.రూపవతి హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్స్‌లో పది మంది బంగారు పతకాలు సాధించడం గురుకులాలకు గర్వకారణమన్నారు. పతకాలు సాధించిన వారిలో 8వ తరగతికి చెందిన బి.మదన్‌కుమార్, హేమంత్ వికాస్, ఎం.లోకేశ్, 9వ తరగతికి చెందిన బి.మనోహర్, జె.విశాల్, ఎం.ధనుంజయ్, కె.శివహేమంత్, టి.భవానీప్రసాద్, 10వ తరగతికి చెందిన జె.సందీప్, వి.డి.దత్తతేజ, జి.కూర్మారావు ఉన్నారు. సంబంధిత విద్యార్థులను, వారికి మార్గ నిర్దేశం చేసిన టీచర్ టి.రాంబాబును ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో సంయుక్త కార్యదర్శి రూపవతి, ప్రిన్సిపల్ కేశవరావు, తదితరులు

పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి

స్థానికులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గొట్టివాడ ప్రాథమిక పాఠశాల పరిధిలో ప్రవేశాల కోసం ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు పాల్గొన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ మేరకు కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు పంపిస్తామని భరోసా ఇచ్చారు. మరి కొంతమంది తల్లిదండ్రులతో మాట్లాడి ఆయనే కొందరిని స్వయంగా చేర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, పూర్వ విద్యార్థి దినకర్ తదితరులు పాల్గొన్నారు.

చదువంటే మాకిష్టం..!

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: బాలల్లో పుస్తక పఠనాసక్తిని పెంపొందించే ఉద్దేశంతో పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో 'చదువంటే మాకిష్టం..' పేరుతో ప్రత్యేక పుస్తక పఠన కార్యక్రమం నిర్వహించారు. గ్రంథపాలకులు పిల్లలకు కథలు చెప్పి, నీతి పుస్తకాలను చదివించారు. గ్రంథాలయాధికారి వీవీ రమణ పర్యవేక్షించారు. ★ పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదువంటే మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా పిల్లలతో కథలు చెప్పించారు. కళారత్న ఎస్.చలపతిరావు 'గర్వభంగం' అనే కథను పిల్లలకు చెప్పారు. గ్రంథాలయ అధికారి ఆజాద్‌కుమార్, బాలలు పాల్గొన్నారు.

కథలు చదువుతున్న బాలలు

అవీ ఇవీ

పరారీలో ఉన్న నిందితుడు అరెస్టు

పెందుర్తి, న్యూస్‌టుడే: మోసం కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసినట్లు పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ఆ వివరాలిలా.. ఒడిశా రాష్ట్రానికి చెందిన నవీన్ బామా అలియాస్ నవీన్ నకిలీ దస్త్రాలు సృష్టించి భూమి అమ్మకానికి పెట్టారు. ఆ మేరకు నగరానికి చెందిన దుగ్గిరాల ప్రసాద్‌బాబుకు రూ.28లక్షల మేర మోసం చేసి పరారయ్యాడు. దీనిపై ప్రసాద్‌బాబు గత ఏడాది ఆగస్టులో పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి నిందితుడి కోసం గాలించిన పోలీసులు ఎట్టకేలకు ఒడిశాలోని సునాబెడ ప్రాంతంలో ఉన్నట్లు కనుగొన్నారు. ఆ మేరకు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పురోగతిలో ప్రతిభ చూపిన ఎస్ఐ ఎన్.వి. భాస్కరరావును సీఐ అభినందించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెందుర్తి, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకుని మంచి నడవడికతో మెలగాలని పెందుర్తి ఎస్ఐ పి.లక్ష్మి సూచించారు. ఆదివారం పెందుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. సంబంధిత నిందితులంతా ప్రతివారం తప్పనిసరిగా స్టేషన్‌లో హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. రౌడీషీటర్ల కదలికలపై నిత్యం నిఘా ఉంటుందని హెచ్చరించారు.

రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న పెందుర్తి ఎస్ఐ పి.లక్ష్మి

తిరుమలనగర్ నూతన కార్యవర్గం ఎన్నిక

కూర్మన్నపాలెం(తిరుమలనగర్), న్యూస్‌టుడే: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షునిగా ఎం.పరమానందం, ఉపాధ్యక్షునిగా జి.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.విశ్వేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.వసంతరెడ్డి, కోశాధికారిగా పి.తిరుపతినాయుడు, సహాయ కోశాధికారిగా వి.విశ్వనాథం, కార్యనిర్వాహక అధ్యక్షునిగా ఎన్.అప్పలనాయుడు, కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శిగా ఎ.సన్యాసిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.పరమేశ్వరరావు, ఎన్.రాములును రెండేళ్లకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతనంగా ఎన్నికైన తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఘనంగా చిన్నారుల స్నాతకోత్సవం

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు పరిధి సుజాతనగర్‌లోని షిర్డీసాయి ఆక్స్‌ఫర్డ్ పాఠశాల వార్షికోత్సవం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. ప్రిన్సిపల్ వాకా చంద్రశేఖర్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ మల్లికారెడ్డి ఆధ్వర్యంలో తొలుత పూర్వ ప్రాథమిక విద్యార్థుల స్నాతకోత్సవం జరిగింది. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృసింహావతారం, కల్కి అవతరణ ఘట్టాలతో పాటు నృత్య కార్యక్రమాలు అలరించాయి.

12న శ్రీ మరిడిమాంబ జాతర

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి పరిధి కొండయ్యవలస కాలనీవాసుల ఆరాధ్య దేవత శ్రీ మరిడిమాంబ అనుపు జాతర ఈనెల 12న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు బలిరెడ్డి శ్రీను ప్రకటించారు. ఆదివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు, భక్తులు పండగను జయప్రదం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల సంక్షేమానికి కృషి

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి, ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండుసార్లు అంగన్‌వాడీల వేతనాలు పెంచిన ఘటన తెదేపాకు ఉందన్నారు. అంగన్‌వాడీలకు ప్రభుత్వం స్మార్ట్‌ఫోన్లు అందించిందన్నారు. దశల వారీగా సమస్యలు పరిష్కరించేందుకు సర్కారు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

రూ.82.63 లక్షలతో పార్కు అభివృద్ధి

పాపయ్యరాజుపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని పాపయ్యరాజుపాలెం సమీప గొల్లవిల్లివానిపాలెం ఎల్ఐసీ కాలనీలో రూ.82.63 లక్షలతో పార్కు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయని వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు తెలిపారు. ఆదివారం ఆయన కాలనీవాసులతో కలిసి పనులు పరిశీలించారు. ప్రహరీ, బహిరంగ వ్యాయామ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు పరిశీలించారు. త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 95, 97 వార్డుల భాజపా అధ్యక్షుడు చిక్కాల సతీశ్, సామాజిక మాధ్యమ కన్వీనర్ కేవీ సంతోష్, ఉపాధ్యక్షురాలు లక్ష్మీమణి, కాలనీవాసులు పాల్గొన్నారు.

పార్కులోని జారుడు బల్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

ప్రాణాధారం.. నేలపాలు

సింహపురికాలనీ(వేపగుంట), న్యూస్‌టుడే: సింహపురి కాలనీ ఎల్ఐజీ వీధిలో వారం రోజులుగా పైపులైను లీకుల కారణంగా ప్రాణాధారమైన మంచినీరు వృథాగా పోతోంది. ప్రతీరోజూ నీటి సరఫరా సమయంలో తాగునీరు రహదారిపై ప్రవహిస్తూ రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత విభాగం అధికారులు వెంటనే స్పందించి ఇక్కడి లీకులను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలి

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: పార్టీ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని పెందుర్తి ఎమ్మెల్యే, విశాఖ ఉమ్మడి గ్రామీణ జిల్లా జనసేన అధ్యక్షుడు పంచకర్ల రమేశ్ బాబు సూచించారు. 97వ వార్డు చినముషిడివాడ కూడలిలో వార్డు అధ్యక్షుడు సేనాపతి సోమశేఖర్‌నాయుడు, ముక్కా సంతోష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సేనాపతి లీలాధరరావు, ముక్కా చిన్నారావు, బుచ్చిబాబు, ముమ్మన శ్రీనివాసరావు, గురువులు, రాజా సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో చేసిన సభ్యత్వ నమోదును చూపుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

ఆరిపాక విద్యార్థుల ప్రతిభ

సబ్బవరం, న్యూస్‌టుడే: సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల విజయవాడలో జరిగిన 'సైన్స్ సమగ్ర మహోత్సవ్-2026'లో అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు కె.కోమలి, కె.వర్షిణి, ఎం.మాధురి ప్రదర్శించిన 'కార్బన్ ప్యూరిఫికేషన్' ప్రాజెక్టు ఉన్నతాధికారుల ప్రశంసలు పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.జె.రవీంద్రబాబు తెలిపారు. ఈమేరకు ఏపీ సైన్స్ సిటీ సీఈవో వెంకటేశ్వర్లు, ఎయిర్‌పోర్టు అథారిటీ కమిషనర్ ప్రవీణ్‌ఆదిత్య అభినందించారన్నారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందించారన్నారు. ఈ మేరకు రవీంద్రబాబు సంబంధిత విద్యార్థులను, సైన్స్ ఉపాధ్యాయిని దువ్వాడ శిరీషను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు

నవ్వులు పంచిన పేరడీ అవధానం

పేరడీ అవధానం చెబుతున్న జె.ఎల్.నరసింహారావు

సీతంపేట, న్యూస్‌టుడే: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విశాఖ పౌర గ్రంథాలయంలో 'నవ్వుకుందాం రండి' పేరుతో పేరడీ అవధాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. హెల్మెట్ పెట్టుకుంటే లాభాలు, తెలుగు ప్రస్తుత పరిస్థితి, భగవంతుడి లీలలు, వారఫలాలు, కవితలు, అంత్యప్రాసలు, తాగడం వల్ల నష్టాలు, వాస్తు పిచ్చి, చమత్కారం మాట్లాడే ఆడవారి అంశాలపై అవధానం చేస్తూ నవ్వులు పూయించారు. అవధానిగా జె.ఎల్.నరసింహారావు, సభ్యులు కె.ఎల్.కామేశ్వరరావు, ఎం.వి.సుబ్రహ్మణ్యం, నండూరి రామకృష్ణ, రామానుజం, శ్రీధర్, రజని, జేపీ శర్మ, నాయుడు, బోను నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. తిలక్ పట్నాయక్, సినీ నటులు భద్రం, శివకుమార్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ పరస

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: అడివివరం గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారి పరస మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. మహిళలు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఈవో జె.వెంకటరావు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

పూజల్లో పాల్గొన్న ఈవో వెంకటరావు

హరేరామ.. హరేకృష్ణ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిరం(సాగర్‌నగర్)లో హరేరామ.. హరేకృష్ణ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్రబలభద్ర జగన్నాథ స్వామి విగ్రహాలను పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించి భజనలు నిర్వహణ, గీతాలాపనలు చేశారు. అన్నసమారాధన చేపట్టారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్, మాతాజీనితాయిసేవిని, తదితరులు పాల్గొన్నారు.



రాధాకృష్ణుల ఉత్సవమూర్తులు

ఆర్వో ప్లాంటు ఉన్నా..లేనట్లే..

ముత్యాలమ్మపాలెంలో మూలకు చేరిన మంచినీటి పథకం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెంలోని ఆర్వో ప్లాంటు నిరుపయోగంగా ఉంది. గ్రామప్రజలకు శుద్ధి నీటిని అందించాలనే లక్ష్యంతో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులు రూ.12లక్షలు వెచ్చించి 2016లో దీన్ని నిర్మించారు. ప్లాంటుకు ఎన్టీపీసీ అధికారులు సౌర పలకలు ఏర్పాటు చేశారు. కొన్నేళ్లపాటు బాగానే పనిచేయడంతో స్థానికులు ఇక్కడి శుద్ధి నీటిని పట్టుకుని వెళ్లేవారు. కాగా..కొంతకాలంగా ఇది మూలకు చేరి నిరుపయోగంగా ఉంది. దాంతో గ్రామస్థులు శుద్ధినీటికి అవస్థలు పడుతున్నారు. వ్యయప్రయాసలకు గురై పరిసర గ్రామాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ ప్లాంటును వినియోగంలోకి తీసుకురావడానికి తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

స్వామి, అమ్మవార్లు

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరుల సమేతంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవం కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

జ్యోతిర్లింగ ప్రదర్శన ప్రారంభం

అగనంపూడి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం గ్రామీణ బ్యాంకు వద్ద ఆదివారం ప్రజాపిత బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో సోమనాథ జ్యోతిర్లింగ ప్రదర్శన ఏర్పాటు చేశారు. పరవాడ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.నీలబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు అపరంజి, రామకోటి, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఫాల్గుణ పక్షోత్సవాలు

పూజలందుకుంటున్న అమ్మవారు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై జరుగుతున్న ఫాల్గుణ పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం క్షీరాబ్ది కన్యకు శ్రీమహాలక్ష్మి అమ్మవారికి శోడషాభిషేకం, శ్రీసూక్త హవనం వైభవోపేతంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారికి పదహారు రకాల ద్రవ్యాలతో శోడష ద్రవ్యాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నూతన వస్త్రాలతో జగన్మాతను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండంలో శ్రీసూక్త హవనం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హోమగుండం ప్రదక్షిణం చేశారు. సామూహిక అష్టలక్ష్మి స్తోత్ర పారాయణం చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

శ్రీసూక్త హవనంలో పాల్గొన్న భక్తులు

రేపు వేంకన్న ఆలయం మూసివేత

పెందుర్తి, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం సందర్భంగా వేంకటాద్రిపై కొలువుదీరిన శ్రీనివాసుడి ఆలయాన్ని మంగళవారం మూసివేయనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున శ్రీవారికి ఆరాధన, అర్చనలు పూర్తి చేసి ఉదయం 8.30 గంటలకు ఆలయ ద్వారాలు మూసివేస్తామన్నారు. బుధవారం తెల్లవారుజామున 5.30గంటలకు గుడి తలుపులు తెరిచి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు చేస్తామన్నారు. ఆలయ సంప్రోక్షణ అనంతరం సుమారు ఉదయం 8గంటల నుంచి భక్తులకు తిరిగి శ్రీవారి దర్శనం కల్పిస్తామని వివరించారు.

ముత్యమాంబ పండగ చాటింపు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట పరిసర 14 గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం ముత్యమాంబ అమ్మవారి పండగ చాటింపు ఉత్సవం ఆదివారం జరిగింది. ఈనెల 5న అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించనున్నారు. గురువారం జరగనున్న అనుపోత్సవానికి ముందు ఐదు రోజులపాటు ఈ వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం చాటింపు ఉత్సవం చేపట్టారు. భక్తులు మాంసాహారానికి దూరంగా ఉండేందుకు సంబంధిత దుకాణాలను వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేయడం ఇక్కడి ఆచారంగా వస్తోంది. అమ్మవారు బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారుగా గుర్తింపు పొందడంతో అప్పటి నుంచి ఈ సంప్రదాయాన్ని పెద్దలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా వేపగుంట నాలుగురోడ్ల కూడలిని విద్యుత్తు దీపాలతో తీర్చిదిద్దుతున్నారు. ఈ సందర్భంగా ప్రతీరోజూ ఆలయ ప్రాంగణంలో భజనలు, కోలాటం తదితర ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పెందుర్తి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు పరిహారం అందజేత

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: అడివివరం-నీళ్లకుండీలు కూడలి వరకు రహదారి విస్తరణలో భాగంగా పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురం గ్రామంలో తొలగించిన ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు నష్టపరిహారం పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. స్థానిక రత్నగిరినగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ సమకూర్చిన రూ.16లక్షలు విలువైన పరిహారం చెక్కులను ఆయా కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ప్రణాళికాధికారి కిశోర్‌కుమార్, ఏడీఎం రహీం బేబీ, గ్రామ నాయకులు దూది వెంకటరమణ, జి.సోమునాయుడు, కాయిత ఎర్రిబాబు, దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ప్రతినిధులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

(c) eenadu

భీమిలి

◊ సినిమాలు ◊

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేష్ - **మన శంకర వరప్రసాద్ గారు**
రాములమ్మ - **భర్త మహాశయులకు విజ్ఞప్తి**
తాతా - **100 డేస్ లవ్ స్టోరీ**
సప్తగిరి - **విష్ణు విన్యాసం**

తెదేపా నేతకు పరామర్శ

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న తెదేపా నాగవంశ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు డొకర అప్పలనారాయణను పలువురు నాయకులు సింగనబందలోని ఆయన స్వగృహానికి వెళ్లి ఆదివారం పరామర్శించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాష్ట్ర నాగవంశ సంఘం సాధికార కమిటీ సభ్యులు మద్దిల వైకుంఠరావు, తెదేపా సీనియర్ నాయకుడు జోగ సన్యాసిరావు, తదితరులు ఆయన్ను పరామర్శించి కోలుకోవాలని ఆకాంక్షించారు.

చంద్రగ్రహణంతో రేపు ఉత్సవాలు నిలిపివేత

కొమ్మాది, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం కారణంగా 6వ వార్డు కొమ్మాది అన్నంరాజునగర్‌లో కొలువైన అష్టలక్ష్మీ దేవాలయంలో మంగళవారం లక్ష్మిజయంతి ఉత్సవాలను నిలిపివేస్తున్నామని ధర్మకర్త అన్నంరాజుసత్యనారాయణమూర్తి, ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర్‌స్వామి తెలిపారు. 3వ తేదీ ఉదయం 7:30 గంటలకు శ్రీలక్ష్మీనారాయణులకు పంచామృతాభిషేకాలు నిర్వహించి 9:30 గంటలకు ఆలయాన్ని మూసివేస్తామన్నారు. 4వ తేది ఉదయం 5:30 గంటలకు ఆలయాన్ని తెరచి సంప్రోక్షణ చేసి 7:30 గంటల నుంచి దర్శనం కల్పిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ?: బీచ్‌రోడ్డు (సాగర్‌నగర్) విద్యుత్తు కార్యాలయం కూడలి నుంచి సుభాష్‌నగర్‌కు వెళ్లే ప్రధానమార్గంలో అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. - **కోన గోపి, రాజేష్** ✓: జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగాధికారుల దృష్టికి తీసుకెళ్లి రహదారి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. - **జెడ్సీ అయ్యప్పనాయుడు**

?: రుషికొండ గాయత్రీ కళాశాల సమీప బీచ్‌రోడ్డు కూడలి బస్టాప్ వద్ద నగరం వైపు వచ్చే 900కే సిటీ బస్సులు నిలపకపోవడంతో అసౌకర్యానికి గురవుతున్నాం. - **విద్యార్థులు.** ✓: బస్సులు ఆపేలా దృష్టి సారిస్తాం. - **ఆర్టీసీ అధికారులు**

?: సాగర్‌నగర్-ముసలయ్యపాలెం ప్రధాన రోడ్డులో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. - **కె.అప్పారావు** ✓: జీవీఎంసీ విభాగాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తాం. - **జెడ్సీ అయ్యప్పనాయుడు**

?: సాగర్‌నగర్ ఎంఐజీ-డీ, ఎల్‌ఐజీ-సీ నివాస సముదాయాల్లో చెత్త రహదారులపై వేసేస్తున్నారు. - **కె.శ్యామ్, సతీష్.** ✓: అవసరం మేరకు చెత్తకుండీలు ఏర్పాటు చేస్తాం. - **శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రవి.**

నందనవనాన్ని తలపిస్తున్న సంపద కేంద్రం

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస-భీమిలి రోడ్డులోని రేఖవానిపాలెం పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (డంపింగ్ యార్డ్) నందనవనాన్ని తలపిస్తోంది. ప్రధాన రోడ్డుకు కూత వేటు దూరంలోని ఈ కేంద్రం జిల్లా శిక్షణ కేంద్రంగా ఇప్పటికే ఎంపికైంది. జిల్లాలోని వివిధ పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తోంది. సేకరించిన చెత్తను ఎరువుగా మార్చి మొక్కలు పెంచుతున్నారు. అదేవిధంగా ప్లాస్టిక్, తదితర వ్యర్థాలతో అందమైన ఆకృతులు తయారు చేస్తున్నారు. ఈ డంపింగ్‌యార్డును చూడగానే ఎంతో చూడముచ్చటగా పచ్చదనంతో దర్శనమిస్తోంది. వివిధ రకాల పండ్లు, తీగ జాతులు, పూల మొక్కలతో కళకళలాడుతోంది. దీనిని జిల్లా రిసోర్స్ సెంటర్‌గా వ్యవహరిస్తున్నారు. చెత్త నుంచి సంపద తయారీపై వివిధ గ్రామాల సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

పచ్చదనంతో కనిపిస్తున్న రేఖవానిపాలెం సంపద తయారీ కేంద్రం

✦ రేఖవానిపాలెం సంపద తయారీ కేంద్రం జిల్లా ట్రైనింగ్ సెంటర్‌గా కొనసాగుతోంది. అరటి, జామ, దానిమ్మ, బొప్పాయి, తదితర పండ్లతో పాటు వివిధ రకాల పూలు, తీగ జాతి మొక్కలు పెంచుతున్నారు. రేఖవానిపాలెం కేంద్రం జిల్లాలోనే ఉత్తమ కేంద్రంగా గుర్తింపు పొందింది. - కె.రమేశ్‌నాయుడు (భీమిలి మండలం పరిశుభ్రత డిప్యూటీ ఎంపీడీవో)

రక్షణ లేని బడులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం పరిసరాల్లోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధాన 'గేట్ల' సమస్యలు వెంటాడుతున్నాయి. ఆర్‌హెచ్ కాలనీలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీతో పాటు గేటు లేకపోవడంతో ప్రాంగణం ఆకతాయిలకు నిలయంగా మారుతోంది. చీకటి పడితే స్థానిక యువకులు లోపలకు ప్రవేశించి మద్యం తాగడంతో పాటు ఆవరణలో మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. మరో వైపు లక్ష్మీవానిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రహరీ గోడ దెబ్బతిని మూడేళ్లు కావస్తోంది. గేటు తెరచుకోక విద్యార్థులు పాఠశాలలోకి ప్రవేశించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రహరీ లేని ఆర్‌హెచ్ కాలనీ ప్రాథమిక పాఠశాల

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ

కొమ్మాది, న్యూస్‌టుడే: కొమ్మాది మోడల్ ప్రైమరీ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సవర ఆరాధ్య సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిందని ప్రధానోపాధ్యాయులు సుదర్శన్‌పట్నాయక్ తెలిపారు. ఈ పరీక్షలో కటాఫ్ మార్కులు 80 కాగా ఆరాధ్య 96 మార్కులతో ప్రతిభ చాటిందన్నారు. ఆరాధ్యకు ఉపాధ్యాయులు కృష్ణయ్య, సత్యవాణి, పద్మజ, లక్ష్మిప్రియ అభినందనలు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి చింతాడ రవీంద్రబాబు బాలికను ప్రశంసించారు.

ఆరాధ్యను అభినందిస్తున్న అధ్యాపక బృందం

చురుగ్గా జనసేన సభ్యత్వ నమోదు

మధురవాడ, న్యూస్‌టుడే: జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో వార్డుల్లో జనసేన పార్టీ ఉద్యమి (క్రియాశీలక) సభ్యత్వ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోందని భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ పేర్కొన్నారు. 6వ వార్డులో వార్డు అధ్యక్షులు సంతోష్‌నాయుడు ఆధ్వర్యంలో, 7వ వార్డులో వార్డు అధ్యక్షులు నాగోతి నర్సింహనాయుడు సారథ్యంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ఆదివారం నిర్వహించారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని పెద్దఎత్తున సభ్యత్వాలు తీసుకుంటున్నారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బి.వి.కృష్ణయ్య, శాఖరి శ్రీనివాస్, పిళ్లా శ్రీనివాస్, పోతిన తిరుమలరావు, అనురాధ, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఆరో వార్డులో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్

అలరించిన నృత్య ప్రదర్శనలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి సాగరతిరుమల క్షేత్రంపై నిర్వహిస్తున్న వార్షిక శ్రీవారి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. శ్రీకృష్ణ కూచిపూడి నిలయం నిర్వాహకురాలు ఆర్. కృష్ణవేణి ఈశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాలికలు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అంతకు ముందు సుదర్శన హోమం నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

బాలికల నృత్య ప్రదర్శన

బాధితులకు పరిహారం అందజేత

భీమునిపట్నం, చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబీకులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తగరపువలసలో ఆదివారం ఉదయం బీమా చెక్కులు అందించారు. ఇటీవల వేటకువెళ్లి మృతి చెందిన భీమిలి బోయవీధికి చెందిన వీరాజు కుటుంబీకులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల పరిహారం, ఆనందపురం మండలం జోని గ్రామానికి చెందిన ప్రసాద్ కుటుంబానికి ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున రూ.2 లక్షలను అందించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ లక్ష్మణరావు, ఎఫ్‌డీవో ఈశ్వరరాజు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు, మత్స్యకార నాయకులు గంటా నూకరాజు, వాదమొదులు సత్యారావు, కాసారపు నాగరాజు, నాగవంశ నేతలు జీవీ నారాయణ, కనకల అప్పలనాయుడు, గాడు తాతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబానికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మధురవాడ, న్యూస్‌టుడే: పీఎంపాలెం క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న స్టైపెండరీలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీకౌశిక మాలిక్యులర్ డయాగ్నొస్టిక్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ (ఎస్ఎండీఆర్సీ), అపోలో డయాగ్నొస్టిక్ సంయుక్త భాగస్వామ్యంతో వైద్యనిపుణులు డాక్టర్ జోగేశ్వర్ తదితరులు పలువురికి పరీక్షలు చేశారు. పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులతో పాటు స్థానిక పాత్రికేయులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు వైద్యసేవలు పొందారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పోలీసులకు వైద్యపరీక్షలు చేస్తున్న నిపుణులు

డంపింగ్‌యార్డుగా రహదారులు

కొమ్మాది, న్యూస్‌టుడే

ప్లాస్టిక్, భవన నిర్మాణ వ్యర్థాలతో మారికవలస ఓజోన్‌వ్యాలీ రహదారి డంపింగ్‌యార్డులా దర్శనమిస్తోంది. ఈ వ్యాలీ లే-అవుట్‌లో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని సైతం కొనుగోలు చేసింది. రాత్రి వేళ నగరం నుంచి లారీలతో తీసుకువచ్చే మట్టికుప్పలు, చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలను రహదారి వెంబడి గుట్టలుగా పడేస్తున్నారు. అలా వేయకుండా పర్యవేక్షించాల్సిన జీవీఎంసీ పారిశుద్ధ్యం, టౌన్‌ప్లానింగ్ అధికారులు కనీసం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం లేదు. ఒకవైపు కేంద్ర హోం శాఖ ఇక్కడ ఇమిగ్రేషన్ సేవలకు ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాంతానికి వస్తే ఇబ్బంది పడే అవకాశాలున్నాయి. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలు సైతం ఇదే ప్రాంతంలో ఉన్నాయి. ఆయా అంశాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓజోన్‌వ్యాలీ రహదారిలో గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలు

నోరు తెరిచిన ప్రమాదం

సింహాచలం, న్యూస్‌టుడే

సింహగిరిపై నిత్యం భక్తులు సంచరించే ప్రాంతంలో విద్యుత్తు వైర్ల బాక్సు ఎలాంటి రక్షణ లేకుండా ప్రమాదాలకు ఆహ్వానంగా నిలిచింది. అన్నప్రసాద భవనం నుంచి బయటకు వచ్చే ప్రాంతంలోని కార్ల పార్కింగ్ వద్ద ఫుట్‌పాత్‌ను ఆనుకుని ఎల్‌టీ విద్యుత్తు తీగల సెక్షన్ బాక్సు ఉంది. దీనిలోకి అధిక వోల్టేజీ విద్యుత్తు ప్రవహిస్తూ ఉంటుంది. ఇలాంటి బాక్సులకు మూతవేసి సురక్షితంగా ఉంచాలి. కానీ, ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకుండా మోకాలు ఎత్తులో ఉన్న ఈ బాక్సు ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. దీంతో పాటు సమీపంలోని కొన్ని వీధిదీపాల స్తంభాల తీగలు బయటకు వచ్చి ఉన్నాయి. రద్దీ రోజులు ప్రారంభమైన నేపథ్యంలో ఎలాంటి విపత్తులు జరగక ముందే అధికారులు స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

అన్నదానం భవనం ఎదురుగా కారు పార్కింగ్ సమీపంలో ప్రమాదకరంగా విద్యుత్తు వైర్ల బాక్సు

క్రికెట్ పోటీల ముగింపు

గ్రామీణభీమిలి, ఎండాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం జరిగింది. తెదేపా నాయకుడు గంటా రవితేజ ముఖ్య అతిథిగా హాజరై విజేత, రన్నరప్ జట్లకు బహుమతులను అందించారు. క్రీడలతో యువతలో క్రమశిక్షణ, ఐక్యత, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు చెట్టుపల్లి గోపి, ఒమ్మి బాబు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న రవితేజ

అప్పలనాయుడు సేవలు చిరస్మరణీయం

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: గుండెపోటుతో ఇటీవల హఠాన్మరణం చెందిన తెదేపా సీనియర్ నేత, నాగవంశ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే గంటా అన్నారు. తగరపువలస జాతీయరహదారి గోస్తనీ నది వంతెన కూడలి వద్దనున్న ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన సంస్మరణ సభకు హాజరై నివాళులర్పించారు. కార్యక్రమంలో అప్పలనాయుడు సతీమణి, కార్పొరేటర్ చిన్నికుమారిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, నాగవంశ కార్పొరేషన్ ఛైర్మన్ రమణ, గంటా రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

'జూ'లో చిత్రలేఖనం పోటీలు

గ్రామీణభీమిలి, ఎండాడ, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వన్యప్రాణి దినోత్సవం ఈనెల 3న నిర్వహించనున్న నేపథ్యంలో ఎండాడ ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు ఆదివారం నిర్వహించారు. ఒకటి నుంచి అయిదో తరగతి విద్యార్థులు జూలోని జంతువులు, మొక్కలు, ప్రకృతి అనే అంశంపై.. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు మనుషులు, వన్యప్రాణుల సహజీవనానికి తోడ్పతే ఔషధ మొక్కలు అనే అంశంపై, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణలో ఔషధ, సుగంధ మొక్కలు అనే అంశంపై పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. ఇందులో ఎంపికైన చిత్రాలను జూ బయోస్కోప్‌లో ఈనెల 3న ప్రదర్శించడంతో పాటు బహుమతులు అందించనున్నట్లు క్యూరేటర్ మంగమ్మ చెప్పారు

బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

బాలలతో జిల్లా గ్రంథాలయాధికారి సతీష్‌కుమార్

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థులు విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వన్నెంరెడ్డి సతీష్‌కుమార్ పేర్కొన్నారు. భీమిలిలో ఉన్న శాఖ గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న 'చదవడం మాకిష్టం' అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలలతో సరదాగా ముచ్చటించారు. నీతికథలు చెప్పి వారిలో ఉత్సాహాన్ని నింపారు. వివిధ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ త్వరలోనే మరిన్ని పోటీపరీక్షల పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.మహేష్ పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల్లో జాప్యంపై ఆగ్రహం

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: గ్రామాల్లో కొళాయిలు ద్వారా ఇంటింటికి తాగునీటిని అందించేందుకు చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనుల్లో జాప్యం, అవినీతి, వివక్షపై పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆదివారం జరిగిన భీమిలి మండల ప్రజా పరిషత్తు సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ దంతులూరి సూర్యనారాయణరాజు అధ్యక్షత వహించారు. లక్ష్మీపురం, మజ్జివలస గ్రామాల్లో ఈ పనుల్లో జరిగిన అవకతకలపై వైస్ ఎంపీపీ బంగారనాయుడు ప్రశ్నించారు. చిప్పాడలో తన ఇంటికే కొళాయి వేయలేదని తెదేపా ఎంపీటీసీ చుక్కా ఈశ్వరమ్మ భర్త శివాజీ ఆరోపించారు. రేఖవానిపాలెంలో చాలాచోట్ల కొళాయిలు వేయలేదని సర్పంచి సమ్మిడి శ్రీనివాసరావు తెలిపారు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చేతిపంపులు, ట్యాంకర్లు, ఇతర ప్రత్యామ్నాయాల ద్వారా రక్షితనీటిని ప్రజలకు అందించే ఏర్పాట్లు చేయాలని తాళ్లవలస ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రమణ విన్నవించారు. నారాయణరాజుపేట ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామ సర్పంచి కాద సూర్యనారాయణ డిమాండ్ చేశారు. అనంతరం ఈ నెలలో పదవీకాలం ముగుస్తున్నందున పంచాయతీ సర్పంచులను సత్కరించారు. కాగా ఉప ఎంపీపీ-2 దుర్గాలమ్మ, కొందరు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో నర్సింహారావు, ఉప ఎంపీడీవోలు రమేశ్‌నాయుడు, కీర్తి ప్రసాద్, ఉప తహసీల్దారు ప్రసాద్, ఉప ఎంపీపీ బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్తు సమావేశంలో ఎంపీపీ సూర్యనారాయణరాజు, తదితరులు

తల్లిని కడసారి చూడలేక తల్లడిల్లిన కొడుకు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: మృతిచెందిన తల్లిని ఆఖరిచూపు చూడలేక ఓ కొడుకు తల్లడిల్లిన ఘటన భీమిలి మండలం మంగమారిపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మేరుగు రాములమ్మ (87) అనారోగ్యంతో కొద్దికాలంగా మంచం పట్టి ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఏకైక కుమారుడైన ఏపీటీడీసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మేరుగు అప్పన్న (53) నాలుగురోజుల కిందట సీతమ్మధార వద్ద తన కుమారునితో బైక్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయనకు కాలు విరిగిపోవడంతో శుక్రవారం శస్త్రచికిత్స జరిగింది. తల్లి మృతి చెందిన వార్త తెలిసి తల్లడిల్లిన ఆయన అంబులెన్స్‌లో వచ్చేందుకు ప్రయత్నించినా వైద్యులు వారించడంతో వాట్సాప్ కాల్‌లోనే మాతృమూర్తి మృతదేహాన్ని చూసి బోరున విలపించడం స్థానికంగా విషాదం నింపింది. కాగా రాములమ్మకు ఆమె మనవడు డిగ్రీ పరీక్షలు రాసి వచ్చి అంతిమ సంస్కారాలు నిర్వహించడం కంటతడి పెట్టించింది.

భూమి పూజ చేస్తున్న నాయకులు

పాఠశాల భవనానికి భూమి పూజ

ఆనందపురం, న్యూస్‌టుడే: మండలంలోని కణమాం పంచాయతీ పరిధిలోని యాత కణమాం గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించేందుకు భీమిలి తెదేపా ఇన్‌ఛార్జి గంటా రవితేజ ఆదివారం భూమి పూజ చేశారు. ప్రాథమిక పాఠశాల శిథిలం కావడంతో వైజాగ్ వికింగ్స్ రౌండ్ టేబుల్, వైజాగ్ రౌండ్ టేబుల్ ప్రతినిధులు అందించే రూ.30 లక్షల ఆర్థిక సహాయంతో నూతన భవనం నిర్మించనున్నారు. తెదేపా నాయకులు తాత్రాజు అప్పారావు, బీఆర్‌బీ.నాయుడు, చందవరపు కుమార్, యర్రా రాము, ఆంబోతు రాము, పాండ్రంగి అప్పలరాజు, బలిరెడ్డి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సిరులొలికే సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరుల సమేతంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవం కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి కల్యాణ తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

ప్రత్యేక అలంకరణలో అనంత పద్మనాభ స్వామి

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం క్షేత్రంలో కొలువైన శ్రీఅనంత పద్మనాభ స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అనంతుని తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. స్వామివారి తెప్పోత్సవానికి తెప్పను దానం చేసిన దాతలు దివంగత లింగుబోతు సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను రవితేజ చేతులమీదుగా సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని కానుకగా అందజేశారు.

ఘనంగా బంగారమ్మ పరస

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: అడివివరం గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారి పరస మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. మహిళలు పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఈవో జె.వెంకటరావు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

పూజల్లో పాల్గొన్న ఈవో వెంకటరావు

భూలోకమాత అమ్మవారికి ప్రత్యేక పూజలు

కొమ్మాది, న్యూస్‌టుడే: దశాబ్దాల చరిత్ర కలిగిన భూలోకమాత అమ్మవారి ఆలయాన్ని ఆధునికీకరించి పసిడి కలశ ప్రతిష్ఠతో పాటు ఉపదేవాలయాల విగ్రహ ప్రారంభోత్సవాలను రేవళ్లపాలెంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీ బంగారమ్మ భూలోకమాత సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో రెండో రోజు ఆదివారం మహాయజ్ఞం, హోమాలను ఆలయ ప్రధాన అర్చకులు రావి రామమూర్తిశర్మ సారథ్యంలో జరిపించారు. జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పంచకర్ల సందీప్, స్థానిక నాయకులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారిని ఆలయ కమిటీ బృందం సత్కరించింది. సోమవారం ప్రత్యేక పూజలతో పాటు మధ్యాహ్నం అన్నసమారాధన చేపడుతున్నామని ఆలయ కమిటీ అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, కార్యదర్శి పిళ్లా రమణబాబు తెలిపారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం 16వ జాతీయ రహదారి వెల్లంకి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. విశాఖ నగరంలోని పాత డైయిరీఫారం ప్రాంతానికి చెందిన వలపు శేఖర్ (26) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని బంధువుల శుభకార్యానికి వెళ్లి సాయంత్రం ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా ఆనందపురం సమీపంలోని వెల్లంకి వద్దకు వచ్చేసరికి ఓ లారీ పక్కగా వెళ్లి ప్రమాదవశాత్తు రోడ్డుపై పడిపోయాడు. వెనుక నుంచి వచ్చే ఓ వ్యాన్ ఆయన పై నుంచి వెళ్లగా అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు సిబ్బందితో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. మృతుడి సోదరుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.శివ వెల్లడించారు.

విద్యార్థినులకు టవల్స్ అందజేసిన ఎమ్మెల్యే గంటా

విద్యార్థినులకు టర్కీ టవల్స్ పంపిణీ

కొమ్మాది, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. పరదేశిపాలెంలో ఉన్న ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో 212 మంది విద్యార్థినులకు ఆదివారం ప్రభుత్వం అందించిన టర్కీ టవల్స్‌ను గంటా చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఎమ్మెల్యే కాసేపు ముచ్చటించారు. వసతి గృహంలో అన్ని సదుపాయాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, జెడ్సీ అయ్యప్పనాయుడు, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.రాజారవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

14న దమ్మ దీక్ష మహోత్సవం

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: చిట్టివలస సంతపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో బౌద్ధ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బౌద్ధుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి, మాలమహానాడు వ్యవస్థాపక కార్యదర్శి గోపాలరావు మాట్లాడుతూ నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 14న జరిగే స్వచ్ఛంద బౌద్ధ దమ్మ దీక్ష స్వీకరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సొసైటీలోని ఇతర ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, గాదం మహేష్, డి.రవికుమార్, బి.కల్యాణ్‌రావు, గౌతంబాబు, తీన్‌మూర్తి, శ్రీనివాస్, కిరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గోపాలరావు, తదితరులు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ అయినటువంటి విశాఖపట్నం జిల్లా, గ్రేటర్ విశాఖపట్నం నగర పాలక సంస్థ, మధురవాడ గ్రామం, రేవళ్లపాలెం, డోర్ నెం. 7-109 కాపురస్థులు నాగోతి నాగరాజు గారి కుమారుడు నాగోతి అప్పలరాజు గారు ఇచ్చిన భోగట్టా మేరకు ఈ బహిరంగ ప్రకటన జారీచేయడం జరిగినది.

ఈ దిగువ పేర్కొన్నటువంటి షెడ్యూల్ ఆస్తిని నా క్లయింటు కాకినాడ జిల్లా, ఏలేశ్వరం మండలం, ఏలేశ్వరం గ్రామం, డోర్ నెం. 16-207రు కాపురస్థులు వెలగల వెంకట కృష్ణారెడ్డి గారి భార్య శ్రీమతి వెలగల లక్ష్మి తులసి, వయస్సు 45 సం॥లు దగ్గర నుండి క్రయం పొందుటకు వారితో ఒడంబడిక చేసుకొనియున్నారు.

ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిపై ఎవరికైనను ఎటువంటి ఆక్షేపణలుకానీ, క్లయిములుకానీ, క్రయపురోజీలు కాని, తనఖాలు కాని, కోర్టు వ్యాజ్యం ఏమైననూ యున్నయెడల నా క్లయింటుకు కానీ లేదా నాకుకానీ ఈ బహిరంగ ప్రకటన ప్రచురించిన 15 దినములలో తగుపత్రములతో వారియొక్క ఆక్షేపణలు లిఖిత పూర్వకంగా తెలియపరచవలెను. లేనిపక్షమునా నా క్లయింట్ ఈ దిగువ పేర్కొన్నటువంటి షెడ్యూల్ ఆస్తిని క్రయము పొంది యుండుదురు. తదనంతరం ఎటువంటి ఆక్షేపణలు నా క్లయింటును బంధింపజాలవు.

షెడ్యూలు ఆస్తి: విశాఖపట్నం జిల్లా, మధురవాడ గ్రామము టీచర్స్ లేఅవుట్ ప్లాట్ 350 Sq. Yds స్థలం ప్లైన్ ఏరియా బౌండరీవాల్‌తో ఉన్న ప్లాట్ నెంబర్ 172కు **హద్దులు: తూర్పు:** 60 అడుగుల రోడ్డు, **ఉత్తరం:** 30 అడుగుల రోడ్డు, **దక్షిణం:** ప్లాట్ నెంబర్ 173, **పడమర:** ప్లాట్ నెంబర్ 180.

POLINAIDU VUDAMALA, Advocate
Flat No. 5RA, Block-V, JK Modern Homes Apartment, Anthony Nagar, Nowroji Road, Visakhapatnam -530002. **Cell: 9966631486**

(c) eenadu

విశాఖ తూర్పు

సిరుల స్వామికి వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాద్రినాథుడికి ఆదివారం స్వర్ణ పుష్పార్చన కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని దేవేరుల సమేతంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆసీనులను చేశారు. బంగారు సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం నిత్య కల్యాణోత్సవం కమనీయంగా జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తలంబ్రాలు, శేషవస్త్రాలు అందజేశారు.

హరేరామ.. హరేకృష్ణ

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిరం(సాగర్‌నగర్)లో హరేరామ.. హరేకృష్ణ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి విగ్రహాలను పుష్పాలతో ఆకర్షణీయంగా అలంకరించి భజనలు నిర్వహించి, గీతాలాపనలు చేశారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్, మాతాజీనితాయి సేవిని పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769
మద్దిలపాలెం: 9912120229

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి సంతపాలెంలోని వీధి కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నీరు నిలిచిపోతుంది. దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాము. – గోపి, సంతపాలెం
✓: సంబంధిత సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాము. – అబ్దుల్ మీరా, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ?: విశాలాక్షి నగర్ బీచ్‌రోడ్డులోని జీవీఎంసీ పార్కులో సాయంత్రం పూట మందుబాబులు బహిరంగంగా మద్యం తాగుతున్నారు. – నూకరత్నం, జోడుగుళ్లపాలెం, ✓: సిబ్బందిని పంపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. – మల్లేశ్వరరావు, సీఐ

సుందర్‌నగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : ?: పదో వార్డు సుందర్‌నగర్, వివేకానందనగర్‌లో రెండు రోజుల నుంచి కుళాయిలు ద్వారా నీరు రావడం లేదు. – వినాయకరావు, సుందర్‌నగర్. ✓: పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. – వార్డు నీటి సరఫరా అధికారి.

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 22వ వార్డు మంగాపురంకాలనీ ప్రాంతంలో రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయాయి. తీవ్ర దుర్వాసన వస్తోంది. – ఈశ్వరరావు, ✓: తక్షణమే సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. – శ్రీనివాస్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 15వ వార్డు పాతవెంకోజీపాలెంలో యూజీడీ లీకులు అధికంగా ఉన్నాయి. మురుగు రహదారిపై ప్రవహిస్తోంది. – చంద్రశేఖర్, ✓: మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేస్తాం. – రహీం, యూజీడీ ఏఈ

స్పందనకు వందనం

ఎం.ఎం.టి.సి.కాలనీ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 15వ వార్డు ఎం.ఎం.టి.సి.కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ ప్రాంతాల్లోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిశోర్ స్పందించారు. సిబ్బందితో వ్యర్థాలు తీయించి పరిసరాలను శుభ్రం చేయించారు.

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే : పదో వార్డు ఇందిరానగర్ రామాలయం వీధిలో దీపాలు వెలగడం లేదన్న సమస్యపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు ఏఈ రాజేష్ స్పందించారు. తమ సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

టీఐసీ పాయింటు(ఆరిలోవ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్, రాజీవ్‌నగర్‌లోని వీధి కాలువల్లో వ్యర్థాలు నిండిపోయి, మురుగు నిలిచిపోతుందని 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ బంగార్రాజు స్పందించారు. సిబ్బందితో శుభ్రత పనులు చేయించారు.

కొనసాగుతున్న ప్రవచన యజ్ఞం

ఎంవీపీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: పరమాత్ముని కోసం చెప్పేది ఉపనిషత్తు అని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. విశాఖ రుషిపీఠం, సత్సంగం ఆధ్వర్యంలో ఎంవీపీకాలనీ సెక్టార్-6లో ఉన్న వీఎంఆర్‌డీఏ పార్కులో భాగవత ప్రవచన యజ్ఞం 11వ రోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. కృష్ణుడు ఆత్మస్వరూపుడన్నారు. సామాన్యులు దేహాన్ని చూస్తే పరమాత్ముడు జీవుణ్ని చూస్తాడన్నారు.

ప్రసంగిస్తున్న షణ్ముఖశర్మ

5 వరకు కల్యాణ ఉత్సవాలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: పాతనగరం శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నగరేశ్వరస్వామి, జనార్దనస్వామి, దేవేరుల కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం హోమం నిర్వహించారు. ఆలయ సంఘం అధ్యక్షులు ఏ.దినకరన్ మాట్లాడుతూ... 5వ తేదీ వరకు నగరేశ్వరస్వామి- వింధ్యావాసిని, జనార్దన స్వామి- కోన కమలాదేవి కల్యాణ ఉత్సవాలు జరుగుతాయన్నారు. సంఘం సభ్యులు పి.కామరాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

'కుట్టు మిషన్లు'... ఇంకెన్నాళ్లకు..!

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి తప్పని నిరీక్షణ

ఆరిలోవ, న్యూస్‌టుడే

సంతపాలెంలో శిక్షణ పొందిన మహిళలు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేద మహిళలు, యువతులకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఉచితంగా కుట్టు పనిలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ వరకు పక్కాగా జరిగినా, ఆ తర్వాత ఉచితంగా కుట్టుమిషన్లు, ధ్రువపత్రాలు ఇవ్వాల్సి ఉన్నా... ఇప్పటివరకు అందించలేదు. దీంతో స్వయం ఉపాధిలో రాణించాలన్న వారి ఆశ నెరవేరడం లేదు.

ఆరు నెలలు పూర్తయినా..: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ(బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్) ద్వారా ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గత ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తయ్యి ఆరు నెలలు గడుస్తున్నా... ఇప్పటికీ కుట్టుమిషన్లు ఇవ్వకపోవడంతో విమర్శలు వస్తున్నాయి.

తూర్పు నియోజకవర్గంలో..: శిక్షణ నేపథ్యంలో విశాఖ తూర్పు నియోజకవర్గంలో అయిదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పెదగదిలి, సంతపాలెం, వివేకానందకాలనీ, ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ దగ్గర, చేపలుప్పాడ కేంద్రాల ద్వారా సుమారు 500 మందికి 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. రోజూ మూడు గంటల పాటు శిక్షకుల పర్యవేక్షణలో మెలకువలు నేర్పించారు.

రోజువారీ పనులకు..: శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలు మరిచిపోతున్నామని పలువురు ఆందోళన చెందుతున్నారు. స్వయం ఉపాధిలో రాణించే వీల్లేక చాలామంది రోజువారీ పనులకు వెళ్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. మిషన్లు అందించాలని వారు కోరుతున్నారు.

అందరికీ అందిస్తాం..: బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు కొనుగోలు చేస్తాం. కొన్ని సాంకేతిక కారణాలతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆయా సమస్యల్ని అధిగమించి, శిక్షణ పూర్తి చేసిన వారికి కుట్టుమిషన్లు ఉచితంగా అందిస్తాం. – శంకరరావు, ఈడీ, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్

తీగలు.. అస్తవ్యస్తం..!

చినగదిలి(ఆరిలోవ), న్యూస్‌టుడే

జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల సమీపంలోని విద్యుత్తు స్తంభంపై వివిధ ప్రైవేటు సంస్థలకు చెందిన తీగలు అడ్డదిడ్డంగా ఉన్నాయి. తరచూ ఆయా తీగలు కలిసిపోవడంతో కొన్ని గృహాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతోంది. ఈ సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేస్తున్నా... ఎవరూ పట్టించుకోవడం లేదని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. తీగలు అడ్డంగా ఉండడంతో.. స్తంభంపై ఉన్న దీపం కాంతి కిందకు ప్రసరించడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఆయా సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

గాంధీనగర్ వీధిలో..

తాగునీరు.. నేలపాలు..!

టీఐసీపాయింట్(ఆరిలోవ), న్యూస్‌టుడే

జీవీఎంసీ 11వ వార్డు ముస్తఫాకాలనీలో వీధి కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నిత్యం విలువైన తాగునీరు నేలపాలవుతోంది. దీంతో పరిసరాలన్నీ అధ్వానంగా మారి, దోమల బెడద ఎక్కువైందని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై ఫిర్యాదు చేస్తున్నా.. సిబ్బంది పట్టించుకోవడం లేదని వారు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చురుగ్గా సభ్యత్వ నమోదు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం పదో వార్డు పరిధి పాతడెయిరీఫారం ప్రాంతంలో చురుగ్గా సాగింది. పార్టీ సభ్యత్వంతో కలిగే ప్రయోజనాలపై కార్యకర్తలు వివరించి, పలువురి వివరాలు నమోదు చేశారు. జనసేనలో కష్టపడి పని చేస్తే, పదవులు దక్కుతాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.రాజారమేష్, పి.సునీల్‌నాయుడు, ఏ.తిరుపతిరావు, కె.సంతోష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు నమోదు చేస్తున్న కార్యకర్తలు

అన్నదానం చేస్తున్న ప్రతాపరుద్ర, తదితరులు

వినాయక ఆలయ వార్షికోత్సవం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : జీవీఎంసీ తొమ్మిదో వార్డు హనుమంతువాక రామాలయం వీధిలోని వినాయక ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు, సహస్ర ఘటాభిషేకం, గరికి అర్చన నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాపరుద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వి.సుబ్బరాజు, శ్రీనివాసరెడ్డి, ఏ.రాంబాబు, శివకేశవ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు హోలీ సందడి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు టి.యు-142 సమీపంలో ఆదివారం ఉదయం ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. 'వాసవీ క్లబ్ వాల్తేర్ కపుల్స్' సభ్యులు పరస్పరం రంగులు పూసుకొని ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు.

విద్యార్థుల ఫ్లాష్‌మాబ్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు వై.ఎం.సి.ఎ. ఆవరణలో ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. మార్చి నెలలో నిర్వహించనున్న సైన్స్‌క్స్-26 సాంకేతిక మేధోత్సవాన్ని పురస్కరించుకొని బీచ్‌రోడ్డులో ఆదివారం సాయంత్రం ఫ్లాష్‌మాబ్‌తో అదరగొట్టారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

అనంత పద్మనాభుడికి పూజలు

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం క్షేత్రంలో కొలువైన శ్రీఅనంత పద్మనాభ స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి అనంతుని తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. స్వామివారి తెప్పోత్సవానికి తెప్పను దానం చేసిన దాతలు దివంగత లింగుబోతు సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను రవితేజ చేతులమీదుగా సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని కానుకగా అందజేశారు.

అరటి దవ్వ ఉత్పత్తులపై ఉచిత శిక్షణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అరటి దవ్వతో వివిధ రకాల ఉత్పత్తుల తయారీపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు స్టూడియో ఆర్ట్ హౌస్ ప్రోగ్రాం డైరెక్టర్ పెద్దింటి శ్రీకావ్య తెలిపారు. ఈనెల 5 నుంచి 7 తేదీ వరకు మూడు రోజుల పాటు ఇది జరుగుతుందన్నారు. అరటి దవ్వ నుంచి నార తీసి ఆర బెట్టి, పేపర్ తయారీ విధానంపై మెలకువలు నేర్పిస్తామన్నారు. తయారు చేసిన పేపర్‌పై ఆర్ట్ వేసి వాటిని వివిధ రకాలుగా ఉపయోగించుకోవచ్చునని అన్నారు. మహిళలు ఈ శిక్షణతో ఇంటి నుంచే స్వయం ఉపాధి పొందవచ్చునన్నారు. ఆసక్తి గలవారు పీఎంపాలెం క్రికెట్ స్టేడియం సమీప స్టూడియో ఆర్ట్ హౌస్‌కు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 85559 19188 నంబరుకు ఫోనులో సంప్రదించవచ్చునన్నారు.

కల్యాణం.. కమనీయం..!

చినగదిలి(ఆరిలోవ), న్యూస్‌టుడే: రుషిపీఠం సత్సంగ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం వేణుగోపాలస్వామి, రుక్మిణీదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంవీపీకాలనీలోని ఎంవీ.భద్రం సామాజిక భవనం ప్రాంగణంలో నిర్మించిన వేదికపై ఉదయం స్వామి, అమ్మవార్లను అలంకరించి అధిష్ఠింపజేశారు. భాస్కరశర్మ ఆధ్వర్యంలో కల్యాణ క్రతువు జరిపించారు. భక్తులు పాల్గొని దర్శించుకున్నారు. నిర్వాహకులు కె.అరుణ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అలంకరణలో స్వామి, అమ్మవార్లు

తవ్వేసి.. ఇలా వదిలేశారు..!

ఎఫ్‌ఎంకాలనీ (విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీ సెక్టార్-6 భూగర్భ విద్యుత్తు లైన్ల ఏర్పాటు కోసం 15 రోజుల కిందట అంతర్గత రహదారులను తవ్వారు. అప్పటి నుంచి పనులు పూర్తి చేయకుండా, గోతుల్ని పూడ్చకుండా వదిలేశారు. దీంతో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో పలువురు ద్విచక్ర వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమాజంలో స్త్రీ పురుషులు సమానమే

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న న్యాయమూర్తి మంగకుమారి, ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: సమాజంలో స్త్రీ పురుషులు సమానమేనని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి పైడి మంగకుమారి పేర్కొన్నారు. డైమండ్ పార్కు సమీపంలోని ఓ హోటల్‌లో ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(అప్సా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలను ఆదివారం నిర్వహించారు. న్యాయమూర్తి మంగకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్యం నుంచే లింగ వివక్ష లేకుండా పిల్లలను పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్‌జేడీ) విజయకుమార్ మాట్లాడుతూ మహిళలు స్వయం ప్రతిపత్తి దిశగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎక్స్‌లెన్స్ పురస్కారాలకు ఎంపికైన పలువురు మహిళా ఉపాధ్యాయులను న్యాయమూర్తి, ఆర్‌జేడీ కలిసి సత్కరించారు. కార్యక్రమంలో అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు, ఛైర్మన్ సుందరరామయ్య, గౌరవ అధ్యక్షుడు జనార్దనరావు రాష్ట్ర మహిళా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నవ్వులు పంచిన పేరడీ అవధానం

పేరడీ అవధానం చెబుతున్న జె.ఎల్.నరసింహారావు

సీతంపేట, న్యూస్‌టుడే: ఫ్రెండ్స్ కామిడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విశాఖ పౌర గ్రంథాలయంలో 'నవ్వుకుందాం రండి' పేరుతో పేరడీ అవధాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. హెల్మెట్ పెట్టుకుంటే లాభాలు, తెలుగు ప్రస్తుత పరిస్థితి, భగవంతుడి లీలలు, వారఫలాలు, కవితలు, అంత్యప్రాసలు, తాగడం వల్ల నష్టాలు, వాస్తు పిచ్చి, చమత్కారం మాట్లాడే ఆడవారి అంశాలపై అవధానం చేస్తూ నవ్వులు పూయించారు. అవధానిగా జె.ఎల్.నరసింహారావు, సభ్యులు కె.ఎల్.కామేశ్వరరావు, ఎం.వి.సుబ్రహ్మణ్యం, నందూరి రామకృష్ణ, రామానుజం, శ్రీధర్, రజని, జేపీ శర్మ, నాయుడు, బోను నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిని కడసారి చూడలేక తల్లడిల్లిన కొడుకు

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: మృతిచెందిన తల్లిని ఆఖరిచూపు చూడలేక ఓ కొడుకు తల్లడిల్లిన ఘటన భీమిలి మండలం మంగమారిపేట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మేరుగు రాములమ్మ (87) అనారోగ్యంతో కొద్దికాలంగా మంచం పట్టి ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఏకైక కుమారుడైన ఏపీటీడీసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మేరుగు అప్పన్న (53) నాలుగు రోజుల కిందట సీతమ్మధార వద్ద తన కుమారునితో బైక్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కాలు విరిగిపోవడంతో శుక్రవారం శస్త్రచికిత్స జరిగింది. తల్లి మృతి చెందిన వార్త తెలిసిన తర్వాత వచ్చేందుకు ప్రయత్నించినా వైద్యులు వారించారు. వాట్సప్ కాల్‌లో మృతదేహాన్ని చూసి విలపించడం స్థానికంగా విషాదం నింపింది. రాములమ్మకు మనవడు డిగ్రీ పరీక్షలు రాసి వచ్చి అంతిమ సంస్కారాలు నిర్వహించాడు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

పత్రికను ఆవిష్కరిస్తున్న పూర్వ అధ్యక్షుడు రవీంద్ర, తదితరులు

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో ఆదివారం వనితా వాకర్స్ క్లబ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు ఎస్.పి.రవీంద్ర హాజరై జిల్లా 101 నెలవారీ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాలోని మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న వారికి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా 101 గవర్నర్ ఆర్.మహేష్, ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు ఎ.వి.పి.గుప్తా, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సుదిత, జి.శిరీషలత, భానుమతి, కె.వినీల, లక్ష్మీకుమారి, పూర్వ రీజనల్ కౌన్సిలర్ యు.శుభ తదితరులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలు అదరహో

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం కళావేదికపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మధురవాడకు చెందిన జోష్ డాన్స్ అకాడమీ చిన్నారులైన సుమదా, మోహన, ఆశ్రిత, జస్విత, లలిత, లక్ష్మి, త్రివేణి, సౌమ్య తదితరులంతా వారి హావభావాలతో నర్తించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ నృత్యాలకు కె.మురళీగోవింద్ దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలనాధికారి రమేష్‌రెడ్డి చిన్నారులకు ధ్రువపత్రాలు అందించి అభినందించారు.

నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు

కొమ్మాది, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. పరదేశిపాలెంలో ఉన్న ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో 212 మంది విద్యార్థినులకు ఆదివారం ప్రభుత్వం అందించిన టర్కీ టవల్స్‌ను గంటా చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఎమ్మెల్యే కాసేపు ముచ్చటించారు. వసతి గృహంలో అన్ని సదుపాయాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రామారావు, జెడ్పీ అయ్యప్పనాయుడు, ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.రాజారవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టవల్స్ అందజేసిన ఎమ్మెల్యే గంటా

అంగన్‌వాడీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఎంవీపీకాలనీ (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు. ఎంవీపీకాలనీలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తక్కువ కాలంలోనే రెండు సార్లు అంగన్‌వాడీల వేతనాలను పెంచిన ఘనత తెదేపాకే దక్కిందన్నారు. ఎన్నికల్లో అంగన్‌వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

ఏయూ పురుషుల బెస్ట్ ఫిజిక్ జట్టు ఎంపిక

ఆచార్య ఎన్.విజయమోహన్‌తో ఎంపికైన జట్టు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం పురుషుల బెస్ట్ ఫిజిక్ జట్టు ఎంపిక ఆదివారం ఏయూ జిమ్నాజియం మైదానంలో జరిగింది. ఈనెల 2 నుంచి 4 వరకు ఆల్ ఇండియా యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ పోటీలు ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరుగుతాయని ఏయూ వ్యాయామ విద్యా సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి తదితరులు అభినందించారు. కార్యక్రమంలో వై.శ్రీనివాసరావు, కోచ్ ఈవీవీఎస్ శివకుమార్, టి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు ఉచిత విద్య

బాలలతో కలిసి ప్రచారపత్రాలు ప్రదర్శిస్తున్న ప్రకాశరావు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు 25 శాతం సీట్లు ఉచితంగా ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు కోరారు. ఆదివారం వైజాగ్ చేపలరేవు సమీప బాలవికాస్ ఫౌండేషన్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హులైన వారికి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచితంగా విద్య అందుతుందన్నారు. అనంతరం ప్రచారపత్రాలు అందించారు. కార్యక్రమంలో స్థానిక చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలతో సమాజాభివృద్ధి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : సమాజ అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సీపీ శంఖబ్రతబాగ్చీ సూచించారు. వృత్తి బాధ్యతతో పాటు, సామాజిక బాధ్యతగా సేవలు అందిస్తున్న సీపీని ఆదివారం నగరానికి చెందిన ఇండియన్ ఉమెన్ ఫౌండేషన్ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జీవీఎల్.పద్మ మాట్లాడుతూ... 'సర్వేజనా సుఖినోభవంతు' అనే నినాదంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రుల ఆస్తులకు వారసులుగా ఉండే పిల్లలంతా, ఆ తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు తోడుగా ఉండే బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఇదే అంశంపై ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామని ఆమె తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు పద్మ, రాధ, రమణి, అపరంజిత, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీపీ శంఖబ్రతబాగ్చీని సత్కరిస్తున్న మహిళా ప్రతినిధులు

హోమియోతో మధుమేహం నియంత్రణ సాధ్యం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: మధుమేహం నియంత్రణ హోమియోతో సాధ్యమని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ జాతీయ సభ్యులు డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్.భవనంలో ఆదివారం విశాఖ జిల్లా శాఖ హోమియో వైద్యుల సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రాఘవేంద్రరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ హోమియో వైద్యంలో వివిధ వ్యాధుల నివారణకు మందులున్నాయన్నారు. హోమియో వైద్యశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రాధ తన రోగి అరచేతికి సోకిన సొరియాసిస్ అనే చర్మవ్యాధిని పూర్తిగా నయం చేసిన విధానాన్ని చిత్రాల రూపంలో వివరించారు. కార్యక్రమంలో పలువురు హోమియో వైద్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

ఉత్సాహంగా నడక పోటీలు

పోటీల్లో పాల్గొన్న మహిళలు

మురళీనగర్, న్యూస్‌టుడే: మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఈస్ట్ పార్కులో నడక పోటీలు నిర్వహించారు. 40 నుంచి 70 ఏళ్ల విభాగాల్లో పలువురు మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. 9 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. త్వరలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ పోటీలు జరిపినట్లు క్లబ్ అధ్యక్షురాలు డి.శిరీష తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796
విశాఖ దక్షిణం: 8008574977

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ?: జీవీఎంసీ 31వ వార్డు సరస్వతి పార్కు సమీప గెడ్డలో వ్యర్థాలు నిండిపోయి మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. –రమేష్, స్థానికుడు ✓: పరిశీలించి, గెడ్డలో పూడికలు తొలగిస్తాం. –కామేశ్వరరావు, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : ?: జీవీఎంసీ 41వ వార్డు జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పలుచోట్ల విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. –అప్పాలరాజు, 41వ వార్డు ✓: సిబ్బందితో పరిశీలన చేసి, దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. –సంతోష్, విద్యుత్తు అధికారి

గురుద్వారా, న్యూస్‌టుడే:?: సీతమ్మధార ఆర్ అండ్‌బీ పార్కులో మందుబాబుల ఆగడాలు అధికమయ్యాయి.– రవీంద్ర ✓: గస్తీ ఏర్పాటు చేసి కట్టడి చేస్తాం. – రమణ, ద్వారకా సీఐ

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్ సెక్టార్-11లో కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వస్తోంది. – పి.లక్ష్మి ✓:తక్షణమే సిబ్బందిని పంపించి పూడికలను తొలగిస్తాం. – బి.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందన

ఎట్టకేలకు శుభ్రత పనులు

పనులు చేస్తున్న సిబ్బంది

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 37వ వార్డు జాలారిపేటలో భూగర్భడ్రైనేజీ నిండిపోయి, మురుగు నీరంతా రోడ్డుపైకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. తీవ్ర దుర్వాసనతో పాటు, పరిసరాలు అధ్వానంగా మారడంతో రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడేవారు. ఈ సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తమ సిబ్బందితో పూడికలు తీయించి, మురుగు ముందుకు ప్రవహించేలా చర్యలు చేపట్టారు.

ఎక్కడి నుంచో తెచ్చి.. ఇక్కడ వదిలేసి..

మాధవధార, న్యూస్‌టుడే: నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి వాహనాలను తెచ్చి జీవీఎంసీ 50, 51, 53 వార్డులైన మాధవధార, మురళీనగర్, మర్రిపాలెం సేవా రహదారిలో పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. ఇవి ఎవరివో స్థానికులకు తెలియని పరిస్థితి. గత కొన్ని నెలల నుంచి పలు కాలనీల ప్రధాన రోడ్ల పక్కన, సేవా రహదారిలో గుర్తు తెలియని వ్యక్తులు వాహనాలు తెచ్చి పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. ఈ వాహనాలకు సంబంధించి పోలీసులకు కూడా సమాచారం తెలియకపోవడంతో నెలలు తరబడి అక్కడే ఉంటున్నాయి. కొన్ని వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేవు. మరికొన్ని వేరే రాష్ట్రం రిజిస్ట్రేషన్ నెంబర్ కలిగి ఉన్నాయి. ఈ వార్డుల్లో గత కొన్ని రోజులుగా గుర్తు తెలియని వాహనాల సంఖ్య పెరిగిపోతోందని స్థానికులు చెబుతున్నారు.

తెన్నేటినగర్ - మురళీనగర్ వెళ్లే ప్రధాన రహదారిలో నెలల తరబడి ఉంచిన వాహనాలు

★ ఇతర ప్రాంతాల్లో వాహనాలను అపహరించి వాటిని ఇలా కొన్ని నెలలు పాటు ఇక్కడ వదిలేసి, ఎవరికీ అనుమానం రాకుండా తరువాత తీసుకెళ్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేరే చోట వాహనాలను దొంగిలించి వాటిని ఇక్కడున్న నిర్మానుష్య ప్రాంతాల్లోకి తీసుకొచ్చి ముఖ్యమైన భాగాలను తొలగించి అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారని మరికొందరు ఆరోపిస్తున్నారు. రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి నిరుపయోగంగా ఉన్న వాహనాల్లో కొందరూ ఆకతాయిలు మద్యం, గంజాయి తాగుతున్నారని, వీరి వల్ల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయా కాలనీవాసులు చెబుతున్నారు.

★ ఈ తరహా వాహనాలపై పోలీసులు గస్తీ కానరావడం లేదని, పలుమార్లు ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ వారొచ్చి చూసి వెళ్లిపోవడం తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని చుట్టుపక్కల నివాసితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి గుర్తు తెలియని వాహనాలను తరలించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమాజంలో స్త్రీ పురుషులు సమానమే

ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న న్యాయమూర్తి పైడి మంగకుమారి, అప్సా సభ్యులు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: సమాజంలో స్త్రీ పురుషులు సమానమేనని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి పైడి మంగకుమారి పేర్కొన్నారు. డైమండ్ పార్కు సమీపంలోని ఓ హోటల్‌లో ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(అప్సా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలను ఆదివారం నిర్వహించారు. న్యాయమూర్తి మంగకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్యం నుంచే లింగ వివక్ష లేకుండా పిల్లలను పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్జేడీ) విజయకుమార్ మాట్లాడుతూ మహిళలు స్వయం ప్రతిపత్తి దిశగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎక్సలెన్స్ పురస్కారాలకు ఎంపికైన పలువురు మహిళా ఉపాధ్యాయులను న్యాయమూర్తి, ఆర్జేడీ కలిసి సత్కరించారు. కార్యక్రమంలో అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు, ఛైర్మన్ సుందరరామయ్య, గౌరవ అధ్యక్షుడు జనార్దనరావు రాష్ట్ర మహిళా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో పార్టీ బలోపేతం

సభ్యత్వం అందజేస్తున్న జనసేన నేతలు

మురళీనగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 49వ వార్డు బర్మాకాలనీలో ఆదివారం జనసేన ఉత్తర సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. పలువురు స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకున్నట్లు వార్డు జనసేన అధ్యక్షుడు బోడసింగి శ్రీధర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రమేష్, నవీన్, బాల, మహేష్, కోటి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తగాదాలకు పాల్పడితే కేసులు తప్పవు

గురుద్వారా, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు నేరాల జోలికి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని ద్వారకా సీఐ డి.వి.రమణ హెచ్చరించారు. స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం మత్తులో తగాదాలకు పాల్పడితే కేసులు తప్పవన్నారు. రౌడీషీటర్లపై నిత్యం నిఘా ఉంటుందని వారం వారం క్రమం తప్పకుండా స్టేషన్‌కు హాజరుకావాలన్నారు. ఎస్సై ఆసిరితాత పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికలు అందజేత

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 14వ వార్డు నరసింహనగర్ శివారు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో ఈనెల 5వ తేదీన నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యేలను నిర్వాహకులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు ఎం.ఎస్.ప్రకాశరావు, జి.కృష్ణ, రమణ ఆదివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును వారి నివాసాల్లో కలుసుకుని ఆహ్వాన పత్రికలు అందజేశారు.

రేపు వైభవుడి ఆలయం మూసివేత

మురళీనగర్, న్యూస్‌టుడే: ఎన్‌జీజీఓస్ కాలనీ కప్పరాడ వైభవ వేంకటేశ్వరుడి దివ్యక్షేత్రంలో ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం 6:30 గంటలకు విశేష పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారు. చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం 9:30కు ఆలయాన్ని మూసివేస్తారు. గురువారం ఉదయం సంప్రోక్షణ అనంతరం యథావిధిగా స్వామివారి దర్శనానికి అనుమతిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

స్వచ్ఛంద సంస్థలతో సమాజాభివృద్ధి

సీపీ శంఖబ్రతబాగ్చీని సత్కరిస్తున్న మహిళా ప్రతినిధులు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: సమాజ అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సీపీ శంఖబ్రతబాగ్చీ సూచించారు. వృత్తి బాధ్యతతో పాటు, సామాజిక బాధ్యతగా సేవలు అందిస్తున్న సీపీని ఆదివారం నగరానికి చెందిన ఇండియన్ ఉమెన్ ఫౌండేషన్ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జీవీఎల్. పద్మ మాట్లాడుతూ... 'సర్వేజనా సుఖినోభవంతు' అనే నినాదంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తల్లిదండ్రుల ఆస్తులకు వారసులుగా ఉండే పిల్లలంతా, ఆ తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు తోడుగా ఉండే బాధ్యతలు తీసుకోవాలన్నారు. ఇదే అంశంపై ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నామని ఆమె తెలిపారు. ఫౌండేషన్ ప్రతినిధులు పద్మ, రాధ, రమణి, అపరంజిత, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు ఉచిత విద్య

బాలలతో కలిసి ప్రచారపత్రాలు ప్రదర్శిస్తున్న ప్రకాశరావు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు 25 శాతం సీట్లు ఉచితంగా ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు కోరారు. ఆదివారం వైజాగ్ చేపలరేవు సమీప బాలవికాస్ ఫౌండేషన్ కార్యాలయంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. . అర్హులైన వారికి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచితంగా విద్య అందుతుందన్నారు. అనంతరం ప్రచారపత్రాలు అందించారు. కార్యక్రమంలో స్థానిక చిన్నారులు, వారి తల్లిదండ్రులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐలు అప్పలనాయుడు, మనోజ్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : సమాజంలో రౌడీషీటర్లంతా సత్ప్రవర్తనతో మెలగాలని మహారాణిపేట ఎస్‌ఐలు అప్పలనాయుడు, మనోజ్ సూచించారు. ఆదివారం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతీ రౌడీషీటర్ కదలికపై నిఘా ఉంటుందని, గొడవల్లో జోక్యం చేసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయంలో అన్నదానం

పూర్ణమార్కెట్(అల్లిపురం), న్యూస్‌టుడే : పూర్ణమార్కెట్ సమీప శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయం జాతర ముగింపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం అన్నదానం ఏర్పాటు చేశారు. దక్షిణం నియోజకవర్గం తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని.. అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తెదేపా నాయకులు విల్లూరి భాస్కరరావు, బొచ్చ రామిరెడ్డి, ఆలయ ఈఓ పైలా శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు భోజనం వడ్డిస్తున్న సీతంరాజు సుధాకర్

అరటి దవ్వ ఉత్పత్తులపై ఉచిత శిక్షణ

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: అరటి దవ్వతో వివిధ రకాల ఉత్పత్తుల తయారీపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు స్టూడియో ఆర్ట్ హౌస్ ప్రోగ్రాం డైరెక్టర్ పెద్దింటి శ్రీకావ్య తెలిపారు. ఈనెల 5 నుంచి 7 తేదీ వరకు మూడు రోజుల పాటు ఇది జరుగుతుందన్నారు.

CAUTION NOTICE

Our Client Sri Bandaru Satyanarayana Murthy, S/o Bandaru Jagannadha Rao, R/o D.No.43-9-162/2, Visakhapatnam instructed us that he is the eldest son of Late Sri Bandaru Jagannadha Rao, who was the absolute owner and possessor of the property vide document No.417/1969 and on 27-1-2026, our client was travelling from Simhachalam to Dondaparty by engaging an autorikshaw along with his carry bag, in which the original sale deed vide document No.417/1969, his cheque book, house keys and other some important papers were in the said carry bag, while getting down from the said autorikshaw at the Dondaparthy junction, he noticed that he lost the above said carry bag, in which containing the above said items including the original sale deed, thereby our client gave a report before the IV Town Police Station through mee-seva on 18-2-2026 vide it's Transaction ID:TAMLD012600635527 for enquiry and obtaining not traced out certificate to that effect. If anyone has traced out the said carry bag and the said original sale deed as stated above and to handover the same to the below mentioned counsel and if any one mis-used the said original sale deed, for his/her an unlawful gain purpose, our client will reserve his right to take necessary criminal and civil actions.

D.V.V.S.S HARSHA VARDHAN
R. LAHARI V.E.S.PRASAD
ADVOCATES
D.NO.38-40-78, MAIN ROAD
MARRIPALEM, VISAKHAPATNAM
MOB NO. 9985996813

గౌరీ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక

మురళీనగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 49వ వార్డు బర్మాక్యాంప్ అల్లూరి గౌరీ సేవాసంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాండ్రేగుల శివఅప్పారావు, కార్యదర్శిగా అడారి పాపారావు, కోశాధికారిగా పొలమరశెట్టి గోపి, సంయుక్త కార్యదర్శిగా ఆళ్ల హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా పి.గణేష్, ఎస్.వెంకట్రావు, ఎం.గణేష్, ఎస్.పైడిరాజు, పి.మోహన్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కె.ఎస్.అప్పారావు, ఎం.కుమార్, కె.సత్యనారాయణ, సలహాదారులుగా బి.నాగు, దాడి ఈశ్వరరావును ఎన్నుకున్నారు. ఎన్నికల సమన్వయకర్తలుగా కె.సత్యనారాయణ, పి.మోహన్ వ్యవహరించారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

మాసపత్రిక ఆవిష్కరిస్తున్న అతిథి రవీంద్ర, క్లబ్ ప్రతినిధులు, సభ్యులు

ఉచిత వైద్య సేవలందించడం అభినందనీయం

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో ఆదివారం వనితా వాకర్స్ క్లబ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు ఎస్.పి.రవీంద్ర హాజరై జిల్లా 101 నెలవారీ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాలోని మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న వారికి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా 101 గవర్నర్ ఆర్.మహేష్, ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు ఎ.వి.పి.గుప్తా, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.సుదిత, జి.శిరీషలత, భానుమతి, కె.వినీల, లక్ష్మీకుమారి, పూర్వ రీజనల్ కౌన్సిలర్ యు.శుభ తదితరులు పాల్గొన్నారు.

నవ్వులు పంచిన పేరడీ అవధానం

సీతంపేట, న్యూస్‌టుడే: ఫ్రెండ్స్ కామిడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విశాఖ పౌర గ్రంథాలయంలో 'నవ్వుకుందాం రండి' పేరుతో పేరడీ అవధాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. హెల్మెట్ పెట్టుకుంటే లాభాలు, తెలుగు ప్రస్తుత పరిస్థితి, భగవంతుడి లీలలు, వారఫలాలు, కవితలు, అంత్యప్రాసలు, తాగడం వల్ల నష్టాలు, వాస్తు పిచ్చి, చమత్కారం మాట్లాడే ఆడవారి అంశాలపై అవధానం చేస్తూ నవ్వులు పూయించారు. అవధానిగా జె.ఎల్.నరసింహారావు, సభ్యులు కె.ఎల్.కామేశ్వరరావు, ఎం.వి.సుబ్రహ్మణ్యం, నండూరి రామకృష్ణ, రామానుజం, శ్రీధర్, రజని, జేపీ శర్మ, నాయుడు, బోను నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. తిలక్ పట్నాయక్, సినీ నటులు భద్రం, శివకుమార్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పేరడీ అవధానం చెబుతున్న జె.ఎల్.నరసింహారావు

ఘనంగా త్రిమూర్తి శివ జయంతి ఉత్సవాలు

కార్యక్రమంలో పాల్గొన్న బ్రహ్మకుమారీలు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: బాపూజీనగర్‌లోని సేవా కేంద్రంలో ఆదివారం ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో 90వ త్రిమూర్తి శివ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ శాఖ నిర్వాహకురాలు రాజయోగిని బి.కె.శశికళ మాట్లాడుతూ శివ పరమాత్మ ఉపదేశించిన రాజయోగ విద్య ద్వారా వ్యక్తిగత జీవితంలో శాంతి, ఆనందం, సమతుల్యత కలుగుతాయని తెలిపారు. సభ్యులందరూ శివ పరమాత్ముని జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.కె.లీలాకుమారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నిర్యాణం

జననం: 30-11-1942
మరణం: 01-03-2026

కీ॥శే॥ పయిల సత్యనారాయణ గారు
Retd. GM - ABG Shipyard, Surat
మాజీ అధ్యక్షులు, వెలమ సంక్షేమ సంఘం, సెంట్రల్ ఆర్గనైజేషన్, విశాఖపట్నం

మా తండ్రిగారు శ్రీ పయిల సత్యనారాయణ గారు
తేది. 01-03-2026 ఆదివారం స్వర్గస్తులైనారని తెలియజేయుటకు
చింతిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు, కుమార్తె మరియు కుటుంబ సభ్యులు

అంతిమయాత్ర: తేది. 02-03-2026 సోమవారం ఉదయం 10 గం॥లకు
మా స్వగృహము నుండి బయలుదేరి కె.ఆర్.ఎం. కాలనీ, సి.ఎం.ఆర్.
స్మశానవాటిక నందు అంత్యక్రియలు జరుపబడును.

నూకాంబిక సేవా సంఘం ఎన్నిక

సీఐ రవికుమార్‌తో నూతన కార్యవర్గ సభ్యులు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: బాపూజీనగర్ దుర్గా నూకాంబిక సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముక్కా గోవింద్, కార్యదర్శిగా కోట గౌరీ శంకర్, గౌరవ అధ్యక్షులుగా మైలపల్లి రామకృష్ణ, కంటిపాము గురూజీ, కోశాధికారిగా ముక్కా పరమేశ్వర రెడ్డి, యూత్ ప్రెసిడెంట్‌గా ఇల్లా వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు ఉంటుందని దుర్గా నూకాంబిక సేవా సంఘం తెలిపింది. కంచరపాలెం సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు.

5 వరకు కల్యాణ ఉత్సవాలు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : పాతనగరం శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నగరేశ్వరస్వామి, జనార్దనస్వామి, దేవేరుల కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆదివారం హోమం నిర్వహించారు. ఆలయ సంఘం అధ్యక్షులు ఏ.దినకరన్ మాట్లాడుతూ... 5వ తేదీ వరకు నగరేశ్వరస్వామి- వింధ్యావాసిని, జనార్దనస్వామి- కోన కమలాదేవి కల్యాణ ఉత్సవాలు జరుగుతాయన్నారు. సంఘం సభ్యులు పి.కామరాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

గాజువాక
•గాజువాక •విశాఖ పశ్చిమం

సోలార్ ఉపయోగాలపై అవగాహన

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: ఆటోనగర్ దరి తోకాడలో ఆదివారం ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుపై అవగాహన సదస్సు జరిగింది. విద్యుత్తు అధికారులు, తోకాడ గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో సదస్సు నిర్వహించారు. ఆటోనగర్ ఏడీఈ పార్థసారథి, ఏఈ జ్యోతి సోలార్ రూఫ్ టాప్ ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు శంకర్‌నాయుడు, అన్నపూర్ణ, మురళీమోహన్, గోపి, స్థానికులు పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న విద్యుత్తు అధికారులు, తోకాడ గ్రామ ప్రతినిధులు

డిమాండ్ల పరిష్కారానికి కృషి : పల్లా

గాజువాక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గాజువాక పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల డిమాండ్ల పరిష్కారానికి తామంతా కట్టుబడి ఉన్నామన్నారు. సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే:

?: ఏడుమెట్లమర్రిపాలెం దారిలో కొత్తగా స్తంభాలను మార్చారు. వీటికి లైట్లు వేయకుండా గాలికి వదిలేశారు. –దేవుడు, ఏడుమెట్లమర్రిపాలెం. ✓: సిబ్బందిని పంపి పరిశీలిస్తాం. –శివ, వీధి దీపాల నిర్వాహకుడు ?: పెదగంట్యాడ ఉక్కు నిర్వాసితకాలనీల్లో చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు ఖాళీ చేయించాలి. –పెంటయ్య. ✓: సిబ్బందితో ప్రత్యేక శుభ్రత చర్యలు చేపట్టాం. –కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 92వ వార్డు రజకవీధి, శ్రీనుబాబునగర్, బాపూజీనగర్‌లో విద్యుత్తుదీపాలు వెలగడం లేదు.–వినీత్, రజకవీధి. ✓: ప్రాంతాన్ని పరిశీలించి మరమ్మతులు చేపడతాం. –గోవిందరావు, విద్యుత్తు దీపాల నిర్వాహకులు ?: జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌లో పైపులైను గోతులకు మరమ్మతులు చేపట్టాలి. – శంకర్, ఇందిరానగర్. ✓: రోడ్డు మరమ్మతులు చేపడతాం. –ఎస్.వెంకటలక్ష్మి, పనుల విభాగం డీఈ

కాలువల శుభ్రత.. స్పందనకు వందనం

కణితిరోడ్డు (గాజువాక), న్యూస్‌టుడే: 'ఈనాడు'లో కాలువల అపరిశుభ్రతపై వచ్చిన వార్తలకు సంబంధిత అధికారులు స్పందించారు. అదనపు పారిశుద్ధ్య సిబ్బందితో కణితిరోడ్డు, షీలానగర్‌లో అధ్వానంగా ఉన్న చెత్తను తీసి మురుగుపారేలా చేశారు.

పారిశుద్ధ్యంలో 'పాస్' అవుతామా?
అడుగడుగునా సవాళ్లే..

సిబ్బందికి సూచనలిస్తున్న జోనల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఈనెల 15 నుంచి స్వచ్ఛ సర్వేక్షన్ బృందం విశాఖ నగరానికి వస్తుందని సమాచారం అందింది. ఈ బృందం కొన్నాళ్లుగా తమ మొదటి సర్వేను గాజువాక నుంచే ప్రారంభిస్తోంది. ఈసారి కూడా అదే జరుగుతుందని అధికారులకు సమాచారం అందింది. అయితే ఆ బృంద పరిశీలనలో మార్కులు పడేలా గాజువాకలో పరిస్థితులు ఉన్నాయా? అంటే ప్రస్తుతం లేవనే చెప్పాలి. ఎందుకంటే పలు సవాళ్లు ఉన్నాయి. వాటిని అధిగమించాలి. ఆ సవాళ్లు ఏమిటో తెలుసుకుందాం..

ఇలా ఉంటే ఎలా..? : పరిశుభ్రత, ప్రజారోగ్యం లక్ష్యంగా గాజువాక జోన్‌లో ఏర్పాటు చేసిన సులభ్ కాంప్లెక్సుల నిర్వహణ చూసేవారులేక పలుచోట్ల దిష్టిబొమ్మలుగా మిగిలాయి.

★ రహదారుల్లో బహిరంగ మల, మూత్ర విసర్జనకు చెక్ పెట్టడానికి స్వచ్ఛభారత్ స్ఫూర్తితో గాజువాక జోన్‌లో 2015లో 52 చోట్ల ప్రజా మరుగుదొడ్ల(సులభ్ కాంప్లెక్సుల)ను అందుబాటులోకి తెచ్చారు. వీటి నిర్వహణను తొలుత ప్రైవేటు ఏజెన్సీలకు ఇచ్చినా తర్వాత వాళ్లు వదిలేయడంతో ఇప్పుడు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలకు అప్పగించారు. ఇది వారికి భారం అవుతోంది.

★ గాజువాకలో పలుచోట్ల పచ్చదనంతో కళకళలాడాల్సిన గ్రీన్‌బెల్టు జాగాలు డెబ్రిస్, చెత్తతో నిండిపోయాయి. డివైడర్లు మొక్కల్లేక దిక్కులు చూస్తున్నాయి. పలుచోట్ల ఉద్యానవనాలు నిర్వహణలేక పశువులు, పందులు తిష్ఠ వేస్తున్నాయి. గాజువాకలో అనుబంధ రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, సీసీ డ్రైన్ల పరిస్థితి అధ్వానంగా ఉన్నాయి.

తగిన చర్యలు..: దీనిపై గాజువాక జోన్ ప్రజా ఆరోగ్య విభాగం సహాయ వైద్యారోగ్య విభాగం అధికారి **డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్‌**ను సంప్రదిస్తే.. స్వచ్ఛ సర్వేక్షన్‌ను దృష్టిలో పెట్టుకుని గాజువాకలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లను పునరుద్ధరిస్తున్నామన్నారు. వార్డులో డస్ట్‌బిన్ ఫ్రీ ప్రోగ్రాం కింద రోడ్లపై ఎవరూ చెత్త వేయకుండా చెత్త బిన్ ప్రదేశంలో ముగ్గులు వేసి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్నామన్నారు. త్వరలోనే స్వచ్ఛ సర్వేక్షన్ టీం వస్తున్నందున సిబ్బందిని అప్రమత్తం చేశామని, ముందస్తు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

బాపూజీకాలనీకి వెళ్లేదారిలో చెత్త, అక్కడే పందులు

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 63వ వార్డు చింతలోవలోని ఆదర్శరాయల్ విద్యాలయంలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక ఉత్సాహంగా జరిగింది. వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ దాసరి వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయురాలు నాగశ్రీ, కూటమి నాయకులు, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

మేలో గ్రామ దేవతల పండగ

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతంలో అత్యధిక కులాల సమూహ గ్రామంగా పేరొందిన మల్కాపురం గ్రామ దేవతల పండగను ఈ ఏడాది మేలో నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నామని సంఘ గౌరవాధ్యక్షులు బోగవల్లి నాగభూషణం అన్నారు. ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే వారం జరగనున్న మరో సమావేశంలో తేదీలు ఖరారు చేస్తామన్నారు. సమావేశంలో వివిధ కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: నడుపూరు గాంధీ పార్కు సెంటర్‌లో జనసేన 76వ వార్డు అధ్యక్షుడు ముమ్మన మురళీ ఆధ్వర్యంలో జనసేన ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆ పార్టీ గాజువాక ఇన్‌ఛార్జి కోన తాతారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

గోపాలపట్నం (ఆర్.ఆర్.వి.పురం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 91, 92వ వార్డులోని జనసేన పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురికి సభ్యత్వ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, మురళీ, కోటేశ్వరరావు, మోహన్, త్రినాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

2 టన్నుల కోళ్ల వ్యర్థాల తరలింపు

గాజువాక: గాజువాకలో జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో ఆదివారం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల సిబ్బంది చికెన్ దుకాణాలు, రెస్టారెంట్లలో తనిఖీలు చేపట్టారు. జోన్-6 ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ కోటేశ్వరరావుల పర్యవేక్షణలో వార్డుల వారీగా 139 చికెన్ దుకాణాల నుంచి సుమారు 2 టన్నుల మేర కోళ్ల వ్యర్థాలను వాహనాల్లో నగరంలోని కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలించారు.

12న శ్రీ మరిడిమాంబ జాతర

అగనంపూడి: అగనంపూడి పరిధి కొండయ్యవలస కాలనీవాసుల ఆరాధ్య దేవత శ్రీ మరిడిమాంబ అనుపు జాతర ఈనెల 12న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు బలిరెడ్డి శ్రీను ప్రకటించారు. భక్తులు పండగను జయప్రదం చేయాలని కోరారు. కాలనీ నాయకులు విందుల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం చేపట్టాలి

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 85వ వార్డు పరిధి అండమాన్ కొండయ్యవలస కాలనీలో శ్రీ బంగారమ్మ ఆలయ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు ఆదివారం నగరంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే తక్షణం ప్రహరీని పూర్తి చేయించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాలనీవాసులు పి.వసంతరావు, ఎం.రామకృష్ణ, గణేష్, కె.సుధాకర్, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

తిరుమలనగర్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కూర్మన్నపాలెం(తిరుమలనగర్), న్యూస్‌టుడే : జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నుకుంది. అధ్యక్షునిగా ఎం.పరమానందం, ఉపాధ్యక్షునిగా జి.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.విశ్వేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.వసంత రెడ్డి, కోశాధికారిగా పి.తిరుపతినాయుడు, సహాయ కోశాధికారిగా వి.విశ్వనాథం, కార్యనిర్వాహక అధ్యక్షునిగా ఎన్.అప్పలనాయుడు, కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శిగా ఎ.సన్యాసిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.పరమేశ్వరరావు, ఎన్.రాములను రెండేళ్లకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రిఫైనరీ కాంట్రాక్టర్ల సంఘం..

సింధియా (నెహ్రూనగర్), న్యూస్‌టుడే : హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్‌కు చెందిన విశాఖ్ రిఫైనరీ కాంట్రాక్టర్ల సంఘం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. ప్రస్తుత కార్యవర్గం తన రెండేళ్ల కాలం పూర్తయిన నేపథ్యంలో తిరిగి ఎన్నిక అనివార్యమైంది. అధ్యక్షులుగా మజ్జి సోమేష్, సెక్రటరీగా రవిశంకర్ దయానంద, వైస్ ప్రెసిడెంట్‌గా పోతిన శ్రీకాంత్, ట్రెజరర్‌గా సత్యాల రవికుమార్‌లను ఎన్నుకున్నారని నిర్వాహకులు వెల్లడించారు.

రక్తదాన శిబిరానికి స్పందన

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 79వ వార్డు పరిధి వేపచెట్టు కూడలిలో ముత్యాలహారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఫౌండేషన్ అధ్యక్షుడు బి.కాళిదాసు శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. రోటరీ క్లబ్ వైద్యాధికారి ఎ.మురళీధర్, స్థానిక స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులు ఎం.మస్తాన్‌రెడ్డి, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

మల్కాపురం: యంగ్ మైండ్ క్రియేటివ్ ఫెయిర్ - 26 పేరుతో శ్రీ సాయిలత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థులు పలు రకాల ప్రయోగాలను ప్రదర్శనలో ఉంచారు. కార్పొరేటర్ చిన్నా ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో శ్రీ సాయిలత పాఠశాల ప్రిన్సిపల్ కె.శైలజ, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోరమాండల్ గేటు వద్ద రోడ్డు ప్రమాదం

సింధియా, న్యూస్‌టుడే: వేగంగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనం కారును ఢీకొన్న సంఘటన ఆదివారం కోరమాండల్ గేటు ఎదురుగా జరిగింది. శ్రీహరిపురం నుంచి కోరమాండల్ వైపు వస్తున్న కారు కుడివైపునకు తిరుగుతుండగా.. అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి కారు కుడిభాగం చక్రాన్ని బలంగా ఢీకొంది. గాయపడ్డ ద్విచక్ర వాహనదారుడిని ఎఫ్ఆర్‌యూ ఆసుపత్రికి తరలించారు. కారు ఇంజిన్ దెబ్బతినడంతో పోలీసులు క్రేను సాయంతో అక్కడి నుంచి తరలించారు. మల్కాపురం పోలీసులు విచారణ చేస్తున్నారు.

కారుని క్రేను సాయంతో తరలిస్తున్న దృశ్యం

జ్యోతిర్లింగ ప్రదర్శన ప్రారంభం

అగనంపూడి, న్యూస్‌టుడే : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం గ్రామీణ బ్యాంకు వద్ద ఆదివారం ప్రజాపిత బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో సోమనాథ జ్యోతిర్లింగ ప్రదర్శన ఏర్పాటు చేశారు. పరవాడ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.నీలబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు అపరంజి, రామకోటి, రాము, రాజు పాల్గొన్నారు.

మర్రిపాలెంలో కార్డన్ సెర్చ్

కరాస, న్యూస్‌టుడే : నేరాల నియంత్రణలో భాగంగా ఎయిర్‌పోర్టు పోలీసులు 57వ వార్డు మర్రిపాలెం శ్యామ్‌నగర్‌లో సీఐ శంకరనారాయణ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున ఆ ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు కార్తిక్, నాగమణి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్యామ్‌నగర్‌లో కార్డన్ సెర్చ్‌లో పాల్గొన్న ఎయిర్‌పోర్టు పోలీసులు

అభివృద్ధి పనులు ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం, కాపు తుంగ్లాంలోని పలు అభివృద్ధి పనులను ఆదివారం వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో సకాలంలో పూర్తిచేయాలని గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై ఎమ్మెల్యే ఆరా

అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్తపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ బొడ్డేటి విజయ్‌కుమార్, వార్డు అధ్యక్షులు ఎస్.అరుణ్‌కుమార్, సత్తిరాజు, కంపర ఆనంద్, ఎలమంచిలి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజల్లోకి కల్తీనెయ్యి వ్యవహారం'

సీతానగరం (పెదగంట్యాడ), న్యూస్‌టుడే: కల్తీనెయ్యి వ్యవహారంలో వైకాపా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెదేపా నగర ఉపాధ్యక్షుడు పులి రమణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం 75వ వార్డు సీతానగరం ఎన్టీఆర్ కూడలిలో 'మహాపాపం' గోడపత్రిక ఆవిష్కరణ, వైకాపా తీరుపై మహా నిరసన చేపట్టారు. వార్డు అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య, తెలుగు యువత జిల్లా కార్యదర్శి మొల్లి పెంటిరాజు, నాయకులు గొక్యాడ ముత్యాలు, ఉరుకూటి అప్పలరాజు, కణితి సన్యాసమ్మ పాల్గొన్నారు.

చదువంటే మాకిష్టం..!

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : బాలల్లో పుస్తక పఠనాసక్తి పెంచాలనే ఉద్దేశంతో పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో 'చదువంటే మాకిష్టం..' పేరుతో ప్రత్యేక పుస్తక పఠన కార్యక్రమం నిర్వహించారు. గ్రంథ పాలకులు పిల్లలకు కథలు చెప్పి, నీతి పుస్తకాలను చదివించారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ పర్యవేక్షించారు.

కథలు చదువుతున్న బాలలు

మాట్లాడుతున్న కళారత్న చలపతిరావు

సింధియా(జవహర్‌నగర్), న్యూస్‌టుడే: పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో పిల్లలతో కథలు చెప్పించారు. కళారత్న ఎస్.చలపతిరావు 'గర్వభంగం' అనే కథను పిల్లలకు చెప్పారు. గ్రంథాలయ అధికారి అజయ్‌కుమార్, బాలలు పాల్గొన్నారు.

వేలం వేసినా తెరచుకోని దుకాణాలు

సింధియా: 60వవార్డు గుల్లలపాలెం హాకర్ జోన్‌కు మౌలిక వసతులను కల్పించి వేలం ప్రాతిపదికన దుకాణాలు కేటాయింపు జరిపారు. ఈ ప్రక్రియ పూర్తయి మూడు నెలలైనా ఇంత వరకు తెరచుకోలేదు. చిల్లర వర్తకుల కోసం నిర్మించిన హాకర్ జోన్‌కు పుష్కరకాలంగా వ్యాపారులు ఎవరూ ముందుకు రాకపోవడం శోచనీయం. దీంతో ఈ ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి.

దుకాణాల సముదాయం

ఇరుకుదారిలో చిక్కులు
అనధికార పార్కింగ్‌తో అవస్థలు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : గాజువాక 66వ వార్డు సీతారాంనగర్ నుంచి సింహగిరికాలనీకి వెళ్లేదారి పక్కన కొండ ప్రాంతానికి 12 వరకూ వీధులు ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులు ఎక్కడా చోటు లేనట్లు నేరుగా ఈ వీధుల్లో వాహనాలు పెడుతున్నారు. కనీసం అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉంటోంది. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యామ్నాయాలు సూచించి ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని నివాసితులు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు
దర్పణం

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక శివారు పైడిమాంబకాలనీ దారిలో సిమెంటు దిమ్మెలు, కుండీలు ప్రాణ సంకటంగా మారాయి. అసలే ఇరుకురోడ్డు, ఆపై కాలువపై యూజీడీ పనులకు సంబంధించిన సిమెంటు కుండీలు, ఛాంబర్లు అడ్డంగా ఉంచారు. అటుగా వెళ్లే పాదచారులు ఏమాత్రం ఆదమర్చినా ప్రమాదానికి గురికావల్సి వస్తుంది. కాలువపై ఉన్న వీటిని తొలగించి ఇబ్బందుల్లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

కాలువపై సిమెంటు కుండీలు



సా..గదీత పనులతో పాట్లు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : సింహాచలం రైల్వేస్టేషన్‌రోడ్డులో చేపడుతున్న అభివృద్ధి పనులు సా..గదీస్తున్నారు. వాస్తవానికి ఇక్కడి దారిలోని కాలువ నిర్మాణ పనులు గతేడాది పూర్తి కావాల్సి ఉంది. అయితే కొంతమంది దుకాణదారులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో రాజకీయ ప్రమేయంతో పనులు నిలిచిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం ఆక్రమిత దుకాణాల జోలికి పోకుండా రోడ్డును కుదించి కాలువ పనులు చేపడుతున్నారు. ఈ పనులు కూడా నెమ్మదించడంతో ఇటుగా రాకపోకలు సాగించే రైలు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

రోడ్డులో జరుగుతున్న కాలువ పనులు

(c) eenadu

నమూనా ప్రశ్నపత్రాలతో..

గణితంలో ఫార్ములాలు, కాలిక్యులేషన్లు తప్పక సాధన చేయాలి. ఎన్‌సీఈఆర్టీ బ్లూప్రింట్, నమూనా ప్రశ్నపత్రాలను అర్థం చేసుకోవాలి. వాస్తవ సంఖ్యలు, రేఖీయ సమీకరణాలు, గ్రాఫ్, నిరూపక రేఖాగణితం, స్టాటిస్టిక్స్, సంభావ్యత(ప్రోబబులిటీ) తదితర అధ్యాయాల్లో ఎనిమిది, నాలుగు మార్కుల లెక్కలను సులువుగా చేయగలగాలి. 1-33 వరకు ప్రశ్నలు బ్లూప్రింట్ ప్రకారమే వస్తాయి.

జీవీబీఎస్‌ఎన్.రాజు, గణితం : 12 94900 26834

వ్యాకరణంపై పట్టు

వ్యాకరణాంశాలపై దృష్టి పెట్టాలి. సాధ్యమైనంత వరకు వరుస క్రమాన్ని పాటించాలి. పేరాగ్రాఫ్‌ల మాదిరిగా రాయడం మంచిది. ఎన్సీఈఆర్టీ నమూనా పేపర్లను సమగ్రంగా చదవాలి. తెలుగు విభక్తులను హిందీ కారక చిహ్నాలను ఒకే దగ్గర రాసుకుని సాధన చేస్తే సులువుగా అర్థమవుతాయి. రాష్ట్రీయ త్యోహార్, ధార్మిక త్యోహార్, పర్యావరణ్-ప్రదూషణ్, స్వచ్ఛ భారత్, దూరదర్శన్, ప్రియనేత తదితర పాఠ్యాంశాలు కీలకం.

కిరణ్‌కుమార్ మిశ్రా, హిందీ 9 94413 05260

ఉచ్చారణ ముఖ్యం..

ప్రశ్నకు అనుబంధమైన వాక్యాలు 10 నుంచి 15 వరకు ఉండాలి. దీర్ఘం, హ్రస్వం చదివినప్పుడు ఉచ్చారణ సరిగా ఉంటే తప్పులు రావు. అలంకారాల విషయంలో లక్షణం తెలుసుకోవాలి. కన్యాశుల్కంలో పాత్ర భాగ నేపథ్యమే ఇస్తారు. ప్రత్యక్ష దైవాలు, ప్రకృతి సందేశం, రాజనీతి, యుద్ధ విజేత, బతుకు గంప, జీవని, అన్నమయ్య అంశాలకు సంబంధించిన ప్రశ్నలు చదవాలి.

ఎన్.శ్రీనివాసరాజు, తెలుగు 13 94411 63113

సాధన..అవగాహనతోనే మార్కులు

- ఎన్‌సీఈఆర్టీ నమూనా పత్రాలపై దృష్టి
- 'ఈనాడు' ఫోన్‌ఇన్‌లో సబ్జెక్టు నిపుణులు

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం, ఉడాకాలనీ

వందరోజుల ప్రణాళికను సద్వినియోగం చేసుకుని, పూర్తిస్థాయిలో రివిజన్ చేస్తే శతశాతం మార్కులు సాధించవచ్చని సబ్జెక్టు నిపుణులు పేర్కొన్నారు. ఎన్‌సీఈఆర్టీ నమూనా పత్రాలపై దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో 'ఈనాడు- జిల్లా విద్యాశాఖ' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్‌లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. డీఈవో యు.మాణిక్యం నాయుడు పాల్గొన్నారు. పరీక్షలు ముగిసే వరకు వీరిని సంప్రదించవచ్చన్నారు.

సూచిక: నిపుణుడు, సబ్జెక్టు: ➡ వచ్చినకాల్స్: ☛ చరవాణి నంబరు: ✆

ఫోన్‌ఇన్‌లో పాల్గొన్న డీఈవో మాణిక్యం నాయుడు, సబ్జెక్టు నిపుణులు

సందర్భానికి అనుగుణంగా..

ఆంగ్లంలో సందర్భానికి అనుగుణంగా సమాధానాలు ఉండాలి. సంభాషణ, దైనందిని(డైరీ) అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి. లేఖ, స్పీచ్ రైటింగ్, డిస్క్రిప్షన్, ఇన్‌ఫర్మేషన్ ట్రాన్స్‌ఫర్, సబ్, వెర్బ్, అగ్రిమెంట్, టెన్స్‌ను కచ్చితంగా ఫాలో అవ్వాలి. పేరాగ్రాఫ్‌లుగా విభజించాలి. సంభాషణ, స్పీచ్ విషయంలో గ్రీటింగ్స్, కంటెంట్, కన్‌క్లూజన్, సోషల్ నార్మ్స్ వాడాలి. మోడల్ పేపర్లను సాధన చేయడం ద్వారా సెక్షన్లపై పట్టు దొరుకుతుంది. వ్యాకరణం, వొకబ్లరీ(పదజాలం)మీద ఎక్కువ మార్కులు వస్తాయి.

ఎస్.నాగరాజు, ఆంగ్లం 14 94405 99788

ప్రయోగాలు, పటాలు కీలకం

రాసేటప్పుడు అన్ని ప్రధానాంశాలను కలిపి కనీసం 8 నుంచి పది పాయింట్లు తక్కువ లేకుండా చూసుకోవాలి. ఉద్దేశం, పరికరాలు, పని చేసే విధానం, పరిశీలన, నిర్ధారణ, జాగ్రత్తలను వివరంగా తెలియజేయాలి. రీ ప్రొడక్షన్, జీవ క్రియలు, ప్రత్యుత్పత్తి తదితర పాఠ్యాంశాలు కీలకం. పుష్పం-నిలువు కోత, ఫలదీకరణ విధానం, పురుష-స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థలు, మూత్రపిండాలు, నెఫ్రాన్ పటాలు ఎక్కువగా వస్తాయి.

జి.సన్యాసినాయుడు, జీవశాస్త్రం 08 94900 09294

సమకాలీన అంశాలపై అవగాహన

మ్యాప్‌లను గుర్తించగలగాలి. సముద్రాలు, మహాసముద్రాలు, నదులు, పీఠభూములు, పర్వతాల కోసం తెలుసుకోవాలి. భూగోళశాస్త్రం, జల వనరులు, వ్యవసాయం, భారతదేశ జాతీయవాదం, ముద్రణ సంస్కృతి, ఆధునిక ప్రపంచం, అధికార విభజన, రాజకీయపార్టీలు, దేశ ఆర్థిక వ్యవస్థ రంగాలు, ద్రవ్య పరపతి తదితర పాఠ్యాంశాలు కీలకం. అబ్రివేషన్లు, భిన్నమైన దానిని గుర్తించడం, జతపరచడం తదితర విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. పాయింట్ల రూపంలో రాయాలి.

ఎం.హరికృష్ణారావు, సాంఘికశాస్త్రం 10 95818 25986

చర్యలు తెలిస్తే సులువుగా ఫలితాలు

ఆల్కేన్, ఆల్కీన్, ఆల్కైన్లు, సంకలన చర్యలు, ఉత్ప్రేరకాలు, ప్రతిక్షేపణలు, విద్యుత్తు అయస్కాంత ప్రయోగాలు కీలకం. రెండు మార్కుల ప్రశ్నలకు సులువుగా సమాధానాలు రాయాలి. ప్రయోగాత్మక ప్రశ్నలకు ఉద్దేశం, పరికరాలు, డయాగ్రామ్, విధానం, పరిశీలన, ముగింపు రాస్తే మార్కులు వస్తాయి. భౌతిక, రసాయనిక ధర్మాలను తెలుసుకుంటే చర్యల ద్వారా ఏమేం ఏర్పడతాయో అవగాహన వస్తుంది.

బి.మధుకుమార్, భౌతికశాస్త్రం 12 79891 67689

విద్యుత్తు సమస్యలపై ఫోన్ చేయండి

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగంగా పరిష్కరించే లక్ష్యంతో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సమయం: ఉదయం 10.30 నుంచి 11.30 వరకు
ఫోను నెంబరు : 86884 00499

వీటిపై: విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని సీఎండీ ప్రకటించారు.

పైడితల్లి ఆలయం మూసివేత రేపు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: చంద్ర గ్రహణం సందర్భంగా ఈనెల 3న విజయనగరం పైడితల్లి చదురు, వనంగుడులను మూసి వేయనున్నట్లు ఈవో కె.శిరీష తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు తలుపులను మూసేస్తామని, బుధవారం సంప్రోక్షణ అనంతరం ఉదయం 8 గంటల నుంచి భక్తులను దర్శనాలకు అనుమతిస్తామన్నారు.

గుట్టుగా కాదు.. గట్టిగానే తవ్వకం!

న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

పిల్లర్ల వరకు తవ్వేశారిలా..

దూరం నుంచి చూస్తే ఆ ప్రాంతమంతా కిలోమీటర్ల మేర కంకర గుట్టలు కనిపిస్తాయి. అక్కడక్కడా పచ్చని మొక్కలు దర్శనమిస్తాయి.. కానీ లోపలకు వెళితే అసలు విషయం బయట పడుతుంది. ఎక్కడికక్కడే భారీ గుంతలు ఏర్పడ్డాయి.. కొత్తగా రోడ్లు కనిపిస్తున్నాయి.. విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని వైఎస్సార్‌నగర్ నుంచి కొండవెలగాడకు వెళ్లే మార్గంలోని దృశ్యాలివి. కొన్ని నెలలుగా ఇక్కడ పెద్దఎత్తున కంకర తవ్వకాలు సాగుతున్నాయి. టిడ్కో గృహ సముదాయాల వెనకవైపు ఈ తంతు సాగుతున్నా చర్యల్లేవు.

- రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు తవ్వకాలు సాగుతున్నాయి. భారీ యంత్రాలతో గుట్టలను కొల్లగొడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రధాన రహదారుల మీదుగా తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆయా మార్గాలన్నీ ఎర్రగా మారిపోతున్నాయని, కొన్నిచోట్ల గుంతలు ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు. గతంలో వీటికి సమీపంలోని సోనియా నగర్‌లో ప్రభుత్వం పట్టణ పేదలకు టిడ్కో ఇళ్లను కేటాయించింది. సౌకర్యాలు లేకపోవడంతో ఎవరూ రావడం లేదు. జన సంచారం లేకపోవడం అక్రమార్కులకు కలిసొస్తోంది. నెల్లిమర్ల, విజయనగరం, గజపతినగరం వైపు ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. దీనిపై తహసీల్దారు కూర్మనాథరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. అనుమతులు లేవని, అడ్డుకుంటామని చెప్పారు.

అందుకోండి.. అంతరిక్ష విజ్ఞానం

- బాలల కోసం ఇస్రో 'యువిక'
- ప్రత్యేక శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

● రిజిస్ట్రేషన్లు ప్రారంభం: ఫిబ్రవరి 27	● చివరి తేదీ: మార్చి 31	● మొదటి ఎంపిక జాబితా: ఏప్రిల్ 13

● రెండో జాబితా: ఏప్రిల్ 20 ● శిక్షణ: మే 11 నుంచి 22 వరకు

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

ఖగోళ శాస్త్రవేత్తలుగా ఎదగాలని కలలుగంటున్న బాల మేధావులకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అండగా నిలుస్తోంది. యువ విజ్ఞాన కార్యక్రమం(యువిక-2026) పేరుతో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనుంది. స్పేస్ టెక్నాలజీ, స్పేస్ సైన్స్, స్పేస్ అప్లికేషన్స్ అంశాలను విద్యార్థులకు పరిచయం చేయడమే దీని ఉద్దేశం.

తొమ్మిదో తరగతి అర్హతతో..

అన్ని యాజమాన్యాల పాఠశాల విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. 2026 జనవరి 1 నాటికి తొమ్మిదో తరగతి చదువుతున్న వారు అర్హులు. https://jigyasa.iirs.gov.in/yuvika, www.isro.gov.in వెబ్‌సైట్‌లో పేరు, ఈమెయిల్ ఐడీని రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం వచ్చే లింక్‌పై క్లిక్ చేసి సరిచూసుకోవాలి. లాగిన్ అయిన తర్వాత, ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. ఒకసారి మాత్రమే రాసే అవకాశం ఉంటుంది. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపికలో పది శాతం వెయిటేజీ కల్పిస్తారు. వ్యక్తిగత, చదువుకు సంబంధించిన వివరాలను నింపాలి. అర్హతను నిర్ధారించే ధ్రువపత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి.

వెయిటేజీ ఇలా..

- పంచాయతీ పరిధిలోని పాఠశాలలో చదువుతున్నట్లయితే దానికి సంబంధించిన పత్రాన్ని (సంబంధిత ప్రధానోపాధ్యాయుడి సంతకంతో) అప్‌లోడ్ చేయాలి. దీనికి 15 శాతం అదనపు, 8వ తరగతిలో పొందిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఉంటుంది.
- గత మూడేళ్లలో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు, సైన్స్ ప్రతిభ పరీక్షలు, ఒలింపియాడ్‌లో పాల్గొని మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి పది శాతం వరకు ఇస్తారు. క్రీడలు, అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చినవారు, స్కౌట్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లో సభ్యులుగా ఉన్నవారికి 5 శాతం కేటాయిస్తారు.

7 కేంద్రాల్లో శిక్షణ..

ఎంపికైన వారికి దేశవ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రాలకు పిలుస్తారు. ఎంపికైతే ఖర్చులన్నింటినీ ఇస్రోనే భరిస్తుందని డీఈవో యు.మాణిక్యం నాయుడు తెలిపారు.

తాగునీరు.. తాగలేరు

- మురుగు చేరికతో ముప్పు
- కానరాని నివారణ చర్యలు

నీటి పథకాలు ఇలా.. ● సీపీడబ్ల్యూఎస్: 30 ● చేతిపంపులు: 15,800 ● పీడబ్ల్యూఎస్: 934 ● ఎంపీడబ్ల్యూఎస్: 185 ● నేరుగా పంపింగ్: 408

'గంట్యాడ మండలం పెదవేమలిలో కుళాయిల వద్ద గల పరిసరాలు మురుగుతో అధ్వానంగా ఉన్నాయి. నీరు కలుషితమై రోగాల బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు'

'చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, జి.సిగడాం, రాజాం, పొందూరు మండలాలకు తాగునీరు సరఫరా చేసే సుజలధార పథకం నుంచి లీకులు ఏర్పడ్డాయి. మరమ్మతుల పేరుతో సరఫరాను ఎప్పటికప్పుడు నిలిపివేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు'

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

గ్రామాల్లో తాగునీటి పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. తరచూ నీరు కలుషితం కావడంతో రోగాలు వెంటాడుతున్నాయి. గతేడాది గుర్ల, పూసపాటిరేగ పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున అతిసారం కేసులు నమోదయ్యాయి. మరణాలు సైతం చోటుచేసుకున్నాయి. పైప్‌లైన్ల లీకేజీలు, డ్రైనేజీల్లో కుళాయిలతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ట్యాంకుల అపరిశుభ్రత, పరీక్షలు చేపట్టకపోవడమూ ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

రాజాం: పట్టణంలోని అమ్మవారి కాలనీ వద్ద 4 రక్షిత మంచినీటి ట్యాంకులున్నాయి. అక్కడ ఉన్న ఎయిర్ వాల్వ్ చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. వాల్వ్ కనిపించకుండా ఇలా మురుగు చేరింది.

చేయాల్సింది ఇలా..

- నీళ్ల ట్యాంకులను 15 రోజులకోసారి శుభ్రం చేయాలి.
- ప్రతి ఫిల్లింగ్‌కు(నింపడం) ఒకసారి క్లోరినేషన్ జరగాలి
- క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు, కార్యదర్శులు, గ్రామీణ నీటిసరఫరా అధికారులు పర్యవేక్షించాలి.
- ఏడాదికి రెండుసార్లు నాణ్యత పరీక్షలు నిర్వహించాలి.
- ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టడంతో పాటు కాలువల్లో పైపులైన్లు లేకుండా చూడాలి.

పంచాయతీలదే బాధ్యత..

గతంలో ఎదురైన ఇబ్బందుల దృష్ట్యా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. నీటి పరీక్షలు, క్లోరినేషన్ బాధ్యతలు పంచాయతీలవే. ఈమేరకు ఆదేశాలు జారీ చేశాం. ట్యాంకులను శుభ్రం చేసేలా చూస్తున్నాం. ఎక్కడా డ్రైన్లలో పైపులైన్లు లేవు. సమస్యలుంటే ఫిర్యాదు చేయొచ్చు.
– కవిత, ఎస్ఈ, గ్రామీణ నీటిసరఫరా, పారిశుద్ధ్య విభాగం

ర్యాలీలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న పోలీసులు, విద్యార్థినులు

సమోన్నత సంకల్పం.. సాధికారత సాకారం

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8 వరకు సాధికారత వారోత్సవాలు నిర్వహించనున్నట్లు డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. ఆదివారం నగరంలోని కోట కూడలి నుంచి మూడులాంతర్లు వరకు సిబ్బంది, విద్యార్థినులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా పోలీసులను సంప్రదించవచ్చన్నారు. శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా పోలీసు స్టేషన్ సీఐ ఇ.నర్సింహమూర్తి, ఒకటో పట్టణ సీఐ ఆర్‌వీ ఆర్‌కే చౌదరి, రెండో పట్టణ సీఐ టి.శ్రీనివాసరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

రైతు కష్టం 2 రూపాయలు!

న్యూస్‌టుడే, బొబ్బిలి, రామభద్రపురం

టమాటా రైతు పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా నష్టాలను చవిచూస్తున్నారు. కిలో రూ.2కు అమ్ముతున్నా కొనేవారులేరు. గత నెలలో రూ.40 పలికినా అప్పటికి చేతికి రాలేదు. పంట వచ్చే సమయానికి ధర లేదు. జిల్లాలో అతి పెద్ద మార్కెట్‌గా పేరుగాంచిన రామభద్రపురంలో టమాటా విక్రయానికి రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. బొబ్బిలి ప్రాంతంలో సుమారు 80 ఎకరాల్లో ఈ పంట సాగవుతోంది. మార్కెట్లో రోజంతా నిరీక్షించినా అమ్ముకోలేని పరిస్థితి.

కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న రైతు

టమాటా ధరతో కర్షకుడు కుదేలు

ఎందుకిలా..

ఒకేసారి పంట దిగుబడి రావడంతో ధర పతనం అయినట్లు ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. నవంబరు, డిసెంబరులో టమాటా నారు వేస్తారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులంతా ఒకేసారి నవంబరులో నార్లు వేయడంతో ఇప్పుడు చేతికొస్తోంది. ఎకరాకు 13 నుంచి 15 టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేస్తే ఈసారి 18 నుంచి 20 టన్నుల మేర వచ్చింది.

నెల రోజుల్లో ఎంత తేడా

సాధారణంగా వేసవిలో ధర ఎక్కువ పలుకుతుంది. కిలో రూ.50 నుంచి రూ.80 వరకు గతేడాది అమ్మకాలు జరిగాయి. గత నెలలో రూ.40 ఉండేది. ఇంతలోనే రూ.2కు పడిపోవడంతో రైతులకు పాలుపోవడం లేదు. ఎకరా విస్తీర్ణంలో సాగుకు రూ.50 వేలు ఖర్చు కాగా.. పంట విక్రయిస్తే రూ.35 వేలు కూడా రావడం లేదని కర్షకులు వాపోతున్నారు. కూలీ డబ్బులు రాక చాలామంది పొలాల్లోనే పంటను వదిలేస్తున్న పరిస్థితులున్నాయి.

రోజంతా నిరీక్షణ .. 25 కిలోల కేట్ అమ్ముకునేందుకు రోజంతా మార్కెట్‌లో నిరీక్షించాల్సి వస్తోంది. గతంలో అర గంటలో విక్రయించే వాళ్లం. ఇలాంటి పరిస్థితి వస్తుందని అనుకోలేదు. – ఎం.లక్ష్మి, రైతు

నేటి నుంచి ఇంటర్ పరీక్షల మూల్యాంకనం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఇంటర్ పరీక్షల మూల్యాంకన ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. గజపతినగరంలోని శ్రీసాయి సిద్ధార్థ కళాశాలలో ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్మీడియట్ జిల్లా అధికారి తవిటినాయుడు తెలిపారు. ఉత్తర్వులు అందుకున్న అధ్యాపకులు హాజరు కావాలన్నారు.

శెభాష్ శంకరరావు

- యువకుడి చొరవతో దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం

న్యూస్‌టుడే – బొబ్బిలి

ఓ యువకుడి చిరు సంకల్పం ఆ ప్రాంతంలో దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది. స్థానిక ఎమ్మెల్యే, స్నేహితులు, మరికొందరి సాయం తోడైంది. కల్వర్టు రూపుదాల్చి.. అంతిమయాత్ర అవస్థలను గట్టెక్కించింది.

పాత బొబ్బిలిలో శ్మశానవాటిక చుట్టూ పంట కాలువలు ఉన్నాయి. దాటేందుకు కల్వర్టు సక్రమంగా లేక మృతదేహాల తరలింపు సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలమైతే కాలువ నిండా నీరున్నా. దాటుకుని వెళ్లాల్సిందే. ఈ పరిస్థితిని గమనించిన గ్రామానికి చెందిన మోదీ శంకరరావు సమస్యను పరిష్కరించాలని సంకల్పించారు. శ్మశానానికి ఎదురుగా ఉన్న కాలువపై సొంత ఖర్చుతో కల్వర్టు నిర్మాణానికి పదిరోజుల కిందట శ్రీకారం చుట్టారు. చేస్తున్న పనిని స్థానిక వాట్సప్ గ్రూపులలో పెట్టారు. దీంతో మరికొంతమంది యువకులు తోడుగా నిలిచారు. ఎమ్మెల్యే బేబినాయన వరకు విషయం వెళ్లి పైపుల కోసం అయ్యే ఖర్చు రూ.25 వేలు అందించారు. స్నేహితులు, యువకులు కలిసి రూ.20 వేల వరకు సమకూర్చారు. మిగిలిన సొమ్ము శంకరరావు భరించి మొత్తం రూ.75 వేలతో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. పనులు చివరి దశకు వచ్చాయి. నేరుగా వాహనాలు వెళ్లేలా ఏర్పాటు చేశారు. 'ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. చాలామంది అక్కడ కల్వర్టు కట్టడం అసాధ్యమన్నారు. ఎందుకు కాదని నడుం బిగించాను.' అని యువకుడు చెబుతున్నారు.

నిర్మిస్తున్న కల్వర్టు వద్ద శంకరరావు(మధ్యలో నిల్చున్న వ్యక్తి)

पीएम श्री केन्द्रीय विद्यालय/PM SHRI KENDRIYA VIDYALAYA
विजयनगरम/ VIZIANAGARAM -535002
साक्षात्कार /WALK-IN-INTERVIEW

सत्र 2026-27 के लिए संविदा कर्मचारियों का एक पैनल की तैयारी के लिए योग्य और इच्छुक उम्मीदवारों को वॉक-इन-इंटरव्यू में भाग लेने के लिए आमंत्रित किया जाता है।
Eligible and interested candidates are invited to attend a Walk-in-interview for the preparation of a panel of contractual staff for the session 2026-27.

साक्षात्कार की तिथि / Date of interview: 14.03.2026
पंजीकरण समय / Registration time : सुबह 8.30 बजे से 10.00 बजे तक / 8.30 AM TO 10.00 AM

न./SI.NO	पद / POST	पोस्ट का विवरण / DETAILS OF POST
1	स्नातकोत्तर शिक्षक / PGT	अंग्रेजी, हिंदी, गणित, भौतिकविज्ञान, रसायन विज्ञान, जीव विज्ञान, कंप्यूटर विज्ञान /ENGLISH, HINDI, MATHS, PHYSICS, CHEMISTRY, BIOLOGY, COMPUTER SCIENCE
2	प्र. स्ना . शिक्षक / TGT	अंग्रेजी, हिंदी,संस्कृत,गणित, सामाजिक विज्ञान, विज्ञान/ENGLISH, HINDI ,SANSKRIT, MATHS, SOCIAL SCIENCE , SCIENCE
3	प्राथमिक / बलवाटिका शिक्षक. PRT, BALVATIKA	प्राथमिक & बलवाटिका शिक्षक / PRT& BALVATIKA TEACHERS
4	विविध/ MISCELLANEOUS	खेल प्रशिक्षक, नर्स, कंप्यूटर अनुदेशक ,व्यावसायिकअनुदेशक, परामर्शदाता, विशेष शिक्षक, तेलुगु शिक्षक / SPORTS COACH, NURSE, COMPUTER INSTRUCTOR, VOCATIONAL INSTRUCTOR, COUNSELOR, SPECIAL EDUCATOR, TELUGU TEACHER

कृपया सत्यापन के लिए अपने सभी मूल प्रमाणपत्र, स्व-सत्यापित ज़ेरॉक्स प्रतियों का एक सेट और एक फोटो साथ लाएँ।
Please bring all your original certificates, set of xerox copies along with a photograph for verification.

"अधिक जानकारी के लिए कृपया वेबसाइट पर विज़िट करें।" /For further details , please visit the website : https://vizianagaram.kvs.ac.in
Contact : 08922-229669 PRINCIPAL / प्राचार्य

ఎల్లయ్యకు ఇల్లొస్తోంది..

- నెరవేరుతున్న సీఎం హామీ

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చీపురుపల్లి మండలం రావివలస పంచాయతీ పైలపేటలో రొంగలి ఎల్లయ్య కుటుంబానికి ఇల్లు మంజూరు దిశగా యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. తమకు ఇల్లు లేదని, ఆదుకోవాలని శనివారం పింఛను అందజేయడానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఎల్లయ్య కోరడంతో ఆయన స్పందించారు. త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాంసుందర్‌రెడ్డిని సీఎం ఆదేశించారు. ఈ మేరకు గృహనిర్మాణ శాఖ జిల్లా అధికారి జి.మురళీమోహన్, ఈఈ ఎం.సత్యనారాయణ, ఏఈ ప్రదీప్ తదితరులు.. సీఎం తిరుగుప్రయాణమైన అనంతరం వివరాలు సేకరించారు. గ్రామంలోని సర్వే నంబరు 172లో రెండు సెంట్ల స్థలాన్ని గుర్తించినట్లు తహసీల్దారు సి.ధర్మరాజు తెలిపారు.

ఎల్లయ్య దంపతులతో మాట్లాడుతున్న గృహనిర్మాణశాఖ అధికారులు

తల పగిలితేనే పట్టించుకుంటారా?

పగిలిన గోడలు.. ఊడుతున్న పెచ్చులు.. కూలేందుకు సిద్ధంగా మేడపైన డమ్మీ పిల్లరు.. ఇదీ లక్కవరపుకోటలోని 'మహిళా విజయం' భవనం దుస్థితి. ఎప్పుడు.. ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పట్టణంలో వెలుగు కార్యాలయం కోసం దీన్ని నిర్మించారు. కొన్నాళ్లకు కొత్త భవనంలోకి మార్చారు. దీంతో 108 వాహన సిబ్బంది ఉండేందుకు పాతదాన్ని అప్పగించారు. నిర్వహణ లేక ఇలా శిథిలమైంది. కార్యాలయాలతో పాటు పక్కనే ఉన్న గ్రంథాలయానికి వచ్చేవారు ఈ ఆవరణలోనే సేదదీరుతుంటారు. విషయాన్ని ఎంపీడీవో భాస్కరరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి బాగు చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట

(c) eenadu

విద్యుదాఘాతంతో ఇద్దరి దుర్మరణం

శ్రీను(పాతచిత్రం)

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పద్మనాభం మండలం జనకుపాలెంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు మృతి చెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పెద్ద నిర్మాణానికి జేసీబీతో స్తంభాన్ని నిలబెట్టే క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. జనకుపాలేనికి చెందిన కాళ్ల సూరిబాబు(70), ఆయన కుమారుడు సూరిబాబు(46) కల్లం వద్ద పాత స్తంభాలు సేకరించి పనులు పెద్ద నిర్మిస్తున్నారు. తాపీ మేస్త్రీ కె.శ్రీను(36) స్తంభాలు నిలబెట్టడానికి వెళ్లారు. పైనున్న 11 కేవీ విద్యుత్తు తీగలకు తాకడంతో ముగ్గురూ ఉలిక్కిపడ్డారు. సూరిబాబు, శ్రీను అక్కడికక్కడే మృతి చెందగా, సూరిబాబు గాయాలతో బయటపడ్డారు. కె.శ్రీను స్వస్థలం విజయనగరం జిల్లా డెంకాడ మండలంలోని గుండాలపేట. బతుకుదెరువు కోసం 15 ఏళ్ల క్రితం పద్మనాభం వచ్చి స్థిరపడ్డారు. కృష్ణాపురం జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకున్నారు. భార్య రాజు(35), కుమార్తె మాధురి(14), కుమారుడు పవన్‌సాయి(12) ఉన్నారు. అందరితో సరదాగా ఉండేవాడు. శ్రీను కుమార్తె పది పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఆయన మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

సింగిల్స్ విభాగంలో తలపడుతున్న క్రీడాకారిణులు

క్రీడలతో మానసికోల్లాసం

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం దక్కుతుందని, గెలుపోటములతో సంబంధం లేకుండా రాణించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పిలుపునిచ్చారు. విజయనగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి వెటరన్ స్త్రీ, పురుషుల బ్యాడ్మింటన్ పోటీలను సంఘ జిల్లా అధ్యక్షుడు కేవీ నాయుడుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. 35 నుంచి 55 ఏళ్ల వయసు క్రీడాకారులు పోటీపడ్డారు. నిర్వాహక కార్యదర్శి సురేష్, సభ్యులు సుధారాజు, కుసుంబచ్చన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గజపతినగరం, న్యూస్‌టుడే: జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక సీఐ రమణ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి జాతీయ రహదారి మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేపట్టి మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎస్సైలు కిరణ్‌కుమార్ నాయుడు, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగురోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడిన మహిళలు

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక

పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి

భోగాపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-21 యూత్ జట్ల ఎంపిక పోటీలను ఎమ్మెల్యే లోకం మాధవి ఆదివారం ప్రారంభించారు. రాష్ట్రంలోని 23 జిల్లాల నుంచి జట్లు పాల్గొన్నాయి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 22 మంది పురుషులు, 15 మంది మహిళా క్రీడాకారులతో రెండు జట్లు ఎంపిక చేశారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సత్యేంద్ర వర్మ మాట్లాడుతూ ఎంపికైన జట్లు ఆంధ్రా తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ సభ్యుడు సూరిబాబు, అంతర్జాతీయ క్రీడాకారుడు కృష్ణంరాజు, రాజు, శేఖర్, నాగన్న పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు పాఠశాలలకు అడ్డుకట్ట వేసేలా కూటమి ప్రభుత్వం నిబంధనలను కఠినతరం చేసింది. దీంతో కొత్తగా విద్యాసంస్థలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చేవారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. 2026-27 విద్యా సంవత్సరంలో ఏడు చోట్ల ప్రారంభించేందుకు దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ ప్రాథమిక విద్యాలయాలే. ఓ యాజమాన్యం తొమ్మిదో తరగతి వరకు నిర్వహణకు అనుమతి కోరడంతో ఆర్జేడీకి పంపించారు.
– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

షెడ్లలో తరగతులు.. అయినా అనుమతులు

ఇదీ పలు ప్రైవేటు పాఠశాలల్లో పరిస్థితి

అన్నీ అరకొరగానే..

ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 40 వరకు పాఠశాలలు ఏర్పాటయ్యాయి. ఇందులో కొన్నింటికి ఇప్పటివరకు అనుమతులు లేవు. తనిఖీ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాల్సి ఉంది. ఒక విద్యార్థికి 6-8 చదరపు అడుగుల స్థలం కేటాయించాలి. గ్రామీణంలో అయితే 2000 చదరపు మీటర్లు, అర్బన్‌లో వెయ్యి చదరపు మీటర్ల ఆటస్థలం తప్పనిసరి. ప్రాథమిక విద్యాలయాల్లో తరగతుల కోసం విధిగా అయిదు గదులు కేటాయించాలి. ల్యాబ్‌లు, గ్రంథాలయం, కంప్యూటర్, మరుగుదొడ్లు, తాగునీరు.. తదితర 40 రకాల సదుపాయాలు కల్పించాలి. ఇవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. కొన్నిచోట్ల అరకొరగానే ఉంటున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనల్లో మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

❖ పెట్రోల్ బంకుల పక్కన నిర్వహించకూడదు. దీనికి విరుద్ధంగా బొండపల్లి మండలంలోని ఓ విద్యాలయంలో తరగతులు జరుగుతున్నట్లు గుర్తించారు. దానికి గతంలోనే అనుమతులు సైతం ఇచ్చేశారు. తొలుత ప్రాథమికం వరకే అని చెప్పి.. తర్వాత ఉన్నతీకరణ సైతం పొందారు.

లోపాలిలా..

❖ విజయనగరంలో ఓ ప్రైవేటు పాఠశాలకు గుర్తింపు లేదని అధికారులు సీజ్ చేశారు. ఆ విద్యాలయం ఏళ్ల నుంచి నడుస్తోంది.

❖ రేకుల షెడ్లలో పిల్లలను ఉంచకూడదు. చాలాచోట్ల ఇవే ఉన్నాయి. జామి మండలంలో ఓ విద్యాలయం విషయం అధికారుల దృష్టికి వచ్చినా ఎలాంటి చర్యలు లేవు.

❖ ఒకే అనుమతి పత్రంతో రెండు, మూడుచోట్ల పాఠశాలలు కొనసాగుతున్నాయి. ముందు చూపించిన స్థలం కాకుండా.. వేరే ప్రాంతానికి వెళ్లడం, రెన్యువల్‌ను పునరుద్ధరించలేకపోవడం తదితర లోపాలు వెలుగు చూస్తున్నాయి. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని డీఈవో మాణిక్యంనాయుడు తెలిపారు.

కొత్త నిబంధనలివే..

❖ ఇప్పటికే ఓ పాఠశాల(ప్రభుత్వ లేదా ప్రైవేటు) ఉంటే.. దానికి కిలోమీటరు పరిధిలో కొత్తగా ఏర్పాటు చేయాలంటే సంబంధిత యాజమాన్యం నుంచి ఎన్‌వోసీ(నిరభ్యంతర పత్రం) తప్పనిసరి.

❖ గతంలో మార్చి, ఏప్రిల్ వరకు దరఖాస్తులు స్వీకరించేవారు. అపరాధ రుసుము అక్టోబర్ వరకు చెల్లించే అవకాశం ఉండేది. ఈ ఏడాది మాత్రం డిసెంబరుతో ప్రక్రియను నిలిపివేశారు.

❖ గతంలో పత్రాలన్నీ అప్‌లోడ్ చేస్తేనే ప్రారంభ అనుమతి ఇచ్చేవారు. దీంతో పాఠశాలను నిర్వహించుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు డాక్యుమెంట్ల పరిశీలన అనంతరం సంబంధించిన అంశాలను అధికారులు తనిఖీ చేసి, ఆ వివరాలన్నీ అందించాలి. 40 రకాల సదుపాయాలు పక్కాగా ఉంటేనే అవకాశం కల్పిస్తున్నారు.

క్రీడా కోటాలో ఉద్యోగం..

కేవలం చదువే కాకుండా క్రీడలపైనా దృష్టి పెట్టాలి. నాకు ఆ కోటా కిందే రైల్వేలో ఉద్యోగం దక్కింది. మా నాన్న బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కావడంతో నేనూ సాధన చేసేవాడిని. 2002 నుంచి 2010 వరకు ఆల్ ఇండియా రేటింగ్స్‌లో 4వ స్థానంలో ఉన్నాను. బంగ్లాదేశ్, సింగపూర్, కంబోడియా తదితర దేశాల్లో జరిగిన అంతర్జాతీయస్థాయి పోటీల్లో దేశం తరపున పాల్గొన్నా. అయిదేళ్లుగా 50+ ఏళ్ల కేటగిరీలో ఉషశ్రీతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో బరిలోకి దిగుతున్నా. అయిదుసార్లు రాష్ట్ర ఛాంపియన్‌షిప్ సాధించాం.
– ఉదయ్ భాస్కర్, అంతర్జాతీయ క్రీడాకారుడు

క్రమశిక్షణ అలవడుతుంది..



రోజూ సాధనతో శారీరక, మానసిక ప్రశాంతతతో పాటు క్రమ శిక్షణ అలవడుతుంది. చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తి. 19 ఏళ్లకే ఎస్పీఎఫ్‌లో ఉద్యోగం వచ్చింది. కొన్నాళ్లుగా ఆల్ ఇండియా పోలీసుశాఖ తరపున పాల్గొంటున్నా. గతేడాది రజత పతకం సాధించి, ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని పొందా. శ్రీవెంకటగణేష్‌తో కలిసి డబుల్స్‌లో 45+ విభాగంలో ఆడుతున్నా. రాష్ట్ర, జాతీయస్థాయి మీట్‌లలో వందసార్లకు పైగా పాల్గొని పలు పతకాలు సాధించాం.
– సునీల్‌కుమార్, జాతీయ క్రీడాకారుడు

వెటరన్.. అదిరెన్

– న్యూస్‌టుడే, విజయనగరం బాబామెట్ట

మనసుండాలే కానీ వయసుతో పనేముంది అని నిరూపిస్తున్నారు పలువురు క్రీడాకారులు.. సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ.. కృషి, పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. పాఠశాల స్థాయిలో అవకాశాలు లేక ఆడనివారు కొందరైతే.. చిన్నతనం నుంచి క్రీడలే శ్వాసగా జీవించి వాటి ద్వారా ఉద్యోగాలు పొందిన వారు ఇంకొందరు.. కొలువుదీరిన తర్వాత కూడా సాధన చేస్తున్న వారు మరికొందరు.. ఇలా నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తూ దూసుకెళ్తున్నారు వెటరన్లు. విజయనగరంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ మీట్‌లో భాగంగా తమ విజయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

యువతలో స్ఫూర్తి నింపేందుకే..

2008లో ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. ప్రస్తుతం విజయనగరంలోని కస్పా ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేస్తున్నా. ప్రాథమిక స్థాయిలో ఆడుకునే అవకాశాలు తక్కువగా ఉండేవి. దీంతో ఉద్యోగం వచ్చాక పిల్లలతో ఆడిస్తూనే నేనూ సాధన చేస్తున్నా. జాతీయ, అంతర్జాతీయస్థాయి మీట్‌లలో సత్తా చాటా. సివిల్ సర్వీసెస్, వెటరన్ పోటీల్లో పాల్గొంటున్నా. ఆర్థిక పరిస్థితి కారణంగా చాలామంది విద్యార్థులు ముందుకు వెళ్లలేకపోతున్నారు. అలాంటి వారికి ఆర్థికసాయం అవసరం. యువతలో స్ఫూర్తి నింపేందుకు వెటరన్లు రాణిస్తున్నారు. – ఆదిలక్ష్మి, విజయనగరం

పత్రికల్లో చూసి..

మాది సాలూరు మండలంలోని మామిడిపల్లి. క్రీడలపై ఆసక్తి ఉన్నా బయటకు వెళ్లలేని పరిస్థితి. పత్రికల్లో వచ్చిన పలువురు క్రీడాకారుల ఫొటోలు చూసి ఇంట్లో వాళ్లు ప్రోత్సహించారు. అలా పాఠశాల స్థాయిలోనే బ్యాడ్మింటన్‌లో సాధన మొదలుపెట్టా. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ప్రస్తుతం 35+ కేటగిరీలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో తలపడుతున్నా. – మంజుభార్గవి

అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

చిత్రకళా ఉపాధ్యాయుడికి పురస్కారం

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: పూసపాటిరేగ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్ట్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇనపకుర్తి చిన్న సత్యనారాయణకు జాతీయస్థాయి ఉత్తమ చిత్రకళ ఉపాధ్యాయుడిగా పురస్కారం లభించింది. విజయవాడకు చెందిన డ్రీమ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు దీన్ని ప్రదానం చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడం, చిత్రకళ అభివృద్ధికి సత్యనారాయణ అందిస్తున్న సేవలను గుర్తించి పురస్కారం అందించినట్లు ఏపీ తెలుగు కల్చరల్ అకాడమీ ఛైర్మన్ ఆర్డీ విల్సన్, ఏపీ క్రియేటివ్ కల్చరల్ కమిషన్ ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి తెలిపారు. కార్యక్రమంలో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, 64 కళలు డాట్‌కామ్ ఎడిటర్ కళాసాగర్ పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.సౌభాగ్యలక్ష్మి ఆయనను అభినందించారు.

ఇళ్లల్లో ఆకస్మిక తనిఖీలు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ప్రజల భద్రత, నిషేధిత వస్తువులు, మత్తు పదార్థాల స్వాధీనమే లక్ష్యంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు విజయనగరం, చీపురుపల్లి డీఎస్పీలు ఆర్.గోవిందరావు, ఎస్.రాఘవులు తెలిపారు. శనివారం రాత్రి విజయనగరంలోని పూల్‌బాగ్ కాలనీ, గరివిడి పోలీసు స్టేషన్ సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. 300 మంది సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి పరిశీలించారని చెప్పారు. అపరిచిత వ్యక్తుల సంచారం, గంజాయి, నాటుసారా నిల్వలపై ఆరా తీశారని, కొందరి నుంచి వేలిముద్రలు సేకరించారన్నారు. పత్రాలు సరిగ్గా లేని 30 ద్విచక్ర వాహనాలను స్టేషన్లకు తరలించామన్నారు. సీఐలు టి.శ్రీనివాసరావు, శంకర్రావు, ఉపేంద్ర, ఎస్సైలు పాల్గొన్నారు.

ఓ ఇంట్లో బ్యాగులను పరిశీలిస్తున్న పోలీసులు

గొర్రెల షెడ్డు పేరుతో గోవధ

❖ గోపాలపల్లిలో కబేళాపై దాడులు
❖ పోలీసుల అదుపులో ఇద్దరు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: గొర్రెల షెడ్డు పేరుతో అయిదు నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా మండలంలోని గోపాలపల్లి గ్రామంలో గోవధ నిర్వహిస్తున్న ఇద్దరిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి సీఐ నారాయణమూర్తి వివరాల ప్రకారం. . గ్రామానికి చెందిన యువకులు శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో జాతరకు వెళ్లి వస్తుండగా టేకు తోట వద్ద షెడ్డులో ఆవుల అరుపులు వినిపించడంతో వెళ్లి చూశారు. వాటిని వధిస్తుండడాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఏఎస్సై గోవింద, సిబ్బంది వెళ్లి దాడి చేశారు. మూడు ఆవులను చంపి, మాంసం తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గుర్తించారు. వీరిని చూసి అయిదుగురు నిర్వాహకులు పారిపోగా, విశాఖ రైల్వే న్యూకాలనీకి చెందిన షేక్ సుల్తాన్, షేక్ బాషాను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషనుకు తరలించారు. గ్రామ ఉప సర్పంచి గణేష్, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసప్పుడు, యువత రమేష్, కిశోర్ రాజు, నాయుడు, సూరిబాబు, రమణ మాట్లాడుతూ అయిదు నెలల కిందట ఇంటి నిర్మాణానికి అనుమతులు తీసుకొని, పక్కనే గొర్రెలు పెంచేందుకు షెడ్డు వేశారన్నారు. చుట్టుపక్కల గ్రామస్థులకు గొర్రెల మాంసం విక్రయిస్తుండడం, రోజూ వ్యానులో మాంసం రవాణా చేస్తుంటే మటన్ వ్యాపారమని భావించామన్నారు. అలమండ సంత నుంచి గోవులను కొని, చంపి ఇక్కడి నుంచి మాంసం రవాణా చేస్తున్నారన్నారు. ఆదివారం ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో సమక్షంలో పశువైద్యాధికారి రామ్‌కుమార్ పంచనామా నిర్వహించారు. మాంసాన్ని గొయ్యి తీసి పూడ్చారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, మాంసాన్ని పరీక్షల నిమిత్తం ఎఫ్ఎస్ఎల్‌కు పంపుతున్నామని సీఐ తెలిపారు. మిగిలిన రెండు ఆవులు, దూడను సమీపంలోని గోశాలకు పంపుతున్నామన్నారు.

పశుమాంసాన్ని చూపిస్తున్న గ్రామస్థులు, యువత

చంపావతి ఎండినది!

కనుచూపు మేర ఇసుక దిబ్బలతో దర్శనమిస్తున్న ఈ చిత్రం చూసి ఎడారి ప్రాంతం అనుకుంటే ఇసుకలో కాలేసినట్లే.. జిల్లాలో వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం ప్రజలకు తాగునీరు అందించే చంపావతి నది దుస్థితి ఇది. వేసవికి ముందే నెల్లిమర్ల ప్రాంతంలో నది పూర్తిగా ఎండింది. ఇప్పుడే ఇలా ఉంటే.. రానున్న రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విషయాన్ని కమిషనరు ఎస్.జనార్దనరావు వద్ద ప్రస్తావించగా తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

మహాధర్నా విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.వి.పైడిరాజు

విద్యావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు ఈనెల 3న కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వి.పైడిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. విజయనగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీఆర్సీని ప్రకటించాలని, టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండు చేశారు. నాయకులు ఆర్.కృష్ణ, ఎ.వి.శ్రీనివాస్, వి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యావిభాగం: ఉపాధ్యాయుల విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ముందుకెళ్లాలని, హాజరు విధానం అమలులో నిబంధనలు తొలగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొవ్వాడ శ్రీనివాసరావు, బల్లా శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ఇజ్జిరోతు రామునాయుడు కోరారు. పది నిమిషాల గ్రేస్ పీరియడ్‌ను కొనసాగించాలని, సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేశారు.

అనుమతులు తప్పనిసరి.. అయ్యన్నపేట: బాణసంచా విక్రయదారులు సంబంధిత శాఖల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని డీఎస్పీ ఆర్.గోవిందరావు ఆదేశించారు. ఆదివారం ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో తయారీ, విక్రయ యజమానులతో మాట్లాడారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

చికెన్ ధరలు

రకం (కిలో రూ.ల్లో..)	(బ్యాగ్)లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	167	304	314

MAHARAJAH'S COLLEGE (AUTONOMOUS)
Affiliated to Andhra University, Accredited by NAAC with 'B' Grade
FOUNDERS DAY CELEBRATIONS
Estd. 1879
2nd March, 2026

Dr. P.V.G. RAJU
D.Litt.
(1924 - 1995)
Founder
MANSAS


MAHARAJAH VIJAYARAMA GAJAPATHI RAJU - III
Founder, M.R. College

Dr. P. ANAND GAJAPATHI RAJU
Ph.D.
(1950 - 2016)
Former Chairman
MANSAS

Presentation of Merit Scholarships and Medals to the Students at 10.00 AM
"Abhinava Andhrabhoja Maharaja Anand Gajapathi Raju Auditorium, Moti Mahal, Fort"


Sri P. ASHOK GAJAPATHI RAJU
Hon'ble Governor, State of GOA & Chairman, MANSAS

CORRESPONDENT, PRINCIPAL, STAFF & STUDENTS

వైభవంగా సామూహిక పూజలు

గజపతినగరం, న్యూస్‌టుడే: స్థానిక సీతారామ ఆలయ ప్రాంగణంలో ఆదివారం సామూహిక మణిదీప వర్ణన పూజలు వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన గొల్లపేరంటాల జాతర

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మెట్టపల్లిలో నాలుగు రోజులుగా జరుగుతున్న గొల్లపేరంటాల అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. దీనిలో భాగంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంపడాపు రామ్మూర్తినాయుడు ఆధ్వర్యంలో శనివారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ ప్రాంగణం జనసందోహంగా మారింది. ఆదివారం రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు.

విద్యార్థులూ.. ఉపాధ్యాయులవుతారా

న్యూస్‌టుడే- రాజాం పట్టణం

ఇంటర్మీడియట్ పూర్తిచేసిన, పూర్తికావస్తున్న విద్యార్థులకు జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి చక్కటి అవకాశం కల్పిస్తోంది. నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ ఉపాధ్యాయ విద్యా కార్యక్రమం (ఐటీఈపీ) అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనికోసం ఎన్‌టీఏ విడుదల చేసే జాతీయ సాధారణ ప్రవేశ పరీక్ష (ఎన్‌సీఈటీ) రాయాల్సి ఉంటుంది. దీనిలో మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలనుకున్న యువతీ, యువకులకు ఇదో మంచి అవకాశం.

ఇంటిగ్రేటెడ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

- ★ ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ప్రస్తుతం రెండో ఏడాది చదువుతున్న విద్యార్థులు అర్హులు.
- ★ దరఖాస్తుకు చివరి తేది: మార్చి 10
- ★ వెబ్‌సైట్: ncet@nta.ac.in, www.nta.ac.in
- ★ ప్రవేశ పరీక్ష కేంద్రాలు: విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, విజయవాడ, తిరుపతి, అనంతపురం, కర్నూలు
- ★ తెలుగులో పరీక్ష రాయొచ్చు

మన పరిధిలో కోర్సు అందుబాటులో ఉన్న కళాశాలలు

- ★ ఎంఆర్ కళాశాల విజయనగరం : **బీఎస్సీ, బీఈడీ**
- ★ సీట్లు: **50** ★ డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం జిల్లా : **బీఏ, బీఈడీ, బీఎస్సీ, బీఈడీ**
- ★ మొత్తం సీట్లు : **100**
- ★ మరింత సమాచారం కోసం సంప్రదించాల్సిన నంబర్: 98492 52910, ఎన్.శ్రీనివాస్, కోర్సు కోఆర్డినేటర్, డా.బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

రామభద్రపురం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన రామభద్రపురం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బాడంగి మండలం వాడాడ గ్రామానికి చెందిన కళ్లూరి భైరాగి(84) కొన్నిరోజులుగా మెంటాడ మండలం కుంటినవలసలోని పెద్ద కుమార్తె అప్పలనరసమ్మ వద్ద ఉంటున్నారు. కుమారుడి వద్దకని ఆదివారం స్వగ్రామానికి నడిచి వెళ్తుండగా.. రామభద్రపురం మండలం ఆరికతోట వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, వాహనం కోసం గాలిస్తున్నామని హెచ్‌సీ సత్యనారాయణ తెలిపారు.

వృద్ధురాలిపై హత్యాయత్నం

తేరేజమ్మ

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, బెలగాం, న్యూస్‌టుడే: ఇంటి గడపలో నిద్రిస్తున్న వృద్ధురాలిపై గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నం చేశారు. రాయితో తలపై మోది, పింఛను నగదు దోచుకెళ్లిన ఘటన పార్వతీపురం మండలంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల వివరాల మేరకు.. కృష్ణపల్లి గ్రామానికి చెందిన తేరేజమ్మ ఒంటరిగా ఉంటున్నారు. పెద్ద కుమారుడు ఏళ్ల క్రితమే ఇంటి నుంచి వెళ్లిపోగా.. చిన్న కుమారుడు కొన్నాళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్య, పిల్లలు ఉన్నారు. వృద్ధురాలి కుమార్తె తవిటమ్మ పక్కవీధిలో ఉంటున్నారు. శనివారం రాత్రి 7 గంటలకు కుమార్తె భోజనం తీసుకురాగా. . తిని నిద్రపోయింది. ఆదివారం ఉదయం అల్లుడు టీ పట్టుకుని వచ్చేసరికి రక్తపు మడుగులో అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం విజయనగరం తీసుకెళ్లారు.

డబ్బుల కోసమా.. మరేదైనా కారణమా?: పింఛను సొమ్ము రూ.4 వేల కోసం మద్యం, గంజాయికి అలవాటు పడిన వారెవరైనా ఇలా చేసి ఉండొచ్చని తెలుస్తోంది. ఆగంతకులు హత్య చేసేందుకు ఉపయోగించిన కాంక్రీటు రాయి, మంచం కింద రక్తం మరకలు సమీపంలో ఉంటున్న కుటుంబ సభ్యులే శుభ్రం చేయడం.. మరిన్ని సందేహాలకు తావిస్తోంది. తవిటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంగనాథం, ఎస్సై రాజేష్ తెలిపారు.

EENADU Classifieds

REAL ESTATE
PLOT FOR SALE
200 Sq.yd site near Likhitha gardens (Gollalapeta (back side of KVR gated community) open for sale for immediate buyers. ✆ 9959222542.

JOBS
ప్రముఖ ఇన్స్యూరెన్స్ కంపెనీలో పనిచేయుటకు మండలానికి ఒక అధికారి కావలెను. జీతం రూ: 20,000/- Cell: 9494684846

బుక్ డిస్ట్రిబ్యూటర్స్ కొరకు నో పెట్టుబడి మీ ఏరియాలో ప్రైవేట్ స్కూల్స్ పరిచయం & అనుభవమున్న వారికి ప్రాధాన్యత. ఉమా పబ్లిషర్స్, Guntur. ✆ 98493 70729.

ADMS ఎలక్ట్రికల్ వెహికల్ మార్కెటింగ్ చేయుటకు (MLM లీడర్స్ LIC ఆగ్రోల్ట్) టీం లీడర్స్ కావలెను. జీతం 20K+ ఇన్సెంటివ్స్. ✆ 8897221102.

ఆర్మీ NAVY ఎయిర్‌ఫోర్స్ రైల్వే, బ్యాంకులలో ఉద్యోగావకాశాలు. అర్హత:10th-డిగ్రీ. Age:16-25. శిక్షణ 3నెలలు శిక్షణతోపాటు హాస్టల్ ఉచితం 10th, ఇంటర్, డిగ్రీ డిస్టెన్స్ కోర్సులు కలవు.* ముందుగా ఎటువంటి ఫీజులేదు * క్రిస్టియన్ డిఫెన్స్ అకాడమీ, వైజాగ్. 9121232328.

MARKETING/ SALES
విజయనగరంలో పని చేసేందుకు లేడీ స్టాఫ్ కావలెను. జీతం: 15000/ రియల్ ఎస్టేట్ వారికి ప్రాధాన్యత. స్వర్ణ: 9908224693

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

బొబ్బిలి

● బొబ్బిలి ● రాజాం ● గజపతినగరం ● చీపురుపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? గోపాలపురానికి వెళ్లే రహదారిలో చెరువు పక్కన చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. - **స్థానికులు** ● తొలగింపజేస్తాం. - **ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** – రాజాం పట్టణం

? వి.చిన్నయ్యపేటలోని ప్రధాన రహదారి పక్కన చెత్త పేరుకుపోయింది. - **స్థానికులు** ● చర్యలు తీసుకుంటాం. - **ఆర్.నీలిమ, డిప్యూటీ ఎంపీడీవో** – న్యూస్‌టుడే, తెర్లాం

? కంచరాం ఉన్నత పాఠశాల దారి పక్కన వ్యర్థాలు పడేస్తున్నారు. - **విద్యార్థుల తల్లిదండ్రులు** ● తొలగింపజేస్తాం. - **శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో** – రాజాం గ్రామీణం

? గంట్యాడ మంచినీటి పథకం వాల్వ్ గోతిలో మురుగునీరు చేరింది. - **స్థానికులు** ● చర్యలు తీసుకుంటాం. - **విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో** – గంట్యాడ గ్రామీణం

? దేవుపల్లి నుంచి కనిమెరక మీదుగా బొండపల్లి రహదారికి ఇరువైపులా బెర్ములు పాడయ్యాయి. - **చోదకులు** ● ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. - **జి.గిరిబాల, ఎంపీడీవో** – న్యూస్‌టుడే, బొండపల్లి

అంగన్‌వాడీలకు అండగా ప్రభుత్వం

చీపురుపల్లి, గ్రామీణం, బొబ్బిలి: అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, బేబీనాయన అన్నారు. ఈ మేరకు ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండుసార్లు వేతనాలు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

బాణసంచా యూనిట్ తనిఖీ

బాడంగి, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లాలోని బాణసంచా తయారీ యూనిట్‌లో భారీ ప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో బాడంగి మండలం ఎరుకులపాకలు గ్రామంలోని అమ్మ భగవాన్ ఫైర్ వర్క్స్ యూనిట్‌ను బొబ్బిలి రూరల్ సీఐ శ్రీనివాస్ ఆదివారం తనిఖీ చేశారు. లైసెన్స్ కాలపరిమితి, సేఫ్టీ పరికరాలు, ఫైర్ అలారం పనితీరు పరిశీలించారు. సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. యాజమానికి పలు సూచనలు చేశారు.

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో ఆదివారం కూరగాయల ధరలు (కిలో రూ.లలో).. ● టమాటా: 10 ● వంకాయలు: 20 ● దొండ: 30 ● బీర: 50 ● బెండ: 50 ● కాకర: 50 ● చిక్కుడు: 30 ● ఆనపకాయ (ఒకటి): 26 ● అరటి (జత): 22 ● మునగ కాయలు: 80 ● ఉల్లి: 25 ● బంగాళదుంపలు: 20 ● అల్లం: 80 ● వెల్లుల్లి: 100 ● పచ్చిమిర్చి: 70 ● క్యాబేజీ: 20 ● క్యారెట్: 42 – న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

★ ఎస్‌వీసీ సీతారామా: **విష్ణు విన్యాసం** ★ ఎస్‌వీసీ సీతారామా: **సన్ ఆఫ్** ★ ఎస్‌వీసీ అప్సర: **మన శంకరవరప్రసాద్‌గారు** – న్యూస్‌టుడే, రాజాం

★ లక్ష్మీ థియేటర్: **కపుల్ ఫ్రెండ్లీ** ★ వాసవి: **హే బల్వంత్** ★ టీబీఆర్ స్క్రీన్-1: **మన శంకరవరప్రసాద్‌గారు** ★ టీబీఆర్ స్క్రీన్-2: **విష్ణు విన్యాసం** – న్యూస్‌టుడే, బొబ్బిలి

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

● విస్తరణకు నోచుకోని రహదారులు
● ప్రయాణికులకు తప్పని తిప్పలు

న్యూస్‌టుడే– సంతకవిటి

గ్రామాలను పట్టణాలతో అనుసంధానించే ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారులు ఏళ్లతరబడి అభివృద్ధికి నోచుకోవడంలేదు. రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగించే మార్గాలను విస్తరించడంలేదు. ఇరుకు రోడ్లు, మలుపులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా పట్టించుకొని అవస్థలు తీర్చాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

రాజాం- సంతకవిటి- పొందూరు, రాజాం- వంగర- పార్వతీపురం రహదారుల్లో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిని రెండు లైన్లుగా మార్చాల్సి ఉంది.

నిధులు వెనక్కి వెళ్లాయ్..

సంతకవిటి- రాజాం రహదారి 14 కి.మీల పొడవున ఉంది. దీన్ని రెండు లైన్లుగా మార్చేందుకు 2013లో ప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల సమయంలో చేసిన పొరపాట్లతో గుత్తేదారులు కోర్టును ఆశ్రయించారు. సకాలంలో పనులు చేపట్టకపోవటంతో నిధులు వెనక్కి వెళ్లాయి.

సంతకవిటి- రాజాం ప్రధాన రహదారిలో బొద్దూరు- పొనుగుటివలస గ్రామాల మధ్య ఫిబ్రవరి 4న ఆటో, పాలవ్యాన్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చీపురుపల్లికి చెందిన 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ● ఇదే దారిలో తాలాడ- ఎస్.రంగరాయపురం మధ్య ఓ మలుపు వద్ద గతేడాది ఏప్రిల్‌లో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదు.

సంతకవిటి- పొందూరు రహదారిలో మిర్తివలస సమీపంలోని ఓ మలుపు వద్ద రెండేళ్ల కిందట నడుచుకుంటూ వెళ్తున్న మంతిన గ్రామానికి చెందిన వ్యక్తిని ట్రాక్టరు ఢీకొట్టింది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందారు. కుటుంబం వీధిన పడింది.

సంతకవిటి- రాజాం ప్రధాన రహదారిలో ఎదురెదురుగా వాహనాలు వస్తే ఇలా ఆగిపోవాల్సిందే..

ప్రతిపాదనలు పంపించాం..

సంతకవిటి- రాజాం, సంతకవిటి- పొందూరు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారులను రెండు లైన్లుగా మార్చేందుకు రూ.55 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే విస్తరణ పనులు చేపడతాం. ★ రాజాం- వంగర, వంగర- పార్వతీపురం మార్గాల విస్తరణ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– సతీష్‌కుమార్, నాగభూషణం, ర.భ.శాఖ ఏఈలు, సంతకవిటి, రాజాం

● సంతకవిటి- పొందూరు రహదారి 17 కి.మీల పొడవున ఉంది. రెండు లైన్లుగా మార్చేందుకు 2022లో రూ.45 కోట్లు మంజూరు చేశారు. వైకాపా హయాంలో గుత్తేదారులు ముందుకురాలేదు. దీంతో నిధులు వెనక్కి పోయాయి.

మహిళలు శక్తి స్వరూపులు

ర్యాలీలో డీఎస్పీ రాఘవులు తదితరులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: మహిళలకు సహనం, ఓపిక ఎక్కువని, వారు శక్తి స్వరూపులని డీఎస్పీ రాఘవులు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఆదివారం చీపురుపల్లి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారోత్సవాలు ఈనెల 8 వరకు కొనసాగుతాయన్నారు. సీఐ శంకరరావు, ఎస్సై దామోదరరావు పాల్గొన్నారు. ● **బొబ్బిలి:** బొబ్బిలిలో వేణుగోపాలస్వామి ఆలయ కూడలి నుంచి పట్టణ పురవీధుల మీదుగా ర్యాలీ సాగింది. సీఐ నారాయణరావు, ఎస్సైలు జ్ఞానప్రసాద్, రమేష్, మానవ హక్కుల సంఘ ప్రతినిధి గోన మానస పాల్గొన్నారు. ● **రాజాం:** మహిళలపై వేధింపులు, దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఉమావెంకటేశ్వరరావు అన్నారు. రాజాంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

దాడితల్లి ఉత్సవాల తేదీలు ఖరారు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి ప్రాంతవాసుల ఇలవేల్పు దాడితల్లి ఉత్సవాలు ఏప్రిల్ 27 నుంచి నిర్వహించేందుకు గ్రామ పెద్దలు ఆదివారం నిర్ణయించారు. 27న తొలేళ్ల, 28న సిరిమానోత్సవం, 29న అనుపోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం అమ్మవారిని గ్రామంలోకి మేళతాళాలతో తీసుకురానున్నారు. నేటి నుంచి ఉత్సవాల వరకు గ్రామంలో ఘటాలను ఊరేగిస్తారు. దీంతోపాటు పాతబొబ్బిలి సరేపోలమ్మ ఉత్సవాలు జరగాల్సి ఉంది. ఇంకా ఆ గ్రామపెద్దలు తేదీలు ఖరారు చేయలేదు.

ప్రజలు తాగేది విషమే..!

గజపతినగరం మండల కేంద్రంలోని శివాలయం పక్కన మంచినీటి పైపులైను డ్రైనేజీ మధ్యలో అధ్వానంగా దర్శనమిస్తోంది. చుట్టూ వ్యర్థాలు పేరుకుపోయి దారుణంగా ఉంది. పైపులైనుకు ఏ మాత్రం రంధ్రం పడినా నీరు కలుషితమై.. ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశముంది. తీవ్ర నష్టం కలిగే ప్రమాదముందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఇన్‌చార్జి కార్యదర్శి జగదీష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, గజపతినగరం

ఆరుబయట వంట.. నిర్వాహకులకు తంటా

మెరకముడిదాం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు, గ్యాస్ సరఫరా లేక వారు బయటే వంటలు చేస్తున్నారు. వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నిర్వాహకులు వాపోతున్నారు. బిల్లలవలస ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల సమీపంలో, గర్భాం ఉన్నత పాఠశాలలో మంచినీటి ట్యాంకు కింద వంటలు చేయాల్సిన దుస్థితి. సోమలింగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 200 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడా అదే పరిస్థితి. విషయం ఎంఈవో చంద్రశేఖర్ వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, మెరకముడిదాం

భవనం ఎప్పటికి పూర్తిచేస్తారో

గంట్యాడ మండలం వసంత గ్రామంలో అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా ఉంది. [illegible] శాతం పనులు పూర్తి కావచ్చిన.. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ఆగిపోయింది. ప్రస్తుతం సమీపంలోని ఇరుకైన అద్దె గదిలో కేంద్రం నిర్వహిస్తున్నారు. నరవ గ్రామంలోనూ ఇదే దుస్థితి. ఇప్పటికైనా స్పందించి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. విషయం గంట్యాడ ఐసీడీఎస్ సీడీపీవో ఉమా భారతి వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు నివేదించామని, త్వరలో పనులు పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

చెరువు కాదు.. రహదారే

ఈ చిత్రంలో కనిపిస్తున్నది సంతకవిటి- రాజాం ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారి. మడ్డువలస కాలువల ద్వారా సాగుభూములకు నీరందిస్తుండగా, వాడుకున్నంత వాడుకుని మిగతాది వృథాగా విడిచిపెడుతున్నారు. గరికిపాడు గ్రామంలో మిగులు నీరు ఇలా రోడ్డుపైకి వచ్చి చెరువును తలపిస్తోంది. నిత్యం నిల్వ ఉంటుండడంతో రహదారి గోతులమయంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరిస్తామని ర.భ.శాఖ ఏఈ సతీష్‌కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, సంతకవిటి

ఆదమరిచి వెళ్తే ఆపదే

రాజాం పట్టణం పరిధి మాదిగవీధిలోని వార్డు సచివాలయానికి వెళ్లే తోవలో రోడ్డు ఓ పక్కన విరిగిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. రాత్రివేళల్లో ఏ మాత్రం ఆదమరిచి వెళ్లినా ప్రమాదం జరిగే అవకాశముందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. సమస్యను కమిషనర్ రామచంద్రరావు వద్ద ప్రస్తావించగా.. చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

ఆక్రమిస్తున్నా.. అడగరే?

బొబ్బిలి మండలం గోపాలరాయుడుపేట పంచాయతీ వెంకటరాయుడుపేటలో చెరువును ఆక్రమించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. మట్టి తీసుకొచ్చి చెరువులో వేసి చదును చేయడానికి సిద్ధం చేశారు. ఇటీవల విషయం తెలుసుకున్న వీఆర్వో వెళ్లి అడ్డుచెప్పడంతో ఆపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే చెరువులు, బందలు ఆక్రమణకు గురయ్యాయి. అలజంగి, పిరిడి, కోమటిపల్లి, కలవరాయి, పారాది తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది. అయినా అధికారుల్లో చలనం లేదు.

చెరువులో మట్టి వేశారిలా..

– న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

అక్రమార్కుల ఆగడాలకు అంతులేకుండా పోతోంది. చెరువు, కాలువ దేన్నీ వదలడంలేదు. అన్నింటినీ ఆక్రమించేస్తున్నారు. పంట పొలాలకు సాగునీరు అందించే చెరువులను కబ్జా చేస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతోనే ఇదంతా జరుగుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డుకున్నాం..

వెంకటరాయుడుపేటలోని చెరువును ఆనుకుని ఉన్న 50 సెంట్ల భూమిని 40 ఏళ్లుగా సాగుచేసుకుంటూ జీవనం సాగించానని, కొన్ని కారణాలతో రెండేళ్లుగా వదిలేశానని, ఇప్పుడు మళ్లీ సాగుచేస్తానని వెంకటరాయుడుపేటకు చెందిన మహిళ తెలిపారని వీఆర్వో పోలబాబు చెప్పారు. చెరువులో సాగు చేయడానికి వీల్లేదని అడ్డుకుని, తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఇకపై ఇలా జరగకుండా చూస్తామని చెప్పారు.

దుర్భాషలాడడం సరికాదు

వంగర: గత ప్రభుత్వ హయాంలోని తప్పిదాలే భూసమస్యలకు ప్రధాన కారణమని తెదేపా మండలాధ్యక్షుడు పి.మోహన్‌రావు అన్నారు. ఆదివారం వంగరలో విలేకరులతో మాట్లాడారు. శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో వైకాపా నాయకులు రెవెన్యూ అధికారులపై దుర్భాషలాడడం సరికాదన్నారు. నాయకులు ఎల్.కృష్ణమూర్తి, ఎం.గణపతి తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ ఆలయంలో చోరీ

గంట్యాడ గ్రామీణం: మధుపాడ బంగారమ్మ ఆలయంలో హుండీ చోరీకి గురైన ఘటన ఆదివారం వెలుగుచూసింది. శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి హుండీని పగులగొట్టి సుమారు రూ.10 వేలు ఎత్తుకెళ్లాడు. అమ్మవారి విగ్రహం చేతులు విరిగాయి. అక్కడ లభించిన నిందితుడి ఫోన్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

ఉపాధి లేక వలసలు

బొబ్బిలి: స్థానికంగా ఉపాధి లేక బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల నుంచి చాలామంది కూలీలు వలస వెళ్లిపోతున్నారని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు శంకరరావు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.గోపాలం అన్నారు. ఆదివారం పెద్దఎత్తున కూలీలు వెళ్లిపోతుండడాన్ని గమనించారు. బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో వారితో మాట్లాడారు.

కనకమహాలక్ష్మి మారు జాతర

చీపురుపల్లి: చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి మారు జాతర ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పంచామృతాభిషేకం చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గవిడి నాగరాజు, ఈవో ఎస్.నానాజీబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నీలగిరి తోటలో అగ్నిప్రమాదం

గజపతినగరం: గుడివాడ గ్రామంలో నడిమింటి గాంధీకి చెందిన నీలగిరి తోటలో గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం చుట్ట పడేయడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. చెట్లు కాలిపోయాయి. గజపతినగరం అగ్నిమాపక శాఖ సిబ్బందితో మంటలను అదుపుచేశారు. రూ.15 వేల ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

సైన్స్ ప్రదర్శనలో సత్తా

రాజాం గ్రామీణం: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శనివారం కంచరాం సృజన విద్యాలయంలో పోటీలు నిర్వహించారు. కంచరాం ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి వచ్చింది. ఆదివారం రూరల్ సీఐ ఉపేంద్ర చేతుల మీదుగా రూ.5 వేలు నగదు అందించారు.

వైద్య శిబిరాలతో మేలు

రాజాం: మెంటిపేట సత్యసాయి సుందరం మందిరంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 125 మందికి పరీక్షలు చేశారు. ★ **రామభద్రపురం:** ఎనుబొరువు గిరిజన గ్రామంలో ట్రైబల్‌రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

చీపురుపల్లి ఆర్డీవోగా సుధారాణి

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి ఆర్డీవోగా ఎం.సుధారాణి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జీవీ సత్యవాణి ఏలూరు జిల్లా భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్‌గా ఇటీవల బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా డీఆర్డీఏ పీడీగా పనిచేస్తున్న సుధారాణిని ప్రభుత్వం నియమించింది. ఆదివారం రాజాంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే కళా వెంకటరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

చిన్నారులు ఆకట్టుకున్నారు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని టిన్నీటాట్స్ ప్రీ ప్రైమరీ పాఠశాలలో ఆదివారం సైన్స్ దినోత్సవ వేడుకలు జరిగాయి. సుమారు 150 ప్రాజెక్టులను చిన్నారులు తయారు చేశారు. కాలుష్య కారకాలను తెలియజేసే నమూనాలు, హైడ్రాలిక్ వంతెనల ఉపయోగం, సూర్య మండలం పనితీరు, ఇస్రో నమూనాలు, రోబోలు పనిచేసే విధానం తదితర ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ప్రిన్సిపల్ పి.స్రవంతి చిన్నారులను అభినందించారు.

విద్యార్థినుల ప్రతిభ

పతకం అందుకుంటున్న నిహారిక

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి హిందీ సేవాసదన్ పరీక్షల్లో గంట్యాడ మండలం కొటారుబిల్లి కేజీబీవీ, నరవ జ్యోతిబా పులే గురుకుల పాఠశాలల విద్యార్థినులు నిహారిక, చిన్ని వెండి, రజత పతకాలతో సత్తాచాటారు. ఆదివారం రణస్థలంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర సహకార, భూవిజ్ఞాన మంత్రిత్వశాఖ సలహాదారు ఎస్.గైబువల్లి చేతులమీదుగా ప్రశంసాపత్రాలు, పురస్కారాలు అందుకున్నారు. హెచ్ఎంలు జ్యోతి, రమణమ్మ బాలికలను అభినందించారు.

రైళ్లకు హాల్ట్ కల్పించాలని వినతి

ఎంపీ కలిశెట్టికి వినతిపత్రం అందజేస్తున్న గోవిందరాజులు, తదితరులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లకు హాల్ట్ సదుపాయం కల్పించాలని మానవీయత సంస్థ వ్యవస్థాపకుడు బీవీ గోవిందరాజులు కోరారు. ఈ మేరకు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నాలుగు నియోజకవర్గాల ప్రజలకు ఈ స్టేషనే దిక్కని తెలిపారు. రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ అన్నారు. కె.త్రిమూర్తులరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి సాయం.. రాజాం: పోలిపల్లి పైడితల్లి జాతరలో మందుగుండు నిప్పు పడి గాయపడిన డోలపేట గ్రామానికి చెందిన శ్రీదేవికి ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ రూ.25 వేలు సహాయం చేశారు. తెదేపా నాయకులు గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, శాశపు రమేష్‌కుమార్ ఆదివారం బాధితురాలి ఇంటికి వెళ్లి నగదు అందజేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాట్లాడుతున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి

గుర్ల, న్యూస్‌టుడే: జనసేన కార్యకర్తలు అధైర్య పడొద్దని, అండగా ఉంటామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. ఆదివారం రాత్రి గుర్లలో జనసేన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జనసేన నేత సారిక రాము అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడారు. ప్రజాసమస్యలే ధ్యేయంగా అధినేత పవన్‌కల్యాణ్ చేసిన పోరాటాన్ని ఎవరూ మర్చిపోలేరన్నారు. గత ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను నిర్లక్ష్యం చేస్తే డిప్యూటీ సీఎం కేంద్రంతో మాట్లాడి రూ.23 వేల కోట్లు తెచ్చారన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో రహదారి సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. మాజీ మంత్రి పడాల అరుణ, జనసేన నాయకులు లోకం ప్రసాద్, అవనాపు విక్రమ్, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటికెళ్లి పింఛను ఇచ్చారు

రాజాం పట్టణం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని మాదిగవీధి పరిధిలో 80 ఏళ్ల వృద్ధురాలిని శనివారం పింఛను కోసం వార్డు సచివాలయానికి రప్పించారు. దీనిపై ఆదివారం 'ఈనాడు'లో 'కదల్లేకున్నా.. సచివాలయానికి రావాల్సిందేనా' శీర్షికన వార్త ప్రచురితమైంది. పురపాలిక కమిషనర్ రామచంద్రరావు స్పందించారు. సచివాలయ సిబ్బందిని ఆమె ఇంటికి పంపించి పింఛను అందజేశారు.

ఈనాడు కథనానికి స్పందన

రూ.56 లక్షలు మంజూరు

గుర్ల, న్యూస్‌టుడే: గుర్లలోని ఎమ్మార్సీ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాల సమయంలో నీరు కారిపోయేది. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవడంతో రూ.56 లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం భవనం పనులు జోరుగా సాగుతున్నాయి. త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఎస్ఏ ఏఈ రమణ తెలిపారు.

ఘనంగా మజ్జిగౌరమ్మ పండగ

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: పెదమానాపురంలో ఆదివారం మజ్జిగౌరమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి పెద్దఎత్తున వచ్చారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పంచాయతీలకు చెత్త తరలింపు వాహనాలు

మెరకముడిదాం, న్యూస్‌టుడే: స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో చెత్త సేకరణకు 20 రిక్షాలను కేటాయించారు. వీటిని త్వరంలో పంచాయతీలకు అందజేస్తామని ఈవోపీఆర్డీ శ్రీరాములనాయుడు ఆదివారం తెలిపారు.

రహదారి నిర్మాణంపై హర్షం

రేగిడి, న్యూస్‌టుడే: రేగిడి మండలం దేవుదళ పంచాయతీ గోపంపేట గ్రామానికి సరైన రహదారి లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ స్పందించి రూ.44 లక్షలు మంజూరు చేయించారు. కి.మీ మేర రోడ్డు నిర్మించేలా కృషి చేశారు. దీంతో గ్రామస్థులు ఆదివారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

వార్డు మూడు.. సమస్యలు బోలెడు

న్యూస్‌టుడే- బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలోని మూడో వార్డు ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. తాగునీరు, విద్యుత్తు, కాలువలు తదితర సమస్యలు ఏళ్ల తరబడి వేధిస్తున్నాయి. చాలా వీధులకు రహదారులు లేవు. మురుగునీటి కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. డ్రైనేజీ వద్దనే తాగునీరు పట్టుకోవాల్సిన దుస్థితి. మూడో వార్డును దశలవారీగా అభివృద్ధి చేస్తామని పురపాలిక కమిషనర్ రామలక్ష్మి తెలిపారు. ఇప్పటికే పలు పనులకు నిధులు కేటాయించామన్నారు. మిగిలినవి గుర్తించి, కౌన్సిల్ ఆమోదంతో ప్రతిపాదనలు తయారు చేస్తామన్నారు.

ఇక్కట్లు ఇవీ.. ● బండారు వీధిలో ఇనుప విద్యుత్తు స్తంభాలు తొలగించి సిమెంటుతో తయారుచేసినవి వేయాలి. ● రెల్లి వీధిలో సీసీ రోడ్డు, తాగునీటి పైపులైన్లు లేవు. ● సంఘం వీధిలో కాలువలు శుభ్రం చేసి, ఎత్తు పెంచాలి. ● చాకలివీధిలో నిధులు సరిపోక సీసీ రహదారి సగం వరకే వేశారు. మిగిలిన దారిని పూర్తిచేయాలి. ● విశాల్ మార్టు వెనుక ప్రధాన రహదారి, డ్రైను లేవు. సమీపంలో పాఠశాల ఉంది. విద్యార్థులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. ● బాపూజీ పాఠశాల స్థలంలో అంబేడ్కర్ సామాజిక భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ● పలు వీధుల్లో బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. పబ్లిక్ కుళాయిలు డ్రైన్లలో ఉన్నాయి.

ఆకులరెల్లి వీధిలో కాలువ వద్దనే తాగునీరు

● పురపాలక సంఘం: బొబ్బిలి ● వార్డు: 3 ● నివాస గృహాలు: 650
● జనాభా: 4 వేలు ● ప్రాంతాలు: బండారు, ఆకులరెల్లి, సంగం, చాకలి వీధులు

(c) eenadu

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	70959 54646

?: గాయత్రీనగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. - **జగదీశ్వరరావు, స్థానికుడు** ✦ సిబ్బందితో బాగు చేయిస్తాం. - **స్రవంతి, ఏఈ**

?: గౌతమీనగర్‌లో రహదారి అధ్వానంగా ఉంది. - **ఎ.వెంకటరావు, కాలనీవాసి** ✦ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - **కె.బాలస్వామి, కమిషనరు** ?: పూల్‌బాగ్ హనుమాన్ నగర్‌లో వారం రోజుల నుంచి తాగునీరు సక్రమంగా రావడం లేదు.- **రాజు, ప్రభుత్వ ఉద్యోగి** ✦ వెంటనే సరఫరా సాగేలా చూస్తాం.- **రవి, ఏఈ, నగరపాలక సంస్థ** ?: పూల్‌బాగ్ సాయినగర్‌లో పన్నులు కడుతున్నా కుళాయిల నుంచి నీరివ్వడం లేదు.- **స్థానికులు** ✦ పరిశీలించి, నీరందేలా చూస్తాం.- **బి.నరసింహారెడ్డి, డీఈఈ** –న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

? గుంకలాం శివారు ప్రాంతాల్లో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. - **స్థానికులు** ✦ కార్మికులతో శుభ్రం చేయిస్తాం. - **శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ** ? కోరుకొండలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. దోమలు విజృంభిస్తున్నాయి. - **స్థానికులు** ✦ కార్మికులతో శుభ్రం చేయిస్తాం.- **శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ**
– న్యూస్‌టుడే, విజయనగరం గ్రామీణం

వెలుగులొచ్చాయ్

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: నగరంలోని ఫోర్టుసిటీ దారి, గురజాడ దారి, లక్ష్మీగణపతి కాలనీ, కొత్తపేట కుమ్మరివీధి, పట్టణ ఆరోగ్య కేంద్రం, వైఎస్సార్ నగర్ ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను డీఈఈ రత్నాకర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి బాగు చేయించారు.

తెరపై ఈనాడు

✦ ఎన్సీఎస్: **అతడు** ✦ శ్రీకృష్ణ: **కపుల్ ఫ్రెండ్లీ** ✦ ఆదిత్య: **సన్ఆఫ్, దరైజ్ ఆఫ్ అశోక** ✦ లీలామహల్: **విష్ణు విన్యాసం** ✦ రంజనీ స్క్రీన్-1: **విష్ణు విన్యాసం** ✦ శివరంజనీ స్క్రీన్-2: **ఉత్తుత్త హీరోలు, సన్ఆఫ్, మన శంకరవరప్రసాద్‌గారు** ✦ హిమగిరి: **మన శంకరవరప్రసాద్‌గారు** ✦ సప్తగిరి: **హేయ్ బల్వంత్**
– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

పూల్‌బాగ్ మారుతీ ధ్యానమందిరంలో పూజలు

వేణుగోపాలుడికి తులాభారం వేస్తున్న వేదపండితులు

వేడుకగా రామయ్య పట్టాభిషేకం

కంటోన్మెంట్, జామి, కొత్తవలస: విజయనగరంలోని పూల్‌బాగ్ శ్రీమారుతీ ధ్యానమందిరంలో ఆదివారం సీతారాముల పట్టాభిషేక మహోత్సవం ఘనంగా జరిగింది. వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 30 రోజుల పాటు రామాయణ పారాయణం చేశారు. ● పుష్పగిరి వేణుగోపాల ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి తులాభార సేవ వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం బెల్లంతో తూకం వేశారు. జామి యల్లారమ్మ జాతర ముగిసిన సందర్భంగా ఉత్సవ సేవా కమిటీ, ఈవో ప్రసాదరావు ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే లలితకుమారి పాల్గొని వడ్డించారు. ● మంగళపాలెంలో భూలోకమాంబ పండగ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం పూజలు, సాయంత్రం ఘటాల ఊరేగింపు నిర్వహించారు.

కొత్తవలస: రామాలయం నుంచి ఘటాలతో భక్తుల ఊరేగింపు

నగరం.. పద్మవ్యూహం

అస్తవ్యస్త ట్రాఫిక్‌తో ప్రజలకు చిక్కులు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో అస్తవ్యస్త ట్రాఫిక్ ప్రజలకు పద్మ వ్యూహాన్ని తలపిస్తోంది. ప్రధాన కూడళ్ల వద్ద నిత్యం నరకం చూస్తున్నారు. వై కూడలి, గంట్యాడ, గజపతినగరం, డెంకాడ రోడ్డు, కొత్తపేట నీళ్ల ట్యాంకు దారి, దాసన్నపేట రైతు బజారు కూడలిలో ఇదే పరిస్థితి. భోగాపురం ఎయిర్‌పోర్టు వచ్చాక రద్దీ మరింత పెరగనుంది.

కొత్తపేట నీళ్ల ట్యాంకు కూడలి వద్ద అడ్డదిడ్డంగా వాహన రాకపోకలు

కొలిక్కిరాని విస్తరణ...

నగరంలో కొన్ని రహదారులు ఇప్పటికీ విస్తరణకు నోచుకోలేదు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఐస్‌ఫ్యాక్టరీ నుంచి చింతలవలస మీదుగా అయినాడ రహదారి విస్తరణ పనులకు రూ.28.50 కోట్లు మంజూరవడంతో అప్పటి కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు శంకుస్థాపన చేశారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక పనులు ఆపేయడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఈ దారిని నాలుగులైన్లతో నిర్మించడానికి రూ.75 కోట్లు, ఆరు లైన్లతో అయితే రూ.120 కోట్లు అవుతుందని ర.భ.శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికీ కొలిక్కి రాలేదు. ● కంటోన్మెంట్ గణేష్ కోవెల నుంచి సీఎంఆర్ కూడలి వరకు 60 అడుగుల విస్తరణకు రూ.7 కోట్లతో ప్రతిపాదించారు. మొత్తం 1500 మీటర్లకు గాను 1200 మీటర్ల మేర పూర్తయ్యాయి. ఇరువైపులా కాలువలు, మధ్యలో డివైడర్, రెండు వైపులా రోడ్డుపనులు పూర్తికావాల్సి ఉంది. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రైల్వే ఆస్తులకు సంబంధించి ప్రత్యామ్నాయ స్థలం చూపించాల్సి ఉంది. ఈ కారణంగా పనులు పూర్తికావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

చర్యలు తీసుకుంటాం..

నగరంలో గంటస్తంభం కూడలి, సిటీ స్టాండ్, నగర పాలక సంస్థ కార్యాలయ కూడలి, కన్యకాపరమేశ్వరి కోవెల, డాబా తోట, ఐస్‌ఫ్యాక్టరీ కూడలి, మూడు లాంతర్లు, కోట కూడలి తదితర ప్రాంతాల్లో రద్దీ విపరీతంగా ఉంటోంది. త్వరలో అధికారులతో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకుంటామని కమిషనరు బాలస్వామి అన్నారు.

వేపాడ - విశాఖ బస్సు ప్రారంభం

వేపాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం నుంచి సోంపురం మీదుగా విశాఖ ఆర్టీసీ కాంప్లెక్సుకు బస్సును ఎమ్మెల్యే లలితకుమారి, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ దన్ను దొర ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గ్రామాల నుంచి విద్య, వైద్యం, ఉపాధి నిమిత్తం విశాఖ వెళ్లే వారికి దీంతో ప్రయాణ కష్టాలు తీరుతాయన్నారు. అనంతరం బక్కునాయుడుపేటలోని అంబేడ్కర్ గురుకులం, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలను సందర్శించి వారి నుంచి వినతులు స్వీకరించారు. డీఎం సుదర్శనరావు, నాయకులు వెంకటరావు, వెంకటరమణ, రమణమూర్తి, భారతి పాల్గొన్నారు.

జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గ్రామాల్లో పోలీసుల ముమ్మర తనిఖీలు

కొత్తవలస: వేట్లపాలెంలో బాణసంచా పేలుడు నేపథ్యంలో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. కొత్తవలస మండలం చింతలదిమ్మ, రామలింగాపురం, దేవాడ గ్రామాల్లో సీఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. గతంలో బాణసంచా తయారీ కేసుల్లో పట్టుబడిన వారి ఇళ్లను పరిశీలించారు. అక్రమంగా ఎవరైనా పేలుడు సామగ్రి తయారుచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై జోగారావు పాల్గొన్నారు. ● భోగాపురంలో సీఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు పలు గ్రామాల్లో తనిఖీలు చేశారు.

చింతలదిమ్మలో పరిశీలిస్తున్న సీఐ షణ్ముఖరావు, సిబ్బంది

పేరుకుపోయిన వ్యర్థాలు

నగరపాలక సంస్థ పరిధిలోని మేజరు డ్రైన్లు, వరదనీటి కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. ప్రధాన మార్కెట్ ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. వర్షాల సమయంలో నీరు ముందుకు కదలక రోడ్లపైకి ఉప్పొంగుతోంది. గంటస్తంభం, నగరపాలక సంస్థ కార్యాలయం, సిటీ స్టాండ్, ప్రకాశం పార్కు, తదితర ప్రాంతాల్లో శుభ్రం చేయాల్సి ఉంది. దోమలు విజృంభిస్తున్నాయని, దుర్వాసన వస్తోందని ఆయా ప్రాంతాలవారు చెబుతున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తి తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

ధ్వంసమైన కల్వర్టులతో భయం

నగరంలో పలుచోట్ల కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. పలకలు లేక కొన్ని, ధ్వంసమై మరికొన్ని వాహనదారులను ఇబ్బంది పెడుతున్నాయి. స్థానిక మహారాజ ఆసుపత్రి దారి నుంచి రైతుబజారు, ఉడాకాలనీ, ఆదర్శనగర్ వైపునకు వెళ్లే మార్గంలో ముప్పు పొంచి ఉంది. ఏమాత్రం అదుపుతప్పినా నేరుగా కాలువలోకి వెళ్లిపోయే పరిస్థితి నెలకొంది. దీనిపై నగరపాలిక ఈఈ ప్రసాద్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పరిశీలించి, పలకలు ఏర్పాటు చేస్తామన్నారు.
– న్యూస్‌టుడ, విజయనగరం పట్టణం

అసంపూర్తి నిర్మాణంతో అవస్థలు

లక్కవరపుకోట మండలంలోని రంగరాయపురం గ్రామంలో రైతు సేవా కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో వివిధ పనులపై వచ్చే రైతులు, అధికారులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. గ్రామానికి గత ప్రభుత్వ హయాంలో రూ.21.8 లక్షలు మంజూరు కాగా, గతంలో ప్రారంభమైన భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. స్థానికులు కొందరు ఇందులోనే నివాసం ఉంటున్నారు. దీనిపై సహాయ ఇంజినీరింగ్ అధికారిణి వీరలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట

ఒరిగిన స్తంభం.. కూలితే ప్రమాదం

కొత్తవలస శివారు రామచంద్రపురం గ్రామానికి సమీపంలో పొలంలోకెళ్లేవారి కల్లాలకు వెళ్లే మార్గానికి ఆనుకుని ఉన్న విద్యుత్తు స్తంభంతో పాటు పొలంలో మరొకటి వాలిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. రామచంద్రపురానికి వెళ్లే రోడ్డు పక్కనే మరో రెండు వాలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు కూలిపోతాయోనని రైతులు, గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. త్వరలో నాలుగింటినీ మార్చేస్తామని ట్రాన్స్‌కో కొత్తవలస ఏఈ సూరిబాబు తెలిపారు.
– న్యూస్‌టుడే, కొత్తవలస

వంతెన నిర్మాణం ప్రారంభం

ఈనాడు కథనానికి స్పందన

కొత్తవలస, న్యూస్‌టుడే: మంగళపాలెం ప్రాంత ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న మేహాద్రి గెడ్డపై వంతెన, బీటీ రహదారి పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.కోటి అంచనాతో మంజూరైన ఈ పనులు తర్వాత వైకాపా పాలనలో గెడ్డపై కాంక్రీట్ పిల్లర్లు పూర్తయ్యాక బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఆగిపోయాయి. దీనిపై 'ఈనాడు'లో జనవరి 29న 'అప్పుడు ఆగింది.. ఇంకా కదలనంటోంది' శీర్షికతో ఇచ్చిన కథనంపై స్పందించిన ఎమ్మెల్యే లలితకుమారి కొత్తగా రూ.1.50 కోట్లు మంజూరు చేయించారు. స్లాబ్ వేయడానికి సెంటరింగ్ వేశారు. గ్రామం నుంచి కొత్తవలస-సబ్బవరం రోడ్డును కలుపుతూ మేహాద్రిగెడ్డ వద్దగల చర్చి వరకు 1.250 కిలో మీటర్లు ఉన్న రోడ్డుపై బీటీ వేసేందుకు వీలుగా ఎర్త్‌వర్క్ చేస్తున్నారు.

సమస్యలపై చర్చించాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: తమ సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని ఏపీటీఎఫ్- 1938, పొరుగు సేవల ఉద్యోగుల జేఏసీ నాయకులు డి.ఈశ్వరరావు, ఎన్.వి.పైడిరాజు, ఎ.వి.శ్రీనివాసరావు, మహేంద్రబాబు, శివకుమార్, డి.వెంకట్ కోరారు. ఆదివారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ● నగరంలోని 26వ డివిజన్‌లో ఉన్న సచివాలయాన్ని(31 నంబరు) మార్పు చేయాలని కోరుతూ తెదేపా నాయకులు అర్జీ ఇచ్చారు. ● 39వ డివిజన్ సైలాడ కాలనీ, అలకనంద కాలనీ, వివేకానంద కాలనీల్లో విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలని డివిజన్ ఇన్‌ఛార్జి కొర్నాన రాజ్యలక్ష్మి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

సత్తిబాబు నాగభూషణరావు లీల

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో ఈనెల 6 నుంచి 10 వరకు జరగనున్న జాతీయస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలకు వై.సత్తిబాబు(కొత్తవలస), ఎ.నాగభూషణరావు(బొబ్బిలి), ఎస్.లీల(నెల్లిమర్ల) ఎంపికైనట్లు పారా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.దయానంద్ తెలిపారు.

చురుగ్గా క్రాష్ ప్రోగ్రాం

3,837 బోర్లకు మరమ్మతులు

నియోజకవర్గంలో 216 ఓహెచ్ఆర్‌లు, 39 ఎంపీడబ్ల్యూఎస్ రక్షిత నీటి పథకాలున్నాయి. వీటి పరిధిలోని 340 ఆవాసాల్లో ఉన్న 3,837 బోర్లను తనిఖీ చేసి మరమ్మతులు చేయిస్తున్నాం. 45 రోజుల పాటు క్రాష్ కార్యక్రమం ఉంటుంది. ఇందుకు గానూ రూ.40 లక్షల విలువైన విడి సామగ్రి, పైపులు సిద్ధం చేశాం. బోరు సామాగ్రి, పైపులు వంటివి సిద్ధం చేశాం.

138 గ్రామాలకు...

మొత్తం సీపీడబ్ల్యూ పథకాల ద్వారా 138 గ్రామాలకు నీరందుతోంది. ఎస్.కోట పైలట్ ప్రాజెక్టుతో పాటు మామిడిపల్లి, జామి, భీమసింగి, అలమండ సీపీడబ్ల్యూ పథకాల ద్వారా జామిలో 44, ఎస్.కోటలో 72, ఎల్.కోటలో 17, వేపాడలో అయిదు ఆవాసాలకు నీరు సరఫరా అవుతోంది.

న్యూస్‌టుడే, శృంగవరపుకోట

క్రాష్ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పైపుల మరమ్మతులు చురుగ్గా చేపడుతున్నామని రక్షిత మంచినీటి విభాగం డీఈ పైడిరాజు అన్నారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి, ముందస్తు కార్యాచరణపై ఆయన 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వెల్లడించారు.

ముఖాముఖి

నీటి నాణ్యత పరీక్షలు చేస్తున్నాం..

ఎల్.కోటలో ఉన్న ల్యాబ్ ద్వారా ప్రతి నెలా 300 నీటి నమూనాలకు నాణ్యత పరీక్షలు చేయిస్తున్నాం. ఇందుకోసం ఎఫ్‌టీ కిట్లను అధికారుల వద్ద ఉంచాం. ట్యాంకులను 14 రోజులకోసారి శుభ్రం, రోజూ క్లోరినేషన్ చేయాలి. ఆ తేదీలను అక్కడి బోర్డుపై నమోదు చేయాలి. నియోజకవర్గంలో సరాసరి నీటి మట్టం 9 మీటర్లు. ఈ ఏడాది 6 నుంచి 9 మీటర్లుగా ఉంది. ఎస్.కోటలో ఏఈ పోస్టు భర్తీ చేయాల్సి ఉంది.

సమస్య ఉందా.. ఫోను చేయండి

ఎక్కడైనా నీటి సమస్య ఉంటే.. ఎల్.కోట సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోనటరింగ్ సెల్‌కు (90002 63006, 94927 25564) ఫోను చేసి చెప్పొచ్చు. జూన్ 30 వరకు ఇది అందుబాటులో ఉంటుంది. అయిదు మండల పరిషత్తు కార్యాలయాల్లోనూ సెల్‌లు ఏర్పాటు చేశాం.

ప్రగతిలో జల్‌జీవన్..

అయిదు మండలాల్లో 80,459 ఇళ్లు ఉన్నాయి. వీటిలో 30,717 గృహాలకు జల్‌జీవన్ పథకంలో కుళాయి కనెక్షన్లు ఇచ్చాం. 11,334 పురోగతిలో ఉన్నాయి. ఎల్.కోట మండలంలో 13,637 ఇళ్లకు వీటిని వేసేందుకు రూ.15.56 కోట్లు మంజూరయ్యాయి.

నేడు నగరపాలిక బడ్జెట్ సమావేశం

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ 2026-27 వార్షిక బడ్జెట్ సమావేశం సోమవారం మేయరు వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరగనుంది. సభ్యులు, అధికారులు హాజరు కావాలని కార్యదర్శి కె.అప్పలరాజు కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఉడాకాలనీ, న్యూస్‌టుడే: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు కేంద్రం చర్యలు తీసుకోవడం అభినందనీయమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఆదివారం నగరంలో మాట్లాడారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంచిక ఆవిష్కరణ

కంటోన్మెంట్: మిత్ర సాహితీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో 'వెలుగు రామినాయుడు అభినందన సంచిక'ను ఆవిష్కరించారు. రచయిత ప్రసాదవర్మ, కవి, కథా రచయిత జి.గౌరునాయుడు, జీఎస్ చలం పాల్గొన్నారు.

మిద్దెతోటల పెంపకానికి ఆదరణ

విజయనగరం పట్టణం: మిద్దె తోటల పెంపకంపై మహిళల్లో ఆదరణ పెరుగుతోందని టెర్రస్ ఉద్యాన్ వాట్సప్ గ్రూపు అడ్మిన్లు లలితా శ్రీనివాస్, కళ్యాణి పేర్కొన్నారు. గౌతమీ నగర్ పార్కులో వారు మాట్లాడారు. ఖర్చు లేకుండా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలు పెంచుకునే విధానాలను తెలియజేశారు. ● ఎంఆర్.యునైటెడ్ వాకర్స్ క్లబ్ సభ్యులు నగర వనంలో సమావేశమయ్యారు.

ప్రశాంతంగా గురుకులం ప్రవేశ పరీక్షలు

కొత్తవలస, వేపాడ: వియ్యంపేట బాలికలు, వేపాడ మండలం బక్కునాయుడుపేట అంబేడ్కర్ గురుకులాల్లో 2026-27లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు, ఐఐటీ, నీట్ శిక్షణ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవోలు శ్రీదేవి, బాలభాస్కరరావు తెలిపారు.

సాయం అందజేత

అయ్యన్నపేట: రోడ్డు ప్రమాద బాధితులకు వాసవీ ఛారిటీ గ్రూప్ సభ్యులు అండగా నిలిచారు. నగరానికి చెందిన ఇద్దరికి రూ.66 వేల ఆర్థికసాయం చేశారు. అధ్యక్షుడు శేఖర్, డిమ్స్ రాజు, నాగరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అయ్యన్నపేట: ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అశోక్ కోరారు. ఆదివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు.

ధర్నా విజయవంతానికి పిలుపు

అయ్యన్నపేట: ఎల్ఎల్ఆర్, లైసెన్సుల ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తున్న విజయదుర్గ ఆటో యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అప్పలరాజు, నారాయణరావు పేర్కొన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. ఈనెల 7న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు.

రహదారుల నిర్మాణానికి రూ.7.67 కోట్ల మంజూరు

విజయనగరం అర్బన్: మండలంలో ఏడు రహదారుల నిర్మాణానికి రూ.7.67 కోట్లు మంజూరైనట్లు తెదేపా మండలాధ్యక్షుడు పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం అశోక్ బంగ్లాలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే వేల కి.మీ. పరిధిలో రోడ్ల నిర్మాణానికి అనుమతులు వచ్చాయన్నారు.

నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఎస్.కోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సెక్యూరిటీ అనలిస్టు కోర్సుపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ కేశవరావు ఓ ప్రకటనలో తెలిపారు. 18-30 మధ్య వయసుండి డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు 3వ తేదీ లోగా నమోదు చేసుకోవాలన్నారు.

పంచాయతీరాజ్ క్లాస్-4 సమితి ఎన్నికలు

డెంకాడ: మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఏపీ పంచాయతీరాజ్ క్లాస్-4 భోగాపురం సమితి ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడుగా కె.మోహన్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడుగా జి.సంతోష్‌వర్మ, కార్యదర్శిగా జి.వంశీకృష్ణ, ఉపాధ్యక్షుడుగా రవి కుమార్, జాయింట్ కార్యదర్శులుగా పి.భార్గవ సాయి, జి.ఈశ్వరమ్మ, కోశాధికారిగా టి.ధనలక్ష్మి ఎన్నికయ్యారు.

వెనుకబడిన వర్గాలకు అండ

విజయనగరం గ్రామీణం, అయ్యన్నపేట, న్యూస్‌టుడే: వెనుకబడిన వర్గాలు, గిరిజనులకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అండగా నిలుస్తున్నారని జనసేన పార్టీ నాయకులు అవనాపు విక్రమ్, భావన పేర్కొన్నారు. ఆదివారం విజయనగరం మండలంలోని పడాలపేట, సారికలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. నాయకులు కెల్ల కవితారాణి, గంగిరెడ్ల రాజేష్, అనురాధ, నందిని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● 35వ డివిజన్ వీటీ.అగ్రహారంలో తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, జమ్ము శ్రీను పాల్గొన్నారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న అవనాపు విక్రమ్, భావన తదితరులు

ఎల్.కోటలో గడ్డివాములు, ధాన్యం దగ్ధం

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: అగ్నిప్రమాదంలో గడ్డి వాములు, ధాన్యం దగ్ధమైన ఘటన ఎల్.కోటలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం. . నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో గ్రామానికి చెందిన రైతులు జామి అప్పలనారాయణ సుమారు 50 బస్తాల ధాన్యం, గడ్డివాము, బూర్లె సూరిబాబుకు చెందిన గడ్డివాము ఉంచారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ప్రమాదవశాత్తు వాటికి నిప్పు అంటుకోవడంతో దగ్ధమయ్యాయి. స్థానికులు గుర్తించి ఎస్.కోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది మంటలను ఆర్పారు. ఘటనా స్థలానికి పోలీసులు, వీఆర్వో గణేష్ చేరుకుని పరిశీలించారు. రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

కరాటే విజేతలకు అభినందన

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఏబీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 25వ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో విజేతలైన విద్యార్థులను డీఎస్పీ గోవిందరావు, యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ అప్పారావు ఆదివారం అభినందించారు. విజయనగరం కణపాక నవజీవన్ పూర్ చిల్డ్రన్స్ వసతి గృహంలో ఉంటున్న 20 మంది విద్యార్థులు 10 స్వర్ణాలు, అయిదు కాంస్యాలు, అయిదు రజతాలు సాధించారన్నారు.

చిన్నారులతో డీఎస్పీ గోవిందరావు

అంగన్‌వాడీల సంక్షేమానికి కృషి

పూసపాటిరేగ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది, ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు తెలిపారు. ఆదివారం పూసపాటిరేగ మండలంలోని వెంపడాంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా రెండు సార్లు వేతనాలు పెంచిన ఘటన తెదేపాకే దక్కుతుందన్నారు. నాయకులు సన్యాసినాయుడు, శ్రీనివాసరావు, భూలోకా పాల్గొన్నారు.

క్రీడలతోనే ఆరోగ్యం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: యువతకు క్రీడలతో మానసికోల్లాసం, ఆరోగ్యం కలుగుతుందని సీఐ జి.రామకృష్ణ, ఎస్సై బి.గణేష్ అన్నారు. ఆదివారం నెల్లిమర్లలో నిర్వహించిన మండలస్థాయి పోలీస్ ప్రీమియర్ లీగ్-2026 క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో 36 జట్లు పాల్గొన్నాయి. నెల్లిమర్ల, కొండవెలగాడ జట్లు తొలి రెండు స్థానాలు సాధించాయి. విజేతలకు సీఐ, ఎస్సైలు ట్రోఫీలను అందజేశారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ రామకృష్ణ, ఎస్సై గణేష్

పార్టీ బలోపేతమే లక్ష్యం

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: అభివృద్ధి సాధన, సమస్యల పరిష్కారం, జనసేన పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే, విశాఖ పార్లమెంటు ఇన్‌ఛార్జి సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఎల్.కోట జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో ఎస్.కోట నియోజకవర్గ స్థాయి సమావేశం సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ బలంగా ఉంటేనే పదవులు వస్తాయని ఆయన వివరించారు. వీర మహిళ వెంకటలక్ష్మి, నాయకులు షేక్ ఫిరోజ్, అప్పారావు పాల్గొన్నారు.

(c) eenadu

వదిలేస్తే.. పుట్టమా.. కుట్టమా!

దోమల బెడదతో ప్రజలు బెంబేలు
మొక్కుబడి తంతుగా ఫాగింగ్

పాలకొల్లు, ఆకివీడు, న్యూస్‌టుడే: పట్టణాల నుంచి పల్లెల వరకు దోమల బెడద తంతులా తయారైంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అన్ని ప్రాంతాల్లో దోమల బెడద విపరీతంగా పెరిగిపోయింది. వీటి కాట్లతో ప్రజలే కాదు పశువులు సైతం విలవిల్లాడుతున్నాయి. పాడి గేదెలు దోమకాట్లతో పాల ఉత్పత్తి తగ్గిపోయిందని యలమంచిలి మండలం ఊటాడకు చెందిన రైతు కవురు సత్యనారాయణ వాపోయారు. ఈ నెల 24న జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురవడంతో ఒక్కసారిగా దోమల బెడద పెరిగిందని పురపాలక అధికారులు చెబుతున్నారు.

➡ 300 మంది జనాభా ఉండే పాలకొల్లు శివారు చిత్రాయిచెరువు ప్రాంతంలో మురుగు నిలిచిపోవడంతో నాలుగు రోజులుగా దోమలు విజృంభించాయి. రేయింబవళ్లు వాటి కాట్లతో సుమారు 50 మంది చిన్నారులకు ఒంటిపై దద్దుర్లు వచ్చి అస్వస్థతకు గురయ్యారంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు.

➡ ఆకివీడు నగర పంచాయతీలో 45 వేల జనాభా ఉండగా రెండు ఫాగింగ్ యంత్రాలు మాత్రమే ఉన్నాయి. అయిదు సచివాలయాల పరిధిలో నాలుగు చొప్పున వార్డులుండగా రెండింటితో ఫాగింగ్ చేయడం ఎలా సాధ్యమో అధికారులకే తెలియాలి. నెలకోసారి కూడా ఫాగింగ్ చేస్తున్న దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు.

అలంకార ప్రాయం ▶ పట్టణాలు, పంచాయతీలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా గతంలో ఫాగింగ్ యంత్రాలు పంపిణీ చేయగా నిర్వహణ భారంతో వాటిలో చాలా వరకు మూలకు చేరాయి. మలేరియా నిర్మూలన విభాగం ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం నిర్వహించాల్సిన డ్రైడే నామమాత్రంగా సాగుతోంది. మురుగు కాలువల్లో చమురు బంతులు వేయడం, ఖాళీ స్థలాల్లో నీటిమడుగుల్లో గంబూషియా చేపలు వదలడం వంటి చర్యలు దాదాపు కనుమరుగయ్యాయి. ఈ అంశంపై జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి గీతాబాయి స్పందిస్తూ పాలకొల్లు ప్రాంతంలో శుక్రవారం క్షేత్ర పరిశీలన చేసి దోమకాట్లతో ఒంటిపై దద్దుర్లు వచ్చిన వారికి పరీక్షలు చేయించామన్నారు. రక్త నమూనాలను ఏలూరులో ల్యాబ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

మావుళ్లమ్మ సేవలో 'బ్యాండ్ మేళం'

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఈ నెల 13న విడుదల కానున్న 'బ్యాండ్ మేళం' చిత్ర బృంద సభ్యులు మావుళ్లమ్మను ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సినిమా ప్రచారంలో భాగంగా అమ్మవారి ఆలయానికి వచ్చినట్లు హీరో, హీరోయిన్ హర్ష రోషన్, శ్రీదేవి, దర్శకుడు సతీష్, మాటల రచయిత, నిర్మాత కోన వెంకట్ తెలిపారు.

వైభవంగా జలదుర్గా గోకర్ణేశ్వరుడి కల్యాణం

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేటి సరస్సు తీరాన కొలువైన మహిమాన్విత మాత జలదుర్గమ్మ పెండ్లి కూతురుగా ముస్తాబవగా.. అమ్మను పరిణయం ఆడేందుకు పల్లకిలో తరలి వచ్చారు అందాల గోకర్ణయ్య. కొల్లేటి కోట పెద్దింట్లమ్మ జాతరలో భాగంగా జల దుర్గ సమేత గోకర్ణేశ్వరస్వామి కల్యాణం ఆదివారం తెల్లవారుజామున కనుల పండువగా సాగింది. గోకర్ణపురం నుంచి గోకర్ణేశ్వరస్వామిని గ్రామస్థులు పల్లకిలో కొల్లేటికోటకు తీసుకొచ్చారు. అనంతరం ఆది దంపతులను మండపానికి చేర్చి వేద పండితులు కల్యాణ తంతు జరిపించారు.

కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు, తిలకిస్తున్న భక్తులు

నేటి నుంచి దూరవిద్య.. ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీఓఎస్ఎస్) దూరవిద్య ఇంటర్ వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 13 వరకు కొనసాగనున్నాయి. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 4 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏలూరు తూర్పు వీధి, గాంధీ నగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలు, జిల్లా కేంద్ర కారాగారం, చింతలపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. మొత్తం 736 మంది విద్యార్థులు హాజరు కానున్నారని విద్యా శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

అవినీటి మీటర్లు

చుక్కనీరు మిగల్చడం లేదు

భీమవరం పట్టణం, ఆకివీడు, నరసాపురం, తణుకు, న్యూస్‌టుడే: పట్టణాలు విస్తరించడంతో భవనాలు, బహుళ అంతస్తుల సంస్థలు పెరగడంతో జనాభా రెట్టింపు అయ్యింది. వారి అవసరాలకు తగ్గట్టు తాగునీటి సరఫరా ఉండటం లేదు. కారణం.. గృహావసరాల పేరిట కుళాయి కనెక్షన్లు తీసుకుని గృహేతరాలకు నీళ్లు లాగేస్తున్నారు. ఈ దోపిడీని అరికట్టేందుకు గతంలో తెరపైకి మీటర్లు తెచ్చారు. అవి ఎక్కడా కనిపించవు. ఉన్నా పని చేయవు. జిల్లాలోని అన్ని పట్టణాల్లో సాధారణ రోజుల్లోనే సరిపడా నీరు అందడం లేదు. మీటర్లు లేకపోవడం వల్ల వేసవిలో జనం గొంతు తడపడం కూడా అసాధ్యమే. బిందెడు నీరు రాక వేలాది కుటుంబాలు నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జిల్లాలో పరిస్థితులపై 'న్యూస్‌టుడే' పరిశీలన చేసింది.

➡ భీమవరం శివారు గొల్లవానితిప్ప రోడ్డు పొడవునా తాగునీటి కోసం ఉంచిన డబ్బాలు ఇవి. వందలాది కుటుంబాలు ట్యాంకరు వచ్చినప్పుడు ఈ డబ్బాల నింపుకొని జీవనం సాగిస్తున్నారు.

బహుళ అంతస్తులు, వాణిజ్య అవసరాలకు నీటి అవసరాలకు ఏర్పాటు చేయల్సిన మీటరు ఇది. చాలా చోట్ల ఇవి బిగించలేదు. గృహ అవసరాల కనెక్షన్‌తో తెగ వాడేస్తున్నారు. మీటరు ఉన్న చోట తిరుగుతుందో లేదో చూసేవారు లేరు.

బహుళ అంతస్తులకు బీపీఎల్ కనెక్షన్ తీసుకుని వేలాది లీటర్ల నీటిని తోడేస్తున్నారు. అపార్టుమెంట్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, వ్యాపార సంస్థలు, థియేటర్లు, విద్యాలయాలకు నీటి మీటర్లు ఏర్పాటు చేయాలి. ప్రతి 1000 లీటర్ల నీటి వాడకానికి నిర్దేశించిన రుసుము వసూలు చేయాలి. మీటరు తిరగకపోతే కొత్తది బిగించాలి. దీర్ఘకాలంగా పనిచేయకపోతే పురపాలక చట్టాన్ని అనుసరించి నీటి వాడకాన్ని బట్టి అంచనా వేసి అందుకు తగ్గట్టు పన్ను విధించాలి. కానీ ఎక్కడా ఆ పరిస్థితి లేదు.

పరిశీలన

ఇదీ నిబంధన గృహావసరాల బీపీఎల్ పథకంలో రూ.200 చెల్లించి కనెక్షన్ పొందవచ్చు. నెలకు రూ.120 పన్ను చెల్లించాలి. గృహేతర అవసరాల కనెక్షన్‌కు రూ.5000 పన్ను ఉంటుంది. కిలో లీటరు నీటికి రూ.5 నుంచి రూ.20 చొప్పున పురపాలక సంఘానికి చెల్లించాలి.

● భీమవరం పట్టణంలోని 39 వార్డుల్లో 19,557 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. మీటర్లు 1020 ఉండగా చాలా చోట్ల పనిచేయడం లేదు. మీటరు పనిచేయనవి, నిబంధనలు లేకుండా బిగించినవి 350కు పైగా గతంలో గుర్తించారు.

● నరసాపురంలో అక్రమ కుళాయి కనెక్షన్లు 62, తాడేపల్లిగూడెంలో 150 ఉన్నట్లు గుర్తించారు. పాలకొల్లులో నాలుగు గుర్తించి వాటిని తొలగించారు.

● ఆకివీడులో 6000 కనెక్షన్లలో దాదాపు 600 అక్రమ కుళాయిలు ఉన్నాయి. నగర పంచాయతీ ఏర్పడినప్పుడు అక్రమంగా బిగించుకున్నవి ఇంకా ఉండటంతో పలు ప్రాంతాలకు నీరందని పరిస్థితి ఉంది.

● తణుకులో అక్రమ కుళాయి కనెక్షన్లను గతంలో గుర్తించి కొందరిపై చర్యలు తీసుకున్నారు. అయినా కొన్ని చోట్ల యథాతథంగా ఉన్నాయనే ఆరోపణలున్నాయి.

పట్టణాలు 6

గతంలో గుర్తించిన అక్రమ కనెక్షన్లు 2250

నీరందని శివారు ప్రాంతాలు 145కు పైగా

● మీటర్ల విషయాన్ని పురపాలక ఆర్డీ సి.హెచ్.నాగనరసింహారావు దృష్టికి తీసుకెళ్లగా.. అక్రమ కనెక్షన్లు ఎన్ని గుర్తించారు, వాటిపై చర్యలు ఏమి తీసుకున్నారో పట్టణాల వారీగా తెలుసుకుంటానని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించి అక్రమ మీటర్లు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు శ్రీవారి ఆలయం మూసివేత

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: చంద్రగ్రహణం సందర్భంగా ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని ఈ నెల 3న మూసివేయనున్నట్లు ఆలయ ఈవో వై.భద్రాజీ తెలిపారు. ఆ రోజు ఉదయం 6.20 గంటల లోపు స్వామి ప్రాతఃకాలార్చనాదికాలను ముగించి ఆలయాన్ని మూసి వేస్తామన్నారు. తిరిగి రాత్రి 7.30 గంటలకు దేవాలయాన్ని తెరిచి శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఆ రోజు ఆర్జిత సేవలు, దర్శనాలను రద్దు చేస్తున్నట్లు వివరించారు. 4వ తేదీ నుంచి ఆర్జిత సేవలు, దర్శనాలు యథావిధిగా జరుగుతాయని తెలిపారు.

సోమేశ్వరాలయం.. భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: చంద్ర గ్రహణం కారణంగా పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామి ఆలయం 3న ఉదయం 9 గంటలకు మూసివేసి బుధవారం ఉదయం 7 గంటలకు తెరవనున్నట్లు ఆలయాధికారి డి.రామకృష్ణంరాజు తెలిపారు.

ఆటకు లేదు చోటు!

ప్రైవేటు బడుల్లో మైదానాలు కరువు
ప్రభుత్వ ఉత్తర్వుల అమలైతే మేలు

పాలకొల్లు పట్టణ పరిధిలో దాదాపు 20 వరకు ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో మూడు, నాలుగింటికి మాత్రమే క్రీడా మైదానాలున్నాయి. వాటిలోనూ క్రీడల నిర్వహణ మొక్కుబడి తంతే. బాలల దినోత్సవం, పండగలు, వేడుకల సమయంలో మాత్రం ఒకటి రెండు పోటీలు పెట్టి మమ అనిపిస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 90 శాతం ప్రైవేటు పాఠశాలల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

పాలకొల్లు, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల్లో రోజంతా పాఠాలు, పుస్తకాలతో విద్యార్థులపై ఒత్తిడి పెంచుతూ వారి మానసిక వికాసం, ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదనే అంశం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు వచ్చింది. దీనిపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ ప్రైవేటు పాఠశాలల్లోనూ క్రీడలకు తగు సమయం కేటాయించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైతే సమీప ప్రభుత్వ పాఠశాలల మైదానాలు వినియోగించుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని విద్యా శాఖకు సూచించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో క్రీడల పరిస్థితి మెరుగయ్యేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

బాలల ఆరోగ్యానికి భరోసా.. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే వ్యాయామ విద్య కొనసాగుతోంది. తాజా ఉత్తర్వుల ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లోనూ క్రీడలను తప్పనిసరి చేయడంతో బాలల ఆరోగ్యానికి భరోసా లభించనుంది. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు నిత్యం ఒక పిరియడ్‌ను క్రీడలకు కేటాయిస్తే పిల్లల మానసిక, శారీరక వికాసానికి దోహదపడుతుందని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధి రేలంగి రామకృష్ణ తెలిపారు.

ఆరోగ్య విద్య.. నిత్యం ఉదయం అసెంబ్లీ సమయంలో పది నిమిషాల పాటు విద్యార్థులతో ధ్యాన సాధన చేయించాల్సి ఉంటుంది. వారంలో ఒకసారి యోగా, ఆరోగ్య విద్యపై ఒక తరగతి జరగాలి. సమతుల ఆహారం తీసుకోవడం, రక్తహీనత రాకుండా జాగ్రత్త పడటం వంటి అంశాలు తెలియజేయాల్సి ఉంది. వ్యసనాలు, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఈ అంశంపై డీఈవో నారాయణ స్పందిస్తూ అన్ని ప్రయివేటు పాఠశాలల్లో పిల్లలకు నిత్యం క్రీడలు నిర్వహించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని.. ఇప్పట్నుంచే ఈ ఉత్తర్వులు అమలు చేయాలని సూచించామని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో..
ప్రైవేటు పాఠశాలలు- 1,120
విద్యార్థులు- 2.45 లక్షలు (సుమారుగా)

ఆసుపత్రులకు ఆరోగ్యం

131 భవనాల పూర్తికి నిధులు

వీరవాసరం, న్యూస్‌టుడే: పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు గొప్పలు చెప్పిన గత వైకాపా సర్కార్ జిల్లా వ్యాప్తంగా 104 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాన్ని మధ్యలోనే అటకెక్కించింది. వాటిని కూటమి ప్రభుత్వం పూర్తి చేసే బాధ్యత తీసుకుంది. విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) నిధులు రూ.14.34 కోట్లు మంజూరు చేసింది. వీటితో ఇవి పూర్తయితే గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్య సేవలు మెరుగవుతాయి.

✪ ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కింద కేంద్ర ప్రభుత్వం జిల్లాలో కొత్తగా 12 ఆరోగ్య భవనాలు నిర్మిస్తోంది. ఒక్కో దానికి రూ.42 లక్షల చొప్పున మంజూరు చేసింది. దీంతోపాటు 15వ ఆర్థిక సంఘం నిధులతో జిల్లాలో మరో 15 ఆరోగ్య భవనాలు నిర్మిస్తున్నారు. ఒక్కో భవనానికి రూ.36 లక్షల చొప్పున మంజూరు చేసింది.

అందుబాటులోకి వస్తే.. ✦ ఈ ఆరోగ్య ఉప కేంద్రాల్లో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటారు. ✦ జనరల్ ఓపీ, మధుమేహం, బీపీ, ప్రాథమిక చికిత్స ఇలా 14 రకాల సేవలు అందిస్తారు. ✦ స్థానికంగా ఉన్న గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు.

వేగంగా పూర్తి చేయిస్తాం.. జిల్లాలో వెల్‌నెస్ కేంద్రాలు, పీఎం అభిమ్, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన భవనాలన్నీ వీలైనంత వేగంగా పూర్తి చేయిస్తాం. నాలుగు చోట్ల నూతన భవనాల నిర్మాణానికి స్థలం లేకపోవడంతో ఇబ్బంది తలెత్తింది. ఆయా మండలాల అధికారులను సంప్రదించి అక్కడ కూడా వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

\- జి.వెంకటరత్నం, పంచాయతీ రాజ్ ఈఈ

మత్స్యపురిలో నిర్మిస్తున్న భవనం

ఐక్యతతో ప్రగతి పథం: నిమ్మల

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఐక్యతా స్ఫూర్తిని పెంపొందించేలా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు మండలం ఆగర్తిపాలెం గ్రామంలో శ్మశాన వాటిక అభివృద్ధి పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి పునాదుల తవ్వకం పనుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో గ్రామంలో ప్రతి ఇంటి నుంచి ఒకరు స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. గ్రామస్థులంతా కలిసికట్టుగా ఉంటే పల్లెలు ప్రగతి బాటలో పయనిస్తాయన్నారు.

శ్రమదానం చేస్తున్న మంత్రి

స్వీయ సన్నద్ధతకు పరీక్ష!

'పది' విద్యార్థులకు నేటి నుంచి గ్రాండ్ టెస్టులు

మార్టేరు, వీరవాసరం, న్యూస్‌టుడే: పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేసింది. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక తరగతులతోపాటు నిత్యం పరీక్షలు నిర్వహించారు. వాటిలో వచ్చిన మార్కుల ఆధారంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో పిల్లలు వారి స్వీయ సన్నద్ధతను అంచనా వేసుకొనేలా సోమవారం నుంచి గ్రాండ్ టెస్టులు నిర్వస్తున్నారు.

హాజరు తప్పనిసరి.. పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 9 నుంచి 17వ తేదీ వరకు ప్రీ పబ్లిక్ పరీక్షలు నిర్వహించారు. వాటి ఫలితాలను ప్రకటించాక విద్యార్థులకు వచ్చిన మార్కులను బట్టి వెనుకబడిన సబ్జెక్టులు, పాఠ్యాంశాల్లో పది రోజులపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఇప్పుడు నిర్వహించే గ్రాండ్ టెస్టుల ఫలితాలను బట్టి మార్చి 16 నుంచి జరిగే పబ్లిక్ పరీక్షల నాటికి మరో మారు విద్యార్థులకు తర్ఫీదు ఇస్తారు. వీటికి తప్పనిసరిగా హాజరు కావాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

షెడ్యూలు ఇలా.. 2న తెలుగు, 4న హిందీ, 5న ఆంగ్లం, 6న గణితం, 7న భౌతిక శాస్త్రం, 9న జీవశాస్త్రం, 10న సాంఘిక శాస్త్రం పరీక్షలు జరగనున్నాయి. భౌతిక, జీవ శాస్త్రం పరీక్షలు మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 గంటల వరకు, మిగిలినవి మధ్యాహ్నం 1.30 నుంచి 4.45 గంటల వరకు జరగనున్నాయి.

తొమ్మిదో తరగతికి ఎస్ఏ- 2.. సోమవారం నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఎస్ఏ 2 పరీక్షలు నిర్వహించనున్నారు.

లేదు.. నా సేతుల్లో

లోసరి వంతెనపై ఊచలు తేలి..

ముత్యాలపల్లిలో విరిగిన స్తంభం

216వ నంబరు జాతీయ రహదారిలో భీమవరం మండలం లోసరి నుంచి నరసాపురం మధ్య పలు వంతెనలపై రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల ఊచలు పైకి తేలడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ముత్యాలపల్లి వద్ద రహదారి పక్కన విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

\- ఈనాడు, నరసాపురం

మఖానా.. కొల్లేరు ఖజానా

- బోర్డు ప్రతిపాదనపై అభినందన
- మత్స్యకారులకు మంచి రోజులు

మండవల్లి, కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేరులో ఫూల్ మఖానా(తామర, కలువ గింజలు) సాగుతో ఇక్కడ మత్స్యకారులకు ఆదాయ మార్గాలను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ మేరకు రాష్ట్రంలో మఖానా బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరడంపై కొల్లేరు ప్రాంతంలో ఆశలు చిగురిస్తున్నాయి. ఎంతో సారవంతమైన కొల్లేరు భూములు చేపల పెంపకంతో పాటు సహజ సిద్ధంగా పెరిగే తామర, కలువ గింజలకు ప్రసిద్ధి. ఇప్పుడు వీటిని పరిశ్రమగా మార్చి భారీ స్థాయిలో పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇక్కడ పండే ఈ గింజలకు జాతీయ, అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంది. రాష్ట్ర ప్రభుత్వ చొరవను అసెంబ్లీ సాక్షిగా కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అభినందించడంతో ప్రాధాన్యం సంతరించుకుంది.

సరస్సులో కలువ పువ్వులు

ఆక్రమణలు, వలసలు తగ్గే అవకాశం.. కొల్లేరులో మఖానా సాగును ప్రోత్సహించేందుకు బోర్డు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం నుంచి వలసలు తగ్గే అవకాశం ఉంటుంది. 2006 కొల్లేరు ఆపరేషన్ తర్వాత లంక గ్రామాల్లో 30శాతం ప్రజలు ఒడిశా, పశ్చిమ బెంగాల్, తెలంగాణ, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. మరోపక్క ఏటికేడు పెరుగుతున్న కొల్లేరు ఆక్రమణలు సైతం తగ్గుతాయని అంచనా వేస్తున్నారు.

అధిక ప్రోటీన్లకు చిరునామా.. మఖానాలో ప్రోటీన్లు అధికంగా ఉండటంతో సూపర్ ఫుడ్‌గా గుర్తింపు పొందింది. ప్రస్తుతం చేపలతో పోల్చితే ప్రోటీన్లు, ధర రెండూ అధికంగా ఉండటంతో కొల్లేరులో సాగుతో మత్స్యకారులకు మంచి ఆదాయ వనరులుగా మార్చవచ్చు. తక్కువ పెట్టుబడి మందులు లేకుండా పెంచే వీటితో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

3 లక్షల మందికి ప్రయోజనం.. కొల్లేరులో మఖానా సాగును ప్రోత్సహిస్తే ఏలూరు జిల్లాలోని ఏడు మండలాల్లోని 3 లక్షల మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూరనుంది. మరోపక్క వీటిని మార్కెటింగ్, ప్రాసెసింగ్ విభాగాల్లో మరికొందరికి ఉపాధి లభించే అవకాశం ఉంటుంది.

అనువైన భూములు .. కొల్లేరు ప్రస్తుతానికి చేపల ఆధారిత వ్యవస్థగా కొనసాగుతోంది. మఖానా సాగుకు కొల్లేరు భూములు ఎంతో అనువైనవని ఇప్పటికే శాస్త్రవేత్తలతో పాటు అటవీశాఖ అధికారులు సైతం ధ్రువీకరించారు.

\- డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే, కైకలూరు

అక్కడ యుద్ధం.. ఇక్కడ కలవరం!

గల్ఫ్ దేశాల్లో జిల్లా వాసుల పరిస్థితిపై ఆందోళన

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు.. గల్ఫ్‌దేశాల్లో అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతిదాడుల నేపథ్యంలో ఆయా దేశాల్లో ఉన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వాసుల పరిస్థితిపై వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం ఉమ్మడి జిల్లాకు చెందిన 1.5 లక్షల మంది ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాల్లో ఉన్నట్లు అధికార వర్గాల అంచనా.

ఎక్కడి వారు అక్కడే.. మొగల్తూరుకు చెందిన దంపతులు ఏడాది కిందట ఉపాధి నిమిత్తం ఇజ్రాయెల్‌కు వెళ్లారు. ప్రస్తుతం వారికి ఫోన్ చేయగా క్షేమంగానే ఉన్నామని.. ఇక్కడ రక్షణ దళాలు తరచూ అప్రమత్తం చేస్తున్నాయని, సైరన్లు మోగుతున్నాయని వారు చెబుతున్నారు. కొత్తపాలేనికి చెందిన పలువురు కువైట్‌లో ఉపాధి పొందుతున్నారు. ఇరాన్ ప్రయోగించిన మిసైళ్లు ఆ దేశంలోని ఎయిర్‌పోర్టు వద్ద పడటంతో ప్రజలందరినీ అప్రమత్తం చేశారు. తమను కూడా ఇళ్ల నుంచి బయటకు రానివ్వడం లేదని అక్కడ ఉపాధి పొందుతున్న కార్మికులు చెబుతున్నారు. ఇతర గల్ఫ్ దేశాల్లో కూడా ఇలాంటి పరిస్థితే నెలకొంది. అప్రమత్తంగా ఉండాలని ఆయా దేశాల్లో భారత ఎంబసీ అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ నాగరాణి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ప్రజలు తమ సమస్యలపై వినతులు ఇవ్వొచ్చని చెప్పారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మున్సిపల్, మండల కార్యాలయాల్లోనూ పీజీఆర్ఎస్ జరుగుతుందని పేర్కొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో.. భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'మీ కోసం' కార్యక్రమాన్ని భీమవరం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు.

దివ్యాంగుల ఉచిత ప్రయాణానికి రైట్‌రైట్..!

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: దివ్యాంగులకు ఇక నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కలగనుంది. కూటమి ప్రభుత్వం జీవో నం.21 ద్వారా ఈ వెసులుబాటు కల్పించింది. 'ఇంద్ర ధనుస్సు' పథకంలో భాగంగా 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు ఉచిత బస్సు ప్రయాణానికి అర్హులు. వీరు అయిదు రకాల బస్సు సర్వీసుల్లో రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. వారికి సహాయం (ఎస్కార్టు)గా వెళ్లే వారికి టికెట్ ధరలో 50 శాతం రాయితీ కల్పించారు. ఎస్కార్టు తప్పనిసరైన పక్షంలోనే వారికి రాయితీ వర్తిస్తుంది.

35 వేల మందికి పైగా.. ఏలూరు జిల్లాలో మొత్తం 35 వేల మందికి పైగా 40 శాతానికి మించి వైకల్యం ఉన్న దివ్యాంగులు ఉన్నారు. వీరంతా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. వీరు ప్రయాణ సమయంలో ఆర్టీసీ జారీ చేసిన పాసు లేదా ప్రభుత్వం గుర్తించిన వైకల్య ధ్రువీకరణ పత్రం కండక్టరుకు చూపించాల్సి ఉంటుంది. ఇతర అంతర్రాష్ట్ర సర్వీసులు, నాన్‌స్టాప్, అల్ట్రా డీలక్స్ సర్వీసుల్లో 50 శాతం రాయితీతో ప్రయాణ సౌకర్యం ఉంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విధి విధానాలు పూర్తి స్థాయిలో వచ్చిన తర్వాత దివ్యాంగుల ఉచిత ప్రయాణానికి అవకాశం ఉంటుందని జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో మేనేజరు పీపీవీ గంగాధరరావు తెలిపారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

జీఎస్‌టీ 5% అదనం

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

గుప్తా ఫౌండేషన్ సేవలు నిరుపమానం

సత్యవతికి పురస్కారం అందజేస్తున్న అనిల్‌కుమార్, గుప్తా తదితరులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమాజ హితానికి గుప్తా ఫౌండేషన్ అందిస్తున్న సేవలు నిరుపమానమని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం.అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణమూర్తి సాహిత్య పురస్కారం ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. తొలుత తెలుగు సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన రచయిత్రి పి.సత్యవతికి అనిల్ కుమార్, గుప్తా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మదుపల్లి మోహన్‌గుప్తా పురస్కారం ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ.. సాహితీవేత్తలను గౌరవించడం ద్వారా సమాజానికి మంచి సందేశం ఇచ్చిన వారవుతామన్నారు. కృష్ణమూర్తి సాహిత్య పురస్కారం అందుకోవడం ప్రయాణ మజిలీలో గొప్ప అనుభూతని సత్యవతి పేర్కొన్నారు. సత్యవతి రచనల్లోని లోతు, సామాజిక స్పృహను కాలిఫోర్నియా ఆరియా విశ్వవిద్యాలయం తెలుగు ఛైర్‌పర్సన్ ఆచార్య చుండూరి మృణాళిని వివరించారు.

జనగణనకు ముమ్మర ఏర్పాట్లు

ఈ నెల 3, 4, 5 తేదీల్లో సిబ్బందికి శిక్షణ

ఈనాడు డిజిటల్, భీమవరం: డిజిటల్ విధానంలో మొట్టమొదటిసారిగా చేపట్టనున్న జనగణనకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జనగణనలో భాగంగా మే 1 నుంచి గృహగణన మొదలు కానున్న నేపథ్యంలో ఏవిధంగా సర్వే చేపట్టాలనే అంశాలపై కలెక్టరేట్‌లో ఈనెల 3, 4, 5 తేదీల్లో సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. దిల్లీలోని డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ కార్యాలయం నుంచి ఆరుగురు అధికారులు ఇందుకోసం భీమవరం రానున్నారు.

నియామకం ఇలా..

జిల్లా వ్యాప్తంగా 20 మండలాలు, ఆరు మున్సిపాలిటీలకు 104 మంది జనగణన కార్యాలయ సిబ్బంది, వారి పర్యవేక్షణకు 15 మంది అధికారులను నియమించారు. వీరు కాకుండా ఇళ్లను 3,277 బ్లాకులుగా విభజించి 800 మందికి ఒక గణకుడు చొప్పున 3,169 మందిని, 544 మంది సర్కిల్ సూపర్‌వైజర్లను నియమించనున్నారు.

వీటిని సేకరిస్తారు..

ప్రతి నివాసానికి వెళ్లి ఇంట్లో మౌలిక సదుపాయాల వివరాలను సమగ్రంగా నమోదు చేస్తారు. ఇందుకోసం ఇల్లు కట్టడం మొదలు ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు(సైకిల్, బైక్, కారు, జీపు, వ్యాన్), గృహోపకరణాలు(రేడియో, టీవీ), తాగునీటి వనరులు, మరుగుదొడ్ల వాడకం, వంటి గది సౌకర్యాలు, వంటకు వినియోగించే ఇంధన వివరాలు, ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు నిర్మాణం తీరు, నివాసితులు, గదుల సంఖ్య వంటి 33 ప్రశ్నలకు సమాధానాలను రాబట్టనున్నారు.

పర్యవేక్షించేది వీరే..

కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రధాన అధికారిగా, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి అదనపు ప్రధాన అధికారిగా, జిల్లా అధికారిగా డీఆర్వో శివన్నారాయణ రెడ్డి వ్యవహరించనున్నారు. మూడు డివిజన్లకు ముగ్గురు ఆర్డీవోలను సహాయకులుగా, మున్సిపాలిటీలకు కమిషనర్లు, మండలాలకు తహసీల్దార్లను ఇన్‌ఛార్జులుగా నియమించారు.

2011 ప్రకారం జిల్లా జనాభా	2026 నాటికి
18,45,029	20,78,505 అంచనాతో సర్వే మొదలుకానుంది.

తప్పులు దొర్లకుండా..

ఇళ్ల గణన(హౌస్ లిస్టింగ్), కుటుంబ సభ్యుల వివరాల నమోదులో తప్పులు దొర్లకుండా(కుటుంబ వివరాలు) వ్యక్తిగత వివరాల నమోదు (సెల్ఫ్ ఎన్యుమరేషన్) విధానాన్ని తీసుకొచ్చారు. ఏప్రిల్ 15 నుంచి 30 వరకు అమలులో ఉంటుంది. ఎవరికివారు తమ వ్యక్తిగత వివరాలను 'హెచ్ఎల్ఓ' యాప్‌లో నమోదు చేసే అవకాశం కల్పిస్తున్నారు. కుటుంబానికో కోడ్(అంకె) కేటాయిస్తారు. గణకులు(ఎన్యుమరేటర్లు) సర్వేకి వెళ్లినప్పుడు ఆ కోడ్‌ను చెబితే మొత్తం వివరాలు వస్తాయి. వాటిలో తప్పులు సరిదిద్దుకోవడంతో పాటు నవీకరించుకునే అవకాశం ఉంటుంది.

ఏమిటి ఉపయోగం..

ప్రజలకు ఎలాంటి కనీస సౌకర్యాలున్నాయనేది పక్కాగా తెలుస్తుంది. ఈ సమాచారాన్ని వినియోగించుకుని సంక్షేమ పథకాల రూపకల్పనకు ప్రభుత్వాలకు అవకాశం కలుగుతుంది.

ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఎంపిక

ఉంగుటూరు, కొయ్యలగూడెం గ్రామీణ, తాడేపల్లిగూడెం పట్టణం- న్యూస్‌టుడే: విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి పెంచాలనే ఉద్దేశంతో కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించే ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ఏలూరు జిల్లా నుంచి 101, పశ్చిమ నుంచి 71 ఆలోచనలు అర్హత సాధించాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థుల వరకు ప్రాజెక్టుల ఆలోచనలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వీటిలో మెరుగైన వాటిని ఎంపిక చేసి విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహం అందజేస్తారు. ఈ నగదుతో వారు ప్రాజెక్టు తయారు చేస్తే.. జిల్లా స్థాయిలో ప్రదర్శిస్తారు. అత్యుత్తమ ప్రతిభ చాటితే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

నేడు 'డయల్ యువర్ సీఎండీ'

గురుద్వారా, న్యూస్‌టుడే: ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు సంబంధిత సమస్యలను మరింత వేగంగా పరిష్కరించే లక్ష్యంతో విశాఖలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని 11 జిల్లాలకు చెందిన వినియోగదారులు 86884 00499 ఫోన్ నంబర్‌కు ఉదయం 10.30 నుంచి 11.30 వరకు తమ సమస్యలను తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర సమస్యలపై ఫిర్యాదులను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని సీఎండీ ప్రకటించారు. ఈ అవకాశాన్ని విద్యుత్తు వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వేసవి మొదట్లోనే మంటలు

- పశ్చిమలో 38.. ఏలూరులో 36 డిగ్రీలు
- ఇప్పుడే ఇలా ఉంటే.. మే లో ఎలా?

కుక్కునూరు, న్యూస్‌టుడే: వేసవి ముంగిట్లోనే మంటలు మండిస్తున్నాయి. పశ్చిమలో ఎప్పుడూ పచ్చదనం, సాగునీటి సవ్వడులతో చల్లగా ఉండాల్సిన వాతావరణం అందుకు భిన్నంగా మారింది. ఆ జిల్లాలోని పోడూరులో అత్యధికంగా 38.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావటం గమనార్హం. ఏలూరు జిల్లాలో అత్యధికంగా లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో 35.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ల ద్వారా శనివారం ఉదయం 8.30 నుంచి ఆదివారం ఉదయం 8.30 వరకూ నమోదైన ఉష్ణోగ్రతల వివరాలను పరిశీలించినపుడు జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు ఇలా కనబడుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండల పరిస్థితి తలచుకొని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయని వాతావరణ శాఖ చెబుతుండగా, వేసవి ఆరంభంలోనే ఈ స్థాయిలో ఉంటాయని ఎవరూ ఊహించలేదు. ఉమ్మడి జిల్లా అంతటా ఎండలు మండుతూనే ఉన్నాయి. మండే ఎండలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పశ్చిమలో, మెట్టప్రాంతం ఏలూరు కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావటం గమనార్హం.

శీతలం నుంచి ఉష్ణంలోకి.. చలి క్రమేపీ తగ్గుతూ ఉష్ణోగ్రతలు నెమ్మదిగా పెరుగుతూ వస్తుంటాయి. ఈ ఏడాది చలి తగ్గడం, ఉష్ణోగ్రత గరిష్ఠ స్థాయిలకు చేరటం ఒకేసారి జరిగింది. దీంతో చలికాలం ఎప్పుడు ముగిసిందో.. ఎండకాలం ఎప్పుడు మొదలైందో కూడా తెలియకుండానే వేసవి వచ్చేసింది. అకస్మాత్తుగా ఎండలు పెరగటంతో, విద్యుత్తు వినియోగం ఒకేసారి పెరిగిపోయింది.

పశ్చిమ, ఏలూరు జిల్లాల్లో నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతల వివరాలు ఇలా ఉన్నాయి...

పశ్చిమ / ఏలూరు మండలం	ప్రాంతం	నమోదైన ఉష్ణోగ్రత
పోడూరు	పోడూరు	38.1
తాడేపల్లిగూడెం	తాడేపల్లి	35.7
ఆచంట	ఆచంట	35.0
భీమవరం	గొల్లవానితిప్ప	34.1
తణుకు	దువ్వ	33.4
లింగపాలెం	ధర్మాజీగూడెం	35.9
చింతలపూడి	అల్లిపల్లి	35.5
చింతలపూడి	చింతలపూడి	35.3
కొయ్యలగూడెం	గవరవరం	33.9

ఎన్నికైన వీఆర్ఏల సంఘం కార్యవర్గ సభ్యులు

పోరాటాలతోనే హక్కుల సాధన

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే శరణ్యమని వీఆర్ఏల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ అన్నారు. వీఆర్ఏల సంఘం జిల్లా సమావేశం పాలకొల్లులో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మోటూరి మోషే, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా డి. వీరభద్రం, ఉపాధ్యక్షుడిగా కురెళ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పతివాడ గోపాలకృష్ణ, కోశాధికారిగా బయ్యే క్రాంతికుమార్ ఎన్నికయ్యారు. ఏపీ అమరావతి రెవెన్యూ ఐకాసకు సంపూర్ణ మద్దతు ఇవ్వనున్నట్లు సంఘ నాయకులు ప్రకటించారు.

శ్రీవారి ఆలయంలో కొనసాగిన రద్దీ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. సెలవు రోజు కావడంతో రాష్ట్ర నలు మూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే శ్రీవారి దర్శన క్యూలు, ప్రసాదాల కౌంటర్లు, అన్నదానం క్యూలు, కేశఖండనశాల వద్ద భక్తులు ఎక్కువ సంఖ్యలో దర్శనమిచ్చారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుబ్బలమంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి భక్తులు ఆదివారం పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చెట్ల కింద కూర్చుని సహపంక్తి భోజనాలు చేశారు.

గుట్ట మింగేసి.. గట్టు కలిపేసి!

పరిశీలన

భీమడోలు, ఉంగుటూరు, ద్వారకాతిరుమల, దెందులూరు, పెదవేగి- న్యూస్‌టుడే: గోదావరి జలాలను కృష్ణా నదికి అనుసంధానం చేస్తూ..178 కి.మీ. మేర పోలవరం కుడి కాలువ నిర్మించారు. ఏటా ఖరీఫ్‌లో పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా సుమారు 8,500 క్యూసెక్కులకు విడుదల చేస్తున్నారు. పోలవరం, కొయ్యలగూడెం, దేవరపల్లి, నల్లజర్ల, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, పెదవేగి మండలాల మీదుగా కాలువ ప్రవహిస్తోంది. భవిష్యత్తు అవసరాల నిమిత్తం కాలువకు ఇరువైపులా అధిక మొత్తంలో భూములు సేకరించారు. అందులో కాలువ మట్టిని గుట్టలుగా పోశారు.

భీమడోలు మండలం పోలసానిపల్లి సమీప పోలవరం కుడి కాలువ గట్టుపై యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతుండటంతో గ్రావెల్ గుట్టలు కరిగిపోతున్నాయి. దెందులూరు మండలం పెరుగుగూడెం, చల్లచింతలపూడి, రామారావుగూడెం, మేదీనరావుపాలెం; పెదవేగి మండలం ముండూరు, కొప్పులవారిగూడెం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో గ్రావెల్ తవ్వకాలు నిర్విరామంగా సాగుతున్నాయి.

పోలవరం కుడి కాలువ వెంబడి తవ్వకాలు

మాయం చేసేశారు.. ఈ గుట్టలపై కన్నేసిన అక్రమార్కులు.. యంత్రాల సాయంతో ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టి తరలిస్తూ మాయం చేసేశారు. స్థిరాస్తి వ్యాపారులు తమ లేఅవుట్లకు ఈ మట్టిని రాత్రింబవళ్లు తరలించి చదును చేయించుకున్నారు. మరోవైపు ఇక్కడి ఖాళీ స్థలాల్లో సైతం తవ్వకాలు చేపడుతున్నారు. కొందరు రైతులు కాలువ భూముల్ని తమ పొలాల్లో కలిపేసుకుంటూ సాగు చేస్తున్నారు. కాలువ నిర్మాణానికి భూములు సేకరించినప్పుడు తమకు తక్కువ పరిహారం ఇచ్చారని, ఖాళీ భూమిని సాగు చేస్తే తప్పేమిటని వారు వాదిస్తున్నారు.

ఉంగుటూరు మండలం గొల్లగూడెం సమీప పోలవరం కుడి కాలువ భూములు ఆక్రమించి వరి సాగు చేస్తున్నారు. కాలువ నిర్మాణానికి మండలంలో మొత్తం 165.70 ఎకరాలు సేకరించగా.. సుమారు 70 ఎకరాలు ఆక్రమణకు గురైందని అంచనా.

ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం, ఎం.నాగులపల్లి, గుణ్ణంపల్లి ప్రాంతాల్లో పోలవరం కుడి కాలువ గట్టు వెంబడి ఖాళీ భూములను కొందరు రైతులు ఆక్రమించేసి తమ చేలల్లో కలిపేసుకున్నారు. పంగిడిగూడెంలో ఆక్రమించిన భూముల్లో మొక్కజొన్న, కొబ్బరి, ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు.

పర్యవేక్షణ లోపం.. పోలవరం కుడి కాలువ నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఏళ్లు గడుస్తున్నా వివిధ పోస్టులు భర్తీ చేయలేదు. కుడి కాలువ పరిధిలో ఏఈఈలు అందుబాటులో లేరు. జలవనరుల శాఖలో ఎనిమిది కిలోమీటర్లకు ఒక లస్కరు ఉండాల్సి ఉండగా.. ఒక్కరూ లేకపోవడం గమనార్హం. 'కాలువ గట్టు వెంబడి మట్టి తవ్వకాలు చేసేవారిపై కేసులు నమోదు చేస్తున్నాం. భూములు ఆక్రమించే వారికి నోటీసులు ఇస్తున్నాం' అని పోలవరం కుడి కాలువ ఏఈ బాపూజీ తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా నిల్వలు

రూ.30 లక్షల విలువైన సరకు సీజ్

పెదపాడు, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుళ్ల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏపూరులోని లక్ష్మీనారాయణ క్రాకర్స్ గోదాము, విక్రయ దుకాణాలపై ఆదివారం ఎస్సై ఆర్.శ్రీను ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన సుమారు రూ.30 లక్షల విలువైన బాణసంచాను గుర్తించారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో యజమాని పైడి సుధాకర్‌పై కేసు నమోదు చేశారు. అగ్నిమాపక శాఖాధికారి నాగరాజు, పౌరసరఫరాల శాఖ డీటీ రామారావు, వీఆర్వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి గుడివాడ రైల్వే గేటు మూత

ముదినేపల్లి, న్యూస్‌టుడే: గుడివాడ నుంచి ముదినేపల్లి వచ్చే రహదారిలోని మల్లయ్యపాలెం వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతులు కారణంగా ఈ నెల 3 నుంచి నాలుగు రోజుల పాటు గేటు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుడివాడ నుంచి ముదినేపల్లి, కైకలూరు, కలిదిండి, భీమవరం, బంటుమిల్లి వెళ్లే వాహనాలు, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సూచించారు.

ఏటి గట్టు పనుల పరిశీలన

ఈనాడు కథనానికి స్పందన

పాలకొల్లు, న్యూస్‌టుడే: యలమంచిలి మండలం గంగడపాలెం- అబ్బిరాజుపాలెం గ్రామాల మధ్యలో జరుగుతున్న ఏటిగట్టు పనుల్లో లోపాలపై 'లోగుట్టు.. నాణ్యత తీసిగట్టు' శీర్షికతో గత నెల 28న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఏటి గట్ల పరిరక్షణ శాఖ అధికారులు స్పందించారు. పనులు జరుగుతున్న ప్రాంతాలను ఆదివారం పరిశీలించిన నరసాపురం ఏఈ పవన్ మట్టిలో వ్యర్థాలను పూర్తిగా తొలగించిన తర్వాతే రోలింగ్ చేయాలని గుత్తేదారును ఆదేశించారు.

దేశభక్తి.. సేవా దీప్తి

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో రాణిస్తున్న విద్యార్థులు

నూజివీడు, న్యూస్‌టుడే: చదువు, క్రమశిక్షణ, సమాజంపై బాధ్యత, సేవాభావం పెరిగేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపకరిస్తోంది. ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సేవలు అందిస్తున్నారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు పి.వి.రమణ ప్రోత్సాహంతో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయులు జి.సురేశ్‌బాబు, వై. మౌనిక శిక్షణ అందిస్తున్నారు.

కార్యక్రమాలు ఇవీ..

పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి వాటి పర్యవేక్షణ, దేవాలయాల వార్షికోత్సవాలు, వివిధ వేడుకల సమయంలో వచ్చే భక్తులకు క్యూలైన్లలో వెళ్లేలా పర్యవేక్షించడం, తాగునీరు, మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేస్తారు. స్వాతంత్ర్య దినోత్సవాలు, రిపబ్లిక్ డే తదితర కార్యక్రమాల్లో భాగస్వాములవుతారు.

ఐఏఎస్ కావాలన్నదే ధ్యేయం..

నా పేరు వి. జెస్సిక, 8వ తరగతి చదువుతున్నా. మా ఊరు అడవినెక్కలం. రెండేళ్లుగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సేవలు అందిస్తున్నా. దీని ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు విలువలు, క్రమశిక్షణ పెంపొందించుకుంటున్నా. ఐఏఎస్ కావాలన్నదే నా లక్ష్యం.

నాయకత్వ లక్షణాలు..

నా పేరు టి. హేమలత. మాది నెక్కలం గొల్లగూడెం గ్రామం. ఏడో తరగతి చదువుతున్నా. ఏడాదిగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సేవలు అందిస్తున్నాను. దీనిలో చేరడం వల్ల నాయకత్వ లక్షణాలు అలవడతాయి. సమయ నిర్వహణ, చొరవ, ప్రణాళికా బద్ధంగా పనిచేసే నైపుణ్యాలు అలవర్చుకున్నాను. పోలీస్ అధికారిణి అవుతా.

బాధ్యతలపై అవగాహన


ఎం. ప్రేమ్ సాయి నా పేరు. అడవినెక్కలం గ్రామం. ఏడో తరగతి చదువుతున్నా. ఏడాదిగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సేవలు అందిస్తున్నాను. దీనిలో చేరడం వల్ల సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ.. పౌరుల బాధ్యతను అర్థం చేసుకుంటున్నాను. మంచి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా.

చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ..


నా పేరు ఎస్. శివ నాగరాజు, మాదలవారిగూడెం గ్రామం. 8వ తరగతి చదువుతున్నా. రెండు సంవత్సరాలుగా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో సేవలు అందిస్తున్నా. దీనిలో చేరడం వల్ల నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ పొందుతూ.. చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించడానికి చక్కని అవకాశం లభించింది.

వ్యక్తిత్వ వికాసానికి దోహదం..


విద్యార్థి దశలోనే వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది. పాఠశాలలు, గ్రామం, ఇతర ప్రాంతాల్లో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడతాయి. సమాజంలో ఎలా ప్రవర్తించాలి, పౌరుల బాధ్యతపై అవగాహన కలుగుతుంది.

\- పి.ఎస్.సుధాకర్, డీవైఈవో, నూజివీడు

కరపత్రాలు ఆవిష్కరించిన విజయకుమార్, పూర్ణచంద్రరావు తదితరులు

ఉద్యమాలతోనే బీసీలకు రాజ్యాధికారం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఉద్యమాలతోనే బీసీలకు రాజ్యాధికారం సొంతమవుతుందని బీసీ ఐకాస నాయకుడు, ఐఏఎస్ విశ్రాంత అధికారి విజయకుమార్, ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ జాతీయ సమన్వయకర్త, విశ్రాంత డీజీపీ పూర్ణచంద్రరావు అన్నారు. నగరంలోని సాహిత్య మండలిలో బీసీ చైతన్య వేదిక, బీసీ కుల సంఘాల ఐకాస ఆధ్వర్యాన ఆదివారం బీసీ మేధోమథన సభ నిర్వహించారు. బీసీ చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ.. బీసీలకు స్థానిక సంస్థల్లో 52 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల రక్షణకు ప్రత్యేకంగా చట్టం తేవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కుల గణన చేపట్టాలన్నారు. జూన్ 3న విజయవాడలో బీసీల సమావేశం నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున బీసీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. బీసీ కుల సంఘాల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్వీఆర్ విఠల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ
ఇ. ప్రొక్యూర్‌మెంట్ నోటీస్
ఇ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా **ఉండి** గ్రామం మరియు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా నందు గల **శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవాలయమునకు అభివృద్ధి పనులు** చేయుటకు **రూ.56.00 లక్షలకు టెండరు** పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్‌సైట్ **www.apeprocurement.gov.in** నందు చూడగలరు.
సం/- ఎం.లక్ష్మీశరణ్య, కార్యనిర్వాహక అధికారి
DIPR No. /CL/ADVT/1/1/-

ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ
ఇ. ప్రొక్యూర్‌మెంట్ నోటీసు (2వ పిలుపు)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా మల్లిపూడి గ్రామం, పెనుమంత్ర మండలం, పశ్చిమగోదావరి జిల్లా నందు గల శ్రీ మదన గోపాల స్వామి వారి దేవాలయము నందు గల వాహనశాలను పునర్నిర్మించుటకు రూ. 15.00 లక్షలకు టెండరు పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్ సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.
సం/- కార్యనిర్వహణాధికారి

తాడేపల్లిగూడెం పురపాలక సంఘము
ఆర్.ఓ.సి.నెం. 208/2026/ఎ1. **బహిరంగ వేలం నోటీసు** తేదీ: 28-02-2026
తాడేపల్లిగూడెం పురపాలక సంఘమునకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరమునకు గాను బ్రహ్మానందరెడ్డి మార్కెట్ మరియు రోడ్డు మార్జిన్లలో ఆశీలు మరియు కబేళ ఆశీలు వసూలు చేసుకునే హక్కు నిమిత్తము ది. 09-03-2026, సోమవారం ఈ క్రింది తెలిపిన విధముగా పురపాలక సంఘ కార్యాలయమునందు బహిరంగ వేలం నిర్వహించబడును. సదరు బహిరంగ వేలం పాటలో పాల్గొనదలచిన వారు ఈ దిగువ షరతులకు లోబడి వేలం పాటలో పాల్గొనవలెను.

వరుస సంఖ్య	వేలం వివరము	వేలం నందు కట్టవలసిన డిపాజిట్ రూ.	వేలంనందు చెల్లించవలసిన స్టాంపుడ్యూటీ మరియు అగ్రిమెంట్ ఛార్జెస్ రూ.	వేలంనందు దాఖలు పరచవలసిన సాల్వెన్సీ సర్టిఫికెట్ విలువ రూ.	సమయము
1	2026-27 సంవత్సరమునకు సంబంధించి అనగా ది. 01-04-2026 నుండి 31-3-2027 వరకు శ్రీ బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ డైలీ & వారాంతపు మార్కెట్ మరియు రోడ్డు మార్జిన్‌ల యందు ఆశీలు వసూలు చేసుకునే హక్కు. ముఖ్య గమనిక:- ఎస్.వి.ఆర్. జంక్షన్ ఈట్ స్ట్రీట్ రోడ్ మార్జిన్ నందు ఏర్పాటు చేసిన జి.ఐ. షీట్ ఫుడ్ స్టాల్ షాపులకు రోడ్డు మార్జిన్ ఆశీలు మినహాయింపు ఇవ్వబడునని తెలియజేయడమైనది.	15,00,000/-	2,00,000/-	30,00,000/-	మధ్యాహ్నం 3.00 గం.
2	2026-27 సంవత్సరమునకు సంబంధించి అనగా ది. 01-04-2026 నుండి 31-3-2027 వరకు కబేళ యందు ఆశీలు వసూలు చేసుకును హక్కు.	50,000/-	20,000/-	2,00,000/-	మధ్యాహ్నం 3.30 గం.

1. బహిరంగ వేలం పాటను ఏ కారణము తెలుపకనే అంగీకరించుటకు మరియు నిరాకరించుటకు గాని ఎగ్జిక్యూటివ్ అధికారి, పురపాలక సంఘం వారికి అధికారం కలదు. 2. బహిరంగ వేలం పాటలో పాల్గొనదలచిన వారు పాట తేదీనకు రెండు రోజులు ముందుగా సాల్వెన్సీ ధృవపత్రము కార్యాలయమునకు దాఖలు పర్చవలెను. 3. ఇతర వివరముల కొరకు కార్యాలయము పని చేయు వేళలలో రెవెన్యూ విభాగము నందు తెలుసుకొనవలసినదిగా తెలియజేయడమైనది. సం/- **కమిషనరు, తాడేపల్లిగూడెం పురపాలక సంఘము**

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం దొరమామిడి సమీపాన ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం ఆకుల గణపవరం గ్రామానికి చెందిన మొరిగిపూటి నాని(19) వర్జీనియా పొగాకు పనుల నిమిత్తం దొరమామిడి వచ్చాడు. బుట్టాయగూడెం- దొరమామిడి వైపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదానికి గురైనట్లు భావిస్తున్నారు. ఘటన స్థలంలో నాని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రమాదానికి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యూట్యూబర్‌పై కేసు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: తనపై ఓ యూట్యూబర్ అఘాయిత్యానికి పాల్పడ్డాడంటూ ఓ మహిళ జంగారెడ్డిగూడెం పోలీసులను ఆదివారం ఆశ్రయించారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఓ మహిళ.. ఎంసీ మీడియా పేరుతో యూట్యూబ్ ఛానల్‌ను నడుపుతున్న మిథున్ వద్దకు ఓ సమస్య నిమిత్తం శనివారం వెళ్లారు. ఆమెపై సదరు వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడంటూ మహిళ ఆదివారం జంగారెడ్డిగూడెం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై వీరప్రసాద్ కేసు నమోదు చేయగా.. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎంవీ సుభాశ్ తెలిపారు. ఇదిలా ఉండగా బాధిత మహిళకు న్యాయం చేయాలంటూ పలువురు మహిళలు ర్యాలీగా వెళ్లి ఏఎస్పీ సుస్మితను కలిసి వినతిపత్రం అందించారు. సమగ్ర దర్యాప్తు జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఇంటి పన్ను పేరిట పింఛను కోత

ఆశన్నగూడెం(చింతలపూడి), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఒక రోజు ముందుగానే సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్న పింఛనుదారులకు సచివాలయ సిబ్బంది షాక్ ఇస్తున్నారు. పింఛను సొమ్మును ఇంటి పన్నులకు మినహాయిస్తుండటంతో పింఛనుదారులు నివ్వెరపోతున్నారు. లింగపాలెం మండలం ఆశన్నగూడెం, బాదరాల పంచాయతీల్లో సుమారు 300కు పైగా పింఛనుదారులు ఉన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీకి ముందే వృద్ధులు, వితంతువుల ఇంటికి వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందిస్తున్నారు. ఈ నెలాఖరులోపు పన్నులు పూర్తిగా వసూలు చేయాలని సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి పెరగడంతో చేసేదేం లేక వీరు పింఛను డబ్బుల నుంచి పన్ను మినహాయించి ఇస్తున్నారు. దాదాపు సగం మంది లబ్ధిదారుల నుంచి 50 శాతం పైగా మినహాయించి ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.

లబ్ధిదారుల గగ్గోలు..

ప్రతి నెలా మందులు, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు పింఛను డబ్బు వినియోగిస్తున్నామని, పన్ను పేరిట మినహాయించడం ఎంత వరకు సబబని పింఛనుదారులు ప్రశ్నిస్తున్నారు. పింఛను మొత్తం నుంచి పన్నుల పేరిట మినహాయించాలని ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేకపోయినా సచివాలయ సిబ్బంది ఈ విధంగా చేయటంపై పింఛనుదారులు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై ఎంపీడీవో వాణిని సంప్రదించగా పింఛనుదారులకు పూర్తి మొత్తం పింఛను ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. పన్నుల కోసం పింఛను సొమ్ము మినహాయించడంపై సచివాలయ సిబ్బందిని వివరణ కోరతామన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -150 రిటైల్ ధర 177 చికెన్ విత్ స్కిన్ - 257 చికెన్ స్కిన్‌లెస్ - 292.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph.81422 92071.

REAL ESTATE
LAND FOR SALE
ఏలూరు చాటపర్రు మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న సుమారు 7 ఎకరముల పొలం అమ్మకమునకు కలదు. సంప్ర॥ శ్రీమతి ఆచంట రజని, ✆ +16303867373.

2 ఎకరాల 20 సెంట్లు చేపల చెరువు అమ్మకం. దొడ్డనపూడి గ్రామం కాళ్ల మండలం, భీమవరం, ప. గో. జిల్లా సెల్: 8500405678, 9885912559

JOBS
Wanted Pharma.D, B.Sc. Nursing ANM, GNM Staff to work in reputed hospital in Bhimavaram with attractive Salaries. Cont: 93982 32949.

ఉద్యోగం: East&West జిల్లాల్లో ప్ర॥ కంపెనీలకు సూపర్‌వైజర్స్, హెల్పర్స్, టెలీకాలర్స్ స్త్రీ/పు. కావలెను. జీతం, రూం+భోజనం ఫ్రీ. R.S. సర్వీసెస్, RJY, 99633 27756.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డ ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 4.58 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
CLASSIFIEDS

భీమవరం

• భీమవరం • ఉండి

అంగన్‌వాడీ కార్యకర్తలకు అండగా ప్రభుత్వం

తోట సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరంలోని ఆమె కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గతంలో తెదేపా హయాంలో రెండు సార్లు కార్యకర్తలు, ఆయాలకు వేతనాలు పెంచామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పుడూ.. ఇప్పుడూ వారికి అండగా ఉండేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన ఆయన వల్లే సాధ్యమన్నారు. ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చాలా వరకు ప్రభుత్వం నెరవేర్చిందని, మిగిలిన వాటిని అమలు చేయడానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు.

మహిళల సాధికారతతోనే అభివృద్ధి

అవగాహనలో పాల్గొన్న ఎస్సై నసీరుల్లా

చెరుకువాడ (ఉండి), న్యూస్‌టుడే: మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. చెరుకువాడ పెదపేటలో మహిళా వారోత్సవాలను ఆదివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించాలని సూచించారు. విద్యారంగంలో రాణిస్తే మరిన్ని మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. చట్ట ప్రకారం మహిళలకు ఉన్న హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

చేయమన్నారంతే.. చేశాం.. వదిలేశాం!

ఆకివీడులో రోజువారీ మార్కెట్ ప్రాంతంలో అనేక ఏళ్లుగా నగర పంచాయతీకి చెందిన 18 దుకాణాలు నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తీసుకొచ్చి ఆదాయం పెంచే దిశగా కృషి చేయాలని ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు ఆదేశించారు. ఆ మేరకు అధికారులు శరవేగంగా మరమ్మతులు చేయించి, రంగులు వేసి 'ఎన్టీఆర్ ప్రజా బజార్' అనే నామకరణం కూడా చేశారు. నెలలు గడుస్తున్నా దుకాణాలను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. - న్యూస్‌టుడే, ఆకివీడు

కూలేలా ఉన్నాం.. అప్పుడే చూద్దాం!

శిథిల వంతెనలపై యంత్రాంగానికి పట్టదా?

భీమవరం పట్టణ పరిధిలో 70 ఏళ్ల కిందట నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి దశాబ్దం దాటింది. ఎన్నో సార్లు ప్రమాద ఘంటికలు మోగించింది. తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారే కానీ నూతన వంతెన నిర్మించడంపై పాలకులు శ్రద్ధ చూపడం లేదు. రెయిలింగ్‌లు ధ్వంసమయ్యాయి. జిల్లా కేంద్రం నుంచి భీమవరం, మొగల్తూరు మండలాల్లోని అనేక గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం. ప్రజలు, రైతులు, విద్యార్థులు రోజూ వేల సంఖ్యలో దీని మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. పలు ఆక్వా పరిశ్రమలు ఈ మార్గంలో ఉండటంతో రూ.కోట్ల విలువైన ఉత్పత్తులతో భారీ వాహనాలు ఇలాగే తిరుగుతుంటాయి.

• ఉండి ప్రధాన కూడలిలో 165 జాతీయ రహదారిపై ఉన్న వంతెన అధ్వాన స్థితికి చేరింది. దీని రెయిలింగ్‌లు దెబ్బతిన్నాయి. ఎంతో రద్దీగా ఉండే ఈ మార్గంలోని వంతెన ఇరుకుగా ఉండటంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

• ఆకివీడు మండలంలో పెదకాపవరం నుంచి పాములపర్రు వెళ్లే మార్గంలో వెంకయ్యవయ్యేరుపై వంతెన శిథిల స్థితిలో ఉంది. శ్లాబ్‌పై ఇనుప చువ్వలు బయటకు వచ్చి ప్రమాదకరంగా ఉన్నాయి.

భీమవరం గ్రామీణ, పాలకోడేరు, ఉండి, ఆకివీడు, న్యూస్‌టుడే

భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోని పలు కీలక మార్గాల్లో ఉన్న వంతెనలు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయి. రహదారుల అభివృద్ధి విస్తరణపై దృష్టి సారిస్తున్న పాలకులు వీటిని పట్టించుకోవడం లేదు. భీమవరం-తాడేపల్లిగూడెం మార్గంలో గరగపర్రు వద్ద ఉండి కెనాల్‌పై ఉన్న వంతెన ఇప్పటికే కూలేలా ఉండటంతో దానికి ఇరువైపులా గడ్డర్లు పెట్టి భారీవాహనాల రాకపోకలను నిలిపివేశారు. తాజాగా ఓ భారీ వాహనం ఢీకొట్టడంతో అవి ధ్వంసమయ్యాయి. ఒక వేళ ఇది కూలిపోతే భీమవరం, తాడేపల్లిగూడెం మధ్య రాకపోకలు ఆగిపోయినట్లే. 'అత్యవసరమైన చోట్ల వంతెనలు నిర్మించాలనే ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. సమస్య తీవ్రతను ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరైతే పనులు చేపట్టేందుకు శాఖాపరంగా సిద్ధంగా ఉన్నాం. కోపెల్ల వద్ద వంతెన పనులు చేపట్టాం. దానిని త్వరగా పూర్తి చేస్తాం అని' ర.భ.శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

బొండాడ డ్రెయిన్‌పై ఈలంపూడి-పల్లిపాలెం గ్రామాల మధ్య ఉన్న శిథిల వంతెన ఇది. నిర్మించి 50 ఏళ్లు దాటింది. ప్రస్తుతం వంతెన మధ్యలో గుంతలు పడ్డాయి. రెయిలింగ్ పూర్తిగా ధ్వంసమైంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం:	80085 74471	గునుపూడి:	80085 74474
భీమవరం మండలం:	80085 74533	వీరవాసరం:	80085 74475
పాలకోడేరు:	80085 74467	ఉండి:	80085 74526
ఆకివీడు:	80085 74525	కాళ్ల:	94401 04042

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? గునుపూడి 12వ వార్డు బ్రిడ్జిపేట రహదారి ప్రారంభంలో పైపులైను లీకేజీతో తాగునీరు వృథా అవుతోంది. - కె.సత్యకుమార్, స్థానికుడు
✔ ఆ ప్రాంతం పరిశీలించి వృథాను అరికడతాం. - టి.సురేంద్ర, పురపాలక నీటి సరఫరా విభాగం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? భీమవరం రెస్ట్‌హౌస్‌రోడ్డులో గుంతలు పూడ్చటానికి వేసిన రాళ్ల నుంచి దుమ్ము వస్తోంది. ఇంటి తలుపులు మూసుకుంటున్నాం. -రామచంద్రరావు, రాజు, నాగబాబు, వెంకన్న
✔ దుమ్ము రాకుండా చూస్తాం. -కె.రామచంద్రారెడ్డి, కమిషనర్

? బ్యాంకు కాలనీలో డ్రెయిన్లలో చెత్త వేయడంతో మురుగు ప్రవాహానికి అడ్డు పడుతున్నాయి. - శివబాబు, ప్రైవేటు ఉద్యోగి
✔ మురుగుకు ఆటంకాలు లేకుండా చేస్తాం. -ఎ.రాంబాబు, సహాయ కమిషనర్

భీమవరం గ్రామీణ: ? రాయలం పంచాయతీ పరిధిలో కొమరాడ కాలువ గట్టు వెంబడి ఇష్టారాజ్యంగా చెత్త వేస్తున్నారు. - బాలు, స్థానికుడు
✔ పరిశీలించి చెత్త తొలగిస్తాం. - వీర్రాజు, పంచాయతీ కార్యదర్శి

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? పాలకోడేరు శివారు కొత్తపేట కనకదుర్గమ్మ ఆలయ సమీపంలో రోడ్డు పక్కన చెత్త, వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. దీంతో పారిశుద్ధ్యపరంగా ఇబ్బందులు పడుతున్నాం. - ఎస్.సత్యనారాయణ
✔ చెత్త కుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - బి.గోపి, కార్యదర్శి, పాలకోడేరు

ఆకివీడు, న్యూస్‌టుడే: ? ఆకివీడు మాదివాడ రాళ్ల చెరువు ప్రాంతంలో డ్రెయినేజీలు సక్రమంగా లేక మురుగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. - ఏడుకొండలు, స్థానికుడు
✔ డ్రెయినేజీలను బాగు చేయించేందుకు, మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - సాకేత్‌బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆకివీడు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు నేర ప్రవృత్తికి స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో జీవించాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సూచించారు. జిల్లాలోని పోలీస్ సర్కిల్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే పీడీ యాక్టు నమోదు చేసి కారాగారానికి పంపిస్తామని హెచ్చరించారు.

తేనెలాంటి ఉపాధి

ఉండి, న్యూస్‌టుడే వంటింటికే పరిమితం కాకుండా ఆర్థికంగా ఎదిగి కుటుంబానికి అండగా నిలవాలని ముందుకెళ్తున్నారు మహిళలు. ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకునేందుకు ఉన్న మార్గాల వైపు దృష్టి సారిస్తున్నారు. ప్రధానంగా చింతూరు, పోలవరం, బుట్టాయగూడెం తదితర ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన కొందరు ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై ప్రత్యేక శిక్షణ తరగతులకు హాజరై నేర్చుకున్నారు.

ఆసరాగా నిలుస్తా

మాది చింతూరు మండలం వీరాపురం. డిగ్రీ చదివా. వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. తల్లిదండ్రులిద్దరు వ్యవసాయం చేస్తారు. అక్క, తమ్ముడు చదువుకుంటున్నారు. కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు తేనెటీగల పెంపకం యూనిట్ స్థాపన మంచి అవకాశంగా కనిపించింది. - పీసం శైలజ, చింతూరు

గ్రూపుగా ఏర్పడతాం

ఉద్యాన విభాగంలో డిప్లమో చేశా. ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు వివరిస్తా. ఇక్కడ తేనెటీగల రకాలు, ఉత్పత్తులపై శాస్త్రవేత్తలు మంచి పరిజ్ఞానం అందించారు. మా ప్రాంతంలో మరికొందరితో గ్రూపుగా ఏర్పడి తేనె ఉత్పత్తితో ఆదాయాన్ని ఆర్జిస్తా. - తెల్లం ప్రమీల, నూతిరామన్నపాలెం, బుట్టాయగూడెం

'బ్రాండ్' పేరుతో విక్రయిస్తా

నేను అగ్రికల్చర్ బీఎస్సీ చదివా. వ్యవసాయం చేస్తున్నా. ఉపాధి కోసం అన్వేషించే సమయంలో నాణ్యమైన తేనెకు మార్కెట్‌లో గిరాకీ ఉందని తెలుసుకుని శిక్షణ పొందా. 'బ్రాండ్' పేరుతో విక్రయించి ఉపాధి మెరుగుపరచుకుంటా. ఆన్‌లైన్ మార్కెట్‌లో విక్రయాలతో మరికొందరికి ఉపాధి కల్పిస్తా. - ఎస్.సుబ్బలక్ష్మి, కంచులూరు, చింతూరు

ఐటీడీఏ సహకారం తీసుకుంటా..

డిగ్రీ చదువుకున్నా. ప్రకృతి వ్యవసాయంలో ఎన్జీవో సభ్యురాలిగా రైతులకు సేవలందిస్తున్నా. తేనె, ఉత్పత్తుల తయారీపై నేర్చుకున్న పరిజ్ఞానంతో మా ఐటీడీఏ అధికారుల సహకారంతో యూనిట్ ఏర్పాటు చేస్తా. తద్వారా మరికొంత ఆదాయాన్ని సంపాదిస్తా. - మొడియం వీరభారతి, కొండ్రుకోట, పోలవరం మండలం

పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

ఉండిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ఉండి, న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికీ స్థలాలిచ్చి, ఇళ్లు నిర్మిస్తామనే హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. ఉండి ప్రధాన కూడలిలో సీపీఎం ప్రజా చైతన్య పాదయాత్రను ఉద్దేశించి ఆదివారం ఆయన మాట్లాడారు. పల్లెలు, పట్టణాల్లో స్వచ్ఛమైన మంచినీరు అందడం లేదని, డ్రైనేజీ, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. కోలమూరు అరుంధతీపేటలో మంచినీరు అందించాలని విన్నవించారని తెలిపారు. ఈ నెల 23న విస్సాకోడేరు వంతెన వద్ద ముగింపు సభలో ప్రజా సమస్యలన్నింటినీ ప్రస్తావిస్తామని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బురిడి వాసుదేవరావు, సభ్యులు సత్యనారాయణ, శ్రీనివాస్, రామకృష్ణ, జార్జి, శేషు, మాధవరావు, పూర్ణ, అజయకుమారి, క్రాంతిబాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

స్పందనకు వందనం

ఉండి, న్యూస్‌టుడే: పాందువ్వ గ్రామంలో అల్ప విద్యుత్తు సమస్య పరిష్కారానికి ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. సమస్యపై 'మేమున్నాం. మీకు తోడుగా'లో గత నెల 26న వార్త ప్రచురితమైంది.

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: గునుపూడి సోమేశ్వర జనార్దన స్వామి ఆలయం ఎదుట ఉన్న సోమగుండం చుట్టూ ఉన్న రహదారిలో పలు చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో తెల్లవారుజామున, సాయంత్రం సోమగుండం చుట్టూ నడిచే వారు ఇబ్బంది పడుతున్నారు. గత నెల 25న 'సోమగుండం చెరువు చుట్టూ వెలగని వీధి దీపాలు శీర్షికన ప్రచురితమైన కథనానికి ఏఈ సాంబశివ స్పందించి మరమ్మతులు చేయించారు.

వీరవాసరం, న్యూస్‌టుడే: మత్స్యపురి గ్రామంలోని పెన్నమ్మ గుడిదిబ్బ ప్రాంతంలో వీధి దీపాలు వెలగడం లేదంటూ మేమున్నాం.. మీకు తోడుగాలో ప్రచురితమైన వార్తకు పంచాయతీ కార్యదర్శి కల్యాణి స్పందించి మరమ్మతులు చేయించారు. ● రాయకుదురు-వీరవల్లిపాలెం రహదారి వెంబడి చెత్త కుప్పలను పంచాయతీ కార్యదర్శి ఎన్.సూర్యనారాయణ తీయించారు.

రామాలయానికి రూ.1,00,116 విరాళం

పాలకోడేరు, న్యూస్‌టుడే: పెన్నాడ అగ్రహారం కునుకువారి వీధిలో పునర్నిర్మిస్తున్న రామాలయం పనులకు స్థానికులు దాసరి వెంకట్రావు, పార్వతి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని ఆదివారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. దాతలను గ్రామస్థులు అభినందించారు.

ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా దానియేలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: శృంగవృక్షం సబ్బితి పేటకు చెందిన సబ్బితి దానియేలు భాజపా ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆ మేరకు పార్టీ అధిష్ఠానం నుంచి ఆదివారం నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తూడు అల్లుకుపోయి.. నీరు ఆగిపోయి

బొండాడ మేజర్ డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క, వ్యర్థాలు దట్టంగా అల్లుకుపోవడంతో గణపవరం, ఉండి, పాలకోడేరు, భీమవరం మండలాల్లోని పొలాల్లో మురుగునీరు బయటకు వెళ్లడం లేదు. కొన్ని రోజులుగా సమస్య ఎక్కువైందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ అంశంపై డ్రైనేజీ శాఖ ఏఈ జయప్రకాశ్ స్పందిస్తూ ఓఅండ్ఎం నిధులతో తొలగింపు పనులను ప్రతిపాదించామని తెలిపారు. - న్యూస్‌టుడే, ఉండి

నీరు రాదు.. డ్రెయిన్లు శుభ్రం చేయరు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఒకటో పట్టణంలోని డ్రెయిన్లు శుభ్రతకు నోచుకోవడం లేదు. కాలువల్లో సిల్టు, చెత్త తీయకపోవడంతో దోమలతో 13వ వార్డు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అమృత్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల ఏర్పాటు పూర్తి కాలేదు. పైపులు ఇంటి ముందు కర్రలకు వేలాడుతున్నాయి. కొన్నిచోట్ల గొట్టాల నుంచి ఇళ్లకు కనెక్షన్ కలపకపోవడంతో నీరు వృథా అవుతోంది. పైపులైన్ల కనెక్షన్లు పూర్తి చేయిస్తున్నామని కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తెలిపారు. డ్రెయిన్లను వెంటనే శుభ్రం చేయిస్తామన్నారు.

ఆగింది.. పదేళ్లయింది

వీరవాసరంలో మండల విద్యా వనరుల కేంద్రం భవనం పనులు పదేళ్ల కిందట నిలిచిపోయాయి. ఇటీవల ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని రూ.3 లక్షల నిధులు మంజూరు చేయడంతో కొన్ని పనులు పూర్తి చేశారు. మిగిలిన భవనం పూర్తి చేయడానికి మరో రూ.10 లక్షలు అవసరం. అప్పుడే విద్యా వనరుల కేంద్రం పూర్తవుతుందని పంచాయతీరాజ్ శాఖ ఏఈ రమేష్ తెలిపారు. - న్యూస్‌టుడే, వీరవాసరం

వాండ్రంలో ఇక మురుగుండదు

వాండ్రం (ఉండి), న్యూస్‌టుడే: వాండ్రం ఎస్సీ కాలనీలో కొన్ని దశాబ్దాలుగా వెంటాడుతున్న దీర్ఘకాలిక సమస్యకు విముక్తి లభిస్తోంది. తమ ప్రాంతంలో మురుగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపరచాలని రామాపురంలోని పేదలు ఇటీవల ఉపసభాపతికి నివేదించారు. ఆయన దాత సహకారంతో ఈపనులు చేపట్టాలని ఆదేశించారు. వెల్కమ్ ఫిషరీస్ అధినేత ఆనంద్ ముందుకొచ్చారు. రామాపురం నుంచి బొండాడ మేజర్ డ్రెయిన్ వరకు 300 మీటర్ల పరిధిలో సుమారు 11 అడుగుల లోతులో డ్రైనేజీని తవ్వించారు. అందులో మూడు అడుగుల సిమెంట్ తూరలు వేసి భూగర్భ మురుగునీటి పారుదలకు చర్యలు చేపట్టారు. ఈ పనులకు రూ.15 లక్షలు ఖర్చు చేస్తున్నారు.

కాలువేనండి.. జాగ్రత్త సుమండి

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు ఎస్ కూడలి వద్ద జాతీయ రహదారి ఇరుకుగా ఉంటుంది. దాని అంచులో ఉన్న డ్రెయినేజీ గొయ్యి వాహనచోదకులకు దగ్గరకు వచ్చే వరకు కనిపించడం లేదు. దీంతో పలు ద్విచక్ర వాహన చోదకులు అదుపు తప్పి పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. దీంతో స్థానికులు గుర్తించేలా ఎర్రగా ఉండే ఉల్లిపాయల సంచులను ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాకేత్‌బాబు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా పరిశీలించి రక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బాలలు.. బహు భాషా కోవిదులు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో.. భాషాభిమానాన్ని పెంపొందించడంలో భాషా పండుగలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి స్థానిక భాషల గొప్పదనాన్ని చాటడం.. సాహిత్యాన్ని ప్రోత్సహించడం, పాఠశాల స్థాయి నుంచి మాతృభాషపై ఆసక్తి పెంపొందించడానికి దోహదం చేస్తాయి.

విద్యార్థుల్లో స్నేహపూర్వక, ఆనందకర, వినోదభరితమైన వాతావరణం సృష్టించడం, బహుభాషా సాంస్కృతికతపై ఆసక్తి పెంపొందించేలా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో భీమవరంలో గత నెల 27న బహుభాషోత్సవాలు నిర్వహించారు. జిల్లాలోని 124 పాఠశాలలకు చెందిన 320 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు, హిందీ, ఆంగ్లం, సంస్కృతం, ఉర్దూ భాషల్లో పాటలు, పద్యాలు, నృత్య ప్రదర్శనలు, నాటికలతో అలరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను డీఈవో ఇ.నారాయణ, ఎస్ఎస్ఏ ఏపీసీ పి.శ్యాంసుందర్ అందజేశారు.

భువన విజయం ప్రదర్శనలో విద్యార్థినులు

ఎన్నో విషయాలు తెలుసుకున్నాం.. బహు బాషోత్సవాల్లో పలు ప్రాంతాల విద్యార్థులు పాల్గొన్నారు. ఒకరి ఆలోచనలు, మరొకరం పంచుకునేందుకు ఇది చక్కని వేదికైంది. మాకు తెలిసిన వాటి కంటే కొత్త విషయాలు ఎన్నో తెలుసుకున్నాం. మేము జిల్లాస్థాయిలో బహుమతులు అందుకోవడం ఆనందంగా ఉంది. - శ్రీలక్ష్మి, రేష్మ, తాడేపల్లిగూడెం

భవిష్యత్తు తరాలకు తెలిసేలా.. కవులు, రచనలు, సాంస్కృతిక వేడుకలు, పండుగలు ఇవన్నీ భారతీయ సంస్కృతిలో ఓ మేళవింపు. వాటిని భావితరాలకు తెలియజేసేలా ప్రదర్శనలు ఇచ్చాం. అలాగే బహు భాషల గురించి తెలుసుకున్నాం. - వర్షిణి, ప్రియ, జేఎల్‌బీ బాలికోన్నత పాఠశాల, భీమవరం

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: లోసరిలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్తు ఉప కేంద్రానికి లైన్లు వేస్తున్నందున సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లోసరి పరిశ్రమల ఫీడర్‌తో పాటు లోసరి, దెయ్యాలతిప్ప, నాగేంద్రపురం, తోకతిప్ప, బర్రెవానిపేట, గరవల్లదిబ్బతో పాటు ఆక్వా చెరువులకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఎవరి పని అది?

ఫ్రీజరు వైర్లు అపహరణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి శవాగారంలో మృతదేహాలను ఉంచేందుకు 10 రోజుల కిందట కొనుగోలు చేసిన ఫ్రీజరు విద్యుత్తు తీగలు చోరీకి గురయ్యాయి. దీంతో ప్రారంభించిన నెల రోజులు కాకముందే నిరుపయోగంగా మారింది.

ప్రాంతీయ ఆసుపత్రిలోని శవాగారంలో ఒక్క ఫ్రీజరు మాత్రమే ఉండేది. ఒకే రోజు రెండు, మూడు మృతదేహాలు వచ్చినప్పుడు ప్రైవేటుగా ఫ్రీజరు ఏర్పాటు చేసుకోవడం మృతుల కుటుంబ సభ్యులకు ఆర్థిక భారంగా ఉండేది. దీనిపై కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలతో రూ.2.60 లక్షలతో కొత్తగా ఫ్రీజరు (ఒకేసారి రెండు మృతదేహాలను ఉంచవచ్చు) కొని గతనెల 16న అందుబాటులోకి తీసుకొచ్చారు.

రెండు రోజుల కిందట ఓ మృతదేహాన్ని ఫ్రీజరులో పెట్టేందుకు సిబ్బంది వెళ్లగా తీగలు, రాగి వైర్లు కోసేసి ఉండటాన్ని ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ లక్ష్మణ్ జితానంద్ దృష్టికి తీసుకెళ్లారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, అధికారులు పరిశీలించి ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు. ఈలోగా కొత్త తీగలు బిగించే ఏర్పాట్లు చేయిస్తున్నామని ఆసుపత్రి పర్యవేక్షకుడు తెలిపారు.

ఇంతకీ దొంగలు ఎవరు..? ఆసుపత్రి ఆవరణలోని శవాగారం దగ్గర కొందరు ప్రైవేటు వ్యక్తులదే పెత్తనం. కొన్నేళ్లుగా ఇది సాగుతుండగా కొవిడ్ నుంచి అధికమైంది. ప్రైవేటు అంబులెన్సులు సైతం ఆసుపత్రి పరిసరాల్లో పెడతారు. ఎవరైనా చనిపోయారని తెలిస్తే దోచుకుంటారు. ప్రైవేటు ఫ్రీజర్ల వ్యాపార దందా అధికం కావడంతో 'ప్రాంతీయ ఆసుపత్రిలో ఫ్రీజరు ఉపయోగించుకోండి.. దళారుల మాట నమ్మవద్దంటూ' వైద్యాధికారులు ఉంచిన బ్యానర్‌ను సైతం యనమదుర్రు కాలువలోకి విసిరేశారు. ఇటీవల ఆసుపత్రిలో ప్రైవేటు వ్యక్తుల పెత్తనంపై జిల్లా ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినా షరా మామూలే.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఒకటో పట్టణంలోని చినరంగనిపాలేనికి చెందిన ఎ.గణపతి (65) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణాజీ తెలిపారు. మృతుడు పారిశ్రామికవాడలోని ఓ కంపెనీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఇతని భార్య ఆరేళ్ల కిందట చనిపోగా అప్పట్నుంచి కుమార్తె దగ్గర ఉంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తాను కుటుంబానికి భారమవుతున్నట్లు మిత్రుల దగ్గర గణపతి బాధపడుతుండేవారు. ఈ క్రమంలో శనివారం రాత్రి విధులకు వెళ్లి అక్కడే ఉన్న చెట్టుకు ఉరేసుకుని మృతి చెందినట్లు అతని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కె.బేతపూడిలో చోరీ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కె.బేతపూడిలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాలి నాగేశ్వరరావు చికిత్స నిమిత్తం భార్యతో కలిసి గత నెల 27న పాలకొల్లు వెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం దగ్గులూరులోని కుమార్తె ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన సుమారు 4.5 కాసుల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్
ప్రఖ్యాత ఆర్థోపెడిక్ వైద్య నిపుణులచే
ఇప్పుడు తణుకు & భీమవరం లో
Apollo HOSPITALS HYDERABAD
ఆర్థోపెడిక్ క్లినిక్
4 మార్చి 2026
భాగ్యశ్రీ ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా వీధి, తణుకు
10:30 am - 1:30 pm
కృష్ణ హాస్పిటల్, ఉండి రోడ్, భీమవరం.
2:30 pm - 5 pm
ఈ సమస్యలు ఏమైనా ఉన్నట్లైతే డాక్టర్ గారిని సంప్రదించండి.
డా కిరణ్ వర్మ ఉద్దరాజు
కన్సల్టెంట్ - ఆర్థోపెడిక్ & జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్
MBBS, MS (Orthopaedics)
• తుంటి, మోకాలు, భుజం మొదలైన కీళ్ల మార్పిడి
• మోకాళ్ళ సమస్యలు • మోకాలు, భుజం యొక్క ఆర్థోస్కోపీ ఆపరేషన్లు అవసరమైనవారు
• అత్యాధునిక రోబోటిక్ సర్జరీ ద్వారా మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స చేయబడును.
అపాయింట్మెంట్ కొరకు: +91 8074 936 811

చెరువు నీరు బాగు

మూడు దశాబ్దాల తర్వాత ప్రక్షాళన

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే

మూడు దశాబ్దాల తర్వాత మహదేవపట్నం గ్రామంలో మంచినీటి చెరువు ప్రక్షాళన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో వ్యర్థాలతో అల్లుకుపోయి, గట్లు జారిపోయి అస్తవ్యస్తంగా మారిన చెరువులో నీరు నింపినా కొన్ని రోజులకే అవి పసర్లు పట్టేవి. అయిదేళ్ల నుంచి ఈ సమస్య మరింత అధికమవ్వడంతో మట్టిపూడికతీత పనులు అత్యవసరంగా చేపట్టాలని పంచాయతీ పాలకవర్గం భావించింది. ఈ పనులకు అవసరమైన నిధులు సమకూరని నేపథ్యంలో గ్రామస్థులంతా ఐక్యమై పనులు చేపట్టాలని నిర్ణయించారు.

ఇటీవల తొలుత గట్ల ప్రక్షాళన, ఎత్తు, పటిష్టపరిచే పనులకు ఉప సభాపతి రఘురామ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో చెరువులో నాలుగైదు అడుగుల మేర యంత్రాల సహాయంతో మట్టిని తీస్తున్నారు. చెరువు చుట్టూ నడక మార్గం ఏర్పాటు చేస్తున్నారు. మరో 15-20 రోజుల్లో పనులు పూర్తి చేసిన తర్వాత చెరువులో నీరు నింపి వేసవిలో ప్రజలకు అందిస్తామని సర్పంచి వనిమా నాగవెంకట సుబ్బలక్ష్మి తెలిపారు. మైక్రోఫిల్టర్ల ద్వారా ప్రస్తుతం శుద్ధి నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నామని ఆమె వివరించారు.

పూడికతీత పనులు

పాలకోడేరులో... పాలకోడేరు, న్యూస్‌టుడే: వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా పంచాయతీల్లో మంచినీటి చెరువులను సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మోగల్లులో ఇప్పటికే ప్రక్షాళన పనులు మొదలుపెట్టారు. సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మూడు చెరువుల పనులను వేసవి నాటికి పూర్తిస్థాయిలో చేసి నీరు నింపనున్నారు. గతంలో మాదిరిగా గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సుమారు రూ.1.10 కోట్లతో వేండ్ర కెనాల్ నుంచి నేరుగా పైపులైన్లు ఏర్పాటు చేశారు. స్వచ్ఛత కోసం రెండు మంచినీటి పథకాల వద్ద సుమారు రూ.40 లక్షలతో మైక్రోఫిల్టర్లను సిద్ధం చేశారు.

శ్రద్ధాంజలి

ఆప్యాయతానురాగాలతో మమ్ములను పెంచి మాకు మంచి భవిష్యత్తును ఇచ్చిన మీరు మా మధ్య లేకున్న మీ ఆశలు, ఆశయాలు మా మదిలో పదిలం. దివికేగిన మీ ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రీ కీర్తి సత్యనారాయణ గారు (రిటైర్డ్ టీచర్)
అత్తిలి
జననం: 02-01-1955 మరణం: 20-02-2026
భార్య: వెంకటలక్ష్మి
కుమారుడు - కోడలు: కె.ఎస్.వి జయకుమార్ - శ్వేత
కుమార్తెలు -అల్లుళ్ళు: పిన్నింటి జయశ్రీ - శ్రీనివాస్
కోరాడ లావణ్య - వరప్రసాద్
మరియు మనుమడు, మనుమరాండ్రు, బంధువులు
పెదకార్యం: 02-03-2026 సోమవారం శ్రీ స్వామియోగీశ్వరా నందగిరి ఫంక్షన్ హాల్ చినఅమిరం నందు జరుపబడును.

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

సూర్య భగవానుడికి అభిషేకాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురంలో వశిష్ఠ గోదావరి తీరాన ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు చేశారు. అనంతరం స్వామిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

నేత్రపర్వంగా పుష్పవాహన సేవ

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో దక్షిణ, సత్యభామా సమేత రాజగోపాలస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పుష్ప వాహన సేవను నేత్ర పర్వంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పవాహనంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ★ ఆలయానికి అర్బన్ సత్యనారాయణ, బానుమతి జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీరాఘవ శంకర్, విజయలక్ష్మి దంపతులు పుష్ప వాహనాన్ని సమర్పించారు.

వైభవంగా కల్యాణోత్సవాలు

పోడూరు, న్యూస్‌టుడే: పోడూరులో శ్రీదత్తేశ్వర, మూలేశ్వర స్వామి, కేశవస్వామి వార్ల కల్యాణోత్సవాలను ఆదివారం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం జరిగింది.

దుర్గమ్మ సన్నిధిలో హోమాలు

పాలకొల్లు ఆర్బన్‌టెక్, న్యూస్‌టుడే: పాలకొల్లు యడ్లబజారులోని కనకదుర్గమ్మ ఆలయంలో కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం హోమాలు, కుంకుమ పూజలు జరిపించారు. సోమిశెట్టి రంగ ప్రసాద్ దంపతులు 5,116 పెన్నులు అందజేయగా అర్చకులు వాటికి పూజలు చేసి విద్యార్థులకు పంచారు. సాయంత్రం అమ్మవారికి ఊయలసేవ, దీపాలంకరణ సేవలు నిర్వహించారు.

ఘనంగా కొండాలమ్మ జాతర

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో వశిష్ఠ గోదావరి తీరాన కొలువైన కొండాలమ్మ జాతర ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. గరగల నృత్యాలు, కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పులతో ఉత్సవాన్ని ఊరేగించారు.

గ్రామ దేవతలకు కుంకుమ పూజలు

పోడూరు, న్యూస్‌టుడే: పెనుమదం గ్రామ దేవతలు చల్లాలమ్మ, మహాలక్ష్మమ్మ జాతరలో భాగంగా ఆలయంలో ఆదివారం మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పోతురాజు ఆలయం వద్ద విఘ్నేశ్వర, గౌరీపూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు అందజేశారు.

నేడు శంకుస్థాపనలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం శంకుస్థాపనలు చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక ఏఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యే కార్యక్రమాలు మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతాయని మంత్రి కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

నరసాపురం, పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, చినమామిడిపల్లి వార్డు కౌన్సిలర్ పాలూరి బాబ్జి అన్నారు. ఆదివారం తన నివాసం వద్ద తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చినమామిడిపల్లిలో డ్రైనేజీ మూసివేతతో ఎదురవుతున్న ఇబ్బందులను రామరాజు సహకారంతో కేంద్ర మంత్రులు నిర్మలాసీతారామన్, భూపతిరాజు శ్రీనివాసవర్మల దృష్టికి తీసుకువెళ్లగా వారు సానుకూలంగా స్పందించారన్నారు. ఆ ప్రాంతంలో కాలిబాట వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. చినమామిడిపల్లిలో ఈ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు లోకేష్, సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కారం చూపారని చెప్పారు.

మలుపులతో చిక్కు.. ఎదురొచ్చే ముప్పు!

నరసాపురం-మత్స్యపురి-భీమవరం ప్రధాన రహదారిలో లిఖితపూడి వద్ద ప్రమాదకర మలుపు ఇది. నరసాపురం, భీమవరం నియోజకవర్గాల పరిధిలో విస్తరించిన ఈ మార్గంలో 12 చోట్ల భారీ మలుపులు ఉన్నాయి. చాలా చోట్ల ఎదురుగా వచ్చే వాహనాలు సమీపించే వరకు కనపడని పరిస్థితి నెలకొంది.

వాసవీ పెనుగొండ గ్రామీణ, నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారుల్లో మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఎదురుగా వచ్చే వాహనాలు సమీపించే వరకు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో వీధి దీపాలు కూడా లేకపోవడంతో రాత్రి వేళ ప్రయాణించాలంటే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాల లైట్ల కాంతి కూడా కొన్ని సార్లు ప్రమాదాలకు దారి తీస్తోంది.

➤ వాసవీ పెనుగొండ- దొంగరావిపాలెం ప్రధాన రహదారిలో నాలుగు మలుపులు, సిద్ధాంతం- ఆచంట మార్గంలో 10 మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.

➤ జొన్నలగరువు- తాడేరు మధ్య, కె.బేతపూడి గ్రామ పరిధిలో మంచినీటి చెరువు, సచివాలయం వద్ద, తుమ్ములపల్లిలో మూడు చోట్ల, వీరవాసరం మండలం మత్స్యపురి రామాలయం వద్ద, బొబ్బనపల్లి ప్రధాన రహదారి చెంత మలుపుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

➤ కొప్పర్రులో యూనియన్ బ్యాంకు శాఖ కూడలిలో, జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద, లిఖితపూడి పరిధి సుబ్బారాయుడు పేటలో పంట కాలువ సమీపాన మలుపులపై హెచ్చరిక బోర్డులు, వేగనిరోధకలు లేవు.

తరచూ ప్రమాదాలతో ఆందోళన

ఈ ఏడాది జనవరి 20న జల్లుర్రులో మలుపు వద్ద ప్రమాదానికి గురైన ట్రక్ ఆటో ఇది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో రహదారిపై ఇతర వాహనదారులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

బోర్డుల ఏర్పాటుకు ప్రతిపాదనలు.. నరసాపురం- మత్స్యపురి- భీమవరం ప్రధాన రహదారుల్లో ఉన్న మలుపుల వద్ద వేగ నిరోధకాలు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే తదుపరి చర్యలు చేపడతాం. **- జీఎస్ కిరణ్ కుమార్, ఆర్అండ్‌బీ డీఈ, నరసాపురం**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం : 80085 74504	ఆచంట: 90631 44737
పాలకొల్లు : 80085 74510	వాసవీ పెనుగొండ: 80085 74469
పోడూరు : 90631 44741	పెనుమంట్ర: 91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? కొత్తకాలనీ ప్రాంతంలో డ్రైయిన్లు పూడిపోయి మురుగునీరు నిలిచి దోమలతో ఇబ్బంది పడుతున్నాం. **- నాగేశ్వరరావు, నరసాపురం**
✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి పూడిక తొలగింపు పనులు చేయిస్తాం. **- పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ? సిద్ధాంతం- ఇలపర్రు మార్గంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలకు పాదులు అల్లుకొని ప్రమాదకరంగా మారాయి. **- స్థానికుడు**
✔ పాదుల తొలగింపు పనులు చేయిస్తాం. **- సువర్ణకుమార్, ఎలీవి**

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? కేపీపాలెంలోని జంగిల్ ఛానల్ వద్ద తాగునీటి పథకం పంపుహౌస్ పైపు నుంచి నీరు లీకై వృథాగా పోతోంది. **- వెంకటేశ్వరరావు, కేపీపాలెం**
✔ పరిశీలించి పైపులకు మరమ్మతులు చేయిస్తాం. **- టి.లోకేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఏఈ**

నరసాపురం, న్యూస్‌టుడే: ? పంజా కూడలి వద్ద చెత్త పేరుకుపోవడంతో పారిశుద్ధ్యం క్షీణించింది. **- రాంబాబు**
✔ చర్యలు తీసుకుంటాం. **- కృష్ణబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

బాలోత్సవం.. కళాత్మకం

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్సీ గోపీమూర్తి, నిర్వాహకులు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: చిన్నారులను చదువుతో పాటు కళల్లోనూ ప్రోత్సహించేలా బాలోత్సవం పేరిట వేడుకలు నిర్వహించడం అభినందనీయమని నరసాపురం ఆర్డీవో దాసిరాజు అన్నారు. పట్టణంలోని వైఎన్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం 'బాలోత్సవం - పిల్లల పండగ' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, తెలుగు కథారచన, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలు, జానపద, శాస్త్రీయ నృత్యాలు, వివిధ వేషధారణ పోటీల్లో 55 పాఠశాలలకు చెందిన 622 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ సమాజ నిర్మాణానికి అవసరమైన అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నిర్వాహక కమిటీ సభ్యులు పూరిళ్ల శ్రీనివాస్, యూవీ రామరాజు, గుత్తుల సాగర్, ఎం.మార్కండేయులు, రత్నకుమార్, రామశ్రీనివాస్, రాజశ్రీ, నరసింహస్వామి, వెంకటేశ్వరరావు, రమేష్, చిత్రకారుడు ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన

జనసేన సభ్యత్వ నమోదు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: జనసేన పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నరసాపురం మండలం సారవలో నిర్వహించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి, డీసీఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, లక్ష్మణేశ్వరం సొసైటీ ఛైర్మన్ చాగంటి పార్థసారథి పాల్గొన్నారు. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు కార్యకర్తలంతా సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న మురళీకృష్ణ, నాయకులు

డిజిటల్ వేదికల పాత్ర కీలకం

తణుకు, న్యూస్‌టుడే: సాంకేతికతను వినియోగించుకొని మహిళలు ఇంటి వద్ద నుంచి తమ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా విక్రయించి గొప్ప వ్యాపారవేత్తలుగా మారాలని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక అన్నారు. జగ్గారి డిజిటల్ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీవీఎ కార్యాలయం వద్ద మహిళా సాధికారతపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రదర్శించిన స్టాల్స్‌ను పరిశీలించి మాట్లాడారు. ఆహార పదార్థాలు, హస్తకళా ఉత్పత్తులు, గృహోపయోగ వస్తువులు వంటి ఉత్పత్తులను ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా వినియోగదారులకు చేరవేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.

కూటమి విజయమే లక్ష్యం

నరసాపురం, న్యూస్‌టుడే: కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కృషి చేయాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు శ్రేణులకు సూచించారు. 31వ వార్డులో పార్టీ అధ్యక్షుడు పాలూరి విమ్మేశ్వరవరప్రసాద్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వార్డులో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. వీటిని ప్రజలకు తెలియజేయడంతో పాటు ఇంకా ఎక్కడ సమస్యలు ఉన్నాయో తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నాయకులు గునిశెట్టి శ్రీనివాస్, బళ్ల మూర్తి, పాలపు నాగేశ్వరరావు, పంజా దినేష్, గాడి శివగిరి, అయ్యాల కుమారి తదితరులు పాల్గొన్నారు.

నాడు బీటలు.. నేడు ప్రగతి బాటలు!

యలమంచిలి, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో కనీసం తట్ట మట్టి పోసిన దాఖలాలు లేకపోవడంతో 2025 వరకు భయపెట్టే పగుళ్లతో అధ్వానంగా కనిపించిన గోదావరి ఏటిగట్టు కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్త రూపు సంతరించుకొంది. ఏటు గట్టు ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయగా ఇటీవల పనులు తుది దశకు చేరాయి. యలమంచిలి మండలం చించినాడ వద్ద గతంలో, ప్రస్తుతం ఏటు గట్టు దృశ్యాలివి.

బుల్లితెర నటుల సందడి

పెనుమదంలో పోతురాజు ఆలయం వద్ద సిద్ధార్థవర్మ, విష్ణుప్రియ

పోడూరు, న్యూస్‌టుడే: పెనుమదంలో బుల్లితెర నటులు సిద్ధార్థవర్మ, విష్ణుప్రియ ఆదివారం సందడి చేశారు. గ్రామ దేవతలు చల్లాలమ్మ, మహాలక్ష్మమ్మ, గంట్లమ్మ, ధనకొండమ్మ, పోలేరమ్మ, గోగులమ్మ జాతరలో భాగంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో వారు పాల్గొన్నారు. అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, దీపం కుందెలు అందజేశారు. 'ఈటీవీ'లో ప్రసారమవుతున్న జానకి పరిణయం, అమ్మోరు సీరియళ్లను ఆదరిస్తున్న మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పోతురాజు కొలువైన వేపచెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కర్రి రామచంద్రరావు, స్థానిక నాయకులు వారిని సత్కరించారు.

ప్రభుత్వ సహకారంతో కులవృత్తుల బలోపేతం

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: విశ్వ బ్రాహ్మణ కుల వృత్తుల బలోపేతానికి ప్రభుత్వం సహకారం అందించాలని ఆ సంఘ నాయకులు కోరారు. నరసాపురం పట్టణంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. జిల్లా అధ్యక్షులు నక్కా చైతన్య శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అనంతరం సంఘానికి అందించిన సేవలకు గుర్తింపుగా పలువురు సభ్యులను ఘనంగా సత్కరించారు. సంఘ నాయకులు కొమ్మోజు వెంకట రత్నం, రమేష్, నాగమల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీడని తాగునీటి కష్టాలు

మరమ్మతులు చేస్తున్న కార్మికులు

మార్టేరు, న్యూస్‌టుడే: ఆలమూరు పంచాయతీ పరిధిలో కోమటిచెరువు ప్రాంత వాసుల తాగునీటి కష్టాలు అయిదో రోజైన ఆదివారం కూడా తీరలేదు. పైపులైను లీకేజీలకు మరమ్మతులు కొలిక్కిరాలేదు. వెలగలేరు నుంచి ప్రధాన రహదారి వెంబడి సుమారు కిలోమీటరు మేర ఈ పైపులైను ఎక్కువ శాతం దెబ్బతింది. లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేస్తున్నా విఫలమై యథాస్థితికి రావడం ఇబ్బందికరంగా మారింది. ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి తమ కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. అప్పటి వరకు కనీసం ట్యాంకరుతో నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

పంట కాలువల ప్రక్షాళన

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం- మొగల్తూరు ప్రధాన పంట కాలువలో తూడు, వ్యర్థాలు పేరుకుపోవడంతో శివారు ప్రాంతాలకు నీరు చేరని పరిస్థితి నెలకొంది. దీంతో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో కాలువ ప్రక్షాళనకు చర్యలు చేపట్టారు. సగంచెరువు గ్రామ పరిధి నుంచి కాలువలో వ్యర్థాల తొలగింపు పనులను ప్రారంభించారు. దీంతో పాటు వేములదీవి- బియ్యపుతిప్ప కాలువల్లో తూడు, డెక్క తొలగింపు పనులను సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టినట్లు జలవనరులశాఖ డీఈ సీహెచ్ వెంకటనారాయణ తెలిపారు.

చూస్తే.. గుండె చెరువు!

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట వేమవరంలో 10 ఎకరాల్లో విస్తరించిన ఈ చెరువు ఒకప్పుడు వేలాది మంది దాహార్తి తీర్చింది. దీనిలో పూడిక తీయకుండా వదిలేయడంతో ఇప్పుడు మురుగు కాలువ కంటే దారుణంగా మారింది. నిండా గుర్రపుడెక్క పెరిగి, వ్యర్థాలు పెరిగి దుర్వాసన వస్తోంది. మండలంలో వల్లూరు, ఆచంట, కొడమంచిలి, పెనుమంచిలి వంటి మేజర్ గ్రామాలతో పాటు చిన్న గ్రామాల్లోనూ జల వనరులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. క్షేత్ర స్థాయిలో చెరువుల పరిస్థితిని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఎల్పీవో ఐ.జ్యోతిర్మయి తెలిపారు.

విలువైన స్థలం.. వృథాగా

కోడేరులో శిథిలమైన అతిథిగృహం

ఆచంట, న్యూస్‌టుడే: కోడేరులో వశిష్ఠ గోదావరి తీరంలో జలవనరుల శాఖకు 80 సెంట్ల విశాలమైన స్థలముంది. ఇక్కడ ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన భవనం పాతికేళ్ల క్రితమే శిథిలమైంది. ఏళ్ల తరబడి పట్టించుకొనే వారు లేకపోవడంతో శిథిల భవనంపై చెట్లు పెరిగాయి. ఆ ప్రాంగణమంతా చిట్టడవిలా తయారైంది. ఇక్కడ కొత్త భవనం నిర్మాణానికి గతంలో ప్రతిపాదనలు చేసినా ఫలితం లేకుండా పోయింది. వచ్చే పుష్కరాల నాటికి ఇక్కడ అభివృద్ధి పనులు చేసేందుకు మళ్లీ ప్రతిపాదనలు చేస్తున్నారు. ఈ స్థలం ప్రధాన రహదారి, లాకుల సమీపాన ఉంది. ఇక్కడ రైతులకు శిక్షణ ఇవ్వడానికి భవనాలు, ఇరిగేషన్ అతిథి గృహం నిర్మిస్తే మేలని అధికారులు భావిస్తున్నారు. వీటికి అవసరమైన భవనాలు నిర్మిస్తే వరదల సమయంలో ముంపు గ్రామాల ప్రజలకు పునరావాస కేంద్రంగా కూడా ఉపయోగపడనున్నాయి. ఈ అంశంపై జలవనరుల శాఖ ఏఈ నరేశ్‌ను సంప్రదించగా రూ.1.4 కోట్ల అంచనా వ్యయంతో రైతు శిక్షణ కేంద్ర భవనం, అతిథి గృహం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం

విద్యార్థుల నృత్య ప్రదర్శన

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: సోమరాజు చెరువు ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎంఈవో పి.రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. సర్పంచి రూపవతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలపై ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పిస్తామని, విద్యార్థుల సంఖ్యను పెంచేలా తోడ్పాటు అందిస్తామని చెప్పారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణానికి చెందిన శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అతడి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు తెలిసి స్థానిక తూర్పుకాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం, దాతలు రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ మొత్తాన్ని పాలకొల్లు తహసీల్దారు వై.దుర్గాకిశోర్, స్థానిక నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు.

రచయిత మూర్తికి సత్కారం

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: అమలాపురంలో కిమ్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన తెలుగు మహాసభల జాతీయ స్థాయి కవి సమ్మేళనంలో వాసవీ పెనుగొండకు చెందిన రచయిత ఎమ్మార్వీ సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. ఆయన రాసిన 'పల్లె అందాలు' కవితను సమ్మేళనంలో చదివి వినిపించారు. అనంతరం నిర్వాహకులు వేదికపై ఆయనను సత్కరించారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెంసౌత్, కేపీపాలెంసౌత్‌ల లోని బీచ్‌కు ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో బీచ్‌లో సందడి వాతావరణం నెలకుంది. పర్యాటకులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇసుక తిన్నెలపై ఆటపాటలతో, సముద్ర అలల్లో స్నానాలు చేస్తూ గడిపారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల ప్రదర్శన

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు, నరసాపురంలలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. ఆయా కూడళ్లలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు.

మురుగుతో నిత్యం నరకం

మురుగు కలుస్తున్న బాక్స్ ఛానల్

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణ పరిధి 30వ వార్డులో మురుగు, దోమల బెడదతో స్థానికులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. వారంలో రెండు సార్లు ఫాంగింగ్, దోమల నివారణ మందు పిచికారీ చేయించాల్సి ఉండగా.. అలాంటి చర్యలేమీ లేవని ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో గోరింటాడ బాక్స్ ఛానల్‌లోకి మురుగు నీరు కలవడంతో జలాలు కలుషితమవుతున్నాయని చెబుతున్నారు. దీని కారణంగా దోమల బెడద, దుర్వాసనతో స్థానికులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. వార్డు పరిధిలో డ్రెయిన్లను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో మురుగు నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. ★ వార్డులో కొన్ని వీధుల్లో దీపాలు వెలగడం లేదు. కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మేడిదివారి తోట, రెల్లివీధుల్లో రాత్రి వేళ రాకపోకలకు మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

30 వార్డు నివేదన

జనాభా : 2,400

ప్రాంతాలు: మావుళ్లమ్మపేట, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంతం

పరిశీలిస్తాం: వార్డులో క్షేత్ర పరిశీలన చేసి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపడతామని పురపాలక కమిషనర్ బి.విజయసారథి తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన ఆటో

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పొలమూరు శివారు చెన్నాడచెరువు - బ్రాహ్మణచెరువు మార్గంలో ట్రక్కు ఆటో ఆదివారం అదుపు తప్పి పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో చోదకుడికి గాయాలయ్యాయి. ఈ రహదారి దెబ్బతిని ఎగుడుదిగుడుగా మారడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

నమ్మించి వంచన.. నిందితుడిపై పోక్సో కేసు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: కుటుంబ వివాదం పరిష్కరిస్తానంటూ నమ్మబలికి బాలికను మోసం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై ఎస్ఎన్ ముత్యాలరావు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నరసాపురం పట్టణానికి చెందిన బాలిక (17) కుటుంబ వివాదం గతంలో పెద్దల సమక్షంలో పరిష్కారమైంది. ఈ వ్యవహారంలో నరసాపురానికి చెందిన కాకిలేటి ఆనంద్ కుమార్ మధ్యవర్తిత్వం వహించారు. అప్పట్లో బాలికకు కొంత సొమ్ము ఇచ్చేలా ఒప్పందం జరిగింది. ఈ సొమ్ము తీసుకున్న ఆనంద్‌కుమార్ ఆ మొత్తాన్ని తనకు ఇవ్వకుండా లైంగికంగా, మానసికంగా వేధిస్తున్నట్లు బాలిక, ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆనంద్ కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందే

పాలకొల్లు: దస్త్రాలు తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్

పాలకొల్లు మార్కెట్, గ్రామీణ, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా వేట్లపాలెం వద్ద బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటన నేపథ్యంలో పాలకొల్లు నియోజకవర్గ పరిధిలో బాణసంచా దుకాణాల్లో పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. నిర్వాహకులు కచ్చితంగా భద్రతా ప్రమాణాలు పాటించాలని పాలకొల్లు గ్రామీణ సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, అక్రమంగా బాణసంచా నిల్వ చేసినా బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

మార్టేరు, న్యూస్‌టుడే: వెలగలేరు, ఆలమూరు ప్రాంతాల్లో ఉన్న మూడు బాణసంచా దుకాణాల్లో వాసవీ పెనుగొండ సీఐ ఆర్.విజయకుమార్ ఆదివారం తనిఖీలు చేశారు. దుకాణాల్లో బాణసంచా నిల్వలపై ఆరా తీశారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

యలమంచిలి, న్యూస్‌టుడే: పాలకొల్లు యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో యలమంచిలిలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడ ఒమేగా హాస్పిటల్స్, అమరావతి కంటి ఆసుపత్రి వైద్యులు పాల్గొని వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి అందే హరిప్రసాద్, త్సవటపల్లి సత్యనారాయణ చేయూతతో కళ్లజోళ్లు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, అధ్యక్షుడు కానూరి ప్రభాకరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు అండగా ప్రభుత్వం

సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరంలోని ఆమె కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గతంలో తెదేపా హయాంలో రెండు సార్లు కార్యకర్తలు, ఆయాలకు వేతనాలు పెంచామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పుడూ.. ఇప్పుడూ వారికి అండగా ఉండేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన ఆయన వల్లే సాధ్యమన్నారు. ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చాలా వరకు ప్రభుత్వం నెరవేర్చిందని, మిగిలిన వాటిని అమలు చేయడానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు.

పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ఉండి, న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికీ స్థలాలిచ్చి, ఇళ్లు నిర్మిస్తామనే హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. ఉండి ప్రధాన కూడలిలో సీపీఎం ప్రజా చైతన్య పాదయాత్రను ఉద్దేశించి ఆదివారం ఆయన మాట్లాడారు. పల్లెలు, పట్టణాల్లో స్వచ్ఛమైన మంచినీరు అందడం లేదని, డ్రైనేజీ, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. కోలమూరు అరుంధతీపేటలో మంచినీరు అందించాలని విన్నవించారని తెలిపారు. ఈ నెల 23న విస్సాకోడేరు వంతెన వద్ద ముగింపు సభలో ప్రజా సమస్యలన్నింటినీ ప్రస్తావిస్తామని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బురిడి వాసుదేవరావు, సభ్యులు సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరుల పాల్గొన్నారు.

కె.బేతపూడిలో చోరీ

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కె.బేతపూడిలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాలి నాగేశ్వరరావు చికిత్స నిమిత్తం భార్యతో కలిసి గత నెల 27న పాలకొల్లు వెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం దగ్గులూరులోని కుమార్తె ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన సుమారు 4.5 కాసుల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై టి.వెంకటసురేశ్ తెలిపారు.

దస్తావేజులు పోయినవి

యిందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నేను అనగా బొలిశెట్టి సీత, W/o వెంకటస్వామి నాకు సంబంధించిన పాలకొల్లు సబ్ రిజిస్ట్రారు పరిధిలో ది. 12-11-1981న రి.నెం. 3350/1981 గా రిజిష్టరు అయిన ఒరిజినల్ దస్తావేజులు ది. 04-02-2026 తేదీన నేను వేడంగి మా ఇంటి వద్ద నుండి జిరాక్స్ కొరకు మెయిన్ రోడ్‌లో గల జిరాక్స్ షాపునకు వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినవి. వెతికినను దొరకలేదు. కావున దొరికిన వారు దయచేసి ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

బొలిశెట్టి సీత W/o వెంకటస్వామి
D.No.4-70, రామాలయం దగ్గర, కాలవ దగ్గర, వేడంగి, పోడూరు మండలం, ప.గో.జిల్లా, సెల్: 99592 33089

(c) eenadu

తాడేపల్లిగూడెం

● తాడేపల్లిగూడెం ● తణుకు

పొన్నవాహనంపై మదనగోపాలుడు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రుక్మిణీ, సత్యభామా సమేత మదనగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి శని వారం రాత్రి పొన్నవాహనంపై బల్లిపాడులో ఊరేగారు. వాహనాన్ని విశేషంగా అలంకరించి దేవతలను కొలువుదీర్చారు. మేళతాళాలతో, డప్పు వాద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంచార శకటంతో ఇంటికే వైద్యం

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచారశకటం ద్వారా ఇంటింటికీ వైద్యం కార్యక్రమం నిర్వహించారు. నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, ఎముకల వైద్య నిపుణుడు నిమ్మగడ్డ అచ్యుతరామయ్య తణుకు, పైడిపర్రు, వేల్పూరు ప్రాంతాల్లో పర్యటించి మంచానికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. కాకరపర్తి అనంత వీరవెంకట సత్యవతి ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ ఉచిత వైద్య సేవలు కావాల్సిన వారు సెల్: 998 534 3530, 905 929 0717 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? హౌసింగ్ బోర్డుకాలనీలోని ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు మొలిచి విషపురుగులకు నిలయంగా మారాయి - **గణేష్, స్థానికుడు**

✔పిచ్చిమొక్కలు తొలగించేలా స్థల యజమానులపై చర్యలు చేపడతాం - **ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్**

? మసీదు రోడ్డు నుంచి మహలక్ష్మి నగర్‌కు వెళ్లే రోడ్డులో చెత్త పేరుకుని రహదారిలోకి వస్తోంది - **ప్రసాద్, స్థానికుడు**

✔రహదారిలో చెత్తను తొలగించేలా చర్యలు చేపడతాం - **సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

లాభాల ఆత్రం.. నిబంధనలు నామమాత్రం

రెచ్చిపోతున్న ఔషధ దుకాణదారులు

తణుకు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో ఔషధ దుకాణాల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఔషధ విక్రయాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వైద్యులు రాసిన చీటీ (ప్రిస్క్రిప్షన్) లేకుండానే షెడ్యూల్ హెచ్ ఔషధాలు విక్రయిస్తున్నారు. నిషేధిత మందులు, నొప్పుల నివారణ, నిద్ర కోసం, గర్భవిచ్ఛిత్తి, స్టెరాయిడ్స్, యాంటీ బయోటిక్స్, వయాగ్రా వంటి మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మరోవైపు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు క్లినిక్‌లతో పాటు ఔషధ దుకాణాలను నడుపుతున్నారు.

ఏటా ఒకసారే.. ఏటా ఒక సారి మాత్రమే తనిఖీ చేయడం అధికారులకు పరిపాటిగా మారిపోయింది. గత ఏడాది మార్చిలో చేసిన తర్వాత మళ్లీ ఈ ఏడాది ఫిబ్రవరిలో చేశారు. దీని ప్రధాన కారణం అధికారులు నెల వారీ మామూళ్లకు కక్కుర్తి పడటమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫార్మసిస్టులు ఉండరు.. ఔషధ తనిఖీ అధికారి కార్యాలయం పరిధిలో సుమారు 800 వరకు ఔషధ దుకాణాలు ఉన్నాయి. ఇందులో సగానికి పైగా దుకాణాల్లో ఫార్మసిస్టులు ఉండటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోకపోవడం గమనార్హం. ఇదే అదనుగా దుకాణదారులు రెచ్చిపోతున్నారు.

తక్కువ సమయంలో ఎక్కువ సొమ్ములు ఆర్జించాలనే ఉద్దేశంతో అక్రమార్కులు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. గతంలో అనేక సార్లు ఈ దందాను పట్టుకున్నా మళ్లీ అదే పంథాలో నడుస్తున్నారు. జిల్లాలో వైద్యపరంగా తణుకు కేంద్రంగా ఉంది. ఇక్కడి ప్రైవేటు ఆసుపత్రులే కాక మెడికల్ రిటైల్, హోల్ సేల్ దుకాణాలు పెద్ద ఎత్తున వెలిశాయి. ఇదే అవకాశంగా కొందరు అక్రమార్కులు మందుల దుకాణాల ముసుగులో అక్రమ మందుల విక్రయాలకు తెరతీస్తున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుని పలు ఆయా చోట్ల నిల్వలు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. మందుల దుకాణాలపై సమగ్ర నిరంతర నిఘాకు అవసరమైన ఔషధ నియంత్రణ శాఖను పటిష్ఠం చేసి, తరచూ తనిఖీలు చేస్తూ ఈ దందాకు అడ్డుకట్ట వేసి పరిస్థితి చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాపారంలో డిజిటల్ వేదికల పాత్ర కీలకం

స్టాల్స్‌ను పరిశీలిస్తున్న రేణుక

తణుకు, న్యూస్‌టుడే: సాంకేతికతను వినియోగించుకొని మహిళలు ఇంటి వద్ద నుంచి తమ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా విక్రయించి గొప్ప వ్యాపారవేత్తలుగా మారాలని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ముళ్లపూడి రేణుక అన్నారు. జాగృతి డిజిటల్ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద మహిళా సాధికారతపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రదర్శించిన స్టాల్స్‌ను పరిశీలించి మాట్లాడారు. ఆహార పదార్థాలు, హస్తకళా ఉత్పత్తులు, గృహోపయోగ వస్తువులు వంటి ఉత్పత్తులను ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా వినియోగదారులకు చేరవేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు భూపతిరాజు శశిరేఖ, కార్యదర్శి భూపతిరాజు వాణి, కోశాధికారి యలమంచిలి రేణుక, ట్రైనింగ్ ఆఫీసర్ ఎం.జయలక్ష్మి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గురువు రమణతో బృందం

తిరుమలలో కోలాట ప్రదర్శన

దండగర్ర(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మండలంలోని దండగర్ర గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కోదండ రామ భజన మండలి కోలాట గురువు టీవీ రమణ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకా తిరుమలలో కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తితిదే దాస సాహిత్య ప్రాజెక్టు పర్యవేక్షణలో చేయగా ఆహూతులను అలరించిందని రమణ తెలపారు.

స్త్రీశక్తి పురస్కారానికి ఎంపిక

అవార్డు అందుకుంటున్న కృష్ణవేణి

పెంటపాడు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పెంటపాడు గ్రామానికి చెందిన తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దాసరి కృష్ణవేణి ఆదివారం విజయవాడలో స్త్రీశక్తి - 2026 అవార్డు అందుకున్నారు. విశ్వ కళావేదిక ఆధ్వర్యంలో గజల్ శ్రీనివాస్, కొల్లి రమావతి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నట్లు ఆమె తెలిపారు.

దివ్యాంగులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వం దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పించడం హర్షణీయమని ఆదర్శ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రొక్కాల నాగబుజ్జి అన్నారు. సిటీ, ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో 40 శాతం కంటే ఎక్కువ శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించారన్నారు.

అంగన్‌వాడీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

సమావేశంలో మాట్లాడుతున్న బాబ్జీ, తదితరులు

కొబ్బరితోట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ భవన నిర్మాణ ఇతర కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ అన్నారు. ఆదివారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోకపోయినా ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు ప్రభుత్వం ఇస్తోందన్నారు. శౌచాలయాలు లేని పరిస్థితుల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు వాటిని నిర్మించి ఇస్తున్నామన్నారు.

తణుకు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రకటన విడుదల చేశారు. చరిత్రలోనే తొలిసారిగా రెండు సార్లు అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఎన్నికల్లో అంగన్‌వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

జనసైనికుల స్వచ్ఛభారత్

చెత్త తొలగిస్తున్న కార్యకర్తలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో ఉన్న టిడ్కో గృహాల్లో పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించడానికి జనసేన నాయకులు, కార్యకర్తలు నడుం బిగించారు. ఈ కార్యక్రమాన్ని జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం టిడ్కో గృహాల్లో జనసేన, భాజపా కార్యకర్తలు, నాయకులు చెత్తను తొలగించారు. దీంతో నివాసితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ చాపల రమేశ్, జిల్లా కార్యదర్శి కేశవభట్ల విజయ్, తెలుగుదేశం పార్టీ నాయకులు సుబ్బరాజు, భాజపా పట్టణ అధ్యక్షుడు దువ్వా శ్రీనివాస్, యర్ర శ్రీనివాస, టిడ్కో గృహాల జనసేన ఇన్‌ఛార్జి తోట రాణి, ప్రసాద్, రౌతు సోమరాజు, సుబ్బారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

ఇరగవరం, న్యూస్‌టుడే: రబీ పంటకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు సోమవారం లోగా పూర్తిచేయాలని వ్యవసాయాధికారి వై.రాఘవేంద్రరావు ఆదివారం తెలిపారు. మండలంలో 14వేల ఎకరాల్లో ఈ-క్రాఫ్ నమోదు పూర్తయిందని, మరో 50ఎకరాల్లో నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ-క్రాఫ్ నమోదు పూర్తయిన రైతులంతా ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈకేవైసీ జరగకపోతే ధాన్యం అమ్మే విషయాల్లో ఇబ్బంది ఎదురవుతుందన్నారు.

పాల్గొన్న వర్తనపల్లి కాశీ, కార్యకర్తలు

సభ్యత్వం తీసుకునేలా ప్రోత్సహించండి

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని 23వ వార్డులో ఆదివారం జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచనల మేరకు పట్టణ జనసేన అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ ఆధ్వర్యంలో ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా కాశీ మాట్లాడుతూ జనసేన కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి పార్టీ సభ్యత్వం తీసుకునేలా ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిడుగు రాంమోహనరావు, మద్దాల మణికుమార్, కోడిత్రాసు వెంకటేష్, కంచుమర్తి సాయి, బండి దుర్గాప్రసాద్, రాకుర్తి కిరణ్, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

ప్రజా చైతన్య యాత్ర విజయవంతానికి పిలుపు

మాట్లాడుతున్న మునిస్వామి

తణుకు, న్యూస్‌టుడే: సీపీఎం ప్రజా చైతన్య పాదయాత్ర ఈ నెల 6, 7 తేదీలలో ఇరగవరం చేరుకుంటుందని, దాన్ని విజయవంతం చేయాలని సీపీఎం ఇరగవరం మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఇరగవరం మండలం పెద్దిరెడ్డి పాలెంలో ఆదివారం తామరపల్లి ముసలయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి పోరాటం చేయడమే యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు.

పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్రను విజయవంతం చేయాలని ప్రజా సంఘ నాయకులు కోరారు. ఆదివారం పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులుగా సీపీఎం పెంటపాడు మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి, నాయకుడు బంకురు నాగేశ్వరరావు, కర్రి సాయిరెడ్డి పాల్గొని మాట్లాడారు.

వీబీజీ రామ్‌జీ పథకంపై అవగాహన

ఇరగవరం, న్యూస్‌టుడే: వీబీజీ రామ్‌జీ పథకానికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. పథకంపై వాస్తవాలను కార్మికులకు వివరిస్తామన్నారు. ఆరు వారాల పాటు జరిగే ఈ కార్యక్రమంలో మొదటి వారంలో అపోహలు, వాస్తవాలు, ఉపాధి నుంచి ఆస్తుల కల్పన వంటి అంశాలను చర్చిస్తారన్నారు.

శ్రద్ధాంజలి

మంచితనం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి, చిన తాడేపల్లి గ్రామ అభివృద్ధికి నిరంతరం శ్రమించిన శ్రీ పిచ్చికల రాజారావు గారి ఆకస్మిక మరణం మాకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ పిచ్చికల రాజారావు గారు
సర్పంచ్, చినతాడేపల్లి
జననం: 27-12-1955 మరణం: 18-02-2026

చినతాడేపల్లి గ్రామ పంచాయతీ

చిట్టూరి కాశీ విశ్వనాథం ఉప సర్పంచ్	దూలపల్లి సత్తియ్య MPTC, చినతాడేపల్లి	కాసాని నాగలక్ష్మి 1వ వార్డు మెంబరు
తోంటా రాంబాబు 2వ వార్డు మెంబరు	కొక్కిరాల గోవిందరాజు 3వ వార్డు మెంబరు	పరిమి భారతి 4వ వార్డు మెంబరు
నందమూరి శేషకుమారి 5వ వార్డు మెంబరు	గుల్లపల్లి ధర్మరాజు 6వ వార్డు మెంబరు	మెడెంకల పెద్దిరాజు 8వ వార్డు మెంబరు
కండెల్లి దానమ్మ 9వ వార్డు మెంబరు	దూలపల్లి నర్సమ్మ 10వ వార్డు మెంబరు	Y.సురేష్‌బాబు, సెక్రటరీ మరియు సచివాలయ సిబ్బంది

అమృతమూర్తికి అశ్రునివాళి

మంచితనం, నిరాడంబరత కలిగి, చినతాడేపల్లి గ్రామ అభివృద్ధికి నిరంతరం శ్రమించిన కీ॥శే॥ పిచ్చికల రాజారావు గారి మరణం మాకు తీరని లోటు. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ పిచ్చికల రాజారావు గారు
సర్పంచ్, చినతాడేపల్లి
జననం: 27-12-1955 మరణం: 18-02-2026

తోడల్లుడు: పరిమి నాగేశ్వరరావు (లేటు)

మేనల్లుళ్ళు: నందమూరి గంగరాజు, నందమూరి నాగేశ్వరరావు, నందమూరి ప్రకాశరావు
మేనల్లుడి కుమారుడు: నందమూరి శ్రీనివాసరావు S/o గంగరాజు

పరిమి ఇందిరాదేవి
పరిమి హరికృష్ణ
పరిమి శ్రీనివాసరావు (చిట్టిబాబు)
దాసరి సత్యగోపాలకృష్ణ
దాసరి సుజాత

సమస్యలతో సతమతం

18వ వార్డు నివేదన

తుప్పు పట్టి శిథిలావస్థకు చేరిన ఫ్యూజు పెట్టె

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘ పరిధిలోని 18వ వార్డులో సమస్యలు తిష్ఠ వేశాయి. మురుగు పారకపోవడం, రక్షణ లేకుండా ఉన్న నియంత్రికలు, దోమల బెడద కుక్కల స్వైరవిహారంతో ఇబ్బంది పడుతున్నారు.

జనాభా:	2534
ప్రాంతాలు:	తిప్పాని, గుంటూరి, మద్దాల, కొట్టి, సత్తిరాజు గారి, గుంటూరి, మండపాక, చాగంటి, తోట, ఆతం, గూట్ల, జామి, మహముద్దీన్ వార్ల వీధులు, వేల్పూరు వారి వీధి, రంగం తోట

● మండపాక వారి వీధిలోని విద్యుత్తు నియంత్రికకు రక్షణ లేక ప్రమాదకరంగా మారింది. ఫ్యూజు పెట్టె తుప్పు పట్టి శిథిలావస్థకు చేరింది. ● వార్డులో డ్రెయిన్ల పూడికతీత సక్రమంగా చేయకపోవడంతో మురుగు నీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా రాత్రుళ్లు దోమలతో యుద్ధం చేయవలసిన పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● తరచూ విష జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ● దోమల నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ● డ్రెయినేజీల్లో బ్లీచింగ్ చల్లిన దాఖలాలు కనిపించడం లేదు. ఫాగింగ్ అంతంత మాత్రంగా చేస్తున్నారు. ● కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి నూతన పెట్టె ఏర్పాటు చేస్తామని, నియంత్రిక రక్షణకు చర్యలు చేపడతామని ఏఈ వెంకటేశ్వరరావు అన్నారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు

పోలీస్‌ఐలాండ్ కూడలి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పోలీస్ ఐలాండ్ కూడలి నుంచి భీమవరం మినీబైపాస్ రోడ్డుకు వెళ్లే రహదారి మలుపు అంచున గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. గతంలో రహదారి వేసినా తరచూ గుంతలు పడటం.. అధికారులు పట్టించుకోకపోవడంతో వాహన చోదకులకు, పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

గుంతల దారిలో రేగిన దుమ్ము

భారీ వాహనాల రాకపోకలతో.. తరచూ భారీ లోడుతో వాహనాలు రాకపోకలు సాగించడంతో రహదారి గుంతలు పడుతోంది. దీంతో గుంతల్లో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏడేళ్లుగా తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతుండటంతో సమస్య పునరావృతమవుతోంది. ఇటీవల తణుకు రహదారి వేయడంతో ఎత్తు తగ్గి భీమవరం మినీ బైపాస్ రోడ్డు వాహనాల తాకిడికి గుంతలు పడింది.

త్వరలో సమస్య పరిష్కరిస్తాం.. భీమవరం మినీబైపాస్ రోడ్డు మలుపు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాం. సుమారు రూ.4 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నాం. ప్రస్తుతం టెండరు ప్రక్రియలో ఉంది. త్వరలో నిర్మించి సమస్య పరిష్కరిస్తాం. - **ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్**

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

మాట్లాడుతున్న చిన వీరభద్రరావు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని వేల్పూరు భవన నిర్మాణ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) సమావేశం వాటాల నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం స్థానిక పార్వతీ దేవి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఈ రోజు నుంచి అమలులోకి రావడం సంతోషకరంగా ఉందని తాడేపల్లిగూడెం ప్రాంతీయ తాపీ, వడ్రంగి, సెంట్రింగ్, రాడ్ బెండింగ్, వర్కర్స్ యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం సిపాయిపేటలోని కార్మిక సంఘ భవనంలో నెలవారీ సమావేశం యూనియన్ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షుడు అంకం భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామకృష్ణ, కోశాధికారి మాదు శ్రీను, రౌతు శ్రీనివాస్, కాకర్ల రాంబాబు, మల్లిపూడి వెంక్రటావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దానవరప్రసాద్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ ఆఫీసులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

పీపుల్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడి నియామకం

తాలూకాఫీసుకూడలి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పీపుల్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా కుసులూరి శివరామకృష్ణ ఎన్నికయ్యారు. ఆమేరకు ఆదివారం ఏలూరులో నిర్వహించిన సంఘ సమావేశంలో ఎన్నుకున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం శివరామకృష్ణ తాడేపల్లిగూడెం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయన్ను అభినందించారు.

రామకృష్ణ సేవలు ఎనలేనివి

మాట్లాడుతున్న రవీంద్రనాథ్

తణుకు, న్యూస్‌టుడే: సామాన్య ప్రజలకు ఆపదలో ఉన్నప్పుడు ప్రత్యక్షంగా సహాయపడే అవకాశం పోలీస్ కానిస్టేబుల్‌కు మాత్రమే ఉంటుందని, అలాంటి సర్వీస్‌లో సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం బాబ్జికు వచ్చిందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. అత్తిలి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన బిరదా గణ శివరామకృష్ణ బాబ్జి సత్కార సభ ఆదివారం స్థానిక పద్మశ్రీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

పాల్గొన్న సభ్యులు

మానవత నెలవారీ సమావేశం

పెంటపాడు న్యూస్‌టుడే: మానవతా నెలవారీ మండల సమావేశం ఆదివారం నిర్వహించారు. మానవతా విద్యా కమిటీ ఛైర్మన్ తాడేపల్లి మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జనవరి, ఫిబ్రవరి నెలల మానవతా పనితీరు, మార్చి నెలలో జరగబోయే పనుల వివరాలు చర్చించారు. అనంతరం ఉమ్మడి జిల్లా మానవతా సెంట్రల్ కమిటీ ఛైర్మన్ దివంగత ఆలపాటి నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

నెరవేరని పేదల సొంతింటి కల: సీపీఎం

గణపవరం, న్యూస్‌టుడే: అయిదేళ్లకో సారి ప్రభుత్వాలు మారుతున్నా.. పేదల సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదని సీపీఎం నాయకుడు జేఎన్వీ గోపాలన్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర ఆదివారం సరిపల్లె చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు స్వాగతం పలికారు. గోపాలన్ మాట్లాడుతూ.. సరిపల్లెలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు ఎక్కువ ఉందన్నారు. దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు వెంకటేశ్వరరావు, అజయ్ కుమార్, పూర్ణక్రాంతి బాబు, ఇంజేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మార్పు రాదంతే!

తణుకు, న్యూస్‌టుడే: నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ తరచూ మన కళ్ల ఎదుట ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నా పలువురిలో మార్పు రావడం లేదు. ఎక్కడో జరిగింది, ఎప్పుడో జరిగింది మనకేం కాదులే అని ప్రమాదపుటంచున ప్రయాణం చేస్తున్నారు. దీనికి నిదర్శనమే ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర కూడలి వద్ద కనిపించిన ఈ దృశ్యం. ద్విచక్రవాహనంపై ఏకంగా ఐదుగురు వ్యక్తులు ప్రయాణించడం చూసిన స్థానికులు నిశ్చేష్టులయ్యారు. ఏదైనా జరగరానిది జరిగితే కుటుంబంలో ఆ లోటు భర్తీ చేయడం అసాధ్యమేనని భావిస్తున్నారు.

గురుకులాల ప్రవేశ పరీక్ష ప్రశాంతం

పెదతాడేపల్లి, ఆరుగొలను(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మండలంలోని గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి జరిగిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పెదతాడేపల్లిలోని అంబేడ్కర్ పీఎంశ్రీ ఆరుగొలను న్యూ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 115మందికి గాను 82, జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్షకు 141మందికి గాను 124, ఐఐటీ/నీట్ ప్రవేశ పరీక్షకు 124మందికి గాను 108 మంది విద్యార్థులు హాజరు అయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ భీమడోలు రాజారావు తెలిపారు.

★ ఆరుగొలనులోని అంబేడ్కర్ ఆరుగొలను గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 66మందికి గాను 49, జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్షకు 95 మంది గాను 89, ఐఐటీ/నీట్ ప్రవేశ పరీక్షకు 81మందికి గాను 76 మంది విద్యార్థులు హాజరు అయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ ఎం.దుర్గారావు తెలిపారు.

అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ వైద్య నిపుణులచే ఇప్పుడు తణుకు & భీమవరం లో
Apollo HOSPITALS HYDERABAD
ఆర్థోపెడిక్ క్లినిక్
4 మార్చి 2026
భాగ్యశ్రీ ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా వీధి, తణుకు 10:30 am - 1:30 pm
కృష్ణ హాస్పిటల్, ఉండి రోడ్, భీమవరం. 2:30 pm - 5 pm
ఈ సమస్యలు ఏమైనా ఉన్నట్లైతే డాక్టర్ గారిని సంప్రదించండి.
డా కిరణ్ వర్మ ఉద్దరాజు
కన్సల్టెంట్ - ఆర్థోపెడిక్ & జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్
MBBS, MS (Orthopaedics)
• తుంటి, మోకాలు, భుజం మొదలైన కీళ్ల మార్పిడి
• మోకాళ్ళ సమస్యలు • మోకాలు, భుజం యొక్క ఆర్థోస్కోపీ ఆపరేషన్లు అవసరమైనవారు
• అత్యాధునిక రోబోటిక్ సర్జరీ ద్వారా మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స చేయబడును.
అపాయింట్మెంట్ కొరకు: +91 8074 936 811

ఆదర్శమూర్తికి అశ్రునివాళి

మాకు అత్యంత ఆత్మీయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అయిన కీ॥శే॥ పిచ్చికల రాజారావు గారి ఆకస్మిక మరణం మాకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ పిచ్చికల రాజారావు గారు
సర్పంచ్, చినతాడేపల్లి
జననం: 27-12-1955 మరణం: 18-02-2026

	గుల్లపల్లి ధర్మరాజు సొసైటీ Ex. డైరెక్టర్, సొసైటీ Ex. వైస్ ప్రెసిడెంట్, 6వ వార్డు మెంబర్, చినతాడేపల్లి
చిట్టూరి కాశీవిశ్వనాథం ఉప సర్పంచ్, చినతాడేపల్లి	
గుల్లపల్లి వెంకట దుర్గాప్రసాద్ చినతాడేపల్లి	[illegible]
రేవూరి శ్రీనివాస భానుప్రకాష్ (నాని) చినతాడేపల్లి	నందమూరి వేణుగోపాలస్వామి చినతాడేపల్లి
నందమూరి శ్రీనివాసరావు S/o చినగంగారావు, చినతాడేపల్లి	పరిమి రాంబాబు (బుజ్జి) మాజీ వైస్ ప్రెసిడెంట్, చినతాడేపల్లి
పరిమి సూర్యనారాయణ S/o చినగంగారావు, చినతాడేపల్లి	పరిమి శ్రీనివాసరావు S/o రంగారావు, చినతాడేపల్లి
పరిమి రత్నాజీ చినతాడేపల్లి	పరిమి వెంకటరత్నం చినతాడేపల్లి
చిటకని సత్యనారాయణ Rtd RTC కండక్టర్, చినతాడేపల్లి	చిటకని సర్వేశ్వరరావు చినతాడేపల్లి
గన్నమని అనిల్‌కుమార్ చినతాడేపల్లి	పరిమి నారాయణరావు S/o చినగంగారావు, చినతాడేపల్లి
అక్కిన వెంకట శ్రీనివాస్ చినతాడేపల్లి	కాసాని వీరరాఘవులు (చిన్నబ్బులు) చినతాడేపల్లి
ఆలపాటి వీరవెంకటసత్యనారాయణ చినతాడేపల్లి	రుద్ర ఆంజనేయులు చినతాడేపల్లి
బండి సూర్యగణపతిరావు కొండ్రుప్రోలు	కాసాని గంగరాజు వెటర్నరీ డాక్టర్, చినతాడేపల్లి
కాసాని సోమరాజు చినతాడేపల్లి	బయ్యే వెంకట్రావు (చిన్న) మాజీ సర్పంచ్, చినతాడేపల్లి
బయ్యే పోతురాజు మాజీ వార్డు మెంబర్, చినతాడేపల్లి	కాసాని చినసుబ్రహ్మణ్యం చినతాడేపల్లి

(c) eenadu

ఈనాడు
వైఎస్సార్ కడప
సోమవారం మార్చి 2, 2026

పేద పిల్లలకు ఉచిత కార్పొరేట్ విద్య

ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య, కమలాపురం, న్యూస్‌టుడే: విద్యాహక్కు చట్టం-2009 ప్రకారం పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు ఉచితంగా కార్పొరేట్ విద్య పొందవచ్చు. అందుకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయిస్తారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

వీరు అర్హులు

- వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలున్న తల్లిదండ్రులు అర్హులు.
- రాష్ట్ర సిలబస్ పాఠశాలలో చేరే విద్యార్థి 2020 జూన్ 2 నుంచి 2021 మే 31వ తేదీ మధ్య, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ సిలబస్ పాఠశాలలో చేరే విద్యార్థి 2020 ఏప్రిల్ 2 నుంచి 2021 మార్చి 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. అయిదేళ్లు నిండి ఉండాలి.

ఈ ధ్రువపత్రాలు అవసరం

- విద్యార్థి జనన, కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. • తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, ఓటరు, గుర్తింపు కార్డు, తెల్ల రేషన్‌కార్డు, భూహక్కు పత్రం, పాస్‌పోర్ట్, ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్తు బిల్లు, గ్యాస్ కనెక్షన్, అద్దె ఒప్పంద పత్రాన్ని చిరునామా ధ్రువీకరణకు పరిగణనలోకి తీసుకుంటారు.
- దరఖాస్తు గడువు మార్చి 10వ తేదీ • మార్చి 25న లాటరీ తీసి విద్యార్థులను ఎంపిక చేస్తారు. • ఏప్రిల్ 13 నుంచి 23వ తేదీ వరకూ ప్రవేశాల నిర్ధారణ ఉంటుంది.

దరఖాస్తు చేసుకోండిలా..

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్‌ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో లేదా స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంఈవో కార్యాలయం, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 18004258599 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చు.

వెళ్లి.. మళ్లీ రా పెద్దమ్మా

జమ్మలమడుగులో పెద్దమ్మ దేవర ఆదివారం వైభవంగా ముగిసింది. చివరి రోజు అధిక సంఖ్యలో భక్తులు హాజరై పెద్దమ్మ, చిన్నమ్మలను దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం అర్ధరాత్రి కుమ్మరి వీధి నుంచి పెద్దమ్మ, చిన్నమ్మను బాణసంచా కాలుస్తూ మేళతాళాల నడుమ పెద్దమ్మ మూల విరాట్ ప్రాంగణం వద్దకు చేర్చి కుంభంతో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం తెల్లవారుజామున నుంచే అమ్మవారికి సమర్పించే బోనాలతో సందడి వాతావరణం నెలకొంది. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు

డీకేటుగాళ్లు చెలరేగుతున్నారు!

◆ యథేచ్ఛగా డీకేటీ భూములు అన్యాక్రాంతం
◆ రికార్డుల్లో పేర్లు మార్చేసిన వైనం

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటం మండలంలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జాదారులు వాలిపోతున్నారు. వారికున్న రాజకీయ పలుకుబడితో పట్టాదారులు వచ్చి అడ్డుకున్నా లెక్క చేయకుండా వారి అక్రమాలను కొనసాగిస్తున్నారు. ఇలా రూ.కోట్ల విలువ చేసే భూములను అప్పనంగా ఆక్రమించుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల సిద్దవటం మండలం మాధవరం-1లో చోటుచేసుకున్న భూ కబ్జా వ్యవహారమే అందుకు నిదర్శనం.

మాధవరంలో అన్యాక్రాంతమైన భూమి

కన్నేశారు... పావులు కదిపారు

సిద్దవటం మండలం పెద్దపల్లె రెవెన్యూ గ్రామ పరిధి మాధవరం-1లో సర్వే సంఖ్య 1085/2, 1085/3, 1085/4లోని 4.50 ఎకరాల ప్రభుత్వ భూమికి రెండు దశాబ్దాల కిందట స్థానికంగా ఉన్న ముగ్గురు వ్యక్తులు పట్టాలు పొందారు. ఈ భూముల్లో వర్షాధార పంటలు సాగు చేసుకునేవారమని సంబంధిత రైతులు చెప్పారు. పదిహేనేళ్ల కిందట మాధవరం-1 పరిధిలోని భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసమంటూ ప్రభుత్వం ఇక్కడి భూములను సర్వే చేసింది. సదరు భూములను స్వాధీనం చేసుకుంటున్నామంటూ సంబంధిత రైతులకు అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. అనంతరం ఆ పథకం నిలిచిపోవడంతో రైతులు తిరిగి వారి భూములను సాగు చేసుకున్నారు. అయితే పై మూడు సర్వే నంబర్లలోని 4.50 ఎకరాల భూములకు చెందిన రైతులు జీవనోపాధి నిమిత్తం కడపకు తరలివెళ్లారు. ఇక వారి భూములు ఖాళీగా దర్శనమివ్వడంతో ఉప్పరపల్లె, మాధవరం-1 గ్రామాలకు చెందిన కొందరు కన్నేశారు. వాటిని కాజేసేందుకు క్రమంగా పావులు కదిపారు.

పేర్లు మార్చేసి.. ఆపై కంచె వేసి

సర్వే సంఖ్య 1085/2, 1085/3, 1085/4లోని భూములపై కన్నేసిన అక్రమార్కులు తమకున్న రాజకీయ పలుకుబడితో అధికారులతో బేరసారాలు ఆడినట్లుగా బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. 2024లో ఆ మూడు సర్వే నంబర్లలో ఉన్న తమ పేర్లను కబ్జాదారులు తొలగింపజేసి వారి కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేయించుకున్నట్లుగా వాపోతున్నారు. ఇటీవల వారు వచ్చి తమ భూముల చుట్టూ కంచె వేసి, మొక్కలు సాగు చేసి ఏకంగా షెడ్డు నిర్మాణం చేపట్టారని చెబుతున్నారు. తాము వెళ్లి వారిని ప్రశ్నించినా అధికారులే భూమి సాగు చేసుకోమని చెప్పారని.. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● ఈ విషయమై సిద్దవటం తహసీల్దారు తిరుమలబాబు మాట్లాడుతూ.. వివాదాస్పదంగా మారిన డీకేటీ భూములపై పరిశీలన చేస్తున్నామన్నారు. ఇరువురి వద్ద ఉన్న పత్రాలు తీసుకురావాలని చెప్పామని.. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేస్తామని వివరించారు.

నృత్య రూపకం.. ఆనంద పరవశం

బద్వేలు మండలం లక్ష్మీపాలెంలో ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. ఆ చిత్రమే ఇది. - న్యూస్‌టుడే, బద్వేలు గ్రామీణ

రంజాన్ వేళలు	ఇఫ్తార్ సోమవారం (సా)	సహర్ మంగళవారం (తె)
కడప	6.29	5.15
ప్రొద్దుటూరు	6.30	5.19

బాణసంచా.. మన వద్ద భద్రమేనా!

కాకినాడ ఘటనతో అప్రమత్తత అవసరం

- 2018లో ప్రొద్దుటూరులోని టపాసుల గోదాంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అయితే.. ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. రూ.లక్షలు విలువ చేసే టపాసులు కాలిపోయాయి. ఆ తరువాత ఆ స్థాయి ప్రమాదం జిల్లాలో సంభవించలేదు.

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో టపాసుల తయారీ కేంద్రాలు లేవు. కానీ విక్రయించే గోదాములు దాదాపు 20 ఉన్నాయి. ఇవన్నీ శివారు ప్రాంతాల్లోనే ఉన్నాయి. దీపావళి అనంతరం మిగిలిపోయిన టపాసులను కొందరు దుకాణదారులు అక్రమంగా నివాసాల మధ్య నిల్వ ఉంచారు. శుభకార్యాలకు బాణసంచా కావాలంటే అక్కడికి వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కాకినాడ జిల్లాలో జరిగిన దుర్ఘటన తర్వాతైనా జిల్లా అగ్నిమాపక అధికారులు మేల్కొనాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కడపలో టపాసుల గోదామును తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇదీ పరిస్థితి

కడప నగర సమీపంలోని రిమ్స్‌కు వెళ్లే దారిలో మూడు టపాసుల గోదాములున్నాయి. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు, రాజంపేట తదితర ప్రాంతాల్లో టపాసుల గోదాములున్నాయి. ఇవి కాకుండా అనధికారికంగా కొందరు నివాసాల మధ్య టపాసులు నిల్వ ఉంచుకుని విక్రయాలు సాగిస్తున్నారు. ఏదైనా ఘటన జరిగితే తప్ప అగ్నిమాపక అధికారులు స్పందించడం లేదనే విమర్శలున్నాయి.

కొన్ని గోదాముల్లో సరైన భద్రతా నిబంధనలు లేవు. అధికారులు కేవలం ఎన్‌వోసీ ఇచ్చే సమయంలో మాత్రమే గోదాములు తనిఖీ చేస్తున్నారు. అప్పుడు అగ్నిమాపక నిబంధనలు ఉన్నాయా లేవా అని పరిశీలిస్తారు. అన్నీ బాగుంటే ఎన్‌వోసీ ఇస్తారు. మధ్యలో తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. గోదాముల వద్ద స్ప్రింకర్లు ఉండాలి. ఒక వేళ మంటలు చెలరేగితే వెంటనే ఆర్పే విధంగా ఏర్పాట్లు ఉండాలి. కానీ చాలా గోదాముల వద్ద ఈ నిబంధనలు అమలు కావడం లేదు. గోదాముల్లో సామర్థ్యం కంటే ఎక్కువగా టపాసులను నిల్వ ఉంచుతున్నారు.

ఎన్‌వోసీ లేకుంటే చర్యలు

జిల్లా వ్యాప్తంగా తొమ్మిది అగ్నిమాపక కేంద్రాల పరిధిలో టపాసుల గోదాములకు ఏడాదికోసారి ఎన్‌వోసీ ఇస్తాం. మంజూరు చేసే ముందు తామే స్వయంగా వెళ్లి పరిశీలిస్తాం. అగ్ని నిరోధక పరికరాలున్నాయా.. నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని తనిఖీ చేస్తాం. అన్నీ బాగుంటేనే ఎన్‌వోసీ ఇస్తాం. మరోసారి జిల్లాలోని టపాసుల గోదాములన్నీ తనిఖీ చేస్తాం. - శరత్‌బాబు, జిల్లా అగ్నిమాపక అధికారి, కడప

జిల్లాకు 1,695 టన్నుల యూరియా

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాకు ఎరువులు వచ్చాయి. అవసరాల మేరకు ప్రభుత్వం నుంచి తెప్పించుకుంటున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఆదివారం కడప రైల్వేస్టేషన్‌కు ర్యాక్‌లో వచ్చిన ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. వచ్చిన 1,695 టన్నుల యూరియాను 795 టన్నులు ప్రైవేటు డీలర్లకు, 900 టన్నులు మార్క్‌ఫెడ్‌కు పంపించామని అధికారులు చెప్పారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కడప కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు తెలిపారు. సభాభవనంలో కలెక్టర్, అధికారులు వినతులు స్వీకరిస్తారన్నారు. అంతకు ముందు ఉదయం 9.30 గంటలకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఉంటుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి రాలేని వారు 08562-244437 నంబరుకు ఫోన్ చేసి సమస్యలను చెప్పాలని సూచించారు. కడప కలెక్టరేట్‌తో పాటు అన్ని మున్సిపల్ కార్యాలయాలు, మండల కార్యాలయాల్లో కూడా అర్జీలను సమర్పించాలని వివరించారు.

సేవల్లో భేష్.. అవినీతిపై పెదవి విరుపు

◆ ఐవీఆర్ఎస్ సర్వేలో వాహనదారుల వెల్లడి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: రవాణా సేవలు సులభతరం చేయడం కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అనుకున్న స్థాయిలో సఫలం కావడం లేదు. దీంతో ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న పనుల తీరుపై ప్రజాభిప్రాయం ఎలా ఉందో తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగా జిల్లా రవాణా శాఖ పని తీరుపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారా.. అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారా? అనే కోణాల్లో ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టగా పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

వాహనాల రిజిస్ట్రేషన్ జారీకి సిబ్బంది అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారా అని అడగ్గా 53.1 శాతం మంది.. డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో రవాణా శాఖ అదనంగా వసూలు చేస్తున్నారా? అని అడగ్గా 62 శాతం మంది వసూళ్లు చేస్తున్నారని తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఐవీఆర్ఎస్ ద్వారా గుర్తించిన అంశాలు (ఫిబ్రవరి నెలలో) (శాతాల్లో) సంతృప్తి | అసంతృప్తి	వాహన్ పోర్టల్ సేవలు	పన్ను, పర్మిట్, ఫిట్‌నెస్ పత్రాలు పొందడంలో	రవాణా శాఖలు పలు సేవలు అందుతున్న తీరు
	65.7 | 34	62.9 | 37.1	46.4 | 53.6

జిల్లా రవాణా శాఖలో వాహన్ పోర్టల్ సేవలు అనుకున్న స్థాయిలో లేవని ప్రజలు తమ అభిప్రాయం వెలిబుచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో అదనపు వసూలు చేస్తున్నారా లేదా అని సర్వే చేయగా 62 శాతం మంది అదనంగా వసూలు చేస్తున్నారని చెప్పడం

ఇదీ విషయం

గమనార్హం. కార్యాలయంలో పని చేసే కొంతమంది సిబ్బంది వాహనదారులను పదే పదే తిప్పించుకుంటున్నారనే విమర్శలున్నాయి. డీటీసీ వారంలో రెండు రోజులు అందుబాటులో ఉన్నప్పుడు పూర్తి స్థాయిలో పనులు అవుతున్నట్లు వాహనదారుల అభిప్రాయాన్ని చెప్పారు.

మెరుగైన సేవలందించేలా చూస్తాం - వీరాజు, ఇన్‌ఛార్జి డీటీసీ, కడప

ప్రభుత్వం తరపున నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో కొన్ని విభాగాల్లో వాహనదారులు అసంతృప్తిగా ఉన్నట్లు వెల్లడైంది. ఏ విభాగంలో అసంతృప్తిగా ఉన్నారో ఆ విభాగంలో మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తాం. సిబ్బంది ఎవరైనా పనులు చేయడంలో ఇబ్బందులు పెట్టినా.. పదే పదే తిప్పుకొన్నా బుధ, గురువారాల్లో కార్యాలయానికి వచ్చి నేరుగా నన్ను కలవొచ్చు.

వందేళ్ల చెట్టు సంరక్షించుకుంటూ

పోరుమామిళ్ల పట్టణం మార్కెట్ వీధిలో ఓ ఇంటి ఆవరణలో ఏళ్ల నాటి వేపచెట్టు అబ్బురపరుస్తోంది. దానికి సుమారు వందేళ్ల వయసు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. దాని కిందనే కొన్నేళ్ల కిందట నిర్మించిన భవనంలో ఆర్ఎంపీ అన్వర్ ప్రథమ చికిత్స కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కొంత కాలం కిందట చెట్టు కొమ్మలు భారీగా పెరగడంతో అడ్డొచ్చిన వాటిని మాత్రమే తొలగిస్తూ సంరక్షిస్తున్నారు. దీంతో ఏటా వేసవిలో చల్లదనాన్ని ఇస్తోందని.. పలువురు సేద తీరుతున్నారని ఆయన తెలిపారు. - న్యూస్‌టుడే, పోరుమామిళ్ల

లంకమలలో వెలుగులోకి త్రిపాదాలు

ఏ క్షేత్రంలోనైనా స్వామి వారి రెండు పాదాలే దర్శనమిస్తాయి. కానీ.. బద్వేలు మండల పరిధి లంకమల్లేశ్వర శైవక్షేత్రంలో ఓ రాతిపై త్రిపాదాలు వెలుగు చూశాయి. వీటితో పాటు పురాతన శంఖులిపి, బ్రహ్మీలిపి, దేవనాగరి రాతి శాసనాలను ఇటీవల సిద్దవటం ఎస్ఆర్వో కళావతి గుర్తించి ఇటీవల పురావస్తు శాఖకు సమాచారం అందించారు. వారు పరిశోధనలు చేసి ఇక్కడ మరుగున పడిన పురాతన చారిత్రక ప్రాంతంగా తేల్చారని.. రవాణా సౌకర్యం లేని రోజుల్లో భక్తులు అటవీ ప్రాంతంలో వెలసిన ఆలయాలకు కాలినడకన వచ్చి సందర్శించేవారని వారు వెల్లడించారని ఆమె చెప్పారు. - న్యూస్‌టుడే, బద్వేలు

ఓపెనా.. వేస్తారా అడ్డుకట్ట!

నేటి నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు ◆ ప్రొద్దుటూరులో విచ్చలవిడిగా దందా

'మీరు ఇంటి వద్ద చదవాల్సిన పనిలేదు.. పరీక్షలకు సిద్ధం అవ్వాల్సిన అవసరమే లేదు. అదనంగా డబ్బులిస్తే చూసి రాసుకునేలా ఏర్పాటు చేయిస్తాం. పరీక్షకు హాజరు కాకపోతే.. మీ స్థానంలో వేరొకరితో పరీక్ష రాయిస్తాం.. ఎలాగైనా ఉత్తీర్ణులయ్యేలా చూస్తాం.. అయితే అందుకు అదనంగా ఖర్చవుతుంది' అంటూ కొందరు స్టడీ సెంటర్ల నిర్వాహకులు విద్యార్థుల నుంచి రూ.వేలు దండుకుంటున్నారు. ప్రధానంగా ప్రొద్దుటూరులో ఈ తరహా దందా యథేచ్ఛగా కొన్నేళ్లుగా సాగుతోంది. సోమవారం నుంచి జిల్లాలో ఓపెన్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న తరుణంలో చూచిరాతల బాగోతంపై నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది.

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, బద్వేలు, కడప ప్రాంతాల్లో సోమవారం నుంచి ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరుగనున్నాయి. అందులో 34 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. అధికంగా ప్రొద్దుటూరులో 12 కేంద్రాలున్నాయి. మొత్తంగా 6,545 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నిశితంగా పరిశీలిస్తే దొరికే వీలు.. గతంలో ప్రొద్దుటూరు కేంద్రంగా స్టడీసెంటర్ల నిర్వాహకులు చూచిరాతకు అవకాశం కల్పించడం కోసం స్థాయిని బట్టి ఒక్కో విద్యార్థి నుంచి నగదు వసూళ్లకు పాల్పడిన సందర్భాలు ఉన్నాయి. ఈ ఏడాది ఇప్పటికే పలువురి వద్ద రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అదనంగా డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. వేరే వ్యక్తులతో పరీక్షలు రాయించేందుకు సైతం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒకరి బదులు మరొకరు పరీక్ష రాసిన వారికి కొంత మొత్తం ఇచ్చేలా ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికే ఇన్విజిలేటర్లతో మంతనాలు జరిపినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద హాల్‌టికెట్లను పరిశీలిస్తే కొందరి బండారం బయటపడే అవకాశం ఉంది.

- ఈ విషయమై ప్రభుత్వ పరీక్షల కడప సహాయ సంచాలకులు శ్రీకాంత్ మాట్లాడుతూ.. చూచిరాతలు లేకుండా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎవరైనా చూచిరాతలను ప్రోత్సహించినట్లు తేలితే తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు డయల్ యువర్ సీఎండీ

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యల పరిష్కారానికి సోమవారం 'డయల్ యువర్ సీఎండీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 2న ఉదయం 10 నుంచి 12.30 వరకు తిరుపతి సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి కార్యక్రమం ఉంటుందన్నారు. వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు సెల్ 89777 16661కు ఫోన్ చేసుకోవచ్చన్నారు. జిల్లా పరిధిలో అదే విధంగా జిల్లాలో ఎస్ఈ పరిధిలోనూ ఇదేవిధంగా ఉంటుందన్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 వరకు ఎస్ఈ కార్యాలయంలో డయల్ యువర్ కార్యక్రమం ఉంటుందన్నారు. వినియోగదారులు ఫోన్ నెంబరు 08562 242457కు ఫోన్ చేసుకోవచ్చన్నారు.

పెద్దకర్మ
మంచితనంతో అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగి మాకు మార్గదర్శకంగా నిలిచిన మీరు మా నుండి ఆకస్మికంగా దూరమవ్వడం మాకు తీరనిలోటు. మీ పవిత్ర ఆత్మకు దైవసన్నిధిలో శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

Nava Barath Auto Mobiles, Kadapa.
జననం: 25.07.1976 మరణం: 19.02.2026

కష్టం నష్టపోకుండా కొంటారు

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో హర్షం

జమ్మలమడుగు మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంలో శనగల విక్రయం

జమ్మలమడుగు, పెద్దముడియం, న్యూస్‌టుడే: జిల్లాలో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో 20 కొనుగోలు కేంద్రాలను గత నెల 23వ తేదీన ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌తో పోల్చుకుంటే కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే ఒక్కో క్వింటాకు రూ.675 అదనంగా లబ్ధి చేకూరుతుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జమ్మలమడుగు నియోజకవర్గంలోనే దాదాపు 85 వేల ఎకరాల్లో శనగ సాగు ఎక్కువగా ఉంది. ఒక్క పెద్దముడియం మండలంలోనే 46,483 ఎకరాలల్లో సాగు చేశారు. పులివెందుల, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు, కడప తదితర ప్రాంతాల్లో శనగ అధికంగా సాగులో ఉంది. బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.5,200 ఉండగా కొనుగోలు కేంద్రంలో రూ.5,875 ప్రకటించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
- 40 ఎకరాల్లో శనగ సాగు చేయగా ఎకరాకు 10 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చిందని పెద్దముడియం మండలం జంగాలపల్లెకు చెందిన రైతు రవీంద్రారెడ్డి చెప్పారు. మొత్తం 400 క్వింటాల దిగుబడులు రాగా కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర రూ.5,875 ప్రకటించడంతో బహిరంగ మార్కెట్‌లో కంటే ఒక్కో క్వింటా మీద రూ.675 అదనంగా లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేశారు.

ఈ-క్రాప్ నమోదైతే పండగే

ఈ క్రాప్, రిజిస్ట్రేషన్ చేసుకున్న శనగ రైతులకు పండగే. గరిష్ఠంగా ఒక రోజు 40 క్వింటాళ్ల వరకు కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవచ్చు. ఈ ఏడాది ఒక్కో ఎకరానికి 8 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. సుమారు 15 లక్షల క్వింటాళ్ల దిగుబడిని రైతులు సాధించారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

రామయ్య గోపురాలకేదీ నవమి శోభ!

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలకు తితిదే ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సివిల్, విద్యుత్తు విభాగం పర్యవేక్షణలో వసతుల కల్పనకు పనులకు శ్రీకారం చుట్టారు. అయితే.. రామయ్య క్షేత్రంలో తూర్పు, ఉత్తర, దక్షిణ గోపురాలు కళ తప్పాయి. రంగ మండపం, శ్రీవారి పోటు, యాగశాల పైకప్పు దెబ్బతిన్నాయి. మరమ్మతు పనులు చేయడానికి తితిదే నుంచి కేంద్ర పురావస్తు శాఖకు అవసరమైన నిధులను ముందస్తుగా ఇచ్చారు.

ఓ శిల్పంపై ఏర్పడిన నల్లటి మచ్చలు

- రంగమండపం, శ్రీవారిపోటు, యాగశాల పైకప్పు పైన ప్రస్తుతం పూత వేయకపోయినా ఎలాంటి ఇబ్బంది లేదు. గోపురాల శిల్పాలు నల్లగా ఉన్నాయి. పాచి పట్టి దర్శనమిస్తున్నాయి. యాత్రికులను ఆకర్షించేలా గోపురాలకు కొంగొత్త కళ తీసుకురావాలని తితిదే అధికారులు భావించినా ఎలాంటి కదలిక లేదు.
- బ్రహ్మోత్సవాలకు నవమి శోభ తీసుకు రావాలని పురావస్తు శాఖ అధికారులు ఈ ఏడాది జనవరి 2న రూ.96,85,484 గుత్తపత్రాలు ఆహ్వానించగా చెన్నైకి చెందిన ఓ గుత్తేదారు దక్కించుకున్నారు. పనులను చేపడితే ఉత్సవాల నాటికి పూర్తి చేయలేరేమోనని ఇంకా మొదలుపెట్టలేదు.
- రంగ మండపం 32 స్తంభాలతో శిల్ప సంపద కడు రమణీయంగా ఉంది. వారసత్వ సంపద భావితరాలకు అందించడానికి కనీసం రసాయనాలతో కడిగి శుభ్రం చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : 99899 97626

(c) eenadu

వైభవం.. శ్రీవారి బ్రహ్మోత్సవం

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు సింహ వాహనంపై దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

సింహ వాహనంపై స్వామి వారు

పాడదుప్పిని రక్షించిన అటవీ సిబ్బంది

పాడదుప్పిని రక్షిస్తున్న అధికారులు, స్థానికులు

కలసపాడు, న్యూస్‌టుడే: మండల సమీపంలో ఉన్న తెలుగు గంగ ప్రధాన ఎడమ కాలువ నీటిలో ఆదివారం ఐదేళ్ల పాడదుప్పి నీటి కోసం వచ్చి కాలువలో పడిపోయింది. అది బయటకు రాలేక తల్లడిల్లిడాన్ని గమనించిన స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అటవీ అధికారులు పాడదుప్పిని రక్షించారు. అది కొద్దిసేపటికి కోలుకుని అడవిలోకి పరుగులు తీసింది. ఇటీవల కలసపాడు పరిసర గ్రామాల్లోకి వన్యప్రాణులు తరచూ నీటి కోసం వస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు.

నేరప్రవృత్తికి స్వస్తి పలకండి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు నేరప్రవృత్తి విడనాడాలని పోలీసులు సూచించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మంచిగా జీవించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచుతున్నారు. అనంతరం వాహనదారులను తనిఖీ చేశారు. పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేకుంటే కేసులు నమోదు చేస్తున్నారు.

క్రికెట్ ఎంపికలకు 145 మంది హాజరు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: వైఎస్ఆర్-ఏసీఏ స్టేడియంలో ఆదివారం జరిగిన అండర్-23, సీనియర్స్ విభాగాలకు సంబంధించిన జిల్లాస్థాయి ఎంపికలకు 145 మంది హాజరయ్యారు. బ్యాటింగ్, బౌలింగ్, కీపింగ్ రంగాల్లో క్రీడాకారుల నైపుణ్యాలను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మునికుమార్‌రెడ్డి, రెడ్డిప్రసాద్, సెలెక్షన్ కమిటీ సభ్యులు సాయిపృథ్వీ తేజ్, శ్రీకాంత్‌రెడ్డి, విష్ణుమోహన్‌రావు పరిశీలించారు. అండర్-23 విభాగంలో నాలుగు జట్లను, సీనియర్స్ విభాగంలో రెండు జట్లకు ప్రాబబుల్స్ మ్యాచ్‌లను నిర్వహిస్తామన్నారు. అందులో సత్తాచాటిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు.

తెలుగు ఉపాధ్యాయినికి స్త్రీశక్తి పురస్కారం

మైదుకూరు, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయిని చిట్టి స్వర్ణలత ఆదివారం విజయవాడలోని బాలోత్సభవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్త్రీశక్తి పురస్కారం అందుకున్నారు. జాతీయ సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుల నుంచి పురస్కారాన్ని అందుకున్నారు.

పురస్కారం అందుకున్న స్వర్ణలత

పుష్పగిరిలో అరుదైన శిల్పం గుర్తింపు

వల్లూరు, న్యూస్‌టుడే: శిల్పకళా సౌందర్యానికి పేరుగాంచిన పుణ్యక్షేత్రం పుష్పగిరి కొండపై వెలసిన చెన్నకేశవస్వామి ఆలయం ఆవరణంలో సంతాన మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మరో అరుదైన శిల్పాన్ని గుర్తించినట్లు ఆదివారం ప్రముఖ రచయిత చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ ఆదివారం తెలిపారు. మొదటిది నంది లేదా ఎద్దు, రెండోది నందికేశ్వరుడి మానవ రూపం. ఇవి చాలా అరుదుగా కనిపించే శిల్పంగా అభివర్ణించారు. నంది ముఖం దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పది పరీక్షలకు ఇలాగేనా బాధ్యతలు!

-న్యూస్‌టుడే, చాపాడు

త్వరలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు చీఫ్ ఆఫీసర్ (సీవో), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ (డీవో) నియామకంలో కొన్ని లోపాలు చోటుచేసుకున్నాయి. ఇదివరకు ఆయా డివిజన్ పరిధిలోని ఉప విద్యాశాఖాధికారులు వారి పరిధిలోని ఉపాధ్యాయుల్లో సమర్థతను, సీనియారిటీని, వ్యక్తిగత సమస్యలు పరిగణనలోకి తీసుకుని పరీక్ష కేంద్రాల బాధ్యతలు కేటాయించేలా డీఈవోకు ప్రతిపాదనలు పంపేవారు. తాజాగా ఆన్‌లైన్ ద్వారా ఎంఈవోలతో వివరాలు సేకరించి నేరుగా రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుంచి నియామకాలు చేపట్టారు. దీంతో పైరవీలకు ఆస్కారం లేకుండా, ప్రైవేటు పాఠశాలల సిఫారసుల్లేకుండా పోయాయని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● ఇదివరకు ఇన్విజిలేటర్లుగా పనిచేసిన అనుభవం లేనివారిని కూడా సీవో, డీవోలుగా నియమించారు. దీంతో తరగతి గదిలో పాఠ్యాంశ బోధన వేరు.. పరీక్ష నిర్వహణ వేరుకదా అనే చర్చలు సాగుతున్నాయి. లక్ష్మీపేట పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులందరికీ డీవోలుగా బాధ్యతలు కల్పించారు.

చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులకు విధుల కేటాయింపులో లోపాలు

ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతున్న విమర్శలు

50 శాతం మంది తప్పనిసరిగా బడిలో ఉండాల్సి ఉండగా ఇలా ఎందుకు చేశారని ఆరోపణలొస్తున్నాయి. అయ్యవారిపల్లెలో ఒక్కరికి కూడా కేటాయించలేదు. కొన్ని పాఠశాలల నుంచి ఒకరిద్దరిని ఈ విధులకు వేశారు. కొన్ని కేంద్రాల్లో జూనియర్ ఉపాధ్యాయులను తొలిసారిగా పర్యవేక్షకులుగా నియమించడంపై విమర్శలు వస్తున్నాయి. రెగ్యులర్ విద్యార్థులతోపాటు ఓపెన్ స్కూల్ వారికీ ఒకేసారి పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకే పాఠశాలలో వేర్వేరు కేంద్రాలుగా సీవోలు, డీవోలు వేర్వేరుగా ఉండి పరీక్షలు జరపనున్నారు. గతేడాది నుంచి వీటి పరీక్ష కేంద్రాల సంఖ్య పెరిగింది. ఎక్కువ మంది అధికారులు అవసరం కావల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 167 కేంద్రాల్లో 28,152 మంది విద్యార్థులు, ఓపెన్ స్కూల్‌కు సంబంధించి 34 కేంద్రాల్లో 6 వేల మంది పరీక్షలు రాయనున్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షలకు రెగ్యులర్ టీచర్లను కేటాయించడంతో కొరత ఎక్కువగా రానుంది. కిలోమీటర్ల దూరం మాత్రమే కాకుండా, ఏకంగా డివిజన్లను దాటించి విధులకు కేటాయించారని వారు వాపోతున్నారు. త్వరలో ఇన్విజిలేటర్ల నియామకాలు జరగనుండగా అధికారుల నియామక లోపాలు త్వరగా చక్కదిద్దాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

ఇబ్బందులు సరిదిద్దుతాం

పరీక్ష అధికారుల నియామకం మా పరిధిలో జరగలేదు. రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం నుంచి వెలువడ్డాయి. ఎవరైనా ఆరోగ్యం బాగాలేదంటే నెల రోజులు సెలవులో వెళ్లాలి. పెళ్లి చేసుకునే వారుంటే ఆహ్వానపత్రంతో సంప్రదించాలి. కొన్ని పాఠశాలల నుంచి ఎక్కువ మంది టీచర్లను నియమించడం, ఇతర ఇబ్బందులు త్వరలో సరిదిద్దుతాం.

-షంషుద్దీన్, డీఈవో, కడప

'జగన్ కడప బిడ్డకాదు.. కన్నడ బిడ్డ'

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప బిడ్డకాదని కన్నడ బిడ్డ అని అందుకే ఇక్కడ దోచుకున్న డబ్బులను అక్కడ దాచుకుంటున్నారని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఆదివారం కడపలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధి తెదేపా పేటెంట్ అని స్పష్టం చేశారు. గత వైకాపా ప్రభుత్వం రాయలసీమకు ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను మోసం చేసేందుకు ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేందుకు వైకాపా నాయకులు కడపలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారని ఆరోపించారు. వైకాపాను ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా బుద్ధి మారలేదన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

చక్రాయపేట,(వేంపల్లె), న్యూస్‌టుడే: ఆసక్తి ఉన్న క్రీడల్లో విద్యార్థులు రాణించాలని డైరెక్టర్ కుమారస్వామిగుప్త అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో అభియాత్ 2కె 26 మారథాన్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. క్యాంపస్ కోఆర్డినేటర్లు పవన్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జెండా ఊపి క్రీడలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ కుమారస్వామిగుప్త

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చింతకొమ్మదిన్నె (కడప చిన్నచౌకు), న్యూస్‌టుడే: చింతకొమ్మదిన్నె మండలంలో ఆదివారం గంగమ్మజాతర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని నిమ్మకాయలతో అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

ఉభయ కవి సార్వభౌముడు భూతపురి

మారుతీనగర్, న్యూస్‌టుడే: తెలుగు, సంస్కృత భాషల్లో పలు రచనలు చేసి ఉభయ కవిసార్వభౌముడిగా డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ పేరొందారని వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రంలో భూతపురి సుబ్రహ్మణ్యశర్మ జయంతి, స్మారక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూతపురి పురస్కార గ్రహీత ఆచార్య సర్వోత్తమరావును శివరామసురేంద్రశర్మ, గోపాలకృష్ణశాస్త్రి రూ.10,116 నగదు, జ్ఞాపిక, సన్మానపత్రంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జయరామిరెడ్డి, ఎస్వీ విశ్రాంత తెలుగుశాఖ ఆచార్యులు దామోదర నాయుడు, జలవనరులశాఖ ఈఈ అనిమెల రాజ, ఆడిటర్ శివరావు, విశ్రాంత తెలుగు పండితులు రాజారెడ్డి, వెంకటేశ్వరాచారి, రచయితలు పాల్గొన్నారు.

సర్వోత్తమరావును సత్కరిస్తున్న వైవీయూ వీసీ రాజశేఖర్, ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం వీసీ జయరామిరెడ్డి

విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేయాలని నిరసన

లింగాల, న్యూస్‌టుడే: తాతిరెడ్డిపల్లె ఎత్తిపోతల పథకం వద్ద విద్యుత్తు నియంత్రికను వెంటనే అమర్చాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రైతులు ఆందోళనలు చేశారు. నియంత్రిక మరమ్మతులకు గురై నెల రోజులు గడిచినా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. దీని వల్ల అరటి, టమాటా దిగుబడులు చేతికందే సమయంలో రూ.లక్షలు నష్టపోతున్నామన్నారు. ఈ విషయాన్ని ఎంపీ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన నియంత్రికను ఏర్పాటు చేయించారు. అయినా విద్యుత్తు అధికారులు కనెక్షన్ ఇవ్వలేదని రైతులు వాపోయారు. విద్యుత్తు నియంత్రికను రెండు రోజుల్లోగా అమర్చకపోతే ధర్నా నిర్వహిస్తామని కర్షకులు హెచ్చరించారు.

తాతిరెడ్డిపల్లె ఎత్తిపోతల పథకం వద్ద ఆందోళన తెలుపుతున్న రైతులు

ప్రతిపక్షం లేని పాలన ప్రజాస్వామ్య భావనకు విరుద్ధం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిపక్షం లేని పాలన ప్రజాస్వామ్య భావనకు విరుద్ధమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య అన్నారు. ఆదివారం పౌర ప్రజాస్వామిక హక్కుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎన్జీవో హోంలో 'భావ ప్రకటన స్వేచ్ఛపై దాడి' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ ఏపీ శాసనసభలో లడ్డూ కల్తీ పేరుతో మతవిశ్వాసాలపై చర్చ సాగటం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు ఇర్ఫాన్‌బాషా మాట్లాడుతూ ఇజ్రాయిల్‌ను ఫాదర్ ఆఫ్ ఇండియాగా మోదీ మాట్లాడడం దారుణమన్నారు. ఉపాధ్యాయ నాయకుడు రషీద్ మాట్లాడుతూ దేశం ప్రమాదకరస్థితిలోకి నెట్టబడిందని పౌరుల స్వేచ్ఛ హక్కులు అణచివేయబడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామిక్ అధ్యక్షుడు మైనుద్దీన్, ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆర్‌వీవీ జిల్లా కన్వీనర్ మహమూద్, న్యాయవాది హరిత, సురేష్‌బాబు, సీఎంఎస్ పద్మ తదితరులు ప్రసంగించారు.

మాట్లాడుతున్న విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి

కాలువకు గండి.. వంకల పాలవుతున్న కృష్ణమ్మ

లింగాల, న్యూస్‌టుడే: పెంచికల బసిరెడ్డి జలాశయం(పీబీఆర్) కుడికాలువకు గండి పడటంతో కృష్ణాజలాలు వృథాగా వంకల పాలవుతున్నాయి. వేసవిలో సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని గండికోట నుంచి కృష్ణాజలాలను రూ.లక్షలు విద్యుత్తు బిల్లులు చెల్లించి పీబీఆర్‌లో నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం చెరువులను నింపేందుకు పీబీఆర్ నుంచి 200 క్యూసెక్కుల మేర నీటని కుడికాలువకు తరలిస్తున్నారు. అయితే వెలిదండ్ల వద్ద 10 రోజుల కిందట గండి పడటంతో 60 క్యూసెక్కుల మేర నీరు వృథా అవుతోంది. సద్వినియోగం చేసుకోవాల్సిన జలాలు వృథా అవుతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ విషయంపై కుడికాలువ ఈఈ మధుసూధనరెడ్డిని వివరణ కోరగా.. త్వరలోనే గండి పూడ్చి వృథా నీటికి అడ్డుకట్ట వేస్తామన్నారు.

కారు కొందామని మోసపోయిన బిల్డర్

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : ఓఎల్ఎక్స్‌లో కారు కొందామని యత్నించిన.. ఓ బిల్డర్ రూ.15 లక్షలు మోసపోయిన ఘటనపై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల మేరకు పోరుమామిళ్ల మండలం రెడ్డినగర్‌కు చెందిన ఏరువ గురుపూర్ణ బిల్డర్‌గా పని చేస్తున్నారు. ఫార్చ్యూనర్ కారు కొనేందుకు ఓఎల్ఎక్స్ వెబ్‌సైట్లో చూశారు. గత నెల 13న ఒక ప్రకటన చూసి.. తన చరవాణి నంబరును దానిలో నమోదు చేశారు. వెంటనే గుర్తు తెలియని ఓ వ్యక్తి ఫోన్ చేసి.. తన పేరు అజిత్‌కుమార్ అని పరిచయం చేసుకున్నాడు. తనకు ఇన్నోవా క్రిస్టా కారు ఉందని.. దాన్ని అమ్ముతానని, జగ్గయ్యపేటలోని తన సోదరుడు జలపతిరావు ఇంట్లో కారు ఉందని తెలిపారు. డబ్బులు తనకు పంపించి, ఆ కారు తీసుకువెళ్లవచ్చని చెప్పారు. తనకు కొన్ని అప్పులు ఉన్నాయని.. కారు అమ్మే ముందే వాటిని తీర్చాలని చెప్పడంతో అతని మాటలు నమ్మారు. గురుపూర్ణ.. విడతల వారీగా అతనికి రూ.15లక్షలు పంపించారు. ఆ తర్వాత నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో మోసపోయినట్లు గుర్తించారు. శనివారం రాత్రి విజయవాడ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు.

గోదాముల తనిఖీ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు, అగ్నిమాపక అధికారులు జిల్లాలోని టపాసుల నిల్వ గోదామును తనిఖీ చేశారు. ఎన్‌వోసీలను, అగ్నినిరోధక పరికరాలు తదితర వాటిని పరిశీలించారు. గోదాములో పరిమితికి మించి టపాసులను నిల్వ చేయరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే గోదాములను జప్తు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా అనధికారికంగా టపాసులు తయారు చేసినా, నిల్వ ఉంచినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి పోలీసులు పాల్గొన్నారు.

మైదుకూరులో టపాసుల విక్రయకేంద్రంలో పరిశీలిస్తున్న తహసీల్దారు రాజసింహ నరేంద్ర, ఎస్సై కత్తి వెంకటరమణ

మైదుకూరు : మైదుకూరులోని టపాసుల విక్రయ కేంద్రాలను తహసీల్దారు రాజసింహ నరేంద్ర, ఎస్సై కత్తి వెంకటరమణ ఆదివారం తనిఖీ చేశారు. ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

ముక్కు మూసుకుంటేనే ముందుకు సాగేది

ప్రొద్దుటూరు పట్టణం వెంగళరెడ్డిపేట దళితవాడ వద్ద పురపాలక పాఠశాల సమీపంలో ఉన్న దిబ్బలోని చెత్తను సకాలంలో పారిశుద్ధ్య అధికారులు తొలగించడం లేదు. చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో స్థానికులు రోడ్డుపైనే చెత్తను వేసి వెళ్లిపోతున్నారు. ఈ మార్గంలో రాకపోకలు చేసేవారు ముక్కు మూసుకుని వెళుతున్నారు. ఈ సమస్యలపై కమిషనర్ రవిచంద్రారెడ్డికి స్థానికులు ఫిర్యాదు చేయగా తొలగించేలా చర్యలు చేపడతానన్నారు. -న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

వాహనం ఢీకొని వృద్ధుడి దుర్మరణం

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు మండలం జ్యోతినగర్ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని శ్రీరాంనగర్‌కు చెందిన కూనపులి గురయ్య (65) మృతి చెందారు. గంగాయపల్లెరోడ్డులో నడుచుకుంటూ గ్రామానికి వస్తుండగా ప్రమాదానికి గురై అక్కడికక్కడే చనిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూనపులి గురయ్య (పాత చిత్రం)

బస్సు ఢీకొని న్యాయశాఖ ఉద్యోగి..

సిద్దవటం, న్యూస్‌టుడే: ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని న్యాయశాఖ ఉద్యోగి మృతి చెందిన ఘటన మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బద్వేలు సుమిత్రనగర్‌కు చెందిన బత్తల మధుసూదన్‌రావు(47) సిద్దవటంలోని న్యాయస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం సిద్దవటం నుంచి బద్వేలుకు ద్విచక్రవాహనంపై బయలు దేరారు. అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో ముందువైపు వెళ్తున్న కారును దాటుతుండగా ఎదురుగా వచ్చిన బస్సు ఢీకొంది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఒంటిమిట్ట సీఐ నరసింహారాజు, సిద్దవటం ఎస్సై హారిక ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కడప సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మధుసూదన్‌రావు (పాత చిత్రం)

పెట్రోల్ దాడికి గురైన యువకుడి మృతి

కాశినాయన, న్యూస్‌టుడే: పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై యోగేంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు ఫిబ్రవరి 22న మండలంలోని గంగనపల్లెకు చెందిన దిలీప్(24)పై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ ఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడడంతో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఈ ఘటనపై అనుమానితులను పోలీసులు ఇంకా విచారిస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి బలవన్మరణం

కొండాపురం, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెంది కొండాపురం శివారు ప్రాంతంలో రైలు కిందపడి గండ్లూరు గ్రామానికి చెందిన చౌడప్ప (45) మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్సై భాస్కర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. చౌడప్ప మద్యానికి బానిసై, అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వివరించారు.

● ఆయాసంతో ఇబ్బందిపడుతున్న పేట నడిపి కంటన్న (78) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కొండాపురం మండలం యనమలచింతల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ వివరాల మేరకు.. యనమలచింతల గ్రామానికి చెందిన నడిపి కంటన్న కొంత కాలంగా ఆయాసంతో బాధపడుతూ ఉండేవాడు. వ్యాధి తగ్గలేదని మనస్తాపానికి గురై గత నెల 26వ తేదీ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు తాడిపత్రి ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. నడిపి కంటన్న భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

పెన్నానదిలో ఇద్దరు యువకుల గల్లంతు

వల్లూరు: పెన్నానదిలో ఈతకెళ్లి ఇద్దరు యువకులు గల్లంతు కాగా ఒకరు సురక్షితంగా బయట పడిన ఘటన వల్లూరు మండలం పుష్పగిరి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. కొండాపురం మండలం కొర్రపాడుకు చెందిన సురేంద్ర కడపలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. గుండ్లూరులోని మేనమామ కుమారుడు శ్రీనాథ్, కడపలోని చిన్నచౌక్‌కు చెందిన స్నేహితుడు చైతన్యలతో కలిసి పుష్పగిరి వద్ద ఉన్న పెన్నానదిలోకి ఈతకెళ్లారు. ఈ క్రమంలో శ్రీనాథ్, చైతన్యలు ఈత కొడుతూ ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లి గల్లంతయ్యారు. సురేంద్ర సురక్షితంగా ఒడ్డుకు చేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

శ్రీనాథ్ చైతన్య

అరటి తోట దగ్ధం

పులివెందుల: గుర్తు తెలియని వ్యక్తులు అరటి తోటకు నిప్పు పెట్టిన ఘటన పులివెందులలోని డంపింగ్ యార్డు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పులివెందులకు చెందిన రాజశేఖర్ 8 ఎకరాలు కౌలుకు తీసుకుని అరటిని సాగుచేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తోటకు నిప్పంటించడంతో సాగు చేసిన అరటి పంట పూర్తిగా దగ్ధమైంది. పంట చేతికొచ్చే సమయంలో గెలలతో కూడిన అరటిపంట, డ్రిప్ పరికరాలు కాలిపోయి రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు.

నిర్మాణ రంగ కార్మికులకు ఊతం

దస్త్రాలు సిద్ధం చేస్తున్న కూటమి ప్రభుత్వం

గోపవరం న్యూస్‌టుడే: కార్మికుల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వారికి ప్రత్యేక సంక్షేమ పథకాల అమలుకు సిద్ధం అయ్యింది. గత తెదేపా ప్రభుత్వంలో త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నారు. గత వైకాపా ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బంది పడ్డ శ్రామికులు ప్రస్తుత ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందనున్నారు. గత తెదేపా హయాంలో నిర్మాణ రంగ కార్మికులకు కోసం 11 పథకాలు తీసుకొచ్చారు. ప్రస్తుతం వాటినే తీసుకురానున్నారు.

గతంలో అందించిన లబ్ధి

● మహిళా, నిర్మాణరంగ కార్మికుల ఇద్దరు అమ్మాయిల వివాహాలకు రూ. 40 వేల వంతున సాయం అందించారు. ● ప్రసూతి కింద మహిళా కార్మికులు, కార్మికుడి భార్య, ఇద్దరు పిల్లలకు రూ.20 వేల ఆర్థిక సాయం అమలు చేశారు. ● శ్రామికుల సహజ మరణానికి రూ.60వేలు సాయం అందించేవారు. ● ఒకవేళ మరణిస్తే వారి అంత్యక్రియలకు రూ.20వేలు.. పని ప్రదేశంలో మరణం సంభవిస్తే అక్కడి నుంచి వారిని సొంత ఊరికి తీసుకెళ్లడానికి కి.మీ రూ.20 చొప్పున అందించేవారు. ● నిర్మాణరంగ కార్మికులకు నైపుణ్య శిక్షణతో పాటు హాజరయ్యే వారికి రూ.300 స్టైఫండ్ చెల్లించేవారు. వీటితో పాటు తదితర పథకాలు అమలు చేసేవారు.

కార్మికులుగా నమోదు చేసుకోండి

ఎవరైనా నిర్మాణ రంగంలో పనిచేస్తుంటే ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు వెబ్‌సైట్‌లోకి వెళ్లి కార్మికులుగా నమోదు చేసుకోవాలి. ఇప్పటి వరకు 67,416 మంది రిజిస్టర్ చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ తప్పక ఆధార్ అనుసంధానం చేసుకోవాలి. - రంగరాజు, ఉపకమిషనర్, కార్మిక శాఖ, కడప

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టాలి

కడప నగరపాలక, న్యూస్‌టుడే: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై వైకాపా నాయకులు కడప నగరంలో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాల వైకాపా ప్రజాప్రతినిధులు, ఆయా జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కొన్ని నెలలుగా పొరుగురాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలు సీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు గొడ్డలిపెట్టుగా మారాయన్నారు. సీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఆపేస్తున్నామని ఏపీ సీఎం తనకు హామీ ఇచ్చినట్టు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును బ్యారేజీ స్థాయికి తెచ్చి నామమాత్రంగా పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో గ్రేటర్ రాయలసీమ జిల్లాల సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా దశలవారీ ఉద్యమాన్ని చేపడతామన్నారు. అనంతరం లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై పలు తీర్మానాలు చేశారు. ఎంపీలు వైఎస్ అవినాష్‌రెడ్డి, గురుమూర్తి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, అమరనాథరెడ్డి తదితరులు ఈ అంశంపై ప్రసంగించారు.

సమావేశంలో పాల్గొన్న వైకాపా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి చిత్రంలో నాయకులు

EENADU Classifieds

BUSINESS SERVICES

CCTV షాపులో పని చేయుటకు 2 వీలర్ ఉన్న టెక్నీషియన్స్-2, హెల్పర్స్-2, కావలెను. Cont: 90107 95735, 9652470124.

స్వామి సెక్యూరిటీ సర్వీస్ కడప వారికి కడప పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: 10 వేలు. Cont: 9440546530.

BUSINESS OFFER

బంగారం,వెండి, డైమండ్స్ [illegible] © 7382114647

JOBS

Wanted Female Telecallers, Q: Degree/B.Tech/Any PG. Salary: 13K to 18K. Exp/Freshers, Kadapa. Ph: 9032052758, 9700957573.

పనిమనిషి కావలెను. [illegible] © 9849794289, 9059119923.

గమనిక [illegible]

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ. 330/- మాత్రమే

Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620

(c) eenadu

రాజంపేట
•రాజంపేట • బద్వేలు

విహారంతో విజ్ఞానం

గండి క్షేత్రం వద్ద విద్యార్థులతో ఉపాధ్యాయులు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: ప్రీ ఒకేషనల్ ట్రేడర్ విజిట్‌లో భాగంగా విద్యార్థులు గండి క్షేత్రాన్ని సందర్శించినట్లు పోరుమామిళ్ల కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఎస్‌వో నాగమల్లీశ్వరి తెలిపారు. యాత్రలో భాగంగా గండి, మైలవరం, మ్యూజియం, వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రాన్ని వెళ్లినట్లు వివరించారు. అక్కడి విశిష్టతపై ఉపాధ్యాయులు వారికి అవగాహన కల్పించారు.

డీసీసీబీ ఛైర్మన్‌కు సత్కారం

డీసీసీబీ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డిని సన్మానించిన అధికారులు, సభ్యులు

అట్లూరు, న్యూస్‌టుడే: మండల సమావేశాల్లో సభ్యులు అడిగే ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని డీసీసీ బ్యాంకు ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పంచాయతీల్లోని సమస్యలు మూడు నెలలుగా విన్నవిస్తున్నా.. అధికారులు పరిష్కరించడం లేదని ఎలా అని ప్రశ్నించారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. అనంతరం ఆయనను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
బద్వేలు గ్రామీణ : 8008573493

?: పురపాలికలోని మహబూబ్‌నగర్‌లో మురుగు కాలువలో పూడిక పేరుకు పోయి నీరు ముందుకు పారడం లేదు. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **- జహంగీర్‌బాషా, స్థానికుడు**

✓: సిబ్బందిని పంపించి కాలువలో పూడిక తీయిస్తాం.

?: బద్వేలులోని రామాంజనేయనగర్‌లో కొన్ని వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో విషపురుగులు సంచరిస్తున్నాయి. **- నరసింహులు, రామాంజనేయనగర్**

✓: సిబ్బందిని పంపించి వెలగని వీధి దీపాలను బాగుచేయిస్తాం.

?: పురపాలికలోని రిక్షా కాలనీలో వీధి రోడ్డు దారుణంగా మారింది. అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. **- సుబ్బయ్య, బద్వేలు**

✓: రిక్షా కాలనీలో సిమెంటు రోడ్డు వేయించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం.

(పై సమస్యలకు బద్వేలు పురపాలిక కమిషనరు నరసింహారెడ్డి సమాధానం చెప్పారు.) - న్యూస్‌టుడే, బద్వేలు గ్రామీణ

స్పందనకు వందనం

వీరబల్లి, న్యూస్‌టుడే: వీరబల్లి-రాయచోటి మార్గంలో రోడ్డు మరమ్మతు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. గత నెల 24న రహదారి..గుంతల మయం అన్న శీర్షికన 'ఈనాడు'లో చిత్ర వార్త ప్రచురితమైంది. స్పందించిన రహదారులశాఖ అధికారులు గుంతలు పూడ్చారు. దీంతో పాటు ఎలకచెట్టుపల్లె వద్ద సిమెంటు రహదారి నిర్మాణం కూడా చేపడుతున్నారు. అందుకు సంబంధించిన పనులను జేసీబీ యంత్రంతో సన్నాహక పనులు నిర్వహిస్తున్నారు. దీంతో వాహనదారులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బాలురు.. క్రీడల్లో వీరులు

రాష్ట్ర, జాతీయ స్థాయి నెట్‌బాల్, తైక్వాండోలో రాణింపు

తైక్వాండోలో ప్రత్యర్థితో తలపడుతున్న సుశాంత్

సిద్దవటం, న్యూస్‌టుడే: ఆటపై ఉన్న ఆసక్తితో పట్టుదలతో శిక్షణ తీసుకుంటూ మండలానికి చెందిన పలువురు విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. చదువుతో పాటు ఆటల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారు. బంగారు పతకాలు సాధిస్తూ.. అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. త్వరలో గుంటూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీకి ఎంపికయ్యారు. ప్రతిభ చూపుతున్న ఆ బాలుర మనోగతం ఇలా...

క్రీడా కోటాలో ఉద్యోగం సాధిస్తా : మాది సిద్దవటం మండలం, ఎస్.రాజంపేట. ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నా. ఏడాదిగా తైక్వాండోలో శిక్షణ తీసుకుంటున్నా. గత ఏడాది రైల్వేకోడూరు, వైజాగ్, గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని 30 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించా. గుంటూరులో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటా. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం. **- భవనాశి సుశాంత్**

కరాటే మాస్టర్ కావాలని ఉంది : మాది సిద్దవటంలోని సంటిగారిపల్లె. ఆరో తరగతి చదువుతున్నా. కరాటే క్రీడకు అనుబంధంగా ఉన్న తైక్వాండోలో శిక్షణ తీసుకుంటున్నా. రెండు సార్లు రాష్ట్ర స్థాయిలో రాణించి స్వర్ణ పతకాలు అందుకున్నా. గత ఏడాది 26 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించా. మరిన్ని మెలకువలు, నైపుణ్యాలు నేర్చుకుని భవిష్యత్తులో కరాటే మాస్టర్ రాణించాలని ఉంది. **- ఈశ్వర్‌నాథ్‌రెడ్డి**

పోలీసు అవ్వాలని లక్ష్యం : మండలంలోని కనుమలోపల్లిలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. నెట్‌బాల్ క్రీడపై ఉండే ఆసక్తితో నేర్చుకున్నా.. రెండు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించా. ఒకసారి జాతీయస్థాయి పోటీలో తలపడ్డాను. నెట్‌బాల్‌లో రాణించి భవిష్యత్తులో క్రీడా కోటా కింద పోలీసు ఉద్యోగం సాధించాలని లక్ష్యం. **- అయ్యన్న**

వైభవంగా ముగిసిన గంగమ్మ జాతర

అలరించిన అమ్మవారి వేషధారణ

అలంకరణలో గంగమ్మ తల్లి

వీరబల్లి, న్యూస్‌టుడే: వీరబల్లిలో జరుగుతున్న గంగమ్మ జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. శనివారం రాత్రి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నడుమ చాందినీబండ్లు, కుంకుమ బండిని పురవీధుల్లో ఊరేగించారు. కుంకుమబండి ఎదుట రూగా దేవత వేషధారణ ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ

ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న భక్తులు

పెద్దనేనికాలువ(సుండుపల్లి), న్యూస్‌టుడే: పెద్దనేనికాలువ గ్రామం తోటి దళిత వాడలో ఆదివారం రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. హిందూ బంధువులు, శ్రీరాముని సేవకుల పేరుతో ఈ పూజ ఏర్పాట్లు చేశారు. ఇదే గ్రామానికి చెందిన కువైట్‌లో ఉన్న కె.మల్లికార్జునరెడ్డి రూ.50వేలు విరాళంగా అందజేశారు. మరో రూ.70వేలను భక్తుల నుంచి సమీకరించారు. తితిదే రూ.15 లక్షలు మంజూరు చేసింది. కార్యక్రమంలో వాల్మీకిపురం ప్రముఖులు, హేమమాలిని, కడప భద్రాద్రి రామాలయ చారిటబుల్‌ట్రస్టు ఛైర్మన్ రామచంద్రారెడ్డి, హరినాథ, ప్రమీల పాల్గొన్నారు.

వడ్ల రామయ్యకు రాజ్యసభ సీటు ఇవ్వాలి

రాజంపేట: పార్టీ విధేయుడు, బలహీనవర్గాల తరఫున గొంతుకను వినిపించే వడ్ల రామయ్యకు రాజ్యసభ సీటు ఇవ్వాలని తెదేపా ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మంద శ్రీనివాసులు కోరారు. స్థానిక తెదేపా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ అభివృద్ధికి పాటు పడుతున్న రామయ్యకు మంచి అవకాశం కల్పించాలని విన్నవించారు.

అమరుల త్యాగం అజరామరం

నివాళులర్పిస్తున్న నాయకులు

సుండుపల్లి, న్యూస్‌టుడే: మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సామాజిక సమానత్వం కోసం ఏర్పాటు చేసిన ఎస్సీ రిజర్వేషన్ ఉద్యమంలో వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

కలసపాడు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు పోరుమామిళ్లకు చెందిన ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కల్యాణ్‌చక్రవర్తి పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎఫ్‌టీవో జాతీయ కార్యదర్శి పి.రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రమణ ఉపాధ్యాయుడు గఫార్, ఎస్టీయూ నాయకులు ప్రసాద్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ అదృశ్యంపై కేసు నమోదు

ముదుంపాడు(సుండుపల్లి), న్యూస్‌టుడే: తల్లీబిడ్డ అదృశ్యమయ్యారని తండ్రి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై హుస్సేన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని కురవపల్లెకు చెందిన సునీల్‌కుమార్‌కు భార్య అశ్విని, రెండున్నర ఏళ్ల కుమారుడు ఉన్నారు. గత నెల 26న ఆయన భార్య, కుమారుడితో పాటు సమీప దుకాణానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లారు. ఆ తరువాత ఎంత సేపటికీ తిరిగి రాలేదు. ఎక్కడ గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు.

మట్టి తవ్వకాలపై వాగ్వాదం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: పెన్నపేరూరులోని ఓ సర్వే నంబరు భూమిలో మట్టి తవ్వకాలపై తెదేపాలోని రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్వర్ణ గ్రామం కార్యాలయం సమీపంలో ఓ నాయకుడు ప్రభుత్వ నిధులతో చేపడుతున్న రహదారుల నిర్మాణానికి మట్టి కావాలని ఆదివారం పొక్లెయిన్ తెప్పించి అనధికారికంగా తవ్వకాలు చేపట్టారు. ఈ పనులను ఇదే గ్రామానికి చెందిన ఓ యువ నాయకుడు అడ్డుకున్నారు. వెంటనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తాము అభివృద్ధి పనులు చేస్తుంటే అడ్డుకోవడమేంటి, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ఏమిటంటూ సీనియర్ నాయకుడు కాస్త కటువుగా మాట్లాడారు. ఈ విషయంపై రెండు వర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. కానీ సాయంత్రానికే మళ్లీ తవ్వకాలు చేపట్టడం గమనార్హం.

ఏఐటీయూసీ మహాసభలు విజయవంతానికి వినతి

మారుతీనగర్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు మార్చి 16, 17, 18 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేసీ బాదుల్లా తెలిపారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారి మున్నాఫ్

గోపవరం న్యూస్‌టుడే: అడవుల రక్షణ అందరి బాధ్యతని అటవీ అధికారి మున్నాఫ్ అన్నారు. కడప డీఎఫ్‌వో ఆదేశాల మేరకు, బద్వేల్ అటవీ క్షేత్రాధికారి నయీం అలీ ఆధ్వర్యంలో ఆదివారం లక్కవారిపల్లెలో ''అడవికి నిప్పు...మానవాళికి ముప్పు'' కార్యక్రమం నిర్వహించారు. అడవుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అడవులకు నిప్పు పెట్టడం వలన మానవాళికి జరిగే నష్టాలు, రక్షించుకోవడం వలన కలిగే లాభాలు వారికి వివరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

కార్యకర్తలతో తెదేపా రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు

వీరబల్లి, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని రాజంపేట అసెంబ్లీ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు అన్నారు. మట్లిలో సొసైటీ అధ్యక్షుడు రాజానాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికల్లో ఇప్పటి నుంచే దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం స్థానిక గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు ఎం.భానుగోపాల్‌రాజు, నాయకులు టి.సురేంద్రారెడ్డి, బూషణం నాయుడు, నాగార్జునాచారి, రామాంజులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుంది : రాజంపేట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్ రాజు అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీలకు రెండు సార్లు వేతనాలు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఏళ్ల తరబడి ఎదురు చూసిన గ్రాడ్యుటీ కళను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని, గత బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించినట్లు గుర్తుచేశారు.

ఏఐఎఫ్‌ఈటీవో జాతీయ కార్యదర్శిగా రమణారెడ్డి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్(ఏఐఎఫ్‌ఈటీవో) జాతీయ కార్యదర్శిగా పోరుమామిళ్లకు చెందిన రమణారెడ్డి ఎంపికయ్యారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు తెలిపారు. గతంలో ఈయన ఎస్టీయూలో వివిధ పదవులలో పనిచేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై చేస్తున్న కృషి గుర్తించి ఎంపిక చేసినట్లు వివరించారు. అనంతరం పోరుమామిళ్ల ఎస్టీయూ కార్యాలయంలో ఉపాధ్యాయులు ఆయనను పూలమాల, శాలువాతో సన్మానించారు.

సందడిగా బాలల పండగ

ప్రతిభ చూపిన విద్యార్థులతో అధికారులు

రాజంపేట, న్యూస్‌టుడే: బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాజంపేట పట్టణంలోని బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి బాలల పండగ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 37 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 850 మంది విద్యార్థులు తరలి వచ్చారు. సందడిగా గడిపారు. వారికి కోలాటం, శాస్త్రీయ నృత్యం, డ్రాయింగ్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. డిప్యూటీ డీఈవో నాగయ్య, ఎంఈవో-2 సుబ్బరాయుడు, బాలోత్సవం జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగముని రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఉత్సాహంగా కుర్చీలాట ఆడుతున్న మహిళా కార్మికులు

రాజంపేట, న్యూస్‌టుడే: కష్టపడి పనిచేసే కార్మికుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఆట విడుపు కార్యక్రమాలను చేపడుతున్నట్లు పురపాలక కమిషనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పురపాలక కార్యాలయ ఆవరణంలో ఆదివారం హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు కుర్చీల పోటీలు నిర్వహించారు.

అహోబిలం బ్రహ్మోత్సవాల్లో మాధవరం భక్తులు

పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మాధవరం వాసులు

సిద్దవటం, న్యూస్‌టుడే : అహోబిలం బ్రహ్మోత్సవాల్లో కన్యాదాతలుగా మాధవరం-1 గ్రామానికి చెందిన భక్తులకు అవకాశం లభించింది. ఈ సందర్భంగా శని, ఆదివారం నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వెంకటసుబ్బయ్య, దశరథ, లక్ష్మీ, తులసీ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ప్రింటర్ వితరణ

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: స్థానిక గ్రంథాలయానికి విజయ పాఠశాలలో 2002- 2003లో చదివిన విద్యార్థులు ప్రింటర్‌ను వితరణగా అందజేశారు. ఈ మేరకు గ్రంథాలయ అధికారి ఆఫ్రీద్‌కు ఆదివారం అందించారు. పాఠశాలలో చదువుతున్న రోజుల్లో గ్రంథాలయం సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఖాసీంవల్లి, సీపీఎం నాయకులు భైరవప్రసాదు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఆధునిక పోటీ ప్రపంచంలో ఎంతో మంది మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కడప శ్రీనివాస వైద్యాలయం డైరెక్టర్ గౌరి, వైద్యులు శ్రీనివాసరావు అన్నారు. ఒంటిమిట్ట కేర్ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని సంకల్పంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్యులు పృథ్వీ, సిబ్బంది షామీర్, లీలా పాల్గొన్నారు.

రైతుబజారు.. నిర్వహణ కొరవడి బేజారు

బద్వేలు మార్కెట్ యార్డు వద్ద రోడ్డుపైనే పెట్టి విక్రయిస్తున్న వ్యాపారులు

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు మార్కెట్ యార్డులో రూ.యాభై లక్షలు వెచ్చించి ఇటీవల రైతు బజారు ఏర్పాటు చేశారు. కానీ, కొన్ని రోజులకే నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దాంతో పలువురు వ్యాపారులు కూరగాయల మార్కెట్ రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తున్నారు. అక్కడే రాష్ట్ర హైవే రోడ్డు ఉంది. కడప బెంగళూరు, చెన్నై ఉభయ రాష్ట్రాలకు వెళ్లే బస్సులతో నిత్యం రద్దీగా ఉంటుంది. దాంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ● ఇటీవల రైతు బజారు ఏర్పాటు కావడంతో చాలా మంది వ్యాపారులు ఇక్కడకు వచ్చి రోడ్డుపైనే క్రయ విక్రయాలు జరుపుతున్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో పండించే కూరగాయలన్నీ వాహనాల్లో రోడ్డు పక్కనే దించుతుండటంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ మార్కెట్‌లో కూరగాయల విక్రయానికి షెడ్లు ఉన్నాయి. కావాల్సిన స్థలమూ ఉంది. అయినా పలువురు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ● ఈ విషయాన్ని మార్కెట్ యార్డ్ కార్యదర్శి మురళీతో న్యూస్‌టుడే ప్రస్తావించగా కూరగాయల క్రయ విక్రయాలు మార్కెట్ యార్డులో జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు.

లక్ష్మీపాళెంలో వైద్యశిబిరం

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపాళెం గ్రామంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయం ఆవరణంలో భక్తులకు ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు వైద్యసేవలను సద్వినియోగం చేసుకున్నారు. మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందిని ఆలయ ఛైర్మన్ సత్యసంజీవకుమార్ అభినందించారు. కార్యక్రమంలో శీలం చిన్నా, జ్యోతి, గ్రామస్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజేతలు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: ఒత్తిడి జయిస్తే విజేతలుగా నిలుస్తారని సీఐ హేమసుందరరావు విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని గురుకుల పాఠశాలను ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాను గురుకుల పాఠశాలలో చదువుకున్నాని విద్యార్థులకు చెప్పారు. అనంతరం వారితో కలిసి వాలీబాల్ ఆడారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు.. ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని చెప్పారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకరావాలని అన్నారు. ప్రిన్సిపల్ శామ్యూల్, పీఈటీ అనిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫలరాజుకు లాభాల కవర్

కాయల నాణ్యత పెంచడానికి సంచులు

మామిడి కాయలకు ఏర్పాటు చేసిన కవర్లు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ప్రస్తుతం వాతావరణ మార్పులతో మామిడి రైతుల్లో ఆందోళన నెలకొంది. చీడలు, తెగుళ్లు అధికంగా వ్యాప్తి చెందుతుండటంతో తీవ్ర నష్టం చవిచూడాల్సి వస్తుందని భయాందోళనకు గురవుతున్నారు. దాంతో సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాటికి అవసరమైన సంచులను (కవర్లు) రాయితీపై ఇవ్వాలని నిర్ణయించింది. దరఖాస్తులు స్వీకరించి అర్హులకు మంజూరు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

700 హెక్టార్లకు అనుమతి ; వాతావరణ ప్రభావంతో మామిడి పంటలో పండు ఈగ, పిండినల్లి, రాతిమంగు తదితర పురుగులు అధికంగా ఆశిస్తున్నాయి. దాంతో కాయ నాణ్యత, ఎదుగుదల, ఉత్పత్తి, రంగు, రుచిని దెబ్బతీస్తున్నాయి. వాటి నివారణకు పరిమితికి మించి మందులు పిచికారీ చేస్తుండటంతో రైతులపై అదనపు భారం పడుతోంది. దీంతో ఉద్యానశాఖ సంకల్పించి.. ప్రభుత్వ అనుమతితో కవర్లు అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆదేశాలు అందడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ● జిల్లాలో ప్రస్తుతం 700 హెక్టార్లకు సంచులను ఇవ్వాలని ప్రణాళికను రూపొందించారు. హెక్టారుకు 15 వేల కవర్లు ఇస్తారు. ఒక సంచి ధర రూ.2 కాగా.. మొత్తం రూ.30 వేలు ఖర్చు అవుతుంది. అందులో రూ.15 వేలు రాయితీ ఇస్తారు. సాగుదారుల నుంచి అందిన పత్రాలను రైతు సేవా కేంద్రాల బాధ్యులు పరిశీలించి ఎంపిక చేస్తారు.

సద్వినియోగం చేసుకోండి ; కవర్లు అవసరమైన రైతులు ఆర్ఎస్‌కే సిబ్బందిని సంప్రదించాలి. భూమి హక్కు పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. వీటితో కాయ పరిమాణం, రంగు, నాణ్యత పెరుగుతుంది. అన్నదాతలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- జి.సతీష్, ఉప సంచాలకులు, ఉద్యాన శాఖ, కడప

ప్రొద్దుటూరు
• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • మైదుకూరు

మాంసం దుకాణాల వద్ద ప్రైవేటు వసూళ్లకు చెక్

స్పందనకు వందనం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: పుర పాలక పరిధిలో ఉన్న చికెన్, మాంసం, చేపల దుకాణాల నుంచి ఆదివారం పుర రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) రమేష్ మాంసపు పన్నును వసూలు చేశారు. గత ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ప్రైవేటు వ్యక్తులు ఈ దుకాణాల నుంచి పురపాలక సంఘం పేరుతో పన్ను వసూలు చేశారు. 'ఈనాడు'లో వారం కిందట ప్రొద్దుటూరులో కోళ్ల అంగళ్లు మేస్తున్నాయంటూ ప్రైవేటువ్యక్తుల వసూలు దందాతో పుర ఖజానాకు నష్టం వాటిల్లుతోందని కథనం ప్రచురితమైంది. దుకాణదారుల నుంచి పన్ను వసూలు తీరును భాజపా నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం 73 దుకాణాల నుంచి రూ.20,100ల నగదు వసూలుచేసినట్లు ఆర్‌ఐ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ప్రొద్దుటూరులోని ఎడిఫై పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వేదికపై నృత్యం చేస్తున్న విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8008573447

?: రాజుపాళెం మండలంలోని కొర్రపాడులో ప్రధానమైన వెలవలి వెళ్లే రోడ్డులో గ్రామవాడికి పక్కన వీధి దీపం వెలగా పోవడంతో ఇబ్బంది మురుగునీరు సిమెంటురోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో పాటు కట్టలు వేయడంతో రాత్రి వేళ చీకటిలో నిత్యం వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇక్కడ లైటు, పారిశుద్ధ్యం పనులు చేయించాలి. - రామ్, కొర్రపాడు

✓: కొర్రపాడులో వెలవలి వెళ్లే రోడ్డులో అక్కడ వీధి దీపం, పారిశుద్ధ్యం పనులు చేయిస్తాం.

?: రాజుపాళెం మండలం కొర్రపాడు బస్టాండులో వీధి దీపం సరిగా వెలగడంలేదు. దీంతో బస్సు దిగే సమయంలో వెలుగులు లేక అసౌకర్యంగా ఉంది. ఈ రోడ్డులో రాజుపాళెం వైపు ప్రధాన రోడ్డులో కూడా వీధిలైట్లు లేక పాదచారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. - బాషా, బీసీ కాలనీ, కొర్రపాడు

✓: కొర్రపాడు బస్టాండులోని ప్రధాన రాజుపాళెం వెళ్లే రోడ్డులో వీధి దీపాలు కొత్తగా వేయిస్తాం.

(పై సమస్యలకు రాజుపాళెం డిప్యూటీ ఎంపీడీవో షాకీర్ అభిషాన్ సమాధానాలు ఇచ్చారు.)

?: రాజుపాళెం మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో పగలు వీధిలైట్లు వెలుగుతుండడంతో పంచాయతీపై అదనపు ఛార్జీలు పడుతున్నాయి. - రామనాథరెడ్డి, తొండలదిన్నె, సుబ్బయ్య, వెలవలి

✓: పగలు వెలిగే వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. - వేణుగోపాల్, రాజుపాళెం ఏఈ, - న్యూస్‌టుడే, రాజుపాళెం

?: ప్రొద్దుటూరు పట్టణం వెంగళరెడ్డిపేట దరివాడ, అలీబేగం వీధి కూడలి వద్ద విద్యుత్తు దీపం వెలగడం లేదు. చీకటి కారణంగా సమస్యలకు వెళ్లలేకపోతున్నాం. - వర్సన్, స్థానికులు

✓: వీధిదీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
- సురేష్, ప్రొద్దుటూరు పురపాలక సంఘం ఎలక్ట్రికల్ ఏఈ
- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

రహదారులు అస్తవ్యస్తం.. పారిశుద్ధ్యం అధ్వానం

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దుస్థితి పట్టించుకోని అధికారులు

ప్రొద్దుటూరు పట్టణం భవానీనగర్‌లో దెబ్బతిన్న మురుగు కాలువ

- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కనీస వసతులకు నోచుకోవడంలేదు. ఏటా అభివృద్ధి పనులకు లక్షలాది రూపాయలు వ్యయం చేస్తున్నామని అధికారులు అంటున్నారేగానీ.. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దారుణంగా ఉంటోంది. ప్రొద్దుటూరు పట్టణం వైఎంఆర్‌కాలనీ భవానీనగర్‌లో రోడ్డు నాణ్యతపై సందేహాలు తలెత్తుతున్నాయి. సుమారు ఏడేళ్ల కిందట సిమెంటురోడ్డు నిర్మించారు. కొన్నేళ్ల కిందట రోడ్డుకు నెర్రెలు చీలాయి. ఇటీవల ఓ ట్రాక్టర్ మట్టిని తీసుకువెళ్లిన అనంతరం రోడ్డు అధ్వానంగా సిమెంటు పెచ్చులేచాయి. సిమెంటు అంతా వెళ్లిపోవడంతో గుంతలు పడ్డాయి. స్థానికులు గుంతల్లో మట్టిని నింపడంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా రాకపోకలు చేస్తున్నారు.

• భారీ వాహనాల రాకపోకలు ఉండవు: ట్రాక్టర్లవంటి వాహనాలు నిర్మాణాల సమయంలోనే ఈ వీధిలో వస్తుంటాయి. సిమెంటు రోడ్డును నాసిరకంగా నిర్మించడంతో అధ్వానంగా తయారైందని వాసులు చెబుతున్నారు. మురుగు కాలువ కూడా దెబ్బతింది. మురుగు సక్రమంగా పారడం లేదని స్థానికులు ఆందోళన వెలిబుచ్చారు. ఈ విషయాన్ని పురపాలక ఇంజినీర్ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

కంకర పరిచి మమ

మండల కేంద్రం రాజుపాళెం గ్రామంలోని కడప - కర్నూలు కాలువ ఆయకట్టు రహదారిపై కంకర మూడు నెలల కిందట పరిచారు. ఈ మార్గాన్ని పంట పొలాలకు వెళ్లడానికి రైతులు వినియోగిస్తున్నారు. టూరు గ్రామానికి వెళ్లే వాహనదారులు తక్కువ దూరం కావడంతో ఈ రోడ్డును వాడుతున్నారు. ఆరు కిలో మీటర్ల పాటు ఇక్కడ కంకరను పరిచారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.6.25 కోట్ల నిధుల ఇటీవల మంజూరయ్యాయి. కంకరపై రైతులు, ద్విచక్రవాహనదారులు నానాయాతనలు పడుతున్నారు. పరిపాలన పరమైన అనుమతులతో నిధుల మంజూరుకు నోచుకోవడంతో గుత్తేదారు ఈ పనులు చేపట్టలేదనే వదంతులతో రైతులు, వాహనదారులు కంకరపైనే వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయాన్ని పంచాయతీ రాజ్ ఏఈ గణేష్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా వెంటనే పనులు చేస్తామన్నారు.

రాజుపాళెంలో కంకరపైనే ప్రయాణం

విద్యార్థి, యువజన నాయకుల ఇఫ్తార్ విందు

కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 'ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా' (ఎస్ఐఓ), ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ (వైఐఎం) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో ప్రొద్దుటూరులోని విద్యార్థి, యువజన సంఘాల నాయకులతో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత విద్యా వ్యవస్థలోని సవాళ్లు, విద్యార్థులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడి, అధిక ఫీజు ఖర్చులు, గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడం, యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యలు, సామాజిక మాధ్యమాల ప్రభావం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్ జాకీర్‌హుస్సేన్, ఎస్ఐఓ అధ్యక్షుడు రోషన్‌జమీర్‌ఖాన్, వైఐఎం అధ్యక్షుడు జబీవుల్లా, ఉపాధ్యక్షుడు మహమ్మద్‌షుఖీ, కార్యదర్శి రహమతుల్లా, సంఘసేవ సంస్థ వ్యవస్థాపకుడు అయాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

వెల్లాల గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష

రాజుపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని వెల్లాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం 5వ తరగతి, ఇంటర్మీడియట్ జనరల్, ఐఐటీ, నీట్‌లో ప్రవేశానికి పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపల్ తులశమ్మ తెలిపారు. 5వ తరగతికి 96, ఇంటర్ జనరల్ కోర్సుకు 145, ఐఐటీ, నీట్‌కు 77 మంది హాజరయ్యారని తెలిపారు.

హాల్ టికెట్లు తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

పింఛను మంజూరు చేయండి సారూ

రాజుపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని ఏర్పాపాళెం పంచాయతీకి చెందిన ఉప్పలపాటి గుర్రప్ప అనే దివ్యాంగుడు తనకు ప్రభుత్వం పింఛను మంజూరు చేయండి కలెక్టర్ సార్ అని కోరుతున్నారు. పని చేయి లేక పోవడంతో ఏదైనా పనులు చేయాలన్నా వీలుకాని పరిస్థితి కలుగుతోందన్నారు. దీంతో కుటుంబ పోషణ భారం కావడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నానని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తనకు దివ్యాంగ పింఛను మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఉప్పాలపాటి గుర్రప్ప

సిమెంటు రోడ్డు తవ్వారు.. మరిచారు

ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

చాపాడు, న్యూస్‌టుడే: చాపాడు మండలం తిప్పిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో సిమెంటు రోడ్డు తవ్వి ఎనిమిది నెలలవుతున్నా ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక నాయకులు పోటీలతో తొలగించారు ఇప్పటికే కాంక్రీటు దిమ్మెలు అలాగే ఉంచారు. పక్కన పొలాల్లో నుంచి, ఇరుకు మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. పంచాయతీ అధికారులు నామమాత్రంగా పర్యటించి తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రజాప్రతినిధులు తమకు దారి లేకుండా చేశారని, ఎన్నికల సమయంలోనైనా తమ వద్దకు వస్తారు కదా అంటూ మహిళలు నిరసన వ్యక్తం చేస్తున్న ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది.

పెద్దమ్మ దేవరలో మజ్జిగ పంపిణీ

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: జమ్మలమడుగులో జరిగిన పెద్దమ్మ దేవర కార్యక్రమంలో లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు. ఆదివారం పండగ వాతావరణంలో పెద్దమ్మ, చిన్నమ్మ అమ్మవార్లకు బోనాలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఎండ వేడిమికి తాళలేక పలువురు ఇబ్బంది పడ్డారు. ఈ సందర్భంగా పలువురు దాతలు ముందుకు వచ్చి మజ్జిగ, తాగునీటిని అందించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ఖాజీపేట: మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన రౌడీ షీటర్లకు పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ వంశీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రౌడీ షీటర్ల ప్రవర్తన, వారి ప్రస్తుత కార్యకలాపాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీ షీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తీసుకుని శాంతియుత జీవితం గడపాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడేందుకు అందరూ సహకరించాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: నగరంలోని వార్డుల్లో మౌలిక వసతుల కల్పన బాధ్యతను భాజపా తీసుకుంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా 'మన డివిజన్-మన బాధ్యత' పేరిట ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా ఆదివారం 12వ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్‌లో ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి భాజపా చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ బాధ్యులు మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పవన్‌కుమార్ తదితరులున్నారు.

రక్షణ గోడలు లేక.. పొంచి ఉన్న ప్రమాదం

కేసీ కాలువపై ఉన్న వంతెనల వద్ద రక్షణ కరవైంది. వంతెనకు ఇరువైపులా రక్షణ లేక పోవడంతో ప్రమాదం పొంచి ఉంది. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి నుంచి మామిళ్లపల్లెకు వెళ్లే దారిలో వంతెన రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. చాపాడు మండలం జడ్డికొట్టాలు నుంచి సిద్ధారెడ్డిపల్లెకు, శివపురం ఎస్సీకాలనీ నుంచి చౌటపల్లెకు వెళ్లేదారిలో వంతెనలకు రక్షణగోడలు లేవు. రాకపోకల సమయంలో వంతెన వద్ద పశువులు పోట్లాడుతున్నా.. రాకపోకల సమయంలో వాహనాలు అదుపు తప్పినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కేసీ కాలువ వంతెనల వద్ద రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. - న్యూస్‌టుడే, మైదుకూరు

పనులు చేస్తే మేలు.. బాధలు తప్పేట్టు

అధికారులు కనీసం వీధి రోడ్లను పరిశీలిస్తే అనేక సమస్యలు ప్రత్యక్షంగా చూసి పరిష్కారం చేసే అవకాశం ఉంటుంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సిమెంటు రోడ్డు మట్టిరోడ్డుగా మారి.. ప్రజలను దుమ్మూ ధూళిలో రాకపోకలు చేసే దుస్థితి వెలవలి గ్రామంలోని పాత సచివాలయం సమీపం బీసీ కాలనీలో నెలకొంది. ఇక్కడ సిమెంటు రోడ్డు ఆనవాళ్లు కోల్పోయింది. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కావడంతో ఇలాంటి సమస్యలు అనేకం పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రోడ్డును బాగు చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, రాజుపాళెం

శుభ్రత శూన్యం.. పశువుల ఆరోగ్యమెలా పదిలం

ఈ చిత్రం చూశారా..! సముద్ర అడుగుభాగంలో పెరుగుతున్న నాచు భలే ఆకర్షణీయంగా పెరుగుతోందనుకుంటే పొరపాటే. ఖాజీపేట మండలం నందిపాడు వద్ద పశువుల నీటితొట్టె వద్ద ఈ దుస్థితి నెలకొంది. కొన్ని నెలలుగా నీటితొట్టెను శుభ్రం చేయక పోవడంతో అడుగుభాగంలో నాచు పాయలుగా పెరుగుతోంది. చేతిపంపులు, వ్యవసాయబోరు బావుల నుంచి వచ్చే నీటిని తాగేందుకు జంకుతున్న జనం శుద్ధిజలాలు సేవిస్తున్నారు. పశువుల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. పశువులే కదా తాగేదని అనుకోకుండా వేసవి ప్రారంభమైన నేపథ్యంలో నీటితొట్టెల శుభ్రతపైనా యంత్రాంగం చొరవ చూపాల్సి ఉంది. - న్యూస్‌టుడే, మైదుకూరు

వాహనం కొంచెం.. సరకు అధికం

చిన్నపాటి గూడ్స్ వ్యాన్‌లో అధిక లోడుతో నిండుగా ప్లాస్టిక్ నీళ్ల డ్రమ్ములతో ప్రమాదకరంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు. కుదుపుల వద్ద సడన్ బ్రేక్ వేసినా.. ఏ మాత్రం వ్యాన్ అదుపు తప్పినా వెనుక ఉన్న డ్రమ్ములకు కట్టిన తాడు తెగి జారిపడినపుడు వెనుక వస్తున్న వాహనదారులకు ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉంది. ముద్దనూరు పట్టణంలోని ప్రధాన రహదారిపై వ్యాన్‌లో నిండుగా ప్లాస్టిక్ డ్రమ్ములతో ప్రయాణిస్తున్న చిత్రాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. అయితే ఇలాంటి ప్రయాణాలకు సంబంధిత శాఖ అధికారులు అడ్డుకట్టా వేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ముద్దనూరు

ఒరిగిన స్తంభం.. భయం భయం

స్థానిక నారాపుర వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట ఒరిగిన విద్యుత్తు స్తంభంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల నుంచి స్తంభం ఒరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్తు సిబ్బంది దృష్టికి పలుమార్లు తీసుకొచ్చినా వారు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. స్తంభం ఒరిగితే ఇళ్లపై పడే ప్రమాదం ఉంది కాబట్టి వెంటనే సరిచేయాలని కోరుతున్నారు. తమ సిబ్బందిని పంపి స్తంభాన్ని సరిచేస్తామని విద్యుత్తుశాఖ డీఈఈ రాజగోపాల్ తెలిపారు. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు

వ్యకాస మండల కమిటీ ఎన్నిక

మైదుకూరు, న్యూస్‌టుడే : వ్యవసాయ కార్మిక సంఘం మైదుకూరు మండల కమిటీ అధ్యక్షుడిగా గురయ్య, కార్యదర్శిగా శ్రీనివాసులును ఎన్నుకున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు జి.శివకుమార్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రవి, బాలవెంకటయ్య, నాగయ్య, ప్రవీణ్, సహాయ కార్యదర్శులుగా రాజా, గురయ్య, రాజు, నరసింహులు, సుధాకర్, బాలకృష్ణ, ప్రభాకర్, ప్రసాద్, సంటెయ్య, చంటి, స్వర్ణలత, సుశీలమ్మ, రమణ, నాగరాజు, తిరుపతమ్మ, రవికుమార్, మున్ని, చైతన్య, రాజేశ్వరి, మహిళ కన్వీనర్‌గా భాగ్యలక్ష్మి, కోశాధికారిగా నరసింహులు ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

డీసీసీబీ ఛైర్మన్‌కు సత్కారం

డీసీసీబీ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డిని సన్మానించిన అధికారులు, సభ్యులు

అట్లూరు, న్యూస్‌టుడే: మండల సమావేశాల్లో సభ్యులు అడిగే ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని డీసీసీ బ్యాంకు ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ఎంపీపీ రమాదేవి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన మండల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పంచాయతీల్లోని సమస్యలు మూడు నెలలుగా విన్నవిస్తున్నా.. అధికారులు పరిష్కరించకుంటే ఎలా అని ప్రశ్నించారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. అనంతరం ఆయన్ను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

ఏఐఎఫ్‌ఈటీవో జాతీయ కార్యదర్శిగా రమణారెడ్డి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్(ఏఐఎఫ్‌ఈటీవో) జాతీయ కార్యదర్శిగా పోరుమామిళ్లకు చెందిన రమణారెడ్డి ఎంపికైనట్లు ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. గతంలో ఈయన ఎస్టీయూలో వివిధ పదవుల్లో పనిచేశారని.. ఉపాధ్యాయుల సమస్యలపై చేస్తున్న కృషి గుర్తించి ఎంపిక చేసినట్లు వివరించారు. అనంతరం పోరుమామిళ్ల ఎస్టీయూ రీజియన్ కార్యాలయంలో ఉపాధ్యాయులు ఆయన్ను పూలమాల, శాలువాతో సన్మానించారు.

నిమిషం ఆలస్యం నిబంధన తగదు

కడప విద్య, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులు బయోమెట్రిక్ హాజరులో నిమిషం ఆలస్యంగా వేసినా పూర్తిరోజు గైర్హాజరుగా పరిగణిస్తామని ప్రభుత్వం చెప్పడం అన్యాయమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయుల ఆంధ్రప్రదేశ్ లీవ్స్ చట్టం ప్రకారం మూడురోజులు ఆలస్యంగా పాఠశాలకు వస్తే సీఎల్‌గా పరిగణిస్తారన్న విషయం అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు.

భార్యను రాయితో కొట్టి గాయపరిచిన భర్త

ఎర్రగుంట్ల: పట్టణంలోని ముద్దనూరురోడ్డులో జ్యోతి అనే మహిళను ఆమె భర్త చంటి తలపై రాయితో కొట్టి గాయపరచిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చిలమకూరు చెందిన జ్యోతి భర్త తన చంటితో విడిపోయి వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరులో నివాసం ఉండే చంటి తన కుమార్తెను చూసేందుకు చిలమకూరు వెళ్లాడు. ఈక్రమంలో ఇరువురు మధ్య వాగ్వాదం జరిగి చంటి జ్యోతిని రాయితో కొట్టి గాయపరిచాడు. గాయపడిన జ్యోతి పోలీసుస్టేషన్ వెళ్లగా ఆమెను పోలీసులు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి నుంచి ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

పోట్లదుర్తిలో గడ్డివాముల దగ్ధం

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: పోట్లదుర్తి గ్రామంలో ఆదివారం రాత్రి ఓబుళరెడ్డి, రామసుబ్బారెడ్డి, పెద్ద సుబ్బిరెడ్డికి చెందిన మూడు గడ్డివాములు దగ్ధమైంది. స్థానికుల నుంచి సమాచారం వచ్చిన వెంటనే ప్రొద్దుటూరు, ఆర్టీపీపీకి చెందిన అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఆస్తినష్టాన్ని అంచనా వేస్తున్నామని అధికారులు తెలిపారు. సంఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ.. కార్మికుడికి గాయాలు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: ఎర్రగుంట్ల పట్టణ శివార్లలోని జువారీకట్ట సమీపంలో శనివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటనలో ఈశ్వర్ అనే వ్యక్తి గాయపడినట్లు స్థానికులు తెలిపారు. కమలాపురానికి చెందిన ఈయన చిలమకూరు ఐసీఎల్ పరిశ్రమలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో లారీ ఢీకొని గాయపడినట్లు వివరించారు. ఇతన్ని 108 వాహనంలో ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుని నుంచి ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

మైదుకూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు మైదుకూరు పోలీసులు తెలిపారు. వివాహిత శనివారం నుంచి కనిపించకుండా పోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

3న ఆలయాల మూసివేత

ప్రొద్దుటూరు పట్టణం, చాపాడు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు నడిబొడ్డున ఉన్న శివాలయం (అగస్త్యేశ్వరాలయం)ను మంగళవారం 3వ తేదీన ఉదయం 6.30 గంటల కేతు చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ వంగల నారాయణరెడ్డి, ఈవో కె.వి.రమణ తెలిపారు. మధ్యాహ్నం 3.20 నిమిషాలకు చంద్రగ్రహణం ప్రారంభమై సాయంత్రం 6.45 నిమిషాలకు పూర్తి అవుతుందని చెప్పారు. బుధవారం 6 గంటల నుంచి ఆలయంలో భక్తులకు దర్శనం ప్రారంభమవుతుందన్నారు. ● చాపాడు మండలం అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయం మూత వేస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ పెరుగు వీరనారాయణయాదవ్ తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7.30 వరకు దేవాలయం తలుపులు మూసి ఉంచుతామన్నారు. స్వామివారి దర్శనం, సేవలు ఉండవన్నారు. రాత్రి ఆలయ శుద్ధి, పుణ్యాఃవచనం, అభిషేకం తర్వాత భక్తులకు దర్శనం, తీర్థ ప్రసాదాలు నిర్వహిస్తామని అందజేస్తామని వివరించారు.

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
కర్నాటక బ్యాంక్ లి., ప్రొద్దుటూరు బ్రాంచి 11వ వార్షికోత్సవ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ శ్రీ జి.విజయక్రిష్ణ గారికి మరియు సిబ్బందికి మా శుభాకాంక్షలు.
బి.వి.నాగప్రసాద్, ప్రొప్రైటర్
శ్రీ వెంకటేశ్వర లాడ్జి
శివాలయం వీధి, ప్రొద్దుటూరు. Cell : 9845137166

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్న కర్నాటక బ్యాంక్, ప్రొద్దుటూరు శాఖ నేడు 11వ వార్షికోత్సవం జరుపుకొంటున్న శుభ సందర్భంగా బ్రాంచి మేనేజర్ శ్రీ జి.విజయక్రిష్ణ గారికి మరియు సిబ్బందికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

శ్రీ G.విజయక్రిష్ణ
బ్రాంచి మేనేజర్
రోజ వేర్ హౌస్
S.ఉప్పలపాడు గ్రామం, జమ్మలమడుగు (మం.)

కుందూ గలగల.. పంటలు కళకళ

జోరుగా కొర్రలు, వరి, మొక్కజొన్న, పత్తి సాగు

- న్యూస్‌టుడే, రాజుపాళెం

ఖరీఫ్ సీజనులో సాగు చేసిన రైతులు నూర్పిడి అనంతరం మళ్లీ పొలం బాట పట్టారు. రెండో పంటగా పలు రకాలు సాగు చేస్తున్నారు. అన్నదాతలను కుందూ నది ఆదుకుంటోంది. కేసీ, చాపాడు కాలువ పరిధిలో ... వేలాది ఎకరాల పంటలు సాగు చేశారు. గతంలో ఎప్పుడు రైతులు ఇంత విస్తీర్ణంలో రైతులు పంటలు సాగు చేసిన సంఘటన లేదని అంటున్నారు. దీంతో ఈసారి నీటి ఆధారంగా కొర్రలు, బరిగెలు, వరి, మొక్కజొన్న, పత్తి, ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. దీంతో కుందూతీరం పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారింది. వెలవలి నుంచి తొండలదిన్నె మధ్య వరి పంట వందలాది ఎకరాలు పచ్చదనం మైమరపిస్తోంది. ఇక మొక్క జొన్న, ఇతర పంటలు సాగు చేశారు. జిల్లాలో కుందూ నది పరిధిలోని పది మండలాలకు చెందిన మూడు వేల మంది రైతులు దాదాపు 15 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీంతో ఏటా రెండు పంటలు సాగు చేస్తారు. అయితే తొలిసారి సాగు చేసిన పంట ఆదాయం రాక పోయినా మళ్లీపంటతో కోలుకుంటామనే నమ్మకంతో రైతులు సాగు చేస్తున్నారు. ఈసారి వరి పంట దిగుబడులు ఆశాజనకంగా వచ్చిన తక్కువ ధరతో కేవలం బస్తా వడ్లు కేవలం రూ.1400 అమ్మకాలు చేసి నష్ట పోయారు. అనంతరం కొంత పెరిగాయి. దీంతో ఇప్పుడు పంటతో కోలుకొని బాగు పడుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

తీరంలో వేసిన వరి పంట

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

16 నుంచి రాష్ట్ర మహాసభలు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు మార్చి 16, 17, 18 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేసీ బాదుల్లా తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించి మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తారకరామారావు, వసంతరావు, నాగేష్, ఈశ్వరయ్య, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి

కళావేదికపై నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: శిల్పారామం కళావేదికపై ఆదివారం చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో అలరించాయి. నగర ప్రజల కోసం విద్యార్థులు, కళాకారులతో నిర్వహించిన పలు సాంస్కృతిక, జానపద, పల్లెటూరు, సినీగీతాల కార్యక్రమాలు ప్రజలను ఎంతో ఉత్సాహపరిచాయి. వారాంతపు సెలవురోజు కావడంతో నగర ప్రజలు, చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున శిల్పారామానికి చేరుకుని సేద తీరి సందడి చేశారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణప్రసాద్, శిల్పారామం సిబ్బంది, నగర ప్రజలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి

కమలాపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ హయాంలోనే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందుతుందని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో దేవరాజుపల్లె నుంచి దాదిరెడ్డిపల్లె, సముద్రంపల్లె, పెద్దచెప్పలికి వెళ్లేందుకు రూ.2.17కోట్లు నాబార్డు నిధులతో సీసీ, బీటీ, డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నాగిరెడ్డి, జయరామిరెడ్డి, సర్పంచి ఓబయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంకెంత కాలం ఇన్‌ఛార్జి పాలన?

పూర్తి స్థాయి డీటీసీ కరవు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, పులివెందుల, రాజంపేట రవాణా శాఖ కార్యాలయాలున్నాయి. జిల్లా కేంద్రమైన కడప రవాణాశాఖ కార్యాలయానికి 2025 ఫిబ్రవరి నుంచి రెగ్యులర్ డీటీసీ లేరు. కొద్ది రోజులు అన్నమయ్య జిల్లా ఆర్టీవో ప్రసాద్‌ను, తర్వాత చిత్తూరు డీటీసీ నిరంజన్‌రెడ్డిని నియమించారు. ప్రస్తుతం అనంతపురం డీటీసీ వీర్రాజు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆయన వారంలో రెండు రోజులు మాత్రమే ఇక్కడికి వస్తారు. మిగిలిన నాలుగు రోజులు అనంతపురంలోనే ఉంటారు. అంతేగాక ఇక్కడ ఆర్టీవో కూడా లేకపోవడంతో పనులు నత్తనడకన జరుగుతున్నాయి. కార్యాలయంలో ఉన్న ఓ ఉద్యోగికి కీలకమైన విభాగాన్ని కేటాయించారు. అతను ఎప్పుడు వెళ్లినా ఉండరు. ఒక వేళ ఉన్నా అతను ఇచ్చే సమాధానం చాలా కఠినంగా ఉంటుందని వినియోగదారులు వాపోతున్నారు. ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ పరీక్షలు సక్రమంగా జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్ అధికారి లేకపోవడంతో సిబ్బంది పని తీరు కూడా అధ్వానంగా ఉంది. అధికారి లేకపోతే కార్యాలయంలోకి దళారులు యథేచ్ఛగా వెళ్లి పనులు చేసుకుంటున్నారు.

అయిదేళ్లుగా ఆర్టీవో పోస్టు ఖాళీ

గత వైకాపా హయాంలో జిల్లాల విభజన జరిగింది. ఆ సమయంలో కడపలో ఆర్టీవోగా పని చేస్తున్న శాంతకుమారిని అన్నమయ్య జిల్లా డీటీసీగా నియమించారు. అప్పటి నుంచి కడప కార్యాలయానికి రెగ్యులర్ ఆర్టీవో లేరు. డీటీసీ లేని సమయంలో ఆర్టీవో కార్యాలయ పనులను పర్యవేక్షిస్తుంటారు. ఇప్పుడు ఆర్టీవో కూడా లేకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

● ఈ విషయమై జేటీసీ కృష్ణవేణి మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు జరగనున్నాయని తెలిపారు. ఆ సమయంలో ఉన్నతాధికారులు ఇక్కడికి రెగ్యులర్ డీటీసీ నియమించే అవకాశముందని ఆమె స్పష్టం చేశారు.

భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు

పూజలందుకుంటున్న శ్రీచౌడేశ్వరీదేవి అమ్మవారు

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందుల పట్టణంలో వెలసిన శ్రీరామలింగ చౌడేశ్వరీదేవి, అంకాళమ్మ, సుంకులపరమేశ్వరీదేవి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

లింగాల: పెద్దకుడాలలో తిరునాలను పురస్కరించుకొని ఆదివారం గంగమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు.

వల్లూరు: మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లె నరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహిళలు పాల్గొని సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు.

లోక కల్యాణార్థం మహాచండీ హోమం

రాజరాజేశ్వరీ అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసులురెడ్డి

మారుతీనగర్, న్యూస్‌టుడే: స్థానిక సర్వేశ్వర మహర్షి ఆశ్రమంలోని రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయంలో ఆదివారం లోక కల్యాణార్థం మహాచండీహోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రచారం చేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: నగరంలోని వార్డుల్లో మౌలిక వసతుల కల్పన బాధ్యతను భాజపా తీసుకుంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా భాజపా 'మన డివిజన్-మన బాధ్యత' పేరిట ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా ఆదివారం 12వ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్‌లో ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి భాజపా చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ బాధ్యులు మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పవన్‌కుమార్ తదితరులున్నారు.

ఉచిత విద్య పేదలకు వరం

మాట్లాడుతున్న భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్

చక్రాయపేట(వేంపల్లె), న్యూస్‌టుడే: కార్పొరేట్ విద్య సంపన్నులకే కాకుండా పేద పిల్లలకు కూడా దక్కాలనే ఆశయంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని భాజపా జిల్లా అధికార ప్రతినిధి గాలి హరి ప్రసాద్ అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించేలా కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాణిజ్యం విభాగ జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రవియాదవ్ పాల్గొన్నారు.

విద్యారంగంలో ఉపాధ్యాయ వృత్తి ప్రత్యేకం

చక్రాయపేట,(వేంపల్లె), న్యూస్‌టుడే: విద్యారంగంలో ఉపాధ్యాయ వృత్తి ప్రత్యేకమైనదని మాజీ ఎంపీ తులసిరెడ్డి అన్నారు. స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి పదవీవిరమణ కార్యక్రమానికి ఆదివారం ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేది ఉపాధ్యాయుడన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వర్‌రెడ్డి, విశ్రాంత ఎంఈవో వీరారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవతా సేవలు మరింత విస్తరిస్తాం

మాట్లాడుతున్న ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : ప్రతిఒక్కరూ నైతిక విలువలు పాటించాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం మానవతా సేవా సంస్థ నెలవారీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇందుకు వైవీయూ విశ్రాంత రిజిస్ట్రార్ జి.సాంబశివారెడ్డి అధ్యక్షత వహించారు. మనవతా సంస్థ సేవలను మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సభ్యులు సుబ్బరాయుడు, పుట్టా సుధాకర్, గోపి, రామాంజులరెడ్డి, మోహన్‌కృష్ణ, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, సుబ్బారెడ్డి, శివప్రసాదరావు, ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒరిగిన స్తంభం.. జర భద్రం

మండల పరిధి కొత్తసంగటిపల్లె గ్రామ పొలాల్లో విద్యుత్తు స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. పొలాల్లోకి వెళ్లే రైతులు, పశువుల కాపరులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల బారిన పడకముందే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై మిట్టమీదపల్లె విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో విద్యుత్తు స్తంభాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, పెండ్లిమర్రి

బాణసంచా గోదాములో తనిఖీలు

తనిఖీలు చేస్తున్న తహసీల్దారు హరినాథ్‌రెడ్డి, ఎస్సై తిరుపాల్‌నాయక్

చక్రాయపేట (వేంపల్లె), న్యూస్‌టుడే: వేంపల్లెలోని బాణసంచా గోడౌన్‌లను ఆదివారం తహసీల్దారు హరినాథ్‌రెడ్డి తనిఖీలు చేశారు. కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ముందస్తు తనిఖీలు చేపట్టారు. గోడౌన్, దుకాణాల్లో పరిమితికి మించి బాణసంచా నిల్వ చేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపాల్‌నాయక్ పాల్గొన్నారు.

పులివెందుల: పులివెందులలోని పలు టపాసుల దుకాణాల యజమానుల ఇళ్లలో ఆదివారం పట్టణ సీఐ సీతారామిరెడ్డి తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. నివాస ప్రాంతాల వద్ద టపాసులు నిల్వ చేయరాదని, ఊరికి దూరంగా ఉన్న గోదాముల్లోనే నిల్వ చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

జనసేన సభ్యత్వానికి విశేష స్పందన : అరవిందనగర్ (కడప): నగరంలో జనసేనపార్టీ సభ్యత్వానికి విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ నాయకుడు జీవీరమణ స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలో జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు.

నిమిషం ఆలస్యం నిబంధన తగదు : కడప విద్య : ఉపాధ్యాయులు బయోమెట్రిక్ హాజరులో నిమిషం ఆలస్యంగా వేసినా పూర్తిరోజు గైర్హాజరుగా పరిగణిస్తామని ప్రభుత్వం చెప్పడం అన్యాయమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయుల ఆంధ్రప్రదేశ్ లీవ్స్ చట్టం ప్రకారం మూడురోజులు ఆలస్యంగా పాఠశాలకు వస్తే సీఎల్‌గా పరిగణిస్తారన్న విషయం అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు, యాప్ లోపాలు, సర్వర్‌డౌన్ వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు.

చలమారెడ్డిపల్లెలో చోరీ? : కడప నేరవార్తలు: నగర శివారులోని చలమారెడ్డిపల్లెలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. తలుపు తెరిచి ఉండడంతో విషయాన్ని చంద్రశేఖర్‌రెడ్డి తెలియజేశారు. రిమ్స్ సీఐ రామకృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బీరువాలో ఉన్న వెండి వస్తువులు తీసుకెళ్లారు. అయితే చోరీ జరిగిన తీరును పరిశీలించిన సీఐ అనుమానం వ్యక్తం చేశారు. దీంతో మమ్మల్నే దొంగలంటవా అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. చోరీ జరిగిందని ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని సీఐ చెప్పారు.

డబ్బుల విషయమై గొడవ: కడప నేరవార్తలు : కడప రెండో పట్టణ ఠాణా పరిధిలో ఓ వ్యక్తిపై కొంతమంది వ్యక్తులు దాడి చేశారు. ఆకుల వీధికి చెందిన మహమ్మద్ ఇషాక్‌కు మరొకరి మధ్య డబ్బుల విషయమై గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మహమ్మద్ ఇషాక్ ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తుండగా కొంతమంది వచ్చి అతనిపై దాడి చేశారు. అతడిని రిమ్స్‌కు తరలించారు.

గడ్డివాము దగ్ధం: తొండూరు: గడ్డివాము దగ్ధమైన సంఘటన మండలంలోని బోడివారిపల్లెలో ఆదివారం చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డి పశువులకు గ్రాసం పోగు చేసి వాము ఏర్పాటు చేశారు. గడ్డివాము నుంచి పొగ వస్తుండటం గమనించి అగ్నిమాపక అధికారులు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారులు ఘటనాస్థలానికి చేరుకునే సమయానికి వాము దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు విలపించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: పులివెందుల: యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం లభిస్తుందని యోగా గురూజీ వెంకట్రామిరెడ్డి, ఆర్డీవో చిన్నయ్యలు అన్నారు. ఆదివారం పులివెందులలోని శ్రీసరస్వతీ విద్యామందిరంలోని ఏర్పాటుచేసిన వార్షికోత్సవ కార్యక్రమానికి వారు హాజరై ప్రసంగించారు. ప్రతి రోజు ఒక గంటపాటు యోగా చేయడం అలవాటు చేసుకుంటే అనారోగ్యానికి దూరంగా ఉండవచ్చునన్నారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు : పులివెందుల: పులివెందులలోని పలు ప్రాంతాల్లో జూదమాడుతున్న 17 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు ఆదివారం చెప్పారు. బ్రాహ్మణపల్లె పొలాల్లో 16 మంది జూదమాడుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడి చేసి 14 మందిని అదుపులోకి తీసుకోగా ఇద్దరు పారిపోయారన్నారు. వారి వద్ద నుంచి రూ.76వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. అలాగే మండలంలోని ఆర్.తుమ్మలపల్లె పొలాల్లో జూదమాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.25 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఏఐఎఫ్ఈటీవో జాతీయ కార్యదర్శిగా రమణారెడ్డి : పోరుమామిళ్ల: ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలిమెంటరీ టీచర్స్ ఆర్గనైజేషన్(ఏఐఎఫ్ఈటీవో) జాతీయ కార్యదర్శిగా పోరుమామిళ్లకు చెందిన రమణారెడ్డి ఎంపికైనట్లు ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. గతంలో ఈయన ఎస్టీయూలో వివిధ పదవులలో పనిచేశారని.. ఉపాధ్యాయుల సమస్యలపై చేస్తున్న కృషి గుర్తించి ఎంపిక చేసినట్లు వివరించారు. అనంతరం పోరుమామిళ్ల ఎస్టీయూ రీజియన్ కార్యాలయంలో ఉపాధ్యాయులు ఆయన్ను పూలమాల, శాలువాతో సన్మానించారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత పనులు

కొప్పర్తిలో వైవీయూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

వైవీయూ, న్యూస్‌టుడే: యోగివేమన విశ్వవిద్యాలయం దత్త గ్రామమైన కొప్పర్తిలో ఆదివారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛభారత్ కార్యక్రమం ఏర్పాటు చేసి పలు సేవలందించారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారి అమృత్‌ప్రసాద్‌రెడ్డి హాజరై స్వచ్ఛభారత్ ప్రాముఖ్యతను వివరించారు. మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రజలకు ఆరోగ్యంపై పలు సలహాలు సూచనలు చేశారు. వ్యాపార నిర్వహణ శాస్త్ర డీన్ సుబ్బరాయుడు, వరప్రభాకర్, లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

మాట్లాడుతున్న సీఐ సీతారామిరెడ్డి

పులివెందుల, న్యూస్‌టుడే: జీవితం బాగుండాలంటే లెక్కలే ఆధారమని, గణితంలో మంచిగా రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పులివెందుల పట్టణ సీఐ సీతారామిరెడ్డి అన్నారు. ఆదివారం పులివెందులలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన విద్యార్థులకు సీజీటర్ మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థి దశలో వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీస్తున్న ఎన్ఆర్ఐ దాసరి మహేశ్వరరెడ్డిని అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1975-77 సంవత్సరంలో ఇంటర్ విద్యను అభ్యసించిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 50 ఏళ్ల తర్వాత సమావేశమయ్యారు. మనవళ్లతో ఆడుకుంటున్నావా.. లేదా అంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అందరూ కలిసి భోజనం చేశారు.

నిత్యావసర సరకుల పంపిణీ

కడప చిన్నచౌకు: స్థానిక ఎన్జీవో కాలనీకి చెందిన కోఆపరేటివ్ విశ్రాంత డిప్యూటీ రిజిస్ట్రార్ సయ్యద్ జాఫర్ హుస్సేన్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఆగాడి వీధిలోని అర్రహ్మాన్ ఇందాద్ సొసైటీ ఆధ్వర్యంలో 500 మంది పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. 2014 నుంచి ప్రతి రంజాన్ మాసంలో పేద ముస్లింలకు ఏటా రూ.4 లక్షలు వెచ్చిస్తానని ఆయన వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మహబూబ్‌బాషా తదితరులున్నారు.

నిత్యావసర సరకులు అందజేస్తున్న దాత సయ్యద్ జాఫర్ హుస్సేన్

ఆత్మవిశ్వాసం విజయానికి మూలం

మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు వెంకటేశ్వర్‌రెడ్డి

చక్రాయపేట,(వేంపల్లె), న్యూస్‌టుడే: ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయడం విజయానికి మూలమని ప్రముఖ ప్రేరణాత్మక వక్త రామ్మూర్తి, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం వేంపల్లెలోని శ్రీచైతన్య, ఉషాకిరణ్ పాఠశాలలో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఆత్మవిశ్వాసంతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్‌లు చక్రపాణిరెడ్డి, రమణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెదేపా హయాంలోనే అభివృద్ధి

అరవిందన్‌నగర్, న్యూస్‌టుడే: తెదేపా హయాంలోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే మాధవి అన్నారు. నగరంలోని 2వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలో ఆదివారం తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డితో కలిసి సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. నగరంలోని ప్రతి వీధిలో నాణ్యమైన రోడ్లు, మురుగు వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా చలో దిల్లీ

మాట్లాడుతున్న సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్

మారుతీనగర్, న్యూస్‌టుడే: కేంద్రంలో భాజపా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 24న నిర్వహించే చలో దిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నగర నాయకులు రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

3 నుంచి నారాయణ స్వామి ఆరాధన ఉత్సవాలు

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధి మొయిళ్ల కాల్వలో వెలసిన శ్రీ హజరత్ హుస్సేన్ వల్లి ఉరుసు, శ్రీనారాయణ స్వామి ఆరాధన ఉత్సవాలు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం గంధం, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అలాగే బుధవారం ఉరుసు, బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రైతుబజారులో కూరగాయల ధరలు



కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా... బంగాళదుంప-30, క్యాబేజి-25, క్యారెట్-35, బీన్స్-40, బీట్‌రూట్-35, కీర-30, దోస-35, దొండకాయలు-40, ముల్లంగి-30, అల్లం-90, కాలీఫ్లవర్-25, క్యాప్సికం-60, టమాట-08, మిరపకాయలు 40, వంకాయలు-20, బెండకాయలు-20, బీర-30, కాకర-30, మటిక్కాయ-25, చిక్కుడు-20, అలసందకాయలు-25, అనపకాయలు-30, ఉల్లిపాయలు-15

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

మురుగు కూపం.. ప్రజలకు శాపం

కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

గాంధీ రోడ్డులో పేరుకున్న చెత్తా చెదారం

వేంపల్లె(చక్రాయపేట), న్యూస్‌టుడే: వేంపల్లె మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. దీంతో దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రధానమైన గండిరోడ్డు, క్రిస్టియన్ కాలనీ, శ్రీరాంనగర్, అమ్మవారిశాల వీధుల్లో మురుగు, చెత్త పేరుకుపోయింది.

● వేంపల్లె ప్రధాన వీధులు మినహా కాలనీ ప్రాంతాల్లో మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. నిర్వహణ పేరుతో రూ.లక్షల్లో ఖర్చు చేసి డ్రైనేజీలు నిర్మించినా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉంది. పక్కీరుపల్లె, చింతలమడుగుపల్లెలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. కాలువల్లో చెత్త తొలగించక పోవడంతో మురుగు నీరు పారడం లేదు.

శుభ్రత పనులు చేయిస్తాం : సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు అందకపోవడంతో వారు విధుల్లోకి రావడం లేదు. దీంతో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో శుభ్రత పనులు చేయిస్తాం.
- నాగభూషణంరెడ్డి, ఈవో వేంపల్లె

గండి ఆలయం మూసివేత రేపు

చక్రాయపేట, వేంపల్లె: ప్రసిద్ధి గండిక్షేత్రంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయాన్ని ఈ నెల 3న సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆలయం మూసివేస్తున్నామని డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9:30 నిమిషాలకు ఆలయం మూసి బుధవారం ఉదయం 7 గంటలకు భక్తులకు సర్వదర్శనం కల్పిస్తామన్నారు. వేంపల్లెలోని శ్రీ వృషభాచలేశ్వరస్వామి ఆలయంలో కూడా అదే రోజు ఆలయం మూసివేసి శుద్ధి అనంతరం బుధవారం ఉదయం భక్తులకు ప్రవేశం కల్పిస్తామని ఈవో కె.సుభాష్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వేముల, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. స్థానిక నారేపల్లెలో ఆదివారం నిర్వహించిన ముద్దలపండగకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన పరిష్కారానికి తమవంతు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

(c) eenadu